కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 11

శల్య, సౌప్తిక, స్త్రీ పర్వములు

కృతికర్త

తిక్కన సోమయాజి

వ్యాఖ్యాతలు

డా॥ పి.వెంకటరాజు

విద్వాన్ సింగరాజు సచ్చిదానందం

డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

డా॥ హెచ్.యస్. బ్రహ్మానంద

ప్రధానసంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

KAVITRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Shalya, Souptika, Sthri parvamulu of Tikkana Somayaji
Vol. XI

Commentary by
Dr. P. Venkataraju - Salya Parvam 1st Canto
Vidwan Singaraju Sacchidanandam - Salya Parvam - 2nd Canto
Dr. Jonnalagadda Mruthyunjaya Rao - Soupthika Parvam
Dr. H.S. Brahmananda - Sthri Parvam

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Series No.610
First Edition : 2005

Second Edition: 2013
Copies : 5,000

Published by
Sri. M.G. Gopal, I.A.S.
Executive Officer,
T.T.Devasthanams,
Tirupati - 517 507

D.T.P. Type Setting
Editor-In-Chief Office
T.T.D. Tirupati.

Cover Design:

Printed at:

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్ఫైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వైయస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా ఆధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియ వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారి సేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్–ఇన్–చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

మహాభారతం వేదాల, శాస్త్రాల, ఉపనిషత్తులసారం. అందుకే ఈ గ్రంథాన్ని పంచమ వేదంగా పరిగణిస్తారు. "భరతానాం మహజ్జన్మ మహాభారత ముచ్యతే" అని, "మహత్త్వాద్భారవత్త్వాచ్చ మహాభారత ముచ్యతే" అని మహాభారతనామ నిష్పత్తి. అన్నితరాలను అలరించి ధర్మాన్ని, జ్ఞానాన్ని బోధించే మహేతిహాసం మహాభారతం.

ఇంతటి ప్రాశస్త్యం గల మహాభారతాన్ని వ్యాఖ్యానసహితంగా ప్రజలకు అందించాలని తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం 1982–83 నన్నయ సంవత్సరంలో నిర్ణయం తీసుకున్నది. అందుకు అనుగుణంగా సామాన్యులకు కూడా అనువైన రీతిలో ప్రతిపదార్థ, తాత్పర్య విశేషాలతో రూపొందించాలని సంకల్పించింది. ఈ మహాభారత ప్రచురణ ఒక మహాయజ్ఞంలాగా కొనసాగుతున్నది. ఆంధ్రదేశంలోని ముప్ఫైమంది ప్రసిద్ధ విద్వాంసులు, మహాభారత వ్యాఖ్యానంలో పాలుపంచుకున్నారు. ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు ప్రధాన సంపాదకత్వం వహించారు. ఇందులో భాగంగా ఆది, సభా పర్వాలను 2000 సంవత్సరంలోను, 2003 సంవత్సరంలో గోదావరీ పుష్కరాల సందర్భంగా అరణ్య, విరాటపర్వాలను, 2004లో కృష్ణా పుష్కరాల సందర్భంగా ఉద్యోగ, భీష్మ, ద్రోణ పర్వాలను వెలువరించటం జరిగింది. తరువాత 2005లో కర్ణపర్వాన్ని ప్రత్యేక సంపుటంగా ప్రకటనకు సిద్ధం చేయడమైనది. ప్రస్తుతం శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలను ఒకే సంపుటంగా మీముందుంచుతున్నాం.

పగ, ద్వేషం, ప్రతీకారం, ఈర్ష్యకు లోనైన కౌరవులు పోరుకు సిద్ధపడటం, తద్ద్వారా కలిగిన పరిణామాలకు ఫలితంగా 'శోకరసం' ఈ పర్వాలలో మూర్తీభవించింది. శల్యునిసారథ్యాన్ని ఆతని మరణాన్ని, దుర్యోధనుని పతనాన్ని వర్ణించే పర్వమే శల్యపర్వం. సౌప్తిక పర్వంలో అశ్వత్థామ కరడుగట్టిన ప్రతీకార హింసాయుత ప్రవృత్తి గలవాడుగా గోచరించగా, ధర్మ పరిరక్షణ కోసం అవతరించిన భగవానుడుగా శ్రీ కృష్ణమూర్తి దర్శనమిస్తాడు. ఇక స్త్రీ పర్వంలో గాంధారి, కుంతి మున్నగు స్త్రీల మనఃప్రవృత్తుల చిత్రీకరణలో శోకరసం పెల్లుబికింది.

ఈ పర్వాలకు డా॥పి. వేంకటరాజు, విద్వాన్ సింగరాజు సచ్చిదానందం, డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు, డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద వ్యాఖ్యానం అందించారు. వీరికి మా ధన్యవాదాలు. ప్రధాన సంపాదకులైన ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు విపులపీఠికను, కథాసంగ్రహాన్ని సమకూర్చారు. వారికి మా కృతజ్ఞతలు.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,తిరుపతి.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీవేంకటేశ్వరస్వామి వారి దివ్యానుగ్రహంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవశ్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భఆగవతం ప్రథమ స్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన ''పోతన'' పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 -' 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాసపీఠము' - అనే ప్రశస్తసంచికను ప్రచురించింది.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనాప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జూలై 11వ తేదీన హైదరాబాదు బాలాజీభవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శకసూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం :

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్య పర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అర సున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయతల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో

ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసి యున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్లవేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్పురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్లవేంకటావధానిగారు తిక్కన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ'' కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిక్రమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగాపర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీమధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జూలై 3వ తేదీన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన :

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్ధారెడ్డి గారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్‌కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక''ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

ఆ నివేదిక సారాంశం :

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను''.

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యంలో 1992 నవంబరు 5వ తేదీన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥ కే. సర్వోత్తమరావు	**శ్రీడి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్)**

సలహాసంఘం

ఆచార్య తూమాటి దొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥ రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీ కాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం :

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిని అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జులై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీడి. నాగసిద్ధారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు :

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్న భిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీస్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలో ని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం :

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్లకొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పంద్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి, విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి''.

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాష్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదక మండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

సంపాదక మండలి సభ్యులు

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు	శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య	డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
డా॥ కె.జె. కృష్ణమూర్తి	డా॥ కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

పౌరసంబంధాధికారి, తి.తి.దే.	డా॥ బిరుదురాజు రామరాజు
అన్నమాచార్యప్రాజెక్ట్ డైరెక్టర్, తి.తి.దే.	డా॥ ఎం. కులశేఖరరావు
ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి, తి.తి.దే.	డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు
	డా॥ ఎం. బుద్ధన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన తిరుమలలో అప్పటి కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలుల లోని సభ్యులయొక్క సంయుక్తసమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటాలన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్తపాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ప్రథమసంపుటం ఆదిపర్వం (రెండు భాగాలు), ద్వితీయ సంపుటం-సభాపర్వం వెలువడినాయి. డాక్టర్ ఐ.వి. సుబ్బారావుగారి తరువాత కార్యనిర్వహణాధికారి అయిన డా॥పి. కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్. గారు వచ్చిన తత్క్షణమే ఆంధ్ర మహాభారత ప్రచురణనుగూర్చి ఆస్తకితో గమనిస్తూ అన్ని విధాల సహకరించి ఆది,సభా పర్వాల విడుదలకు ఏర్పాటుచేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాలనిర్ణయంతో పని జరగాలని త్వరపరిచినారు. 2002 సంవత్సరానికి ఈ బృహత్ప్రణాళిక వ్యాఖ్యాసహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. అప్పట్లో తీవ్రతరం అయిన ప్రయత్నంతో గోదావరి పుష్కరాల సమయానికి ఆరణ్యపర్వం (2 భాగాలు), విరాటపర్వం విడుదల అయ్యాయి. తర్వాత శ్రీ అజేయ కల్లంగారు కార్యనిర్వహణాధికారిగా విచ్చేసిన వెనువెంటనే ఈ మహాభారత వ్యాఖ్యన సహితప్రచురణ ప్రణాళికను మరింత వేగిరపరచి కృష్ణాపుష్కరాలలోపల యుద్ధ పంచకాన్ని విడుదల చేయాలనీ, 2004 సంవత్సరం చివరకు మిగిలిన పర్వాష్టకము వెలుగు చూడాలనీ నిర్ణయించడం జరిగింది. ఆ మార్గదర్శక సూత్రానుగుణంగా ఉద్యోగ, భీష్మ, ద్రోణపర్వాలు వెలువడ్డాయి. ఇప్పుడు కర్ణపర్వం విడుదలయింది. ప్రస్తుతం శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలను మూడింటిని కలిపి ఒకే సంపుటంగా మీముందు ఉంచుతున్నాము. పర్వాలన్ని విడుదల చేయటానికి సర్వయత్నాలు సాగుతున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూవున్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారత' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయ సాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తృత్వమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. ఈ మహాగ్రంథం వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహక పర్యవేక్షణకు కైమోడ్పులు. సాహిత్యప్రియులూ, తి.తి.దేవస్థానం సంయుక్తకార్యనిర్వహణాధికారిగా ఉండిన శ్రీ ఆర్. అప్పారావు, ఐ.ఏ.ఎస్., గారికి వందనములు.

సంబంధిత విభాగాధిపతిగా, సలహామండలి ఎక్స్ అఫిషియోసభ్యులైన డా॥పి రంగారావు, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి-వారికి మరియు ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగా సహాయ సహకారాలందించిన తదితర అధికారిగణానికి నమస్సులు. ఈ ప్రణాళికద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధానపాత్ర వహించిన-వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదకమండలి, సలహా మండలి) విద్యావేత్తలకు, ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారికి- నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు. తి.తి.దేస్థానముల సవ్యాఖ్యాన మహాభారతాన్ని ప్రకటించడంలో వేగాన్ని పుంజుకోవడానికై తీర్మానించినప్పుడు ఎడిటోరియల్ కమిటీ వారు దాని కొరకై ప్రధాన సంపాదకునికి సహాయంగా స్థానిక పండితవర్యుల ఉప సంఘం (ఎడిటోరియల్ సెల్) నిర్మాణానికి సిఫారసు చేయగా, దేవస్థానం ఆమేరకు **పండితవరేణ్యులు డా॥ కె.సర్వోత్తమరావు, శ్రీసముద్రాల లక్ష్మణయ్య, మహాకవి శ్రీముదివర్తి కొండమాచార్యులు గారలతో** ఎడిటోరియల్‌సెల్‌ను ఏర్పరచడం జరిగింది. ఈ మేరకు ఆరణ్యపర్వంలోని ద్వితీయభాగంతో ఆరంభమైన ఈ సెల్ ఉపకారం మరువరానిది. వీరు వర్క్‌షాపువలె నిర్వహింపబడుతున్న కవిత్రయ మహాభారత యజ్ఞంలో పాలుపంచుకుంటున్నారు. ఆ కారణంగానే తక్కిన పర్వాలు త్వరితంగా వెలువరించగలుగుతున్నాం.

"సప్తగిరి" సంపాదకులుగా, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి అమరులయ్యేవరకూ ప్రముఖపాత్ర వహించిన కాట్రపాటిసుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు డా॥ కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్-ఎడిటర్లు డాక్టర్ కె. రాధారమణ, డాక్టర్ ఎ. సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్-ఎడిటర్ శ్రీ బి. ఎన్. శ్రీనివాసన్ గారికి, తదితర సిబ్బందికి, ఈ పుస్తకాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్ది పాఠకులకు తక్కువ వ్యవధిలో అందించడానికి తోడ్పడిన టి.టి.డి. ముద్రణాలయాధికారి శ్రీ ఐ. పార్వతీశ్వరరావు గారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహ విశేషంవల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగుచూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ఎన్.ఎస్. రామమూర్తి
కన్వీనర్
సంపాదకుడు - సప్తగిరి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. **1,2,3**
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. **4**; శాంతి. ఆశ్వా.**1**
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. **5,6,7,8**; సభా. ఆశ్వా **1,2**
4. డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. **1** నుండి **7** వరకు; భీష్మ. ఆశ్వా. **1,2**
5. డాక్టర్ కే. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా. **1**
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. **2**
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. **3**; ద్రోణ. ఆశ్వా. **3,4**; శల్య. ఆశ్వా.**2**
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా.**4**
9. డాక్టర్ కే. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా.**5**
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. **1,2**; సౌప్తిక. ఆశ్వా. **1,2**
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. **3,4**
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. **3**
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. **1**
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. **2**
15. డాక్టర్ కె. రాజన్నశాస్త్రి	ద్రోణ. ఆశ్వా. **5**
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. **1**
17. డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. **2**
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. **3**
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. **1**
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. **1,2**; అశ్వ. ఆశ్వా **1,2**; మౌసల-**1**; మహా.**1**; స్వర్గా-**1**
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. **2**
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. **3**
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. **4**
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. **5**
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. **6**
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	అను. ఆశ్వా. **1,2**
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	అను. ఆశ్వా. **3,4**
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు, శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	అను. ఆశ్వా. **5**
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. **3,4**
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. **1,2**

సంకేతాక్షర సూచి

ఆది. - ఆదిపర్వం
సభా. - సభాపర్వం
ఆర. - ఆరణ్యపర్వం
విరా. - విరాటపర్వం
ఉద్యో. - ఉద్యోగపర్వం
భీష్మ. - భీష్మపర్వం
ద్రోణ. - ద్రోణపర్వం
కర్ణ. - కర్ణపర్వం
శల్య. - శల్యపర్వం
సౌప్తి. - సౌప్తికపర్వం
స్త్రీ. - స్త్రీ పర్వం
శాంతి. - శాంతిపర్వం
ఆను. - ఆనుశాసనికపర్వం
అశ్వ. - అశ్వమేధపర్వం
ఆశ్ర. - ఆశ్రమవాసపర్వం
మౌస. - మౌసలపర్వం
మహా. - మహాప్రస్థానికపర్వం
స్వర్గా. - స్వర్గారోహణపర్వం
సం. - భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా. - సంస్కృత మహాభారతము
అను. - పై ప్రతిలోని అనుబంధాలు
సంపా. - ప్రధానసంపాదకుడు

క. - కందపద్యం
వ. - వచనం
ఆ. - ఆటవెలది
తే. - తేటగీతి
సీ. - సీసం
ఉ. - ఉత్పలమాల
చ. - చంపకమాల
మ. - మత్తేభవిక్రీడితం
శా. - శార్దూలవిక్రీడితం
ఆశ్వా. - ఆశ్వాసం
క్రీ.శ. - క్రీస్తుశకం
య. - యగణం
మ. - మగణం
త. - తగణం
ర. - రగణం
జ. - జగణం
భ. - భగణం
న. - నగణం
స. - సగణం
ల. - లఘువు
గ. - గురువు
అలం. - అలంకారం
సం. - సంవత్సరం
మొ. - మొదలైన

శ్రీమదాంధ్ర మహాభారతము

సౌప్తికపర్వము-ద్వితీయాశ్వాసము

శ్రీ శాశ్వతత్వ కరణ క । లాశాలి! దయాది నిర్మల జ్ఞానమయా!
నాశోత్పత్తి రహిత! శు । ద్ధాశయ సంభజన మహిత! హరిహరనాథా! **1**

ప్రతిపదార్థం: శ్రీ= సిరియొక్క; శాశ్వతత్వ= స్థిరత్వంయొక్క; కరణ= చేయటం అనే; కలా= విద్యచేత; శాలి!= ప్రకాశించేవాడా!; దయా+ఆది= దయ మొదలైనవీ; నిర్మల= అమలినమైన; జ్ఞానమయా!= జ్ఞానమూ స్వరూపంగా కలవాడా!; నాశ+ఉత్పత్తి రహిత!= మరణమూ, పుట్టుకా లేనివాడా!; శుద్ధ+ఆశయ సంభజన మహిత!= పరిశుద్ధ చిత్తవృత్తులు గలవారియొక్క ఉత్తమసేవచేత పూజింపబడేవాడా!, హరిహరనాథా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! చంచలమైన శ్రీని స్థిరంగా చేసే కళ కలవాడా! దయ మొదలైన సద్గుణాలూ, విమలజ్ఞానమూ స్వరూపంగా కలవాడా! నాశనం, ఉత్పత్తీలేనివాడా! పరిశుద్ధాత్ముల ఉత్తమ సేవచేత పూజించబడువాడా!

విశేషం: శ్రీకి స్వభావమైన చాంచల్యాన్ని పోగొట్టి స్థిరత్వం కల్పించటం ఒకకళ. అటువంటి కళ కలవాడు హరిహరనాథుడు. అతడు దయాది స్వరూపుడు. నిర్మలజ్ఞాన స్వరూపుడు. 'నాశోత్పత్తి రహిత' పుట్టటం, ఉండటం, పెరగటం, మార్పుచెందటం, క్షీణించటం, నశించటం అని పదార్థానికి ఆరు స్థితులు. షడ్భావవికారాలు. వాటిలో ఆద్యంతాలను (పుట్టటం, నశించటం) నిషేధించటం చేత మధ్యలో ఉన్న నాలుగూ కూడా పరమేశ్వరుడికి లేవని స్పష్టపడుతున్నది. 'నాశోత్పత్తి రహిత' అనే విశేషణంలో ఉత్పత్తికంటె నాశాన్నే మొదట పేర్కొనటం, ప్రాణులకు మరణం సహజం అని చెప్పటానికి.

వ. **దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. నట్లు సూర్యోదయంబైన యా సమయంబున సమీరనందనాదిసోదరులును, శౌరిసాత్యకులుం బరివేష్టింపనున్న ధర్మతనయు పాలికిఁ బఱతెంచి ధృష్టద్యుమ్నుని సారథి సాష్టాంగ దండ ప్రణామంబు సేసి కరకమలంబులు మొగిడ్చి.** **2**

ప్రతిపదార్థం: దేవా!= ఓ భగవంతుడా! హరిహరనాథా!; వైశంపాయనుండు; జనమేజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అట్లు; సూర్య+ఉదయంబు+ఐనన్= సూర్యోదయంకాగా; ఆ సమయంబునన్= ఆవేళ; సమీరనందన+ఆది సోదరులును= భీముడు మున్నగు సోదరులూ; శౌరి సాత్యకులున్= కృష్ణసాత్యకులూ; పరివేష్టింపన్+ఉన్న= చుట్టువారగా ఉన్న; ధర్మతనయు పాలికిన్= ధర్మరాజు వద్దకు; పఱతెంచి= వచ్చి; ధృష్టద్యుమ్నుని సారథి= ధృష్టద్యుమ్నుడియొక్క సారథి; సాష్టాంగదండ ప్రణామంబు= దండాకారంగా ఎనిమిది అంగాలు నేలకు తగిలేటట్టుగా నమస్కారం; చేసి; కరకమలంబులు= హస్తపద్మాలు; మొగిడ్చి= ముడిచి.

తాత్పర్యం: దేవా! హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు: అట్లా సూర్యోదయం కాగా ఆ సమయంలో భీముడూ మొదలైన సోదరులూ, కృష్ణసాత్యకులూ చుట్టూరా ఉన్న ధర్మరాజు దగ్గరకు వచ్చి ధృష్టద్యుమ్నుడి రథసారథి సాష్టాంగ నమస్కారం చేసి, హస్తపద్మాలు ముడిచి.

విశేషం: సాష్టాంగ దండప్రణామం - జానువులూ, పాదాలూ, చేతులూ, ఉరస్సూ, ధీ, శిరస్సూ, వచస్సూ, దృష్టీ - ఈ ఎనిమిదింటినీ నేలకు తగిల్చి కర్ర ఆకారంగా బోర్లా పరుండి చేసే నమస్కారం.

సీ. 'నరవర! మన వీడు నడిరేయి కృతవర్మ । యును గృపాచార్యుండుఁ దనకుఁ దోడు
గా వచ్చి జనులు నిద్రావివశాత్ములై । యుండ నశ్వత్థామ యొకఁడు సొచ్చి
తొలుత ధృష్టద్యుమ్నుఁ ద్రుంచి తత్సోదర । తనయాది పాంచాల తతుల ముట్టి
యన్యాయవిధిని నింద్యంబైన విక్రమ । లీలాతిశయమున నేలఁ గలిపి

ఆ. చేది బలము నెల్లఁ జెండి మాత్స్య ప్రభ । ద్రకులు మేలుకాంచి ద్రౌపదేయు
లను శిఖండిఁ గూర్చికొని తన్నుఁ దాఁకిన । బెట్టు చంపె నంతవట్టు వారి. 3

ప్రతిపదార్థం: నరవర!= రాజా! ధర్మరాజా!; మనవీడు= మనశిబిరం; నడిరేయి= అర్ధరాత్రి; కృతవర్మయును; కృపాచార్యుండున్; తనకున్; తోడు+కాన్= సహాయంగా; వచ్చి; జనులు; నిద్రా వివశ+ఆత్ములు+ఐ= నిద్రలో ఒళ్ళు మరచినవారై; ఉండన్= ఉండగా; అశ్వత్థామ+ఒకఁడు= అశ్వత్థామ ఒక్కడూ; చొచ్చి= ప్రవేశించి; తొలుతన్= మొదట; ధృష్టద్యుమ్నున్; త్రుంచి= వధించి; తద్+సోదర తనయ+ఆది పాంచాల తతులన్= అతడి సోదరులూ, కొడుకులూ మొదలైన పాంచాలవీరుల సమూహాలను; ముట్టి= తాకి; అన్యాయవిధిని= అధర్మపద్ధతిలో; నింద్యంబు+ఐన= నిందింపదగిన; విక్రమ లీలా+అతిశయమునన్= పరాక్రమలీల ఆధిక్యంతో; నేలన్+కలిపి= చంపి; చేది బలమున్+ఎల్లన్= చేది దేశపుసేన నంతనూ; చెండి= వధించి; మాత్స్య ప్రభద్రకులు= మాత్స్యులూ, ప్రభద్రకులూ; మేలుకాంచి= మేల్కొని; ద్రౌపదేయులను= ద్రౌపది కొడుకులనూ; శిఖండినీ= శిఖండినీ; కూర్చికొని= కూడగట్టుకుని; తన్నున్= తనను; తాఁకినన్= మార్కొనగా; అంతవట్టువారిన్= వాళ్ళను అంతమందినీ; బెట్టు= క్రూరంగా; చంపెన్= చంపాడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! మన శిబిరంలోకి అర్ధరాత్రి కృతవర్మా, కృపాచార్యుడూ తనకు తోడుగా వచ్చి, జనం నిద్రలో ఒళ్ళు మరచిపోయి ఉండగా, అశ్వత్థామ ఒక్కడూ ప్రవేశించి, మొదట ధృష్టద్యుమ్నుడిని వధించి, అతడి సోదరులూ, కొడుకులూ మొదలైన పాంచాల వీరులను అధర్మ పద్ధతిలో నింద్యమైన పరాక్రమం ప్రదర్శించి చంపి, చేది సైన్యాన్ని అంతనూ వధించి, మాత్స్యులూ, ప్రభద్రకులూ మేలుకొని ద్రౌపదికొడుకులనూ, శిఖండినీ కూడగట్టుకుని తనను ఎదిరిస్తే, వాళ్ళను అంతమందినీ దారుణంగా చంపాడు.

వ. మఱియును. 4

తాత్పర్యం: ఇంకా.

స్రగ్ధర.

వీడెల్లం దల్లడిల్లన్, వివిధ గతులమై విక్రమోల్లాస మొందం,
గ్రీడాకల్పంబుగా, నాకృతిఁగని ప్రజ శంకించి దైత్యుం డనం, జెం
డాడెన్. శీర్ష వ్రజంబున్, హరులగముల వేఁటాడె, నేనుంగులం దు
న్మాడెం, గౌక్షేయ హేలాభ్యసనలసిత బాహార్గళా భీషణుండై. 5

ప్రతిపదార్థం: వివిధ గతులమైన్= రకరకాల పద్ధతులతో; విక్రమ+ఉల్లాసము+ఒందన్= పరాక్రమం ప్రకాశించగా; క్రీడా+కల్పంబుగాన్= ఆటలాగా; ప్రజ= జనం; ఆకృతిన్= ఆకారాన్ని; కని= చూచి; శంకించి= అనుమానించి; దైత్యుండు+అనన్= రాక్షసుడనగా; కౌక్షేయ= ఖడ్గంయొక్క; హేలా+అభ్యసన= సౌలభ్యంకోసమైన అభ్యాసంచేత; లసిత= ప్రకాశించిన; బాహా+అర్గళ= తలుపు గడియల వంటి బాహువులచేత; ఆభీషణుండు+ఐ= మిక్కిలి భయంకరుడై; వీడు+ఎల్లన్= శిబిరమంతా; తల్లడిల్లన్= కలతచెందగా; శీర్షవ్రజంబున్= తలల సమూహాన్ని; చెండాడెన్= ఖండించాడు; హరుల గములన్= గుర్రాల గుంపులను; వేంటాడెన్; తున్మాడెన్= ఖండించాడు.

తాత్పర్యం: అశ్వత్థామ రకరకాల పద్ధతులతో పరాక్రమం ఒప్పేటట్లు, ఆటవలె, జనం తన ఆకారం చూచి అనుమానించి రాక్షసుడనగా, ఖడ్గలీలాభ్యాసంచేత ప్రకాశించే భుజార్గళాలు కలిగి భయంకరుడై, శిబిరం అంతా కలతచెందగా, తలల సమూహాన్ని ఖండించాడు. గుర్రాల గుంపులను వేటాడాడు. ఏనుగులను వధించాడు.

తే. **అడవి దరమిడి నఱుకంగ నందుఁ గల వి । హంగమంబులు గలగొన నఱచు తెఱఁగు**
దోఁచె నాతఁడు యోధులఁ దునుమఁ గలఁగి । యన్యజనము లాక్రందించునప్ప డధిప! 6

ప్రతిపదార్థం: అధిప!= రాజా! ధర్మరాజా!; ఆతఁడు= ఆ అశ్వత్థామ; యోధులన్= వీరులను; తనుమన్= వధించగా; కలఁగి= కలతచెంది; అన్య జనములు= ఇతర జనులు; ఆక్రందించు+అప్పుడు= ఏడ్చేటప్పుడు; అడవి= అడవిని; తరము+ఇడి= వరసపెట్టి; నఱుకంగన్= నరకగా; అందున్+కల= అందులో ఉన్న; విహంగమంబులు= పక్షులు; కలగొనన్= వ్యాపించేటట్టు; అఱచు తెఱఁగు+తోఁచెన్= అరిచే విధం స్ఫురించింది.

తాత్పర్యం: ధర్మరాజా! ఆ అశ్వత్థామ యోధులను వధించగా కలతచెంది ఇతర జనులు ఏడుస్తూంటే, అడవిని వరుసబెట్టి నరకగా అందులో ఉన్న పక్షులు అంతటా వ్యాపించేటట్లు అరచే విధం స్ఫురించింది.

విశేషం: అలం: స్మృతి. ఇక్కడ అశ్వత్థామ యోధులను నరకగా ఇతరులు ఏడవటం చేస్తూ, అడవిని నరికినప్పుడు అందులోని పక్షులు అరవటం తోచింది- అనటంచేత అలంకారం స్మృతి. ఉపమేయోపమానాలలో ఒకదానిని చూచినప్పుడు, ఇంకొకటి స్ఫురించినదని చెప్పితే అది స్మృతిమదలంకారం అవుతుందని లక్షణం.

క. **అఱచినఁ బఱచిన వ్రేకులు । గఱచిన నతఁ డించుకయును గరుణింపక యం**
దఱ నుఱుముసేసె గుంపుల । కుటికి యుటికి ఖడ్గదారుణోల్లసనములన్. 7

ప్రతిపదార్థం: అతఁడు= అశ్వత్థామ; గుంపులకున్= గుంపులలోకి; ఉటికి+ఉటికి= మిక్కిలి దుమికి; ఖడ్గదారుణ+ఉల్లసనములన్= కత్తియొక్క భయంకరములైన ప్రకాశాలతో; అందఱన్= అందరినీ; అఱచినన్= అరచినా; పఱచినన్= పారిపోయినా; వ్రేళులు+కఱచినన్= తమ తప్పు తాము ఒప్పుకొనటం సూచించినా; కరుణింపక= దయచూపక; నుఱుము+చేసెన్= ఖండించాడు.

తాత్పర్యం: అశ్వత్థామ గుంపులలోకి ఉరికి ఉరికి కత్తి భయంకరంగా మెరుస్తూండగా, అందరినీ అరిచినా, పరుగెత్తుకొనిపోయినా, తమ తప్పు తాము ఒప్పుకొనటం సూచించినా, దయచూపక ఖండించాడు.

వ. **ఆ సమయంబున.** 8

తాత్పర్యం: అప్పుడు.

మహాస్రగ్ధర.

కృపుఁడున్ హార్దిక్యుఁడున్ వాకిట నిలిచి భయాక్షిప్తయోధవ్రజంబున్
నృపులున్ వే నిర్గమింప న్వివిధ శరముల న్మేదినిం గూల్చుచున్ ఘో
రపు సంరంభంబు దుర్వారముగఁ గెరలి రౌద్రంబు రూపంబు దాల్పం
గుపితక్రవ్యాదులో నాఁ గుచరిత నిరతిం గ్రూరతాధుర్యు లైనన్. 9

ప్రతిపదార్థం: కృపుఁడున్; హార్దిక్యుఁడున్= కృతవర్మా; వాకిటన్= ద్వారదేశంలో; నిలిచి; భయ= భయంచేత; ఆక్షిప్త= కలతపడిన; యోధ వ్రజంబున్= వీరుల గుంపూ; నృపులున్= రాజులూ; వే= వేగంగా; నిర్గమింపన్= బయటికి రాగా; వివిధ శరములన్= రకరకాల బాణాలతో; మేదినిన్= భూమిమీద; కూల్చుచున్= కూలుస్తూ; ఘోరము+సంరంభంబు= భయంకరమైన సంక్షోభం; దుర్వారముగన్= వారింపరానిదికాగా; కెరలి= చెలరేగి; రౌద్రంబు= రౌద్రరసం; రూపంబు+తాల్పన్= ఆకారం ధరించగా; కుపితక్రవ్యాదులో నాన్= కోపించిన రాక్షసులూ అన్నట్లు; కుచరిత నిరతిన్= చెడునడతయందలి ఆసక్తితో; క్రూరతా ధుర్యులు+ఐనన్= క్రూరత్వపు భారం వహించినవారు కాగా- మిక్కిలి క్రూరులు కాగా.

తాత్పర్యం: కృపాచార్యుడూ, కృతవర్మా ద్వారదేశంలో నిలిచి, భయంతో కలతచెందిన వీరుల సమూహమూ, రాజులూ వేగంగా బయటికి వస్తూ ఉంటే వాళ్ళను రకరకాల బాణాలతో నేలకూలుస్తూ, మహా సంక్షోభం వారించరానిది కాగా, చెలరేగి, రౌద్రరసం ఆకారం ధరించినట్లు, కోపించిన రాక్షసులా అన్నట్లు, చెడ్డ నడత అందలి ఆసక్తితో, మిక్కిలి క్రూరులు కాగా. (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. 'రౌద్రంబు రూపంబు దాల్పన్' - 'కుపిత క్రవ్యాదులోనాన్' - అలంకారాలు ఉత్ప్రేక్షలు.

వ. తత్ప్రదేశంబు నవ్వీటిలోనుంబోలెఁ బీనుంగుపెంట యయ్యె నట్లు శిబిరంబునం గల కరితురగ నర నికరంబులు నిశ్శేషత్వంబు నొందె నాయుశ్శేషంబు కతంబునం గృతవర్మచేతం బట్టువడి యతండు మందల విడువ నిట వచ్చితి' నని చెప్పినం బాండవాగ్రజుండు. 10

ప్రతిపదార్థం: తద్+ప్రదేశంబున్= ఆ ద్వారదేశంకూడా; ఆ+వీటిలోనున్+పోలెన్= ఆ శిబిరంలోపల వలెనే; పీనుంగుపెంట+ అయ్యెన్= శవాల నెలవు అయింది; అట్లు; శిబిరంబునన్+కల= శిబిరంలో ఉన్న; కరి తురగ నర నికరంబులు= ఏనుగుల, గుర్రాల, మనుష్యుల సమూహాలు; నిశ్శేషత్వంబున్+ఒందెన్= ఏమీ మిగలకుండా పోయాయి; ఆయుస్+శేషంబు కతంబునన్= ఆయుర్దాయం మిగలబట్టి; కృతవర్మచేతన్; పట్టువడి; అతండు; మందల విడువన్= ప్రాణాలతో విడిచిపెడితే; ఇటన్= ఇక్కడకు; వచ్చితిన్= వచ్చాను; అని; చెప్పినన్= చెప్పగా; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడు ధర్మరాజు.

తాత్పర్యం: ఆ ద్వారదేశంకూడా శిబిరంలోపల వలెనే పీనుగుపెంట అయింది. ఆ రీతిగా శిబిరంలో ఉన్న ఏనుగుల, గుర్రాల, మనుష్యుల సమూహాలు ఏమీ మిగలకుండా పోయాయి. ఏదో కొంత ఆయుర్దాయం ఇంకా మిగలబట్టి కృతవర్మ చేతికి దొరికి, అతడు ప్రాణాలతో విడిచిపెడితే, ఇట్లా వచ్చాను.' అని చెప్పగా ధర్మరాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. శోకవేగసంతప్తుఁడై సొలసివ్రాల । సంభ్రమమ్మునఁ బట్టిరి సాత్యకియును
గవలు భీమసేనుండును గరతలముల । నుమ్మలికము నెమ్మనములఁ గ్రమ్ముదేర. 11

ప్రతిపదార్థం: శోక వేగ సంతప్తుఁడు+ఐ= దుఃఖోద్రేకం చేతమిక్కిలి తపించినవాడయి; సొలసి+వ్రాలన్= మూర్ఛపోయి వాలిపోగా; సాత్యకియును; కవలున్= నకుల సహదేవులూ; భీమసేనుండును= భీముడూ; నెఱ+మనములన్= మనస్సులలో; ఉమ్మలికము= దుఃఖం; క్రమ్ముదేరన్= వ్యాపించగా; సంభ్రమమ్మునన్= వేగిరపాటుతో; కరతలములన్= అరచేతులతో; పట్టిరి.

తాత్పర్యం: దుఃఖోద్రేకంతో మిక్కిలి తపించి మూర్ఛపోయి వాలిపోగా, సాత్యకీ, నకుల సహదేవులూ, భీముడూ, మనస్సులలో దుఃఖం పొంగగా వేగిరపాటుతో ఆయనను అరచేతులతో పట్టుకొన్నారు.

వ. కొండొకసేపునకు మూర్ఛదేఱి యన్నరపాలుం డెలుంగు రాల్పడ నిట్లనియె. 12

ప్రతిపదార్థం: ఆ+నరపాలుండు= ఆ రాజు- ధర్మరాజు; కొండొకసేపునకున్= కొంతసేపటికి; మూర్ఛ+తేఱి= మూర్ఛనుండి తెప్పిరిల్లి; ఎలుంగు= కంఠస్వరం; రాల్పడన్= డగ్గుత్తిక చెందగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఆ ధర్మరాజు కొంతసేపటికి మూర్ఛనుండి తేరుకొని కంఠస్వరం డగ్గుత్తికపడగా ఇట్లా అన్నాడు:

ధర్మరాజు తన పుత్రు లశ్వత్థామచేఁ జచ్చుట విని పలవించుట (సం. 10-19-9)

సీ. 'ఎట్టివారలకైన నెఱుఁగంగ నగునె కా । ర్యంబులగతు లుపాయంబు బలుపు
వెలయంగ నట్లు శత్రుల బంధుమిత్ర పు । త్రామాత్య యుతముగ నాహవమున
నందఱ నేఁ దెగటార్చినవాఁడనై । విజయంబు సేకొని విభవమెసఁగ
నిట యేఁగుదెంచితి నట బంధుమిత్ర పు । త్రామాత్యయుతముగ నస్మదీయ

తే. బలము నెల్లను ముట్టి శత్రులు నితాంత । ఘోరముగఁ దెగటార్చిరి కుత్సితంపు
విధము వాటిల్లె నస్థిరవిజయమునఁ బ । రాజయమని యాడు నిఁక ధరాజనంబు. 13

ప్రతిపదార్థం: ఎట్టివారలకున్+ఐనన్= ఎంతటివారికైనా; కార్యంబుల గతులు= పనుల పోకడలు; ఎఱుఁగంగన్+అగునె?= తెలిసికో శక్యమవుతుందా?; ఉపాయంబు బలుపు= ఉపాయపుదార్ఢ్యం; వెలయంగన్= ఒప్పగా; అట్లు; శత్రులన్= శత్రువులను; బంధుమిత్ర పుత్ర+అమాత్య యుతముగన్= చుట్టాలతో, స్నేహితులతో, కుమారులతో, మంత్రులతో సహా; అందఱన్= అందరినీ; ఆహవమునన్= యుద్ధంలో; ఏన్= నేను; తెగటార్చినవాఁడను+ఐ= చంపినవాడినయి; విజయంబు+చేకొని= గెలుపొంది; విభవము+ఎసఁగన్= వైభవం అతిశయించగా; ఇట+ఏఁగుదెంచితిన్= ఇక్కడికి వచ్చాను; అటన్= అక్కడ; బంధుమిత్ర-పుత్ర+అమాత్య యుతముగన్= చుట్టాలతో, మిత్రులతో, కుమారులతో, మంత్రులతో సహా; అస్మదీయ బలమున్+ ఎల్లను= మా సైన్యాన్ని అంతనూ; ముట్టి= తాకి; శత్రులు= వైరులు; నితాంత ఘోరముగన్= మిక్కిలిఘోరంగా; తెగటార్చిరి= చంపారు; కుత్సితము+విధము= కీడ్పడినరీతి; వాటిల్లెన్= సంభవించినది; ఇఁకన్= ఇకమీద; ధరాజనంబు= లోకం; అస్థిర విజయమునన్= నిలకడలేని గెలుపుచేత; పరాజయము+అని+ఆడున్= ఓటమి అని అంటుంది.

తాత్పర్యం: 'ఎంతటివారికైనా పనుల పోకడలు తెలిసికొనటానికి శక్యం కాదు. మంచి ఉపాయంతో ఆ రీతిగా శత్రువులను చుట్టాలతో, స్నేహితులతో, కుమారులతో, మంత్రులతో సహా అందరినీ యుద్ధంలో చంపి నేను గెలుపొంది, వైభవం అతిశయించగా ఇక్కడికి వస్తే; అక్కడ చుట్టాలతో, స్నేహితులతో, కుమారులతో, మంత్రులతో సహా మా సైన్యాన్ని అంతనూ తాకి వైరులు మిక్కిలి ఘోరంగా చంపారు. కీడ్పాటు సంభవించింది. ఇకమీద జనులు నిలకడలేని విజయం పరాజయంతో సమానం అని అంటారు.

స్రగ్ధర.

బాణజ్వాలా నితాంత ప్రసరణముల శుంభద్విషత్సాంద్ర సైన్య
శ్రేణీ కాంతారముల్ చూర్ణితములుగఁ బటుక్రీడమైఁ దేజరిల్లెన్
ద్రోణాచార్యాగ్ని; వేఁడిం దొడరక మెఱసెన్ దోర్విలాసంబు; వైరుల్
ప్రాణంబుల్ నాఁచికోల్ దప్పదు; తుది విధి యబ్బాలురం ద్రెళ్ళవైచెన్. 14

ప్రతిపదార్థం: ద్రోణ+ఆచార్య+అగ్ని= ద్రోణాచార్యుడనే అగ్ని; బాణ= బాణాలు అనే; జ్వాలా= మంటలయొక్క; నితాంత= అధికమైన; ప్రసరణములన్= ప్రసారాలచేత; శుంభత్= ప్రకాశిస్తున్న; ద్విషత్= శత్రువులయొక్క; సాంద్ర= దట్టమైన; సైన్య= సేనలయొక్క; శ్రేణీ= వరుసలు అనే; కాంతారముల్= అడవులు; చూర్ణితములుగన్= పొడులుగా; పటు క్రీడమైన్= తీవ్రమైన విహారంతో; తేజరిల్లెన్= ప్రకాశించింది; దోస్(ః)+విలాసంబు= భుజబలలీల; వేఁడిన్= ఆ అగ్నివేడిని; తొడరక= పొందక; మెఱసెన్= ప్రకాశించింది - ఒప్పింది; వైరుల్= శత్రువులు; ప్రాణంబుల్; నాఁచికోల్= అపహరించటం; తప్పదు; తుదిన్= చివర; విధి= దైవం; ఆ+బాలురన్= ఆ పిల్లలను; త్రెళ్ళన్+వైచెన్= చంపించింది.

తాత్పర్యం: ద్రోణాచార్యుడనే అగ్ని బాణాలనే జ్వాలల అధికమైన ప్రసారాలతో శత్రువుల దట్టమైన సేన లనే అడవులు నుగ్గు నుగ్గు అయ్యేటట్లు తీక్షణంగా విహరించి ప్రకాశించింది. ఆ అగ్ని వేడిని పొందక మన భుజబలం ఒప్పింది. శత్రువులు మనప్రాణాలు అపహరించటం తప్పదు. చివరకు దైవం ఆ పిల్లలను చంపించింది.

విశేషం: అలం: రూపకం. 'బాణాజ్వాలా', 'సైన్యశ్రేణీ కాంతారముల్', 'ద్రోణాచార్యాగ్ని' - అనేచోట్ల ఉపమేయోపమానాలకు అభేదం చెప్పబడింది కాబట్టి అలంకారం రూపకం. శత్రువులు ప్రాణాలు తీయటం ఎటూ తప్పదు కాని చివరకు పిల్లలు పోయారే అని ధర్మరాజు బాధ.

మహాస్రగ్ధర.

శరదంష్ట్రా భీషణంబై చటుల రిపుమృగస్వైర విధ్వంసలీలా
స్ఫురణన్ శోభిల్లు రాధాసుతుఁ డను పులి విస్ఫూర్జితంబున్ సహింపన్
వెరవున్ దర్పంబు గల్గెన్; వికల రిపులచే వీటిఁబోయెం గుమారో
త్కర; మిం కేమందు? నాపత్పరికలన ప్రమాదంబునం గాక యున్నే? 15

ప్రతిపదార్థం: శర= బాణాలు అనే; దంష్ట్రా= కోరలచేత; భీషణంబు+ఐ= భయంకరమయినదయి; చటుల= చంచలమైన; రిపు= శత్రువులనెడి; మృగ= లేళ్ళయొక్క; స్వైర= తన ఇచ్చవచ్చినట్టి; విధ్వంస లీలా= వినాశలీల యొక్క; స్ఫురణన్= తోచుటతో; శోభిల్లు= ప్రకాశించే; రాధాసుతుఁడు+అను పులి విస్ఫూర్జితంబున్= రాధకొడుకు(కర్ణుడు) అనే పులియొక్క గాండ్రింపు; సహింపన్= ఓర్చుకోవటానికి; వెరవున్= ఉపాయమూ; దర్పంబున్= గర్వమూ; కల్గెన్= కలిగాయి; వికల రిపులచేన్= క్షుద్ర శత్రువులచేత; కుమార+ఉత్కరము= కుమారుల సమూహం; వీటిఁబోయెన్= నశించింది; ఇంకన్+ఏమి+అందున్?= ఇంకేమంటాను?; ప్రమాదంబునన్= ఏమరుపాటుచేత; ఆపద్+పరికలన= ఆప్రద్గహణం; కాక+ఉన్నే?= కాకుండా ఉంటుందా?;

తాత్పర్యం: బాణాలనే కోరలచేత భయంకరమై, కదిలే శత్రువులనే లేళ్ళను ఇష్టంవచ్చినట్లు చంపి శోభిల్లే కర్ణుడనే పులి గాండ్రింపును ఓర్చుకొనే ఉపాయమూ, గర్వమూ కలిగి, క్షుద్ర శత్రువులచేత కుమారుల సమూహం నశించింది. ఇంక అనటాని కేముంది? ఏమరుపాటువలన ఆపద సంభవించకుండా ఉంటుందా?

విశేషం: అలం: రూపకం. అర్థాంతరన్యాసం. 'శరదంష్ట్ర', 'రిపుమృగ', 'రాధాసుతుఁ డను పులి' అనే చోట్ల ఉపమేయోపమానాలకు అభేదం చెప్పబడటం వలన అలంకారం రూపకం. ఇందులో 'వికల రిపులచేత వీటఁబోయెం గుమారోత్కరము' అనే విశేషాంశం 'ఆపత్పరికలన ప్రమాదంబునం గాకయున్నే?' అనే సామాన్యాంశంచేత సమర్థింపబడింది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

స్రగ్ధర.

శాతాస్త్ర స్ఫారవీచీ సముదయ రభసాశ్చర్యసంపాది హేలా
స్ఫీతంబై క్రమ్ముదేరన్ బెదరక కలఁచెన్ భీష్మవారాశిఁ దుచ్ఛా
రాతి వ్యాపారదుర్వారతఁ దెగియెఁ గుమారవ్రజం బక్కటా! ని
ద్రా తంద్రావ్యాప్తి నక్రూరతఁ బొరసి భుజాప్రౌఢి వమ్మయ్యెఁ జుమ్మీ. 16

ప్రతిపదార్థం: కుమార వ్రజంబు= కుమారుల సమూహం; శాత= వాడియైన; అస్త్ర= బాణాలు అనే; స్ఫార= పెద్దవైన; వీచీ= తరంగాలయొక్క; సముదయ= సమూహంయొక్క; రభస= తీవ్రతచేతా; ఆశ్చర్య సంపాది= ఆశ్చర్యాన్ని కలిగించే; హేలా= సౌలభ్యంచేత; స్ఫీతంబు+ఐ= వ్యాపించినదయి; క్రమ్ముదేరన్= పైకి ఉబుకగ; బెదరక= భయపడక; భీష్మ వారాశిన్= భీష్ముడనే సముద్రాన్ని; కలఁచెన్= కలతచెందించింది; అక్కటా!= అయ్యో!; తుచ్ఛ= నీచమైన; అరాతి= శత్రువులయొక్క; వ్యాపార= పనియొక్క; దుర్వారతన్= వారించరామిచేత; తెగియెన్= నశించింది; నిద్రా తంద్రా వ్యాప్తిన్= నిద్రవలని మైమరుపుయొక్క వ్యాప్తిచేత; అక్రూరతన్= క్రూరత్వం లేమిని; పొరసి= పొంది; భుజ-ప్రౌఢి= భుజబలనైపుణ్యం; వమ్ము+అయ్యెన్+చుమ్మీ= వ్యర్థమయింది సుమా!

తాత్పర్యం: కుమారుల సమూహం - వాడి బాణాలు అనే పెద్ద తరగల సమూహపు తీవ్రతతోనూ, ఆశ్చర్యకర సౌలభ్యం తోనూ వ్యాపించినదై మీదికిరాగా, భయపడక, భీష్మసముద్రాన్ని కలతచెందించింది. అయ్యో! ఇప్పుడు నీచశత్రువుల పని వారించరాకపోవటంచేత నశించింది. నిద్రమత్తుచేత క్రూరత్వం కోలుపోయి భుజబలనైపుణ్యం వ్యర్థమయింది సుమా!

విశేషం: అలం: రూపకం. 'శాతాస్త్ర స్ఫార వీచీ.' 'భీష్మ వారాశి' అనేచోట్ల ఉపమేయోపమానాల అభేదం వలన అలంకారం రూపకం.

ఆ. అధికబలము గెల్చి యవనీపతులు గొంద । అతివిహీనరిపుల యాక్రమమున
మడిసి రకట! జలధి వెడలి సన్నపుఁ గ్రయ్య । మునిఁగి రూపడంగు జనుల మాడ్కి. 17

ప్రతిపదార్థం: జలధిన్ వెడలి= సముద్రంలోంచి వెలికివచ్చి - సముద్రాన్ని దాటి; సన్నము+క్రయ్యన్= సన్నపాటి కాలువలో; మునిఁగి; రూపు+అడంగు= నశించే; జనులమాడ్కిన్= జనులవిధంగా; అకట!= అయ్యో!; అధిక బలమున్= గొప్ప సైన్యాన్ని; గెల్చి= గెలిచి; అవనీపతులు+కొందఱు= రాజులు కొంతమంది; అతివిహీన రిపుల+ఆక్రమమునన్= మిక్కిలి నీచశత్రువుల ఆక్రమణంచేత; మడిసిరి= చచ్చిపోయారు.

తాత్పర్యం: సముద్రాన్ని దాటి సన్నపాటి కాలువలో మునిగిపోయి నశించే జనుల విధంగా, కొంతమంది రాజులు గొప్ప సేనను గెలిచి మిక్కిలి తక్కువ రకపు శత్రువుల ఆక్రమణంచేత చచ్చిపోయారు. అయ్యో!

విశేషం: అలం: ఉపమ, భీష్మ ద్రోణ కర్ణాదులవంటి మహావీరులను ఓడించి, కొంతమంది రాజులు కృపకృతవర్మాశ్వత్థామల వంటి తక్కువరకం శత్రువులచేత చచ్చారని భావం.

చ. జనకుఁడు లేమికిం గడు విషాదము నొందెడి కృష్ణ యిమ్మెయిం
దనయులు భ్రాతలుం దెగుట దా విని మూర్ఛ మునుంగు నెమ్మనం
బును నవశంపుమేను నయి భూస్థలిఁ ద్రెళ్ళక యున్నె? త్రెళ్ళదే
నిని బటుశోకవేగమున నిర్భరవేదనఁ జెందకుండునే? **18**

ప్రతిపదార్థం: జనకుఁడు= తండ్రి ద్రుపదుడు; లేమికిన్= లేకపోవటానికి - చచ్చిపోవటానికి; కడున్= మిక్కిలి; విషాదమున్+ఒందెడి= విచారించే; కృష్ణ= ద్రౌపది; ఈ+మెయిన్= ఈ విధంగా; తనయులున్= కొడుకులూ; భ్రాతలున్= సోదరులూ; తెగుట= నశించటం; తాన్= తాను; విని; మూర్ఛన్+మునుంగు= మూర్ఛపోయే; నెఱి+మనంబును= మనస్సూ; అవశము+మేనున్+అయి= వశం తప్పిన శరీరమూ కలదై; భూస్థలిన్= నేలమీద; త్రెళ్ళక+ఉన్నె?= కూలిపోదా?; త్రెళ్ళదు+ఏనిని= కూలిపోకపోయినా; పటుశోక వేగమునన్= తీవ్ర దుఃఖోద్రేకంతో; నిర్భర వేదనన్= తీవ్రమైన బాధను; చెందక+ఉండునే?= పొందకుండా ఉంటుందా?

తాత్పర్యం: తండ్రి అయిన ద్రుపదుడు పోయాడని మిక్కిలి పరితపించే ద్రౌపది ఈ విధంగా కొడుకులూ, సోదరులూ నశించారని విని మూర్ఛిల్లే మనస్సూ, వశంతప్పిన శరీరమూ కలదై నేలమీద కూలిపోదా? ఒకవేళ కూలిపోకపోయినా, తీవ్ర దుఃఖోద్రేకంతో మిక్కిలి బాధపడకుండా ఉంటుందా?

క. మున్నిట్టి తెఱఁగు శోకం । బెన్నఁడుఁ దా ననుభవించి యెఱుఁగ దకట! నేఁ
డన్నెలఁత యలఁత పెల్లున । నెన్ని యవస్థలకు వచ్చి యెట్లయ్యెడినో!' **19**

ప్రతిపదార్థం: మున్ను= ఇంతకుముందు; ఇట్టి తెఱఁగు శోకంబు= ఈ విధమైన దుఃఖం; ఎన్నఁడున్= ఎప్పుడూ; తాన్= తాను; అనుభవించి+ఎఱుఁగదు= అనుభవించి ఎరుగదు; అకట!= అయ్యో!; నేఁడు= ఇప్పుడు; ఆ+నెలఁత= ఆ ఇంతి - ద్రౌపది; అలఁత పెల్లునన్= దుఃఖాతిశయంతో; ఎన్ని అవస్థలకున్ వచ్చి= ఎంత బాధపడి; ఎట్లు+అయ్యెడినో!= ఏమయిపోతుందో!

తాత్పర్యం: ఇంతకు ముందెప్పుడూ ఈ విధమైన దుఃఖం తాను అనుభవించి ఎరుగదు. అయ్యో! ఆమె దుఃఖాతిశయంతో ఎంత బాధపడి ఏమయిపోతుందో!'

వ. అని వగలం బొగిలి పాంచాలి రావింపం దలంచి తన పనుపున నవ్వేలంది ద్రుపద విరాటులు చచ్చిన మఱునాఁడు తదీయ పత్నులకు శోకాపనోదంబు సేయుటకై సుభద్రయు నుత్తరయును దోనరుగ విడిదలనుండి విరాటుపురంబున కరిగి ద్రుపదుండును గొడుకులు నవ్వీటికి వచ్చునాఁడు దోడన వచ్చి కోడండ్రును దానును నందయున్న యా ద్రుపదు పత్నిని, విరాటపత్నిం గాంచి పదంపడి సుభద్ర యర్జును ననుమతి వడసి ద్వారవతికిం బోవ నమ్మత్స్యపురంబున నునికిం జేసి యన్నరనాథుండు నకులుం గనుంగొని యతిత్వరితగమనంబునకుం దగు రథంబునం జటులంబులైన రథ్యంబులం బూన్చికొని యుపప్లావ్యంబున కుం జని ద్రుపదనందనను, దక్కును మనదెసలంగలుగు నంగనలను ద్రుపదమత్స్యపతి పక్షంబు భామలను

దోడ్కొని యవ్విడిదలకుం జనుదెమ్మని చెప్పి యేము నయ్యెడకుం జనుదెంచెద మనుటయు నతండు తదుక్త ప్రకారంబునఁ జనియె. నజ్జనవల్లభుండు తక్కటి తమ్ములును, దామోదర సాత్యకులును నడలుచుఁ దన్నుం బొదివికొని చనఁ గౌరవ శిబిరంబునం గల జనంబులు గొల్చి వోవ నేడ్చుచు నిజశిబిరంబునకుం బోయి తత్ప్రదేశంబున. 20

ప్రతిపదార్థం: అని; వగలన్= దుఃఖాలతో; పొగిలి= కుమిలి; పాంచాలిన్= ద్రౌపదిని; రావింపన్+తలంచి= రప్పించనెంచి; తన పనుపునన్= తన ఆజ్ఞచేత; ఆ+వెలంది= ఆ స్త్రీ - ద్రౌపది; ద్రుపదవిరాటులు= ద్రుపదుడూ, విరాటుడూ; చచ్చిన మఱునాఁడు= చచ్చిపోయిన మరుసటి దినం; తదీయ పత్నులకున్= వారి భార్యలకు; శోక+అపనోదంబు+చేయుటకై= దుఃఖం పోగొట్టడానికని; సుభద్రయున్= సుభద్రా; ఉత్తరయును= ఉత్తరా; తోన్+అరుగన్= వెంటరాగా; విడదలనుండి= శిబిరంనుండి; విరాటు నగరంబునకున్= విరాటుడి పట్టణానికి; అరిగి= వెళ్ళి; ద్రుపదుండును; కొడుకులున్; ఆ+వీటికిన్= ఆ పట్టణానికి; వచ్చునాఁడు= వచ్చేటప్పుడు; తోడన్+అ= వెంటనే; వచ్చి; కోడండ్రును+తానును= కోడళ్ళూ, తనూ; అందున్+అ+ఉన్న= అక్కడే ఉన్నట్టి; ఆ ద్రుపదుపత్నిని= ఆ ద్రుపదుడి భార్యనూ; విరాటపత్నిన్= విరాటుడి భార్యనూ; కాంచి= చూచి; పదంపడి= తరువాత; సుభద్ర; అర్జును+అనుమతి= అర్జునుడి సమ్మతి; పడసి= పొంది; ద్వారవతికిన్+పోన్= ద్వారకకు వెళ్ళటానికి; ఆ+ మత్స్య పురంబునన్= ఆ మత్స్యనగరంలో-విరాటనగరంలో; ఉనికిన్+చేసి= ఉండటంచేత; ఆ+నరనాథుండు= ఆ రాజు-ధర్మరాజు; నకులున్+కనుంగొని= నకులుడిని చూచి; అతి త్వరిత గమనంబునకున్= మిక్కిలి తొందరగా వెళ్ళటానికి; తగు రథంబునన్= తగిన రథానికి; చటులంబులు+ఐన= చంచలములయిన; రథ్యంబులన్= గుర్రాలను; పూన్చికొని= కట్టి; ఉపప్లావ్యంబునకున్+చని= ఉపప్లావ్యపురానికి వెళ్ళి; ద్రుపద నందనను= ద్రౌపదినీ; తక్కును= మిగిలిన; మన దెసన్+కలుగు+ అంగనలను= మనవైపు స్త్రీలను; ద్రుపద మత్స్యపతి పక్షంబు భామలను= ద్రుపదరాజు; విరాటరాజు వైపు స్త్రీలను; తోడ్కొని= వెంటబెట్టుకొని; ఆ+విడదలకున్= ఆ శిబిరానికి; చనుదెమ్ము+అని చెప్పి= రమ్మని చెప్పి; ఏమున్= మేముకూడా; ఆ+ఎడకున్= ఆ ప్రదేశానికి; చనుదెంచెదము+అనుటయున్= వస్తాము అనగా; అతండు= నకులుడు; తద్+ఉక్త ప్రకారంబునన్= అతడు (ధర్మరాజు) చెప్పిన రీతిగా; చనియెన్= వెళ్ళాడు; ఆ+జనవల్లభుండు= ఆ రాజు(ధర్మరాజు); తక్కటి తమ్ములును= తక్కిన తమ్ములూ; దామోదర సాత్యకులును= కృష్ణసాత్యకులూ; అడలుచున్= దుఃఖిస్తూ; తన్నున్= తనను; పొదివికొని= కూడుకొని; చనన్= వెళ్ళగా; కౌరవ శిబిరంబునన్+కల జనంబులు= కౌరవశిబిరంలో ఉన్న జనులు; కొల్చి+పోవన్= సేవించి నడువగా; ఏడ్చుచున్= ఏడుస్తూ; నిజ శిబిరంబునకున్= తన శిబిరానికి; పోయి; తద్+ప్రదేశంబునన్= అక్కడ.

తాత్పర్యం: అని దుఃఖంతో కుమిలి ద్రౌపదిని రప్పించనెంచాడు. తన ఆజ్ఞ చొప్పున ఆమె ద్రుపద విరాటులు చచ్చిపోయిన మర్నాడు వారి భార్యలను ఓదార్చటానికని సుభద్రా, ఉత్తరా కూడా రాగా, శిబిరం నుండి విరాటనగరానికి వెళ్ళింది. ద్రుపదుడూ, కొడుకులూ ఆ విరాటనగరానికి వచ్చేటప్పుడు వాళ్ళ వెంటనే వచ్చి కోడళ్ళతో అక్కడే ఉన్న ద్రుపదుడి భార్యను, విరాటుడి భార్యను చూచింది. తరువాత అర్జునుడి అనుమతి పొంది సుభద్ర ద్వారకకు వెళ్ళటానికి ఆ విరాట నగరంలోనే ఉన్నది. అందుచేత ధర్మరాజు నకులుడిని చూచి, మిక్కిలి తొందరగా వెళ్ళటానికి తగిన రథానికి బాగా పరిగెత్తే గుర్రాలను పూన్చి 'నీవు ఉపప్లావ్యపురానికి వెళ్ళి ద్రౌపదినీ, తక్కిన మనస్త్రీలనూ, ద్రుపద విరాటుల స్త్రీలనూ వెంటబెట్టుకొని ఆ శిబిరానికి రమ్ము. మేము కూడా అక్కడికి వస్తాము' అని చెప్పాడు. నకులుడు ధర్మరాజు చెప్పిన విధంగా వెళ్ళాడు. ధర్మరాజు తక్కిన తమ్ములూ, కృష్ణ సాత్యకులూ దుఃఖిస్తూ తనతో రాగా, కౌరవశిబిరంలో ఉన్న జనులు సేవిస్తూ నడవగా, ఏడుస్తూ తన శిబిరానికి పోయి, అక్కడ. (తరువాతి పద్యంతో అన్వయం).

మహాస్రగ్ధర.

స్ఫురదశ్వత్థామ చంచద్భుజలసదసి విస్ఫూర్జిత క్రూరధారా
పరికృత్తావ్యక్తగాత్రప్రకరుల, సఖులన్, బంధులం, బుత్రులం, దాఁ
గరుణం బుప్పొంగ నార్తిం గనుఁగొని, వికలాంగత్వముం బొంది మూర్ఛా
పరతంత్రుండై ధరిత్రిం బడినఁ, బడిరి తద్భ్రాతలుం, గేశవుండున్. 21

ప్రతిపదార్థం: స్ఫురత్= ప్రకాశిస్తున్న; అశ్వత్థామ= అశ్వత్థామయొక్క; చంచత్= చలిస్తున్న; భుజ= బాహువులలో; లసత్= ప్రకాశిస్తున్న; అసి= కత్తియొక్క; విస్ఫూర్జిత= ప్రకాశించే; క్రూర= కనికరంలేని; ధారా= అంచుచేత; పరికృత్త= ఖండించబడిన; అవ్యక్త= స్పష్టంగా తెలియబడని; గాత్ర= అవయవాలయొక్క; ప్రకరులన్= సమూహాలుగలవారైన; సఖులన్= మిత్రులనూ; బంధులన్= చుట్టాలనూ; పుత్రులన్= కొడుకులనూ, తాన్= తాను(ధర్మరాజు); కరుణంబు= కరుణరసం; ఉప్పొంగన్= పొంగిపొరలగా; ఆర్తిన్= బాధతో; కనుఁగొని= చూచి; వికల+అంగత్వమున్ పొంది= అవయవాలు వశంతప్పి; మూర్ఛా+పరతంత్రుఁడు+ఐ= మూర్ఛకు లోనైనవాడై; ధరిత్రిన్= నేలమీద; పడినన్= పడగా; తద్+భ్రాతలున్= అతడి సోదరులూ; కేశవుండున్= కృష్ణుడూ; పడిరి.

తాత్పర్యం: అశ్వత్థామ చేతిలో ప్రకాశించే కత్తిచేత ఖండించబడి, ఇది ఆ అవయవం అని తెలియకుండా ఉన్న అవయవాలు గల మిత్రులనూ, చుట్టాలనూ, కొడుకులనూ చూచి ధర్మరాజు కరుణరసం ఉప్పొంగగా బాధతో చూచి అవయవాలు వశంతప్పి మూర్ఛకు లోనయి నేలపై పడగా, అతడి సోదరులూ, కృష్ణుడూ కూడా పడ్డారు.

వ. ఇట్లు పడి సాత్యకి ప్రయత్నంబున నందఱుం దెలిసిరి. ధర్మనందనుండు వెడవెడ దెలిసియు మగుడ నిగుడు నడలున మనంబు మునుంగ వెగడొంది నందనుల తనువుల మీఁద వ్రాలుచు వదనంబు బాష్పాంబు ధారాక్రాంతంబుగాఁ బ్రకటాక్రందనంబు సేయుచుఁ బలవించుచుండెఁ; గృష్ణార్జునులు సముచిత భాషణంబుల బోధించిరి. తక్కటివారును దగుమాటల నుపచరించిరి. కొండొకసేపునకు నవ్విభుండు రోదనంబు దక్కె. 22

ప్రతిపదార్థం: ఇట్లు; పడి; సాత్యకి ప్రయత్నంబునన్= సాత్యకియొక్క ప్రయత్నంచేత; అందఱున్; తెలిసిరి= తెప్పరిల్లారు; ధర్మనందనుండు= ధర్మరాజు; వెడవెడ= కొంచెం; తెలిసియున్= తెప్పరిల్లీ; మగుడన్= మళ్ళీ; నిగుడు+అడలునన్= కలిగే దుఃఖంలో; మనంబు= మనస్సు; మునుంగన్= మునుగగా; వెగడు+ఒంది= తల్లడపడి; నందనుల తనువుల మీఁదన్= కొడుకుల శరీరాలపై; వ్రాలుచున్= పడుతూ; వదనంబు= ముఖం; బాష్ప+అంబు+ధారా+ఆక్రాంతంబు+కాన్= కన్నీటి ప్రవాహంచేత ఆక్రమించబడినది కాగా; ప్రకట+ఆక్రందనంబు+చేయుచున్= బిగ్గరగా మొర్రోమంటూ; పలవించుచున్+ఉండెన్= ఏడుస్తున్నాడు; కృష్ణ+అర్జునులు= కృష్ణుడూ, అర్జునుడూ; సముచిత భాషణంబులన్= తగిన మాటలతో; బోధించిరి= ఓదార్చారు; తక్కటివారును= తక్కినవారుకూడా; తగు మాటలన్= తగిన మాటలతో; ఉపచరించిరి= బోధించారు; ఆ+విభుండు= ఆ రాజు- ధర్మరాజు; కొండొకసేపునకున్= కొంతసేపటికి; రోదనంబు+తక్కె= ఏడుపుమాని.

తాత్పర్యం: ఇట్లా పడి సాత్యకి ప్రయత్నంచేత అందరూ తెప్పరిల్లారు. ధర్మరాజు కొంచెం కొంచెంగా తేరుకొని మళ్ళీ కలిగే దుఃఖంలో మనస్సు మునుగగా తల్లడిల్లి కొడుకుల శరీరాలపై పడుతూ ముఖం కన్నీటి ప్రవాహంతో నిండగా బిగ్గరగా మొర్రోమని ఏడ్చాడు. కృష్ణార్జునులు తగిన మాటలతో ఓదార్చారు. తక్కినవాళ్ళు కూడా తగినట్లు మాటలాడి బోధించారు. కొంతసేపటికి ఆ రాజు ఏడుపుమాని. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'వ్రాలుచున్' - ఈ మాట పెక్కు ప్రతుల్లో ఉన్నదనటంచేత, అన్వయం యోగ్యతరంగా ఉంటుందని, స్వీకరించబడింది.

తే. పుత్రులకు బాంధవులకును మిత్రతతికి । నగ్నికార్యంబు వొగులుచు నాచరించి
యొక్కచోట నాసీనుఁడై యుండె ద్రుపద । తనయ వచ్చుట వార్చి నెమ్మనము దలర. 23

ప్రతిపదార్థం: (పూర్వవచనంలోని 'అవ్విభుండు' - కర్త); పొగులుచున్= ఏడుస్తూ; పుత్రులకున్= కొడుకులకూ; బాంధవులకును= చుట్టాలకూ; మిత్ర తతికిన్= స్నేహితుల సమూహానికీ; అగ్ని కార్యంబు= దహనం; పొగులుచున్= కుములుతూ; ఆచరించి= చేసి; నెఱ+మనము= మనస్సు; తలరన్= చలించగా; ద్రుపద తనయ= ద్రౌపది; వచ్చుట= రాక; వార్చి= ప్రతీక్షించి; ఒక్కచోటన్; ఆసీనుఁడు+ఐ+ఉండెన్= కూర్చున్నాడు.

తాత్పర్యం: (ధర్మరాజు) దుఃఖిస్తూ కొడుకులకూ, చుట్టాలకూ, స్నేహితుల సమూహానికీ దహనకార్యం చేసి మనస్సు చలించగా ద్రౌపదికొరకు ప్రతీక్షిస్తూ ఒకచోట కూర్చున్నాడు.

వ. అద్దేవియు నకులునిచేత నుపప్లావ్యంబున సుత సోదర మరణ ప్రకారంబు వినుటం జేసి. 24

ప్రతిపదార్థం: ఆ+దేవియున్= ఆ ద్రౌపదీదేవి కూడా; నకులునిచేతన్= నకులుడివలన; ఉపప్లావ్యంబునన్= ఉపప్లావ్యపురంలో; సుత సోదర మరణ ప్రకారంబున్= కొడుకులూ, సోదరులూ చచ్చిపోయిన విధం; వినుటన్+చేసి= వినటంచేత.

తాత్పర్యం: ఆ ద్రౌపదికూడా నకులుడివలన ఉపప్లావ్యపురంలో కొడుకులూ, సోదరులూ చచ్చిపోయిన విధం వినటంచేత. (తరువాతి పద్యంతో అన్వయం).

క. అలఁత గదిరి నోరెండఁగఁ । బలవించుచుఁ దోడుతోడ బాష్పజలం బ
గ్గలమై క్రమ్మఁగ సొలయుచుఁ । దెలియుచు నాతనికి నడలు దీపింపంగన్. 25

ప్రతిపదార్థం: అలఁత= దుఃఖం; కదిరి= అతిశయించి; నోరు+ఎండఁగన్= నోరు ఆర్చుకొనిపోయేటట్టు(ఆమె); పలవించుచున్= రోదిస్తూ; తోడుతోడన్= వెనువెంటనే; బాష్పజలంబు= కన్నీరు; అగ్గలము+ఐ= ఎక్కువై; క్రమ్మఁగన్= అలముకోగా; సొలయుచున్= మూర్ఛపోతూ; తెలియుచున్= తెప్పిరిల్లుతూ; ఆతనికిన్= ఆ నకులుడికి; అడలు= దుఃఖం; దీపింపంగన్= అతిశయించగా.

తాత్పర్యం: దుఃఖం అతిశయించి నోరు ఆర్చుకుపోయేటట్టు (ఆమె) రోదిస్తూ వెనువెంటనే కన్నీళ్ళు ఎక్కువై అలముకోగా మూర్ఛపోతూ తెప్పిరిల్లుతూ, ఆ నకులుడి శోకం అతిశయించగా. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అరుగుదెంచి యంతంత నవనీకాంతుఁగాంచి యధిక శోకాక్రాంతయై యార్తిం గూరి యాక్రందనంబు సేయ నమ్మాద్రీపుత్రుం డొయ్యన యయ్యంగన నరదంబు డించె; నుచిత వాహనంబుల నెక్కి తోడన వచ్చిన వనితాజనంబు లవతరణంబు సేసి వనట వందురుచుఁ బరివేష్టించి; రప్పు డా వధూరత్నంబు. 26

ప్రతిపదార్థం: అరుగుదెంచి= వచ్చి; అంతంతన్= కొంచెందూరం నుంచి; అవనీకాంతున్= రాజును (ధర్మరాజును); కాంచి= చూచి; అధికశోక+ఆక్రాంత+ఐ= మిక్కిలి దుఃఖంచేత ఆక్రమించబడిన దయి; ఆర్తిన్+కూరి= బాధలో మునిగి; ఆక్రందనంబు+ చేయన్= ఏడువగా; ఆ+మాద్రీ పుత్రుండు= ఆ మాద్రికొడుకు-నకులుడు; ఒయ్యన= మెల్లగా; ఆ+అంగనన్= ఆ స్త్రీని (ద్రౌపదిని); అరదంబున్+డించెన్= రథంనుండి దింపాడు; ఉచిత వాహనంబులన్= తగిన వాహనాలను; ఎక్కి; తోడన్+అ=

వెంట; వచ్చిన; వనితా జనంబులు= స్త్రీలు; అవతరణంబు+చేసి= దిగి; వనటన్= శోకంతో; వందురుచున్= దుఃఖిస్తూ; పరివేష్టించిరి= చుట్టూ కూర్చున్నారు; అప్పుడు= ఆ సమయంలో; ఆ వధూరత్నంబు= ఆ కాంతామణి - ద్రౌపది.

తాత్పర్యం: వచ్చి కొంచెం దూరంనుండి ధర్మరాజును చూచి అధిక శోకాక్రాంత అయి, బాధలో మునిగి రోదించగా ఆ నకులుడు మెల్లగా ఆమెను రథంనుండి దింపాడు. తగిన వాహనా లెక్కి వెంట వచ్చిన స్త్రీలు దిగి ఏడుస్తూ చుట్టూ కూర్చున్నారు. అప్పుడు ఆ కాంతామణి ద్రౌపది. (తరువాతి పద్యంతో అన్వయం).

క. పెనుమంచునఁ జెలువేదిన । వనజంబును బోలె నశ్రువారిపరీతా
ననము చెలువెడలఁ గొడుకులఁ । బనవుచుఁ జరణములు తొట్రువడ దీనగతిన్. 27

ప్రతిపదార్థం: పెను మంచునన్= అధికమైన మంచుచేత; చెలువు+ఏదిన= అందం కోల్పోయిన; వనజంబును+పోలెన్= పద్మంలా; అశ్రువారి పరీత+ఆననము= కన్నీళ్ళతో నిండిన ముఖం; చెలువు+ఎడలన్= అందం నశించగా; కొడుకులన్= కొడుకులను గూర్చి; పనవుచున్= ఏడుస్తూ; చరణములు= కాళ్ళు; తొట్రు+పడన్= తడబడగా; దీనగతిన్= విచారంతో.

తాత్పర్యం: అధికమైన మంచుచేత అందం కోలుపోయిన పద్మంవలె కన్నీటితో నిండిన ముఖం అందం నశించగా కొడుకులను గూర్చి ఏడుస్తూ కాళ్ళు తడబడగా దైన్యంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ. 'పెనుమంచున - చెలువెడలన్' అలంకారం ఉపమ. అశ్రువారి - పెనుమంచు, ఆననము - వనజము- ఉపమేయోపమానాలు. చెలువేదు - సామాన్యధర్మం. పోలెన్ - ఉపమావాచకం.

వ. కొన్ని యడుగులు వచ్చి వసుధాతలంబున వ్రాలిన వేగంబ వాయునందనుం డా ద్రుపదనందనఁ గ్రుచ్చియెత్తి ధర్మసూను సమీపంబునకుఁ దెచ్చిన నమ్మగువ మగుడ నిలంబడి యమ్మహీపతి యాననం బాలోకించి యెలుంగు రాలుపడ దైవమానుషంబులు సుసంగతంబులై యుండుటయు నతనికి సామ్రాజ్యంబు చొప్పడుటయు నుగ్గడించి. 28

ప్రతిపదార్థం: కొన్ని+అడుగులు వచ్చి= కొన్ని అడుగులువేసి; వసుధా తలంబునన్= నేలమీద; వ్రాలినన్= పడగా; వేగంబు+అ= వడిగా; వాయు నందనుండు= భీముడు; ఆ ద్రుపద నందనన్= ఆ ద్రౌపదిని; క్రుచ్చి+ఎత్తి= పట్టుకొని లేవదీసి; ధర్మసూను సమీపంబునకున్= ధర్మరాజు దగ్గరకు; తెచ్చినన్= తీసికొనిరాగా; ఆ+మగువ= ఆ స్త్రీ-ద్రౌపది; మగుడన్= మళ్ళీ; ఇలన్+పడి= నేలపైబడి; ఆ+మహీపతి+ఆననంబు= ఆ రాజుముఖం; ఆలోకించి= చూచి; ఎలుంగు రాలుపడన్= కంఠస్వరం డగ్గుత్తికపడగా; దైవ మానుషంబులు= దైవమూ, పురుష ప్రయత్నమూ; సుసంగతంబులు+ఐ= బాగా పొసగినవయి; ఉండుటయున్= ఉండటమూ; అతనికిన్; సామ్రాజ్యంబు; చొప్పడుటయున్= లభించటమూ; ఉగ్గడించి= ప్రశంసించి.

తాత్పర్యం: కొన్ని అడుగులు వేసి నేలమీద వాలింది. వెంటనే భీముడు ఆ ద్రౌపదిని పట్టుకొని లేవదీసి ధర్మరాజు దగ్గరకు తీసికొనిరాగా, ఆమె మళ్ళీ నేలపైబడి ఆ రాజు ముఖం చూచి డగ్గుత్తికపడ్డ కంఠస్వరంతో దైవమూ, పురుషకారమూ రెండూ బాగా పొసగినవై ఉండటమూ, అతడికి సామ్రాజ్యం లభించటమూ ప్రశంసించి. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. కలిమికి నొప్పఁగాఁగ బలగంబయి నీకడ నా తనూభవుల్
మెలఁగఁగఁ జూడఁ గానన; యమేయ భుజాబలశాలి విక్రమో
జ్జ్వలుఁడు సుభద్రపట్టియును వమ్మయిపోయె; ననూనభోగముల్
గలిగెన్ యేనియున్ మఱవఁగా వశమే మన కా కుమారులన్? 29

ప్రతిపదార్థం: కలిమికిన్= సంపదకు; ఒప్పు+కాఁగన్= తగినట్లుగా; బలఁగంబు+అయి= పరిజనమై; నీ కడన్= నీ దగ్గర; నా తనూభవుల్= నా కొడుకులు; మెలఁగఁగన్+చూడన్+కానన్=అ= ఉండటం చూడనేలేకపోయాను; అమేయ భుజా బలశాలి= అపరిమిత బాహుబల సంపన్నుడూ; విక్రమోజ్జ్వలుఁడు= పరాక్రమంచేత ప్రకాశించేవాడూ(అయిన); సుభద్ర పట్టియును= సుభద్రకొడుకూ-అభిమన్యుడూ; వమ్ము+అయి పోయెన్= వ్యర్థమైపోయాడు; అనూన భోగముల్= తక్కువకాని సుఖాలు; కలిగెన్+అ+ఏనిన్= ఉన్నప్పటికీ; మనకున్= మనకు; ఆ కుమారులన్= ఆ బిడ్డలను; మఱవఁగాన్+వశమే?= మరిచిపోవ తరమా?

తాత్పర్యం: సంపదకు తగ్గట్లుగా పరివారమయి నీ దగ్గర నా కుమారులు వర్తిల్లటం నేను చూడనేలేకపోయాను. అమిత బాహు బల సంపన్నుడూ, పరాక్రమశాలీ అయిన అభిమన్యుడు కూడా నశించాడు. అధిక భోగాలున్నా మనకు ఆ కుమారులను మరచిపోవ తరమా?

వ. అని యప్పు డశ్వత్థామోద్దామ రణకరణస్మరణంబు దన చిత్తం బుత్తల పెట్టఁ గోపంబు దీపింప నాసీనయై. 30

ప్రతిపదార్థం: అని; అప్పుడు= ఆ సమయంలో; అశ్వత్థామ+ఉద్దామ రణ కరణ స్మరణంబు= అశ్వత్థామయొక్క గొప్ప యుద్ధపుచేత యొక్క స్మృతి; తన చిత్తంబు= తన మనస్సును; ఉత్తలపెట్టన్= కలతపెట్టగా; కోపంబు; దీపింపన్= అతిశయించగా; ఆసీన+ఐ= కూర్చున్నదై.

తాత్పర్యం: అని అప్పుడు అశ్వత్థామ యుద్ధం చేసిన రీతి తలపుకు వచ్చి తన మనస్సును కలతపెట్టగా కోపాతిశయంతో కూర్చున్నదై.

క. 'భూరమణ! గాఢనిద్రం । గూరిన సమయమున ముట్టికొని నా సుతులం
గ్రూరతఁ దెగటార్చెను బా । పారంభుఁడు గురుతనూజుఁ డక్రమలీలన్. 31

ప్రతిపదార్థం: భూరమణ!= రాజా!; నా సుతులన్= నా కుమారులను; గాఢనిద్రన్+కూరిన సమయమునన్= గాఢంగా నిద్రపోతూన్న సమయంలో; పాప+ఆరంభుఁడు= పాపాత్ముడు అయిన; గురుతనూజుఁడు= గురుపుత్రుడు-అశ్వత్థామ; ముట్టికొని= మార్కొని; అక్రమలీలన్= అధర్మ పద్ధతిలో; క్రూరతన్= కనికరం లేకుండా; తెగటార్చెను= చంపాడు.

తాత్పర్యం: 'రాజా! నా కుమారులు మంచి నిద్రలో ఉన్న సమయంలో పాపాత్ముడైన అశ్వత్థామ మార్కొని అధర్మ పద్ధతిలో కనికరం లేకుండా చంపాడు.'

క. అది యాఱని పెను చిచ్చై । మదిఁ గాల్పఁ దొడంగె దీని మాన్ప నుపాయం
బు దలంప నొండు లే ద । య్యదయుని ముట్టుకొని నామ మడఁచుట దక్కన్. 32

ప్రతిపదార్థం: అది= ఆ అక్రమయుద్ధం; ఆఱని= ఆరిపోని; పెను చిచ్చు+ఐ= పెద్ద అగ్నియై; మదిన్= మనస్సును; కాల్పన్+ తొడంగెన్= దహించసాగింది; ఆ+అదయునిన్= ఆ నిర్దయుడిని; ముట్టుకొని= ఎదిరించి; నామము+అడఁచుట+తక్కన్= పేరులేకుండా చేయటంతప్ప; తలంపన్= ఆలోచించగా; దీనిన్= ఈ దుఃఖాన్ని; మాన్పన్= పోగొట్టటానికి; ఉపాయంబు= ఉపాయం; ఒండు లేదు= ఇంకొకటి లేదు.

తాత్పర్యం: 'అతడు చేసిన అధర్మయుద్ధం ఆరిపోని పెద్ద అగ్ని అయి మనస్సును దహించసాగింది. ఆ నిర్దయుడిని ఎదిర్చి పేరు లేకుండా చేయటం తప్ప, ఆలోచించగా, ఈ దుఃఖాన్ని ఉపశమింప చేయటానికి ఇంకొక ఉపాయం లేదు.

క. వాయుసుతుఁ బనిచి నేఁడటు । సేయింపక తక్కితేనిఁ జెప్పెద విను మేఁ
బ్రాయోపవేశమున నీ । కాయ ముపేక్షింతుఁ జుమ్ము కౌరవనాథా!' 33

ప్రతిపదార్థం: కౌరవనాథా!= కురుపతీ-ధర్మరాజా!; వాయుసుతున్= భీముడిని; పనిచి= పంపి; నేఁడు= ఈ వేళ; అటు= ఆ విధంగా; పేరుమాపేపని; చేయింపక తక్కితి(వి)+ఏనిన్= నీవు చేయించకపోతే; చెప్పెదన్+వినుము= చెపుతా విను; ఏన్= నేను; ప్రాయోపవేశమునన్= ఆమరణ నిరాహారదీక్షతో; ఈ కాయము= ఈ శరీరం; ఉపేక్షింతున్+చుమ్ము= విడుస్తాను సుమా!

తాత్పర్యం: ధర్మరాజా! భీముడిని నియోగించి ఈ వేళ ఆ విధంగా వాడి పేరు మాపే పని నీవు చేయించకపోతే, చెపుతాను వినుము - నేను ఆమరణనిరాహారదీక్షతో ఈ శరీరం విడుస్తాను సుమా!'

వ. అనుటయు నమ్మనుజపతి యమ్మానిని కిట్లనియె. 34

ప్రతిపదార్థం: అనుటయున్= ద్రౌపది అలా అనగా; ఆ+మనుజపతి= ఆ రాజు; ఆ+మానినికిన్= ఆ మానవతికి; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అట్లా అనగా ఆ ధర్మరాజు ఆ మానవతితో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: పరికరం. ద్రౌపది పట్టుదల గల స్త్రీ కాబట్టి. ఇక్కడ ఆమెకు 'మానిని' అనే విశేషణం సాభిప్రాయం. కాబట్టి అలంకారం పరికరం.

క. 'క్షితిపతి తనయులు పోర । న్మృతిఁ బొందుట తగునకాదె నీ సోదరులున్
సుతులు నతిపుణ్యపురుషో । చిత సుగతులు గనిరి వగలఁ జేడ్పడ నేలా? 35

ప్రతిపదార్థం: క్షితిపతి తనయులు= రాచబిడ్డలు; పోరన్= యుద్ధంలో; మృతిన్+పొందుట= మరణించటం; నీ సోదరులున్= నీ సోదరులూ; సుతులున్= కుమారులూ; అతి పుణ్యపురుష+ఉచిత సుగతులు= మిక్కిలి పుణ్యాత్ములకు తగిన సద్గతులు; కనిరి= పొందారు; వగలన్= దుఃఖంతో; చేడ్పడన్+ఏలా= బాధపడటం దేనికి?

తాత్పర్యం: 'రాచబిడ్డలు యుద్ధంలో మరణించటం సముచితమే కదా! నీ సోదరులూ, కుమారులూ మిక్కిలి పుణ్యాత్ములకు తగిన సద్గతులు పొందారు. ఇంక నీవు దుఃఖంతో బాధపడటం దేనికి?

వ. మనస్వినివైన నీ కుపశమించుట గర్తవ్యంబు. శోకంబు దక్కు మశ్వత్థామ యొనర్చిన పరాభవంబునఁ బుట్టిన యలుక వాని సమయింపక పోదని చెప్పుటయ కాదు, నా తలంపును నిట్ల; వాఁ డడవిం గలసినవాఁడు గానోపు; సమయించుట నీ కె ట్లెఱుంగ నగుఁ? జెప్పు' మనిన నప్పొలఁతి 'యప్పాపాత్మునకు సహజంబైన శిరోమణి గలదు, దానిం దెచ్చి యిచ్చినఁ జూచి జీవంబుతో నుండెద నని తలంచితి' నని పురుషాక్షరంబుగాఁ బలికి యప్పవమానతనయుఁ దన పాణితలంబున సంస్పర్శించి. 36

ప్రతిపదార్థం: మనస్వినివి+ఐన= ప్రశస్తమైన మనస్సు కలదానవైన; నీకున్; ఉపశమించుట= శాంతించుట; కర్తవ్యంబు= కార్యము; శోకంబు= విచారం; తక్కుము= మాను; అశ్వత్థామ+ఒనర్చిన పరాభవంబునన్= అశ్వత్థామ చేసిన అవమానంవలన; పుట్టిన= కలిగిన; అలుక= కోపం; వానిన్= అతడిని; సమయింపక పోదు= చంపకుండా పోదు; అని; చెప్పుట+అ= చెప్పటమే; కాదు; నా తలంపును= నా అభిప్రాయమూ; ఇట్లు+అ= ఇట్లే; వాఁడు= అతడు(అశ్వత్థామ); అడవిన్+కలసినవాఁడు= అడవిలో కలిసినవాడు; కాన్+ఓపున్= అయి ఉంటాడు; సమయించుట= చంపటం; నీకున్; ఎట్లు+ఎఱుంగన్+అగున్= ఎలా తెలుస్తుంది?; చెప్పుము; అనినన్; ఆ+పొలఁతి= ఆ స్త్రీ (ద్రౌపది); ఆ+పాప+ఆత్మునకున్= ఆ దుష్టుడికి; సహజంబు+ఐన= పుట్టుకతో ఉన్న; శిరోమణి= తలమానికం; కలదు; దానిన్; తెచ్చి; ఇచ్చినన్; చూచి; జీవంబుతోన్+ఉండెదన్= ప్రాణాలతో ఉంటాను; అని; తలంచితిన్; అని; పరుష+అక్షరంబుగాన్= నిష్ఠురంగా; పలికి; ఆ+పవమాన తనయున్= ఆ వాయుకుమారుడిని - భీముడిని; తన పాణితలంబునన్= తన చేతితో; సంస్పర్శించి= తాకి.

తాత్పర్యం: మంచి మనస్సుగల నీవు శాంతించటం మంచిది. శోకం మానుము. అశ్వత్థామ చేసిన అవమానం వలన కలిగిన కోపం వాడిని చంపితేకాని పోదని చెప్పటం కాదు. నా అభిప్రాయం కూడా ఇదే. వాడు అడవులపాలై పోయి ఉంటాడు. చంపినట్లు నీకెట్లా తెలుస్తుంది? చెప్పుము.' అంటే, ద్రౌపది' ఆ దుష్టుడికి పుట్టుకతోనే శిరోమణి ఉన్నది. దానిని తెచ్చి ఇస్తే చూచి ప్రాణాలతో ఉందా మని అనుకొన్నాను' అని కఠినంగా పలికి భీముడిని తన చేతితో స్పృశించి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'క్షత్రధర్మ మాత్మఁ గైకొని రయమున । నరిగి పాపకర్ముఁడైన కుంభ
జన్మతనయు ముట్టి చంపుము నా మది । కనలు నడలు నుడిపి కావు నన్ను.' 37

ప్రతిపదార్థం: క్షత్రధర్మము= క్షత్రియధర్మం; ఆత్మన్= మనస్సులో; కైకొని= పూని; రయమునన్= శీఘ్రంగా; అరిగి= వెళ్ళి; పాపకర్ముఁడు+ఐన= దుర్మార్గుడైన; కుంభజన్మ తనయున్= ద్రోణుడి కొడుకైన అశ్వత్థామని; ముట్టి= తాకి; చంపుము; నా మది కనలున్+అడలున్= నా మనస్సులోని కోపాన్నీ, శోకాన్నీ; ఉడిపి= మాన్పి; నన్నున్; కావు= రక్షించు.

తాత్పర్యం: 'మనస్ఫూర్తిగా క్షత్రియోచిత ధర్మం పూని శీఘ్రమే వెళ్ళి ఆ దుష్టుడైన అశ్వత్థామను తాకి చంపుము. నా మనస్సులోని కోపాన్నీ, శోకాన్నీ మాన్పి నన్ను రక్షించుము.'

వ. వెండియు. 38

తాత్పర్యం: ఇంకా.

ద్రౌపది యశ్వత్థామం బరిభవింప భీమసేను నియోగించుట (సం. 10-11-21)

సీ. 'జతుగృహదాహావసరమునఁ జేసిన । సముదీర్ణతరపౌరుషంబుతోడ
నత్యుగ్రుఁడగు హిడింబాసుర వ్రచ్చిన । చోటఁ గైకొన్న నిష్ఠురతతోడ
యక్షులు పొదివిన యపుడు వాటించిన । యాభీల దోర్బలవ్యాప్తితోడ
సమధికబలుఁడు గీచకుని యేఁచినయెడఁ । బూనిన విక్రమస్ఫూర్తితోడఁ

ఆ. గూడ నిన్ను జనులు గొనియాడునట్టుగఁ । జనుము నీదు బలముఁ జలము మెఱయ
గీటడంపు మనల గెలిచితి నని గర్వ । మునఁ దనర్చు ద్రోణతనయు నెట్లు.' 39

ప్రతిపదార్థం: జతు గృహ దాహ+అవసరమునన్= లక్కయిల్లు కాలే సమయంలో; చేసిన; సముదీర్ణ తన పౌరుషంబుతోడన్= మిక్కిలి గొప్పదైన పౌరుషంతోనూ; అతి+ఉగ్రుఁడు+అగు= మిక్కిలి భయంకరుడైన; హిడింబ+అసురున్= హిడింబుడనే రాక్షసుడిని; వ్రచ్చినచోటన్= చంపినచోట; కైకొన్న= పూనిన; నిష్ఠురతతోడన్= కాఠిన్యంతోనూ; యక్షులు; పొదివిన+అపుడు= ఆక్రమించినప్పుడు; పాటించిన= చూపిన; ఆభీలదోస్(ః)+బల వ్యాప్తితోడన్= భయంకరమైన భుజబల విస్తరంతోనూ; సమధిక బలుఁడు= మిక్కిలి గొప్పబలం కలవాడైన; కీచకుని ఏఁచిన+ఎడన్= కీచకుడు విజృంభించినప్పుడు; పూనిన= చూపిన; విక్రమస్ఫూర్తితోడన్= పరాక్రమ ప్రకాశంతోనూ; కూడన్= కూడుకోగా; నిన్నున్; జనులు; కొనియాడునట్లుగన్= ప్రశంసించే విధంగా; చనుము= వెళ్ళుము. నీదు బలమున్+చలమున్= నీ బలమూ, పట్టుదలా; మెఱయన్= ప్రకాశించేటట్లు; మనలన్= మనలను; గెలిచితిన్+అని= గెలిచానని; గర్వమునన్= అహంకారంతో; తనర్చు= ఒప్పే; ద్రోణతనయున్= అశ్వత్థామను; ఎట్లున్= ఎలా అయినాసరే; గీటడంపు(ము)= చంపుము.

తాత్పర్యం: 'లక్క ఇల్లు కాలేటప్పుడు చూపిన మిక్కిలి గొప్ప పౌరుషంతోనూ, మిక్కిలి భయంకరుడైన హిడింబాసురుడిని చంపినప్పుడు పూనిన కాఠిన్యంతోనూ, యక్షులు ఆక్రమించినప్పుడు చూపిన భయంకర భుజపరాక్రమవిస్తరంతోనూ, మిక్కిలి బలవంతుడైన కీచకుడు విజృంభించినప్పుడు ప్రదర్శించిన పరాక్రమ ప్రకాశంతోనూ కూడుకొని, నిన్ను జనులు ప్రశంసించే విధంగా వెళ్ళుము. నీ బలమూ, చలమూ ప్రకాశించేటట్లు మనలను గెలిచానని విర్రవీగే అశ్వత్థామను ఎట్లా అయినా సరే, చంపుము.'

వ. అనిన విని యగ్గురుపుత్రుదెసం బొడమిన యమర్షంబున మేను పొంగఁ బవమానసూనుండు ద్రుపదనందనతో ధర్మనందనుం డాడిన మాట లశ్వత్థామపైఁ బోవుట కనుమతిగా నంతరంగంబున నంగీకరించి. 40

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; ఆ+గురుపుత్రు దెసన్= ఆ అశ్వత్థామమీద; పొడమిన= పుట్టిన; అమర్షంబునన్= కోపంతో; మేను= శరీరం; పొంగన్; పవమానసూనుండు= భీముడు; ద్రుపదనందనతోన్= ద్రౌపదితో; ధర్మనందనుండు= ధర్మరాజు; ఆడిన మాటలు= పలికిన పలుకులు; అశ్వత్థామపైన్= అశ్వత్థామమీదికి; పోవుటకున్= వెళ్ళుటకు; అనుమతి+కాన్= అంగీకారంగా, అంతరంగంబునన్= మనస్సులో; అంగీకరించి= సమ్మతించి.

తాత్పర్యం: అనగా విని ఆ అశ్వత్థామమీద పుట్టిన కోపంతో శరీరం పొంగగా భీముడును ద్రౌపదితో ధర్మరాజన్న మాటలు అశ్వత్థామ మీదికి పోవటానికి అంగీకారంగా మనస్సులో సమ్మతించి.

మహాస్రగ్ధర.

కనక ప్రస్ఫీత రత్నోత్కర పరివిసరత్కాంతి రాజన్నిజస్యం
దనముం బన్నంగ నత్యాదరమున నకులుం దా నియోగించె; నాతం
డును దీప్తోత్సాహుఁడై గండున సబలరయాటోపరథ్యాది సత్సా
ధనయోగం బొప్ప సారథ్యమునకు నమరెం దన్మనోవృత్తియుక్తిన్. 41

ప్రతిపదార్థం: తాన్= తాను-భీముడు; కనక= బంగారంయొక్క; ప్రస్ఫీత= మిక్కిలి విస్తారమైన; రత్న= మణులయొక్క; ఉత్కర= సమూహంయొక్క; పరివిసరత్= బాగా వ్యాపిస్తూన్న; కాంతి= ప్రకాశంతో; రాజత్= వెలుగొందుతూన్న; నిజస్యందనమున్= తనదైన రథాన్ని; పన్నంగన్= పూన్చటానికి; అతి+ఆదరమునన్= మిక్కిలి ఆదరంతో; నకులున్; నియోగించెన్= ఆజ్ఞాపించాడు; ఆతండును= ఆ నకులుడూ; దీప్త+ఉత్సాహుఁడు+ఐ= ప్రకాశించే ఉత్సాహం కలవాడై; గండునన్= పరాక్రమంతో; సబల= బలంతోనూ; రయ= వేగంతోనూ; ఆటోప= సంభ్రమంతోనూ కూడిన; రథ్య+ఆది= గుర్రాలూ మొదలైన; సత్+సాధన యోగంబు= మంచి ఉపకరణాల కూడిక; ఒప్పన్= ఒప్పగా; తద్+మనస్(ః)+వృత్తి యుక్తిన్= ఆతని(భీముడి) మనోవ్యాపారంతోడి కూడికతో; సారథ్యమునకున్= సారథ్యానికి; అమరెన్= సిద్ధపడ్డాడు.

తాత్పర్యం: భీముడు బంగారుకాంతితోనూ, మణుల కాంతితోనూ వెలుగొందుతూన్న తన రథాన్ని సిద్ధం చేయుమని మిక్కిలి ఆదరంతో నకులుడిని నియోగించాడు. అతడు ప్రకాశించే ఉత్సాహంతో, పరాక్రమంతో, బలమూ, వేగమూ, సంభ్రమమూ కల గుర్రాలూ మొదలైన మంచిసాధన సామగ్రి ఒప్పగా, భీముడి మనోవృత్తి కనుగుణంగా సారథ్యం చేయటానికి సిద్ధపడ్డాడు.

వ. ఇట్లు సహదేవ పూర్వజుం దనకు సారథిం జేసికొని సమీరనందనుండు కోదండ గదాదండాది హేతి సంపన్నం బైన యా రథం బెక్కి శిబిరంబు వేగంబ వెడలి గురుతనయాది యోధుల యరదంబుల చొప్పు వట్టికొని యతిత్వరితగతిం జని కురుక్షేత్ర సంచారి జనంబులం గని 'యశ్వత్థామ యెక్కడ మెలంగెనో యెఱుఁగుదురే?' యని యడిగిన వార లతండు కృపకృతవర్మలతోడం గరినగరంబు దెసకు నరిగి మగిడి భాగీరథీ తీరంబున కరుగుదెంచి యయ్యెడ నయ్యిరువురుం బాసి యొక్క వలని కరుగం దానును గృష్ణద్వైపాయన మహాముని యాశ్రమంబునకై తొలఁగి తత్ప్రదేశంబున వసియించెనని చెప్పుటయు నద్దిక్కు తేరు నడప నియోగించి నట్టియెడ ధర్మనందనునకు వసుదేవనందనుం డిట్లనియె. 42

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సమీరనందనుండు= వాయుపుత్రుడు భీముడు; సహదేవ పూర్వజున్= సహదేవుడి అన్నను నకులుడిని; తనకున్= తనకు; సారథిన్= సారథిగా చేసికొని; కోదండ గదాదండ+ఆదిహేతి సంపన్నంబు+ఐన= విల్లూ, దండంవంటి గదా మొదలైన ఆయుధాలతో కూడిన; ఆ రథంబు+ఎక్కి; శిబిరంబున్= శిబిరంనుంచి; వేగంబు+అ= వేగమే; వెడలి; గురుతనయ+ఆదియోధుల+అరదంబుల చొప్పు= అశ్వత్థామ మొదలగు వీరుల రథాల మార్గం; పట్టికొని= అవలంబించి; అతి త్వరితగతిన్= మిక్కిలి తొందరగా; చని; కురుక్షేత్ర సంచారి జనంబులన్+కని= కురుక్షేత్రంలో తిరిగే జనులను చూచి; అశ్వత్థామ; ఎక్కడ; మెలంగెన్= ఉన్నాడో; ఎఱుఁగుదురే?; అని; అడిగినన్; వారలు; అతండు; కృపకృతవర్మలతోడన్; కరినగరంబు దెసకున్= హస్తినాపురివైపు; అరిగి= వెళ్ళి; మగిడి= తిరిగి; భాగీరథీ తీరంబునకున్= గంగానది ఒడ్డుకు; అరుగుదెంచి= వచ్చి; ఆ+ఎడన్= అక్కడ; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరూ; పాసి= విడిచి; ఒక్క వలనికిన్= ఒక దిక్కుకు; అరుగన్= వెళ్ళగా; తానును= తాను; కృష్ణద్వైపాయన మహాముని+ఆశ్రమంబునకై= వ్యాసమునీంద్రుడి ఆశ్రమానికి;

తొలఁగి= వెళ్ళి; తద్+ప్రదేశంబునన్= ఆ చోట; వసియించెన్= నివసించాడు; అని; చెప్పుటయున్= చెప్పగా; ఆ+దిక్కు= ఆ వైపు; తేరు= రథం; నడపన్= పోనివ్వటానికి; నియోగించిన+అట్టి+ఎడన్= నియమించిన సమయంలో; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; వసుదేవ నందనుండు= కృష్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఇట్లా భీముడు నకులుడిని తనకు సారథిగా చేసికొని విల్లూ, గదా మొదలైన ఆయుధాలతో కూడిన ఆ రథం ఎక్కి, శిబిరంనుంచి వేగమే బయలుదేరి అశ్వత్థామాది యోధుల రథాలు వెళ్ళిన మార్గాన్ని అవలంబించి, మిక్కిలి తొందరగా వెళ్ళి, కురుక్షేత్రంలో తిరిగే జనులను చూచి, 'అశ్వత్థామ ఎక్కడున్నాడో ఎరుగుదురా?' అని అడుగగా, వాళ్ళు 'అతడు కృపకృతవర్మలతో హస్తినాపురంవైపు వెళ్ళి, మరలి, గంగానది ఒడ్డుకు వచ్చి అక్కడ ఆ ఇద్దరు వీరులూ తనను విడిచి ఒక దిక్కుగా వెళ్ళగా, తాను వ్యాసాశ్రమానికి వెళ్ళి, అక్కడ నివసించాడు' అని చెప్పగా, 'ఆ వైపు రథం పోని' మ్మని నియోగించిన సమయంలో ధర్మరాజుతో కృష్ణు డిట్లా అన్నాడు:

చ. అనిలసుతుండు శోకమును నల్కయుఁ జిత్తమునం గరంబు పే
ర్చిన గురుపుత్త్రు ముట్టికొనఁ జెచ్చెరఁ బోయెడు; నీతఁ డొంటి యా
తనిపయిఁ బోవ భూరమణ! తప్పదె కార్యము? పెద్దగూర్తు వీ
వనుజులలోన నాతనికి; నందఱుఁ బోవుట మేలు పోరికిన్. 43

ప్రతిపదార్థం: భూరమణ!= ఓ రాజా! ధర్మరాజా!; అనిలసుతుండు= భీముడు; శోకమును= దుఃఖమూ; అల్కయున్= కోపమూ; చిత్తమునన్= మనస్సులో; కరంబు పేర్చినన్= మిక్కిలి అతిశయించగా; గురుపుత్రున్= అశ్వత్థామను; ముట్టికొనన్= మార్కొనటానికి; చెచ్చెరన్= శీఘ్రంగా; పోయెడున్= వెడతాడు; ఈతఁడు ఆతనిపయిన్= ఆ అశ్వత్థామమీదికి; ఒంటిపోవన్= ఒక్కడే పోతే; కార్యము= పని; తప్పదె?= చెడదా?; ఈవు= నీవు; అనుజులలోన్= తమ్ముళ్ళలో; ఆతనికిన్= ఆ భీముడికి; పెద్ద+కూర్తువు= మిక్కిలి ఇష్టపడతావు; పోరికిన్= యుద్ధానికి; అందఱున్= అందరూ; పోవుట= పోవటం; మేలు= మంచిది.

తాత్పర్యం: 'ధర్మరాజా! భీముడు శోకమూ, కోపమూ మనస్సులో మిక్కిలి అతిశయించగా అశ్వత్థామను మార్కొనటానికి వేగంగా వెళ్ళాడు. ఇతడు ఒక్కడూ అతడి మీదికి పోతే కార్యం చెడదా? తమ్ముళ్ళందరిలోకీ అతడంటే నీకెంతో ఇష్టం. యుద్ధానికి అందరూ వెళ్ళటం మంచిది.

వ. వినుము. 'సకల పృథివియు దహింపఁ జాలునట్టి బ్రహ్మశిరోనామకం బను దివ్యాస్త్రం బశ్వత్థామకు ద్రోణుం డిచ్చెఁ బ్రియాతిశయంబున వివ్వచ్చునకు నొసంగె. నశ్వత్థామ వివ్వచ్చుతోడి మత్సరంబునఁ దదీయబల నైపుణ్యంబునకు నసహ్యంబువడుఁ బదంపడి యెఱింగి పాండవులపై వీఁడు దీనిం బ్రయోగింప కుండవలయు నని తలంచి యమ్మహనీయ సాధనంబు మనుష్యులపైఁబ్రయోగించుకొలఁది గాకునికియుం గలదు గావున సర్వధర్మవిదుండైన యగ్గురుం డొక్కనాఁ డస్త్రవిషయ సంభాషణ సమయంబున నతనితో ని ట్లనియె.'44

ప్రతిపదార్థం: వినుము; సకల పృథివియున్= భూమినంతనూ; దహింపన్+చాలునట్టి= కాల్చగల; బ్రహ్మశిరోనామకంబు+అను= బ్రహ్మ శిరోనామకం అనే; దివ్య+అస్త్రంబు= దివ్యాస్త్రం; ద్రోణుండు= ద్రోణుడు; అశ్వత్థామకున్= అశ్వత్థామకు; ఇచ్చెన్; ప్రియ+అతిశయంబునన్= ప్రేమాతిశయంచేత; వివ్వచ్చునకున్= అర్జునుడికి; ఒసంగెన్= ఇచ్చాడు; అశ్వత్థామ; వివ్వచ్చుతోడి= అర్జునుడిమీది; మత్సరంబునన్= కోపంతో; తదీయ బల నైపుణ్యంబునకున్= అతడి బలప్రౌఢికి; అసహ్యంబు+పడున్=

అసూయపడతాడు; పదంపడి; తరువాత; ఎఱింగి; పాండవులపైన్= పాండవులపైన; వీఁడు; దీనిన్= దీనిని; ప్రయోగింపక+ ఉండవలయున్+అని తలంచి= ప్రయోగించకుండా ఉండాలని ఎంచి; ఆ+మహనీయ సాధనంబు= ఆ గొప్ప అస్త్రం; మనుష్యులపైన్= మనుష్యులమీద; ప్రయోగించు కొలఁది కాక+ఉనికియున్= ప్రయోగించకూడదనేదీ; కలదు కావునన్= ఉన్నది కాబట్టి; సర్వధర్మ విదుండు+ఐన ఆ+గురుండు= అన్ని ధర్మాలూ తెలిసిన ఆ ద్రోణుడు; ఒక్కనాఁడు= ఒకరోజు; అస్త్ర విషయ సంభాషణ సమయంబునన్= అస్త్రాలను గూర్చిన మాటల సందర్భంలో; అతనితోన్= అశ్వత్థామతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: వినుము. 'భూమినంతటినీ కాల్చగల బ్రహ్మశిరస్సు అనే పేరుగల దివ్యాస్త్రం అశ్వత్థామకు ద్రోణుడిచ్చాడు. ప్రేమాతిశయంచేత అర్జునుడికీ ఇచ్చాడు. అశ్వత్థామ అర్జునుడిమీది కోపం కొద్దీ అతడి బల ప్రౌఢికి అసూయపడతాడు. తరువాత తెలిసి పాండవులమీద వీడు దాన్ని ప్రయోగించకుండా ఉండాలని తలచి, ఆ గొప్ప సాధనం మానవుల మీద ప్రయోగించకూడదనేదీ ఉన్నది కాబట్టి, అన్ని ధర్మాలూ తెలిసిన ఆ ద్రోణుడు ఒకనాడు అస్త్రాలను గూర్చి మాటాడే సందర్భంలో అతడితో ఇట్లా అన్నాడు.'

క. 'మనుజులపై బ్రహ్మశిరం । బనునస్త్రం బేసితేని నశుభం బొలయున్
విను మెన్ని యాపదలు వ । చ్చిన నపరోపాయములన చెఱుపుము పుత్రా!' 45

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; వినుము= విను; మనుజులపైన్= మనుష్యులమీద; బ్రహ్మశిరంబు+అను+అస్త్రంబు= బ్రహ్మశిరోనామకాస్త్రం; ఏసితి(వి)+ఏనిన్= ప్రయోగించితివా; అశుభంబు= కీడు; ఒలయున్= కలుగుతుంది; ఎన్ని+ఆపదలు= వచ్చినన్; అపర+ఉపాయములన్+అ= ఇతరోపాయాలచేతనే; చెఱుపుము= పోగొట్టుము.

తాత్పర్యం: 'కుమారా! వినుము. మనుష్యులమీద బ్రహ్మశిరోనామకాస్త్రం ప్రయోగించితివా కీడు కలుగుతుంది. ఎన్ని ఆపదలు వచ్చినా నీవు వాటిని ఇతరోపాయాలచేతనే తొలగించుకొమ్ము.'

వ. అని చెప్పి మనోగతం బవశంబై నాలుకకు వచ్చి, 'వీఁ డెట్లును సజ్జనుల వృత్తంబునఁ బ్రవర్తిల్లెడునే?;' యని యతండు విన నుగ్గడించె. దానికి నశ్వత్థామ విషాదంబునఁ గుందియుండుఁ గాని యగ్గురుని చెప్పినట్లు సదుపదేశ కరణ నిష్ఠుండుగాఁ; డతనికి దురభిమానంబును గలదు. వినుము చెప్పెదఁ జిరజీవిత్వంబును భర్గవరప్రసాద జనక కారణంబును గలిగి యుండు ననియును దివ్యాస్త్ర శస్త్ర విద్యారహస్యంబునకు మూలం బైన యగస్త్యుచేత ద్రోణుండు వడసిన బ్రహ్మ శిరోనామకంబు దనకుం గలదనియును దత్ప్రభావంబు దేవమనుజ దనుజలోకంబులు భస్మీభూతంబులు సేయు నని యుండుం గావున మున్ను మీరు వనవాసులరై యున్నతఱిఁ దాను మా పురంబునకు వచ్చి యాదవ కుమారులతోడి వినోదంబులం దగిలియుండి యొక్కనాఁ డే నొంటిమై నుండ నా కడకుం జనుదెంచి నగుచు నిట్లనియె. 46

ప్రతిపదార్థం: అని చెప్పి; మనన్(ః)+గతంబు= మనసులో ఉన్నది; అవశంబు+ఐ= తనకు తెలియకుండానే; నాలుకకున్ వచ్చినన్= నాలుకమీదికి రాగా; వీఁడు= ఈ అశ్వత్థామ; ఎట్లును= ఎలానూ; సత్+జనుల వృత్తంబునన్= మంచివాళ్ళ ప్రవర్తనతో; ప్రవర్తిల్లెడునే?= ప్రవర్తిస్తాడా; అని; అతండు; వినన్; ఉగ్గడించెన్= పలికాడు; దానికిన్= ఆ మాటకు; అశ్వత్థామ; విషాదంబునన్= విచారంతో; కుంది+ఉండున్+కాని= బాధపడి ఉంటాడే కాని; ఆ+గురుని చెప్పిన+అట్లు= ఆ గురుడు

చెప్పిన విధంగా; సత్+ఉపదేశ కరణ నిష్ఠుండు+కాఁడు= సదుపదేశాన్ని ఆచరించే వాడు కాడు; అతనికిన్; దురభిమానంబును= దురహంకారమూ; కలదు; వినుము; చెప్పెదన్; చిరజీవిత్వంబును= చిరంజీవిత్వంకూడా; భర్గ వర ప్రసాద జనక కారణంబును= ఈశ్వరుడి వర ప్రసాదంవలన కలిగినది; కలిగి+ఉండున్= కలిగి ఉన్నాడు; అనియును; దివ్య+అస్త్ర శస్త్ర విద్యా రహస్యంబునకున్= దివ్యాస్త్ర శస్త్ర విద్యా రహస్యానికి; మూలంబు+ఐన= మూల పురుషుడైన; అగస్త్యు చేతన్= అగస్త్యుడివలన; ద్రోణుండు; పడసిన పొందిన; బ్రహ్మశిరోనామకంబు; తనకున్; కలదు+అనియును; తద్+ప్రభావంబు= దాని మహిమ; దేవ మను దనుజలోకంబులు= దేవతల, మనుష్యుల, రాక్షసుల లోకాలు; భస్మీభూతంబులు+చేయున్+అని= బూడిదచేస్తుందని; ఉండున్; కావునన్; మున్ను= పూర్వం; మీరు; వనవాసులరు+ఐ= అడవిలో వసించేవారై; ఉన్న తఱిన్= ఉన్నప్పుడు; తాను; మా పురంబునకున్= మా నగరానికి; వచ్చి; యాదవ కుమారులతోడి= యాదవ బాలురతోడి; వినోదంబులన్= వేడుకలలో; తగిలి+ ఉండి= ఆసక్తుడై యుండి; ఒక్కనాఁడు; ఏన్= నేను; ఒంటిమైన్= ఒంటరిగా; ఉండన్= ఉండగా; నాకడకున్; చనుదెంచి= వచ్చి; నగుచున్= నవ్వుతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అని చెప్పి, మనస్సులోని మాట తనకు తెలియకుండానే నాలుకమీదకు రాగా, 'వీడు ఎట్లాగూ సజ్జనుల ప్రవర్తన కలిగి ఉంటాడా?' అని అతడు వినేటట్లు అన్నాడు. ఆ మాటకు అశ్వత్థామ విచారంతో బాధపడి ఉంటాడే కాని ఆ గురుడు చెప్పినట్లు సదుపదేశం ఆచరించేవాడు కాడు. అతడికి దురహంకారం ఉన్నది. వినుము. చెప్పుతాను. అతడికి ఈశ్వరవరప్రసాదం వలన చిరంజీవిత్వమూ కలిగింది గదా అనీ, దివ్యాస్త్ర శస్త్ర విద్యా రహస్యానికి మూల పురుషుడైన అగస్త్యుడివలన ద్రోణుడు పొందిన బ్రహ్మశిరోనామకాస్త్రం తనకున్నది కదా! అనీ, దాని మహిమవలన దేవమనుష్యరాక్షసలోకాలు బూడిద అవుతాయనీ ధీమాగా ఉంటాడు. కాబట్టి, పూర్వం మీరు వనవాసం చేస్తూండేటప్పుడు తాను మా నగరానికి వచ్చి యాదవ బాలకులతోడి వేడుకలలో ఆసక్తుడై ఉండి, ఒకనాడు నేను ఒంటరిగా ఉండగా నా దగ్గరకు వచ్చి నవ్వుతూ ఇట్లా అన్నాడు:

తే. 'విను మగస్త్యుఁడు మా తండ్రి వినుత తపము । పేర్మి కెంతయు నాత్మలోఁ బ్రీతిఁ బొంగి
బ్రహ్మ శిరమను దివ్యాస్త్రరత్న మొసఁగె; । నగ్గురుండు నాకిచ్చె నత్యాదరమున. 47

ప్రతిపదార్థం: వినుము; అగస్త్యుఁడు; మా తండ్రి= మా తండ్రియొక్క; వినుత తపము పేర్మికిన్= పొగడబడే తపస్సుయొక్క గొప్పతనానికి; ఎంతయున్= మిక్కిలి; ఆత్మలోన్= మనస్సులో; ప్రీతిన్= సంతోషంతో; పొంగి; బ్రహ్మశిరము+అను; దివ్య+ అస్త్ర రత్నము= దివ్యమైన అస్త్ర శ్రేష్ఠం; ఒసఁగెన్= ఇచ్చాడు; ఆ+గురుండు; అతి+ఆదరమునన్= మిక్కిలి వాత్సల్యంతో; నాకున్= నాకు; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: 'వినుము. అగస్త్యుడు మా తండ్రి చేసిన గొప్ప తపస్సుకు మనస్సులో ఎంతో సంతోషించి, బ్రహ్మ శిరస్సు అనే అస్త్రశ్రేష్ఠం ఇచ్చాడు. ఆ గురుడు అమిత వాత్సల్యంతో దానిని నా కిచ్చాడు.

వ. ఆ దివ్యాస్త్రంబు నీ కిచ్చెద. నీవు నాకుఁ జక్రం బొసంగవలయు'నని పలికిన నే నద్దురభిమాని నాయెడం బరమ స్పర్ధ గలిగి యట్లడుగుట యెఱింగియు నొండనక యతనికి మదీయ చక్ర ధనుర్గదాఖడ్గంబులు సూపి 'వీనిలోన నీకు ధరింపఁ బ్రయోగింప శక్యంబైన దాని ధరింపు'మని చెప్పి 'నీవు నీ యస్త్రంబు నాకు నీ వలవదు. మిత్రుని కోరినయది యిచ్చుచుండి దానికి మాఱుగా నొకటి పుచ్చుకొనుట పురుషార్థంబు తెరువే?' యనుటయు నతండు సుదర్శనంబు వరియించినఁ; 'బుచ్చుకొ' మ్మంటి. నమ్మాటకు

ముదితుండగుచు నమ్మూఢుండు దనవామకరంబునఁ జక్రం బవలంబించి యెత్తం జాలక దక్షిణపాణిం బట్టి యెట్లుఁ గదలఁ దివియశక్తుండు గాక యుభయ హస్తంబులును లావుసేసి తివిసినను నది కదలకుండె నాతండు డస్సి నిలిచి విషణ్ణుండై యున్న నతని నాలోకించి యిట్లంటి. 48

ప్రతిపదార్థం: ఆ దివ్య+అస్త్రంబున్; నీకున్= నీకు; ఇచ్చెదన్= ఇస్తాను; నీవు; నాకున్= నాకు; చక్రంబు= చక్రం; ఒసంగవలయున్= ఇవ్వవలెను; అని; పలికినన్= పలుకగా; నేను; ఆ+దురభిమాని= ఆ దురహంకారుడు; నా+ఎడన్= నాయందు; పరమ స్పర్ధ= మిక్కిలి అసూయ; కలిగి; అట్లు+అడుగుట= ఆ విధంగా అడగటం; ఎఱింగియున్; ఒండు+అనక= ఇంకొకమాట అనక; అతనికిన్; మదీయ చక్ర ధనుస్(ః)+గదా ఖడ్గంబులు= నా చక్రం (సుదర్శనం); ధనుస్సు (శార్‌ఙ్గం), గద(కౌమోదకి), ఖడ్గం(నందకం); చూపి; వీనిలోనన్; నీకున్; ధరింపన్= ధరించటానికి; ప్రయోగింపన్= ప్రయోగించటానికి; శక్యంబు+ఐన దానిన్; ధరింపుము= ధరించుము; అని; చెప్పి; నీవు; నీ+అస్త్రంబు; నాకున్; ఈన్+వలవదు= ఇవ్వనక్కరలేదు; మిత్రుని కోరిన+అది= స్నేహితుడు కోరినది; ఇచ్చుచున్+ఉండి= ఇస్తూ; దానికిన్; మాఱుగాన్= బదులుగా; ఒకటి; పుచ్చుకొనుట; పురుషార్థంబు తెరువే?= ధర్మమార్గమా?; అనుటయున్; అతండు; సుదర్శనంబున్; వరియించినన్= కోరగా; పుచ్చుకొమ్ము+ అంటిన్; ఆ+మాటకున్= ఆ మాటకు; ముదితుండు+అగుచున్= సంతోషించినవాడై; ఆ+మూఢుండు= ఆ తెలివితక్కువవాడు; తన వామ కరంబునన్= తన ఎడమచేతితో; చక్రంబు= చక్రం; అవలంబించి= పట్టుకుని; ఎత్తన్+చాలక= ఎత్తలేక; దక్షిణ పాణిన్= కుడిచేతితో; పట్టి; ఎట్లున్= ఏ విధంగానూ; కదలన్+తివియన్ శక్తుండు కాక= కదల్చలేక; ఉభయ హస్తంబులును= రెండు చేతులూ; లావు+చేసి= కూడగట్టి; తివిసినను= లాగినా; అది; కదలక+ఉండెన్; ఆతండు= అశ్వత్థామ; డస్సి= అలసి; నిలిచి; విషణ్ణుండు+ఐ= విషాదం పొందినవాడై; ఉన్నన్= ఉండగా; అతనిన్; ఆలోకించి= చూసి; ఇట్లు+అంటిన్= ఈ విధంగా అన్నాను.

తాత్పర్యం: ఆ దివ్యాస్త్రం నీ కిస్తాను. నీవు నాకు చక్రం ఇవ్వాలి' అని అంటే నేను ఆ దురహంకారి నాపై అసూయ కలిగి అట్లా అడుగుతున్నాడని తెలిసీ, ఇంకొకమాట అనకుండా, అతడికి నా చక్రం (సుదర్శనం), ధనుస్సూ(శార్‌ఙ్గం), గద(కౌమోదకి), ఖడ్గం (నందకం), చూపించి వీటిలో నీవు ధరించగల, ప్రయోగించగల దానిని ధరించుము' అని చెప్పి, 'నీవు నీ అస్త్రం నా కివ్వనక్కర్లేదు. స్నేహితుడు కోరినదానిని ఇస్తూ దానికి బదులుగా ఒకటి పుచ్చుకొనటం ధర్మమార్గం కాదు' - అనగా అతడు సుదర్శనం కోరితే, 'పుచ్చుకొమ్ము' అన్నాను. ఆ మాటకు సంతోషించి ఆ మందబుద్ధి తన ఎడమచేతితో-చక్రం పట్టుకొని ఎత్తలేక, కుడిచేతితో పట్టుకొని ఏ విధంగానూ కదల్చలేక, రెండు చేతులతోనూ లాగినా అది కదలకపోతే, అతడు అలసిపోయి దిగాలు పడిఉంటే, నేను అతడిని చూచి ఇట్లా అన్నాను:

తే. 'అధికనిష్ఠమై బ్రహ్మచర్య వ్రతంబు । తోడ రుక్మిణీయుతముగాఁ దుహినశైల
తటమునందుఁ బండ్రెండు వత్సరము లుగ్ర । తప మొనర్చి యిమ్మహిత సాధనము వడసి. 49

ప్రతిపదార్థం: అధిక నిష్ఠమైన్= ఎక్కువ నిష్ఠతో; బ్రహ్మచర్య వ్రతంబుతోడన్; రుక్మిణీ యుతముగాన్= రుక్మిణితో కూడి; తుహినశైల తటమునందున్= హిమవత్పర్వతపు చరియమీద; పండ్రెండు వత్సరములు= పన్నెండేళ్ళు; ఉగ్ర తపము= ఘోరతపస్సు; ఒనర్చి= చేసి; ఈ+మహిత సాధనము+పడసి= ఈ గొప్ప సాధనం పొంది.

తాత్పర్యం: 'ఎంతో నిష్ఠతో బ్రహ్మచర్యవ్రతంతో రుక్మిణితో కూడి హిమవత్పర్వతపు చరియమీద పన్నెండేళ్ళు ఘోరతపస్సు చేసి ఈ గొప్ప సాధనం పొంది. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. దివిజ దానవ గంధర్వాది సమస్తభూతంబులు నాతోడి యెత్తు రాకుండెడు నట్టి దోర్వీర్యంబున వెలసి వర్తిల్లుదు; నట్టిది దీని మహత్త్వంబు; న న్నీ చక్రం బింతక మున్ను బలభద్ర ప్రద్యుమ్న సాంబాది యాదవశ్రేష్ఠు లెవ్వరు నడుగరు; గాండీవి శ్వేతాశ్వ కపిధ్వజంబులుఁ దపోబలంబునఁ బడసి యెక్కటికయ్యంబున రుద్రు మెప్పించి పాశుపతంబు గొనియెఁ; బ్రాణంబులకంటె నే నతనికిం గూర్తు; నద్దేవసమునకు నొసంగఁ దగనిది యెద్దియులేే; దట్టి యర్జునుండును దీని నడిగెనే? భరతవంశాచార్యపుత్రుండవు, సకలజన మాన్యుండవు, నీ విట్లెఱుఁగక యడుగుదే? దీని నెవ్వరితోడ రణంబు సేయఁ దలంచి యడిగి?' తనిన నగ్గురునందనుం డిట్లనియె. 50

ప్రతిపదార్థం: దివిజ దానవ గంధర్వ+ఆది సమస్త భూతంబులున్= దేవతలు, రాక్షసులు, గంధర్వులు మొదలుగా అన్ని ప్రాణులూ; నాతోడి ఎత్తు రాక+ఉండెడు+అట్టి= నాతో సాటి రానట్టి; దోర్వీర్యంబునన్ (దోస్(ః)+వీర్యంబునన్)= భుజ పరాక్రమంతో; వెలసి= ఒప్పి; వర్తిల్లుదున్= ఉంటాను; అట్టిది= అటువంటిది; దీని మహత్త్వంబు= దీని గొప్పతనం; నన్నున్; ఈ చక్రంబు; ఇంతకమున్ను= ఇదివరకు; బలభద్ర ప్రద్యుమ్న సాంబ+ఆది యాదవశ్రేష్ఠులు= బలరాముడూ, ప్రద్యుమ్నుడూ, సాంబుడూ మొదలగు యాదవోత్తములు; ఎవ్వరున్= ఎవరూ; అడుగరు; గాండీవి= అర్జునుడు; శ్వేత+అశ్వ కపిధ్వజంబులు= తెల్లగుర్రాలూ, కపిధ్వజమూ; తపస్(ః)+బలంబునన్= తపశ్శక్తిచేత; పడసి= పొంది; ఎక్కటి కయ్యంబునన్= ఒక్కడూ చేసిన యుద్ధంలో; రుద్రున్= శివుడిని; మెప్పించి; పాశుపతంబున్= పాశుపతాస్త్రం; కొనియెన్= పొందాడు; నేను; ప్రాణంబులకంటెన్= ప్రాణాధికంగా; అతనికిన్+కూర్తున్= అతడిని ఇష్టపడతాను; ఆ+దేవ సమునకున్= ఆ దేవ సమానుడికి; ఒసంగన్+తగనిది= ఇవ్వరానిది; ఎద్దియున్+లేదు= ఏదీ లేదు; అట్టి అర్జునుండును= అలాంటి అర్జునుడు సైతం; దీనిన్+అడిగెనే?; భరతవంశ+ఆచార్య పుత్రుండవు= భరతవంశ గురుడి కుమారుడవు; సకల జన మాన్యుండవు= జనులందరిచేత మన్నింపదగ్గవాడవు; నీవు, ఇట్లు; ఎఱుఁగక; అడుగుదె?= అడుగుతావా?; దీనిన్; ఎవ్వరితోడన్; రణంబు+చేయన్+తలంచి= యుద్ధం చేయాలని; అడిగితి(వి)?+ అనినన్= అడిగావు? - అంటే; ఆ+గురునందనుండు= అశ్వత్థామ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు;

తాత్పర్యం: దేవతలూ, రాక్షసులూ, గంధర్వులూ మొదలైన ఎల్ల ప్రాణులూ నాతో సాటికాని భుజబలంతో ఒప్పి ఉంటాను. అదీ దీని గొప్పతనం. ఈ చక్రం ఇమ్మని నన్ను ఇంతవరకూ బలరాముడు, ప్రద్యుమ్నుడు, సాంబుడు మొదలుగా గల యాదవోత్తము లెవరూ అడగలేదు. అర్జునుడు శ్వేతాశ్వాలూ, కపిధ్వజమూ తపోబలంతో పొంది, ఒక్కడూ చేసిన యుద్ధంలో రుద్రుడిని మెప్పించి పాశుపతాస్త్రం పొందాడు. నాకు ప్రాణంకంటె ఎక్కువైన ఆ దేవసమానుడికి ఇవ్వరానిది ఏదీ లేదు. అటువంటి అర్జునుడుసైతం దీనిని అడిగాడా? భరతవంశ గురుడి కుమారుడివి, అందరి మన్ననలూ పొందదగినవాడివి నీవు ఇట్లా తెలియక అడిగావా? దీనిని పుచ్చుకొని ఎవరితో యుద్ధం చేయాలని అడిగావు?' అంటే అశ్వత్థామ ఇట్లా అన్నాడు:

చ. 'సకలజగత్ప్రసిద్ధ మగు చక్రము నీ వొసఁగంగ నిప్డ వు
చ్చి కొని భవత్పదాంబురుహసేవ పదంపడి చేసియైనఁ బో
రికి నిను నియ్యకొల్పి మదిఁ బ్రీతి యెలర్పఁ బెనంగి నీకు నో
డక విలసిల్లి యెల్లఁ బొగడం బెనుపొందఁగఁ గోరి వేఁడితిన్. 51

ప్రతిపదార్థం: సకల జగత్+ప్రసిద్ధము= ఎల్ల లోకాలలోనూ గొప్పది; అగు; చక్రమున్= సుదర్శనాన్ని; నీవు; ఒసఁగంగన్= ఇస్తే; ఇప్డు= ఇప్పుడు; పుచ్చికొని= తీసుకొని; పదంపడి= తరువాత; భవత్+పద+అంబురుహ సేవ= నీ పాదపద్మ సేవ; చేసి+ఐనన్=

చేసైనా; పోరికిన్= యుద్ధానికి; నినున్; ఇయ్యకొల్పి= ఒప్పించి; మదిన్= మనస్సులో; ప్రీతి= సంతోషం; ఎలర్పన్= అతిశయించగా; పెనంగి= యుద్ధం చేసి; నీకున్; ఓడక= జంకక; విలసిల్లి= ఒప్పి; ఎల్లన్= అంతా; పొగడన్= పొగడగా; పెనుపు+ఒందఁగన్+ కోరి= అతిశయించగోరి; వేఁడితిన్= కోరాను.

తాత్పర్యం: 'ఎల్ల లోకాలలోనూ ప్రసిద్ధమైన సుదర్శనం నీవు ఇస్తే, ఇప్పుడు పుచ్చుకొని తరువాత నీ పాదపద్మసేవ చేసైనా, యుద్ధానికి నిన్ను ఒప్పించి, మనస్సులో సంతోషం అతిశయించగా, యుద్ధం చేసి నీకు జంకకుండా ఒప్పి అందరూ పొగడగా పెంపు వహించగోరి కోరాను.

వ. **ఈ చక్రంబు నీక ధరియింపం దగియుండుఁ గాక, నా కిది లేకున్న నేమియగు? నెట్లును నీతోడ సంగరంబు సేయంగలవాఁడ' ననియె. నేను నవ్వుచు నట్లకాక యని ద్రోణాచార్య పుత్రత్వ బహుమానంబున మాననీయ రథ్యంబులు, నభిరామరత్నాంబరాభరణంబులు నిచ్చి పుచ్చినం జనియె; నట్టి మహాహంకారంబునకుఁ గారణంబైన బ్రహ్మశిరోనామకం బను దివ్యాస్త్రంబున నవ్యాహత సంరంభుండును, నసద్వ్యాపారారం భుండును, గ్రూర దర్శనుండును నగు నశ్వత్థామచేత భీముండు బాధితుండు గాకుండవలయు'నని పలికి పద్మనాభుండు సాత్యకి సహదేవులం జూచి మీరు శిబిరంబున నిలువుం'డని నియోగించి.** **52**

ప్రతిపదార్థం: ఈ చక్రంబు; నీకున్+అ= నీకే; ధరియింపన్= ధరించటానికి; తగి+ఉండున్+కాక; నాకున్; ఇది; లేక+ఉన్నన్= లేకపోతే; ఏమి+అగున్?= ఏమవుతుంది? ఎట్లును; నీతోడన్; సంగరంబు= యుద్ధం; చేయంగలవాఁడన్; అనియెన్; నేను; నవ్వుచున్; అట్లు+అ+కాక+అని= అట్లే అని; ద్రోణాచార్య పుత్రత్వ బహుమానంబునన్= ద్రోణాచార్యుడి కుమారుడనే గౌరవంతో; మాననీయ రథ్యంబులున్= ప్రశస్తాలైన గుర్రాలూ; అభిరామ రత్న+అంబర+ఆభరణంబులున్= మనోహరాలైన రత్నాలూ, వస్త్రాలూ, నగలూ; ఇచ్చి; పుచ్చినన్= పంపగా; చనియెన్= వెళ్ళాడు; అట్టి; మహా+అహంకారంబునకున్= గొప్ప పొగరుకు; కారణంబు+ఐన; బ్రహ్మశిరోనామకంబు; అను; దివ్య+అస్త్రంబునన్= దివ్యాస్త్రంచేత; అవ్యాహత సంరంభుండును= అప్రతిహతమైన సంరంభం గలవాడూ; అసత్+వ్యాపార+ఆరంభుండును= దుష్కర్మాచరణుడూ; క్రూరదర్శనుండును= క్రూరాత్ముడూ; అగు; అశ్వత్థామచేతన్; భీముండు; బాధితుండు= పీడితుడు; కాక+ఉండవలయున్= కాగూడదు; అని; పలికి; పద్మనాభుండు= కృష్ణుడు; సాత్యకి సహదేవులన్+చూచి; మీరు; శిబిరంబునన్; నిలువుండు= ఉండండి; అని; నియోగించి= నియమించి.

తాత్పర్యం: ఈ చక్రం నీకే ధరించదగ్గదై ఉండుగాక! నాకు ఇది లేకపోతే నష్టమేమున్నది? ఎట్లాగూ నీతో యుద్ధం చేస్తాను' అన్నాడు. నేను నవ్వుతూ అట్లాగే అని ద్రోణాచార్యుడి కొడుకనే గౌరవంచేత అతడికి మంచి గుర్రాలూ, మనోహర రత్నాలూ, వస్త్రాలూ, ఆభరణాలూ ఇచ్చి పంపితే వెళ్ళిపోయాడు. అటువంటి గొప్ప పొగరుకు కారణమైన బ్రహ్మశిరోనామక దివ్యాస్త్రంతో అప్రతిహతమైన సంరంభం గలవాడూ, దుష్కర్మాచరణుడూ, క్రూరాత్ముడూ అయిన అశ్వత్థామచేత భీముడు బాధితుడు కారా' దని పలికి, కృష్ణుడు సాత్యకినీ, సహదేవుడినీ చూచి 'మీరు శిబిరంలో ఉండండి' అని నియమించి.

ధర్మజధనంజయకృష్ణు లశ్వత్థామమీఁదికిఁ బోవుట (సం. 10-13-1)

సీ. **ప్రద్యోతితానేక రత్న శోభితమును। సంభృతాయుధవరిష్ఠంబు నైన**
మాన్య రథమ్మున శైబ్యసుగ్రీవంబు। లను మేఘపుష్పవలాహకములఁ

బూన్పించి యాభీల భుజగారికేతనం । బెత్తించి వే నొగ లెక్కుటయును,
గాండీవధరణోద్భటుండును దూణీర । యుగళసన్నాహసముజ్జ్వలుండు

ఆ. నై ధనంజయుఁడు రథారోహణము సేసె । నగ్రజుండు నెక్కెననికి నమరి
యొప్పి రమ్మురారియును వారు నప్పుడు । బలహరుండు నశ్వినులును బోలె. 53

ప్రతిపదార్థం: ప్రద్యోతిత= మిక్కిలి ప్రకాశించిన; అనేక= పెక్కు; రత్న శోభితమును= మణులచేత ఒప్పినదీ; సంభృత+ఆయుధ వరిష్ఠంబున్= నిండిన ఆయుధాలచేత మిక్కిలి గొప్పదీ; ఐన; మాన్య రథమ్మునన్= గొప్ప రథానికి; శైబ్యసుగ్రీవంబులను= శైబ్యమునూ; సుగ్రీవమునూ; మేఘపుష్ప వలాహకములన్= మేఘపుష్పమునూ; వలాహకమునూ; పూన్పించి= కట్టించి; ఆభీల భుజగ+అరి కేతనంబు= భయంకరమైన గరుడకేతనం; ఎత్తించి; వే= శీఘ్రంగా; నొగలు+ఎక్కుటయును= తొట్టిలో కూర్చుండగా; గాండీవ ధరణ+ఉద్భటుండును= గాండీవధారణచేత భయంకరుడూ; తూణీర= అమ్ములపొదులయొక్క; యుగళ= జంట చేతా; సన్నాహ= కవచంచేతా; సముజ్జ్వలుండున్= మిక్కిలి ప్రకాశించేవాడూ; ఐ; ధనంజయుఁడు= అర్జునుడు; రథ+ఆరోహణము+ చేసెన్= రథం ఎక్కాడు; అగ్రజుండున్= అన్నకూడా (ధర్మరాజు కూడా); ఎక్కెన్; ఆ+ముర+అరియును= ఆ కృష్ణుడూ; వారున్= ధర్మజార్జునులూ; అప్పుడు; బలహరుండున్= ఇంద్రుడూ; అశ్వినులును+పోలెన్= అశ్వినీదేవతలవలె; అనికిన్= యుద్ధానికి అమరి= సంసిద్ధులై; ఒప్పిరి.

తాత్పర్యం: ప్రకాశించే పెక్కు మణులచేత ఒప్పినదీ, ఆయుధ సమృద్ధిచేత గొప్పదీ అయిన శ్రేష్ఠమైన రథానికి శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకాలనే కృష్ణుడి గుర్రాలను కట్టించి, భయంకరమైన గరుడకేతనం ఎత్తించి శీఘ్రమే నొగలపై కూర్చుండగా, గాండీవధారణచేత భయంకరుడూ, అంపపొదుల జంటా, కవచం అనేవాటిచేత మిక్కిలి ప్రకాశించేవాడూ అయి అర్జునుడు రథం ఎక్కాడు. అన్న ధర్మరాజు కూడా ఎక్కాడు. కృష్ణుడూ, వాళ్ళిద్దరూ అప్పుడు ఇంద్రుడూ, అశ్వినులూ అన్నట్లుగా యుద్ధానికి సంసిద్ధులై ఒప్పారు.

విశేషం: అలం: ఉపమ. 'ఒప్పి రమ్మురారియును వారు నప్పుడు - బలహరుండు నశ్వినులును బోలె.' - అలంకారం ఉపమ. మురారి, వారు - ఉపమేయం, బలహరుడు, అశ్వినులు ఉపమానం. పోలె - ఉపమావాచకం. ఒప్పిరి - సమానధర్మం. ఈ నాలుగూ ఉండటంచేత ఇది సంపూర్ణోపమ. కృష్ణుడి గుర్రాలలో ఒకదానికి సైన్యము (శైబ్యము) అని పేరు.

వ. ఇట్లు సన్నద్ధంబైన యా రథంబు భాసురప్రతోదంబు పుచ్చుకొని యద్దామోదరుండు వఱప నయ్యుత్తమ రథ్యంబుల రయాతిశయంబున సమీరనందన స్యందనంబు గొండొక సేపునకుం గూడె; నప్పుడు భాగీరథీతీరం బునఁ గ్రోధాయత్త చిత్తుండగుచు నశ్వత్థామ యున్నయెడ రోయుచుఁ బోవు నప్పావని నమ్ముప్పురు వారించి; రట్టు వారించిన నిలువక వారి ముందటం జని యతండు సూడ్కి యట నిగిడించి. 54

ప్రతిపదార్థం: ఇట్లు; సన్నద్ధంబు+ఐన= కట్టబడిన; ఆ రథంబున్; భాసుర ప్రతోదనంబున్= ప్రకాశించే కొరడాను; పుచ్చుకొని; ఆ+దామోదరుండు= ఆ కృష్ణుడు; వఱపన్= పరుగెత్తించగా; ఆ+ఉత్తమ రథ్యంబుల= ఆ శ్రేష్ఠములైన గుర్రాలయొక్క; రయ+అతిశయంబునన్= వేగాధిక్యంచేత; సమీర నందన స్యందనంబున్= భీముడి రథాన్ని; కొండొకసేపునకున్= కొంతసేపటికి; కూడెన్= కలిసికొన్నది; అప్పుడు; భాగీరథీ తీరంబునన్= గంగానది ఒడ్డున; క్రోధ+ఆయత్త చిత్తుండు+అగుచున్= కోపానికి వశమైన మనస్సుకలవాడు అవుతూ; అశ్వత్థామ+ఉన్న ఎడన్= అశ్వత్థామ ఉన్నచోటు; రోయుచున్= వెదకుతూ; పోవు+ఆ+పావనిన్= వెళ్ళే ఆ భీముడిని; ఆ+ముప్పురున్= ఆ ముగ్గురూ - ధర్మజార్జున కృష్ణులు; వారించిరి= ఆపుచేశారు; అట్టు= ఆ విధంగా;

వారించినన్= ఆపగా; నిలువక; వారి ముందటన్+చని= వారికంటె ముందువెళ్ళి; అతండు= భీముడు; చూడ్కి= చూపు; అటన్= అక్కడ; నిగిడించి= సారించి.

తాత్పర్యం: ఇట్లా కట్టబడిన ఆ రథాన్ని మంచి కొరడా పుచ్చుకొని ఆ కృష్ణుడు పరుగెత్తించగా ఆ శ్రేష్ఠములైన గుర్రాల వేగాధిక్యంచేత భీముడి రథాన్ని కొంతసేపటికి కలుసుకొన్నది. అప్పుడు గంగానది ఒడ్డున కోపంతో అశ్వత్థామ ఉన్నచోటు వెదకుతూపోయే భీముడిని ఆ ముగ్గురూ ఆపుచేశారు. అట్లా వారిస్తే నిలువక వారికంటె ముందుగా వెళ్ళి అతడు అక్కడ చూపు సారించి.

చ. సలిల సమీపదేశమున సంయమిసంఘము గొల్వఁగా సము
జ్జ్వల మహనీయమూర్తి యగు సాత్యవతేయుఁడు తారకాగణం
బుల నడుమం బ్రదీప్తుఁడగు పూర్ణసుధాంశుని యట్టు లుండ న
వ్వలనికిఁ బోక భక్తి నభివాదనముల్ మదిలోనఁ జేయుచున్. 55

ప్రతిపదార్థం: (పై వచనంలోని 'అతండు' - కర్త), సలిల సమీప దేశమునన్= నీటికి దగ్గరగా ఉన్నచోట; సంయమి సంఘము= మునుల సమూహం; కొల్వఁగాన్= సేవిస్తూండగా; సముజ్జ్వల మహనీయ మూర్తి+అగు= ప్రకాశించే గొప్ప ఆకారం గలవాడు అగు; సాత్యవతేయుఁడు= వ్యాసుడు; తారకా గణంబు నడుమన్= నక్షత్రాల సమూహాల మధ్య; ప్రదీప్తుఁడు+అగు= ప్రకాశించే; పూర్ణ సుధాంశుని+అట్టులు+ఉండన్= పూర్ణచంద్రుడిలా ఉండగా; ఆ+వలనికిన్= ఆవైపు; పోక= వెళ్ళక; భక్తిన్= భక్తితో; అభివాదమున్= నమస్కారం; మదిలోనన్= మనస్సులో; చేయుచున్= చేస్తూ.

తాత్పర్యం: నీటికి దగ్గరగా ఉన్న ప్రదేశంలో ముని సమూహం సేవిస్తూండగా ప్రకాశించే గొప్ప ఆకారం కల వ్యాసుడు నక్షత్ర సమూహాల మధ్య ప్రకాశించే నిండుచంద్రుడివలె ఉండగా (భీముడు) ఆ వైపు పోక, భక్తితో మనస్సులో నమస్కరిస్తూ. (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ. 'సంయమిసంఘము గొల్వఁగా.... సాత్యవతేయుఁడు తారకాగణంబుల నడుమం బ్రదీప్తుఁడగు పూర్ణసుధాంశుని యట్టులుండ'... అలంకారం ఉపమ. సంయమిసంఘము, సాత్యవతేయుడు ఉపమేయాలు. తారకాగణంబులు, పూర్ణసుధాంశుడు క్రమంగా వాటికి ఉపమానాలు. ఉండు - సమానధర్మం. 'అట్టులు' ఉపమావాచకం. నాలుగంశాలూ ఉండటంచేత ఇది సంపూర్ణోపమ. ఈ ఉపమవలన ఇతర మునులకంటె వ్యాసుడి విశిష్టత తెలుస్తున్నది. భీముడు వ్యాసుడి దగ్గరకు వెళ్ళకపోవటానికి కారణం, అశ్వత్థామను పట్టుకోవటమే ప్రస్తుతం అతడికి ముఖ్యకర్తవ్యం కాబట్టి.

వ. కెలంకులు గలయం బరికించి యొక్కెడ. 56

ప్రతిపదార్థం: కెలంకులు= ప్రక్కలు; కలయన్+పరికించి= అంతటా చూసి; ఒక్క+ఎడన్= ఒక్కచోట.

తాత్పర్యం: ప్రక్కలు బాగా చూచి, ఒకచోట.

ఆ. మేన భసిత మలఁది మాననీయ తపః ప్ర। యుక్తి నాదరించి యున్న ద్రోణ
తనయుఁ గాంచి చాపదండంబు సజ్యంబు। సేసి మహితశరముచే నమర్చి. 57

ప్రతిపదార్థం: (54వ వచనంలోని 'అతఁడు' - కర్త) మేనన్= శరీరంపై; భసితము= భస్మం; అలఁది= పూసి; మాననీయ తపస్(ః)+ప్రయుక్తిన్= మన్నించదగిన తపఃప్రయోగాన్ని; ఆదరించి+ఉన్న= పాటించి ఉన్నట్టి; ద్రోణతనయున్= అశ్వత్థామను;

కాంచి= చూచి; చాపదండంబున్= వింటి బద్దను; సజ్యంబు+చేసి= త్రాటితో కూడినదిగా చేసి; మహిత శరముచేన్= గొప్ప బాణంతో; అమర్చి= కూర్చి.

తాత్పర్యం: శరీరం నిండా బూది పూసికొని గొప్ప తపస్సు చేస్తున్న అశ్వత్థామను భీముడు చూచి, వింటికి నారి తగిలించి, గొప్పబాణం కూర్చి.

వ. భ్రుకుటిత వికట ఫాలభాగుండై. 58

ప్రతిపదార్థం: భ్రుకుటిత= బొమముడి పడటంచేత; వికట= భయంకరమైన; ఫాలభాగుండు+ఐ= నుదుటి ప్రదేశం కలవాడయి.

తాత్పర్యం: బొమలు ముడిపడటంచేత భయంకరమైన నుదురు కలవాడై.

తే. 'ఓరి ధాత్రీసురాధమ! క్రూరకర్మ! । కపట ధార్మిక! యత్యంత కల్మషాభి
యుక్తిఁ బోయినరేయి మహోగ్రవృత్తిఁ । దగిలి; తెంత వేగిరమునఁ దపసివైతి! 59

ప్రతిపదార్థం: ఓరి ధాత్రీసుర+అధమ!= ఓరి నీచబ్రాహ్మణుడా!; క్రూరకర్మ!= క్రూరపు పనులు చేసేవాడా!; కపట ధార్మిక!= ధర్మం నటించేవాడా!; పోయిన రేయి= కడచిన రాత్రి; అత్యంత కల్మష+అభియుక్తిన్= మిక్కిలి పాపంతో; మహా+ఉగ్ర వృత్తిన్= మిక్కిలి ఘోరమైన ప్రవర్తనతో; తగిలితి(వి)= ఆసక్తిగలిగి ఉన్నావు; ఎంత వేగిరమునన్= ఎంతవేగంగా; తపసివి+ఐతి(వి)!= ముని వయ్యావు!

తాత్పర్యం: 'ఓరీ నీచబ్రాహ్మణుడా! క్రూరకర్ముడా! ధర్మం నటించేవాడా! గతరాత్రి మిక్కిలి పాపంతో ఘోరంగా ప్రవర్తించి, ఎంతవేగంగా ముని వయ్యావు?

వ. ఇట్టు లొదిఁగిన జావు దప్పునే? లే లెమ్ము. తపమ్ము సాలు రణమ్మునకు ర'మ్మని కఠినాక్షరంబులుగాఁ బలికె. నటు పలుకు నా భీమసేనుం గనుంగొని యతని వెనుకఁ గదియ నడచిన సవ్యసాచి ధర్మజులం జూచి సవ్యథంబగు నంతఃకరణంబుతో నగ్గురునందనుండు వారల దివ్యాస్త్రవేదిత్వం బూహించి దుస్సహంబగు నమ్మహా దురితంబునకుఁదలంకి బ్రహ్మశిరోనామకం బను దివ్యాస్త్రంబు దలంచి యొక్క యిషీకంబు పుచ్చికొని యం దయ్యస్త్రంబు నావహించి 'యపాండవం బయ్యెడు' మని దారుణ భాషణంబులతోడ రోషప్రదీప్తుం డగుచుఁ బ్రయోగించిన. 60

ప్రతిపదార్థం: ఇట్టులు= ఇలా; ఒదిఁగినన్= దాక్కుంటే; చావు; తప్పునే?; లెమ్ము+లెమ్ము; తపమ్ము+చాలున్; రణమ్మునకున్= యుద్ధానికి; రమ్ము+అని; కఠిన+అక్షరంబులు+కాన్= పరుషంగా; పలికెన్; అటు= అట్లా; పలుకు+ఆ భీమసేనున్= పలికే ఆ భీముడిని; కనుంగొని= చూచి; అతని వెనుకన్; కదియన్+నడచిన= వెంటవచ్చినట్టి; సవ్యసాచి ధర్మజులన్= అర్జునుడినీ, ధర్మరాజునీ; చూచి; సవ్యథంబు+అగు+అంతఃకరణంబుతోన్= బాధతో గూడిన మనస్సుతో; ఆ+గురునందనుండు= ఆ అశ్వత్థామ; వారల= వాళ్ళయొక్క; దివ్య+అస్త్ర+ వేదిత్వంబు= దివ్యాస్త్రజ్ఞానం; ఊహించి= తెలిసి; దుస్సహంబు+అగు+ఆ+మహత్ (మహా) దురితంబునకున్= సహించశక్యంకాని ఆ మహాపాప కార్యానికి; తలంకి= కలతచెంది; బ్రహ్మశిరోనామకంబు+అను దివ్య+అస్త్రంబు= బ్రహ్మశిరోనామకమైన దివ్యాస్త్రాన్ని; తలంచి; ఒక్క+ఇషీకంబు+పుచ్చికొని= ఒక్క రెల్లుగడ్డిపరకను పట్టుకుని; అందున్; ఆ+అస్త్రంబున్= ఆ అస్త్రాన్ని; ఆవహించి= ఆవాహనం చేసి; అపాండవంబు+అయ్యెడున్+అని= నిష్పాండవం

అవాలని; దారుణ భాషణంబులతోడన్= పరుషవాక్యాలతో; రోష ప్రదీప్తుండు+అగుచున్= కోపంతో మండిపడుతూ; ప్రయోగించినన్= ప్రయోగించగా.

తాత్పర్యం: ఇట్లా దాక్కుంటే చావు తప్పుతుందా? లెమ్ము. లెమ్ము. తపం చాలును. యుద్ధానికి రమ్ము' అని పరుషంగా పలికాడు. అట్లా అనే భీముడిని చూచి, అతడి వెనక వచ్చిన అర్జునుడినీ, ధర్మరాజునీ చూచి బాధపడే మనస్సుతో ఆ అశ్వత్థామ వాళ్ళ దివ్యాస్త్రజ్ఞానం ఎరిగి, సహించరాని తన మహాపాపకార్యానికి కలతపడి బ్రహ్మశిరోనామక దివ్యాస్త్రం తలచుకొని ఒక రెల్లు గడ్డిపోచ పట్టుకొని దానిపైకి ఆ అస్త్రాన్ని ఆవాహనంచేసి, 'పాండవనిర్మూలనం అవుతుంది గాక!' అని పరుషంగా అంటూ, కోపంతో మండిపడుతూ ప్రయోగించగా.

స్రగ్ధర.

> **ఆ దివ్యాస్త్రంబునం దుద్యత మయి ఘనఘోరాగ్ని యర్చిర్వితానం**
> **బేదిక్కుం దానయై పెల్లెసఁగుచు భవనంబెల్ల భస్మంబుగా నా**
> **పాదింపం బేర్చుమాడ్కిం బరఁగి పెరిఁగినం బార్థునిం జూచి తద్బా**
> **హాదర్పజ్ఞానముద్రావ్యపగతభయుఁ డై యంబుజాక్షుండు వల్కున్. 61**

ప్రతిపదార్థం: ఆ దివ్య+అస్త్రంబునందున్= ఆ దివ్యాస్త్రంలోంచి; ఉద్యతము+అయి= పుట్టినదయి; ఘన ఘోర+అగ్ని= గొప్పదీ, భయంకరమైనదీ అయిన అగ్నియొక్క; అర్చిస్(ః)+వితానంబు= జ్వాలల సమూహం; ఏ దిక్కున్= ఏవైపైనా; తాను+అ+ఐ= తానే అయి; పెల్లు+ఎసఁగుచున్= మిక్కిలి విజృంభిస్తూ; భువనంబు+ఎల్లన్= లోకం అంతా; భస్మంబు+కాన్= బూడిదగా; ఆపాదింపన్= చేసేటట్టు; పేర్చుమాడ్కిన్= విజృంభించే విధంగా; పరఁగి= ఒప్పి; పెరింగినన్= వృద్ధిపొందగా; పార్థునిన్= అర్జునుడిని; చూచి; తద్= అతడియొక్క (ఆ అర్జునుడియొక్క); బాహా= భుజాలయొక్క; దర్ప= గర్వంయొక్క; జ్ఞానముద్రా= తెలివిడిగుర్తు చేత; వ్యపగత= పోయిన; భయుఁడు+ఐ= భయంగలవాడై; అంబుజ+అక్షుండు= పద్మాలవంటి కళ్ళుగలవాడు-కృష్ణుడు; పల్కున్= పలికాడు.

తాత్పర్యం: ఆ దివ్యాస్త్రంనుండి పుట్టిన పెద్దదీ భయంకరమైనదీ అయిన అగ్నిజ్వాలల సమూహం, అన్నివైపులా తాను అయి మిక్కిలి విజృంభిస్తూ లోకాన్ని అంతనీ బూడిదచేసేటట్లు అతిశయించే విధంగా ఒప్పి పెరుగగా, కృష్ణుడు అర్జునుడిని చూచి, అతడి భుజ పరాక్రమం తెలిసినవాడవటంచేత భయంలేనివాడై ఇట్లా అన్నాడు.

వ. 'అర్జున! యర్జున! యిది బ్రహ్మ శిరోనామకం బను దివ్యాస్త్రంబు. దీని నొం డస్త్రంబు ప్రతిహతంబుఁ జేయంజాలదు, బ్రహ్మ శిరంబు నీవునుం బ్రయోగించి దీని నుడిపి నిన్నును నీ సోదరులను గాచికొనుము. సత్వరుండవు గమ్ము.' 62

ప్రతిపదార్థం: అర్జున!= అర్జునా!; ఇది; బ్రహ్మ శిరోనామకంబు; అను; దివ్య+అస్త్రంబు; దీనిన్= దీనిని; ఒండు+అస్త్రంబు= ఇంకొొక అస్త్రం; ప్రతిహతంబున్= తిప్పికొట్టబడిందిగా; చేయన్+చాలదు= చేయలేదు; నీవునున్= నువ్వుకూడా; బ్రహ్మశిరంబున్= బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని; ప్రయోగించి; దీనిన్; ఉడిపి= మాన్పి; నిన్నును; నీ సోదరులను; కాచికొనుము= రక్షించుకొమ్ము; సత్వరుండవు+కమ్ము= త్వరపడు.

తాత్పర్యం: 'అర్జునా! అర్జునా! ఇది బ్రహ్మశిరోనామక దివ్యాస్త్రం. దీన్ని వేరే అస్త్రం తిప్పికొట్టలేదు. నీవు కూడా బ్రహ్మశిరోనామకాస్త్రాన్నే ప్రయోగించి దీనిని నిరోధించి, నిన్నూ నీ సోదరులనూ కాపాడుకొమ్ము. త్వరపడుము.'

క. అనవుడు నవ్వీరుఁడు స । య్యన నరదము డిగ్గి నియతుఁడై ధనురాచా
ర్యుని సంస్మరించి చాపము । గొని మంత్రముతోడ శరము గుణమునఁ గూర్చెన్. 63

ప్రతిపదార్థం: అనవుడున్= అన్నంతనే; ఆ+వీరుఁడు= ఆ వీరుడైన అర్జునుడు; చయ్యనన్= శీఘ్రంగా; అరదమున్+డిగ్గి= రథందిగి; నియతుఁడు+ఐ= నియమం గలవాడై; ధనుస్(ః)+ఆచార్యునిన్= ధనుర్విద్యా గురువైన ద్రోణుడిని; సంస్మరించి= తలచుకొని; చాపము+కొని= విల్లు తీసుకొని; మంత్రముతోడన్= సమంత్రకంగా; శరమున్= బాణాన్ని; గుణమునన్= అల్లెత్రాటియందు; కూర్చెన్.

తాత్పర్యం: అని కృష్ణు డనగానే ఆ వీరుడు వెంటనే రథం దిగి నియమంతో ద్రోణాచార్యుడిని తలచుకొని, విల్లు తీసికొని, సమంత్రకంగా బాణాన్ని అల్లెత్రాటితో సంధించాడు.

అశ్వత్థామార్జునుల బ్రహ్మశిరోనామకాస్త్రంబు లొండొంటిం దాఁకుట (సం. 10-15-1)

వ. కూర్చి తొలుత గురునందనునకుం గీడు వొందకుండ వలయునని ప్రార్థించి పదంపడి నాకును సోదరులకును శుభం బయ్యెడుమని పలికి యస్త్రదేవతలకు నమస్కరించి యస్త్ర మస్త్రంబునన శమియించుఁ గావుత మని శివంబుఁ జింతించుచుం బ్రయోగించిన నా దివ్యాస్త్రంబు కల్పాంతజ్వలనంబునుం బోలె నాభీలజ్వాలా మాలాకరాళంబై యుప్పరం బెల్లను దనమయంబుగా నిగిడి యశ్వత్థామాస్త్రంబు గ్రమ్మఱింప నుత్సహించిన నది క్రమ్మఱక పెరిఁగి సముద్దామధామం బగుటయు నయ్యస్త్రద్వితయంబు నాటోపంబున. 64

ప్రతిపదార్థం: కూర్చి= సంధించి; తొలుతన్= మొదట; గురు నందనునకున్= అశ్వత్థామకు; కీడు+పొందక+ఉండన్+వలయున్+అని= హాని జరగకుండా ఉండాలని; ప్రార్థించి; పదంపడి= పిమ్మట; నాకున్= నాకు; సోదరులకును; శుభంబు+అయ్యెడున్+అని= శుభం కలగాలని; పలికి; అస్త్ర దేవతలకున్; నమస్కరించి; అస్త్రము; అస్త్రంబునన్+అ= అస్త్రంచేతనే; శమియించున్+కావుతన్+అని; శాంతించాలని; శివంబున్= శుభం; చింతించుచున్= తలపెడుతూ; ప్రయోగించినన్= ప్రయోగించగా; ఆ దివ్య+అస్త్రంబు; కల్పాంతజ్వలనంబునున్+పోలెన్= ప్రళయ సమయంలోని అగ్నివలె; ఆభీల జ్వాలామాలా కరాళంబు+ఐ= భయంకరమైన జ్వాలల సమూహంచేత భయంకరమై; ఉప్పరంబు+ఎల్లను= ఆకాశం అంతా; తనమయంబు కాన్= తనే నిండగా; నిగిడి= వ్యాపించి; అశ్వత్థామ+అస్త్రంబు= అశ్వత్థామ అస్త్రం; క్రమ్మఱింపన్= మరల్చటానికి; ఉత్సహించినన్= ప్రయత్నించగా; అది, క్రమ్మఱక= మరలక; పెరిఁగి; సముద్దామ+ధామంబు+అగుటయున్= మిక్కిలి భయంకరమైన కాంతులు గలది కాగా; ఆ+అస్త్ర+ద్వితయంబు+ఆటోపంబునన్= ఆ రెండు అస్త్రాల విజృంభణం చేతా.

తాత్పర్యం: సంధించి మొదట అశ్వత్థామకు హాని కలగకుండా ఉండాలని ప్రార్థించి, తరువాత 'నాకూ నా సోదరులకూ శుభం కలగా' లని పలికి అస్త్రదేవతలకు నమస్కరించి అస్త్రం అస్త్రంచేతనే శాంతించాలని, శుభం జరగాలని కోరుతూ ప్రయోగించగా ఆ దివ్యాస్త్రం ప్రళయ సమయంలో అగ్నివలె భయంకర జ్వాలల సమూహంతో వెరపు పుట్టిస్తూ ఆకాశం అంతా తనే అయ్యేటట్టు వ్యాపించి అశ్వత్థామ అస్త్రాన్ని త్రిప్పికొట్టటానికి ప్రయత్నించగా

అది మరలక పెరిగి భయంకరకాంతులు గలిగినది కాగా, ఆ రెండస్త్రాల విజృంభణంచేత. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ. 'కల్పాంతజ్వలనంబునుం బోలె' - అలంకారం ఉపమ. అశ్వత్థామ అపాండవం కావాలని కోరగా, అర్జునుడు అశ్వత్థామకు కీడు కలగకూడదని కోరాడు. అదీ వాళ్ళ శీలాలకు గల తేడా.

మహాస్రగ్ధర.

జలధుల్ ఘూర్ణిల్లె, నుల్కాశతములు వడియెం, జండభానుండు మాసెం,
గులశైలంబుల్ వడంకెం, గురిసె నురవడిన్ ఘోరపాషాణధారా
వలి, నాకాశంబు ధాత్రీవలయముఁ దిరిగెన్, వజ్రనిర్ఘోష మెందుం
జెలఁగం జొచ్చెన్, జనం బచ్చెరువును భయముం జెంది నిశ్చేష్ట మయ్యెన్. 65

ప్రతిపదార్థం: జలధుల్= సముద్రాలు; ఘూర్ణిల్లెన్= తిరుగుడుపడ్డాయి; ఉల్కాశతములు+పడియెన్= వందలకొద్దీ ఉల్కలు రాలాయి; చండభానుండు= తీక్షణమైన సూర్యుడు; మాసెన్= అంతరించాడు; కులశైలంబుల్= కులపర్వతాలు; వడంకెన్= కంపించాయి; ఆకాశంబున్= ఆకాశం; ఘోరపాషాణ ధారా+ఆవలిన్= భయంకర శిలావర్షధారల సమూహాన్ని; ఉరవడిన్= మిక్కిలి వేగంతో; కురిసెన్; ధాత్రీ వలయమున్= భూమండలమూ; తిరిగెన్; ఎందున్= అన్నిచోట్లా; వజ్ర నిర్ఘోషము= పిడుగుల చప్పుడు; చెలఁగన్+చొచ్చెన్= మ్రోగ నారంభించినది; జనంబు= మనుష్యుల సమూహం; అచ్చెరువును= ఆశ్చర్యమూ; భయమున్; చెంది; నిశ్చేష్టము+అయ్యెన్= చేష్టలుడిగింది.

తాత్పర్యం: సముద్రాలు తిరుగుడు పడ్డాయి. వందలకొద్దీ ఉల్కలు రాలాయి. తీవ్ర సూర్యుడు అంతరించాడు. కులపర్వతాలు కంపించాయి. ఆకాశం భయంకర శిలావర్షం మిక్కిలి వేగంగా కురిసింది. భూమి తిరుగుడు పడింది. అంతటా పిడుగుల చప్పుడు మ్రోగ నారంభించింది. జనులు ఆశ్చర్యమూ, భయమూ చెంది చేష్ట లుడిగారు.

విశేషం: 'కులశైలములు - మహేంద్రము, మలయము, సహ్యము, శుక్తిమంతము, గంధమాదనము, వింధ్యము, పారియాత్రము అని కులపర్వతాలు ఏడు.

వ. ధర్మాత్ముండగు నారదుం డప్పుడు సాత్యవతేయునకు సన్నిహితుండయ్యె, నతండును భరత కులోద్వహుండగు నప్పారాశర్యుండును గూడి యిట్లు జగద్భయంకర ప్రక్రమోద్దాములగు నయ్యర్జునాశ్వత్థామల నుపశమింపంజేయుట కై నడుమ నిలిచి యయ్యిరువురును నాకర్ణింప నిట్లనిరి. 66

ప్రతిపదార్థం: ధర్మ+ఆత్ముండు+అగు= పుణ్యాత్ముడైన; నారదుండు= నారదుడు; అప్పుడు; సాత్యవతేయునకున్= వ్యాసుడికి; సన్నిహితుండు+అయ్యెన్= సమీపించినవాడు అయ్యాడు; అతండును; భరతకుల+ఉద్వహుండు+అగు= భరతవంశోద్ధారకుడైన; ఆ+పారాశర్యుండును= ఆ వ్యాసుడును; కూడి= కలిసి; ఇట్లు; జగత్+భయంకర+ప్రక్రమ+ఉద్దాములు+అగు= లోక భీకరమైన ప్రయత్నంతో ఉద్దండులు అయిన; ఆ+అర్జున+అశ్వత్థామలన్= ఆ అర్జునుడినీ, అశ్వత్థామనీ; ఉపశమింపన్+చేయుటకై= శాంతింపజేయటానికి; నడుమన్= మధ్య; నిలిచి; ఆ+ఇరువురును= ఆ ఇద్దరూ; ఆకర్ణింపన్= వినేటట్టు; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: పుణ్యాత్ముడైన నారదుడు అప్పుడు వ్యాసుడి దగ్గరకు వచ్చాడు. అతడూ, భరతవంశోద్ధారకుడైన వ్యాసుడూ కలిసి, ఈ రీతిగా లోకభీకర ప్రయత్నంలో ఉద్దండులైన ఆ అర్జునుడినీ, అశ్వత్థామనీ శాంతింపజేయటానికి మధ్య నిలిచి, వాళ్ళిద్దరూ వినేటట్లు ఇట్లా అన్నారు:

క. 'పలువురు మహాస్త్ర విత్తము । లలఘు భుజావీర్యశౌర్యు లవనిఁ జనిరి వా
రలు దీనిఁ బ్రయోగించుట । గలిగెనె మానవులపై నకల్మషులారా?' 67

ప్రతిపదార్థం: పలువురు= పెక్కుమంది; మహా+అస్త్రవిత్తములు= గొప్ప అస్త్రాలు తెలిసినవారిలో శ్రేష్ఠులూ; అలఘు భుజా వీర్య శౌర్యులు= తక్కువకాని భుజబల పరాక్రమం గలవారూ; అవనిన్+చనిరి= భూమిపై; ఒప్పినారు; అకల్మషులారా!= అనఘులారా!; వారలు; దీనిన్; మానవులపైన్= మనుష్యులమీద; ప్రయోగించుట= ప్రయోగించటం; కలిగెనె?= సంభవించిందా?

తాత్పర్యం: 'ఓ అనఘులారా! ఎంతోమంది దివ్యాస్త్రవిద్యావేత్తలలో శ్రేష్ఠులూ, గొప్ప భుజబలపరాక్రమం గలవారూ భూమిలో ఉండినారు. వాళ్ళు దీనిని మనుష్యుల మీద ప్రయోగించటం సంభవించిందా?'

వ. అనిన విని సవ్యసాచి దివ్యాస్త్ర జ్వాలా కలాప మధ్యంబున నిస్సంభ్రములై యున్న సర్వధర్మరక్షణ సర్వలోక హితాచరణపరిణతులగు నప్పరమమునులం గనుంగొని తత్కాలోచితానుష్ఠానంబు నూహించి యమ్మహాత్ములతో నిట్లనియె. 68

ప్రతిపదార్థం: అనినన్; విని; సవ్యసాచి= అర్జునుడు; దివ్య+అస్త్రజ్వాలా కలాప మధ్యంబునన్= దివ్యాస్త్రాల అగ్నిజ్వాలల సమూహం నడుమ; నిస్సంభ్రములు+ఐ+ఉన్న= నిశ్చేష్టులైఉన్న; సర్వ ధర్మ రక్షణ సర్వలోక హిత+ఆచరణ పరిణతులు+అగు= అన్ని ధర్మాలనూ రక్షించటంలోనూ, అన్ని లోకాలకూ మేలు చేయటంలోనూ పండిపోయినవారైన; ఆ+పరమ మునులన్= ఆ మహర్షులను; కనుంగని= చూచి; తద్+కాల+ఉచిత+అనుష్ఠానంబున్= ఆ సమయానికి తగిన ఆచారాన్ని; ఊహించి= తలచి; ఆ+మహత్+ఆత్ములతోన్= ఆ మహనీయులతో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని అర్జునుడు దివ్యాస్త్రాల అగ్నిజ్వాలల సమూహం మధ్య నిశ్చేష్టులై ఉన్న సర్వధర్మ రక్షణంలోనూ, సకలలోక హితాచరణంలోనూ పండిపోయిన ఆ మహర్షులను చూచి, ఆ సమయానికి తగిన ఆచారాన్ని తలచి, ఆ మహనీయులతో ఇట్లా అన్నాడు:

తే. అస్త్ర మస్త్రముతో శాంత మగుటఁ గోరి । సొలవ కట్లు ప్రయోగింపవలసెఁ గాని
యొండు దలఁపునఁ గా దది యుడుపవలయు । నేని యుడిపెదఁ బరమమునీంద్రులార! 69

ప్రతిపదార్థం: పరమ ముని+ఇంద్రులార!= మహామునీశ్వరులారా!; అస్త్రము; అస్త్రముతోన్; శాంతము+అగుటన్+కోరి= శాంతించటం కోరి; సొలవక= జంకక; అట్లు= ఆ రీతిగా; ప్రయోగింపన్+వలసెన్+కాని= ప్రయోగించవలసి వచ్చింది కాని; ఒండు+తలఁపునన్+కాదు= మరొక ఉద్దేశంతో కాదు; అది; ఉడుపవలయున్+ఏని= ఉపసంహరించాలంటే; ఉడిపెదన్= ఉపసంహరిస్తాను.

తాత్పర్యం: 'మహామునీశ్వరులారా! అస్త్రం అస్త్రంతో ఉపశమిస్తుంది గదా అని జంకకుండా అట్లా ప్రయోగించవలసి వచ్చింది కాని మరొక ఉద్దేశంతో కాదు. దానిని ఉపసంహరించాలంటే ఉపసంహరిస్తాను.

క. ఏను మదస్త్రం బుడుపం । గా నీ పాపాత్ముఁ డస్త్రఘనదహనమునం
దా నేర్చు నందఱను; మీ । మానసములఁ దలఁపవలయు మా సేమంబుల్.' 70

ప్రతిపదార్థం: ఏను= నేను; మత్+అస్త్రంబు= నా అస్త్రం; ఉడుపంగాన్= ఉపసంహరించగా; ఈ పాప+ఆత్ముఁడు= ఈ దుర్మార్గుడు; అస్త్ర ఘన దహనమునన్= అస్త్రంయొక్క గొప్ప కాల్పుచేత; తాన్= తాను; అందఱను= మమ్ములను అందరినీ; ఏర్చున్= దహిస్తాడు; మా సేమంబుల్= మా క్షేమాలు; మీ మానసములన్= మీ మనస్సులలో; తలఁపవలయున్= ఆలోచించాలి.

తాత్పర్యం: నేను నా అస్త్రాన్ని ఉపసంహరిస్తే, ఈ దుర్మార్గుడు తన అస్త్రపు మహాదాహశక్తిచేత మమ్ములను అందరనూ దహిస్తాడు. మరి మా క్షేమం గూర్చి మీ మనస్సులలో ఆలోచించాలి.'

తే. అనుచుఁ జయ్యన నస్త్రవిద్యాప్రవీణ । మానసుండగు నరుఁ డయ్యహీన రూప
సాధనము నశ్రమంబున సంహరించె । మెచ్చి యమ్మహామును లెదఁ బిచ్చలింప. 71

ప్రతిపదార్థం: అనుచున్; చయ్యనన్= శీఘ్రంగా; అస్త్ర విద్యా ప్రవీణ మానసుండు+అగు నరుఁడు= అస్త్రవిద్యలో నేర్పుగల మనస్సు గలవాడైన అర్జునుడు; ఆ+అహీన రూప సాధనమున్= ఆ గొప్పసాధనాన్ని; ఆ+మహా+మునులు= ఆ మహర్షులు; మెచ్చి; ఎదన్= మనస్సులో; పిచ్చలింపన్= ఆనందించగా; అశ్రమంబునన్= అనాయాసంగా; సంహరించెన్= ఉపసంహరించాడు.

తాత్పర్యం: అంటూ శీఘ్రంగా అస్త్రవిద్యా నిపుణుడైన అర్జునుడు ఆ మహాస్త్రాన్ని ఆ మహర్షులు మెచ్చి హృదయంలో ఆనందించగా అనాయాసంగా ఉపసంహరించాడు.

విశేషం: చయ్యన ద్రుతప్రకృతికం కాబట్టి 'చయ్యననస్త్ర' అని దిద్దడమయినది.

చ. తపమును, బ్రహ్మచర్యమును, దానము, సత్యముఁ గల్గు నా సురా
ధిపతనయుండు దక్క సముదీర్ణముగా నిగిడించి యమ్మహో
గ్రపు మహితాస్త్ర మొండ్లకును రాదు మగుడ్పఁగ; నట్టి భంగి భూ
మిపతుల కాదు దేవతలు మేకొనఁ జాలరు కౌరవేశ్వరా! 72

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా!= కురురాజా! జనమేజయా!; తపమును; బ్రహ్మచర్యమును; దానమున్; సత్యమున్; కల్గు; ఆ సుర+అధిప తనయుండు= ఆ దేవేంద్రుడి కొడుకు - అర్జునుడు; తక్కన్= తప్ప; ఆ+మహత్+ఉగ్రము+మహిత+అస్త్రము= ఆ మిక్కిలి భయంకరమైన గొప్ప అస్త్రం; సముదీర్ణముగాన్= బాగా; నిగిడించి= ప్రయోగించి; ఒండ్లకును= ఇతరులకును; మగుడ్పఁగన్+రాదు= మరల్చరాదు; అట్టి భంగిన్= అటువంటి విధాన్ని; భూమిపతులు+అ కాదు= రాజులే కాదు; దేవతలున్= దేవతలు సైతం; మేకొనన్+చాలరు= చేయలేరు.

తాత్పర్యం: జనమేజయా! తపస్సూ, బ్రహ్మచర్యమూ, దానమూ, సత్యమూ కల ఆ అర్జునుడికి తప్ప ఆ భయంకరమైన దివ్యాస్త్రాన్ని బాగా ప్రయోగించి మరల్చటానికి ఇతరులకు సాధ్యంకాదు. ఆ పని రాజులే కాదు దేవతలు సైతం చేయలేరు.

వ. బ్రహ్మశిరోనామకంబగు నమ్మహాస్త్రంబు దలంచి బ్రహ్మతేజోమయంబగుటం జేసి యిట్లు ప్రయోగించి వారింప శక్యంబు గాకుండు; వారించిరేని వారించిన వారిన తలద్రెంచు; గురుభక్తియు వ్రతయుక్తియు నెక్కుడు గలుగుట నక్కౌరవశ్రేష్ఠుండు నివారణపటిష్ఠుం డయ్యెఁ; నవ్విధంబునఁ గవ్వడి యా దుర్నివారసాధనంబు వారించుట నాలోకించి యమ్మునీశ్వరు లమ్మాహాత్మ్యం బూహించి, రశ్వత్థామ నిజాస్త్ర సంహారంబు సేయంజూచి యది శక్యంబుగా కుండుటయు దీనమానసుండగుచు మాననీయోపాయుండగు సాత్య వతేయున కిట్లనియె. 73

ప్రతిపదార్థం: బ్రహ్మశిరోనామకంబు+అగు+అ+మహా+అస్త్రంబు= బ్రహ్మశిరోనామకమైన ఆ గొప్ప అస్త్రాన్ని; తలంచి; బ్రహ్మ తేజస్(ః)+మయంబు+అగుటన్+చేసి= బ్రహ్మతేజస్సుతో నిండిన దవటంచేత; ఇట్లు; ప్రయోగించి; వారింపన్= ఆపడానికి; శక్యంబు+కాక+ఉండున్= సాధ్యంకాదు; వారించిరి+ఏని= ఒకవేళ వారించితే; వారించినవారిన్+అ= వారించిన వారినే; తల+త్రెంచున్= తల ఖండిస్తుంది; గురు భక్తియున్; వ్రతయుక్తియున్= తపస్విత్వమూ; ఎక్కుడు+కలుగుటన్= ఎక్కువగా ఉండటంచేత; ఆ+కౌరవ+శ్రేష్ఠుండు= ఆ కురువంశోత్తముడు (అర్జునుడు); నివారణ పటిష్ఠుండు+అయ్యెన్= వారించటానికి సమర్థుడయ్యాడు; ఆ+విధంబునన్; కవ్వడి= అర్జునుడు; ఆ దుర్నివార సాధనంబున్= ఆ వారించశక్యం కాని సాధనాన్ని; వారించుటన్= వారించటం; ఆలోకించి= చూచి; ఆ+ముని+ఈశ్వరులు= ఆ మునిశ్రేష్ఠులు; ఆ+మాహాత్మ్యంబు= ఆతడి మాహాత్మ్యం; ఊహించిరి; అశ్వత్థామ; నిజ+అస్త్ర సంహారంబు= తన అస్త్రోపసంహారం; చేయన్+చూచి= చేయబోయి; అది; శక్యంబు+కాక+ఉండుటయున్= సాధ్యం కాకపోగా; దీన మానసుండు+అగుచున్= విచారంతో కూడిన మనస్సుగల వాడవుతూ; మాననీయ+ఉపాయుండు+అగు= మన్నించదగిన ఉపాయం గలవాడైన; సాత్యవతేయునకున్= వ్యాసుడికి; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని స్మరించి అది బ్రహ్మతేజస్సుతో నిండిన దవటంచేత, ఇట్లా ప్రయోగించిన తరువాత వారించటానికి శక్యం కాదు. ఒకవేళ వారిస్తే, వారించిన వారికే శిరశ్ఛేదం చేస్తుంది. గురుభక్తీ, తపోయుక్తీ అధికంగా ఉండటంచేత ఆ అర్జునుడు వారించటానికి సమర్థుడయ్యాడు. ఆ విధంగా అర్జునుడు ఆ వారించ శక్యం కాని సాధనాన్ని వారించటం చూచి ఆ మునిశ్రేష్ఠులు అతడి మాహాత్మ్యాన్ని గుర్తించారు. అశ్వత్థామ తన అస్త్రాన్ని వారించాలని చూచి, అది సాధ్యం కాకపోవటం చేత, దైన్యంతో మంచి ఉపాయశాలి అయిన వ్యాసుడితో ఇట్లా అన్నాడు:

తే. 'చంపెఁ గురువిభు నాకు లజ్జాకరముగ । భీముఁ డదియు నధర్మ సంగ్రామవృత్తి;
నంతఁ బోవక వచ్చి ప్రాణాపహార । మాచరింపఁగఁ బూని నన్నాక్రమించె. 74

ప్రతిపదార్థం: భీముఁడు; కురువిభున్= కురుపతిని - దుర్యోధనుడిని; నాకున్; లజ్జాకరముగన్= సిగ్గు అయ్యేటట్టు; చంపెన్; అదియున్= ఆ చంపటంకూడా; అధర్మ సంగ్రామ వృత్తిన్= అధర్మయుద్ధ ప్రవర్తనతో; అంతన్+పోవక= దానితో ఊరుకోక; వచ్చి; ప్రాణ+అపహారము+ఆచరింపఁగన్+పూని= ప్రాణాలు తీయటానికి ప్రయత్నించి; నన్నున్+ఆక్రమించెన్= నాపై దండెత్తాడు.

తాత్పర్యం: భీముడు నాకు సిగ్గయ్యేటట్లు దుర్యోధనుడిని చంపాడు. అదీ అధర్మయుద్ధంలో. దానితో ఊరుకొనక వచ్చి నా ప్రాణాలు తీయాలని నామీద కురికాడు.

చ. **పరిభవజాతరోషమునఁ బ్రాణభయంబునఁ జేసి యిమ్మహా**
శరము వివేకవర్జితవిచారుఁడనై యిటు లేసితిన్ మునీ
శ్వర! యిది పాండుభూపసుత వర్గము నంతటినేర్చుఁగాని యె
ప్పరుసున మాన దివ్విధము పాపమయేనియు దాని కోర్చితిన్.' **75**

ప్రతిపదార్థం: ముని+ఈశ్వర!= మునిపతీ!; పరిభవజాత రోషమునన్= అవమానం వలన కలిగిన కోపంతోనూ; ప్రాణ భయంబునన్+చేసి= ప్రాణభీతితోనూ; ఈ+మహత్+శరమున్= ఈ మహాస్త్రాన్ని; వివేక వర్జిత విచారుఁడను+ఐ= వివేకశూన్యమైన ఆలోచన గలవాడనై; ఇటులు+ఏసితిన్= ఇట్లా ప్రయోగించాను; ఇది; పాండు భూపసుత వర్గమున్+అంతటిన్= పాండురాజు కొడుకుల సమూహాన్నంతటినీ; ఏర్చున్+కాని; దహిస్తుందికాని; ఏ+పరుసునన్= ఏ విధంగానూ; మానదు; ఈ+విధము; పాపము+అ+ఏనియున్= పాపమే అయినా; దానికిన్; ఓర్చితిన్= సహించాను.

తాత్పర్యం: మునీశ్వరా! అవమానంవలన కలిగిన కోపంతోనూ, ప్రాణభీతితోనూ ఈ మహాస్త్రాన్ని మంచీచెడ్డా ఆలోచించకుండా ఇట్లా ప్రయోగించాను. ఇది పాండవుల నందరినీ ఎట్లా అయినా దహించి తీరుతుంది. ఈ విధం పాపమే అని తెలిసినా, దానికి ఒడబడ్డాను.'

వ. **అనిన విని యమ్మునిపతి యతని యాననంబునఁ జూడ్కి నిలిపి మీ తండ్రి యిప్పాండవమధ్యమునకు వాత్సల్యంబున నీయస్త్రం బొసంగె నీ యోధవరుండు నీకుఁ గీడు దలంపఁడు; భవదస్త్రం బుపశమించుటకునై నిజాస్త్రంబు ప్రయోగించె; మేము వలవ దన్న నుపసంహరించె; ని ట్లస్త్రవిద్యావైదగ్ధ్యంబు సడిసన్న కవ్వడి వధింప నీకు వశంబగునే? నీ యస్త్రం బతని యస్త్రంబు చేత నివారితం బయ్యెడు; నది యట్లుండె; విను; మమ్మహాస్త్రంబు మనుష్య విషయంబుగాఁ బ్రయోగించువానికి నశుభంబగు; నొకనిచేతఁ బ్రయోగింపఁబడి యన్య్ష నస్త్రం బుపశమించెనేని, యద్దేశంబునకుఁ బండ్రెండేం డ్లనా వృష్టి దురితం బగుం; గావునఁ బాండవులను నిన్నును నిద్దేశంబును రక్షించుటకుం జెప్పితి; మెప్పాటనయిన దీని నుపసంహరింపవలయుఁ; దపంబునకుఁ జొచ్చినవాఁడవు, రోషంబునకుఁ దొలంగి సుఖివి గమ్ము; ధర్మంబున జయంబు గొన నోపిన యిప్పార్థుండును బ్రీతుండై చనవలయు; భవదీయ శిరోమణి యీతని కి; మ్మట్లయిన నితండ కాఁడు, పాండవులందఱును నీ దగు జీవనంబు నపహరించినంతయ సంతసిల్లుదు; రిది సమీచీనంబయిన సంధిప్రకారం; బిట్లు సేయుట మే;' లనుటయు, నుమ్మలికంబుతో నగ్గురునందనుండు పరాశరనందనున కిట్లనియె.** **76**

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ+ముని పతి= ఆ మునీశ్వరుడు-వ్యాసుడు; అతని+ఆననంబునన్= అతని ముఖంపై; చూడ్కి= చూపు; నిలిపి; మీ తండ్రి; ఈ+పాండవ మధ్యమునకున్= ఈ అర్జునుడికి; వాత్సల్యంబునన్; ఈ+అస్త్రంబు+ ఒసంగెన్= ఈ అస్త్రాన్నిచ్చాడు; ఈ+యోధవరుండు= ఈ వీరశ్రేష్ఠుడు; నీకున్; కీడు+తలంపఁడు= హాని తలపెట్టడు; భవత్+అస్త్రంబు= నీ అస్త్రం; ఉపశమించుటకున్+ఐ= శాంతించటానికని; నిజ+అస్త్రంబు= తనదైన అస్త్రం; ప్రయోగించెన్; మేము; వలవదు+అన్నన్= వద్దంటే; ఉపసంహరించెన్= నివారించాడు; ఇట్లు; అస్త్రవిద్యా వైదగ్ధ్యంబు సడి+చన్న= అస్త్రవిద్యా నైపుణ్యంలో అనింద్యుడైన; కవ్వడిన్= అర్జునుడిని; వధింపన్= చంపటానికి; నీకున్; వశంబు+అగునే?= తరమవుతుందా?; నీ+అస్త్రంబు; ఇతని+అస్త్రంబుచేతన్; నివారితంబు+అయ్యెడున్= వారించబడుతుంది; అది; అట్లు+ఉండెన్; వినుము;

ఆ+మహా+అస్త్రంబు; మనుష్య విషయంబు+కాన్= మనుష్యులను గూర్చి-; మనుష్యులమీద; ప్రయోగించువానికిన్; అశుభంబు+అగున్= కీడు కలుగుతుంది; ఒకనిచేతన్; ప్రయోగింపఁబడి; అన్య+అస్త్రంబు= ఇతరుడి అస్త్రం; ఉపశమించెన్+ఏని= శాంతిస్తే; ఆ+దేశంబునకున్; పంద్రెండు+ఏండ్లు; అనావృష్టి దురితంబు= వర్షాభావ కష్టం; అగున్; కావునన్; పాండవులను; నిన్నును; ఈ+దేశంబును; రక్షించుటకున్; చెప్పితిమి; ఏ+పాటన్+అయినన్= ఏ విధంగానైన; దీనిన్; ఉపసంహరింపవలయున్; తపంబునకున్; చొచ్చినవాఁడవు= తపస్సు చేయటానికి పూనుకున్నవాడవు; రోషంబునకున్= కోపానికి; తొలంగి; సుఖివి+కమ్ము; ధర్మంబునన్; జయంబు+కొనన్+ఓపిన+ఈ+పార్థుండును= గెలువగల ఈ అర్జునుడూ; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; చనవలయున్= వెళ్ళాలి; భవదీయ శిరోమణి= నీ శిరోమణి; ఈతనికిన్; ఇమ్ము; అట్లు+అయినన్; ఇతండు+అ+కాఁడు; పాండవులు+అందఱును; నీది+అగు జీవనంబున్= నీ ప్రాణాన్ని; అపహరించిన+అంత+అ= తీసినంతే; సంతసిల్లుదురు= సంతోషిస్తారు; ఇది; సమీచీనంబు+అయిన= సముచితమైన; సంధి ప్రకారంబు= సంధి పద్ధతి; ఇట్లు+చేయుట; మేలు; అనుటయున్; ఉమ్మలికంబుతోన్= విచారంతో; ఆ+గురునందనుండు= ఆ అశ్వత్థామ; పరాశర నందనునకున్= పరాశరుడి కొడుకునకు వ్యాసుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని ఆ మునీశ్వరుడు (వ్యాసుడు) అతడి ముఖంపై దృష్టి నిలిపి, 'మీ తండ్రి ఈ అర్జునుడికి శిష్యవాత్సల్యంతో ఈ అస్త్రాన్నిచ్చాడు. ఈ వీరశ్రేష్ఠుడు నీకు హాని తలపెట్టడు. నీ అస్త్రం ఉపశమించటానికి తన అస్త్రం ప్రయోగించాడు. మేము వద్దంటే ఉపసంహరించాడు. ఈ విధంగా అస్త్రవిద్యా నైపుణ్యంలో ఆరితేరిన అర్జునుడిని వధించటం నీ తరమవుతుందా? నీ అస్త్రం ఇతడి అస్త్రంచేత వారించబడుతుంది. అది అట్లా ఉండనిమ్ము. వినుము. ఆ మహాస్త్రాన్ని మనుష్యులపై ప్రయోగించినవాడికి అశుభం అవుతుంది. ఒకడిచేత ప్రయోగించబడి, ఇతరుడి అస్త్రం ఉపశమిస్తే, ఆ దేశానికి పన్నెండేళ్ళు అనావృష్టి కష్టం ప్రాప్తిస్తుంది. కాబట్టి, పాండవులనూ, నిన్నూ, ఈ దేశాన్నీ రక్షించటానికి చెప్పాము. ఏ విధంగా నైనా సరే దీనిని ఉపసంహరించాలి. తపస్సుకు పూనుకొన్నవాడివి కోపం విడిచిపెట్టి సుఖపడుము. ధర్మబద్ధంగా గెలువగల ఈ అర్జునుడు కూడా సంతోషంతో వెళ్ళాలి. నీ శిరోమణిని ఇతడి కిమ్ము. అట్లా అయితే ఇతడే కాడు, పాండవులందరూ నీ ప్రాణం తీసినంతగా సంతోషిస్తారు. ఇది సముచితమైన రాజీ పద్ధతి. ఇట్లా చేయటం మంచిది' అనగా విచారంతో ఆ అశ్వత్థామ వ్యాసుడితో ఇట్లా అన్నాడు:

సీ. **'పాండునందనులకు బ్రాఁతె రత్నంబులు? । కౌరవనాథు భండార మెల్లఁ**
గైకొన్నవారు; నాగభయంబుఁ, దస్కర । భయమును, దానవభయము, దేవ
భయమును, బొరయవు; బాధింప దాఁకలి । తృష, నిద్ర, రోగంబు, దీనికతన;
నిట్టిరత్నము వీరి కీఁ జాలుదునె? ముని । నాయక! నీ వచనం బలంఘ్య

ఆ. **మగుట దీని నీకు నర్పించితిని; మద । స్త్రంబు పాండవేయ రాగ పాత్ర**
గర్భములకు హానిఁ గావించి సంతృప్తిఁ । బొంది తాఁ బ్రశాంతిఁ బొందుఁగాత.' **77**

ప్రతిపదార్థం: ముని నాయక!= మునీశ్వరా!; రత్నంబులు; పాండు నందనులకున్= పాండవులకు; బ్రాఁతె?= అపురూపమా; కౌరవ నాథు భండారము+ఎల్లన్= కురురాజైన దుర్యోధనుడి బొక్కసమంతా; కైకొన్నవారు= పొందినవారు; నాగభయంబున్= సర్పభయమూ; తస్కర భయమును= చోరభయమూ; దానవభయమున్= రాక్షసభయమూ; దేవ భయమును; పొరయవు= కలుగవు; ఆఁకలి; తృష= దప్పి; నిద్ర; రోగంబు; దీనికతనన్= దీనివలన; బాధింపదు; ఇట్టి రత్నమున్; వీరికిన్; ఈన్+చాలుదునె?=

ఇయ్యగలనా?; నీ వచనంబు= నువ్వు అనిన మాట; అలంఘ్యము+అగుటన్= దాటరానిది అవటంచేత; దీనిన్; నీకున్; అర్పించితిని= ఇచ్చాను; మత్+అస్త్రంబు= నా అస్త్రం; పాండవేయ రాగ పాత్ర గర్భములకున్= పాండవేయుల ఇష్టానికి పాత్రములైన గర్భాలకు; హానిన్+కావించి= కీడుచేసి; సంతృప్తిన్+పొంది= తృప్తిపడి; తాన్= తాను(అస్త్రం); ప్రశాంతిన్= ఉపశమనాన్ని, పొందున్= కాత పొందునుగాక!

తాత్పర్యం: 'మునీశ్వరా! దుర్యోధనుడి బొక్కసాన్నంతటినీ పొందిన పాండవులకు రత్నాలు అపురూపమా? సర్పభయమూ, చోరభయమూ, రాక్షసభయమూ, దేవభయమూ కలుగవు. దీనివలన ఆకలీ, దప్పిక, నిద్రా, రోగమూ బాధించవు. ఇట్లాంటి రత్నం వీళ్ళకు ఇవ్వగలనా? అయినా నీ మాట దాటరానిది కాబట్టి దీనిని నీకు ఇచ్చాను. నా అస్త్రం పాండవేయుల గర్భాలకు హాని కలిగించి తృప్తిపడి ఉపశమిస్తుంది గాక!'

క. అన విని కృష్ణద్వైపా । యనుఁ 'డట్టులు సేయు మొంటి కాస పడకు మీ'
యని పలుక నప్పలుకునం । గనియెను దన పలుకు తప్పగా నతఁడు మదిన్. 78

ప్రతిపదార్థం: అనన్= అనగా; విని; కృష్ణద్వైపాయనుఁడు= వ్యాసుడు; అట్టులు+చేయుము= అట్లా చెయ్యి; ఒంటికిన్= ఇంకొకదానికి; ఆసపడకుమీ= ఆశించకుమీ; అని; పలుకన్= పలుకగా; అతఁడు= అశ్వత్థామ; మదిన్= మనస్సులో; ఆ+ పలుకునన్= ఆ మాటచేత; తన పలుకు= తను అన్నది; తప్పు+కాన్= తప్పుగా; కనియెను= గ్రహించాడు.

తాత్పర్యం: అనగా విని వ్యాసుడు 'అట్లా చేయుము. వేరే దానికి ఆశించకుము' అని పలుకగా, అశ్వత్థామ తన మనస్సులో, ఆతడి మాటను బట్టి తన మాట తప్పని గ్రహించాడు.

విశేషం: అశ్వత్థామ 'పాండవేయ గర్భా' లనటంలో 'పాండవుల సంతతి గర్భా' లని భావించగా, వ్యాసుడు 'పాండవులకు సంబంధించిన గర్భా' లని వేరుగా భావించాడు (పాండవేయ= పాండవ సంతతి యొక్క, పాండవులయొక్క.).

వ. కని 'పాండవేయ రాగపాత్ర గర్భంబులని తత్సంతాన సంజాత గర్భంబులనెల్ల నుగ్గడించిన వాఁడనయితి; నది పారాశర్యుండు పాండవేయ భార్యాగర్భంబులన పేరుకొనుటగాఁ జేసి 'యొంటి కాసపడకుమీ' యనియె. దీని నెఱింగినవాఁడఁ గానేని యిది యనుమతిగా భావించి సకలగర్భవిధ్వంసనంబు గావించెదంగాక' యని నిశ్చయించి యమ్మునీంద్రునితో 'నట్ల చేయువాఁడ' నని పలికె. వారల సంవాదప్రకారంబు హృషీకేశుం డెఱింగి 'వీఁడు సంయమివరు మాట గీటునం బుచ్చి తనవలసినట్లు సేయువాఁడయ్యెఁ; నిప్పాపాత్ము నుపక్రమంబునకు నడ్డపడి చూచెదఁ; గాకున్నఁ దుది నా చేయుతెఱంగున్నదియ కాదె' యని వితర్కించె, నప్పు డశ్వత్థామ చేతోవృత్తి సాత్యవతేయుం డెఱిఁగియుం, గృష్ణుం డెఱుంగుటయు నతం డతనితో సల్లాపంబు సేయం దలంచుటయుఁ గనుంగొని యూరకుండె. 79

ప్రతిపదార్థం: కని= గ్రహించి, తెలిసి; పాండవేయ రాగ పాత్ర గర్భంబులు+అని= పాండవేయుల రాగానికి పాత్రములైన గర్భములని; తద్+సంతాన సంజాత గర్భంబులన్+ఎల్లన్= పాండవులయొక్క సంతతివలన పుట్టిన గర్భాలనన్నింటినీ; ఉగ్గడించినవాఁడన్+అయితిన్= చెప్పినవాడిని అయ్యాను; అది; పారాశర్యుండు= వ్యాసుడు; పాండవేయ భార్యాగర్భంబులన్+అ= పాండవులయొక్క భార్యల గర్భాలుగానే; పేరుకొనుటగాన్= చేసి= పేర్కొనటంచేత; ఒంటికిన్= వేరేదానికి; ఆసపడకుమీ=

ఆశించకుమీ; అనియెన్; దీనిన్= వ్యాసుడిభావం; ఎఱింగినవాఁడన్+కాన్+ఏని= తెలిసినవాడిని కాకపోతే; ఇది; అనుమతి+కాన్= అంగీకారంగా; భావించి; సకల గర్భ విధ్వంసనంబు సర్వగర్భాల నాశనం; కావించెదన్+కాక= చేస్తానుగాక; అని; నిశ్చయించి= నిర్ణయించి; ఆ+ముని+ఇంద్రునితోన్= ఆ మునీశ్వరుడితో-వ్యాసుడితో; అట్లు+అ= అట్లే; చేయువాఁడన్+అని పలికెన్= చేస్తానని పలికాడు; వారల సంవాద ప్రకారంబున్= ఆ వ్యాసాశ్వత్థామల పరస్పర సంభాషణ విధం; హృషీకేశుండు= కృష్ణుడు; ఎఱింగి= తెలిసి; వీఁడు= ఇతడు - అశ్వత్థామ; సంయమివరుమాటన్= మునీశ్వరుడైన వ్యాసుడిమాట; గీటునన్+పుచ్చి= అనాదరించి; తన వలసిన+అట్లు చేయువాఁడు+అయ్యెన్= తన ఇష్టం వచ్చినట్లు చేస్తాడు; ఈ+పాప+ఆత్ము+ ఉపక్రమంబునకున్= ఈ దుర్మార్గుడి పూనికకు; అడ్డుపడి చూచెదన్= అడ్డపడటానికి చూస్తాను; కాక+ఉన్నన్= లేకుంటే; తుదిన్= చివర; నా చేయు తెఱంగు+ఉన్నయది కాదె= నేను చేసే విధం ఉండనే ఉన్నది కదా!; అని; వితర్కించెన్= ఆలోచించాడు; అప్పుడు; అశ్వత్థామ చేతస్(ః)+వృత్తిన్= అశ్వత్థామ మనోభిప్రాయం; సాత్యవతేయుండు= వ్యాసుడు; ఎఱిఁగియున్= గ్రహించినా; కృష్ణుండు; ఎఱుంగుటయున్= గ్రహించటమూ; అతండు= కృష్ణుడు; అతనితోన్ అశ్వత్థామతో; సల్లాపంబు+చేయన్+తలంచుటయున్= మాట్లాడాలనుకోవటం; కనుంగొని= చూచి; ఊరక+ఉండెన్= ఊరుకున్నాడు.

తాత్పర్యం: గ్రహించి, 'పాండవేయ రాగ పాత్రగర్భము' లని పాండవుల సంతతి తాలూకు గర్భాలనన్నిటినీ ఉద్దేశించాను. కాని దానిని వ్యాసుడు పాండవుల భార్యల గర్భాలుగానే పేర్కొనటంచేత వేరే దానిని ఆశించకుము-అన్నాడు. అది నేను తెలిసినట్టుగా ఎందుకుండాలి? ఇది అంగీకారంగా భావించి అన్ని గర్భాలనీ నాశనం చేస్తానుగాక' అని నిర్ణయించి ఈ మునీశ్వరుడితో అట్లాగే చేస్తానని పలికాడు. వాళ్ళ పరస్పర సంభాషణక్రమం కృష్ణుడు తెలిసి 'వీడు మునీశ్వరుడి మాటను కాదని తన యిష్టం వచ్చినట్లు చేసేవాడివలె ఉన్నాడు. ఈ దుర్మార్గుడి ప్రయత్నానికి అడ్డపడటానికి చూస్తాను. లేకుంటే చివర నేను చేసే పని ఎట్లాగూ ఉండనే ఉన్నది కదా!' అని తలచాడు. అప్పుడు అశ్వత్థామ మనోభిప్రాయం వ్యాసుడు గ్రహించీ, కృష్ణుడు గ్రహించాడనీ, అతడు అశ్వత్థామతో మాటాడాలను కొంటున్నాడనీ తెలిసి, ఊరుకున్నాడు.

శ్రీకృష్ణుఁ డుత్తరగర్భంబు దగ్ధంబు గాకుండఁ జేయ నిశ్చయించుట (సం. 10-16-1)

క. వనజాక్షుఁడు ద్రౌణికి ని । ట్లనుఁ 'దునిమితి పాండు పౌత్రు లందఱఁ; బాపం
బునఁ బోయితి; గర్భంబులఁ । దునిమెద వం దొకటియైనఁ దొలఁగింపఁ దగున్.' 80

ప్రతిపదార్థం: వనజ+అక్షుఁడు= తామరలవంటి కన్నులుగలవాడు - శ్రీకృష్ణుడు; ద్రౌణికిన్= అశ్వత్థామకు; ఇట్లు+అనున్; పాండు పౌత్రులన్+అందఱన్= పాండురాజు మనుమలనందరినీ; తునిమితి(వి)= వధించావు; పాపంబునన్= పోయితి(వి)= పాపానపోయావు-పాపం కట్టుకున్నావు; గర్భంబులన్= ఆ పౌత్రుల గర్భాలను ఆ పౌత్రుల సంతతిని; తునిమెదవు= వధిస్తావు; అందున్= ఆ గర్భాలలో; ఒకటి+ఐనన్= ఒకదాన్నైనా; తొలఁగింపన్+తగున్= తొలగించాలి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అశ్వత్థామతో ఇట్లా అన్నాడు: 'పాండురాజు మనుమలనందరినీ వధించావు. పాపం కట్టుకొన్నావు. ఇప్పుడు ఆ మనుమల గర్భాలను చంపాలనుకొంటున్నావు. అందులో ఒక దాన్నైనా నీ బారినపడకుండా తొలగించాలి.'

క. 'ఏ నొక్కనిఁ బాండవ సం । తానార్థము గాఁగ నిత్తు; ధర్మముల మహా
దానంబులఁ గ్రతువుల జన । తానందితుఁ డగుచుఁ బెంపుఁ దలకొనువానిన్.' 81

ప్రతిపదార్థం: ఏను= నేను; ఒక్కనిన్= ఒకడిని; ధర్మములన్= ధర్మాలతోనూ; మహా+దానంబులన్= గొప్పదానాలతోనూ; క్రతువులన్= యజ్ఞాలతోనూ; జనతా+ఆనందితుఁడు+అగుచున్= జన సమూహాన్ని సంతోషించేటట్లు చేసేవాడు అవుతూ; పెంపున్= గొప్పతనాన్ని; తలకొనువానిన్= వహించేవాడిని; పాండవ సంతాన+అర్థము+కాఁగన్= పాండవుల సంతతికోసం; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: 'నేను ధర్మాలతోనూ, గొప్ప దానాలతోనూ, యజ్ఞాలతోనూ జనులను సంతోషపెట్టి గొప్పతనం పొందే ఒకడిని పాండవవంశం నిలబెట్టటం కొరకు రక్షిస్తాను.'

తే. **'అట్టి గర్భంబు నిలుపు త క్కన్ని గర్భ । ములును భవదస్త్రమున దగ్ధములుగఁ జేయు'**
మనుడు సంరంభజృంభితుఁ డగుచు ద్రోణ । తనయుఁ డిట్లను నమ్మురాంతకుని తోడ. **82**

ప్రతిపదార్థం: అట్టి గర్భంబున్= అటువంటి గర్భాన్ని; నిలుపు(ము); తక్కు+అన్ని గర్భములును= తక్కిన గర్భాల నన్నిటినీ; భవత్+అస్త్రమునన్= నీ బాణంతో; దగ్ధములుగన్+చేయుము= నాశనం చేయుము; అనుడున్= అనగానే; ద్రోణ తనయుఁడు= అశ్వత్థామ; సంరంభ జృంభితుఁడు+అగుచున్= కోపంతో విజృంభించినవాడవుతూ; ఆ+ముర+అంతకునితోడన్= ఆ శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'అట్లాంటి గర్భాన్ని నిలుపుము. తక్కిన గర్భాలనన్నిటినీ నీ అస్త్రంతో దహించుము' అనగానే అశ్వత్థామ కోపంతో విజృంభించి ఆ శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

వ. **'పక్షపాతంబున నీ విట్లు పలికిన నే నట్లేల చేయుదు? మదస్త్రంబునకు లక్ష్యంబులుగా గర్భంబు లొండు గలుగు లేకుండు; నది యట్లుండె; విరాటనందన యగు నుత్తరగర్భంబు రక్షించెద నని చూచె; దప్పనికిఁ బూనితేనియు నా యస్త్రంబున నవశ్యం బదియును విధ్వంసంబు గావింతు' నని పలికినఁ బద్మనాభుండు.** **83**

ప్రతిపదార్థం: నీవు; పక్షపాతంబునన్= పాండవులమీదనే ఉన్న అభిమానంతో; ఇట్లు; పలికినన్= పలికితే; నేను; అట్లు+ఏల చేయుదున్?= అట్లా ఎందుకుచేస్తాను?; మదస్త్రంబునకున్= నా అస్త్రానికి; లక్ష్యంబులు+కాన్= గురిగా; గర్భంబులు+ఒండు+ కలుగున్ లేక+ఉండున్= గర్భాలలో ఒకటి ఉంటుంది, లేకపోతుంది; అది+అట్లు+ఉండెన్= అది అలా ఉండనీ; విరాట నందన+అగు= విరాటుడి కూతురైన; ఉత్తర= ఉత్తరయొక్క; గర్భంబున్= చూలు; రక్షించెదన్+అని చూచెదు= కాపాడాలని చూస్తావు; ఆ+పనికిన్; పూనితి(వి)+ఏనియున్= పూనుకున్నావో; నా+అస్త్రంబునన్= నా బాణంతో; అవశ్యం= తప్పకుండా; అదియును= దానినికూడా; విధ్వంసంబు+కావింతున్= నాశనం చేస్తాను; అని పలికినన్= అని పలుకగా; పద్మనాభుండు= పద్మం నాభియందు గలవాడు-శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: 'నీవు పాండవ పక్షపాతంతో ఇట్లా అంటే, నేను అట్లా ఎందుకు చేస్తాను? నా అస్త్రానికి ఒక గర్భం లక్ష్యం కావచ్చు కాకపోవచ్చు. అది అట్లా ఉండనిమ్ము. నీవు విరాటపుత్రి అయిన ఉత్తర గర్భాన్ని రక్షించాలని చూస్తావు. ఆ పనికి పూనుకున్నావో, నా బాణంతో దానిని కూడా తప్పకుండా నాశనం చేస్తాను.' అని పలుకగా శ్రీకృష్ణుడు.

క. 'అనఘుఁ డభిమన్యు తేజం । బనూనమై మాత్స్యపుత్రియం దున్నది; నీ
తునుముట గలిగిననుం ద । త్తనయున కే నాయు విచ్చెదను దీర్ఘముగన్.' 84

ప్రతిపదార్థం: అనఘుఁడు+అభిమన్యు తేజంబు= పాపరహితుడైన అభిమన్యుడి వీర్యం; అనూనముః= తక్కువకానిదయి-గొప్పదయి; మాత్స్య పుత్రియందున్= విరాటుడి కూతురైన ఉత్తర గర్భంలో; ఉన్నది; నీ తునుముట= నువ్వు వధించుట; కలిగిననున్= సంభవించినా; తద్+తనయునకున్= అతడి కుమారుడికి; ఏను= నేను; దీర్ఘముగన్= దీర్ఘంగా; ఆయువు; ఇచ్చెదను.

తాత్పర్యం: పుణ్యాత్ముడైన అభిమన్యుడి వీర్యం గొప్పదయి ఉత్తర గర్భంలో ఉన్నది. నీవు దానిని వధించటం సంభవించినా అతడి కుమారుడికి నేను దీర్ఘాయు విస్తాను.

క. అనిన విని నగుచుఁ గుంభజ । తనయుం డిట్లనియె; 'నస్త్ర దగ్ధుని బ్రతికిం
చిన మేలకాదె! నీ వి । న్ననువు నెఱింగెదము గాక నరసఖ! దీనన్.' 85

ప్రతిపదార్థం: అనినన్; విని; కుంభజ తనయుండు= అశ్వత్థామ; నగుచున్= నవ్వుతూ; ఇట్లు+అనియెన్; అస్త్రదగ్ధునిన్= అస్త్రంతో దహించబడినవాడిని; బ్రతికించినన్= బ్రతికిస్తే; మేలు+అ+కాదె!= మంచిదేకదా!; నరసఖ!= అర్జున మిత్రమా!; కృష్ణా!; దీనన్= ఈ విషయంలో; నీ విన్ననువున్= నీ నేర్పు; ఎఱింగెదము+కాక= చూద్దాములే.

తాత్పర్యం: అనగా విని అశ్వత్థామ నవ్వుతూ ఇట్లా అన్నాడు: 'అస్త్రదగ్ధుడిని బ్రతికిస్తే మంచిదేకదా! అర్జునమిత్రమా! కృష్ణా! ఈ విషయంలో నీ నేర్పు చూద్దాములే.'

వ. అని పలికి పరమాదరణీయులగు సాత్యవతేయదేవకీనందనుల వాక్యంబు లాదరింపక పాండవ సంతాన సకల గర్భవిషయంబుగా నస్త్రప్రమోచనంబు సేసిన నుపలక్షించి వాసుదేవుం డతనితో నిట్లనుఁ; 'త్రికాలవేదియగు నొక్క బ్రాహ్మణుం డుపప్లావ్యంబునకు వచ్చి యుత్తరను జూచి నీ పుణ్యంబునఁ బ్రాణంబులు పరిక్షీణంబులైన పుత్రుండు జనియింపంగలవాఁ; డది కారణంబుగా భవదీయగర్భస్థునకుఁ బరిక్షిన్నామధేయం బగునని పలికె; నమ్మహాత్ముని వచనం బనృతంబు గానేరదు; భవత్కృత్యం, బకృతసమంబ; యబ్బాలుండు పాండవవంశకరుండగు,' నని చెప్పి తన చిత్తంబున రోషం బావహిల్లుటయు, 'బాలఘాతి వగు నీకు నశనంబు దుర్లభంబై, సహాయరహితుండవై దుర్గంధరక్తంబున నంగంబు దగ్ధంబగుచుండ మూఁడు వేలేండ్లు దిరుగుము; నాచేత రక్షితుండై, యక్కుమారుండు గృపాచార్యువలన ధనుర్వేదవిదుండై సర్వశస్త్రాస్త్రంబులు వడసి బహుసంవత్సరంబులు వసుధఁ బాలింపంగలవాఁడు; వానికి జనమేజయుండను మహారాజు ప్రభవించి నీవు సూచుచుండ నుజ్జ్వలుండె ప్రవర్తించు; మదీయంబులగు తపస్సత్యంబుల మహనీయ ప్రభావంబులు సూడు;' మని యాడె నప్పుడు కృష్ణద్వైపాయనుండు గురునందనున కిట్లనియె. 86

ప్రతిపదార్థం: అని; పలికి; పరమ+ఆదరణీయులు+అగు= మిక్కిలి గౌరవించదగినవారైన; సాత్యవతేయ దేవకీనందనుల= వ్యాస శ్రీకృష్ణులయొక్క; వాక్యంబులు; ఆదరింపక= మన్నించక; పాండవ సంతాన సకల గర్భ విషయంబు+కాన్= పాండవుల యొక్క సంతతి యొక్క ఎల్ల గర్భాలు లక్ష్యంగా; అస్త్ర ప్రమోచనంబు+చేసినన్= అస్త్రంయొక్క విడుదల చేయగా - అస్త్రాన్ని విడిచిపెట్టగా; ఉపలక్షించి= చూచి; వాసుదేవుండు= కృష్ణుడు; అతనితోన్; ఇట్లు+అనున్; త్రికాలవేది+అగు+ఒక్క బ్రాహ్మణుండు=

త్రికాలజ్ఞుడైన ఒక బ్రాహ్మణుడు; ఉపప్లావ్యంబునకున్; వచ్చి; ఉత్తరను; చూచి; నీ పుణ్యంబునన్= నీ పుణ్యంచేత; ప్రాణంబులు; పరిక్షీణంబులు+ఐన పుత్రుండు= కృశించినవైన కుమారుడు; జనియింపన్+కలవాఁడు= పుట్టబోతాడు; అది; కారణంబు+కాన్; భవదీయ గర్భస్థునకున్= నీ గర్భంలో ఉన్నవాడికి; పరిక్షిత్+నామధేయంబు= పరిక్షిత్తు అనేపేరు; అగున్; అని; పలికెన్; ఆ+మహా+ఆత్ముని వచనంబు= ఆ మహానుభావుడి మాట; అనృతంబు+కాన్+నేరదు= అబద్ధం కాజాలదు; భవత్+కృత్యంబు= నీవు చేసినపని; అకృత సమంబు+అ= చేయనిదానితోనే సమానం; ఆ+బాలకుండు= ఆ పిల్లవాడు; పాండవ వంశకరుండు+ అగున్= పాండవ వంశోద్ధారకుడు అవుతాడు; అని చెప్పి; తన చిత్తంబునన్= తన మనస్సులో; రోషంబు= కోపం; ఆవహిల్లుటయున్= కలగగా; బాలఘాతివి+అగు= పిల్లలను చంపినవాడవైన; నీకున్; అశనంబు= ఆహారం; దుర్లభంబు+ఐ= పొందశక్యం కానిదై; సహాయ రహితుండవు+ఐ= నిస్సహాయుడవై; దుర్గంధ రక్తంబునన్= దుర్వాసనగల రక్తంతో; అంగంబు= శరీరం; దగ్ధంబు+అగుచున్+ఉండన్= కాలిపోతూండగా; మూఁడు వేల+ఏండ్లు; తిరుగుము; నాచేతన్; రక్షితుండు+ఐ= కాపాడబడిన వాడై; ఆ+కుమారుండు= ఆ బాలుడు; కృపాచార్యువలనన్; ధనుస్(ః)+వేద విదుండు+ఐ= ధనుర్వేదం నేర్చుకొన్నవాడై; సర్వశస్త్ర+ అస్త్రంబులు= ఎల్ల శస్త్రాలూ, అస్త్రాలూ; పడసి= పొంది; బహు సంవత్సరంబులు= చాలా ఏళ్ళు; వసుధన్= భూమిని; పాలింపఁగలవాఁడు= ఏలతాడు; వానికిన్; జనమేజయుండు+అను మహారాజు= జనమేజయుడనే పేరుగల గొప్పరాజు; ప్రభవించి= పుట్టి; నీవు+చూచుచున్+ఉండన్= నీవు చూస్తూండగానే; ఉజ్జ్వలుండు+ఐ= ప్రకాశించేవాడై; ప్రవర్తించున్; మదీయంబులు+అగు= నావయిన, తపస్+సత్యంబుల మహనీయ ప్రభావంబులు= తపస్సుయొక్క, సత్యంయొక్క, గొప్ప మహిమలు; చూడుము+అని; ఆడెన్= పలికాడు; అప్పుడు; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; గురునందనునకున్= అశ్వత్థామతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని పలికి, మిక్కిలి గౌరవించదగిన వ్యాస శ్రీకృష్ణుల మాటలు పాటించక పాండవుల సంతానం తాలూకు గర్భాలన్నింటిమీద అస్త్రం విడిచిపెట్టటం చూచి శ్రీకృష్ణుడు అతడితో ఇట్లా అన్నాడు: 'త్రికాలజ్ఞుడైన ఒక బ్రాహ్మణుడు ఉపప్లావ్యపురం వచ్చి ఉత్తరను చూచి 'నీ పుణ్యంచేత ప్రాణాలు కృశించిన కొడుకు పుట్టుతాడు. అది కారణంగా నీ గర్భంలో ఉన్నవాడికి పరిక్షిత్తు అనే పేరు కలుగుతుంది' అని పలికాడు. ఆ మహానుభావుడి వచనం అబద్ధం కాజాలదు. నీవు చేసినపని చేయనిదానితోనే సమానం. ఆ బాలుడు పాండవ వంశోద్ధారకు డవుతాడు' అని తన మనస్సులో కోపం ఏర్పడగా 'పిల్లలను చంపిన నీవు ఆహారం లేక, నిస్సహాయుడ వై, కంపు కొట్టే రక్తంతో శరీరం కాలిపోతూండగా మూడువేల సంవత్సరాలు తిరుగుము. నా చేత రక్షితుడై ఆ కుమారుడు కృపాచార్యుడి దగ్గర ధనుర్వేదం నేర్చుకొని అన్ని శస్త్రాస్త్రాలూ పొంది అనేక సంవత్సరాలు భూమిని పరిపాలిస్తాడు. అతడికి జనమేజయ మహారాజు పుట్టి, నీవు చూస్తూండగానే, గొప్పగా వెలుగొందుతాడు. నా తపస్సత్యాల మహామహిమలు చూడుము' అని పలికాడు. అప్పుడు వ్యాసుడు అశ్వత్థామతో ఇట్లా అన్నాడు:

విశేషం: 'నీ పుణ్యంబునఁ బ్రాణంబులు పరిక్షీణంబులైన పుత్రుండు జనియింపం గలవాఁ డది కారణంబుగా భవదీయ గర్భస్థునకుఁ బరిక్షిన్నామధేయంబు.' అని తెలుగు భారతంలో ఉన్నది. కాని ఇక్కడ సంస్కృత భారతంలో ఇట్లా లేదు. అందులో-

> **"పరిక్షీణేషు కురుషు పుత్ర స్తవ జనిష్యతే,**
> **ఏతద స్యపరిక్షిత్త్వం గర్భస్థస్య భవిష్యతి"**

అని ఉన్నది. 'కౌరవులు నశించిపోగా నీకు కొడుకు పుట్టుతాడు. కడుపులో ఉన్నవాడికి ఈ పరిక్షిత్త్వం కలుగుతుంది.' అని దాని భావం. అశ్వమేధపర్వంలో కూడా ఇట్లాగే ఉన్నది.

తే. 'ఆత్మకులము పరిక్షీణమైన జనన । మొందెఁ గాన నియ్యభిమన్యునందనునకు
నర్థమగు పరిక్షిన్నామ మనియెఁ గృష్ణుఁ । డఖిల జనములు వినఁ బౌరవాధినాథ!' (భార. అశ్వ.)

'నీపుణ్యం కొద్దీ పరిక్షీణాలైన ప్రాణాలు గల కొడుకు పుట్టుతా' డంటే అర్థం ఏమిటి? ప్రాణాలు పరిక్షీణాలైన కొడుకు పుట్టటం పుణ్యం ఎట్లా అవుతుంది? మూలానువాదాలకు ఇక్కడ ఈ తేడా ఎందుకు వచ్చిందో! ఆలోచనీయం.

తే. 'బ్రాహ్మణుఁడ వయ్యు నిట్లు క్రూరతకు రోయ । కస్మదీయ వాక్యంబుల నాదరంబు
సేయ కీ పాపకర్మంబు సేసినాఁడ; । వచ్యుతుఁడు వల్కినట్టుల యగుము నీవు.' 87

ప్రతిపదార్థం: బ్రాహ్మణుఁడవు+అయ్యున్= నువ్వు బ్రాహ్మణుడివైనా; ఇట్లు= ఈ విధంగా; క్రూరతకున్= క్రౌర్యానికి; రోయక= వెనుదీయక; అస్మదీయ వాక్యంబులన్= నా మాటలను; ఆదరంబు+చేయక= మన్నించక; ఈ పాపకర్మంబు= ఈ పాపపుపని; చేసినాఁడవు; నీవు; అచ్యుతుఁడు= శ్రీకృష్ణుడు; పల్కిన+అట్టుల= పలికినట్లే; అగుము.

తాత్పర్యం: 'నీవు బ్రాహ్మణుడివైనా, ఈ విధంగా క్రౌర్యానికి వెనుదీయకుండా, నా మాటలను పాటించకుండా, ఈ పాపకృత్యం చేశావు. నీవు కృష్ణు డన్నట్లుగానే కమ్ము.'

వ. అని యిట్లు శపియించి 'నీచకర్ముండ! పొ'మ్మనిన, విని యశ్వత్థామ యమ్మహాత్ముని యాననం బాలోకించి 'మునీంద్రా! నీవు మనుజులలోన నుండువాఁడ' వని ప్రతిశాపం బిచ్చి, 'నీకడన యేను వర్తిల్లఁ గలవాఁడ, నీవును శౌరియు సత్యవాదు లగుదురుగాక!' యని తన శిరోమణి పాండవుల కిచ్చి తపోవనంబునకుం జనియెఁ; బాండవులును గృష్ణుండును నమ్మునీంద్రునకు నమస్కరించి వీడ్కొని యతిత్వరితగతి నరుగుదెంచి. 88

ప్రతిపదార్థం: అని; ఇట్లు; శపియించి; నీచకర్ముండ!= తుచ్ఛుడా!; పొమ్ము; అనినన్; విని; అశ్వత్థామ; ఆ+మహాత్ముని+ఆననంబు= ఆ మహానుభావుడి ముఖం; ఆలోకించి= చూచి; ముని+ఇంద్రా!= మునీశ్వరా!; నీవు; మనుజులలోనన్= మనుష్యులలో; ఉండువాఁడవు= ఉందువుగాక!; అని; ప్రతిశాపంబు+ఇచ్చి= మారుశాపం ఇచ్చి; నీకడన్+అ= నీ దగ్గరే; ఏను= నేను; వర్తిల్ల గలవాఁడన్= ఉండగలను; నీవును; శౌరియున్= కృష్ణుడూ; సత్యవాదులు= సత్యసంధులు; అగుదురు+కాక; అని; తన శిరోమణి; పాండవులకున్; ఇచ్చి; తపస్(ః)+వనంబునకున్= తపోవనానికి; చనియెన్; పాండవులును; కృష్ణుండును; ఆ+ముని+ ఇంద్రునకున్= ఆ మునీశ్వరుడికి; నమస్కరించి; వీడ్కొని= సెలవు పుచ్చుకొని; అతి త్వరితగతిన్= మిక్కిలి తొందరగా; అరుగుదెంచి= వచ్చి.

తాత్పర్యం: అని ఇట్లా శపించి 'తుచ్ఛుడా! పొమ్ము'. అనగా విని అశ్వత్థామ ఆ మహానుభావుడి ముఖం చూచి, 'మునీశ్వరా! నీవు మనుష్యులలో ఉందువుగాక!' అని ప్రతిశాపం ఇచ్చి, 'నీ దగ్గరే నేను ఉంటాను. నీవూ, కృష్ణుడూ సత్యసంధులు అవుతారుగాక!' అని తన శిరోమణిని పాండవుల కిచ్చి తపోవనానికి వెళ్ళాడు. పాండవులూ, కృష్ణుడూ ఆ మునీశ్వరుడికి నమస్కరించి సెలవు పుచ్చుకొని మిక్కిలి తొందరగా వచ్చి.

క. అరదములు డిగ్గి వగలం । బరితాపముఁ బొందుచున్న పాంచాలిం గాం
చిరి తమచేతోవృత్తులఁ । గరుణము మగుడంగఁ బొడమఁ గౌరవనాథా! 89

ప్రతిపదార్థం: కౌరవనాథా!= కురురాజా!-జనమేజయా!; అరదములు డిగ్గి= రథాలుదిగి; వగలన్= దుఃఖాలతో; పరితాపమున్+ పొందుచున్+ఉన్న పాంచాలిన్= పరితపిస్తూన్న ద్రౌపదిని; తమ చేతస్+వృత్తులన్= తమ మనస్సులలో; మగుడంగన్= మళ్ళీ; కరుణము= శోకం; పొడమన్= పుట్టగా; కాంచిరి= చూశారు.

తాత్పర్యం: జనమేజయా! వాళ్ళు రథాలు దిగి దుఃఖంతో పరితపిస్తూ ఉన్న ద్రౌపదిని తమ మనస్సులలో మళ్ళీ కరుణరసం పుట్టగా చూచారు.

వ. అట్లు గాంచి యక్కాంత చుట్టు నాసీనులై; రప్పు డగ్రజుండు వనుపఁ బవనతనయుం డమ్మణి యద్దేవికి సమర్పించి. 90

ప్రతిపదార్థం: అట్లు; కాంచి; ఆ+కాంత చుట్టున్= ఆ ద్రౌపది చుట్టూ; ఆసీనులు+ఐరి= కూర్చున్నారు; అప్పుడు; అగ్రజుండు= అన్న ధర్మరాజు; పనుపన్= పంపగా; పవనతనయుండు= వాయుపుత్రుడు- భీముడు; ఆ+మణి= ఆ శిరోమణిని; ఆ+దేవికిన్= ఆ ద్రౌపదికి; సమర్పించి= ఇచ్చి.

తాత్పర్యం: అట్లా చూచి ఆ ద్రౌపది చుట్టూ కూర్చున్నారు. అప్పుడు అన్నగారు పంపగా భీముడు ఆ శిరోమణిని ఆ ద్రౌపది కిచ్చి.

భీమసేనుఁ డశ్వత్థామ శిరోరత్నంబు ద్రౌపది కిచ్చుట (సం. 10-16-25)

క. 'పగతు పని సక్కనయ్యెన్; । వగ మానుము రాజధర్మ వైశిష్ట్యము పెం
పుగ నాదరించి; నీ తా । ల్మిగదా భూపాలు నుమ్మలికముం బాచున్. 91

ప్రతిపదార్థం: పగతు పని= శత్రుకార్యం శత్రువుని సాధించే కార్యం; చక్కన+అయ్యెన్= సమాప్తమయింది; రాజ ధర్మ వైశిష్ట్యము= రాజులకు ఉచితమైన ధర్మం యొక్క ప్రత్యేకత; పెంపుగన్= గొప్పగా-బాగా; ఆదరించి= మన్నించి; వగ మానుము= దుఃఖం విడిచిపెట్టుము; నీ తాల్మి కదా= నీ ఓరిమేకదా!; భూపాలు నుమ్మలికమున్= రాజు(ధర్మరాజు) దుఃఖాన్ని; పాచున్= పోగొట్టుతుంది.

తాత్పర్యం: 'శత్రువును సాధించేకార్యం పూర్తయింది. రాజోచిత ధర్మపు విశిష్టతను మన్నించి దుఃఖం మానుము. నీ ఓరిమే కదా ధర్మరాజు దుఃఖాన్ని పోగొట్టేది!

చ. జనపతి పంపఁ గేశవుఁడు సంధికిఁ బోయెడునప్డు నీవు సె
ప్పిన గరువంపు రాజసపు బెట్టిదపుం దగు మాట లెల్ల నె
మ్మనమున నెక్కొనన్ నిలుపుమా; వగవం బనియేమి? సంగరం
బునఁ బగవారు పేర్చి పొరిపుచ్చక పువ్వులకోల సాఁతురే? 92

ప్రతిపదార్థం: జనపతి= రాజు (ధర్మరాజు); పంపన్= పంపగా; కేశవుఁడు= శ్రీకృష్ణుడు; పోయెడు+అప్డు= వెళ్ళేటప్పుడు; నీవు; చెప్పిన; గరువంపు రాజసపు బెట్టిదపుందగు, మాటలెల్లన్= గొప్పతనంతో కూడిన, రజోగుణ ప్రధానములైన - పరుషాలైన, ఉచితములైన మాటలన్నీ; నెఱ+మనమునన్= నిండు మనస్సులో; నెక్కొనన్= పాదుకొనేటట్టు; నిలుపుమా= నిలువు; వగవన్+పని+

ఏమి?= విచారించటం వలన ప్రయోజనమేమిటి?; సంగరంబునన్= యుద్ధంలో; పగవారు= శత్రువులు; పొరిపుచ్చక= చంపక; పువ్వుల కోల= పుష్పబాణం; సాఁతురే?= ప్రయోగిస్తారా?

తాత్పర్యం: ధర్మరాజు పంపగా సంధిచేయటానికి శ్రీకృష్ణుడు కౌరవసభకు వెళ్ళేటప్పుడు నీవు అతడితో చెప్పిన గొప్పతనంతో కూడిన, రజోగుణ ప్రధానములైన, పరుషాలైన, ఉచితాలైన మాటలన్నీ నీ మనస్సులో పాదుకొనేటట్టు నిలుపుము. దుఃఖించటం వలన ఏమి ప్రయోజనం? యుద్ధంలో శత్రువులు చంపక, పుష్పబాణం ప్రయోగిస్తారా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 'సంగరంబున .... సాఁతురే' అనే సామాన్యాంశంచేత శత్రువులు ద్రౌపది కొడుకులను చంపారు అనే విశేషాంశం సమర్థించ బడింది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం. చాఁచు, సాఁచు అని రెండు ధాతువులూ ఉన్నాయి.

క. వినుము ధృతరాష్ట్ర! వంశం । బున మగపీచంబు నెల్లఁ బొలియించితిఁ గృ
ష్ణుని కారుణ్యము, జిష్ణుని । పెనుఁ బ్రాపును గలుగ నేను విగత భయుఁడనై. 93

ప్రతిపదార్థం: వినుము; ధృతరాష్ట్ర వంశంబున; మగపీచంబున్+ఎల్లన్= ధృతరాష్ట్రుడి వంశంలో ఉన్న శూరులగర్వాన్నంతనీ; కృష్ణుని కారుణ్యమున్= శ్రీకృష్ణుడి దయా; జిష్ణుని పెను+ప్రాపును= అర్జునుడి పెద్ద అండా; కలుగన్; నేను; విగత భయుఁడను+ఐ= నిర్భయుడినై; పొలియించితిన్= అంతమొందించాను.

తాత్పర్యం: ద్రౌపదీ! వినుము. శ్రీకృష్ణుడి దయా, అర్జునుడి పెద్ద అండా ఉండగా నేను నిర్భయుడనై ధృతరాష్ట్రుడి వంశంలో ఉన్న శూరుల గర్వాన్నంతటినీ అంతమొందించాను.

ఉ. త్రావితి దుస్ససేను రుధిరం బుర ముగ్రతఁ బేర్చి వ్రచ్చి, క్రీ
డా విధి వాని యగ్రజు తొడల్ వడి నుగ్గుగఁ జేసి, యార్చి, యా
భూవరు మౌళిఁ దన్నితి నృపుల్గని సంతసమంద; నింత హ
ర్షావసరంబు శోకసమయంబుగఁ జేయుట నీకు నర్హమే? 94

ప్రతిపదార్థం: నృపుల్= రాజులు; కని= చూచి; సంతసము+అందన్= సంతోషపడగా; ఉగ్రతన్+పేర్చి= కోపంతో; విజృంభించి; ఉరము= రొమ్ము; వ్రచ్చి= చీల్చి; దుస్ససేను రుధిరంబు= దుశ్శాసనుడి రక్తం; త్రావితిన్= త్రాగాను; క్రీడావిధిన్= ఆటవలె అవలీలగా; వాని+అగ్రజు తొడల్= వాడి అన్నయైన దుర్యోధనుడి తొడలు; వడిన్= వేగంగా; నుగ్గుగన్+చేసి= విరుగగొట్టి; ఆర్చి= బొబ్బపెట్టి; ఆ భూవరు మౌళిన్= ఆ రాజు(దుర్యోధనుడి) శిరస్సును; తన్నితిన్; ఇంత హర్షావసరంబున్= ఇంతటి సంతోష సమయాన్ని; శోక సమయంబుగన్= దుఃఖ సమయంగా; చేయుట; నీకున్; అర్హమే?= తగునా?

తాత్పర్యం: రాజులు చూచి సంతోషపడగా కోపంతో విజృంభించి రొమ్ము చీల్చి దుశ్శాసనుడి నెత్తురు త్రాగాను. వాడి అన్న అయిన దుర్యోధనుడి తొడలు ఒక ఆటవలె - అవలీలగా వేగంగా విరుగగొట్టి బొబ్బపెట్టి శిరస్సు తన్నాను. ఇంతటి సంతోషసమయాన్ని దుఃఖసమయంగా చేయటం నీకు తగునా?

క. గురుతనయుఁ డగుటఁ బ్రాణము । హరియింపఁగఁ జొరక విజయుఁ డశ్వత్థామం
బరిభూతుఁ జేసి యాయుధ । పరిగ్రహముతోడ' లజ్జఁ బాయం జేసెన్. 95

ప్రతిపదార్థం: గురు తనయుఁడు+అగుటన్= గురుపుత్రుడవటంచేత; అశ్వత్థామన్= అశ్వత్థామను; విజయుఁడు= అర్జునుడు; ప్రాణము హరియింపఁగన్+చొరక= ప్రాణం తీయటానికి పూనుకోక; పరిభూతున్+చేసి= అవమానించి; ఆయుధ పరిగ్రహముతోడన్= ఆయుధ సాధనంతో; లజ్జన్+పాయన్+చేసెన్= సిగ్గు విడిచేటట్టు చేశాడు.

తాత్పర్యం: గురుపుత్రు డవటం చేత అశ్వత్థామను అర్జునుడు ప్రాణం తీయటానికి పూనుకొనక అవమానించి ఆయుధసాధనంతో సిగ్గు విడిచేటట్లు చేశాడు.

వ. చూడామణి గోలుపోవుటంజేసి యా కుంభసంభవసంభవు కీర్తిశరీరంబు వడియె; ముఱికిఁ బొందియున్న; దింతియ; యిటువైరంబు పేరు లేకుండఁ దీర్చుట యెవ్వరికిం జను? నేమియుఁ గీడాడఁ దెఱపిలేక ధర్మతనయుండు నిర్మలకీర్తికి భాజనంబై యుల్లసిల్లెడు; నూఱడిల్లుము.' 96

ప్రతిపదార్థం: చూడామణి= శిరోమణి; కోలుపోవుటన్+చేసి= పోగొట్టుకోవటంచేత; ఆ కుంభసంభవ సంభవు కీర్తి శరీరంబు= ఆ ద్రోణకుమారుడి (అశ్వత్థామయొక్క) కీర్తి అనే శరీరం; పడియెన్= పతనంచెందినది; ముఱికిన్+పొంది ఉన్నది= కలుషితమై ఉన్నది; ఇంతియ= ఇంతే; ఇటు= ఈ రీతిగా; వైరంబు పేరులేక+ఉండన్+తీర్చుట= శత్రుత్వం నామమాత్రంగా అయినా లేకుండా అంతమొందించటం; ఎవ్వరికిన్+చనున్?= ఎవరికి సాధ్యపడుతుంది?; ఏమియున్ కీడు+ఆడన్+తెఱపిలేక= ఏమీ నిందించటానికి అవకాశం లేక; ధర్మతనయుండు= ధర్మరాజు; నిర్మల కీర్తికిన్= స్వచ్ఛమైన కీర్తికి; భాజనంబు+ఐ= పాత్రమై; ఉల్లసిల్లెడున్= సంతోషిస్తున్నాడు; ఊఱడిల్లుము= ఉపశమించుము.

తాత్పర్యం: 'శిరోమణిని పోగొట్టుకొనటంచేత ఆ అశ్వత్థామ కీర్తిశరీరం పతనం చెందింది. కలుషితమై ఉన్నది. ఇంతే. ఇట్లా శత్రుత్వం నామమాత్రంగా కూడా లేకుండా అంతమొందించటం ఎవరికైనా సాధ్యమవుతుందా? ఎంతమాత్రమూ నిందించటానికి అవకాశం లేకుండా ధర్మరాజు స్వచ్ఛమైన కీర్తికి పాత్రుడై విరాజిల్లుతున్నాడు. ఉపశమించుము.'

తే. అనినఁ గొండొక తెలివొందు నాననంబు । తోడ నుత్థితయైన యా తోయజాక్షి
ప్రభలు పర్వంగ నొప్పు నాపద్మరాగ । రత్న మఱచేత నిడికొని రాజుఁ జూచి. 97

ప్రతిపదార్థం: అనినన్= అనగా; కొండొక తెలివు+ఒందు+ఆననంబు తోడన్= కొంచెం వికసించిన ముఖంతో; ఉత్థిత+ఐన= లేచిన; ఆ తోయజ+అక్షి= ఆ స్త్రీ - పద్మాలవంటి కళ్ళు గల ఆ ద్రౌపది; ప్రభలు= కాంతులు; పర్వంగన్= వ్యాపించగా; ఒప్పు; ఆ; పద్మరాగ రత్నము= పద్మరాగమణి; అఱచేతన్= అరచేతిలో; ఇడికొని= పెట్టుకుని; రాజున్= ధర్మరాజుని; చూచి.

తాత్పర్యం: అనగా, కొంచెం వికసించిన ముఖంతో లేచిన ఆ ద్రౌపది కాంతులు చిమ్ముతూ ఒప్పే పద్మరాగ మణిని అరచేతిలో పెట్టుకొని ధర్మరాజును చూచి.

వ. భీమసేను నుద్దేశించి. 98

తాత్పర్యం: భీముడితో.

ఉ. 'నా మనమార దీనిఁ గని నందముఁ బొందితి; నింత సాలు నా,
కీ మహనీయరత్నము వహింపఁగ నర్హుఁ డితండ; యంచు నా

భూమిపుచేతఁ బెట్టుటయు, భూవర! యాతఁడు ద్రౌణిగౌరవ
శ్రీ మది భక్తిఁ బెంపఁగ ధరించె శిరంబున దానిఁ బ్రీతుఁడై. 99

ప్రతిపదార్థం: నా మనము+ఆరన్ దీనిన్+కని= నేను మనసారా దీన్ని పొంది; నందమున్+పొందితిన్= సంతోషించాను; నాకున్; ఇంత+చాలున్= ఈ మాత్రం చాలు; ఈ మహనీయ రత్నమున్= ఈ గొప్ప రత్నాన్ని; వహింపఁగన్= ధరించటానికి; అర్హుఁడు= తగినవాడు; ఇతండు+అ= ఇతడే; అంచున్; ఆ భూమిపు+చేతన్= ఆ రాజు (ధర్మరాజు) చేతిలో పెట్టుటయున్= పెట్టగా; భూవర!= రాజా! జనమేజయా!; ఆతఁడు= ధర్మరాజు; ద్రౌణి గౌరవ శ్రీ= అశ్వత్థామమీద ఉండే గౌరవ సంపద; మదిన్= మనస్సులో; భక్తి; పెంపఁగన్= వృద్ధి పొందించగా; ప్రీతుఁడు+ఐ= సంతోషించినవాడై; దానిన్; శిరంబునన్= తలమీద; ధరించెన్= తాల్చాడు.

తాత్పర్యం: 'దీనిని పొంది నా మనసారా ఆనందించాను. నాకు ఈ మాత్రం చాలు. ఈ మహనీయ రత్నాన్ని ధరించటానికి ఇతడే అర్హు' డంటూ దానిని ఆ ధర్మరాజు చేతిలో పెట్టగా, జనమేజయా!, అతడు అశ్వత్థామపై గల గౌరవసంపద మనస్సులో అతడిపై భక్తిని పెంచగా, సంతోషంతో దాన్ని శిరస్సుపై ధరించాడు.

వ. ఇవ్విధంబున. 100

తాత్పర్యం: ఈ రీతిగా.

తే. విలసితం బగు నమ్మణి చెలువు మిగుల । మౌళియందు ధరించి యమ్మనుజనాథుఁ
డుదయరాగ నితాంత సముజ్జ్వలేందు । బింబమునఁ బొల్చు పూర్వశైలంబు వోలె. 101

ప్రతిపదార్థం: ఆ+మనుజనాథుఁడు= ఆ రాజు-ధర్మరాజు; విలసితంబు+అగు+ఆ+మణి= ప్రకాశించే ఆ మణి; చెలువు+మిగులన్= అందం అతిశయించగా; మౌళి+అందున్= శిరస్సుపై; ధరించి= తాల్చి; ఉదయరాగ నితాంత సముజ్జ్వల+ఇందు బింబమునన్= ఉదయ సమయంలోని ఎరుపుచేత అధికంగా ప్రకాశించే చంద్రబింబంచేత; పొల్చు= ఒప్పే; పూర్వ శైలంబు= తూర్పుకొండ(ను); పోలెన్.

తాత్పర్యం: ఆ ధర్మరాజు ప్రకాశిస్తూ ఉన్న ఆ మణిని అందం అతిశయించగా శిరస్సుపై ధరించి, ఉదయకాలపు ఎరుపుతో అధికంగా ప్రకాశించే చంద్రబింబంతో ఒప్పే తూర్పుకొండవలె ఉన్నాడు.

విశేషం: అలం: ఉపమ. మనుజనాథుడు, మణి-ఉపమేయాలు. పూర్వశైలం, చంద్రబింబం-వాటికి వరుసగా ఉపమానాలు. 'పోలెన్' ఉపమావాచకార్థాన్నిచ్చే సమాపకక్రియ. పొల్చు= సామాన్యధర్మం. అందుచేత ఇది పూర్ణోపమాలంకారం.

వ. ఇత్తెఱంగునం బాండవాగ్రజుండు పాంచాలికిఁ బ్రియం బాచరించి తత్ప్రభృతి కాంతలును సహదేవ ప్రముఖ పురుషులును వినఁబవనతనయుం డశ్వత్థామఁబొడఁగనుట మొదలై గురునందనుండు చూడామణి యిచ్చుట తుదియైన వృత్తాంతం బంతయుఁ జెప్ప, నా భూవల్లభుండు లోనుగా నెల్లవారును నపత్యబాధకంబైన యా బ్రహ్మశిరంబు ప్రభావం బూహించి కృష్ణుని ప్రతివిధానంబు గలుగుట నూఁఅడిల్లియు నెట్లగునో యను శంకనుండి; రత్తఱి నుత్తరకుం దక్కఁ బాండవేయ వంశవధూజనంబులకు గర్భంబులు లేకయుండె; నయ్యస్త్రోత్తమం బవ్విరాటపుత్రి యుదరంబున నున్న పిండంబు బాధితంబు సేయుట గనుంగొని

యప్పుండరీకాక్షుండు ద్రౌణితో సల్లాపంబు సేయునవసరంబున నయ్యస్త్రఘాతవేదన లేకుండఁ దన చిత్తవృత్తిన యుడిపెం గాన నవ్విశేషం బయ్యభిమన్యువల్లభయాదిగా నెవ్వరు నెఱుంగ; రది యట్లుండెఁ; బుత్రుల దెస వగ దొఱఁగకున్న యా ధర్మనందనుండు దేవకీనందనున కిట్లనియె; 102

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; పాండవ+అగ్రజుండు= పాండవుల అన్న ధర్మరాజు; పాంచాలికిన్= ద్రౌపదికి; ప్రియంబు+ఆచరించి= ప్రీతిని చేసి; తద్+ప్రభృతి కాంతలును= ఆమె మొదలైన స్త్రీలూ; సహదేవప్రముఖ పురుషులును= సహదేవుడు మొదలైన పురుషులూ; వినన్= వినేటట్టు; పవన తనయుండు= వాయుపుత్రుడు-భీముడు; అశ్వత్థామన్; పొడఁగనుట మొదలు+ఐ= చూడటం మొదలుకొని; గురు నందనుండు= అశ్వత్థామ; చూడామణి= శిరోమణి; ఇచ్చుట తుది+ఐన= ఇవ్వటం వరకూ గల; వృత్తాంతంబు+అంతయున్= వృత్తాంతమంతా; చెప్పన్= చెప్పగా; ఆ భూ వల్లభుండు= ఆ రాజు(ధర్మరాజు); లోనుగాన్= మొదలుగా; ఎల్లవారును= అందరూ; అపత్యబాధకంబు+ఐన= సంతానాన్ని నాశనంచేసే; ఆ బ్రహ్మశిరంబు+ప్రభావంబు= ఆ బ్రహ్మశిరోనామకాస్త్రం మహిమ; ఊహించి= తలచి; కృష్ణుని ప్రతివిధానంబు= శ్రీకృష్ణుడి ప్రతిక్రియ; కలుగుటన్= ఉండటంచేత; ఊఱడిల్లియున్= ఊరటచెందీ; ఎట్లు+అగునో= ఏం జరుగుతుందో; అను శంకన్= అనే భయంతో; ఉండిరి; ఆ+తఱిన్= ఆ సమయంలో; ఉత్తరకున్+తక్కన్= ఉత్తరకు తప్ప; పాండవేయ వంశ వధూజనంబులకున్= పాండవ వంశపు స్త్రీలకు; గర్భంబులు లేక+ఉండెన్= చూలులు లేకుండా పోయాయి; ఆ+అస్త్ర+ఉత్తమంబు= ఆ అస్త్రరాజం; ఆ+విరాటపుత్రి+ఉదరంబునన్= ఆ ఉత్తర గర్భంలో; ఉన్న; పిండంబున్= పిండాన్ని; బాధితంబు+చేయుట= బాధించటం; కనుంగొని= చూచి; ఆ+పుండరీక+అక్షుండు= తెల్లతామరలవంటి కన్నులు గల ఆ శ్రీకృష్ణుడు; ద్రౌణితోన్= అశ్వత్థామతో; సల్లాపంబు+చేయు+అవసరంబునన్= సంభాషించేటప్పుడు; ఆ+అస్త్రఘాతవేదన= ఆ అస్త్రపు దెబ్బవలన కలిగే బాధ; లేక+ఉండన్= లేకుండా; తన చిత్తవృత్తిన్+అ= తన మనోవ్యాపారం చేతనే; ఉడిపెన్+కానన్= మాన్పాడు కాబట్టి; ఆ+విశేషంబు= ఆ సంగతి; ఆ+అభిమన్యు వల్లభ+ఆదిగాన్= ఆ అభిమన్యుడి భార్య (ఉత్తర) మొదలుకొని; ఎవ్వరున్; ఎఱుంగరు; అది+అట్లు+ఉండెన్; పుత్రుల దెసన్= కుమారులమీద; వగ= దుఃఖం; తొఱఁగక+ఉన్న= పోని; ఆ ధర్మనందనుండు= ఆ ధర్మరాజు; దేవకీనందనునకున్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు ద్రౌపదికి ప్రియంచేసి, ఆమె మొదలుగా స్త్రీలూ, సహదేవుడు మొదలుగా పురుషులూ వినేటట్లు భీముడు అశ్వత్థామను చూచింది మొదలుకొని అశ్వత్థామ శిరోమణి ఇవ్వటం వరకూ గల వృత్తాంతం అంతా చెప్పగా, ధర్మరాజు మొదలుగా అందరూ సంతానాన్ని నాశనం చేసే ఆ బ్రహ్మశిరోనామకాస్త్రపు మహిమను తలచుకొని, దానికి శ్రీకృష్ణుడి ప్రతిక్రియ ఉన్నదికదా అని ఊరటచెంది, ఏమవుతుందో అనే భయంతో ఉన్నారు. అప్పుడు ఉత్తరకు తప్ప పాండవవంశంలోని స్త్రీలకు చూలులు లేకుండా పోయాయి. ఆ అస్త్రరాజం ఉత్తర గర్భంలో ఉన్న పిండాన్ని బాధించటం చూచి కృష్ణుడు అశ్వత్థామతో సంభాషించేటప్పుడే ఆ అస్త్రంవలన బాధలేకుండా తన మనోవ్యాపారంచేతనే మాన్పాడు కాబట్టి ఆ సంగతి ఉత్తర మొదలుగా ఎవ్వరూ ఎరుగరు. అది అట్ల ఉండగా కుమారులకొరకు దుఃఖం విడిచిపెట్టని ధర్మరాజు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

**చ. 'బలమున శౌర్యసంపద నభంగపరాక్రములైన ద్రౌపదే
యుల నొకరుండ ముట్టికొని యుద్భటవిక్రమ ముల్లసిల్ల దు
ర్బలుల వధించు చాడ్పునఁ గృపాణకళాలలితంబు లొప్ప వి
చ్చలవిడిఁ ద్రుంచె నట్టె! గురుసంభవుఁ డంతకు నెట్టు సాలెనో! 103**

ప్రతిపదార్థం: బలమునన్= బలంవలనా; శౌర్య సంపదన్= శౌర్యసంపదవలనా, అభంగ పరాక్రములు+ఐన= భంగపాటు లేని పరాక్రమంగల; ద్రౌపదేయులన్= ద్రౌపది కొడుకులను; ఒకరుండు+అ= ఒక్కడే; ముట్టికొని= ఎదుర్కొని; ఉద్భట విక్రమము= శ్రేష్ఠమైన పరాక్రమం; ఉల్లసిల్లన్= ఒప్పగా; దుర్బలులన్= బలహీనులను; వధించు చాడ్పునన్= చంపేవిధంగా; కృపాణ కళా లలితంబులు= ఖడ్గ విద్యానైపుణ్యాలు; ఒప్పన్; విచ్చలవిడిన్= ఇష్టం వచ్చినట్లు; త్రుంచెన్+అట్టె!= చంపాడట!; గురుసంభవుఁడు= అశ్వత్థామ; అంతకున్= అంతపనికి; ఎట్టు+చాలెనో= ఎట్లా సమర్థుడయ్యాడో!

తాత్పర్యం: 'బలంవలనా, శౌర్య సంపదవలనా భంగపా టెరగని పరాక్రమం గల ద్రౌపది కొడుకులను ఒక్కడూ ఎదుర్కొని శ్రేష్ఠమైన పరాక్రమం ఒప్పగా బలహీనులను వధించే విధంగా ఖడ్గవిద్యా నైపుణ్యం ప్రకాశించగా ఇష్టం వచ్చినట్లు చంపాడట! అశ్వత్థామకు ఆ సామర్థ్యం ఎట్లా వచ్చిందో!

శా. ఉద్యోగ స్ఫురితుం, డజయ్య భుజవీర్యుం, డిద్ధ విక్రాంత సం
పద్యోగ ప్రథితుండు, శక్రనుతసంభావ్యక్రమోద్యద్ధను
ర్విద్యావైభవశాలి, సంగరకళావిస్తారసంవేది, ధృ
ష్టద్యుమ్నుం; డతఁ డోర్వకున్కి యెటు లశ్వత్థామ యుద్రేకమున్?. 104

ప్రతిపదార్థం: ధృష్టద్యుమ్నుండు; ఉద్యోగ స్ఫురితుండు= కార్యనిర్వహణ దక్షుడూ; అజయ్య భుజ వీర్యుండు= జయించరాని బాహుపరాక్రమం కలవాడూ; ఇద్ధ విక్రాంత సంపద్+యోగ ప్రథితుండు= అప్రతిహతమైన పరాక్రమసంపద కలిగి ఉండటంచేత ప్రసిద్ధుడూ; శక్ర నుత సంభావ్య క్రమ+ఉద్యత్+ధనుస్(ః)+విద్యా వైభవశాలి= ఇంద్రుడిచేత పొగడబడిన, సమ్మానించదగిన సామర్థ్యంతో పూనుకొనే ధనుర్విద్యా సంపదచేత ఒప్పేవాడూ; సంగర కళా విస్తార సంవేది= యుద్ధ విద్య విపులంగా తెలిసినవాడూ; అతఁడు= అటువంటి అతడు; అశ్వత్థామ ఉద్రేకమున్= అశ్వత్థామ విజృంభణాన్ని; ఓర్వక+ఉన్కి= ఓడించలేక పోవటం; ఎటులు?= ఎట్లా (సంభవించింది)?

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు కార్యనిర్వహణ దక్షుడు. జయించరాని బాహుబలం గలవాడు. అప్రతిహతమైన పరాక్రమ సంపద చేత ప్రసిద్ధుడు. ఇంద్రుడి ప్రశంస లందుకొన్న సామర్థ్యం గల ధనుర్విద్యా వైభవంతో ఒప్పేవాడు. యుద్ధవిద్య బాగా తెలిసినవాడు. అట్లాంటివాడు అశ్వత్థామ విజృంభణాన్ని ఓడించలేకపోవటం ఏమిటి?

క. తక్కును గల పాంచాలుర । నొక్కఁడ శిబిరంబు సొచ్చి యుక్కు దలిర్పం
బెక్కంద్రఁ దునిమె నటె; యిది । యక్కజ మగు! నేమి కతన నధికుం డయ్యెన్?' 105

ప్రతిపదార్థం: (అశ్వత్థామ కర్త); తక్కును+కల= మిగిలిన; పాంచాలురన్= పాంచాలదేశపు వీరులను; ఒక్కఁడు+అ= ఒక్కడే; శిబిరంబు+చొచ్చి= శిబిరంలోకి ప్రవేశించి; ఉక్కు= బలం; తలిర్పన్= ఒప్పగా; పెక్కంద్రన్= అనేకులను; చంపెన్+అటె= చంపాడట; ఇది; అక్కజము+అగున్= ఆశ్చర్యంగా ఉన్నది; ఏమి కతనన్= ఏ కారణంచేత; అధికుండు+అయ్యెన్= గొప్పవాడయ్యాడు?

తాత్పర్యం: తక్కిన పాంచాలదేశపు వీరులను ఎంతమందినో ఒక్కడూ శిబిరంలో ప్రవేశించి బలం ఒప్పగా అశ్వత్థామ చంపాడట! ఇది ఆశ్చర్యకరం. అత డట్లా అధికు డవటానికి కారణం ఏమిటి?'

వ. అనిన నమ్మహీకాంతునకు మురాంతకుం డి ట్లనియె. 106

ప్రతిపదార్థం: అనినన్= అని అడుగగా; ఆ+మహీకాంతునకున్= ఆ రాజుకు; ముర+అంతకుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అని అడుగగా ధర్మరాజుతో శ్రీకృష్ణు డిట్లా అన్నాడు:

ధర్మరాజునకుఁ గృష్ణుఁడు శివప్రభావంబు చెప్పుట (సం. 10-17-6)

చ. **'హరుఁ, బరమేశ్వరేశ్వరుఁ, గృపాతిశయార్ద్రు, నమేయమూర్తి, శం**
కరు, నచలైక భక్తిరసగమ్యుని, నవ్యయు, నిందుమౌళిఁ ద
త్పరమతి నాశ్రయించి యనపాయబలోద్భటశౌర్యసంపదన్
గురుతనయుండు గాంచి యధికుం డగుటం బగదీర్చె నమ్మెయిన్. 107

ప్రతిపదార్థం: గురు తనయుండు= గురుపుత్రుడు అశ్వత్థామ; హరున్= ఈశ్వరుడిని; పరమేశ్వర+ఈశ్వరున్= పరమేశ్వరుడైన ఈశ్వరుడిని; కృపా+అతిశయ+ఆర్ద్రున్= దయారసార్ద్రుడిని; అమేయమూర్తిన్= మితిలేని ఆకారం గలవాడిని; శంకరున్= శుభం కలగజేసేవాడిని అచల+ఏక భక్తిరస గమ్యునిన్= స్థిరమైన భక్తిరసంచేతనే పొందదగినవాడిని; అవ్యయున్= నాశనంలేని వాడిని; ఇందుమౌళిన్= చంద్రుడు శిరస్సునందు గలవాడిని; తత్పరమతిన్= ఆసక్తితో కూడిన మనస్సుతో; ఆశ్రయించి; అనపాయ బల+ఉద్భట శౌర్య సంపదన్= నాశనంలేని బలంచేత శ్రేష్ఠమైన పరాక్రమశ్రీని; కాంచి= పొంది; అధికుండు+అగుటన్= గొప్పవాడవటంచేత; ఆ+మెయిన్= ఆ రీతిగా; పగ+తీర్చెన్= పగసాధించాడు.

తాత్పర్యం: 'హరుడూ, పరమేశ్వరేశ్వరుడూ, దయారసార్ద్రుడూ, అపరిమితాకారుడూ, శంకరుడూ, స్థిరభక్తిచేతనే పొందదగినవాడూ, నాశరహితుడూ అయిన చంద్రశేఖరుడిని భక్తిశ్రద్ధలతో ఆశ్రయించి అశ్వత్థామ నాశనంలేని మహాపరాక్రమసంపత్తిని పొంది అధికు డవటంచేత ఆ రీతిగా పగసాధించాడు.

చ. **శివుఁడు ప్రసన్నుఁడైన నఱచేయునె యెవ్వరికైన? రాజపుం**
గవ! యమరత్వమైన, బలఘస్మరు గెల్వఁగ నోపునట్టి ద
ర్ప విభవమైన నిచ్చుఁ; బరిపంథు లనేకుల నొక్కరుండు బా
హువిలసనంబు ఘోరముగ నోర్వఁగఁ జాలుట యీగి చోద్యమే? 108

ప్రతిపదార్థం: రాజపుంగవ!= రాజోత్తమా! ధర్మరాజా!; శివుఁడు; ప్రసన్నుఁడు+ఐనన్= ప్రసన్నుడైతే; ఎవ్వరికిన్+ఐనన్= ఎవరికైనా; అఱ= కొరత; చేయునె?= చేస్తాడా?; అమరత్వము+ఐనన్= దేవత్వాన్నైనా; బల ఘస్మరున్= బలాసురుడిని చంపినవాడిని - ఇంద్రుడిని; గెల్వఁగన్+ఓపు+అట్టి= గెలవగల; దర్ప విభవము+ఐనన్= పరాక్రమ సంపదనైనా; ఇచ్చున్; పరిపంథులు+అనేకులన్= శత్రువులను; పెక్కుమందిని; ఒక్కరుండున్= ఒక్కడూ; బాహు విలసనంబు= భుజక్రీడ; ఘోరముగన్= భయంకరంగా; ఓర్వఁగన్+చాలుట= ఓడించే సామర్థ్యాన్ని; ఈగి= ఇవ్వటం; చోద్యమే?= వింతా?

తాత్పర్యం: రాజోత్తమా! ధర్మరాజా! శివుడు ప్రసన్నుడైతే, ఎవరికైనా కొరతచేస్తాడా? దివ్యత్వాన్నైనా ఇస్తాడు. ఇంద్రుడిని గెలవగల పరాక్రమ సంపదనైనా ఇస్తాడు. అట్లాంటప్పుడు శత్రువు లనేకులను ఒక్కడూ భుజబలక్రీడను, భయంకరంగా ఓడించే సామర్థ్యాన్ని ఇవ్వటం ఏమి వింత?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. అమరత్వాన్నీ, ఇంద్రుడినీ ఓర్చే సామర్థ్యాన్నీ ఇచ్చేటప్పుడు, అనేక శత్రువులను ఒక్కడూ ఓడించే సామర్థ్యాన్ని ఇవ్వటంమాట చెప్పాలా? అని కైముత్యంచేత అర్థసంసిద్ధి జరుగుతోంది కాబట్టి కావ్యార్థాపత్త్యలంకారం.

ఉ. తెల్లమి గాఁగ నేను శివదేవు నెఱుంగుదు; భూతసంచయం
బెల్ల జనింప, నిల్వఁగ, లయింపఁగఁ జేయు నతండె; యవ్విభుం
డుల్లమునం దలంప భువనోత్కరవిశ్వవిధానయుక్తి వ
ర్తిల్లుచునుండు; భక్తికి విధేయుఁ, డమేయుఁడు కౌరవేశ్వరా! 109

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా!= కురురాజా! ధర్మరాజా!; నేను; శివదేవున్= భగవంతుడైన శివుడిని; తెల్లమి+కాఁగన్= స్పష్టంగా; ఎఱుంగుదున్; అతండు+ఎ= అతడే; భూత సంచయంబు+ఎల్లన్= ప్రాణి సమూహమంతా; జనింపన్= పుట్టేటట్టూ; నిల్వఁగన్= నిలిచేటట్టూ; లయింపఁగన్= నశించేటట్టూ; చేయున్; ఆ+విభుండు= ఆ స్వామి; ఉల్లమునన్= మనస్సులో; తలంపన్= అనుకుంటే; భువన+ఉత్కర విశ్వ విధాన యుక్తి= లోక సమూహంయొక్క సకల సృష్టి వ్యవహారమూ; వర్తిల్లుచున్+ ఉండున్= ప్రవర్తిల్లుతూ ఉంటుంది; (అతడు); భక్తికిన్; విధేయుఁడు= వశపడేవాడు; అమేయుఁడు= మితియిడదగనివాడు.

తాత్పర్యం: ధర్మరాజా! నేను భగవంతుడైన శివుడిని బాగా ఎరుగుదును. అతడే ప్రాణి సమూహం అంతా పుట్టేటట్లూ, నిలిచేటట్లూ నశించేటట్లూ చేస్తాడు. ఆ స్వామి మనస్సులో అనుకొంటే లోక సమూహపు సర్వసృష్టి వ్యవహారమూ జరుగుతూ ఉంటుంది. అతడు భక్తికి లొంగేవాడు. ఇంతటివాడని చెప్పటానికి శక్యం కానివాడు.

వ. అమ్మహాదేవుని దివ్యలీలలు సెప్పెద నాకర్ణింపుము. 110

ప్రతిపదార్థం: ఆ+మహాదేవుని= ఆ పరమేశ్వరుడి; దివ్యలీలలు= మానవాతీతమైన లీలలు; చెప్పెదన్; ఆకర్ణింపుము= విను.

తాత్పర్యం: ఆ పరమేశ్వరుడి మానవాతీతలీలలు చెపుతాను వినుము.

సీ. భూతసంచయ సృష్టి బుద్ధిఁ దలంచి య । ప్పరమేశుఁ గానఁగ బ్రహ్మ యరిగి
తనదు మనోవృత్తి దగ నెఱింగించిన, । నమ్మహాత్ముండు తదభిమతంబు
గావింపఁ బూని తపోవిభవం బేమి । పనులకు నైనను బ్రథమసాధ
నంబని యూహించి, యంబుసమర్పిత । నిజమూర్తియై, తపోనిష్ఠ నుండె;

తే. నా విరించియు నద్దేవదేవు రాక । బహుసహస్రవర్షంబులు వార్చియుండి,
నిజతపఃప్రభావంబున నిపుణచిత్తు । దక్షుఁడనువాని సృజియించె; ధరణినాథ! 111

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా! - ధర్మరాజా!; బ్రహ్మ; భూతసంచయ సృష్టిన్= ప్రాణి సమూహపు సృష్టిని; బుద్ధిన్= మనస్సులో; తలంచి= కోరి; ఆ+పరమేశున్= ఆ పరమేశ్వరుడిని; కానఁగన్= చూడటానికి; అరిగి= వెళ్ళి; తనదు మనస్(ః)+వృత్తిన్= తన మనోభిప్రాయాన్ని; తగన్= ఒప్పేటట్టు; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; తద్+అభిమతంబు= ఆ బ్రహ్మతలపు; కావింపన్+పూని= చేయబూని; ఏమి పనులకున్+ఐనన్= ఏ పనులకైనా; తపస్(ః)+విభవంబు= తపస్సంపద; ప్రథమ సాధనంబు= మొదటిసాధనం; అని; ఊహించి= తలచి; అంబు సమర్పిత నిజమూర్తి+ఐ= నీళ్ళలో ఉంచబడిన తన ఆకారం గలవాడై; తపస్(ః)+నిష్ఠన్= తపోనియమంతో; ఉండెన్; ఆ విరించియున్= ఆ బ్రహ్మయు; ఆ+దేవదేవురాకన్= ఆ దేవదేవుడి రాకను; బహు సహస్ర వర్షంబులు= పెక్కువేలేండ్లు; వార్చి+

ఉండి= కనిపెట్టుకొని ఉండి; నిజ తపస్(ః)+ప్రభావంబునన్= తనదైన తపోమహిమచేత నిపుణ చిత్తున్= నేర్పుగల మనస్సుగలవాడిని; దక్షుఁడు+అను వానిన్= దక్షుడనే వాడిని; సృజియించెన్= పుట్టించాడు.

తాత్పర్యం: ధర్మరాజా! బ్రహ్మ ప్రాణి సమూహాన్ని సృజించాలనే తలంపుతో ఆ పరమేశ్వరుడిని చూడటానికి వెళ్ళి తన మనోభిప్రాయం ఒప్పుగా చెప్పగా, ఆ మహానుభావుడు అతడి ఉద్దేశం నెరవేర్చాలని, ఏ పనులకైనా తపస్సంపద మొదటి సాధనం గదా అని తలచి, నీళ్ళలో నిలబడి తపస్సు చేయసాగాడు. బ్రహ్మ ఆ దేవదేవుడు వస్తాడు గదా! అని పెక్కు వేలేండ్లు కనిపెట్టుకొని ఉండి, తన తపోమహిమ చేత నేర్పరి అయిన దక్షుడనే వాడిని పుట్టించాడు.

వ. ఇట్లు సృజియించి యవ్విరించి యతని నాలోకించి 'ప్రజల సృజియింపు' మని పంచిన, నతండు 'పెద్దవా రొండ్లు లేరై రేనియు సృజియించెద' ననిన, నప్పరమేష్ఠి 'పరమేశ్వరుండు జలనిమగ్నుండై యున్నవాఁ; డేను నిన్ను నియోగించెద; నింక సృజియించుపెద్ద లెవ్వరును లేరు. సృజియింతువు గాక' యనవుడు నమ్మహాత్ముండు దేవాసురమనుష్యతిర్యగాత్మకభూతంబుల సృజియించిన, నాఁకొని యవి దక్షప్రజాపతి భక్షింపం గవిసిన. 112

ప్రతిపదార్థం: ఇట్లు; సృజియించి= పుట్టించి; ఆ+విరించి= ఆ బ్రహ్మ; అతనిన్= ఆ దక్షుడిని; ఆలోకించి= చూచి; ప్రజలన్; సృజియింపుము= పుట్టించుము; అని; పంచినన్= ఆజ్ఞాపించగా; అతండు; పెద్దవారు; ఒండ్లు= ఇతరులు; లేరు+ఐరి+ఏనియున్= లేకపోయినట్లయితే; సృజియించెదన్= సృష్టిస్తాను; అనన్; ఆ+పరమేష్ఠి= ఆ బ్రహ్మ; పరమేశ్వరుండు; జల నిమగ్నుండు+ఐ= నీటిలో మునిగినవాడై; ఉన్నవాఁడు; ఏను; నిన్నున్; నియోగించెదన్= నియమిస్తాను; ఇంకన్; సృజియించు పెద్దలు+ఎవ్వరును= సృష్టించే పెద్దలెవరూ; లేరు; సృజియింతువు+కాక= పుట్టించుము; అనవుడున్= అనగానే; ఆ+మహాత్ముండు; దేవ+అసుర మనుష్య తిర్యక్+ఆత్మక భూతంబులన్= దేవతలు; రాక్షసులు; మనుష్యులు; పశుపక్ష్యాదులు అనే ప్రాణులను; సృజియించినన్= పుట్టించగా; అవి; ఆఁకొని= ఆకలిగొన్నవై; దక్షప్రజాపతిన్= దక్షుడనే బ్రహ్మను; భక్షింపన్= తినటానికి; కవిసినన్= మీదపడగా.

తాత్పర్యం: ఇట్లా సృష్టించి ఆ బ్రహ్మ అతడిని చూచి, 'ప్రజలను సృజించుము' అని ఆజ్ఞాపిస్తే, అతడు 'పెద్దవాళ్ళు ఇతరులు లేకపోతే సృజిస్తాను' అన్నాడు. బ్రహ్మ 'పరమేశ్వరుడు నీళ్ళలో మునిగి ఉన్నాడు. నేను నిన్ను నియోగిస్తాను. ఇంక సృజించే పెద్దలెవ్వరూ లేరు అందుచేత నీవు సృజించుము.' అనగానే ఆ మహానుభావుడైన దక్షుడు దేవతలు, రాక్షసులు, మనుష్యులు, పశుపక్ష్యాదులు ఐన ప్రాణులను సృజించాడు, అంత అవి ఆకలిగొని దక్షప్రజాపతిని భక్షించటానికి మీదపడగా.

ఆ. అతఁడు బ్రహ్మపాలి కతిరయంబునఁ బాఱి । 'భూతతతులు నన్నుఁ బొదువకుండ
నాఁగవలయు; వాని కాహారములు గల్పి । తములు సేయవలయుఁ దగ మహాత్మ!' 113

ప్రతిపదార్థం: అతఁడు= ఆ దక్షప్రజాపతి; బ్రహ్మ పాలికిన్= బ్రహ్మ దగ్గరకు; అతి రయంబునన్= మిక్కిలి వేగంతో; పాఱి= పరుగెత్తి; మహాత్మ!= మహానుభావా!; భూత తతులు= ప్రాణులు సమూహాలు; నన్నున్; పొదువక+ఉండన్= చుట్టుముట్టకుండా; ఆఁగవలయున్= ఆపాలి; వానికిన్= ఆ భూతాలకు; తగన్= తగినట్లు; ఆహారములు; కల్పితములు+చేయవలయున్= కల్పించాలి.

తాత్పర్యం: అతడు బ్రహ్మ దగ్గరకు వేగంగా పరుగెత్తి 'మహాత్మా! ప్రాణికోట్లు నన్ను చుట్టుముట్టకుండా ఆపాలి. వాటికి తగినట్లుగా ఆహారాలు కల్పించాలి.'

వ. అనిన విని యా జగత్కర్త యోషధులును ఫలమూలాదిభక్ష్యసంపదుపకారంబులుగా వృక్షలతాగుల్మంబులను గల్పించి, యా భూతంబులకు వాని నాహారంబులుగా సమర్పించి, మఱియును బలిష్ఠభూతంబులకు దుర్బల భూతంబులు భక్ష్యంబగుం గాక యనియు నాదేశించె; నంత నా భూతంబులు ప్రీతంబులై చని తత్ప్రకారంబున వృద్ధినొంది సంతానరూపంబున సమృద్ధంబు లగుచునుండెఁ; బెద్దకాలంబునకు బాలేందుధరుండు జలంబులు వెడలివచ్చి భూతకోట్ల నాలోకించి కోపించి నిజలింగంబుఁ బుచ్చి నేలనిడినం గని యా నీరజాసనుండు భవునిం బ్రశమనవాక్యంబుల ననునయించుచుఁ జేరనరిగి 'లింగంబు నిట్లేల చేసి?' తనుటయు నద్దేవుండు. 114

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ జగత్+కర్త= ఆ బ్రహ్మ; ఓషధులను; ఫలమూల+ఆది భక్ష్య సంపద్+ఉపకారంబులు+కాన్= పళ్ళు, వేళ్ళు మొదలైన భక్ష్య సంపదకు సాధనాలుగా; వృక్షలతా గుల్మంబులను= చెట్లు, తీగలు, పొదలు; కల్పించి= సృష్టించి; ఆ భూతంబులకున్= ఆ ప్రాణులకు; వానిన్; ఆహారంబులు+కాన్; సమర్పించి= ఇచ్చి; మఱియును; బలిష్ఠ భూతంబులకున్= బలవత్తమప్రాణులకు; దుర్బల భూతంబులు= బలహీనాలైన ప్రాణులు; భక్ష్యంబు+అగున్+కాక= ఆహారం అవుతాయి కాక; అనియున్; ఆదేశించెన్= ఆజ్ఞాపించాడు; అంతన్; ఆ భూతంబులు; ప్రీతంబులు+ఐ= సంతోషించినవయి; చని= వెళ్ళి; తద్+ప్రకారంబునన్= ఆ విధంగా; వృద్ధిన్+ఒంది= పెరిగి; సంతాన రూపంబునన్= సంతతి రూపంగా; సమృద్ధంబులు+అగుచున్+ ఉండెన్= బాగా వృద్ధి పొందుతున్నాయి; పెద్ద కాలంబునకున్= చాలా కాలానికి; బాల+ఇందుధరుండు= చంద్రకళను తాల్చినవాడు - శివుడు; జలంబులు వెడలి వచ్చి= నీళ్ళలో నుండి వెలికివచ్చి; భూతకోట్లన్= ప్రాణుల సమూహాలను; ఆలోకించి= చూచి; కోపించి; నిజలింగంబున్+పుచ్చి= తనదైన లింగాన్ని తీసి; నేలన్+ఇడినన్= నేలమీద పెట్టగా; కని; ఆ నీరజ+ఆసనుండు= ఆ పద్మాసనుడు-బ్రహ్మ; భవునిన్= శివుడిని; ప్రశమన వాక్యంబులన్= శాంత వచనాలతో; అనునయించుచున్= బ్రతిమాలుతూ; చేరన్+అరిగి= దగ్గరకు వెళ్ళి; లింగంబున్; ఇట్లు; ఏల చేసితి(వి)?; అనుటయున్; ఆ+దేవుండు= ఆ శివుడు.

తాత్పర్యం: అని చెప్పగా విని, ఆ సృష్టికర్త ఓషధులను, ఫలమూలాలూ మొదలైన భక్ష్య సంపదకు సాధనాలైన చెట్లనూ, తీగలనూ, పొదలనూ సృష్టించి ఆ ప్రాణులకు వాటిని ఆహారంగా సమర్పించి, ఇంకా, మిక్కిలి బలంగల ప్రాణులకు బలహీనాలైన ప్రాణులు భక్ష్యం అవుతాయని కూడా ఆదేశించాడు. అంత ఆ భూతాలు సంతోషించి, పోయి ఆ విధంగా వృద్ధినొంది సంతతి రూపంలో పెరుగుతున్నాయి. చాలాకాలం తరువాత శివుడు నీళ్ళలో నుండి వెలుపలకు వచ్చి ప్రాణికోట్లను చూచి కోపించి తన లింగాన్ని పెరికి నేలమీదపెట్టాడు. అది చూచి బ్రహ్మ శివుడిని శాంత వచనాలతో బ్రతిమాలుతూ దగ్గరకు వెళ్ళి 'లింగాన్ని ఇట్లా ఎందుకు చేశా?' వని అడిగాడు. ఆ దేవుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'భూతంబుల సృజియించుట । కై తోయములందు మునిఁగి యత్యుగ్ర తపః
స్ఫీతుఁడనై వచ్చితి నొరు । చేత సృజనమగుట నిట్లు సేసితి దీనిన్.' 115

ప్రతిపదార్థం: భూతంబులన్= ప్రాణులను; సృజియించుటకై= పుట్టించటంకోసం; తోయములందున్= నీళ్ళలో; మునిఁగి; అత్యుగ్రతపఃస్ఫీతుఁడన్+ఐ= (అతి+ఉగ్ర)+తపస్+స్ఫీతుఁడన్+ఐ= మిక్కిలి భయంకరమైన తపస్సుచేత అధికుడినయి; వచ్చితిన్; ఒరుచేతన్= ఇతరుడిచేత; సృజనము+అగుటన్= సృష్టి జరగటం చేత; దీనిన్= ఈ లింగాన్ని; ఇట్లు చేసితిన్= ఈ విధంగా చేశాను.

తాత్పర్యం: 'ప్రాణులను పుట్టించటంకొరకు నీళ్ళలో మునిగి మిక్కిలి ఘోరమైన తపస్సుచేసి అధికుడినయి వచ్చాను. ఇంకొకడిచేత సృష్టి జరిగిపోవటం వలన ఈ లింగాన్ని ఇట్లా చేశాను.'

వ. 'భూతంబుల సృజియించుటకుం గాక లింగంబు దన కేల?' యని పలికి సంరంభవిజృంభితుం డగుచు మాల్యవంతంబునకుఁ జని మహాతపంబు సేయుచుండ. 116

ప్రతిపదార్థం: భూతంబులన్; సృజియించుటకున్+కాక= పుట్టించటానికి కాకపోతే; లింగంబు; తనకున్+ఏల= నాకెందుకు?; అని; పలికి; సంరంభ విజృంభితుండు+అగుచున్= కోపంతో విజృంభిస్తూ; మాల్యవంతంబునకున్; చని; మహా+తపంబు+ చేయుచున్+ఉండన్= గొప్ప తపస్సు చేస్తూండగా.

తాత్పర్యం: 'భూతాలను సృష్టించటానికి కాకపోతే లింగం నా కెందుకు?' అని పలికి కోపంతో విజృంభిస్తూ మాల్యవంతమనే పర్వతం దగ్గరకు వెళ్ళి తపస్సు చేస్తూండగా.

క. ఆ సమయంబున లింగము । భాసురగతిఁ జూడ నొప్పె బ్రహ్మాదులకుం;
జేసిరి పూజలు వారలు । వాసవముఖ్యామరాదివర్గముఁ దారున్. 117

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అప్పుడు; బ్రహ్మాదులకున్= బ్రహ్మ మొదలైనవారికి; లింగము; భాసుర గతిన్= ప్రకాశించే విధంగా; చూడన్+ఒప్పెన్= చూడటానికి ఒప్పింది; వారలు; వాసవ ముఖ్య+అమర+ఆది వర్గమున్+తారున్= ఇంద్రుడు మొదలుగా గల దేవతలు మొదలైనవారి సమూహమూ, తామూ; పూజలు చేసిరి= పూజించారు.

తాత్పర్యం: అప్పుడు లింగం బ్రహ్మ మొదలైనవాళ్ళకు అందంగా కనిపించింది. ఇంద్రుడూ మొదలైన దేవతల సమూహమూ తామూ దానికి పూజలు చేశారు.

వ. అంతం బెద్దకాలంబునకు. 118

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట; పెద్దకాలంబునకున్= చాలాకాలం తరువాత.

తాత్పర్యం: పిమ్మట చాలాకాలం తరువాత.

రుద్రుఁడు దేవతలు సేయు యజ్ఞంబు సేరుట (సం. 10-18-1)

క. సుర లొక్క మహాధ్వర మా । చరింపఁగఁ దలంచి ద్రవ్యసంపద మిగులం
దొరకొల్పి భాగయోగ్యా । మరుల నిరూపించి యతిసమాహితమతులై. 119

ప్రతిపదార్థం: సురలు= దేవతలు; ఒక్క; మహా+అధ్వరము= గొప్ప యజ్ఞం; ఆచరింపఁగన్+తలంచి= చేయగోరి; ద్రవ్య సంపదన్= వస్తుసంపదను; మిగులన్= ఎక్కువగా; దొరకల్పి= సిద్ధంచేసి; భాగ యోగ్య+అమరులన్= భాగానికి అర్హులైన దేవతలను; నిరూపించి= నిర్ణయించి; అతి సమాహిత మతులు+ఐ= మిక్కిలి ఏకాగ్రతగల మనస్సులుగలవారై.

తాత్పర్యం: దేవతలు ఒక మహాయజ్ఞం చేయగోరి దానికి కావలసిన వస్తుసంపదను అధికంగా సమకూర్చికొని యజ్ఞభాగానికి అర్హులైన దేవతలను నిర్ణయించి, మిక్కిలి ఏకాగ్రతగల మనస్సులు కలవారై.

వ. తొడంగి యనుష్ఠానప్రపంచప్రవర్తకు లగుచుండిరి గాని రుద్రుని మహానుభావం బెఱుంగమింజేసి యయ్యోగమూర్తికి భాగకల్పనం బొనర్పరైరి; దాని నెఱింగి. 120

ప్రతిపదార్థం: తొడంగి= ప్రారంభించి; అనుష్ఠాన ప్రపంచప్రవర్తకులు= ఆచరణ విస్తారాన్ని జరిపించేవారు; అగుచున్+ఉండిరి= అవుతున్నారు; కాని; రుద్రుని= శివుడియొక్క; మహానుభావంబు= గొప్పతనం; ఎఱుంగమిన్+చేసి= ఎరుగకపోవటంచేత; ఆ+యోగ మూర్తికిన్= ఆ ధ్యానస్వరూపుడికి - శివుడికి; భాగ కల్పనంబు= యజ్ఞభాగం కల్పించటం; ఒనర్పరైరి= చేయలేదు; దానిన్; ఎఱింగి.

తాత్పర్యం: ప్రారంభించి అనుష్ఠానం విస్తారంగా జరిపిస్తున్నారు కాని రుద్రుడి గొప్పతనం ఎరుగకపోవటంచేత ఆ యోగస్వరూపుడికి భాగం కల్పించలేదు. అది తెలిసి.

సీ. అతుల తపోమయం బయి యద్భుతావహం । బయిన దైర్ఘ్యంబున నతిశయిల్లి
బాలార్కసన్నిభప్రభఁ దేజరిల్లెడు । నట్లుగా నొక్క శరాసనంబు
సృజియించి దానికి శింజినీ ప్రముఖంబు । లగు నంగకములు యజ్ఞాంగకల్పి
తములు గావించి యుద్దామకోపానల । జ్వాలలు సాకారలీల నిగుడఁ

ఆ. గేలియం దమర్చి కృత్తివాసుఁడు సుర । శ్రేణిక్రతువు నియతిఁ జేయునెడకు
నరుగుదెంచె సత్వరాభీల హేలా వి । కాసభాసి యగుచుఁ గౌరవేంద్ర! 121

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కౌరవులలో శ్రేష్ఠుడా! - ధర్మరాజా!; అతుల తపస్(ః)+మయంబు+అయి= సాటిలేని వేడిమితో నిండినదై; అద్భుత+ఆవహంబు+అయిన= ఆశ్చర్యకరమైన; దైర్ఘ్యంబునన్= పొడవుతో; అతిశయిల్లి= మించి; బాల+అర్క సన్నిభ ప్రభన్= బాలసూర్యుడితో సమానమైన కాంతితో; తేజరిల్లెడు+అట్లు+కాన్= ప్రకాశించేటట్లు; ఒక్క శరాసనంబున్= ఒక ధనుస్సును; సృజియించి= పుట్టించి; దానికిన్; శింజినీ ప్రముఖంబులు+అగు+అంగకములు= నారి మొదలైన అంగాలు; యజ్ఞ+అంగ కల్పితములు= యజ్ఞ సాధనాలచే కల్పించబడినవి; కావించి= చేసి; ఉద్దామ కోప+అనల జ్వాలలు= భయంకర కోపాగ్ని శిఖలు; స+ఆకార లీలన్= మూర్తీభవించినట్లు; నిగుడన్= వ్యాపించగా; కేలియందున్= చేతిలో; అమర్చి= ధరించి; కృత్తివాసుఁడు= శివుడు (చర్మం వస్త్రంగా గలవాడు); సుర శ్రేణి= దేవతల సమూహం; క్రతువున్= యజ్ఞం; నియతిన్= నిష్ఠతో; చేయు+ఎడకున్= చేసే చోటికి; సత్వర+ఆభీల హేలా వికాస భాసి= తొందరతో గూడిన భయంకరమైన ద్వేషంయొక్క వికాసంతో ప్రకాశించేవాడు; అగుచున్; అరుగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: కురువంశ శ్రేష్ఠుడా - ధర్మరాజా! సాటిలేని వేడిమితో నిండినదై, ఆశ్చర్యకరమైన పొడవుతో మించి, బాల భాస్కరుడి తేజస్సుతో సమానమైన తేజస్సుతో ప్రకాశించేటట్లు ఒక విల్లు సృష్టించి, దానికి నారి మొదలైన అంగాలు యజ్ఞాంగాలచేత కల్పించి, భయంకరకోపాగ్ని జ్వాలలు మూర్తీభవించినట్లు వ్యాపించగా, చేత ధరించి, శివుడు దేవతలసమూహం నిష్ఠతో యజ్ఞం చేసే చోటికి సత్వరమూ, భయంకరమూ అయిన ద్వేషంతో ప్రకాశిస్తూ వచ్చాడు.

మ. ధరణీచక్రము దిర్దిరం దిరిగెఁ; బాతాళంబు ఘూర్ణిల్లె; భూ
ధరముల్ పెల్లగిలెన్; దిశావలయ ముత్కంపంబు నొందెన్; దివా

కర చంద్రాగ్నుల దీప్తి మాసె; సురలోకం బాకులం బయ్యె న
ప్పరమేశుం డటు తా మరుత్క్రతుపరిభ్రంశార్థియై వచ్చినన్. 122

ప్రతిపదార్థం: ఆ+పరమేశుండు= ఆ పరమేశ్వరుడు; అటు= ఆ విధంగా; తాన్; మరుత్+క్రతు పరిభ్రంశ+అర్థి+ఐ= దేవతల యజ్ఞనాశనం కోరినవాడై; వచ్చినన్= రాగా; ధరణీచక్రము= భూవలయం; దిర్దిరన్= గిరగిరా; తిరిగెన్; పాతాళంబు; ఘూర్ణిల్లెన్= తిరుగుడు పడింది; భూధరముల్= పర్వతాలు; పెల్లగిలెన్= పెకలాయి; దిశావలయము= దిఙ్మండలం; ఉత్కంపంబున్+ఒందెన్= అధికంగా కంపించాయి; దివాకర చంద్ర+అగ్నుల దీప్తి= సూర్యుడి, చంద్రుడి, అగ్నికాంతి; మాసెన్= నశించింది; సురలోకంబు= దేవతల సమూహం; ఆకులంబు+అయ్యెన్= కలతచెందినది.

తాత్పర్యం: ఆ పరమేశ్వరుడు ఆ విధంగా దేవతల యజ్ఞాన్ని ధ్వంసం చేయటానికి రాగా, భూవలయం గిరగిరా తిరిగింది. పాతాళలోకం తిరుగుడుపడింది. పర్వతాలు పెల్లగిల్లాయి. దిగ్వలయం మిక్కిలి కంపించింది. సూర్య చంద్రాగ్నులు తేజోవిహీనులయ్యారు. దేవతల సమూహం కలతచెందింది.

చ. అనిమిష సంఘమెల్లను భయంబునఁ జేష్టలు దక్కి యధ్వరం
బు నడప నేర్పు లేది కురుభూవర! చిత్రగతప్రకార మ
య్యెఁ; నదరి యేసె నా క్రతువు నీశుఁడు; డెందము గాఁడఁ బాఱిపో
యె నది మృగంబుచందము వహించి హుతాశనసంయుతంబుగన్. 123

ప్రతిపదార్థం: కురు భూవర!= కురురాజా! ధర్మరాజా!; అనిమిష సంఘము+ఎల్లను= దేవతల సమూహం అంతా; భయంబునన్= భయంతో; చేష్టలు+తక్కి= నిశ్చేష్టమై; అధ్వరంబున్= యజ్ఞాన్ని; నడపన్= నడిపించటానికి; నేర్పులు+ఏది= నైపుణ్యం కోల్పోయి; చిత్రగత ప్రకారము+అయ్యెన్= చిత్తరువులో ఉన్న విధంగా నిశ్చేష్టం అయింది; ఈశుఁడు; అదరి= విజృంభించి; ఆ క్రతువున్= ఆ యజ్ఞాన్ని; ఏసెన్= కొట్టాడు; అది= ఆ యజ్ఞం; డెందము+కాఁడన్= హృదయంలో నాటుకోగా; మృగంబు చందమున్= లేడి విధం; వహించి= పొంది; హుతాశన సంయుతంబుగన్= అగ్నితో కూడా; పాఱిపోయెన్.

తాత్పర్యం: ధర్మరాజా! దేవతలందరూ భయంతో నిశ్చేష్టులై యజ్ఞ నిర్వహణానికి కావలసిన నేర్పు కోల్పోయి, బొమ్మలవలె అయిపోయారు. ఈశ్వరుడు విజృంభించి ఆ యజ్ఞాన్ని కొట్టాడు. హృదయంలో నాటుకోగా ఆ యజ్ఞం లేడి రూపాన అగ్నితో కూడి పారిపోయినది.

వ. ఇవ్విధంబున యజ్ఞం బపక్రాంతం బగుటయు నిర్జరులు నిశ్చేతనులైః రందు సవితృని బాహువులును, బూషుని దంతంబులును, భగుని లోచనంబులును ద్రిలోచనుండు గోదండాగ్రంబునఁ దునియను, డొల్లను బగులను బొడిచె నప్పుడు దలరి దివిజులు యజ్ఞాంగబులతోడంగూడఁ బలుగడలం బాఱం దొడంగిన. 124

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; యజ్ఞంబు; అపక్రాంతులు+అగుటయున్= ఆగిపోయినది కాగా; నిర్జరులు= దేవతలు; నిశ్చేతనులు+ఐరి= నిశ్చేష్టులయ్యారు; అందున్; సవిత చేతులూ; పూషుని దంతంబులును= పూషుడి పళ్ళూ; భగుని లోచనంబులును= భగుడి కళ్ళూ; త్రిలోచనుండు= ముక్కంటి శివుడు; కోదండ+అగ్రంబునన్= వింటికొనచేత; తునియను= ముక్కలయ్యేటట్టూ; డొల్లను= రాలేటట్టూ; పగులను= పగిలేటట్టూ; పొడిచెన్; అప్పుడు; దివిజులు= దేవతలు; తలరి= కంపించి; యజ్ఞ+అంగంబులతోడన్+కూడన్= యజ్ఞోపకరణాలతో సహా; పలు+కడలన్= నానా దిక్కులకు; పాఱన్+తొడంగినన్= పారిపోవ నారంభించగా.

తాత్పర్యం: ఈ విధంగా యజ్ఞం ఆగిపోగా దేవతలు నిశ్చేష్టులయ్యారు. వాళ్ళలో సవితృడి చేతులు ముక్కలయ్యే టట్లు, పూషుడి పళ్ళు ఊడేటట్లు, భగుడి కళ్ళు పగిలేటట్లు, ముక్కంటి వింటి కొనతో పొడిచాడు. అప్పుడు దేవతలు కంపించి యజ్ఞోపకరణాలతోసహా నానాదిక్కులకూ పారిపోవనారంభించగా.

క. ఆ దేవుఁడు వారందఱు । నే దిక్కులఁ బోవకుండ నెయిది భయం బా
పాదించుచు నలి నాఁగెఁ । గోదండము నారి సాఁచి గుములుగు గొనఁగన్. 125

ప్రతిపదార్థం: ఆ దేవుఁడు= ఆ శివుడు; వారు+అందఱున్; ఏ దిక్కులన్+పోవక+ఉండన్= ఏ దిక్కులకూ వెళ్ళిపోకుండా; ఎయిది= వెంటాడి; భయంబు+ఆపాదించుచున్= వెరపు పుట్టిస్తూ; కోదండము నారి సాఁచి= వింటి త్రాడు లాగి; గుములుగు+ కొనఁగన్= గుంపులు కట్టేటట్టు; నలిన్= సమర్థతతో; ఆఁగెన్= ఆపాడు.

తాత్పర్యం: ఆ దేవుడు వెంటాడి వెరపు పుట్టిస్తూ వింటిత్రాడు లాగి వాళ్ళందరూ ఏ దిక్కులకూ పారిపోకుండా, గుంపులు కట్టేటట్లు సమర్థతతో ఆపాడు.

తే. ఏయ నొల్లక యమరుల నివ్విధమునఁ । బొదివికొని యీశ్వరుఁడు వార
లొక్క మొగి 'వింటిగొనయంబు పెక్కు దునియ । లయ్యెడును' యనవుడు నది యట్ల యయ్యె. 126

ప్రతిపదార్థం: ఏయన్+ఒల్లక= కొట్టటానికి ఇష్టపడక; అమరులన్= దేవతలను; ఈ+విధమునన్; పొదివికొని= ఆక్రమించి; ఈశ్వరుఁడు; తూలపుచ్చన్= అవమానించగా; వారలు= ఆ దేవతలు; ఒక్క మొగిన్= ఒక్కుమ్మడిగా; వింటి గొనయంబు= వింటిత్రాడు; పెక్కు+తునియలు+అయ్యెడున్+అ= ముక్కలు ముక్కలయిపోవుగాక; అనవుడున్= అనగానే; అది= ఆ త్రాడు; అట్లు+అ+అయ్యెన్= అలాగే అయింది.

తాత్పర్యం: దేవతలను కొట్టటానికి ఇష్టపడక ఈ విధంగా ఆక్రమించి ఈశ్వరుడు అవమానించగా వాళ్ళందరూ ఒక్కపెట్టున 'వింటిత్రాడు ముక్కలు ముక్కలయిపోవుగాక' అని అనగానే అది అట్లాగే అయింది.

వ. ఆలోన. 127

తాత్పర్యం: అంతలోనే.

క. సుర లా క్రతువుం దారును । శరణం బను పలుకుతోడఁ జరణానతులై
కరుణకుఁ బాత్రము లగుటయు । శరణాగతవత్సలుఁడుఁ బ్రసన్నతఁ బొందెన్. 128

ప్రతిపదార్థం: సురలు= దేవతలు; ఆ క్రతువున్= ఆ యజ్ఞమూ; తారును= తామూ; శరణంబు+అను పలుకుతోడన్= శరణం అనే మాటతో; చరణ+ఆనతులు+ఐ= కాళ్ళమీద పడినవారై; కరుణకున్= దయకు; పాత్రములు= తగినవారు; అగుటయున్= కాగా; శరణ+ఆగత వత్సలుఁడు= శరణుకై వచ్చినవాళ్ళపై దయగలవాడు - ఈశ్వరుడు; ప్రసన్నతన్+పొందెన్= అనుగ్రహించాడు.

తాత్పర్యం: ఆ యజ్ఞమూ, దేవతలూ శరణంటూ కాళ్ళమీద పడి దయతో అర్హులు కాగా, శరణన్నవారిని కాచే ఈశ్వరుడు వాళ్ళను అనుగ్రహించాడు.

వ. ఇట్లు ప్రసన్నుండై. 129

ప్రతిపదార్థం: ఇట్లు; ప్రసన్నుండు+ఐ= అనుగ్రహించినవాడై.

తాత్పర్యం: ఈవిధంగా అనుగ్రహించినవాడై.

తే. ఆత్మకోపంబు పుచ్చి జలాశయమున । వైచి బాలేందుధరుఁడు దేవతల నాద
రమున వీక్షించె; నమ్మహోగ్రంపు రోష । మనలరూపమై యిగిరించె నజ్జలముల. 130

ప్రతిపదార్థం: బాల+ఇందు ధరుఁడు= చంద్రకళాధరుడు-శివుడు; ఆత్మకోపంబు= తనకోపం; పుచ్చి= తొలగించి; జలాశయమునన్= సరస్సులో; వైచి= పడవేసి; దేవతలన్; ఆదరమునన్= దయతో; వీక్షించెన్= చూశాడు; ఆ+మహత్+ఉగ్రము+రోషము= ఆ మిక్కిలి భయంకరమైన కోపం; అనలరూపము+ఐ= అగ్నిరూపం కలదయి; ఆ+జలములన్= ఆ నీళ్ళను; ఇగిరించెన్= ఇంకించింది.

తాత్పర్యం: శివుడు తన కోపాన్ని తొలగించి సరస్సులో పడవైచి దేవతలను దయతో చూశాడు. ఆ మహాకోపం అగ్నిరూపం ధరించి ఆ నీళ్ళను ఇంకించింది.

వ. ఇత్తెఱంగునఁ గృపాయత్తచిత్తుండై సర్వేశ్వరేశ్వరుండు సవితృనకుఁ, బూషునకు, భగునకుఁ గరంబులును, దంతబులును, నయనంబులును నొసంగి యజ్ఞం బెప్పటియట్ల ప్రవర్తిల్ల ననుగ్రహార్ద్రభావంబునం బనిచిన. 131

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; సర్వ+ఈశ్వర+ఈశ్వరుండు= సర్వప్రభువులకు ప్రభువైనవాడు - పరమేశ్వరుడు; కృపా+ఆయత్త చిత్తుండు+ఐ= దయకు వశమైన మనస్సు గలవాడై; సవితృనకున్= సవితకు; పూషునకున్; భగునకున్; కరంబులును= చేతులూ; దంతంబులును= పళ్ళూ; నయనంబులును= కళ్ళూ; ఒసంగి= ఇచ్చి; యజ్ఞంబు; ఎప్పటి+అట్లు+అ= ఎప్పటిలాగే; ప్రవర్తిల్లన్= జరిగేటట్లు; అనుగ్రహ+ఆర్ద్ర భావంబునన్= దయవలని ఆర్ద్రతతో; పనిచినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: ఈ విధంగా పరమేశ్వరుడు దయాధీన మనస్కుడై సవితకు చేతులూ, పూషుడికి పళ్ళూ, భగుడికి కళ్ళూ ఇచ్చి యజ్ఞం యథాప్రకారంగా జరిగేటట్టు దయా భావంతో ఆజ్ఞాపించగా.

క. అమరులు భక్తిం గ్రతు భా । గము నప్పరమేశ్వరునకుఁ గల్పించి; రతం
డు మనంబునఁ బ్రీతుండై । సమాహితుండయ్యెఁ; జగము సంతోషించెన్. 132

ప్రతిపదార్థం: అమరులు= దేవతలు; భక్తిన్= భక్తితో; ఆ+పరమేశ్వరునకున్; క్రతుభాగమున్= యజ్ఞభాగాన్ని; కల్పించిరి= ఇచ్చారు; అతండు; మనంబునన్= మనస్సులో; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; సమాహితుండు+అయ్యెన్= శాంతించాడు; జగము; సంతోషించెన్.

తాత్పర్యం: దేవతలు భక్తితో ఆ పరమేశ్వరుడికి యజ్ఞభాగం కల్పించారు. అతడు మనస్సులో సంతోషించి శాంతించాడు. లోకం సంతోషించింది.

వ. అట్టివి యద్దేవదేవుని దివ్యలీల; లతండు కోపించిన భువనంబు లస్వాస్థ్యంబును, బ్రసన్నుండైన సుఖిత్వంబును గను; నా భూతనాథుండు గురుసుతునకు సన్నిహితుం డయ్యెఁ గావున నయ్యోధవరుం డొక్కరుండ శిబిరంబు ప్రవేశించి యిత్తెఱంగు పరాక్రమం బాచరించెఁ గాని యివ్విశేషం బారథికవరుని శక్తి నైనది గా; దిది చిత్తంబున నిడం బనిలేదు, భీష్మద్రోణకర్ణశల్యాదులైన మహావీరులం బోరఁ బరిమార్ప దొరకొనుటకును, దర్పదుర్దములైన ధృతరాష్ట్ర నందనాగ్రేసరులైన దుశ్శాసన దుర్యోధనులఁ జలంబు నెరయ వక్షోరక్తపానంబున, నూరుభంజనంబునం బరిమార్చుటం జేసి ప్రతిజ్ఞాపూరణాచరణశోభనంబు నొంద సంభావించుటకును గారణంబైన భవదీయ దైవమానుషయోగంబునకుఁ బరమానందంబు నొందు' మని యిట్లు గోవిందుండు ధర్మనందనునకు నాశ్వాసం బొనరించె నని జనమేజయునకు వైశంపాయనుండు సెప్పుటయు. 133

ప్రతిపదార్థం: ఆ+దేవదేవుని= ఆ పరమేశ్వరుడి; దివ్యలీలలు; అట్టివి= అటువంటివి; అతండు; కోపించినన్= కోపిస్తే; భువనంబులు= లోకాలు; అస్వాస్థ్యంబును= అనారోగ్యస్థితినీ; ప్రసన్నుండు+అయినన్= ప్రసన్నుడైతే; సుఖిత్వంబును= సౌఖ్యాన్నీ; కనున్= పొందుతాయి; ఆ భూతనాథుండు= ఆ భూతపతి-శివుడు; గురు సుతునకున్= అశ్వత్థామకు; సన్నిహితుండు+అయ్యెన్= దగ్గరయ్యాడు; కావునన్; ఆ+యోధవరుండు= ఆ వీరశ్రేష్ఠుడు; ఒక్కరుండు+అ= ఒక్కడే; శిబిరంబు; ప్రవేశించి; ఈ+తెఱంగు పరాక్రమంబు= ఈ విధమైన పరాక్రమం; ఆచరించెన్= చేశాడు; కాని; ఈ+విశేషంబు; ఆ రథిక వరుని శక్తిన్= ఆ రథిక శ్రేష్ఠుడి శక్తిచేత; ఐన+అది కాదు; ఇది; చిత్తంబునన్= మనస్సులో; ఇడన్+పనిలేదు= పెట్టుకోపనిలేదు; భీష్మ ద్రోణ కర్ణ శల్య+ఆదులు+ఐన మహావీరులన్= భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, శల్యుడు మొదలుగా గల మహావీరులను; పోరన్= యుద్ధంలో; పరిమార్పన్= చంపటానికి; దొరకొనుటకును= యత్నించటానికీ; దర్ప దుర్దములు+ఐన= అణచరాని అహంకారం గలవారైన; ధృతరాష్ట్ర నందన+అగ్రేసరులు+ఐన= ధార్తరాష్ట్రులలో పెద్దవారైన; దుశ్శాసన దుర్యోధనులన్; చలంబు= పంతం; నెరయన్= నిండగా; వక్షస్(ః)+రక్తపానంబునన్= రొమ్ము నెత్తురు త్రాగటంచేతా; ఊరు భంజనంబునన్= తొడలు విరుగగొట్టటంచేతా; పరిమార్చుటన్+ చేసి= చంపటంవలన; ప్రతిజ్ఞా పూరణ+ఆచరణ శోభనంబున్= ప్రతిజ్ఞ నెరవేర్చటం అనే శుభాన్ని; ఒందన్= పొందేటట్టు; సంభావించుటకును= ఆదరించటానికి; కారణంబు+ఐన; భవదీయ దైవ మానుష యోగంబునకున్= నీదైన దైవమానుషాల కూటమికి; పరమ+ఆనందంబున్+ఒందుము+అని= పరమానందంపొందుమని; ఇట్లు; గోవిందుండు= కృష్ణుడు; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; ఆశ్వాసంబు= ఓదార్పు; ఒనరించెన్= చేశాడు; అని; జనమేజయునకున్; వైశంపాయనుండు; చెప్పుటయున్= చెప్పగా.

తాత్పర్యం: 'ఆ దేవదేవుడైన ఈశ్వరుడి దివ్యలీలలు అటువంటివి. అతడు కోపిస్తే లోకాలు అస్వస్థతనూ, ప్రసన్నుడైతే సౌఖ్యాన్నీ పొందుతాయి. ఆ ఈశ్వరుడు అశ్వత్థామకు ప్రసన్నుడయ్యాడు. కాబట్టి ఆ వీరవరు డొక్కడే శిబిరంలోకి ప్రవేశించి ఈ విధంగా పరాక్రమించాడు. కాని, ఈ విశేషం ఆ రథికవరుడి శక్తిచేత జరిగింది కాదు. నీవు ఇది మనస్సులో పెట్టుకొననక్కరలేదు. భీష్మ ద్రోణ కర్ణ శల్యాది మహావీరులను యుద్ధంలో చంప యత్నించటానికీ, అణచరాని అహంకారం గల ధార్తరాష్ట్రులలో పెద్దవాళ్లైన దుశ్శాసనుడినీ, దుర్యోధనుడినీ పంతం నిండగా, రొమ్ము నెత్తురు త్రాగీ, తొడలు విరగ్గొట్టి ప్రతిజ్ఞ నెరవేరటం అనే శుభాన్ని పొందేటట్లు సంభావించడానికీ కారణమైన నీ దైవమానుష సమ్మేళనానికి పరమానందపడుము' అని ఈ విధంగా శ్రీకృష్ణుడు ధర్మరాజును ఓదార్చాడు అని జనమేజయుడికి వైశంపాయనుడు చెప్పగా. (తరువాతిదైన స్త్రీ పర్వ ప్రథమాశ్వాసంలోని మొదటి పద్యంతో అన్వయం).

ఆశ్వాశాంతము

స్రగ్ధర.

సాయంప్రాతర్హుత ప్రజ్వలిత హుతవహస్వైరనిర్ధూతజాడ్య
స్ఫాయచ్చేతః ప్రసాద ప్రసృమరవిమలప్రౌఢబోధానుమోదీ!
మాయావ్యాపారదూరా! మఖతతిహృతినిర్మాణసంపాద్యమానా!
శ్రేయోరాజత్త్రిలోకాశ్రిత జనదురితక్షేపలీలావిలాసా! 134

ప్రతిపదార్థం: సాయం= సాయంకాలమందూ; ప్రాతః= ఉదయసమయమందూ; హుత= హోమం చేయబడి; ప్రజ్వలిత= బాగా జ్వలించిన; హుతవహ= అగ్నిచేత; స్వైర= స్వేచ్ఛగా; నిర్ధూత= పోగొట్టబడిన; జాడ్య= జడత్వం గలిగినట్టీ; స్ఫాయత్= వృద్ధి పొందుతున్న; చేతః+ప్రసాద= మనోనైర్మల్యమూ; ప్రసృమర= ప్రసరించే స్వభావంగల; విమల= నిర్మలమూ; ప్రౌఢ= గొప్పదీ అయిన; బోధ= జ్ఞానాన్ని; అనుమోదీ!= అంగీకరించేవాడా! (ఉభయ సంధ్యలలోనూ చేసే అగ్నిహోత్ర రూపకర్మంచేత చిత్తశుద్ధి కలిగి స్థిరమైన ఆత్మవిజ్ఞానం కలుగుతుందనీ, అలాంటి విజ్ఞానం పరమేశ్వరుడి తృప్తికి కారణమనీ భావం); మాయా వ్యాపార దూరా!= కుటిలమైన ఆచారం గలవారికి దవ్వయినవాడా! (లేదా మాయావ్యాపార మంటే జగత్ప్రవృత్తి. అధ్యాత్మ విదులకు తప్ప జగద్వ్యాపారమే యథార్థమనీ, గమ్యమనీ అనుకునే మూఢులకు దూరుడని భావం); మఖ= యజ్ఞాలయొక్క; తతి= సమూహంయొక్క; హృతి= నిర్మాణంచేత; సంపాద్యమానా!= సంపాదించబడేవాడా!; ('హృతినిర్మాణ' శబ్దంచేత త్రేతాగ్ని సంబద్ధములైన యజ్ఞాలే ప్రధానంగా గ్రాహ్యాలు); శ్రేయః= నిశ్శ్రేయస(ముక్తి) ఫలాన్నిచ్చే జ్ఞానంతో; రాజత్= ప్రకాశిస్తున్నట్టీ; త్రిలోక= మూడు లోకాలను; ఆశ్రిత= ఆశ్రయించినట్టి; జన= జనులయొక్క; దురిత= పాపాలను; క్షేప= పోగొట్టడం అనే పనే; లీలా విలాసా!= కేళీవిలాసంగా గలవాడా!- (హరిహరనాథా! అని ఈ విశేషణాలన్నీ కృతిపతియైన హరిహరనాథుడివి.)

తాత్పర్యం: హరిహరనాథా! నిష్కామంగా ఉభయ సంధ్యలలోనూ ఆచరించే అగ్నిహోత్రాది వైదిక కర్మలచేత కలిగే ఉత్తమజ్ఞానమంటే నీవు మిక్కిలి సంతోషిస్తావు. కుటిల వ్యాపారాలంటే నీకు ఎంతమాత్రమూ ఇష్టం ఉండదు. యజ్ఞస్వరూపుడవైన నీవు యజ్ఞ నిర్వహణం చేతనే సంపాదించబడతావు. సర్వలోకాలలోని జ్ఞానుల జ్ఞానాన్ని అభినందిస్తూ నీవు వాళ్ళ పాపాల నన్నింటినీ పోగొట్టుతూ మిక్కిలి వినోదిస్తావు.

క. సురనికరానందకరా! । సురారికాంతావిలాసశోభాపహరా!
కరుణాసక్తమనస్కా! । సరిద్వరా బర్హి బర్హ చారు శిరస్కా! 135

ప్రతిపదార్థం: సుర నికర+ఆనందకరా!= దేవతల సమూహానికి ఆనందాన్ని సమకూర్చేవాడా!; సుర+అరి= దేవతల శత్రువులైన రాక్షసులయొక్క; కాంతా= భార్యలయొక్క; విలాస= విలాసాలనూ; శోభా= శోభనూ; అపహరా!= అపహరించేవాడా!; (రాక్షసులను చంపేవాడా అని భావం); కరుణా+ఆసక్త మనస్కా!= దయతో గూడిన చిత్తం గలవాడా!; సరిత్+వర= నదీశ్రేష్ఠమైన గంగచేతనూ; (హరరూపంలో); బర్హి= నెమలియొక్క; బర్హ= పింఛం చేతనూ (హరిరూపంలో); చారు= మనోహరమైన; శిరస్కా!= శిరస్సుగలవాడా!

తాత్పర్యం: దేవతల సమూహానికి ఆనందాన్ని సమకూర్చేవాడా! రాక్షసుల భార్యల విలాసాలనూ, శోభనూ హరించేవాడా! (రాక్షసులను సంహరించేవాడా), దీనులయందు దయగలవాడా! హరరూపంతో నదీశ్రేష్ఠమైన గంగనూ, హరిరూపంలో నెమలి ఫింఛాన్నీ ధరించిన అందమైన శిరస్సు కలవాడా! హరిహరనాథా!

మాలిని.

అకలుష హృదయాభివ్యక్త! సర్వోపయుక్తా!
సకలనిగమవేద్యా! స్వాస్థ్యవిద్యోపపాద్యా!
ప్రకృతివికృతిభావప్రాప్త సాంఖ్య ప్రదీప్తా!
సుకృతమయ విలాసా! సుస్థిరానందభాసా! **136**

ప్రతిపదార్థం: అకలుష హృదయ+అభివ్యక్త!= నిర్మలమైన చిత్తమునందే సుస్పష్టంగా గోచరించేవాడా! మాలిన్యరహితమైన దర్పణంతో ప్రతిబింబంలాగా నిర్మల చిత్తంలో పరమేశ్వరుడు సుస్పష్టంగా గోచరిస్తాడని భావం; సర్వ+ఉపయుక్తా!= విశ్వానికంతకూ ఉపకరించేవాడా!; ధర్మ సంస్థాపనం ద్వారా పరమేశ్వరుడు సర్వలోకాలకీ ఉపకరిస్తాడని భావం; సకల నిగమ వేద్యా!= సమస్త శ్రుతులచే తెలియదగినవాడా!; స్వాస్థ్య విద్యా+ఉపపాద్యా!= స్వస్థ భావాన్ని తెలిపే విద్యలచేత తెలియదగినవాడా!; స్వ= తాను అంటే ఆత్మ; స్వస్థ అంటే ఆత్మనిష్ఠుడని భావం. పరమేశ్వరుఁడు ఆత్మస్వరూపుడవటం వలన స్వాస్థ్య విద్యోపపాద్యుడని భావం; ప్రకృతి వికృతి భావ= ప్రకృతి వికృతి భావంచేత అంటే కార్యకారణభావం చేత, ప్రాప్త= పొందబడిన; సాంఖ్య= సాంఖ్య దర్శన ప్రతిపాదకమైన జ్ఞానంచేత; ప్రదీప్తా!= మిక్కిలి ప్రకాశించేవాడా!; సుకృతమయ విలాసా!= పుణ్యరూపమైన విలాసం గలవాడా! (పరమేశ్వరుడి విశ్వసృష్ట్యాదిక విలాసజ్ఞానం పుణ్యహేతువవటంచేత పరమేశ్వరుడు సుకృతమయ విలాసుడని భావం); సుస్థిర+ఆనంద భాసా!= శాశ్వతానందం చేత ప్రకాశించేవాడా!; (ఇతరములైన ఇంద్రియసుఖాదులన్నీ కార్యరూపాలు అవటంచేత అవి నశ్వరాలు. పారమేశ్వర స్వరూపానందం కారణ స్వరూపం కాబట్టి, అది సుస్థిరమని భావం).

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నీవు నిర్మల హృదయాలలోనే గోచరిస్తావు. ధర్మసంస్థాపనం చేస్తూ విశ్వానికంతకూ ఉపకరిస్తావు. అధ్యాత్మ విద్యా ప్రతిపాదకాలైన వేదాలే నీ స్వరూపాన్ని తెలుపుతాయి. ప్రకృతి పురుషరూప తత్త్వాల ద్వారా విశ్వ స్వరూపాన్ని బోధించే సాంఖ్య మతంలో నీవే వెలుగొందుతున్నావు. నీ విలాసరూపమైన విశ్వసృష్టి స్థితి సంహారాల విచారం చేత జనులకు ఎంతో సుకృతం కలుగుతుంది. నీవు శాశ్వతానంద స్వరూపుడవై ప్రకాశిస్తూ ఉంటావు.

గద్యము.

ఇది శ్రీమదుభయ కవిమిత్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధా రాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీమహాభారతంబున సౌప్తిక పర్వంబునందు సర్వంబును ద్వితీయాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది; శ్రీమత్+ఉభయకవిమిత్ర= శ్రీమంతుడైన ఉభయకవిమిత్ర బిరుదం కలవాడూ; కొమ్మన+అమాత్య పుత్త్ర= కొమ్మనమంత్రి కుమారుడూ; బుధ+ఆరాధన విరాజి= పండితుల-దేవతల- పూజచే ప్రకాశించేవాడూ(అయిన); తిక్కన సోమయాజి= తిక్కన అనేపేరుగల సోమయాజిచేత; ప్రణీతంబు+ఐన= రచించబడిన; శ్రీమహాభారతంబునన్= శ్రీమహాభారతంలో; సౌప్తిక పర్వంబునందున్= సౌప్తికమనే పేరుగల పర్వంలో; ద్వితీయ+ఆశ్వాసము= రెండవ ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది శ్రీమంతుడైన ఉభయకవిమిత్ర బిరుదంకలవాడూ, కొమ్మనమంత్రి కుమారుడూ, పండితుల (దేవతల) పూజలచేత ప్రకాశించేవాడూ, అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శ్రీమహాభారతంలోని సౌప్తికపర్వంలో రెండవ ఆశ్వాసం.

సౌప్తికపర్వంలో ద్వితీయాశ్వాసం సమాప్తం.
శ్రీమదాంధ్ర మహాభారతంలో సౌప్తికపర్వం ముగిసింది.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

స్త్రీపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీ సాంగత్య విధాయి వి । కాసోల్లాసిత కటాక్ష! కరుణామయ మూ
ర్తీ! సారబోధ భరిత । వ్యాసాది మనోనివాస! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= ఐశ్వర్య; సాంగత్య= లాభాన్ని; విధాయి= కలుగజేసేటటువంటి; వికాస+ఉల్లాసిత= వికసనంచేత ప్రకాశింపజేయబడిన; కటాక్ష!= క్రీగంటి చూపుగలస్వామీ! (హరిహరనాథా!); కరుణామయమూర్తీ!= దయాస్వరూపుడా!; సారబోధ= విశ్వానికంతా సారభూతమైన జ్ఞానంతో; భరిత= నిండిన; వ్యాసాది మనోనివాస= వ్యాసాదులైన బ్రహ్మర్షుల మనసులలో నివసించేవాడా! హరిహరనాథా! (నీకు నమస్కారం).

తాత్పర్యం: స్వామీ! హరిహరనాథా! నీ కడగంటి చూపే భక్తులకు ఐశ్వర్యాన్ని కలిగించి సంతోష పరచగలుగుతుంది. నీవు దయామయుడివి. మహాజ్ఞానమూర్తులైన వ్యాసమహర్షి మొదలైన వారు సదా నిన్ను తమ హృదయాలలో ధ్యానిస్తారు. అట్లాంటి నీకు నమస్కారం.

విశేషం: భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇట్లా చెప్పాడు:

'చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోఽర్జున,
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ!"

'అర్జునా! నన్ను నాలుగు విధాలైన పుణ్యాత్ములు ఆరాధిస్తారు. ఆర్తులు జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులు - అని నా భక్తులు నాలుగు రీతులుగా ఉన్నారు' అని తాత్పర్యం.

ఆర్తితో తమ కష్టాన్ని తొలగించుమని కోరేవారు (ద్రౌపది, గజేంద్రుడు మొదలైనవారు), మహాతత్త్వాన్ని తెలిసికొనాలన్న తపనతో - జిజ్ఞాసువులుగా - నా వద్దకు వచ్చేవారు, (ప్రహ్లాదుడు మొదలైన వారు), ధనమో, మరో ప్రయోజనమో కోరుకొని వచ్చేవారు (కుచేలుడు ఇట్లా వచ్చినవాడే) - ఉండగా, నాకు ప్రీతిపాత్రులు, మిక్కిలి శ్రేష్ఠులు జ్ఞానులు మాత్రమే (శుక, వ్యాస, పరాశరాదులు - నారదాదులు - మహాజ్ఞానులు - వీరే జీవన్ముక్తులు) అని శ్రీకృష్ణుడు చెప్పుతున్నాడు.

వ్యాసాదులు అట్లాంటి బ్రహ్మజ్ఞాన సంపన్నులు. ఇంతవరకు భారతకథలో అంతా లోకవ్యవహారమే. అర్థకామాల లంపటంలో ఒకరిపై మరొకరు జరిపిన యుద్ధమే అంతటా కనిపించేది.

యుద్ధమైపోయింది. ధర్మరాజులో నిర్వేదం మొదలయింది. ఈ నిర్వేదమే భగవద్గీతలోని అర్జున విషాదం. దాని ఫలితమే 'జ్ఞాన బోధ'. దానినే తిక్కన గారు 'సారబోధ' అని ఇక్కడ పిలుస్తున్నారు.

స్త్రీ పర్వంతో యుద్ధషట్కం పూర్తి అవుతుంది. ఇక తక్కినవి శాంతి సప్తకాలు. శాంత్యాది పర్వాలలో ధర్మరాజు ఈషణత్రయ విముక్తుడై మోక్షార్హుడు కావడానికి సంబంధించిన కథ ఉన్నది. ఈ మోక్షార్హత 'సారబోధ' ఉన్నవాడికే ఉంటుంది. అందుకే హరిహరనాథ స్తుతిలో వ్యాసాదుల ప్రసక్తి వచ్చింది. అన్ని పర్వాలలోను తరువాత జ్ఞాన వివేచన ప్రధానం కావటం గమనించవచ్చును.

క. దేవా! జనమేజయ జగ। తీవరుఁడు కుతూహలము మదిన్ మొలతేరం
గా వైశంపాయన వద। నావేశిత దృగ్విలాసుఁ డై యి ట్లనియెన్. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా! (విను); జనమేజయ; జగతీవరుడు= జనమేజయ మహారాజు; మదిన్= మనసులో; కుతూహలము మొలతేరన్= కుతూహలం మొలకెత్తగా; వైశంపాయన= వైశంపాయన మహర్షియొక్క; వదన+ఆవేశిత= ముఖంలో చేర్చిన; దృక్+విలాసుఁడై= చూపుల విలాసం కలవాడై; ఇట్లు+అనియెన్= ఇట్లా అడిగాడు.

తాత్పర్యం: స్వామీ! హరిహరనాథా! తరువాతి కథ వినుము. జనమేజయ మహారాజు ఇంతవరకు విన్న సౌప్తిక పర్వ కథాసారాన్ని తలచి తరువాత ఏమి జరిగిందో అన్న కుతూహలంతో వైశంపాయనుడి ముఖంలోకి చూస్తూ ఇట్లా అడిగాడు.

వ. తన సుతుండును సైన్యంబును బాండుసుతులచేత నట్లగుట సంజయువలన విని 'ధృతరాష్ట్రుం డెబ్బంగి వర్తించె నశ్వత్థామ కృప కృతవర్మ లా రాత్రి తమ చేసిన పరాక్రమంబు తెఱంగు దుర్యోధనున కెఱింగించి పోయిరని వింటిఁ బదంపడి కరినగరంబు దెస కరిగి మగిడి రనియు నాకర్ణించితి వార లట యెవ్వలనికిం జని రేల మగిడి రశ్వత్థామ కృష్ణద్వైపాయనాశ్రమంబునకుం బోవం దక్కిన యిరువురు నెక్కడ వోయి రవ్విధంబున విజయంబు నొందిన ధర్మనందనుం డేమి యాచరించె నంతయుం బరిపాటిం దేటపడం జెప్పు' మనిన నమ్ముని వరుం డిట్లనియె. 3

ప్రతిపదార్థం: తన సుతుండును= తన కుమారుడైన దుర్యోధనుడూ; సైన్యంబును= అతని సైన్యమూ; పాండు సుతులచేతన్+అట్లగుట= పాండవులచేత ఆ విధంగా నాశనం కావటం; సంజయుని వలన విని= సంజయుడు చెప్పగా విని; ధృతరాష్ట్రుండు+ఏ+భంగిన్+వర్తించెన్?= ధృతరాష్ట్రుడు ఏం చేశాడు?; అశ్వత్థామ, కృప, కృతవర్మలు; ఆ రాత్రి= ఆ రాత్రి సమయంలో; తమచేసిన పరాక్రమంబు తెఱంగు= తాము చూపిన పరాక్రమాన్ని గురించి; దుర్యోధనునకున్+ఎఱింగించి= దుర్యోధనునికి చెప్పి; పోయిరని వింటిన్= పోయారని మీరు చెప్పగా విన్నాను; పదంపడి= ఆ తరువాత; కరినగరంబు దెసకున్= హస్తినాపురంవైపు; అరిగి= వెళ్ళి; మగిడిరనియున్= తిరిగి వచ్చారని కూడా; ఆకర్ణించితిన్= విన్నాను; వారలు+అట= ఆ అశ్వత్థామాదులు అక్కడ; ఏ+వలనికిన్+చనిరి?= ఏ దిక్కుగా వెళ్ళారు?; ఏల మగిడిరి?= ఎందుకు తిరిగి వచ్చారు?; అశ్వత్థామ; కృష్ణద్వైపాయనాశ్రమంబునకున్+పోవన్= వ్యాసుడి ఆశ్రమానికి వెళ్ళగా; తక్కిన ఇరువురు= కృపుడు, కృతవర్మ; ఎక్కడ+పోయిరి?= ఎక్కడికి వెళ్ళారు?; ఆ+విధంబునన్= ఆ విధంగా; విజయంబున్+ఒందిన= విజయం పొందిన; ధర్మనందనుండు= ధర్మరాజు; ఏమి+ఆచరించెన్= ఏం చేశాడు? అంతయున్= ఈ విషయాలన్నిటినీ; పరిపాటిన్= క్రమంగా; తేటపడన్= వివరంగా; చెప్పుమనినన్= చెప్పండి అని కోరగా; ఆ మునివరుండు= వైశంపాయనుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: 'తన కుమారుడు అతడి సైన్యం పాండవులచేత సంపూర్ణంగా నాశనమవటాన్ని గురించి సంజయుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు ఎట్లా భరించాడు? ఏమి చేశాడు? అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ ఆ రాత్రి తాము చేసిన ఉపపాండవ సంహారాది విషయాలను దుర్యోధనుడికి చెప్పారని మీరు చెప్పగా విన్నాను. వాళ్ళు ముగ్గురూ హస్తినానగరంవైపు వెళ్ళి తిరిగి వచ్చారని కూడా విన్నాను. వారు హస్తినలో ఎక్కడికి వెళ్ళి వచ్చారు? ఎందుకు తిరిగి వచ్చారు? మరి అశ్వత్థామ వ్యాసుడి ఆశ్రమానికి వెళ్ళిపోగా కృప, కృతవర్మలు ఎక్కడికి వెళ్ళారు? అంతటి మహావిజయాన్ని పొందిన ధర్మరాజు ఏమి చేశాడు? ఈ విషయాలన్నీ వింటూ ఉంటే చాలా కుతూహలం కలుగుతున్నది.

ఆ తరువాత ఏ మేమి జరిగిందో అన్నీ వివరంగా చెప్పండి' అని జనమేజయుడు కోరగా వైశంపాయన మహర్షి ఇట్లా చెప్పటం మొదలుపెట్టాడు.

తరలము

ధరణినాయక! యట్లు పుత్త్రశతంబు వైరికులంబుచే
నిరవశేషత నొందుటన్ మహనీయ గౌరవహీనతం
బొరసి కొమ్మలు దున్మ మ్రోడ్పడు భూరుహంబును బోలె ని
ర్భర విపద్వికలాత్ముఁడై ధృతరాష్ట్రుఁ డుల్లము వమ్ముగన్. 4

ప్రతిపదార్థం: ధరణినాయక!= ఓ జనమేజయ మహారాజా!; అట్లు= ఆ విధంగా; పుత్రశతంబు= తన నూరుగురు కొడుకులు; వైరికులంబుచేన్= శత్రువులైన పాండు కుమారులచేత; నిరవశేషతన్+ఒందుటన్= నిశ్శేషం కావటం - అందరూ చనిపోవటం (వలన); మహనీయ= గొప్పదైన; గౌరవహీనతన్= గౌరవం నశించగా; ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; పొరసి= పొంది (అతిక్రూరంగా); కొమ్మలు+తున్మన్= కొమ్మలు తునిమివేయగా; మ్రోడు+పడు= మోడుగా మారిపోయిన; భూరుహంబునున్+ పోలెన్= చెట్టులాగా; నిర్భర= పరిపూర్ణమైన; విపద్+వికల+ఆత్ముఁడై= ఆపదచేత వికలమైన మనసు కలవాడై; ఉల్లము= హృదయం; వమ్ముగన్= వ్యర్థం కాగా.

తాత్పర్యం: 'ఓ రాజా! వినుము. ఆ విధంగా తన నూరుగురు సంతానమూ ఒక్కరూ మిగలకుండా ఆ పాండవులచేతిలో నశించటం వలన ఆ ధృతరాష్ట్రుడికి ఉన్న గౌరవమంతా ఒక్కపాటున పడిపోయినట్లయి పోయింది. దగ్గరికి చేరి అతిక్రూరంగా కొమ్మలన్నిటిని తునిమివేస్తే పెద్దచెట్టయినా ఎట్లా మోడువారిపోతుందో అట్లా అయిపోయాడాయన పాపం! ఆయనకు భరించరాని దుఃఖం కలిగింది. అది ఎవరూ ఆర్చలేని ఆపద. మనసంతా కకావికలైపోయింది. హృదయం శూన్యమైపోయింది.

విశేషం: అలం: ఉపమ. ఇక్కడి నుండి తిక్కనగారు స్త్రీ పర్వంలో అంతటా చాలా విశేష వృత్తాలను వాడారు. క్రీ.శ. 13వ శతాబ్దంలో భారతాన్ని రాగాత్మకంగా పాడగా శ్రోతలు విని ఆనందించేవారు. ఆధునిక కాలంలోనే కావ్యాలు మౌనంగా చదవటం అలవాటయింది. ఈ వృత్తాలన్నీ వివిధ రీతుల గతులను కలిగినవి. ముఖ్యంగా అన్నిటిలోనూ ఒక గానయోగ్యతాలక్షణం కనిపిస్తుంది. తరువాతి కథలో యుద్ధభూమిలో కౌరవ వనితలు రకరకాలుగా తమ వారిని గురించి రోదిస్తారు. ఒక్కొక్క వ్యక్తిది ఒక్కొక్క అనురాగం. దానికి తగిన రాగం, తానం, లయ, రోదనలోనూ కనిపిస్తుంది. అంతే కాకుండా ఈ స్త్రీ పర్వాన్ని ఒకే ఛందస్సులో వ్రాసి ఉంటే చదివి భరించటమూ కష్టమే. తిక్కన శోక వర్ణన చేస్తున్న ఆయా సందర్భాలలో జ్ఞాన మీమాంస సదసత్కర్మల విచారణ చేయటం ద్వారా కరుణ రసం శాంతానికి అంగభూతంగా ఉండేటట్లు చేశాడు. అందుకే భిన్న చ్ఛందోరూపాలను గ్రహించాడని పెద్దలు చెప్పుతారు.

ఈ పద్యంలో 'తున్మ' - అనే క్రియ ఉంది. తునుమటమంటే మొగ్గను త్రుంచటం' వంటిది. అజేయ పరాక్రమం కల దుర్యోధనాదులను శ్రీకృష్ణుడి సహాయంతో పాండవులు అవలీలగా గెలవగలిగారు. 'తునుము' అనే క్రియ ఆ లక్షణాన్ని సూచిస్తుంది.

ధృతరాష్ట్రుడిని మోడువారిన చెట్టుతో పోల్చటంలో కూడా ఒక సార్థకత ఉన్నది. ధృతరాష్ట్రుడు కాండం, కొడుకులు, బంధువులు కొమ్మలు రెమ్మలు. అవన్నీ తెగిపోగా మిగిలిన 'మోడు' వలె మహారాజు ఉన్నాడు. ఒక నిర్జీవ ప్రతిమ, జీవచ్ఛవంవలె ఉన్నాడని అర్థం. అందుకే హృదయం శూన్యమైందని చెప్పటం కూడా.

విశేషం: తరలమునకు ప్రతిపాదంలోనూ న, భ, ర, స, జ, జ, గ అనే గణాలుంటాయి. 1-12 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

వ. చింతా భరంబున నూరక యున్నం జూచి సంజయుం డతని కిట్లనియె. 5

ప్రతిపదార్థం: చింతాభరంబునన్= చింతాభారంచేత; ఊరక+ఉన్నన్= మాటా పలుకూ ఏమీలేకుండా ఉండగా; చూచి; సంజయుండు+అతనికిన్+ఇట్లు+అనియెన్= సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: చింతతో గుండె బరువైపోయింది. ధృతరాష్ట్రుడు మాటా పలుకూ లేకుండా అట్లాగే ఉండిపోయాడు. అపుడు సంజయుడు ఆయనతో ఇట్లా అన్నాడు.

ఆ. 'నీకు నితరులట్లు శోకింపఁదగునె? యె। వ్వరిఁ దలంచి యింక వనరువాఁడ
వీవు? శోకమునకు నెయ్యది తుది? యిది। వలవ దుడుగు వినుము వసుమతీశ! 6

ప్రతిపదార్థం: వసుమతీశ!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; నీకు= నీలాంటి జ్ఞానికి; ఇతరులు+అట్ల= పామర జనులవలె; శోకింపన్+తగునె?= దుఃఖపడటం తగిన పనేనా!; ఎవ్వరిన్+తలంచి= (అందరూ పోయాక) ఎవరిని తలచుకొని; ఇంకన్= ఇంక; ఈవు= నీవు; వనరువాడవు= దుఃఖిస్తావు!; శోకమునకున్= బాధకు; తుది+ఏ+అది?= అంతమెక్కడ?; ఇది= ఇట్లా శోకించటం; వలవదు= తగదు; ఉడుగు= దుఃఖం వదలిపెట్టు; వినుము= నేను చెప్పబోయే మాటలు వినుము.

తాత్పర్యం: 'ఓ రాజా! నీవు జ్ఞానవంతుడివి. అయినా పామరుడివలె దుఃఖిస్తున్నావు. ఇది తగిన పనేనా? అందరూ పోయారు. ఇక నీవు ఎవరిని గురించి బాధపడతావు? అసలు నీ బాధకు అంతముంటుందా! ఇట్లా శోకించటం తగనపని. దుఃఖాన్ని వదలిపెట్టుము. నేను చెప్పేది వినుము.

విశేషం: ఇక్కడ ధృతరాష్ట్రుడి స్థాయి యుద్ధానికి ముందు అర్జునుడి విషాదస్థాయివలె ఉన్నది. అక్కడ చనిపోతారే అని అర్జునుడు బాధపడ్డాడు. ఇక్కడ చనిపోయారే అని ధృతరాష్ట్రుడు బాధపడుతున్నాడు. అందుకే గీతోపదేశం ఈ ఇరుతెగల మనుష్యులకూ జరిగింది. కృష్ణుడు చెపుతాడు.

'గతాసూ నగతాసూంశ్చ
నానుశోచన్తి పణ్డితాః'

(చనిపోయినవారి గురించి కాని, చనిపోనివారి గురించి కాని పండితులు శోకించరు.)

అట్లా దుఃఖించటం పామరుల పద్ధతి - అని కూడా శ్రీకృష్ణుడు చెప్పాడు. అందుకే నీవు జ్ఞానివి కనుక దుఃఖించవద్దంటూ

'న త్వం శోచితు మర్హసి' (నీవు దుఃఖించటానికి తగిన వాడవు కావు) అని కూడా చెప్పాడు.

భగవద్గీతను సొంతం విన్న సంజయుడు ఈ మాటను అనటంలో ఎంతో సామంజస్యం ఉన్నది. ఇతరులు- అనే మాటకు ఇంత అర్థాన్ని భావించవచ్చును.

వ. పదునెనిమిది యక్షౌహిణులు సమసెఁ బితామహ పితృభ్రాతృ పుత్ర పౌత్ర సఖి సుహృత్సహాయులుందెగి రందు వగపునకుం బనిగాని వారలు గలరే? యేది కొలందిగా వగచె దందఱకు నగ్నికార్యంబు నిర్వర్తింపను దగిన వారలకుం దిలోదక ప్రదానంబులు సేయను వలయుఁ బొలిగలనికి వేంచేయు' మనుటయు. 7

ప్రతిపదార్థం: పదునెనిమిది+అక్షౌహిణులు= పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యమూ; సమసెన్= నశించింది; పితామహ= తాతలు; పితృ= తండ్రులు; భ్రాతృ= అన్నదమ్ములు; పుత్ర= కొడుకులు; పౌత్ర= మనుమలు; సఖి= సన్నిహితులు; సుహృద్= స్నేహితులు; సహాయులున్= సదా తోడుగా ఉన్నవారు; తెగిరి= చనిపోయారు; అందున్= వారిలో; వగపునకున్+పని+కానివారలు= దుఃఖించటానికి తగనివాళ్ళు; కలరే?= ఉన్నారా?; ఏది+కొలందిగాన్= దేనికోసమని; వగచెదు?= దుఃఖిస్తావు?; అందఱకున్= అందరికీ; అగ్నికార్యంబు= దహన సంస్కారం; నిర్వర్తింపను (వలయున్)= చేయాలి; తగినవారలకున్= సన్నిహిత బంధువర్గానికి; తిలోదక ప్రదానంబులు+చేయను వలయున్= తిలలు, నీళ్ళు వదలిపెట్టాలి (తర్పణం చేయాలి); పొలి+కలనికిన్= యుద్ధభూమికి; వేంచేయుము+అనుటయున్= బయలుదేరండి అని చెప్పగా.

తాత్పర్యం: పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యమంతా నశించింది. తాతలు, తండ్రులు, కొడుకులు, అన్నదమ్ములు, మనుమలు, సన్నిహితులు, స్నేహితులు, సదా తోడుగా పనిచేసినవారు - అందరూ చచ్చిపోయారు. వీరిలో దుఃఖించటానికి తగనివారెవరు! అందరినీ గురించి శోకించవచ్చును. ఇక దేనికొరకు ఏడుస్తావు! రాజా! ఇక ఏడుస్తూ కూర్చొనవద్దు. యుద్ధంలో చనిపోయిన వారందరికీ దహన సంస్కారం చేయాలి. సన్నిహిత బంధువర్గానికి తిలోదక ప్రదానం చేయాలి. కాబట్టి దయచేసి సకుటుంబంగా యుద్ధభూమికి బయలుదేరండి' అని సంజయుడు చెప్పగా.

విశేషం: చనిపోయిన వారిని ప్రేతలంటారు. ప్రేతకు తొలుత దహన సంస్కారాదికం కావాలి. అది బంధువులు చేయవచ్చును. ఇతరులు కూడా చేయవచ్చును. కాని, తిలోదక ప్రదానం సన్నిహిత బంధువులు మాత్రమే చేస్తారు. దేహ ఋణవిముక్తి ఈ తిలోదక ప్రదానానికి అర్థమని సంప్రదాయజ్ఞులు చెప్తుతారు.

ప్రేతకు తిలోదక, వాసోదక(వాసస్+ఉదక), పిండోదకాలు మూడూ వరుసగా నీరు, వస్త్రం, అన్నం అవుతాయని హైందవ సంప్రదాయం చెపుతున్నది. ఈ తిలోదక ప్రదానాన్ని ధర్మోదక ప్రదాన మని కూడా హైందవు లంటారు.

క. విపులార్తిఁ గూరి మనుజా । ధిప! యా భూవల్లభుండు ధృతిలేమిం జం
డపవన పతితంబగు పా । దపంబు చందంబు దోఁప ధరణిం బడియెన్. 8

ప్రతిపదార్థం: మనుజ+అధిప!= ఓ జనమేజయ మహారాజా! (వినుము); ఆ భూవల్లభుండు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; విపుల+ఆర్తిన్+కూరి= మిక్కిలి బాధలో కూరుకుపోయి; ధృతిలేమిన్= ధైర్యం కోల్పోయి; చండ= భయంకరమైన; పవన= గాలిచేత; పతితంబు+అగు= పడిపోయిన; పాదపంబు చందంబు+తోఁపన్= చెట్టులాగా; ధరణిన్+పడియెన్= నేలమీద పడ్డాడు.

తాత్పర్యం: ఓ జనమేజయా! వినుము. ఆ ధృతరాష్ట్రమహారాజు ఆ విధంగా పెద్దశోక సముద్రంలో మునిగిపోయాడు. ధైర్యం కోల్పోయాడు. భయంకరమైన గాలి తాకిడికి పడిపోయిన చెట్టువలె నేలమీద కూలిపోయాడు.

వ. పడియుండి తల దోర్చికొనుచు నిట్లనియె. 9

ప్రతిపదార్థం: పడి+ఉండి= అట్లా కొంత సేపు నేలమీద పడిఉండి; తలన్+దోర్చికొనుచున్= తల ఇటూ అటూ మోదుకొంటూ; ఇట్లనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అట్లా కొంతసేపు పడి ఉండి, పైకి లేచి, తల బాదుకుంటూ ఇలా అన్నాడు.

వసంత తిలకము

'హా! పుత్రవర్గ మిటులాఅడిఁ బోవ దీప్త। వ్యాపారమేది మది వందుచు దీన వృత్తిం
బ్రాపించి యన్యులు కృపం బరికింప నిం కే। నోపన్ భవం బెడలి యుండఁగ జీవితోడన్. 10

ప్రతిపదార్థం: హా!= అయ్యో!; పుత్రవర్గము= కుమార సమూహం; ఇటులు= ఈవిధంగా; ఆఱడిన్+పోవన్= అతిదీనంగా చనిపోగా; దీప్త వ్యాపారము= వైభవంతోడి ఉనికిని; ఏది= పోగొట్టుకొని; మదిన్= మనసులో; వందుచున్= కుంగిపోతూ; దీనవృత్తిన్= దైన్యంగా బ్రతకటాన్ని; ప్రాపించి= పొంది; భవంబు= ప్రాధాన్యం; ఎడలి= పోగొట్టుకొని; అన్యులు= ఇతరులు; కృపన్+పరికింపన్= దయతో నన్ను చూస్తుండగా; ఇంకన్= నేను; జీవితోడన్= కేవలం ప్రాణం నిలుపుకొన్న దేహంతో; ఉండఁగన్+ఓపన్= ఉండజాలను.

తాత్పర్యం: 'అయ్యో! ఎంత దౌర్భాగ్యం వచ్చిపడింది! కొడుకులంతా అతి దీనంగా చనిపోయారు. నా బ్రతుకులోని వైభవమంతా నశించిపోయింది. మనసులో నిరంతరం క్రుంగిపోతున్నాను. అతి దీనమైన బ్రతుకు మాత్రమే మిగిలింది. ఏ ప్రాధాన్యమూ లేని ఈ ప్రాణంతోటి దేహం మాత్రం ఎందుకు? ఇకపైన ఇతరులు నన్ను దయతో జాలితో చూడగా ఇంక నేను ప్రాధాన్యం పోగొట్టుకొని ప్రాణం నిలుపుకొన్న దేహంతో ఉండలేను.

విశేషం: రాష్ట్రమంతా- దైహికమయిన సంపద; ధృత= ధరించిన వాడని అర్థం చెప్పవచ్చు. నిరంతరం ధృతరాష్ట్రుడు తన జీవితాన్ని, తన బాధను, తన కుమారుల జీవితాన్ని, వారి వైభవాన్ని, తన ప్రాముఖ్యాన్ని మాత్రమే చూచుకొంటూ బ్రతికాడని అర్థం. అందుకే ఇతరులు తనమీద కృప చూపటాన్ని కూడా సహించలేకపోయాడు. సాధారణంగా మనుష్యుల బ్రతుకు లింతే.

వసంతతిలకానికి ప్రతిపాదంలోనూ త, భ, జ, జ, గ, గ- అనే గణా లుంటాయి, 1-8 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

క. ఎఱకలు విఱిగిన గరుడుని। తెఱఁగునఁ దేజంబు సెడిన దినకరుగతి నం
దఱు బంధులు దెగి విభవం। బఱి వెలవెలఁబాఱుచునికి యది బ్రదు కగునే! 11

ప్రతిపదార్థం: ఎఱకలు= రెక్కలు; విఱిగిన= తెగిన; గరుడుని= తెఱఁగునన్= గురుత్మంతుడిలాగా; తేజంబు= కాంతి; చెడిన= పోగొట్టుకున్న; దినకరుగతిన్= సూర్యుడిలాగా; అందఱు బంధులున్= బంధువులంతా; తెగి= చనిపోగా; విభవంబు+అఱి= వైభవం పోగొట్టుకొని; వెలవెలన్+పాఱుచున్+ఉనికి= వెలవెలపోతూ ఉండటం; అది బ్రదుకు+అగునే?= అదీ ఒక బ్రతుకేనా?

తాత్పర్యం: 'రెక్కలు తెగిన పక్షివలె, కాంతిని కోల్పోయిన సూర్యుడివలె అయిపోయింది నా బ్రదుకు. నా బంధువులంతా పోయారు. నా వైభవం అంతా పోయింది. నా బ్రతుకు మసకబారి వెలవెలపోతున్నది. ఇట్లా బ్రతకటమూ ఒక బ్రతకటమేనా?

విశేషం: అలం: ఉపమ, మాలోపమ. పురాణాలలో గరుత్మంతుడు మహా పరాక్రమవంతుడు. సూర్యుడు సాక్షాత్తు నారాయణుడుగా చెప్పబడ్డాడు. ఇంద్రుడి వజ్రాయుధానికే కేవలం ఒక ఈకను పోనిమ్మని దానంచేసినవాడు గరుత్మంతుడు. అట్లాంటి అతడి రెక్కలు పోవటం అసంభవం. సూర్యుడికి గ్రహణ సందర్భంలో కాని, మేఘాలు అలముకొన్నప్పుడు కాని కాంతి తగ్గుతుంది. మహారాజుకు గరుడుడు, సూర్యుడు స్మృతిలో మెదలటం వెనుక తన బ్రతుకు, వైభవం ఎంత గొప్పవో చెప్పుకొనటమే చాలా ప్రధానాంశం. ఇట్లా భావించటమే మనషిలోని లోభం. పక్షికి రెక్కలు ఎటువంటివో, ధృతరాష్ట్రుడికి బంధువులు అటువంటి వారు. సూర్యుడికి తేజస్సు వంటిది ధృతరాష్ట్రుడికి విభవం అటువంటిది- అని గ్రాహ్యం.

సీ. **సంధికిఁ గృష్ణుండు సనుదెంచి పెక్కుభం । గులఁ జెప్ప భీష్ముండు గుంభజుండు**
నట్లు హితార్థులై యంతలంతలు మాట । లాడిరి జామదగ్న్యాదులైన
మునివరు లవ్విధంబున నొత్తి చెప్పి రా । బుద్ధులన్నియును దుర్బుద్ధి నగుటఁ
బాటింపనైతి లోభమునఁ బాండు నృపాలు । పాలు తత్సుతులకుఁ బంచి యీని

తే. **నా కతంబునఁ బొలిసిరి నందనులును । జెలులుఁ జుట్టంబులును సహాయులును ధైర్య**
మెట్లు కలుగు వైదికముల కెట్లు మనసు । గొలుపుఁ బ్రాణంబుతో నెట్లు నిలువ వచ్చు? 12

ప్రతిపదార్థం: సంధికిన్= రాయబారంకోసం; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; చనుదెంచి= వచ్చి; పెక్కు భంగులన్+చెప్పన్= ఎన్నో విధాలుగా చెప్పినా; భీష్ముండు= భీష్మాచార్యుడు; కుంభజుండు= ద్రోణాచార్యుడు; అట్లు= ఆ విధంగా; హిత+అర్థులు+ఐ= మేలుకోరినవారై; అంతలు+అంతలు= ఎన్నోహితోక్తులను (పెద్దమాటలను); మాటలు+ఆడిరి= చెప్పారు; జామదగ్న్య+ఆదులు+ ఐన= పరశురాముడు మొదలైన; మునివరులున్= ఋషిశ్రేష్ఠులు కూడా; ఆ+విధంబునన్= అదే విధంగా; ఒత్తి+చెప్పిరి= నొక్కి నొక్కి చెప్పారు (ప్రబోధించారు); ఆ బుద్ధులు+అన్నియును= ఆ ఉపదేశాలన్నిటినీ; దుర్బుద్ధిన్+అగుటన్= దుష్టబుద్ధి కలవాడిని కావటంవల్ల; పాటింపన్+ఐతిన్= పాటించలేదు; లోభమునన్= నా లోభగుణంవల్ల; పాండునృపాలు పాలు= పాండురాజుయొక్క వంతు; తద్+సుతులకున్= పాండురాజు కుమారులకు; పంచి ఈని= భాగం ఇవ్వని; నా కతంబునన్= నావల్లనే; నందనులున్= నా కొడుకులు; చెలులున్= స్నేహితులు; చుట్టంబులును= బంధువులు; సహాయులును= సహచరులు; పొలిసిరి= మరణించారు; ధైర్యము+ఎట్లు కలుగున్= ఇక ధైర్యం ఎలా ఉంటుంది; వైదికములకున్= వైదిక కర్మలవైపు; మనసు= మనసు; ఎట్లు+కొలుపున్?= ఎలా కుదురుతుంది?; ప్రాణంబుతోన్= ప్రాణంతో; ఎట్లు నిలువవచ్చున్?= ఎట్లా బ్రతకటం?.

తాత్పర్యం: ఆనాడు రాయబారం కొరకు శ్రీకృష్ణుడు వచ్చి ఎన్నో విధాలుగా యుద్ధం నాశకరమని చెప్పాడు. భీష్మద్రోణులూ ఇట్లాగే చెప్పారు. పరశురాముడూ మునులూ ఎన్నో హితోక్తులు చెప్పారు. కాని, లోభగుణంచేత, పుత్రులమీది మమకారంచేత ఏ మాటలూ విన్నవాడిని కాను. పాండుకుమారులకు రాజ్యభాగం ఇవ్వక పోతిని. నా కారణం వలననే నా కొడుకులు, చుట్టాలు, స్నేహితులు, సహచరులు అందరూ చనిపోయారు. ఇక నాకు ధైర్యం ఎట్లా ఉంటుంది? వైదిక కర్మకాండవైపు మనసు ఎట్లా పోతుంది? అసలు ప్రాణంతో బ్రతకటం ఎట్లా?

క. **నా కీడు దలఁప నేరక । శ్రీకి నెడపి పాడి యింత సేయక పుత్రా**
నీక సుహృద్బాంధవులం । బోకార్చితి బ్రదుకు టింకఁ బొసఁగునె చెపుమా! 13

ప్రతిపదార్థం: నాకీడు= నాకు రాబోయే దుర్గతిని; తలఁపనేరక= ఆలోచించకుండా; శ్రీకిన్= సంపదకు; ఎడపి= (పాండవులను) దూరంచేసి; పాడి= న్యాయం; ఇంత+చేయక= కొద్దిగా కూడా నడిపించకుండా; పుత్ర+అనీక= పుత్ర సమూహాన్నీ; సుహృద్=

స్నేహితుల్నీ; బాంధవులన్= బంధువులనూ; పోకార్చితిన్= చంపుకొన్నాను; బ్రతుకుట= బ్రతకటం; ఇంకన్= ఇంక; పొసఁగునె?= కుదురుతుందా?; చెపుమా!= (సంజయా!) చెప్పుము.

తాత్పర్యం: సంజయా! నాకు రాబోయే దుర్గతిని గురించి ఆలోచించకుండా పాండవులను సంపదకు దూరంచేశాను. న్యాయం ఏ మాత్రం నడిపించకుండా ఇట్లా చేయటం వలననే నా కొడుకులను, బంధువులను, స్నేహితులను పొట్టన పెట్టుకొన్నాను. ఇక నేను బ్రతకటం సమంజసం కాదు.

వ. దైవంబు దుఃఖ భాజనత్వం బొనర్చుటం బూర్వజన్మాచరితంబైన సుకృతంబు లేమి గాననయ్యెడు వయః పరిణామంబునఁ బంచభూత క్షయంబును దుర్వినయ పరిపాకంబున సకల బంధునాశంబును సమయ ప్రాప్తంబులయ్యెనింక బ్రహ్మపదప్రాప్తియ తగు నదియై యున్నది యది యాచరించుట సంశితవ్రత పరాయణులైన పాండు సుతులు చూతురు గాక యనిన విని యజ్జనపతి శోకంబు శాంతంబు సేయుటకు సంజయుం డిట్లనియె. 14

ప్రతిపదార్థం: దైవంబు= దైవం; దుఃఖభాజనత్వంబు= నా బ్రతుకును ఇలా దుఃఖంపాలుగా; ఒనర్చుటన్= చేయటం గమనిస్తే; పూర్వజన్మ ఆచరితంబు+ఐన= ముందుజన్మలో చేసుకొన్న; సుకృతంబులేమి= పుణ్యంలేకపోవటం; కానన్+అయ్యెడున్= స్పష్టంగా తెలుస్తోంది; వయః+పరిణామంబునన్= ప్రాయం మార్పుచేత; పంచభూతక్షయంబునున్= పంచభూతాల నాశనమున్నూ; దుర్వినయపరిపాకంబునన్= ఆయా వీరుల దుష్ట ప్రవృత్తి ఫలితంగా; సకల బంధునాశంబును= బంధువులందరూ ఇట్లా చనిపోవటం; సమయప్రాప్తంబులు+అయ్యెన్= కాలానికి తగినట్టు సంభవించాయి; ఇంకన్+అ= ఇక; బ్రహ్మపద ప్రాప్తిఅ= ఇట్లా మరణించినవారికి శాశ్వత బ్రహ్మలోక సిద్ధిమాత్రమే; తగునదియై యున్నది= తగిందిగా ఉంది (మిగిలింది); అది+ఆచరించుట= దానికి తగిన క్రియా కలాపాలు చేయటం; సంశిత వ్రత పరాయణులైన= పట్టిన ప్రతిజ్ఞను తీర్చుకోవటంలో దక్షులైన; పాండుసుతులు= పాండు కుమారులు; చూతురుగాక= చూసుకొంటారులే; అనినన్= అని ధృతరాష్ట్రుడు చెప్పగా; విని= సంజయుడు విని; ఆ జనపతి= ఆ మహారాజు; శోకంబు= దుఃఖాన్ని; శాంతంబు+చేయుటకున్= ఉపశమింపచేయటానికి; సంజయుడు; ఇట్లనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: నా బ్రతుకు ఇట్లా శోకమయం కావటం చూస్తే నేను పూర్వజన్మలో ఏ పుణ్యమూ చేసిన వాడివలె కనిపించటం లేదు. కాలపరిణామం ఎవరికీ తప్పించటానికి వీలులేదు. పంచభూతాలు నశిస్తుండగా ఆయా వీరులలో పుట్టిన దుష్టప్రవృత్తుల ఫలితంగానే బంధువులంతా ఇట్లా తలా ఒకరీతిలో చనిపోయారు. ఇక వీరికి సుగతి ప్రాప్తి మాత్రమే మిగిలిన పని. దానికి తగిన ఉత్తర క్రియలు చేయటానికి పాండుకుమారు లున్నారు. వారు పట్టిన ప్రతిజ్ఞను నేరవేర్చటంలో నిష్ణాతులు. వారు చేయలేని దేమున్నది!' అని ధృతరాష్ట్రుడు అంటే ఆయన శోకాన్ని ఉపశమింపచేయటంకొరకు సంజయుడు ఇట్లా అన్నాడు.

విశేషం: భారతీయులు పూర్వజన్మ సుకృతాన్నిబట్టి ఉత్తరజన్మలో ఐశ్వర్యాదులు ఉంటాయని భావిస్తారు. అందుకే ధృతరాష్ట్రుడు తాను పూర్వజన్మలో పుణ్యకార్యాలు చేసిన వాడిని కానని బాధపడుతున్నాడు.

జీవితానికి అతి గంభీరమైన వ్యాఖ్యానం చెప్పాడు వ్యాసమహర్షి. మనిషి చేసే ప్రతి పనికి 'కాల' ప్రభావం కారణం అనటం ఆ వ్యాఖ్యాన తాత్పర్యం. కాలాన్నిబట్టి ప్రకృతి (పంచభూతాలు, వాటి తన్మాత్రలు), వాటినిబట్టి మనిషి ప్రవృత్తి,

ఉంటాయని ధర్మరాజాదులు అట్లా ప్రవర్తించి విజయాన్ని పొందటానికీ, దుర్యోధనాదులు అట్లా ప్రవర్తించి దుర్మరణం పాలు కావటానికీ 'సమయప్రాప్తి' (కాలశక్తి) కారణమని వ్యాసుడి నిర్ణయం.

మరణించిన వారికి 'బ్రహ్మలోక' సిద్ధి కలగాలని భారతీయులు వాంఛిస్తారు. అందుకు ఏర్పడిందే వైదిక క్రియ. బ్రహ్మ పదార్థం నుంచీ పుట్టిన జీవుడు మళ్ళీ బ్రహ్మలోకి చేరిపోవటమే బ్రహ్మపదప్రాప్తి. అందుకే అందరికీ మరణానంతరం చేయగల క్రియాకలాపం 'ఉత్తరక్రియ' అని అర్థం.

సంశిత వ్రతం - అంటే పట్టిన ప్రతిజ్ఞను నెరవేర్చటం. ద్రౌపదీ వస్త్రాపహరణ సందర్భంలో భీమాదులు ఏ ప్రతిజ్ఞలు చేశారో, వాటిని నెరవేర్చుకొనటమే సంశితవ్రత దీక్ష - అంటే దృఢవ్రత దీక్ష అని భావం.

క. 'శ్రుతులును శాస్త్రములు బహూ । శ్రుతులవలన వింటి శాంతి చొప్పడ వలదే?
మృతికి నృపులడలుదురె? ధీ । యుతు లీ విధమునకు రోయకుండుదురె? నృపా! 15

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; శ్రుతులును= వేదాలును; శాస్త్రములున్= శాస్త్రాలును; బహుశ్రుతులవలనన్= గొప్ప పండితుల ద్వారా; వింటి(వి)= విన్నావు; శాంతి చొప్పడవలదే?= శాంతి నీకు కలుగవలదా?; నృపులు= రాజులు; మృతికిన్= చావుకు; అడలుదురె?= శోకిస్తారా?; ధీయుతులు= జ్ఞానులు (పండితులు); ఈ విధమునకున్= ఇట్లా దుఃఖించటాన్ని; రోయక+ ఉండుదురె?= అసహ్యపడకుండా ఉంటారా?

తాత్పర్యం: 'రాజా! ఎందు కిట్లా దుఃఖిస్తావు!' ఎంతోమంది పెద్ద పెద్ద పండితుల వద్ద వేద శాస్త్రాలను విన్నావు కదా! నీవు శాంతి కలుగవలదా! రాజులు మృతికి భయపడటమా! పండితులు దీన్ని ఏవగించుకోరా! కనుక దుఃఖించవద్దు.

తొ. తొల్లి సృంజయుండు పుత్రశోకార్తుండైన నమరమునిసత్తముండగు నారదుం డుపన్యసించిన యితిహాసం బభిమన్యు మరణ శోక సంతప్తుండైన ధర్మతనయునకుం బరాశర తనయుండు సెప్పిన చొప్పునన యేనును జెప్ప నాకర్ణించితి గాదె! సుహృజ్జనంబు లుపదేశించిన మాటలు విననైతి నని నీవ చెప్పె దుమ్మలింపం బనియేమి? నీకును నీ కొడుకునకు మంత్రులు దుశ్శాసనుండును గర్ణుండును శకునియునటె యేమి సెప్పం గల దవధరింపుము. 16

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; సృంజయుండు= సృంజయుడు; పుత్రశోక+ఆర్తుండు+ఐనన్= పుత్రశోకంతో బాధపడుతుండగా; అమరముని సత్తముండగు= స్వర్గలోక ఋషులలో శ్రేష్ఠుడైన; నారదుండు= నారదమహర్షి; ఉపన్యసించిన= చెప్పిన; ఇతిహాసంబు= కథను; అభిమన్యు మరణశోక= అభిమన్యుని మృతిచేత పుట్టిన దుఃఖంతో; సంతప్తుండైన= కాలిపోతూ ఉండిన (బాధపడుతూ ఉండిన); ధర్మతనయునకున్= ధర్మరాజుకు; పరాశర తనయుండు= వ్యాసుడు; చెప్పిన చొప్పునన్+అ= చెప్పిన రీతిగానే; ఏనునున్+చెప్పన్= నేనూ నీకు చెప్పగా; ఆకర్ణించితి(వి)+కాదె!= విన్నావు కదా!; సుహృద్+జనంబులు= మిత్రులు; ఉపదేశించిన మాటలు= చెప్పిన ఉపదేశోక్తులను; వినన్+ఐతిన్+అని= వినకపోతినని; నీవ చెప్పెదు= నీవే చెబుతున్నావు; ఉమ్మలింపన్= బాధపడాల్సిన; పనిఏమి?= అవసరమేమున్నది?; నీకును= నీకూ; నీ కొడుకునకున్= కొడుకైన దుర్యోధనునికి; మంత్రులు= మంచి చెడులు బోధించే మంత్రి వర్యులు; దుశ్శాసనుండును, కర్ణుండును, శకునియున్+అటె!= దుశ్శాసనుండును, కర్ణుండును, శకునియున్+అటె!= దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని - వీళ్ళా!; ఏమి చెప్పన్+కలదు= ఇక ఏం చెప్పటానికున్నది!; అవధరింపుము= వినుము.

తాత్పర్యం: పూర్వం సృంజయుడు కుమారుడిని పోగొట్టుకొని బాధపడుతుండగా నారదుడు చెప్పిన ఇతిహాసాన్ని, అభిమన్యుడు పోయి దుఃఖిస్తున్న ధర్మరాజుకు వ్యాసుడు చెప్పగా, ఆ కథను నీకు నేను అట్లే చెప్పాను. విన్నావు కదా! ఇంకా శాంతి కలుగలేదా! మిత్రులు, ఆప్తులు చెప్పిన మంచిమాటలు వినకపోతినని నీవే అంటున్నావు. ఇక బాధ ఎందుకు! అయినా నీకూ, నీ కొడుకుకూ మంత్రులు దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని - వీళ్ళు! ఇక ఏమి చెప్పగలను! అయినా వినుము.

విశేషం: సృంజయు డనేరాజు కుమారుడు సువర్ణష్ఠీవి. నారదుడి అనుగ్రహంతో జన్మించినవాడు. అతని మూత్ర పురీషాలు బంగారంగా మారిపోయే వరంతో అతడు పుట్టాడు. కొందరు దుర్మార్గులు బంగారానికి ఆసపడి ఆ అబ్బాయిని చంపి చీల్చి వేశారు. సృంజయుడు బాధపడుతుండగా నారదుడు వచ్చి షోడశ మహారాజుల వృత్తాంతాలు చెప్పి అతడి దుఃఖం మాన్పి సుష్ఠర్ణష్ఠీవిని బ్రతికించాడు. ఆ కథనే ఇక్కడ గుర్తు చేస్తున్నాడు (చూ. శాంతిపర్వం)

ఆ. కొఱుత నుఱుకుఁ గాని కొడుకెన్నఁడును గార్య । తంత్రమునకుఁ జొరఁడు దాని నీవు
మాన్ప నొల్ల వతని మగఁటిమియును లావు । నచ్చి లోభ మెదఁ బెనంగొనంగ. 17

ప్రతిపదార్థం: కొఱుతన్= శూలంమీద; ఉఱుకున్+కాని= పరిగెత్తడానికి ప్రయత్నిస్తాడు (సాహస కృత్యాలు చేయబూనుతాడని అర్థం) తప్ప; కొడుకు= నీ కుమారుడైన దుర్యోధనుడు; ఎన్నఁడును= ఏనాడూ; కార్యతంత్రమునకున్= కార్యసిద్ధికి అవసరమైన క్రియా కలాపానికి; చొరఁడు= ప్రయత్నించడు; అతని మఁగటిమియును= ఆ సుయోధనుని పరాక్రమం; లావు= బలం (శక్తి); నచ్చి= నమ్మి; లోభము= లోభగుణము; ఎదన్= హృదయంలో; పెనంగొనంగన్= బాగానాటుకుపోగా; దానిన్= అట్లా చేయటాన్ని; నీవు మాన్పన్+ఒల్లవు= నీవు మాన్పవు (నీవు అడ్డు పెట్టలేకపోయావు).

తాత్పర్యం: నీ కొడుకు దుర్యోధనుడు ఎప్పుడూ ఆపదలు కొని తెచ్చుకొనే పనులు చేయటానికే సాహసించాడు తప్ప కార్యసిద్ధికి తగిన రీతులలో సమాలోచన చేశాడా? పనిని సాధించాడా? పోనీ ఆ అవివేకపు పనులను నీవు ఆపగలిగావా? అతడి పరాక్రమాన్ని, శక్తిని నమ్మి నీలో లోభగుణం బాగా మనసులో నాటుకొనిపోగా, దానిని ఆపటానికి ఇష్టపడవైతివి.

విశేషం: కొఱ్ఱు - అంటే శూలంవంటి మారణాయుధం. దానిపైన నడవటానికి ఎవరూ సాహసించరు. దానిపై పరుగెత్తటానికి ఎవరు పూనుకొంటారు! అట్లా చేసినవాడు దుర్యోధనుడు. అందుకే ఆపదలు కొనితెచ్చుకొన్నాడని తాత్పర్యం. దీనికితోడు అవివేకుల మంత్రాంగం. పైగా ధృతరాష్ట్రుడు దుర్యోధనుడి పరాక్రమం నమ్మి లోభగుణం తన మనస్సులో పెనగొనగా వారించలేదు.

క. ఆర్యులు దతితోఁ దగియెడు । కార్యమనుష్ఠింతు రట్టుగా కప్పని మా
త్సర్యమునఁ దిగిచిపట్టి య । నార్యులు దుదిఁ దూర వగతు రాపదయైనన్. 18

ప్రతిపదార్థం: ఆర్యులు= పుణ్యాత్ములు; తతితోన్+తగియెడు= సమయానికి తగిన; కార్యము+అనుష్ఠింతురు= పనిచేస్తారు; అట్టు+కాక= అలా కాకుండా; ఆ+పని= ఆ పనిని; మాత్సర్యమునన్= మత్సర భావంతో (అసూయతో); అనార్యులు= పాపాత్ములు; తిగిచిపట్టి= విఘ్నం కల్పించి-ఆపి; తుదిన్= చివరకు; తూరన్= విఫలంకాగా; ఆపద+ఐనన్= ఆపద వాటిల్లగా; వగతురు= ఏడుస్తారు.

తాత్పర్యం: పుణ్యాత్ములు ఏ సమయానికి ఏం చేయాలో అది చేసి, కార్యసాధనలో సఫలీకృతులవుతారు. పాపాత్ములు ఆ పనిని అసూయాగ్రస్తులై అడ్డుకొని, తమ ప్రయత్నం విఫలం కాగా చివరకి ఏడుస్తారు. నీ కొడుకులు చేసిన పనులు అట్లాంటివే.

విశేషం: ఆర్య - అనార్య శబ్దాలను ఇతిహాసాలలో ధర్మ - అధర్మ; పుణ్య - పాప; శ్రేష్ఠ - అధమ వాచకాలుగా వాడి ఉన్నారు. పాండవులు ధౌమ్యాది పురోహితులచేత, నారదాది మహర్షులచేత ప్రరోచన పొంది కార్యసిద్ధిని పొందారు. దుర్యోధనాదులు దుర్మంత్రంతో అడుగడుగునా వారికి అడ్డుపడ్డారు. విఫలు లయ్యారు. చివరకి శోకం పాలయ్యారు.

ఆ. జున్ను డెప్పరంపు జోటైన చటినున్నఁ । జూచి విఱుగఁబడుటఁ జూడ కాత్మ
దీపుఁ గోరి యుఱుకు తిండికాఁడును బోలె । నయితి; వగచు టింక యనుచితంబు. 19

ప్రతిపదార్థం: జున్ను= తేనెపట్టు; డెప్పరము+చోటు+ఐన= అపాయకరమైన; చటిన్= కొండ చరియలో; ఉన్నన్= ఉండగా; చూచి; (ఆ చరియ); విఱుగన్+పడుటన్= విరిగిపోతూండటం (పడిపోవటం); చూడక= గమనించక; ఆత్మన్= చిత్తంలో; తీపున్+కోరి= తేనెలోని తియ్యదనాన్ని కోరి; ఉఱుకు= పరిగెత్తేటటువంటి; తిండికాఁడునున్+పోలె= తిండిపోతులాగా; అయితి(వి)= నీవు అయ్యావు; ఇంకన్; వగచుట= చింతించటం; అనుచితంబు= ఉచితం కాదు.

తాత్పర్యం: తేనెపట్టు కొండచరియలో శిఖరాన ఉన్నదనుకొమ్ము. దానిలోనుండి తేనె కావాలనుకొన్నవాడు ఆ చరియ గట్టిగా ఉన్నదా? లేదా? మనిషి ఎక్కినపుడు విరిగి పోతుందా? పోదా? అని ఆలోచించి మరీ ఎక్కాలి. కాని, తిండిపోతయినవాడు అదంతా పట్టించుకొనడు. ఎట్లాగైనా సరే ఆ తీపును అందుకుంటే చాలనుకొంటాడు. సరిగ్గా నీ పరిస్థితి అట్లాగే అయిపోయింది. ఇంక ఎందుకు ఏడవటం?

విశేషం: అలం: ఉపమ. జున్ను - అంటే సాధారణంగా పాలజున్ను మాత్రమే గుర్తుకువస్తుంది. తేనెపట్టును కూడా 'జున్ను' అనిపిలుస్తారు. రాజ్యసంపద - ఆ తేనెపట్టు. విరిగిపోతున్న చరియ - రాజధర్మం. అయినా లోభగుణగ్రస్తుడైన ధృతరాష్ట్రుడు దానిని పట్టించుకొనలేదు. ఆ సంపదనే కోరుకొన్నాడు. చివరికి చరియ విరిగిపోయింది - అని తాత్పర్యం. అధికంగా తిండిని కోరటానికి కూడా మనిషిలోని 'లోభ' గుణమే కారణం అని ప్రాచీనులు విశ్వసించారు.

క. వగచినఁ బోయిన కార్యము । మగుడునె? వగవంగ లోకమాన్యుండగునే?
వగ పుణ్యగతికి మూలమె? వగ పెల్లవిధముల నుడుగ వలయు నరేంద్రా! 20

ప్రతిపదార్థం: వగచినన్= దుఃఖిస్తే; పోయిన కార్యము= జరిగిపోయిన పని; మగుడునె?= మరలా తిరిగి వస్తుందా?; వగవంగన్= ఏడుస్తే; లోకమాన్యుండు+అగునే?= లోకంలో గౌరవం పొందుతాడా?; వగ= దుఃఖించటం; పుణ్యగతిన్ మూలమె?= చనిపోయిన వారికి ఉత్తమగతులు కలిగించటానికి కారణమవుతుందా?; నరేంద్రా!= ఓ రాజా!; (అందువల్ల); వగపు= దుఃఖాన్ని; ఎల్లవిధములన్= అన్ని రీతులలోనూ; ఉడుగన్+వలయున్= వదలిపెట్టాలు.

తాత్పర్యం: ఏడిస్తే ఒకసారి జరిగిపోయిన పని మళ్ళీ తిరిగి వస్తుందా? (చనిపోయిన వారు మరలివస్తారా?). ఏడిస్తే లోకం (నిన్ను) గౌరవిస్తుందా? నీవు ఏడవటం వలన చనిపోయినవారికి పుణ్యగతి కలుగుతుందా? అందుచేత బాధపడుతూ కూర్చొనటం ఏవిధంగానూ మంచిదికాదు. రాజా! దుఃఖించటం మానివేయుము.

మత్తకోకిల:

తాన చుట్టుఁ దగిల్చి యగ్ని యుదగ్రతం దరికొన్నఁ దా
పానుభూతికి నోర్వఁజాలక యప్రయోజన వాక్య సం
తాన శోషిత వక్త్రుఁడై యతి దైన్యమొందెడు వాని య
ట్లైన నీదు విలాప మన్యుల కాడఁ బట్టగు భూవరా! 21

ప్రతిపదార్థం: తాను+అ= తనుకుతానే (స్వయంగా); చుట్టున్= తన చుట్టూ; తగిల్చి= మంటపెట్టుకొని; అగ్ని= మంట; ఉదగ్రతన్= భయంకరంగా; దరికొన్నన్= రాజుకొనగా; తాప+అనుభూతికిన్= ఆ వేడిమి అనుభవానికి; ఓర్వన్+చాలక= తట్టుకోలేక; అప్రయోజన= నిష్ప్రయోజనకరమైన; వాక్యసంతాన= మాటల సమూహంచేత; శోషిత= ఎండిపోయిన; వక్త్రుఁడు+ఐ= నోరుగలవాడై; అతిదైన్యము+ఒందెడువాని+అట్లు+అయినన్= అతిదీన స్థితిని పొందినవాడివలె అయితే; నీదు విలాపము= నీ ఏడ్పు; అన్యులకున్= ఇతరులకు; ఆడన్+పట్టు+అగున్= నవ్వులాటకు తగినది అవుతుంది (కనుక); భూవరా!= ఓ రాజా! (ఏడ్పు మానుము).

తాత్పర్యం: స్వయంగా తానే చుట్టూ మంట పెట్టుకొని ఆ మంట ఎక్కువైపోయి భయంకరంగా చుట్టుముట్టగా ఆ వేడిమికి తట్టుకొనలేక వ్యర్థంగా ప్రలాపం చేస్తూ నోరుకూడా తడి ఆరిపోయినవాడివలె ఉన్నది నీ ఏడ్పు. నీ దీనస్థితిని చూచి అందరూ నవ్వుకొంటారు కాని, ఎవరూ సానుభూతి చూపరు. కాబట్టి ఓ రాజా! ఏడ్పును మానుము.

విశేషం: అలం: ఉపమ. సంసారంలో తగులుకోవటం సాలీడు తనచుట్టూ తాను గూడుకట్టుకొని మధ్యన నిలిచిపోవటం వంటిదని వేదాంతులంటారు. తనచుట్టూ మంటపెట్టుకోవటం కూడా అలాంటిదే. భారతంలో అన్నిటికీ మూలం ధృతరాష్ట్రుడే అని 'మూలం ధృతరాష్ట్రో మహారాజ' అనే సామెత చెబుతుంది.

మత్తకోకిలలో ప్రతి పాదానికీ ర,స,జ,జ,భ,ర అనే గణాలుంటాయి. 1-11 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉంటుంది.

ఆ. నీవుఁ గొడుకుఁ బల్కు నిష్ఠురవచనంబు । లను సమీరగతుల నతిశయిల్లు
పార్థు రోషవహ్ని పాల్పడి రధిప! నీ । వారలెల్ల నింక వగవఁ దగునె?' 22

ప్రతిపదార్థం: నీవున్= నీవూ; కొడుకున్= నీ కుమారుడు దుర్యోధనుడూ; పల్కు= పలికే; నిష్ఠుర= కఠినమైన; వచనంబులు+అను= మాటలనే; సమీర గతులన్= గాలి తాకిడికి; అతిశయిల్లు= ఎక్కువైన; పార్థు= అర్జునుడి; రోషవహ్ని= రోషమనే అగ్నికి; అధిప!= ఓ రాజా!; నీ వారలు+ఎల్లన్= నీ వారంతా; పాలు+పడిరి= పాలయ్యారు; ఇంకన్= మరి ఇక; వగవన్+తగునె?= ఏడవటం ఉచితమా?

తాత్పర్యం: నీవు, నీ కుమారుడు దుర్యోధనుడు పలికిన కఠినవాక్కులనే గాలితాకిడికి అతిశయించిన అర్జునుడి రోషమనే అగ్నికి నీ వారంతా భస్మమయ్యారు. ఇక ఏడవటం ఎందుకు?'

విశేషం: అలం: రూపకం.

వ. అని యనేక భంగులలం బలికిన సంజయు పలుకులకుం జెవియొడ్డి ధైర్యంబు చిక్కఁబట్టి యంకిలిదేఱిన యవ్విభు నాలోకించి 'యేల నేలఁబడి పొరలెదు? లె'మ్మని పలికి విదురుం డి ట్లనియె. 23

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; (సంజయుడు) అనేక భంగులన్= అనేక రీతులుగా; పలికినన్= చెప్పగా; (అతని) పలుకులకున్= మాటలకు; చెవియొడ్డి= చెవిని అప్పగించి (ఆ మాటలు విని); ధైర్యంబు= ధైర్యాన్ని; చిక్కన్+పట్టి= కూడదీసికొని; అంకిలి+తేఱిన= స్పృహలోకి వచ్చిన; ఆ+విభున్+ఆలోకించి= ఆ రాజును చూచి; ఏల= ఎందుకు; నేలన్+పడి= నేలమీదపడి; పొరలెదు?= పొర్లుతావు?; లెమ్ము+అని= పలికి= అంటూ; విదురుండు= విదురుడు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నారు.

తాత్పర్యం: ఇట్లా సంజయుడు ఎన్నో రీతుల చెప్పగా ధృతరాష్ట్రుడు ఆ మాటలు విని, ధైర్యం కూడదీసికొని, స్పృహలోకి వచ్చాడు. ఇదంతా చూస్తున్న విదురుడు 'రాజా! ఎందు కిట్లా మాటిమాటికి రోదిస్తావు? లే లె'మ్మని అంటూ ఇట్లా చెప్పాడు.

విదురుఁడు ధృతరాష్ట్రునకు దుఃఖోపశమనంబు చేయుట (సం. 11-2-1)

క. 'పెరుఁగుట స్రగ్గఁగ, రుచులం । బొరయుట యరుచంబు గాఁగఁ, బుట్టుట సావం,
బెరయుట పాయఁ, బదార్థో । త్కరముల నైజ; మది యెట్లు దప్పింప నగున్? 24

ప్రతిపదార్థం: పెరుఁగుట= వృద్ధిపొందటం; స్రగ్గఁగన్= తగ్గిపోవటం కోసమే; రుచులన్+పొరయుట= రుచులలో ఆసక్తిపొందటం; అరుచంబు+కాఁగన్= విరక్తిని పొందటం కోసమే; పుట్టుట= జన్మించటం; చావన్= చావటం కోసమే; బెరయుట= సమీపించటం; పాయన్= వీడిపోవటం కోసమే; పదార్థ+ఉత్కరముల నైజము= పదార్థ సమూహాల తత్త్వం (ఇది); అది= అట్లా కావటాన్ని; ఎట్లు+తప్పింపన్+అగున్?= ఎట్లా తప్పించగలుగుతాం?

తాత్పర్యం: 'పెరగటం తరిగిపోవటంకొరకే, రుచులలో ఆసక్తి చూపించటం అసలు రుచినే పోగొట్టుకొనటంకొరకే, పుట్టటం చావటంకొరకే, దగ్గర కావటం దూరం కావటంకొరకే - ఇది పదార్థ స్వభావం. దీన్ని ఎట్లా తప్పించ గలుగుతాము?

విశేషం: విదురుడు ద్వంద్వ భావాలను గురించి బోధిస్తున్నాడు. ఆయన బోధించిన వేదాంతానికి భూమిక ఈ గుణాల వివరణలో ఉన్నది. పెరుగు×విరుగు; రుచి×అరుచి; పుట్టుక×చావు; దగ్గర×దూరం - అన్నవి రెండూ పదార్థాని కున్న విరుద్ధ స్వభావాలు. ఇదే లక్షణం కౌరవ పాండవుల విషయంలోనూ సత్యమని అర్థం. భగవద్గీత కూడా సుఖదుఃఖాది ద్వంద్వభావననుండి విముక్తుడు కావటమే జ్ఞానమని బోధించింది. మృత్యువు మనిషికి సహజమైన ధర్మం. అది తప్పించటానికి వీలుకాదు. మృత్యువు ఎట్లాంటిదో ముందరి పద్యంతో విదురుడు వివరిస్తాడు.

సీ. బిరుదుల నైనను బిఱికి వాండ్రనునైనఁ । జంపుచోఁ గడపఁడు జముఁడు నేర్పు
లావును మర్త్యుని చావు మాన్పఁగలేవు । రణమొనర్చినఁ గాని రాదె మరణ
మెయ్యది యవధి? యిందెల్ల వారును దెగు । వారకా కది గడవంగ వశము
గా దింత యుమ్మలికంబేల? యట్లును । గాక నీ సుతులు సంగ్రామకేళి

తే. సలిపి యింద్రుని కతిథులై చనిరి యజ్ఞ। దానవిద్యాతపోలబ్ధ మాననీయ
గతులు సమరానివర్తన మృతుల యరుగు। నట్టి గతులకుఁ బాటిగా వండ్రు బుధులు. 25

ప్రతిపదార్థం: బిరుదులన్+ఐనను= పరాక్రమవంతుల్ని కాని; పిఱికివాండ్రనున్+ఐనన్= పిరికివాళ్ళనిగాని; చంపుచోన్= చంపేసమయంలో; జముఁడు= యమధర్మరాజు; కడపఁడు= వదలిపెట్టడు; నేర్పు= ఒక మనిషికున్న నైపుణ్యంకాని; లావును= బలంకాని; మర్త్యుని= ఆ మనిషిని; చావు= మరణం; మాన్పఁగలేవు= తప్పింపజాలవు; రణము+ఒనర్చినన్+కాని= యుద్ధం చేస్తే తప్ప; మరణము= చావు; రాదె?= రాదా?; అవధి= చావుకు హద్దు; ఏ+అది?= ఎక్కడ?; ఇందున్= ఈ జగత్తులో; ఎల్లవారును= పుట్టినవారందరూ; తెగువారు+అ= చనిపోయేవారే; కాక= తప్ప; అది= ఆ మరణం; కడవంగన్= తప్పించకోవటానికి; వశము+కాదు= సాధ్యంకాదు; ఇంత= ఇంతగా; ఉమ్మలికంబు+ఏల?= దుఃఖించటం ఎందుకు?; అట్లును+కాక= అంతేకాకుండా; నీ సుతులు= నీ కుమారులు; సంగ్రామకేళి+సలిపి= యుద్ధమనే ఆటను ఆడి; ఇంద్రునికిన్+అతిథులై= ఇంద్రుడికి అతిథులుగా; చనిరి= స్వర్గానికి వెళ్ళారు; యజ్ఞ= యాగాలు; దాన= దాన ధర్మాలు; విద్యా= చదువులు; తపస్= తపస్సులు; (వీటిచేత) లబ్ధ= లభించే; మాననీయ గతులు= ఉత్తమ గతులు; సమర= యుద్ధంలో; అనివర్తన= తిరిగిరాని; మృతుల+అరుగు+అట్టి= మరణించిన యోధులు పొందే; గతులకున్= సుగతులకు; పాటి= సమానమైనవి; కావు= కావు (అని); బుధులు= పండితులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: యముడు జీవి ప్రాణం పోయేటప్పుడు పాశంవేసి లాగికొనిపోతున్న సమయంలో వాడు పరాక్రమశాలా? పిరికివాడా? అని చూడడు. ఎవరినీ వదలిపెట్టడు. మనిషి ఎంత నిపుణుడైనా, బలోపేతుడైనా వాడి చావు మాత్రం తప్పదు. యుద్ధం చేస్తేనే చస్తారా? మనిషి ఎక్కడున్నా చస్తాడు. ఇట్లాగే చావాలన్న నియమం ఏముంది? ఈ లోకంలో అందరూ తప్పక చనిపోయేవారే. ఎవరూ చావును తప్పించుకొనలేరు. ఇంతగా చావును గురించి బాధపడటం ఎందుకు? అంతే కాదు. నీ కొడుకులు ఉత్సాహంతో ఆటవలె యుద్ధంచేసే స్వర్గానికి అతిథులుగా వెళ్ళి ఇంద్రుడి చేత సత్కారాలు పొందుతున్నారు. యజ్ఞాలు చేయటం వలనకాని, దానధర్మాలు చేయటం వలన కాని, వేదశాస్త్రాలను నిరంతరం అభ్యసించటం వలన కాని, తపోదీక్షలో చిరకాలం ఉండటం వలన కాని ఏ పుణ్యగతులు కలుగుతాయో అవి యుద్ధంలో వెన్ను చూపకుండా పోరాడి మరణించే యోధులకు కలిగే పుణ్యగతులకు ఏ మాత్రం సరిసాటి కావని పండితులు అంటారు.

విశేషం: సూర్యమండలాన్ని ఛేదించుకొని ఉత్తమ లోకప్రాప్తి (వైకుంఠప్రాప్తి) నందగలవారు ఇద్దరేనట.

"ద్వా విమౌ పురుషౌ లోకే సూర్యమండల భేదినౌ
పరివ్రాడ్యోగయుక్తశ్చ రణే చాభిముఖే హతః"

అని సంప్రదాయజ్ఞులు చెప్పుతారు. అష్టాంగ యోగంతో తనువును స్వతంత్రంగా త్యజించగలవాడు (పరివ్రాజకుడు), యుద్ధంలో ఎదురొడ్డి నిలిచి మరణించిన వాడు (యోధుడు) - వీరిరువురే వైకుంఠప్రాప్తికి అర్హులు. (కనుక నీ కొడుకులు యుద్ధంలో వీరమరణం పొందారు కాబట్టి వారు పుణ్యాత్ములయ్యారు).

వ. కావున వారికి వగవం బనిలే దది యట్లుండె. సంసారంబున మాతృ పితృ సోదర దార పుత్ర సహస్రంబు లనుభవ గోచరంబులయ్యె నందెవ్వరికి వగచెద?' వని వెండియు. 26

ప్రతిపదార్థం: కావునన్= అందుచేత; వారికిన్= నీ కొడుకులను గురించి; వగవన్= దుఃఖించటం; పనిలేదు; అనవసరం; అది= ఆ విషయం; అట్లు+ఉండెన్= అట్లా ఉన్నది; సంసారంబునన్= ఈ సృష్టిలో; మాతృ= తల్లులు; పితృ= తండ్రులు; సోదర= అన్నదమ్ములు; దార= భార్యలు; పుత్ర= కొడుకులు; సహస్రంబులు= వేలకొద్దీ; అనుభవ= అనుభవంలో; గోచరంబులయ్యెన్= కనిపిస్తున్నారు; అందున్= వీరిలో; ఎవ్వరికిన్= ఎవరికోసమని; వగచెదవు?= ఏడుస్తావు?; అని= అంటూ; వెండియున్= ఇంకా ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: కాబట్టి నీ కొడుకుల విషయంలో చింతించటం అనవసరం. అది అట్లా ఉంచుము. ఎంతోమంది తల్లులు, తండ్రులు, అన్నదమ్ములు, భార్యలు, సంతానం - వేలకొద్దీ ఈ సంసారంలో తటస్థపడుతూ ఉంటారే! వాళ్ళలో ఎవ్వరికొరకు ఏడుస్తూ కూర్చుండగలవు?' అంటూ ఇంకా ఇట్లా చెప్పాడు.

విశేషం: పై పద్యంలో 'అనుభవగోచరంబు' అనే మాట చాలా విశిష్టమైనది. ఈ ప్రపంచం ఒక అనుభవం. నాటకంలోని అనుభవం కూడా ఇట్లాంటిదే. కుటుంబం, బంధు, మిత్రాది భావన ఒక అనుభవం మాత్రమే. జ్ఞాని ప్రపంచాన్నంతా ఒక కుటుంబంగా భావిస్తాడు, అందుకే జ్ఞానిని 'విశ్వకుటుంబి' అంటారు. విదురుడు అట్లాంటివాడు. అందుకే ఈ విశ్వభావనను గురించి చెప్పుతున్నాడు. అంటే లోకంలో శోకించటానికి ఎంతోమంది ఇతరులూ ఉన్నారు. వారిని గురించీ ఆలోచించుము. నీ దుఃఖం పటాపంచలవుతుం దని ఈ మాటల అర్థం. ఇది 'ఆత్మవాదం'.

కాని, ధృతరాష్ట్రుడు ఎంత సేపటికీ 'దేహవాది' గానే శోకిస్తాడు. తన కొడుకులు, తన బంధువులు, తనవారు: రాష్ట్రమంటే - దేహమని కూడా అర్థం. దేహధారి అని ధృతరాష్ట్ర పదానికి అర్థం.

తే. 'యౌవనంబును రూపంబు జీవితంబు । ద్రవ్య సంచయములు ననిత్యములు గావె?
వీని హానికి వగ పవివేక మగుటఁ । బండితులు వగఁ గూరరు పౌరవేంద్ర! 27

ప్రతిపదార్థం: పౌరవేంద్ర!= పూరువంశంలో పుట్టిన శ్రేష్ఠుడైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; యౌవనంబును= యౌవనమూ; రూపంబు= సౌందర్యమూ; జీవితంబు= జీవితమూ; ద్రవ్యసంచయములు= పదార్థాలూ; అనిత్యములు+కావె?= అశాశ్వతాలు కావా?; వీని= వీటియొక్క; హానికి= నాశనాన్ని గురించి; వగపు= దుఃఖించటం; అవివేకము+అగుటన్= అవివేకం కాబట్టి; పండితులు= ప్రాజ్ఞులు (వివేకులు); వగన్= దుఃఖంలో; కూరరు= మునిగిపోరు.

తాత్పర్యం: 'రాజా! పూరువంశంలో పుట్టిన మీకు తెలియనిది ఏ మున్నది? వయస్సు, అందమూ, జీవితమూ, పదార్థ జగత్తు - ఇవన్నీ అశాశ్వతాలే కదా! అందువలన పండితు లెపుడూ ఇట్లాంటివాటి విషయంలో దుఃఖంలో మునిగిపోరు.

విశేషం: ఆదిపర్వంలో యయాతి కథ ఉన్నది. ఆ కథలో యయాతి తన ముసలితనాన్ని తీసికొని యౌవనం ఇమ్మని కొడుకులను అడుగుతాడు. పూరుడు మాత్రం ముందుకు వచ్చి తన తండ్రికి తన యౌవనం ధారపోస్తాడు. అట్లాంటి పుణ్యాత్ముడు కాబట్టి యయాతి పూరువుకే రాజ్యాభిషేకం చేశాడని కథ. 'అట్లాంటి వంశంలో పుట్టిన నీవు నిత్యానిత్య వివేకం కలిగినవాడివి కాకపోతే ఎట్లా?' అని విదురుడు గుర్తు చేయటంకొరకే 'పౌరవేంద్రా' అని పిలుస్తున్నాడు.

వ. పాండిత్య సంపన్నుండవగు నీవు బంధుజీవహానికి వగవందగునె? వగవకూరకునికి మే లాకర్ణింపుము.28

ప్రతిపదార్థం: పాండిత్య= విద్యా; సంపన్నుండవు+అగు+నీవు= పాండిత్య సంపద కలిగిన నీవు; బంధుజీవహానికిన్= బంధువుల మృతికి; వగవన్+తగునె?= దుఃఖించటం న్యాయమా?; వగవక= బాధపడకుండా; ఊరక+ఉనికి= ఊరకుండటమే; మేలు= మంచిది; ఆకర్ణింపుము= ఎందుకో చెబుతాను వినుము.

తాత్పర్యం: నీవు పండితుడవు. విద్యాసంపదగలవాడివి. బంధువుల మృతికి ఇట్లా బాధపడటం న్యాయంగా ఉన్నదా? బాధపడకుండా ఊరకే ఉండటమే శ్రేయస్కరం. ఎందుకో చెప్పుతాను వినుము.

ఇంద్రవజ్ర :

చింతాపరత్వంబునఁ జెందు దుఃఖా । క్రాంతత్వ ముర్వీశ్వర! కానఁ గీడుం
జింతింపఁ డార్యాత్ముఁ డచింతనుండై । యంతః పరీతాపము నార్పఁ జాలున్. 29

ప్రతిపదార్థం: చింతాపరత్వంబునన్= చింతిస్తూ ఉండిపోవటంవల్ల; దుఃఖాక్రాంతత్వమున్+చెందున్= దుఃఖంచేత ఆక్రమింపబడతాడు; ఉర్వి+ఈశ్వర!= ఓరాజా!(వినుము); కానన్= కాబట్టి; ఆర్య+ఆత్ముఁడు= పుణ్యాత్ముఁడు; కీడున్= అనర్థమును; చింతింపఁడు= చింతిస్తూ కూర్చోడు; అచింతనుండు+ఐ= ఏ చింతాలేనివాడై; అంతః+పరీతాపమున్= లోపల ఉన్న బాధాగ్నిని; ఆర్పన్+చాలున్= ఆర్పివేసికొనగలుగుతాడు.

తాత్పర్యం: ఓరాజా! ఊరకే చింతిస్తూ కూర్చుంటే నిన్ను దుఃఖం ఆక్రమిస్తుంది. దానివలన అనర్థమే తప్ప మంచిదికాదు. అందుకే పుణ్యాత్ముఁడు ఎప్పుడూ చింతచేస్తూ కూర్చోడు. చింతను వదలి, క్రియాశీలుడై లోపల ఉన్న బాధ అనేటటువంటి అగ్నిని వివేకమనే శక్తితో ఆర్పివేయగలుగుతాడు.

విశేషం: 'చింత' చేయటం - శోకించటం లౌకిక విషయాల్లో దుఃఖకారక మవుతుంది. చింతన చేయటం - స్మరణ - భగవంతుడి విషయంలో సుఖకారి అవుతుంది. అచింతనత్వం - అంటే దుఃఖకారి అయిన వ్యామోహంపట్ల స్మరణలేకుండా ఉండటమని అర్థం. అట్లాంటి అచింతనుడు - నిరంతరం ఉత్సాహంతో క్రియాశీలిగానే ఉంటాడు. కార్య విజయాన్ని పొందుతాడు. గీతలో పరమాత్మ కూడా అర్జునుడి విషాదం 'అనార్యజుష్ట' మని (పామరపద్ధతి) అనటంలో ఉద్దేశమిదే.

ఇంద్రవజ్రలో త,త,జ,గ,గ అనే గణాలుంటాయి. 1-8 యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

క. ప్రియవస్తు వెడలుటయు న । ప్రియంబు వాటిల్లుటయుఁ బరిజ్ఞాన విని
శ్చయ హీనులైన యల్పా । శయులకు 'దుఃఖంబుఁ జేయు' జగతీనాథా! 30

ప్రతిపదార్థం: జగతీనాథా!= ఓ రాజా!; ప్రియవస్తువు= ఇష్టమైన వస్తువు; ఎడలుటయున్= నశించటం; అప్రియంబు= ప్రియంకానటువంటిది; పాటిల్లుటయున్= కలగటం; పరిజ్ఞాన= సమగ్రజ్ఞానముయొక్క; వినిశ్చయ హీనులు+ఐన= నిత్యానిత్య వివేక శూన్యులైన; అల్పాశయులకున్= సాధారణ మానవులకు (చిన్న ఆశయపరిధి ఉన్నవారికి); దుఃఖంబు+చేయున్= దుఃఖాన్ని కలుగజేస్తుంది.

తాత్పర్యం: ఓ రాజా! సాధారణ మనుష్యుల ఆశయాల పరిధి చాలా చిన్నదిగా ఉంటుంది. అట్లాంటివారికి నిత్యానిత్యవివేకం చేత కలిగిన నిశ్చిత జ్ఞానం ఉండదు. కనుక ప్రియమైన వస్తువు నశిస్తే ఏడుస్తారు. ఏ మాత్రం అనిష్టమైన పరిస్థితిలో చిక్కుకున్నా దుఃఖిస్తారు.

విశేషం: తిక్కన 'మహాశయ' శబ్దంనుండి 'అల్పాశయ' శబ్దాన్ని పుట్టించాడు. మహాశయులంటే సమగ్రజ్ఞానవంతులని అర్థం. వారి ఆశయాల పరిధి విశ్వజనీనంగా ఉంటుంది. అల్పాశయులు కుల, కుటుంబ, జీవిత పరిధిలో బ్రతుకుతూ ఉంటారు.

అట్లాంటివారికి ఏ చిన్న 'వస్తువు' పోయినా ఎంత చిన్న సంకట పరిస్థితి వచ్చినా ఏడుస్తూ కూర్చుంటారు. మహాశయులు ఇట్లాంటి సందర్భాలలోనే ధైర్యం వహిస్తారు.

జ్ఞానంకంటె విజ్ఞానం, దానికన్నా పరిజ్ఞానం చాలా గొప్పది. పరి - అంటే సమగ్రమైనదని అర్థం. భారత తాత్పర్యం 'ఎఱుకను సమగ్రం' చేయటం. ఆత్మజ్ఞానమే సమగ్ర జ్ఞానం. పదార్థజ్ఞానం విజ్ఞానం కావచ్చునేమో కాని పరిజ్ఞానం మాత్రం కాదు. కాబట్టి వస్తునాశం, అప్రియ సందర్భం - ఇవన్నీ తాత్కాలికాలు అనే నిశ్చితబుద్ధి పరిజ్ఞానంచేతే కలుగుతుంది.

వ. పండితుల నవి గలంపం జాల 'వనిన విని ధృతరాష్ట్రుం డతనిదిక్కు మొగంబు గాఁగఁ గూర్చుండి 'నీ సుభాషితంబుల కతంబున శోకంబు డిందువడియెఁ బండితులు ప్రియాప్రియ వస్తు వియోగ సంయోగంబు వలన జనించు మానస దుఃఖంబుల నేమిటంజేసి పొరయకుండుదు రది సెప్పు 'మనుటయు నమ్మనుజపతి కతం డిట్లనియె. 31

ప్రతిపదార్థం: (కనుక) పండితులన్= పండితులైన వారిని (పరిజ్ఞానం ఉన్నవారిని); అవి= వస్తునాశం, అప్రియసంప్రాప్తి - ఇవి రెండూ; కలంపన్+చాలవు= బాధింపజాలవు; అనినన్= అని చెప్పగా; విని; ధృతరాష్ట్రుండు; అతని దిక్కు= విదురుడివైపు; మొగంబు+కాఁగన్= ముఖంపెట్టి (ఎదురుగా); కూర్చుండి= కూర్చొని; నీ సుభాషితంబుల కతంబునన్= నీ సుభాషితాలవలన; శోకంబు= నా బాధ; డిందు+పడియెన్= నశించింది; పండితులు= ప్రాజ్ఞులు; ప్రియ+అప్రియ= ఇష్టమైన, ఇష్టంకాని; వస్తు= వస్తువులయొక్క; వియోగ= పోగొట్టుకోటంచేత; సంయోగంబువలనన్= కలయికచేత; జనించు= పుట్టునట్టి; మానస= మానసికమైన; దుఃఖంబులన్= సుఖదుఃఖాది భావాలను; ఏమిటన్+చేసి= దేనిచేత; పొరయకుండుదురు= పొందకుండా ఉంటారో; అది= అట్లా ఉండటం (ఎట్లాగో); చెప్పుము+అనుటయున్= చెప్పుమని అడుగగా; ఆ+మనుజపతికిన్= ఆ ధృతరాష్ట్రునితో; అతండు= విదురుడు; ఇట్లనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: సమగ్రమైన ఎరుక గలవారిని ప్రియాప్రియ వస్తువులు రెండూ 'ఏమీ చేయజాలవు' - అని చెప్పగా ధృతరాష్ట్రుడు విని, అతనివైపు తిరిగి కూర్చుండి 'నీ సుభాషితాల వలన నా బాధ తగ్గింది. ప్రాజ్ఞులు ప్రియాప్రియ వస్తువుల సంయోగ వియోగాల వలన పుట్టే ఏ మానసిక భావాలచేతా ఆక్రమించబడకుండా ఎట్లా ఉంటారు? అది ఎట్లాగో వివరించుము' - అని అడిగాడు. అప్పుడు విదురుడు ఇట్లా అన్నాడు.

విశేషం: వేదాంతం చదవటం, వినటం వేరు. అది ఆచరణలో ఉంచటంవేరు. ధృతరాష్ట్రుడు వినని విషయం ఏమున్నది? అందుచేత ప్రాజ్ఞులు ద్వంద్వభావాతీతులుగా ఎట్లా ఉంటారో తెలిసికొనాలని అడుగుతున్నాడు.

క. 'ఈ లోకము నిస్సారం । బాలోకింపంగ ననఁటియట్టుల; యని తా
లోలతఁ బొందని పురుషుం । డేలా నెవ్వగలఁ జెందనిచ్చు మనంబున్? 32

ప్రతిపదార్థం: ఈలోకము= ఈ సంసారం; ఆలోకింపంగన్= ఆలోచించిచూస్తే; అనఁటి+అట్టుల= అరటి చెట్టులాగా; నిస్సారంబు= బలంలేనిది (అందుకే దుఃఖిస్తుందని అర్థం); అని= అని భావించి; తాన్= తాను; లోలతన్= అందులో ఆసక్తి కలగి ఉండటాన్ని; పొందని పురుషుండు= పొందని మనిషి; ఏలా= ఎందుకు; మనంబున్= మనస్సును; నెఱ+వగలన్= సంపూర్ణ వ్యథలను; చెందన్+ఇచ్చున్?= పొందనిస్తాడు?

తాత్పర్యం: 'బాగా ఆలోచించి చూస్తే ఈ సంసార మనే వృక్షం అరటి చెట్టువలె దుర్బలమైనది. ఈ సంగతి గుర్తించి లోకంపట్ల ఆసక్తి పొందని మనిషి మనసును ఎందుకు వ్యథకు గురి చేస్తాడు?

విశేషం: అలం: ఉపమ. అరటి చెట్టు దుర్బలమైనది. అంతా నీరే. అందుకే దుర్యోధనుని తొడలు అరటి కాండాలవలె ఉన్నాయని (రంభోరు నిజోరుదేశమునన్- అని నన్నయగారి ప్రయోగం - సభాపర్వం 2-249). ఈ సందర్భంలో చెట్లలో వేప, మామిడి మొదలైన చెట్లకున్న సారత్వం అరటిచెట్టుకు లేకపోవటం గమనిస్తే - ఈ పోలిక అర్థమవుతుంది. సారమంటే బలమని అర్థం. ధీమంతులు సారజ్ఞానం కలవారు కాబట్టి 'ధృతి' మంతులనబడ్డారు.

తే. **అరయవచ్చినఁ దనమేను నెరవ తనకు । నొండు రూపులు దక్కక యునికి యరుదె?**
యను తలంపు ధ్రువంబుగ నలవరించి । బుధజనంబులు శోకంబుఁ బొరయ రధిప! **33**

ప్రతిపదార్థం: అధిప= ఓ రాజా!; అరయవచ్చినన్= పర్యాలోచించగా; తనమేనున్= తన శరీరము; ఎరవు+అ= అన్యమైనదే; తనకున్; ఒండురూపులు= స్వరూపాలు; తక్కక+ఉనికిన్= కలగడం; అరుదె!= ఆశ్చర్యకరమా?; అను తలంపు= అనే నిశ్చయ జ్ఞానం; ధ్రువంబుగన్= దృఢంగా; అలవరించి= కలిగించుకొని (అభ్యాసంచేత సిద్ధింపజేసికొని); బుధజనంబులు= పండితులు; శోకంబున్= శోకాన్ని; పొరయరు= పొందరు.

తాత్పర్యం: పరిశీలించగా తన శరీరం కూడా తన కంటె భిన్నమయినదే. తనకు ఇతరమయిన ఆకారాలు సంభవించడం ఆశ్చర్యమా అని భావమును దృఢపరచుకొని విజ్ఞులు శోకించరు.

విశేషం: జీవుడు శరీరాన్ని ధరించి కొంతకాలం ఉండి దాన్ని పాత వస్త్రాలను వదలివేసినట్లు వదలివేస్తాడని గీత బోధిస్తున్న విషయం ఇక్కడ అనుసంధించుకుంటే 'వచ్చిన' అనే క్రియకు అర్థం తెలుస్తుంది. నెరయుట- అంటే సంపూర్ణత్వం పొందటం అని అర్థం. పుణ్యకర్మలవలన పునరావృత్తి రహితమైన బ్రహ్మలోక ప్రాప్తిని జీవి చెందుతాడు. అట్లాంటి ప్రాజ్ఞుడు మరలా మరొక రూపం పొందాలని ఆశించడు. వాడు జ్ఞానాగ్నిదగ్ధకర్ముడు - కాబట్టి కర్మపరిపాకం ఈ దేహంతోటే పూర్తి అవుతుందని అర్థం. లేనివాడే దివికి- భువికి తిరుగుతూ మరలా మరలా పుట్టుతుంటాడు. ఒండురూపులు - అంటే కొత్త కొత్త జన్మలని అర్థం.

సీ. **ఒక యింటనుండి వేఱొక యింటి కరిగిన । విధమును వస్త్రంబు విడిచి యొండు**
వస్త్రంబు గట్టిన వడువును నై యుండు । నొడలు దొఱంగి యొండొక్క యొడలు
గైకొంట నృప! విను కడవకు సారెపై । నమర మృత్తిక యిడినపుడు విరియు
టయు వెరవారఁ బట్టఁగరాక చెడుటయు । వాని యెత్తెడు నెడ వ్రయ్యుటయును

తే. **నెత్తి యొకచోట డించిన నెడలుటయును । నెండి యవియుటయును నావ మిడినఁ బగిలి**
పోవుటయు వాడు జనులచేఁ బొలియుటయును । గలుగు గతి మేనికెట్లును గలుగుఁ జేటు. **34**

ప్రతిపదార్థం: నృప!= ఓ రాజా! విను; ఒడలు= శరీరము; తొఱంగి= వదలిపెట్టి; ఒండు+ఒక్క+ఒడలు= మరొక శరీరం; కై+కొంట= ధరించటం; ఒక ఇంటన్+ఉండి= ఒక ఇంటిలో నుండి; వేఱు+ఒక+ఇంటికి+అరిగిన విధమును= మరో ఇంట్లోకి వెళ్ళిన పద్ధతి; వస్త్రంబు విడిచి= కట్టిన వస్త్రాన్ని విడిచిపెట్టి; ఒండు వస్త్రంబు+కట్టిన వడువును= మరొక వస్త్రాన్ని ధరించినపద్ధతి; ఐ+ఉండున్= అయి ఉంటుంది; కడవకున్= కుండ తయారు చేయటానికై; సారెపైన్= సారెపైన; అమరన్= తగినట్టుగా; మృత్తికన్+ఇడిన+అపుడు= మట్టిని పెట్టినప్పుడు; విరియుటయున్= విరిసిపోవటం; వెరవు+ఆరన్+నేర్పు అతిశయించగా; పట్టఁ గన్+రాక= కుండను తీర్చటానికి కాకుండా; చెడుటయున్= చెడిపోవటం; వాని+ఎత్తెడు+ఎడన్= అవి ఎత్తేటప్పుడు; వ్రయ్యుటయును= విరిగిపోవటం; ఎత్తి+ఒకచోటడించినన్= కుండ తయారయ్యాక ఎత్తి ఒక వైపుపెట్టగా; ఎడలుటయును=

విచ్చిపోవటం; ఎండి= ఎండిన తరువాత; అవియుటయును= చీలిపోవటం; ఆవము+ఇడినన్= ఆవంలో పెట్టాక; పగిలిపోవుటయున్= విరిగిపోవటం; వాడు+జనులచేన్= ఉపయోగించే మనుష్యులచేత; పొలియుటయును= నశించటం; కలుగు గతి= కలిగే రీతి; మేనికిన్= దేహానికి కూడా; చేటు= నాశనం; ఎట్లునున్= ఎట్లాగైనా; కలుగున్= కలుగుతుంది (తప్పదు).

తాత్పర్యం: ఓ రాజా! వినుము. ఈ శరీరం వదలి మరో శరీరాన్ని ధరించటమే మరణమంటే. ఇది ఎట్లాంటిదంటే ఒక ఇంటిలో కొంతకాలం ఉండి మరో ఇంట్లోకి మారటం వంటిది. కట్టిన బట్టను విడిచి మరో బట్టను కట్టుకొనటం వంటిది. కుండలు తయారు చేయటానికి ఎంతో నేర్పుగా సారెపైన కుమ్మరి మట్టిని అమర్చుతాడు. అప్పుడే చాలాసార్లు ఆ మట్టి విరిసిపోవటం జరుగుతుంది. మరింత నేర్పుతో కుండను తీర్చటానికి ప్రయత్నిస్తాడు. అప్పుడూ పాకం చెడి మట్టి ముద్దగా మిగిలిపోవచ్చును. కుండ తయారయిందనుకొందాము. అప్పుడు ఆ కుండను ఎత్తి నేలమీద దించేటప్పుడు విచ్చిపోవచ్చును. ఎండించిన తరువాత చీలిపోవచ్చును. ఆవంలో పెట్టి కాల్చాక కూడా విరిగిపోవచ్చును. ఇదంతా అయ్యాక ఆ కుండను ఉపయోగించేవాడిచేత ఎపుడో ఒకప్పుడు అది పగలకుండా ఉండలేదు. ఇట్లా ఆ కుండ ఏదో ఒక దశలో ఎట్లా నశిస్తుందో ఈ దేహం కూడా అంతే ఎప్పుడో ఒకప్పుడు నశించి తీరుతుంది.

విశేషం: మనిషి దేహం ఎట్లాంటిదో, బ్రహ్మాండం కూడా అట్లాంటిదే. అందుకే బ్రహ్మాండాన్ని 'భాండ' మంటారు. దానిని చేసే కుమ్మరి పేరే బ్రహ్మదేవుడు. ఈ పౌరాణిక నేపథ్యమంతా కలిగిన ఆచారమే శవసంస్కారం చేసేటప్పుడు నీటితో నిండిన కుండను శవం చుట్టూ తిప్పి పగులగొట్టటం. ఇతిహాసాలలోని ఉపమలు కూడా ధార్మిక సందేశాన్ని అందిస్తాయనటానికి ఇక్కడ శరీరాన్ని కడవతో పోల్చి చెప్పిన పద్ధతి మంచి నిదర్శనం.

వ. అది యెట్లంటేని గర్భాధానవేళయందును బిండావస్థయందును బ్రసూతిమాత్రంబున బాల్యంబునను యౌవనంబునం బ్రౌఢత్వ సమయంబునను వార్ధకంబునం గర్మానురూపంబగు నాశంబు శరీరంబునకు సంప్రాప్తంబగు నిది కొలందియని యెఱుంగరా దట్లగుటం దమతమ సుకృతదుష్కృతంబుల తెరువులఁ బోయిన నీ తనయాదులవలని వగలం బొగులం బ్రయోజనంబు లేదు. ప్రాజ్ఞులు వివేకంబున సంసారంబు దుఃఖబహుళంబని యెఱింగి తద్రూపగహనంబు గడచి శాశ్వత సుఖంబుఁ బడయుదు'రనిన విని యాంబికేయుండు 'సంసారదుఃఖబహుళతయును దద్గహనత్వంబును నెఱిగింపు' మనుటయు నవ్విభునకు విదురుం డిట్లనియె. **35**

ప్రతిపదార్థం: అది+ఎట్లు+అంటి(వి)+ఏనిన్= అది ఎట్లాగని అంటివా, వినుము; గర్భ+ఆధాన వేళయందును= పురుషుడు స్త్రీలో గర్భాన్ని ధరింపజేసిన సమయంలోనూ; పిండ+అవస్థయందును= పిండదశలోనూ; ప్రసూతి+మాత్రంబునన్= ప్రసవసమయంలోనూ; బాల్యంబునను= బాల్యావస్థలోనూ; యౌవనంబునన్= యౌవనంలోనూ; ప్రౌఢత్వ సమయంబునన్= పెద్దవారయ్యాక; వార్ధకంబునన్= ముసలితనంలోనూ; శరీరంబునకున్= ఈ దేహానికి; కర్మ+అనురూపంబు+అగు= తమతమ పూర్వ జన్మలలో చేసిన పాపపుణ్య కర్మలకు తగిన; నాశంబు= (రీతిలో) నశించటం; సంప్రాప్తంబు+అగున్= జరుగుతుంది; ఇది+కొలంది+అని= మరణానికి ఇదే పద్ధతి అని; ఎఱుంగరాదు= గుర్తించలేము; అట్లు+అగుటన్= అట్లాకావటంవలన; తమతమ= తాము తాము చేసిన; సుకృత దుష్కృతంబుల= పుణ్యాపాపాల; తెరువులన్= (ఫలితంగా తమకు లభించిన) దారులలో (స్వర్గానికి, నరకానికి); పోయిన= వెళ్ళిపోయిన; నీ తనయాదుల వలని= నీ కుమారులు బంధువులు - వీరివలన

ఏర్పడ్డ; వగలన్= దుఃఖంతో; పొగులన్= బాధపడి; ప్రయోజనంబులేదు= ఏమీ లాభంలేదు; ప్రాజ్ఞులు= సమగ్రమైన జ్ఞానం ఉన్నవారు; వివేకంబునన్= వివేకం కారణంగా; సంసారంబు= ఈ సంసారం; దుఃఖబహుళంబు+అని= అనేక విధాలైన దుఃఖాలకు ఆకరమని; ఎఱింగి= తెలిసికొని; తద్+రూపగహనంబున్+కడచి= ఆ సంసారంలోని భిన్నక్లేశకారకమైన ఘట్టాలను దాటి; శాశ్వత సుఖంబున్= శాశ్వతమైన మోక్ష సుఖాన్ని; పడయుదురు= పొందుతారు; అనినన్= అని విదురుడు చెప్పగా; విని; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; సంసారదుఃఖ బహుళతయును= సంసారంలో ఎక్కడెక్కడ ఎట్లా దుఃఖం ఉందో; తద్+గహనత్వంబును= దాన్ని దాటటం ఎందుకు కష్టమో; ఎఱింగింపుము+అనుటయున్= నాకు తెలుపుము- అని కోరగా; ఆ+విభునకున్= ధృతరాష్ట్రుడికి; విదురుడు; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: అది ఎట్లాగంటావా వినుము. పురుషుడు స్త్రీలో గర్భాన్ని ధరింప జేసిన సమయంలో, గర్భంలో పిండం ఎదుగుతున్న దశలో, కాన్పు జరిగేటప్పుడు, బాల్యంలో, యౌవనంలో, పెద్దవారయ్యాక ముసలితనంలో - ఈ దేహం తమ తమ కర్మలకు అనుగుణంగా ఎన్నో రీతులుగా నశిస్తూ ఉంటుంది. ఎన్ని విధాలుగా ఎప్పుడెప్పుడు నశిస్తుందో చెప్పటం కూడా కష్టమే. మరణానికి ఇదే పద్ధతి అని గుర్తించలేము. అట్లా కావటం వలన నీ కుమారులు బంధువులు కూడా తాము తాము పూర్వజన్మలలో చేసిన పుణ్యాపాప కర్మలకు అనుగుణంగా లభించిన దారులలో స్వర్గ, నరకాలకు చేరుకొన్నారు. వారిని గురించి దుఃఖించటం వలన లాభం ఏముంది? ఎరుక సమగ్రంగా ఉన్నవారు ఈ జీవితం ఎన్నో విధాలైన దుఃఖాలకు ఆకరమని తెలిసికొని ఆ దుఃఖ కారకమైన ఘట్టాలన్నింటినీ దాటి శాశ్వతమైన మోక్ష సుఖాన్ని పొందుతారు' అని విదురుడు చెప్పగా ధృతరాష్ట్రుడు విని 'సంసారంలో ఎక్కడెక్కడ దుఃఖం పరివ్యాప్తమయిందో దాన్ని దాటటం ఎందుకు కష్టమో వివరించు'మని కోరగా విదురుడు ఇట్లా చెప్పటం మొదలు పెట్టాడు.

విశేషం: తరువాతి పద్యాలలో పుట్టుకనుండి మరణందాకా జీవితంలో దుఃఖం ఏ విధంగా పెనవేసుకున్నదో విదురుడు వివరిస్తాడు. 'గహనం' అనే మాటలకు వివరణ అవసరం. కఠినమని, కష్టమని, అసాధ్యమని - సందర్భాన్నిబట్టి అర్థం చెప్పాలి. దుఃఖం ఏదో ఒక రూపంలో వచ్చి మనిషిని తాకుతుంది - ఆ తాకిడిని తట్టుకొనటం 'గహనం' (గగనమైపోయిందని వ్యవహారంలో అంటాం).

తద్రూపగహనంబు - అంటే అనేక విధాలైన కష్టాలకు ఆకరమైన కఠినమైన సంసారమని అర్థం. గహనమైన దుఃఖరూపమైన సంసారమని భావం చెప్పుకోవాలి.

తే. **'కలసి శుక్ల శోణితములు కరుడు గట్టి । విను మమేధ్య మధ్యమునఁ బ్రవృద్ధిఁ బొంది**
కాలవశత నప్పిండ మంగంబులెల్ల । గలిగి శిశువయి మారుతగతి యెలర్ప. 36

ప్రతిపదార్థం: వినుము=రాజా విను; శుక్ల శోణితములు= వీర్యము, రజస్సులు; కలసి= రెండూకలిసి; కరుడుగట్టి= ముద్దగా మారి; అమేధ్య= మురికి (మలం); మధ్యమునన్= నడుమ; ప్రవృద్ధి పొంది= పెరిగి; ఆ+పిండము= ఆ పిండం; కాలవశతన్= కాలక్రమంలో; అంగంబులు+ఎల్లన్= అన్ని అవయవాల్నీ; కలిగి= పొంది; శిశువు+అయి= శిశువుగా; మారుతగతి= ప్రాణవాయు గమనం; ఎలర్పన్= కలుగగా.

తాత్పర్యం: 'రాజా! వినుము వీర్యం, రజస్సు కలిసి ముద్దగా మారి మురికి మధ్య పెరిగి ఆ పిండం కాలక్రమంలో అన్ని అవయవాల్నీ పొంది శిశువుగా అయి, ప్రాణవాయు గమనం పొందగా.

క. వెడలునెడ గాఢ పీడం । బడి సుడివడి యోని నొత్తువడి యొక భంగిన్
వెడలఁగ గ్రహభూతముల । ప్పడు దొడఁగి యనేక దురితములు గల్పించున్. 37

ప్రతిపదార్థం: వెడలు+ఎడన్= తల్లి గర్భం నుంచి బయటపడేటప్పుడు; గాఢపీడన్+పడి= తీవ్రమైన బాధను అనుభవించి; సుడివడి= గర్భంలో గిరగిర తిరిగి; యోనిన్= యోని ముఖంలో; ఒత్తు+పడి= అదుమబడి; ఒక భంగిన్= ఏదో ఒక రీతిగా (కష్టంపైన); వెడలఁగన్= బయటపడగా; గ్రహభూతములు= గ్రహాలు, భూతాలు; అప్పుడు= ఆ సమయంలో; తొడఁగి= ప్రయత్న పూర్వకంగా (పూనుకొని); అనేక= చాలా; దురితములు= కష్టాలు; కల్పించున్= కల్పిస్తాయి.

తాత్పర్యం: అట్లా పెరిగి శిశువైన పిండం తల్లి గర్భంనుండి బయటపడేటప్పుడు తీవ్రమైన బాధను అనుభవించి గర్భాశయంలో గిరగిర తిరుగుతూ యోని ముఖంలో అదుమబడి అతికష్టంమీద బయటపడగా, సరిగ్గా అదే సమయంలో గ్రహాలు, భూతాలు వ్రాలి ఆ శిశువునకు ఎన్నో కష్టాలు కలిగిస్తాయి.

విశేషం: గ్రహ - భూత శబ్దాలకు వివరణ అవసరం. సూర్యచంద్రాదులు గ్రహాలు. గ్రహస్థితి శిశువు జాతకంమీద ప్రభావం చూపుతుంది. భూతాలు - అంటే పంచభూతాలు (పృథివి, ఆపస్సు, తేజస్సు (అగ్ని), వాయువు, ఆకాశం) - వీటి ప్రభావం కూడా శిశువు ఆరోగ్యం మీద ఉంటుంది. భూతమని పిశాచాదులకు కూడాపేరు. శ్రీకృష్ణుడి బాల్యంలో వేధించిన పూతన ఒక భూతమే. ఇట్లా శిశువుకు ఆయురారోగ్య పీడలు కలుగుతాయి అంటారు. వీటిని మొత్తం కలిపి 'బాలగ్రహ దోష' మంటారు.

వ. అట్లు జనియించి మనుజుండు. 38

ప్రతిపదార్థం: మనుజుండు= మానవుడు; అట్లు; జనియించి= పుట్టి.

తాత్పర్యం: మనుష్యుడు అట్లా పుట్టి.

క. బాలత్వంబున నవివే । కాలోలత శుచియు నశుచి యైనదియు సమం
బై లీల జుగుప్సిత విధి । శీలత నొందంగ దుర్విచేష్టలఁ దిరుగున్. 39

ప్రతిపదార్థం: బాలత్వంబునన్= బాలుడుగా; అవివేక+ఆలోలతన్= అవివేకంతో కూడిన పనులలో ఆసక్తి కలిగి; శుచియున్= పవిత్రతా; అశుచి+ఐనదియున్= అపవిత్రమైనదీ; సమంబై= ఒకటికాగా; లీల= ఆడే ఆట(లు); జుగుప్సిత= అసహ్యంకలిగించే; విధి శీలత= పనులనే లక్షణంగా కలిగినవి కాగా; దుర్విచేష్టలన్= చెడ్డనడవడులతో; తిరుగున్= కాలం గడిపివేస్తాడు.

తాత్పర్యం: ఇక బాల్యంలో వివేకం లేని పనులలోనే ఆసక్తి మెండు. పరిశుభ్రత, అపరిశుభ్రత రెండూ బాలుడికి సమానమే. ఆటలో ఎన్నో అసహ్యకరమైన పనులు చేస్తాడు. యోగ్యం కాని పనులలో కాలం గడిపివేస్తాడు.

విశేషం: 'బాలస్తావత్ క్రీడాసక్తః' అని శంకరాచార్యులు కూడా ఈ విషయాన్ని వివరించారు. బాల్యమంటే ఆటలాడుకొనటం మాత్రమే. అవివేకపు పనుల మీద బాలుడికి ఆసక్తి మెండుగా ఉంటుంది. ఇట్లా బాల్యం వ్యర్థమవుతుంది. అప్పుడే నడవడిలో దుర్మార్గత్వం కూడా ప్రవేశించేది. అక్కడ సన్మార్గంవైపు ఎవరు మరలుతారో వారు పెద్దవా రయ్యాక బాగుపడుతారు.

క. యౌవనమున విషయ పర। త్వావేశము దుఃఖకారియై యలఁపఁగ నా
నా విధ దుర్వినయములకుఁ। దావలమై మెలఁగు నిందితప్రక్రియలన్. 40

ప్రతిపదార్థం: యౌవనమునన్= యుక్తవయస్సులో; విషయపరత్వ+ఆవేశము= ఇంద్రియపరమైన సుఖంలోని తీవ్రమైన కోరిక; దుఃఖకారియై= దుఃఖాన్ని కలిగించేదై; అలఁపఁగన్= బాధించగా; నానావిధ= అనేక విధాలైన; దుర్వినయములకున్= దుష్టప్రవర్తనలకు; తావలము+ఐ= చోటై; నిందిత= దూషితమైన; ప్రక్రియలన్= పనులలో; మెలఁగున్= ప్రవర్తిస్తాడు.

తాత్పర్యం: యౌవనం రాగానే ఇంద్రియపరమైన సుఖంలోని తీవ్రమైన కోరిక యువతీయువకులచేత ఎన్నో పనులు చేయిస్తుంది. చివరికి దుఃఖాన్నే కలిగిస్తుంది. ఎంతో బాధిస్తుంది. అనేక విధాలైన దుష్టమైన పనులు చేయటానికి ప్రేరేపిస్తుంది. ఇట్లా యౌవనం కూడా దుఃఖకారే అవుతుంది.

విశేషం: 'తరుణస్తావత్ తరుణీ సక్తః' అని శంకరాచార్యులు తరుణావస్థను వివరించారు. యౌవనంలో స్త్రీ సంబంధమైన కామన తప్ప మరొకటి 'ఇష్టంగా' ఉండదు. ఇంద్రియాలను ఆకర్షించటం, తద్వారా మనస్సును భోగంవైపు లాగి బంధించటం కామలక్షణం. కామం ముందు ఏ వివేకమూ పనిచేయదు. ఆ యౌవనంలోనే ఎందరో తప్పటడుగులు వేసి ఆరోగ్యం కోల్పోతారు. అన్ని విధాలుగా భ్రష్టులై దొంగతనం, మోసం, మొదలు హత్యలు చేయటం దాకా మనిషిని పతనావస్థకు చేర్చగలగటం ఒక కామానికే సాధ్యం. చివరికి మనిషి దుఃఖంపాలు కావటం తప్ప కామం వలన మరొక లాభం లేదు - అని విదురుడి ఉపదేశ సారాంశం.

'బలవా నింద్రియగ్రామో విద్వాంస మపి కర్షతి' అని అన్నారు. ఎంత గొప్ప విద్వాంసుడు, ఇంద్రియనిగ్రహ పటువూ అయినా విషయవాసన ముందు ఆకర్షించబడతాడని అర్థం.

మత్తకోకిల:

వృద్ధుఁడైనతఱిన్ బలంబును వీఁకయుం దఱుగంగ దు
ర్బుద్ధి పాటిల ప్రుగ్గి యింద్రియముల్ విశక్తతఁ బొంద దో
షోద్ధతిన్ రుజ లుద్భవింపఁగ నొండురూపగు పాశసం
బద్ధుఁ జేసి జముండు దివ్వఁగఁ బాయు నబ్భవముం దుదిన్. 41

ప్రతిపదార్థం: వృద్ధుఁడు+ఐన+తఱిన్= ముసలివాడయ్యాక; బలంబును= బలమూ; వీఁకయున్= పరాక్రమమూ; తఱుగంగన్= తగ్గిపోగా; దుర్బుద్ధి+పాటిలన్= ఉచితానుచిత పరిజ్ఞానం నశించి, 'చెడు' వైపు బుద్ధి ప్రసరిస్తుండగా; ఇంద్రియముల్= ఇంద్రియాలు; ప్రుగ్గి= పడిపోయి (అరిగిపోయి); విశక్తతన్= నిశ్శక్తిని; పొందన్= పొందగా; దోష+ఉద్ధతిన్= దోషాల విజృంభణంచేత; రుజలు= రోగాలు; ఉద్భవింపఁగన్= పుట్టగా; ఒండురూపగు= ఏదో ఒక రూపంలో; పాశసంబద్ధున్+చేసి= పాశంతోకట్టి; జముండు= యముడు; తివ్వఁగన్= ప్రాణంలాగగా (మనిషి చివరకు); ఆ+భవమున్= ఆ జన్మను; తుదిన్= చివరికి; పాయున్= వదిలి వేస్తాడు.

తాత్పర్యం: చివరికి ముసలితనం రాగా మనిషి బలమూ తగ్గుతుంది. పరాక్రమమూ తగ్గిపోతుంది. ఉచితానుచిత పరిజ్ఞాన శూన్యుడై అనుచిత కార్యాలవైపే బుద్ధి ప్రసరిస్తుంది. ఇంద్రియాలు పడిపోయి నిశ్శక్తి ఆవరిస్తుంది. దోషాలు విజృంభించి రకరకాల రోగాలు పుట్టుతాయి. అప్పుడు యముడు ఏదో ఒక రూపంలో కాలపాశాన్ని వేసి మనిషి ప్రాణాన్ని లాగుతాడు. చివరికి మనిషి నిస్సహాయుడై ఆ జన్మను వదలిపెట్టుతాడు.

విశేషం: బలం వేరు, విజృంభించే స్వభావం వేరు. ముసలి వయసులో ఈ రెండూ తగ్గిపోతాయి.

ఉచితానుచితపరిజ్ఞానం నశించటంతో ముసలివారి ప్రవృత్తి పిల్లల ప్రవృత్తిగా మారిపోతుంది. శిక్షితమైన జీవితం కాకపోతే ఏ విషయంలోనూ నిగ్రహముండదు. అందరినీ తిడుతూ అందరికీ భారమవుతాడు.

ఇంద్రియాలు అరిగిపోతాయి. వాటి కార్యకలాపాలకు కావలసిన శక్తి ఉండదు.

సత్త్వ రజ స్తమోగుణాలకు చెందిన వాతపిత్తశ్లేష్మదోషాలు మూడూ విజృంభిస్తాయి. ఆయుర్వేదం ప్రకారం అన్ని రోగాలు ఈ త్రివిధ దోషాలతో పుట్టుతాయి.

వయస్సుపరంగా 'జర' (ముసలితనం) ఆరోగ్యం చెడిపోవటం 'రుజ' (వ్యాధి) - ఈ రెండింటిలో ఏది వచ్చినా యమపాశం సిద్ధంగా ఉంటుంది.

అందుకే దంతాలు పడకుండా ఉన్నప్పుడే, తనువులో శక్తి ఉన్నప్పుడే, కాంతాసంఘం అసహ్యించుకొనకముందే మనిషి జాగరూకుడై భగవంతునివైపు మనసు మళ్ళించి ధార్మిక కార్యాలలో మగ్నుడై యుక్తాహార విహారాలతో దేహాన్ని మనస్సును క్రమబద్ధీకరించుకొనాలని మన భారతీయ సంప్రదాయం విధించింది.

మత్తకోకిల వృత్తంలో ప్రతిపాదానికీ ర,స,జ,జ,భ,ర గణాలుంటాయి. 1-11 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

వ. కావున సంసారంబు దుఃఖబహుళంబగుట విస్పష్టం బది యట్లుండె లోభక్రోధ మదోన్మత్తులై దుర్మతు లింద రమింతు రందలి సుఖలేశంబునకై యొండొరులం జెఱుపను జంపను జొచ్చి ధర్మపథంబు దప్పి యమ కింకరుల చేతం బడుదు రిత్తెఱంగు బుధులవలనఁ దెలియ విని విమలస్వాంతులు సన్మార్గంబున వర్తిల్లి నిత్యానంద స్వరూపు లగుదురు. దీని గహనత్వంబు పెద్దలచేత వినినతెఱంగు సెప్పెద నాకర్ణింపుము. 42

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; సంసారంబు= ఈ సంసారం; దుఃఖబహుళంబు+అగుట= చాలా దుఃఖాలతో నిండినది కానటం; విస్పష్టంబు= చాలాస్పష్టమైన అంశం; అది+అట్లు+ఉండెన్= అది అట్లా ఉన్నది; లోభ, క్రోధ, మద+ఉన్మత్తులు+ఐ= లోభంతోనూ, క్రోధంతోనూ, మదంతోనూ మిక్కిలి ఉన్మాదం పొందినవారై; దుర్మతులు= దుష్టబుద్ధి కలవారు; ఇందున్+అ= ఈ విషయలంపటలోనే; రమింతురు= మునిగి సుఖాలు అనుభవిస్తుంటారు; ఇందలి= ఈ విషయజగత్తులోని; సుఖ లేశంబునకై= కొద్దిపాటిదైన ఈ సుఖంకోసం; ఒండు+ఒరులన్= ఒకరినొకరు; చెఱుపను= నాశనం చేయడానికి; చంపను= చంపివేయడానికి; చొచ్చి= బయలుదేరి; ధర్మపథంబు+తప్పి= ధర్మమార్గం వదిలి; యమకింకరులచేతన్+పడుదురు= యమభటులచేతికి చిక్కుతారు; ఈ+తెఱంగు= ఈ రీతి; బుధులవలనన్+తెలియన్+విని= పండితులవలన బాగా విని; విమల స్వాంతులు= పవిత్రమైన హృదయం కలిగినవారు (పుణ్యాత్ములు); సత్+మార్గంబునన్+వర్తిల్లి= మంచి మార్గంలో నడుచుకొని; నిత్య+ఆనంద స్వరూపులు+అగుదురు= నిత్యమైన బ్రహ్మానంద స్వరూపులవుతారు (విముక్తులవుతారు); దీని= ఈ సంసారంయొక్క; గహనత్వంబు= దాటటంలోని క్లేశం; పెద్దలచేతన్+వృద్ధులవలన; వినిన తెఱంగు= విన్న పద్ధతి; చెప్పెదన్= నీకు చెబుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అందువలన ఈ సంసారం బహుదుఃఖాలకు నిలయం - అన్నది చాలా స్పష్టమైన అంశం. అది అట్లా ఉంచుదాం. లోభ క్రోధ మదాల చేత మనుష్యులు ఒక ఉన్మాద స్థాయిలో పడిపోయి దుష్టబుద్ధులై నిరంతరం విషయ లంపటంలోనే మునిగి సుఖం అనుభవిస్తూ కాలం గడిపేస్తారు. కొద్దిపాటిదైన ఈ సుఖం కొరకు ఒకరినొకరు

చెరపటానికి, చివరకి చంపటానికి కూడా వెనుదీయరు. ఈ పనిలో వాళ్ళు ధర్మపథాన్ని వదలివేసి చివరకి యమభటుల చేతుల్లో చిక్కుతారు. పుణ్యాత్ములు ఈ విధంగా దుష్ట బుద్ధులు నశించటాన్ని ప్రాజ్ఞులద్వారా విని నిత్యానిత్య వివేకం పొంది, సన్మార్గంలో వర్తిస్తూ, నిత్యమైన ఆనంద స్వరూపులై విముక్తులవుతారు. ఈ సంసారాన్ని దాటటం ఎంత క్లేశంతో కూడినదో పెద్దలనుండి నేను విన్న విషయం నీకు చెప్పుతాను వినుము.

విదురుడు ధృతరాష్ట్రునకు సంసారగహనంబు తెలంగెఱింగించుట (సం. 11-5-1)

తరువోజ:

అతిదుర్గమగు నరణ్య ప్రదేశమున నవనీసురుం డొకఁ డరుగుచునుండ
మితిలేని ఘోరంపు మృగములు శరభమృగపతిప్రముఖముల్ మిక్కిలి భయము
మతి కావహించుచు మార్గంబునందు మల్లడిగొనుడు నున్మార్గ యానమున
ధృతి దూలఁ జన నవి తిరిగె వెన్వెనుకఁ దెక్కలికాఁడు దోఁతెంచి రాతనికి. 43

ప్రతిపదార్థం: అతి= మిక్కిలి; దుర్గము+అగు= చొరటానికి వీలుకాని; అరణ్య ప్రదేశమునన్= అడవిలో; అవనీసురుండు+ ఒకఁడు= ఒక బ్రాహ్మణుడు; అరుగుచున్+ఉండన్= వెళుతుండగా; మితిలేని= లెక్కకు మిక్కిలి; ఘోరము+మృగములు= భయంకరమైన అడవి జంతువులు; శరభ= శరభాలు; మృగపతి ప్రముఖముల్= సింహాలు మొదలైనవి; మిక్కిలి భయము= గొప్ప భీతిని; మతికిన్= మనసుకి; ఆవహించుచున్= కలిగిస్తూ; మార్గంబునందున్= దారిలో; మల్లడిగొనుడున్= చుట్టుముట్టగా; ఉన్మార్గయానమునన్= దారిని తప్పించి అడ్డదారులు తొక్కి; ధృతిదూలన్= ధైర్యం నశించగా; చనన్= పరుగెత్తగా; అవి= ఆ అడవి జంతువులు; తిరిగె= వెనక్కు మళ్ళాయి; వెను+వెనుకన్= ఆ వెంటనే; ఆతనికిన్= ఆ బ్రాహ్మణుడికి; తెక్కలికాఁడు= దొంగలు; తోఁతెంచిరి= అగుపడ్డారు.

తాత్పర్యం: ప్రవేశించటానికి వీలుకాని ఒక భయంకరమైన అడవిలో ఒక బ్రాహ్మణుడు వెళ్ళుతుండగా లెక్కకు మిక్కిలిగా అడవిజంతువులు, శరభాలు, సింహాలు, పులులు మొదలైనవి గొప్పభీతిని పుట్టిస్తూ అతడి చుట్టూ కమ్ముకొన్నాయి. ఆ బ్రాహ్మణుడు భయంతో వణికిపోతూ అడ్డదారులలో పడి పరిగెత్తటం మూలాన ఆ జంతువులు వెనక్కు మళ్ళాయి. ఆ వెంటనే ఆ బ్రాహ్మణుడికి ఒక దొంగల గుంపు కనిపించింది.

విశేషం: శరభం: మీగండ్లమెకము అని నిఘంటువులు చెప్పుతున్నాయి. సింహ శరభ శార్దూలాలను కలిపి చెప్పుతారు. అడవిలో మిక్కిలి భీతిని కలిగించే జంతువులు ఈ మూడూ అని అంటారు.

తరువోజలో ప్రతిపాదంలోనూ మూడు ఇంద్రగణాలూ, ఒక సూర్యగణమూ, మరల మూడు ఇంద్రగణాలూ, ఒక సూర్యగణమూ ఉంటాయి. మొదటి గణము మొదటి అక్షరమునకు, అయిదవగుణము మొదటి అక్షరమునకు యతిమైత్రి, మరల ఆఱవ గణము మొదటి అక్షరమునకు ఎనిమిదవ గణము మొదటి అక్షరమునకు యతిమైత్రి. ప్రాస నియమం కలదు.

వ. అట్టి యెడ. 44

తాత్పర్యం: ఆ సమయంలో.

తోటకము

గరుపాఱఁగ మేను ప్రకంపమునం । బొరిఁ దొట్రువడం బదముల్ దొలఁగం
జొర నెచ్చోటు లేమి నసువ్యయభీ । భర మొందినఁ జేడ్పడు భావముతోన్. 45

ప్రతిపదార్థం: మేను= శరీరం; గరుపాఱంగన్= నిశ్చేష్టమై వెంట్రుకలు నిక్కపొడుచుకోగా; ప్రకంపమునన్= మిక్కిలి అదిరిపాటుచేత; పొరిన్= మిక్కిలిగా; తొట్రు+పడన్= తడబాటు పొందగా; పదముల్= కాళ్ళు; తొలఁగన్= అటు ఇటూ పడుతుండగా; చొరన్= ప్రవేశించటానికి (దూరటానికి); ఏ+చోటు+లేమిన్= ఏ చోటూ లేకపోవడంచేత; అసువ్యయభీభరము= ప్రాణంపోతుందన్న మిక్కిలి భయం; ఒందినన్= కలుగగా; చేడ్పడు= చేష్టలుడిగిన; భావముతోన్= మనసుతో.

తాత్పర్యం: దొంగలను చూచి అతడి ఒళ్ళు నిక్కపొడుచుకొన్నది. భయంతో అదిరిపోయాడు. అడుగులు తడబడ్డాయి. ఎటువైపూ తప్పించుకొనటానికి వీల్లేని పరిస్థితి. ప్రాణం పోతుందన్న భయం అతిశయించి నిశ్చేష్టుడయ్యాడు.

విశేషం: అలం: స్వభావోక్తి. ప్రకరణోచితమైన ఛందస్సు. తోటకవృత్తంలో ప్రతిపాదానికీ నాలుగు సగణా లుంటాయి. మొదటి అక్షరానికీ తొమ్మిదవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

తే. **దెసలు గలయంగఁ జూచుచు దిక్కుదనకు । నెవ్వరును లేమి వెగడందు నెంత దవ్వు**
సనిన నడవికిఁ గడ లేమియును మృగవ్ర జంబు పొదువుటయును గొందలంబు సేయ. **46**

ప్రతిపదార్థం: దెసలు= దిక్కులు; కలయంగన్= అన్నివైపులా; చూచుచున్= చూస్తూ; తనకున్; దిక్కు; ఎవ్వరును+లేమిన్= ఎవరూలేకపోవటంవలన; వెగడు+అందున్= భయపడ్డాడు; ఎంతదవ్వు+చనినన్= ఎంత దూరం పరిగెత్తినా; అడవికిన్= అడవికి; కడలేమియును= అంతం లేకపోవటం; మృగవ్రజంబు= అడవి జంతువుల సమూహం; పొదువుటయును= కమ్ముకోవటం; కొందలంబున్= చీకాకును; చేయన్= కలగజేయగా.

తాత్పర్యం: అటూ ఇటూ దిక్కులు చూస్తూ, తనను కాపాడేవారు ఎవరూ లేరని తెలిసిపోగా భయం ఎక్కువైంది. ఎంతదూరం పరుగెత్తినా అడవికి అంతం కనిపించటం లేదు. ఎటుపోయినా మృగాలు కమ్ముకొంటూనే ఉన్నాయి. వీటితో అతడు చీకాకు పడిపోగా. (తరువాతి పద్యంతో అన్వయం)

వ. **అప్పు డాభీషణారణ్యంబున నేదిక్కు సూచినను దఱచుగా నొడ్డిన యురులు దోఁచె. ఘోరాకారయగు నొక్క యువిద యతనిం గౌఁగిలించుకొనియెఁ బంచశిరంబులును నగనిభంబులు నగు నాగంబు లనేకంబు లవ్వనంబునం గ్రందుకొనం దిరుగుచుండెఁ దత్ప్రదేశంబున నొక్కయుదపానంబు వల్లీవితానంబుచేత సంవృతంబై మీఁదఁ దృణంబులు వరఁగి నిగూఢంబైయున్న నప్పరుషుం డా నూతంబడి యొక్క బలుదీఁగం దవిలి తలక్రిందై వ్రేలుచుఁ గొమ్మనున్న పనసవంటి చందంబున నుండె న ట్లయ్యవస్థ నొందియు నక్కూపంబులో నొక్కభీమభుజంగంబు నాలుకలు గ్రోయ నాఱు దలలును బండ్రెండు కాళ్ళును గృష్ణశబల వర్ణంబును గల మహాగజం బానూతి దరినున్న తరువుఁ జేరంజనుదేర నందు శాఖోపశాఖల నానావర్ణంబులగు మధుకరంబులు మధుసంచయనం బాచరించి వర్తింప సితాసితంబులగు మూషికంబు లమ్మహీరుహంబు మూలంబు నఱుకు చుండ.** **47**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ఆ+భీషణ+అరణ్యంబునన్= ఆ భయంకరమైన అడవిలో; ఏ దిక్కు+చూచినను= ఏవైపు చూచినా; తఱచుగాన్= ఎక్కడ పడితే అక్కడ; ఒడ్డిన= పన్నిన; ఉరులు= ఉచ్చులు; తోఁచెన్= కనిపించాయి; ఘోర+ ఆకార+అగు= భయంకరమైన ఆకారమున్న; ఒక్క+ఉవిద= ఒకస్త్రీ; అతనిన్+కౌఁగిలించుకొనియెన్= అతడిని కౌగిలించుకొన్నది;

పంచశిరంబులును= ఐదు తలలున్నవి; నగ నిభంబులున్+అగు= పెద్ద కొండలలాంటివైన; నాగంబులు= ఏనుగులు; అనేకంబులు= చాలా; ఆ+వనంబునన్= ఆ అడవిలో; క్రందుకొనన్= సందడిగా; తిరుగుచుండెన్= తిరుగాడుతున్నాయి; తద్+ప్రదేశంబునన్= అక్కడ; ఒక్క+ఉదపానంబు= ఒకబావి; వల్లీవితానంబుచేతన్= తీగల గుంపుచేత; సంవృతంబు+ఐ= కప్పబడి; మీద= పైన; తృణంబులు+పరఁగి= గడ్డితోకూడి ఉండి; నిగూఢంబు+ఐ+ఉన్నన్= గుర్తించటానికి వీలుకాకుండా ఉండగా; ఆ+పురుషుండు= ఆ బ్రాహ్మణుడు; ఆ నూతన్+పడి= ఆ బావిలోపడి; ఒక్క+బలు+తీఁగన్= ఒక గట్టి తీగకు; తవిలి= తగుల్కొని; తలక్రిందు+ఐ= తలకిందుగా; వ్రేలుచున్= వేలాడుతూ; కొమ్మన్+ఉన్న= కొమ్మచివరనున్న; పనస వంటి చందంబునన్= పనసపండులాగా; ఉండెన్= ఉండిపోయాడు; అట్లు+అవస్థన్+ఒందియున్= అలాంటి దుర్దశను పొందికూడా; ఆ+కూపంబులోన్= ఆ బావిలో; ఒక్కభీమ భుజంగంబు= ఒక పెద్దపాము; నాలుకలు గ్రోయన్= నాలుకలు చాచగా; ఆఱు+ తలలున్= ఆరుతలలూ; పంఢ్రెండు కాళ్ళును= పన్నెండు కాళ్ళూ; కృష్ణ శబలవర్ణంబును= రంగుల చారలు కలిగిన నల్లదనము; కల= కలిగిన; మహాగజంబు= పెద్ద ఏనుగు ఒకటి; ఆ నూతి దరిన్+ఉన్న= ఆ బావి దగ్గరనున్న; తరువున్+చేరన్+ చనుదేరన్= చెట్టు దగ్గరకు సమీపిస్తుండగా; అందున్= ఆ చెట్టులో; శాఖ+ఉపశాఖలన్= కొమ్మలలో రెమ్మలలో; నానా వర్ణంబులు+అగు= వివిధమైన రంగులు గల; మధుకరంబులు= తుమ్మెదలు; మధుసంచయనంబు+ఆచరించి= తేనెను ప్రోగుచేసి; వర్తింపన్= తిరుగుతుండగా; సిత+అసితంబులు+అగు= తెల్లనివి నల్లనివి అయిన; మూషికంబులు= ఎలుకలు; ఆ+మహీరుహంబు+మూలంబున్= ఆ చెట్టు మొదటిని; నఱుకుచున్+ఉండన్= కొరికివేస్తుండగా.

తాత్పర్యం: ఆ సమయంలో ఆ భయంకరమైన అడవిలో ఏవైపు చూసినా ఎక్కడబడితే అక్కడ పన్నిన ఉచ్చులు కనిపిస్తున్నాయి. భయంకరమైన ఆకారమున్న ఒక స్త్రీ ఆ బ్రాహ్మణుడిని కౌగిలించుకొన్నది. ఐదుతలలతో కొండలవలె ఉన్న పెద్ద పెద్ద ఏనుగులు ఆ అడవిలో సందడిగా తిరుగుతున్నాయి. అక్కడ ఒక బావిలో అల్లిబిల్లిగా తీగలు అల్లుకొని ఉన్నాయి. ఆ తీగలపైన గడ్డి నిండి ఉండి, లోపల ఉన్న బావి ఎవరికీ తెలియకుండా ఉన్నది. ఆ బ్రాహ్మణుడు ఆ బావిలో పడ్డాడు. కాని, ఒక గట్టి తీగకు తగుల్కొని తలకిందులుగా వేలాడుతూ కొమ్మ చివరనున్న పనసపండువలె అట్లాగే ఉండిపోయాడు. అట్లాంటి దుర్దశలో అతడుండగా, ఆ బావిలో ఒక పెద్ద సర్పం నాలుకలు చాస్తుండగా ఆరుతలలూ, పంఢ్రెండు కాళ్ళూ ఉన్న ఒక పెద్ద ఏనుగు ఆ బావిదగ్గరున్న చెట్టును సమీపిస్తున్నది. అది రంగు రంగుల చారలున్న నల్లటి ఏనుగు. ఆ చెట్టులోని కొమ్మలు రెమ్మలు చిత్ర వర్ణాలు కలిగిన తుమ్మెదలతో నిండి ఉన్నాయి. ఆ తుమ్మెదలు ఆ పూలనుండి తేనెను బాగా చేర్చిపెట్టి నాట్యమాడుతున్నాయి. ఆ చెట్టుమూలాన్ని నల్లటివి తెల్లటివి అయిన ఎలుకలు తమ బలిష్ఠమైన పండ్లతో కొరికివేస్తున్నాయి.

ఉత్సాహవృత్తము:

ధరణినాథ! వినుము మధుర ధారలెల్ల ప్రొద్దునుం ।
దొరుఁగుచుండ నతఁడు వాని దోహలమున నానుచుం
బొరయఁ డెప్డుఁ దృప్తి వగలప్రోక యైన యట్టి దు ।
స్తరపుటున్కి కొల్లఁబాటుఁ దన్కఁ డించుకేనియున్. 48

ప్రతిపదార్థం: ధరణినాథ!= ఓ రాజా!; వినుము= వినుము; మధురధారలు= తేనెధారలు; ఎల్ల ప్రొద్దునున్= ఎల్లప్పుడూ; తొరఁగుచుండన్= కారుతూ ఉంటే; అతడు= ఆ బ్రాహ్మణుడు; వానిన్= ఆ తేనెలను; దోహలమునన్= ఉత్సాహంతో; ఆనుచున్= తాగుతూ; ఎప్డున్= ఎప్పటికీ; తృప్తిన్= తృప్తిని; పొరయఁడు= పొందడు; వగలప్రోక+ఐన= బాధలకు రాశి (చోటు) అయిన; అట్టి= అట్లాంటి; దుస్తరము+ఉన్కికిన్= దుర్భరమైన స్థితికి; ఒల్లఁబాటున్= నిరాసక్తిని; ఇంచుకేనియున్= కొంచెంకూడా; తన్కఁడు= పొందడు.

తాత్పర్యం: రాజా! వినుము. అట్లా తేనె ధారలు ఆపైన ఉన్న చెట్టులోనుండి పడుతూ ఉంటే ఆ తేనెలను ఎంతో ఉత్సాహంతో త్రాగుతూ ఆ బ్రాహ్మణుడు అట్లాగే ఉండిపోయాడు. ఎంత త్రాగినా అతనికి తృప్తి కలగలేదు. అంత దుర్భరమైన స్థితిలో ఉండి కూడా తన స్థితిపై అతడికి అసహ్యం పుట్టలేదు.

విశేషం: ఉత్సాహవృత్తంలో ప్రతిపాదానికీ ఏడు సూర్యగణాలూ, ఒక గురువూ ఉంటాయి. మొదటి గణం మొదటి అక్షరంచే అయిదవగణం మొదటి అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు. (వాడి పానోత్సాహానికి తగినట్లుగా ఉత్సాహవృత్తం.)

వ. ఇట్లున్న యతనికి నా బహుళవ్యాళంబులం, దెక్కలికాఁడ్రుల యురుల వలనను, నయ్యుగ్రకామినీ కారణంబున నుం, బంచశిరస్కంబులగు సామజంబుల సందడి, నా కూపంబులోనున్న యద్దారుణ దర్వీకరంబు కతంబునను నూతిదరిం జరించునగ్గజంబు ఘోరత్వంబునం జేసియు మూషికంబుల తరుపతనహేతుభావంబునను నాచంచల చంచరీకంబుల కారించుటనుం జేతోవృత్తంబు వికలతాయత్తంబై యుండ నతండు జీవితాశయు విడువం' డనిన విని విదురునకు ధృతరాష్ట్రుం డిట్లనియె. 49

ప్రతిపదార్థం: ఇట్లు+ఉన్న+అతనికిన్= ఇట్లా ఉన్న అతనికి; ఆ+బహు+వ్యాళంబులన్= అక్కడ తిరుగుతున్న చాలా ఏనుగులచేతనూ; తెక్కలికాఁడ్రుల= దొంగలయొక్క; ఉరులవలనను= ఉచ్చులచేతనూ; ఆ+ఉగ్ర కామినీ కారణంబుననున్= ఆ భయంకరమైన స్త్రీ కారణంగానూ; పంచశిరస్కంబులగు= ఐదు తలలున్న; సామజంబుల సందడిన్= ఏనుగుల సందడిచేత; ఆ కూపంబులోనున్న= ఆ బావిలోనున్న; ఆ+దారుణ దర్వీకరంబు+కతంబునను= ఆ భయంకరమైన పాముచేతనూ; నూతిదరిన్= బావివద్ద; చరించు= తిరుగాడే; ఆ+గజంబు= ఆ ఏనుగు యొక్క; ఘోరత్వంబునన్+చేసియున్= భయంకరమైన ఆకారంచేతనూ; మూషికంబుల= ఎలుకలయొక్క; తరుపతన= చెట్టుపడిపోవటమనే; హేతు= కారణమనే; భావంబునన్= ఆలోచనచేతనూ; ఆ+చంచల+చంచరీకంబుల= తిరుగాడే ఆ తుమ్మెదల; కారించుటనున్= పైన ముసిరి ఇబ్బంది పెట్టటంచేతనూ; చేతస్+వృత్తంబు= మనఃస్థితి; వికలత+ఆయత్తంబు+ఐ+ఉండన్= కకావికలై ఉండగా; అతండు= ఆ బ్రాహ్మణుడు; జీవితాశయున్= ప్రాణంపైన ఆశనుమాత్రం; విడువండు= వదలిపెట్టడు; అనినన్+విని= అని చెప్పగా విని; విదురునకున్= విదురుడితో; ధృతరాష్ట్రుండు+ఇట్లనియెన్= ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా తీగలపైన తలకిందుగా వేలాడుతున్న అతడికి అక్కడ మెదలుతున్న పాములు, తిరుగుతున్న దొంగలు, పన్నిన ఉచ్చులు, ఆ భయంకరమైన స్త్రీ కౌగిలింత, ఐదుతలల ఏనుగుల సంచారం, ఆ బావిలోని విషసర్పం, బావి దగ్గర తిరుగుతున్న ఏనుగు, చెట్టును కొరికేస్తున్న ఎలుకలు, చెట్టు పడిపోతుందన్న ఆలోచనవలన పుట్టిన భయం, పైగా ముసురుతున్న తుమ్మెదలు - వీటితో మనసు కకావికలై పోయింది. అయినా ఆ బ్రాహ్మణుడు ఆ సమయంలో కూడా ప్రాణాలపైన ఆశను మాత్రం కోల్పోలేదు' - అని విదురుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు.

క. 'మనమునఁ గృప పుట్టెడు న । ట్లనయముఁ గీడైన యునికి కాతం డెమ్మెఁ
గనియెను విడుమర? దానిన్ । వినవలతుం జెప్పవే వివేకనిరూఢా!' 50

ప్రతిపదార్థం: వివేక నిరూఢా!= వివేకంచేత సుప్రసిద్ధుడవైన ఓ విదురా!; మనమునన్= హృదయంలో; కృప+పుట్టెడున్+అట్లు= దయపుట్టేటట్లుగా; అనయమున్= నిరంతరం; కీడు+ఐన+ఉనికికిన్= అపాయకరమైన ఆ స్థితికి; ఆతండు= ఆ బ్రాహ్మణుడు;

ఏ+మైన్= ఏ విధంగా; విడుమరన్= విమోచనాన్ని; కనియెన్?= పొందాడు?; దానిన్= ఆ పద్ధతిని; వినవలతున్= వినగోరుతున్నాను; చెప్పవే= దయతో వివరించుము.

తాత్పర్యం: 'వివేకంతో పేరు పొందిన విదురా! హృదయం ద్రవించి పోయేటట్లు అట్లా నిరంతరం అపాయకరమైన ఆ స్థితినుండి అతడు ఎట్లా బయటపడ్డాడు? ఈ విషయాన్ని వివరించుము. వినాలని కోరికగా ఉన్నది'.

కవిరాజ విరాజితము

అనవుడు నిట్లను నన్నర పాలును కాతఁడు 'మోక్షము నర్థి జగ
జ్జనులకుఁ బెట్టుట సన్మతిఁ గోరి విశారదు లాదరసంభృతులై
యనఘ! సుదుస్తరమైన భవంబున కచ్చగు నీ యితిహాసము బో
ధన మహనీయ విధంబునఁ జెప్పి రుదాత్తగుణాశ్రయతామహితా! 51

ప్రతిపదార్థం: అనవుడున్= అని ధృతరాష్ట్రుడు అడుగగా; ఆ నరపాలునకున్= రాజుతో; ఆతఁడు= విదురుడు; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; విశారదులు= ప్రాజ్ఞులు; అర్థిన్= పరోపకారబుద్ధితో; జగత్+జనులకున్= ప్రపంచంలోని మనుష్యులకు; మోక్షమున్+పుట్టుట+కోరి= మోక్షం కలగటాన్ని కోరుకొని; సన్మతిన్= మంచి బుద్ధితో; ఆదరసంభృతులై= జగత్తుమీద పరమాదరం కలిగినవారై; అనఘ!= పాపరహితుడా!; సుదుస్తరమైన= దాటటానికి కష్టసాధ్యమైన; భవనంబునకున్= పుట్టుకకు (మానవజీవితానికి); అచ్చు+అగు= తుల్యమైన; ఈ+ఇతిహాసమున్= ఈ కథను; బోధన= జ్ఞానాన్ని; కలిగించే విధంగా; మహనీయ విధంబునన్= గొప్పరీతిలో; చెప్పిరి= చెప్పారు; ఉదాత్త= గొప్ప; గుణాశ్రయతా= గుణములకు ఆశ్రయం ఇవ్వటం వలన; మహితా!= మహనీయుడైన ఓ ధృతరాష్ట్ర మహారాజా! (వినుము).

తాత్పర్యం: అని రాజు అడుగగా విదురుడు ఇట్లా చెప్పాడు. 'లోకంలోని మనుష్యులకు మోక్షం అంటే ఏమిటో తెలియ చెప్పటం కొరకే పండితులు ఈ కథను లోకహితం కోరి చెప్పారు. సరిగా జీవితం ఎట్లా దాటటానికి కష్టసాధ్యమైందో ఈ కథకూడా అచ్చంగా అట్లాంటిదే. అందుకే ఈ ఇతిహాసాన్ని ప్రాజ్ఞులు కల్పించారు. ఈ కథవలన మహత్తరమైన జ్ఞానబోధ కలుగుతుంది. నీవు కూడా గొప్ప గుణాలు కలిగినవాడివే. అందుచేత ఈ కథను వింటే నీకు తెలియని విషయం ఏమీ ఉండదు.

విశేషం: ఇతి+హ+ఆస - ఇతిహాసమని పెద్దలంటారు, ఇట్లా జరిగిందని ఏ కథను పెద్దలు సందర్భవశంగా ఉదాహరిస్తూ వస్తారో అవన్నీ ఇతిహాసాలే. ఇట్లాంటి ఇతిహాసాలు ఎన్నో కలిగిన మహేతిహాసం భారతం. ఇందులో జరిగినవి కొన్ని జరిగాయని జనులు చెప్పుకొంటూ వచ్చినవి కొన్ని, సందర్భాన్నిబట్టి పండితులు కల్పించినవి కొన్ని -ఇవన్నీ కలిసి భారత తాత్పర్యాన్ని నిరూపిస్తున్నాయి. అట్లాంటి కథ ఈ కథ.

కవిరాజవిరాజితవృత్తంలో ప్రతిపాదంలోనూ న,జ,జ,జ,జ,జ లగ - అనే గణాలుంటాయి. 1-8-14-20 అక్షరాలకు యతిమైత్రి, ప్రాసమైత్రి ఉన్నది.

వ. కావున నేతత్స్వరూపం బభివ్యక్తంబుగా వివరింపవలసియుండు వినుము చెప్పెద నా దుర్గంబు సంసార గహనంబు వాలు మృగంబులుఁ దెక్కలికాఱు నురులు రోగంబులు కామినిజర పంచ శిరస్కంబులగు గజంబు లింద్రియ ప్రపంచంబు లాకూపంబున నున్న నాగం బంతకుండు తీఁగ జీవితాశ కూపంబు నుపాంతంబున

నున్న యవనీరుహం బాయువు దాని దెస నడచు సామజంబు సంవత్సరంబు తదీయ శిరంబు లాఱును ఋతువులు తత్పాదంబులు పండ్రెండు మాసంబులు తరుమూలంబు నఱుకు నెలుక లహోరాత్రంబులు మధుకరంబులు కామంబులు మధుధారలు కామరసంబులు మధుసంచయనం బాయువు వానివలన మానవులాసక్తులగుదు రిట్టి సంసార చక్రంబు పరివర్తనంబు బుధు లెఱుంగుదురు వారు దీని పాశంబులు ద్రెంపంజాలుదు' రనిన విని యాంబికేయుండు విదురున కిట్లనియె. 52

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఏతద్= దీని; స్వరూపంబు= స్వరూపాన్ని; అభివ్యక్తంబుగాన్= స్పష్టంగా; వివరింపవలసి యుండున్= వివరించాల్సి ఉంటుంది; చెప్పెదన్+వినుము= చెబుతాను వినుము (జాగ్రత్తగా వినుమని అర్థం); ఆ దుర్గంబు= ఇంతవరకూ వర్ణించిన ఆ అడవి; సంసారగహనంబు= సంసారమనే అడవి; వాలుమృగంబులు= క్రూరమృగాలు; తెక్కలి కాఱు= దొంగలు; ఉరులు= ఉచ్చులు; రోగంబులు= రోగాలు; కామిని= స్త్రీ; జర= ముసలితనం; పంచశిరస్కంబులగు= ఐదు తలలున్న; గజము= ఏనుగు; ఇంద్రియ ప్రపంచంబులు= ఐదు ఇంద్రియాలు (కర్మేంద్రియ జ్ఞానేంద్రియాలు); ఆ కూపంబు= ఆ బావిలో; ఉన్న నాగంబు= ఉన్న పాము; అంతకుండు= యముడు; తీఁగ= ఆ వ్యక్తి చిక్కుకున్న తీగ; జీవిత+ఆశ= బతకాలన్న కోరిక; కూపంబు+ఉపాంతంబునన్+ఉన్న= బావిసమీపంలోని; అవనీరుహంబు= చెట్టు; ఆయువు= ఆయుస్సు; దానిదెసన్= దానివైపు; నడచుసామజంబు= నడిచివచ్చే ఏనుగు; సంవత్సరంబు= సంవత్సరం; తదీయశిరంబులు+ ఆఱును= ఆ ఏనుగుకున్న ఆరు తలలూ; ఋతువులు= ఆరు ఋతువులు; తత్పాదంబులు పండ్రెండున్= దాని పండ్రెండు కాళ్ళు; మాసంబులు= నెలలు; తరుమూలంబు నఱుకు= చెట్టుమొదలును కొరికేటువంటి; ఎలుకలు= ఎలుకలు; అహోరాత్రంబులు= పగలు, రాత్రి; మధుకరంబులు= తుమ్మెదలు; కామంబులు= కోరికలు; మధుధారలు= తేనె ప్రవాహాలు; కామరసంబులు= ఇష్టప్రాప్తివలన పుట్టే తృప్తి; సంతోషం మొదలైన భావాలు; మధు సంచయనంబు= తుమ్మెదలు దాచిన తేనె; ఆయువు= ఆయుస్సు; వానివలనన్= కామం, దాని తృప్తి, ఇంకా బ్రతకాలన్న కోరిక, మిగిలిన ఆయుస్సు - వీటివలన; మానవులు= మనుష్యులు; ఆసక్తులగుదురు= జీవితంపట్ల ఆశకలిగిన వారు అవుతారు; ఇట్టి సంసార చక్రంబు+పరివర్తనంబు= సంసారమనే చక్రం తిరగటం ఇలాంటిదని; బుధులు+ఎఱుంగుదురు= పండితులు తెలుసుకొంటారు; వారు= అలాంటి ప్రాజ్ఞులు; దీని పాశంబులు= దీని పాశాలను; త్రెంపన్+చాలుదురు= తెంచిపారవేయగలుగుతారు; అనినన్+విని= అని విదురుడు చెప్పగా విని; ఆంబికేయుండు= అంబికాతనయుడైన ధృతరాష్ట్రుడు; విదురునకున్+ఇట్లు+అనియెన్= విదురుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కాబట్టి దీని స్వరూపాన్ని వివరిస్తే కాని అర్థం కాదు. చెప్పుతాను జాగ్రత్తగా వినుము. ఇంతవరకు వర్ణించిన ఆ అడవే సంసారం. క్రూరమృగాలే దొంగలు. ఉచ్చులే రోగాలు. ఆ స్త్రీయే ముసలితనం. ఐదు తలలున్న ఏనుగు ఐదు ఇంద్రియాలకు ప్రతీక. ఆ బావిలోని పామే యమధర్మరాజు. ఆ వ్యక్తి చిక్కుకున్న తీగయే బతకాలన్న కోరిక. ఆ బావి వద్దనున్న చెట్టు ఆయుస్సు. దానివైపు నడిచి వచ్చే ఏనుగు సంవత్సరం. దాని ఆరు తలలూ ఆరు ఋతువులు, పన్నెండు కాళ్ళూ పన్నెండు నెలలు. ఆ చెట్టు మొదటిని కొరికివేస్తున్న ఎలుకలే రేయుంబవళ్ళు. (అందుకే నల్లగా తెల్లగా ఉన్నాయనటం). ఆ తుమ్మెదలే ఎడతెగని కోరికలు. కారుతున్న తేనె ప్రవాహాలే ఇష్టప్రాప్తివలన కలిగే సుఖసంతోషాదిభావాలు. ఆ తుమ్మెదలు చేర్చి ఉంచిన తేనెపట్టే ఆయుస్సు. వీటిచేత మనిషి ఇంకా బ్రతకాలని కోరుకొంటాడు. సంసారమనే చక్రం తిరగటం ఇలాంటిదని పండితులు తెలిసికొంటారు. వివేకవంతులైనవారు ఆ ఉచ్చులలో పడరు. పాశాలను ఛేదించుకొని బయటపడగలుగుతారు' అని విదురుడు చెప్పగా ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు.

విశేషం: ఆ తీగపైన తలకిందులుగా వేలాడుతున్న మనిషివంటి బ్రతుకే మానవజీవిత మని తాత్పర్యం. ఇది అసలు బ్రతుకు కాదు. ఆ బావిలోనుండి బయటపడటం ఎంతకష్టమో ఈ మానవజీవితం నుంచి విముక్తి పొందటం కూడా అంతే కష్టం.

ఈ కథలోని పాత్ర - 'బ్రాహ్మణుడు' - ప్రతిమనిషీ ఆలోచన కలిగితే బ్రాహ్మణుడే అవుతాడని అర్థం. మోక్షానికి అర్హుడేనని అర్థం. అగ్రవర్ణీయుడైనా జీవితంలోని కామాది గుణాలకు బానిస కాక తప్పదని చెప్పటంకోసమే ఈ ఇతిహాసంలోని పాత్రగా బ్రాహ్మణుడు చెప్పబడ్డాడు.

ఇంద్రియాలు ఐదు. జ్ఞానేంద్రియాలు (త్వక్, చక్షుః, శ్రోత్ర జిహ్వాఘ్రాణాలు - చర్మం, కన్ను, చెవి, నాలుక, ముక్కు); జ్ఞానేంద్రియాలు పదార్థ జ్ఞానం కలిగిస్తాయి.

కర్మేంద్రియాలు - వాక్, పాణి, పాద, పాయు, ఉపస్థలు (నోరు, చేయి, కాలు, గుద, జననేంద్రియాలు) - ఇవి కర్మావహం కలిగినవి. మనిషి సదా ఈ రెండింటి ద్వారా అటు మనసులోనూ, ఇటు దేహంలోనూ ఏదో ఒకపని చేస్తుంటాడు. అందుకే ఆ ఏనుగు నిరంతరం తిరుగుతూనే ఉన్నదనటం.

కాలాన్ని ఎలుకలతో పోల్చి చెప్పటం కూడా ఆలోచించదగినదే. కాలం తరిగిపోతుంది. నల్ల తెల్ల వర్ణాలే రేయుంబవళ్ళు. కడచిన కాలం మళ్ళీ రాదు కాబట్టి అది కొరికివేస్తున్నదనటం.

అన్ని అనుభవాలకన్నా కోరిక సిద్ధించినపుడు కలిగే సంతోషం మధురంగా ఉంటుంది. అంచేతనే అది 'తేనె' అనటం.

కాని, చివరి నిమిషం వరకు బ్రతకాలన్న కోరిక మనిషిని మళ్ళీ ఆశాపాశాలవైపు లాగుకొని వెళ్తుంది. ఆ కోరికను ఎవడు అదుపులో ఉంచుకొని నిరాసక్తుడవుతాడో - వాడు అసంగుడవుతాడు. అసంగత్వమే - వాడికి శస్త్రమవుతుంది. అట్లాంటివాడు ఈ సాంసారిక బంధాలనుండి విముక్తి పొందగలడు.

'అసంగశస్త్రేణ దృఢేన ఛిత్వా' అని భగవద్గీత అందుకే కీర్తించింది. ఆ విషయాన్నే విదురుడు ఈ ఇతిహాసం ద్వారా ధృతరాష్ట్రునికి బోధిస్తున్నాడు. ఇది మానవునికి సార్వకాలికమైన ప్రబోధం.

క. 'హిత ముపదేశించితి వీ । వతి నిర్మల చిత్తవృత్తి వగుట సుజన సం
స్తుత గుణ! యింకను జెప్పుము । ధృతికారక వచన పద్ధతిన్ విశదముగన్.' 53

ప్రతిపదార్థం: ఈవు= నీవు (ఓ విదురా!); అతి నిర్మల= అతి పవిత్రమైన; చిత్తవృత్తివి+అగుటన్= మనోవృత్తి కలిగినవాడివి కావటంచేత; హితము+ఉపదేశించితి(వి)= నాకు మంచిని బోధించావు; సుజనసంస్తుతగుణ!= సుజనులచేత ప్రస్తుతించబడే గుణాలు కలవాడా! ఓ విదురా!; ధృతి= ధైర్యాన్ని; కారక= కలిగించే; వచనపద్ధతిన్= మాటలతో (రీతిలో); విశదముగన్= వివరంగా; ఇంకనున్+చెప్పుము= ఇంకా కాస్త బోధించుము.

తాత్పర్యం: 'విదురా! నీవు అతిపవిత్ర చిత్తవృత్తి కలవాడివి. నాకు హితాన్ని ఉపదేశించావు. నీ బోధనలవలననే సుజనులు నిన్ను ఎప్పుడూ కీర్తిస్తారు. నాకు ధైర్యం కలిగే రీతిలో ఇంకా వివరంగా ఈ విషయాన్ని బోధించుము'.

వ. అనుటయు విదురుం డవ్విభున కిట్లనియె. 54

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; విదురుండు; ఆ+విభునకున్= ఆ రాజుతో; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు పలుకగా విదురుడు ఆయనతో ఇట్లా అన్నాడు.

కవిరాజ విరాజితము:

అనయము లోలతమై విషయప్రచయంబను దుస్తర పంకమునన్
మునుఁగుచుఁ దేలుచు నుండఁగఁ గాలము ముట్టి రుజన్ జర నెవ్వగ పై
కొన దొరకొల్పి క్రమంబున నంగము క్రొవ్వును జెల్వును బాపి ప్రయో
జన రహితంబుగఁ జేసి యపాత్రపుఁజా వొనరించుఁ గురుప్రవరా! 55

ప్రతిపదార్థం: కురుప్రవరా!= రాజా!; (మానవుడు) అనయమున్= నిరంతరం; లోలతమైన్= ఆసక్తితో (వ్యామోహంతో); విషయప్రచయంబు+అను= విషయ సమూహం అనేటటువంటి; దుస్తర పంకమునన్= దాటిపోవటానికి వీల్లేని బురదలో; మునుఁగుచున్+తేలుచున్= మునుగుతూ తేలుతూ; ఉండఁగన్= ఉండగా; కాలము= (ఇంతకు ముందు వివరించిన) కాలశక్తి; ముట్టి= తాకి; రుజన్= రోగంచేతనూ; జరన్= ముసలితనంచేతనూ; నెఱి+వగ= అధికదుఃఖం; పైకొనన్= ఆక్రమించగా; దొరకొల్పి= ఉసికొల్పి; క్రమంబునన్= క్రమంగా; అంగము= దేహంయొక్క; క్రొవ్వును= శక్తిని; చెల్వును= అందాన్ని; పాపి= పోగొట్టి; ప్రయోజనరహితంబుగన్+చేసి= ఎందుకూ పనికిరాకుండా చేసి; అపాత్రము+చావు= ఆయా జన్మకు ఉచితంకాని రీతిలోనైనాసరే చచ్చే విధంగా (అనుచిత మరణాన్ని); ఒనరించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: కురువంశం రాజులలో శ్రేష్ఠుడవైన ధృతరాష్ట్ర మహారాజా! వినుము. వ్యామోహంతో నిరంతరం విషయ ప్రపంచమనే బురదలో మునిగి తేలుతూ ఒకవైపు మనిషి తననుతాను మరచి ఉండగా, మరోవైపు కాలశక్తి రోగాన్ని, ముసలితనాన్ని ఉసికొల్పి మనిషిని ఆక్రమించేటట్లు చేస్తుంది. దానితో క్రమంగా మనిషిలోని శక్తి సన్నగిల్లుతుంది. అందం తరిగిపోతుంది. దేహం ఎందుకూ పనికిరాకుండా పోతుంది. చివరికి అన్యాయపు చావు చస్తాడు. ఇంతే మనిషిగతి.

విశేషం: అలం: రూపకం. కవిరాజ విరాజితంలో ప్రతిపాదానికీ- న, జ, జ, జ, జ, జ, వ అనే గణాలుంటాయి. 1-14 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. అని మఱియును. 56

తాత్పర్యం: అని అంటూ ఇంకా.

క. 'తేరు శరీరము దానికి । సారథి సత్త్వంబు తురగచయ మింద్రియముల్
దారుణతర బుద్ధి వ్యా । పారము లొనరంగ గనప పగ్గము లధిపా! 57

ప్రతిపదార్థం: అధిపా!= రాజా! (వినుము); శరీరము= ఈ దేహం; తేరు= రథం; సత్త్వంబు= బుద్ధి; సారథి= రథాన్ని నడిపేవాడు; ఇంద్రియముల్= అవయవాలు; తురగచయము= గుర్రాలు; దారుణతర= మిక్కిలి భయంకరమైన; బుద్ధి= మతి (చేసే); వ్యాపారములు= ఆలోచనలు; ఒనరంగన్= అమరినట్లుగా; గనప= పెద్దవైన; పగ్గములు= పగ్గాలు.

తాత్పర్యం: 'ఓ రాజా! వినుము. ఈ శరీరం ఒక రథం. దానికి సారథి బుద్ధి. కరచరణాది ఇంద్రియాలే గుర్రాలు. బుద్ధిచేసే భయంకరమైన ఆలోచనలే పగ్గాలు.

విశేషం: మనస్సు, బుద్ధి అనే మాటలను కొంత వివరించాల్సిన అవసరం ఉన్నది. మనస్సు- ఒక జ్ఞానేంద్రియం. పనులు చేయటానికి కావలసిన ప్రేరణ ఇచ్చేంతవరకే దానిపని. మంచి చెడుపనులకు రెంటికీ ప్రేరణ మనస్సే ఇస్తుంది.

బుద్ధి - మనసుకన్నా లోపలిపొర. సంకల్ప - వికల్పాలకు మీట (switch) బుద్ధి, విచక్షణ (discretion) బుద్ధి వ్యాపారం. అందుకే బుద్ధిని అంతఃకరణశక్తిగా చెప్పవచ్చును. శుశ్రూష, శ్రవణం, గ్రహణం, ధారణం, ఊహ, అపోహ, అర్థవిజ్ఞానం, తత్త్వజ్ఞానం- ఇవి బుద్ధివ్యాపారాలుగా చెప్పబడ్డాయి.

చిన్నతనంలో ఎవరిని సేవిస్తామో, ఏది వింటామో, ఏది గ్రహించి మనసులో పదిలపరుచుకొంటామో, ఎట్లా ఊహిస్తామో, ఎట్లా తర్కిస్తామో, ఇహపరాలమీద ఏ ఆలోచనలు కలిగి ఉంటామో అవన్నీ కలిసి ఏర్పడే లోపలిపొర బుద్ధి. దానినిబట్టి ఆలోచన, దాన్నిబట్టి పని ఉంటాయి.

పగ్గాలు ఎట్లా లాగితే గుర్రాలు అట్లా పరుగిడుతాయి. అందుకని అవి బలిష్ఠంగా ఉండాలి. అప్పుడే గుర్రాలను అదుపు చేయగలుగుతాయి. దుర్మార్గపుటాలోచనలు బలిష్ఠంగా ఉన్నప్పుడు ఏమవుతుందో తరువాతి పద్యంలో (58) చెప్పుతున్నాడు. ఆ తరువాతి పద్యంలో (59) ఆలోచనలను ఎట్లా అదుపు చేయాలో చెప్పాడు. ఆ మీది పద్యంలో (60) ఈ దేహరథం ఎట్లా యముడి అధీనమో, వివేకంతో దానిని ఎట్లా నియంత్రించుకొనవచ్చో చెప్పాడు.

ఈ నాలుగు పద్యాల మూలాన్నీ కఠోపనిషత్తులో చూడవచ్చును. నచికేతునికీ యముడికీ సంవాదరూపంలో ఉన్న ఈ ఉపనిషత్తులో ఈ విషయం ఉన్నది.

"ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు

బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ."

(ఆత్మను రథంలోని యజమానుడిగా తెలిసికొనుము. శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సును కళ్ళెంగా తెలిసికొమ్ము.)

"ఇంద్రియాణి హయా నాహుః విషయాంస్తేషు గోచరాన్,

ఆత్మేంద్రియ మనో యుక్తం భోక్తే త్యాహు ర్మనీషిణః".

(ఇంద్రియాలు గుర్రాలు. వాటి మార్గాలు ఇంద్రియ సుఖాలు. ధీమంతులు దేహేంద్రియ మనస్సులతో కూడిన 'ఆత్మను' 'భోక్త' అని పిలుస్తారు.)

తిక్కనగారు రథికుడు 'ఆత్మ' అనే విషయాన్ని అనువదించకపోయినా 'సత్త్వం' అనే మాటతో 'సారథి'ని సూచించటంలో ఈ మంత్రంలోని అర్థమంతా ఉన్నది. మనస్సు కళ్ళెం అనే మాటను కూడా 'ఆలోచనలు'గా చెప్పాడు.

"య స్త్వవిజ్ఞానవాన్ భవ త్యయుక్తేన మనసా సదా

తస్యేన్ద్రియాణ్యవశ్యాని దుష్టాశ్వా ఇవ సారథేః."

(అయుక్తమైన మనస్సు కలవాడై అవిజ్ఞానవంతుడైన వాడికి సారథికి దుష్టాశ్వాలు వశం కానట్లు ఇంద్రియాలు వశం కావు.)

ఈ అర్థాన్నే తరువాతి పద్యంలో తిక్కనగారు చెప్పుతున్నారు.

క. నరవర! యేర్పడ విను మ । త్తురగంబుల పటు రయంబుతో ననుసరతం

దిరుగు పురుషుండు సంసృతిఁ । బరువడి భ్రమియించు నవశభావవ్యాప్తిన్. 58

ప్రతిపదార్థం: నరవర!= ఓ రాజా!; ఏర్పడన్= కుదురుగా; వినుము; ఆ+తురగంబుల= ఆ గుర్రాల; పటు= బలిష్ఠమైన; రయంబుతోన్= వేగంతో; అనుసరతన్= పాటుగా; తిరుగు పురుషుండు= తిరిగే మనిషి; అవశభావవ్యాప్తిన్= తన అధీనంలోలేని భావాలకు లోబడి; సంసృతిన్= సంసారంలో; పరువడిన్= క్రమంగా; భ్రమియించున్= అటూ ఇటూ భ్రమిస్తుంటాడు.

తాత్పర్యం: ఓ రాజా! జాగ్రత్తగా వినుము. ఆ గుర్రాలు ఎంత వేగంగా వెళ్తే వాటి కనుగుణంగా ఎవరు తిరుగుతారో వారు తమ అధీనంలోలేని భావాలకు లోబడి ఈ సంసారంలో ఉరుకులు పరుగులతో అటూ ఇటూ భ్రమిస్తుంటారు.

విశేషం: ఇంద్రియాలు చెప్పినట్లుగా వింటూ పోతే చివరకి మిగిలేది 'బంధం' మాత్రమేనని తాత్పర్యం. సంసృతి - అనే పదం చాలా విశిష్టమైనది. ఎప్పటికీ కొనసాగుతూ పోయేదని అర్థం. ఆ ప్రయాణానికి అంతం ఉండదు. అందుకే పరుగెత్తటం అనటం. అంతే కాదు - నిర్దిష్ట గమ్యముండదు కాబట్టి 'భ్రమించటం' అనే మాటను తిక్కనగారు వాడారు.

క. వానిఁ దమయిచ్చ నెందుం । బోనీ కుండంగ నాఁగు పురుషుఁడు సంసా
రానేక దుఃఖభాజన । తా నిరసనమునకు నేర్చు ధరణీనాథా! 59

ప్రతిపదార్థం: ధరణీ నాథా!= రాజా!; వానిన్= ఆ గుర్రాలను; తమ ఇచ్చన్= తమ ఇష్టప్రకారం; ఎందున్+పోనీక+ఉండంగన్= ఎటూవైపూ పోనీకుండా ఉండేలా; ఆఁగు= ఆపేటువంటి; పురుషుఁడు= మనిషి; సంసార= సంసారంలోని; అనేక వివిధాలైన; దుఃఖ= దుఃఖాలకు; భాజనతా= పాత్రమగుటయొక్క; నిరసనమునకున్= తిరస్కారానికి; నేర్చున్= సమర్థ డౌతాడు.

తాత్పర్యం: రాజా! ఆ గుర్రాలను తమ ఇష్టం వచ్చినట్లు పోనీకుండా ఎవడు ఆపగలుగుతాడో అట్లాంటి మనిషి సంసారంలో అనేక దుఃఖాలపాలు కాకుండా ఉండటం నేర్చుకొనగలుగుతాడు.

విశేషం: పగ్గాలను రౌతు సరిగా నియమించకపోతే గుర్రాలు అదుపులో ఉండవు. తమ ఇష్టం వచ్చినట్లు పరిగెడుతాయి. ఎప్పుడు ఆలోచనలను గట్టిగా పట్టుకొని ఇంద్రియాలను అదుపుచేసికొంటామో అప్పుడు క్షేమంగా తేరును కాపాడుకొన గలుగుతాము.

కఠోపనిషత్తు ఈ విషయాన్ని ఇట్లా వివరిస్తున్నది.

"యస్తు విజ్ఞానవా న్భవతి సమనస్క స్సదా శుచిః
స తు తత్పద మాప్నోతి యస్మా ద్భూయో న జాయతే."

(ఎవడు వివేకవంతుడో, మనోనిగ్రహం కలవాడో, సదా పవిత్రుడో అట్లాంటివాడు పునరావృత్తిరహితమైన ఆ 'పరమ' పదాన్ని పొందుతాడు.

ఈ 'పరమపదం' అనే అర్థాన్నే 'దుఃఖభాజనతా నిరసన'మని తిక్కనగారు చెప్తున్నారు.

క. యముని యధీనం బిది దుః । ఖముల ననేకములఁ జేయఁగా నోపు నృపో
త్తమ! యీరథ మది యడఁతురు । విమలవివేకౌషధమున విను మార్యజనుల్. 60

ప్రతిపదార్థం: నృపోత్తమ!= రాజశ్రేష్ఠుడా!; వినుము; ఇది= ఈ జీవితం; యముని= కాలస్వరూపుడైన యమధర్మరాజుయొక్క; అధీనంబు= అధీనంలో ఉంటుంది (అంతేకాదు); అనేకములన్= నానా విధాలైన; దుఃఖములన్; చేయఁగాన్= కలిగించటానికి;

ఓపున్= సమర్థమైనది; ఆర్యజనుల్= పుణ్యాత్ములు (ప్రాజ్ఞులు); విమల= పవిత్రమైన; వివేక= వివేకమనే; ఔషధమునన్= మందుతో; ఈ రథము+అది= (ఈ శరీరం ఏదైతే ఉందో) దాన్ని; అడఁతురు= అధీనంలో ఉంచుకొంటారు.

తాత్పర్యం: రాజా! వినుము. ఈ జీవితం యముడి అధీనంలో ఉంటుంది. అంతే కాకుండా ఎన్నో విధాలైన దుఃఖాలకు ఇది నిలయం. అందుచేత పుణ్యాత్ములు వివేకమనే మందుతో శరీరమనే ఈ తేరును అదుపులో ఉంచుకొంటారు.

విశేషం: అలం: రూపకం. అకార్యం (చేయదగింది, చేయరానిది) అనే రెండు విషయాలను గురించి వివేచన ఉండటమే వివేకం. బుద్ధికి ఉన్న శక్తులన్నీ కలిగించేది వివేకాన్ని. ఆ శక్తులు దురుపయోగంపాలు అయితే అవివేకం ఏర్పడుతుంది. అపుడు ఇంద్రియాలు విజృంభిస్తాయి. ఫలితం రుజ-జర ఇత్యాదిగా ఉన్న అనారోగ్యం. దీనికి మందు వివేకమే. అందుకే 'వివేకౌషధమునన్' అని చెప్పటం.

వ. ఆ పగ్గంబులు శీలంబను వెరవుతో నలవరించి వేగం బార్యు లుడుపుదురు వారలు జననమరణాదుల వలని భయంబు నుజ్జగించి పరమసుఖంబు నొందుదు రింతయు నెఱింగి శాంతినొంది పుత్రాది జ్ఞాతులకు నౌర్ధ్వదైహికంబులు సేయించి సుఖివిగ'మ్మనిన విని యమ్మాటలన్నియుం బోవిడిచి తుదింజెవి సూఁడినట్టి దయినఁ బుత్ర పరలోక క్రియావిషయంబగు మాటకు శోకం బతిశయిల్ల మూర్ఛిల్లె నట్టి సమయంబునం గృష్ణద్వైపాయనమునీంద్రుఁ డయ్యెడకు విజయంచేసిన విదురసంజయాదులు సంభ్రమంబున నెదురువచ్చి ప్రణతులైధృతరాష్ట్రునకు శిశిరజలసేచన లలితవ్యజనవీజనంబుల నాచరించిన నతండు సేదదేఱుటయు నతని కమ్మహాత్ముని రాక యెఱింగించిన నమ్మహీపతి యతనికి దండనమస్కారంబుసేసి గద్గదిక నెలుంగు రాలుపడ నిట్లనియె. 61

ప్రతిపదార్థం: ఆర్యులు= పుణ్యాత్ములు; ఆ పగ్గంబులు= ఆ పగ్గాలను; శీలంబు= నడవడి; అను= అనేటువంటి; వెరవుతోన్= ఉపాయంతో; అలవరించి= నియమించి; వేగంబు= ఆ గుర్రాల వేగాన్ని; ఉడుపుదురు= నియంత్రిస్తారు; వారలు= అట్లాంటి పుణ్యాత్ములు; జనన= పుట్టుకవలన; మరణ+ఆదుల వలని= మరణం మొదలైన వాటివలన (కలిగే); భయంబున్= భయాన్ని; ఉజ్జగించి= వదలిపెట్టి; పరమసుఖంబున్= మోక్షాన్ని; ఒందుదురు= పొందుతారు; ఇంతయున్+ఎఱింగి= ఇదంతా గుర్తించి; పుత్ర+ఆది జ్ఞాతులకున్= కొడుకులకు దాయాదులందరికీ; ఔర్ధ్వదైహికంబులు= ఉత్తర క్రియలు; చేయించి; సుఖివి+కమ్ము+అనినన్= సుఖంగా ఉండుము అని చెప్పగా; విని= వినికూడా; ఆ+మాటలు+అన్నియున్= ఆ మాటలన్నిటిని; పోన్+విడిచి= వదలిపెట్టి; తుదిన్= చివరిలో; చెవి సూఁడినట్టి దయినన్= చెవిని కాల్చినటువంటిది కాగా; పుత్ర= కొడుకులయొక్క; పరలోక+ఉత్తర; క్రియా విషయంబు+అగు+మాటకున్= క్రియలకు సంబంధించిన మాటలచేత; శోకంబు+అతిశయిల్లన్= దుఃఖం పెల్లుబికిరాగా; మూర్ఛిల్లెన్= మూర్ఛపోయాడు; అట్టి సమయంబునన్= ఆ సమయంలో; కృష్ణద్వైపాయన మునీంద్రుఁడు= వ్యాసుడు; ఆ+ఎడకున్= అక్కడికి; విజయము+చేసినన్= రాగా; విదుర సంజయులు= విదురుడు, సంజయుడు; సంభ్రమంబునన్= ఆశ్చర్యంగా; ఎదురువచ్చి= ఎదుర్కొని (ఆహ్వానించి); ప్రణతులు+ఐ= నమస్కరించి; ధృతరాష్ట్రునకున్= రాజుకు; శిశిరజల= చల్లటి నీటిని; సేచన= చల్లడమూ; లలిత= సుకుమారంగా; వ్యజన వీజనంబులన్= విసనకర్రతో విసరడమూ; ఆచరించినన్= చేయగా; అతండు; సేదదేఱుటయున్= బడలికదీరగా; అతనికిన్= ధృతరాష్ట్రునికి; ఆ+మహాత్మునిరాక= వ్యాసుడిరాకను; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+మహీపతి= ఆ రాజు; అతనికిన్= వ్యాసుడికి; దండనమస్కారంబు+చేసి= సాష్టాంగ నమస్కారం చేసి; గద్గదికన్= డగ్గుత్తికతో; ఎలుంగు= కంఠధ్వని; రాలుపడన్= కంపిస్తుండగా; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: 'పుణ్యాత్ములు ఆ పగ్గాలను నడవడి అనే ఉపాయంతో నియంత్రించి ఆ గుర్రాల వేగాన్ని అదుపులో ఉంచుకొంటారు. అట్లాంటి పుణ్యాత్ములు పుట్టుక మరణం మొదలైన వాటివలన కలిగే భయాన్ని విడిచిపెట్టి మోక్షసుఖాన్ని పొందుతారు. ఇదంతా గుర్తించి నీవు నీ పుత్రాదులకు, నీ దాయాదులకు ఉత్తరక్రియలు జరిపించి సుఖంగా ఉండుము' అని చెప్పగా విని, ఆ మాటలన్నిటినీ వదలిపెట్టి చివరిలో 'నీ పుత్రులకు ఉత్తరక్రియలు చేయుము' అన్నమాట చెవిని కాల్చివేయగా, దుఃఖం పెల్లుబికి రాగా, మూర్ఛపోయాడు. ఆ సమయంలో సరిగ్గా వ్యాసుడు అక్కడికి వచ్చాడు. విదురుడు, సంజయుడు మున్నగువారు ఆశ్చర్యపడి గౌరవంతో ఆయనను ఆహ్వానించి నమస్కరించారు. మరొకవైపు ధృతరాష్ట్రుడి ముఖంపైన చల్లని నీటిని చల్లి, విసనకర్రలతో నెమ్మదిగా విసిరి ఉపచారాలు చేశారు. సేదదీరిన ధృతరాష్ట్రుడికి వ్యాసముని రాకను తెలిపారు. ఆ రాజుకూడా గౌరవంతో వ్యాసమహర్షికి సాష్టాంగ నమస్కారంచేసి డగ్గుత్తికతో గొంతు కంపిస్తుండగా ఇట్లా అన్నాడు.

విశేషం: ఇంతమంది ఇన్ని విధాలుగా ఉపదేశించినా దేహధారి తన ఇంద్రియాల మార్గంలోనే వెళ్తాడని చెప్పటం కొరకే ధృతరాష్ట్రుడి ఈ అవస్థను వర్ణించటం. రాష్ట్రమంటే-శరీరం, దానిని ధృత-ధరించినవాడు. అతడి పిల్లలే అతడి ఇంద్రియాలు. రాజ్యభోగమే అతడి మనసుకున్న లోభగుణం. అందుకే పుత్రులమాట వినగానే 'వివేకం' నశిస్తుంది. భారత కథకంతా మూలం ఇదే.

దోధక వృత్తము:

> **'మానుష జన్మము మాన్య వివేకా! । మానసదుఃఖ సమాజము నెల్లం**
> **దాన ఘటించుచు దైన్యము దెచ్చుం । గాన భవంబిది గాల్పనె? తండ్రీ!** 62

ప్రతిపదార్థం: మాన్య= మహనీయమైన; వివేకా!= జ్ఞానం కలవాడా! (వ్యాసమహర్షీ); మానుషజన్మము= మానవజన్మ; మానస దుఃఖ సమాజమునెల్లన్= మనసుకు అన్ని విధాల దుఃఖాలనూ; తాను+అ= తానే; ఘటించుచున్= సృష్టిస్తూ; దైన్యమున్+తెచ్చున్= దీనస్థితిని కల్పిస్తుంది; కాన= కాబట్టి; తండ్రీ!= ఓ తండ్రిగారైన వ్యాసమహర్షీ!; భవంబు+ఇది= ఈ పుట్టుక; కాల్పనె?= కాల్చటానికా? (నిష్ప్రయోజనమని అర్థం.)

తాత్పర్యం: 'మహనీయజ్ఞాన సంపన్నుడవైన వ్యాసమహర్షీ! ఈ మానవజన్మ తానంతట అదే మనస్సుకు అన్ని విధాలైన దుఃఖాలను సృష్టించి దీనస్థితిని కల్పింపజేస్తుంది. అందుచేత తండ్రీ! ఈ జన్మం ఎందుకు? కాల్చనా? (చివరకి ఎట్లాగూ జరిగే పని అదే!) ప్రయోజనం ఏమున్నది?

విశేషం: భవశబ్దానికి పుట్టుక-జన్మ-సంసారం- అని సందర్భాన్నిబట్టి అర్థాలుంటాయి. భూ-అనే ధాతువుకు పుట్టటమని అర్థం-ఎప్పటికప్పుడు కొత్తగా అనిపిస్తూ పుట్టేదికాబట్టి దీనిని జన్మమని-కొత్తగా ఏదో సమస్య పుట్టుతూనే ఉంటుంది. కాబట్టి-సంసారమని-అంటాం.

దోధక వృత్తంలో పాదానికి - భ, భ, భ, గ, గ అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ, ఏడవ అక్షరానికీ యతిమైత్రి, ప్రాస నియమం కలదు.

మంజుభాషిణీ వృత్తము:

ధనమంతయుం బొలియ దారుణంబుగాఁ । దనయవ్రజంబు దెగ దైన్యమారఁగాఁ
దన బంధులందఱు మృతంబుఁ బొంద నె । వ్వనినైన శోకమనువహ్ని కాల్చదే? 63

ప్రతిపదార్థం: ధనమంతయున్= ధనమంతా; పొలియన్= నశించిపోగా; దారుణంబుగాన్= ఘోరంగా; తనయవ్రజంబు= కుమారుల సమూహం; తెగన్= చనిపోగా; దైన్యము+ఆరఁగాన్= దీనత్వమతిశయించగా; తనబంధులు+అందఱున్; మృతంబున్+ పొందన్= చావును పొందగా; ఎవ్వనిన్+ఐనన్= ఎవడినైనా; శోకమను= శోకమనేటువంటి; వహ్ని= అగ్ని; కాల్చదే?= కాల్చదా?

తాత్పర్యం: ఉన్న ధనమంతా నశించి, కొడుకులందరూ చచ్చి, బంధువులందరూ ఒక్కసారిగా పోతే, ఎవడినైనా ఆ దుఃఖమనే అగ్ని దహించకుండా ఉంటుందా?

విశేషం: అలం: రూపకం. మంజుభాషిణీ వృత్తంలో ప్రతిపాదంలోనూ స, జ, స, జ, గ అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ తొమ్మిదవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

ఉపజాతి వృత్తము:

మునీంద్ర! నిర్భాగ్యత ముట్టి చావుం । గానేరదయ్యెం గడుగట్టి చిత్తం
బనూన మూర్ఛం దెగటారియుఁ దా । రానేర్చె నిమ్మేనికిఁ గ్రమ్మఱంగన్. 64

ప్రతిపదార్థం: మునీంద్ర!= వ్యాసమహర్షీ!; నిర్భాగ్యత= దౌర్భాగ్యం; ముట్టి= ఆవరించి; చావున్= చావుకూడా; కాన్+నేరదయ్యెన్= రానిదయింది (రాకపోయింది); కడున్+గట్టి+చిత్తంబు= (నాది) చాలా గట్టి మనస్సు; అనూన= గొప్పదైన; మూర్ఛన్= మూర్ఛలో; తెగటారియున్= నశించికూడా; క్రమ్మఱంగన్= మళ్ళీ; ఈ+మేనికిన్= ఈ దేహంలోకి; తాన్= (ప్రాణం) తాను; రాన్+నేర్చెన్= రాగలిగింది (అంటే చనిపోతే బాగుండేదని అర్థం).

తాత్పర్యం: మహర్షీ! నా దౌర్భాగ్యం ఏమని చెప్పాలి! నాకు చావుకూడా రావటంలేదు. నాది చాలా గట్టి మనస్సు. లేకపోతే ఇంత పెద్ద మూర్ఛలో మునిగికూడా మళ్ళీ ఈ బొందిలోకి ప్రాణం రాగలిగింది.

విశేషం: ఐదు ప్రాణాలున్నాయని శారీరక శాస్త్రం చెప్తుతుంది. నాగ-కూర్మ-కృకర-దేవదత్త-ధనంజయాలని వీటిపేర్లు. నాగం-వాగ్ ద్వారంలో ఉండేది; కూర్మం-కంటిరెప్పలలో ఉంటుంది. కృకర-తుమ్మును కలిగిస్తుంది. దేవదత్తం-ఆవులింతను కలిగిస్తుంది-దేహమంతటా 'ధనంజయ' మనే ప్రాణం వ్యాపించి ఉంటుంది. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానాలని వరుసగా హృదయ, గుద, నాభి, కంఠ, సర్వశరీరాలను ఆశ్రయించి ఈ 'పంచప్రాణాలూ' వ్యాపించి ఉంటాయి. నాగకూర్మాది నామాలు కలిగినవి పంచప్రాణాల పేర్లు అని కొందరు. ఉపప్రాణాలు, లేదా ఉపవాయువులని కొందరు అంటారు. 'మనస్సంకల్ప' రూపంతో దృఢంగా ఉన్న 'ధనంజయ' మనే ప్రాణం వ్యాపించి ఉంటుంది.

కృష్ణద్వైపాయనముని ధృతరాష్ట్రునకు దుఃఖోపశమనంబు చేయుట (సం. 11-8-12)

వ. ఇంక నేమిసేయువాఁడ' నని పలికి యూరకున్న యన్నరనాథునకు మునినాథుం డి ట్లనియె. 65

ప్రతిపదార్థం: ఇంకన్= ఇంక; ఏమి+చేయువాఁడను?= ఏం చేయగలను?; అని పలికి; ఊరకున్నన్= ఊరకుండగా; ఆ+ నరనాథునకున్= ఆరాజుతో; మునినాథుండు= శ్రేష్ఠుడైన వ్యాసమహర్షి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లాంటి స్థితిలో నేను ఏం చేయగలను?' అనిమాత్రమని ఊరకున్న ధృతరాష్ట్రుడితో వ్యాసుడు ఇట్లా చెప్పాడు.

ఉత్సాహవృత్తము;

'నీవు ధర్మభంగి నెఱుఁగ నేర్తు నీతి కౌశలం। బావహిల్లు నీదు మనమునందుఁ గాన నేను శో
కావిలత్వ ముడుపఁబూని యరుగుదెంచితిన్ సుతా। భావజనిత దుఃఖవార్ధిపార మెయ్యు పుత్రకా! 66

ప్రతిపదార్థం: పుత్రకా!= కుమారా!; నీవు; ధర్మభంగిన్= ధర్మవిధిని; ఎఱుఁగన్+నేర్తు(వు)= తెలిసినవాడివి; నీదు మనమునందున్= నీ మనసులో; నీతి కౌశలంబు= నీతి పథంలోని నేర్పు; ఆవహిల్లున్= ఉంది; కానన్= అందుకే; శోక+ఆవిలత్వము= శోకంచేత పుట్టిన కలతను; ఉడుపన్+పూని= పోగొట్టాలని; నేను+అరుగుదెంచితిన్= నేనువచ్చాను; సుత+అభావ+జనిత= కొడుకులు మరణించటంచేత పుట్టిన; దుఃఖవార్ధిన్= దుఃఖమనే సముద్రాన్ని; ఎయ్యు(ము)= దాటుము.

తాత్పర్యం: 'కుమారా! నీవు ధర్మవిధి ఎరిగినవాడవు. నీవు నీతిశాస్త్ర కుశలుడవు. అందుచేత నీకు శోకాన్ని పోగొట్టి శాంతిని ప్రసాదించాలని నేను వచ్చాను. పుత్రుల మరణంచేత పుట్టిన దుఃఖసముద్రాన్ని దాటి శాంతిని పొందుము.

విశేషం: అభావం-అంటే లేకపోవటం: ఈ సందర్భంలో అభావం అంటే మరణం చేత ఏర్పడ్డ అభావమని అర్థం. వృత్తవిశేషానికి చూడండి: స్త్రీ. 1.48.

క. భూతము లనిత్యములు నీ। వీ తెరు వెప్పడును విం దహీన ధృతిన్ నీ
చేతోగతి నలవఱుపుము। భూతానిత్యత్వ మదియ పుచ్చును వగలన్. 67

ప్రతిపదార్థం: భూతములు= ప్రాణులు; అనిత్యములు= అశాశ్వతాలు; నీవు; ఈ తెరువు= ఈ ధర్మాన్ని గురించి; ఎప్పుడును= ఎప్పుడూ; విందువు= వింటూనే ఉన్నావు; అహీన= గొప్ప; ధృతితోన్= ధైర్యంతో; భూత+అనిత్యత్వము= ప్రాణుల అశాశ్వతత్వమనే ఈ ధర్మాన్ని; చేతోగతిన్= మనసులో; అలవఱుపుము= (చక్కగా) అభ్యసించుము; అది+అ= ఆ జ్ఞానమే; వగలన్= నీ దుఃఖాన్ని; పుచ్చును= పోగొడుతుంది.

తాత్పర్యం: ప్రాణులు అన్నీ అశాశ్వతాలే. ఈ ధర్మాన్ని గురించి నీవు ఎప్పుడూ వింటూనే ఉన్నావు. గొప్ప ధైర్యంతో నీ మనస్సులో ప్రాణులు అశాశ్వతమనే ఈ ధర్మాన్ని అభ్యసించటం మొదలుపెట్టుము. ఆ జ్ఞానమే నీ దుఃఖాన్ని పోగొట్టుతుంది.

విశేషం: భూతం-అనేమాటకు నీరు, భూమి, వాయువు, ఆకాశం, అగ్ని అనే పంచభూతాలూ, ప్రాణం కలిగినవి, ప్రాణంలేనివి, జంతువులు, పక్షులు, మనుష్యులు - అనే ఇన్ని అర్థాలూ ఉన్నాయి. వెరసి మొత్తం 'ప్రకృతి' అని అర్థం. ఇది మార్పును పొందుతుంది, కాబట్టి అశాశ్వతం. ఆత్మ ఒకటే శాశ్వతమైనది- దానికి మార్పులేదు. అందుచేత ఆత్మనిత్యత్వ స్ఫురణ ఉండి 'జీవి' అశాశ్వతత్వాన్ని గురించి ఎరిగి, జీవితాన్ని ఆ జ్ఞానంతో గడపటంచేత విషాదాన్ని దాటగలడని తాత్పర్యం. కాని, ఈ జ్ఞానం వినుకలిచేత వచ్చేది కాదు. నిరంతరసాధనచేతనే వస్తుంది. అందుకే అభ్యసించుమని చెప్పటం.

ఆ. అరయ జీవలోక మధ్రువ మన నరు। నొడలి బ్రదుకు చావుఁ గడవ దనఁగ
వినియు నెల్లఁ గనియు వీతవివేకతఁ। బుత్ర మరణమునకుఁ బొగుల నగునె? 68

ప్రతిపదార్థం: అరయన్= బాగా ఆలోచిస్తే; జీవలోకము= ప్రాణిలోకం; అధ్రువము+అనన్= అశాశ్వతమైనదనీ; నరున్= మనిషియొక్క; ఒడలి బ్రదుకు= దేహంతోటి ఈ జీవితం; చావున్= మరణాన్ని; కడవదు+అనఁగన్= తప్పించుకోజాలదు అని; వినియున్= వినీ; ఎల్లన్+కనియున్= అన్నిటినీ చూచీ; వీత= పోయిన, వివేకతన్= జ్ఞానంతో; పుత్ర మరణమునకున్= పుత్రుల మరణానికి; పొగులన్+అగునె?= శోకించటం తగునా?

తాత్పర్యం: బాగా ఆలోచిస్తే ప్రాణిలోకం అశాశ్వతమైనదని, మనిషి దేహంతోడి ఈ జీవితం మరణాన్ని తప్పించుకొనజాలడని విని, ఇట్లాంటి నిజాలను చూచి వివేకజ్ఞానాన్ని కోల్పోయి పుత్రుల మరణానికి శోకించటం తగని పని.

వ. అదియునుం గాక. **69**

తాత్పర్యం: అంతమాత్రమే కాకుండా.

సీ. నీ వెఱుంగక యుండఁగా వచ్చెనే వైర । బంధంబు కౌరవపాండవులకు?
నీ పుత్రకుండ దీనికిఁ గారణం బిది । విధి నిర్మితంబైన విధము సువ్వె!
కౌరవజాతి సంక్షయ మవశ్యంబుగాఁ । గలయదియై చెల్లెఁగాక క్రొత్త
యైనదియే? బంధు లాజి విహార త । త్పరతమై సద్గతిఁ బడసినారు

ఆ. వారి కేల యింత వగవ నట్లును గాక । విమలబుద్ధియైన విదురుఁ డిట్టు
లగుట యెఱిఁగి బుద్ధి తగఁ జెప్పె నీకు జూ । దంబు సమయముననె దాని వినవ. **70**

ప్రతిపదార్థం: నీవు= నీవు; ఎఱుంగక+ఉండఁగాన్= తెలియకుండా; కౌరవపాండవులకున్= కౌరవులకు; పాండవులకు; వైరబంధంబు= వైరరూపమైన బంధం; వచ్చెనే?= కలిగినదా?; నీ పుత్రకుండు+అ= నీ కొడుకే; దీనికిన్= దీనికంతటికీ; కారణంబు= కారణం; ఇది= ఇట్లా కావటం; విధి= విధిచేత (దైవంచేత); నిర్మితంబు+ఐన= కల్పించబడిన; విధము+చువ్వె!= పద్ధతి సుమా!; కౌరవజాతి= కురువంశీయుల; సంక్షయము= నాశనం; అవశ్యంబుగాన్= తప్పని సరిగా; కాన్+కల+అది+ఐ= జరగాల్సి ఉండి; చెల్లెన్+కాక= అట్లా జరిగిపోయింది తప్ప; క్రొత్త+ఐనది+ఏ?= ఇదేమి కొత్త విషయమా?; బంధులు= బంధువులందరూ; ఆజి= యుద్ధం అనే; విహార తత్పరతమైన్= విహారంలో ఆసక్తి కలవారై; సత్+గతిన్= సుగతిని; పడసినారు= పొందారు; వారికిన్= వారికోసం; ఇంత= ఇంతగా; వగవన్= దుఃఖించటం; ఏల?= ఎందుకు?; అట్లునున్+కాక= అంతేకాకుండా; విమలబుద్ధి+ఐన= పవిత్ర బుద్ధి కలిగిన; విదురుఁడు; ఇట్టులు+అగుట= ఇట్లా కాబోతుందని; ఎఱిఁగి= తెలిసినవాడై; నీకున్= నీకు (నీ కుమారునికి); తగన్= ఎన్నో విధాలుగా; జూదంబు సమయమునన్+అ= జూదమాడే సమయంలోనే; బుద్ధి+చెప్పెన్= నీతి బోధించాడు; దానిన్= దానిని; వినవు+అ= నీవు వినకపోతివి.

తాత్పర్యం: నీకు తెలియకుండా కౌరవ పాండవులకు వైరం కలిగిందా! నీకొడుకే ఇంతటికీ మూలం. ఇట్లా కావటం దైవవిధి. అందుకే అనివార్యంగా కౌరవ వంశం నాశనమైంది. అంతేకాని ఇదేం కొత్త విషయం కాదే! బంధువులందరూ యుద్ధమనే ఆటలో ఆసక్తి కలవారై (ఆడి) సుగతిని పొందారు. వారికొరకు ఇంతగా దుఃఖం పొందటం ఎందుకు? అంతేకాకుండా పరమ పవిత్ర బుద్ధి కలిగిన విదురుడు ఇట్లా కాబోతుందని తెలిసినవాడై ఆనాడు ద్యూతసమయంలోనే నీకూ నీ కుమారునికీ ఎన్నో విధాలుగా నీతిబోధ చేశాడు. కాని, నీవు దానిని విన్నావు కావు.

దోధక వృత్తము:

దేవ కృతంబులు ధీరులకైనన్ । భూవర! మాన్పఁగఁ బోలునె? యెట్లుం
గావున శోకముఁ గాఱియ దల్గం । గా వలదే తుది గౌరవ మొప్పన్? 71

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; దేవకృతంబులు= దైవ నిర్ణయాలు (దేవతల పనులు); ధీరులకున్+ఐనన్= ఎంత ధీరులకైనా; ఎట్లున్= ఎట్లాగైనా; మాన్పఁగన్+పోలునె?= ఆపటానికి అవుతుందా?; కావునన్= అందుచేత; శోకమున్= శోకమును; కాఱియన్= బాధను; తుదిన్= చివరికి; గౌరవము+ఒప్పన్= నీకు మన్నన ఏర్పడేలా; తల్గన్+కాన్+వలదే?= పోగొట్టుకోవద్దా?

తాత్పర్యం: రాజా! దేవతల పనులను ఎంత ధీరులైనా ఎంత ప్రయత్నించినా ఆపలేరు. అవి అట్లాగే జరుగుతాయి. అందువలన నీ గౌరవాన్ని, వంశప్రతిష్ఠను నిల్పుకొనటానికైనా నీ శోకాన్నీ, బాధనూ పోగొట్టుకొమ్ము.

విశేషం: 'భీష్మాదులు జన్మించిన సద్వంశంలో పుట్టిన నీవు శోకిస్తూ కూర్చోవటం అనుచితమైనపని' - అని వంశగౌరవాన్ని గుర్తుచేయటం అతనిలో ఆత్మవిశ్వాసాన్ని నింపటం కోసమే. వృత్తలక్షణానికి చూడండి. స్త్రీ. 1.62

వ. దేవతలకుం గృత్యంబయిన దానిఁ దత్ప్రత్యక్షంబున వింటి నది నీకు మేలు గోరిచెప్పెద నాకర్ణింపు; మే నశ్రమంబున నెందయినఁజరింతు నొక్కనాఁడు దేవసభకుంబోయితి నందుఁబురందరప్రముఖ బృందారకులను నారదాదిమునిబృందములనుంగాంచి సుఖగోష్ఠినున్న సమయంబున భూదేవి యచ్చటికి వచ్చి య వ్విబుధులతో నిట్లనియె. 72

ప్రతిపదార్థం: దేవతలకున్= దేవతలకు; కృత్యంబయిన దానిన్= చేయదగ్గ పనిని గురించి (చేయబోయే దాన్ని గురించి); తద్+ఆ దేవతల; ప్రత్యక్షంబునన్= సమక్షంలోనే; వింటిన్= విన్నాను; అది= ఆ విషయాన్ని; నీకున్; మేలు+కోరి= మేలు కావాలన్న కోరికతో; చెప్పెదన్= చెబుతాను; ఆకర్ణింపుము= వినుము; ఏను= నేను; అ(శ్రమంబునన్= ఏ శ్రమాలేకుండానే; ఎందయినన్= ఎక్కడికి కావాలన్నా; చరింతున్= వెళ్తాను; ఒక్కనాడు; దేవసభకున్= స్వర్గంలో దేవతల సభకు; పోయితిన్= వెళ్ళాను; అందున్= ఆ సభలో; పురందర= ఇంద్రుడు; ప్రముఖ= మొదలైన; బృందారకులను= దేవతలను; నారద+ఆది= నారదుడు మొదలైన; ముని బృందములనున్= మునుల సమూహాలను; కాంచి= చూచి; సుఖగోష్ఠినున్న సమయంబునన్= ఇష్టాగోష్ఠిలో ఉన్న సమయంలో; భూదేవి; అచ్చటికిన్+వచ్చి= ఆ సభలోకి వచ్చి; ఆ+విబుధులతోన్= ఆ దేవతలతో; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: దేవతలు ఏం చేయబోతున్నారన్న విషయాన్ని ఆ దేవతల సమక్షంలోనే ఒకప్పుడు నేను విన్నాను. ఆ విషయాన్ని నీకు జ్ఞానం కలగటం కొరకు చెప్పుతాను వినుము. నేను ఏ శ్రమా లేకుండా ఎక్కడికి కావాలన్నా వెళ్ళగలను. ఒకనాడు దేవసభకు వెళ్ళాను. ఆ సభలో ఇంద్రాది దేవతలు, నారదాది మహర్షులు ఉన్నారు. వారి నందరినీ చూచి ఇష్టాగోష్ఠిలో ఉన్న సమయంలో ఆ సభలోకి భూదేవి వచ్చి దేవతలతో ఇట్లా అన్నది.

క. 'మీరలు బ్రహ్మసభను మ । ద్భారము మాన్పుటకు నలిని బనిఁబూనితి రె
క్కారణమునఁ దడసితి రొకో? । యేరూపునఁ దలుఁగుదాన నేను భరంబున్? 73

ప్రతిపదార్థం: మీరలు= మీరందరూ (ఒకప్పుడు); బ్రహ్మసభను= బ్రహ్మదేవుడి సన్నిధిలో జరిగిన సభలో; మత్+భారము= నాపై ఉన్న దుష్ట భారాన్ని; మాన్పుటకున్= తొలగించటానికి; నలిని= ఉత్సాహంతో; పనిన్+పూనితిరి= ఏదో ఒకటి చేయాలని

పూనుకొన్నారు; ఏ+కారణమునన్= ఏ కారణంచేత; తడసితిరి+ఒకొ?= ఆలస్యం చేస్తున్నారో? (చెబుతారా); నేను; భరంబున్= ఈ భారాన్ని; ఏ రూపునన్= ఏ విధంగా తలుఁగుదానన్?= తగ్గించుకోగలను?

తాత్పర్యం: 'దేవతలారా! మీరంతా ఒకప్పుడు బ్రహ్మసన్నిధిలో జరిగిన సభలో నాపై ఉన్న దుర్భర భారాన్ని తొలగించటానికి ఎంతో ఉత్సాహంతో ఏదో ఒక పనిచేయాలని పూనుకొన్నారు. మరి ఏ కారణంచేత మీరు ఆలస్యం చేస్తున్నారో ఏమో! నేను ఈ భారాన్ని ఏ విధంగా తగ్గించుకొనగలను? (మీరే చెప్పండి)'.

వ. అనిన విని సర్వలోక నమస్కృతుండగు నారాయణుండు నవ్వుచు న వ్వెలంది కిట్లనియె. 74

ప్రతిపదార్థం: అనినన్= అని అడుగగా; విని; సర్వలోక= అన్ని లోకాలలోని వారిచేత; నమస్కృతుండు+అగు= నమస్కరింప బడేటటువంటివాడైన; నారాయణుండు= శ్రీమహావిష్ణువు; నవ్వుచున్= నవ్వుతూ; ఆ+వెలందికిన్= ఆ భూదేవితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: అని భూదేవి అడుగగా సర్వలోకాలలోనూ నమస్కరించ బడేటటువంటి శ్రీమహావిష్ణువు నవ్వుతూ ఆమెతో ఇట్లా అన్నాడు.

విశేషం: లోకానికంతా ఏది భారమో అది శ్రీమహావిష్ణువుకు ఒక ఆటలాంటిదని అర్థం. అందుకే ప్రతి అవతారమూ ఆయనకు ఒక 'లీల' అని పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ లోకమంతా అతడి 'లీల' లో భాగమని భాగవతం చెబుతుంది. అందుకే విష్ణువు 'నవ్వటం'. ఈ హాసం కూడా 'లీలా విలాసం'లో భాగమేనని అర్థం. నరుడి కథలో జరగబోయే మార్పు నారాయణుడికే తెలుసునని ఈ సందర్భానికి అర్థం.

తే. 'వినుము ధృతరాష్ట్రుఁ డనురాజు తనుజశతముఁ । బడయు దుర్యోధనుం డనఁబరఁగు పెద్ద
కొడుకు నీ భారతమంతయు నుడుపు నతఁడు । తడయ కయ్యెడు నది వగఁ దక్కు మబల! 75

ప్రతిపదార్థం: అబల!= ఓ భూదేవీ!; వినుము; ధృతరాష్ట్రుఁడు+అనురాజు= ధృతరాష్ట్రుడనే పేరున్న రాజు; తనుజ శతమున్= నూరుగురు కుమారులను; పడయున్= పొందుతాడు; దుర్యోధనుండు+అనన్+పరఁగు= దుర్యోధనుడనే పేరున్న; పెద్ద కొడుకు; అతఁడు; నీ భారమంతయున్= నీ భారాన్ని అంతటినీ; ఉడుపున్= పోగొడతాడు; అది= ఆ పోగొట్టటం; తడయక+ అయ్యెడున్= తొందరలోనే జరుగుతుంది; వగన్= దుఃఖాన్ని; తక్కుము= వదలిపెట్టుము.

తాత్పర్యం: 'భూదేవీ! వినుము. ధృతరాష్ట్రుడనే రాజు నూరుగురు కొడుకులను పొందుతాడు. వారిలో దుర్యోధను డనేవాడు పెద్దకొడుకు. నీ దుర్భర భారాన్నంతా సంపూర్ణంగా పోగొట్టుతాడు. అది కూడా తొందరలోనే జరుగుతుంది. ఇక శోకించవద్దు.

వ. ఎట్లనిన. 76

తాత్పర్యం: ఎట్లాగంటే.

క. వానిం జంపను గావం । బూని సకలరాజలోకమును నీసుమెయిన్
సేనాసముదయములునుం । దానుఁ గురుక్షేత్ర సమర దారుణతఁ దెగున్. 77

ప్రతిపదార్థం: వానిన్= ఆ దుర్యోధనుడిని; చంపనున్= చంపటానికి; కావన్= కాపాడటానికి; సకల రాజలోకమునున్= రాజులందరూ; ఈ సుమెయిన్= ఈర్ష్యతో; సేనాసముదయములునున్= సేనా సమూహాలూ; తానున్= సకలరాజలోకమూ; కురుక్షేత్ర= కురుక్షేత్రంలో జరిగే; సమర దారుణతన్= భయంకర యుద్ధంలో; తెగున్= చస్తుంది.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడిని కాపాడటానికి, చంపటానికి భారతభూమిలోని రాజులందరూ ఈర్ష్యతో చేరుతారు. చివరికి కురుక్షేత్రంలో జరిగే మహాయుద్ధంలో ఆ సకలరాజలోకమూ సైన్యాలతోపాటు ఘోరంగా చనిపోతుంది.

వ. **సోదరసముదయసహితంబుగా నతండును మృతుండగు; దానంజేసి భవదీయభారంబు వాయు నిశ్చింతంబునం జనుము భూతధారణం బాచరింపుము పొ'మ్మని పలికి యద్దేవిని వీడుకొలిపెఁ బదంపడి సకల ప్రజాసంహార కారణంబై కల్యంశంబున దుర్యోధనుండు జనియించె; నక్కుమారుండు.** **78**

ప్రతిపదార్థం: సోదర సముదయ= తమ్ముల గుంపుతో; సహితంబుగా= కూడ; అతండును= దుర్యోధనుడును; మృతుండు+ అగున్= చనిపోతాడు; దానన్+చేసి= అంచేత; భవదీయ= నీ; భారంబు+పాయున్= బరువు తగ్గిపోతుంది; నిశ్చింతంబునన్= నిశ్చింతగా; చనుము= వెళ్ళు; భూతధారణంబు= జీవులను ధరించటం; ఆచరింపుము= కొనసాగించుము; పొమ్ము; అని పలికి; ఆ+దేవిని= ఆ భూదేవిని; వీడుకొలిపెన్= పంపించాడు; పదంపడి= ఆ వెనుక; సకల ప్రజాసంహార= ప్రజలందరి మృతికీ; కారణంబు+ఐ= కారణం అవుతూ; కలి+అంశంబునన్= కలి అంశతో; దుర్యోధనుండు; జనియించెన్= పుట్టాడు.

తాత్పర్యం: సోదరులందరితో కూడా ఆ దుర్యోధనుడు చనిపోతాడు. అందువలన నీ భారం పూర్తిగా తగ్గిపోతుంది. నిశ్చింతగా వెళ్ళుము. మునుపటివలె జీవులను భరించే నీ పనిని చేస్తూ ఉండుము' - అని పలికి ఆ భూదేవిని నారాయణుడు ఓదార్చి పంపించాడు. ఆ వెనుక రాజులందరూ చనిపోవటానికి కారణమైన 'కలి' అంశతో దుర్యోధనుడు పుట్టాడు.

విశేషం: భూమికి 'భూతధాత్రి' అని పేరు - అన్ని భూతాలను ధరిస్తుంది కాబట్టి.

తే. **ఒరుల యున్నతి సయిరింపనోపఁ డధిక । బలుఁడు క్రోధి శూరత్వసంపన్నబుద్ధి**
బుద్ధి సెప్పిన వినియెడు ప్రోడగాఁడు । గాన వైరంబు విడువఁడు కౌరవేంద్ర! **79**

ప్రతిపదార్థం: కౌరవేంద్ర!= కురువంశీయులలో శ్రేష్ఠుడా!; ఒరుల= ఇతరుల; ఉన్నతి= గొప్పతనాన్ని; సయిరింపన్+ఓపఁడు= సహించలేడు; అధికబలుఁడు= మిక్కిలి బలవంతుడు; క్రోధి= క్రోధనుడు (కోపమున్నవాడు); శూరత్వ= పరాక్రమంతో; సంపన్న= నిండిన; బుద్ధి= చిత్తవృత్తి కలిగినవాడు; బుద్ధి+చెప్పినన్= ఇతరులు నీతి చెబితే; వినియెడు= వినేటువంటి; ప్రోడ= ప్రౌఢుడు (విచక్షణ ఉన్నవాడు); కాఁడు; కానన్= అందువలన; వైరంబున్= విరోధాన్ని; విడువఁడు= వదలిపెట్టడు.

తాత్పర్యం: రాజా! ఆ 'కలి' అంశతో పుట్టటంవలన దుర్యోధనుడు ఇతరుల గొప్పతనాన్ని సహించడు. ఎంత బలవంతుడో అంత కోపం కలిగినవాడు. అతని చిత్తవృత్తి పరాక్రమంతో నిండిపోయింది. ఎవరైనా పెద్దలు నీతి చెప్పితే వినే సంస్కారం లేదు. అందుకే వైరాన్ని వదలిపెట్టలేదు.

విశేషం: కలి - అంటే 'పాప'మని సారభూతమైన అర్థం. ఈనాటి మనుష్యులలో సర్వసాధారణంగా కనిపించే ఈర్ష్య, కోపం, దుష్టమైన బలం, అసంస్కార హృదయం - ఇవన్నీ 'కలి' లక్షణాలని భారత కథ నిరూపిస్తుంది.

క. తమ్ముఁడు, శకునియుఁ, గర్ణుఁడు । నమ్మానవపతికిఁ దగినయనుచరు లతనిన్
సమ్మదమునఁ గలసిన నృపు । లమ్మెయి వారలు వినాశమగు టేలుడుగున్? 80

ప్రతిపదార్థం: తమ్ముఁడు= దుశ్శాసనుడు; శకునియున్= శకుని; కర్ణుడు; ఆ+మానవపతికిన్= ఆ దుర్యోధనుడనే రాజుకు; తగిన+అనుచరులు= అన్నివిధాలా తగిన స్నేహితులు; అతనిన్= ఆ సుయోధనుని; సమ్మదమునన్= ప్రీతితో; కలసిన= చేరిన; నృపులు= రాజులందరూ; ఆ+మెయి+వారలు= అలాంటివారే (ఇక); వినాశము+అగుట= నాశనమైపోవటం అన్నది; ఏలా+ ఉడుగున్?= ఎందుకు ఆగుతుంది?

తాత్పర్యం: దుశ్శాసన శకుని కర్ణులు ఆ రాజుకు తగిన సహచరులు. అతడితో చేరిన రాజులూ అట్లాంటివారే. ఇక అందరూ నశించకుండా ఎట్లా ఉంటారు?

తోదక వృత్తము:

తమ తమ తప్పులఁ దా రెరియంగా । విమలమతీ! యిటు వీరికినై శో
కమునఁ దహింపఁగఁగాదు మనంబున్ । సముచిత మిత్తఱి శాంతము సుమ్మీ!' 81

ప్రతిపదార్థం: (అందుచేత); విమలమతీ!= నిర్మలమైన చిత్తమున్న రాజా!; తమతమ= వారువారు చేసిన; తప్పులన్= తప్పులతో; తారు= తాము; ఎరియన్+కాన్= కాలిపోగా (నశించగా); వీరికిన్+ఐ= వీరికోసమని; ఇటు= ఇలా; శోకమునన్= దుఃఖాగ్నిలో; మనంబున్= నీ మనస్సును; దహింపఁగన్+కాదు= కాల్చరాదు; ఈ+తఱిన్= ఈ సమయంలో; శాంతము= శాంతంగా ఉండటమే; సముచితము= తగింది; సుమ్మీ!= సుమా!.

తాత్పర్యం: తాము తాము చేసిన తప్పులతో తాము తాము కాలిపోయి నశించారు. అట్లాంటివారి కొరకు నీవు నీ మనస్సును ఇట్లా శోకాగ్నిలో దహించి వేయటం తగిన పనికాదు. ఈ సమయంలో శాంతంగా ఉండటమే తగిన పని సుమా!'

విశేషం: ఎరియు-మండు: దోషమనేది అగ్ని - పాపం ఎవరు చేస్తారో వారిని పాపమే దహించివేస్తుందని భారతీయుల విశ్వాసం.

'విమలమతీ!' - అనటంలో 'నిర్మలమైన చిత్తంతో ఇకనైనా ఆలోచించుము' అనే సూచనకూడా గర్భితంగా ఉంది.

తోదకవృత్తంలో ప్రతిపాదంలోనూ, న,జ,జ,య అనే గణాలుంటాయి: మొదటి అక్షరానికీ ఎనిమిదవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. అని చెప్పిన నవ్విభుండు దనకుం బాండవాగ్రజుం డవమానం బాచరించునను శంక నూని యునికి యమ్మహాముని దివ్యబోధంబునం దేటపడి యుండుం గావున నత్తాపసోత్తముండు వెండియు నిట్లనియె. 82

ప్రతిపదార్థం: అని చెప్పినన్= అని దుర్యోధనుని జన్మరహస్యాన్ని చెప్పగా; ఆ+విభుండు= ధృతరాష్ట్రుడు; తనకున్= తనకు; పాండవాగ్రజుండు= ధర్మరాజు; అవమానంబు+ఆచరించునను= అవమానం చేస్తాడని; శంకన్+ఊని+ఉనికి= అనుమానం కలిగి ఉండటం; ఆ+మహాముని= ఆ వ్యాసమహర్షి; దివ్య+బోధంబునన్= దివ్యజ్ఞానంలో (దృష్టిలో); తేటపడి+ఉండున్= స్పష్టమై ఉన్నది; కావునన్= అందుచేత; ఆ+తాపస+ఉత్తముండు= ఆ ఋషిశ్రేష్ఠుడు; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: అని వ్యాసుడు చెప్పాడు. అంతలో ధృతరాష్ట్రుడి మనసులో తనను ధర్మరాజు తప్పక సోదరులతో వచ్చి అవమానపరుస్తా డన్న అనుమానం మొలకెత్తింది. దీనిని తన దివ్యదృష్టితో గుర్తించిన వ్యాసుడు ఆయనతో ఇట్లా అన్నాడు.

క. 'పాండవుల వలని కీడొ । క్కొండును లేదధిప! నీదు కొడుకులు ధరణీ
మండలమంతయు మ్రింగిరి । పాండునృపతి భాగమునకుఁ బాపిరి వారిన్. 83

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; పాండవులవలని= పాండవులవలన జరిగిన; కీడు+ఒక్కొండును= ఒక అపకారంకూడా; లేదు; నీదు కొడుకులు= నీ కుమారులైన దుర్యోధనాదులు; ధరణీమండలము+అంతయున్= భూమండలాన్ని అంతా; మ్రింగిరి= మ్రింగివేశారు; పాండు నృపతి= పాండురాజు; భాగమునకున్= రాజ్యభాగానికి; వారిన్= పాండవులను; పాపిరి= దూరంచేశారు.

తాత్పర్యం: 'రాజా! వినుము. పాండవుల వలన ఎప్పుడూ ఏ కీడూ జరగలేదు. నీ కుమారులు దుర్యోధనాదులే మొత్తం భూమండలాన్నంతా మ్రింగివేశారు. పాండురాజు భాగాన్ని కూడా పాండవులకు దక్కకుండా చేశారు.

వ. దానంజేసి యిట్లు సకల కౌరవ్యులకు నఖిల భూపతులకు నిఖిల ప్రజలకును బొలియవలసె నిది యంతయు మున్న యెఱుంగుదుఁ గావున. 84

ప్రతిపదార్థం: దానన్+చేసి= అందువలన; ఇట్లు; ఈ రీతిగా; సకల కౌరవ్యులకున్= సకల కురువంశీయులకు; నిఖిల భూపతులకున్= రాజులదరికీ; నిఖిల ప్రజలకున్= ప్రజలందరికీ; పొలియన్ వలసెన్= చావవలసి వచ్చింది; ఇది+అంతయున్= ఇదంతా; ఇట్లా జరగబోతుందని; మున్ను+అ= ముందే; ఎఱుంగుదున్= నాకు తెలుసు; కావునన్= కాబట్టి.

తాత్పర్యం: అందువలననే ఈ రీతిగా కురువంశీయులు, రాజులు, ప్రజలు - అందరూ దుర్మరణం పాలు కావలసి వచ్చింది. ఇదంతా ఇట్లా జరుగబోతుందని నాకు తెలుసు కాబట్టి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: కురువంశంలో పుట్టిన వారందరూ కౌరవ్యులే. పాండవులు, వారి బంధువులు, సంతానం కూడా కురువంశీయులే. అందుకే ఇట్లా అనటం.

ఉత్సాహవృత్తము

వినుము నారదుండు దీని వినఁగఁ జెప్పె ధర్మనం
దనున కతని మనము కరుణ దవిలియున్కి హింసకున్
గొనకొనంగఁ జొరమి నతఁడు కురుబలంబుతోడ పొం
దునక పడఁడె? జగము మెచ్చఁ దొడఁగి పెక్కు భంగులన్. 85

ప్రతిపదార్థం: వినుము= (ధృతరాష్ట్ర మహారాజా!) వినుము; నారదుండు= నారదమహర్షి; దీనిన్= ఈ విషయాన్నంతా; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; వినఁగన్= వినేలా; చెప్పెన్= చెప్పాడు; (అందువలన) అతని మనము= ధర్మరాజు మనస్సు; కరుణన్+తవిలి= కరుణలో తగుల్కొని; ఉనికి= ఉండటంచేత; హింసకున్= హింసచేయటానికి; కొనకొనంగన్+చొరమిన్= ప్రయత్నించకపోవటంవలన; అతఁడు= ఆ ధర్మరాజు; కురుబలంబు తోడన్= కురు సైన్యంతో; జగము= ప్రపంచమంతా; పెక్కుభంగులన్= ఎన్నో విధాలుగా; మెచ్చన్= మెచ్చుకోగా; తొడఁగి= ప్రయత్నించి; పొందునకున్+అ+పడఁడె= సంధికే ప్రయత్నించలేదా?

తాత్పర్యం: రాజా! వినుము. నారదుడు ఈ విషయమంతా ధర్మరాజుకు ఏనాడో వివరించాడు. అందుచేతనే ధర్మరాజు మనసులో కరుణపుట్టి హింస చేయటానికి ప్రయత్నించకుండా కురుబలంతో ప్రపంచమంతా స్తుతించే విధంగా సంధికే ప్రయత్నించాడు. ఇది నీకు తెలియని విషయమా?

విశేషం: వృత్తలక్షణానికి చూడండి: స్త్రీ. 1.48

తే. **ఏను నతనికిఁ జెప్పితిం గాన నాతఁ। డధికయత్నంబు సేసెఁ దానంతవడియు**
వైర మెమ్మెయి మాన్పంగ నేరఁ డయ్యె। నియతిఁ దప్పింప నేరికి నేర నగునె? 86

ప్రతిపదార్థం: ఏనున్= నేనుకూడా; అతనికిన్= ఆ ధర్మరాజుకు; చెప్పితిన్+కానన్= చెప్పాను కాబట్టి; ఆతఁడు= ధర్మరాజు; అధికయత్నంబు+చేసెన్= సంధికోసం ఎంతో ప్రయత్నించాడు; తాను+అంత పడియున్= తాను అంత ప్రయత్నించికూడా; వైరము+ఏ+మెయిన్= వైరం ఏ విధంగానూ; మాన్పంగన్+నేరఁడు+అయ్యెన్= మాన్పించలేకపోయాడు; నియతిన్= విధిని; తప్పింపన్= తప్పించటానికి; ఏరికిన్= ఎవరికైనా; నేరన్+అగునె?= సాధ్యమా?

తాత్పర్యం: నేనుకూడా ఆ ధర్మరాజుకు చెప్పాను కాబట్టి అతడు సంధికొరకు ఎంతగానో ప్రయత్నించాడు కాని, శత్రుత్వాన్ని మాన్పించలేకపోయాడు. ఎంత ప్రయత్నించినా విధిని తప్పించటానికి ఎవరు సమర్థులు?

క. **ఏ నిది యంతయు నెఱుఁగుదుఁ। గాన వృథా శోక వహ్నిఁ గాలమికిని నీ**
మానసమునఁ గృపకలిమికిఁ। గా నొడివితి దేవగుహ్యగతియుఁ దెలిపితిన్. 87

ప్రతిపదార్థం: ఏను= నేను; ఇది= ఈ విషయం; అంతయున్= అంతా; ఎఱుఁగుదున్= తెలియుదును; కానన్= కాబట్టి; వృథా శోకవహ్నిన్+కాలమికిని= వ్యర్థమైన శోకమనే అగ్నిలో కాలకుండా ఉండటానికి; నీ మానసమునన్= నీ మనస్సులో; కృపకలిమికిన్+కాన్= దయపుట్టటానికి గాను; నొడివితిన్= ఇట్లా చెప్పాను; దేవ గుహ్యగతియున్= దేవతలయొక్క రహస్యమైన విధానాన్ని గురించి; తెలిపితిన్= నీకు తెలిపాను.

తాత్పర్యం: నాకు ఇదంతా బాగా తెలుసు కాబట్టి నీవు వ్యర్థమైన శోకాగ్నిలో కాలిపోకుండా ఉండటానికి, నీ మనసులో పాండవులపైన దయపుట్టటానికి ఇదంతా చెప్పాను. పైగా దేవతల రహస్య విధానం ఎట్లా ఉందో కూడా తెలిపాను.

విశేషం: గుహ్య మంటే రహస్యమని అర్థం. మానవులకు అర్థంకాని దాన్నే 'దైవరహస్య' మంటారు. దాన్నిబట్టి మనుషుల ప్రవృత్తులు ఉంటాయి - జ్యోతిశ్శాస్త్రాదుల ద్వారా ఈ రహస్యాన్ని కొద్దిగానైనా తెలిసికొనవచ్చును కాబట్టి జ్యోతిష్కులను 'దైవజ్ఞులు' అంటారు. ఋషులు ఈ రహస్యాన్ని సంపూర్ణంగా ఎరుగుదురని ఈ సందర్భం వలన తెలిసికొనగలము.

భుజంగప్రయాతము:

వినీతుండవై ధర్మ వేదిత్వబుద్ధిం। దనర్పొందు నీ విట్లు దైన్యాతిరేకం
బునం బొంది శోకాగ్నిఁ బొక్కంగఁ గుంతీ। తనూజాగ్రజుం డాత్మఁ దాఁ గుందకున్నే? 88

ప్రతిపదార్థం: వినీతుండవు+ఐ= పవిత్రుడవై; ధర్మవేదిత్వబుద్ధిన్= ధర్మాన్ని తెలిసిన బుద్ధితో; తనర్పు+ఒందు= ఔన్నత్యాన్ని పొందిన; నీవు; ఇట్లు= ఈ విధంగా; దైన్యాతిరేకంబునన్+పొంది= అతిశయించిన దైన్యాన్ని పొంది; శోకాగ్నిన్= శోకమనే

అగ్నిలో; పొక్కంగన్= పరితపిస్తూ ఉంటే; కుంతీ తనూజ+అగ్రజుండు= ధర్మరాజు; ఆత్మన్= తనలో; తాన్= తాను; కుందక+ఉన్నే?= బాధపడకుండా ఉంటాడా?

తాత్పర్యం: నీవు అతి పవిత్రుడవు. ధర్మవేదివి. ఎంతో ఉన్నతుడవు. అట్లాంటి నీవు మిక్కిలి దీనంగా శోకమనే అగ్నిలో పరితపిస్తూ ఉంటే చూచి కుంతి పెద్దకొడుకు (ధర్మరాజు) ఎంత బాధపడతాడో చూచావా?'

విశేషం: భుజంగ ప్రయాత వృత్తంలో ప్రతిపాదంలోనూ నాలుగు య గణాలు ఉంటాయి. మొదటి అక్షరానికీ ఎనిమిదవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాస నియమం ఉన్నది.

క. డెందము తిర్యగ్యోనుల । యందును గరుణా సమగ్రమై యుండు భవ
న్నందనుఁ డజాతశత్రున । కుం దచ్చరితంబు నీవుఁ గొంత యెఱుఁగవే! 89

ప్రతిపదార్థం: భవత్+నందనుడు= నీ కుమారుడు; అజాతశత్రువునకున్= ధర్మరాజుకు; తిర్యగ్+యోనులఅందునన్= పక్షుల విషయంలోను, జంతువుల విషయంలోనూ; డెందము= హృదయం; కరుణా సమగ్రమై+ఉండున్= కరుణతో నిండి ఉంటుంది; తద్+చరితంబు= అతని చరిత్ర; నీవున్= నీకూ; కొంత; ఎఱుఁగవే!= తెలుసుకదా!

తాత్పర్యం: నీ కుమారుడైన ధర్మరాజు అజాతశత్రువు. అతడికి ఈ లోకంలో శత్రువులే లేరు. అతడి హృదయంలో మనుష్యులు, జంతువులు, పక్షులు - అందరి విషయంలోనూ అన్నిటి విషయంలోనూ కరుణ మాత్రమే ఉంటుంది. అతడి చరిత్ర నీవూ కొంత ఎరుగుదువు కదా!

విశేషం: పండితుడు సమదర్శనం కలిగి ఉంటాడని భగవద్గీత చెప్పుచున్నది. ధర్మరాజు అట్లాంటివాడని ధృతరాష్ట్రుడు తెలియని వాడు కాడు. అందుకే 'కొంత' ఎరుగుదువు అనటం. ఈ సమదర్శనం ఉన్న ధర్మరాజు అజాతశత్రువే. అతడికి శత్రువే పుట్టలేదని అర్థం. అందుచేత నీ కొడుకులు కూడా అతడికి శత్రువులు కారనీ అర్థం అవుతుంది. ధృతరాష్ట్రుడికి ఈ సమభావం కలిగించాలనే దృష్టితోనే 'నీ కొడుకు ధర్మరాజు' అని గుర్తు చేస్తున్నాడు వ్యాసుడు.

మానినీ వృత్తము

కావున నీ దెస నాతనికిన్ విముఖత్వము గల్గదు; భక్తి మెయిం
దా వినయం బెనయం గొనియాడుట దప్పదు కాంచెద వాతనిపై
నీవును నెయ్యముఁ గారుణికత్వము నెక్కొనఁ దమ్ములు నవ్విభుఁడు
న్వేవుర పెట్టుగ సంతతికల్మియ నీమది నిల్పుము పెంపొలయన్. 90

ప్రతిపదార్థం: కావునన్= అందుచేత; నీ దెసన్= నీ మీద; ఆతనికిన్= ఆ ధర్మరాజుకు; విముఖత్వము= వైముఖ్యం; కల్గదు= లేదు; (ఎందుకంటే); తాన్= అతడు; వినయంబు+ఎనయన్= వినయం పొందగా; కొనియాడుటన్= నిన్ను ఎప్పుడూ గౌరవిస్తూనే ఉండటంవలన; ఆతనిపైన్= ఆ ధర్మరాజుపై; నీవును= నీవు కూడా; నెయ్యమున్= స్నేహభావాన్ని; కాంచెదవు= పొందుతావు; తప్పదు= ఇది అనివార్యం; (నీవు కూడా); కారుణికత్వము= దయ; నెక్కొనన్= అతిశయించగా; తమ్ములున్= తమ్ములును; ఆ+విభుఁడున్= ఆ ధర్మరాజును; వేవుర= వేయిమందికి; పెట్టుగన్= మారుగా; సంతతి+కల్మి+అ= (నీ) సంతాన సంపదగానే; పెంపొలయన్= సౌభాగ్యం అతిశయించగా; నీ మదిన్= నీ హృదయంలో; నిల్పుము= నిలుపుకొమ్ము.

తాత్పర్యం: అందువలన నీ మీద ధర్మరాజుకు ఏ మాత్రం వైముఖ్యం లేదు. అతడు నిన్నెపుడూ గౌరవంతో చూస్తూనే ఉంటాడు. గమనించావు కదా! ఆ ధర్మరాజుపై నీవు కూడా తప్పకుండా స్నేహభావాన్ని పొందుతావు చూడుము. ఇది తప్పనిసరిగా జరుగుతుంది. ఇక నీవు దయతో పాండవులైదుగురినీ వెయ్యిమంది సంతానానికి మారుగా నీ హృదయంలో భావించుము. వారిని ఆదరించుము. అది మీ అందరికీ శ్రేయస్సు కలిగిస్తుంది.

విశేషం: మానినీ వృత్తంలో ప్రతిపాదానికీ ఏడు భ గణాలు, మీద గురువూ ఉంటాయి. మొదటి అక్షరానికీ పదమూడవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

తే. దైవకృతము నా పంపు చిత్తమునఁ బెట్టి । పుత్రశోకంబు విడు పాండుపుత్రు లధిప
తగరె! నినుఁ గొనియాడి పుత్రత్వ వృత్తిఁ । బరఁగ నది కీర్తిధర్మసంపాది గాదె! 91

ప్రతిపదార్థం: దైవకృతము= దైవ నిర్ణయం; నా పంపు= నా ఆజ్ఞ; చిత్తమునన్+పెట్టి= మనసులో ఉంచుకొని; అధిప!= ఓ రాజా!; పుత్రశోకంబున్= నీ పుత్రుల మరణంవలన పుట్టిన శోకాన్ని; విడు= వదలిపెట్టుము; పాండుపుత్రులు= పాండవులు; నినున్+కొనియాడి= నిన్ను గౌరవిస్తూ; పుత్రత్వ+వృత్తిన్= కుమారుల ధర్మంతో; పరఁగన్= ప్రవర్తించటానికి; తగరె!= అర్హులుకారా! (ఇంతేకాకుండా); అది= అట్లా ఉంటే; (నీకు) కీర్తి= కీర్తిని; ధర్మ= ధర్మాన్ని; సంపాది= సంపాదించేది; కాదె!= అవుతుంది కదా!

తాత్పర్యం: రాజా! దైవనిర్ణయాన్ని, నా ఆజ్ఞను నీ మనసులో ఉంచుకొమ్ము. నీ శోకాన్ని మానుము. పాండవులు నిన్ను గౌరవిస్తూ నీ కొడుకులవలె వర్తించటానికి తగినవారు కారా? (నీ తమ్ముడి కుమారులే కదా!). అట్లా వారు ఉండటం నీకు కీర్తిని, ధర్మాన్ని సంపాదించి పెట్టుతుంది కదా!

వ. వనట యనియెడు నగ్ని నెఱుక యనియెడు నీట నార్పుము. ప్రాణంబులు ధరియింపుము. సముచిత వృత్తిఁ జరియింపు' మనిన విని చింతాక్రాంతుండై కొండొకసే పూరకుండి ధృతరాష్ట్రుఁడు తేజోధనుండగు నత్తాపసోత్తమున కిట్లనియె. 92

ప్రతిపదార్థం: వనట= శోకం; అనియెడు= అనే; అగ్నిన్= మంటను; ఎఱుక= జ్ఞానం; అనియెడు= అనే; నీటన్= నీటితో; ఆర్పుము= చల్లార్చుము; ప్రాణంబులు= నీ ప్రాణశక్తిని; ధరియింపుము= కూడదీసుకొమ్ము; సముచిత= తగిన; వృత్తిన్= రీతిలో; చరియింపుము= నడుచుకొమ్ము; అనినన్= అని వ్యాసమహర్షి చెప్పగా; విని; చింతా+ఆక్రాంతుండు+ఐ= ఆలోచనలో మునిగిపోయి (ఆలోచనచేత ఆక్రమింపబడి); కొండొకసేపు= కొంత సమయం; ఊరకుండి; ధృతరాష్ట్రుడు; తేజస్+ధనుండు+అగు= తపస్సువలన వచ్చిన తేజస్సునే సంపదగా కలిగిన; ఆ+తాపస్+ఉత్తమునకున్= ఆ ఋషి శ్రేష్ఠునితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: 'నీ శోకం అనే మంటను జ్ఞానం అనే నీటితో ఆర్పివేయుము. నీ ప్రాణశక్తిని కూడదీసికొమ్ము. తగిన రీతిలో నడుచుకొమ్ము'. అని వ్యాసమహర్షి చెప్పగా మళ్ళీ కొంతసేపు ఆలోచనలో మునిగిపోయి తేరుకొని కాసేపు ఊరకుండి ధృతరాష్ట్రుడు తేజోధనుడైన ఆ మహర్షితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: రూపకం. అగ్ని దహిస్తుంది. శోకం కూడా పరితాపాన్ని కలిగిస్తుంది. పరితాపమంటే మళ్ళీ కాలటమే. కాబట్టే శోకాన్ని శోకాగ్ని అంటారు. జ్ఞానం నీరువలెనే ప్రవాహరూపమైంది. అంతే కాకుండా అనుద్వేగకరమైనది. శాంతమైనది. అది నీటి లక్షణం.

క. 'మును శోకానలతాపం । బునఁ బొగులుట నొండెఱుంగఁ బోలక దుఃఖం
బున మునుఁగ వలసె నీదు వ । చనములు విని మునివరేణ్య! శాంతుఁడ నైతిన్. 93

ప్రతిపదార్థం: మును= ముందు (ఇంతవరకు); శోక+అనల= దుఃఖమనే అగ్నియొక్క; తాపంబునన్= మంటలో; పొగులుటన్= కుమిలిపోవటంవలన; ఒండు+ఎఱుంగన్+పోలక= మరోదాన్ని గుర్తించలేక; దుఃఖంబునన్= దుఃఖంలో; మునుఁగన్+వలసెన్= మునుగవలసి వచ్చింది; మునివరేణ్య!= మునిశ్రేష్ఠుడా!; నీదు= నీ; వచనములు= మాటలు; విని; శాంతుఁడను+ఐతిన్= శాంతమనస్కుడిని అయ్యాను.

తాత్పర్యం: 'మునిశ్రేష్ఠుడా! ఇంతవరకు దుఃఖమనే అగ్నిలో కుమిలిపోయి ఉండటం వలన మరొక దానిని గురించి ఆలోచించలేక పోయాను. ఇప్పుడు నీ మాటలు విని మనస్సు ప్రశాంతమైనది.

విశేషం: అలం: రూపకం.

క. ధరియించెదఁ బ్రాణము మది । నెరియకయుండంగ శోక మేఁ దొఱఁగెద ని
ర్భర బాంధవంబు నొందెదఁ । బురుషోత్తములైన పాండుపుత్రకుల దెసన్'. 94

ప్రతిపదార్థం: ప్రాణమున్= ప్రాణశక్తిని; ధరియించెదన్= కూడదీసుకొంటాను; మదిన్= మనసులో; ఎరియక+ఉండంగన్= బాధపడకుండా ఉండే లాగున; ఏన్= నేను; శోకము= దుఃఖాన్ని; తొఱఁగెదన్= విడిచిపెటతాను; పురుషోత్తములు+ఐన= మానవోత్తములైన; పాండుపుత్రకుల దెసన్= పాండవుల మీద; నిర్భర= అతిశయించిన; బాంధవంబు= బాంధవ్యాన్ని; ఒందెదన్= పొందుతాను.

తాత్పర్యం: మహర్షీ! మీరు చెప్పినట్టే నా ప్రాణశక్తులను కూడదీసుకొంటాను. బాధపడటం మానివేసి దుఃఖాన్ని విడిచిపెడతాను. పాండవులు మానవోత్తములు. వారిమీద అతిశయించిన బాంధవ్యాన్ని పెంచుకొంటాను'.

వ. అనుటయు నమ్మహాత్ముం డట్లగుట మేలని పలికి యంతర్ధానంబుఁజేసె. నిట్లు ప్రబోధితుండై యాంబికేయుండు గొండొక ప్రొ ద్దూరకుండి సంజయుం బేరుకొని పయనం బాయితంబు సేయుమని చెప్పి, విదురుతో 'నీవు గాంధారిని గుంతినిం దక్కుఁగల కౌరవవధూవర్గంబును దోడ్కొని రావలయు మనము పొలికలనికిం బోవుచున్న వారమని యెఱింగించి వెలువరింపు' మనిన నయ్యిరువురు నట్ల చేసిన. 95

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధృతరాష్ట్రుడు అనగా; ఆ+మహాత్ముండు= ఆ వ్యాసమహర్షి; అట్లు+అగుట= అట్లా చేయటం; మేలు+అని= మంచిదని; పలికి= చెప్పి; అంతర్ధానంబున్+చేసెన్= అంతర్ధానమయ్యాడు; ఇట్లు= ఈ విధంగా; ప్రబోధితుండు+ఐ= ఉపదేశింపబడి; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; కొండొకప్రొద్దు= కొంతసేపు; ఊరకుండి; సంజయున్= సంజయుడిని; పేరుకొని= పిలిచి; పయనంబు= ప్రయాణం; ఆయితంబు+చేయుము+అని= సిద్ధంచేయుమని; చెప్పి; విదురుతోన్= విదురునితో; నీవు; గాంధారినిన్= గాంధారిని; కుంతినిన్= కుంతిని; తక్కుఁగల= మిగిలిన; కౌరవ వధూవర్గంబునున్= కౌరవస్త్రీలను; తోడ్కొని= పిలుచుకొని; రావలయున్= రావాలి; మనము= మనం అందరం; పొలికలనికిన్= యుద్ధభూమికి; పోవుచున్నవారము= వెళ్తున్నాము; అని; ఎఱింగించి= చెప్పి (తెలిపి); వెలువరింపుము= ప్రయాణం చేయించుము; అనినన్= అని చెప్పగా; ఆ+ఇరువురున్= ఆ సంజయ విదురులు; అట్లు+అ చేసినన్= అట్లాగే చేయగా.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు చెప్పగా వ్యాసమహర్షి 'అట్లా చేయటం మంచి' దని చెప్పి మాయమయ్యాడు. ఈ విధంగా మహర్షిచేత ఉపదేశం పొందిన ధృతరాష్ట్రుడు కొంతసేపు నిశ్శబ్దంగా ఉండి సంజయుడిని పిలిచి 'ప్రయాణానికి సిద్ధం చేయుము' అని చెప్పి విదురుడితో 'నీవు గాంధారిని, కుంతిని, తక్కిన కౌరవ స్త్రీలను పిలుచుకొని రావాలి. మనమందరం యుద్ధభూమికి వెళ్తున్నా మని వారికి తెలిపి, ప్రయాణం చేయించుము'. అని చెప్పగా ఆ ఇరువురు అట్లాగే చేయగా (తరువాతి పద్యంతో అన్వయం).

ధృతరాష్ట్రుఁడు సపరివారంబుగాఁ బొలికలనికిం బోవుట (సం. 11-9-5)

క. ఆరంగూరిన శోకము । భారంబున మేను దూలఁ బరవశగతి గాం
ధారి చనుదెంచె నవ్వసు । ధారమణుని కడకు జనవితానము వొగులన్. 96

ప్రతిపదార్థం: ఆరన్= మిక్కిలిగా; కూరిన= పొందిన; శోకము భారంబునన్= శోక భారంచేత; మేను= శరీరము; తూలన్= తూలిపోతుండగా; పరవశగతిన్= పరాధీనురాలిగా (ఇతరుల ఆసరాతో); గాంధారి= గాంధారీదేవి; ఆ+వసుధారమణుని కడకున్= ఆ ధృతరాష్ట్ర భూపాలుని వద్దకు; జనవితానము= తోడుగా ఉన్న జనసమూహం; పొగులన్= దుఃఖిస్తుండగా; చనుదెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: మిక్కిలిగా పొందిన శోకం బరువుచేత గాంధారి శరీరం తూలిపోతూ ఉన్నది. ఇతరుల ఆసరాతో ఆమె ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చింది. తోడుగా వస్తున్న కౌరవస్త్రీలు ఏడుస్తున్నారు.

వ. కుంతీ ప్రముఖంబైన కురువృద్ధనారీజనంబును బరివారవనితాజనసహితంబుగాఁ దరతరంబ యరుగు దెంచె నట్టియెడ. 97

ప్రతిపదార్థం: కుంతీ ప్రముఖంబైన= కుంతి మొదలైన; కురువృద్ధ నారీజనంబును= కురువంశంలోని ముసలి ఆడవారు; పరివార వనితాజన సహితంబుగాన్= పరిచారికలైన ఇతర పరివార స్త్రీ సమూహంతో కూడి; తరతరంబ= క్రమక్రమంగా కలిసి; అరుగుదెంచెన్= అక్కడికి వచ్చారు; అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: కుంతీదేవి మొదలైన కురువంశంలోని పెద్ద ఆడవారు, వారికి పరిచర్యలు చేసే ఇతర స్త్రీలు, క్రమక్రమంగా కలిసి అక్కడకు వచ్చారు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. చేతులు నడుదల సేర్చు టుత్కటశోక । మాకారములు దాల్చి నట్టులుండ
విరిసిన వేనలుల్ వెన్నులఁ బ్రక్కల । నెఱసి చూపఱ దృష్టి నీఱు సేయ
నందంద దొరఁగెడు నశ్రుజలంబుల । పెంపున మోములు ముంపఁబడఁగ
నేమియుఁ దొడవులు లేమిఁ బాడఱియున్న । యంగంబులందు దైన్యంబు నెఱయఁ

తే. బతుల నన్నలఁ దమ్ముల సుతుల హితులఁ । బేరుకొని వాతు లెండఁగఁ బ్రేముడించి
పనవు పలుకులు వినువారి వనటఁ దేల్పఁ । గురుకుమార నారీజనకోటి వచ్చె. 98

ప్రతిపదార్థం: నడు+తలన్= నడినెత్తిమీద; చేతులు+చేర్చుట= తమ చేతుల్ని చేర్చడం; ఉత్కట= మిక్కిలిదైన; శోకము= శోకరసం; ఆకారములు= శరీరాలు; తాల్చినట్టులు+ఉండన్= ధరించినట్లు ఉండగా; విరిసిన= విరయబోసుకున్న; వేనలుల్= కొప్పులు; వెన్నులన్= వీపులపైనా; ప్రక్కలన్= పక్కలలోనూ; నెఱసి= వ్యాపించి; చూపఱ= చూచేవారి; దృష్టిన్= చూపును; నీఱు+చేయన్= భస్మం చేయగా (నిర్వికారంగా మార్చగా); అందంద= అక్కడక్కడా; తొరఁగెడు= వర్షిస్తున్న; అశ్రుజలంబుల= కంటి నీటియొక్క; పెంపునన్= అతిశయంచేత; మోములు= ముఖాలు; ముంపఁబడఁగన్= ముంచివేయబడగా; ఏమియున్= బొత్తిగా; తొడవులు= నగలు; లేమిన్= లేకపోవటంచేత; పాడు+అటి+ఉన్న= పాడువడినట్టున్న; అంగంబులందున్= శరీరాలలో; దైన్యంబు= దీనత్వం; నెఱయన్= నిండగా; పతులన్= భర్తలను; అన్నలన్= అన్నలను; తమ్ములన్= తమ్ముళ్ళను; పేరుకొని పేర్లు పెట్టి పిలుస్తూ; వాతులెండంగన్= నోళ్ళుతడారిపోగా; ప్రేముడించి= దుఃఖిస్తూ; పనవు పలుకులు= వారిని పేర్కొంటూ మాట్లాడుతున్న మాటలు; వినువారిన్= వినేవాళ్ళను; వనటన్= దుఃఖంలో; తేల్పన్= ముంచివేయగా; కురుకుమార= కురువంశ రాజకుమారుల; నారీజనకోటి= స్త్రీ జనసమూహం; వచ్చెన్= వచ్చారు.

తాత్పర్యం: నడి నెత్తులపై చేతులుంచుకొని దుఃఖిస్తున్న ఆ స్త్రీలు రూపం దాల్చిన శోకంవలె కనిపిస్తున్నారు. విరబోసికొన్న వారి జడకొప్పులు వీపులమీదా పక్కలలోనూ వ్యాపించి చూచేవారిని నిర్వికారంగా మార్చి వేస్తున్నాయి. వారి కళ్ళనుంచి కారుతున్న అశ్రుజలాల వర్షంలో వారి ముఖాలు మునిగిపోయాయి. ఏ ఒక్క ఆభరణమూ లేని వారి అవయవాలు పాడుబడి శిథిలాలై అతిదీనంగా కనిపిస్తున్నాయి. యుద్ధంలో చనిపోయిన తమ భర్తలను, అన్నదమ్ములను పేరు పేరునా పిలుస్తూ నోళ్ళుతడి ఆరిపోయేటట్లు వారు చేస్తున్న ఆర్తనాదాలు వినేవాళ్ళనందరినీ దుఃఖసాగరంలో ముంచి వేస్తున్నాయి. ఈ విధంగా కురువంశ రాజకుమారుల స్త్రీలందరూ యుద్ధ భూమికి తరలివస్తున్నారు.

విశేషం: అలం: స్వభావోక్తి. 'నివుఱు' అంటే బూడిద. దానికి 'నీఱు' రూపాంతరం. భస్మంచేయటం అంటే కావ్యపరంగా ఏమీలేకుండా చేయటమని అర్థం. ఏ జడకొప్పు కామాన్ని ఉద్రేకింపజేస్తుందో ఆ జడే విరబోసుకున్నప్పుడు, దుఃఖసమయంలో నిర్వికారాన్ని కలిగిస్తుందని అర్థం.

క. చెలులైనఁ జూడఁ బయ్యద । దొలఁగుటకును సిగ్గు పడు వధూజనతతి య
త్తల యెదుర నేక వస్త్రం । బులతో నంగమును వికృతిఁ బొందఁగ నడచెన్. 99

ప్రతిపదార్థం: చెలులు+ఐనన్= చెలికత్తెలయినా; చూడన్= చూస్తుండగా; పయ్యద+తొలఁగుటకును= పైట తొలగిపోతే; సిగ్గుపడు= సిగ్గుపడేటటువంటి; వధూ జనతతి= కురుకుమారుల భార్యలు; అత్తల+ఎదురన్= తమ అత్తల ఎదుటనే; ఏకవస్త్రంబులతోన్= ఒకే చీరతో (తొలగిపోయిన పైటలతో); అంగమును= తమ శరీరాలు; వికృతిన్+పొందఁగన్= శోకంచేత వికారాన్ని పొందగా; నడచెన్= నడుస్తూ వచ్చారు.

తాత్పర్యం: సాధారణంగా చెలికత్తెలు అయినా చూస్తుండగా పైటలు తొలగిపోతే సిగ్గుపడేటటువంటి కురుకుమారుల భార్యలు తమ అత్తల ఎదుట పైటలు తొలగిపోతున్నా లెక్కచేయక శోకోద్రేకంచేత వికారమైన ఆకారాలతో వస్తున్నారు.

క. కొండొక వగపున కేనియు । నొండొరువులఁ దెల్పునట్టి యువిదలు చిత్తం
బొండొండ వనట మునుఁగఁగ । నొండెవ్వరుఁ దెలుపలేక యుండి రవశలై. 100

ప్రతిపదార్థం: కొండు+ఒక= ఏ కొంచెం; వగపునకున్+ఏనియున్= బాధనైనా; ఒండు+ఒరువులన్= ఒకరికొకరు; తెల్పునట్టి= చెప్పుకొనేటువంటి; ఉవిదలు= ఆ స్త్రీలు; చిత్తంబు= మనస్సులు; వనటన్= శోకంలో; మునుఁగఁగన్= మునిగిపోగా; ఒండు+ ఎవ్వరున్= ఒకరికి మరొకరు; (ఏమీ); తెలుపలేక= చెప్పుకోలేకుండా; అవశలై= తమ మీద తమకే అదుపులేని స్థితిలో ఉండిరి= ఉన్నారు.

తాత్పర్యం: ఆ కురు కుమారుల వనితలు చాలా సుకుమారమైన మనసులున్నవారు. ఏ కొంచెం బాధకలిగినా ఒకరికొకరు చెప్పుకొనే వారుకూడా మనస్సులు శోకంలో మునిగిపోగా ఒకరి కొకరు ఏమీ చెప్పలేక తమ మీద తమకే అదుపులేని మానసిక స్థితిలో సాగిపోతున్నారు.

వ. అట్టి యెడఁ బురంబున నచ్చటచ్చట. 101

తాత్పర్యం: అట్లాంటి సమయంలో నగరంలో ఆయా చోట్ల.

తే. విపుల హర్మ్యతలంబులు వెడలునట్టి । వెలఁది మొత్తముల్ వొల్చె బల్వేఁటకాఱు
పతులఁ జంపిన గిరిగుహాప్రతతి వెడలఁ । బాఱు సింగంపుఁ బెంట్లకుఁ బాటియగుచు. 102

ప్రతిపదార్థం: విపుల= పెద్దవైన; హర్మ్యతలంబులు= ఇంటి వాకిళ్ళు; వెడలునట్టి= వదలివస్తున్న; వెలఁది మొత్తముల్= స్త్రీల సమూహాలు (కురుకుమారుల భార్యలు కాని ఇతర యోధుల వనితలు); బల్+వేటకాఱు= బలిష్ఠులైన వేటగాండ్రు; పతులన్+ చంపినన్= తమ పోతులను చంపివేయగా; గిరిగుహా ప్రతతిన్= కొండ గుహల సమూహాన్ని; వెడలన్+పాఱు= వదలి పారిపోతున్న (వస్తున్న); సింగంపున్+పెంట్లకున్= ఆడ సింహాలకు; పాటి+అగుచున్= సమానంగా; పొల్చెన్= అగుపించారు.

తాత్పర్యం: హస్తినాపురంలోని ఇతర మృతవీరుల భార్యలు విశాలమైన ఇళ్ళ నుండి బయటికి వస్తున్నారు. వారు వేటగాళ్ళు తమ పోతులను చంపివేయగా ఆక్రోశిస్తూ గుహలనుండి బయటికి వస్తున్న ఆడ సింహాలవలె వారు అగుపిస్తున్నారు.

విశేషం: అలం: ఉపమ.

క. మున్నెన్నఁడు నెవ్వరికిం । గన్నులెదురఁ బడని యట్టి కాంతలు జను లె
ల్ల న్నిలిచి చూడ వెడలిరి । కన్నులు గమరన్ సుహృన్నికాయంబులకున్. 103

ప్రతిపదార్థం: మున్ను= మునుపు; ఎన్నఁడున్= ఏనాడూ; ఎవ్వరికిన్= ఎవరికీ; కన్నుల+ఎదురన్= కళ్ళెదుట; పడని+అట్టి= కనిపించని; కాంతలు= కౌరవ కాంతలు; జనులు+ఎల్లన్= జనులందరూ; నిలిచి+చూడన్= నిలబడి చూస్తుండగా; సుహృద్+ నికాయంబులకున్= స్నేహితుల, ఆప్తులసమూహాలకు; కన్నులు కమరన్= కన్నులు కాలగా; వెడలిరి= బయలు దేరారు.

తాత్పర్యం: మునుపు ఏనాడూ ఎవరికీ కళ్ళెదుట కనిపించని కౌరవకాంతలు ప్రజలందరూ నిలబడి చూస్తుండగా ఆప్తులైనవాళ్ళకు, స్నేహితులకు వారిని చూడలేక బాధతో కళ్ళుమండిపోతుండగా బయలుదేరి వచ్చారు.

వ. అప్పుడు కురువీరాగారంబులయందు హాహాకారంబు లెసంగ నిట్లు వనితా జనవ్రాతం బేతెంచి ధృతరాష్ట్ర సూరెల నాక్రందన ధ్వనులు సెలంగ నిలిచె, విదురుండు డగ్గుత్తికపడుచు నయ్యువిదల నూరార్చుచుఁ

దగువారల నుచిత వాహనంబులపై నిడియె. నద్ధరణీనాథుండు నిజయోగ్యయానంబునఁ జనఁ దోడన యా తమ్ముండును గాంధారీప్రభృతులం దోడుకొని సంజయ సహితంబుగాఁ జనియెఁ, బిన్నలు పెద్దలనక సకల పౌరలోకంబునకు శోకం బావహిల్లినం బెల్లైన రోదనప్రణాదంబుల దిక్కులు పిక్కటిల్లెఁ. బ్రళయకాల జ్వలన జ్వాలలం బొదువంబడు జంతువు లాక్రోశించు చందంబు దోఁచెఁ, బురిఁగల వైశ్యశూద్ర శిల్పి కర్మార తక్షక క్షౌరక స్వర్ణకారక రజకాదు లమ్మహీపతి బలసి చని రివ్విధంబునం గ్రోశమాత్రంబు చని రాసమయంబున. **104**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; కురువీర+అగారంబులయందు= కురు వీరుల ఇళ్ళలో; హాహాకారంబులు= ఆర్తనాదాలు; ఎసంగన్= పుట్టగా; ఇట్లు; ఈ విధంగా; వనితాజనవ్రాతంబు= స్త్రీ సమూహం; ఏతెంచి= వచ్చి; ధృతరాష్ట్రు సూరెలన్= ధృతరాష్ట్రుడి ప్రక్కల (సమీపంలో); ఆక్రందన ధ్వనులు= ఆర్తనాదాలు; చెలంగన్= మ్రోయగా; నిలిచెన్= నిలిచింది; విదురుండు= విదురుడు; డగ్గుత్తిక పడుచున్= మాట పెగలక, గద్గదస్వరంతో; ఆ+ఉవిదలన్= ఆ స్త్రీలను; ఊరార్చుచున్= ఓదారుస్తూ; తగువారలన్= ముఖ్యమైన వారిని; ఉచిత= వారి వారికి తగిన; వాహనంబులపైన్= వాహనాలమీద (బళ్ళమీద); ఇడియెన్= కూర్చోపెట్టాడు; ఆ+ధరణీనాథుండు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; నిజయోగ్య= తనకు తగిన; యానంబునన్= రథంలో; చనన్= బయలు దేరగా; తోడన్+అ= వెంటనే; ఆ+తమ్ముండును= తమ్ముడైన ఆ విదురుడు; గాంధారీ ప్రభృతులన్= గాంధారి, కుంతి మొదలైనవారిని; తోడుకొని= పిలుచుకొని; సంజయ సహితంబుగాన్= సంజయుడితో; కలిసి; చనియెన్= బయలుదేరాడు; పిన్నలు, పెద్దలు+అనక= చిన్నా పెద్దా అనే తేడా లేకుండా; సకల పౌరలోకంబునకున్= ప్రజలందరికీ; శోకంబు= దుఃఖం; ఆవహిల్లినన్= కలుగగా; పెల్లు+ఐన= అతిశయించిన; రోదన ప్ర+నాదంబులన్= పెద్ద ఏడుపులతో; దిక్కులు+పిక్కటిల్లెన్= దిక్కులు నిండాయి; ప్రళయకాల= ప్రళయకాలంలో; జ్వలన= మండుతున్న; జ్వాలలన్= మంటల్లో; పొదువంబడు= చిక్కుకున్న; జంతువులు; ఆక్రోశించు= రోదించే; చందంబు= విధం; తోఁచెన్= అగుపించినది; పురిన్+కల= ఆ నగరంలోని; వైశ్య= వైశ్యులు; శూద్ర= శూద్రులు; శిల్పి= శిల్పులు; కర్మారులు= కమ్మరులు; తక్షక= వడ్లవారు; క్షౌరక= మంగళ్ళు; స్వర్ణకారక= కంసాలులు; రజకాదులు= చాకళ్ళు మొదలైనవారు; ఆ+మహీపతిన్= ఆ రాజును; బలసి= చుట్టి లేదా చుట్టుకొని (ముందువెనుకలుగా); చనిరి= బయలుదేరారు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; క్రోశమాత్రంబు= ఒక క్రోసు దూరం; చనిరి= వెళ్ళారు; ఆ సమయంబునన్= అప్పుడు.

తాత్పర్యం: ఆ సమయంలో కురుకుమారుల ఇళ్ళలో ఆర్తనాదాలు పుట్టాయి. ఏడ్పులు రోదనాలతో కురుస్త్రీలంతా వచ్చి ధృతరాష్ట్రుడి సమీపంలో నిలిచారు. విదురుడికి నోట మాట పెగలటం లేదు. నెమ్మదిగా వారికి ఓదార్పు మాటలు చెబుతూ ముఖ్యమైన వారిని వారివారికి తగిన వాహనాలమీద కూర్చొనపెట్టాడు. ధృతరాష్ట్రుడు కూడా తనకు తగిన రథాన్ని ఎక్కి బయలుదేరాడు. అతడి వెనుకనే విదురుడు గాంధారి, కుంతి మొదలైన వాళ్ళను పిలుచుకొని సంజయుడితో కలిసి బయలుదేరాడు. చిన్నా పెద్దా అనక అందరూ శోక సముద్రంలో మునిగిపోయారు. ఏడ్పులు పెడబొబ్బలతో దిక్కులు మారుమ్రోగిపోయాయి. ప్రళయకాలంలో మంటలలో చిక్కుకొన్న జంతువులవలె ఆ స్త్రీలు ఏడుస్తున్నారు.ఆ నగరంలోని వైశ్యులు, శూద్రులు, శిల్పులు, కమ్మరులు, వడ్లవారు, మంగళ్ళు, కంసాలులు, చాకళ్ళు మొదలైన అన్ని వృత్తులవాళ్ళు ఆ రాజును చుట్టుముట్టి నడుస్తున్నారు. ఇట్లా ఒక క్రోసెడు దూరం అందరూ వెళ్ళారు అప్పుడు.

విశేషం: క్రోశం - రెండు వేల ధనుస్సుల నిడివి కలిగిన దూరమని నిఘంటువులు 'క్రోసెడు' అన్నమాటకు అర్థం చెప్పుతున్నాయి.

సీ. **ఆచార్య సుతుఁడుఁ గృపాచార్యుఁడును గృత । వర్మయు నెదురుగా వచ్చి రథము**
లంతంత డిగ్గి శోకార్తి నంగంబులు । దూల బాష్పంబులు దొరుఁగుచుండఁ
గా ధృతరాష్ట్రునిఁ గాంచి గద్గదకంఠు । లగుచు నాతని కిట్టు లనిరి 'నీదు
తనయుండు భుజబల దర్పంబు దుర్వార । శౌర్యంబు మెరయంగ సంగరంబు

తే. **సేసి యింద్రాది సురుల మెచ్చించి వారి । కతిథియై చని పరమ సుఖానుభవము**
దగిలె నేము ముప్వురమును దక్క నమ్మ । హీశుతోడన్ సైన్యంబు లెల్లఁ జనియె.' 105

ప్రతిపదార్థం: ఆచార్యసుతుఁడున్= ద్రోణాచార్యుని కుమారుడైన అశ్వత్థామా; కృపాచార్యుఁడును= కృపుడూ; కృతవర్మయున్= కృతవర్మా; ఎదురుగాన్+వచ్చి= ఎదురుగావచ్చి; అంతంతన్= కొంచెం దూరంలో; రథములు= రథాలనుండి; డిగ్గి= దిగినవారై; శోక+ఆర్తిన్= దుఃఖబాధచేత; అంగంబులు= అవయవాలు; తూలన్= కంపిస్తుండగా; బాష్పంబులు= కంటినీరు; తొరుఁగుచుండఁగాన్= ప్రవహిస్తుండగా; ధృతరాష్ట్రునిన్+కాంచి= ధృతరాష్ట్రుడిని చూచి; గద్గద= వణుకుతున్న; కంఠులగుచున్= గొంతుకలు కలవారై; ఆతనికిన్= ఆ రాజుతో; ఇట్టులు+అనిరి= ఇట్లా అన్నారు; నీదు తనయుండు= నీ కుమారుడైన దుర్యోధనుడు; భుజబలదర్పంబు= భుజబలంచేత ఏర్పడిన గర్వం; దుర్వార= వారించటానికి వీలుకాని; శౌర్యంబు= పరాక్రమం; మెఱయంగన్= ప్రకాశించగా; సంగరంబు+చేసి= యుద్ధంచేసి; ఇంద్ర+ఆది= ఇంద్రుడు యముడు మొదలైన; సురులన్= దేవతలను; మెచ్చించి; వారికిన్+అతిథి+ఐ= వారికి అతిథిగా (స్వర్గానికి); చని= వెళ్ళి; పరమ సుఖానుభవమును= స్వర్గసుఖాన్ని; తగిలెన్= పొందాడు; ఏము= మేము; ముప్వురమును తక్కన్= ముగ్గురం తప్ప; సైన్యంబులు+ఎల్లన్= తక్కిన సైన్యమంతా; ఆ+మహీశుతోడన= ఆ రాజుతోనే; చనియెన్= చనిపోయింది.

తాత్పర్యం: ద్రోణాచార్యుడి కుమారుడైన అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ - వీరు ముప్వురూ ఎదురుగా వచ్చి కొంత దూరంలో రథాలు దిగి, దుఃఖబాధతో వారి అవయవాలు కంపిస్తుండగా, కళ్ళల్లో నీళ్ళు ధారలుగట్టి ప్రవహిస్తుండగా, ధృతరాష్ట్రుడిని చూచి గడగడలాడుతూ వణుకుతున్న కంఠాలతో ఆ రాజుతో ఇట్లా అన్నారు. 'నీ కుమారుడైన దుర్యోధనుడు తన భుజబలం దర్పంతోనూ, వారించటానికి కాని పరాక్రమంతోనూ మహాయుద్ధంచేసి ఇంద్రాది దేవతలను మెప్పించి వారికి అతిథిగా స్వర్గానికి వెళ్ళి పరమసుఖాన్ని పొందాడు. మేము ముగ్గురం తప్ప తక్కిన సైన్యమంతా ఆ మహారాజుతోనే చనిపోయింది.'

వ. **అనినఁ దదనంతరంబ.** 106

తాత్పర్యం: అని వారు ముప్వురూ చెప్పారు. ఆ తరువాత.

కృపాచార్యుఁడు గాంధారి నూరార్చిన ప్రకారము (సం. 11-10-5)

తే. **తనుజ శోకార్తయైన గాంధారిఁ జూచి । యడలు తనదు చిత్తంబున నతిశయిల్ల**
నలఁతఁ దేర్పంగఁ దలఁచి తానల్లఁ జేరి । యమ్మహాదేవి తోడ నిట్లనియెఁ గృపుఁడు. 107

ప్రతిపదార్థం: తనుజ= కుమారుల మరణంచేత ఏర్పడిన; శోక+ఆర్త+ఐన= దుఃఖంచేత ఆర్తురాలుగా కనిపిస్తున్న; గాంధారిన్+చూచి= గాంధారీదేవిని చూసి; కృపుఁడు= కృపాచార్యులు; తనదు చిత్తంబునన్= తన మనసులో; అడలు= దుఃఖం; అతిశయిల్లన్= అధికంకాగా; అలఁతన్= బాధను; తేర్పంగన్+తలఁచి= పోగొట్టటంకోసం (పోగొట్టాలని ఆలోచించి); తాను; అల్లన్+చేరి= నెమ్మదిగా చేరి; ఆ+మహాదేవి తోడన్= ఆ మహారాణితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నారు.

తాత్పర్యం: తన కుమారుల మృతి చేత ఏర్పడ్డ దుఃఖంతో అతి దీనురాలుగా కనిపిస్తున్న గాంధారిని చూచి కృపాచార్యుడికి కూడా మనసులో దుఃఖం కట్టలు తెంచుకొన్నది. ఆమె బాధను పోగొట్టాలని ఆలోచించి ఆయన ఆమె వద్దకు నెమ్మదిగా వెళ్ళి ఆ మహారాణితో ఇట్లా అన్నాడు.

మణిమాలా వృత్తము:

'భవదీయ సూను లరి సైన్య పఙ్క్తిఁ గొని కాల్చిరెల్లఁ బొగడన్
వివిధాస్త్ర శస్త్రమయ సాంద్రవృష్టిఁ దెగటాఱి పెంపు మిగులన్
దివి కేఁగి యందు మహనీయ తేజ మెసఁగంగ హృద్యబలభి
ద్ధువ సౌఖ్యసంపదలు గాంచి సంతోషమునఁ దేలి రేల వగవన్? 108

ప్రతిపదార్థం: భవదీయ= నీ; సూనులు; కుమారులు; అరిసైన్య పఙ్క్తిన్= శత్రు సైన్య సమూహాన్ని; కొని= పట్టుకొని; ఎల్లన్+ పొగడన్= అందరూ ప్రశంసించగా; కాల్చిరి= బూడిద చేశారు; వివిధ= అనేకాలైన; శస్త్రమయ= శస్త్రాలతో కూడిన; సాంద్రవృష్టిన్= దట్టమైన వర్షంచేత; తెగటాఱి= చనిపోయి; దివికిన్= స్వర్గానికి; పెంపుమిగులన్= అతిశయించిన గౌరవంతో; ఏఁగి= వెళ్ళి; అందున్= ఆ స్వర్గంలో; మహనీయ= గొప్ప; తేజము= కాంతి; ఎసఁగంగన్= అతిశయించగా; హృద్య= మనోహరమైన; బలభిత్= ఇంద్ర సంబంధమైన (స్వర్గ); ధ్రువ= నిత్యమైన; సౌఖ్యసంపదలు= సుఖాలను; కాంచి= పొంది; సంతోషమునన్= సంతోషంలో; తేలిరి= సరదాగా ఉన్నారు; వగవన్= దుఃఖించటం; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: 'గాంధారీదేవీ! నీ కుమారులు శత్రుసైన్య సమూహాలను అందరూ ప్రశంసించే రీతిలో ధ్వంసంచేశారు. వివిధ శస్త్రాస్త్రమయమైన ఆయుధ వర్షంలో అందరూ చనిపోయి అతిశయించిన గౌరవంతో స్వర్గానికి వెళ్ళి అక్కడ గొప్ప కాంతితో ప్రకాశిస్తూ మనోహరమైన నిరంతర స్వర్గసౌఖ్యాన్ని పొంది సంతోషసాగరంలో తేలుతున్నారు. అట్లాంటి వారిని గురించి చింతించటం తగదు.

విశేషం: మణిమాలా వృత్తంలో ప్రతిపాదానికీ స, జ, స, జ, స, జ, స గణము లుంటాయి. మొదటి అక్షరానికీ పదకొండవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

స్వాగత వృత్తము:

అందొకండును రణావని భీతిం । బొంద కేటులను బోటుల దప్పిం
బొందియైనఁ బొలివోవఁడ దానం । బొంది రూర్ధ్వగతిఁ బుణ్యచరిత్రా! 109

ప్రతిపదార్థం: పుణ్యచరిత్రా!= పవిత్ర చరిత్ర కలిగిన ఓ గాంధారీ! అందున్= నీ కొడుకులలో; ఒకండును= ఒక్కడుకూడా; రణ+అవనిన్= బాణాల యుద్ధభూమిలో; భీతిన్+పొందక= భయపడక; ఏటులన్= బాణాల దెబ్బలతో; పోటులన్= కత్తి పోట్లతో; డప్పిన్+పొంది+ఐనన్= దప్పిక పొందినవాడై ఉండికూడా; పొలి+పోవఁడు+అ= భంగపడి యుద్ధంనుండి మరలిపోలేదు; దానన్= అంచేత; ఊర్ధ్వగతిన్= సుగతిని (స్వర్గాన్ని); పొందిరి= పొందారు.

తాత్పర్యం: ఓ పవిత్ర చరిత్ర కలిగిన గాంధారీ! నీ కొడుకులలో ఒక్కడుకూడా యుద్ధభూమిలో భయాన్ని పొందలేదు. బాణాల, గదల దెబ్బలను, బల్లెం, కత్తి మొదలైన వాటి పోటులను పొంది ఎంత దప్పిక పొందిన వారైనా భంగపడి యుద్ధం విరమించి మరలి పోలేదు. అందుచేతనే వారికి స్వర్గ ప్రాప్తి కలిగింది.

విశేషం: యుద్ధంలో శత్రువులకు భయపడి వెన్నుచూపిరావటం యోధుడి లక్షణం కాదు. అట్లా ఎదురొడ్డి చనిపోయిన వారే స్వర్గాన్ని పొందుతారని భారతీయుల విశ్వాసం.

స్వాగతవృత్తంలో ప్రతి పాదానికీ ర, న, భ, గ, గ అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ, ఏడవ అక్షరానికీ యతిమైత్రి, ప్రాస నియమం కలవు.

వనమయూర వృత్తము:

పోర నొడ లస్త్రపరిపూతముగ ధీరో । దారతఁ బిఱిందికిఁ బదం బిడక దృప్య
ద్వైరితతి నొంచి తెగువారగుట మేలు । ర్వీరమణకోటి కని వేదములు సెప్పన్. 110

ప్రతిపదార్థం: పోరన్= యుద్ధంలో; ఒడలు= దేహం; అస్త్ర= అస్త్రాలచేత; పరిపూతముగన్= నిండి పవిత్రంకాగా; ధీర+ఉదారతన్= పరాక్రమంచేత, ఔదార్యంచేత; పిఱిందికిన్= వెనుకకు; పదంబు+ఇడక= అడుగు పెట్టకుండా; దృప్యత్= దర్పించిన; వైరితతిన్= శత్రుసమూహాన్ని; నొంచి= నాశనంచేసి; తెగువారగుట= చచ్చినవారు కావటం; ఉర్వీరమణ కోటికిన్= రాజుల సమూహానికి; మేలు+అని= శ్రేష్ఠమని; వేదములు= వేదాలు; చెప్పన్= చెబుతాయి.

తాత్పర్యం: యుద్ధంలో శరీరం శస్త్రాస్త్రాలచేత సంపూర్ణంగా పవిత్రంగా, ధీరోదాత్తంగా పోరాడి, అడుగు వెనుకకు వేయకుండా దర్పించిన శత్రువుల సమూహాలను నాశనంచేసి చావటమే రాజులకు శ్రేష్ఠమైన కార్యమని వేదాలు చెప్పుతున్నాయి.

విశేషం: యోధుడు, యోగి - ఇరువురు మాత్రమే స్వర్గాన్ని పొందుతారు. అందుకే 'యుద్ధం ఒక యోగమే' అని భారతీయులు భావిస్తారు. వనమయూరవృత్తంలో ప్రతిపాదానికీ భ, జ, స, న, గ, గ అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ తొమ్మిదవ అక్షరానికీ యతిమైత్రి.

క. దానాద్యుత్తమ కర్మ వి । ధానంబులఁ బడయు గతు లుదాత్త రణమునం
జా నేర్చువాని చనియెడు । మానితగతిఁ బోల వండ్రు మహనీయాత్ముల్. 111

ప్రతిపదార్థం: మహనీయ+ఆత్ముల్= మహాత్ములు; దాన+ఆది= దానం ధర్మం మొదలైన; ఉత్తమ= గొప్ప; కర్మవిధానంబులన్= కర్మ విధులచేత; పడయు= పొందేటటువంటి; గతులు= పుణ్యలోకాలు; ఉదాత్తరణమునన్= గొప్ప యుద్ధంలో; చాన్+నేర్చు+వాని= చనిపోగలవాడి; చనియెడు= పోయేటటువంటి; మానితగతిన్= ఉత్తమ లోకప్రాప్తిని; పోలవు+అండ్రు= సమానమైనవి కావని అంటారు (సరిపోవు అంటారు).

తాత్పర్యం: దానం, ధర్మం మొదలైన గొప్ప కర్మల విధులచేత ఏ పుణ్యలోకాలను పొందుతామో అవి మహాయుద్ధంలో మరణించే వాడు పొందే ఉత్తమ లోకప్రాప్తికి సమానం కావని మహాత్ములు అంటారు.

వ. కావునం గురుకుమారుల మరణంబు సంభావనీయం బది దా నట్లుండెఁ బాండుకుమారులు గెలిచితి మని సంతసింపలే దది యెట్లనిన. 112

ప్రతిపదార్థం: కావునన్= అందువలన; కురుకుమారుల= కురురాకుమారుల; మరణంబు= మృతి; సంభావనీయంబు= ఊహించదగినదే (దేవతలు ముందుగానే చెప్పారు కాబట్టి); అది+తాన్+అట్లుండెన్= అది అట్లా జరిగింది; పాండు కుమారులు= పాండవులు; గెలిచితిమి+అని= విజయం పొందామని; సంతసింపలేదు= సంతోషించలేదు; అది ఎట్లా అంటే.

తాత్పర్యం: అందువలన కురు రాజకుమారుల మృతి ఊహించదగినదే. దేవతలు ముందు చెప్పినట్లే జరిగింది. అది అట్లా ఉండనిమ్ము. పాండవులు మాత్రం తాము గెలిచామని సంతోషపడ్డారా! అదీ ఏమీ లేదు. ఎట్లాగంటే.

నర్కుట వృత్తము:

వినుము మరుత్తనూభవుఁడు విశ్రుతధర్మగతిం
జనక కురుక్షితీశ్వరునిఁ జంపె గదాసమరం
బున నది యే మెఱింగి చనిపోయిన రేయి గడుం
గనలున ముట్టి మువ్వురముఁ గ్రౌర్య ముదగ్రముగన్. 113

ప్రతిపదార్థం: వినుము= గాంధారీదేవీ! వినుము; మరుత్+తనూభవుఁడు= మరుత్తు అంటే వాయువు - వాయుకుమారుడు - భీముడు; విశ్రుత= ప్రసిద్ధమైన; ధర్మగతిన్= ధర్మపద్ధతిలో; చనక= నడవక; కురుక్షితి+ఈశ్వరునిన్= సుయోధన మహారాజును; గదాసమరంబునన్= గదా యుద్ధంలో; చంపెన్= చంపాడు; అది= ఆ విషయం; ఏము+ఎఱింగి= మేము తెలిసికొని; చనిపోయిన రేయి= దుర్యోధనుడు చనిపోయిన ఆ రాత్రే; మువ్వురము= మేము ముగ్గురం; కనలునన్= కోపంతో; క్రౌర్యము+ఉదగ్రముగన్= కఱకుదనం అతిశయించగా.

తాత్పర్యం: గాంధారీదేవీ! వినుము. వాయుపుత్రుడైన భీముడు యుద్ధంలో పాటించే ధర్మపద్ధతిని అనుసరించకుండా సుయోధనుడిని గదాయుద్ధంలో క్రూరంగా చంపాడు. ఆ విషయం విన్న మేము ముగ్గురం అదే రాత్రి అతికోపంతో అతిశయించిన క్రౌర్యంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: నర్కుటవృత్తంలో ప్రతిపాదానికీ న, జ, భ, జ, జ, వ అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ పదకొండవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. పాండవ శిబిరంబున. 114

తాత్పర్యం: పాండవుల సైనిక స్థావరంలో.

బంధుర వృత్తము:

సకల రథములను నఖిల గజములున్ సర్వహయంబులతో బెరయన్
శకలములుగ భటనికర మఖిలముం జావఁగ ద్రౌపదిపుత్రులలో
నొకఁడును బ్రదుకక పొడిపొడియుఁగ నయ్యుర్వికి వారలమామల మ
స్తకములు కడమపడక వడి బలిగా సంతసమందఁ బిశాచతతుల్. 115

ప్రతిపదార్థం: సకల రథములను= రథాలన్నింటినీ; అఖిల గజములున్= అన్ని ఏనుగులూ; సర్వహయంబులతోన్= అన్ని గుర్రాలతో; బెరయన్= కలిసిపోయేటట్టు; శకలములుగన్= ముక్కలు ముక్కలుగా; భటనికరము+అఖిలమున్= సైన్యం మొత్తం; చావఁగన్= చచ్చిపోయేలా; ద్రౌపది పుత్రులలోన్= ఉపపాండవులలో; ఒకఁడును= ఒక్కడుకూడా; బ్రదుకక= బ్రతికి బయటపడకుండా; పొడిపొడియుఁగన్= నుగ్గునుగ్గుగా అయిపోయేలా; వారల= ఆ ఉపపాండవుల; మామల మస్తకములు= మామల తలలు; కడమ+పడక= మిగులకుండా; ఆ+ఉర్వికిన్= ఆ యుద్ధభూమికి; వడిన్= పరాక్రమంతో; బలిగాన్= బలి అయ్యేటట్లుగా; పిశాచతతుల్= పిశాచసమూహాలు; సంతసమందన్= సంతోషపడగా.

తాత్పర్యం: రథాలను, ఏనుగులను, గుర్రాలను - అన్నిటిని కలిపి నుగ్గునుగ్గుచేసి మొత్తం సైన్యమంతా చనిపోగా, ద్రౌపది కుమారులలో ఒక్కడు కూడా మిగలకుండా అందరినీ చంపి, వారి మామల తలకాయలు కూడా మిగలకుండా వీరులందరినీ పొడిపొడిచేసి, ఆ యుద్ధభూమికి మా పరాక్రమంతో బలి పెట్టాము. పిశాచ సమూహాలు సంతోషించాయి. ఈ విధంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: బంధురవృత్తంలో ప్రతిపాదానికీ న, న, న, న, స, భ, భ, గ అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ పదహారవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. **సమరంబు సేసితి మట్లగుట నప్పాండవుల విజయంబు వితథంబయ్యె నిటయేము సేయం దలంచిన దాని నెఱింగించెద నాకర్ణింపు మే మట్టి సమయంబున వార లాశిబిరంబున లేమింజేసి యాభంగి పరాక్రమం బాచరింప నోపితిమి గాని యమ్మహాబలుల మార్కొన శక్తులముగా మవ్వీరులట్లు దమ తనయులు మా తెగువం దెగటాఱుట విని శోక క్రోధాక్రాంతంబులగు నంతరంగంబులతో మమ్ము వెనుకొనుట దప్పదు. వారల బారికిం దప్పిపోవలయుం బోయెద మది తలం పనుజ్ఞయిమ్ము నీవు నుమ్మలింపకుండు 'మని పలికి ధృతరాష్ట్రు నుద్దేశించి 'దేవా! ధర్మపుత్రాదుల బారింబడక తొలంగుట భీతులగు మాకుం గర్తవ్యంబై యున్నయది మీ చేత ననుజ్ఞాతులమ నీ వింక దైవకృతం బలంఘనీయంబగుటఁ దలంచి వగ పుడుగు' మని యచ్చట నా కృప కృతవర్మాశ్వత్థామ లారాజునకు నద్దేవికిం బ్రదక్షిణంబుగా వచ్చి మరలి మరలి వారలం జూచుచుఁ దేరు లెక్కి భయంబున రయంబున నరదంబులు దోలుకొని గంగాతీరంబున కరిగి యచ్చట నన్యోన్యామంత్రణంబు సేసి పాసి రందుఁ గృపాచార్యుఁడు గరిపురి కేతెంచెఁ, గృతవర్మ నిజపురంబునకుఁ జనియె. నశ్వత్థామ కృష్ణద్వైపాయనాశ్రమంబు నాశ్రయించి గ్రక్కునం దపస్వియయ్యెఁ, దదనంతరంబ ధర్మజభీమార్జునులు దాడిమై వచ్చి యతని ముట్టుకొని రావృత్తాంతంబంతయు నీ విన్నయదియ తరువాతి కథ సెప్పెద విను మవ్విధంబునఁ గృపప్రముఖ రథికులు ముచ్చురుం దన్ను విడిచి చనిన నాంబికేయుండు గ్రొత్తయైన నెవ్వగ పెల్లునఁ జిత్తంబు విషాద వేదనాయత్తం బగుచుండ నెడనెడ నిలుచుచుఁ జనుచుండె నక్కడ నయ్యజాతశత్రుండు గురునందను శిరోరత్నంబు దెచ్చి యిచ్చి యట్లు పాంచాలి నూరార్చియున్నంత నట వోయిన జనంబుల వలన వైచిత్రవీర్యుండు పొలికలనికి వచ్చుచున్నవాఁడని విని తదభిగ మనోన్ముఖుండై.** **116**

ప్రతిపదార్థం: సమరంబు= యుద్ధం; చేసితిమి= చేశాము; అట్లు+అగుటన్= అట్లా కావటంవలన; ఆ+పాండవుల విజయంబు= ఆ పాండవులు సాధించిన విజయం; వితథంబు+అయ్యెన్= వ్యర్థమయింది; ఇట= ఇక్కడ; ఏము= మేము ముగ్గురం; చేయన్+తలంచిన దానిన్+ఎఱింగించెదన్= చేయదలచినదాన్ని చెబుతాను; ఆకర్ణింపుము= వినుము; ఏము= మేము; అట్టి= సమయంబునన్= ఆ సమయంలో; వారలు+ఆ శిబిరంబునన్+లేమిన్+చేసి= ఆ పాండవులు శిబిరంలో లేరు కాబట్టి; ఆ భంగిన్= ఆ రీతిగా; పరాక్రమంబు= పరాక్రమాన్ని; ఆచరింపన్+ఓపితిమి= చూపించగలిగాము; కాని; ఆ+మహాబలులన్= ఆ మహాపరాక్రమవంతులను; మార్కొనన్= ఎదుర్కొనటానికి; శక్తులము+కాము= సమర్థులం కాము; ఆ+వీరులు= ఆ పాండవులు; తమ తనయులు= తమ కుమారులు; మా తెగువన్= మా సాహసంచేత; అట్లు= ఆ విధంగా; తెగటాఱుట విని= చనిపోవటాన్ని విని; శోక+క్రోధ+ఆక్రాంతంబులగు+అంతరంగంబులతోన్= దుఃఖం, క్రోధం నిండిన మనస్సులతో; మమ్మున్=

మమ్ములను; వెనుకొనుట= తరుముకొంటూ రావటం; తప్పదు= తప్పనిసరిగా జరుగుతుంది; వారల బారికిన్= వాళ్ళ బారినుండి; తప్పిపోవలయున్= తప్పించుకోవాలి; పోయెదము+అది+తలంపు= వెళ్ళిపోతాము- అది మా ఆలోచన; అనుజ్ఞ+ఇమ్ము= అనుమతిని ఇవ్వుము; నీవున్= నీవు కూడా; ఉమ్మలింపక+ఉండుము= శోకించవద్దు; అని పలికి; ధృతరాష్ట్ర+ఉద్దేశించి= ఆ మహారాజును చూచి; దేవా!= ఓ రాజా!; ధర్మపుత్రాదుల బారిన్+పడక= ధర్మరాజాదుల హింసకు చిక్కకుండా; తొలంగుట= తప్పించుకుపోవటం; భీతులు+అగు= భీతులైన; మాకున్+కర్తవ్యంబు+ఐ+ఉన్న+అది= మాకు చేయదగినపని అనిపిస్తోంది; మీచేతన్+అనుజ్ఞాతులము+అ= మీ చేత అనుమతింప బడ్డాము; నీవ, ఇంకన్= ఇకమీదట; దైవకృతంబు= దైవనిర్ణయం; అలంఘనీయంబు+అగుటన్+తలంచి= ఉల్లంఘించటానికి వీలు కాదన్నది అర్థం చేసికొని; వగపు= దుఃఖాన్ని; ఉడుగుము= విడిచిపెట్టుము; అని; అచ్చటన్= ఆ చోటే; ఆ, కృప, కృతవర్మ, అశ్వత్థామలు; ఆ రాజునకున్= రాజుకు; ఆ+దేవికిన్= గాంధారికీ; ప్రదక్షిణంబుగాన్+వచ్చి= ప్రదక్షిణంగా నమస్కరించి; మరలి మరలి= మళ్ళీ మళ్ళీ; వారలన్+చూచుచున్= వాళ్ళను చూస్తూ; తేరులు+ఎక్కి= రథాలు ఎక్కి; భయంబునన్+రయంబునన్= భయంగా, వేగంగా; అరదంబులు+తోలుకొని= రథాలు తోలుకొంటూ; గంగాతీరంబునకున్+అరిగి= గంగానదీతీరానికి వెళ్ళి; అచ్చటన్= అక్కడ; అన్యోన్య+ఆమంత్రణంబు+చేసి= ఒకరినొకరు వీడ్కొని; పాసిరి= వెళ్ళిపోయారు; అందున్= వారిలో; కృపాచార్యుడు; కరిపురికిన్+ఏతెంచెన్= హస్తినాపురానికి వచ్చాడు; కృతవర్మ; నిజపురంబునకున్= ద్వారకకు; చనియెన్= వెళ్ళాడు; అశ్వత్థామ; కృష్ణద్వైపాయన= వ్యాసమహర్షి; ఆశ్రమంబున్= ఆశ్రమాన్ని; ఆశ్రయించి= చేరి; గ్రక్కునన్= ఆలస్యం చేయకుండా; తపస్వి+అయ్యెన్= తాపసి అయ్యాడు; తద్+అనంతరంబ= ఆ తరువాత; ధర్మజ భీమ అర్జునులు; దాడిమైన్= దాడిగా; వచ్చి; అతనిన్= ఆ అశ్వత్థామను; ముట్టుకొనిరి= ముట్టడించారు; ఆ వృత్తాంతంబు+అంతయున్= ఆ విషయమంతా; నీవు+విన్న+అది+అ= నీవు విన్నదే; తరువాతి కథ+చెప్పెదన్+వినుము= ఆ తరువాత జరిగిన కథ చెబుతాను వినుము; ఆ+విధంబునన్= ఆ విధంగా; కృప ప్రముఖ రథికులు= కృపాచార్యుడు మొదలైన మహావీరులు; తన్నున్ విడిచి చనినన్= తనను వదలిపోగా; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; క్రొత్త+ఐన= క్రొత్తగా పుట్టిన; నెఱ+వగ పెల్లునన్= సంపూర్ణ దుఃఖాతిశయంతో; చిత్తంబు= మనస్సు; విషాదవేదనా+ఆయత్తంబు+అగుచుండన్= విషాద వేదనతో నిండినది కాగా; ఎడనెడన్= అక్కడక్కడ; నిలుచుచున్+చనుచుండెన్= ఆగి నిలబడుతూ వెళ్తూ ఉన్నాడు; అక్కడన్= ఆ శిబిరంలో; ఆ+అజాతశత్రుండు= ఆ ధర్మరాజు; గురునందను= ద్రోణకుమారుడైన అశ్వత్థామయొక్క; శిరోరత్నంబు= తలమీదనున్న రత్నాన్ని; తెచ్చియిచ్చి; అట్లు= ఆ విధంగా; పాంచాలిన్+ఊరార్చి+ఉన్న+అంతన్= ద్రౌపదిని ఓదార్చి ఉండగా; (అప్పుడు); అట+పోయిన= యుద్ధభూమికి వెళ్ళి వచ్చిన; జనంబులవలనన్= జనాలవలన; వైచిత్రవీర్యుండు= విచిత్ర వీర్యుని కుమారుడైన ధృతరాష్ట్రుడు; పోలి+కలనికిన్= యుద్ధభూమికి; వచ్చుచున్నాడు+అని+విని= వస్తున్నాడని విని; తద్+అభిగమన+ఉన్ముఖుండై= ఆయన వస్తున్న దారిలోనే (బయలుదేరాడు).

తాత్పర్యం: యుద్ధం చేశాము. అట్లా అవటం వలన ఆ పాండవులు సాధించిన విజయం నిరుపయోగమయింది. ఇక్కడ మేము చేయదలచిన దాన్ని చెబుతాను వినుము. ఆ సమయంలో పాండవులు ఆ స్థావరంలో లేకపోవటం చేతనే అట్లా పరాక్రమించి మిగిలిన వారిని చంపగలిగాము. అంతే కాని ఆ మహాపరాక్రమవంతులను ఎదుర్కొనటానికి మేము సమర్థులం కాము. ఆ పాండవులు తమ కుమారులు మా పరాక్రమంతో అట్లా చనిపోవటాన్ని గురించి విని దుఃఖం, క్రోధం నిండిన మనస్సులతో మమ్మల్ని వెన్నాడి రావటం తప్పదు. వాళ్ళబారినుండి బయటపడాలి అన్నది మా ఆలోచన. దీనికి మీరు అనుమతించండి. నీవు దుఃఖించవద్దు' - అని గాంధారికి చెప్పి, ధృతరాష్ట్రుడితో 'ఓ రాజా! ధర్మరాజాదుల బారికి చిక్కకుండా తప్పించుకొనిపోవటం మాకు ఇప్పుడు కర్తవ్యం. మీ రెట్లాగూ అనుమతించారు. ఇక నీవు దైవనిర్ణయం ఎదిరించటానికి కాదన్న విషయాన్ని అర్థం చేసికొని దుఃఖాన్ని వదలిపెట్టుము' అని ఆ చోటనే వారిరువురికీ ప్రదక్షిణనమస్కారం చేసి, మళ్ళీ మళ్ళీ వాళ్ళనే చూస్తూ రథాలు ఎక్కి భయంభయంగా

రథాలు తోలుకొంటూ గంగానదీతీరానికి చేరుకొన్నారు. అక్కడ ఒకరినొకరు వీడ్కొని తమతమ మార్గాలలో వెళ్ళిపోయారు. వారిలో కృపాచార్యుడు హస్తినకు తిరిగి వచ్చాడు. కృతవర్మ ద్వారకకు చేరుకొన్నాడు. అశ్వత్థామ వ్యాసమహర్షి ఆశ్రమాన్ని చేరుకొని వెంటనే తపస్సు మొదలుపెట్టాడు. ఆ తరువాత ధర్మరాజాదులు దాడిగా వచ్చి ఆ అశ్వత్థామను ముట్టడించారు. ఆ విషయ మంతా నీవు విన్నదే. తరువాతి కథ చెప్పుతాను వినుము (అంటూ జనమేజయుడికి వైశంపాయనుడు చెప్పుతున్నాడు). ఆ విధంగా కృపాచార్యుడు మొదలైన వీరులు తనను వదలిపోగా ధృతరాష్ట్రుడు కొత్తగాపుట్టిన దుఃఖంతో మనసు విషాదంతో వేదనతో నిండిపోగా అక్కడక్కడా ఆగి ఆగి ముందుకు సాగుతున్నాడు. అక్కడ ఆ శిబిరంలో ధర్మరాజు అశ్వత్థామ తలమీదనున్న రత్నాన్ని తెచ్చి ద్రౌపదికి ఇచ్చి ఆమెను ఓదార్చాడు. ఆ సమయంలో యుద్ధభూమినుండి తిరిగివచ్చిన వారి ద్వారా ధృతరాష్ట్రుడు యుద్ధభూమికి వస్తున్నాడని తెలిసి ఆయనను కలసికొనటానికి అదే దారిలో ధర్మరాజాదులు కూడా బయలుదేరారు.

ధర్మరాజు దమ్ములతోడ ధృతరాష్ట్రు నొద్దకుఁ బోవుట (సం. 11-11-1)

తే. **తనయులందఱుఁ బొలియుట వినిన యడలు । మానసంబు దహింప నమ్మనుజవిభుఁడు**
పొగులుచును వచ్చెనను తలపోఁతఁ జేసి । యుల్ల మక్కటికమునఁ జొత్తిల్లుచుండ. 117

ప్రతిపదార్థం: తనయులందఱున్= కొడుకులందరూ; పొలియుట= చనిపోవటం; వినిన= విన్నటువంటి; అడలు= దుఃఖం; మానసంబున్= మనసును; దహింపన్= కాల్చివేస్తుండగా; ఆ+మనుజవిభుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; పొగులుచునున్= దుఃఖిస్తూ (బాధపడుతూ); వచ్చెన్+అను= వస్తున్నాడన్న; తలపోఁతన్+చేసి= ఆలోచనవచ్చి; ఉల్లము= హృదయం; అక్కటికమునన్= దయతో; జొత్తిల్లుచుండన్= ఆర్ద్రమై పోగా.

తాత్పర్యం: అంతమంది కొడుకులూ చనిపోయారన్న వార్త విని దుఃఖం మనసును దహించి వేస్తుండగా ఆ మహారాజు యుద్ధభూమికి వస్తున్నాడన్న ఆలోచన కలిగి ధర్మరాజుకు హృదయమంతా కనికరంతో ఆర్ద్రమై పోయింది.

క. **వదనమున విన్నఁదనముం । గదురఁగ హరిఁ జూచి రాజుఁ గానవలయు నా**
కదియెట్లు నుడుగవచ్చునె? । కదలుండని పలికి చనియెఁ గలనివలనికిన్. 118

ప్రతిపదార్థం: వదనమునన్= ముఖంలోని; విన్నఁదనమున్= దైన్యం; కదురఁగన్= వ్యాపించగా; హరిన్+చూచి= శ్రీకృష్ణుని చూచి; రాజున్= ధృతరాష్ట్ర మహారాజును; కానన్ వలయున్= తప్పకుండా దర్శించుకోవాలి; నాకున్+అది+ఎట్లున్+ఉడుగన్ వచ్చునె?= నాకు అది తప్పనిసరి కాదా?; కదలుండు+అని= ముందుకు పదండి; అని; పలికి; కలనివలనికిన్= యుద్ధభూమివైపు; చనియెన్= సాగిపోయాడు.

తాత్పర్యం: ముఖంలో దైన్యం వ్యాపించగా ధర్మరాజు శ్రీకృష్ణుడితో 'నేను ధృతరాష్ట్రమహారాజును తప్పక దర్శించుకొనాలి. అది నాకు అవశ్యకర్తవ్యం. తప్పించుకొనటానికి వీలులేదు, ముందుకు వెళ్ళుదాము - 'అని అంటూ యుద్ధభూమివైపు సాగిపోయాడు.

ద్రుతవిలంబిత వృత్తము

చనఁగ నాతఁడు సాత్యకి వాయునం । దనుఁడు గాండివి దమ్ములు సూరెలం
జనిరి ద్రౌపది సంభృతశోక యై । చనియెఁ జుట్టపుఁ జానలు సుట్టిరాన్. 119

ప్రతిపదార్థం: ఆతఁడు= ధర్మరాజు; చనఁగన్= వెళుతుండగా; సాత్యకి; వాయునందనుఁడు= భీముడు; గాండివి= అర్జునుడు; తమ్ములు= నకుల సహదేవులు; సూరెలన్= ఆ ప్రక్కల; చనిరి= వచ్చారు; ద్రౌపది; సంభృత= మిక్కిలి; శోక+ఐ= శోకంతో కూడినదై; చుట్టపు+చానలు= బంధువులైన స్త్రీలు; చుట్టిరాన్= వెన్నంటి వస్తుండగా; చనియెన్= ముందుకు సాగింది.

తాత్పర్యం: అట్లా ధర్మరాజు వెళ్ళుతుండగా సాత్యకి, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు ఆయనకు ఇరువైపులా బయలుదేరారు. ద్రౌపది మిక్కిలి శోకంతో కూడినదై బంధు స్త్రీలు వెన్నంటి వస్తుండగా ముందుకు సాగింది.

విశేషం: ద్రుతవిలంబితవృత్తంలో ప్రతిపాదానికీ న, భ, భ, ర అనే గణాలుంటాయి. 1-7 అక్షరాలకు యతిమైత్రి, ప్రాసనియమం కలదు.

వ. ఇట్లు మాత్స్యపాంచాల భామలు నరిగిరి. తొలునాఁడు దుర్యోధనుండు మన్నించు మానవతులం గరి నగరంబునకుం గొని చని యారాత్రి యందు నిలిచి ధృతరాష్ట్రుం బొడగానక రేపకడ మగిడి వచ్చి యున్న యుయుత్సుండును నమ్మానవపతితోన చనియె. నట్లు ధర్మసూనుండు సని సమరతలంబు దఱియునంతకు నయ్యెడకు నాంబికేయుండు సనుదెంచె. నతని ముందటి వలని వనితాజనంబు లక్కౌంతేయాగ్రజుం గనుంగొని కరంబులెత్తి యేడ్చుచు నెదుర్కొని. 120

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మాత్స్య= మత్స్యదేశానికి చెందిన స్త్రీలు; పాంచాలభామలు= పాంచాలదేశానికి చెందిన స్త్రీలు; అరిగిరి= వెళ్ళారు; తొలునాఁడు= మొదటిరోజు; దుర్యోధనుండు= సుయోధనుడు; మన్నించు= అభిమానించే; మానవతులన్= స్త్రీలను; కరినగరంబునకున్= హస్తినాపురికి; కొని చని; ఆ రాత్రి+అందున్+నిలిచి= ఆ రాత్రి అక్కడే ఉండి; ధృతరాష్ట్రున్+పొడగానక= ధృతరాష్ట్రుడు కనిపించకపోగా; రేపకడ= ఉదయాన్నే; మగిడివచ్చి+ఉన్న= తిరిగివచ్చి ఉన్న; యుయుత్సుండును= యుయుత్సుడనే ధృతరాష్ట్రుని కుమారుడు; ఆ+మానవపతితోన్+అ= ఆ మహారాజుతోనే; చనియెన్= కలిసి వెళ్ళాడు; అట్లు= ఆ విధంగా; ధర్మసూనుండు= ధర్మరాజు; చని= బయలుదేరి; సమరతలంబున్= యుద్ధభూమిని; దఱియునంతకున్= సమీపించేటప్పటికి; ఆ+ఎడకున్= ఆ చోటికి; ఆంబికేయుండు+చనుదెంచెన్= ధృతరాష్ట్రుడు కూడా వచ్చాడు; అతని ముందటి వలని వనితాజనంబులు= ఆ రాజుకు ముందు నడుస్తున్న స్త్రీలు; ఆ+కౌంతేయ+అగ్రజున్= ఆ ధర్మరాజును; కనుంగొని= చూచి; కరంబులు+ఎత్తి= చేతులు పైకెత్తి; ఏడ్చుచున్= ఏడుస్తూ; ఎదుర్కొని= ఎదురుగా వచ్చి.

తాత్పర్యం: ఈ విధంగా మత్స్య పాంచాల దేశాలకు చెందిన స్త్రీలు, ద్రౌపది ముందువెనుకలుగా బయలుదేరారు. మొదటిరోజున సుయోధనుడు అభిమానించే స్త్రీలను హస్తినాపురికి తీసికొని వెళ్ళి ఆ రాత్రి అక్కడే ఉండిన యుయుత్సుడు అక్కడ ధృతరాష్ట్రుడు లేకపోగా ఉదయాన్నే యుద్ధభూమికి చేరుకొని మహారాజు వెంబడి బయలుదేరాడు. ఆ విధంగా ధర్మరాజు బయలుదేరి యుద్ధభూమికి చేరుకొనేటప్పటికి ధృతరాష్ట్రుడుకూడా అక్కడికి చేరుకొన్నాడు. ఆ రోజు ముందు నడుస్తున్న స్త్రీలు ధర్మరాజును చూడగానే చేతులు పైకెత్తి హాహాకారాలు చేస్తూ ఏడుస్తూ ఎదురుగా వచ్చారు.

సీ. ధర్మ వేదిత్వ మీ ధరణీశ్వరునకు నెక్కడి । యది కృప యెందుఁగలదు? తలఁపఁ
దండ్రుల మామలఁ దాతలఁ గొడుకులఁ । దోడఁబుట్టువులను ద్రుంచివైచెఁ

క్రూరత మెఱయంగ గురుజనంబులఁ గూల్చె । సఖుల సంబంధులఁ జంపె నదయుఁ
డని పల్కుదురు కొంద ఱప్పార్థుఁ జేరి గాం । గేయుని ద్రోణునిఁ గెడయఁ బొదువఁ

ఆ. బనుపనెట్లు నేర్చి తని పల్కుదురు గొంద । ఱకట! సింధురాజు ననుజమగనిఁ
దునిమి తేటి రాజ్య? మని పల్కుదురు గొంద । ఱతఁడు మోము వాంచి యరుగుచుండ. 121

ప్రతిపదార్థం: కొందఱు= కొంతమంది స్త్రీలు; ఈ ధరణీశ్వరునకున్= ఈ ధర్మరాజుకు; ధర్మవేదిత్వము+ఎక్కడి+అది?= ధర్మవేత్తృత ఎక్కడిది?; తలఁపన్= ఆలోచిస్తే; కృప= దయ; ఎందున్+కలదు?= ఎక్కడున్నది?; తండ్రులన్= తండ్రులను; మామలన్= మామలను; తాతలన్= తాతలను; కొడుకులన్= కొడుకులను; తోబుట్టువులను= తమ్ముళ్ళను; త్రుంచివైచెన్= చంపివేశాడు; క్రూరత= క్రౌర్యం; మెఱయంగన్= ప్రకాశించగా; గురుజనంబులన్= గురువులను; కూల్చెన్= చంపాడు; సఖులన్= స్నేహితులను; సంబంధులన్= బంధువులను; చంపెన్= చంపాడు; అదయుఁడు= ఇతడు కనికరం లేనివాడు; అని పల్కుదురు= అని అన్నారు; కొందఱు= మరికొందరు; ఆ+పార్థున్+చేరి= ఆ అర్జునుడిని సమీపించి; గాంగేయునిన్= భీష్ముడిని; కెడయన్= చంపటానికి; ద్రోణునిన్= ద్రోణాచార్యుడిని; పొదువన్+పనుపన్= ముట్టడించి చంపటానికి; ఎట్లు నేర్చితి(వి)?+అని= ఎలా సాహసించావు? అని; పలుకుదురు= ప్రశ్నించారు; కొందఱు= ఇంకొందరు; అకట!= అయ్యో!; సింధురాజున్= సింధురాజును (సైంధవుడిని); అనుజమగనిన్= నీ చెల్లెలు భర్తను; తునిమితి(వి)= చంపావు; ఏటి+రాజ్యము?= ఏమిటి మీరు సంపాదించిన రాజ్యం?; అని పల్కుదురు= అని ఎత్తి పొడిచారు; అతఁడు= ఆ అర్జునుడు; మోము+వాంచి= ముఖం వంచుకొని; అరుగుచుండన్= వెళ్ళిపోతుండగా.

తాత్పర్యం: కొంతమంది స్త్రీలు 'ఈ ధర్మరాజుకు ధర్మం ఏమి తెలియును? అసలు ఈ రాజుకు దయ ఎక్కడున్నది? తండ్రులను, మామలను, తాతలను, కుమారులను, తమ్ముళ్ళను చంపివేశాడు. విద్యనేర్పిన పెద్దలను గురువులను అతిక్రూరంగా చంపాడు. ఏ మాత్రం కనికరంలేని వాడు, ఛీ ఛీ' అన్నారు. మరికొందరు అర్జునుడిని చేరి 'కురువృద్ధుడు భీష్ముడిని చంపటానికి, గురువైన ద్రోణాచార్యుడిని ముట్టడించి తుదముట్టించటానికి, నీవు ఎట్లా సాహసించావు?' అని ప్రశ్నించారు. ఇంకొందరు 'అయ్యో! నీ చెల్లెలు భర్త అని కూడా చూడకుండా సైంధవుడిని ఎట్లా చంపావు? ఎందుకు మీరు సంపాదించిన ఈ రాజ్యమంతా? ఎవరికొరకు?' అని ఎత్తిపొడిచారు. అర్జునుడు ఏమీ మారు పలుకకుండా తల వంచుకొని వెళ్ళిపోతూ ఉండగా. (తరువాతి వచనంతో అన్వయం)

వ. మఱియుం గొందఱు. 122

తాత్పర్యం: ఇంకా కొంత మంది.

క. ఇందఱఁ జంపితినని యు । బ్బం దీఱద ద్రుపదతనయపట్టుల నభిమ
న్యుం దెగటార్చితి మఱఁదుల । నందఱ మ్రింగితి విభూతి యన నీ కెద్దీ? 123

ప్రతిపదార్థం: (ధర్మరాజును చూచి); ఇందఱన్= ఇంతమందిని; చంపితిన్+అని= చంపానని; ఉబ్బన్+తీఱదు+అ= గర్విస్తే చాలదు; ద్రుపద తనయ పట్టులన్= ద్రౌపదికొడుకులను; అభిమన్యుడిని; తెగటార్చితి(వి)= పొట్టన పెట్టుకొన్నావు; మఱఁదులన్+అందఱన్= మరదులందరినీ; మ్రింగితి(వి)= పొట్టను బెట్టుకొన్నావు; విభూతి+అనన్= సంపద అనేది? నీకున్+ఎద్దీ?= ఎక్కుడున్నది?

తాత్పర్యం: ధర్మరాజును చూచి' ఇంతమందిని చంపానని గర్విస్తే సరిపోదు. ద్రౌపదికొడుకులను, అభిమన్యుడిని, చంపావు. మరదులందరినీ నీ పొట్టన బెట్టుకొన్నావు. అయినా నీకు వైభవం ఎక్కడున్నది? (ఏనాడున్నది కాబట్టి ఈనాడు లేకపోవటానికి? - అని అర్థం).

వ. అని పలుకుదు రిట్లు బహుప్రకారంబులం బలుకుచుండం బలుకు వెలువరింపక పుత్రశోకార్తుఁడగు నప్పాండురాజపుత్రుండు పుత్ర శోకార్తి మిగులం బొగులు విచిత్ర వీర్యపుత్రుకడకుంజని తత్పార్శ్వవర్తులచేత నావేదితుండగుచు నా భూవల్లభు పాదంబులకుం బ్రణతుండగుటయు. 124

ప్రతిపదార్థం: అని పలుకుదురు= అని అన్నారు; ఇట్లు= ఈ విధంగా; బహుప్రకారంబులన్= రకరకాలుగా; పలుకుచుండన్= అంటుండగా; పలుకు= మాట; వెలువరింపక= మాట్లాడక; పుత్రశోక+ఆర్తుఁడగు= పుత్రులు చనిపోయిన శోకంతో దీనుడుగా ఉన్న; ఆ+పాండురాజ పుత్రుండు= ఆ ధర్మరాజు; పుత్రశోక+ఆర్తిన్= కుమారులు చనిపోయిన శోకంవలన పుట్టిన దైన్యంతో; మిగులన్= మిక్కిలిగా; పొగులుచున్న= దుఃఖపడుతున్న; విచిత్రవీర్యపుత్రు కడకున్= ధృతరాష్ట్రుడి వద్దకు; చని= వెళ్ళి; తద్+పార్శ్వ వర్తులచేతన్= ఆయన పక్కనున్నవారిచేత; ఆవేదితుండు+అగుచున్= తనరాకను అతనికి తెలియచేస్తూ (వెళ్ళి); ఆ భూవల్లభు= ఆ రాజు; పాదంబులకున్= పాదాలకు; ప్రణతుండు+అగుటయున్= నమస్కరించగా.

తాత్పర్యం: అని అన్నారు. ఈ విధంగా రకరకాలుగా ఆ స్త్రీలు అంటుండగా, మారుమాట్లాడకుండా కొడుకులు పోయిన దుఃఖంతో అతిదీనంగా ఉన్న ధర్మరాజు, తనవలెనే కొడుకులు చనిపోయిన శోకంతో అతి దీనంగా దుఃఖిస్తున్న ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళి అతడి ప్రక్కనున్నవారి ద్వారా తన రాకను ఆ మహారాజుకు తెలిపి ఆ రాజు పాదాలకు నమస్కరించగా (తరువాతి పద్యంతో అన్వయం).

శుద్ధ విరాటి వృత్తము:

ఉల్లం బప్రియ మొందఁ గ్రొత్త సం । ధిల్లన్ నెవ్వగ దీనవక్త్రుఁడై
యొల్లంబోవుచు నుచ్చె నవ్విభుం । డల్లం గౌఁగిట నా నృపాలకున్. 125

ప్రతిపదార్థం: ఉల్లంబు= హృదయం; అప్రియము+ఒందన్= బాధామయం కాగా; క్రొత్త సంధిల్లన్= క్రొత్తగా కలుగగా; నెవ్వగన్= నిండు దుఃఖంతో; దీనవక్త్రుఁడు+ఐ= దీనంగా మారిపోయిన ముఖంతో; ఒల్లన్+పోవుచున్= వైకల్యంపొందుతూ; ఆ+విభుండు= ఆ ధృతరాష్ట్రుడు; ఆ నృపాలకున్= ధర్మరాజును; అల్లన్= నెమ్మదిగా; కౌఁగిటన్= కౌగిట్లో; ఉచ్చెన్= చేర్చుకున్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు వచ్చాడని' నమస్కరించాడని గుర్తించిన ధృతరాష్ట్రుడికి మళ్ళీ దుఃఖం కట్టలు తెంచుకొని ముఖం అతి దీనంగా మారిపోయింది. మనస్సు వికలమైపోయింది. అప్పుడు ధృతరాష్ట్రుడు ధర్మరాజును నెమ్మదిగా కౌగిలించుకొన్నాడు.

విశేషం: శుద్ధవిరాటి వృత్తంలో ప్రతిపాదానికీ మ, స, జ, గ అనే గణాలుంటాయి. 1-6 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. ఇవ్విధంబున నాలింగనంబు సేసి సాంత్వన వచనంబుల నుపచరించెఁ దదనంతరంబ భీమార్జున నకుల సహదేవులు సేరిన నతనియొద్దివారు వారిం బేరు వేర నెఱిఁగించిన. 126

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; ఆలింగనంబు+చేసి= ఆలింగనం చేసికొని; సాంత్వన వచనంబులన్= ఓదార్పు మాటలతో; ఉపచరించెన్= ఉపశమనం కలిగించాడు; తద్+అనంతరంబ= ఆ తరువాత; భీమ, అర్జున, నకుల, సహదేవులు; చేరినన్= దగ్గరకురాగా; అతని+ఒద్దివారు= ధృతరాష్ట్రుని వద్ద ఉన్నవారు; వారిన్= వారిని; పేరు పేరన్= పేరు పేరునా; ఎఱిఁగించినన్= తెలుపగా.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజును కౌగిలించుకొని ఓదార్పు మాటలతో సాంత్వనం కలిగించాడు. ఆ తరువాత భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు మహారాజును సమీపించారు. సమీపంలో ఉన్నవారు వారిని పేరు పేరునా ధృతరాష్ట్రుడికి తెలుపగా (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **భీముఁ డనుమాట విని యతి భీమమైన । యలుక యను వహ్ని యవ్వీరుఁడను వనంబు**
దరికొనంగ నుంకింప నధర్మవిధికి । నాయితంబగు నయ్యాంబికేయుఁ జూచి. **127**

ప్రతిపదార్థం: భీముఁడు+అనుమాట+విని= భీముడు (వచ్చాడు) అనే మాట వినగానే; అతిభీమము+ఐన= అతిభయంకరమైన; అలుక+అను+వహ్ని= కోపం అనే అగ్ని; ఆ+వీరుఁడు+అను వనంబున్= ఆ మహావీరుడైన ధృతరాష్ట్రుడు అనే అడవిని; దరికొనంగన్= కాల్చివేయటానికి; ఉంకింపన్= యత్నించగా; అధర్మవిధికిన్= అధర్మకార్యానికి; ఆయితంబు+అగు= సిద్ధపడుతున్న; ఆ+ఆంబికేయున్+చూచి= ఆ ధృతరాష్ట్రుడిని (కృష్ణుడు) చూచి.

తాత్పర్యం: అర్జున నకుల సహదేవులను పరిచయం చేసినపుడు ఊరుకున్నాడు కాని 'భీముడు' అనే మాట వినగానే అతిభయంకరమైన కోపాగ్ని అతడిని దహించివేయటం ప్రారంభించింది. ఏ అధర్మకార్యం చేయటానికైనా సిద్ధపడేవాడివలె కనిపిస్తున్న ఆ మహారాజును కృష్ణుడు గమనించాడు.

విశేషం: అలం: రూపకం.

క. **మనసెఱిఁగి హృషీకేశుఁడు । దనమనమున నిద్దురాత్ము తలఁపొప్ప దిసీ**
యనుచుం బవనజు నద్దెస । జనకుండఁగ బట్టి వీతసంభ్రమలీలన్. **128**

ప్రతిపదార్థం: హృషీకేశుఁడు= విష్ణురూపుడైన కృష్ణుడు; మనసు+ఎఱిఁగి= ఆ ధృతరాష్ట్రుని మనసులో ఉన్నది తెలిసికొని; తన మనమునన్= తన మనస్సులో; ఈ+దురాత్ము+తలఁపు+ఒప్పదు= ఈ దురాత్ముడి ఆలోచన సమంజసం కాదు; ఇసీ+అనుచున్= ఛీ ఛీ అనుకొంటూ; పవనజున్= భీముడిని; ఆ+దెసన్+ఉండఁగన్= ఆ రాజు వద్దకు వెళ్ళకుండా; వీత సంభ్రమలీలన్= పోయిన సంభ్రమంతో; పట్టి= పట్టుకొని.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి మనస్సును కృష్ణుడు గుర్తించి 'ఈ దురాత్ముడి ఆలోచన చాలా దుర్మార్గమయిన' దని తలచి, భీముడిని ఆ రాజువద్దకు వెళ్ళకుండా సంభ్రమం లేక పట్టుకొన్నాడు.

వ. **ధృతరాష్ట్రుం డిట్టివాఁడు గాఁగలవాఁడని తొల్లి యెఱింగి త్రికాలవేదియైన కృష్ణుం డయోమయంబుగా భీమ ప్రతిరూపంబు సేయించి సంగ్రహించి నిగూఢ ప్రకారంబునం దత్ప్రదేశంబునకుఁ దెప్పించినవాఁడు గావున గ్రక్కున నయ్యినుపరూ పజ్జగతీశ్వరుం జేర నిలిపె; నిలిపిన నది భీమసేనుండ కాఁ దలంచి.** **129**

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండు; ఇట్టివాఁడు= ఇలాంటివాడు; కాఁగలవాఁడు+అని= కాబోతాడని (ఇట్లాంటి పని ఏదో చేయబోతాడని); త్రికాల వేదియైన= మూడు కాలాలు తెలిసిన; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; తొల్లి+ఎఱింగి= ముందుగానే గుర్తించినవాడై; అయోమయంబుగాన్= ఇనుముతో; భీముని= భీముడి; ప్రతిరూపంబు= విగ్రహం; చేయించి; సంగ్రహించి= తీసికొని; నిగూఢ= రహస్య; ప్రకారంబునన్= పద్ధతిలో; తద్+ప్రదేశంబునకున్= ఆ స్థలానికి; తెప్పించినవాఁడు కావునన్= తెప్పించి ఉన్నాడు కాబట్టి; గ్రక్కునన్= వెంటనే; ఆ+ఇనురూపు= ఇనుప విగ్రహాన్ని; ఆ+జగత్+ఈశ్వరున్= రాజు దగ్గరికి; చేరన్+నిలిపెన్= చేర్చాడు; నిలిపినన్= అట్లా ఉంచగా; అది= ఆ విగ్రహం; భీమసేనుండు+అ+కాన్+తలంచి= భీముడే అని అనుకొని.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు భూత భవిష్యత్ వర్తమానాలు మూడూ తెలిసిన మహాత్ముడు కాబట్టి ధృతరాష్ట్రుడు ఇట్లాంటి పని ఏదో చేయబోతాడని ఊహించి ఇనుముతో భీముడి విగ్రహాన్ని తయారుచేయించి రహస్యంగా అక్కడికి తీసికొనివచ్చి పెట్టుకొని ఉండటంచేత వెంటనే ఆ విగ్రహాన్ని రాజు ముందరికి జరిపాడు. అట్లా విగ్రహాన్ని ఉంచగా ఆ విగ్రహమే భీమసేను డనుకొని (తరువాతి పద్యంతో అన్వయం).

క. కోపం బుత్కటమై యా । రూపము నిరుగేలఁ బట్టి క్రూరత ఘోరా
టోపం బెసకమెసఁగ నా । భూపతి వెసఁ గౌఁగిలించి పొలుపఱ విఱిచెన్. 130

ప్రతిపదార్థం: కోపంబు= కోపం; ఉత్కటము+ఐ= అధికం కాగా; ఆ రూపమున్= ఆ విగ్రహాన్ని; ఇరుకేలన్+పట్టి= రెండు చేతులతోనూ అదుముకొని; క్రూరతన్= అతి క్రూరంగా; ఘోర= భయంకరమైన; ఆటోపంబు= వేగం; ఎసకము= విజృంభణ; ఎసఁగన్= అతిశయించగా; ఆ భూపతి= ఆ రాజు; వెసన్= క్షణంలో ఆలస్యం చేయకుండా; కౌగిలించి= కౌగిలించుకొని; పొలుపు+అఱన్= (ఆ విగ్రహం) అందం నశించేలా (ముక్కలయ్యేలా); విఱిచెన్= విరిచివేశాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు కోపం అతిశయించగా, ఆ విగ్రహాన్ని రెండు చేతులమధ్యా అదుముకొని అతిక్రూరంగా భయంకరమైన వేగంతో విజృంభణతో క్షణం ఆలస్యంచేయకుండా పొదువుకొని ఆ విగ్రహం ముక్కలయ్యేటట్లు విరిచిపారవేశాడు.

విశేషం: ఎంత వయస్సు ముదిరినా కామక్రోధాది గుణాలు నశించవనటానికి ధృతరాష్ట్రుని ఈ పని మంచి నిదర్శనం. విదురుడు, వ్యాసుడు చేసిన బోధలన్నీ నిష్ఫలమయ్యాయి. ఇంద్రియాలు మనస్సుకంటే బలవత్తరమైనవి అనటానికి నిరూపణమే ధృతరాష్ట్రుని ఈ క్రూరచేష్ట, అతని బలమూ భయంకరమైనదే.

లయవిభాతి:

పెరుఁగఁగ నిజాంగములు సరభసపరిస్ఫురణ । మరుదుగ జనావలులు నిరుపమవిధం బి
న్నరపతి బలంబనఁగఁ గరయుగముతోలవియ । నురము సదియం బెలుచఁ దొరఁగఁగఁ బొలిన్ నె
త్తురులు ముఖ రంధ్రములఁ బరవశత మానసము । బొరయుటకుఁ జొచ్చియును సరిగొనఁగఁ గంటిన్
వరసుతున కిప్పుడను పరమపదవిన్ మగుడఁ । గురున్నపతి యా ప్రతిమఁ బొరి నిటులు పుచ్చెన్. 131

ప్రతిపదార్థం: నిజ+అంగములు= తన అవయవాలు; పెరుఁగఁగన్= ఛిన్నములుకాగా; సరభస పరిస్ఫురణము= గొప్పవేగంయొక్క మిక్కిలి ప్రకాశం; అరుదుగన్= ఆశ్చర్యకరం కాగా; జన+ఆవలులు= అక్కడచేరిన జనాలు; ఈ+నరపతి+బలంబు= ఈ రాజు శక్తి; నిరుపమ+విధంబు+అనఁగన్= అసామాన్యమైనది అంటుండగా; కురునృపతి= ధృతరాష్ట్రుడు; ఆ ప్రతిమన్= ఆ

విగ్రహాన్ని; పొరిన్= దృఢంగా; ఇటులు= ఇట్లాగ; పుచ్చెన్= గట్టిగా అదుముకొన్నాడు; కరయుగముతో లవియన్= రెండు చేతులతో కౌగిలించుకొని అదుమగా; ఉరము= రొమ్ము; చదియన్= చిట్లగా; పొరిన్= మిక్కిలిగా; నెత్తురులు= రక్తం; పెలుచన్= అత్యధికంగా; ముఖరంధ్రములు= ముఖంలోని రంధ్రాలవెంబడి; తొరఁగఁగన్= కారుతుండగా; మానసము= మనస్సు; పరవశతన్+పొరయుటకున్+చొచ్చియును= అదుపుతప్పిపోవటానికి సిద్ధంగా ఉన్నా; (ఈ భీముడిని) సరిగొనఁ గన్+కంటిన్= చంపగలిగాను; వరసుతునకున్= దుర్యోధనుడికి; పరమపదవిన్+మగుడన్= పరమపదవి (మోక్షం)ని చేరటం; ఇప్పుడు+అనున్= ఇప్పుడే - అంటున్నాడు.

తాత్పర్యం: అట్లా ఆ విగ్రహాన్ని అందిపుచ్చుకొన్న ధృతరాష్ట్రుడి అవయవాలు ఛిన్నములుకాగా; కాంతిమంతంగా వ్యాకోచించటం మొదలు పెట్టాయి. చూస్తున్న జనాలు ఈ రాజు బలం నిరుపమానమైనదని అంటుండగానే రెండు చేతుల తోలు లేచిపోయింది. ఆ కౌగిలిలో ఆ బొమ్మ ముక్కలైపోయింది. ధృతరాష్ట్రుడి రొమ్ము చిట్లిపోయింది. మిక్కిలి రక్తం ధారలు ముఖంలోని అన్ని రంధ్రాల ద్వారా చిమ్మటం ప్రారంభమయింది. మనసు అదుపు తప్పే స్థితిలో ధృతరాష్ట్రుడు మూర్ఛలో పడిపోతున్నాడు. ఇప్పుడు నేను నా కొడుకు మృతికి బదులు తీర్చుకోగలిగాను అనే ఉల్లాస స్థితిలో ధృతరాష్ట్రుడు ఆ ప్రతిమను మరల విధ్వంసము చేశాడు.

విశేషం: కొడుకు పగను తండ్రి తీర్చగలిగాడు- ఇది ధృతరాష్ట్రుడికి తృప్తిని కలిగిస్తున్న అంశం. ధృతరాష్ట్రుడి రాజ్యలోభం అంత భయంకరమైన వ్యసనం. అతడి ఈ చర్యద్వారా మనిషిలోని దుర్గుణాలు చిరకాలం మనిషిని ఎట్లా వదలవో అర్థం చేసికొనవచ్చును.

లయవిభాతివృత్తంలోని ప్రతిపాదానికీ న, స, న, న, స, న, న, న - అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ 10, 19, 28 అక్షరాలకూ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. ఇత్తెఱంగున దశసహస్రసామజ సమానబలుండగు నయ్యంధనృపతి గంధవహనందన ప్రతిరూపంబు భగ్నంబు సేసి పెంపున నెడఁద నిర్భర హర్షంబు నొందియు మెఱమెచ్చునకై భీమునిం బేర్కొని హాహాకారంబు లెసంగ రోదనంబు సేసినఁ జిఱునవ్వునం దన వదనకమలం బొప్పం గమలనాభుం డతని కిట్లనియె.132

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; దశసహస్ర= పదివేల; సామజసమాన= ఏనుగులతో సమానమైన; బలుండగు= బలం కలిగినవాడైన= ఆ+అంధ నృపతి= ఆ గ్రుడ్డి మహారాజు; గంధవహనందన= వాయుకుమారుడి; ప్రతిరూపంబున్= విగ్రహాన్ని;= భగ్నంబు+చేసి= విరుగగొట్టి; పెంపున్= మిక్కిలిగా; ఎడఁదన్= హృదయంలో; నిర్భర= అధికమైన; హర్షంబున్+ ఒందియున్= సంతోషం పొందికూడా; మెఱమెచ్చునకై= అందరూ ఏమనుకొంటారోనని (ముఖప్రీతికోసం); భీమునిన్+పేర్కొని= భీముడిని పేరుపెట్టి పిలుస్తూ; హాహాకారంబులు+ఎసంగన్= హాహాకారాలు పుట్టగా; రోదనంబు+చేసినన్= ఏడ్వగా; చిఱునవ్వునన్= చిరునవ్వుతో; తన= తనయొక్క; వదనకమలంబు+ఒప్పన్= కమలంవంటి ముఖం ప్రకాశించగా; కమలనాభుఁడు= పద్మనాభుడైన కృష్ణుడు; అతనికిన్= ధృతరాష్ట్రునితో; ఇట్లనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా పదివేల ఏనుగుల బలమున్న ఆ గ్రుడ్డి మహారాజు భీముడి విగ్రహాన్ని విరుగగొట్టి అత్యంత సంతోషం పొందిన హృదయంతో ఉండి కూడా అందరూ ఏమనుకుంటారో అని ముఖప్రీతికొరకు భీముడిని పేరుపెట్టి పిలుస్తూ హాహాకారాలు చేస్తూ ఏడుపులు మొదలుపెట్టాడు. అది చూచి చిరునవ్వుతో తన ముఖకమలం ప్రకాశిస్తుండగా శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ధృతరాష్ట్రుడి బలం పదివేల ఏనుగుల బలంతో సమానమైనదట- అంటే నిజంగా భీముడు ఆ కౌగిలిలో చిక్కి ఉంటే బ్రతికేవాడుకాడని అర్థం. అందుకే 'ధృతరాష్ట్రుడి కౌగిలి' అనేమాట లోకంలో పుట్టింది. కపటపు కౌగిలింత అనే అర్థంలో ఆ ప్రయోగం రూఢి కెక్కింది.

తే. **'అడల నేటికి? నీచేతఁ బడఁడు భీముఁ । డిపుడు భంజింపఁ బడినది యినుపరూపు**
వినుము నీ కోప మెఱిఁగియ వెనుక కతనిఁ । దిగిచి యేను నీ ముందట దీని నిడివి. **133**

ప్రతిపదార్థం: అడలన్= ఏడవటం; ఏటికిన్?= ఎందుకు?; భీముఁడు= భీమసేనుడు; నీ చేతన్= నీ చేతిలో; పడఁడు= చావలేదు; ఇపుడు= ఇప్పుడు; భంజింపన్+పడినది= విరగగొట్టబడినది; ఇనుపరూపు= ఇనుముతో చేసిన విగ్రహం; వినుము= (ఏం చేశానో చెబుతాను వినుము); నీ కోపము= నీ కెంతకోపం ఉందో; ఎఱిఁగియ= తెలిసే; అతనిన్= ఆ భీముడిని; వెనుకకున్ తిగిచి= వెనుకకు నిలిపి; ఏను= నేను; నీ ముందటన్= నీ ముందర; దీనిన్+ఇడితిన్= ఈ బొమ్మను ఉంచాను.

తాత్పర్యం: 'మహారాజా! ఎందుకు ఏడుస్తావు? భీముడు నీచేతిలో చావలేదు లెమ్ము. ఇపుడు నీవు విరచింది ఆ భీముడి ప్రతిరూపమైన ఇనుప విగ్రహాన్ని. నీకింత కోపం ఉన్నదని ఎరిగినవాడిని కాబట్టే భీముడిని వెనుకకు దాటి నీ ముందర ఈ విగ్రహాన్ని జరిపాను.

క. **బలమున నీతో దొరయఁగ । నిల నెవ్వఁడు గలఁడు? నీ మహిత భుజ శాఖల్**
తలఁపఁగఁ బ్రళయాంతకు దం । ష్ట్రలు వీనిం దగిలి వశమె? చాకుండంగన్. **134**

ప్రతిపదార్థం: బలమునన్= బలంలో; నీతోన్+దొరయఁగన్= నీతో సమానంకావటానికి; ఇలన్= ఈ భూమిలో; ఎవ్వఁడు+కలఁడు?= ఎవడు ఉన్నాడు?; తలఁపగన్= ఆలోచిస్తే; మహిత భుజశాఖల్= నీ యొక్క గొప్పవైన కొమ్మలవంటి భుజాలు; ప్రళయాంతకు= ప్రళయకాల రుద్రుడి; దంష్ట్రలు= కోరలు; వీనిన్+తగిలి= వీటితో తగులుకొని; చాకుండగన్= చావకా+ఉండా ఉండేందుకు; వశమె?= సాధ్యమా?.

తాత్పర్యం: రాజా! బలంలో నిన్ను సమీపించటానికి ఈ భూమిలో ఎవరున్నారు? నీ భుజశాఖలు ప్రళయకాలంలో విజృంభించిన రుద్రుడి కోరల్లాంటివి. వాటిని తగిలిన మనిషి మరలా బ్రతకటం సాధ్యమా!

విశేషం: అలం: రూపకం.

వ. **కావున** **135**

తాత్పర్యం: అందుచేత

ఉపేంద్రవజ్రావృత్తము:

మరుత్తనూజుం బరిమార్పఁ జూచుం । బరిస్ఫురత్కోప నిబద్ధుఁడై యి
ద్ధరావిభుండం చిది తల్గనే సం । స్మరించి యీ కోపు నమర్చికొంటిన్. **136**

ప్రతిపదార్థం: ఈ+ధరావిభుండు= ఈ భూవల్లభుడు; పరిస్ఫురత్= మిక్కిలి ప్రకాశించేటువంటి; కోప= కోపంచేత; నిబద్ధుఁడై= కట్టబడినవాడై; మరుత్+తనూజున్= వాయుకుమారుడిని; పరిమార్పన్+చూచున్= చంపటానికి ప్రయత్నిస్తాడు (అని ఆలోచించి); ఇది= ఈ అపాయం; తల్గన్= తప్పించుకోవటానికే; సంస్మరించి= బాగా ఆలోచించి; ఈ కోపున్= ఈ విధానాన్ని ఈ బొమ్మను; అమర్చికొంటిన్= ఏర్పాటు చేసికొన్నాను.

తాత్పర్యం: ఈ రాజు మిక్కిలికోపానికి దాసుడై భీముడిని తప్పకుండా చంపటానికి ప్రయత్నిస్తాడని ఊహించి ఈ అపాయం తప్పించటానికై బాగా ఆలోచించి ఈ బొమ్మను సిద్ధంగా ఉంచుకొన్నాను.

విశేషం: ఉపేంద్రవజ్రలో ప్రతిపాదానికీ పదకొండు అక్షరాలుంటాయి. జ, త, జ, గ, గ అనే గణాలుంటాయి. 1-8 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

తే. **తనయ శోకాతురుండవై ధర్మ మెడలి । యనిలసుతుఁ దెగటార్చెదనని తలంచి**
తట్టి పనియేల నీ చేతనగు? విధాతృ । లీలఁ బరికింప నేరక బేలవైతి. **137**

ప్రతిపదార్థం: తనయ= కొడుకులు చనిపోయిన; శోక+ఆతురుండవై= దుఃఖంచేత పుట్టిన తొందరపాటుతో; ధర్మము+ఎడలి= ధర్మం విడిచిపెట్టి; అనిలసుతున్= వాయుకుమారుడిని; తెగటార్చెదను+అని తలంచితి(వి)= చంపేస్తానని ఆలోచించావు; అట్టి పని= అట్లా చంపటం; నీచేత; ఏల+అగున్?= ఎందుకు వీలవుతుంది?; విధాతృలీలన్= సృష్టికర్త లీలను; పరికింపన్+నేరక= తెలుసుకోలేక; బేలవు+ఐతి(వి)= అమాయకుడివి అయ్యావు.

తాత్పర్యం: కొడుకులు చనిపోయారన్న శోకంతో పుట్టిన తొందరపాటుతో ధర్మం విడిచిపెట్టి వాయుకుమారుడిని చంపివేద్దామని ఆలోచించావు. అట్లా చంపటం నీ చేతిలో ఉందా! సృష్టికర్త లీలను గుర్తించలేక నీవే అపహాస్యం పాలయ్యావు.

వ. **అదియునుం గాక.** **138**

తాత్పర్యం: అంతే కాకుండా.

క. **వినుమొకని నేల భవదను । జుని పుత్రుల నెల్లఁ జంపఁ జొప్పడినను నీ**
తనయులు మగుడఁగ వత్తురె? । యనయము పాపంబు సేసి తాఱడిఁ బోవన్. **139**

ప్రతిపదార్థం: వినుము= విను; ఒకనిన్+ఏల= ఒకడిని మాత్రం ఏమిటి?; భవత్+అనుజుని పుత్రులన్+ఎల్లన్= నీ తమ్ముడి కొడుకులను అందరినీ; చంపన్+చొప్పడినను= చంపటానికి సిద్ధపడినా; నీ తనయులు= నీ కొడుకులు; మగుడఁగన్+వత్తురె?= మరలి వస్తారా?; అనయము= మిక్కిలిదైన; పాపంబు= పాపాన్ని; ఆఱడిన్+పోవన్= నిందబడేటట్లు; చేసితి(వి)= చేశావు.

తాత్పర్యం: రాజా! వినుము. ఈ ఒక్కడిని మాత్రం ఏమిటి? పాండురాజు కుమారులందరినీ చంపినా నీ కొడుకులు తిరిగివస్తారా? శాశ్వతమైన నిందమాత్రం మిగిలేటట్లు చాలా పెద్ద పాపం చేశావు.

స్రగ్విణీ వృత్తము:

ఏము నీ పుత్రుచే నెన్నియేన్ భంగులన్ । వేమఱుం బాటు నీ వెంట భావించుచున్
సామసంపాదివై సైఁపు మాతప్పులన్ । భీమహత్త్వంబు సంధిల్లు నీ కిమ్మెయిన్.' **140**

ప్రతిపదార్థం: ఏము= మేము (నేను, పాండవులు); నీ పుత్రుచేన్= నీ కొడుకుచేతిలో; ఎన్నియేన్+భంగులన్= ఎన్నో రీతులలో; వేమఱున్= మాటిమాటికి; పాటు= ఆపదను (పొందినా); నీ వెంటన్= నీవు మా వెంట ఉన్నావని; భావించుచున్= భావిస్తూ (గడిపాము); (కనీసం ఇప్పుడైనా); మా తప్పులన్= మేము చేసిన తప్పులను; సామ సంపాదివై= అనుకూల్యాన్ని సాధించేవాడివై;

సైఁపు= సహించుము (క్షమించు); నీకున్+ఈ+మెయిన్= నీకు ఈ విధంగానైనా; ధీ మహత్త్వంబు= జ్ఞానంతో కూడిన బుద్ధి వైభవం; సంధిల్లున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: నేను, పాండవులు నీ కుమారుడి చేతిలో ఎన్నో రీతులలో మాటిమాటికి ఆపదపొందినా నీవు మా వెంట ఉన్నావని భావిస్తూ గడిపాము. కనీసం ఇప్పుడైనా నీవు మా తప్పులను సామరస్యం సాధించటంకొరకైనా క్షమించుము. నీకు ఈ విధంగానైనా జ్ఞానంతో కూడిన బుద్ధి వైభవం సిద్ధిస్తుంది.

విశేషం: స్రగ్విణీవృత్తంలో ప్రతిపాదానికీ ర, ర, ర, ర గణాలుంటాయి. 1-7 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. అని చెప్పె నప్పుడు ధృతరాష్ట్రు పరిచారకు లతని యవయంబుల రుధిరంబు ప్రక్షాళనంబున నపనయింపం దలంచి జలంబులు దెచ్చి యెఱింగించిన నజ్జనపతి యప్పని యాచరించె. నప్పుండరీకాక్షుండు వెండియు నవ్విభున కిట్లనియె. 141

ప్రతిపదార్థం: అని= అని ఈ విధంగా; చెప్పెన్= కృష్ణుడు చెప్పాడు; అప్పుడు= ఆ తరువాత; ధృతరాష్ట్రు పరిచారకులు= ధృతరాష్ట్రుని సేవకులు; అతని= ఆ రాజుయొక్క; అవయవంబుల రుధిరంబు= అవయవాలకు అంటిన రక్తాన్ని; ప్రక్షాళనంబునన్= కడగటం ద్వారా; అపనయింపన్= పోగొట్టటానికి; తలంచి= ఆలోచించి; జలంబులు= నీళ్ళు; తెచ్చి; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+జనపతి= ఆ రాజు; ఆ+పని= ఆపని; ఆచరించెన్= చేశాడు; ఆ+పుండరీకాక్షుండు= ఆ శ్వేతకమలనేత్రుడైన కృష్ణుడు; వెండియున్= మళ్ళీ; ఆ+విభునకున్= ఆ రాజుతో; ఇట్లనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని కృష్ణుడు చెప్పాడు. ఆ తరువాత పరిచారకులు అతడి ఒంటికి అంటిన రక్తాన్ని కడిగివేయటానికై నీళ్ళు తెచ్చి ఆ విషయం రాజుకు తెలిపారు. ధృతరాష్ట్రుడు ఒడలంతా కడుక్కొన్నాడు. అప్పుడు కృష్ణుడు మళ్ళీ ఇట్లా అన్నాడు.

సీ. 'జగతీశ! వేదముల్ సదివితి శాస్త్రముల్ । వింటి వర్తిల్లితి వృద్ధగోష్ఠి
నఖిలపురాణ పర్యాలోచనము సేసి । తెల్ల ధర్మంబులు నెఱుఁగు దిట్లు
నీ తప్పు దలఁపక నెవ్వగఁ బొందెదు । కనలెద వేను శంతనసుతుండు
గురుఁడును విదురుండుఁ గూర్చొని కూర్చొని । చెవులఁ బోయమె సవిశేషకార్య

తే. వచనములు? సంజయుఁడు పెక్కువరుస లుభయ । బలవిధంబులు దెలియఁగఁ బలుకఁ డెట్లు?
నీకు నా బుద్ధులన్నియు నెమ్మనమునఁ । జేర్పఁబోలవ యింకేమి సేయవచ్చు? 142

ప్రతిపదార్థం: జగతీశ!= ఓ రాజా!; వేదముల్+చదివితి(వి)= నీవు వేదాలు చదివావు; శాస్త్రముల్+వింటి(వి)= శాస్త్రాలు విన్నావు; వృద్ధగోష్ఠిన్= పెద్దల చర్చలలో; వర్తిల్లితి(వి)= ఉన్నావు; అఖిల= అన్ని; పురాణ= పురాణాలను; పర్యాలోచనముచేసితి(వి)= బాగా ఆలోచించి అర్థంచేసుకొన్నావు; ఎల్ల ధర్మంబులు= అన్ని ధర్మాలను; ఎఱుగుదు(వు)= తెలిసినవాడివి; ఇట్లు= ఈ విధంగా; నీ తప్పున్+తలపక= నీ తప్పును గురించి ఆలోచించకుండా; నెఱ+వగన్+పొందెదు= మిక్కిలి దుఃఖాన్ని పొందుతున్నావు; కనలెద(వు)= లోలోపలి కోపంతో మండుతున్నావు; నేను= (రాయబార సమయంలో) నేను; శంతనసుతుండు= భీష్ముడు; గురుఁడును= ద్రోణాచార్యుడు; విదురుండు= విదురుడు; సవిశేష కార్యవచనములు= మిక్కిలి ప్రశస్తమైన చేయదగిన

పనులను గురించి మంచిమాటలు; కూర్కొని కూర్కొని= కూరికూరి; చెవులన్+పోయమె?= చెవులలో పోయలేదా?; సంజయుడు; పెక్కువరుసలు= చాలాసార్లు; ఉభయ బల విధంబులు= కురుపాండవ బలాలలోని తేడాలను; తెలియఁగన్+పలుకఁడె?= నీకు వివరంగా చెప్పలేదా?; ఎట్లు= ఏ విధంగా; నీకున్; ఆ బుద్ధులు+అన్నియున్= ఆ నీతివాక్యాలన్నీ; నెమ్మనమునన్= (నీ) మనస్సులో; చేర్పన్+పోలవు+అ= దూరలేకపోయాయి; ఇంకన్+ఏమి+చేయవచ్చున్?= ఇక మనం ఏం చేయగలం?

తాత్పర్యం: 'ఓ రాజా! నీవు వేదాలు చదివినవాడివి. శాస్త్రాలు విన్నావు. పెద్దల చర్చలలో పాల్గొన్నవాడివి. అన్ని పురాణాలను అవలోకనం చేసి వాటి సారాన్ని గ్రహించినవాడివి. అన్ని ధర్మాలను ఎరిగినవాడివి. ఈ రీతిగా నీ తప్పును నీవు గుర్తించకుండా ఊరికే దుఃఖాన్ని పొందుతున్నావు. కోపపడుతున్నావు. నేను, భీష్ముడు, ద్రోణుడు, విదురుడు ఎన్ని మార్లు ఏంచేయాలో ఎట్లా చేయాలో నీ చెవుల్లో కూరికూరి నూరిపోశాము కదా! సంజయుడు కురుపాండవ బలాలలోని తేడాను ఎన్ని సార్లు నీకు వివరంగా చెప్పలేదు? ఆ బుద్ధులన్నీ నీ మనసులో ఏ మాత్రం దూరలేకపోయాయి. ఇక మనం ఏమి చేయగలం?

క. భీమార్జునుల రణసము । ద్దామత్వం బెఱిఁగి యెఱిఁగి తగునే తొడరం
గా మనుజుల కవ్వీరుల? । నేమనఁగల దింక నేల యీ చందంబుల్? 143

ప్రతిపదార్థం: భీమార్జునుల= భీముడు, అర్జునుడు - వీరి; రణ= యుద్ధ క్రీడలోని; సమ్+ఉద్దామత్వంబు= అతిశయించిన స్వాతంత్ర్యాన్ని; ఎఱిఁగి+ఎఱిఁగి= తెలిసి తెలిసీ; మనుజులకున్= సామాన్యులకు; ఆ+వీరులన్= ఆ ఇరువురినీ (ఆ మహావీరులిద్దరినీ); తొడరంగాన్= ఎదిరింపగా; తగునే?= అవుతుందా?; ఏమనఁగలదు?= ఏమి అనగలం?; ఇంకన్= ఇక; ఈ చందంబుల్= ఈ రీతులు (ఇట్లా శోకించటం); ఏల= ఎందుకు?

తాత్పర్యం: భీమార్జునులు రణ క్రీడలో ఎట్లా లోకోత్తరంగా స్వతంత్రిస్తారో తెలిసి తెలిసీ సామాన్యులు వారిని ఎదిరించటం సాధ్యమవుతుందా! ఇక మనం ఏమనగలం? మరింక ఎందు కిట్లా శోకాలు పెట్టటం?

క. తన మేలుఁ గీడుఁ దా మదిఁ । గనుచు హితులు సెప్ప బుద్ధిఁ గైకొని శుభముం
గొనకొని నడపు పతికి వ । చ్చునె పశ్చాత్తాప మెట్టి చోట? నరేంద్రా! 144

ప్రతిపదార్థం: తనమేలున్= తనకు ఏదిమేలో దానిని; కీడున్= తనకు ఏది చెడుపో దానిని; తాన్+మదిన్+కనుచున్= తాను సవ్యంగా తెలిసికొంటూ; హితులు చెప్పు= పెద్దలు స్నేహితులు చెప్పే; బుద్ధిన్+కైకొని= నీతి వాక్యాలను స్వీకరించి; శుభమున్+గొనకొని= శుభాన్ని సాధించి; నడపు= కార్యాన్ని నిర్వహించే; పతికిన్= రాజుకు; ఎట్టిచోటన్= ఏ సందర్భంలోనూ; నరేంద్రా!= ఓ రాజా!; పశ్చాత్తాపము= చేసిన తప్పునకు చింతించటం అన్నది; వచ్చునె?= కలుగుతుందా?

తాత్పర్యం: తన మంచి చెడులను తానే స్వయంగా గుర్తిస్తూ పెద్దలు స్నేహితులు చెప్పే నీతి వాక్యాలను స్వీకరించి శుభాన్ని సాధించి కార్యం నిర్వహించే రాజుకు ఎప్పుడూ చేసిన తప్పునకు చింతించవలసిన అవసరం కలుగదు.

ప్రణవ వృత్తము:

నీ యుల్లం బొక నియతిం గార్యం । బాయత్తంబుగ ననుసంధింపం
జేయం జాలవు చెడు తెర్పుం బోఁ । బాయం ద్రోవవు బలిమిం బుత్రున్. 145

ప్రతిపదార్థం: నీ+ఉల్లంబు= నీ హృదయం; ఒక నియతిన్= ఒక నియమానికి లోబడి; కార్యంబు= పనిని; ఆయత్తంబుగన్= సొంతంగా; అనుసంధింపన్= సిద్ధింపచేసుకోవటానికి; చేయన్= నీ చిత్తాన్ని సిద్ధపరచ; చాలవు= సమర్థుడివి కావు; బలిమిన్= బలంతో; పుత్రున్= నీ కొడుకును; చెడుతెర్వున్= చెడ్డమార్గంలో; పోన్= పోతుండగా; పాయక+త్రోవవు= ఆదారి తప్పించ జాలకపోయావు.

తాత్పర్యం: నీ మనసును సొంతంగా ఒక నియమానికి లోబడి ఎన్నడూ ఒక పనిని చేసికొనటానికి నీవు సిద్ధంచేయలేదు. (ఎప్పుడూ ఇతరులమీద ఆధారపడే పని చేశావు). నీ కొడుకు చెడుదారిలో పోతున్నపుడు ఆ దారిని తప్పించిన వాడివీ కావు (నీవు చేసిన ఉపేక్షా రూపమైన తప్పు ఇదే. అందుకే కౌరవ వంశం పతనమైంది).

విశేషం: 'ఆత్మబుద్ధి స్సుఖం చైవ' అని పెద్దల మాట. ఏ పనిచేసినా నిర్ణయం తీసుకున్నా తనకు తానుగా తీసికొనాలి. పరులమీద ఆధారపడి జీవించేవాడు ఎప్పుడూ వినాశం పొందుతాడు. (పరబుద్ధిర్వినాశకః) - ధృతరాష్ట్ర దుర్యోధనులు ఆత్మబుద్ధి నిష్ఠితులు కారు. వారిని ప్రబోధించిన పరబుద్ధులు దుర్మార్గులు తప్ప సాధుసత్పురుషులు కారు. ధృతరాష్ట్రుడికి రాజ్యలోభం, పుత్రలోభం రెండూ ఉన్నాయి. అందుకే పుత్రుడి దోషాలను సైరించటమే కాక 'ఉపేక్షిస్తూ' వచ్చాడు. దానినే కృష్ణుడు ఇక్కడ గుర్తు చేస్తున్నాడు.

వృత్తలక్షణం: ప్రణవవృత్తంలో ప్రతిపాదానికీ మ, న, య, గ అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ ఆరవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

తే. ద్యూతమునగెల్పు నెపమున నుఱికి పుణ్య । కాంతఁ దల పట్టికొని సభాభ్యంతరమున
ఈడ్చి వలువ లొలుచుటయు నెఱిఁగి సుతులఁ । జంపెనని భీముఁ జంపఁ దలంపనగునె. 146

ప్రతిపదార్థం: ద్యూతమునన్= మాయాద్యూతంలో; గెల్పు నెపమునన్= గెలిచామన్న మిషతో; ఉఱికి= దూకి (పరిగెత్తి); పుణ్యాకాంతన్= పతివ్రత సుమంగళి అయిన ద్రౌపదిని; తలపట్టికొని= తలపట్టి; సభాభ్యంతరమునకున్= సభలోకి; ఈడ్చి= ఈడ్చుకొనివచ్చి; వలువలు+ఊడ్చుటయున్= బట్టలు ఊడదీయటం; ఎఱిఁగి= తెలిసి; సుతులన్= కొడుకులను; చంపెనని= చంపాడని; భీమున్+చంపన్= భీముడిని చంపటానికి; తలంపన్+అగునె= ఆలోచించవచ్చా!

తాత్పర్యం: మాయాద్యూతంలో గెలిచామనే నెపంతో పరుగెత్తిపోయి పుణ్యాకాంత అయిన ద్రౌపదిని తలపట్టుకొని సభామధ్యంలోకి లాగుకొనివచ్చి బట్టలు ఊడదీసిన విషయం తెలిసి ఉండికూడా, నీ కొడుకులను చంపాడని భీముడిని నీవు చంపాలని ఆలోచించటం బాగుందా! నీవే చెప్పుము!

విశేషం: కార్యకారణ సంబంధాన్ని కృష్ణుడు వివరిస్తున్నాడు. దుర్యోధనాదులను అంతక్రూరంగా చంపటానికి సభామధ్యంలో చేసిన ప్రతిజ్ఞలు కారణం. ఆ ప్రతిజ్ఞలకు ద్రౌపదీ మానభంగం కారణం. అది తెలిసి కూడా మళ్ళీ భీముడిని చంపాలని చూడటం సమంజసం కాదని కృష్ణుడి భావం.

వ. నీ యవినీతియుం గొడుకుల దుశ్చరిత్రంబునుం దలంచి శోక రోషంబులు విడిచి శాంతుండవై యుండుమనిన నుపేంద్రునకు నన్నరేంద్రుం డిట్లనియె. 147

ప్రతిపదార్థం: నీ+అవినీతియున్= నీ అవినీతి; కొడుకుల= నీ కుమారుల; దుశ్చరిత్రంబునున్= దుష్టచరిత్రనూ; తలంచి= బాగా గుర్తుచేసుకొని; శోకరోషంబులు= శోకాన్నీ, రోషాన్నీ, విడిచి; శాంతుండవై= శాంతమూర్తిగా; ఉండుము+అనినన్= ఉండుమని చెప్పగా; ఉపేంద్రునకున్= కృష్ణునికి; ఆ+నరేంద్రుండు= ఆ మహారాజు; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: నీ అవినీతినీ, నీ కొడుకుల దుష్టచరిత్రను ఒకసారి బాగా గుర్తుచేసికొమ్ము. శోకాన్ని రోషాన్ని వదలిపెట్టుము. శాంతం పొందుము' - అని కృష్ణుడు చెప్పగా ధృతరాష్ట్రు డిట్లా అన్నాడు.

జలదవృత్తము:

'నీ పలుకెల్ల నిక్కమ యనింద్యగుణా! । యీ పురుషార్థహాని సుతు లీల్గుటకుం
దాపముఁ బొంది తాల్మి దిగఁ ద్రావి మహా । కోపుఁడ నైనఁ బాటిలెఁ దగుం గినియన్. 148

ప్రతిపదార్థం: అనింద్యగుణా!= ప్రశంసింపదగిన గుణాలు కలిగిన కృష్ణా!; నీ పలుకు+ఎల్లన్= నీ మాటలన్నీ; నిక్కము+అ= సత్యాలే; సుతులు= కుమారులు; ఈల్గుటకున్= చనిపోయినందువలన; తాపమున్+పొంది= బాధపొంది; తాల్మి+దిగన్+ద్రావి= ఓర్పును పోగొట్టుకొని; మహాకోపుఁడను+ఐనన్= మహాకోపం కలిగిన వాడివికాగా; ఈ పురుషార్థహాని+పాటిలెన్= ఈ ధర్మవిరుద్ధకార్యం వచ్చి పడింది; (నీవు) కినియన్= కోపగించుకోవటం; తగున్= సమంజసమైనదే.

తాత్పర్యం: 'కృష్ణా! నీవు ప్రశంసించదగిన గుణాలు మాత్రమే కలిగిన పురుషోత్తముడివి. నీ మాటలు అన్నీ సత్యాలే. కొడుకులు చనిపోయినందువలన మిక్కిలి బాధపొంది, ఓర్పును పోగొట్టుకొని మహాకోపాన్ని పొందటంవలన ఈ ధర్మహాని జరిగింది. అట్లాంటి నన్ను నీవు కోపగించటం సమంజసమే.

విశేషం: పురుషార్థాలని నాలిగింటికి పేరు - ధర్మం, అర్థం, కామం, మోక్షం. సందర్భాన్నిబట్టి ఇక్కడ 'ధర్మం' ప్రసక్తమయింది. ఇట్లా చంపాలనుకొనటం నాలోని కోపం ప్రకోపించటంచేత జరిగింది తప్ప నేను కోరి చేసినది కాదన్న విషయాన్ని మహారాజు చెప్తున్నాడు.

జలదవృత్తలక్షణం: ప్రతిపాదానికీ భ, ర, న, భ, గ - అనే గణాలుంటాయి. 1-10 అక్షరాలకు యతిమైత్రి - ప్రాసనియమం కలదు. దీనిని జలధరవృత్తమనీ పిలుస్తారు. (చూడండి స్త్రీ. 1.164). కొన్ని ప్రతులలో ఈ వృత్తం జలధరవృత్తంగా పేర్కొనబడి ఉన్నది.

క. తెలిసితి నీ మాటలఁ బు । త్రుల దెస నెవ్వగనెల్లఁ దొఱఁగి యనుజ పు
త్రుల నాకుఁ బ్రియ మొనర్పం । గలవారుగ నడచువాఁడఁ గంసారాతీ!' 149

ప్రతిపదార్థం: కంసారాతీ!= కంసుడి శత్రువైన కృష్ణా!; నీ మాటలన్= నీ మాటలవలన; తెలిసితిన్= జ్ఞానాన్ని పొందాను; పుత్రుల దెసన్= నా కుమారుల విషయంలో; నెవ్వగలన్+తొఱఁగి= బాధను వదలి; అనుజపుత్రులు+అ= నా తమ్ముడి కొడుకులే; నాకున్= నాకు; ప్రియము+ఒనర్పన్+కలవారుగన్= సంతోషం కలిగించగలిగే వారుగా; నడచువాఁడన్= నడుచుకొంటాను.

తాత్పర్యం: ఓ కంసవైరీ! నీ మాటలచేత 'తెలివి' ని పొందాను. నా కొడుకుల విషయంలో పడుతున్న బాధను ఇక వదలివేస్తాను. నా తమ్ముడి కుమారులే నాకు సంతోషం కలిగించగలిగేవారుగా నేను నడుచుకొంటాను.'

వ. అనుటయు నమ్మహాత్ముండు భీమార్జున నకుల సహదేవులం గానిపించినఁగ్రమంబున నమ్మానవపతి వారలం గౌఁగిలించుకొని దీవించె నప్పు డాశ్రితవత్సలుండగు శ్రీవత్సలాంఛనుండు యుయుత్సునకుఁ దదీయ సందర్శనంబు సముచిత ప్రకారంబున నడిపె నట్లు గాంచిన వణిక్కన్యాజాతునెడం బొడమిన వాత్సల్యంబున వైచిత్రవీర్యుం డతనిఁ దిగిచికొని యక్కునం జేర్చికొనియెఁ దదనంతరంబ యద్ధరణీవిభుండు ధర్మపుత్ర

ప్రభృతులగు నయ్యేవుర నుద్దేశించి 'మీరు గాంధారిం గనుం' డని పంచిన నప్పాండవేయులు పద్మనాభ పురస్సరంబుగాఁ జని వినయంబున వినతులైన నద్దేవి దీవింప నొల్లక యుల్లంబు నిజతనూజుల మరణంబునకుం దాపంబునొంద శాపంబిచ్చునదియై యజాతశత్రు నుద్దేశించిన నత్తెఱఁగు సకలప్రాణి చిత్త వృత్తంబులు దన దివ్యబోధనంబునం దేటపడం గనియెడువాఁడును మనోజవుండును సర్వలోక సంపూజ్యుండును నగు సత్యవతీ సూనుండెఱింగి తత్క్షణంబ సన్నిహితుండై యఖిలజనంబు లభివందనంబు సేయం గైకొనుచు నక్కోడలిం జేరి యోహో! శపింపకు శమింపుమని పలికి మఱియు నిట్లనియె. 150

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధృతరాష్ట్రుడనగా; ఆ+మహాత్ముండు= మహాత్ముడైన ఆ కృష్ణుడు; భీమార్జున నకుల సహదేవులం గానిపించినన్= భీముడిని, అర్జునుడిని, నకులుడిని, సహదేవుడిని ధృతరాష్ట్రుడి దగ్గర చూపెట్టాడు; క్రమంబునన్= వరుసగా; ఆ+మానవపతి= ఆ రాజు; వారలన్= వారిని; కౌఁగిలించుకొని దీవించెన్= కౌగిలించుకొని ఆశీర్వదించాడు; అప్పుడు= ఆశ్రిత వత్సలుండు+అగు= ఆశ్రయించినవారిని పిల్లలలాగా కాపాడే గుణమున్న; శ్రీవత్సలాంఛనుండు= శ్రీవత్సమనే పుట్టుమచ్చను గుర్తుగా కలిగిన శ్రీమహావిష్ణు రూపుడైన కృష్ణుడు; యుయుత్సునకున్= ధృతరాష్ట్రుని కుమారుడైన యుయుత్సునికి; తదీయ= ఆ ధృతరాష్ట్రుని; సందర్శనంబు= దర్శించుకోవటాన్ని; సముచిత= తగిన; ప్రకారంబునన్= విధానంలో; నడపెన్= నడిపాడు; అట్లు+కాంచిన= అలా వచ్చిచూసిన; వణిక్+కన్యాజాతుని+ఎడన్= వైశ్యకన్యాకుమారుని విషయంలో (యుయుత్సుడిపై); పొడమిన= పుట్టిన; వాత్సల్యంబునన్= కుమారత్వ భావనతో; వైచిత్రవీర్యుండు= విచిత్రవీర్యుని కుమారుడైన ధృతరాష్ట్రుడు; అతనిన్= యుయుత్సుడిని; తిగిచికొని= దగ్గరకు తీసికొని; అక్కునన్+చేర్చికొనియెన్= రొమ్ముమీద చేర్చుకున్నాడు (కౌగిలించుకొన్నాడు); తద్+అనంతంబ= ఆ తరువాత; ఆ+ధరణీవిభుండు= ఆ రాజు; ధర్మపుత్ర= ధర్మరాజు; ప్రభృతులు +అగు= మొదలైన; ఆ+ఏవురన్+ఉద్దేశించి= ఆ ఐదుగురిని చూచి (పాండవులవైపు తిరిగి); మీరు= మీరు ఐదుగురు; గాంధారిన్+కనుండు+అని= గాంధారిని చూడండి అని; పంచినన్= పంపగా; ఆ+పాండవేయులు= ఆ కుంతీకుమారులు; పద్మనాభ పురస్సరంబుగాన్= కృష్ణుడు ముందు నడుస్తుండగా; చని= వెళ్ళి; వినయంబునన్= వినయంతో; వినతులు+ఐనన్= నమస్కరించగా; ఆ+దేవీ= ఆ గాంధారి; దీవింపన్+ఒల్లక= దీవించటానికి ఇష్టపడక; ఉల్లంబు= హృదయం; నిజ తనూజుల= తన కుమారుల; మరణంబునకున్= చావుకు; తాపంబున్+ఒల్లక= దీవించటానికి ఇష్టపడక; ఉల్లంబు= హృదయం; నిజ తనూజుల= తన కుమారుల; మరణంబునకున్= చావుకు; తాపంబున్+ఒందన్= మండిపడుతుండగా; శాపంబు+ఇచ్చునది+ ఐ= శాపం ఇవ్వటానికి; అజాతశత్రున్+ఉద్దేశించిన= ఆ ధర్మరాజువైపు చూడగా (తిరుగగా); ఆ తెఱఁగున్= ఆ వైనాన్ని; సకలప్రాణి చిత్త వృత్తంబులున్= అన్ని ప్రాణుల మనసులతో జరిగే పనులను; తన= తనయొక్క; దివ్యబోధంబునన్= దివ్యజ్ఞానంలో; తేటపడన్= స్పష్టంగా; కనియెడువాఁడును= చూచేవాడూ; మనోజవుండును= మహావేగం కలగినవాడూ; సర్వలోక= లోకాలన్నిటిచేతనూ; సంపూజ్యుండును= మిక్కిలిగా గౌరవింపబడేవాడూ; అగు= అయిన; సత్యవతీసూనుండు= సత్యవతి కొడుకైన వ్యాసమహర్షి; ఎఱింగి= గుర్తించి; తద్+క్షణంబు+అ= వెంటనే; సన్నిహితుండు+ఐ= ప్రత్యక్షమై; అఖిల జనంబులు= అక్కడున్న వారందరూ; అభివందనంబు= నమస్కారాలు; చేయన్= చేస్తుండగా; కైకొనుచున్= స్వీకరిస్తూ; ఆ+కోడలిన్+చేరి= కోడలైన గాంధారిని సమీపించి; ఓహో!= ఓ గాంధారీ!; శపింపకు(ము)= శాపం పెట్టవద్దు; శమింపుము+అని+పలికి= శాంతించుము అని చెప్పి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు అన్నాడు. అపుడు కృష్ణుడు భీమార్జున నకుల సహదేవులను ధృతరాష్ట్రుడి దగ్గర నిలబెట్టాడు. వరుసగా అందరినీ ఆ రాజు కౌగిలించుకొని దీవించాడు. ఆశ్రయించినవారిని కాపాడే ఆ కృష్ణుడు చివరగా యుయుత్సుడిని ధృతరాష్ట్రుడి వద్దకు పంపాడు. (యుయుత్సుడు వైశ్యకన్యకు ధృతరాష్ట్రుడికి జన్మించినవాడు - ధార్తరాష్ట్రుడై.) అతడిని చూడగానే కుమారుడు లభించాడని ఎంతో ఆనందం పొంది ఆ రాజు యుయుత్సుడిని

దగ్గర చేర్చుకొని కౌగిలించుకొన్నాడు. ఆ తరువాత మహారాజు పాండవుల వైపు తిరిగి 'మీరు గాంధారీదేవిని చూడండి' అని అన్నాడు. ఆ కుంతీకుమారులు పెదతండ్రిగారి అనుజ్ఞ మేరకు శ్రీకృష్ణుడు ముందు నడుస్తుండగా వెళ్ళి గాంధారికి వినయంతో నమస్కరించారు. అపుడు ఆమె ఆశీర్వదించటానికి ఇష్టపడక తన హృదయం మరణించిన కుమారులను గురించిన శోకంతో మండిపడుతుండగా శాపం ఇవ్వటానికి ధర్మరాజువైపు తిరిగింది. ప్రాణులందరి చిత్తాలలోనూ ఏ వికారాలు ఏర్పడుతాయో ఎట్లా ప్రవర్తిస్తారో తన దివ్యజ్ఞానంతో స్పష్టంగా చూడగలిగినవాడు, వ్యాసమహర్షి అక్కడ ప్రత్యక్షమయ్యాడు. మనోవేగం ఉన్నవాడు. అన్ని లోకాలలోనూ మిక్కిలిగా గౌరవించబడేవాడు; అట్లాంటి వ్యాసమహర్షి అక్కడ ప్రత్యక్షం కాగానే జనులందరూ ఆయనకు నమస్కరించారు. వారిని ఆశీర్వదిస్తూ మహర్షి కోడలైన గాంధారివద్దకు చేరి 'ఓ గాంధారీ! శపించవద్దు. శాంతించుము' అని అంటూ ఇంకా ఇట్లా చెప్పాడు.

విశేషం: భీముడిని కౌగిలించుకొనే సమయంలో శ్రీకృష్ణుడు అడ్డుపడ్డాడు. ఇనుపబొమ్మను పంపించి భీముడిని కాపాడాడు. ఇప్పుడు గాంధారి శాపం ఇవ్వకుండా వ్యాసమహర్షి కాపాడుతున్నాడు. గాంధారి పరమపతివ్రత. భర్తకొరకు కన్నులు మూసికొని అంధవ్రతదీక్ష చేయటమే ఆమె తపస్సు. అందుచేత మహర్షి కాపాడాడు. 'దైవం' అనుకూలమైనపుడే 'మనిషి' విజయం పొందగలడనటానికి ఇట్లాంటి సంఘటనలే నిరూపణం.

ధర్మజుని శపింపఁ బూనిన గాంధారిని వ్యాసుఁడూరార్చుట (సం. 11-13-6)

సీ. **'పాండవేయాగ్రజుపై నల్కమానుము । రాజసంబేల? యీ రాజు ధర్మ**
పరుఁడు నీ వించుక పాటించి వినవమ్మ । చెప్పెదఁ గౌరవశ్రేష్ఠుఁ డనికిఁ
జనుచుండి 'తల్లి! దీవన యిమ్ము జయముగా । నా'కని పలికిన నా కుమారు
తోడ నీ పేర్మికి నీడుగాఁ గొడుక! యె । క్కడనుండు ధర్మ మక్కడకు జయము

తే. **సేరు ననవె? భూరి ఘోర యుద్ధంబున । గెలుపుగొనిరి గాన తలఁప ధర్మ**
పరుల కాఁగవలయుఁ బాండుతనూజు ల । సూయ లేని బుద్ధిఁ జూడు మెట్లు. **151**

ప్రతిపదార్థం: పాండవేయ+అగ్రజపైన్= కుంతీకుమారులలో పెద్దవాడైన ధర్మరాజుపైన; అల్కమానుము= కోపం విడిచిపెట్టు; రాజసంబు+ఏల?= ఈ రజోగుణం ఎందుకు?; ఈ రాజు= ఈ ధర్మరాజు; ధర్మపరుఁడు= ధర్మదీక్ష కలిగినవాడు; నీవు= అంచేత నువ్వు; ఇంచుక= కొంచెం; పాటించి= శ్రద్ధతో; వినవమ్మ!= వినుతల్లీ!; చెప్పెదన్= ఎందుకు క్షమించాలో చెబుతాను; కౌరవశ్రేష్ఠుఁడు= దుర్యోధనుడు; అనికిన్+చనుచుండి= యుద్ధానికి వెళ్తున్నపుడు; తల్లి!= ఓ అమ్మా!; నాకున్= నాకు; జయము+కాన్= జయం కలిగేలా; దీవన= ఆశీస్సు; ఇమ్ము= ఈ; అని; పలికినన్= కోరగా; ఆ కుమారుతోడన్= అతనితో; నీ పేర్మికిన్= నీ ప్రేమకు; ఈడుగాన్= సాటిగా (ప్రేమను అటుంచి); కొడుకు= కుమారా!; ధర్మము= ధర్మం; ఎక్కడన్+ఉండున్= ఎక్కడ ఉంటుందో; అక్కడకున్= అక్కడికి; జయము= జయం; చేరును+అనవె?= 'చేరుతుంది' అని చెప్పలేదూ!; భూరి= మహా; ఘోర యుద్ధంబునన్= భయంకర యుద్ధంలో; గెలుపున్+కొనిరి= విజయం పొందారు; కానన్= కాబట్టి; తలఁపన్= బాగా ఆలోచిస్తే; ధర్మపరులన్= ధర్మదీక్షితులైన; పాండుతనూజులకున్= పాండుకుమారులను; ఆఁగవలయున్= సైపవలయును (కరుణించాలి); ఎట్లున్= ఎలా అయినా (అన్ని విధాలా!); అసూయలేని; బుద్ధిన్= బుద్ధితో; చూడుము= చూడు (నీకే తెలుస్తుంది).

తాత్పర్యం: 'తల్లీ! ధర్మరాజుమీద కోపం విడిచిపెట్టుము. ఈ రజోగుణం ఇంకా నీ కెందుకు? ఈ ధర్మరాజు ధర్మదీక్ష కలవాడు. అందుచేత నీవు నేను చెప్పబోయే మాటలను శ్రద్ధతో వినుము. నీ కుమారుడు దుర్యోధనుడు యుద్ధభూమికి వెళ్ళబోతూ 'నాకు విజయం సిద్ధించేటట్లు ఆశీర్వదించుము' అని అడిగినప్పుడు నీ పుత్రాభిమానాన్ని అటుంచి 'నాయనా! ధర్మ మెక్కడో జయ మక్కడిచే చేరుతుం'దని చెప్పావు కదా! మహాఘోరమైన యుద్ధంలో వీళ్ళు గెలిచి బైటపడ్డారు. అందుచేత బాగా ఆలోచించి ధర్మదీక్షతో పోరాడి గెలిచిన పాండవులను సహించుము. ఆశ్రయ మిమ్ము. ఏ విధంగా నైనా అన్యాయం లేని బుద్ధితో ఆలోచించుము. నీకే అర్థమవుతుంది.

విశేషం: 'యతో ధర్మ స్తతోజయః' అని ప్రాచీన భారతీయుల విశ్వాసం.

గాంధారికూడా ఇదే మాటనే అన్నది. కుమారులు ధర్మపక్షాన లేరన్న వివేకం ఆమెకు ఉన్నదని ఈ మాటలు తెలుపుతాయి.

'రజోగుణం' - సత్త్వ రజస్తమోగుణాలని మూడు చెప్పబడ్డాయి. భగవద్గీతలో ఈ మూడింటి లక్షణాలు చెప్పబడ్డాయి. 'నేను అనే భావన, నాది, నాకు - అన్న కోరిక, రజోగుణ సంబంధులు. నేనే, నాకే - అన్నవి తమోగుణ సంబంధులు. ఈ రెండూలేని స్థితి సత్త్వస్థితి. యోగులు మాత్రమే ఈ స్థితిని అందుకొంటారు. భగవంతుడికి ఈ ముడు గుణాలూ లేవు. కాబట్టే ఆత్మ స్వరూపుడని పిలుస్తారు.

'తనకుమారులు చనిపోయారు. పాండవులు చంపివేశారు' అన్న భావనతోనే గాంధారీదేవి కుమిలిపోతున్నది. ఇదే రజోభావన. దానిని విడిచిపెట్టుమని వ్యాసుడి బోధ.

మేదినీవృత్తము:

విను మిటులేటికిం జనిన వృత్త మూఁ ది యల్గన్ । జనము నుతించు నీదు గురుసారధీరబుద్ధిన్
నిను నతిశాంతచిత్తయని నిక్క మేనుఁ గందున్ । మనమున నట్టి నీ కగునె? మత్సరంబు వత్సా! 152

ప్రతిపదార్థం: వత్స!= ఓ బిడ్డా! (ఓ అమ్మాయీ!); వినుము= నేను చెప్పేది బాగా వినుము; ఇటులు= ఈ విధంగా; చనిన= జరిగిపోయిన; వృత్తము= కథను; ఊఁది= పట్టుకొని; అల్గన్= కోపగించుకొనటం; ఏటికిన్?= ఎందుకు?; జనము= లోకం; నీదు= నీ యొక్క; గురు= గొప్పదైన; సారధీరబుద్ధిన్= జ్ఞానంతో; ధైర్యంతో కూడిన బుద్ధిని; నుతించున్= ప్రశంసిస్తుంది; నిక్కము= నిజంగా; నినున్= నిన్ను; అతిశాంత చిత్త+అని= అతి ప్రశాంతమైన మనస్సు కలిగినదానివని; ఏనున్+కందున్= నేను అనుకొంటాను; ఇట్టి నీకున్= ఇలాంటి నీకు; మనమునన్= మనస్సులో; మత్సరంబు= అసూయ; అగునె?= పుట్టవచ్చునా? (సమంజసంకాదని భావం).

తాత్పర్యం: అమ్మా! ఏనాడో జరిగిన కథలను పట్టుకొని ఇప్పుడు కోపగించుకొనటం వలన లాభం ఏముంటుంది? నీవు విచక్షణతో కూడిన జ్ఞానం కలిగిన దానివని, ధైర్యవంతురాలివని లోకం మెచ్చుకొనటం ఉన్నది. నేను ఎప్పుడూ నిన్ను ప్రశాంతమైన మనస్సు కలిగిన ఇల్లాలుగానే చూచాను. అట్లాంటి నీ మనస్సులో అసూయ పుట్టటమా! అది సమంజసంగా కనిపించటం లేదు.

విశేషం: మేదినీవృత్తంలో ప్రతిపాదానికీ న, జ, భ, జ, ర, గ - అనే గణాలుంటాయి. 1-11 అక్షరాలకు ప్రాసమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

వ. ధర్మంబు పరిగ్రహించి నీ కొడుకులగు పాండవులదెస రోషంబు నిగ్రహింపు' మనిన గంధవతీనందనునకు గాంధారరాజనందన యిట్లనియె. 153

ప్రతిపదార్థం: ధర్మంబు= (నీవు) మాతృధర్మాన్ని; పరిగ్రహించి= అవలంబించి; నీ కొడుకులు+అగు= నీ కుమారులైన; పాండవుల దెసన్= పాండవుల విషయంలో; రోషంబు= కోపాన్ని; నిగ్రహింపుము+అనినన్= అణచుకో అని చెప్పగా; గంధవతీ నందనునకున్= యోజనగంధి కొడుకు - వ్యాసమహర్షికి; గాంధారరాజనందన= గాంధార రాజకుమార్తె (గాంధారి); ఇట్లు+అనియెన్= ఇలా అన్నది.

తాత్పర్యం: నీవు ఇప్పుడైనా మాతృధర్మాన్ని అవలంబించి నీ కుమారులైన పాండవులపైన ఉన్న రోషాన్ని పోగొట్టుకొమ్ము' అని చెప్పాడు. అప్పుడు వ్యాసుడితో గాంధారి ఇట్లా అన్నది.

సీ. 'ఏ నసూయాగ్రస్తఁ గాను వీరలఁ జెడఁ । దలఁతునె? యెట్టు లుమ్మలికఁ జేసి
కలఁగితిఁ గాక యిక్కొంతేయ వర్గంబు । గొంతికెట్లట్ల నాకును భరింప
వలదె? దుర్యోధను తులువతనంబున । శకునియుఁ గర్ణదుశ్శాసనులును
దుష్టాత్ము లగుటను ద్రుంగెఁ గౌరవకుల । మడరి పాండవులుఁ గయ్యంబుపాడిఁ

ఆ. జంపి రందఱ నది మది నొంపఁజాల । దచ్యుతుఁడు సూడఁ గురుపతి ననిలసుతుఁడు
దగునె గదపోర నాభికి దిగువ నొంచి । చంప? నత్తెఱఁ గుల్లంబు నొంపకున్నె? 154

ప్రతిపదార్థం: ఏను= నేను; అసూయాగ్రస్తన్= అసూయతో నిండిన దాన్ని; కాను= కానేకాను; వీరలన్= పాండవులను; చెడన్+తలఁతునె?= నశించాలని అనుకొంటానా?; ఎట్టులు= ఎట్లాగో; ఉమ్మలికన్+చేసి= దుఃఖాతిశయంచేత; కలఁగితిన్+కాక= కోపగించుకొన్నాను తప్ప!; ఈ+కొంతేయవర్గంబు= ఈ కుంతి కుమారులు (పాండవులు); గొంతికిన్+ఎట్లు+అట్లు= కుంతికి ఎట్లాగో అట్లాగే; నాకును= నేనూ; భరింపవలదె?= భరించవద్దా?; దుర్యోధను= దుర్యోధనుడి; తులువతనంబునన్= తుంటరితనంచేత; శకునియున్= శకునీ; కర్ణ దుశ్శాసనులును= కర్ణుడూ, దుశ్శాసనుడూ; దుష్టాత్మలగుటను= దుష్టాత్ములు కావటంవలన; కౌరవకులము= కురువంశం; త్రుంగెన్= నాశనమయింది; అడరి= విజృంభించి; పాండవులు= పాండుకుమారులు; కయ్యంబుపాడిన్= యుద్ధకర్మప్రకారంగా; అందఱన్= అందరినీ; చంపిరి= చంపారు; అది= అట్లా చంపటం; మదిన్= నా మనసును; నొంపన్+చాలదు= బాధపెట్టలేదు (బాధ కలిగింపజాలదు); అచ్యుతుఁడు+చూడన్= శ్రీకృష్ణుడు చూస్తుండగా; కురుపతిన్= దుర్యోధనుడిని; అనిల సుతుఁడు= వాయునందనుడైన భీముడు; గదపోరన్= గదాయుద్ధంలో; నాభికిన్+దిగువన్+నొంచి= నాభికి దిగువ కొట్టి; చంపన్+తగునె?= చంపవచ్చునా?; ఆ+తెఱఁగు= ఆ పని; ఉల్లంబున్= హృదయాన్ని; నొంపక+ఉన్నె?= బాధపెట్టకుండా ఉంటుందా?

తాత్పర్యం: 'మహర్షీ! నేను అసూయ కలిగిన దానను కాను.పాండవులు నశించాలని నేను కోరుకొంటానా? ఎట్లాగో దుఃఖం అధికం కావటం వలన కోపగించుకొన్నాను. అంతే! ఈ పాండవులు కుంతికి ఎంతో నాకూ అంతే కదా! వీరి బాధ్యత ఆమె కెంతో నాకూ అంతే. దుర్యోధనుడి తుంటరితనంచేత, శకునికర్ణదుశ్శాసనుల దుర్మార్గంచేత కౌరవకులం నాశనమయిపోయింది. యుద్ధంలో విజృంభించి యుద్ధధర్మాన్ని బట్టి ఈ పాండవులు అందరినీ చంపారు. దీనివలన నా మనసుకు ఏమీ బాధ కలుగలేదు. శ్రీకృష్ణుడు చూస్తుండగా భీముడు గదాయుద్ధంలో దుర్యోధనుడిని బొడ్డుకు క్రింది భాగంలో గదతో మోది చంపటం న్యాయంగా ఉన్నదా? ఆ పని ఈ మాతృహృదయాన్ని బాధించకుండా ఉంటుందా? (మీరే చెప్పండి).

క. విడుతురె శూరులు రణమునఁ । బడునట్టి యవస్థ తమకుఁ బాటిల్లిననుం
బుడమి సమస్తజనంబులు । నడపెడు తెఱఁ గలుక తప్పనకు రాకున్నే?' 155

ప్రతిపదార్థం: శూరులు= పరాక్రమవంతులు; రణమునన్= యుద్ధంలో; పడునట్టి= (తాము) చనిపోయే; అవస్థ= పరిస్థితి; తమకున్; పాటిల్లిననున్= కలిగినా కూడా; పుడమిన్= భూమిలో; సమస్త జనంబులు= జనులందరూ; నడపెడు తెఱఁగు= అనుసరించే పద్ధతిని (నియమాలను); విడుతురె?= విడిచిపెడతారా?; తప్పునకున్= ఎవరైనా ఈ నియమాలు తప్పితే; అలుక= కోపం; రాక+ఉన్నే?= రాకుండా ఉంటుందా?

తాత్పర్యం: పరాక్రమవంతులైన వాళ్ళు యుద్ధంలో చివరికి తాము చనిపోయే పరిస్థితి ఎదురైనా జనులంతా ఏ నియమాలను పాటించి యుద్ధంచేస్తారో దాన్నే అనుసరిస్తారు. నియమాన్ని ఉల్లంఘించరు. ఎవరైనా అట్లా ఉల్లంఘిస్తే చూచిన వారికి కోపం రాకుండా ఉంటుందా?

విశేషం: ప్రాచీన భారతీయ సమాజంలో నియమానికి (కట్టుబాటు) ఎంత విలువ ఉండేదో ఈ పద్యం సూచిస్తుంది. అట్లా నియమాన్ని తప్పినప్పుడు ఎవరైనా తప్పుపట్టే అవకాశం ఉండేదని అర్థం.

వ. అనిన భీముండు భీతికంపితుండగుచు గాంధారికి వినతుండై వినయంబున నిట్లనియె. 156

ప్రతిపదార్థం: అనినన్= గాంధారి ఇలా అనగా; భీముడు; భీతి= భయంతో; కంపితుండు+అగుచున్= కంపిస్తూ; గాంధారికి; వినతుండు+ఐ= నమస్కరించి; వినయంబునన్; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: గాంధారి ఇట్లా అనగా భీముడు భయంతో గడగడ వణకిపోతూ పెద్దతల్లికి నమస్కరించి ఇట్లా అన్నాడు.

భీముఁడు గాంధారికిఁ గోపోపశమనంబుగా నుత్తరంబు లిచ్చుట (సం. 11-14-1)

సీ. 'తలపోసి చూడంగ ధర్మమయ్యె నధర్మ । మయ్యెనేఁ బ్రాణభయంబు కతన
నట్లు సేసితిఁ గృపయార సైరింపుము । నీదు పుత్త్రుఁడు లావు నేర్పుఁ గలఁడు
గావున నమ్మెయిఁగాని యోర్వంగ రా । దదియట్టులుండె ధర్మాత్మజునకుఁ
బాడితో వచ్చెనే పరిభవం బతనిచే? । ద్రౌపది యేకవస్త్రయు రజ స్వ

ఆ. లయును గాదె? యపుడు దయమాలి కొలువున । కీడ్చి తేరఁబంచి యేమి యనియె
నతఁడు వినవె! యూరు లప్పుణ్యకాంతకుఁ । జూపు టెఱుఁగవే విశుద్ధచరిత! 157

ప్రతిపదార్థం: విశుద్ధచరిత!= పరమపవిత్రమైన చరిత్ర కలిగిన గాంధారీదేవీ! తలపోసి చూడంగన్= బాగా ఆలోచిస్తే; ధర్మము+అయ్యెన్= ధర్మం అయిందో; అధర్మము+అయ్యెన్= అధర్మమే అయిందో!; ప్రాణభయంబుకతనన్= ప్రాణభయంతో; నేను+అట్లు+చేసితిన్= నేను అట్లా చేశాను (తొడలపైన కొట్టటం); కృప+ఆరన్= కృప నిండగా (నిండు కృపతో); సైరింపుము= క్షమించుము; నీదుపుత్త్రుఁడు= నీ కుమారుడు; లావు= బలం; నేర్పున్= చాకచక్యం; కలఁడు= కలిగినవాడు; కావునన్= అందువలన; ఆ+మెయిన్+కాని= అలా తప్ప; ఓర్వంగన్+రాదు= ఓడించటం సాధ్యంకాదు; అది+అట్టులు+ఉండెన్= అది

అట్లా జరిగినది; (మరి); ధర్మాత్మజునకున్= ధర్మరాజుకు; అతనిచేన్= ఆ దుర్యోధనునిచేత; పరిభవంబు= అవమానం; పాడితోవచ్చెనే?= న్యాయపద్ధతిలో జరిగినదా?; అపుడు= ఆ జూదం సమయంలో; ద్రౌపది= పాండువుల పత్ని, నీ కోడలు అయిన ద్రౌపది; ఏకవస్త్రయున్= ఒకే చీర ధరించినది; రసజ్వలయున్= ముట్టుతో ఉన్నది; కాదె?= కాదా?; దయమాలి= కనికరంలేకుండా; కొలువునకున్= రాజసభలోకి; ఈడ్చి= ఈడ్చుకొని; తేరన్+పంచి= తీసుకురమ్మని పంపి (పిలిపించి); అతఁడు= ఆ దుర్యోధనుడు; ఏమి+అనియెన్= ఏమన్నాడో; వినవె!= నీవు విన్నావుగదా!; ఆ+పుణ్యాంతకున్= రాజసూయ యజ్ఞంలో పవిత్రురాలైన ఆ పుణ్యస్త్రీకి; ఊరులు= తన తొడలు; చూపుట= చూపించి కూర్చోమనటం; ఎఱుఁగవే= నీకు తెలియదా!

తాత్పర్యం: 'పరమపవిత్ర చరిత్ర కలిగిన గాంధారీదేవీ! బాగా ఆలోచించిచూస్తే నేను చేసింది ధర్మమో అధర్మమో! ప్రాణభీతితో అట్లా చేశాను. నిండుదయతో మమ్మల్ని క్షమించుము. నీ కుమారుడు బలవంతుడు, చాకచక్యమున్నవాడు. అట్లాంటివాడిని అట్లా తప్ప ఓడించటం సాధ్యంకాదు. అందుచేత అట్లా చేయాల్సి వచ్చింది. అది అట్లా ఉంచుదాము. మరి ధర్మరాజుకు సభలో జరిగిన అవమానం న్యాయపద్ధతిలో జరిగిందా? ఆ సమయంలో ద్రౌపది ఏకవస్త్రంతో రజస్వలగా ఉన్నది కదా? ఏ మాత్రం దయలేకుండా నిండుకొలువులోకి ఈడ్పించుకొని వచ్చి దుర్యోధనుడు ఏమేమి అన్నాడో నీవు విన్నావు కదా! ఆ పవిత్రురాలికి తన తొడలు చూపించి కూర్చొనుమనటం నీవు ఎరుదుగువు కదా!

వ. తత్కాలోద్దీపితంబైన కోపంబున నెసంగు మనస్సంతాపంబు దాల్మి దహించిన దదూరుభంగంబు గదా దండంబునఁ జేయంగలవాఁడనని యప్పేరోలగంబునఁ బ్రతిన వట్టితి నుత్తమ క్షత్ర ధర్మజ్ఞులు ప్రతిజ్ఞాహాని నిందింతురు గాన పూనిక నెఱపితి విను మా సభలో నప్పుడ తొడలు పొడిసేసి యతనిం దెగఁ జూడఁ దగియుండ నజాతశత్రునాజ్ఞ మిగులరామించేసి యమ్మహాత్ము చేసిన సమయంబు దప్పింపక యవ్విధంబున విపినంబున కరిగి యనేకదుఃఖంబులంబడి మగిడి యజ్జనపతి సంధిగోరి శౌరిం గౌరవసభకుం బుత్తెంచుటకుం దగుమాటలాడు నవసరంబున నేనును. 158

ప్రతిపదార్థం: తద్+కాల= ఆ కాలంలో; ఉద్దీపితంబు+ఐన= ప్రకాశించిన; కోపంబునన్= కోపంతో; ఎసంగు= విజృంభించిన; మనస్+సంతాపంబు= మనసులోని పరితాపం; తాల్మిన్= ఓర్పును; దహించినన్= కాల్చివేయగా; తద్+ఊరుభంగంబు= అతడి తొడలను విరగగొట్టటం; గదాదండంబునన్= (నా) గదా దండంతో; చేయన్+కలవాఁడను+అని= చేయబోతానని; ఆ+పేరోలగంబునన్= ఆ నిండు సభలో; ప్రతిన+పట్టితిన్= ప్రతిజ్ఞ చేశాను; ఉత్తమ క్షత్ర ధర్మజ్ఞులు= ఉత్తమ క్షత్రియ ధర్మం తెలిసినవారు; ప్రతిజ్ఞాహానిన్= ప్రతిన నెరవేర్చుకోలేకపోవటాన్ని; నిందింతురు+కానన్= నిందిస్తారు కాబట్టి; పూనిక= నా పట్టుదలను; నెఱపితిన్= సాధించాను; వినుము= ఇంకా వినుము; ఆ సభలోన్= ఆ సభలోనే; అప్పుడు+అ= అప్పుడే; తొడలు= (నీ కుమారుని) తొడలు; పొడి+చేసి= నుగ్గుచేసి; అతనిన్= ఆ దుర్యోధనుడిని; తెగన్+చూడన్+తగి+ఉండన్= చంపివేయటం బాగుండగా; అజాతశత్రు+ఆజ్ఞ= ధర్మరాజు ఆనతి; మిగులరామిన్+చేసి= మీరకూడదు కాబట్టి; ఆ+మహాత్ము చేసిన= ఆ మహాత్ముడు చేసిన; సమయంబున్+తప్పింపక= నియమం; తప్పించకుండా; ఆ+విధంబునన్= ఆ రీతిగా; విపినంబునకున్+అరిగి= అడవికి వెళ్ళి; అనేక= చాలా విధాల; దుఃఖములన్+పడి= దుఃఖాలకు లోనై; మగిడి= మళ్ళీ; ఆ+జనపతి= ఆ ధర్మరాజు; సంధిన్+కోరి= సంధిని అభిలషించి; శౌరిన్= శ్రీకృష్ణుడిని; కౌరవసభకున్= కౌరవుల సభకు; పుత్తెంచుటకున్= పంపటానికి; తగుమాటలు+ఆడు+అవసరంబునన్= తగిన మాటలు మాట్లాడుతున్న సమయంలో; నేనును= నేను కూడా.

తాత్పర్యం: ఆ కాలంలో అప్పటికప్పుడు పుట్టిన కోపంతో పరితాపం అధికమై మనసును దహించివేస్తుండగా అతడి తొడలను నా గదాదండంతో విరుగగొట్టుతానని ఆ నిండు సభలో ప్రతిజ్ఞ చేశాను. ఉత్తమక్షత్రియధర్మం తెలిసినవారు ప్రతినను నెరవేర్చలేకపోవటం తప్పుగా భావిస్తారు. కాబట్టి నా పట్టుదలను నెరవేర్చుకొన్నాను. ఇంకా ఒక విషయం వినుము. ఆ సభలోనే అప్పుడే ఆ దుర్యోధనుడి తొడలు నుగ్గునుగ్గుచేసి చంపివేస్తే బాగుండేది. కాని, ధర్మరాజుమాట మీరటానికి వీలులేదు. కాబట్టి ఆ మహాత్ముడు పెట్టిన నియమాలను తప్పించకుండా అడవికి వెళ్ళి, పడరాని దుఃఖాలు అనుభవించాము. చివరకు మళ్ళీ ధర్మరాజు సంధి జరిగితేనే మంచిదని శ్రీకృష్ణుడిని హస్తినాపురానికి పంపించే సమయంలో నేను కూడా (ఇట్లా అన్నాను).

తే. **'అన్నదమ్ములమై యుండియకట! మనల । నొరులు దల లెత్తి చూడ నొండొరుల తోడఁ**
బెనఁగ నేటికి? నీ నేల పెద్దవారి । బుద్ధి విని పంచికుడుచుట పోలదొక్కొ?' **159**

ప్రతిపదార్థం: అన్న+తమ్ములము+ఐ+ఉండి= అన్నదమ్ములై ఉండి కూడా; అకట!= అయ్యో! (ఈ విధంగా); మనలన్= మనలను; ఒరులు= ఇతరులు; తలలు+ఎత్తి+చూడన్= తప్పుపట్టటానికై తలలు పైకెత్తి చూచేలా; ఒండు+ఒరుల తోడన్= ఒకరు మరొకరితో; పెనఁగన్+ఏటికిన్?= పోరాడటం ఎందుకు?; ఈ నేలన్= ఈ భూమిని; పెద్దవారి బుద్ధివిని= పెద్దల మాటవిని; పంచి= పంచుకొని; కుడుచుట= అనుభవించటం; పోలదు+ఒక్కొ?= సరిపోదా?.

తాత్పర్యం: 'మనం అన్నదమ్ములమై ఉండి కూడా ఈ విధంగా ఇతరులు మనలను తప్పుపట్టటానికి వీలుకలిపిస్తూ (తలలు పైకెత్తి చూస్తుండగా) ఒకరితో మరొకరు యుద్ధం చేయటం ఎందుకు? పెద్దలు చెప్పినట్లుగా ఈ భూమిని పంచుకొని ఎవరి భాగం వారు అనుభవిస్తే సరిపోదా?'

వ. **అని నీ కొడుకునకుం జెప్పి పుత్తెంచితి దానను శాంతిం బొందక యద్దురాచారుండు చలంబున వైరంబుఁ బెనిచె నట్లగుట నవశ్యంబును ధర్మరాజునకు రాజ్యంబు సేకొనుటయు నాకుఁబ్రతిజ్ఞ దీర్చుటయుం గర్తవ్యంబులయ్యెం గావున నేమిభంగినైనం బగదీర్పవలసె నీవును సువిచార వింతయు విచారింపు' మనవుడు నద్దేవి యతని కిట్లనియె.** **160**

ప్రతిపదార్థం: అని= అని; నీ కొడుకునన్= నీ కుమారుడైన దుర్యోధనుడికి; చెప్పి పుత్తెంచితిన్= చెప్పి పంపాను; దానను= దానిచేతకూడా; శాంతిన్+పొందక= శాంతించక; ఆ+దుర్+ఆచారుండు= ఆ దుర్మార్గుడు; చలంబునన్= కసితో; వైరంబున్+పెనిచెన్= శత్రుత్వాన్ని పెంచుకొన్నాడు; అట్లు+అగుటన్= అట్లా చేయటంవలన; అవశ్యంబును= తప్పని సరిగా; ధర్మరాజునకున్= ధర్మరాజుకు; రాజ్యంబు+చేకొనుటయున్= రాజ్యాన్ని గ్రహించటం; నాకున్; ప్రతిజ్ఞ+తీర్చుటయున్= చేసిన ప్రతినలను నిర్వహించటం; కర్తవ్యంబులు+అయ్యెన్= చేయదగ్గపనులు అయ్యాయి; కావునన్= అందుచేత; ఏమిభంగిన్+ఐనన్= ఏదో ఒక పద్ధతిని అవలంబించి; పగతీర్పన్+వలసెన్= పగను తీర్చుకోవలసి వచ్చింది. నీవును= నీవుకూడా; సువిచారవు= మంచి చెడులను తెలిసిన విచక్షణ ఉన్నదానివి; ఇంతయున్= దీన్నంతా; విచారింపుము= ఆలోచించుము; అనవుడున్= అని భీముడనగా; ఆ+దేవి= గాంధారీదేవి; అతనికిన్= భీముడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అని నీ కుమారుడికి చెప్పి పంపాను. దానితో శాంతించక ఆ దుర్మార్గుడు కసితో వైరం పెంచుకొన్నాడు. దానివలన ధర్మరాజు రాజ్యాన్ని గ్రహించటం, నేను నా ప్రతిజ్ఞలు తీర్చటం తప్పనిసరి అయింది. అందుచేత ఏదో ఒక విధంగా మా పగ తీర్చుకొనవలసి వచ్చింది. నీవు కూడా మంచి చెడులు తెలిసిన దానివి. విచక్షణ ఉన్నదానివి. ఇదంతా బాగా ఆలోచించుము' అని భీము డనగా గాంధారి అతడితో ఇట్లా అన్నది.

క. **'ఆ చావు సావఁ దగు న । న్నీచునకున్ వానివలన నిక్కం బరయన్**
నీ చెప్పినయన్నియుఁగల । వా చెయ్దియుఁ దగవ నీకు? నదియట్లుండెన్. **161**

ప్రతిపదార్థం: ఆ+నీచునకున్= ఆ నీచుడికి; ఆ చావు= ఆ విధంగా చావటం; తగున్= తగిందే; నిక్కంబు+అరయన్= నిజం ఆలోచిస్తే; వానివలనన్= వాడిలో; నీ చెప్పిన+అన్నియున్+కలవు= నీవు చెప్పిన దుర్గుణాలు అన్నీ ఉన్నాయి; (కాని) నీకున్= నీకు; ఆ చెయ్దియున్= ఆ పని; తగవ?= తగవే (న్యాయమే); అది= అది; అట్లుండెన్= అట్లా జరిగిపోయింది.

తాత్పర్యం: 'ఆ నీచుడికి అట్లా చావటం బాగుంది. ఆలోచిస్తే నీవు చెప్పిన దుర్గుణాలు అన్నీ వాడిలో ఉన్నాయి. కాని, అట్లా తొడలు విరుగగొట్టటం నీకు మాత్రం తగిన పనే? ఏమో అది అట్లా జరిగిపోయింది.

తే. **వైరి ననిఁ జంపుదురుగాక వ్రచ్చి నెత్తు । రెత్తికొని క్రోలు క్రూరాత్ము లెచట నైన**
నెన్నఁడేనియుఁ గలిగిరే యీవు దక్క? । నది వృకోదర! వృకవిధ మసురభంగి.' **162**

ప్రతిపదార్థం: వృకోదర!= తోడేలువంటి పొట్ట కలిగిన ఓ భీమసేనా!; అనిన్= యుద్ధంలో; వైరిన్= శత్రువును; చంపుదురు+కాక= చంపుతారు తప్ప; వ్రచ్చి= రొమ్ముచీల్చి; నెత్తురు+ఎత్తికొని= నెత్తురు తీసికొని; క్రోలు= త్రాగేటువంటి; క్రూరాత్ములు= క్రూరులు; ఎచటనైనన్= ఎక్కడైనా; ఎన్నఁడేనియున్= ఎప్పుడైనా; కలిగిరే?= పుట్టారా?; నీవు+తక్కన్?= నీవు తప్ప?; అది= అట్లా తాగటం; వృకవిధము= తోడేలు చేసేపని; అసురభంగి= రాక్షసులు చేసే పని.

తాత్పర్యం: వృకోదరా! యుద్ధంలో శత్రువును చంపుతారు తప్ప రొమ్ము చీల్చి నెత్తురు తీసికొని త్రాగేటటువంటి క్రూరులు నీవు తప్ప ఇంక ఎక్కడైనా ఎప్పుడైనా పుట్టారా? అట్లా త్రాగటం మనుషులు చేసే పనికాదు. తోడేలు అట్లా చేస్తుంది. రాక్షసులు అట్లా చేస్తారు'.

విశేషం: 'వృకం' అంటే తోడేలు. తోడేలు జీర్ణాశయంలోనే 'వృకం' అనే భాగంవల్లనే ఆ పేరు వచ్చింది. అందుచేత ఎంత తిన్నా దానికి తృప్తి కాదన్న విశ్వాసం ఉన్నది. అందుచేత భీముడు వృకోదరుడని ప్రసిద్ధి చెందాడు. ఇక్కడ భీముడికి వృకోదర అనే సంబుద్ధి సార్థకంగా ప్రయోగించబడింది.

వ. **అనవుడు ననిలపుత్త్రుండు సుబలరాజపుత్త్రి కిట్లనియె.** **163**

ప్రతిపదార్థం: అనవుడున్= అని గాంధారి అనగా; అనిలపుత్త్రుడు= వాయునందనుడైన భీముడు; సుబలరాజ పుత్త్రికిన్= సుబలరాజు కుమార్తె అయిన గాంధారితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: అని గాంధారి అనగా భీముడు ఆమెతో ఇట్లా చెప్పాడు.

జలధరవృత్తము:

ఆ సభలోని కట్లు ద్రుపదాత్మజఁ దా । గాసిగ నీడ్చి వల్వొలువఁగాఁ గినుకం
జేసిన బాసకై పెదవిఁ జేర్చితి దు । శ్శాసను శోణితం బిది నిజం బరయన్. 164

ప్రతిపదార్థం: ఆ సభలోనికిన్= ఆ ద్యూత సభలోనికి; అట్లు= ఆ విధంగా; ద్రుపదాత్మజన్= ద్రౌపదిని; తాన్= తాను (ఆ దుశ్శాసనుడు); గాసిగన్= బాధించేలా; ఈడ్చి= ఈడ్చుకొనివచ్చి; వల్వ+ఒలువన్+కాన్= చీర విప్పగా; కినుకన్= కోపంతో; చేసిన= చేసినటువంటి; బాసకై= ప్రతిజ్ఞను తీర్చుకోవటానికై; దుశ్శాసను శోణితంబు= దుశ్శాసనుడి రక్తాన్ని; పెదవిన్+చేర్చితిన్= పెదవికి తాకించాను; అరయన్= బాగా చూస్తే; నిజంబు= నిజం; ఇది= ఇంతే.

తాత్పర్యం: ఆ సభలోనికి అంత క్రూరంగా ఆమెను బాధపెడుతూ లాగుకొనివచ్చి చీర విప్పి అవమానించినందువలన కోపంతో చేసిన ప్రతిజ్ఞ తీర్చటంకొరకు అట్లా దుశ్శాసనుడి రక్తాన్ని పెదవికి చేర్చాను (తాకించాను) తప్ప, త్రాగలేదు. నిజంగా నేను చేసినది ఇంతే.

విశేషం: లాక్షణికులు దీనిని జలదవృత్తమని కూడ పిలుస్తారు. లక్షణానికి చూడండి స్త్రీ. 1.148

వ. అదియునుంగాక వినుమతని నేఁ బొదివినప్పుడు. 165

ప్రతిపదార్థం: అదియునున్+కాక= అంతేకాకుండా; వినుము= మరో విషయం ఉన్నది వినుము; అతనిన్= ఆ దుశ్శాసనుడిని; నేను; పొదివినప్పుడు= ఆక్రమించుకొన్నప్పుడు.

తాత్పర్యం: అంతేకాదు మరో విషయం కూడా ఉన్నది వినుము. నేను యుద్ధంలో దుశ్శాసనుడిని క్రిందపడవేసి ఆక్రమించుకొన్నప్పుడు.

క్రౌంచపదవృత్తము:

కౌరవసేనావీరులు లావుం గడిమియుఁ జలమును గడఁక యెలర్పన్
ధీరతసొంపుం గ్రూరతపెంపుం దెగువయు నెఱపఁగఁ దెరలక వీఁకన్
బోరనఁ ద్రోవంగా రభసం బేపును గలితనమును బొలుపు వహింపన్
వారు భయంబుం గూరుటకుం గావలసెను రుధిరము వదనము సేర్పన్. 166

ప్రతిపదార్థం: కౌరవ సేనావీరులు= కురు సేనలోని వీరులు; లావున్= బలం; కడిమియున్= పరాక్రమం; చలమును= పట్టుదల; కడఁక= పూనిక; ఎలర్పన్= అతిశయించగా; ధీరత సొంపున్= ధైర్య సమృద్ధి; క్రూరతపెంపున్= అతిశయించిన క్రౌర్యం; తెగువయున్= సాహసం; నెఱపఁగన్= చూపించటానికి; తెరలక= మరలిపోకుండా; వీఁకన్= పరాక్రమంతో; బోరనన్= వెంటనే; త్రోవంగాన్= నన్ను పట్టి తోసివేయగా; రభసంబు= వేగం; ఏపును= విజృంభణం, కలితనమును= పరాక్రమం; పొలుపు వహింపన్= అధికంకాగా; వారు= ఆ సైన్యం; భయంబున్= భయంతో; కూరుటకున్= మునగటానికి; రుధిరమున్= రక్తాన్ని; వదనము+చేర్పన్= నోటికి తాకించటం; కావలసెను= అవసరమయింది.

తాత్పర్యం: ఆ కురుసేనలోని మహావీరులు బలపరాక్రమాలతో పట్టుదల వదలకుండా విజృంభించారు. ధైర్యసమృద్ధితో, అతిశయించిన క్రూరత్వంతో సాహసం చూపుతూ వెనుదిరుగకుండా మహాపరాక్రమంతో నన్ను వెంటనే ప్రక్కకు

తోసివేశారు. అపుడు నాలో వేగం, విజృంభణ, పరాక్రమం పెనవేసికొని నేనూ విజృంభించాను. ఆ సైన్యం భయపడాలంటే నా సమీపానికి రాకుండా ఉండాలంటే అట్లా రక్తాన్ని నోటికి తాకించక తప్పలేదు.

విశేషం: క్రౌంచపదవృత్తంలో ప్రతిపాదానికీ భ, మ, స, భ, న, న, య గణాలుంటాయి. 1, 11, 19 అక్షరాలకు యతిమైత్రి, ప్రాస నియమం ఉన్నది.

వ. ఆ రెండు పనులకై యట్లు ద్రావుటగా నటించితిం గాని. 167

తాత్పర్యం: వారు భయపడాలి. నన్ను సమీపించకుండా ఉండాలి. ఆ రెండుపనులు సిద్ధించటంకొరకు అట్లా నెత్తురు తాగటంవలె నటించాను తప్ప (నిజంగా రక్తం దోసిలితో పట్టి త్రాగలేదని అర్థం). (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. అన్యజనముల శోణితమైనఁ ద్రావు। టధిక పాతకమని విందు ననుజ రక్త
మాన నేనంత వెఱ్ఱినె? యంతపాప। కర్ముఁడనె? తల్లి! యంత నిష్కరుణమతినె? 168

ప్రతిపదార్థం: తల్లి!= ఓ తల్లీ!; అన్యజనముల= ఇతరుల; శోణితమైనన్= రక్తమైనా; త్రావుట= త్రాగటం; అధిక= మిక్కిలి; పాతకము+అని= పాపమని; విందును= విన్నాను; అనుజరక్తము= తమ్ముడి రక్తాన్ని; ఆనన్= తాగటానికి; నేను; అంత వెఱ్ఱినె?= అంత పిచ్చివాడినా?; అంత; పాపకర్ముఁడనె= పాపిష్ఠివాడినా!; అంత; నిష్కరుణ= కరుణలేని; మతినె?= హృదయమున్నవాడినా?

తాత్పర్యం: అమ్మా! వేరే మనుష్యుల రక్తమైనా త్రాగటం మహాపాపమని విన్నాను. అట్లాంటప్పుడు తమ్ముడి రక్తాన్ని త్రాగటానికి నేనేమైనా వెఱ్ఱివాడినా! అంత పాపిష్ఠినా! లేదా అంత కరుణలేని హృదయమున్న వాడినా?'

వ. అనుటయు. 169

తాత్పర్యం: అని భీముడు చెప్పగా- (గాంధారి ఇట్లా అన్నది.)

తే. 'అంధులకు నూఁతకోలగా నకట! యొకని। నైన నిలుపక నూర్వుర నదయవృత్తి
మ్రింగి తందెవ్వఁ డేనియు మీకు నెగ్గు। లాచరింపని వాఁడు లేఁడయ్యెనయ్య? 170

ప్రతిపదార్థం: అంధులకున్= గుడ్డివారికి; ఊఁతకోలగాన్= ఊతకర్రగా; అకట!= అయ్యో! ఒకనినైనన్= ఒక్కడినికూడా; నిలుపక= మిగల్చకుండా; నూర్వురన్= నూరుమందినీ; అదయవృత్తిన్= కనికరం ఏ మాత్రంలేకుండా; మ్రింగితి(వి)= పొట్టనుబెట్టుకొన్నావు (చంపివేశావు); అందున్= ఆ నూరుమందిలో; ఎవ్వఁడు+ఏనియున్= కనీసం ఒక్కడైనా; మీకున్= మీ పాండవులకు; ఎగ్గులు= అపకారం; ఆచరింపనివాఁడు= చేయనివాడు; లేఁడయ్యెనయ్య?= లేకపోయాడా నాయనా!

తాత్పర్యం: 'అయ్యో! గ్రుడ్డివాళ్ళకు ఆసరాగా ఒక్కడినైనా మిగల్చకుండా నూరుమందినీ నీ పొట్టన పెట్టుకొన్నావే! ఎంత దయలేని వాడివయ్యా నీవు? ఆ వందమందిలో ఒక్కడైనా మీకు అపకారం చేయనివాడు లేకపోయాడా బాబూ!

క. ఒక్కరుని నీవు సంపక । తక్కిన నంతటనె ప్రతిన దప్పునె? విభవం
బెక్కఁగ మీయన్న నతం । డెక్కటి రాజ్యంబు సేయ నీఁడె కుమారా!' 171

ప్రతిపదార్థం: కుమారా!= నాయనా!; ఒక్కరిని= ఒక్కడిని; నీవు+చంపక= నీవు చంపకుండా; తక్కిన+అంతటనె= వదలి వేసినంత మాత్రంలో; ప్రతిన+తప్పునె?= నీ ప్రతిజ్ఞ తప్పిపోతుందా?; అతండు= ఆ వదలివేసిన ఒకడు; మీ అన్నను= ధర్మరాజును; విభవంబు+ఎక్కఁగన్= వైభవం అతిశయించగా; ఎక్కటి రాజ్యంబు= ఏకచ్ఛత్రాధిపత్యం; చేయన్+ఈఁడె= చేయనివ్వడా!

తాత్పర్యం: నాయనా! నీవు ఒక్కడిని చంపకుండా వదలివేసినంత మాత్రంలో నీ ప్రతిజ్ఞాభంగ మవుతుందా! ఆ ఒక్కడు మీ అన్న వైభవోపేతంగా ఈ రాజ్యాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలకుండా అడ్డుపడతాడా? (ఎందు కింత క్రూరంగా అందరినీ ఊచకోత కోశావు?).'

వ. అని పలికి ధర్మనందను దెస మనసు నిగుడం బుత్రపౌత్రవధసంపీడితస్వాంతయగు నగ్గాంధారి క్రోధ పరుషాక్షరంబుల 'నమ్మహారాజెచట నున్నవాఁ?' డనిన నా భూపతి భయకంపిత గాత్రుండగుచుం జేతులు మొగిచి సవినయంబుగా మెత్తని మాటల నిదె వచ్చితి దేవీ! యేను బాండవాగ్రజుండ ననుచుం జేరం బోయి. 172

ప్రతిపదార్థం: అని పలికి ఈ విధంగా అని; ధర్మనందను దెసన్= ధర్మరాజు దిక్కు; మనసు+నిగుడన్= మనసు పోగా; పుత్ర= కొడుకుల; పౌత్ర= మనుమల; వధ= వధచేత; సంపీడిత= మిక్కిలిగా పీడించబడిన; స్వాంత+అగు= మనసు కలిగిన; ఆ+గాంధారీదేవి; క్రోధ= కోపంతోను; పరుష= కాఠిన్యంతోనూ; (నిండిన) అక్షరంబులన్= అక్షరాలతో; ఆ+మహారాజు+ఎచటన్+ ఉన్నవాఁడు+అనినన్= ఆ మహారాజు ఎక్కడ ఉన్నాడు? అని అడుగగా; ఆ భూపతి= ఆ ధర్మరాజు; భయ= భయంచేత; కంపిత= వణకుతున్న; గాత్రుండు+అగుచున్= శరీరం కలిగినవాడై; చేతులు= చేతులను; మొగిచి= ముడిచి (నమస్కరించి); సవినయంబుగాన్= వినయంతో; మెత్తని మాటలన్= మెత్తని పలుకులతో; దేవీ!= ఓ తల్లీ!; ఇదె= ఇదిగో; ఏను= నేను; పాండవ+అగ్రజుండన్= ధర్మరాజును; వచ్చితిన్= వచ్చాను చూడు; అనుచున్= అంటూ; చేరన్+పోయి= ఆమెను సమీపించి.

తాత్పర్యం: అని గాంధారి అన్నది. అప్పుడు ఆమె మనసులో ధర్మరాజు మెదిలాడు. కొడుకులు, మనుమళ్ళు క్రూరంగా చంపబడ్డారన్న వ్యథతో మిక్కిలిగా పీడించబడిన మనస్సు కలిగిన ఆ గాంధారి కోపంతోనూ, కాఠిన్యం తోనూ నిండిన కరకు ధ్వనితో 'ఎక్కడ ఆ మహారాజు?' అని అడిగింది. ఆ మాట విని ధర్మరాజు భయపడిపోయాడు. గడగడ వణుకుతూ చేతులు ముడిచి నమస్కరించి వినయంతోనూ నెమ్మదిగా. 'అమ్మా! ఇదుగో నేను ధర్మరాజును వచ్చాను చూడుము' అంటూ ఆమెను సమీపించి - (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఇక్కడ గాంధారి ధర్మరాజుకు మహారాజు అనే విశేషం ప్రయోగించటం వాత్సల్యంతోకాదు. 'కసి'తో.

క. 'నీ పుత్రులఁ జంపించిన । పాపాత్మునిఁ గ్రూరచిత్తుఁ బరివాదార్హున్
శాపంబునఁ బొలియింపుము । భూపాలకవల్లభాభిపూజిత చరణా! 173

ప్రతిపదార్థం: భూపాలక= రాజుల; వల్లభా+అభిపూజిత= భార్యలచేత ఆరాధింపబడే; చరణా!= పాదాలు కలిగిన గాంధారీదేవీ!; నీ పుత్రులన్= నీ కుమారులను; చంపించిన= చంపించినటువంటి; పాపాత్ముని= పాపాత్ముడైనవాడూ; క్రూరచిత్తున్= క్రూరచిత్తుడైనవాడూ; పరివాదార్హున్= నిందకు తగినవాడూ (అయిన నన్ను); శాపంబునన్= శాపంతో; పొలియింపుము= వధించు (చంపుము).

తాత్పర్యం: 'నానా రాజుల భార్యలచేత ఆరాధింపబడే చరణసీమ కలిగిన ఓ మహారాణీ (గాంధారీదేవీ!) నీ కొడుకులను చంపించిన పాపాత్ముడను నేను. అతికఠిన చిత్తుడను నేను. నిందించటానికి అన్ని విధాలా తగినవాడిని. అట్లాంటి నన్ను నీ శాపంతో చంపివేయుము.

క. **ధరణింగల రాజులకుం । బరివారమ్మునకుఁ జావు పాటిల్లుటకై**
పరుషత గైకొన్న యుధి । ష్ఠిరు దారుణ దండ కలితుఁ జేయందగదే! 174

ప్రతిపదార్థం: ధరణిన్= భూమిలో; కల= ఉన్న; రాజులకున్= రాజులకు; పరివారమ్మునకున్= వారి పరివారానికి; చావు= మరణం; పాటిల్లుటకై= కలగటంకోసం; పరుషతన్= కాఠిన్యాన్ని; కైకొన్న= పొందిన; యుధిష్ఠిరున్= ఈ ధర్మరాజును; దారుణ= భయంకరమైన; దండ+కలితున్= దండన పొందినవానిగా; చేయన్+తగదే?= చేయదగదా?

తాత్పర్యం: ఈ భారతభూమిలోని రాజులు, వారి పరివారాలూ అందరూ మరణం పాలుకావటానికై అతి కఠినుడుగా మారిపోయిన ఈ ధర్మరాజుకు ఏదైనా దారుణమైన శిక్ష విధించవమ్మా!

మత్తకోకిల:

జీవమేటికి? రాజ్యమేటికిఁ జెల్లుఁ? జుట్టల బిడ్డలం
జావఁ జూచిన యట్టి ద్రోహికి సర్వభోగము లేటికిన్?'
నావుడున్ మఱుమాటలాడఁగ నాలుకాడక యుండి య
ద్దేవి యూర్పు నిగిడ్చె నుష్ణము దీర్ఘముం బరుషంబుగన్. 175

ప్రతిపదార్థం: చుట్టలన్= చుట్టాలను; బిడ్డలన్= పిల్లలనూ; చావన్+చూచిన= చనిపోయేలా చేసిన; అట్టి ద్రోహికిన్= అట్లాంటి ద్రోహబుద్ధి ఉన్నవాడికి; జీవము+ఏటికిన్?= ప్రాణం ఎందుకు?; రాజ్యము+ఏటికిన్+చెల్లున్?= రాజ్యపాలనాధికారం ఎందుకు?; సర్వభోగములు+ఏటికిన్?= ఈ భోగాలన్నీ ఎందుకు?; నావుడున్= అని ధర్మరాజు అనగా; మఱుమాటలు+ఆడఁగన్= మలిమాటలాడటానికి; నాలుక+ఆడక+ఉండి= నాలుకాడక అట్లాగే మౌనంగా ఉండి; ఆ+దేవి= గాంధారి; ఉష్ణమున్= వేడిగా; దీర్ఘమున్= పొడవుగా; పరుషంబుగన్= కఠినంగా (ఉన్న); ఊర్పున్= నిట్టూర్పును; నిగిడ్చెన్= వదలిపెట్టింది.

తాత్పర్యం: బంధువులను, కుమారులను చావజూసిన ద్రోహిని నేను. నేను ఇంకా ప్రాణాలతో ఎందు కుండాలి? నాకు రాజ్యం ఎందుకు? ఈ వైభవా లెందుకు?' అని ధర్మరాజు విలపించాడు. ఇది విని గాంధారి నోట మాటరాలేదు. వేడిగా పొడవుగా కరకుగా ఉన్న పెద్ద నిట్టూర్పును మాత్రం విడిచిపెట్టింది.

విశేషం: వేడి నిట్టూర్పు - లోపల ఉన్న పరితాపాన్ని సూచిస్తుంది. పొడవు నిట్టూర్పు - లోపల ఉన్న బాధతాలూకు ఆధిక్యాన్ని సూచిస్తుంది, కరకు నిట్టూర్పు - లోపల ఇంకా ఆమెకు వారిపై కోపం పోలేదని సూచిస్తుంది. సముచితంకాదని మాటలాడకుండా ఉండిపోయిందని అర్థం. వృత్తలక్షణానికి చూడండి. స్త్రీ. 1.21.

వ. ఇట్లు ధృతరాష్ట్ర మహిషి యతని యుచితవచనంబులు విని యూరక యుండె నతం డంజలిపుటంబు ఫాలంబున మోపి యానతుండయ్యెఁ బట్టావృతనయన యగు నప్పతివ్రత దృష్టి పట్టంబునంచు సందునం జని యజ్జనపతి పదనఖంబులం జెందిన నవి గందినం జూచి సవ్యసాచి జనార్దను వెనుకకుం జనియెం సమీర సుతుండును మాద్రీసుతులునుం దిరుగుడువడి రప్పుడు గాంధార రాజనందన క్రోధంబు దక్కి ధర్మపుత్రాదుల దెస మాతృభావం బలవడ సాంత్వనస్వరంబునం గుంతీసందర్శనంబు సేయరన్నా! యని పలికిన నప్పురుష సత్తములు చిత్తంబుల కలంక డిందువడ నందఱు నొక్కటఁ గుంతియున్న దెసకుఁ జన నక్కుంతిభోజనందన వారిం గలయం గనుంగొని. 176

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఆ ధృతరాష్ట్ర మహిషి= ఆ గాంధారి= అతని= ధర్మరాజుయొక్క; ఉచిత= సమంజసమైన; వచనంబులు విని= మాటలు విని; ఊరక+ఉండెన్= ఊరకే ఉండిపోయింది; అతండు= ఆ ధర్మరాజుకూడా; అంజలిపుటంబు= నమస్కరిస్తున్న చేతులను; ఫాలంబునన్+మోపి= నొసటన చేర్చి; ఆనతుండు+అయ్యెన్= వంగినవాడు అయ్యాడు; పట్ట+ఆవృత+ నయన+అగు= గుడ్డతో కప్పబడిన కనులు కలిగిన; ఆ+పతివ్రత= పతివ్రతఅయిన ఆ గాంధారీదేవీ; దృష్టి= చూపు; పట్టంబున్+అంచు= గుడ్డ అంచులోని; సందునన్+చని= సందులో దూరి; ఆ+జనపతి= ధర్మరాజుయొక్క; పదనఖంబులన్+ చెందినన్= కాలిగోళ్ళను తాకగా; అవి= ఆ వేళ్ళు; కందినన్= ఎర్రబడగా; చూచి; సవ్యసాచి= అర్జునుడు; జనార్దను= కృష్ణుడి; వెనుకకున్= వెనుకవైపుగా; చనియెన్= వెళ్ళి దాక్కున్నాడు; సమీర సుతుండును= భీముడూ; మాద్రీ సుతులున్= నకుల సహదేవులూ; తిరుగుడు+పడిరి= దూరంగా అటూ ఇటూ వెళ్ళిపోయారు; అప్పుడు= ఆ సమయంలో; గాంధార రాజనందన= గాంధారీదేవీ; క్రోధంబు+తక్కి= కోపం విడిచిపెట్టి; ధర్మపుత్రాదులదెసన్= పాండుకుమారుల పట్ల; మాతృభావంబు= తల్లిదనం; అలవడన్= ఏర్పడగా; సాంత్వన= ఓదార్పు కలిగించే; స్వరంబునన్= ధ్వనితో; కుంతీ సందర్శనంబు చేయరన్నా!= కుంతీదేవిని చూడండి నాయనలారా!; అని; పలికిన; ఆ+పురుషసత్తములు= ఆ పురుష శ్రేష్ఠులైన పాండవులు; చిత్తంబుల= మనసులోని; కలంక= శోకం; డిందు+పడన్= నశించగా; అందఱున్+ఒక్కటన్= అందరూ కలిసి; కుంతి+ఉన్న+దెసకున్= కుంతి ఉన్నచోటికి; చనన్= వెళ్ళగా; ఆ+కుంతిభోజ+నందన= ఆ కుంతిభోజుని కుమార్తె; వారిన్= వాళ్ళను; కలయన్+కనుంగొని= అందరినీ నెమ్మదిగా చూచి.

తాత్పర్యం: ఈ విధంగా ఆ గాంధారి ధర్మరాజు యొక్క సమంజసమైన మాటలు విని ఊరకే ఉండిపోయింది. ధర్మరాజు కూడా జోడించిన చేతులను పైకెత్తి నొసటనచేర్చి వినమితుడయ్యాడు. అప్పు డా గాంధారీదేవి చూపు కన్నులకు కట్టుకొన్న గుడ్డ అంచు సందులో నుండి దూరి ధర్మరాజు కాలి గోళ్ళను తాకినది. అప్పుడు ఆ వేళ్ళు వెంటనే ఎర్రబడ్డాయి. అది చూచి అర్జునుడు కృష్ణుడి వెనుకవైపుగా వెళ్ళి నిలబడ్డాడు. భీముడు, నకుల సహదేవులు కూడా తొట్రుపాటుతో అటూ ఇటూ పోయారు. ఆ సమయంలో గాంధారి కోపం విడిచిపెట్టి పాండు పుత్రులపట్ల మాతృభావాన్ని పొంది, ఓదార్పు కలిగించే స్వరంతో 'నాయనలారా! కుంతిని దర్శించుకోండి' అని చెప్పింది. ఆ మాటలు విని పాండవుల మనసులు కాస్త తేరుకొన్నాయి. శోకం తగ్గింది. అందరూ కలిసి కుంతి ఉన్నచోటికి వెళ్ళారు. అపుడు కుంతి వారినందరిని నెమ్మదిగా చూచి (ఇట్లా అన్నది). (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: కళ్ళకు కట్టుకున్న గంతసందులో నుండి చూస్తేనే ధర్మరాజు గోళ్ళు కమలిపోయాయంటే, ఇంక ఆమె గంతలులేక నేరుగా చూస్తే పాండవులందరూ భస్మీభూతులయిపోయి ఉండే వారని గ్రహించాలి. అదీ ఆ గాంధారి పాతివ్రత్యమహిమ.

పాండవులు కుంతీదేవి కడకు గాంధారి పంపునం బోవుట (సం. 11-15-9)

అంబురుహ వృత్తము

పెద్దయుఁగాలము వారలఁ జూడఁగఁ బ్రేముడించుచు దుర్భరా
పద్దశ నొందుట నమ్మహితాత్ముల పట్టులందఱుఁ ద్రుంగుటం
దద్దయు శోకమునం బొరి నశ్రులధార లొల్క వగర్పుతో
నద్దురవస్థ తెఱంగు గనుంగొని యంతకంటెను నార్తు లై. 177

ప్రతిపదార్థం: పెద్దయున్+కాలము= చాలా కాలంగా; వారలన్= పాండవులను; చూడఁగన్= చూడాలని; ప్రేముడించుచున్= కోరుకుంటూ; దుర్భర+ఆపద్+దశన్= భరించటానికి వీలుకాని విపత్పరిస్థితిని; ఒందుటన్= పొందటంవలన; ఆ+మహితాత్ముల= పాండవుల; పట్టులు+అందఱున్= కుమారులంతా; త్రుంగుటన్= చనిపోవటంవలన; తద్దయున్= మిక్కిలి; శోకమునన్= దుఃఖంతో; పొరిన్= ఎడతెగకుండా; అశ్రులధారలు+ఒల్కన్= కళ్ళలో నీళ్ళు కారుతుండగా; వగర్పుతోన్= నిట్టూర్పులతో (ఉన్న); ఆ+దురవస్థన్= ఆ కుంతి పడుతున్న బాధను; కనుంగొని= చూసి (పాండవులు); అంతకంటెన్= ఆమెకంటె; ఆర్తులై= బాధపడుతున్న వారై.

తాత్పర్యం: పాండవులను చూడాలని చాలాకాలం నుండి కోరుకొంటున్న కుంతీదేవి వారిని చూచి, వాళ్ళు పడ్డ దారుణమైన కష్టాలను తలచుకొని, అభిమన్యుడు, ఘటోత్కచుడు, ఉపపాండవులు మొదలైన పాండుపుత్రుల కొడుకులందరూ చనిపోయిన వైనాన్ని గుర్తుతెచ్చుకొని, మహాదుఃఖంలో మునిగిపోయింది. ఆమె కళ్ళవెంబడి నీరు ధారగా కారుతుండగా, వేడి నిట్టూర్పులు విడుస్తూ బాధపడుతుండగా, ఆమె దురవస్థ చూచి పాండవులు ఆమెకంటె దీనులు అయి - (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అంబురుహవృత్తంలో ప్రతిపాదానికి భ, భ, భ, భ, ర, స, వ అనే గణాలుంటాయి. 1 - 13 అక్షరాలకు యతిమైత్రి.

వ. చరణంబులు దొట్రిల్లం జని తచ్చరణంబుల మీఁద వ్రాలి. 178

ప్రతిపదార్థం: చరణంబులు= కాళ్ళు; తొట్రిల్లన్= తడబడగా; చని= వెళ్ళి; తద్+చరణంబులమీఁదన్= ఆమె కాళ్ళపై; వ్రాలి= పడి.

తాత్పర్యం: ఆమె బాధ చూచి వీళ్ళూ చలించిపోయారు. తడబడుతున్న కాళ్ళతో వెళ్ళి ఆమె పాదాలపై అందరూ పడి నమస్కరించి.

తే. ఏడ్వ నందఱపైఁ జేతు లిడుచుఁ బెలుచ । నేడ్చి యద్దేవి వారల నెత్తి వేఱు
వేఱ మేనులు నివురుచు వివిధ దారు । ణాస్త్ర శస్త్రవ్రణ ప్రచయములు గాంచి. 179

ప్రతిపదార్థం: ఏడ్వన్= ఏడుస్తుండగా; అందఱపైన్= అందరిమీదా; చేతులు+ఇడుచున్= చేతులు ఉంచుతూ; పెలుచన్= మిక్కిలిగా; ఏడ్చి= ఆమెకూడా ఏడ్చి; ఆ+దేవి= ఆ కుంతీదేవి; వారలన్+ఎత్తి= వారినిపైకి తీసి; వేఱువేఱ= వేరువేరుగా ప్రతి ఒక్కరి; మేనులు= శరీరాలను; నివురుచున్= నిమురుతూ; వివిధ= నానావిధాలైన; దారుణ+అస్త్ర+శస్త్ర= భయంకరమైన అస్త్రాలచేత శస్త్రాలచేత (ఏర్పడిన); వ్రణ= గాయాల; ప్రచయములు= సముదాయాన్ని; కాంచి= చూచి.

తాత్పర్యం: అందరూ ఏడుస్తుండగా అందరిమీద చేతులు ఉంచి, కుంతికూడా కుమిలి ఏడ్చింది. వారిని ఒక్కొక్కరిని పైకి లేపి, వారి శరీరాలను నిమిరింది. వారి దేహాలలో నానావిధ శస్త్రాలచేత, అస్త్రాలచేత ఏర్పడిన గాయాలను చూచి- (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: శస్త్రం - బాహుబలంతో మాత్రమే ప్రయోగించేది. ఉదాహరణకు 'గద'. దీనికి మంత్ర ప్రయోగం ఉండదు. 'అస్త్రం' మంత్రంతో కూడి ప్రయోగించేది - ఉదాహరణకు ఆగ్నేయాస్త్రం. గాయాలు రెండింటివలన కావచ్చును. కన్నతల్లి కాబట్టి ఆమె వారి గాయాలను చూచింది. వారు పడ్డ కష్టాలకు ఆమె ప్రత్యక్ష సాక్షి. మీదు మిక్కిలి భాగస్వామిని కూడా. తల్లి అనురాగం ఎంత గాఢమైనదో ఈ పద్యం ద్వారా తెలిసికొనవచ్చును. ధర్మరాజాదులు తమ తల్లి అయిన కుంతికంటె ముందు గాంధారిని చూడటం విశేషం.

క. **'అచ్చోటు లంటి చూచుచు । వెచ్చని యూర్పులు నిగుడ్చు వేఁగుచుఁ బొగులుం**
గ్రుచ్చి కవుంగిటఁ జేర్చును । 'వచ్చితిరే! నృపకుమారవరులార!' యనున్. **180**

ప్రతిపదార్థం: అచ్చోటులు+అంటిచూచుచున్= ఆ గాయాలు అయిన చోట్లను తాకి చూస్తూ; వెచ్చని= వేడి; ఊర్పులు= నిట్టూర్పులు; నిగుడ్చున్= వదలిపెడుతూ; వేఁగుచున్= పరితాపంతో కాలిపోతూ; పొగులున్= ఏడుస్తుంది; గ్రుచ్చి= పట్టుకొని; కవుంగిటన్+చేర్చును= కౌగిలిలోకి చేర్చుకొంటుంది; నృపకుమార వరులార!= రాజకుమార శ్రేష్ఠులారా!; వచ్చితిరే!= వచ్చారా నాయనా!; అనున్= అంటుంది.

తాత్పర్యం: ఆ గాయాలు అయినచోట్లను తాకి చూస్తూ వేడి నిట్టూర్పులు విడుస్తూ పరితాపంతో కుమిలిపోతూ ఏడ్చింది. వారిని పట్టుకొని కౌగిలించుకొని 'నాయనలారా! వచ్చారా!' (ఇంతకాలానికి) అని అన్నది.

సీ. **ఆ సమయంబున నప్పాండుభూపాల । పత్నికి శోకాగ్ని ప్రజ్వరిల్లఁ**
దత్సమీపమునకు ద్రౌపది విన్నని । మోముపైఁ గన్నీరు ముసుఁగువడఁగఁ
బదముల నట దొట్రుపాటు వాటిల్లంగ । దైన్య మాకారంబు దాల్చినట్టి
తెఱఁగునఁ జనుదెంచి 'దేవి! సౌభద్రాదు ।లైన నీ మనుమ లెం దరిగి? రెంత
తే. **యేనిఁ గాలంబు నినుఁ జూడ రిప్ప డిచటి । కేలరా?' రంచు నడుగుల మ్రోల నేల**
వ్రాలె వికలాంగియై తెంచివైవ నెండ । దాఁకి వందిత తీఁగ చందంబు దోఁప. **181**

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అప్పుడు; ఆ+పాండు భూపాల పత్నికిన్= పాండుమహారాజు భార్య అయిన కుంతీదేవికి; శోక+అగ్ని= శోకమనే అగ్ని; ప్రజ్వరిల్లన్= అతిశయించి మండగా; తద్+సమీపమునకున్= ఆమె దగ్గరకు; ద్రౌపది; విన్నని= పాలిపోయిన; మోముపైన్= ముఖంమీద; కన్నీరు= కంటినీరు; ముసుఁగు+పడఁగన్= కప్పివేయగా; పదములన్+అట= ఆమె నడకలో; తొట్రుపాటు= తడబాటు; వాటిల్లంగన్= కలుగగా; దైన్యము= దీనత్వం; ఆకారంబు+తాల్చినట్టి= ఆకారం ధరించిన; తెఱఁగునన్+చనుదెంచి= విధంగా వచ్చి; దేవి!= అమ్మా!; సౌభద్రాదులైన= అభిమన్యుడు మొదలైన; నీ మనమలు= నీ మనవళ్ళు; ఎందు+అరిగిరి?= ఎక్కడికి వెళ్ళారు?; ఎంత+ఏనిన్+కాలంబు= ఎంత కాలం గడిచినా; నినున్+చూడరు= నిన్ను చూడలేదు; ఇప్పుడు; ఇచటికిన్= ఇక్కడికి; ఏలరారు?= ఎందుకని రారు?; అంచున్= అంటూ; అడుగుల మ్రోలన్= కుంతి పాదాల సమీపంలో; వికలాంగి+ఐ= విచ్ఛేదంపొందిన అవయవాలు కలిగినదై; తెంచివైవన్= తెంచివేయగా; ఎండ+తాఁకి=

ఎండతాకిడికి; వందిన= వాడిపోయిన; తీఁగ చందంబు= తీగ విధం; తోఁపన్= అగుపించగా; నేలన్= నేలమీద; వ్రాలెన్= కూలిపోయింది.

తాత్పర్యం: అప్పుడు కుంతీదేవికి శోకాగ్ని అతిశయించి మండటం మొదలుపెట్టింది. ఆమె దగ్గరకు ద్రౌపది పాలిపోయిన ముఖంమీద కన్నీరు తెరలుకట్టగా, తడబడుతున్న నడకతో జీవచ్ఛవంవలె దైన్యం ఆకారం దాల్చిన విధంగా వచ్చి 'అమ్మా! అభిమన్యుడు మొదలైన నీ మనవళ్ళు ఎక్కడా కనిపించరే. ఎక్కడికి వెళ్ళారు? ఇన్ని రోజులైనా నిన్ను చూడటానికి రా రెందుకు?' అని పిచ్చిదానివలె మాట్లాడుతూ కుంతి పాదాల సమీపంలో కుప్పకూలిపోయింది. కొమ్మనుండి తెంచివేయగా పైగా ఎండ తాకి వాడిపోయి నిర్జీవమైపోయిన తీగవలె ఆ ద్రౌపది కనిపించగా.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, ఉపమ.

వ. ఇట్లు మేదినింబడి రోదనంబు సేయు నయ్యుగ్మలి మీఁద నొఱగి తానునుం బెద్ద యెలుంగున నేడ్చి గ్రుచ్చి యెత్తి యక్కునం జేర్చి యూరార్చి యత్తన్వియుం దనయులుం దోడన చనుదేరఁ గుంతి గాంధారి కడకుం జనియె నప్పుడు ద్రౌపది యా ధృతరాష్ట్ర పత్ని పాదంబులకు మ్రొక్కి యడలున వెక్కుచున్న నద్దేవి యమ్ముద్దియ నుద్దేశించి. 182

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మేదినన్+పడి= నేలమీద పడి; రోదనంబు+చేయు= ఏడుస్తున్న; ఆ+యుగ్మలిమీఁదన్= ఆస్త్రీ (ద్రౌపది)మీద; ఒఱగి= ఒరిగిపోయి; తానునున్= కుంతి తానుకూడా; పెద్ద+ఎలుంగునన్= పెద్ద గొంతుకతో; ఏడ్చి; గ్రుచ్చి+ఎత్తి= పట్టుకొని ఎత్తి; అక్కునన్+చేర్చి= రొమ్మున చేర్చుకొని; ఊరార్చి= ఓదార్చి; ఆ+తన్వియున్= ఆ ద్రౌపదీ; తనయులున్= తన కుమారులూ; తోడన్= తోడుగా; చనుదేరన్= రాగా; కుంతి; గాంధారి కడకున్= గాంధారి దగ్గరకు; చనియెన్= వెళ్ళినది; అప్పుడు= ఆ సమయంలో; ద్రౌపది; ఆ+ధృతరాష్ట్ర+పత్ని= గాంధారి; పాదంబులకున్= కాళ్ళకు; మ్రొక్కి= మొక్కి; అడలునన్= దుఃఖంతో; వెక్కుచున్+ఉన్నన్= వెక్కిళ్ళు పెడుతుండగా; ఆ+దేవి= ఆ గాంధారి; ఆ+ముద్దియన్= ద్రౌపదిని; ఉద్దేశించి= చూచి (వైపు తిరిగి).

తాత్పర్యం: ఈ విధంగా నేలమీద పడి ఏడుస్తున్న ద్రౌపది మీద కుంతి ఒరిగిపోయి తానుకూడా పెద్దగా ఏడ్చింది. ఆమెను పట్టుకొని ఎత్తి కౌగిలించుకొని ఓదార్చి, కొడుకులు, ద్రౌపది వెంట రాగా కుంతి గాంధారి దగ్గరికి వెళ్ళింది. అప్పుడు ద్రౌపది గాంధారి కాళ్ళకు నమస్కరించి వెక్కిళ్ళుపెడుతూ ఏడుస్తుండగా గాంధారి ఆమెవైపు తిరిగి ఇట్లా అన్నది.

మత్తకోకిల:

'పుత్రి! యిట్లగు నమ్మ? శోకముఁ బొంది కుందుచు నున్న నీ
గాత్ర మొండొక కీడు పాటిలి కందుఁ బాండుతనూభవుల్
పుత్రవర్గము గన్నచో నెద భూరితాపముఁ బొందుడుం
బౌత్ర హీనతఁ బడ్డ గొంతికిఁ బాయనేర్చునె నెవ్వగల్? 183

ప్రతిపదార్థం: పుత్రి!= అమ్మాయీ!; ఇట్లు+అగునమ్మ?= ఇట్లా చేస్తే అవుతుందా?; శోకమున్+పొంది= దుఃఖాన్ని పొంది; కుందుచున్+ఉన్నన్= కుంగిపోతే; నీ గాత్రము= నీ శరీరం; ఒండొక కీడు= ఏదో ఒక అపాయం; పాటిలి= కలిగి; కందున్= తపిస్తుంది; పాండుతనూభవుల్= మరి పాండవులు; పుత్ర వర్గమున్+కన్నచోన్= మరణించిన కుమారులను తలచుకొంటే; భూరితాపమున్+పొందుడున్= మహావేదనను పొందగా; పౌత్రహీనతన్= మనుమళ్ళ మరణం అనే దుఃఖంలో; పడ్డ= పడిన; గొంతికిన్= కుంతీదేవికి; నెవ్వగల్= నిండుశోకాలు; పాయనేర్చునె?= వదులుతాయా?

తాత్పర్యం: 'అమ్మాయీ! ఇట్లా బాధపడితే అవుతుందా! నీ విట్లా క్రుంగిపోతే తప్పకుండా ఏదో ఒక అపాయం జరుగుతుంది. మరి పాండవులకు మాత్రం వారి కుమారులను తలచుకొంటే శోకం కలగటంలేదా? మనవళ్ళు పోగా కుంతికి మాత్రం దుఃఖం లేదా?

విశేషం: వృత్తలక్షణానికి చూడండి - స్త్రీ. 1. 21.

క. నిను నే నిట్టూరార్చెద । నను నీ వూరార్ప వలదె? నా నీ తెఱఁగుల్
విను మొక్కరూప మన కే । మనఁగలదు విధాత క్రూరుఁడై పఱుపంగన్? 184

ప్రతిపదార్థం: నినున్= నిన్ను; నేను= నేను; ఇట్టు= ఇలా; ఊరార్చెదన్= ఓదారుస్తాను; ననున్= నన్ను; నీవు= నీవు; ఊరార్పవలదె?= ఓదార్పవద్దా?; వినుము= ఒక విషయం చెబుతాను వినుము; నా, నీ, తెఱఁగుల్= నా బదుకు నీ బదుకు; ఒక్కరూప= ఒకేవిధమైనవి; మనకున్= మనపట్ల; విధాత= బ్రహ్మ; క్రూరుఁడు+ఐ= కఠినుడై; పఱుపంగన్= బాధింపగా; ఏమనగలదు= ఏమనగలము?

తాత్పర్యం: నేను ని న్నెట్లా ఓదారుస్తున్నానో నన్ను నీవూ అట్లాగే ఓదార్చుము. మరొక విషయం వినుము. నీ జీవితమూ నా జీవితమూ ఒకే విధంగా ఉన్నాయి. (నేనూ కొడుకులను పోగొట్టుకున్నాను, నీవూ కొడుకులను కోల్పోయావు). మన విషయంలో విధి చాలా క్రూరంగా వ్యవహరించింది. దీన్ని ఏమనగలము చెప్పుము?

ప్రహరణకలిత వృత్తము:

ఇది యిటులగు ట ట్లెఱిఁగి పలికె నా । విదురుండు సభఁ గోవిదులు వొగడఁగా
నది వినియును నే నడఁపన దురితం । బొదవెఁ గలఁక సే టొలయ కుడుగునే? 185

ప్రతిపదార్థం: ఇది; ఇటులు+అగుట+అట్లు= ఇలా జరగబోయేటట్లుగా; ఎఱిఁగి= తెలిసి; ఆ సభన్= ఆ సభలో; కోవిదులు= పండితులు; పొగడఁగాన్= ప్రశంసించగా; ఆ విదురుండు= ఆ మహాత్ముడైన విదురుడు; పలికెన్= (ఆనాడే) చెప్పాడు; అది వినియును= అదంతా వినికూడా; దురితంబు= ఆ దుర్మార్గాన్ని; నేను అడఁపన= అణచలేదు (అణచిన దాన్ని కాను); కలఁక= సంక్షోభం; ఒదవెన్= ఏర్పడింది; చేటు= కీడు; ఒలయక= తగులకుండా; ఉడుగునే?= తప్పుతుందా?

తాత్పర్యం: ఇది ఇట్లా అవుతుందని తెలిసి, ఆనాడే సభలో విదురుడు పెద్దవారంతా ప్రశంసిస్తుండగా ఎంతగానో చెప్పాడు. అదంతా విని కూడా నా కుమారుల దుర్మార్గాన్ని నేను ఆపలేకపోయాను. అందుకే ఈ సంక్షోభం ఏర్పడింది. ఏనాటికైనా కీడు తగలకుండా ఉంటుందా!

విశేషం: ప్రహరణకలితవృత్తంలో ప్రతిపాదానికీ న, న, భ, న, ల, గ - అనే గణాలుంటాయి. 1 - 8 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

వ. ఇట్లనియెదం గాక నా చేతఁబోవునే యెవ్వరు నేమి సేయుదురు కాలవశంబున నవశ్యభావియైనది యయ్యె నుపశమింపు 'మని పలికెనని యిట్లు పాండవులు ధృతరాష్ట్రుని గాంధారిని ననునయించిన తెఱంగెఱింగించిన నా భంగి నుపశమితక్రోధయైన గాంధారరాజనందన పదంపడి యెవ్విధంబున వర్తించె? ధర్మతనయు ననంతర వర్తనం బెప్పాటఁ జెల్లె?నని యడుగుటయును. 186

ప్రతిపదార్థం: ఇట్లు= ఇలా; అనియెదన్‌గాక= అంటాను కాని; నా చేతన్+పోవునే?= దీన్ని ఆపడం నా సాధ్యమా?; ఎవ్వరున్+ ఏమి+చేయుదురు?= ఎవరైనా ఏం చేస్తారు?; కాలవశంబునన్= కాలానికి లోబడి; అవశ్యభావి+ఐనది= తప్పకుండా ఏది జరగాలో అది; అయ్యెన్= అయిపోయింది; ఉపశమింపుము= ప్రశాంతంగా ఉండుము; అని; పలికెన్= చెప్పింది; అని; ఇట్లు= ఈ విధంగా; పాండవులు; ధృతరాష్ట్రుని గాంధారిని= ధృతరాష్ట్ర గాంధారులను; అనునయించిన= ఓదార్చిన; తెఱంగు+ ఎఱింగించినన్= విధం తెలుపగా; ఆ భంగిన్= అలా; ఉపశమిత= ఉపశమించిన; క్రోధ+ఐన= కోపం కలిగిన; గాంధార రాజనందన= గాంధారీదేవి; పదంపడి= ఆ తరువాత; ఏ+విధంబునన్= ఏ విధంగా; వర్తించెన్?= నడుచుకొంది? (ఏం చేసింది?); ధర్మతనయున్= ధర్మరాజుయొక్క; అనంతరవర్తనంబు= తరువాతి ప్రవర్తన; ఏ+పాటన్= ఏ విధంగా; చెల్లెన్?= జరిగాయి? (ఏం చేశాడు?); అని; అడుగుటయున్= అడుగగా.

తాత్పర్యం: ఇట్లా అంటాను కాని నేను మాత్రం దీనిని ఆపగలిగిన దానినా? ఎవరు మాత్రం ఏమి చేయగలరు? కాలధర్మానికి లోబడి ఏది ఎట్లా జరగాలో అట్లా జరిగిపోయింది. నీవు ఇకనైనా ప్రశాంతంగా ఉండుము' అని చెప్పినది. ఇదే విధంగా పాండవులు ధృతరాష్ట్రుడిని గాంధారిని ఓదార్చారు. ఈ విషయాన్ని చెప్పగా అట్లా ప్రశాంతిపొందిన కోపంకలిగిన ఆ గాంధారి తరువాత ఏం చేసింది? ధర్మరాజు తరువాత ఏమేం చేశాడు?' అని జనమేజయుడు అడిగాడు.

ఆశ్వాసాంతము

శిఖరిణీవృత్తము:

తపస్స్వాధ్యాయాది క్షపిత మలచిత్తప్రకలితా। విపజ్జాలజ్వాలావిరమణ సుధావృష్టిలలితా!
జపాపుష్ప క్షీరచ్ఛవికిరణ సంసర్జనధురా!। సపర్యానిర్వాహప్రచుర కలన స్థైర్య మధురా! 187

ప్రతిపదార్థం: తపస్= తపస్సుచేత; స్వాధ్యాయ= వేదాధ్యయనంచేత; క్షపిత= తొలగించబడిన; మల= కల్మషమున్న; చిత్త= మనస్సులచేత; ప్రకలితా!= చక్కగా భావించబడేటటువంటి స్వామీ!; విపద్+జాల= ఆపదల సమూహాలు అనేటువంటి; జ్వాలా= మంటల; విరమణ= ఆరిపోవటానికి; సుధావృష్టి= అమృతాన్ని వర్షించే; లలితా!= మధుర స్వరూపుడైన ఓ హరిహరనాథా!; జపాపుష్ప= దాసాని పూవుయొక్క; క్షీర= పాలయొక్క; ఛవి= కాంతి ఉన్న; కిరణ= కాంతుల; సంసర్జన= కలయికచేత; ధురా!= బరువైన ఓ స్వామీ!; సపర్యా నిర్వాహ= నీకైంకర్యాన్ని నిర్వహించే (భక్తులలో); ప్రచురకలన= మిక్కిలిగా ఏర్పడే; స్థైర్య= స్థిరత్వంచేత; మధురా!= ఆనంద స్వరూపంగా అనుభూతమయ్యే స్వామీ! (నీకు నమస్కారం).

తాత్పర్యం: ఓ హరిహరనాథస్వామీ! నీవు తపస్సుచేత, వేదాధ్యయనంచేత పరిశుద్ధ మనస్సులు కలవారిచేత చక్కగా భావించబడతావు. ఆపదలనే మంటలు ఆరిపోవటానికి నీ దయామృతమనే వర్షాన్ని కురిపిస్తావు. దాసానిపూవువలె ఎర్రగా, పాలవలె తెల్లగా ఉన్న నీ అరుణశ్వేతకాంతి చాలా మనోహరమైనది. భక్తులు తమతమ కైంకర్యాలతో స్థిరంగా నిన్ను హృదయాలలో పదిలపరచుకొని మధురమైన అద్వైతానందానుభవాన్ని పొందుతారు. అట్లాంటి నీకు నమస్కారము.

విశేషం: అలం: రూపకం, ఉపమ. 'తపస్సు' అనేమాటకు చాంద్రాయణాది వ్రతాలు చేయటం అని ఒక అర్థమున్నది. మనస్సును, ఇంద్రియాలను ఏకాగ్రతలో చేర్చటమనే మరి ఒక అర్థముంది. వీటిచేత మనస్సు పవిత్రమవుతుందని వైదిక సంప్రదాయం చెప్పుతున్నది.

సాధారణంగా హరి నల్లటివాడని; హరుడు తెల్లటివాడని పురాణ ప్రసిద్ధం. కాని తంత్రగ్రంథాలలో శివుడు - శుక్ల వర్ణుడుగా; దేవీ - అరుణ వర్ణగా చెప్పబడ్డారు. కనుక మహేశ్వర సంబంధమైన ప్రాణశక్తి ఎరుపు. తెలుపు వర్ణాలను రెండింటిని కలిగినదని అర్థం.

"వందే గురుపద ద్వంద్వ మవాఙ్మానస గోచరమ్
రక్త శుక్ల ప్రభామిశ్ర మతర్క్యం త్రైపురం నమః"

అని తంత్ర గ్రంథ వచనం. తర్కించటానికి వీలులేని, త్రిపుర సంబంధం కలిగిన గురుపద ద్వంద్వం వాక్కుకు మనస్సుకు అతీతమైనది. అందులో రక్త శుక్ల కాంతులు రెండూ కలిసి ఉన్నాయట.

విష్ణు సహస్రనామంలో 'విక్షరో రోహితో మార్గః' (58) అనీ, 'సువర్ణ వర్ణో హేమాంగః' (93) అనీ - రెండు విధాలుగా చెప్పటం గమనిస్తే విష్ణువు అరుణవర్ణుడని, సువర్ణవర్ణుడని తెలుస్తున్నది.

భగవంతుడి ఆరాధనచేత భక్తి స్థిరమవుతుంది. 'ఓర్పు' దీని లక్షణం. దీనితో కలిగేది 'తృప్తి'. దీన్నే ఆనందంగా తిక్కనగారు పేర్కొన్నారు.

శిఖరిణీవృత్తంలో ప్రతిపాదానికీ య, మ, న, స, భ, వ అనే గణాలుంటాయి. 1-13 అక్షరాకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

క. సాత్యవతేయాది మహా । మత్యవగమ్య ప్రకార! మధుర విలాసా!
సత్యత్వానంతత్వ ని । రత్యయ శుభసారమయ సమగ్రవికాసా! 188

ప్రతిపదార్థం: సాత్యవతేయ= సత్యవతి కుమారుడైన వ్యాసమహర్షి; ఆది= మొదలైన; మహామతి= గొప్ప మనీషులచేత; అవగమ్య= తెలియదగిన; ప్రకార= విధం కలిగినవాడా!; మధుర విలాసా!= హృద్యమైన లీలా విశేషాలు కలిగినవాడా!; సత్యత్వ= నిత్య భావంచేత; అనంతత్వ= అనంతత్వంచేత; నిరత్యయ= నశించని; శుభసారమయ= కల్యాణ రూపమైన; సమగ్ర వికాసా!= సంపూర్ణ అవతార స్వరూపుడా!

తాత్పర్యం: స్వామీ! నీ అసలు రూపాన్ని వ్యాసాది మహర్షులు మాత్రమే తెలిసికొనగలరు. నీ విలాసాలు అతి మధురాలు. నీ సంపూర్ణ స్వరూపం సత్యమైనది. అనంతమైనది. శాశ్వతమైనది. కల్యాణప్రదమైనది.

విశేషం: ఆలోచన, చేష్ట, విభూతి - ఈ మూటినీ ఇక్కడ 'ప్రకార' శబ్దంచేత మనం అర్థం చేసికొనవచ్చును. 'వికాస' శబ్దానికి అవతారమని అర్థం చెప్పాలి. 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' మనే ఆర్యోక్తిని 'సత్యం శివం సుందరం' అనే సూక్తిని ఈ సందర్భంలో స్మరించవచ్చును.

హరిహర స్వరూపాన్ని గుర్తించటం ఎరుక సమగ్రమైన దనటానికి నిదర్శనం. అందుకే 'సమగ్ర వికాసా!' అని సంబోధించటం.

మాలిని:

సదసదనభిషిక్తా! సంభృతానందభక్తా! । విదళిత దురితాలీ! విశ్వనిర్వాహ శాలీ!
మదవదసురభేదీ! మానసానుప్రమోదీ! । వదనజనితవిప్రా వైభవానంద దీప్రా! **189**

ప్రతిపదార్థం: సత్+అసత్+అనభిషిక్తా!= 'సత్'రూపంలోకాని, 'అసత్' రూపంలోకాని అభిషేకం పొందనివాడా!; సంభృత+ఆనంద+ భక్తా!= ఆనందంతో నిండిన భక్తులు కలవాడా!; విదళిత= నశింపచేయబడిన; దురిత+ఆలీ!= పాపసముదాయం కలిగినవాడా!; విశ్వప్రపంచాన్ని; నిర్వాహశాలీ!= నిర్వహించేవాడా!; మదవత్+అసురభేదీ!= మదంతో కూడిన రాక్షసులను చంపేవాడా!; మానస+అనుప్రమోదీ!= ఆయాప్రాణుల చిత్త సంస్కారాన్నిబట్టి దానికి తగిన సంతోషాన్ని కలిగించేవాడా!; వదన జనిత విప్రా! ముఖం నుండి పుట్టిన బ్రాహ్మణులను కలవాడా!; వైభవ+ఆనంద దీప్రా!= ప్రభు సంబంధమైన ఆనందంతో ప్రకాశించేవాడా! (నీకు నమస్కారం).

తాత్పర్యం: హరిహరనాథస్వామీ! నీ రూపం సదసత్తులకు భిన్నమైనది, విలక్షణ మైనది. నిన్ను తలచే భక్తుల హృదయాలు సదా ఆనందంతో నిండి ఉంటాయి. నీవు వారి పాపాలను పటాపంచలు చేస్తావు. ప్రపంచంలో దేనిని ఎట్లా నిర్వహించాలో నీవు సమర్థంగా తెలిసినవాడవు. ధర్మహాని కలిగించే రాక్షసులను సంహరించి సాధుజన సంరక్షణ చేసేవాడవు. విజ్ఞాన స్వరూపులైన బ్రాహ్మణులు నీ ముఖం నుండే పుట్టారు. నీవు సర్వభువన నిర్వహణ రూపమైన ప్రభుత్వంతో మహానందరూపంతో ప్రకాశిస్తావు.

విశేషం: ఈ పద్యంలోని ప్రతి మాటా చాలా బరువైన అర్థాన్ని తెలుపుతుంది

సత్ - అని నేల, భూమి, అగ్ని, వాయువు మొదలైన ఇంద్రియాల అనుభవాలకు లోనయ్యే పదార్థ జగత్తును పిలుస్తాము. (అస్తి)

అసత్ - అంటే 'సత్తు' కానిది. ఇంద్రియానుభవాలకు అతీతమైన మనోబుద్ధ్యహంకారాదులన్నీ అసత్తులే (నాస్తి)

భగవంతుడి తత్త్వం 'ఆత్మ' పదార్థం- ఇది ఇంద్రియాలలాగా 'సత్తు' కాదు; మనోబుద్ధులవలె 'అసత్తు' కాదు. క్షీణతలేనిది. స్థిరమైనది. పరిణామానికి అతీతమైనది. కాబట్టి 'బ్రహ్మ' మన్నారు.

అనాదిమత్పరం బ్రహ్మ న 'సత్' తత్, 'నాసత్' ఉచ్యతే అని భగవద్గీత (13-13) - ఆ బ్రహ్మ పదార్థం సదసత్తులకు అతీతమైనదని వివరించింది.

'సంభృత' - అంటే నిండిన అని అర్థం. భక్తుడిలో భాగవతానందం తప్ప మరి ఒకటి ఉండదు. అందుకే ప్రహ్లాదాది భక్తులు భక్తి మాధుర్య పారవశ్యంలో భగవంతుడిని స్తుతించారు.

'దురితం' అంటే పాపం - ఎన్ని పాపాలు చేసినా భగవంతుడు భక్తుడైనవాడిని క్షమించి వాడి పాపాలు తొలగిస్తాడు - అన్ని పురాణాలు ఘోషించాయి. ఎంత దురాచారుడైనా నన్ను భజిస్తే సాధువు అవుతాడని భగవద్గీత స్పష్టంగా చెప్పింది. (గీత 9-30)

'విశ్వనిర్వహణం' అంటే సృష్టి స్థితి లయాలను కలుగచేయటమని అర్థం. ఎవరిని ఎట్లా పుట్టించి, పెంచి, తెంచాలో తెలిసి అట్లా చేయటమే విశ్వనిర్వహణం. అందుకే భగవంతుడిని లోకస్రష్ట అని, లోకపాలుడని, లోకాధిపతి అని, సర్వేశ్వరుడని ఉపనిషత్తులు ప్రశంసించాయి.

భగవద్గీతలో ఈ నిర్వహణను ఐంద్రజాలికుడు జంతువు బొమ్మను ఆడించిన విధంగా ఈశ్వరుడు ఈ మానవుడిని ఆడిస్తున్నాడని క్రింది శ్లోకం చెప్తుతుంది.

"ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా." (గీత 18-61)

'మదవత్' - అంటే మదం కలిగిన అని అర్థం. అసురులు విశృంఖలంగా సాధువులను హింసించి ధర్మగ్లాని కలుగచేయగా భగవంతుడు సాధువులను కాపాడి దుర్మార్గులను సంహరించి ధర్మసంస్థాపన చేయటం కొరకు పుడతాడని గీత స్పష్టంగా చెప్తుతున్నది.

"పరిత్రాణాయ సాధూనాం । వినాశాయ చ దుష్కృతాం'
ధర్మసంస్థాపనార్థాయ । సంభవామి యుగే యుగే." (గీత 4-8)

'మానస+అను+ప్రమోదీ' - ఎవరెవరి మనసు ఎట్లా ఉంటే అట్లాంటి సంతోషం అనుభవంలోకి వస్తుంది. అట్లా అనుభవంలోకి వచ్చేటట్లు చేసేవాడు పరమాత్మే. అందుచేత ఆ ఆనందానుభవం కూడా ఆయా దేహాలలో ఆవరించి ఉన్న భగవంతుడి 'అంశకు' చెందినదేనని తాత్పర్యం.

'వదన జనిత విప్రా' - పురుషసూక్తంలో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు వరుసగా ఆ విశ్వరూపుడి వదన, బాహు, ఊరు, పాద సముద్భూతులని చెప్పటం కనిపిస్తుంది. అంటే ఈ భావన శ్రుతిస్మృతులలో ఉన్నదని అర్థం.

'బ్రాహ్మణోఽస్య ముఖ మాసీత్ । బాహూ రాజన్య కృతః
ఊరూ తదస్య యద్వైశ్యః । పద్భ్యాం శూద్రో అజాయత." (పురుషసూక్తం)

"లోకానాం తు వివృద్ధ్యర్థం । ముఖ బాహూరు పాదతః
బ్రాహ్మణం క్షత్రియం వైశ్యం । శూద్రం చ నిరవర్తయత్."(మనుస్మృతి)

బ్రాహ్మణాది వర్ణ వాచకాలు గుణ వాచకాలే తప్ప 'కుల' వాచకాలు కావు అని భారతంలోని కథలను బట్టి తెలుస్తుంది. విజ్ఞాన-రక్షణ - వ్యాపార - శ్రమలనే ధర్మాలను బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య - శూద్రులుగా ప్రాచీనులు పిలిచారు.

'వైభవానందం' - ఆ ప్రభువువలెనే శాంత రసానందం కూడా పరమశ్రేష్ఠమైనదని చెప్పటానికే వైభవానందమనటం. అందుకే పరమేశ్వరుడిని 'ఆనందనిలయు'డని పిలవటం.

ఎక్కడ రూప, భావ, వ్యాపారాలు మూడూ అవాఙ్మానస గోచరాలో, అక్కడి అవతారాన్ని 'లీల' అంటారు. సకల సృష్టి స్థితి సంహార సమర్థుడైన హరిహరనాథుడు ఈ జగత్తును 'లీల'గా నిర్వహిస్తున్నాడని అర్థం.

విశేషం: మాలినీవృత్తంలోని ప్రతిపాదానికీ వరుసగా న, న, మ, య, య అనే గణాలుంటాయి. 1-9 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీమహాభారతంబున స్త్రీపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

తాత్పర్యం: ఉభయకవిమిత్రుడు, కొమ్మనామాత్యుడి పుత్రుడు, పండితులను గౌరవించటంలో సుప్రసిద్ధుడు, బుధులచేతి ఆరాధనచే ప్రకాశించేవాడూ అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీమహాభారతంలోని స్త్రీపర్వంలో మొదటి ఆశ్వాసం సంపూర్ణం.

స్త్రీపర్వంలో ప్రథమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

స్త్రీపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీ మత్కీర్తిమదత్యభి । రామాకృతి! సద్గుణాభిరతి! మత్పుణ్య
గ్రామాకృతి! మత్సంప । త్త్యామోదిత భక్తలోక! హరిహరనాథా! **1**

ప్రతిపదార్థం: శ్రీమత్= సంపదతోకూడిన; కీర్తిమత్= కీర్తికలిగిన; అతి+అభిరామ+ఆకృతి!= మిక్కిలి మనోహరమైన రూపమున్నవాడా!; సద్గుణ+అభిరతి!= మంచి గుణాలయందు ఆసక్తి ఉన్నవాడా!; మత్పుణ్య= నా (తిక్కనగారి) పూర్వగణ్య; గ్రామ= సముదాయంయొక్క; ఆకృతి!= స్వరూపం కలవాడా!; మత్= నా (తిక్కనగారి); సంపత్తి= ఐశ్వర్యంచేత; ఆమోదిత= సంతోషపెట్టబడిన; భక్తలోక!= భక్త సముదాయం కలవాడా!; హరిహరనాథా! (నీకు నమస్కారం).

తాత్పర్యం: స్వామీ హరిహరనాథా! నీవు లోకోత్తరమైన శోభను, యశస్సును, సౌందర్యాన్ని కలిగినవాడివి. సత్యశౌచాది సద్గుణాలపట్ల నీకు అభిలాష అధికం. అంతే కాదు. నీవు నా పూర్వజన్మ పుణ్యస్వరూపుడివే. అందుకే నా కున్న ఐశ్వర్యంతో భక్తులను దానాదులచేత సంతోషపెట్టటానికి నాకు మహావకాశాన్ని ఇచ్చి కరుణించావు.

విశేషం: అభిరతి - అంటే ఇష్టం. భగవంతుడు సద్గుణవంతులను ప్రేమిస్తాడు. ఇట్లాంటివారికై ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తాడన్నది పురాణ ప్రసిద్ధమైన సత్యం.

వ. **దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; నట్లు పాంచాలి నూఱడం బలికిన యనంతరంబ పతివ్రతాశిరోమణియు మహాభాగయు సత్యవచనయునగు నయ్యాంబికేయు భార్యకుం బారాశర్య మునీంద్ర వరప్రదానంబునం బ్రాప్తంబై తాత్కాలికం బయిన దివ్యదృష్టి విభవంబున నిజవ్రతహాని లేని తెఱంగున సంగర తలం బఖిలంబును నధికవిస్తార దూరప్రాప్తంబయ్యు నాలోకనగోచరం బగుటయు.** **2**

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథ స్వామీ! (విను); వైశంపాయనుండు; జనమేజయునకున్; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు; అట్లు= ఆ విధంగా; పాంచాలిన్= పాంచాలిని; ఊఱడన్+పలికిన= ఓదార్పు మాటలు చెప్పిన; అనంతరంబు+అ= తరువాత; పతివ్రతా= పతివ్రతలలో; శిరోమణియున్= తలమానికమైనదియు; మహాభాగయున్= గొప్ప పుణ్యాత్మురాలూ; సత్యవచనయున్= ఎప్పుడూ సత్యాన్నే పలికేది; అగు= అయినటువంటి; ఆ+ఆంబికేయు+భార్యకున్= ఆ ధృతరాష్ట్రుడి భార్యకు గాంధారికి; పారాశర్య మునీంద్ర= పరాశరుడి కొడుకైన వ్యాసుడియొక్క; వరప్రదానంబునన్= వరం ఇవ్వటంచేత; ప్రాప్తంబు+ఐ= కలిగినదై; తాత్కాలికంబు+అయిన= అప్పటికి మాత్రం వచ్చిన; దివ్యదృష్టి విభవంబునన్= దివ్యదృష్టి వైభవంతో; నిజవ్రతహానిలేని తెఱంగునన్= తాను కళ్ళకు కట్టిన గుడ్డ విప్పరాదన్న నియమం పొల్లుపోకుండానే; సంగరతలంబు= యుద్ధరంగం; అఖిలంబును= అంతా; అధిక విస్తార= అధికవైశాల్యం కలిగినదై; దూరప్రాప్తంబు+అయ్యున్= దూరంగా ఉన్నప్పటికీ; ఆలోకన= చూపునకు; గోచరంబు+అగుటయున్= కనిపిస్తుండగా.

తాత్పర్యం: ఓ దేవా! తరువాతి కథను వినుము. వైశంపాయనుడు జనమేజయుడికి ఇట్లా చెప్పాడు - ఆ విధంగా పాంచాలిని ఓదార్చిన తరువాత పరమ పతివ్రత, మహాపుణ్యాత్మురాలు, సత్యవ్రతురాలు అయిన గాంధారీదేవికి వ్యాసమునీంద్రుడి వరంవలన అప్పటికప్పుడు దివ్యదృష్టి కలిగింది. దీనివలన ఆమె కళ్ళకు కట్టిన గంత తీయకుండానే యుద్ధభూమిలో సుదూరంలో ఉన్నప్పటికీ వస్తు సముదాయమంతా ప్రత్యక్షంగా కనిపించటం మొదలుపెట్టింది.

మణిగణ నికరము;

గొడుగుల పఱియలు గుఱుకులు గొనుటన్ । సిడముల తునియలు సెదరి యునికి బెం
దడిగలుఁ బడగలు దఱచు మురియలై । పుడమిఁ గలయుటకుఁ బొగు లొలయ మదిన్. **3**

ప్రతిపదార్థం: గొడుగుల పఱియలు= గొడుగుల బద్దలు; కుఱుకులు= ప్రోవులుగా (రాశులుగా); కొనుటన్= ఏర్పడి ఉండటంవలన; సిడముల= ధ్వజాల; తునియలు= ముక్కలు; చెదరి+ఉనికిన్= చెల్లాచెదురుగా పడిఉండటంవలన; పెన్= పెద్దవైన; దడిగలు= అరిగెలు; పడగలు= టెక్కెములు; తఱచు= మిక్కిలిగా; మురియలై= ఖండఖండాలై; పుడమిన్+కలయుటకున్= నేలలో కలిసిపోవటానికి; మదిన్= మనస్సులో; పొగులు= పరితాపం; ఒలయన్= కలగగా.

తాత్పర్యం: ఆ యుద్ధభూమిలో రథాలమీద ఉన్న గొడుగులు ముక్కలు ముక్కలై పెద్ద పెద్ద రాశులుగా పడి ఉన్నాయి. ధ్వజాలు ముక్కలై చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అరిగెలు, టెక్కెములు చిన్న చిన్న ముక్కలైపోయి మట్టిలో కలిసిపోయాయి. ఇవన్నీ చూచిన గాంధారికి పరితాప మధికమై.

విశేషం: మణిగణనికర వృత్తంలో ప్రతిపాదానికీ వరుసగా నాలుగు నగణాలమీద ఒక సగణం ఉంటుంది. మొదటి అక్షరానికీ తొమ్మిదవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

క. **నుఱుమైన కాల్బలంబులు । నఱవఱ లయి యున్న యట్టి యరదంబులుఁ బెం**
దఱచగు సూతాంగకములు । నొఱగిన రథ్యములగములు నుల్ల మలంపన్. **4**

ప్రతిపదార్థం: నుఱుము+ఐన= చంపబడిన; కాల్బలంబులు= సైనికులు; అఱవఱలు+అయి+ఉన్న+అట్టి= చిన్న చిన్న ముక్కలుగా పడి ఉన్న; అరదంబులు= రథాలు; పెన్+తఱచు+అగు= ఎక్కడిపడితే అక్కడ కనిపిస్తున్న; సూత+అంగకములు= సారథుల అవయవాలు; ఒఱగిన= చనిపోయి నేలపైబడిన; రథ్యముల= గుర్రాల; గములు= గుంపులు; ఉల్లము= హృదయాన్ని; అలంపన్= బాధించగా.

తాత్పర్యం: ఆ యుద్ధ భూమిలో చనిపోయిన సైనికుల దేహాలు, చిన్న చిన్న ముక్కలై పడి ఉన్న రథాలు, ఎక్కడపడితే అక్కడ పడి ఉన్న సారథుల దేహభాగాలు, నేల కొరిగిన గుర్రాల సముదాయాలు కనిపిస్తున్నాయి. వీటిని చూచి గాంధారి హృదయం తరుక్కుపోగా.

లయగ్రాహి:

రావుతుల తుండములు మావఁతుల నుగ్గుఁ దుర । గావలి శవంబులు గజావయవ రాశీ
భావభయదస్థలులుఁ బ్రేవులును గండలును । బ్రోవులయి పెన్మెదడుపై విరిసి రక్త

స్రావమునఁ బెల్లయిన ఱేవమునఁ జూడఁ గడు । నేవ మగుపట్ల మృతభావగతులయ్యున్
జీవములఁ బాయరొకొ? నా వికచ వక్త్రముల । తో వఱలు రాజులు మనోవికృతి సేయన్. 5

ప్రతిపదార్థం: రావుతుల= గుర్రాలు నడిపేవారి; తుండములు= ముక్కలు; మావఁతుల= మావటివాళ్ళ; నుగ్గున్= ముక్కలు; తురగ+ఆవలి= గుర్రపు సమూహాల; శవంబులు= శవాలు; గజ+అవయవ+రాశీభావ= ఏనుగుల అవయవాలు ముక్కలై రాశులుగా పడి ఉండటంవలన; భయద= భయాన్ని పుట్టించే; స్థలులున్= చోట్లు; ప్రేవులును= ప్రేగులూ; కండలును= కండలూ; ప్రోవులు+అయి= రాశులుగా పడి; పెన్మెదడు+పైన్ విరిసి= ఏనుగు వంటిపెద్ద జంతువుల మెదళ్ళ పైగా విచ్చిపోయి; రక్తస్రావమునన్= రక్త ప్రవాహంతో; పెల్లయిన ఱేవమునన్= అతిశయించిన విధంగా; చూడన్= చూడటానికి; కడున్= మిక్కిలి; ఏవము+అగు= రోత కలిగించే; పట్ల= చోట్ల; అమృతభాగవతులు+అయ్యున్= మరణించినప్పటికీ; జీవములన్= ప్రాణాలను; పాయరు+ఒక్కొ+నాన్= వదలిపెట్టరా? అనిపించేటట్లు; వికచ= తెరుచుకొన్న; వక్త్రములన్= నోళ్ళతో; వఱలు= ఒప్పుతున్న; రాజులు; మనోవికృతి+చేయన్= మనసుకు వికారం కలిగించగా.

తాత్పర్యం: గుర్రాలను నడిపే రౌతుల దేహాలు ఒకపక్క, ఏనుగులను నడిపే మావటివాండ్ర శరీరాలు ఒకపక్క ఖండఖండాలై పడి ఉన్నాయి. మరోవైపు గుర్రాల శవాలు, ఇంకొకవైపు ఏనుగుల అవయవాలు రాశులుగా పడి ఉన్నాయి. వాటిని చూస్తే గుండెల్లో గుబులు పుట్టేటట్లు ఉన్నది. ఎక్కడపడితే అక్కడ పేగులు, కండలు, పోగులుగా పడి ఉన్నాయి. ఏవో మృగాల పెద్ద మెదళ్ళు విచ్చిపోయి రక్తం ఏర్లు కట్టి పారుతున్నది. అదంతా చూడటానికి చాలా అసహ్యంగా ఉన్నది. మరణించినా ఇంకా జీవించి ఉన్నారా ఏమి! అనే తలపు కలిగేరీతిగా - రాజ్యాలు ఏలిన మహారాజులు నోళ్ళు తెరుచుకొని పడి ఉన్నారు. వీరినందరినీ చూసి గాంధారి మనస్సు కకావికలయిపోగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. లయగ్రాహివృత్తంలోని ప్రతిపాదానికీ భ, జ, స, న, భ, జ, స, న, భ, య - అనే గణాలుంటాయి. 1-9-17-25 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

లయగ్రాహి:

హార రుచులన్ హృదయ హారితరమూర్తు లగు । వారు హరినీలమణి భారవిలసత్కే
యూర బహులాంశుచయ చారుతర రేఖులగు । వారు నవవజ్రరుచిరోరు ఘృణిమత్కో
టీర రమణీయులగు వారు గరుడాశ్మమయ । భూరికటకద్యుతివిహార పరిశోభా
స్ఫారులగు వారలును బోరఁబడి నెత్తురులఁ । గూరుటఁ గరంబెడఁద కారటము సేయన్. 6

ప్రతిపదార్థం: హార రుచులన్= ధరించిన దండల కాంతులచేత; హృదయహారితర= హృదయాలను మిక్కిలిగా ఆకర్షించే; మూర్తులు+అగువారు= శరీరాలు గలవారు; హరినీలమణి= ఇంద్రనీలమణుల; భారవిలసత్+కేయూర= ఆధిక్యంచేత ప్రకాశం పొందుతున్న భుజకీర్తుల; బహుల= అధికమైన; అంశుచయ= కిరణ సమూహంచేత; చారుతర= మిక్కిలి అందగించిన; రేఖులగువారు= విధంకలిగినవారు; నవవజ్ర= కొత్త వజ్రాలచేత; రుచిర= కాంతిమంతాలైన; ఉరు+ఘృణిమత్= పెద్ద వెలుతురుతోడి; కోటీర= కిరీటాలచేత; రమణీయులగు వారు= అందంగా ఉన్నవారు; గరుడ+అశ్మ+మయ= గరుడ పచ్చలతో నిండిన; భూరికటక= పెద్ద కడియాల; ద్యుతి= కాంతియొక్క; విహార= వ్యాప్తిచేత; పరిశోభా= మిక్కిలి శోభతో; స్ఫారులగు వారలును= నిండైన శోభతో కనిపిస్తున్నవారు (కూడా); పోరన్+పడి= యుద్ధంలో చనిపోయి; నెత్తురులన్+కూరుటన్= రక్తపు మడుగులో పడి ఉండటం; కరంబు= మిక్కిలిగా; ఎడఁదకున్= హృదయానికి; ఆరటము= ఆరాటం; చేయన్= కలిగించగా.

తాత్పర్యం: అక్కడపడి ఉన్న యుద్ధవీరులు ఎట్లా ఉన్నారంటే - ఒక్కొక్కరి మెడలో ఉన్న బంగారు హారాలచేత హృదయాలను మిక్కిలి ఆకర్షించేటట్లు వారి దేహాలు మిలమిలలాడుతున్నాయి. అత్యధికంగా ఇంద్రనీలమణులు పొదిగిన భుజకీర్తుల నుండి వెలువడే కాంతి సమూహంచేత వారి అందం ప్రత్యేకంగా కనిపిస్తున్నది. కొత్త వజ్రాలను పొదిగిన కిరీటాలు తళతళమెరుస్తూ ఆ వీరుల సౌందర్యాన్ని ప్రకటింపచేస్తున్నాయి. గరుడపచ్చలతో నిండిన పెద్ద పెద్ద కడియాలు వెలువరించే కాంతి దేహమంతటా పడి వారు అతి గంభీరంగా శోభాయమానంగా కనిపిస్తున్నారు. అట్లాంటి వీరులందరూ యుద్ధంలో చనిపోయి నెత్తురు మడుగులలో పడి ఉండటం చూసి గాంధారికి గుండెలో ఆరాటం కలుగగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: వృత్తలక్షణం - చూడండి స్త్రీ. 2. 5.

లయగ్రాహి:

> **అమ్ములును విండ్లుఁ బరిఘమ్ములును దోమర చ । యమ్ములును గుంతనికరమ్ములుఁ గనత్ఖ**
> **డ్గమ్ములు నహీన ముసలమ్ములును జక్ర నివ । హమ్ములును లోనగు నసమ్మత మహోగ్రా**
> **స్త్రమ్ములును గండలును నెమ్ములుఁ గపాలములు । సమ్మిళిత రూపశకలమ్ములయి సంగ్రా**
> **మ మ్మతుల దారుణ విధమ్మగుటఁ దెల్పుట ధి । కమ్మగు కలంక హృదయమ్మున కొనర్పన్.** 7

ప్రతిపదార్థం: అమ్ములును= బాణాలూ; విండ్లున్= ధనుస్సులూ; పరిఘమ్ములును= పరిఘలు; తోమరచయమ్ములును= ఈటెల సముదాయాలు; కుంతనికరమ్ములున్= బల్లెముల సముదాయాలు; కనత్= ప్రకాశించే; ఖడ్గమ్ములు= కత్తులూ; అహీన= గొప్పవైన; ముసలమ్ములును= రోకళ్ళు (పెద్ద దుడ్డు కర్రలు); చక్రనివహమ్ములును= చక్రములచే ఆయుధాలూ; లోనగు= మొదలైన; అసమ్మత= భయంకరమైన; మహా+ఉగ్ర+అస్త్రమ్ములును= మహాక్రూరమైన ఆయుధాలు; కండలును= కండలూ; ఎమ్ములున్= ఎముకలూ; కపాలములున్= పుర్రెలు; సమ్మిళిత రూప శకలమ్ములు+అయి= అన్నీ కలిసిపోయి ముక్కలు ముక్కలై; సంగ్రామమ్ము= యుద్ధము; అతుల= సాటిలేని; దారుణ= భయంకరమైన; విధమ్ము+అగుటన్= విధంగా కలదని; తెల్పుట= తెలుపుతూ ఉండటం; హృదయమ్మునకున్= హృదయానికి; అధికమ్ము+అగు= మిక్కిలి; కలంక= బాధ; ఒనర్పన్= కలిగించగా.

తాత్పర్యం: అమ్ములు, ధనుస్సులు, పరిగెలు, ఈటెలు, బల్లెములు, తళతళలాడుతున్న కత్తులు, పెద్దపెద్ద దుడ్డు కర్రలు, చక్రాలు మొదలైన మహాక్రూరమైన ఆయుధాలు, మరొకవైపు కండలు, ఎముకలు, పుర్రెలు కలిసిపోయి ముక్కలు ముక్కలుగా పడి ఉండటం చూస్తే జరిగిందే మహా ఘోరయుద్ధమని తెలుపుతూ ఉండటం గాంధారి హృదయానికి మిక్కిలి బాధ కలిగించగా.

విశేషం: వృత్తలక్షణం - చూడండి. స్త్రీ. 2.5.

లయగ్రాహి:

> **కుత్తుకలబంటి యగు నెత్తురులు దోయిళుల । నెత్తి చవిగ్రోలుచును జిత్తములు దృప్తిన్**
> **జొత్తిలి నితాంత మదమత్తములుగాఁ జటుల । నృత్తములు సేయుచుఁ జలత్తను వికారో**
> **ద్వృత్తపటుహాసముల రిత్తలగు దుర్వచన । వృత్తులను నొండొరుల నొత్తికొని మాంసం**
> **బత్తి తినుటన్ వికటవృత్తులగు రాక్షసుల । మొత్తము పరిక్షుభితచిత్తత యొనర్పన్.** 8

ప్రతిపదార్థం: కుత్తుకలబంటి+అగు= కంఠాలవరకు; నెత్తురులు= రక్తాన్ని; దోయిళులన్= దోసిళ్ళతో; ఎత్తి+చవిన్+క్రోలుచును= ఎత్తుకొని ఇష్టంగా తాగుతూ; చిత్తములు= మనస్సులు; తృప్తిన్+జొత్తిలి= తృప్తితో మునిగిపోయి; నితాంత మదమత్తములుగాన్= మిక్కిలి మదించి; చటుల నృత్తములు+చేయుచున్= భయంకరమైన చిందులువేస్తూ; చలత్తనువికార+ఉద్వృత్త= ఊగుతున్న దేహవికారాలచేత మితిమీరిన; పటు= మొరటు; హాసములన్= నవ్వులతో; రిత్తలు+అగు= వ్యర్థాలైన; దుర్వచన వృత్తులను= బూతుమాటలతో; ఒండొరులన్= ఒకరినొకరు; ఒత్తికొని= తోసుకొంటూ; మాంసంబు+అత్తి+తినుటన్= అందరూ కలిసి మాంసం తినటంలో; వికటవృత్తులు+అగు= భయంకరంగా ప్రవర్తించే; రాక్షసుల మొత్తము= రాక్షసుల గుంపు; పరిక్షుభిత= మిక్కిలి కలత పొందిన; చిత్తతన్= మనస్థితిని; ఒనర్పన్= కలిగించగా.

తాత్పర్యం: గొంతుకలదాకా రక్తాన్ని దోసిళ్ళతో ఎత్తుకొని మహా ఇష్టంగా త్రాగుతూ, ఆ తృప్తిలో కరిగిపోయి మదమత్తులై చిందులువేస్తూ ఊగిపోతున్న దేహ వికారాలచేత ఎగిరెగిడిపడుతూ మొరటు నవ్వులతో బూతులు మాట్లాడుతూ ఒకరినొకరు తోసుకొంటూ అందరూ కలిసి మాంసం తినటంలో అతిభయంకరంగా వర్తిస్తున్న రాక్షసుల గుంపు గాంధారి మనస్సును మిక్కిలిగా కలచివేయగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: వృత్తలక్షణం - చూడండి. స్త్రీ. 2. 5

సీ. **ప్రేవులు గండలు పెటికి పేటాడి యం । గదఁగొని మెదళుల గల్చికొనుచు**
రాగిలి రక్తంబు ద్రావుచు లోచన । గుళికల నొలిచి మ్రింగుచును గుండె
కాయ లాదట మెయిఁ గబళించుచును గ్రొవ్వు । దెమలచి నమలుచు నెముక యూట
చవిగొని యానుచుఁ జావకయున్న రూ । పులు సచ్చుటకుఁ గాఁగఁ బెలుచఁ దన్ని

తే. **కొనిన దెఱఁబాయఁ బాఱుచుఁ జెనకి తొడరి । కాటులాడుచు నున్న సృగాలములును**
గాకములు రాపులుఁగులును గ్రద్దలును వృ । కంబులును మానసము వికలంబు సేయ. 9

ప్రతిపదార్థం: ప్రేవులు= పేగులను; కండలు= కండలను; పెటికి= ఊడబెరికి; పేటాడి= ముక్కలు చేసి; అంగదన్+కొని= ఆకలికొని; మెదళులు= మెదళ్ళను; అగల్చికొనుచున్= ఊడబెరుక్కొని; రాగిలి= ఆసక్తితో; రక్తంబున్+త్రావుచు= రక్తం త్రాగుతూ; లోచన గుళికలన్= కంటి గుడ్లను; ఒలిచి= ఒలుచుకొని; మ్రింగుచును= మింగుతూ; గుండెకాయలు= గుండెకాయల్ని; ఆదటమెయిన్= ఎంతో ఆపేక్షతో; కబళించుచును= మింగుతూ; క్రొవ్వున్+తెమలిచి= కొవ్వును ఊడదీసి; నమలుచున్= తింటూ; ఎముక+ఊట= మూలుగును; చవిగొని+అనుచున్= రుచిచూస్తూ జుర్రుతూ; చావక+ఉన్న= ఇంకా చావకుండా ఉండే; రూపులు= శరీరాలు చచ్చుటకున్+కాఁగన్= చావటానికై; పెలుచన్= మిక్కిలిగా; తన్నికొనినన్= తన్నుకొంటుండగా; తెఱఁబాయన్= ప్రాణాలుపోయేలా; పాఱుచున్= మీద ఎగురుతూ; చెనకి= ఎదిరించి; తొడరి= పూనికతో; కాటులాడుచున్= కొట్లాడుతూ; ఉన్న= ఉన్నటువంటి; సృగాలములు= నక్కలు; కాకములు= కాకులూ; రాపులుఁగులును= రాబందులూ; గ్రద్దలును; వృకంబులు= తోడేళ్ళు; మానసము= మనసును; వికలంబు+చేయన్= కలచివేస్తుండగా.

తాత్పర్యం: ఆ యుద్ధభూమిలో పేగులను కండలను ఊడబెరికి ముక్కలుచేసి ఆకలిగొని తింటూ, మెదళ్ళను ఊడబెరుక్కొని ఆసక్తితో రక్తం తాగుతూ, కంటిగుడ్లను ఒలుచుకొని మింగుతూ, గుండెకాయలను ఎంతో ఆసక్తిగా కబళిస్తూ ఎముకలలోని మూలుగును రుచిచూస్తూ జుర్రుతూ, ఇంకా చావకుండా ఉండే శరీరాలు తన్నుకొంటుండగా

ప్రాణాలుపోయేటట్లు పైన ఎగురుతూ, ఎదుర్కొని ఎంతో పూనికతో ఒకదానితో ఒకటి కొట్లాడుతూ ఉన్న తోడేళ్ళు, కాకులు, రాపులుగులు, గద్దలు, నక్కలు గాంధారి మనస్సును కలచి వేయగా.

వ. అగ్గాంధార రాజనందన కలను గలయం గనుంగొనియెఁ దదవసరంబున సాత్యవతేయుండు కౌంతేయుల రావించి 'బంధు శవంబులకుఁ గాలోచితాచార సహితంబుగా నగ్ని సంస్కారంబు సేయుం'డని పనిచి యంతర్ధానంబు సేసె. వారు ధృతరాష్ట్రుం బొదివికొని వాసుదేవపురస్సరులయి యప్పనికిం జనుచుఁ గౌరవకాంతలఁ దత్ప్రదేశంబునకు నడపించిన నప్పడఁతులు పతులును సుతులును సోదరులును బౌత్రులును మిత్రులును గుణపంబులై పడియున్నఁ జూచి చెయ్వేది మేదిని నొఱగువారును వా విడిచి యఱచువారును బురపురం బొక్కువారును బడిపొరలుచుఁ బొగులువారును వేనలులు వీడి వెన్నుల విరియం దిరుగువారును బలవించువారును బేర్కొని యగ్గించువారును బ్రాన్పడువారును మోములుం దలలును మోఁదుకొనువారును నై రప్పు డా దుర్యోధనజనని జనార్దనుం బేర్కొని చేరంబిలిచి పరమశోకార్తయగుచు నతని కిట్లనియె. 10

ప్రతిపదార్థం: ఆ+గాంధార రాజనందన= ఆ సుబలరాజుకుతురు గాంధారి; కలనున్= యుద్ధభూమిని; కలయన్+ కనుంగొనియెన్= అంతా పరికించింది; తద్+అవసరంబునన్= ఆ సమయంలో; సాత్యవతేయుండు= వ్యాసుడు; కౌంతేయులన్= పాండవులను; రావించి= పిలిపించి; బంధు శవంబులకున్= బంధువుల శవాలకు; కాలోచిత+ఆచార సహితంబుగాన్= ఆ సమయానికి తగిన ఆచారాలను అనుసరించి; అగ్నిసంస్కారంబు+చేయుండు+అని= అగ్ని సంస్కారం చేయండి అని; పనిచి= ఆనతి ఇచ్చి; అంతర్ధానంబు+చేసెన్= అంతర్ధానమయ్యాడు; వారు= ఆ పాండవులు; ధృతరాష్ట్రున్+పొదివికొని= ధృతరాష్ట్రుని చుట్టుకొని (పరివేష్టించి); వాసుదేవ పురస్+సరులయి= శ్రీకృష్ణుడు ముందు నడుస్తుండగా; ఆ+పనికిన్+చనుచున్= ఆ బంధువుల అగ్నికార్యం కోసం వెళ్తూ; కౌరవకాంతలన్= కౌరవ స్త్రీలను; తద్+ప్రదేశంబునకున్= ఆ చోటికి; నడిపించినన్= పిలుచుకొని వెళ్ళగా; ఆ+పడఁతులు= ఆ స్త్రీలు; పతులును= భర్తలు; సుతులును= కుమారులు; సోదరులును= తమ్ముళ్ళు, అన్నలు; పౌత్రులును= మనుమళ్ళు; మిత్రులును= స్నేహితులు; కుణపంబులు+ఐ= శవాలై; పడి+ఉన్నన్+చూచి= పడి ఉండగా చూసి; చెయ్వు+ఏది= చేష్టలుడిగి; మేదినికిన్= నేలమీదికి; ఒఱగువారును= ఒరిగిపోయేవారు; వా+విడిచి= నోరుతెరచి; అఱచువారును= అరుస్తున్నవారు; పురపురన్+పొక్కువారును= తహతహలాడుతూ దుఃఖించేవారూ; పడిపొరలుచున్= నేలమీదపడి పొర్లుతూ; పొగులు వారును= పరితపిస్తున్నవారు; వేనలులు+వీడి= జడలు వీడిపోయి; వెన్నులన్+విరియున్= వీపులమీద పరచుకొని ఉండగా; తిరుగువారును= తిరుగుతున్నవారు; పలవించువారును= పిచ్చి పిచ్చిగా అరుస్తున్నవారు; పేర్కొని= ఆయా మృతవీరుల పేర్లు పెట్టి పిలుస్తూ; అగ్గించువారును= వారిని పొగడుతున్నవారు; మ్రాను+పడువారును= నిశ్చేష్టులవుతున్నవారు; మోమున్+తలలును= ముఖాలను, తలలను; మోఁదుకొనువారును= కొట్టుకొనేవారు; ఐరి= అయ్యారు; అప్పుడు; ఆ; దుర్యోధనజనని= ఆ గాంధారి; జనార్దనున్+పేర్కొని= కృష్ణుడిని పేరుపెట్టి పిలిచి; చేరన్+పిలిచి= దగ్గరకు రమ్మని; పరమశోకార్తయగుచున్= మిక్కిలి దుఃఖంతో దీనురాలై; అతనికిన్= కృష్ణుడితో; ఇట్లనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: గాంధారి ఇట్లా బాధపడుతూ ఆ యుద్ధభూమిని అంతా పరికించింది. ఆ సమయంలో వ్యాసమహర్షి పాండవులను పిలిపించి 'మృతులైన బంధువుల శవాలకు ఆ కాలానికి తగిన ఆచారాలతో కూడిన అగ్ని సంస్కారం చేయండి' అని ఆనతిచ్చి అంతర్ధాన మయ్యాడు. అపుడు పాండవులు ధృతరాష్ట్రుడిని నడిపించుకొంటూ శ్రీకృష్ణుడు ముందు నడుస్తుండగా ఆ బంధువులకు దహన సంస్కారం చేయటంకొరకు వెళ్తూ కౌరవస్త్రీలను ఆ ప్రదేశానికి

తీసికొని వెళ్ళారు. అక్కడ వారు తమతమ భర్తలు, కొడుకులు, తమ్ముళ్ళు, అన్నలు, మనుమళ్ళు, స్నేహితులు శవాలై పడి ఉండగా చూచి చేష్టలుడిగి నేలమీద ఒరిగిపోయారు. నోళ్ళు తెరచి హాహాకారాలు చేస్తున్నారు. తహతహలాడుతూ నేలమీదపడి పొర్లుతూ పరితపిస్తున్నారు. జడలు వీడిపోయి వీరుల పేర్లు పెట్టి పిలుస్తూ వారి గుణగణాలను గురించి చెప్పుతున్నారు. నిశ్చేష్టలై కొయ్యబారిపోతున్నారు. ముఖాలను, తలలను మోదుకొంటున్నారు. అప్పుడు గాంధారి కృష్ణుడిని పిలిచి దగ్గరికి రమ్మని మిక్కిలి దుఃఖంతో దీనురాలై అతడితో ఇట్లా అన్నది.

విశేషం: కాలోచితమైన ఆచారం - అంటే కొంత వివరించాలి. ఇక్కడ చేస్తున్నది సామూహిక దహన సంస్కారం. దీని పద్ధతి సాధారణ పితృ ప్రేతకర్మవంటిది కాదని అర్థం. అందుకే ఆ సమయానికి తగిన పద్ధతిలో చేశారని అర్థం.

గాంధారి పొలికలను చూచి కృష్ణునితోఁ జెప్పి దుఃఖించుట (సం. 11-16-18)

సీ. **'చూడుము ధృతరాష్ట్రు కోడండ్రఁ గన్నార । వీరె కన్నీరు పై వెల్లి గొనఁగ**
దీనతఁ బొందెడు నాననంబుల విప్ర । లాపంబులైన సల్లాపములను
నడలు చొండొరులకు నన్నలఁ దమ్ముల । రూపించి వేర్వేఱఁ జూపుటయును
బొరిమొగంబులు సూచి పురుపురఁ బొక్కుచుఁ । దలలల్లం దూలంగ నిలుచుటలును

తే. **గలిగి యలిగెడు వారి కన్నులకుఁ బండు । వగుచునున్నారు కాకులు మగల తనువు**
లెక్కియున్నను చేష్టలు దక్కి కొంద । ఱడువఁ జేయాడకున్నవా రంబుజాక్ష! **11**

ప్రతిపదార్థం: అంబుజ+అక్ష!= కమలనేత్రుడవైన కృష్ణా!; ధృతరాష్ట్రు= ధృతరాష్ట్రుని; కోడంద్రన్= కోడళ్ళను; కన్నారన్= కళ్ళారా; చూడుము; వీరె= ఇదుగో వీరే ఆ కోడళ్ళు; కన్నీరు= కంటినీరు; పై+వెల్లికొనఁగన్= ముఖంపైన ప్రవహిస్తుండగా; దీనతన్+పొందెడు+ఆననలంబులన్= దైన్యంతో కూడిన ముఖాలతో; విప్రలాపంబులైన= పొంతనలేని; సల్లాపములను= మాటలతో; అడలుచున్= దుఃఖిస్తూ; ఒండొరులకున్= ఒకరు మరొకరికి; అన్నలన్= తమ అన్నలను; తమ్ములన్= తమ్ముళ్ళను; రూపించి= నిర్ణయించి; వేర్వేఱన్= వేరు వేరుగా; చూపుటయును= చూపించటం; పొరిన్= క్రమంగా; మొగంబులు= ముఖాలు; చూచి; పురపురన్+పొక్కుచున్= తహతహలాడుతూ ఏడుస్తూ; తలలు+అల్లన్+తూలంగన్= తలలు వాలిపోతూ ఉండగా; నిలుచుటలును= ఎట్లాగో నిలదొక్కుకొని నిలబడి ఉండటం; కలిగి; అలిగెడువారి= కోపగించుకొన్నవారి; కన్నులకున్= కళ్ళకు; పండువు+అగుచున్+ఉన్నారు= విందు అవుతున్నారు; కాకులు; (తమ); మగల తనువులు= భర్తల దేహాలు; ఎక్కి+ఉన్నను= ఎక్కిఉన్నా; చేష్టలు+తక్కి= నిశ్చేష్టలై; కొందఱు= కొందరు స్త్రీలు; అడువన్= తోలటానికి; చేయి+అడకున్నారు= చేయి ఆడించుకున్నారు.

తాత్పర్యం: 'కృష్ణా! ధృతరాష్ట్ర మహారాజు కోడళ్ళను చూడుము. ఇదుగో వీరే వారు! కంటినీరు ముఖాలపైన వెల్లువలుగట్టగా అతిదీనమైన ముఖాలతో పొంతన లేని పలుకులతో, పుట్టెడు దుఃఖంతో, ఒకరి కొకరు చనిపోయిన తమ అన్నదమ్ముల ముఖాలు చూచి ఇది 'ఫలానా వారిదే' అని నిర్ణయిస్తూ చూపిస్తున్నారు. చూపించి తాము చూచి మళ్ళీ తహతహలాడుతూ ఏడుస్తూ తలలు వాలిపోతుండగా ఎట్లాగో నిలదొక్కుకొని నిలబడి ఉన్నారు. వీళ్ళమీద కసి ఉన్నవారికి ఈ నాటికి 'కన్నులపండుగు' అయింది. తమ భర్తల దేహాలపై కాకులు కూర్చొని ఉన్నా వాటిని తోలటానికి చెయ్యి ఎత్తలేని స్థితిలో ఉన్న ఈ ఆడవారిని చూస్తే ఎంత బాధ అవుతుందో చూడుము.

విశేషం: అంత దుఃఖంలోనూ పగవారిని గురించి స్మరించటంలోనే మనుష్య సహజమైన అజ్ఞానం ఉన్నది. మమతానుబంధాలు అధికంగా ఉన్న స్త్రీలలో అది మరింత అధికమని నిరూపించటానికే 'స్త్రీ పర్వ' మనేపేరు వ్యాసమహర్షి ఉంచాడు. దుఃఖంలోనూ ద్వేషం, అసూయ, పట్టుదలలు నశించవని అర్థం.

మానిని:

కూలియుఁ గాంతి యిగుర్పఁగఁ దేజము గుందక వహ్నులు గ్రూరశిఖా
జాల మడంగియుఁ జాయ వెలింగెడు చందము నొందిరి శల్యుఁడుఁ బాం
చాలుఁడుఁ గర్ణుఁడుఁ జాపగురుండును శాంతనవుండు నిజంబున కీ
బాలుఁడు వీరి ప్రభం గడచెం గుణభద్రునిఁ గంటె సుభద్రసుతున్. 12

ప్రతిపదార్థం: శల్యుఁడు; పాంచాలుఁడు= ద్రుపదుడు; కర్ణుఁడు; చాపగురుండును= ద్రోణుడూ; శాంతనవుండు= భీష్ముడు (వీరంతా); కూలియున్= చనిపోయికూడా; తేజము+కుందక= కాంతి తగ్గక; కాంతి+ఇగుర్పఁగన్= కొత్తకాంతులీనుతూ; వహ్నులు= అగ్నులు; క్రూర= తీక్ష్ణమైన; శిఖాజాలము= జ్వాలల సమూహం; అడంగియున్= తగ్గిపోయినా; చాయ= కాంతి; వెలింగెడు చందమున్= ప్రకాశించే విధాన్ని; ఒందిరి= పొందారు; నిజంబునకున్= నిజానికి; ఈ బాలుఁడు= ఈ బాలుడైన అభిమన్యుడు; వీరి ప్రభన్= వీరందరి కాంతిని; కడచెన్= అధిగమించాడు; గుణభద్రునిన్= సుగుణవంతులలో శ్రేష్ఠుడైన; సుభద్రసుతున్= సుభద్ర కుమారుడైన అభిమన్యుడిని; కంటె?= చూచావా?

తాత్పర్యం: కృష్ణా! శల్యుడు, ద్రుపదుడు, కర్ణుడు, ద్రోణుడు, భీష్ముడు వీరంతా యుద్ధంలో చనిపోయినా, మంటలు తగ్గాక కూడా అగ్ని కాంతి ఎట్లా కొత్త కొత్తగా పుట్టుతూ ఉంటుందో అట్లా ప్రకాశం తగ్గకుండా ఉన్నారు. నిజానికి వీరందరికన్నా ఎక్కువ కాంతితో అభిమన్యుడు మెరిసిపోతున్నాడు. సుగుణాలఖని ఈ సుభద్రకొడుకు ఈ బాలుడిని చూచావా? (శవంలో కూడా జీవకాంతులు తగ్గలేదని అర్థం).

విశేషం: అలం: ఉపమ. వృత్తలక్షణానికి చూడండి స్త్రీ. 1.90

ఆ. **ప్రభువు లంతనంత రాజిల్ల నెడనెడ । వీరయోధతతులు వెలుఁగుచుండ**
గ్రహచయమునఁ దారక ప్రకరంబున । బొలుచు గగనతలముఁ బోలెఁ గలను. 13

ప్రతిపదార్థం: ప్రభువులు= రాజులు; అంతన్+అంతన్= అక్కడక్కడా; రాజిల్లన్= ప్రకాశిస్తుండగా; ఎడన్+ఎడన్= అక్కడక్కడా; వీరయోధతతులు= వీరులైన యోధుల సమూహాలు; వెలుఁగుచుండన్= ప్రకాశిస్తుండగా; గ్రహచయమునన్= గ్రహాలరాశితోనూ; తారక ప్రకారంబునన్= నక్షత్రాల సముదాయంతోనూ; పొలుచు= ఒప్పినటువంటి; గగన తలమున్= ఆకాశతలాన్ని; కలను= యుద్ధభూమి; పోలన్= పోలి ఉంది.

తాత్పర్యం: అక్కడక్కడా రాజులు, అక్కడక్కడా యుద్ధవీరులు కాంతులీనుతూ ప్రకాశిస్తుండగా ఈ యుద్ధభూమి గ్రహరాశులతోనూ, నక్షత్రసముదాయాలతోనూ వెలిగే ఆకాశంవలె కనిపిస్తున్నది.

విశేషం: అలం: ఉపమ.

సీ. **అర్జున భీష్మ చాపాచార్య భీమ క।ర్ణాదుల మహిత దివాస్త్ర వితతు**
లాడిన నొండొక కీడు రానేరమి। వీతవికారమై వీరయోధ
చారుశరీరసంచయ ముండఁగా దీనిఁ। గంకశివాగృధ్రకాకకులము
లాదిగాఁ గలుగు క్రవ్యాదముల్ వీఁకు వీఁ। కాడుట నెంగిలి యయ్యెనకట!

తే. **హంసతూలికా తల్పములందుఁ బొందు। భోగిజనముల మృదుగాత్రములు ముకుంద!**
కంటె పరుసని ధరణి భాగమునఁ గూలి। యున్న యవి సూచువారల యుల్ల ముడుక. **14**

ప్రతిపదార్థం: ముకుంద!= ఓ కృష్ణా!; అర్జున; భీష్మ; చాపాచార్య= ధనుర్విద్యాగురుడైన ద్రోణ; భీమ; కర్ణాదుల= కర్ణుడు మొదలైన మహావీరుల; మహిత= గొప్పవైన; దివ్యాస్త్ర వితతులు= దివ్యమైన అస్త్రసముదాయాలు; ఆడినన్= నాటుకోగా; ఒండొక= ఏ ఒక్క; కీడు రానేరమిన్= అపాయం కలుగనందువలన; వీత= పోయిన; వికారమై= వికారం కలిగినదై (ఏ వికారం లేకుండా); వీరయోధ= వీరులైన యోధుల; చారు= అందమైన; శరీర సంచయము= శరీర సముదాయం; ఉండఁగాన్= యుద్ధభూమిలో ఉండగా; దీనిన్= దీనిని; కంక= రాపులుగులు; శివాగృధ్రకాకకులములు= నక్కలు, గ్రద్దలు, కాకులు - వీటి సముదాయం; ఆదిగాఁగలుగు= మొదలైనటువంటి; క్రవ్యాదముల్= మాంసాన్ని తినేవి; వీఁకు వీఁకాడుటన్= ఉద్ధతితో చెలరేగి పరాక్రమించటంవలన; ఎంగిలి+అయ్యెన్+అకట!= అయ్యో! ఎంగిలి అయిపోయింది; హంసతూలికా తల్పములందున్= బూరుగు దూదితో చేసిన పరుపులందు; పొందు= విశ్రమించే; భోగిజనముల= ఈ భోగపురుషుల; మృదుగాత్రము=మెత్తటి శరీరాలు; చూచువారల= చూచేవారి; ఉల్లము+ఉడుకన్= హృదయాలు పరితపించే విధంగా; పరుసని= కఠినమైన; ధరణిభాగమునన్= నేలమీద; కూలి= పడి; ఉన్నయవి= ఉన్నాయి; కంటె= చూచావా?

తాత్పర్యం: కృష్ణా! అర్జున, భీష్మ, ద్రోణ, భీమ, కర్ణాదుల దివ్యాస్త్ర సముదాయాలు నాటినా కించిత్తు కీడు వాటిల్లని ఈ మహావీరుల దేహాలను రాపులుగులు, నక్కలు, గ్రద్దలు, కాకులు ఆక్రమించి పొడిచి పొడిచి ఎంగిలిచేశాయి. అయ్యో! హంసతూలికాతల్పాలలో విశ్రమించే ఈ విలాసపురుషుల శరీరాలు కఠినమైన ఈ నేలపై పడి ఉన్నాయి. చూచేవారికి గుండెలు తరుక్కుపోతున్నాయి. చూచావా?

క. **చెవిని సొగియించు వీణా। రవమును గానంబు వేణురావము నిత్యో**
త్సవముగ విను రాజులకడ। శివారుతము చెలఁగుచునికి చిత్త మలంచెన్. **15**

ప్రతిపదార్థం: చెవినిన్= చెవులను; సొగియించు= సుఖింపచేసేటువంటి; వీణానాదం; గానంబు= పాట; వేణురావము= పిల్లనగ్రోవి ధ్వని; నిత్య+ఉత్సవముగన్= ప్రతిరోజూ సంతోషదాయకమైన వినోదంగా; విను= వినేటువంటి; రాజులకడన్= రాజుల సమీపంలో; శివారుతము= ఆడు నక్కల ఊళలు; చెలఁగుచునికి= ధ్వనిస్తూ ఉండటం; చిత్తము= హృదయాన్ని; అలంచెన్= బాధపెట్టుతోంది.

తాత్పర్యం: ప్రతిరోజూ వినోదకార్యక్రమాలుగా చెవులను సుఖింపచేసే వీణానాదాన్ని, మధురగానాన్ని వేణుధ్వనులను వినేటువంటి రాజుల వద్ద నక్కలు ఊళలు విజృంభించటం చూస్తే హృదయం కలత పొందుతున్నది.

తే. **సారచందనహృద్య కస్తూరి కాది। లేపనాలిప్తి నుండెడు భూపవర్యు**
లకట! శోణితపంకదిగ్ధాంగులగుటఁ। గనుట కోర్వరాదయ్యెడుఁ గమలనాభ!. **16**

ప్రతిపదార్థం: సార= శ్రేష్ఠమైన; చందన= శ్రీగంధం; హృద్య= మనోహరమైన; కస్తూరిక+ఆది= కస్తూరి, పునుగు, జవ్వాది మొదలైన; లేపన= లేపనాల; ఆలిప్తిన్= పూతతో; ఉండెడు= సుగంధాలు చిమ్ముతూ ఉండే; భూపవర్యులు= రాజులు; అకట!= అయ్యో!; శోణిత= రక్తమనే; పంక= బురదచేత; దిగ్ధ+అంగులగుటన్= పూత పూయబడిన శరీరాలు కలవారు కావటం వలన; కమలనాభ!= ఓ కృష్ణా!; కనుటకున్= చూడటానికి; ఓర్వరాదు+అయ్యెడున్= భరింటానికి వీలుకాకుండా ఉన్నది.

తాత్పర్యం: శ్రేష్ఠమైన శ్రీగంధం, మనోహరమైన కస్తూరి, పునుగు, జవ్వాది మొదలైన లేపనాలతో సుగంధాలు చిమ్ముతూ అందంగా కనిపించే ఈ రాజుల శరీరాలు రక్తమనే బురద పూత పూయబడి చాలా దారుణంగా అగుపిస్తున్నాయి. కృష్ణా! ఎట్లా చూచి భరించటం?

క. వనితలు మేలపుమెయి మెలు । పునఁ దిగిచిన నొప్పు హారములు మొదలగు ప్ర
న్నని తొడవులు గ్రద్దలు దివి । య నరేంద్రులు గొందఱునికి యచ్యుత! కంటే? 17

ప్రతిపదార్థం: అచ్యుత!= కృష్ణా!; మేలపు మెయిన్= సరదాగా; వనితలు= తమ ప్రియురాళ్ళు; మెలుపునన్= నెమ్మదిగా; హారములు మొదలగు= దండలు మొదలైన; ప్రన్నని= చక్కటి; తొడవులు= ఆభరణాలు; తివియన్= తీసివేయగా; ఒప్పు= ప్రకాశించే; రాజులు; కొందఱు(ఇక్కడ); (ఆ నగలను); గ్రద్దలు= గద్దలు; తివియన్= లాగిపారవేస్తుండగా; ఉనికి= ఇలా పడిఉండటం; కంటే?= చూస్తున్నావా?

తాత్పర్యం: కృష్ణా! తమ ప్రియురాళ్ళు సరదాకొరకు తాము ధరించిన చక్కని ఆభరణాలను హారాలను తీసివేస్తుండగా ప్రకాశించే రాజులు ఆ నగలనే గ్రద్దలు క్రూరంగా లాగివేస్తుండగా ఈ యుద్ధభూమిలో చలనం లేకుండా పడి ఉన్నారు. చూస్తున్నావు కదా!

క. ప్రాణంబులు విడిచియును గృ । పాణాదులు విడువకున్న భటు లారయ స
ప్రాణుల పోలెం బ్రధన । క్షోణికిఁ దొడవగుచు నున్కి చూడుము కృష్ణా! 18

ప్రతిపదార్థం: కృష్ణా!= వాసుదేవా!; ప్రాణంబులు= ప్రాణాలు; విడిచియును= విడిచిపెట్టికూడా; కృపాణ+ఆదులు= కత్తులను కటార్లను; విడువక+ఉన్న= చేతులలో అట్లాగే పట్టుకొని ఉన్న; భటులు= యోధులు; ఆరయన్= బాగాచూస్తే; సప్రాణుల పోలెన్= బ్రతికి ఉన్న వారిలాగా; ప్రధన క్షోణికిన్= యుద్ధ భూమికి; తొడవు+అగుచున్= ఆభరణాలౌతూ; ఉన్కి= ప్రకాశిస్తూ ఉండటం; చూడుము.

తాత్పర్యం: వాసుదేవా! ప్రాణాలు వదిలినా కూడా కత్తులను కటార్లను తమ చేతుల్లోనే ఉంచుకొని ఉన్న ఈ వీరులు బాగా చూస్తే బ్రతికి ఉన్నవారివలెనే కనిపిస్తున్నారు. ఈ యుద్ధభూమికి సమర్పించబడిన ఆభరణాలవలె అగుపిస్తున్నారు - చూస్తున్నావా?

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. సూరెలను నందిజను లిం । పారఁగ వినుతింప నొప్పునట్టి మహీశుల్
నారీజనములు సుట్టుం । జేరి పనవుచుండ నునికి సేసె నలంతన్. 19

ప్రతిపదార్థం: సూరెలను= ప్రక్కలను; వంది జనులు= వంది మాగాధులు; ఇంపు+ఆరఁగన్= మనోహరంగా; వినుతింపన్= స్తోత్రాలు చేస్తుండగా; ఒప్పునట్టి= ప్రకాశించేటువంటి; మహీశుల్= రాజులు; నారీజనములు= తమ తమ స్త్రీలు; చుట్టున్+చేరి= చుట్టూచేరి; పనవుచుండన్= ఏడుస్తూ ఉండగా; ఉనికి= ఇట్లా ఉండటం; అలంతన్= దుఃఖాన్ని; చేసెన్= కలిగిస్తోంది.

తాత్పర్యం: వందిమాగధులు చుట్టూ నిలబడి మనోహరంగా స్తోత్రపాఠాలు చెప్తుతూ ఉంటే ప్రకాశించేటువంటి రాజులు తమతమ స్త్రీలు చుట్టూ చేరి హృదయవిదారకంగా ఏడుస్తుండగా ఇట్లా పడి ఉండటం ఎంతో బాధను కలిగిస్తున్నది.

తే. **కూరు మొన పెట్టినట్టులు గొంద ఱుజ్జ్వ । లాయుధములు గంకటములు నమర నున్నఁ**
జూచి చావని వారని చూడు చేర । నరుగకున్నవి కంక గృధ్రాదు లనికి. **20**

ప్రతిపదార్థం: కొందఱు= కొందరు యుద్ధవీరులు; కూరు మొనపెట్టిన+అట్టులు= కునుకుతీస్తున్నవారివలె; ఉజ్జ్వల= ప్రకాశిస్తున్న; ఆయుధములు= ఆయుధాలు; కంకటములు= కవచాలు; అమరన్= ఒప్పగా; ఉన్నన్= ఉండగా; చూచి; చావని వారని= చనిపోయినవారు కారని (అంటే బ్రతికినవారేనని); కంక= రాపులుగులు; గృధ్ర+ఆదులు= గద్దలు మొదలైనవి; అనికిన్= యుద్ధభూమివైపు; అరుగక+ఉన్నవి= వెళ్ళకుండా ఉన్నాయి; చూడు= చూడుము.

తాత్పర్యం: కృష్ణా! అటుచూడుము కొంతమంది వీరులు మెరిసిపోతున్న ఆయుధాలతో తళతళలాడుతున్న కవచాలతో కునుకుతీస్తున్నవారివలె అగుపిస్తూ ఉండటం చూచి వారు బ్రతికినవారే అని రాపులుగులు, గద్దలు ఆవైపుకి రాకుండా దూరదూరంగానే ఉంటున్నాయి.

విశేషం: అలం: భ్రాంతిమంతం.

వ. **ఇది యంతయు నీచే సాధితంబైన కార్యం' బని పలికి వెండియు.** **21**

తాత్పర్యం: ఇదంతా నీవు సాధించిన ఘనకార్య'మని ఎత్తిపొడిచి గాంధారి మళ్ళీ ఇట్లా అంటున్నది.

సీ. **'అట్టలకడ యుత్తమాంగముల్ గానక । యలమట నలుగడ లరయువారుఁ**
దలలు చేతులఁగొని తనువు లుత్తలమునఁ । దఱచు పీనుఁగులలోఁ దడవు వారు
శిరములు మేనులఁ జేర్చి భావించి ని । జాస్యముల్ వ్రేసికొం చఱచువారు
తునియలు పెక్కైనఁ బనివడి గూర్చి రూ । పులు గనుంగొని మూర్ఛ మునుఁగువారు

తే. **నైన కౌరవపాంచాలి మానినీ జ । నముల నచ్యుత! చూడుము నాథజనక**
పుత్రసోదరశవముల పొంతకేఁగి । పెక్కు దురవస్థ లొందెద రక్కటకట! **22**

ప్రతిపదార్థం: అచ్యుత!= కృష్ణా!; అట్టలకడన్= మొండెముల దగ్గర; ఉత్తమాంగముల్= తలలు; కానక= కనిపించక; అలమటన్= దుఃఖంతో; నలుగడలు= నాలుగువైపులా; అరయువారు= తిరిగిచూస్తున్నవారు; తలలు; చేతులన్+కొని= చేతుల్లో పట్టుకొని; తనువులు= మొండెములను; ఉత్తలమునన్= పరితాపంతో; తఱచు= అధికమైన; పీనుఁగులలోన్= శవాలలో; తడవువారు= వెదికి చూచేవారు; శిరములు= తమకు దొరికిన తలలను; మేనులన్+చేర్చి= శరీరాలతో చేర్చి; భావించి= తమవారిని

పోల్చుకొని; నిజ+ఆస్యముల్= తమ ముఖాలను; వ్రేసికొంచున్= మొత్తుకొంటూ; అఱచువారు= ఏడ్చేవారు; తునియలు+ పెక్కు+ఐనన్= శరీరాలు ముక్కలు ముక్కలయిపోగా; పనివడి= యత్నించి; కూర్చి= ఆ భాగాలను చేర్చి; రూపులు= తమవారి దేహాలను; కనుంగొని= గుర్తించి; మూర్ఛన్= మూర్ఛలో; మునుఁగువారున్= పడిపోయేవారు; ఐన= అయినటువంటి; కౌరవ= కౌరవులకు చెందిన; పాంచాల= పాంచాలురకు చెందిన; మానినీజనములన్= స్త్రీలను; చూడుము; నాథ= భర్తల; జనక= తండ్రుల; పుత్ర= కొడుకుల; సోదర= అన్నదమ్ముల; శవముల పొంతకున్+ఏఁగి= శవాల వద్దకు వెళ్ళి; అక్కటకట!= అయ్యయ్యో!; పెక్కు= ఎన్నో; దురవస్థలు= పాట్లు; ఒందెదరు= పడుతున్నారు (పొందుతున్నారు).

తాత్పర్యం: 'కృష్ణా! అటు చూడుము. మొండెముల దగ్గర తలలు కనిపించక కొందరు నాలుగు దిక్కులా పరుగెత్తి తలలు వెదుకుతున్నారు. తలలు చేతులలో పట్టుకొని మొండెములు కనిపించక పరితాపంతో ఆ పీనుగుల పెంటల్లో కొందరు మొండెములు వెదకుతున్నారు. తమకు దొరికిన తలలను శరీరాలతో చేర్చి తమ వారిని పోల్చుకొని బాధతో తలలు మొత్తుకొంటూ కొందరు ఏడుస్తున్నారు. శరీరాలు ముక్కలయిపోగా ఆ భాగాలను కూర్చుకొని తమవారి దేహాలను గుర్తించి కొందరు మూర్ఛపడిపోతున్నారు. తమ భర్తల, తండ్రుల, కొడుకుల, అన్నదమ్ముల శవాలవద్దకు వెళ్ళి, వారు పడుతున్నపాట్లు ఎట్లా చూడటం! అయ్యయ్యో!

తే. అవయవములు రూపఱఁగఁ గ్రవ్యాద భక్షి । తంబులై యున్కిఁ గొన్ని శవంబు లువిద
లెంత సూచియునవి గొంద ఱెఱుఁగ జాల । రయ్యెదరు సూడు తమ బంధులగుటఁ గృష్ణ! 23

ప్రతిపదార్థం: కృష్ణ!= వాసుదేవా!; అవయవములు= శరీర భాగాలు; రూపు+అఱఁగన్= ఆకారాలు నశించగా; క్రవ్యాద= మాంసం తినేటువంటి కాకులు గ్రద్దలు మొదలైనవాటి చేత; భక్షితంబులు+ఐ= తినబడి; ఉన్కిన్= ఉండటంవలన; తమ బంధులు+అగుటన్= తమ బంధువులు కావటంవలన; ఉవిదలు= స్త్రీలు; కొందఱు= కొంతమంది; కొన్ని శవంబులు= కొన్ని శవాలను; ఎంత చూచియున్= ఎంత పరికించినా; అవి= ఆ శవాలను; ఎఱుఁగఁజాలరు+అయ్యెదరు= గుర్తించలేకుండా పోతున్నారు!; చూడు.

తాత్పర్యం: వాసుదేవా! కొన్ని శవాల అవయవాలు నక్కలు కాకులు తినివేయుటంవలన, పూర్తిగా ఆకారాలు కోల్పోవటంవలన, తమబంధువుల శవాలకొరకై వచ్చి పరికిస్తున్న కొంతమంది స్త్రీలు తమవారి దేహాలనే గుర్తించలేకుండా పోతున్నారు. ఇది ఎంత దురవస్థ!

క. ఇట్టివి యెల్లనుఁ గనుఁగొను । కట్టిఁడితన మొందునట్లుగా నేమొకొ తొ
ల్పుట్టువునం జేసితి నీ । చుట్టలనిటు సూడకుండఁ జొప్పడ దయ్యెన్. 24

ప్రతిపదార్థం: ఇట్టివి= ఇలాంటి దురవస్థలను; ఎల్లనున్= అన్నిటిని; కనుఁగొను= చూచేటటువంటి; కట్టిఁడితనము= క్రూరత్వం; ఒందునట్లుగాన్= పొందేటట్లుగా; తొల్పుట్టువునన్= పూర్వజన్మంలో; చేసితిన్= (ఏ పాపాన్ని) చేశానో; ఏమొకొ= ఏమో; ఈ చుట్టలన్= ఈ బంధువులను; ఇటు= ఇలా; చూడకుండన్= చూడకుండా ఉండటానికి; చొప్పడదు+అయ్యెన్= కుదరలేదు.

తాత్పర్యం: ఇట్లాంటి దురవస్థలను చూచే క్రూరత్వం పొందేటట్లుగా పూర్వజన్మలో నేను ఏపాపం చేశానో ఏమో? ఈ బంధువులను ఇట్లా చూడకుండా తప్పింది కాదు.

క. అని పలుకునపుడు దుర్యో । ధనుని కళేబరము దృగ్గతంబగుటయు న
వ్వనిత యిలఁ ద్రెళ్ళె నఱికిన । యనఁటి క్రియన్ మూర్ఛఁ జిత్త మవశం బైనన్. 25

ప్రతిపదార్థం: అని= అని పై విధంగా; పలుకునపుడు= మాట్లాడుతున్న సమయంలో; దుర్యోధనుని కళేబరము= దుర్యోధనుని శరీరం; దృక్+గతంబు+అగుటయున్= కనిపించటంతో; ఆ+వనిత= ఆ స్త్రీ (గాంధారి); మూర్ఛన్= మూర్ఛవలన; చిత్తము= మనస్సు; అవశంబు+ఐనన్= అదుపు కోల్పోగా; నఱికిన= నరికివేసిన; అనఁటి క్రియన్= అరటి చెట్టువలె; ఇలన్= నేలమీద; త్రెళ్ళెన్= పడిపోయింది.

తాత్పర్యం: అని ఇట్లా మాట్లాడుతున్న సమయంలో దుర్యోధనుడి శవం గాంధారి కంటబడింది. వెంటనే ఆ తల్లి మూర్ఛవలన వివశురాలై మొదలు నరికిన అరటిచెట్టువలె నేలమీద పడిపోయింది.

విశేషం: అలం: ఉపమ.

గాంధారి దుర్యోధనుని కళేబరంబు చూచి పలవించుట (సం. 11-17-1)

వ. ఇట్లు మూర్ఛిల్లి కొండొక సేపునకుం దెలిసి గాంధారి పరిచారిక లూఁదికొని పోవ నప్పుత్ర శవంబుకడకుఁ బోయి. 26

ప్రతిపదార్థం: ఇట్లు; మూర్ఛిల్లి; కొండొకసేపునకున్= కొంతసేపటికి; తెలిసి= తెలివివచ్చి; గాంధారి; పరిచారికలు; ఊఁదికొని పోవన్= ఊతగా పట్టుకొనగా; ఆ+పుత్రశవంబు కడకున్= ఆ కుమారుడి శవంవద్దకు; పోయి.

తాత్పర్యం: ఇట్లా మూర్ఛపోయి, కొంత సేపటికి తెలివి రాగా, గాంధారిని పరిచారికలు పట్టుకొని పోగా, ఆ కుమారుడి శవం దగ్గరగా వెళ్ళి.

విశేషం: ఊఁది= ఊతగా; కొని= పట్టుకొని - అంటే ఆసరాగా నిలిచి నెమ్మదిగా నడిపించుకొని పోవటమని అర్థం.

తరలము:

విపుల వక్షముమీఁద నశ్రులు వెల్లిగొల్పుచు వ్రాలి 'యో
నృపతికుంజర! కౌరవేశ్వర! నేలనిమ్మెయి నీ యుదా
త్తపు శరీరముఁ బొందఁ బాడియె? తల్లి వచ్చిన భక్తితో
నుపచరింపక లాఁతివై యిటులూరకుండుట యుక్తమే?' 27

ప్రతిపదార్థం: విపుల= విశాలమైన; వక్షము మీఁదన్= రొమ్ముమీద; అశ్రులు= కంటినీరు; వెల్లికొల్పుచున్= ప్రవాహంలాగా కారుస్తూ; వ్రాలి= ఆశరీరంమీద వాలిపోయి; ఓ నృపతి కుంజర!= ఓ రాజశ్రేష్ఠుడా!; కౌరవేశ్వర!= కౌరవులలో శ్రేష్ఠుడా!; నీ+ఉదాత్తము+శరీరము= నీదైన గొప్ప శరీరం; ఇమ్మెయిన్= ఇంత నికృష్టంగా; నేలన్= నేలమీద; పొందన్= పడిఉండటం (నేలను చేరటం); పాడియె?= న్యాయమా?; తల్లి వచ్చినన్= తల్లి దగ్గరకు వస్తే; భక్తితోన్= భక్తితో ఉపచరింపక= లేచి నమస్కరించి సేవించకుండా; లాఁతివి+ఐ= వేరే వ్యక్తిలాగా; ఇటులు= ఈ విధంగా; ఊరక+ఉండుట= మౌనంగా కదలకుండా ఉండటం; యుక్తమే?= సమంజసమేనా?

తాత్పర్యం: విశాలమైన కుమారుడి రొమ్ముమీద ఎడతెగకుండా కన్నీరు కారుస్తూ గాంధారి వాలిపోయింది. 'రాజులలో పేరుపొందావు. కౌరవులలో అందరికన్నా మిన్న అనిపించుకొన్నావు. నాయనా! నీ గొప్ప దేహం ఇట్లా నికృష్టంగా నేలమీద పడి ఉండటం ఎంత అన్యాయమయ్యా! తల్లి దగ్గరికి వస్తే, లేచి నమస్కరించి ఉపచారాలు చేయకుండా వేరే వ్యక్తివలె కదలకుండా మౌనంగా ఉన్నావే! నీ కిది న్యాయంగా ఉన్నదా?' (అని బాధపడుతున్నది).

విశేషం: తరములో ప్రతిపాదానికీ న, భ, ర, స, జ, జ, గ అనే గణాలుంటాయి. 1-12 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. అని మఱియు ననేక ప్రకారంబులం బలవించుచు హాహాకారంబు లెసంగ రోదనంబు చేసి యా సుబలనందన తన సమీపంబునకుఁ జనుదెంచియున్న యుపేంద్రున కిట్లనియె. 28

ప్రతిపదార్థం: అని= ఇట్లా బాధపడి; మఱియున్= ఇంకా; అనేక= పలు; ప్రకారంబులన్= రీతులలో; పలవించుచున్= విలపిస్తూ; హాహాకారంబులు+ఎసంగన్= హాహాకారాలు అతిశయించగా; రోదనంబుచేసి= ఏడ్చి; ఆ సుబలనందన= ఆ గాంధారి; తన; సమీపంబునకున్= దగ్గరకు; చనుదెంచియున్న= వచ్చి ఉన్న; ఉపేంద్రునకున్= కృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అని ఇట్లా బాధపడి ఇంకా పలువిధాలుగా తనకుమారుడిని గురించి తలచుకొంటూ హాహాకారాలు చేస్తూ ఏడుస్తుండగా గాంధారి సమీపానికి కృష్ణుడు వచ్చాడు. ఆయనను చూచి గాంధారి ఇట్లా అన్నది.

మంగళమహాశ్రీ:

ఈతఁడు రణంబునకు నెత్తి చనుచుండియును నెంతయును భక్తిఁ గని నాకుం
బ్రీతియెసఁగం బలికి బ్రేమ మొలయం బొగడి పెద్దయు వినీతినిరతుండై
చేతులు మొగిడ్చి జయ సిద్ధియుఁగ దీవన విశిష్టదయ నిమ్మనిన ధర్మం
బే తల ననూనమగు నిద్ధజయ మా తలకు నెట్లయిన సిద్ధమగు నంటిన్. 29

ప్రతిపదార్థం: ~~ఈతఁడు~~= ~~ఈ~~ సుయోధనుడు; రణంబునకున్= యుద్ధానికి; ఎత్తి= దండెత్తి; చనుచున్+ఉండియును= వెళ్తూ; ఎంతయును= ఎంతో; భక్తిన్+కని= భక్తితో నన్ను చూచి; నాకున్+ప్రీతి+ఎసఁగన్+పలికి= నాకు ఎంతో సంతోషం కలిగేలా మాట్లాడి; ప్రేమము+ఒలయన్+పొగడి= ప్రేమ పుట్టేలా పొగడి; వినీతి= వినయంతో; నిరతుండు+ఐ= శ్రద్ధ కలిగినవాడై; చేతులు; మొగిడ్చి= జోడించి (నమస్కరించి); జయసిద్ధియుఁగన్= జయం సిద్ధించేలాగున; విశిష్టదయన్= మిక్కిలి అనుగ్రహంతో; దీవనన్= ఆశీస్సు; ఇమ్ము+అనినన్= ఇవ్వాలమ్మా! - అని కోరగా; ధర్మంబు= ధర్మం; ఏ తలన్+అనూనము+అగున్= ఏ పక్షంలో అధికంగా ఉంటుందో; ఇద్ధజయము= గొప్పవిజయం; ఆ తలకున్+ఎట్లయినన్= ఆ వైపు ఎట్లాగైనా; సిద్ధము+అగున్= సిద్ధిస్తుంది; అంటిన్= అన్నాను.

తాత్పర్యం: ఈ సుయోధనుడు యుద్ధానికి పూనుకొని వెళ్తూ ఎంతో భక్తితో నన్ను దర్శించుకొని నాకు సంతోషం కలిగే మాటలు మాట్లాడి ప్రేమ పుట్టేటట్లు పొగడి వినయంతో కూడినవాడై చేతులు జోడించి నమస్కరించి 'తల్లీ! నాకు విజయం సిద్ధించేటట్లుగా నీవు మిక్కిలి అనుగ్రహంతో ఆశీర్వదించుము' అని కోరగా 'నాయనా! ధర్మం ఏ పక్షంలో అధికంగా ఉంటుందో ఆ పక్షానికి దిగ్విజయం ఎట్లాగయినా తప్పక సిద్ధిస్తుం' దని అన్నాను.

విశేషం: 'యతో ధర్మ స్తతో జయః' (ఎక్కడ ధర్మముంటే అక్కడ విజయమని అర్థం). ధర్మం సత్యకర్మకు సంబంధించింది. భగవంతుడు ధర్మసంరక్షణకే అవతరిస్తాడు.

'యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత,
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్' (గీత)

పాండవులు 'ధర్మ' రక్షితులని గాంధారికి తెలుసును కాబట్టి ఇట్లా అంటున్నది.

మంగళమహాశ్రీవృత్తంలో ప్రతిపాదానికీ భ, జ, స, న, భ, జ, స, న, గ, గ అనే గణాలుంటాయి. 1-9-17 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. ఇట్లన నేల? యంటేని. 30

ప్రతిపదార్థం: ఇట్లు; అనన్+ఏల?= ఎందుకు అన్నావు?; అంటి(వి)+ఏనిన్= అంటే.

తాత్పర్యం: ఇట్లా ఎందుకు అన్నానంటే.

మానినీవృత్తము:

జూదమునప్పుడు సర్వజనంబులు చూచి భయంపడి యిప్పని యి
మ్మేదిని సేనలకుం గురుకోటికి మృత్యువు గాని నిజం బలఁతిం
బోదని యాడరె? యమ్మెయి నాదగు బుద్ధికిఁ దోఁచిన సత్యము దా
మోదర! పాటిలదే కొడుకంచుఁ బ్రియోక్తులు వల్కినఁ బెంపు సెడున్. 31

ప్రతిపదార్థం: జూదము+అప్పుడు= జూదమాడే సమయంలో; సర్వజనంబులు= అక్కడ చేరిన జనులంతా; చూచి= ఆ ద్రౌపదీమాన భంగాన్ని చూసి (భీముడు చేసిన ప్రతిజ్ఞలు); భయంపడి= భయపడి; ఈ+పని= ఇట్లా చేయటం; ఈ+మేదినిన్= ఈ భూమిలో; సేనలకున్= సైన్యాలకు; కురుకోటికిన్= కౌరవ సమూహానికి; మృత్యువు+కాని= మృత్యువు తప్ప (మరొకటి కాదు); నిజంబు= సత్యం; అలఁతిన్= తేలికగా; పోదు= పొయ్యేది కాదు; అని; ఆడరె?= అనలేదా?; ఆ+మెయిన్= ఆ విధంగా; దామోదర!= ఓ కృష్ణా!;' నాదగు= నాదైన; బుద్ధికిన్= బుద్ధికి; తోఁచిన సత్యము= తోచిన సత్యం; పాటిలదే?= కలుగదా?; కొడుకు+అంచున్= కొడుకు అంటూ; ప్రియ+ఉక్తులు= మంచిమాటలు; పల్కినన్= పలికితే; పెంపు+చెడున్= శ్రేయస్సు నశిస్తుంది.

తాత్పర్యం: ఆనాడు జూదమాడుతున్న సమయంలో అక్కడ చేరిన జనమంతా ద్రౌపది మానభంగాన్ని, భీముడి ప్రతిజ్ఞలు చూచి ఇట్లా చేయటం ఈ భూమిలోని సైన్యానికి, కౌరవవంశానికి చావుకోసం తప్ప - ధర్మం అంత సులభంగా నశించదు - అని అన్నారు గదా! నా బుద్ధికి కూడా అదే తోచింది. అది జరగకపోతుందా? కుమారుడని మెప్పుకోలు మాటలు పలకటం పెంపు కలిగించదు.

విశేషం: కొడుకు ఇట్లా అడిగినప్పుడు తల్లి అట్లా చెప్పటం కేవలం ద్వాపరయుగానికి సంబంధించిన మాతృధర్మమనే చెప్పాలి. రాజనీతి ప్రకారం ఆలోచిస్తే చివరి నిమిషంలోనైనా ఈ మాటలకు విలువనిచ్చి 'సంధి' చేసుకోకుండా ఉంటాడా అన్న ఆశ కూడా ఆ తల్లికి ఉండవచ్చును. ఆశీర్వదించినా జయం పొందడు. అందుకే ధర్మమున్నచోట విజయమనిచెప్పి అతడినే ఆలోచించుకొమ్మంది. భారతంలోని స్త్రీ పాత్రలలోని విజ్ఞత, వివేకం ఉదాత్తమైనవి - అనటానికి గాంధారి పలుకులు ప్రబల నిదర్శనం.

మానినీ వృత్తంలో ప్రతిపాదానికీ ఏడు భగణాలు, మీద గురువు ఉంటాయి. 1-13 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. వినుము దీవనకుం జొరక మధ్యస్థపుమాట లాడుటయకాదు మఱి నే నప్పు డతని తోడ. 32

ప్రతిపదార్థం: వినుము; దీవనకున్+చొరక= ఆశీర్వదించకుండా; మధ్యస్థపు మాటలు+ఆడుట+అ+కాదు= మధ్యస్థంగా మాటలాడటమే కాదు; మఱి; నేను; అప్పుడు+అతనితోడన్.

తాత్పర్యం: అంతేకాదు. వినుము. ఆశీర్వదించకుండా మధ్యస్థంగా మాట్లాడటమే కాదు. మరి నేను అతడితో ఇంకా- (ఇట్లా అన్నాను.) (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. 'ఆహవంబునయందు నీ వోహటించి । పోవ సడివచ్చు సడి కంటెఁ జావుమేలు;
శస్త్రజీవితఁ బరలోకసౌఖ్య మనుభ । వింపు మమరత్వసంపద వెలయు మంటి.' 33

ప్రతిపదార్థం: ఆహవంబున+అందున్= యుద్ధంలో; నీవు; ఓహటించి+పోవన్= వెనుదిరిగిపోగా; సడి= అపవాదు; వచ్చున్= వస్తుంది; సడికంటెన్= ఆ అపవాదువలన అపకీర్తి కన్నా; చావు మేలు= మరణం మేలు; (కనుక) శస్త్రజీవితన్= శస్త్రాలతో జీవించే యోధుని ధర్మంతో (వీరత్వంతో); పరలోక= స్వర్గలోక; సౌఖ్యము= సుఖాన్ని; అనుభవింపుము; అమరత్వ సంపదన్= స్వర్గంలో మరణంలేని వైభవంతో; వెలయుము+అంటిన్= ప్రకాశించుమన్నాను.

తాత్పర్యం: 'యుద్ధంలో వెనుదిరిగి వస్తే అపకీర్తి వస్తుంది. అపకీర్తికన్నా చావు నయం. నీవు యుద్ధవీరుడుగా జీవించుము. పరలోక సౌఖ్యాన్ని పొందుము. స్వర్గంలో మరణంలేని వైభవాన్ని పొందుము. సుఖించుము' అన్నాను.

క. అని చెప్పియుంటి; నా చె । ప్పిన యట్టులు సేసి యితఁడు పేరును బెంపుం
గనియుండఁగ ని ట్లడలున । మునుఁగు టరయఁ గడుపుశోకమున పెంపు సుమీ! 34

ప్రతిపదార్థం: అని= అని పై విధంగా; చెప్పి+ఉంటిన్= చెప్పాను; నా+చెప్పిన+అట్టులు+చేసి= నేను చెప్పినట్టుగా చేసి; ఇతఁడు= దుర్యోధనుడు; పేరును= కీర్తిని; పెంపున్= ప్రతిష్ఠను; కని+ఉండఁగన్= పొంది ఉండగా; ఇట్లు= ఈ విధంగా; అడలునన్= దుఃఖంలో; మునుఁగుట= మునిగిపోవటం; అరయన్= బాగా ఆలోచిస్తే; కడుపు శోకమునన్= పుత్రుడు చావటంవలన ఏర్పడిన గర్భ శోకం యొక్క; పెంపు సుమీ!= అతిశయం తప్ప మరొకటికాదు సుమా!

తాత్పర్యం: అట్లా నేను ఆనాడు చెప్పాను. నేను చెప్పినట్టుగానే చేసి దుర్యోధనుడు కీర్తి ప్రతిష్ఠలు పొందాడు. ఇక అతడిని గురించి ఇట్లా ఏడుస్తూ ఉన్నానంటే కేవలం పుత్రశోకంతో మాత్రమే తప్ప, అతడి కేమి తక్కువ?

విశేషం: శోకాలలో పుత్రశోకం నిరంతరంగా ఉంటుందని పెద్దలు చెప్తుతారు.

మాతృదుఃఖం తు షాణ్మాసం । పితృదుఃఖం తు వత్సరమ్,
భార్యాదుఃఖం పునర్భార్యా । పుత్రశోకం నిరంతరమ్.

తల్లి పోతే ఆరు నెలలు చింతిస్తారు. తండ్రిపోతే సంవత్సరంపాటు దుఃఖిస్తారు. భార్య చనిపోతే దుఃఖం మరో భార్య వచ్చే వరకే. కాని పుత్రుడి మరణం జీవితాంతం దుఃఖాన్ని కలగజేస్తుంది.

ఇక్కడ గాంధారీధృతరాష్ట్రుల శోకం తగ్గకపోవటానికి హేతువు గర్భసంబంధమే.

ఆ. అరి విమర్ది యితనికై వగపేటికిఁ । బుణ్య లోకమునకుఁ బోయెననుచు
నుండ నోపెనేని నుల్లంబు ధృతరాష్ట్రు । దిక్కులేమిఁ దలఁచి పొక్కకున్నె?' 35

ప్రతిపదార్థం: అరి విమర్ది= శత్రువులను చంపిన; ఇతనికై= ఇతనికోసం; వగపు+ఏటికిన్?= చింత ఎందుకు?; పుణ్యలోకమునకున్= పుణ్యలోకాలకు; పోయెను+అనుచున్+ఉండన్+ఓపెను+ఏని= వెళ్ళిపోయాడంటూ ఉండగలిగినా; ఉల్లంబు= హృదయం; ధృతరాష్ట్రు= ధృతరాష్ట్రునియొక్క; దిక్కులేమిన్= దిక్కులేనితనాన్ని; తలఁచి= తలచుకొని; పొక్కక+ఉన్నె?= దుఃఖించకుండా ఉంటుందా?

తాత్పర్యం: శత్రువులను ఘోరంగా చంపి తానూ చనిపోయిన ఇతడికొరకు చింతించటం ఎందుకు? పుణ్యాత్ముడు స్వర్గానికి వెళ్ళిపోయా డంటూ ఉండగలిగినా ఆ పెద్దాయన ధృతరాష్ట్రుడికి ఈ వయసులో ఆసరాగా ఎవరూ లేకపోయారే? అన్న ఆలోచనతో హృదయం తరుక్కుపోతున్నది. ఈ దుఃఖం తప్పుతుందా కృష్ణా!'

వ. అని వెండియు. 36

తాత్పర్యం: అని మళ్ళీ ఇట్లా అన్నది.

సరసిజ వృత్తము:

'శ్రీరమ్యత్వం బారఁగఁ బెం పూర్జితముగ మణివిరచితమకుటములం
దారుం జూడన్ సారవిభూతిన్ ధరణిపు లనిమిషధవనిభు లగుచున్
భూరిప్రీతిన్ సూరెలఁ గొల్వన్ భువనవినుతమగు పొలుపు వెలయ ము
న్నీ రా జుండున్ దారుణ దైవం బిటు పఱచునె తుది నితని? కటకటా! 37

ప్రతిపదార్థం: శ్రీరమ్యత్వంబు= రాజ్యసంపద యొక్క మనోహరత్వం; ఆరఁగన్= ఒప్పగా; పెంపు= వైభవం; ఊర్జితముగన్= వృద్ధిచెందగా; మణి విరచిత= మణులు పొదిగిన; మకుటములన్= కిరీటాలతో; సారవిభూతిన్= గొప్ప సంపదలతో; ధరణిపులు= రాజులు; అనిమిషధవ= (దేవతలరాజు - ఇంద్రుడు) ఇంద్రుడితో; నిభులు+అగుచున్= సమానులవుతూ; తారున్+చూడన్= తాము చూస్తుండగా; భూరిప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; సూరెలన్= ప్రక్కల; కొల్వన్= సేవిస్తుండగా; భువన వినుతము+అగు= ప్రపంచ ప్రసిద్ధమైన; పొలుపు= వైభవం; వెలయన్= ప్రకాశించగా; మున్ను+ఈ రాజు+ఉండున్= మునుపు ఈ సుయోధనుడు వెలిగాడు; తుదిన్= చివరికి; దారుణదైవంబు= కరుణలేని దైవం; ఇతనిన్= ఇతడిని; ఇటు+పఱచునె?= ఇట్లా భంగపరుస్తుందా?; కటకటా!= అయ్యయ్యో!.

తాత్పర్యం: 'కృష్ణా! రాజ్యసంపదవలని మనోహరత్వంతో వృద్ధిచెందిన వైభవంతో మణులు పొదిగిన కిరీటాలు కలిగిన గొప్ప కీర్తి సంపదలతో విరాజిల్లుతూ ఇంద్రసములైన రాజులు తనచుట్టూ చేరి సేవిస్తుండగా సంతోషించినవాడు ఈ దుర్యోధనుడు. ఇతడి వైభవం ఈ భువనంలోనే సుప్రసిద్ధమైనది. అట్లాంటి ఇతడిని పాపిష్ఠి దైవం చివరకు ఇట్లా భంగపరుస్తుందా! అయ్యో ! ఎంత దారుణం!

విశేషం: సరసిజవృత్తంలో ప్రతిపాదానికీ వరుసగా మ, త, య, న, న, న, స - గణాలు ఉంటాయి. 1-10-18 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం లేదు.

తే. **కనకబహురత్నమయ పీఠమున మృగాక్షు । లాలవట్టంబు లిడఁ జెలు వమరునట్టి**
కౌరవేంద్రుండు పెనునేలఁ గంకపక్ష । పవన హతుఁడయ్యెఁ జూచితె? పద్మనాభ! **38**

ప్రతిపదార్థం: పద్మనాభ!= ఓ కృష్ణా!; మృగాక్షులు= లేడి కన్నులుగల స్త్రీలు; ఆలవట్టంబులు+ఇడన్= గుడ్డతో చేసిన గుండ్రని పెద్దవిసనకర్ర (సం. ఆలావర్తం)తో వీస్తుండగా; కనక బహురత్నమయ= బంగారుతోను, అనేక మణులతోను చేయబడిన; పీఠమునన్= సింహాసనంలో; చెలువు+అమరునట్టి= అందంగా ప్రకాశించేటటువంటి; కౌరవేంద్రుండు= దుర్యోధనుడు; పెనునేలన్= ఈ విశాలమైన, కఠినమైన నేలమీద; కంకపక్ష= రాపులుగుల రెక్కలచేత పుట్టిన; పవన= హోరుగాలిచేత; హతుఁడు+అయ్యెన్= కొట్టబడినవాడయ్యాడు - చనిపోయాడు; చూచితె?= చూచావా? (ఎంత ఘోరమో).

తాత్పర్యం: కృష్ణా! లేడికన్నులవంటి కన్నులున్న పరిచారక స్త్రీలు వస్త్రంతో తయారుచేసిన పెద్ద విసనకర్రను వీస్తుండగా మణులు పొదిగిన బంగారు సింహాసనంలో అందంగా కొలువు తీరినట్టి ఈ దుర్యోధనుడు ఈనాడు ఈ యుద్ధభూమిలో రాబందుల రెక్కలనుండి పుట్టిన హోరుగాలి తాకిడికి గురి అయ్యాడు - ప్రాణాలు పోగొట్టుకున్నాడు. చూచావా? ఎంత ఘోరంగా ఉన్నదో!

క. **ఈ రాజు భీమసేను ను । దారోగ్ర పరాక్రమమున ధరణి నొఱగి దు**
ర్వారమదవారణము కం । ఠీరవము విహారమునఁ బడిన గతిఁ బొలిచెన్. **39**

ప్రతిపదార్థం: ఈ రాజు= అలాంటి ఈ దుర్యోధనుడు; భీమసేను= భీమసేనుడి; ఉదార+ఉగ్ర పరాక్రమమునన్= ఘనమైన క్రూరమైన పరాక్రమంచేత; దుర్వార= వారించటానికి వీలులేని; మదవారణము= మదించిన ఏనుగు; కంఠీరవము విహారమునన్= సింహంతో చేసిన వినోద క్రీడలో (లేదా సింహం వీర విహారంలో); పడిన గతిన్= చనిపోయేరీతిలో; ధరణిన్+ఒఱగి= నేలమీద ఒరిగిపోయి; పొలిచెన్= కనిపిస్తున్నాడు.

తాత్పర్యం: అట్లాంటి ఈ దుర్యోధనుడు భీమసేనుడి ఘనమైన క్రూరమైన పరాక్రమంతో ఓడి, మదపుటేనుగు సింహం చేసిన వీర విహారంలో చనిపోయినట్టుగా నేలమీద ఒరిగిపోయి కనిపిస్తున్నాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **విదురుఁడుఁ దండ్రియుఁ దనకుం । బదివేలవిధములఁ జెప్పఁ బాటింపఁడు దు**
ర్మదమునఁ దగియెడు బుద్ధులు । విధి మూఁడిన మర్త్యుఁ డేల విను నుచితోక్తుల్? **40**

ప్రతిపదార్థం: విదురుఁడు= పినతండ్రి విదురుడు; తండ్రియున్= తన తండ్రి ధృతరాష్ట్రుడు; తనకున్= తనకని; తగియెడు= తగిన; బుద్ధులు= మంచిమాటలు (నీతులు); పదివేల విధములన్= పదివేల రీతులుగా; చెప్పన్= చెప్పగా; దుర్మదమునన్= మిక్కిలి మదంతో; పాటింపఁడు= విన్నాడు కాడు; విధి= కర్మ (చేటు); మూఁడిన= సంభవించిన; మర్త్యుడు= మనిషి; ఉచిత+ఉక్తుల్= సుభాషితాలు; ఏల వినున్?= ఎందుకు వింటాడు?

తాత్పర్యం: తన పినతండ్రి, మహాజ్ఞాని విదురుడు, తన తండ్రి ధృతరాష్ట్రుడు చెవిలో ఇల్లుకట్టుకొని ఎన్ని వేల విధాలుగానో బుద్ధిమాటలు చెప్పారు. ధర్మాన్ని బోధించారు. కాని, అతడి దుర్మదం అట్లాంటిది. ఒకరి మాటలూ లెక్కచేసినవాడు కాడు. చేటుమూడిన మనిషి సుభాషితాలు వింటాడా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. పదునొకఁ డక్షౌహిణు లే । పొదవఁగ నలిఁ గొలువ నొప్ప నుర్వీశ్వరుఁడే
తుది నిష్పరివారుండై । గదఁ జేకొని యొంటి పోరి కలనిం బడియెన్. 41

ప్రతిపదార్థం: పదునొకఁడు= పదకొండు; అక్షౌహిణులు= అక్షౌహిణుల సైన్యం; ఏపు= ఆధిక్యం; ఒదవఁగన్= కలుగగా; నలిన్= ఉత్సాహంతో; కొలువన్= సహాయకారులుగా సేవించగా; ఒప్పు= ప్రకాశించే; ఉర్వీశ్వరుఁడే= ఈ సుయోధన మహారాజే; తుదిన్= చివరికి; నిష్పరివారుండు+ఐ= ఏ పరివారములేనివాడై; గదన్= గదను; చేకొని= తీసికొని; ఒంటి= ఒంటరిగా; పోరి= యుద్ధంచేసి; కలనిన్= యుద్ధభూమిలో; పడియెన్= నేలకు ఒరిగాడు.

తాత్పర్యం: పదకొండు అక్షౌహిణుల సైన్యం ఆధిక్యం అతిశయించగా ఉత్సాహంతో తనవెంట ఉండగా ప్రకాశించే ఈ రాజే చివరకి ఏతోడూ లేక గదను తీసికొని ఒంటరిగా పోరాడి నేలమీద పడ్డాడు.॥

తే. ధరణి గజఘోటకము లొప్ప ధార్తరాష్ట్ర । లెల్లఁ బొలుపారఁగాఁగంటి నిప్ప డవి వి
నాశ మొందినఁ బాడఱి నలిననాభ । యది పరాధీనముగఁ జూచునట్టి దయ్యె.' 42

ప్రతిపదార్థం: నలిననాభ!= పద్మనాభా! (కృష్ణా!); ధరణి= విశాలమైన రాజ్యమూ; గజ= ఏనుగులు; ఘోటకములు= గుఱ్ఱాలు; ఒప్పన్= ఒప్పగా; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్ర కుమారులు; ఎల్లన్= అందరూ; పొలుపు+ఆరన్+కాన్= వైభవంగా ఉండటం; కంటిన్= చూశాను; ఇప్పుడు= ఈనాడు; అవి= ఆ ఏనుగులు; గుఱ్ఱాలు; వినాశమొందినన్= నశించగా; అది= ఆ భూమి; పాడఱి= శూన్యమై; పరాధీనముగన్= శత్రువులకు వశం కాగా; చూచునట్టిది+అయ్యెన్= చూసేటువంటిది అయినది (చూడటం సంభవించినది).

తాత్పర్యం: కృష్ణా! విశాలమైన ఈ రాజ్యం, ఏనుగులు, గుఱ్ఱాలు కలిగి కురుకుమారులు వైభవోపేతంగా అందరూ కలకలలాడుతూ ఉండటం చూచాను. అదే ఈనాడు ఆ ఏనుగులు, గుఱ్ఱాలు సర్వనాశనమైపోగా, ఈ విశాలభూమి శూన్యమై పరాధీనం కాగా చూచే దౌర్భాగ్యం నాకు దాపురించింది.'

వ. అని దుర్యోధనవల్లభ నిరీక్షించి మాధవు నుద్దేశించి యిట్లనియె. 43

ప్రతిపదార్థం: అని= ఇట్లా అని; దుర్యోధన వల్లభన్= దుర్యోధనుడి భార్యను (భానుమతిని); నిరీక్షించి= చూచి; మాధవున్= శ్రీకృష్ణుడి; ఉద్దేశించి= వైపు చూచి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ఇట్లా అని, గాంధారి భానుమతిని చూచి శ్రీకృష్ణుడివైపు తిరిగి ఇట్లా అన్నది.

ఆ. 'కొడుకు చావుకంటెఁ గోడలి యడలునఁ । బెరిఁగి శోకవహ్ని దరికొనంగ
నంతరంగ మిప్ప డగ్గల మెరియంగఁ । దొడఁగె దీనికేది తుది? యుపేంద్ర! 44

ప్రతిపదార్థం: ఉపేంద్ర!= కృష్ణా!; కొడుకు= కుమారుడి; చావుకంటెన్= మృతికన్నా; కోడలి= ఈ భానుమతి; అడలునన్= శోకంతో; పెరిఁగి= అధికమై; శోకవహ్ని= శోకమనే; నిప్పు; దరికొనంగన్= విజృంభిస్తుండగా; అంతరంగము= హృదయము; ఇప్పుడు= ఇప్పుడు; అగ్గలము= మిక్కిలిగా; ఎరియంగన్+తొడఁగెన్= మండటం మొదలుపెట్టింది; దీనికిన్= ఈ బాధకు; ఏది తుది?= అంతం ఎక్కడ?

తాత్పర్యం: 'కృష్ణా! కొడుకు చనిపోవటం వలన కంటె ఈ కోడలి దుఃఖం వలన నాలో ఉన్న శోకమనే అగ్ని బాగా ప్రజ్వరిల్లి హృదయాన్ని కాల్చివేయటం మొదలుపెట్టింది. ఈ బాధకు అంతం ఎక్కడ?

విశేషం: అలం: రూపకం.

సీ. **చూడు మిమ్ముద్దియ సుతుఁజూచి వదన మ । ల్లార్చుచుఁ బ్రాణేశునాననంబు**
పైఁ జూడ్కి యడరించి పాణితలంబున । నందంద నెమ్మొగ మడిచికొనుచు
మరలఁ బుత్రునిదెస కరిగిన మనసు పే । రడలున మునుఁగంగ నతని చెన్ను
మోమునఁ దనమోము మోపి మూర్ఛిల్లుచుఁ । దెలిసి వల్లభునురఃస్థలము గ్రుమ్ము

తే. **నుడుకుఁ గన్నీరఁ దడియంగ నొఱగుచును వి । చేష్టయై యూరకుండుచుఁ జెలులతోడఁ**
దిరిగి పొగులంగ వేనలి విరియ మేన । నవులఁ దిరుగుచున్నది యక్కటకట! 45

ప్రతిపదార్థం: చూడుము; ఈ+ముద్దియ= ఈ స్త్రీ; సుతున్+చూచి= కుమారుడిని చూచి; వదనము= ముఖం; అల్లార్చుచున్= కదలిస్తూ= అటూ ఇటూ ఊపుతూ; ప్రాణేశు+ఆననంబుపైన్= తన భర్త ముఖంమీదికి; చూడ్కి= చూపును; అడరించి= వ్యాపింపచేసి; పాణితలంబునన్= అరచేతితో; అందందన్+నెమ్మొగము= ముఖంమీద పలుమార్లు; అడిచికొనుచున్= కొట్టుకొంటూ; మరలన్= మళ్ళీ; పుత్రుని దెసకున్= కొడుకు వద్దకు; అరిగినన్= పోగా; మనసు= తన మనస్సు పేరు+అడలునన్= పెను దుఃఖంలో; మునుఁగంగన్= మునిగిపోగా; అతని చెన్నుమోమునన్= అతడి అందమైన ముఖంపైన; తన మోము= తన ముఖాన్ని; మోపి= ఆనించి; మూర్ఛిల్లుచున్= మూర్ఛపోయి; తెలిసి= తెలివి వచ్చాక; వల్లభు+ఉరఃస్థలమున్= భర్త రొమ్ముమీద; గ్రుమ్మన్= తలబాదుకొంటుంది; ఉడుకు+కన్నీరన్= వేడి కన్నీటితో; తడియంగన్= తడిసేటట్లు; ఒఱగుచును= ఒరగిపోతూ; విచేష్టయై= చేష్టలుడిగి; ఊరకుండుచున్= మౌనంగా ఉండిపోతూ; చెలులతోడన్= తోడి స్త్రీలతో; తిరిగి= కలిసిమళ్ళీ; పొగులంగన్= ఏడుస్తుండగా; వేనలి= జడ; మేనన్= ఒంటిపై విరియన్= వ్యాపించగా; అవులన్= పిచ్చిదానిలాగా బయట; తిరుగుచున్నది= తిరుగుతోంది; అక్కటకట!= అయ్యయ్యో!

తాత్పర్యం: కృష్ణా! చూడుము. ఈ భానుమతి తన కొడుకును చూచి ముఖం అల్లాడిస్తూ, భర్త ముఖం వైపు చూచి అరచేతితో తన తలమీద పలుమార్లు బాదుకొంటున్నది. మళ్ళీ కొడుకువైపు మనసుపోగా దుఃఖంలో మునిగిపోయి అందమైన అతడి ముఖంమీద తన ముఖం పెట్టి మూర్ఛపోయింది. తెలివి వచ్చాక భర్త శవంవద్దకు వెళ్ళి రొమ్ముమీద తలను బాదుకొంటున్నది. ఆమె వేడి కన్నీటితో భర్త దేహం తడిసిపోయేటట్లు ఒరిగిపోయింది. నిశ్చేష్టురాలై మౌనంగా ఉండిపోయి మళ్ళీ తన తోడి స్త్రీలతో కలిసి ఏడవటం మొదలుపెట్టింది. జడ విడిపోయి దేహమంతా వ్యాపించగా పిచ్చిదానివలె బయట తిరుగుతున్నది. అయ్యయ్యో! ఎంత ఘోరం!

విశేషం: అలం: స్వభావోక్తి

వ. **అని వెండియు.** 46

తాత్పర్యం: అని ఇంకా.

సీ. ఈ సుమధ్యమ యిమ్మహీశ్వరు బాహు త । లంబున లలితోపలాలనంబు
నొంది రాగిల్లెడునుల్లంబుతో నుండు । నింకిట నిమ్ముద్ద నెట్లు సూడ
వచ్చుఁ? గనుంగొన వశముగాదిది యిట్టి । కొడుకును మనుమండుఁ బుడమి నిట్లు
పడియుండఁ జూచెడు పాపజాతికి నిప్ప । డవియక నిగ్గడియైన యినుప

తే. గుండియకుఁ జేటుపాటింకఁ బుండరీక । నయన! యెన్నఁడు లేమి నిర్ణయముగాదె?
యింత కోర్చెడు నట్టివా రెన్నఁడేని । నుర్వి నెందేని గలుగుదురొక్కొ యొరులు? 47

ప్రతిపదార్థం: పుండరీక నయన!= శ్వేతకమలాక్షా! కృష్ణా!; ఈ సుమధ్యమ= ఈ స్త్రీ (చక్కని నడుముగలది); ఈ+మహీశ్వరు= ఈ సుయోధనుని; బాహుతలంబునన్= బాహువులక్రింద; లలిత+ఉపలాలనంబున్= సుకుమారమైన బుజ్జగింపును; ఒంది= పొంది; రాగిల్లెడు+ఉల్లంబుతోన్= ప్రేమమయమైన హృదయంతో; ఉండున్= ఉంటుంది; ఇంకన్+ఇటన్= ఇకమీదట; ఈ+ముద్దన్= ఈ ముద్దరాలిని; ఎట్లు+చూడఁగన్+వచ్చున్?= ఎట్లా చూడగలము?; కనుంగొనన్+వశము+కాదు+ఇది= ఇది చూడటానికి దుర్భరమైన విషయం; ఇట్టి కొడుకును= ఇట్లాంటి కుమారుడు; మనుమండు= ఇట్లాంటి మనుమడూ; పుడమిన్+ఇట్లు= నేలమీద ఇలా; పడి+ఉండన్+చూచెడు= పడి ఉండగా చూచేటువంటి; పాపజాతికిన్= పాపిష్ఠురాలైననాకు; ఇప్పుడు+అవియక= ఇప్పుడే బద్దలు అయిపోకుండా; నిగ్గడి+ఐన= కఠినమైన; ఇనుము+గుండియకున్= ఇనుముతో తయారైన గుండెకు; చేటు+పాటు+ఇంకన్= నాశనం ఇంక; ఎన్నఁడున్= ఏనాటికీ; లేమి= లేకపోవటం; నిర్ణయము+కాదె?= నిశ్చయమేకదా!; ఇంతకున్+ఓర్చెడు+అట్టివారు= ఇంతకష్టానికి కూడా ఓర్చుకొనేటువంటివారు; ఎన్నఁడు+ఏనిన్= ఏనాడైనా; ఉర్విన్+ఎందేనిన్= భూమిమీద ఎక్కడైనా; ఒరులు= ఇతరులు; కలుగుదురు+ఒక్కొ?= ఉంటారా మరి?

తాత్పర్యం: కృష్ణా! సన్నని నడుము గలిగిన ఈ భానుమతి ఆ సుయోధనుడి ఉన్నత బాహువుల నీడలో బుజ్జగింపబడి, అతిశయించిన ప్రేమతో సంతోషంతో కనిపించేది. ఇక పైన ఈ ముద్దరాలిని ఎట్లా చూడగలం చెప్పుము? ఇది భరించరాని విషయం. ఇట్లాంటి కొడుకును మనవడిని నేలమీద దిక్కులేకుండా ఇట్లా పడిఉండగా చూచేటటువంటి పాపిష్ఠిదాన్ని నేను. నా గుండె మామూలు గుండెకాదు. ఇనుపగుండె. అందుకే ఇంత దురవస్థను చూచీ బద్దలైపోకుండా ఇంకా అట్లాగే ఉన్నది. ఇక ఎప్పటికీ ఇది బద్దలు కాదు. ఎంత కఠినురాలిని నేను! ఇంత కష్టాన్ని ఓర్వగలిగినవారు ఏ కాలంలోనైనా భూమిమీద ఎక్కడైనా ఇతరు లున్నారా? (నేను తప్ప).

క. జననియు భార్యయు నేమై । న నేమి? వేదములు బొంకునకుఁ జొరమి నిజం
బని పుణ్యలోక మగునని । తన కార్యము సూచె నిట్లు తగునె యితనికిన్?' 48

ప్రతిపదార్థం: జననియున్= తల్లీ; భార్యయున్= భార్యా; ఏమి+ఐనన్+ఏమి?= ఏమయితే ఏమి?; వేదములు= వేదాలు; బొంకునకున్+చొరమి= అసత్యానికి సాహసించకపోవటం; నిజంబు+అని= సత్యమని; పుణ్యలోకము+అగును+అని= స్వర్గం తప్పకసిద్ధిస్తుందని; తన కార్యము+చూచెన్= తనపని తాను చూచికొన్నాడు; ఇతడికిన్= ఇతనికి; ఇట్లు= ఇలా (చేయటం); తగునె?= సరిపోతుందా?

తాత్పర్యం: ఈ దుర్యోధనుడు 'తల్లీ భార్యా ఏమైతేనేమి? వేదాలు అసత్యం పలకవు. స్వర్గం తప్పక సిద్ధిస్తుంది.' అని తనపని తాను చేసికొని తన స్వర్గం తాను చూచికొన్నాడు. ఇట్లా చేయటం సమంజసంగా ఉన్నదా!'

వ. అని యనేక భంగుల విలాపంబు సేసి తక్కటితనయుల దెస నాలోకించి విష్ణుదేవునితో నిట్లనియె. 49

ప్రతిపదార్థం: అని= ఇలా చెప్పి; అనేక భంగులన్= రకరకాలుగా; విలాపంబు+చేసి= ఏడ్చి; తక్కటి= తక్కిన; తనయుల దెసన్= కుమారులవైపు; ఆలోకించి= చూచి; విష్ణుదేవునితోన్= కృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నది.

తాత్పర్యం: ఇట్లా అనేక విధాలుగా వాపోయి, ఏడ్చి ఏడ్చి, చివరికి తక్కిన కుమారుల శవాల వైపు చూచి కృష్ణుడితో ఇట్లా అన్నది.

భాస్కర విలసిత వృత్తము:

కౌరవనృపతి తనూజశతంబుం గంటె? పవనసుతు పటుభుజలీలా
ఘోరతఁ దడఁబడ మేదినిమీఁదఁగూలె వికటముఖకరచరణత్వం
బేరికయినఁ గనుఁగొన్న విషాదం బెంతయు మది నొలయఁగఁ బ్రియకాంతల్
చేరి విలపనము దద్దయు నార్తిం జేయఁగ నునికి వనట తిరిఁ బెట్టన్. 50

ప్రతిపదార్థం: కౌరవనృపతి= ధృతరాష్ట్ర మహారాజుయొక్క; తనూజ శతంబున్= నూరుగురు కొడుకులను; కంటె?= చూశావా?; పవనసుతు= భీముని; పటు= బలంతోకూడిన; భుజలీలా ఘోరతన్= భుజముల విలాసంయొక్క భీకరత్వంచేత; తడఁబడన్= ముందువెనుకలై; మేదినిమీఁదన్= నేలమీద; కూలెన్= పడిపోయారు; (వారి); వికట= వికారంపొందిన; ముఖ= ముఖాలు; కరచణత్వంబు= చేతులు, కాళ్ళు కలిగి ఉండటం; ఏరికిన్+అయినన్= ఎవరికైనా; కనుగొన్నన్= చూస్తే; విషాదంబు= విషాదం; ఎంతయున్= ఎంతో (పుడుతుంది); మదిన్+ఒలయఁగన్= (విషాదం) మనసుల్లో పుట్టగా; ప్రియకాంతల్= ఈ కురువీరకుమారుల భార్యలు; చేరి= వారి శవాలవద్దచేరి; తద్దయున్= మిక్కిలి; ఆర్తిన్= దీనత్వంతో; విలపనము= విలాపం; చేయఁగన్+ఉనికి= చేస్తూ ఉండటం; వనట= దుఃఖాన్ని; తిరిన్+పెట్టన్= పురివెట్టగా (అధికంగా చేయగా).

తాత్పర్యం: కృష్ణా! అదిగో! అక్కడ ధృతరాష్ట్ర మహారాజుగారి నూరుగురు సంతానాన్ని చూడుము. భీముడి బలిష్ఠమైన భుజాల విలాసానికి తలకిందులై నేలమీద కూలారు. వికారం పొందిన వారి ముఖాలు, కాళ్ళు చేతులు చూస్తే ఎవరికైనా దుఃఖం కలుగుతుంది. అట్లాంటిది ఈ కుమారుల భార్యలందరూ వారి శవాలవద్ద చేరి అతిదీనంగా విలపిస్తూ ఉండటం చూస్తూంటే దుఃఖం మరింత అధికమవుతున్నది.

విశేషం: (తిరిఁబెట్టు'= అన్నది జాతీయం. దీనికి గుడ్డను పురిపెట్టి చెవుల్లో ముక్కుల్లో ఎక్కించటమని అర్థం. పురి ఎక్కించటమనీ అర్థం. పురి ఎక్కిస్తే గట్టిదనం ఎక్కువ అవుతుంది. దానితో ఫలితం అధికమవుతుంది. అట్లాగే దుఃఖం రెండింతలయిందనే అర్థంలో తిక్కనగారు అచ్చమైన ఈ గ్రామీణమైన పలుకుబడిని గాంధారినోట పలికించారు.

భాస్కరవిలసిత వృత్తానికి ప్రతిపాదంలోనూ వరుసగా భ, న, జ, య, భ, న, న, స, గ - అనే గణాలు ఉంటాయి 1-13 అక్షరాలకు యతిమైత్రి. ప్రాస నియమం ఉన్నది.

తే. చందనార్ద్రకుట్టిమములఁ జరణతలము । లొందుటకు నేవగించు నయ్యువిదలిపుడు
నెత్తురుల రేవ మెక్కిన నేలఁ బొరలు । చున్న వారేమి సెప్పుదు? నుడుకుపేర్మి. 51

ప్రతిపదార్థం: చందన+ఆర్ద్ర= శ్రీగంధ కలాపంచేత తడిగా ఉన్న; కుట్టిమములన్= రత్నాలు పొదిగిన చలువరాతి చుట్టులపైన; చరణతలములు= అరికాళ్ళు; ఒందుటకున్= మోపటానికి; ఏవగించు= అసహ్యించుకొనే; ఆ+ఉవిదలు+ఇపుడు= ఆ కురువీరుల భార్యలు ఇపుడు; ఉడుకుపేర్మిన్= విషాదంవలన పుట్టిన వేడితో; నెత్తురుల= రక్తం గడ్డకట్టటంచేత; లేవము+ఎక్కిన= గట్టిపడిన; నేలన్+పొరలుచున్నవారు= నేలమీదపడి పొర్లుతున్నారు; ఏమి+చెప్పుదున్?= ఏమనగలను?

తాత్పర్యం: పూర్వం శ్రీగంధం పూసినందువలన చల్లగా తడిగా ఉన్న చలువరాతి చట్టులపైన కాళ్ళుమోపటానికి అసహ్యించుకొనే కురుకుమారుల భార్యలు విషాదం వలన పుట్టిన నిండు వేడిమిలో రక్తం గడ్డలుకట్టి గట్టిపడిన ఈ యుద్ధభూమిలో పడి పొర్లుతున్నారు. ఏ మనేది ఈ దురదృష్టాన్ని?

క. బాలలుఁ దరుణులు ప్రౌఢలుఁ । దూలెడు వికలాంగకములతో డెందములన్
వాలిన విరహానలముల । పాలై వందురెద రొక్కభంగిన యకటా! 52

ప్రతిపదార్థం: బాలలున్= చిన్న వయసులోనివారు; తరుణులు= యుక్తవయసులోనివారు; ప్రౌఢలు= నడిమి వయసులోని వారు; తూలెడు= తూలిపోతున్న; వికల+అంగకములతోన్= వికారశరీరాలతో; డెందములన్= హృదయాలలో; వాలిన= విజృంభించిన; విరహ+అనలముల= విరహమనే అగ్నుల; పాలై= పాలై; ఒక్కభంగిన్= ఒకే రీతిగా; వందురెదరు= దుఃఖిస్తున్నారు; అకట!= అయ్యో! (ఏం దురవస్థ).

తాత్పర్యం: ఈ కురుకుమారుల భార్యలలో చిన్నవారు, యుక్తవయుసులలోనివారు, నడివయస్సులలో ఉన్నవారు -అందరూ తూలిపోతున్న వికార శరీరాలతో హృదయాలలో విరహాగ్నులు విజృంభించగా, ఒకే రీతిలో ఏడుస్తూ దుఃఖిస్తున్నారు. అయ్యో! ఇదేమి దురవస్థ!

క. బలదర్ప ధైర్యశౌర్యో । జ్జ్వలులగు ధృతరాష్ట్రసుతుల సతులకు ని ట్లా
కులతమెయి వనటపెల్లునఁ । దలరవలసె దిక్కుమాలి దైవముచెయిదిన్. 53

ప్రతిపదార్థం: బల= బలంచేత; దర్ప= గర్వంచేత; ధైర్య= ధైర్యంచేత; శౌర్య= పరాక్రమంచేత; ఉజ్జ్వలులు+అగు= మిక్కిలి ప్రకాశించిన; ధృతరాష్ట్ర సుతుల సతులకున్= కురు కుమారుల భార్యలకు; ఇట్లు= ఈ విధంగా; ఆకులతమెయిన్= వ్యాకులతతో; దిక్కుమాలి= ఏ దిక్కులేకుండా; దైవము చెయిదిన్= ఆ దైవ చేష్టవలన; వనట పెల్లునన్= అధికమైన దుః ఖంలో; తలర వలసెన్= బాధపడవలసి వచ్చింది.

తాత్పర్యం: ఈ కురుకుమారులు బల మున్నవారు. గర్వ మున్నవారు. ధైర్యపరాక్రమాలు కలవారు. మిక్కిలి వైభవంతో ప్రకాశించారు. అట్లాంటి వీరి భార్యలు ఆ దైవం చేసిన పనివలన ఇట్లా మిక్కిలి వ్యాకులత పొంది ఏ దిక్కూ లేని స్థితిలో అతిశయించిన దుఃఖంతో బాధపడవలసి వచ్చింది. దీన్ని ఎట్లా భరించటం?

క. నిజభూషణాతపత్ర । ధ్వజకంకటఖండవేష్టితములైన కురు
వ్రజగాత్రశకలములు వా । రిజనాభ! కనుంగొనంగ రెట్టించె వగల్. 54

ప్రతిపదార్థం: వారిజనాభ!= పద్మనాభా! (కృష్ణా!); నిజ= తమవైన; భూషణ= నగలు; ఆతపత్ర= గొడుగులు; ధ్వజ= టెక్కెములు; కంకట= కవచాలు; (వీటి) ఖండ వేష్టితములైన= ముక్కలతో కూడుకొని ఉన్న; కురువ్రజ= కురుకుమారుల సమూహంయొక్క; గాత్ర శకలములు= శరీర భాగాలు; కనుంగొనంగన్= చూడగా; వగల్= దుఃఖం; రెట్టించెన్= రెండింతలయింది.

తాత్పర్యం: కృష్ణా! నగలు, గొడుగులు, ధ్వజాలు, కవచాలు - వీటి ముక్కలతో కలసిపోయిన కురుకుమారుల దేహ భాగాలను చూస్తుంటే నా దుఃఖం ఇబ్బడి అయిపోయింది.

క. **జననియుఁ దండ్రియుఁ దొలు బా । మునఁ జేసిన పాపకర్మమునఁగాక సుయో**
ధనుఁడు మొదలయిన నూర్వుర । ననఘుఁడు ధర్మజుఁడు నామ మడఁపగఁదగునే. 55

ప్రతిపదార్థం: జననియున్= తల్లీ; తండ్రియున్= తండ్రీ; తొలుబామునన్= పూర్వ జన్మంలో; చేసిన= చేసినటువంటి; పాపకర్మమునన్+కాక= పాపకర్మవలన కాకపోతే; సుయోధనుఁడు మొదలయిన; నూర్వురన్= మహావీరులు నూరుమందినీ; అనఘుఁడు= పుణ్యాత్ముడు; ధర్మజుఁడు= ధర్మరాజు; నామము+అడఁపగన్= పేళ్ళులేకుండా చేయటానికి; తగునే?= సమర్థుడా?

తాత్పర్యం: వాళ్ళ తల్లిదండ్రులు చేసిన పూర్వజన్మ పాపంవలన కాకపోతే దుర్యోధనుడు దుశ్శాసనుడు మొదలైన మహావీరులు నూరుమందిని ఈ పుణ్యాత్ముడు ధర్మరాజు నామరూపాలు లేకుండా చేయగలడా?

విశేషం: ధర్మరాజును 'పుణ్యాత్ముఁడు' అని నొక్కి చెప్పటంలో గాంధారికి ఇంకా ధర్మరాజాదులపై కోపం నశించలేదని స్పష్టం. స్త్రీకి ఉన్న ఈ పుత్రప్రేమవలన శత్రుద్వేషాన్ని 'పుణ్యాత్ముఁడు' అనేమాట నొక్కి చెప్పుచున్నది.

గాంధారి దుశ్శాసనుని కళేబరంబు చూచి పలవించుట (సం. 11-18-19)

సీ. **అచ్యుత! వీఁడె మహాభీలభుజుఁడగు । భీమగదాహతి భూమిఁ గూలి**
యాతని చేత సర్వాంగంబులందును । గలుగు క్రొన్నెత్తురు కాంక్షఁ ద్రావఁ
బడి మఱి తెగటారి పడియున్నవాఁడు దు । శ్శాసనుఁ డీతండు సభకు ద్రుపద
పుత్రి నీడిచి తెచ్చి పొలువతనమ్మునఁ । బతుల సన్నిధిఁ గురుక్షితివిభునకుఁ

తే. **గర్ణునకుఁ జిత్తసంప్రీతి గాఁగ దూల । పుచ్చెఁ బెక్కువిధంబుల నొచ్చి యా మృ**
గాక్షి యప్పుడు మారుతి యంతరంగ । మేర్పఁ దలఁపించుదానన యింతపుట్టె. 56

ప్రతిపదార్థం: అచ్యుత!=కృష్ణా!; మహా+ఆభీల+భుజుఁడు+అగు= మహా భయంకరమైన భుజబలం కలిగిన; భీమ= భీముని యొక్క; గదాహతిన్= గదదెబ్బలచేత; భూమిన్+కూలి= నేలమీదపడి; ఆతనిచేతన్= ఆ భీముడిచేత; సర్వాంగంబులందును= అన్ని అవయవాలలోనూ; కలుగు= ఉన్న; క్రొన్నెత్తురు= క్రొత్త నెత్తురు; కాంక్షన్= కోరికతో; త్రావఁబడి= త్రాగబడి; మఱి= ఇంతేకాకుండా; తెగటారి= చచ్చి; పడి+ఉన్నవాఁడు= పడిఉన్నాడు; వీఁడె= ఇతడే; దుశ్శాసనుఁడు; ఈతండు= ఇతడు; సభకున్= ఆనాడు సభలోకి; ద్రుపద పుత్రిన్+ఈడిచి+తెచ్చి= ద్రౌపదిని ఈడ్చుకొని వచ్చి; పొలువతనమ్మునన్= దుర్మార్గంతో; పతుల సన్నిధిన్= ఆమె భర్తలముందు; కురుక్షితి విభునకున్= దుర్యోధనునికి; కర్ణునకున్= కర్ణుడికి; చిత్త సంప్రీతి+కాఁగన్= మనసుకు సంతోషమయ్యేలా; పెక్కు విధంబులన్= చాలా రీతులలో; దూలపుచ్చెన్= అవమానించాడు; ఆ మృగాక్షి= ఆ ద్రౌపది; అప్పుడు= ఆ సమయంలో; నొచ్చి= బాధపడి; మారుతి= వాయుదేవుని కుమారుడైన భీముడి; అంతరంగము+ ఏర్పన్+తలపించుదానన= గుండె మండేలా తన బాధను వ్యక్తీకరించినందువల్ల; ఇంత పుట్టెన్= ఇదంతా జరిగింది; (ఎవరు తప్పించగలరు?)

తాత్పర్యం: కృష్ణా! మహాభయంకరమైన భుజబలమున్న భీముడి గద దెబ్బలతో నేలమీద పడి అన్ని అవయవాలలోనూ పొంగిన క్రొత్త వేడి నెత్తురును భీముడు తనివితీరా త్రాగగా ప్రాణాలు కోల్పోయి పడి ఉన్నాడు. ఇదుగో! వీడే దుశ్శాసనుడు. ఇతడు ఆనాడు సభలోకి ద్రౌపదికి ఈడ్చుకొని వచ్చి, దుర్యోధనుడు, కర్ణుడు సంతోషపడేటట్లు ఆమెను చాలా రీతులతో అవమానించాడు. ఆ సమయంలో ఆ భీముడి గుండెలు మండిపోయేలా ద్రౌపది తన బాధను ప్రకటిస్తూ ఏడ్చిన ఏడ్పు ఆ ఘోరానికి కారణం. దానివలననే ఇదంతా జరిగింది. ఎవరు తప్పించగలరు?

క. ఆ సభ నమ్మెయి నీ దు । శ్శాసనుఁ డప్పాండుపుత్రసతిఁ గ్రూరాత్ముం
డై సంకలేక పెద్దయుఁ । గాసిం బెట్టంగ నెఱిఁగి కలఁగినమదితోన్. 57

ప్రతిపదార్థం: ఆ సభన్= ఆ సభలో; ఆ+మెయిన్= ఆ తీరుగా; ఈ దుశ్శాసనుఁడు; ఆ+పాండుపుత్రసతిన్= ద్రౌపదిని; క్రూరాత్ముండు+ఐ= కఠినమైన మనస్సుతో; సంకలేక= ఏ జంకూ లేకుండా; పెద్దయున్= మిక్కిలిగా; గాసిన్+పెట్టంగన్= బాధపెట్టగా; ఎఱిఁగి= పరిచారికలు చెప్పగా; తెలిసికొని; కలఁగిన= బాధపడిన; మదితోన్= మనసుతో.

తాత్పర్యం: ఆ సభలో ఆ తీరుగా ఈ దుశ్శాసనుడు ద్రౌపదిని కఠినచిత్తుడై ఏ జంకూ లేకుండా మిక్కిలిగా బాధపెట్టగా, ఆ విషయాన్ని పరిచారకుల ద్వారా తెలిసికొని బాధపడ్డ మనస్సుతో.

వ. ఏను దుర్యోధనునితో నిట్లంటి. 58

తాత్పర్యం: నేను దుర్యోధనుడితో ఇట్లా అన్నాను.

తరువోజ:

హరిచేత రక్షితయైన పాంచాలి కగునయ్య యిమ్మెయి నత్యంత నీచ
పరిభవదుఃఖంబుపాల్ సేఁత? మీఁదు పరికింపకున్నఁ గీడ్పాటిల్లకున్నె?
యరికంజకుంజరుఁ డగు భీముఁ బల్కులను బరిగోలల నలఁచుమేలె?
వెరవిడి వేవేగ విడువుము గారవింపు మీ వంశపవిత్ర నో పుత్ర! 59

ప్రతిపదార్థం: ఓ పుత్ర!= ఓ కుమారా!; హరిచేతన్= శ్రీకృష్ణుడిచేత; రక్షిత+ఐన= రక్షింపబడిన; పాంచాలికిన్= ద్రౌపదికి; ఈ+మెయిన్= ఈ విధంగా; అత్యంత నీచ= మిక్కిలి నీచంగా; పరిభవ దుఃఖంబుపాల్+చేఁత= అవమానమనే దుఃఖంపాలు చేయటం; అగును+అయ్య?= సరైన పని అవుతుందా?; మీఁదు= తరువాతి జరిగేదానిని; పరికింపకున్నన్= ఆలోచించకుండా ఉంటే; కీడ్+పాటిల్లక+ఉన్నె?= కీడు జరక్కుండా ఉంటుందా?; అరి= శత్రువులనే; కంజ= తామర పూలకు; కుంజరుఁడు+అగు= ఏనుగువంటి వాడయిన; భీమున్= భీముడిని; పల్కులు+అను= మాటలనేటువంటి; బరిగోలలన్= అంకుశాలతో; నలఁచుట= బాధించటం; మేలె?= తగునా?; వెరవు+ఇడి= నీతిని పాటించి (వెరవిఁడి= ఉపాయహీనుడా! అని సంబోధన కూడా కావచ్చు - అపుడు విఁడి అన్నది రూపం); వేవేగ= వెంటనే; విడువుము= ద్రౌపదిని వదలిపెట్టుము; ఈ వంశపవిత్రను= కురువంశ పవిత్రురాలైన ఈ ద్రౌపదిని; గారవింపుము= గౌరవించుము.

తాత్పర్యం: కుమారా! శ్రీకృష్ణుడి రక్షణ ఉన్న ద్రౌపదిని ఇట్లా మిక్కిలి నీచంగా అవమానం పాలుచేయటం సరైనపని అవుతుందా? తరువాత ఏమవుతుందో ఆలోచించకుండా పని చేయవచ్చునా? అట్లా చేస్తే కీడు కలుగకుండా

ఉంటుందా? శత్రువు లనే తామరపూలకు ఏనుగువంటివాడు భీముడు. అతడిని మాటవలనే అంకుశాలతో పొడిచి బాధించటం మంచిదా! నీతిని పాటించి వెంటనే ద్రౌపదిని వదలిపెట్టుము. కురువంశానికే పవిత్రత తెచ్చిన ఈ సాధ్విని గౌరవించుము.

విశేషం: అలం: రూపకం. ద్రౌపది అగ్నిలోపుట్టింది. కనుక పవిత్రురాలు. రాజసూయయాగంలో పవిత్రస్నానంచేత కూడా పవిత్రురాలు. కనుక అవమానించటం వలన వంశం నశిస్తుందన్న సూచన ఉన్నది.

తరువోజలో ప్రతిపాదానికీ రెండింద్రగణాలూ ఒక సూర్యగణమూ, మరల రెండింద్రగణాలూ ఒక సూర్యగణమూ ఉంటాయి. గణాల మొదటి అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

క. క్రూరాత్ముఁడు నీచుఁడు గాం । ధార విభునిఁ దొఱఁగు పాండు తనయులఁ బుణ్య
ప్రారంభులఁగూడి మనుము । కౌరవకుల మెల్ల బ్రదుకఁగాఁ బొగడొందన్.' 60

ప్రతిపదార్థం: క్రూర+ఆత్ముఁడు= కఠిన చిత్తుడు; నీచుఁడు= నీచగుణాలు కలిగినవాడు; గాంధార విభునిన్= గాంధారరాజు శకునిని; తొఱఁగు= వదలిపెట్టుము; పాండు తనయులన్= పాండుపుత్రులను; పుణ్యప్రారంభులన్= పుణ్యం సంపాదించే కార్యాల విషయంలో పూనిక గలవారు; (అట్లాంటివారిని); కూడి= కలిసికొని; కౌరవకులమెల్లన్= కౌరవ వంశీయులంతా; బ్రదుకఁగాన్= జీవించేలా; పొగడు+ఒందన్= ప్రశంసలు పొందగా; మనుము= నీవు హాయిగా బ్రదుకుము.

తాత్పర్యం: ఈ గాంధారరాజు శకుని కఠినచిత్తుడు. అతినీచగుణాలు కలిగినవాడు. (నా సోదరుడే కావచ్చును గాక - అని అర్థం). 'ఇతడి స్నేహం వదలిపెట్టుము. పాండవులు పుణ్యం సంపాదించే కార్యాల విషయంలో పూనిక గలవారు. అట్లాంటివారి స్నేహం చేయుము. కౌరవవంశీయు లంతా చల్లగా బ్రదుకుతారు. ప్రపంచమంతా నిన్ను స్తుతిస్తుంది. నీవు చల్లగా ఉండుము'.

క. అని యెన్ని భంగులను జె । ప్పినఁ దా నప్పలుకు లెల్లఁ బెడచెవులం బె
ట్టె నుదగ్రుఁడు దగుకార్యము । గనునె? వశంబగునె దైవగతి తప్పింపన్? 61

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; ఎన్ని భంగులను= ఎన్ని రీతులుగా; చెప్పినన్= చెప్పినా; తాను= ఆ దుర్యోధనుడు; ఆ+పలుకులు+ఎల్లన్= ఆ మాటలను అన్నిటినీ; పెడచెవులన్+పెట్టెన్= పెడచెవిని పెట్టాడు (వినలేదు); ఉదగ్రుఁడు= మిక్కిలి కోపమున్నవాడు; తగు కార్యమున్= తగిన పనిని (సముచిత కార్యాన్ని); కనునె?= నిర్ణయించుకోగలడా?; దైవగతి= దైవనిర్ణయం; తప్పింపన్= తప్పించటానికి; వశంబు+అగునె?= వీలు అవుతుందా?

తాత్పర్యం: అని ఈ విధంగా ఎన్ని రీతులుగా చెప్పినా ఆ దుర్యోధనుడు ఆ మాటలను పెడచెవినిపెట్టాడు. కోపిష్ఠి ఏది మంచి? ఏది చెడు? అనే ఆలోచనతో పని చేస్తాడా? అయినా దైవనిర్ణయం తప్పించటం ఎవరికి సాధ్యమవుతుంది.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

తే. నాఁటిమాట లుల్లంబున నాటియుండ । నొవ్వుతోఁ దటివేచి నేఁ డివ్విధమునఁ
బటిచె భీముండు నొప్పింపఁబడిన త్రాఁచు । పాము పగసాటి తెగ తార్చుభంగిఁ గృష్ణ! 62

ప్రతిపదార్థం: కృష్ణ!= కష్ణా!; నాఁటిమాటలు= ఆనాటి పలుకులు; ఉల్లంబునన్= హృదయంలో; నాటి+ఉండన్= నాటుకొని ఉండగా; నొవ్వుతోన్= బాధతో; తఱి+వేచి= సమయం కోసం కాచుకొని ఉండి; నేఁడు= ఈ రోజు; ఈ+విధమునన్= ఈ విధంగా; భీముండు= భీముడు; నొప్పింపఁబడిన= బాధింపబడిన; త్రాఁచుపాము= నాగుపాము; పగ+చాటి= పగను ప్రకటించి (కసిదీరా); తెగటార్చు భంగిన్= చంపేవిధంగా; పఱిచెన్= చంపాడు (చేశాడు).

తాత్పర్యం: కృష్ణా! ఆనాడు సభలో వాళ్ళంతా మాట్లాడిన మాటలు హృదయంలో గాఢంగా నాటుకొనిపోగా ఆ బాధతో సరైన సమయంకొరకు కాచుకొని ఉన్న భీముడు ఈనాటికి దెబ్బతిన్న నాగుపాము కసిదీరా కాటువేసినట్లు ఈ విధంగా కురుకుమారులందరినీ చంపాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **తగుఁ బగ దీర్చుట యిమ్మెఁ । దగ వగునే నెత్తురెత్తి త్రావుట? భీముం**
డు గడున్ ఘోరము సేసెను । మగల కతి క్షుద్రవృత్తమా పొగ డొసఁగున్? **63**

ప్రతిపదార్థం: పగతీర్చుట= పగతీర్చుటం; తగున్= సమంజసమే; ఈ+మెయిన్= ఈ విధంగా; నెత్తురు+ఎత్తి+త్రావుట= నెత్తురు తీసికొని త్రాగటం; తగవు+అగునే?= న్యాయమా?; భీముండు= భీముడు; కడున్= మిక్కిలి; ఘోరము= ఘోరమైనపని; చేసెను= చేశాడు; మగలకున్= వీరులకు; అతి= మిక్కిలి; క్షుద్రవృత్తమా= నీచ పద్ధతా; పొగడు+ఒసఁగున్?= ప్రశంసను తెచ్చేది?

తాత్పర్యం: పగ తీర్చుకొనటం ఎవరికైనా సమంజసమే. కాని, ఈ విధంగా నెత్తురు తీసికొని త్రాగటం న్యాయమైన పని అవుతుందా? ఏమైనా భీముడు చాలా దారుణమైన పనిచేశాడు. వీరులకు ఇట్లాంటి నీచమైన పద్ధతులద్వారానా మంచి పేరు వచ్చేది? (రాదని అర్థం).

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

తరలము:

కరములుం జరణంబులున్ విరి గల్గి సాఁగి వికీర్ణమై
యురము నిర్భరవైకృతంబుగ నుర్విఁ ద్రెళ్ళి సుతుండు గే
సరి నఖంబుల వ్రవ్వఁబడ్డ గజంబు చాడ్పున నుండఁగాఁ
గరుణ మాత్మకు నింత మిక్కిలి గాక యున్నె? జనార్దనా! **64**

ప్రతిపదార్థం: జనార్దనా!= కృష్ణా!; కరములున్= చేతులూ; చరణంబులున్= కాళ్ళూ; విరి గల్గి సాఁగి= విడిపోయి వ్యాపించి; వికీర్ణమై= ముక్కలై (యుద్ధభూమిలో వెదజల్లబడ్డాయి); ఉరము= రొమ్ము; నిర్భర= మిక్కిలి; వైకృతంబుగన్= వికారరూపాన్ని పొంది; ఉర్విన్= నేలమీద; త్రెళ్ళి= పడి; సుతుండు= ఈ దుశ్శాసనుడు; కేసరి నఖంబులన్= సింహం గోళ్ళతో; వ్రవ్వఁబడ్డ= చీల్చబడిన; గజంబు చాడ్పునన్= ఏనుగులాగా; ఉండఁగాన్= కనిపిస్తుండగా; ఆత్మకున్= మనసుకు; కరుణము= దుఃఖం; ఇంత= మరింత; మిక్కిలి+కాక+ఉన్నె?= అధికం కాకుండా ఉంటుందా?

తాత్పర్యం: కృష్ణా! చేతులు కాళ్ళు విడిపోయి ముక్కలు ముక్కలై యుద్ధభూమిలో వెదజల్లబడ్డాయి. రొమ్ము చీలిపోయి వికారంగా తయారై నేలమీదపడిన ఈ దుశ్శాసనుడిని చూస్తే సింహంగోళ్ళచేత చీల్చబడిన ఏనుగువలె అగుపిస్తున్నాడు. ఇట్లాంటి కొడుకును చూచి మనసులో దుఃఖం మరింత ఎక్కువ కాకుండా ఉంటుందా? చెప్పుము.

విశేషం: అలం: ఉపమ. తరలములో ప్రతిపాదానికీ న, భ, ర, స, జ, జ, గ అనే గణాలుంటాయి. 1-12 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

సీ. **వీఁడె వికర్ణుండు వాఁడి మెఱుంగు మే । ఘంబుల గముల మధ్యంబునందుఁ**
దేజరిల్లెడుమాడ్కి రాజిల్లుచున్నవాఁ । డతిసాంద్రహస్తికాయములలోనఁ
గార్ముకజ్యాకిణకఠినమైనయున్న యి । బ్బాలుని ముంజేయి బాల గృధ్ర
మోపదు కబళించియును జంచుపుటమునఁ । జీరంగఁ జూచితే శౌరి? యితని

తే. **రమణి పొరిఁబొరి గన్నీరు గ్రమ్మఁ జుట్టు । మెలఁగి కాకుల గ్రద్దలఁ దొలఁగ నడుచు**
చున్నయది పాసి యవి వోవకున్న నిట్లు । సూతురే తల్లులెందును సుతుల నకట! **65**

ప్రతిపదార్థం: వీఁడె= వీడే; వికర్ణుండు; వాఁడి మెఱుంగు= ఉజ్జ్వలమైన మెరుపు; మేఘంబుల గముల= మేఘాల గుంపుల; మధ్యంబునందున్= నడుమ; తేజరిల్లెడు మాడ్కిన్= ప్రకాశించు రీతిగా; అతిసాంద్ర= మిక్కిలి బలిష్ఠములైన; హస్తి కాయములలోనన్= ఏనుగుల దేహాలమధ్య; రాజిల్లుచున్నవాఁడు= ప్రకాశిస్తున్నాడు; కార్ముక= ధనుస్సు యొక్క; జ్యా= అల్లెత్రాటిని లాగటంవల్ల పుట్టిన; కిణ= కాయలచేత; కఠినము+ఐ+ఉన్న= గట్టిగా ఉన్న; ఈ బాలుని= ఈ కుమారుడి; ముంజేయిన్= ముంచేతిని; బాలగృధ్రము= పిల్లగద్ద; కబళించియును= ముక్కుతోపట్టుకున్నా; చంచుపుటమునన్= ముక్కుపుటంతో; చీరంగన్= చీల్చడానికి; ఓపదు= దానిచేత కావటంలేదు (అంత పెద్దదని అర్థం); చూచితే శౌరి?= కృష్ణా చూస్తున్నావా?; ఇతని రమణి= ఇతని భార్య; పొరిన్+పొరిన్= మాటిమాటికి (నిరంతరంగా); కన్నీరు క్రమ్మన్= కంట్లో నీరు కమ్ముతుండగా; చుట్టున్+మెలఁగి= చుట్టూ తిరుగుతూ; కాకులన్= కాకులనీ; గ్రద్దలన్= గద్దలనీ; పాసి= దూరంగా; అవి= ఆ కాకులు గద్దలు; పోవకున్నన్= పోకుండా ఉంటే; (వాటిని); తొలఁగన్= పారిపోయేలా; అడుచుచున్న+అది= తరుముతూ ఉంది; ఇట్లు= ఈ విధంగా; తల్లులు; ఎందును= ఎక్కడైనా; సుతులన్= కొడుకులను; చూతురే?= చూశారా?; అక్కట!= అయ్యో!

తాత్పర్యం: కృష్ణా! ఇదిగో వీడే వికర్ణుడు. ఉజ్జ్వలమైన మెరుపు మేఘాలనడుమ తళుక్కున ప్రకాశించినట్లుగా అతి బలిష్ఠములైన ఏనుగుల దేహాల మధ్య వెలుగుతూ ఉన్నాడు. నిరంతరం వింటినారిని లాగటంవలన పుట్టిన కణుపులచేత గట్టిపడిన ఈ కుమారుడి ముంజేతిని పిల్లగద్ద ముక్కుతో కరుచుకొనటానికి యత్నించినా ముక్కుపుటంతో దానిని చీల్చటం ఆ గ్రద్దకు సాధ్యం కాలేదు. చూచావా? కృష్ణా! అదిగో అతడి భార్య నిరంతరంగా ఏడుస్తూ భర్త శవంచుట్టూ తిరుగుతూ, మూగుతున్న కాకులను గద్దలను దూరంగా తరుముతూ ఉన్నది పాపం. ఇట్లా ఏ తల్లులకైనా ఎక్కడైనా తమ కొడుకులను చూచే దౌర్భాగ్యం కలిగిందా! అయ్యో! నేనెంత దురదృష్టవంతురాలిని!

విశేషం: అలం: ఉపమ. అర్థాంతరన్యాసం.

క. **మారుతనందను నుగ్రపు । నారాచము లొడల నాటినం జచ్చియు న**
వ్వీర కుమారుం డుజ్జ్వల । చారుత్వముఁ బాయకున్న చందముఁ గంటే? **66**

ప్రతిపదార్థం: మారుత నందను= వాయు నందనుడైన భీముడియొక్క; ఉగ్రము+నారాచములు= క్రూరమైన బాణాలు; ఒడలన్= ఒంటియందు; నాటినన్= దిగబడగా; చచ్చియున్= చనిపోయికూడా; ఆ+వీర కుమారుండు= ఆ వికర్ణుడు; ఉజ్జ్వల చారుత్వమున్= ప్రకాశంతోడి అందాన్ని; పాయకున్న= వదలకున్న; చందము= తీరును; కంటే?= చూస్తున్నావా?

తాత్పర్యం: కృష్ణా! భీముడు వేసిన క్రూరమైన బాణాలు దేహంలో దిగబడి ప్రాణాలు కోల్పోయికూడా ఈ వీరకుమారుడి దేహంలో కాంతి, మనోహరత్వం తగ్గకున్నాయి. చూస్తున్నావు కదా!

క. అని మొన నెవ్వరికిని మా । ర్కొన రాని ఘనుండు దుర్ముఖుఁడు భీమునిచే
వినిపాతితుఁడై భూరజ । మున బ్రుంగుడు వడ్డవాఁడు మురహర! కంటే? 67

ప్రతిపదార్థం: మురహర!= మురాసురుడిని చంపిన ఓ కృష్ణా!; అనిమొనన్= యుద్ధంలో; ఎవ్వరికిని= ఎవరికీ; మార్కొనన్+రాని= ఎదిరించటానికి వీలులేని; ఘనుండు= బలవంతుడైన; దుర్ముఖుఁడు= దుర్మ్ముఖుడు; భీమునిచేన్= భీముడిచేత; వి+ నిపాతితుఁడు+ఐ= కొట్టబడి నేలగూలి; భూరజమునన్= నేలమీది ధూళిలో; బ్రుంగుడు+పడ్డవాఁడు= మునిగిపోయాడు; కంటే?= చూశావా?

తాత్పర్యం: కృష్ణా! ఇదిగో చూడుము! ఈ దుర్మ్ముఖు డున్నాడే - వీడిని యుద్ధంలో ఎవరూ ఎదిరించలేరు. అంతటి బలపరాక్రమశాలి వీడు. అట్లాంటి వీడు భీముడి గద దెబ్బలకు నేలగూలి మట్టిలోని దుమ్మ్ముధూళులతో మునిగిపోయాడు. చూస్తున్నావా!

తే. నక్క తోఁడెలు వీని యాననము సగము । దిన్నయవి యట్టులయ్యును నున్నయొప్ప
దొరసి సప్తమినాఁటిచందురునిఁ బోలె । చూడు భావించి దీపితశూరవంశ! 68

ప్రతిపదార్థం: దీపిత= ప్రకాశించే; శూరవంశ!= శూరుని వంశం కలవాడా! (నీవు పుట్టగా శూరుని వంశం ప్రకాశించిందని అర్థం. శౌరి- అని కృష్ణుడికి మరో పేరు); నక్క; తోఁడెలు; వీని+ఆననమున్= వీడి ముఖాన్ని; సగము+తిన్నయవి= సగం తిన్నాయి; అట్టులు+అయ్యును= అలా అయికూడా; ఉన్న+ఒప్పు= ఉన్నకాంతి; దొరసి= కలిగి; సప్తమినాఁటి= శుద్ధ సప్తమినాడు ప్రకాశించే; చందురునిన్+పోలెన్= చంద్రుడివలె; భావించి చూడు= కాస్త ఆలోచించి చూడుము.

తాత్పర్యం: కృష్ణా! నీవు శూరుడి వంశాన్ని ప్రకాశింపజేశావు. అక్కడ చూడుము. నక్క, తోడేలు వాడి ముఖాన్ని సగం తినివేశాయి. అయినా కూడా ఆ ముఖంలో మిగిలిన కాంతి సప్తమినాటి చంద్రబింబంవలె కాంతులు చిమ్ముతూనే ఉన్నది. బాగా చూడుము.

విశేషం: ఉపమ.

మత్తకోకిల:

శూరసేనుఁడు భీమసేననిషూదితుండయి చుట్టు నం
భోరుహానన లార్తి మూర్తతఁ బొందిన ట్లతిరూక్ష హా
హారవంబులతోడఁ గ్రుమ్మర నల్లవాఁడె వికారితా
కారుఁడై పడియున్నవాఁడు వృకంబుఁ బక్షులు జించినన్. 69

ప్రతిపదార్థం: శూరసేనుఁడు= శూరసేనుడనే నా కుమారుడు (అదిగో); భీముడిచేత; నిషూదితుండు+అయి= చంపబడి; చుట్టున్= చుట్టూ; అంభోరుహ+ఆననలు= పద్మముఖులైన భార్యలు; ఆర్తి= దీనత్వం; మూర్తతన్+పొందినట్లు= మూర్తిమత్త్వాన్ని పొందినట్లు; అతి+రూక్ష= అతి దారుణమైన; హాహారవంబులతోడన్= హాహాకారాలతో; క్రుమ్మరన్= తిరుగుతుండగా; అల్లవాఁడె= అదుగోవాడే (అక్కడ); వృకంబు= తోడేలు; పక్షులు= కాకులు గద్దలు; చించినన్= చీల్చివేయగా; వికారిత+ఆకారుఁడు+ఐ= వికారంపొందిన శరీరం కలిగినవాడై; పడి+ఉన్నవాఁడు= పడి ఉన్నాడు.

తాత్పర్యం: కృష్ణా! వాడే నా కొడుకు శూరసేనుడు. భీముడిచేత చంపబడి, చుట్టూ అతని భార్యలు దీనత్వం ఆకారం పొందినట్టు అతి దారుణంగా హాహాకారాలు చేస్తూ విలపిస్తూ తిరుగుతుండగా, తోడేలు, కాకులు గ్రద్దలు చీల్చివేయగా దేహం గుర్తించటానికి వీలులేకుండా మారిపోయి పడి ఉన్నాడు.

విశేషం: మత్తకోకిలలో ప్రతిపాదానికీ ర, స, జ, జ, భ, ర - అనేగణాలుంటాయి. 1-11 యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

సీ. **అంగంబు కోమల మంతరంగంబు చా । తుర్య నిరూఢంబు శౌర్యఘనుఁడు**
వీఁడె గోవింద! వివింశతి యీతండు । సొబగుండు మెలఁతలు సుట్టు నెపుడు
నప్సరోగణ మమరాధిపుఁ గొలిచెడు । చాడ్పునఁ బాయక సమ్మదంబు
చిగురొత్త నుండుదు రగరుకస్తూరికా । చందనాద్యనులేపశాలి యిపుడు

తే. **గ్రద్దలును గాకులును జుట్టుఁ గదిసియుండఁ । దఱచునెత్తుటఁ దోఁగిన తనువుఁ దాను**
నున్నవాఁడు గానాకర్ణనోత్సుకుండు । నక్క లఱచెడు చేరువ నక్కటకట! **70**

ప్రతిపదార్థం: గోవింద!= కృష్ణా!; వీఁడె= ఇతడే; వివింశతి= వివింశతి అనే పేరు గల నా మరి ఒక కుమారుడు; అంగంబు కోమలము= ఇతని శరీరము చాలా సుకుమారం; అంతరంగంబు= మనస్సు; చాతుర్యనిరూఢంబు= నేర్పరితనంలో ప్రసిద్ధం; శౌర్యఘనుఁడు= గొప్ప పరాక్రమంచేత గొప్పవాడు; ఈతండు= ఇతడు; సొబగుండు= అందగాడు; చుట్టున్= ఇతడి చుట్టూ; మెలఁతలు= స్త్రీలు; ఎపుడున్= ఎల్లప్పుడూ; అమరాధిపున్= ఇంద్రుడిని అప్సరస్+గణము= అప్సరసల సమూహం; కొలిచెడు చాడ్పునన్= సేవించే తీరుగా; పాయక= ఎప్పుడూ వదలకుండా; సమ్మదంబు= సంతోషం; చిగురొత్తన్= క్రొత్త క్రొత్తగా పుడుతుండగా (నిత్య సంతోషంతో); ఉండుదురు= (ఇతనిచుట్టూ) ఉంటారు; అగరు= అగరు; కస్తూరికా= కస్తూరి; చందనాది= శ్రీగంధం మొదలైన; అనులేపశాలి= అనులేపాలను పూసుకోవటంలో సుసంపన్నుడు; ఇపుడు; గ్రద్దలును= గ్రద్దలూ; కాకులును= కాకులూ; చుట్టున్= చుట్టూ; కదిసి+ఉండన్= మూగి ఉండగా; తఱచు నెత్తుటన్= మిక్కిలిగా రక్తంలో; తోఁగిన= మునిగిపోయిన; తనువున్+తానున్= తనువుతో తాను; ఉన్నవాఁడు= ఉన్నాడు; గాన+ఆకర్ణన= పాటలను వినటంలో; ఉత్సుకుండు= ఆసక్తి కలవాడు; నక్కలు; అఱచెడు= ఊళలువేసే; చేరువన్= చోట; అక్కటకట!= అయ్యయ్యో! (పడిఉన్నాడు).

తాత్పర్యం: కృష్ణా! వీడు నా ఇంకొక కుమారుడు వివింశతి. ఇతడి శరీరం సుకుమారం. మనసు నేర్పరితనంలో ప్రసిద్ధమైనది. గొప్ప పరాక్రమం కలిగినవాడు. ఇంద్రుడి చుట్టూ అప్సరసలు సేవిస్తూ ఉండే విధంగా ఇతడి చుట్టూ ఎల్లప్పుడూ స్త్రీలు వదలకుండా నిత్య సంతోషంతో ఉండేవారు. అగరు, కస్తూరి, చందనం మొదలైన సుగంధద్రవ్యాల పూతలను పూసికొని చాలా వైభవంతో కనిపించేవాడు. ఇప్పుడు అతని చుట్టూ గ్రద్దలు, కాకులు కూచుకొని ఉన్నాయి. రక్తపుమడుగులో మునిగిపోయి ఉన్నాడు. ఇతడికి సంగీతమంటే చాలా ఆసక్తి. ఇపుడు నక్కలు ఊళలువేసే చోట పడి ఉన్నాడు. ఎంత దౌర్భాగ్యమో చూడుము.

విశేషం: అలం: ఉపమ.

తే. **కనకపుంఖశరావృత గాత్రుఁడైన । దుష్ప్రహుండు చచ్చి యుండియుఁ దోయజాక్ష!**
వికచ నవకర్ణికార సంవేష్టనంబు । గలుగు శైలంబు తెఱఁగునఁ బొలిచెఁ జూడు. **71**

ప్రతిపదార్థం: తోయజాక్ష!= పద్మనయనా కృష్ణా!; కనకపుంఖ= బంగారు పింజలు అమర్చిన; శర+ఆవృత= బాణాలచేత కప్పబడిన; గాత్రుఁడు+ఐన= దేహం కలిగినటువంటి; దుష్ప్రహుఁడు= దుష్ప్రహుడు అనే పేరుగల నా కొడుకు; చచ్చియుండియున్= చనిపోయికూడా; వికచనవ= అప్పుడే వికసించిన; కర్ణికార= కొండగోగు చెట్లయొక్క; సంవేష్టనంబు= చుట్టూ కూడుకొని ఉండటం; కలుగు= కలిగిన; శైలంబు= కొండ; తెఱఁగునన్= రీతిగా; పొలిచెన్= ప్రకాశిస్తున్నాడు; చూడు= చూడుము.

తాత్పర్యం: కృష్ణా! అటు చూడుము. బంగారు పింజలు అమర్చిన బాణాలచేత కప్పబడిన దేహం కలిగి, నేల కొరిగిన దుష్ప్రహుడు చనిపోయికూడా అప్పుడే వికసించిన కొండగోగుచెట్లు చుట్టూ విస్తరించగా ప్రకాశించే కొండవలె కాంతులు విరజిమ్ముతూ పడి ఉన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

గాంధారి యభిమన్యు కళేబరంబు గనుంగొని ప్రలాపించుట (సం. 11-20-1)

వ. **అని మఱియు నిట్లనియె.** **72**

తాత్పర్యం: అని ఇంకా ఇట్లా అన్నది.

లయవిభాతి:

అరయ నిది పెద్దయని యరుల మొనఁ జిత్తమున । సరకుగొన కుగ్రమగు బరవస మెలర్పం
ద్వరితగతిఁ జొచ్చి కురువరుఁడు దలరం గవిసి । కరితతులుఁ దేరులనికరములుఁ దురంగో
త్కరములును గాల్బలము నెరవులును గీటడఁగ । శరగురుఁడుఁ గర్ణుఁడును గురుసుతుఁడు మద్రే
శ్వరుఁడుఁ గృపుఁడుం బరవ బరఁగి దివిజుల్ వొగడ । ధరఁబడి ముకుంద! మన నరతనయుఁ డొప్పెన్. **73**

ప్రతిపదార్థం: ముకుంద!= కృష్ణా!; మన నరతనయుఁడు= మన అర్జునుని కొడుకు (అభిమన్యుడు); అరయన్= చూడగా; ఇది; పెద్ద+అని= చాలాపెద్ద దని; లెక్కచేయకుండా; ఉగ్రము+అగు= భయంకరమైన; బరవసము= ధైర్యం; ఎలర్పన్= పుట్టగా; త్వరితగతిన్= అతివేగంగా; చొచ్చి= యుద్ధరంగంలో ప్రవేశించి; కురువరుఁడు= దుర్యోధనుడు; తలఁదన్= భయపడేట్టు; కవిసి= ఎదుర్కొని; కరితతులు= ఏనుగుల సమూహాలు; తేరుల నికరములు= రథాల సముదాయాలు; తురంగ+ఉత్కరములు= గుర్రాల గుంపులు; కాల్బలము= సైనికులు; నెరవులును= పరివారమూ; గీటడఁగన్= చావగా; శరగురుఁడు= ద్రోణుడూ; కర్ణుఁడును= కర్ణుడూ; గురుసుతుఁడున్= అశ్వత్థామా; మద్రేశ్వరుఁడున్= శల్యుడూ; కృపుఁడున్= కృపుడూ; పరవన్= బాణాలు ప్రయోగించగా; పరఁగి= ఘోరయుద్ధం చేసి ప్రసిద్ధుడై; దివిజుల్+పొగడన్= దేవతలు స్తుతించగా; ధరన్+పడి= నేలగూలి; ఒప్పెన్= ప్రకాశిస్తున్నాడు.

తాత్పర్యం: కృష్ణా! మన అర్జునుడి కుమారుడి అభిమన్యుడు వీడే. శత్రుసైన్యం అంత పెద్దదని ఏ మాత్రం లెక్కచేయకుండా భయంకరమైన ధైర్యంతో అతివేగంగా పద్మవ్యూహాన్ని ప్రవేశించి దుర్యోధనుడివంటి మహావీరుడు

భయపడేటట్టు ఎదిరించి యుద్ధం చేశాడు. ఏనుగులను, రథాలను, గుర్రాలను, సైనికులను, పరివారాలను నుగ్గునుగ్గు చేశాడు. చివరికి ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ, శల్యుడు, కృపుడు - అందరూచేరి ఘోరంగా బాణాలు ప్రయోగించగా వాటిని ఎదిరించి ప్రసిద్ధుడై దేవతలు ప్రస్తుతిస్తుండగా నేలమీద కూలి ప్రకాశిస్తున్నాడు.

విశేషం: లయవిభాతికి వృత్తలక్షణానికి చూడండి - స్త్రీ. 1-131.

ఆ. పాడి మాలి తన్నుఁ బలువురు పొదివినఁ । బోరి తద్ద డప్పిఁ గూరి నిదుర
పోయెనొకొ సుభద్ర పుత్రుండు! మృతుఁడైనఁ । జెలువ మింత యేల కలుగ నేర్చు? 74

ప్రతిపదార్థం: పాడి= న్యాయం; మాలి= తప్పి; తన్నున్= తనను; పలువురు= చాలమంది; పొదివినన్= చుట్టుముట్టగా; పోరి= పోరాడి; తద్ద= మిక్కిలి; డప్పిన్= దప్పికతో; కూరి= మునిగి; నిదురపోయెన్+ఒకొ!= నిద్రపోయాడు కాబోలు!; సుభద్ర పుత్రుండు= ఈ అభిమన్యుడు; మృతుఁడు+ఐనన్= చనిపోయి ఉంటే; ఇంత; చెలువము= సౌందర్యం; ఏల= ఎందుకు; కలుగన్+నేర్చున్?= ఉంటుంది?

తాత్పర్యం: అన్యాయంగా తనను అంతమంది చుట్టుముట్టితే వారితో పోరాడి పోరాడి, అలసిపోయి, దప్పికతో గాఢనిద్రలో మునిగిపోయాడు కాని, మన అభిమన్యుడు చావలేదు. చనిపోయి ఉంటే ముఖంలో ఇంత 'కళ' ఎందుకుంటుంది?

విశేషం: అలం: కావ్యలింగం.

సీ. ఉత్తర యిక్కుమారోత్తము నురమున । వ్రాలి మోమునఁ దనవదనకమల
మందంద చేర్చుచున్నది మున్ను గన్నంత । మెలఁగంగనేరక చెలులమాటు
గొను సిగ్గు పెంపున వనట నిట్లయ్యె ని । ప్పడు మాటిమాటికిఁ బొలఁతి ప్రియునిఁ
గనుఁగొని బిగియారఁ గౌఁగిలించుచు శిర । మూరుతలంబున నునిచి పాణి

తే. పల్లవంబున నానన మల్లనల్ల । దొడయుచును నిన్నుఁ జూచుచుఁ దోడుతోడఁ
బొడము పెల్లునఁ గన్నీరు దుడిచికొనుచు । నలఁత పెనువెల్లిఁ దేలెడు నంబుజాక్ష! 75

ప్రతిపదార్థం: అంబుజాక్ష!= కృష్ణా!; ఉత్తర= అభిమన్యుడి భార్య ఉత్తర; ఈ+కుమారోత్తము= అభిమన్యుడి; ఉరమునన్= రొమ్ముమీద; వ్రాలి= వ్రాలి; మోమునన్= ముఖంమీద; తన; వదనకమలమున్= కమలంవంటి ముఖాన్ని; అందందు+అ= మాటి మాటికి (అక్కడక్కడా); చేర్చుచున్నది= ఆనిస్తోంది; మున్ను= ముందు (యుద్ధానికి మునుపు); కన్న+అంతన్= అభిమన్యుడిని చూడగానే; మెలఁగంగన్+నేరక= అతనితో కలిసి వర్తించటానికి ధైర్యంచాలక; సిగ్గుపెంపునన్= అధికమైన సిగ్గుతో; చెలుల మాటు+కొనున్= చెలికత్తెల చాటుకు వెళ్ళిపోయేది; వనటన్= దుఃఖంతో; ఇప్పుడు; ఇట్లు+అయ్యెన్= ఇట్లా అయింది చూడు; పొలఁతి= ఈమె (స్త్రీ); ప్రియునిన్= ప్రియుడిని; కనుఁగొని= చూసి; బిగియారన్= గట్టిగా; కౌఁగిలించుచున్= కౌగిలించుకొంటూ; శిరమున్= తలను; ఊరుతలంబునన్= తొడలమీద; ఉనిచి= ఉంచుకొని; పాణిపల్లవంబునన్= అరచేతులతో; ఆననము= ముఖాన్ని; అల్లనల్లన్= మెల్లమెల్లగా; తొడయుచును= నిమురుచు; నిన్నున్+చూచుచున్= నిన్ను చూస్తూ; తోడుతోడన్= వెంటనే; పొడము పెల్లునన్= పుట్టే ఆధిక్యంతో; కన్నీరు తుడిచికొనుచున్= వచ్చిన కన్నీరును తుడుచుకొంటూ; అలఁత పెనువెల్లిన్= శోక మహాసముద్రంలో; తేలెడున్= కొట్టుకొనిపోతున్నది.

తాత్పర్యం: కృష్ణా! ఉత్తరాదేవి తన భర్త రొమ్ముమీద వాలిపోయి ముఖంమీద ముఖం మాటిమాటికి ఆనిస్తోంది. యుద్ధానికి మునుపు అభిమన్యుడిని చూడగానే చెలికత్తెలచాటుకు సిగ్గుతో పారిపోయేది. మరి ఇప్పటి స్థితిలో అతి దుఃఖంవలన ఇట్లా అయింది. ప్రియుడిని చూచి గట్టిగా కౌగిలించుకొని మోకాళ్ళపై తలను వాల్చి అరచేతులతో మొగాన్ని స్పృశిస్తూ నిన్ను చూడగానే మరింత దుఃఖానికి లోనై కంటినీరు తుడుచుకొంటూ శోకమహా సముద్రంలో మునిగిపోయింది పాపం!

విశేషం: అలం: రూపకం.

వ. **వింటె యవ్వనిత విలాపంబు?** **76**

తాత్పర్యం: ఆ స్త్రీ విలపిస్తున్న తీరు విన్నావా?

సీ. **'భద్రచారిత్ర! సుభద్రను నిర్జర । ప్రతిమానులగు పాండురాజసుతులఁ**
బాసి యెం దరిగితి? పార్థుని పట్టి న। చ్యుతుని యల్లుని సమరోర్విఁ జెనసి
పరిమార్పఁ జాలిరెవ్వరు? పెక్కుభంగుల । మాటలాడఁగ మఱుమాటలేల
యాడవు నాతోడ? నస్త్రగురుండుఁ ద । త్తనయుండుఁ గృపుఁడు రాధాసుతుండుఁ

తే. **బాడిమానసులండ్రు నిబ్బాలు నొకనిఁ । బొదివి రిస్సిరో! పెక్కండ్రు ప్రోడ లిదియు**
మగఁటిమియె? క్రించుపని కిట్లు దెగినయప్పు । డుల్లములు వారలకు నెట్టులుండె నొక్కొ! **77**

ప్రతిపదార్థం: భద్ర= శ్రేష్ఠమైన; చారిత్ర!= చరిత్రకల ఓ అభిమన్యుడా!; సుభద్రను= మీ తల్లి సుభద్రను; నిర్జర= దేవతలతో; ప్రతిమానులు= సమానులైన; పాండురాజసుతులన్= పాండు కుమారులను; పాసి= వదలి; ఎందున్+అరిగితి(వి)?= ఎక్కడికి వెళ్ళావు?; పార్థుని పట్టిన్= అర్జునుని కుమారుడిని; అచ్యుతుని+అల్లునిన్= కృష్ణుడి అల్లుడిని; సమర+ఉర్విన్= యుద్ధభూమిలో; చెనసి= ఎదిరించి; పరిమార్పన్+చాలిరి+ఎవ్వరు?= చంపగలిగినవారు ఎవరున్నారు?; పెక్కు+భంగులన్= ఎన్నో తీరులలో; మాటలాడఁగన్= మాట్లాడుతున్నానే; మఱుమాటలు+ఏల+ఆడవు+నాతోడన్?= నాతో మారు మాట్లాడకున్నావెందుకు?; అస్త్రగురుండున్= ద్రోణాచార్యుడు; తత్తనయుండున్= అశ్వత్థామ; కృపుఁడున్= కృపాచార్యుడు; రాధాసుతుండున్= కర్ణుడూ; పాడి మానసులు+అండ్రు= న్యాయంగా నడుచుకునే పెద్ద మనుషులంటారు; ఈ+బాలున్+ఒకనిన్+పొదివిరి= ఆ యువకుడిని ఒక్కడిని ముట్టడించారు; పెక్కండ్రు ప్రోడలు= చాలామంది పెద్దవాళ్ళు (కలిసి); ఇస్సిరో!= ఛీ ఛీ!; ఇదియున్= ఇదికూడా (ఒక); మగఁటిమియె?= పరాక్రమమేనా?; ఇట్లు= ఇట్లా; క్రించు పనికిన్= నీచ కార్యానికి; తెగిన+అప్పుడు= సాహసించినపుడు; వారలకున్= వాళ్ళకు; ఉల్లములు= హృదయాలు; ఎట్టులు+ఉండెన్+ఒక్కొ!= ఎట్లా ఉన్నాయో ఏమో! (ఈ కరకు పని చేయటానికి వాళ్ళ మనసులు ఎట్లా అంగీకరించాయి? అని అర్థం.)

తాత్పర్యం: 'ఉత్తమమైన చరిత్ర కలిగిన ఓ అభిమన్యుడా! మీ తల్లి సుభద్రను, దేవతాసమానులైన పాండవులను వదలి ఎక్కడికి వెళ్ళావు? అర్జునుడి కుమారుడివి. శ్రీకృష్ణుడి అల్లుడివి. నిన్ను ఎదిరించి చంపగలిగినవారు ఎవరున్నారు? ఇన్ని విధాలుగా మాట్లాడుతున్నానే - మారుమాటలాడ వెందుకు? ద్రోణుడు, అశ్వత్థామ, కృపుడు, కర్ణుడు న్యాయ మెరిగిన పెద్దమనుషులంటారే. అట్లాంటి పెద్దలు పలువురు చేరి ఒక చిన్నవాడిని ముట్టడించటమా? ఛీ ఛీ! ఇది కూడా మగతనమేనా? ఇట్లాంటి నీచకార్యానికి పాల్పడటానికి వాళ్ళకు మనస్సులు ఎట్లా వచ్చాయి?

క. పాండవులును బాంచాలురు । దండిమగలు వారు సూడఁ దలఁకక నిన్నున్
భండనమునఁ బడవైవఁగ । గండు గలుగు టద్భుతంబు గాదె తలంపన్! 78

ప్రతిపదార్థం: పాండవులును= పాండుకుమారులు; పాంచాలురు= పాంచాలవీరులు; దండిమగలు= నిండు పరాక్రమవంతులు; వారు+చూడన్= వాళ్ళు చూస్తుండగా; తలఁకక= భయపడక; నిన్నున్= నిన్ను; భండనమునన్= యుద్ధంలో; పడవైవఁగన్= చంపగా; గండు= మగఁటిమి కలవాడు; కలుగుట= ఉండటం; తలంపన్= ఆలోచిస్తే; అద్భుతంబు+కాదె!= ఆశ్చర్యం కాదూ!

తాత్పర్యం: పాండవులు, పాంచాలురు మహాపరాక్రమశాలులు. వాళ్ళు చూస్తుండగా నిన్ను ఏ సంకోచమూ లేకుండా యుద్ధంలో చంపగలిగిన మగటిమి ఉన్నవారు ఉండటం ఆశ్చర్యం కాదూ!

క. తనలేనిచోటఁ బలువురు । నినుఁ జుట్టును ముట్టి యొక్కనింజేరి వధిం
చిన వంచనకు ధనంజయు । మన మెమ్మెయి నురియునొక్కొ! మన్మథమూర్తీ! 79

ప్రతిపదార్థం: మన్మథ= మన్మథుని వంటి; మూర్తీ!= ఆకారం కలవాడా!; తన= తనయొక్క; లేనిచోటన్= లేని స్థలంలో; పలువురు= చాలమంది; నినున్= నిన్ను; చుట్టును= చుట్టుముట్టి; ఒక్కనిన్+చేరి= ఒక్కడిని సమీపించి; వధించిన= చంపిన; వంచనకున్= మోసానికి; ధనంజయు మనము= అర్జునుడి మనస్సు; ఏ+మెయిన్= ఏ విధంగా; ఉరియున్+ఒక్కొ!= దుఃఖిస్తుందో ఏమో!

తాత్పర్యం: మన్మథుడి వంటి మనోహరాకారం కలిగిన నాథా! తానులేని సమయంలో అంతమంది నిన్ను చుట్టుముట్టి ఒక్కడిని చేసి ఘోరంగా చంపిన మోసాన్ని తలచుకొని అర్జునుడి మనస్సు ఏ విధంగా దుఃఖిస్తుందో కదా!

తరలము:

అరుల నెల్లను గెల్చి మేదిని యంతయుంగొని తేజమున్
సిరియుఁ బెంపును గీర్తియున్ విలసిల్లఁగా వినుచుండియుం
బురుషసింహులు పాండుభూవరపుత్రు లక్కట! మోదముం
బొరయ నేర్తురె? నిన్నుఁ గోల్పడిపోయి పుష్కరలోచనా! 80

ప్రతిపదార్థం: పుష్కరలోచనా!= పద్మలోచనా! (తామరలవంటి కన్నులు కలవాడా); అరులన్+ఎల్లను= శత్రువులందరినీ; గెల్చి= గెలిచి; మేదిని+అంతయున్+కొని= రాజ్యాన్నంతా సంపాదించుకొని; తేజమున్= కాంతిని; సిరియున్= సంపదను; పెంపును= వైభవాన్ని; కీర్తియున్= మంచిపేరును; విలసిల్లన్ఁగాన్= వ్యాపించగా; వినుచుండియున్= ప్రశంసలను వింటూ ఉండి కూడా; పురుష సింహులు= పురుష శ్రేష్ఠులు; పాండుభూవర పుత్రులు= పాండు కుమారులు; నిన్నున్+కోల్పడి+పోయి= నిన్ను పోగొట్టుకొని; అక్కట!= అయ్యో!; మోదమున్= సంతోషాన్ని; పొరయన్+నేర్తురె?= పొందగలరా?

తాత్పర్యం: తామరలవంటి కన్నులు గలవాడా! శత్రువులందరినీ చంపి రాజ్యాన్నంతా సంపాదించుకొని కాంతి, సంపద, వైభవం, కీర్తి - నలుదిశల వ్యాపించగా లోకం మెచ్చుకొంటూ ఉండగా, వింటూ ఉన్నా పాండురాజ కుమారులు నిన్ను పోగొట్టుకొని సంతోషం పొందగలరా! అయ్యో! ఇప్పుడు రాజ్యం వచ్చి లాభ మేమిటి?

విశేషం: వృత్తలక్షణం - చూడండి. స్త్రీ 2-27.

క. నీ మూర్తియందుఁ బ్రాణము । లేమిఁ దెలిసియుండఁ జంచలింపక జీవం
బేమి కతంబునఁ గలిగియె । నామేను దొఱఁగిపోదు నాథ! యెఱుంగన్. 81

ప్రతిపదార్థం: నాథ!= ప్రియా!; నీ మూర్తియందున్= నీ దేహంలో; ప్రాణము లేమిన్= ప్రాణంలేకపోవటం; తెలిసి+ఉండన్= తెలిసి ఉండికూడా; చంచలింపక= ఏచలనమూలేక; జీవంబు= ప్రాణం; ఏమి కతంబునన్= ఏ కారణం; కలిగియె= ఉన్నదో; నా మేనున్= నా దేహం నుండి; తొఱఁగిపోదు= వెళ్ళిపోదు; ఎఱుంగన్= తెలియదు.

తాత్పర్యం: ప్రియా! నీ దేహంలో ప్రాణం లేదని తెలిసినా కూడా ఏ చలనమూ లేకుండా నా ప్రాణం ఏ కారణంతో నా దేహం నుండి వెళ్ళిపోవటం లేదో నాకు తెలియటం లేదు.

సీ. దేవలోకంబున నీ విప్పుడెవ్వతఁ । దీపారు పలుకులఁ దేర్చి కురులు
పుడుకుచుఁ దగ నన్న పోలె లోలాత్మఁగాఁ । జేయుచున్నాఁడవు? చెలువు నేర్పు
మెఱయంగ నచ్చర తెఱవల మనములు । గలఁచి యాడుదు గాక యలఁతిఁ బోదె?
యంగనాగోష్ఠి నున్నపుడు నా నడవడి । బుద్ధిఁ దలంతె? ని న్బొందఁ గాంచి

ఆ. యాఱు నెలలు వోయె నంతియ యింతియె । కానిలేదె? తొంటి మేనఁ జేసి
నట్టి మేలు మోహనాకార యభిమన్యు । వీర నిర్వికార! వినుతసార! 82

ప్రతిపదార్థం: అభిమన్యు వీర!= వీరుడైన ఓ అభిమన్యు కుమారా!; నిర్వికార!= ఏ వికారములేనివాడా!; వినుతసార!= ప్రస్తుతింపబడ్డ పరాక్రమం కలవాడా!; దేవలోకంబునన్= స్వర్గంలో; నీవు+ఇపుడు= నీవు ఈ సమయంలో; ఎవ్వతన్= ఏ అప్సరసను; తీపారు పలుకులన్= మధురమైన పలుకులతో; తేర్చి= లాలించి; కురులు+పుడుకుచున్= వెంట్రుకలలో వేళ్ళుపోనిచ్చి; తగన్= తగినట్టుగా; నన్నున్+అ+పోలెన్= నన్నులాగే; లోలాత్మగాన్= సంతసించిన హృదయం కలిగినదానిలాగా; చేయుచున్నాఁడవు?= చేస్తున్నావు?; చెలువు= అందమూ; నేర్పు= జాణతనం; మెఱయంగన్= వెలయగా; అచ్చర తెఱవల మనములు= అప్సరసల మనస్సులు; కలఁచి+ఆడుదు+కాక= క్షోభపెడతావు తప్ప; అలఁతిన్+పోదె?= సులభంగా వారిని వదలిపెడతావా?; అంగనాగోష్ఠిన్+ఉన్నపుడు= స్త్రీలతో కలిసి ఉన్నపుడు; నానడవడి= నేను వర్తించే రీతిని; బుద్ధిన్+తలంతె= మనసులో అనుకొంటావా! నిన్+పొందన్+కాంచి= నీతో సుఖపడి; ఆఱునెలలు+పోయెన్= ఆరు నెలలు గడిచిపోయింది; తొంటిమేనన్= పూర్వజన్మలో; చేసినట్టిమేలు= చేసిన ఉపకారం; అంతియ= అంతో; ఇంతియ= ఇంతో; కానిలేదె?= కాని లేకపోయిందా?; మోహనాకార!= సమ్మోహకమైన శరీరం కలిగిన నాథా! (నన్ను వదిలి ఎట్లా వెళ్ళావు?).

తాత్పర్యం: మహావీరా! అభిమన్యూ! ఏ వికారాలూ లేకుండా నిద్రిస్తున్నావా! ప్రపంచమంతా నీ పరాక్రమం మారు మోగిపోతోంది. నీవు స్వర్గానికి చేరి ఇప్పుడు ఏ అప్సరసను మధురమైన పలుకులతో లాలించి జుట్టులోకి వేళ్ళు జొనిపి నన్ను ఎట్లా సమ్మోహనపరిచావో అట్లాగే ఆమెనూ సుఖింపచేస్తూ ఉండి ఉంటావు. అందమూ నేర్పరితనమూ కల్గిన నీవు అప్సరసల మనస్సులను క్షోభపెట్టుతావు తప్ప అంత సులభంగా వారిని వదిలిపెట్టుతావా? ఆ దివ్యాంగనలతో కలిసి మాట్లాడుతున్నపుడు నేనూ, నా నడవడీ గుర్తుకురావా? నన్ను తలచుకోవా? నీతో సుఖించి ఆరు నెలలు గడిచిపోయింది. ఆ జన్మలో చేసిన మేలు అంతో ఇంతో కూడా నీకు మనసులో మిగలలేదా? ఓ సమ్మోహనకారా! నన్ను వదలి ఎట్లా వెళ్ళావు?'

వ. అను చున్నది యిట్లు పలవింప విరాటనందనం దదీయ జననీప్రముఖ బాంధవస్త్రీ జనంబు లచ్చటువాయం దిగిచి పొగులుచుం గొనిపోయిరి వారలం గనుంగొనుము. 83

ప్రతిపదార్థం: అనుచున్నది= అని అంటున్నది; ఇట్లు= ఈ విధంగా; పలవింపన్= శోకించగా; విరాటనందనన్= ఉత్తరను; తదీయ= ఆమె యొక్క; జననీ ప్రముఖ= తల్లి మొదలైన; బాంధవ స్త్రీజనంబు= బంధు స్త్రీలు; ఆ+చోటు+పాయన్= ఆ చోటునుండి; తిగిచి= పట్టుకొని లేపి; పొగులుచున్= దుఃఖిస్తూ; కొనిపోయిరి= తీసుకువెళ్ళారు; వారలన్= వారిని; కనుంగొనుము= చూడుము.

తాత్పర్యం: అని అంటున్నది. ఈ విధంగా ఆమె శోకిస్తుండగా ఉత్తరను ఆమె తల్లి మొదలైన బంధువులైన స్త్రీలు ఆ చోటినుండి లేపి దుఃఖిస్తూ పట్టుకొని తీసికొనివెళ్ళారు. వారిని చూడుము.

కవిరాజ విరాజితము.

గురుని శరంబులు దాఁకిన మేదినిఁగూలి విరాటుఁడు పేరిన నె
త్తురుల మునింగిన మేనును దానును ధూళి సమీరుఁడు మోము పయిం
బొరిఁబొరిఁ జల్లఁగ నున్కి గనుంగొని పొడ్మఁగ నశ్రులు హా యనుచుం
బురపురఁ బొక్కెద రెమ్మెయిఁ జోపినఁ బోవక మూఁగెడుఁ బక్షితతుల్. 84

ప్రతిపదార్థం: గురుని శరంబులు= ద్రోణుడి బాణాలు; తాఁకినన్= నాటుకోగా; మేదినిన్+కూలి= నేలకూలి; విరాటుఁడు= విరాటరాజు; పేరిన= గడ్డకట్టిన; నెత్తురులన్+మునింగినన్= రక్తంలో మునిగిపోగా; సమీరుఁడు= వాయుదేవుడు; ధూళిన్= దుమ్మును; మోముపయిన్= ముఖంమీద; పొరిన్+పొరిన్= మాటిమాటికీ; చల్లఁగన్= చల్లగా; మేనును+తానును= దుమ్ము నిండిన శరీరంతో ఆరాజు; ఉన్కిన్= ఉండటాన్ని; కనుంగొని= చూసి; అశ్రులు= కళ్ళనీరు; పొడ్మఁగన్= పెల్లుబికిరాగా; హా+అనుచున్= హా హా కారాలు చేస్తూ; పురపురన్+పొక్కెదరు= కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నారు (ఆ స్త్రీలు); ఎమ్మెయిన్= ఎంత; చోపినన్= తరిమినా; పక్షితతుల్= పక్షి సమూహాలు; పోవక= వెళ్ళిపోకుండా; మూఁగెడున్= ఆ శవంచుట్టూ మూగుతున్నాయి.

తాత్పర్యం: ద్రోణాచార్యుల బాణాలు తగిలి నేలకూలి విరాటరాజు గడ్డకట్టిన నెత్తురులో మునిగిపోగా, వాయుదేవుడు దుమ్మును దోసిళ్ళతో చల్లినట్లు మాటిమాటికీ చల్లుతుండగా, ఆ దుమ్ములో, ధూళితో నిండిన శరీరంలో ఆ రాజు పడి ఉండటం చూచి ఆ స్త్రీలకు కళ్ళల్లో నీరు పెల్లుబికి రాగా హాహాకారాలు చేస్తూ కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నారు. వారు ఎంత తరిమినా పోకుండా కాకులు, గద్దలు, రాబందులు ఆ శవం చుట్టూ మూగుతున్నాయి.

విశేషం: కవిరాజవిరాజితవృత్తంలో ప్రతిపాదంలోనూ వరుసగా న, జ, జ, జ, జ, జ, ల, గ - అనే గణాలు ఉంటాయి. 1-8-14 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

క. అకటకట! యుత్తరుఁడు గొం । డొక కాంభోజుండునుం గడున్ బాలుఁడు వా
లిక కైదువు లాడిన నే । ల కొఱగి యొప్పి రభిమన్యు లక్ష్మణుల క్రియన్. 85

ప్రతిపదార్థం: అకటకట!= అయ్యయ్యో!; ఉత్తరుఁడు= విరాటమహారాజు కుమారుడు ఉత్తరుడు; కడున్+బాలుఁడు= మరీ చిన్నవాడు; కొండొక= ఒకానొక; కాంభోజుండును= కాంభోజయువరాజు; వాలిక= వాడి అయిన; కైదువులు= ఆయుధాలు;

ఆడఁగన్= నాటుకోగా; అభిమన్యు= అభిమన్యుడు; లక్ష్మణుల క్రియన్= లక్ష్మణకుమారుడు - వీరిలాగా; నేలకొఱఁగి= నేల మీదపడి; ఒప్పిరి= ప్రకాశిస్తున్నారు.

తాత్పర్యం: అయ్యయ్యో! ఇక్కడ చూడుము. ఉత్తరకుమారుడు, మరొక చిన్నవాడు కాంభోజయువరాజు. శత్రువులు ప్రయోగించిన వాడి ఆయుధాలకు చిక్కి అభిమన్యు లక్ష్మణ కుమారులవలె నేలకొరగి ఉజ్జ్వలంగా ప్రకాశిస్తున్నారు.

సీ. పాండుపుత్రుల భుజాబలమున కులుకక । యెవ్వీరు ప్రాపున నెదురు నడచె
దుర్యోధనుఁడు గొంతి తొలిచూలి కెవ్వఁడు । హృదయ శల్యంబయి నిదుర సెఱుచు
నట్టి కర్ణుండు మదాంధసింధురము బ । లోద్ధత ద్విరద మహోగ్రవిక్ర
మమున గీటడఁగిన మాడ్కి నర్జును బలు । గడిమిచేఁ దెగటార్చఁబడియె వీని

ఆ. బాహు విలసనమునఁ బడిన మహాయోధ । వరు లనేకు లితఁ డవార్యరోష
భూషితుండు పరుషభాషణశీలుండు । ధైర్యధనుఁడు దానశౌర్యశాలి. 86

ప్రతిపదార్థం: పాండుపుత్రుల= పాండవుల; భుజాబలమునకున్= భుజభక్తికి; ఉలుకక= భయపడక; ఏ+వీరు= ఏ వీరునియొక్క; ప్రాపునన్= అండతో; దుర్యోధనుఁడు: ఎదురు నడచెన్= పాండవులకు వ్యతిరేకంగా ప్రవర్తించాడో; గొంతి= కుంతీదేవి; తొలిచూలికిన్+ఎవ్వఁడు= తొలిబిడ్డ అయిన ధర్మరాజుకు ఎవడు; హృదయశల్యంబు+అయి= గుండెలో పుండులాగా; నిదుర+చెఱుచున్= నిద్రలేకుండా చేశాడో; అట్టి= అటువంటి; కర్ణుండు= కర్ణుడు; మద+అంధ= మదంతో గ్రుడ్డిదయిన; సింధురము= ఏనుగు; బల+ఉద్ధత= బలంతో మిక్కిలి అతిశయించిన; ద్విరద= ఏనుగుయొక్క; మహోగ్రవిక్రమమునన్= మిక్కిలి భయంకరమైన పరాక్రమంచేత; గీటడఁగినమాడ్కిన్= చచ్చిన తీరుగా; అర్జును= అర్జునుడియొక్క; బలు+కడిమిచేన్= మిక్కిలి పరాక్రమంచేత; తెగటార్చఁబడియెన్= చంపబడ్డాడు; వీని= ఈ కర్ణుడి; బాహు విలసనమునన్= బాహువుల విలాసంచేత; పడిన= చచ్చిన; మహాయోధవరులు= మహాయోధశ్రేష్ఠులు; అనేకులు= చాలామంది (ఉన్నారు); ఇతఁడు= ఈ కర్ణుడు; అవార్య= వారించటానికి వీలుకాని; రోష= రోషంతో; భూషితుండు= అలంకరించబడినవాడు; పరుష భాషణశీలుండు= కఠినంగా మాట్లాడేస్వభావం కల్గినవాడు; ధైర్యధనుఁడు= ధైర్యమే సంపదగా కలవాడు; దాన= దానంచేతను; శౌర్య= పరాక్రమంలోనూ; శాలి= ఒప్పేవాడు.

తాత్పర్యం: ఏ వీరుడి అండతో దుర్యోధనుడు పంచపాండవుల బాహు పరాక్రమానికి భయపడక వారికి వ్యతిరేకంగా ప్రవర్తించాడో, కుంతీదేవి పెద్దకొడుకయిన ధర్మరాజుకు ఎవడు గుండెలో గాలమై నిద్రలేకుండా చేశాడో - ఆ కర్ణుడు మదంతో గుడ్డిదయిన ఏనుగు, బలంతో మిక్కిలి అతిశయించిన ఏనుగుయొక్క మిక్కిలి భయంకరమైన పరాక్రమం చేత చచ్చిన రీతిగా అర్జునుడి మహా పరాక్రమంచేత చంపబడ్డాడు. ఈ కర్ణుడి బాహువిలాసంచేత ఎంతో మంది మహాయోధులు మృతిపొందారు. ఈ కర్ణుడికి రోషమే మహాభూషణం. ఇతడు అతి పరుషంగా మాట్లాడే స్వభావం కలిగినవాడు. ధైర్యమే ఇతడి సంపద. దానవీరంలో ఇతడు సుప్రసిద్ధుడు.

వ. విను మవ్వీరోత్తముండు. 87

తాత్పర్యం: ఆ వీర శ్రేష్ఠుడు ఎట్లాంటివాడో చెప్పుతాను వినుము.

క. పిఱుఁదం గురుధరణీపతి । నఱచేతం బ్రాణములు ఘనారాతి బలం
బుఱని తెగువ ముందటఁ బె । న్గొఱలుట చిత్తమునఁ బెట్టికొని విహరించెన్. 88

ప్రతిపదార్థం: పిఱుఁదన్= వెనుక; కురుధరణీపతిన్= కురురాజు దుర్యోధనుడిని; అఱచేతన్= అరచేతిలో; ప్రాణములు= ప్రాణాలను; ముందటన్= ముందు; ఘన+అరాతిబలంబు= గొప్పదైన శత్రుసైన్యం; ఉఱని= లక్ష్యపెట్టని; తెగువన్= సాహసంతో; పెన్= మిక్కిలిగా; కొఱలుట= కోపించటం; చిత్తమునన్= మనసులో; పెట్టికొని= ఉంచుకొని; విహరించెన్= యుద్ధం చేశాడు.

తాత్పర్యం: ఆ కర్ణుడు బాధ్యతతో యుద్ధం చేశాడు. ఇతడి వెనుక ఇతడిని నమ్మి యుద్ధంలోకి దిగిన దుర్యోధను డున్నాడు. పరశురామాదుల శాపాలవలన తన ప్రాణాలకు ముప్పున్నదని తెలుసును. ముందర శత్రుసైన్యం విజృంభణంతో అతిరోషంతో దూసికొనివస్తున్నది. ఇన్నిటినీ మనసులో ఉంచుకొని యుద్ధంలో వీరవిహారం చేశాడు.

తే. **ఇతని చుట్టును గలకల మెసఁగ రోద । నంబు సేయు పత్నీనివహంబులోనఁ**
గంటె వృషసేనుతల్లి యగ్గలపుటడలు? మూర్తియైన తెఱంగున నార్తిఁ దూలె. **89**

ప్రతిపదార్థం: ఇతని చుట్టును= ఈ కర్ణుడి శవం చుట్టూ; కలకలము+ఎసఁగన్= పెద్దధ్వని పుట్టగా; రోదనంబు+చేయు= ఏడుస్తున్న; పత్నీ నివహంబులోనన్= భార్యల సమూహంలో; వృషసేనుతల్లి= వృషసేనుడితల్లి - కర్ణుడిభార్య; అగ్గలము+అడలు= మిక్కిలి దుఃఖం; మూర్తి+ఐన= ఆకారం దాల్చిన; తెఱంగునన్= రీతిగా; ఆర్తిన్= దుఃఖంతో; తూలెన్= వాలిపోయింది; కంటె= చూస్తున్నావా!

తాత్పర్యం: ఈ కర్ణుడి శవం చుట్టూ చేరి పెద్ద ధ్వనిపుట్టగా పెద్దగా ఏడుస్తున్న అతడి భార్యల గుంపును చూశావా? అందులో దుఃఖమే ఆకారం పొందినట్టుగా అతి దుఃఖంతో నేలమీద వాలిపోతున్న ఆమె వృషసేనుడి అమ్మ. కర్ణుడి ధర్మపత్ని. ఆమెను చూస్తున్నావా?

వ. **ఈ రమణీరత్నంబు ధరణీతలంబునం బొరలుచు.** **90**

ప్రతిపదార్థం: ఈ రమణీరత్నము= ఈ శ్రేష్ఠమైన స్త్రీ; ధరణీతలంబునన్= నేలమీద; పొరలుచున్= పొర్లుతూ.

తాత్పర్యం: ఈ వృషసేనుడి అమ్మ దుఃఖాతిరేకంతో నేలమీద పడి పొర్లుతూ (ఇట్లా అంటున్నది).

తే. **పరశురాముని శాపంబు బాణశక్తిఁ । గ్రాఁప బ్రాహ్మణశాపంబు రథము సిక్కు**
వఱుప గాండీవధరుచేతి మెఱుఁగుటమ్ము । మన్నిగొనియెనె యో కర్ణ! మగలరాజ! **91**

ప్రతిపదార్థం: ఓ కర్ణ!= ఓ మహావీరుడైన కర్ణా!; మగలరాజ!= వీరులలో శ్రేష్ఠుడా!; పరశురాముని శాపంబు= పరశురాముడిచ్చిన శాపం; బాణశక్తిన్= నీ బాణాలశక్తిని; క్రాఁపన్= నాశనం చేయగా; బ్రాహ్మణశాపంబు= బ్రాహ్మణుడిచ్చిన శాపం; రథమున్= రథాన్ని; చిక్కుపఱుపన్= భూమిలో ఇరుక్కుపోయేలా చేయగా; గాండీవధరు చేతి= అర్జునుడి చేతిలోని; మెఱుఁగు+అమ్ము= వాడిబాణం; (నిన్ను); మన్నిగొనియెనె?= చంపివేసిందా? (నాథా!)

తాత్పర్యం: 'ఓ మహావీరుడా! కర్ణా! పరశురాము డిచ్చిన శాపం నీ బాణాలశక్తిని నశింపజేసింది. బ్రాహ్మణు డిచ్చిన శాపం రథచక్రం భూమిలో క్రుంగిపోయేటట్లు చేసింది. చివరకు అర్జునుడి చేతిలోని వాడిబాణం నీ ప్రాణాలు తీసింది. నాథా! ఎంత దారుణ మిది!

వ. **అని మఱియుం బలుదెఱంగులం బలవించి యుత్థితయై యాలోకించి.** **92**

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; మఱియున్= ఇంకా; పలు+తెఱంగులన్= అనేకవిధాలుగా; పలవించి= విలపించి; ఉత్థిత+ఐ= లేచి; ఆలోకించి= తన భర్త దేహాన్ని చూసి.

తాత్పర్యం: ఈ విధంగా ఇంకా అనేక రీతులలో ఆమె విలపించి విలపించి, చివరికి లేచి తన భర్త దేహాన్ని చూచి (తరువాత పద్యంతో అన్వయం.)

తే. **కాకులును గ్రద్దలును దిన్నఁ గడును ద్రెస్సి । యపరపక్షచతుర్దశి యమృతకరుని**
కరణి నొప్పెడు కర్ణుమొగంబుమీఁద । వనిత యందంద మోపెడుఁ దన మొగంబు. **93**

ప్రతిపదార్థం: కాకులును; గ్రద్దలును; తిన్నన్= తినగా; కడును= మిక్కిలి; త్రెస్సి= తెగి చివికిపోయి; అపరపక్ష= కృష్ణపక్ష; చతుర్దశి= చతుర్దశినాటి; అమృతకరుని కరణిన్= చంద్రుడిలాగా; ఒప్పెడు= కనిపిస్తున్న; కర్ణు మొగంబుమీఁదన్= కర్ణుడి ముఖంపైన; వనిత= వృషసేనుడి తల్లి; అందంద= మాటిమాటికి; తన మొగంబున్= తన ముఖాన్ని; మోపెడున్= మోపుతోంది.

తాత్పర్యం: కాకులు, గద్దలు తినవేయగా మిక్కిలిగా తెగి చివికిపోయిన కృష్ణపక్షంలోని చతుర్దశినాటి చంద్రుడివలె కాంతివిహీనంగా కనిపిస్తున్న కర్ణుడి ముఖంపైన తన ముఖం మాటిమాటికి మోపుతూ వృషసేనుడి తల్లి దుఃఖిస్తున్నది.

విశేషం: అలం: ఉపమ.

ఉత్సాహవృత్తము:

వాఁడిమగఁడు నిద్రపోవు వాలుమృగముఁ బోలె నై
వీఁడె బాహ్లికుండు వృష్ణివీర! చూడు చచ్చియుం
బోఁడి దొఱఁగ కున్నయట్టి పొల్పునన్ వెలింగె వె
న్నీఁ డితండు బలము లెన్నియేనిఁ బెల్లు ద్రోచినన్. **94**

ప్రతిపదార్థం: వృష్ణివీర!= వృష్ణికులంలో పుట్టిన, వీరుడైన కృష్ణా!; చూడు= ఇక్కడచూడుము; వీఁడె= ఇతడే; బాహ్లికుండు= బాహ్లికుడు; వాలు మృగమున్+పోలెన్+ఐ= పులిలాగా; వాఁడి మగఁడు= ఈ మహావీరుడు; నిద్రపోవున్= నిద్రపోతున్నాడు; చచ్చియున్= చచ్చికూడా; పోఁడి= అందం; తొఱఁగకున్న+అట్టి+పొల్పునన్= తగ్గిపోని విధంగా; వెలింగెన్= ప్రకాశిస్తున్నాడు; బలములు+ఎన్నియేనిన్= శత్రుబలాలు ఎన్నైనా సరే; పెల్లు+త్రోచినన్= ఎంత ఘోరంగా పోరాడినా; ఇతండు= ఈ బాహ్లికుడు; వెన్ను+ఈఁడు= వెన్నుచూపడు.

తాత్పర్యం: ఓ కృష్ణా! ఇదిగో ఈ బాహ్లికుడు మహావీరుడు నిద్రపోయేపులిలాగా ఉన్నాడు చూడు. చచ్చినా అందం ఏమాత్రం తగ్గని విధంగా వెలుగుతున్నాడు. ఎంతసైన్యం ఎంత బలంగా ఎదిరించినా వెనుకకు తిరిగిపోడు.

విశేషం: అలం: ఉపమ. వృత్తలక్షణానికి చూడండి. స్త్రీ. 1. 48.

తే. **మేనఁ బ్రాణము వాసినమీఁద మొగము । బొఱసి యుండునె? యెందు నిత్తెఱఁగు కాంతి**
తోడఁ? బున్నమనాఁటి చందురుని చంద । మమరెఁ జూడు మిక్కురువృద్ధు నాననంబు. **95**

ప్రతిపదార్థం: మేనన్= దేహంలోనుండి; ప్రాణము; పాసిన= వదలిన; మీఁదన్= తరువాత; ఎందున్= ఎక్కడైనా; మొగము= ముఖం; ఈ+తెఱగు కాంతితోడన్= ఈ విధమైన ప్రకాశంతో; పొఱసి+ఉండునె?= కూడి ఉంటుందా?; ఈ+కురువృద్ధ+ ఆననంబు= కురువంశీయులలోని పెద్దలలో ఒకడైన ఇతడి ముఖం; పున్నమనాఁటి= పూర్ణిమనాటి; చందురుని చందము= నిండు చందురుని రీతిగా; అమరెన్= ఒప్పింది; చూడు= చూడుము.

తాత్పర్యం: కృష్ణా! ఆ బాహ్లికుడిని చూడుము. దేహంలో నుండి ప్రాణం వదలిపోయిన తరువాత ఎక్కడైనా ముఖం ఇంత కాంతిమంతంగా ఉండటం చూచామా! కురువృద్ధులలో ఒకడైన ఈ బాహ్లికుడి ముఖం నిండుపున్నమినాటి చంద్రుడి రీతిగా కాంతులు విరజిమ్ముతున్నది.

విశేషం: అలం: ఉపమ.

గాంధారి సైంధవుని కళేబరము చూచి వాపోవుట (సం. 11-22-7)

సీ. **పల్కుతప్పమి నెఱపంగఁ దలంచి యు । త్సాహంబు పాటించి సవ్యసాచి**
దుర్యోధనుండును దొరలు ననేక సై । న్యంబులు నంతంత నడ్డపడఁగ
దెరలిచి వడి మెడద్రెవ్వ నేసినఁ బడి । యున్నాఁడు సైంధవుఁ డుఱక ద్రుపద
తనయఁ గాననమునఁ గొనిచన్ననాఁడ తాఁ । దెగినాఁడు గాఁడె! కౌంతేయు లపుడు

తే. **దయ దలిర్పంగ దుస్సలఁ దలఁచి యలుక । గ్రాఁచి మందలవిడిచిరి గాక దైవ**
కృతము తప్పింప రాకున్కి కతన నిపుడు । వారు విడిచి రిమ్ముద్దియవలని కరుణ. 96

ప్రతిపదార్థం: సవ్యసాచి= అర్జునుడు; పల్కుతప్పమి= మాట తప్పకపోవటాన్ని; నెఱపంగన్+తలంచి= చెల్లించుకోవాలని నిశ్చయించి; ఉత్సాహంబు= ఉత్సాహాన్ని; పాటించి= పూని; దుర్యోధనుండును; దొరలు= అనేక సామంతరాజులు (అనేక శ్రేష్ఠవీరులని కూడా అర్థం); అనేక సైన్యంబులున్= ఎంతో సైన్యం; అంతంతన్= మాటిమాటికి; అడ్డపడఁగన్= అడ్డుపడగా; తెరలిచి= పక్కకునెట్టి; వడిన్= వేగంగా; మెడన్+త్రెవ్వన్+ఏసినన్= మెడ తెగేలాగా బాణం వేయగా; సైంధవుఁడు= సైంధవుడు; ఉఱక= మెదలకుండా; పడి+ఉన్నాఁడు= పడి ఉన్నాడు; ద్రుపదతనయన్= ద్రౌపదిని; కాననమునన్= అడవిలో; కొని చన్ననాఁడు+అ= అపహరించి తీసుకొని వెళ్ళిననాడే; తాన్= తాను; తెగినాఁడుగాఁడె!= చచ్చాడు కాదూ!; కౌంతేయులు= పాండవులు; అపుడు= ఆ సమయంలో; దయ+తలిర్పంగన్= దయపుట్టగా; దుస్సలన్+తలఁచి= దుస్సలను తలచుకొని; అలుక+గ్రాఁచి= కోపం వదలి; మందల విడిచిరిగాక= ప్రాణంతో వదలిపెట్టారు తప్ప!; దైవకృతము= దైవనిర్ణయం; తప్పింపరాక+ఉన్కి+కతనన్= తప్పించటానికి వీలుకానిది కావటం వలన; వారు= ఆ పాండవులు; ఈ+ముద్దియ వలని కరుణన్= ఈ స్త్రీపట్లగల కరుణచేత; విడిచిరి= వదలిపెట్టారు.

తాత్పర్యం: అర్జునుడు తనమాట చెల్లించుకొనాలని నిశ్చయించుకొని ఉత్సాహం పూని దుర్యోధనాది మహావీరులు, గొప్ప సైన్యం మాటిమాటికి తనకు అడ్డుపడుతున్నా ప్రక్కకు నెట్టి వాడిబాణాలు వేయగా మెడతెగి సైంధవుడు కదలక మెదలక పడి ఉన్నాడు. అసలు ఆనాడు ద్రౌపదిని అడవిలో దొంగిలించి తీసికొనివెళ్ళిననాడే తాను చచ్చాడు కదా! ఆ సమయంలో తమ చెల్లెలని దుస్సల ముఖం చూచి వాడిని ప్రాణాలతో పోనిచ్చారు. దైవనిర్ణయం ఎవరూ తప్పించలేరు. అందుకే ఆ పాండవులు కూడా ఈనాడు చెల్లెలిపట్ల దయను విడిచి సైంధవుడిని చంపారు.

తే. హృదయమున వగలేనియ ట్టిట్టునట్టుఁ । దిరుగుచున్నది దుస్సల వరుని శిరముఁ
గాన కీ కూఁతు నిమ్మెయిఁ గనుట కంటెఁ । దలఁప నెక్కుడు దుఃఖంబు గలదె కృష్ణ! 97

ప్రతిపదార్థం: కృష్ణ= కృష్ణా!; హృదయమునన్= హృదయంలో; వగలేని+అట్టు= ఏ దుఃఖమూ లేని రీతిగా; ఇట్టున్+అట్టున్= ఇలా అలా; దుస్సల= సైంధవుడి భార్య; వరుని శిరమున్+కానక= తన భర్త శిరస్సు కనిపించక; తిరుగుచున్నది= తిరుగుతోంది; ఈ కూఁతున్= ఈ దుస్సలను; ఈ+మెయిన్= ఈ విధంగా; కనుటకంటెన్= చూడటం కన్నా; తలఁపన్= ఆలోచిస్తే; ఎక్కుడు= అధికమైన; దుఃఖంబు+కలదె?= దుఃఖం ఉంటుందా?

తాత్పర్యం: కృష్ణా! హృదయంలో ఏ దుఃఖమూ లేని దానివలె నా కూతురు దుస్సల సందడిగా అటూ ఇటూ తిరుగుతున్నది. ఎందుకో తెలుసా! తన భర్త శిరస్సు దొరకక. ఇట్లా ఈ కొమార్తెను చూడటం కన్నా అధికమైన దుఃఖం ఏముంటుంది?

వ. నాఁటి రాత్రి యరులు చేసికొనిన ప్రతిజ్ఞ వేగులవారిచేత దుస్సల విని సైంధవునికి బుద్ధి చెప్పిన తెఱంగు లవి వినుము. 98

ప్రతిపదార్థం: నాఁటిరాత్రి= ఆనాటి రాత్రి; అరులు= శత్రువులు; చేసికొనిన= చేసికొన్నటువంటి; ప్రతిజ్ఞన్= ప్రతిజ్ఞను; వేగులవారిచేతన్= గూఢచారులవలన; దుస్సల; విని; సైంధవుడికి; బుద్ధి చెప్పిన= బుద్ధి చెప్పిన; తెఱంగులు+అవి= ఆ రీతులను; వినుము.

తాత్పర్యం: ఆనాటి రాత్రి సైంధవుడిని చంపటానికి శత్రువులు చేసికొన్న ప్రతిజ్ఞలు వేగులవారిచేత విని దుస్సల సైంధవుడికి ఎన్నో రీతులుగా నీతిబోధ చేసింది. ఎట్లాగో వినుము.

సీ. విజయు ప్రతిజ్ఞకుఁ ద్రిజగంబులోపల । నడ్డంబులేదు సు మ్మధికుఁ డంటిఁ
గురురాజు సైన్యంబు బిరుదు నమ్మకు మంటి । గురుఁడు పార్థునకు మార్కొనఁడ యంటి
నరు డాయ నొకనికైనను బుద్ధిగొనదంటి । సమరంబు నీకు నసాధ్యమంటి
ధర్మపుత్త్రుఁడు నిన్ను దయఁగాచుఁ బొమ్మంటి । నామాట వినఁగదె నాథ యంటి

ఆ. రాజతిలక రాజ రాజకంఠీరవ । రాజరత్న దివసరాజతేజ
రాజరాజ!' యనుచు రాజన్యసైంధవ । రాజుఁ బనవుచుండె నాజిలోన. 99

ప్రతిపదార్థం: రాజతిలక!= రాజశ్రేష్ఠుడా!; విజయు= పార్థుని; ప్రతిజ్ఞకున్= ప్రతిజ్ఞకు; త్రిజగంబులోపలన్= ముల్లోకాలలో; అడ్డంబులేదు= అడ్డంలేదు; సుమ్ము= సుమా!; అధికుఁడు= ఆ అర్జునుడు అందరినీ మించినవాడు; అంటిన్= అన్నాను; నమ్మకుము= నమ్మవద్దు; అంటిన్= అన్నాను; గురుఁడు= ద్రోణుడు; పార్థునకున్= అర్జునుడికి; మార్కొనఁడు= ఎదుర్కోడు; అంటిన్= అన్నాను; రాజరత్న!= రాజులలో శ్రేష్ఠుడా!; నరున్= అర్జునుడిని; డాయన్= సమీపించటానికి; ఒకనికైనను= ఏ ఒక్కడికీ; బుద్ధి+కొనదు+అంటిన్= సాహసం రాదు అన్నాను; సమరంబు= యుద్ధం; నీకున్= నీకు; అసాధ్యము+అంటిన్= అసాధ్యం అన్నాను; దివసరాజతేజ!= సూర్యతేజా!; ధర్మపుత్రుడు= ధర్మరాజు; నిన్నున్= నిన్ను; దయన్+కాచున్+పొమ్ము+అంటిన్= దయతో రక్షిస్తాడు పో అన్నాను; నాథ= ఓ నాథా!; రాజరాజ!= రాజ శ్రేష్ఠుడా!; నామాట= నా మాటలు; వినన్+కదె+అంటిన్= దయచేసి వినుము అన్నాను (ఇట్లా ఆమె అన్న మాటలు గాంధారి తెల్పి); అనుచున్= అని ఈ విధంగా; రాజన్యున్= రాజశ్రేష్ఠుడైన; సైంధవరాజున్= సైంధవుడిని గూర్చి; ఆజిలోనన్= యుద్ధభూమిలో; పనవుచుండెన్= ప్రలాపిస్తూ ఉన్నది.

తాత్పర్యం: 'రాజా! నీవు రాజశ్రేష్ఠుడివి. నా మాటలు వినుము. అర్జునుడి ప్రతిజ్ఞకు మూడులోకాలలోను తిరుగులేదు సుమా! అతడు అందరికన్నా మిన్న. నీవు రాజసింహానివి. దుర్యోధనుడి సైన్యం అంత గొప్పది, ఇంత గొప్పది అని నమ్మి యుద్ధరంగంలోకి దూకవద్దు. ద్రోణుడు ఎప్పటికీ అర్జునుడిని ఎదుర్కొనటానికి ఇష్టపడడు. నీకున్న కాంతి రాజులలో ఎవరి కున్నది? అర్జునుడిని సమీపించటానికి ఎవడూ సాహసించడు. నీవు సూర్యతేజుడివి. ధర్మరాజు నిన్ను తప్పక దయతో కాపాడుతాడు 'పో' అన్నాను. నీవు చక్రవర్తివి. నా మాటలు దయచేసి వినుము. అన్నాను' అని ఆ దుస్సల ఆనాడు సైంధవుడితో అన్న మాటలు మళ్ళీ అంటుండగా వింటున్నావు గదా! అట్లా ఆ రాజును గూర్చి ఆ వనిత యుద్ధరంగంలో ప్రలాపిస్తున్నది.

తే. **తోడఁబుట్టువు విధవయై తొలఁగి యునికి । కోర్చి చలమునఁ బతిఁ దెగటార్చి సంత**
సించితిరె? తండ్రులార! మీరంచుఁ బాండు । పుత్రకుల దూఱుచున్నది పొలఁతి వింటె? **100**

ప్రతిపదార్థం: తండ్రులార!= ఓ తండ్రులార; తోడఁబుట్టువు= మీ చెల్లెలు; విధవ+ఐ= భర్తను పోగొట్టుకొనినదై; తొలఁగి= శుభకార్యాలకు అనర్హురాలై; ఉనికికిన్= ఉండటాన్ని; ఓర్చి= భరించి; చలమునన్= పట్టుదలతో; పతిన్= నా భర్తను; తెగటార్చి= చంపి; మీరు సంతసించితిరె?= మీరందరూ సంతోషపడ్డారా?; అంచున్= అంటూ; పాండుపుత్రకులన్= పాండు కుమారులను; పొలఁతి= దుస్సల; దూఱుచున్నది= నిందిస్తున్నది; వింటె?= వింటున్నావా?

తాత్పర్యం: 'ఓ తండ్రులారా! మీ చెల్లెలు భర్తను పోగొట్టుకొని విధవరాలై ఏ శుభకార్యానికీ పనికిరానిదిగా బయటికి నెట్టబడి ఉండటం కూడా సహించి పట్టుదలతో నా భర్తను చంపి మీరు సంతోషపడ్డారా?' అంటూ పాండవులను దుస్సల నిందిస్తున్నది. వింటున్నావా?

ఉత్సాహావృత్తము:

తనయుఁ గాచుపనికిఁబూని ధర్మపుత్ర వాయునం
దనులుఁ గవలుఁ జేయఁ గలుగు దండిమగలు సేనలం
గొని వడిం గడంగ సరకుగొనక నిల్చి యొక్కఁడుం
బెనఁగి యాఁగె సైంధవుండు బిరుదు దక్షుఁడుంగదే! **101**

ప్రతిపదార్థం: తనయున్= కొడుకైన అభిమన్యుడిని; కాచు= కాపాడే; పనికిన్+పూని= పనికోసం పూనుకొని; ధర్మపుత్ర వాయునందనులున్= ధర్మరాజు, భీముడు; కవలున్= నకుల సహదేవులు; చేయన్+కలుగు= సమర్థులైన; దండిమగలు= పరాక్రమవంతులైన వీరులు; సేనలన్+కొని= తమ సైన్యంతో; వడిన్+కడంగన్= వేగంగా ఉద్యమించగా; సైంధవుండు= సైంధవుడు; సరుకుగొనక= లెక్క చేయకుండా; నిల్చి= యుద్ధంలో నిలబడి; ఒక్కఁడున్= ఒక్కడే; పెఁనగి+ఆఁగెన్= యుద్ధం చేసి ఆపాడు; బిరుదు దక్షుఁడున్+కదే!= పేరందిన సమర్థుడు కదా!

తాత్పర్యం: అభిమన్యుకుమారుడిని కాపాడే పనికోసం పూనుకొన్న ధర్మరాజు, భీముడు, నకుల సహదేవులు సమర్థులైనవారు. పరాక్రమవంతులు. తమ సైన్యంతో కూడి వేగంగా ఉద్యమించినపుడు సైంధవుడు వాళ్ళను లెక్కచేయకుండా యుద్ధంలో నిలదొక్కుకొని ఒక్కడే పోరాడి వారిని ఆపగలిగాడు. సైంధవుడు మరి తక్కువవాడా! పేరు పొందిన సమర్థుడు కదా!

విశేషం: ఈ పేరు ఏమిటంటే అర్జునుడు లేని పాండవులను ఒక్కపూట జయించగలడన్న వరం ఉండటమే. వృత్తలక్షణానికి చూడండి. స్త్రీ. 1.48.

తే. **తప్పు సైంధవుపైఁ బెట్టఁ దగునొ? తగదొ? పార్థు ప్రతినకు నొక్కండ పాత్రమయ్యెఁ**
దాన యందఱ నాఁగుట తప్పుగాదె? । యదియ సౌభద్రు మృతి హేతు వగుట లేదె? **102**

ప్రతిపదార్థం: తప్పు= తప్పంతా; సైంధవుపైన్= సైంధవుడిమీద; పెట్టన్+తగునొ?+తగదొ?= పెట్టవచ్చునో? రాదో? (పెద్దలు నిశ్చయించాలి); పార్థు ప్రతినకున్= అర్జునుడి ప్రతిజ్ఞకు; ఒక్కండు+అ= సైంధవుడు ఒక్కడే; పాత్రము+అయ్యెన్= పాత్రుడయ్యాడు; తాను+అ= తానే; అందఱన్= అందరినీ; ఆఁగుట= ఆపటం; తప్పుకాదె?= తప్పుకాదె?; అదియ= అదే; సౌభద్రు= అభిమన్యుడి; మృతిహేతువు= మృతికి కారణం; అగుటలేదె?= కావటం లేదా?

తాత్పర్యం: తప్పు సైంధవునిమీద పెట్టవచ్చునో లేదో కాని అర్జునుని ప్రతిజ్ఞకు సైంధవుడు ఒక్కడే గురియైనాడు. (సైంధవుడు) తానొక్కడే అందరునూ (పాండవులనందరినీ) ఆపడం తప్పేకదా? అదియే అభిమన్యుడి మృతికి కారణం కావడం లేదా?

విశేషం: తన అల్లుడు కాబట్టి సైంధవుడి విషయంగా ఇంత మీమాంస చేస్తున్నది గాంధారి. ధర్మరాజాదులను ఆపటంవలన సైంధవుడే అభిమన్యుడి చావుకు కారణమంటారు కొందరు. కాని, అభిమన్యుడు తానొక్కడే దుస్సాహసంతో అంతమంది మేటిమగలను ఎదుర్కొనటం తప్పుగదా! ఆ దుస్సాహసమే అతడి మృతికి హేతువు. అభిమన్యుడు చావటానికి పద్మవ్యూహంలో నుండి బయటికి రావటం తెలియకపోవటం తప్ప సైంధవుడు అడ్డుపడటం కాదని గాంధారి వాదం.

తే. **బోరగిలఁ బడ్డవాఁడు గపోలమొకటి । పుడమి మోచినయది మోము పొలుపు సెడదు**
వీఁడె చూచితె శల్యుండు? వెడలియున్న జిహ్వ దినియెడు వాయస శ్రేణి కృష్ణ! **103**

ప్రతిపదార్థం: కృష్ణ!= కృష్ణా!; బోరగిలపడ్డవాఁడు= బోరగిల పడిఉన్నాడు; కపోలము+ఒకటి= ఒక చెక్కిలి; పుడమిన్= నేలను; మోచిన+అది= ఆని ఉన్నది; మోము= ముఖం; పొలుపు+చెడదు= అందం చెడిపోలేదు; వీఁడె+చూచితె?= వీడిని చూచావా?; శల్యుండు= ఇతడే శల్యుడు; వెడలి+ఉన్న= బయటకు వచ్చిన; జిహ్వన్= నాలుకను; వాయసశ్రేణి= కాకుల గుంపు; తినియెడున్= తింటున్నది.

తాత్పర్యం: కృష్ణా! ఇటుచూడుము. పాపం బోరగిలపడి ఉన్నాడు. ఒక చెక్కిలి నేలమీద ఆని ఉన్నది. ముఖంలో అందం ఏమాత్రమూ చెడిపోలేదు. ఎవరో గుర్తించావా? ఇతడే శల్యుడు. అయ్యో! బయటికి వచ్చిన నాలుకను కాకులు పొడుచుకొని తింటున్నాయి.

క. **ఇట్టవునె? మాద్రితోడం । బుట్టె ననక యితని ధర్మ పుత్రునకుఁ గడుం**
బెట్టిదుఁడై చంపవలసెఁ । జుట్టఫుఁదనమేల రాజ సుతులకుఁ గలుగున్? **104**

ప్రతిపదార్థం: ఇట్టు+అవునె?= ఇట్లా చేయటం బాగున్నదా?; మాద్రితోడన్= నకులసహదేవులతల్లి; తన పినతల్లి మాద్రితోపాటు; పుట్టెను+అనక= శల్యుడు పుట్టాడని భావించక; ఇతనిన్= ఈ శల్యుడిని; ధర్మపుత్రునకున్= ధర్మపుత్రుడికి; కడున్= మిక్కిలి; బెట్టిదుఁడై= నిర్దయుడై; చంపన్ వలసెన్= చంపవలసి వచ్చినది; రాజసుతులకున్= రాజకుమారులకు; చుట్టఫుఁదనము= చుట్టరికం; ఏల కలుగున్= ఎందుకుంటుంది?

తాత్పర్యం: ఈ విధంగా చేయటం బాగున్నదా? ఈ శల్యుడు తమ తల్లి తోబుట్టువు అని కూడా భావించకుండా నిర్దయగా ధర్మరాజు యుద్ధంలో ఇతడిని చంపివేశాడు. అయినా రాజకుమారులకు బంధుత్వాలు ఎందుకు?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. సెల్లుఁడు యమతనయునితో । నెల్ల గుణంబులను జాల నెనయుదు నని తా
నుల్లమున నిశ్చయించుం । జెల్లంబో! పోరఁ బగఱచే ని ట్లయ్యెన్. 105

ప్రతిపదార్థం: సెల్లుఁడు= ఈ శల్యుడు; తాను; ఎల్లగుణంబులను= అన్నిగుణాలలోను; యమతనయునితోన్= ధర్మరాజుతో; చాలన్= మిక్కిలిగా; ఎనయుదును= పోలుతాను; అని; ఉల్లమునన్= హృదయంలో; నిశ్చయించున్= అనుకొంటాడు; చెల్లంబో= అయ్యో! (అయితే ఏమిటి?); పోరన్= యుద్ధంలో; పగఱచేన్= శత్రువులచేత; ఇట్లు+అయ్యెన్= ఇలా దుర్గతి పాలయ్యాడు.

తాత్పర్యం: ఈ శల్యుడు తాను అన్ని గుణాలలోనూ ధర్మరాజుతో సమానమే అని అనుకొంటూ ఉండేవాడు. అయ్యో! ఏమి లాభం! చివరికి యుద్ధంలో ఈ విధంగా దుర్మరణం పాలయ్యాడు.

వ. అ మ్మహీవిభుండు. 106

తాత్పర్యం: ఆ శల్యమహారాజు.

భుజంగ ప్రయాతము:

కురుక్షోణినాథుండు గోరంగ మైత్రిన్ । ధురం దాల్చి తా నేర్పుతో సారథిత్వం
బరిశ్రేణిసంత్రాసియై పూని కర్ణుం । బరిక్షోభితుం జేసె భాషాస్త్రపంక్తిన్. 107

ప్రతిపదార్థం: కురుక్షోణినాథుండు= దుర్యోధనుడు; మైత్రిన్= స్నేహాన్ని; కోరంగన్= కోరగా; ధురన్+తాల్చి= ఆ బరువును మోసి; తాన్= తాను; నేర్పుతోన్= నైపుణ్యంతో; అరిశ్రేణి= శత్రుసమూహానికి; సంత్రాసి+ఐ= భయం కలిగించేవాడై; సారథిత్వంబు= రథచోదకుని పనిని; పూని= తీసికొని; కర్ణున్= కర్ణుడులాంటి మహావీరుడిని; భాషాస్త్రపంక్తిన్= మాటలనే బాణాల వరుసతో; పరిక్షోభితున్= మిక్కిలి కలతచెందినవాడినిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు శల్యుడిని మైత్రి కోరాడు. మిత్రధర్మాన్ని పాటించి, పెట్టిన బాధ్యతను స్వీకరించి ఎంతో నైపుణ్యంతో శత్రుసైన్యం ఇబ్బందిపడే రీతిగా రథసారథి పనిని చేపట్టి కర్ణుడి వంటి మహావీరులను మాటలనే బాణాలతో మిక్కిలి క్షోభచెందేటట్లు చేశా డీ శల్యుడు.

విశేషం: అలం: రూపకం. వృత్తలక్షణానిక చూడండి: స్త్రీ. 1. 88॥

ఆ. అధిక పంక పతితమై యున్న యాఁబోతుఁ । బొదివియున్న మొదవు కదుపు వోలె
నున్న వారు సూడు మువిదలు దైన్య మా । స్యముల నెలవు కొనఁగ శల్యు బలసి. 108

ప్రతిపదార్థం: అధికపంక= మిక్కిలిగా ఉన్న బురదలో; పతితమై+ఉన్న= పడిఉన్న; ఆఁబోతున్= ఆబోతును; పొదివి+ఉన్న= పొదువుకొని ఉన్న; మొదవు కదుపు= ఆవుల సమూహం; పోలెన్= వలె; ఉవిదలు= అతని భార్యలు; దైన్యము= దీనత్వం; ఆస్యములన్= ముఖాలలో; నెలవు+కొనఁగన్= నిండుకోగా; శల్యున్= శల్యుడిని; బలసి= చుట్టూచేరి; ఉన్నవారు+చూడుము= ఉన్నారు చూడుము.

తాత్పర్యం: కృష్ణా! ఆ శల్యుడిని ఆశ్రయించి అతి దీనంగా ఏడుస్తూ ఉన్న స్త్రీలను చూడుము. ఆబోతు బురదలో కూరుకొనిపోగా చుట్టూ ఆవులు పొదువుకొన్నట్లుగా కనిపించటం లేదూ?

విశేషం: అలం: ఉపమ. శల్యుడు మద్యమన్నా, స్త్రీ అన్నా చాలా ఆసక్తి కలిగిఉండేవాడు. అందుకే అతడి శవంచుట్టూ ఉన్న స్త్రీలను గురించి ప్రత్యేకంగా పోల్చి చెప్పటం.

మత్తకోకిల:

చూచితే భగదత్తు? నీతఁడు శూరతామహిమన్ నరున్
వీచిసన్నిభబాణపంక్తుల వెఱ్ఱిఁ జేసె మహేంద్రుతో
నేచి పోరుబలుండు వోలె సహింప కీతని నిట్లుగాఁ
జూచి తాతనిమీఁది నెయ్యము సొంపునన్ మురమర్దనా! 109

ప్రతిపదార్థం: మురమర్దనా!= మురాసురుడిని చంపిన ఓ కృష్ణా!; భగదత్తున్= భగదత్తుడిని; చూచితే?= చూచావా?; ఈతఁడు= ఇతడు; శూరతామహిమన్= పరాక్రమం యొక్క ఆధిక్యంచేత; మహేంద్రుతోన్= మహేంద్రుడితో; ఏచి= విజృంభించి; పోరు= యుద్ధం చేసిన; బలుండు+పోలెన్= బలుడనే రాక్షసుడివలె (అందుకే ఇంద్రుడికి బలవిరోధి అనిపేరు); నరున్= అర్జునుడిని; వీచి= అలలతో; సన్నిభ= సమానమైన (అంటే అలలవలె ఎడతెరిపి లేని); బాణపంక్తులన్= అమ్ముల వరుసలతో; వెఱ్ఱిన్+చేసెన్= పిచ్చివాడిని చేశాడు; సహింపక= భగదత్తుడి పరాక్రమం చూచి ఓర్వలేక; అతనిమీఁది= అర్జునుడిపై గల; నెయ్యపుసొంపునన్= ప్రేమాధిక్యంచేత; ఈతనిన్= ఈ భగదత్తుడిని; ఇట్లుకాన్+చూచితి(వి)= ఇట్లా మరణం పాలు కావించావు.

తాత్పర్యం: కృష్ణా! ఇతడు భగదత్తుడు. పోల్చుకొన్నావా! మహేంద్రుడిమీద విజృంభించి యుద్ధం చేయగల్గిన బలాసురుడివలె నరుడిమీద ఎడతెరిపి లేకుండా బాణాల వర్షం కురిపించి, అతడిని పిచ్చివాడిని చేశాడు. భగదత్తుడి పరాక్రమం చూచి ఓర్వలేక, అర్జునుడిమీద అభిమానంతో ఈతడిని ఈ విధంగా మరణంపాలు చేశావు.

క. పులుఁగులును మెకంబులునుం। దొలిచి తినిన నెలవుదప్పి తొలఁగియుఁ గంటే?
తల నున్న కనక దామము। పొలుపు దెగం బాయ దీ నృపుం గమలాక్షా! 110

ప్రతిపదార్థం: కమల+అక్షా!= కమలాలవంటి కన్నులు గల కృష్ణా!; పులుఁగులును= కాకులు, గద్దలువంటి పక్షులు; మెకంబులునున్= నక్కలు, తోడేళ్ళువంటి జంతువులు; తొలిచి తినినన్= రంధ్రాలు చేసి విరిచి తినగా; నెలవు+తప్పి= తమతమ స్థానాల నుండి; తొలఁగియున్= జారి ప్రక్కల్లో బడినా; తలన్+ఉన్న= తలలో అలంకరించుకొన్న; కనకదామము పొలుపు= సంపెంగపూల వాసన; ఈ నృపున్= ఈ రాజు దేహాన్ని; తెగన్+పాయదు= కొంచెంకూడా వదలిపెట్టలేదు; కంటే?= చూస్తున్నావా?

తాత్పర్యం: కృష్ణా! పక్షులు, మృగాలు దేహాన్ని రంధ్రాలు చేసి విరిచి తినటం వలన దేహభాగాలు ఎక్కడివక్కడ వెదజల్లబడ్డాయి. అయినా ఇతడి తలలో అలంకరించుకొన్న సంపెంగపూల వాసన ఈ రాజు శరీరాన్ని కొంచెంకూడా వదలలేదు. చూస్తున్నావా?

గాంధారి శరతల్పగతుం డగు భీష్మునుద్దేశించి శోకించుట (సం. 11-23-14)

సీ. బలశౌర్యములఁ దన పాటిగా నెందును । మానవు నొరుఁ జూపలేని యట్టి
శంతనుపుత్రుఁడే శత్రులబాహు ద । ర్పంబున రణభూమిఁ బడియెఁ దన్ను
వాలాయమును గెల్వవచ్చునె? 'చంపి కొం' । డని పాండుసుతులపై నగ్గలంపుఁ
గరుణ మర్మము సెప్పెఁగాక యెమ్మెయి నైన । నతినిష్ఠ యెప్పుడు నతనియందుఁ

ఆ. గలదు గాదె! తండ్రి కార్యంబునకుఁ గాఁగ । రాజ్య ముడిగి పూనె బ్రహ్మచర్య
మితనిఁ జెప్పి చెప్ప నితరుండు పౌరుష । కలిత సంభవుండు గలఁడె కృష్ణ. 111

ప్రతిపదార్థం: కృష్ణ= కృష్ణా!; బలశౌర్యములన్= బలంలోనూ, పరాక్రమంలోనూ, తన పాటిగాన్= తనకు సమానుడుగా; ఎందును= ఎక్కడా; ఒరున్ మానవున్= ఇంకో మానవుడిని; చూపలేనియట్టి= చూపలేనటువంటి; శంతనుపుత్రుఁడే= భీష్ముడే; శత్రుల= శత్రువుల; బాహుదర్పంబునన్= బాహుగర్వంచేత; రణభూమిన్+పడియెన్= యుద్ధభూమిలో కూలిపోయాడు; తన్నున్= తనను; వాలాయమును= తప్పక; గెల్వన్‌వచ్చునె?= ఎవరైనా గెలవటానికి శక్యం అవుతుందా?; చంపికొండు+అని= చంపుకోండి అని; పాండుసుతులపైన్= పాండుకుమారులపైన; అగ్గలము+కరుణన్= మిక్కిలి దయతో; మర్మము చెప్పెన్+కాక= తాను చనిపోయే రహస్యాన్ని చెప్పాడు తప్ప (ఎవరు గెలవగలుగుతారు?); ఎమ్మెయిన్+ఐనన్= ఎలాఅయినా; అతినిష్ఠ= గొప్పనిష్ఠ; ఎప్పుడున్= అన్ని కాలాలలోనూ; అతనియందున్= భీష్ముడిలో; కలదు+కాదె!= ఉన్నదేకదా!; తండ్రికార్యంబునకున్= తండ్రిపనికి (కర్తవ్యానికి); కాఁగన్= అనుకూలం అయ్యేట్టుగా; రాజ్యము+ఉడిగి= రాజ్యం వదలుకొని; బ్రహ్మచర్యము= బ్రహ్మచారిగా ఉండిపోవటాన్ని; పూనెన్= అవలంబించాడు; ఇతనిన్+చెప్పి= ఇతడిని పేర్కొని; చెప్పన్= చెప్పటానికి; పౌరుషకలితసంభవుండు= సంపూర్ణ పురుషత్వంతో కూడిన జన్మగలవాడు; ఇతరుండు= మరొకడు; కలఁడె?= ఉన్నాడా? (లేడు).

తాత్పర్యం: కృష్ణా! బలంలోకాని, పరాక్రమంలోకాని తనకు సాటిగా మరొక మానవుడిని చూపటానికి వీలులేని మహావ్యక్తి భీష్ముడే శత్రువుల బాహుదర్పానికి బలై నేలమీద పడ్డాడు. అయినా ఆయనను ఎవరూ తమంతట తాముగా జయించలేరు కదా! 'నన్ను చంపుకోండి' అని పాండవులమీద ఉన్న అధికమైన దయతో ఆయనే తాను చనిపోయే రహస్యాన్ని వారికి చెప్పాడు తప్ప, ఆయనను ఎవరు గెలువగలరు! ఎట్లా అయితేనేం! ఆయనకున్న దీక్ష ఈనాటిది కాదు కదా! తన తండ్రి కోరికను సానుకూలం చేయటానికి తాను బ్రహ్మచారిగా ఉండిపోయాడు గాదా! రాజ్యం వదలుకోలేదా! (అట్లాగే ఇదికూడ అని తాత్పర్యం). ఈయన పేరు చెప్పి మరోపేరు చెప్పటానికి సంపూర్ణ పురుషత్వంతో కూడిన జన్మగల మరో మహానుభావుడు ఎవ డున్నాడు?

క. కురువంశ మెడల వచ్చినఁ । బరమోపాయమున మగుడఁ బడసెన్ మడిసెం
గురునికరముతోడన యి । ప్పురుషుఁడు పురుషార్థసారభూషణుఁడు గదే! 112

ప్రతిపదార్థం: కురువంశము= కౌరవవంశం; ఎడలవచ్చినన్= విచ్ఛిన్నం కాగా; పరమ+ఉపాయమునన్= తల్లి సత్యవతిద్వారా వ్యాసమహర్షిని రప్పించి అంబికాదులకు సంతానాన్ని కల్గించటం ద్వారా; మగుడన్+పడసెన్= మళ్ళీ కౌరవవంశాన్ని రక్షించుకొన్నాడు;

కురునికరముతోడన్+అ= కురుకుమారుల సమూహంతోనే; మడిసెన్= చనిపోయాడు; ఈ+పురుషుఁడు= ఈ మహాపురుషుడు; పురుషార్థసార= ధర్మార్థకామమోక్షాలనే పురుషార్థాల సారభూతమైన ధర్మానికి; భూషణుఁడు= అలంకారంవంటి వాడు; కదే!= కదా!

తాత్పర్యం: కృష్ణా! కౌరవవంశం ఆగిపోయిన సమయంలో ధార్మికమైన పద్ధతిలో వ్యాసమహర్షిద్వారా మళ్ళీ కౌరవవంశాన్ని సంపాదించుకొన్నవాడూ ఈయనే. చివరివరకు కురుకుమారులతోనే ఉండి వారితోపాటే ప్రాణాలూ వదిలినవాడూ ఈయనే. ఈ మహాపురుషుడు ధర్మ స్వరూపుడు! (పురుషార్థాల పరమార్థాన్ని ఇట్లాంటి మహావ్యక్తుల జీవితం ద్వారానే కదా తెలిసికొనాలి!).

క. దేవుఁడు గా కితఁడు నరుఁడు । నా వచ్చునె? నిష్ఠపెంపునం బ్రాణంబుల్
తా వలసినపుడ విడువం । గా వేడుక నునిచి నాఁడు గాదె తనువునన్! 113

ప్రతిపదార్థం: ఇతఁడు= భీష్మాచార్యుడు; దేవుఁడుగాక= దైవస్వరూపం తప్ప; నరుఁడు+నాన్+వచ్చునె?= మనిషి అనవచ్చునా?; నిష్ఠపెంపునన్= దీక్షయొక్క ఆధిక్యంచేత; ప్రాణంబుల్= ప్రాణాలను; తాన్+వలసినపుడు+అ= తానుకోరుకున్నపుడే; విడువంగాన్= వదలటానికి గాను; వేడుకన్= లీలగా; తనువునన్= శరీరంలో; ఉనిచినాఁడు+కాదె!= ఉంచినాడు కదా!

తాత్పర్యం: కృష్ణా! భీష్ముడు దైవస్వరూపుడు తప్ప సాధారణ మానవుడు కాడు. అందుకే ఆయనకున్న దీక్షతో ప్రాణాలను తాను కోరుకొన్నపుడు వదలటానికై లీలగా తన దేహంలోనే ఉంచాడు కదా!

విశేషం: ముందటి పద్యంలో భీష్ముడి ధర్మనిష్ఠ చెప్పబడింది. భీష్ముడు రాజధర్మాన్ని, పుత్రధర్మాన్ని, పితృధర్మాన్ని- దేనినీ వదలలేదు. 'స్వధర్మే నిధనం శ్రేయః' - అనే గీతోక్తిని సంపూర్ణంగా ఆచరించాడు. అందుకే ఎంత దోష దూషితమైనా కౌరవ పక్షంలోనే జీవితాంతం ఉన్నాడు. అందుకే అతడిలో 'నిష్ఠ' తపస్సుగా మారి దివ్యత్వంగా సిద్ధించింది. దాని రూపమే 'స్వచ్ఛంద మరణం'. ఇది మహాయోగులకు మాత్రమే సిద్ధించే విషయం. భీష్ముడిలోని బ్రహ్మచర్యం - సత్యవ్రతదీక్ష - ధర్మనిష్ఠ - కర్మయోగం - నిష్కామంగా కర్మఫలత్యాగం - అనే అన్ని గుణాలు సాత్త్విక తపస్సు లక్షణాలు కాబట్టి ఆయన పరమశాంతమూర్తిగా తన మరణాన్ని కూడా కోరి తెచ్చుకొన్నాడు. ఆ జీవితంలో మిగిలిపోయింది దేహం ఒకటే. దానిని పుణ్యమార్గం పట్టించటం కొరకు దేహగతంగా చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తంగా అనుభవించిన శిక్ష- అంపశయ్య మీదపడి ఉండటం. ఇదంతా కలిపి చూస్తే ఇతడు మానవమాత్రుడు కాడు అనే గాంధారి వాక్యాలకు పరమార్థం తెలుస్తుంది.

తే. తీవ్ర బాణజాల దీప్తులు పరఁగించి । పాండుతనయ సైన్య బహుళతమము
లీలఁ బదిదినంబు లోలి వినోదించి । యకట! భీష్మభానుఁ డస్తమించె. 114

ప్రతిపదార్థం: తీవ్ర= వాడిఅయిన; బాణజాల= బాణాల సమూహాలనేటటువంటి; దీప్తులు= కిరణాలు; పరఁగించి= వ్యాపింపజేసి; పాండుతనయసైన్య= పాండు కుమారుల సైన్యమనేటటువంటి; బహుళతమమున్= దట్టమైన చీకటిని; లీలన్= వేడుకగా; పది దినంబుల్= పదిరోజులు; ఓలిన్= వరుసగా; వినోదించి= తొలగించి; భీష్మభానుఁడు= భీష్ముడనే సూర్యుడు; అస్తమించెన్= వెళ్ళిపోయాడు; అకట!= అయ్యో!

తాత్పర్యం: వాడి బాణాలనే కిరణాలు వ్యాపింపజేసి పాండవసైన్యమనే చీకటిని ముప్పుతిప్పలు పెట్టి ఆడించి, పదిరోజులు వినోదించి, భీష్ముడనే సూర్యుడు అస్తమించాడు. ఎంత విషాదకరం!

విశేషం: అలం: రూపకం.

క. శరవణమునందుఁ బొలుపుం । బొరసిన గాంగేయుతోడఁ బోల్పఁగ ననువై
శరతల్పంబునఁ దేజో । భరితుఁడు గాంగేయుఁ డొప్పెఁ బంకజనాభా! 115

ప్రతిపదార్థం: పంకజనాభా!= కమలం నాభిలోగల కృష్ణా!; శరవణమునందున్= రెల్లుగడ్డిలో; పొలుపున్= ఒప్పును; పొరసిన= పొందిన; గాంగేయుతోడన్= (గంగకుమారుడితో) కుమారస్వామితో; పోల్పఁగన్= పోల్చడానికి; అనువు+ఐ= వీలుగా; శరతల్పంబునన్= బాణాలతో చేసిన పడకలో; తేజస్+భరితుఁడు= కాంతిమంతుడైన; గాంగేయుఁడు= గంగకుమారుడు (భీష్ముడు); ఒప్పెన్= ప్రకాశిస్తున్నాడు.

తాత్పర్యం: అలనాడు రెల్లుగడ్డిలో ప్రభవించిన కుమారస్వామితో పోల్చదగినవాడై ఈనాడు బాణతల్పంలో తేజోమూర్తి అయిన ఈ భీష్ముడు కాంతులు చిమ్ముతున్నాడు.

విశేషం: అలం: ఉపమ, శ్లేష 'శర' మనే మాటకు బాణమని, రెల్లు అని రెండు అర్థాలున్నాయి. శివపార్వతుల తేజాన్ని అగ్నిదేవుడు గంగలో నిక్షేపించగా పుట్టినవాడు కుమారస్వామి అందుకే 'గాంగేయుడు' అని షణ్ముఖుడికి పేరున్నది. గంగాశంతనుల కుమారుడు భీష్ముడు. కాబట్టి ఇతడూ 'గాంగేయుడే'. మరి ఆయన రెల్లువనంలో పుట్టగా ఈయన 'శరతల్పంలో' (అంపశయ్యపై) ఉన్నాడు. కాబట్టి పోలిక సరిపోయిందని గాంధారి అంటున్నది.

తే. అర్జునుఁడు వెట్టె నితనికి నంపపాన్పు । నకుఁ దగంగ నిశాత బాణముల మూఁట
నలవరించిన తలగడ యస్త్రజనిత । వారిఁ దృప్తునిఁ జేసె నవ్వీరవరుఁడు. 116

ప్రతిపదార్థం: అర్జునుఁడు= పాండవమధ్యముడైన అర్జునుడు; ఇతనికిన్= ఈ మహావీరుడైన భీష్ముడికి; అంపపాన్పునకున్= అంపశయ్యకు; తగంగన్= తగినట్టుగా; నిశాత= వాడియైన; బాణములమూఁటన్= మూడు బాణాలతో; అలవరించిన= ఏర్పరచిన; తలగడ= తలగడను (దిండును); పెట్టెన్; ఆ+వీరవరుఁడు= ఆ అర్జునుడే; అస్త్రజనిత= అస్త్రంతో పుట్టిన; వారిన్= నీటితో; తృప్తునిన్+చేసెన్= దప్పిక తీరినవాడిగా చేశాడు.

తాత్పర్యం: కృష్ణా! ఈ మహావీరుడికి అర్జునుడు అంపశయ్యను ఏర్పరచి, దిండుగా మూడు వాడిబాణాలను సవరించి, బాణంతో నీటిని తెప్పించి ఆ నీటితో ఆ మహావీరుడి దప్పికను పోగొట్టాడు.

క. వీరశయనమున గంగకు । మారుఁడు కల్పక్షయమున మార్తాండుఁడు సం
చార మెడలి ధరఁ బడి యొ । ప్పారెడు చందమున వెలిఁగె నంబురుహాక్షా! 117

ప్రతిపదార్థం: అంబురుహ+అక్షా!= కమలాక్షా (కృష్ణా); వీరశయనమునన్= వీరుడికి తగిన ఈ అంపశయ్యలో; గంగకుమారుఁడు= ఈ భీష్ముడు; కల్పక్షయమునన్= కల్పాంతంలో; మార్తాండుఁడు= సూర్యుడు; సంచారము+ఎడలి= సంచారం చాలించి; ధరన్+పడి= నేలవాలి; ఒప్పారెడు= ప్రకాశించే; చందమునన్= రీతిలో; వెలిఁగెన్= కాంతులు చిమ్ముతున్నాడు.

తాత్పర్యం: కృష్ణా! ఈ అంపశయ్యమీద ఉన్న భీష్ముడు కల్పాంతంలో సూర్యుడు లోకసంచారం మాని, నేలమీద వాలి, విశ్రాంతి తీసికొన్న రీతిగా ప్రకాశిస్తున్నాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. దేవవ్రతుండు గీర్వా । ణావాసంబునకుఁ జనినయట కురునికరం
బేవాని నడిగి తెలియునొ । కో? విశ్రుతధర్మ సంప్రయోగ విధంబుల్. 118

ప్రతిపదార్థం: దేవవ్రతుండు= భీష్ముడు; గీర్వాణ+ఆవాసంబునకున్= దేవతల నివాసానికి - స్వర్గానికి; చనిన+అట= వెళ్ళిపోయాక; కురునికరంబు= కురువంశీయులు; ఏవానిన్= ఎవరిని; అడిగి; విశ్రుత= సాంప్రదాయకమైన; ధర్మ సంప్రయోగవిధంబుల్= ధార్మికంగా ఈ పని ఇట్లా చేయాలి; ఇట్లా చేయకూడదు అనే విధాన్ని గురించి; తెలియును+ఒకో?= తెలిసికొంటుందో ఏమో?

తాత్పర్యం: భీష్ముడు స్వర్గం చేరిన తరువాత కురుకుమారులకు ఇది మంచి, ఇది చెడు, ఇట్లా చేయాలి, ఇట్లా చేయకూడదు అనే ధర్మసూక్ష్మాలను వివరించి, చేయదగిన పనిని బోధించేవారు ఎవరుంటారు? వారు ఎవరిని అడిగి తెలిసికొనాలో ఏమో!

విశేషం: ఇంటిపెద్ద మరణించినపుడు అందరూ బాధపడేది ఈ విషయంలోనే. భారతకథలో భీష్ముడు ఎన్నో సందర్భాలలో దుర్యోధనుడికి, ధర్మరాజుకు, ఇరువురికి ధర్మసూక్ష్మ వివేచన చేసి కర్తవ్యం బోధించాడు. ధర్మరాజాదులు ఆ మాటలు పాటించారు. దుర్యోధనుడు పాటించక మరణం పొందాడు. ఇది గాంధారికి తెలుసు. అందుకే వంశానికి పెద్ద దిక్కు - ఈయన కూడా పోతే వంశాన్ని రక్షించే పురుషుడే ఉండడే! అని ఆమె ఆక్రోశిస్తోంది.

సీ. పగవారి మొన లను పల్లెరులం గాల్చి । మడిసెఁ గుంభజుఁ డనియెడు దవాగ్ని
యెన్ని యస్త్రము లింద్రుఁ డెఱుఁగు నన్నింటను । బరిణతుం డీతండు భార్గవునకు
నెట్లట్ల సువిధేయ మిమ్మహాత్మునకు ధ । నుర్వేద మితనికి సర్వవేద
ములుఁ బరిచితము లియ్యలఘుతేజుని శిక్షఁ । గాదె! పార్థుఁడు కార్ముకమున మేటి

ఆ. యయ్యెఁ? దక్కుకౌరవాన్వయజాతులు । సాత్యకియును ని వ్విశాలబుద్ధి
నాశ్రయించుటను మహాస్త్రవిత్తములైరి । యోధు లింతవార లుర్విఁగలరె? 119

ప్రతిపదార్థం: పగవారి= శత్రువుల; మొనలు+అను= సైన్యమనేటువంటి; పల్లెరులన్+కాల్చి= పల్లేరులను కాల్చి; కుంభజుఁడు= ద్రోణుడు; అనియెడు దవాగ్ని= అనబడేటటువంటి దావాగ్ని; మడిసెన్= సమసినది; ఎన్ని అస్త్రములు= ఎన్ని అస్త్రాలు; ఇంద్రుఁడు+ఎఱుగున్= ఇంద్రుడికి తెలియునో; అన్నింటను= అన్నిటిలోను; ఈతండు= ఇతడు; పరిణతుండు= నిష్ణాతుడు; భార్గవునకున్= పరశురాముడికి; ఎట్లు= ఏవిధంగా; ధనుర్వేదము= ధనుర్విద్య; సువిధేయము= మిక్కిలి విధేయమో; అట్ల= అలాగే; ఈ+మహాత్మునకున్= ఈ మహానుభావుడికికూడా (సువిధేయమే); ఇతనికిన్= ఇతనికి; సర్వవేదములున్= అన్ని వేదాలు; పరిచితములు= పరిచయం లోనివే; ఇయ్యలఘుతేజుని= ఈ గొప్ప తేజస్సు కల్గినవాని; శిక్షన్+కాదె!= శిష్యరికంతోనే కదా!; పార్థుఁడు= అర్జునుడు; కార్ముకమునన్= విలువిద్యలో; మేటి+అయ్యెన్?= సమర్థుడయ్యాడు? (సర్వోత్తముడయ్యాడు); తక్కు= తక్కిన; కౌరవ+అన్వయ+జాతులున్= కురుకుమారులూ; సాత్యకియును= సాత్యకీ; ఈ+విశాలబుద్ధిన్= ఈ గొప్ప విద్యావంతుడిని; ఆశ్రయించుటను= ఆశ్రయించటంచేత; మహాస్త్ర+విత్+తములు+ఐరి= మహాస్త్రాలు తెలిసిన వారిలో శ్రేష్ఠులయ్యారు; ఇంతవారు= ఇంతటి; యోధులు= మహావీరులు; ఉర్విన్= భూమిలో; కలరె?= ఉన్నారా?

తాత్పర్యం: శత్రుసైన్యా లనే పల్లేరులను తుదముట్టించి ద్రోణుడనే దావాగ్ని ఆరిపోయింది. ఇంద్రుడికి ఎన్ని దివ్యాస్త్రాలు తెలియునో అన్నీ తెలిసినవాడు ఈయన. పరశురాముడికి ఎట్లా ధనుర్విద్య వశమయిందో అట్లా వశమైన మహాధనుర్వేత్త ఈ ద్రోణాచార్యుడు. సర్వవేదాలూ తెలిసిన మనీషి, ఈ పుణ్యపురుషుడి శిక్షణలోనే కదా అర్జునుడు మేటి విలుకాడు అయ్యాడు! తక్కిన కురుకుమారులు, సాత్యకి ఈ మహావేత్త దగ్గరకదా ఉత్తమ ధనుర్వేత్తలుగా తయారయ్యారు! ఇంతటి గొప్ప యోధుడు ప్రపంచంలో ఉన్నాడా?

విశేషం: అలం: రూపకం.

క. **వివిధ మహాస్త్రంబులు గా । లవశతఁ జెడెఁ గాక శౌర్యలంపటు నియ్యో**
ధవరునిఁ బగవారికిఁ జే । ర వశంబగునెట్లు సంగరంబునఁ? గృష్ణా! **120**

ప్రతిపదార్థం: కృష్ణా= కృష్ణా!; వివిధ= వివిధాలైన; మహాస్త్రంబులు= గొప్ప గొప్ప అస్త్రాలు; కాలవశతన్= కాలశక్తికి లోబడి; చెడెన్+కాక= వ్యర్థాలు అయ్యాయి తప్ప; శౌర్యలంపటున్= పరాక్రమమే వ్యసనంగా కల్గిన; ఈ+యోధువరునిన్= ఈ వీరశ్రేష్ఠుడిని; సంగరంబునన్= పోరులో; చేరన్= సమీపించటానికి (ఎదిరించటానికి); పగవారికిన్= శత్రువులకైనా; ఎట్లు వశంబు+అగున్= ఎట్లా సాధ్యం?

తాత్పర్యం: కృష్ణా! ద్రోణాచార్యుల వద్దనున్న మహాస్త్రాలు కాలశక్తికి లోబడి వ్యర్థమయ్యాయి తప్ప ఆ మహాయోధుడిని యుద్ధంలో శత్రుసేనలు సమీపించగలవా? అది ఎట్లా సాధ్యం?

తే. **గురుని ము న్నిడుకొని కాదె కురుకుమారు । లనికిఁ బిలిచిరి? ధర్మపుత్రాదులయిన**
వాలుమగల నట్లంతటివాఁడుఁబగఱు । నఱకివైచినఁ బడియున్న తెఱఁగుఁ గంటె? **121**

ప్రతిపదార్థం: గురునిన్= తమ గురువైన ద్రోణాచార్యుడిని; మున్ను+ఇడుకొని+కాదె!= ముందుంచుకునే కదా!; కురుకుమారులు= దుర్యోధనాదులు; ధర్మపుత్ర+ఆదులు+అయిన= ధర్మరాజు మొదలైన; వాలుమగలన్= మహావీరులను; అనికిన్+పిలిచిరి?= యుద్ధానికి రమ్మన్నారు?; అట్లు+అంతటివాఁడు= అట్లాంటివాడు; పగఱు= శత్రువులు; నఱకివైచినన్= నరికివేయగా; పడి+ఉన్న పడిఉన్న; తెఱఁగున్= విధాన్ని; కంటె?= చూశావా?

తాత్పర్యం: అసలు ద్రోణాచార్యులను నమ్మికదా దుర్యోధనాదులు - ధర్మరాజు, భీముడు, అర్జునుడు వంటి మహావీరులను యుద్ధానికి రమ్మని ప్రకటించారు! అట్లాంటి వీరుడు ఈనాడు శత్రువులు నరికివేయగా నేలమీదపడి ఉన్న తీరు చూస్తున్నావా?

తోటకము.

సతతంబును శిష్యులు సద్వినయా । న్వితులై ప్రణమిల్లెడు వీరిపద
ద్వితయంబు గడుంజెడఁ దిన్నవి సూ । చితె నక్కలు? దైవము చెయ్దిఁ గటా! **122**

ప్రతిపదార్థం: సతతంబును= నిత్యమూ; శిష్యులు= శిష్యులైన కురుకుమారులు; పాండవులు; సత్+వినయ+అన్వితులై= మంచి వినయంతో కూడినవారై; ప్రణమిల్లెడు= నమస్కరించేటువంటి; వీరి= ఈ ద్రోణాచార్యులవారి; పద ద్వితయంబున్= రెండుకాళ్ళనూ; కడున్+చెడన్= బాగా నశించేలా; నక్కలు; తిన్నవి; కటా= అయ్యో!; దైవము+చెయ్దిన్= దేవుడి చేత; చూచితె= చూచావా?

తాత్పర్యం: ఎల్లప్పుడూ శిష్యులు మంచి వినయంతో నమస్కరించేటువంటి ఈ ద్రోణాచార్యులవారి పాదాలను ముక్కలు చేసి నక్కలు తినివేశాయి. అయ్యో! దైవం ఎంత క్రూరంగా ప్రవర్తించిందో చూచావా? కృష్ణా!

విశేషం: తోటకవృత్తంలో ప్రతిపాదానికీ నాలుగు సగణాలుంటాయి. 1-9 అక్షరాలకు యతిమైత్రి - ప్రాసనియమం కలదు.

ఆ. **ద్రుపదతనయుఁ డట్టె! ద్రోణునితలఁ గోయు । వాఁడు విధికి నెట్టివారి నెట్టి**
తెఱఁగు సేయ రాదు? దీనికి నేమను । వార మిది యసంభవంబు గాదె? 123

ప్రతిపదార్థం: ద్రోణునితలన్= ద్రోణాచార్యులతలను; కోయువాఁడు= ఖండించేవాడు; ద్రుపద తనయుఁడు+అట్టె!= ధృష్టద్యుమ్నుడా! విధికిన్= విధి; ఎట్టివారిన్= ఎలాంటివారిని; ఎట్టి తెఱఁగు= ఏ తీరుగా; చేయన్‌రాదు?= మార్చులేదు?; దీనికిన్= దీనికి; ఏమి+అనువారము?= ఏమనగలము?; ఇది= ఇట్లా కావటం; అసంభవంబు+కాదె!= సంభవమైన విషయంకాదు కదా!

తాత్పర్యం: ఇట్లాంటి మహాయోధుడైన ద్రోణాచార్యుడి తలనరికేవాడు అర్భకుడైన ధృష్టద్యుమ్నుడా! విధివశంగా ఎంతటివారు ఎంతగా అయిపోతారు! విధి చేయని పని ఏమున్నది? ఏమనవచ్చు దీనిని? అయినా ఎట్లా చంపాడు? ఇది అసంభవమే!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

సీ. **కృపునితోఁబుట్టువు కృపి తన భర్త ద్రో । ణాచార్యుపాల దైన్యంబు విపుల**
వేణియు మొగమున వెంట ముసుంగు ప । డంగ రాల్పడిన యెలుంగుతోడఁ
బలవించి పలవించి బహుశిష్యు లయ్యతి । రథవర్యు నస్త్రశస్త్రములు రథము
నవయవంబులును జితాకలనంబు సే । యుచు సామగానసంయుక్తవదను

ఆ. **లగుట సూచి సామ మతికరుణంబుగాఁ దాను బాడఁజొచ్చె మానితాగ్ని**
సాద నమర్చి యవ్విశుద్ధాత్ము నొండొక । యగ్నిపోలెఁ బెట్టి రందుఁ గృష్ణ! 124

ప్రతిపదార్థం: కృష్ణ!= కృష్ణా!; కృపునితోఁబుట్టువు= కృపాచార్యుడి చెల్లెలు; కృపి= తన భర్త ద్రోణాచార్యు(డి); పాలన్= సమీపంలో; దైన్యంబు= దీనత్వం(తో); విపులవేణియున్= విరబోసుకున్న వెంట్రుకలతో; మొగమున వెంటన్= ముఖంమీద; ముసుంగు+పడంగన్= ముసుగు పడగా (ముసుగు వేసికొని); రాల్పడిన= బొంగురుపోయిన; ఎలుంగుతోడన్= కంఠంతో; పలవించి పలవించి= మాటిమాటికి దుఃఖిస్తూ (ఉండగా); బహుశిష్యులు= ద్రోణుడికున్న చాలామంది శిష్యులు; అతిరథవర్యు= అతిరథశ్రేష్ఠుడైన ఆ ద్రోణుడియొక్క; అస్త్రశస్త్రములు+రథమున్+అవయవంబులును= బాణాలను, శస్త్రాలను, దేహభాగాలను; చితాకలనంబు+చేయుచున్= చీల్చి చితిగా పేర్చి; సామగాన సంయుక్తవదనులు+అగుట+చూచి= సామగానం పాడుతున్న నోళ్ళు కలవారు కావటం చూసి; మానితాగ్ని= వైదిక కార్యాలలో మిక్కిలిగా గౌరవింపబడే అగ్నిదేవుడే; అతికరుణంబుగాన్= అతి కరుణతో; సామము= సామవేదాన్ని; తాను+పాడన్+చొచ్చెన్= తానుపాడటం మొదలు పెట్టాడు (అప్పు డందరూ చేరి); సాదను= చితిని; అమర్చి; ఆ+విశుద్ధాత్మున్= ఆ పవిత్రాత్ముడిని; ఒండొక= మరొక; అగ్ని+పోలెన్= అగ్నిలాగా; అందున్= ఆ చితిలో; పెట్టిరి= ఉంచారు.

తాత్పర్యం: కృష్ణా! ద్రోణుడి భార్య, కృపాచార్యుడి చెల్లెలు - కృపి తన భర్తసమీపంలో అతి దీనంగా కూర్చొని విరబోసికొన్న జుట్టుతో తలమీది ముసుగుతో పలవరిస్తూ రోదిస్తున్నది. ద్రోణుల శిష్యులు తక్కినవారు చూచి ఆ మహాయోధుడి అమ్ములు, బాణం, శస్త్రాలు, రథం, అవయవాలు వీటి నన్నిటిని ప్రోగుచేసి, చితి పేర్చి, సామవేదం చదువుతూ ఉండగా సాక్షాత్తు అగ్నిదేవుడే సామం పాడజొచ్చాడు. ఆ విధంగా చితి నేర్పరచి గురువుగారినే మరొక అగ్నివలె ఆ చితిలో చేర్చి దహనానికి సిద్ధం చేశారు.

విశేషం: ఇతరులను ఎవరిని వర్ణించినపుడు కాని ఈ చితి వర్ణన లేదు. ఎందుకంటే ద్రోణుడు బ్రాహ్మణుడు కాబట్టి ధర్మరాజాదులు దహనం చేయటానికి వీలు లేదు; కాబట్టి శిష్యులు చేయటాన్ని వర్ణిస్తున్నాడు. దహనం కూడా జీవికి చేయవలసిన కర్మలలో ఒకటి. అందుకే సామగానం చేశారనటం. అగ్ని స్వయంగా సామం ఆలపించటం ఏమిటి? ద్రోణుడు పవిత్రుడు. అగ్నిస్వరూపుడే. అయోనిజుడు. కాబట్టి దైవస్వరూపుడు. అందుకే అగ్ని స్వయంగా ద్రోణుడి శరీరాన్ని స్వీకరించాడని అర్థం. అందుకే 'మరి ఒక అగ్నివలె' అని స్పష్టం చేయటం.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. కృపి మున్నుగ శిష్యులు సొద । యపసవ్యము గాఁగఁ దిరిగి యరిగిరి శోకా
ర్తపు టొడలులతో గంగకు । నపగతశరవిద్య యయ్యె నవని కటకటా! 125

ప్రతిపదార్థం: కృపి మున్నుగన్= కృపి ముందు నడుస్తుండగా; శిష్యులు= ద్రోణుడి శిష్యులు; సొద= చితికి; అపసవ్యము కాఁగన్= అప్రదక్షిణ మార్గంలో; తిరిగి; శోక+ఆర్తపు+ఒడళులతోన్= శోకంతో, దీనత్వంతో కూడిన శరీరాలతో; గంగకున్= నదికి స్నానాలు చేయటానికి; అరిగిరి= వెళ్ళారు; అవని= భూమి; అపగత= పోగొట్టుకున్న; శరవిద్య+అయ్యెన్= శరవిద్య కలిగింది అయింది; కటకటా!= అయ్యయ్యో!

తాత్పర్యం: కృపి ముందు నడుస్తూండగా శిష్యులు ఆ చితికి అప్రదక్షిణంగా తిరిగి శోకంతో దీనత్వంతో కూడిన శరీరాలతో నదిలో స్నానాలు చేయటానికి వెళ్ళారు. ఈ భూలోకంలో ఇక బాణవిద్య లుప్తమై పోయినట్లే. ఎంత దౌర్భాగ్యం!

విశేషం: భారతకాలంలో స్త్రీలు కూడా చితిచుట్టూ తిరిగేవారన్న విషయం ఈ సందర్భంలో గుర్తించాలి.

ఆ. సోమదత్త సుతునిఁ జూడుము సాత్యకి । దూష్యభంగి శిరముఁ దునుమ నొఱగి
యున్నవాఁడు గ్రద్ద లొలిచి తినంగ నీ । సుకృతపరుని నిట్లు సూడవలసె. 126

ప్రతిపదార్థం: సోమదత్తసుతునిన్= భూరిశ్రవుని; చూడుము; సాత్యకి; దూష్యభంగిన్= నిందింపదగు రీతిలో; శిరమున్+తునుమన్= కుత్తుకను కోయగా; ఒఱిగి+ఉన్నవాడు= నేలమీద పడి ఉన్నాడు; ఈ సుకృతపరునిన్= ఈ పుణ్యాత్ముడిని; ఇట్లు= ఈ విధంగా; గ్రద్దలు; ఒలిచి తినంగన్= ఒలిచి తింటుండగా; చూడన్ వలసెన్= చూడవలసి వచ్చింది.

తాత్పర్యం: కృష్ణా! చూడుము. అదే సోమదత్తుడి కొడుకు భూరిశ్రవుడి పార్థివశరీరం. సాత్యకి చాలా నీచంగా తల నరికివేయగా అట్లా పడి ఉన్నాడు. గద్దలు ఒంటిని ఒలిచివేసి తింటున్నాయి. ఈ పుణ్యాత్ముడిని ఇట్లా చూడవలసి వచ్చినది.

వ. సోమదత్తుఁడు పుత్రశోకాయత్తుండై యుండి తన్ను సాత్యకి గవిసినప్పుడు తన కొడుకునెడ నతండు సేసిన యధర్మం బుగ్గడించి గర్హించిన విధంబు మృతుండైనను మొగంబునం దోఁచుచున్నది. భూరిశ్రవు తల్లి యది యతనిని వల్లభునిఁ బొరిఁ బొరిం గనుంగొనుచు గద్గదకంఠంబుతో నా సోమదత్తు నుద్దేశించి. 127

ప్రతిపదార్థం: సోమదత్తుఁడు; పుత్రశోక+ఆయత్తుండు+ఐ+ఉండి= కుమారుడి మరణశోకానికి వశుడై ఉండి; తన్నున్= తనను; సాత్యకి; కవిసినప్పుడు= ముట్టడించినప్పుడు; తన కొడుకు+ఎడన్= తన కుమారుడి విషయంలో; అతండు+చేసిన= ఆ సాత్యకి చేసిన; అధర్మంబు= అధర్మయుద్ధం (నీచకార్యం); ఉగ్గడించి= పేర్కొని; గర్హించిన= నిందించిన; విధంబు= తీరు; మృతుండు+ఐనను= ఆ సోమదత్తుడు చనిపోయినా; మొగంబునన్= ముఖంలో; తోఁచుచున్నది= కనిపిస్తున్నది; భూరిశ్రవు తల్లి= సోమదత్తుడి భార్య; అది= ఆమె; అతనిని= ఆ భూరిశ్రవుడిని; వల్లభునిన్= తన భర్తను; పొరిన్+పొరిన్= మాటిమాటికి; కనుంగొనుచున్= చూస్తూ; గద్గద కంఠంబుతోన్= డగ్గుత్తిక పడిన గొంతుతో; ఆ సోమదత్తున్= ఆ సోమదత్తుడిని; ఉద్దేశించి= చూసి.

తాత్పర్యం: ఆ సోమదత్తుడు పుత్రశోకంతో కూడినవాడై తన మీదికి సాత్యకి దూసుకొని వచ్చినప్పుడు తన కుమారుడి విషయంలో అతడు చేసిన నీచకార్యాన్ని పేర్కొని నిందించిన తీరు ఆ సోమదత్తుడు చనిపోయినా అతడి ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నది (అంటే ముఖదర్పణంలో ఆ నరాల బిగింపు, ఆవేశం, క్రోధం, అవమానం అవన్నీ అట్లాగే ప్రతిబింబిస్తున్నాయని అర్థం). అదిగో ఆమె భూరిశ్రవుడి తల్లి. తన కొడుకును, తన భర్తను మార్చి మార్చి చూస్తూ వణకిపోతున్న కంఠంతో భర్తను ఉద్దేశించి ఇట్లా అంటున్నది).

సీ. ఓ రాజ! కల్పక్షయోపమానంబగు । కౌరవజాతి సంక్షయము చూడ
కున్నాఁడ వధిక దానోజ్జ్వలు బహుమహా । ధ్వరకర్త భూరిశ్రవసుఁడు నీదు
గారాబుపట్టి సంక్రందననందను । దుర్విక్రమంబునఁ దునుమఁబడిన
బాహువు సాత్యకి పాపకర్మంబున । సంఛిన్నమైన మస్తకము నై మ

ఆ. హీతలమునఁ బడియె నిప్పుణ్యసంతతి । దిక్కుసూడ వేల? యొక్కమాటు
కొడుకు చుట్టు నేడ్చు కోడండ్ర యలమట । యరయ విట్లు దగునె యధిప! నీకు? 128

ప్రతిపదార్థం: ఓ రాజ!= ఓ సోమదత్త మహారాజా!; కల్పక్షయ+ఉపమానంబగు= కల్పాంతంతో సమానమైన; కౌరవజాతి= కురువంశ; సంక్షయము= నాశనం; చూడక+ఉన్నాఁడవు= చూడకుండా ఉన్నావు (చూడకుండానే వెళ్లిపోయావా! అని అర్థం); అధిక దాన+ఉజ్జ్వలు= మిక్కిలి దానధర్మాలచేత ప్రకాశించేవాడు; బహుమహా+అధ్వరకర్త= గొప్ప యాగాలను చాలా వాటిని చేసినవాడు; నీదు గారాబుపట్టి= నీ ముద్దులకొడుకు; భూరిశ్రవసుఁడు (అంటే పెద్దల దగ్గర బాణ ధర్మసూక్ష్మాలు శాస్త్ర చర్చలు విన్నవాడని అర్థం); సంక్రందననందను= ఇంద్ర కుమారుడైన అర్జునుడి; దుర్విక్రమంబునన్= దుష్టపరాక్రమంతో; తునుమన్+పడిన= ఖండించబడిన; బాహువు= భుజం(కలవాడై); సాత్యకి; పాపకర్మంబునన్= నీచమైన పనివలన; సంఛిన్నమైన= తెగగొట్టబడిన; మస్తకమున్+ఐ= తలగల్గినవాడై; మహీతలమునన్= నేలమీద; పడియెన్= పడ్డాడు; ఈ+పుణ్యసంతతి+దిక్కు= ఈ పుణ్యపురుషుడైన కుమారుడివైపు; ఒక్కమాటు= ఒక్కసారి; చూడవు+ఏల?= చూడకున్నావెందుకు?; కొడుకుచుట్టు= నీ కుమారుడి చుట్టూ; ఏడ్చు= ఏడుస్తున్న; కోడండ్ర+అలమట= కోడళ్ళ దుఃఖం; అరయవు= తెలిసికొని పరామర్శించవు; అధిప!= మహారాజా!; ఇట్లు= ఇలా చేయటం; నీకున్+తగునె?= నీకు తగిన పనేనా?

తాత్పర్యం: ఓ సోమదత్తమహారాజా! యుగాంతంతో ఉపమింపదగిన కురువంశ నాశనాన్ని చూడలేకుండా వెళ్ళిపోయావా? ఎన్నో దానధర్మాలు చేసినవాడు, ఎన్నో మహాయాగాలు చేసినవాడు, నీ ముద్దులకొడుకు అయిన భూరిశ్రవుడిని చూస్తున్నావా? అర్జునుడు దుర్మార్గంగా విజృంభించి భుజం తెగగొట్టాడు. సాత్యకి అతి నీచంగా తల నరికాడు. అట్లా నీ కొడుకు నేలకూలాడు. నీ కొడుకును ఒక్కసారి ఎందుకు పలకరించవు? నీ కుమారుడి చుట్టూ చేరి ఏడుస్తున్న కోడళ్ళను ఎందుకు పరామర్శించవు? మహాప్రభువైన నీకు ఇది తగినదేనా?

క. వీ రేవు రొంటి చీరలుఁ । దారును విరిదలలతోడఁ దద్దయు నడలుం
గూరి పలవించెదరు నిను । సారసికల భీతిరుతుల చందము దోఁపన్. 129

ప్రతిపదార్థం: వీరు+ఏవురు= నీ కోడళ్ళు ఐదుగురూ; ఒంటిచీరలన్= ఏకవస్త్రలై; తారును= తాము; విరిదలలతోడన్= విరబోసుకున్న వెంట్రుకలతో; తద్దయున్= మిక్కిలిగా; అడలున్+కూరి= దుఃఖంలో మునిగి; సారసికల= ఆడబెగ్గురు పక్షుల; భీతిరుతుల= భయంతో కూడిన అరపుల; చందము= తీరు; తోఁపన్= తోచేటట్లుగా; పలవించెదరు నినున్= నిన్ను గూర్చి ప్రలాపాలు చేస్తూ ఏడుస్తున్నారు;

తాత్పర్యం: నీ కోడళ్ళు ఐదుగురూ ఏకవస్త్రలై, విరబోసుకున్న జుట్లు కలిగినవారై మిక్కిలిగా దుఃఖంలో మునిగిపోయి నిన్ను గురించి విలపిస్తున్నారు. ఆ ఏడుపు ఆడబెగ్గురు పిట్టలు భయంతో అరిచిన తీరుగా ఉన్నది.

విశేషం: అలం: ఉపమ.

ఆ. ఆలమునకు వెడలునప్పు డిచ్చితి నీదు । పసిఁడి గొడుగు లసిత విభవుఁ
డగుట కది నికృత్తమై పడి యున్నది । య క్కుమారు రథమునందుఁ జూడు. 130

ప్రతిపదార్థం: ఆలమునకున్= యుద్ధానికి; వెడలు+అప్పుడు= బయలు దేరినప్పుడు; పసిఁడి గొడుగున్= బంగారు గొడుగును; సుతుఁడు= కుమారుడు; లసిత= వెలుగొందిన; విభవుఁడు= వైభవం కలవాడు (వైభవోపేతుడు కావాలని అర్థం); అగుటకున్= కావాలని; ఇచ్చితి(వి)= ఇచ్చావు; అది= ఆ గొడుగు; నికృత్తమై= విరగగొట్టబడి; పడి+ఉన్నది; ఆ+కుమారు= భూరిశ్రవుని; రథమునందున్+చూడు= రథంలో చూడుము.

తాత్పర్యం: రాజా! నీవు నీ కుమారుడు యుద్ధానికి బయలుదేరుతున్నపుడు వైభవోపేతుడుగా ఉండాలని బంగారు గొడుగును బహుమతిగా ఇచ్చావు. ఆ గొడుగు శత్రు సైన్యంచేత విరుగగొట్టబడి నీ కుమారుడి రథంలో పడి ఉన్నది చూడుము!).

క. అని పనవుచున్నయది య । వ్వనితను గోడండ్రఁ జూడ వశమే? ఘనుఁ డ
ర్జునుఁ డిట్టి నీచకర్మం । బున కెట్టులు సొచ్చెనో! కుపురుషుఁడ పోలెన్. 131

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పనవుచున్న+అది= రోదిస్తున్నది; ఆ+వనితను= ఆమెను; కోడండ్రన్= కోడళ్ళను; చూడన్+వశమే?= చూడటానికి సాధ్యమా?; ఘనుఁడు= మహావీరుడైన; అర్జునుఁడు; కుపురుషుఁడ+పోలెన్= నీచ మానవుడిలాగా; ఇట్టి= ఇట్లాంటి; నీచకర్మంబునకున్= నీచమైన పనికి; ఎట్టులు= ఏ విధంగా; చొచ్చెనో!= సిద్ధపడ్డాడో!

తాత్పర్యం: అని అంటూ ఆమె ఎన్నో విధాలుగా భర్తను తలచుకొని ఏడుస్తున్నది. ఆమెను ఆమె కోడళ్ళను చూడటానికి శక్యం కావటంలేదు. మహావీరుడైన అర్జునుడే ఇట్లాంటి నీచకార్యానికి ఎట్లా ఒడిగట్టాడు? ఈ పని ఎవరో నీచులు చేయదగింది.

కవిరాజ విరాజితము:

విను మది సాత్యకి చచ్చుట కోర్వక వీరవరుండగు పార్థుఁడు సే
సిన తగవైనను నయ్యె నతం డటు చే నఱుకన్ మునియైన మహా
త్మునిఁ గని యుబ్బుచు సాత్యకి యేమని త్రుంచె శిరంబు? కడంగి జగం
బున నొరు లింత నికృష్టపుఁ గర్మము పొంతను బోదురె? చక్రధరా! **132**

ప్రతిపదార్థం: చక్రధరా!= చక్రాన్ని ధరించిన శ్రీకృష్ణా!; అది+విను= ఆ సంఘటన వినుము; సాత్యకి; చచ్చుటకున్+ఓర్వక= చనిపోవటాన్ని సహించలేక; వీరవరుండగు= వీరులలో శ్రేష్ఠుడైన; పార్థుఁడు= అర్జునుడు; చేసిన= చేసినటువంటి; తగవు= న్యాయం; ఐనను+అయ్యెను= అయితే అయినది; అతండు= ఆ అర్జునుడు; అటు= ఆ రీతిగా; చే+నఱుకన్= చేతిని నరికివేయగా; ముని+ఐన= ముని అయినటువంటి; మహాత్మునిన్+కని= మహాత్ముడైన భూరిశ్రవసుని చూచి; ఉబ్బునన్= విజృంభించి; సాత్యకి= సాత్యకి; శిరంబు= తలను; కడంగి= మిక్కిలి ప్రయత్నించి; ఏమని= ఏ ప్రయోజనం కోసం; త్రుంచెన్?= నరికాడు?; జగంబునన్= ఈ ప్రపంచంలో; ఒరులు= ఇతరులు ఎవరైనా సరే; ఇంత= ఇంతటి; నికృష్టపు+కర్మము+పొంతను= నీచమైన పని దగ్గరికైనా; పోదురె?= వెళ్ళుతారా?

తాత్పర్యం: కృష్ణా! అది ఎట్లా జరిగిందో వినుము. సాత్యకి చనిపోవటాన్ని అర్జునుడు భరించలేడు కాబట్టి, అట్లా చేయి నరికి 'న్యాయం' అనుకొన్నా డనుకొందాము. మరి ఆ భూరిశ్రవుడు సాధువే! ఆ మహాత్ముడిని సమీపించి విజృంభించి పూనుకొని ఆయన తలను సాత్యకి నరికి ఏమి సాధించాడు? అసలు జగత్తులో ఎవరైనా ఇంత నీచపుపని దగ్గరకైనా వెళ్తారా? నీవే చెప్పుము!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. కవిరాజవిరాజితంలో ప్రతిపాదానికీ న, జ, జ, జ, జ, జ, స, ర అనే గణాలుంటాయి. 1-14 అక్షరాలకు యతిమైత్రి. ప్రాస నియమం కలదు.

క. **ఇక్కురువరు నాండ్రురలో । నొక్కత యతిరమ్యమూర్తి యుత్సంగమునం**
దక్కర మిడికొని పనవెడు । నెక్కుడువగ నూని యదె మహీధర! కంటే? **133**

ప్రతిపదార్థం: మహీధర!= భూసతిని ధరించినవాడా! (విష్ణురూపుడైన కృష్ణా!); ఈ+కురువరు= ఈ కురుశ్రేష్ఠుడియొక్క; ఆండ్రురలోన్= భార్యలలో; అతిరమ్యమూర్తి= మిక్కిలి సౌందర్యవతి; ఒక్కత= ఒకామె; ఉత్సంగమునన్= తొడమీద; ఆ+కరము= ఆ భుజాన్ని; ఇడుకొని= ఉంచుకొని; ఎక్కుడు వగన్+ఊని= ఎక్కువ దుఃఖాన్ని పొంది; పనవెడున్= శోకిస్తోంది; అదె= అదిగో అక్కడ; కంటే?= చూస్తున్నావా?

తాత్పర్యం: కృష్ణా! ఈ భూరిశ్రవుడి భార్యలలో అందమైన ఒక స్త్రీ అతడి చేతిని తన తొడపై ఉంచుకొని మిక్కిలి శోకంతో కుమిలిపోతూ ఏడుస్తున్నది. అదిగో చూస్తున్నావా?

సీ. మెలుపారఁగాఁ బట్టి మొలనూలి మణులు గ । దల్చుచుఁ దిగుచుచుఁ దగులొనర్చుఁ
జనుఁగవ మీఁది కల్లన వచ్చి లలిత వి । మర్దనంబున లజ్జ మరలఁ ద్రోచు
నాభి యూరులు జఘనము మెత్త మెత్తన । యొత్తి ముదంబున నుల్ల మూన్చు
ననయంబుఁ దిన్నని యనువున గనయంబు । ప్రిదులంగ మెలఁపి సొక్కొదవఁ జేయ

ఆ. నిక్కరంబు నెయ్య మెక్కింప నేరంగఁ । దగిలి సంతతంబుఁ దలఁచునట్టి
భంగి మెఱయ గీడువఱుపంగఁ గొనియాడ । వలఁతి నీఱు సేయవలసె దీని. 134

ప్రతిపదార్థం: మెలుపు+ఆరఁగాన్= సౌకుమార్యం నిండగా; పట్టి= పట్టుకొని; మొలనూలి= కటి సూత్రంలోని; మణులు= మణులను; కదల్పుచున్= కదలిస్తూ; తిగుచుచున్= లాగుతూ; తగులు+ఒనర్చు= తమిని పుట్టిస్తుంది (ఈ+కరము= ఈ చేయి); చనుఁగవ మీఁదికిన్= స్తనాలమీదికి; అల్లన= మెల్లగా; వచ్చి= వచ్చి; లలిత విమర్దనంబునన్= నెమ్మదిగా పిసకటం వలన; లజ్జన్= సిగ్గును; మరలన్+త్రోచున్= మరలిపోయేలా చేస్తుంది; నాభి=బొడ్డు; ఊరులు= తొడలు; జఘనము= పిరుదు; మెత్తమెత్తని= సుతిమెత్తగా; ఒత్తి= ఒత్తి; ముదంబునన్= సంతోషంతో; ఉల్లము+ఊన్చు= హృదయాన్ని సంతోషింపచేస్తున్నది (ఊంచు - ఊయలలూపుతుంది); అనయంబున్= ఎప్పుడూ; తిన్నని+అనువునన్= మనోహరమైన రీతిలో; గనయంబు= పోకముడి; ప్రిదులంగన్= ఊడిపోయేలా; మెలఁపి= చేసి; చొక్కు= పారవశ్యం; ఒదవన్+చేయన్= కల్గించటానికి; ఈ+కరంబు= ఈ చేయి; నెయ్యము= ప్రేమను; ఎక్కింప నేరంగన్= అధికం చేయడానికి సమర్థమై; తగిలి= స్పృశించి; సంతతంబున్= ఎల్లప్పుడూ; తలఁచునట్టి భంగిన్= తలుచుకునే రీతిలో; మెఱయన్= ప్రకాశిస్తుండగా; దీనిన్= దీన్ని; కొనియాడవలఁతి= ప్రశంసించదగిన నేర్పరితనం కల్గినది కాగా; కీడు పఱుపంగన్= నాశనం చేయగా; నీఱు+చేయవలసెన్= అగ్నికి ఆహుతి చేసి బూడిద చేయాల్సి వచ్చింది.

తాత్పర్యం: ఆ భూరిశ్రవుని భార్య తన భర్తచేతి గొప్పతనాన్ని గురించి ఇట్లా విలపిస్తున్నది - 'ఈ చేయి సుకుమారంగా కటిసూత్రాన్ని పట్టుకొని అందులోని మణులను కదిలిస్తూ లాగుతూ ఆసక్తిని అధికం చేసేది. స్తనాలమీదికి నెమ్మదిగా వచ్చి సుతారంగా పిసుకుతూ సిగ్గును పోగొట్టేది. బొడ్డును, తొడలను, పిరుదులను మెత్త మెత్తగా ఒత్తుతూ హృదయాన్ని ఊయల లూపేది. ఎప్పుడూ చాలా తిన్నగా పోకముడిని సడలించి నన్ను పారవశ్యం పాలు చేసేది. ఈ చేయి తగిలిన వారికి ఎప్పుడూ ప్రేమ అధికం కావటమే. ఎవరూ ఈ చేతిని మరవలేరు. ఇది ఎప్పుడూ మెచ్చుకోదగిన బంగారు చేయి. అట్లాంటి దీనిని నరికి పారవేయగా ఈనాడు మంటలలో వేసి బూడిద చేయాల్సివస్తున్నది.

విశేషం: ఈ పరిస్థితిలో కూడా ఎంత శృంగారం!

ఆ. ఒరుని తోడఁ బోర హరి సూడ సిగ్గఱి । యేసె విజయుఁ డతని యేటు సభల
న ముకుందుఁ డెట్టు లగ్గించు? నట్టి వి । వ్వచ్చుఁ డేమిభంగి మెచ్చుఁ దన్ను? 135

ప్రతిపదార్థం: ఒరునితోడన్= మరి ఒకడితో; పోరన్= యుద్ధం చేస్తుండగా; హరి+చూడన్= శ్రీకృష్ణుడు చూస్తూండగా; సిగ్గు+అఱి= సిగ్గు వదలి; విజయుఁడు= అర్జునుడు; ఏసెన్= ఈ చేతిని విరగొట్టాడు; అతని+ఏటున్= అట్లా అతడు కొట్టటాన్ని; ఆ+ముకుందుఁడు= ఆ కృష్ణుడు; సభలన్= పదిమంది పెద్దలు చేరి న్యాయం చెప్పేచోట; ఎట్టులు= ఏ విధంగా; అగ్గించున్?= ప్రశంసించగలుగుతాడు?; అట్టి= అలాంటి; వివ్వచ్చుఁడు= అర్జునుడు; ఏమిభంగిన్= ఏ విధంగా; తన్నున్= తన్నుతాను; మెచ్చున్?= పొగడుకోగలడు?

తాత్పర్యం: మరొకడితో యుద్ధం చేస్తుండగా (సాత్యకితో యుద్ధం చేస్తున్నప్పుడు) శ్రీకృష్ణుడు చూస్తుండగా సిగ్గు విడిచి అర్జునుడు భూరిశ్రవుడి చేయి నరికాడు. పదిమంది పెద్దలు చేరినచోట అర్జునుడు చేసిన ఈ పనిని కృష్ణుడు ఎట్లా మెచ్చుకొంటాడు? అసలు అర్జునుడు బీభత్సుడని కదా పేరు. అతడు మాత్రం తాను చేసిన ఈ పనిని 'ఏం గొప్ప' అని పొగడుకొనగలడు?

వ. అని యిట్లు విలాపంబు చేసి యూరకున్న దిన్నాతిం దక్కటి యెలనాఁగ లేలిన దానిఁ బొదివికొని యున్న వా రాలోకింపుము. 136

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; విలాపంబు+చేసి= ఏడ్చి; ఊరకున్నది= ఊరకే ఉండిపోయింది; ఈ+నాతిన్= ఈ స్త్రీని; తక్కటి= తక్కిన; ఎలనాఁగలు= స్త్రీలు; ఏలినదానిన్+పోలెన్= మహారాణినివలె; పొదివికొని= పొదువుకొని; ఉన్నవారు= ఉన్నారు; ఆలోకింపుము= చూడుము.

తాత్పర్యం: అని ఈ రీతిగా ఏడ్చి ఏడ్చి ఆమె ఊరుకొన్నది. తక్కిన స్త్రీలు ఈమెను పట్టపురాణివలె పొదువుకొని ఉన్నారు. చూడుము.

గాంధారి శకుని కళేబరంబు గాంచి యతని చేఁత లుగ్గడించి శోకించుట (సం. 11-24-21)

సీ. మేనల్లుఁడగు నకులానుజు నేటులఁ । బడియుండి శకునుల పాలువడ్డ
శకునిఁ జూచితె? మురసంహర! యితఁడు మా । యా జాలమునకు నాఁడోజ సకల
మాయలు నీ చేత మడిసె దుర్ద్యూతంబు । నొనరించి రాజ్యంబు గొనియె ధర్మ
తనయునిచే నిష్టు దన చెయ్మి ఫలియించె । ననియను జూదంబునందుఁ బ్రాణ

ఆ. మోటు వడియె నెత్తమాటకు నీతండు । గఱచు టెల్లఁ గురునికాయనాశ
మునకు నయ్యె నీ నృపుఁడ కాఁడె పాండు నం । దనుల తోడివైరమునకుఁ గర్త? 137

ప్రతిపదార్థం: మేనల్లుఁడు+అగు= మేనల్లుడైనటువంటి; నకుల+అనుజున్= సహదేవుని; ఏటులన్= దెబ్బలచేత(బాణపు); పడి+ఉండి= నేలమీదపడి ఉండి; శకునుల= రాబందుల; పాలు+పడ్డ= పాలుపడిన; శకునిన్= నా సోదరుడు శకునిని; చూచితె?= చూశావా?; మురసంహర= కృష్ణా!; ఇతఁడు= ఈ శకుని; మాయాజాలమునకున్= మాయా జాలాలు చేయడంలో; నాఁడు= ఆనాడు; ఓజ= ఉపాధ్యాయుడు; సకలమాయలు= అన్ని మాయలు; నీచేతన్= నీ చేతుల్లో; మడిసెన్= నశించాయి. దుర్ద్యూతంబున్= దుర్మార్గపద్ధతిలో జూదాన్ని; ఒనరించి= ఆడి; ధర్మతనయుచేన్= ధర్మరాజు నుండి; రాజ్యంబున్+కొనియెన్= రాజ్యాన్ని లాగుకొన్నాడు; ఇష్టు= చివరికి, ఈనాడు; తన= తనయొక్క; చెయ్మి= చేత(పాపకర్మ); ఫలియించెన్= ఫలించింది; అని+అను= యుద్ధమనేటువంటి; జూదంబునందున్= జూదంలో; ప్రాణము+ఓటు+పడియెన్= ప్రాణం ఓడిపోయాడు; నెత్తము+ఆటకున్= జూదం ఆడటానికి; ఈతండు= ఇతడు; కఱచుట+ఎల్లన్= చేసిన అభ్యాసమంతా; కురునికాయ నాశమునకున్= కురు సమూహ వినాశానికి; అయ్యెన్= పనికి వచ్చింది; ఈ నృపుఁడ+కాఁడె!= ఈ రాజే కదా!; పాండునందనుల తోడి= పాండు కుమారులతో; వైరమునకున్+కర్త?= శత్రుత్వానికి మూలం?

తాత్పర్యం: స్వయానా తన మేనల్లుడైన సహదేవుడి వాడి బాణాల దెబ్బలకు చిక్కి, ప్రాణాలు పోయి, నేలబడి రాబందులపాలైన సోదరుడు శకునిని చూస్తున్నావా! కృష్ణా! ఈ శకుని ఆ రోజులలో మాయలు పన్నటంలో అందరికీ

గురుస్థానంగా ప్రకాశించాడు. కాని అన్ని మాయలూ నీ చేతిలో నశించాయనుకో. ఆనాడు మోసంగా జూదమాడి ధర్మరాజునుండి రాజ్యమంతా లాగుకొన్నాడు. చివరికి ఈనాడు యుద్ధమనే జూదంలో తన ప్రాణాన్నే ఒడ్డి ఓడిపోయాడు. ఈ నాటికి ఇతని పాపకర్మ ఫలించింది. అసలు జూదమాడటానికి ఇతడు చేసిన నిరంతరమైన అభ్యాసం కురువంశ నాశనానికి తప్ప ఎందుకు పనికి వచ్చింది? నిజానికి పాండుకుమారులతో వైరం రావటానికి మూలం కూడా ఇతడే.

విశేషం: ద్వాపరయుగం 'సంశయ' ప్రధానమైనదట. 'శకునం' - అంటే నిశ్చయజ్ఞానం లేకపోవటమే. దుర్యోధనుడికి 'శకుని' మంత్రి కావటంలో రహస్య మిదే. అందుకే జీవితాంతం దుర్యోధనుడిని ధర్మపద్ధతికి వ్యతిరేకంగానే నడిపించాడు. అందుకే పాండవులతో నిరంతరవైరం నడిపినవాడు శకునే. అందుకే గాంధారి ఈమాట అంటున్నది.

క. **హిత మొనరించెద నంచున్ । ధృతరాష్ట్ర తనూభవునకుఁ దెక్కలికాఁడై**
మృతి యొనరించెం దానును । మృతుఁ డయ్యెను భ్రాతృపుత్ర మిత్ర యుతముగన్. **138**

ప్రతిపదార్థం: హితము= మంచిది; ఒనరించెదను+అంచున్= చేస్తాను అంటూ; ధృతరాష్ట్ర తనూభవునకున్= దుర్యోధనుడికి; తెక్కలికాఁడై= మోసగాడై(వంచకుడై); మృతి+ఒనరించెన్= చావుతెచ్చిపెట్టాడు; తానును= తానుకూడా; మృతుఁడు+అయ్యెన్= చనిపోయాడు; భ్రాతృ= సోదరులతో; పుత్ర= కొడుకులతో; మిత్రయుతమునన్= స్నేహితులతో (కలిసి - చనిపోయాడు).

తాత్పర్యం: 'నీకు మంచి చేస్తాను' అంటూ దుర్యోధనుడికి ఈ మోసగాడు చివరకు మరణం తెచ్చిపెట్టాడు. అంతేకాక తానుకూడా సోదరులతో, కొడుకులతో, స్నేహితులతో కలిసి చనిపోయాడు.

మత్తకోకిల:

వార లస్త్రహతాంగులై యనవద్యలోకము గాంచి రీ
వైరకర్తయు నట్లు గాంచెను వారి నల్పవిచారులం
బోరి కెత్తెడునట్లుగాఁ దగఁ బొంది వెఱ్ఱులఁ జేసె నీ
క్రూరుఁ డందును నన్నదమ్ములకున్ విరోధము సేయఁడే? **139**

ప్రతిపదార్థం: వారలు= కురుపుత్రులు; అస్త్ర+హత+అంగులు+ఐ= అస్త్రాల చేత నశింపచేయబడిన శరీరాలు గలవారై; అనవద్య= పుణ్య; లోకమున్= లోకాన్ని; కాంచిరి= పొందారు; ఈ+వైరకర్తయున్= ఈ విరోధమూలమైన శకునికూడా; అట్లు+కాంచెను= అట్లాగే దోషరహితమైన స్వర్గాన్ని పొందాడు; వారిన్= వారిని (ఆ కురుకుమారులను); అల్పవిచారులన్= అల్పజ్ఞానులను; పోరికిన్+ఎత్తెడునట్లుగాన్= యుద్ధానికి సిద్ధపడే విధంగా; తగన్+పొంది= తగినట్టుగా వశం చేసుకొని; ఈ క్రూరుఁడు= ఈ కఠినాత్ముడు; వెఱ్ఱులన్+చేసెన్= వెఱ్రివాడిగా చేశాడు; అందున్= అందులోనూ; అన్నదమ్ములకున్= అన్నదమ్ములకు; విరోధము+చేయఁడే?= విరోధం కల్పించడా?

తాత్పర్యం: ఈ కురుకుమారులు అస్త్రాలచేత నశించిన శరీరాలు కలవారై స్వర్గానికి వెళ్ళిపోయారు. ఈ వైరానికి మూలమైన ఈ శకునికూడా అట్లాగే స్వర్గం పొందాడు. అసలే కౌరవులు అల్పజ్ఞానులు. అల్పబుద్ధులుకూడా. అట్లాంటివారిని వశం చేసికొని వెఱ్రివారిగా మార్చి యుద్ధానికి సిద్ధపడేటట్లు చేసినవాడు ఈ శకునే. అట్లాంటివాడు అన్నదమ్ముల మధ్య విరోధాన్ని కల్పించడా!

విశేషం: వృత్తలక్షణానికి చూడండి : స్త్రీ. 1. 21.

క. రుచిరాంగదు శస్త్రనిచయు । నిచితాంగకునిం గళింగనృపుఁ గంటి సమి
ద్విచరణ విహరణమున నితఁ । డ చలితధృతి యగుట యెఱుఁగ నయ్యెడుఁ గృష్ణా! 140

ప్రతిపదార్థం: కృష్ణా!= కేశవా!; రుచిర+అంగదున్= కాంతిమంతమైన భుజకీర్తులు గలవాడు; శస్త్రనిచయ= శస్త్ర సమూహంతో; నిచితాంగకునిన్= నిండిన అవయవాలు కల్గిన వాడిని; కళింగనృపున్= కళింగరాజును; కంటిన్= చూచాను; సమిత్= యుద్ధంలో; విచరణ విహరణమునన్= భ్రమించటమనే ఆటలో; ఇతఁడు= ఈ కళింగరాజు; అచలిత= చలించని; ధృతి+అగుట= ధైర్యం కలవాడనటం; ఎఱుఁగన్+అయ్యెడున్= స్పష్టమవుతోంది.

తాత్పర్యం: కృష్ణా! ఇతడే కళింగదేశాధిపతి. అందమైన భుజకీర్తులు కల్గిన ఇతడి దేహం నిండా శస్త్రాలు నాటుకొని ఉన్నాయి. ఈ శస్త్రాల వ్యాప్తిని బట్టి ఇతడు యుద్ధరంగంలో వీరవిహారం చేయడంలో ఏమాత్రం ధైర్యం మొక్కవోనివాడని స్పష్టమవుతున్నది. చూస్తున్నావా!

ఆ. ఇతని చుట్టునున్న యెలనాఁగ లడలునఁ । గూరి వందియును ముకుంద! యొప్ప
వాయకున్నవారు బలితంపువడఁబడ్డ । పుష్పదామకముల పొలుపు దోఁప. 141

ప్రతిపదార్థం: ముకుంద!= కృష్ణా!; ఇతనిచుట్టున్= ఇతనిచుట్టూ; ఉన్న= చేరి ఉన్న; ఎలనాఁగలు= స్త్రీలు; అడలునన్+కూరి= దుఃఖంలో మునిగి; వందియును= వాడిపోయి కూడా; బలితంపు+వడన్+పడ్డ= బలమైన వడదెబ్బతిన్న; పుష్పదామకముల= పూలదండల; పొలుపు+తోఁపన్= విధం తోపగా; ఒప్పు= అందాన్ని; పాయకున్నవారు= పోగొట్టుకోకుండా ఉన్నారు.

తాత్పర్యం: కృష్ణా! ఇతడి చుట్టూ చేరి ఉన్న స్త్రీలు దుఃఖంలో మునిగిపోయి ఏడుస్తూ ఉండటం వలన వాడిపోయినా బలమైన వడదెబ్బ తగిలినా పూలదండలు ఎట్లా తమ సౌందర్యం కోల్పోవో అట్లాగే అందంగా కనిపిస్తున్నారు.

విశేషం: అలం: ఉపమ.

ఉత్సాహవృత్తము:

మానినీ జనంబు సేరి మగధనాథుఁడగు జయ
త్సేను చుట్టు నేడ్వ నధిక దీన నాదములకు నా
మానసంబు సాంద్రకరుణమయతఁ బొందె మోహనం
బైన యిట్టి యేడ్పు లెందు నంబుజాక్ష! వింటిమే? 142

ప్రతిపదార్థం: అంబుజాక్ష!= కమలనయనా (కృష్ణా!); మగధనాథుఁడగు= మగధదేశాధిపతియైన; జయత్సేనుచుట్టున్= జయత్సేనుడి చుట్టూ; మానినీ జనంబు+చేరి= స్త్రీలు చేరి; ఏడ్వన్= ఏడుస్తుండగా; అధిక= అధికమైన; దీన నాదములకున్= ఆర్తితో కూడినవారి ఎలుగులకు; నా మానసంబు= నా మనస్సు; సాంద్ర కరుణమయతన్= దట్టమైన కరుణతో కూడిన లక్షణాన్ని; పొందెన్; మోహనంబు+ఐన= మనస్సును హరించేటువంటి; ఇట్టి+ఏడ్పులు= ఇట్లాంటి ఏడుపులు; ఎందున్= ఎక్కడైనా; వింటిమే?= విన్నామా?

తాత్పర్యం: కృష్ణా! మగధదేశాధిపతి అయిన జయత్సేనుడి చుట్టూ స్త్రీలు చేరి ఏడుస్తుండగా వారి మిక్కుటమైన దీనాలాపాలు విని నా మనసు నిండా దట్టంగా కరుణ వ్యాపించిపోయింది. ఇట్లాంటి మనసును మోహింపజేసే ఏడుపులను ఎక్కడైనా విన్నామా!

విశేషం: పై పద్యంలో గాంధార స్త్రీలలో ఏడ్చినా లావణ్యం కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నదని, మగధస్త్రీలలో ఏడుపులోనూ మనోహరత్వం ఉందని ఇక్కడ చెప్పటం వలన - ఆయా ప్రాంతాలలోని స్త్రీల మానసిక దైహిక వ్యవస్థలలోని తేడాను సూచిస్తున్నట్లు కనిపిస్తున్నది. అందరిదీ ఏడుపే. అందరికీ శోకముంది. కాని వ్యక్తం తీరే వేరు. ఆ తీరులోని ఆకర్షణ కూడా వేరు. అందుకే స్త్రీపర్వమని వ్యాసభగవానుడు సార్థకనామధేయం చేసి ఉండాలి. వృత్తలక్షణానికి చూడండి. స్త్రీ. 1. 48.

సీ. **కోసలనాథుండు భాసురమూర్తి బృ । హద్బలుచుట్టుఁ బ్రియాంగనాజ**
నంబులు సేరి కంపంబుతోడఁ జెమర్చు । కరముల నభిమన్యు కరవిముక్త
శరములఁ బెఱుకుచుఁ బొరి మూర్ఛఁ బొరయుచు । నప్పటికప్పటి కతని ముఖముఁ
దేఱి చూచుచు విధిఁ దిట్టుచు శోకాగ్ని । నుల్లంబు లెరియంగ నున్నవారు

ఆ. **తునిమివైవ నెండఁ దనికినఁ బెద్దయు । వంది చూడ్కి దిగువ వలను కలిమి**
దొఱఁగకున్నయట్టితోయజంబుల చంద । మయ్యెఁ జూడ వీరి యాననములు. **143**

ప్రతిపదార్థం: కోసలనాథుండు= కోసలదేశాధిపతి; భాసురమూర్తి= ప్రకాశించే శరీరంకలవాడు; బృహద్బలు చుట్టున్= బృహద్బలుని చుట్టూ; ప్రియాంగనాజనంబులు= భార్యలగుంపు; చేరి; కంపంబుతోడన్= వణకుతో; చెమర్చుకరములన్= చెమర్చుతున్న చేతులలో; అభిమన్యు= అభిమన్యుని; కర= చేతినుంచి; విముక్త= వదలబడిన; శరములన్+పెఱుకుచున్= బాణాలను తీసివేస్తూ; పొరిన్= మాటిమాటికీ; మూర్ఛన్+పొరయుచున్= మూర్ఛపోతూ; అప్పటికప్పటికిన్= మాటిమాటికీ; అతని ముఖమున్; తేఱిచూచుచున్= బాగా చూస్తూ; విధిన్+తిట్టుచున్= దైవాన్ని తిట్టుకుంటూ; శోకాగ్నిని= శోకాగ్నిలో; ఉల్లంబులు+ఎరియంగన్= హృదయాలు అడలుతుండగా; ఉన్నవారు= ఉన్నారు; వీరి+ఆననములు= వీరి ముఖాలు; తునిమివైవన్= విరిచివేయగా; ఎండన్+తనికినన్= ఎండలో ఎండినాకూడా; పెద్దయున్+వంది= మిక్కిలిగా వాడి; చూడ్కి= చూపునకు; దిగువవలను= దిగువవైపు; కలిమి+తొఱఁగక+ఉన్న= శోభను పోగొట్టుకోకుండా ఉన్న; తోయజంబుల= తామరల; చందమయ్యెన్= తీరుగా ఉన్నాయి.

తాత్పర్యం: కృష్ణా! ఈ కోసలాధిపతి పేరు బృహద్బలుడు. మిక్కిలి ప్రకాశించే శరీరం కలవా డితడు. ఇతడి భార్యలు ఇతడి చుట్టూ చేరి వణకుతూ చెమర్చుతున్న చేతులతో అభిమన్యుడి చేతినుండి వదలబడి బృహద్బలుడి శరీరంలో నాటిన బాణాలను తీసివేస్తూ మాటిమాటికి మూర్ఛపోతున్నారు. మాటిమాటికీ అతడి ముఖాన్ని తనివితీరా చూచికొంటూ దైవాన్ని తిట్టుకుంటూ శోకాగ్నిలో ఎదలు మండగా చింతాక్రాంతులై ఉన్నారు. తామరలను తూళ్ళతో సహా పెరికివేయగా ఎండలో ఎండిపోయినా దిగువవైపు శోభను పోగొట్టుకోకుండా ఉన్న విధంగా వీరి ముఖాలు సొంపుతో ప్రకాశిస్తూనే ఉన్నాయి.

విశేషం: అలం: ఉపమ. వారి దేహాలు తామరతూడులు. అవి ఎండతాకిడికి వాడిపోయాయి. తామరలు పైనకూడా వాడిపోయి ఉండవచ్చును. అట్లాగే తలలమీద ముసుగులు వేసికొన్నవారి శిరోభాగాలు కూడా కాంతి విహీనమయ్యాయి. కాని, ముసుగు లోపలి ముఖాలు మాత్రం తమ సహజకాంతితో ఒప్పి ఉన్నాయి. అది ఈ పోలికలోని స్వారస్యం.

వ. ద్రోణబాణపరిపీడితప్రాణులై పడియున్నవారు ధృష్టద్యుమ్ననందనులు. 144

ప్రతిపదార్థం: ద్రోణ= ద్రోణాచార్యులయొక్క; బాణ= బాణాల చేత; పరిపీడిత= బాగా పీడించబడిన; ప్రాణులు+ఐ= ప్రాణాలు గలవారై; ధృష్టద్యుమ్న నందనులు= ధృష్టద్యుమ్నుడి కొడుకులు; పడి+ఉన్నవారు= పడి ఉన్నారు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడి కొడుకులు ద్రోణాచార్యులు ప్రయోగించిన బాణాల చేత పీడించబడి ప్రాణాలు కోల్పోయి పడి ఉన్నారు.

మత్తకోకిల:

అంగదంబులుఁ గంకణంబులు హారవల్లులు నాదిగా
నంగకంబుల భూషణంబులు హారికాంతి వెలుంగఁ
సంగరాంగణభూమికిం దమచారుభావ మలంక్రియా
సంగతిం గలిగింప నొప్పిరి శౌరి! చూచితె వీరలన్? 145

ప్రతిపదార్థం: శౌరి!= కృష్ణా!; అంగదంబులు= భుజకీర్తులు; కంకణంబులు= కడియాలు; హారవల్లులున్= సన్నటి మణులు గూర్చిన దండలు; ఆదిగాన్= మొదలైనవి - కల్గి; అంగకంబుల= అవయవాలయొక్క; భూషణంబులు= నగలు; హారికాంతిన్= మనోహరమైన కాంతితో; వెలుంగగాన్= ప్రకాశిస్తుండగా; సంగర+అంగణ+భూమికిన్= యుద్ధభూమికి; తమ= తమయొక్క; చారుభావము= అందం; అలంక్రియా సంగతిన్= అలంకారంతో ఒప్పినదిగా; కలిగింపన్= చేయగా; ఒప్పిరి= ప్రకాశిస్తున్నారు; వీరలన్= వీరిని; చూచితె?= చూచావా?

తాత్పర్యం: కృష్ణా! వీరి భుజకీర్తులు, కడియాలు, సన్నటిమణులతో కూర్చిన దండలు, ఆయా అవయవాలలో పొదిగిన నగలు మనోహరమైన కాంతితో ప్రకాశిస్తున్నాయి. ఈ చిన్నవారు సమరభూమికి తమ సౌందర్యాన్ని అలంకారంగా సమర్పించిన రీతిగా వెలుగుతున్నారు. వీళ్ళను చూస్తున్నావా!

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. వృత్తలక్షణం - చూడండి: స్త్రీ. 1.21

నర్కుటము:

త్వరిత రథాశ్వమారుత గతస్ఫురితాకృతియై
శరబహుళార్చిరుద్గమవిశాలతఁ బొల్చు ధను
ర్గురుఁడను చిచ్చుపై శలభకోటిగతింబడి మ్రం
దిరిఁ గనుఁగొంటె యేవురు నుదీర్ణులఁ గేకయులన్? 146

ప్రతిపదార్థం: త్వరిత= వేగిరింపబడిన; రథాశ్వమారుత= రథానికి కట్టిన గుర్రాలు అనబడే వాయువులో; గత= లీనమైన; స్ఫురిత= సంచరిస్తున్న; ఆకృతి+ఐ= ఆకారం కల్గినదీ; శర= బాణాల; బహుళ= ఆధిక్యంతోడి; ఉద్గమ= పొడుచుకొని వస్తున్న; విశాలతన్= వైశాల్యం కల్గిందీ (అయినటువంటి); పొల్చు= ఒప్పు; ధనుః+గురుఁడు= ధనుర్విద్యా గురుడైన ద్రోణాచార్యుడు; అను= అనబడే; చిచ్చుపైన్= మంటపైన; శలభకోటి= మిడతలదండు; గతిన్+పడి= రీతిగాపడి; మ్రందిరి= చచ్చారు; (ఈ); ఏవురన్= అయిదుగురినీ; ఉదీర్ణులన్= ఉద్రిక్తులను; కేకయులన్= కేకయ రాజులను; కనుఁగొంటే?= చూచావా?

తాత్పర్యం: వేగంగా పోతున్న రథాశ్వాలు అనే గాలి కారణంగా కదులుతున్న ఆకారం కల్గిందీ, బాణాల ఆధిక్యంచేత విస్తరిస్తున్న వైశాల్యం కల్గిందీ అయినటువంటి ధనుర్విద్యాగురువైన ద్రోణాచార్యుడనే మంటపైన మిడతల దండు రీతిగా పడి ఈ ఐదుగురు ఉద్రిక్తులైన కేకయరాజులు మాడి చచ్చారు. చూస్తున్నావా!

విశేషం: అలం: ఉపమ - రూపకానుప్రాణితం. కదులుతున్న అశ్వాలు గల రథంలో ఉండటం వలన ద్రోణుడి ఆకారం నిర్దిష్టంగా తెలియటం లేదు. ఆయన అవిచ్ఛిన్నంగా ప్రయోగిస్తున్న బాణాల పరిధి ఎప్పటికప్పుడు విస్తరిస్తూ ఉండటం వలన ఎటు తిరిగినా ఎటు పరుగెత్తినా ఆ బాణాల దెబ్బలను తప్పించుకొనలేరని అర్థం. అది ద్రోణుడు - అనే ధనుర్విద్యా పండితుడనే 'మంట' అనే మాటకు అర్థం. వృత్తలక్షణానికి చూడండి - స్త్రీ. 1. 113.

క. పంచాననంబుచేతం । బంచత్వముఁ బొందియున్న బంధురకరిఁ బో
లించుటకుం దగి యొప్పెం । బాంచాలుఁడు ద్రోణుకడిమిఁబడి కంసారీ! 147

ప్రతిపదార్థం: కంసారీ!= కంసుడి శత్రువైన కృష్ణా!; పంచాననంబు చేతన్= సింహంచేత; పంచత్వమున్+పొంది ఉన్న= చచ్చి ఉన్న; బంధుర= పెద్దదైన; కరిన్+పోలించుటకున్= ఏనుగుతో పోల్చుటకు; తగి= తగినవాడై; పాంచాలుఁడు= పాంచాలరాజు; ద్రోణు= ద్రోణుని; కడిమిన్= విక్రమానికి; పడి= చిక్కి; ఒప్పెన్= కనిపిస్తున్నాడు.

తాత్పర్యం: కృష్ణా! ద్రోణుడి పరాక్రమానికి చిక్కి చచ్చిపడి ఉన్న పాంచాలరాజు సింహంచేత చచ్చిన పెద్ద ఏనుగువలె కనిపిస్తున్నాడు.

విశేషం: అలం: ఉపమ.

క. ద్రుపదనృపాలుని ధవళా । తపత్రమస్త్రంబులె చోటుఁ దాఁకక జిగియా
రి పొలిచె శారద చంద్రుం । డుపమాపాత్రంబు గాఁగ నుర్వియను దివిన్. 148

ప్రతిపదార్థం: ద్రుపదనృపాలుని= పాంచాలరాజైన ద్రుపద మహారాజుయొక్క; ధవళ= తెల్లనైన; ఆతపత్రము= గొడుగు; అస్త్రంబులు= అస్త్రాలు; ఏ+చోటన్= ఎక్కడా; తాఁకక; జిగి+ఆరి= కాంతులు చిమ్ముతూ; ఉర్వి+అను= భూమి అనేటువంటి; దివిన్= ఆకాశంలో; శారద= శరత్కాలంలోని; చంద్రుండు= చంద్రబింబం; ఉపమాపాత్రంబు+కాగన్= ఉపమకు తగింది కాగా; పొలిచెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: పాంచాలాధిపుడైన ద్రుపదుడి తెల్లనిగొడుగు మాత్రం ఏ అస్త్రాలకూ చిక్కకుండా కాంతులు చిమ్ముతూ భూమి అనే ఆకాశంలో శరత్కాలంలోని చంద్రబింబంవలె ప్రకాశిస్తున్నది. (అంటే శరత్కాలంలో స్వచ్ఛమైన వెన్నెల ఉంటుంది కాబట్టి ఆ గొడుగుకూడా ఏ రంధ్రాలు లేకుండా ప్రకాశిస్తున్నదని అర్థం. దీనిని బట్టి రథాన్ని ద్రుపదుడి సారథి అంత జాగరూకంగా నడిపించాడని అర్థం).

విశేషం: అలం: ఉపమ.

తే. వల్లభులును గోడండ్రు నీ వసుమతీశ్వ । రునకు నగ్నిసంస్కారంబు నొనరఁ జేసి
యుమ్మలికమునఁ దద్దయు వెమ్మునంత । రంగములతోడ నరిగిరి గంగ దెసకు. 149

ప్రతిపదార్థం: వల్లభులును= తక్కినరాజులు (వల్లభలు= భార్యలు); కోడండ్రున్= కోడళ్ళు; ఈ వసుమతీశ్వరునకున్= ఈ రాజుకు; అగ్ని సంస్కారంబున్= దహనకార్యాన్ని; ఒనరన్+చేసి= పూర్తిచేసి; ఉమ్మలికమునన్= దుఃఖంతో; తద్దయున్= మిక్కిలిగా; వెమ్మ= పరితప్తమైన; అంతరంగములతోడన్= హృదయాలతో; గంగ దెసకున్= గంగవైపు; అరిగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: మిగిలిన రాజులు, అతడి భార్యలు, కోడళ్ళు ద్రుపదమహారాజుకు దహనకార్యం పూర్తిచేసి దుఃఖాతిశయంతో పరితప్తమైన హృదయాలతో గంగవైపు వెళ్ళుతున్నారు.

క. ద్రోణుఁడు దలరం దలపడి । బాణకళావేది చేదిపతి యుజ్జ్వల త
ద్బాణహతిఁ గూలి సమర । క్షోణి పరిష్కారమగుచు శోభిల్లెఁ గడున్. 150

ప్రతిపదార్థం: ద్రోణుఁడు= ద్రోణాచార్యులవంటి ధనుర్విద్యాశూరులే; తలరన్= వణికిపోయేట్లు; తలపడి= ఎదుర్కొని; బాణకళావేది= బాణవిద్యావేత్త; చేదిపతి= చేదిభూపాలుడు; ఉజ్జ్వల= ప్రకాశించేటటువంటి పదునైన; తద్= ఆ ద్రోణుడి; బాణహతిన్= బాణపుదెబ్బలచేత; కూలి= నేలమీద పడి; సమరక్షోణి= యుద్ధభూమికి; పరిష్కారము+అగుచున్= భూషణంలాగా; కడున్= మిక్కిలిగా; శోభిల్లెన్= ప్రకాశిస్తున్నాడు.

తాత్పర్యం: ద్రోణుడివంటి బాణవిద్యాగురువే కంపించేటట్లు ఎదుర్కొని బాణవిద్యారహస్యవేత్త అయిన చేది భూపాలుడు పదునైన ఆ ద్రోణుడి అస్త్రఘాతాలకు చిక్కి నేలమీద పడి యుద్ధభూమికి ఒక గొప్పభూషణంవలె మిక్కిలి ప్రకాశిస్తున్నాడు.

విశేషం: అలం: రూపకం.

తే. తలయుఁ గాళులు దమయూరుతలములందు । బెట్టికొని వీని భార్యలు బెట్టిదంపు
టడలు తాఁకునఁ గడు బెగడారఁ గూరు । నుల్లములతోడఁ బలవించుచున్నవారు. 151

ప్రతిపదార్థం: వీని భార్యలు= ఈ చేదిరాజు భార్యలు; తలయున్= ఇతడి తలా; కాళులు= కాళ్ళూ; తమ ఊరుతలములందున్= తమ తొడలమీద; పెట్టికొని= పెట్టుకొని; బెట్టిదము+అడలు= తీవ్రమైన శోకముయొక్క; తాఁకునన్= దెబ్బతో; కడున్= మిక్కిలిగా; బెగడు+ఆరన్= బెంగతో కూడి; కూరున్= దుఃఖంలో మునిగిపోయిన; ఉల్లములతోడన్= హృదయాలతో; పలవించుచున్నవారు= ఏదేదో మాట్లాడుతూ ఉన్నారు.

తాత్పర్యం: ఈ రాజు భార్యలు ఇతడి తలను కాళ్ళను తమ తొడలమీద ఉంచుకొని తీవ్రమైన శోకపు దెబ్బతో మిక్కిలిగా నిండిన బెంగతో దుఃఖంలో మునిగిపోయిన హృదయాలతో ఏదేదో పలవరిస్తున్నారు.

క. మానవనాథు లనేకులు । వీని భుజావిక్రమంబు వేఁడిఁ బడిరి నీ
మేనమఱఁది శిశుపాలుని । సూనుం డీ ధృష్టకేతుఁ జూచితె? కృష్ణా! 152

ప్రతిపదార్థం: కృష్ణా!; మానవనాథులు= రాజులు; అనేకులు= చాలమంది; వీని= ఈ చేదిరాజుయొక్క; భుజావిక్రమంబు వేఁడిన్= భుజపరాక్రమమనే మంటలో; పడిరి= పడ్డారు; (ఇతడు); నీ మేనమఱఁది= నీ మేనత్తకొడుకు; శిశుపాలుని సూనుండు= శిశుపాలుడి కుమారుడు; ఈ+ధృష్టకేతున్= ఈ ధృష్టకేతుడిని; చూచితె?= చూశావా?

తాత్పర్యం: కృష్ణా! ఎంతోమంది రాజులు ఈ చేదిరాజు భుజపరాక్రమమనే వేడితాకుకు చచ్చారు. ఇతడే ధృష్టకేతువు. నీ మేనత్త కుమారుడు శిశుపాలుడి కుమారుడు. గుర్తుపట్టావా?

ఉత్సాహవృత్తము:

అతని నందనుఁడు సుకేతుఁ డల్లవాఁడె ద్రోణ పా
తితుఁడు వీనిఁ జూడగా మదిన్ సుయోధనుండుఁ ద
త్సుతుఁడు దోఁచుచున్నవారు శోకవహ్నితాప మూ
ర్జితము గాఁగ బంధుజనుల చిత్తమెంత గుందునో? 153

ప్రతిపదార్థం: అతని= ఆ ధృష్టకేతుని; నందనుఁడు= కుమారుడు; సుకేతుఁడు; అల్ల+వాఁడె= అదిగోవాడే!; ద్రోణ= ద్రోణాచార్యులచేత; పాతితుఁడు= పడగొట్టబడ్డవారు; వీనిన్+చూడగా= వీడిని చూస్తుంటే; మదిన్= నా మనసులో; సుయోధనుండు= దుర్యోధనుడు; తత్సుతుఁడు= అతడి కొడుకు; తోఁచుచున్నవారు= గుర్తుకు వస్తున్నారు; శోకవహ్నితాపము= శోకమనే మంటవేడిమి; ఊర్జితము+కాఁగన్= ఎక్కువకాగా(వీరినిచూసి); బంధుజనుల చిత్తము= బంధువుల హృదయాలు; ఎంత+కుందునో?= ఎంత దుఃఖిస్తాయో?

తాత్పర్యం: ఆ ధృష్టకేతుడి కుమారుడు సుకేతుడు అడుగో వాడే. ద్రోణాచార్యుడు వాడిని పడగొట్టాడు. వీడిని చూస్తుంటే నాకు దుర్యోధనుడు, అతడి కొడుకు గుర్తుకు వస్తున్నారు. ఇట్లా తండ్రీకొడుకులను ఒకసారి చూచిన బంధువుల హృదయాలలో శోకమనే అగ్ని మరింతమంటలు రేపకుండా ఉంటుందా! వారు ఎంతగా కుందిపోతారో! (నా హృదయమూ అట్లాగే చింతా దుఃఖశోక పరితప్తమై పోయిందని అర్థం.)

విశేషం: అలం: రూపకానుప్రాణితమైన స్మృతి. వృత్తలక్షణం - చూడండి. స్త్రీ. 1. 48

తే. **అల్ల వారె యవంతీశు లధిక బాహు । బలులు విందానువిందులు బహుళభూష**
ణోజ్జ్వలులు పడియున్నవా రుగ్ర వాయు । పతిత కుసుమిత నవసాల భంగి దోఁప.' 154

ప్రతిపదార్థం: అల్ల= అరుగో; వారె= వారే; అవంతీశులు= అవంతీ రాజ్యపాలకులు; అధిక బాహుబలులు= మిక్కిలి బాహుబలం కలవారు; వింద+అనువిందులు= విందుడు, అనువిందుడు; బహుళ= అధికమైన; భూషణ= నగలచేత; ఉజ్జ్వలులు= మిక్కిలిగా ప్రకాశించేవారు; ఉగ్రవాయుపతిత= భయంకరమైన పెనుగాలికి పడిన; కుసుమిత= దండిగా పూలుపూసిన; నవ సాలభంగి= కొత్త సాలవృక్షాలలీల; తోఁపన్= స్ఫురిస్తుండగా; పడి+ఉన్నవారు= పడి ఉన్నారు.

తాత్పర్యం: అరుగో - వారే అవంతీ రాజ్యపాలకులు. మిక్కిలి బాహుబలవంతులు. వీరిని విందుడు, అనువిందుడు అంటారు. దండిగా నగలు ధరించి కాంతులీనుతూ వెలిగేవారు. భయంకరమైన పెనుగాలి తాకిడికి నేలకూలినటువంటి పూలు విరగబూసిన మద్దిచెట్లు గుర్తుకు వస్తున్నాయి - వీళ్ళను చూస్తుంటే'.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. **అని చూపి యిట్లనియె.** 155

తాత్పర్యం: అని ఆ విందానువిందులను చూపించి ఇట్లా అన్నది:

సీ. **'శాంతనవుండు నాచార్యుండుఁ గర్ణుండు । భూరిశ్రవుఁడు గురుపుత్రకుండుఁ**
గృపుఁడు సైంధవుఁడును గృతవర్మయును గురు । రాజు నమానుషరథికవరులుఁ
గలయంగ నెన్నెడు కొలఁదులవారె? వా । రలిగిన జెడుదు రయ్యమరులైన
నట్టి వీరుల బారికగపడియుండియు । నేమియుఁ గారైతి రీవుఁ బాండు

తే. **తనయు లందఱు నీ కూర్మితమ్ముఁడును । మహాద్భుత మ్మిది దలఁప భీష్మాదులైన**
వారి నటె పోర నిర్జింపవచ్చు నెట్టి । పనియు భరమె? దైవమునకుఁ బద్మనాభ! **156**

ప్రతిపదార్థం: పద్మనాభ!= పద్మాన్ని నాభిలో ధరించిన ఓ కృష్ణా!; శాంతనవుండున్= భీష్ముడు; ఆచార్యుండున్= ద్రోణుడూ; కర్ణుండున్= కర్ణుడూ; భూరిశ్రవుఁడున్= భూరిశ్రవసుడూ; గురుపుత్రకుండున్= అశ్వత్థామా; కృపుఁడున్= కృపుడూ; సైంధవుఁడును; కృతవర్మయును; కురురాజున్= దుర్యోధనుడూ; అమానుష రథికవరులున్= ఇంకా తక్కిన అతిరథమహారథులు (అమానుష= అసాధారణులైన); కలయంగన్= చూడగా; ఎన్నెడు+కొలఁదులవారె?= లెక్కింపదగిన శక్తులు కలవారా?; వారు; అలిగినన్= కోపగించుకొన్న; ఆ+అమరులైనన్= ఆ దేవతలయినా; చెడుదురు= నశిస్తారు; అట్టివీరుల= అట్లాంటి మహావీరుల; బారికిన్= హింసకు; అగపడి+ఉండియున్= వశమైకూడా; ఈవున్= నీవు; పాండుతనయులందఱున్= పాండుకుమారులు ఐదుగురూ; నీ కూర్మి తమ్ముఁడును= సాత్యకీ; ఏమియున్+కారు+ఐతిరి= ఏమి కాకుండా బయటపడ్డారు; ఇది; తలఁపన్= ఆలోచించగా; మహాద్భుతమ్ము= మహాద్భుతమే; భీష్మాదులైనవారిన్= భీష్మాదిమహావీరులను; పోరన్= యుద్ధంలో; నిర్జింపవచ్చునటె!= జయించడమా!; దైవమునకున్= దేవుడికి; ఎట్టి పనియున్= ఎట్లాంటి పని అయినా; భరమె?= గొప్పదా?

తాత్పర్యం: కృష్ణా! భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, భూరిశ్రవుడు, అశ్వత్థామ, కృపుడు, సైంధవుడు, కృతవర్మ, దుర్యోధనుడు - అసాధారణమైన పరాక్రమమున్న అతిరథ మహారథులు. వీరిలో ఎవ్వరిశక్తినైనా ఇంతే అని చెప్పగలమా? వారు కోపగించుకొంటే దేవతలైనా నశిస్తారు. అట్లాంటి మహావీరుల తాకిడికి ఎదురై కూడా నీవు, పాండవులు, నీ తమ్ముడు సాత్యకి ఏ అపాయమూ లేకుండా బయటపడ్డారు. ఆలోచిస్తే ఇంతకంటే మహాద్భుతం ఏముంటుంది? భీష్మాది మహాయోధులను యుద్ధంలో జయించటమా! నమ్మటానికి వీలులేని విషయమే. అయినా భగవంతుడి చేత కాని పని ఏముంది!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

వ. **దైవంబు దుర్యోధనాదులగు నూర్వురకు నొక్కెత్తున నిట్లగునే?' యని వెండియు.** **157**

ప్రతిపదార్థం: దైవంబు= దైవం; దుర్యోధన+ఆదులకు= దుర్యోధనుడు మొదలైన; నూర్వురకున్= నూరుమందికీ; ఒక్క+ఎత్తునన్= ఒక్కరీతిగా; ఇట్లు+అగునే= ఇట్లా అవుతుందా? అని; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: దైవం దుర్యోధనాదులైన నూరుమంది పట్లా ఇట్లా ఒకేరీతిగా అన్యాయం చేస్తుందా?' అని ఇంకా ఇట్లా అంటున్నది.

తరువోజ;

కురురాజు మొదలైన కొడుకుల నెల్ల గోల్పోవు టిప్పుడు గోవింద! కలిగె;
నరిగితి సంధి సేయఁగరాకయున్న నటయప్డు నీ చెప్పుటైనది కాదె?
పరమహితంబుగఁ బలికిరి గంగపట్టియు విదురుండు పాటించి పెక్కు
వెరవుల నొత్తిన వినవైతి నా వివేకుల చూ పేల వృథ నోవనేర్చు?' **158**

ప్రతిపదార్థం: గోవింద!= కృష్ణా!; కురురాజు మొదలైన= దుర్యోధనుడు మొదలైన; కొడుకులన్+ఎల్లన్= కుమారులందర్నీ; కోల్పోవుట= పోగొట్టుకోవటం; ఇప్పుడు= ఈ వేళ; కలిగెన్= సంభవించింది; సంధి+చేయఁగన్= సంధి చేయటానికి; అరిగితి(వి)= వెళ్ళావు; రాకయున్నన్= సంధిచేయలేకపోయిన స్థితి వచ్చినపుడు; అట= ఆ సభలో; అప్డు= ఆ సమయంలో; నీ+చెప్పుట= నీయొక్క చెప్పుట (నీవేం చెప్పావో అది); ఐనది+కాదె!= నిజం అయిందికదా!; గంగపట్టియున్= భీష్ముడూ; విదురుండున్= విదురుడూ; పరమ+హితంబుగన్= గొప్ప మేలునుకోరి; సలిపిరి= బోధించారు; పాటించి= పూనికతో; పెక్కు+వెరవులన్= అనేక ధర్మాలను, రాజనీతులను, ఉపాయాలను; ఒత్తినన్= నొక్కి చెప్పినా; వినన్+ఐతిన్= వినకుండా పోయాను; ఆ+వివేకుల= ఆ వివేకవంతుల; చూపు+ఏల+వృథ+పోవ+నేర్చున్?= దృష్టి ఎందుకు తప్పవుతుంది?

తాత్పర్యం: కృష్ణా! దుర్యోధనుడు మొదలైన కుమారులందరినీ ఈనాడు కోల్పోయాను. నీవు ఆనాడు సంధి చేయటానికి హస్తినకు వచ్చావు. సంధి కుదరదని తెలిసినపుడు నీవు ఏ మాటలు చెప్పావో అవన్నీ నిజమయ్యాయి గదా! భీష్ముడు, విదురుడు అనేక విధాలుగా కురువంశ క్షేమాన్ని కోరి ఎంతగానో బోధించారు. పూనికతో ఎన్నో ధర్మసూక్ష్మాలు, రాజనీతులు, ఉపాయాలు నొక్కి నొక్కి చెప్పారు. అయినా నేను పుత్రవ్యామోహంతో వినకపోయాను. ఆ పుణ్యాత్ముల వివేకంతో కూడిన దూరదృష్టి తప్పవుతుందా?'

విశేషం: వృత్తలక్షణానికి చూడండి. స్త్రీ. 1.43.

వ. **అని పలికి పశ్చాత్తాప దుఃఖంబు పెల్లున నొల్లంబోయి తెలిసి చిత్తస్థాయియైన పుత్రశోకం బడరి యలంతి గాని యలఁతఁ బెట్ట నూరకుండి యక్కౌరవరాజపత్ని పద్మనాభుదెసఁ గనుంగొని కోపోద్దీపితయై.** **159**

ప్రతిపదార్థం: అని పలికి= అని ఈ విధంగా పలికి; పశ్చాత్తాప దుఃఖంబు పెల్లునన్= పశ్చాత్తాపం వలన పుట్టిన అత్యధిక దుఃఖంతో; ఒల్లంబోయి= తెలివి పోగొట్టుకొని; తెలిసి= తెలివిరాగా; చిత్తస్థాయి అయిన= చిత్తంలో నాటుకుపోయిన; పుత్రశోకంబు+అడరి= పుత్రులమరణం వలన పుట్టిన దుఃఖం అధికమై; అలంతికాని= స్వల్పంగాని (అత్యధికమైన); అలఁతన్+పెట్టన్= బాధ కల్గించగా; ఊరకుండి= కొంచెంసేపు ఊరకొని; ఆ+కౌరవరాజపత్ని= ఆ ధృతరాష్ట్రరాజు భార్య; పద్మనాభుదెసన్+కనుంగొని = కృష్ణుడివైపు చూచి; కోపోద్దీపితయై= కోపంతో మిక్కిలి మండిపోతూ (ఇలాఅంది).

తాత్పర్యం: అని చెప్పి పశ్చాత్తాపం వలన పుట్టిన దుఃఖాతిశయంతో మూర్ఛపోయి తేరుకొని మనసులో పేరుకొనిపోయిన శోకం అత్యధికమైన బాధను కల్గించగా కొంతసేపు ఊరకుండి ఆ గాంధారి కృష్ణుడిని చూస్తూ కోపంతో మండిపోతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **'ధృతరాష్ట్ర పాండుభూపతుల కుమారులు। తమలోన నీసున సమరమునకుఁ**
దొడఁగిన నీ వడ్డపడవైతి తగుచాలు। మానిసుల్ గలిగియు మాననీయ

వాక్యుండవయ్యును శక్యసమస్త కా। ర్యుండనఁ బేర్కొనియును నుపేక్ష
చేసితి కురురాజుఁ జెఱుపన తిరిగితి। నిఖిలరాజులఁ దదనీకములను

ఆ. నామ మడఁచి తెల్లభూములుఁ బాడయ్యె। నంతవట్టు ఫలము ననుభవింపు
మేపడంగ నిన్ను శాపానలజ్వాల। దగ్ధమూర్తిఁ జేయుదాన వినుము. 160

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర= ధృతరాష్ట్రుడియొక్క; పాండుభూపతులు= పాండురాజు యొక్క; కుమారులు= కొడుకులు; తమలోనన్= తమలోతాము; ఈసునన్= అసూయతో; సమరమునకున్+తొడఁగినన్= యుద్ధానికి సిద్ధపడితే; నీవు+ అడ్డపడవు+ఐతి(వి)= నీవు అడ్డుపడకుండా పోయావు; తగు= న్యాయం తెలిసినవారు; చాలు= సమర్థులైనవారు అయిన; మానుసుల్= పెద్దమనుషులు; కలిగియున్= ఉండికూడా; మాననీయ= గొప్పదైన; వాక్యుండవు+అయ్యును= మాట కలిగినవాడయికూడా; శక్యసమస్తకార్యుండు+అనన్= అన్ని పనులు చేతనయినవాడు అని; పేరు+కొనియును= పేరు పొందికూడా; ఉపేక్ష చేసితి(వి)= ఉపేక్ష చేశావు; కురురాజున్= దుర్యోధనుడిని; చెఱుపన్+అ= చెడపడానికే; తిరిగితి(వి)= రాయబారాలు చేశావు; నిఖిలరాజులన్= రాజులందరినీ; తద్+అనీకములను= వారి సైన్యాలను; నామము+అడఁచితి(వి)= పేరు కూడా లేకుండా చేశావు; ఎల్లభూములున్+పాడయ్యెన్= అన్ని ప్రాంతాలూ నాశనమయ్యాయి; అంత+పట్టు ఫలము= దానికి తగ్గఫలాన్ని; అనుభవింపుము; ఏపు+అడంగన్= నీ వైభవం సర్వనాశనం అయ్యేలా; నిన్నున్= నిన్ను; శాప+అనలజ్వాలన్= శాపమనే నిప్పుమంటలో; దగ్ధమూర్తిన్= కాలినవానిగా; చేయుదానన్= చేస్తాను; వినుము= వినుము.

తాత్పర్యం: 'పాండవ కౌరవులు తమలో తాము అసూయతో యుద్ధానికి సిద్ధపడితే నీవు వారికి అడ్డుపడకుండా పోయావు. న్యాయం తెలిసినవారు, సమర్థులు అయిన భీష్మాదులు ఉండి కూడా, నీవు సకల ధర్మవేత్త మధురభాషి అయి ఉండికూడా, అన్ని పనులు చేతనయినవాడివని పేరుపొందికూడా, నిర్లక్ష్యం చేశావు. దుర్యోధనుడిని నాశనం చేయటానికి నీవు రాయబారాలు చేశావు. రాజులను, వారి సైన్యాలను పేరు లేకుండా చేశావు. అందరూ చచ్చారు. అన్ని ప్రాంతాలూ బీడుభూము లయ్యాయి. చేసినదానికి తగిన ఫలాన్ని అనుభవించుము. నీ వైభవం సర్వనాశన మయ్యేట్లుగా నా శాపాగ్నిలో నిన్ను కాల్చి పారవేస్తాను వినుము.

గాంధారి శ్రీకృష్ణునకు శాపం బిచ్చుట (సం. 11-25-36)

సీ. పూని పాతివ్రత్యపుణ్యఫలంబున। సంపాదితంబైన సారతపము
బలిమి సాధనముగాఁ బలికెద నుత్తమ। జ్ఞాతులఁ దమలోని సంగరమునఁ
బొలియఁజేసితి గాన పొలియుదు రన్యోన్య। ఘాతుకులై భవద్ జ్ఞాతిజనులు
నీవును దప్పక నేఁ డాదిగా ముప్ప। దాఱగు నేఁడైన యద్దినమున

తే. నరయ దిక్కెవ్వరును లేని యగ్గలంపు। గుత్సితంపుఁ దెఱంగునఁ గూలువాఁడ
విట్లు మీ వధూజనములు నేడ్చువారు। పతుల సుతులను బంధులఁ బనవి పనవి.' 161

ప్రతిపదార్థం: పూని= ప్రయత్నించి; పాతివ్రత్య= పతివ్రతగా జీవించటంలో అబ్బిన; పుణ్యఫలంబునన్= పుణ్యానికి ఫలితంగా; సంపాదితంబు+అయిన= సంపాదింపబడిన; సారతపము= గొప్ప తపస్సును; బలిమి= బలమైన; సాధనముగాన్= సాధనంగా (గ్రహించి); పలికెదన్= చెబుతున్నాను; ఉత్తమజ్ఞాతులన్= మంచి దాయాదులను; తమలోని= తమలో తాము చేసుకొన్న;

సంగరమునన్= యుద్ధంలో; పొలియన్+చేసితి(వి)+కానన్= చచ్చేలా చేశావు కాబట్టి; భవత్= నీయొక్క; జ్ఞాతి జనులున్= దాయాదులు కూడా; అన్యోన్య= ఒకరినొకరు; ఘాతుకులు+ఐ= కొట్టుకొని; పొలియుదురు= చస్తారు; నీవును= నీవు కూడా; తప్పక= తప్పకుండా; నేఁడాదిగాన్+ముప్పది+ఆఱగు+ఏఁడైన+ఆ+దినమునన్= సరిగా ఈ నాటికి 36 సంవత్సరాలు పూర్తి అయిన రోజున; అరయన్= చూడటానికి; దిక్కు+ఎవ్వరునులేని= దిక్కెవ్వరూ లేనటువంటి; అగ్గలంపున్+కుత్సితంపున్+ తెఱంగునన్= మిక్కిలి క్రూరమైన విధంగా; కూలువాఁడవు= చస్తావు(చావబోతావు); ఇట్లు= ఈవాళ వీళ్ళందరూ ఎట్లా ఏడుస్తున్నారో అట్లు; మీ వధూజనంబులు= మీ యాదవ కాంతలు కూడా; పతులన్= భర్తలను; సుతులను= కొడుకులను; బంధులను= బంధుజనులను; పనవి పనవి= పేరు పేరునా తలచుకొని; ఏడ్చువారు= ఏడుస్తారు.

తాత్పర్యం: ఎంతో దీక్షతో పతివ్రతగా ఇంత సుదీర్ఘజీవితాన్ని గడపిన పుణ్యానికి ఫలంగా అబ్బిన తపశ్శక్తితో చెప్పుతున్నాను. మంచి దాయాదులను తమలోతాము పోరాడుకొని ఒకరినొకరు చంపుకొని నశించేటట్లు చేశావు. నీ దాయాదులు కూడా ఇట్లాగే ఒకరి నొకరు కొట్టుకొని చస్తారు చూడుము! నీవు కూడా సరిగ్గా ఈనాటికి 36 సంవత్సరాలు పూర్తి అయిన రోజున చూడటానికి దిక్కు ఎవరూ లేని రీతిలో అతిక్రూరంగా చావబోతావు. నామాట తప్పదు. ఈవాళ వీళ్ళందరూ ఎట్లా ఏడుస్తున్నారో అట్లాగే మీ యాదవకాంతలు కూడా భర్తలను, కొడుకులను, బంధువులను పేరుపేరునా తలచుకొని కుమిలి కుమిలి ఏడుస్తారు పొమ్ము.'

క. అని ఘోరంబుగఁ బలికిన । విని విపులమనస్కుఁడైన విష్ణుఁడు చిఱున
వ్వున నానన మొప్పఁగ న । వ్వనితకు ని ట్లనియె గౌరవస్తుత్యముగన్. 162

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; ఘోరంబుగన్= కఠినంగా, పలికినన్= పలకగా; విని; విపుల= విశాల; మనస్కుఁడైన= హృదయంగలవాడైన; విష్ణుఁడు= శ్రీకృష్ణుడు; చిఱునవ్వునన్= చిరునవ్వుతో; ఆననము= ముఖం; ఒప్పఁగన్= ప్రకాశింపగా; ఆ+వనితకున్= ఆ గాంధారితో; గౌరవస్తుత్యముగన్= మర్యాదాకరంగానూ, స్తుతింపదగిన రీతిలోనూ; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: ఇట్లా అతి ఘోరంగా ఆమె శాప మివ్వగా విని, విశాల హృదయుడైన శ్రీహరి చిరునవ్వుతో ముఖం విరాజిల్లగా ఆ గాంధారీదేవితో మర్యాదను పాటిస్తూ శత్రువులు కూడా స్తుతించే విధంగా ఇట్లా అన్నాడు:

తే. 'మున్నకాదె యాదవులకు మునివరేణ్య । కలిత దారుణ శాపంబు గలదు నీకు
నేల చర్వితచర్వణమిట్లు సేయ? దీన నీవేమి త్రవ్వితి? దానిఁ జెపుమ! 163

ప్రతిపదార్థం: యాదవులకున్= యాదవ సమూహానికి; మునివరేణ్య= మునులలో శ్రేష్ఠులైనవారిచేత; కలిత= చేయబడిన; దారుణ= భయంకరమైన; శాపంబు= శాపం; మున్న= ముందే; కలదుకాదె!= ఉన్నది కదా!; నీకున్= నీకు; ఇట్లు; చర్వితచర్వణము= నమిలినదాన్నే మళ్ళీ నమిలేవిధంగా చెప్పినదాన్నే మళ్ళీ చెప్పటం; చేయన్+ఏల?= చేయడం ఎందుకు?; దీనన్= ఇందువలన; నీవు+ఏమి త్రవ్వితి(వి)?= నీవు కొత్తగా ఏమి చెప్పావు? (త్రవ్వటం - అంటే ఏదో ఒక కొత్త విషయాన్ని కనుక్కోవటమని అర్థం); దానిన్= దాన్ని; చెపుమ!= చెప్పు చూద్దాము.

తాత్పర్యం: 'గాంధారీదేవీ! యాదవులకు మునివరులు ఇచ్చిన ఘోరశాపం ముందే ఉన్నది కదా! మళ్ళీ నీవు దానిని పునరుక్తం చేశావు. దీనివలన నీవు కొత్తగా ఏమి చెప్పావు? దాన్ని చెప్పుము.

క. యదువంశజాతులకుఁ ద । ప్పదు నాశము వారి సురలుఁ బరిమార్పఁగ లే
రది కారణంబు గాఁగఁ దె । గుదు రొండొరుచేత రణము ఘోరత్వమునన్.' 164

ప్రతిపదార్థం: యదువంశ జాతులకున్= యదువంశంలో పుట్టినవారికి; నాశము= నాశనం; తప్పదు; వారిన్= వారిని; సురలున్= దేవతలుకూడా; పరిమార్పగన్+లేరు= చంపజాలరు; అది కారణంబు+కాఁగన్= ఆ కారణంచేత; రణము ఘోరత్వమునన్= ఘోరయుద్ధంలో; ఒండు+ఒరుచేతన్= ఒకరిచేతిలో ఒకరు; తెగుదురు= చస్తారు.

తాత్పర్యం: యాదవులకు నాశనం తప్పదు. వారిని దేవతలు కూడా చంపలేరు. అందుచేత ఘోరయుద్ధంలో ఒకరినొకరు చంపుకొని చస్తారు' - అని కృష్ణుడు ఆ శాపరహస్యాన్ని వివరించాడు.

తే. అనిన పలుకులు విని పాండుతనయు లెదలు । వెఱపు పెంపున గంపింప విహ్వలించి
యాత్మజీవితములదెస నాస లపుడు । వదల విడిచిరి కౌరవవంశవర్య! 165

ప్రతిపదార్థం: కౌరవవంశవర్య!= ఓ జనమేజయ మహారాజా!; (ఈ విధంగా); అనిన పలుకులు= శ్రీకృష్ణు డన్న మాటలు; విని= విన్నవారై; పాండు తనయులు= పాండు కుమారులు; ఎదలు= హృదయాలు; వెఱపు+పెంపునన్= అధికమైన భయంతో; కంపింపన్= వణకగా; విహ్వలించి= మిక్కిలిగా భయపడిపోయి; ఆత్మజీవితముల దెసన్= తమ జీవితాలపట్ల; ఆసలు= ఆశలు; వదల విడిచిరి= వదలిపెట్టారు.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! ఇట్లా కృష్ణుడు అనగానే పాండుకుమారుల గుండెలు అధికమైన భయాందోళనలతో వణకిపోయారు. వారు తమ తమ జీవితాలపట్ల ఆశ సంపూర్ణంగా వదులుకొన్నారు.

విశేషం: పాండువులకు శ్రీకృష్ణుడే ప్రాణం. ప్రాణశక్తి కూడా. ఎప్పుడు ఆయనకే శాపం తప్పనిదవుతున్నదని తెలిసిందో పాండవులు ప్రాణాలపై ఆశలు వదులుకొనటం సహజం కదా!

వ. ఇట్లు పలికిన యచ్యుతుం డద్దేవి నుద్దేశించి 'లేవమ్మా! మృతులైన సకల బంధుమిత్రులకు నగ్నికార్యంబులు సేయింపవలయు'నని వెండియు. 166

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పలికిన= అనిన; అచ్యుతుండు= కృష్ణుడు; ఆ+దేవిన్= ఆ గాంధారిని; ఉద్దేశించి= చూసి; లేవమ్మా!= అమ్మా! ఇంతవరకు శోకించింది చాలు 'లే'; మృతులు+ఐన= చనిపోయిన; సకలబంధు మిత్రులకున్= బంధువులకు, స్నేహితులకు అందరికీ; అగ్నికార్యంబులు= దహనకార్యం; చేయింపవలయున్+అని= చేయించాలి అని; వెండియున్= ఇంకా (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ఈ విధంగా పలికిన శ్రీకృష్ణుడు గాంధారిని చూసి 'అమ్మా! చాలు. ఇంక పైకి లెమ్ము. చనిపోయిన బంధుమిత్రులందరికీ అగ్నికార్యాలు చేయించాలి కదా!' అంటూ ఇంకా ఇట్లా అన్నాడు:

సీ. 'వినుము గాంధారి! నీ తనయుండు చేయు దు । ర్నయము లెఱుంగవె? నాకు నీకు
శాంతనవునకు నాచార్యునకు బాహ్లి । కునకుఁ దండ్రికి మాన్పఁ గొలఁది గాని
దుర్మానమున నట్లు దొడరి యి ట్లయ్యె మీ । యపరాధమున వచ్చినట్టి కీడు
నకు నింత నొవ్వంగ ననుఁ బల్కఁ దగునె? యు । మ్మలికంబు ధృతిఁ బట్టి మాన్పు మింకఁ

తే. జేటునకుఁ జావునకు వగఁజెందు జనుల। కినుమడింపదె మానసమున నలంత?
రాచ కూఁతుండ్రు సుతుల సంగ్రామ నిరత। హృదయులగు వారిఁ గాంచఁ గోరుదుర కాదె!' 167

ప్రతిపదార్థం: గాంధారి!= గాంధారీదేవీ!; వినుము; నీ తనయుండు= నీ కుమారుడు; చేయు= చేసే; దుర్నయములు= చెడ్డపనులు; ఎఱుంగవె?= నీకు తెలియవా?; నాకున్= నాకూ; నీకున్= నీకూ; శాంతనవునకున్= భీష్ముడికీ; ఆచార్యునకున్= ద్రోణుడికీ; బాహ్లికునకున్= బాహ్లికుడికీ; తండ్రికిన్= ధృతరాష్ట్రుడికీ; మాన్పన్= మాన్పడానికి; కొలఁదికాని= వీలుకాని; దుర్మానమునన్= దురభిమానంతో; అట్లు= ఆ విధంగా; తొడరి= పనులుచేసి; ఇట్లు+అయ్యెన్= ఈనాడు ఇట్లా అయ్యాడు దుర్యోధనుడు; మీ+అపరాధమునన్= మీ తప్పువలన; వచ్చిన+అట్టి కీడునకున్= వచ్చినటువంటి చేటుకు; ఇంత నొవ్వంగన్= ఇంత నొచ్చేటట్లుగా; ననున్+పల్కన్+తగునె?= నన్ను గురించి మాట్లాడటం న్యాయమా?; ఇంకన్= ఇక; ఉమ్మలికంబున్= శోకాన్ని; ధృతిన్+పట్టి= ధైర్యాన్ని అవలంబించి; మాన్పుము= పోగొట్టుకొమ్ము; చేటునకున్= నాశనానికి; చావునకున్= మరణానికి; వగన్+చెందు= శోకించేటటువంటి; జనులకున్= మానవులకు; మానసమునన్= మనస్సుల్లో; అలంత= బాధ; ఇనుమడింపదె?= రెట్టింపు కాదా?; రాచ కూఁతుండ్రు= రాజుల ఇళ్ళలోని అమ్మాయిలు; సుతులన్= కొడుకులను; సంగ్రామ నిరతహృదయులగు వారిన్= యుద్ధంలో అంకితమైన అంతరంగం కలవారిని; కాంచన్+కోరుదురు+అ కాదె= కనాలని కోరుకుంటారు కదా!

తాత్పర్యం: 'గాంధారీదేవీ! వినుము. నీ కుమారుడు చేసిన దుర్మార్గమైన పనులు నీకు తెలియనివా? దుర్యోధనుడి దురభిమానాన్ని నేను కాని, నీవు కాని, భీష్మద్రోణ బాహ్లికులు కాని, చివరకి ధృతరాష్ట్ర మహారాజు కాని మాన్పలేకపోయాము. ఆ దురభిమానంతో చేసిన పనుల పర్యవసానంగానే అతడికి ఈనాడు ఈ దశ వచ్చింది. మీ తప్పువలన వచ్చిన చేటుకు బాధ్యుడిని నేనని నన్ను నొప్పించేటట్లు ఇట్లా మాట్లాడటం న్యాయమా? ఇకనైనా ధైర్యం అవలంబించి నీ శోకాన్ని దూరం చేసికొమ్ము. కీడుకు, చావుకు ఏ మానవులు శోకిస్తారో వారి దుఃఖం రెండింతలవుతుంది తప్ప ఉపశమించదు. రాజుల కుమార్తెలు యుద్ధంలో అంకితమైన హృదయం కలవారిని కుమారులుగా పొందాలని కోరుకుంటారు కదా!'

విశేషం: గాంధారి క్షత్రియ కులసంజాత కాబట్టి ఆమె అభిలాషకు అనుగుణంగా యుద్ధంలో నిరంతర ఆసక్తి పొందే కుమారులే పుట్టారని తాత్పర్యం.

కూఁతు శబ్దమునకు బహువచనరూపం కూఁతులు. కూఁతుండ్రు అని తిక్కన ప్రయోగించటం విశేషం. ఇక్కడ కూఁతుల అని ఉన్నప్పటికీ ఛందోభంగం ఏర్పడదు.

వ. అని చెవి సూఁడినట్లు పలికిన విని నిరుత్తరయై గాంధారి యూరకుండె నట్టియెడ ధృతరాష్ట్రుండు ధర్మనందనుతో 'నీవు మన మొనలంగల జనులకొలంది యెఱుంగుదు చచ్చినవారి లెక్క దలంతేని నా కెఱిఁగింపు' మని పల్కిన విను మెఱుకపడ్డవా రుత్తమ జనంబులు డెబ్బది యాఱుకోట్లు నిరువది వేలును ముక్కడి మూఁక యిరువది నాలుగువేలు మున్నూట యిరువండ్రుఁ దెగిరని చెప్పిన నమ్మనుజపతి 'వీరిందఱు నేగతికిఁ బోదు?' రనుటయు. 168

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా కృష్ణుడు; చెవి సూఁడినట్లు= చెవి కాలినట్లు (అంటే భరించలేని విధంగా అని అర్థం); పలికినన్= అనగా; విని; నిరుత్తర+ఐ= సమాధానం ఏమీ చెప్పక; గాంధారి; ఊరక+ఉండెన్= మౌనంగా ఉండిపోయింది; అట్టి+ఎడన్= అప్పుడు; ధృతరాష్ట్రుండు; ధర్మనందనునితో; నీవు; మన= కౌరవపాండవుల; మొనలన్= సైన్యాలలో; కల=ఉన్న;

జనులకొలంది= జనుల పరిమితి (జనసంఖ్య); ఎఱుంగుదు(వు)= తెలిసినవాడివి; చచ్చినవారి లెక్క= చనిపోయినవారిలెక్క; తలంతు+ఏని= గుర్తు ఉంటే; నాకున్+ఎఱింగింపుము= నాకు చెప్పు; అని పల్కినన్= అని అడుగగా; వినుము= ధర్మరాజు అంటున్నాడు 'వినుము'; ఎఱుకపడ్డవారు= ప్రసిద్ధులు; ఉత్తమజనంబులు= ఉన్నతవర్గాల మనుష్యులు; డెబ్బదియాఱుకోట్లు నిరువదివేలును= 76 కోట్ల 20 వేలమంది; ముక్కడిమూఁక= ఇతరజనం; ఇరువదినాలుగువేలు మున్నూరు యిరువండ్రున్= 24వేల 320 మంది; తెగిరని చెప్పినన్= చనిపోయారని చెప్పగా; ఆ+మనుజపతి= ఆ రాజు; వీరు+ఇందఱున్= వీరు ఇంతమందీ; ఏగతికిన్= ఏయే గతులకు; పోదురు?+అనుటయున్= వెళ్తారు? అని అడుగగా.

తాత్పర్యం: అని ఈ విధంగా శ్రీకృష్ణుడు మాట్లాడిన మాటలు గాంధారి చెవిని కాల్చాయి. అయినా ఏమీ సమాధానం చెప్పకుండా ఊరకుండిపోయింది. అపుడు ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో 'నీకు మన రెండు సైన్యాలలోని జనుల సంఖ్య తెలుసును. యుద్ధంలో ఎంతమంది చనిపోయారో గుర్తుంటే చెప్పుము' అని అడిగాడు. అప్పుడు ధర్మరాజు 'మహారాజా! వినుము. ప్రసిద్ధులు ఉన్నత వర్గాలవారు 76కోట్ల 20 వేలమంది, ఇతరజనం 24వేల 320 మంది చనిపోయా'రని చెప్పగా ఆ రాజు' అయితే వీరు ఇంతమందీ ఏయే గతులకు వెళ్ళుతారో చెప్పుతావా?' అని అడిగాడు.

తే. **'ఎవ్వ రాత్మదేహములు సమిద్ధమైన । యస్త్రవహ్ని వేలిచిరి వా రమరలోక**
మునకుఁ జని నిర్జరాంగనాజన విలసితుఁ । డైన యమరేంద్రునకుఁ బూజ్యు లగుదు రధిప! 169

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఎవ్వరు= ఏ యోధులైతే; ఆత్మదేహములు= తమ దేహాలను; సమిద్ధమైన= బాగా రగుల్చబడిన; అస్త్రవహ్నిన్= అస్త్రాలచేత పుట్టిన అగ్నిలో; వేలిచిరి= హోమం చేశారో; వారు; అమరలోకమునకున్+చని= స్వర్గానికి వెళ్ళి; నిర్జర+అంగనాజన= అప్సరసలతోడి; విలసితుఁడైన= ప్రకాశించేటువంటి; అమరేంద్రునకున్= ఇంద్రుడికి; పూజ్యులు= పూజింపదగినవారు; అగుదురు= అవుతారు.

తాత్పర్యం: 'రాజా! వినుము. ఏ యోధులు తమ దేహాలను బాగా మండుతున్న అస్త్రాల చేత పుట్టిన అగ్నిలో హోమం చేశారో వారు స్వర్గానికి వెళ్ళి అప్సరసలతో వైభవంగా విరాజిల్లే మహేంద్రుడికి అతిథులై పూజలందుతారు.

క. **తఱచుగ శస్త్రాస్త్రంబులు । నెఱఁకులు దూఱినఁ జలించి నిజధైర్యంబుల్**
మఱచి తెఱలి చచ్చిరి కొం । దఱు గుహ్యకగతికిఁ బోవఁ దగుదురు వారల్. 170

ప్రతిపదార్థం: తఱచుగన్= మిక్కిలిగా; శస్త్రాస్త్రంబులు= శస్త్రాలు, అస్త్రాలు; నెఱఁకులు= ఆయువుపట్టుల్లో; దూఱినన్= నాటుకోగా; చలించి= భయపడిపోయి; నిజధైర్యంబుల్= తమ ధైర్యాన్ని; మఱచి= విస్మరించి; తెఱలి= బయటపడి; కొందఱు= కొంతమంది యోధులు; చచ్చిరి= చచ్చారు; వారల్= వారు; గుహ్యకగతికిన్= యక్షలోకానికి; పోవన్+తగుదురు= పోవటానికి అర్హులవుతారు.

తాత్పర్యం: అనేక శస్త్రాలు, అస్త్రాలు ఆయువుపట్టులలో నాటుకోగాభయపడిపోయి, తమ ధైర్యాన్ని కోల్పోయి వెన్నుచూపి యుద్ధరంగంనుండి బయటపడి కొంతమంది యోధులు చచ్చారు. వారు యక్షలోకానికి పోవటానికి అర్హులవుతారు.

విశేషం: గుహ్యకులు దేవయోనులు. కుబేరుడు వీరి అధిపతి.

క. సమరమున నెత్తెఱంగున । సమసిననుం గీడుతెరువు చన రుత్తమ లో
కమునకుఁ బోదురు జనములు । ప్రముదితులై యంద్రు బుధులు పౌరవముఖ్యా!' 171

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశంలో పుట్టిన శ్రేష్ఠుడైన ధృతరాష్ట్రుడైన మహారాజా!; సమరమునన్= యుద్ధంలో; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; సమసిననున్= చచ్చినా; జనములు= మనుష్యులు; కీడుతెరువు= నరకానికి; చనరు= పోరు; ప్రముదితులు+ఐ= మిక్కిలి సంతోషంతో; ఉత్తమ లోకమునకున్= స్వర్గానికే; పోదురు= వెళతారు (అని); బుధులు= పండితులున అంద్రు= అంటారు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! యుద్ధంలో ఎట్లా చనిపోయినా ఆ వ్యక్తులు నరకానికి పోనే పోరు. తప్పకుండా సంతోషంతో స్వర్గానికే వెళ్తారు అని పండితు లంటారు.'

క. అనిన విని ' నాథవంతులు । ననాథులును నైన వీరి కందఱకుఁ గృపా
ధనలోల! చేయఁగా వ । చ్చున కాదే యగ్నికార్యశోభనముఁ దగన్? 172

ప్రతిపదార్థం: అనినన్= ఇలా అనగా; విని= ధృతరాష్ట్రుడు విని (ఇట్లా అన్నాడు); కృపాధనలోల!= దయ అనే సంపదలో (దయాసంపదలో) ఆసక్తి ఉన్న ఓ ధర్మరాజా!; నాథవంతులున్= దిక్కున్నవారు; అనాథులును= దిక్కులేనివారు; ఐన= అయినటువంటి; వీరికందఱకున్= వీరందరికీ; అగ్ని కార్య శోభనమున్= పవిత్రమైన అగ్నికర్మను; తగన్= విధియుక్తంగా; చేయఁగాన్+వచ్చున కాదే!= చేయవచ్చు కదా!

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అనగా విని ధృతరాష్ట్ర డిట్లా అన్నాడు: 'దయామూర్తి అయిన ధర్మరాజా! ఈ చనిపోయిన వారిలో దిక్కున్నవారూ ఉన్నారు. ఏ దిక్కు లేనివారూ ఉన్నారు. అట్లాంటప్పుడు వీరి కందరికీ విధి ప్రకారంగా దహనకర్మ చేయటంలో తప్పేమీ లేదు కదా!'

విశేషం: ఇక్కడ 'దిక్కు' అనే మాటకు మిగిలినవారు అని అర్థం. సాధారణంగా బంధువులలో ఎవరో ఒకరు మిగిలి ఆ దహనకర్మ జరుపుతారు. ఈ మహాయుద్ధంలో దాదాపు అందరూ తుడిచిపెట్టుకుపోయారు కాబట్టి ఈ ధర్మసంకటం వచ్చింది. సమాధానం ధర్మరాజే చెప్పుతున్నాడు.

వ. అని పలుకుటయు ధర్మనందనుం డిట్లను 'నీ యఖిల జనంబులు నాహితాగ్నుల యట్ల యట్లుంగాక వీరలిందఱ కుదకదహనక్రియాకరణయోగ్యులును లేరు మన మేది కొలఁదిగా నిప్పని సేయుద'మని పలికి తా రజ్ఞాత వాసంబు నిర్వహించి సముచిత ప్రకారంబున విరాటాదులచేతం బరిజ్ఞాతులైన సమయంబున సంగతుండై యది మొదలుగాఁ జెల్లెడు శాంతిక పౌష్టికాది శ్రౌతస్మార్తక్రియాకలాపంబులు నడపుచుం దమయొద్దనున్న ధౌమ్యునాలోకించి విదురుని సంజయునిఁ గనుంగొని 'మీరు భరతకులులకుందక్క ననాథవంతులైన వారలకు విధ్యుక్తంబుగా నగ్నిసంస్కారంబు సేయుం'డని పనిచి యత్తెఱంగునకుం దోడుపడుటకై సూతజనంబులను దత్కాలసమాగతులైన కరిపురజనంబులోనం దగువారి నిరూపించి మున్న తెప్పించిన చందనాగురుఖండ క్షౌమవసన కస్తూరికాకుంకుమఘృతతైలప్రభృతులగు వలయువస్తువు లా

ధౌమ్యముఖ్యుల కొప్పించిన వా రయ్యవసరంబునం గూడికొనిన బహుబ్రాహ్మణ సంఘంబులతోఁ జని దుర్యోధన దుశ్శాసనకర్ణశల్యాదులకు నభిమన్యుఘటోత్కచవిరాటధృష్టకేతుప్రముఖులకును దక్కను బే రెఱుకపడు నానాదేశాధీశులకుం బ్రచురకాష్ఠ సంచయంబులను భగ్నరథావయవ ధ్వజ ధనుశ్శరకుంతాదులను సొదలు వేర్పించి పితృమేధ క్రియలు నడపి చిచ్చునం జొనిపి యనాథవంతులైన భూకాంతుల ననేక సహస్ర సంఖ్యులం బ్రోవులుగాఁ బెట్టించి సమగ్రదారుసముదయంబు లమర్చి యగ్ని యిచ్చి రప్పడు ఋగ్యజుః పఠన రవంబులును సామగాన నాదంబులును రమణీరోదన ధ్వనులును రోదసీకుహరంబు నిండె ధూమంబున దిక్కులు పిక్కటిల్లెఁ జేతనభూతంబులకెల్ల విపులవిషాదం బావహిల్లె నవ్విధంబునం దగవు నడిపించి. **173**

ప్రతిపదార్థం: అని పలుకుటయున్= అని ధృతరాష్ట్రుడనగా; ధర్మనందనుండు= ధర్మరాజు; ఇట్లు+అనున్= ఇలా అంటాడు; ఈ అఖిలజనంబులున్= ఈ యుద్ధంలో పాల్గొన్న సమస్త జనులూ; ఆహితాగ్నుల+అట్ల= విధిపూర్వకంగా నిత్యమూ ఇంటిలో అగ్నిని స్థాపించుకొని యజ్ఞం చేసే వారివలె (అంటే వీరికి అగ్నికార్యం యుద్ధప్రక్రియలోనే సిద్ధిస్తోందని అర్థం); అట్లున్+కాక= అంతే కాకుండా; వీరలు+ఇందఱకున్= వీరు ఇంతమందికీ; ఉదకదహన క్రియాకరణ యోగ్యులు= జలతర్పణం, దహనం చేయటానికి అర్హత ఉన్నవారు; లేరు; మనము+ఏది= మనం పూనుకొని; కొలఁదిగా= సాధ్యమైనంతవరకు; ఈ+పని+చేయుదము= ఈ పనిచేద్దాము; అని పలికి; తారు= తాము; అజ్ఞాతవాసంబు; నిర్వహించి= చేసి; సముచిత= తగిన; ప్రకారంబునన్= విధంగా; విరాటాదులచేతన్= విరాట రాజు మొదలైనవారిచేత; పరిజ్ఞాతులైన= తెలిసికోబడిన; సమయంబునన్= సందర్భంలో; సంగతుండు+ఐ= కలిసినవాడై; అది మొదలుగాన్= అప్పటినుంచి; చెల్లెడు= జరిగిన; శాంతిక= శాంతి; పౌష్టిక= పుష్టి; ఆది= మొదలైన; శ్రౌత= శ్రుతికి సంబంధించిన; స్మార్త= స్మృతికి సంబంధించిన; క్రియాకలాపంబులు= హోమాది యాజ్ఞిక కార్యాలు; నడపుచున్= నడిపిస్తూ; తమ+ఒద్దన్+ఉన్న= తమ వద్ద ఉన్న; ధౌమ్యున్+ఆలోకించి= ధౌమ్యుడిని చూసి; విదురునిన్= విదురుడిని; సంజయునిన్= సంజయుడిని; కనుంగొని= చూసి; మీరు= మీరిద్దరూ; భరతకులులకున్+తక్కన్= భరతవంశీయులకు తప్ప; అనాథవంతులైన వారలకున్= ఏ దిక్కూ లేకుండా చనిపోయినవారికి; విధి+ఉక్తంబుగాన్= కర్మవిధి ప్రకారంగా; అగ్ని సంస్కారంబు= దహనక్రియను; చేయుండని పనిచి= చేయండి అని పంపి; ఆ+తెఱంగునన్= ఆ విధంగా; తోడుపడుటకై= సహాయంగా ఉండటానికి; సూతజనంబులనున్= సూతజనులను; తత్కాల= ఆ సమయానికి; సమాగతులైన= అక్కడికి వచ్చి ఉన్న; కరిపురజనంబులోనన్= హస్తినాపుర జనులలో; తగువారిన్= తగిన మనుష్యులను; నిరూపించి= ఏర్పరచి; మున్న= ముందుగానే; తెప్పించిన= తెప్పించి సిద్ధంగా ఉంచిన; చందన= శ్రీగంధం; అగురు= అవురుగడ్డి; ఖండ= దర్భ; క్షౌమ వసన= పట్టు బట్టలు; కస్తూరికా= కస్తూరి; కుంకుమ; ఘృత= నెయ్యి; తైల= నూనె; ప్రభృతులు+అగు= మొదలైన; వలయు వస్తువులు= అవసరమైన వస్తువులను; ఆ ధౌమ్యముఖ్యులకున్= ఆ ధౌమ్యాచార్యుడు మొదలైన పెద్దవారికి; ఒప్పించినన్= అప్పగించగా; వారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; కూడికొనిన= అక్కడికి చేరిన; బహు= చాలమంది; బ్రాహ్మణ సంఘంబులతోన్= బ్రాహ్మణ సమూహాలతో; చని= వెళ్ళి; దుర్యోధన; దుశ్శాసన; కర్ణ; శల్య+ఆదులకున్= శల్యుడు మొదలైనవారిన్; అభిమన్యు; ఘటోత్కచ; విరాట; ధృష్టకేతు; ప్రముఖులకును= మొదలైనవారికీ; తక్కు= తప్ప(తక్కిన); పేరు+ఎఱుకపడు= ప్రసిద్ధులైన; నానా దేశ+అధి+ఈశులకున్= నానా రాజులకు; ప్రచుర= దండిగా; కాష్ఠ= కర్రల; సంచయంబులను= మోపులతో; భగ్న= విరిగిన; రథావయవ= రథభాగాలు; ధ్వజ=టెక్కెములు; ధనుః=విండ్లు; శర=అమ్ములు; కుంత+ఆదులను= బల్లెం మొదలైన వాటిచేత; సొదలు+పేర్పించి= చితులు పేర్పించి; పితృమేధ క్రియలు= ప్రేతయజ్ఞ క్రియను (దహన కర్మను); నడపి= నడిపించి; చిచ్చునన్= మంటలో; చొనిపి= ఆ శవాలను చేర్చి; అనాథవంతులైన= ఏ దిక్కూలేక మరణించిన; భూకాంతులన్= రాజులను; అనేక సహస్రసంఖ్యులన్= చాలావేలమందిని (వేనకువేలుమందిని); ప్రోవులుగాన్= రాసులుగా; పెట్టించి= ఒకచోట చేర్పించి; సమగ్ర= పెద్దపెద్ద; దారు సముదయంబులు= దుంగలను, కొయ్యలను; అమర్చి; అగ్ని+ఇచ్చిరి=

నిప్పుపెట్టారు; అప్పుడు; ఋక్+యజుః+పఠన రవంబులును= ఋక్ వేదం; యజుర్వేదం పఠిస్తున్న శబ్దాలు; సామగాన నాదంబులును= సామవేదం పాడుతున్నప్పటి నాదం; రమణీ= స్త్రీల; రోదన ధ్వనులును= ఏడుపులు; రోదసీకుహరంబు= ఆకాశమనే గుహ అంతటా; నిండెన్= నిండిపోయింది; ధూమంబునన్= పొగలో; దిక్కులు= అన్ని దిక్కులు; పిక్కటిల్లెన్= నిండిపోయాయి; చేతన= ప్రాణమున్న; భూతంబులకెల్లన్= జీవరాశికంతటికీ; విపుల= మిక్కిలి; విషాదంబు= శోకంబు; ఆవహిల్లెన్= కల్గింది; ఆ+విధంబునన్= ఆ రీతిగా; తగవున్= ఆ కర్మవిధిని; నడిపించి= నడిపించాక.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగా ధర్మరాజు ఇట్లా అన్నాడు: 'ఈ యుద్ధంలో పాల్గొన్న సమస్త జనులూ అగ్నిని సిద్ధంగా ఉంచుకొన్న యాజ్ఞికులవంటివారే. (యుద్ధమే వారికి యజ్ఞకుండం. అస్త్రాలే అగ్నులు. కాబట్టి వారికి వేరే యజ్ఞం అక్కరలేదని అర్థం). అంతే కాకుండా వీరింతమందికీ జలతర్పణం, దహనం చేయటానికి అర్హత ఉన్నవారు లేరు. మనం పూనుకొని సాధ్యమైనంత వరకు ఈ పనిచేద్దాము' అని అంటూ తాము అజ్ఞాతవాసం చేసి సముచితమైన రీతిలో విరాటమహారాజు మొదలైన వారిచేత తెలిసికొనబడిన సందర్భంలో కలిసినవాడై, అప్పటి నుండి జరిగిన శాంతి పుష్టి హోమాదులను నడిపిస్తూ తమ వెంటనే ఉన్న ధౌమ్యాచార్యులను చూచి, విదుర సంజయులను పిలిచి 'మీరిద్దరూ భరతవంశీయులకు తప్ప తక్కిన ఏ దిక్కూలేకుండా చనిపోయినవారికి కర్మవిధి ప్రకారంగా దహనకర్మను చేయండి' అని చెప్పి పంపించి, ఆ పనిలో వారికి సహకరించటానికి సూతజనులను, ఆ సమయానికి అక్కడికి వచ్చి ఉన్న హస్తినాపుర జనులలో తగినవారిని గుర్తించి, ముందుగానే తెప్పించి సిద్ధంగా ఉంచిన శ్రీగంధం, అగురుగడ్డి, దర్భలు, పట్టు బట్టలు, కస్తూరి, కుంకుమ, నెయ్యి, నూనె మొదలైన వస్తువులను ఆ ధౌమ్యుడు మొదలైన పెద్దలకు అప్పగించాడు. వారు ఆ సమయానికి అక్కడ చేరి ఉన్న బ్రాహ్మణులను తీసికొని వెళ్ళి దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శల్యాదులకు, అభిమన్యు, ఘటోత్కచ, విరాట, ధృష్టకేతు ప్రముఖులకు తప్ప, తక్కిన ప్రసిద్ధులైన నానారాజులకు పెద్ద పెద్ద కర్రల మోపులతోను, విరిగిన ప్రేతయజ్ఞ క్రియ జరిపించి, మంటలో ఆ శవాలను చేర్చి అనాథలుగా మరణించిన రాజులను వేనకువేలమందిని రాసులుగా ఒకచోట చేర్పించి పెద్ద పెద్ద దుంగలను, కొయ్యలను వారిపై అమర్చి నిప్పుపెట్టారు. అపుడు ఒకపక్క ఋగ్వేదం, యజుర్వేదం చదువుతున్న శబ్దాలు, సామవేదం పాడుతున్న నాదం, ఆడవారి ఏడుపులు అన్నీ కలిసి ఆకాశమనే గుహ మారుమోగిపోయింది. పొగతో దిక్కులన్నీ నిండిపోయాయి. ప్రాణాలతో ఉన్న జీవరాసులన్నిటికీ మిక్కిలి శోకం పుట్టింది. ఆ రీతిగా వారు ప్రేతకర్మ విధిని నడిపించారు.

విశేషం: భరతవంశీయులకు పాండవులు ఉత్తర క్రియలు జరిపారు. ధృతరాష్ట్ర సహితంగా ధర్మరాజు సోదరులతో కలిసి ఈ క్రియ నిర్వర్తించాడు.ఇది ప్రేతకర్మలో ధర్మవిధి.

కాని, భారతయుద్ధంలో చనిపోయిన అన్ని లక్షలమందికి ఉత్తరక్రియలు ఎట్లా జరిపారన్న సందేహం వస్తుంది. 'అనాథ ప్రేతలుగా' వారిని పరిగణించి వారికి ఉత్తర క్రియలు ఎవరైనా చేయవచ్చునని వ్యాసుడు పరిష్కారం చూపాడు. విదురుడు, సంజయుడు, ఆ నగరవాసులు, అప్పటికి అక్కడున్న బ్రాహ్మణులు ఈ పనిచేశారట. అందుకే భారతాన్ని 'ధర్మశాస్త్ర' మంటారు.

కుంతి ధర్మజునకుఁ గర్ణుండు దన కొడు కగుట దెలుపుట (సం. 11-27-1)

సీ. భూవర! కురువంశ పుంగవుం డగు ధర్మ । తనయుండు ధృతరాష్ట్రు వినయ మొప్ప
మున్నిడుకొని యాఁడు మొత్తంబుఁ దోడ్కొని । బంధు జనంబులు బలసి రాఁగ
నరిగి గంగాస్నాన మాచరించి తిలోద । క ప్రదానము సర్వకౌరవులకు
నయ్యాంబికేయుండు నక్కురుభార్యలు । ననుజులుఁ దానును నధిక నిష్ఠఁ

ఆ. చేసి రతనికడకు నా సమయంబున । నడలు నెమ్మనమున నడరి క్రమ్ము
కన్నునీరు మొగము గప్పంగఁ జని కుంతి । యెల్లవారు వినఁగ నిట్టు లనియె 174

ప్రతిపదార్థం: భూవర!= ఓ జనమేజయ మహారాజా!; కురువంశ= కురువంశంలో; పుంగవుండు+అగు= శ్రేష్ఠుడైన; ధర్మతనయుండు= ధర్మరాజు; వినయము+ఒప్పన్= వినయంతో; ధృతరాష్ట్రున్= ధృతరాష్ట్ర మహారాజును; మున్ను+ఇడుకొని= ముందుగా ఉంచుకొని; ఆఁడుమొత్తంబున్+తోడ్కొని= స్త్రీ జనాన్ని పిలుచుకొని; బంధుజనంబులు+బలిసిరాఁగన్= బంధువులందరూ వెంటరాగా; అరిగి= వెళ్ళి; గంగాస్నానమాచరించి= నదిలో స్నానం చేసి; సర్వకౌరవులకున్= కౌరవులందరికీ; ఆ+ఆంబికేయుండు= ఆ ధృతరాష్ట్రుడు; ఆ+కురుభార్యలు= కురుకుమారుల భార్యలు; అనుజులున్= తమ్ములు; తానును= తానూ; నిష్ఠన్= నిష్ఠతో; తిలోదక ప్రదానము+చేసిరి= తిలోదకా లిచ్చారు; అతని కడకున్= ఆ ధర్మరాజు దగ్గరకు; ఆ సమయంబునన్= అప్పుడు; అడలు= దుఃఖిస్తున్న; నెమ్మనమునన్= నిండుమనసుతో; అడరి= అదేపనిగా; క్రమ్ము= క్రమ్ముకొంటున్న; కన్నునీరు= కంటినీరు; మొగము+కప్పంగన్= ముఖంమీద తెరలాగ కప్పుతుండగా; కుంతి= కుంతీదేవి; చని= వెళ్ళి; ఎల్లవారు= అక్కడచేరిన వారంతా; వినఁగన్= వింటుండగా; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! అప్పుడు ధర్మరాజు ధృతరాష్ట్ర మహారాజును ఎంతో వినయవిధేయతలతో ముందుగా ఉంచుకొన్నవాడై (అంటే ధృతరాష్ట్రుడు ముందు నడుస్తుండగా); కౌరవస్త్రీ జన సమూహాన్ని పిలుచుకొని, బంధుజనులంతా వెంట తరలిరాగా నదికి వెళ్ళాడు. అందరూ స్నానాలు చేశారు. యుద్ధంలో మరణించిన కౌరవులందరికీ ధృతరాష్ట్రుడు, కురుకుమారుల భార్యలు, తాను, తన తమ్ములు అత్యధిక శ్రద్ధతో తిలోదకాలు ఇచ్చారు. ఆ సమయంలో ధర్మరాజు దగ్గరకు కుంతీదేవి వచ్చింది. ఆమె మనసంతా దుఃఖంతో నిండిపోయి అదే పనిగా కమ్ముకొని వస్తున్న కంటినీరు మొగంమీద తెరవలె కప్పుకొంటుండగా అందరూ వింటుండగా ఆమె ధర్మరాజుతో ఇట్లా అన్నది:

తరలము.

'వినుము! కౌరవ కోటికిం దన విల్లు పెట్టనికోటగా
నని యొనర్చి, భవద్బలంబుల నన్నిటిన్ మిము నేవురం
దనిపి, యంబరచారులెల్లను దన్ను మెచ్చి నుతింపఁ బా
ర్థునిమహాస్త్రము బల్విడిం దలఁ ద్రుంపఁ గూలిన కర్ణునిన్. 175

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! వినుము; కౌరవకోటికిన్= కౌరవసమూహానికి; తనవిల్లు= తన విల్లు; పెట్టనికోటగాన్= పెట్టనటువంటి కోటలాగ; అని+ఒనర్చి= యుద్ధంచేసి; భవత్+బలంబులన్= నీ సైన్యాన్ని; అన్నిటిన్= అంతటినీ; మిమున్+ఏవురన్= మీ ఐదుగురినీ; తనిపి= తృప్తులయ్యేటట్లు చేసి; అంబర= ఆకాశ; చారులు= గమనం కల్గిన దేవతలందరూ;

తన్నున్ మెచ్చి నుతింపన్= తన్ను ప్రశంసించి ప్రస్తుతిస్తుండగా; పార్థుని= అర్జునుడి; మహాస్త్రము= గొప్ప అస్త్రం; బల్విడిన్= పరాక్రమంతో; తలన్+త్రుంపన్= తలను తుంచగా; కూలిన= చనిపోయిన; కర్ణునిన్= కర్ణుడిని.

తాత్పర్యం: 'ధర్మరాజా! వినుము. కౌరవ సమూహానికి తన విల్లును పెట్టని కోటవలె నిలిపి యుద్ధం చేసి, మీ సైన్యానికీ మీ ఐదుగురికీ యుద్ధక్రీడలో అసామాన్యుడనే తృప్తిని కల్గించి, దేవతలు కూడా తన పరాక్రమాన్ని ప్రశంసిస్తుండగా అర్జునుడి మహాస్త్రం అతివేగంగా తలను తుంచివేయగా నేలకూలిన కర్ణుడిని. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: పద్యలక్షణానికి చూడండి. స్త్రీ. 2. 94.

క. జనులెల్లను రాధేయుం । డనుటను మీరలును వాని నట్టుల కా నె
మ్మనమునఁ దలంతు రటుగా । దనఘ! మదీయాత్మజన్ముఁ డాతం డరయన్. 176

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; జనులు+ఎల్లనున్= జనులంతా; రాధేయుండు+అనుటను= రాధేయుడు అంటూ రావటం వలన; మీరలును= మీరుకూడా; వానిన్= అతడిని; అట్టులకాన్= అలాగే; నెమ్మనమునన్= మనసుల్లో; తలఁతురు= ఊహించారు; అటుగాదు= అది సత్యంకాదు; ఆతండు= ఆ కర్ణుడు; అరయన్= బాగా గుర్తిస్తే; మదీయ= నా; ఆత్మ జన్ముఁడు= కుమారుడే.

తాత్పర్యం: పుణ్యాత్ముడా! జనులంతా అతడిని రాధేయుడు అంటూ రావటం వలన మీరుకూడా రాధ కుమారుడనే ఇంతకాలమూ మీ మనసులలో భావిస్తూ వచ్చారు. కాని, అది సత్యం కాదు. ఆ కర్ణుడు నిజానికి నా కుమారుడేనయ్యా!

ఆ. మీకు నగ్రజుండు నాకు భాస్కరు దయ । లలితకవచకుండలములతోడఁ
బుట్టినాఁడు గానఁ బోయంగ వలయుఁ ది । లోదకంబు లమ్మహోన్నతునకు'. 177

ప్రతిపదార్థం: మీకున్+అగ్రజుండు= మీ ఐదుగురికీ ఆయన అన్నగారు; నాకు; భాస్కరుదయన్= సూర్యుని వరంతో; లలిత= అందమైన; కవచకుండలములతోడన్= కవచకుండలాలతో; పుట్టినాఁడు= పుట్టాడు; కానన్= కాబట్టి; ఆ+ మహోన్నతునకున్= ఆ గొప్పవాడికి; తిలోదకంబులన్= నువ్వులు, నీళ్ళు; పోయంగవలయున్= ప్రదానం వేయాలి (ఇవ్వాలి).

తాత్పర్యం: మీ ఐదుగురికీ ఆయన అన్నగారు. సూర్యుడి వరప్రసాదంగా నాకు సుందరమైన కవచకుండలాలతో పుట్టాడు. అందువలన ఆ మహానుభావుడికి తిలోదకప్రదానం మీరు చేయాలి.'

వ. అని తదీయ జన్మప్రకారంబును దివాకరుప్రసాద ప్రభావంబును జెప్పుటయు దుస్సహంబు లగు నమ్మాటలు చెవులు సూఁడినట్లయినఁ బాండవులు పరమదుఃఖావేశంబు నొంది రందు భీమాదులు నివ్వెఱపడియుండ ధర్మనందనుండు దల్లడిల్లుచుం దల్లితో నిట్లనియె. 178

ప్రతిపదార్థం: అని= అనిచెప్పి; తదీయ= ఆ కర్ణుని; జన్మప్రకారంబునున్= పుట్టిన తీరును; దివాకరు= సూర్యుడి; ప్రసాదప్రభావంబునున్= వరప్రభావాన్ని; చెప్పుటయున్= చెప్పగా; దుస్సహంబులు+అగున్= భరించడానికి; వీలులేని; ఆ+మాటలు= ఆ కుంతీదేవి మాటలు; చెవులు+చూడిఁనట్లు+అయినన్= చెవులు కాల్చినట్టుకాగా(మిక్కిలి బాధించగా); పాండవులు; పరమ

దుఃఖ+ఆవేశంబున్+ఒందిరి= మిక్కిలి దుఃఖం పొందారు; అందున్= వారిలో; భీమ+ఆదులు= భీముడు మొదలైనవారు; నివ్వెఱపడి+ఉండన్= ఆశ్చర్యంతో నిశ్చేష్టులై ఉండగా; ధర్మనందనుండు= ధర్మరాజు; తల్లడిల్లుచున్= తల్లడిల్లుతూ; తల్లితోన్= తమ తల్లితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: అని చెప్పి కుంతీదేవి ఆ కర్ణుడు పుట్టినతీరునూ, సూర్యుడి దివ్యవర ప్రభావాన్నీ వివరించగా ఆ కుంతీదేవి పలుకులు భరింపరానివై చెవులు కాల్చగా పాండవులు దారుణమైన దుఃఖం పొందారు. వారిలో భీమాదులు ఆశ్చర్యంతో నిశ్చేష్టులైపోగా ధర్మరాజు తల్లడిల్లిపోతూ తమతల్లితో ఇట్లా అన్నాడు:

సీ. **'అనిలజార్జునుల మార్కొని నేర్చె నెవ్వని । యుత్సాహమూఁది సుయోధనుండు,**
వైదేహ పౌండ్రాది వసుధేశులెవ్వని । కడిమి సొంపున కరిగాఁపులైరి,
మనసైన్యకోటి యెవ్వని బాహువీర్య సం । పద కోడి యంతంత నొదుఁగుచుండు,
నద్భుతం బొనరించె నమరుల కెవ్వని । యసమాన వివిధ దివ్యాస్త్ర మహిమ.

తే. **మమ్మునందఱ నెవ్వని మహితశక్తి । యెక్కుడై సంగరంబునఁ జిక్కుపఱిచె,**
నట్టికర్ణునిఁ గొంగున నగ్ని డాఁచి । నట్టు లెమ్మెయి డాఁచితో యమ్మ! చెపుమ. 179

ప్రతిపదార్థం: అనిలజ= వాయుకుమారుడైన భీముడిని; అర్జునులన్= అర్జునులను (అంటే భీమార్జునులను); ఎవ్వని= ఎవ్వడియొక్క; ఉత్సాహము+ఊఁది= ఉత్సాహాన్ని ఆసరాగాకొని; సుయోధనుండు= దుర్యోధనుడు; మార్కొనన్+నేర్చెన్= ఎదిరించటానికి సమర్థుడయ్యాడో; వైదేహ= విదేహరాజు; పౌండ్ర+ఆది+వసుధేశులు= పౌండ్రక మొదలైన రాజులు; ఎవ్వని= ఎవ్వడియొక్క; కడిమి= పరాక్రమం; సొంపునన్= వైభవంచేత; అరిగాఁపులు+ఐరి= పన్ను చెల్లించే సామంతరాజులయ్యారో; మనసైన్యకోటి= మన పాండవసైన్యం; ఎవ్వరి= ఎవ్వడియొక్క; బాహువీర్యసంపదకున్+ఓడి= బాహుబల సంపదముందు ఓడి; అంతంతన్= క్రమంగా; ఒదుఁగుచుండున్= అణిగి ఉంటూ వచ్చిందో; ఎవ్వని= ఎవ్వడియొక్క; అసమాన= నిరుపమానమైన; వివిధ= అనేక; దివ్య+అస్త్రమహిమ= దివ్యాలైన అస్త్రాల వైభవం; అమరులకున్= దేవతలకు కూడా; అద్భుతంబు+ఒనరించెన్= ఆశ్చర్యాన్ని కలిగించిందో; మమ్మున్+అందఱన్= మమ్ములను అందరినీ; ఎవ్వని= ఎవ్వడియొక్క; మహితశక్తి= గొప్పశక్తి; ఎక్కుడు+ఐ= అధికమై; సంగరంబునన్= యుద్ధంలో; చిక్కు+పఱిచెన్= ఇబ్బందిపెట్టిందో; అట్టి= అలాంటి; కర్ణునిన్= మహావీరుడు కర్ణుడిని; కొంగునన్= కొంగులో; అగ్నిడాఁచి+అట్టులు= నిప్పును దాచిపెట్టినట్లు; ఎమ్మెయిన్= ఎలా; డాఁచితో!= దాచిపెట్టావో!; అమ్మ!= అమ్మా!; చెపుమ= చెప్పుము.

తాత్పర్యం: 'భీమార్జునులవంటి అసమానవీరులను ఎవడి ఉత్సాహాన్ని ఆసరాగాకొని దుర్యోధనుడు ఎదుర్కొనటానికి సమర్థుడయ్యాడో, విదేహపౌండ్రాదులైన చిన్న చిన్న రాజులు ఎవడి పరాక్రమ వైభవంచేత కప్పాలు చెల్లించగలిగిన సామంతులయ్యారో, మన పాండవసైన్యం ఎవడి బాహుబలసంపదముందు ఓడి అక్కడి కక్కడ అణగి ఉంటూ వచ్చిందో, ఎవడి నిరుపమానమైన దివ్యాస్త్ర సంపద దేవతలకు కూడా ఆశ్చర్యాన్ని కల్గించిందో, మమ్ములను అందరినీ ఎవడి మహాశక్తి అతిశయించి యుద్ధంలో చికాకు కలిగించిందో - అట్లాంటి కర్ణుడిని కొంగులో నిప్పును దాచిపెట్టినట్టు ఎట్లా దాచిపెట్టావమ్మా! చెప్పుము.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. అర్జునుఁ డొకరుఁడు దక్క ను । పార్జితశౌర్యమున నమ్మహాబాహుని వి
స్ఫూర్జితరథమున కెదురై । గర్జిల్లఁగ రథికుఁ డెందుఁ గలుగునె జననీ! 180

ప్రతిపదార్థం: జననీ!= అమ్మా! అర్జునుఁడు ఒకరుఁడు+తక్కన్= అర్జునుడు ఒకడుతప్ప; ఉపార్జిత= సంపాదింపబడిన; శౌర్యమునన్= పరాక్రమంతో; ఆ+మహాబాహుని= ఆ మహావిక్రముడైన కర్ణుడి; విస్ఫూర్జిత= మిక్కిలి ప్రకాశించేటువంటి; రథమునకున్= రథానికి; ఎదురు+ఐ= ఎదురుపడి; గర్జిల్లగన్= గర్జించటానికి; రథికుఁడు= రథంమీద ఉండి యుద్ధం చేసే వీరుడు; ఎందున్= ఎక్కడైనా; కలుగునె?= ఉన్నాడా?

తాత్పర్యం: అమ్మా! అర్జునుడు ఒకడు తప్ప సంపాదించిన పరాక్రమంతో ఆ మహావిక్రముడైన కర్ణుడి దివ్యప్రకాశమున్న రథానికి ఎదురుపడి గర్జించగల యోధు డెవడున్నాడు చెప్పుము!

తే. కర్ణుఁ దొలుచూలుగా నేల కంటి తల్లి? నీదుమంత్రంబు పరమ విషాదకారి
యయ్యెఁ మాకెల్ల నట్టి మహాబలైక । గమ్యు బ్రుంగుడుపఱుచుట కారణమున. 181

ప్రతిపదార్థం: కర్ణున్= కర్ణుడిని; తొలుచూలుగాన్= తొలికాన్పుగా; ఏలకంటి తల్లి?= ఎందుకు కన్నావమ్మా?; నీదుమంత్రంబు= నీవు నేర్చుకున్న మంత్రం; మాకున్+ఎల్లన్= మా కందరికీ; అట్టి= అట్లాంటి; మహాబల+ఏక+గమ్యున్= అద్వితీయమైన మహాపరాక్రమవంతుడిని; బ్రుంగుడుపఱుచుట కారణమునన్= చంపటంవలన; పరమవిషాదకారి+అయ్యెన్= గొప్పశోకాన్ని కల్గించినదయినది.

తాత్పర్యం: తొలిచూలుగా కర్ణుడిని ఎందుకు కన్నావమ్మా? అట్లాంటి అద్వితీయ మహాపరాక్రమవంతుడిని చంపటం వలన నీవు నేర్చిన మంత్రం మా అందరికీ గొప్ప శోకాన్నే తెచ్చిపెట్టింది.

తరువోజ:

భానుపుత్రుని చావు బంధులనెల్లఁ బరమసంతాపంబు పాల్పడఁజేసె
మానితబలుఁ డభిమన్యుండు పోర మడిసినప్పడు నిట్టి మఱకువ నాత్మ
మానదు ద్రౌపదేయుల నాశమునకు నుడుక దివ్విధమున నుల్లంబు ద్రుపద
సూనులు ధృతరాష్ట్రసుతులును ద్రుంగుచొప్పున కిమ్మెయిఁ జొర దడల్ చాల. 182

ప్రతిపదార్థం: భానుపుత్రుని= సూర్యపుత్రుడైన కర్ణుడి; చావు= మరణం; బంధులన్+ఎల్లన్= బంధువులందరినీ; పరమ= మిక్కిలి; సంతాపంబు= దుఃఖం; పాల్పడన్+చేసెన్= పాల్పడచేసినది; మానిత= ప్రఖ్యాతమైన; బలుఁడు= బలంగలవాడైన; అభిమన్యుండు= అభిమన్యుడు; పోరన్= యుద్ధంలో; మడిసినప్పుడున్= చనిపోయినప్పుడుకూడా; ఇట్టి; మఱకువ= విస్మృతి (నిశ్చేష్టత); ఆత్మము= మనసు; ఆనదు= పొందదు; ద్రౌపదేయుల= ద్రౌపదికుమారులైన ఉపపాండవుల; నాశమునకున్= నాశనానికి కూడా; ఉల్లంబు= హృదయం; ఈ+విధమునన్= ఈ రీతిగా; ఉడుకదు= తపింపలేదు; ద్రుపదసూనులు= ద్రుపదరాజు కొడుకులు; ధృతరాష్ట్ర సుతులును= కురు కుమారులు; త్రుంగు చొప్పునకున్= చనిపోయిన రీతికికూడా; ఈ+మెయిన్= ఈ రీతిగా; చాల+అడల్= మిక్కిలి దుఃఖాన్ని; చొరదు= పొందలేదు.

తాత్పర్యం: అమ్మా! సూర్యకుమారుడైన కర్ణుడి మరణం బంధువులందరినీ మిక్కిలిగా దుఃఖంపాలు చేసింది. ప్రఖ్యాతబలుడు అభిమన్యుడు చనిపోయినప్పుడు కూడా ఇంత విస్మృతిని మనసు పొందలేదు. ఉపపాండవులు

గతించినప్పుడు కూడా హృదయ మింత ఉడికిపోలేదు. ద్రుపదుడి కుమారులు, కురుకుమారులు చనిపోయిన తీరుకు కూడా హృదయాలు ఇంతగా దుఃఖాన్ని పొందలేదు. (కర్ణుడి మరణం అంతగా క్రుంగదీసిందని అర్థం).

విశేషం: వృత్తలక్షణానికి చూడుడు - స్త్రీ. 1. 43.

ఆ. అతఁడు మాకు నన్న యని మున్న యెఱుఁగంగఁ । గన్నఁ గురుబలంబుఁ గలఁగఁబడక
మనుదు మట్టులైన మనుజలోకమునకుఁ । గలుగ దడలు మాకుఁ గలుగ దడలు.' 183

ప్రతిపదార్థం: అతఁడు= కర్ణుడు; మాకున్+అన్న+అని= మాకు అన్న అనేటువంటి విషయం; మున్న+అ= ముందే; ఎఱుఁగంగన్+కన్నన్= తెలిసికొని ఉంటే; కురుబలంబు= కురుసైన్యం; కలఁగన్+పడక+మనుదుము= వ్యాకులం చెందకుండా ఎట్లా మెలగాలో అట్లా మెలిగేవాళ్ళం; అట్టులు+ఐనన్= అట్లా అయి ఉంటే; మనుజలోకమునకున్= మానవలోకానికే; అడలు= దుఃఖం; కలుగదు= కల్గేదికాదు; మాకున్= మాకుకూడా; అడలు= దుఃఖం; కలుగదు= ఉండేది కాదు.

తాత్పర్యం: కర్ణుడు మాకు అన్న అనే విషయం ముందుగానే తెలిసి ఉంటే కురుకుమారులు, వారి సైన్యం వ్యాకులం చెందకుండా ఎట్లా మసలుకొనాలో అట్లా మెలిగేవాళ్ళం. అట్లా అయి ఉంటే మానవలోకానికే ఏ దుఃఖమూ కలిగేది కాదు.'

వ. అని విలాపంబు సేసి విషాదశిథిలవర్ణంబులతో గోత్రనామంబు లుగ్గడించుచు నమ్మార్తాండనందనునకుం దిలోకప్రదానంబు సేసెఁ; దదనంతరంబ భీమార్జున నకుల సహదేవులుం జేసి రట్లు కర్ణుండు పాండవాగ్రజుం డగుట యెఱింగి గురువధూజనంబు లార్తనాదంబు లెసంగ నాక్రందించిరి; ధృతరాష్ట్రుండును గాంధారీ కుంతీ పూర్వకంబుగా నతనికి నుదకకర్మం బాచరించె; నయ్యజాతశత్రుండా దినేశపుత్రునివలని సౌభ్రాత్రంబువలనఁ బరిచారికాసమేతంబుగాఁ దద్భార్యల రావించి గారవించి యతనికై యనేక విధ పుణ్యకర్మంబులు భూరిదక్షిణంబులుగాఁ ననుష్ఠించి కృతకృత్యతానందంబు నొంది సకలబంధుసహితంబుగా గంగాసముత్తరణం బాచరించె - నని యిట్లఖిలజనాభినందితుండగు ధర్మనందనుండు గర్ణుం దమయన్న యని యెఱింగిన తెఱంగు వైశంపాయనుండు జనమేజయున కెఱింగించిన నజ్జనపతి 'కురువంశ్యుండగు నయ్యుధిష్ఠిరువర్తనం బటమీఁద నెట్లు సెల్లె?'నని యడుగుటయు. 184

ప్రతిపదార్థం: అని విలాపంబు+చేసి= అని ఏడ్చి; విషాద= శోకం వలన; శిథిల= వణకువల్ల జారిపోతున్న; వర్ణంబులలోన్= అక్షరాలతో; గోత్రనామంబులు= గోత్రంపేరు, పూర్వికుల పేర్లు, చనిపోయినవానిపేర్లు; ఉగ్గడించుచున్= పలుకుతూ; ఆ+మార్తాండనందనునకున్= ఆ సూర్యకుమారుడైన కర్ణుడికి; తిలోదక ప్రదానంబు+చేసెన్= నువ్వులు, నీళ్ళు వదలిపెట్టాడు (తిలతర్పణం చేశాడు); తద్+అనంతరంబ= ఆ తరువాత; భీమ, అర్జున, నకుల, సహదేవులున్= అతడి తమ్ముళ్ళూ; చేసిరి= అట్లాగే చేశారు; కర్ణుండు; పాండవ+అగ్రజుండు+అనుట= పాండవుల అన్న అనే విషయం; ఎఱింగి= తెలిసి; కురువధూజనంబులు= కురుకుమారుల భార్యలు; ఆర్తనాదంబులు+ఎసంగన్= ఆర్తనాదాలు అతిశయించగా; ఆక్రందించిరి= ఏడ్చారు; ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్రుడు కూడా; గాంధారీ, కుంతీ పూర్వకంబుగాన్= గాంధారి; కుంతీదేవులు ముందు చేయగా; అతనికిన్= కర్ణుడికి; ఉదకకర్మంబు= ధర్మోదక ప్రదానం; ఆచరించెన్= చేశాడు; ఆ+అజాతశత్రుండు= ఆ ధర్మరాజు; ఆ+దినేశపుత్రుని వలని= ఆ కర్ణుడిపట్ల ఉన్న; సౌభ్రాత్రంబు వలన్= సోదరభావం వలన; పరిచారికా సమేతంబుగాన్=

పరిచారికలతో సహా; తద్+భార్యలన్+రావించి= అతడి భార్యలను రప్పించి; గారవించి= గౌరవించి; అతనికై= కర్ణుడికోసం; అనేకవిధ= వివిధాలైన; పుణ్యకర్మంబులు= పుణ్యకర్మలను; భూరి దక్షిణంబులుగాన్= అధికమైన దక్షిణలతో; అనుష్ఠించి=చేసి; కృతకృత్యతా+ఆనందంబున్+ఒంది= విధిని పూర్తి చేశానన్న తృప్తిని పొంది; సకల బంధు సహితంబుగాన్= బంధువులందరితో కలిసి; గంగా సముత్తరణంబున్+కావించెన్+అని= గంగానదిని దాటాడని; ఇట్లు= ఈ విధంగా; అఖిలజన= జనులందరిచేత; అభినందితుండు+అగు= మెచ్చుకోబడిన; ధర్మనందనుండు= ధర్మరాజు; కర్ణున్= కర్ణుడిని; తమ అన్నయని= తమ అన్న అని; ఎఱింగిన తెఱంగు= తెలిసికొన్న విధం; వైశంపాయనుండు= వైశంపాయనుడు; జనమేజయునకున్= జనమేజయుడికి; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+జనపతి= జనమేజయుడు; కురువంశ్యుండగు= కురువంశీయుడైన; ఆ+యుధిష్ఠిరు వర్తనంబు= ఆ యుధిష్ఠిరుడి నడవడి; మీఁదన్= తరువాత; ఎట్లు+చెల్లెనని= ఎట్లా జరిగిందని; అడుగుటయున్= అడుగగా.

తాత్పర్యం: అని ఏడ్చి, ధర్మరాజు దుఃఖం వలన వణకుతున్న కంఠంతో జారిపోతున్న అక్షరాలతో గోత్రనామాదులను ఉచ్చరిస్తూ కర్ణుడికి తిలోదకాలు వదలిపెట్టాడు. ఆ తరువాత భీమార్జున నకుల సహదేవులు కూడా అట్లాగే చేశారు. కర్ణుడు పాండవుల అన్న అని తెలిసి కురుకుమారుల భార్యలు ఆర్తనాదాలు చేస్తూ ఏడ్చారు. ధృతరాష్ట్రుడు గాంధారి కుంతీదేవులతో కలిసి ధర్మోదకాలు సమర్పించాడు. ధర్మరాజు ఆ కర్ణుడిపట్ల ఉన్న సోదరభావం వలన పరిచారికలతో సహా అతడి భార్యలను రప్పించి, గౌరవించి, కర్ణుడికోసం అనేక పుణ్యకర్మలను అధికమైన దక్షిణలతో చేసి, విధిని పూర్తి చేశానన్న తృప్తిని పొంది, బంధువులతో కలిసి గంగానదిని దాటాడని - ఈ విధంగా జనులందరి చేత ప్రశంసించబడిన ధర్మరాజు కర్ణుడిని తమ అన్న అని తెలిసికొన్న విధం వైశంపాయనుడు జనమేజయుడికి తెలిపాడు. అప్పుడు జనమేజయుడు వైశంపాయనుడిని 'అయ్యా! ఆ తరువాత ధర్మరాజు ఏమి చేశాడు' అని అడిగాడు.

ఆశ్వాసాంతము

మందాక్రాంతము.

వీణానాద ప్రతిమ నిగమావిర్భవత్సార పుణ్య
శ్రేణీ సంపాదిత విమలతాస్థేమ నిర్లేపచిత్త
త్రాణక్రీడాకలన సతతోత్సాహ వద్దివ్యభావా!
ప్రాణాపానాహరణ నిపుణ ప్రాపణీయానుభావా! **185**

ప్రతిపదార్థం: వీణానాద= వల్లకీ ధ్వనులతో; ప్రతిమ= సమానమైన; నిగమ= వేదపాఠం చేయటం వలన; పుట్టేనాదంతో; ఆవిర్భవత్= పుట్టుతున్న; సారపుణ్య= సారభూతమైన పుణ్యుల; శ్రేణీ= వరుసలచేత; సంపాదిత= సమకూర్చబడిన; విమలతా= నైర్మల్యం; స్థేమ= స్థిరత్వం కల్గిన; నిర్లేప= ఆసక్తతలేని; చిత్త= మనస్సుకలవారిని; త్రాణ= రక్షించడమనేటువంటి; క్రీడా= విలాసంతో; కలన= ఒప్పుచున్న; సతత= నిరంతర; ఉత్సాహవత్= ఉత్సాహం కల్గిన; దివ్యభావా!= ప్రకాశించే హృదయం కలవాడా!; ప్రాణ= ప్రాణమూ; అపాన= అపానమూ అనే ప్రాణవృత్తుల; ఆహరణ= కూడికచేత; నిపుణ= నైపుణ్యంతో; ప్రాపణీయ= పొందించబడదగినటువంటి; అనుభావా= ప్రభావం కల్గినవాడా!

తాత్పర్యం: వీణవలె మనోహరమైన వేదనాదాన్ని అర్థభావన చేస్తూ నిరంతరం అభ్యసించే పుణ్యాత్ములకు కలిగేటటువంటి అసంగచిత్త, స్థైర్యాది ఉత్తమగుణాలను నీవే రక్షిస్తావు. ప్రాణాపానాది వాయువృత్తి నిరోధక రూపమైన యోగాభ్యాసంవలన మహాయోగులు నిన్నే పొందుతారు. అట్లాంటి దివ్య ప్రభావం కల్గిన నీకు నమస్కారం.

విశేషం: హరిహరనాథస్వామిని ఇక్కడ యోగస్వరూపుడిగా వర్ణించటాన్ని మనం గమనించవచ్చును. వీణ -శరీరానికి ప్రతీకగా కల్పించబడిన దివ్యవాద్యమని సంగీతజ్ఞులు చెబుతారు. వీణాదండమే మేరుదండం. నాడులే నాదతంత్రులు. కనుక వీణానాద సాధన మహాయోగంగా వివరించబడింది. మహర్షులుకూడా వీణాసాధన చేసేవారని ప్రతీతి. కారణం నాదోపాసనవలన కలిగేది నిర్వికారమైన ప్రశాంత చిత్తం. వేదనాదోపాసనకు కూడా అదే ప్రయోజనం కాబట్టి ఈ పోలిక సమంజసం. నిర్వికారతకు ఫలితమే అసంగచిత్తం. అంటే ఎందులోనూ మునిగిపోనిదని అర్థం. తామరాకుమీద నీటిబొట్టువలె తటస్థంగా ఉండే చిత్తమని అర్థం. స్థేమమంటే స్థిరమని అర్థం. ఉపాసకుడు అసంగధర్మాన్ని అలవరచుకొన్నా సులభంగా లభ్యంకానిది స్థిరత్వం. దానిని కూడా ప్రసాదించేవాడు భగవంతుడు మాత్రమేనని అర్థం. అందుకే భగవద్గీతలో స్వామి 'యోగక్షేమం వహామ్యహం' అని ఆనతి ఇచ్చాడు. యోగమంటే అసంగచిత్త పరిపాకమనే అర్థం. క్షేమమంటే స్థిరమైన అంతరంగమనే పరమార్థం.

ఇక ప్రాణాపానాదుల విషయం స్థానంగా కల్గినది ప్రాణం. గుదస్థానీయమైనది అపానం. ప్రాణాపాన సమాయుక్తుడుగానే భగవంతుడు చతుర్విధాలైన భక్ష్య భోజ్య లేహ్య చోష్యములనే ఆహార పదార్థాలను జీర్ణం చేస్తున్నాడని భగవద్గీత చెబుతున్నది. ప్రాణయామం అంటే ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం - ఇత్యాదిగా ఉన్న ప్రాణవృత్తులను నియమించటం అని అర్థం (నియమించటమంటే నిగ్రహించటమని భావం). యోగమంటే ఈ నిరోధం ద్వారా ఏర్పడేటటువంటి చిత్తవృత్తి సంయమనమని అర్థం. దానిద్వారా కలిగేదే పరమేశ్వరానుగ్రహమని యోగశాస్త్రం చెప్పుతున్నది. యోగతత్త్వోపనిషత్తులవంటి గ్రంథాలలో ఈ ప్రక్రియ వివరించబడింది.

ఇట్లా ప్రాణాపానాదులను సంయమనం చేయటం వలన తొలుత దూరశ్రవణ, దూరదర్శన, దూరగమన, కామరూపత్వ, అదృశ్యకరణి, సువర్ణకరణి - ఇత్యాది కొన్ని సిద్ధులు కలుగుతాయనీ, అల్లాంటి లౌకిక సిద్ధుల విషయంలో అనాసక్తుడై ఎవడు నిరంతర అభ్యసనంతో నిష్ఠను, ఓర్పును అవలంబిస్తాడో ఆ యోగి పరమేశ్వరానుగ్రహం పొందుతాడు. అదే మోక్షం. అందుకే 'నిపుణంగా' (నైపుణ్యంతో అని అర్థం). లౌకకవ్యామోహాదులనుండి బయటపడటానికి నైపుణ్యమవసరం. ఈ అనుగ్రహసిద్ధి సహజంగా వచ్చేది కాదు. బహుప్రయత్న సిద్ధం కాబట్టి 'ప్రాపణీయ' మని తిక్కనగారు సూచిస్తున్నారు.

మందాక్రాంతలో ప్రతి పాదానికీ మ, భ, న, త, త, గ, గ అనే గణాలుంటాయి. 1-11 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

క. త్వంతాహంతా నిరసన! శాంతాంతఃకరణ యోగిజనవిజ్ఞేయా
చింతాసాగరమగ్న। భ్రాంతజనాధ్యేయ! పరమభక్తివిధేయా! 186

ప్రతిపదార్థం: త్వంతా+అహంతా నిరసన!= నీవు, నేను అనే భావాలు లేనివాడా!; శాంత+అంతఃకరణ యోగిజన విజ్ఞేయా!= శాంతమైన అంతఃకరణం కల్గిన ఉత్తమ జ్ఞానయోగుల చేత తెలిసికోదగినవాడా!; చింతాసాగర= చింత అనేటువంటి సముద్రంలో; మగ్న= మునిగి; భ్రాంత= అజ్ఞాన రూప భ్రాంతిని కల్గిన; జన+అధ్యేయ!= జనులకు అధ్యేయుడా! (అట్లాంటి జనులు నిన్ను తెలిసికో లేరని తాత్పర్యం); పరమభక్తి విధేయా!= ఉత్తమ భక్తికి లొంగేటువంటివాడా!

తాత్పర్యం: హరిహరనాథా! నీవు - నేను అనే భావన లేని పరమ శాంత చిత్తవృత్తి గల జ్ఞానయోగులు సమాధిలో నిన్నే తెలిసికొంటారు. సదా సంసార సముద్రంలో మునిగి చింతాభ్రాంతులతో కూడిన జనులు ఎన్నటికీ నిన్ను గుర్తించలేరు. ఉత్తమభక్తి మాత్రమే నిన్ను అందుకొనగలిగిన సులభ సాధనం.

విశేషం: ఈ సృష్టిమొదట ఆత్మ మాత్రమే ఉన్నది. దానికి స్వ- పర భేదం లేదు. సృష్టిక్రమంలో పదార్థ మేర్పడి జీవం అందులో బద్ధమైన తరువాత నీ - నా అనే తేడాలు ఏర్పడ్డాయి. లోకంలోని మనుష్యులను ఈ భావనే వేరుచేస్తున్నది. స్త్రీపర్వంలోని కథనంతా మనసులో తలచుకొంటే గాంధారీ ధృతరాష్ట్రులకు ఈ భావన అందరూ చనిపోయిన తరువాతకూడా పోలేదని తెలుస్తుంది. ధర్మరాజు, విదురుడు, కృష్ణుడు మాట్లాడిన మాటలలో ఈ స్వపరభేదం లేదు. అందుకే చిత్తభ్రాంతి, శోకం, గాంధారీ ధృతరాష్ట్రులకు, తక్కిన కురుకుమారుల భార్యలకు, చివరికి పాండవులకుకూడా ఇవి పోలేదు.

కాని, భగవంతుడు పరమశాంతులకు కాని లభ్యం కాడు. అందుకే భీష్మాది జ్ఞానయోగులకు మాత్రమే అతడి తత్త్వం అవగతమైంది. వారికి చింతాభ్రాంతులు లేవు.

ధర్మరాజు, ఇతర పాండవులు, ద్రౌపది కూడా మామూలు మనుష్యులే, కేవలం భక్తితో శ్రీకృష్ణుడిని విశ్వసించారు. జీవితాన్ని కర్మయోగంగా సాధించారు. ఇక రాబోయే పర్వాలలో యజ్ఞయాగాదులచేత పవిత్రులై, శోక భ్రాంతులను పోగొట్టుకొని, సంయమితేంద్రియులై చివరకు మహాప్రస్థానయోగ్యత పొందారు. వారిలో మిగిలిన స్వర్గారోహణ పర్యంతం 'ధర్మం' చేత నడుపబడినవాడు ధర్మరాజు మాత్రమే. ఈ అర్థమంతా 'పరమభక్తి విధేయా!' అనే సంబోధనలో నిక్షిప్తంగా ఉన్నది.

మాలిని

> **భరిత నియమచేతః పద్మవిజ్ఞాన కేలీ!**
> **పరిమళపరిపాక ప్రౌఢసంపర్కశాలీ!**
> **పరిణతికృతదూష్య ద్భంగి భూతాళిహేలా!**
> **కరణ భృతి జగత్సంస్కర్తృతానందశీలా!** **187**

ప్రతిపదార్థం: భరిత నియమ= నియమాలతో కూడిన; చేత; పద్మ= పద్మంవంటి హృదయంయొక్క; విజ్ఞాన= జ్ఞానంలో; కేలీ!= రమించేవాడా!; పరిమళ= సుగంధంలాంటి; పరిపాక= పుణ్యపరిపాకం ఉన్న వారితో; ప్రౌఢ= దృఢమైన; సంపర్కశాలీ!= సంబంధం కలవాడా!; పరిణతి= పరిణామంచేత; కృత= చేయబడ్డ; దూష్యత్= దూషింపదగిన; భంగి= రీతి కల్గిన; భూతాళి= భూతాల; హేలా= విలాసంకలవాడా!; కరణ= చేయుటం; భృతి= ధరించటం; అనేటువంటి; జగత్= జగత్తుయొక్క; సంస్కర్తృత+ఆనందశీలా!= ప్రపంచ సంస్కారంతో ఆనందించే స్వభావం కల్గినవాడా!

తాత్పర్యం: హరిహరనాథ ప్రభూ! నీవు ఉత్తమ నియమాలను పాటించే సుచరిత్రుల హృదయపద్మాలలోని మహాజ్ఞానంతో రమిస్తావు. నీవు ఎప్పుడూ సుగంధం వంటి పుణ్యపరిపాకం ఉన్నవారితోనే దృఢమైన సంబంధం ఉంటుంది. నిత్యపరిణామం పొందిఅనేకరకాలుగా విచ్ఛిన్నం పొందే ఈ సర్వసృష్టీ నీ విలాసంలో భాగమే. అందుకే జగత్తును సృష్టించి, పెంచి, సంహరించి ఆనందిస్తూ ఉంటావు.

విశేషం: వైదికజీవితం నియమనిష్ఠలతో కూడింది. శుచిత్వం, తుష్టి, సంతోషం, తపస్సు, ఇంద్రియనిగ్రహం, స్నానం, మౌనం, ఉపవాసం, యజ్ఞం, వేదాధ్యయనం, బ్రహ్మచర్యం, క్రోధరాహిత్యం, గురుభక్తి, దానం - అనే 14 నియమాలను స్మృతి గ్రంథాలు వివరిస్తున్నాయి. ఈ నియమాలచేత హృదయంలో జ్ఞానం పాటమరిస్తుంది. ఇది సాత్త్విక జీవితంలో పుట్టే జ్ఞానం కాబట్టి ఉత్తమజ్ఞానమని భగవంతుడు ఈ జ్ఞానంలో ఆసక్తి కలవాడని మొదటి పాదానికి అర్థం.

భగవంతుడు ఎప్పుడూ పుణ్యపరిపాకమున్న ఉత్తమపురుషులలోనే నికటసంబంధం కలిగి ఉంటాడు. భారతకథలో పాండవులతోనే శ్రీకృష్ణుడు జీవితమంతా నడపటంలోని మహార్థ మిదే. చివరకి యుద్ధం పూర్తి అయ్యాక కూడా పాండవులను వెన్నాడి ఉన్నాడు. లేకపోతే భీముడు ధృతరాష్ట్రుడి కౌగిలినుండి తప్పించుకొనేవాడు కాడు. ఆ ఉత్తమపురుషుల స్నేహం 'పరిమళం' వంటిదట. ఆ పరిమళమే మహాభారతంలో మనకు అనుభవమయ్యే శాంతరసానుభవం. ఇది రెండవ పాదానికి అర్థం.

లోకసృష్టి పరిణామంలో దూషణకు పాత్రమవుతుంది. కౌరవుల పక్షంలోని వీరులందరి జీవితాలను స్మరిస్తే పరిణామంలో పంచభూతాత్మక జగత్తు ఎట్లా దిగజారుతుందో తెలుస్తుంది. ఆ భూతాళి యొక్క విలాసం కూడా పరమేశ్వరుడి లీలలో భాగమే. అందుకే భగవద్గీతాకారుడు 'మోసంబులలో ద్యూతము నేనే' అని తన విశ్వవిభూతిని ప్రకటించాడు. ఇది మూడవ పాదానికి అర్థం.

ఇక చివరిపాదం. జగత్తును చేసేవాడు, మోసేవాడు, తీసేవాడు- అన్నీ తానే అని గీతాకారుడు ప్రకటించిన విషయం సుప్రసిద్ధమేకదా! సృష్టి స్థితి లయాలు మూడూ స్వామివారి ఆనందలీల. ప్రతి పనిలోనూ స్వామివారికి ఆనందమే. అందుకే బ్రహ్మసూత్రాలలో 'లోకవత్తు లీలాకైవల్యం' అని బాదరాయణుడు సూత్రించాడు. అందుచేత గాంధారీ ప్రభృతుల శోకరస ప్రవాహంలో కూడా భగవంతుడి లీలా స్రవంతి ఉన్నదని అర్థం. అందుకే తిక్కనగారు అంత రమణీయంగా చిత్రచిత్రగతులలో, వృత్తాలతో స్త్రీ పర్వాన్ని అతిరమణీయంగా రచించారు.

మాలినీవృత్తంలోని ప్రతిచరణంలోనూ వరుసగా న, న, మ, య, య - అనే గణాలుంటాయి, 1-9 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

గద్యము:

ఇది శ్రీమదుభయ కవిమిత్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతంబున స్త్రీపర్వంబునందు సర్వంబును ద్వితీయాశ్వాసము.

తాత్పర్యం: ఉభయ కవిమిత్రుడు, కొమ్మనామాత్యుడి పుత్రుడు, బుధారాధనవిరాజి, తిక్కన సోమయాజి రచించిన శ్రీ మహాభారతంలో స్త్రీపర్వంలో ద్వితీయాశ్వాసం సంపూర్ణం. ఇంతటితో స్త్రీపర్వం సమాప్తం.

స్త్రీపర్వంలోని ద్వితీయాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతంలో స్త్రీపర్వం ముగిసింది.

***

శ్రీమదాంధ్ర మహాభారతము

శల్య పర్వము

గద్య పద్య ప్రథమ పాద సూచి

గ

ఘ

చ

శ్రీమదాంధ్ర మహాభారతము

సౌప్తికపర్వము

గద్య పద్య ప్రథమ పాద సూచి

శ్రీమదాంధ్ర మహాభారతము

స్త్రీ పర్వము

గద్య పద్య ప్రథమ పాద సూచి

***

పీఠిక

★ ★ ★

ఉ. 'నీదెస నాదు చిత్తమున నెక్కొనియుండెడు భక్తి భద్రసం
పాదిని గావు టచ్చెరువె? భక్తజనాభిమత ప్రదాన వి
ద్యాదయితత్వ మేర్పడ జయం బొడఁగూర్పుము దేవ! సంశ్రితాం
హోదళనంబు నీకు వ్రత; ముల్లము నా పయి నిల్పు మిత్తఱిన్.' **(శల్య. 1. 275)**

మహాభారతంలోని యుద్ధషట్కాన్ని రెండు భాగాలుగా విభజించటం సాహిత్య సంప్రదాయం. భీష్మ ద్రోణ కర్ణ పర్వాలు మొదటి భాగం; శల్య సౌప్తిక స్త్రీ పర్వాలు రెండవ భాగం.

"మహాభారతంలో పద్దెనిమిది పర్వాలను ఆదిపంచకం, యుద్ధషట్కం, శాంతిసప్తకం - అని మూడు భాగాలుగా వ్యవహరించే సంప్రదాయం ఒకటుంది. బహుశా ఇది తెలుగుదేశంలో ఏర్పడ్డ సంప్రదాయమే కాబోలు. ఎందుచేతనంటే మహాభారతానికి తెలుగుదేశంలో ఉన్న వ్యాప్తి, ప్రాముఖ్యం మరో ప్రాంతంలో లేదు."

"నన్నయ భావించినట్లు మహాభారత మొక దివ్య వృక్షమైనట్లయితే (ఆది. 1.66) ఆ వృక్షానికి మూలం ఆదిపంచకం; స్కంధం యుద్ధషట్కం; శాఖోపశాఖలు శాంతిసప్తకం - అని వ్యాఖ్యానించవచ్చు. అంటే మహాభారత వృక్షానికి ఆధారం ఆది పంచకం; ఆయువుపట్టు యుద్ధషట్కం; సారం శాంతి సప్తకం. ఆదిపంచకంలోగాని, శాంతిసప్తకంలోగాని పర్వాలపేర్లు వ్యక్తి నామాంకితాలు కావు. స్థల, విషయ, కార్య, తత్త్వాదులను సూచించే పేర్లవి. యుద్ధషట్కంలో భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య పర్వాలు - కౌరవపక్ష సేనానాయక నామాంకితాలు. సౌప్తికపర్వాన్ని వీరనామాంకితంగా చెప్పాలంటే అశ్వత్థామ పర్వంగా చెప్పాలి. కాని, అశ్వత్థామ బ్రాహ్మణోచితం, వీరోచితం కానట్టి అధమాధమ ప్రవర్తనను ప్రదర్శించినందువల్ల అతని పేరును పర్వాంకితం చేయడం అనుచితం. ఇక స్త్రీ పర్వం యుద్ధపంచకానికి ఒక విధమైన సింహావలోకనం. యుద్ధ పరిణామ ఫలమైన శోకం ఇందు మూర్తీభవించింది. విజేతల హృదయాలు నిర్భరమైన నిర్వేదానికి, పశ్చాత్తాపానికి పాల్పడ్డాయి. మానవుని శీలపరీక్షకు, ధర్మనిరతికి, యుక్తా యుక్త విచక్షణకు క్లిష్టపరిస్థితులు ఒక గీటురాయి. అట్టి పరిస్థితుల్లోనే వ్యక్తుల నిజస్వరూపం బయటపడుతుంది. కురుపాండవులకు యుద్ధం అనివార్యంగా పరిణమించినప్పుడు బంధుమిత్రులు, రాజులు, సామంతులు, వీరులు ధర్మాధర్మ నిర్ణయాలు చేసుకొని, లక్ష్యాన్ని నిర్దేశించుకొని కార్యరంగంలోకి ఉరకవలసి వచ్చింది.

కాబట్టే భారతపాత్రల బాహ్యాభ్యంతర ప్రవృత్తులు యుద్ధషట్కంలోనే ప్రస్ఫుటంగా గోచరిస్తాయి''. (ఆచార్య జి.యన్.రెడ్డి - పీఠిక. ఆం.ప్ర. సాహిత్య అకాడమి ప్రచురణ 'ఆంధ్రమహాభారతము. శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు)

1. పర్వత్రయం పగకే అంకితం:

యుద్ధషట్కం షడ్రస సమాహారం. భీష్మపర్వంలో యుద్ధవీరం, ద్రోణపర్వంలో రౌద్రం, కర్ణపర్వంలో అద్భుతం, శల్యపర్వంలో భయానకం, సౌప్తికపర్వంలో బీభత్సం, స్త్రీ పర్వంలో కరుణ ప్రధానంగా ప్రవర్తిల్లుతాయి. పరుషరసాలూ, పరుషరసజన్య రసాలూ పోషించబడే యుద్ధఘట్టాల విశ్వరూపం ఈ పర్వషట్కం. భీష్మ, ద్రోణ, కర్ణులను సంహరించే వీరుడు అర్జునుడు. అందువలన యుద్ధషట్క ప్రథమభాగంలో అర్జున ప్రతాపం కథను ముందుకు నడిపిస్తుంది. ఆ తరువాతి మూడు పర్వాలలో భీమ పరాక్రమం భయంకరంగా సాగుతుంది. ధార్తరాష్ట్రుల నందరిని చంపే భారం భీముడే వహించాడు. దుష్టచతుష్టయంలో దుశ్శాసన దుర్యోధనులు భీముడి పాల పడ్డారు. కర్ణుడిని అర్జునుడు, శకునిని సహదేవుడు చంపారు. శల్యుడు వస్తుతః పాండవ పక్షపాతి. కాని, దుర్యోధనుడి వ్యూహంలో చిక్కి ధర్మజుడిని వదలి కౌరవపక్షంలో చేరవలసి వచ్చింది. అది ధర్మవిరుద్ధమని తెలిసి కూడా ఇచ్చిన మాట నిలబెట్టుకొనటానికి కర్ణ రథసారథ్యంలో ఆ మహావీరుడి మనస్సును కలతపెట్టి పాండవులకు సహాయం చేశాడు. ఇక మిగిలింది దుర్యోధనుడికి సహాయం చేయటమే. అది అతడి కర్తవ్యంగా మిగిలిన వీరధర్మం. పాండవులకు పరోక్షంగా సహాయం చేసి, ప్రత్యక్షంగా యుద్ధానికి సిద్ధమై కౌరవసేనా నాయకుడుగా వ్యూహాన్ని నడిపిన శల్యుడి సంహారం ధర్మరాజుకు మిగిలింది. ఇతిహాస నాయకుడైన ధర్మరాజు చంపిన శల్యుడి పేరుమీద వెలసిన శల్యపర్వం నామసార్థక్యం కలిగి ఉన్నది. భీష్మాది పర్వాలవలెనే శల్యపతనంతో శల్యపర్వం ముగియాలి. కాని, అతడు మధ్యాహ్నానికే చనిపోయాడు. ఆ తరువాత యుద్ధభారాన్ని దుర్యోధనుడే చేపట్టాడు. చివరిదాకా పోరాడాడు. అతడిచుట్టూ ఉన్న వీరులలో ఉలూక శకునులు కన్నుమూశారు. యుద్ధవీరులు అతడిని వీడి పరుగెత్తారు. పదకొండు అక్షౌహిణుల సైన్యం సమసిపోగా దుర్యోధనుడు ఓడినట్లే అయింది. ఆ తరువాత ద్వైపాయన హ్రదంలో దాగినా పాండవు లాతడిని బయటికి రప్పించి ద్వంద్వయుద్ధం ప్రవర్తిల్లచేశారు. భీమ గదాఘాతానికి దుర్యోధనుడు తొడలు విరిగిపడిపోయాడు. కాని, ఈ పర్వంలో చావలేదు. అశ్వత్థామను సైన్యాధ్యక్షుడిగా అభిషేకించి కథను ముందుకు సాగించాడు కాబట్టి శల్యపర్వంలోని పూర్వభాగంలో శల్యపతనం, ఉత్తరభాగంలో దుర్యోధన పతనం చిత్రించబడటం వలన శల్యపర్వానికి ఒక ప్రత్యేకత కలిగింది. రారాజైన దుర్యోధనుడు సేనాధ్యక్షుడు కాడు. కాని, యుద్ధరంగంలో సేనాధ్యక్షుడు లేకపోతే అతడే ఆ బాధ్యత నిర్వహించాలి. చివరకు ఆతడు చేసింది అదే. సేనాధ్యక్షు లెవ్వరూ రణరంగంనుండి పారిపోయి ప్రాణరక్షణం కొరకు పాట్లుపడలేదు. అట్టి దుర్గతి దుర్యోధనుడికి ఏర్పడింది. చనిపోయే ముందు చనిపోని ఒక మహావీరుడిని - అశ్వత్థామను సైన్యాధ్యక్షుడిగా అభిషేకించటం ఈ పర్వ నిర్వహణంలో విశేషం. ప్రాణం విడువనున్న దుర్యోధనుడు తన పగకు ప్రతినిధిగా నిలువగలిగిన అశ్వత్థామకు శత్రుసంహారం కార్యాన్ని ఒప్పచెప్పటం కురుక్షేత్ర యుద్ధానికి కొసమెరుపు. అయితే ఒక విశేషం. భీష్మాదులు దుర్యోధనుడి ప్రార్థనపై సేనానులయ్యారు. అశ్వత్థామ స్వీయప్రార్థనపై సర్వసేనానిగా రారాజుచేత నియుక్తుడయ్యాడు. సర్వసేనానులు సైన్యాన్ని నడిపారు. అశ్వత్థామ రథిక ద్వయ సహాయంతో రాత్రియుద్ధం చేసి రాక్షసత్వాన్ని ప్రకటించాడు.

తమ్ములూ, కొడుకులూ కూలినప్పుడు కూడా బిగ్గరగా దుఃఖించని దుర్యోధనుడు కర్ణుడు చనిపోయాడని ఎలుగెత్తి విలపించాడు. తాను ఒంటరివాడ నయ్యానని భయపడ్డాడు. ఆ రాత్రి శిబిరంలో ఉంటే పాండవులు వచ్చి తననూ, మిగిలినవారినీ చంపివేస్తారేమో అని భయపడి సరస్వతీనదీతీరం చేరి గుడారాలలో రాత్రి గడిపాడు. భీష్మాది వీరులు పడిపోయినప్పుడు కూడా కర్ణుడు తనకు తోడున్నాడనీ, పాండవులపై విజయాన్ని సాధిస్తాడనీ పేరాశతో ఉండేవాడు. కర్ణుడు పోగానే తన ఆశలన్నీ కుప్పగూలినట్లు ఆవేదనపడ్డాడు. కౌరవ సేనకు బలం కర్ణుడు. అతడు లేని దుర్యోధనుడు తాను బలహీనుడనని భావించాడు. బలంలేని దుర్యోధనుడికి పగయే బలంగా పరిణమించింది. కర్ణుడు అతడిలో పగను రగిల్చి చివరకు పగను మిగిల్చాడు. ఇక మిగిలినవారు అతడి పగను మాన్చటానికి పగను బలపరిచారు. శల్య సౌప్తిక పర్వాలలోని కౌరవవీరులు, సేనానాయకులు ఈ బాటలో నడిచారు. అందువలన శల్య పర్వం నుండి పాత్రలవర్తనాలలో ధర్మచింతకంటె

పగయే ప్రధానపాత్ర నిర్వహించింది.

2. 'పగ యడఁగించు టెంతయు శుభంబు':

ఏనాడో ధర్మరాజు శ్రీకృష్ణుడితో చెప్పిన ఈ పద్య తాత్పర్యం ఇక్కడ ప్రవర్తిల్లుతున్నట్లు ప్రత్యక్షమౌతుంది.

చ. 'పగ యడఁగించు టెంతయు శుభం; బది లెస్స; యడంగునే పగం
బగ?; వగగొన్న మార్కొనక పల్కక యుండఁగ వచ్చునే? కడుం
దెగ మొదలెత్తిపోవఁ బగ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు; నే
మిగతి దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు గేశవా!'. **(ఉద్యో. 3. 21)**

శల్య సౌప్తిక స్త్రీ పర్వ నిర్మాణానికి ఈ పద్యం ఒక ప్రణాళికవలె భాసించింది. ధర్మరాజు పలికిన పలుకే సత్యమైనట్లు తారసిల్లింది.

కర్ణుడి మరణంతో యుద్ధం ఆగిపోతుందనీ, దుర్యోధనుడు ధర్మరాజుతో సంధికి అంగీకరిస్తాడనీ, దానితో పగ చల్లారుతుందనీ కౌరవస్కంధావారంలో కూడా కొందరు పెద్దలు భావించారు. కృపాచార్యుడు దుర్యోధనుడికి హితబోధ చేశాడు. సమరనీతి నాశ్రయించి తర్కబద్ధంగా మాట్లాడాడు. ముఖ్యంగా ఆయన చెప్పిన మూడంశాల ముచ్చట విలువైనది.

క. 'సమరము నిష్కారణవై । రమునం బాటిల్లె; నెల్లరాజులు, భరతో
త్తములును మడిసిరి; విడు కో । పము; దీర్ఘక్రోధుఁడైన పతి కీ డొందున్'.

క. 'తమకు బలం బెక్కిన తఱి । సముచిత మగు విగ్రహంబు; శత్రుల కుత్సా
హము మీఱినపుడు గర్త । వ్యము సంధి యనంగ విందు మార్యులచేతన్'.

క. 'కలవారెల్లను దెగి నీ । తలన నిలిచెఁ గార్య మధిప! తగ నొడఁబడు మి
ట్టుల మగునాత్మ వినాశము । కలుగుట యది విపులపాతకం బండ్రు బుధుల్'. **(శల్య. 1. 55-57)**

పగకు మూలం కోపం; కోపాతిశయంతో తనకు బలాధిక్యం ఉన్నది కదా అని రాజు పగరపై దండెత్తటం సహజం. కాని, శత్రువులది పైచేయై, విజయం విఫలమైనప్పుడు కోపాన్ని తగ్గించుకొని, పగను చల్లార్చుకొని సంధిచేయటం శ్రేయస్కరం. దుర్యోధనుడికి అండగా నిలిచిన వీరులంతా చనిపోయారు. ఇక ప్రారంభించిన కార్యం అతడివలననే ముగింపు లేనిదిగా ముందు నిలిచింది. కార్యాన్ని కొనసాగిస్తే ఆత్మవినాశమే ఫలితాంశంగా పరిణమిస్తుంది. అది మహాపాప మంటారు పండితులు - అని అరటిపండు ఒలిచినట్లుగా విప్పి చెప్పాడు కృపుడు.

ధర్మదృష్టితో చూస్తే దుర్యోధనుడికి హితం కలిగే ప్రబోధ మిది. కాని, అతడిది ధర్మదృష్టి కాదు. పగసాధించే పంతం. దానికి అనుగుణంగా తనవాదాన్ని వినిపించాడు.

సీ. 'కపటంపు జూదంబు ఘటియించి రాజ్యంబు । గొని ధర్మజుని మది గుందఁజేసి,
సభ కేకవస్త్ర రజస్వల నమ్మెయిఁ । బాంచాలి ముందల పట్టి యీడ్చి,
సంధి సేయఁగఁ బూని శౌరి యేతెంచిన । నవ్విధంబున నప్రియం బొనర్చి,
పలువురు గూడి సౌభద్రు నొక్కని బాలుఁ । గిట్టి యత్తెఱఁగున గీ టడంచి.

తే. 'నేఁడు దుశ్శాసనుని జొమ్ము నెత్తు రనిల । సుతుఁడు మదమునఁ ద్రావుట సూచి కొఱఁత
ప్రతిన దీర్చునతం డని భయముఁ బొంది । పొందు గోరిన నది యేల పొసఁగుఁ జెపుమ!'(శల్య.1. 66)

ఈ మాటలు దుర్యోధనుడు పశ్చాత్తాపంతో అన్నవి కావు. 'పగ యడఁగించు టెంటయు శుభం; బది లెస్స' అని కృపాచార్యుడు హితవు చెప్పితే, దుర్యోధనుడు 'అడంగునే పగన్ బగ?' అని తన వాదాన్ని సాగించాడు. మోసంతో రాజ్యాన్ని హరించటం రాజనీతి ధర్మ ద్రోహం; పరుల ఇల్లాలిని ఏకవస్త్రను నిండుసభలో అవమానం చేయటం నైతిక ధర్మద్రోహం; సంధి ప్రయత్నాన్ని సాగకుండా చేయటం లోకనీతి ధర్మద్రోహం; అభిమన్యు వధ యుద్ధనియమ ధర్మద్రోహం. ఇన్ని ద్రోహాలనూ దుర్యోధనుడు చేసినట్లు అతడే అంగీకరించాడు. దాని వెనుక స్వార్థపూరిత క్రోధ ప్రేరితమైన పగ ప్రేరకశక్తిగా ప్రజ్వరిల్లింది. ఆతడి పగ పాండవులు తిరిగి ప్రతీకారం చేసే పగను ప్రేరేపించింది. సహనమూర్తులని ప్రశస్తిపొందిన పాండవులు తమ తమ ప్రతిజ్ఞలను తీర్చుకొనటానికే సమరం సాగించారు. దానికి సాక్ష్యాలు ఎన్ని ఉన్నా భీముడు దుశ్శాసనుడిని చంపి, నెత్తురు త్రాగి పగ తీర్చుకొన్న సన్నివేశం నికట దృష్టాంతం. దుర్యోధనుడి పగకూ, పాండవుల పగకూ ప్రతికారరూప సంఘర్షణ ఏర్పడినప్పుడు పగ అణగదు, అభివృద్ధి చెందుతుంది. భీముడు చేసిన రెండు ప్రతిజ్ఞలలో దుశ్శాసన వధ మొదటిది. అది ముగిసింది కాబట్టి త్వరలో దుర్యోధనుడి తొడలు విరుగగొట్టి అతడిని సంహరిస్తా నన్న ప్రతినను చెల్లించుకొంటానని బహిరంగంగా ప్రకటించాడు. కాబట్టి 'అడంగునే పగం బగ?' అని ధర్మరాజు అన్నట్లు దుర్యోధనుడు సంధి కుదరటానికి ధర్మజు నడిగి రాజ్యభాగం తీసికొనవలసిన దైన్యాన్ని అతడు అంగీకరించవలసి వస్తుంది కాబట్టి 'ఒక్కని దయం గను రాజ్యసుఖంబు లేటికిన్?' -అని పేర్కొని యుద్ధమే కర్తవ్య మని నిశ్చయించాడు.

దుర్యోధను డేముహూర్తాన ఈ మాటలన్నాడో కాని, శల్యపర్వమంతా ఈ పద్యం చుట్టే తిరిగింది. 'పగఁ గొన్న మార్కొనక పల్కక యుండఁగవచ్చునే?' అనే తాత్పర్యం పెక్కుచోట్ల ప్రత్యక్షమౌతుంది. ఉదాహరణకు సంధి కంగీకరించక, శల్యాది వీరులు, శకునివంటి బంధువులు, తమ్ములు తనచుట్టూ చచ్చిపడ్డా పంతం వీడకుండా యుద్ధం సాగించటం, అందరినీ చంపించి తానూ చచ్చి పాండవులపై పగ సాధించటమే తన వీర వ్రతంగా ప్రవర్తించటం చూచి కృష్ణార్జునులు దుర్యోధనుడి మూర్ఖత్వానికి విస్తుపోయారు, ఏవగించుకొన్నారు. అర్జును డన్నమాటలు:

చ. 'అమరనదీ సుతుండు వడినప్పుడు వీరలబుద్ధి సంధికా
ర్యమునకుఁ జొచ్చు నింక నని యాత్మఁ దలంచింతి; సమ్మహాత్ముఁడు
న్సముచితవాక్యవృత్తిఁ గురునాయకుఁ దేర్పఁగఁ జూచెఁ; జిత్తదో
షమహిమ నద్దురాత్ముఁడు ప్రశాంతత నొందఁడ యెన్ని భంగులన్.' (శల్య. 1. 350)

కర్ణ, దుశ్శాసన, శల్యుల మరణం కన్నారా చూచికూడా పగ మాని ధర్మరాజుకు రాజ్యభాగ మిచ్చే తలపు దుర్యోధనుడికి రాలేదు. కాబట్టి అతడిని చంపి మిగిలిన కథను ముగించటమే కర్తవ్యమని అర్జునుడు భావించాడు. కృష్ణుడు రాయబారిగా నిలిచిన నిండుసభలో విదురుడు చెప్పిన మాటలూ, దుర్యోధనుడు పుట్టినప్పుడు మునులు 'ఈ పాపాత్ముడు నిఖిల క్షత్రియ క్షయహేతు' వని పలికిన తీరూ చెప్పి అతడి వధ అవశ్య కర్తవ్యమని సమర్థించాడు. కృష్ణార్జున సంవాదం పగగొన్న పాండవ పక్షం మాట్లాడుతూ, మార్కొనే ప్రస్థానానికి ప్రతినిధిగా నిలిచింది. పాండవ వీరులందరూ దుర్యోధనుడిని అధిక్షేపించినవారే, అతడిపై, అతడి సైన్యంపై విజృంభించి పగతీర్చుకొనే ప్రయత్నం చేసినవారే. అందుకే ధర్మరాజు అన్నాడు- శత్రువులవలన పగగొన్నవారు తిరగబడక మానరనీ. ప్రతీకారానికి పూనుకొంటే పగవారి అంతు చూచేంతవరకు ఆగరనీ, ఆ స్థితిలో పగసాధింపు చర్యలే ప్రధానమయి క్రూరత్వం చోటుచేసికొంటుందనీ పేర్కొన్నాడు. దుర్యోధనుడిపై పగ సాధించి అతడి అంతం చూడదలచుకొన్న ధర్మరాజాదులు- అతడిని వెన్నాడి, అధిక్షేపించి, దాగి ఉన్న కొలనునుండి బయటకు తెప్పించి, భీముడిని ప్రబోధించి గదాయుద్ధంలో దుర్యోధనుడి తొడలు విరుగగొట్టేటట్లు చేశారు. దుర్యోధనుడు ప్రదర్శించిన క్రౌర్యాన్ని తలదన్నేటట్లు పాండవులు త్రిప్పికొట్టారు. నాభిక్రింద కొట్టటం సమరధర్మమా? తలను కాలితో తన్నటం న్యాయమా? వంటి ప్రశ్నలు వేసినప్పుడు శ్రీకృష్ణాదులు చెప్పిన సమాధానాలలో- పాండవులు ప్రదర్శించిన పగ

దుర్యోధనుడు పగతో చేసిన పాపకార్యాలకు ప్రతీకారమే కాని వారు పూనుకొని చేసినవి కావని సమర్థించారు. ప్రతీకారచర్యలను యుద్ధమర్యాదలుగా, ప్రతిజ్ఞాపాలనలుగా వ్యాఖ్యానించారు. బలరామాదులకు నచ్చజెప్పారు. ప్రతిజ్ఞలు చేసినప్పుడు లేని అభ్యంతరాలు వాటిని ప్రవర్తిల్ల చేసేటప్పు డెందుకని ప్రశ్నించారు. కపటవర్తనులను, మాయావులను వారికి తగిన పద్ధతులలో చంపటం యుద్ధధర్మవిరుద్ధం కాదని వాదించారు. దుర్యోధనుడు చివరివరకూ పగసాధించే ధర్మాన్నే పాటించి, తనకు ముప్పువాటిల్లిన సమయంలో పాండవుల పగసాధింపు చర్యలను యుద్ధ ధర్మ విరుద్ధ చర్యలుగా వ్యాఖ్యానించి, తన క్రౌర్యాన్ని కప్పిపుచ్చుకొనటానికి యత్నించాడు. భీమార్జున కృష్ణులు అతడి బండారాన్ని బయటపెట్టి భంగించారు. పగయే యుద్ధంలో ప్రమాణమైతే 'ఏమిగతి తలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు కేశవా!' అన్నమాట సత్యమౌతుంది. పాండవుల పగ - వారికి విజయాన్ని కలిగించింది. కాని, పాండవులు తన తండ్రిని అబద్ధంతో వంచించి చంపిన తీరుకు కోపించి పగసాధించే ప్రతిన పూనిన అశ్వత్థామ, ఆరిపోతున్న దుర్యోధనుడి పగలో ఆజ్యం పోసి మండించి సౌప్తికపర్వంలో పాండవ శిబిరాన్ని శ్మశానంగా మార్చాడు. ఇది దేనిఫలం? పాండవుల ప్రతీకారానికి జరిగిన ప్రతీకారం. చివరకు పాండవులకు ఏమి మిగిలింది? పగవలన వారికి ఏమి లాభించింది? ధర్మరాజుమాట నిజమైంది. శల్యపర్వం పగవలన కౌరవులకు తగిలిన శాపం. సౌప్తిక పర్వం కౌరవుల పగవలన పాండవులకు మిగిలిన ప్రతిఫలం. ఈ రెండింటిలో ధర్మచింత లేదు. శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలలో దీనిమీద ధర్మాధర్మ విచారం ఎంతో సాగుతుంది. పాత్రలు తమలో తాము నిందించుకొన్నారు, అధిక్షేపించుకొన్నారు, సరిపెట్టుకొన్నారు, శాపాలు పెట్టుకొన్నారు. ఇన్ని అయినా చివరకు మిగిలిం దేమిటి? అందరూ కలిసి చనిపోయినవారికి శ్రద్ధాంజలి ఘటించటమే. అందుకే తిక్కనగారి 'పగ యడఁగించు టెంతయు శుభంబు' అనే వాక్యం ఒక 'సామెతపద్యంగా' తెలుగులో మిగిలిపోయింది.

పగలు వగలు సుఖదుఃఖాలవలె ద్వంద్వాలు. అయితే, పగను సాధించి పొందే ఫలాన్ని గురించి దుర్యోధనుడికీ, ధర్మరాజుకూ భిన్న దృక్పథాలు ఉన్నాయి. పగ వగ కలిగిస్తుందని ఇద్దరికీ తెలుసు. కాని, దుర్యోధనుడు దుర్మదాంధుడు, అహంకారి కాబట్టి వగ లేని పగ విజయమని భావించాడు. పాండవులను పగతో వధిస్తే పగవలన వగ కలుగకుండా సుఖించవచ్చునని ప్రయత్నించాడు. ఒకవేళ పగవలన వగయే మిగిలితే బ్రతికి దానిని అనుభవించటం కంటె చచ్చి స్వర్గసుఖాన్ని పొందటం విజయ మనుకొన్నాడు.

చ. 'చదివితి నెల్ల వేదములు, జన్నము లొప్పఁగఁ జేసితిన్, రమా
స్పద మగు వృత్తిఁ బొల్చి నరపాలకు లెల్లను గొల్వఁ గంటి, దు
ర్మదరిపుగాఢపర్వ పరిమర్దన కేళి యొనర్చితిం దగం,
దుది నని మిత్రబాంధవులతోఁ ద్రిదివంబున కేఁగు టొప్పదే?'.

వ. 'నీకుం జూడ నెట్టివాఁడ నైనను నా కేమి? మీరింకఁ బశ్చాత్తాప దుఃఖితు లగుచు నుందురు గాక!'
(శల్య. 2. 329, 330)

అని శ్రీకృష్ణుడితో పలికిన మాటలు అతడి హృదయాన్ని వ్యక్తం చేశాయి. అతడు పగతోనే పురుషార్థ చతుష్టయాన్ని సాధించినట్లు చెప్పుకొన్నాడు. వేదాలు చదివాడు, యజ్ఞాలు చేశాడు, పాండవులను పాండిత్యంలో పుణ్యకార్యాలలో మించాలని యత్నించి ధర్మ పురుషార్థాన్ని సాధించినట్లు భావించాడు. ధనాన్ని సంపాదించే ఉపాయంతో రాజ్యాన్ని హరించి, పరిపాలన సామర్థ్యంతో రాజుల నందరినీ మెప్పించి అర్థపురుషార్థాన్ని సాధించినట్లు తలచాడు. శత్రుమర్దనం చేసి పగసాధించే ప్రయత్నం చేసి కామపురుషార్థాన్ని సాధించా ననుకొన్నాడు. పగతో సాధించిన పురుషార్థాలు ఇహంలో వగనే కలిగిస్తాయని తెలిసి కూడా దానిని అతిక్రమించటానికి యత్నించి విఫలుడయ్యాడు. తనవారందరు నశించారన్న వగ తనను క్రుంగదీయకుండా రణమరణంతో స్వర్గాన్ని సాధిస్తున్నానని ప్రకటించాడు. బ్రతికి పగసాధించలేకపోతే చచ్చి స్వర్గాన్ని పొందటమే వగలేని పగగా అతడు వ్యాఖ్యానించాడు. ఆ ధీమాతోనే ధర్మరాజును శ్మశానంవంటి రాజ్యాన్ని ఏలుకొనుమన్నాడు. కౌరవులు సాధించిన

పగవలన కలిగిన వగను జీవితాంతం అనుభవిస్తూ శేషజీవితాన్ని నరకంగా గడుపుమన్నాడు.

ఆ. 'ఓడి వచ్చినాఁడ; నుద్ధతి నా కేల? । యుడుకు మాని నీవ యుర్వి యేలు;
గుజ్జములును నేనుఁగులు లేని బయలు నీ । తలనె కట్టికొనుము ధర్మతనయ!'. **(శల్య. 2. 72)**

అని దుర్యోధను డంటే, ధర్మరాజు ఇట్లా మారు పలికాడు.

సీ. 'నీ యీగి నేను భూనాయకుఁ డగు టొల్ల । రాజకోటికిఁ బరిగ్రహము సనునె?
నిను ననిం దెగటార్చి నేలఁ బాలించెద; । నను నోర్చితేని పెంపును సుఖింపు;
మేమిటివాఁడవై యిచ్చితి పుడమి నీ । కనియెడు మాట యిట్లాడె దిపుడు;
నీవు ధరిత్రి నీ నేర్చినఁ గురుకులం । బునకు ని ట్లాఱడిఁ బోవ నేల?

తే. శాంతి నొందుటకై ధర్మ సంవిభాగ । కరణ మొనరింప వచ్చిన కమలనాభు
వాక్యవృత్తిఁ బాటింపక వాఁడి సూది । మోపినం తైన నుర్వి నీ నోప నంటి.

క. ఏమి విధంబునఁ బొరలియు । భూమి కురునృపాల నీకుఁ బుచ్చుకొనఁగ రా
కీమెయి దైన్యపడితి; నా । కే మార్గము వట్టి యిచ్చె దేర్పడ జెపుమా!

క. అరులకు సిరి యిచ్చెద నను । వెరవిఁడియుం గలఁడె? దీని విడువుము; నాకున్
ధర యిచ్చితేనియును నినుఁ । బొరిగొన కే విడువ; నఱిమి పోరుట యొప్పున్.

క. నాచే నీ ప్రాణంబులు । నీచే నా జీవితంబు నిజ మున్నవి; యి
న్నీచత యపకార్యము; రా । జోచితకర్మ కృతనిశ్చయుఁడ వగుము నృపా!' **(శల్య. 2. 74-77)**

ప్రాణాలున్నంతవరకు పగసాధించాలని పూనుకొని, ప్రాణభయంతో కొలనులో దాగికొని, ప్రాణరక్షణకొరకై తనకు ఉద్ధతిలేదని బొంకి, కోపం మాని భూమిని ఏలుకొనుమని ధర్మరాజుకు రాజ్యాధికారాన్ని ఇస్తూ, బలగంలేని శూన్యభూమిని తలకుచుట్టుకొమ్మని కసితో కూడిన ఎగతాళిగా హెచ్చరించి తన మనఃప్రవృత్తిని ప్రకటించుకొన్నాడు రారాజు. రాజ్యాన్ని ఇవ్వదలచిన దుర్యోధనుడు పగ వీడినవాడుగా కనపడ్డా అది పరివర్తనమా? కపటనాటకమా? అనే ప్రశ్నను పగరకు కల్పించాడు. చిత్తశుద్ధి కలవాడైతే పై చివరి వాక్యం పలుకడు. పగతో రాజ్యాన్ని బలహీనపరిచి వగను కలిగించేటట్లు వదలిపెట్టుతానన్న అహంకారం ప్రదర్శించాడు. సంపదతో కూడిన భూమిని సంతృప్తిగా అనుభవించి, సారరహితమైన నేలను వదలి విజయాన్ని సాధించినట్లు వ్యంగ్యంగా వెటకారం చేశాడు దుర్యోధనుడు.

దుర్యోధనుడికి సమాధానం చెప్పిన ధర్మజుడు అతడి పగలోని సెగను గుర్తించి పరిహాసంచేశాడు. దాన మిచ్చినా తాను క్షత్రియుడు గాన తీసికొననని దుర్యోధనుడే స్వయంగా పలికిన మాటను జ్ఞాపకం తెచ్చాడు. తానూ అదే మాటను మాటకు మాటగా అన్నాడు. దుర్యోధనుడిని చంపిగాని రాజ్యం పాలించేది లేదనీ, ధర్మరాజును చంపగలిగితే సుయోధనుడు సుఖించవచ్చుననీ చెప్పాడు. ఒకడు చచ్చి మరొకడికి రాజ్యం చెందేటట్లు చేయటమే కర్తవ్యంగాని బ్రతికి ఉండగా భూమిని పాలించటం చెల్లదని పేర్కొన్నాడు. దుర్యోధనుడికి రాజ్యమిచ్చే అధికారం ఎక్కడ ఉన్న? దని ప్రశ్నించాడు. నిజంగా ఇవ్వగలిగి ఉంటే కురుకులానికి ఇంత కష్టం వచ్చి ఉండేది కాదన్నాడు. శ్రీకృష్ణు డెంత చెప్పినా వినక 'వాడి అయిన సూదిమొన మోపినంత నేలనైనా నేను పాండవులకు ఇవ్వనని' నిండుకొలువులో చెప్పినమాటను జ్ఞాపకం చేశాడు. దుర్యోధనుడు తనకు ఎవరైనా రాజ్యమిచ్చినా స్వీకరించలేని దైన్యస్థితిలో ఉండి ధర్మరాజుకు రాజ్యమిస్తా ననటం విడ్డూరమని ఎగతాళి చేశాడు. శత్రువులకు సిరినిచ్చే వెర్రివాడు లోకంలో ఉన్నాడా? అని అవహేళన చేశాడు. ఒకవేళ దుర్యోధనుడు చివరిక్షణంలో మనసు మార్చుకొని రాజ్యమిచ్చినా, తాను అతడిని చంపక విడువనని స్పష్టంగా ప్రకటించాడు. ఫలితాంశం

ఇట్లా తేల్చిచెప్పాడు - 'ధర్మజుడి చేతిలో దుర్యోధనుడి ప్రాణాలున్నాయి. సుయోధనుడిచేతిలో ధర్మజుడి జీవితం ఉన్నది. ఎవరో ఒకరు మిగలాలి. 'శత్రువును చంపి రాజ్యం తీసికొనటమే క్షత్రియధర్మం' అన్నాడు.

ఈ మాటలు ధర్మజుడి హృదయానికి వ్యాఖ్యానాలు. అగ్నిశేషం, ఋణశేషం, శత్రుశేషం ఉంచకూడదంటారు. అట్లాగే పరివర్తనం లేని పగను సగంలో వదలకూడదు. దుర్యోధనుడు పగతో పాండవులకు వగ కల్పించి, చివరకు తాను ప్రాణంతో బ్రతికి, సమయం చూచి పగరకు అపకారం చేయాలనీ, రాజ్యాన్ని మరల ఆక్రమించాలనీ భావించాడు. అతడిని వదలిపెట్టితే పగవలన కలిగే వగను నిరంతరం కొనితెచ్చుకొన్నట్లే అవుతుందని ధర్మజుడు భావించాడు. పగ లేని వగయే ఉత్తమం అనుకొన్నాడు. వగ వివేకం వలన తగ్గిపోతుంది కాని, పగ నట్టింట పుట్టలో ఉన్న పామువలె భయం కలిపిస్తుంది- అన్నది ధర్మరాజు అభిప్రాయం. అందువలననే దుర్యోధనుడిని చంపక వదలనన్నాడు. తాను చచ్చి అయినా పగను అంతం చేయాలని తలపెట్టాడు. భావికథ ధర్మజుడి అభిమతానికి అనుగుణంగానే సాగింది. ఎందరు హతులైనా, అనంతదుఃఖం ముంచెత్తినా కాలక్రమంలో పాండవులు శాంతిని పొందారు. సంపూర్ణ రాజ్యసుఖాల ననుభవించారు. 'పగ యడఁగించు టెంతయు శుభంబు - అది లెస్స' అనే వాక్యం పగకు ప్రతినిధిగా నిలిచిన దుర్యోధనుడికి వర్తింపజేసి వ్యాఖ్యానించిన మనీషి ధర్మరాజు. అడగించుటకు అక్కడి అర్థం అణచటం, ఇక్కడి అర్థం అంతమొందించటం!

3. శల్యపర్వం సహజ యుద్ధపర్వం:

భీష్మ, ద్రోణ, కర్ణ పర్వాలలో ఆయా మహావీరుల ప్రతాపాలు క్రమంగా పది, అయిదు, రెండు రోజులు ప్రచండంగా వెలుగొందాయి. అయితే వారి నాయకత్వం సాగినప్పుడు సంఖ్యాబలం అధికంగా ఉండేది. క్రమంగా వీరులూ, చతురంగబలాలూ నేలగూలటంచేత సంఖ్యాబలం తగ్గింది. పెక్కుమంది నడుమ ప్రకాశించటం ఒక విశేషం అయితే పలుచబడిన సైన్యం మధ్య వెలుగొందటం కూడా మరొక విచిత్రం. శల్యవిజృంభణం రెండవ పద్ధతికి చెందింది. అతడు సేనాపతి అయ్యేటప్పటికి ఉభయ పక్షాలలో మిగిలిన సైన్యాలు - కౌరవపక్షంలో 11వేల రథాలు, 10700 ఏనుగులు, 2 లక్షల గుర్రాలు, 3 కోట్ల కాల్బలం; పాండవ పక్షంలో 6వేల రథాలూ, 3వేల ఏనుగులూ, లక్ష గుర్రాలూ, కోటి కాల్బలం. బలాలమోహరింపు తగ్గటంవలన వీరుల విజృంభణాలకు కథలో విస్తృతి కనపడుతుంది. కౌరవసేనాపతులలో ఒక విశేషం ఉన్నది. వారు మరణించేరోజు ఆరే దీపం భగ్గుమంటుందన్నట్లు అప్రతిహతంగా పోరాడి దేవతల మెప్పు పొందుతారు. అవక్రపరాక్రములుగా రణరంగంలో రాణించే ఆ వీరులను పాండవులు సప్రయత్నంగా, సోపాయంగా సంహరించే సాహసం ప్రదర్శిస్తారు. కౌరవవీరులలో పురుషయత్నం పరాకాష్ఠ నందుకొంటే పాండవ వీరులలో దైవానుకూల్యం గల మానవతేజం ప్రజ్వలిస్తుంది. ఈ దృష్టితో చూస్తే శల్యపర్వం ఒక ప్రత్యేకతను సంతరించుకొన్నది.

మహాభారత యుద్ధసమయంలో కౌరవపాండవులచేత విశేషంగా గౌరవించబడిన వీరుడు శల్యుడు. పాండవులకు మేనమామ కావటంచేత వారి ప్రార్థన మేరకు సైన్యసహాయం చేయటానికి అంగీకరించి అతడు వారి పక్షంలో చేరటానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో దుర్యోధనుడు ప్రచ్ఛన్నంగా ఆయనకు చేయించిన సేవలు అతడిని ముగ్ధుడిని చేశాయి. సేవలు చేయించింది ధర్మరాజని భావించి తెర వెనుక ఉన్న దుర్యోధనుడికి వరాలు గుప్పించాడు. తనది తొందరపాటని గుర్తించి, ధర్మజుడిని దర్శించి, పరిస్థితి వివరించి, సారథ్యంలో కర్ణుడి మనసు కలతపెట్టి పాండవ విజయానికి తోడ్పడేటట్లు రహస్య వాగ్దానమిచ్చాడు. ఈ సంగతి లోకానికి తెలియదు. అత డెవరికీ చెప్పలేదు. ధర్మజుడు బైట పెట్టలేదు. కర్ణుడు నేలకూలిన తరువాత ధర్మజుడి కిచ్చిన వరం ముగిసినట్లయింది. ఆ తరువాత దుర్యోధన పక్షంలో శల్యుడు పూర్తిగా పోరాడే పాత్ర నిర్వహించవలసి వచ్చింది. శల్యుడు గొప్ప ఆత్మాభిమాని, బలశాలి, స్నేహప్రవృత్తి, బంధుప్రీతి కలవాడు. అన్నిటినీ మించి స్తుతిప్రియుడు, అల్పసంతోషి. ఈ బలాబలాలను గుర్తించిన దుర్యోధన ధర్మజులు ఆయనను సమయోచితంగా వాడుకొన్నారు. ఇరువురూ యథోచితంగా లాభపడ్డారు.

కర్ణుడు శల్యసారథ్యాన్ని సమకూర్చుమని దుర్యోధనుడిని అడిగాడు. రారాజే స్వయంగా శల్యుడిని సమీపించి అతడు సత్యవ్రతుడనీ, శాత్రవులను దుర్దశపాలు చేయటంలో ఘనుడనీ, మహాభాగుడనీ కీర్తించి, అర్జునుడిని చంపాలని

ఉత్సహిస్తున్న కర్ణుడికి రథసారథ్యం చేయుమని వినయవినమ్రుడై ప్రార్థించాడు. శల్యుడికి జాత్యభిమానం, ఆత్మాభిమానం అడ్డం వచ్చాయి. మూర్ధాభిషిక్తుడూ, మహావీరుడూ, క్షత్రియుడూ అయిన తాను సూతపుత్రుడైన కర్ణుడికి సారథ్యం చేయనని భీష్మించుకొన్నాడు. కాని, దుర్యోధనుడు అతడి ఆత్మాభిమానం తృప్తిపడేటట్లు రథికంటె సారథి గొప్పవాడని తెలిపే త్రిపురాసుర సంహార కథను చెప్పి, రథి అయిన కర్ణుడు అర్జునుడికంటె ఘనుడనీ, సారథి అయిన శ్రీకృష్ణుడికంటె శల్యుడు అన్నింట మించినవాడనీ అతిశయంగా ప్రశంసించాడు. దానికి మనసు పొంగి శల్యుడు కర్ణసారథ్యానికి అంగీకరించాడు. అంతటితో ఆగక కర్ణుడిని రణమధ్యంలో తన ఇచ్చవచ్చిన మాటలతో హితవు చెప్పటానికి రారాజువద్ద అనుమతి తీసికొన్నాడు. కర్ణసారథి అన్నదానికంటె పార్థసారథికంటె గొప్పవాడన్న ప్రశంస శల్యుడికి బిరుదుగా తోచింది. ఆ ప్రవృత్తి అతడి చిత్తవృత్తికి పతాక.

కర్ణుడి తరువాత సేనాపతి ఎవ్వరనే ప్రశ్న వచ్చింది కౌరవ స్కంధావారంలో. అశ్వత్థామ శల్యుడి పరాక్రమాన్ని నిరూపించి అతడిని సర్వసైన్యాధ్యక్షుడిగా చేయుమని దుర్యోధనుడికి సలహా ఇచ్చాడు. ఆజి నైపుణ్యం, మహనీయ శౌర్యం, భూరిబలం, సర్వసత్త్వవేదనం. పరాక్రమోద్ధతి, ధైర్యసమగ్రత శల్యుడి సహజ వీరగుణాలని పేర్కొన్నాడు. మేనల్లురైన పాండవులను వదలి కౌరవపక్షంలో చేరిన శల్యుడి కంటె పరమహితుడు మరొకడు ఉండడని చెప్పాడు. కుమారస్వామి సేనాపతి కాగా దేవతలు దైత్యులను సంహరించినట్లు శల్యుడు నాయకుడైతే మనం శత్రువులను జయించగలమని ప్రోత్సహించాడు. దుర్యోధనుడు శల్యుడిని ప్రార్థించాడు. ఆతడు సుముఖుడై తనను గురించి ఇట్లా చెప్పుకొన్నాడు.

మ. 'భుజవీర్యంబున నచ్యుతార్జునులు నన్ బోలంగలే; రల్కా వ
చ్చి జయింపంగఁ గడంగినన్ సురలు నాచే నొత్తు; రే నేచి య
క్కజపుం జేవయు లావుఁ జూపు వడికిం గౌంతేయు లే యోర్తు? రా
ప్రజయున్ నీ ప్రజయుం దలంగఁ జెలఁగం బాటింతు నాటోపమున్.'

చ. 'అఱిముఱి బాణజాలముల నక్కడి సైనికులం దెరల్చెదన్;
గుఱుకొని నాకు మాఱుకొని కోల్తలఁ జేసిన వీర వర్గమున్
నఱికెదఁ; జూచు ఖేచరగణంబుల కచ్చెరుపా టొనర్చెదన్;
బఱపెదఁ బాండునందనులఁ బాఱక నిల్చిన రూ పడంచెదన్',

శా. 'గంగానందను పోటు మెచ్చక, గురుం గాదంచు, రాధాతనూ
జుం గీడాడుచు, నీతఁ డెవ్వఁడొకొ యంచున్ శల్యుఁడే! యిట్టివా
నిం గయ్యంబుల మున్ను గాన మనుచు న్వేభంగులం జూపఱె
ల్లం గీర్తింప ధనుః కళానిపుణ లీలా ఖేలతన్ జూపెదన్'. **(శల్య. 1. 85-87)**

శల్యుడు ధీరోద్ధతుడివలె పలికాడు. భీష్మ ద్రోణులకంటె కర్ణుడూ ఇట్లాగే ప్రగల్భాలు పలికాడు. అయితే శ్రీకృష్ణుడు శల్యుడిని గురించి వేసిన అంచనా మనకు ఆశ్చర్యం కలిగిస్తుంది. అది వ్యాజస్తుతి ఏమో అన్నంత అనుమానం కలిగిస్తుంది. కృష్ణుడు ధర్మరాజుతో అనిన మాట లివి -

సీ. 'శల్యు నెఱుంగుదు; శౌర్య ధైర్యంబు । లగ్గల మాతనికి; బాహుబల ఘనుండు;
గాంగేయకుంభకర్ణుల మిగిలెడుఁ; । గాఁడేని సముఁ డగుఁ గాని యసదు
గాఁ దలంపఁగ రాదు; కౌరవపతి మాన్యుఁ । జేయుట నధిక విజృంభణంబుఁ
జూపు; భీమునకు నర్జునునకు నెనయంగ । రాదు; సాత్యకి కోర్వరాదు; పార్ష

తే. తునకుఁ దత్సోదరులకు మార్కొని పెనంగి । బ్రదుకురాదు; నీవీట నా బల్లిదునకు
నెదురు రథికునిఁ గాన ననేక హేతి । నిపుణ శార్దూల విక్రమ! నీవు దక్క'. **(శల్య. 1.91)**

శల్యుడు పాండవ వీరులకంటె అన్నింట మిన్న అయినా ధర్మరాజుతో సరిగాడని శ్రీకృష్ణుడి నిష్కర్ష. ధర్మజుడే శల్యుడిని చంపుతాడని శ్రీకృష్ణుడి నిర్ణయం. 'యుద్ధంలో శల్యుడిని నేను చంపుతా'నని ధర్మజుడు ఉద్యోగపర్వంలో ప్రతిజ్ఞచేశాడు. దానిని శ్రీకృష్ణుడు స్థిరీకరించినట్లయింది. ధర్మరాజుది పురుషయత్నం. శ్రీకృష్ణుడిది దైవానుకూల్యం. స్వల్పమైన నిందకూడా రాకుండా ధర్మరాజుచేత ధర్మబద్ధమైన సహజయుద్ధాన్ని చేయించి విజయాన్ని ప్రసాదించాడు శ్రీకృష్ణుడు. శల్యపర్వ ప్రత్యేకతలలో ఇది ఒకటి.

పదునెనిమిదవనాటి యుద్ధంలో శల్యుడు సర్వతోభద్ర వ్యూహం పన్నాడు. అంతకుముందే పాండవులు త్రిముఖ వ్యూహంతో సిద్ధమై ఉన్నారు. యుద్ధారంభంలో శల్యుడి విజృంభణం కౌరవసేనలకు ఆశ్చర్యం కలిగించింది. పాండవులతడిచేతిలో ప్రాణాలు కోల్పోవటం తథ్యమనే ఆశలు దుర్యోధనుడి మనసులో పొటమరించాయి. పాండవులు తెగబడి శల్యుడిపై విరుచుకొని పడ్డారు. భీమార్జునులు భయంకరమైన ఎదురుదాడి చేసి సైన్యాన్ని మట్టుపెట్ట నారంభించారు. ధర్మజ, నకుల, సహదేవులు ప్రతివీర సంహారంతో తమ ప్రతాపాలకు వన్నె తెచ్చుకొన్నారు. నకులుడు కర్ణ పుత్రులైన చిత్రసేన, సత్యసేన, సువర్మలను సంహరించాడు. అతడి ధాటికి ఓర్వలేక కౌరవసేనలు వికావికలై పరుగెత్తసాగాయి. శల్యుడు సింహనాదం చేసి, రౌద్రవిక్రమ స్ఫూర్తితో సేనలను పురికొల్పి సమీకరించి విజృంభించాడు. పాండవులు ఒక్కుమ్మడిగా అతడిపై దాడిచేశారు. అయినా శల్యుడు తెగించి విక్రమించి పాండవసేనలపై బాణవర్షం కురిపించాడు. వారు భయపడి ధర్మరాజు రథం వెనుకకు పోయి తలదాచుకొన్నారు. ధర్మరాజు శల్యుడి దాడిని త్రిప్పికొట్టాడు. భీముడు శల్యుడిని ఢీకొని భీకర గదాయుద్ధం చేశాడు. ఇరువురు వీరులూ మత్తేభాలవలె పోరాడి సైనికుల మెప్పులు పొందారు. కొంతసేపటికి ఇరువురూ పరస్పర గదాఘాతాలతో మూర్ఛపోయారు. కృపాచార్యుడు శల్యుడిని రథంమీద ఉంచుకొని దూరంగా తొలగిపోయాడు. భీముడు తేరికొని శల్యుడిని యుద్ధానికి పిలిచాడు. శల్యుడు తేరుకొని గదాదండంతో రథమెక్కి యుద్ధానికి వచ్చాడు. దుర్యోధనుడి ముందున్న సైనికులు అతడిని అనుసరించారు. ధర్మరాజుకు ముందున్న రథికులు చేకితానుడిని ముందుంచుకొని భీముడిని దాటి దుర్యోధనుడిపై తలపడ్డారు. అతడి వజ్రగదాఘాతానికి చేకితానుడు చనిపోయాడు. పాండవసేన మండిపడి కౌరవసేనపై బాణవర్షం కురిపించింది. శల్యుడిపై పాండవులు విజృంభించారు. అతడిపై ధర్మరాజు ముద్గరాన్నీ, సాత్యకి తోమరాన్నీ, భీముడు భల్లాన్నీ, నకులుడు శక్తినీ, సహదేవుడు గదనూ ఒక్కసారిగా ప్రయోగించారు. శల్యుడు వాటిని వమ్ముచేసి ఆర్చాడు. పటు బాణ ప్రయోగాలతో సాత్యకిని, పాండవులను మూర్ఛపొందించాడు. దానిని చూచి శల్యుడు పాండవులను ఆనాడు చంపుతాడని భావించి దుర్యోధనుడు సంతోషించాడు.

భీమ నకుల సహదేవులు కలిసి శల్యుడిపై విజృంభించారు. ధర్మరాజు శల్యుడి చక్రరక్షకుడైన ద్యుమత్సేనుడి తల నరికాడు. శల్యుడు జూలు పీకిన సింహంవలె కోపించి భీమాదులను బాణాలతో నొప్పించి, నెత్తురు పారేటట్లు చేశాడు. ధర్మరాజును మూర్ఛపొందించాడు. తేరుకొన్న ధర్మరాజుకు శల్యపరాక్రమం భయం కలిగించింది. పౌరుషంతో శల్యుడిని చంపుతానని శపథంచేసిన ధర్మరాజుచేత శ్రీహరిని స్మరింపజేసిన గౌరవం శల్యుడికే దక్కింది. ఒక్కసారితో అది ఆగలేదు. మూడు సార్లు శల్యుడు ధర్మరాజును ముచ్చెమటలు పట్టించాడు. మూర్ఛలో ముంచాడు. శ్రీహరిని స్మరింపజేశాడు. ధర్మజ విజయం దైవాధీన మని నిరూపించాడు.

శల్యుడు ఎంతటి మహావీరుడైనా యుద్ధంలో కొన్నిసార్లు అతడిని కృపాశ్వత్థామలు రక్షించవలసి వచ్చింది. అయినా, ఆయన ప్రదర్శించిన యుద్ధకేళి దేవతలను కూడా మెప్పించింది. పాండవులను ముప్పు తిప్పలు పెట్టింది. దానికి ప్రతిగా భీమార్జున నకుల సహదేవులు అతడిని మూడు చెరువుల నీళ్ళు త్రాగించారు. ఆ భీకర సమరంలో ప్రత్యర్థులైన శల్యధర్మజుల యుద్ధం వీర రసోద్రేకంగా సాగింది. మచ్చుకొక సన్నివేశం - శల్యుడు ధర్మజుడి వక్షఃస్థలంమీద పటుబాణాన్ని నాటాడు. ధర్మజుడు మరొక ఘోరబాణంతో శల్యుడిని కొట్టి మూర్ఛచెందేటట్లు చేశాడు. శల్యుడు తేరికొని కోపంతో

వాడిబాణాన్ని ప్రయోగించగా ధర్మరాజు పసిడి బాణాలతో దానిని విరుగగొట్టాడు. శల్యుడు తొమ్మిది బాణాలను ధర్మజుడి వక్షంమీద నాటాడు. క్రూరభల్లంతో చాపాన్ని విరుగగొట్టాడు. ధర్మజుడు మరొకవిల్లు చేపట్టి యుద్ధం చేశాడు. శల్యుడికి కృపుడూ, ధర్మరాజుకు భీముడూ తోడుగా నిలిచి పోరాడారు. కృపుడూ శల్యుడూ కలిసి ధర్మరాజును విరథుడిని చేశారు. అప్పుడు మరల ధర్మజుడు శ్రీహరిని స్మరించాడు.

4. ధర్మరాజుకు దైవ సహాయం:

ధర్మరాజు శ్రీహరిస్మరణం మూడుసార్లు చేశాడు. అందులో గజేంద్రుడిని తలపింప చేశాడు. 'కలఁడు కలం డనెడి వాఁడు కలఁడో లేఁడో?' అని భయంతో శంకించిన గజరాజువలెనే ధర్మజుడు మొదటిసారి శ్రీహరివచనం నిజమౌతుందో కాదో అని భయాందోళనలను ప్రకటించాడు.

క. 'హరి వచనంబు లసత్యతఁ । బొరయఁగ నేర్చునొకొ! మద్రభూపతి బాహు
స్ఫురణము భీమాది రథిక । వరు లోర్వని యట్లు గాఁగ వ్రాలెడిఁ దోడ్తోన్'. **(శల్య. 1. 205)**

శ్రీకృష్ణుడు చెప్పిన మాటలలో రెండంశా లున్నాయి. ఒకటి - భీమాదులు శల్యుడితో దీటురారు. రెండు - ధర్మజు డొక్కడే శల్యుడిని మించిన యోధుడు. ఇందులో శల్యుడు భీమాదులను యుద్ధంలో మించిన మాట సత్య మౌతున్నట్లు స్పష్టమైనది. మరి ధర్మజుడు కూడా శల్యుడిచేతిలో మూర్ఛపోవటం గమనిస్తే రెండవ మాట నిజమౌతుందో లేదో అనే భయం, ఆందోళనం కలిగింది. పురుషయత్నంలో భగవంతుడిని స్మరింపచేసే ప్రథమదశ భయం. దానివలన విజయం అనిశ్చిత స్థితిలో ఉంటుంది.

అనిశ్చిత స్థితికి మూలం అనుమానం. మూర్ఛలో పడ్డప్పుడు భయాందోళనలు కలిగాయి. ఆపై విరథుడైనప్పుడు శంక అంకురించింది.

క. 'గెలుపుము శల్యుని నీ' వని । పలికి ముకుందుండు నన్నుఁ బనిచిన వాఁ; డ
ప్పలుకులకు నసత్యత్వము । గలుగఁగ నేర్చునొకొ దైవఘటన బలమునన్' **(శల్య. 1. 263)**

అని ధర్మజుడు తలపోశాడు. ఇక్కడ భీమాదుల ప్రసక్తి లేదు. శ్రీకృష్ణుడి ఆశీస్సుల ప్రసక్తి ఉన్నది. శల్యుడిని చంపుతా నని చెప్పిన ధర్మజుడి మాట మానవీయం కాబట్టి అబద్ధం కావచ్చును. కాని, కృష్ణుడిమాట దైవనిర్ణయం కదా! అది అసత్యం కావటానికి వీలు లేదు. అయినా, శల్యుడి పరాక్రమం ధర్మరాజుకు ప్రాణసంకటంగా మారింది. శ్రీకృష్ణుడు ఆశీర్వదించినా ధర్మజుడి జీవితంలో దేవుడు విజయం వ్రాసిపెట్టి ఉండకపోతే అది నిజం కాదేమో! అని శంకించాడు ధర్మరాజు.

శంకను తొలగించగలిగింది విశ్వాసం. ధర్మజుడు దైవంమీద అచంచల విశ్వాసం కలవాడు. కాబట్టి శంకతో ఊగిసలాడుతున్న మనస్సును స్వయంగా కుదుటపరచుకొన్నాడు. 'ఆ జగన్నాథు వచనంబునకు నన్యథాత్వం బేలఁ గలుగు?' (శల్య. 1. 264) నని వెంటనే విశ్వాసభావాన్ని వ్యక్తీకరించాడు. స్థిర నిశ్చయుడైన తరువాత భగవంతుడి నేకాగ్రచిత్తంతో, భక్తి భావంతో, విజయార్థి అయి ప్రార్థించాడు. శరణాగతికి సుముఖు డయ్యాడు. 'అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే । తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్' అన్న భగవంతుడి వాగ్దాన ఫలాన్ని పొందే అర్హతను సంపాదించాడు. ఈ క్రింది రెండు పద్యాలూ అందుకు సాక్ష్యాలు.

చ. 'స్ఫురిత షడర్ధనేత్రునిఁ, ద్రిశూల సముజ్జ్వలు, నిర్గుణున్, గుణా
దర సముపాత్తమూర్తిఁ, గలిత ప్రభవస్థితి సంహృతి క్రియా

నిరతి వివర్తిత త్రిభువనీ మహనీయుని, దైత్యమర్ది, న
ప్పురుషవరుం జతుర్భుజవిభుత్వ మహోన్నతు నాశ్రయించెదన్'.

తే. 'భండనము సేయు నరు నగ్రభాగమునఁ బ । చండ శూలోగ్ర హస్తుఁడై శత్రుకోటి
గీటడంచుచు నేఁ జూడఁ గేలి సలుపు । దేవు జయసిద్ధికై నన్నుతింతు భక్తి'. **(శల్య. 1. 265 -266)**

వీటిలో మొదటి పద్యం తిక్కనగారే ధర్మజుడి నోట పలికినట్లున్నది. అది హరిహరాద్వైత భావంతో పురుషోత్తముడిని స్తుతించిన పద్యం. రెండవ పద్యం అర్జునుడి ముందుభాగంలో శూలహస్తుడై నడుస్తూ శత్రు సంహార కార్యాన్ని తానే ముందుగా నిర్వహిస్తున్న రుద్రుడి ప్రశంస ఉన్నది. శ్రీకృష్ణుడి నర్చించిన పూజాద్రవ్యాలు ఆ మహాదేవుడి శరీరంమీద తోచినట్లు అర్జునుడు చెప్పగా ధర్మరాజు విన్నాడు కూడా. ఆ మహాదేవుడే అతడి కానాడు శరణ్యు డయ్యాడు. శివుడే విష్ణువని, విష్ణువే శివరూపుడని తెలిసిన ఎరుక ఈ భక్తి భావనకు మూలం. శత్రుసంహారానికి కావలసిన దివ్య లక్షణాలను దైవ చైతన్యంలో జాగృతం చేసి వాటిని తన విజయసిద్ధికై ప్రసన్నం చేసికొనటమే ఈ పరమేశ్వర స్తుతిలోని పరమతాత్పర్యం.

మొదట పరమేశ్వరుడి త్రినేత్రత్వాన్ని స్మరించాడు. మూడవకన్ను తెరిచి శత్రువులను భస్మం చేయమని దాని భావం. ఆ తరువాత త్రిశూలం చేత ప్రకాశించేవాడిని తలచాడు. శూలంతో శత్రుసంహారం చేయుమని భావం. నిర్గుణుడైన పరమాత్మభావనం చేత సర్వాంతర్యామివై సర్వశక్తిమత్త్వాన్ని ప్రకటించుమని కోరాడు. గుణాలను ఆదరించే ఉదాత్తమూర్తిని భావించటంతో భగవంతుడి దయాగుణాదులను అర్థించినట్లు భావం. సృష్టిస్థితిలయాత్మక ప్రవృత్తిచేత భువనాలను పాలించే మహనీయుడిని భావించటంచేత పుట్టిన జీవులను గిట్టించే సంకల్పం గల మహేశ్వరుడే శత్రువులను సంహరించగలడని భావం. రాక్షసమర్దనుం డనటంచేత దుష్టశిక్షణ ప్రవృత్తిని ప్రదర్శించుమని ప్రార్థించాడని భావం. పురుషవరుడనీ, చతుర్భుజుడనీ, విభుత్వ మహోన్నతుడనీ కీర్తించటంవలన ఉత్తమ పురుష స్థితినీ, విష్ణు స్థితినీ (నలుగురు తమ్ముల పరాక్రమ స్ఫూర్తినీ), ప్రభుత్వ ప్రాప్తిచేత కలిగే ఉదాత్త ఔన్నత్యాన్నీ ధర్మజుడు భగవంతుడినుండి కోరుతూ ఆతడిని శరణువేడుతున్నాడని ధ్వని. 'నరుడికి తోడుగా నిలిచి ముందుగా శత్రుసంహారం చేసి అతడి విజయమార్గం ఎట్లా సుగమం చేస్తున్నావో, నాకు కూడా అటువంటి సహాయాన్ని అందించి విజయం చేకూర్చు'మని పరమేశ్వరుడిని కోరాడు. ధర్మజుడు సాత్త్విక సంపన్నుడు కాబట్టి అతడు భగవంతుడిని అర్థించి సంకల్ప సిద్ధి పొందగలడని భారతంలో ఎన్నో చోట్ల నిరూపించబడింది. ఇక్కడ కూడ సకామభక్తిని సాత్త్విక సమాహితశక్తితో ప్రసరించి విజయాన్ని ప్రసాదించుమని పరమేశ్వరుడిని ప్రార్థించాడు. భక్తిపారవశ్యంలో ఉన్న ధర్మరాజు చేసిన బాణప్రయోగం బలహీనంగా తోచగా శల్యుడు విజృంభించి ఆతడిమీద పెల్లుగా బాణ వర్షం కురిపించాడు.

యోగక్షేమం వహిస్తానన్న పరమేశ్వరుడి చైతన్యం జాగృతమైనట్లు స్పష్టంగా తోచింది. భీముడు శల్యుడి విల్లును విరిచాడు. గుర్రాలను, సూతుడిని క్రమంగా కూల్చాడు. శల్యుడి కవచాన్ని నేలపడగొట్టాడు. కవచ హీనుడైన శల్యుడు ఆగ్రహించి, కత్తీ డాలూ తీసికొని రథం దిగి యముడివలె విజృంభించాడు. భీముడు అతడి కత్తిని, డాలునూ విరుగగొట్టాడు. వెంటనే శల్యుడు మరొక కవచాన్ని ధరించి భయంకరమైన గదను చేపట్టి ధర్మరాజుపై ఉద్ధృతంగా దాడిచేశాడు. అప్పుడు సాత్యకి, ధృష్టద్యుమ్న, శిఖండి, ద్రౌపదేయులు, మాద్రేయులు ధర్మరాజుకు బాసటగా నిలిచి శల్యుడిని ఎదుర్కొన్నారు. కాని, అతడు వారిని లెక్కచేయక హుటాహుటి ధర్మరాజుపై సింహంవలె లంఘించాడు. ధర్మజుడు రౌద్రోద్రేకంతో మేనుపెంచి భారమంతా శ్రీకృష్ణుడిపై ఉంచి ఇట్లా మనసులో సంకల్పించాడు.

క. 'ఇతని సమయింప నయ్య । చ్యుతుఁడు ననుం బనిచె; నాకు నొనరించిన పా
లితఁ' డని తలంచి మొగ ము । గ్రత నొందఁగ శక్తిమీఁదఁ గనుదో యొలయన్'. **(శల్య. 1. 273)**

ధర్మరాజు భావనలో ఒక విశేషం ఉన్నది. అచ్యుతుడు ధర్మరాజును శల్యుడిని చంపుమని పంపాడట! శల్యుడిని తన పాలుగా మిగిల్చాడట! ఈ మాట లెంత సార్థకంగా ఉన్నాయి! ధర్మజుడిలో అహంకారం లేదు; కర్తృత్వ భావన లేదు.

అతడు తనను భగవంతుడి సాధనంగా భావించాడు. అచ్యుతుడే అందరినీ సంహరిస్తూ శల్యుడిని తన పాలుగా మిగిల్చాడట! అంటే- చంపేది ధర్మరాజైనా చంపిస్తున్నది అచ్యుతు డని భావం. మొదట శల్యుడిని చంపుతానని ఎంచుకొన్నది ధర్మజుడే. అది అతడికి అహంకారానికి ఆనవాలు. తరువాత తనకు తన పరాక్రమం మీద అనుమానం కలిగి శల్యసంహారం అచ్యుతుడి దయవలన తనకు సిద్ధించే అవకాశ మని భావించాడు. ఆ తరువాత సంకల్పించినవాడూ, ప్రతిజ్ఞ నిర్వహించేవాడూ, చంపేవాడూ - అన్నీ అచ్యుతుడే అని భావించి ధర్మరాజు తనను నిమిత్తమాత్రుడిగా తలంచాడు. ఇక యోగక్షేమ భారం శ్రీకృష్ణుడిదే అయింది.

ఇక్కడ తిక్కన తీర్చిదిద్దిన సన్నివేశం కడు రమణీయం. ధర్మరాజు ప్రదర్శించింది విష్ణుభక్తి, పొందింది శివశక్తి. ధర్మరాజు వద్ద శక్తి అనే మహాస్త్రం ఉన్నది. అది ప్రాణాంతక సమయంలో ధర్మరాజుకు స్ఫురించింది. ఈ స్ఫురణ నిచ్చినవాడు స్థితికారు డయిన విష్ణువు. అందుకే మనస్సులో మ్రొక్కాడు హృషీకేశుడిని.

ఉ. 'నీ దెస నాదు చిత్తమున నెక్కొని యుండెడు భక్తి భద్రసం
పాదిని గావు టచ్చెరువె? భక్తజనాభిమత ప్రదాన వి
ద్యాదయితత్వ మేర్పడ జయం బొడఁగూర్పుము దేవ! సంశ్రితాం
హోదళనంబు నీకు వ్రత; ముల్లము నాపయి నిల్పు మిత్తఱిన్'. **(శల్య. 1. 275)**

విష్ణుభక్తుడికి భద్రత కలగటంలో ఆశ్చర్యం లేదు. భక్తాభీష్టం తీర్చటమే భగవంతుడి వ్రతం. కాబట్టి ధర్మరాజును కాపాడాలని భగవంతుడు సంకల్పిస్తే చాలు జయం కరతలామలకం ఔతుందని భావించటం పై పద్య తాత్పర్యం.

ధర్మరాజుకు స్ఫూర్తి నిచ్చింది విష్ణువు. శక్తి నిచ్చింది పరమేశ్వరుడు.

ఉ. 'అచ్చపు భక్తికిన్ మదిఁ బ్రియంబున నొందిన ఫాలలోచనుం
డిచ్చిన ప్రీతి యోగమును నెక్కుడు భక్తియు నావహిల్లఁగా
నిచ్చలు గంధపుష్పముల నిష్ఠమెయిం బరిశోభితార్చనం
బిచ్చుచుఁ దాను గొల్వ నుతి కెక్కిన యమ్మహనీయ శక్తికిన్'.

మ. 'ప్రణతుండై రభసోదయాభినవదర్పస్ఫూర్తి శోభిల్లుచు
న్మణిదండద్యుతి మంజరీ స్ఫురణము న్సంశోభిఘంటాపటు
క్వణనంబున్ రిపుసైనిక ప్రకర దృక్కర్ణవ్యథం జేయ భీ
షణరేఖం బగుదానిఁ బుచ్చుకొని చంచన్ముష్టి దృష్ట్యుద్ధతిన్'. **(శల్య. 1.277-278)**

శల్యుడిమీద శక్తిని ప్రయోగించాడు. అది శల్యుడి కవచంలో ప్రవేశించి, రొమ్ము చీల్చి వీపునుండి బయటకు వెలువడి భూమిలో ప్రవేశించింది. ఆ వేటువలన ముక్కులనుండి, చెవులనుండి, కన్నులనుండి నెత్తురు కారుతూ శరీరాన్ని తడిపివేయగా శల్యుడు - ప్రియురాలి ఉరంమీద వాలే ప్రియుడివలె - నేలమీద చేతులు రెండూ చాచి బోరగిలపడి ప్రాణాలు వదిలాడు. ధర్మరాజు చేసిన ధర్మయుద్ధంలో చనిపోయిన శల్యుడు శాస్త్రోక్తంగా సమర్పించిన హవిస్సులను స్వీకరించి చల్లారిన హోమాగ్నివలె భాసించాడు.

శల్యుడి తమ్ముడూ, చుట్టాలూ కలిసి ధర్మరాజును ఎదుర్కొని ప్రాణాలు కోల్పోయారు. కృతవర్మ, కృపాచార్యుడు వీగిపోయారు. శల్యపర్వంలో ధర్మరాజుకు తిరుగులేని విజయం సిద్ధించింది. ఈ పర్వంలో భీమార్జున నకుల సహదేవులు, మిగిలిన వీరులూ చేసిన పోరు స్థాయిభావానికి పోషకంగా నిలిచిన సంచారిభావాల సంపుటివలె రాణించింది.

శల్యు డెవ్వరికీ ఆజన్మశత్రువు కాడు. పగతో ఎవరినైనా చంపుతానని అతడు శపథాలు చేయలేదు. అతడిని చంపటానికి కారణంగా బలమైన విద్రోహచర్య ఏదీ కానబడదు. దుర్యోధనుడు అతడిని అవసరం కొద్దీ వాడుకొన్నాడు. కర్ణసారథ్యం తరువాత శల్యుడు కౌరవసైన్య సారథ్యం నిర్వహించవలసి వస్తుందని ఊహించలేదు. మిగిలినవారిలో పెద్దవాడు, తనపట్ల అభిమానం చూపాడని మాత్రమే దుర్యోధను డాతడికి సైన్యాధ్యక్షపదవి నిచ్చాడు. ఏ కారణంచేతనో కృప, కృతవర్మ, అశ్వత్థామలను సర్వసైన్యాధ్యక్షులుగా అతడు శల్యుడికి ముందుగా వరించలేదు. అది కూడా విధి ప్రేరితమనే భావించాలి. పాండవులు చేసిన శపథాలలో ధర్మజ, నకుల, సహదేవులవి ఇంకా పూర్తికావలసి ఉన్నది. ఆ వరుసలో శల్యుడు, శకుని, ఉలూకుడు చావటానికి మిగిలి ఉన్నారు. అందువలన శల్యుడిని ఎన్నుకొని ఉంటాడు. అతడు యుద్ధం చేసింది సగం దినం. కొన్ని గడియలు మాత్రమే పాండవులను సంహరించే ప్రతాపాన్ని ప్రదర్శించి మెరుపువలె మెరిసి ఆరిపోయాడు. అతడి నాయకత్వంలోనే శల్య, శకునుల పుత్రులు, మిత్రులు అస్తమించారు. భీమ ప్రతిజ్ఞకు బలికావలసి ఉన్న దుర్యోధనుడు ఒంటికంబంవలె నిలిచి ఉన్నాడు. ఇట్లా నిలిచిన దుర్యోధనుడు గెలిచిన రాజా? ఓడిన రాజా? సైన్యాధిపతియా? సైన్యాధిపతిని నియమించే సర్వాధికారియా? పెద్ద ప్రశ్నార్థకంగా మిగిలిన దుర్యోధనుడు శల్య మరణానంతరం శకునిని పిలిచి తరువాతి కార్యక్రమాన్ని గురించి అడిగాడు. శకుని తాను సేనాపతి నౌతానని అనలేదు. మరెవ్వరూ అతడి పేరును ప్రతిపాదించలేదు. శకుని తన పావులు నడిపి 'రాజు పూనుకొని ముందుకు ధైర్యంగా సాగకపోతే సైనికులు మెచ్చుకొంటారా?' అని సలహాచెప్పి దుర్యోధనుడిని ముందుకు త్రోశాడు. సేనాపతి అయితే చావక తప్పదని శకునికి తెలుసు. కాని, చివరి క్షణంలో కూడా మోసంతో విజయాన్ని సాధించి దుర్యోధనుడికి బహూకరించటానికి యత్నించాడు. అశ్వసైన్యంతో పాండవబలాన్ని వెనుకనుండి దాడిచేసి మట్టుపెట్టాలని రహస్యవ్యూహం పన్నాడు. దానిని నకుల సహదేవులతో త్రిప్పికొట్టించి ధర్మరాజు అతడి ప్రాణాలను తీయించాడు. మోసగాడిని మోసంతో కాక మొగంమీద మొత్తి శకునినీ, ఉలూకుడినీ నకుల సహదేవులు చంపారు. శకుని తరువాత చివరకు మిగిలింది కృపాశ్వత్థామ కృతవర్మలు. వారితో యుద్ధభవితవ్యాన్ని గురించి చర్చించకుండానే దుర్యోధనుడు రణరంగం నుండి ఏకాంతంగా నిష్క్రమించి ద్వైపాయన హ్రదంలో దాగికొన్నాడు. మిగిలిన ముగ్గురు రథికులూ దారం తెగిన గాలిపటాలవలె గమ్యంలేని గతితో తిరుగవలసి వచ్చింది. శల్యవధ కౌరవులకు హృదయశల్యంగా పరిణమించింది.

యుద్ధషట్కంలో శల్యపర్వం సాధారణ యుద్ధ ప్రక్రియ సాగిన సహజపర్వం. శల్యవధవరకు ధర్మజుడి విజయాన్ని సూచించే వస్తు ధ్వని రమణీయంగా సాగింది. ఈ పర్వంలో శల్యుడు మహాస్త్ర ప్రయోగం చేయలేదు. ఆ మాటకు వస్తే కౌరవపాండవ వీరులందరూ శస్త్రప్రయోగాలే చేశారు కాని అస్త్రాలు వెలికి తీయనేలేదు. ఇందులో మహేశ్వరదత్తమైన శక్తిని బయటికి తీసి ప్రయోగించినవాడు ధర్మరాజొక్కడే. అందుకే అతడు గెలుపును సాధించి నాయకుడయ్యాడు. ఇందులో శల్యధర్మజులకు ఏ శాపాలూ లేవు. శల్యుడు పొందింది సహజమరణం. ధర్మజుడు సాధించింది సహజ విజయం. అందువలన శల్యపర్వం సహజయుద్ధపర్వం.

5. శల్యపర్వ నామ సార్థక్యం:

శల్యపర్వం వస్తుతః రెండు భాగాలుగా విరిగింది. పూర్వభాగం శల్యనామధేయుడైన సేనాని పేరుతో సార్థకమయింది. ఉత్తర భాగం శల్యశబ్దార్థ ప్రవర్తనంవలన సార్థకమయింది. శల్యమంటే కంటకం (ముల్లు) అనీ, గుండెలో గ్రుచ్చుకొన్న బాణమనీ, బాణపు ముక్క అనీ, ఒకచోట నిలువక చలించేదనీ (శలతీతి శల్యః శల చలనే) అర్థాలు గోచరిస్తాయి. శల్యపతనానంతరం దుర్యోధనుడు రణరంగంలో అనేక విధాల యుద్ధం చేయటానికి యత్నించి, తన వారందరూ తనువులు చాలించగా, రణరంగాన్ని వీడి ద్వైపాయన హ్రదానికి సాగిపోయాడు. ఆ తరువాత భీముడితో గదాయుద్ధం చేయటానికి శమంత పంచక తీరానికి వెళ్ళాడు. అట్లాగే కృప, కృతవర్మ, అశ్వత్థామలు దుర్యోధనుడి అన్వేషణలో తిరగటం, పాండవులు దుర్యోధనుడు దాగి ఉన్న చోటును అన్వేషించటానికి తిరగటం, చారులవలన విని దుర్యోధనుడున్న హ్రదం వద్దకు పోవటం, అక్కడికి తీర్థయాత్రాచణశీలి అయిన బలరాముడు రావటం, దుర్యోధనుడు, పాండవులు, శ్రీకృష్ణ సాత్యకులు శిబిరాలలో వసించకుండ రాత్రివేళ నదీతీరాలకు వెళ్ళి నిద్రించటం, శ్రీకృష్ణుడు నడిరేయి హస్తినాపురానికి

వెళ్ళిరావటం, యుయుత్సుడు భర్తలను కోల్పోయిన స్త్రీలను హస్తినాపురానికి చేర్చటం మొదలైన సన్నివేశాలన్నీ చలన శీలాన్ని తెలిపే కథాంశాలుగా గోచరిస్తాయి. అందువలన శల్యపర్వనామం స్వభావ వ్యంజకంగా సార్థకమయింది.

శల్యపర్వోత్తర భాగంలోని కథలో ముఖ్యాంశం దుర్యోధనుడి ఊరుభంగం. ఇది కౌరవపాండవుల హృదయాలలో శాశ్వతంగా నాటుకొన్న శల్యం. దుర్యోధనుడు తొడలు విరిగి పడిన నాటినుండి నేటివరకు ఈ అంశంపై ధర్మాధర్మచర్చ చర్చనీయాంశమై సాగుతూ రావణకాష్ఠంవలె ఆరకుండా మండుతూనే ఉన్నది. శల్యమంటే ముల్లూ కావచ్చును. బాణమూ కావచ్చును. పాండవులకు కురుసభలో గుచ్చుకొన్న శల్యాలు అనేకం. మాయాద్యూతంలో ధర్మజుడి రాజ్యం హరించటంవలన కలిగిన బాధ ఒక శల్యం. ద్రౌపది నేకవస్త్ర అని కూడా తలంచక నిండుకొలువుకు జుట్టుపట్టి లాగికొని వచ్చి అవమానించటం మరొక శల్యం. ద్రౌపదిని తన తొడపై కూర్చుండుమని దుర్యోధనుడు సైగ చేయటం మరొక శల్యం. ద్రౌపదిని 'బంధకి' అని కర్ణుడు పిలిచి హేళన చేయటం మరొక శల్యం. అభిమన్యుడిని ఒంటరివాడిని చేసి, బాలుడని కూడా భావించకుండా ప్రౌఢవీరులందరూ కలిసి మోసంతో సంహరించటం మొదలైనవి శల్యాలే. బాల్యంనుండి దుర్యోధనుడు పాండవులకు చేసిన అపకారాలన్నీ మాయని గాయాలవలె బాధపెట్టే శల్యాలు. పాండవుల గుండెలలో గుచ్చుకొన్న శల్యాలకు ప్రతిజ్ఞాపాలనలే నివారణోపాయాలు, తగిన ఔషధాలు. ప్రతిజ్ఞలు ధర్మశాస్త్రాలను చూచి చేసేవి కావు. శాపాలూ అంతే. శత్రువులు చేసిన అధర్మ క్రియలకు ప్రతీకార క్రియలే పాండవ ప్రతిజ్ఞలు. వాటిని పగ తీర్చికొన్నట్లుగా తీర్చికొని కృతప్రతిజ్ఞులు కావటమే క్షత్రియులకు కృతార్థత. ఇది క్షత్రియ వీరధర్మం. ప్రతిజ్ఞానిర్వహణంమీద ప్రతివిమర్శ ఎంతవరకు న్యాయం? అనేది శల్యపర్వంలో ప్రారంభమయ్యే చర్చ. యుద్ధధర్మానికీ, ప్రతిజ్ఞానిర్వహణానికీ, లోకధర్మానికీ, ధర్మశాస్త్రానికీ, వేదతాత్పర్యానికీ ముడిబెట్టి ఏకవాక్యత సాధించటం ఎవ్వరికీ సాధ్యం కాదు. వేదవ్యాసుడూ, శ్రీకృష్ణుడూ ఆయా ధర్మాలకు అనుగుణమైన సమన్వయ సూత్రాలను చెప్పి హృదయశల్యాలకు తగిన మందువేయగల వైద్య విద్వాంసులు. వారి మాటలకు ప్రామాణ్యం కలిగించటమే భారత పరమార్థం. వారి తీర్పులను అంగీకరించటమే పరమధర్మం. కాదనటం వ్యక్తి దృక్పథం. ఈ రెండింటినడుమ విశ్వజనీనతను సాధించే యత్నమే ఈ పర్వత్రయ ప్రయత్నం. అందులో శల్యపర్వం శల్యమూల్యాంకన చర్యల చర్చాపర్వం. 'ఊరుభంగం' దానికి కేంద్ర బిందువు.

ధృతరాష్ట్ర దుర్యోధనులది కణిక (శుక్ర)నీతి; ధర్మజ శ్రీకృష్ణాదులది బృహస్పతి నీతి. ఈ ఇరువురికీ సమాన ప్రమాణాలు వాదంలో ఉండటం దుర్లభం. మిత్రులనైనా బంధువులనైనా మోసంచేసి, చంపి రాజ్యాన్ని, ధనాన్ని హరించటం శుక్రనీతి సమర్థిస్తుంది. అందువలన దుర్యోధనుడు తాను పాండవులపట్ల వ్యవహరించిన తీరుగాని, సంధిని కాదనటం కాని, రాజ్యభాగ మివ్వననటం గాని, యుద్ధంలో నిర్దయగా అభిమన్యు ప్రభృతులను చంపటం కాని, అధర్మపద్ధతులు కావు. ధర్మం తనదాకా వచ్చినప్పుడు అతడి ప్రమాణాలు వేరౌతాయి. దుర్యోధనుడు శ్రీకృష్ణుడిని భీమార్జునులను, ధర్మరాజును రణనియమాలను ఉల్లంఘించారని వాదించాడు. అందులో ఊరుభంగం నియమ విరుద్ధమనీ, పాండవులది అధర్మ విజయమనీ విమర్శించాడు. కృష్ణుడిపై మోపిన అభియోగా లివి-

సీ. 'కంసదాసుని పుత్త్ర! కానవు నీ దురా । చారంబుఁ గృపయు లజ్జయును లేక
ప్రేలెదు; నీవు సెప్పినఁ బార్థు చేసిన । నన్న గైకొని గదా సంగరంబు
పాడి దొఱఁగి యప్పాపకర్ముఁడు వైచెఁ । గాక; చక్కటి తోడి కయ్య మైన
లీల మిమ్మందఱ నేలపాలుగఁ జేయ । నే; శిఖండి గడంగి యేసె ననఁగ

తే. నర్జునుఁడు శాంతనవుఁ గూల్చునట్లు చేసి; । తస్త్రగురుచాపునకుఁ బాండవాగ్రజున్కు
బొంకు మని పంచి; తరదంబు పుడమిఁ గ్రుంగఁ । గర్ణుఁ జంపించి; తేమనఁ గలదు నిన్ను?'

క. 'భూరిశ్రవుఁ డొక్కనితోఁ । బోరఁగ నేయించి తట్లు; పాడిచీఁకటి నం
హోరహితు సైంధవుని నరు । బారి పఱిచి; తిట్టి నీకుఁ బల్కులు సనునే!'

క. 'నను, భీష్ము, గురుని, సూతసు । తుని భూరిశ్రవు జయద్రథుం జక్కటి ద

ప్పని యనిఁ గోల్పుచ్చుఁగ వ । చ్చునె నీకుం? గపటశూర! సుచరితదూరా!'.**(శల్య. 2. 325 - 327)**

అతడి మాటలకు శ్రీకృష్ణుడు ఇచ్చిన సమాధానంలో రణనియమాలకు సంబంధించినవి కాక ధర్మనీతికి చెందిన అంశాలుండటం గమనార్హం. 'పాండునందనులు పుట్టినంతనుండి నేఁడు దుదిగా నీయెడ ధర్మవిరోధం బాచరింపరు; కురుబలంబునకు గుద్దలి గొని దూర్వ్యాతంబు నీవ తొడరితి; దాన నింతలు వుట్టెఁ; బవనతనయుండు పట్టిన ప్రతిన యెఱుంగవె? గద నూరుభంగంబు సేయుదు నని పలికి పిడికిటం బొడుచునే? యవి యెల్లను వృథాజల్పంబు; లూరకుండు'. (శల్య. 2.328) మని మందలించాడు.

దుర్యోధనుడు శ్రీకృష్ణుడి ధర్మవాదానికి సూటిగా సమాధానం చెప్పలేదు. చెప్పలేడు కూడా. పాండవులపట్ల పగ సాధించటం అతడి కణికనీతి దృష్టిలో ధర్మమే. అందుకే అన్నాడు - 'నేను వేదాలు చదివాను, యజ్ఞాలు చేశాను, సంపదలు గడించి సామంతులు కొలువగా సంతోషించాను. దుర్మదాంధులైన శత్రువులను మర్దించాను. చివరకు మిత్రులతో బంధువులతో కలిసి స్వర్గానికి వెళ్ళుతున్నాను. ఇది ఒప్పదా?' అని అడిగాడు. కృష్ణుడి దృష్టిలో తాను ఎటువంటి వాడైనా, అతడిని యుద్ధనియమాలకు విరుద్ధంగా చంపినందుకు పాండవులు జీవితాంతం పశ్చాత్తాపంతో పరితపిస్తూనే ఉంటారని పలికాడు. అప్పుడు దేవతలు దుర్యోధనుడిమీద పూలవాన కురిపించారు.

దానిని దైవప్రశంసగా గ్రహించి ధర్మజాదులు తాము దుర్యోధనుడినీ, భీష్మాదులనూ చంపింది ధర్మవిరుద్ధమేమో అని దిగులు పడ్డారు. శ్రీకృష్ణుడు వారితో ఇట్లా అన్నాడు.

సీ. 'గాంగేయు గురుకర్ణ కౌరవపతులఁ జ । క్కటియనిఁ బరిమార్పఁ గాన మైతి
మని మీరు వగవకుఁ; డద్దొర లుగ్రాస్త్ర వేదులు; ప్రస్ఫుట విక్రమమున
నడరి వారల గెల్చు టరిది గావున నేను । బహువిధోపాయముల్ వన్ని యిట్లు
దీర్చితిఁ గాక; యత్తీవ్ర పరాక్రము । లలఁతులఁ బోదురే? యట్లుఁ గాక

తే. వారి విధి యివ్విధమునఁ జావంగఁ జేసె; । దైవఘటనలు దప్పింప మీ వశంబె?
సురలు దనుజులు గెల్చిన చొప్పు లిట్ల; । సంతసపు సమయంబున వంత లేల?' **(శల్య. 2. 331)**

శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు ఉపశమన వాక్యాలుగా తోచినా అత డనుసరించిన ఉపాయాలను దేవతలు దనుజులను వధించటంలో పాటించిన బృహస్పతినీత్యుపాయాలుగా పేర్కొన్నాడు. అది దేవతలు మెచ్చే పద్ధతిగా సూచించాడు. అన్నిటికి మించి వారి వారి విధి వ్రాతలు తప్పించటం ఎవ్వరి తరం కాదు - అని ప్రకటించాడు. ఇంతటితో పాండవులలో ధర్మాధర్మ చర్చ ముగిసినట్లే.

అయితే ఈ చర్యను ముందుకు సాగించింది కౌరవపక్షంవారే. వారిలో బలమైన ప్రతినిధులు ఇద్దరు. ఒక అశ్వత్థామ. అతడికి తోడుగా నిలిచినవారు కృపకృతవర్మలు. రెండు: గాంధారి. ఆమె నంటి ఉన్నవాడు ధృతరాష్ట్రుడు. వీరికి ప్రతివాదులుగా నిలిచినవారు శ్రీకృష్ణుడు, వేదవ్యాసుడు. ముద్దాయిలుగా నిలిచి వినయవాక్యాలతో ఎదుటివారి ఎత్తులను చిత్తుచేసినవారు ధర్మజ భీమాదులు. అశ్వత్థామ మాటలకంటె మిన్నగా పగకు ప్రతిచర్యను నడిపి, పాండవులకు వగకలిగించి, వారి పగ తీర్చే చర్యలవలన తానూ వగచెంది శిరోమణిని పోగొట్టుకొని జీవచ్ఛవంగా నిలిచాడు. గాంధారి శ్రీకృష్ణుడిని శపించి ఆయనచేత నిష్ఠురా లాడించుకొని, పశ్చాత్తాపపడి పాండవులచేత తమకు అపరకర్మలు తప్పని తమ కర్మకు స్వయంకృతాపరాధాలే కారణమని తెలిసి, తెలివితో మౌనం పాటించింది. ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడి వ్యూహంలో చిక్కి ఇనుప భీముడి విగ్రహాన్ని కౌగిలించుకొని, దానిని విరుగగొట్టి తనలోని పగను పైకి ప్రకటించుకొని కుటిలుడుగా అపకీర్తిపాలయ్యాడు. శ్రీకృష్ణుడి

మందలింపుతో మారుమాటాడకుండ ఉండిపోయాడు. అనగా, శల్యపర్వంలోని 'ఊరుభంగం' రేపిన దుమారం రెండు పర్వాల నిండా రేగి చివరకు మృతుల కిచ్చిన జలతర్పణాలతో అణగిపోయిందన్నమాట!

నన్నయ శల్యపర్వాన్ని 'నవ్యార్థరమణీయ' మని ప్రశంసించాడు.

ఆ. 'సభల విస్తరిల్లి శల్యాదికములైన । నాల్గు పర్వముల వినంగఁ జాలి
నవమ పర్వమనఁగ నవ్యార్థరమణీయ । మగుచు శల్యపర్వ మతిశయిల్లు'. **(ఆది. 1. 52)**

6. సౌప్తికపర్వ కథాసూత్రం:

సౌప్తికపర్వ కథానాయకుడు అశ్వత్థామ. పగను సాధించటంలో దుర్యోధనుడికి మానసిక ప్రతినిధి. అయితే, వారిద్దరి ప్రతీకారాలలో ప్రాధాన్య వివక్షలు వేరు. భీష్ముడిని చంపటానికి పగతో తపస్సుచేసి పుట్టాడు శిఖండి. ద్రోణుడిని చంపటానికి పగతో ద్రుపదుడు చేసిన యజ్ఞఫలంగా జన్మించాడు ధృష్టద్యుమ్నుడు. దుర్యోధనుడిలోని పగను పెంచి మహాగ్నిగా మార్చిన కర్ణుడు తనశాపాలకు తానే బలి అయ్యాడు. అతడి మృత్యువుకు అర్జునుడు హేతువయ్యాడు. దుర్యోధన దుశ్శాసనుల పగకు గురి అయిన భీముడు వారి చావుకు కారణమయ్యాడు. ఈ వీరుల మరణాలకూ బలమైన కారణాలున్నాయి. కాగా, అశ్వత్థామను ప్రతీకారశక్తిగా మార్చిన సన్నివేశాలు ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిని చంపిన తీరు, దానిని వీరధర్మంగా చెప్పుకొంటున్న పాండవుల వైఖరి, దానిని సమర్థించిన శ్రీకృష్ణుడి వైనం.

యజ్ఞకుండంలో నుండి పుట్టిన ధృష్టద్యుమ్నుడు పాండవ సర్వసేనాధ్యక్షుడు అయ్యాడు. అంటే ద్రుపదుడి పగనుండి ద్రోణవధ కొరకే పుట్టిన వీరుడిని పాండవులు తమసేనాపతిగా అంగీకరించారన్నమాట! అతడు పరాక్రమాతిశయంతోనే, తపఃఫలంతోనో, మహాస్త్రసంపదతోనో ద్రోణాచార్యుడిని చంపుతాడని అందరూ ఆశించారు. కాని, నిజానికి ద్రోణుడిని చంపింది శ్రీకృష్ణుడి నీతిచాతుర్యం, ధర్మజుడి వాక్యచాతుర్యం. అశ్వత్థామ హతుడైనాడన్న వార్త ఆయనను యుద్ధవిముఖుడిని చేసింది. బ్రతుకుమీది ఆశను మాన్పింది. యోగంతో ప్రాణాలను త్యజించి జీవన్ముక్తావస్థను సాధించాడు ద్రోణుడు. అట్టి స్థితిలో జుట్టుపట్టి, తలపైకెత్తి, కత్తితో శిరస్సు నరికాడు ధృష్టద్యుమ్నుడు. అర్జునాదులు దానిని వారించినా ధృష్టద్యుమ్నుడు వినలేదు. చచ్చినపామును చంపిన వీరుడయ్యాడు పాండవసేనాపతి. ఆ సంగతి తెలిసిన అశ్వత్థామ అప్పుడే పగతీర్చుకొనటానికి విజృంభించాడు కాని, పాండవు లతని ఆట కట్టించటంతో ఆ ప్రయత్నం మానుకొన్నాడు. లేకపోతే తండ్రి తరువాత కొడుకే సైన్యాధ్యక్షు డయ్యేవాడేమో! కర్ణుడికి అగ్రతాంబూలం ఇవ్వటంతో అశ్వత్థామ వెనుకబడ్డాడు. కర్ణుడి తరువాత కూడా ఆతడే శల్యుడి పేరు చెప్పాడు. శల్యుడి తరువాత దుర్యోధను డెవరి పేరూ చెప్పలేని స్థితిలో ఉండటంచేత తాను చేయదలచుకొన్న ప్రతీకారానికి అవకాశం దొరకలేదు. అందువలన తనంతట తానే కౌరవసేనాపతిగా ఉండటానికి ప్రతిపాదించుకొన్నాడు. అతడు చంపదలచుకొన్న వారివరుసలో మొదటివాడు ధృష్టద్యుమ్నుడు. అతడిని పశువును చంపినట్లు చంపుతానని తన కసినంతా ఒలకపోశాడు. ద్రుపద సంతానంలో పురుషులు మొదట, ఆ తరువాత ఆతడి స్త్రీ సంతానమైన ద్రౌపదికి పుట్టిన సంతానం (ఉపపాండవులు) అతడి లక్ష్యం. ధృష్టద్యుమ్న సేనాపతిత్వాన్ని అంగీకరించిన పాండవులూ, పాండవసైన్యం,. ఏనుగులు, గుర్రాలూ - అందరూ వధార్హులే. యోగనిద్రలో ఉన్న ద్రోణుడిని చంపిన పాండవులందరూ నిద్రలో ఉండగా చంపదగిన వారే. ఇట్లా ఆలోచించిన అశ్వత్థామ అంతఃకరణానికి బహిఃప్రతీక గుడ్లగూబ. రాత్రివేళ సంచరించే ఆ పక్షికి కాకులగుంపును చంపటం ప్రతీకారచర్య కాదు, స్వాభావికచర్య మాత్రమే. పొగవంటి పగచీకటిలో ఉన్న అశ్వత్థామకు కూడా అది సహజ యుద్ధ చర్యగానే స్ఫురించింది. అతడికి తగిన రాజు దుర్యోధనుడు - ఆ క్రింది రాత్రి పాండవులు రాత్రివేళ దాడిచేస్తారేమో అనే భయంతో శిబిరంలో పడుకొనకుండా సరస్వతీ నదీతీరంలో బసచేశాడు. కాని, పాండవులు ఆ దుశ్చర్యకు పాల్పడలేదు. అశ్వత్థామ అటువంటి చర్యకే పూనుకొన్నాడు. దుర్యోధనుడి తొడలు విరుగగొట్టింది భీమసేనుడు కదా! మరి అశ్వత్థామ అతడిపై దండెత్తటానికి మొదట సంకల్పించలే దెందుకు? అసలు రహస్యం అది కాదు. రారాజు అనుమతిస్తే తనపగను సాధించుకొనాలని. దుర్యోధనుడు ప్రేరకుడు కాదు. నిమిత్తమాత్రుడైన కారకుడు. రాత్రి యుద్ధం ధర్మవిరుద్ధమని

కృపాచార్యుడు హితబోధ చేసినా, అతడు పగసాధింపు న్యాయానికే ప్రాధాన్యమిచ్చి, కృప కృతవర్మలను నిరుత్తరులను చేయగలిగాడు. పగతీర్చుకొనటంలో ధర్మచింత లేదనీ, పగతో పుట్టినవారి చావు పగతోనే ముగియటం కాలం ధర్మమనీ అశ్వత్థామ తన ప్రవర్తనతో ప్రతిష్ఠాపనం చేశాడు. ధృష్టద్యుమ్న శిఖండులను తాను చేతులారా చంపి సంతృప్తిని ప్రకటించాడు. ద్రౌపదికి పుట్టిన పాపానికి ఉపపాండవులకు ఉచితమైన శిక్ష వేశానని భావించాడు. ఆ విశేషాలను దుర్యోధనుడికి చెప్పి అతడి చేత భీష్మ ద్రోణ కర్ణాదులు చేయని ఘనకార్యం చేసినట్లు ప్రశంస లందుకొన్నాడు. తన పగకు ఫలంగా తన కేమౌతుం దని మొదట ఊహించలేదు. కాని, పాండవ శిబిరంలో పాండవులూ, శ్రీకృష్ణుడూ, సాత్యకీ కనబడకపోవటంతో పాండవ ప్రతీకారం తనకు అపాయం కలిగిస్తుందని శంకించాడు. చేసిన పాపం ధృతరాష్ట్రుడికి చెప్పి పితౄణాన్నీ ప్రభుఋణాన్నీ తీర్చుకొన్న తృప్తితో, వ్యాసాశ్రమానికి పోయి తాపసిగా వేషం మార్చి తపస్సు చేయటం మొదలుపెట్టాడు.

చమత్కార మేమంటే - దుర్యోధన విరోధి భీముడూ, కర్ణవిరోధి అర్జునుడూ, ద్రోణవధకు కారకుడైన ధర్మరాజూ, కౌరవులకే విరోధి అనిపించుకొనే శ్రీకృష్ణుడూ అతడు తాపసి వేషంలో దాగి ఉన్న తామసిక రూపాన్ని బయటపెట్టారు. ద్రుపదవంశానికి ఆడబడుచైన ద్రౌపది అశ్వత్థామను పరిభవించటానికి పగతోకూడిన పంతంపట్టి భీముడిని ప్రేరేపించి అతడిపైకి ఆగ్రహంతో పంపింది. శ్రీకృష్ణుడు మిగిలినవారి నందరినీ అతడికి తోడుగా తీసికొనివెళ్ళాడు. అనగా ప్రాణాలతో మిగిలిన పాండవ పక్షమంతా కలిసి అశ్వత్థామను అంతం చేయాలని పూనుకొన్నదన్నమాట! పగల ప్రతాపాలు ప్రచండంగా సంఘర్షణకు దిగాయి. కురుక్షేత్ర యుద్ధంలో ఇది చివరి ఘట్టం. అద్భుతానికే అద్భుతం. ఆ అద్భుత పురుషోత్తముడు శ్రీకృష్ణుడు. ఆయన కురుసభలో చేసిన ప్రకటనను అంతవరకు పరోక్షంగాను, ప్రత్యేకించి సౌప్తికపర్వంలో ప్రత్యక్షంగానూ ప్రపంచించి చూపించాడు.

ఉ. 'సారపు ధర్మమున్ విమల సత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁబారిన దైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగుఁ గాని ధర్మ ని
స్తారకమయ్యు సత్యశుభదాయక మయ్యును దైవ ముండెడున్'. **(ఉద్యో. 3.373)**

సర్వకాల సర్వావస్థలయందు నిత్యసత్యంగా నిలిచేది సారవంతమైన ధర్మం. ఆపద్ధర్మాలూ, అవాంతర ధర్మాలూ, అవసరానికి అనువైన అవస్థా ధర్మాలూ సారవంతాలు కావు. సాపేక్షాలు మాత్రమే. ధర్మానికి విజయం కలగటమే సారపుధర్మం. చిత్తశుద్ధితో కూడిన సత్యం విమలసత్యం. ధర్మలక్షితమైన త్రికరణశుద్ధి విమలసత్యం. యుద్ధంలో ధర్మవిజయానికి కృషిచేస్తూ కార్యసాధనకు ఆపద్ధర్మంవంటి దానిని ఆశ్రయించినా చిత్తశుద్ధీ లక్ష్యశుద్ధీ దానిని కలుషితం కాకుండా రక్షిస్తాయి. ఒకవేళ దానికి పాపం, అసత్యం అడ్డుపడి ఆపదలు కలిగిస్తే, ఫలవంతం కాకుండా చేస్తే ఆ సమయంలో ఎవరు ఉపేక్ష చేసినా వారికి చేటు తప్పదు. సమర్థుల ఉపేక్షవలన కార్యం చెడిపోయే అవస్థ ఏర్పడినప్పుడు దైవమే పూనుకొని ధర్మాన్ని రక్షించి, సత్యశుభదాయకమైన ఫలాన్ని అందిస్తాడు. ఈ ప్రకటన అక్షరాలా సత్యమయింది సౌప్తికపర్వంలో.

కౌరవులకు ఎప్పుడూ అపకారం చేయని పాండవుల వర్తనం సారవంతమైన ధర్మం. తమకు న్యాయంగా రావలసిన రాజ్యభాగంకంటె మరొక్కటి అడగకుండా ఉండటం, సంధికి రాయబారం పంపటం, కౌరవుల దుర్నీతికి ఫలంగా మరొకమార్గం లేక యుద్ధం చేయటం విమల సత్యానికి సాక్ష్యాలు. భీష్మపతనం నుండి శల్యపతనం వరకు విజ్ఞులు సంధిచేసికొమ్మని ఎన్నిసార్లు ప్రబోధించినా దుర్యోధనుడు వినక పాపచింతతో పాండవులను చంపి వారిరాజ్యాన్ని శాశ్వతంగా అనుభవించాలని భావించటం మహాపాపం. దీనిని శ్రీకృష్ణుడే పెక్కుసార్లు ప్రస్తావించి దుర్యోధనాదులను నిందించటం ఈ పర్వంలో గమనిస్తాం. ఈ పర్వంలో ధృతరాష్ట్రుడు పెద్ద బొంకు. అతడి మనసులో ఒకటి, మాటలో మరొకటి, చేతలో మరొకటి. అతడు దుర్యోధనుడి దుష్ప్రవర్తనను మాన్పలేక, తాను మారలేక, పరిస్థితులను చక్కదిద్దలేక, ప్రారంభమైన యుద్ధాన్ని ఆపలేక కథను శుభాంతం చేసే శక్తిని కోల్పోయాడు. గాంధారి తన కొడుకును సరిదిద్దుకొనలేక పాపమంతా కృష్ణుడిమీద పెట్టి వాస్తవాన్ని బొంకుగా వక్రీకరించింది. వీరందరికి ప్రతినిధిగా అశ్వత్థామ లోకాన్ని అపాండవం చేయాలని ఆగ్రహించి నరహోమ

శిశుహోమాలు చేశాడు. వీరందరూ సారపు ధర్మాన్నీ, విమల సత్యాన్నీ తమకు తోచిన రీతిలో యథాశక్తి చెడబారేటట్లు చేశారు. శ్రీకృష్ణు డొక్కడే వాటిని సత్యశుభదాయకాలుగా నిర్వహించి, సారపు ధర్మాన్నీ, విమలసత్యాన్నీ సంరక్షించాడు. అందుకే శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడైన సర్వేశ్వరుడని సౌప్తికపర్వం నిర్ద్వంద్వంగా నిరూపించింది.

పాండవ స్కంధావారాన్ని శ్మశానంగా మార్చి, పాండవ ప్రతీకారానికి భయపడి, పాండవులకు పరమపూజ్యుడయిన వ్యాసమహర్షి ఆశ్రమ సమీపంలో నిలిచి, శరీరాన్నంతా బూడిద పూతతో నింపి, పాండవులు గౌరవించే మునివేషంలో తపస్సు చేస్తున్నట్లు నటించాడు అశ్వత్థామ. చేసిన పాపాన్ని, బొంకుతో కప్పిపుచ్చుకొనటానికి యత్నించాడు. పాండవు లాతడి కపట ప్రవృత్తిని సత్యంగా భావించి క్షమిస్తారేమో అని భావించాడు. కాని, భీముడు అతడి బండారాన్ని బైటపెట్టాడు. పరుషంగా మందలించి యుద్ధానికి పిలిచాడు.

తే. 'ఓరి! ధాత్రీసురాధమ! క్రూరకర్మ! కపట ధార్మిక! యత్యంత కల్మషాభి
యుక్తిఁ బోయినరేయి మహోగ్రవృత్తిఁ । దగిలి; తెంత వేగిరమునఁ దపసి వైతి?'

వ. 'ఇట్టు లొదిగినఁ జూపు దప్పునే? లేలెమ్ము! తపమ్ము సాలు; రణమ్మునకు రమ్ము' **(సౌప్తి. 2.59,60)**

భీము డుపయోగించిన సంబుద్ధులు సౌప్తికపర్వంలోని అశ్వత్థామ శీలచిత్రణకు పనికివచ్చే సార్థక విశేషణాలు. వాటిని విన్న అశ్వత్థామ తాను చేసిన మహాపాపాన్ని స్మరించి లోలోన కలత చెందాడు. కాని, పరితాపాన్ని ప్రకటించటానికి సిద్ధపడలేదు. ఆ క్షణంలో కూడా ప్రతీకారాన్నే ఎన్నుకొన్నాడు. అసాధ్యమైన బ్రహ్మశిరోనామక మహాస్త్రాన్ని పైకి తీసి 'దీనివలన అపాండవమగుగాక!' అని సంకల్పించి ప్రయోగించాడు. దానికి ప్రతీకారం చేయకపోతే పాండవులు దగ్ధమౌతారు. శ్రీకృష్ణుడు తాను పూనుకొని అర్జునుడిచేత బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని దానిపై ప్రయోగింపచేశాడు. ఉభయాస్త్రాలూ ఉజ్జ్వలంగా సంఘర్షించాయి. లోకాలు తల్లడిల్లాయి.

అప్పుడు నారదుడూ, వ్యాసుడూ కలిసి వచ్చి ఆ వీరుల నడుమ నిలిచి, మానవులమీద ప్రయోగించరాని ఆ అస్త్రాలను ప్రయోగించటం దోషమని ప్రబోధించి, ఉపసంహరించుకొనండని హితవు చెప్పారు. అర్జునుడు గురుభక్తి ప్రకాశించగా పారాశర్యుడి మాట ననుసరించి ఉపసంహరించుకొన్నాడు. ఒకసారి ప్రయోగించి ఉపసంహరించుకొన్నవారికి కీడు కలుగుతుందనే నియమమున్నా వ్యాసుడి కృపవలన అర్జునుడికి ఏ అపాయమూ కలుగలేదు. అశ్వత్థామ ఆత్మనిగ్రహాన్ని కోల్పోవటంచేత అస్త్రాన్ని ఉపసంహరించుకొనలేకపోగా, విచారిస్తూనే ఇట్లా అన్నాడు:

చ. 'పరిభవజాతరోషమునఁ బ్రాణభయంబునఁ జేసి యిమ్మహా
శరము వివేకవర్జిత విచారుఁడనై యిటు లేసితిన్; మునీ
శ్వర! ఇది పాండుభూపసుతవర్గము నంతటి నేర్చుఁ గాని యె
ప్పురుసున మాన; దివ్విధము పాపమ యేనియు దాని కోర్చితిన్'. **(సౌప్తి. 2. 75)**

అన్నాడు. తపస్సు చేస్తున్నవాడికి పగ పనికిరాదని చెప్పి, పాండవులు అతడి ప్రాణాలు తీయకుండా ఉండాలంటే శిరోమణి నర్పించుమని వ్యాసుడు హితవు చెప్పాడు. శిరోరత్నం ధరించినవారికి నాగభయం, దొంగల భయం, దానవభయం, దేవభయం కలుగవు. ఆకలి, దప్పిక, నిద్ర రోగభయాలు ఉండవు. అట్టి రత్నాన్ని ఇవ్వటానికి మొదట అంగీకరించకపోగా, అతడి అస్త్రం 'పాండవేయ రాగపాత్ర గర్భమాలకు హాని కలిగించి శాంతి పొందుతుం'దని చెప్పాడు. 'అపాండవ మౌతుం'దన్న మాటకు ప్రత్యామ్నాయ మిది. అందులో 'ఒక దాని కాసపడబోకు' మని వ్యాసుడు కోరాడు. అతడు దానికి అంగీకరించలేదు. అప్పుడు శ్రీకృష్ణుడు అడ్డుతగిలి అభిమన్యుడి తేజం ఉత్తరగర్భంలో పెరుగుతున్నదనీ దానిని రక్షించుమనీ కోరాడు. అది పాండవ పక్షపాతంతో అడుగుతున్న కోరికగా పేర్కొని శ్రీకృష్ణుడి మాటను అశ్వత్థామ తిరస్కరించాడు. దానితో శ్రీకృష్ణుడిలోని దివ్యత్వం జాగృతమై ఆ బిడ్డను తానే రక్షిస్తాననీ' అతడు వంశకరు డౌతాడనీ ప్రకటించటం జరిగింది. ఆ మాట వెంటనే అమలు జరిగింది. ఉత్తరగర్భం నిలిచింది. 'అస్త్రాగ్ని దగ్ధుడైన వాడిని రక్షించటం మేలేకదా!' అని అవహేళన చేశాడు అశ్వత్థామ. సకల గర్భాలపై అస్త్ర ప్రయోగం చేశాడు.

బాలఘాతి అయిన అశ్వత్థామ ఆహారం లేక, సహాయం లేక, దుర్గంధంతో కూడిన రక్తంతో శరీరం కుళ్ళిపోతూండగా మూడువేలేళ్ళు తిరుగుతూ కృపాచార్యుడిచేత విలువిద్య నేర్చిన పరీక్షిత్తునూ, అతడి కొడుకు జనమేజయుడినీ చూడగలడని శ్రీకృష్ణుడు శపించాడు. వేదవ్యాసుడు కూడా ఆ శాపాన్ని ధ్రువీకరించాడు. శిరోమణిని పాండవుల కిప్పించాడు.

తే. బ్రాహ్మణుఁడవయ్యు నిట్లు క్రూరతకు రోయ । కస్మదీయ వాక్యంబుల నాదరంబు
సేయ కీపాపకర్మంబు సేసినాఁడ; । వచ్యుతుఁడు పల్కినట్టుల యగుము నీవు'. **(సౌప్తి. 2.87)**

అశ్వత్థామ వేదవ్యాసుడిని కూడ వదలలేదు. ఆ మహర్షిని మానవుల మధ్య వసించి ఉండేటట్లు ప్రతిశాపం ఇచ్చాడు. అతడి పగకు పారాశరుడైనా పరమాత్ముడైన ఒక్కటే! అపాండవంగా అంతం కావలసిన ధర్మచరితం ఉద్ధరించబడింది. విమలసత్యం బొంకుచేత, పాపంచేత చెడబారకుండా శ్రీకృష్ణుడు కథానిర్వహణం చేసి ధర్మాన్నీ, సత్యాన్నీ, శుభాన్నీ కలిగించి దైవమనిపించుకొన్నాడు. వంశాంకురాన్ని రక్షించి చంద్రవంశాన్ని ఆచంద్రతారార్కం ఉండేటట్లు చేశాడు.

సౌప్తికపర్వంలో సంహారశక్తి అశ్వత్థామ. అతడు మహేశ్వర శక్తి ప్రభావంతో సంహారం చేశాడు. ఇక సంరక్షణ శక్తి శ్రీకృష్ణుడు. భక్త రక్షణ కళాపారీణుడై ప్రకాశించాడు. శివకేశవులు రేయుంబవళ్ళవలె రాణించిన పర్వం సౌప్తికపర్వం.

అందుకే నన్నయ సౌప్తికపర్వం ప్రతిభా పూర్ణమని కీర్తించాడు.

క. 'నుత సౌప్తికాది పర్వ । త్రితయంబునఁ దనరి వసుమతీసురవర స
మ్మతమై సౌప్తికపర్వము । ప్రతిభ వినం బొలుచు దశమపర్వం బనఁగన్'. **(ఆది. 1. 54)**

7. స్త్రీపర్వం సార్థకనామం:

శల్య సౌప్తికపర్వాలవలెనే స్త్రీపర్వం కూడా రెండాశ్వాసాలలో నిర్మించబడింది. ఇందులో ప్రధానపాత్రలు గాంధారీ ధృతరాష్ట్రులు. వీరిద్దరూ పుత్రులనూ, బంధువులనూ, పౌత్రులనూ, మిత్రులనూ కోల్పోయి రెక్కలు తెగిన పక్షులవలె, కొమ్మలు విగిరిన చెట్లవలె మిగిలిపోయారు. ఆ దంపతులు కురుక్షేత్ర యుద్ధానంతరం వ్యవహరించిన తీరు ఈ పర్వంలో ప్రధానవస్తువు. పుత్రుల మరణవార్త ధృతరాష్ట్రుడికి అపారదుఃఖాన్ని కలిగించింది. గాంధారికి దుఃఖాన్ని మించిన కోపాన్ని పెంచింది. వారిరువురిని శాంతింపజేయటం ప్రథమాశ్వాసంలోని వస్తువు. విదురుడూ, కృష్ణద్వైపాయనుడూ ధృతరాష్ట్రుడి దుఃఖాన్ని శమింపచేసే బోధను చేశారు. కృపాచార్యుడూ, వ్యాసుడూ గాంధారి దుఃఖాన్నీ, కోపాన్నీ చల్లార్చటానికి యత్నించారు. శ్రీకృష్ణుడు, ధర్మరాజు, భీముడు మొదలైన పాండవులు నిపుణంగా వ్యవహరించి ఆ దంపతులకు దుఃఖకోపోపశమనం చేసి ప్రశాంత వాతావరణాన్ని కల్పించగలిగారు.

పురుషుడైన ధృతరాష్ట్రుడికంటె స్త్రీ అయిన గాంధారి పాత్ర ఈ పర్వంలో విశిష్టస్థానాన్ని పొందింది. రణరంగంలో అసువులు కోల్పోయిన వీరుల భార్యలందరూ శోకమూర్తులై వారివారి ఆత్మీయుల శవాలను దర్శించి తమ కన్నీటి తర్పణాలను అర్పించటానికి యుద్ధభూమికి బయలుదేరారు. వారందరికీ గాంధారి నాయకురాలుగా ముందు సాగింది. సంతతినంతా కోల్పోయి భర్తతో మిగిలిన హస్తినాపుర మహారాజ్ఞి ఆమె ఒక్కతే. ఆమె శాపానుగ్రహశక్తియుక్తురాలైన పతివ్రత. ఆమె మిగిలిన స్త్రీలను ఓదార్చగలదా? ఆ విషాదానికి కారణం ఎవరని ఆమె వారికి నిరూపించి చెప్పగలుగుతుంది? పాండవులా? కౌరవులా? ధృతరాష్ట్రుడా? చివరకు తానా? లేక జగన్నాటక సూత్రధారి శ్రీకృష్ణుడా? - ఎవరీ విపత్తుకు కారణం? అన్న ప్రశ్న స్త్రీలకందరికీ సంబంధించింది. వారందరి మనోభావాలకు మణిదర్పణమే స్త్రీపర్వం.

పాండవులు ధృతరాష్ట్రుడిని చూచి జాలిపడతారు; గాంధారిని చూచి భయపడతారు. ఆ రాజు పుట్టుగ్రుడ్డి. ఆమె కన్నులకు గంత కట్టుకొన్న ఇల్లాలు. శ్రీకృష్ణుడు కురుసభలో విశ్వరూపాన్ని ప్రదర్శించినప్పుడు దానిని చూడగలగటానికి ధృతరాష్ట్రుడికి దివ్యదృష్టిని ప్రసాదించాడు. ఆ తరువాత దృష్టిని ప్రసాదిస్తానన్నా పరమాత్మదర్శనం చేసిన దృష్టితో లోకాన్ని చూడనని దృష్టిని ఉపసంహరించుమని ధృతరాష్ట్రుడు కోరుకొన్నాడు. యుద్ధారంభంలో వేదవ్యాసుడు రణరంగంలో జరిగే

సన్నివేశాల నన్నింటిని దర్శించగలిగే దివ్యదృష్టి నిస్తానన్నాడు. కాని, కుమారులు ప్రదర్శించే ఆ క్రూరకర్మలను చూడలేనని గ్రుడ్డిరాజు దానిని స్వీకరించలేదు. సంజయుడికి వ్యాసు డా దృష్టి నిచ్చి జరిగిన వృత్తాంతాన్ని రాజుకు వినిపించే సౌకర్యాన్ని కలిగించాడు. దుర్యోధనుడి పతనంతో అతడి దివ్యదృష్టికూడా ఆగిపోయింది. ధృతరాష్ట్రుడు పూర్వంవలెనే గ్రుడ్డిరాజుగానే మిగిలిపోయాడు. ఇతరుల సహాయంతో బ్రతికే ఇబ్బందిలో పడ్డాడు. అయినా, అతడికి ఆత్మజ్ఞానం కలగలేదు.

గాంధారి చరిత్రం స్త్రీపర్వంలో విచిత్రం. ఆమె ఎంత శోకమూర్తియో అంతకంటె మించిన క్రోధమూర్తి. కొడుకులలో ఒక్కడిని కూడా మిగల్చకుండ చంపిన పాండవులంటే ఆమెకు మంట! కడుపుకోతకంటె ఆ మంట అధికంగా బాధకలిగించింది. చనిపోయిన కొడుకులను, మనుమళ్ళను, బంధువులను కన్నారా చూచుకొని కన్నీరు కార్చాలని ఆమె కోరుకొన్నది. వ్యాసు డామె అంతరంగాన్ని గుర్తించి దివ్యదృష్టి నిచ్చాడు. కళ్ళకు గంతలున్నా బయటి ప్రపంచం స్పష్టంగా కనపడసాగింది. ద్వితీయాశ్వాసమంతా ఆమె చేసింది శవాల దర్శనమే. విన్నది - ఆ శవాలపై బడి విలపించే స్త్రీల ఆర్తనాదాలే. ఆమె వాటిని చూచి, విని తానూ స్పందించి శోకించింది. అయితే వాటిని మూగగా అనుభవించటమా? ఎవరికైనా చెప్పుకొనటమా? అన్న ప్రశ్న వచ్చింది. ఇతరులతో పంచుకొన్నప్పుడే బాధ తగ్గుతుంది కాబట్టి శ్రోతగా ఆమె భర్త అయిన ధృతరాష్ట్రుడిని కాక శ్రీకృష్ణుడిని ఎన్నుకొన్నది. ఆయన ఆమె చెప్పినదంతా సాక్షిగా విన్నాడు. చివర కామెకు తోచిన సత్యమేమిటంటే- ఈ కౌరవ వినాశనానికంతా శ్రీకృష్ణుడే మూలకారణమని. దుఃఖంనుండి కోపం విజృంభించింది. అంతఃకలహాలతో యాదవులు నశిస్తారనీ, వారి భార్యలు కౌరవ వనితలవలెనే రోదిస్తారనీ, శ్రీకృష్ణుడు నిస్సహాయుడై చంపబడతాడనీ ఆమె శ్రీకృష్ణుడిని శపించింది. శ్రీకృష్ణు డామెను మందలించి, ఆ సర్వనాశనానికి కారణం ధృతరాష్ట్ర గాంధారుల లోభ గుణమేనని తేల్చి చెప్పి, వారికి పాండవులే దిక్కని చూపించి, దుఃఖ క్రోధాల పొంగును తగ్గించి, బంధువుల పరలోక క్రియలకు పూనుకొనేటట్లు చేశాడు.

మరొక విచిత్ర మేమంటే - స్త్రీపర్వం ముగిసేసరికి కొడుకులను సరిదిద్దుకొనలేక ఒక తల్లి (గాంధారి) నూరుగురు కొడుకులను పోగొట్టుకొన్నది. కన్నెప్రాయంలోనే తాను కన్న పెద్దకొడుకును చివరివరకు ప్రకటించలేక మరొకతల్లి (కుంతి) ఆతడిని స్వార్థానికి బలిచేసింది. ఇద్దరు మహారాజ్ఞులు చేసిన నిర్వాహకమే కురుకులనాశనానికీ, అంతఃపుర వనితల రోదనానికీ, వీరపత్నుల వేదనలకూ మూలకారణమని శ్రీకృష్ణుడు సాక్షిగా ప్రదర్శించే విధిరూప విశ్వదర్శనమే స్త్రీ పర్వం. గ్రుడ్డివారికి కూడా కనపడే దివ్యసత్యం ఇది.

గాంధారివంటి వీరమాతలకు, భానుమతివంటి వీరపత్నులకు శ్రీకృష్ణు డిచ్చిన ఈ శాంతి సందేశం స్త్రీపర్వానికి భరతవాక్యం వంటిది.

సీ. 'వినుము గాంధారి! నీ తనయుండు చేయు । దుర్నయము లెఱుంగవే? నాకు నీకు
శాంతనవునకు నాచార్యునకును బాహ్లి । కునకుఁ దండ్రికి మాన్పఁ గొలఁది గాని
దుర్మానమున నట్లు దొడరి యిట్లయ్యె; మీ । యపరాధమున వచ్చినట్టి కీడు
నకు నింత నొవ్వంగ ననుఁ బల్కఁ దగునె? యు । మ్మలికంబు ధృతిఁ బట్టి మాన్పు మింకఁ;

తే. జేటునకుఁ జావునకు వగఁ జెందు జనుల । కినుమడింపదె మానసమున నలంత?
రాచకూతుండ్రు సుతుల సంగ్రామ నిరత । హృదయు లగువారిఁ గాంచఁ గోరుదుర కాదె'.

(స్త్రీ. 2.167)

8. మూడు రసాల ముచ్చట:

శల్యపర్వంలో భయానక రసం సున్నితంగా పోషించబడింది. భయం కలిగించేవారు మూడు రకాలు. 1. ఆకృతి భీషణులు; 2. క్రియా భీషణులు; 3. మాహాత్మ్య భీషణులు. రాక్షసులు, పిశాచాలు మొదలైనవారు ఆకృతి భీషణులు.

వీరభద్రుడు, పరశురాముడు మొదలైనవారు క్రియా భీషణులు. శ్రీకృష్ణుడు మొదలైన దివ్యులు మాహాత్మ్య భీషణులు. భయం ఒకటే అయినా హేతువులనుబట్టి మూడు విధాలయింది. భయాన్ని అనుభవించేవారు కూడా త్రిగుణ ప్రధానులుగా ఉంటారు. సహజభయం రజస్తమ ప్రవృత్తులలోనూ, సత్త్వసముత్థమైన భయం సాత్త్వికులలోనూ గోచరిస్తుంది. శల్యపర్వంలో ధర్మజుడు సాత్త్వికుడు; దుర్యోధనుడు రాజసికుడు. వీరిద్దరికి కలిగింది మరణభయమే. భయాలన్నింటిలో మరణభయం గొప్పది. స్థాయిభావంగా అభివృద్ధి చెందగలిగింది. సాత్త్వికుడైన ధర్మరాజు శల్యుడిని సంహరిస్తానని ప్రతిజ్ఞచేసినా శ్రీకృష్ణుడి ఆశీస్సులుంటే తప్ప గెలవటం సాధ్యం కాదనే భయం ఆయనకు లోలోన ఉన్నది. ఇంగితజ్ఞుడైన కృష్ణుడు -

క. 'గాంగేయుని గుంభజుఁ గ । ర్ణుం గడచిత; మింక నుద్ధురుం డగు మద్రే
శుం గూల్చు; మంతతోడఁ దె । గుం గురుపతి పని; జయంబు గొనుము గడంకన్' **(శల్య. 1. 94)**

అని ధర్మరాజును ప్రోత్సహించాడు. యుద్ధంలో శల్యుడు ప్రచండంగా పోరాడినా రెండు మూడుసార్లు మూర్ఛపోయాడు. జయాభిలాషతో పాటు అపజయభయాన్ని కూడా అతడు దుర్యోధనుడికి కలిగించాడు. ధర్మరాజు తన శక్తినంతా వినియోగించి పోరాడినా మూడుసార్లు మూర్ఛపోయి, అపజయం పాలౌతానని భయపడ్డాడు. మూడుసార్లు దైవాన్ని స్మరించిన సన్నివేశం వెనుక గమనించాం. విశేషమేమంటే భయానకరసానికి దైవం కాలుడు, వర్ణం కృష్ణం. ధర్మరాజు చేసిన హరిహరాత్మకమైన స్తుతి భయానక రసాన్ని వ్యంగ్యంగా సూచించింది. ధర్మరాజుకు భయకారకుడు శల్యుడు. అతడు క్రియాభీషణుడు. శల్యుడు ధర్మరాజుపరాక్రమాన్ని చూచి భయపడ్డట్లు లేదు. నాయకుడైన ధర్మజుడే భయభావానికి పాత్రం కావటం రసవిశేషం.

శల్యపతనానంతరం దుర్యోధనుడిపై యుద్ధ భారం పడింది. ఆ పరిస్థితిలో రాజే స్వయంగా యుద్ధంచేసి ఆదర్శవంతుడు కావాలన్న శకుని సూచనతో యుద్ధాన్ని సాహసంతో సాగించాడు. భీముడు గదతో 21వేల మంది వీరులను ఏనుగులనూ అడవిని కూల్చినట్లు మట్టుపెట్టాడు. అర్జునుడు అశ్వాలనూ, రథాలనూ పడగొట్టాడు. ధృష్టద్యుమ్న సాత్యకులు సాల్వుడిని కడతేర్చారు. కృతవర్మ విరథుడయ్యాడు. ఉలూకుడూ, శకునీ అశ్వయుద్ధంలో నకుల సహదేవుల చేతులలో హతులయ్యారు. దుర్యోధనుడి తమ్ముడు సుదర్శనుడు చనిపోయాడు. దుర్యోధనుడు తనచుట్టూ నిలిచిపోరాడేవారు లేక, ఎదుట పాండవులు హర్షోత్సాహాలతో విజృంభించటం చూచి సహించలేక, ఒంటరిగా దొరికితే తనను పాండవులందరూ కలిసి చంపుతారనే భయంతో రణం నుండి తొలగి, రక్షణకొరకు ద్వైపాయనహ్రదంలో దాగుకొన్నాడు. ధర్మజుడు దుర్యోధనుడి భయాన్ని పేర్కొని అధిక్షేపించాడు.

మ. 'భయముం బాయఁగఁ ద్రోచి వీరగుణముం బాటించి సంగ్రామ ని
శ్చయబుద్ధిం దలకొల్పి పౌరుషము మైఁ జా వొండె గెల్పొండెఁ గా
క యధీరత్వము నాకు నీడె? యని వీఁకం బేర్చి వే తాఁకు; మెం
తయుఁ బేరయ్యెడు రమ్ము! లె! మ్మొదిఁగినం దైన్యంబు వచ్చుం జుమీ!' **(శల్య. 2. 61)**

ఇందులో తిక్కన భయభావం వలన కలిగే అనుభవాదులను పేర్కొని వాటిని దాటి యుద్ధవీరాన్ని ప్రకటించుమని ధర్మజుడు ప్రబోధించినట్లు రసవ్యంజకమైన రచన చేశాడు. 'నరుఁడు ప్రాణభయంబుఁ బొరయుట యరుదు' అని దుర్యోధనుడు తన స్థితిని సమర్థించుకొన్నాడు. కొలనునుండి బయటకు వస్తే పాండవులందరు కలిసి ఒక్కుమ్మడిగా పై బడి చంపుతారేమో నన్న భయం అతడిని మొదట పీడించింది. భయం ఆ ఉద్ధతుడిచేత పేదమాటలు మాట్లాడింపజేసింది. మచ్చుకు -

సీ. 'మీ రేవురును బరివార బాంధవ మిత్ర । సహితుల, రఖిలాస్త్ర శస్త్రవంతు
లరు, కరిస్యందన తురగ సమేతుల; । రే నొకరుండ, విహీన సహచ
రత్వంబు విగతాయుధత్వంబు వాహన । హీనత నొందితి; నే విధమున

నని యొనర్పఁగ వచ్చు? నది గాక పోటుల । డస్సితిఁ గడు; మీకు డప్పి లేదు;

తే. వరుసఁ దగ నొక్కఁ డొక్కఁడ వచ్చి పోరు । డిపుడ వెడలి మిమ్మందఱ నెల్ల చెలులఁ
జుట్టముల రూపుమాపెదఁ; జుట్టుముట్టి । పలువు రొక్కనితోఁ బోరఁ బాడి యగునె?'**(శల్య. 2. 84)**

'పలువురు కూడి ఒక్కడిని చుట్టుముట్టి చంపటం' అనే క్రూరనీతి కౌరవులే అభిమన్యు వధలో ప్రయోగించారు. పాండవులు దాని కెప్పుడు ఎట్లా తిప్పికొట్టి ప్రతీకారం చేస్తారో అని దుర్యోధనుడి హృదయంలో పెనుభూతంవలె భయం బెదిరిస్తూనే ఉన్నది. అతడికి అభయం ఇచ్చే దైవం లేక నేలకూలాడు.

శల్యపర్వంలో నాయక ప్రతినాయకు లిరువురూ భయాభావంచేత ఆవరించబడి వ్యవహరించటం వలన వారి నాశ్రయించిన అంగరసంగా భయానకం భాసించింది.

సౌప్తికపర్వం బీభత్సరస ప్రధానం. ఈ పర్వానికి నాయకుడు అశ్వత్థామ. అర్థరాత్రివేళ గుడ్లగూబ చెట్టుకొమ్మలపై నిద్రిస్తున్న కాకులను చంపిన దృశ్యాన్ని చూచాడు.

ఉ. 'కొన్నిటి కంఠముల్ నులుపుఁ, గొన్నిటి కాళులు ద్రుంచు, నుగ్రతం
గొన్నిటి పక్షముల్ నఱకుఁ, గొన్నిటి పొట్టలు వ్రచ్చు లీలమైఁ,
గొన్నిటి నప్పళించుకొని కోలెముకల్ నుఱుమాడు; నిట్టుల
య్యన్నిటి నయ్యులూకము రయం బెసఁగన్ వధియించె భూవరా!' **(సౌప్తి. 1.18)**

ఈ దృశ్యం చూచిన అశ్వత్థామకు జుగుప్స కలగాలి. జుగుప్స సామాన్యంగా వైరాగ్య ప్రేరకం కావచ్చును. లేదా రౌద్రప్రేరకం కావచ్చును. అశ్వత్థామకు రౌద్రోద్రేక హేతువయింది. తానుకూడ పాండవ శిబిరంమీద పడి పగరను దారుణంగా చంపి భయానక బీభత్సాలను సృష్టించాలనే ఉత్సాహం కలిగింది. బీభత్సకారకుడైన అశ్వత్థామకు ఆ రసాధిదేవత అయిన మహాకాలుడైన శివుడు ప్రత్యక్షమయ్యాడు. అతడు అఖిలభూత భయంకరుడు. అతడి రూపం ఉగ్రంగానూ, సుందరంగానూ, ఉజ్జ్వలంగానూ, భీషణంగానూ ఉన్నది. అశ్వత్థామ ప్రయోగించిన ఆయుధాలన్నీ ఆ భూతనాథుడిపట్ల వమ్మయి పోయాయి. చివరికి అశ్వత్థామ ఆత్మోపహార మిచ్చే వీరకృత్యానికి పూనుకొన్నాడు. అతడి తెగువకు మెచ్చి శివుడు తాను నారాయణాత్మకుడైన మహాకాలుడ నని తెలియచెప్పుకొని, పాంచాలురకు కాలం చెల్లిందని పేర్కొని, ఒక మహనీయ ఖడ్గాన్ని ప్రసాదించాడు.

అశ్వత్థామ అసలే రౌద్రరసమూర్తి. దానికి తోడు మహాకాలుడి ఖడ్గంతో భయానక రూపం తాల్చాడు. రౌద్రభయానకాలు జనక రసాలు. వాటివలన కరుణ బీభత్సరసాలు జనిస్తాయి. రౌద్రరసం శత్రుసంహార రూప రౌద్రకర్మగా అశ్వత్థామ నాశ్రయించింది. వీరుల కది భయానకంగా పరిఢవిల్లింది. చూచేవారిలో, వినేవారిలో, ఆ దృశ్యాన్ని చదివేవారిలో అది భయానక రసంగానూ, కరుణ రసంగానూ పరిణమించింది. పీనుగులను తింటూ విచ్చలవిడినాట్యం చేసే పిశాచాలను చూస్తే జుగుప్స కలుగుతుంది. ఒక్కొక్క అవస్థకు ఒక్కొక్క ఉదాహరణం.

1. అశ్వత్థామ చేసిన ధృష్టద్యుమ్న సంహారం అతిభయంకరం. మచ్చుకు -

చ. 'వివశత భీతిఁ బొంది కడు విహ్వలుఁడై తనుఁ జూడ ద్రోణ సం
భవుఁడు వెసన్ శరాసనము వాపి గుణంబు తదీయకంఠముం
దవులఁగఁ జేర్చి వాగురవిధం బొడఁగూర్చి మనంబు విక్రమో
త్సవమున నుబ్బఁగాఁ బశువుఁ జంపెడు చాడ్పునఁ జంపువేడుకన్'. **(సౌప్తి. 1. 152)**

2. చూచేవారికి కరుణరస కారకం.

తే. 'పీనుఁగై యున్న పాంచాల సూనుఁ జూచి । రక్షకులును దదీయపురంధ్రులును స
మగ్రశోకాంధకార నిమగ్నచిత్త । వృత్తులై యేడ్చి రెలుఁగులు విన్ను ముట్ట'. **(సౌప్తి. 1. 163)**

3. అశ్వత్థామ సలిపిన సంహార క్రీడలు భయంకరాలే కాక బీభత్స కారకాలు కూడా.

శా. 'కాలాకారతఁ బేర్చి దోర్లసిత ఖడ్గస్ఫార సాంద్రప్రభా
జాలం బొప్పఁగ నిట్లు సొచ్చి లఘుసంచారంబు శోభిల్లఁ బాం
చాల వ్రాతముఁ గ్రీడమైఁ దునిమె రక్తశ్రేణి మాంసంబుఁ గీ
లాలంబుం గబళించి త్రావి మదలీలాలోలతం గ్రాలఁగన్'. **(సౌప్తిక. 1-171)**

4. దానవగణం చేసే రక్తపానాదులు జుగుప్సాకరాలు.

వ. 'ఇవ్విధంబున వివిధ వికారాననంబులు బహుభంగిక కరపాదంబులు గలుగు నపరిమిత క్రవ్యాదులు గవిసి మేదోమాంస మస్తిష్క మజ్జంబు లానుచుం, జవియైనవానిఁ బుత్రమిత్ర కళాత్రాదుల కొసంగుచు, నన్యకోటి బెరసినయెడఁ ద్రోద్రోపులాడి, యవియుఁ గైకొనుచుం గీలాల పానంబున మత్తిల్లి నృత్యంబులు సేయుచు మఱియు ననేక ప్రకారంబుల విహారంబు సలుపుచు నుల్లసిల్లిరి'..... **(సౌప్తి. 1. 202)**

అశ్వత్థామ పగతో నిర్వహించిన రౌద్రకర్మ వలన పాండవులలో కరుణరసం ఉద్భవించింది. కరుణనుండి ద్రౌపదిలో మరల రౌద్ర ముదయించింది. భీముడిలో ఆ రౌద్రం రూపం తాల్చింది. అర్జున శ్రీకృష్ణాదులలో అది అతిశయించింది. అశ్వత్థామపై ఆ క్రోధం విజృంభించింది. పాండవ క్రోధం అశ్వత్థామకు తాపకారకమయింది. అతడి ప్రతీకార వాంఛ పాండవులకు భయంకర శాపంగా పరిణమించింది. శ్రీకృష్ణుడే లేకపోతే కథ అపాండవంగా ముగిసేది. అశ్వత్థామ చివరకు వాసనకొట్టే శరీరంతో, అన్నపానాలు లేక, ఏకాకిగా, మూడువేల ఏళ్ళు తిరుగుతూ ఉండవలసి వచ్చింది. అతడి స్థితిని గమనిస్తే ఆకృతి కట్టిన బీభత్సం వలె భాసించాడు. బీభత్సాన్ని సృష్టించి తానే బీభత్సంగా మారిన అశ్వత్థామ పగవలన పతితుడైన బ్రాహ్మణుడు.

నన్నయ స్త్రీపర్వాన్ని సుకవులు, పండితులు సభలలో మెచ్చుకొంటారనీ, అది 'కృపాయితమై' (కృపాయుతమై) ఉంటుందని పేర్కొన్నాడు. అయితే 'కృప' దయారసమైనా కావాలి, లేదా కరుణరసమైనా కావాలి. స్త్రీపర్వం కరుణరస ప్రధానమని జగద్విదితం.

క. పర్వుచు స్త్రీపర్వాదిక । పర్వంబుల నేనిటం గృపాయితమై స్త్రీ
పర్వంబు పదునొకండగు । పర్వము నా వెలయు సుకవిపండిత సభలన్.' **(ఆది. 1.56)**

తిక్కన స్త్రీపర్వాన్ని కరుణరస సంభరితంగా సంతరించాడు. కరుణానికి స్థాయిభావం శోకం. ఆత్మీయుల మరణం వలన ఏర్పడిన శోకం రసస్థాయికి చేరుతుంది. శోకం ఉత్తమ మధ్యమాధమ పాత్రలలో వేరువేరుగా వ్యక్తమౌతుంది. ఉత్తమ మధ్యములో పరగతం అనీ, ఆత్మగతమనీ రెండేసి విధాలుగా గోచరిస్తుంది. పరులను ఆశ్రయించిన విభావాలచేత శోకం కలగటం పరగతం. స్వాశ్రయా (ఆత్మగతా)లైన విభావాలచేత ఉత్పన్నమయ్యేది ఆత్మగతం. స్త్రీ పురుషులలో శోకం సమానమే అయినా స్త్రీలలో సుస్వరంగా రోదించటం, మోహం చెందటం, పరివేదనం, విలపించటం, ఆయాసపడటం, గుండెలు బాదుకొనటం వంటి చేష్టలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. స్త్రీల వాచకాభినయంలో హాహాకారాలూ, రోదనలూ,

ఆక్రోశాలూ, ప్రలాపాలూ, దీర్ఘభాషణలూ, దూరాహ్వానాలూ, ఆక్రందనలూ ఉంటాయి. గుణ కథనంతో కూడిన రోదనం విలాపం. గద్గదకంఠంతో గుణాఖ్యానంతో కూడిన రోదనం పరిదేవితం. బిగ్గరగా ఏడ్వటం ఆక్రందనం. ఇట్లా కరుణరస పోషణం కావ్యనాటకాలలో ప్రసిద్ధం. విశేష మేమంటే అలంకార శాస్త్రంలో ఎన్నిరకాల శోకాభినయ విశేషా లున్నాయో దాదాపు వాటికన్నిటికీ తిక్కన రచించిన స్త్రీపర్వం సరసోదాహరణ కావ్యంగా ఉండటం అపూర్వం.

స్త్రీపర్వంలో గాంధారి స్వయంగా దుర్యోధన దుశ్శాసనాదులైన కుమారులను, శకునివంటి బంధువులను తానే స్వయంగా దర్శించి, స్పర్శించి దుఃఖించింది. అది స్వాశ్రయ శోకం. కోడళ్ళు, వీరుల భార్యలు ఆయా వీరుల శవాలను చూస్తూ విలపించినవన్నీ తాను విని స్పందించి శ్రీకృష్ణుడికి చెప్పింది. దీనిని పరగత శోకం అనవచ్చును. స్త్రీల రోదనలలో సుస్వర విన్యాసాలు విశేష వృత్తాలలో ధ్వనించాయి. శవాల దీనస్థితి చూస్తే శత్రువుకు కూడా గుండె తరుక్కొనిపోతుంది. రణభూమిని స్వయంగా చూచిన అనుభవమున్న తిక్కన గాంధారి దృష్టితోచూచి వర్ణించినదంతా సహజంగా సమకూరింది. ఇనుమును బంగారం చేసే రసవిద్య తిక్కనది. జుగుప్సాకరమైన శిథిల శవాలపై వారి జీవన స్మృతుల చిత్రాలను చిత్రించి, స్త్రీ విలాపాలతో ఫ్రేములు కట్టి భావుకుల మనఃఫలకాల మీద తగిలించాడు.

మచ్చుకు కొన్ని:

1. గాంధారి దుర్యోధనుడి శవాన్ని చూచి శోకాతిశయంతో మూర్ఛపోయి, కాసేపటికి తెప్పరిల్లి పరిచారికలు తనను తీసికొనిపోగా కుమారుడి దరిచేరింది.

తరల. 'విపుల వక్షముమీఁద నశ్రులు వెల్లిగొల్పుచు వ్రాలి యో
నృపతి కుంజర! కౌరవేశ్వర! నేల నిమ్మెయి నీ యుదా
త్తపు శరీరముఁ బొందఁ బాడియె? తల్లి వచ్చిన భక్తితో
నుపచరింపక లాఁతివై యిటు లూరకుండుట యుక్తమే?' **(స్త్రీ. 2. 27)**

అని విలపించింది. తల్లి వస్తే ఎదురువచ్చి ప్రీతితో మాట్లాడి ఉపచరించే సన్నివేశం రణరంగంలో పడి ఉన్న అతడి శరీరాన్ని చూచినప్పుడు జ్ఞాపకం రావటం సహజం. కరుణరసభరితం. తరలమంటే చంచలం, తరంగితం, కంపితం అని అర్థం. ఏడుమాత్రల ఆవృత్తితో నడిచే తరలం మత్తకోకిలవలె రాగరంజితం. శృంగార కరుణాది రసాలలో సస్వర విన్యాసం దీనిలో బాగా రాణిస్తుంది.

తిక్కన తరలవృత్తాన్ని అయిదు సార్లు స్త్రీ పర్వంలోనే వాడాడు. ఆ అయిదింటినీ స్వాశ్రయశోక వర్ణనలోనే వినియోగించి ప్రధాన స్త్రీ పురుష పాత్రలు ఆత్మీయులైన ప్రముఖులను గురించి విలపించినట్లుగా రచించటం ఛందోరసశిల్పం. ఒక్కొక్క పద్యంలో ఒక్కొక్క శోకభంగిమ. ధృతరాష్ట్రుడు శోకచింతాభారంతో మాటాడలేక స్తంభమనే భావముద్రను వహించి ఉన్న స్థితి 1.4వ పద్యంలో చిత్రించాడు. గాంధారి దుర్యోధనుడిని చూచి విలపించినట్లుగానే దుశ్శాసనుడి శవాన్ని చూచికూడా తరలవృత్తంలో విలపిస్తుంది. దుర్యోధన దుశ్శాసనుల భార్యల విలాపం కంటె తిక్కన గాంధారి శోకానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చాడు. వారు కథలో అనామకలుగా ఉండటం దానికి కారణం కావచ్చును.

గాంధారి తరువాత కర్ణుడిని గూర్చి కుంతి చేసిన విలాపం కూడా తరలవృత్తం కావటం విశేషం (2.174). ఈ రెండింటికంటె తిక్కన మరొక ఔచిత్యాన్ని కూడా పాటించాడు. అభిమన్యుడిని గురించి ఉత్తర విలపించిన తరలవృత్తం (2.79) కరుణరసార్ద్రం. తల్లులు కొడుకులను గూర్చి పలికినవి విలాపాలు కావటం, భార్య భర్తను గురించి పలికినది పరిదేవితం కావటం మరొక విశేషం.

2. సైంధవుడి భార్య దుస్సల గాంధారి కూతురు. ఆమె తన భర్త తల తెగి ఎక్కడ పడ్డదో కనుగొనలేక వెఱ్ఱిగా అటూ ఇటూ తిరుగుతున్నదట! దుఃఖాతిశయంలో అది ఒక దుర్భరావస్థ. కరుణ రసాలంబనంగా ఉన్న ఆ కూతురును చూచి గాంధారి స్పందించిన తీరు మనస్సును ద్రవింపచేస్తుంది.

తే. 'హృదయమున వగలేని యట్టిట్టు నట్టుఁ । దిరుగుచున్నది దుస్సల వరుని శిరము
గాన; కీ కూఁతు నిమ్మెయిఁ గనుటకంటె । దలఁప నెక్కుడు దుఃఖంబు గలదె కృష్ణ!' (స్త్రీ. 2.97)

3. తమ్ముడైన శకుని శవాన్ని చూచి గాంధారి బోరున దుఃఖించలేదు. ఆయన తన కొడుకులకు చేసిన కానరాని కీడును స్మరిస్తూ వేడిగా నిట్టూర్చింది.

మత్తకోకిల. 'వార లస్త్రహతాంగులై యనవద్య లోకముఁ గాంచి; రీ
వైరకర్తయు నట్ల గాంచెను; వారి నల్వ విచారులం
బోరి కెత్తెడునట్లుగాఁ దగఁ బొంది వెఱ్ఱులఁ జేసె నీ
క్రూరుఁ; డందును నన్నదమ్ములకున్ విరోధము సేయఁడే!' (స్త్రీ. 2.139)

4. శరతల్పగతుడై ఉత్తరాయణ పుణ్యకాలం కొరకు ప్రాణాలు ఉగ్గబట్టి శయనించి ఉన్న భీష్ముడిని దర్శించి దుఃఖించటానికి మారుగా కంటె భక్తితో నమస్కరించింది గాంధారి. భక్తిగౌరవ ప్రదమైన శోక ప్రదర్శన మది.

క. 'దేవుఁడు గా కితఁడు నరుఁడు । నా వచ్చునె! నిష్ఠ పెంపునం బ్రాణంబుల్
తా వలసినపుడు విడువం । గా వేడుక నునిచినాఁడు గాదె తనువునన్'. (స్త్రీ. 2.118)

5.ద్రోణాచార్యుల శవాన్ని చూచి మర్యాద పూర్వకంగా కంటతడిపెట్టింది గాంధారి. కౌరవుల ఆశల కన్నింటికీ ఆలంబనమైన ద్రోణుడు శిష్యుల నమస్సులందుకొనే పూజ్యపాదుడు. అతడి పాదాలను నక్కలు తిన్న వైఖరిని గమనించి నిట్టూర్చింది.

తోటకము.' సతతంబును శిష్యులు సద్వినయా । న్వితులై ప్రణమిల్లెడు వీరపద
ద్వితయంబు గడుం జెడఁ దిన్నవి సూ । చితె నక్కలు దైవము చెయ్దిఁ గటా!' (స్త్రీ. 2.122)

6.గాంధారి స్త్రీల విలాపాలలో విపంచినాదాలు విన్నది. శోకంలో నుండి రాగమయ శోకా లుద్భవిస్తాయని శ్రీకృష్ణుడికి (శ్రోతకు) వినిపించింది ఉత్సాహవృత్తంలో.

ఉత్సాహ.'మానినీ జనంబు సేరి మగధనాథుఁ డగు జయ
త్సేను చుట్టు నేడ్వ నధిక దీన నాదములకు నా
మానసంబు సాంద్ర కరుణమయతఁ బొందె; మోహనం
బైన యట్టి యేడ్పు లెందు నంబుజాక్ష! వింటివే!' (స్త్రీ. 2. 143)

కవిత్రయ మహాభారతంలో నన్నయ నాలుగు, ఎఱ్ఱన రెండు, తిక్కన ఏడు ఉత్సాహ వృత్తాలను రచించారు. ముగ్గురిలో ఎక్కువ వ్రాసిన తిక్కన వాటినన్నింటినీ స్త్రీపర్వంలోనే వాడాడు. అందులోనూ ఏడింట నాలుగు గాంధారి నోట పలికించాడు. వరుసగా బాహ్లిక, సైంధవ, జయత్సేన, సుకేతనుల శవాలను చూచి విలపించిన వాక్యాలను వాటిల్లో నినదింపజేశాడు.

పై పద్యాన్ని వ్యాఖ్యానిస్తూ కీ.శే. డా॥ పాటిబండ మాధవశర్మగారు ఇట్లా అన్నారు. "జయత్సేనుడి చుట్టుఁ జేరి విలపించు నాతని భార్యల దీననాదములు వినుచు గాంధారి తన యప్పటి చిత్తవృత్తిని తానే యొక యుత్సాహవృత్తమున

వర్ణించుచున్నది. తిక్కన రససిద్ధాంత గర్భిత మీ పద్యము. ప్రసాదమాధుర్య గుణములకు నిధియైన ఈ పద్యము గాంధారి తత్కాల కరుణరస పారవశ్యమును చక్కగా వ్యక్తము చేయుచున్నది. మోహనములైన జయత్సేన పత్నుల రోదననాదములు గాంధారీ హృదయమునఁ బ్రతిధ్వనించి యామె వాక్యమందలి వర్ణవిన్యాసమునఁ బ్రత్యక్షమై శ్రోతకు పరమాహ్లాదము ప్రసాదించుచున్నవి. ఈ వృత్తమందలి యక్షరములలో సగము వఱకు అనునాసికములు, బిందుపూర్వక సరళములు నగుట గమనించ వచ్చును." (ఆంధ్ర మహాభారతము: ఛందశ్శిల్పము - పుట. 364).

తిక్కన మహాకవిత్వ శిల్ప సౌందర్యంలో శల్యసౌప్తిక స్త్రీపర్వాలు రసోల్లాసాన్ని రాగరంజితంగా రంగరించుకొన్నాయి.

9. తిక్కన రచనా శిల్పం:

తిక్కనది ప్రధానంగా వర్ణనాత్మక ధోరణి, నాటకీయ ఫణితి. జడపదార్థాలలో చైతన్య స్ఫూర్తిని ప్రదర్శించటం, ప్రకృతిని కథాసన్నివేశానికీ, పాత్రల మనః ప్రవృత్తులకూ అనుగుణంగా ప్రకరణోచితంగా వర్ణించటం, బీభత్సాది పరుష రసాలకు రమణీయ స్వభావాన్ని కల్పించి రసాస్వాదన శక్తిని పెంచటం, నిత్యజీవితం నుండి ఉపమాద్యలంకారాలను ఎన్నుకొని వర్ణనలు నిర్మించి ఆంధ్రావళి మోద మొందేటట్లు చిత్రించటం వంటి శిల్ప విశేషాలు ఏ పర్వంలోనైనా సామాన్యంగా గోచరిస్తాయి. ఈ పర్వత్రయంలో ప్రతిఫలించిన కొన్ని శిల్పాలను మచ్చుకు గమనిద్దాం.

(1). సూర్యోదయ వర్ణనం:

శల్యపర్వారంభంలో యుద్ధం ప్రారంభం కాకపూర్వం సూర్యోదయమైనట్లు మూడు పద్యాలలో వర్ణించి ప్రకృతికీ, కాలానికీ, కథకూ ఉన్న సంబంధాన్ని కళాత్మకంగా ఆవిష్కరించిన శిల్పం తిక్కనకు వెన్నతో పెట్టిన విద్య.

ఉ. 'ఒండొరులన్ జయించు మతి నుద్భట లీలలఁ జాల నొప్పి య
ప్పాండవ కౌరవుల్ పెనఁగుభంగిఁ గనుంగొను నొక్కొ యీ
తండు మహాద్రి నెక్కె ననఁ దద్దయుఁ జెన్నగు బింబకాంతి న
ర్కుం డభిరాముఁడై పొడపుఁగొండ పయిన్ వెలుఁగొందెఁ జూడఁగన్'.

చ. 'అరసి యనాగతం బెఱుఁగునట్టి మనంబులు గల్గు పాండు భూ
వరసుత బంధుమిత్ర కురువర్గ సుహృజ్జనకోటు లత్తఱిం
బొరసె నతిప్రమోదమును భూరి విషాదము నాఁగ నంబుజో
త్కరము వికాసమయ్యెఁ, గుముదంబులు మీలన మొందె నెంతయున్'.

సీ. కుంజర నికురుంబకుంభస్థలీ సంగ । సిందూర రుచులతోఁ జెలిమి చేసి,
కేతన వ్రాత సంకీలిత మాణిక్య । రశ్మల గెడ విహారంబు సలిపి,
సైనిక నికర వక్షఃస్థల పరిలిప్త । కాశ్మీర దీప్తులఁ గౌఁగిలించి,
దండనాథోత్కర చండభావోద్వృత్త । చక్షుః ప్రభలుఁ దారు సరసమాడి,

తే. యంశుజాలంబు లుభయ సైన్యంబులందుఁ । బరఁగి బహువిధ శస్త్రాస్త్ర కిరణతతుల
బెరసి ప్రాగ్భాగలక్ష్మి దీపించి మెఱయ । బాల్యరమణీయుఁ డగు చిత్రభానుఁ డొప్పె'. **(శల్య. 1.114-116)**

కావ్యంలో ఉండే అష్టాదశవర్ణనలలో ఒకటిగా భావిస్తే ఈ సూర్యోదయ వర్ణనం కవి ప్రతిభకు ప్రతీకగా భావించవచ్చును. తాత్పర్యం మూడు ముక్కలలో చెప్పాలంటే - సూర్యుడు తూర్పుకొండమీద ఉదయించాడు. పద్మాలు వికసించాయి, కలువలు ముకుళించాయి. సూర్యకిరణాలు చతురంగబలాలపై పడి ఆయా సైన్యాభరణాలపై ప్రతిఫలించి తూర్పుదిక్కనే

లక్ష్మికి వెలుగు తోరణా లందించాయి. యుద్ధప్రారంభానికి సమయం ఆసన్నమయింది అనే కాల సూచనగా వర్ణనం జరిగింది.

తిక్కన దీనిని అలంకృతం చేశాడు. మొదటి పద్యంలో ఉత్ప్రేక్ష ఉన్నది. జడమైన సూర్యబింబాన్ని అభిరాముడిగా చెప్పి దానియందు చేతనత్వాన్ని ఆరోపించాడు. ఆ రోజు చివరిరోజు కాబోతున్న దన్న కాలసూచనను చేస్తూ ఆ వీరుడు ఉభయసేనల యుద్ధం చూడాలన్న ఆసక్తితో తూర్పుకొండపై కెక్కి విహంగవీక్షణంచేయాలని సంకల్పించాడో అన్నట్లు కనపడుతున్నాడట! సూర్యుడు కాలానికి కాని నారాయణుడికి గాని ప్రతీక కావచ్చును. కాలపురుషుడుగానూ నారాయణుడుగానూ శల్యవధ ధర్మరాజు నిర్వహించి విజయానికి బాటవేస్తాడని నిర్దేశించాడు. ఆ ఫలితాన్ని సూచించే వస్తు నిర్దేశంగా దీనిని అన్వయించవచ్చును. అప్పు డీపద్యం నాటి యుద్ధపర్వానికి నాందీవాక్యమౌతుంది. ఉత్ప్రేక్ష ఊహయే కాబట్టి వేచి చూడవలసిందే - అని భావం.

మొదటి పద్యం 'చూడఁగన్' అనే క్రియతో ముగిసి రెండవ పద్యం 'అరసి' అన్న క్త్వార్థక క్రియతో మొదలౌతుంది. పైకి చూస్తే అది సూర్యోదయమే. కాని, దాని ప్రభావాన్ని పరిశీలించి చూస్తే మరొక ఉత్ప్రేక్ష భాసిస్తుంది. పాండవ బంధుమిత్రులు, కౌరవబంధుమిత్రులు సూర్యోదయాన్ని చూచి బాగా ఆలోచించి క్రమాలంకారాన్ని ఆశ్రయించి ఒక వర్గం అత్యంతానందాన్ని పొందిందా? మరొక వర్గం భూరివిషాదాన్ని పొందిందా? అని ఊహించగలిగేటట్లుగా పద్మాలు వికసించాయట! కలువలు ముకుళించాయట! ఉభయ పక్షవీరులూ భవిష్యత్కాల ఫలాలను తెలిసికొనగల్గిన మనీషులట! అందువలన ప్రకృతి వివేకాన్నిబట్టి భవిష్యత్తును భావించగలిగారని భావం. అలంకారధ్వనితో పాండవులకు కలుగబోయే విజయం, కౌరవులకు రాబోయే విషాదం రెండవ పద్యంలో ధ్వనించింది.

నాంది మూడు శ్లోకాలలో ఉండటం ఒక పరిపాటి. తెలుగులో తిక్కన ఆ పరిపాటిని పద్యాలలోకి మార్చాడు. మూడవ పద్యంలో కూడా కర్త సూర్యుడే. అయితే అందులో చిత్రభానుడు, చిత్రాః భానవో యస్య సః చిత్రభానుః నానావర్ణాలైన కిరణాలు కలవాడు చిత్రభానుడు. అతడు బాల్య రమణీయుడు. చిన్నవయసులో ఉన్న అందగాడు. ప్రౌఢుడు, ప్రచండుడు కాడు; ఉభయభానుడు. కాబట్టి అతడు క్రీడాప్రియుడు. బాల్యస్నేహితుడు, అతడికి రంగులన్నా రంగుల కాంతులన్నా ఇష్టం. వాటితో తన చేతులు కలిపి ఆడుకొంటాడు. చిత్రభానుడి కరాలు (కిరణాలనే చేతులు) సహజంగా అరుణారుణ కాంతులు కలవి. ఏనుగుల కుంభస్థలాలపై సిందూరం కనపడితే ఆ వర్ణ కాంతులతో ముందుగా స్నేహం చేసికొని తన కిరణాల వన్నెను పెంచుకొన్నాడు. తరువాత టెక్కాలపై కట్టబడిన మాణిక్యాల కాంతితో కలిసి చేతులల్లారుస్తూ విహారం చేశాడు. సైనికుల వక్షఃస్థలాలపై పూసిన కాశ్మీర వర్ణకాంతులను తన చేతులతో కౌగిలించుకొన్నాడు. కోపోద్రిక్తులైన దండనాథుల చూపులలోని ఎర్రని కాంతులతో సరసమాడాడట! చిత్రభానుడి విచిత్రవర్ణ కరాలు (కిరణాలనే చేతులు) శస్త్రాస్త్ర కిరణతతులతో కలిసి ప్రాగ్దిశాలక్ష్మిని మెప్పించి మెరిసిపోయాయట! అంటే సూర్యకిరణాలు సైన్యంమీద పడి కాంతులు ప్రతిఫలించి వెలగటం చేత తూర్పుదిక్కున మరింత ప్రకాశింపచేశాయని భావం. శ్లేషప్రాణిత రూపకం వలన సూర్యకరప్రభావం ధ్వనిమయం అయింది. పాండవవర్గంలోని సైన్యం సంతోషాన్ని పొందుతుందనీ, కౌరవవర్గసైన్యం విషాదం పొందవచ్చుననీ భావికథార్థ సూచన ఏర్పడింది. జడవస్తువుల మీద చైతన్యపాత్రారోపణం చేయటమే కాకుండ, సాలంకృత వర్ణనతో ధ్వనిమయంగా కథావస్తువును సూచించే నాందీ శ్లోకమర్యాదను కూడా తిక్కన పాటించి శిల్పత్రివేణిని కల్పించాడు.

(2). యుద్ధవర్ణనం

తిక్కన యుద్ధవర్ణనలతో భయానక బీభత్స రససన్నివేశాలను సైతం ఆస్వాద మధురంగా మార్చే రామణీయకమంత్రం ప్రయోగించి ఇనుమును బంగారం చేస్తాడు. శల్యపర్వంలో పోరు ఘోరంగా మొదలయింది. అది దొమ్మియుద్ధం. రక్తం ఏరులవలె పారినట్లు, అందులో వీరులు విహారాలు చేసినట్లూ అలంకరించి వర్ణించి భయానక బీభత్సాలలో రమణీయ దృశ్యం కల్పించాడు. ఇది గొప్పకాల్పనిక భావన! భావిప్రబంధ వర్ణనలకు మార్గదర్శి.

సీ. 'నెత్తుటఁ దోఁగియు నిగిడిపోరెడు వీరు । లలరిన నడమోదుగుల విధంబు,
గ్రక్కునఁ దెగిపడి కదలెడు బాహు దం । డములు మహాభుజంగముల పగిది,
యవని రక్తాక్తంబులై యున్న యట్టిబల్ । దలలు గెందామర కొలని పగిది,
దఱచుగా నెఱిదప్ప నొఱగిన గజములు । గులిశ భగ్నాచల కులమునట్లు,

తె. దునిసి తొఱఁగిన జోదుల తొడలు సామ । జముల కరములు నొండొంటి చందములు గ
నుంగొనఁగ వింత లగుటను సంగరాంగ । ణంబు రమణీయమును భీషణంబు నయ్యె'.

తె. 'ఏమి చెప్పుదు రౌద్రంపు టెసకమందుఁ । దఱచు మెదళులు ఱొంపులు నుఱుములైన
యెమ్ము లిసుకయు సితచామరమ్ము లంచ । లయ్యె రుధిరంపు టేఱుల కప్పు డధిప!'

క. 'విను మయ్యేఱులలో వా । హనములె యోడలుగఁ జూడ నక్కజ మగు ను
క్కున నుద్దామ విహారం । బొనరించిరి వీరయోధు లుర్వీనాథా!' **(శల్య. 1. 129-131)**

ఇటువంటి వర్ణనలు సందర్భోచితంగా పర్వమంతా పరచి కథను రక్తికట్టించాడు తిక్కన.

(3). ప్రతిపద సార్థక్యం

క. 'పలపలని మూఁకలోఁ గా । ల్నిలువక గుఱ్ఱంబు డిగ్గి నీ కొడుకు గదా
కలితభుజుం డయి యొక్కఁడుఁ । దొలఁగి చనియె; నేమి చెప్పుదుం గురునాథా!' **(శల్య. 1. 401)**

"ఈ పద్యమును గూర్చి యొక రసవంతమైన ఇతిహాసము కలదు. భారతరచనమున వేదవ్యాసునకు గణనాథుడు వలె తిక్కనగారికి గురునాథు డనువాడు లేఖకుడుగా నుండెనట! అతడు తిక్కనగారి వలె కొమ్మనగారి రక్తము పంచుకొని పుట్టిన కుమ్మరియట! గురునాథుని గంటము నిలిచినచో తిక్కనకంఠము నిలువదు అని ఆ యన్నదమ్ములు సమయము చేసికొనిరట! తిక్కనగా రీపద్యము చెప్పుచు 'తొలఁగి చనియె' అన్నచోట వాక్యము ముగిసియు పద్యము ముగియనందున, వ్యర్థ పదములతో పూరింప మనసు రాక, ఏమియు తోచక 'ఏమి చెప్పుదుం గురునాథా!' అని పలికిరట! గురునాథు డామాటను వ్రాసెనట! పద్యము పూర్తికాక గురునాథుని గంటము నిలిచిన దని భ్రమించి తిక్కనగారు తన కంఠము నుత్తరించుకొనబోయిరట! గురునాథు డాయనను వారించి గంటము నిలువకుండనే పద్యము పూర్తి యైనదని చెప్పి పై పద్యము కడముట్ట చదివెనట!. గురునాథుని ఉద్దేశించి తాను పలికిన వాక్యము ధృతరాష్ట్రు నుద్దేశించి సంజయుడు పలికినట్లు పద్యమున చక్కగా అతికినందులకు తిక్కనగారు మిగుల ఆశ్చర్య పడిరట! ఈ ఇతిహాసమున సత్యముమాట యెట్లున్నను సరసత్వము నిండుగా నున్నది. ఈ యైతిహ్యము లేనిచో ఈ చిన్నపద్యము నెవరు గుర్తింతురు? గుర్తింపనిచో ఇందలి సుందర శిల్పమంతయు అడవిగాచిన వెన్నెలయే కదా!

"పదునెనిమిదవనాటి అపరాహ్ణమున కౌరవ పక్ష స్థితి యెట్లున్నదో సంజయుడు ధృతరాష్ట్రునికి జెప్పుచున్నాడు. పదునొకండు అక్షౌహిణుల పరిమితిగల సేనయంతయు నశించినది. మహావీరులు, వీరభటులు, రథగజతురగదళములు నశించినవి. అల్పమైన కాల్బలము మిగిలినది. అప్పుడు దుర్యోధనుడు - పలపలని మూకలో - పలుచగా రణరంగములో కాల్నిలువక - 'కాలు' నిలుచునుగాని 'కాల్' నిలువదు. ప్రాణము లేని లకారము ప్రక్కకు క్రుంగదీయగా ఒరిగిపోవును. కాల్ నిలువక - గుఱ్ఱంబు డిగ్గి - యుద్ధారంభమున అతిరథుడైన దుర్యోధనుడు రథారూఢుడు; రథదళము నశింపగా భద్రగజారూఢుడు; గజదళము నశింపగా భద్రాశ్వరూఢుడు; అదియు నశింపగా అశ్వారూఢుడు. ఆ యశ్వము గుఱ్ఱము - తట్టు దానినుండి దిగినాడు. దిగుటకాదు. గుభాలున ఉరుకుట. డిగి గదాకలితభుజు డయినాడు. అతని బలగమంతయు నశించినది. మిగిలినది గదాబలము, భుజబలము. ఆ రెండింటిని కూడగట్టుకొనినాడు. ఒక్కఁడు - ఒంటరి - సోదరమిత్ర

బంధు వర్గమంతయు నశించినది. తొలఁగిచనియె - పారిపోయెనని చెప్పుటకు సంజయునకు బుద్ధిపుట్టలేదు. ఎంతటి వైభవముతో వెలిగిన రాజరాజు దుర్యోధనుడు ఎంతటి హీనదశకు వచ్చినాడు? దుర్యోధనుని శోచనీయావస్థను వర్ణించుటకు సంజయునికి మాటలు దొరకలేదు. ఏమి చెప్పుదున్ కురునాథా! - అని వాపోయినాడు. నిందయంతయు ధృతరాష్ట్రుని నెత్తిన మోపుచున్నట్లు 'నీ కొడుకు' అన్నాడు. నీ యవివేకము వలన ఇట్టి స్థితికి వచ్చినవాడు. నూర్గురు సోదరులకు మొట్టమొదటివాడయ్యు, అందరు చావగా చిట్టచివరకు మిగిలినవాడు దుర్యోధనుడు. అప్పటి స్థితిలో రాజరాజు కాడు. కేవలం ధృతరాష్ట్రుడి కొడుకు. పద్యమున ప్రతిపదము, అక్షరము పనితనము మెరపించుచున్నది. తిక్కనగారు భారతమును ఆశువుగా చెప్పినారని ఐతిహ్యము చెప్పుచున్నది. తిక్కనగారు ఆశువుగా చెప్పినను ప్రత్యక్షరము శిల్పరమణీయముగా చెప్పిరని ఈ పద్యము చాటుచున్నది." (డా॥ పాటిబండ మాధవశర్మ : తిక్కన కవితావైభవము: యువభారతి ప్రచురణ, 1974).

(4). మానవ స్వభావ వ్యంజకమైన సన్నివేశ చిత్రణం:

అశ్వత్థామ రౌద్రోద్రేకంలో ఉన్మాదావస్థను ప్రదర్శించాడు సౌప్తికపర్వంలో. ధృష్టద్యుమ్నుడిని పశువును చంపిన విధంగా చంపితేకాని కోపం పోదనీ, ఉత్తమాస్త్రాలతో చంపననీ కృప, కృతవర్మలతో స్పష్టంగా చెప్పాడు. పాండవ స్కంధావారంలో పాన్పున గాఢనిద్రలో ఉన్న ధృష్టద్యుమ్నుడిని తలపట్టుకొని, పెడమరల దిగిచి,

ఉ. 'నేలపయిం బడం దిగిచి నిష్ఠురభంగి నురఃస్థలంబు మో
కాల నొగిల్చి యేపున మొగం బతిదారుణ ముష్టి నొంచె; ని
ద్రాలసవృత్తి నంగములయందు బలంబును బుద్ధినేర్పునుం
జాలని యవ్విరోధి వివశత్వముఁ బొందఁగఁజేసె వ్రేల్మిడిన్'. **(సౌప్తి. 1.150)**

ఉ. 'కాలను గేలనుం జదిపి గంధకరిం దెగటార్చు సింహముం
బోలుచుఁ బేర్చి యా ద్రుపదభూపసుతున్ సమయించె వేదనన్
ఱోలఁగ, రోఁజఁగాఁ బలుమఱుం బొరలంబడి లాలఁ గ్రక్క న
వ్వాలుమగండు వాక్పరిభవంబుఁ దలంచుచుఁ గ్రౌర్యధుర్యుఁడై'. **(సౌప్తి. 1.158)**

తన తండ్రిని చంపిన ధృష్టద్యుమ్నుడిని నిర్దయగా చంపి, అంతటితో ఆగక, ద్రుపదపుత్రులనూ పాంచాల దేశ వీరులనూ వరుసగా వధించాడు. అతడు సంహరించేటప్పుడు ఆయావీరుల తత్కాలావస్థలను తిక్కన అత్యంత సహజంగా చిత్రించాడు.

శా. 'నిద్రాసక్తునిఁ, గొంత మేల్కనినవానిన్, సుప్రబుద్ధాత్ముఁడై
యుద్రేకంబును శౌర్యసారమును బాహూల్లాసముం జూపఁ జం
చ ద్రేఖం దిరమైనవానిఁ దను నుత్సాహోగ్రతం దాఁకి యు
న్నిద్రస్వైర సముద్ధతిన్ మెఱయువానిం దున్మె నేకాకృతిన్.' **(సౌప్తి. 1. 173)**

అంతటితో ఆగలేదు అతడి క్రౌర్యం. గజతురగాది బలాలను కూడా బలిగొన్నది. ఆనాటి రాత్రి గుడ్లగూబ కాకులను చంపిన ఘోరవైఖరిని తా నప్పుడు ప్రదర్శించాడు.

ఉ. 'కొన్నిటి పాదముల్ నఱకుఁ, గొన్నిటి మోరలు సెక్కు, లీలమైఁ
గొన్నిటి కంఠముల్ దునుముఁ, గొన్నిటి వీఁపులు వ్రచ్చు, నుబ్బునం

గొన్నిటి సర్వగాత్రములు క్రూరవిచేష్టిత విభ్రమంబు దోఁ
ప న్నుఱుమాడుఁ బ్రౌఢబల భాసిత భూరి భుజావిహారుఁడై'. **(సౌప్తి. 1. 176)**

ప్రతీకార కాంక్షతో ధర్మాధర్మాలనూ, ఉచితానుచితాలనూ పాటించక వివేకాన్ని కోల్పోయి ఉన్మాదావస్థలో రక్తపిపాసువుగా మారిన అశ్వత్థామ పాత్ర చిత్రణం అత్యంత సహజం.

(5). వస్తుచ్ఛందఃసంవాదం :

మహాస్రగ్ధర: 'తలలన్ హస్తమ్ములం బాదములఁ దనువులం దత్ప్రదేశంబుఁ గప్పం
దొలఁగించున్ వానిఁ గ్రొన్నెత్తురు వఱపి; హయస్తోమదంతి ప్రతానం
బుల మేదోమాంస ఖండంబుల దనుజ మహాభోజనం బావహించున్;
మలఁగంబాఱున్ జెలంగు న్నలి నెసఁగు జయోన్మత్తుఁడై మానవేంద్రా!'. **(సౌప్తి. 1. 194)**

"ఈ మహాస్రగ్ధరయందు వర్ణింపబడిన యంశము రక్తమును ఘనీభవింప జేయు అశ్వత్థామ సౌప్తిక రౌద్రవిహారము. ఉపపాండవ సంహారఘట్టము. సౌప్తికపర్వము అద్భుత భయానక బీభత్స కరుణ జనకమైన మహారౌద్ర రసమునకు ఆటపట్టు. రుద్రదేవతావిష్టుడైన యశ్వత్థామ ప్రళయ విహారము ఇందలి వస్తువు. ఆ వస్తువును భావించి కవిబ్రహ్మయు రౌద్రరసావిష్టుడై రచన సాగించెనా యనిపించును. ఆ పర్వమందలి స్థాయిచ్ఛందము స్రగ్ధర. అది సర్వేతర వృత్తములను అధఃకరించి సహృదయుని రక్తమును కరడు కట్టించి హృదయ స్పందము మందీభూతము గావించు తమఃప్రధానమైనది. గురుదీర్ఘాక్షర బాహుళ్యము ఈ పర్వమందలి గద్యపద్యము లన్నింటను సులభముగా గుర్తింపవచ్చును. మంద్రము, మందమునైన హృదయస్పంద సంచారము పర్వమందంతటను ప్రళయసమయ మహాతాండవమందలి రుద్రదేవుని గురువిలంబిత పదన్యాసము ననుకరించుచున్నది. ఆఱు మత్తేభములు, ఆఱు శార్దూలములు నాతి దూరాంతరావృత్తము లైన ఇరువది స్రగ్ధరా మహాస్రగ్ధర రౌద్రతాండమునకు దీప్తి కలిగించుచున్నవి. పర్వమును పఠించిన సహృదయునకు ఇందలి 327 పద్యగద్యములను స్రగ్ధరాచ్ఛందమే యావేశించినదా యనిపించును. అశ్వత్థామ హృదయమువలె కవిబ్రహ్మ హృదయముకూడ రౌద్రావేశముచే ఏకాగ్రమై యున్నది. అంతరంగ బహిరంగ క్రియాసంవాదము, వస్తుచ్ఛందః సంవాదము ఈ పర్వమున పరమ రమణీయముగా నున్నవి. (డా. పాటిబండ మాధవశర్మ: ఆంధ్ర మహాభారతము: ఛందఃశిల్పము. పు. 553-554)

(6). విలాపవీణానాదాల శ్రుతి మాధుర్యం :

మందాక్రాంతము:

'వీణా నాద ప్రతిమ నిగమావిర్భవత్సారపుణ్య
శ్రేణీ సంపాదిత విమలతాస్థేమ నిర్లేపచిత్త
త్రాణ క్రీడాకలన సతతోత్సాహవద్దివ్యభావా!
ప్రాణాపానాహరణ నిపుణ ప్రాపణీయానుభావా!' **(స్త్రీ. 2. 185)**

"స్త్రీపర్వమున తా నుపయోగించిన ఛందముల మాధుర్యమును తిక్కనగారు తామే ప్రశంసించుకొనుచున్నారా యనిపించుచున్నది ఈ పద్యము. వీణానాద ప్రతిమము లైన వేదనాదముల లయించి నిర్మలములు, నిర్లిప్తములు నైన చిత్తములను త్రాణము చేయుటకు ఉత్సహించువాడట హరిహరనాథుడు. ఆ స్వామి తన నానావిధ మధురచ్ఛందోమయమైన స్త్రీపర్వము విని తన్ననుగ్రహించు నని తిక్కనగారి యాశయము. స్త్రీపర్వ ద్వితీయాశ్వాసమునందలి స్త్రీల రోదన నాదములు విని స్వామి కరుణార్ద్ర హృదయు డయ్యెనన్న సూచనయు నిందు గలదు. 'మోహనంబైన యిట్టి యేడ్పు లెందు నంబుజాక్ష!

వింటిమే!' అని కురుకాంతల విలాప మాధుర్యమున జొక్కిన గాంధారి శ్రీకృష్ణునితో పలికినది. ఆ మధుర నాదములు తిక్కనగారి చెవులందు మారుమ్రోగుచు ఆయన చిత్తమును కరుణరసమయము గావించుచుండె గాబోలు! ఆయననోట వీణానాద ప్రతిమ మధురమైన మందాక్రాంతావృత్తము వెలువడెను. రౌద్ర రసావిష్టమైన హృదయముతో సౌప్తిక పర్వమున హరిహరనాథుని స్రగ్ధరలో సంబోధించుట యెట్టి యౌచిత్యమో స్త్రీపర్వాంతమున మందాక్రాంతలో సంబోధించుటయు అట్టి యౌచిత్యమే. స్త్రీపర్వమున ప్రథమాశ్వాసము ప్రధానముగా ధృతరాష్ట్ర విలాపమయము. అతని విలాపములందు అంతర్వాహినిగా పాండవ ద్వేషము గలదు. ఓజః ప్రదీప్తమయిన ఆర్ద్రత ఆయన చిత్తవృత్తి లక్షణము. ఆ ఆశ్వాసము చివర తిక్కనగారు హరిహరనాథ ప్రబోధమున ఓజస్వినియైన శిఖరిణీవృత్తమును వాడిరి. ద్వితీయాశ్వాసము అంతయు గాంధారీ విలాపమయము. ఆమె చిత్తము శుద్ధకరుణమయము. మధురమైన ఆర్ద్రత దాని లక్షణము. ఈ యాశ్వాసము చివర తిక్కనగారు మధుర మందరమైన మందాక్రాంతను వాడిరి. పర్వరసానుసారియైన ఛందమును పర్వాంతమున ప్రయోగించుట ఛందోమర్మజ్ఞతకు పరకోటి'. (డా॥ పాటిబండ మాధవశర్మ; తిక్కన కవితావైభవం. యువభారతి ప్రచురణ).

10. ఉపాఖ్యానాలూ, ఉపదేశాలూ :

శల్యపర్వంలో బలరాముడి తీర్థయాత్రాభివర్ణనం, సౌప్తికపర్వంలో శివప్రభావ వర్ణనం అనేవి ఉపాఖ్యానాలుగా లెక్కించదగినవి. ఈ రెండూ కథకు ప్రత్యక్షంగా తోడ్పడి, కథాజీవితానికి బలాన్ని చేకూర్చేవి కావు, అయితే బలరాముడు చేసిన తీర్థయాత్రలలో ప్రభాసతీర్థంనుండి కురుక్షేత్రం వరకూ గల పుణ్యక్షేత్ర తీర్థ మాహాత్మ్యాలను గమనిస్తే కురుక్షేత్రం కూడా మహాపుణ్యక్షేత్రమని స్పష్టమౌతుంది. ఆ క్షేత్రంలో మృతులైనవారు స్వర్గవాసులౌతారని తెలుపబడుతుంది. దుర్యోధనుడు ఆ క్షేత్రంలో శమంత పంచకతీర్థం వద్ద యుద్ధంచేసి మృతుడైనందువలన అతడికి స్వర్గం తథ్యమని అతడితోపాటు అందరూ భావించటానికి దోహదకారి అయింది. బలరాముడు దుర్యోధన భీములకు గదాయుద్ధ గురువు కాబట్టి ఆయన ఎదుట శిష్యుల యుద్ధం జరగటం, ఆయన వారిరువురిలో యుద్ధ నియమాల ననుసరించి పోరు సలిపిన దుర్యోధనుడికి సద్గతి కలగాలనీ, భీముడికి కీర్తి కలగాలనీ ఆశించటం గమనిస్తే గదాయుద్ధంమీద విజ్ఞుల అభిప్రాయాలు ఎట్లా ఉంటాయో తెలుస్తుంది. శ్రీకృష్ణుడు బలరాముడికి ఇచ్చిన సమాధానం కాదనలేని ఒక తీర్పుగా నిలిచింది. కథలో ఊరుభంగ చర్యకు బలరాముడి చర్చ ఒక బలమైన ప్రతిపక్షంగా ఉంటుంది. శ్రీకృష్ణుడు దానికి ప్రతిసమాధానం చెప్పటం వలన పాండవయుద్ధనీతి కథలో బలపడింది. బలరాముడి తీర్థయాత్రా భాగం ప్రక్షిప్తమని కొందరి పండితుల అభిప్రాయం.

అశ్వత్థామకు పరమశివుడి అనుగ్రహం వలన లభించింది దివ్య ఖడ్గం. ఆతడి రౌద్ర విహారానికి గల కారణా లేమి టని ధర్మరాజు శ్రీకృష్ణుడిని అడుగగా గోవిందుడు చెప్పిన శివప్రభావ వృత్తాంతం సౌప్తికపర్వం చివర చెప్పబడి ఉన్నది. శివుడు కరుణిస్తే కలిగే లాభాలను, కోపిస్తే కలిగే నష్టాలను తెలిపే ఈ ఉపాఖ్యానం ధర్మరాజుకు సందేహ నివృత్తిని కలిగించటమే కాక భారత కథలో శివశక్తి నిర్వహించిన పాత్రకు వ్యాఖ్యాన మనిపించింది.

పాండవ పక్షంలో అర్జునుడు మహావీరుడు. అతడు శివుడిని తపస్సుతో మెప్పించి పాశుపతాస్త్రాన్ని సంపాదించాడు. కౌరవ పక్షంలో అశ్వత్థామ రుద్రుడిని ఆత్మోపహారంతో సంతోషపెట్టి దివ్యఖడ్గాన్ని పొందాడు. ఆ పరమశివుడు నారాయణ సంకల్పానికి అనుగుణంగా సంహార కార్యాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నాడు. దీనినిబట్టి శ్రీకృష్ణుడే అర్జునుడికీ అశ్వత్థామకూ శత్రు సంహార శక్తులను సమకూర్చాడన్నమాట! స్థితికారుడి అదుపాజ్ఞలలో లయకారుడు వ్యవహరించటం వలన కాలం తీరినవారు విధి ప్రేరణతోనే కన్ను మూస్తారనే పరమసత్యాన్ని ఈ గాథ ప్రకటిస్తున్నది.

దుర్యోధనుడు తొడలు విరిగి పడిపోవటంతో గాంధారీ ధృతరాష్ట్రులు శోక సముద్రంలో మునిగారు. వారికి దుఃఖ కోపోపశమనం కొరకు హితోక్తులు.

సంజయుడు లౌకిక నీతివాదాన్ని ప్రమాణంగా చేసికొని హితవు చెప్పాడు. దుర్యోధనాదుల దుర్వర్తననూ, ధృతరాష్ట్రుడి

లోభగుణాన్నీ విమర్శించి, స్వయంకృతాపరాధం వలన కలిగిన విపత్తుకు అప్పుడు దుఃఖించటం గతజల సేతుబంధనం వంటిదనీ, హాస్యాస్పదమనీ హెచ్చరించాడు.

క. 'ఆర్యులు దఱితోఁ దగియెడు । కార్య మనుష్ఠింతు; రట్టుగా కప్పని మా
త్సర్యమునఁ దిగిచి పట్టి య । నార్యులు దుదిఁ దూర వగతు రాపద యైనన్"

ఆ. 'జున్ను డెప్పరంపుఁ జోటైన తఱి నున్నఁ । జూచి విఱుగఁబడుటఁ జూడ కాత్మఁ
దీపుఁ గోరి యుఱుకు తిండికాఁడును బోలె । నయితి; వగచు టింక ననుచితంబు'.

క. 'వగచినఁ బోయిన శౌర్యము । మగుడునె? వగవంగ లోకమాన్యం డగునే?
వగ పుణ్యగతికి మూలమె? । వగ పెల్లవిధముల నుడుగవలయు నరేంద్రా!'. **(స్త్రీ. 1. 18-20)**

విదురుడు ధర్మనీతి నాశ్రయించి వైరాగ్య బోధకమైన హితవు చెప్పి దుఃఖోపశమనం చేయ యత్నించాడు. మచ్చుకు కొన్ని మాటలు:

తే. 'యౌవనంబును, రూపంబు, జీవితంబు । ద్రవ్యసంచయములు ననిత్యములు గావె!
వీని హానికి వగ పవివేక మగుటఁ । బండితులు వగఁ గూరరు పౌరవేంద్ర!'

సీ. 'ఒక యింటనుండి వేఱొక యింటి కరిగిన । విధమును, వస్త్రంబు విడిచి యొండు
వస్త్రంబుఁ గట్టిన వడువును నై యుండు । నొడలు దొఱంగి యొండొక్క యొడలు
గైకొంట నృప! విను కడవకు సారెపై । నమర మృత్తిక యిడునపుడు విరియు
టయు, వెరవారఁ బట్టఁగ రాక చెడుటయు, । వాని యెత్తెడు నెడ వ్రయ్యుటయును,

తే. నెత్తి యొకచోట డించిన నెడలుటయును, । నెండి యవియుటయును, నావ మిడినఁ బగిలి
పోవుటయు, వాడుజనులచేఁ బొలియుటయును । గలుగు గతి మేని కెట్లును గలుగుఁ జేటు'.

(స్త్రీ. 1. 27, 34)

వేదవ్యాసుడు ధృతరాష్ట్రుడికి వివేకాన్ని ప్రబోధించాడు. జరిగిన కథకంతటికి కారణ మెవరో గ్రుడ్డిరాజుకు తెలుసు. తెలిసి తెలిసి దుఃఖించటం అవివేకం. విధిప్రేరితులై కౌరవులు అందరూ యుద్ధంలో పాల్గొని కన్నుమూశారు. కాబట్టి

తోదకవృత్తము. 'దేవకృతంబులు ధీరులకైనన్ । భూవర! మాన్పఁగఁ బోలునె యెట్లుం?
గావున శోకము గాఱియ దల్గం । గావలదే తుది గౌరవ మొప్పన్'.

తోదక వృత్తము.'తమ తమ తప్పులఁ దా రెరియంగా । విమలమతీ! యిటు వీరికినై శో
కమున దహింపఁగఁ గాదు మనంబున్; । సముచిత మిత్తఱి శాంతము సుమ్మీ!'(స్త్రీ. 1. 71, 81)

ఇట్లా స్త్రీపర్వంలో శోక మెంత ఉన్నదో దానిని ఉపశమింపజేసే ఉపదేశ మంత ఉన్నది. బంధువినాశ దుఃఖతాపంతో వగకు గురి అయిన మనుష్యులకు బుధులు ఉపదేశ వాక్యాలు అమృత ధారలు!

11. పర్వ పరమార్థం:

మహాభారత కథలోని అంతరార్థాన్ని అధ్యాత్మవిదులు భావించి దర్శించి, తాత్త్విక జ్ఞాన సంపన్నులు కావటం ఇతిహాస పఠన, శ్రవణ, మనన, నిదిధ్యాసల ఫలం. శల్య సౌప్తిక పర్వాలలో పాండవ విజయం చెప్పబడింది. దాని తాత్పర్యాన్ని ఈ విధంగా భావించవచ్చును. అంతరార్థ మహాభారత గ్రంథ రచయిత డా॥ వేదుల సూర్యనారాయణ శర్మగారి

మాటలలో కొన్ని విశేషాలు.

1.''శల్యుని యుద్ధంలో ఉభయ పక్షాల సైన్యాలు చాలావరకు నాశనమయ్యాయి. తామసిక వృత్తిలో చిక్కువడిన అసమగ్ర ద్వైత జ్ఞానమార్గం (శల్యుడు) సమగ్ర సాత్త్విక జ్ఞానంలోని అద్వైత ఋజుమనోవృత్తితో (ధర్మజాదులతో) సంఘర్షణకు తలపడి పోరుసాగిస్తే రెండు వర్గాలలోని వృత్తులూ చాలావరకు ఒకదానితో మరొకటి విజృంభించి నశిస్తాయని ఉభయసైన్యాలూ శల్యుని యుద్ధంలో చాలవరకు నశించాయి అనటానికి అంతరార్థం''.

2.''దుర్యోధనుడు జలస్తంభన విద్యతో ద్వైపాయన హ్రదంలో మునిగి ఉన్నాడు. అంటే ముక్తిని నాశం చేసే దుష్టయుద్ధం సాగించే తమోవృత్తి (దుర్యోధనుడు) అహంకార మమకారాలనే ద్వైపాయన హ్రదంలో మాయావృతుడై జలంలో మునిగి ఉన్నాడని అంతరార్థం''.

3.''ధర్మరాజు హ్రదం గట్టుపైని నిలబడి దుర్యోధనుడిని ఎత్తిపొడుపు మాటలతో దూషించటంతో దుర్యోధనుడు బైటపడ్డాడు. అంటే, అహంకార మమకారాలలో చిక్కుకొన్న అజ్ఞాని తన లోపాలను ఎవరైనా జ్ఞాని బయటపెట్టినప్పుడు దానిని సహించక ఎదురు తిరుగుతాడు. అంటే, సాధకునిలోని అజ్ఞానంలోని అజ్ఞానవృత్తి రహస్యంగా దాగి చిరకాలం ఉండలేదనీ, అది తిరిగి జ్ఞానవృత్తిపై అహంకరించి ఎదుర్కొంటుందనీ అంతరార్థంగా గ్రహించాలి''.

4.''దుర్యోధనునికి భీముడు ఊరుభంగం చేశాడు. ఊరుభంగం అంటే తొడలు విరుగగొట్టటం అని అర్థం. అంతరార్థంలో ఉ+ఉరు= ఊరు ఔతుంది. 'ఉ' అంటే సూక్ష్మదేహమైన తైజసిక ప్రకృతి . తైజసిక ప్రకృతి అనగా త్రిపుటిలోని స్వప్నావస్థలో ఉండే మానసికవృత్తి. భీముడనగా సాధకుడిలోని అభయవృత్తి. భీమునిచేత - అభయవృత్తిచేత, ఉ - తైజసిక మనఃప్రకృతికి, అనగా సూక్ష్మదేహ వాసనా ప్రకృతికి; ఉరు= గొప్పదైన; భంగం= నాశనం చేసిందని అర్థం''

5. ''దుర్యోధనుడు అశ్వత్థామను సర్వసైన్యాధిపతిగా అభిషిక్తుడిని చేశాడు అంటే- ముక్తికి సంబంధించిన సమస్త వృత్తుల నాశనానికై సాధకునిలోని తామసికవృత్తి, తనలోని ప్రకృతి సంబంధ ప్రకాశానికి తనలోని ముక్తి నిరోధక తామసికవృత్తుల పై అధికారం కలిగించిందని అంతరార్థం''.

6. ''అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ - ఈ ముగ్గురు రథికులూ కురుక్షేత్ర యుద్ధంలో చావకుండా మిగిలినవారు. అశ్వత్థామ అంటే ప్రకృతి ప్రకాశం. కృపు డంటే పోషించేవాడు. అనగా వాసనా కృతములైన కర్మలను ప్రోత్సహించే ప్రారబ్ధ కర్మ ప్రవృత్తి అని అర్థం. కృతవర్మ అంటే - చేయబడిన కర్మలకు కవచం వంటివాడని అర్థం - అనగా జీవునిలో వాసనావృత్తి అని భావం. ప్రకృతి ప్రకాశం అనగా మాయ, ప్రారబ్ధకర్మ, సంచితకర్మల యొక్క వాసనలు అనే ఈ మూడూ ఒకదానిని ఒకటి వీడకుండా కలిసి ఉంటాయని అంతరార్థం.''

7. ''న్యగ్రోధ వృక్షం మీద దివాంధం (గుడ్లగూబ) రాత్రివేళ చేసిన పనిని అశ్వత్థామ ఆదర్శంగా తీసికొన్నాడు. అంటే- ప్రకృతి ప్రకాశం తమోవృత్తిలో ఉన్నప్పుడు ముక్తిమార్గాన్ని నిరోధించే అపరాశక్తి యొక్క అజ్ఞానంచేత ఆవరించబడి ఉంటుంది అనే అంతరార్థం చెప్పుకొనాలి''.

8. ''అశ్వత్థామ ఆ రాత్రి పాండవ శిబిరంలో నిద్రిస్తున్న ధృష్టద్యుమ్నుడు, పాంచాలురు, ఉపపాండవులు మొదలైనవారిని అనేకులను చంపాడు. అంటే - అజ్ఞానావృతమయిన మాయాప్రకృతి సాధకునిలోని ముక్తివృత్తికి సంబంధించిన దృఢజ్ఞాన ప్రకాశాన్నీ (ధృష్టద్యుమ్నుడిని), పంచేంద్రియ నిగ్రహవృత్తులనూ (పాంచాలురనూ), మనోవ్యాపారాలను (ఉపపాండవులనూ) సుప్తములై ఉన్నప్పుడు చంపివేసింది. అనగా - కారణదేహంలోని జ్ఞాన వాసనలను పనిచేయకుండా వ్యర్థములైన వానినిగా చేసివేసిందని అంతరార్థంగా గ్రహించాలి.''

9. ''సూర్యోదయం కాగానే పాండవులు అశ్వత్థామను వెదకి పట్టుకొని అతని శిఖలో ఉన్న మణిని లాగుకొని దానిని ధర్మరాజుచేత ధరింపజేశారు. మణి తళతళ మెరిసే లక్షణం కలది. అశ్వత్థామ శిఖలోని మణిని లాగేశారు అంటే- ప్రకృతి యొక్క ప్రకాశాన్ని ప్రకృతినుండి లాగి తీసివేశారు. సాధకుడు జీవన్ముక్తావస్థను చేరుకోవటమంటే అదే. ప్రకృతిలోనే

ఉంటూ, ప్రకృతిని తన గుప్పిటిలో ఉంచుకొని, ప్రకృతికి బద్ధులు కాకుండా, ప్రకృతిని స్వవశం చేసికొని అసంగత్వంతో సాధకుడు జీవించటమే జీవన్ముక్తావస్థ. మణిని ధర్మరాజు ధరించాడు అంటే సాధకుడు స్వధర్మ ప్రవృత్తిలో జీవన్ముక్తావస్థను చేరుకొన్నాడని అర్థం. అశ్వత్థామ యొక్క శిరోమణిని ధరించినవారికి ఆకలిదప్పులు గాని, చోర వ్యాధి శస్త్రబాధలు కాని ఉండవు. అంటే ప్రకృతిశక్తియొక్క గొప్పతనాన్ని అనుభవించినవారికి అనగా అష్టసిద్ధులు లభించినవారికి సర్వబాధానివారక శక్తులూ లభిస్తాయని వాని అంతరార్థంగా గ్రహించాలి.

11. ''కౌరవపక్షంలో అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ అను ముగ్గురు తప్ప, అందరూ హతులయ్యారు. పాండవ పక్షంలో పంచపాండవులు, కృష్ణుడూ, సాత్యకి అను ఏడుగురు తప్ప మిగిలిన వారందరు నిహతులయ్యారు. అంటే సాధకుడిని ముక్తుడిని కాకుండా చేయటానికీ, సాధకునిలోని సాత్త్విక వృత్తులతో యుద్ధం చేసే తామసిక సంబంధం గల వృత్తులన్నీకూడా సాధనవలన జ్ఞానంలో చిట్టచివరకు విలీనమై పోతాయి. ఒక్క ప్రకృతి మాత్రం విలీనావస్థలో నిలిచి ఉంటుంది. ప్రకృతికి సంబంధించినవే మాయ, జీవుడు, ప్రకృతిని అనుసరించియే ఉంటాయి. ఈ మూడూ కలిసియే ప్రకృతి అని పిలువబడుతుంది. ఆ ప్రకృతిలోని వ్యాపింపజేసే ఇతర తామసిక వృత్తులన్నీ జ్ఞానసాధనలో సాధకునిలో విలీనమై ఉంటాయి. ప్రకృతిమాత్రం అనగా మాయ, జీవుడు, ప్రకృతి నశించవు - అన్నదే అశ్వత్థామాదులు మువ్వురూ యుద్ధంలో చనిపోక బ్రతికి ఉన్నారన్నదానికి అంతరార్థం. అభయవృత్తి, ఋజువృత్తి, ఐహిక విరాగవృత్తి, జ్ఞానప్రకాశవృత్తి అనే నాలుగు వృత్తులూ ధర్మవృత్తిని ఆశ్రయించి ఉండేవే. ఆ ధర్మవృత్తి యమనియమాది అష్టాంగ సాధనవలన కలుగుతుంది. ఆ ధర్మవృత్తి ప్రతిజీవునిలోను గల బ్రహ్మైక్యం పొందాలనే ముక్తి వృత్తి. దానికి నశించటం అనేదే లేదు. ధర్మపదానికి సహజమైనది అని అర్థం. నిర్వృతివృత్తి (కృష్ణుడు) ధర్మవృత్తికి ఎప్పుడూ తోడ్పడుతూనే ఉంటుంది. సాత్యకి అనేది 'సత్యక' శబ్దం నుండి పుట్టింది. 'సత్యం' అనగా పరమాత్మ అని అర్థం. సత్యం, శివం, సుందరం - అనేవి పరమాత్మను చెప్పే పదాలు. కాన, సత్యవృత్తియే సాత్యకి అనే పదానికి అర్థం. ప్రతిజీవికి అంటే సాధకుడికి సహజమైన పరమాత్మభావన అని అర్థం. ప్రతిజీవికి పరమాత్మలో ఐక్యమవ్వాలనే భావన అంతర్గతంగా సహజంగా ఉంటుంది. పాండవపక్షంలో పంచపాండవులు, కృష్ణుడు, సాత్యకి యుద్ధంలో నశించక బ్రతికి ఉన్నారన్న దానిలో సౌప్తికపర్వంలో ముక్తిమార్గం సంపూర్ణతకు చేరుకోవడం అనేది జయప్రదంగా ముగింపు చేయబడింది. వ్యాసుడు తన భారతాన్ని 'జయం' అనే పేరుతో పాండవ విజయంగా సౌప్తికపర్వంతో ముక్తి సాధనాక్రమాన్ని పూర్తిచేశాడు. 'జయం' అంటే పాండవులు కౌరవులను జయించటం అనేది బాహ్యార్థం. తామసిక వృత్తులను సాత్త్వికవృత్తులు ఎదిరించి ముక్తిని సాధించటం అనే సాధనలను జయప్రదంగా ఎట్లు నెరవేర్చాలో చెప్పేది 'జయం' అని అంతరార్థం''.

12. ''స్త్రీపర్వం, శాంతిపర్వం, అనుశాసనికపర్వం, ఆశ్రమవాసపర్వం, అశ్వమేధపర్వం - అను అయిందింటిలోనూ అంతరార్థం చెప్పవలసిన కథాభాగాలు లేవు. కథను ఆసక్తికరంగా పూర్తిచేయటానికి సౌతి, వైశంపాయనుడు అను వ్యాసమహర్షి యొక్క శిష్యులు ఆ అయిదు పర్వాలు తాము పెంచారు. వ్యాసుడు వ్రాసిన 8800 శ్లోకాల గ్రంథాన్ని మొత్తం లక్షశ్లోకాలు గల గ్రంథంగా పర్వాలు పెంచి పెద్దది చేసి 'జయ' మనే దానిని మహాభారతంగా వ్యాప్తి చేశారని డా॥ వేదుల సూర్యనారాయణ శర్మగారు అభిప్రాయపడ్డారు. (వివరాలకు చూడండి అంతరార్థ మహాభారతము (1986)

12. కవిత్రయ మహాభారతం: వ్యాఖ్యానం

తెలుగులో ఆదికావ్యమైన ఆంధ్రమహాభారతం అవతరించి వెయ్యేళ్ళు కావస్తున్నా, ఇంతవరకు దానికి సమగ్రవ్యాఖ్య వెలువడలేదు. ఆంధ్రుల అభిమాన దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి వారి అనుగ్రహంతో కవిత్రయ మహాభారతానికి తెలుగులో శిష్టవ్యావహారిక భాషలో సరళవ్యాఖ్య వెలువడటం ఆంధ్రావళి ఆనందించే అపూర్వ సాహిత్యోత్సవం. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారు భారతీయ వైదిక ధర్మప్రచార మహోద్యమాన్ని చేపట్టి మహనీయంగా సాగిస్తున్నారు. అందులో ఈ పంచమవేద వ్యాఖ్యాన ప్రణాళిక ఒక మహత్తర సారస్వత యజ్ఞం. ఏడుకొండలరాయడు మాత్రమే చేపట్టి ధర్మరక్షణ కళా ప్రావీణ్యంతో ఈ బృహత్తర ధర్మకార్యాన్ని ప్రజలకు ప్రసన్నంగా ప్రసాదించగలిగిన పరమదయాళువు. ఆ దేవదేవుడి కృపాకటాక్షంతో పండితులు వ్యాఖ్యానించిన పదునెనిమిది పర్వాల ఈ దివ్య ప్రబంధ మండలిని పరిష్కరించి సర్వాంగసుందరంగా

ప్రచురించి, సామాన్య జనులకు అందుబాటులో ఉండేటట్లు చేయటం తెలుగువారు చేసికొన్న వెలుగుల పుణ్యం. ఈ పవిత్ర మహత్తర ప్రయత్నానికి శ్రీ తిరుమలేశుడి పక్షాన బాధ్యతవహించి, అభ్యుదయ పరంపరను విజయవంతంగా సమకూరుస్తున్న మాన్యులు, మహనీయులు టి.టి.డి.బోర్డు ఛైర్మన్, సభ్యులు, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, వారి సహకారులూ, సంపాదక సలహామండలుల సభ్యులూ, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, ఎడిటోరియల్ సెల్ సభ్యులూ, పలురకాలుగా ఈ కార్యక్రమంలో తోడ్పడుతున్న అధికారులూ, అనధికారులూ ధన్యులు. వారికి నా కృతజ్ఞతాభినందనాలు.

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటి. అది రెండు భాగాలుగా వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటిగా రూపుదిద్దుకొన్నది. విస్తృతమైన అరణ్యపర్వం మూడవసంపుటిగా రెండుభాగాలలో ప్రచురించబడింది. మొదటిభాగం నన్నయ రచించిన ఆరణ్యపర్వభాగం. రెండవభాగం ఎఱ్ఱాప్రెగడ పూరించిన ఆరణ్యపర్వ శేషం. ఈ విధంగా ఆరణ్యపర్వం విభజించబడి ప్రచురించబడటం తెలుగులో ఇదే ప్రథమం. నాల్గవ, అయిదవ, ఆరవ, ఏడవ, ఎనిమిదవ సంపుటాలుగా విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ, కర్ణ పర్వాలు వెలువడ్డాయి. ఇప్పటి ఈ తొమ్మిదవ సంపుటి శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాల సమష్టి సంపుటి.

ఈ పర్వాల వ్యాఖ్యానంలో నలుగురు మహాపండితులు పాల్గొన్నారు. శల్యపర్వ ప్రథమాశ్వాసానికి డా॥ పి.వేంకటరాజుగారు, ద్వితీయాశ్వాసానికి శ్రీసింగరాజు సచ్చిదానందంగారు, సౌప్తికపర్వంలోని రెండాశ్వాసాలకూ విద్వన్మణులు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారు, స్త్రీపర్వం మొత్తానికీ సంగీత సాహిత్యకళావేత్తలు డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానందగారూ వ్యాఖ్యానం వ్రాశారు. శాస్త్ర మర్మజ్ఞులైన వీరు సరళమైన రచన చేశారు. ఈ పర్వాలకు తగిన పీఠికను నేను సంతరించాను. ఇవి ఆంధ్రుల ఆమోదాన్ని పొందుతాయని ఆశిస్తాను.

ఈ సంపుటి ఈ విధంగా రూపొందటానికి తోడ్పడిన మిత్రులు, విద్మన్మణులు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు గారికీ, శ్రీ కె.సత్యరామ ప్రసాద్‌గారికీ, శ్రీ జి.రాధాకృష్ణగారికీ, శ్రీమతులు సుశీలా లక్ష్మీ విద్యానాథులకు, డాక్టర్ వి.యస్. లక్ష్మికీ నా కృతజ్ఞతలు.

పరమ కల్యాణ భద్రమూర్తి అయిన శ్రీ పద్మావతీ సహిత శ్రీ వేంకటేశ్వర స్వామివారు వేదవేద్యులు, వేదాంత గమ్యులు, పరతత్త్వరూపులు అయినా భక్తసులభులు, సాహిత్య సంగీత కళాప్రియులు, రసానందమూర్తులు. ఆ స్వామికి ఈ పంచమవేదం అక్షరమైన తోమాలసేవ; వ్యాఖ్యానం సుగంధపరిమళ సేవ; విశేషాంశాలు ఉజ్జ్వలాలంకార సేవ; పీఠిక ఆ విరాణ్మూర్తికి మంగళనీరాజన సేవ. ఈ పర్వం స్వామివారికి సారస్వతమైన అక్షరార్చన!

సత్యశివసుందర రూపులైన స్వామివారి దివ్యసన్నిధిలో ఈ వ్యాఖ్యా సంపుటిని వాఙ్మయారాధనలోని భాగంగా పుణ్యపూజకు సుమమంజరిగా సమర్పించుకొంటున్నాను. విశ్వశ్రేయస్సును ప్రసాదించుమని స్వామివారిని వేడుకొంటున్నాను.

హైదరాబాదు
02-10-2004

జి.వి.సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు,
కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానం.

శల్యపర్వ కథాసారం

కర్ణుడు నేలగూలిన తరువాత దుర్యోధనుడు మిగిలిన కొద్దిపాటి సైన్యంతో స్కంధావారంలో ప్రవేశించి బంధుమిత్రులతో అనంతర కార్యక్రమాన్ని గురించి యోచించసాగాడు. అప్పుడు కృపాచార్యుడు ఇట్లా అన్నాడు. 'మీ వంటి రాజులు పూర్వం కూడా యుద్ధాలు చేశారు. అది ఉత్తమ ధర్మం కూడా. దానివలన సుగతిని పొందారు. అయినా, నే నొక్కటి చెప్పుతాను వినుము. భీష్మద్రోణ కర్ణాది మహావీరులూ, రాజులూ, బంధుమిత్రులూ, బలగాలూ రణంలో చనిపోయారు. పదిహేడు రోజులు యుద్ధం సాగింది. మనవైపు సైనికులు బాగా తగ్గిపోయారు. అర్జునాది వీరులు తలచుకొంటే ఈ సైన్య మొక లెక్కకాదు. నీ వలన యుద్ధం కలిగింది. ప్రాణహాని జరిగింది. ఇకనైనా యుద్ధం మాని ముందుగా నిన్ను కాపాడుకొమ్ము. ధర్మనందనుడిని చూచి సంధిచేసికొమ్ము. రాజ్యాన్ని ఇరువురూ పంచుకొని ధృతరాష్ట్రుడిని సేవిస్తూ సుఖంగా జీవించండి'- అని హితోపదేశం చేశాడు. అయినా, ఆయన మాటలు దుర్యోధనుడికి రుచించలేదు. పై పెచ్చు -

తే. 'నేఁడు దుశ్శాసనుని ఱొమ్ము నెత్తు రనిల । సుతుఁడు మదుమునఁ ద్రావుట సూచి కొఱఁత

ప్రతిన దీర్చు నతం డని భయముఁ బొంది । పొందుఁ గోరిన నది యేల పోసఁగుఁ జెపుమ!"**(శల్య. 1.66)**

అని పలికి, యుద్ధం చేయటమే ఉచిత మని పేర్కొని, గెలిస్తే విజయం, ఓడితే స్వర్గం స్వీకరిస్తానని సంధి ప్రతిపాదనను తిరస్కరించాడు. ఒకరి దయవలన కలిగే రాజ్యసుఖాలు తనకు వద్దని మరల యుద్ధానికి సిద్ధమయ్యాడు.

1. శల్యసేనాపతిత్వం:

ఆనాటి రాత్రి శిబిరంలో వసిస్తే పాండవులు దాడి చేస్తారేమోనన్న అనుమానంతో దుర్యోధనాదులందరూ కలిసి సరస్వతీ నదీతీరానికి పోయి కృతస్నానులై అక్కడి పలు కుటీరాలలో రాత్రి గడిపారు. మరునాడు ఉదయాన అశ్వత్థామ సలహామేరకు మద్రభూపతి అయిన శల్యుడిని సర్వసైన్యాధ్యక్షుడిగా రారాజు అభిషేకించాడు. ఆ వార్త విన్న ధర్మరాజు శ్రీకృష్ణుడి ప్రబోధంతో ఉత్సహించి తన మేనమామ అయిన శల్యుడిని మరునాడు సంహరించాలని సంకల్పించి ఆ రాత్రి విశ్రమించాడు.

మరునాడు ఉదయం శల్యుడు సర్వతోభద్రవ్యూహాన్ని పన్నాడు. దాని ముఖస్థానంలో అతడే నిలిచాడు. వలపట శక, యవన సమేతుడై కృపాచార్యుడూ, దాపట త్రిగర్త సమేతుడై కృతవర్మా, వెనుక కాంభోజ సహాయుడై అశ్వత్థామా, నడుమ దుర్యోధనుడూ, అతడి ముందు గజసైన్యంతో శకునీ మోహరించారు. అంతకుముందే పాండవులు త్రిముఖవ్యూహం సిద్ధంచేసికొన్నారు. ఆ మూడు ముఖాలలో వరుసగా ధృష్టద్యుమ్న, శిఖండి, సాత్యకులు నిలిచారు. ధర్మజుడికి రక్షగా భీమార్జునులు అగ్రభాగంలో మోహరించారు. కౌరవులు పాండవులతో తలపడేటప్పుడు ఎట్టి పరిస్థితులలోనూ వారితో ఒక్కొక్కరుగా పోరాడరాదనీ, పలువురు కలిసి ఒక్కుమ్మడిగా యుద్ధం చేయాలనీ నిర్ణయించుకొన్నారు.

పదునెనిమిదవ నాటి యుద్ధం ప్రారంభమయింది. శల్య విజృంభణం కౌరవసేనలకు ఆశ్చర్యం కలిగించింది. అతడు పాండవులను జయించగలడనే పేరాస కలిగించింది. గురుభీష్మ కర్ణులు సాధించలేని కార్యాలను శల్యుడు సాధించగలడనే నమ్మకం కలిగింది. 'శల్యో జేష్యతి పాండవాన్' అనే నానుడి పుట్టింది.

పాండవ పక్షంలో భీమార్జునుల విజృంభణం బలంగా సాగింది. పాండవులు తెగబడి పోరు సల్పారు. కౌరవవీరులు పంతంతో ఎదిరించారు. నకులుడు కర్ణపుత్రులైన చిత్రసేన, సత్యసేన, సుశర్మలను పరాక్రమాన్ని ప్రకటించి వధించాడు. భీమసేనుడు భీకర గదాయుద్ధంలో శల్యుడిని మూర్ఛపోయేటట్లు చేశాడు. కృపాచార్యుడు శల్యుడిని రథంమీద ఉంచుకొని దూరంగా తొలగిపోయాడు. కొంతసేపటికి శల్యుడు తేరుకొని ఎత్తిన గదాదండంతో తన రథాన్ని పిలిచాడు. చుట్టూ ఉన్న సైనికులు ఉప్పొంగి పోవగా దుర్యోధనుడి ముందున్న సైనికులను కలుపుకొని ముందుకు సాగగా, ధర్మరాజు ముందున్న

రథికులు చేకితానుడిని ముందుంచుకొని భీముడిని దాటి దుర్యోధనుడిపై తలపడ్డారు. అతడి వజ్ర గదాఘాతానికి చేకితానుడు చనిపోయాడు. పాండవసైన్యం మండిపడి కౌరవసైన్యంమీద బాణవర్షం కురిపించింది. శల్యుడు ధర్మరాజును, దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడినీ, మూడువేల రథికులతో కూడిన అశ్వత్థామ అర్జునుడిని ఢీకొన్నారు. పోరు ఘోరంగా సాగింది.

2. శల్యవిజృంభణం:

యుద్ధంలో శల్యుడి ప్రయోగ ప్రతాపం ప్రశంసాపాత్రంగా సాగింది. అతడిపై ధర్మరాజు ముద్గరాన్నీ, సాత్యకి తోమరాన్నీ, భీముడు భల్లాన్నీ, నకులుడు శక్తినీ, సహదేవుడు గదనూ ప్రయోగించగా శల్యుడు బాణాలతో వాటిని వమ్ముచేసి ఆర్చాడు. సాత్యకి రోషంతో విజృంభించగా శల్యుడు అతడిని, పాండవులను మూర్ఛపొందించాడు. దానిని చూచి శల్యుడు పాండవులను ఆనాడు చంపుతాడని దుర్యోధనుడు భావించి సంతోషించాడు.

అంతలో భీమ నకుల సహదేవులు కలిసి విజృంభించి శల్యుడిని ఎదుర్కొన్నారు. ధర్మరాజు శల్యుడి చక్రరక్షకుడైన ద్యుమత్సేనుడి తల నరికాడు. శల్యుడు జూలు పీకిన సింహంవలె కోపించి భీమాదులను బాణాలతో నొప్పించి నెత్తురు పారేటట్లు చేశాడు. దానిని చూచి ధర్మరాజు ఖిన్నుడై తాను శల్యుడిని చంపగలనని శ్రీకృష్ణుడు తనతో అన్నమాటలను జ్ఞాపకం చేసికొన్నాడు. ధైర్యంతో సైన్యాన్ని శల్యుడిపై పురికొలిపాడు. శల్యుడు ధర్మరాజాదులను బాణాలతో కప్పి, వారిని చిమ్మచీకట్లలో ముంచాడు. దేవతలు అతడి ప్రతాపాన్ని ప్రశంసించారు. అర్జునుడు తనను చుట్టుముట్టిన సంశప్తకులను వికలాంగులుగా మార్చాడు. అశ్వత్థామ అర్జునుడిని వాడి బాణాలతో క్రూరంగా కొట్టాడు. అర్జునుడు అడవిని కాల్చే కార్చిచ్చువలె కౌరవసైన్యాన్ని ధ్వంసంచేశాడు. అశ్వత్థామ సురథుడనే పాంచాల కుమారుడిని చంపి అర్జునుడిని ఎదుర్కొన్నాడు. అప్పుడు దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడితో పోరి బాధింపబడ్డాడు. కృప కృతవర్మలు శిఖండి ప్రభృతులతో తలపడగా శల్యుడు ధర్మజ, భీమ, నకుల సహదేవ సాత్యకులతో పోరాడి వారిని నొప్పించాడు. పాండవులు తొలగిపోయారు. సాత్యకి శల్యుడిపై తిరగబడ్డాడు. శల్యుడు విజృంభించాడు. పాండవసేనలు శ్రీకృష్ణార్జునులవైపు పరుగెత్తాయి. అర్జునుడు వారికి అండగా నిలిచి కృప కృతవర్మలను ఎదుర్కొన్నాడు. సహదేవుడు శకునిని, శిఖండి అశ్వత్థామను, భీముడు దుర్యోధనుడిని ఢీకొన్నారు. ధర్మరాజు నకులుడు వెంటరాగా శల్యుడిని ఎదిరించి నిలువరించాడు.

3. శల్యసంహారం:

మధ్యాహ్నమయింది. చండప్రచండుడై శల్యుడు పాండవసైన్యాన్ని నురుమాడటం మొదలుపెట్టాడు. ఇరుపక్షాలవారూ అతడి పరాక్రమాన్ని ప్రశంసించారు. ధర్మరాజు క్రుద్ధుడై శల్యుడిపై దాడికి పూనుకొన్నాడు. తన రథానికి కుడివైపున నకుల సాత్యకులూ, ఎడమవైపున సహదేవ ధృష్టద్యుమ్నులూ, ముందు భీముడూ, వెనుకవైపు అర్జునుడూ నడువగా, శల్యుడిని సంహరిస్తానని శపథం చేసి ముందుకు సాగాడు. ఇద్దరి నడుమ ద్వంద్వయుద్ధం ఘోరంగా జరిగింది. వారిరువురూ పెద్దపులులవలె విజృంభించారు. అంతలో భీముడు దుర్యోధనుడిపై తలపడి అతడిని మూర్ఛలో ముంచాడు. గుర్రాలు రారాజు రథాన్ని దూరంగా లాగికొని పోయాయి. అశ్వత్థామాదులు అర్జునుడిని లెక్కచేయకుండా ధర్మరాజుపై దాడిచేసి చుట్టుముట్టారు. వారిని బాధించి ధర్మజుడు శల్యుడిని ఎదుర్కొన్నాడు. వారిద్దరినీ చూచి, సమబలానికి మెచ్చి ఎవరు విజయాన్ని సాధిస్తారో అని సైనికులు ఆసక్తిని ప్రకటించారు. ధర్మరాజు శల్యుడిపై మూడువందల బాణాలు గుప్పించాడు. గుర్రాలనూ, సారథినీ చంపి, చేయి కదపలేని విధంగా శల్యుడిని బాధించాడు. అశ్వత్థామ శల్యుడిని తన రథంమీద ఉంచి అపాయం నుండి తప్పించాడు. శల్యుడు తేరికొని మరొక రథంమీద ఎక్కి రణరంగంలో ప్రవేశించి తనను ముట్టడించిన పాండవవీరులను త్రోసికొనిపోయి ధర్మరాజుతో తలపడ్డాడు. వారిద్దరి నడుమ బాణయుద్ధం బలంగా సాగింది. ఇద్దరికి వారి వారి వీరులు సాయంగా పోరాడారు. ధర్మరాజు తనలో ఇట్లా అనుకొన్నాడు: 'నీవు శల్యుడిని గెలుపుము - అని దీవించి కృష్ణుడు నన్ను పంపాడు. అతడి మాటలు అబద్ధాలౌతాయా? దైవ ఘటన తప్పించరానిది' - అని శ్రీకృష్ణుడిని స్మరించాడు. ఆతడి ఆశీస్సులు ఫలించేటట్లు ప్రార్థించాడు. శ్రీకృష్ణుడిని రుద్రరూపుడిగా సంభావించాడు.

అంతలో భీముడు శల్యుడి విల్లును ఖండించాడు. గుర్రాలను చంపాడు. సూతుడి కంఠం నరికాడు. కవచాన్ని నేలపడగొట్టాడు. విరథుడు కవచహీనుడు అయిన శల్యుడు కోపించి కత్తీ డాలూ తీసికొని రథం దిగి యముడివలె విజృంభించాడు. భీముడు అతడి కత్తిని, డాలును ఖండించాడు. శల్యుడు ధర్మరాజుపై దాడిచేశాడు. 'శ్రీకృష్ణుడు ఈ శల్యుడిని సంహరించటానికే నన్ను పంపించాడు. శల్యసంహారం నా వంతు' అని భావించి ధర్మరాజు భయంకరమైన శక్తిని సంధించి భగవానుడిని ప్రార్థించి, రౌద్రోద్రేకంతో త్రిపురాసుర సంహారం చేసే రుద్రుడివలె కోపించి ఆ మహాశక్తిని శల్యుడిపై ప్రయోగించాడు. అది శల్యుడి కవచంలో భేదించి దూరింది. రొమ్ము చీల్చి, వీపునుండి బయటకు వెలువడి భూమిలో ప్రవేశించింది. ఆ గాయంవలన ముక్కులనుండి, చెవులనుండి, కన్నులనుండి నెత్తురు కారుతూ శరీరాన్ని తడిపివేయగా శల్యుడు - ప్రియురాలి ఉరంమీద వాలే ప్రియుడివలె - నేలమీద చేతులు రెండూ చాచి బోరగిల పడి ప్రాణాలు వదిలాడు. ధర్మరాజు చేసిన ధర్మయుద్ధంలో చనిపోయిన శల్యుడు శాస్త్రోక్తంగా వేల్చిన హవిస్సులు స్వీకరించి చల్లారిన హోమాగ్నివలె భాసించాడు. అన్నమరణానికి కోపించి శల్యుడి తమ్ముడు ధర్మరాజును ఎదిరించి అతడిచేతిలో మరణించాడు. శల్యసోదరుల మరణానికి పాండవసైన్యం పొంగిపోయింది.

4. దుర్యోధన యుద్ధ నిర్వాహకం:

కృతవర్మ, కృపాచార్యుడు ధర్మరాజును ఎదుర్కొని వీగిపోయారు. దుర్యోధనుడు భద్రగజాన్ని ఎక్కి యుద్ధరంగంలో విజృంభించాడు. శల్యుడి చుట్టాలు ధర్మరాజును చుట్టుముట్టారు. పాండవులందరూ కలిసి వారిని వధించారు. అప్పుడు దుర్యోధనుడు ఖిన్నుడై శకునిని తగిన ఉపాయాన్ని చెప్పమని కోరాడు. 'రాజు పూనుకొని ముందుకు ధైర్యంగా సాగకపోతే, సైనికులు మెచ్చుకొంటారా?'- అని శకుని హితవు చెప్పాడు. ఆ మాట విని దుర్యోధనుడు సైన్యానికి ధైర్యం చెప్తూ రణాన్ని సాగించాడు. పాండవ విజృంభణం దుర్యోధనుడి సైన్యాన్ని కలవరపెట్టింది. నలుదిక్కులా పరుగెత్తేటట్లు చేసింది. సైనికులంతా ధర్మజ విజయం తథ్యమనీ, దుర్యోధనుడి మరణం తప్పదనీ భావించారు. పాండవపక్షంవారు 'ఇంక ధర్మరాజు నాయకుడు' అని కీర్తించారు.

దుర్యోధనుడు ఏనుగు దిగి, రథ మెక్కాడు. పారిపోతున్న బలాలకు ధైర్యం చెప్పి యుద్ధానికి పురికొల్పాడు. 'పాండవ సైన్యం పలచబడింది. కృష్ణార్జునులు దాహంతో అలసిపోయారు. ఇప్పుడు మనం పరాక్రమాన్ని ప్రదర్శించి విజయం సాధిద్దాం' - అని చేయెత్తి పిలుపు నిచ్చాడు. సైనికులు ఉప్పొంగి దుర్యోధనుడి వెంటనడిచి భీముడిని చుట్టుముట్టారు. అతడు గదను చేపట్టి రథం దిగి 21వేల మంది వీరులను అడవిని నరికినట్లు మట్టుపెట్టాడు. రథాలనూ, అశ్వాలనూ అర్జునుడు ధ్వంసం చేశాడు. ధృష్టద్యుమ్న సాత్యకుల చేతిలో సాల్వుడు చనిపోయాడు. కృతవర్మ విరథు డయ్యాడు. కురుసైన్యం చెల్లాచెదరైపోయింది. దుర్యోధనుడు ఒంటరిగా పోరు సాగించాడు. తన కున్న లౌకిక దివ్యశక్తుల నన్నింటినీ కూడగట్టి పరాక్రమాన్ని ప్రదర్శించాడు. పాండవ వీరులపై బాణాలను గుప్పించాడు. శకుని మొదలైనవారు దుర్యోధనుడిని సమీపించి సహాయంచేశారు. శకునికీ ధర్మరాజుకూ ద్వంద్వయుద్ధం సాగింది. శకుని పుత్రుడైన ఉలూకికీ నకులుడికీ; సాత్యకికీ, కృతవర్మకూ; దుర్యోధనుడికీ ధృష్టద్యుమ్నుడికీ గొప్పయుద్ధం జరిగింది. దుర్యోధనుడు ఉపపాండవులను కలతపెట్టాడు. పాండవులు విజృంభించి కౌరవసేనను తరుమగొట్టారు. దుర్యోధనుడు ఒంటరిపోరు సాగించాడు. ధర్మజుడు కృప, కృతవర్మలను విరథులను చేశాడు. దుర్యోధనుడు కోపించి ఏడువందలమంది రథికులను పురికొల్పి ధర్మరాజుపై దాడికి పంపాడు. శిఖండి ప్రముఖులతో కలిసి పాండవులు వారిని సంహరించారు.

శకుని మాయోపాయం పన్ని పాండవ సైన్యాన్ని వెనుకనుండి అశ్వసేనతో దాడిచేశాడు. ధర్మరాజు అశ్వహృదయం తెలిసిన నకుల సహదేవులను అశ్వబలంతో శకునిపై పంపాడు. వారితో ఉపపాండవులను కూడా పంపాడు. వారు కౌరవ బలాలను పెంటకుప్పలుగా మార్చారు. శకుని యుద్ధరంగంనుండి తొలగిపోయాడు. యుద్ధం చేస్తున్న దుర్యోధనుడిని కలిసి పాండవ గజసైన్యాన్ని చంపేయత్నం చేశాడు. వారి ప్రయత్నాన్ని చూచి అర్జునుడు దుర్యోధనుడివైపు రథాన్ని నడిపించుమని కృష్ణుడిని కోరాడు.

'కృష్ణా! యుద్ధం ఆగకుండా పద్దెనిమిది రోజులు సాగింది. సముద్రంవలె ఉన్న కౌరవసైన్యం గోష్పాదమంత అయింది. కౌరవులే మూర్ఖులై ఈ యుద్ధాన్ని ప్రారంభించారు. భీష్ముడు పడినప్పుడైనా వారు యుద్ధం మాని ఉండవలసింది. భీష్ముడు దుర్యోధనుడికి అనునయంగా చెప్పాడు కూడా. ద్రోణాచార్యుడూ, భగదత్తుడూ, సైంధవుడూ, దుశ్శాసనుడూ, కర్ణుడూ, చివరకు శల్యుడూ చనిపోవటం చూచిన తరువాతైనా వారికి వివేకోదయం కాలేదు. ఇప్పటికైనా ధర్మరాజుకు రాజ్యభాగ మిచ్చి ప్రాణం రక్షించుకొనడు. దుర్యోధనుడు నిజంగా మూర్ఖుడివలె ఉన్నాడు' అని అర్జునుడు అన్నాడు. 'కుత్సితుడైన దుర్యోధనుడు ముక్కున ఊపిరి ఉండగా రాజ్యభాగం ఇవ్వడు. అంతేకాక అతడు పుట్టినప్పుడు మునులు 'ఈ పాపాత్ముడు నిఖిల క్షత్రియ క్షయ హేతువు' అని ఆదేశించారు కదా!' అని కృష్ణు డన్నాడు. 'ఆ మునులు చెప్పినట్లుగానే జరిగింది. బ్రతికి ఉన్నవారిని చంపించి తాను చచ్చిగాని ధర్మరాజుకు రాజ్యం వదలడు. ఇది నిశ్చయం. దురహంకారి అయిన దుర్యోధనుడు తన నిస్సహాయతను గమనించి కూడా పంతం వదలటంలేదు. ఇతడిని ఇంక చంపి తీరుతాను' అని అర్జునుడు రథాన్ని ముందుకు సాగించాడు.

5. ద్వైపాయన హ్రదంలో దాగిన దుర్యోధనుడు:

అర్జునుడు సైన్యాన్ని నుగ్గుచేస్తూ పారిపోయేటట్లు చేశాడు. దుర్యోధనుడు వారిని ప్రోత్సహిస్తూ మరల యుద్ధం సాగించాడు. ధృష్టద్యుమ్నుడిని కలతపరచాడు. అతడు దుర్యోధనుడి రథాన్ని కూలగొట్టాడు. రారాజు రథాన్ని దిగి ఉత్తమాశ్వాన్ని అధిరోహించాడు. ఏనుగుల గుంపును అర్జునుడిమీదకు ఉసికొల్పాడు. అర్జునుడు బాణాలతో, భీముడు గదాదండంతో, ధృష్టద్యుమ్నాదులు బాహుబలాలతో కౌరవసేనను కూలగొట్టారు. ఒంటరిగా వ్యూహాన్ని ఆలోచిస్తున్న దుర్యోధనుడిని చంపండి- అని కృష్ణుడు అర్జునుడికి సూచించాడు. అంతలో శకునీ, సుశర్ముడూ అర్జునుడిని ఎదుర్కొన్నారు. దుర్యోధనుడి తమ్ముడు సుదర్శనుడూ రణంలో చనిపోయాడు. ఉలూకుడిని సహదేవుడు చంపాడు. కొడుకు చావుకు కుమిలిపోయిన శకునిని వెంటాడి బల్లెంతో తల నరికి చంపాడు. కౌరవుల కుతంత్రాలకు మూలమైన శకుని మరణించటంవలన పాండవులందరూ సంతోషించారు. దుర్యోధనుడు తన చుట్టూ నిలిచి పోరాడేవారు లేక, ఎదుట పాండవులు హర్షోత్సాహాలతో ఉండటం సహించలేక యుద్ధభూమినుండి తొలగిపోవటానికి నిశ్చయించుకొన్నాడు. గుర్రం దిగి, గద భుజంమీద ధరించి, ఏకాదశాక్షౌహిణీపతి పరివార రహితుడై వెడలి, ద్వైపాయన హ్రదం చేరి, జలస్తంభన విద్యా ప్రభావంతో అందులో దాగుకొన్నాడు.

యుద్ధంలో చావకుండా కృపాశ్వత్థామ కృతవర్మలు మిగిలారు. ఆ సమయంలో ధృష్టద్యుమ్నుడు సంజయుడిని పట్టుకొన్న సాత్యకిని చూచి వారించాడు. అయినా సాత్యకి సంజయుడిని తల నరుక పోగా వ్యాసమహర్షి ప్రత్యక్షమై సంజయుడి వధను వారించాడు. సంజయుడు దుర్యోధనుడిని దర్శించుకొన్నాడు. ప్రాణాలతో ఉన్నావారు ముగ్గురు రథికులే అన్న విషయాన్ని తెలియపరిచాడు. దుర్యోధనుడు నిట్టూర్చి తన తండ్రికి అతడి ద్వారా సందేశాన్ని పంపాడు. 'ధృతరాష్ట్ర మహారాజా! నీ వైపువారంతా చనిపోయారు. పాండవులు, వారి ఆప్తులూ జీవించి ఉన్నారు. దెబ్బలు తిని నేను చావకుండా పాండవులబారి నుండి తప్పించుకొన్నాను. పాండవులు రాజ్యాన్ని తీసికొని నాకు కొంతభాగం ఇస్తామన్నా నాకు ఆ ఎంగిలి కూడు వద్దు. తమ్ములూ, కొడుకులూ, సేవకులూ అందరూ పోయిన తరువాత నేను సంతోషంతో ఉండగలనా? కాబట్టి ఈ మడుగులో కొంతకాలం దాగి, అనుకూల సమయంలో ఎక్కడికైనా పోయి, ఏదో విధంగా నా పగ తీర్చికొంటాను' అని సంజయుడి ద్వారా తన సందేశాన్ని పంపాడు. జలస్తంభన శక్తితో మడుగులోకి దూరి గుప్తంగా దాగి ఉన్నాడు.

కృపాచార్యుడికీ, కృతవర్మకూ సంజయుడు కనపడి జరిగిన సంగతి అంతా తెలియచెప్పాడు. దుర్యోధనుడి దీనస్థితికి వారు చింతించారు. బంధువుల శవాలను చూచి దుఃఖించే స్త్రీల ఆర్తనాదాలు పెరిగాయి. యుయుత్సుడు ధర్మరాజు అనుమతితో వారినందరినీ హస్తినాపురానికి తీసికొనిపోయాడు. పాండవులు దుర్యోధనుడిని అన్వేషిస్తూ కొలనుప్రాంతానికి వచ్చి అక్కడ అతడు కనపడక పోవటంతో తిరిగివెళ్ళాడు.

పాండవులు వెళ్ళగానే కృప కృతవర్మ అశ్వత్థామలు దుర్యోధనుడు దాగి ఉన్న కొలను సమీపించి అతడిని పిలిచారు. అతడు అలసి ఉండటంచేత మరునాడు కలుద్దామని చెప్పాడు. అశ్వత్థామ పౌరుషంతో 'దాగటం పిరికివారి లక్షణం, దాడిచేయటం వీరలక్షణం. నా పగ తీరేటట్లు నేను పాండవులను చంపి నా తండ్రికి సంతోషం కలిగిస్తాను' అని రారాజుతో పలికాడు.

పాండవ గూఢచారులలో ఒకడైన భీముడి బోయవాడు వారి సంభాషణలు విని భీముడికీ, ధర్మరాజుకూ దుర్యోధనుడు దాగి ఉన్న ద్వైపాయన హ్రదం గురించి చెప్పాడు. వా రాసంగతి శ్రీకృష్ణుడికి తెలిపారు. అందరూ కలిసి హ్రదం వద్దకు చేరారు. వారి కోలాహలం విని దుర్యోధనుడి అనుమతితో రథికత్రయం అప్పటికి పోరుమాని రహస్యస్థలంలో ఉండటానికి వెళ్ళారు. సంజయుడు ప్రక్కనున్న పొదలలో దాగి ఉన్నాడు. పాండవులు హర్షోత్సాహాలతో ఆ కొలని వద్దకు వచ్చారు. దుర్యోధనుడి మాయాశక్తిని గుర్తించారు.

6. ధర్మజ దుర్యోధన సంవాదం :

ధర్మ : కృష్ణా! దుర్యోధనుడు మాయావిద్యా శక్తిచేత నీటిలో నిశ్చింతగా దాగి ఉన్నా, దేవేంద్రుడే వచ్చి ఇతడికి సహాయపడినా, నా చేతిలో వీడికి చావు తప్పదు.

శ్రీకృష్ణ : (సన్నని స్వరంతో) మాయావులను మోసంతోనే చంపాలి, రాక్షసులను విష్ణువు, ఇంద్రుడూ తగిన మాయోపాయాలతో చంపలేదా? కాబట్టి దుర్యోధనుడు నీటినుండి బయటకు వచ్చే ఉపాయం ఆలోచించుము.

ధర్మ : (దుర్యోధనుడిని ఉద్దేశించి) సుయోధనా! ఇది నీకు తగిన పనేనా? భూమండలంలో ఇంతటి దురవస్థ ఎక్కడా చూడలేదు. నీ కొరకు లెక్కలేనంత మంది రాజులు, బంధువులు, మిత్రులు, సేనలు నేల కొరిగారు. వారందరి త్యాగాలూ చావులూ వృథా అయ్యేటట్లు నీవు మాత్రం క్షేమంగా ఉందామని నీటిలో దాగావా? ఒకవేళ ఇట్లా దాగుకొన్నా చావు తప్పుతుందా? నీవు మహారాజువు కదా! ఇది వీర ధర్మమా? గొప్పదైన కౌరవశంశంలో పుట్టి ఇటువంటి దైన్యానికి పాలుపడటం వంశగౌరవమా? నిన్ను చూచి శత్రువులు నవ్వరా? రాజధర్మం వదలితే నీకు ఇహపరాలు ఉండవు. ఆనాడు నిండు సభలో నీవు పలికిన మాటలు నీ ప్రాణాలను తప్పక బలిగొంటాయి. ప్రాణం కంటె మానం గొప్పది కదా! నీ తీరు అభిమానానికి అవమానం కలిగిస్తున్నది. నీవు నమ్ముకొన్న కర్ణశకుని దుశ్శాసనుల వలననే నీ కీ అవమానం కలిగింది. ఇంక ఎక్కడికి తప్పించుకొని పోగలవు? మగతనంతో యుద్ధానికి సిద్ధం కమ్ము. యశస్సో, మృత్యువో తేల్చుకొమ్ము. యుద్ధంలో నీవు మమ్మల్ని జయిస్తే భూవలయాన్ని పాలించుము. చనిపోతే స్వర్గసుఖాలు అనుభవిస్తావు.

దుర్యో : ధర్మరాజా! మానవుడు ప్రాణభయం పొందటంలో ఆశ్చర్యం లేదు. నాకు ఇప్పుడు పరివారం లేదు. ఆప్తులూ, స్నేహితులూ లేరు. అస్త్రశస్త్రాలు లేవు. వాహనాదులు లేవు. సాయుధ బలాలూ లేవు. యుద్ధంలో తగిలిన దెబ్బలవలన నేను అలసి ఉన్నాను. అలసట తీరిన తరువాత యుద్ధం చేస్తాను. మీరూ కొంత విశ్రాంతి తీసికొని రండి.

ధర్మ : మేము ఇంతదాకా విశ్రాంతి తీసుకొన్నాము. అలసట తీరింది. నిన్ను వెదకి కనుగొన్నాము. నీకూ దాహం తీరింది. ఇక యుద్ధానికి సిద్ధం కమ్ము.

దుర్యో : ఎవరికొరకు రాజ్యాలనూ భోగాలనూ కోరుకొంటామో ఆ కుమారులూ, తమ్ములూ, బంధువులూ అందరూ పోయారు. ఇక యుద్ధ మెందుకు? ఒకవేళ మీ వారిని చంపి విజయం సాధించినా కర్ణభీష్మద్రోణులు లేని రాజ్యం నాకు సంతోషాన్ని కలిగిస్తుందా? తనవారితో కలిసి భోగించలేని సంపద తనివి తీర్చదు. నీ వారు బ్రతికి ఉన్నారు కాబట్టి నీవే రాజ్యభోగాన్ని అనుభవించుము. గుర్రాలూ, ఏనుగులూ లేని ఈ బీడువంటి రాజ్యాన్ని నీ తలకు చుట్టుకొనుము.

ధర్మ : (నవ్వుతూ) ఎందుకు ఈ ప్రేలాపనలు? నీవారంతా పోయిన తరువాత కూడా శల్యుడిని సేనాపతి చేసికొని మమ్మల్ని గెలిచి రాజ్యాన్ని పాలించాలని ఆశపడలేదా? అయినా, నాకు రాజ్యదానం చేస్తానన్నావు. నీవు ఎవడవు ఇవ్వటానికి? నీ కేమి అధికారం ఉన్నది ఇప్పుడు? శ్రీకృష్ణుడు సంధిచేసికొని భాగమిమ్ము అన్నప్పుడు నీవు ఇవ్వక ఈ దీనస్థితికి వచ్చావు. శత్రువులకు రాజ్యదానం చేసే వెర్రివాడు లోకంలో ఉండడు. కాబట్టి యుద్ధమే నీ

ధర్మం. ఇప్పుడు నీ ప్రాణాలు నా చేతులలో ఉన్నాయి. నా జీవితం నీ చేతిలో ఉన్నది. నీవు లక్కయిల్లు కాల్చావు, పాములతో కరిపించావు. నీళ్ళలో త్రోయించావు. విషం కలిపిన అన్నం పెట్టించావు. ఇట్లా ఎన్ని కపటోపాయాలు చేసినా మేము నశించలేదు. అందువలన ఇక మాయోపాయాలవలన ప్రయోజనం లేదు. ఇంకా దాగి ఉండటం ఎందుకు? బయటపడి యుద్ధం చేయుము.

దుర్యో : (చికాకుపడి) మీరందరు బంధుమిత్రులతో కూడి ఉన్నారు. నేను ఒంటరివాడిని, నాకు సేనలు లేవు. ఎట్లా యుద్ధం చేయగలను? అంతేకాక దెబ్బలతో అలసి ఉన్నాను. అయినా మీలో ఒక్కొక్కరు వచ్చి పోరాడండి. నేను హ్రదం వెలువడి వచ్చి మిమ్ములను వరుసగా చంపుతాను. అనేకులు ఒక్కుమ్మడిగా దాడిచేసి ఒక్కడితో యుద్ధం చేయటం న్యాయమా? మీరు ఈ కట్టడికి సమర్థులు కాకపోతే - నేనే మీ అందరినీ మట్టు పెట్టుతాను. భీష్మద్రోణాదుల ఋణం తీర్చుకొంటాను. ఇట్లా అనటం శ్రీకృష్ణుడినీ మిమ్ములనూ చూచి భయపడి కాదు. యుద్ధనీతిని అందరికీ తెలియచెప్పటానికి.

ధర్మ : సుయోధనా! నీ యుద్ధనీతి హర్షించతగిందే. నీ వొక్కడివే మా అందరిని భుజబలంతో చంపుతా నంటున్నావు. అయినా, నేను యుద్ధ ధర్మాన్ని ఎందుకు విడుస్తాను? నీకు కావలసిన అస్త్రశస్త్రాల నిస్తాను. మాలో ఒక్కడే నీతో యుద్ధంచేసి జయిస్తాడు. అతడిని నీవు ఓడించగలిగితే రాజ్యమంతా నీవే తీసికొని పరిపాలించుము.

దుర్యో : నేను గదాయుద్ధం చేస్తాను. నిన్నూ, నీ సోదరులను, వీరులను నా గదతోనే మట్టుపెట్టుతాను.

ధర్మ : సరే! రమ్ము. నేను ఒక్కడనే గదతో అకుంఠిత బలాన్ని ప్రదర్శించి నీ ప్రాణాలు తీస్తాను.

ధర్మరాజు మాటలు విని దుర్యోధనుడు మనసు కలతపడగా పుట్టలోనుండి వెలువడ్డ మహాసర్పంవలె మహాపౌరుషంతో కొలనునుండి బయటకు వెలువడ్డాడు. చూచేవారికి కాలదండం చేతపట్టిన యముడివలె భయం కలిగించాడు. పాండవులందరు కలిసి అతడిని చూచి నవ్వారు. అతడు మండిపడి వారిని యుద్ధంలో చంపుతానని హుంకరించాడు. అయినా, పాండవులందరూ కలిసి తనపై దాడిచేసి చంపుతారేమో అని భయపడి ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

దుర్యో : ఒక్కరొక్కరే పోరుకు రండి. మీరు చాలమంది ఉన్నారు. నేను ఒక్కడనే కత్తివేటులతో డస్సి ఉన్నాను.

ధర్మ : ఆనాడు యుద్ధంలో అభిమన్యుడు బాలుడై ఉన్నా, ఒంటరిగా పోరుతున్నా, ప్రౌఢవీరులైన అనేకులు ఒక్కుమ్మడిగా దాడిచేసి ఏ న్యాయంతో చంపారో - ఇప్పుడు కూడా అదే న్యాయం చెల్లుతుందని గ్రహించుము. (ఆ మాట విని నిరుత్తరు డయ్యాడు దుర్యోధనుడు). అది నీకు న్యాయం కావచ్చునేమో కాని నాకు కాదు. నీకు తగిన శిరస్త్రాణాన్నీ, కవచాన్నీ ఇస్తాను. మా అయిదుగురిలో ఒకరిని ఎన్నుకొమ్ము. అతడు నీతో యుద్ధం చేస్తాడు. వాడిని చంపి అఖండరాజ్యాన్నీ ఏలుకొమ్ము. లేదా వాడిచేతిలో చచ్చి వీరస్వర్గం పొందుము. నే నీ కట్టడి చేస్తున్నాను. ఒక్కటి వినుము. నిన్ను ప్రాణాలతో పోనివ్వను. యుద్ధానికి కావలసిన సౌకర్యాలన్నీ కలిగిస్తాను. అన్నదమ్ముల కుండే బంధుత్వానికి దీనివలన ఇబ్బంది ఉండదు.

దుర్యోధనుడు తనకు దగిన సువర్ణ శిరస్త్రాణాన్నీ, కవచాన్నీ ఎన్నుకొన్నాడు. వాటిని ధరించి మేరుపర్వతంవలె మెరసిపోయాడు. పాండవులలో ఎవరైనా గదతో యుద్ధంచేయండి అని ఎలుగెత్తి పిలిచాడు.

శ్రీకృష్ణ : ధర్మరాజా! దుర్యోధనుడు గదాయుద్ధానికి పిలిస్తే పాండవులు వివేకం కోల్పోయి ఒప్పుకొన్నారని లోకం అనుకొంటుంది. శత్రువులపట్ల అతిదయ పనికిరాదు. ఒకడిని చంపితే భూమినంతా తీసికొను మని అనటం నీవు శకుని జూదంలో రాజ్యాన్నంతా ఒక్కసారి పందెం కాచి ఓడినట్లే ఉన్నది. యుద్ధం జూదం కాదు.

భీముడు : శ్రీకృష్ణా! గద నా చేతిలో ఉంటే పదునాల్గు లోకాలను మట్టుపెట్టగలను. దుర్యోధనుడి బడాయిమాటల కేమి? అతడు నాకంట పడి ప్రాణాలతో పోగలడా?

శ్రీకృష్ణ : భీమా! బకుడిని, హిడింబుడిని, జరాసంధుడిని - ఇట్లా బలగర్వితులను ఎందరినో చంపావు. ఇత డొక లెక్కా? (దుర్యోధనుడివైపు క్రీగంటి చూపు ప్రసరిస్తూ) నీవు విజృంభించి దుశ్శాసనుడి రొమ్మును చీల్చి నెత్తురు త్రాగినప్పుడు కళ్ళు ఒప్పగించి చూస్తూ భయంతో ఈ దుర్యోధనుడు నోరు నొక్కుకొన్నాడు. అలనాడు నిండుసభలో ద్రౌపదిని అవమానించినప్పుడు నీవు చేసిన ప్రతిజ్ఞలలో ఒకటి తీర్చుకొన్నావు. ఈ రెండవ ప్రతిజ్ఞను కూడా పౌరుషంతో తీర్చికొమ్ము. ధర్మరాజుకు పట్టం కట్టుము. నీవు గదతో విజృంభించుము. దుర్యోధనుడు హతుడౌతాడు. దానికి నేను బాధ్యుడను. భీమా! మరొక మాట. దుర్యోధనుడు మహాబలవంతుడు బాగా వ్యాయామం చేశాడు. నీవు ప్రయత్న పూర్వకంగా యుద్ధం చేయాలి సుమా! ఇది నా హెచ్చరిక!

భీముడు : (ఉత్సాహంతో ధర్మరాజును ఉద్దేశించి) అగ్రజా! వినుము. అర్జునుడు ఖాండవాన్ని దహించినట్లుగా నేనీ వంశనాశకుడిని చుట్టుముట్టి చంపుతాను. రాజ్యాధికారాన్ని నీకు కట్టపెట్టుతాను. శకుని మాయోపాయం తనకే బెడిసికొట్టిందని కొడుకు మరణవార్త విని ఆ గ్రుడ్డిరాజు దుఃఖిస్తాడు. (అని దుర్యోధనుడికి ఎదురుగా నిలబడి) నీవు చేసేవి క్రూర కర్మలని తలంచకుండా లక్కయింటికి నిప్పుపెట్టించావు. మాయాజూదంలో ధర్మరాజును ఓడించావు. నిండుసభలో ద్రౌపదిని అవమానించావు. వాటన్నిటి ఫలాన్నీ ఇప్పుడు అనుభవిస్తావు. పెక్కుమాట లెందుకు? యుద్ధానికి రమ్ము.

దుర్యో : భీమా! గదాయుద్ధంలో ఇంద్రుడు కూడా నన్ను ఎదుర్కొనలేడు. నీవు ఒక లెక్కా? అయితే నీవు ధర్మం తప్పకుండా యుద్ధం చేసి, ప్రాణాలతో తప్పుకొనుము. చూద్దాం.

భీమ దుర్యోధనుల విజృంభణ చూచి అక్కడ కూడి ఉన్న రాజకుమారులందరూ హర్షించారు. అంతలో బలరాముడు తన శిష్యులైన భీమ దుర్యోధనుల గదాయుద్ధాన్ని చూడాలని తీర్థయాత్రలను ముగించుకొని అక్కడికి వచ్చి సత్కారాలను పొంది ఆసక్తితో యుద్ధ దర్శనోత్సాహాన్ని ప్రకటించాడు.

7. భీమదుర్యోధనుల గదాయుద్ధం:

దుర్యోధనుడి కోరిక ప్రకారం గదాయుద్ధం శమంత పంచక సమీపంలోని కురుక్షేత్ర యుద్ధభూమిలో ప్రవర్తిల్లటానికి నిశ్చయించారు. ధర్మరాజు చూడవచ్చిన రాజులందరినీ క్రమశిక్షణతో వ్యవహరించేటట్లు నిర్దేశించి కూర్చుండబెట్టాడు. భీమ దుర్యోధనులు బలరాముడి ఆశీస్సులను పొంది రంగభూమిలో నిలిచారు. పరస్పరం కొరకొర చూచుకొంటూ యుద్ధోత్సాహాన్ని ప్రకటించారు. మొదట దుర్యోధనుడే భీముడిని యుద్ధానికి పిలిచాడు. అప్పుడు ఎన్నో అపశకునాలు కనపడ్డాయి. భీమ దుర్యోధనులు పరస్పర వీర పరుషవాక్యాలు మాటాడుకొన్నారు. తమ గొప్పలు తాము చెప్పుకొన్నారు. భీముడు ఎత్తినగదతో దుర్యోధనుడిపై దూకాడు. దుర్యోధనుడు ఉత్సాహంతో ఎదుర్కొన్నాడు. గదాయుద్ధం మహా భయంకరంగా సాగింది. అనేక విధాల వ్యూహాలతో పెనగటం సాగించారు. ఒకరివేటులను మరొకరు నేర్పుతో తప్పించుకొన్నారు. రౌద్రోల్లాసంతో కొట్టిన గదల దెబ్బలవలన నెత్తురులు కారగా సంధ్యామేఘాలవలె వారిరువురూ రాణించారు. దేవతలు వారి యుద్ధానికి ఆశ్చర్యపోయారు. వారిద్దరిలో ఎవరు గెలుస్తారో చెప్పలేని సందిగ్ధావస్థలో పడ్డారు. దుర్యోధనుడి దెబ్బలకు భీముడు మూర్ఛపోయాడు. అతడు చనిపోయాడని భ్రమించి దుర్యోధనుడు సింహనాదం చేశాడు. దేవతలు పూలవాన కురిపించారు. భీముడు తేరుకొని అతడిని నేలపై పడవేశాడు.

అప్పుడు అర్జునుడు భీమదుర్యోధనుల బలతారతమ్యాన్ని గురించి శ్రీకృష్ణుడి నడిగాడు. 'గురూపదేశం ఇరువురికీ సమానమే అయినా, భీముడికి శరీరబలం ఎక్కువ. దుర్యోధనుడికి నేర్పరితనం ఎక్కువ. అందువలన నేర్పరి అయిన దుర్యోధనుడి వలన భీముడు దెబ్బలు తినవలసి వచ్చింది. మాయదారిని మాయోపాయంతో మట్టుపెట్టటమే న్యాయ' మని నిర్ణయించి దుర్యోధనుడి తొడలు విరుగగొట్టుతానని భీముడు చేసిన శపథాన్ని అర్జునుడి సైగలతో అతడికి సూచింపచేశాడు కృష్ణుడు. భీముడు దానిని గ్రహించి, ఆ పనిని ప్రాణంమీదకు వచ్చినప్పుడు చేయ నిశ్చయించాడు. భీముడి గదాఘాతాన్ని నేర్పుగా దుర్యోధనుడు తప్పించుకొన్నాడు. అతడు తిరిగి భీమసేనుడిని కొట్టాడు. అతడు సొమ్మసిల్లాడు. దానిని గుర్తించక

దుర్యోధనుడు భీముడిపైకి తిరిగి దూకాడు. భీముడు స్వీయరక్షణార్థం దుర్యోధనుడి తొడలపై గదతో మోదాడు. వజ్రపాతంతో కొండచరియ విరిగి పడినట్లుగా దుర్యోధనుడు తొడలు విరిగి నేలమీద కూలాడు. భీముడు కోపంతో అతడిని చూచి 'ఏకవస్త్ర అయి ఉన్న ద్రౌపదిని ఆ విధంగా నిండు సభకు లాగి అవమానించిన పాపానికి ఫలం అనుభవించు' మని ఎడమకాలితో అతడి తలను గట్టిగా తన్నాడు. అంతటితో అతడికి కసి తీరక మరల అతడి ముఖం చూచి 'బంధుద్రోహీ! ఆనాడు మమ్ములను పశువులని అవహేళన చేస్తూ అరిచావు. ఇప్పుడు మేము క్షత్రధర్మం ప్రకాశించగా మిమ్మల్ని పశువులని పిలుస్తున్నాను. ఇది మాయాద్యూతం కాదు. భుజబలంతో శత్రువుల గర్వాన్ని అణచటం. (అని పలికి ధర్మజ శ్రీకృష్ణాదులవైపు తిరిగి) మమ్ములను గొడ్డువోయిన వారని పరుషంగా నిందించిన కౌరవులను బంధుమిత్ర పరివార సమేతంగా యుద్ధంలో చంపాము. దీనివలన మాకు స్వర్గమైనా, నరకమైనా సమానమే.'

అంటూ భీముడు గదను తీసికొని దుర్యోధనుడి మెడను అదిమిపట్టి అతడి తలను మరల తన్నాడు. ధర్మరాజు వారించి అతడి పొగరుబోతుతనాన్ని అధిక్షేపించాడు. అతడి పనిని లోకం మెచ్చదని గర్హించాడు. ధర్మనీతి వర్తనులైన పాండవులు చేయదగని అనుచిత కార్యమని మందలించాడు. కన్నీరు నిండగా దుర్యోధనుడిని సమీపించి అతడి అధర్మత్వం, అత్యాశ, అవివేకం, గర్వం కారణంగా బంధునాశనం జరిగిందనీ, కౌరవుల భార్యలకు వైధవ్యం ఏర్పడిందనీ దుఃఖించాడు.

గదాయుద్ధంలో బొడ్డుక్రింది భాగంలో మోదకూడదన్న న్యాయాన్ని పాటించనందుకు కోపగించి బలరాముడు భీముడి చర్యను నిందించి దండించబోయాడు. శ్రీకృష్ణుడు అతడిని వారించి రాజులకు ప్రతిజ్ఞ నెరవేర్చటం ఉత్తమ ధర్మమనీ, మైత్రేయ ముని శాపంవలన దుర్యోధనుడి తొడలు విరుగలసి ఉన్నదనీ తెలిపాడు. బలరాముడు దానిని పూర్తిగా అంగీకరించకపోయినా, ధర్మం తప్పకుండ యుద్ధం చేసిన దుర్యోధనుడికి ఉత్తమ లోకాలు కలుగుతాయనీ, భీముడికి కీర్తి కలుగుతుందనీ పలికి వెంటనే రథమెక్కి వెళ్ళిపోయాడు. భీముడు ధర్మరాజును నిస్సంశయంగా రాజ్యభారం వహించుమని కోరాడు. ధర్మరాజు శ్రీకృష్ణుడి దివ్య సంకల్పాన్నీ, భీముడి బల ప్రదర్శననూ కీర్తించాడు. భీమ పరాక్రమాన్ని వీరులందరు ప్రశంసించారు.

8. శ్రీకృష్ణ దుర్యోధనుల సంవాదం:

దుర్యోధనుడి తొడలు విరుగగొట్టటం ధర్మమా అధర్మమా అనే మీమాంసలో చిక్కుకొన్న రాజులనందరినీ ఉద్దేశించి శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు. - 'భీముడు అధర్మ యుద్ధం చేశా డనవద్దు. పతివ్రత అయిన స్త్రీని కనికరం లేకుండా అంతగా అవమానం చేసినా సహించి ధర్మరాజు తన తండ్రిపాలు తనకు ఇమ్మని అడిగాడు. దుర్యోధనుడు ఆ ధర్మాన్ని నిర్వర్తించలేదు. అందువలన సుయోధనుడు మోసగాడు. అతడికి ఆ చావు తగిందే. విదురాదు లెందరో హితవు చెప్పారు. వినలేదు. భీముడి ప్రతినకు లోనైతే అది అధర్మ మౌతుందా? కూకటివేళ్ళతో కూలిన చెట్టువలె భూమిమీద పడి ఉన్న ఈ పాపాత్ముడి విషయంలో ధర్మాధర్మచింత లెందుకు? మీరందరూ రథా లెక్కి బయలుదేరండి' అన్నాడు.

దుర్యో : కంసదాసుడి కొడుకా! కృష్ణా! నీ దురాచారాలు గుర్తించకొనకుండా దయా దాక్షిణ్యాలు మాని మాట్లాడుతున్నావు. నీవు చెప్పగా అర్జునుడు చేసిన సైగను అందుకొని గదాయుద్ధ ధర్మాన్ని తప్పి భీముడు కొట్టాడు. న్యాయ యుద్ధంలో అయితే మిమ్ములనందరిని మట్టి కరిపించేవాడిని. శిఖండిని ముందుపెట్టుకొని అర్జునుడు భీష్ముడిని కూలదోశాడు. ద్రోణుడి వధకొరకు ధర్మరాజు అబద్ధమాడాడు. రథచక్రం భూమిలో కూరుకొనగా కర్ణుడిని పార్థుడు చంపాడు. వీటికి కారణం నీవే. భూరిశ్రవుడినీ, సైంధవుడినీ అర్జునుడిపాలబడేటట్లు చేసింది నీవే. నన్నూ, భీష్ముడినీ, ద్రోణుడినీ, కర్ణుడినీ, భూరిశ్రవస్సైంధవులనూ న్యాయం తప్పని యుద్ధంలో మీరు ఓడించగలరా? మాయదారి కృష్ణుడవు నీవు.

కృష్ణుడు : నీవు భీముడిని బాల్యంలో పాములచేత కరపించావు; అన్నంలో విషంపెట్టావు, నీట ముంచావు, చాలాసార్లు చంపయత్నించావు, పాండవులు నిద్రించే లక్క ఇల్లు తగులబెట్టావు, మాయాద్యూతంలో ధర్మరాజు సంపదలను హరించావు, ద్రౌపదిని నిండు సభలో అవమానించావు, నీ దుర్ణయాలకు అప్పుడే నిన్ను చంపి ఉండవలసింది.

ధర్మరాజు ఆ కష్టాలన్నీ సహించి నా చేత సంధియత్నం చేయించాడు. నీవు ఆ యత్నాలను వమ్ము చేశావు. నీ లోభగుణం చేతనే భీష్మద్రోణాదులకు ప్రాణహాని కలిగింది. శిఖండి ధృష్టద్యుమ్నులు కారణజన్ములు. వారివలన భీష్మద్రోణులు పడిపోయారు. యుద్ధంలో అనేకులతో పోరి అలసి ఉన్న సాత్యకిని చంపబోయిన భూరిశ్రవుడిని చంపటం అన్యాయమా? అనేక ప్రౌఢవీరులు కలిసి అభిమన్యుడిని చంపటం న్యాయమా? చెల్లెలైన ద్రౌపదిని చెరపట్టదలచిన సైంధవుడిని చంపటం అధర్మమా? చంపకుండ అర్జునుడు అగ్నిలో ప్రవేశించటం న్యాయమా? ఘోషయాత్రలో నిన్ను గంధర్వులచెర నుండి తప్పించాడు అర్జునుడు. ఉత్తర గోగ్రహణంలో నిన్ను చంపక వదలిపెట్టాడు. కర్ణుడికి బ్రాహ్మణ శాపం వలన కలిగిన ముప్పునకు అర్జునుడు బాధ్యుడా? శల్యుడిని ధర్మరాజు అధర్మంగా చంపాడనలేదు నీవు. పాండవులు ధర్మవర్తనులు. నీవు పుట్టినప్పటినుండి ధర్మాన్ని గొడ్డలితో నరుకుతున్నావు. భీముడు నిన్నుగూర్చి చేసిన ప్రతిజ్ఞ నీకు తెలియదా? తొడలు గదతో మోదుతా నన్నాడు కాని పిడికిలితో పొడుస్తా నన్నాడా? నీవు తగిన జాగ్రత్త వహించవద్దా? వట్టి ప్రగల్భా లెందుకు? మాట్లాడకుము.

దుర్యో : వేదాలన్నీ చదివాను, యజ్ఞాలు చేశాను, సంపదలు గడించి రాజులు కొలువగా సంతోషించాను. దుర్మదాంధులైన శత్రువులను మర్దించాను. చివరకు మిత్రులతో బంధువులతో కలిసి స్వర్గానికి వెళ్ళుతున్నాను. ఇది ఒప్పదా? నీ దృష్టిలో నే నెటువంటి వాడనైనా నా కేమి? మీరంతా పశ్చాత్తాపంతో పరితపిస్తూనే ఉంటారు గాక!

దేవతలు దుర్యోధనుడి మీద పూలవాన కురిపించారు. దేవదుందుభులు మ్రోగాయి. దిక్కులన్నీ సుగంధయుతమైన గాలితో నిండిపోయాయి. భీష్మద్రోణ కర్ణ దుర్యోధనాదులను చంపిన తీరు ధర్మం కాదేమోనని పాండవులు సిగ్గుపడి బిక్కమొగాలు పెట్టారు. శ్రీకృష్ణుడు వారికి ధైర్యం చెప్పి, భీష్మాదుల బల విశేషాలనూ, దైవ నిర్ణయాలనూ తెలియచెప్పి, దేవతలు రాక్షసులను గెలిచే తీరువంటిదని పేర్కొని, సంతోష సమయంలో దుఃఖించవద్దన్నాడు. పాండవుల మనసులు కుదుటపడ్డాయి. పాండవులూ కృష్ణుడూ తమ తమ శంఖాల నూదారు. ధృష్టద్యుమ్నాదులు శిబిరాలకు వెళ్ళి ఆ రాత్రి విశ్రమించారు. మరునాడు హస్తినాపురానికి వెళ్ళాలని సంకల్పించి ధర్మజుడి అనుమతి తీసికొన్నారు. ధర్మరాజాదులు కౌరవ శిబిరానికి వెళ్ళారు.

కృష్ణార్జునుల రథం అక్కడికి చేరింది. శ్రీకృష్ణుడు అర్జునుడిని ఆయుధాలు ప్రక్కనబెట్టి అతడిని ముందుగా రథం దిగుమన్నాడు. ఆపైన ఆయన దిగుతానన్నాడు. గాండీవాన్నీ, తూణీరాల జంటనూ తీసికొని అర్జునుడు రథం దిగాడు. శ్రీకృష్ణుడు పగ్గాలు ముడిచి రథం దిగాడు. ధ్వజంమీద భూతగణం తొలగిపోయింది. తేరు మండిపోయింది. అర్జునుడు ఆశ్చర్యపడి కృష్ణుడిని దానికి కారణమడిగాడు. 'భీష్మద్రోణకర్ణాదులు ప్రయోగించిన బాణాల అగ్నులచేత రథం ఇదివరకే చుట్టబడింది. యుద్ధం అయిపోయింది కాబట్టి ఇప్పుడు దానిని కాలనిచ్చాను' అని గోవిందుడు చెప్పాడు. ధర్మజుడు కోరిన మేరకు పాండవులను రక్షించానని శ్రీకృష్ణుడు ప్రకటించాడు. దివ్యాస్త్రాగ్నులనుండి వారిని రక్షించి అనుగ్రహించినందుకు ధర్మరాజు గోవిందుడికి కృతజ్ఞతలు తెలిపాడు. కృష్ణ డేవైపు ఉంటే ఆ వైపు విజయం తథ్యమని వ్యాసుడి వాక్యాన్ని యుధిష్ఠిరుడు స్మరించాడు. శ్రీకృష్ణుడు అర్జునుడి ప్రతాపాన్ని ప్రశంసించాడు. పాడుపడిన కౌరవశిబిరంలో ఉండటం శ్రేయస్కరం కాదని రత్నరాశులను గ్రహించి శ్రీకృష్ణుడి వెంట ఓఘవతీ తీర్థం చేరి ఆ రాత్రి అక్కడ విశ్రమించారు.

9. శ్రీకృష్ణుడు గాంధారీ ధృతరాష్ట్రులను ఓదార్చటం:

ఆ రాత్రి ధర్మరాజు శ్రీకృష్ణుడిని హస్తినాపురానికి వెళ్ళిరమ్మని ప్రార్థించాడు. భీముడు దుర్యోధనుడిని యుద్ధంలో అధర్మంగా చంపాడని తెలిసి గాంధారి కోపించి పాండవులను శపిస్తుందేమో అన్న భయం కలిగి, ఆమెను శాంతింపజేయగల

మహితాత్ముడు శ్రీకృష్ణుడని భావించి ధర్మజుడు అతడిని పంపాడు. పంపింది ధృతరాష్ట్రుడి వద్దకైనా ప్రయోజనం గాంధారి కోపోపశమనమే.

శ్రీకృష్ణుడు హస్తినాపురికి పోయాడు; గాంధారీ సహితుడై పుత్రశోకంతో తపిస్తున్న ధృతరాష్ట్రుడిని దర్శించాడు. అప్పటికే వ్యాసమహర్షి అక్కడికి వచ్చి ఆ మహారాజును ఓదారుస్తున్నాడు. శ్రీకృష్ణుడు కూడ వ్యాసమహర్షికి నమస్కరించి ధృతరాష్ట్రుడి చేతులను తనచేతిలోకి తీసికొని కన్నీరు పెట్టుకొని, బొంగురుపోయిన గళంతో పలుకుతూ వంశమంతా నిష్కారణంగా నాశనమైనందుకు విచారం వ్యక్తంచేశాడు. తన రాయబారాన్నీ, ద్రౌపది అవమానాన్నీ, పాండవుల అరణ్య అజ్ఞాతవాస కష్టాలనూ, విదురాది బోధలనూ దుర్యోధనాదులు వినక రాజ్యభాగాన్ని పాండవులకు నిరాకరించిన అంశాలనూ పేర్కొన్నాడు. పాండవులు మోసపు మనసులు లేనివారనీ, ఇకపై గాంధారీ ధృతరాష్ట్రుల పరలోక క్రియలు పాండవులే నిర్వహించవలసి ఉంటుందనీ, అందువలన వారి మేలు కోరటం మంచిదని చెప్పి, ధర్మరాజు పొందుతున్న దుఃఖాన్ని గురించి వివరించాడు. గాంధారిని ఉద్దేశించి ఆమెవంటి సాధ్వీమణి లేదని కీర్తించి, ఎన్ని చెప్పినా వినక రాజ్యంలో భాగ మివ్వక దుర్యోధనుడు అవలంబించిన దుర్నీతి ఆ విపత్తుకు కారణమని పేర్కొని, ఆమె కోపంతో చూస్తే మూడు లోకాలు భస్మీపటలం ఔతాయని, కాబట్టి పాండవుల పట్ల వాత్సల్యాన్ని చూపాలని హితవు చెప్పి ఆమెను ఒప్పించాడు. అంతలో శ్రీకృష్ణుడి మనసులో అశ్వత్థామ సమరోత్సాహం గోచరించింది. వెంటనే బయలుదేరి పాండవుల వద్దకు వెళ్ళాడు. వ్యాసుడుకూడా ఉపశమన వాక్యాలు చెప్పి అంతర్ధాన మయ్యాడు.

సంజయుడు దుర్యోధనుడిని సందర్శించాడు. భీమాదులు యుద్ధంలో అనుసరించిన యుద్ధధర్మ విరుద్ధ మార్గాన్ని గురించి చెప్పి, వారికి అపకీర్తి కలుగుతుందని చెప్పి ధృతరాష్ట్రుడికి తెలియపరిచాడు. తొడలు విరిగి పడేంతవరకు ఇతరులకు తలవంచలేదనీ, శమంతపంచక ప్రాంతంలో ప్రాణాలు వదలితే పుణ్యలోకాలు కలుగుతాయనీ, మోసంతో పొందిన రాజ్యాన్ని పాండవులు పొందుతారనీ పేర్కొన్నాడు. ఆ విషయాలను అశ్వత్థామ, కృప, కృతవర్మలకు చెప్పుమని కోరాడు. అతడిని చూడటానికి వచ్చిన జనులు ఆ సంగతిని అశ్వత్థామాదులకు తెలియచెప్పారు.

10. అశ్వత్థామ విజృంభణం:

ఆ రథికత్రయం దుర్యోధనుడి వద్దకు వచ్చి అతడి దీనావస్థను చూచి దుఃఖించింది. అశ్వత్థామ అతడి పూర్వవైభవాన్ని ప్రస్తావించి పలవరించాడు. దుర్యోధనుడు గద్గదకంఠంతో సుఖదుఃఖాలు కావడి కుండల వంటివని పేర్కొని, ఎన్ని ఆపదలు వచ్చినా జంకక ధైర్యంతో యుద్ధంచేసే బంధువులు, స్నేహితులు, కుమారులు, సోదరులు యుద్ధంలో చనిపోగా తా నొక్కడే మిగిలినా వారిని చూచే భాగ్యం కలగటం అదృష్టంగా భావించాడు. విష్ణుమహిమ తెలిసి ఉన్నా నిర్భయంగా పగను సాధించటానికి పూనుకొని జయంకోరి వారు శౌర్యసంపదను ప్రదర్శించి పోరినందుకు హర్షం ప్రకటించి, విధివైపరీత్యానికి విచారించాడు. దుర్యోధనుడి దుఃస్థితిని గమనించిన అశ్వత్థామ రోషోద్రేకంతో ఇట్లా అన్నాడు. 'పాండవులు నా తండ్రిని ఆ విధంగా చంపినప్పుడే నాకు తీవ్రకోపం, తాపం కలిగాయి. ఇప్పుడు రారాజును నిన్ను కూల్చిన విధం నా మనసున మరీ మండిస్తున్నది. పాండవులను నా భయంకరాస్త్రాల వహ్నికి దగ్ధం చేస్తాను. మహారాజా! వినుము ఆ శ్రీకృష్ణుడు చూస్తుండగానే ధృష్టద్యుమ్నాది వీరుల నందరినీ మట్టుపెట్టుతాను. నన్ను ఆజ్ఞాపించుము' అన్నాడు. ఆ మాటలకు దుర్యోధనుడు సంతోషించి, కృపాచార్యులచేత కమండలు జలం తెప్పించి, అశ్వత్థామను సైన్యాధ్యక్షుడిగా అభిషేకించాడు. అతడు సంతోషించి దుర్యోధనుడిని కౌగిలించుకొని సింహనాదం చేసి కృప కృతవర్మలు వెంటరాగా పాండవ స్కంధావారంవైపు ప్రస్థానం సాగించాడు.

సౌప్తికపర్వ కథాసారం

అశ్వత్థామా, కృపాచార్యుడూ, కృతవర్మా పాండవశిబిరం వైపు నడిచారు. అక్కడ విజయోత్సాహం కోలాహలంగా సాగుతూ ఉన్నది. తాము గుర్తించబడతామేమో అనే భయంతో ఆ ముగ్గురూ సమీపారణ్యంలో ఒక మర్రిచెట్టుకింద శరీరాలు వాల్చారు. చీకటి పడింది. కృపుడూ, కృతవర్మా బాగా అలసిపోవటంచేత నిద్రపోయారు. కోపంచేత కాల్చబడిన మనస్సుగల అశ్వత్థామకు మాత్రం నిద్రపట్టలేదు. పాండవులమీద ఎట్లా పగదీర్చుకొనాలా అనే ఆలోచనలో పడి అతడు మర్రిచెట్టుకేసి చూశాడు. దాని కొమ్మలపై ఎన్నో కాకులు నిద్రపోతున్నాయి. అప్పుడు ఒక గుడ్లగూబ అక్కడికి వచ్చి ఆ కాకుల నన్నిటినీ రకరకాలుగా చంపటం అశ్వత్థామ చూచి, అది తనకు కర్తవ్యోపదేశంగా భావించి, తాను కూడా అట్లాగే శత్రువులను ఆ రాత్రే నిద్రపోతే ఉన్న సమయంలో చంపటానికి నిశ్చయించుకొన్నాడు. కృపకృతవర్మను లేపి, తన నిశ్చయం చెప్పి, వాళ్ళ అభిప్రాయం అడిగాడు. కృపాచార్యుడు దానికి సమ్మతించక, ఎన్నో నీతులు చెప్పి, 'గాంధారీ ధృతరాష్ట్రుల దగ్గరకు వెళ్ళి, అక్కడ విదురుడు కూడా ఉంటాడు కాబట్టి, వాళ్ళు ముగ్గురూ ఎట్లా చెప్పితే అట్లా నడుచుకొందాం' అన్నాడు. అశ్వత్థామకు అతడి మాటలు నచ్చలేదు. 'నే నొక్కడినే ఆ కార్యం నిర్వహిస్తా' నని అశ్వత్థామ పట్టుపట్టగా, విధి లేక ఆ ఇద్దరూ అతడిని అనుగమించారు.

11. నడిరేయి నరహోమం:

ఇట్లా వెళ్ళే అశ్వత్థామ స్థిరసంకల్పాన్ని పరీక్షించటానికి ఈశ్వరుడు ఒక భయంకర భూతరూపంలో అతడి మార్గాన్ని నిరోధించాడు. అశ్వత్థామ ఆ పెనుభూతంపై ప్రయోగించిన బాణాలన్నీ వ్యర్థమయ్యాయి. చివరకు తీవ్రస్వభావుడైన ఆ అశ్వత్థామ ఆత్మోపహారానికి సంసిద్ధుడు కాగా శివుడు ప్రత్యక్షమై అతడి కొక మహనీయమైన ఖడ్గాన్ని ప్రసాదించాడు. అశ్వత్థామ సంతోషించి అప్రతిహతమైన ఆ ఖడ్గం సహాయంతో పాండవ సంహారానికి ఉద్యమించాడు. ఆ స్కంధావారం గుట్టుమట్టూ అంతకుముందే తెలిసికొన్నవా డవటంచేత ముందుగా తన తండ్రిని చంపిన ధృష్టద్యుమ్నుడి శిబిరం ప్రవేశించి నిద్రిస్తు ఉన్నవాడిని తన్ని లేపి, ఆక్రమించి, వింటి అల్లెత్రాడు అతడి కంఠానికి బిగించి ఉరిపోసి చంపాడు. పిశాచోన్మత్తుడైన ఆ వీరుడు క్రమంగా పాంచాలురను అందరినీ, ద్రౌపదేయులనూ, అసంఖ్యాక యోధులనూ నిద్రపోతూ ఉండగా నిర్దయుడై వధించాడు. మేలుకొని పారిపోవటానికి ప్రయత్నించే అభాగ్యులను శిబిరద్వారం దగ్గర ఉన్న కృప కృతవర్మలు అడ్డగించి చంపివేశాడు. పాండవులైదుగురూ, కృష్ణ సాత్యకులూ మాత్రం ఆ శిబిరంలో కనబడనందుకు అశ్వత్థామ విచారించాడు. అతడి రాక్షసావేశానికి, నీచ పరాక్రమానికి విచారిస్తూ కృప కృతవర్మలు తలలు వంచుకొని ఊరకున్నారు.

తరువాత ఆ ముగ్గురు యోధులూ తాము జరిపిన సంహార వృత్తాంతాన్ని వినిపించటానికి దుర్యోధనుడి దగ్గరకు పరుగెత్తారు. అతడు చనిపోవటానికి సిద్ధంగా ఉండి, తీవ్రవేదన పొందుతూ, ఇప్పుడో ఇకనో అన్నట్లుగా ఉన్నాడు. అతడి దీనస్థితిని చూచి వాళ్ళు చాలా బాధపడ్డారు. అశ్వత్థామ దుర్యోధనుడికి ఎంతో కీర్తిని సంపాదించిపెట్టిన అతడి గదాయుద్ధ కౌశలాన్ని ప్రశంసించి, 'నీ కొరకు బాధపడకుము. నీవు పుణ్యలోకానికి పోయినప్పుడు నా తండ్రి అయిన ద్రోణుడిని చూచి ద్రోహి అయిన ధృష్టద్యుమ్నుడిని నీ కొడుకు చంపాడని చెప్పుము' అని విన్నవించాడు. ఉపపాండవ, పాంచాలాదుల మరణం విని దుర్యోధనుడు సంతోషించి, 'భీష్మ ద్రోణులు కాని, కర్ణశల్యులు కాని మీవలె నాకు మేలు చేయలేదు. సుఖంగా ఉండండి, మనకు పునర్దర్శనం స్వర్గ లోకంలో అవుతుంది. వెళ్ళండి' అని పలికి ప్రాణం విడిచిపెట్టాడు. రథికులు ముగ్గురూ దుఃఖంతో అతడికి ప్రదక్షిణం చేసి తిరిగి తిరిగి చూస్తూ రథారూఢులై వెళ్ళిపోయారు.

ఈ వృత్తాంతం అంతటినీ సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పి 'యుద్ధ ప్రకారం అంతా నీకు చెప్పటానికి వ్యాసమునీంద్రుడు నన్ను నియోగించి ఇచ్చిన దివ్యదర్శనత్వం నీ కొడుకుతో పాటు పోయింది. ఇంక నా కా శక్తి లే' దని చెప్పి వెళ్ళిపోయాడు.

12. అశ్వత్థామ శిరోరత్నం:

మర్నాడు సూర్యోదయ సమయంలో ధృష్టద్యుమ్నుడి సారథి పాండవుల వద్దకు వచ్చి రాత్రి జరిగిన దారుణవధ క్రమం అంతా చెప్పాడు. ధర్మరాజాదులు మూర్ఛిల్లి, కొంతసేపటికి తెలిసి, మిక్కిలి విలపించారు. సముద్రమంతా దాటి చిన్న క్రయ్యలో మునిగిపోయినట్లు అయిందని ధర్మరాజు దుఃఖించాడు. అతడు ద్రౌపదికి ఈ దుఃఖవార్తను చెప్పటానికి నకులుడిని పంపాడు. ద్రౌపది ద్రుపద విరాటులు మరణించిన నాటి రాత్రి వారి భార్యలను ఓదార్చటానికి సుభద్రతోనూ, ఉత్తరతోనూ కలిసి మాత్స్య నగరానికి వెళ్ళింది. నకులుడు ఉపప్లావ్యపురానికి వెళ్ళి ద్రౌపదికి ఈ దుఃఖవార్త చెప్పి, ఆమెనీ, ఇతర స్త్రీ జనాన్నీ తీసికొని వచ్చాడు. ఆత్మపుత్ర వినాశనానికి దుఃఖించే ద్రౌపదిని 'క్షత్రియకాంత సంతానం యుద్ధంలో వీర మరణం పొందటం సముచితమే కదా!' అని ధర్మరాజు ఊరడించాడు. 'దుర్మార్గుడైన అశ్వత్థామను చంపవలసిందే. కాని, అతడు అడవికి పోయి ఉంటాడు. అతడిని చంపటం నీ కెట్లా తెలుస్తుంది?' అని ధర్మరాజు అనగా ద్రౌపది 'అశ్వత్థామకు సహజమైన శిరోరత్నాన్ని తెచ్చి చూపితే జీవంతో ఉంటా'నని భీముడిని హెచ్చరించింది. వెంటనే అతడు నకుల సహాయుడై రథం ఎక్కి అశ్వత్థామను అన్వేషించటానికి బయలుదేరాడు. 'అశ్వత్థామ అజేయ పరాక్రముడు. క్రూరుడు, వాడి దగ్గర లోకభయంకరమైన బ్రహ్మశిరో నామకాస్త్రం ఉన్నది. భీముడిని ఒక్కడినీ పంపటం క్షేమకరంకా'దని శ్రీకృష్ణుడు ధర్మరాజుకు చెప్పాడు. అప్పుడు సహదేవసాత్యకులను స్కంధావార రక్షణకై నియోగించి ధర్మరాజూ, శ్రీకృష్ణుడూ, అర్జునుడూ భీముడికి సాయపడటానికి వెళ్ళారు. పలాయితుడైన అశ్వత్థామను వ్యాసుడి ఆశ్రమానికి సమీప ప్రదేశంలో తపస్సు చేస్తుండగా పట్టుకొన్నారు. పాండవవీరులను చూచి అశ్వత్థామ భయక్రోధాలతో బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ఒక గడ్డి పరకయందు ఆవహింపజేసి ప్రయోగించాడు. అది భయంకర జ్వాలలతో పాండవులను ఆక్రమించబోయింది. అర్జునుడు కూడా శ్రీకృష్ణ ప్రేరితుడై ఆత్మరక్షణ కొరకు అదే అస్త్రాన్ని ప్రయోగించాడు. నారద వేదవ్యాసులు ఆ మహాస్త్రాలచేత లోక సంక్షోభం కాకుండా ఎవరి అస్త్రాన్ని వారు ఉపసంహరించుకొనాలని ఆదేశించారు. సత్త్వస్వభావుడూ, గురుభక్తి తత్పరుడూ అయిన అర్జునుడు తన అస్త్రాన్ని ఉపసంహరించుకొన్నాడు. కాని, తామస ప్రవృత్తిగల అశ్వత్థామ అట్లా చేయలేకపోయాడు. 'ఆ మహాస్త్రాన్ని మనుష్య విషయంగా ప్రయోగించే వాడికి అశుభం కలుగుతుంది. ఒకటిచేత ప్రయోగించబడి, అన్యుడి అస్త్రం ఉపశమిస్తే, ఆ దేశానికి పన్నెండేళ్ళు అనావృష్టిదోషం పడుతుంది. కాబట్టి పాండవులనూ, నిన్నూ ఈ దేశాన్నీ రక్షించటానికి చెప్పాము. ఎట్లా అయినా సరే దీనిని ఉపసంహరించుము. నీ శిరోమణిని అర్జునుడికి ఇమ్ము. అప్పుడు ఇతడే కాదు, పాండవులందరూ నీ ప్రాణం తీసినంతగా సంతోషిస్తారు' - అని వ్యాసుడు ఉపదేశించగా, అశ్వత్థామ దానిని పాండవుల కివ్వటానికి నిరాకరించి, వ్యాసుడి కిచ్చి, తన అస్త్రం పాండవేయ గర్భాలకు హాని కలిగింది ఉపశమిస్తుందని చెప్పాడు. వ్యాసుడు అతడితో 'అట్లా చెయ్యి, వేరే దానికి ఆశించకు' అనగానే అశ్వత్థామ తన మాట తప్పని గ్రహించాడు. అశ్వత్థామ పాండవేయగర్భాలనటంలో పాండవ సంతతి గర్భాల నన్నిటినీ ఉద్దేశించగా, వ్యాసుడు పాండవుల భార్యల గర్భాలుగానే 'వేరేదానికి ఆశించకు' అన్నాడు. అది నేను తెలిసినట్లుగా ఎందుకుండాలి?' అని అతడితో పలికి, అన్ని గర్భాలనూ నాశనం చేయటానికి నిశ్చయించుకొన్నాడు. శ్రీకృష్ణుడు తాను ఉత్తరాగర్భస్థుడికి సుదీర్ఘమైన ఆయువు నిస్తానని పలికినా లెక్కచేయక అస్త్రాన్ని ప్రయోగించాడు. కృష్ణుడు అది చూచి అశ్వత్థామతో 'ఉత్తరకు ఒక బ్రాహ్మణుడి వాక్కువలన పరిక్షిత్తు అనే కొడుకు పుట్టుతాడు. వాడు పాండవ వంశోద్ధారకుడు అవుతాడు. నీవు చేసిన పని అంతా వ్యర్థం' అని పలికి కోపంతో 'పిల్లలను చంపిన నీవు ఆహారం లేక, నిస్సహాయుడవై దుర్గంధ భూయిష్ఠమైన రక్తంచేత శరీరం దగ్ధమవుతూ ఉండగా మూడువేల సంవత్సరాలు తిరుగుము. ఆ పరిక్షిత్తుకు జనమేజయుడు పుట్టి గొప్పవాడవుతాడు' అన్నాడు. వ్యాసుడు కూడా 'కృష్ణ డన్నట్లుగానే కమ్ము' అని శపించాడు. అశ్వత్థామ వ్యాసుడిని 'నీవు మనుష్యులలో ఉంటా'వని బదులు శపించి 'నేనూ నీ దగ్గరే ఉంటా'నని పలికి శిరోమణిని పాండవుల కిచ్చి తపోవనానికి వెళ్ళాడు.

గురుపుత్రు డవటంచేత అర్జునుడు అశ్వత్థామను చంపటానికి పూనుకోక, అవమానించి, ఆయుధాలతోపాటు సిగ్గుకూడా విడిచిపెట్టేటట్లు చేశాడు.

ధర్మరాజు అశ్వత్థామశిరోమణిని భీముడి కిచ్చి దానిని ద్రౌపది కిమ్మన్నాడు. భీముడు అట్లాగే చేసి 'దుఃఖం మాని ఓర్పు వహించు'మని ఆమె కుపదేశించాడు. ద్రౌపది దానిని ధర్మరాజుకే ఇచ్చింది.

శ్రీకృష్ణుడి అభయ ప్రదానంవలన ఊరడిల్లినా, ఉత్తరాగర్భానికి ఏమి ముప్పు కలుగుతుందో అని అందరూ భయపడజొచ్చారు. అప్పుడు ఉత్తరకు తప్ప పాండవ వంశంలోని స్త్రీలకు చూలులు లేకుండా పోయాయి. ఆ అస్త్రరాజం ఉత్తర గర్భంలోని పిండాన్ని బాధించటం చూచి శ్రీకృష్ణుడు తాను అశ్వత్థామతో సంభాషించేటప్పుడు ఆ అస్త్రం వలన దాని కెటువంటి ప్రమాదం లేకుండా తన మనోవ్యాపార్థం చేతనే చేశాడు. ఆ సంగతి ఎవరికీ తెలియదు.

13. పరమేశ్వర ప్రభావం:

మిక్కిలి బలవంతులైన ద్రౌపదేయులనూ, ధృష్టద్యుమ్నుడినీ, తక్కిన వీరులనూ అశ్వత్థామ ఒక్కడూ ఎట్లా చంపగలిగా డని ధర్మరాజు శ్రీకృష్ణుడిని అడుగగా, ఈశ్వరుడిని ఆశ్రయించటంచేత అశ్వత్థామ అట్లా చేయగలిగాడని చెప్పి శ్రీకృష్ణుడు ధర్మరాజుకు శివుడి దివ్యలీలలు చెప్పాడు.

బ్రహ్మ జగత్తును సృష్టించగోరి పరమేశ్వరుడిని సృష్టి నిర్మాణ సూత్రాన్ని అడుగగా, అతడు బ్రహ్మ కోరికను తీర్చటానికి నీళ్ళలో నిలబడి తపస్సు చేయటం ప్రారంభించాడు. శివుడు ఎంతకూ రాకపోవటంచేత బ్రహ్మ దక్షుడనే వాడిని సృజించి సృష్టిచేయ నియోగించాడు. దక్షుడు భూతసృష్టి చేశాడు. అవి ఆకలిగొని దక్షుడిని భక్షించటానికి మీదపడ్డాయి. రక్షించుమని దక్షుడు బ్రహ్మను వేడుకొన్నాడు. బ్రహ్మ ఓషధులనూ, వృక్షసంపదనూ సృష్టించి వాటికి సమర్పించి, బలహీనులు బలవంతులకు ఆహారం అవుతారని ఆదేశించాడు. భూతాలు సంతోషించి సంతతి రూపంలో వృద్ధి పొందసాగాయి. చాలాకాలం తరువాత శివుడు నీళ్ళలో నుండి వెలుపలికి వచ్చి ప్రాణికోట్లను చూచి కోపంతో తన లింగాన్ని పెరికి నేలమీద పెట్టాడు. 'భూతసృష్టికొరకు నేను నీళ్ళలో ఉండి తపస్సు చేసి అధికుడి నయి వచ్చాను. ఈలోగా ఇంకొకడిచేత సృష్టి జరిగిపోయింది. భూతసృష్టికి పనికిరాని లింగం నా కెందు కని పలికి మాల్యవంతానికి వెళ్ళి మహాతపస్సు చేయనారంభించాడు. దేవతలు శివలింగానికి పూజలు చేశారు. దేవతలు ఒక యజ్ఞం చేస్తూ, రుద్రుడి మహానుభావత ఎరుగకపోవటంచేత అతడికి అందులో భాగం కల్పించలేదు. అది తెలిసి శివుడు ఒక విల్లు సృజించి ఆ యజ్ఞాన్ని ధ్వంసం చేయటానికి రాగా, లోకాలన్నీ వ్యాకులత చెందాయి. సూర్యచంద్రాగ్నులు తమ తేజస్సులు కోల్పోయారు. దేవతలు కలతచెందారు. ఈశ్వరుడు విజృంభించి యజ్ఞాన్ని కొట్టాడు. అది లేడి రూపం ధరించి పారిపోయింది. ఈశ్వరుడు వింటికొనతో సవితచేతులూ, పూషుడిపళ్ళూ, భగుడికళ్ళూ రాలగొట్టాడు. దేవతలు పారిపోయారు. శివుడు వాళ్ళను ఆపి, కొట్టకుండా అవమానించగా, వాళ్ళు వింటిత్రాడు ముక్కలయిపోవుగాక!' అనగానే అది అట్లాగే అయింది. ఆ యజ్ఞమూ, దేవతలూ శరణంటూ శివుడి పాదాల మీద పడ్డారు. ఈశ్వరుడు వాళ్ళను అనుగ్రహించాడు. అతడు తన కోపాన్ని తొలగించి సరస్సులో పడవేసి దేవతలను దయతో చూచాడు. అది అగ్ని రూపం ధరించి ఆ నీళ్ళను ఇంకించింది. శివుడు సవితకు చేతులూ, పూషుడికి పళ్ళూ, భగుడికి కళ్ళూ ఇచ్చి యజ్ఞం ఎప్పటివలె ప్రవర్తించేటట్టు అనుగ్రహించాడు. దేవతలు శివుడికి యజ్ఞభాగం కల్పించారు. శివుడు శాంతించాడు.

'ఈశ్వరుడి లీలలు అట్లాంటివి. అతడు కోపిస్తే లోకాలు అస్వస్థతనూ, ప్రసన్నుడైతే సౌఖ్యాన్నీ పొందుతాయి. అశ్వత్థామ అతడి అనుగ్రహం వలననే అంతటి శక్తిమంతు డయ్యాడు. కాని, స్వశక్తి వలన కాదు. నీవు దీనిని మనస్సులో పెట్టుకొనవద్దు. నీ యుద్ధ విజయానికి కారణమైన నీ దైవమానుష యోగానికి నీవు పరమానందపడుము' అని శ్రీకృష్ణుడు ధర్మరాజును ఓదార్చాడు.

స్త్రీపర్వ కథాసారం

14. ధృతరాష్ట్రుడికి సంజయుడి ప్రబోధం:

కొడుకులు నూరుమంది పాండవుల చేతిలో నశించి పోవటంతో ధృతరాష్ట్రుడు కొమ్మలన్నీ నరికివేసిన మహావృక్షం వలె మోడువడి పోయి భరించలేని దుఃఖంలో మునిగిపోయాడు. సంజయుడు ఆయనకు ధైర్యం చెప్పి, గతించినవారిని గురించి దుఃఖిస్తూ కూర్చునేదానికంటె వారి దహన సంస్కారాల గురించి, బంధువుల కిచ్చే తిలోదకాల గురించీ ఆలోచించుమని హితవు చెప్పాడు. ఆ మాట విని ఆ వృద్ధరాజు గాలితాకిడికి పడిపోయిన పెద్దచెట్టువలె మూర్ఛపోయాడు. కొంతసేపటికి తేరుకొని రెక్కలు తెగిన పక్షివలె, కాంతిని కోల్పోయిన సూర్యుడివలె వెలవెల పోతూ ఆత్మీయులందరూ అంతరించిపోయిన తన బ్రతుకూ ఒక బ్రతుకేనా? అంటూ పెద్దగా విలపించాడు. ఆనాడు కృష్ణుడు రాయబారపు సభలో చెప్పిన హితవూ, భీష్మద్రోణాదులు పలికిన నీతివచనాలూ వినక, పాండవులకు తండ్రిపాలు రాజ్యం ఇవ్వక తనవారి నందరినీ చంపుకొన్నందుకు పరితపించాడు. తన బ్రతుకు వృథా అని వాపోయాడు. తనకు కలిగిన శోకం పూర్వజన్మ పాపఫల మని భావించాడు. తానే స్వయంగా తనవారికి అంత్యక్రియలు చేయలేననీ, దానికీ పాండవులే సమర్థులనీ పేర్కొన్నాడు.

సంజయుడు ధృతరాష్ట్రుడికి అభిమన్యుడి మరణానంతరం వ్యాసుడు ధర్మరాజుకు బోధించిన సృంజయ వృత్తాంతం చెప్పాడు. పుణ్యాత్ములు ఏ సమయంలో ఏం చేయాలో అది చేసి కార్యసాధనలో సఫలీకృతు లౌతారు. పాపాత్ములు అసూయాగ్రస్తులై ఆ పనిని అడ్డుకొని తమ ప్రయత్నం విఫలం కాగా విలపిస్తారు. కౌరవులు చేసిన పనులు పాపాత్ముల చేష్టల వంటివి. గతించింది, నశించింది తిరిగిరాదు. స్వయంగా చుట్టూ మంట పెట్టుకొని అది క్రమ్ముకొంటే తట్టుకొనలేక రోదన చేసినట్లున్నదని ధృతరాష్ట్రుడి దీన స్థితిని పేర్కొని, అతడికి వివేకాన్ని బోధించాడు. దుర్యోధనుడి కఠినవాక్కు లనే గాలికి అర్జున భీముల రోషమనే అగ్ని వ్యాపించి కౌరవాటవిని దహించి వేసిందని తెలియచెప్పాడు. యుద్ధంలో చనిపోయినవారందరూ యజ్ఞాలూ, దానధర్మాలూ, వేదశాస్త్రపఠనాలూ చేసి సంపాదించిన పుణ్యంకంటె ఎక్కువ పుణ్యాన్ని పొంది వీరస్వర్గాన్ని అలంకరిస్తారనీ, వారిని గురించి దుఃఖించ నవసరం లేదనీ ఉపశమన వాక్యాలు పలికాడు. సంసారం అరటిచెట్టువలె నిస్సారమైనదనీ, దానిని గుర్తిస్తే మనస్సు పెనువగలకు గురికాకుండా ఉంటుందనీ, శరీరాన్ని విడిచి ఆత్మలు క్రొత్త శరీరాలను పొందటమే మరణజననాల రహస్యమని తెలిసిన విజ్ఞులు ఆప్తుల మరణానికి ఆర్తి పొందరనీ జీవనతత్త్వాన్ని వివరించి సంసారం బహుళ దుఃఖమయమని తెలిపే ఇతిహాసాన్ని వివరించాడు. శరీరం ఒక రథం. బుద్ధి సారథి. ఇంద్రియాలు గుర్రాలు. బుద్ధి చేసే ఆలోచనలు పగ్గాలు. పుణ్యాత్ములు పగ్గాలను నడవడి అనే ఉపాయంతో నడిపి ఇంద్రియాలనే గుర్రాలను అదుపు చేస్తారు. అటువంటి వారిని జననమరణాదులవలన కలిగే దుఃఖాలు కలతపెట్టలేవు. కాబట్టి ధృతరాష్ట్రుడు ఇంద్రియవశుడు కాక భయాన్ని వదలి, మోక్షం పొందే మార్గాన్ని ఎన్నుకొని, పుత్రపౌత్రాదులకు, దాయాదులకు ఉత్తరక్రియలు చేయటం సముచితమని ప్రబోధించాడు.

15. ధృతరాష్ట్రుడికి వ్యాసమహర్షి ప్రబోధం:

కన్నబిడ్డలకు ఉత్తరక్రియలు చేయాలనే మాట వినేసరికి గుండె మండగా ధృతరాష్ట్రుడు వేదనతో మూర్ఛపోయాడు. ఆ సమయంలో వ్యాసమహర్షి అక్కడికి వచ్చాడు. వృద్ధరాజు తేరుకొని బిడ్డల నందరినీ కోల్పోయిన తన జన్మ నిష్ఫల మనీ, తనకు చావు కూడా రావటం లేదనీ వాపోయాడు. అప్పుడు వ్యాసు డిట్లా అన్నాడు: 'పుట్టిన ప్రతిజీవీ గిట్టకమానదు. ఈ వాస్తవాన్ని తెలిసిన విజ్ఞులు వివేకాన్ని కోల్పోయి పుత్రుల మరణానికి శోకించరు. అంతేకాక కౌరవపాండవుల వైరం నీకు తెలియకుండా కలిగింది కాదు. అంతటికీ నీ కొడుకే మూలం. మిగిలినవారందరూ యుద్ధంలో ఆసక్తి కలవారే. కాబట్టి విదురాది విబుధులు ఎన్నివిధాల చెప్పినా నీవూ, నీ కొడుకూ వినలేదు. దీనికితోడు దేవతల సంకల్పం కూడా దానికి తోడ్పడింది. పూర్వం భూభారాన్ని తొలగించటానికి ధృతరాష్ట్రుడి కొడుకైన దుర్యోధనుడు పుట్టి యుద్ధంలో తన నూరుగురు సోదరులూ, వివిధ దేశ ప్రభువులూ సైనికులూ కురుక్షేత్రంలో చనిపోతారని విష్ణువు చెప్పిన మాటలు వినిపించాడు.

కౌరవులు తాము చేసిన తప్పులతో నశించారు. దానికి విచారపడటం వివేకం కాదని అన్నాడు. ధర్మరాజు తనను అవమానిస్తాడేమో అన్న ధృతరాష్ట్రుడి అనుమానాన్ని వ్యాసుడు తీర్చాడు. పాండవుల వలన ఎప్పుడూ ఎవ్వరికీ ఎటువంటి కీడు జరగలేదు. దుర్యోధనాదులే భూమండలాన్ని మ్రింగారు. పాండవులకు పాండురాజు భాగం దక్కకుండా చేశారు. అందువలననే కౌరవులందరూ కదనరంగంలో కన్నుమూశారు. నారదుడీ సంగతి ధర్మరాజుతో ఎప్పుడో చెప్పాడు. అందుకే అతడు వంశనాశనం కాకుండా హింస ప్రవర్తిల్లకుండా శాంతికాముకుడై సంధియత్నం చేశాడు. నేను కూడా అతడిని ప్రోత్సహించాను. కాని, విధిని ఎవ్వరు తప్పించగలరు? ఇదంతా దేవరహస్యం. నీకు తెలియాలనీ పాండవులపై పగ తగ్గి దయపెరగాలనీ చెప్పాను. ధర్మరాజు సర్వభూత సమభావం కలవాడు. అతడు అజాతశత్రువు. నీవు దుఃఖిస్తూ ఉంటే చూడలేడు. కాబట్టి నీ కొడుకులకంటె ఎక్కువగా అతడిని ఆదరించుము. వారు నీ తమ్ముడి కొడుకులే కదా! నీ శోకాగ్నిని జ్ఞానజలంతో ఆర్పివేయుము'. ఈ ఉపదేశం విని ధృతరాష్ట్రుడు తీవ్ర దుఃఖం నుండి ఉపశమనం పొందాడు. వ్యాసుడు అంతర్ధానమయ్యాడు.

16. యుద్ధభూమికి ధృతరాష్ట్రుడి పయనం:

ధృతరాష్ట్రుడు యుద్ధభూమికి బయలుదేరాడు. శోకభారంతో శరీరం తూలుతూ ఉండగా గాంధారి అతడి వద్దకు వచ్చింది. కుంతీదేవి మొదలైన దేవేరులు, కౌరవుల భార్యలు, పరిచారికలు, తలలపై చేతులు పెట్టుకొని, జుట్టు విరబోసికొని, వనితల ఆకారం పొందిన శోకంవలె, రోదిస్తూ, అతిదీనంగా అక్కడికి తరలివచ్చారు. మిగిలిన మృతవీరుల భార్యలు దుఃఖార్తలై వీథులలోకి వచ్చారు. విదురాదులు వారివారికి ఉచితమైన వాహనాలను అమర్చి ప్రస్థానం సాగించారు. ధృతరాష్ట్రుడి రథం ముందుకు సాగగా ఆ శోకయాత్ర కొనసాగుతున్నది.

అంతలో అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ - ముగ్గురూ రణభూమినుండి తిరిగివస్తూ రథాలు దిగి ధృతరాష్ట్రుడికి నమస్కరించి, దుర్యోధనుడు వీరోచితంగా పోరి వీరస్వర్గం పొందాడనీ, కౌరవసేనలో చనిపోక మిగిలింది తాము ముగ్గురే అనీ నివేదించారు. దుఃఖితురా లైన గాంధారికి దుర్యోధన పరాక్రమాన్నీ, కురువీరుల యుద్ధనైపుణ్యాన్నీ ప్రశంసించి చెప్పి, వారు దానధర్మాలవలన పొందే పుణ్యలోకాల కంటె ఉత్తమలోకాలను పొందారని చెప్పారు. భీముడు ధర్మయుద్ధమార్గాన్ని తప్పి దుర్యోధనుడి తొడలు విరుగగొట్టటంచేత ఆ ముగ్గురూ కోపగించి పాండవ స్కంధావారాన్ని శ్మశానం చేసినట్లు పేర్కొన్నారు. పాండవు లక్కడలేకపోవటంతో వారుప్రాణాలతో బ్రతికిపోయారని అంటూ వారు పగ సాధించటానికై వారిని వెన్నాడి రావటం తథ్యమని చెప్పి, గాంధారి అనుమతి పొంది తప్పించుకొని పోయారు. వారిలో కృపాచార్యుడు హస్తినకు తిరిగివచ్చాడు. కృతవర్మ ద్వారకకు చేరుకొన్నాడు. అశ్వత్థామ వ్యాసమహర్షి ఆశ్రమాన్ని చేరుకొని వెంటనే తపస్సు మొదలుపెట్టాడు. ఆ తరువాత పాండవు లతడిపై దాడి చేసి, శిరోరత్నాన్ని గ్రహించి వెళ్ళి ద్రౌపదికిచ్చిన కథ ఇదివరకే చెప్పబడింది.

ధృతరాష్ట్రుడు సపరివారంగా యుద్ధభూమికి వస్తున్నాడన్న వార్త విని ధర్మరాజు ఆర్ద్రుడై శ్రీకృష్ణుడి అనుమతితో భీమాదులందరూ, ద్రౌపదీ, ఇతర రాణులూ పరివారం అందరూ కలిసి వెంటరాగా శోకమూర్తులై ఆ రాజుకు ఎదురు పోయారు. ధృతరాష్ట్రుడివైపున్న స్త్రీలందరూ ధర్మరాజును చూచి చేతులు పైకెత్తి, హాహాకారాలు చేస్తూ 'తండ్రులను, మామలను, తాతలను, తమ్ములను గురువులను అతిక్రూరంగా చంపిన నిర్దయుడు' అని ఛీత్కారాలు చేశారు. భీష్మద్రోణులను చంపినందుకు అర్జునుడిని నిష్ఠురాలాడారు. చెల్లెలి మగడని కూడా తలంచక సైంధవుడిని చంపినందుకు కొందరు బాధపడ్డారు. 'ఇంతకూ మీరు ఇంతటి యుద్ధం చేసి సంపాదించిన ఈ రాజ్యం ఎవరికొరకు?' అని ఎత్తిపొడిచారు. ధర్మజుడూ, అర్జునుడూ నిశ్శబ్దంగా తలలు వంచి నడిచి ధృతరాష్ట్రుడిని సమీపించారు.

17. ధృతరాష్ట్రుడి కౌగిలి:

ధృతరాష్ట్ర మహారాజును సమీపించి, తన నెరిగించుకొని ధర్మరాజు నమస్కరించాడు. ధృతరాష్ట్రు డతడిని కౌగిలించుకొన్నాడు. అట్లాగే అర్జున, నకుల, సహదేవులను కూడ కౌగిలించుకొన్నాడు. భీముడిపేరు వినేసరికి ఆ గ్రుడ్డిరాజు మొగంలో భయంకరమైన క్రోధం ప్రకోపించింది. ఏదో ఘోరాన్ని తలపెట్టిన రీతి గోచరించింది. త్రికాలజ్ఞుడైన శ్రీకృష్ణుడు

భీముడిని అతడి వద్దకు పంపకుండా అంతకుముందే అమర్చిఉన్న ఒక ఇనుప భీమవిగ్రహాన్ని ధృతరాష్ట్రుడి ముందు ఉంచాడు. అతడు నిజభీముడని భావించి గ్రుడ్డిరాజు తన వేయిఏనుగులబలాన్ని కూడగట్టుకొని కౌగిలించుకొన్నాడు. ఆ కౌగిలి బిగువులో భీముడి ఉక్కు విగ్రహం ముక్కలయింది. రాజురొమ్ము చిట్లింది. ముఖరంధ్రాలన్నింటినుండి రక్తం కారనారంభించింది. అతడు మూర్ఛపోయాడు. ఆ మూర్ఛలో 'ఈనాటికి భీముడిని చంపగలిగాను. నా కొడుకు దుర్యోధనుడికి ఈనాడే మోక్షం కలుగుతుంది' అని పలవరించాడు. మూర్ఛ తేరినతర్వాత తాను లోలోన సంతోషిస్తూనే ఎవ రే మనుకొంటారో అని భీముడి పేరు ఉచ్చరిస్తూ పెద్దగా ఏడవటం మొదలుపెట్టాడు. శ్రీకృష్ణు డా కపటనాటకాన్ని చూచి, నవ్వి, భీముడు బ్రదికి ఉన్నాడని చెప్పి, ధృతరాష్ట్రుడి దుర్బుద్ధిని బైటపెట్టి, 'పాండవులను చంపినా, చనిపోయిన కౌరవులు తిరిగి వస్తారా? ఇప్పటి చర్యవలన చెరగని మచ్చవంటి పాపం చేశా' వని, ఇప్పటికైనా పాండవులను సామరస్యంతో చూచి విజ్ఞతను ప్రకటించుము' అని హెచ్చరించాడు. పలురకాల మందలించాడు. శ్రీకృష్ణుడి మాటలు విని ధృతరాష్ట్రుడు పరితప్తుడై పాండవులను సొంత కొడుకులుగా చూచుకొంటానని మాట ఇచ్చాడు. ధృతరాష్ట్రుడి శరీరాని కంటిన రక్తాన్ని పరిచారకులు కడిగారు. అప్పుడు శ్రీకృష్ణుడు పాండవులనూ, యుయుత్సుడినీ ధృతరాష్ట్రుడి వద్దకు పంపాడు. అతడు వారి నందరినీ కౌగిలించుకొన్నాడు.

18. గాంధారి కోపతాపాలు:

ధృతరాష్ట్రుడి సూచన మేరకు పాండవులు గాంధారిని దర్శించారు. గాంధారి వారిని ఆశీర్వదించటానికి ఇష్టపడకపోగా ధర్మరాజును శపించటానికి సంకల్పించింది. దానిని దివ్యజ్ఞానంతో గమనించిన వ్యాసుడు ప్రత్యక్షమై అతడిని శపించవద్దని వారించాడు. దుర్యోధనుడు యుద్ధానికి బయలుదేరే టప్పుడు తల్లికి నమస్కరించి 'విజయం సిద్ధించేటట్లు దీవించు'మని కోరగా, ఆమె 'ధర్మ మెక్కడ ఉంటుందో విజయ మక్కడ కలుగుతుంది' అని దీవించిన సంగతి జ్ఞాపకం చేసి, ధర్మదీక్షతో యుద్ధంచేసిన పాండవులకు విజయం కలగటం ఆమె ఆశీఃఫలమే అని పలికాడు. అసూయను మాని, మాతృధర్మాన్ని గౌరవించి, పాండవులపై కోపాన్ని వదలి శాంతితో మసలుకొను' మని వ్యాసుడు గాంధారికి హితవు చెప్పాడు. దానికి గాంధారి ఒడబడింది. దుర్యోధనుడి దుర్నీతి వలన కౌరవనాశనం జరిగిందని అంగీకరించింది. కాని, శ్రీకృష్ణుడు చూస్తూ ఉండగా భీముడు గదాయుద్ధంలో దుర్యోధనుడి తొడలు విరుగగొట్టటం అన్యాయమనీ, అదే తన హృదయాన్ని బాధిస్తున్న దనీ అదే కోపకారణ మనీ పేర్కొన్నది. ఆమె కోపాన్ని చూచి భయపడి భీముడు గాంధారితో ఇట్లా అన్నాడు: 'తల్లీ! నేను చేసింది ధర్మమో అధర్మమో నాకు తెలియదు కాని, ప్రాణభయంతో అట్లా చేయవలసి వచ్చింది. దానికి నన్ను క్షమించుము. బలవంతుడూ, నిపుణుడూ అయిన సుయోధనుడిని అట్లా తప్ప మరొక విధంగా ఓడిచటం సాధ్యంకాదు. అయినా, దానిని అట్లా ఉంచి ఆలోచించుము. అలనాటి సభలో ధర్మరాజుకు జరిగిన అవమానం ధర్మమేనా? ఏకవస్త్ర అయిన ద్రౌపదిని నిండుసభకు ఈడ్చుకొని వచ్చి, దుర్భాషలాడి, ఆ పవిత్రురాలికి తన తొడలు చూపించి కూర్చొనుమనటం నీకు తెలియదా? అప్పుడు నాకు కలిగిన క్రోధావేశంలో, పరితాపతీవ్రతలో అతడి తొడలు యుద్ధంలో విరుగగొట్టుతా నని శపథం చేశాను. ప్రతిజ్ఞను నెరవేర్చటం ప్రతాపవంతులకు ప్రధాన లక్షణం. అతడి తొడలను ఆ నిండుసభలోనే నుగ్గు నుగ్గు చేసి ఉంటే బాగుండేది. కాని, ధర్మజుడి నియమానుసారం అడవులకు వెళ్ళాం. పడరాని పాట్లు పడ్డాం. చివరకు ధర్మరాజు సంధియత్నం చేశాడు. శ్రీకృష్ణుడిని రాయబారిగా పంపాడు. అప్పుడు ఆయనతో నేను పంపిన సందేశం విన్నావుగా. 'మనం అన్నదమ్ములమై ఉండికూడా, ఇతరులు వేలెత్తి చూపేటట్లు, వైరంతో పరస్పరం యుద్ధం చేయటం తగదు. పెద్దలు చెప్పినట్లుగా విని రాజ్యాన్ని పంచుకొని సుఖంగా అనుభవించటం మంచిది' - అని చెప్పి పంపాను. కాని, దుర్యోధనుడు ఆ మాటలు వినక వైరం పెంచుకొని యుద్ధం చేశాడు. దానివలన ధర్మజుడు రాజ్యాన్ని గ్రహించాడు. నేను ప్రతిజ్ఞలను నెరవేర్చుకొన్నాను. మంచిచెడలు తెలిసినదానిని నీవు విచక్షణతో విచారించుము' - అనగా ఆమె సమాధాన పడింది కాని, దుశ్శాసనుడి రొమ్ము చీల్చి నెత్తురు త్రాగటం అమానుషం కాదా? అని అడిగింది. దానికి భీముడు అలనాటి నిండుసభలో ద్రౌపది అతడు చేసిన అవమానాన్ని పేర్కొని తన ప్రతిజ్ఞను సమర్థించుకొన్నాడు. అంతేకాక, యుద్ధంలో శత్రువులు తనను చుట్టుముట్టి దుశ్శాసనుడికి దూరంగా త్రోసివేయటానికి ప్రయత్నించగా వారిని భయపెట్టటానికి రక్తాన్ని త్రాగినట్లు నటించి పెదవుల దాక చేర్చానే కాని నిజానికి తమ్ముడి రక్తాన్ని త్రాగేటంత క్రూరుడిని కాను' అన్నాడు. దానికి గాంధారి ఇట్లా అన్నది. 'గ్రుడ్డివాళ్ళమైన ఈ

తల్లిదండ్రులకు అసరాగా ఒక కొడుకునైనా మిగల్చకుండా అందరినీ చంపటం న్యాయమా? ఒక్కడు మిగిలితే, మీ రాజ్యానికి అడ్డం వస్తా డనుకొన్నారా? ఏడీ ఆ ధర్మజమహారాజు?' అని కరకుగా పలికింది.

ధర్మరాజు ఆమె మనసు కనిపెట్టి, దగ్గరకు పోయి నమస్కరించాడు. 'నీ కొడుకులను చంపిన పాపాత్ముడను వచ్చాను. కఠినంగా శపించి శిక్షించుము. నేను బ్రతకటానికి అర్హుడిని కాను. నా కీ రాజ్యం వద్దు. ఈ వైభవాలు వద్దు' అని విలపించాడు. గాంధారి మారుమాటాడలేకపోయింది. కరుకుగా వేడి నిట్టూర్పులు విడిచి ఊరకుండిపోయింది. ధర్మరాజు చేతులెత్తి నమస్కరించి ఆశీస్సులు కోరాడు. గాంధారి కళ్ళగంతల సందులోనుండి ధర్మజుడి కాలిగోళ్ళు కనపడగా చూచింది. అవి ఎర్రగా కందిపోయాయి. దానిని చూచి అర్జునుడు శ్రీకృష్ణుడి వెనుకకుపోయి నిలిచాడు. భీమనకుల సహదేవులు ప్రక్కకు జరిగారు. అప్పుడు గాంధారి కోపం వదలి, వాత్సల్యంతో పాండవులను 'కుంతీదేవిని దర్శించుకొనండి' అని చెప్పింది. పాండవులు తేరుకొని కుంతి వద్దకు వెళ్ళారు.

చాలాకాలంగా పాండవులను చూడాలనే కోరికతో అలమటిస్తున్న కుంతీదేవి వారు పడ్డ కష్టాలను, కోల్పోయిన పుత్రపౌత్రులను తలంచుకొని కన్నీరు మున్నీరుగా దుఃఖించింది. పాండవుల నందరినీ చేతులు సాచి దరికి తీసికొని, వారి శరీరాలపై ఆయుధాల దెబ్బలవలన కలిగిన గాయాలను తాకి నిట్టూర్పులు నిగిడించింది. ద్రౌపది ఆమెను సమీపించి, చనిపోయిన అభిమన్యుప్రభృతులను తలచుకొని విలపించింది. అత్తా కోడళ్ళు ఒకరి నొకరు కౌగిలించుకొని భోరున ఏడ్చారు. ఇద్దరూ కలిసి గాంధారి వద్దకు వెళ్ళారు. వారందరూ తమ పుత్రులను కోల్పోయిన దుఃఖాలను కలియబోసికొని ఒకరు నొకరు ఓదార్చుకొన్నారు. విదురాదులు చెప్పిన హితవును విని కుమారులను అదుపులో పెట్టుకొనలేకపోవటం చేతనే ఆ విపత్తు ఏర్పడిందని గాంధారి పేర్కొన్నది. కాలప్రభావాన్ని తప్పించటం శక్యం కాదని అందరూ నిర్వేదాన్ని ప్రకటించారు. పాండవులు గాంధారినీ, ధృతరాష్ట్రుడినీ సముచితంగా ఓదార్చారు.

19. గాంధారి మృతవీరుల సందర్శనం:

వ్యాసమహర్షి గాంధారికి దివ్యదృష్టిని ప్రసాదించాడు. ఆమె కన్నులకు గంత ఉన్నా యుద్ధభూమిలో దగ్గరగా, దూరంగా ఉన్న వస్తువులన్నీ స్పష్టంగా కనపడసాగాయి. యుద్ధభూమిలో ముక్కలు ముక్కలై చిందరవందరగా పడిఉన్న రథాల భాగాలూ, గజాలు, గుర్రాలు, సైనికుల దేహఖండాలూ కుప్పలు కుప్పలుగా పడి ఉన్న దృశ్యాలూ ఆమె దృష్టికి గోచరించాయి. ఆమె హృదయం తరక్కుపోయింది. నెత్తురు మడుగులలో పడిఉన్న వీరుల శవాలు ఆమెకు ఆరాటం కలిగించాయి. శవాల మాంసాలను, నెత్తురును త్రాగుతూ సంతోషంతో గంతులు వేస్తున్న రాక్షసుల గుంపులు మిక్కిలి ఏవగింపును కలిగించాయి. గాంధారి శ్రీకృష్ణుడిని దగ్గరికి పిలిచి దీనంగా ఈ విధంగా చెప్ప నారంభించింది.

'కృష్ణా! ధృతరాష్ట్ర మహారాజు కోడళ్ళను చూడుము. వారు కన్నీరు మున్నీరౌతూ వారి భర్తలనూ, అన్నదమ్ములనూ గుర్తిస్తూ, కాకులు పొడుచుకొని తింటున్న వారి శవాలను చూచి తూలిపోతున్నారు. కర్ణ, శల్య, ద్రోణాదులు అభిమన్యు ముఖ్య కుమారులు చనిపోయినా కాంతుల నీనుతున్నారు. హంసతూలికాతల్పాలుమీద శయనించే ఈ వీరుల శరీరాలను రాపులుగులు, నక్కలు, గ్రద్దలు, కాకులు ఆక్రమించి పొడిచి పొడిచి ఎంగిలిచేశాయి. వినోద వాద్యాలతో, సుగంధద్రవ్యాలతో, హారాలతో విరాజిల్లేవారు నక్కల ఊళలు, రక్తపు పూతలు, గ్రద్దలు తమను క్రమ్మివేస్తున్నా కదలక మెదలక పడి ఉన్నారు. రాజులూ, యుద్ధవీరులూ కాంతు లీనుతూ పడి ఉన్న యుద్ధభూమి గ్రహనక్షత్రాలలో వెలిగిపోతున్న ఆకాశంవలె ఉన్నది చూచావా?

యుద్ధం చేస్తున్నప్పుడు చేతులలో ఉన్న ఆయుధాలతో అట్లాగే పడి ఉన్న వీరులను చూచి రాబందులు దగ్గరకు రావటానికి జంకుతున్నాయి. కొందరి శరీరాలను నక్కలు, కాకులు తినివేయగా వారిని గుర్తించటం కష్టమై పోతున్నది. ముక్కలైన దేహభాగాలను కలిపి తమ తమ వారి ఆకారాలను కూర్చుకొని వనితలు భోరుమని విలపిస్తున్నారు. ఇటువంటి దారుణదృశ్యాలను చూడటానికి బ్రతికి ఉన్న నేను పూర్వజన్మలో ఎంతటి పాపం చేశానో? అని బావురు మన్నది.

ఆమె దుర్యోధనుడి శవాన్ని చూచింది. శోకాతిశయంతో మొదలు నరికిన అరటిచెట్టువలె మూర్ఛపోయింది. కన్నీరు ధారలుగా కారుస్తూ అతడి రొమ్ముమీద వాలిపోయింది. రారాజుగా బ్రతికిన కొడుకు దీనంగా నేలమీద పడి ఉన్నందుకు కుమిలిపోయింది. తల్లి వచ్చినా లేచి నమస్కరించకుండా మౌనంగా పడి ఉన్నందుకు ఆమె వాపోయింది పలు పలువిధాలుగా విలపిస్తున్న గాంధారి శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నది. 'కృష్ణా! నా కొడుకు యుద్ధానికి పోతూ వినయంతో నాకు నమస్కారంచేసి తనకు విజయం కలిగేటట్లు ఆశీర్వదించుమని కోరాడు. నేను 'ధర్మం ఏ పక్షంలో ఉంటే ఆ పక్షానికి విజయం తప్పక సిద్ధిస్తుంది' అని అన్నాను. ఎందుకంటే ఆనాడు జూదమాడుతున్న సమయంలో సభలోనివారంతా ద్రౌపదీ వస్త్రాపహరణాన్నీ, భీముడి ప్రతిజ్ఞలను చూచి భయపడి, 'ఆ అధర్మానికి ఫలంగా కౌరవవంశనాశం, విస్తారసైన్య ధ్వంసం ఔతుంది కాని, ధర్మం అంత సులభంగా నశించదు' అని అన్నారు. నా బుద్ధికి కూడా అదే తోచింది. నా కుమారుడని సత్యం తప్పి మెరమెచ్చు మాటలు పలికితే పెంపు కలుగుతుందా? అంతేకాక మరొకమాటకూడా అన్నాను. 'యుద్ధంలో వెనుదిరిగి వచ్చిన దానికంటె చావు మేలు, యుద్ధవీరుడుగా నీవు పరలోక సౌఖ్యాన్ని పొంది సుఖించుము' అన్నాను. నే నన్నట్లే, నా మాట నిలుపుతున్నట్లే - దుర్యోధనుడు కీర్తి ప్రతిష్ఠలు పొందాడు. నేను ఇతడి పరాక్రమాన్ని తలచి ధైర్యంగా ఉన్నా, ధృతరాష్ట్రుడికి దిక్కు ఎవరూ లేకపోయారే అనే భావం నా గుండెను మండిస్తున్నది. అదే నాకు మిగిలిన దుఃఖం. ఎన్నో భోగాల ననుభవించిన ఈ రారాజు సింహం చంపిన మదపుటేనుగువలె కటికనేలమీద పడి ఉండటం చూడలేకపోతున్నాను. విదురాది విజ్ఞులు ఎందరు ఎన్నివిధాల చెప్పినా ఇతడు వినలేదు. విధి మూడిన బుద్ధికి మంచిమాటలు రుచిస్తాయా? పదకొండు అక్షౌహిణుల సైన్యం వెంటరాగా ప్రకాశించే ఈ రాజు ఒంటరిగా పడి ఉండి రాబందులకు ఆహారం కావటం అబ్బురం కాదా! కొడుకు చావుకంటె నా కోడలు (దుర్యోధనుడి భార్య) భానుమతి శోకం నన్ను కలవర పెట్టుతున్నది. యుద్ధభూమిలో పడి ఉన్న తన భర్తనూ, కొడుకునూ చూస్తూ, దుఃఖాతిశయంతో వారిపైబడి మూర్ఛపోతూ లేస్తూ దీనంగా విలపిస్తున్నది. ఆమెను చూచి శోకాన్ని భరించలేకపోతున్నాను. దుర్యోధనుడు మాత్రం తల్లీ భార్యా ఏమయితేనేం? తాను మాత్రం సర్వం సిద్ధించే మార్గాన్ని ఎన్నుకొని వెళ్ళాడు' అంటూ ఎన్నో విధాల వాపోయింది.

ఆ తరువాత గాంధారి భీముడిచేతిలో మృతులైన తన కొడుకుల నందరినీ చూపించి వారి భార్యల విలాపాలను వినిపించి, పలువిధాల తాను వాపోయింది. కౌరవుల తల్లిదండ్రులు చేసిన పూర్వజన్మ పాపంవలన కాకపోతే దుర్యోధన దుశ్శాసనాదులను పుణ్యాత్ముడైన ధర్మరాజు చంపగలడా?' అని పలికింది.

సింహం తన వాడి అయిన గోళ్ళతో చీల్చి చంపిన మదపుటేనుగువలె పడి ఉన్న దుశ్శాసనుడిని చూపించి, అతడు నిండుసభలో ద్రౌపదికి చేసిన అపచారానికి ఫలితంగా భీమ ప్రతిజ్ఞకు బలి అయ్యాడని పేర్కొన్నది. ద్రౌపదిని అవమానపరచటం అధర్మమని తాను దుర్యోధనుడికి నీతి చెప్పిన మాటలను జ్ఞాపకంచేసికొన్నది. కొడుకులు మాట విననందుకు విచారించింది. కాని, భీముడు దుశ్శాసనుడి శరీరాన్ని విరిచి, ముక్కలను నలుదిక్కులా విసరి అతడి రొమ్ముచీల్చి రక్తాన్ని త్రాగిన దారుణ దృశ్యం అతడికి కీర్తి కలిగిస్తుందా? నాకు దుఃఖం అతిశయింపజేయకుండా ఉంటుందా?' అని వాపోయింది.

వికర్ణుడి శవాన్ని చూచి అతడి చేతికున్న కణుపులను పిల్లగ్రద్దలు చీల్చటానికి వీలుకాకపోతున్న దృశ్యానికి అతడి భార్య దుఃఖిస్తున్న తీరుకు జాలిపడింది. అట్లాగే దుర్ముఖుడు, శూరసేనుడు, వివింశతి మొదలయిన కురుకుమారుల శవాలను చూచి విలపించింది. ఆ తరువాత అభిమన్యుడి శవాన్ని చూచి యుద్ధంలో పద్మవ్యూహ భేదనంలో అతడు ప్రదర్శించిన ప్రతాపాన్ని ప్రశంసించింది. దుర్యోధన, కర్ణ, ద్రోణ, అశ్వత్థామ, శల్యాది మహావీరులతో అతడు మహాయుద్ధం చేసి అలసిపోయి పడుకొన్నట్లుగా అతడి శరీరం ఉన్నదనీ, అతడి ముఖకాంతి అతడు చావలేదేమో అన్న భ్రాంతిని కలిగిస్తున్నదనీ పలవరించింది. సిగ్గుల ముద్దరాలైన ఉత్తర తన భర్త శవంపై బడి దుఃఖిస్తున్న దృశ్యాన్ని చూచి హృదయం ద్రవిస్తున్నదని విలపించింది. 'పెద్దలందరూ కూడి అన్యాయంగా అతడిని చంపిన వ్యూహాన్ని తలపోసి ఆ నీచకార్యాన్ని ఉత్తర నిరసించటం గాంధారి విన్నది. అతడిని, ఉపపాండవులను పోగొట్టుకొన్న పాండవులకు విజయం కలిగి లాభ మేమున్నదని విలపిస్తున్న ఉత్తరను బంధువులు బుజ్జగించి ప్రక్కకు తీసికొని పోతున్న దృశ్యాన్ని కృష్ణుడికి గాంధారి చూపించింది.

అట్లాగే ఉత్తర కుమారుడు, లక్ష్మణ కుమారుడు మొదలయిన వీర కుమారులను, మహాపరాక్రమశాలి కర్ణుడినీ గాంధారి చూచింది. వారి యుద్ధవీరాన్ని ప్రశంసిస్తూ విలపించింది. ఆ తరువాత బాహ్లికుడూ, సైంధవుడూ మొదలయిన మహావీరులను చంపిన అర్జునుడికి జాలికూడా లేదని వాపోయింది. చెల్లెలని కూడా భావించక తనకు పతి వియోగం కలిగించిన అన్నలను నిష్ఠుర మాడుతున్న దుస్సలను చూపించి దుఃఖించింది. చెక్కుచెదరని శల్యుడి శవాన్ని చూచి, దుర్యోధనుడికీ అతడికీ ఉన్న స్నేహాన్ని స్మరించి అతడి భార్యల దుఃఖాన్ని చూచి శోకించింది. భీష్ముడు కురువంశ రక్షణంలో చేసిన సేవలను కీర్తించింది. సూర్యుడి వంటి భీష్ముడు అంపశయ్యపై అస్తమించినట్లున్న ఆ దృశ్యాన్ని చూచి విషాదాన్ని పొందింది. శత్రువు లనే అడవిని దహించి ఆరిపోయిన అగ్నివలె ఉన్న ద్రోణుడి శరీరాన్ని దర్శించింది. ద్రోణుడిని నమ్మి దుర్యోధనుడు యుద్ధానికి దిగిన సన్నివేశాలను స్మరించింది. శిష్యులు నమస్కరించే ఆ గురుదేవుడి పాదాలను నక్కలు పీక్కొని తింటున్న దృశ్యాన్ని చూచి హృదయవిదారకంగా దుఃఖించింది. ద్రోణాచార్యుడి భార్య, కృపాచార్యుడి చెల్లెలు అయిన కృపి పొందే వేదనను చూచి జాలిపడింది. ద్రోణ శిష్యులు గురుశవదహనం చేయటం, అందరూ కలిసి నదిలో స్నానంచేయటం గాంధారి కృష్ణుడికి చూపించి కంటనీరు పెట్టింది.

సాత్యకి నిర్దాక్షిణ్యంగా చంపిన సోమదత్తుడి కొడుకు భూరిశ్రవుడి శవాన్ని చూచింది. సోమదత్తుడి భార్య అటు మగడి శవాన్ని ఇటు కొడుకు శవాన్ని చూచి దుఃఖించే దృశ్యం కరుణరసభరితంగా ఉండగా కృష్ణుడికి చూపించింది.

మాయలకే మామ అనిపించుకొన్న శకుని సహదేవుడి బాణాలకు నేలకూలాడు. అతడి మాయలన్నీ శ్రీకృష్ణుడి దివ్యమాయలతో వమ్మయిపోయాయి. ఆనాడు మోసంతో జూదమాడి ధర్మజుడు రాజ్యమంతా లాగుకొన్నాడు. ఈనాడు యుద్ధమనే జూదంలో తన ప్రాణాన్నే ఒడ్డి ఓడిపోయాడు. ఇతడి పాపకర్మ ఫలించింది. ఇతడి ద్యూత వ్యసనం కురువంశ నాశనానికి తప్ప ఎందుకూ పనికిరాలేదు. ఇతడు చూపించిన అధర్మమార్గమే కౌరవులకు పాండవులతో వైరం తెచ్చి పెట్టింది. దుర్యోధనుడికి మంచి చేస్తానని చెప్పి మోసంచేశాడు. చివరకు సోదరులతో, పుత్రులతో, స్నేహితులతో సహా మరణించేటట్లు చేశాడు. కౌరవులందరితోపాటు శకుని కూడా స్వర్గానికి పోయాడు. అల్పజ్ఞులైన కౌరవులను మోసంచేసి యుద్ధానికి పురికొల్పాడు. ఇతడివలననే సోదరకలహం ఏర్పడింది - అంటూ గాంధారి కృష్ణుడికి చెప్పింది.

ఆ తరువాత శరీరం నిండా శస్త్రాలతో ఉన్న కళింగదేశాధిపతిని చూచి, అనేక స్త్రీలు అతడిపైబడి దుఃఖించటం శ్రీకృష్ణుడికి చూపించింది. అట్లాగే మగధదేశాధిపతి జయత్సేనుడి శవాన్ని పేర్కొని, అతడి వనితల విలాపాన్నీ, తగ్గని లావణ్యాన్నీ చూపించింది. కోసలాధిపతి బృహద్బలుడు, ధృష్టద్యుమ్నుడి కొడుకులు, కేకలరాజులూ, పాంచాల రాజైన ద్రుపదుడు, చేది భూపాలుడు, ధృష్టకేతువు, సుకేతుడు, అవంతి రాజ్యపాలకులైన విందానువిందులు మొదలయిన వీరుల శవాలను, వారి భార్యల శోకాలనూ చూపించింది. వినిపించింది. ఆ తరువాత గాంధారీ కృష్ణుల నడుమ ఇట్లా సంభాషణ సాగింది.

20. గాంధారి శాపం:

గాంధారి : కృష్ణా! భీష్మద్రోణ, కర్ణులు, భూరిశ్రవుడు, అశ్వత్థామ, కృప, సైంధవ, కృతవర్మ, దుర్యోధనాదులవంటి అతిరథమహారథులు విజృంభిస్తే దేవతలు కూడా నశిస్తారు. కాని, వారి నందరినీ ఎదిరించి కూడా నీవూ, పాండవులూ, సాత్యకీ ఏ అపాయం లేకుండా బయటపడ్డారు. ఇంతకంటె అద్భుత మేముంటుంది? ఇది విధివిలాసం. దైవం కౌరవులకు ఇంత అన్యాయం చేస్తుందా? నేను నా కొడుకుల నందరినీ కోల్పోయాను. ఆనాడు నీవు సంధికి వచ్చి నిండుసభలో చెప్పిన మాటలన్నీ ఇప్పుడు నిజమయ్యాయి. భీష్మ విదురాదులు చెప్పిన హితోక్తులను నేను పుత్ర వ్యామోహంతో పాటించలేదు. అందుకే ఈ దుఃస్థితి కలిగింది. (అని మూర్ఛపోయి కొంతవడికి తేరుకొని కృష్ణుడిని చూచి మండిపడుతూ) కృష్ణా! దీనికి నీవే మూలకారణం. నీవు సకల ధర్మవేత్తవు. మధురభాషివి, సర్వకార్య దక్షుడవు అయి కూడా పాండవ కౌరవుల మధ్య యుద్ధం జరుగకుండా చూడక నిర్లక్ష్యం చేశావు. నీ రాయబారం సంధికి కాదు. దుర్యోధనాదులైన రాజులను నామరూపాలు లేకుండా చేయటానికే. ఇప్పుడు అందరూ పోయారు, అన్ని ప్రాంతాలు

బీడులయ్యాయి. దీనికి ఫలితం అనుభవించుము. నేను పతివ్రతాదీక్షతో పొందిన తపఃపుణ్యంతో నిన్ను శపిస్తున్నాను. దాయాదుల నడుమ పోరు కలిగి వారందరు నశించేటట్లు చేసినందువలన నీ దాయాదులు కూడా ఒకరినొకరు కొట్టుకొని చస్తారు. నీవు కూడా సరిగ్గా ఈనాటికి ముప్పైఏళ్ళకు దిక్కులేని చావు పొందుతావు. ఈనాడు కౌరవ వనితలు ఏ విధంగా ఏడుస్తున్నారో యాదవకాంతలు కూడా భర్తలను, కొడుకులను, బంధువులను పేరు పేరునా తలచుకొని కుమిలి కుమిలి ఏడుస్తారు' (అని ఘోరంగా శపించింది).

శ్రీకృష్ణుడు : (చిరునవ్వుతో) గాంధారీదేవి! యాదవులకు మునివరులు ఇచ్చిన ఘోరశాపం ముందే ఉన్నది కదా! మళ్ళీ నీవు దానిని పునరుక్తం చేశావు. దీనివలన నీవు కొత్తగా ఏమి సాధించావు చెప్పుము. యాదవులకు నాశనం తప్పదు. వారిని దేవతలు కూడా చంపలేరు. అందుచేత ఘోరయుద్ధంలో పరస్పరం చంపుకొని చస్తారు. గాంధారీ! ఇక లెమ్ము చనిపోయిన బంధుమిత్రులకు దహన కార్యాలు చేయించాలి కదా! చివరకు ఒకమాట చెప్పుతాను వినుము. నీ కుమారుడు చేసిన దుర్మార్గాలు నీకు తెలియవా? దుర్యోధనుడి దురభిమానాన్ని నేను కాని, నీవు కాని, భీష్మ ద్రోణ బాహ్లికాదులు కాని, చివరకు ధృతరాష్ట్ర మహారాజు కాని మాన్పలేకపోయాము. అతడి దుశ్చర్యల ఫలితమే నేటి ఈ దుఃస్థితి. మీ తప్పువలన కలిగిన కీడుకు నన్ను బాధ్యుడిని చేయటం న్యాయమా? ఇకనైనా నీ శోకాన్ని దూరం చేసికొమ్ము. క్షత్రియవనితలు యుద్ధవీరులనే కొడుకులుగా కోరుకొంటారు. వారికై దుఃఖిస్తే శోకం రెండింతలౌతుంది. కాబట్టి నిగ్రహించుకొమ్ము'.

శ్రీకృష్ణుడి మాటలు గాంధారి చెవులలో నిప్పులు పోశాయి. ఆమె మారుమాటాడలేక ఊరకుండి పోయింది.

ధృతరాష్ట్రుడు : ధర్మరాజా! నీకు మన రెండు వైపుల సైన్యాలలోని జనుల సంఖ్య తెలుసు. యుద్ధంలో ఎంత మంది చనిపోయారో గుర్తుంటే చెప్పుము.

ధర్మరాజు : ప్రసిద్ధులు, ఉత్తములు 76 కోట్ల 20 వేలమంది. ఇతరులు 24 వేల 320 మంది చనిపోయారు.

ధృతరాష్ట్రుడు : వీరందరూ ఏయే గతులు పొందుతారో చెప్పగలవా?

ధర్మరాజు : అస్త్రాల అగ్నిలో ఆహుతి అయిన వీరులు స్వర్గంలో ఇంద్రుడి అతిథులై అప్సరః స్త్రీలతో ఆనందిస్తారు. అస్త్రశస్త్రాలు ఆయువుపట్టులలో తగలటంచేత భయపడి పారిపోయినవారు యక్షలోకం చేరుతారు. ఇక- యుద్ధంలో ఏ విధంగా చనిపోయి స్వర్గానికే పోతారు కాని, నరకానికి పోరు - అని పండితులంటారు.

ధృతరాష్ట్రుడు : ఈ చనిపోయినవారిలో దిక్కున్నవారూ ఉన్నారు. దిక్కులేనివారూ ఉన్నారు. వీరందరికీ విధి ప్రకారం దహన కర్మ చేయవచ్చునా?

ధర్మరాజు : ఈ యుద్ధంలో పాల్గొన్నవారందరూ అగ్నిని సిద్ధంగా ఉంచుకొన్న యాజ్ఞికులవంటివారే. వీరందరికీ తల కొరివి పెట్టి, జలతర్పణాలు వదిలే అర్హత కలవారు లేరు. మనమే పూనుకొని ఆ పని నిర్వహించాలి.

అప్పుడు ధర్మరాజు ధౌమ్యుడినీ, విదుర, సంజయులనూ పిలిచి 'మీరు భరత వంశీయులకు తప్ప మిగిలిన దిక్కులేని వారికందరికి విధి విధానాన్ని అనుసరించి దహనకర్మ చేయించండి' అని తగిన వారిని వారికి తోడుగా నియమించాడు, కావలసిన ద్రవ్యాలు సమకూర్చాడు. వారు ధర్మజుడు చెప్పినట్లు కర్తవ్యం నిర్వహించారు. ఒకవైపు వేద స్వరాలు, మరొకవైపు స్త్రీల శోకనాదాలూ కలిసి ఆకాశమంతా మారుమ్రోగిపోయాయి.

21. కర్ణుడు రాధేయుడు కాడు కౌంతేయుడు:

ఆ తరువాత ధర్మరాజు ధృతరాష్ట్ర మహారాజును, కౌరవ వనితలను, బంధుజనులను కలుపుకొని గంగకు వెళ్ళి, స్నానాలు చేసి, మృతులకు తిలోదకాలు ఇచ్చాడు. అప్పుడు కుంతీదేవి ధర్మరాజు వద్దకు వచ్చి పొంగివస్తున్న దుఃఖంతో అందరూ వినేటట్లు ఈ విధంగా అన్నది.

కుంతి : ధర్మరాజా! వినుము. కౌరవులకు తన వింటిని పెట్టనికోటగా ఉంచినవాడూ, యుద్ధక్రీడలలో మీ అందరిచేత ప్రశంస లందుకొన్నవాడూ, దేవతలు కీర్తించగా అర్జునుడి మహాస్త్రానికి తల తెగి నేల కొరిగినవాడూ అయిన కర్ణుడు లోకులంతా పిలిచేటట్లు రాధేయుడు కాదు. నా కొడుకు. మీ అయిదుగురికీ అన్న. సూర్యుడి వరప్రసాదంగా నాకు అందమైన కవచకుండలాలతో పుట్టాడు. అందువలన ఆ మహానుభావుడికి తిలోదక ప్రదానం మీరు చేయండి.

ధర్మరాజు : (దుఃఖిస్తూ) కర్ణుడు మహావీరుడు. దుర్యోధనుడు అతడి ఆసరా చూచుకొని అసమాన వీరులైన భీమార్జునులను ఎదుర్కొనటానికి సాహసించాడు. అతడి బలం చూచి విదేహాది రాజులు రారాజుకు సామంతులయ్యారు. అతడి బాహుబలం వలన పాండవ బలం అక్కడి కక్కడ అణగి ఉంటూ వచ్చింది. అతడి దివ్యాస్త్ర సంపదకు దేవతలు కూడా ఆశ్చర్యపడేవారు. అతడి మహాశక్తి మమ్ములను యుద్ధంలో చీకాకు కలిగించింది. అటువంటి ఆ మహాత్ముడి జన్మరహస్యాన్ని కొంగున నిప్పులు దాచిపెట్టినట్లు ఎట్లా ఇన్నాళ్ళు దాచావమ్మా?. ఒక్క అర్జునుడు తప్ప మరెవ్వరూ అతడి రథాన్ని ఎదిరించి నిలువగలిగినవారు లేరు. తొలిచూలుగా కర్ణుడిని ఎందుకు కన్నావమ్మా? అట్లాంటి అద్వితీయ మహాపరాక్రమవంతుడిని చంపటంవలన నీవు నేర్చిన మంత్రం మా అందరికీ మహాశోకాన్ని తెచ్చిపెట్టింది. సూర్యకుమారుడైన కర్ణుడి మరణం బంధువులందరికీ దుఃఖం కలిగించింది. అభిమన్యుడూ, ఉపపాండవులూ, ద్రుపదుడి కుమారులూ, కురుకుమారులూ మరణించినప్పుడు కూడా ఇంతటి దుఃఖం కలుగలేదు. కర్ణుడు మా అన్న అని ముందుగానే తెలిసి ఉంటే కురుకుమారులు, వారి సైన్యం వ్యాకులం చెందకుండా ఎట్లా మసలు కొనాలో అట్లా మసలుకొనేవాళ్ళం, అట్లా అయి ఉంటే మానవ లోకానికి ఏ దుఃఖమూ కలిగేది కాదు.×

అని ధర్మరాజు దుఃఖించాడు. వణకుతున్న చేతులతో కర్ణుడికి తిలోదకాలు ఇచ్చాడు. ఆ తరువాత శోకభారంతో భీమార్జున నకుల సహదేవులు అట్లాగే చేశారు. ధృతరాష్ట్ర గాంధారులూ, కురుకుమారుల భార్యలూ తర్పణాలు వదిలారు. కర్ణుడిపై గల సోదరభావంతో ధర్మరాజు అతడి భార్యలనూ, పరిచారికలనూ పిలిపించి సముచితంగా గౌరవించి, బహుదక్షిణలతో పుణ్యదానాలు చేసి, విధి విధానంగా అపరకర్మలు చేశాడు. తరువాత బంధుజనులతో కలిసి గంగానదిని దాటి వెళ్ళాడు.

జి.వి. సుబ్రహ్మణ్యం

ప్రధాన సంపాదకుడు

శ్రీమదాంధ్ర మహాభారతము

శల్యపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

ద్వితీయాశ్వాసము

శ్రీమదాంధ్ర మహాభారతము

సౌప్తికపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

ద్వితీయాశ్వాసము

శ్రీమదాంధ్ర మహాభారతము

స్త్రీపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

ద్వితీయాశ్వాసము

శ్రీమదాంధ్ర మహాభారతము

శల్య, సౌప్తిక, స్త్రీ పర్వములు

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శల్యపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీ గిరిజాసమవాయమ । హాగురు తరశుభగ సంపదాలంబ! సదా
యోగిజన క్షేమ సమీ । హాగర్భిత దివ్యచిత్త! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= లక్ష్మితో; గిరిజా= పార్వతితో; సమవాయ= విడదీయరాని సంబంధం కలిగిన; మహా= మిక్కిలి; గురుతర= గొప్పది అయిన అనగా వర్ణింపశక్యం కాని అనంతమైన; శుభగ= మంగళకరాలగు; సంపద్= ఐశ్వర్యములకు; ఆలంబ= ఆధారమయినవాడా!; సదా= ఎల్లప్పుడు; యోగిజన= బ్రహ్మజ్ఞానులగు మహర్షులయొక్క; క్షేమ= సంరక్షణయందలి; సమీహా= తీవ్రమయిన కోరికతో అనగా ఇచ్ఛాశక్తితో; గర్భిత= నిండిన; దివ్యచిత్త!= ఉత్తమగుణాలు గల హృదయం కలవాడా!; (దయ, కరుణ, ప్రేమ మొదలగు గుణములు; దివ్యములు- అట్టి గుణాలతో నిండిన చిత్తం దివ్యచిత్తం); హరి= విష్ణువు; హర= శివుడు- అనే భేదం లేని అనగా హరిహర అభేదరూపం కలిగిన - పరబ్రహ్మ స్వరూపా! హరిహరనాథా!= (సంబోధనం.)

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నీవు లక్ష్మీపార్వతులతోడి విడదీయరాని సంబంధం కలవాడవై (అనగా హరికి లక్ష్మితోను, హరునకు పార్వతితోను విడదీయరాని సంబంధం కలవాడవు), సకల కల్యాణ ప్రదాలైన మహైశ్వర్యాలకు ఆశ్రయుడవు. నీవు ఎల్లప్పుడు బ్రహ్మజ్ఞానులైన యోగిజనుల సంరక్షణనే అపేక్షిస్తావు.

విశేషం: సమవాయము - ఇది తర్కశాస్త్ర పదం. మధువు నుండి మాధుర్యం విడదీయరానిది. అట్లే అగ్నికి ఉష్ణమునకు, వాయువునకు స్పర్శమునకు విడదీయరాని సంబంధం. ఇదియే సమవాయము. ఇందు శ్రీగిరిజలకు సమవాయము. హరిహరులకు సమవాయము. శ్రీహరులకు గిరిజాహరులకు సమవాయము. ఇది హరిహరాద్వైతమును ప్రతిపాదించటంలో తిక్కయజ్వహృదయం.

క. దేవా! జనమేజయ ధా । త్రీవల్లభుఁ డుత్సుకత్వరేఖాసౌమ్య
శ్రీవిలసితుఁడై యిట్లనుఁ । దా వైశంపాయనున కుదాత్త వినీతిన్. 2

ప్రతిపదార్థం: దేవా= హరిహరనాథా!; జనమేజయ= జనమేజయుడను; ధాత్రీ= భూమికి; వల్లభుఁడు= భర్తఅయినవాడు అనగా జనమేజయమహారాజు; ఉత్సుకత్వ= కుతూహలం అను; రేఖా= కాంతివలన; సౌమ్య= ప్రశాంత; శ్రీ= సౌందర్యముతో; విలసితుఁడై= ప్రకాశించుచున్నవాడగుచు; ఉదాత్త= ఉన్నతమైన; వినీతిన్= వినయముతో; తాన్= తనంతతానుగా; వైశంపాయనునకున్= వైశంపాయన మహర్షితో; ఇట్లు= ఈ ముందు చెప్పబోవు విధంగా; అనున్= అన్నాడు.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! జనమేజయ మహారాజు మిక్కిలి కుతూహలం కలవాడై వినయంతో వైశంపాయన మహర్షితో ఇట్లా అన్నాడు.

విశేషం: సామాన్యంగా పురాణకథలు అన్నీ ఉగ్రశ్రవసుడు అనే సూతుడు శౌనకాది మహర్షులకు సత్రయాగమున చెప్పుతున్నట్లు సాగుతాయి. మహాభారత రచనలో ఆదికవి నన్నయ ఆ మార్గాన్నే అవలంబించారు. కాని తిక్కయజ్వ స్వతంత్రించి 'ఏను

విన్నపంబు సేయు తెఱంగుగా అంతస్సన్నిధిం గలిగించుకొని అమ్మహాకావ్యంబు నర్థంబు సంగతంబు సేసెద' అని తానుగా హరిహరనాథునకు మహాభారత కథను విన్నవిస్తున్నట్లు పదిహేను పర్వములను రచించాడు. కావ్యాన్ని కూడా హరిహరనాథుడికే అంకితమొనర్చి హరిహర అద్వైతమును అవలంబించాడు. ఇది తిక్కయజ్వ విశిష్టత.

జనమేజయుడు పరీక్షిత్తు కుమారుడు. వైశంపాయనుడు వ్యాసభగవానుడి శిష్యుడు. పైల, సుమంత, వైశంపాయన జైమినులు నల్వురు వ్యాసభగవానుడి శిష్యులు. చతుర్వేదాలను, అష్టాదశ పురాణాలను ముల్లోకాలకు వ్యాప్తి చెందించిన మహర్షులు.

క. దురమున నమ్మెయిఁ గర్ణుఁడు । పరిమార్పంబడిన నల్పపరిజనుఁడై య
క్కురుపతి యజయ్యులగున । య్యరులయెడం బిదప నెట్టులయ్యెఁ? మునీంద్రా! 3

ప్రతిపదార్థం: మునీంద్రా!= వైశంపాయన మహామునీ!; పిదపన్= అటు తరువాత; దురమునన్= యుద్ధంలో; ఆ+మెయిన్= ఆ విధంగా-కర్ణుఁడు= సైన్యాధ్యక్షుడైన కర్ణుడు; పరిమార్పంబడినన్= చంపబడగా; ఆ కురుపతి= కౌరవనాథుడైన దుర్యోధనుడు; అల్ప= తక్కువ; పరిజనుఁడై= సేవకులు కలవాడై - అనగా స్వల్పసైన్యము కలవాడై; అజయ్యులగు= జయింపశక్యముకాని; అ+అరులఎడన్= ఆ శత్రువులైన పాండవులతో; ఎట్టులు= ఏ విధంగా; అయ్యెన్?= (యుద్ధం) జరిగినది?

తాత్పర్యం: ఓ వైశంపాయన మహామునీ! (ఆ పదియేడవ రోజు) యుద్ధంలో కౌరవసైన్యాధ్యక్షుడైన కర్ణుడు ఆ విధంగా చంపబడగా, స్వల్పసైన్యం గల దుర్యోధనుడు అజేయులైన పాండవులతో ఏ విధంగా యుద్ధం చేశాడు?

తే. ఏను మును విన్న యక్కౌరవేంద్రపాండు । విభు తనూజుల చరితంబు వేడ్కఁ బెంచెఁ
జెవుల తియ్యంబు దళుకొత్తఁ జెప్పు మనఘ! వారిదైన యనంతర వర్తనంబు. 4

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; వైశంపాయన మహామునీ; ఏను= నేను; మును= ఇంతకుముందు; విన్న= వినినటువంటి; ఆ కౌరవేంద్ర= ఆ కురుపతి అయిన దుర్యోధనుడియొక్క; పాండువిభు= పాండురాజుయొక్క; తనూజుల= కుమారులయిన పాండవులయొక్క; చరితంబు= చరిత్ర; వేడ్కన్= నాలో కుతూహలమును; పెంచెన్= పెంపొందించెను; ఎక్కువచేసెను; వారిదైన= ఆ కౌరవపాండవులయొక్క; అనంతర వర్తనంబు= అటుతరువాత ప్రవర్తనం; చెవుల తియ్యంబు= చెవులకు ఇంపు; తళుకొత్తన్= మిక్కిలి ప్రకాశింపగా; చెప్పుము= వినిపించుము.

తాత్పర్యం: పవిత్రుడైన ఓ వైశంపాయన మహామునీ! నేను మీ వలన ఇంతవరకు వినిన కౌరవపాండవుల చరిత్రం ఇంకనూ వినాలని మిక్కిలి కుతూహలం రేకెత్తెతున్నది. అందువలన వారి అనంతర చరిత్రను చెవుల కింపుగా వినిపించుము.

వ. అని యడిగిన వైశంపాయనుం డమ్మహీనాయకున కి ట్లనియె నట్లు కర్ణుండు దెగిన దుర్యోధనుండు హతావశిష్ట వసుధావరులు పరివేష్టింపఁ గొంచెపు మూఁకలతోడ విడిదలకుం జని సుహృజ్జనంబులు దేర్ప విషాదం బుడిచి సముత్సాహదోహలియై శల్యునిం దనకు సేనాపతిఁ గావించి వేగుటయు బలువుఁబొలుపును వెలయఁ బొలికలనికి నడచెఁ బాండవేయులును బలంబుతోడం బన్నియేతెంచిన నయ్యిరువాఁగునకు సురాసురసమరంబునుం బోని సంగ్రామం బయ్యె నంత మధ్యాహ్నంబున నమ్మద్రపతి యుధిష్ఠిరు పరాక్రమంబునం దెగియెఁ బదంపడి తనభటులుం జెలులుఁ జుట్టంబులును సమసిన నుక్కుదక్కి

యక్కురువిభుం డనిపని సాలించి వెఱం బొందెడుడెందంబుతో నొక్కరుండునుం దొలంగం బాఱి యొక్క మడువుసొచ్చి దాఁగి యుండె నట గెలుపునుబ్బునం బొంపిరివోవు పాండవేయు లతం డందునికి యెఱింగి యయ్యెడకు నరిగి నలిరేఁగి చుట్టుముట్టి పిలిచిన వెడలి వడముడి తోడిపెనంకువం బెద్దయుంబ్రొద్దు పెనంగి యాభూనాథుండును బ్రొద్దు సాల వాలినప్పుడు భీముగదాఘాతంబునఁ దొడలు విఱిగి పడియె నంత నిశాసమయంబున నశ్వత్థామ కృపకృతవర్మలు దనకుం దోడుగా ధర్మనందనస్కంధావారంబుఁ బొదివి పాంచాల ప్రభద్రక మాత్స్య ప్రభృతి శేషసైన్యంబుల సమయించె మఱునాఁడు సంజయుండు కురుక్షేత్రంబున నుండి పూర్వాహ్ణంబునఁ గరినగరంబున కరుగుదెంచి. **5**

ప్రతిపదార్థం: అని= ఈ విధముగా; అడిగిన= జనమేజయుడు అడుగగా; వైశంపాయనుండు= వైశంపాయన మహర్షి; ఆ మహీ= ఆ భూమికి; నాయకునకున్= మహారాజైన జనమేజయునకు; ఇట్లు= ఈ విధముగా; అనియెన్= చెప్పెను; అట్లు= ఆ విధముగ; కర్ణుండు; తెగినన్= యుద్ధమునందు చావగా; దుర్యోధనుండు; హత= చంపబడగా; అవశిష్ట= మిగిలిన; వసుధావరులు= రాజులు; పరివేష్టింపన్= చుట్టుముట్టగా; కొంచెపు= కొద్దిపాటి; మూఁకలతోడన్= సైనికులతో; విడిదలకున్= విడిదిచేయుచోటునకు; చని= వెడలి; సుహృజ్జనంబులు= స్నేహితులు; తేర్పన్= ఓదార్చగా; విషాదంబు= దుఃఖమును; ఉడిచి= పోగొట్టుకొని; సముత్సాహ= మిక్కిలి ఉత్సాహమువలన; దోహలియై= ప్రేరేపింపబడినవాడై; శల్యునిన్; తనకున్= తన పక్షమునకు; సేనాపతిన్= సైన్యాధ్యక్షునిగా; కావించి= చేసి; వేగుటయున్= తెల్లవారుటయు; బలుపు= బలమును; పొలుపును= ఒప్పును; వెలయన్= ప్రకాశింపగా; పొలికలనికిన్= యుద్ధభూమికి; నడచెన్= వెడలెను; పాండవేయులును= పాండురాజుకుమారులైన ధర్మరాజు మొదలగువారు కూడ; బలంబుతోడన్= తమ సైనికబలముతో; పన్ని= వ్యూహరచన చేసి యుద్ధమునకు సిద్ధపడి; ఏతెంచినన్= రాగా; అయిరువాఁగునకున్= రెండుపక్షముల సైన్యమునకు; సుర= దేవతలయొక్క; అసుర= రాక్షసులయొక్క; సమరంబునున్= యుద్ధమును; పోని= పోలిన; సంగ్రామంబు= యుద్ధము; అయ్యెన్; అంతన్= అప్పుడు; మధ్యాహ్నంబునన్; ఆ+మద్రపతి= అట్టి శల్యుడు; యుధిష్ఠిరు పరాక్రమంబునన్= ధర్మరాజుయొక్క శౌర్యమువలన; తెగియెన్= చనిపోయెను; పదంపడి= మరియు ఆ వెనువెంటనే; తన= తనయొక్క; భటులున్= సైనికులును; చెలులున్= స్నేహితులును; చుట్టంబులును= బంధువులును; సమసినన్= చనిపోగా; ఉక్కు= బలము; తక్కి= కోల్పోయి; ఆ+కురువిభుండు= ఆ దుర్యోధనుడు; అనిపని= యుద్ధం చేయటం; చాలించి= మానివేసి; వెఱన్= భయమును; పొందెడు= పొందినటువంటి; డెందంబుతోన్= హృదయముతో; ఒక్కరుండునున్= ఒక్కడును; తొలంగంబాఱి= తొలగిపోయి (అనగా యుద్ధభూమినుండి వెడలిపోయి); ఒక్క= ఒక; మడువు= లోతైన కొలను; చొచ్చి= ప్రవేశించి; దాఁగి= మరుగుపడి; ఉండెన్; అట= అక్కడ; గెలుపు+ఉబ్బునన్= విజయంయొక్క ఉత్సాహంవలన - అనగా విజయోత్సాహంవలన; పొంపిరివోవు= విజృంభించిన; పాండవేయులు; అతండు= ఆ దుర్యోధనుడు; అందున్= ఆ మడువునందు; ఉనికి= ఉండుట; ఎఱింగి= తెలిసికొని; ఆ+ఎడకున్= ఆ స్థానమునకు; అరిగి= వెడలి; నలిరేఁగి= మిక్కిలిరెచ్చిపోయి - అనగా మిక్కిలి ఉద్రేకం పొంది; చుట్టుముట్టి= ఆ మడువు చుట్టునుమూగి; పిలిచినన్= పిలువగా; వెడలి= బయటకువచ్చి; వడముడితోడి= భీముడితోడి; పెనంకువన్= యుద్ధమున; పెద్దయున్= ఎక్కువ; ప్రొద్దు= కాలం - అనగా ఎక్కువసేపు; పెనంగి= యుద్ధముచేసి; ఆ భూనాథుండును= భూమికి భర్త అయిన ఆ దుర్యోధనుడు; ప్రొద్దు= సూర్యుడు; చాలన్= ఎక్కువగా; వాలినప్పుడు= క్రుంకిన సమయమున; భీము= భీముడియొక్క; గదా= గద అను ఆయుధముయొక్క; ఘాతంబునన్= దెబ్బవలన; తొడలు, విఱిగి= ముక్కలుగా విరిగి; పడియెన్= క్రిందపడిపోయెను; అంతన్= అటు తరువాత; నిశాసమయంబునన్= రాత్రి సమయమునందు; అశ్వత్థామ= ద్రోణుడి కుమారుడైన అశ్వత్థామ; కృప= ద్రోణుని బావమరది అయిన కృపుడును; కృతవర్మ= భోజదేశమునకు అధిపతి అయిన కృతవర్మయు; తనకున్; తోడుగాన్= తోడురాగా; సహాయము రాగా; ధర్మనందన= ధర్మరాజుయొక్క; స్కంధావారంబున్= సైనిక శిబిరంబును; పొదివి= క్రమ్ముకొని; పాంచాల= పాంచాలదేశముయొక్క; ప్రభద్రక= ప్రభద్రకులను క్షత్రియదళము; మాత్స్య= మత్స్య దేశ

క్షత్రియదళము; ప్రభృతి= ఈ మొదలగు; శేష= మిగిలిన; సైన్యంబులన్= సేనలను; సమయించెన్= సంహరించెను; మఱునాఁడు= మరుసటి దినమున; సంజయుండు; కురుక్షేత్రంబుననుండి= కురుక్షేత్రయుద్ధభూమినుండి; పూర్వాహ్ణంబునన్= మధ్యాహ్నానికి ముందు కాలాన; కరినగరంబునకున్= హస్తినాపురమునకు; అరుగుదెంచి= వచ్చి.

తాత్పర్యం: జనమేజయమహారాజు పాండవులు అటుపిమ్మట ఏమి చేశారని అడుగగా వైశంపాయన మహాముని ఈ విధంగా చెప్పాడు; కర్ణుడు చనిపోయిన తరువాత యుద్ధంలో చనిపోగా మిగిలిన రాజశ్రేష్ఠులు తన చుట్టును చేరి ఉండగా కొంచెం సైన్యాన్ని వెంటనిడికొని దుర్యోధనుడు విడిదికి వెళ్ళాడు. అక్కడ స్నేహితులు దుఃఖితుడైన అతడిని ఓదార్చగా దుఃఖాన్ని విడిచి, మరల సమరోత్సాహాన్ని సంతరించుకొని మద్రపతి అయిన శల్యుడిని తనకు సేనాపతిగా చేసికొని తెల్లవారిన వెంటనే సైనికబలమును సమకూర్చుకొని మరల యుద్ధభూమికి వెళ్ళాడు. పాండవులు కూడా తమ సైనికబలంతో వ్యూహరచన కావించుకొని యుద్ధానికి సిద్ధమై రాగా, ఆ ఇరుపక్షాలవారికి దేవరాక్షసుల యుద్ధమును పోలిన యుద్ధం జరిగింది. అంతట మధ్యాహ్నసమయాన ధర్మరాజు మహాపరాక్రమంతో కౌరవసైన్యాధిపతి అయిన శల్యుడిని చంపివేశాడు. అటు తరువాత వెనువెంటనే దుర్యోధనుడి సైనికులు, స్నేహితులు, చుట్టములు, ఆ యుద్ధంలో చనిపోగా సమస్తబలాన్నీ కోల్పోయి దుర్యోధనుడు సమరం చాలించి, భయంతో ఒంటరిగా ఆ యుద్ధభూమినుండి తొలగిపోయి, ఒక లోతైన జలాశయంలో దిగి దాగి ఉన్నాడు. ఇక అక్కడ విజయోత్సాహంతో విజృంభించిన పాండవులు దుర్యోధనుడు మడుగులో దాగి ఉండటాన్ని గమనించి, అక్కడకు వెడలి, ఆ మడువును చుట్టుముట్టి, మహోద్రేకంతో దుర్యోధనుడిని పిలువగా అతడు ఆ మడువునుండి పైకి వచ్చి భీముడితో చాలాసేపు యుద్ధం చేశాడు. అంతట సూర్యాస్తమయ సమయంలో భీముడి గదాఘాతమున తొడలు విరిగి దుర్యోధనుడు నేలకు ఒరిగాడు. అనంతరం రాత్రి సమయంలో కృపకృతవర్మలు తోడు రాగా అశ్వత్థామ ధర్మరాజుయొక్క సైనిక శిబిరంలోనికి ప్రవేశించి, యుద్ధంలో పాండవపక్షాన మిగిలిన పాంచాల ప్రభద్రక మాత్స్య సైనికులను సంహరించాడు. ఆ మరునాటి మధ్యాహ్నానికి ముందుగా సంజయుడు కురుక్షేత్రం నుండి హస్తినాపురానికి వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. **పొరిఁ బొరి మోము బాష్పజలపూరము గ్రమ్మఁగ నూర్ధ్వబాహుఁడై**
చరణయుగంబు దొట్రువడ సంభృతశోకత రాజవీథి నె
వ్వరిఁ గనినైన హా మహితవైభవ హా ధృతరాష్ట్రపుత్ర! హా
కరిపురనాథ! యం చెలుఁగు గద్గదికం దగులంగ నేడ్చుచున్ ॥ **6**

ప్రతిపదార్థం: పొరిన్+పొరిన్= మాటిమాటికి; మోమున్= ముఖమును; బాష్పజల పురము= కన్నీటి వెల్లువ; క్రమ్మఁగన్= ఆవరించగా; ఊర్ధ్వబాహుఁడు+ఐ= పైకి ఎత్తబడిన చేతులు కలవాడై; చరణయుగంబు= రెండు కాళ్ళు; తొట్రుపడన్= తొందరపాటు వలన తడబడగా; సంభృత= మిక్కిలియైన; శోకతన్= దుఃఖముతో; రాజవీథిన్= రాజమార్గమున; ఎవ్వరిన్= ఏ ఒక్కరిని; కని+ఐనన్= చూచినను; హా!= అయ్యో!; మహిత వైభవ= గొప్ప సంపద గల; ధృతరాష్ట్ర= ధృతరాష్ట్రునియొక్క; పుత్ర!= కుమారా!; హా!= అయ్యో!; కరిపుర= హస్తినాపురమునకు; నాథ!= ప్రభువు అయినవాడా!; అంచున్= అనుచు; ఎలుఁగు= కంఠధ్వని; గద్గదికన్= గాద్గద్యమును - డగ్గుత్తికను; తగులంగన్= పొందగా; ఏడ్చుచున్= దుఃఖిస్తూ.

తాత్పర్యం: ఆ సంజయుడు కురుక్షేత్రంనుండి హస్తినాపురానికి వచ్చి, మాటిమాటికి ముఖం కన్నీటితో నిండిపోగా, చేతులు పైకెత్తి, కాళ్ళు తొట్రుపాటు పడుతుండగా దుఃఖ భారంతో, హస్తినాపుర రాజమార్గంలో ఎవరు కనిపించినా

'హా మహితవైభవా! హా ధృతరాష్ట్రపుత్రా! హా కరిపురనాథా!' అంటూ గద్గదస్వరంతో ఎలుగెత్తి ఏడుస్తూ, (తరువాతి పద్యంతో అన్వయం.)

క. జననయన చకోరానం । దనుఁడగు నృపచంద్రుఁ డనుచితంబయిన విధం
బున నస్తమించె నంచుం । దనుడోలన భరితభూరిదైన్యుం డగుచున్. 7

ప్రతిపదార్థం: జన= ప్రజలయొక్క; నయన= నేత్రములనెడి; చకోర= చకోరపక్షులకు; ఆనందనుఁడు= సంతోషమును కలిగించువాడు; అగు= అయినటువంటి; నృప= రాజు అనెడి; చంద్రుఁడు= చందమామ; అనుచితంబు+అయిన= ఉచితం కాని; విధంబునన్= ప్రకారంగా; అస్తమించెన్= మరణించెను; అంచున్= అనుచు; తను= శరీరంయొక్క; డోలన= ఊగుటచేత; భరిత= నిండిన; భూరి= అధికమైన; దైన్యుండు= దీనత్వం కలవాడు; అగుచున్= ఔతూ.

తాత్పర్యం: చంద్రుడు చకోర పక్షులకు ఆనందాన్ని చేకూర్చేటట్లు ప్రజలనేత్రాలకు ఆనందాన్ని చేకూరుస్తున్న రాజచంద్రు డయిన దుర్యోధనుడు అనుచితంగా మరణించాడు - అంటూ మిక్కిలి దుఃఖభారంతో సంజయుడు దీనుడై (ధృతరాష్ట్ర మందిరాన్ని ప్రవేశించాడు).

విశేషం: 'జన నయన చకోరానందనుఁ డగు నృపచంద్రుఁడు అస్తమించె' - ఇది చక్కని రూపకాలంకారం.

వ. చని ధృతరాష్ట్ర మందిరంబు ప్రవేశించి లోపలికొలువున గాంధారియుం గోడండ్రును విదురుండును మఱియును దగు చుట్టంబులునుం బరివేష్టింపఁ గర్ణులేమికిఁ బ్రేముడించు పలుకులు సెల్ల నుల్లంబు దురపిల్లనున్న యన్నర నాథుం గని డగ్గుత్తికవెట్టుచుఁ దనపేరు సెప్పికొని చేరి పాదప్రణామం బాచరించి యేడ్పు బెరయు నెలుంగుతో నిట్లనియె. 8

ప్రతిపదార్థం: చని= వచ్చి; ధృతరాష్ట్ర= ధృతరాష్ట్రునియొక్క; మందిరంబు= భవనములోనికి; ప్రవేశించి= చొచ్చి; లోపలికొలువునన్= లోపల ఉన్న సభాస్థానమునందు - అనగా ఆంతరంగిక సభామండపమునందు; గాంధారియున్= గాంధారియు; కోడండ్రును= కోడళ్ళును; విదురుఁడును; మఱియును= ఇంకను; తగుచుట్టంబులునున్= దగ్గరిబంధువులును; పరివేష్టింపన్= చుట్టును మూగి ఉండగా; కర్ణులేమికిన్= కర్ణునియొక్క మరణమునకు; ప్రేముడించు= దుఃఖపూరితములు అయిన; పలుకులు= మాటలు; చెల్లన్= కొనసాగగా; ఉల్లంబు= హృదయము; దురపిల్లన్= తపించుచుండగా; ఉన్న= ఉన్నటువంటి; ఆ నరనాథున్= ఆ ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళి; పాద= పాదములకు; ప్రణామంబు= నమస్కారం; ఆచరించి= చేసి; ఏడ్పు= దుఃఖము; బెరయు= వ్యాపించు; ఎలుంగుతోన్= పెద్దకంఠధ్వనితో - అనగా బోరుబోరున ఏడుస్తూ; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: సంజయుడు వచ్చి ధృతరాష్ట్రుడి మందిరం లోనికి ప్రవేశించాడు. ఆ మందిరంలోపల ఉన్న అంతరంగిక సభామండపంలో, గాంధారియు, కోడళ్ళును, విదురుడును, దగ్గరిచుట్టాలు ఆ ధృతరాష్ట్రుడి చుట్టూ మూగి ఉన్నారు. అప్పుడు ధృతరాష్ట్రుడు కర్ణుడి మరణానికి దుఃఖిస్తూ సంతాపంతో నిండిన హృదయంతో తపిస్తుండగా, ఆ ధృతరాష్ట్రుడిని చూచి, గద్గదస్వరంతో తనపేరు చెప్పుకొని, దగ్గరకు పోయి, పాదాలకు నమస్కరించి సంజయుడు బోరుబోరున ఎలుగెత్తి ఏడుస్తూ, ఈ విధంగా చెప్పాడు.

సీ. **'జననాథ! శల్యుండు సమసె సౌబలుఁడు గీ । టడఁగె నులూకుండు మడిసె సకల**
సంశప్తకులుఁ గడచనిరి కాంభోజశ । తానీకములు దెగటాఱె యవన
పార్వతీయమ్లేచ్ఛబలములు ద్రుంగె నల్ । దిక్కులమన్నీలుఁ దక్కఁగలుగు
నరనాయకులును జచ్చిరి కుమారులు గల । యందఱుఁ దెగిరి కర్ణాత్మజులును

తే. **బొలిసిరయ్య! వృకోదరు పలుకు దప్ప । కుండఁ దద్గదాదండప్రచండనిహతి**
రెండు దొడలును విఱిగి ధరిత్రిఁ బెలుచఁ । గూలి రూపఱి రారాజు ధూళి బ్రుంగె. **9**

ప్రతిపదార్థం: జననాథ!= ధృతరాష్ట్ర మహారాజా! శల్యుండు= మద్రపతి అయిన శల్యుడు; సమసెను= చనిపోయెను; సౌబలుఁడు= గాంధార రాజు శకుని; గీటడఁగెన్= చచ్చెను; ఉలూకుండు= శకుని పుత్రుడు అయిన ఉలూకుడు; మడిసెన్= మరణించెను; సకల= సమస్తమైన; సంశప్తకులు= త్రిగర్తాధీశ్వరులగు సుశర్మ, సత్యరథుడు, సత్యసేనుడు, సత్యకర్ముడు, మొదలగు వారు; కడచనిరి= చచ్చిరి; కాంభోజ= కాంభోజరాజు సుదక్షిణుడు - అతడిసేనలు; శతానీకములు; తెగటాఱెన్= చచ్చిపోయాయి; యవన= యవనదేశాధీశులయొక్క; పార్వతీయ= పార్వతీయుడను రాజుయొక్క (ఇతడు కుక్షి అను దానవుడి అంశవలన జన్మించాడు.); మ్లేచ్ఛ= మ్లేచ్ఛ దేశాధీశులయొక్క; బలములు= సేనలు; త్రుంగెన్= నేలకూలెను; నల్= నాలుగు; దిక్కుల= దిక్కులనుండి; వచ్చిన; మన్నీలున్= రాజశ్రేష్ఠులును; తక్క= మిగిలి; కలుగు= ఉన్న; నరనాయకులును= రాజులును; చచ్చిరి= మరణించారు; కుమారులు= రాజపుత్రులు; కల= ఇంకను ఉన్న; అందఱున్= అందరును; తెగిరి= చచ్చారు; కర్ణ= కర్ణునియొక్క; ఆత్మజులును= పుత్రులును; పొలిసిరి= చచ్చిరి; అయ్య!= ఓ పూజ్యుడా - ధృతరాష్ట్ర మహారాజా!; వృకోదరు= భీముని యొక్క (తోడేలు పొట్టవంటి పొట్టకలవాడు కావున భీముడికి వృకోదరుడని పేరు); పలుకు= మాట; తప్పకుండన్= అబద్ధం కాకుండగ; తద్= ఆ; గదాదండ= గదాయుధముయొక్క; ప్రచండ= తీవ్రమైన; నిహతిన్= దెబ్బవలన; రెండు+తొడలును= రెండు తొడలును; విఱిగి= ముక్కలై; ధరిత్రిన్= భూమిపై; పెలుచన్= దబ్బున; కూలి= పడిపోయి; రూపఱి= రూపము చెడి; రారాజు= దుర్యోధనుడు; ధూళిన్= దుమ్ములో; బ్రుంగెన్= పడ్డాడు.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజా! శల్యుడు, శకుని, శకుని కుమారుడు ఉలూకుడు, సమస్త సంశప్తకులు, కాంభోజరాజులు, శకులు, యవనులు, పార్వతీయులు, మ్లేచ్ఛులు, వారి బలాలు నలు దిక్కులనుండి వచ్చిన రాజులు, రాజపుత్రులు కర్ణుడి కుమారులు అందరూ యుద్ధంలో మరణించారు. ఇక భీముడి ప్రతిజ్ఞ ప్రకారం గదాఘాతం వలన రారాజు దుర్యోధనుడు రెండు తొడలు విరిగి నేలకూలి రూపం చెడి దుమ్ము కొట్టుకొని ఉన్నాడు.

విశేషం: ఈ సీసపద్యంలో తిక్కయజ్వ వాడిన పదమును వాడకుండా - తొమ్మిది శబ్దములను ప్రయోగించాడు. ఈ తొమ్మిది శబ్దములు 'చచ్చుట' అను ఒకే అర్థమును బోధిస్తున్నవి. 1.సమసె. 2.గీటఁడగె. 3.మడిసె. 4.కడచనిరి. 5.తెగటాఱె. 6.త్రుంగె;. 7.చచ్చిరి. 8.తెగిరి. 9.పొలిసిరి. ఒకే అర్థమును బోధించు అనేక శబ్దములను ఒకే పద్యమున ప్రయోగించటం 'శబ్దవైచిత్రి'. ఇక, ఇచ్చట బీభత్సకరుణ రసములు పోషింపబడుతున్నవి. ఈ శబ్దవైచిత్రి తిక్కయజ్వ రసాభ్యుచితబంధమునకు ప్రాణం.

వ. **మఱియు ధృష్టద్యుమ్నుండును శిఖండియు నుత్తమౌజుండును యుధామన్యుండును లోనుగాఁ గల పాంచాలురును జేదిమాత్స్య ప్రభద్రక ప్రభృతి బలంబులు లోనుగా నవశిష్టజనంబులును నీమనుమలైన ప్రతివింధ్యాది ద్రౌపదేయులును సకల రథసామజ ఘోటక సుభటసమేతంబుగా మృతిఁ బొందిరిట్లు కౌరవ శిబిరంబును బాండవస్కంధావారంబును విధి వశంబున వనితావశేషంబులయ్యె నిందుఁ గృపకృతవర్ములు**

నశ్వత్థామయుఁగా ముప్వురును నందుఁ బాండవు లేవురును గృష్ణసాత్యకులుగా నేడ్వురును భవత్సుతుండయిన యుయుత్సుండును శేషించి రివ్విధంబునఁ బదునొకండు నేడక్షౌహిణులు నఖిలక్షోణికి దుర్యోధను నధిపుఁ గావింపనుం జంపనుం బూను కాలంబగుటయు నాలంబున నిశ్శేషత్వంబు నొందె' నని చెప్పటయు నమ్మహీపతి మూర్ఛిల్లె. విదురుండును వివశుండై యొఱగె. గాంధారియుఁ గోడండ్రును జెయ్యేది పుడమింబడిరి; తక్కటిచుట్టంబులు మొగంబులు మొగుడం జిత్రరూపంబుచందం బైరి. సంజయప్రయత్నంబున నందఱుం గ్రమంబునం దేఱి రప్పుడు మేను వడంక న మ్మానవనాథుండు నలు దిక్కులకు మొగంబు ద్రిప్పి విదురునుద్దేశించి 'పుత్రహీనుండ ననాథుండ నగుట యెఱింగితిఁ దమ్ముండ! యిటమీఁద నీవ నాకు గతి యగు' మనుచు మగుడనిగుడు మూర్ఛాతిశయంబునం బరవశుండయిన నతండును నారీజనంబును శీతాంబుసేచనంబులను లలితవ్యజనవీజనంబులను గొండొకసేపునకు సేదదీర్చినం గూర్చుండి యక్కురువిభుండు గుంభనిక్షిప్త భుజంగంబు చందంబున నిశ్వాసంబు నిగుడ్చుచు నూరకున్నం గనుంగొని యక్కాంతాసముదయంబును సంజయుండును రోదనంబు సేసిరి, పదంపడి యవ్విచిత్రవీర్యనందనుండు. 10

ప్రతిపదార్థం: మఱియును= ఇంకను; ధృష్టద్యుమ్నుండును; శిఖండియున్; ఉత్తమౌజుండును= ఉత్తమౌజుడును - (ఇతడు పాంచాలదేశపు యోధుడు); యుధామన్యుండును= యుధామన్యుడును- (ఇతడు పాంచాలదేశపురాజకుమారుడు - ఉత్తమౌజుడును - యుధామన్యుడును యుద్ధమున అర్జునుని రథరక్షకులు); లోనుగాన్= మొదలుగా; కల= ఉన్న; పాంచాలురును= పాంచాలదేశమువారును; చేది= చేదిదేశముయొక్క; మాత్స్య= మత్స్యదేశముయొక్క; ప్రభద్రక= ప్రభద్రకులు; ప్రభృతి= మొదలగు; బలంబులు= సైన్యములు - (చేది దేశపు రాజు శిశుపాలుడు - అతడి పుత్రుడు ధృష్టకేతుడు. ఇతడు ఒక అక్షౌహిణి సేనతో పాండవపక్షముననుండి పోరాడాడు. కురుక్షేత్ర యుద్ధంలో - విరాటుడు ఒక అక్షౌహిణి సైన్యముతో పాండవ పక్షంనుండి యుద్ధం చేశాడు. ఇక ప్రభద్రకులు పాంచాలదేశపు క్షత్రియవీరులు); లోనుగాన్= మొదలుగా; అవశిష్ట= మిగిలిన; జనంబులును= సైనికులును; నీ మనుమలైన; ప్రతివింధ్య= ప్రతివింధ్యుడు; ఆది= మొదలగు; ద్రౌపదేయులును= ద్రౌపదీపుత్రులును- (ద్రౌపదికి పంచపాండవుల వలన జన్మించిన పుత్రులు అయిదుగురు. ఇందు మొదటివాడు ప్రతివింధ్యుడు. ధర్మరాజు వలన ప్రతివింధ్యుడు - భీముడి వలన సుతసోముడు - అర్జునుడి వలన శ్రుతకీర్తి - నకులుడి వలన శతానీకుడు- సహదేవుడి వలన శ్రుతకర్ముడు జన్మించారు); సకల= సమస్తమైన; రథ= రథములు; సామజ= ఏనుగులు; ఘోటక= గుర్రములు; సుభట= వీరసైనికులు; సమేతంబుగాన్= సహితముగ; మృతిన్= మరణమును; పొందిరి; ఇట్లు; కౌరవశిబిరంబును= దుర్యోధనాదులయొక్క విడిదిచేయు శిబిరము; పాండవ స్కంధావారంబును= పాండవులు విడిదిచేయు శిబిరమును; విధివశంబునన్= కాల ప్రభావమున; వనితా= స్త్రీలు మాత్రమే; అవశేషంబులు= మిగిలినవిగా; అయ్యెన్= అయినవి; ఇందున్= ఈ కౌరవపక్షమున; కృపకృతవర్ములున్= కృపుడు, కృతవర్మ; అశ్వత్థామయున్+కాన్= అశ్వత్థామతో కలిపి; ముప్వురునున్= ముగ్గురును; అందున్= ఆ పాండవపక్షమున; పాండవులు= ధర్మరాజాదులు; ఏవురును= అయిదుగురును; భవత్= నీయొక్క; సుతుండు= పుత్రుడు; అయిన= అయినటువంటి; యుయుత్సుండును= యుయుత్సుడనేవాడు; శేషించిరి= మిగిలిరి; ఈ విధంబునన్= ఈ ప్రకారముగ; పదునొకండు= పదకొండును; ఏడక్షౌహిణులును= ఏడు అక్షౌహిణులును; అఖిల= సమస్తమైన; క్షోణికిన్= భూమండలమునకు; దుర్యోధనున్= దుర్యోధనుడిని; అధిపున్= అధిపతిని; కావింపనున్= చేయుటకొరకు; చంపనున్= చంపుటకును; పూను= పూనిక వహించిన; కాలంబు= సమయము; అగుటయున్= వచ్చుటయు; ఆలంబునన్= యుద్ధంలో; నిశ్శేషత్వంబున్= ఒక్కడును మిగులని స్థితిని; ఒందెన్= పొందెను; అని= ఈ విధంగా; చెప్పుటయున్= చెప్పగా; ఆ మహీపతి= ఆ ధృతరాష్ట్రుడు; మూర్ఛిల్లెన్= మూర్ఛను పొందెను; విదురుండును= విదురుడు కూడ; వివశుండై= స్మృతి

కోల్పోయినవాడై; ఒఱగెన్= వాలిపోయెను; గాంధారియున్= గాంధారియు; కోడండ్రును= కోడళ్ళును; చెయ్వు= చేష్ట; ఏది= ఉడిగి; పుడమిన్= భూమిపై; పడిరి; తక్కటి చుట్టంబులు= మిగిలిన బంధువులు; మొగంబులు= ముఖములు; మొగుడన్= ముడుచుకొనిపోగా; చిత్రరూపంబు= చిత్రించిన బొమ్మల రూపము; చందంబు= మాదిరిగా; ఐరి= అయిపోయిరి; సంజయప్రయత్నంబునన్; అందఱున్= అందరు; క్రమంబునన్= ఒకరితరువాత ఒకరు క్రమముగా; తేఱిరి= తేరుకొనిరి; అనగా తెలివిని పొందిరి; అప్పుడు; మేను= శరీరము; వడంకన్= వణకుచుండగా; ఆ మానవనాథుండు= ఆ ధృతరాష్ట్రుడు; నలుదిక్కులకున్= నాలుగు వైపులకును; మొగంబు= ముఖము; త్రిప్పి= త్రిప్పిచూచి; విదురున్; ఉద్దేశించి; పుత్రహీనుండన్= పుత్రులు లేనివాడను; అనాథుండన్= దిక్కులేనివాడను; అగుట= అయితినని; ఎఱింగితిన్= తెలిసికొంటిని; తమ్ముండ!= తమ్ముడా!; ఇటమీఁదన్= ఇటుపైన; నీవ= నీవే; నాకున్; గతి; అగుము; అనుచున్; మగుడన్= మరల; నిగుడు= వ్యాపించు; మూర్ఛాతిశయంబునన్= మూర్ఛయొక్క విజృంభణమువలన; పరవశుండు= స్మృతిని కోల్పోయినవాడు; అయినన్= కాగా; అతండును= ఆ సంజయుడు; నారీజనంబును= స్త్రీజనమును; శీత= చల్లని; అంబు= నీళ్ళచేత; సేచనంబులను= తడుపుటవలనను; లలిత= మెత్తని; వ్యజన= తాటాకు విసనకర్రలతో; వీజనంబులను= విసరుటవలన; కొండొకసేపు= కొంతసేపటికి; సేద= బడలిక; తేర్చినన్= తీరునట్లు చేయగా; కూర్చుండి; ఆ+కురువిభుండు= ధృతరాష్ట్రుడు; కుంభ= కుండయందు; నిక్షిప్త= దాచబడిన; భుజంగంబు= త్రాచుపాము; చందంబునన్= విధముగా; నిశ్వాసంబు= నిట్టూర్పు; నిగుడ్చుచున్= వ్యాపింపజేస్తూ; ఊరకున్నన్= మౌనముగా ఉండగా; కనుంగొని; ఆ+కాంతా= ఆ స్త్రీలయొక్క; సముదయంబును= సమూహమును; సంజయుండును; రోదనంబుచేసిరి= బొబ్బలుపెట్టి ఏడ్చిరి; పదంపడి= ఆ వెనువెంటనే; ఆ= అట్టి; విచిత్రవీర్య= విచిత్రవీర్యునియొక్క; నందనుండు= పుత్రుడు అయిన ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ఉత్తమౌజుడు, యుధామన్యుడు మొదలైన పాంచాలురు, చేది, మాత్స్య, ప్రభద్రకాదుల సైన్యాలు, ఇంకను మిగిలిన బలాలు, నీ మనుమలు ద్రౌపది పుత్రులు, అయిన ప్రతివింధ్యాదులు, సకల రథగజ తురగ పదాతి దళములగు చతురంగబల సమేతంగా యుద్ధంలో మరణించారు. కౌరవ శిబిరంలోను, పాండవ శిబిరంలోను, స్త్రీలు మాత్రం మిగిలారు. కౌరవపక్షంలో కృప కృతవర్మ అశ్వత్థామలు ముగ్గురు మిగిలారు. పాండవ పక్షంలో, పాండవులు అయిదుగురు, కృష్ణుడు, సాత్యకి నీ కొడుకు యుయుత్సుడు మిగిలారు. ఈ సమస్తభూమండలానికి దుర్యోధనుడు అధిపతి కాగలడనే కారణంగా కాలవశాన ఈ కురుక్షేత్ర యుద్ధంలో, కౌరవపక్షంలో పదకొండు అక్షౌహిణులు, పాండవపక్షంలో, ఏడు అక్షౌహిణులు, మొత్తం పద్దెనిమిది అక్షౌహిణులయోధులు పోరాడి నిశ్శేషంగా మరణించారు- అని ఇట్లు సంజయుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు మూర్ఛపొందాడు. విదురుడు వివశుడయ్యాడు. గాంధారి, ఆమె కోడళ్ళు చేష్టలుడిగి నేలపై పడిపోయారు. మిగిలిన బంధువులందరూ చలనం లేని చిత్రములయ్యారు. అంతట సంజయుడి ప్రయత్నం వలన మరల వారందరూ తేరుకొన్నారు. అప్పుడు ధృతరాష్ట్రుడు నలువైపుల ముఖం త్రిప్పి విదురుడితో 'నేను పుత్రహీనుడను, దిక్కులేని వాడను అయిపోయాను. ఓ తమ్ముడా! ఇక మీద నీవే నాకు దిక్కు. అని చెప్పి మరల మూర్ఛపోయాడు. అప్పుడు సంజయుడు అచ్చట ఉన్న స్త్రీలు, ఆ ధృతరాష్ట్రుడిపై చల్లని నీళ్ళు చల్లి, విసనకర్రలతో విసరగా, కొంతసేపటికి బడలిక తగ్గగా లేచి కూర్చొని, కుండలో ఉంచిన నాగుపాము బుసలు కొట్టేటట్లు - ఆ ధృతరాష్ట్రుడు నిట్టూర్పులు నిగుడిస్తూ మౌనం వహించి ఉన్నాడు. అట్టి స్థితిలో ఉన్న ధృతరాష్ట్రుడిని చూచి, అచ్చట ఉన్న స్త్రీలు, సంజయుడు, భోరున ఏడ్చారు. ఆ వెనువెంటనే ధృతరాష్ట్రుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ. 'కుంభ నిక్షిప్త భుజంగంబు చందంబున నిశ్వాసంబు నిగుడ్చుచు' అను ఈ ఒక్క ఉపమానంతో తిక్కయజ్వ ధృతరాష్ట్రుడికి పాండవులయందు గల క్రోధాన్ని, పుత్రమరణంవలన కలిగిన శోకాన్ని, ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితిని చక్కగ చూపించి, ధృతరాష్ట్రుడి పాత్రను అపూర్వంగా చిత్రించాడు.

ఆ. అనఘ! వశము గాదు మనసు గోడండ్ర మీ । వదినెఁ జుట్టములను సదనములకుఁ
బుచ్చు మనియెఁ బలుకు లచ్చుపాటడఁచు గ । ద్గదిక దైన్య మెసఁగ విదురుతోడ. 11

ప్రతిపదార్థం: పలుకులు= మాటలు; అచ్చుపాటు= స్పష్టత; అడఁచున్= తగ్గించు; గద్గదిక= డగ్గుత్తిక; దైన్యము= దీనత వలన వచ్చిన దుఃఖమును; ఎసఁగన్= ఎక్కువచేయగా - అనగా అతిశయింపచేయగా; విదురుతోడన్= విదురుడితో; అనఘ!= పాపరహితుడా!; మనసు= మనస్సు అనగా ఆలోచనాశక్తి; వశము= అధీనము; కాదు; కోడండ్రన్= కోడళ్ళను; మీ వదినెన్= నీకు వదినె అయిన గాంధారిని; చుట్టములను= బంధువులను; సదనములకున్; వారి వారి ఇండ్లకు; పుచ్చుము= పంపుము; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: మాటలు తడబాటు వలన స్పష్టత కోల్పోతూ ఉండగా, దుఃఖాతిశయంవలన వణకుతున్న కంఠస్వరంతో ధృతరాష్ట్రుడు విదురుడితో 'నా మనసు నా అధీనంలో లేదు. నీవు మీ వదినె గాంధారిని, కోడండ్రను, బంధువులను వారి వారి ఇండ్లకు పంపు' మన్నాడు.

క. అనుటయు నాతం డందఱ । కును మెలపునఁ జెప్ప వగలఁ గుందుచు నల్ల
ల్లన తమనిలయంబులకును । జనిరి మఱియు నేడ్చుచుండె సంజయుఁ డలఁతన్. 12

ప్రతిపదార్థం: అనుటయున్= ధృతరాష్ట్రుడు విదురునితో ఇట్లు చెప్పగ; ఆతండు= ఆ విదురుడు; అందఱకును= అచ్చట ఉన్న స్త్రీలకందరకును; మెలపునన్= మెల్లగా-ఊరడింపుగా; చెప్పన్= చెప్పగా; వగలన్= భరింపరాని దుఃఖముతో; కుందుచున్= క్రుంగిపోవుచు; అల్లల్లన= మెల్లమెల్లగా; తమ నిలయంబులకును= వారి వారి ఇండ్లకు; చనిరి= వెడలిరి; మఱియును= ఇంకను; సంజయుఁడు; అలఁతన్= బాధతో; ఏడ్చుచుండెన్= దుఃఖిస్తూ ఉండినాడు.

తాత్పర్యం: తన మందిరంలో ఉన్న స్త్రీలను చుట్టాలను గాంధారిని వారి వారి ఇండ్లకు పంపుమని ధృతరాష్ట్రుడు విదురుడితో చెప్పగా విదురుడు వారందరికి ఓదార్పుగా మెల్లగా చెప్పగా వారందరు దుఃఖంతో క్రుంగిపోతూ మెల్లమెల్లగా వారి వారి ఇండ్లకు వెడలిపోయారు. అటు తరువాత కూడా సంజయుడు భరించరాని బాధతో ఏడుస్తూనే ఉండినాడు.

వ. అమ్మేదినీశ్వరుం డేది గతి? యని దుఃఖాతిశయంబునఁ జేతులు విదిర్చి యా సూతనందను దిక్కు మొగంబయి. 13

ప్రతిపదార్థం: ఆ+మేదినీశ్వరుండు= ప్రభువు అయిన ఆ ధృతరాష్ట్రుడు; దుఃఖాతిశయంబునన్= భరింపశక్యము కాని దుఃఖముతో; ఏది= ఏది; గతి?= మార్గము?; అని; చేతులు; విదిర్చి= విదిలించి; ఆ సూతనందను= ఆ సంజయుడి(యొక్క); దిక్కు= వైపు; మొగంబు= ముఖము; అయి= ఉంచినవాడై అనగా సంజయుడి వైపు చూచినవాడై.

తాత్పర్యం: అప్పుడు ధృతరాష్ట్రుడు భరించరాని దుఃఖంతో 'నాకిప్పు డేది గతి' అని చేతులు విదిలిస్తూ సంజయుడి వైపు తిరిగి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'చావరు నొవ్వరు పాండవు । లేవురు నని నీవు చెప్ప ని ప్పలుకులు దుః
ఖావేశకరములై చే । తోవృత్తి దహింపఁ జొచ్చె దుర్భరభంగిన్. 14

ప్రతిపదార్థం: పాండవులు= పాండురాజకుమారులైన ధర్మరాజాదులు; ఏవురున్= అయిదుగురు (ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు); చావరు= మరణించరు; నొవ్వరు= బాధపడరు; అని= ఈ ప్రకారంగా; నీవు; చెప్పన్= చెప్పుచుండగా; ఈ పలుకులు= ఈ మాటలు; దుర్భరభంగిన్= భరింపశక్యంకాని విధంగా; దుఃఖ= దుఃఖమును; ఆవేశకరములు+ఐ= ఆవేశింపచేసినవై - అనగా దుఃఖమును కల్పించినవై; చేతోవృత్తిన్= మనస్సుయొక్క వ్యాపారమును; దహింపన్= మండింప(లేక) తగులబెట్ట; చొచ్చెన్= చేసెను - అనగా బాధింపజేసెను.

తాత్పర్యం: 'పాండవులు అయిదుగురు మరణించలేదు. ఏ విధమయిన బాధనూ పొందలేదు' అని నీవు చెప్పిన మాటలు భరించరాని దుఃఖంతో నా గుండెను మండింపజేస్తున్నాయి.

క. తనయు లని నందఱుం బడి । రనఁగా విని పెక్కు పఱియలై పోవక యి
ట్లునికి యరయ వజ్రమయం । బని తలఁపఁగఁదగు మదీయ మగు హృదయంబున్. 15

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధమునందు; తనయులు= కుమారులు; అందఱున్= అందరును; పడిరి= చనిపోయిరి; అనఁగాన్= అని నీవు చెప్పగా; విని; పెక్కు; పఱియలు= బ్రద్దలు; ఐ= అయి; పోవక= పోకుండ; ఇట్లు= ఈ విధముగ; ఉనికి= ఉండుట; అరయన్= ఆలోచింపగ; మదీయము= నాకు సంబంధించినది; అగు= అయినటువంటి; హృదయంబున్= గుండెను; వజ్రమయంబు= వజ్రమువలె కాఠిన్యముతో కూడినదిగా; అని; తలఁపఁగన్= భావింపగ; తగున్= ఒప్పును.

తాత్పర్యం: నా కుమారులందరూ యుద్ధంలో మరణించారని నీవు చెప్పగా వినికూడా నా హృదయం బ్రద్దలు కాకుండా ఉన్నదంటే అది వజ్రమయమని చెప్పవచ్చును.

ఉ. కన్నులు చీకులై సుతనికాయము బాలవిహారలీలలుం
జెన్నగు ప్రాయమొంది విలసిల్లు తెఱంగును జూడఁ గాన కి
ట్లున్నను బంధుకోటి సమయోచితలాలనఁ బల్కుపల్కులన్
విన్నవి వీనులిప్డు గొఱవిం దముఁ జూఁడినయట్ల పొక్కెడిన్. 16

ప్రతిపదార్థం: సుత= కొడుకులయొక్క; నికాయము= సముదాయము; బాల= పసితనమునందు; విహార= వేడుకగా తిరుగుచు చేయు; లీలలున్= క్రీడలును అనగా ఆటపాటలును; చెన్ను= సుందరము; అగు= అయిన; ప్రాయము= వయసు అనగా యౌవనము; ఒంది= పొంది; విలసిల్లు= ప్రకాశించు; తెఱంగును= విధమును; కన్నులు; చీకులై= గ్రుడ్డివై; చూడన్+కానక= చూచే భాగ్యానికి నోచుకొనక; ఇట్లు= ఈ విధముగా; ఉన్నను= ఉన్నప్పటికీ; బంధుకోటి= చుట్టముల సముదాయము, అనగా చుట్టాలందరు; సమయ= కాలమునకు; ఉచిత= అనుకూలమయిన; లాలనన్= బుజ్జగింపుతో; పల్కు= పలికెడి; పల్కులన్= పలుకులను; విన్నవి= వినినటువంటి; వీనులు= చెవులు; ఇప్డు= ఇప్పుడు; కొఱవిన్= కొఱకచ్చుతో - అనగా కాలుతున్న కర్రతో, తమున్= తమను; (చెవులను) చూఁడిన= కాల్చిన; అట్ల= అట్లే; పొక్కెడిన్= బాధపడుతున్నాయి.

తాత్పర్యం: కన్నులు గ్రుడ్డివై ఉన్నందున కొడుకులు పసితనంలో ఆడిన ఆటలను, వయస్సు వచ్చిన తరువాత ప్రకాశించే యౌవన సౌందర్యాన్ని - చూడలేక పోయినా, బంధుకోటి సమయోచితంగా బుజ్జగించుతూ పలికే

పలుకులను విన్న ఈ చెవులు ఇప్పుడు కొరవితో తమను వాతపెట్టినట్లుగా బాధపడుతున్నాయి. (యుద్ధంలో తనయులందరు చనిపోయారని సంజయుడు చెప్పగా విన్న చెవులు - కొరవితో వాతపెట్టినట్లుగా బొబ్బలెక్కాయని భావం.)

వ. అని దుర్యోధను నుద్దేశించి. 17

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా సంజయుడితో చెప్పి; దుర్యోధనున్= దుర్యోధనుడిని; ఉద్దేశించి= గురించి.

తాత్పర్యం: ఈ విధముగా సంజయుడితో చెప్పి అటు తరువాత దుర్యోధనుడి గురించి. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ఇట రమ్ము నన్నుఁ గౌఁగిటఁ జేర్పు కొడుక! మీ । యమ్మ నూరార్ప రావయ్య వృద్ధు
లగు మమ్ము విడుచుట దగునె? యేగతిఁ బోవు । వారము సెప్పుము? కౌరవేంద్ర!
యంధత్వవికలుల నరయక యి ట్లుపే । క్షించితి నామీఁదఁ గృపయుఁ బ్రియము
నెక్కడ వోయె? భూమీశులు గొలువంగ । నుండుదీ వ ట్లొంటి నున్నవాఁడ ।

తే. వధికబల దుర్నివారుండవైన నీకుఁ । బాండుపుత్రుల చేత నప్పాటఁ జావు
వచ్చె నిచ్చలు భక్తిమై వచ్చి కొలిచి । గారవింప నింకెవ్వరు గలరు నాకు? 18

ప్రతిపదార్థం: కొడుక!= కుమారా దుర్యోధనా!; ఇట= ఇక్కడకు; రమ్ము= రావయ్యా!; నన్నున్= నన్ను; కౌఁగిటన్= కౌగిలింతలో; చేర్పు= చేర్పుము-అనగా కౌగిలించుకొనుము; మీయమ్మన్= మీ తల్లిని; ఊరార్పన్= ఊరడించుటకు- ఓదార్చుటకు; రావయ్య; వృద్ధులు= ముసలివారము; అగు= అయిన; మమ్మున్; విడుచుట= విడిచిపెట్టుట; తగునె?= ఒప్పునా?; ఏగతిన్= ఏ విధమయిన బ్రతుకు మార్గమున; పోవువారము= పోగలవారము; చెప్పుము= తెలుపుము; కౌరవేంద్ర!= దుర్యోధనా!; అంధత్వ= గ్రుడ్డితనముచే; వికలులన్= అంగవిహీనులమయిన మమ్ములను; అరయక= విచారింపక; ఇట్లు= ఈ ప్రకారముగ; ఉపేక్షించితి(వి)= అశ్రద్ధగ విడిచిపెట్టితివి; నామీఁదన్= నాయందు; కృపయున్= దయయును; ప్రియమున్= ప్రేమయును; ఎక్కడన్= ఎచ్చటకు; పోయెన్?; భూమీశులు= భూమికి ప్రభువులు అయిన మహారాజులు; కొలువంగన్= సేవించుచుండగ; ఉండుదు(వు)= ఉండెడివాడవు; ఈవ= అట్టినీవే; అట్లు= ఆ విధముగ; ఒంటిన్= ఒంటరిగ; ఉన్నవాఁడవు= ఉన్నావు (అనగా మడువు దగ్గర మరణించి ఒంటరిగా పడి ఉన్నావు); అధిక= మిక్కిలి ఎక్కువ అయిన; బల= బలముచే; దుర్నివారుండవు= నిరోధింపశక్యముకాని వాడవు; ఐన= అయినటువంటి; నీకున్= నీకు; పాండుపుత్రులచేతన్= పాండురాజు కుమారులచేత; ఆ+పాటన్= ఆ విధంగా; చావు; వచ్చెన్= సంభవించినది; నిచ్చలున్= ఎల్లప్పుడూ; భక్తిమైన్= భక్తితో; వచ్చి= ఏతెంచి; కొలిచి= సేవించి; గారవింపన్= ఆదరించుటకు; నాకున్; ఇంకన్= ఇటుపైని; ఎవ్వరు= ఎవరు; కలరు?= ఉన్నారు?

తాత్పర్యం: ఓ కుమారా! దుర్యోధనా! ఇటు వచ్చి నన్ను కౌగిలించుకోవయ్యా! మీ తల్లి గాంధారిని ఓదార్చవయ్యా! ముసలివార మయిన మమ్ములను విడిచిపోవటం తగునా? ఏ విధమయిన బ్రతుకు మార్గంలో మేము పోగలం? ఓ కౌరవేంద్రా! దుర్యోధనా! చెప్పుము. గ్రుడ్డితనంచేత అంగవిహీనుల మని కూడ విచారించక, ఇట్లా మమ్ములను అశ్రద్ధగా విడిచిపెట్టావు. నామీద గల దయ, ప్రేమ ఎక్కడికి పోయాయి? మహారాజులచేత సేవ లందుకొను నీ వేనా ఇట్లా ఒంటరివాడవై మడువు దగ్గర మరణించి పడి ఉన్నావు? అత్యధిక బలసంపన్నులకు కూడ నిరోధింప శక్యంకాని

నీకు పాండుపుత్రులచేత ఆ విధమయిన మరణం సంభవించిందా? ఇంక నాకు నిత్యం భక్తితో వచ్చి సేవచేసి ఆదరించేవారెవ్వరు ఉన్నారు?

విశేషం: ఈ సీసమున తిక్కన ధృతరాష్ట్రుడి దుఃఖాతిరేకాన్ని - అలతి అలతి పలుకులతో అత్యంత సుందరంగా, కరుణరస భావాలతో అభివర్ణించాడు. ఇది శోకవివశుడైన ధృతరాష్ట్రుడి భావరూప చిత్రణం.

వ. కయ్యంపుమాట పుట్టినయప్పుడు నీవు నాతోడ. 19

ప్రతిపదార్థం: కయ్యంపుమాట= యుద్ధమునకు సంబంధించిన ప్రసంగం; పుట్టిన+అప్పుడు= వచ్చినప్పుడు; నీవు; నాతోడ=నాతో.

తాత్పర్యం: యుద్ధవిషయం ప్రస్తావించేటప్పుడు నీవు నాతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

శా. 'చాపాచార్యుఁడు భీష్ముఁడుం గృపుఁడు నశ్వత్థామయుం గల్గ నా
కీ పాండుక్షితిపాలపుత్రులెదు రిం దెవ్వాఁడు దృప్యద్భుజా
వ్యాపారుం డనిఁ గర్ణుఁడొక్కరుఁడు మాయం జేయు మద్బాణవి
ద్యాపారీణత గెల్తు నొక్కఁడన యే నయ్యేవురన్ వ్రేల్మిడిన్. 20

ప్రతిపదార్థం: చాపాచార్యుఁడు= ద్రోణుడు, భీష్ముఁడున్= భీష్ముడును; కృపుఁడున్= కృపాచార్యుడును; అశ్వత్థామయున్= ద్రోణపుత్రుడు అశ్వత్థామయును; కల్గన్= ఉండగా; ఈ పాండుక్షితిపాల= ఈ పాండురాజుయొక్క; పుత్రులు= కుమారులు; ఇందున్= వీరిలో; ఏ+వాఁడు= ఎవడు అనగా ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు - ఇందులో ఎవడు; నాకున్; ఎదురు?= ఎదురు నిలువగలవాడు?; దృప్యత్= దర్పించుచున్న; భుజావ్యాపారుండు= యుద్ధము చేయువాడు; కర్ణుఁడు; ఒక్కరుఁడు= ఒక్కడే; అనిన్; యుద్ధమునందు; మాయన్= నాశము అగునట్లు; చేయున్; (అనగా కర్ణుడు ఒక్కడే పాండవులను నాశము చేయును); మద్బాణవిద్యాపారీణతన్= నాయొక్క అస్త్రప్రయోగవిద్యయందలి పరిపూర్ణమయిన నేర్పరితనమువలన; ఏను= నేను; ఒక్కఁడన= ఒక్కడనే; ఆ+ఏవురన్= ఆ అయిదుగురు పాండవులను; వ్రేల్మిడిన్= చిటికెలో; గెల్తున్= గెలువగలను.

తాత్పర్యం: 'భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ ఉండగా ఈ పాండురాజ పుత్రులయిన ధర్మరాజ భీమార్జున నకుల సహదేవులలో ఎవడు నాకు ఈ యుద్ధంలో ఎదురు నిలిచి పోరగలడు? (అనగా పాండవులలో ఒక్కడును నన్ను ఎదురించగలవాడు లేడు.) ఇక భుజదర్పంతో యుద్ధంలో విజృంభించే కర్ణుడు ఒక్కడే ఈ పాండవులను నాశనం చేయగలడు. మరియు నా అస్త్రప్రయోగ విద్యాపారీణతతో నే నొక్కడనే ఆ అయిదుగురు పాండవులను చిటికెలో గెలువగలను.

తే. మున్ను చెప్పినవారు గా కెన్నఁ గలరు । సుమ్ము! బాహ్లీక భగదత్త సోమదత్త
శకుని భూరిశ్రవశ్శలశల్యసింధు । రాజ విందానువిందాది రథికవరులు. 21

ప్రతిపదార్థం: మున్ను= ఇంతకుముందు; చెప్పినవారు= చెప్పబడినవారు (భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, కర్ణులు); కాక= కాకుండా; బాహ్లీక= బాహ్లీకుడు; (ఇతడు బాహ్లీక దేశపురాజు. క్రోధవశుడను దైత్యుని అంశవలన జన్మించినవాడు.) భగదత్త= భగదత్తుడు (ఇతడు ప్రాగ్జ్యోతిషపురాధిపతి. భాష్కలుడను అసురుని అంశవలన జన్మించినవాడు. వీనికి సుపర్వుడనుపేరు

కలదు.) సోమదత్త= సోమదత్తుడు (ఇతడు కురువంశ మహారాజు ప్రతీపుని పౌత్రుడు- బాహ్లికుని పుత్రుడు. మహాపరాక్రమవంతుడు. వీనికి బాహ్లిక - బాహ్లికాత్మజ- కౌరవేయ - కౌరవ్య - కురుపుంగవ - అనుపేర్లు ఉన్నాయి); శకుని= శకుని (ఇతడు గాంధారరాజు సుబలుని కుమారుడు, దుర్యోధనుని మేనమామ. దుష్టచతుష్టయములో ముఖ్యుడు. ద్వాపరుని అంశవలన జన్మించినవాడు. దేవతల శాపము వలన ధర్మవిరోధిగా మిగిలాడు.); భూరిశ్రవస్= భూరిశ్రవుడు; శల= శలుడు (భూరిశ్రవుడు, శలుడు వీరు సోమదత్తుని కుమారులు); శల్య= శల్యుడు (ఇతడు మద్రదేశాధిపతి. మాద్రికి అన్నగారు. నకులసహదేవులకు మేనమామ.); సింధురాజ= సింధుదేశాధీశుడైన సైంధవుడు (వీని అసలుపేరు జయద్రథుడు. దుర్యోధనుని సోదరి దుశ్శల భర్త. వృద్ధక్షత్రునికుమారుడు. వీనికి సైంధవుడు, సౌవీరుడు, సింధుపతి, సింధురాజు, సింధుసౌవీర భర్త - వృద్ధక్షత్రుని కుమారుడు కాబట్టి, వార్ధక్షత్రి - అని పేర్లు గలవు.); విందానువింద= విందుడు- అనువిందుడు (వీరు అవంతీ రాజకుమారులు - వీరిద్దరు చెరొక అక్షౌహిణీ సేనకు అధిపతులు - దుర్యోధనుడి సేనలో గల పదిమంది ప్రధాన అధినాయకులలో వీరు కూడ ముఖ్యులు; ఆది= ఈ మొదలగు; రథికవరులు= రథికశ్రేష్ఠులు; ఎన్న(న్)= లెక్కింప; కలరు= కలవారు; సుమ్ము= సుమా!

తాత్పర్యం: ఇంతకుముందు చెప్పిన వారు కాకుండా బాహ్లికుడు, భగదత్తుడు, సోమదత్తుడు, శకుని, భూరిశ్రవుడు, శలుడు, శల్యుడు, సైంధవుడు, విందుడు, అనువిందుడు మొదలైన రథికశ్రేష్ఠులు లెక్కింప పెక్కురు కలరు సుమా!

విశేషం: వీరు పదిమంది. దుర్యోధనుడి సేన పదునొకండక్షౌహిణులు. ఒక్కొక్క అక్షౌహిణికి ఒక్కొక్కరు అధినాయకులుగా పది అక్షౌహిణులకు ఈ పదిమంది అధినాయకులుగా వ్యవహరించారు. మిగిలిన అక్షౌహిణికి దుర్యోధనుడు అధినాయకుడు.

క. **ఏనును గర్ణుఁడు దమ్ములు । నా నలువురు వీరులైన నటు సూడు పృథా**
సూనుల నెట్ల జయించెద । నో నమ్ముము నా బలంబును గలితనంబున్.' **22**

ప్రతిపదార్థం: ఏనును= నేనును; కర్ణుఁడు= కర్ణుడు; తమ్ములున్= తమ్ములును; ఆ నలువురు= ఆ భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామలు నలుగురు; వీరులు= శూరులు; అయినన్= అయి ఉండగా; పృథాసూనులన్= కుంతియొక్క పుత్రులను; ఎట్ల= ఏ ప్రకారముగ; జయించెదనో= జయింపగలనో; అటుచూడు; నా బలంబును= నా శక్తిని; కలితనంబున్= సామర్థ్యమును; నమ్ముము.

తాత్పర్యం: నేనూ, కర్ణుడూ, తమ్ములూ; భీష్మద్రోణకృపాశ్వత్థామలు నలుగురూ; వీరులమైన మేమందరం కలిసి ఆ కౌంతేయులను ఎట్లా జయిస్తామో చూడుము. నా శక్తిసామర్థ్యాలను విశ్వసింపుము.'

క. **అని యూఱడిల్లఁ బలికిన । విని భవదీయానివార్య విక్రమమునఁ బాం**
డు నరేంద్రసుతులు దెగుదుర । యని తలఁచితి నీవె తెగితె యవ్వీరులచేన్? **23**

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారముగ; ఊఱడిల్లన్= ఓదార్పు పొందునట్లు; పలికినన్= పలుకగా; విని; భవదీయ= నీయొక్క; అనివార్య= నివారింపశక్యముకాని; విక్రమమునన్= పరాక్రమమువలన; పాండు నరేంద్ర= పాండురాజుయొక్క; సుతులు= కుమారులు; తెగుదురు+అ= తప్పకుండ నశిస్తారు; అని; తలఁచితిన్= భావించితిని; ఆవీరులచేన్= వీరులైన ఆ పాండవులచే; నీవె= నీవే; తెగితె?= చచ్చితివా?

తాత్పర్యం: నన్ను ఊరడించటానికి నీవు పలికిన పలుకులు విని నివారించ శక్యంకాని నీ పరాక్రమంతో పాండవులు చంపబడుతారని భావించాను. అట్లాకాక ఆ వీరులచేత నీవే చంపబడ్డావా?

విశేషం: ఈ పద్యంలో ధృతరాష్ట్రుడి అంతఃకరణం చక్కగా ఆవిష్కరించబడింది.

క. అమరనదీతనయుఁడు సిం । హము గాక నరుండె? పార్థుఁ డట్టి మహాత్మున్
సమయించెనట్లు జంబుక । సముని శిఖండిఁ గొని విధి కసాధ్యము గలదే! 24

ప్రతిపదార్థం: అమరనదీ= ఆకాశగంగానదియొక్క; తనయుఁడు= కుమారుడు భీష్ముడు; సింహము= సింహము; కాక= కాక; నరుండె?= మానవుడా? (కాదు అని అర్థం); అట్టి= అటువంటి; మహాత్మున్= గొప్పవాడిని; జంబుక= నక్కతో; సముని= సమానమైనవానిని; శిఖండిన్= శిఖండిని; కొని= తీసికొని; పార్థుఁడు= అర్జునుడు; (పృథయొక్క కొడుకు కావున పార్థుడు); అట్లు; సమయించెన్= సంహరించెను; విధికిన్= బ్రహ్మకు; అసాధ్యము= చేయలేనిది; కలదే!= కలదా! (లేదని తాత్పర్యము.)

తాత్పర్యం: భీష్ముడు సింహమే కాని నరుడు కాడు. అటువంటి మహాత్ముడిని నక్కవంటి శిఖండిని ముందిడుకొని అర్జునుడు సంహరించాడు. విధికి సాధ్యం కానిది ఏమున్నది?

విశేషం: అలం: రూపకం, ఉపమ, అర్థాంతరన్యాసం. భీష్ముడు - ఉపమేయం; సింహము - ఉపమానం; శిఖండి - ఉపమేయం; జంబుకము - ఉపమానం; పార్థుడు భీష్ముడిని సంహరించటం - విశేషార్థం. విధి కసాధ్యము కలదే!- సామాన్యార్థం. విశేషార్థాన్ని సామానార్థం చేత సమర్థించటం వలన అర్థాంతరన్యాసం.

మూలము: **భీష్మశ్చ నిహతో యత్ర లోకనాథః ప్రతాపవాన్ । శిఖండినం సమాసాద్య మృగేంద్ర ఇవ జంబుకమ్ ॥**

కేవలం ఉపమాలంకారము గల మూలశ్లోకమును కందంలో బిగించి అర్థాంతరన్యాసంతో కూడ అలంకరించి తిక్కయజ్వ స్వతంత్రానువాదాన్ని ప్రకటించాడు.

శిఖండి: ఇతడు ద్రుపదమహారాజు పుత్రుడు. ద్రౌపదికి అన్నగారు. మనస్విని అనే రాణి గర్భమున పుత్రికగా జన్మించాడు. తల్లిదండ్రులు పుత్రోచితసంస్కారములు జరిపించారు. స్థూలకర్ణుడనే యక్షుడి దయవలన పురుషరూపమును ధరించాడు. ముందు స్త్రీగా జన్మించి తరువాత పురుషరూపమును ధరించినందువలన - శిఖండి, శిఖండినీ - అనే పేర్లు కలిగినవి. భీష్ముడు స్త్రీగా పుట్టి పురుషులుగా మారిన శిఖండుల మోములు చూడడు. అది ఆతడి ప్రతిజ్ఞ. అందువలన పార్థుడు భీష్ముడి సలహాను అనుసరించి కురుక్షేత్ర సంగ్రామమున భీష్ముడిని సంహరించటానికి మరొకమార్గంలేక శిఖండిని ముందిడుకొని యుద్ధం చేశాడు. భీష్ముడు అస్త్రసన్న్యాసం చేశాడు. పార్థుడు భీష్ముడిని కూల్చాడు.

చ. శరగురుఁడట్టి యోధుఁ డటె చచ్చె ననిన్ దొర గాని వానిచే
వెరవున లావునన్ జనులు వెక్కసమందఁగఁ జేయు సింధుభూ
వరుఁడటె! రిత్తపోయె ననివార్యుల బాహ్లిక సోమదత్తులం
బరు లవలీలఁ జంపిరటె! పల్కుదు నేమని యేను దైవమున్? 25

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధమునందు; శరగురుఁడు= ద్రోణుడు; అట్టియోధుఁడటె! = సామాన్యయోధుడా! (ఎంతో గొప్ప యోధుడు); దొర= యోధుడు; కానివానిచే= కానటువంటివాడిచే; చచ్చెన్= మరణించెను; వెరవునన్= ఉపాయమునందును; లావునన్= బలంచేతను; జనులు= ప్రజలు; వెక్కసము= దుస్సహత్వము; అందఁగన్= పొందగ; చేయు= చేయగల; సింధుభూవరుఁడు+అటె! = సింధుదేశమునకు రాజు అయిన జయద్రథుడా!; రిత్త= వ్యర్థముగా; పోయెన్= చనిపోయెను; అనివార్యులన్= నివారింప శక్యముకానివారు అయిన; బాహ్లికసోమదత్తులన్= బాహ్లికుడిని సోమదత్తుడిని; పరులు= శత్రువులు; అవలీలన్= చాలా తేలికగా; చంపిరి+అటె!= సంహరించారా!; ఏను= నేను; దైవమున్= దైవమున గూర్చి; ఏమని; పల్కుదును?= చెప్పుదును?

తాత్పర్యం: ద్రోణుడు తనకెంతమాత్రము సాటిగాని వాడిచేత యుద్ధంలో మరణించేటంత తక్కువ యోధుడా? జనులు సహింపశక్యం కాని బలం కల జయద్రథుడు వ్యర్థంగా చనిపోయాడు కదా! యుద్ధంలో ఎవ్వరిచేతకూడా నిరోధింపశక్యం కాని బాహ్లిక సోమదత్తులను శత్రువులు అవలీలగా చంపారు కదా! ఇక నేను దైవచేష్టితాన్ని గూర్చి ఏమని చెప్పను? (అంతా విధివిధానమని తాత్పర్యం.)

విశేషం: ద్రోణుడు భరద్వాజ మహర్షి పుత్రుడు. బృహస్పతి అంశతో జన్మించాడు. ఒకరోజు భరద్వాజ మహాముని గంగానదిలో స్నానానికి వెళ్ళాడు. అక్కడ అంతకుముందే గంగలో స్నానం చేస్తున్న ఘృతాచి అనే అప్సరస వస్త్రం కొంచెం తొలగింది. అది చూచిన భరద్వాజుడికి వీర్యస్ఖలన మయింది. మహర్షి ఆ వీర్యాన్ని ద్రోణమున (యజ్ఞకలశం) ఉంచి సంరక్షించగా దాని నుండి ద్రోణుడు జనించాడు. ద్రోణము నుండి పుట్టినందువలనే ద్రోణుడని పేరు వచ్చింది.

ద్రోణుడు సంపూర్ణవేదాధ్యయన సంపన్నుడు. పరశురాముడి వద్ద సమస్త అస్త్రవిద్యలను అభ్యసించాడు. మహర్షి అగ్నివేశుడి ఆశ్రమంలో, ద్రుపదుడితో కలిసి విద్యాభ్యాసం చేశాడు. కౌరవులకు, పాండవులకు శరగురువు. అర్జునుడివంటి మహావీరుడికి ప్రియగురువు. భీష్ముడిచేత ప్రశంసలందిన పరాక్రమం కలవాడు. బ్రహ్మశిరోనామక అస్త్రమును అర్జునుడికి ఉపదేశించినవాడు. ఇంతటి మహాయోధుడు ద్రోణుడు. సామాన్యుడయిన ధృష్టద్యుమ్నుడిచేత సంహరించబడ్డాడా!- అని ధృతరాష్ట్రుడు విలపిస్తూ ఆశ్చర్యాన్ని ప్రకటించాడు.

నిజానికి ద్రోణుడిని ఎవ్వరూ సంహరించలేదు. అశ్వత్థామ మరణించాడని భావించి అస్త్రత్యాగం చేసి యోగమార్గాన బ్రహ్మలోకాన్ని పొందాడు. అనంతరం ధృష్టద్యుమ్నుడు ద్రోణుడి శిరమును ఖండించి తన జన్మకారణానికి సాఫల్యం చేకూర్చుకొన్నాడు.

క. నీ నమ్మిన భూరిశ్రవుఁ । డేనికలా వతఁడు నెందు నెనలేని మగం
డైన భగదత్తుఁడును వ । మ్మైన తెఱంగట్టె! యేమి యందుఁ గుమారా! 26

ప్రతిపదార్థం: కుమారా!= కొడుకా!; నీ నమ్మిన= నీవు నమ్మిన; భూరిశ్రవుఁడు; ఏనిక, లావు, అతడు= ఏనుగంతటి బలం కలవాడు (భూరిశ్రవుడు); ఏనికలావు+అతఁడు= ఏనుగంతటి బలం కలవాడు; ఎందున్= ఎచ్చటను; ఎనలేని= సమానమైనవాడు లేని; మగండు= శూరుడు; ఐన= అయినటువంటి; భగదత్తుఁడును= భగదత్తుడుకూడ; వమ్ము= నాశము; ఐన= అయిన; తెఱంగు= విధము; అట్టె!= ఆశ్చర్యకరం; ఏమి= ఏమని?; అందున్= చెప్పుదును?

తాత్పర్యం: కుమారా! నీవు నమ్మిన భూరిశ్రవుడు ఏనుగు వంటి బలంకలవాడు. ఎచ్చటను తనతో సమానమైనవాడు లేని శూరుడు. అటువంటి భగదత్తుడు మరణించిన విధం ఆశ్చర్యకరం. ఇంక ఏమి చెప్పగలను?

ఉ. నచ్చిన కర్ణు విక్రమమునం బరవీరులయందొకండునుం
జచ్చుట లేదు దుర్దమము శల్యభుజావిభవంబు లోకముల్
మెచ్చినయట్టి దందు నొకమేలు వినంబడ దమ్మహాత్ములన్
మ్రుచ్చులఁ జంపినట్టులు పరుల్ దెగటార్చిరి దైవ మిచ్చినన్. 27

ప్రతిపదార్థం: నచ్చిన= నమ్మిన; కర్ణు= కర్ణునియొక్క; విక్రమమునన్= పరాక్రమమువలన; పర= శత్రువులయొక్క; వీరులయందున్= శూరులయందు; ఒకండునున్= ఒక్కడు కూడ; చచ్చుట= చచ్చినది; లేదు; దుర్దమము= నిగ్రహింపశక్యముకాని;

శల్య= శల్యుడియొక్క; భుజావిభవంబు= భుజసంపద; లోకముల్= జనులు; మెచ్చిన అట్టిది= మెచ్చినటువంటిదే; అందున్= ఆ భుజసంపదయందు; ఒక మేలు= ఒక్క శుభంకూడ; వినంబడదు= వినిపించదు; ఆ మహాత్ములన్= అట్టి గొప్పవారిని; దైవము; ఇచ్చినన్= సహాయమందించినందున; మ్రుచ్చులన్= దొంగలను; చంపినట్టులు= చంపినట్లుగా; పరుల్= శత్రువులు; తెగటార్చిరి= సంహరించిరి.

తాత్పర్యం: నీవు నమ్మిన కర్ణుడి పరాక్రమంవలన శత్రువీరులలో ఒక్కడు కూడా మరణించలేదు. నిగ్రహింప శక్యం కానిది, లోకం మెచ్చినది అయిన శల్యుడి భుజబలపరాక్రమాన్ని గూర్చి ఒక్క శుభవాక్యం కూడా వినబడదు. దైవసహాయం కారణంగా అట్టి మహాత్ములను శత్రువులు దొంగలను చంపినట్లు చంపారు.

విశేషం: 'దైవమిచ్చినన్' అను దానికి - దైవం అనుకూలం కాగా అని భావం. ఒక్క శుభవాక్యం కూడా వినబడదు అంటే శల్యుడు ఒకరినైనా చంపినాడనే వార్త వినలేదు కదా! అని అర్థం.

తే. కొడుక! తమ్ములు దోడ్పడఁ గడఁగి శత్రు । వరుల గెలిచెద నంటి వొక్కరుఁడు దక్క
కుండ నీ తమ్ముఁ గుఱ్ఱల నూచముట్టు । గొనియెనే విధి! యేగతిఁ జనుదుఁ జెపుమ! 28

ప్రతిపదార్థం: కొడుక!= కుమారా దుర్యోధనా; తమ్ములు= తమ్ములు; తోడ్పడన్= సహాయపడగా; శత్రువరులన్= శత్రువులలో శ్రేష్ఠులైనవారిని; కడఁగి= పూని; గెలిచెదను= జయించెదను, అంటివి= అన్నావు; ఒక్కరుఁడు= ఒక్కడుకూడ; తక్కకుండ= మిగలకుండ; నీ తమ్ముఁగుఱ్ఱలన్= పిన్నవారైన నీ తమ్ములను; ఊచముట్టు= నిశ్శేషముగ అనగ ఒక్కడూమిగులకుండ; విధి= దైవము; కొనియెన్+ఏ= తీసికొనిపోయాడా!; (ఆశ్చర్యార్థకము-); ఏగతిన్= ఏ మార్గమున; చనుదున్= పోవుదును; చెపుమ!= తెలుపుమా!

తాత్పర్యం: కుమారా దుర్యోధనా! తమ్ములు సహాయపడగా శత్రువులను జయిస్తానన్నావు. ఇప్పుడు ఒక్కడుకూడా మిగలకుండా చిన్నవాళ్లైన నీ తమ్ములను దైవం తీసికొనిపోయింది. ఇక నేనెటు వెళ్లాలో చెప్పు.

క. కదిసి పవనజుఁడు బెట్టుగ । గద వ్రేసినఁ దొడలు విఱిగి కయ్యపునేలన్
మదమఱి పడినప్పుడు నీ । మది నేమని తలఁచితో కుమార! యెఱుంగన్!'. 29

ప్రతిపదార్థం: కుమార= కొడుకా! కయ్యపునేలన్= యుద్ధభూమియందు; పవనజుఁడు= వాయుపుత్రుడైన భీముడు; కదిసి= కలియబడి; గదన్= గదతో; బెట్టుగన్= గట్టిగ; వ్రేసినన్= కొట్టగా; తొడలు; విఱిగి= ముక్కలయిపోయి; పడినప్పుడు= పడిపోయి ఉన్నప్పుడు; మదము= గర్వము; అఱి= నశించి; నీమదిన్= నీ మనసునందు; ఏమని; తలఁచితో= ఆలోచించితివో; ఎఱుంగన్= తెలియలేకున్నాను.

తాత్పర్యం: కుమారా! దుర్యోధనా! యుద్ధభూమిలో భీముడు నీతో కలియబడి గదతో నిన్ను గట్టిగా కొట్టగా తొడలు విరిగిపడిపోయి ఉన్నప్పుడు గర్వం నశించి నీ మనసులో ఏమని ఆలోచించావో గదా!'

వ. అని పెక్కు భంగుల విలపించి. 30

ప్రతిపదార్థం: అని= అని; పెక్కు= అనేకములైన; భంగులన్= విధాలుగా; విలపించి= శోకించి.

తాత్పర్యం: ఇట్లు ధృతరాష్ట్రుడు అనేక విధాలుగా పేరుపేరునా తలచి తలచి దుఃఖించి.

విశేషం: తొడలు విరిగి పడి ఉన్నప్పుడు దుర్యోధనుడు తలచిన తలపులు (చూడు. శల్య. ద్వి. ఆ. ప. 325, 326, 327, 329) శ్రీకృష్ణుని నిందించినవే. ధృతరాష్ట్రుడు అనేక విధాల పుత్రనాశనానికి విలపిస్తూ 'విధి కసాధ్యము గలదే' పల్కుదు నేమని యేను దైవమున్ 'దైవమిచ్చినన్' 'కొనియెనే విధి' అని శ్రీకృష్ణుడిని ఉద్దేశించే పలికాడు. ఈ పలుకులలో శోకమే కాక క్రోధం కూడా వ్యంగ్యంగా ఉన్నది. సహజంగా శత్రువు తన పుత్రుడిని సంహరించినప్పుడు పుత్రశోకంతోపాటు శత్రువు ఎడల క్రోధం మిక్కుటంగా ఉంటుంది. చంపినవాడికంటె చంపించిన వాడి యెడల క్రోధం మిక్కుటంగా ఉండటం - లోకధర్మం. ఈ ధర్మాన్నే తిక్కయజ్వ ధృతరాష్ట్రుడి విలాపంలో వ్యంగ్యంగా ఆవిష్కరించాడు.

చ. **తలఁపఁగ భాగ్యవంతుల కుదాత్తశుభంబగుఁ గాక పుణ్యహీ**
నుల కది గల్గనేర్చునె తనూభవు లాఱడిఁ బోయిరింకఁ గా
నలఁ జరియింపఁ బోవుటయ నా కుచితం బటు గాక చండినై
నిలిచితినేని మాటలనె నిచ్చలు భీముఁడు చూఁడుచుండఁడే! **31**

ప్రతిపదార్థం: తలఁపంగన్= ఆలోచింపగా; భాగ్యవంతులకున్= అదృష్టవంతులకు; ఉదాత్తశుభంబు= ఉన్నతమైన మంగళము; అగున్= కలుగుతుంది; కాక= అట్లుకాక; పుణ్యహీనులకున్= సుకృతములేనివారికి; అది= అట్టి ఉన్నతమైన శుభము; కల్గన్= కలుగ; నేర్చునె?= వచ్చునా? (అనగా కలుగదు); తనూభవులు= కొడుకులు; ఆఱడిన్ పోయిరి= నశించారు; ఇంకన్= ఇంక; కానలన్= అడవులందు; చరియింపన్= సంచరించుటకు అనగా నివసించుటకు; పోవుటయ= పోవుటయే; నాకున్; ఉచితంబు= తగింది; అటు= అట్లా; కాక= కాకుండా; చండినై= మొండివాడినై; నిలిచితిన్= ఉంటిని; ఏని; నిచ్చలున్= నిత్యము, ఎల్లప్పుడు; మాటలనె= మాటలతోనే; భీముఁడు; చూఁడుచున్= కాల్చుచు; ఉండఁడే!= ఉండడా! (ఉండును అని అర్థము.)

తాత్పర్యం: ఆలోచించి చూడగా అదృష్టవంతులకు మాత్రమే గొప్ప గొప్ప శుభాలు కలుగుతాయి. సుకృతం లేని వారికి శుభం కలుగదు. కొడుకులు నశించిపోయారు. ఇంక ఇటుపైన అడవులందు నివసించి జీవించటమే నాకు తగినది. అట్లుకాక మొండివాడినై ఇక్కడనే ఉన్నట్లయితే భీముడు నిత్యం మాటలతోనే నన్ను కాలుస్తూ ఉంటాడు.

విశేషం: తిక్కయజ్వ సహజకవితాశైలికి ఈ పద్యమును ఉదాహరణంగా గ్రహింపవచ్చును. ఆయన కవిత యందంతటా ఈ శైలియే కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. ఈ పద్యంలో అయిదు విడివిడి వాక్యాలు ఉన్నాయి. ఏ వాక్యానికావాక్యం వచనంవలె సాగిపోతుంది. గద్యసౌందర్యాన్ని పుణికిపుచ్చుకొన్న పద్యరచన ఇది. గొలుసుకట్టుగా కలిపి పద్యంగా చేయవచ్చును. అట్లా కలిపినప్పుడు అలవోకగా యతిప్రాసలు అతికిపోతాయి. ఇది తిక్కన శైలిలోని పరమరహస్యం. అందువలన అనంతర కవులు నన్నయాదులను అనుసరించినట్లు తిక్కయజ్వను అనుసరించలేకపోయారు. ఒక్క అనంతామాత్యుడు మాత్రం ఆ ప్రయత్నం చేశాడు.

క. **విను దుర్యోధన దుశ్శా । సనులఁ బలికి పలికి నిచ్చ చావుగ నప్పా**
వని యలఁచుఁ గాన నడవికిఁ । జనుటయ మేలైన తెఱఁగు సంజయ నాకున్!. **32**

ప్రతిపదార్థం: సంజయ!; విను= వినుము; దుర్యోధన దుశ్శాసనులన్= దుర్యోధన దుశ్శాసనులను; పలికి పలికి= తిట్టి తిట్టి; నిచ్చ-చావుగన్= నిత్యమరణంగా; ఆ పావని= ఆ భీముడు; అలఁచున్= నన్ను బాధిస్తాడు; కానన్= కావున; నాకున్= నాకు; అడవికిన్= అరణ్యమునకు; చనుటయ= వెడలుటయే; మేలు ఐన తెఱఁగు= మంచిమార్గం.

తాత్పర్యం: సంజయా! వినుము. దుర్యోధన దుశ్శాసనులను నిందించి నిందించి భీముడు నిత్య మరణంగా నన్ను బాధిస్తాడు. కనుక నాకు అడవికి పోవటమే మంచి మార్గం.

వ. అని పలికి యత్యంత దుఃఖదూషితస్వాంతుం డగుచు నమ్మహీకాంతుండు నిట్టూర్పు నిగిడించి యా సూత నందనున కిట్లనియె. 33

ప్రతిపదార్థం: అని; పలికి; అత్యంత= మిక్కిలి; దుఃఖ= శోకముచే; దూషిత= పాడుపడిన; స్వాంతుండు= మనస్సు కలవాడు; అగుచున్; మహీ= భూమికి; కాంతుండు= భర్తయైన ఆ ధృతరాష్ట్రుడు; నిట్టూర్పు= దీర్ఘనిశ్వాసము; నిగిడించి= సాగదీసి; ఆ సూతనందనునకున్= ఆ సంజయుడితో; ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్.

తాత్పర్యం: అడవికి పోవటమే మంచిమార్గమని చెప్పి మిక్కిలి దుఃఖంతో పాడైపోయిన మనస్సుకలవాడై, ఆ ధృతరాష్ట్రుడు ఒక దీర్ఘనిశ్వాసం విడిచి ఆ సంజయుడితో ఇట్లా అన్నాడు.

క. 'సురసరిదాత్మజుఁడును శర । గురుఁడును గర్ణుండుఁ దెగుటకుం దలఁకక యె
వ్వరి బాహుబలముగొని యే । మరి కోల్తల సేసి రొక్కొ! మనవా రనికిన్.' 34

ప్రతిపదార్థం: సురసరిత్= దేవగంగానదియొక్క అనగా ఆకాశగంగానదియొక్క; ఆత్మజుఁడును= తనయుడును అనగా భీష్ముడును; శరగురుఁడును= అస్త్రవిద్యకు గురువు అయిన ద్రోణుడును; కర్ణుండున్= కర్ణుడును; తెగుటకున్= మరణించుటకు; తలఁకక= భయపడక; మనవారు= దుర్యోధనాదులైన మనవారు; అనికిన్= యుద్ధమునకు; ఎవ్వరి= ఎవరియొక్క; బాహుబలము= భుజపరాక్రమము; కొని= తీసికొని; ఏమరి= మరచి; కోల్తల= యుద్ధసన్నాహం; చేసిరి; ఒక్కొ!= చేశారో కదా!

తాత్పర్యం: 'భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, మరణించినందులకు భయపడకుండా ఎవడి పరాక్రమాన్ని పరిగణించి మనవారు యుద్ధసన్నాహం చేశారు?'

వ. అని తన కొడుకు చలం బూహించి. 35

ప్రతిపదార్థం: అని= అని; తన= తనయొక్క; కొడుకు= కొడుకైన అనగా దుర్యోధనుడియొక్క; చలంబు= మాత్సర్యము; ఊహించి= గుర్తించి.

తాత్పర్యం: అని ప్రశ్నించి, తన కొడుకు మాత్సర్యాన్ని గుర్తించి.

చ. 'మును విదురుండు సెప్పె నతిమూర్ఖమనోగతి యైన యీ సుయో
ధను చరితంబు గీ డఖిలధాత్రిజనంబులకుం బొనర్చు నా
శన మని దానిఁ గొంద అవిచారులు పాటిగఁ బట్టరైరి నా
కును మది వారికె ట్లటుల కుత్సిత మయ్యె విధాత త్రిప్పునన్. 36

ప్రతిపదార్థం: అతి= మిక్కిలి; మూర్ఖ= తెలివితక్కువ; మనః= మనస్సుయొక్క; గతి= గమనము; ఐన= కలిగిన అనగా పరమమూర్ఖుడైన; ఈ సుయోధను= ఈ దుర్యోధనుడియొక్క; చరితంబు= నడవడిక; కీడు= దోషభూయిష్ఠం; అఖిల= సమస్తమైన; ధాత్రి= భూమండలమందలి; జనంబులకున్= ప్రజలకు; నాశనము= చేటు; పొనర్చున్= కలుగచేస్తుంది; అని;

విదురుండు; మును= ముందుగా; చెప్పెన్; దానిన్= దానిని; కొందఱు= కొంతమంది; అవిచారులు= ఆలోచనలేనివారు అనగా తెలివితక్కువవారు; పాటిగన్= ప్రమాణంగా; పట్టరు= గ్రహింపనివారు; ఐరి= అయ్యారు; విధాత= బ్రహ్మయొక్క; త్రిప్పునన్= త్రిప్పుటచేత; నాకును= నాకుకూడ; వారికిన్= ఆ తెలివితక్కువవారికి; ఎట్లు= ఏ విధంగా తోచినదో; అటుల= ఆ విధంగానే; మది= మనస్సు; కుత్సితము= చెడినది; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: 'పరమమూర్ఖుడయిన ఈ దుర్యోధనుడి నడవడి దోష భూయిష్ఠం. అది సమస్త భూమండలప్రజలకు నాశనం కలుగచేస్తుంది - అని ఇంతకుముందే విదురుడు చెప్పాడు. ఆ మాటను కొందరు మందబుద్ధులు ప్రమాణంగా గ్రహించలేదు. బ్రహ్మవ్రాతవలన నాకు కూడా ఆ తెలివిలేనివారికి వలెనే మనస్సు పాడయింది.

క. **అప్పు డటు లతఁడు సెప్పఁగఁ । దప్పఁ దలంచిన ఫలంబు దగఁ గుడువక పోఁ**
జొప్పడునె సూతనందన! చెప్పు మనికి నెవ్వఁ డమరు సేనాపతియై? **37**

ప్రతిపదార్థం: సూతనందన!= సంజయా!; అప్పుడు; అటులు= ఆ విధముగా; అతఁడు= ఆ విదురుడు; చెప్పఁగన్= చెప్పగా; తప్పన్= తప్పుగా; తలంచిన ఫలంబు= ఆలోచించిన ఫలితము; తగన్= తగినట్లుగా; కుడువక= అనుభవింపక; పోన్= పోగొట్ట; చొప్పడునె?= తప్పుతుందా?; అనికిన్= యుద్ధమునకు; ఎవ్వఁడు= ఎవడు; సేనాపతియై= సేనానాయకుడై; అమరున్= ఒప్పునో; చెప్పుము.

తాత్పర్యం: అప్పుడు విదురుడు దుర్యోధనుడి చరితం చెప్పగా దానిని తప్పుగా తలంచిన ఫలితం అనుభవించక తప్పదు కదా! సంజయా! యుద్ధానికి ఎవ్వడు సేనాపతి అయి ఒప్పాడో చెప్పుము.

చ. **దురమున నర్జున ప్రకట దోర్విభవంబు నెదుర్పఁ జాలు ను**
ద్ధుఁడొకరుండు గల్గెనె విధూతవిరోధిబలుండు శల్యుఁ డె
వ్వరి భుజశక్తిఁ జిక్కెఁ? గురువర్గము సంక్షయమట్లు సెల్ల దు
స్తరబలభాసి భీముని గదంబడియెం గురుముఖ్యుఁ డెమ్మెయిన్? **38**

ప్రతిపదార్థం: దురమునన్= యుద్ధమునందు; అర్జున= అర్జునునియొక్క; ప్రకట= ప్రసిద్ధమయిన; దోః= భుజములయొక్క; విభవంబున్= సంపదను - అనగా భుజబల పరాక్రమమును; ఎదుర్పన్= ఎదురింప; చాలు= సరిపడు; ఉద్ధురుఁడు= భరించువాడు అనగా సామర్థ్యముకలవాడు; ఒకరుండు= ఒక్కడైనను; కల్గెనె?= కలిగెనా?, ఉన్నాడా?; విధూత= ఎగురగొట్టబడిన; విరోధి= శత్రువుయొక్క; బలుండు= బలము కలవాడయిన; శల్యుఁడు; ఎవ్వరిభుజశక్తిన్= ఎవరిభుజబలమునకు; చిక్కెన్= దొరకిపోయెను?; కురువర్గము= కౌరవసమూహముయొక్క; సంక్షయము= సర్వనాశము; అట్లు= ఆ విధముగా; చెల్లన్= కొనసాగగా; ఏ మెయిన్= ఏ విధముగా; కురుముఖ్యుడు= కౌరవులలో ప్రధానమైనవాడు అయిన దుర్యోధనుడు; దుస్తర= తరింపశక్యముకాని అనగా అడ్డుకొనజాలని; బల= బలముచే; భాసి= ప్రకాశించు; భీముని; గదన్= గదాయుధమువలన; పడియెన్?= కూలిపోయెను?

తాత్పర్యం: యుద్ధంలో అర్జునుడి భుజబలపరాక్రమాన్ని ఎదురించగల సామర్థ్యం కలవాడు ఒక్కడైనా కలడా?- లేడు. శత్రుబలాలను ఎగురగొట్ట గలిగిన శల్యుడు ఎవరి పరాక్రమానికి దొరికిపోయాడు? కురు సమూహంయొక్క సర్వనాశనం - సంతాపం కలుగచేస్తుండగా, ఏ విధంగా దుర్యోధనుడు భీముడి గదాయుధం వలన కూలిపోయాడు?

వ. కృపకృతవర్మాశ్వత్థామ లెబ్బంగి బ్రతికిరి? ధృష్టద్యుమ్న శిఖండి ప్రముఖ పాంచాలురును జేది మాత్స్య ప్రభద్రక ప్రభృతి బలంబులును నా మనుమలైన ప్రతివింధ్యాది ద్రౌపదేయులును దక్కునుం గలుగు యోధవీరులు నెవ్విధంబున మృతిఁ బొందిరి? పాండవు లేవురును బద్మనాభసాత్యకులును యుయుత్సుండును నెత్తెఱంగునఁ దెగటాఱక తప్పి రింతయుఁ బరిపాటిఁ దేటపడం జెప్పు' మనిన విని సంజయుండు ధృతరాష్ట్రున కిట్లనియె. 39

ప్రతిపదార్థం: కృప కృతవర్మాశ్వత్థామలు= కృపాచార్యులు, కృతవర్మ, అశ్వత్థామ; ఏ+భంగిన్= ఏ విధంగా; బ్రతికిరి?= జీవించి ఉండిరి?; ధృష్టద్యుమ్న= ధృష్టద్యుమ్నుడును; శిఖండి= శిఖండియును; ప్రముఖ= ముఖ్యులైన; పాంచాలురును= పాంచాలదేశపురాజులును; చేది= చేది దేశముయొక్క; మాత్స్య= మత్స్యదేశముయొక్క రాజులును; ప్రభద్రక= ప్రభద్రకులను; ప్రభృతి= ఈ మొదలగు; బలంబులును= యోధులును; నా మనుమలైన= నాకు మనుమలు అయిన; ప్రతివింధ్యాది= ప్రతివింధ్యుడు మొదలగు; ద్రౌపదేయులును= ద్రౌపది పుత్రులును; (ప్రతివింధ్యుడు, సుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతకర్మ - వీరు ద్రౌపదేయులు - ఉపపాండవులని నామాంతరము); తక్కునున్= ఇంకను మిగిలి; కలుగు= ఉన్నట్టి; యోధవీరులును= శూరులైన యోధులును; ఏవిధంబునన్= ఏ విధముగా; మృతిన్= మరణమును; పొందిరి?; పాండవులు; ఏవురును= అయిదుగురును; పద్మనాభ= శ్రీకృష్ణుడును; సాత్యకులును= సాత్యకియును; యుయుత్సుండును; ఎత్తెఱంగునన్= ఏ ప్రకారంగా; తెగటాఱక= చావక; తప్పిరి?= తప్పుకొనిరి?; ఇంతయున్= ఇదియంతయు; పరిపాటిన్= అనుక్రమంగా; తేటపడన్= తేటతెల్లంగా - స్పష్టంగా; చెప్పుము; అనినన్= అనగా; విని; సంజయుండు; ధృతరాష్ట్రునకు; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: కృప, కృతవర్మ, అశ్వత్థామలు ఎట్లా బ్రతికారు? ధృష్టద్యుమ్న శిఖండి ప్రముఖులైన పాంచాల రాజులు చేదిదేశ, మత్స్య దేశరాజులు, ప్రభద్రకులనే పాంచాలదేశపు క్షత్రియదళాలు, ప్రతివింధ్యుడు మొదలైన ద్రౌపది పుత్రులు, ఇంకను మిగిలిన యోధులు ఏ విధంగా మరణాన్ని పొందారు? పాండవులు అయిదుగురు, శ్రీకృష్ణుడు, సాత్యకి, యుయుత్సుడు, ఏ విధంగా మృత్యువుకు లోబడకుండా తప్పించుకొన్నారు. ఇది అంతా క్రమం తప్పకుండా తేటతెల్లంగా చెప్పుము.' అని ధృతరాష్ట్రుడు అడుగగా విని, సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: మహాభారత యుద్ధంలో కౌరవపక్షాన మృతిపొందకుండా ముగ్గురు మాత్రం మిగిలారు. వారు కృపుడు, కృతవర్మ, అశ్వత్థామలు.

కృపుడు: ఇతడు గౌతమగోత్రుడు. శరద్వంతుడి పుత్రుడు. రుద్రగణ అంశావతారుడు. 'జానపది' అను అప్సరసను చూడడం వల్ల మహర్షి శరద్వంతునికి వీర్యస్ఖలనమయినది. అతడు దానిని రెల్లుగడ్డిపై గిరవాటు వేయగా అది రెండు భాగములయినది. ఒక భాగం కుమారుడుగా, మరొక భాగం కుమార్తెగా జన్మించారు. కుమారుడు కృపుడు. కుమార్తె కృపి. ఈ కృపి ద్రోణాచార్యుడి పత్ని. అశ్వత్థామకు తల్లి. కృపుడు అశ్వత్థామకు మేనమామ. రెల్లుగడ్డిలో పుట్టిన వీరిని వేటకై వచ్చిన శంతనుడు కృపతో పెంచి పోషించాడు. కృపతో పోషించబడినందువలన కృప, కృపి అనే పేర్లు సిద్ధించాయి. కృపుడు ధనుర్వేదంలో పరమాచార్యుడు. అందువలన కృపాచార్యుడుగా కూడా ప్రసిద్ధుడు. 'ఆచార్య, ఆచార్యసత్తమ, భారతాచార్య, బ్రహ్మర్షి, శారద్వత-' మొదలైన పేర్లతో భారతంలో వ్యవహరించబడ్డాడు.

కృతవర్మ: ఇతడు యదుకులవీరుడు. భోజవంశజుడు. హృదికుడి పుత్రుడు. మరుద్గణ అంశావతారుడు. శ్రీకృష్ణుడికి ఇష్టుడు. కౌరవపక్షంలో యుద్ధం చేసిన యదుసేనకు అధినాయకుడు. 'అనార్తవాసి, హార్దిక్య, హృదికసుత, మాధవ, సాత్వత, వార్ష్ణేయ, వృష్ణి, వృష్ణిసింహ', మొదలైన పేర్లతో వ్యవహరించబడ్డాడు.

అశ్వత్థామ: ఇతడు కృపి గర్భమున జన్మించిన ద్రోణాచార్యుడి పుత్రుడు. శివ, యమ, కామ, క్రోధములు సమ్మిళితం అయిన అంశవలన జన్మించినవాడు. ఇతడు పుట్టినవెంటనే పాలకొరకు ఉచ్చైశ్రవము అరచినట్లు గట్టిగా ఏడ్చాడు. పిండి కలిపిన నీళ్ళు ఇయ్యగా, వాటిని పాలు అనుకొని త్రాగి ఏడుపు మానాడు. అందువలన ఆకాశవాణి 'అశ్వత్థామ' అని పేరుపెట్టిందట. 'ఆచార్యనందన, ఆచార్యపుత్ర, ఆచార్యతనయ, ద్రౌణి, గురుపుత్ర, భారతాచార్యపుత్ర' మొదలైన పేర్లు కూడా ఇతనికి ఉన్నాయి.

ఇక పాండవ పక్షంలో మిగిలినవారు - ఐదుగురు పాండవులు, శ్రీకృష్ణుడు, సాత్యకి, యుయుత్సుడు. శ్రీకృష్ణ పాండవులు ప్రసిద్ధులు.

సాత్యకి: ఇతడు వృష్ణి వంశజుడు. 'శిని' కుమారుడైన సత్యకుడి పుత్రుడు. ఇతనికి 'యుయుధానుడు' అనే ప్రసిద్ధనామం కలదు. ఇతడు ఎల్లప్పుడు శ్రీకృష్ణుడితో కలిసి ఉండేవాడు. శ్రీకృష్ణుడికి సోదరసమానుడు. పాండవులకు హితుడు. 'వృష్ణికులభూషణ, సత్యప్రతిజ్ఞ, శత్రుమర్దన' అనునవి ఇతడి బిరుదాలు. సప్తమరుత్తుల అంశవలన జన్మించాడు. శైనేయ, మాధవ, మాధవసింహ, సాత్వత, వృష్ణి మధూద్వహ' మొదలైన నామాలతో మహాభారతంలో వ్యవహరింపబడ్డాడు.

యుయుత్సుడు: ఇతడు 'కరణ' అను వైశ్యపత్నియందు ధృతరాష్ట్రుడికి జన్మించిన పుత్రుడు. ధృతరాష్ట్రుడికి గాంధారీ గర్భమున జన్మించినవాడని శాంతిపర్వమున కలదు. కురుక్షేత్ర యుద్ధం ప్రారంభించటానికి ముందు ధర్మరాజు భీష్మాదులకు నమస్కరించి, 'మా పక్షమున చేరదలచిన రాజులుంటే ఇప్పుడే వచ్చి చేరండి' అని పిలిచాడు. అప్పుడు కౌరవసేనలో ఉన్న ధృతరాష్ట్ర పుత్రుడు యుయుత్సుడు ఒక్కడు మాత్రం వచ్చి పాండవ పక్షంలో చేరాడు. ధృతరాష్ట్రుడి పుత్రులలో యుద్ధంలో మరణించకుండా మిగిలినవాడు ఇతడు ఒక్కడే.

ధృతరాష్ట్రుడి విలాపం: సంజయుడు కురుక్షేత్రము నుండి హస్తినాపురానికి వచ్చి ధృతరాష్ట్రుడి మందిరాన్ని ప్రవేశించి కౌరవుల పరాజయాన్ని, పాండవుల విజయాన్ని, దుర్యోధనాదుల మరణాన్ని, ఇరుపక్షాలలో చావకుండా మిగిలినవారిని గూర్చి ధృతరాష్ట్రుడికి వివరించాడు. అది మొదలు ఇంతవరకు పుత్రపరాజయాన్ని గూర్చి, సర్వసంక్షయాన్ని గూర్చి తలచి తలచి ధృతరాష్ట్రుడు విలపించాడు.

ఈ ధృతరాష్ట్ర విలాపమున తిక్కన చూపిన కవనసౌందర్యం అనితరసాధ్యం. ఈ సన్నివేశమంతా ధృతరాష్ట్రుడి ఏకపాత్రాభినయం. ఒక్క ఆహార్యాభినయం తప్ప వాచికం - ఆంగికం - సాత్త్వికం పుష్కలంగా కలవు. తిక్కన కవిత నాటకీయ శిల్పంతో నిండి ఉన్నదని ఆర్యుల వచనం. ఆ శిల్పసౌందర్యాన్ని శల్యపర్వంలోని ఈ 'ధృతరాష్ట్ర విలాపం' అనే సన్నివేశంలో దర్శించవచ్చును. క్రోధాన్ని శోకంతో కలగలిపి, ప్రేమను ద్వేషంతో మేళవించి ధృతరాష్ట్రుడు పలికిన పలుకులు తిక్కన చేసిన సజీవపాత్ర చిత్రణకు, సాత్త్వికాభినయశిల్పానికి పరమోదాహరణాలు. 'మూర్ఛిల్లుట', 'నలుదిక్కులు మొగము త్రిప్పుట', 'కుంభనిక్షిప్త భుజంగంబు చందంబున నిశ్వాసంబు నిగుడ్చుట', 'చేతులు విదుర్చుట', 'నిట్టూర్పు నిగుడించుట'- ఈ మొదలైన ధృతరాష్ట్రుడి చేష్టలు తిక్కన చిత్రించిన ఆంగికాభినయానికి మచ్చుతునకలు. ఇక 'స్వగతం' గా సాగిన విలాపమంతా వాచికాభినయమే.

ఉ. సూతసుతుండుఁ జేయఁగల శూరులు దర్పసమగ్రభూపతి
వ్రాతముఁ బెక్కుదంతిరథవాజి భటావలులున్ భుజాబల
స్ఫీతులు పాండునందనులచేఁ దెగటారిన నోడి వీటికిన్
నీ తనయుండు హీనరథినీయుతుఁడై యటు లేఁగి నెవ్వగన్. 40

ప్రతిపదార్థం: భుజాబల= భుజబలంచేత; స్ఫీతులు= అధికులు; పాండు= పాండురాజుయొక్క; నందనులచేన్= కొడుకులచే; సూతసుతుండున్= కర్ణుడును; చేయఁగల శూరులు= యుద్ధం చేయగలవీరులు అనగా భీష్మద్రోణాదులు; దర్ప= భుజగర్వముకల;

సమగ్ర= సమస్తమైన; భూపతి= భూమికి భర్తలైన రాజులయొక్క; వ్రాతమున్= సమూహమును; పెక్కు= అనేకములైన; దంతి= ఏనుగులయొక్క; రథ= రథములయొక్క; వాజి= గుర్రములయొక్క; భట= భటులయొక్క; ఆవలులున్= వరుసలను - అనగా రథగజ తురంగ పదాతిదళములును - చతురంగ బలములును; తెగటారినన్= చంపబడగా; ఓడి= అపజయము పొంది; నెవ్వగన్= మిగుల సంతాపముతో; నీ తనయుండు= నీ కుమారుడు దుర్యోధనుడు; హీన= స్వల్పమైన; రథినీ= సైన్యముతో; యుతుడు+ఐ= కూడినవాడై; వీటికిన్= శిబిరమునకు; అటులు= ఆప్రకారముగ; ఏఁగి= వెడలి.

తాత్పర్యం: భుజబల పరాక్రమాలు గల పాండవులచేత కర్ణుడు, భీష్మద్రోణాది మహావీరులు భుజగర్వం గల సమస్త భూపతులు, అనేకములైన రథ గజతురగ పదాతిదళాలు, సంహరించబడగా, ఓడిపోయి నీ కుమారుడు దుర్యోధనుడు కొద్దిసేనలతో మిక్కిలి సంతాపంతో శిబిరానికి వెడలి. (తరువాతి వచనంతో అన్వయం.)

కృపాచార్యుఁడు దుర్యోధనునకు హితోపదేశంబు చేయుట (సం. 9-3-8)

వ. మందిరంబుఁ బ్రవేశింపక యొక్కబయల నిఖిలబంధుమిత్రపరిజనవృతుండై నిలిచె నయ్యవసరంబునఁ గృపార్ద్రచిత్తుండై కృపాచార్యుం డన్నరేంద్రున కిట్లనియె. **41**

ప్రతిపదార్థం: మందిరంబున్= శిబిరములోనికి; ప్రవేశింపక= ప్రవేశించకుండా; ఒక్క; బయలన్= బహిరంగ ప్రదేశమున; నిఖిల= సమస్తమైన; బంధు= చుట్టములతో; మిత్ర= స్నేహితులతో; పరిజన= సేవకులతో; వృతుండై= చుట్టబడినవాడై; నిలిచెన్= ఉండెను; ఆ అవసరంబునన్= ఆ సమయమున; కృపా= దయచే; ఆర్ద్ర= తడిసిన; చిత్తుండు+ఐ= హృదయము కలవాడై; కృపాచార్యుండు; ఆ నరేంద్రునకున్= ఆ దుర్యోధనునకు; ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: దుర్యోధనుడు శిబిరంలోనికి ప్రవేశించక, ఒక బహిరంగ ప్రదేశంలో బంధుమిత్ర పరిజనులతో పరివేష్టించబడి ఉన్నాడు. అట్టి సమయంలో దయార్ద్రహృదయుడై కృపాచార్యుడు ఆ దుర్యోధనుడితో ఈ ప్రకారంగా అన్నాడు.

క. 'సమరము మిముబోంట్లకు ను । త్తమ ధర్మం బిదియ తొంటి ధాత్రీశులు కృ
త్యముగఁ గొని యాచరించిరి । తమకు సుగతి గోరి కీర్తితస్ఫురణమెయిన్. **42**

ప్రతిపదార్థం: మిముబోంట్లకున్= మీ వంటివారికి; సమరము= యుద్ధము; ఉత్తమ= శ్రేష్ఠమయిన; ధర్మంబు= వేదవిహితకర్తవ్యము; ఇదియ= ఈ యుద్ధధర్మమే (అవధారణార్థము); కృత్యముగన్= చేయదగిన దానినిగా; తొంటి= మునుపటి; ధాత్రీ= భూమికి; ఈశులు= ప్రభువులయిన రాజులు; కొని= స్వీకరించి; కీర్తిత= కీర్తింపబడిన; స్ఫురణమెయిన్= ప్రకాశముతో; తమకున్; సుగతి= ఉత్తమగతి; కోరి; ఆచరించిరి= యుద్ధధర్మమును ఆచరించిరి.

తాత్పర్యం: 'మీ వంటి వారికి యుద్ధం వేదవిహిత కర్తవ్యమే. ఈ ధర్మాన్నే పాటించి మునుపటి రాజులు కీర్తిమంతులై ఉత్తమగతిని కోరి యుద్ధధర్మాన్ని ఆచరించారు.

విశేషం: తిక్కన 'సుగతి' పదంయొక్క అభంగశ్లేషతో ఈ కందమున సుందరమైన గీతావాక్యార్థాన్ని బంధించి క్షత్రియ ధర్మమును బోధించాడు. 'హతో వా ప్రాప్స్యసే స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్' (గీత 2 - 37)' 'స్వధర్మమపి చావేక్ష్య

న వికంపితు మర్హసి। ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే' (గీ॥ 2 - 31) వంటి భగవద్గీతలోని శ్లోకాలను ఆయా సందర్భాలకు తగిన విధంగా తిక్కన తన భారతంలో అనువదించినట్లు గ్రహించటాని కిది ఉదాహరణ.

క. ఐనను నొకపలు కడ్డము । గా నొడివెద దానిలెస్సగా విని యది మే
లైనను జేసెదు గాదే । న్మానెద వేర్పడఁగ వినుము మనుజాధీశా! 43

ప్రతిపదార్థం: మనుజ= మానవులకు; అధీశా!= ప్రభువు అయిన దుర్యోధనా!; ఐనను= అయినప్పటికి (మీవంటివారికి యుద్ధం ఉత్తమధర్మం అయినప్పటికిని); ఒక; పలుకు= మాట; అడ్డముగాన్= విరుద్ధంగా (ఆ ఉత్తమధర్మానికి విరుద్ధంగా); నొడివెదన్= చెప్పెదను; దానిన్= దానిని (ఆమాటను); లెస్సగాన్= చక్కగా; విని; అది (ఆ మాట); మేలు= శుభము; ఐనను= అయినచో; చేసెదు= చేయుదువుగాక; కాదేన్= అట్లుకాని ఎడల (శుభంకానిది అయిన ఎడల); మానెదవు= మానెదవు; ఏర్పడఁగన్= స్పష్టంగా; వినుము.

తాత్పర్యం: ఓ దుర్యోధనా! అయినా క్షత్రియధర్మానికి విరుద్ధంగా ఒకమాట చెప్పుతాను. ఆమాటను చక్కగా విని, అది శుభం అయితే ఆ ప్రకారం చేయుము. కానిచో మానుకొమ్ము. నేను చెప్పేది స్పష్టంగా వినుము.

చ. అమరనదీ తనూభవుఁడు నస్త్రగురుండును కర్ణుఁడుం బరా
క్రమమహనీయు లావహధురంధరు లట్టిర తక్కుఁ గల్గు భూ
రమణులు బంధుమిత్రులు దురంబున నందఱఁ బాండునందనుల్
సమయఁగఁ జేసి రట్లు భుజశక్తియు దైవబలంబు నెక్కుడై. 44

ప్రతిపదార్థం: అమరనదీ= దేవనదియొక్క (ఆకాశగంగానదియొక్క); తనూభవుఁడున్= తనయుడును (భీష్ముడును); అస్త్ర= అస్త్రవిద్యకు; గురుండును= గురువుఅయినవాడును (ద్రోణుడును); కర్ణుఁడున్= కర్ణుడును; పరాక్రమ= శౌర్యముచేత; మహనీయులు= గొప్పవారు; ఆహవ= యుద్ధముయొక్క; ధురంధరులు= భారమును మోయువారు; (యుద్ధముచేయుటలో ప్రముఖులు); తక్కున్= మిగులు; కల్గు= ఉన్నట్టి; భూ; రమణులు= రాజులు; బంధు= చుట్టములు; మిత్రులు= స్నేహితులు; అట్టిర= అట్టివారే (అవధారణార్థం) అనగా పరాక్రమంలోమహనీయులే, ఆహవ ధురంధరులే అయిఉన్నారు); అందఱన్= ఇట్టివారి నందరినీ; పాండునందనుల్= పాండవులు; భుజశక్తియున్= భుజబలమును; దైవబలంబును= దైవంయొక్క బలమును; ఎక్కుడై= అధికంగా కలవారై; దురంబునన్= యుద్ధంలో; అట్లు= ఆ విధంగా (శిఖండిని అడ్డుపెట్టి భీష్ముడిని; అశ్వత్థామా హతః అని' ద్రోణుడిని; రథం క్రుంగగా కర్ణుడిని) సమయఁగన్= మరణించేటట్లుగా; చేసిరి= చేశారు.

తాత్పర్యం: భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, పరాక్రమంలో చాలా గొప్పవారు. యుద్ధవిద్యలో ప్రముఖులు. మిగిలిన భూపతులు, చుట్టాలు, స్నేహితులు కూడా అంతటి పరాక్రమవంతులే. యుద్ధవిద్యలో వాళ్ళూ ప్రముఖులే. అట్టివారి నందరినీ పాండవులు భుజబలము, దైవబలం, అధికంగా కలవారై చంపగలిగారు.

చ. వెరవును లావునుం గలుగు వీరులు పోరులఁ బడ్డ హీనతం
బొరసితి మస్త్రశస్త్రహతి భూవర చిక్కినవారు నొల్లఁ బో
యిరి విను పాండురాజసుతు లేవురు గంటికి రెప్పచందమై
హరి తముఁ గావఁగా వెలసి రక్షతదేహవిలాససంపదన్. 45

ప్రతిపదార్థం: భూవర!= రాజా దుర్యోధనా!; అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధాలయొక్క; శస్త్ర= మంత్రపూతములుకాని ఆయుధములయొక్క; హతిన్= దెబ్బలవలన; వెరవును= ఉపాయమును (అనగా యుద్ధవ్యూహములను); లావునున్= బలమును; కలుగు= కలిగిన, వీరులు= శూరులు; పోరులన్= యుద్ధములందు (ఈ పదియేడు దినముల యుద్ధములందు); పడ్డన్= చనిపోగా; హీనతన్= తక్కువతనమును; పొరసితిమి= పొందితిమి; చిక్కిన= మిగిలిన; వారున్= వారును; ఒల్లఁబోయిరి= మూర్ఛపోయిరి; విను; పాండురాజు= పాండురాజుయొక్క; సుతులు= కొడుకులు; ఏవురు= అయిదుగురు; కంటికిన్; రెప్పచందమై= రెప్పవలె; హరి= శ్రీకృష్ణుడు; తమున్= తమను; కావఁగాన్= రక్షించుచుండగా; అక్షత= దెబ్బలు లేని (అనగా గాయములులేని); దేహ= శరీరములయొక్క; విలాస= సౌందర్యంయొక్క; సంపదన్= ఐశ్వర్యముతో; వెలసిరి= ప్రకాశించిరి.

తాత్పర్యం: దుర్యోధనా! అస్త్రశస్త్రాల దెబ్బలవలన ఉపాయం, బలం కలిగిన వీరులు ఈ పదియేడు దినముల యుద్ధంలో చనిపోగా మనం తక్కువతనమును పొందాము. అనగా బలహీనుల మయ్యాము. ఇక మిగిలిన వారు శస్త్రాస్త్రాల దెబ్బలచేత మూర్ఛిల్లారు. దుర్యోధనా! వినుము. పాండురాజు కొడుకులు అయిదుగురు కంటికి రెప్పవలె శ్రీకృష్ణపరమాత్మ తమను రక్షిస్తూ ఉండగా గాయాలు కూడా లేని దేహవిలాస సంపదలతో ప్రకాశించారు.

క. శ్వేతాశ్వపాటవం బు । ద్ద్యోతితమై మెఱయఁగాఁ జతుర్దంతరుచి
స్ఫీత మగు గజముక్రియ నరుఁ । డాతత కురుసైన్యసరసియందుఁ జరించున్. 46

ప్రతిపదార్థం: నరుడు= అర్జునుడు; శ్వేత= తెల్లని; అశ్వ= గుఱ్ఱములయొక్క; పాటవంబు= శక్తి; ఉద్ద్యోతితము= ప్రకాశవంతము; ఐ= అయి; మెఱయఁగాన్= ప్రకాశింపగా; చతుర్దంత= నాలుగు దంతాలయొక్క; రుచి= కాంతితో; స్ఫీతము= గొప్పది; అగు; గజము= ఏనుగు; క్రియన్= వలె; ఆతత= విశాలమయిన; కురుసైన్య= కౌరవసేనయనెడి; సరసియందున్= సరోవరమునందు; చరించున్= సంచరించును.

తాత్పర్యం: తెల్లనిగుఱ్ఱాల శక్తి ప్రకాశవంతమై వెలుగుతుండగా అర్జునుడు చతుర్దంతాల కాంతితో వెలుగొందే ఐరావతం అనే ఏనుగువలె విశాలమైన కౌరవసైన్యమనే సరోవరంలో సంచరిస్తాడు. (ఏనుగు సరోవరాన్ని కలచివేసేటట్లు అర్జునుడు కురుసేనను నశింపచేస్తాడని భావం.)

విశేషం: రూపకానుప్రాణిత ఉపమాలంకారంతో ఈ పద్యం అలంకరింపబడింది. కురుసైన్యమనెడి సరసి - రూపకం. కురుసైన్యమునకు సరోవరమునకు అభేదం. (ఉపమాన ఉపమేయములకు అభేదకల్పనం రూపకం) ఇక నరుడు - ఉపమేయం, గజము - ఉపమానం; క్రియన్ - ఉపమావాచకం; చరించున్ - సమానధర్మం. పూర్ణోపమ.

అర్జునుడి రథమునకు గల శ్వేతాశ్వములు నాలుగు. ఇంద్రుడి ఏనుగు ఐరావతమునకు దంతములు నాలుగు. అందువలన చతుర్దంతి అని పేరు. నాలుగు అశ్వములు తెల్లనివి. నాలుగు దంతములు తెల్లనివి. ఐరావతం తెల్లనిది. చతుర్దంత పదప్రయోగంతో అశ్వసంఖ్య, శ్వేతాశ్వపదప్రయోగంతో ఐరావతవర్ణం సూచితాలు. ఇది తిక్కనగారి శ్లేషవ్యంగ్య చమత్కారం. మూలంలో మూడు శ్లోకాలు కలవు. ఆ మూడు శ్లోకాల తాత్పర్యార్థాన్ని తిక్కన ఈ కందంలో రమణీయముగా పొదిగాడు.

'శ్వేతాశ్చ వేగ సంపన్నాః శశికాశ సమప్రభాః । పిబంత ఇవ చాకాశం రథే యుక్తాస్తు వాజినః ॥
గాహమాన మనేకాని మహేంద్రసదృశప్రభమ్ । ధనంజయ మపశ్యామ చతుర్దంష్ట్ర మివ ద్విపమ్ ॥

విక్షోభయంతం సేనాంతే త్రాసయంతం చ పార్థివాన్ । ధనంజయ మపశ్యామ నలినీమివ కుంజరమ్ ॥ (శల్య ॥ప ॥ అధ్యా 4) (శ్లో 20, 23, 24)

క. జ్యారవము నాదముగ నతి । ఘోరత వైరులను కరటికోటికి రయదు
ర్వారం బగు నర్జున కం । ఠీరవము శితాస్త్రనఖపటిష్ఠతఁ జూపున్. 47

ప్రతిపదార్థం: వైరులు= శత్రువులు; అను= అనెడి; కరటి= ఏనుగులయొక్క; కోటికిన్= గుంపునకు; జ్యా= వింటినారియొక్క; రవము= ధ్వని; అతిఘోరతన్= మిక్కిలి భయంకరమగు; నాదముగన్= ధ్వనికాగా (అనగా గర్జనముకాగా); రయ= వేగంచేత; దుర్వారంబు= నివారింపశక్యముకానిది; అగు= అయినట్టి; అర్జున= అర్జునుడు అనెడి; కంఠీరవము= సింహము; శిత= వాడియైన (అనగా తీక్షణమైన); అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములనెడి; నఖ= గోళ్ళయొక్క; పటిష్ఠతన్= గట్టితనమును (అనగా పటుత్వమును); చూపున్= చూపించును.

తాత్పర్యం: శత్రువులు అనే ఏనుగుల గుంపునకు వింటినారియొక్క ధ్వని అతిభయంకరమైన ధ్వనికాగా - వేగంచేత, బలంచేత నివారింప శక్యంకాని అర్జునుడు అనే సింహం వాడి అయిన మంత్రాస్త్రా లనెడి గోళ్ళయొక్క పటుత్వాన్ని చూపిస్తుంది.

విశేషం: ఇది రూపకముల మయము. జ్యారవమునకు - సింహగర్జనమునకు; వైరులకు; కరటికోటికి-అర్జునునకు-కంఠీరవమునకు; శితాస్త్రములకు - నఖములకు; అభేదకల్పనముతో తిక్కన దీనిని రచించాడు. 'రయ' శబ్ద ప్రయోగం అర్థ గాంభీర్య చమత్కార జనకం. రయము= వేగము; రయము= బలము అని రెండర్థములు. ఇచ్చట ఈ రెండర్థములూ సాభిప్రాయములు. అర్జునుడు యుద్ధవిద్యలో వేగమునందు-బలమునందు అనితరసాధ్యుడు. అట్లే సింహం ఏనుగులవేటలో వేగమునందు - బలము నందు అనితరసాధ్యం. సింహగర్జనం ఏనుగులకు అతి భయంకరమైనది. అర్జునుడి జ్యారవము - శత్రువులకు అతిభయంకరమైనది. సింహనఖములు అతిపటుతరములు; అర్జునుని అస్త్రములు మహామంత్రపూతములు. సింహము గర్జించి ఏనుగుల గుంపును చెదరగొట్టి, నఖములతో కుంభస్థలములను చీల్చుతుంది. (సింహగర్జనను స్వప్నంలో విన్నను ఏనుగు మరణిస్తుందని లోకవ్యవహారం.) అర్జునకంఠీరవ పదప్రయోగంతో తిక్కన అర్జునుడి అద్భుత పరాక్రమ పరోక్షచిత్రణం- ఈ కందమున సుందరంగా తీర్చాడు. 'త్రాసయంతం తథా యోధాన్ ధనుర్ఘోషేణ పాండవమ్ । భూయ ఏనమపశ్యామ సింహం మృగగణానివ' ॥ ఇది దీనికి మూలం. (శల్య ॥ అధ్యా-4, శ్లో-25)

తే. అర్జునోదగ్ర దవశిఖ హరిమహాని । లంబు ప్రేరేఁప వైరిబలప్రకీర్ణ
గహనదహనవిహార ముగ్రముగఁ జలుపఁ । దేటి చూడను రాకున్కి దెల్ల మధిప! 48

ప్రతిపదార్థం: అధిప!= దుర్యోధనా!; అర్జున= అర్జునుడు అనెడి; ఉదగ్ర= భయంకరమయిన; దవశిఖ= దవాగ్ని జ్వాల (అనగా అడవులను కాల్చు అగ్ని); హరి= శ్రీకృష్ణుడు అనెడి; మహా= గొప్ప; అనిలంబు= వాయువు; ప్రేరేఁపన్= ప్రేరేపించగా (అనగా రెచ్చగొట్టగా); వైరి= శత్రువులయొక్క; బల= సైన్యమనెడి; ప్రకీర్ణ= వ్యాపించిన; గహన= అడవియొక్క; దహన= అగ్నియొక్క; విహారము; ఉగ్రముగన్= భయంకరముగ; చలుపన్= చేయగా; తేటి= తేరిపార; చూడను= చూచుటకు కూడ; రాకున్కి= వీలుకాదనుట; తెల్లము= స్పష్టము.

తాత్పర్యం: అర్జునుడు అనే భయంకరమయిన దవాగ్నిజ్వాల - శ్రీకృష్ణుడు అనే మహావాయువు ప్రేరేపించగా శత్రుసైన్య మనెడి వ్యాపించిన అటవీదహన విహారాన్ని శత్రువులకు తేరిపార చూడటానికి కూడా వీలుకాదనడం స్పష్టం.

విశేషం: అలం: రూపకం. అర్జునుడు దవాగ్నిజ్వాల; అర్జున దవాగ్నిజ్వాల శత్రుసైన్యమనే గహనాన్ని దహనవిహారం చేస్తున్నది. ఆ విహారాన్ని తేరిచూడ శక్యంగాదు. - శ్రీకృష్ణుడు - మహానిలము; శత్రుసైన్యము - గహనం (అరణ్యము); ఈ ఉపమాన ఉపమేయములకు అభేదము.

ఉ. ద్రోణుఁడు సూతనందనుఁడు ద్రోణ తనూజుఁడు నేను శల్యుడుం
ద్రాణపరాయణత్వమున దర్పము సూపఁగఁ నీవుఁ దమ్ములున్
బాణపరంపరల్ గురియ ఫల్గునుఁ డందఱ మీఱి సైంధవ
ప్రాణము నాఁచికోలు నరపాల! తలంపఁగ మర్త్యకృత్యమే! 49

ప్రతిపదార్థం: ద్రోణుఁడు; సూతనందనుఁడున్= కర్ణుడు; ద్రోణ తనూజుఁడున్= ద్రోణుడి కుమారుడు అశ్వత్థామ; నేను= నేనును(కృపాచార్యుడు); శల్యుఁడున్= శల్యుఁడును; త్రాణపరాయణత్వమునన్= (సైంధవుడిని) రక్షించటంలో గల ఆసక్తితో; దర్పము= గర్వం; చూపఁగ= చూపించగ; నీవున్= నీవును (దుర్యోధనుడవు అయిన నీవును); తమ్ములున్= తమ్ములును (దుశ్శాసనాదులును); త్రాణ= రక్షించుటయందలి; పరాయణత్వమునన్= ఆసక్తితో; బాణ= బాణములయొక్క; పరంపరల్= వరుసలు (అనగా ఒక దాని తరువాత ఒకటిగా); కురియన్= కురిపించగా; ఫల్గునుఁడు= అర్జునుడు; అందఱన్= మనలనందరను; మీఱి= మించిపోయి; సైంధవప్రాణము= సైంధవుని యొక్క ప్రాణము; నాఁచికోలు= అపహరణం; నరపాల!= నరులను పాలించు దుర్యోధనా!; తలంపఁగన్= ఆలోచింపగ; మర్త్య= మానవులకు సాధ్యమయిన; కృత్యమే!= కార్యమా! (కాదు అని అర్థం)

తాత్పర్యం: ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ, నేను, శల్యుడు, నీవు నీ తమ్ములు సైంధవుడి రక్షణ అందలి అనురక్తితో బాణపరంపరలు కురిపిస్తున్నా ఒక్క అర్జునుడు మనలనందరిని మించిపోయి సైంధవుడి ప్రాణం అపహరించాడు. దుర్యోధనా! ఆలోచించి చూడగా అది మానవసాధ్యమయిన కార్యమా? కాదుసుమా!

ఉ. ఇంతకుమున్ను సెల్లెఁ బదియేడుదినంబుల సంగరం బతి
శ్రాంతతఁ గుంది రిందుఁ గలసైనికు లద్దెసఁ గల్గుయోధు లా
క్రాంత విరోధిదర్పుఁడు పురందరనందను బల్మికల్మి ని
శ్చింతత నుల్లసిల్లెదరు చెక్కు చెమర్పక కౌరవేశ్వరా! 50

ప్రతిపదార్థం: కౌరవ= కౌరవులకు; ఈశ్వరా!= ప్రభువు అయిన దుర్యోధనా!; ఇంతకుమున్ను= ఇంతకుముందు; పదియేడు; దినంబుల= రోజుల; సంగరంబు= యుద్ధము; చెల్లెన్= సాగింది; ఇందున్= ఇందు(కౌరవపక్షమున); కల= ఉన్నట్టి; సైనికులు= సేనలు; అతి= మిక్కిలి; శ్రాంతతన్= అలసిపోవుట వలన; కుందిరి= క్రుంగిపోయిరి(బలహీనులు అయిపోయారు); ఆ+దెసన్= ఆ దిక్కునందు(ఆ పాండవపక్షమున); కల్గు= ఉన్నట్టి; యోధులు= యుద్ధవీరులు; ఆక్రాంత= ఆక్రమించబడిన; విరోధి= శత్రువులయొక్క; దర్పుఁడు= గర్వముకలవాడు అయిన; పురందర= ఇంద్రునియొక్క; నందను= కుమారునియొక్క (అర్జునునియొక్క); బల్మికల్మిన్= శత్రువులను జయించగల శక్తి సంపదవలన; చెక్కుచెమర్పక= కొంచెం కూడా అలసటలేకుండగా (చెక్కిలి చెమటపట్టకుండా - అనగా అశ్రమంగా); నిశ్చింతతన్= ఏ విధమయిన విచారములేకుండగా; ఉల్లసిల్లెదరు= సంతోషంతో ఒప్పారుతారు.

తాత్పర్యం: దుర్యోధనా! ఇంతకుముందు పదియేడు దినాల యుద్ధం అయిపోయింది. మన సైనికులు అలసి సొలసి క్రుంగిపోయి ఉన్నారు. ఆ వైపు పాండవ పక్ష యోధులు శత్రుదర్పాన్ని నిర్మూలించే ఇంద్రతనయుడైన అర్జునుడి బలం కలిగి ఉన్నందున చెక్కు చెమర్పకుండా ఏ విధమయిన విచారం లేకుండా అమితానందం కలిగి ఉన్నారు.

క. బలవిక్రమ ఘనులగు దొర । లిలిగిన మనసేన మేదినీశ్వర! విను క
న్నులు సెడినట్లున్నది యీ । కొలఁదిం బొరిగొనుట నరునకున్ సుకరమగున్॥' 51

ప్రతిపదార్థం: మేదినీ= భూమికి; ఈశ్వర!= ప్రభువు అయిన దుర్యోధనా!; విను; బల= బలమునందు; విక్రమ= పరాక్రమమునందు; ఘనులు= గొప్పవారు; అగు= అయినట్టి; దొరలు= ప్రభువులు (అనగా సైన్యాధ్యక్షులయిన భీష్మ, ద్రోణ, కర్ణులు); ఇలిగినన్= మరణించగా; మనసేన= మనయొక్క సైన్యము; కన్నులు= నేత్రములు; చెడినట్లు= చెడిపోయినట్లు (గ్రుడ్డిది అయినట్లు) ఉన్నది= ఉన్నది. (అనగా సేనను నడిపించు సేనాపతులు లేక మనసేన గ్రుడ్డిదానివలె ఉన్నదని తాత్పర్యం); ఈకొలఁదిన్= ఈ తక్కువసేనను; పొరిగొనుట= చంపుట; నరునకున్= అర్జుననకు; సుకరము= సులభము; అగున్= అగును.

తాత్పర్యం: ఓ దుర్యోధనా! వినుము. బలపరాక్రమవంతులైన భీష్మ, ద్రోణ, కర్ణులు మరణించిన తరువాత మనసేన సేనాపతులు లేక గ్రుడ్డిది అయినట్లున్నది. అర్జునుడికి ఈ తక్కువసేనను సంహరించటం మిక్కిలి సులభం సుమా!'

వ. అని చెప్పి కృతవర్మ శల్య గురుపుత్రులను దన్ను నెన్ని. 52

ప్రతిపదార్థం: అని; చెప్పి; కృతవర్మ; శల్య; గురుపుత్రులను= అశ్వత్థామలను; తన్నున్= తనను; ఎన్ని= పరిగణించి (అనగా ఎంపికచేసి.

తాత్పర్యం: కృపాచార్యుడు ఈ విధంగా కౌరవపాండవపక్ష బలాబలాలను గూర్చి దుర్యోధనుడికి చెప్పి, కృతవర్మ, శల్య, అశ్వత్థామలనూ- తననూ ఎంపిక చేసి.

క. దామోదరు తమ్ముండును । భీముఁడు నిరుగెలఁకులందుఁ బేర్చి తఱుమ ను
ద్దామగతి నడరు కవ్వడి । కే మిందఱుఁ దలఁప నొక్క యెత్తుకుమారా! 53

ప్రతిపదార్థం: కుమారా!= దుర్యోధనా!; తలఁపన్= ఆలోచించగా; దామోదరు= శ్రీకృష్ణునియొక్క; తమ్ముండును= తమ్ముడు అయిన సాత్యకియును; భీముఁడును= భీముడును; ఇరు= రెండు; కెలఁకులందున్= ప్రక్కలయందును; పేర్చి= విజృంభించి; తఱుమన్= వెంబడించి పరుగెత్తించగా; ఉద్దామ= అడ్డులేని; గతిన్= గమనముతో; అడరు= విజృంభించి బాణములు ప్రయోగించు; కవ్వడికిన్= అర్జుననకు; ఏము= మేము; ఇందఱున్= ఇంతమందిమి (అనగా ఈ కృతవర్మ, శల్యుడు, అశ్వత్థామ, నేనుకూడా); ఒక్క; ఎత్తు= సమానము. (మేమందరము ఒక్క అర్జునుడితో సమానమని తాత్పర్యం.)

తాత్పర్యం: కుమారా! శ్రీకృష్ణుడి తమ్ముడు సాత్యకి, భీముడు, అర్జునుడి రథానికి రెండుప్రక్కల నుండి విజృంభించి వెంటాడి తరుముతుండగా అడ్డులేని విధంగా బాణాలు ప్రయోగించే అర్జునుడు ఒక ఎత్తు, మేమందరం ఒక ఎత్తు.

విశేషం: తిక్కన ఒక్క అర్జునుడి పౌరుష పరాక్రమాలనే ఈ సన్నివేశంలో 46వ పద్యం మొదలు 53వ పద్యం వరకు ఏడు పద్యాలలో బహుభంగుల సాలంకారంగా అభివర్ణించాడు. వ్యాసభగవానులు ఈ సందర్భంలో భీముడి సింహనాదాన్నీ, శ్రీకృష్ణుడి పాంచజన్యనిస్వనాన్నీ, అర్జునుడి గాండీవ నిర్ఘోషాన్నీ కలగలిపి ఒక్క శ్లోకంలో ప్రణవనాదాన్ని వినిపించాడు.

చ. అనిలసుతుండు పూన్కి బలుపారఁగఁ గొండొక దీర్చె నేపు నొం
దిన భుజసంపదం గొఱఁత దీర్పఁగ నింకఁ గడంగకుండునే?
మనకు నజాతశత్రుని సమంచితమార్దవ మూఁది సంధి సే
య నుచితమైన కాలమిది యాగ్రహముం జొరనీకు చిత్తమున్. 54

ప్రతిపదార్థం: అనిలసుతుండు= వాయువు కొడుకైన భీముడు; పూన్కి= పూనిక-ఉద్యమము; బలుపు= బలము; ఆరఁగన్= ఒప్పగా; కొండొక= కొంచెము; తీర్చెన్= చక్కదిద్దెను; ఏపును= ఆధిక్యమును; ఒందిన= పొందిన; భుజసంపదన్= భుజబలముతో; కొఱఁత= మిగిలినలోటు; తీర్పఁగన్= చక్కబరుచుటకు; ఇంకన్= ఇంక; కడంగక= ప్రయత్నింపకుండగ; ఉండునే?= ఉండునా? (ఉండడు అని భావం.); మనకున్= మనకు; అజాతశత్రుని= ధర్మరాజుయొక్క; సమంచిత= ఒప్పిన; మార్దవము= మృదుత్వము; ఊఁది= లేపి; సంధి; చేయను= చేసికొనుటకు; ఇది; ఉచితము= తగినది; ఐన= అయినటువంటి; కాలము= సమయము; చిత్తమున్= మనసునందు; ఆగ్రహమున్= కోపమును; చొరనీకు= ప్రవేశించనీయకుము - పాండవులయెడల మనసునందు ఆగ్రహమును చొరనీయకుము.

తాత్పర్యం: భీముడు తన ఉద్యమాన్ని కొంచెం నెరవేర్చాడు. ఇంకా తన అధికమైన భుజబల సంపదతో మిగిలిన లోటును చక్కబరచటానికి ప్రయత్నించకుండా ఉండడు. అందువలన ఒప్పిన ధర్మరాజుయొక్క మార్దవ లక్షణాన్ని వినియోగించుకొని, సంధి చేసికోవటాని కిది మంచి సమయం. ఇట్లా చెప్పుతున్నందులకు నా యెడల నీ మనసులో కోపం ప్రవేశించనీయకుము. పాండవుల విషయంలో కూడా నీ మనసులో ఆగ్రహమును ప్రవేశించనీయకుము.

విశేషం: 'నాడు ద్రౌపది వస్త్రాపహరణ సమయంలో కౌరవసభలో భీముడు రెండు శపథాలు చేశాడు. ఒకటి దుశ్శాసనుడి వక్షఃస్థలమును చీల్చి చంపటం. దానిని చక్కదిద్దాడు. అనగా నెరవేర్చాడు. ఇక రెండవది దుర్యోధనుడి తొడలు విరుగగొట్టి చంపటం. దానిని చక్కబరచవలసి ఉన్నది. ఆ శపథమును ఏపుమీఱిన తన భుజబలంతో నెరవేర్చకుండా ఉండడు. భీముడు నీ తొడలు విరుగగొట్టి తప్పకుండా చంపగలడు. అందువలన ధర్మజుడిని ఆశ్రయించి సంధి చేసికొనుము', ఇది ఈ పద్యంలోని భావం.

క. సమరము నిష్కారణవై । రమునం బాటిల్లె నెల్ల రాజులు భరతో ।
త్తములును మడిసిరి విడు కో । పము; దీర్ఘక్రోధుఁడైనపతి కీడొందున్. 55

ప్రతిపదార్థం: సమరము= యుద్ధము; నిష్కారణ= కారణములేని; వైరమునన్= శత్రుత్వము వలన; పాటిల్లెన్= కలిగెను; ఎల్లరాజులున్= అందరు రాజులు; భరత= భరతవంశమునందలి; ఉత్తములును= శ్రేష్ఠులును; మడిసిరి= మరణించిరి; కోపము; విడు= విడిచిపెట్టుము; దీర్ఘక్రోధుఁ డైనపతి; ఎడతెగని కోపం కలిగినవాడు; అయినట్టి; రాజు; కీడు= నాశనము; ఒందున్= పొందును.

తాత్పర్యం: ఈ యుద్ధం కారణంలేని శత్రుత్వంవలన కలిగింది. సమస్త రాజులు, భరతవంశంలోని శ్రేష్ఠులు మరణించారు. అందువలన ఇక కోపం విడిచిపెట్టుము. దీర్ఘక్రోధుడైన రాజు నాశనమౌతాడు.

క. తమకు బలం బెక్కినతఱి । సముచితమగు విగ్రహంబు శత్రుల కుత్సా
హము మీఱినపుడు గర్త । వ్యము సంధి యనంగ విందు మార్యులచేతన్. 56

ప్రతిపదార్థం: తమకున్; బలంబు; ఎక్కిన తఱిన్= అధికముగా ఉన్న సమయమున; విగ్రహంబు= యుద్ధము; సముచితము= తగినది; అగున్; శత్రులకున్= విరోధులకు; ఉత్సాహము; మీఱినపుడు= అతిశయించినపుడు; సంధి= యుద్ధవిరమణకు తగిన ఒప్పందము; కర్తవ్యము= తప్పకచేయతగినది; అనంగన్= అని; ఆర్యులచేతన్= పూజ్యులైన పెద్దలచేత; విందుము= వినుచుందుము.

తాత్పర్యం: తమకు శక్తిసామర్థ్యాలు అధికంగా ఉన్నప్పుడు యుద్ధం తగినది. శత్రువులకు ఉత్సాహం అధికంగా ఉన్నప్పుడు సంధి చేసికొనటం కర్తవ్యం. ఈ న్యాయం పూజ్యులైన పెద్దలచే చెప్పబడగా వింటాము. కావున, సంధి చేసికొనటం ఉచితం కదా!

విశేషం: 'హీయమానేన వై సంధిః పర్యేష్టవ్యం సమేన వా విగ్రహో వర్ధమానేన మతి రేషా బృహస్పతేః' (మూలం)

క. కలవారెల్లను దెగి నీ । తలన నిలిచెఁ గార్య మధిప! తగ నొడఁబడు మి
ట్టలమగు నాత్మవినాశము । కలుగుట యది విపులపాతకం బండ్రు బుధుల్. 57

ప్రతిపదార్థం: అధిప!= ప్రభువా! దుర్యోధనా!; కలవారు= ఉన్నవారు; ఎల్లను= అందరును; తెగి= మరణించగా; నీతలన= నీయందే; కార్యము= సంధికార్యం; నిలిచెన్= శేషించి ఉన్నది; తగన్= ఒప్పుగా; ఒడఁబడుము= సంధికి సమ్మతించుము; ఇట్టలము= అధికము; అగు= అయినట్టి; ఆత్మవినాశము= తనయొక్క వినాశము; కలుగుట= కలిగినందువలన; బుధుల్= పండితులు (అనగా ధర్మజ్ఞానము కలవారు); అది; విపుల= మిక్కిలి; పాతకంబు= పాపము; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ఓ దుర్యోధనా! నీ పక్షాన ఉన్నవారందరు మరణించారు. అందువలన కర్తవ్యం నీ పక్షాన శేషించి ఉన్నది. కావున సంధికి సమ్మతించుము. అధికమయిన ఆత్మవినాశం మహాపాతకమని ధర్మజ్ఞానులయిన బుధులు చెప్తుతూ ఉంటారు.

క. తనకై కాదే! మదినె । ల్లను గోరుట వినుము దాఁ బ్రళయమొందెన యే
నిని వారని యుద్యోగం । బునకు ఫలంబేమి? రాజపుంగవ! చెపుమా! 58

ప్రతిపదార్థం: రాజపుంగవ!= రాజులలో శ్రేష్ఠుడవు అయిన దుర్యోధనా!; మదిన్= మనసునందు; ఎల్లను= సమస్తమును (అనగా సమస్త రాజ్యసంపదను); కోరుట= కోరుకొనుట; తనకై= తన కొరకు; కాదే!= కాదా! - (తన కొరకే అని తాత్పర్యము); వినుము; తాన్= తాను (మదిలో సమస్త రాజ్యమును కోరుకొను తానే); ప్రళయము= గొప్ప నాశము; ఒందెనయేనిని= పొందినచో; వారని= ఆగని; ఉద్యోగంబునకున్= యుద్ధ ప్రయత్నమునకు; ఫలంబు= ప్రయోజనము; ఏమి?= ఏమి ఉన్నది?; చెపుమా!;

తాత్పర్యం: ఓ దుర్యోధనా! మదిలో సమస్త రాజ్యసంపదను తన కొరకే కోరుకొనేవాడు తానే నాశనం పొందినపుడు ఈ యుద్ధప్రయత్నంవలన ప్రయోజనం ఏమున్నది చెప్పుము? (ఆత్మవినాశనం వలన ప్రయోజనమేమీ లేదు. అందువలన సంధియే అవశ్యకర్తవ్య మనటం తాత్పర్యం.)

విశేషం: 'దుర్యోధనా! పాండవులకు దాయభాగం దక్కకుండా సమస్త రాజ్యసంపదను నీవే పొందవలె నని ఈ యుద్ధాన్ని ప్రారంభించావు. ఇపుడు నీవే వినాశం పొందినట్లయితే, ఇక ఈ యుద్ధంవలన నీకు ప్రయోజన మేమి? ఏమీ లేదు. అందువలన యుద్ధాన్ని విరమించి సంధికి ఒడంబడుము.' ఇది కృపాచార్యుడి హితోపదేశ సారాంశం.

క. నినుఁ గాచికొనుము నీ వు । న్నను సర్వమ గల్గు ధర్మనందనునిఁ దగం
గను మతఁడు రాజునని తన । మనమున నెక్కించుకొనఁడు మదగర్వంబుల్. 59

ప్రతిపదార్థం: నినున్= నిన్ను; కాచికొనుము= రక్షించుకొనుము; నీవు; ఉన్నను= ఉన్నచో (అనగా బ్రతికి ఉన్నచో); సర్వము+ అ= సమస్తమును; కల్గును= లభించును; ధర్మనందనునిన్= ధర్మరాజును; తగన్= ఒప్పుగా; కనుము= చూడుము; అతఁడు; రాజను= నేను రాజును; అని; తన= తనయొక్క; మనమునన్= మనసునందు; మదగర్వంబుల్= మదమును, గర్వమును; ఎక్కించుకొనఁడు= ప్రవేశింపనీయడు.

తాత్పర్యం: నిన్ను రక్షించుకొనుము. నీవు జీవించి ఉంటే నీకు సర్వసంపదలు కలుగుతాయి. ధర్మజుడిని మంచిగా చూడుము. అతడు 'నేను రా'జను మద గర్వాలతో నిండిన భావాలను తన మనసునందు ప్రవేశించనీయడు. అందువలన యుద్ధాన్ని విరమించి సంధి చేసికొనుము.

విశేషం: 'అతడు రాజునని తన మనమున నెక్కించుకొనడు మదగర్వంబుల్' - ధర్మజుడు నీవలె 'నేనే రాజును' అనే మదగర్వాలు తన మనస్సులో ఎక్కించుకొనడు- అనే తాత్పర్యార్థంతో కృపుడు దుర్యోధనుడికి బుద్ధి చెప్పటం గ్రహించవచ్చును.

తే. రాజ్యభాగంబు దగ ధృతరాష్ట్రునకును । నీకు నన్నదమ్ములకు నా నృపతి యొసఁగు
నాతఁ డెపుడు శుశ్రూష సేయంగఁ గోరు । గురుజనములకుఁ గావునఁ గూడుటొప్పు. 60

ప్రతిపదార్థం: ఆ నృపతి= ఆ ధర్మరాజు; రాజ్యభాగంబు= సామ్రాజ్యమందలి వంతు; తగన్= ఒప్పుగా; ధృతరాష్ట్రునకును; నీకును; అన్నదమ్ములకును; ఒసఁగున్= ఇచ్చును; ఆతఁడు; ఎపుడున్= ఎల్లపుడు; గురుజనములకున్= పెద్దలకు (అనగా గాంధారీ ధృతరాష్ట్రులకు); శుశ్రూష= సేవ; చేయంగన్= చేయటానికి; కోరున్= కోరుచుండును; కావునన్= అందువలన; కూడుట= సంధిచేసికొని వారితో కలిసియుండుట; ఒప్పు= ధర్మము (న్యాయసమ్మతము).

తాత్పర్యం: ఆ ధర్మరాజు రాజ్యభాగాన్ని ధృతరాష్ట్రుడికి, నీకు, తోడబుట్టువులకు తప్పక ఇస్తాడు. ఆ ధర్మరాజు ఎల్లప్పుడూ పెద్దలకు సేవ చేయాలనే ఉత్సాహం చూపుతూ ఉంటాడు. అందువలన సంధి చేసికొనుట న్యాయసమ్మతం.

విశేషం: ఈ పద్యం ధర్మరాజు స్వభావాన్ని తెలుపుతుంది. ధర్మరాజు రాజ్యభాగం తమ్ములకు ఇస్తాడన్న సందర్భంలో తమ్ములంటే భీమార్జున నకుల సహదేవులు.

చ. హరియును గా దనండు గరుణాన్వితులై తగ నమ్మహాత్ము లె
ప్పరుసునఁ గార్యనిశ్చయము పల్కినఁ గీచకవైరియుం బురం
దరతనయుండునుం గవలు దానికి మార్పులుకంగ నెమ్మెయిం
జొర రగు సంధియెట్లు ననసూయత నూల్కొని చేయు మిత్తఱిన్. 61

ప్రతిపదార్థం: హరియును= శ్రీకృష్ణుడును; కాదు; అనండు; ఆ మహాత్ములు; ఆ గొప్పవారు (అనగా పూజ్యులు అయిన ఆ శ్రీకృష్ణధర్మజులు); కరుణా= దయతో; అన్వితులై= కూడినవారై; ఏ+పరుసునన్= ఏ విధంగా; కార్య నిశ్చయము= సంధి కార్యంయొక్క నిర్ణయం; తగన్= ఒప్పునట్లుగా; పల్కినన్= చెప్పినా; కీచకవైరియున్= కీచకునకు శత్రువు అయిన భీముడును; పురందర= మహేంద్రునియొక్క; తనయుండునున్= కుమారుడైన అర్జునుడును; కవలు= కవలపిల్లలైన నకుల సహదేవులును; దానికిన్; మాఱు= మరొకవిధంగా; పలుకంగన్= చెప్పుటకు; ఏ+మెయిన్= ఏ విధముగాను; చొరరు= ప్రవేశించరు, ఒప్పుకొనరు; ఎట్లును= ఏ ప్రకారముగ నైనను; సంధి; అగున్= జరుగును; ఇత్తఱిన్= ఈ సమయమున; అనసూయతన్= అసూయ లేకుండా; నూల్కొని= ఒప్పుకొని; చేయుము= సంధి ప్రయత్నము చేయుము.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు కూడా సంధిని కాదనుడు. ఆ మహాత్ములైన శ్రీకృష్ణ ధర్మజులు ఏ విధంగా కార్య నిశ్చయం చేస్తారో దానికి విరుద్ధంగా భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు అడ్డుచెప్పరు. అందువలన ఈ సమయంలో అసూయ మాని సంధి ప్రయత్నం చేయుము. సంధి జరిగి తీరుతుంది.

విశేషం: కీచకుడు మత్స్యదేశాధీశుడైన. విరాటమహారాజునకు సేనాపతి. మహారాణి అయిన సుదేష్ణకు అన్నగారు. మహాబలశాలి. సూతరాజు కేకయుడి యొక్క పెద్ద భార్య మాలవిక గర్భమున, ఈ కీచకుడు, ఇతడి సోదరులు ఉపకీచకులు జన్మించారు. అజ్ఞాతవాసంలో ద్రౌపది సుదేష్ణ ఒద్ద సైరంధ్రిగా ఉన్నపుడు కీచకుడు ద్రౌపదిని మోహించి బలాత్కరించాడు. అది కారణంగా భీముడు కీచకుడిని, ఉపకీచకులను సంహరించాడు. అందువలన భీమునికి కీచకవైరి నామం సిద్ధించింది. ఈ నామం భీముడి బలపరాక్రమాలను ప్రకటిస్తున్నది. కాలేయుడనే మహాదైత్యుడి బాణముయొక్క అంశవలన కీచకుడు జన్మించాడు.

ఆ. ఇంత చెప్పు టనికి నేనోడి ప్రాణ ర । క్షణము సేసికొనుట గాదు నీకుఁ
బథ్యమనియుఁ దఱిమి పల్కితి విను విన । వేని నొచ్చి తలఁచె దిట్టులగుట. 62

ప్రతిపదార్థం: ఇంత= ఇదియంతయు; చెప్పుట; (అనగా ఇంతవరకు సంధికై నీకు హితము చెప్పుట); అనికిన్= యుద్ధమునకు; ఏను; ఓడి= భయపడి; ప్రాణరక్షణము= ప్రాణముయొక్క రక్షణము - కాపాడుటకు; చేసికొనుట= చేసికొనుటకు; కాదు (అనగా ప్రాణమును కాపాడుకొనుటకు కాదు); నీకున్= నీకును; పథ్యము= హితము; అనియున్= కలుగునని కూడ; తఱిమి= మఱిమఱి - వెంటపడి; పల్కితి= చెప్పితిని; విను; ((ప్రార్థనార్థకము); వినవు= వినిపించుకొనవు; ఏనిన్= అట్లయితే; ఇట్టులు= ఈ ప్రకారముగ; అగుట= అయినందులకు; నొచ్చి= బాధపడి; తలఁచెదు= చింతిస్తావు, పశ్చాత్తాపపడతావు.

తాత్పర్యం: ఇంతవరకూ నీకు ఈ విధంగా చెప్పటానికి కారణం నేను యుద్ధానికి భయపడి కాని, నా ప్రాణాన్ని రక్షించుకొనటానికి కాని కాదు. నీకు హితం శుభం కలుగాలని చెప్పాను. నా మాట వినుము. నా ఉపదేశం విననిచో, అయ్యో! ఇట్లయినదే అని ఆవల చింతిస్తావు.

వ. అని యగ్గౌతముండు శోకాయత్తచిత్తుం డగుచుం దనకు హితోపదేశంబు సేసిన విని దుర్యోధనుండు వేఁడి నిట్టూర్పు నిగిడించి యొక్కింత సేపు చింతాక్రాంతుండై యూరకుండి వ్రాల్చిన కనుదోయి విచ్చి యవ్విప్రవరు మొగంబు సూచి యిట్లనియె. 63

ప్రతిపదార్థం: అని; ఆ+గౌతముండు= ఆ కృపాచార్యుడు; శోక= దుఃఖమునకు; ఆయత్త= అధీనము అయిన; చిత్తుండు= మనసు కలవాడు; అగుచున్= అగుచు; తనకున్; హిత= క్షేమమును కలుగచేయు; ఉపదేశంబు= బోధ; చేసినన్= చేయగా;

విని; దుర్యోధనుండు; వేఁడినిట్టూర్పు; నిగిడించి= విడిచి; ఒక్కింతసేపు= కొంచెం సమయం; చింతాక్రాంతుండై= విచారం కలిగినవాడై; ఊరకుండి= మౌనంగా ఉండి; వ్రాల్చిన= వాలియున్న; కనుదోయి= రెండు కన్నులను; విచ్చి= తెరచి; ఆ విప్రవరు మొగంబు= ఆ బ్రాహ్మణ శ్రేష్ఠునియొక్క ముఖము (ఆ కృపాచార్యుని ముఖము); చూచి; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ కృపాచార్యుడు దుఃఖంతో నిండిన మనసు కలవాడై తనకు క్షేమకరమైన బోధ చేయగా విని, ఆ దుర్యోధనుడు వేడి నిట్టూర్పును విడుస్తూ కొంచెం సేపు విచారించి, వ్రాల్చిన కన్నులను తెరచి, ఆ కృపాచార్యుడి ముఖం చూచి ఇలా అన్నాడు.

విశేషం: ఈ వచనమున తిక్కనగారు ప్రయోగించిన 'విప్రవరుమొగంబు' అను పదము సాభిప్రాయం. 'విప్ర' శబ్దం బ్రాహ్మణ సామాన్యవాచకం కాదు. 'విప్రః వేదాధ్యయన సంపన్నః' అని ఆర్యోక్తి. విప్రుడు వేదాధ్యయన సంపన్నుడైన బ్రాహ్మణుడని ఆర్య వచనం. కృపాచార్యులు విప్రవరుడు. అథర్వవేదాధ్యయనంలో వరిష్ఠుడు. అథర్వవేదమునకు ఉపవేదము అయిన ధనుర్వేదవిద్యలో పారం ముట్టినవాడు.

కృపాచార్యులవారి తండ్రి శరద్వంతుడు, ధనుర్వేదవిద్యయందు పారంగతుడు. కృపుడు తండ్రి ఒద్ద ధనుర్వేదాన్ని అభ్యసించాడు. ద్రోణాచార్యుడు మాత్రం ఈ విద్యను పరశురాముడి యొద్ద అభ్యసించాడు. తిక్కన కృపాచార్యుడిని 'విప్రవరు' డనుట కిది తాత్పర్యం. మూలంలో ఈ సందర్భమునందు - వ్యాసభగవానులు ఈ పదాన్ని ప్రయోగించలేదు.

చ. 'చెడుటకు నోర్వ కీ విటులు చెప్పితి నాకు హితంబు నెయ్య మె
క్కుడు గలయట్టి చుట్టమునకున్ నయశిక్ష దగుం గదా! భరం
పడి బవరంబులం బెనఁగు భంగిని గార్యము దెల్పఁ జాలిన
ప్పడు నిను రక్షణార్థివని భూసురసత్తమ యే నెఱుంగుదున్!. 64

ప్రతిపదార్థం: భూసురసత్తమ!= బ్రాహ్మణులలో శ్రేష్ఠుడవైనవాడా!; చెడుటకున్= చెడిపోవుటకు; ఓర్వక= సహింపక; ఈవు= నీవు; ఇట్టులు= ఈ ప్రకారముగా; నాకున్; హితంబును= క్షేమమును గూర్చి; చెప్పితి(వి); నెయ్యము= స్నేహము; ఎక్కుడు= ఎక్కువగా; కలయట్టి= కలిగినట్టి; చుట్టమునకున్= బంధువునకు; నయశిక్ష= నీతిబోధ; తగున్= ఒప్పును; కదా!; భరంపడి= విజృంభించి; బవరంబులన్= యుద్ధములందు; పెనఁగు భంగిని= పోట్లాడునప్పుడు; కార్యము= చేయవలసిన పని; తెల్పన్+ చాలినప్పుడు= తెలియచేయవలసి వచ్చినప్పుడు; నినున్= నిన్ను; రక్షణార్థివి= రక్షణము కోరువాడవు; అని; ఏను; ఎఱుంగుదున్.

తాత్పర్యం: 'నేను చెడిపోవటం సహించలేక నీవు ఈ ప్రకారంగా నా క్షేమాన్ని గూర్చి చెప్పావు, స్నేహం ఎక్కువగా గల చుట్టానికి నీతిబోధ చేయటం ఒప్పును కదా! యుద్ధాలలో విజృంభించి పోట్లాడుకొనేటప్పుడు చేయతగిన పనిని తెలియచేయవలసి వచ్చినప్పుడు నిన్ను నా రక్షణం కోరేవాడవని - ఓ బ్రాహ్మణోత్తమా! నేను ఎరుగుదును.

వ. నీ కూర్మి పేర్మిం జేసి దొలఁగింపం జూచి సంధి కర్తవ్యంబని పలికితివి గాని యప్పలుకులు నాకు రుచియింప వెట్లంటేని. 65

ప్రతిపదార్థం: నీ కూర్మి= నీయొక్క స్నేహముయొక్క; పేర్మిన్= ఆధిక్యము; చేసి= చేత; తొలఁగింపన్= యుద్ధమునుండి తప్పింప; చూచి= తలచి; సంధి; కర్తవ్యంబు= చేయతగినపని; అని; పలికితివి= చెప్పితివి; కాని; ఆ పలుకులు= ఆ మాటలు; నాకున్; రుచియింపవు= ఇష్టము కావు; ఎట్లు= ఏ ప్రకారంగా; అంటి(వి)+ఏని= అంటావా.

తాత్పర్యం: నీకు నాయందు గల స్నేహం, గౌరవంవలన నన్ను ఈ యుద్ధంనుండి తొలగించదలచి సంధికార్యం ఆచరణీయమని చెప్పావు. కాని ఆ మాటలు నాకు రుచించవు - ఎందువలననంటావేమో!

సీ. **కపటంపు జూదంబు ఘటియించి రాజ్యంబు । గొని ధర్మజుని మది గుందఁ జేసి**
సభ కేకవస్త్ర రజస్వల నమ్మెయిఁ । బాంచాలి ముందల పట్టి యీడ్చి
సంధిసేయఁగఁ బూని శౌరి యేతెంచిన । నవ్విధంబున నప్రియం బొనర్చి
పలువురు గూడి సౌభద్రు నొక్కని బాలుఁ । గిట్టి యత్తెఱఁగున గీటడంచి

తే. **నేఁడు దుశ్శాసనుని ఱొమ్ము, నెత్తు రనిల । సుతుఁడు మదమునఁ ద్రావుట సూచి కొఱఁత**
ప్రతిన దీర్చు నతండని భయముఁ బొంది । పొందు గోరిన నదియేల పొసగుఁ జెపుమ? **66**

ప్రతిపదార్థం: కపటంపు జూదము= మాయాద్యూతము; ఘటియించి= కల్పించి; రాజ్యంబు; గొని= తీసికొని; ధర్మజుని= ధర్మరాజుయొక్క; మది= మనసు; కుందన్= క్రుంగిపోవునట్లు చేసి; సభకున్= కౌరవసభకు; ఏకవస్త్రన్= ఏకవస్త్రను; రజస్వలన్; పాంచాలిన్; ఆ+మెయిన్= ఆ విధంగా; ముందల= ముందుతలను(జుట్టును); పట్టి= పట్టుకొని; ఈడ్చి; (లాగి); సంధి; చేయఁగన్= చేయుటకు; పూని= పూనిక వహించి(ప్రయత్నించి); శౌరి= శ్రీకృష్ణుడు; ఏతెంచినన్= రాగా; ఆ విధంబునన్= ఆ విధముగా; అప్రియంబు= అనిష్టము; ఒనర్చి= చేసి; పలువురు= అనేకులు; కూడి= కలిసి (అనగా ద్రోణ, కర్ణ, శల్య, కృప, కృతవర్మ, అశ్వత్థామాదులు అనేకులు); బాలున్= పసివానిని; సౌభద్రున్= సుభద్ర కుమారుడయిన అభిమన్యుని; ఒక్కనిన్; కిట్టి= సమీపించి; ఆ తెఱఁగునన్= ఆ విధముగ; గీటడంచి= చంపి; నేఁడు= ఈనాడు; దుశ్శాసనుని= దుశ్శాసనునియొక్క; ఱొమ్ము= వక్షఃస్థలంయొక్క; నెత్తురు= రక్తము; అనిలసుతుఁడు= వాయువు యొక్క సుతుడు, భీముడు; మదమునన్= గర్వముతో; త్రావుట; చూచి; కొఱఁత= మిగిలిపోయిన; ప్రతిన= శపథము; అతండు= ఆ భీముడు; తీర్చును= నెరవేర్చగలడు; అని; భయమున్= భీతిని; పొంది; పొందు= సంధిని; కోరినన్= అభ్యర్థించినట్లయిన; అది= ఆ సంధి; ఏల= ఎందులకు; పొసఁగున్= కుదురుతుంది; చెపుమ?= చెప్పుము?

తాత్పర్యం: మాయాజూదాన్ని కల్పించి, రాజ్యాన్ని అపహరించి ధర్మరాజు మనసు క్రుంగదీసి, నిండు కౌరవసభలో ఏకవస్త్ర, రజస్వల అయిన ద్రౌపదిని జుట్టుపట్టి ఈడ్చి, సంధి చేయటానికి వచ్చిన శ్రీకృష్ణుడికి అనిష్టం కలిగించి, ద్రోణ, కర్ణ, శల్య, కృతవర్మ, అశ్వత్థామ మొదలైన అనేకులు కూడి బాలు డయిన అభిమన్యుడిని ఒంటరివాడిని చేసి చంపించి, దుశ్శాసనుడి వక్షఃస్థలం చీల్చి భీముడు గర్వంతో నెత్తురు త్రాగటం ఈనాడు ప్రత్యక్షంగా చూచి, నీ తొడలు విరుగగొట్టి చంపుతా' నని మిగిలిపోయిన రెండవ శపథం భీముడు నెరవేర్చగలడని భయపడి సంధికై పాండవులను అర్థిస్తే - అది ఏవిధంగా పొసగుతుంది? ఒప్పుతుంది? చెప్పుము.

ఉ. **రాజులు భక్తిఁ గొల్వఁగ ధరావలయం బఖిలంబు దర్పవి**
భ్రాజిత వృత్తి నేలి యనురక్తులఁ బ్రోచుచు శత్రుకోటికి
న్దేజము దప్పఁ జేయుచు నతిప్రమదంబున నున్న నాకు నిం
కాజియె కాక యొక్కని దయం గను రాజ్యసుఖంబు లేటికిన్? **67**

ప్రతిపదార్థం: రాజులు; భక్తిన్= భక్తితో; కొల్వఁగన్= సేవించుచుండగ; ధరావలయంబు= భూమండలము; అఖిలంబున్= సమస్తమును; దర్ప= గర్వముతో; విభ్రాజిత= ప్రకాశించుచున్న; వృత్తిన్= ప్రవర్తనతో; ఏలి= పరిపాలించి; అనురక్తులన్=

అనురాగముకలవారిని (అనగా నాయందు అనురాగము కలవారిని - నేను అనురాగముతో చూచువారిని); ప్రోచుచున్= రక్షిస్తూ; శత్రుకోటికిన్= విరోధి సముదాయమునకు; తేజము= ప్రకాశము(లేక) శక్తి; తప్పన్= తక్కువగా; చేయుచున్= చేస్తూ; అతిప్రమదంబునన్= మిక్కిలి సంతోషంతో; ఉన్న= ఉన్నటువంటి; నాకున్= నాకు; ఇంకన్; ఆజియె= యుద్ధమే; కాక; ఒక్కని= ఒకానొకడి (ఒక అల్పుడి); దయన్= దయవలన; కను= పొందెడి; రాజ్యసుఖంబులు= రాజ్యంవలన లభించు భోగములు; ఏటికిన్?= ఎందులకు?

తాత్పర్యం: రాజులందరు భక్తితో సేవిస్తుండగా ఈ సమస్త భూమండలాన్నీ గర్వంతో వెలిగే నడవడితో పరిపాలిస్తూ నాకు అనురక్తులయిన వారిని, నాయందు అనురాగం కలవారిని పోషిస్తూ శత్రుసమూహాలను శక్తిహీనులను చేస్తూ, అత్యంత సంతోషంతో ఉండే నాకు ఇంక యుద్ధమే అవశ్యకర్తవ్యం కాని, ఒకానొకడి దయవలన లభించే రాజ్యభోగాలు ఎందుకు?

విశేషం: 'ఒక్కని దయం గను రాజ్యసుఖంబు లేటికిన్' - ఈ ఒక్క మాటతో మహాకవి తిక్కన దుర్యోధనుడి హృదయాన్ని ఆవిష్కరించాడు. దుర్యోధనుడి మాటలన్నీ అతడెంతటి అభిమానధనుడో పట్టిచూపుతాయి.

వ. నిశ్చయం బిట్టిద యగుటం జేసి. 68

ప్రతిపదార్థం: నిశ్చయంబు= నిర్ణయము; ఇట్టిద= ఇదియే; అగుటంజేసి= అయినందువలన;

తాత్పర్యం: యుద్ధం చేయటమే నా నిర్ణయం అయినందువలన.

ఆ. పొడుతు నెట్లు పాండుపుత్రులతోఁ గయ్య । మేను నీవు దీనికియ్యకొనుము
పలుకు వినమి గాఁగఁ దలఁపకు ముచితంబు । తెఱఁగు ధీరజనుల కెఱుఁగరాదె? 69

ప్రతిపదార్థం: పాండు పుత్రులతోన్= పాండురాజుకుమారులతో; ఏను= నేను; కయ్యము= యుద్ధము; ఎట్లున్= ఎట్లయినను; పొడుతును= పోట్లాడుదును, చేస్తాను; దీనికి= ఈ నిర్ణయమునకు; నీవు; ఇయ్యకొనుము= అంగీకరింపుము; పలుకు= నీవు చెప్పినమాట; వినమి కాఁగన్= వినకపోవటంగా; తలఁపకుము= భావించకుము; ఉచితంబు= సరి అయిన; తెఱఁగు= మార్గం; ధీరజనులకున్= ధైర్యవంతులయిన మనుజులకు; ఎఱుఁగరాదె?= తెలియాలికదా?

తాత్పర్యం: నా నిర్ణయం పాండుపుత్రులతో యుద్ధం. నీవు దీనికి అంగీకరించాలి. నేను నీ మాట విననందులకు అన్యవిధంగా తలపవద్దు. సరి అయిన మార్గం ధైర్యవంతులైన మనుజులకు తెలియవలయును కదా!

చ. విభవమునుం బ్రతాపమును విశ్రుతకీర్తియు మాయ ధర్మపు
త్రభటసమానవృత్తమున దైన్యమునొందుట కోర్వరాదు వీ
తభయతఁ బోరఁ బేర్కొని యుదాత్తపదంబున కేఁగి భీష్మ కుం
భ భవ జయద్రథాదు లగు బంధులమిత్రులఁ గూడు టొ ప్పగున్. 70

ప్రతిపదార్థం: విభవమునున్= సమస్త సంపదయును; ప్రతాపమును= పరాక్రమమును; విశ్రుతకీర్తియున్= ప్రసిద్ధమయిన యశస్సును; మాయ= నశించిపోయేవే; ధర్మపుత్ర= యమధర్మరాజు పుత్రుడయిన ధర్మరాజుయొక్క; భట= యోధులతో; సమాన= సరితూగగలగునట్లు; వృత్తమునన్= ప్రవర్తించుటయందు; దైన్యమును= దీనత్వమును (దిక్కులేనితనమును);

ఒందుటకున్= పొందుటకు; ఓర్వన్= సహింప; రాదు; వీత= పోయిన; భయతన్= భీతితో; పోరన్= యుద్ధంలో; పేర్కొని= పిలిచి; ఉదాత్త= గొప్పదియైన; వదంబునకున్= స్థానమునకు - అనగా స్వర్గమునకు; ఏఁగి= వెళ్ళి; భీష్మ; కుంభభవ= ద్రోణుడు; జయద్రథ= సైంధవుడు; ఆదులగు= మొదలగు; బంధులన్= చుట్టములను; మిత్రులన్= స్నేహితులను; కూడుట= కలియుట; ఒప్పు= ఒప్పిదము (మంచిది); అగున్= అగును.

తాత్పర్యం: నా వైభవం, నా పరాక్రమం, నా ప్రసిద్ధమయిన కీర్తి, నిత్యం కావు, స్థిరం కావు. ధర్మపుత్రుడి యోధులతో సరితూగేటట్లు ప్రవర్తించటం దీనత్వాన్ని పొందటం సహించరానిది. అందువలన భీతిని విడిచి యుద్ధం చేయటం, స్వర్గానికి వెళ్ళి భీష్మ ద్రోణ జయద్రథాదులగు చుట్టాలను, స్నేహితులను కలియటం మంచిది అవుతుంది.

వ. అంత వలవ దిమ్మాట మగపాడి కాడితిం గాని. 71

ప్రతిపదార్థం: అంత= అంతవరకు; వలవదు= వలదు; ~~ఈ~~+మాట= ~~ఈ~~ పలుకు; మగపాడికిన్= పురుష ధర్మము తెలియుటకు; ఆడితిన్= పలికితిని; కాని= అంతియ కాని.

తాత్పర్యం: అంతవరకు వద్దు. ~~ఈ~~ మాట (స్వర్గానికివెళ్ళి, భీష్మద్రోణాదులను కలియటం మంచిది అనే మాట) పురుష ధర్మం తెలియటానికి చెప్పాను కాని. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. ఏను దెంపుచేసి యీ యున్నరథిక జ । నంబుతోడఁ గడఁగి నడవ బెట్టు
దఱిమి పాండురాజతనయుల మర్దింతు । ననఘ! నీవు మెచ్చునట్లు గాఁగ!' 72

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన కృపాచార్యా!; ఏను; తెంపు చేసి= సాహసం చేసి; ~~ఈ~~ ఉన్న= ఇక్కడ ఉన్నట్టి; రథికజనంబుతోడన్= రథ మధిరోహించి యుద్ధం చేయగల యోధులతో; కడఁగి= పూని; నడవన్= నడువగా (యుద్ధమునకు వెళ్ళగా); బెట్టు= బెడిదంగా-బాగా; తఱిమి; పారద్రోలి; పాండురాజు తనయులన్= పాండురాజు యొక్క కుమారులను; నీవు; మెచ్చునట్లు కాఁగన్= నీవు మెచ్చుకొనేవిధంగా; మర్దింతున్= చంపుతాను.

తాత్పర్యం: ఓ కృపాచార్యా! నేను సాహసం చేసి ఇక్కడ ఉన్నట్టి మహాయోధులైన రథికజనంతో యుద్ధానికి వెళ్ళి, నీవు మెచ్చుకొనేటట్లు ఆ పాండవులను తరిమి కొట్టి చంపుతాను.'

చ. అన విని చుట్టు నున్న నృపులందఱు సంతస మంది యన్నరేం
ద్రుని వినుతించి యోటమికి రోయుట నొందిన చింతవంత యె
ల్లను దిగఁ ద్రోచి నెమ్మనములన్ రణకౌతుక మావహిల్లు నా
ననములు దోఁప దర్పవచనంబుల సేనకు నుబ్బొనర్చుచున్. 73

ప్రతిపదార్థం: అనన్= అని చెప్పగా; విని; చుట్టును; ఉన్న= ఉన్నట్టి; నృపులు= రాజులు; అందఱున్; సంతసము; అంది= పొంది; ఆ+నరేంద్రుని= ఆ దుర్యోధనుని; వినుతించి= పొగడి; ఓటమికిన్= ఓడిపోయినందులకు; రోయుటన్= నిందలు పాలగుటాన్ని; ఒందిన= పొందిన; చింతన్, వంతన్= విచారాన్నీ, దుఃఖాన్నీ; ఎల్లను= అంతయును; దిగన్+త్రోచి= వదలిపెట్టి; నెమ్మనములన్= (నెఱ+మనములన్)= నిండుహృదయాలలో; రణ= యుద్ధమునందలి; కౌతుకము= కుతూహలము; ఆవహిల్లు= కలుగునట్టి; ఆననములు= ముఖములు; తోఁపన్= కనబడగా; దర్ప= గర్వముతో కూడిన; వచనంబులన్= పలుకులతో; సేనకున్= సైన్యమునకు; ఉబ్బు= ఉత్సాహము; ఒనర్చుచున్= కలిగించుచు.

తాత్పర్యం: 'ఈ రథిక జనంతో వెడలి యుద్ధంలో పాండురాజు తనయులను సంహరిస్తానని దుర్యోధనుడు చెప్పగా విని, చుట్టు గుమిగూడి ఉన్న రాజులందరు సంతోషం పొంది, దుర్యోధనుడిని పొగడి, ఓటమివలన కలిగిన నిందను పొందినందువలన ఏర్పడిన సమస్త దుఃఖాన్ని, బాధను విడిచిపెట్టి నిండు మనసులలో యుద్ధ కుతూహలం కలిగినట్టి ముఖాలు గోచరించగా గర్వంతో కూడిన పలుకులతో సైన్యానికి ఉత్సాహం కలిగిస్తూ. (తరువాతి, వచనంతో అన్వయం.)

దుర్యోధనుఁడు శిబిరంబు విడిచి సరస్వతీతీరంబు చేరుట (సం. 9-4-49)

వ. **చెలంగిన కృపకృతవర్మాశ్వత్థామ శకుని శల్యులు గార్యంబు విచారించి కౌరవేశ్వరు నాలోకించి 'మనమీరాత్రి శిబిరంబున నిద్రించుట యొప్పదెట్లనినఁ గర్ణుందెగటార్చుటం జేసి పేర్చినయుబ్బునఁ బాండవులు పైకొని పరాక్రమింప నప్పళింపఁ గలుగుఁ బో యని తలంచెదము. వినుము వంచనఁ దొలంగియుండి మనకుం గల చతురంగంబుల నాయితంబు సేసికొని పెనఁకువం బన్ని వారికి వెఱఁగగునట్టి బెట్టిదంపుటురవడిం గదిసి రణంబు సేయుద మట్లైన జయంబు గొనవచ్చు' నని చెప్పిన నవ్వసుమతీపతి ప్రీతుండై యది లెస్స వెర వట్ల చేయుదమని సముచితభంగిం దగువారల కెఱింగించి కదలి యచటికి రెండామడ యగు సరస్వతిపొంతం బయలికి బలంబులం గొని చని సకలజనవాహనసహితంబుగా నమ్మహానదియం దిచ్ఛానురూపస్నానపానంబు లాచరించి వలయు తెఱంగున వెనుక నడతెంచిన వివిధాహారంబులం దుష్టిఁ బొంది యిష్టాలాపంబులు సెల్లుచుండ నున్న సమయంబున ము న్నాకర్ణంబు నడపిన దొరలును జిత్రసేనాది భవత్కుమారులును గర్ణుకొడుకు సత్యసేనుండును లోనైన యాప్తజనంబు లమ్మనుజనాథున కి ట్లనిరి.** **74**

ప్రతిపదార్థం: చెలంగినన్= (రాజులు) విజృంభించగా; కృప= కృపుడు; కృతవర్మ; అశ్వత్థామ; శకుని; శల్యులు - ఈ అయిదుగురు; కార్యంబున్= చేయవలసి పనిని; విచారించి= బాగుగ ఆలోచించి; కౌరవేశ్వరున్= దుర్యోధనుడిని; ఆలోకించి= చూచి; మనము; ఈ రాత్రి; శిబిరంబునన్= శిబిరమునందు (సైన్యముండుచోటు); నిద్రించుట; ఒప్పదు= మంచిదికాదు; ఎట్లు; అనినన్; కర్ణున్= కర్ణుని; తెగటార్చుటన్= సంహరించటం చేత; పేర్చిన= విజృంభించిన; ఉబ్బునన్= సంతోషముతో; పాండవులు; పైకొని= మీదపడి; పరాక్రమింపన్= పరాక్రమము చూపుటకు; అప్పళింపన్= ప్రయత్నము; కలుగున్ పో= జరుగవచ్చునో; అని; తలంచెదము; వినుము; వంచనన్= మోసమునుండి; తొలంగి= తప్పించుకొని; ఉండి; మనకున్= మనకు; కల= ఉన్నట్టి; చతురంగంబులన్= చతురంగ బలములను (అనగా రథబలము- గజబలము- తురంగబలము - పదాతిబలము. ఈ నాలుగు సైన్యములందు గల బలములు.) ఆయితంబు= సిద్ధము; చేసికొని; పెనఁకువన్= యుద్ధమునకు; పన్ని= వ్యూహరచనచేసి; వారికిన్= వారికి అనగా పాండవులకు; వెఱఁగు= ఆశ్చర్యం; అగునట్టి= కలిగించునట్టి; బెట్టిదంపు= ఉద్ధతమగు; ఉరవడిన్= వేగముతో; కదిసి= ఢీకొని; రణంబు= యుద్ధం; చేయుదము; అట్లు= ఆ ప్రకారముగా; ఐన= అయిన ఎడల(అనగా చేసినచో); జయంబు= విజయము; కొనవచ్చున్= పొందవచ్చును; అని; చెప్పినన్; ఆ వసుమతీ పతి= భూమికి భర్త అయిన ఆ దుర్యోధనుడు; ప్రీతుండై= సంతోషించినవాడై; అది= ఆ పద్ధతి; లెస్స= ఆమోదయోగ్యమయిన; వెరవు= ఉపాయము; అట్ల= ఆ ప్రకారముగానే (నిర్ధారణార్థకము); చేయుదము; అని; చెప్పి; సముచితభంగిన్= తగినవిధముగా; తగు= అర్హమైన; వారలకున్; ఎఱింగించి= తెలియజేసి; కదలి= బయలుదేరి; అచటికిన్; రెండు; ఆమడ= ఆమడ దూరము; అగు= కలుగు; సరస్వతి పొంతన్= సరస్వతీ నదీతీరముయొక్క సమీపమున; బయలికిన్= బహిరంగప్రదేశమునకు; బలంబులన్=

సేనలను; కొని= తీసికొని; చని= వెళ్ళి; సకల జనవాహన సహితంబుగాన్; సకల= సమస్తమయిన; జన= జనులతో; వాహన= వాహనముల; సహితంబుగాన్= కూడినవాడై; ఆ+మహానదియందు= ఆ గొప్పనదియందు (అనగా ఆ పవిత్రమయిన నదియందు); ఇచ్ఛా= ఇష్టమునకు; అనురూప= అనుగుణమయిన; స్నాన, పానంబులు= స్నానపానములు; ఆచరించి= చేసి; వలయు= కావలసిన; తెఱంగునన్= విధంగా; వెనుకన్= తన వెంట; నడతెంచిన= తమతోపాటు తీసికొనివచ్చిన; వివిధ= పలు రకములయిన; ఆహారంబులన్= తినుబండారాలను; తుష్టిన్= సంతప్తితో; పొంది; ఇష్ట= ప్రియమయిన; ఆలాపంబులు= సంభాషణములు; చెల్లుచుండన్= కొనసాగుచుండగా; ఉన్న; సమయంబునన్= కాలమున; మున్ను= ఇంతకుముందు; ఆ కర్జంబు= ఆ పని; నడిపిన= చేసిన; దొరలును= యోధవరులును అనగా కృప కృతవర్మాశ్వత్థామ శకుని శల్యులు; చిత్రసేన= చిత్రసేనుడు; ఆది= మొదలగు; భవత్= నీయొక్క కుమారులును= కొడుకులును; కర్ణుకొడుకు= కర్ణుని కుమారుడు; సత్యసేనుండును; లోనైన= ఈ మొదలైన; ఆప్తజనంబులు= సన్నిహితులైన మనుజులు (అనగా బంధువులు); ఆ+మనుజ నాథునకున్= మనుజులకు ప్రభువు అయిన దుర్యోధనునకు; ఇట్లు= ఈ ప్రకారముగా; అనిరి= చెప్పిరి.

తాత్పర్యం: విజృంభించిన కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ, శకుని, శల్యులు అటు తరువాత చేయవలసిన పనిగురించి బాగుగా ఆలోచించి, ఆ దుర్యోధనుడిని చూచి 'మనం ఈ రాత్రి శిబిరంలో నిద్రించటం మంచిది కాదు. ఎందువలననంటే కర్ణుడిని సంహరించటం వలన కలిగిన సంతోషంతో పాండవులు మీదపడి ఆక్రమించటానికి ప్రయత్నించవచ్చు నేమో అని ఆలోచిస్తున్నాము. అందువలన వినుము. మోసమునుండి తప్పించుకొని ఉండి మనకు గల చతురంగ బలాలను సిద్ధం చేసికొని, యుద్ధవ్యూహాన్ని రచించి, ఆ పాండవులకు ఆశ్చర్యం కలిగేటట్లు ఉద్ధతమైన వేగంతో ఢీకొని యుద్ధం చేద్దాము. అట్లా చేస్తే విజయం గైకొనవచ్చును-' అని చెప్పగా, ఆ దుర్యోధనుడు సంతోషించినవాడై 'అది ఆమోదయోగ్యమయిన ఉపాయం. అట్లే చేద్దాము.' అని చెప్పి, తగిన విధంగా అర్హమయిన వారికి తెలియచేసి బయలుదేరి అక్కడికి రెండామడల దూరంలో ఉన్న సరస్వతీనది సమీపంలో బహిరంగ ప్రదేశానికి సేనలను తీసికొని వెళ్ళి సమస్త జనులతో, వాహనాలతో కూడుకొనినవాడై ఆ మహానదిలో ఇష్టానుసారంగా స్నానపానాదులు కావించి, కావలసిన విధంగా తమవెంట తెచ్చిన పలురకాలయిన ఆహారాలను భుజించి సంతృప్తిని చెంది, ప్రియమైన సరససల్లాపాలు కొనసాగిస్తూ ఉండగా, అట్టి సమయంలో ఇంతకుముందు చెప్పిన యోధవరులు (కృపాచార్య కృతవర్మాశ్వత్థామ శకుని శల్యులు, చిత్రసేనాదు లయిన నీ కుమారులు, కర్ణుడి కుమారుడు సత్యసేనుడు మొదలయిన ఇష్టజనులు) ఆ దుర్యోధనుడితో ఈ ప్రకారంగా చెప్పారు.

విశేషం: చిత్రసేనుడు: ఇతడు ధృతరాష్ట్రుడి నూర్గురు పుత్రులలో ఒకడు. ఇతడికి సత్యసంధుడనే మరొక పేరు ఉన్నది. ధృతరాష్ట్రుడి వందమంది పుత్రులలో సత్యసేను డనే పేరుగల పుత్రుడు కూడ ఉన్నాడు. అతడుకూడా ధృతరాష్ట్రుడి పుత్రులలో గల పదకొండుమంది మహారథులలో ఒక మహారథి. అందువలన ధృతరాష్ట్రపుత్రుడు సత్యసేనుడికి, కర్ణుడి పుత్రుడు సత్యసేనుడికి భేదం తెలియటానికి 'కర్ణుకొడుకు సత్యసేనుండు' అని ప్రత్యేకంగా చెప్పబడిందని గ్రహించాలి.

చ. **'వెరవును లావునుం గలిగి విక్రమసంపద సొంపు మీఱి భూ**
వర భవదీయమైన బలవర్గము నొడ్డన మేర్ప వీఁకమైఁ
బురికొలుపంగ నిర్భయతఁ బోరెడు నట్లుగఁ దాను ముందరై
తిరముగఁ జేయఁ జాలు నొకధీరు నొనర్పుము సైన్యనాథుఁగన్.' **75**

ప్రతిపదార్థం: భూవర!= రాజులలో శ్రేష్ఠుడవైన దుర్యోధనా!; వెరవును= ఉపాయమును; లావునున్= బలమును; కలిగి= కలిగి ఉండి; విక్రమ= పరాక్రమముయొక్క; సంపదన్= ఐశ్వర్యంయొక్క; సొంపు= సమృద్ధిని; మీఱి= అతిక్రమించి; భవదీయము= నీకు సంబంధించినది; ఐన= అయినటువంటి; బలవర్గమును= సైన్యసమూహమును; ఒడ్డనము= వ్యూహముగ; ఏర్పన్= ఏర్పరచగల; వీఁకమైన్= పరాక్రమముతో; పురికొలుపంగన్= ఉద్రేకము పుట్టించగల; నిర్భయతన్= భయము లేకుండగ; పోరాడునట్లుగన్= యుద్ధముచేయునట్లుగ; తాను= తానే; ముందరై= ముందుగా ఉండి (అగ్రభాగమున ఉండి); తిరముగన్= స్థిరముగ; చేయన్= యుద్ధము చేయుటకు; చాలు= సమర్థుడై; ఒక; ధీరున్= ధైర్యశాలిని; సైన్యనాథుఁగన్= సేనకు అధిపతినిగ; ఒనర్పుము= చేయుము.

తాత్పర్యం: 'రాజశ్రేష్ఠుడవైన దుర్యోధనా! ఉపాయబలం కలిగి ఉండి, పరాక్రమ సంపద సమృద్ధిగా ఉండి, నీ సైన్య సమూహంతో వ్యూహాన్ని ఏర్పరచి, పరాక్రమంతో ఉద్రేకాన్ని పుట్టించి, నిర్భయంగా యుద్ధం చేయటానికి సమర్థుడైన ఒక ధైర్యశాలిని సైన్యాధిపతిగా చేయుము.'

వ. అనిన విని వృషస్కంధుండును పీనదీర్ఘభుజార్గళుండును భర్గవరలబ్ధజన్ముండును దివ్యాస్త్రవేదియు నవ్యాహతవిక్రమోద్దాముండును నగు నశ్వత్థామ నాలోకించి యాదరభరితుండగుచు నాధరణీవరుండతని కిట్లనియె. 76

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని; వృష= ఎద్దుమూపువంటి; స్కంధుండును= భుజముల మధ్యభాగం కలవాడును; పీన= ఉబ్బిన (లేక) బలిసిన; దీర్ఘ= పొడవైన; భుజా+అర్గళుండును= గడియమ్రాకులవంటి భుజములుకలవాడును (పూర్వము తలుపులకు పెట్టుకొను గెడ - గట్టిగా లావుగా - పొడవుగా ఉండెడిది. దానికి గడియమ్రాను అనిపేరు. దీనినే అర్గళమందురు.); భర్గ= శివునియొక్క; వర= వరము వలన; లబ్ధ= పొందిన; జన్ముండును= పుట్టుక కలవాడును; దివ్య= దేవతలకు సంబంధించిన; అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములను గూర్చి; వేదియును= తెలిసినవాడును; అవ్యాహత= అడ్డులేని విధంగా; విక్రమ= పరాక్రమంచేత; ఉద్దాముండును= గొప్పవాడును; అగు= అయినటువంటి; అశ్వత్థామను; ఆలోకించి= చూచి; ఆదర= గౌరవభావముతో; భరితుండు= నిండిన హృదయము కలవాడు; అగుచున్= అగుచు; ఆ ధరణీ వరుండు= భూమికి భర్త అయిన ఆ దుర్యోధనుడు; అతనికిన్= అతడికి - అనగా ఆ అశ్వత్థామతో; ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: వృషము మూపు వంటి మూపుకలవాడూ, ఉబ్బుగా ఎత్తుగా పొడవుగా గడియమ్రానువంటి భుజాలు కలవాడూ, శివుడివరం వలన పుట్టినవాడూ, దివ్యాస్త్రాలను తెలిసినవాడూ, అడ్డులేని పరాక్రమంతో భయంకరుడు - అయిన అశ్వత్థామను దుర్యోధనుడు చూచి ఆదరపూర్వకంగా ఇలా అన్నాడు.

ఆ. 'అనఘ! నీవు నాకు నాచార్యునట్లు। నేడుగడయుఁ గాన హితము సెప్పఁ
దగు బలాధినాథుఁడుగఁ జేయ నర్హుని। నెల్ల వినఁగ నిశ్చయింప వలయు.' 77

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! అనగా పూజ్యుడా!; నీవు; నాకున్; ఆచార్యు= ద్రోణాచార్యుని; అట్టులన్= ఆ విధముగ; ఏడుగడయున్= రక్షకుడవు; కానన్= కావున; హితము= క్షేమము(లేక)శుభము; చెప్పన్= చెప్పుటకు; తగున్= తగినవాడవు; బల= సైన్యమునకు; అధినాథుడుగన్= అధిపతిగ; చేయన్= చేయుటకు; అర్హునిన్= యోగ్యతకలవాణ్ణి; ఎల్లన్= అందరు; వినఁగన్= వినునట్లుగ; నిశ్చయింపన్= నిర్ణయించగా; వలయున్= వలయును. (అనగా నిర్ణయించుము.)

తాత్పర్యం: 'ఓ పూజ్యుడా! నీవు నాకు ద్రోణాచార్యులవంటి రక్షకుడవు. నాకు క్షేమాన్ని, శుభాన్ని చెప్పటానికి తగినవాడవు. అందువలన సైన్యాధిపతిగా యోగ్యత కలవాడిని అందరు వినేటట్లు నిర్ణయించుము.

చ. అనుటయు నాతఁడిట్టులను 'నజ్జనపాలున కాజి నైపుణం
బున మహనీయశౌర్యమును భూరిబలంబును సర్వసత్త్వవే
దనముఁ బరాక్రమోద్ధతియు ధైర్యసమగ్రతయుం గలండు శ
ల్యుని రథినీపతిత్వమహిమోజ్జ్వలుఁ జేయుము కౌరవేశ్వరా! 78

ప్రతిపదార్థం: అనుటయున్= ఇట్లు చెప్పగా; ఆ జన పాలునకున్= రాజైన ఆ దుర్యోధనునకు; ఆతఁడు= ఆ అశ్వత్థామ; ఇట్టులు= ఈ ప్రకారముగా; అనున్= అనెను; కౌరవేశ్వరా!; ఆజిన్= యుద్ధమునందు; నైపుణంబును= నేర్పరితనమును; మహనీయ= మిక్కిలి గొప్పది అయిన - అనగా శ్రేష్ఠమయిన; శౌర్యమును= పరాక్రమమును; భూరి= అధికమయిన; బలంబును= శక్తియును; సర్వసత్త్వ వేదనమును= సమస్తమైన సేనాబలాలకు బాధ కలిగించటమూ; పరాక్రమ= పరాక్రమమునందు; ఉద్ధతియున్= దర్పమును; ధైర్య= ధీరత్వమునందు; సమగ్రతయున్= సంపూర్ణత్వమును; కలండు= కలిగియున్నట్టి; శల్యుని; రథినీ= సైన్యమునకు; పతిత్వ= అధిపతిత్వముయొక్క; మహిమ= గొప్పతనముచే; ఉజ్జ్వలున్= ప్రకాశవంతుని; చేయుము.

తాత్పర్యం: దుర్యోధనుడు సేనాపతిత్వానికి అర్హుడిని నిర్ణయించుమని అశ్వత్థామను కోరగా, అశ్వత్థామ ఆ దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు: 'ఓ కౌరవేశ్వరా! దుర్యోధనా! యుద్ధవిద్యయందు నేర్పరితనం కలవాడు, శ్రేష్ఠమైన శౌర్యపరాక్రమాలు కలవాడు, ఎవరెవరి శక్తి ఏ పాటిదో తెలిసి సేనాబలాలను బాధించగలవాడు, పరాక్రమ దర్పం, సంపూర్ణమయిన ధైర్యం కలవాడు అయిన శల్యుడిని సైన్యాధిపతిగా అభిషిక్తుడిని చేయుము.

క. నినుఁబట్టి పాండుపుత్రులఁ । దన మేనల్లురఁ దొఱంగె ధరణీశ్వర! యీ
తనిఁగడచిన పరమహితులు । మనకుఁ గలరె? యితఁడు లోకమాన్యుఁడు గాఁడే? 79

ప్రతిపదార్థం: ధరణీశ్వర!= భూమికి ప్రభువు అయిన దుర్యోధనా!; నినున్= నిన్ను; పట్టి= చేకొని; (నినున్ పట్టి= నీగురించి); తన మేనల్లురన్= చెల్లెలి కుమారులైన; పాండుపుత్రులన్= పాండురాజు కుమారులయిన నకుల సహదేవులను; తొఱంగెన్= విడిచిపెట్టాడు; ఈతనిన్= ఈతనిని అనగా శల్యుని; కడచిన= మించిన; పరమహితులు= మిక్కిలి మేలు కోరేవారు; మనకున్= మనకు; కలరె?= ఉన్నారా?; ఇతఁడు= ఈ శల్యుడు; లోక= లోకముచేత అనగా ప్రజలచేత; మాన్యుఁడు= పూజింపదగినవాడు; కాఁడే?= కాడా?; (పూజింపదగినవాడని తాత్పర్యము.)

తాత్పర్యం: ఓ దుర్యోధనా! నీ వలన ఇతడు తన మేనల్లురు అయిన పాండవులను వదలి వచ్చాడు. ఇంతకు మించిన గొప్పవారు కాని, మన హితం కోరేవారు కాని మనకు లేరు. ఈ శల్యుడు లోకపూజ్యుడు సుమా!

తే. కార్తికేయుం డధీశుఁడుగా నమర్త్యు । లెలమిఁ బురికొని దైత్యుల గెలుచుకరణి
మద్రవిభుఁ డగ్రణిగఁ నేచి మనము నడచి । కడిఁది పగఱ జయింతము కౌరవేంద్ర!' 80

ప్రతిపదార్థం: కౌరవేంద్ర!= కౌరవులకు ప్రభువు అయిన దుర్యోధనా!; కార్తికేయుండు= కుమారస్వామి; అధీశుఁడుగాన్= అధిపతిగా (దేవసేనకు అధిపతిగ); అమర్త్యులు= దేవతలు; (మృత్యువు కలవారు మర్త్యులు - మృత్యువులేని వారు అమర్త్యులు); ఎలమిన్= సంతోషముతో; పురికొని= ఉద్రేకించి; దైత్యులన్= రాక్షసులను; గెలుచు= జయించు; కరణిన్=

విధముగా; మద్రవిభుఁడు= మద్రదేశ ప్రభువు అయిన శల్యుడు; అగ్రణిగన్= అధిపతిగ - (లేక) ప్రధానుడుగా (లేక) ముఖ్యుడిగా; ఏచి= విజృంభించి; మనము; నడచి= యుద్ధమునకు వెళ్ళి; కడిఁది పగఱన్= జయింపనలవికాని శత్రువులను; జయింతము= జయించగలము.

తాత్పర్యం: ఓ దుర్యోధనా! కుమారస్వామి సేనాధిపతిగా దేవతలు ఉద్రేకించి రాక్షసులను జయించిన విధంగా మద్రదేశపు ప్రభువు అయిన శల్యుడిని సేనాధిపతిగా చేసి విజృంభించి యుద్ధంలో శత్రువులను జయించగలము.

విశేషం: అలం: ఉపమ. కార్తికేయుడు: సప్తర్షిమండలానికి ఎదురుగా మధ్యాకాశంలో మనకు ఆరు నక్షత్రాల గుంపు కనిపిస్తుంది. జానపదులు వాటిని పిల్లలకోడి చుక్కలంటారు. జ్యోతిశ్శాస్త్రంలో వాటిని కృత్తికలు అంటారు. ఆధునిక పదార్థ విజ్ఞనశాస్త్రజ్ఞులు - వాటిని - కోట్లాది అగ్ని నక్షత్రాల మండలం అంటారు. సప్తమహర్షుల పత్నులలో ఒక్క వసిష్ఠపత్ని అరుంధతి తప్ప మిగిలిన మహర్షిపత్నులందరిని భర్తలు శపించగా వీరికి పరమశివుడు నక్షత్రమండలంలో స్థానం కల్పించాడనీ, వీరే ఆరు నక్షత్రాలుగా వెలుగుతున్నారనీ అంటారు పౌరాణికులు. ఈ కృత్తికలను తల్లులుగా స్వీకరించి నందున కుమారస్వామికి కార్తికేయు డనే పేరు వచ్చింది.

వ. అనిన విని సమస్త జనపతులును 'జయ జయ' శబ్దంబులతో శల్యుం బరివేష్టించి సంగరోత్సాహంబునం బొంగిరి. కురునాథుండును గద్దియ డిగి సవినయంబున నమ్మద్రవిభున కభిముఖుండై యిట్లనియె. 81

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; సమస్త= సమస్తమయిన; జనపతులును= రాజులును; జయ జయ= 'జయ జయ'అను; శబ్దంబులతోన్= ధ్వనులతో; శల్యున్= శల్యుడిని; పరివేష్టించి= చుట్టునుమూగి; సంగర= సంగ్రామమునందలి; ఉత్సాహంబునన్= ప్రయత్నముతో; పొంగిరి= సంతోషించిరి; కురునాథుండును= దుర్యోధనుడును; గద్దియ= ఆసనము; డిగి= దిగి; సవినయంబునన్= వినయసహితముగా అనగా వినమ్రత కలిగినవాడగుచు; ఆ+మద్రవిభునకున్= మద్రదేశ ప్రభువు అయిన ఆ శల్యుడికి; అభిముఖుండై= ఎదురు మొగము కలవాడై; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: మద్రవిభుడిని సేనాపతిగా చేస్తే శత్రువులను జయించగలమని అశ్వత్థామ చెప్పగా విని, రాజులందరు జయజయధ్వానాలతో శల్యుడిని చుట్టుముట్టి యుద్ధోత్సాహంతో పొంగిపోయారు. దుర్యోధనుడు కూడా గద్దె దిగి శల్యుడికి అభిముఖంగా నిలబడి వినమ్రతతో ఈ ప్రకారంగా పలికాడు.

ఉ. పొచ్చెము లేని నెయ్యమునఁ బూని విపద్దశనొందకుండఁగా
నెచ్చెలిఁగావఁ జూచు మహనీయున కిట్టిద కాల మిప్పు డీ
వచ్చుపడంగ నీ భుజబలాతిశయంబున నద్భుతంపు గె
ల్పిచ్చి కృతార్థుఁ జేయు నను నే నినుఁ జెందియుఁ దూలఁ బోదునే? 82

ప్రతిపదార్థం: పొచ్చెము= కపటము; లేని= లేనట్టి; నెయ్యమునన్= స్నేహము వలన; పూని= ఉద్యమించి (లేక) ప్రయత్నించి; విపద్= ఆపదతో కూడిన; దశన్= అవస్థను; ఒందకుండఁగాన్= పొందకుండగ; నెఱ+చెలిన్= నెచ్చెలిన్= మంచి మిత్రుని; కావన్= రక్షింప; చూచు= చూచెడి; మహనీయునకున్= గొప్పవానికి; ఇట్టిది+అ= ఇటువంటిదే (అవధారణార్థము); కాలము= సమయము; ఇప్పుడు; (ఈ సమయమున); ఈవు= నీవు; నీ భుజబలాతిశయంబునన్; నీ= నీయొక్క; భుజ= భుజములయొక్క; బల= పరాక్రమముయొక్క; అతిశయంబునన్= విజృంభణంతో; అచ్చుపడంగన్= స్పష్టపడేటట్లుగా; అద్భుతంపు=

ఆశ్చర్యకరమయిన; గెల్పు= విజయము; ఇచ్చి= సమకూర్చి; ననున్= నన్ను; కృతార్థున్= కృతకృత్యుని; చేయు= చేయము; నినున్= నిన్ను; ఏన్= నేను; చెందియున్= పొందియుండి కూడ; తూలఁబోదునే?= నశిస్తానా?

తాత్పర్యం: కపటం లేని స్నేహం కారణంగా ఉద్యమించి ఆపద పొందకుండ నెచ్చెలిని కాపాడే మహనీయుడికి ఇదే మంచి సమయం. ఇప్పుడు నీ భుజబలంతో విజృంభించి ఆశ్చర్యకరమయిన విజయాన్ని సమకూర్చి నన్ను కృతార్థుడిని చేయగల నిన్ను నేను పొంది ఉండి కూడా నష్టపోతానా?

క. పూనుము చమూపతిత్వము । నా నమ్మినవారు నేను నరవర బలసం
తానంబుతోడఁ బరిజన । మై నడచెద మాక్రమింపు మరివర్గంబున్.' 83

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; చమూ= సైన్యమునకు; పతిత్వము= అధిపతిత్వమును; పూనుము= వహింపుము; నా నమ్మినవారు= నన్ను నమ్ముకొని ఉన్నవారు; నేను; నరవర= రాజశ్రేష్ఠులయొక్క; బల= సైన్యములయొక్క; సంతానంబుతోడన్= సమూహముల తోడను; పరిజనమై= సేవకులమై; నడచెదము= యుద్ధమునకు వెడలెదము; అరి= శత్రువులయొక్క; వర్గంబున్= సమూహమును; ఆక్రమింపుము= జయించుము.

తాత్పర్యం: శల్య మహారాజా! సైన్యాధిపత్యం వహించుము. నేనూ, నన్ను నమ్మినవారు నీ సేవకులమై నీ వెంట నడుస్తాము. అందరము కలిసి యుద్ధానికి రాగలము. శత్రుసమూహాన్ని జయించుము.'

చ. అన విని శల్యుఁ డిట్లనియె 'నమ్మనుజేంద్రును కిప్పు డింత ప్రా
ర్థన మొనరింప నేల? వసుధావర! యే నినుఁ జేరి నప్డ నా
ధనమును బ్రాణమున్ బలవితానము నీకు సమర్పణంబు సే
సినయవి గావె? నీ పనుపు సేసెదఁ గౌరవసేనఁ గాచెదన్. 84

ప్రతిపదార్థం: అనన్= అనగా; విని; శల్యుఁడు; ఇట్లు= ఈ విధంగా; మనుజ= మానవులకు; ఇంద్రునకున్= ప్రభువు అయిన ఆ దుర్యోధనుడికి; అనియెన్= చెప్పెను; ఇప్పుడు; ఇంత; ప్రార్థనము= వేడుకొనటం; ఒనరింపన్= చేయగ; ఏల?; వసుధావర!= భూమికి భర్తఅయిన దుర్యోధనా!; ఏన్= నేను; నినున్= నిన్ను; చేరినప్డు+అ= కూడినప్పుడే; నా= నాయొక్క; ధనమును= సంపదయును; ప్రాణమును; బలవితానమున్= సైన్య సమూహమును అనగా నా సర్వస్వమును; నీకున్; సమర్పణంబు= నీ పరము; చేసినయవి= చేయబడినవి; కావె?= కావా?; నీ పనుపు= నీవు నియోగించిన పనిని; చేసెదన్= చేయుదును; కౌరవసేనన్= కురుసైన్యమును; కాచెదన్= రక్షించెదను.

తాత్పర్యం: అని చెప్పగా విని, శల్యుడు ఆ మనుజేంద్రుడయిన దుర్యోధనుడితో ఈ విధంగా అన్నాడు. 'ఇంత ప్రార్థన మెందుకు? నేను నీ పక్షంలో చేరినప్పుడే నా ధనాన్నీ ప్రాణాన్నీ - సైన్యసమూహాన్నీ, నా సర్వస్వాన్నీ నీకు సమర్పించాను. నీవు నియోగించిన పనిని చేస్తాను. కురుసైన్యమును రక్షిస్తాను.

మ. భుజవీర్యంబున నచ్యుతార్జునులు నన్ బోలంగ లే రల్క వ
చ్చి జయింపంగఁ గడంగినన్ సురలు నాచే నొత్తు రే నేచి య
క్కజపుంజేవయు లావు జూపువడికిం గౌంతేయులే యోర్తు రా
ప్రజయున్ నీ ప్రజయుం దలంగఁ జెలఁగం బాటింతు నాటోపమున్. 85

ప్రతిపదార్థం: భుజవీర్యంబునన్= భుజబలపరాక్రమమునందు; అచ్యుత+అర్జునులు= అచ్యుతార్జునులు= శ్రీకృష్ణార్జునులు; నన్= నన్ను; పోలంగన్= సరిపోవగ; లేరు; అల్కా= కోపము; వచ్చి; జయింపఁగన్= గెలుచుటకు; కడంగినన్= పూనుకొనినచో; సురలు= దేవతలు; నాచేన్= నాచేత; నొత్తురు= బాధచెందగలరు; ఏన్= నేను; ఏచి= విజృంభించి; అక్కజపున్= ఆశ్చర్యకరమయిన; చేవయున్= ధైర్యమును; లావున్= బలమును; చూపు= చూపించెడి; వడికిన్= వేగమునకు; కౌంతేయులే(లా)= కుంతీకుమారులా; ఓర్తురు= సహిస్తారు లేదా ఓడిస్తారు?; ఆ ప్రజయున్= ఆ ప్రజలును; నీ ప్రజయున్= నీ ప్రజలును; తలంగన్= తొలగిపోవునట్లుగ; చెలఁగన్= సంతోషించునట్లుగా; ఆటోపమున్= విజృంభణమును; పాటింతున్= ఆచరించి చూపిస్తాను.

తాత్పర్యం: భుజ బల పరాక్రమంలో శ్రీకృష్ణార్జునులు నాతో సరి సమానులుకారు. నేను కోపం వచ్చి జయించటానికి పూనుకుంటే దేవతలు కూడా నాచేత బాధింపబడుతారు. నేను విజృంభించి ఆశ్చర్యకరమయిన ధైర్యసాహస శౌర్యాలు చూపితే ఆ కౌంతేయులా సహించువారు? కావున పాండవసేనలు పారిపోయేటట్లుగా, కౌరవసేనలు సంతోషించేటట్లుగా, నా గర్వాన్ని, ప్రతాపాన్ని చూపిస్తాను.

విశేషం: ఆ ప్రజయున్ తలంగన్. ఈ ప్రజయున్ చెలంగన్ - అని క్రమాన్వయం. దేవతలు సహితం నాచే బాధింపబడతారంటే, ఇంక ఆ పాండవులా సహించగలవారు? లేదా ఓడించగలవారు? ఓడు= ఓడిపోవు, ఓడుచు= ఓరుచు= ఓడించు; ఓరుచు+దురు= ఓర్తురు; ఓడిస్తారు; ఓర్చు= సహించు - ఓర్చుదురు= ఓర్తురు= సహిస్తారు.

చ. **అఱిముఱి బాణజాలముల నక్కడి సైనికులం దెరల్చెదన్**
గుఱుకొని నాకు మాఱుకొని కోల్తలఁ జేసిన వీరవర్గమున్
నఱికెదఁ జూచు ఖేచరగణంబుల కచ్చెరుపా టొనర్చెదన్
బఱపెదఁ బాండునందనులఁ బాఱక నిల్చిన రూ పడంచెదన్. **86**

ప్రతిపదార్థం: అఱిముఱి= త్వరత్వరగా; బాణ= అమ్ములయొక్క; జాలములన్= వరుసలతో; అక్కడి= ఆ చోటునందున్న; సైనికులన్= సేనలను; తెరల్చెదన్= తొలగించెదను; కుఱుకొని= యత్నించి; నాకున్; మాఱుకొని= ఎదుర్కొని; కోల్తలన్= ఎదుట నిలిచి యుద్ధమును; చేసిన; వీర= శూరులయొక్క; వర్గమున్= సమూహమును; నఱికెదన్= ఖండించెదను; చూచు= చూచుచుండెడి; ఖే= ఆకాశమున; చర= సంచరించెడి దేవతలయొక్క; గణంబులకున్= గుంపులకు; అచ్చెరుపాటు= ఆశ్చర్యము; ఒనర్చెదన్= కలిగిస్తాను; పాండునందనులన్= పాండురాజు కుమారులను; పఱపెదన్= పాఱిపోవునట్లు చేసెదను; పాఱక= పాఱిపోకుండ; నిల్చినన్= నిలిచి ఉన్నచో; రూపు= రూపమును; అడంచెదన్= నశింపచేసెదను.

తాత్పర్యం: యుద్ధభూమియందలి సైనికులను తొందర తొందరగా బాణాల వరుసలను ప్రయోగించి తొలగిస్తాను. నాకు దగ్గరపడి నన్ను ఎదుర్కొని ఎదుట నిలిచి యుద్ధం చేసే వీర వర్గాన్ని ఖండిస్తాను. దివినుండి చూచే దేవ గణాలు ఆశ్చర్యపడేటట్లు చేస్తాను. పాండుకుమారులను పారద్రోలుతాను. పారిపోకుండా నిలిచి ఉంటే సంహరిస్తాను.

శా. **గంగానందను పోటు మెచ్చక గురుం గాదంచు రాధాతనూ**
జుం గీడాడుచు నీతఁ డెవ్వఁ డొకొ యంచున్ శల్యుఁడే! యిట్టి వా
నిం గయ్యంబుల మున్నుగాన మనుచు న్వేభంగులం జూప ఔ
ల్లం గీర్తింప ధనుఃకళానిపుణలీలాఖేలతన్ జూపెదన్. **87**

ప్రతిపదార్థం: గంగానందును= భీష్మని; పోటు= యుద్ధము; మెచ్చక; గురున్= ద్రోణుని; కాదు; అంచున్= అనుచు; రాధా= రాధయొక్క; తనూజున్= కుమారుడైన కర్ణుని (కన్నతల్లికుంతి - పెంచిన తల్లి రాధ - కర్ణుడు రాధేయుడు గానే ప్రసిద్ధుడు); కీడు= తక్కువ; ఆడుచున్= చేయుచు; ఈతఁడు; ఎవ్వఁడు; ఒకొ!; అంచున్= అనుచు; శల్యుఁడే!= శల్యుడా!; ఇట్టి వానిన్= ఇటువంటివానిని; మున్ను= ఇంతకుమునుపు; కయ్యంబులన్= యుద్ధములందు; కానము= చూడము; అనుచున్= అనుచు; వేభంగులన్= వేయి విధములుగా; చూపఱు= చూచువారు; ఎల్లన్= అందరును; కీర్తింపన్= పొగడుచుండగా; ధనుః= ధనుస్సుయొక్క; కళా= విద్యయందలి; నిపుణ= నేర్పరితనమును; లీలా= వినోదము కలిగించు; ఖేలతన్= క్రీడగా; చూపెదన్= చూపించెదను.

తాత్పర్యం: భీష్మడి యుద్ధాన్ని మెచ్చుకొనక, ద్రోణుడిని కాదని, కర్ణుడిని తక్కువచేస్తూ యుద్ధం చేసే ఈతడు ఎవ్వడు? శల్యుడేనా? అని ఆశ్చర్యం చెందుతూ ఇంతకు ముందెన్నడూ ఏ యుద్ధంలోనూ - ఇట్టి వాడిని చూడలేదంటూ, వేయివిధాలుగా చూచేవారందరూ కీర్తించేటట్లు నా విలువిద్యా నైపుణ్యాన్ని వినోదక్రీడగా చూపిస్తాను.

విశేషం: ఈ సందర్భంలో మూడు పద్యాలలో (85,86,87) తిక్కన శల్యుడి ప్రతాపమును వర్ణించాడు. ఆ వర్ణన వలన శల్యుడు ఆత్మప్రతాపస్తుతి పరాయణుడయిన ఉద్ధతుడుగా కనిపిస్తాడు. ఉదాత్తుడుగా కనిపిస్తాడు. మూలమున వ్యాసభగవానులు శల్యుని ఉదాత్తుడుగా చిత్రించాడు. "అద్య చాహం రణే సర్వాన్ పాంచాలాన్సహ పాండవైః । నిహనిష్యామి వా రాజన్! స్వర్గం యాస్యామి వా హతః" - ఇది వ్యాసుడు చేసిన శల్యుడి ధీరోదాత్త లక్షణం. (శల్య. అధ్యా-7)

దుర్యోధనుఁడు శల్యుని సేనానాయకుంగాఁ జేయుట (సం. 9-6-5)

వ. అని పలికిన నీ సుతుండు ప్రీతుండై కనకకలశంబుల సరస్వతీజలంబులు దెప్పించి శాస్త్రోక్తప్రకారంబునఁ దగురాజులుం దానును సేనామధ్యంబున భద్రవిధానోపేతంబుగా నమ్మద్రవిభు నభిషేకించి బలాధిపత్యపట్టబంధంబు నిర్వర్తించిన శంఖభేరీప్రముఖమంగళతూర్యరవంబులు సెలంగ సైనిక సింహనాదంబు లుల్లసిల్ల నప్పు డా శల్యునుద్దేశించి దీవనలం బొగడ్తల నఖిల జనంబులును ముఖరులయి రిట్లు సంతసిల్లి సపరివారంబుగాఁ గురుభూమీశ్వరుండు విశ్రామంబు నొందె. నట్టియెడ మున్ను సమరజయంబునం బ్రమోదభరితుండగుచు నిజశిబిరంబునకుం జనిన పాండవాగ్రజుండు బంధుమిత్రపరిజనంబులఁ దమతమ విడిదలకుం బోవం బనుపక యుచితప్రదేశంబునఁ బేరోలగంబుండి మనవారివలనివిశేషంబు లరయఁ జారులం బనిచినవాఁడై వారలు మగిడి వచ్చునంతకు నే మేని వినోదంబులం బ్రొద్దుపుచ్చి యక్కడి యుత్సాహంబు తెఱంగంతయు విని యచ్యుతునాననం బాలోకించి యిట్లనియె: 88

ప్రతిపదార్థం: (సంజయుడు ధృతరాష్ట్రునకు ఇట్లు చెప్పెను) అని= ఈ విధముగా శల్యుడు; పలికినన్= చెప్పిన తరువాత; నీ సుతుండు= నీ కుమారుడయిన దుర్యోధనుడు; ప్రీతుండై= సంతోషించినవాడై; కనక= బంగారముతో చేసిన; కలశంబులన్= చెంబులతో (జలపాత్రలతో); సరస్వతీ జలంబులు= సరస్వతీ నదియొక్క నీళ్ళు; తెప్పించి; శాస్త్ర= ధర్మశాస్త్రములందు; ఉక్త= చెప్పిన; ప్రకారంబునన్= విధముగా; తగు= యోగ్యతగల; రాజులున్= రాజులును; తానును; సేనామధ్యంబునన్= సేనయొక్క మధ్యభాగమున; భద్ర= శుభకరమగు; విధాన= వేద విహితమగు పద్ధతిలో; ఉపేతంబుగాన్= కూడినదిగా; ఆ మద్రవిభున్= ఆ మద్రదేశపు ప్రభువు అయిన శల్యుడిని; అభిషేకించి; బల= సైన్యమునకు; ఆధిపత్య; పట్ట= పట్టం; బంధంబు= కట్టుటను;

నిర్వర్తించినన్= నిర్వర్తించగా; శంఖ= శంఖములు; భేరీ= భేరులు; ప్రముఖ= మొదలగు వాద్యాలయొక్క; మంగళ= శుభప్రదములయిన; తూర్య= వాద్యములయొక్క; రవంబులు= ధ్వనులు; చెలంగగన్= మ్రోయగా; సైనిక= సైనికులయొక్క; సింహనాదంబులు= సింహగర్జనలు; ఉల్లసిల్లన్= విజృంభించగా; అప్పుడు; ఆ శల్యున్= ఆ సేనాధిపతిఅయిన శల్యుని; ఉద్దేశించి= గురించి; దీవనలన్= ఆశీస్సులతో; పొగడ్తలన్= స్తుతులతో; అఖిలజనంబులును= సమస్తమయిన ప్రజలును; ముఖరులు= శబ్దం చేసిన వారు; అయిరి; ఇట్లు= ఈ ప్రకారముగా; సంతసిల్లి= సంతోషించి; సపరివారంబుగాన్= అనుచరులతో కూడిన వాడగుచు; కురుభూమీశ్వరుడు= కురురాజయిన దుర్యోధనుడు; విశ్రామంబును= విశ్రాంతిని; ఒందెన్= పొందెను; అట్టి+ఎడన్= ఆసయమంలో; మున్ను= అంతకుముందు; సమర= సంగ్రామమందలి; జయంబునన్= విజయమువలన; ప్రమోదభరితుండు= ఆనందం నిండిన హృదయం కలవాడు; అగుచున్; నిజ= తనయొక్క; శిబిరంబునకున్= విడిదికి; చనినన్= వెడలగా; పాండవాగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; బంధుమిత్ర= చుట్టములను, స్నేహితులను; పరిజనంబులన్= సేవకులను; తమ తమ= వారి వారి; విడిదలకున్= శిబిరములకు; పోవన్= పోవుటకు; పనుపక= నియోగించక; ఉచిత= తగిన; ప్రదేశంబునన్= చోటునందు; పేరు+ఓలగంబు= పెద్దకొలువు; ఉండి; మనవారివలని= మనవారియొక్క; విశేషంబులు= తెలిసికొనదగిన విశిష్ట విషయములు; అరయన్= విచారించి తెలిసికొనుటకు; చారులన్= గూఢచారులను; పనిచినవాఁడై= పంపించినవాడై; వారలు; మగిడి= తిరిగి; వచ్చునంతకున్= వచ్చువరకు; ఏమి+ఏని= ఏమైనను; వినోదంబులన్= వేడుకల వలన; ప్రొద్దు+పుచ్చి= కాలముగడపి; అక్కడి; ఉత్సాహంబు= ప్రయత్నము యొక్క; తెఱంగు= విధము; అంతయున్; విని; అచ్యుతున్= శ్రీకృష్ణుడియొక్క; ఆననంబు= ముఖము; ఆలోకించి= చూచి; ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా చెప్పాడు. 'శల్యుడు తన ప్రతాపాన్ని, బల పరాక్రమాలను గూర్చి చెప్పిన తరువాత నీ కుమారుడు దుర్యోధనుడు సంతోషించి, బంగారు చెంబులతో సరస్వతీ నదీ జలాలు తెప్పించి శాస్త్రోక్తంగా యోగ్యులయిన రాజులును, తానును సేనామధ్యంలో శుభప్రదమైన వేదవిహిత విధానంతో ఆ మద్ర దేశాధిపతి శల్యుడిని అభిషేకించి, సైన్యాధిపత్యానికి చిహ్నమయిన పట్టబంధాన్ని తొడిగి అభిషేకం నిర్వర్తించగా మంగళవాద్యధ్వనులు మిన్నుముట్టగా సైనికులు ఆనందోత్సాహాలతో సింహనాదాలు చేయగా, ఆ సమయంలో సేనాధిపతి అయిన శల్యుడిని ఉద్దేశించి ఆశీస్సులతో, స్తుతులతో జనులందరు రణగొణ ధ్వనులు చేశారు. ఈ విధంగా సంతోషం పొంది, అనుచరులతో కూడి దుర్యోధనుడు విశ్రాంతిని పొందాడు. ఆ సమయంలో అంతకుముందు సంగ్రామ విజయంవలన ఆనంద భరిత హృదయుడయిన ధర్మరాజు తన విడిదికి వెడలి బంధుమిత్ర పరిజనులను తమ తమ శిబిరాలకు పంపించకుండా, తగిన ప్రదేశంలో పెద్ద కొలువు తీర్చి కౌరవ శిబిరంలో జరుగుతున్న ప్రయత్నాలను విచారించి తెలిసికొనుటకు గూఢచారులను పంపించి, వారు తిరిగి వచ్చేవరకు వేడుకలతో కాలం గడిపి, ఆ కౌరవ శిబిరంలోని ప్రయత్నాన్నంతా విని శ్రీకృష్ణుడి ముఖాన్ని చూచి ఈ ప్రకారంగా అన్నాడు.

చ. 'కురుపతి మద్రరాజుఁ దనకున్ బలముఖ్యునిఁగా నొనర్చి సం
గరమున కుత్సహించె నధికప్రమదంబున వారిసేనయుం
దిరమయి పేర్చియున్నయది దీనికి నెయ్యది సేయువార? మీ
వరయుము కార్యవృత్తి హృదయంబునఁ బాండవరక్షణోత్సుకా. 89

ప్రతిపదార్థం: పాండవ= పాండవులను; రక్షణ= కాపాడుట యందు; ఉత్సుకా!= ఉత్కంఠం కలిగినవాడా! - శ్రీకృష్ణా!; కురుపతి= దుర్యోధనుడు; మద్రరాజున్= శల్యుడిని; తనకున్; బల= సేనకు; ముఖ్యునిఁగాన్= అధిపతిగా; ఒనర్చి= చేసి;

సంగరమునకున్= యుద్ధమునకు; ఉత్సహించెన్= ప్రయత్నము చేయుచుండెను; వారి= వారియొక్క; సేనయున్= సైన్యము కూడ; అధికప్రమదంబునన్= మిక్కిలి సంతోషముతో; తిరుమయి= స్థిరమయినదిగ; పేర్చి= విజృంభించి; ఉన్నయది= ఉన్నది; కార్య= చేయదగిన; వృత్తిన్= పనిని; ఎయ్యది= ఏది; చేయువారము?= చేయగలవారము?; ఈవు= నీవు; హృదయంబునన్= మనసులో; అరయుము= విచారింపుము.

తాత్పర్యం: 'పాండవ రక్షణమునందే ఉత్కంఠ కలిగిన శ్రీకృష్ణా! కురుపతి మద్రపతి శల్యుడిని తనకు సేనాధిపతిగా చేసి, యుద్ధానికి సిద్ధమయ్యాడు. దీనికి ఏమి చేయగలవారం? నీవు చేయదగిన పనిని మనసునందు ఆలోచించుకో

వ. నీ వెట్లు నిశ్చయించి పలికె దట్ల సేయుదు' ననిన నమ్మహీకాంతునకు మురాంతకుం డి ట్లనియె: 90

ప్రతిపదార్థం: నీవు; ఎట్లు= ఏ ప్రకారముగా; నిశ్చయించి= నిర్ణయించి; పలికెదు(వు)= చెప్పుదువో; అట్ల; చేయుదున్; అనినన్= అని చెప్పగా; ఆ మహీ= భూమికి; కాంతునకున్= భర్తఅయిన ఆ ధర్మరాజుకు; మురాంతకుండు= శ్రీకృష్ణుడు; (మురుడు అను రాక్షసుడిని సంహరించినందువలన శ్రీకృష్ణునకు మురాంతకుడని పేరు.); ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: నీవు ఏ ప్రకారంగా నిర్ణయించి చెప్పితే అట్లే చేస్తాను' అని చెప్పిన ధర్మరాజుతో శ్రీకృష్ణు డిట్లా అన్నాడు.

సీ. శల్యు నెఱుంగుదు శౌర్యధైర్యంబు । లగ్గల మాతనికి బాహుబలఘనుండు
గాంగేయకుంభజకర్ణుల మిగిలెడుఁ । గాదేని సముఁడగుఁ గాని యసదు
గాఁ దలంపఁగరాదు కౌరవపతి మాన్యుఁ, । జేయుట నధికవిజృంభణంబుఁ
జూప భీమునకు నర్జునునకు నెనయంగ । రాదు సాత్యకి కోర్వరాదు పార్ష

తే. తునకుఁ దత్సోదరులకు మార్కొని పెనంగి । బ్రదుక రాదు నీవీట నా బల్లిదునకు
నెదురు రథికునిఁగాన ననేక హేతి । నిపుణశార్దూలవిక్రమ! నీవు దక్క. 91

ప్రతిపదార్థం: శల్యున్= శల్యుని; ఎఱుంగుదున్= ఎరుగుదును; ఆతనికిన్= శల్యుడికి; శౌర్యము= పరాక్రమము; ధైర్యంబులు= ధీరత్వములు; అగ్గలము= అధికము; బాహు= భుజములయొక్క; బల= బలమునందు; ఘనుండు= గొప్పవాడు; గాంగేయ= భీష్మ; కుంభజ= ద్రోణ; కర్ణులన్= కర్ణులను; మిగిలెడున్= మించిపోవును(అనగా అతిశయించును.); కాదేని= అట్లు కాని ఎడల; సముఁడగున్= వారికి సమానుడగును; కాని= అంతేకాని; అసదుగాన్= అల్పునిగా; తలంపఁగన్= భావింప; రాదు; కౌరవపతి= కౌరవులకు ప్రభువు అయిన దుర్యోధనుడు; మాన్యున్= గౌరవింపదగినవాడినిగా (అనగా సైన్యాధిపతిగా); చేయుటన్= చేసినందువలన; అధిక= మిక్కిలి; విజృంభణంబున్= అతిశయంబును; చూపున్= చూపించును; భీమునకును; అర్జునునకును; ఎనయంగన్+రాదు=ఎదురించరాదు; సాత్యకికిన్; ఓర్వరాదు= సహింపరాదు; పార్షతునకున్= ధృష్టద్యుమ్నుడికి; తత్సోదరులకున్= అతని సోదరులకును; మార్కొని= ఎదుర్కొని; పెనంగి= యుద్ధముచేసి; బ్రదుకరాదు= జీవించి యుండుటకు వీలు కాదు; అనేక= వివిధములయిన; హేతి= ఆయుధాలు ప్రయోగించుట యందు; నిపుణ= నైపుణ్యము గల అనగా నేర్పరితనంగల; శార్దూల= పెద్దపులి వంటి; విక్రమ!= పరాక్రమం కలవాడా! నీవు; తక్కన్= తప్ప; ఆ బల్లిదునకున్= అధికబలవంతుడయిన ఆ శల్యునకు; ఎదురు; రథకునిన్= సమానుడైన రథమధిరోహించి యుద్ధము చేయగల యోధుడిని; కానను= చూడను.

తాత్పర్యం: శల్యుడిని ఎరుగుదును. ఆ శల్యుడికి పరాక్రమధైర్యాలు అధికం. భుజబలంలో కూడా గొప్పవాడు. భీష్మ, ద్రోణ, కర్ణులను మించినవాడు. లేకుంటే వారితో సమానుడు. అంతేకాని అల్పుడు కాడు. అదీకాక దుర్యోధనుడు ఆతడిని సైన్యాధిపతిగా చేశాడు. అందువలన అతడు యుద్ధంలో అధిక విజృంభణాన్ని ప్రదర్శిస్తాడు. భీముడు కాని, అర్జునుడు కాని, సాత్యకి కాని, ధృష్టద్యుమ్నుడు గాని ఆతడి సోదరులు కాని ఆతడిని ఎదుర్కొనజాలరు. ఎదుర్కొంటే బ్రదుకజాలరు. వివిధాయుధ ప్రయోగ నైపుణ్యం కలిగి, పెద్దపులి వంటి పరాక్రమం కల ఓ ధర్మరాజా! నీవు తప్ప అధికబలవంతుడయిన ఆ శల్యుడిని ఎదుర్కొని యుద్ధం చేయగల రథికుడు మరొకడు మన సేనలో కనపడటం లేదు.

క. ఒరులయినఁ బెక్కు దినములఁ । బొరిగొను నీ బలము నెల్లఁ బొరిపోవ నతం
డరిభంజన! నీ వైనం । బరమోత్సాహమున నెల్లి పడవై తతనిన్. 92

ప్రతిపదార్థం: అరిభంజన!= శత్రుసంహారకుడవైన ధర్మజా!; అతండు= ఆ శల్యుడు; ఒరులు= ఇతరులు (అనగా నీవు తప్ప ఇతరులు); అయినన్= అయినచో; పెక్కు= అనేక; దినములన్= రోజులలో; నీ బలమున్= నీయొక్క సైన్యమును; ఎల్లన్= సమస్తమును; పొరిపోవన్= నాశమగునట్లు; పొరిగొనున్= చంపివేయును; అతనిన్= ఆ శల్యుడిని; నీవు; అయినన్= అయినచో; పరమ= ఉత్కృష్టమయిన; ఉత్సాహమునన్= ప్రయత్నముతో; ఎల్లి= రేపు; పడవైతు(వు)= పడగొట్టుదువు (అనగా చంపగలవు).

తాత్పర్యం: ఆ శల్యుడు నీవు తప్ప ఇతరులయితే పెక్కు దినాలలో నీ సమస్త సైన్యాన్ని నాశనమయ్యేటట్లు చేస్తాడు. శత్రువులను అణచగల ఓ ధర్మరాజా! నీవు అయితే పరమోత్సాహంతో ఆ శల్యుడిని రేపే సంహరించగలవు.

ఆ. అతఁడు మేనమామ యను కృప దక్కుము । రాజధర్మమును బురస్కరించి
యతుల విక్రమక్రియా పాటవంబున । నవ్విరోధినామ మడఁపవలయు. 93

ప్రతిపదార్థం: అతఁడు= ఆ శల్యుడు; మేనమామ; అను= అనెడి; కృపన్= దయను; తక్కుము= విడిచిపెట్టుము; రాజధర్మమును= రాజులయొక్క ధర్మమును; పురస్కరించి= ముందిడుకొని (రాజధర్మమునకు ప్రాముఖ్యమిచ్చి); అతుల= సాటిలేని; విక్రమ= పరాక్రమముయొక్క; క్రియా= అభ్యాసమువలన లభించిన; పాటవంబునన్= శక్తివలన; ఆ విరోధి= ఆ శత్రువుయొక్క; నామము= ప్రసిద్ధి; అడఁపవలయున్= నాశము చేయవలయును.

తాత్పర్యం: ఆ శల్యుడు నీ మేనమామ అనే దయను విడిచిపెట్టుము. రాజధర్మానికి ప్రాముఖ్య మిచ్చి, సాటిలేని పరాక్రమంతో ఆ శత్రువు పేరు లేకుండా చేయాలి.

క. గాంగేయునిఁ గుంభజుఁ గ । ర్ణుం గడచితి మింక నుద్ధురుండగు మద్రే
శుం గూల్పు మంతతోడఁ దె । గుం గురుపతి పని జయంబు గొనుము కడంకన్. 94

ప్రతిపదార్థం: గాంగేయునిన్= భీష్ముని; కుంభజున్= ద్రోణుని; కర్ణున్= కర్ణుని; కడచితిమి= దాటితిమి; ఇంకన్= ఇంక; ఉద్ధరుండు= బరువైనవాడు అనగా బలాఢ్యుడు; అగు; మద్రేశున్= శల్యుని; కూల్పుము= పడగొట్టుము (సంహరించుము); అంతతోడన్= అంతటితో; కురుపతి= దుర్యోధనునియొక్క; పని; తెగున్= పరిసమాప్తము అగును; కడంకన్= ప్రయత్నంతో; జయంబున్= విజయమును; కొనుము= కైకొనుము - దక్కించుకొనుము.

తాత్పర్యం: భీష్ముడిని, ద్రోణుడిని, కర్ణుడిని దాటాము. ఇంక బలాఢ్యుడు మద్రదేశాధీశుడైన శల్యుడిని కూల్చుము. అంతటితో కురుపతి పని పూర్తవుతుంది. ప్రయత్నించి విజయాన్ని గైకొనుము.

వ. అనిన విని యుధిష్ఠిరుం డతని కిట్లనియె. 95

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అతనికిన్= శ్రీకృష్ణుడికి; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ఇట్లు చెప్పిన తరువాత మరల ధర్మరాజు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'అనఘ! నీవు చెప్పినట్టులు సేసెద; । మున్ను పలికినాఁడ నన్నరేంద్రు
కడిమి నాకుఁ బాలుగాఁ బూని యుద్యోగ । వేళయందు నెల్ల వినుచునుండ. 96

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితా! - శ్రీకృష్ణా!; నీవు; చెప్పినట్టులు= చెప్పినవిధముగా; చేసెదన్; మున్ను= ఇంతకు ముందు; ఉద్యోగవేళయందున్= సంజయుని రాయబారపు సమయమున; ఎల్లన్= అందరును; వినుచున్= వినుచును; ఉండన్= ఉండగా; ఆ+నర+ఇంద్రు కడిమి= ఆ శల్యుడి శౌర్యం; నాకున్= నాకు; పాలుగాన్= వంతుగా; పూని= పూనిక వహించి; పలికినాఁడన్= చెప్పినాడను.

తాత్పర్యం: 'పూజ్యుడా శ్రీ కృష్ణా! నీవు చెప్పిన విధంగానే తప్పక చేస్తాను. ముందు సంజయుడి రాయబార సమయంలో అందరూ వింటూండగా ఆ శల్యుడు యుద్ధంలో నా వంతుగా ప్రతిజ్ఞ చేసి పలికాను. అందువలన నీవు చెప్పినట్లుగానే చేస్తాను.

విశేషం: మహాభారత యుద్ధమునకు పూర్వం రెండురాయబారాలు జరిగాయి. ఒకటి సంజయుడి రాయబారం. రెండవది శ్రీకృష్ణుడి రాయబారం. సంజయుడు కౌరవుల తరపున రాయబారం నడిపాడు. శ్రీకృష్ణుడు పాండవుల తరపున రాయబారం నడిపాడు. సంజయుడు ధర్మరాజు నిశ్చయాన్ని దుర్యోధనుడికి చెప్పే సందర్భంలో యుద్ధంలో శల్యుడిని తన వంతుగా గెలుస్తానని ధర్మరాజు అన్నట్లు చెప్పాడు. 'కృతపుణ్యుఁడు సుశ్లోకుఁడు ధర్మతనూజుఁడు లోకోత్తరు శల్యుఁదా గెలుచువాఁ డధిపా' (చూడుడు. ఉద్యోగపర్వము. ద్వి. 229, 230, 231)

వ. సదనంబునకుం జని సుఖనిద్ర సేయు మని పలికి పద్మనాభునిఁ దమ తమ్ములను ధృష్టద్యుమ్న శిఖండిసాత్యకి ప్రముఖులను దక్కటి పరిజనంబులను నిజమందిరంబులకుం బోవం బనిచి వీతశల్యంబైన మాతంగంబు చందంబున శయ్యాతలంబు సేరె బలం బంతయు నత్యంత సంతుష్టంబై విశ్రాంతి నొందె నారాత్రి యే నిట వచ్చి నీకుఁ గర్ణువృత్తాంతంబు సెప్పి నీవు వనుప మగిడి చని తెలతెల వేగునప్పుడు కౌరవసేనాసన్నివేశంబు సేరితి నా సమయంబున. 97

ప్రతిపదార్థం: (ధర్మరాజు) పద్మనాభునిన్= శ్రీకృష్ణుని; సదనంబునకున్= మందిరమునకు; చని= వెళ్ళి; సుఖనిద్ర= గాఢనిద్ర (అనగా సుషుప్తియందు గల నిద్రాస్థితి); చేయుము; అని; పలికి; తన తమ్ములను; ధృష్టద్యుమ్ను; శిఖండి; సాత్యకి; ప్రముఖులను; తక్కటి= మిగిలిన; పరిజనంబులను= సేవకులను; నిజమందిరంబులకున్= తమయొక్క భవనములకు; పోవన్= పోవునట్లుగా; పనిచి= పంపించి; వీత= పోయిన; శల్యంబు= బాణము; ఐన= కలిగిన; మాతంగంబు= ఏనుగు;

చందంబునన్= వలె; శయ్యాతలంబు= శయనించుటకు తగిన స్థలము; చేరెను; బలంబు= సైన్యము; అంతయున్= సమస్తమును; అత్యంత= మిక్కిలి; సంతుష్టంబు+ఐ= సంతృప్తి పొందినదియై; విశ్రాంతిన్= విశ్రాంతిని; ఒందెన్= పొందెను (ఇక సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లు చెప్పుచున్నాడు); ఆ రాత్రి; ఏన్= నేను; ఇటన్= ఇక్కడకు; వచ్చి; నీకున్; కర్ణు= కర్ణునియొక్క; వృత్తాంతంబు= సమాచారము; చెప్పి; నీవు; పనుపన్= పంపించగా; మగిడి= తిరిగి; చని= వెళ్ళి; తెలతెల= తెల్లతెల్లగా వెలుతురు; వేగునప్పుడు= ఉదయించునప్పుడు (అనగా తెల్లవారుచుండగా); కౌరవ= కౌరవులయొక్క; సేనా= సైన్యముయొక్క; సన్నివేశంబు= శిబిరము; చేరితిన్= చేరితిని; ఆ సమయంబునన్= ఆ సమయమునందు.

తాత్పర్యం: ధర్మరాజు శ్రీకృష్ణుడిని మందిరానికి వెళ్ళి 'సుఖనిద్ర' చేయుమని పంపించి, తన తమ్ము లైన భీమార్జున నకుల సహదేవులను, ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకి ప్రముఖులను, మిగిలిన సేవకులను, తమ తమ గృహాలకు పంపించి, తీసివేయబడిన బాణం కల ఏనుగువలె ధర్మరాజు శయనమందిరం చేరాడు. సైన్యమంతయును మిక్కిలి సంతృప్తి పొంది విశ్రాంతి పొందింది. ఇంక సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా చెప్పుతున్నాడు: ఆ రాత్రి అనగా పదిహేడవ రోజు యుద్ధం ముగిసి కర్ణుడు కూలిన రాత్రి నేను ఇక్కడకు వచ్చి కర్ణుడి యుద్ధం, సంహారం మొదలైన సమాచారమంతా చెప్పి నీవు పంపగా తిరిగి వెళ్ళి తెలతెలవారుతుండగా కౌరవ శిబిరం చేరాను. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

క. కురుపతి పడవాళ్ళం దగు । దొరలకడకు సత్వరముగ దురమునకు భటో
త్కరము నను వు సేయుటకై । బరవసము దలిర్పఁ బనిచెఁ బార్థివముఖ్యా! 98

ప్రతిపదార్థం: పార్థివ= రాజులలో; ముఖ్యా!= ప్రముఖుడవు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; కురుపతి= దుర్యోధనుడు; పడవాళ్ళన్= సేనాధిపతులను; తగు= తగిన - అనగా దళపతులు కా తగిన; దొరలకడకున్= రాజులవద్దకు; దురమునకున్= యుద్ధమునకు; భట= భటులయొక్క; ఉత్కరమున్= సమూహమును; సత్వరముగన్= మిక్కిలి వేగముగా; అనువు= సిద్ధము; చేయుటకై; బరవసము= ధైర్యము; తలిర్పన్= చిగురించునట్లుగా; పనిచెన్= పంపించెను.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! దుర్యోధనుడు యుద్ధానికి భట సమూహాన్ని వేగంగా సిద్ధం చేయటానికి ధైర్యం అతిశయించేటట్లుగా దళపతులు కాదగిన రాజులకడకు సేనాధిపతులను పంపించాడు.

వ. పనిచిన నెల్లవారు నుల్లంబుల నుత్సాహంబు లుల్లసిల్లఁ దమతమ చతురంగంబులకు సవరణలు సంఘటింపం దొడంగినఁ దూర్యంబులు సెలంగ నొండొరులఁ బిలుచునెలుంగులు నింగిముట్ట రథనేమిగజపద తురంగఖురపుటభటచరణ సంఘట్టితంబగు ధరణీతలం బద్రువ బహుళంబగు నులివు చంద్రోదయ సమయఘూర్ణమానంబగు మహార్ణవంబు నినదంబు ననుకరించె; న ట్లాయితంబై శల్యశకుని కృతవర్మాశ్వత్థామలును దక్కునుం గల యోధవరులును నొక్కెడ ననుజసహితుండై యున్న మనుజపతి సన్నిధిఁ గూడి యతండు వినఁ దమలో నిట్లనిరి. 99

ప్రతిపదార్థం: పనిచినన్= పంపగా; ఎల్లవారున్= అందరును; ఉల్లంబులన్= మనస్సులందు; ఉత్సాహంబులు= యుద్ధప్రయత్నములు; ఉల్లసిల్లన్= ప్రకాశింపగా; తమతమ= వారి వారి; చుతరంగంబులకున్= చతురంగ బలములకు అనగా

రథ, గజ, తురగ, పదాతి దళములకు; సవరణలు= అలంకరణలు; సంఘటింపన్= సమకూర్చుటకు; తొడంగినన్= ప్రారంభించగా; తూర్యంబులు= వాద్య ధ్వనులు (అనగా యుద్ధసన్నాహ సూచకములగు వాద్యధ్వనులు); చెలంగన్= మ్రోగగా; ఒండొరులన్= ఒకరినొకరును (అనగా పరస్పరము); పిలుచు నెలుంగులు= పిలిచెడి కంఠధ్వనులు; నింగిముట్టన్= ఆకాశము ముట్టుకొనగా (అనగా వ్యాపించగా); రథనేమి= రథచక్రముల అంచులచేత; గజ= ఏనుగులయొక్క; పద= పాదములచేత; తురంగ= గుర్రాలయొక్క; ఖురపుట= దొప్పలవంటి గిట్టలచేత; భటచరణ= భటులయొక్క పాదములచేత; సంఘట్టితంబు= గట్టిగా త్రొక్కబడినది; అగు= అయిన; ధరణీ= భూమియొక్క; తలంబు= స్థలము (అనగా భూభాగము); అద్రువన్= అదరగా(అనగా చలింపగా); బహుళంబు= అధికము; అగు= అయినట్టి; ఉలివు= మ్రోత; చంద్ర= పున్నమ చందమామ; ఉదయ= ఉదయించు; సమయమునన్= కాలమున; ఘూర్ణమానంబు= సుళ్ళు తిరుగబడుచు శబ్దించునది; అగు= అయినట్టి; మహార్ణవంబు= మహాసముద్రముయొక్క; నినదంబును= ధ్వనిని; అనుకరించెన్= అనుకరించెను; అట్లు= ఆ ప్రకారముగా; ఆయితంబై= సంసిద్ధమై; శల్య= శల్యుడు; శకుని; కృతవర్మ; అశ్వత్థామలు; తక్కునున్= ఇంకను మిగిలి; కల= ఉన్నట్టి; యోధవరులునున్= శ్రేష్ఠులైన యోధులును; ఒక్కెడన్= ఒక చోట; అనుజ= తమ్ములతో; సహితుండై= కూడియున్నవాడై; ఉన్న= ఉన్నట్టి; మనుజ= మానవులకు; పతి= ప్రభువు అయిన; దుర్యోధనుడి; సన్నిధిన్= అతిసమీపమున; కూడి= కలిసి; అతండు= ఆ దుర్యోధనుడు; వినన్= వినునట్లుగా; తమలోన్= తమలోతాము; ఇట్లు= ఈ ప్రకారముగ; అనిరి= అనుకొన్నారు.

తాత్పర్యం: అట్లు పంపించగా అందరూ మనసులందు రణోత్సాహాలు ఉప్పొంగగా వారి వారి రథగజతురంగ పదాతులనెడి చతురంగ బలాలకు అలంకరణాలు సమకూర్చుకొనటం ప్రారంభించగా యుద్ధ సన్నద్ధసూచకాలైన తూర్యధ్వనులు మ్రోగాయి. సైనికులు ఒకరినొకరు పిలుచుకొనే అరుపులు నింగిని తాకాయి. చతురంగబలాలతో రథచక్రాల అంచులచేత, ఏనుగుల పాదాలచేత, గుర్రాల గిట్టలచేత భటుల చరణఘాతాలచేత, సంఘట్టితమైన భూభాగం చలించిపోయింది. ఆ సమయంలో ఉద్భవించిన అధికమయిన ఆ మ్రోత చంద్రోదయ సమయాన సుళ్లు తిరుగుతూ ఉప్పొంగే మహాసముద్రం చేసే ధ్వనిని అనుకరించింది. ఆ ప్రకారంగా యుద్ధ సన్నద్ధులైన శల్య శకుని కృతవర్మాశ్వత్థామలు, మిగిలిన యోధవరులు ఒకచోట తమ్ములతో కూడి ఉన్న సుయోధనుడి సన్నిధిలో కలిసి, ఆ సుయోధనుడు వినేటట్లుగా తమలో తాము ఈ ప్రకారంగా చెప్పుకొన్నారు.

క. **ఒకఁ డొకఁడ పాండవులఁ దాఁ । కక సైన్యోపేతగాఢగతి నందఱు నొ**
క్కొక తలగాఁ దలపడి వా । రి కడంక యుడుపఁగవలయుఁ గ్రీడయ పోలెన్. 100

ప్రతిపదార్థం: ఒకఁడు; ఒకఁడ= ఒక్కడే; పాండవులన్; తాఁకక= ఎదుర్కొనక; సైన్య= సేనతో; ఉపేత= కూడుకొని; గాఢ= గట్టి అయిన; గతిన్= పద్ధతితో(అనగా దృఢమైన వ్యూహంతో); అందఱున్= అందరును; ఒక్కొక్కతలగాన్= ఒక్కుమ్మడిగా; తలపడి= ఎదుర్కొని; వారి= వారియొక్క; కడంక= ప్రయత్నము; క్రీడయ= ఆట; పోలెన్= వలె; ఉడుపఁగన్= తొలగింపగ(లేక) పోగొట్టగ; వలయును.

తాత్పర్యం: ఒక్కొక్కడే పాండవులను ఎదుర్కొనక, సేనతోకూడి దృఢమైన వ్యూహంతో అందరూ కలిసి ఒక్కుమ్మడిగా ఒక్కొక్కడిపై తలపడి ఆ పాండవుల ప్రయత్నాన్ని ఒక క్రీడవలె ఉడిగించాలి.

వ. **మన మొకళ్ళొకళ్ళకుఁ బ్రాపగుచు నేపారి పోరినం జుల్కన గెల్పు గొనవచ్చు నిత్తెఱంగు మనకు సమయంబు సుండీ! యట్లుగాక యొంటి పెనంగెడివాఁడును బెనఁగెడివానిఁ గని కూడుకొనని వాఁడును బంచవిధ**

పాపంబుల నొందఁగలవాఁడని యొండొరులకుం జెప్పికొని కదలి యుద్దామసామర్థ్యంబున నమ్మద్రపతి ముంగలియై నడవం జనునప్పుడు. **101**

ప్రతిపదార్థం: మనము; ఒకళ్ళొకళ్ళకున్= ఒకరు మరొయొకరికి; ప్రాపు= ఆశ్రయం; అగుచున్; ఏపారి= విజృంభించి; పోరినన్= పోరాటము సల్పినచో; గెల్పు= విజయము; చుల్కనన్= తేలికగా; కొనవచ్చున్= కైకొనవచ్చును; ఈ+తెఱంగు= ఈ ప్రకారంగా; మనకున్; సమయంబు= ఒప్పందము (అనగా శపథము); సుండీ!= సుమండీ!; అట్లు= ఆ ప్రకారంగా; కాక; ఒంటి= ఒంటరిగ; పెనంగెడివాఁడును= పోరాడెడివాడును; పెనఁగెడివానిని= పోరాడేవాడిని; కని= చూచి; కూడుకొననివాఁడును= వానికి సహకరించనివాడును; పంచవిధ= అయిదు విధాలైన; పాపంబులన్= పాతకములను; ఒందన్ కలవాఁడు= పొందగలడు; అని; ఒండొరులకున్= ఒకరికొకరికి (అనగా పరస్పరము); చెప్పికొని= అనుకొని; కదలి= బయలుదేరి; ఉద్దామ= భయంకర= అధిక; సామర్థ్యంబునన్= యోగ్యతవలన (అనగా శక్తివలన); ఆ+మద్రపతి= ఆ మద్రదేశాధిపతి శల్యుడు; ముంగలియై= ముందున్నవాడై; నడవన్= నడుచుచుండగా; చనునప్పుడు= వెడలుచున్నప్పుడు.

తాత్పర్యం: 'మనం ఒకరికొకరం రక్షకులమై విజృంభించి పోరాడితే జయం సులభంగా సంపాదించవచ్చును. ఇది మనకు శపథం. ఈ శపథం ప్రకారం కాకుండా ఒంటరిగా పోరాడెడివాడు, వాడిని చూచి అతడితో కలిసి పోరాటం చేయనివాడు, పంచమహాపాతకాలను పొందగలడు' అని పరస్పరం ఒట్టుపెట్టుకొని బయలుదేరి అధికమైనశక్తి కల శల్యుడు ముందు నడుస్తూ ఉండగా. (తరువాతి పద్యంలో అన్వయం.)

విశేషం: ఈ వచనమున ఉస్మానియా ప్రతియందు తప్పు పాఠం ఉన్నది. అది అచ్చుతప్పు అనటానికి వీలుకాదు. మంచిపాఠమును పాఠాంతరంగా చూపి - తప్పు పాఠమును ప్రమాణంగా గ్రహించారు. (3) కూడుకొనిన - తప్పుడు పాఠము. (3) కూడుకొనని - పాఠాంతరము - ఇదే అసలు పాఠము. ఈ వచనమున 'కూడుకొనని' అనే పాఠమునే గ్రహించితిని. ఇట్లు చెప్పుటకు మూలమే ప్రమాణము.

'న న ఏకేన యోద్ధవ్యం కథంచిదపి పాండవైః ॥8॥
యో హ్యేకః పాండవైర్యుధ్యే ద్యోవాయుద్ధ్యంత ముత్సృజేత్ ।
స పంచభిర్భవేద్యుక్తః పాతకైశ్చోపపాతకైః ॥9॥
అన్యోన్యం పరిరక్షద్భిర్యోద్ధవ్యం సహితైశ్చ హ ।
ఏవం తే సమయం కృత్వా సర్వే తత్ర మహారథాః ॥10॥
మద్రరాజం పురస్కృత్య తూర్ణ మభ్యద్రవన్ పరాన్ । ॥11॥ (శల్య. అ-8; 8,9,10,11,)

పంచమహాపాతకములు:

1. స్వర్ణస్తేయం 2. సురాపానం 3. బ్రహ్మహత్య 4. గురుపత్నీగమనం, 5. శిశుహత్య.

కౌరవసైన్యంబు యుద్ధసన్నద్ధం బై వెడలుట (సం. 9-7-10)

సీ. **చంచరీకావళి ఝుంకృతుల్ గల్పించు । కర్ణఝుళంఝుళాకలనములును**
ధరణీపరాగసంతానంబుఁ గబళించు । కరశీకరచ్ఛటాస్ఫురణములును
ఘంటికాటంకృతికాంతి సంభావించు । నిర్భరబృంహితనిస్స్వనములు
నంబరభాగంబు నల్పంబు గావించు । నున్నతగాత్రసముద్ధతులును

తే. **జారు భీషణరేఖలు భూరిమద భ। రాభిరామ యానంబులు నాహవోచి**
తోగ్ర కల్పనాభంగులు నుల్లసిల్లఁ। గరులు ధాత్రీతలంబు గ్రక్కదల నడచె. **102**

ప్రతిపదార్థం: చంచరీక= తుమ్మెదల; ఆవళి= సమూహంయొక్క; ఝంకృతుల్= ఝంకారములు; కల్పించు; కర్ణ= చెవులయందలి; ఝళం ఝళా= ఝళం ఝళం అను; ఆ కలనములును= ధ్వనులును (అనగా ఏనుగుల చెవులకు వ్రేలాడ గట్టిన చిరు మువ్వల ఝళం ఝళారావములును); ధరణీ= భూమియొక్క; పరాగ= ధూళియొక్క; సంతానంబు= సముదాయము; కబళించు= మ్రింగెడి; కర= తొండములనుండి వచ్చు; శీకర= నీటి తుంపరలయొక్క; ఛటా= సమూహములను; స్ఫురణములను= తలంపులను(శీకరము అనగా సామాన్యార్థము - తుంపర విశేషార్థము - ఏనుగు తొండమునుండి వచ్చుమదము - కరశీకరము అనినను, శీకరము అనినను ఏనుగుతొండమునుండి వచ్చు మదమనియే అర్థము. సామాన్య విశేషార్థములను గ్రహించుటకు తిక్కయజ్వ 'కరశీకర' ప్రయోగము చేసెను. అందువలన ఏనుగుల తొండములనుంచి వచ్చు మదముయొక్క తుంపరలు - అను అర్థమును గ్రహింపవలసి యున్నది.) ఘంటికా= ఘంటలయొక్క; టంకృతి= టంకారధ్వనులయొక్క; కాంతి= సౌందర్యము; సంభావించు= గౌరవించు; నిర్భర= ప్రగాఢమయిన; బృంహిత= ఏనుగుల ఘీంకారములయొక్క; నిస్వనములును= ధ్వనులును; అంబర= ఆకాశముయొక్క; భాగంబు; అల్పంబు= తక్కువ; కావించు= చేసే; ఉన్నత= ఎత్తైన; గాత్ర= దేహములయొక్క; సముద్ధతులును= ఔన్నత్యములును; చారు= సుందరమయిన; భీషణ= భయంకరమయిన; రేఖలు= వరుసలు; భూరి= అధికమైన; మద= మదముయొక్క; భర= భారమువలన; అభిరామ= మనోహరమయిన; యానంబులును= నడకలును; ఆహవ= యుద్ధమునకు; ఉచిత= యోగ్యమయిన; ఉగ్ర= భయంకరమయిన; కల్పనా= రచింపబడిన (అనగా ఏర్పాటు చేయబడిన); భంగులున్= రీతులును; ఉల్లసిల్లన్= ప్రకాశింపగా; ధాత్రి= భూమియొక్క; తలంబు= స్థలము (అనగా భూభాగము లేక భూమండలము) క్రక్కదలన్= కంపించగా; కరులు= ఏనుగులు; నడచెన్= నడచెను.

తాత్పర్యం: (చతురంగబలములలో గజదళం ముఖ్యమైనది. సేనలు యుద్ధభూమికి నడచేటప్పుడు అగ్రభాగంలో గజదళం నడవటం ఆచారం. అందువలన ముందుగా గజదళం వర్ణించబడుతున్నది.) ఏనుగుల చెవులయొక్క చిరుమువ్వల నుండి వచ్చే ఝళం ఝళ ధ్వనులు తుమ్మెదల గుంపులు చేసే ఝంకారాలను తలపిస్తున్నాయి. ఏనుగుల తొండాలనుండి పుట్టిన మదంయొక్క తుంపరలు భూమినుండి పుట్టిన ధూళి సముదాయాన్ని మ్రింగుతున్నట్లు తోస్తున్నవి. ఏనుగుల కంఠాలలో వ్రేలాడే ఘంటలయొక్క టంకార ధ్వనులు ప్రగాఢమయిన ఘీంకారధ్వనులను పోలి ఉన్నాయి. ఎత్తైన ఏనుగులయొక్క దేహాల ఔన్నత్యాలు ఆకాశభాగాన్ని అల్పం చేస్తున్నవి. సుందరాలు, భయంకరాలు అయిన మదభారం కల ఏనుగుల వరుసలయొక్క మదభారంవలని మందగమనాలు మనోహరాలౌతున్నవి. ఈ విధంగా యుద్ధానికి తగిన భయంకర మయిన ఏనుగుల వరుసలు ప్రకాశించగా భూభాగం కంపించేటట్లు గజదళం యుద్ధభూమికి నడచింది.

చ. **గతిబహుతాలసత్ఖురవిఘట్టితమేదిని జీవితేశ క**
ల్పిత నఖరేఖలం జెలువు పెంపు వహించు పురంధ్రిఁ బోల ను
ద్ధతముఖబంధురాంగలలితంబులు నూర్జితకింకిణీఝణ
త్కృతి పటుహేషలుం దగ నుదీర్ణములై నడచెం దురంగముల్. **103**

ప్రతిపదార్థం: గతి= గమనములయొక్క; బహుతా= అనేకత్వముచే; లసత్= ప్రకాశించుచున్న; ఖుర= గిట్టలతో; విఘట్టిత= తొక్కబడిన(లేక)కొట్టబడిన; మేదిని= భూమి; జీవిత+ఈశ= ప్రాణమునకు అనగా బ్రతుకునకు ప్రభువు అయిన భర్తచేత అనగా ప్రాణప్రియునిచేత; కల్పిత= చేయబడిన; నఖ= గోళ్ళయొక్క; రేఖలన్= గీతలవలన (అనగా నఖక్షతములవలన); చెలువు= అందముయొక్క; పెంపు= వృద్ధిని; వహించు= ధరించు; పురంధ్రిన్= గృహిణిని; పోలన్= పోలునట్లుగా; ఉద్ధత= ఉన్నతమయిన; ముఖ= ముఖములతో; బంధుర= సుందరముగా వంగిన; అంగ= అవయవములయొక్క; లలితంబులును= సౌకుమార్యములు కలిగినట్టియు - (ముఖములు ఎత్తుగా ఉండి, మెడ, నడుము సుందరముగా వంగిఉండి - సుకుమారముగా ఉన్న ఉత్తమజాతి అశ్వములను తురంగములందురు); ఊర్జిత= అధికమైన; కింకిణీ= చిరుగంటలయొక్క (అనగా గుర్రములకాళ్లకు కట్టిన గజ్జెలయొక్క); ఝణత్కృతి= ఝణం ఝణ ధ్వనులు; పటు= చురుకుతనమును చూపుటకు సమర్థమయిన; హేషలున్= సకిలింపులు కలిగినట్టియు అగు; తురంగముల్= గుర్రాలు; తగన్= ఒప్పుగా; ఉదీర్ణములై= గొప్పవియై; నడచెన్= (యుద్ధభూమికి) నడచెను.

తాత్పర్యం: (ఇది చతురంగబలములలో తురంగదళ వర్ణనం.) యుద్ధభూమికి వెడలుతున్న తురంగాలు తాళ లయాన్వితముగా నడుస్తున్నాయి. ఆ తురంగాల గిట్టలతో తొక్కబడిన భూమి ప్రాణప్రియుడి నఖక్షతాలవలన అతిశయించిన సౌందర్యం కల గృహిణిని పోలి ఉన్నది. (ఉత్తమజాతి తురగాల నడకలు తాళలయాన్వితంగా ఉండటం లోకప్రసిద్ధం). ఉన్నతాలయిన ముఖాలతో సుందరంగా వంగిన మెడ, నడిమి భాగాలతో సుకుమారాలయిన అవయవాలతో ఆ తురంగా లొప్పుతున్నవి. (గుర్రాల కాళ్ళకు గజ్జెలు కట్టటం, ఏనుగుల మెడలకు ఘంటలు కట్టటం సంప్రదాయం, సౌందర్య పోషకం.) దృఢమయిన ఆ చిరుగంటల ఝణంఝణ ధ్వనులు, చురుకుతనాన్ని చూపటానికి సమర్థమయిన సకిలింపులు కల ఆ తురంగాలు ఒప్పుగా గొప్పగా యుద్ధభూమికి నడచాయి.

విశేషం: ఇది శ్లేషానుప్రాణిత ఉపమ. బహుతాల+సత్ఖుర - బహుతా+లసత్ఖుర - అని పదచ్ఛేదము. అందువలన ఖండశ్లేష. ఉత్ప్రేక్ష అనగా ఊహ. ఉపమాన ధర్మసంబంధంతో ఉపమేయాన్ని ఉపమానంగా ఊహించి చెప్పుట ఉత్ప్రేక్ష. ఇచ్చట - ఉపమేయం మేదిని. ఉపమానం పురంధ్రి. ఖుర విఘట్టితమునకు నఖరేఖలకు ధర్మసంబంధం. పోల(న్) - వాచకం.

సీ. **మీఱిన యుబ్బున మీఁదికిఁ గాళులు । సాఁచు రథ్యంబుల చటులతయును**
లలిఁ బెండ్లికినిఁ బోవు చెలువున విలసిల్లు । సూతజనంబు విస్ఫూర్జితంబు
జతనంబు మేలిమిఁ జారుఘోరములగు । నవయవంబుల విభవాతిశయము
బిరుదుల నుద్భటస్ఫురణంబులై క్రాలు । కేతనంబుల సముద్యోతితంబు

తే. **సొంపు మిగులంగ జోదుల యంపపొదుల । దీప్తులును లేఁత నవ్వుల దీధితులును**
హారిరశ్ములుఁ గీడ్పర నగుచు వెలుఁగఁ । దేరు లరిగె నుద్దామతఁ గౌరవేంద్ర! **104**

ప్రతిపదార్థం: కౌరవేంద్ర!= కౌరవులకు ప్రభువుఅయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; మీఱిన= అతిశయించిన; ఉబ్బునన్= ఆనందముతో; మీఁదికిన్= పైకి; కాళులు= కాళ్లు; చాఁచు= చాచెడి; రథ్యంబుల= గుర్రములయొక్క; చటులతయును= చంచలత్వమును; లలిన్= ఉత్సాహంతో; పెండ్లికినిన్= పెండ్లికొరకు; పోవు= వెడలునట్లుగా; చెలువునన్= సొంపుతో; విలసిల్లు= ప్రకాశించు; సూతజనంబు= సూతజనులయొక్క (అనగా రథములను తోలు జనులయొక్క) (గుర్రములను మేపుచు - రథములను తోలుచూ జీవించువారు సూతులు. వీరు సారథులుగా కూడ ఉండవచ్చును. కాని సారథులందరు సూతులు మాత్రముకారు. పార్థసారథి శ్రీకృష్ణుడు సూతుడు కాడు. కర్ణసారథి శల్యుడు సూతుడుకాడు.) విస్ఫూర్జితంబు= అరుపులు

బొబ్బలతో, చప్పట్లతో నిండిన శబ్దముతో మిక్కిలి ప్రకాశవంతమగు; జతనంబుమేలిమిన్- జతనంబు= ప్రయత్నముయొక్క- మేలిమిన్= ఆధిక్యము వలన (అనగా అధిక ప్రయత్నముతో చేయబడిన); చారు= సుందరములు; ఘోరములు= భయంకరములు; అగు= అయినట్టి; అవయవంబుల= అంగములయొక్క (అనగా రథాంగములయొక్క) విభవ= సంపద అనగా శక్తియొక్క; అతిశయము= ఆధిక్యమును; బిరుదులన్= బిరుదులవలన (అనగా - అథిరథుడు - మహారథుడు - రథుడు - అర్ధరథుడు - మొదలగు శౌర్య చిహ్నములగు బిరుదులవలన); ఉద్భట= అధికమయిన; స్ఫురణంబులై= తలపులు తోచునట్లు; క్రాలు= ఒప్పు; కేతనంబుల= జెండాయొక్క (రథములమీద వారి వారి శౌర్యచిహ్నములు సూచించుటకు కట్టబడిన టెక్కెములు); సముద్ద్యోతితంబు= గొప్ప ప్రకాశము కలిగినదియును; సొంపు= సౌందర్యము; మిగులంగన్= అతిశయింపగా; జోదుల= యోధులయొక్క; అంపపొదుల= తూణీరములయొక్క; దీప్తులును= కాంతులును; లేఁత నవ్వుల దీధితులును= చిరునవ్వుల యొక్క కాంతులును (అనగా పరిహాసమును సూచించు చిరునవ్వులు); హారి రశ్మలున్- హారి= మనోజ్ఞములైన; రశ్మలున్= పగ్గములును (అనగా కళ్ళెములు); కీడ్వెరన్= శత్రువులకు కీడు; సూచించేది; అగుచున్= సూచించునది అగుచు; వెలుఁగన్= ప్రకాశింపగా - ఉద్దామతన్= అడ్డులేని విధముగా; తేరులు= రథములు (అనగా రథ దళము); అరిగెన్= వెడలెను.

తాత్పర్యం: (ఇది చతురంగ బలములలో రథ దళముయొక్క వర్ణనం.) ఓ ధృతరాష్ట్ర మహారాజా! అతిశయించిన ఆనందంతో కాళ్ళు పైకి చాచే చంచలత్వం, - ఉత్సాహంతో పెండ్లికి పోయేటట్లుగా సొంపుతో సూతజనులు చేసే శబ్దాలు-అధిక ప్రయత్నంతో చేయబడిన - భయద సుందరమైన రథాంగాల వైభవాతిశయం, శౌర్యచిహ్నాలగు బిరుదముల వలన అధికస్ఫూర్తితో ఒప్పు జెండాల అధిక ప్రకాశం, సౌందర్యం అతిశయింప యోధులయొక్క అమ్ముల పొదుల కాంతులు, చిరునవ్వుల కాంతులు మనోజ్ఞాలయిన కళ్ళాలు కలిగి ఇతరులయిన శత్రుపక్షాన్ని తక్కువచేస్తూ అశుభసూచక మవుతూ ప్రకాశించగా అడ్డులేని విధంగా రథాలు యుద్ధభూమికి వెడలాయి.

విశేషం: అలం: స్వభావోక్తి. చైతన్య చిత్రణంలో తిక్కయజ్వ సిద్ధహస్తులు. ఈ సీసపద్యంలో దూరమునుండి దర్శించేటప్పుడు కనిపించే దృశ్యరూప చైతన్య చిత్రణం చేయబడినది. అందువలన ముందుగా ఉత్సాహంతో కాళ్ళు పైకెత్తు రథ్యముల చంచలత్వం, ఆ తరువాత రథ్యములను తోలు సూతజనుల సొగసులు, అటు పిమ్మట రథాంగముల వైభవం, అనంతరం రథాలపై నుండు టెక్కెముల రెపరెపలు, యోధుల తూణీరాలు, లేతనవ్వులు, కళ్ళెములు కాంతులు - ఇది క్రమ దృశ్యరూప చిత్రణం.

చ. కడఁకయు లావునుం గరఁగి గట్టిగఁ గూర్చి యొనర్చినట్టి పే
రొడళులఁ దాల్మియుం గడిమియుం గలయం బరికించి యందు నే
ర్పిడుకొని గాఢభంగి రచియించిన చందము నెమ్మనంబులం
గడుఁ జెలువొంద నుబ్బి వడిఁ గాల్బలమేఁగెఁ గరం బుదగ్రతన్. 105

ప్రతిపదార్థం: కడఁకయున్= ప్రయత్నమును; లావునున్= బలమును; కరఁగి= కరగించి; గట్టిగన్= కఠినముగ; కూర్చి= కలిపి; ఒనర్చునట్టి= తయారుచేసినట్టి; పేరొడళులన్= పెద్ద దేహములను; తాల్మియున్= ఓర్పును; కడిమియున్= పరాక్రమమును; కలయన్= కలిసిపోవునట్లుగా; పరికించి= వీక్షించి; అందున్= అందులో; నేర్పు= నేర్పరితనమును; ఇడుకొని= ఉంచుకొని (అందులో సామర్థ్యము కలవారిని ఉంచుకొని); గాఢ= తీక్ష్ణమయిన; భంగిన్= విభాగముగా; రచియించిన= సేనను రూపొందించిన; చందమున్= విధానంతో; నెమ్మనంబులన్= నిండైన మనస్సులందు; కడున్= మిక్కిలి; చెలువు= సౌందర్యం; ఒందన్= పొందగా; ఉబ్బి= సంతోషంతో పొంగిపోయి; కరంబు= మిక్కిలి; ఉదగ్రతన్= భయంకరంగా; వడిన్= వేగంగా - కాల్బలము= పదాతిదళము; ఏఁగెన్= వెడలెను.

తాత్పర్యం: (ఇది చతురంగ బలాలలో పదాతివర్ణనం) ప్రయత్నం, బలం కలగలిపి కరిగించి గట్టిగా పోతపోసినట్టి పెద్ద పెద్ద దేహాలు గల వాళ్లలో ఓర్పు, పరాక్రమం కలగలిపి బాగుగా పరీక్షించి అందులో నేర్పరితనం కలవారిని మాత్రమే పరిగణించి అధిక విభాగంగా సేనను రూపొందించిన విధానంతో నిండు మనసులందు మిక్కిలి సౌందర్యం పొందగా, సంతోషంతో పొంగిపోయి మిక్కిలి భయంకరంగా వేగంగా కాల్బలం యుద్ధభూమికి వెడలింది.

విశేషం: యుద్ధ సన్నద్ధమయి వెడలే ఈ చతురంగ బలవర్ణనం మూలంలో లేదు. అందువలన ఇది తిక్కయజ్వ కవనరామణీయకానికి, స్వీయకల్పనకు, స్వతంత్ర భావనాపటిమకు నిదర్శనం. ఉత్తమ కవనానికి వర్ణన, చిత్రణములు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు. ఈ వర్ణన చిత్రణములే నిశ్చేతన పదార్థాలకు చేతనత్వం పరికల్పించును. స్థావరాలను జంగమాలుగా రూపొందించును. మహాకవుల బుద్ధిశక్తికి రెండు ముఖ్య లక్షణములుండును. ఒకటి ఊహ. రెండు భావన. ఊహాకల్పనము వర్ణనం. సత్యభావన చిత్రణం. కవిబ్రహ్మ తిక్కయజ్వ సత్యాత్మిక భావన ఈ చతురంగ బల చిత్రణమున సాక్షాత్కరించింది. 'రూపచిత్రణం, భావ చిత్రణం - చైతన్యచిత్రణం' అని చిత్రణం మూడు విధాలు. వర్ణ్య వస్తువునందలి - రూప, భావ, చేతనత్వములు కుసుమించి, వికసించి ఫలిస్తే కావ్యశరీరానికి ప్రాణప్రతిష్ఠ జరుగుతుంది.

వ. ఇట్లు కురుబలంబు సమరతలంబు చేరం బోవునంతం బాండవబలంబును జనుదెంచె ననిన విని
యాంబికేయుండు సంజయున కిట్లనియె. 106

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగా; కురుబలంబు= కౌరవసైన్యము; సమరతలంబు= యుద్ధభూమి; చేరన్= చేరుటకు; పోవన్= పోవుచుండగా; అంతన్= ఆ సమయమున; పాండవబలంబును= పాండవులయొక్క సైన్యమును; చనుదెంచెన్= వచ్చెను; అనినన్= అని చెప్పగా; విని; ఆంబికేయుండు= అంబిక కుమారుడైన ధృతరాష్ట్రుడు; సంజయునకున్; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: ఈ ప్రకారంగా కౌరవసైన్యం యుద్ధభూమి చేరేటంతలో పాండవ సైన్యం కూడా యుద్ధభూమి చేరిన దని విని ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు:

తే. 'సురనదీ సుతుచావును గురుని చావుఁ । గర్ణుచావును వినిన నా కర్ణములకు
శల్యుచావు, దుర్యోధనుచావుఁ జెప్పి, । యధికతరముగ సంతోష మావహింపు. 107

ప్రతిపదార్థం: సురనదీ= ఆకాశగంగానదియొక్క; సుతు= కుమారుడైన భీష్మునియొక్క; చావును= మరణమును; గురుని= ద్రోణునియొక్క; చావున్= మరణమును; కర్ణుచావును; కర్ణునియొక్క మరణమును; వినిన= ఆలకించిన; నా కర్ణములకున్= నా చెవులకు; శల్యుచావున్= శల్యుడి యొక్క మరణమును; దుర్యోధను= దుర్యోధనునియొక్క; చావున్= మరణమును; చెప్పి= వినిపించి; అధికతరగముగన్= మిక్కిలి ఎక్కువగ; సంతోషము; ఆవహింపుము= కలుగచేయుము.

తాత్పర్యం: 'భీష్మ ద్రోణ కర్ణుల మరణములను ఆలకించిన నా చెవులకు శల్య దుర్యోధనుల మరణాలను కూడా వినిపించి అనుభవశక్యంకాని సంతోషమును కలుగచేయుము. (ఇది ధృతరాష్ట్రుడి దుఃఖాతిశయ స్థితిని సూచిస్తున్నది.)

క. అమ్మద్రవిభుని ధర్మజుఁ । డెమ్మెయిఁ బరిమార్చెఁ గౌరవేంద్రుని భీముం
డెమ్మెయి గీటడఁచె రణం । బెమ్మెయిఁ బరిపాటిఁ జెల్లె? నేర్పడఁ జెపుమా!' 108

ప్రతిపదార్థం: ఆ+మద్రవిభుని= ఆ మద్రదేశ ప్రభువు అయిన శల్యుడిని; ధర్మజుండు= ధర్మరాజు; ఏ+మెయిన్= ఏ విధంగా; పరిమార్చెన్= సంహరించాడు; కౌరవేంద్రుని= కౌరవులకు ప్రభువు అయిన దుర్యోధనుడిని; భీముండు; ఏ+మెయిన్= ఏ విధంగా; గీటడఁచెన్= చంపెను; రణంబు= యుద్ధం; ఏ+మెయిన్= ఏ విధంగా; చెల్లెన్?= జరిగెను?; పరిపాటిన్= క్రమముగా; ఏర్పడన్= తేటతెల్లంగా; చెపుమా!= చెప్పుము.

తాత్పర్యం: మద్రదేశ ప్రభువు అయిన శల్యుడిని ధర్మరాజు ఏ విధంగా సంహరించాడు? దుర్యోధనుడిని భీముడు ఎట్లు చంపాడు? యుద్ధం ఏ విధంగా జరిగింది? ఇది అంతా క్రమంగా తేటతెల్లంగా చెప్పుము.'

వ. అనుటయు సంజయుం డమ్మనుజపతి కిట్లను 'వగచుకొలంది కడచనియె; ధీరుండవై వార్త లవధరింపుము. 109

ప్రతిపదార్థం: అనుటయున్= (ధృతరాష్ట్రుడు) ఇట్లు అడుగగా; సంజయుండు; ఆ+మనుజపతికిన్= మానవులకు ప్రభువు అయిన ఆ ధృతరాష్ట్రుడికి; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; వగచు కొలంది= దుఃఖంయొక్క మితి; కడచనియెన్= దాటింది (అనగా ఇప్పటికే దుఃఖం అనుభవించగల మితి దాటిపోయింది కాబట్టి); ధీరుండవు+ఐ= ధైర్యంకలవాడవై; వార్తలు (నేను చెప్పే); వృత్తాంతాలు; అవధరింపుము= ఏకాగ్రతతో శ్రద్ధగా వినుము.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ఇట్లా అడుగగా సంజయుడు ఆ ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: దుఃఖాన్ని అనుభవించగల మితి దాటింది. ఇక ధీరుడవై నేను చెప్పే వృత్తాంతాలు, యుద్ధవిషయాలు శ్రద్ధగా వినుము.

క. గంగాసుతగురుకర్ణుల । సంగరమునఁ బాండుసుతులు సంపుట గన్నా
రం గనియు నీ తనయు లా । సం గూరిరి వారిఁ జంపు శల్యుం డనుచున్. 110

ప్రతిపదార్థం: సంగరమునన్= యుద్ధమునందు; పాండుసుతులు= పాండురాజ కుమారులు; గంగాసుత= గంగాదేవి పుత్రుడు అయిన భీష్ముడిని; గురు= ద్రోణుడిని; కర్ణులన్= కర్ణులను; చంపుట= సంహరించుట; కన్నారన్= ప్రత్యక్షముగా; నీ తనయులు= నీకొడుకులు; కనియున్= చూచియు; శల్యుండు; వారిన్= వారిని (ఆ పాండవులను); చంపున్= చంపును; అనుచున్= అనుచు; ఆసన్= ఆశను; కూరిరి= పొందిరి.

తాత్పర్యం: యుద్ధంలో పాండవులు భీష్మద్రోణ కర్ణులను సంహరించటం ప్రత్యక్షంగా చూచి కూడా నీ కొడుకులు శల్యుడు ఆ పాండవులను చంపుతాడనే పేరాశ పొందారు.

వ. దుర్యోధనుండు దిక్కుమాలి యుండియు నడియాసం జేసి తన్ను సంపన్నునిం గాఁ దలంచుచు. 111

ప్రతిపదార్థం: దుర్యోధనుండు; దిక్కుమాలి= దిక్కులేక (అనగా ఏ మార్గములేక); ఉండియున్= ఉన్నవాడయ్యును; అడి+ఆసన్+చేసి= వ్యర్థమైన ఆశవలన; తన్నున్= తనను; సంపన్నునిన్= సంపదకలిగిన వాడు; కాన్= అగునట్లుగా; తలంచుచున్= ఆలోచించుచూ.

తాత్పర్యం: దుర్యోధనుడు దిక్కుమాలినవాడై ఉండికూడా పేరాశ వలన తనను తాను సకలైశ్వర్యములు కలవాడినిగా తలుస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. **అనుజులుఁ దాను శల్యునిఁ బ్రియాతిశయంబునఁ జేరఁ బోవ నా**
యన మును కర్ణుఁ డర్జున శరాహతిఁ గూలిన నుబ్బి భీముఁ డా
ర్చిన నడలొంది తల్లడిలు చిత్తము లూఱట నొంద వారలం
గనుఁగొని పల్కులన్ శ్రుతిసుఖం బొనరించె నుదగ్రమూర్తియై. **112**

ప్రతిపదార్థం: అనుజులున్= తమ్ములును; తాను(దుర్యోధనుడు); ప్రియ= ప్రేమయొక్క; అతిశయంబునన్= ఆధిక్యంవలన; శల్యునిన్= శల్యుడిని; చేరన్= సమీపమునకు; పోవన్= వెళ్లగా; ఆయన= ఆ శల్యుడు; మును= ఇంతకుముందు; అర్జున= అర్జునునియొక్క; శర= తీక్ష్ణమయిన బాణములయొక్క; ఆహతిన్= దెబ్బలవలన; కర్ణుఁడు; కూలినన్= పడిపోగా; భీముడు; ఉబ్బి= సంతోషముతో పొంగి; ఆర్చినన్= పెద్దగొంతుతో అరవగా; అడలు= భయము (లేక) దుఃఖము; ఒంది= పొంది; తల్లడిలు= చలించిపోయిన; చిత్తములు= మనస్సులు; ఊఱటన్= ఉపశమనం; ఒందన్= పొందునట్లుగా; వారలన్= వారిని (దుర్యోధనాదులను); ఉదగ్ర= భయంకరమయిన; మూర్తియై= రూపంకలవాడై (శల్యుడు); కనుఁగొని= చూచి; పల్కులన్= మాటలతో; శ్రుతిసుఖంబు= చెవులకు ఇంపుకలిగేటట్లు; ఒనరించెన్= చేశాడు.

తాత్పర్యం: తమ్ములు, తాను అధిక ప్రేమతో శల్యుడి చెంతకు చేరగా ఆ శల్యుడు అంతకుముందు అర్జునుడి బాణాల దెబ్బలకు కర్ణుడు కూలగా భీముడు సంతోషంతో పొంగి అరిచిన ఆర్పులకు భయపడి చలించిపోయిన మనసులకు ఉపశమనం కలిగేటట్లు - ఆ దుర్యోధనాదులను చూచి భయంకర రూపం కలవాడై మాటలతో వారి చెవులకింపు కలిగించాడు.

వ. **ఇట్లు సమరోత్సాహ సమగ్రుండయిన మద్రపతి సర్వతోభద్ర వ్యూహంబు పన్నించె నందు ముఖంబున మద్రపతి గర్ణపుత్ర ప్రముఖ పరివృతుండై తాను నిలిచె. వలపట శకయవనసమేతుండై కృపాచార్యుండును దాఁపటఁ ద్రిగర్తసహితుండై కృతవర్మయు వెనుకఁ గాంభోజసహాయుండై యశ్వత్థామయు నడుమఁ గురువీర పరిరక్షితుండయి కౌరవేశ్వరుండును నతని ముందటఁ గరిఘటాగ్ర భాగవర్తియై బహుల చతురంగంబులతోడ శకునియు నిలుచునట్లుగా నొనర్చి పేర్చి యురవణించె. నంతక మున్న పాండవులు మూఁడు మొగంబులుగా మోహరించిరి. ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకు లగ్రేసరులుగా భీమార్జును లగ్రజునగ్ర భాగంబున శోభిల్లి సీతారూప విద్యోతితంబైన శల్యకేతనంబు సూచి త్రోచి నడచి' రనిన విని ధృతరాష్ట్రం డప్పటికి మనకుఁ బాండవులకుం గల సేనాంగంబుల కొలంది యెఱింగింపు' మనవుడు సంజయుం డా జనపతికిట్లను మనకుఁ బదునొకండు వేలు రథంబులును బదివేలు నేడు నూఱు గజంబులును రెండు లక్షలు హయంబులును మూఁడు కోట్లు పదాతులును వారికి నాఱువేలు రథంబులును మూఁడువే లేనుంగులును లక్ష గుఱ్ఱంబులును కోటి కాల్బలంబులును గలిగియుండె నయ్యుద్ధనంబు లొండొంటి గెలుచు నగ్గలిక డగ్గరియె నట్టియెడ.** **113**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; సమర= యుద్ధమునందలి; ఉత్సాహ= ప్రయత్నముతో; సమగ్రుండు= సంపూర్ణుడు; అయిన; మద్ర= మద్రదేశమునకు; పతి= అధిపతి (భర్త) అయిన శల్యుడు; సర్వతోభద్ర= సర్వతోభద్రము అను పేరుగల; వ్యూహంబు= యుద్ధ తంత్రరచనము; పన్నించెన్= సిద్ధము చేసెను; (మహాభారత యుద్ధమున భీష్ముడు - గరుడ వ్యూహమును ద్రోణుడు పద్మవ్యూహము చక్రవ్యూహము చక్రశకట వ్యూహములను; కర్ణుడు-మకర వ్యూహమును; శల్యుడు

సర్వతోభద్రవ్యూహమును రచించిరి. అర్జునుని ప్రతిజ్ఞనుండి జయద్రథుని రక్షించుటకు ద్రోణుడు చక్రశకట వ్యూహమును రచించెను. సర్వతోభద్రము అను ఒక యోగముద్ర కలదు. దీనికి వరుణుడు అధిదైవము. విష్ణు రథమునకు సర్వతోభద్రమని పేరు.); అందున్= అందు; (ఆ సర్వతోభద్రవ్యూహమునందు); ముఖంబునన్= ముఖస్థానమున; మద్రపతి= మద్రదేశమునకు భర్త అయిన శల్యుడు; ప్రముఖ= గొప్పవారైన; కర్ణపుత్ర= కర్ణుడియొక్క పుత్రులతో; పరివృతుండై= చుట్టబడినవాడై; తాను (శల్యుడు); నిలిచెన్= ఉండెను; వలపటన్= కుడివైపున; శక= శకులతో; యవన= యవనులతో; సమేతుండై= కూడియున్నవాడయి; కృపాచార్యుండును; దాఁపటన్= ఎడమవైపున; త్రిగర్త= త్రిగర్త దేశవీరులతో; సహితుండై= కూడియున్నవాడై; కృతవర్మయున్= కృతవర్మయును; వెనుకన్= వెనుకవైపున; కాంభోజసహాయుండై= కాంభోజవీరులు తోడుగాఉన్నవాడై; అశ్వత్థామయున్; నడుమన్= మధ్యభాగమున-కురువీర= కౌరవవీరులచేత; పరిరక్షితుండు+అయి= కాపాడబడువాడై; కౌరవ= కౌరవులకు; ఈశ్వరుండును= ప్రభువు అయిన దుర్యోధనుండును; అతనిముందటన్= ఆ దుర్యోధనుడిముందు; కరి= ఏనుగుల; ఘటా= సమూహంయొక్క; అగ్రభాగ= ముందుభాగమున; వర్తియై= ఉన్నవాడై; బహుల= విశాలమైన; చతురంగంబులతోడన్= చతురంగబలంబులతోడ; శకునియున్; నిలుచునట్లుగాన్= ఉండునట్లుగా; ఒనర్చి= చేసి; పేర్చి= చతరంగబలములు ఒకదాని తరువాత ఒకటి వరుసగా ఉంచి; ఉరవణించెన్= విజృంభించెను; అంతకమున్న= అంతకంటె ముందుగా; పాండవులు; మూఁడు మొగంబులుగాన్= మూఁడు ముఖములుగా (త్రిముఖ వ్యూహముతో); మోహరించిరి= వ్యూహమును పన్నిరి; ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకులు= ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకియును; అగ్రేసరులుగాన్= ముందు ఉన్నవారు కాగా (మూడు ముఖములయొక్క ముందుభాగమున ముప్పురును యథాక్రమముగా ఉండగా); భీమార్జునులు= భీముడును, అర్జునుడును; అగ్రజు= అన్న అయిన ధర్మరాజుయొక్క= అగ్రభాగంబునన్= ముందుభాగమునందు; శోభిల్లి= ప్రకాశించి; సీతా= పసుపు రంగుకల (లేక చిత్రవిచిత్ర వర్ణములు కల); రూప= ఆకారముతో; విద్యోతితంబైన= ప్రకాశించుచున్న; శల్యు= శల్యునియొక్క; కేతనంబు= రథముపై ఉన్నటెక్కెము (జెండా); చూచి; త్రోచి= వేగిరపడి; నడచిరి= యుద్ధమునకు వెడలిరి; అనినన్= (సంజయుడు) ఇట్లు చెప్పగా; విని; ధృతరాష్ట్రుండు; అప్పటికిన్= ఆ సమయమునకు; మనకున్= మనకు (అనగా కౌరవపక్షమునకు); పాండవులకున్; కల= ఉన్నట్టి; సేనా= సైన్యముయొక్క; అంగంబుల= విభాగములయొక్క (అనగా చతురంగంబులయొక్క); కొలంది= పరిమితి; ఎఱింగింపుము= తెలియచేయుము; అనవుడున్= (ధృతరాష్ట్రుడు) ఇట్లు అడిగినవెంటనే; సంజయుండు; ఆ జనపతికిన్= ఆ ధృతరాష్ట్రునికి; ఇట్లు= ఈ విధముగా; అనున్= చెప్పెను; మనకున్= మనకు (కౌరవపక్షమునకు); పదునొకండువేలు= పదకొండు వేలు; రథంబులును; పదివేలు; ఏడునూఱు= ఏడువందలు; గజంబులును= ఏనుగులును; రెండులక్షలు; హయంబులును= గుర్రములును; మూడుకోట్లు; పదాతులును= కాల్బలమును; వారికిన్ (అనగా పాండవులకు); ఆఱువేలు; రథంబులును; మూడువేలు; ఏనుంగులును; లక్ష గుఱ్ఱంబులును; కోటి; కాల్బలంబులును; కలిగి; ఉండెన్; అ+ఒడ్డనంబులు= ఆ సేనావ్యూహంబులు; ఒండొటిన్= ఒకదానితో ఒకటి క్రమముగా; గెలుచు= గెలిచే; అగ్గలికన్= ఉత్సాహంతో; డగ్గఱియెన్= దగ్గరపడియెను (సమీపమునకు చేరెను); అట్టియెడన్= అటువంటి సమయంలో.

తాత్పర్యం: ఈ ప్రకారంగా యుద్ధ సన్నద్ధుడయిన శల్యుడు సర్వతోభద్ర వ్యూహం సిద్ధం చేశాడు. ఆ సర్వతోభద్ర వ్యూహమునందు ముఖస్థానంలో కర్ణపుత్రులతో చుట్టబడినవాడై శల్యుడు నిలిచాడు. కుడివైపు శకయవన సమేతుడై కృపాచార్యుడున్నాడు. ఎడమవైపు త్రిగర్త వీరులతో కూడి కృతవర్మ ఉన్నాడు. వెనుకవైపు కాంభోజులు తోడుగా అశ్వత్థామ నిలిచాడు. నడుమభాగంలో కురువీరులతో దుర్యోధనుడు ఉన్నాడు. ఆ దుర్యోధనుడికి ముందు గజసమూహం ఉన్నది. దానికి అగ్రభాగంలో చతురంగబలాలతో శకుని నిలిచాడు. ఈ విధంగా సర్వతోభద్రవ్యూహాన్ని సిద్ధపరచి, ఒకటి తరువాత ఒకటి వరుసగా ఉంచి, వేగిరపాటుతో శల్యుడు సమరోత్సాహ సమగ్రుడయ్యాడు. అంతకంటె ముందుగానే పాండవులు మూడు ముఖాలుగా వ్యూహాన్ని సిద్ధపరిచారు. అనగా త్రిముఖ వ్యూహాన్ని పన్నారు. ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకులు ముగ్గురు మూడు ముఖాల సేనలకు అగ్రభాగంలో నిలిచారు. భీమార్జునులు

అగ్రజుడయిన ధర్మరాజునకు ముందుభాగాన నిలిచి ప్రకాశించారు. అప్పుడు పసుపురంగుతో ప్రకాశిస్తున్న శల్యుడి కేతనం చూచి పాండవులు వేగంగా యుద్ధానికి నడిచారు. సంజయుడు ఇట్లా చెప్పగా విని ధృతరాష్ట్రుడు: 'మనకును, పాండవులకు ఆ యుద్ధ సమయంలో కల చతురంగ బలముల పరిమితిని వివరించుము' అన్నాడు. ఇట్లు ధృతరాష్ట్రుడు అడిగిన వెంటనే సంజయుడు ధృతరాష్ట్రుడి కిట్లా చెప్పాడు. 'మనకు అనగా కౌరవపక్షానికి, పదకొండు వేలు రథాలు, పదివేల ఏడువందల ఏనుగులు, రెండు లక్షల గుర్రాలు, మూడు కోట్లు కాల్బలం, పాండవులకు ఆరువేలు రథాలు, మూడువేలు ఏనుగులు, లక్ష గుర్రాలు, కోటి కాల్బలం ఉన్నది. ఇట్లుండగా ఆ సేనా వ్యూహాలు ఒకదానితో ఒకటి గెలిచే ఉత్సాహంతో సమీపించాయి. అటువంటి సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: మహాభారతముననుసరించి త్రిగర్తమను జనపదము కలదు. అచ్చట నివసించు రాజుపేరు త్రిగర్తుడు. త్రిగర్తరాజు 'సురథుడు' అనువాడు కలడు. అతడు ఏనుగుతో సహా నకులుడిచే చంపబడెను (ద్రోణపర్వము). త్రిగర్తరాజు 'సుశర్మ' ప్రసిద్ధుడు. ఇతడు దక్షిణ గోగ్రహణము నిర్వహించెను. అందు భీముడిచే ఓడింపబడినాడు. ఇక ఒక త్రిగర్తరాజునకు అయిదుగురు సోదరులు కలరు. అందు 'సత్యరథుడు' ముఖ్యుడు. త్రిగర్తదేశ నామముతో వ్యవహరింపబడు వీరులైన రాజులు అనేకులు కురుక్షేత్ర సంగ్రామమున కౌరవపక్షమున ఉండి పోరాడిరి. ఈ సర్వతోభద్ర వ్యూహమున - కృతవర్మతో ఉన్న త్రిగర్తుల పేర్లు చెప్పుటకు వలనుపడదు. 'సుశర్మ' కాని 'సత్యరథుడు' కాని కావచ్చును. మూలమున 'త్రిగర్తైః' అని ఉన్నందువలన త్రిగర్త దేశముయొక్క వీరులు అని చెప్పుట ఉచితము. కాంభోజదేశమనగా-ప్రస్తుత 'కాబోలి' ముఖ్య పట్టణముగా గల ఆఫ్ఘనిస్తాన్. మహాభారత కాలమున ఆ దేశమును పాలించురాజు సుదక్షిణుడు. అతడు మహారథుడు. ఈ సుదక్షిణుని అర్జునుడు సంహరించినట్లు ద్రోణపర్వమున కలదు. అందువలన సుదక్షిణుని తండ్రి సైన్యసమేతముగా ఇచ్చట అశ్వత్థామకు తోడుగా ఉండి ఉండవచ్చును. మూలమున 'కాంబోజైః' అని ఉన్నందువలన కాంబోజవీరులు అని చెప్పుట ఉచితము. 'కాంబోజ' - 'కాంభోజ' - ఇందు 'కాంబోజ' శుద్ధరూపము.

ఉ. ఒండొరులన్ జయించుమతి నుద్భటలీలలఁ జాల నొప్పి య
ప్పాండవ కౌరవుల్ పెనఁగు భంగిఁ గనుంగొను వేడ్క నొక్కొ? యీ
తండు మహాద్రి నెక్కె ననఁ దద్దయుఁ జెన్నగు బింబకాంతి న
ర్కుం డభిరాముఁడై పొడుపు గొండపయిన్ వెలుఁగొందెఁ జూడఁగన్. 114

ప్రతిపదార్థం: ఒండొరులన్= ఒకరినొకరు (పరస్పరము); జయించు= గెలుచు; మతిన్= తలంపుతో; ఉద్భట= అధికమయిన; లీలలన్= చేష్టలతో (అనగా సంగ్రామ క్రీడలతో); చాలన్= మిక్కిలి; ఒప్పి= ప్రకాశించి; ఆ+పాండవకౌరవుల్= ఆ పాండవులు, కౌరవులు, పెనఁగు= యుద్ధముచేయు; భంగిన్= విధానమును; కనుంగొను= చూచెడి; వేడ్కన్= కుతూహలముతో; ఈతండు= ఈతడు (ఈ సూర్యుడు); మహా+అద్రిన్= ఉదయపర్వతమును; ఎక్కెన్= ఎక్కెను; ఒక్కొ?; అనన్= అనునట్లుగా; తద్దయున్= మిక్కిలి; చెన్ను+అగు= ఎఱ్ఱని; బింబకాంతిన్= బింబముయొక్క ప్రకాశంతో; అర్కుండు= సూర్యుడు; చూడఁగన్= చూడగా; అభిరాముడై= మనోహరుడై; పొడుపు= తూరుపు; కొండపయిన్= కొండమీద; వెలుఁగు+ఒందెన్= ప్రకాశించెను.

తాత్పర్యం: ఒకరినొకరు పరస్పరం జయించే తలంపుతో ఆ పాండవ కౌరవులు యుద్ధనీతిని పాటించి యుద్ధాన్ని చేసే విధానాన్ని చూచే కుతూహలంతో సూర్యుడు మేరుపర్వతాన్ని అధిరోహించాడా? అనునట్లు మిక్కిలి ఎఱ్ఱని

బింబకాంతితో సూర్యుడు మనోజ్ఞుడై తూర్పు దిక్కున ప్రకాశించాడు. (సూర్యోదయ మయిందని తాత్పర్యం. ఇది సూర్యోదయ వర్ణనం.)

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

చ. **అరసి యనాగతం బెఱుఁగునట్టి మనంబులు గల్గు పాండుభూ**
వరసుతబంధుమిత్రకురువర్గ సుహృజ్జనకోటు లత్తఱిం
బొరసె నతిప్రమోదమును భూరివిషాదమునాఁగ నంబుజో
త్కరము వికాసమయ్యెఁ గుముదంబులు మీలన మొందె నెంతయున్. **115**

ప్రతిపదార్థం: అరసి= ఆలోచించి; అనాగతంబు= జరుగబోవునది (భవిష్యము); ఎఱుఁగునట్టి= తెలియునట్టి; మనంబులు= మనస్సులు; కల్గు= కలిగిన; పాండుభూవర= పాండురాజుయొక్క; సుత= కుమారుల; బంధు= చుట్టముల; మిత్ర= స్నేహితులయొక్క; కోటులు= సమూహములు; కురువర్గ= కౌరవ విభాగముయొక్క; సుహృద్+జన= స్నేహితులయొక్క; కోటులు= సమూహములు; ఆ+తఱిన్= ఆ సమయమునందు; అతిప్రమోదమును; మిక్కిలి ఆనందమును; భూరి= అధికమయిన; విషాదమున్= దుఃఖమును; పొరసెన్= పొందెను; నాఁగన్= అన్నట్లు; అంబుజ= పద్మములయొక్క; ఉత్కరము= సముదాయముయొక్క; వికాసము= వికసనము; అయ్యెన్= ఐనది; కుముదంబులు= కలువలు; ఎంతయున్= మిక్కిలి; మీలనము+ఒందెన్= ముడుచుకొన్నాయి.

తాత్పర్యం: ఆలోచించి జరుగబోయేది తెలియునట్టి మనస్సులు కలిగిన పాండవులు, వారి బంధుమిత్ర సముదాయం అత్యంతానందాన్ని, అట్లే జరుగబోయేది తెలియునట్టి మనస్సులు కలిగి కురువర్గంవారి సుహృజ్జన సముదాయం అధిక దుఃఖమును పొందెనా! అనునట్లుగా ఆ సూర్యోదయ సమయంలో తామరలు వికసించాయి. కలువలు ముకుళించాయి.

విశేషం: అలం: క్రమాలంకార అనుప్రాణితం - ఉత్ప్రేక్షాలంకారం. ఇది సూర్యోదయ వర్ణనం. సూర్యోదయసమయాన తామరలు వికసించటం - కలువలు ముకుళించటం, చంద్రోదయ సమయాన కలువలు వికసించటం, తామరలు ముకుళించటం ప్రకృతి ధర్మం. తామర వికాసం ఆనందానికి, కుముదం ముకుళించటం దుఃఖానికి ప్రతీకలుగా పాండవపక్షం విజయానందం కౌరవపక్షం అపజయ దుఃఖం పొందేటట్లుగా క్రమంగా ఉత్ప్రేక్షించబడ్డాయి.

సీ. **కుంజరనికురుంబకుంభస్థలీసంగ । సిందూరరుచులతోఁ జెలిమి చేసి**
కేతనవ్రాతసంకీలితమాణిక్య । రశ్ముల గెడ విహారంబు సలిపి
సైనికనికరవక్షఃస్థలపరిలిప్త । కాశ్మీర దీప్తులఁ గౌఁగిలించి
దండనాథోత్కరచండభావోద్వృత్త । చక్షుఃప్రభలుఁ దారు సరసమాడి

తే. **యంశుజాలంబు లుభయసైన్యంబులందుఁ । బరఁగి బహువిధశస్త్రాస్త్రకిరణతతుల**
బెరసి పరభాగలక్ష్మి దీపించి మెఱయ । బాల్యరమణీయుఁడగు చిత్రభానుఁ డొప్పె. **116**

ప్రతిపదార్థం: కుంజర= ఏనుగులయొక్క; నికురుంబ= సమూహముయొక్క; కుంభస్థలీ= కుంభస్థలములందు; సంగ= కూడి ఉన్న; సిందూర= సిందూరముయొక్క; రుచులతోన్= కాంతులతో; చెలిమిన్= స్నేహమును; చేసి; కేతన= జెండాలయొక్క;

వ్రాత= సమూహమునందు; సంకీలిత= పొదుగబడిన; మాణిక్య= కెంపులయొక్క; రశ్ములన్= కాంతులతో; గెడ= జతకూడి (స్నేహముచేసి); విహారంబు; సలిపి= చేసి; సైనిక= సేనలయొక్క; నికర= సమూహములయొక్క; వక్షఃస్థల= ఉరఃస్థలములందు; పరిలిప్త= బాగుగా పూయబడిన; కాశ్మీర= కుంకుమపువ్వుల; దీప్తులన్= కాంతులను; కౌఁగిలించి; దండనాథ= సైన్యాధిపతులయొక్క; ఉత్కర= సమూహములయొక్క; చండ= రోషపూరితమయిన; భావ+ఉద్వృత్త= భావములతో వృద్ధిపొందిన; చక్షుః= నేత్రములయొక్క; ప్రభలున్= కాంతులును; తారున్= తామును; సరసము= శృంగార సంభాషణము; ఆడి= చేసి; అంశు= కిరణములయొక్క; జాలంబులు= సమూహములు; ఉభయ= రెండుపక్షముల; సైన్యములందున్= సేనలయందును; పరఁగి= వ్యాపించి; బహువిధ= పలురకములయిన; శస్త్ర= సామాన్య ఆయుధములయొక్క; అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములయొక్క; కిరణ= కాంతులయొక్క; తతులన్= సమూహాలతో; బెరసి= కలిసి; పరభాగ= తూర్పుదిక్కుయొక్క; లక్ష్మి= సౌందర్యము; దీపించి= ప్రజ్వలించి; మెరయన్= ప్రకాశించేటట్లుగా; బాల్య= పసితనంచేత; రమణీయుఁడు= సౌందర్యము కలవాడు(శోభకలవాడు); అగు= అయినట్టి; చిత్రభానుఁడు= బాలసూర్యుడు (ఉదయసూర్యుడు); ఒప్పెన్= ప్రకాశించెను.

తాత్పర్యం: ఉదయసూర్యుడి కిరణాలు ఏనుగుల గుంపులయొక్క కుంభస్థలాల అందలి సిందూరకాంతులతో చెలిమి చేసి, జెండా కొయ్యల సమూహాలందు పొదుగబడిన కెంపుల కాంతులతో జతగూడి విహారం సలిపి, సేనా సమూహాల ఉరఃస్థలాలందు పూయబడిన కుంకుమపువ్వుల కాంతులను కౌగిలించి, సైన్యాధిపతుల సమూహాలయొక్క రోషపూరిత భావాలతో వర్ధిల్లిన నేత్రకాంతులతో కదిసి సరసమాడి, ఉదయసూర్యుడి కిరణసమూహాలతో కలిసి, తూర్పుదిక్కుయొక్క సౌందర్యం ప్రజ్వలించి ప్రకాశించేటట్లుగా పసితనపు శోభతో ఉదయసూర్యుడు ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఇదికూడా సూర్యోదయ వర్ణనమే. ఈ వర్ణనలో తిక్కన శబ్దవైచిత్రిని ప్రదర్శించారు. ఒకే అర్థం ఇచ్చే పలు శబ్దాలను ప్రయోగించటం శబ్దవైచిత్రి. వర్ణనలందు శబ్దవైచిత్రిని, చిత్రణలందు అర్థవైచిత్రిని ప్రదర్శించటం తిక్కనకు అలవాటు. ఈ సీసపద్యంలో సమూహం అనడానికి నికురంబ, వ్రాత, నికర, ఉత్కర, జాలంబులు -తతులు, అని ఆరు శబ్దాలను ప్రయోగించాడు. అట్లే కాంతులు అనే అర్థానికి రుచులు, రశ్ములు, దీప్తులు, ప్రభలు, కిరణములు- అని అయిదు శబ్దాలు ప్రయోగించాడు. ఇంకను - లేత ఎరుపు రంగు అర్థానికి - సిందూరము - మాణిక్యము - కాశ్మీరము- అని మూడు శబ్దాలు ప్రయోగించాడు. ఈ సూర్యోదయవర్ణనం అమూలకం. అనేక వర్ణభాసురమైన బాలభానుని కాంతులు కుంజర-కేతన-సైనిక-దండనాథుల వివిధాంశములతో కూడి ఉన్నట్లు వర్ణింపబడెను. చెలిమిచేయుట, విహరించుట, కౌగిలించుట, సరసమాడుట అనునవి ఆ రెంటి సమ్మేళనమును సూచించు సరసశబ్దములు, సామ్యార్థవాచకాలు. ఈ వర్ణన తిక్కన వర్ణనానైపుణ్యానికి గీటురాయి.

కురుపాండవుల పదునెనిమిదవనాఁటి యుద్ధప్రారంభము (సం. 9-7-43)

వ. ఇట్లు పూర్వసంధ్యాసమయంబునఁ దార్కొని భేరీప్రముఖ తూర్య నిస్వనంబులు నింగి పొంగం జెలంగ.

117

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; పూర్వసంధ్యా= ఉదయసంధ్యయొక్క; సమయంబునన్= కాలమున; తార్కొని= ఎదుర్కొని; భేరీ= భేరీ అను వాద్య విశేషము; ప్రముఖ= మున్నగు; తూర్య= తూర్యములను వాద్య విశేషములయొక్క (తూతూ బూరాలని జానపదుల వ్యవహారము); నిస్వనంబులు= ధ్వనులు; నింగి= ఆకాశము; పొంగన్= పొంగునట్లుగా; చెలంగన్= మ్రోయగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా ఉదయకాలంలో కురుపాండవులు వారి సైన్యాలు ఒకరినొకరు ఎదుర్కొని భేరీ తూర్యధ్వనులు ఆకాశం మారుమ్రోగేటట్లు వినిపిస్తూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఒండొంటిఁ దాఁకి హేతులు । మండఁగఁ దచ్చూర్ణతతులు మహి రాలఁగ ను
ద్దండతఁ గలయం బెరసెను । రెండు మొనలుఁ గ్రూరతరపరిస్ఫురణములై. 118

ప్రతిపదార్థం: ఒండొంటిన్= ఒకదానితో ఒకటి; తాఁకి= తగిలి; హేతులు= పొడవైన కత్తులు; మండఁగన్= మండగా; తద్+ చూర్ణ= ఆ పొడులయొక్క; తతులు= సమూహములు; మహిన్= భూమియందు; రాలఁగన్= పడగా; కలయన్= అంతట; ఉద్దండతన్= అధికముగా; రెండుమొనలున్= రెండు పక్షాల సైన్యాలును; క్రూరతర= మిక్కిలి భయంకరముగా; పరిస్ఫురణంబులై= తలపించునవియై; బెరసెను= కలియబడెను.

తాత్పర్యం: కత్తులు ఒకదానితో మరియొకటి తగిలి మంటలు లేవగా పొడి అయిపోయిన ఆ ఆయుధాల పోగులు భూమిపై రాలగా భయంకరంగా ఆ కురు పాండవసేనా వ్యూహములు కలియబడ్డాయి.

వ. ఇత్తెఱంగునఁ దలపడి. 119

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ ప్రకారముగా; తలపడి= కలియబడి.

తాత్పర్యం: ఈ ప్రకారంగా కురుపాండసేనలు కలియబడి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అరదంబులు నరదంబులఁ । గరులు గరుల హరులు హరులఁ గాల్బురు మఱి గా
ల్బురఁ దాఁకి పెనఁగెఁ గడు భీ । కర భంగులు మెచ్చు దేర గగనచరులకున్. 120

ప్రతిపదార్థం: అరదంబులన్= రథములతో; అరదంబులును= రథములును; కరులన్= ఏనుగులతో; కరులున్= ఏనుగులును; హరులన్= గుర్రములతో; హరులున్= గుర్రములు; మఱి= ఇంకను; కాల్బురన్= కాల్బలముతో; కాల్బురున్= కాల్బలము; తాఁకి= ఎదుర్కొని; కడున్= మిక్కిలి; భీకర= భయంకరమయిన; భంగులు= పద్ధతులు; గగన= ఆకాశమునందు; చరులకున్= సంచరించువారికి (అనగా సిద్ధ సాధ్యగరుడగంధర్వ యక్షకిన్నర కింపురుషాది దేవయోనులకు); మెచ్చుదేరన్= మెప్పుకలిగేటట్లు; పెనఁగెన్= పోరాడెను.

తాత్పర్యం: రథాలు రథాలతో, ఏనుగులు ఏనుగులతో, గుర్రాలు గుర్రాలతో, కాల్బలం కాల్బలంతో ఎదుర్కొని మిక్కిలి భయంకరమైన యుద్ధ రీతులతో గగన సంచారు లయిన దేవయోనులకు మెప్పు కలిగేటట్లు పోరాడాయి. (అనగా చతురంగ దళాలు ఒకదానితో ఒకటి భయంకరంగా పోరాడాయి అని తాత్పర్యం.)

చ. పెనుపును నాకసం బవియు బృంహితముల్ దము నుగ్రగర్జిత
స్వనములతోడి మేఘముల చందముగా నొనరింప మీఁది యో
ధనికర మేయు సాయకవితానము భీషణవృష్టి గా రయం
బునఁ బయికొన్న యేనుఁగుల పోరునఁ దేరులు దేలె నెత్తుటన్. 121

ప్రతిపదార్థం: పెనుపున= ఎంతోగొప్పగా; ఆకసంబు= ఆకాశము; అవియు= బ్రద్దలయ్యే; బృంహితముల్= ఘీంకారములు; తమున్= తమను (ఆ ఏనుగులను); ఉగ్ర= భయంకరములయిన; గర్జిత= ఉరుముచున్న ఉరుములయొక్క; స్వనములతోడి= ధ్వనులతోకూడియున్న; మేఘముల= మబ్బులయొక్క; చందము= విధము; గాన్= అగునట్లుగా; ఒనరింపన్= చేయగా; మీఁది= మీదను ఉన్న; యోధ= వీరులయొక్క; నికరము= సమూహము; ఏయు= ప్రయోగించు; సాయక= బాణములయొక్క; వితానము= సమూహము; భీషణ= భయంకరమయిన; వృష్టి= వర్షము; గాన్= అగునట్లుగా; రయంబునన్= వేగముగా; పయికొన్న= మార్కొనిన; ఏనుఁగులపోరునన్= ఏనుగులయొక్క పోరాటమునందు; నెత్తుటన్= రక్తమునందు; తేరులు= రథములు; తేలెన్= తేలెను.

తాత్పర్యం: ఆకాశాన్ని బ్రద్దలు చేసే గొప్ప ఘీంకృతులు తమను ఉరుములతో కూడిన మేఘాలుగా చేయగా, మీదనున్న యోధులు వేసే బాణాల సమూహం భయంకరమైన వర్షంగా మారి - వేగంగా మార్కొనిన ఏనుగుల పోరులో రథాలు రక్తంలో తేలాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఔన్నత్య ధర్మమున ఆకాశంతో, బృంహిత ధర్మమున మేఘాలతో సాయకవితాన ప్రయోగ ధర్మమున వృష్టితో ఉత్ప్రేక్షించి తిక్కయజ్వ చంపకమాలతో ఉత్ప్రేక్షమాలికలల్లాడు. నెత్తుట తేరులు తేలుట అతిశయోక్తి. బ్రహ్మర్షి వ్యాస భగవానుడిని కవిబ్రహ్మ ఈ గజసంగ్రామ వర్ణనంలో అతిశయించి, మూలానికి మెరుగులు పెట్టాడు.

మూలం:

> **'గజానాం భీమరూపాణాం ద్రవతాం నిఃస్వనో మహాన్ ।**
> **అశ్రూయత యథాకాలే జలదానాం నభస్తలే ॥**
> **నాగైరభ్యాహతాః కేచిత్ సరథా రథినోఽ పతన్ ।**
> **వ్యద్రవన్త రణే వీరా ద్రావ్యమాణా మదోత్కటైః ॥ (శల్య- 9 - 3, 4.)**

తే. కరులగమి వొదివి రథముల్ గాలుకొనఁగ । నీక మరలిన ఘోటకానీకములను
బిరుదుమగల మొత్తములను బిండిపీఁచు । సేయు బలితంపునేర్పు లచ్చెరువుఁ బెనుఁ ప. 122

ప్రతిపదార్థం: కరుల= ఏనుగులయొక్క; గమి= గుంపు; పొదివి= చుట్టుముట్టి; రథముల్= రథాలు; కాలుకొనఁగన్= కాలుపెట్టడానికి; ఈక= ఇయ్యక (అనగా కాలునిలుపుటకు అవకాశమీయక); మరలిన= తిరిగిపోయిన; ఘోటక= గుర్రములయొక్క; అనీకములను= సేనలను; బిరుదు= శౌర్యచిహ్నములుగల; మగల= వీరులయొక్క; మొత్తములను= సమూహములను (అనగా అతిరథ మహారథ రథ అర్ధరథులను); పిండిపీఁచుసేయు= పిండి, పీచు చేయుచున్న (ఇది తెలుగు జాతీయ ప్రయోగము); బలితంపు= బలిష్ఠములయిన; నేర్పులు= చేష్టలు(నేర్పరితనములు); అచ్చెరువున్= ఆశ్చర్యమును; పెనుఁపెన్= పెంపు చేయగా.

తాత్పర్యం: ఆ యుద్ధమునందు ఏనుగులగుంపు రథాలను చుట్టుముట్టి కాలు నిలుపటానికి అవకాశమీయనందువలన మరలిపోయిన ఆ రథాలను లాగే గుర్రాలను, ఆ రథాలను అధిరోహించిన అతిరథ మహారథ అర్ధరథ మొదలైన బిరుదులు గల వీరుల సమూహాలను పిండి, పీచు చేస్తున్న ఆ ఏనుగులయొక్క బలిష్ఠమయిన చేష్టలు ఆశ్చర్యాన్ని అధికం చేస్తుండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఇది తిక్కయజ్వ కవిత యందలి చైతన్య చిత్రణ సౌందర్యం. (మూలము 121 పద్య విశేషంలో ఇవ్వబడింది.)

క. **పటురయమున నాశ్వికు లొ । క్కటఁ బెక్కం డ్రెక్కి రథనికరములు ఝుడితి**
త్రుటితాకృతులుగ విహరిం । చుట యెక్కుడు వేడ్కసేయ సురగణమునకున్. **123**

ప్రతిపదార్థం: పటు= తీవ్రమయిన; రయమునన్= వేగమున; ఆశ్వికులు= గుఱ్ఱములను ఎక్కి యుద్ధము చేయువారు; ఒక్కటన్= ఒక్కసారిగా (ఏకకాలమున); పెక్కండ్రు= పలువురు; రథ= రథములయొక్క; నికరములు= సమూహములు; ఎక్కి; ఝుడితి= అతిశీఘ్రముగ (వెనువెంటనే); త్రుటిత= ముక్కలు ముక్కలుగా చేయబడిన; ఆకృతులుగన్= ఆకారాలు కలుగునట్లుగ; విహరించుట= వేడుకతో సంచరించుట; సుర= దేవతలయొక్క; గణములకు(న్)= సమూహములకు; ఎక్కుడు= మిక్కిలి; వేడ్క= వేడుక; చేయన్= చేయుచుండగా.

తాత్పర్యం: అతి శీఘ్రంగా పలువురు ఆశ్వికులు ఒక్కసారిగా రథాలను ఎక్కి వెనువెంటనే ముక్కలు ముక్కలుగా త్రుంచిన ఆకారాలు అయ్యేటట్లు చేయడం దేవతా సమూహాలకు మిక్కిలి సంతోషం కలిగిస్తూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **పలువుర నొక్కఁడు నొక్కనిఁ । బలువురుఁ దెగటార్చుటయును బలుదెఱఁగుల మూఁ**
కలు పలుదెఱఁగులఁ దలఁపడి । పొలియించుట పొలియుటయును బోరి నుగ్రముగన్. **124**

ప్రతిపదార్థం: ఒక్కఁడున్= ఒక్కడు; పలువురన్= అనేకులను; ఒక్కనిన్= ఒక్కనిని; పలువురున్= అనేకులును; తెగటార్చుటయును= చంపుటయును; పలుతెఱఁగుల= అనేక విధములయిన; మూఁకలు= సమూహములు (అనగా సేనా సమూహములు); పలు తెఱఁగుల= అనేక విధములుగ; తలఁపడి= కలియబడి(పోరాడి); పొలియించుట= చంపుట; పొలియుటయును= చచ్చుటయును; పొరిన్= మిక్కిలి; ఉగ్రముగన్= భయంకరం కాగా.

తాత్పర్యం: ఒక్కడు పలువురను, పలువురు ఒక్కడిని చంపుతూ అనేకములయిన సేనల సమూహాలు అనేక విధాలుగా పోరాడి చంపటం, చావటం కలిగి మిక్కిలి భయంకరం కాగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **చలమునఁ బోక పెనఁగు కా । ల్బలముపయిఁ దురగములును నిభంబులును రథం**
బులుఁ గూడి కవిసి యింతిం । తలు దునియలు సేఁత యనుచిత క్రౌర్యముగాన్. **125**

ప్రతిపదార్థం: చలమునన్= మాత్సర్యముతో; పోక= వెడలిపోకుండగ; పెనఁగు= యుద్ధము చేయు; కాల్బలముపయిన్= పదాతిదళముమీద; తురగములునున్= గుఱ్ఱపు దళమును; ఇభంబులును= ఏనుగులును(అనగా గజదళమును); రథంబులున్= రథములును; కూడి= కలిసి; కవిసి= కలియబడి; ఇంతింతలు= చిన్న చిన్న; తునియలు= ముక్కలు; చేఁత= చేయుట (అనగా అశ్వదళము గజదళము రథములు కలిసి ఒక్కుమ్మడిగా పదాతిదళముపై పడి చిన్న చిన్న ముక్కలుగా చేయుట); అనుచిత= ఉచితము కానిది అగు (అనగా యుద్ధనీతికి తగనిది అగు); క్రౌర్యముగాన్= క్రూరత్వంగా.

తాత్పర్యం: ఒకరిపై ఒకరు మాత్సర్యంతో యుద్ధం చేసే పదాతి దళంపై రథగజ తురంగ దళాలు ఒక్కుమ్మడిగా కలియబడి చిన్న చిన్న ముక్కలుగా ఆ పదాతి దళాన్ని చేయటం - యుద్ధనీతికి ఉచితం కాని క్రూరత్వంగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **తెల్లని సవరణ మెఱయ స । ముల్లసితములగు తురంగముల మొత్తము చం**
చల్లలిత పక్షములు శో । భిల్లుగతుల నొప్పనంచపిండుం బోలన్. **126**

ప్రతిపదార్థం: తెల్లని; సవరణ= అలంకారము (వాహనములకు చేసే అలంకారలు - అనగా జీనులు మొదలగునవి, గుర్రాలకు తగిలించే తెల్లని చామరాలు); మెఱయన్= ప్రకాశింపగా; సముల్లసితములు= మిక్కిలి ప్రకాశవంతములు; అగు= అయినట్టి; తురంగముల= గుర్రములయొక్క; మొత్తము= సముదాయము; చంచత్= చలించుచున్నవియు; లలిత= అందమైనవి అగు; పక్షములు= రెక్కలు; శోభిల్లు= ప్రకాశించు; గతులన్= గమనములతో; ఒప్పు= ఒప్పే; అంచ= హంసలయొక్క; పిండున్= గుంపును; పోలన్= పోలగా.

తాత్పర్యం: తెల్లని చామరాలు ప్రకాశించగా - మిక్కిలి ప్రకాశవంతాలైన గుర్రాల సముదాయం చంచలాలు మనోహరాలు అయిన రెక్కలు ప్రకాశించే గమనాలతో ఒప్పే హంసల గుంపును పోలగా.

విశేషం: అలం: ఉపమ. తెల్లని చామరాలతో ప్రకాశించే గుర్రాల గమనాలు చంచలాలు సుకుమారాలు అయిన హంసల గుంపుల గమనాలను పోలి ఉన్నాయి. తురంగాల మొత్తము ఉపమేయం. అంచపిండు ఉపమానం; పోలన్ ఉపమవాచకం. తెలుపు సమానధర్మం. పూర్ణోపమ.

వ. అయ్యిరువాఁగును పోరాడునప్పడు. 127

ప్రతిపదార్థం: ఆ+ఇరువాఁగుఁను= ఆ రెండుపక్షముల సైన్యములును; పోరాడునప్పుడు= యుద్ధము చేయు సమయమున.

తాత్పర్యం: ఆ రెండు పక్షముల సైన్యాలును అనగా కురుపాండవ సైన్యాలు యుద్ధం చేసే సమయంలో.

విశేషం: 121, 122, 123, 124, 125, 126 పద్యాలన్నీ అసంపూర్ణ వాక్యాలే, అవి అన్నీ 'పోరాడు' అనుక్రియతో అన్వయిస్తున్నాయి.

క. గుణనినదము రథనేమి । క్వణనంబుం దురగఖురరవముఁ గరిఘంటా
రణనమును హేతి సంఘు । ర్షణనాదముఁ దూర్యఘోష సంపదఁ గడచెన్. 128

ప్రతిపదార్థం: గుణ= వింటినారి యొక్క; నినదమున్= ధ్వనియును (విల్లునకు కట్టు అల్లెత్రాడునకు నారి అనిపేరు. అమ్ములు ప్రయోగించునప్పుడు ఈ నారినుండి వచ్చు మ్రోతలు.) రథ= రథములయొక్క; నేమి= చక్రముల కడకమ్ములయొక్క; కణ్వనంబున్= ధ్వనియును (రథములు వెళ్లునప్పుడు చక్రములకడకమ్ములు భూమిని తాకునప్పుడు వచ్చు ధ్వనులు); తురగ= గుర్రములయొక్క; ఖుర= గిట్టలయొక్క; రవమున్= ధ్వనియును; కరి= ఏనుగులయొక్క; ఘంటా= ఘంటలయొక్క (కంఠములందు వ్రేలాడుచున్న ఘంటలయొక్క); రణనమును= ధ్వనియును; హేతి= కత్తులు మొదలయిన ఆయుధములయొక్క; సంఘర్షణ= ఒకదానికొకటి ఒరిసికొనుట వలన పుట్టిన; నాదమున్= ధ్వనియును; తూర్య= తూర్యములయొక్క; ఘోష= ధ్వనియొక్క; సంపదన్= వైభవమును; కడచెన్= మించిపోయెను.

తాత్పర్యం: ఆ రెండు సైన్యాలు యుద్ధం చేసే సమయంలో అల్లెత్రాడుల ధ్వనులు, రథచక్రాల కడకమ్ముల ధ్వనులు, గుర్రాల గిట్టల చప్పుళ్ళు, ఏనుగుల కంఠాలలో వ్రేలాడే ఘంటల మ్రోతలు, కత్తులు మొదలయిన ఆయుధాలు ఒకదాని కొకటి ఒరిసికొనటంవలన పుట్టిన ధ్వనులు, మొత్తం ఈ అయిదు ధ్వనులు మిళితమయి తూర్యధ్వనుల వైభవాన్ని మించిపోయింది.

విశేషం: ఇందు తిక్కన శబ్ద చిత్రణవైచిత్ర్యమును దర్శింపవచ్చును. నినదము, క్వణనము, రవము, రణనము, నాదము, ఘోషము. ఈ కందమునందలి ఈ ఆరు శబ్దములూ - ధ్వన్యర్థకములే కాక ధ్వన్యనుకరణములు. (ఒక్క అర్థాన్ని బోధించటానికి) ఏకార్థ బోధకాలైన వివిధ శబ్దాల ప్రయోగం శబ్దవైచిత్రి.

ఇప్పట్టున వ్యాసభగవానుని వర్ణనం కూడా రమణీయంగా ఉన్నది.

'వాజినాం ఖురశబ్దేన రథనేమి స్వనేన చ । పత్తీనాం చాపి శబ్దేన నాగానాం బృంహితేన చ॥
వాదిత్రాణాం చ ఘోషేణ శంఖానాం నినదేన చ । అభవన్నాదితా భూమిః నిర్హ్రాదైరివ భారత ॥
ధనుషాం కూజమానానాం శస్త్రౌఘానాం చ దీప్యతాం । కవచానాం ప్రభాభిశ్చ న ప్రాజ్ఞాయత కించన ॥ (శల్య9-14,15,16)

సీ. **నెత్తుటఁ దోఁగియు నిగిడి పోరెడు వీరు । లలరిన నడ మోదుగులవిధంబు**
గ్రక్కునఁ దెగిపడి కదలెడు బాహు దం । డములు మహాభుజంగములభంగి
యవని రక్తాక్తంబులై యున్న యట్టిబల్ । దలలు గెందామరకొలని పగిది
దఱచుగా నెఱి దప్ప నొఱగిన గజములు । గులిశభగ్నాచలకులమునట్లు

తే. **దునిసి తొఱఁగిన జోదులతొడలు సామ । జములకరములు నొండొంటి చందములు గ**
నుంగొనఁగ వింతలగుటను సంగరాంగ । ణంబు రమణీయమును భీషణంబు నయ్యె. **129**

ప్రతిపదార్థం: నెత్తుటన్= రక్తమునందు; తోఁగియున్= తడిసియు లేక మునిగియు; నిగిడి= విజృంభించి; పోరెడు= పోరాటము సల్పెడు; వీరులు= శూరులు (పరాక్రమవంతులు); అలరిన= (పూలు) వికసించిన; నడ= నడచు; మోదుగుల= మోదుగ వృక్షములయొక్క; విధంబు= విధమును; గ్రక్కునన్= వేగముగ; తెగిపడి= తెగిపోయి; కదలెడు= చలించెడు; బాహుదండములు= దండములవంటి భుజములు, మహా= గొప్పవి అగు; భుజంగముల= నాగుపాములయొక్క; భంగి= విధమును; అవని= భూమియందలి; రక్త= రక్తంతో; అక్తంబులై= కలిసినవియై; ఉన్న; అట్టి; బల్= గొప్ప; తలలు= శిరములు; కెందామర= ఎర్రతామరలయొక్క; కొలని= సరస్సు; పగిది= విధమును; తఱచుగాన్= ఎక్కువగా; నెఱి= అందము; తప్పన్= తప్పిపోగా (తరిగిపోగా); ఒఱగిన= నేలవ్రాలిన; గజములు= ఏనుగులు; కులిశ= వజ్రాయుధముచే; భగ్న= విరుగగొట్టబడిన; అచల= పర్వతములయొక్క; కులము= సముదాయము; అట్లు= రీతి; తునిసి= ఖండింపబడి; తొరఁగిన= విడివడిపోయిన; జోదుల= యోధులయొక్క; తొడలు; సామజముల= ఏనుగులయొక్క; కరములున్= తొండములును; ఒండొంటి= ఒకదానికొకటి; చందములు= విధములు; కనుంగొనఁగన్= కనిపించగ (తొడలు తొండములుగ తొండములు తొడలుగ కనిపించగ); వింతలు= ఆశ్చర్యజనకములు; అగుటను= అగుటచేత; సంగర= యుద్ధము చేయు; అంగణంబు= ముంగిలి (అనగా యుద్ధము చేయు ప్రదేశము - అనగా యుద్ధభూమి); రమణీయమును= సుందరమయినదియును; భీషణంబును= భయానకమయినదియును; అయ్యెన్= అయ్యెను.

తాత్పర్యం: రక్తంతో తడిసి యుద్ధం చేస్తున్న వీరులు - వికసించిన పూలతో నడుస్తున్న మోదుగుచెట్లుగాను, వేగమున తెగిపోయి కదలాడుతున్న దుడ్డుక్రరలవంటి భుజాలు గొప్ప గొప్ప నాగుపాములుగాను, భూమిపై రక్తసిక్తములై పడి ఉన్న తలలు ఎర్రతామరల కొలనుగాను; అందం తరిగి కూలిపోయిన ఏనుగులు వజ్రాయుధంచేత విరుగగొట్టబడిన పర్వాతాల సముదాయాన్నీ, ఖండించబడి విడిపడిపోయిన యోధుల తొడలు ఏనుగుల తొండాలు ఒకదానికొకటి అనిపించగా ఆశ్చర్యజనకంగా ఆ యుద్ధభూమి సుందరమూ, భయానకమూ అయింది.

విశేషం: ఇది యుద్ధభూమి స్వరూప చిత్రణం. ఉపమల మాలిక. శృంగార, భయానక, అద్భుతరసభావాలతో నిండిన సీస మిది. ఈ సీసంలోని ప్రతిపాదంయొక్క మొదటిభాగం భయానకం. రెండవ భాగం శృంగారం. ఇచట శృంగార మంటే సౌందర్యం. ప్రతి పాదం ఒక ఉపమ. భయానకమును శృంగారంతో ఉపమించటం ఇందలి విచిత్ర చిత్రణం. బీభత్సరస భావాలు కూడా ఇందు పుష్కలంగా ఉన్నాయి. కాని తిక్కయజ్వ 'రమణీయమును, భీషణంబును, వింతలగుటను' అనే ప్రయోగాలతో శృంగార, భయానక, అద్భుత రసభావాలను మాత్రం సూచించాడు.

తే. ఏమి చెప్పుదు రౌద్రంపు టెసకమందుఁ । దఱచు మెదళులు ఱొంపులు నుఱుములైన
యెమ్ము లిసుకయు సితచామరమ్ము లంచ । లయ్యె రుధిరంపు టేరుల కప్పుడధిప! 130

ప్రతిపదార్థం: అధిప!= ప్రభువు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అందున్= ఆ యుద్ధభూమియందు జరుగు; రౌద్రంపు= క్రోధముయొక్క; ఎసకము= విజృంభణము; ఏమి; చెప్పుదున్; తఱచు= అధికమయిన; మెదళులు= మస్తిష్కములు; ఱొంపులు= బురదలు; నుఱుములు= పొడులు(చూర్ణములు); ఐన= అయినటువంటి; ఎమ్ములు= ఎముకలు; ఇసుకయున్; సిత= తెల్లని; చామరమ్ములు= వింజామరములు; అప్పుడు= ఆ సమయమున; రుధిరంపు= రక్తముయొక్క; ఏరులకున్= నదులకు; అంచలు= హంసలు; అయ్యెన్= అయ్యెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ యుద్ధభూమిలోని క్రోధ విజృంభణాన్ని గూర్చి ఏమి చెప్పను? అది వర్ణించటానికి శక్యం కానిది. ఆ యుద్ధసమయంలో మెదడులు బురదలుగా, చూర్ణాలయిన ఎముకలు ఇసుకగా తెల్లని చామరాలు ఆ రక్తపుటేరులలో హంసలుగా అయ్యాయి.

విశేషం: అలం: రూపకం. ఉపమాన ఉపమేయములకు అభేద కల్పనం రూపకం. సమరాంగణం ఉపమేయం. ఏరులు ఉపమానం. ఈ రెంటికి అభేదం కల్పించటంవలన ఇది రూపకం. అట్లే నదులందు బురద ఇసుక, నీరు; ఆ నీటియందు మస్తిష్కములు బురదలుగా, చూర్ణములయిన ఎముకలు ఇసుకగా, రక్తం జలంగా - తెల్లని చామరాలు హంసలుగా ఉపమేయ ఉపమానములకు క్రమంగా అభేదకల్పనంవల్ల ఇది రూపకమాలిక అయింది. ఇట్లు అలంకార మాలిక లల్లటం తిక్కన సహజకవితాలక్షణం.

క. విను మయ్యేఱులలో వా । హనములె యోడలుగఁ జూడ నక్కజమగు ను
క్కున నుద్దామ విహారం । బొనరించిరి వీరయోధు లుర్వీనాథా! 131

ప్రతిపదార్థం: ఉర్వీ= భూమికి; నాథా! ప్రభువు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; వినుము; ఆ+ఏఱులలోన్= ఆ రక్తపు నదులలో; వాహనములె= ఎక్కదగిన రథాదులే; ఓడలుగన్; చూడన్= చూడగ; అక్కజము= ఆశ్చర్యము; అగు= అయినట్టి; ఉక్కునన్= శౌర్యముతో; వీర= పరాక్రమము కలిగిన; యోధులు= యుద్ధము చేయు సైనికులు; ఉద్దామ= అడ్డులేని విధముగ; విహారంబు= సంచారము; ఒనరించిరి= చేసిరి.

తాత్పర్యం: (సంజయుడు చెప్పుతున్నాడు) ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆలకించుము. ఆ రక్తపు నదులలో వాహనాలు ఓడలు కాగా, అధికమయిన శౌర్యంతో వీరులయిన యోధులు అబ్బురపరిచే సాహసంతో అడ్డులేని విధంగా సంచారం చేశారు. వీర విహారం చేశారు.

వ. ఇవ్విధంబునం బోరు ఘోరంబై చెల్లుచుండ నుల్లసిత విక్రమవిజృంభితులగు భీమపార్థులు నలిరేఁగి నారాచప్రముఖ నానావిశిఖంబుల మనమొనఁ గనుపుగొట్టిన నది బెగడొంది మగిడిన నమ్మేటి మగలుబ్బి పాంద్రదేవదత్తంబుల నొత్తుటయు ధృష్టద్యుమ్నుండును శిఖండియుం గౌంతేయాగ్రజు మున్నిడికొని తఱుమఁ దొడన కవలును గడంగి రట్లాటోపదీపితులైన పాండవేయుల యురవడికి నోటటి నీబలంబు హాహాకారంబు లతోఁ బలుదెసలఁ బఱవందొడంగినం గనుంగొని శల్యుండు సారథి కిట్లనియె. 132

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారముగ; పోరు= యుద్ధము; ఘోరంబు= భయంకరము; ఐ= అయినట్టిదియై; చెల్లుచున్= కొనసాగుచు; ఉండన్; ఉల్లసిత= ప్రకాశించుచున్న; విక్రమ= పరాక్రమముతో; విజృంభితులు= చెలరేగినవారు; అగు= అయినట్టి; భీమ పార్థులు= భీముడును అర్జునుడును; నలి రేఁగి= విజృంభించి; నారాచ= వాడి అయిన ఇనుప బాణములు; ప్రముఖ= మొదలైన; నానా= పలురకములగు; విశిఖంబులన్= తీక్ష్ణములయిన బాణములతో; మన= మనయొక్క; మొనన్= సేనావ్యూహమును; కనుపు= ఒకముక్కను (అనగా ఒక భాగమును లేక ఒక పర్వమును); కొట్టినన్ విడగొట్టగా; అది= ఆ సేనావిభాగము; బెగడు= భయము; ఒంది= పొంది; మగిడినన్= మరలిపోవుచుండగా; ఆ+మేటి మగలు= గొప్పవారయిన ఆ వీరులు; ఉబ్బి= పొంగి; పౌండ్ర= పౌండ్రమను పేరుగల శంఖమును; దేవదత్తంబులన్= దేవదత్తమను పేరుగల శంఖమును; ఒత్తుటయున్= ఊదుటయు (పూరించుటయు); ధృష్టద్యుమ్నుండును; శిఖండియున్; కౌంతేయ= కుంతీపుత్రులలో; అగ్రజున్= పెద్దవాడు అయిన ధర్మరాజును; మున్ను= ముందు; ఇడుకొని= ఉంచుకొని; తఱుమన్= పారద్రోలగా; తోడన= ఆ వెంబడి; కవలును= కవలపిల్లలు అయిన నకులసహదేవులును; కడంగిరి= పూనిక వహించిరి; అట్లు= ఆ ప్రకారముగ; ఆటోప= సంభ్రమము వలన (అతి వేగముగా యుద్ధము చేయుటవలన); దీపితులు= ప్రకాశింపచేయబడినవారు; ఐన= అయినట్టి; పాండవేయుల= పాండురాజు కుమారులయిన పాండవులయొక్క; ఉరవడికిన్= విజృంభణమునకు; ఓటఱి= బలహీనమయి; నీ బలంబు= నీయొక్క సైన్యము; హాహాకారంబులతోన్= దుఃఖమును, బాధను తెలుపు హాహా అను అరుపులతో; పలు= అనేకములగు; దెసలన్= దిక్కులకు; పఱవన్= పారిపోవుటకు; తొడంగినన్= ప్రారంభించగా; కనుంగొని= చూచి; శల్యుండు; సారథికిన్; ఇట్లు= ఈ విధముగా; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఈ ప్రకారంగా యుద్ధం భయంకరంగా కొనసాగుతుండగా ప్రకాశమాన పరాక్రమంతో విజృంభించే భీమార్జునులు అతిశయించి, వాడి అయిన ఇనుపబాణాలు మొదలైన ముఖ్యములైన బాణాలతో మన సేనావ్యూహంలోని ఒక భాగాన్ని విడగొట్టగా, ఆ సేనా విభాగం భయపడి పారిపోతుండగా మహావీరు లయిన ఆ భీమార్జునులు పొంగిపోయి పౌండ్ర దేవదత్తాలను పూరించారు. అంతట ధృష్టద్యుమ్నుడు, శిఖండి ధర్మరాజును ముందుంచుకొని తరుమగా ఆ వెంబడి నకుల సహదేవులునూ పూనిక వహించారు. ఆ ప్రకారంగా ప్రకాశమానులైన పాండవుల శీఘ్రసంగ్రామానికి బలహీనమయిన నీ సైన్యం హాహాకారలతో పలు దెసలకు పారిపోవటం ప్రారంభించగా చూచి శల్యుడు సారథితో ఇట్లా అన్నాడు:.

విశేషం: భీముడి శంఖంపేరు పౌండ్రం. అర్జునుడి శంఖం పేరు దేవదత్తం. ఈ దేవదత్తం దివ్యశంఖం. మయుడు ఈ దేవదత్తాన్ని బిందుసరోవరంనుండి తెచ్చి అర్జునుడికి ఇచ్చాడు. ఈ మయుడే భీముడికి గదను ఇచ్చాడు. ఈ మయుడే పాండవులకు మయసభను నిర్మించి ఇచ్చాడు.

ఉ. 'అల్లదె కంటె? పాండుతనయాగ్రణితేరు సితాశ్వయుక్తమై
తెల్లని యెల్లి నొప్పినది తీవ్రత మార్కొని యాన్నృపాలు శో
భిల్లుట మాన్పఁగా వలయు భీషణభంగి రథంబు వోవ ని
మ్మెల్లజనంబు నా కడిమి యేర్పడ నేఁ డెఱుఁగంగఁ జేసెదన్. 133

ప్రతిపదార్థం: సిత= తెల్లని; అశ్వ= గుర్రములతో; యుక్తమై= కూడినదియై; పాండు= పాండురాజుయొక్క; తనయ= కుమారులలో; అగ్రణి= పెద్దవాడయిన ధర్మరాజుయొక్క; తేరు= రథము; తెల్లని; ఎల్లిన్= గొడుగుతో; ఒప్పినది= అందముగా ఉన్నది; అల్లదె= అదిగో అక్కడ ప్రత్యేకముగా ఉన్నది; కంటె?= చూచితివా?; తీవ్రతన్= తీవ్రముగా(భీకరముగా); మార్కొని=

ఎదుర్కొని; ఆ నృపాలు= ఆ రాజు(ఆ ధర్మరాజు); శోభిల్లుట= ప్రకాశించుట (విజృంభించుట); మాన్పఁగాన్= పోగొట్టగా; వలయున్= చేయవలయును; భీషణ= భయంకరమయిన; భంగిన్= విధముగా; రథంబు; పోనిమ్ము; నేఁడు; ఎల్ల= సమస్తమయిన; జనంబున్= ప్రజలు; నా; కడిమి= పరాక్రమము; ఎఱుంగగన్= తెలిసికొనునట్లుగా; ఏర్పడన్= తేటపడగా; చేసెదన్= చేసెదను.

తాత్పర్యం: 'తెల్లని గుఱ్ఱాలతో కూడి, తెల్లని గొడుగుతో అందంగా ప్రకాశిస్తున్న ఆ ధర్మరాజురథం అదిగో అక్కడ ఉన్నది. చూచావా? తీవ్రంగా ఎదుర్కొని ఆ ధర్మరాజు విజృంభణాన్ని పోగొట్టాలి. కాబట్టి, భయంకర రీతిలో రథాన్ని అటు పోనిమ్ము. నేడు నా పరాక్రమం సమస్త ప్రజలు తెలిసికొనేటట్లు తేటపడచేస్తాను.

తే. సురల నైన గెలుతు దురమున విను నాకుఁ । బాండుపుత్త్రు లెదురె భండనమున?
నేర్పు బలుపుఁ జూపి నిన్ను మెప్పింతు నా । చేతిబరువు సూడు సూతవర్య! 134

ప్రతిపదార్థం: సూత= సూతులలో; వర్య!= ఉత్తముడవు అయిన ఓ సారథీ!; విను; దురమునన్= యుద్ధమునందు; సురలను= దేవతలను; ఐనన్= అయినను; గెలుతున్= జయింతును; భండనమునన్= యుద్ధంలో; నాకున్= నాకు; పాండుపుత్రులు= పాండురాజు కుమారులు; ఎదురె?= ఎదురు నిలువగలవారే?; నా= నాయొక్క; చేతి= చేతియొక్క; బరువున్= భారమును; చూడు= చూడుము; భండనమునన్= యుద్ధమున; నేర్పు; బలుపున్= బలమును; చూపి; నిన్ను; మెప్పింతున్= మెప్పింతును.

తాత్పర్యం: ఓ సారథీ! ఆలకింపుము. యుద్ధంలో దేవతల నైనను జయిస్తాను. యుద్ధంలో నాకు ఈ పాండవులు ఎదురు నిలువలేరు. నా చేతిభారం చూడుము. ఈ యుద్ధంలో నా నైపుణ్యం, బలం ప్రదర్శించి నిన్ను మెప్పిస్తాను.

విశేషం: ఈ పద్యం అమూలకం. 133వ పద్యానికి మూలం.

'ఉవాచ సారథిం తూర్ణం చోదయాశ్వాన్మహాజవాన్ ।
ఏష తిష్ఠతి వై రాజా పాండుపుత్రో యుధిష్ఠిరః ।
ఛత్రేణ ధ్రియమాణేన పాండురేణ విరాజతా ॥
అత్ర మాం ప్రాపయ క్షిప్రం పశ్య మే సారథే బలమ్ ।
న సమర్థో హి మే పార్థః స్థాతు మద్య పురోయుధి ॥ (శల్య. అధ్యా. 10)

తిక్కయజ్వ స్వేచ్ఛానువాద సౌందర్యాన్ని గ్రహించటంకొరకు అచ్చటచ్చట మూలమును చూపటం జరుగుతున్నది.

వ. అనుటయు వాఁడు పాండవబలంబుల కెదురుగా నరదంబు సముచితరయంబున నడప నమ్మద్రపతి సముద్ర సముద్రేకంబు చందంబైన యా సైన్యంబు సరభసత్వంబు చెలియలికట్టయుంబోలి యుడుపుట యచ్చెరువై యుండె నట్లు శౌర్యధైర్యంబుల నుల్లసిల్లు శల్యుం జూచి మనమూఁకలును మగుడ నిగిడిన సంగ్రామంబు భీమంబయ్యె నందు నకులుండును గర్ణపుత్త్రుండగు చిత్రసేనుండును దలపడి యొండొరువులకుఁ గృతాస్త్రత్వంబును సమరవిశారదత్వంబును జూపుచుం బెనంగునెడ నా సూతపౌత్త్రుండు. 135

ప్రతిపదార్థం: అనుటయున్= చెప్పుటయు; వాఁడు= సారథి; పాండవ= పాండవులయొక్క; బలంబులకున్= సేనలకు; ఎదురుగాన్= ఎదురుగా; అరదంబు= రథము; సముచిత= తగిన; రయంబునన్= వేగమున; నడపన్= నడపగా; ఆ+మద్రపతి= మద్రదేశమునకు ప్రభువు అయిన ఆ శల్యుడు; సముద్ర= సముద్రముయొక్క; సముద్రేకంబు= ఉప్పొంగు(విజృంభించు);

చందంబు= విధము; ఐనన్= కాగా; ఆ సైన్యంబు= ఆ సేనలు (ఆ పాండవసేనలు); సరభసత్వంబు= వేగిరపాటుతనము; చెలియలి కట్టయున్= సముద్రపు గట్టును; పోలి= వలె; ఉడుపుట= ఆపుట; అచ్చెరువై= ఆశ్చర్యకరమై; ఉండెన్= ఉండెను; అట్లు= ఆ ప్రకారముగా; శౌర్య= పరాక్రమము; ధైర్యంబులన్= ధీరత్వములతో; ఉల్లసిల్లు= ప్రకాశించు; శల్యున్; చూచి; మనమూఁకలును= మనయొక్క సేనలును; మగుడన్= మరల; నిగిడినన్= నిక్కగా(విజృంభించగా); సంగ్రామంబు= యుద్ధము; భీమంబు= భయానకము; అయ్యెన్= అయ్యెను; అందున్= ఆ యుద్ధమునందు; నకులుండును; కర్ణపుత్రుండగు= కర్ణుని కుమారుడగు; చిత్రసేనుండును; తలపడి= కలియపడి; ఒండొరువులకున్= ఒకరికొకరికి (పరస్పరం); కృతాస్త్రత్వంబును= సమర్థమైన అస్త్రప్రయోగము కలిగియుండుటను; సమర= యుద్ధముచేయుటయందు; విశారదత్వంబును= పాండిత్యము కలిగియుండుటను; చూపుచున్= చూపించుచు; పెనంగు= పోరాటమును; ఎడన్= సలుపు సమయమున (పోరాడే స్థానంలో); ఆ సూత= ఆ సూతునియొక్క; పౌత్రుండు= మనుమడు (కర్ణుడిని పెంచిన తండ్రి సూతుడు - అందువలన కర్ణుడి కొడుకు సూతుడికి మనుమడు).

తాత్పర్యం: శల్యుడు ఇట్లా సారథితో చెప్పగా, సారథి పాండవ బలాలకు ఎదురుగా రథాన్ని తగిన వేగంతో నడపగా ఆ శల్యుడు ఉప్పొంగే సముద్రాన్ని చెలియలికట్ట ఆపిన విధంగా పాండవసేనలయొక్క వేగిరపాటును ఆపటం ఆశ్చర్యకరమై ఉండింది. ఆ ప్రకారంగా పరాక్రమ ధీరత్వాలు ప్రకాశించే శల్యుడిని చూచి, కురు సైన్యాలు మరల విజృంభించగా, యుద్ధం భయానకమైనది. ఆ యుద్ధంలో నకులుడు, కర్ణుడి కుమారుడయిన చిత్రసేనుడును కలియబడి ఒకరినొకరు పరస్పరం అస్త్రప్రయోగ సామర్థ్యంతో యుద్ధం చేయటంలో పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ పోరాడేటప్పుడు ఆ సూతుడి మనుమడయిన చిత్రసేనుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

కర్ణుకొడుకులు చిత్రసేన సత్యసేన సుశర్ములు నకులునిచేతఁ జచ్చుట (సం. 9-9-12)

చ. **నకులుని చాపదండము ఘనప్రదరంబునఁ దున్మి, భాస్వరాం**
బకములు మూఁడు దీవ్రగతి ఫాలతలంబున నాటి త్రుంచె ఘో
టకములఁ గేతనం బిలఁ బడన్ విదళించి వధించె సూతు ఖే
టకమును ఖడ్గముం గొని కడఁగఁ బయిం బరఁగించె భల్లముల్. **136**

ప్రతిపదార్థం: నకులుని= నకులునియొక్క; చాపదండము= వింటికర్రను; ఘన= గొప్పదిఅయిన; ప్రదరంబునన్= బాణముతో; తున్మి= ఖండించి; మూఁడు; భాస్వర= ప్రకాశమానములగు; అంబకములు= బాణములు; తీవ్రతన్= మిక్కిలి వేగంగా; ఫాల= లలాటము యొక్క; భాగంబునన్= ప్రదేశమునందు; నాటి= గ్రుచ్చి; ఘోటకములన్= గుర్రములను; కేతనంబు= జెండాకొయ్య; ఇలన్ పడన్= భూమిపై పడునట్లు; విదళించి= ఖండించి; త్రుంచెన్= చంపెను; సూతు= సారథిని; వధించెన్= సంహరించెను; ఖడ్గమున్= కత్తిని; ఖేటకమును= డాలును; కొని= తీసికొని; కడంగన్= ప్రయత్నం చేయగా; భల్లముల్= బల్లెములు; పయిన్= ఆ నకులుడిపై; పరఁగించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: ఆ సూతపౌత్రుడు చిత్రసేనుడు నకులుడి వింటి కర్రను గొప్పదైన బాణంతో ఖండించి, మూడు ప్రకాశమానాలైన బాణాలు నకులుడి లలాటంపై గ్రుచ్చి, గుర్రాలను జెండా కొయ్యను భూమిపై పడేటట్లు ఖండించాడు. సారథిని ఖండించి, సంహరించాడు. (నకులుడు) కత్తిని డాలును గైకొని దాడికి పూనుకొనగా చిత్రసేనుడు అతనిపై బల్లాలు ప్రయోగించాడు.

క. ఆ నిశితభల్లములు దన । మేనికి రాకుండఁ బలుక మెఱయ జడియుచున్
వే నిగిడి కదిసె మాద్రీ । సూనుం డా సూతసూతిసూను నరదమున్. 137

ప్రతిపదార్థం: ఆ; నిశిత= వాడి అయిన; భల్లములు= బల్లెములు; తన; మేనికిన్= దేహమునకు; రాకుండన్= తగులకుండగ; పలుక= డాలు; మెఱయన్= ప్రకాశింపగ; జడియుచున్= త్రిప్పుతూ; వే= వేగమున; నిగిడి= విజృంభించి; మాద్రీ= మాద్రియొక్క (పాండురాజు రెండవపత్ని); సూనుండు= కుమారుడు(నకులుడు); ఆ; సూత= సూతునియొక్క; సూతి= కుమారునియొక్క (కర్ణుడియొక్క); సూనుని= కుమారుని (చిత్రసేనుని); అరదమున్= రథమును; కదిసెన్= చేరెను.

తాత్పర్యం: చిత్రసేనుడు విసిరిన ఆ వాడిఅయిన బల్లెములు తన దేహానికి తగులకుండగనే (తన దేహం దగ్గరకు రాకుండగనే) డాలును త్రిప్పుతూ వేగంగా విజృంభించి నకులుడు చిత్రసేనుడి రథాన్ని సమీపించాడు.

తే. కదిసి మీఁదికి లంఘించి మదమెలర్ప । గళముఁ దునిమిన నమ్మస్తకంబు దొల్లెఁ
గర్ణపూరకిరీటసంకలిత వివిధ । రత్నరోచులు మెఱయ ధరాతలమున. 138

ప్రతిపదార్థం: కదిసి= చేరి (చిత్రసేనుని రథముచేరి); మీఁదికిన్= పైకి(రథముపైకి); లంఘించి= దూకి; మదము= గర్వము; ఎలర్పన్= అతిశయింపగ; గళము= కంఠము(కుత్తుక); తునిమినన్= ఖండించగా; ఆ+మస్తకంబు= ఆ శిరస్సు; కర్ణపూర కిరీట= చెవికమ్మ, మకుటములయందు; సంకలిత= కూడియున్న (పొదిగియున్న); వివిధ= పలురకములయిన; రత్న= మాణిక్యములయొక్క; రోచులు= కాంతులు; మెఱయన్= ప్రకాశింపగ; ధరా= భూమియొక్క; తలమునన్= స్థలమున; డొల్లెన్= దొర్లెను.

తాత్పర్యం: నకులుడు చిత్రసేనుడి రథంపైకి దూకి, గర్వం అతిశయించగా కుత్తుకను ఖండించగా ఆ తల కర్ణకుండలాలలో, కిరీటంలో పొదిగిన పలురకాలయిన మాణిక్య కాంతులు ప్రకాశిస్తూ ఉండగా భూమిపై పడి దొర్లింది.

విశేషం: మహాభారతంలో చిత్రసేనులు లెక్కకు మిక్కిలి ఉన్నారు. ధృతరాష్ట్రుడి పుత్రులు పదకొండుమంది మహారథులలో చిత్రసేను డొకడు ఉన్నాడు. పరీక్షిత్తు మహారాజుయొక్క మూడవపుత్రుడు చిత్రసేను డొకడు ఉన్నాడు. జరాసంధుని మంత్రి నీతిశాస్త్ర విశారదుడు చిత్రసేను డొకడు ఉన్నాడు. అభిసార దేశపురాజు చిత్రసేను డొకడు ఉన్నాడు. త్రిగర్తరాజు సుశర్మ అన్నగారు చిత్రసేను డొకడు ఉన్నాడు. పాంచాల యోధుడు చిత్రసేను డొకడు ఉన్నాడు. నాగరాజు చిత్రసేను డొకడు ఉన్నాడు. గంధర్వరాజు చిత్రసేను డొకడు ఉన్నాడు.

వ. ఇట్లు చిత్రసేనుండు వడినం గనుంగొని కౌంతేయసైనికు లార్చినం బేర్చిన శోకరోషంబుల మనంబుల ముప్పిరిగొన వాని సోదరులు సత్యసేనుండును - సుశర్ముండును నప్పాండుపుత్రుపైఁ గవిసిన నతండు వేతొక్క-తేరెక్కి బలు విల్లెత్తి దండధర ప్రచండమూర్తియై మార్కొనిన నబ్బిరుదుమగ లయ్యరదంబు భల్లంబుల నఱకం దొడంగిన నుఱక చిఱునవ్వు నవ్వి. 139

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; చిత్రసేనుండు; పడినన్= పడిపోయిన(చనిపోయిన); కనుంగొని= చూచి; కౌంతేయ= కుంతీపుత్రులయొక్క(పాండవులయొక్క); సైనికులు; ఆర్చినన్= అరవగా; పేర్చిన= అతిశయించిన; శోకం= దుఃఖము; రోషంబులు= క్రోధములు; మనంబులన్= మనస్సులందు; మూడు+పిరి= మూడు పేటలుగా; కొని= చుట్టుకొని; వాని;

సోదరులు; సత్యసేనుండు; సుశర్ముండునున్; ఆ+పాండుపుత్రునిపైన్= ఆ పాండురాజు కుమారుడిపై(నకులుడిపై); కవిసినన్= ఉరకగా; ఆతండు= ఆ నకులుడు; వేఱొక్క= ఇంకొక; తేరు= రథము; ఎక్కి; బలు= బలముగల; విల్లు= ధనువు; ఎత్తి= తీసికొని; దండధర= యమునివలె; ప్రచండ= తీవ్రమయిన (భయంకరమయిన); మూర్తి+ఐ= ఆకారము కలవాడై; మార్కొనినన్= ఎదుర్కొనగా; ఆ+బిరుదు= ఆ మహారథులు అయిన; మగలు= వీరులు (సత్యసేన - సుశర్మలు); ఆ+అరదంబు= ఆ రథమును; భల్లంబులన్= బల్లెములతో; నఱకన్= ఖండించుటకు; తొడంగినన్= ప్రారంభించగా; ఉఱక= లెక్కచేయక; చిఱునవ్వు; నవ్వి.

తాత్పర్యం: ఈ ప్రకారంగా చిత్రసేనుడు పడిపోగా చూచి పాండవుల సైనికులు అరవగా, దుఃఖం, క్రోధం ముప్పిరిగొనగా చిత్రసేనుడి సోదరులయిన సత్యసేన, సుశర్మలు ఆ నకులుడిపై కలియబడగా, నకులుడు ఇంకొక రథం ఎక్కి బలమయిన ధనువు గైకొని యముడివలె భయంకరమయిన ఆకారం కలవాడయి ఎదుర్కొనగా, మహారథులయిన ఆ వీరులు నకులుడి రథాన్ని బల్లెములతో ఖండించటానికి ప్రారంభించగా నకులుడు దానిని లెక్కచేయక ఒక చిన్న నవ్వు నవ్వి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: మూలంలో కర్ణుడి కొడుకు 'సుశర్మ' డనేవాడు లేడు. 'సుషేణు'డు ఉన్నాడు. సుశర్ముడు త్రిగర్త దేశాధీశుడు. దక్షిణ గోగ్రహణంలో కౌరవసైన్యానికి ఇతడు నాయకుడు. ఆ యుద్ధంలో విరాటుడికి బందీ కాగా ధర్మరాజు కృపవలన విడిపించబడ్డాడు. ఈ శల్యపర్వమునందే ఈ 'సుశర్మ'ను అర్జునుడు సంహరించాడు.

'సుశర్మాణం సమాసాద్య బిభేద హృదయం రణే ।
స గతాసు ర్మహారాజ పపాత ధరణీతలే ॥ (శల్య 27-46)

ఇక మహాభారతంలో 'సుషేణ' నామధేయులు చాలమంది ఉన్నారు. ధృతరాష్ట్రుడి నూరుమంది పుత్రులలో ఒక 'సుషేణుడు' ఉన్నాడు. ధృతరాష్ట్రుడనే నాగరాజు పుత్రుడు ఒక 'సుషేణుడు' ఉన్నాడు. పురువంశీయ పరీక్షిత్తుడి పుత్రుడు ఒక 'సుషేణుడు' ఉన్నాడు. జమదగ్ని పుత్రుడు ఒక 'సుషేణుడు' ఉన్నాడు. వానరరాజు వాలి మామగారు ఒక 'సుషేణుడు' ఉన్నాడు.

చ. కడువడి సత్యసేను తురగంబులఁ గూల్చి శరాసనంబుఁ జ
క్కడిచిన నొండుతేరికి రయంబు మెయిం జని యన్యచాప మె
క్కిడుటయు నక్కుమారు నిశితేషుయుగంబున నొంచి నొంచెఁ గ
వ్వడియనుజన్ముఁ డుగ్రుఁ డయి వాని సహోదరు రెండు తూపులన్. 140

ప్రతిపదార్థం: కడు= మిక్కిలి; వడిన్= వేగంగా; సత్యసేను; తురగంబులన్= గుర్రములను; కూల్చి= చంపి; శరాసనంబున్= వింటిని; చక్కడిచినన్= ఖండించగా; ఒండు= ఇంకొక; తేరికిన్= రథమునకు; రయంబుమెయిన్= మిక్కిలివేగముగా; చని= వెళ్ళి; అన్య= మరియొక; చాపము= విల్లు; ఎక్కిడుటయున్= ఎక్కుపెట్టుటయు; ఆ+కుమారు= ఆ కుమారుని; నిశిత= వాడియైన; ఇషు= బాణములయొక్క; యుగంబునన్= రెండింటితో; నొంచి= నొప్పించి; కవ్వడి= అర్జునునియొక్క; (ఏకకాలమున రెండు చేతులతో బాణములు ప్రయోగించగల వాడు కావున అర్జునునకు కవ్వడి అనిపేరు. సవ్యసాచి అని అర్థము); అనుజన్ముండు= తమ్ముడు(నకులుడు); ఉగ్రుఁడయి= భయంకరుడయి; వాని(సత్యసేనుని); సహోదరునిన్= సోదరుని; రెండుతూపులన్= రెండు బాణములతో; నొంచెన్= నొప్పించెను.

తాత్పర్యం: నకులుడు చిన్నినవ్వు నవ్వి, మిక్కిలి వేగంగా సత్యసేనుడి గుఱ్ఱాలను కూల్చి వింటిని ఖండించగా సత్యసేనుడు ఇంకొక రథం కొరకు వేగంగా వెళ్ళి మరియొక వింటిని ఎక్కుపెట్టగా అర్జునుడి తమ్ముడైన నకులుడు ఆ కుమారుడిని వాడి అయిన రెండు బాణాలతో నొప్పించి, భయంకరుడైన అతడి సోదరుడిని రెండు బాణాలతో నొప్పించాడు.

తే. అతని ధను వా సుశర్ముఁ డుద్ధతి దలిర్పఁ । ద్రుంచుటయు నొండువింట బల్దూపు లొడలఁ
బఱపి వాని సిడంబున నఱకి సత్య । సేను విలు ద్రుంచె నా పాండుసూనుఁ డధిప! 141

ప్రతిపదార్థం: అధిప! ధృతరాష్ట్ర మహారాజా!; అతని; ధనువు= విల్లు; ఆ సుశర్ముడు; ఉద్ధతి= గర్వము; తలిర్పన్= అతిశయింపగా; త్రుంచుటయున్= ఖండించుటయు; ఆ పాండు సూనుఁడు= ఆ పాండురాజు కుమారుడు(నకులుడు); ఒండు= మరియొక; వింటన్= ధనువుతో; బల్= బలమయిన; తూపులు= బాణములు; ఒడలన్= దేహమునందు; పఱపి= ప్రయోగించి; వాని; సిడంబును= టెక్కెమును; నఱకి; సత్యసేను విలు= సత్యసేనునియొక్క ధనువు; త్రుంచెన్= ఖండించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ నకులుడి ధనువును ఆ సుశర్ముడు గర్వం అతిశయించగా ఖండించటంతో నకులుడు మరియొక వింటితో బలమైన బాణాలు ప్రయోగించి, ఆ సుశర్ముడి రథకేతనాన్ని ఖండించి సత్యసేనుడి విల్లును కూడా నరికాడు.

విశేషం: వావిళ్ళవారి ప్రతిలోనూ, ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ప్రతిలోనూ సుశర్ముడి 'శిరమ్మును నఱకి' అని ఉన్నది. కాని, 148వ పద్యంలో సుశర్మ శిరస్సును నకులుడు తునిమినట్లు 'అవ్విరోధి శిరము దునిమె' అని ఉన్నది. కర్ణుడి కొడుకులలో మూడవవాడైన సుశర్మ 148వ పద్యంలో చంపబడినట్లున్నది కాబట్టి ఈ పద్యంలో 'శిరంబును' అనటానికి మారుగా ఉస్మానియావారి భారత పాద దీపికలో 'సిడంబు' అనే పాఠాంతరం పరిగ్రాహ్యమైతే ఆ విరోధం తొలగుతుంది కాబట్టి 'సిడంబు' అనే పాఠాంతరాన్ని గ్రహించటమైనది.

శా. ఆ రాధేయతనూజుఁ డన్యధను వుగ్రాకారుఁడై యెత్తి దు
ర్వారప్రక్రియ నేసె నావిశిఖముల్ వారించి యాతం డతి
క్రూరస్ఫారశరత్రయం బతని వక్షోభిత్తిఁ గీలించి వే
నారాచంబులు రెండు దమ్మునిమెయిన్ నాటెం గడున్ బెట్టుగన్. 142

ప్రతిపదార్థం: ఆ; రాధేయ= రాధకుమారుడయిన కర్ణునియొక్క; తనూజుఁడు= కుమారుడు(సత్యసేనుడు); ఉగ్ర= భయంకరమయిన; ఆకారుఁడై; అన్య= మరియొక్క; ధనువు= విల్లు; ఎత్తి= ఎక్కుపెట్టి; దుర్వార= వారింపశక్యముకాని; ప్రక్రియన్= విధముగా; ఏసెన్= ప్రయోగించెను; ఆ విశిఖముల్= ఆ బాణములు; వారించి= నివారించి(ఆపి); ఆతండు; అతి= మిక్కిలి; క్రూర= భయంకరమయిన; స్ఫార= గొప్పవి అయిన(అధికశక్తిమంతమయిన); శర= బాణములు; త్రయంబు= మూడు(మూడు బాణములు); అతని= అతనియొక్క (ఆ సత్యసేనునియొక్క); వక్షస్భిత్తిన్= గోడవలె దృఢమైన రొమ్మున; కీలించి= నాటించి; వే= వేగంగా; రెండు; నారాచంబులు= వాడి అయిన ఇనుప బాణాలు; తమ్ముని= తమ్ముడియొక్క (సత్యసేనుని తమ్ముడయిన సుశర్మునియొక్క); మెయిన్= శరీరమును; కడున్= మిక్కిలి; బెట్టుగన్= గట్టిగా; నాటెన్= గ్రుచ్చెను.

తాత్పర్యం: ఆ సత్యసేనుడు భయంకరాకారుడై ఇంకొకవిల్లు ఎక్కుపెట్టి వారింపశక్యంకాని విధంగా బాణాలను ప్రయోగించాడు. ఆ బాణాలను నివారించి నకులుడు మిక్కిలి భయంకరం, అధిక శక్తిమంతం అయిన మూడు బాణాలు ఆ సత్యసేనుడి వక్షఃస్థలంలో నాటించి, వేగంగా రెండు బాణాలు సత్యసేనుడి తమ్ముడు సుశర్ముడి శరీరంలోనికి మిక్కిలి గట్టిగా గ్రుచ్చాడు.

క. వా రలిగి యొక్కయుమ్మడి । సారథిఁ దెగటార్చి యార్చి చాపము దునియం
దేరు వికలముగ మేను వి । దారితముగ నేసి రత్యుదగ్రస్ఫురణన్. 143

ప్రతిపదార్థం: వారు(ఆ సత్యసేన సుశర్ములు); అలిగి= కోపించి; ఒక్క+ఉమ్మడి= ఒక్కటిగా ఇద్దరును ఏకమై; సారథిన్= సారథిని; తెగటార్చి= చంపి; ఆర్చి= అరచి; చాపము= విల్లు; తునియన్= ఖండించగా; తేరు= రథము; వికలముగన్= ముక్కలుగ; మేను= దేహము; విదారితముగన్= చీలిపోవునట్లుగా; అతి+ఉదగ్ర= మిక్కిలి భయంకరమయిన; స్ఫురణన్= విజృంభణతో; ఏసిరి= కొట్టిరి.

తాత్పర్యం: కర్ణపుత్రులైన సత్యసేన సుశర్ములు కోపించి ఒక్కుమ్మడిగా సారథిని చంపి అరచి విల్లు ఖండించగా రథం ముక్కలయ్యేటట్లుగా దేహం చీలిపోయేటట్లుగా మిక్కిలి భయంకరమయిన విజృంభణంతో కొట్టారు.

వ. ఇవ్విధంబున. 144

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా సత్యసేన సుశర్ములు నకులుడిని కొట్టగా.

మ. విరథుండున్ వినికృత్తచాపుఁడు శరావిద్ధుండునై మేదినీ
వర నీపుత్రుఁడు చంచదుగ్రతర జిహ్వాం బైన చండాహి నాఁ
గర మాభీలతఁ బొల్చుశక్తిఁ గొని యల్కన్ సత్వరుండయ్యె సు
స్థిరసంరంభత సత్యసేనుఁ బడవైచెం జూప అగ్గింపఁగన్. 145

ప్రతిపదార్థం: మేదినీ= భూమికి; వర!= భర్తవయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; విరథుండున్= రథములేనివాడును; వినికృత్త= విరుగగొట్టబడిన; చాపుఁడున్= ధనువు కలవాడును; శర= బాణములతో; ఆ విద్ధుండును= చీల్చబడినవాడును; ఐ= ఉన్నవాడై; నీ పుత్రుడు= నీయొక్క కుమారుడు(నకులుడు); చంచత్= చలించుచున్న; ఉగ్రతర= మిక్కిలి భయంకరమయిన; జిహ్వాంబు+ఐన= నాలుక గల; చండ= తీవ్ర; అహి= పాము; నాన్= అనునట్లుగా; కరము= మిక్కిలి; ఆభీలతన్= భయంకరముగా; పొల్చు= ఒప్పు; శక్తిన్= శక్తి అను ఆయుధమును; కొని= తీసికొని; అల్కన్= కోపంతో; సత్వరుండు= మిక్కిలివేగిరపాటు కలవాడు; అయ్యెన్; సుస్థిర= మిక్కిలి నిలకడకల; సంరంభతన్= గర్వంతో; చూపఱు= చూచువారు; అగ్గింపఁగన్= పొగడేటట్లుగ; సత్యసేనున్= సత్యసేనుని; పడవైచెన్= పడగొట్టెను (చంపెను.)

తాత్పర్యం: (సంజయుడు చెప్తున్నాడు) ఓ ధృతరాష్ట్ర మహారాజా! రథం లేని వాడు, విరుగగొట్టబడిన విల్లు కలవాడు, బాణాలతో శరీరం చీల్చబడినవాడు అయిన నీ పుత్రుడు నకులుడు చలిస్తున్న భయంకరమైన నాలుక

కలిగిన మిక్కిలి క్రూరమైన పాము అన్నట్లు భయంకరమైన 'శక్తి' అనే ఆయుధాన్ని తీసికొని కోపంతో వేగిరపాటు కలవాడై నిలకడ కలిగిన గర్వంతో చూచేవాళ్ళు పొగడేటట్లుగా సత్యసేనుడిని సంహరించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

ఆ. అన్నపాటు సూచి యనుజుఁ డుల్లంబున । నడలు కనలుఁ గదుర నంపవానఁ
గప్పె నకులు నంతఁ గాంచి భీముకుమారుఁ । డెయిదె నతనియరద మెక్కె నతఁడు. 146

ప్రతిపదార్థం: అన్న; పాటు= పడుట; చూచి; అనుజుఁడు= తమ్ముడు (సుశర్ముడు లేక సుషేణుడు); ఉల్లంబునన్= హృదయమునందు; అడలు= శోకము; కనలున్= కోపమును; కదురన్= అతిశయింపగా; అంప= బాణములయొక్క; వానన్= వర్షంతో; నకులున్; కప్పెన్= కప్పెను; అంతన్= అంతలో; కాంచి= చూచి; భీము= భీమునియొక్క; కుమారుడు(భీమునివలన ద్రౌపదియందు పుట్టినపుత్రుడు శ్రుతసోముడు); ఎయిదెన్= దగ్గరకు చేరాడు. అతఁడు= నకులుడు; అతని= అతనియొక్క (భీమపుత్రుడియొక్క); అరదము= రథము; ఎక్కెన్= ఎక్కెను.

తాత్పర్యం: అన్న సత్యసేనుడు పడిపోవటం చూచి తమ్ముడు సుశర్ముడు (సుషేణుడు) హృదయంలో శోకం, కోపం అతిశయించగా నకులుడిపై బాణవర్షం కురిపించాడు. అంతలో నకులుడిని చూచి భీముడిపుత్రుడు శ్రుతసోముడు దగ్గరకు చేరాడు. నకులుడు శ్రుతసోముడి రథం అధిరోహించాడు.

వ. ఇట్లు ద్రౌపదేయుండగు శ్రుతసోముని యరదంబెక్కి బలువిల్లుగొని యక్కుమారుండును దోడుపడ నా సుశర్ముని బటుశరపరంపరలం బొదివినఁ బొలివోక యతండు. 147

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగా; ద్రౌపదేయుఁడు= ద్రౌపది పుత్రుడు అగునట్టి; శ్రుతసోముని= శ్రుతసోమునియొక్క; అరదంబు= రథము; ఎక్కి; బలు= బలమయిన; విల్లున్= ధనువు; కొని= తీసికొని; ఆ+కుమారుండును; ఆ పుత్రుడును (శ్రుతసోముడును); తోడుపడన్= సహాయపడగా; ఆ సుశర్ముని; (సుషేణుని); పటు= తీవ్రమయిన; శర= బాణములయొక్క; పరంపరలన్= వరుసలతో (ఒకదానితరువాత ఒకటిగా); పొదివినన్= క్రమ్ముకొనగా; పొలివోక= వెనుదీయక; అతండు (అనగా ఆ సుశర్ముడు లేక సుషేణుడు).

తాత్పర్యం: ఈ ప్రకారంగా ద్రౌపది కుమారుడైన శ్రుతసోముడి రథం ఎక్కి బలమయిన ధనువును తీసికొని ఆ శ్రుతసోముడు సహాయపడగా ఆ సుశర్ముడి (ఆ సుషేణుడి) తీవ్రమయిన బాణాల వరుసలతో కొట్టాడు. అయినా, వెనుదీయకుండా ఆ సుశర్ముడు (ఆ సుషేణుడు). (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. వాఁడి తూపులు నకులుమై మూఁడు నాఁటి । యిరువదింటఁ దత్పుత్రుని యురము నొంప
నర్ధచంద్రబాణాహతి నవ్విరోధి । శిరము దునిమె నప్పాండుభూవరసుతుండు. 148

ప్రతిపదార్థం: వాఁడి తూపులు= వాడి అయిన బాణములు, నకులు= నకులునియొక్క; మైన్= దేహమందు; మూఁడు; నాఁటి= గ్రుచ్చి; ఇరువదింటన్= ఇరువది బాణములతో; తద్= ఆ; పుత్రుని= ద్రౌపదేయుని(శ్రుతసోముని); ఉరమున్= వక్షఃస్థలమును; నొంపన్= బాధింపగా; ఆ+పాండు భూవర= ఆ పాండురాజుయొక్క; సుతుండు= కుమారుడు(నకులుడు); అర్ధచంద్ర= అర్ధచంద్రుడియొక్క ఆకృతిగల; బాణ= బాణంయొక్క; ఆహతిన్= దెబ్బతో; ఆ+విరోధి= ఆ శత్రువుయొక్క (సుశర్ముడియొక్క లేక సుషేణుని యొక్క) శిరము= తలను; తునిమెన్= ఖండించెను.

తాత్పర్యం: వాడి అయిన బాణాలు నకులుడి దేహంలో మూడు గ్రుచ్చి ఇరువది బాణాలతో శ్రుతసోముడి వక్షఃస్థలాన్ని బాధించగా, ఆ నకులుడు అర్ధచంద్రాకృతిగల బాణంయొక్క దెబ్బతో శత్రువు అయిన ఆ సుశర్మడి (సుషేణుని) తలను ఖండించాడు.

శా. మాద్రీపుత్రునిచేతఁ గర్ణసుతు లీమాడ్కిం బడం జూచి వీ
రోద్రేకం బెడలంగ నీ సుతుబలం బొక్కుమ్మడిన్ విచ్చిన
న్మద్రాధీశుఁడు సింహనాదము రణన్మౌర్వీసముల్లాసమున్
రౌద్రప్రక్రమసూచకంబులుగ సంరంభస్ఫురన్మూర్తియై. 149

ప్రతిపదార్థం: మాద్రీపుత్రునిచేతన్= మాద్రీపుత్రుడు అయిన నకులుడిచేత; కర్ణసుతులు= కర్ణునియొక్క కుమారులు (చిత్రసేన - సత్యసేన - సుశర్ములు (సుషేణులు)); ఈ మాడ్కిన్= ఈ విధంగా; పడన్= కూలిపోవుటను; చూచి; వీర= శూరులయొక్క; ఉద్రేకంబు= విజృంభణము; ఎడలంగన్= పోగా; నీ= నీయొక్క(ధృతరాష్ట్రునియొక్క); సుతు= కుమారునియొక్క= (దుర్యోధనునియొక్క); బలంబు= సైన్యము; ఒక్కుమ్మడిన్= ఒక్కసారిగ; విచ్చినన్= విడివడిపోగా (చెల్లాచెదరుకాగా); మద్రాధీశుఁడు= మద్రదేశమునకు అధిపతి అయిన శల్యుడు; సింహనాదమున్= సింహగర్జనమును; రణత్= ధ్వనిచేయు; మౌర్వీ= వింటినారియొక్క (అల్లెత్రాడుయొక్క); సముల్లాసమున్= ప్రకాశమును; రౌద్ర= క్రోధముయొక్క; ప్రక్రమ= ప్రారంభమునకు; సూచకంబులుగన్= తెలియచేయు గుర్తులుగా; సంరంభ= ఆటోపంతో; స్ఫురత్= ప్రకాశించు; మూర్తి; రూపము; ఐ= కలవాడై.

తాత్పర్యం: నకులుడిచేత కర్ణుడికుమారులు ఈ ప్రకారంగా కూలిపోవటం చూచి, శూరుల విజృంభణం వికలం కాగా నీ కుమారుడైన దుర్యోధనుడి సైన్యం ఒక్కసారిగా విడివడి చెల్లాచెదురుకాగా మద్రదేశాధిపతి శల్యుడు సింహగర్జనను, మౌర్వీనాదాన్ని క్రోధసూచకాలుగా ప్రకాశించే రూపం కలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. హస్తతల మెత్తి నిలునిలుమని యదల్పఁ । బోకతిరిగి యమ్మూఁకలు పోరి కమరెఁ
బాండవేయుల మొనలు నుద్దండవృత్తి । నురవణించిన సంగర ముగ్రమయ్యె. 150

ప్రతిపదార్థం: హస్తతలము= అరచేతిని; ఎత్తి; నిలునిలుము= ఆగుము ఆగుము; అని; అదల్పన్= అదలించగా; ఆ+ మూఁకలు= ఆ సైన్యములు; పోక= వెడలిపోక; పోరికిన్= యుద్ధమునకు; అమరెన్= సిద్ధమయ్యెను; పాండవేయుల= పాండవులయొక్క; మొనలున్= సేనలును; ఉద్దండ= అధికమయిన; వృత్తిన్= వ్యాపారంతో (ఉత్సాహంతో); ఉరవడించినన్= వేగిరపాటు పడగా; సంగరము= యుద్ధము; ఉగ్రము= భయంకరము; అయ్యెన్= అయ్యెను.

తాత్పర్యం: శల్యుడు చేతిని ఎత్తి, ఆగుమాగు మని అదలించగా ఆ కౌరవసైన్యం వెడలిపోక మరల యుద్ధానికి సిద్ధమైనది. పాండవసేనలు కూడా అధికోత్సాహంతో వేగిరపాటు పడగా యుద్ధం భయంకరం అయింది.

చ. అడరి ధనంజయాదులగు నక్కడి వీరులు విక్రమింప ని
క్కడ భవదీయనందనముఖప్రభవోద్భట యోధవర్గము
ల్వడిఁ దఱుమంగ నప్పుడు బలద్వయమున్ విశిఖాగ్ని పేర్చి యె
క్కుడయిన భీతి నొందె రణఘోరత భూవర! యేమి సెప్పదున్? 151

ప్రతిపదార్థం: అడరి= విజృంభించి; ధనంజయ= అర్జునుడు; ఆదులు= మొదలు; అగు= అగునట్టి; అక్కడి= ఆ పాండవపక్షమందలి; వీరులు= శూరులు; విక్రమింపన్= పరాక్రమమును చూపగా; ఇక్కడన్= ఈ కౌరవపక్షమునందలి; భవదీయ= నీయొక్క; నందన= కుమారుడు (దుర్యోధనుడు); ముఖ= మున్నగు; ప్రభవ= పుట్టుకచేత; ఉద్భట= భయంకరులైన; యోధ= వీరులయొక్క; వర్గముల్= సమూహాలు; వడిన్= వేగముగా; తఱుమంగన్= తరుమగా (వెంటపడి పరుగెత్తునట్లు చేయగా); అప్పుడు= ఆ సమయమున; బల= సైన్యములు; ద్వయమున్= రెండును; విశిఖాగ్ని= బాణాలయొక్క అగ్ని; పేర్చి= విజృంభించి; ఎక్కుడు+అయిన= అధికమయిన; భీతిన్= భయమును; ఒందెన్= పొందెను; భూవర!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; రణ= రణముయొక్క; ఘోరతన్= భయంకరత్వమును గూర్చి; ఏమి; చెప్పుదున్?= చెప్పగలను? (అత్యంత భయంకరమయిన యుద్ధమున గూర్చి చెప్పటం సాధ్యంకాదు.)

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! విజృంభించి అర్జునుడు మొదలయిన పాండవపక్షంలోని వీరులు పరాక్రమించగా ఈ కౌరవ పక్షంలోని నీ కుమారుడు దుర్యోధనుడు మున్నగు పరాక్రమవంతులు, శ్రేష్ఠులు అయిన యోధ సమూహాలు వేగంగా వెంటపడి తరుమగా ఆ సమయంలో రెండు సైన్యాలూ బాణాల వలన పుట్టిన అగ్ని విజృంభించి అధికమయిన భయాన్ని పొందాయి. ఆ భయంకర యుద్ధాన్ని గూర్చి ఏమి చెప్పగలను? (ఆ యుద్ధం వర్ణింప శక్యం కానిది.)

వ. ఇట్లు మథితంబయ్యును బౌరుషంబు పెంపున నిరువాఁగును వేగంబు గుందక వింత చందంబునం బేర్చుక్రందు గగనచరులకుఁ గన్నులపండువుగా బృంహితధ్వనులను ఘంటానినదంబులను నేమినిస్వనంబులను గేతుకింకిణీక్వణనంబులను రింఖారవంబులను హేషాఘోషంబులను భుజాస్ఫాలనంబులను సింహనాదంబులను దిక్తటభేదనం బొనర్ప నద్భుతోత్సాహంబున నాహవక్రీడ సలుపుచుండఁ బుండరీకాక్ష రక్షితులగు పాండుపుత్రుల బలశౌర్యసంపదల సొంపునం బెంపాదవు ధృష్టద్యుమ్న శిఖండిసాత్యకి ప్రముఖులైన దండిమగలు గూడికొని తఱుమ దారుణనైపుణంబున బాహాటోపంబు సూపినఁ గార్చిచ్చు గవిసినం గలంగు మృగకులంబు కైవడిం గౌరవసైన్యంబు దైన్యంబు నొందిన. 152

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగా; మథితంబు= మథించబడింది; అయ్యును= అయినప్పటికిని; పౌరుషంబు= పరాక్రమముయొక్క; పెంపునన్= ఆధిక్యమువలన; ఇరు= రెండు; వాఁగును= పక్షములసైన్యములును; వేగంబు= వేగిరపాటు; కుందక= తగ్గిపోకుండగ; వింత= విచిత్రమయిన; చందంబునన్= విధముగా; పేర్చు= విజృంభించు; క్రందు= సందడి; గగన= ఆకాశమునందు; చరులకున్= సంచరించువారికి (యక్షగంధర్వ కిన్నర కింపురుషాదులకు); కన్నుల= నేత్రములకు(చూపులకు); పండువుగాన్= వేడుకకాగా; బృంహిత= ఏనుగులు చేయు ఘీంకారపు; ధ్వనులను= శబ్దములచేతను; ఘంటా= ఘంటలయొక్క; నినదంబులను= ధ్వనులచేతను (ఏనుగుల మెడలకు వ్రేలాడగట్టిన ఘంటల ధ్వనులచేతను); నేమి= రథ చక్రముల కమ్ములయొక్క; నిస్వనంబులను= శబ్దములచేతను; కేతు= జెండాకొయ్యలయొక్క; కింకిణీ= చిరుమువ్వలయొక్క; క్వణనంబులను= ధ్వనులచేతను; రింఖా= గుర్రాల గిట్టలయొక్క; రవంబులను= శబ్దములచేతను; హేషా= గుర్రాల సకిలింతలయొక్క; ఘోషంబులను= ధ్వనులచేతను; భుజా= భుజములయొక్క; స్ఫాలనంబులను= చరుపుల వలన పుట్టిన శబ్దముల చేతను; సింహనాదంబులను= సింహ గర్జనములచేతను (యుద్ధభూమియందు వీరులు చేయు బొబ్బలు); దిక్= దిక్కులయొక్క; తట= ఆకాశపుటంచులను; భేదనంబు= బ్రద్దలగునట్లు (చిల్లులుపడునట్లు); ఒనర్పన్= చేయగా; అద్భుత= ఆశ్చర్యకరమగు; ఉత్సాహంబునన్= ప్రయత్నముతో; ఆహవ= యుద్ధమనెడి; క్రీడన్= ఆటను; సలుపుచుండన్= చేయుచుండగా; పుండరీక+అక్ష= తెల్లతామరలవంటి నేత్రములు కలవాడు అగు శ్రీకృష్ణుడిచేత; రక్షితులు= కాపాడబడుచుండువారు; అగు= అయినట్టి; పాండుపుత్రుల= పాండురాజు కుమారులయొక్క; బల= బలము; శౌర్య= పరాక్రమములయొక్క; సంపదల=

ఐశ్వర్యములయొక్క; సొంపునన్= సమృద్ధివలన; పెంపు= వృద్ధి; ఒదవు= పొందు; ధృష్టద్యుమ్ను= ధృష్టద్యుమ్నుడును; శిఖండి; సాత్యకి; ప్రముఖులు= ముఖ్యులు; ఐన; దండి= ప్రతాపవంతులయిన; మగలు= వీరులు; కూడికొని= కలిసికొని; తఱుమన్= వెంటపడి పరుగెత్తునట్లు చేయగా; దారుణ= భయంకరమయిన; నైపుణంబునన్= కౌశలముతో; బాహా= భుజములయొక్క; ఆటోపంబు= గర్వము; చూపినన్= చూపగా (ప్రదర్శింపగా); కార్చిచ్చు= దవానలము (అడవులను కాల్చు అగ్ని); కవిసినన్= వ్యాపించగా; కలంగు= కలతపడు (వ్యాకులమగు); మృగ= లేళ్ళయొక్క; కులంబు= గుంపు; కైవడిన్= వలె; కౌరవసైన్యంబు= కౌరవులయొక్క సైన్యము; దైన్యంబున్= దీనత్వమును; ఒందినన్= పొందగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా అల్లకల్లోలం అయినప్పటికీ అధిక పరాక్రమంతో రెండు పక్షాల సైన్యాలు వేగిరపాటు తగ్గకుండా మరియొక విధంగా విజృంభించిన ఆ విచిత్ర యుద్ధం ఆకాశసంచారులయిన యక్ష, గంధర్వ, కిన్నర, కింపురుషాదులకు కన్నులపండువు కాగా, ఏనుగుల ఘీంకార ధ్వనులతో, ఏనుగుల కంఠాలకు వ్రేలాడుతున్న ఘంటానాదాలతో, రథచక్రాల కమ్ముల తాకిడివలన పుట్టిన ధ్వనులతో, జెండాకొయ్యలయందు వ్రేలాడే చిరుమువ్వల నాదాలతో, గుర్రాల గిట్టల చప్పుళ్ళతో, గుర్రాల సకిలింతల ధ్వనులతో, భుజాల చరుపులవలన పుట్టిన ధ్వనులతో వీరులు చేసే సింహగర్జనలతో దిక్కుల అంచులు చిల్లులు పడగా ఆశ్చర్యకరమయిన ప్రయత్నంతో యుద్ధక్రీడ చేస్తూ ఉండగా శ్రీకృష్ణుడిచేత పరిరక్షించబడుతున్న పాండవుల బలపరాక్రమాల సమృద్ధివలన వర్ధిల్లే ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకి మున్నగు ప్రతాపవంతులగు వీరులు ఒక్కటిగా కలిసికొని తరుమగా భయంకరమైన కౌశలంతో భుజగర్వం చూపగా కార్చిచ్చు వ్యాపించినప్పుడు వ్యాకులమయిన లేళ్ళ గుంపువలె కౌరవసైన్యం దీనత్వం పొందగా.

విశేషం: ఈ వచనంలో చిన్న ఉపమ కలదు. 'కార్చిచ్చు వ్యాపించగా వ్యాకులమయిన లేళ్ళ గుంపు వలె కౌరవసైన్యం దీనత్వం పొందింది.' తిక్కన ఈ వచనంలో ఆహవక్రీడలో నాదవిన్యాసం చేశాడు. ఘీంకారనాదము, ఘంటానాదము, నేమినాదము, కింకిణీ నాదము, రింఖానాదము, హేషానాదము, స్ఫాలననాదము, సింహనాదము, హాసవిన్యాస, నాద విన్యాసములు తిక్కయజ్వ కవనక్రీడలు.

క. పెనురొంపి లోపలను బ్రుం । గిన ధేనువు నెత్తుపోలికిని శల్యుం డ
మ్మొనఁ దనభుజబలమునఁ గలఁ । గని యట్టుగ నిలిపె శౌర్యగర్వము మెఱయన్. 153

ప్రతిపదార్థం: పెను= పెద్ద; రొంపి= బురద; లోపలను; బ్రుంగిన= మునిగిపోయిన; ధేనువును= గోవును; ఎత్తు= పైకి తీయు; పోలికిని; శల్యుండు; ఆ+మొనన్= ఆ కురుసైన్యమును; తన= తనయొక్క; భుజబలమునన్= భుజబలముతో; శౌర్య= పరాక్రమము; గర్వము; మెఱయన్= ప్రకాశింపగా; కలఁగని= కలతచెందని; అట్టుగ; నిలిపెను.

తాత్పర్యం: పెద్ద బురదలో మునిగిపోయిన గోవును పైకి తీసే విధంగా శల్యుడు ఆ కురుసైన్యాన్ని తన భుజబలంతో పరాక్రమం, గర్వం ప్రకాశించగా కలతచెందనట్లుగా నిలిపాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. నిలిపి పేర్చిన సమయంబున మన దిక్కున నుల్కాపాత ప్రముఖంబులగు దుర్నిమిత్తంబులు వొడమిన నీ కొడుకులు గూడుకొని చేయం గలసైనికులం గూర్చికొని తిరంబయి పెనంగి రట్లు పెనంగునెడఁ గడంగి తలకడచి మిగిలి మద్రపతి మార్గణాసారంబు వరఁగించుచుఁబాండవాగ్రజు నగ్రభాగంబున నున్న భీమసేన

సాత్యకి ధృష్టద్యుమ్న శిఖండి ద్రౌపదేయమాద్రేయులఁ దాఁకి పదిపదిప్రదరంబుల నొప్పించి కదిసి యన్నరపతికిని బదితూపుల వేఁడిమి సూపి మలసినఁ బాంచాలప్రభద్రకబలంబు లా జెట్టిబిరుదు చుట్టుముట్టిన. 154

ప్రతిపదార్థం: నిలిపి(సేనలను నిలిపి); పేర్చిన= విజృంభించిన; సమయంబునన్; మనదిక్కునన్= మనవైపున(కౌరవుల పక్షమున); ఉల్కాపాత= ఆకాశమునుండి వెలుగుచుపడునట్టి చుక్కలవంటి పదార్థములు పడిపోవుట; ప్రముఖములు= మున్నగు; దుర్నిమిత్తంబులు= దుష్టశకునములు; పొడమినన్= పుట్టిన(పొడచూపగా); నీ కొడుకులు= నీయొక్క (ధృతరాష్ట్రుడియొక్క) కుమారులు; కూడుకొని= కలిసికొని; చేయంగల= చేయగల (బాగుగా యుద్ధం చేయగల); సైనికులన్= సేనలను; కూర్చికొని= సమీకరించుకొని (పోగుచేసికొని); తిరంబు= స్థిరము; అయి; పెనంగిరి= పోరాడిరి; అట్లు; పెనంగు= యుద్ధముచేయు; ఎడన్= సమయమున; కడంగి= ప్రయత్నించి; తల కడచి= సేనాగ్రమునుండి (వ్యూహమునుండి) అతిక్రమించి; మిగిలి= ఉద్రేకించి; మద్రపతి= శల్యుడు; మార్గణ= బాణములయొక్క; ఆసారంబు= వర్షము; పరఁగించుచున్= ప్రయోగించుచు (బాణవర్షము కురిపించుచు); పాండవ= పాండవులలో; అగ్రజున్= పెద్దవాడయిన ధర్మరాజునకు; అగ్రభాగంబునన్= ముందుభాగమున; ఉన్న; భీమసేన= భీమసేనుడిని; సాత్యకి= సాత్యకిని; ధృష్టద్యుమ్న= ధృష్టద్యుమ్నుడిని; శిఖండి= శిఖండిని; ద్రౌపదేయ= ద్రౌపది పుత్రులను; మాద్రేయులన్= మాద్రిపుత్రులను (నకుల సహదేవులను); తాఁకి= ఎదుర్కొని; పదిపది= పది పది చొప్పున; ప్రదరంబులన్= బాణములతో; వేఁడిమి= ప్రతాపము; చూపి= చూపించి; మలసినన్= విజృంభించుచుండగా; పాంచాల= పాంచాల దేశముయొక్క; ప్రభద్రక= ప్రభద్రకులను క్షత్రియులయొక్క; బలంబులు= సైనికదళములు; ఆ జెట్టి= శూరశ్రేష్ఠుడయిన ఆ శల్యుని; బిరుదు= శౌర్యచిహ్నమును (మహారథుడను శౌర్య చిహ్నముగల రథమును); చుట్టుముట్టినన్= చుట్టుముట్టగా.

తాత్పర్యం: శల్యుడు చెదరిపోతున్న సేనలను నిలిపి, విజృంభించే సమయంలో మనవైపున ఉల్కాపాతాలు మొదలయిన దుష్టశకునాలు పొడచూపగా నీకుమారులు కలిసికొని యుద్ధం చేయటానికి సమర్థులయిన సేనలను సమకూర్చుకొని స్థిరంగా పోరాడారు. ఆ ప్రకారంగా యుద్ధం చేసే సమయంలో ఆ వ్యూహాన్ని అతిక్రమించి, ఉద్రేకించి మద్రపతి శల్యుడు బాణవర్షం కురిపిస్తూ ధర్మరాజునకు ముందు నిలిచిన భీమసేన సాత్యకి ధృష్టద్యుమ్న శిఖండి ద్రౌపదేయ మాద్రేయులను ఎదుర్కొని, పది పది చొప్పున బాణాలతో బాధించి, ధర్మరాజు దగ్గరకు చేరి పదిబాణాలతో ప్రతాపం చూపించి విజృంభిస్తుండగా పాంచాల దేశపు క్షత్రియులయిన ప్రభద్రక దళములు ఆ శల్యుడిని చుట్టుముట్టగా.

విశేషం: వ్యాసభగవానులు మూలమున మహారథ శబ్దం ప్రయోగించిన చోట తిక్కన బిరుదు శబ్దం ప్రయోగించిన కారణంగా బిరుదు శబ్దానికి మహారథుడనే అర్థం చెప్పటం జరుగుతున్నది. సామాన్యంగా అతిరథ - మహారథ - రథ - అర్ధరథులందరికి బిరుదు శబ్ద ప్రయోగం తిక్కన తెనుగు శబ్ద ప్రయోగంపై గల మక్కువను సూచిస్తున్నది.

ఉ. వాలి యతండు బాహువిభవం బలరించినఁ బేర్చి రౌద్రతం
గూలుగజంబులుం గెడయు గుఱ్ఱపుతండముఁ ద్రెళ్ళు తేరులుం
గీలెడలించినట్ల పడుకేతువితానము నుగ్గునూచమై
రాలు పదాతి వర్గములు రక్తపుటేఱులుఁ బ్రేవుప్రోవులున్. 155

ప్రతిపదార్థం: అతండు (ఆశల్యుడు); వాలి= విజృంభించి; బాహు= భుజములయొక్క; విభవంబు= సంపద; అలరించినన్= ప్రకాశింపజేయగా; రౌద్రతన్= క్రోధముతో; పేర్చి= విజృంభించి; కూలు= కూలిపోయిన(చనిపోయిన); గజంబులున్= ఏనుగులును; కెడయు= చనిపోయిన; గుఱ్ఱపు= గుర్రములయొక్క; తండమున్= గుంపులను; త్రెళ్ళు= విరిగిపడిపోయిన; తేరులున్= రథములును; కీలు= ఇరుసు; ఎడలించినట్లు+అ= తొలగించినట్లుగా; పడు= పడిపోవుచున్న; కేతు= జెండాకొయ్యలయొక్క; వితానమున్= సమూహమును; నుగ్గునూచమై= ఖండఖండములై (పిండిపిండియై); రాలు= క్రిందపడిపోయిన; పదాతివర్గములున్= కాల్బలములును; రక్తపుటేఱులున్= నెత్తుటి నదులను; ప్రేవు= పేగులయొక్క; ప్రోవులున్= పోగులును.

తాత్పర్యం: ప్రభద్రక దళాలు చుట్టుముట్టగా శల్యుడు విజృంభించి భుజసంపద ప్రకాశింపజేయగా క్రోధంతో అతిశయించి కూలిపోయిన ఏనుగులు, చనిపోయిన గుర్రాల గుంపులు, విరిగిపడిపోయిన రథములు, ఇరుసులు తొలగిపడిపోయిన జెండా కొయ్యల సమూహం, ఖండఖండాలై పిండిపిండిగా రాలిపోయిన కాల్బలం, నెత్తురు ప్రవాహాలు, పేగుల పోగులు. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'నుగ్గునూచమై' ఇది తెలుగుజాతీయం. సందర్భాన్ని అనుసరించి 'ఖండఖండములై' అనే అర్థం వ్రాయబడింది. తిక్కయజ్వ యుద్ధ పర్వాలలో తరచుగా ఈ జాతీయాన్ని ప్రయోగించాడు. బహుజనపల్లి సీతారామాచార్యులవారు శబ్దరత్నాకరంలో ఇట్లా వ్రాశారు. "నుగ్గునూచ" అని ఒకానొక నిఘంటువునందు ఏకపరముగా వ్రాయబడి యున్నది. అట్లు చెప్పినచో 'నూచ' శబ్దము ప్రత్యేకముగాను ప్రయోగించబడుచున్నది. కనుక 'నుగ్గునూచ' శబ్దములు రెండు చేరినప్పుడు 'మిక్కిలిపొడి' యని అర్థము చెప్పవచ్చును." దీనికి పై ఉదాహరణమునందు 'దుమ్ము ధూళిగా" అని చెప్పి ఉండటమే ప్రమాణంగా గ్రహించవలెను. పై ఉదాహరణలు 'కొన్నిటి హస్తముల్ చదియఁ గొన్నిటిఁ గొమ్ములు దుమ్ము ధూళిగాఁ గొన్నిటి గుంభముల్ వగులఁ గొన్నిటిగాళులు 'నుగ్గునూచగా' - (భీష్మ -2 ఆశ్వా) రూ ॥ నూచము.' అరదంబులు పొడిపొడియై హరులగములు 'నుగ్గునూచమై' (భీష్మ -2 ఆశ్వా) - ఇది శబ్దరత్నాకరవ్యవహారం.

ఇంతకు ఇది 'నూచ' శబ్దమా 'ఊచ' శబ్దమా? లోకవ్యవహారంలో 'ఊచకోత' ఖండ ఖండములుగా ముక్క ముక్కలుగా నరకుట అనే అర్థం ప్రచురంగా ఉన్నది. అట్లే 'నుగ్గునూచమై' అను తెలుగుజాతీయ ప్రయోగానికి, ఖండ ఖండాలుగా, ముక్కలు ముక్కలుగా, పొడి పొడిగా, పిండి పిండిగా' అని సందర్భాన్ని అనుసరించి అర్థం చెప్పటం యుక్తం.

వ. మఱియును. 156

ప్రతిపదార్థం: మఱియును= ఇంకను.

క. ఏ రూపులయిన రూపఱ । ఘోరాశనులట్ల శల్యు క్రూరాస్త్రంబుల్
కౌరవులు పొంగఁ బాండుకు । మారులసేనపయిఁ దొరిఁగె మనుజాధీశా! 157

ప్రతిపదార్థం: మనుజ= మానవులకు; అధీశా!= ప్రభువు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; ఏ రూపులు= ఏ ఆకారములు; అయినన్= అయినప్పటికిని; రూపు+అఱన్= అంగ విహీనులగునట్లు; శల్యు= శల్యునియొక్క; క్రూర= భయంకరములయిన; అస్త్రంబుల్= బాణములు; ఘోర+అశనులు+అట్లన్= భయంకరమైన పిడుగులవలె; పాండుకుమారుల= పాండురాజు పుత్రులయొక్క; సేనపయిన్= సైన్యముమీద; కౌరవులు; పొంగన్= సంతోషించునట్లు; తొరిఁగెన్= పడెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఏ ఆకారాలు కలిగిఉన్నప్పటికీ అంగవిహీనములయ్యేటట్లు శల్యుడి భయంకరములైన బాణాలు భయంకరములైన పిడుగులు పడుతున్నట్లు పాండవుల సేనపై కౌరవులైన దుర్యోధనాదులు సంతోషించేటట్లుగా పడ్డాయి.

వ. అట్లు దొరుఁగు దారుణమార్గణాసారంబున వెగడుపడి యాబలంబు పాండవాగ్రజు వెనుక కొదిఁగిన నమ్మహీపతి పురికొలిపికొని శల్యు మార్కొని నిశితవిశిఖవర్షంబునం బొదివిన నమ్మద్రవిభుండు గ్రూరనారాచం బతనిమేనుచ్చివో నేయ నా ధర్మనందనునకుఁ దలకడచి యేడమ్ముల నవ్వడముడియు సహదేవుం డయిదు తూపులను నకులుండు నవశరంబులను బ్రతివింధ్యాదిద్రౌపదేయులు బహుబాణపరంపరలను నవ్వీరు నేయ నప్పుడు కృపాచార్యుండును గృతవర్మయు శకునియుఁ దత్సుతుం డులూకుండును నీ కొడుకులుం గవిసిరి. గురుపుత్రుండు మందహాసంబుతో నమందగతి వచ్చి వారిఁ గూడికొనియె. నక్కడి సైనికులును రభసంబున నా రథికవరులఁ దాఁకి రట్టియెడ. 158

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారముగా; తొరుఁగు= పడుచున్న; దారుణ= భయంకరమయిన; మార్గణ= బాణములయొక్క; ఆసారంబునన్= వర్షమువలన; వెగడుపడి= భయపడి; ఆ బలంబు= ఆ సైన్యము (పాండవుల సేనలు); పాండవ= పాండవులలో; అగ్రజు= పెద్దవాడు అయిన ధర్మరాజుయొక్క; వెనుకకున్= వెనుకభాగమునకు; ఒదిఁగినన్= తొలగగా; మహీ= భూమికి; పతి= ప్రభువు అయిన ధర్మరాజు; పురికొలిపికొని (అనగా మరల సేనలలో ఉత్సాహము కలుగునట్లు హెచ్చరించుకొని); శల్యు= శల్యుని; మార్కొని= ఎదుర్కొని; నిశిత= వాడిఅయిన; విశిఖ= బాణములయొక్క; వర్షంబునన్= వానవలన; పొదివినన్= క్రమ్ముకొనగా; ఆ+మద్రవిభుండు= శల్యుడు; క్రూర= భయంకరమయిన (తీక్ష్ణమయిన); నారాచంబు= ఇనుపబాణము; అతని మేను= అతనియొక్క దేహము; ఉచ్చివోన్= చీల్చుకొని పోవునట్లు; ఏయన్= ప్రయోగించగా; ఆ ధర్మనందనునకున్= ఆ ధర్మరాజునకు; తల= ముందు భాగమును; కడచి= దాటివచ్చి (సేనావ్యూహమునుండి ధర్మరాజుముందునకు వచ్చి); ఏడు+అమ్ములన్= ఏడు బాణములతో; ఆ+వడముడియున్= భీముడును; సహదేవుండు; అయిదుతూపులను= అయిదు బాణములతో; నకులుండు; నవశరంబులను= తొమ్మిది బాణములతో; ప్రతివింధ్యాది= ప్రతివింధ్యుడు మొదలగు; ద్రౌపదేయులు= ద్రౌపది పుత్రులు; బహు= అనేకాలయిన; బాణ= బాణాలయొక్క; పరంపరలనున్= వరుసలతోడను; ఆ+వీరున్= వీరుడయిన ఆ శల్యుడిని; ఏయన్= కొట్టగా; అప్పుడు= ఆ సమయమున; కృపాచార్యుండును; కృతవర్మయున్; శకునియున్; తద్= ఆ శకునియొక్క; సుతుండు= కుమారుడు; ఉలూకుండును; నీ కొడుకులున్= నీ పుత్రులయిన దుర్యోధనాదులును; కవిసిరి= కలియబడిరి; గురు= ద్రోణుడియొక్క; పుత్రుండు= కుమారుడు(అశ్వత్థామ); మందహాసంబుతోన్= చిరునవ్వుతో; అమందగతిన్= శీఘ్రగమనముతో; వచ్చి; వారిన్ (దుర్యోధనాదులను); కూడికొనియెన్= కలిసికొనియెను; అక్కడి; సైనికులును= సేనలును; రభసంబునన్= ఉత్సాహముతో; ఆరథికవరులన్= ఆ రథిక శ్రేష్ఠులను; తాఁకిరి= ఎదుర్కొనిరి; అట్టియెడన్= ఆ సమయమున.

తాత్పర్యం: ఆ ప్రకారంగా పడుతున్న భయంకరమైన బాణవర్షానికి తడబాటు పడిపోయి ఆ పాండవసేనలు ధర్మరాజు వెనుకకు తొలగగా ఆ ధర్మరాజు సేనలను పురికొలిపికొని శల్యుడిని ఎదుర్కొని, వాడి అయిన బాణవర్షంతో క్రమ్ముకోగా ఆ శల్యుడు భయంకరమైన ఇనుపబాణం ఆ ధర్మరాజు దేహం చీల్చుకొనిపోయేటట్లుగా ప్రయోగించగా, సేనావ్యూహంనుండి తప్పుకొని ఆ ధర్మరాజు ముందునకు వచ్చి ఏడు బాణాలతో భీముడు, సహదేవుడు అయిదు బాణాలతో, నకులుడు తొమ్మిది బాణాలతో, ప్రతివింధ్యాది ద్రౌపది పుత్రులు అనేక బాణాల వరుసలతో, ఆ వీరు డయిన శల్యుడిని కొట్టగా ఆ సమయంలో కృపాచార్యుడు, కృతవర్మ, శకుని అతడి పుత్రుడు ఉలూకుడు, దుర్యోధనాదులు పాండవులతో కలియబడ్డారు. గురుపుత్రుడు అశ్వత్థామ చిరునవ్వుతో శీఘ్రగమనంతో వచ్చి దుర్యోధనాదులను కలిసికొన్నాడు. అచ్చట ఉన్న సైన్యాలు ఉత్సాహంతో ఆ రథిక శ్రేష్ఠులను ఎదుర్కొన్నాయి. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. కృపుఁడును ధృష్టద్యుమ్నుఁడు । నుపమాతీతాతిఘోరయుద్ధంబున బా
హుపటుత్వమ్ములు సూపి ర । ధిప! యొండొరులకు సమత్వదీప్తాకృతులై. 159

ప్రతిపదార్థం: అధిప!= ప్రభువు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; కృపుఁడును= కృపాచార్యుడును; ధృష్టద్యుమ్నుఁడును; ఉపమా= పోలికకు; అతీత= అతిక్రమించిన; అతి= మిక్కిలి; ఘోర= భయంకరమయిన; యుద్ధమునన్= సంగ్రామమునందు; సమత్వ= సమానభావంచేత; దీప్త= ప్రకాశవంతమయిన; ఆకృతులై= ఆకారములు కలవారై (రూపములు కలవారై); ఒండొరులకున్= ఒకరికొకరు; బాహు= భుజములయొక్క; పటుత్వమ్ములు= సామర్థ్యములు; చూపిరి= ప్రదర్శించిరి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ సమయంలో కృపాచార్యుడు, ధృష్టద్యుమ్నుడు పోలిక చెప్పటానికి వీలుకాని మిక్కిలి భయంకరమైన యుద్ధంలో సమానమైన ప్రకాశవంతమైన రూపాలు కలవారై పరస్పరం తమ తమ భుజబల సామర్థ్యాలు ప్రదర్శించుకొన్నారు.

క. ఒకని నొకనిఁ బదిపది సా । యకముల నొప్పించె వీరులగు పాండుకుమా
రకు లేవుర నంతట ద్రో । ణ కుమారుఁడు మోము చిఱుతనగవున నొప్పన్. 160

ప్రతిపదార్థం: అంతటన్= అటు తరువాత; ద్రోణకుమారుఁడు= అశ్వత్థామ; మోము= ముఖము; చిఱుతనగవునన్= చిరునవ్వుతో; ఒప్పన్= ప్రకాశింపగా; వీరులు= పరాక్రమవంతులు; అగు= అయినట్టి; పాండుకుమారకులు= పాండు రాజుయొక్క పుత్రులు; ఏవురన్= అయిదుగురను; ఒకనిన్= ఒక్కొక్కరిని; పదిపది= పదేసి; సాయకములన్= బాణములతో; నొప్పించెన్= బాధించెను.

తాత్పర్యం: అటు తరువాత అశ్వత్థామ ముఖం చిరునవ్వుతో ప్రకాశించగా పరాక్రమవంతులైన పాండుపుత్రులు ఐదుగురనూ ఒక్కొక్కడిని పదేసి బాణాలతో బాధించాడు.

ఆ. వాయుతనయు ఋశ్యవర్ణాశ్వముల మద్ర । పతి ధరిత్రిఁ గూల్చె నతఁడు దేరు
డిగ్గి నిజగదాపటిష్ఠతఁ జూపెఁ గౌ । రవ్య సైన్యమునకు రాజముఖ్య! 161

ప్రతిపదార్థం: రాజముఖ్య!= రాజులలో శ్రేష్ఠుడవు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; మద్రపతి= మద్రదేశమునకు ప్రభువు అయిన శల్యుడు; వాయు= వాయుదేవునియొక్క; తనయు= పుత్రుడు అయిన భీమునియొక్క; ఋశ్యవర్ణ= గిట్టలకు పై భాగమున తెలుపురంగు కాళ్ళుకలిగిన; అశ్వములన్= గుర్రములను; ధరిత్రిన్= భూమిపై; కూల్చెన్= పడగొట్టెను; అతఁడు= అతడు (అనగా భీముడు); తేరు= రథము; డిగ్గి= దిగి; కౌరవ్య= కౌరవులకు సంబంధించిన; సైన్యమునకున్= సేనకు; నిజ= తనయొక్క; గదా= గద అనెడి ఆయుధముయొక్క; పటిష్ఠతన్= శక్తిని(గట్టితనమును); చూపెన్= చూపించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! శల్యుడు భీముడి గుర్రాలను నేలపై కూల్చాడు. భీముడు రథం దిగి కౌరవసైన్యానికి తన గదాయుధం యొక్క శక్తిని చూపించాడు.

క. అనిలజుని యశ్వములఁ గూ । ల్చిన యప్పుడు శల్యునిం గలితనము మెఱయం
దన యంపవెల్లిచే ముం । చె నకులుతమ్ముండు నీదుసేన దలంకన్. 162

ప్రతిపదార్థం: అనిలజుని= వాయుపుత్రుడయిన భీమునియొక్క; అశ్వములన్= గుర్రములను; కూల్చిన= పడగొట్టిన (చంపిన); అప్పుడు= ఆ సమయమున; నకులు= నకులునియొక్క; తమ్ముండు= సహదేవుడు; నీదు= నీయొక్క; సేన= సైన్యము (కురుసైన్యము); తలంకన్= చలించునట్లుగా; కలితనము= సామర్థ్యము; మెఱయన్= ప్రకాశింపగా; శల్యునిన్= శల్యుని; తన= తనయొక్క; అంప= బాణములయొక్క; వెల్లిచేన్= ప్రవాహంలో; ముంచెన్= ముంచివేసెను. (కప్పివేసెను).

తాత్పర్యం: భీముడి గుర్రాలను శల్యుడు చంపిన సమయంలో సహదేవుడు కౌరవసైన్యం చలించేటట్లుగా తన సామర్థ్యం ప్రకాశించగా శల్యుడిని తన బాణప్రవాహంలో ముంచెత్తాడు.

తే. అతని హయములు నమ్మద్రపతి శరములఁ। బడిన నప్పాండవునిఁ దలకడచి బలము
పొదివె నయ్యోధముఖ్యుఁ దత్పుత్రుఁ డపుడు। గదిసె నా సహదేవుపైఁ గడిమి మెఱయ. 163

ప్రతిపదార్థం: ఆ+మద్రపతి= ఆ మద్రదేశాధిపతి అయిన శల్యుని యొక్క; శరములన్= బాణములచే; అతని= అతనియొక్క (సహదేవునియొక్క); హయములున్= గుర్రములును; పడినన్= కూలిపోగా(చనిపోగా); ఆ పాండవునిన్= ఆ పాండు కుమారుడైన సహదేవుడిని; తలకడచి= దాటివచ్చి; బలము= పాండవసైన్యం; ఆ+యోధముఖ్యున్= ఆ వీరశ్రేష్ఠుడైన శల్యుడిని; పొదివెన్= క్రమ్ముకొన్నాడు; తద్= ఆ శల్యుడియొక్క; పుత్రుఁడు= కుమారుడు (రుక్మాంగదుడు); అపుడు= ఆ సమయమున; ఆ+యోధముఖ్యున్= ఆ వీరశ్రేష్ఠుడయిన; సహదేవునిపైన్= సహదేవుడి మీద; కడిమి= పరాక్రమము; మెఱయన్= ప్రకాశింపగా; కదిసెన్= కలియబడెను.

తాత్పర్యం: శల్యుడి బాణాలచేత ఆ సహదేవుడి గుర్రాలు మరణించగా సహదేవుడిని దాటివచ్చి ఆ వీరశ్రేష్ఠుడయిన శల్యుడిపై పాండవసైన్యం క్రమ్ముకొన్నది. ఆ సమయంలో శల్యుడి కుమారుడు (రుక్మాంగదుడు) పరాక్రమం ప్రకాశించగా సహదేవుడిపై కలియబడ్డాడు.

చ. కవిసిన దట్టకెంపడరు కన్నులతోడఁ గృపాణపాణియై
యవనికి దాఁటి యాతనిశరావలిఁ ద్రుంచుచుఁ గిట్టి తేరిపై
కి వడిఁ జలంబుమై నరిగి కేళియపోలె శిరంబు ద్రుంచి పో
యె వెసఁ బొగడ్తకెక్క ధరణీశ్వర! యొండురథంబు మీఁదికిన్. 164

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= భూమికి ప్రభువు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; కవిసినన్= కలియబడగా; దట్టకెంపు= దట్టమయిన ఎరుపు; అడరు= అతిశయించు; కన్నులతోడన్= నేత్రములతో; కృపాణ= కత్తి; పాణి= హస్తమునందు కలవాడు; ఐ= అయి(సహదేవుడు); అవనికిన్= భూమిమీదికి; దాఁటి= దూకి(రథముపై నుండి భూమిమీదకు దూకి); ఆతని= ఆతనియొక్క (ఆ శల్యుడి కుమారుడియొక్క); శర= బాణములయొక్క; ఆవలిన్= సమూహమును (లేక) వరుసను; త్రుంచుచున్= ఖండించుచు; కిట్టి= సమీపించి; తేరిపైకిన్= రథముమీదకు (శల్యపుత్రుడి రథము మీదకు); వడిన్= వేగముగా; చలంబుమైన్= మాత్సర్యముతో; అరిగి= వెడలి; కేళియపోలెన్= క్రీడవలె; శిరంబు= తల; త్రుంచి= ఖండించి; పొగడ్తకున్= స్తుతించుటకు; ఎక్కన్= తగినవాడు అగుచు, ప్రశంసనీయంగా; ఒండు= మరియొక; రథంబుమీఁదికిన్= రథముపైకి; వెసన్= వేగముగా; పోయెన్= వెడలిపోయెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! శల్యుడి పుత్రుడు సహదేవుడితో కలియబడగా దట్టంగా ఎర్రబడిన కన్నులతో కత్తిచేతపట్టి రథంనుండి భూమిపైకి దూకి శల్యపుత్రుడియొక్క బాణపరంపరలను ఖండిస్తూ సమీపించి,

శల్యపుత్రుడి రథంమీదకు వేగంగా మాత్సర్యంతో వెడలి క్రీడవలె అతడి తల ఖండించి స్తుతింప తగినవాడవుతూ ఇంకొక రథంపైకి వేగంగా వెడలిపోయాడు.

వ. ఇవ్విధంబున. 165

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా.

క. సుతుఁ డీల్గిన మద్రమహీ । పతి శోకక్రోధవేగభరితాత్మకుఁడై
శితశరపంపరల ను । ద్ధతిఁ బాండవసైనికుల మదం బడఁగించెన్. 166

ప్రతిపదార్థం: సుతుఁడు= కుమారుడు; ఈల్గినన్= మరణించగా; మద్రమహీపతి= మద్రదేశమునకు అధిపతి అయిన శల్యుడు; శోక= దుఃఖముయొక్క; క్రోధ= కోపముయొక్క; వేగ= వేగముచే; భరిత= నిండిన; ఆత్మకుఁడై= మనస్సుకలవాడై; శిత= వాడి అయిన; శర= బాణములయొక్క; పరంపరలన్= వరుసలతో; ఉద్ధతిన్= గర్వముతో; పాండవ= పాండవులయొక్క; సైనికుల= సైనికులయొక్క; మదంబు= గర్వము; అడఁగించెన్= తగ్గించెను.

తాత్పర్యం: తన పుత్రుడు మరణించగా, మద్రపతి శల్యుడు దుఃఖంతోను, కోపంతోను నిండిన మనస్సు కలవాడై, వాడి అయిన బాణపరంపరతో గర్వాన్ని కనపరుస్తూ ఆ పాండవ సైనికుల గర్వాన్ని అణచాడు.

విశేషం: శల్యుడి పుత్రుడిని సహదేవుడు సంహరించాడు. శల్యుడికి ఇద్దరు పుత్రులు ఉన్నారు. ఒకడు రుక్మాంగదుడు. రెండవవాడు రుక్మరథుడు. రుక్మరథుడిని అభిమన్యుడు సంహరించినట్లు ద్రోణపర్వంలో ఉన్నది. అందువలన సహదేవుడు ఇచ్చట రుక్మాంగదుడిని సంహరించినట్లుగా గ్రహించాలి. ఈ సందర్భంలో మూలంలో వ్యాసుడు కాని, అనువాదంలో తిక్కన కాని, శల్యపుత్రుడి పేరు ప్రస్తావించలేదు.

శల్యభీమసేనుల గదాయుద్ధము (సం. 9-10-42)

క. ఉరవడి రథికజనంబులఁ । దెరలిచి యేపారు తనదుతేరు మెఱయ ను
ద్ధురగతిఁ గౌంతేయాగ్రజు । నరదమునకుఁ గవిసె వాలురమ్ములు నిగుడన్. 167

ప్రతిపదార్థం: ఉరవడిన్= విజృంభణంతో; రథిక= రథికులయిన; జనంబులన్= మనుజులను (అనగా సైనికులను); తెరలిచి= తొలగించి; ఏపారు= అతిశయించు; తనదు= తనయొక్క; తేరు= రథము; మెఱయన్= ప్రకాశింపగా; ఉద్ధుర= గర్వముతో కూడిన; గతిన్= గమనముతో; కౌంతేయ= కుంతీపుత్రులతో; అగ్రజు= పెద్దవాడయిన ధర్మరాజుయొక్క; అరదమునకున్= రథమునకు; వాలు+అమ్ములు= క్రూరమయిన బాణములు; నిగుడన్= వ్యాపించగా; కవిసెన్= ఉరికాడు.

తాత్పర్యం: మిక్కిలి వేగంగా రథికులైన సేనలను తొలగించి శల్యుడు తన రథం ప్రకాశించగా స్థిరమైన గమనంతో ధర్మజుడి రథంమీదికి క్రూరమయిన బాణాలు వ్యాపించగా ఉరికాడు.

సీ. కనుఁగొని భీముండు గన్నుల నిప్పులు । రాల శుండాలకీలాలరంజి
తంబును రిపుసైన్యదైన్యప్రదంబును । నాత్మీయవాహినీహర్షకరము

నై శతధారా మహాభుజగ క్షమా । ధరశృంగసమత నుదగ్ర మగుచు
నెనిమిది యంచుల నెసఁగు మెఱుంగుల । దారుణంబగు గదాదండ ముగ్ర

తే. రేఖ సారించి రౌద్ర ముద్రేక మందఁ । గదిసి మద్రాధిపుని తురంగములఁ జదియ
మోఁదె నాతండు దోమరమునఁ దదీయ । విపులవక్షంబు భేదించె నృపవరేణ్య! 168

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= రాజులలో శ్రేష్ఠుడవయిన ధృతరాష్ట్ర మహారాజా!; భీముండు; కనుఁగొని= చూచి; కన్నులన్= కన్నులనుండి; నిప్పులు= అగ్నికణములు; రాలన్= పడుచుండగా; శుండాల= ఏనుగులయొక్క; కీలాల= నెత్తురుతో (తడిసి); రంజితంబును= ఎర్రనైనదియు; రిపు= శత్రువులయొక్క; సైన్య= సేనకు; దైన్య= దీనస్థితిని; ప్రదంబున్= కలుగచేయునదియును; ఆత్మీయ= తమయొక్క; వాహినీ= సైన్యమునకు; హర్షకరమును+అయి= సంతోషమును కలుగచేయునదియును అయి; శతధారా= వజ్రాయుధముయొక్కయు; మహాభుజగ= గొప్పపాముయొక్కయు; క్షమాధర శృంగ= పర్వత శిఖరము యొక్కయు; సమతన్= సమత్వముచేత; ఉదగ్రము= భయంకరమయినది; అగుచున్= అగుచును; ఎనిమిది; అంచులన్= అంచులతో; మెఱుంగులన్= కాంతులతో; ఎసఁగు= అతిశయించు; దారుణంబు= భయంకరము; అగు; గదాదండము= దండము వంటి గదాయుధముయొక్క (దండము అనగా దుడ్డుకర్ర); ఉగ్రరేఖన్= భయంకరమయిన విధంగా; సారించి= దాచి; రౌద్రము= కోపం; ఉద్రేకము= ఆవేశం; అందన్= పొందుచు; కదిసి= దగ్గరకుచేరి; మద్ర= మద్రదేశమునకు; అధిపుని= ప్రభువు అయిన శల్యుడియొక్క; తురంగములన్= గుర్రములను; చదియన్= చితుక; మోఁదెన్= కొట్టెను; ఆతండు= అతడు అనగా శల్యుడు; తోమరమునన్= తోమరమనే ఆయుధంతో; తదీయ= ఆ భీముడియొక్క; విపుల= విశాలమయిన; వక్షంబు= ఉరఃస్థలము; భేదించెన్= బ్రద్దలుకొట్టెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీముడి కన్నులనుండి అగ్ని కణాలు పడుతుండగా చూచి, ఏనుగుల రక్తంతో తడిసి ఎర్రనైనది, శత్రుసేనలకు దైన్యాన్ని కలిగించేది, తమ సేనలకు సంతోషం కలిగించేది, వజ్రాయుధంతోనూ, మహాసర్పంతోనూ, పర్వత శిఖరంతోనూ సమానమైనది, అతి భయంకరమైనది, ఎనిమిది అంచులతో (ధారలతో) వాటి కాంతులతో అతిశయించేదీ, భయంకరమైనది అయిన గదాదండం భయంకరంగా ఎత్తి, కోపం ఆవేశం పొంది దగ్గరకు చేరి శల్యుడి గుర్రాలను చితుకకొట్టాడు. ఆ శల్యుడు తోమరంతో ఆ భీముడి విశాలమైన వక్షఃస్థలాన్ని బ్రద్దలు చేశాడు.

విశేషం: ఈ సీసంలో భీముడి గదాస్వరూపం వర్ణించబడింది. ఆరు విశేషణాలతో గదయొక్క ఉగ్రరూపమును తిక్కన వర్ణించాడు. మూలంలో ఇంతటి వర్ణన లేదు.

క. ఉరమున నాటిన ఘనతో । మరమును డాచేతఁ బెఱికి మారుతి మద్రే
శ్వరుసూతుఁ వైచె దానన । ధరణిని బోరగిలఁబడ నుదగ్ర స్ఫురణన్. 169

ప్రతిపదార్థం: మారుతి= భీముడు; ఉరమునన్= గుండెపై; నాటిన= గ్రుచ్చుకొన్న; ఘన తోమరమున్= గొప్పదైన ఆ తోమరాన్ని; డాచేతన్= ఎడమచేతితో; పెఱికి= పైకి లాగి; దానన్+అ= దానితోనే; ఉదగ్ర స్ఫురణన్= అతిశయించిన స్ఫూర్తితో; మద్ర+ఈశ్వర సూతున్= శల్యుడి సారథిని; ధరణిని= నేలపై; బోరగిలన్+పడన్= బోరగిలేటట్లు (వీపుపైకి ముఖంక్రిందికి అయ్యేటట్లు) పడగా; వైచెన్= వేశాడు.

తాత్పర్యం: భీముడు తన వక్షఃస్థలం మీద నాటిన ఆ పెద్ద తోమరాన్ని ఎడమచేతితో పైకి లాగి బిగువైన పట్టుతో శల్యుని సారథి నేలపై బోరగిల పడేటట్లు దానితోనే త్రిప్పికొట్టాడు.

మ. విరథుండై పాలిపోని దర్పమున నవ్వీరుండు ఘోరంపు ము
ద్గరముం గేల సమర్చి తేరు డిగి దుర్దాంతాకృతిన్ వజ్ర భా
సురశక్రుండును దండచండ యముఁడున్ శూలోగ్ర ఫాలాక్షుఁడున్
సరి సేయందగువారు గాఁగఁ బొలిచెన్ సంస్తుత్యసంరంభతన్. 170

ప్రతిపదార్థం: ఆ+వీరుండు= పరాక్రమవంతుడైన ఆ శల్యుడు; విరథుండు+ఐ= రథములేనివాడై; పాలి+పోని= తరిగిపోని; దర్పమునన్= గర్వంతో; ఘోరంపు= భయంకరమైన; ముద్గరమున్= ముద్గరమును పేరుగల ఆయుధమును; కేలన్= చేతితో; అమర్చి= పట్టుకొని; తేరు= రథము; డిగి= దిగి; దుర్దాంత= నిగ్రహింపశక్యముకాని; ఆకృతిన్= ఆకారముతో; వజ్ర= వజ్రాయుధంతో; భాసుర= ప్రకాశించే; శక్రుండును= ఇంద్రుడును; దండ= దండముతో; చండ= భయంకరుడయిన; యముఁడున్= యముడును; శూల= త్రిశూలంతో; ఉగ్ర= భయంకరుడయిన; ఫాల= నుదుటియందు; అక్షుఁడున్= నేత్రముకలవాడయిన రుద్రుడును; సరి= సమానము; చేయన్= చేయుటకు; తగువారు; కాఁగన్= అగునట్లుగా; సంస్తుత్య= స్తుతింపదగిన; సంరంభతన్= సంభ్రమంతో; పొలిచెన్= ఒప్పెను.

తాత్పర్యం: పరాక్రమవంతుడైన శల్యుడు రథంలేనివాడై, విరిగిపోయిన రథం కలవాడై తరిగిపోని గర్వంతో భయంకరమైన ముద్గరమనే ఆయుధాన్ని చేతబట్టుకొని రథం దిగి నిగ్రహింప శక్యంకాని ఆకారంతో వజ్రాయుధంతో ప్రకాశించే ఇంద్రుడు, దండంతో భయంకరుడయిన యముడు, త్రిశూలంతో భయంకరుడైన రుద్రుడు సమానులయ్యేటట్లు స్తుతింపదగిన గర్వంతో ఒప్పారాడు.

విశేషం: ఇట శల్యుడి వర్ణనం దీపకముతో దీప్తించినది. ప్రకృతాప్రకృతమయిన ధర్మసామ్యం వల ఔపమ్యం స్ఫురించినచో దీపకము. ముద్గరము చేత బట్టిన శల్యుడు - ప్రకృతము. వజ్రము ధరించిన ఇంద్రుడు, దండము ధరించిన యముడు, త్రిశూలము ధరించిన రుద్రుడు అప్రకృతములు. 'సరిసేయందగువారు' అనుటలో ధర్మసామ్యము వలన ఔపమ్యం స్ఫురించింది కావున దీపకము. ముద్గరధారియైన శల్యుడు వజ్రధారియైన ఇంద్రుడితో, దండధారియైన యముడితో, శూలధారియైన రుద్రుడితో పోల్చబడుతున్నాడు కాబట్టి - ఇది ఉపమేయమే అని కొందరి అభిప్రాయం.

వ. ఇ ట్లవష్టంభ విజృంభితుండైన యాసేనాధిపతిం జూచి యేచి భీముఁ డుద్దామరభసంబున నతనికి సమ్ముఖంబుగా నడరినఁ బణవాది వాదిత్ర నిర్ఘరనినదంబులు సెలంగె, నప్పు డయ్యిరువాఁగు నిరువుర నేనికపోరు చూచు విధంబునఁ గనుఁగొనుచు గదారణంబునకు శల్యుండు దక్క మారుతి మార్కొనఁ జాలు మేటిమగలు నివ్వడమురి వెలిగా నిమ్మద్రపతిమీఁదఁ గవియునట్టిజెట్టి బిరుదులుం గలరే? యనుచు నచ్చెరువొందుచుండ. 171

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగా; అవష్టంభ= గర్వముతో; విజృంభితుండు= అతిశయించినవాడ; ఐన= అయినట్టి; ఆ సేనాధిపతిన్= ఆ సైన్యాధ్యక్షుని (అనగా శల్యుడిని); చూచి; ఏచి= విజృంభించి; భీముఁడు; ఉద్దామ= భయంకరమైన; రభసంబునన్= వేగముతో; అతనికి; సమ్ముఖంబుగాన్= ఎదురుగా; అడరినన్= విజృంభించగా; పణవము= తప్పెట; ఆది=

మొదలగు; వాదిత్ర= తతము - ఆనద్ధము - సుషిరము - ఘనము - అను చతుర్విధ వాద్య విశేషముల యొక్క; నిర్భర= గాఢమయిన; నినదంబులు= ధ్వనులు; చెలంగెన్= మ్రోసెను; అప్పుడు; ఆ+ఇరువాఁగును= ఆ రెండు సైన్యములును; ఇరువురను= ఇద్దరిని (శల్యభీమసేనులిద్దరిని); ఏనిక= ఏనుగులయొక్క; పోరు= పోరాటము; చూచు; విధంబునన్= విధముగా; కనుఁగొనుచున్= చూచుచున్నవారగుచు; గదారణంబునకున్= గదాయుద్ధమునకు; శల్యుండు; తక్కన్= తప్ప; మారుతిన్= భీముడిని; మార్కొనన్+చాలు= ఎదుర్కొనటానికి సరిపడే; మేటిమగలున్= గొప్పవారైన వీరులు; ఈ+వడముడి= ఈ భీముడు; వెలిగాన్= కాకుండా; ఈ+మద్రపతిమీఁదన్= మద్రదేశాధీశుడైన ఈ శల్యుడిపై; కవియు+అట్టి= పోరాడేటటువంటి; జెట్టి బిరుదులున్= మల్లురైన మహారథులు; కలరే?= ఉన్నారా?; అనుచున్; అచ్చెరువు+ఒందుచుండన్= ఆశ్చర్య పడుతుండగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా గర్వంతో విజృంభించే కురుసేనాధిపతి అయిన శల్యుడిని చూచి భీముడు అమితమైన కోపంతో అతడికి ఎదురుగా విజృంభించగా, తప్పెటలు మొదలగు వాదిత్రములయొక్క గాఢమయిన ధ్వనులు చెలరేగాయి. ఆ సమయంలో ఆ రెండు సైన్యాలు ఆ ఇద్దరి పోరాటాన్ని రెండు ఏనుగుల పోరాటం చూచేటట్లు చూస్తూ, గదాయుద్ధానికి శల్యుడు తప్ప భీముడిని ఎదుర్కొనటానికి సరిపడే గొప్పవారైన వీరులు కాని, ఈ భీముడు కాకుండా శల్యుడితో పోరాడునట్టి మల్లురయిన మహారథులు కాని లేరు అనుకొంటూ ఆశ్చర్యం పొందుతుండగా.

విశేషం: అలం: ఉపమ.

ఆ. మండలప్రచార మహితాకృతులు గర్జ । నలుగఁ బొలిచి మాఱు మలసి ఱంకె
లెసఁగఁ బోరి కమరి యేపారు వృషభయు । గంబునట్లు వారు గవిసి రధిప! 172

ప్రతిపదార్థం: అధిప!= ప్రభువు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; మండల= వలయాకారంగా; ప్రచార= తిరుగుతున్న; మహిత+ఆకృతులు= గొప్ప ఆకారములు కలవారు (గదాయుద్ధంలో కాని, మల్లయుద్ధంలో కాని గదలు తిప్పుతూ యోధులిద్దరూ వలయాకారముగ తిరగటాన్ని 'మండల ప్రచారం' అంటారు. 'మండలావర్త మార్గేషు గదావిహరణేషు చ' మూలము); మాఱు= ఎదురు; మలసి= తిరిగి; ఱంకెలు= రంకెలు (ఆబోతుల అరుపులు); గర్జనలుగన్= సింహగర్జనలుగా; పొలిచి= విలసిల్లి; ఎసఁగన్= విజృంభించగా; పోరికిన్= పోరాటమునకు; అమరి= సిద్ధమయిన; ఏపారు= విజృంభించు; వృషభయుగంబున్= రెండు ఆబోతులు; అట్లు= విధంగా; వారు= వారు (ఆ భీముడు, శల్యుడు); 'తౌ వృషావివ'; కవిసిరి= కలియబడిరి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! వలయాకారంగా తిరుగుతూ గదలు త్రిప్పుతూ సింహగర్జనలు చేస్తూ ఎదురు తిరిగి రంకెలు పెట్టుతూ పోరాటానికి సిద్ధమైన రెండు ఆబోతుల విధంగా గొప్పవైన ఆకారాలతో ఆ భీముడూ శల్యుడూ కలియబడ్డారు.

విశేషం: అలం: ఉపమ.

చ. మదమున నిమ్మెయిం గదిసి మద్రవిభుండును భీమసేనుఁడున్
గదలమెఱుంగు లాకసము గ్రమ్మఁగ నుద్భటభంగిఁ ద్రిప్పి బె
ట్టిదముగ వ్రేయ నిప్పులు వడిం దొరఁగించె సమగ్రవిస్మయ
ప్రదరవభంగులై యవి పరస్పరఘోరవిఘట్టనంబునన్. 173

ప్రతిపదార్థం: మద్ర= మద్రదేశానికి; విభుండును= ప్రభువు అయిన శల్యుడును; భీమసేనుఁడున్= భీమసేనుడును; ఈ+మెయిన్= ఈ ప్రకారంగా; మదమునన్= గర్వంతో; కదిసి= కలియబడి; గదల= గదలయొక్క; మెఱుంగులు= మెరుపులు; ఆకసమున్= ఆకాశాన్ని; క్రమ్మఁగన్= కప్పికొనేటట్లుగా; ఉద్భట= మిక్కిలి అధికమయిన; భంగిన్= విధంగా; త్రిప్పి= గిరగిర త్రిప్పి; బెట్టిదముగన్= గట్టిగా; వ్రేయన్= విసరగా; అవి; పరస్పర= ఒకదానితో ఒకటి; ఘోర= భయంకరమయిన; విఘట్టనంబునన్= తాకిడివలన; సమగ్ర= సంపూర్ణమయిన; విస్మయప్రద= ఆశ్చర్యమును కలుగచేయు; రవ= నాదాలయొక్క; భంగులై= అంతరాళాలు కలవిఅయి; నిప్పులు= అగ్నికణాలు; వడిన్= వేగంగా; తొరఁగించెను= కురిసెను. ('అంగారవర్షం ముముచే దద్భుతమివాభవత్' - మూలం).

తాత్పర్యం: శల్యుడు భీమసేనుడు ఈ ప్రకారంగా గర్వంతో కలియబడి గదల కాంతులు ఆకాశాన్ని కప్పివేసేటట్లు అధికమైన వేగంగా గిరగిర త్రిప్పిగట్టిగా విసరగా ఆ గదలు రెండూ ఒకదానితో ఒకటి భయంకరంగా కొట్టుకొనగా, సంపూర్ణమైన, ఆశ్చర్యమైన ధ్వనులు గలవయి నిండిపోగా అవి అగ్నికణాలను వేగంగా కురిపించాయి.

వ. ఇట్లు దొడంగి. 174

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా; తొడంగి= ప్రారంభించి.

తాత్పర్యం: భీముడు, శల్యుడు ఈ ప్రకారంగా గదాయుద్ధాన్ని ప్రారంభించి.

క. ధిక్కారంబులు చరణద । భక్కారంబులును మెఱయ బలువు వెరవు పే
రుక్కును నెక్కుడు వేగము । నక్కజములుగా నుదీర్ణులై పోరునెడన్. 175

ప్రతిపదార్థం: ధిక్కారంబులు= తిరస్కారములు (అనగా ఒకరిపై ఒకరు చేయు నిందలు); చరణ= పాదములయొక్క; దభక్కారంబులును= దభక్కు అనే ధ్వనులును; మెఱయన్= ప్రకాశింపగ; బలువు= ఎక్కువ; వెరవు= ఉపాయము; పేరు= ఎక్కువ; ఉక్కునున్= బలమును; ఎక్కుడు= ఎక్కువ; వేగమును; అక్కజములుగాన్= అధికముగా; ఉదీర్ణులై= పెరిగినవారై (పైకి ఎగిరినవారై); పోరు+ఎడన్= పోరాటం చేయుచుండగా.

తాత్పర్యం: ధిక్కారములు, దభక్కారములు (ఒకరి పాదాలను మరొకరు తొక్కడం వలన కలిగిన చప్పుళ్లు) అతిశయించగా ఉపాయం, బలం, వేగం - ఈ మూడును అధికంగా కలవారై గదాయుద్ధం చేస్తుండగా.

విశేషం: ఏకార్థ బోధకములగు' బలువు - పేరు - ఎక్కుడు - అక్కజములు' ప్రయోగించి తిక్కన శబ్ద వైచిత్రిని కనబరచాడు. 'ఉపాయము - బలము - వేగము' ఈ మూడును యుద్ధవీరులకు ఉండవలసిన ముఖ్య లక్షణములు.

దభక్కారము= పాదముల తాకిడిచేత కలిగే ధ్వన్యనుకరణ శబ్దం.

చ. వెరవున నంగముల్ నుసులవ్రేటులు వమ్ముగఁ దాఁకినప్డు ది
క్కరి రదన ప్రహారములఁ గంపము నొందకయుండు మేదినీ
ధరములఁ బోల్పఁ బట్టగు నుదగ్రపుమూర్తుల కిద్దఱందు ని
ష్ఠుర రభసంబు శౌర్యము పటుత్వము ద్రాసునఁ బెట్టిన ట్లగున్. 176

ప్రతిపదార్థం: అంగముల్= అవయవములు; నుసుల= లాఘవపు; వ్రేటులు= దెబ్బలు; వమ్మగన్= వ్యర్థమయ్యేటట్లు; తాఁకినప్డు= ఒకరితో ఒకరు ఢీకొన్నప్పుడు; దిక్కరి= దిగ్గజములయొక్క; రదన= దంతములయొక్క; ప్రహారములన్= దెబ్బలవలన; కంపమున్= చలనమును; ఒందక= పొందక; ఉండు; మేదినీ= భూమిని; ధరములన్= మోయునట్టి-పర్వతములను; ఉదగ్రపు= భయంకరమయిన; మూర్తులకున్= ఆకారములు కలిగినవారికి; పోల్పన్= పోల్చటానికి; పట్టు+అగున్= తగినదై ఉన్నది; ఇద్దఱందున్= ఇద్దరిలోనూ; నిష్ఠుర= పరుషమయిన; రభసంబు= ఆవేశము; శౌర్యము= పరాక్రమము; పటుత్వమున్= చాతుర్యమును; త్రాసునన్= తక్కెడయందు; పెట్టిన+అట్లు+అగున్= ఉంచినట్లు అగును.

తాత్పర్యం: భీముడు, శల్యుడు ఉపాయంతో ఒకరితో ఒకరు ఢీకొన్నారు. దెబ్బలు తప్పించుకొనే విధంగా నేర్పుగా అవయవాలను కదిలించగా ఆ దెబ్బలు వ్యర్థంకాగా, దిగ్గజాల దంతముల దెబ్బలకు చలించకుండా ఉండునట్టి పర్వతాలతో పోల్చటానికి అనువుగా ఆ భయంకరాకారులు భాసించారు. ఆ ఇద్దరిలోనూ గల పరుషమయిన ఆవేశం, శౌర్యం, చాతుర్యం - మూడింటినీ తక్కెడయందు ఉంచినట్లవుతుంది.

వ. ఒక్కొక్కమా ఱుబ్బున. 177

ప్రతిపదార్థం: ఒక్కొక్కమాఱు= ఒక్కొక్కసారి; ఉబ్బునన్= సంతోషంతో.

తాత్పర్యం: ఆ భీముడూ, శల్యుడూ, ఆ గదాయుద్ధంలో ఒక్కొక్కసారి సంతోషంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఎనిమిది యడుగుల కొలఁదిని । వెనువెనుకకుఁ బోయి నిగిడి వేగంబునఁ గి
ట్టిన తగళులకైవడిఁ దాఁ । కు నగంబుల భంగిదోఁచుఁ గురుకులముఖ్యా! 178

ప్రతిపదార్థం: కురుకుల= కురుకులమునకు; ముఖ్యా!= ముఖ్యుడవు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఎనిమిది; అడుగుల; కొలఁదిని= పరిమితివరకును; వెనుకకున్+వెనుకకున్= బాగా వెనుకకు; పోయి; నిగిడి= తిరిగి విజృంభించి; వేగంబునన్= వేగముగా; కిట్టిన= సమీపించిన; తగళుల= గొర్రెపొట్టేళ్ళ; కైవడిన్= వలెను; తాఁకు= ఒకదాని నొక్కటి ఢీకొనే; నగంబుల= పర్వతముల; భంగిన్= విధముగా; తోఁచున్= తోచును.

తాత్పర్యం: కురుకులంలో శ్రేష్ఠుడవైన ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ భీముడు, శల్యుడు ఎనిమిదేసి అడుగులు వెనుకకు పోయి తిరిగి విజృంభించి వేగంగా సమీపించిన గొర్రె పొట్టేళ్ళ వలె ఒకదానితో ఒకటి ఢీకొనే పర్వతాల వలెను తోచారు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇత్తెఱంగునం బెనంగి నెత్తుట జొత్తిల్లినయంగంబులు పుష్పిత కింశుకంబులఁబోలఁబరిశ్రమంబు నొందియుఁ బొలివోవని దర్పంబున. 179

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధముగా; పెనంగి= పెనగులాడి(పోరాడి); నెత్తుటన్= రక్తంతో; జొత్తిల్లిన= ఎఱ్ఱబడిన; అంగంబులు= అవయవములు; పుష్పిత= పుష్పించిన; కింశుకంబులన్= మోదుగుపూలను; పోలన్= పోలగా; పరిశ్రమంబున్= మిక్కిలి అలసటను; ఒందియున్= పొందియు; పొలిపోవని= చెడిపోని(తగ్గని); దర్పంబునన్= గర్వంతో;

తాత్పర్యం: ఈ విధంగా పోరాడి, రక్తంతో తడిసి ఎర్రబడిన అవయవాలు పుష్పించిన మోదుగచెట్లను పోలగా, మిక్కిలి అలసట పొందినా తగ్గని గర్వంతో.

విశేషం: అలం: ఉపమ. 'తౌ గదాభిహతైర్గాత్రైః క్షణేన రుధిరోక్షితౌ । ప్రేక్షణీయతరా వాస్తాం పుష్పితావివ కింశుకౌ॥ (శల్య- 12-15. మూలం.)

గదాయుద్ధమున మూర్ఛితుఁడైన శల్యునిఁ గృపుడు తొలంగం గొనిపోవుట (సం. 9-11-23)

క. ఇరువురును సందు సూడక । వెర వెడలిన యాగ్రహముల వ్రేసిన గద లొం
డొరుల మెడలకెలఁకుల బ । ల్నరములు దాఁకుటయు వా రిలం బడి రధిపా! 180

ప్రతిపదార్థం: అధిపా!= ప్రభువు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఇరువురును= ఇద్దరును (భీముడును-శల్యుడును); సందు= ఎడము; చూడక= చూడకుండా; వెరవు= ఉపాయము; ఎడలిన= పోయిన; ఆగ్రహములన్= పట్టుదలలతో; వ్రేసిన= కొట్టిన; గదలు; ఒండొరుల= ఒకరొకరి; మెడల; మెడలయొక్క; కెలఁకులన్= ప్రక్కలనున్న; బల్= దృఢములయిన; నరములు; తాఁకుటయున్= తగులుటయు; వారు (ఆ భీమశల్యులు); ఇలన్= నేలపై; పడిరి= పడిపోయిరి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ భీముడూ, శల్యుడూ, ఇద్దరూ ఎడం లేకుండా ఉపాయం విచ్ఛిన్నమయిన కోపాలతో కొట్టుకోగా, గదలు ఒండొరుల మెడల ప్రక్కలనున్న గట్టి నరాలకు తగలగా వారు నేలపై పడ్డారు.

వ. ఇవ్విధంబున నమ్మహావీరులు మూర్ఛిల్లుటయు నుభయసైన్యజనంబులును హాహాకారముఖరులై రట్టియెడఁ
గృపాచార్యుండు శల్యుకడకుఁ దన రథంబు రయంబునం బఱపించి. 181

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; ఆ+మహావీరులు= ఆ గొప్ప పరాక్రమవంతులు (భీముడును, శల్యుడును); మూర్ఛిల్లుటయును= మూర్ఛపోవుటయును; ఉభయ= రెండుపక్షములయొక్క; సైన్య= సేనలకు సంబంధించిన; జనంబులును= మనుజులును; హాహాకార= హాహాకారములనెడి; ముఖరులు= ధ్వనులు చేయుచున్నవారలు; ఐరి= అయిరి; అట్టియెడన్= ఆ సమయమున; కృపాచార్యుండు; శల్యు= శల్యుని; కడకున్= దగ్గరకు; తన రథము; రయంబునన్= వేగముగా; పఱపించి= తోలించి.

తాత్పర్యం: ఈ ప్రకారంగా ఆ మహావీరులు మూర్ఛిల్లగా కురుపాండవ సైన్యాలు రెండూ హాహాకారాలు చేశాయి. ఆ సమయంలో కృపాచార్యుడు శల్యుడి దగ్గరకు తన రథాన్ని వేగంగా తోలించి.

క. పడియును గద విడువని య । క్కడిఁదిమగని గ్రుచ్చి యెత్తి గారవమున నం
దిడి తొలఁగం గొనిపోయెను । వడముడి దెప్పఱియె నంత వసుధాధీశా! 182

ప్రతిపదార్థం: వసుధా= భూమికి; అధీశా!= ప్రభువు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; పడియును= పడిపోయినను; గదన్= గదను; విడువని= విడిచిపెట్టని; ఆ+కడిఁది= ఆ అధికశక్తిగల; మగనిన్= వీరుడిని (ఆ శల్యుడిని); క్రుచ్చి; ఎత్తి; గారవమునన్= గౌరవభావముతో; అందు+ఇడి= రథమునందు పెట్టుకొని; తొలఁగన్= తొలగించి; కొనిపోయెను= తీసికొనిపోయెను; అంతన్= అటు తరువాత; వడముడి= భీముడు; తెప్పఱియెన్= తెప్పిరిల్లెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! పడిపోయినా గదను విడిచిపెట్టని ఆ మహావీరుడయిన శల్యుడిని కృపాచార్యుడు గ్రుచ్చి ఎత్తి, గౌరవభావంతో ఆ రథంమీద ఉంచుకొని అక్కడినుండి తొలగించి తీసికొనిపోయాడు. అటు తరువాత భీముడు మూర్ఛనుండి తెప్పిరిల్లాడు.

వ. తెప్పిఱి లేచి చూచి సేద దేఱని యమ్మద్రపతిం బేరుకొని యుద్దండగదాదండమండితంబైన కరంబునం బిలిచె నయ్యుద్ధతి సహింపఁజాలక సింహనాదంబుతోడఁ దూర్యస్వనంబులు సెలంగఁ గురుభూవరు ముందరి సైనికులు రభసంబుగా నతఁడునుఁ గూడికొని తఱుమఁ గవిసినం గౌంతేయాగ్రజునగ్రభాగంబున రథికులు చేకితానపురస్సరులై యార్పులు నింగిముట్ట నయ్యనిలతనయుఁ దలకడచి వారిం దలపడి పెనంగి రప్పుడు. 183

ప్రతిపదార్థం: (భీముడు) తెప్పిఱి= తెప్పిరిల్లి (మూర్ఛనుండి తేరుకొని); లేచి; చూచి; సేద= అలసటనుండి; తేఱని= తేరుకొనని; ఆ; మద్ర= మద్రదేశమునకు; పతిన్= ప్రభువు అయిన శల్యుడిని; పేరుకొని= పేరుపెట్టి; ఉద్దండ= మిక్కిలి పొడవైన; గదా దండ మండితంబు= దండమువంటి గదచే నలంకరింపబడినది; ఐన= అయినట్టి; కరంబునన్= చేతితో; పిలిచెన్= పిలిచెను; ఆ+ఉద్ధతిన్= గర్వమును; సహింపన్= ఓర్పు వహింప; చాలక= లేక; సింహనాదంబుతోడన్= సింహగర్జనముతో కూడ; తూర్య= తూర్యములను వాద్యములయొక్క (తూతూబూరాలయొక్క); స్వనంబులు= ధ్వనులు; చెలంగన్= మ్రోయగా; కురుభూవరు= కురురాజునకు (దుర్యోధనునకు); ముందరి= ముందుగా ఉన్న; సైనికులు= సేనలు; రభసంబుగాన్= ఆవేశంతో; అతఁడునున్= అతడును (దుర్యోధనుడును); కూడికొని= కలిసికొని; తఱుమన్= తరుముటకు; కవిసినన్= ఎదుర్కొనగా (కలియబడగా); కౌంతేయ= కుంతీపుత్రులలో; అగ్రజు= పెద్దవాడైన ధర్మరాజునకు; అగ్ర= ముందు; భాగంబునన్= ప్రదేశమున; రథికులు= రథముపై నుండి యుద్ధము చేయు యోధులు; చేకితాన= చేకితానుడు; పురస్సరులై= ముందుకలిగినవారై; ఆర్పులు= సింహనాదాలు; నింగి= ఆకాశమును; ముట్టన్= ముట్టుకొనగా; ఆ+అనిల= వాయువుయొక్క; తనయున్= కుమారుడైన భీముడిని; తలకడచి= దాటి; వారిన్= వారిని (కురుసైనికులను); తలపడి= కలియబడి; పెనంగిరి= పోరాడిరి; అప్పుడు.

తాత్పర్యం: భీముడు మూర్ఛనుండి తెప్పరిల్లి, లేచి చూచి, అలసట నుండి తేరుకొనని ఆ శల్యుడిని పేరుపెట్టి పొడవైన దండంవంటి గదతో అలంకృతమైన హస్తంతో పిలిచాడు. భీముడి ఆ గర్వాన్ని సహించలేక సింహగర్జనలతో కూడిన తూర్యధ్వనులు వ్యాపించగా దుర్యోధనుడు ఆవేశంతో తన సేనతో ఎదుర్కొనగా ధర్మరాజునకు అగ్రభాగంలో ఉన్న రథికులైన యోధులూ, చేకితానుడు ముందుండగా సింహనాదాలు ఆకాశాన్ని ముట్టగా ఆ భీముడిని దాటి కురుసైనికులతో కలియబడి పోరాడారు. ఆ సమయంలో.

విశేషం: చేకితానుడు - ఇతడు పాండవపక్షంనుండి యుద్ధం చేసిన వృష్ణి వంశజుడయిన యాదవుడు. ఇతడు మహారథుడు. ఇతడికి సాత్వతుడు - వార్ష్ణేయుడు అనే పేర్లు కూడా ఉన్నాయి.

శా. ఆ కౌరవ్యవిభుండు వజ్రకఠినంబై యొప్పుప్రాసంబు దీ
ప్తాకారోజ్జ్వలవృత్తి నెత్తి నిజసైన్యం బుబ్బునం గ్రాలఁ గే
లీకల్పంబుగ మింట జంట మెఱుఁగు ల్నిండం బ్రదీప్తక్రమ
శ్రీకాంతుండగు చేకితానుఁ బడవైచెం జూప అగ్గింపఁగన్. 184

ప్రతిపదార్థం: ఆ; కౌరవ్య= కురువంశమునకు సంబంధించిన; విభుండు= ప్రభువు- దుర్యోధనుడు; వజ్ర= వజ్రమువలె; కఠినంబు= గట్టిది; ఐ= అయి; ఒప్పు= ఒప్పునట్టి; ప్రాసంబున్= ఈటెను; దీప్త= ప్రజ్వలించిన; ఆకార= రూపముతో; ఉజ్జ్వల= ప్రకాశమానమగు; వృత్తిన్= వ్యాపారముతో; ఎత్తి= పైకి ఎత్తి; నిజ= తనయొక్క; సైన్యంబు= సేన; ఉబ్బునన్= సంతోషంతో; క్రాలన్= ఒప్పగా; కేలీ= క్రీడయొక్క; కల్పంబుగన్= విధమున; మింటన్= ఆకాశమునందు; జంటమెఱుఁగుల్= రెండు మెరుపులు (రెండు కాంతులు); నిండన్= నిండునట్లుగ; చూపఱు= చూచువారు; అగ్గింపఁగన్= పొగడునట్లుగా; ప్రదీప్త= మిక్కిలి ప్రకాశించిన; క్రమశ్రీ= గతుల సంపదచే; కాంతుఁడు= మనోహరుడు; అగు= అయినట్టి; చేకితానున్= చేకితానుని; పడవైచెన్= వధించెను.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు వజ్రంవలె కఠినమైన ఈటెను ప్రజ్వలించేటట్లు ప్రకాశించే విధంగా పైకి ఎత్తి, తన సేన సంతోషంతో సంభ్రమం చెందగా క్రీడాగతిని అనుసరించి ఆకాశంలో రెండు మెరుపులు నిండగా మిక్కిలి ప్రకాశంతో ఆక్రమిస్తున్న ప్రతాపవంతుడైన చేకితానుడిని చూచేవారు పొగడేటట్లుగా వధించాడు.

విశేషం: జంటమెఱుఁగుల్ - రెండు మెరుగులు - ఒకకాంతి దుర్యోధనుడి ప్రాసమునకు సంబంధించినది. రెండవది చేకితానుడి క్రమమునకు సంబంధించినది' - అతడు కూడ 'ప్రదీప్తక్రమశ్రీకాంతుఁడు' కదా! తిక్కన ఈ పద్యంలో 'మింటజంట మెఱుగుల్నిండం' అని వర్ణించాడు. సామాన్యంగా దుర్యోధనుడు - చేకితానుడు - మింటకెగసి తాకినపుడు గల స్థితిని - తిక్కనగారు ఇట్లు ఊహించి ఉత్ప్రేక్షించియుండవచ్చును. ఇంకను - ఆయనకు గల అనుభవాన్ని బట్టి కూడా ఇట్లు సూచించి యుండవచ్చును. ఈ వర్ణనం అమూలకం. మూలంలో వ్యాసభగవానుడు ఒక చిన్న అనుష్టుప్పులో - దుర్యోధనుడు చేకితానుని వధించుటను చెప్పాడు. తిక్కయజ్వ పెద్ద శార్దూలంతో దాని అభివర్ణించాడు.

వ. ఇట్లు చేకితానుండు వీతాసుండైనం గని కౌంతేయులు గోపాటోపంబున సైన్యోపేతగతిం గడంగి కౌరవసైన్యంబుపైఁ బటుబాణంబులు గురియుచు నడరిన శల్యుండు ధర్మపుత్రుని దుర్యోధనుండు ధృష్టద్యుమ్ను నమ్మహీపతిపనుప నశ్వత్థామత్రిగర్తులు మూఁడు వేల రథంబులవారు విన్వచ్చుని మహోత్సాహంబున మార్కొనిరి. తక్కటి యోధులు సేనయు నవ్విరోధి వరూథిని గలయం బెరయుటయు నక్కజంబయ్యె నప్పుడు పెంధూళి యెగసి చూడ్కులు నిగుడకున్నను సైనికుల సింహనాదంబులు సెలంగం జేయుటయు బిరుదులు ప్రకటించుటయు బోధకంబుగాఁ బోరిన బోరనఁ దొరఁగుఁ శోణితం బారేణువు నడంచినఁ బ్రియం బంది యిరువాఁగును 'వ్రేయుండు పొడవుం' దను నెలుంగులు నింగి ముట్టఁ బెనంగు నట్టియెడ. 185

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధముగా; చేకితానుండు; వీత= పోయిన; అసుండు= ప్రాణములుకలవాడు; ఐనన్= కాగా; కని= చూచి; కౌంతేయులు= కుంతీకుమారులు(పాండవులు); కోప= క్రోధముయొక్క; ఆటోపంబునన్= విజృంభణంతో; సైన్య= సేనతో; ఉపేత= కూడిన; గతిన్= గమనముతో; కడంగి= పూని (ప్రయత్నించి); కౌరవ= కౌరవులయొక్క; సైన్యంబుపైన్= సేనపై; పటు= వాడిఅయిన; బాణంబులు= అమ్ములు; కురియుచున్= ప్రయోగించుచు; అడరినన్= అతిశయించగా; శల్యుండు; ధర్మపుత్రుని= ధర్మరాజును; దుర్యోధనుండు; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుడిని; ఆ+మహీపతి= దుర్యోధనుడు; పనుపన్= నియోగించగా; అశ్వత్థామ; త్రిగర్తులు= త్రిగర్తదేశాధీశుడైన సుశర్మ మొదలగువారు; మూఁడువేల రథంబులవారు= మూఁడువేలు రథములు కలవారు; విన్వచ్చున్= అర్జునుని; మహా= గొప్ప; ఉత్సాహంబునన్= ప్రయత్నంతో; మార్కొనిరి= ఎదుర్కొనిరి; తక్కటి= మిగిలిన; యోధులు= వీరులు; సేనయున్= సైన్యమును; ఆ+విరోధి= ఆ శత్రువులయొక్క;

వరూథినిన్= సైన్యముతో; కలయన్= కలియబడుటకు; బెరయుటయున్= చేరుటయు; అక్కజంబు= ఆశ్చర్యం; అయ్యెన్; అప్పుడు= ఆ సమయమున; పెంధూళి= పెద్దదుమ్ము; ఎగసి= పైకిలేచి; చూడ్కులు= చూపులు; నిగుడక= వ్యాపించకుండా (కనిపించకుండా); ఉన్నను= ఉండగా; సైనికుల; సింహనాదంబులు= సింహగర్జనలు; చెలంగన్= శబ్దాలేర్పడేటట్లు; చేయుటయున్= చేయుటవలను; బిరుదులు= పౌరుషచిహ్నములయిన అతిరథమహారథ మొదలగు బిరుదులు; ప్రకటించుటయున్= ప్రకటించుటవలనను; బోధకంబుగాన్= తెలియబడునట్లుగా; పోరినన్= పోరాడగా; బోరనన్= వేగముగా; తొరఁగు= ప్రవహించు; శోణితంబు= రక్తము; ఆ రేణువున్= ఆ దుమ్మును; అడంచినన్= అణగద్రొక్కగా; ప్రియంబు సంతోషము; అంది= పొంది; ఇరువాఁగును= రెండు సేనలును; వ్రేయుండు= కొట్టుడు; పొడువుండు= పొడువుడు; అను= అనునట్టి; ఎలుంగులు= అరుపులు(శబ్దములు); నింగిన్= ఆకాశమును; ముట్టన్= అంటుకొనునట్లు; పెనంగు= యుద్ధము చేయుచున్న; అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా చేకితానుడు మరణించగా చూచి పాండవులు మిక్కిలి కోపంతో సేనతో కూడి కౌరవసైన్యంపై వాడి అయిన బాణాలు ప్రయోగిస్తూ విజృంభించగా, శల్యుడు ధర్మరాజును, దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడిని, దుర్యోధనుడి పనుపున అశ్వత్థామ త్రిగర్తులు మూడువేల రథాలతో అర్జునుడిని ఎదుర్కొన్నారు. మిగిలిన యోధులు, సేనలు ఆ శత్రుసేనతో అనగా పాండవసేనతో కలియబడగా యుద్ధం ఆశ్చర్యకరమైనది. ఆ సమయంలో పెద్ద దుమ్ము పైకి లేచి చూపులకు ఏమీ కనిపించకుండా ఉండగా సైనికులు చేసే సింహగర్జనలవలన పుట్టిన శబ్దాలు, అతిరథమహారథాదిబిరుదాలు ప్రకటించటంవలన పుట్టిన శబ్దాలు తెలియబడేటట్లుగా పోరాడుతుండగా బోరున ప్రవహించే రక్తం ఆ దుమ్మును అణచివేసింది. అప్పుడు సంతోషం పొంది రెండు సేనలూ 'కొట్టండి పొడవండి' అని చేసే అరుపులు ఆకాశాన్ని అంటుకొనేటట్లు యుద్ధం చేస్తున్న సమయంలో.

విశేషం: పెంధూళి - పెను+ధూళి - పెన్+ధూళి - పెంధూళి.

చ. బరవస మొప్ప మద్రపతి పాండవముఖ్యునిమీఁదఁ గాండముల్
గురిసిన నాన్నృపాలుఁడు నకుంఠితుఁడై పదునాల్గు తూపుల
న్నరపతి మేనఁ గ్రుచ్చి యెలనవ్వున నొప్పిన నమ్మహీశు పే
రురమున నాటె నారథికుఁ డొక్క సముజ్జ్వలబాణ మేడ్తెఱన్. 186

ప్రతిపదార్థం: మద్ర= మద్రదేశమునకు; పతి= అధిపతి అయిన శల్యుడు; బరవసము= ధీరత్వము; ఒప్పన్= ప్రకాశింపగా; పాండవ= పాండవులలో; ముఖ్యుని= ముఖ్యుడయిన (అనగా ప్రథముడు అయిన) ధర్మజుని; మీఁదన్= పైన; కాండముల్= బాణములు; కురిసినన్= ప్రయోగించగా; ఆ నృపాలుఁడున్= ఆ ధర్మరాజు కూడా; అకుంఠితుఁడై= మొక్కవోనివాడై - కుంటువడనివాడై; పదునాల్గు తూపులు= పదినాలుగు బాణములు; ఆ; నరపతి= నరులకు ప్రభువు అయిన ఆ శల్యుడి; మేనన్= దేహమునందు; క్రుచ్చి; ఎలనవ్వునన్= చిరునవ్వుతో; ఒప్పినన్= ప్రకాశింపగా; ఆ రథికుఁడు= ఆ శల్యుడు; ఒక్క; సముజ్జ్వల= మిక్కిలి ప్రకాశవంతమయిన; బాణమున్= బాణమును; ఏడ్తెఱన్= పరాక్రమముతో; ఆ; మహీ= భూమికి; ఈశు= ప్రభువు అయిన ఆ ధర్మరాజుయొక్క; పేరు= విశాలమయిన; ఉరమునన్= వక్షఃస్థలమునందు; నాటెన్= క్రుచ్చెను.

తాత్పర్యం: మద్రపతి శల్యుడు మిక్కిలి ధైర్యంతో పాండవ ప్రథముడైన ధర్మరాజుమీద బాణాలు వర్షించగా ఆ ధర్మరాజు కూడా మొక్కవోని ధైర్యం కలవాడై పదునాలుగు బాణాలు ఆ శల్యుడి దేహమునందు గ్రుచ్చి ఒక

చిరునవ్వు నవ్వగా, శల్యుడు ఒక మిక్కిలి ప్రకాశవంతమైన బాణాన్ని పరాక్రమం అతిశయించగా ఆ ధర్మరాజు విశాలమయిన వక్షఃస్థలంపై నాటాడు.

వ. నాటినం గనలి యమ్మనుజేంద్రుండు చంద్రసేనుం డను తదీయచక్రరక్షకుం దునిమి నవనారాచంబులు సారథిమేన నిగిడించె. 187

ప్రతిపదార్థం: నాటినన్= గ్రుచ్చగా; ఆ+మనుజేంద్రుండు= ఆ ధర్మరాజు; కనలి= కోపించి; చంద్రసేనుండు; అను; తదీయ= ఆ శల్యుడి రథంయొక్క; చక్ర= చక్రములను; రక్షకున్= రక్షించువానిని; తునిమి= ఖండించి; నవ= తొమ్మిది; నారాచంబులు= తీక్షణములయిన బాణములు; సారథి= రథమునడుపువాని; మేనన్= శరీరమునందు; నిగిడించెన్= వ్యాపింపచేసెను (అనగా గ్రుచ్చుకొనేటట్లు చేసెను.)

తాత్పర్యం: శల్యుడు ధర్మరాజు యొక్క పేరురంపై వాడి అయిన బాణాన్ని గ్రుచ్చగా - ఆ ధర్మరాజు మిక్కిలి కోపించి, చంద్రసేను డనే శల్యుడి రథచక్రరక్షకుడిని ఖండించి, తొమ్మిది బాణాలు శల్యుడి రథసారథి శరీరంలో గ్రుచ్చాడు.

విశేషం: మహాభారతంలో ఇద్దరు చంద్రసేనులు ఉన్నారు. ఒక చంద్రసేనుడు సముద్రసేనుడి కొడుకు. ఇతడు పాండవపక్షాన యుద్ధం చేసిన మహారథి. ఇతడిని అశ్వత్థామ సంహరించాడు. ఇక రెండవ చంద్రసేనుడు కౌరవపక్షంలోని యోధుడు. ఇతడు శల్యుడి రథచక్ర రక్షకుడు. ఇతడినే ధర్మరాజు ఖండించాడు. ఈ సందర్భంలో ధర్మరాజు ద్రుమసేనుడనే శల్యుడి మరియొక చక్రరక్షకుడిని కూడా సంహరించినట్లు మూలంలో ఉన్నది. 'ద్రుమసేనం చతుఃషష్ట్యా నిజఘాన మహారథః చక్రరక్షే హతే శల్యః పాండవేన మహాత్మనా' ॥ ఈ ద్రుమసేనుడు గవిష్ఠుడనే దైత్యుడి అంశవలన జన్మించిన క్షత్రియుడు. ఈ వచనంలో తిక్కనార్యుడు సారథిని తొమ్మిది బాణాలతో కొట్టినట్లు వ్రాశాడు. ఆ విషయం మూలంలో కనపడదు.

ఆ. అపుడు శినివరుండు ననిలపుత్త్రుఁడుఁ జేది । బలము శల్యుఁ దీవ్రభంగిఁ బొదువ
నాతఁ డా ధనంజయాగ్రణిఁ బటుతర । పంచమార్గణముల నొంచె నధిప! 188

ప్రతిపదార్థం: అధిప!= ప్రభువు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అపుడు; శినివరుండును= సాత్యకియును; అనిల= వాయువుయొక్క; పుత్త్రుఁడును= కుమారుడయిన భీముడును; చేది= చేది దేశముయొక్క; బలమున్= సైన్యమును; శల్యున్= శల్యుడిని; తీవ్ర= అధికమయిన; భంగిన్= విధముగా; పొదువన్= ఎదుర్కొనగా; ఆతఁడు= ఆశల్యుడు; ఆ; ధనంజయ= అర్జునుని కంటె; అగ్రణినిన్= పెద్దవానిని అనగా భీముని; పటుతర= మిక్కిలి కఠినమైన; పంచ= అయిదు; మార్గణములన్= బాణములతో; నొంచెన్= నొప్పించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ సమయంలో అనగా ధర్మరాజు శల్యుడి చక్రరక్షకులను, సారథిని ఖండించిన తరువాత - సాత్యకి, భీముడు, చేది సేన ఆ శల్యుడిని తీవ్రంగా ఎదుర్కొనగా ఆ శల్యుడు భీముడిని మిక్కిలి కఠినమయిన అయిదు బాణాలతో నొప్పించాడు.

విశేషం: పద్యంలో 'చేదిబలము' అని ప్రయోగింపబడింది. చేదిదేశపురాజు శిశుపాలుడు. అతడి పుత్రుడు ధృష్టకేతుడు. అతడు ఒక అక్షౌహిణి సేనతో పాండవపక్షం వైపు యుద్ధం చేశాడు. ఇక శినివరుడు అనగా సాత్యకి, వృష్ణి వంశమునందలి 'శిని'

యొక్క కుమారుడు సత్యకుడు. సత్యకుడి పుత్రుడు సాత్యకి. ఇతడు సప్తమరుత్తుల అంశతో జన్మించాడు. మహాభారతంలో సాత్యకికి అనేక నామాలు ఉన్నాయి. అందు కొన్ని - ఆనర్త, శైనేయ, శినిపౌత్ర, శినిపుత్ర, శినిప్రవర, శినిప్రవీర, శినిపుంగవ, శినివీర, శినివృషభ, దాశార్హ, మాధవ, మాధవసింహ, యుయుధాన, మొదలైనవి.

క. విను మిరువదియేడమ్ముల । శినిమనుమని యు బ్బడంచెఁ జేదిరథికులం
దునిమెం దీవ్రశరోత్కర । మున నిరువది యేవురన్ సముద్భటభంగిన్. 189

ప్రతిపదార్థం: వినుము; ఇరువదియేడు; అమ్ములన్= బాణములతో; శినిమనుమని= సాత్యకియొక్క; ఉబ్బు= ఆధిక్యమును; అడంచెన్= అణచెను(తగ్గించెను); తీవ్ర= మిక్కిలి వాడి అయిన; శర= బాణములయొక్క; ఉత్కరమునన్= సమూహముతో; సముద్భట= శ్రేష్ఠముయిన; భంగిన్= విధముగా; ఇరువది; ఏవురన్= అయిదుగురు; చేది= చేది దేశముయొక్క; రథికులన్= వీరులను; తునిమెన్= ఖండించెను (సంహరించెను).

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆలకించుము. శల్యుడు ఇరువది ఏడు బాణాలతో సాత్యకియొక్క ఆధిక్యాన్ని తగ్గించాడు. తరువాత మిక్కిలి వాడి అయిన బాణాలతో శ్రేష్ఠమైన విధంగా ఇరువది అయిదుమంది చేది వీరులను సంహరించాడు.

క. కవలు తనమీఁద రయమునఁ । గవిసిన నిశితతరసాయకములను మౌర్వీ
రవము సెలంగఁగ వారల । యవయవముల నినిచె నతఁ డహంకృతి మెఱయన్. 190

ప్రతిపదార్థం: అతఁడు (అనగా శల్యుడు); అహంకృతి= అహంకారము (అనగా గర్వము) మెఱయన్= ప్రకాశింపగా; కవలు= నకులసహదేవులు; తనమీఁదన్; రయమునన్= వేగముగా; కవిసినన్= కలియబడగా; మౌర్వీ= వింటినారియొక్క; రవము= ధ్వని; చెలంగఁగన్= మ్రోయగా; నిశితతర= మిక్కిలి వాడి అయిన; సాయకములను= బాణములను; వారల= వారియొక్క; అవయవములన్= అంగములందు; నినిచెన్= నింపెను.

తాత్పర్యం: నకుల సహదేవులు తనపై వేగంగా కలియబడగా, ఆ శల్యుడు ప్రకాశిస్తున్న గర్వంతో, వింటినారియొక్క ధ్వని మిక్కుటమయ్యే విధంగా వాడి అయిన బాణాలతో ఆ నకుల సహదేవుల అంగాలను నింపివేశాడు.

చ. కనుఁగొని ధర్మసూతి భుజ గర్వమెలర్పఁగ బెట్టు గిట్టి శ
ల్యుని మెయిఁ దీవ్రమార్గణసముత్కరముం బరఁగించి కేతువుం
దునిమిన నాతఁ డా పతికిఁ దూపుల వేఁడిమి సూపి వాయుసూ
నునిఁ గవలన్ శినిప్రవరు నొంచె వడిం బదియేసి యమ్ములన్. 191

ప్రతిపదార్థం: ధర్మసూతి= యమధర్మరాజు పుత్రుడయిన ధర్మరాజు; కనుఁగొని= చూచి; భుజగర్వము= బాహువులయొక్క పొగరు; ఎలర్పఁగన్= అతిశయించగా; బెట్టు= అత్యంతము; కిట్టి= సమీపించి; శల్యుని= శల్యునియొక్క; మెయిన్= దేహమునందు; తీవ్ర= తీక్షణమయిన; మార్గణ= బాణములయొక్క; సముత్కరమున్= సమూహమును; పరఁగించి= ప్రయోగించి; కేతువున్= జెండాకొయ్యను; తునిమినన్= ఖండించగా; ఆతఁడు; ఆ పతికిన్= ఆ ప్రభువు అయిన ధర్మరాజునకు; తూపులవేఁడిమి= బాణములయొక్క తాపము; చూపి; వడిన్= వేగముగా; పదియేసి= పది చొప్పున; అమ్ములన్= బాణములను; వాయు సూనునిన్= భీముడిని; కవలన్= నకులసహదేవులను; శినిప్రవరున్= సాత్యకిని; నొంచెన్= నొప్పించెను.

తాత్పర్యం: ధర్మరాజు శల్యుడిని చూచి బాహుగర్వం అతిశయించగా సమీపించి, శల్యుడి దేహంలో తీక్షణమైన బాణసముదాయాన్ని ప్రయోగించి జెండాకొయ్యను ఖండించాడు. అప్పుడు ఆ శల్యుడు ధర్మరాజునకు వాడి బాణాల తాపాన్ని చూపించి, వేగంగా పదేసి బాణాలతో భీముడిని, నకుల సహదేవులను, సాత్యకిని నొప్పించాడు.

ఉ. నొంచి మదించి ఖేచరమనోహరుఁడై వడి ధర్మపుత్రు స్రు
క్కించి మహోగ్రబాణపరికీలితదేహునిఁ జేసె దానఁ గో
పించి శితాస్త్రముల్ గవలు భీముఁడు సాత్యకియుం గడంక గు
ప్పించిన వానిఁ ద్రుంచి శరపీడితదేహులఁ జేసె వారలన్. 192

ప్రతిపదార్థం: నొంచి= నొప్పించి; మదించి= గర్వించి; ఖే= ఆకాశమునందు; చర= సంచరించు దేవయోనులయొక్క; మనః+హరుఁడు+ఐ= మనస్సులను హరించినవాడై (దేవగంధర్వ యక్ష కిన్నరసిద్ధసాధ్యాదులకు ఆనందమును కలిగించువాడై); వడిన్= వేగముగా; ధర్మపుత్రున్= ధర్మరాజును; స్రుక్కించి= మూర్ఛనొందించి; మహా= గొప్ప; ఉగ్ర= భయంకరమయిన; బాణ= బాణములతో; పరికీలిత= బాగుగా నాటబడిన; దేహునిన్= శరీరముకల వానినిగా; చేసెన్= చేసెను; దానన్= అందువలన; కవలు= నకుల సహదేవులు; భీముఁడు; సాత్యకియున్= సాత్యకియును; కోపించి= కోపమును పొంది; శిత= వాడిఅయిన; అస్త్రముల్= బాణములు; కడంకన్= ప్రయత్నముతో; గుప్పించినన్= కురిపించగా; వానిన్= ఆ బాణములను; త్రుంచి= ఖండించి; వారలన్= వారిని (అనగా నకుల సహదేవులను; భీముని- సాత్యకిని); శరపీడిత= బాణములచే బాధింపబడిన; దేహులన్= శరీరములు కలవారినిగా; చేసెన్= చేసెను.

తాత్పర్యం: శల్యుడు భీముడిని, నకుల సహదేవులను, సాత్యకిని నొప్పించి, గర్వించి, దేవగంధర్వాది ఆకాశ సంచారులకు ఆనందాన్ని కలిగిస్తూ, వేగంగా ధర్మజుడిని మూర్ఛనొందించి భయంకరములయిన బాణాలతో అతడి శరీరంలో గ్రుచ్చాడు. ఇట్లా ధర్మజుడు బంధించబడగా నకుల సహదేవులు, భీముడు, సాత్యకి, మిక్కిలి కోపించి వాడి అయిన బాణాలను శల్యుడిపై కురిపించగా, శల్యుడు వాటిని ఖండించి ఆ నకుల సహదేవులను, భీముడిని, సాత్యకిని, శరపీడిత దేహులుగా చేశాడు.

వ. చేసి యొండొక భాసితధ్వజం బెత్తించి మెఱసిన. 193

ప్రతిపదార్థం: చేసి; ఒండొక= ఇంకొక; భాసిత= ప్రకాశవంతమయిన; ధ్వజంబు= జెండాకొయ్యను; ఎత్తించి= నిలబెట్టి; మెఱసినన్= ప్రకాశింపగా.

తాత్పర్యం: ఆ నకుల సహదేవులను, భీముడిని, సాత్యకిని శరపీడిత దేహులను చేసి, ఇంకొక ప్రకాశవంతమయిన జెండా కొయ్యను నిలబెట్టి, ఆ శల్యుడు ప్రకాశించగా.

సీ. భీముఁ డాతని మెయి బెడిదంపు నారసం । బడరించి వెండియు నట్టి వేడు
వఱపె సాత్యకి శతబాణంబు లతనిపై । బెట్టేసె మాద్రి తొల్పట్టి యైదు
తీవ్రాస్త్రముల సహదేవుండు పదునాలు । గమ్ముల నవ్వీరు నంగకములఁ
బరఁగించి రమ్మద్రపతి భీమసేనాదు । లైన యన్నలువుర నతిరయమున

తే. **వరుస డెబ్బదిమూఁటను నిరువదేను। వాఁడి తూపుల నేనింట మూఁడు మార్గ**
ణములఁ బీడితులుగఁ జేసి నఱికె భల్ల। నిహతి సహదేవుచాపంబు నృపవరేణ్య! **194**

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= రాజులలో శ్రేష్ఠుడవు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; భీముఁడు; ఆతని= ఆ శల్యుని; మెయిన్= శరీరమునందు; బెడిదంపు= భయంకరమగు; నారసంబు= బాణము; అడరించి= ప్రయోగించి; వెండియున్= మరియు; అట్టివి; ఏడు; పఱపెన్= ప్రయోగించెను; సాత్యకి; శత= నూరు; బాణంబులు; అతనిపైన్= ఆ శల్యుడిపై; బెట్టు= గట్టిగా; ఏసెన్= ప్రయోగించెను; మాద్రి= మాద్రియొక్క; తొల్పట్టి= మొదటిబిడ్డ(నకులుడు); ఐదు; తీవ్ర= మిక్కిలి వాడి అయిన; అస్త్రములన్= బాణాలను; సహదేవుండు; పదునాలుగు; అమ్ములన్= బాణాలను; ఆ+వీరున్= పరాక్రమవంతుడయిన శల్యుడి; అంగకములన్= అవయవములందు; పరఁగించిరి= ప్రయోగించిరి; ఆ+మద్రపతి= శల్యుడు; భీమసేన; ఆదులు= మొదలగువారు; ఐన= అయినటువంటి; ఆ+నలువురన్= నలువురను; అతి= మిక్కిలి; రయమునన్= వేగముగా; వరుసన్= క్రమముగా; డెబ్బది; మూఁటను= మూడు బాణములతో; ఇరువది; ఏను= అయిదు; వాఁడి= వాడిఅయిన; తూపులను= బాణములతోను; ఏనింటన్= అయిదింటితో; మూఁడు మార్గణములన్= మూడు బాణములతో (సహదేవుని); పీడితులుగన్= బాధింపబడునట్టి వారుగ; చేసి; భల్ల= బల్లెముయొక్క; నిహతిన్= దెబ్బతో; సహదేవు= సహదేవునియొక్క; చాపంబున్= వింటిని; నఱకెన్= ఖండించెను.

తాత్పర్యం: రాజ శ్రేష్ఠుడవైన ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీముడు శల్యుని దేహంలో భయంకరమైన బాణాన్ని ప్రయోగించి ఇంకా అటువంటి ఏడు బాణాలు మరల శల్యుడిపై ప్రయోగించాడు. సాత్యకి శల్యుడిపై నూరు బాణాలు ప్రయోగించాడు. నకులుడు అయిదు వాడి అయిన బాణాలు, సహదేవుడు పదునాలుగు బాణాలు ఆ శల్యుడి అవయవాలపై ప్రయోగించారు. అంతట ఆ శల్యుడు భీముడు, సాత్యకి, నకులుడు, సహదేవుడు ఆ నలువురను వరుసగా డెబ్బదిమూడు, ఇరువది అయిదు, అయిదు, మూడు బాణాలతో కొట్టి బల్లెంతో సహదేవుడి వింటిని ఖండించాడు.

శా. **ఆ మాద్రీసుతుఁ డన్యచాపధరుఁడై యత్యుగ్రబాణంబులన్**
మామా! యెక్కడఁ బోయె? దంచు వెస నమ్మద్రేశు నేయంగ ను
ద్దామోదగ్రత భీమసాత్యకులు శాతప్రస్ఫురన్మార్గణ
స్తోమంబుల్ గురియంగ ధర్మసుఁతుడుం దూపుల్ మెయిం గ్రువ్వఁగన్. **195**

ప్రతిపదార్థం: ఆ; మాద్రీ= మాద్రియొక్క; సుతుఁడు= కుమారుడు (అనగా సహదేవుడు); అన్య= మరియొక; చాప= వింటిని; ధరుఁడై= ధరించినవాడై; అతి= మిక్కిలి; ఉగ్ర= భయంకరమయిన; బాణంబులన్= బాణములతో; మామా!; ఎక్కడన్= ఎక్కడకు; పోయెదు?= పోయెదవు?; అంచున్= అనుచు; వెసన్= వేగముగా; ఆ; మద్రేశున్= శల్యుడిని; ఏయంగన్= కొట్టగా; భీమసాత్యకులు= భీముడును, సాత్యకియును; ఉద్దామ= అడ్డులేని విధముగా; ఉదగ్రతన్= భయంకరత్వముతో; శాత= వాడి అయిన; ప్రస్ఫురత్= ప్రకాశించుచున్న; మార్గణ= బాణములయొక్క; స్తోమంబుల్= సమూహములు; కురియంగన్= కురిపించగా; ధర్మసుతుఁడున్= ధర్మరాజుకూడా; తూపుల్= బాణములు; మెయిన్= దేహమునందు (శల్యుడి దేహమునందు); క్రువ్వఁగన్= కురిపించగా (నాటగా).

తాత్పర్యం: సహదేవుడు మరియొక వింటిని ధరించి, మిక్కిలి భయంకరమయిన బాణాలతో 'మామా! ఎక్కడకు పోతావు?' అంటూ వేగంగా ఆ శల్యుడిని కొట్టగా భీమసాత్యకులు కూడా అడ్డులేని విధంగా భయంకరంగా వాడి

అయిన, ప్రకాశవంతమయిన బాణసమూహాలను కురిపించగా ధర్మజుడు కూడా ఆ శల్యుడి దేహమునందు బాణాలు నాటగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. కలయఁగ నెత్తురుల్ దొరఁగ గైరిక నిర్ఝరజాలరంజితా
చలమును బోలి పొల్పెసఁగి శల్యుఁడు వారల నస్త్రపంచకం
బుల వెస నొంచి త్రుంచెఁ గురుభూవర! ధర్మజు చాప మమ్ముతో
బలమును శౌర్యమున్ సురలు ప్రస్తుతి సేయ మహోగ్రమూర్తియై. 196

ప్రతిపదార్థం: కురుభూవర!= కురు వంశ మహారాజు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; కలయఁగన్= అంతట; శల్యుఁడు; నెత్తురుల్= రక్తములు; తొరఁగన్= ప్రవించుచుండగ; గైరిక= గైరికాది ధాతువులతోడి; నిర్ఝర= సెలయేరులయొక్క; జాల= సమూహములతో; రంజిత= ఎర్రనైన; అచలమును= పర్వతమును; పోలి; పొల్పు= ఒప్పుగా; ఎసఁగి= విజృంభించి; వారలన్= వారిని; అస్త్ర= మంత్రపూతములయిన బాణములయొక్క; పంచకంబులన్= అయిదింటితో; వెసన్= వేగముగా; నొంచి= నొప్పించి; బలమును; శౌర్యమున్= పరాక్రమమును; సురలు= దేవతలు; ప్రస్తుతి= మెచ్చుకోలు; చేయన్= చేయునట్లుగా; మహా= మిక్కిలి; ఉగ్ర= భయంకరమయిన; మూర్తియై= ఆకారముకలవాడై; ధర్మజు= ధర్మరాజుయొక్క; చాపము= విల్లు; అమ్ముతోన్= బాణంతో; త్రుంచెన్= ఖండించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అప్పుడు శల్యుడు రక్తప్రవాహాలు దేహంనుండి ప్రవిస్తుండగా గైరికాది ధాతువులతో నిండిన సెలయేరుల సమూహాలతో ఎర్రగా ఉన్న పర్వతంవలె ప్రకాశిస్తూ విజృంభించి, ధర్మరాజు, భీముడు, సాత్యకి, నకుల సహదేవులు అయిదుగురిని ఒక్కొక్కరిని అయిదేసి మంత్రపూతాలయిన బాణాలతో నొప్పించి, తన బలాన్ని పరాక్రమాన్ని దేవతలు ప్రస్తుతి చేసేటట్లు భయంకరాకారం కలవాడై, ఒక్క బాణంతో ధర్మరాజు వింటిని అమ్ముతో కూడ ఖండించాడు.

విశేషం: అలం: ఉపమ. శల్యుడు ఉపమేయము. గైరిక నిర్ఝరజాల రంజితాచలము - ఉపమానము; పోలి - ఉపమావాచకం. ఎఱుపు - సమానధర్మం. పూర్ణోపమ. ఈ ఉపమకు మూలం. 'సుస్రావ రుధిరం గాత్రై ర్గైరికం పర్వతో యథా!' (శల్య - 13-24)

ఉ. వేఱొక చాపమెత్తి పృథివీవర! ధర్మతనూజుఁ డింతతోఁ
దీఱఁగఁ జేయుదుం బగ యతిప్రకటంబుగ నంచు సూతుమైఁ
దూఱఁ దురంగమాంగములు దూఁటులు వోవఁగ శల్యునెమ్ములన్
గీఱ సిడంబు గాఁడఁ బరఁగించె సముజ్జ్వలచండకాండముల్. 197

ప్రతిపదార్థం: పృథివీ= భూమికి; వర!= భర్తఅయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ధర్మ= యమధర్మరాజుయొక్క; తనూజుఁడు= కుమారుడు అనగా ధర్మరాజు; వేఱొక= మరియొక; చాపము= విల్లు; ఎత్తి= పట్టుకొని; అతి= మిక్కిలి; ప్రకటంబుగన్= వెల్లడియగునట్లుగా; పగ= విరోధము; ఇంతతోన్= ఇంతటితో; తీఱఁగన్= ముగిసిపోవునట్లుగ; చేయుదున్= చేస్తాను; అంచున్= అనుచు; సూతు= సూతునియొక్క; మైన్= దేహమునందు; తూఱన్= చొచ్చుకొనిపోవునట్లుగ; తురంగ= గుర్రములయొక్క; అంగములు= అవయవములు; తూఁటులు= చిల్లులు; పోవఁగన్= పడునట్లుగా; శల్యు= శల్యునియొక్క; ఎమ్ములన్= ఎముకలను; గీఱన్= భేదించునట్లుగ; సిడంబున్= ధ్వజమును(జెండాకొయ్యను); కాఁడన్= నశించునట్లుగ; సముజ్జ్వల= ప్రకాశవంతమయిన; చండ= క్రూరమయిన; కాండముల్= బాణములు; పరఁగించెన్= ప్రయోగించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధర్మరాజు మరియొక విల్లు పట్టుకొని 'ఇంతటితో విరోధం (యుద్ధం) ముగిసిపోవునట్లుగా చేయగలను' అంటూ సూతుడి దేహం చొచ్చుకొని పోయేటట్లుగా, గుర్రాల అవయవాలు చిల్లులు పడేటట్లుగా, శల్యుడి ఎముకలు భేదించేటట్లుగా, జెండాకొయ్య విరిగేటట్లుగా ప్రకాశవంతమైన, క్రూరమైన బాణాలు ప్రయోగించాడు.

వ. ఇవ్విధంబున విజృంభించిన. 198

ప్రతిపదార్థం: ఇవ్విధంబునన్= ఈ ప్రకారముగ; విజృంభించినన్= అతిశయించగా.

తాత్పర్యం: ధర్మరాజు ఈ ప్రకారంగా అతిశయించి యుద్ధం చేస్తూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ధర్మరాజు శల్యునిబాణంబులచేత మూర్ఛితుం డగుట (సం. 9-11-66)

క. కోపించి యతఁడు దర్పా । టోపం బుగ్రముగ దశపటుప్రదరము లా
భూపాలు మేనఁ జొనిపిన । భూపాలక! యాతఁడొల్లఁ బోవుటయు వెసన్. 199

ప్రతిపదార్థం: భూ= భూమికి; పాలక!= పరిపాలకుడవు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అతఁడు= అనగా ఆ శల్యుడు; కోపించి; దర్ప= గర్వముయొక్క; ఆటోపంబు= ఆడంబరము; ఉగ్రముగన్= భయంకరము అగునట్లుగా; దశ= పది; పటు= కఠినమయిన; ప్రదరములు= బాణములు; ఆ; భూపాలు= రాజైన ధర్మరాజుయొక్క; మేనన్= శరీరమునందు; చొనిపినన్= చొప్పించగా; ఆతఁడు= ఆ ధర్మరాజు; ఒల్లఁబోవుటయున్= మూర్ఛపోవుటయు; వెసన్= వేగముగా.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ శల్యుడు కోపించి గర్వపు ఆడంబరం భయంకర మయ్యేటట్లుగా పది కఠినమయిన బాణాలు ఆ ధర్మరాజు శరీరంలో నాటగా ఆ ధర్మరాజు మూర్ఛపోయాడు. ఆ వెంటనే వేగంగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. శైనేయుఁ డడరి యుజ్జ్వల । నానావిశిఖముల మద్రనరపతిఁ బొదువం
దా నలిగి విల్లు దునియలు । గా నొక భల్లమున నేసె గర్వోద్ధతుఁడై. 200

ప్రతిపదార్థం: శైనేయుఁడు= శినియొక్క మనుమడు అయిన సాత్యకి; అడరి= విజృంభించి; ఉజ్జ్వల= ప్రకాశవంతమయిన; నానా= అనేక విధములయిన; విశిఖములన్= వాడి అయిన మొనలు గల బాణాలతో; మద్ర= మద్రదేశముయొక్క; నరపతిన్= నరులకు భర్త అయిన శల్యుని; పొదువన్= కప్పివేయగా; తాన్= తాను(అనగా శల్యుడు); అలిగి= కోపించి; గర్వ= గర్వముతో; ఉద్ధతుఁడై= గర్వించినవాడై; విల్లు= ధనువు(సాత్యకి విల్లు); తునియలు+కాన్= చిన్న చిన్న ముక్కలగునట్లుగా; ఒక భల్లమునన్= ఒక బల్లెముతో; ఏసెన్= కొట్టెను.

తాత్పర్యం: శల్యుడి బాణాల వలన ధర్మరాజు మూర్ఛిల్లగా, ఆ వెంటనే సాత్యకి విజృంభించి ప్రకాశవంతమైన అనేక విధాలైన బాణాలతో ఆ శల్యుడిని కప్పివేయగా, శల్యుడు కోపించి పొగరుతో గర్వించినవాడై సాత్యకి ధనువును చిన్న చిన్న ముక్కలయ్యేటట్లుగా ఒక బల్లెంతో కొట్టాడు.

క. ఆ రథికవరుని నకులుని । మారుతి సహదేవు మూఁడు మార్గణముల నే
పారఁగ బలుపారఁగ రయ । మారఁగ నొప్పించె నమ్మహాభుజుఁడధిపా! 201

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఆ; మహా= గొప్ప; భుజుఁడు= బాహువులు కలవాడు అయిన శల్యుడు; ఆ; రథిక= యోధులలో; వరునిన్= శ్రేష్ఠుడయిన వానిని; నకులుడిని; మారుతిన్= భీముడిని; సహదేవున్= సహదేవుడిని; మూఁడు మార్గణములన్= మూడేసి బాణములతో; ఏపు+ఆరఁగన్= పెంపు అనగా ఆధిక్యము అతిశయించునట్లుగా; బలుపు+ ఆరఁగన్= బలం అతిశయించునట్లుగా; రయము+ఆరఁగన్= వేగము అతిశయించునట్లుగా; నొప్పించెన్= నొవ్వచేసెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ మహాభుజ బలపరాక్రమవంతుడైన శల్యుడు యోధశ్రేష్ఠులైన సాత్యకిని, నకులుడిని, భీముడిని, సహదేవుడిని, మూడేసి బాణాలతో తన ఆధిక్యం, బలం, వేగం అతిశయించేటట్లుగా బాధించాడు.

విశేషం: ఈ పద్యంలో 'మూఁడు మార్గణములన్' అని ఉన్నది. మూడు బాణములని అర్థం. సాత్యకిని, భీముడిని, నకులుడిని, సహదేవుడిని మూడు బాణములతో బాధించాడని తాత్పర్యం. మూలాన్ని పరిశీలించగా - ఒక్కొక్కరిని మూడేసి బాణములతో కొట్టినట్లు ఉన్నది.

వ. అంతం దెలిసి యక్కొంతేయాగ్రజుండు మద్రపతిని ముద్గరంబున నేయ నవ్విరోధిపై సాత్యకి దోమరంబును వృకోదరుండు భల్లంబును నకులుండు శక్తియు సహదేవుండు గదయును బ్రయోగించిన నయ్యోధవరుండు వాని నన్నింటిని మింట మెఱుంగు లడర వెడఁద యమ్ములు వరఁగించి త్రుంచి యార్చినం బేర్చిన రోషంబున నా కృష్ణానుజుండు సారథి మూఁడు వాఁడితూపుల నవ్విరోధి రెండు బాణంబుల బెట్టేసినఁ గ్రోధదీప్తుండై యా శల్యుఁడు ప్రచండకాండంబుల నయ్యేవురను స్రుక్కించిన జూచి నీ పుత్త్రుం డతనిచేతఁ బాండుపుత్త్రులు పొలియుదు రని తలంచె నట్లు భాసమానుండైన సేనాపతిం గని భీమసేనుండు సహింపక తెంపున బెట్టు గిట్టిన. 202

ప్రతిపదార్థం: అంతన్= అంతలో; ఆ; కౌంతేయ= కుంతీపుత్రులలో; అగ్రజుండు= పెద్దవాడు అయిన ధర్మరాజు; తెలిసి= మూర్ఛనుండి తేరుకొని; మద్రపతిని= మద్రదేశమునకు అధిపతి అయిన శల్యుడిని; ముద్గరంబునన్= ముద్గరముతో (అనగా ఇనుపగదతో); ఏయన్= కొట్టగా; ఆ+విరోధిపైన్= శత్రువుపై(అనగా శల్యునిమీద); సాత్యకి; తోమరంబును= తోమరము అనే ఆయుధాన్ని; వృక+ఉదరుండు= భీముఁడు (తోడేలు ఉదరమువంటి ఉదరముకలవాడు కావున భీముడికి వృకోదరుడని పేరు); భల్లంబును= బల్లెమును; నకులుడు; శక్తియును= శక్తి అనే ఆయుధాన్ని; సహదేవుండు; గదయును= గదను; ప్రయోగించినన్= ప్రయోగించగా; ఆ; యోధ= యుద్ధవీరులలో; వరుండు= శ్రేష్ఠుడు అయిన శల్యుడు; వానిన్= వానిని; ఆ ఆయుధములను; అన్నింటిని; మింటన్= ఆకాశమునందు; మెఱుంగులు= మెఱుపులు; అడరన్= వ్యాపించునట్లుగా; వెడఁద= విశాలమయిన (పొడవు అయిన); అమ్ములు= బాణములు; పరఁగించి= ప్రయోగించి; త్రుంచి= ముక్కలు చేసి; ఆర్చినన్= పెద్దబొబ్బ పెట్టగా (గట్టిగా అరవగా); పేర్చిన= అతిశయించిన; రోషంబునన్= కోపముతో; ఆ; కృష్ణ= శ్రీకృష్ణునకు; అనుజుండు= తమ్ముడు అయిన సాత్యకి; సారథిన్= సారథిని(శల్యుడి సారథిని); మూఁడు; వాఁడి= వాడిఅయిన; తూపులన్= బాణములతో; ఆ; విరోధిన్= శత్రువును (అనగా శల్యుడిని); రెండు; బాణంబులన్= బాణములతో; బెట్టు= గట్టిగా; ఏసినన్= కొట్టగా; ఆ శల్యుఁడు; క్రోధ= కోపముతో; దీప్తుండై= ప్రజ్వలించుచున్నవాడై; ప్రచండ= భయంకరములయిన; కాండంబులన్= బాణములతో; ఆ; ఏవురను= అయిదుగురను; స్రుక్కించినన్= బాధించగా; చూచి; నీపుత్రుండు= నీయొక్క కుమారుడు(అనగా దుర్యోధనుడు);

అతనిచేతన్; పాండుపుత్రులు= పాండురాజు కుమారులు; పొలియుదురు= చత్తురు; అని; తలంచెను= ఆలోచించెను; అట్లు= ఆ ప్రకారంగా; భాసమానుండైన= ప్రకాశమానుడయిన; సేనాపతిన్= సైన్యాధ్యక్షుని(శల్యుని); కని= చూచి; భీమసేనుండు; సహింపక= ఓర్పువహింపక; తెంపునన్= సాహసముతో; బెట్టు= మిక్కిలి దగ్గరకు; కిట్టినన్= సమీపించగా.

తాత్పర్యం: అంతలో ధర్మరాజు మూర్ఛనుండి తేరుకొని శల్యుడిని ముద్గరంతో కొట్టాడు. ఆ సమయంలో ఆ శల్యుడిపై సాత్యకి తోమరాన్ని, భీముడు బల్లెమును, నకులుడు శక్తిని, సహదేవుడు గదను ప్రయోగించారు. వీరశ్రేష్ఠుడయిన ఆ శల్యుడు ఆ ఆయుధాలన్నింటినీ ఆకాశంలో మెరుపులు వ్యాపించేటట్లు పెద్ద పెద్ద బాణాలు ప్రయోగించి చిన్న చిన్నముక్కలుగా చేసి పెడబొబ్బ పెట్టాడు. దానితో అతిశయించిన కోపంతో సాత్యకి శల్యుడి సారథిని మూడు వాడి అయిన బాణాలతో, శల్యుడిని రెండు బాణాలతో గట్టిగా కొట్టాడు. అంతట ఆ శల్యుడు క్రోధంతో ప్రజ్వలించినవాడై, భయంకరాలయిన బాణాలతో అయిదుగురిని బాధించాడు. అది చూచి నీ పుత్రుడు దుర్యోధనుడు ఆ శల్యుడిచేత పాండు పుత్రులు చస్తారని తలంచాడు. ఆ ప్రకారంగా ప్రకాశమానుడైన శల్యుడిని చూచి భీమసేనుడు సహించ జాలక సాహసంతో ఆ శల్యుడి సమీపానికి రాగా.

క. శిని మనుమఁడు గవలును దో । డన యురవడి నడరి పొదువుటయు నగ్గలికం
బెనఁగె నతం డా నలువుర । కనలుఁ గడంకయును సరకు గాఁ గొన కధిపా! 203

ప్రతిపదార్థం: అధిపా!= ప్రభువు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; శిని= శినియొక్క; మనుమఁడు(అనగా సాత్యకి); తోడన= వెంటనే; కవలును= నకులసహదేవులును; విజృంభణంతో= మిక్కిలివేగముగా; పొదువుటయును= క్రమ్ముకొనుటయును; అడరి= విజృంభించి; అగ్గలికన్= ఉత్సాహముతో; పెనఁగెన్= పోరాడెను; అతండు; ఆ నలువుర= ఆ నలుగురియొక్క; కనలున్= కోపమును; కడంకయును= యుద్ధముచేయు పోకడలను, సరకుగాన్+కొనక= లక్ష్యము చేయకుండా; పెనఁగెన్= పోరాడెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సాత్యకి ఆ వెంటనే మిక్కిలి వేగంగా నకుల సహదేవులను కలిసికొని విజృంభించి, ఉత్సాహంతో శల్యుడితో పోరాడాడు. ఆ శల్యుడు ఆ నలువురి కోపాన్ని, యుద్ధప్రయత్నాన్ని లక్ష్యపెట్టకుండా పోరాడాడు.

వ. ఇట్లు పెనంగుచుండఁ బాండవాగ్రజుండు మున్ను దనచేతఁ జచ్చిన చంద్రసేనుతోడివాని ద్యుమత్సేనుఁ దల ద్రెవ్వ నేసిన జక్రరక్షకహీనుం డయ్యును బొలివోవని కనలున శల్యుండు సటలు వెటికినం గోపించు సింగంబుచందంబై సమీరణసుతాదులగు జోదుల నలువురయంగంబులఁ దురంగనికరశరీర సారథినికాయసహితంబుగా బహువిధవిశిఖంబులు వరఁగించి నెత్తురులు దొరఁగించినం గని యా ధర్మనందనుండు విషాదంబు నొంది నిజాంతర్గతంబున. 204

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగా; పెనంగుచుండన్= పోరాడుచుండగా; పాండవ= పాండురాజు కుమారులలో; అగ్రజుండు= పెద్దవాడయిన ధర్మరాజు; మున్ను= అంతకుముందు; తనచేతన్= తనచేత; చచ్చిన= చచ్చిపోయిన; చంద్రసేనుతోడివానిన్= చంద్రసేనునితోడివాడైన; ద్యుమత్సేనున్= ద్యుమత్సేనునియొక్క; తల= శిరస్సు; త్రెవ్వన్= తెగిపోవునట్లుగా; ఏసినన్= కొట్టగా; చక్రరక్షక= రథ చక్రములను రక్షించువాడు; హీనుండు= లేనివాడు; అయ్యును= అయినను; పొలివోవని= చెడిపోవని; కనలునన్= కోపముతో; శల్యుండు; సటలు= జూలు; పెటికినన్= పీకినందువలన; కోపించు= కోపించే; సింగంబు=

సింహము; చందంబు= వలె; ఐ= అయినటువంటి వాడయి; సమీరణ= వాయువుయొక్క; సుత= పుత్రుడు భీముడు; ఆదులగు= మొదలగు; జోదులు= యోధులగు; నలువుర= నలువురియొక్క; అంగంబులన్= అవయవములను; తురంగ= గుర్రాలయొక్క; నికర= సమూహముయొక్క; శరీర= దేహములు; సారథి= సారథులయొక్క; నికాయ= సమూహముల; సహితంబుగాన్= సమేతముగా; బహువిధ= అనేకవిధములయిన; విశిఖంబులు= వాడియైన బాణాలు; పరఁగించి= ప్రయోగించి; నెత్తురులు= రక్తములు; తొరఁగించినన్= ప్రవహించునట్లు చేయగా; కని= చూచి; ఆ; ధర్మ= యమధర్మరాజుయొక్క; నందనుండు= కుమారుడు అనగా ధర్మరాజు; విషాదంబున్= దుఃఖమును; ఒంది= పొంది; నిజ= తనయొక్క; అంతర్గతంబునన్= అంతఃకరణమునందు (మనస్సునందు).

తాత్పర్యం: ఈ ప్రకారంగా పోరాడుతుండగా ధర్మరాజు అంతకుముందు తనచేత చంపబడిన చంద్రసేనుడితో పాటు శల్యుడికి చక్ర రక్షకుడుగా ఉన్న ద్యుమత్సేనుడి తల నరికాడు. అటు తరువాత చక్రరక్షకుడు లేనివాడైనా శల్యుడు తరుగని కోపంతో జూలు పీకినందుకు కోపించే సింహంవలె భీముడు మొదలైన యోధులైన నలుగురి అవయవాలను, గుర్రపు సమూహాలయొక్క శరీరాలను, సారథుల సమూహాలను అనేక విధాలయిన వాడి బాణాలు ప్రయోగించి రక్తాలు ప్రవహించేటట్లు చేయగా చూచి ధర్మరాజు దుఃఖించి తనలోతాను.

విశేషం: ఈ సందర్భంలో తిక్కన ధర్మజుడు ద్యుమత్సేనుడనే శల్యుడి చక్రరక్షకుడిని సంహరించినట్లు అభివర్ణించాడు. మూలంలో ఈ సందర్భంలో కాని, మరియొక చోటకాని 'ద్యుమత్సేనుడు' అనే చక్రరరక్షకుడు ఉన్నట్లు కానరాదు. వ్యాసమహాభారతంలో ఒక 'ద్యుమత్సేనుడు' సావిత్రి భర్త అయిన సత్యవంతుడి తండ్రి. మరియొక 'ద్యుమత్సేనుడు' ఉన్నాడు. అతడు పర్వతరాజు. అతడు యుద్ధమునకు సంబంధించిన వాడు కాడు. శల్యుడి చక్రరక్షకుడుగా యుద్ధంలో పాల్గొన్న 'ద్యుమత్సేనుడు' అనే వాడు వ్యాస మహాభారతంలో కానరాదు. ఇది పండితులు పరిశీలించవలసిన విషయం.

క. 'హరి వచనంబు లసత్యతఁ । బొరయఁగ నేర్చునొకొ! మద్రభూపతి బాహు
స్ఫురణము భీమాదిరథిక । వరు లోర్వని యట్లుగాఁగ వ్రాలెడిఁ దోడ్తోన్.' 205

ప్రతిపదార్థం: హరి= శ్రీకృష్ణునియొక్క; వచనంబులు= పలుకులు; అసత్యతన్= నిజము కానితనమును; పొరయఁగన్= పొందగ; నేర్చున్= అగును; ఒకొ!= ఏమో!; మద్రభూపతి= మద్రదేశాధిపతి అయిన శల్యుడియొక్క; బాహు= భుజములయొక్క; స్ఫురణము= విజృంభణము(ప్రకాశము); భీమ= భీముడు; ఆది= మొదలగు; రథికవరులు= శ్రేష్ఠులయిన యోధులు; ఓర్వని= భరింపరానిది; అట్లుగాఁగన్= అగునట్టిదిగా; తోడ్తోన్= వడివడిగా; వ్రాలెడిన్= మీరిపోవుచున్నది (అధికమగుచున్నది).

తాత్పర్యం: ధర్మరాజు తనలోతాను ఇట్లా చింతించాడు. 'శ్రీకృష్ణుడి మాటలు కల్లలు కావు కదా! శల్యుడి భుజవిజృంభణం భీముడు మొదలైన యోధశ్రేష్ఠులు భరించరానిదిగా తీవ్రం అవుతున్నది.'

వ. అని తలపోసి తన బలంబునకుఁ జేయి వీచినఁ దోయధివీచివితానవిలాసంబుచందంబునఁ జతురంగబలంబులు శల్యునిపైఁ గవిసిన నా ధైర్య ధౌరేయుండు మందరనగంబులీలఁ గైకొని వారలం గలంచి పాంచాలపుత్ర ప్రభృతియోధప్రకరంబులను బాండవాగ్రజునిం బరమ సాంద్రతీవ్రశరాంధకారంబునఁ గప్పి సింహనాదంబు చేసిన. 206

ప్రతిపదార్థం: అని= ఈ విధముగా; తలపోసి= చింతించి; తన బలంబునకున్= తనయొక్క సేనకు; చేయి; వీచినన్= ఊపగా; తోయధి= సముద్రముయొక్క; వీచి= కెరటములయొక్క; వితాన= సమూహములయొక్క; విలాసంబు= సౌందర్యము

(శృంగారము); చందంబునన్= విధముగా; చతురంగంబులు= నాలుగు రథాది యుద్ధాంగాలు; శల్యునిపైన్= శల్యుడిమీద; కవిసినన్= కలియబడగా; ఆ; ధైర్య= ధీరత్వముయొక్క; ధౌరేయుండు= భారమును మోయువాడు అయిన శల్యుడు (అనగా మిక్కిలి ధైర్యముకల శల్యుడు); మందర= మందరమనుపేరుగల; నగంబు= పర్వతముయొక్క; లీలన్= విలాసమును; కైకొని= గ్రహించి; వారలన్= వారిని; కలంచి= కలతచెందించి; పాంచాలపుత్ర= ధృష్టద్యుమ్నుడు; ప్రభృతి= మొదలగు; యోధ= వీరులయొక్క; ప్రకరంబులను= సమూహములను; పాండవాగ్రజునిన్= ధర్మరాజును; పరమ= మిక్కిలి; సాంద్ర= దట్టమయిన; తీవ్ర= వాడి అయిన; శర= బాణములవలని; అంధకారంబునన్= చిమ్మచీకటితో; కప్పి= కప్పివేసి; సింహనాదము= సింహగర్జనము; చేసినన్= చేయగా.

తాత్పర్యం: అని ధర్మరాజు తనలోతాను చింతించి, వెనువెంటనే తన సేనలకు చేయి ఊపగా సముద్రతరంగ సమూహాలవలె చతురంగబలాలు శల్యుడిమీద కలియబడగా సాహసవంతుడు అయిన ఆ శల్యుడు మందరపర్వతం పాల సముద్రాన్ని కలచినట్లు ఆ చతురంగ బలాలను కలచి, ధృష్టద్యుమ్నుడు మొదలైన వీరులను, ధర్మరాజును మిక్కిలి దట్టమయిన వాడి అయిన బాణాల వలన నిండిన చిమ్మచీకటితో కప్పివేసి సింహగర్జనం చేయగా.

విశేషం: అలం: ఉపమ. రూపకం.

క. దివిజగరుడఖచరాదులు । వివిధవచనరచన లెసఁగ వినుతించిరి శా
త్రవ భీకరుఁడగు నమ్మద్రవిభుని రణవిహరణములు ధరణీనాథా! 207

ప్రతిపదార్థం: ధరణీనాథా!= ధృతరాష్ట్ర మహారాజా!; శాత్రవ= శత్రువులకు; భీకరుఁడగు= భయంకరుడయిన; ఆ; మద్ర= మద్రదేశమునకు; విభుని= ప్రభువు అయిన శల్యునియొక్క; రణ= యుద్ధమునందలి; విహరణములు= విహారములు; దివిజ= దేవతలు; గరుడ= గరుడులు; ఖ= ఆకాశమునందు; చర= సంచరించు దేవయోనులు; ఆదులు= మొదలగువారు; వివిధ= అనేకవిధములయిన; వచన= వచనములతో కూడిన; రచన= రచనా విన్యాసములు; ఎసఁగన్= ఒప్పగా; వినుతించిరి= స్తుతించిరి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! శత్రుభయంకరుడైన శల్యుడి యుద్ధ విహారాలు దేవతలు, గరుడ గంధర్వయక్షకిన్నరకింపురుష సిద్ధసాధ్యులు మొదలైనవారు వివిధ ప్రక్రియలతో కూడిన వచన రచనా విన్యాసాలతో స్తుతించారు.

వ. ఆ సమయంబున. 208

తాత్పర్యం: అప్పుడు

తే. గురుసుతుఁడు పెనుబ్రాపుగా నరునిఁ బొదివి । యధిప! సంశప్తకులు వివిధా స్త్రతతులఁ
గప్పి రతఁ డందఱను జండకాండవిదళి । తాంగులుగఁ జేసె దోర్లీల యతిశయిల్ల. 209

ప్రతిపదార్థం: అధిప!= ప్రభువు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; గురు= ద్రోణాచార్యునకు; సుతుఁడు= పుత్రుడు అయిన అశ్వత్థామ; పెను= పెద్ద; ప్రాపుగాన్= సహాయకుడిగా; సంశప్తకులు(త్రిగర్తాధీశులయిన సుశర్మ మొదలగువారు); నరునిన్= అర్జునుడిని; పొదివి= క్రమ్ముకొని(చుట్టుముట్టి); వివిధ= అనేకవిధములయిన, అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములయొక్క; తతులన్= సమూహములతో; కప్పిరి= కప్పివేసిరి; అతఁడు; అందఱను; దోః= భుజములయొక్క; లీల=

విలాసము; అతిశయిల్లన్= విజృంభించగా; చండ= భయంకరమయిన; కాండ= బాణములతో; విదళిత= చీల్చబడిన; అంగులుగన్= అవయవములు కలవారినిగా; చేసెన్;

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అశ్వత్థామను ఆశ్రయించి అతడి సాయంతో సంశప్తకులు అర్జునుడిని చుట్టుముట్టి అనేక విధాలయిన ఆయుధాలతో కప్పివేశారు. ఆ అర్జునుడు వారినందరిని భుజబలం విజృంభించగా విలాసంగా భయంకరమైన బాణాలతో ఆ సంశప్తకులను చీల్చబడిన అవయవాలు కలవారినిగా చేశాడు.

విశేషం: త్రిగర్త దేశాధీశుడు సుశర్మ మహాబల పరాక్రమవంతుడు. ఈ త్రిగర్తసేనలు సంశప్తకులు. ద్రోణపర్వంలో అర్జునుడు ఈ సంశప్తకులను సహస్రాధికంగా సంహరించినట్లు ఉన్నది. సుశర్మ తమ్ముడు సత్యరథుడు అనేవాడు ఉన్నాడు. సత్యరథుడు తన అయిదుగురు సోదరులతో కలిసి - 'అర్జునుడిని సంహరించగలము' లేనిచో మరణించగల'మని ప్రతిజ్ఞ చేశాడు. ఈ ప్రతిజ్ఞ కారణంగా త్రిగర్త దేశాధీశులకు, వారిసేనలకు సంశప్తకులనే పేరు వచ్చింది. ఈ సందర్భంలో మూలంలో వ్యాసభగవానుడు త్రిగర్తులనియే ప్రయోగించాడు. తిక్కన మాత్రం సంశప్తకులని ప్రయోగించాడు. మూలంలో ఇలా ఉంది.

> **'అర్జునో ద్రౌణినా విద్ధో యుద్ధే బహుభిరాయసైః ।**
> **తస్య చానుచరైః శూరై స్త్రిగర్తానాం మహారథైః ॥ (శల్య - 14-1)**

చ. **తెరలక వారు పైపయి నుదీర్ణసముద్ధతిఁ గ్రమ్మి వాజులన్**
హరిని సిడంబుపైఁ గదియ నాతఁడు సేద్పడ బాణవర్షముం
గురిసిరి కౌరవేంద్రుమొనకుం బ్రమదంబగు ఘోరభంగి న
ప్పరుషపరాక్రమస్ఫురణ పార్థివసత్తమ! కాన మెయ్యెడన్. **210**

ప్రతిపదార్థం: వారు (అనగా అశ్వత్థామయు ఆ సంశప్తకులును); తెరలక= తొలగిపోవకుండగా; ఉదీర్ణ= పెల్లుబికిన; సముద్ధతిన్= దర్పముతో; క్రమ్మి= క్రమ్ముకొని; వాజులన్= గుర్రములను; హరిని= శ్రీకృష్ణుడిని (అర్జునుడిని రథసారథి); సిడంబుపైన్= ధ్వజముపైని; పైపయిన్= మీదమీద; కదియున్= సమీపించగా; ఆతఁడు (అనగా అర్జునుడు); చేద్పడన్= బాధపడునట్లుగా; కౌరవేంద్రు= దుర్యోధనునియొక్క; మొనకున్= సేనకు; ప్రమదంబు= ఆనందము; అగు= కలిగించునట్టి; ఘోర= భయంకరమయిన; భంగిన్= విధముగా; బాణ= బాణములయొక్క; వర్షమున్= వర్షమును; కురిసిరి= కురిపించిరి; పార్థివ= రాజులలో; సత్తమ!= ఉత్తముడవు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఆ; పరుష= నిష్ఠురమయిన (క్రూరమైన); పరాక్రమ= వీరత్వముయొక్క; స్ఫురణ= ప్రకాశము; ఎయ్యెడన్= ఎక్కడా; కానము= చూడము.

తాత్పర్యం: అశ్వత్థామ, సంశప్తకులు, యుద్ధభూమినుండి తొలగిపోకుండా పెల్లుబికిన దర్పంతో క్రమ్ముకొని పార్థుడి గుర్రాలపై సారథి అయిన శ్రీకృష్ణుడిపై, ధ్వజంపైబడి మీదమీదకు సమీపించి, అర్జునుడు బాధపడేటట్లుగా, దుర్యోధనుడిసేన ఆనందపడేటట్లుగా భయంకరంగా బాణవర్షాన్ని కురిపించారు. ఓ ధృతరాష్ట్ర మహారాజా! అట్టి క్రూరమైన పరాక్రమప్రకాశం ఎక్కడా చూడం.

వ. **ఇట్లు సవ్యసాచికిఁ జేయార్ప రాకుండ దర్పంబు సూపిన నా భూవరకుమారవర్యుండు వీరాగ్రహావేశంబున విజృంభించి భల్లార్ధచంద్రక్షురికాముఖనారాచప్రముఖవిశిఖపరంపరలు వరఁగింప నవి యా సైనికుల రథ్యంబులం గూల్చియుఁ గేతనంబులు ద్రుంచియు బాణంబులు నఱకియు బాణాసనంబులు విఱిచియు**

సూతుల గీటడంచియు నరదంబులఁ జెక్కియు మైమఱువులు పొళ్లుసేసియుఁ జామరంబులు దునిమియు నాతపత్రంబులు రూపుమాపియు నెత్తురు లురలించియుఁ గండలు దొరఁగించియు నెమ్ములు వగిలించియుఁ గాళ్లు ద్రుంచియుఁ జేతులు దునిమియు వ్రయ్యలుగా వక్షంబులు సీఱియు మర్మంబులఁ జొచ్చియు మకుటంబులు డుల్చియుఁ దలలు రాల్చియుఁ బ్రాణంబులు పీల్చియు రౌద్రం బావహించిన లయకాలరుద్రుని సంక్రీడనంబు చందంబు దోఁచెనప్పుడు రథికవరసహస్ర ద్వితయంబు దెగటారె నవ్వాఁడిమగండు పేరడవి దహించు దావపావకుని చందంబున వెలింగెఁ దదీయతేజోమహిమ సహింపక యుద్దామగతి నశ్వత్థామ గదిసి యక్కవ్వడిం దొడరి దురం బొనర్చె నందు. 211

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; సవ్యసాచికిన్= అర్జునుడికి; చేయార్పరాకుండన్= చేతులకు విశ్రాంతి లేకుండగ; దర్పంబు= గర్వము; చూపినన్= ప్రదర్శింపగ; ఆ; భూ= భూమికి; వర= భర్త అయిన పాండురాజుయొక్క; కుమార= కుమారులలో అనగా పుత్రులలో; వర్యుఁడు= శ్రేష్ఠుడు అయిన అర్జునుడు; వీర= శౌర్యము; ఆగ్రహ= కోపము-వీనియొక్క; ఆవేశంబునన్= ప్రవేశంవలన; విజృంభించి= అతిశయించి; భల్ల= బల్లెములు; అర్ధచంద్రక్షురికా= అర్ధచంద్రాకారము గల బాణముల; ముఖ= ముఖముగల; నారాచ= ఇనుపబాణములు; ప్రముఖ= మున్నగు; విశిఖ= బాణములయొక్క; పరంపరలు= వరుసలు; పరఁగింపన్= ప్రయోగించగా; అవి; ఆ సైనికుల= ఆ సేనలయొక్క; రథ్యంబులన్= రథములు లాగెడి గుఱ్ఱములను; కూల్చియున్= కూల్చియు; కేతనంబులు= జెండాకొయ్యలు; త్రుంచియున్= ముక్కలు చేసియు; బాణంబులు; నఱకియున్= ఖండించియు; బాణాసనంబులు= ధనుస్సులు; విఱిచియున్= ఖండించియు; సూతులన్= సూతులను; గీటడంచియున్= చంపియును; అరదంబులన్= రథములను; చెక్కియున్= ముక్కలుచేసియు; మైమఱుపులు= కవచములు; పొళ్ళు= పొడిపొడిగా అనగి పిండి పిండిగా; చేసియున్= చేసియు; చామరంబులు= వింజామరములు; తునిమియున్= ఖండించియు; ఆతపత్రంబులు= గొడుగులు; రూపుమాపియున్= నాశనము చేసియు, రూపం లేకుండా చేసియు; నెత్తురులు= రక్తములు; ఉరలించియున్= కార్పించియు; కండలు= మాంసపుముద్దలు (శరీరభాగములు); తొరిఁగించియున్= స్రవింపచేసియు; ఎమ్ములు= ఎముకలు; పగిలించియున్= చిట్లించియు, పగులునట్లు చేసియు; కాళ్ళు; త్రుంచియున్= ఖండించియు; చేతులు; తునిమియున్= ఖండించియు; వ్రయ్యలుగాన్= ముక్కలుగా; వక్షంబులు= వక్షఃస్థలములు(గుండెలు); చీఱియున్= చీల్చియు; మర్మంబులన్= రహస్యస్థలములను (అనగా మర్మావయవములను); చొచ్చియున్= ప్రవేశించియు; మకుటంబులు= కిరీటములు; డుల్చియున్= పడగొట్టియు; తలలు= శిరములు; రాల్చియున్= నేలకూలునట్లు చేసియు; ప్రాణంబులు; పీల్చియున్= పీల్చియు; రౌద్రంబు= క్రోధము; ఆవహించిన= ఆవేశించినట్టి; లయకాల= ప్రళయకాలమునందలి; రుద్రుని= శివునియొక్క; సంక్రీడనంబు= ఆట; చందంబు= విధముగా; తోఁచెన్= తోచెను; అప్పుడు= ఆ సమయమున; రథికవర= రథికశ్రేష్ఠుల; సహస్రద్వితయంబు= రెండువేలు; తెగటారెన్= సంహరింపబడెను; ఆ; వాఁడిమగండు= శూరుడు; పేరు= విశాలమయిన; అడవి= అరణ్యము; దహించు= కాల్చు; దావపావకుని=కార్చిచ్చు; చందంబునన్= విధముగా; వెలింగెన్= ప్రకాశించెను; తదీయ= ఆ అర్జునుడి; తేజస్= పరాక్రమప్రకాశముయొక్క; మహిమన్= గొప్పతనమును; సహింపక= ఓర్వజాలక (భరింపజాలక); ఉద్దామ= భయంకరమైన; గతిన్= విధమున; అశ్వత్థామ; కదిసి= సమీపించి; ఆ; కవ్వడిన్= అర్జునుని; తొడరి= ఎదిరించి; దురంబు= యుద్ధము; ఒనర్చెన్= చేసెను; అందున్= ఆ యుద్ధంలో.

తాత్పర్యం: ఈ ప్రకారంగా అర్జునుడికి విశ్రాంతి లేకుండా అశ్వత్థామ, సంశప్తకులు తమ దర్పం చూపగా ఆ అర్జునుడు శౌర్యక్రోధముల వలన ఒడలు తెలియకుండా విజృంభించి బల్లెములు, అర్ధచంద్రాకారం గల ఇనుపబాణాలు, ఇంకను వాడి అయిన అనేక విధాలైన బాణాల వరుసలు ప్రయోగించాడు. ఆ ఆయుధాలు ఆ కౌరవసేనల యొక్క

గుఱ్ఱాలను కూల్చి, జెండా కొయ్యలను ముక్కలు చేసి, బాణాలను ఖండించి, ధనుస్సులను విరుగగొట్టి, సూతులను చంపి, రథాలను ముక్కలు చెక్కలు చేసి, కవచాలను పిండిపిండిగా చేసి, వింజామరలను ఖండించి, గొడుగులు ఆకారం లేకుండా చేసి, రక్తములు చెక్కలు చేసి, కండలు స్రవింపచేసి, ఎముకలు పగులగొట్టి, తలలు నేలకూల్చి, ప్రాణాలు పీల్చి, క్రోధం ఆవహించిన ప్రళయకాల రుద్రుడి క్రీడ విధంగా తోపింపజేశాడు. ఆ సమయంలో రెండువేల రథికశ్రేష్ఠులు సంహరించబడ్డారు. అప్పుడు ఆ శూరుడయిన అర్జునుడు మహారణ్యాన్ని కాల్చే దావాగ్ని విధంగా ప్రకాశించాడు. ఆ సమయంలో ఆ అర్జునుడి పరాక్రమాన్ని భరింపజాలక అడ్డులేని గమనంతో అశ్వత్థామ ఆ అర్జునుడిని సమీపించి, ఎదిరించి యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. **అతఁడు పంద్రెండు వాలమ్ము లాబీభత్సు । మెయిఁ, గ్రుచ్చి కృష్ణుని మేనియందుఁ**
బది వాఁడితూపులు వఱపిన మదిలోన । నగ్గించి యవ్వీరుఁ డలఁతినగవు
తోడ రథ్యముల సూతునిఁ గూల్చి యాతని । తనువున నెఱ తెగగొనక నాటె
మూఁడు మార్గణములు ముసలంబు పరిఘంబు । నాతఁడు నిగిడింప నదియు నదియు

తే. **నన్నరుఁడు దోడుతోడ నైదాఱునిశిత । కాండములఁ ద్రుంచి పటుసాయకత్రయంబు**
సొనిపె నవ్విప్రు మేన మార్కొనియె నపుడు । గడఁగి యప్పార్థు సంశప్తకవ్రజంబు. 212

ప్రతిపదార్థం: అతఁడు(అశ్వత్థామ); పంద్రెండు; వాలమ్ములు= బాణములు; ఆ; బీభత్సు= అర్జునుడియొక్క; మెయిన్= దేహమునందు; క్రుచ్చి; కృష్ణుని; మేనియందున్= దేహమునందు; పది; వాడి; తూపులు= బాణములు; పఱపినన్= ప్రయోగించగా; ఆ; వీరుఁడు= శూరుడు అయిన అర్జునుడు; మదిలోనన్= మనసులో; అగ్గించి= స్తుతించి; అలఁతి= చిన్న; నగవుతోడన్= నవ్వుతో(చిరునవ్వుతో); రథ్యములన్= గుఱ్ఱములను; సూతునిన్= సూతుని; కూల్చి= చంపి; ఆతని= ఆ అశ్వత్థామయొక్క; తనువునన్= దేహమునందు; నెఱన్ తెగగొనక= పూర్తిగా ఎక్కుపెట్టక; మూఁడుమార్గణములు= మూడుబాణములు; నాటెన్= గ్రుచ్చెను; ఆతఁడు= ఆ అశ్వత్థామ; ముసలంబు= ముసలము అను ఆయుధమును (ఉక్కుగుండు అగ్రమున కలిగిన బాణము); పరిఘంబు= పరిఘ అను ఆయుధము; నిగిడింపన్= ప్రయోగించగా; ఆ+నరుఁడు= అ అర్జునుడు; తోడుతోడను= వెంటవెంటనే; ఐదు= అయిదు; నిశిత= వాడియైన; కాండములన్= బాణములతో; అదియును= ఆ ముసలమును; ఆఱు; నిశిత= వాడిఅయిన; కాండములన్= బాణములతో; అదియును= ఆ పరిఘమును కూడ; త్రుంచి= ఖండించి; పటు= అత్యంత శక్తిమంతమయిన; సాయక= బాణముల; త్రయంబు= మూడు; ఆ; విప్రు= బ్రాహ్మణునియొక్క అనగా అశ్వత్థామయొక్క; మేనన్= దేహమునందు; చొనిపెన్= చొప్పించెను; అపుడు; సంశప్తక= సంశప్తకులయొక్క; వ్రజంబు= సమూహము; కడఁగి= పూనిక వహించి(ప్రయత్నించి); ఆ+పార్థున్= ఆ అర్జునుడిని; మార్కొనియెన్= ఎదుర్కొనెను.

తాత్పర్యం: అర్జునుడికి అశ్వత్థామకు జరుగుతున్న ఆ యుద్ధంలో - అశ్వత్థామ పన్నెండు బాణాలను అర్జునుడి దేహంలో గ్రుచ్చాడు. శ్రీకృష్ణుడి దేహమునందు పది వాడి అయిన బాణాలు ప్రయోగించాడు. అప్పుడు అర్జునుడు మనస్సులో అశ్వత్థామను స్తుతించి చిరునవ్వుతో గుఱ్ఱాలను, సూతుడిని చంపి అశ్వత్థామ దేహమునందు జీవస్థానం చెడకుండా మూడు బాణాలు గ్రుచ్చాడు. అప్పుడు అశ్వత్థామ ముసలం, పరిఘం ప్రయోగించగా అర్జునుడు వెంటవెంటనే అయిదు వాడి అయిన బాణాలతో ముసలమును, ఆరు వాడి అయిన బాణాలతో పరిఘమును ఖండించి, శక్తిమంతమయిన మూడు బాణాలు అశ్వత్థామ దేహంలో చొప్పించాడు. ఆ సమయంలో సంశప్తక సమూహం అర్జునుడిని ఎదుర్కొన్నది.

విశేషం: ఈ సీసపద్యమున మూడవపాదంలో ఉస్మానియా ప్రతిలో 'నెఱతెగగొనక' పాఠమును స్థిరం చేశారు. నెఱ - నిండు -నెఱి= అందము - ఈ రెండు శబ్దములు ప్రసిద్ధములు. ఇవి కళలు. ఇందొకటి చిన్నయసూరిమతము. మరియొకటి బహుజనపల్లి మతము. ఇక 'నెఱవు' ద్రుతప్రకృతికమయిన శబ్దం కలదు. దానికి ప్రాణము లేక ప్రాణస్థానము - జీవము లేక జీవస్థానం - ఆయువు లేక ఆయుఃస్థానమని అర్థాలు. ఇదియు శకటరేఫ శబ్దం. ద్రుతప్రకృతికమునకు తకారము పరుషము పరుమగుచో అది 'ద'కారము సరళంగా మారుతుంది. అప్పుడు 'నెఱఁ దెగగొనక' అని ఉండాలి. అట్లుగాక 'నెఱతెగగొనక' పాఠమును గ్రహిస్తే అర్థం పొసగదు. అందువలన 'నెఱఁదెగగొనక' అనుపాఠాన్ని గ్రహించటం ఉచితం. ఇది ఒక తెనుఁగు జాతీయ ప్రయోగం. ఇక 'నైదాఱు' పాఠముకంటె' - 'నాఱునైదు' పాఠం మూలానుగుణం. 'త మంతక మివ క్రుద్ధం పరిఘం ప్రేక్ష్య పాండవః । అర్జునస్త్వరితో జఘ్నే పంచభిః సాయకోత్తమైః ॥' (శల్య. 14-33)

వ. ఇత్తెఱంగున. 213

తాత్పర్యం: ఈ విధంగా.

సురథుఁడను పాంచాలకుమారుం డశ్వత్థామచేఁ జచ్చుట (సం. 9-13-35)

క. సురథుఁడు గురుసుతుపైఁ దన । యరదము వఱపించి యేయ నప్పాంచాలో
త్తరు నొక నారసమునకును । నెర సేసె నతండు గినుక యెసకం బెసఁగన్. 214

ప్రతిపదార్థం: సురథుఁడు; గురుసుతు పైన్= అశ్వత్థామపై; తన= తనయొక్క; అరదము= రథము; వఱపించి= తోలించి; ఏయన్= కొట్టగా; ఆ; పాంచాల= పాంచాలదేశపు వీరులలో; ఉత్తరున్= ఉత్కృష్టుని; అతండు= అశ్వత్థామ; కినుక= కోపముయొక్క; ఎసకంబు= విజృంభణము; ఎసఁగన్= అతిశయించగా; ఒక నారసమునకున్= ఒక వాడి అయిన బాణమునకు; ఎర= బలి; చేసెను.

తాత్పర్యం: సురథు డనేవాడు అశ్వత్థామపై తన రథం తోలించి కొట్టగా అశ్వత్థామ కోపోద్రేకంతో ఆ పాంచాల వీరుడిని ఒక వాడి అయిన బాణానికి బలిచేశాడు.

వ. ఇత్తెఱంగున. 215

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ ప్రకారంగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా అశ్వత్థామ సురథుడు యుద్ధం చేస్తూ ఉండగా.

ఆ. సురథుఁ గూల్చి యతనియరదంబు పైకి ను । ద్ధురత నరిగి గురుసుతుండు చండ
కాండసమితి నిగుడ గాండీవిఁ దాఁకి సం । శప్తకులకు సంతసం బొనర్చె. 216

ప్రతిపదార్థం: గురుసుతుండు= అశ్వత్థామ; సురథున్= సురథుని; కూల్చి= చంపి; అతని= సురథునియొక్క; అరదంబుపైకిన్= రథముమీదకు; ఉద్ధురతన్= భారాతిశయంతో; అరిగి= వెడలి; చండ= భయంకరమయిన; కాండ= బాణములయొక్క; సమితి= సమూహము; నిగుడన్= వ్యాపించునట్లుగా; గాండీవిన్= అర్జునుని; తాఁకి= ఎదుర్కొని; సంశప్తకులకున్= సంశప్తకులకు; సంతసంబు= సంతోషము; ఒనర్చెన్= కలుగచేసెను.

తాత్పర్యం: అశ్వత్థామ సురథుడిని చంపి, ఆ సురథుడి రథంపైకి వెడలి, భయంకరమైన బాణ సమూహాన్ని వ్యాపింపజేసి, గాండీవిని ఎదుర్కొని సంశప్తకులకు సంతోషాన్ని కలుగజేశాడు.

విశేషం: మహాభారతంలో సురథులనే పేరుగలవారు అనేకులు ఉన్నారు. ఆదిపర్వంలో క్రోధవశ సంజ్ఞకల దైత్యుడి అంశతోపుట్టిన సురథుడనే ఒక రాజు ఉన్నాడు. సభాపర్వంలో సూర్యపుత్రుడు యముడిని ఉపాసించే సురథుడనే రాజు కూడా ఉన్నాడు. వనపర్వంలో శిబిదేశపు రాజకుమారుడు కోటికాస్యుడి తండ్రి సురథుడనేవాడు ఉన్నాడు. ఇదిగాక వనపర్వంలో - జయద్రథుడి అనుచరుడు త్రిగర్తదేశపురాజు సురథుడనే వాడు ఉన్నాడు. అతడు ద్రౌపదిని జయద్రథుడు అపహరించే సమయంలో నకులుడితో పోరాడి చనిపోయాడు. ద్రోణపర్వంలో సురథుడనే సంశప్తక వీరుడు ఉన్నాడు. అతడు అర్జునుడితో యుద్ధం చేశాడు. మరియు ద్రోణపర్వంలోనే ద్రుపదుడి పుత్రుడు సురథుడు ఉన్నాడు. అతడిని అశ్వత్థామ సంహరించాడు. అశ్వమేధ పర్వంలో దుశ్శల గర్భమున జయద్రథుడి వలన జన్మించిన సురథుడనే జయద్రథుడి పుత్రుడు కూడా ఉన్నాడు. ఇక ఈ శల్యపర్వంలో అశ్వత్థామ సంహరించిన సురథుడు - పాండవపక్షాన యుద్ధం చేస్తున్న ఒక మహారథి అయిన పాంచాల రాజకుమారుడు.

వ. అయ్యవసరంబున 217

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయాన.

తాత్పర్యం: అశ్వత్థామ సురథుని చంపి అర్జునుడిని ఎదుర్కొనే సమయంలో.

క. కురుపతి ధృష్టద్యుమ్నుని । యురవడిఁ దగ నిలువరించి యుద్ధతి మెఱయన్
శరపంచకమున నొంచెను । బరఁగించెను మఱియు సప్తబాణము లొడలన్. 218

ప్రతిపదార్థం: కురుపతి= దుర్యోధనుడు; ధృష్టద్యుమ్నుని= ధృష్టద్యుమ్నుడియొక్క; ఉరవడిన్= విజృంభణమును; తగన్= ఒప్పుగా; నిలువరించి= ఆపుచేసి; ఉద్ధతి= గర్వం; మెఱయన్= ప్రకాశింపగా; శర= బాణములయొక్క; పంచకమునన్= అయిదింటితో; నొంచెను= బాధించెను; మఱియున్= ఇంకను; సప్త= ఏడు; బాణములు; ఒడలన్= దేహమునందు; పరఁగించెను= ప్రయోగించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడి వేగాన్ని ఒప్పుగా నిలుపుచేసి గర్వంతో ప్రకాశిస్తూ అయిదు బాణాలతో ధృష్టద్యుమ్నుడిని బాధించాడు. ఇంకా ఏడు బాణాలు దేహంలో ప్రయోగించాడు.

విశేషం: ఉస్మానియా ప్రతి ప్రకారం 'సప్తబాణము' అనే మాటకు బదులుగా 'నవతి బాణము' అని ఉన్నది. అయితే - 'ద్రోణహన్తార ముగ్రేషు - పునర్వివ్యాధ సప్తభిః' అని మూలం. అందువలన 'సప్త' పాఠమే ఒప్పుగా గ్రహించవలెను.

తే. అతఁడు డెబ్బది యమ్ముల నతని నొంప । నన్నరేంద్రుండుఁ జేడ్పడ ననుజసమితి
బలయుతంబుగ నడరి యబ్బలియు మీఁదఁ । గురిసి రస్త్రశస్త్రంబులు నరవరేణ్య! 219

ప్రతిపదార్థం: అతఁడు= అతడు (ధృష్టద్యుమ్నుడు); డెబ్బది; అమ్ములన్= బాణములతో; అతనిన్= ఆ దుర్యోధనుని; నొంపన్= బాధించగా; ఆ+నరేంద్రుండు= దుర్యోధనుడు; చేడ్పడన్= బాధపడగా; నర= నరులలో; వరేణ్య!= శ్రేష్ఠుడవు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అనుజ= తమ్ముయొక్క; సమితి= సమూహము; బలయుతంబుగన్= సైన్యసమేతముగా;

అడరి= విజృంభించి; ఆ; బలియుమీఁదన్= మిక్కిలి బలముకల ధృష్టద్యుమ్నుడి మీద; అస్త్ర= మంత్రపూతములయిన బాణములు; శస్త్ర= ఆయుధాలు; కురిసిరి= కురిపించిరి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ ధృష్టద్యుమ్నుడు డెబ్బదిబాణాలతో దుర్యోధనుడిని బాధించగా అతడి తమ్ములందరూ సైన్యసమేతులై మహా బలిష్ఠుడయిన ధృష్టద్యుమ్నుడిపై విజృంభించి అస్త్రశస్త్రాలను కురిపించారు.

క. ఆ పాంచాలోత్తముఁ డు । ద్దీపిత కోపుఁడయి వారిఁ దీవ్రతరశరా
టోపంబునఁ గలఁచె రయం । బేపారఁగ నాత్మసేన కేడ్తెఱ మెఱయన్. 220

ప్రతిపదార్థం: ఆ పాంచాలోత్తముఁడు= ఆ ధృష్టద్యుమ్నుడు; ఉద్దీపిత= ప్రజ్వలించిన; కోపుఁడయి= కోపము కలవాడయి; రయంబు= వేగము; ఏపారంగన్= అతిశయించగా; ఆత్మ= తనయొక్క; సేనకున్; ఏడ్తెఱ= పరాక్రమము; మెఱయన్= ప్రకాశించునట్లుగ; వారిన్= వారిని(అనగా సైన్య సమేతులయిన దుర్యోధనుడి తమ్ములను); తీవ్రతర= మిక్కిలి తీక్షణమయిన; శర= బాణములయొక్క; ఆటోపంబునన్= వేగిరపాటుతో; కలఁచెన్= కలతచెందించెను.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ప్రజ్వలించిన కోపం కలవాడై వేగం అతిశయించగా తన సైన్యానికి పరాక్రమం ప్రకాశించేటట్లుగా సైన్యసమేతులయిన దుర్యోధనుడి తమ్ములను మిక్కిలి తీక్షణములయిన బాణాలతో కలత చెందించాడు.

చ. కృప కృతవర్మలం గడిమిఁ గిట్టి శిఖండిప్రభద్రకుల్ మహో
గ్రపువడి దోడ్పడంగ భుజగర్వము సూపిన నా బలాఢ్యులుం
గుపితమనస్కులై బలుపుఁ గోల్తలఁ బేర్చినలావు చేవ క
య్యపువెర వేపు దాల్మి సరి నచ్చెరుపాటున ముంచెఁ జూపఱన్. 221

ప్రతిపదార్థం: శిఖండి; ప్రభద్రకుల్= పాంచాల క్షత్రియవీరులైన ప్రభద్రకులు; కృపకృతవర్మలన్= కృపుడు, కృతవర్మలను; కడిమిన్= మిక్కిలి పరాక్రమముతో; కిట్టి= సమీపించి; మహా= గొప్ప; ఉగ్రపు భయంకరమయిన; వడి= వేగము; తోడ్పడంగన్= సహాయపడగా; భుజగర్వము= బాహువులయొక్క దర్పము; చూపినన్= చూపించగా; ఆ; బలాఢ్యులు= బలవంతులు; కుపిత= కోపముతో కూడిన; మనస్కులు= మనస్సులు కలవారు; ఐ= అయి; బలుపున్= బలమైన; కోల్తలన్= యుద్ధ ప్రయత్నంతో; పేర్చినన్= విజృంభించగా; లావు= బలము; చేవ= ధైర్యము; కయ్యపు= యుద్ధమునకు సంబంధించిన; వెరవు= ఉపాయము; అతిశయము; తాల్మి= క్షమ; సరిన్= సమానముగా; చూపఱన్= చూచువారిని; అచ్చెరుపాటునన్= ఆశ్చర్యమునందు; ముంచెన్= ముంచెను.

తాత్పర్యం: శిఖండి ప్రభద్రకులు కృపకృతవర్మలను మిక్కిలి పరాక్రమంతో సమీపించి మహాభయంకరమైన వేగంతో బాహువుల దర్పం చూపించగా ఆ బలవంతులయిన ఆ కృపకృతవర్మలు కోపించిన మనస్సులు కలవారై బలంతో ఎదుట నిలిచి యుద్ధం చేయటానికి విజృంభించగా ఆ ఇరుపక్షాలయొక్క బలం, ధైర్యం, యుద్ధోపాయం, అతిశయం, క్షమ మొదలైన గుణాలు అన్నీ సమానంగా ఉన్నాయి. అట్టి సమానత్వం చూచువారిని ఆశ్చర్యంతో ముంచింది.

విశేషం: 'శిఖండీ కృతవర్మాణం గౌతమం చ మహారథమ్ । ప్రభద్రకైః సమాయుక్తో యోధయామాస ధన్వినౌ (శల్య - 15, 7) ఇది పై పద్యమునకు మూలం, దీనిని తిక్కన స్వీయ ఊహాపోహలతో అలతి అలతి అచ్చతెలుగు పద సంయోజనతో తన కవితా ప్రాభవాన్ని చంపకంగా సంతరించాడు.

వ. అప్పుడు శల్యుండు యుధిష్ఠిరభీమసేననకులసహదేవసాత్యకులపైఁ బటుబాణంబులు గుప్పించి నొప్పించిన. 222

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయమున; శల్యుండు; యుధిష్ఠిర= ధర్మరాజు; భీమసేన= భీముడు; నకుల సహదేవ; సాత్యకులపైన్= సాత్యకులమీద; పటు= శక్తిమంతములైన; బాణంబులు; కుప్పించి= కురిపించి; నొప్పించినన్; బాధించగా.

తాత్పర్యం: ఆ సమయంలో అనగా కృపకృతవర్మలు శిఖండి ప్రభద్రకులు పోరాడే సమయంలో శల్యుడు ధర్మజ భీమసేన నకుల సహదేవ సాత్యకులమీద శక్తిమంతములైన బాణాలు కురిపించి బాధించగా.

క. నకులుఁడు రభసంబున సా । యకదశక మతని యురంబునందుఁ జొనుప స
భ్రుకుటి యగుచు నయ్యల్లునిఁ । ద్రికాండముల నొంచి యతఁడు దీపించె నృపా! 223

ప్రతిపదార్థం: నృపా!= ధృతరాష్ట్ర మహారాజా!; నకులుఁడు; రభసంబునన్= శీఘ్రముగ; సాయక= బాణములు; దశకము= పది; అతని= ఆ శల్యుడి; ఉరమునందున్= వక్షఃస్థలమునందు; చొనుపన్= చొప్పించగ; సభ్రుకుటి= బొమముడి సహితుడు; అగుచున్= అగుచు; ఆ+అల్లునిన్= మేనల్లుడైన నకులుని; త్రికాండములన్= మూడు బాణములతో; నొంచి= నొప్పించి; అతఁడు= ఆ శల్యుఁడు; దీపించెన్= ప్రకాశించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నకులుడు శీఘ్రంగా పదిబాణాలు ఆ శల్యుడి వక్షఃస్థలంపై చొప్పించగా బొమముడి బిగించి మేనల్లుడైన నకులుడిని మూడు బాణాలతో నొప్పించి ఆ శల్యుడు ప్రకాశించాడు.

క. తక్కటినలువురు వొదివిన । నొక్కొకనిశరీరమున మహోగ్రాస్త్రంబుల్
పెక్కులు వెసఁ బఱపి మదం । బెక్కి నకులుధనువు దునిమె నిషుసహితముగన్. 224

ప్రతిపదార్థం: తక్కటి= మిగిలిన; నలువురు; పొదివినన్= క్రమ్ముకొనగ(చుట్టుముట్టగ); మహా= గొప్ప; ఉగ్ర= భయంకరమయిన; అస్త్రంబుల్= బాణములు; పెక్కులు= అనేకములు; ఒక్కొక్కని; శరీరమునన్; వెసన్= వేగముగా; పఱపి= ప్రయోగించి; మదంబు= గర్వము; ఎక్కి= పొంది; నకులు ధనువున్= నకులుడి యొక్క వింటిని; ఇషు= బాణముల; సహితంబుగన్= సమేతంగా; తునిమెన్= ఖండించెను.

తాత్పర్యం: నకులుడు కాక మిగిలిన నలుగురు శల్యుడిని చుట్టుముట్టగా మహాభయంకరాస్త్రాలు అనేకాలు ఒక్కొక్కడి దేహంలో వేగంగా ప్రయోగించి, గర్వం పొంది బాణసమేతంగా నకులుడి ధనువును ఖండించాడు.

వ. ఇట్లు శల్యుండు విజృంభించినఁ గోపించి. 225

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; శల్యుండు; విజృంభించినన్= అతిశయించగా; కోపించి= కోపం పొంది.

తాత్పర్యం: ఈ ప్రకారంగా శల్యుడు ధర్మజ భీమసేన సహదేవ సాత్యకి నకులులపై విజృంభించగా నకులుడు కోపించి. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. నకులుం డొండొక చాప మెత్తి పటుబాణశ్రేణిఁ బర్వింపఁ గీ
చకవిధ్వంసి నిగిడ్చె షష్టిశరముల్ శైనేయుఁ డుద్దీప్త సా
యకముల్ దొమ్మిది యేయ ధర్మసుతుఁ డీరైదమ్ము లమ్మద్రనా
యకుపై నన్నియుఁ బిన్నతమ్ముఁడును దోడై నాట నాటెం గడున్. 226

ప్రతిపదార్థం: నకులుండు; ఒండొక= మరియొక; చాపము= విల్లు; ఎత్తి= గ్రహించి; పటు= సమర్థమయిన; బాణ= బాణములయొక్క; శ్రేణిన్= వరుసను; పర్వింపన్= ప్రయోగించగా; కీచకవిధ్వంసి= భీముడు; షష్టిశరముల్= అరువది బాణములు; నిగిడ్చెన్= వ్యాపింపచేసెను; శైనేయుఁడు= సాత్యకి; ఉద్దీప్త= ప్రజ్వలించు; సాయకముల్= బాణములు; తొమ్మిది; ఏయన్= ప్రయోగించగా; ధర్మసుతుఁడు= ధర్మరాజు; ఈరైదమ్ములు= పదిబాణములు; ఆ; మద్రనాయకుపైన్= శల్యుడిపై; అన్నియున్= అన్నియును; పిన్న= చిన్న; తమ్ముఁడును; తోడై= సహాయకుడై; నాటన్= గ్రుచ్చగా; కడున్= మిక్కిలి; నాటెన్= క్రుచ్చెను.

తాత్పర్యం: నకులుడు మరియొక విల్లు గ్రహించి సమర్థమైన బాణాల వరుసలను ప్రయోగించగా, భీముడు అరువది బాణాలు వ్యాపింపచేయగా, సాత్యకి ప్రజ్వలించే బాణాలు తొమ్మిది ప్రయోగించగా, ధర్మరాజు పదిబాణాలు, చిన్న తమ్ముడు సహదేవుడు పదిబాణాలు ఆ శల్యుడిపై నాటారు.

తే. అతఁడు వెస నవసప్తతి శితశిలీము । ఖముల సాత్యకి నొంచి మార్గణముతోడ
ధనువు ద్రుంచి రథ్యమ్ముల ధరణిఁ గూల్చి । పదిపదుల్ బలుఁదూపులు వఱపె మేన. 227

ప్రతిపదార్థం: అతఁడు= అతడు (శల్యుడు); వెసన్= శీఘ్రముగ; నవసప్తతి= డెబ్బది తొమ్మిది; శిత= వాడి అయిన; శిలీముఖములన్= బాణములతో; సాత్యకిన్= సాత్యకిని; నొంచి= నొప్పించి; మార్గణముతోడన్= ఒక బాణముతో; ధనువు= విల్లు; త్రుంచి= ఖండించి; రథ్యమ్ములన్= గుర్రములను; ధరణిన్= భూమియందు; కూల్చి; పదిపదుల్= నూరు; బలు+తూపులు= బలమైన బాణములు; మేనన్= శరీరమునందు; పఱపెన్= ప్రయోగించెను.

తాత్పర్యం: శల్యుడు శీఘ్రంగా డెబ్బదితొమ్మిది వాడి బాణాలతో సాత్యకిని నొప్పించి, ఒక బాణంతో విల్లు ఖండించి, గుర్రాలను నేలకూల్చి, నూరుబలమైన బాణాలు ఆ సాత్యకి శరీరంపైన ప్రయోగించాడు.

క. ఇవ్విధమున శినివీరుని । క్రొవ్వు చెఱిచి పాండుపుత్రకుల బాణంబుల్
నివ్వటిలనీక నలువుర । నవ్వీరుఁడు నొవ్వ నేసె నద్భుతభంగిన్. 228

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ ప్రకారముగ; శినివీరుని= సాత్యకియొక్క; క్రొవ్వు; చెఱిచి= పోగొట్టి; పాండు= పాండురాజుయొక్క; పుత్రకుల= కుమారులయొక్క; బాణంబుల్; నివ్వటిలనీక= వ్యాపించనీయక; ఆ+వీరుఁడు= శూరుడు అయిన ఆ శల్యుడు; అద్భుత= ఆశ్చర్యకరమయిన; భంగిన్= విధముగ; నలువురను; నొవ్వన్ ఏసెన్= బాధపడునట్లు కొట్టెను.

తాత్పర్యం: ఈ ప్రకారంగా సాత్యకియొక్క క్రొవ్వు పోగొట్టి, పాండుపుత్రుల బాణాలు వ్యాపించనీయకుండా శూరుడయిన ఆ శల్యుడు ఆశ్చర్యకరమైన విధంగా ఆ నలువురను (ధర్మజ భీమ నకుల సహదేవులను) బాధించాడు.

ఉ. పాండవు లట్లు మద్రపతి బాణములం దెరలంగఁ జూచి తా
నొండొక తేరికిం జని సముద్ధతి సాత్యకి దాఁకె నాతనిం

జండతరప్రచారణవిశారదుఁడై వెస వారు గూడి యు
ద్దండత సూపి రక్కజపుదర్ప మెలర్పఁ బెనంగె నాతఁడున్. 229

ప్రతిపదార్థం: మద్రపతి= శల్యుడియొక్క; బాణములన్= బాణములవలన; పాండవులు; అట్లు= ఆ ప్రకారముగ; తెరలంగన్= తొలగిపోగా; చూచి; సాత్యకి; తాను; ఒండొక= మరియొక; తేరికిన్= రథముమీదకు; చని= వెడలి; చండతర= మిక్కిలి భయంకరమయిన; ప్రచారణ= సంచారమునందు; విశారదుఁడై= మహాపండితుడై; సముద్ధతి(న్)= మిక్కిలి దర్పముతో; ఆతని(న్)= ఆ శల్యుడిని; తాఁకెన్= ఎదిరించెను; వెసన్= శీఘ్రముగా; వారు= పాండవులు; కూడి= కలిసి; ఉద్దండత= ఆధిక్యము; చూపిరి; ఆతఁడున్= ఆ శల్యుడును; అక్కజపు= అధికమయిన (ఆశ్చర్యకరమయిన); దర్పము= గర్వము; ఎలర్పన్= అతిశయించగా; పెనంగెన్= పోరాడెను.

తాత్పర్యం: ఆ శల్యుడి యొక్క బాణాలవలన పాండవులు తొలగిపోవటం చూచి సాత్యకి మరొక రథమెక్కి భయంకర ప్రచారణ విశారదుడై గర్వంతో ఆ శల్యుడిని ఎదిరించాడు. వెంటనే పాండవులు కూడా కలిసి తమ ఆధిక్యం చూపారు. ఆ శల్యుడు అధికమైన గర్వం అతిశయించగా పోరాడాడు.

ఉ. ఏవురతోడ న ట్లొకఁడ యేచి పెనంగుటఁ గౌరవేంద్రయో
ధావళి చూచి కూడికొని యారథికోత్తముగాఢ విక్రమ
శ్రీవిలసిల్ల నంపపెనుఁజీఁకటి యాకసమెల్లఁ గప్పఁగాఁ
జేవయు లావుఁ జూపుటయుఁ జేడ్పడి రా ప్రతివీరులందఱున్. 230

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారముగ; ఒకఁడ= ఒక్కడే, ఏవురతోడన్= అయిదుగురితో; ఏచి= విజృంభించి; పెనంగుటన్= యుద్ధముచేయుటను; కౌరవ= కౌరవులకు; ఇంద్ర= ప్రభువు అయిన దుర్యోధనునియొక్క; యోధ= వీరులయొక్క; ఆవళి= సమూహము; చూచి; కూడికొని= కలిసికొని; ఆ; రథిక= రథికులలో; ఉత్తము= గొప్పవాడయిన శల్యుడియొక్క; గాఢ= అధికమయిన; విక్రమ= పరాక్రమముయొక్క; శ్రీ= శోభ; విలసిల్లన్= ప్రకాశింపగా; అంప= బాణములనెడి; పెను= పెద్ద; చీఁకటి; ఆకసము; ఎల్లన్= అంతటను; కప్పఁగాన్= కప్పివేయగా; చేవయున్= ధైర్యమును; లావున్= బలమును; చూపుటయున్= చూపించగా; ఆ ప్రతివీరులు= ఎదుటిపక్షపువీరులు; అందఱున్= అందరును; చేడ్పడిరి= బాధపడిరి.

తాత్పర్యం: ఆ ప్రకారంగా ఒక్క శల్యుడు అయిదుగురు పాండవులతో విజృంభించి యుద్ధం చేయటాన్ని దుర్యోధనుడి యోధసమూహం చూచి కలిసికొని, రథికశ్రేష్ఠుడు అయిన శల్యుడి అధికమైన పరాక్రమ శోభ ప్రకాశించగా బాణాల పెనుచీకటి ఆకాశమంతా కప్పివేయగా ధైర్యాన్ని, బలాన్ని చూపించగా, ఆ ప్రతివీరులయిన పాండవులు అందరూ బాధపడ్డారు.

వ. సేనయు నొక్కుమ్మడి నద్దిక్కు దఱిమినం గని కృష్ణార్జునులు నిజసైన్యంబు సమస్తంబు నేకముఖంబు సేసి మార్కొని రా సమయంబునఁ గిరీటి కృపకృతవర్మలను సహదేవుండు సౌబలుని ద్రౌపదేయులు గొందఱు రాజులను శిఖండి యశ్వత్థామను భీమసేనుండు సుయోధనునిఁ దాఁకఁ బాండవాగ్రజుండు దనకు నకులుండు బాసటగా శల్యు నిలువరించెఁ దక్కునుం గల యోధులుం దక్కటిసైనికులుం దలపడి క్రమంబున నెల్ల బలంబులును గలయం బెరసె నిట్లు నూల్కొని యంతకంతకు రణంబు సమ్మర్దదారుణం బయ్యె నత్తఱి

నమ్మద్రపతి రౌద్రంబు రూపుదాల్చిన తెఱంగునం బొంగి పాంచాలయాదవాది రథికవరులకును బాండు కుమారులకును వారింపఁ గొలఁదిగాక రథ చిత్రగతుల మెఱయ నెక్కడఁ జూచినం దానయై నానావిధవిశిఖ వితానంబుల(నింపి) నంబర భాగంబు సంపిహితంబు సేసిన మధ్యందినగతం బయ్యును మార్తాండబింబంబు దోఁపక యుండె నట్టియెడ. **231**

ప్రతిపదార్థం: సేనయున్= సైన్యమును; ఒక్కుమ్మడిన్= ఒక్కటిగా; ఆ+దిక్కు= ఆ వైపు; తఱిమినన్= వెంబడించి పరుగెత్తగా; కృష్ణార్జునులు; నిజ= తమయొక్క; సైన్యంబు= సేన; సమస్తంబును= అంతయును; ఏకముఖంబు= ఒక్కటిగా ఐక్యము; చేసి= కావించి; మార్కొనిరి= ఎదుర్కొనిరి; ఆ సమయంబునన్= ఆ సమయమునందు; కిరీటి= అర్జునుడు; కృపకృతవర్మలను= కృప కృతవర్మలను; సహదేవుండు; సౌబలునిన్= శకునిని; ద్రౌపదేయులు= ద్రౌపదిపుత్రులు; కొందఱు రాజులను; శిఖండి; అశ్వత్థామను; భీమసేనుండు; సుయోధనునిన్= దుర్యోధనుని; తాఁకన్= ఎదుర్కొనగ; పాండవ= పాండవులలో; అగ్రజుండు= పెద్దవాడయిన ధర్మరాజు; తనకున్; నకులుండు; బాసటగా= సహాయముగా; శల్యున్= శల్యుడిని; నిలువరించెన్= కదలకుండా నిలిపెను(ఆపెను); తక్కునుంగల= మిగిలిన; యోధులున్= వీరులును; తక్కటి= మిగిలిన; సైనికులున్= సైనికులును; తలపడి= కలియబడి; క్రమంబునన్= వరుసగా; ఎల్లబలంబులును= సమస్త సైన్యములును; కలయన్= కూడునట్లు (కలసిపోవునట్లు); బెరసెన్= వ్యాపించెను; ఇట్లు; నూల్కొని= కుదురుకొని; అంతకున్+అంతకున్= క్రమక్రమముగా; రణంబు= యుద్ధము; సమ్మర్ద= బాగుగా మర్దించునట్లుగా; దారుణంబు= భయంకరము; అయ్యెన్= అయ్యెను; ఆ+తఱిన్= ఆ సమయమున; ఆ+మద్రపతి= ఆ శల్యుడు; రౌద్రంబు= క్రోధము; రూపు= ఆకారము; తాల్చిన= ధరించిన; తెఱంగునన్= విధముగా; పొంగి= ఉత్సహించి(గర్వముతో ఉబ్బి); పాంచాల; ధృష్టద్యుమ్ను; యాదవ= సాత్యకి; ఆది= మొదలగు; రథిక= యోధులలో; వరులకును= శ్రేష్ఠులకును; పాండుకుమారులకును= పాండురాజు పుత్రులకును; వారింపన్= నివారించుటకు; కొలఁది= శక్యము; గాక= కాకుండా; రథ= రథముయొక్క; చిత్ర= చిత్ర విచిత్ర; గతులన్= గమనములతో; మెఱయన్= ప్రకాశించగా; ఎక్కడన్= ఏచోటు; చూచినన్= చూచినా; తానయై= తానే ఐ; నానావిధ= అనేక విధములయిన; విశిఖ= బాణముల; వితానంబులన్= సమూహములతో; అంబరభాగంబు= ఆకాశభాగము; సంపిహితంబు= బాగుగా కప్పబడినదిగా; చేసినన్= చేయగా; మధ్యందిన= మధ్యాహ్న సమయమును; గతంబు= పొందినది; అయ్యును= అయినప్పటికిని; మార్తాండబింబంబు= సూర్యబింబము; తోఁపక= కనబడకుండా; ఉండెను; అట్టిఎడన్= ఆ సమయమున.

తాత్పర్యం: సైన్యమంతా ఒక్కటిగా ఆ వైపు తరుమగా చూచి, కృష్ణార్జునులు తమ సైన్యం అంతా ఒక్కటిగా చేసి ఎదుర్కొన్నారు. ఆ సమయంలో అర్జునుడు, కృపకృతవర్మలను, సహదేవుడు శకునిని, ద్రౌపది పుత్రులు కొందరు రాజులను, శిఖండి అశ్వత్థామను, భీమసేనుడు సుయోధనుడిని ఎదుర్కొనగా, ధర్మరాజు తనకు నకులుడు సహాయకుడుగా శల్యుడిని నిలువరించాడు. మిగిలిన వీరులూ, మిగిలిన సైనికులూ కలియబడి క్రమంగా సమస్త సైన్యాలు అంతటా వ్యాపించాయి. ఈ ప్రకారంగా కుదురుకొని క్రమక్రమంగా యుద్ధం భయంకరమయింది. ఆ సమయంలో శల్యుడు క్రోధం ఆకారం ధరించిన విధంగా గర్వంతో పొంగి ధృష్టద్యుమ్నుడు, సాత్యకి మొదలైన యోధశ్రేష్ఠులకు పాండవులకు నివారింప శక్యంగాక రథంయొక్క చిత్ర గమనాలతో ప్రకాశించగా, ఏ చోట చూచినా తానే అయి అనేక విధాలయిన బాణాల సమూహాలతో ఆకాశభాగం నింపి వేయగా, మధ్యాహ్న సమయం అయింది. అయినప్పటికీ మార్తాండబింబం కనబడకుండా పోయింది. అట్టి సమయంలో.

సీ. **కరులఁ ద్రుంచెడువేళ గిరులఁ దున్మాడు సం । క్రందను కైవడిఁ గానవచ్చు**
నరదముల్ దెరలించునప్పుడు పఱమొగుల్ । విరియించుబలుగాడ్పు విధము మెఱయు

హయములఁ జెండాడ నరుగు చోట్లను లేళ్ళ । గమిఁ గిట్టు కోల్పులికరణి యొలయు

భటులకు నరుగుచోఁ బసలేని పెనుఁ గాన । దరికొనుచిచ్చుచందంబు గలుగు

తే. గసిమసంగిన యంతకుకరణి యంత్య । కాలరుద్రుని దర్ప మకాండ మృత్యు

ముఖము నుగ్రభావము దోఁచు మొనయు వీర । సమితిఁ దెగటార్చు నప్పు డా శల్యునందు. 232

ప్రతిపదార్థం: కరులన్= ఏనుగులను; త్రుంచెడు= ఖండించే; వేళన్= సమయంలో; గిరులన్= పర్వతములను; తునుము+ఆడు= ఖండించు; సంక్రందను= మహేంద్రుని; కైవడిన్= వలె; కానవచ్చున్= కనిపించును; అరదముల్= రథములు; తెరలించునప్పుడు= తొలగించునప్పుడు; పఱ= గొప్ప; మొగుల్= మేఘములు; విరియించు= చెదరగొట్టు; బలు= బలమయిన; గాడ్పు= గాలి; విధము; మెఱయున్= ప్రకాశించును; హయములన్= గుర్రములను; చెండాడన్= ఖండించుటకు; అరుగు= వెడలు; చోట్లను= చోటులందు(స్థలములను); లేళ్ళగమిన్= లేళ్ళయొక్క; గుంపును; కిట్టు= సమీపించు; కోల్పులి= పెద్దపులి; కరణి= విధము; ఒలయున్= పొందును; భటులకున్= భటులకొరకు; అరుగుచోన్= వెడలు నప్పుడు; పస= సారము; లేని; పెనున్= పెద్ద; కానన్= అడవిని; దరికొను= కాల్చు; చిచ్చు= అగ్ని; చందంబున్= విధము; కలుగున్= కలుగును; కసిమసంగిన= విజృంభించిన; అంతకుకరణి= యముని వలె; అంత్యకాల= ప్రళయకాల; రుద్రుని= రుద్రునియొక్క; దర్పము= గర్వము; అకాండ= ఆకస్మిక; మృత్యు= మృత్యువుయొక్క; ముఖము= ముఖముయొక్క; ఉగ్ర= భయంకరమయిన; భావము= భావము; మొనయు= మార్కొనునట్టి; వీర= యోధులయొక్క; సమితిన్= సమూహమును; తెగటార్చునప్పుడు= చంపు సమయమున; ఆ శల్యునందున్= ఆ శల్యునియందు; తోఁచున్= స్ఫురించును.

తాత్పర్యం: ఏనుగులను ఖండించే సమయంలో పర్వతాలను ఖండించే మహేంద్రుడివలె కనిపించాడు. రథాలు తొలగించేటప్పుడు మేఘాలు చెదరగొట్టే బలమయిన గాలి విధంగా ప్రకాశించాడు. గుర్రాలను ఖండించటానికి వెడలేచోట్లలో లేళ్ళగుంపును సమీపించే పెద్దపులివలె వ్యాపించాడు. భటుల కొరకు వెడలేటప్పుడు సారంలేని పెద్ద అడవిని కాల్చే అగ్నివలె అయ్యాడు. విజృంభించిన యముడివలె ప్రళయకాల రుద్రుడి దర్పం ఆకస్మిక మృత్యుముఖం, భయంకరమైన భావం ఎదిరించే యోధసమూహాన్ని చంపేటప్పుడు ఆ శల్యుడి యందు ఉదయించాయి.

విశేషం: అలం: ఉపమ. రూపకం. ఈ సీసపద్యంలో తిక్కన శల్యుడి అతిలోక భయంకర పరాక్రమాన్ని వర్ణించాడు. మొదటిపాదంలో ఇంద్రుడితో ఉపమించాడు. రెండవపాదంలో గాడ్పుతో ఉపమించాడు. మూడవపాదంలో పెద్దపులితో ఉపమించాడు. నాలుగవపాదంలో అగ్నితో ఉపమించాడు. ఎత్తుగీతలో యముడితో, రుద్రుడితో ఉపమించాడు. ఇట్లా ఉపమాలంకార మాలికను శల్యుడికి కంఠహార మొనర్చాడు. అట్లే కరులకు గిరులకు అరదములకు పఱమొగులులకు హయములకు లేళ్ళకు భటులకు కాననమునకు అభేదం పరికల్పించి రూపకమర్యాద పాటించాడు. ఈ సీసపద్యవర్ణన అమూలకం. ఇది తిక్కన స్వీయ కవితావైభవానికి ఉదాహరణం.

వ. ఇట్లు విజృంభించి యత్యద్భుత విక్రమంబున నుల్లసిల్లు నమ్మద్రమహీపతి నుభయసైన్యంబులజనంబులు ప్రశంసించి రంత కంతకు నగ్గలంబగు నగ్గలికఁ జెలంగి యతండు భల్లాదికాండపరంపరలు పటురయంబునఁ బరఁగించు పరమాభీలభంగికి నోహటించి ధర్మజుమోహరంబు దెరలి మరలి పఱవం దొడంగిన నన్నర వరుం డదల్చి కరతలం బెత్తి నిలునిలు మని నివారింప నిలువ దయ్యె. నయ్యుధిష్ఠిరుండు పౌరుషంబు పెంపునఁ దెంపు సేసి యా శల్యునిఁ దాఁకి దర్పంబు సూపినం జూచి మగుడ నిగిడి సేన పోరికిం బురికొనియె నప్పుడు పాండవాగ్రజుండు దమ్ములను దొరలను దనపాలికిఁ బిలువం బంచి వారలతో నిట్లనియె. 233

ప్రతిపదార్థం: ఇట్లు; విజృంభించి; అతి= మిక్కిలి; అద్భుత= ఆశ్చర్యకరమయిన; విక్రమంబునన్= పరాక్రమంతో; ఉల్లసిల్లన్= ప్రకాశింపగా; ఆ; మద్రమహీ= మద్రభూమికి; పతిన్= భర్తఅయిన శల్యుడిని; ఉభయ= ఇరుపక్షములయొక్క; సైన్యంబులు= సేనలయొక్క; జనంబులు= జనులు; ప్రశంసించిరి= మెచ్చుకొనిరి(స్తుతించిరి); అంతకంతకున్= క్రమక్రమముగా; అగ్గలంబు= అధికము; అగు; అగ్గలికన్= శౌర్యముతో; చెలంగి= ఉత్సాహముపొంది, అతండు= ఆ శల్యుడు; భల్ల= బల్లెము; ఆది= మొదలగు; కాండ= బాణములయొక్క; పరంపరలు= వరుసలు; పటు= సమర్థమయిన(మిక్కిలి); రయంబునన్= వేగముగా; పరఁగించు= ప్రవర్తించు; పరమ= అత్యంతమైన; ఆభీల= భయంకరమయిన; భంగికిన్= విధమునకు; ఓహటించి= వెనుదీసి; ధర్మజు= ధర్మరాజుయొక్క; మోహరంబు= సేనావ్యూహము; తెరలి= తొలగి; మరలి= వెనుతిరిగి; పఱవన్= పరుగుపెట్టుటకు; తొడంగినన్= ప్రారంభించగా; ఆ; నర= నరులలో; వరుండు= శ్రేష్ఠుడయిన ధర్మరాజు; అదల్చి= అదలించి (గద్దించి); కరతలంబు= హస్తతలము(చేయి); ఎత్తి= పైకెత్తి; నిలుము+నిలుము= ఆగుము ఆగుము; అని; నివారింపన్= నిరోధించగా (అడ్డగించగా); నిలువదు= ఆగనిది; అయ్యెన్= అయ్యెను; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు; పెంపునన్= ఆధిక్యమువలన; తెంపు= సాహసము; చేసి; ఆ శల్యునిన్; తాఁకి= ఎదిరించి; దర్పంబు= గర్వము; చూపినన్= చూపించగా; చూచి; మగుడన్= మరల; నిగిడి= విజృంభించి; సేన= సైన్యము; పోరికిన్= పోరాటమునకు; పురికొనియెన్= క్రమ్ముకొనెను; అప్పుడు; పాండవ+ అగ్రజుండు= ధర్మరాజు; తమ్ములను; దొరలను= రాజులను; తన; పాలికిన్= దగ్గరకు; పిలువన్= పిలువగా; పంచి; వారలతోన్= వారలతో; ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: ఈ ప్రకారంగా శల్యుడు విజృంభించి మిక్కిలి ఆశ్చర్యకరమైన పరాక్రమంతో ప్రకాశించగా ఆ శల్యుడిని ఇరుపక్షాల సైనికులు మెచ్చుకొన్నారు. అంతట క్రమక్రమంగా అధికమైన శౌర్యంతో ఉత్సహించి శల్యుడు బల్లెం మొదలైన బాణాల వరుసలు మిక్కిలి వేగంగా ప్రవర్తించే అత్యంత భయంకరమైన విధానికి వెనుదీసి ధర్మరాజు సేన తొలగి మరలి వెనుతిరిగి పరుగిడటానికి ప్రారంభించగా వారిని అదలించి చేయిపైకెత్తి, నిలునిలుడని అడ్డగించగా ఆ సైన్యం ఆగనిది అయింది. ఆ ధర్మరాజు పరాక్రమంతో సాహసించి ఆ శల్యుడిని ఎదిరించి గర్వం చూపగా మరల విజృంభించి సైన్యం పోరాటానికి క్రమ్ముకొన్నది. అప్పుడు ధర్మరాజు తమ్ములను రాజులను తన దగ్గరకు పిలిపించి వారలతో ఇట్లా అన్నాడు:

చ. **అమరనదీసుతాదులగు నక్కడివీరుల మీర లందఱుం**
గ్రమమునఁ బిల్కుమార్చి భుజగర్వము సూపితి రేను శత్రుసై
న్యమథనకల్యు శల్యుఁ దెగటార్చెద నాకిది కృత్య మీసము
ద్యమ మనివార్యమై నెగడునట్టి తెఱంగు వినుండు చెప్పెదన్. 234

ప్రతిపదార్థం: అమరనదీ= దేవనదిఅయిన గంగానదియొక్క; సుత= కుమారుడగు భీష్ముడు; ఆదులగు= మొదలగు; అక్కడి= ఆ చోటునందలి అనగా(కౌరవ పక్షమునందలి); వీరులన్= శూరులను; మీరలు= మీరు; అందఱున్= అందరును; క్రమమునన్= వరుసగా; పిల్కుమార్చి= చంపి; భుజగర్వము= భుజములయొక్క దర్పము; చూపితిరి= చూపితిరి; ఏను= నేను; శత్రు= విరోధులయొక్క; సైన్య= సైన్యమును; మథన= మథించుటయందు; కల్యున్= నేర్పరి అయిన; శల్యున్= శల్యుని; తెగటార్చెదన్= చంపెదను; నాకు; ఇది; కృత్యము= చేయదగిన కార్యము; ఈ సముద్యమము= ఈ గొప్ప ప్రయత్నము; అనివార్యమై= నివారింపశక్యము కానిదియై(అడ్డులేనిదియై); నెగడునట్టి= వర్ధిల్లునట్టి; తెఱంగు= మార్గము(క్రమము); చెప్పెదన్= చెప్పెదను; వినుండు= వినుడు.

తాత్పర్యం: 'భీష్మద్రోణకర్ణాది శూరులను మీరు అందరూ వరుసగా చంపి భుజగర్వం చూపారు. నేను విరోధి సైన్యాన్ని మథించటంలో నేర్పరి అయిన శల్యుడిని చంపుతాను. నాకు ఇది చేయదగిన కార్యం. ఈ ప్రయత్నం నివారించ శక్యం కానిది అయి నెరవేరే మార్గం చెపుతాను వినండి.

వ. 'నా తేరికి నకులుఁడును సాత్యకియు వలపటను సహదేవుండును ధృష్టద్యుమ్నుండును డాపటను గావలియై రావలయు వెనుకం గదిసి విష్వచ్చుండును ముందటి కెలన మొనసి వడముడియును నడచునది యింత యేమిటి కనవలదు నన్నొండె నతం డతని నొండె నేను సమయించుట యవశ్యంబును గలుగం జూచితి నిట్లు తెంపుచేసి యమ్మద్రపతి మార్కొను నాకు దుర్దమప్రయత్నంబు కర్తవ్యంబు. కృపకృతవర్మాశ్వత్థామ సౌబల సుయోధనుల య్యోధముఖ్యు రక్షింపం జేయు పరాక్రమంబునకు మీరు ప్రతివిక్రమం బాచరించుచుండ నుదీర్ణంబగు మదీయబాహుపాటవంబున నమ్మేటిమగని గీటడఁగించువాఁడ' నని పలికిన నారథికవరులును దక్కునుగలవార లమ్మానవపతి పూనికి నగ్గించి యతని రథంబు సవిశేషకల్పితంబు గావించి యతండు సెప్పినతెఱంగున సన్నద్ధులై సముద్ధతిం దేజరిల్లుటయుఁ దత్సైన్యం బుత్సాహదీప్తంబై కడంగినఁ గరిఘంటారవంబులును రథనేమినిస్వనంబులును దురంగకింకిణీక్వణనంబులును సుభట సింహనాదంబులును నిస్సాణాదితూర్యనినదంబులును బెరసి యంబరంబు పిక్కటిల్లఁ జేసె. నివ్విధంబున యుధిష్ఠిరుం డుద్భటుండై యురవడించిన. 235

ప్రతిపదార్థం: నా తేరికిన్= నా యొక్క రథమునకు; నకులుఁడును; సాత్యకియు; వలపటను= కుడివైపున; సహదేవుండును; ధృష్టద్యుమ్నుండును; డాపటను= ఎడమవైపున; కావలియై= రక్షకులై; రావలయున్= రావయును; వెనుకన్= వెనుకవైపు; కదిసి= దగ్గరగా ఉండి; విష్వచ్చుండును= అర్జునుడును; ముందటికెలనన్= ముందువైపున; మొనసి= పూని; వడముడియును= భీముడును; నడచునది= నడువవలయును; ఇంత= ఇదియంతయు; ఏమిటికిన్= ఎందులకు; అనవలదు= అనరాదు; అతండు= శల్యుడు; నన్నొండెన్= నన్నో; అతనిన్= శల్యుడిని; నేను ఒండెన్= నేనో; సమయించుట= సంహరించుట; అవశ్యంబును= తప్పకుండా; కలుగన్= అగునట్లుగా; చూచితిని; ఇట్లు; తెంపు= సాహసము; చేసి; ఆ+మద్రపతిన్= ఆ శల్యుడిని; మార్కొను= ఎదుర్కొను; నాకున్; దుర్దమ= అణపశక్యంకాని; ప్రయత్నంబు= మిక్కిలి యత్నము; కర్తవ్యంబు= చేయదగినది; కృప= కృపుడును; కృతవర్మ= కృతవర్మయును; అశ్వత్థామ= అశ్వత్థామయును; సౌబల= శకునియు; సుయోధనులు= దుర్యోధనుడును; ఆ+యోధముఖ్యున్= ఆ యోధ వీరులలో ప్రముఖుడయినవానిని (శల్యుడిని); రక్షింపన్= కాపాడుటకు; చేయు= చేసెడి; పరాక్రమంబునకున్= పౌరుష సామర్థ్యమునకు; మీరు; ప్రతి= సరిఅయిన; విక్రమంబు= పరాక్రమము; ఆచరించుచుండన్= ఆచరించుచుండగా; ఉదీర్ణంబు= పెరిగినది; అగు= అయినట్టి; మదీయ= నా యొక్క; బాహు= భుజములయొక్క; పాటవంబునన్= శక్తివలన (సామర్థ్యమువలన); ఆ; మేటి= గొప్ప; మగని= వీరుని; గీటఁడగించు= నశింపచేయు; వాఁడన్= వాడను; అని; పలికినన్= పలుకగా; ఆ రథికవరులును= ఆ యోధ శ్రేష్ఠులును; తక్కును= ఇంకను; కల= ఉన్నట్టి; వారలున్= వారును; ఆ+మానవపతి= ఆ ధర్మరాజుయొక్క; పూనికిన్= ప్రయత్నము; అగ్గించి= స్తుతించి; అతని రథంబున్= ఆ ధర్మజుడి రథాన్ని; సవిశేష= అతిశయముతో; కల్పితంబు= నిర్మాణము; (నిర్మితము); కావించి= చేసి; అతండు; చెప్పిన; తెఱంగునన్= ప్రకారంగా; సన్నద్ధులై= సంసిద్ధులై; సముద్ధతిన్= మిక్కిలి గర్వముతో; తేజరిల్లుటయున్= ప్రకాశించుటయు; తద్+సైన్యంబు= ఆ సైన్యము; ఉత్సాహ= ప్రయత్నమువలన; దీప్తంబై= ప్రకాశించుచున్నది అగుచు; కడంగినన్= యత్నించగా; కరి= ఏనుగులయొక్క; ఘంటా= గంటలయొక్క; రవంబులును= ధ్వనులును; రథ= రథములయొక్క; నేమి= కమ్మల యొక్క; నిస్వనంబులును= ధ్వనులును; తురంగ= గుర్రముల యొక్క; కింకిణీ= చిరుగంటలయొక్క(మువ్వల

యొక్క); క్వణనంబులును= ధ్వనులును; సుభట= మంచి భటులయొక్క; సింహనాదంబులును= సింహగర్జనలవలన పుట్టిన ధ్వనులును; నిస్సాణ= డప్పులు; ఆది= మొదలగు; తూర్య= బూరాలయొక్క; నినదంబులున్= ధ్వనులును; బెరసి= వ్యాపించి; అంబరంబు= ఆకాశము; పిక్కటిల్లన్= ధ్వనించునట్లు; చేసెను; ఈ+విధంబున= ఈ ప్రకారముగ; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఉద్భటుండై= అధికుడై; ఉరవడించినన్= వేగిరపడగా.

తాత్పర్యం: 'నా రథానికి నకులుడు, సాత్యకి కుడివైపున సహదేవుడు, ధృష్టద్యుమ్నుడు ఎడమవైపున, రక్షకులై రావయును. వెనుకవైపు దగ్గరగా ఉండి అర్జునుడు, ముందు భీముడు నడువవలెను. ఇది అంతా ఎందులకు అని అడుగవద్దు. శల్యుడు నన్నో, శల్యుడిని నేనో సంహరించటం తప్పకుండా జరుగవలెనని చూచాను. ఈ ప్రకారంగా సాహసం చేసి ఆ శల్యుడిని ఎదుర్కొనే నాకు కఠినతరమైన యత్నం చేయతగింది. కృప కృతవర్మ అశ్వత్థామ శకుని దుర్యోధనులు ఆ శల్యుడిని కాపాడటానికి చేసే పురుషయత్నానికి మీరు దానికి మారుగా పరాక్రమం చూపాలి. అధికమైన నా బాహుబలంవలన ఆ మహావీరుడిని సంహరించగలవాడను.' ధర్మరాజు ఈ విధంగా పలుకగా ఆ యోధ శ్రేష్ఠులు ఇంకను మిగిలినవారు ఆ ధర్మరాజు ప్రయత్నాన్ని మెచ్చి, అతడి రథాన్ని చక్కగా సన్నద్ధం చేసి, ఆ ధర్మరాజు చెప్పిన విధంగా యుద్ధానికి సంసిద్ధులై మిక్కిలి గర్వంతో ప్రకాశించగా ఆ సైన్యం ఉత్సాహంతో ప్రజ్వలించి యుద్ధం చేయటానికి ప్రయత్నించగా గజసైన్యంయొక్క గంటల ధ్వనులు, రథముల నేమి ధ్వనులు, గుర్రాల చిరుగంట మ్రోతలు, భటుల సింహగర్జనలనుండి వెడలిన ధ్వనులు, డప్పులు మొదలైన వాద్యాల ధ్వనులు వ్యాపించి ఆకాశం నిండిపోయాయి. ఈ ప్రకారంగా ధర్మరాజు అధికుడై తొందర పడుతుండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

శల్య ధర్మనందనుల ద్వంద్వయుద్ధము (సం.9-15-54)

క. కురువిభుఁడు దనదు మొనలకు । బరవస మొప్పంగ మద్రపతి మును శౌర్యో
ద్ధురుఁడయి కడఁగ నడరి య । వ్వరూథినిం దాఁకె ధరణి వడవడ వడఁకన్. 236

ప్రతిపదార్థం: కురువిభుఁడు= దుర్యోధనుఁడు; తనదు= తనయొక్క; మొనలకున్= సేనలకు; బరవసము= ధైర్యము; ఒప్పంగన్= ఒప్పునట్లు చేయగా; మద్రపతి= శల్యుడు; మును= ముందుగా; శౌర్య= పరాక్రమంతో; ఉద్ధురుఁడు+అయి= గర్వం కలవాడై; కడఁగన్= పూనిక వహించగా; అడరి= చెలరేగి; ధరణి= భూమి= వడవడ= గడగడ; వడఁకన్= కంపించగా; ఆ; వరూథినిన్= పాండవ సైన్యమును; తాఁకెన్= ఎదుర్కొనెను.

తాత్పర్యం: దుర్యోధనుడు తన సేనలకు ధైర్యం కలిగించగా శల్యుడు పరాక్రమంతో గర్వసహితుడై పూనిక వహించి, అతిశయించి భూమి గడగడ కంపించేటట్లు ఆ పాండవసైన్యాన్ని ఎదుర్కొన్నాడు.

వ. అట్టియెడ. 237

తాత్పర్యం: ఆ సమయంలో.

తే. పులులు దలపడిన యుబ్బును । బలుపును దోఁపంగ మద్రపతిధర్మసుతుల్
తలపడి యొండొరువులపై । నలఘుప్రదరములు వఱపి రధికరయమునన్. 238

ప్రతిపదార్థం: పులులు= పెద్ద పులులు; తలపడిన= కలియబడిన; ఉబ్బును= సంతోషమును; బలుపును= బలమును; తోఁపంగన్= తోచగా(అనిపించగా); మద్రపతి= శల్యుడు; ధర్మసుతుల్= యమధర్మరాజుయొక్క పుత్రుడు అయిన ధర్మరాజు; ఒండొరులపైన్= ఒకరిమీద ఒకరు; తలపడి= కలియబడి; అలఘు= తేలికకాని; ప్రదరములు= బాణములు; అధిక= మిక్కిలి; రయమునన్= వేగముగా; పఱపిరి= ప్రయోగించిరి.

తాత్పర్యం: పెద్దపులులు కలియబడిన సంతోషం, ఉత్సాహం బలం తోచేటట్లు శల్యధర్మరాజులు కలియబడి ఒకరిపై ఒకరు మిక్కిలి వేగంగా బలమైన బాణాలు ప్రయోగించారు.

వ. వారి నాలోకించి యుభయసైన్యంబులు విజృంభించి సంరంభంబునం గలయం బెరసినఁ గ్రందుకయ్యం బయ్యె నందు. 239

ప్రతిపదార్థం: వారిన్= ఆ శల్య ధర్మరాజులను; ఆలోకించి= చూచి; ఉభయ= రెండు; సైన్యంబులు= సేనలు; విజృంభించి= అతిశయించి; సంరంభంబునన్= వేగిరపాటుతో; కలయన్= కలియబడి; బెరసినన్= వ్యాపించగా; క్రందుకయ్యంబు= దొమ్మియుద్ధము; అయ్యెన్; అందున్= ఆ యుద్ధంలో.

తాత్పర్యం: ఆ శల్య ధర్మరాజుల యుద్ధాన్ని చూచి రెండు సైన్యాలు విజృంభించి వేగిరపాటుతో కలియబడి వ్యాప్తి చెందగా దొమ్మియుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో.

ఉ. నీ తనయుండు సింహకమనీయతరం బగు భీమునుల్లస
త్కేతన మర్ధచంద్రశరతీవ్రహతిన్ మణికింకిణీనినా
దాతిశయంబుతోడఁ బడునట్లుగ నేసి శరాసనంబు బల్
వాతిశరంబునం దునిమె వారివరూథిని యేపడంగఁగన్. 240

ప్రతిపదార్థం: నీ; తనయుండు= కుమారుఁడు; సింహ= సింహముచేత; కమనీయతరంబు= మిక్కిలి సుందరము; అగు= అయినట్టి; భీముని; ఉల్లసత్= ప్రకాశించుచున్న; కేతనము= టెక్కెము (జెండాకొయ్య); అర్ధచంద్ర= అర్ధచంద్రుడియొక్క ఆకారముగల; శర= బాణముయొక్క; తీవ్ర= గట్టి; హతిన్= దెబ్బతో; మణులయొక్క; కింకిణీ= మువ్వలయొక్క; నినాద= ధ్వనులయొక్క; అతిశయంబుతోడన్= విజృంభణముతో; పడునట్లు= పడిపోవునట్లు; ఏసి= కొట్టి; శరాసనంబు= విల్లు; బల్= బలమయిన; వాతి= వెడద (వాయి= నోరు; వాతి= నోరుగల); శరంబునన్= బాణముతో; వారి; వరూథిని= సేనయొక్క; ఏపు= పెంపు; అడంగఁగన్= అణగిపోవునట్లుగా; తునిమెన్= ఖండించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీయొక్క పుత్రుడు దుర్యోధనుడు సింహసౌందర్యం గల భీముడి ప్రకాశవంతమైన జెండాకొయ్య అర్ధచంద్రాకృతి గల బాణంతో మణుల మువ్వల ధ్వనులతో కూడి పడిపోయేటట్లు కొట్టి, బలమయిన వెడద బాణంతో ఆ పాండవుల సేనల పెంపు నశించేటట్లు భీముడి విల్లును ఖండించాడు.

చ. అతఁడు ప్రదీప్తకోపముఖుఁడై పటుశక్తి నురంబు వైచినం
బతి యరదంబుపైఁ బడియె బల్వగుమూర్ఛమునింగి యప్ప డా
యతధను వెత్తి సూతుతల యక్కురుఘస్మరుఁ డేసి డొల్ల వే
గ తొలఁగ నీడ్చెఁ దేరు దురగంబులు మూఁక గలంగి సొం పఱన్. 241

ప్రతిపదార్థం: అతఁడు= భీముడు; ప్రదీప్త= ప్రజ్వలించిన; కోప= క్రోధముగల; ముఖుఁడై= ముఖముగలవాడై; పటు= కఠినమయిన; శక్తిన్= శక్తి అను ఆయుధముతో; ఉరంబు= వక్షఃస్థలము; వైచినన్= కొట్టగా; బల్వు= బలమయిన; అగు= అయినట్టి; మూర్ఛ= మూర్ఛయందు; మునింగి= మునిగిపోయి; పతి= దుర్యోధనుఁడు; అరదంబు పైన్= రథముపై; పడియెన్= పడిపోయెను; అప్పుడు= ఆ సమయమున; ఆ+కురు ఘస్మరుఁడు= కౌరవ సంహారకుడైన భీముడు; ఆయత= పొడవు అయిన; ధనువు= విల్లు; ఎత్తి= పట్టుకొని; సూతుతల= సూతుని యొక్క తల; డొల్లన్= దొర్లునట్లు; ఏసెన్= కొట్టెను; తేరు= రథము; తురగంబులు= గుఱ్ఱములు; తొలఁగన్= తొలఁగునట్లు; వేగ= వేగముగ; మూఁక= సైన్యము (కురుసైన్యము); కలంగి= కలతచెంది; సొంపు= సంతోషము; అఱన్= నశించునట్లుగా; ఈడ్చెన్= ఈడ్చెను.

తాత్పర్యం: భీముడు ప్రజ్వలిస్తున్న క్రోధంగల ముఖం కలవాడై సమర్థమైన శక్తితో వక్షఃస్థలాన్ని కొట్టగా దుర్యోధనుడు మూర్ఛలో మునిగిపోయి రథంపై పడిపోయాడు. ఆ సమయంలో కురు సంహారకుడైన భీముడు ఒక పెద్ద విల్లు పట్టుకొని సూతుడి శిరస్సు నేల దొర్లేటట్లు కొట్టాడు. తరువాత వేగంగా కురుసైన్యం కలతచెంది సంతోషం నశించేటట్లుగా రథాన్ని గుఱ్ఱాలు దూరంగా తొలగేటట్లు లాగుకొని పోయాయి.

క. కని యశ్వత్థామయుఁ గృపుఁ। డును గృతవర్ముఁడును నెక్కుడు బరవసమునన్
మనసేనకుఁ దలమిగిలిన। మనుజేశ్వర! కవిసెఁ గ్రీడి మద మెలరారన్. 242

ప్రతిపదార్థం: మనుజ= మానవులకు; ఈశ్వర!= పాలకుడవు అయిన ధృతరాష్ట్ర మహారాజ!; అశ్వత్థామయును; కృపుఁడును; కృతవర్ముఁడును; ఎక్కుడు= మిక్కిలి; బరవసమునన్= ధైర్యముతో; మనసేనకున్= మనసైన్యమునకు; తలమిగిలిన= ముందు మిగులగా; క్రీడి= అర్జునుడు; మదము= గర్వము; ఎలరారన్= అతిశయించగా; కవిసెన్= కలియబడెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అశ్వత్థామ కృప కృతవర్మలు మిక్కిలి ధైర్యంతో మన సైన్యానికి ముందుగా రాగా అర్జునుడు గర్వంతో విజృంభించి కలియబడ్డాడు.

క. అమ్ముఖమున సమరము రౌ। ద్రమ్ము పెనిచె మద్రవిభునిఁ దలకడచి యనీ
కమ్ము బహులాస్త్రశస్త్ర చ। యమ్ముల ధర్మజునిఁ బొదివె నత్యుగ్రమునన్. 243

ప్రతిపదార్థం: ఆ+ముఖమునన్= సేనాగ్రభాగమున; సమరము= యుద్ధము; రౌద్రమ్ము= క్రోధము; పెనిచెన్= పెంచెను; అనీకమ్ము= సైన్యము; మద్ర= మద్రదేశముయొక్క; విభునిన్= ప్రభువు అయిన శల్యుడిని; తలకడచి= అతిక్రమించి; బహుల= అనేకములయిన; అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములయొక్క; శస్త్ర= సామాన్య ఆయుధములయొక్క; చయమ్ములన్= సమూహములతో; అతి= మిక్కిలి; ఉగ్రముగన్= భయంకరంగా; ధర్మజునిన్= ధర్మరాజును; పొదివెన్= క్రమ్ముకొనెను.

తాత్పర్యం: ఆ సేనాగ్రభాగంలో యుద్ధం క్రోధాన్ని పెంచింది. అశ్వత్థామాదులతో కూడిన సైన్యం శల్యుడిని దాటి వెడలి, అనేకాలయిన అస్త్రశస్త్రసమూహాలతో మహాభయంకరంగా ధర్మరాజును చుట్టుముట్టింది.

వ. పొదివిన నయ్యుధిష్ఠిరుండు. 244

ప్రతిపదార్థం: పొదివినన్= చుట్టుముట్టగా; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు.

తాత్పర్యం: చుట్టుముట్టగా ఆ ధర్మరాజు.

చ. అరదము చిత్రసంచరణ మక్కజమై విలసిల్లఁ దేరులుం
గరులును ఘోటకంబులును గాల్బలముం దనచేతఁ గూలఁగాఁ
బొరలఁగ మేదినిం దునియ ప్రోవులుగా రుధిరంపురొంపి బ్రుం
గ రణవిహారముం జలిపెఁ గౌరవనాథ! యనేకభంగులన్. 245

ప్రతిపదార్థం: కౌరవనాథ!= ధృతరాష్ట్ర మహారాజా!; అరదము= రథము; చిత్ర= వివిధములగు; సంచరణము= సంచారము; అక్కజమై= ఆశ్చర్యకరమై; విలసిల్లన్= ప్రకాశింపగా; తేరులున్= రథములును; కరులును= ఏనుగులును; ఘోటకంబులును= గుర్రాలును; కాల్బలమున్= పదాతిదళమును; తనచేతన్= తనచేత; కూలఁగాన్= చావగా; మేదినిన్= భూమిపై; తునియ= ముక్కలయొక్క; ప్రోవులుగాన్= ప్రోగులుగా; పొరలఁగన్= దొర్లగా; రుధిరంపు= రక్తముయొక్క; రొంపిన్= బురదయందు; బ్రుంగన్= మునుగగా; అనేక= పలు; భంగులన్= విధములుగా; రణ= యుద్ధమునందు; విహారమున్= విహారమును; చలిపెన్= చేసెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ ధర్మరాజు తన రథం వివిధ గతుల సంచారంతో అధికంగా ప్రకాశించగా రథాలు, ఏనుగులు, గుర్రాలు, పదాతిదళము తనచేత చంపబడగా భూమిపై ముక్కలు ప్రోవులుగా పొర్లగా రక్తం బురదలో మునుగగా పలువిధాలుగా యుద్ధంలో వేడుకగా తిరిగాడు.

క. నరులు మృదు వితఁ డనంగాఁ । బరఁగు యుధిష్ఠిరుఁడు శత్రుబలముల కతి ని
ష్ఠురుఁ డయ్యె నపుడు సుర ల । చ్చెరువందిరి చూచి ద్రోణు శిక్షఁ బొగడుచున్. 246

ప్రతిపదార్థం: నరులు= మనుజులు; ఇతఁడు(అనగా ధర్మరాజు); మృదువు= మెత్తనివాడు; అనంగాన్= అనగా; పరఁగు= ఒప్పు; యుధిష్ఠిరుఁడు= ధర్మరాజు; శత్రుబలములకున్= విరోధిసేనలకు; అతి= మిక్కిలి; నిష్ఠురుఁడు= కఠినుడు; అయ్యెను; అపుడు= ఆ సమయమున; సురలు= దేవతలు; చూచి; ద్రోణు= ద్రోణునియొక్క; శిక్షన్= శిక్షణమును; పొగడుచున్= పొగడుచు(స్తుతించుచు); అచ్చెరువు= ఆశ్చర్యము; అందిరి= పొందిరి.

తాత్పర్యం: మనుజులు 'ఈతడు మృదుహృదయు' డని అనగా ఒప్పే ధర్మరాజు విరోధిబలాలకు మిక్కిలి కఠిన హృదయుడయ్యాడు. ఆ సమయంలో దేవతలు చూచి ద్రోణుడి శిక్షణను పొగడుతూ ఆశ్చర్యం పొందారు.

క. మునుము బయలైన నలిఁ బే । ర్చినయమ్మనుజేంద్రుమీఁద శితవిశిఖము లే
పున నిగిడించుచు శల్యుఁడు । దనరు భుజాబలముతోడఁ దటిమెం బెలుచన్. 247

ప్రతిపదార్థం: మునుము= ముందుభాగం; బయలు= శూన్యము; ఐనన్= అయినను; నలిన్= ఉత్సాహంతో; పేర్చిన= విజృంభించిన; ఆ; మనుజ+ఇంద్రుమీఁదన్= ప్రభువైన ధర్మరాజుమీద; శల్యుఁడు; ఏపునన్= ఆధిక్యముతో; శిత= వాడి అయిన; విశిఖములు= బాణములు; నిగిడించుచున్= ప్రయోగించుచు; తనరు= ఒప్పు; భుజా= భుజములయొక్క; బలముతోడన్= బలముతో; పెలుచన్= అతిశయముతో; తటిమెన్.

తాత్పర్యం: ముందుభాగం బయలుగా ఉన్నా అత్యంతం విజృంభించిన ఆ ధర్మరాజుమీద శల్యుడు వాడి అయిన బాణాలు ఆధిక్యంతో ప్రయోగిస్తూ భుజబలంతో అతిశయంగా తరిమాడు.

క. అవ్వీరుని వాలంపఱ । క్రొవ్వు నడఁచి తనదునంపకోల లడరఁగా
నవ్వసుధాధిపుఁ డల్లని । నవ్వొలయఁగ మాఱుకొనె ఘృణారహితుండై. 248

ప్రతిపదార్థం: ఆ+వీరుని; వాలు= వాడి అయిన; అంపఱ= బాణసమూహము; క్రొవ్వును; అడఁచి= అణచి; తనదు= తనయొక్క; అంపకోలలు= బాణములు; అడరఁగాన్= విజృంభించగా; ఆ; వసుధా+అధిపుఁడు= ప్రభువు అయిన ధర్మరాజు; అల్లని= మెల్లని; నవ్వు; ఒలయఁగన్= వ్యాపించగ; ఘృణా= దయా; రహితుండై= లేనివాడయి; మాఱుకొనెన్= ఎదుర్కొనెను.

తాత్పర్యం: శూరుడయిన ఆ ధర్మరాజు క్రొవ్వును అణచి శల్యుడు తన బాణాలతో విజృంభించగా, ఆ ధర్మరాజు మెల్లని నవ్వు ఒలికించి, దయలేనివాడై ఎదుర్కొన్నాడు.

వ. ఇవ్విధంబున మార్కొని ధర్మజమద్రపతులు నిజశంఖంబులు పూరించిరి. భేరీప్రముఖతూర్యస్వనంబులు నింగి వొంగారఁ జెలఁగె నయ్యిరువురు నొండొరులపైఁ జండకాండపరంపరలు పరఁగించి తనువుల నెత్తురు లురలించి పూచిన బూరువుల పొలుపు దాల్చి రట్టి యెడఁ గనుంగొను జనంబులు. 249

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారముగ; మార్కొని= ఎదుర్కొని; ధర్మజమద్రపతులు= ధర్మరాజు శల్యులు; నిజ= తమ తమ; శంఖంబులు; పూరించిరి= ఊదిరి; భేరీ= దుందుభి; తూర్య= తూతూబూరాలయొక్క; స్వనంబులు= ధ్వనులు; నింగి= ఆకాశము; పొంగారన్= పొంగిపోవునట్లు; చెలఁగెన్= మ్రోసెను; ఆ; ఇరువురును= ఇద్దరును; ఒండొరులపైన్= ఒకరిపై ఒకరు; చండ= భయంకరమయిన; కాండ= బాణములయొక్క; పరంపరలు= వరుసలు; పరఁగించి= ప్రయోగించి; తనువులన్= దేహములందలి; నెత్తురులు= రక్తములు; ఉరలించి= ప్రవహింపజేసి; పూచిన; బూరువుల= బూరుగుచెట్ల యొక్క; పొలుపు= ఒప్పు(సౌందర్యము); తాల్చిరి= ధరించిరి; అట్టియెడన్= ఆ సమయంబున; కనుంగొను= చూచు; జనంబులు= జనులు.

తాత్పర్యం: ఈ విధంగా ఎదుర్కొని ధర్మరాజశల్యులు తమ తమ శంఖాలు ఊదారు. ముఖ్యములయిన దుందుభి తూర్యాల ధ్వనులు ఆకాశం పొంగిపోయేటట్లు ఒప్పాయి. ఆ ఇద్దరు ఒకరి పై ఒకరు భయంకరాలైన బాణాల వరుసలు ప్రయోగించి శరీరాలలో రక్తాలు స్రవించగా పూచిన బూరుగు చెట్ల సౌందర్యం పొందారు. ఆ సమయంలో చూచే జనులు.

విశేషం: అలం: ఉపమ. 'ఉద్భిన్నరుధిరౌ శూరౌ మద్రరాజ యుధిష్ఠిరౌ । పుష్పితౌ శుశుభాతే వై వసంతే కింశుకౌ యథా' (శల్య. 16-57). కింశుక మనగా మోదుగ చెట్టు.

చ. వెరవును లావుఁ జేవయును వీరల కారయ నొక్క రూప దు
స్తరభుజశక్తి ధర్మజుఁడు శల్యుని రూపడఁగించి యివ్వసుం
ధర గొను నొక్కొ? నేఁడితనిఁ దా సమయించి సమస్తమేదినీ
శ్వరుఁడుగఁ జేయ నోపునొకొ శల్యుఁడు గౌరవరాజనందనున్? 250

ప్రతిపదార్థం: వెరవును= ఉపాయమును; లావున్= బలమును; చేవయును= ధైర్యమును; ఆరయన్= ఆలోచించగా; వీరలకున్= వీరికి; ఒక్క+రూపు+అ= ఒక్కవిధమే; దుస్తర= దాటశక్యముకాని; భుజ= భుజములయొక్క; శక్తిన్= సామర్థ్యముతో; ధర్మజుఁడు; శల్యుని; రూపు= ఆకృతిని; అడఁగించి= నశింపజేసి (రూపుమాపి); ఈ; వసుంధర= భూమి; కొనును= గ్రహించును; ఒక్కొ= ఏమో?; నేఁడు= ఈ దినము; ఇతనిన్= ఈ ధర్మరాజును; తాన్= తాను; సమయించి= సంహరించి; సమస్త= సర్వ;

మేదినీ= భూమికి; ఈశ్వరుండుగన్= రాజుగ; కౌరవరాజు= ధృతరాష్ట్రునియొక్క; నందనున్= కుమారుఁడు అయిన దుర్యోధనుని; శల్యుఁడు; చేయన్= చేయుటకు; ఓపున్= చాలును; ఒక్కో?= ఏమో?

తాత్పర్యం: ఉపాయమును, బలమును, ధైర్యమును - ఆలోచించగా వీరికి సమానం. దాటశక్యంకాని భుజశక్తితో ధర్మరాజు శల్యుడిని రూపుమాపి ఈ భూమిని పరిగ్రహిస్తాడేమో! అట్లుకాక శల్యుడు ఈ దినం ఈ ధర్మరాజును సంహరించి దుర్యోధనుడిని ఈ సమస్త భూమండలానికి రాజుగా చేస్తాడేమో? (ఇట్లా శల్యుడు ధర్మరాజు ఒకరిని మించి ఒకరు యుద్ధం చేస్తున్నారనటం తాత్పర్యం.)

వ. అని సందేహడోలాయమానమానసులై; రప్పుడు. 251

ప్రతిపదార్థం: అని= ఈ విధముగా తలచి; సందేహ= సందేహంతో డోలాయమాన= ఊగిసలాడు; మానసులు= మనస్సులు కలవారు; ఐరి= అయ్యారు; అప్పుడు= ఆ సమయమున.

తాత్పర్యం: అప్పుడు సంశయంతో ధర్మరాజశల్యుల యుద్ధాన్ని చూస్తున్న జనులు ఊయలవలె ఊగిసలాడే మనస్సులు కలవారు అయ్యారు. ఆసమయంలో.

తే. మద్రపతి ధర్మజుని విల్లు రౌద్రమెసఁగఁ । ద్రుంచి నూఱమ్ములేసి యుద్ధురతఁ బేర్చె
నతఁడు వేఱొక్క ధను వెత్తి యతని ధనువుఁ । దునిమి వెస నేసె మున్నూఱు తూపు లధిప! 252

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; మద్రపతి= శల్యుడు; రౌద్రము= క్రోధము; ఎసఁగన్= విజృంభించగా; ధర్మజుని= ధర్మరాజుయొక్క; విల్లు= ధనువు; నూఱు; అమ్ములు= బాణములు; ఏసి= ప్రయోగించి; త్రుంచి= ఖండించి; ఉద్ధురతన్= ఆధిక్యముతో; పేర్చెన్= విజృంభించెను; అతఁడు= అతడు(అనగా ఆ ధర్మరాజు); వేఱొక్క= మరియొక; ధనువు= విల్లు; ఎత్తి= పట్టుకొని; అతని= శల్యుడి; ధనువున్= వింటిని; తునిమి= ఖండించి; వెసన్= శీఘ్రముగా; మున్నూఱు= మూడువందలు; తూపులు= బాణములు; ఏసెన్= ప్రయోగించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! శల్యుడు క్రోధం విజృంభించగా ధర్మజుడి ధనువును నూరు బాణాలు ప్రయోగించి ఖండించి, ఆధిక్యంతో విజృంభించాడు. ధర్మరాజు మరియొక విల్లు పట్టుకొని, శల్యుడి ధనువును ఖండించి, శీఘ్రంగా మూడువందల బాణాలు ప్రయోగించాడు.

విరథుఁడయిన శల్యుని నశ్వత్థామ దన రథముపై నిడుకొని పోవుట (సం. 9-15-65)

ఉ. తోడనె తేరి వాహములఁ ద్రుంచి మదంబున సూతుప్రాణముల్
క్రీడయ పోలెఁ బుచ్చికొని కేతువుఁ గూల్చిన సేన విచ్చెఁ జే
యాడకయున్న శల్యుని రయంబున నాత్మరథస్థుఁ జేసి పె
న్గీడునఁ బొందకుండఁ దొలఁగించెను ద్రోణసుతుండు భూవరా! 253

ప్రతిపదార్థం: భూవరా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; తోడనె= వెంటనే; తేరి= రథముయొక్క; వాహములన్= గుర్రములను; త్రుంచి= ఖండించి; మదంబునన్= గర్వముతో; సూతు= సూతుడియొక్క; ప్రాణముల్; క్రీడ+అ= ఆట; పోలెన్= వలెను;

పుచ్చుకొని= తీసికొని; కేతువున్= జెండాకొయ్యను; కూల్చినన్= రాల్చగా; సేన= సైన్యము; విచ్చెన్= విడిపోయెను; చేయి; ఆడక= కదలక; ఉన్న= ఉన్నట్టి; శల్యునిన్; రయంబునన్= వేగముగా; ద్రోణ= ద్రోణునియొక్క; సుతుండు= పుత్రుడు అయిన అశ్వత్థామ; ఆత్మ= తనయొక్క; రథస్థున్= రథమునందున్నవానినిగా; చేసి; పెన్+కీడునన్= పెద్ద అశుభమును; పొందకుండన్= పొందకుండగా; తొలఁగించెను= తప్పించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధర్మరాజు శల్యుడిపై మూడువందల బాణాలు ప్రయోగించి, ఆ వెంటనే రథంయొక్క గుర్రాలను ఖండించి, గర్వంతో సూతుడి ప్రాణాలు ఆటవిధంగా తీసికొని, జెండాకొయ్యను పడగొట్టగా సైన్యం చెల్లాచెదరైంది. అప్పుడు చేయి కదపలేని స్థితిలో ఉన్న శల్యుడిని అశ్వత్థామ వేగంగా తన రథంపై ఉంచాడు. ఆ విధంగా శల్యుడిని పెద్ద కష్టంనుండి తప్పించాడు.

వ. ఇట్లు శల్యుండు సమరవైకల్యంబు నొందుటయు ధర్మనందనుం డార్చి పేర్చి తద్బలంబుఁ దఱిమె నంత నమ్మద్రపతి యొండు రథంబు గల్పించుకొని కడంగి యా కౌంతేయాగ్రజుపైఁ గంకపత్త్రంబులు నిగిడించుచు నిగిడినం గని యద్దెసఁ జేయఁ గల సైనికోత్తములు సరభసంబున నయ్యోధవరు నెదుర్కొని రప్ప డతఁడు సాత్యకిఁ బదిసాయకంబులను భీమసేననకులసహదేవుల శరత్రయంబులను స్రుక్కించి యెక్కుడు మదంబునం బొదలిన యంగంబులతో నలిరేఁగి మఱియు నప్పుడు పొగడం దగియుండె నాకర్ణింపుము. 254

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; శల్యుండు; సమర= యుద్ధమునుండి; వైకల్యంబును= వికలత్వమును; ఒందుటయున్= పొందుటయు; ధర్మనందనుండు= ధర్మరాజు; ఆర్చి= పెడబొబ్బపెట్టి; పేర్చి= విజృంభించి; తద్బలంబున్= ఆ సైన్యమును; తఱిమెను= పారద్రోలెను; అంతన్= ఆ సమయమున; ఆ+మద్రపతి= ఆ శల్యుడు; ఒండు= ఇంకొక; రథంబు= రథము; కల్పించుకొని= సమకూర్చుకొని; కడంగి= యత్నించి(పూనిక వహించి); ఆ+కౌంతేయ+అగ్రజుపైన్= కుంతీపుత్రులలో పెద్దవాడయిన ధర్మరాజుపై; కంకపత్త్రంబులు= బాణములు; నిగిడించుచున్= ప్రయోగించుచు; నిగిడినన్= విజృంభించగా; కని= చూచి; ఆ+దెసన్= ఆ వైపున; చేయఁగల= యుద్ధము చేయగల; సైనిక= సైనికులలో; ఉత్తములు= శ్రేష్ఠులు; సరభసంబునన్= వేగముగా; ఆ; యోధ= వీరులలో; వరున్= శ్రేష్ఠుడయిన శల్యుడిని; ఎదుర్కొనిరి; అప్పుడు; అతఁడు= ఆ శల్యుడు; సాత్యకిన్; పదిసాయకంబులను= పదిబాణములతోడను; భీమసేన నకుల సహదేవులన్= భీమసేన, నకుల, సహదేవులను; శరత్రయంబులను= మూడేసి బాణములతోను; స్రుక్కించి= బాధించి; ఎక్కుడు= మిక్కిలి; మదంబునన్= గర్వముతో; పొదలిన= పెరిగిన; అంగంబులతోన్= అవయవములతో; నలిరేఁగి= విజృంభించి; మఱియును; అప్పుడు; పొగడన్= పొగడుటకు; తగి= తగినట్లుగా; ఉండెను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: వినుము భూవరా! ఈ ప్రకారంగా శల్యుడు యుద్ధంనుండి తొలగగా ధర్మరాజు పెడబొబ్బపెట్టి విజృంభించి ఆ కౌరవసైన్యాన్ని పారద్రోలాడు. ఆ సమయంలో శల్యుడు ఇంకొక రథాన్ని సమకూర్చుకొని ఆ ధర్మరాజుపై బాణాలు ప్రయోగిస్తూ విజృంభించగా చూచి ఆ పాండవపక్షంలోని యుద్ధం చేయగల వీరశ్రేష్ఠులు వేగంగా ఆ శల్యుడిని ఎదుర్కొన్నాడు. అప్పుడు ఆ శల్యుడు సాత్యకిని పదిబాణాలతోను, భీమసేన నకుల సహదేవులను- ఒక్కొక్కరిని మూడేసి బాణాలతోను బాధించి మిక్కిలి గర్వంతో పెరిగిన అవయవాలతో విజృంభించి తగినట్లుగా ఉన్నాడు.

సీ. కమలాకరములీలఁ గలఁచి యాడెడు గంధ। దంతావళము సముద్దండతయును
దరమిడి మృగసముత్కరము ఘోరంబుగా। వధియించు కంఠీరవంబు నేపు

నీరసారణ్యంబు నిర్భరాటోపతఁ । గాల్చు దావాగ్ని యుగ్రక్రమంబు
ప్రకటవిక్రాంతిఁ బురత్రయంబును సమ । యించు ఫాలాక్షుని యేడ్తెఱయును

తే. బోల్పఁ బట్టులయ్యె భుజగర్వశౌర్య ప్ర । తాపదుర్దమప్రకోపములకు
మద్రవిభుఁడు గోలుమసఁగి శాత్రవసైన్య । హననకేళి సలుపు నవసరమున. 255

ప్రతిపదార్థం: కమల= పద్మములకు; ఆకరము= గని అయినట్టిది (అనగా కమలములు కలిగిన సరోవరము); లీలన్= విలాసముగా; కలఁచి; ఆడెడు; గంధ= మదించిన; దంతావళము= ఏనుగుయొక్క; సమ్+ఉద్దండతయును= భయంకరత్వమును; తరమిడి= వరుసపెట్టి; మృగ= లేళ్ళయొక్క; సముత్కరమున్= సమూహమును; ఘోరంబుగాన్= భయంకరముగా; వధియించు= చంపు; కంఠీరవంబున్= సింహముయొక్క; ఏపు= విజృంభణము; నీరస= రసములేని(ఎండిపోయిన); అరణ్యంబు= అడవి; నిర్భర= సంపూర్ణమయిన(దట్టమయిన); ఆటోపతన్= ఆడంబరముతో; కాల్చు; దావాగ్ని= దావాగ్నియొక్క; ఉగ్రక్రమంబు= భయంకరమయిన విధానము; ప్రకట= స్పష్టమయిన; విక్రాంతిన్= పరాక్రమముతో; పురత్రయంబును= త్రిపురములను; సమయించు= సంహరించు; ఫాల+అక్షుని= శివుని; ఏడ్తెఱయును= అతిశయమును; మద్రవిభుఁడు= శల్యుడు; కోలుమసఁగి= మిక్కిలి విజృంభించి; శాత్రవ= విరోధి, సైన్య= సేనలయొక్క; హనన= చంపుట అనెడి; కేళి= క్రీడ(ఆటను); చలుపున్= చేయు(ఆడు); అవసరమునన్= సమయమున; భుజగర్వ= భుజగర్వము; శౌర్య= శౌర్యము; ప్రతాప= ప్రతాపము; దుర్దమ+ప్రకోపములకున్= అణచశక్యముకాని; మిక్కిలి క్రోధములకు; పోల్పన్= వాటితో పోల్చుటకు; పట్టులు= స్థానములు; అయ్యెన్= అయ్యెను.

తాత్పర్యం: విలాసంగా సరోవరాన్ని కలచి ఆడే మదపుటేనుగు విజృంభణమును - వరుసపెట్టి లేళ్ళ సమూహాన్ని భయంకరంగా చంపు సింహంయొక్క విజృంభణమును, ఎండిపోయిన అడవిని గాఢంగా కాల్చే దవాగ్ని విధానమును, స్పష్టమయిన పరాక్రమంతో త్రిపురాలను సంహరించే రుద్రుడి విజృంభణమును పోలి, శల్యుడు మిక్కిలి విజృంభించి విరోధి సైన్యముల చంపెడి ఆట ఆడే సమయంలో శల్యుడి భుజదర్పానికి మదపుటేనుగు ఉద్దండతయు, శల్యుడి పరాక్రమానికి సింహముయొక్క విజృంభణం, శల్యుడి ప్రతాపానికి దావాగ్ని ఉగ్రత్వము, శల్యుడి దుర్దమ ప్రకోపానికి (అడ్డగించలేని రౌద్రమునకు) రుద్రుడి అతిశయం పోల్చటానికి ఆధారస్థానాలు అయ్యాయి.

విశేషం: ఈ సీసపద్యమునందలి శల్యుడి భుజగర్వ శౌర్య ప్రతాపదుర్దమ ప్రకోపముల వర్ణన, చిత్రణ, కల్పనలు తిక్కన స్వీయ కవితా విజృంభణములు. ఈ ఉపమానములు - అమూలకములు. ముఖ్యంగా ఈ సీసంలో అనంతార్థ గాంభీర్యము, ఉపమాలంకారమాలికాలంకృత సౌందర్యములు విరిశాయి. రౌద్రబీభత్సరసభావాలు ఇందు పరిపుష్టములు. తిక్కన అచ్చ తెనుఁగు పదప్రయోగాని కిది ఆటపట్టు కాదు. ఉభయ కావ్యప్రౌఢి కిది ఉదాహరణము.

వ. ధర్మనందనుం దలమిగిలిన చతురంగంబుల నివ్విధంబున వినిహతంబులు సేసి యమ్మహీపతిపైఁ గవిసినం గని కవలును శైనేయుండును భీమసేనుండును దోడ నడవ నతం డమ్మేటిమగని మార్కొని పటుమార్గణంబు లురంబున నించి నొంచె నప్పుడు కురువిభుండు వనుప మనసైనికులు దలమిగిలి శల్యునికిఁ బ్రాపయి యప్పవనతనయప్రభృతులతోడఁ బెనంగి రతం డాపాండవాగ్రజుమేనఁ జండకాండసప్తకంబు నినిచిన నజ్జననాథుండు నవనిశితనారాచంబు లవ్వీరు నంగంబుల నాటించె. నిట్లు దలపడి కోలుపులుల పోలికఁ బేరేనుంగుల తెఱంగున బలుసింగంబులు చందంబునం బోరి యొండొరుల నొప్పించి రప్పుడు. 256

ప్రతిపదార్థం: ధర్మనందనున్= ధర్మరాజును; తల మిగిలిన= మించిన; చతుః= నాలుగు; అంగంబులన్= రథాద్యంగములను; ఈ+విధంబునన్= ఈ ప్రకారముగా; వినిహతంబులు= చంపబడినవి(గా); చేసి; ఆ+మహీపతిపైన్= ఆ ధర్మరాజుమీద; కవిసినన్= కలియబడగా; కని= చూచి; కవలును= నకుల సహదేవులును; శైనేయుండును= సాత్యకియును; భీమసేనుండును; తోడన్= కూడి; నడువన్= నడువగా; అతండు= ఆ ధర్మరాజు; ఆ+మేటి= శ్రేష్ఠుడయిన; మగనిన్= వీరుని; మార్కొని= ఎదుర్కొని; పటు= కఠినమయిన; మార్గణంబులు= బాణములు; ఉరంబునన్= వక్షఃస్థలమునందు; నించి= నిండించి; నొంచెన్= బాధించెను; అప్పుడు; కురువిభుండు= దుర్యోధనుడు; పనుపన్= పంపించగా; మన; సైనికులు; తలమిగిలి= అతిక్రమించి; శల్యునికిన్= శల్యుడికి; ప్రాపయి= తోడై; ఆ; పవన తనయ= వాయుపుత్రుడు అయిన భీముడు; ప్రభృతులతోడన్= మొదలగువారితో; పెనంగిరి= పోరాడిరి; అతండు= ఆ శల్యుడు; ఆ; పాండవ= పాండవులలో; అగ్రజు= పెద్దవాడయిన ధర్మజుని; మేనన్= దేహమునందు; చండ= భయంకరమయిన; కాండ= బాణములయొక్క; సప్తకంబు= ఏడు; నినిచినన్= గ్రుచ్చగా; ఆ; జననాథుండు= ప్రభువు ధర్మరాజు; నవ= నూతనమయిన; నిశిత= వాడి అయిన; నారాచంబులు= బాణములు; ఆ+వీరున్= ఆ వీరునియొక్క; అంగంబులన్= అవయవములందు; నాటించెను= గ్రుచ్చెను; ఇట్లు= ఈ ప్రకారముగ; తలపడి= కలియబడి; కోలుపులుల పోలికన్= పెద్ద పులులవలె; పేరు= పెద్ద; ఏనుగుల= ఏనుగులయొక్క; తెఱంగునన్= విధమున; బలు= బలమయిన; సింగంబుల= సింహములయొక్క; చందంబునన్= విధముగ; పోరి= పోరాడి; ఒండొరులన్= ఒకరినొకరు; నొప్పించిరి= బాధించిరి; అప్పుడు= ఆ సమయమున.

తాత్పర్యం: ధర్మరాజును దాటి పోయిన చతురంగబలాలను ఈ విధంగా పడగొట్టి బాధించి చంపి, ఆ శల్యుడు ధర్మరాజుపై కలియబడగా చూచి నకులసహదేవులు, సాత్యకి, భీముడు కలిసి నడువగా ధర్మరాజు ఆ మహావీరుడయిన శల్యుడిని ఎదుర్కొని కఠినమయిన బాణాలు వక్షఃస్థలమునందు గ్రుచ్చి బాధించాడు. ఆ సమయంలో దుర్యోధనుడు పంపగా మన సైనికులు ముందుకు వెడలి శల్యుడికి దగ్గరపడి భీముడు మొదలైన వారితో పోరాడారు. ఆ శల్యుడు ధర్మరాజు దేహంలో ఏడు భయంకరములైన బాణాలు గ్రుచ్చగా ధర్మరాజు తొమ్మిది వాడి అయిన బాణాలు ఆ వీరుడైన శల్యుడి అవయవాలలో నాటాడు. ఈ ప్రకారంగా కలియబడి శల్యధర్మజులు పెద్దపులుల వలె మదించిన ఏనుగుల విధంగాను, బలమయిన సింహాల మాదిరి పోరాడి ఒకరినొకరు బాధించుకొన్నారు. ఆ సమయంలో.

సీ. **శల్యుండు బలునారసము పాండవాగ్రజు । నురమున నాట నత్యుగ్రదీప్త**
ఘోరనారాచ మా కుంతీసుతుం డేయ । నతఁడు మూర్ఛిల్లిన నలరె నధిపుఁ
డమ్మద్రపతి తేఱి యలుకఁ గెంపారెడు । కనుఁగవతోఁ జండకాండ మొకట
నయ్యుధిష్ఠిరు నొంప నాతండు పసిఁడి మై । మఱు వాఱుతూపుల నటికి వైచి

తే. **వాలురమ్ములు దొమ్మిది వక్షమున ని । గుడ్వ నయ్యోధవరుఁ డతిక్రూరభల్ల**
యుగళఖండితచాపుఁ జేయుడును నొండు । ధనువు గొని యవ్విభుండు దత్తనువు నించె. **257**

ప్రతిపదార్థం: శల్యుండు; బలు= బలమయిన; నారసము= బాణము; పాండవ= పాండవులలో; అగ్రజున్= పెద్దవాడయిన ధర్మరాజుయొక్క; ఉరమునన్= వక్షఃస్థలమున; నాటన్= గ్రుచ్చగా; అతి= మిక్కిలి; ఉగ్ర= భయంకరమయిన; దీప్త= ప్రజ్వలించు; ఘోర= కఠినమయిన(తీవ్రమయిన); నారాచము= బాణము; ఆ; కుంతీ సుతుండు= ధర్మరాజు; ఏయన్= ప్రయోగించగా; అతఁడు= ఆ శల్యుడు; మూర్ఛిల్లినన్= మూర్ఛపొందగా; అధిపుఁడు= అధిపతి అయిన ధర్మరాజు; అలరెన్= సంతోషించెను; ఆ+మద్రపతి= ఆ శల్యుడు; తేఱి= తేఱుకొని(మూర్ఛనుండి మేలుకొని); అలుకన్= కోపముతో; కెంపారెడు= ఎఱ్రబడిన; కనుఁగవతోన్= కన్నుదోయితో; చండ= భయంకరమయిన; కాండము= బాణము; ఒకటన్= ఒక్క; దానితో; ఆ+ యుధిష్ఠిరున్=

ఆ ధర్మరాజును; నొంపన్= నొవ్వచేయగా; ఆతండు= ధర్మరాజు(శల్యుని); పసిఁడి= బంగారుపు; మైమఱువు= కవచము; ఆఱు; తూపులన్= బాణములతో; నఱికివైచి= ఖండించివేసి; వాలురమ్ములు= వాడి బాణములు; తొమ్మిది; వక్షమునన్= రొమ్ముపై; నిగుడ్పన్= నాటగా; ఆ; యోధ= వీరులలో; వరుఁడు= శ్రేష్ఠుడు అనగా శల్యుడు; అతి= మిక్కిలి; క్రూర= భయంకరమయిన; భల్ల= బల్లెములయొక్క; యుగళ= రెంటితో; ఖండిత= ఖండించబడిన; చాపున్= ధనువు కలవానినిగా; చేయుడునున్= చేయగా; ఒండు= మరియొక; ధనువు= విల్లు; కొని= తీసికొని; ఆ+విభుండు= ప్రభువు అయిన ధర్మరాజు; తద్= ఆ శల్యుని; తనువు= దేహము; నించెన్= నింపెను.

తాత్పర్యం: శల్యుడు బలమైన బాణాన్ని ధర్మరాజు వక్షఃస్థలంలో గ్రుచ్చగా మిక్కిలి భయంకరమై ప్రజ్వలించే కఠినమయిన బాణాన్ని ధర్మరాజు ప్రయోగించగా దానితో శల్యుడు మూర్ఛిల్లగా ధర్మరాజు సంతోషించాడు. శల్యుడు మూర్ఛనుండి తేరుకొని, కోపంతో ఎర్రబడ్డ కనులతో భయంకరమైన బాణం ఒకదానితో ఆ ధర్మరాజును నొవ్వచేయగా, ధర్మరాజు శల్యుడి బంగారపు కవచాన్ని ఆరుబాణాలతో ఖండించివేసి, వాడి బాణాలు తొమ్మిది రొమ్మున నాటగా, ఆ యోధశ్రేష్ఠుడైన శల్యుడు మిక్కిలి క్రూరమైన రెండు బల్లెములతో ధర్మరాజు ధనువును ఖండించాడు. అప్పుడు ధర్మరాజు మరియొక విల్లు తీసికొని ఆ శల్యుడి దేహాన్ని బాణాలతో నింపాడు.

క. బాసటయై భీముఁడు పె । ల్లేసెను మద్రపతి నాతఁ డిరువురతోడం
జేసెం గయ్యము గృపును । ద్భాసిత విక్రమముతోడుపాటు గలుగఁగన్. 258

ప్రతిపదార్థం: భీముఁడు; బాసటయై= తోడై(సహాయుడై); మద్రపతిన్= శల్యుని; పెల్లు= గట్టిగా; ఏసెను= కొట్టెను; ఆతఁడు= ఆ శల్యుడు; కృపు= కృపుడియొక్క; ఉద్భాసిత= మిక్కిలి ప్రకాశవంతమయిన; విక్రమము= పరాక్రమము; తోడుపాటు= సహాయపడుట; కలుగఁగన్= కలుగగా; ఇరువురతోడన్= ఇద్దరితో (ధర్మజ భీమసేనులతో); కయ్యము= యుద్ధము; చేసెన్= చేసెను.

తాత్పర్యం: భీముడు తోడుగా శల్యుడిని గట్టిగా కొట్టాడు. శల్యుడు కృపుడి ప్రకాశవంతమయిన పరాక్రమం తోడు కాగా ఆ ఇద్దరితో యుద్ధం చేశాడు.

వ. అట్టియెడం గంకటాంతరంబు ధరియించి కడంగి. 259

ప్రతిపదార్థం: అట్టి ఎడన్= ఆ సమయంలో; కంకట+అంతరంబు= మరొక కవచాన్ని; ధరియించి= ధరించి; కడంగి= పూనుకొని.

తాత్పర్యం: ఆ సమయంలో మరొక కవచాన్ని ధరించి పూనుకొని.

ఆ. మద్రవిభుఁడు ధర్మమారుతసుతుల మై । మఱువు లుఱక నఱికి మార్గణములు
దొమ్మిదింట రెంటఁ దూఁటులు సేసె దో । ర్దండములు ప్రదీప్తదర్పుఁ డగుచు. 260

ప్రతిపదార్థం: మద్రవిభుఁడు= మద్రదేశ ప్రభువు అయిన శల్యుడు; ప్రదీప్త= బాగుగా ప్రజ్వలించుచున్న; దర్పుఁడు= గర్వము కలవాడు; అగుచున్= అగుచు; ధర్మమారుతసుతుల= ధర్మరాజు భీమసేనులయొక్క; మైమఱువులు= కవచములు; ఉఱక= సులభముగా; నఱికి= ఖండించి; మార్గణములు= బాణములు; తొమ్మిదింటన్= తొమ్మిదింటితో; రెంటన్= రెండింటితో; దోః+దండములు= దండములవంటి భుజములు; తూఁటులు= రంధ్రములు; చేసెన్= చేసెను.

తాత్పర్యం: శల్యుడు బాగా ప్రజ్వలిస్తున్న గర్వంతో ధర్మరాజభీమసేనుల కవచాలను తొమ్మిది బాణాలతో ఖండించి, రెండు బాణాలతో దండములవంటి భుజాలను తూట్లు పొడిచాడు.

క. ఆలో ధర్మజు సారథిఁ । గూలఁగఁ గృపుఁ డేయ మద్రకుంజరుఁడు భుజా
లీల మెఱయంగ హయము । ల్నాలుగు నొకవ్రేల్మిడిని నిలం బడవైచెన్. 261

ప్రతిపదార్థం: ఆలోన్= అంతలో; ధర్మజు= ధర్మరాజుయొక్క; సారథిన్= సారథిని(రథమునడుపువానిని); కూలఁగన్= చనిపోవునట్లు; కృపుఁడు; ఏయన్= కొట్టగా; మద్రకుంజరుఁడు= శ్రేష్ఠుడయిన మద్రదేశపురాజు - శల్యుఁడు; భుజాలీల= భుజములయొక్క విలాసము; మెఱయంగన్= ప్రకాశింపగా; హయములు= గుఱ్ఱములు; నాలుగును= నాల్గింటిని; ఒకవ్రేల్మిడిని= ఒక చిటికెలో; ఇలన్= నేలపై; పడవైచెన్= పడవేశాడు.

తాత్పర్యం: అంతలో ధర్మరాజుసారథిని కూలిపోయేటట్లు కృపుడు కొట్టగా, మద్రశ్రేష్ఠుడయిన శల్యుడు భుజవిలాసం ఒప్పగా నాలుగు గుఱ్ఱాలను ఒక్క చిటికెలో నేలపై పడవేశాడు.

వ. ఇవ్విధంబున విరథుండై యమ్మహీకాంతుం డంతర్గతంబున. 262

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారముగ; విరథుండై= రథములేనివాడై; ఆ+మహీకాంతుండు= ఆ ధర్మరాజు; అంతర్గతంబునన్= మనస్సునందు.

తాత్పర్యం: ఈ ప్రకారంగా రథం లేనివాడై ధర్మరాజు మనస్సులో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. గెలువుము శల్యుని నీ వని । పలికి ముకుందుండు నన్నుఁ బనిచినవాఁ డ
ప్పలుకులకు నసత్యత్వము । గలుగఁగ నేర్చు నొకొ! దైవఘటనబలమునన్. 263

ప్రతిపదార్థం: నీవు; శల్యుని; గెలువుము; అని; పలికి; ముకుందుండు= శ్రీకృష్ణుడు; నన్నున్; పనిచిన= పంపించిన; వాఁడు; దైవఘటన= దైవప్రయత్నముయొక్క; బలమునన్= శక్తివలన; ఆ+పలుకులు= ఆ మాటలకు; అసత్యత్వము= అయథార్థత్వము; కలుగఁగనేర్చున్+ఒకొ!= కలుగగలదా?(సంభవించగలదా?)

తాత్పర్యం: 'నీవు శల్యుడిని జయింపుము' అని చెప్పి శ్రీకృష్ణుడు నన్ను పంపాడు. దైవయత్నం వలన ఆ మాటలకు అయథార్థత్వం కలుగదుకదా!'

వ. అని శంకించియుఁ గొంకుపోవక యజ్జగన్నాథు వచనంబునకు నన్యథాత్వం బేల గలుగునని యద్దేవునిం దలంచి యామాట యమోఘంబు గావలయునని ప్రార్థించి వెండియు. 264

ప్రతిపదార్థం: అని; శంకించియున్= సందేహించియు; కొంకు= భయము; పోవక= పొందక; ఆ; జగత్= ప్రపంచమునకు; నాథు= ప్రభువు అయిన శ్రీకృష్ణునియొక్క; వచనంబునకున్= మాటకు; అన్యథాత్వంబు= వేరొక్కవిధము; ఏల?= ఎందులకు?; కలుగును; అని; ఆ+దేవునిన్= ఆ భగవంతుడయిన శ్రీకృష్ణుడిని; తలంచి= స్మరించి; ఆ మాట; అమోఘంబు= సఫలము (వ్యర్థము కానిది); కావలయును; అని; ప్రార్థించి; వెండియున్= మరియు.

తాత్పర్యం: అని సందేహించి, భయపడక శ్రీకృష్ణుడియొక్క మాటకు భిన్నముగా ఎందులకు జరుగుతుంది? అని ఆ దేవుడిని స్మరించి ఆ మాట వ్యర్థం కానిది కావలయునని ప్రార్థించి మరియు. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. 'స్ఫురితషడర్ధనేత్రునిఁ ద్రిశూలసముజ్జ్వలు నిర్గుణున్ గుణా
దర సముపాత్తమూర్తిఁ గలితప్రభవస్థితిసంహృతిక్రియా
నిరతివివర్తితత్రిభువనీమహనీయుని దైత్యమర్ది న
ప్పురుషవరుం జతుర్భుజు విభుత్వమహోన్నతు నాశ్రయించెదన్. 265

ప్రతిపదార్థం: స్ఫురిత= భాసించిన(తోచిన); షడర్ధ= మూడు; నేత్రునిన్= నేత్రములు కలవానిని; త్రిశూల= త్రిశూలముతో; సముజ్జ్వలున్= బాగుగా ప్రకాశించువానిని; నిర్గుణున్= నిర్గుణుని(త్రిగుణరహితుడిని); గుణ= సత్త్వ, రజస్, తమస్ అను త్రిగుణములతో; ఆదర= ఆదరముతో; సముపాత్త= పొందబడిన; మూర్తిన్= రూపము(ఆకారములు) కలవానిని; కలిత= పొందబడిన; ప్రభవ= ఉద్భవము(పుట్టుక); స్థితి(ఉండుట); సంహృతి= సంహారము(నాశము) అనెడి; క్రియా= చేష్టయందలి; నిరతి= ఆసక్తితో; వివర్తిత= త్రిప్పబడిన; త్రిభువనీ= మూడులోకములకు సంబంధించిన; మహనీయునిన్= మహాత్ముని; దైత్య= రాక్షసులను; మర్దిన్= నాశము చేయువానిని; ఆ; పురుష; వరున్= శ్రేష్ఠుని; చతుర్భుజున్= నాలుగు భుజములు కలవానిని; విభుత్వ= వ్యాపకత్వమున, సర్వపరిపాలకత్వమున; మహా+ఉన్నతున్= గొప్ప అభ్యుదయము కలవానిని; ఆశ్రయించెదన్= శరణువేడెదను.

తాత్పర్యం: 'త్రినేత్రుడిని, త్రిశూలుడిని త్రిగుణరహితుడిని త్రిగుణాత్మకుడిని త్రిమూర్తిని, సృష్టి స్థితి లయములు, చేష్టా, ఆసక్తి, పరివర్తనములు భూః భువః సువః అను త్రిభువనములు, ఈ త్రితయములలో మహాత్ముడిని రాక్షససంహారకుడిని పరమపురుషుడిని చతుర్భుజుడిని సర్వవ్యాపకత్వం, సర్వపాలకత్వం మొదలైన వాటియందు గొప్ప అభ్యుదయం కలవాడిని పరమాత్మను శరణు వేడెదను.

విశేషం: ఇది హరిహర స్వరూప వర్ణనం, ప్రార్థనం. తిక్కన హృదయంలో భాసించిన స్వరూపమిది. షడర్ధనేత్రుడు - త్రిశూల సముజ్జ్వలుడు నిర్గుణుడు - గుణాదర సముపాత్తమూర్తి - కలిత ప్రభవ స్థితి సంహృతి క్రియా నిరతి త్రిభువనీమహనీయుడు. ఇంతవరకు సదాశివ స్వరూపము. దైత్యమర్దనుడు - చతుర్భుజుడు - విభుత్వ మహోన్నతుడు పురుషవరుడు - ఇంతవరకు మహా విష్ణు స్వరూపము - వెరసి తిక్కన ఉపాసనా రూపమయిన హరిహరమూర్తి చిత్రణము.

ఇఁక ముఖ్యముగా ఉస్మానియా ప్రతియందు ఈ పద్యమునందలి మూడవపాదము 'నిరతి వివర్తితి త్రిభువన మహనీయుని దైత్య మర్ది' అని కలదు. ఇందు ఇట్లున్నచో గణయతులు తప్పినవి. అందువలన 'త్రిభువనీ' పాఠముగా సరిచేయబడినది. వావిళ్ళ ప్రతియందు 'త్రిభువనీ' అనియే కలదు.

తే. భండనము సేయు నరునగ్రభాగమునఁ బ్ర । చండ శూలోగ్రహస్తుఁడై శత్రుకోటి
గీటడంచుచు నేఁ జూడఁ గేలి సలుపు । దేవు జయసిద్ధికై సన్నుతింతు భక్తి.' 266

ప్రతిపదార్థం: ఏన్= నేను; చూడన్= చూడగా; భండనము= యుద్ధము; చేయు; నరున్= అర్జునుడియొక్క; అగ్రభాగమునన్= ముందు భాగమునందు; ప్రచండ= మిక్కిలి భయంకరమయిన; శూల= శూలముతో; ఉగ్ర= భయంకరమయిన; హస్తుఁడై= (పాణి) చేయికలవాడై; శత్రు= విరోధి; కోటిన్= సముదాయమును; గీటడంచుచున్= చంపుచు; కేలి= క్రీడ(ఆట); చలుపు= చేయు; దేవున్= ఆది దేవుని; భక్తిన్= భక్తితో; జయ= విజయము; సిద్ధికై= సిద్ధించుటకై(సమకూరుటకై); సన్నుతింతున్= స్తుతించెదను.

తాత్పర్యం: నేను చూడగా యుద్ధం చేస్తున్న అర్జునుడి ముందుభాగంలో మిక్కిలి భయంకరమైన శూలంతో భయంకరమయిన హస్తం కలవాడై విరోధి సముదాయాన్ని చంపుతూ క్రీడ సలిపే దేవుడిని భక్తితో జయం సమకూరటానికి స్తుతిస్తాను.'

విశేషం: పై రెండు పద్యాలు నిజానికి రుద్రస్తుతి. జయసిద్ధికి రుద్రస్తుతి చేయటం సంప్రదాయం. మహాభారత యుద్ధంలో రుద్రవిజృంభణం సైన్యసంహారం పరోక్షంగా కలదు. ఈ పద్యంలో 'నరునగ్రభాగమున' అను పాఠము సరి అయినది. ఇక ధర్మరాజు చేసిన ఈ స్తుతి మూలమున దాక్షిణాత్య ప్రతిలో కాని (నీలకంఠీయము) ఉత్తరాది ప్రతిలోకాని (గీతాప్రెస్) లేదు. ఇది కేవలం తిక్కయజ్వ కల్పనం. ఇందు తిక్కన హరిహరస్తుతి ఒనర్చాడు.

వ. అనుచుఁ బురుషోత్తమునిఁ జిత్తమున నిలిపి యున్నతంబైన పూర్వకాయంబుతో మందప్రకారంబున మార్గణంబు లమ్మద్రపతి దెస నిగిడింప నతఁ డవి బెండువడుటగాఁ దలంచి తఱిమి యఱిముఱి శరంబులు గురియుటయు నప్పుడు. 267

ప్రతిపదార్థం: అనుచున్= ఇట్లు అనుచు; పురుషోత్తమునిన్= పురుషోత్తముడయిన నారాయణుని; చిత్తమునన్= చిత్తమునందు; నిలిపి= నిశ్చలముగా ధ్యానించి; ఉన్నతంబైన= ఎత్తైన; పూర్వకాయంబుతోన్= కటిప్రదేశమునకు పై భాగమున ఉన్నదేహముతో; మంద= మెల్లని; ప్రకారంబుగన్= విధంగా; మార్గణంబులు= బాణములు; ఆ+మద్రపతి= శల్యుని; దెసన్= దిక్కు; నిగిడింపన్= ప్రయోగించగా; అతఁడు= ఆ శల్యుడు; అవి= బాణములు; బెండువడుట= బలహీనపడుట; కాన్= అగునట్లుగా; తలంచి= భావించి; తఱిమి= వెంబడించి - పరుగెత్తించి; అఱిముఱిన్= సంభ్రమముతో; శరంబులు= బాణములు; కురియుటయున్= కురిపించుటయు(ప్రయోగించుటయు); అప్పుడు= ఆ సమయమున.

తాత్పర్యం: ఇట్లా ధర్మరాజు రుద్రుడిని ప్రార్థిస్తూ ఆ పురుషోత్తముడిని మనస్సులో నిశ్చలంగా ధ్యానించి ఎత్తైన పూర్వకాయంతో మెల్లగా బాణాలు ఆ శల్యుడి వైపు ప్రయోగించగా శల్యుడు ఆ బాణాలు నిస్సారములైనవిగా భావించి, తరిమి, సంభ్రమంతో బాణాలు ప్రయోగించే సమయంలో.

చ. పవనసుతుండు విల్నఱికి బాణయుగంబున మేనునొంచి శా
త్రవులు దలంక నారథికురథ్యములన్ ధరఁ గూల్చి సూతు కం
ఠవిదళనం బొనర్చి ప్రకటస్ఫురణంబునఁ గంటకంబు భ
ల్ల వితతి ఘోరసంహతి నిలం బడనేసె రయం బెలర్పఁగన్. 268

ప్రతిపదార్థం: పవన= వాయువుయొక్క; సుతుండు= పుత్రుడు అయిన భీముడు; విల్= విల్లు; నఱికి= ఖండించి; బాణ= బాణములయొక్క; యుగంబునన్= రెండింటితో; మేను= శరీరము; నొంచి= నొప్పించి; శాత్రవులు= విరోధులు; తలంకన్= భయపడగా; ఆ రథికు= ఆ శల్యుడియొక్క; రథ్యములన్= రథములాగు గుర్రములను; ధరన్= నేలపై; కూల్చి= పడవైచి; సూతు= సూతిడియొక్క; కంఠ= కంఠముయొక్క; విదళనంబు= ఖండించుట; ఒనర్చి= చేసి; ప్రకట= స్పష్టమయిన; స్ఫురణంబునన్= ప్రకాశంతో; కంటకంబున్= కవచమును; భల్ల= బల్లెములయొక్క; వితతిన్= సమూహముతో; ఘోర= భయంకరమయిన; సంహతిన్= దెబ్బతో; రయంబు= వేగము; ఎలర్పఁగన్= అతిశయించునట్లుగ; ఇలన్= నేలపై; పడవేసెన్= పడగొట్టెను.

తాత్పర్యం: పవనసుతుడైన భీముడు శల్యుడి విల్లు ఖండించి, రెండు బాణాలతో శరీరాన్ని నొప్పించి విరోధులు భయపడేటట్లు ఆ శల్యుడి గుర్రాలను నేలకూల్చి, సూతుడి కంఠం ఖండించివేసి, స్పష్టమయిన ప్రకాశంతో కవచమును బల్లెముల సమూహంతో భయంకరంగా వేగిరపాటుతో నేలపై పడగొట్టాడు.

వ. ఇవ్విధంబున. 269

తాత్పర్యం: ఈ ప్రకారంగా.

క. విరథుండు నచాపుఁడు వ । ర్మరహితగాత్రుండు నైన మద్రవిభుఁడు భా
సురఖడ్గచర్మశోభిత । కరుఁడై తేరుడిగి కన్నుఁగవఁ గెంపారన్. 270

ప్రతిపదార్థం: విరథుండున్= రథములేనివాడును; అచాపుఁడున్= ధనువులేనివాడును; వర్మ= కవచము; రహిత= లేని; గాత్రుండును= దేహముకలవాడును; ఐన= అయినట్టి; మద్రవిభుఁడు= శల్యుడు; భాసుర= ప్రకాశవంతమయిన; ఖడ్గ; చర్మ= డాలుతో; శోభిత= సుందరమయిన; కరుఁడై= చేయి కలవాడై; కన్నుఁగవన్= రెండు కన్నులును; కెంపారన్= ఎర్రబడగా; తేరు= రథము; డిగి= దిగి.

తాత్పర్యం: రథం లేనివాడు, ధనువు లేనివాడు, కవచం లేనివాడు అయినట్టి శల్యుడు ప్రకాశవంతమైన కత్తిడాలులతో సుందరమైన చేతులు కలవాడై రెండు కన్నులు ఎర్రబడగా రథం దిగి.

మ. జముచందంబున నేచి ధర్మసుతుపై సంరంభదుర్దాంతద
ర్పమునన్ వే కలియంగఁ జండబలదుర్వారుండు భీముండు ద్రుం
చె మదంబారఁగ వాలునున్ బలకయున్ శీఘ్రత్వ సందీప్తుఁడై
తమది క్కార్పులుఁ దూర్యనాదములు నత్యంతంబు శోభిల్లఁగన్. 271

ప్రతిపదార్థం: జము= యమునియొక్క; చందంబునన్= విధముగా; ఏచి= విజృంభించి; సంరంభ= వేగిరపాటుతో; దుర్దాంత= అణగద్రొక్క శక్యముకాని; దర్పమునన్= గర్వముతో; ధర్మసుతుపైన్= ధర్మరాజుమీద; వే కలియంగన్= వేగముగా కలియబడగా; చండ= తీవ్రమయిన; బల= బలమువలన; దుర్వారుండు= వారింపశక్యముకాని వాడయిన; భీముండు; మదంబు= గర్వము; ఆరఁగన్= విజృంభించగా; తమదిక్కు= తమవైపు; ఆర్పులున్= బొబ్బలును (అరుపులును); తూర్య= వాద్యాల యొక్క; నాదములును= ధ్వనులును; అత్యంతంబు= మిక్కిలి; శోభిల్లఁగన్= ప్రకాశించుచుండగా; శీఘ్రత్వ= వేగిరపాటుతో; సందీప్తుఁడై= ప్రజ్వలించుచున్నవాడై; వాలునున్= కత్తిని; పలకయున్= డాలును; త్రుంచెన్= ఖండించెను.

తాత్పర్యం: శల్యుడు యముడివలె విజృంభించి వేగిరపాటుతో అణపశక్యంకాని గర్వంతో ధర్మరాజు మీద వేగంగా కలియబడగా, భయంకరమైన బలంవలన అడ్డగించరాని శక్తిగల భీముడు గర్వం అతిశయించగా తమవైపు బొబ్బలు, తూర్యధ్వనులు మిక్కిలి ప్రకాశిస్తూ ఉండగా వేగిరపాటుతో ప్రజ్వలిస్తున్నవాడై, కత్తిని, డాలును ఖండించాడు.

వ. అమ్మద్రపతి నేర్పును జేవయుం గల పరిజనంబులు చేర్పఁ గంకటగదాదండంబులు ధరియించి యుధిష్ఠిరుమీఁద నరువడి నడరె నప్పు డప్పాండవాగ్రజునకు బాసటయై సాత్యకిధృష్టద్యుమ్న శిఖండి ద్రౌపదేయమాద్రేయు లేయు సాయకంబులు సరకుగొనక గదం జిత్రంబుగా జడియుచు వడముడి

విక్రమంబునఁ దవులంబడక నిగిడె నశ్వసూత రహితంబగు రథంబుపై నున్న యన్నరేంద్రుండు తన దెసకు సింహచంక్రమణత్వసుందరుండై వచ్చు నవ్వీరు నాలోకించి నక్రోధంబైన యవష్టంభంబున నుద్దీపితుండై.

272

ప్రతిపదార్థం: ఆ+మద్రపతి= ఆ శల్యుడు; నేర్పును= ఉపాయమును; చేవయున్= ధైర్యమును; కల= కలిగిన; పరిజనంబులు= అనుచరులు; చేర్పన్= సమకూర్చగా; కంకట= కవచము; గదా దండంబులు= గదాయుధం; ధరియించి= ధరించి; యుధిష్ఠిరుమీఁదన్= ధర్మరాజుపై; ఉరవడిన్= అతివేగముగా; అడరెను= విజృంభించెను; అప్పుడు; ఆ+పాండవ+అగ్రజునకున్= ఆ పాండవులలో పెద్దవాడైన ధర్మరాజునకు; బాసటయై= సహాయకులై; సాత్యకి; ధృష్టద్యుమ్నుఁడు; శిఖండి; ద్రౌపదేయు= ద్రౌపదిపుత్రులు; మాద్రేయులు= మాద్రిపుత్రులు అయిన నకుల సహదేవులు; ఏయు= ప్రయోగించు; సాయకంబులు= బాణములు; సరకుగొనక= లెక్కచేయక; గదన్= గదను; చిత్రంబుగాన్= ఆశ్చర్యకరముగా; జడియుచున్= త్రిప్పుచున్న; వడముడి= భీముడి; విక్రమంబునన్= పరాక్రమంచే; తవులంబడక= చిక్కుపడక; నిగిడెను= విజృంభించెను; అశ్వ= గుర్రములు; సూత= సూతుడు; రహితంబు= లేనిది; అగు= అయినట్టి; రథంబుపైన్= రథముమీద; ఉన్న= ఉన్నట్టి; ఆ+నర+ఇంద్రుండు= జనులకు ప్రభువు అయిన ఆ శల్యుఁడు; తన= తనయొక్క; దెసకున్= దిక్కునకు; సింహముయొక్క; చంక్రమణత్వ= లంఘనముతో; సుందరుండై= చూడముచ్చటగా; వచ్చు= వచ్చుచున్న; ఆ+వీరున్= ఆ పరాక్రమవంతుని; ఆలోకించి= చూచి; సక్రోధంబైన= కోపముతో కూడిన; అవష్టంభంబునన్= గర్వముతో; ఉద్దీపితుండై= ప్రకాశించుచున్నవాడై.

తాత్పర్యం: శల్యుడు ఉపాయం ధైర్యం కలిగిన అనుచరులు సమకూర్చిన కవచం గదా దండాలు ధరించి ధర్మరాజు మీద మిక్కిలి వేగంగా విజృంభించాడు. ఆ సమయంలో ధర్మరాజుకు సహాయులై సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ద్రౌపది పుత్రులు, నకుల సహదేవులు ప్రయోగించే బాణాలు లెక్కచేయక, గదను ఆశ్చర్యజనకంగా త్రిప్పుతున్న భీముడి పరాక్రమానికి చిక్కుపడకుండా శల్యుడు విజృంభించాడు. గుర్రాలూ సూతుడూ లేని రథం మీద ఉన్నట్టి శల్యుడు తనవైపు (ధర్మరాజువైపు) సింహంవలె లంఘిస్తూ చూడముచ్చటగా వస్తున్న మహా పరాక్రమవంతుడైన శల్యుడిని చూచి, రౌద్రంతో కూడిన గర్వంతో ధర్మరాజు ప్రకాశిస్తున్నవాడై.

క. 'ఇతని సమయింప నయ్య । చ్యుతుఁడు ననుం బనిచె నాకు నొనరించిన పా
లితఁ' డని తలంచి మొగ ము । గ్రత నొందఁగ శక్తిమీఁదఁ గనుదో యొలయన్. 273

ప్రతిపదార్థం: ఆ; అచ్యుతుఁడు= శ్రీకృష్ణుడు; ఇతనిన్= ఈ శల్యుడిని; సమయింపన్= సంహరించుటకు; ననున్= నన్ను; పనిచెన్= పంపించెను; నాకున్= నాకు; ఒనరించిన= చేసిన; పాలు= భాగము; ఇతఁడు= ఈ శల్యుఁడు; అని; తలంచి= భావించి; మొగము= ముఖము; ఉగ్రతన్= భీకరముగ; ఒందఁగన్= పొందగ; శక్తిమీఁదన్= శక్తి అను ఆయుధముమీద; కనుదోయి= రెండుకన్నులు; ఒలయన్= వ్యాపించగా.

తాత్పర్యం: 'ఆ శ్రీకృష్ణుడు ఈ శల్యుడిని సంహరించటానికి నన్ను పంపించాడు. నావంతు ఈ శల్యుడు' అని భావించి ముఖం భయంకరంకాగా శక్తి అనే ఆయుధంమీద కన్నులు వ్యాపించగా.

వ. హృషీకేశు నుద్దేశించి. 274

ప్రతిపదార్థం: హృషీకేశున్= శ్రీకృష్ణుడిని; ఉద్దేశించి= గురించి.

తాత్పర్యం: ధర్మరాజు శక్తిమీద కన్నులు వ్యాపింపజేసి శ్రీకృష్ణుడిని గురించి ఇట్లా ప్రార్థించాడు.

ఉ. 'నీదెస నాదుచిత్తమున నెక్కొని యుండెడి భక్తి భద్రసం
పాదిని గావు టచ్చెరువె! భక్తజనాభిమతప్రదానవి
ద్యాదయితత్వమేర్పడ జయం బొడఁగూర్పుము దేవ! సంశ్రితాం
హోదళనంబు నీకు వ్రత ముల్లము నాపయి నిల్పు మిత్తఱిన్.' 275

ప్రతిపదార్థం: నీదెసన్= నీవైపు; నాదు= నాయొక్క; చిత్తమునన్= నిశ్చలమయిన మనస్సునందు; నెక్కొని= నెలకొని; ఉండెడి; భక్తి= భక్తి; భద్ర= శుభమును; సంపాదిని= సంపాదించునది; కావుట= అగుట; అచ్చెరువె!= ఆశ్చర్యమా!; భక్తజన= భక్తులైన జనులయొక్క; అభిమత= ఇష్టముయొక్క; ప్రదాన= ఇచ్చుటయును; విద్యా= విద్యయందు; దయితత్వము= ప్రియత్వము; ఏర్పడన్= బయల్పడునట్లుగా; జయంబు= గెలుపు; ఒడఁగూర్పుము= సిద్ధించునట్లు చేయుము; దేవ!; సంశ్రిత= ఆశ్రయింపబడిన వారియొక్క; అంహోదళనంబు= పాపములను ఖండించుట; నీకున్; వ్రతము= నియమము(దీక్ష); ఈ+తఱిన్= ఈ సమయమున; ఉల్లము= హృదయము; నాపైన్= నామీద; నిల్పుము= ఉంచుము.

తాత్పర్యం: 'నా చిత్తంలో నెలకొని ఉన్న నీమీది భక్తి శుభాన్ని కలిగించటంలో ఆశ్చర్య మేమున్నది? భక్తుల ఇష్టాన్ని ఈడేర్చటంలో నీకు గల ప్రియత్వం బయల్పడేటట్లు నాకు గెలుపు సిద్ధింపజేయుము. ఓ భగవంతుడా! ఆశ్రితుల పాపాలను ఖండించటం వ్రతంగా గల నీవు ఈ సమయంలో నీ హృదయాన్ని నాపై ఉంచుము. నన్ను అనుగ్రహించుము!'

వ. అని హృదయంబునఁ బ్రార్థించి యప్పార్థివోత్తముండు. 276

ప్రతిపదార్థం: అని; హృదయంబునన్= మనస్సునందు; ప్రార్థించి; ఆ; పార్థివ= రాజులలో; ఉత్తముండు= శ్రేష్ఠుడు అయిన ధర్మరాజు.

తాత్పర్యం: అని మనస్సునందు శ్రీకృష్ణుడిని రాజశ్రేష్ఠుడైన ధర్మరాజు ప్రార్థించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. అచ్చపు భక్తికిన్ మదిఁ బ్రియంబున నొందిన ఫాలలోచనుం
డిచ్చిన ప్రీతియోగమును నెక్కుడు భక్తియు నావహిల్లఁగా
నిచ్చలు గంధపుష్పములు నిష్ఠమెయిం బరిశోభితార్చనం
బిచ్చుచుఁ దాను గొల్వ నుతి కెక్కిన యమ్మహనీయశక్తికిన్. 277

ప్రతిపదార్థం: అచ్చపు-భక్తికిన్= తన స్వచ్ఛమైన భక్తికి; మదిన్= మనస్సునందు; ప్రియంబునన్+ఒందిన= సంతోషించిన; ఫాలలోచనుండు= ఫాలాక్షుడు(శివుడు); ప్రీతి-యోగమును= సంతోషపుయుక్తి; ఎక్కుడు భక్తియున్= అధికభక్తియును; ఆవహిల్లఁగాన్= కలుగగా; నిచ్చలున్= ఎల్లప్పుడును; గంధ-పుష్పములన్= గంధంతోను; పూలతోను; నిష్ఠమెయిన్= నియమంతో; పరిశోభిత+అర్చనంబు= ప్రకాశించే పూజ; ఇచ్చుచున్; తాను(ధర్మరాజు); కొల్వన్= సేవించగా; నుతికిన్+ఎక్కిన= పొగడ్తకెక్కిన; ఆ+మహనీయ - శక్తికిన్= ఆ గొప్ప శక్త్యాయుధమునకు.

తాత్పర్యం: మనస్సునందు ప్రేమవలన కలిగిన స్వచ్ఛమైన భక్తికి శివుడు సంతోషంతో ప్రసాదించిన స్తుతింపతగిన గొప్ప శక్తి అనే ఆయుధానికి ధ్యానం, మిక్కిలి భక్తి కలుగగా, నిత్యం గంధ పుష్పములతో మిక్కిలి శ్రద్ధతో ప్రకాశవంతమైన పూజ చేస్తూ సేవించగా.

మ. ప్రణతుండై రభసోదయాభినవదర్పస్ఫూర్తి శోభిల్లుచు
న్మణిదండద్యుతిమంజరీస్ఫురణము న్సంశోభిఘంటాపటు
క్వణనంబున్ రిపుసైనికప్రకరదృక్కర్ణవ్యథం జేయ భీ
షణరేఖంబగు దానిఁ బుచ్చుకొని చంచన్ముష్టిదృష్ట్యుద్ధతిన్. 278

ప్రతిపదార్థం: ప్రణతుండై= నమస్కరించినవాడై; రభస= తీవ్రమయిన కోపమువలన; ఉదయ= పుట్టిన; అభినవ= క్రొంగ్రొత్త; దర్ప= గర్వముయొక్క; స్ఫూర్తిన్= తోచుటవలన; శోభిల్లుచున్= ప్రకాశించుచు; మణిదండ= రత్నములు పొదిగిన దండముయొక్క; ద్యుతి= కాంతుల; మంజరీ= గుత్తుల; స్ఫురణమున్= ప్రకాశమును; సంశోభి= మిక్కిలి; ప్రకాశించుచున్న; ఘంటా= గంటలయొక్క; పటు=బలమైన; క్వణనంబున్= ధ్వనియును; రిపు= శత్రువుల; సైనిక= సేనలయొక్క; ప్రకర= సమూహముయొక్క; దృక్= కన్నులకు; కర్ణ= చెవులకు; వ్యథన్= బాధను; చేయన్= కలిగించగా; భీషణ= భయంకరమగు; రేఖంబు= రూపము; అగు; దానిన్= ఆ శక్తిని; పుచ్చుకొని= తీసికొని; చంచత్= చలించుచున్న; ముష్టి= పిడికిలి; దృష్టి= చూపులయొక్క; ఉద్ధతిన్= గర్వముతో.

తాత్పర్యం: ధర్మరాజు శక్తికి నమస్కరించినవాడై, తీవ్రమైన కోపంవలన పుట్టిన క్రొంగ్రొత్త గర్వపు స్ఫూర్తితో ప్రకాశిస్తూ రత్నాలు పొదిగిన దండముయొక్క కాంతుల పూలగుత్తుల ప్రకాశాన్ని మిక్కిలి వెలుగొందుతున్న గంటల గొప్ప ధ్వని, శత్రుసైనికుల సమూహాల కన్నులకు కాంతియు చెవులకు ధ్వనియు బాధను కలిగించగా - భయంకరమైన ఆ శక్తిని తీసికొని చలిస్తున్న పిడికిలితో చూపులలోని గర్వంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. అభిరామభీమాకారుండై. 279

ప్రతిపదార్థం: అభిరామ= మనోహరమైన; భీమ= భయంకరమైన; ఆకారుండు+ఐ= ఆకారం కలవాడై.

తాత్పర్యం: ధర్మరాజు మనోజ్ఞమయిన, భయంకరమైన రూపం కలవాడై.

తే. నెరయుకినుకఁ బెన్వెడఁదయై నిప్పు లురులు । కన్నుఁగవ శల్యుఁ జూచిన నున్నయునికి
నతఁడు నీఱు గాకుండుట యరిది యయ్యె । మాకుఁ జూడంగ నప్పడు మనుజనాథ! 280

ప్రతిపదార్థం: నెరయు= నిండైన; కినుకన్= కోపముతో; పెను= పెద్దగా; వెడఁద ఐ= విశాలమై; నిప్పులు; ఉరులు= రాలు; కన్నుఁగవన్= రెండు కన్నులతో; శల్యున్= శల్యుని; చూచినన్= చూడగా; ఉన్న ఉనికిన్= ఉన్నట్లుండగనే; అతఁడు= ఆ శల్యుడు; నీఱు= నివురు(మసి); కాకుండుట= కాకపోవుట; మనుజనాథ!= మానవులకు ప్రభువైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; మాకున్= మాకు; చూడంగన్= చూడగా; అరిది= ఆశ్చర్యము; అయ్యెన్= అయ్యెను.

తాత్పర్యం: నిండైన కోపంతో పెద్దగా విశాలమైన నిప్పులు రాలే కన్నులతో ధర్మరాజు శల్యుడిని చూడగా ఉన్నవాడున్నట్లే ఆ శల్యుడు నివురు (బూడిద) కాకపోవటం - ఓ ధృతరాష్ట్ర మహారాజా! చూడగా మాకు ఆశ్చర్యమైనది. (ధర్మరాజు చూపులకు శల్యుడు నుసికాకపోవటం చూచేవారికి ఆశ్చర్యమైంది.)

విశేషం: ఈ తేటగీతియందు 'శల్యుఁడు' 'మనుజనాథ!' అనే పదములు తప్ప మిగిలిన వన్నియు అచ్చతెనుఁగు పదాలు. మూలం ఉన్నది ఉన్నట్లుగా అనువదించబడినది. మూలము:

'నిరీక్షితోపై నరదేవరాజ్ఞా । పుతాత్మనా నిర్భృతకల్మషేణ ।
ఆభూ న్నయదృస్మసా న్మద్రరాజ । స్తదద్భుతం మే ప్రతిభాతి రాజన్ ॥ (9-16-39)

ఇక ఈ సందర్భంలో ధర్మజుడు 'ఫాలలోచనుడిచ్చిన ప్రీతియోగమును - నెక్కుడు భక్తియు నావహిల్లగా శక్తికి నమస్కరించి' నట్లు తిక్కయజ్వ వర్ణించాడు. (277వ పద్యం) ఇది అమూలకం. ప్రీతియోగమంటే సంతోషయుక్తి (కూడిక).

వ. ఇట్లు రౌద్రోద్రేకంబునఁ బురత్రయ దాహదోహలియగు శూలాయుధు లీల దోఁప దుర్నిరీక్షుండై. 281

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; రౌద్ర= క్రోధముయొక్క; ఉద్రేకంబునన్= పెరుగుదలవలన; పురత్రయ= త్రిపురములను; దాహ= కాల్చుటయందు; దోహలి= ఉత్సాహము కలవాడు; అగు= అయినట్టి; శూల= త్రిశూలము; ఆయుధు= ఆయుధముగా కలిగిన; శివుని; లీలన్= విధముగ; తోఁపన్= తోచగా; దుర్నిరీక్షుండై= చూడ శక్యము కానివాడై.

తాత్పర్యం: ఈ ప్రకారంగా ధర్మరాజు మిక్కుటమైన క్రోధం వలన త్రిపురాలను దహించే శివుడి విధంగా చూడశక్యం కానివాడై.

విశేషం: అలం: ఉపమ.

ఉ. ఘోరతర ప్రకారమగు కుంచితబాహువిలాస మొప్ప వి
స్తారము వింతయౌనురము సారతరంబుగఁ జూచి వజ్రధా
రారుచి సన్నిభప్రచురరశ్మలు పర్వఁగ బిట్టువైచె న
ద్దారుణశక్తి నవ్విభుఁ డుదాత్తసమిత్కృతికల్యు శల్యునిన్. 282

ప్రతిపదార్థం: ఘోరతర= మిక్కిలి భయంకరమగు; ప్రకారము= పద్ధతి; అగు= కలిగినట్టి; కుంచిత= వంచబడిన; బాహు= భుజములయొక్క; విలాసము= ఒయ్యారము; ఒప్పన్= ప్రకాశింపగా; విస్తారము= విరివి అయిన; వింతయౌ= విస్మయకరమగు; ఉరము= వక్షఃస్థలము; ఒప్పన్= ప్రకాశింపగా; ఆ+విభుండు= ప్రభువు అయిన ధర్మరాజు; ఉదాత్త= ఉన్నతమయిన; సమిత్కృతి= యుద్ధము చేయుటయందు; కల్యున్= నేర్పుకలవాడయిన; శల్యునిన్= శల్యుని; చూచి; వజ్ర= వజ్రాయుధముయొక్క; ధారా= వాడియొక్క; రుచి= కాంతితో; సన్నిభ= సమానమయిన; ప్రచుర= విస్తారమయిన; రశ్మలు= కాంతులు(కిరణములు); పర్వఁగన్= వ్యాపించగా; ఆ+దారుణశక్తిన్= శక్తి అను భయంకరాయుధమును; సారతరంబుగన్= మిక్కిలి బలముగా; బిట్టు= శీఘ్రముగా(వేగంగా); వైచెన్= విసిరెను.

తాత్పర్యం: మిక్కిలి భయంకరమైన పద్ధతి కలిగినట్టి పంచబడిన భుజాల ఒయ్యారం ప్రకాశించగా, విరివి అయిన విస్మయకరమయిన వక్షఃస్థలం ప్రకాశించగా ఆ ధర్మరాజు గొప్పయుద్ధం చేయటంలో నేర్పరి అయిన శల్యుడిని చూచి, వజ్రాయుధపు అంచుల కాంతితో సమానమైన, విస్తారమైన కాంతులు వ్యాపించగా ఆ భయంకరమైన శక్తి అనే ఆయుధాన్ని విసిరాడు.

తే. అట్లు పాండుభూపాలకు నగ్రసుతుఁడు । మద్రనాథుని వైచిన రౌద్రమెసఁగ
గంకటముదూఱి వక్షంబు గడచి వెన్ను । వెడలిచని యమ్మహాశక్తి పుడమిఁ జొచ్చె. 283

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారముగా; పాండుభూపాలకు= పాండురాజుయొక్క; అగ్రసుతుఁడు= పెద్దకొడుకు అయిన ధర్మరాజు; మద్రనాథునిన్= మద్రదేశ ప్రభువైన శల్యుడిని; రౌద్రము= క్రోధము; ఎసఁగన్= విజృంభించగా; వైచినన్= కొట్టగా; ఆ+మహాశక్తి= ఆ గొప్ప శక్తి అను ఆయుధము; కంకటము= కవచము; తూటి= ప్రవేశించి; వక్షంబు= ఱొమ్ము; కడచి= దాటి; వెన్ను= వీపు; వెడలిచని= బయటకు వచ్చి; పుడమిన్= భూమిలో; చొచ్చెన్= ప్రవేశించెను.

తాత్పర్యం: ఆ ప్రకారంగా ధర్మరాజు క్రోధం విజృంభించగా శల్యుడివైపు ఆ మహాశక్తి ఆయుధాన్ని విసరగా అది ఆ శల్యుడి కవచంలో ప్రవేశించి రొమ్ము చీల్చి, వీపునుండి బయటకు వచ్చి భూమిలో ప్రవేశించింది.

విశేషం: ఈ పద్యానికి మూలం: 'సా తస్య మర్మాణి విదార్య శుభ్ర మురో విశాలం చ తథైవ భిత్త్వా। విదేశ గాం తోయమివా ప్రసక్తా యశోవిశాలం నృపతే ర్దహన్తీ॥ (శల్య - 17-50)

వ్యాసభగవానుడు మూలంలో శక్తి ఆయుధాన్ని అద్భుతంగా వర్ణించాడు. దానిని ఇచటచూపటం న్యాయం. తిక్కన సంక్షేపంలో ఇది మరుగునపడినది.

తతస్తు శక్తిం రుచిరోగ్రదండాం మణిప్రవేకోజ్వలితాం ప్రదీప్తామ్ ।
చిక్షేప వేగాత్సు భృశం మహాత్మా మద్రాధిపాయ ప్రవరః కురూణామ్ ॥ (40)

దీప్తా మథైనాం ప్రహితాం బలేన సవిస్ఫులింగాం సహసా పతంతీమ్ ।
ప్రైక్షంత సర్వే కురవః సమేతా దివోయుగాంతే మహతీమివోల్కామ్ ॥ (41)

తాం కాలరాత్రీమివ పాశహస్తాం యమస్య ధాత్రీమివ చోగ్రరూపామ్ ।
స బ్రహ్మదండ ప్రతిమా మమోఘాం ససర్జ యత్తోయుధి ధర్మరాజః ॥ (42)

గన్ధ స్రగగ్ర్యాసనపాస భోజనైరభ్యర్చితాం పాండుసుతైః ప్రయత్నాత్ ।
సాంవర్తకాగ్ని ప్రతిమాం జ్వలన్తీం కృత్యా మథర్వాంగిరసీమి వోగ్రామ్ ॥ (43)

ఈశానహేతోః ప్రతినిర్మితాం తాం త్వష్టా రిపుణామసుదేహభక్ష్యామ్ ।
భూమ్యన్తరిక్షాది జలాశయాని ప్రసహ్య భూతాని నిహన్తు మీశామ్ ॥ (44)

ఘంటాపతాకాం మణివజ్రభాజం వైడూర్య చిత్రాం తపనీయదండామ్ ।
త్వష్టా ప్రయత్నా న్నియమేన క్లుప్తాం బ్రహ్మద్విషా మంతకరకరీమమోఘామ్ ॥ (45)

బలప్రయత్నా దధిరూఢవేగాం మన్త్రైశ్చ ఘోరై రభిమంత్ర్య యత్నాత్ ।
ససర్జ మార్గేణ చ తాం పరేణ వధాయ మద్రాధిపతేస్తదానీమ్ ॥ (46) (9-16-46)

తిక్కన అనువాదంలో ఈ వర్ణనంలేదు. ఔచిత్యాన్ని సహృదయులైన విజ్ఞులు గ్రహింతురుగాక!

ధర్మరాజు శక్తి ప్రయోగించి శల్యునిం జంపుట (సం. 9-16-50)

వ. ఇట్లు శక్తి బెడిదంపుటు రవడి నుచ్చిపోయిన. 284

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; శక్తి= శక్తి అను ఆయుధము; బెడిదంపు= భయంకరమగు; ఉరవడిన్= మిక్కిలి వేగముగా; ఉచ్చిపోయినన్= దూసికొని వెడలిపోగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా శక్తి అనే ఆయుధం భయంకరమైన వేగంతో శల్యుడిని కొట్టి వెడలిపోగా.

చ. క్షతమున ముక్కునం జెవులఁ గన్నుల నొల్కెడు రక్త మంగ మా
ప్లుతముగఁ జేయఁగా నతఁడు బోరగిలంబడియెన్ ధరం గర
ద్వితయము సాఁచి ధర్మజునిదిక్కు శిరంబుగ వజ్రదారుణా
హతిఁ బడు భూరిభూధరమహత్తరశృంగముభంగి భూవరా! 285

ప్రతిపదార్థం: భూవరా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; క్షతమునన్= గాయమువలన; ముక్కునన్= ముక్కునుండి; చెవులన్= చెవులనుండి; కన్నులన్= కన్నులనుండి; ఒల్కెడు= ఒలికెడు; రక్తము; అంగము= శరీరము; ఆప్లుతముగన్= తడిసినదిగా; చేయఁగాన్= చేయగా; అతఁడు= ఆ శల్యుడు; ధరన్= భూమిపై; బోరగిలన్= రొమ్ము భూమిపై ఆనునట్లు; పడియెన్= పడిపోయెను; కరద్వితయము= రెండుచేతులు; చాఁచి= సాగిలపడి; వజ్ర= వజ్రాయుధపు; దారుణ= భయంకరమయిన; ఆహతిన్= దెబ్బవలన; పడు= పడిపోయిన(కూలిన); భూరి= పెద్దది అయిన; భూధర= పర్వతముయొక్క; మహత్తర= మిక్కిలి గొప్పది అయిన; శృంగము= శిఖరము; భంగిన్= విధముగ; ధర్మజునిదిక్కు= ధర్మరాజువైపు; శిరంబుగన్= తల కలవాడుగా; ధరన్= భూమిపై; పడియెన్= పడిపోయెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! గాయం వలన ముక్కునుండి చెవులనుండి కన్నులనుండి ఒలికే నెత్తురు శరీరాన్ని తడిపివేయగా, ఆ శల్యుడు భూమిపై బోరగిలపడిపోయాడు. చేతులరెండూ చాచి, సాగిలబడి వజ్రాయుధం యొక్క భయంకరమైన దెబ్బవలన పడిపోయిన మిక్కిలి పెద్దదైన పర్వత శిఖరం విధంగా ధర్మరాజువైపు తల కలవాడుగా భూమిపై పడిపోయాడు.

విశేషం: అలం: ఉపమ. శల్యుఁడు-ఉపమేయం; పర్వతశిఖరం-ఉపమానం; భంగి(న్) - ఉపమావాచకం. పడిపోవుట - సమానధర్మం. పూర్ణోపమ. ఇక మూలంలో స్కందుడు కొట్టిన క్రౌంచపర్వతమువలె శల్యుడు అయినట్లు కూడా వ్యాసుడు వర్ణించాడు. తిక్కన ఇంద్రుడి వజ్రాయుధం వలన కూలిన పర్వతశిఖరంతో పోల్చి వర్ణించాడు.

ఆ. భూమిమీఁద నిట్లు బోరగిలంబడి । మద్రనాథుఁ డొప్పె మానవేంద్ర!
లేమయురమునందు లీలమై వ్రాలిన । ప్రాణనాథుఁ బోల్పఁ బట్టు గాఁగ. 286

ప్రతిపదార్థం: మానవ= మనుజులకు; ఇంద్ర!= ప్రభువు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఇట్లు= ఈ ప్రకారముగ; భూమిమీఁదన్= నేలమీద; బోరగిలన్+పడి= రొమ్ము భూమిపై ఆనునట్లుగా పడి; మద్రనాథుఁడు= శల్యుఁడు; లేమ= యౌవనవతి అయిన మగువయొక్క; ఉరమునందున్= వక్షఃస్థలముమీద; లీలమైన్= విలాసంతో; వ్రాలిన= ఒరిగిన; ప్రాణనాథున్= ప్రియుని(భర్తను); పోల్పన్= పోల్చుటకు; పట్టు= స్థానము; కాఁగన్= అగునట్లుగా; ఒప్పెన్= ప్రకాశించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఈ ప్రకారంగా నేలమీద బోరగిలపడి శల్యుడు యౌవనవతి అయిన మగువ వక్షఃస్థలంమీద విలాసంతో ఒరిగిన ప్రియుడితో పోల్చటానికి తగినట్లుగా ప్రకాశించాడు.

విశేషం: రాజుకు భూనాథుడని పేరు. శల్యుడు రాజు, భూపాలుడు. భూమి స్త్రీ రూపిణి. అందువలన ఈ పద్యంలోని శల్య వర్ణనం సముచితం.

ఆ. ధర్మసంగరమున ధర్మజుచేఁ జచ్చి । పొలిచెఁ జూడ మద్రభూవిభుండు
విధియుతంబు గాఁగ వేలిచి విడిచిన । నాఱి యున్నయగ్ని ననుకరించి. 287

ప్రతిపదార్థం: మద్రభూవిభుండు= మద్రదేశ ప్రభువైన శల్యుడు; ధర్మసంగరమునన్= ధర్మయుద్ధమునందు; ధర్మజునిచేన్= ధర్మరాజుచేత; చచ్చి= మరణించి; విధియుతంబు గాఁగన్= వేద విధి విధానముతో కూడి; వేలిచి= హోమాగ్నియందు నేయి మొదలగు వానిని స్వాహాకారముతో సమర్పించి; విడిచినన్= వదలిపెట్టగా; ఆఱి= ఆరిపోయి; ఉన్న= ఉన్నట్టి; అగ్నిన్= హోమాగ్నిని; అనుకరించి; చూఁడన్= చూడగా; పొలిచెన్= ఒప్పెను.

తాత్పర్యం: శల్యుడు ధర్మయుద్ధంలో ధర్మరాజు వలన మరణించి, వేదవిధివిధానసహితంగా హోమాగ్నిలో స్వాహాకారంతో సమర్పించి విడిచిన ఘృతాదివస్తు సముదాయం హుతమై ఉపశమించి ఉన్నట్టి అగ్నిని అనుకరించి సాక్షాత్కరించాడు.

విశేషం: శల్యుడి పవిత్రమూర్తిమత్త్వం, ధర్మస్వరూపం, వ్యక్తిత్వసత్యం - ఈ ఒక్క ఆటవెలది యందు సాక్షాత్కరించబడ్డాయి. భీష్ముడు ఎంతటి పరాక్రమవంతుడో, ధర్మస్వరూపుడో, శల్యుడూ అంతటివాడే. రెండు ధర్మాలకు పరస్పరసంఘర్షణమే శల్య ధర్మరాజుల యుద్ధంలోని అంతరార్థం. ధర్మరాజుచేత మరణించటమే శల్యుడి ఉత్తమత్వానికి నిదర్శనం. హిరణ్యకశిపుని పుత్రుడు ప్రహ్లాదుడు; ప్రహ్లాదుడి తమ్ముడు సంహ్లాదుడు. ఈ సంహ్లాదుడి అంశావతారం శల్యుడు. అసలు మహాభారతంలోని పాత్రలన్నీ అంశావతారాలే.

'ప్రియయా కాన్తయా కాన్తః పతమానమివోరసి ।
చిరం భుక్త్వా వసుమతీం ప్రియాం కాన్తా మివ ప్రభుః ॥
సర్వైరంగైః సమాశ్లిష్య ప్రసుప్త ఇవ సోఽభవత్ ।
ధర్మ్యే ధర్మాత్మనా యుద్ధే విహతో ధర్మసూనునా ।
సమ్యక్ హుత ఇవ స్విష్టః ప్రశాంతోఽగ్నిరివాధ్వరే ॥ (శల్య. 16-54, 55, 56)

ఇవి పై రెండు ఆటవెలదులకు మూలాలు. ఎంతటి రమణీయ ఉపమాలంకారాలు!

మ. కని శల్యానుజుఁ డేచి ధర్మసుతు నుగ్రస్ఫూర్తి శోభిల్లఁ దాఁ
కిన నా భూపతి చిత్రచాపధరుఁడై కేళీసమప్రక్రియన్
ధనువుం గేతువుఁ ద్రుంచి తోడన సముద్యద్దీప్తభల్లాహతిం
దునిమెం గుండలకాంతమైన శిరమున్ దుర్దాంతదర్పంబునన్. 288

ప్రతిపదార్థం: శల్య= శల్యుడియొక్క; అనుజుఁడు= తమ్ముడు; కని= చూచి; ఉగ్ర= భయంకరమయిన; స్ఫూర్తి= స్ఫురణము; శోభిల్లన్= ప్రకాశింపగా; ధర్మసుతున్= ధర్మరాజును; ఏచి= విజృంభించి; తాఁకినన్= ఎదుర్కొనగ; ఆ భూపతి= ఆ ధర్మరాజు; చిత్ర= ఆశ్చర్యజనకమయిన; చాప= ధనువును; ధరుఁడై= ధరించినవాడై; కేళీ= క్రీడతో; సమ= సమానమయిన; ప్రక్రియన్= విధముతో; ధనువున్= వింటిని; కేతువున్= టెక్కెమును; త్రుంచి= ఖండించి; తోడన= వెంటనే; సముద్యత్= సంసిద్ధతతో; దీప్త= ప్రజ్వలించుచున్న; భల్ల= బల్లెముయొక్క; ఆహతిన్= దెబ్బతో; దుర్దాంత= సహింపశక్యంకాని; దర్పంబునన్= గర్వముతో; కుండల= కర్ణకుండలములవలన; కాంతము= ప్రకాశవంతము; ఐన= అయినట్టి; శిరమున్= తలను; తునిమెన్= ఖండించెను.

తాత్పర్యం: శల్యుడి తమ్ముడు శల్యుడి మరణాన్ని చూచి భయంకరాకారుడై ప్రకాశిస్తూ, విజృంభించి ధర్మరాజును ఎదుర్కొనగా ధర్మరాజు ఆశ్చర్యజనకమైన వింటిని ధరించి, ఆటాడినట్లుగా శల్యుడి తమ్ముడి వింటిని టెక్కెమును ఖండించి, ఆ వెంటనే సంసిద్ధతతో ప్రకాశిస్తున్న బల్లెంయొక్క దెబ్బతో సహింపశక్యం కాని గర్వంతో కర్ణకుండలాలతో కాంతిమంతమైన తలను ఖండించాడు.

విశేషం: శల్యుడి తమ్ముడనియే కాని పేరులేదు- అగస్త్యభ్రాతవలె. ఇట్టివారు పురాణాలలో చాలామంది ఉన్నారు.

వ. ఇట్లు శల్యుండు సోదర సహితంబుగాఁ బడినఁ బాండవసైన్యంబు జనంబులు వృత్రవధం బొనరించు పాకశాసనుఁ బ్రశంసించు బృందారకుల చందంబున నగ్గించి రమ్మొగ్గరంబునం దూర్యనినదంబులు సింహనాదంబులుఁ జెలంగఁ గలంగి కురుసేన విఱిగి పఱచినం బోనీక పొడువుం డనుచు సాత్యకి వెనుకొనుటయుఁ గనుంగొని కృతవర్మండు మార్కొనియె. నయ్యాదవసింహులరణంబు దారుణంబయ్యె నందు. 289

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగా; శల్యుండు; సోదరసహితంబుగాన్= తమ్ముడితోకూడ; పడినన్= మరణించగా; పాండవ= పాండవులయొక్క; సైన్యంబు= సైన్యముయొక్క; జనంబులు= సైనికులు; వృత్ర= వృత్రాసురునియొక్క; వధన్= సంహారమును; పొనరించు= చేయు; పాకశాసనున్= ఇంద్రుని; ప్రశంసించు= పొగడు; బృందారకుల= దేవతల; చందంబునన్= విధముగా; అగ్గించిరి= పొగడిరి(స్తుతించిరి); ఆ; మొగ్గరంబునన్= సేనావ్యూహమునందు; తూర్య= తూర్యములయొక్క; నినదంబులు= ధ్వనులు; సింహనాదంబులున్= సింహగర్జనములును; చెలంగన్= గోల చేయగా; కలంగి= కలతచెంది; కురుసేన= కౌరవులసైన్యము; విఱిగి= ఓడిపోయి; పఱచినన్= పాఱిపోవుచుండగా; పోనీక= పోనీయక; పొడవుండు= పోట్లాడుడు; అనుచున్= అనుచు; సాత్యకి; వెనుకొనుటయున్= వెంటాడుటయును; కనుంగొని= చూచి; కృతవర్మండు; మార్కొనియెన్= ఎదుర్కొనియెను; ఆ; యాదవసింహుల= యాదవశ్రేష్ఠులైన-సాత్యకి కృతవర్మలయొక్క; రణంబు= యుద్ధము; దారుణంబు= భయంకరము; అయ్యెను; అందున్= ఆ యుద్ధమునందు.

తాత్పర్యం: ఈ ప్రకారంగా శల్యుడు తమ్ముడితో కూడా మరణించగా పాండవుల సైన్యంలోని సైనికులు వృత్రాసురుడిని సంహరించిన మహేంద్రుడిని పొగడే దేవతల విధంగా పొగిడారు. అప్పుడు ఆ సేనావ్యూహంలో తూర్యధ్వనులు, సింహగర్జనలు శబ్దించగా కలతచెంది కురుసేన ఓడిపోయి పారిపోతూ ఉండగా 'పోట్లాడండి' అంటూ సాత్యకి వెంటాడటాన్ని చూచి కృతవర్మ ఎదుర్కొన్నాడు. ఆ యాదవశ్రేష్ఠులయొక్క యుద్ధం భయంకరమైనది. ఆ యుద్ధంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

సీ. కృతవర్మ సాత్యకి నతిశితశరదశ । కమున నొంచి తురంగముల యుబ్బు
నుడిపి విల్లునుముటయును నొండువింట న । బ్బలియుఁ డాతని మేనఁ బదిమెఱుంగు
టమ్ములు వఱపి రథ్యమ్ముల నరదంబు । సూతుని నఱికినఁ జూచి కృపుఁడు
దనతేరిపైఁ బెట్టుకొని తొలఁగించె న । వ్వీరుపోరికి మూఁక వెఱచి పఱచెఁ

తే. **గడఁగి వెనుకొన్న పాండవోత్కరము నొకఁడ । నిలువరించె నుద్దండుఁడై నీతనూజుఁ**
డంత వేఱొక్కతే రెక్కి యరుగుదెంచి । తాఁకె హార్దిక్యుఁ డరిసేన తల్లడిల్ల. **290**

ప్రతిపదార్థం: కృతవర్మ; సాత్యకిన్; అతి= మిక్కిలి; శిత= వాడిఅయిన; శర= బాణములయొక్క; దశకమునన్= పదింటితో; నొంచి= నొప్పించి; తురంగముల= గుఱ్ఱములయొక్క; ఉబ్బున్= పొంగు; ఉడిపి= పోగొట్టి; విల్= విల్లు(ధనువు); తునుముటయున్= ఖండించుటయును; ఒండు= మరియొక; వింటన్= ధనువుతో; ఆ+బలియుఁడు= ఆ బలవంతుడు(సాత్యకి); ఆతని= ఆ కృతవర్మయొక్క; మేనన్= శరీరమునందు; పది; మెఱుంగు= ప్రకాశవంతమయిన; అమ్ములు= బాణములు; పఱపి= ప్రయోగించి; రథ్యమ్ములన్= గుఱ్ఱాలను; అరదంబున్= రథమును; సూతునిన్= సూతుని; నఱికినన్= ఖండించగా; చూచి; కృపుఁడు; తన; తేరిపైన్= రథముమీద; పెట్టుకొని= ఉంచుకొని; తొలఁగించెను= తప్పించెను; ఆ; వీరు= వీరుడయిన సాత్యకియొక్క; పోరికిన్= యుద్ధమునకు; మూఁక= సైన్యము; వెఱచి= భయపడి; పఱచెన్= పాఱిపోయెను; కడఁగి= పూనికవహించి; వెనుకొన్న= వెంటాడిన; పాండవ= పాండవులయొక్క; ఉత్కరమున్= సమూహమును; నీతనూజుఁడు= నీయొక్క కొడుకు (దుర్యోధనుఁడు); ఒకఁడు+అ= ఒక్కడే; ఉద్దండుఁడై= అధికుడై; నిలువరించెను= ఆపెను; అంతన్= అంతలో; వేఱొక్క= ఇంకొక; తేరు= రథము; ఎక్కి; హార్దిక్యుఁడు= కృతవర్మ; అరుగుదెంచి= వచ్చి; అరిసేన= శత్రుసేన; తల్లడిల్లన్= తొట్రుపాటు పడగా(చలింపగా); తాఁకెన్= ఎదిరించెను.

తాత్పర్యం: కృతవర్మ సాత్యకిని మిక్కిలి వాడి అయిన పదిబాణాలతో నొప్పించి, గుఱ్ఱాల పొంగు పోగొట్టి, ధనువును ఖండించాడు. బలవంతుడైన సాత్యకి మరియొక ధనువుతో ఆ కృతవర్మ శరీరమునందు ప్రకాశవంతమయిన పదిబాణాలు ప్రయోగించి గుఱ్ఱాలను రథాన్ని, సూతుడిని ఖండించాడు. అది చూచి కృపుడు, కృతవర్మను తన రథంపై పెట్టుకొని అచ్చటనుండి తప్పించాడు. వీరుడైన ఆ సాత్యకి చేసే యుద్ధానికి సైన్యం భయపడి పారిపోయింది. వెంటాడుతున్న పాండవసైన్యసమూహాన్ని దుర్యోధనుడు ఒక్కడే నిలువరించాడు. అంతలో ఇంకొక రథం ఎక్కి కృతవర్మ వచ్చి శత్రుసేన తొట్రుపాటు పడేటట్లు ఎదిరించాడు.

వ. **ఇ ట్లెదిర్చి పేర్చినయలుకఁ బాండవాగ్రజుండు గృతవర్మని ఘోటకంబులను గీటడఁగించినఁ గురునందనుం డా హృదికనందనుని నిజస్యందనంబున నిడుకొని యవ్వలికిం గొనిపోయె నప్పుడు కృపాచార్యుండు గదిసిన నయ్యుధిష్ఠిరుం డాఱమ్ము లెమ్ములం గీలింప నతండు పదాఱుతూపుల నాభూపాలునిఁ దదీయ తురంగంబుల నేసె నా సమయంబున.** **291**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; ఎదిర్చి= ఎదిరించి; పేర్చిన= అధికమైన; అలుకన్= కోపముతో; పాండవ= పాండవులలో; అగ్రజుండు= పెద్దవాడు అయిన ధర్మరాజు; కృతవర్మని= కృతవర్మయొక్క; ఘోటకంబులను= గుఱ్ఱములను; గీటడఁగించినన్= చంపగా; గురునందనుండు= అశ్వత్థామ; హృదికనందనుని= హృదికునియొక్క పుత్రుడయిన కృతవర్మను; నిజ= తనయొక్క; స్యందనంబునన్= రథమునందు; ఇడుకొని= ఉంచుకొని; అవ్వలికిన్= ఆవలకు; కొనిపోయెన్= తీసికొని పోయెను; అప్పుడు; కృపాచార్యుండు; కదిసినన్= కలియబడగా; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు; ఆఱు= ఆరు; అమ్ములు= బాణములు; ఎమ్ములన్= ఎముకలను; కీలింపన్= తగిలించగా; అతండు= కృపాచార్యుఁడు; పదాఱు= పదియు ఆరు(పదహారు); తూపులన్= బాణములతో; ఆ భూపాలునిన్= ఆ ధర్మరాజును; తదీయ= ఆతడి; తురంగంబులన్= గుఱ్ఱములను; ఏసెను= కొట్టెను; ఆ సమయంబున.

తాత్పర్యం: ఈ ప్రకారంగా ఎదిరించి అతిశయించిన కోపంతో ధర్మరాజు కృతవర్మ గుఱ్ఱాలను చంపాడు. అశ్వత్థామ కృతవర్మను తన రథమునం దుంచుకొని ఆవలకు తీసికొని పోయాడు. ఆ సమయంలో కృపాచార్యుడు

కలియబడగా ధర్మరాజు ఆరుబాణాలతో ఎముకలను కొట్టాడు. అంతట కృపాచార్యుడు పదహారు బాణాలతో ధర్మజుడిని, ఆతడి గుర్రాలను కొట్టాడు. ఆ సమయంలో.

తే. భద్రకరి నెక్కి చామర ప్రకరవీజ । నములు ధవళాతపత్రవిభ్రమసమృద్ధి
యతిశయిల్ల సైన్యోత్సాహ మావహిల్లఁ । బొలిచె నెంతయు భవదీయపుత్త్రుఁ డధిప! 292

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; భవదీయ= మీయొక్క; పుత్త్రుఁడు= కుమారుఁడు అయిన దుర్యోధనుఁడు; భద్రకరిన్= భద్రగజమును(శుభమును కలుగచేయు ఏనుగు భద్రగజము); ఎక్కి; చామర= వింజామరలయొక్క; ప్రకర= సమూహములయొక్క; వీజనములు= విసరుటలు; ధవళ= తెల్లని; ఆతపత్ర= గొడుగులయొక్క; విభ్రమ= విలాసముయొక్క; సమృద్ధి= అధికమయిన సంపద; అతిశయిల్లన్= ఆధిక్యమునందగా; సైన్య= సైన్యముయొక్క; ఉత్సాహము= ప్రయత్నము; ఆవహిల్లన్= కలుగగా; ఎంతయున్= మిక్కిలి; పొలిచెను= ఒప్పెను. (ప్రకాశించెను)

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ పుత్రుడు దుర్యోధనుడు భద్రగజాన్ని ఎక్కి వింజామరల సమూహాలు వీస్తుండగా, తెల్లని గొడుగుల విలాససంపద విలసిల్లగా సైన్యంయొక్క ప్రయత్నం కలుగగా మిక్కిలి ప్రకాశించాడు.

శల్యుచుట్టంబు లొక్కపెట్ట ధర్మరాజుం జుట్టుముట్టుట (సం. 9-17-3)

ఉ. అమ్మనుజేంద్రు ముందటికి నార్పులతోఁ జనుదెంచి శల్యుచు
ట్టమ్ములు సత్వరమ్ముగఁ గడంగి యనేకులు వీరయోధు లు
గ్రమ్ముగ వీఁకఁ దేరులు పొగడ్తకు నెక్కఁగ దీప్తమైన కో
పమ్మున నేచి పాండవులపై నడరం గని పేరెలుంగునన్. 293

ప్రతిపదార్థం: శల్యుచుట్టమ్ములు= శల్యుడి యొక్క చుట్టములు; అనేకులు; వీర= శూరులయిన; యోధులు= పరాక్రమవంతులు; సత్వరమ్ముగన్= వేగముగా; కడంగి= ప్రయత్నించి; ఆ+మనుజేంద్రు= ఆ ధర్మరాజు; ముందటికిన్= ముందునకు; ఆర్పులతోన్= అరుపులతో; చనుదెంచి= వచ్చి; సత్వరమ్ముగన్= శీఘ్రంగా; కడంగి= పూని; అనేకులు= పెక్కులు; వీరయోధులు; ఉగ్రమ్ముగన్= భయంకరంగా; వీఁకన్= పరాక్రమంతో; తేరులు= రథాలు; పొగడ్తకున్= స్తుతికి; ఎక్కఁగన్; దీప్తమైన= ప్రకాశవంతమయిన; కోపమ్మునన్= కోపముతో; ఏచి= విజృంభించి; పాండవులపైన్= పాండవులమీద; అడరన్= విజృంభించుట; కని= చూచి; పేరు= పెద్ద; ఎలుంగునన్= కంఠధ్వనితో.

తాత్పర్యం: శల్యుడి చుట్టాలు పరాక్రమవంతులైన యోధులు అనేకులు వేగంగా ప్రయత్నించి ఆ ధర్మరాజు ముందుకు పెడబొబ్బలు పెట్టుతూ వచ్చి చుట్టుముట్టగా పరాక్రమంతో కోపంతో విజృంభించి పాండవులమీద విజృంభించటాన్ని చూచి పెద్ద కంఠధ్వనితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఈ పద్యమునకు మూలం చిన్న అనుష్టుప్పు.

'శల్యేఽథ నిహతే రాజన్ మద్రరాజ పదానుగాః ।
రథాః సప్తశతా వీరా నిర్యయు ర్మహతో బలాత్ ॥ (9-17-1)

వ. అన్నరనాథుండు. 294

ప్రతిపదార్థం: ఆ+నరనాథుండు= ఆ దుర్యోధనుడు.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు.

తే. **మీర లేర్పడ వడిఁ దలమిగిలి చనఁగ । వలదు నాముోల బలుపారి నిలువుఁడనియె**
వారు నిలువక పాండవబలము చేవ । దఱుగఁ జొచ్చి యుధిష్ఠిరుఁ దాఁకి రధిప! 295

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజ!; మీరలు= మీరు; ఏర్పడన్= తేటపడునట్లు; వడిన్= వేగముగా; తలమిగిలి= ముందుకు; చనఁగన్= వెడలగ; వలదు; నాముోలన్= నా ఎదుట; బలుపు+ఆరి= బలము కలిగి; నిలువుఁడు; అనియెన్= అనియెను; వారు నిలువక; పాండవబలము= పాండవుల సైన్యముయొక్క; చేవ= ధైర్యము; తఱుగన్= తగ్గిపోవునట్లు; చొచ్చి= ప్రవేశించి; యుధిష్ఠిరున్= ధర్మరాజును; తాఁకిరి= ఎదుర్కొనిరి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! 'మీరు వేగముగా ముందుకు వెడల వద్దు. నా ఎదుట బలంగా నిలవండి.' అని దుర్యోధనుడు శల్యుడి చుట్టాలను వారించినా వారు నిలువక పాండవబలముయొక్క ధైర్యం తరిగిపోవునట్లు ప్రవేశించి ధర్మరాజును ఎదుర్కొన్నారు.

వ. **ఇట్లు చలంబున నవ్విభుం దలపడి వివిధాస్త్రంబులు గుప్పించి నొప్పించినఁ గవ్వడియును వడముడియుఁ గవలును ద్రౌపదికొడుకు లేవురును గోవిందుతమ్ముండును ధృష్టద్యుమ్నుండును శిఖండియును జండరయంబున నుద్దండచతురంగ సమేతులై యా రథికులఁ బొదువుటయును వారలు వీరోద్రేకంబున సైన్యసాగరంబున నున్మదమకరప్రకరంబులవిధంబున విహరించి రట్లు పాండవసేనాసంక్షోభసంపాదులగు నాజోదుల యాటోపం బాలోకించి గాంధారపతి గాంధారేయు నాలోకించి. 296**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; చలంబునన్= మాత్సర్యముతో; ఆ; విభున్= ప్రభువు అయిన ధర్మరాజును; తలపడి= ఎదుర్కొని; వివిధాస్త్రంబులు= నానావిధములయిన ఆయుధములు; కుప్పించి= ఒక్కసారిగా ప్రయోగించి; నొప్పించినన్= బాధించగా; కవ్వడియును= అర్జునుడును; వడముడియున్= భీముడును; కవలును= నకుల సహదేవులును; ద్రౌపదికొడుకులు= ద్రౌపదియొక్క పుత్రులు; ఏవురును= అయిదుగురును; గోవిందు= శ్రీకృష్ణుడియొక్క; తమ్ముండును= తమ్ముడు అయిన సాత్యకియును; ధృష్టద్యుమ్నుండును; శిఖండియును; చండ= తీవ్రమయిన; రయంబునన్= వేగముతో; ఉద్దండ= అధికమయిన; చతురంగ= చతురంగ సైన్యములతో; సమేతులై= కూడినవారై; ఆ రథికులన్= రథముపై నుండి యుద్ధము చేయు ఆ యోధులను; పొదువుటయును= క్రమ్ముకొనుటయును; వారలు= వారు; వీర= పరాక్రమముయొక్క; ఉద్రేకంబునన్= అధికమయిన ఆవేశమువలన; సైన్య= సేనలు అనెడి; సాగరంబునన్= సముద్రమునందు; ఉన్మద= మదించిన; మకర= మొసళ్ళయొక్క; ప్రకరంబుల= సమూహములయొక్క; విధంబునన్= ప్రకారముగా; విహరించిరి= వేడుకగా తిరిగిరి; అట్లు; పాండవ= పాండవులయొక్క; సేనా= సేనలకు; సంక్షోభ= అలజడిని; సంపాదులు= కలిగించినవారు; అగు= అయినట్టి; ఆ జోదుల= ఆ యోధులయొక్క; ఆటోపంబు= ఆడంబరము; ఆలోకించి= చూచి; గాంధార= గాంధారదేశమునకు; పతి= భర్త(అనగా గాంధారరాజు శకుని); గాంధారేయున్= గాంధారిపుత్రుడైన దుర్యోధనుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఈ ప్రకారంగా మాత్సర్యంలో ఆ ధర్మరాజును చుట్టుముట్టి నానావిధాలయిన ఆయుధాలు ఒక్కసారిగా ప్రయోగించి బాధించగా అర్జునుడు, భీముడు, నకుల సహదేవులు, ద్రౌపదికొడుకులైన ఉపపాండవులు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, శిఖండియును తీవ్రమైన వేగంతో అధికమైన చతురంగబలాలతో కూడి ఆ యోధులను చుట్టుముట్టారు.

ఆ శల్యుడి చుట్టములు పరాక్రమావేశపరులై సేన అనే సముద్రంలో మదించిన మొసళ్ళయొక్క గుంపుల విధంగా వేడుకగా తిరిగారు. ఆ ప్రకారంగా పాండవసైన్యాల అలజడిని సంపాదించినట్టి ఆ మద్రదేశయోధుల ఆడంబరాన్ని చూచి శకుని దుర్యోధనుడితో.

విశేషం: అలం: ఉపమ. రూపకానుప్రాణితం.

తే. 'మద్రవిభువారి నిమ్మెయి మార్తు రాఁగి । కొనఁగ మనకు నుపేక్షింపఁ జనునె?' యనుడు
నతఁడు 'నామాట వినక వా రరిగి రేమి । సేయువారము? చెప్పు మౌచిత్య మనియె' 297

ప్రతిపదార్థం: మద్రవిభు= మద్రదేశపు అయిన శల్యునికి సంబంధించిన; వారిన్= వారిని; ఇమ్మెయిన్= ఈ విధముగా; మార్తురు= చంపుదురు; మనకున్= మనకు; ఆగికొనగన్= అడ్డగించుటకు; ఉపేక్షింపన్= అశ్రద్ధచేయగా; చనునె?= చెల్లునా? (తగునా?); అనుడున్= శకుని ఇట్లు అనగా; అతఁడు= ఆ దుర్యోధనుఁడు; నామాట; వినక= వినకుండా; వారు; అరిగిరి= వెడలిరి; ఏమి చేయువారము?= చేయగలము?; ఔచిత్యము= ఉచితమార్గము; చెప్పుము; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'శల్యుడికి సంబంధించిన వారిని పాండవులు ఈవిధంగా చంపుతారు. ఆ పాండవులను అడ్డగించటానికి మనకు అశ్రద్ధ చేయతగునా?' శకుని ఇట్లా చెప్పగా దుర్యోధనుడు ఇట్లా అన్నాడు. 'ఆ శల్యుడి అనుచరులు నామాట వినకుండ వెళ్ళారు. ఏమి చేయగలం? ఉచితమయిన మార్గం చెప్పుము'. అన్నాడు.

వ. అని నన్ను నాపరివారంబును రక్షింపను దగవెఱింగింపను నర్హుండ వీవకాదె?' యనుమాట లాడిన నతండు ప్రీతుండై బలపరిపాలనంబును గర్జంబు సెప్పటయును దనపనిగా మనంబునంబూని యవి దోఁచునట్టి యుచితవచనంబుల నవ్వసుమతీపతికిఁ బ్రియం బాపాదించి. 298

ప్రతిపదార్థం: అని; నన్నున్; నాపరివారంబును= నాయొక్క పరిజనమును; రక్షింపను= రక్షించుకొనుటకు; తగవు= న్యాయము (మార్గము); ఎఱింగింపను= తెలియచెప్పుటకు; ఈవ= నీవే; అర్హుండవు= తగినవాడవు; కాదె?= కాదా?; అను= అనెడి; మాటలు= పలుకులు; ఆడినన్= పలికిన; అతండు= ఆ శకుని; ప్రీతుండై= సంతోషించినవాడై; బల= సైన్యముయొక్క; పరిపాలనంబును= నిలుపుటను(కాపాడుటను); కర్జంబు= కార్యము; చెప్పుటయును= చెప్పుటకూడా; తనపనిగాన్= తనయొక్క పనిగా(కార్యముగా); మనంబునన్= మనస్సునందు; పూని= తలచి; అవి; తోఁచునట్టి= తోచునట్టి; ఉచిత వచనంబులన్= న్యాయమయిన మాటలతో; ఆ+వసుమతీ పతికిన్= రాజు దుర్యోధనుడికి; ప్రియంబు= సంతోషము; ఆపాదించి= కలిగించి.

తాత్పర్యం: దుర్యోధనుడు శకునితో ఇట్లా అని, 'నన్ను నా పరిజనాన్ని రక్షించుకొనటానికి తగిన మార్గాన్ని న్యాయాన్ని తెలియచెప్పటానికి నీవే సమర్థుడవుకదా!' అనగా - ఆ శకుని సంతోషించినవాడై తన పనిగా మనస్సునందు తలచి, ఉచితవచనాలతో ఆ దుర్యోధనుడికి సంతోషం కలిగించి.

చ. 'వినుము నరేంద్ర! సైనికులు విక్రమలీల నరాతిసేన సా
చ్చినఁ బతి గావకున్న నుపజీవులు మెత్తురె? యన్నఁ 'గాతుఁ గా'
కని బహుతూర్యనాదములు నార్పులునుం జెలఁగంగఁ ద్రోచి య
జ్జనపతి వీఁకమై నడరె సైన్యయుతంబుగ సత్వరంబుగన్. 299

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= ప్రభువు అయిన (అనగా రాజు అయిన దుర్యోధనా!); వినుము; సైనికులు; విక్రమ= పరాక్రమముయొక్క; లీలన్= విలాసముతో; అరాతి= శత్రువులయొక్క; సేన= సైన్యము; చొచ్చినన్= ప్రవేశించగా; పతి= అధిపతి; కావకున్నను= రక్షించకున్నచో; ఉపజీవులు= రాజుపై ఆధారపడి జీవించువారు; మెత్తురె?= మెచ్చుకొందురా?; అన్నన్= అనగా; కాతున్= రక్షింతును గాక అని; బహు= పలు; తూర్యనాదములును= తూర్య ధ్వనులును; ఆర్పులునున్= అరుపులును; చెలఁగంగన్= ధ్వనించగా; త్రోచి= లెక్కజేయక; ఆ+జనపతి= ఆ దుర్యోధనుడు; సత్వరంబుగన్= మిక్కిలి వేగముగా; సైన్యయుతంబుగన్= సేనా సమేతముగా; వీఁకమైన్= పరాక్రమముతో; అడరెన్= అతిశయించెను.

తాత్పర్యం: 'ఓ దుర్యోధన మహారాజా! ఆలకించుము. సేనలు పరాక్రమవిలాసంతో శత్రుసైన్యమునందు ప్రవేశించినప్పుడు వారి అధిపతి రక్షించకపోతే వారిపై ఆధారపడి జీవించేవారు మెచ్చుకొంటారా?' అని శకుని అనగా 'వారిని రక్షిస్తాను-' అని పలు తూర్యధ్వనులు, సైనికుల అరుపులు వ్యాపించగా, వాటిని దుర్యోధనుడు లెక్కచేయక మిక్కిలి వేగంగా సేనాసమేతంగా పరాక్రమంతో విజృంభించాడు.

క. అంత ధనంజయ కిమ్మీ । రాంతకముఖ యోధవర మహాస్త్రప్రకరం
బంతకుకడ కనిచెఁ బరి । శ్రాంతంబగు మద్రనాథు రథిక చయంబున్. **300**

ప్రతిపదార్థం: అంతన్= అంతలో; ధనంజయ= అర్జునుడు; కిమ్మీరాంతక= భీముడు; ముఖ= మున్నగు; యోధవర= శ్రేష్ఠులయిన యోధులయొక్క; మహా= గొప్ప; అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములయొక్క; ప్రకరంబు= సమూహం; పరిశ్రాంతంబు= మిక్కిలి అలసిపోయింది; అగు= అయినట్టి; మద్రనాథు= శల్యుడియొక్క; రథిక= రథికయోధులయొక్క; చయంబున్= సమూహమును; అంతకుకడకున్= యమునియొద్దకు; అనిచెన్= పంపించెను.

తాత్పర్యం: అంతలో దుర్యోధనుడు సేనాసమేతుడై విజృంభించగా అర్జునుడు, భీముడు మొదలైన యోధ శ్రేష్ఠుల గొప్ప గొప్ప అస్త్ర సమూహాలు అలసిపోయిన ఆ శల్యుడి రథిక సమూహాలను యముడి మందిరానికి పంపాయి (సంహరించాయి).

వ. ఇవ్విధంబున. **301**

తాత్పర్యం: ఈ ప్రకారంగా.

మ. అరులం గీటడఁగించి పాండుసుతు సైన్యం బుబ్బి పైఁ గ్రమ్మినం
గురుభూనాయకుసేన నొచ్చి కలయం గూలన్ ధరన్ గుంపులై
తిరుగం బాఱఁగఁ జొచ్చె విచ్చె మరలన్ దిగ్భ్రాంతి వాటిల్ల స
త్వరతన్ నల్గడఁ బాఱె నవ్విభుఁడు గర్వం బేది వెల్వెల్లఁగన్. **302**

ప్రతిపదార్థం: అరులన్= శత్రువులను; గీటడఁగించి= చంపి; పాండుసుతు= ధర్మరాజుయొక్క; సైన్యంబు= సేన; ఉబ్బి= సంతోషించి; పైన్+క్రమ్మినన్= మీదపడి వ్యాపించగా(చుట్టుముట్టగా); కురుభూనాయకు= దుర్యోధనుడియొక్క; సేన= సైన్యము; నొచ్చి= బాధచెంది; గుంపులై= ప్రోగులై; ధరన్= భూమిపై; కూలన్= కూలిపోగా; కలయన్= అంతటా; తిరుగన్= వెనుతిరిగి; పాఱఁగన్= పాఱిపోవను; చొచ్చెన్= ప్రయత్నించెను; మరలన్= తిరిగి; దిగ్భ్రాంతి= ఆశ్చర్యకరమయిన భ్రమ; వాటిల్లన్= కలుగగా; విచ్చెన్= విడివడిపోయెను; ఆ+విభుఁడు= ప్రభువు అయిన ఆ దుర్యోధనుఁడు; గర్వంబు= దర్పంబు; ఏది= నశించి; వెల్వెల్లఁగన్= వెలవెలపోవగా; సత్వర= మిక్కిలివేగిరపాటుతో కూడిన; గతిన్= గమనముతో; నల్గడన్= నాలుగుదిక్కులకు; పాఱెను= పారిపోయెను.

తాత్పర్యం: ధర్మరాజు సైన్యం శత్రువులను చంపి సంతోషించి మీదపడగా దుర్యోధనుడి సైన్యం బాధచెంది ప్రోగులై నేలపై కూలి, వెనుతిరిగి పారిపోవటానికి ప్రారంభించింది. మరల ఆశ్చర్యకరమైన భ్రమ కలుగగా విడిపోయింది. ఆ దుర్యోధనుడు దర్పం నశించి వెలవెలపోగా మిక్కిలి వేగిరపాటుతో కూడిన గమనంతో నలుదిక్కులకు పారిపోయింది.

క. మనవారి కపుడు భీష్ముని । చనుటయుఁ గోదండగురుని సమయుటయును గ
ర్ణుని పొలియుటయును గ్రొత్తై । మనమున వెనుఁబాటు గదిరె మనుజాధీశా! 303

ప్రతిపదార్థం: మనుజాధీశా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అపుడు= ఆ సమయమున; మనవారికిన్= మన సైన్యమునకు; భీష్ముని= భీష్మునియొక్క; చనుటయును= పోవుటయును; కోదండగురుని= ద్రోణుని; సమయుటయును= చనిపోవుటయును; కర్ణుని; పొలియుటయును= చనిపోవుటయును; క్రొత్తై; మనస్సునందు; వెనుఁబాటు= విషాదము; కదిలె(న్)= కలిగెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ సమయంలో మన సైన్యానికి భీష్ముడి, ద్రోణుడి, కర్ణుడి మరణాలు క్రొత్తగా మనస్సులలో విషాదం కలిగించాయి.

విశేషం: మూలము: 'భీష్మే ద్రోణే చ నిహతే సూతపుత్రే చ భారత । యద్దుఃఖం తవ యోధానాం భయం చాసీ ద్విశాంపతే' (9-18-5)

వ. అప్పు డద్దిక్కు జనంబులు. 304

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ఆ+దిక్కు= ఆ వైపు; జనంబులు= జనులు.

తాత్పర్యం: ఆ సమయంలో పాండవపక్షంలోని జనులు.

చ. ధరణికి నింక నాయకుఁడు ధర్మతనూజుఁడు నేఁ డవశ్యముం
గురుపతి గూలు నెవ్వగలకుం గుదురయ్యెడు నాంబికేయుఁ డు
ద్ధురు లగు పాండునందనుల దుర్దమభంగి యెఱింగి ధర్మత
త్పరులకు గెల్పు బ్రాఁతె? హరిభక్తులఁ బొందవె భూరిసంపదల్? 305

ప్రతిపదార్థం: ఉద్ధురులు= బలవంతులు; అగు= అయినట్టి; పాండునందనులు= పాండవులయొక్క; దుర్దమ= సహింపశక్యముకాని; భంగి= విధము; యెఱింగి= తెలిసికొని; ఇంకన్; ధరణికిన్= భూమికి; నాయకుఁడు= ప్రభువు(రాజు); ధర్మతనూజుఁడు= ధర్మరాజు; నేఁడు= ఈనాడు; అవశ్యమున్= తప్పకుండ; కురుపతి= దుర్యోధనుఁడు; కూలున్= మరణించును; ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుఁడు; నెవ్వగలకున్= ఆపదలకు; కుదురు= అనుకూలుడు; అయ్యెడున్= అగును; ధర్మ= ధర్మమునందు; తత్పరులకున్= లగ్నమయిన మనస్సుకలవారికి; గెల్పు= విజయము; బ్రాఁతె?= దుర్లభమా?; హరి= విష్ణు; భక్తులన్; భూరి= గొప్ప; సంపదలు= ఐశ్వర్యములు; పొందవె?= ప్రాప్తించవా? (ప్రాప్తించునని అర్థము.)

తాత్పర్యం: బలవంతులైన పాండవుల సహింపశక్యంకాని విధం తెలిసికొని పాండవపక్షంలోని జనులు ఇంక ఈ భూమికి రాజు ధర్మరాజు; ఈనాడు దుర్యోధనుడు తప్పకుండ మరణిస్తాడు. ధృతరాష్ట్రుడు ఆపదల పాలౌతాడు. ధర్మమునందు మనస్సు లగ్నమైనవారికి జయం దుర్లభం కాదు. విష్ణుభక్తులకు అనంత ఐశ్వర్యాలు కలుగుతాయి.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. సామాన్య విషయం విశేష విషయంతో కాని, విశేష విషయం సామాన్య విషయంతోకాని సమర్థిస్తే అర్థాంతరన్యాసం. సామాన్యంతో - విశేషం - విశేషంతో సమర్థించినా అర్థాంతర న్యాసమే. ఇక్కడ రెండు సామాన్య విషయాలు ఉన్నాయి. 'ధర్మతత్పరులకు గెల్పు ట్రాఁతె' 'హరిభక్తులఁ బొందవె భూరిసంపదల్' ఈ రెండు సామాన్య విషయాలతో - 'ఇంక ధరణికి నాయకుఁడు ధర్మతనూజుఁడు' అనే విశేష విషయం సమర్థించబడింది. ధర్మతత్పరత, హరిభక్తి- ఈ రెండూ పాండవులకు - అందునా ధర్మరాజునకు ఎక్కువగా ఉన్నాయి.

వ. **అని రట్టియెడ నీ కొడుకు నిజసారథిం జూచి 'మనబలం బాహవంబున కోహటించి పాఱెడు నిత్తఱి నేను బరవసంబు సేసినఁ గాని నిలువ దవ్విధంబునకు రథం బనువై యుండఁ జేసి చేరఁ దె' మ్మనిన వాఁ డట్ల చేయ నతం డేనుంగు డిగ్గి రథంబెక్కి యెక్కుడు మగఁటిమిం బొంగునంగంబులతో సైనికుల కడ్డంబు సని యెలుం గెత్తి.** **306**

ప్రతిపదార్థం: అనిరి; అట్టియెడన్= ఆ సమయమున; నీ కొడుకు; నిజ= తనయొక్క; సారథిన్; చూచి; మనబలంబు= మనయొక్క సైన్యము; ఆహవంబునకున్= యుద్ధమునకు; ఓహటించి= వెనుదీసి; పాఱెడున్= పారిపోవుచుండెను; ఈ+తఱిన్= ఈ సమయమున; నేను; బరవసంబు= ధైర్యము; చేసినన్= కలుగచేసిన; కాని; నిలువదు= నిలిచి ఉండదు; ఆ+విధంబునకున్= ఆ ప్రకారముగా చేయుటకు; రథంబు; అనువై= అనుకూలమై; ఉండన్= ఉండుటను; చేసి; చేరన్= చేరుటకు; తెమ్ము= తీసికొనిరమ్ము; అనినన్= అనగా; వాఁడు; అట్లు= ఆ విధముగానే; చేయన్= చేయగా; అతండు= అతఁడు(దుర్యోధనుఁడు); ఏనుంగు= ఏనుగు; డిగ్గి= దిగి; రథంబు; ఎక్కి; ఎక్కుడు= అధికమయిన; మగఁటిమిన్= పౌరుషమువలన; పొంగు= ఉబ్బు; అంగంబులతోన్= అవయవములతో; సైనికులకున్= సేనలకు; అడ్డంబు= అడ్డముగ; చని= వెడలి; ఎలుంగు= పెద్దకంఠధ్వని; ఎత్తి.

తాత్పర్యం: 'ఇంక ధర్మరాజు నాయకుడు' అని పాండవ పక్ష జనులు అన్నారు. ఆ సమయంలో నీ పుత్రుడు దుర్యోధనుడు తనసారథిని చూచి 'మన సైన్యం యుద్ధానికి వెనుదీసి పారిపోతున్నది. ఈ సమయంలో నేను ధైర్యం కలిగిస్తే కాని నిలిచి ఉండదు. ఆ ప్రకారంగా చేయటానికి రథం అనుకూలమయినది. తెమ్ము' అని అనగా సారథి ఆ విధంగా చేయగా దుర్యోధనుడు ఏనుగు దిగి రథా న్నెక్కి అధికమైన పౌరుషం వలన ఉబ్బిన అవయవాలతో సైనికులకు అడ్డంగా వెడలి పెద్దకంఠధ్వనితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. **'ఎక్కడఁ బోవ వచ్చు? గిరులేనియుఁ గాననభూము లైనఁ దో**
నెక్కియుఁ జొచ్చియుం బగతు రేడ్తెఱఁ గిట్టి చలంబునం దలల్
ద్రొక్కక తక్క రట్లయిన దుర్గతి వాటిలుఁ బోక నిల్చి బే
రుక్కునఁ బోరినన్ సుగతి యొండెను సంపద యొండెఁ జొప్పడున్. **307**

ప్రతిపదార్థం: ఎక్కడన్= ఎక్కడకు; పోవన్= పోవను; వచ్చున్?= వచ్చును?; గిరులు= పర్వతములు; ఏనియున్= అయినా; కానన= అరణ్య; భూములు; అయినన్; తోన్= తోడనే; ఎక్కియున్= ఎక్కియును; చొచ్చియున్= ప్రవేశించియును; పగతురు= శత్రువులు; ఏడ్తెఱన్= పరాక్రమముతో; కిట్టి= సమీపించి; చలంబునన్= మాత్సర్యముతో; తలల్= శిరములు; త్రొక్కక= త్రొక్కకుండ; తక్కరు= విడువరు; అట్లు= ఆ ప్రకారముగ; అయినన్= అయినచో; దుర్గతి= నరకము; పాటిలున్= కలుగును; పోక= పారిపోకుండా; నిల్చి= నిలిచి; పేరు= పెద్ద; ఉక్కునన్= శౌర్యముతో; పోరినన్= పోరాడినచో; సుగతి= స్వర్గము; ఒండెను= కానీ(ఐనా); సంపద; ఒండెన్= కానీ (ఐనా); చొప్పడున్= కలుగును.

తాత్పర్యం: 'ఎక్కడకు పోవచ్చును? పర్వతా లైనా, అరణ్యా లయినా వెంటనే ఎక్కి, చొచ్చి కూడా శత్రువులు పరాక్రమంతో సమీపించి మాత్సర్యంతో తలలు త్రొక్కకుండా విడువరు. ఆ ప్రకారంగా జరిగితే నరకం కలుగుతుంది. అట్లా పారిపోకుండా నిలిచి గొప్ప పరాక్రమంతో పోరాడితే స్వర్గం అయినా, సంపద అయినా కలుగుతుంది. (పోరాడి మరణిస్తే స్వర్గం - జయిస్తే సంపద కలుగుతాయని తాత్పర్యం.)

వ. అట్లుం గాక. 308

ప్రతిపదార్థం: అట్లున్= ఆ విధంగా; కాక= కాకుండ.

తాత్పర్యం: ఆ విధంగా కాక.

క. పాండవబల మల్పంబై । యుండం గృష్ణుఁడు ధనంజయుండును డప్పిం
బెండువడఁగఁ గని మనకును । గం డడఁగఁగ నేల? గెలుపు గైకొన వచ్చున్.' 309

ప్రతిపదార్థం: పాండవబలము= పాండవులయొక్క సైన్యము; అల్పంబు= తక్కువ(స్వల్పము); ఐ= అయి; ఉండన్= ఉండగా; కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; ధనంజయుండును= అర్జునుడును; డప్పిన్= దాహముతో; బెండువడఁగన్= బలహీనతనొందగా; కని; మనకును= మనకును; గండడఁగఁగన్= పరాక్రమహీనులగుట; ఏల?= ఎందులకు?; గెలుపు= జయము; కైకొనవచ్చున్= పొందవచ్చును.

తాత్పర్యం: పాండవుల సైన్యం తక్కువగా ఉండగా, శ్రీకృష్ణుడు అర్జునుడు దాహంతో బలహీనత పొందగా, మనం పరాక్రమహీనుల మవటం ఎందులకు? గెలుపు పొందవచ్చును.'

వ. అని పలికి కరతలం బెత్తి నిలునిలుమనిన నీబలం బతని నగ్గించుచు మరలె. నమ్మేటిమగండు ముంగలి యయి నిలిచి పొంగారం గవియు కౌంతేయసేనాసముద్రంబునకుఁ జెలియలికట్ట యయ్యె. నయ్యవసరంబునందు మునుకొని వడిం దఱుము వడముడిం బొదివి మనపదాతిప్రకరంబు దర్పంబున నార్పులు బొబ్బలుం జెలంగ బహువిధాస్త్రశస్త్రంబులు వరఁగించినం బెరిఁగిన మదాతిరేకంబున గదాదండంబు ధరియించి ఘోరాకారుం డగుచుఁ దేరు డిగ్గి పేరడవిఁ గూల్చు పెనుగాలి కైవడి నతం డేకవింశతి సహస్రసంఖ్యసుభటుల నేలపాలు సేసె నప్పుడు. 310

ప్రతిపదార్థం: అని; పలికి; కరతలంబు= చేయి; ఎత్తి= పైకి ఎత్తి; నిలునిలుము= ఆగుము ఆగుము; అనినన్= అనగా; నీబలంబు= నీయొక్క సైన్యము; అతనిన్= అతనిని; అగ్గించుచున్= పొగడుచు; మరలెను; ఆ+మేటి మగండు= ఆ గొప్పవీరుడు; ముంగలి= ముందు; అయి= ఉన్నవాడయి; నిలిచి; పొంగారన్= ఉవ్వెత్తున పొంగుచు; కవియు= కలియబడు; కౌంతేయ= కుంతీకుమారులయొక్క; సేనా= సైన్యమనెడి; సముద్రంబునకున్= సముద్రమునకు; చెలియలికట్ట= గట్టు; అయ్యెను; ఆ+అవసరంబునందున్= ఆ సమయమునందు; మునుకొని= ముందుపడి; వడిన్= వేగముగా; తఱుము= వెంటపడి పరుగుపెట్టించు; వడముడిన్= భీముని; పొదివి= చుట్టుముట్టి; మన; పదాతి= కాల్బలముయొక్క; ప్రకరంబు= సమూహము; దర్పంబునన్= గర్వముతో; ఆర్పులు= అరుపులు; బొబ్బలున్= పెద్ద పెద్ద అరుపులు; చెలంగన్= మ్రోయగా; బహువిధ= నానావిధములయిన; అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములు; శస్త్రంబులు= సామాన్య ఆయుధములు; పరఁగించినన్= ప్రయోగించగా; పెరిఁగిన; మద= గర్వముయొక్క; అతిరేకంబునన్= ఉద్రేకమువలన; గదాదండంబున్=

గదను; ధరియించి= పట్టుకొని; ఘోర= భయంకరమయిన; ఆకారుండు= రూపముకలవాడు; అగుచున్= అగుచు; తేరు= రథము; డిగ్గి= దిగి; పేరడవిన్= పెద్ద అరణ్యమును; కూల్చు= పడగొట్టు; పెను= పెద్ద; గాలి; కైవడిన్= విధముగా; అతండు= అతఁడు(భీముడు); ఏకవింశతి= ఇరువదియొక్క; సహస్రసంఖ్య= వేలసంఖ్యగల; సుభటులన్= మంచి వీరులను; నేలపాలు= భూమిపాలు; చేసెను; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: 'గెలుపు పొందవచ్చును' అని చెప్పి దుర్యోధనుడు ముంజేయి పైకెత్తి నిలునిలు మని ఆపగా, కౌరవసైన్యం దుర్యోధనుడిని పొగడుతూ మరలింది. గొప్పవీరు డయిన దుర్యోధనుడు ముందు నిలిచి, ఉవ్వెత్తున పొంగుతూ కలియబడే పాండవసైన్యసముద్రానికి చెలియలికట్ట అయ్యాడు. ఆ సమయంలో ముందుపడి వేగంగా వెంటపడి తరుముతూ పరుగుపెట్టించే భీముడిని చుట్టుముట్టి కౌరవుల కాల్బలం గర్వంతో అరుపులు బొబ్బలతో నానావిధ అస్త్రశస్త్రాలను ప్రయోగించగా, పెరిగిన గర్వముయొక్క ఉద్రేకంవలన భీముడు గదను పట్టుకొని భయంకరమయిన ఆకారం కలవాడై రథం దిగి పెద్ద అడవిని పడగొట్టే పెద్దగాలివలె ఇరువది ఒక్కవేలమంది వీరులను సంహరించాడు. ఆ సమయంలో.

విశేషం: అలం: రూపకం, ఉపమ.

క. కరిహయరథబృందం బు । ద్ధురత నడరెఁ బాండునృపసుతుల మూఁకలపై
నరుఁ డబ్బలంబునకు ని । ష్ఠురగాండివ ముక్తశరపటుత్వము సూపెన్. 311

ప్రతిపదార్థం: పాండునృప= పాండురాజుయొక్క; సుతుల= కుమారులయొక్క; మూఁకలపైన్= సేనలమీద; కరి= ఏనుగులయొక్క; హయ= గుర్రములయొక్క; రథ= రథములయొక్క; బృందంబు= సమూహము; ఉద్ధురతన్= బలంగా; అడరెన్= విజృంభించెను; నరుఁడు= అర్జునుఁడు; ఆ+బలంబునకున్= ఆ సైన్యమునకు; నిష్ఠుర= తీక్షణమయిన; గాండివ= గాండీవమునుండి; ముక్త= విడిచిపెట్టిన; శర= బాణములయొక్క; పటుత్వము= కాఠిన్యము; చూపెన్= చూపెను.

తాత్పర్యం: ఆ సమయంలో పాండవుల సేనలమీద ఏనుగుల, గుర్రాల, రథ సమూహాలు ఒక్కుమ్మడిగా వ్యాపించాయి. అర్జునుడు ఆ సమయంలో ఆ కౌరవబలానికి తీక్షణమయిన గాండీవంనుండి విడిచిపెట్టబడిన బాణాలయొక్క కాఠిన్యం చూపించాడు.

క. నకులసహదేవులును సా । త్యకియును రభసమున వాలురమ్ములు నిగుడన్
శకునిపయిఁ గవిసి రతఁడును । బ్రకటస్ఫురణంబునం దిరంబై పోరెన్. 312

ప్రతిపదార్థం: నకులసహదేవులును; సాత్యకియును; రభసమునన్= శీఘ్రముగా; వాలు= వాడియైన; అమ్ములు= బాణములు; నిగుడన్= వ్యాపింపచేయుచు; శకునిపయిన్= శకునిపై; కవిసిరి= కలియబడిరి; అతఁడును= ఆ శకునియును; ప్రకట= స్పష్టముగా; స్ఫురణంబునన్= తోచునట్లుగా; తిరంబై= స్థిరముగా ఉండి; పోరెన్= పోరాడెను.

తాత్పర్యం: నకుల సహదేవులు, సాత్యకి శీఘ్రంగా వాడి బాణాలు వ్యాపింపజేస్తూ శకునిపై కలియబడ్డారు. ఆ శకుని కూడా స్థిరంగా ఉండి పోరాడాడు.

చ. **సమదగజాధిరూఢుఁ డయి సాల్వుఁడు పాండవసేనఁ జొచ్చి ఘో**
టములఁ గలంచుచున్ గజఘటల్ విరియించుచుఁ గాల్బలంబుఁ జి
త్రముగ వధించుచున్ రథకదంబములన్ సమయించుచున్ మహో
గ్రముగఁ జరించువిస్ఫురణఁ గన్గొని కోపసముద్భటాకృతిన్. **313**

ప్రతిపదార్థం: సమద= మదముతో కూడిన; గజ= ఏనుగుపై; అధిరూఢుఁడు= అధిరోహించినవాడు; అయి= అయినట్టి; సాల్వుఁడు; పాండవసేనన్= పాండవులయొక్క; సైన్యమును; చొచ్చి= ప్రవేశించి; ఘోటములన్= గుర్రములను; కలంచుచున్= కలతపెట్టుచు; గజ= ఏనుగులయొక్క; ఘటల్= గుంపులూ; విరియించుచున్= విడివడునట్లు చేయుచు; కాల్బలంబున్= పదాతిదళమును; చిత్రముగన్= ఆశ్చర్యకరముగా; వధించుచున్= చంపుచు; రథ= రథములయొక్క; కదంబములన్= గుంపులను; సమయించుచున్= నశింపచేయుచు; మహా= గొప్ప; ఉగ్రముగన్= భయంకరముగ; చరించు= సంచరించు; విస్ఫురణన్= కాంతిని; కన్గొని= చూచి; కోప= కోపముయొక్క; సముద్భట= మిక్కిలి ఆధిక్యం కలిగిన; ఆకృతిన్= ఆకారముతో.

తాత్పర్యం: మదించిన ఏనుగుపై అధిరోహించినవాడై సాల్వుడు పాండవసైన్యంలో ప్రవేశించి గుర్రాలను కలతపెట్టుతూ, ఏనుగుల గుంపులను విడగొట్టుతూ పదాతిదళమును ఆశ్చర్యకరంగా చంపుతూ, రథాల గుంపులను నశింపజేస్తూ కోపంవలన మిక్కిలి కాంతిమంతమైన ఆకారంతో మహాభయంకరంగా తిరుగాడే ఉద్ధతిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: వ్యాసమహాభారతంలో 'సాల్వుడు' అనువాడు లేడు. 'శాల్వుడు' ఉన్నాడు. మూలము 'సన్నివృత్తే బలౌఘే తు 'శాల్వో' మ్లేచ్ఛగణాధిపః । అభ్యవర్తత సంక్రుద్ధః పాండూనాం సుమహద్బలమ్' (శల్య-20-1). ఈ పద్యంలో 'సాల్వుడు' అని యతిస్థానంలో ప్రయోగింపబడినది. 'శ' వర్ణ - 'స' వర్ణములకు అభేదం. 'శాల్వుఁడు' అని ఉండుటయే ఉత్తమ పాఠం. వ్యాసభారతమున 'శాల్వ' నామకులు కాశీరాజపుత్రి 'అంబ'ను ప్రేమించిన క్షత్రియపుత్రుడు శాల్వుడు ఒకడు. ఇక వ్యుషితాశ్వుని పత్ని భద్ర. ఆమె మృతుడైన పతి శవంతో శయనించగా ముప్వురు 'శాల్వురు', నల్వురు 'మద్రులు' ఉద్భవించారు. ఈ శాల్వదేశపు రాజే ద్యుమత్సేనుడు. సత్యవంతుడి తండ్రి. మద్రదేశపు రాజు అశ్వపతి. సావిత్రి తండ్రి. సావిత్రీసత్యవంతుల వివాహకథ - సత్యవంతుడి మృత్యుంజయత్వం లోకప్రసిద్ధమే కదా! ఇది పాతకాలపు కథ. అశ్వపతి పాలించిన మద్రదేశానికి రాజు ఈ శల్యుడు. ఇతడు ఈ కురుక్షేత్రయుద్ధ కాలంవాడు. ఇక పాండవపక్షంలో 'శాల్వుడు' అనే యోధుడు ఒకడు ఉన్నాడు. ప్రస్తుతం ఈ పద్యము నందలి 'శాల్వుడు' మ్లేచ్ఛ గణాధిపతి. మహాముష్కరుడు. ఈ మ్లేచ్ఛశాల్వుని గజమునకు గొప్ప చరిత్ర ఉన్నది. ఇది పర్వతంవలె ఉంటుంది. మదధారలతో నిత్యం ప్రకాశిస్తూ ఉంటుంది. ఇంద్రుడి గజం ఐరావతంలో సమానమయిన శక్తి కలది. (ఏనుగులలో అనేకజాతులు కలవు. అందు 'మహాభద్ర' అనే పేరుగల కులమునందు పుట్టినది ఈ గజము. ఈ కులమునందలి ఏనుగులకు భద్రగజములని పేరు. చక్రవర్తులు ఈ భద్రగజాలను అధిరోహిస్తారు. సామాన్య గజములు భద్రగజములు కావు.) ఈ మ్లేచ్ఛ గణాధిపతి (శాల్వుడు) గజశాస్త్రంలో నిష్ణాతుడు. నకులుడు అశ్వవిద్యయందు నిష్ణాతుడు. శాల్వుడు తన ఏనుగును ధృష్టద్యుమ్నుడిపైకి తోలాడు. ధృష్టద్యుమ్నుడు ఈ మదగజాన్ని సంహరించాడు. సాత్యకి శాల్వుడిని సంహరించాడు. 'ఆస్థాయ సుమహానాగమ్ ప్రభిన్నం పర్వతోపమమ్ । దృప్తమైరావత ప్రఖ్యమమిత్ర గణమర్దనమ్॥' యో నౌ మహాన్ భద్రకుల ప్రసూతః । సుపూజితో ధార్తరాష్ట్రేణ నిత్యమ్ । సుకల్పితః శాస్త్ర వినిశ్చయజ్ఞైః సదోపవాహ్యః సమరేషు రాజన్॥ (9-19-2,3).' ఆకాశము - ప్రకృతి; ఆకసము వికృతి - అయినట్లు 'శాల్వుఁడు' తెలుఁగున 'సాల్వుఁడు' వికృతి రూపము కావచ్చును.

ధృష్టద్యుమ్నసాత్యకులచేత సాళ్వుఁ డేనుంగుతోడఁ బీనుంగై పడుట (సం. 9-19-24)

వ. ధృష్టద్యుమ్నుం డెదుర్కొనిన నతనిఁ ద్రొక్కించువాఁడై యవ్వీరుండు వారణపతిఁ గొల్పిన నతండు. 314

ప్రతిపదార్థం: (సాల్వుని చూచి); ధృష్టద్యుమ్నుండు; ఎదుర్కొనినన్= ఎదుర్కొనగా; అతనిన్= ఆ ధృష్టద్యుమ్నుడిని; త్రొక్కించువాఁడై= త్రొక్కించుటకు పూనికొనినవాడై; ఆ+వీరుండు= పరాక్రమవంతుడు అయిన సాల్వుడు; వారణపతిన్= గజరాజును; కొల్పినన్= పురికొల్పగా; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ఎదుర్కొనగా ఆ ధృష్టద్యుమ్నుడిని త్రొక్కించేవాడై ఆ సాల్వుడు గజరాజును పురికొల్పగా ధృష్టద్యుమ్నుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

మ. పటునారాచచయంబు కుంభయుగళీభాగంబునన్ బెట్టు నా
టుటయుం గ్రొవ్వఱి పాఱె నగ్గజము సాటోపంబుగాఁ గ్రమ్మఱిం
చుటకున్ సాల్వుని మెచ్చెఁ గన్గొను జనస్తోమంబు కోపోద్గమో
ద్భటవేగంబున వచ్చి పట్టె నది యాపాంచాలు తే రుగ్రమై. 315

ప్రతిపదార్థం: పటు= కఠినమయిన; నారాచ= బాణములయొక్క; చయంబు= సమూహము; కుంభ= కుంభస్థలమునందలి; యుగళీ= రెండింటియొక్క; భాగంబునన్= ప్రదేశమునందు; బెట్టు= గట్టిగా; నాటుటయున్= గ్రుచ్చుటతో; ఆ+గజము= ఆ ఏనుగు; క్రొవ్వు= మదము; అఱి= తరిగి; పాఱెన్= పారిపోయెను; సాటోపంబుగాన్= ఆడంబరముతోకూడా; క్రమ్మఱించుటకున్= మరలించుటకు; కన్గొను= చూచుచున్న; జన= జనులయొక్క; స్తోమంబు= సముదాయము; సాల్వుని; మెచ్చెన్= పొగిడెను; అది= ఆ ఏనుగు; ఉగ్రమై= భయంకరమై; కోప= క్రోధమువలన; ఉద్గమ= ఉబికిన; ఉద్భట= శ్రేష్ఠమయిన; వేగంబునన్= వేగముతో; వచ్చి; ఆ; పాంచాలు= ధృష్టద్యుమ్నుడియొక్క; తేరు= రథము; పట్టెన్= పట్టుకొనెను.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు కఠినమైన బాణ సమూహంతో ఆ మదగజంయొక్క కుంభస్థలాల జంటను గట్టిగా గ్రుచ్చగా ఆ ఏనుగు మదం తరిగి పారిపోయింది. మరల సాల్వుడు ఆడంబరంతో మరలించినందులకు అక్కడ చూస్తున్న జనసముదాయం సాల్వుడిని పొగడింది. ఆ ఏనుగు భయంకరమై, క్రోధంవలన ఉబికిన శ్రేష్ఠమైన వేగంతో వచ్చి ఆ ధృష్టద్యుమ్నుడి రథాన్ని పట్టుకొన్నది.

క. ఆతఁడు గద చేతం గొని । భీతి గదురుమనముతోడఁ బృథ్వికి దాఁటన్
సుతాశ్వసమేతంబుగ । నా తే రయ్యేనుఁ గెత్తె నాకసమునకున్. 316

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ ధృష్టద్యుమ్నుడు; గద; చేతన్= చేతితో; కొని= తీసికొని; భీతి= భయము; కదురు= కలుగు; మనముతోడన్= మనసుతో; పృథ్వికిన్= భూమిపైకి; దాఁటన్= దూకగా; సూత= సూతుడు; అశ్వ= గుర్రములు; సమేతంబుగన్= సహితముగ; ఆ తేరు= ఆ రథము; ఆకసమునకున్= ఆకాశమునకు; ఆ+ఏనుఁగు= ఆ ఏనుగు; ఎత్తెను= లేవనెత్తెను.

తాత్పర్యం: ఆ ధృష్టద్యుమ్నుడు గద చేత తీసికొని భయం కలిగిన మనసుతో భూమిపైకి దూకగా రథాన్ని తోలే సూతుడితో గుర్రాలతో సహా ఆ రథాన్ని ఆకాశానికి ఆ ఏనుగు ఎత్తివేసింది.

ఆ. ఎత్తి త్రిప్పి యాడి యిలతోడ వ్రేసి పా। దములఁ జదుపఁ జూచి దారుణాస్త్ర
తతులు నిగుడఁ బవనతనయ శిఖండి సా। త్యకులు సాల్వుఁ దాఁకి రతిరయమున. 317

ప్రతిపదార్థం: ఎత్తి; త్రిప్పి= గిరగిర త్రిప్పి; ఆడి= ఆడుకొని; ఇలతోడన్= నేలపై; వ్రేసి= కొట్టి; పాదములన్= పాదములతో; చదుపన్= నలుపగా; చూచి; పవన+తనయ= భీముడు; శిఖండి; సాత్యకులు; అతి= మిక్కిలి; రయమునన్= వేగముగా; దారుణ= భయంకరమయిన; అస్త్ర= బాణములయొక్క; తతులు= సమూహములు; నిగుడన్= వ్యాపించునట్లు; సాల్వున్= సాల్వుని; తాఁకిరి= ఎదుర్కొనిరి.

తాత్పర్యం: ఆ రథాన్ని పైకి ఎత్తి త్రిప్పి ఆడుకొని నేలపై కొట్టి, పాదాలతో నలుపగా చూచి భీముడు, శిఖండి సాత్యకి మిక్కిలి వేగంగా భయంకరమైన బాణసమూహాలు వ్యాపించేటట్లు సాల్వుడిని ఎదుర్కొన్నారు.

క. అతఁ డందఱ బాణంబులు। వితథంబులు సేసి యస్త్రవిద్యాపారీ
ణత సూపె నవ్విధం బ। ద్భుతము నినిచె గగనచరతతులచిత్తములన్. 318

ప్రతిపదార్థం: అతఁడు= ఆ సాల్వుడు; అందఱ బాణంబులు= అందరియొక్క బాణములు; వితథంబులు= వ్యర్థములు; చేసి; అస్త్రవిద్యా= బాణవిద్యయందలి; పారీణత= పారము ముట్టుట; చూపెన్= చూపెను; ఆ+విధంబు= ఆ విధానము; గగనచర= దేవతలయొక్క; తతులు= గుంపులయొక్క; చిత్తములన్= మనస్సులను; అద్భుతమును= ఆశ్చర్యమును; నినిచెన్= నింపెను.

తాత్పర్యం: ఆ సాల్వుడు అందరి బాణాలనూ వమ్ము చేసి, అస్త్రవిద్యయందలి సంపూర్ణమైన నేర్పరితనాన్ని చూపాడు. ఆ విధానం దేవతల గుంపుల చిత్తములను ఆశ్చర్యంతో నింపినది.

వ. అప్పుడు. 319

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

తే. ఆజ్ఞ పాటించి మదివెఱ యుజ్జగించి। రయము మెఱయ నప్పాంచాలరాజసుతుఁడు
గదిసి యెగసి కుంభస్థలి గదఁ బగుల్పఁ। గొండ గూలిన ట్లక్కరి గూలె నధిప! 320

ప్రతిపదార్థం: అధిప!= అధిపతి అనగా రాజు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; ఆజ్ఞ!= సమయం; పాటించి= ఆదరించి; మది= మనస్సునందు; వెఱ= భయము; ఉజ్జగించి= విడిచి; రయము= వేగము; మెఱయన్= ప్రకాశింపగా; ఆ; పాంచాల రాజసుతుఁడు= ధృష్టద్యుమ్నుడు; కదిసి= సమీపించి; ఎగసి= ఎగిరి; గదన్= గదతో; కుంభస్థలి= కుంభస్థలము; పగుల్పన్= పగులగొట్టగా; ఆ+కరి= ఆ ఏనుగు; కొండ= పర్వతము; కూలినట్లు; పడిపోయినట్లు; కూలెను= పడిపోయెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సమయాన్ని పాటించి మనస్సునందు భయాన్ని తొలగించి, వేగం ప్రకాశించగా ధృష్టద్యుమ్నుడు సమీపించి, ఎగిరి, గదతో కుంభస్థలము పగులగొట్టగా, ఆ ఏనుగు పర్వతం పడిపోయినట్లు పడిపోయింది.

విశేషం: అలం: ఉపమ. ఏనుగు ఉపమేయం; పర్వతం ఉపమానం; కూలుట - సమానధర్మం; అట్లు - వాచకం. అందుచేత సంపూర్ణోపమ.

క. ఆలోనన శినివరుఁడు వి। శాలాస్యప్రదరనిహతి సాల్వునిశిర మా
భీలముగఁ ద్రుంప నాతఁడు। గూలిన మనమూఁక విచ్చెఁ గురువంశనిధీ! 321

ప్రతిపదార్థం: కురువంశనిధీ!= కురువంశమునకు నిధి అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఆలోనన= అంతలోనే; శినివరుఁడు= సాత్యకి; విశాల= విశాలమయిన; ఆస్య= ముఖముకల; ప్రదర= బాణముయొక్క; నిహతిన్= దెబ్బవలన; సాల్వుని; శిరము= తల; ఆభీలముగన్= భయంకరముగ; త్రుంపన్= ఖండించగా; అతఁడు= ఆ సాల్వుడు; కూలినన్= చనిపోగా; మన= మనయొక్క; మూఁక= సైన్యము; విచ్చెన్= విడిపోయెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అంతలోనే సాత్యకి విశాలమైన ముఖం కలిగిన బాణంయొక్క దెబ్బతో సాల్వుడి తలను భయంకరంగా ఖండించగా ఆ సాల్వుడు చనిపోయాడు. మనసైన్యం విడిపోయింది.

ఉ. వాలి యెలుంగు సూపి కృతవర్ముఁడు సైన్యము నిల్వరించి యు
న్మీలిత విక్రముం డగుడు మేమెయి నాతనిఁ దాఁకె నస్త్ర వి
ద్యాలసితుండు సాత్యకి యుదగ్రత వారలు పోర వారి దో
ర్లీలలు సూచి రోటువడి రెండు బలంబులు యోధవీరులున్. 322

ప్రతిపదార్థం: వాలి= అతిశయించి(విజృంభించి); ఎలుంగు= పెద్ద కంఠనాదము; చూపి= చూపించి(చేసి); కృతవర్ముఁడు= కృతవర్మ; సైన్యమున్= సేనను; నిల్వరించి= నిలిపి(ఆపి); ఉన్మీలిత= వికసించిన; విక్రముండు= పరాక్రమముకలవాడు; అగుడున్= కాగా; మేమెయిన్= అనాయాసముగ; అస్త్రవిద్యా= బాణవిద్యయందు; లసితుండు= ప్రకాశించువాడు అయిన; సాత్యకి; ఆతనిన్= ఆ కృతవర్మను; తాఁకెన్= ఎదుర్కొనెను; ఉదగ్రతన్= భయంకరముగా; వారలు= వారు; పోరన్= పోరుచుండగా; రెండు= ఇరుపక్షముల; బలంబుల= సైన్యములయొక్క; యోధవీరులున్= యుద్ధమునందు నేర్పుగల - శూరులును; వారి= వారియొక్క; దోః= భుజములయొక్క; లీలలు= విలాసములు; ఓటుపడి= భయపడి; చూచిరి.

తాత్పర్యం: కృతవర్మ విజృంభించి పెద్ద బొబ్బపెట్టి సేనను ఆపుచేసి, వికసించిన పరాక్రమం ప్రదర్శిస్తూ ఉండగా, బాణవిద్యలో ప్రకాశించే సాత్యకి అనాయాసంగా ఆ కృతవర్మను ఎదుర్కొన్నాడు. వారిరువురూ భయంకరంగా యుద్ధం చేస్తుండగా రెండు పక్షాల సైన్యాలలో పరాక్రమవంతులయిన యోధులు ఆ కృతవర్మ సాత్యకుల భుజబల పరాక్రమ విలాసాలను భయపడి చూచారు.

వ. ఇట్లు పెనంగు చుండి. 323

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా; పెనంగుచున్= పోరాడుతూ; ఉండి.

తాత్పర్యం: ఈ ప్రకారంగా కృతవర్మ సాత్యకులు పోరాడుతూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. కృతవర్ము నొంచె నెనిమిది। శితశరముల శినివరుండు శినివరుచాపం
బతఁడు దునిమె బలువిలుగొని। యతని హయంబులను సూతు నాతఁడు గూల్చెన్. 324

ప్రతిపదార్థం: శినివరుండు= సాత్యకి; ఎనిమిది; శిత= వాడిఅయిన; శరములన్= బాణములతో; కృతవర్మున్= కృతవర్మని; నొంచెన్= నొప్పించెను; అతఁడు= అతడు (కృతవర్మ); శినిపరు= సాత్యకియొక్క; చాపంబు= ధనువును; తునిమెన్= ఖండించెను; అతఁడు= సాత్యకి; బలు= బలమయిన; విలు= ధనువు; కొని= తీసికొని; అతని= ఆ కృతవర్మయొక్క; హయంబులను= గుఱ్ఱములను; సూతున్= రథము నడుపువానిని; కూల్చెన్= చంపెను.

తాత్పర్యం: సాత్యకి ఎనిమిది వాడి అయిన బాణాలతో కృతవర్మను నొప్పించాడు. కృతవర్మ సాత్యకి వింటిని ఖండించాడు. సాత్యకి బలమైన మరియొక విల్లు తీసికొని కృతవర్మ గుఱ్ఱాలను, సూతుడిని చంపాడు.

మ. విరథుండై యభిరామశూలమున నవ్వీరుండు శైనేయు వై
చె రయం బార నతండు భల్లమునఁ ద్రుంచెం బెక్కు తుండంబు లై
తొరుఁగం జూచి విషాదియై నిజరథ స్థుం జేసి తద్బాణగో
చరతాదుర్దశ కా వృథోద్యముఁ గృపాచార్యుండు దప్పించినన్. 325

ప్రతిపదార్థం: ఆ+వీరుండు= ఆ శూరుఁడు అయిన కృతవర్మ; విరథుండై= రథములేనివాడయి; అభిరామ= మనోహరమయిన; శూలమునన్= శూలము అను ఆయుధముతో; శైనేయున్= సాత్యకిని; వైచెన్= కొట్టెను; అతండు= సాత్యకి; రయంబు+ఆరన్= మిక్కిలి వేగముగా; భల్లమునన్= బల్లెముతో; త్రుంచెన్= ఖండించెను; పెక్కు= అనేకములగు; తుండంబులై= ఖండములై (ముక్కలై); తొరుఁగన్= పడిపోవుటను; చూచి; కృపాచార్యుండు; విషాదియై= దుఃఖము కలవాడై; నిజ= తనయొక్క; రథస్థున్= రథమునందుండునట్లు; చేసి; తద్= ఆ; బాణ= బాణములకు; గోచరతా= లక్ష్యం కావడమనే; దుర్దశకున్= చెడ్డ అవస్థకు; ఆ; వృథా= వ్యర్థమయిన; ఉద్యమున్= ప్రయత్నము కలవాడయిన కృతవర్మను; తప్పించినన్= తప్పించగా.

తాత్పర్యం: శూరుడయిన ఆ కృతవర్మ రథంలేనివాడై మనోహరమైన బల్లెంతో ఆ శూలాన్ని ఖండించాడు. అది అనేకములయిన ముక్కలై పడిపోయింది. కృపాచార్యుడు అది చూచి జాలిపొంది, తన రథమునందుండేటట్లు చేసి, సాత్యకి ప్రయోగించే ఆ బాణాలకు లక్ష్యమైన చెడ్డదశనుండి - ఆ వ్యర్థ ప్రయత్నం కలవాడయిన కృతవర్మను తప్పించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మన సేన విఱిగె నృప నీ। తనయుం డొక్కరుఁడు నత్యుదగ్రతఁ గుంతీ
తనయుల నద్దెసఁ గల యో। ధని కాయముఁ బొదివె బాణధారలఁ బెలుచన్. 326

ప్రతిపదార్థం: నృప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; మన; సేన; విఱిగెన్= చెల్లాచెదరైపోయెను; నీ తనయుండు= నీయొక్క పుత్రుడు(దుర్యోధనుడు); ఒక్కరుఁడున్= ఒక్కడే; అతి= మిక్కిలి; ఉదగ్రతన్= భయంకరముగా; కుంతీతనయులన్= కుంతీపుత్రులను; ఆ+దెసన్= ఆ వైపు; కల= ఉన్నట్టి; యోధ= వీరులయొక్క; నికాయమున్= సముదాయమును; బాణధారలన్= బాణములయొక్క ధారలతో; పెలుచన్= ఆగ్రహముతో; పొదివెన్= కలియబడెను (క్రమ్ముకొనెను).

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! మన కురుసైన్యం చెల్లాచెదరైపోయింది. నీ పుత్రుడు దుర్యోధనుడు ఒక్కడే మిగిలి పాండవులను, ఆ పాండవపక్షాన కల వీరసముదాయాన్ని బాణసమూహాలతో ఆగ్రహంతో భయంకరంగా క్రమ్ముకొన్నాడు.

మ. పతి యిమ్మై సముదీర్ణవిక్రమకళాపారీణుఁడై విద్విష
చ్చతురంగంబులయందు నొక్కటియు విస్ఫారోల్లసన్మార్గణ
హతికిం దప్పక యుండునట్లుగ సమగ్రాశ్చర్యసంపాదకో
ద్ధతబాహావిభవంబు సూపె సురబృందస్తోత్రపాత్రోద్ధతిన్. 327

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధముగా; పతి= రాజు దుర్యోధనుడు; సముదీర్ణ= బాగుగా పెరిగిన; విక్రమ= పరాక్రమముయొక్క; కళా= కళయందు; పారీణుఁడై= పారము ముట్టినవాడయి; విద్విషత్= శత్రువులయొక్క; చతురంగంబులయందున్= నాలుగు సేనాంగములయందును; ఒక్కటియున్= ఒక్కటికూడా; విస్ఫార= అధికమైన; ఉల్లసత్= ప్రకాశించుచున్న; మార్గణ= బాణములయొక్క; ఆహతికిన్= దెబ్బకు; తప్పక= తప్పించుకొనకుండగా; ఉండునట్లుగన్= ఉండునట్లుగా; సమగ్ర= సంపూర్ణముగా; ఆశ్చర్య= అద్భుతమును; సంపాదక= గడించునట్టి; ఉద్ధత= మదించిన; బాహా= భుజములయొక్క; విభవంబు= వైభవం; సుర= దేవతలయొక్క; బృంద= సమూహముయొక్క; స్తోత్ర= స్తుతులకు; పాత్ర= యోగ్యమయిన; ఉద్ధతిన్= గర్వమును; చూపెన్= చూపించెను.

తాత్పర్యం: ఈ విధంగా దుర్యోధనుడు అపారమైన పరాక్రమంతో శత్రువుల చతురంగబలాలలో ఒక్కటికూడా అధికంగా ప్రకాశిస్తున్న బాణాల దెబ్బకు తప్పించుకొనకుండా ఉండేటట్లుగా దేవతాసమూహాలయొక్క స్తుతులతో యోగ్యమైన గర్వంతో అద్భుతమైన, అధికమైన భుజబలసంపదను సంపూర్ణంగా చూపించాడు.

వ. అప్పుడు రెండు వీళ్ళ నతని పాటిమేటిమగలు లేరనుబుద్ధి నాకుం బొడమెఁ బదంబపడి పాండవులును జేయఁగల వారలును నవ్వీరుం బొదివిన నతం డందఱ కన్ని రూపులై ధర్మసుతుని శతశరంబులను భీమసేను డెబ్బది సాయకంబులను సహదేవుని నైదింటను నకులు నఱువదినాల్గింటను ధృష్టద్యుమ్నుని సప్త మార్గణంబులను ద్రౌపదేయుల నైదైదు తూపులను సాత్యకి మూఁడు కాండంబుల నొప్పించి సహదేవుధనువు దునిమిన నక్కుమారుండు వేఱొక్క విలు గొని చలంబున నక్కురువిభుం గదిసినఁ దక్కటి రథికులుం గూడికొని యొక్కొక్కరుండు పె క్కమ్ములు పైఁ గురియఁ గేలిచందంబున వాని నన్నింటి వారించుచుఁ దత్తనువుల శోణితంబు పూరించుచు నాజెట్టి జోదు బెట్టిదుండై పెనంగ మన యోధులుం బురికొని యద్దొరల మార్కొనిరి. మన సైన్యంబు దైన్యంబు విడిచి మరలి వారిబలంబులఁ దలపడియె నట్టియెడ. 328

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయమున; రెండు; వీళ్ళను= దండులందును; అతనిపాటి= అతనివంటి; మేటి= గొప్ప; మగలు= వీరులు; లేరను= లేరు అను; బుద్ధి= తలపు; నాకున్= నాకు; పొడమెన్= కలిగెను; పదంపడి= వెనువెంటనే; పాండవులును; చేయఁగలవారలునున్= యుద్ధము చేయగలవారలును; ఆ+వీరున్= ఆ వీరుని; పొదివినన్= క్రమ్ముకొనగా; అతండు= అతడు(దుర్యోధనుడు); అందఱకున్= అందరకు; అన్ని; రూపులై= ఆకారములై; ధర్మసుతునిన్= ధర్మరాజును; శత= నూరు; శరంబులను= బాణముతోను; భీమసేనున్= భీమసేనుని; డెబ్బది; సాయకంబులను= బాణములతోను; సహదేవునిన్= సహదేవుని; ఐదింటను= అయిదు బాణములతోను; నకులున్= నకులుని; అఱువది నాల్గింటను= అరవైనాలుగు బాణాలతోను; ధృష్టద్యుమ్నుని= ధృష్టద్యుమ్నుని; సప్త= ఏడు; మార్గణంబులను= బాణములతోను; ద్రౌపదేయులన్= ద్రౌపదిపుత్రులను; అయిదైదు= ఐదేసి; తూపులను= బాణములతోను; సాత్యకిన్= సాత్యకిని; మూఁడు; కాండంబులన్= బాణములతోను; నొప్పించి= బాధించి; సహదేవుధనువు= సహదేవునియొక్క విల్లు; తునిమినన్= ఖండించగా; ఆ+కుమారుండు= ఆ కుమారుడు అనగా సహదేవుడు; వేఱొక్క= మరియొక; విలు= విల్లు(ధనువు); కొని= తీసికొని; చలంబునన్= మాత్సర్యముతో;

ఆ+కురువిభున్= ఆ కురురాజును (దుర్యోధనుని); కదిసినన్= దగ్గరకురాగా; తక్కటి= మిగిలిన; రథికులున్= రథముపై నుండి యుద్ధము చేయు వీరులును; కూడికొని= కలిసికొని; ఒక్కొక్కరుండు= ఒక్కొక్కడు; పెక్కు= అనేకములయిన; అమ్ములు= బాణములు; పైన్= మీద; కురియన్= కురిపించగా; కేలి= క్రీడ; చందంబునన్= విధముగా; వానిని; అన్నింటిని; వారించుచున్= అడ్డుకొనుచు; తద్= ఆ; తనువులన్= శరీరములందు; శోణితంబు= రక్తము; పూరించుచున్= నింపుచు; ఆ; జెట్టి= మల్లుడు అయిన; జోదు= యోధుడు; బెట్టిదుండై= గర్వితుడై; పెనంగన్= యుద్ధము చేయుచుండగా; మన= మనయొక్క; యోధులున్= వీరులును; పురికొని= క్రమ్ముకొని; ఆ+దొరలన్= ఆ యోధ శ్రేష్ఠులను; మార్కొనిరి= ఎదుర్కొనిరి; మన సైన్యంబు= మనయొక్క సేన; దైన్యంబు= దీనత్వము; విడిచి= వదలి; మరలి= తిరిగి; వారి= వారియొక్క; బలంబులన్= సేనలతో; తలపడియెన్= పోరాడెను; అట్టియెడన్= ఆ సమయమున.

తాత్పర్యం: ఆ సమయంలో ఇరుపక్షాలలోనూ అతడివంటి గొప్ప వీరులు లేరనే తలపు నాకు కలిగింది. వెనువెంటనే పాండవులు, ఆ పక్షమున యుద్ధం చేయగల వీరులు ఆ వీరుడిని (దుర్యోధనుడిని) క్రమ్ముకొనగా అతడు (దుర్యోధనుడు) అందరకును అన్ని ఆకారాలు కలవాడై, ధర్మరాజును నూరు బాణాలతోను భీమసేనుడిని డెబ్బది బాణాలతోను, సహదేవుడిని అయిదు బాణాలతోను, నకులుడిని అరువది నాలుగు బాణాలతోను ధృష్టద్యుమ్నుడిని ఏడు బాణాలతోను, ద్రౌపది పుత్రులను ఐదేసి బాణాలతోను, సాత్యకిని మూడు బాణాలతోను, నొప్పించి సహదేవుడి విల్లు ఖండించగా సహదేవుడు మరియొక విల్లు తీసికొని మాత్సర్యంతో ఆ కురురాజు (దుర్యోధనుడి) దగ్గరకు రాగా మిగిలిన రథికులను కలిసికొని ఒక్కొక్కడు అనేకములయిన బాణాలు ఆ దుర్యోధనుడిపై కురిపించగా క్రీడవలె వాటిని అన్నింటినీ అడ్డుకొంటూ ఆ శరీరములయందు రక్తం నింపుతూ మల్లుడైన ఆ యోధుడు (దుర్యోధనుడు) గర్వితుడై యుద్ధం చేస్తూ ఉండగా మన వీరులు క్రమ్ముకొని ఆ యోధశ్రేష్ఠులను (పాండవవీరులను) ఎదుర్కొన్నారు. మనసేన దీనత్వం విడిచి తిరుగబడి వారి(పాండవులయొక్క) సేనలతో పోరాడింది. ఆ సమయంలో.

క. **భీముఁడు గురుతనయుఁడు ను । ద్దామ భుజావీర్యశౌర్యధైర్యములు జన**
స్తోమము లగ్గింపఁగ సం । గ్రామ మొనర్చిరి నితాంతగాఢస్ఫూర్తిన్. 329

ప్రతిపదార్థం: భీముఁడున్= భీముడును; గురు= ద్రోణునియొక్క; తనయుఁడును= పుత్రుడును (అశ్వత్థామయును); ఉద్దామ= అధికమైన; భుజా= భుజములయొక్క; వీర్య= పరాక్రమము; శౌర్య= పరాక్రమము (శూరత్వము); ధైర్యము= ధీరత్వములు; జన= జనులయొక్క; స్తోమములు= సమూహములు; అగ్గింపఁగన్= స్తుతించుచుండగ; నితాంత= అత్యంతము (మిక్కిలి); గాఢ= అధికమైన; స్ఫూర్తిన్= ఉత్సాహంతో; సంగ్రామము= యుద్ధము; ఒనర్చి= చేసిరి.

తాత్పర్యం: భీముడు, అశ్వత్థామ అడ్డులేని తమ భుజబల పరాక్రమధైర్యాలను ప్రజాసమూహాలు మెచ్చుకొంటూ ఉండగా అత్యంతం అధికమైన ప్రకాశంతో యుద్ధం చేశారు.

చ. **పరుషపరాక్రమస్ఫురణఁ బాండవముఖ్యుని వాజులం జతు**
శ్శరహతిఁ గూల్చె సౌబలుఁడు సత్వరుఁడై సహదేవుఁ డమ్మహీ
శ్వరుఁ దనతేరిమీఁద నిడి సంగరమధ్యముఁ బాపె నాతఁ డొం
డరదముమీఁదికిం జని రయంబున నయ్యరిఁ దాఁకె నుద్ధతిన్. 330

ప్రతిపదార్థం: పరుష= కఠినమైన; పరాక్రమ= పరాక్రమముయొక్క; స్ఫురణన్= ప్రకాశంతో; పాండవ= పాండవులలో; ముఖ్యుని= ముఖ్యుడైన ధర్మజునియొక్క; వాజులన్= గుర్రములను; సౌబలుఁడు= శకుని; చతుః= నాలుగు; శర= బాణములయొక్క; హతిన్= దెబ్బతో; కూల్చెన్= చంపెను; సహదేవుఁడు= సహదేవుడు; సత్వరుఁడై= వేగిరపాటు కలవాడయి; ఆ= ఆ; మహీ+ఈశ్వరున్= ధర్మజుని; తన= తనయొక్క; తేరిమీఁదను= రథముపైని; ఇడి= ఉంచి; సంగర= యుద్ధముయొక్క; మధ్యము+పాపె= మధ్యనున్నవానిని; పాపెన్= తొలగించెను; ఆతఁడు= అతడు (ఆ ధర్మరాజు); ఒండు= మరియొక; అరదము= రథము; మీఁదికిన్= పైకి; చని= వెడలి; రయంబునన్= వేగముగా; ఆ+అరిన్= ఆ శత్రువును; ఉద్ధతిన్= గర్వముతో; తాఁకెను= ఎదుర్కొనెను.

తాత్పర్యం: శకుని కఠినమైన పరాక్రమవిక్రమంతో ధర్మజుడి గుర్రాలను నాలుగు బాణాలతో కొట్టి చంపాడు. సహదేవుడు వెంటనే వేగిరపాటుతో ధర్మరాజును తన రథంపైన ఉంచి, యుద్ధంయొక్క నడుమ భాగంనుండి తొలగించాడు. ధర్మరాజు ఇంకొక రథం మీదకు వెడలి, వేగంగా ఆ శత్రువును (శకునిని) ఎదుర్కొన్నాడు.

క. శరములఁ బొదివిన నాతఁడు । దిరమై యేయంగ రణము దివిజగరుడ ఖే
చరసిద్ధిప్రకరాద్భుత । కరప్రకారమున నొప్పెఁ గౌరవనాథా! 331

ప్రతిపదార్థం: కౌరవనాథా!= కౌరవులకు ప్రభువైన ఓ ధృతరాష్ట్రమహారాజా!; శరములన్= బాణములతో; పొదివినన్= క్రమ్ముకొనగా; ఆతఁడు= ఆ శకుని; తిరమై= స్థిరముగా ఉండి; ఏయంగన్= బాణములు ప్రయోగించగా; రణము= యుద్ధము (శకుని ధర్మరాజుల యుద్ధము); దివిజ= దేవతలకు; గరుడ= గరుడులకు; ఖే= ఆకాశమున; చర= సంచరించు; సిద్ధ= సిద్ధులయొక్క; ప్రకర= సమూహములకు; అద్భుతకర= ఆశ్చర్యకరములైన; ప్రకారమునన్= విధముగ; ఒప్పెన్= ప్రకాశించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధర్మరాజు శకునిని బాణాలతో క్రమ్ముకొనగా ఆ శకుని కూడా స్థిరంగా ఉండి బాణాలు ప్రయోగించగా వారి యుద్ధం దేవతలు, గరుడులు, ఆకాశసంచారులైన సిద్ధగణాలు ఆశ్చర్యం పొందేటట్లుగా ప్రకాశించింది.

సీ. శకుని నందనుఁడును నకులుండు నొండొరు । లకుఁ జండ బాహుబలంబు సూపి
రతుల శౌర్యమున సాత్యకికృతవర్ములు । పోరిరి విలుద్రుంచి కౌరవేంద్రుఁ
డేసె ధృష్టద్యుమ్ను నేచి యొండొకవింట । నతని నాతఁడు నొంప నక్కజంపుఁ
గయ్య మయ్యిరువుర కయ్యె ద్రౌపదిపుత్రు । లేవురు పతిఁ గిట్టి యింద్రియములు

తే. బాలిశునిఁ జిక్కువఱిచినపగిదిఁ దలరఁ । జేయ నతఁ డీడఁబోవక సాయకములు
పెక్కు రయమున నిగిడించి యక్కుమార । వితతిఁ గలఁపఁ దత్సంగర మతిశయిల్లె. 332

ప్రతిపదార్థం: శకుని= శకునియొక్క; నందనుఁడును= పుత్రుడును; నకులుండును= నకులుడును; ఒండొరులకున్= వారికి ఒకరు; చండ= భయంకరమైన; బాహు= భుజములయొక్క; బలంబు= బలము (శక్తి); చూపిరి; అతుల= సాటిలేని; శౌర్యమునన్= పరాక్రమముతో; సాత్యకి; కృతవర్మలు; పోరిరి= పోరాడిరి; విలు= ధనువు; త్రుంచి= ఖండించి; కౌరవ+ ఇంద్రుఁడు= కౌరవులకు ప్రభువైన దుర్యోధనుడు; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుని; ఏసెన్= కొట్టెను; ఆతఁడు= ఆ ధృష్టద్యుమ్నుడు; ఒండొక= మరియొక; వింటన్= వింటితో (ధనువుతో); అతనిన్= ఆ దుర్యోధనుడిని; ఏచి= అతిశయించి; నొంపన్= నొవ్వచేయగా (బాధించగా); ఆ+ఇరువురకున్= ఆ ఇద్దరకు; అక్కజంపు= ఆశ్చర్యకరమగు (అధికమగు); కయ్యము=

యుద్ధము; అయ్యెన్= అయ్యెను; ద్రౌపదిపుత్రులు= ద్రౌపదియొక్క పుత్రులు; ఏవురు= అయిదుగురు; పతిన్= రాజును (దుర్యోధనుని); కిట్టి= సమీపించి; ఇంద్రియములు= ఇంద్రియములు (త్వక్కు - చక్షువు - శ్రోత్రము - జిహ్వ - ఘ్రాణములు జ్ఞానేంద్రియములు అయిదు. వాక్కు - పాణి - పాదము - పాయువు - ఉపస్థలు - కర్మేంద్రియములు అయిదు - ద్రౌపది పుత్రులు అయిదుగురు); బాలిశునిన్= మూర్ఖుని (అజ్ఞానిని); చిక్కు= సంకటము; పఱచిన= పడచేసిన(పెట్టినట్లుగా); పగిదిన్= విధముగ; తలరన్= చలింప; చేయన్= చేయగా; అతఁడు= అతడు (దుర్యోధనుడు); ఈడఁబోవక= వెనుదీయక; పెక్కు= అనేకములైన; సాయకములు= బాణములు; రయమునన్= వేగముగా; నిగిడించి= ప్రయోగించి; ఆ+కుమార= ఆ ద్రౌపదికుమారులయొక్క; వితతిన్= సమూహమును; కలఁపన్= బాధించగా; తత్సంగరము= ఆ యుద్ధము; అతిశయిల్లెన్= విజృంభించెను.

తాత్పర్యం: శకుని పుత్రుడు ఉలూకుడు, నకులుడు ఒకరికొకరు భయంకరమైన భుజబలాన్ని చూపెట్టుకొన్నారు. సాటిలేని పరాక్రమంతో సాత్యకి కృతవర్మలు పోరాడారు. దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడిని ధనువు ఖండించి కొట్టాడు. ఆ ధృష్టద్యుమ్నుడు మరియొక వింటితో అతిశయించి ఆ దుర్యోధనుడిని బాధించాడు. ఆ ఇద్దరకు ఆశ్చర్యకరమైన గొప్పయుద్ధం జరిగింది. ద్రౌపదిపుత్రులు అయిదుగురూ దుర్యోధనుడిని సమీపించి, ఇంద్రియాలు అజ్ఞాని అయిన మూర్ఖుడిని సంకటపరచినట్లు చలింపజేశారు. ఆ దుర్యోధనుడు వెనుదీయక అనేకములైన బాణాలు వేగంగా ప్రయోగించి, ద్రౌపదికుమారసమూహాన్ని కలత చెందించాడు. ఇట్లా ఆ యుద్ధం అతిశయించింది.

విశేషం: ఈ పద్యమున తిక్కన "ఉపమా కాళిదాసస్య" అనే ఆర్యోక్తి స్ఫురించేటట్లు ఒక చక్కని చిక్కని ఉపమాలంకారాన్ని ప్రయోగించాడు. 'ద్రౌపది పుత్రులేవురు పతిఁ గిట్టి యింద్రియములు బాలిశునిఁ జిక్కు వఱచిన పగిది' - జ్ఞానేంద్రియాలు అయిదు కర్మేంద్రియాలు అయిదు. జ్ఞాని ఇంద్రియ విషయాలకు అతీతంగా ఉంటాడు. అజ్ఞాని ఇంద్రియాలకు వశుడై సంసార సంకటములం దుంటాడు. అట్లే ద్రౌపది పుత్రులైదుగురకు దుర్యోధనుడు వశుడయ్యాడని తాత్పర్యం. ద్రౌపది పుత్రులు ఉపమేయం; ఇంద్రియములు ఉపమానం; చిక్కుపరచుట - సమానధర్మం; పగిది - ఉపమావాచకం. దుర్యోధనుడు ఉపమేయం; బాలిశుడు ఉపమానం; చిక్కుపరచుట - సమానధర్మం; పగిది - ఉపమావాచకం. ఇది ఉపమాసంశ్లిష్టం.

పంచపాండవులు పంచమహాభూతాలకు ప్రతీకలు. యమ,వాయు,ఇంద్ర,అశ్వినులు - పంచమహాభూతాలకు అధిష్ఠానదేవతలు - శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు - వాటి గుణములు లేక తన్మాత్రలు. కుంతి ప్రకృతి. యాజ్ఞసేని ద్రౌపది శక్తి. పంచభూతములైన పంచపాండవులకు శక్తియందు జన్మించిన ఉపపాండవులు - పంచేంద్రియములకు ప్రతీకలు. ఇంతటి భావార్థాన్ని - ఈ ఉపమాలంకారంతో స్ఫురింపచేయటం తిక్కన విశిష్టత.

వ. మఱియు ననేకు లనేకులం బొదివి పోరాడ నంతకంతకుఁ బేర్చిన యగ్గలిక మొగ్గరంబులు రెండునుం గలయం బెరసినం బేర్చిన పెంధూళి భానుబింబంబు గప్పె నప్పుడు దొరుఁగు నరతురంగమాతంగరుధిరధారల నడంగిన నధికంబైన సంగరంబునకుం గడంగిన కౌంతేయుల యురవడికి నోహటించి మన మోహరంబు దొరలు మరలిన మరలనీక నీ కొడుకు పురికొలుపుకొని తఱిమినం గనలి ధర్మసుతుండు. 333

ప్రతిపదార్థం: మఱియును= ఇంకను; అనేకులు= పలువురు; అనేకులన్= పలువురను; పొదివి= క్రమ్మి; పోరాడన్= యుద్ధముచేయుచుండగా; అంతకంతకున్= అంతకంతకును; పేర్చిన= అతిశయించిన; అగ్గలికన్= శౌర్యముతో; మొగ్గరంబులు= సేనావ్యూహములు; రెండునున్= రెండును; కలయన్= కలియబడి; బెరసినన్= వ్యాపించగా; పేర్చిన= అతిశయించిన; పెంధూళి= పెద్దదుమ్ము; భానుబింబంబు= సూర్యబింబమును; కప్పె= కప్పెను; అప్పుడు= ఆ సమయమున; తొరుఁగు=

స్రవించు; నర= మనుజులయొక్క; తురంగ= గుర్రములయొక్క; మాతంగ= ఏనుగులయొక్క; రుధిర= రక్త; ధారలన్= ధారలచేత; అడంగినను= అణగారిపోగా; అధికంబైన= ఎక్కువైన; సంగరంబునకున్= యుద్ధమునకు; కడంగిన= ప్రయత్నించిన (పూనిక వహించిన); కౌంతేయుల= కుంతీపుత్రులయొక్క; ఉరవడికిన్= మిక్కిలి వేగమునకు; ఓహటించి= వెనుదీసి; మన= మనయొక్క; మోహరంబు= సేనావ్యూహమునందలి; దొరలు= రాజులైన వీరులు; మరలినన్= తిరిగిపోవుచుండగా; నీ కొడుకు= నీ యొక్క కొడుకు (దుర్యోధనుడు); మరలనీక= తిరిగిపోకుండ; పురికొలుపుకొని= క్రమ్ముకొని (ఉత్సాహము కల్పించి); తఱిమినన్= తరుమగా; కనలి= కోపించి; ధర్మసుతుండు= ధర్మరాజు.

తాత్పర్యం: ఇంకా పలువురు పలువురను క్రమ్మి పోరాడగా అంతకంతకూ అతిశయించిన శౌర్యంతో సేనావ్యూహాలు రెండును కలియబడి వ్యాపించగా, అతిశయించిన పెద్దదుమ్ము సూర్యబింబాన్ని కప్పివేసింది. ఆ సమయాన స్రవించే నరులయొక్క, గుర్రాలయొక్క, ఏనుగులయొక్క రక్తధారలచేత దుమ్ము అణగారిపోగా, అధికమైన యుద్ధానికి పూనిక వహించిన పాండవుల వేగానికి వెనుదీసి కౌరవసేనా వ్యూహంలోని వీరులు తిరిగి పోతుండగా దుర్యోధనుడు తిరిగిపోకుండా పురికొల్పి తరుమగా, కోపించి ధర్మరాజు (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. మూఁడు నారాచములఁ గృపు వాఁడి చెఱిచి । వాలి కృతవర్మహయముల నాలుగింటఁ
గూల్పఁ దనతేరిపై నిడి గురుసుతుండు । దొలఁగుఁ గొంపోయె నవ్విరథుని నృపాల! 334

ప్రతిపదార్థం: నృపాల!= ధృతరాష్ట్ర మహారాజా!; (ధర్మరాజు); మూఁడు= మూడు; నారాచములన్= బాణములతో; కృపు వాఁడి= కృపునియొక్క శౌర్యము; చెఱిచి= పోగొట్టి; వాలి= అతిశయించి; కృతవర్మ= కృతవర్మయొక్క; హయములన్= గుర్రములను; నాలుగింటన్= నాలుగింటితో (నాలుగు బాణములతో); కూల్పన్= చంపగా; గురుసుతుండు= అశ్వత్థామ; తనతేరిపైన్= తనయొక్క రథముమీద; ఇడి= ఉంచి; తొలఁగన్= తొలగునట్లు; ఆ+విరథుని= ఆ రథములేనివానిని (కృతవర్మను); కొంపోయెను= తీసికొనిపోయెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధర్మరాజు మూడు బాణాలతో కృపాచార్యుడి శౌర్యం పోగొట్టి అతిశయించి కృతవర్మ గుర్రాలను నాలుగు బాణాలతో చంపగా అశ్వత్థామ రథంలేని కృతవర్మను తన రథంమీద ఉంచి తొలగించటానికి తీసికొనిపోయాడు.

చ. కురుపతి చూచి చిత్తమునఁ గోపము పెంపెసలార నేడు నూ
ఱరదము లాతనిం బొదువునట్లుగఁ బంచిన నొక్క పెట్ట బం
ధురతర వారివాహములు తోయజబాంధవుఁ గప్పుచాడ్పు దోఁ
ప రయముమైఁ గడంగి యవి పైకొని యవ్విభుతోఁ బెనంగఁగన్. 335

ప్రతిపదార్థం: కురుపతి= కౌరవులకు ప్రభువైన దుర్యోధనుడు; చూచి; చిత్తమునన్= మనసునందు; కోపము= క్రోధము; పెంపు= ఆధిక్యము; ఎసలారన్= అతిశయించగా; ఏడు; నూఱు= వందలు; అరదములు= రథములు; ఆతనిన్= ఆ ధర్మరాజును; పొదువునట్లుగన్= క్రమ్ముకొనునట్లుగా; పంచినన్= పంపించగ; ఒక్కపెట్టన్= ఒక్కసారిగా; బంధురతర= మిక్కిలి దట్టమైన; వారివాహములు= మేఘములు; తోయజ= పద్మములకు; బాంధవున్= చుట్టమైన సూర్యుని; కప్పు= కప్పివేయు; చాడ్పు= విధము; తోఁపన్= తోచగా (అనిపించగా); రయముమైన్= వేగంతో; కడంగి= ప్రయత్నించి; అవి= అవి (ఆ ఏడు వందల రథములు); పైకొని= కలియబడి-మీదపడి; ఆ+విభుతోన్= ఆ ప్రభువైన ధర్మరాజుతో; పెనంగఁగన్= యుద్ధంచేయగా.

తాత్పర్యం: ధర్మరాజు కృపుడిని, కృతవర్మను విరథులను చేయటం దుర్యోధనుడు చూచి, మనసులో కోపం వృద్ధిపొందగా ఏడు వందల రథాలు ఆ ధర్మరాజును క్రమ్ముకొనేటట్లుగా పంపించాడు. దట్టమైన మేఘాలు ఒక్కసారిగా సూర్యుడిని కప్పివేసినట్లుగా ఆ ఏడువందల రథాలు వేగంగా ఆ ధర్మరాజుతో కలియబడి యుద్ధంచేస్తూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ. ధర్మరాజు - ఉపమేయము; సూర్యుడు - ఉపమానం; కప్పివేయుట - ధర్మము; విధము - వాచకం. అట్లే ఏడు వందల రథములు ఉపమేయం; వారి వాహనాలు ఉపమానం; - కప్పివేయటం ధర్మం; విధం-వాచకం. ధర్మవాచకములు రెండు ఉపమేయ ఉపమానాలు సమానం కావున ఇది ఉపమా సంశ్లిష్టము. ఇట్టి విశిష్ట అలంకార ప్రయోగం తిక్కయజ్వ ప్రత్యేకత.

క. కనుఁగొని శికండిముఖయో । ధనికాయం బడరి యా రథప్రకరంబున్
సునిశితశరప్రకరములఁ । దనుమాడెన్ రౌద్రరసము దొలుకాడంగన్. 336

ప్రతిపదార్థం: శిఖండి= శిఖండి; ముఖ= మున్నగు; యోధ= యుద్ధవీరుల; నికాయంబు= సమూహము; కనుఁగొని= చూచి; అడరి= అతిశయించి (త్వరపడి); ఆ రథప్రకరంబున్= ఆ రథములయొక్క సమూహమును; రౌద్రరసము; తొలుకాడంగన్= తొణికిసలాడునట్లుగా; సునిశిత= బాగుగా వాడియైన; శర= బాణములయొక్క; ప్రకరములన్= సమూహములతో; తునుమాడెన్= ఖండించెను.

తాత్పర్యం: శిఖండి ప్రముఖయుద్ధవీరుల సమూహాన్ని చూచి, అతిశయించి, ఆ రథాల సమూహాన్ని రౌద్రరసం తొణికిసలాడేటట్లుగా వాడి అయిన బాణసమూహాలతో ఖండించాడు.

వ. ఆ సమయంబున మనదెస నుల్కాపాతశర్కరావర్షాదులగు నుత్పాతంబులు గలిగె వానికి శంకింపక శకుని గడంగి యోధవరులతో 'మీరు కోల్తల సేయుం డేను బెడముట్టునఁ దాఁకి ధర్మనందనాదులను సమయించెద' నంచు సముద్ధతిం గదిసె, నప్పుడు మద్రేశబలపురస్సరంబైన యమ్మోహరంబు రభసంబునం దఱిమి పాండవసేనా సంరంభంబున కోర్వక తిరిగిన నా సుబలసూనుండు ప్రబలతురంగ దశ సహస్రంబులతో వేగంబు మెఱయ వైరిసేనవెనుకఁ గిట్టి 'యేను గలుగ మీకు భయం బేల?' యని యక్కౌరవసైనికులం బేరుకొని యదల్చి యార్చిన నా కౌంతేయవాహిని కలంగినఁ గని ధర్మనందనుండు సహదేవు నాలోకించి. 337

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అప్పుడు; మనదెసను= మనవైపు; ఉల్కా= ఆకాశమునుండి పడుచున్నటులు భాసించు తారవంటి వెలుగు; పాత= పడుట; శర్కరా= చెక్కెరయొక్క; వర్షాదులు= వర్షములు మొదలగునవి; అగు= ఐన; ఉత్పాతంబులు= అపశకునములు; కలిగెన్= పుట్టెను; వానికిన్= ఆ అపశకునములకు; శంకింపక= సందేహింపక; శకుని; కడంగి= ప్రయత్నించి (పూనిక వహించి); యోధవరులతోన్= యోధశ్రేష్ఠులతో; మీరు; కోల్తలసేయుండు= ఎదుటనిలిచి యుద్ధము చేయుడు; ఏను= నేను; పెడముట్టునన్= వెనుకనుండి ముట్టడించి; తాఁకి= ఎదుర్కొని; ధర్మనందన= ధర్మరాజు; ఆదులను= మొదలగువారిని; సమయించెదను= సంహరించెదను; అంచున్= అనుచు; సముద్ధతిన్= మిక్కిలి దర్పముతో; కదిసెన్= కలియబడెను; అప్పుడు= ఆ సమయమున; మద్రేశ= శల్యుని; బల= సైన్యము; పురస్సరంబైన= ముందు నడుచుచున్నట్టిదైన; ఆ+మోహరంబు= ఆ సేనావ్యూహము; రభసంబునన్= సాహసముతో; తఱిమి= కలియబడి; పాండవ= పాండవులయొక్క; సేనా= సైన్యముయొక్క;

సంరంభంబునకున్= వేగిరపాటునకు; ఓర్వక= భరింపజాలక; తిరిగినన్= మరలిపోవుచుండగా; ఆ సుబలసూనుండు= ఆ శకుని (సుబలునియొక్క కుమారుడు); ప్రబల= మిక్కిలి బలమైన; తురంగ= గుర్రములయొక్క; దశసహస్రంబుతోన్= పదివేలతో; వేగంబు= వేగము; మెఱయన్= ప్రకాశింపంగా; వైరి= శత్రువులయొక్క; సేన= సైన్యమునకు; వెనుకన్= వెనుకభాగము; కిట్టి= సమీపించి; ఏను= నేను; కలుగన్= ఉండగా; మీకున్; భయంబు= భయము; ఏల?= ఎందులకు? అని; ఆ+కౌరవ= ఆ కౌరవులయొక్క; సైనికులన్= సేనలను; పేరుకొని= పేరుపెట్టి పిలిచి; అదల్చి= అదలించి; ఆర్చినన్= పెద్ద బొబ్బపెట్టగా (అరవగా); ఆ కౌంతేయవాహిని= ఆ కుంతీపుత్రులయొక్క సేన; కలంగినన్= కలత చెందగా; ధర్మనందనుండు= ధర్మరాజు; సహదేవున్= సహదేవుని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అప్పుడు మనవైపు ఉల్కలు చక్కెరవర్షాలు మొదలైన అపశకునాలు కలిగాయి. ఆ అపశకునాలకు సందేహించక, శకుని పూనిక వహించి యోధశ్రేష్ఠులతో 'మీరు యుద్ధంచేయండి; నేను వెనుకనుండి ముట్టడించి ఎదుర్కొని ఆ ధర్మరాజు మొదలైన వారిని సంహరిస్తాను.' అంటూ మిక్కిలి గర్వంతో కలియబడ్డాడు. ఆ సమయంలో శల్యుడి సైన్యం ముందు పోతుండగా ఆ సేనావ్యూహం సాహసంతో కలియబడి పాండవ సేనల వేగిరపాటునకు భరింపజాలక మరలిపోవుతుండగా శకుని మిక్కిలి బలమైన పదివేల గుర్రాలతో వేగం ఒప్పగా శత్రుసేన వెనుక భాగాన్ని సమీపించి, 'నేను ఉండగా మీకు భయం ఎందుకు?' అని ఆ కౌరవసైనికులను పేరు పెట్టి పిలిచి, అదలించి, పెద్దబొబ్బపెట్టగా ఆ పాండవుల సేన కలతచెందింది. అప్పుడు ధర్మరాజు సహదేవుడిని చూచి.

శకుని సహదేవు లాశ్వికసహాయులై ఘోరంబుగాఁ బోరుట (సం. 9-21-32)

ఆ. 'వేగ తాఁకు మైదువేల గుఱ్ఱంబులు । ద్రౌపదీతనూజతతియు నీవు
శకుని ననుడు నతఁడు సంరంభజృంభియై । యట్ల చేయ ఘోరమయ్యెఁ బోరు. 338

ప్రతిపదార్థం: ఐదువేల గుఱ్ఱంబులు= ఐదువేల గుర్రములు; ద్రౌపదీ= ద్రౌపదియొక్క; తనూజ= పుత్రులయొక్క; తతియున్= సమూహమును (అనగా ఉపపాండవులును); నీవు; శకునిన్= శకునిని; వేగ= వేగముగ; తాఁకుము= ఎదుర్కొనుము; అనుడున్= ఇట్లు అనగానే; అతఁడు= అతడు; సంరంభ= త్వరగా; జృంభియై= విజృంభించినవాడై; అట్ల= ఆ విధముగానే (అవధారణార్థము); చేయన్= చేయగా; పోరు= యుద్ధము; ఘోరము= భయంకరము; అయ్యెన్= అయ్యెను.

తాత్పర్యం: ధర్మరాజు సహదేవుడిని చూచి 'ఐదువేల గుర్రాలతో ద్రౌపదిపుత్రులు, నీవు శకునిని వేగంగా ఎదుర్కొనండి.' అని చెప్పగా సహదేవుడు త్వరగా విజృంభించినవాడై ఆ విధంగానే చేయగా యుద్ధం భయంకరమైనది.

వ. అట్టి యెడ. 339

తాత్పర్యం: ఆ సమయంలో.

సీ. లీలఁ గట్టియతోడఁ గూలంగవైచియు । డొంకెనపోటులఁ బొంక మడఁచి
పడఁ ద్రోచియును వాలఁ గడికండములుగ వ్రే । సియుఁ గఠారంబులఁ జీరి చెఱచి
గీటడంగించియు గిట్టి యొండొరుఁ బట్టి । కొని మల్లుచందంబు ననికిఁ జొచ్చి
నేలకు వంచియుఁ గేలిమై గళముపై । నెక్కియుఁ బెక్కండ్రు రొక్క మొగిన

ఆ. యెక్కుటయు సహించి యుక్కునఁ బెనఁగియు । నుఱక వివిధగతుల నుబ్బి చెలంగి
బొమ్మలాడినట్లు పోరి యా రావుతు । లధిప! నెరయ మెఱసి రందు నిందు. 340

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; లీలన్= విలాసముగా; కట్టియతోడన్= కఱ్ఱతో (దండము); కూలంగన్= కూలిపోవునట్లుగ (చనిపోవునట్లుగ); వైచియున్= విసిరియు; డొంకెన= వంకరల ఈటె; పోటులన్= పొడుపులతో(పొడుచుకొనుట); పొంకము= పొందిక; అడఁచి= అణచి; పడఁద్రోచియును= క్రిందపడునట్లు చేసియు; వాలన్= కత్తితో; కడికండములుగన్= ఖండ ఖండములుగ; వ్రేసియున్= నరికియు; కఠారంబులన్= పెద్ద పెద్ద ఖడ్గములతో; చీరి= చీల్చి; చెఱచి= పొగొట్టి; గీటడంగించియున్= చంపియు; కిట్టి= సమీపించి; ఒండొరున్= ఒకరినొకరు; పట్టికొని; మల్లుచందంబున్= మల్లువిధముగ(జెట్టి); అనికిన్= యుద్ధమునకు; చొచ్చి= తలపడి; నేలకున్= భూమికి; వంచియున్= వంగదీసియు; కేళిమైన్= క్రీడతో; గళముపైన్= కంఠముపై; ఎక్కియున్= ఎక్కియు; పెక్కండ్రుదురు= పలువురు; ఒక్కమొగిన= ఒక్కసారి మొత్తముగా; ఎక్కుటయున్= మీదపడుటయును; సహించి= ఓర్పువహించి; ఉక్కునన్= శౌర్యముతో; పెనఁగియును= యుద్ధముచేసియు; ఉఱక= లక్ష్యపెట్టక; వివిధ= అనేక విధములైన; గతులన్= గమనములతో; ఉబ్బి= సంతోషించి; చెలఁగి= ఉత్సహించి; బొమ్మలు; ఆడినట్లు= ఆడినట్లు; పోరి= యుద్ధముచేసి; ఆ రావుతులు= ఆ రౌతులు (గుఱ్ఱములనెక్కి పోరాడువారు); నెరయన్= వ్యాపించగా; అందున్= అచ్చట; ఇందున్= ఇచ్చట; మెఱసిరి= ప్రకాశించిరి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సహదేవుడు, ద్రౌపదికుమారులు అయిదువేల గుఱ్ఱాలతో శకునితో యుద్ధంచేసే సమయంలో క్రీడగా దుడ్డుకఱ్ఱతో చనిపోయేటట్లు విసిరి, వంకరల ఈటె పోటులతో పొంకం అణచి క్రింద పడద్రోచి, కత్తితో ఖండఖండాలుగా నరికి, పెద్ద పెద్ద ఖడ్గాలతో చీల్చి చెండాడి చంపి, సమీపించి ఒకరినొకరు పట్టుకొని మల్లవీరుల విధంగా యుద్ధానికి తలపడి నేలపైకి వంగదీసి, ఆటాడినట్లు మెడలపైకి ఎక్కి, పలువురు మొత్తంగా మీదపడి, ఓర్పుతో శౌర్యంతో యుద్ధంచేసి, ఒకరిపై ఒకరు దుమికి వివిధ గమనాలతో సంతోషించి, ఉత్సహించి, బొమ్మలాడినట్లు ఆ రౌతులు అంతటా వ్యాపించి వెలిగారు.

విశేషం: ఇది తురంగ సైన్యం చేసిన యుద్ధంయొక్కవర్ణనం. గుఱ్ఱాలపై నుండి యుద్ధం చేసేవారు రౌతులు. ఇది రథాలపైనుండి అస్త్రశస్త్ర ప్రయోగాలతో చేసే యుద్ధవర్ణనంకాదు. చతురంగ బలాల యుద్ధాలు నానావిధాలుగా ఉంటాయి. ఆ యుద్ధరీతు లన్నింటిని వ్యాసభగవానుడు మూలమున యుద్ధపర్వములందు అత్యద్భుతంగా వర్ణించాడు. తిక్కన కూడా యుద్ధవర్ణనలు బాగుగా చేశాడనీ అందుకు ఆయన అనుభవం తోడ్పైనదనీ కొందరు విశ్వసిస్తారు.

ఇక ఈ పద్యంలో వర్ణించిన యుద్ధం కఱలతో, కత్తులతో, ఈటెలతో, కాళ్ళతో, చేతులతో చేసిన "దొమ్మీ" అనబడే యుద్ధం. దీనిని బొమ్మలాడినట్లుగా తిక్కన ఉత్ప్రేక్షించాడు.

వ. **మఱియు ననేక ప్రకారంబుల భండనంబుసేసిరి. పదంపడి యమ్మాద్రీకుమారుని వీరోద్రేకంబునకు నోహటించి గాంధారీసోదరుం డాఱువేల తురంగంబులతోడం దిరిగె నతండును ద్విసహస్రహయశేషసేనాసమేతుండై యన్న కడకరిగె. నా సౌబలుండును జుట్టి వచ్చి ధృష్టద్యుమ్నుని మొనపైఁ బడిన నతండు సైన్యసముద్దండ సంరంభం బెసంగ విక్రమాటోపంబు సూపినయపుడు పంచసహస్రత్రిశతహయంబులు వడిన రౌద్రంబు రూపు దాల్చిన ట్లాయుధఖండనాస్థిభంజనశబ్దశ్రవణంబునను రక్తమాంసమేదోస్థిమస్తిష్క మజ్జాసమ్మేళన దారుణరణతలదర్శనంబునను దదీయ విస్రగంధాఘ్రాణంబునను యోధులు వీతచేతస్కులైరి. తెగినతల**

యొకచేతను నెత్తుట జొత్తిల్లిన కరవాలం బొకకరంబునను బట్టుకొని యట్టలాడినట్లు పెనంగి యా శకుని హతావశిష్టంబులైన సప్తశతాశ్వంబులతోడఁ దొలంగి యచ్చటి జనంబులతోఁ 'గురుపతి యెచ్చట నున్నవాఁ డనిన వార లతని కిట్లనిరి. 341

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; అనేక= నానా; ప్రకారంబులన్= విధములుగా; భండనంబు= యుద్ధము; చేసిరి= చేసిరి; పదంపడి= వెనువెంటనే; ఆ+మాద్రీ= ఆ మాద్రియొక్క; కుమారుని= పుత్రుని అనగా సహదేవునియొక్క; వీర= పరాక్రమముయొక్క; ఉద్రేకంబునకున్= విజృంభణమునకు; తిరిగెన్= వెనుదిరిగెను; ఓహటించి= వెనుదీసి; గాంధారీ= గాంధారియొక్క; సోదరుండు= సహోదరుడయిన శకుని; ఆఱువేల తురంగంబులతోడన్= ఆరువేల గుర్రాలతో; అతండును= అతడును (సహదేవుడును); ద్వి= రెండు; సహస్ర= వేల; హయ= గుర్రములు; శేష= మిగిలిన; సేనా= సైన్యముతో; సమేతుండై= సహితుడై (కూడినవాడై); అన్నకడకున్= అన్నదగ్గరకు; అరిగెన్= వెడలెను; ఆ సౌబలుండును= ఆ శకునియు; చుట్టివచ్చి= తిరిగివచ్చి; ధృష్టద్యుమ్నుని; మొనపైన్= సేనపై; పడినన్= పడగా; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు; సైన్య= సేనతోకూడ; సముద్దండ= అధికమైన; సంరంభంబు= వేగిరపాటు; ఎసంగన్= అతిశయించగ; విక్రమ= పరాక్రమముయొక్క; ఆటోపంబు= ఆడంబరము; చూపిన+అపుడు= చూపిన సమయమున; పంచ= ఐదు; సహస్ర= వేలు; త్రిశత= మూడు వందలు; హయంబులు= గుర్రములు (అయిదువేల మూడువందల గుర్రములు); పడినన్= పడిపోగా (చనిపోగా); రౌద్రంబు= క్రోధము; రూపు= ఆకృతి; తాల్చినట్లు= ధరించినట్లు; ఆయుధ= ఆయుధములయొక్క; ఖండన= విరుచుట; అస్థి= ఎముకలయొక్క; భంజన= పగులగొట్టుట; శబ్ద= శబ్దములయొక్క (ధ్వనులయొక్క) శ్రవణంబునను= వినుటవలనను; మాంస= మాంసముయొక్క; మస్తిష్క= మెదడుయొక్క (మేదస్‌నకు-మస్తిష్కమునకు కొంచెము భేదముకలదు. మెదడునందలి రెండ భాగములివి); మజ్జా= మజ్జాయొక్క (ఎముకలలో ఉన్న మూలుగు మజ్జ అనబడును); సమ్మేళన= వీటి కలయిక వలన; దారుణ= భయంకరమైన; రణ= యుద్ధముయొక్క; తల= భూమియొక్క (యుద్ధభూమియొక్క); దర్శనంబునను= చూచుటవలనను; తదీయ= ఆ యుద్ధమునందలి మాంసాదులయొక్క; విస్రగంధ= కుళ్లినకంపు; ఆఘ్రాణంబునను= పీల్చుటవలనను; యోధులు= యుద్ధముచేయుచున్న వీరులు; వీత= పోయిన; చేతస్కులు= మనస్సుకలవారు; ఐరి= అయ్యిరి; తెగిన= ఖండింపబడిన; తల= శిరము; ఒకచేతను= ఒకచేతితోను; నెత్తుటన్= రక్తంతో; జొత్తిల్లిన= ఎర్రబారిన; కరవాలంబు= కత్తి; ఒక కరంబునను= ఒక చేతితోడను; పట్టుకొని; అట్టలు+ఆడినట్లు= తలలు తెగిన శరీరములు ఆడినట్టుగా; పెనంగి= యుద్ధముచేసి; ఆ శకుని; హత= చంపబడగా; అవశిష్టంబులైన= మిగిలిపోయిన; సప్త= ఏడు; శత= వందలు; అశ్వంబులతోడన్= గుర్రములతో; తొలంగి= తప్పించుకొని; అచ్చటి= ఆ యుద్ధభూమియందలి; జనంబులతోన్= ప్రజలతో; కురుపతి= దుర్యోధనుడు; ఎచ్చట= ఎక్కడ; ఉన్నవాఁడు?= ఉన్నవాడు?; అనినన్= అనగా; వారలు= వారు; అతనికిన్= ఆ శకునికి; ఇట్లు= ఈ విధముగా; అనిరి= చెప్పిరి.

తాత్పర్యం: ఇంకా నానా విధాలుగా యుద్ధం చేశారు. వెనువెంటనే సహదేవుడి పరాక్రమ విజృంభణకు వెనుదీసి, శకుని ఆరువేల గుర్రాలతో తిరుగబడ్డాడు. సహదేవుడుకూడా రెండువేల గుర్రాలు మిగిలిన సైన్యంతో కూడి అన్న దగ్గరకు వెళ్ళాడు. శకుని తిరిగి వచ్చి ధృష్టద్యుమ్నుడి సేనపై పడగా ఆ ధృష్టద్యుమ్నుడు సేనతో కూడా అధికమయిన వేగిరపాటుతో అతిశయించి, పరాక్రమపు ఆడంబరాన్ని ప్రదర్శించగా ఆ సమయంలో అయిదువేల మూడువందల గుర్రాలు చనిపోయాయి. అప్పుడు రౌద్రం ఆకృతి ధరించినట్లు ఆయుధాలు విరిగిపోవటంవలనను, ఎముకలు, మస్తిష్కము మజ్జలు బాగా కలిసి పోయినందువలన భయంకరమైన యుద్ధభూమిని చూపటం వలనను, ఆ మాంసమజ్జాదులయొక్క కుళ్ళినకంపు పీల్చుటవలనను యోధుల చైతన్యం నశించింది. ఖండించబడిన తలను ఒకచేతితోను, రక్తంతో ఎర్రబారిన కత్తి ఒక చేతితోను పట్టుకొని, తలతెగిన శరీరములు ఆడినట్లు యుద్ధంచేసి,

చావగా మిగిలిన ఏడువందల గుర్రాలతో ఆ శకుని తప్పించుకొని యుద్ధభూమినుండి తొలగి, అచ్చట ఉన్న ప్రజలతో 'దుర్యోధనుడు ఎక్కడ ఉన్నా?'డ ని అడుగగా వారు ఆ శకునికి ఈ విధంగా చెప్పారు.

ఉ. అల్లదె కంటె? పూర్ణశశియట్లు కడుం జెలువొందెఁ జూడఁ బే
రెల్లి రథప్రతాన మదె యేపున సంగరకేళిఁ జాల శో
భిల్లెడు నయ్యెడన్ రిపువిభీషణవిక్రమణప్రకారగా
ఢోల్లసనుండు భూపతి మహోన్నతి నొప్పెడుఁ బొమ్ము చెచ్చెరన్. 342

ప్రతిపదార్థం: అల్లదె= అల్లదిగొ; కంటె?= చూచితివా?; పూర్ణ= నిండు; శశి= చందమామ; అట్లు= అన్నట్లుగా; పేరు= పెద్ద; ఎల్లి= గొడుగు; చూడన్= చూడగా; కడున్= మిక్కిలి; చెలువు= సౌందర్యము; ఒందెన్= పొందెను; అదె= అదియే; రథ= రథములయొక్క; ప్రతానము= సమూహము; ఏపునన్= విజృంభణముతో; సంగర= యుద్ధమనెడి; కేళిన్= ఆటయందు; చాలన్= మిక్కిలి; శోభిల్లెడున్= ప్రకాశించెను; ఆ+ఎడన్= ఆచ్చోట; రిపు= శత్రువులకు; విభీషణ= భయంకరమైన; విక్రమణ= పరాక్రమముయొక్క; ప్రకార= విధముచే; గాఢ= దట్టమయిన; ఉల్లసనుండు= ఉల్లాసము కలవాడు (ఆనందము కలవాడు); భూపతి= భూభర్త అయిన దుర్యోధనుడు; మహా= గొప్ప; ఉన్నతిన్= ఆధిక్యముతో; ఒప్పెడున్= ప్రకాశించుచున్నాడు; చెచ్చెరన్= వెంటనే (శీఘ్రముగా); పొమ్ము= వెడలుము.

తాత్పర్యం: 'అదిగో చూచావా? నిండు పున్నమిచందమామ అన్నట్లుగా ఆ పెద్ద గొడుగు మిక్కిలి సౌందర్యంతో ప్రకాశించేది. అదే- రథముల వరుస. విజృంభణంతో యుద్ధక్రీడయందు మిక్కిలి ప్రకాశించింది. ఆ చోటనే శత్రువులతో భయంకరంగా పరాక్రమించటంలో దట్టమయిన ఆనందం కలవాడైన దుర్యోధనుడు గొప్ప ఆధిక్యంతో వెలుగుతున్నాడు. వేగంగా పొమ్ము.

వ. అనిన విని తల యెత్తి చూచి తత్ప్రదేశంబున కరిగి యద్ధరణీశుం గని యతని కిట్లనియె. 343

ప్రతిపదార్థం: అనినన్= అనగా (చెప్పగా); విని= విని; తల= శిరము; ఎత్తి= పైకి ఎత్తి; చూచి; తద్= ఆ; ప్రదేశంబునకున్= చోటునకు; అరిగి= వెడలి; ఆ= ఆ; ధరణీ= భూమికి; ఈశున్= ప్రభువు అయిన దుర్యోధనుని; కని= చూచి; అతనికిన్= అనితో; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియె= చెప్పెను (పలికెను).

తాత్పర్యం: ప్రజలు చెప్పగా శకుని విని తల పైకెత్తి చూచి, అక్కడికి వెడలి ఆ దుర్యోధనుడిని చూచి అతడితో ఈ ప్రకారంగా అన్నాడు.

క. 'పొలియించితి నే గుఱ్ఱం। బులఁ దేరుల కుఱికి యింక భూరిరయమునన్
బొలియింపవలయుఁ బ్రాణం। బులు డాఁచిన వశమె పాండుపుత్రుల గెలువన్. 344

ప్రతిపదార్థం: ఏన్= నేను; తేరులకున్= రథములపైకి; ఉఱికి= దుమికి; గుఱ్ఱంబులన్= గుర్రములను; పొలియించితిన్= చంపితిని; ఇంకన్= ఇంక; భూరి= మిక్కిలి; రయమునన్= వేగముగా; పొలియింపవలయున్= చంపవలయును (పాండు పుత్రులను); ప్రాణంబులు; డాఁచినన్= దాచుకొనినచో; పాండుపుత్రులన్= పాండురాజు కుమారులను (పాండవులను); గెలువన్= జయించుట; వశమె?= తరమా?

తాత్పర్యం: 'నేను రథాలపైకి దుమికి గుర్రాలను చంపాను. ఇంకా మిక్కిలి వేగంగా పాండుపుత్రులను చంపాలి. ప్రాణాలు దాచుకొంటే పాండవులను జయించటం సాధ్యం కాదు.

వ. రథంబులు గజంబులు దెగినం గాని కాలుబలంబుల సమయించుట పని గా' దనిన నమ్మాటకు సైనికులు సంతసం బంది బరవసంబు సేయ నమ్మహీనాయకుండు సముత్సాహదోహలియై తఱిమిన మనమూఁకలు కడంక యెలర్ప దర్పస్ఫురితంబులగుచు నురవణించినం గని గాండీవి గోవిందున కిట్లనియె. 345

ప్రతిపదార్థం: రథంబులు= రథములు; గజంబులు= ఏనుగులు; తెగినన్+కాని= చస్తే కాని; కాలుబలంబులన్= పదాతి దళములను; సమయించుట= సంహరించుట; పనికాదు= సాధ్యముకాదు; అనినన్= అని చెప్పగా; ఆ+మాటకున్= ఆ పలుకునకు; సైనికులు= భటులు; సంతసంబు= సంతోషము; అంది= పొంది; బరవసంబు= ధైర్యము; చేయన్= చేయగా; ఆ= ఆ; మహీనాయకుండు= రాజు అయిన దుర్యోధనుడు; సముత్సాహ= మిక్కిలి ప్రయత్నంతో; దోహలియై= అతిశయించినవాడయి (మిక్కిలి ఉత్సాహము కలవాడై); తఱిమినన్= వెంటపడిపోవునట్లు చేయగా; మనమూఁకలు= మన సైన్యములు; కడంక= ప్రయత్నము; ఎలర్పన్= అతిశయింపగా; దర్ప= గర్వముతో; స్ఫురితంబులు= ప్రకాశములు కలవారు; అగుచున్= అగుచును; ఉరవణించినన్= వేగిరపాటు పొందగా; కని= చూచి; గాండీవి= అర్జునుడు (గాండీవము కలవాడు గాండీవి); గోవిందునకున్= శ్రీకృష్ణునకు; ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్.

తాత్పర్యం: రథాలు ఏనుగులు నాశనమయితే కాని పదాతిదళాలను సంహరించటం సాధ్యం కాదు.' అని శకుని చెప్పగా ఆ మాటకు సైనికులు సంతోషం పొంది ధైర్యం చేయగా దుర్యోధనుడు మిక్కిలి అతిశయించిన ఉత్సాహంతో వెన్నంటి పారిపోయేటట్లు తరుముతుండగా మన సైన్యాలు ప్రయత్న మతిశయించగా గర్వంతో ప్రకాశిస్తూ వేగిరపాటుచూపగా చూచి, అర్జునుడు, శ్రీకృష్ణుడితో ఈ ప్రకారంగా అన్నాడు:

క. 'మొనసి చనుదెంచు దుర్యో । ధనసేనాసముదయంబుఁ దఱియ నురవడిం
జననిమ్ము మన రథము నా । సునిశితబాణముల సమయఁ జూచెద దీనిన్.' 346

ప్రతిపదార్థం: మొనసి= పూనికవహించి; చనుదెంచు= వచ్చుచున్న; దుర్యోధన= దుర్యోధనునియొక్క; సేనాసముదయంబున్= సేనా సమూహమును; తఱియన్= సమీపించునట్లు; మనరథమున్= మనయొక్క రథము; ఉరవడిన్= విజృంభణంతో; చననిమ్ము= వెడలనిమ్ము; దీనిన్= ఈ దుర్యోధనసేనా సమూహమును; నా= నాయొక్క; సునిశిత= మిక్కిలి వాడి అయిన; బాణములన్= బాణములతో; సమయన్= నశించునట్లు; చూచెదన్= చూచెదను (నశించునట్లు చేసెదనని భావం).

తాత్పర్యం: 'పూనికతో వస్తున్న, దుర్యోధనుడి సేనాసమూహాన్ని సమీపించేటట్లు మన రథం మిక్కిలి వేగంగా ముందుకుపోనిమ్ము. ఈ దుర్యోధన సేనాసమూహాన్ని వాడి అయిన బాణాలతో నశించేటట్లు చేస్తాను.'

దుర్యోధను మౌర్ఖ్యం బుద్దేశించి కృష్ణార్జునులు సంభాషించుట (సం. 9-23-18)

వ. అనుచు నమ్మొన యాలోకించి నిరూపించి. 347

ప్రతిపదార్థం: అనుచున్= ఇట్లు చెప్పుచు; ఆ+మొన= ఆ సైన్యం; ఆలోకించి= చూచి; నిరూపించి= నిరూపణచేసి (అనగా వేరు వేరుగా స్పష్టంగా పరిగణించి).

తాత్పర్యం: అర్జునుడు శ్రీకృష్ణుడితో ఇట్లా అంటూ ఆ సైన్యాన్ని చూచి నిరూపణచేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. పెనఁకువ యెడ ద్రెవ్వక పదు । నెనిమిదిదివసములు సెల్లె బెనఁగంగా
వనధిం బోలెడు కురుబల । మనఘా! కనుఁగొనఁగ గొప్పదాకృతి యయ్యెన్. 348

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడవు అయిన ఓ శ్రీకృష్ణా! (సంబోధనము); పెనఁకువ= యుద్ధము; ఎడద్రెవ్వక= ఎడతెగకుండగ (ఆగకుండగ); పదునెనిమిది= పద్దెనిమిది; దివసములు= దినములు; చెల్లెన్= కడచెను; ఏన్= నేను; పెనఁగంగాన్= యుద్ధంచేయగా; వనధిన్= సముద్రమును; పోలెడు= పోలునట్టి; కురుబలము= కౌరవసైన్యము; కనుఁగొనఁగన్= చూడగా; గోష్పద= గోవుపాదమంతటి; ఆకృతి= ఆకారముకలది (మిక్కిలి చిన్నది అనుటకు గోష్పదమందురు); అయ్యెన్= అయ్యెను.

తాత్పర్యం: ఓ శ్రీకృష్ణా! యుద్ధం ఎడతెగకుండా పద్దెనిమిది దినాలు గడిచాయి. నేను యుద్ధం చేసినందువలన సముద్రమంతటి కౌరవ సైన్యం చూడగా గోవుపాదమంత చిన్నది అయింది.

ఆ. దైవ మిట్లు గలఁచునే వీరి మదిమది । నుండి ఘోరమైన యుద్ధమునకుఁ
దొడఁగ వలయునట్టి తొడరువు కావించి । కొనిరి చీఁకురాజుకొడుకు లేచి. 349

ప్రతిపదార్థం: చీఁకురాజు= గ్రుడ్డిరాజు (ధృతరాష్ట్రుడు); కొడుకులు= పుత్రులు; ఏచి= విజృంభించి; మదిమదినుండి= హాయిగానుండి; ఘోరమయిన= భయంకరమయిన; యుద్ధమునకున్; తొడఁగవలయు= ప్రారంభించవలయును; అట్టి; తొడరువు= యత్నము; కావించికొనిరి= చేసికొనిరి; వీరి= వీరియొక్క (కౌరవులయొక్క); మది= మనస్సు; ఇట్లు= ఈ ప్రకారమగు; దైవము= దైవము; కలఁచునే!= కలత చెందించెను గదా!

తాత్పర్యం: గ్రుడ్డిరాజు కొడుకులయిన కౌరవులు విజృంభించి హాయిగా ఉండి భయంకరమయిన యుద్ధాన్ని ప్రారంభించవలెననే యత్నం చేసికొన్నారు. వీరియొక్క మనస్సును ఈ ప్రకారంగా దైవం కలతచెందించింది కదా!

చ. అమరనదీసుతుండు వడినప్పుడు వీరలబుద్ధి సంధికా
ర్యమునకుఁ జొచ్చునింక నని యాత్మఁ దలంచితి నమ్మహాత్ముఁడు
స్సముచిత వాక్యవృత్తిఁ గురునాయకుఁ దేర్పఁగఁ జూచెఁ జిత్త దో
షమహిమ నద్దురాత్ముఁడు ప్రశాంతతత నొందఁడ యెన్నిభంగులన్. 350

ప్రతిపదార్థం: అమరనదీ= ఆకాశగంగానదియొక్క; సుతుండు= కుమారుఁడు అనగా భీష్ముడు; పడినప్పుడు= పడిపోయినప్పుడు; ఇంకను; వీరల= ఈ కౌరవులయొక్క; బుద్ధి; సంధికార్యమునకున్= పొందునకు (యుద్ధములేకుండ సంధి చేసికొనుటకు); చొచ్చును= చొరబడును (అంగీకరించును); అని; ఆత్మన్= నాలో; తలంచితిని= అనుకొంటివి; ఆ+మహాత్ముఁడున్= ఆ గొప్ప ఆత్మకలవాడయిన భీష్ముడును; సముచిత= మిక్కిలి ఉపయోగకరమయిన (యోగ్యమయిన); వాక్యవృత్తిన్= మాటలయొక్క పొందికతో; కురునాయకున్= దుర్యోధనుని; తేర్పఁగన్= ప్రసన్నుని చేయుటకు; చూచెన్= చూచెను; ఆ+దురాత్ముఁడు= ఆ చెడ్డమనస్సు కలవాడు; ఎన్ని= భంగులన్= విధములుగానైనను; ప్రశాంతతను= మిక్కిలిశాంతిని; ఒందఁడు+అ= పొందడు గదా!

తాత్పర్యం: భీష్ముడు యుద్ధభూమియందు పడిపోయినప్పుడైనా ఈ కౌరవుల బుద్ధి సంధిచేసికొనటానికి చొరబడుతుందని అనుకొన్నాను. మహాత్ముడయిన ఆ భీష్ముడు కూడా యోగ్యమైన మాటలతో ఆ దుర్యోధనుడిని ప్రసన్నుడిని చేయటానికి చూచాడు. అయినా ఆ దుష్టబుద్ధి కల దుర్యోధనుడు ఎన్ని విధాలుగా చెప్పినా శాంతమనస్కుడు కాడాయెను.

క. గంగాతనయుఁడు దెగినను । సంగరమున కుత్సహింపఁజనునే తమకున్?
వెంగలు లని యప్పుడు దెలి । యంగా నెఱిఁగితి సుయోధనాదులఁ గృష్ణా! 351

ప్రతిపదార్థం: కృష్ణా!; గంగాతనయుఁడు= గంగాదేవి పుత్రుడయిన భీష్ముడు; తెగినను= చచ్చినప్పటికిని; సంగరమునకున్= యుద్ధమునకు; ఉత్సహింపన్= ప్రయత్నింపగా; తమకున్= దుర్యోధనాదులకు; చనునే?= ఒప్పునా? (ఒప్పదు); అప్పుడు= ఆ సమయమున; సుయోధనాదులన్= దుర్యోధనుడు మొదలగువారిని; వెంగలులు= వెర్రివాళ్ళు; అని; తెలియంగాన్= స్పష్టముగా; ఎఱిఁగితిన్= తెలిసికొంటిని.

తాత్పర్యం: శ్రీకృష్ణా!= భీష్ముడు పతనమైన తరువాత కూడా యుద్ధానికి ప్రయత్నించటం దుర్యోధనాదులకు తగదు. అప్పుడే దుర్యోధనాదులు మూఢులని స్పష్టంగా తెలిసికొన్నాను.

ఉ. దంతియుఁ దాను నాజి భగదత్తుఁడు గూలఁగఁ జూచి సింధుభూ
కాంతుని చావు దెల్లముగఁ గన్గొని యాతనిఁ గావఁ బూని య
ట్లంతలు రాజు లెల్ల సమయం గని ద్రోణునిపాటు గాంచి యా
వంతయు నాత్మలోనఁ దెలియండు సుయోధనుఁ డెంత మూర్ఖుఁడో! 352

ప్రతిపదార్థం: ఆజిన్= యుద్ధమునందు; భగదత్తుఁడు; తానున్= తానును; దంతియున్= ఏనుగును; కూలఁగన్= చనిపోగా; చూచి; సింధుభూకాంతుని= సింధుదేశపు రాజు అయిన జయద్రథుని; చావు= మరణము; తెల్లముగన్= స్పష్టంగా; కన్గొని= చూచి; ఆతనిన్= ఆతనిని అనగా ఆ జయద్రథుని; కావన్= రక్షించుటకు; పూని= ప్రయత్నించేసి; అట్లు= ఆ ప్రకారంగా; అంతలు= గొప్పవారయిన; రాజులు; ఎల్లన్= సమస్తమైనవారును; సమయన్= చనిపోగా; కని= చూచి; ద్రోణుని= ద్రోణాచార్యుని; పాటు= మరణము; కాంచి= చూచి; ఆవంతయున్= కొంచెముకూడా; ఆత్మలోనన్= మనసులోపల; తెలియండు= తెలిసికొనడు; సుయోధనుఁడు= దుర్యోధనుడు; ఎంత= ఎంతటి; మూర్ఖుఁడో!= వివేకహీనుడో కదా!

తాత్పర్యం: భగదత్తుడు, అతని ఏనుగు చనిపోవటం స్వయంగా చూచి, సింధుదేశపురాజు జయద్రథుడి చావు తెల్లంగా చూచి, ఆ సైంధవుడిని రక్షించటానికి ప్రయత్నించిన గొప్ప గొప్ప రాజులందరు చనిపోగా చూచి, నా శపథం చూచి, ద్రోణాచార్యుడి మరణం చూచి - కొంచెంకూడా మనసులో తెలిసికొనడు. దుర్యోధనుడు ఎంతటి వివేకహీనుడో కదా!

క. తన యనుజు లకట! దుశ్శా । సనుఁడును లోనైనవారు సమసిన చందం
బును బంధుసహితముగఁ గ । ర్ణుని గీటడఁచిన విధంబునుం జూడఁ డొకొ! 353

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; తన= తనయొక్క; అనుజులు= తమ్ములు; దుశ్శాసనుఁడును= దుశ్శాసనుడును; లోనైనవారు= మొదలగువారు; సమసిన= మరణించిన; చందంబును= విధమును; బంధుసహితముగన్= చుట్టములతోకూడా; కర్ణుని= కర్ణునియొక్క; గీటడఁచిన= చంపిన; విధంబునున్= విధానమునుకూడ; చూడఁడు= చూడడు (గ్రహించడు) ఒకొ!= కదా!

తాత్పర్యం: దుశ్శాసనుడు మొదలైన తన తమ్ములు మరణించిన విధాన్ని, చుట్టాలతో కూడా కర్ణుడిని చంపిన విధాన్ని గ్రహించడు కదా!

క. **అది యెల్ల నేల చెప్పఁగఁ? । దుది శల్యునిపాటు గనియుఁ దోఁపఁ డితఁడు బ**
ల్లిదుఁ డని ధర్మజు దెసఁ దలఁ । పిది కురుపతి బుద్ధికొలఁది యేటికి వగవన్? 354

ప్రతిపదార్థం: అది; ఎల్లన్= అది అంతయూ; చెప్పఁగన్= చెప్పుట; ఏల?= ఎందుకు?; తుది= చివర; శల్యుని= శల్యునియొక్క; పాటు= పతనం - చావు; కనియున్= చూచియును; ఇతడు= ఈ ధర్మరాజు; తోఁపడు= భావించడు; ధర్మజుదెసన్= ధర్మరాజు పట్ల; బల్లిదుఁడు= బలం గలవాడు; అని; కురుపతి= కౌరవులకు భర్త అయిన దుర్యోధనునియొక్క; బుద్ధి= బుద్ధియొక్క (జ్ఞానముయొక్క); కొలఁది= పరిమితి; ఇది; అని; ఇతఁడు= ఇతడు; తలఁపు+ఇది= ఆ దుర్యోధనుని అంచనా ఇదే! వగవన్= విచారించుట; ఏటికిన్?= ఎందులకు?

తాత్పర్యం: అదంతా అనుకోవడం ఎందుకు? చిట్ట చివర శల్యుని చావు చూచి కూడా ధర్మరాజు బలమైన వాడని గ్రహించడం లేదు. ధర్మరాజును గూర్చి దుర్యోధనుడి అంచనా, ఆలోచన ఇంతే. అతడి బుద్ధి బలం అంతే. దీనికి విచారించడం ఎందుకు?

క. **క్షోణీరాజ్యార్ధము దన । ప్రాణము గలుగంగనీఁడు రారాజు జగ**
త్త్రాణపరాయణకరణ ధు । రీణుండగు పాండుసుతగరిష్ఠున కెట్లున్. 355

ప్రతిపదార్థం: ఎట్లున్= ఏ విధముగాను; జగత్= ప్రపంచమును; త్రాణ= కాపాడుటయందు; పరాయణ= అనురక్తి అనెడి; కరణ= కార్యమునందు; ధురీణుండు= భారమును మోయువాడు; అగు= అయినట్టి; పాండు= పాండురాజుయొక్క; సుత= పుత్రులలో; గరిష్ఠునకున్= మిక్కిలి గొప్పవాడయిన ధర్మరాజునకు; రారాజు= దుర్యోధనుడు; తన ప్రాణము= తనయొక్క ప్రాణము; కలుగంగన్= ఉండగా; క్షోణీ= భూమియొక్క; రాజ్య= సామ్రాజ్యముయొక్క; అర్ధము= సగభాగము; ఈఁడు= ఈయడు.

తాత్పర్యం: ఏ విధంగానైనా ప్రపంచాన్ని కాపాడటంలో అనురక్తి గలవాడైన ధర్మరాజుకు ఈ దుర్యోధనుడు తన ప్రాణం ఉన్నంతవరకు రాజ్యభాగం ఈయడు.

వ. **కావునఁ గొలంతయును దీర్పవలసియున్న' దనిన విష్ణుండు జిష్ణున కిట్లనియె. 356**

ప్రతిపదార్థం: కావునన్= అందువలన; కొలంతయును= మిగిలిన కొంచెముకూడ; తీర్పవలసియున్నది= పూర్తిచేయవలసియున్నది; అనినన్= ఇట్లు చెప్పగా; విష్ణుండు= శ్రీకృష్ణుడు; జిష్ణునకున్= అర్జుననకు; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: అందువలన మిగిలి ఉన్న కొంచెం కూడ పూర్తి చేయవలసి ఉన్నది' అని అర్జునుడు అనగా అతడితో శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు:

ఉ. **'అక్కడ సంధికిం జనినయప్పుడు నవ్విదురుండు కృష్ణ! నీ**
విక్కడ కేల వచ్చితి? విహీనవివేకుఁడు దుర్మదాంధ్యముం

దక్కునె? సంగరంబ యుచితం బగుకృత్యముగాక యిమ్మెయి
న్మక్కున నూర్పుగల్గఁ గుజనుండు సుయోధనుఁ డుర్వి యిచ్చునే?' **357**

ప్రతిపదార్థం: సంధికిన్= సంధికి; చనిన= వెడలిన; అప్పుడు= ఆ సమయమున; అక్కడన్= అచ్చట; ఆ+విదురుండు= ఆ విదురుడు; కృష్ణ!= ఓ కృష్ణా!; నీవు; ఇక్కడకున్= ఇచ్చటకు; ఏల= ఎందులకు; వచ్చితి?= వచ్చితివి?; విహీన= లేని (పోయిన); వివేకుఁడు= యుక్తా యుక్త జ్ఞానము కలవాడు (దుర్యోధనుడు); దుర్మద= దుష్టమయిన గర్వముతో కూడిన; ఆంధ్యమున్= గ్రుడ్డితనమును; తక్కునే?= విడిచిపెట్టునా?; సంగరంబ= యుద్ధమే; ఉచితంబగున్= యోగ్యమయిన (ఉపయోగకరమయిన); కృత్యము= చేయదగిన పని; కాక= అట్లుకాక; ఈ+మెయిన్= ఈ విధముగా; కుజనుండు= కుత్సితబుద్ధిగల మనుజుడు అయిన; సుయోధనుఁడు= దుర్యోధనుడు; ముక్కునన్= ముక్కునందు; ఊర్పుగల్గన్= ఊపిరి ఉండగా (ప్రాణమున్నంతవరకు); ఉర్వి= భూమి (రాజ్యము); ఇచ్చునే?= ఇచ్చునా? (ఈయడు).

తాత్పర్యం: 'నేను సంధికి పోయినప్పుడు ఆ విదురుడు 'కృష్ణా! నీ విక్కడికి ఎందుకు వచ్చావు? యుక్తాయుక్త జ్ఞానం లేని దుర్యోధనుడు దుష్టమైన గర్వంతో కూడిన గర్వాన్ని విడిచిపెట్టడు. యుద్ధమే చేయదగిన పని. అట్లా కాకుండా, ఈ విధంగా సంధి జరిగితే కుత్సితుడైన దుర్యోధనుడు ముక్కున ఊపిరి ఉన్నంతవరకు రాజ్యం ఈయడు.'

వ. అని బోధించె నదియునుంగాక దుర్యోధనుండు జనియించినప్పుడు మును 'లిప్పాపాత్ముండు నిఖిల క్షత్రియక్షయ హేతు!' వగునని యాదేశించిరిగాదే' యనిన నర్జునుం డతని కిట్లనియె. **358**

ప్రతిపదార్థం: అని; బోధించెను= చెప్పెను; అదియునుంగాక= అదియేకాకుండా; దుర్యోధనుడు; జనియించినప్పుడు= పుట్టినప్పుడు; మునులు= మునీశ్వరులు (ఋషులు); ఈ+పాపాత్ముండు= పాపబుద్ధికలవాడు; నిఖిల= సమస్తమయిన; క్షత్రియ= రాజులయొక్క; క్షయ= నాశనమునకు; హేతువు= కారణభూతుడు; అగునని; ఆదేశించిరి= ఆజ్ఞాపించిరి; కాదే!= కదా!; అనినన్= అనిచెప్పగా; అర్జునుండు= అర్జునుడు; అతనికిన్= శ్రీకృష్ణునికి; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియెన్= చెప్పెను (ఋషివాక్యము ఆజ్ఞవంటిది)

తాత్పర్యం: విదురుడు ఆ విధంగా నాకు బోధించాడు. అంతేకాక దుర్యోధనుడు పుట్టినప్పుడు మునులు 'ఈ పాపాత్ముడు సమస్త రాజులయొక్క నాశనానికి కారణభూతుడు కాగలడని ఆజ్ఞాపించారు కదా!' అని శ్రీకృష్ణుడు చెప్పగా అర్జునుడు ఆ శ్రీకృష్ణుడితో ఈ ప్రకారంగా అన్నాడు.

తే. 'అమ్మహాత్ములు సెప్పినయట్ల యయ్యె । నున్నవారలఁ బొలియించి తన్ను విడిచి
కాని విడువండు ధృతరాష్ట్రసూనుఁ డుర్వి । ధర్మసూనున కిది నిశ్చితంబు గృష్ణ! **359**

ప్రతిపదార్థం: ఆ+మహాత్ములు= ఆ గొప్ప మనస్సుకల మునులు; చెప్పిన= పలికిన; అట్ల= అట్లే; అయ్యెను; ఉన్నవారలన్= బ్రతికి ఉన్న వారలను; పొలియించి= చంపి; తన్నున్= తనను; విడిచికాని= చంపుకొని కాని; ధృతరాష్ట్ర సూనుఁడు= ధృతరాష్ట్రుని కుమారుడయిన దుర్యోధనుడు; ధర్మసూనునకున్= ధర్మరాజునకు; ఉర్వి= భూమి; విడువండు= విడిచిపెట్టడు; కృష్ణ!= ఓ కృష్ణా!; ఇది; నిశ్చితంబు= నిశ్చయింపబడినది.

తాత్పర్యం: 'ఆ మహాత్ములయిన మునులు చెప్పినట్లుగానే జరిగింది. బ్రతికి ఉన్న వారిని చంపించి, తాను చచ్చికాని దుర్యోధనుడు ధర్మరాజుకు రాజ్యం వదలడు. ఓ కృష్ణా! ఇది నిశ్చయం.

క. దుర్బలమగు నమ్మూఁకను । దోర్బల మెసఁగంగ నిపుడ త్రుంచెద నా దు
ర్నిర్బంధపరుఁడు దనదగు । దౌర్బల్యము గనుచు మదము దక్కి కనుఁగొనన్. 360

ప్రతిపదార్థం: ఆ; దుర్నిర్బంధపరుడు= మొండివాడు (దుర్యోధనుడు); తనదగు= తనదైన; దౌర్బల్యము= దుర్బలత్వము; కనుచున్= పొందుచు; మదము= గర్వము; తక్కి= విడిచి; కనుఁగొనన్= చూచుచుండగా; దుర్బలమగు= బలహీనమైనట్టి; ఆ+మూఁకను= ఆ సైన్యమును; దోర్బలము= భుజబలము; ఎసఁగంగన్= అతిశయించునట్లుగ; ఇపుడు+అ= ఇపుడే (ఈ క్షణమునందే); త్రుంచెదన్= ఖండించెదను.

తాత్పర్యం: ఆ దుష్టశత్రువు దుర్యోధనుడు తనదైన నిస్సహాయతను చూస్తూ, గర్వం పోగొట్టుకొనే విధంగా బలంలేని ఆ సైన్యమును భుజబలం అతిశయించేటట్లుగా ఈ క్షణమే ఖండిస్తాను.

వ. రయంబున రథంబు గడపు' మనుడు నుత్తుంగమాతంగమహీరుహాశోభితంబును సాంద్రస్యందన గుల్మగహనంబును బహుళహయకక్షాకీర్ణంబును సముద్భట సుభట లతాలసితంబును నైన సుయోధను సేనా కాననంబునందు మాధవమహావాయువు ధనంజయదారుణానలంబు దరికొల్పిన. 361

ప్రతిపదార్థం: రయంబునన్= వేగంగా; రథంబు= రథము; కడపుము= త్రోలుము; అనుడును= అనగానే; ఉత్తుంగ= మిక్కిలి ఎత్తైన; మాతంగ= ఏనుగులనే; మహీరుహ= వృక్షములతో; శోభితంబును= సుందరమయినదియును; సాంద్ర= దట్టమయిన; స్యందన= రథములనెడి; గుల్మ= పొదరిండ్లతో; గహనంబును= చొరశక్యము కానిదియును; బహుళ= అనేకములయిన; హయ= గుర్రములనెడి; కక్షా= గడ్డిపొదలతో; ఆకీర్ణంబును= వ్యాప్తమయినదియును; సముద్భట= శ్రేష్ఠమయిన; సుభట= మంచి భటులు అనెడి; లతా= లతలతో; లసితంబును= ప్రకాశించుచున్నదియును; ఐన= అయినట్టి; సుయోధను= దుర్యోధనునియొక్క; సేనా= సైన్యమనెడి; కాననంబునందున్= అరణ్యమునందు; మాధవ= శ్రీకృష్ణుడనెడి; మహా= గొప్ప; వాయువు= గాలి; ధనంజయ= అర్జునుడనెడి; దారుణ= భయంకరమయిన; అనలంబున్= అగ్ని; దరికొల్పినన్= రగుల్గొలుపు తుండగా.

తాత్పర్యం: వేగంగా రథం తోలుము' అని అర్జునుడు మిక్కిలి ఎత్తైన ఏనుగు లనే మహావృక్షాలతో సుందరమయినది, దట్టమయిన రథాలనే పొదరిండ్లతో చొరశక్యం కానిది, అనేకములయిన గుర్రాలనెడి గడ్డిపొదలతో నిండిపోయినది. శ్రేష్ఠు లయిన భటు లనెడి లతలతో ప్రకాశిస్తున్నది - అయిన దుర్యోధనుడి సైన్యమనే అరణ్యాన్ని శ్రీకృష్ణు డనెడి పెనుగాలి అర్జునుడనెడి భయంకరమయిన అగ్ని రగుల్గొలుపుతుండగా రాజుకొనేటట్లు చేయగా (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'బాణోచ్ఛిష్ట మిదం జగత్' అనే ఆర్యోక్తి అన్వర్థమయ్యేటట్లు ఆంధ్రకవులు కూడా వచనరచనలందు విరోధాభాసలు, రూపకములు, ఉత్ప్రేక్షలు, అతిశయోక్తులు, స్వభావోక్తులతో కాదంబరి వచనరచనాశైలిని అనుకరించి, అనుసరించటానికి ప్రయత్నిస్తారు. అట్టిదాని కిది చిన్న ఉదాహరణ. దుర్యోధనుడి సేనారణ్యం ఒక రూపకం. చతురంగ బలములు రూపకాలు. మాధవమహావాయువు, ధనంజాయాగ్నులు - ఈ రూపకమాలికకు సూత్రములు. ఇట్లా ఈ వచనం ఒక చక్కని రూపకమాలిక. చతురంగ బలాలతో - ఏనుగులు వృక్షములుగా - రథములు పొదరిండ్లుగా, గుర్రములు గడ్డిపొదలుగా, భటులు లతలుగా- ఉపమాన ఉపమేయములకు అభేదాన్ని కల్పించి - దుర్యోధనుడి సైన్యమును ఒక మహారణ్యంగా, మాధవుడిని మహావాయువుగా, అర్జునుడిని అగ్నిగా అభేదాన్ని కల్పించి, ఒక మహారూపకాలంకారంగా తిక్కన వర్ణించాడు.

ధనంజయ శబ్దానికి అర్జును డనేకాక అగ్ని అనే అర్థం కూడా ఉన్నది.

క. ఆ కృష్ణవర్త్ముఁ డుజ్జ్వల । భీకరశరజిహ్వ లడరఁ బేర్చిన నధిక
వ్యాకులత నొందె రోదసి । నాకౌకస్సమితి మెచ్చునం బొదలంగన్. 362

ప్రతిపదార్థం: ఆ కృష్ణవర్త్ముఁడు= ఆ అగ్ని (అర్జునుడనెడి ఆ అగ్ని); ఉజ్జ్వల= బాగుగా ప్రకాశించుచున్న; భీకర= భయంకరమయిన; శర= బాణములనెడి; జిహ్వలు= నాలుకలనెడి జ్వాలలు; అడరన్= వ్యాపింపగా; పేర్చినన్= విజృంభించగా; నాకౌకః= దేవతలయొక్క; సమితి= సమూహము; మెచ్చునన్= పొగడ్తలతో; పొదలంగన్= వర్ధిల్లగా; రోదసి= ఆకాశము; అధిక= మిక్కిలి; వ్యాకులతను= కలతను; ఒందెన్= పొందెను.

తాత్పర్యం: ఆ అర్జును డనే అగ్ని బాగా ప్రకాశిస్తున్న భయంకరమైన బాణాలనెడి జ్వాలలు వ్యాపిస్తూ విజృంభించగా దేవతాసమూహం పొగడ్తలతో ఒప్పగా ఆకాశం మిక్కిలి కలతచెందింది.

వ. ఇట్లు దారుణరణవిహరణంబు సలిపి సవ్యసాచి యా సైన్యంబు నిపతిత విఘటిత భ్రాంత పలాయితంబు సేసినఁ దెరలక నిలిచి కురుపతి కరతలంబెత్తి నిలు నిలుమని యెలుంగు సూపిన నది మగుడఁ బురికొని నిగిడి నేమినినద ఘంటాక్వణనకింకిణీ నిక్వాణంబులు సెలంగఁ బాండవబలంబుఁ దాఁకిన ధృష్టద్యుమ్న శిఖండి శతానీకు లయ్యనీకంబు ననేకవిధసాయక నికాయంబులం గప్పి రప్పుడు ధృష్టద్యుమ్ను నరదంబు చక్కటికి సంరంభంబున. 363

ప్రతిపదార్థం: ఇట్లు; దారుణ= భయంకరమయిన; రణ= యుద్ధముయొక్క; విహరణంబు= విహారము; సలిపి= చేసి; సవ్యసాచి= అర్జునుడు; ఆ సైన్యంబు= ఆసేన (కురుసైన్యము); నిపతిత= పడగొట్టబడి; విఘటిత= విడగొట్టబడి; భ్రాంత= భ్రమింపజేయబడి; పలాయితంబు= పారిపోవునట్లు; చేసినన్= చేయగా; తెరలక= తొలగిపోక; నిలిచి; కురుపతి= కౌరవులకు భర్త అయిన దుర్యోధనుడు; కరతలంబు= చేయి; ఎత్తి= పైకి ఎత్తి; నిలునిలుము; అని; ఎలుంగు= పెద్దకంఠధ్వని (పెద్ద అరుపు); చూపినన్= చూపగా (పెద్ద కేకవేయగా); అది= ఆ సైన్యము; మగుడన్= మరల; పురికొని= క్రమ్ముకొని; నిగిడి= విజృంభించి; నేమి= (రథచక్రముల) కమ్ములయొక్క; నినద= ధ్వనులు; ఘంటా= (ఏనుగుల) గంటలయొక్క; క్వణన= ధ్వనులు; కింకిణీ= మువ్వలయొక్క (గుర్రములకు కట్టిన మువ్వలు); నిక్వాణంబులు= ధ్వనులు; చెలంగన్= మ్రోయగా; పాండవబలంబున్= పాండవుల సైన్యమును; తాఁకినన్= ఎదుర్కొనగా; ధృష్టద్యుమ్న= ధృష్టద్యుమ్నుడు; శిఖండి= శిఖండియు; శతానీకులు= శతానీకుడును; ఆ; అనీకంబున్= సైన్యమును; అనేక విధ= పలువిధములైన; సాయక= బాణములయొక్క; నికాయంబులన్= సమూహములతో; కప్పిరి= కప్పివేసిరి; అప్పుడు= ఆ సమయమున; ధృష్టద్యుమ్నుని; అరదంబు= రథముయొక్క; చక్కటికిన్= దిక్కునకు; సంరంభంబునన్= వేగిరపాటుతో.

తాత్పర్యం: ఈ ప్రకారంగా భయంకరమైన యుద్ధవిహారం చేసి అర్జునుడు కురుసేన పడగొట్టబడి విడగొట్టబడి, భ్రమింపజేయబడి, పారిపోయేటట్లు చేయగా తొలగిపోక నిలిచి దుర్యోధనుడు చేయి పైకి ఎత్తి నిలునిలుమని పెద్దకంఠధ్వని చేయగా, ఆ సైన్యం మరల తిరిగి క్రమ్ముకొని విజృంభించి రథచక్రాల కమ్ముల ధ్వనులు, ఏనుగుల ఘంటానాదాలు, గుర్రాలకు కట్టిన మువ్వల ధ్వనులు మ్రోయగా పాండవసైన్యాన్ని ఎదుర్కొనగా ధృష్టద్యుమ్నుడు, శిఖండిశతానీకులు ఆ కురుసైన్యాన్ని పలువిధాలయిన బాణాల సమూహాలతో కప్పివేశారు. ఆ సమయంలో ధృష్టద్యుమ్నుడి రథం దిక్కునకు వేగిరపాటుతో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: నకులుడి వలన ద్రౌపదికి జన్మించిన పుత్రుడు శతానీకుడు. ఇతడు విశ్వేదేవుల అంశవలన జన్మించాడు. కురువంశంలో శతానీకుడనే మహాత్ముడు - రాజర్షి ఉండేవాడు. నకులుడు ఆ రాజర్షిపేరును తనపుత్రుడికి పెట్టాడు. ఇతడికి మహాభారతంలో - నకులదాయాద - నకులసుత - నకులాత్మజ - నాకులి - అనే పేర్లు ఉన్నాయి.

ఉ. భూపతి మించి యా ద్రుపదభూపతనూజునురంబు నిర్భరా
టోపత యుల్లసిల్లఁగఁ బటుప్రదరంబుల నొంప నాతఁ డు
ద్దీపితకోపుఁడై హరులు ద్రెళ్ళఁగ సారథి డొల్ల నేయఁ గా
నే పఱి తేరు డిగ్గి యతఁడెక్కె హయోత్తముఁ గౌరవేశ్వరా! 364

ప్రతిపదార్థం: కౌరవేశ్వరా!= కౌరవులకు ప్రభువు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; భూపతి= భూమికి భర్త అయిన దుర్యోధనుడు; మించి= అతిశయించి; ఆ ద్రుపదభూప= ఆ ద్రుపదమహారాజుయొక్క; తనూజు= పుత్రునియొక్క; ఉరంబున్= వక్షఃస్థలమును (అనగా ధృష్టద్యుమ్నుడి వక్షఃస్థలమును); నిర్భర= ప్రగాఢమయిన; ఆటోపము= ఆడంబరము; ఉల్లసిలఁగన్= ప్రకాశింపగా; పటు= కఠినమయిన; ప్రదరంబులన్= బాణములతో; నొంపన్= నొప్పిచేయగా; ఆతఁడు= అతడు (ధృష్టద్యుమ్నుడు); ఉద్దీపిత= ప్రజ్వలించిన; కోపుఁడై= కోపము కలవాడై; హరులు= గుర్రములు; త్రెళ్ళఁగన్= కూలిపోగా (పడిపోగా); సారథి; డొల్లన్= క్రిందపడునట్లుగా; ఏయఁగాన్= కొట్టగా; అతఁడు= ఆ దుర్యోధనుడు; ఏపు= పెంపు; అఱి= నశించి; తేరు= రథము; డిగ్గి= దిగి; హయ+ఉత్తమున్= ఉత్తమాశ్వమును; ఎక్కెన్= అధిరోహించెను (ఎక్కెను).

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! దుర్యోధనుడు అతిశయించి ధృష్టద్యుమ్నుడి వక్షఃస్థలాన్ని ప్రగాఢమయిన సంభ్రమంతో కఠినమయిన బాణాలతో నొప్పిచేశాడు. ఆ ధృష్టద్యుమ్నుడు ప్రజ్వలించిన కోపం కలవాడై గుర్రాలు కూలిపోయేటట్లు సారథి పడిపోయేటట్లు కొట్టగా దుర్యోధనుడు పెంపు నశించి, రథం దిగి ఉత్తమాశ్వాన్ని అధిరోహించాడు.

వ. ఎక్కి కొండొక తొలంగి మాతంగ ఘటలం బురికొల్పిన నవి పురందరనందను నరదంబుఁ బొదివిన నవ్వీరుండు ఘోరనారాచధారల నవ్వారణంబులపైఁ గురియం గని గదాహస్తుండై యరదంబు డిగ్గి యనిలపుత్రుండు గవిసినఁ దుండంబు లవిసియు దంతంబులు దునిసియుఁ గుభంబులు వగిలియుఁ బ్రక్కలు చదిసియు వెన్నులు విఱిగియు నగ్గజంబు లొఱలుచు నెత్తురులు గ్రక్కుచుఁ దెరలుచు సుడివడుచుండ వెండియుం బైపై నురవణించు కరులం గనుంగొని ధర్మజనకులసహదేవులును ధృష్టద్యుమ్నాదియోధులు నద్దిక్కు తఱిమి రట్టియెడ నశ్వత్థామకృతవర్మకృపాచార్యులు దుర్యోధనుఁ దేరిగములలోనంగానక కలనం బడియెనో? యని యనుమానించుచు నచ్చటి మానవపతులం 'గురుపతి యెచ్చట నున్నవాఁ?'డని యడిగినఁ గొందఱు శకునిదెసఁ దొలంగె ననఁ దక్కటి వా 'రతని వెదక నేల బ్రదికియుండె నేనియుఁ గనికొందము పాండవులమీఁద నుఱికి పొడుతము గాక' యనిన విని యట్ల చేయ నారథికత్రయంబును దదనీకంబును వెడలి సొబలుఁడున్న చక్కటికిం జనియె నిట్లు దిక్కుమాలిన యమ్మొన చుట్టుముట్టి. 365

ప్రతిపదార్థం: ఎక్కి= అధిరోహించి (దుర్యోధనుడు ఒక ఉత్తమాశ్వము ఎక్కి); కొండొక= ఇంకొక చోటునకు; తొలంగి= తొలగి; మాతంగ= ఏనుగులయొక్క; ఘటలన్= సమూహములను (ఏనుగుల గుంపునకు ఘటా అని పేరు); పురికొల్పినన్= క్రమ్ముకొనునట్లు చేయగా; అవి= అవి (ఆ ఏనుగులు); పురందర= ఇంద్రునియొక్క; నందనుని= పుత్రుడయిన అర్జునునియొక్క;

అరదంబున్= రథమును; పొదివినన్= క్రమ్ముకొనగా; ఆ+వీరుండు= ఆ శూరుడు (పరాక్రమ వంతుడయిన అర్జునుడు); ఘోర= భయంకరమయిన; నారాచ= బాణములయొక్క; ధారలన్= జడులను; ఆ+వారణంబులపైన్= ఆ ఏనుగులమీద; కురియన్= కురిపించగా; కని= చూచి; గదా= గద; హస్తుండై= చేతియందుకలవాడై; అరదంబు= రథము; డిగ్గి= దిగి; అనిలపుత్రుండు= భీముడు; కవిసినన్= కలియబడగా; తుండంబులు= తొండములు; అవిసియున్= పగిలిపోయి; దంతంబులు= దంతములు; తునిసియున్= తునాతునకలు అయిపోయియు (ముక్కలు అయిపోయి); కుంభంబులు= కుంభస్థలములు; పగిలియున్= పగిలిపోయి; ప్రక్కలు= ప్రక్కభాగములు; చదిసియున్= నలిగిపోయి; వెన్నులు= వీపులు; విఱిగియున్= విరిగిపోయి; ఆ+గజంబులు= ఆ ఏనుగులు; ఒఱలుచున్= అరచుచు(బాధతో); నెత్తురులు= రక్తములు; క్రక్కుచున్= క్రక్కుచును; తెరలుచున్= బయలువెడలుచు; సుడి+పడుచుండన్= చుట్టుకొని పోవుచుండగా; వెండియున్= మరియును; పైపైన్= మీద మీదకు; ఉరవణించు= విజృంభించుచున్న; కరులన్= ఏనుగులను; కనుంగొని= చూచి; ధర్మజ నకుల సహదేవులును= ధర్మరాజు నకులుడు సహదేవుడును; ధృష్టద్యుమ్న= ధృష్టద్యుమ్నుడు; ఆది= మొదలగు; యోధులును= వీరులును; ఆ+దిక్కు= ఆ వైపు; తఱిమిరి= పరుగెత్తిరి; అట్టియెడన్= ఆ సమయమున; అశ్వత్థామ కృతవర్మ కృపాచార్యులు= అశ్వత్థామయు, కృతవర్మయు, కృపాచార్యుడును; దుర్యోధనున్= దుర్యోధనుడిని; తేరి= రథములయొక్క; గములలోనన్= సమూహములలోపల; కానక= చూడజాలక; కలనన్= యుద్ధమునందు; పడియెనో?= పడిపోయెనా? (చనిపోయెనా ఏమి); అని; అనుమానించుచున్= సందేహించుచు; అచ్చటి= అక్కడ ఉన్న; మానవపతులన్= మహారాజులను; కురుపతి= దుర్యోధనుడు; ఎచ్చటన్= ఎక్కడ; ఉన్నవాఁడు?= ఉన్నాడు?; అని; అడిగినన్= అడుగగా; కొందఱు= కొంతమంది; శకునిదెసన్= శకుని ఉన్నవైపు; తొలంగెను= వెడలెను; అనన్= అనిచెప్పగా; తక్కటివారు= మిగిలినవారు; అతనిన్= ఆ దుర్యోధనుడిని; వెదకను= వెదకుట; ఏల?= ఎందుకు?; బ్రదికి= జీవించి; ఉండెనేనియున్= ఉన్నట్లయితే; కనికొందము= చూచికొందము; పాండవులమీఁదను= పాండవులపై; ఉఱికి= దూకి; పొడుతము= పోట్లాడదాము; కాక; అనినన్= ఇట్లు చెప్పగా; విని; అట్ల= ఆ విధముగానే; చేయన్= చేయుటకు; ఆ+రథిక= ఆ రథికులు అయిన (యోధులు అయిన); త్రయంబును= ముప్పురును (అశ్వత్థామ కృతవర్మ కృపాచార్యులు); తద్+ఆనీకంబును= ఆ సైన్యమును; వెడలి= వెళ్ళి; సౌబలుఁడు= శకుని; ఉన్న= ఉన్నట్టి; చక్కటికిన్= దిక్కునకు; చనియెన్= వెడలింది; ఇట్లు= ఈ ప్రకారముగా; దిక్కుమాలిన= నాథుడులేని; ఆ+మొన= ఆ సేన; చుట్టుముట్టి= క్రమ్ముకొని.

తాత్పర్యం: దుర్యోధనుడు ఒక ఉత్తమాశ్వాన్ని అధిరోహించి ఇంకొక చోటునకు తొలగి ఏనుగుల గుంపులను క్రమ్ముకొనేటట్లు చేయగా అవి అర్జునుడి రథాన్ని చుట్టుముట్టాయి. అప్పుడు వీరుడయిన ఆ అర్జునుడు భయంకరములైన బాణాల వరుసలను ఆ ఏనుగులమీద కురిపించాడు. అది చూచి గదను చేత ధరించి రథం దిగి భీముడు ఏనుగులపై కలియబడగా, తొండములు పగిలి, దంతములు ముక్కలైపోయి, కుంభస్థలాలు బ్రద్దలైపోయి, ప్రక్కభాగాలు నలిగిపోయి, వీపులు విరిగిపోయి, ఆ ఏనుగులు ఘీంకరిస్తూ రక్తములు క్రక్కుతూ, బయలువెడలుతూ చుట్టుకొనిపోతూ ఉన్నాయి. మరియు మీదమీదకు వేగిరపాటుతో పడుతున్న ఏనుగులను చూచి ధర్మరాజ నకుల సహదేవులును ధృష్టద్యుమ్నుడు మొదలైన యోధులును ఆ వైపునకు పరుగెత్తారు. ఆ సమయంలో అశ్వత్థామ కృతవర్మ కృపాచార్యులు దుర్యోధనుడి రథముల సమూహాల లోపల చూడజాలక యుద్ధంలో చనిపోయాడేమో? అని సందేహిస్తూ అచ్చట ఉన్న రాజులను 'దుర్యోధనుడు ఎక్కడ ఉన్నాడు?' అని అడిగారు. ఇట్లా అడుగగా కొందరు రాజులు 'శకుని ఉన్నవైపు వెళ్ళాడు' అని చెప్పారు. మిగిలినవారు 'దుర్యోధనుడిని వెదకటం ఎందులకు? జీవించి ఉండెనా - తెలిసి కొందము. లేనియెడల పాండవులమీదపడి పోట్లాడుదాము'. అని చెప్పగా విని ఆ విధంగానే చేయటానికి ఆ యోధులు ముప్పురూ ఆ సైన్యంతో శకుని ఉన్నట్టి దిక్కుకు వెళ్ళారు. ఈ ప్రకారంగా దిక్కుమాలిన ఆ సేనను చుట్టిముట్టి (తరువాతి పద్యంతో అన్వయం).

దుర్విషహప్రభృతి కురుకుమారులు భీమునిచేఁ జచ్చుట (సం. 9-24-41)

క. పాంచాలకుమారాదు లు। దంచిత భుజబలము మెఱయ నమ్ములవెల్లిన్
ముంచిరి నిజకరిహరి రథ। సంచయసంరంభ మెసఁగ జగతీనాథా! 366

ప్రతిపదార్థం: జగతీనాథా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; పాంచాలకుమారాదులు= పాంచాలదేశపురాజు అయిన ద్రుపదుని కుమారుడు అయిన ధృష్టద్యుమ్నుడు మొదలగువారు; ఉదంచిత= విజృంభించిన; భుజబలము= బాహుబలము; మెఱయన్= ప్రకాశించగా; అమ్ముల= బాణములయొక్క; వెల్లిన్= ప్రవాహంతో; నిజ= తమయొక్క; కరి= ఏనుగులయొక్క; హరి= గుఱ్ఱములయొక్క; రథ= రథములయొక్క; సంచయ= సముదాయముయొక్క; సంరంభము= వేగిరపాటు; ఎసఁగన్= అతిశయించగా; ముంచిరి;

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధృష్టద్యుమ్నుడు మొదలైనవారు విజృంభించి బాహుబలం ప్రకాశించగా తమ ఏనుగుల, గుఱ్ఱాల, రథాల సముదాయపు వేగిరపాటు అతిశయించగా బాణాల పరంపరతో కౌరవసేనను ముంచారు.

వ. అప్పు డేను ధృష్టద్యుమ్నునిబారి కొక భంగిఁ దొలంగఁ దప్పియు నద్దెస నుద్దామగతి చతుశ్శతస్యందనములతో నడరు సాత్యకిచేతఁ బట్టువడితి; నట్టియెడ వడముడి కుంజర ప్రకరభంజనవిహరణపారీణతం బేర్చి యార్చినం జూచి నీ కొడుకులు దుర్విషహ దుష్ప్రదర్శన ప్రముఖులు శితశిఖంబులు గురియుచుం గవిసి యబ్బలుమగనిం బొదివిన నతండు రథం బెక్కియెక్కుడుమదంబున భల్లనారాచాదిబాణంబులఁబ్రాణంబులు గొనినం గనుంగొని హతశేషంబైన భవదీయబలంబు గ్రోధశోకావేశంబున నవ్వీరుఁ జుట్టుముట్టిన నాజెట్టిజోదు పంచశత రథంబులును దంతిశతసప్తకంబును దురంగాష్టశతంబును బదాతిదశసహస్రంబును దనసాయక సముదయంబుల వేగంబున సమయునట్లుగా సంక్రీడనంబు సూపినం దక్కటివారు దేఱిచూడనుం జాల కంతంత నిలువ భవత్కుమారమారణం బప్రతిహతంబై చెల్లుటకు నుల్లంబు వికసిల్లె. శిష్టైకసోదరుండైన సుయోధనునిఁ దెగినవానిన కాఁ గొని తన్ను నప్పుడు కృతార్థునింగాఁ దలంచుచు మల్లచఱచినం గించిదవశిష్టంబైన యాకౌరవసైన్యంబు వెగడంది ఱిచ్చవడియె. నయ్యవసరంబున గుఱ్ఱపుఁ దండంబులతో సుదర్శనుండు దాను నున్న సుయోధను నాలోకించి గోపాలదేవుండు దేవేంద్రపుత్రున కిట్లనియె. 367

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయమున; ఏను= నేను; ధృష్టద్యుమ్ని= ధృష్టద్యుమ్నుడి; బారికిన్= అధీనమునుండి; ఒక భంగిన్= ఏదో ఒక విధముగా; తొలంగన్= తొలగ; తప్పియున్= తప్పుకొనియు (ప్రక్కకు తప్పుకొని); ఆ+దెసను= ఆ దిక్కునకు; ఉద్దామ= అడ్డులేని; గతి= గమనముకలవాడై; చతుశ్శత= నాలుగువందల; స్యందనములతోన్= రథములతో; అడరు= అతిశయించు; సాత్యకిచేతన్= సాత్యకిచేత; పట్టుపడితిని (అ థాపశ్యం సాత్యకిం త ముపాయాంతం మహారథమ్। రథైశ్చతుశ్శతైర్వీరోమామభ్యద్ర తదాహవే॥ 9-24-48- మూలం); అట్టియెడన్= ఆ సమయంలో; వడముడి= భీముడు; కుంజర= ఏనుగులయొక్క; ప్రకర= సమూహమును; భంజన= భగ్నముచేయు (నాశముచేయు); విహరణ= విహారమునందు; పారీణతన్= పారము ముట్టుటవలన; పేర్చి= విజృంభించి; ఆర్చినన్= పెద్ద బొబ్బపెట్టగా; చూచిన; నీ కొడుకులు= నీ పుత్రులు; దుర్విషహ= దుర్విషహుడు; దుష్ప్రదర్శన= దుష్ప్రదర్శనుడు; ప్రముఖులు= మొదలగు ముఖ్యమయినవారు; శిత= వాడియైన; విశిఖంబులు= బాణములు; కురియుచున్= ప్రయోగించుచు; కవిసి= కలియబడి; ఆ+బలు= ఆ బలమయిన; మగనిన్= వీరుని (భీముడిని); పొదివినన్= ఎదుర్కొనగా; అతండు; రథంబు; ఎక్కి= అధిరోహించి; ఎక్కుడు= మిక్కిలి;

మదంబునన్= గర్వముతో; భల్ల= బల్లెములు; నారాచ= నారాచములు(ఇనుపబాణాలు); ఆది= మొదలగు; బాణంబులన్= బాణములతో; ప్రాణంబులు= ప్రాణములు; కొనినన్= తీసికొనగా; కనుంగొని= చూచి; హత= చంపబడగా; శేషంబైన= మిగిలిన; భవదీయ= నీయొక్క; బలంబు= సేన; క్రోధ= కోపముయొక్క; శోక= దుఃఖముయొక్క; ఆవేశంబునన్= తీవ్రతవలన; ఆ+వీరున్= ఆ పరాక్రమవంతుని (భీముని); చుట్టుముట్టినన్= క్రమ్ముకొనగా; ఆ జెట్టి= ఆ మల్లుడయిన; జోదు= యోధుడు (భీముడు); పంచ= అయిదు; శత= వందల; రథంబులును= రథములును; దంతి= ఏనుగులయొక్క; శతసప్తకంబును= ఏడువందలును; తురంగ= గుర్రములయొక్క; అష్టశతంబును= ఎనిమిది వందలును; పదాతి= కాల్బలములయొక్క; దశసహస్రంబును= పదివేలును; తన= తనయొక్క; సాయక= బాణములయొక్క; సముదయంబులన్= సమూహములతో; వేగంబునన్= శీఘ్రముగా; సమయునట్లుగాన్= సంహరింపబడునట్లుగా; సంక్రీడనంబు= గొప్పక్రీడను; చూపినన్= చూపించగా; తక్కటి= మిగిలిన; వారు; తేఱిచూడనున్= తేరిపారచూచుటకు కూడా; చాలక= లేక (శక్తిలేక); అంతంతన్= అక్కడక్కడ; నిలువన్= నిలబడగా; భవత్= మీయొక్క; కుమార= పుత్రులయొక్క; మారణంబు= వినాశనము; అప్రతిహతంబై= అడ్డులేనిదియై; చెల్లుటకున్= అయిపోవుటకు; ఉల్లంబు= హృదయము; వికసిల్లెన్= వికసించినది; శిష్ట+ఏక= మిగిలిన ఒక్క; సోదరుండైన= సోదరుడు కలవాడైన (తమ్ముడు కలవాడు అయిన - ఆ తమ్ముడి పేరు సుదర్శనుడు); సుయోధనునిన్= దుర్యోధనుని; తెగినవానినకాన్= ఖండింపబడిన వానినిగానే; కొని= అనుకొని (తలచి); తన్నున్= తనను; అప్పుడు= ఆ సమయమున; కృత+అర్థునింగాన్= ధన్యునిగా (నెరవేరిన పని కలవానినిగా, చేయబడిన ప్రయోజనము అనగా ఫలితము కలవానినిగా); తలంచుచున్= ఆలోచించుచు; మల్లచఱచినన్= భుజాస్ఫాలనముచేయగా (కుస్తీపట్టునప్పుడు మల్లవీరులు భుజములను కాని తొడలనుకాని చఱచుకొందురు); కించిత్= కొంచెము; అవశిష్టంబైన= మిగిలిన; ఆ కౌరవసైన్యంబు= ఆ కౌరవులయొక్క సైన్యము; వెగడంది= తడబాటుపొంది; ఊచ్చ+పడియెన్= చేష్టలుడిగెను (నిశ్చేష్టమయ్యెను); ఆ+అవసరంబునన్= ఆ సమయమున; గుఱ్ఱపున్= గుర్రములయొక్క; తండంబులతోన్= సముదాయములతో; సుదర్శనుండు= సుదర్శనుడు; తానును; ఉన్న; సుయోధనున్= దుర్యోధనుడిని; ఆలోకించి= చూచి; గోపాలదేవుండు= శ్రీకృష్ణుడు; దేవేంద్రపుత్రునకున్= అర్జునునకు; ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: ఆ సమయంలో నేను ధృష్టద్యుమ్నుడి పట్టునుండి ఏదో ఒక విధంగా ప్రక్కకు తప్పుకొని, ఆ దిక్కునకు అడ్డులేని గమనం కలవాడై నాలుగు వందల రథాలతో అతిశయించే సాత్యకిచేత పట్టుపడ్డాను. ఆ సమయంలో భీముడు ఏనుగులయొక్క సమూహాలను నాశనంచేసే అపారవిహారంతో విజృంభించి పెద్దబొబ్బపెట్టగా చూచి నీ కొడుకులు దుర్విషహ దుష్ప్రదర్శన ప్రముఖులు వాడిబాణాలు ప్రయోగిస్తూ కలియబడి ఆ బలైన వీరుడిని ఎదుర్కొనగా, అతడు రథం ఎక్కి మిక్కిలి గర్వంతో బల్లెములు నారాచములు మొదలైన ఆయుధాలతో వారి ప్రాణాలు తీశాడు. అది చూచి చావగా మిగిలిన నీ సేనలు కోపదుఃఖాల తీవ్రతవలన ఆ పరాక్రమవంతుడైన భీముడిని చుట్టుముట్టాయి. అప్పుడు ఆ మల్లుడైన యోధుడు - భీముడు అయిదువందల రథాలను, ఏడువందల ఏనుగులను, ఎనిమిది వందల గుర్రాలను, పదివేల కాల్బలాలను తన బాణపరంపరత వేగంగా సంహరింపబడేటట్లుగా క్రీడించి చూపించగా మిగిలినవారు తేరిపారచూడటానికి కూడా అర్హతలేక అక్కడక్కడ నిలబడగా నీ పుత్రుల వినాశం అడ్డులేకుండా అయిపోయినందులకు హృదయం వికసించినది. ఇక ఒక్క సోదరుడు మిగిలినవాడైన దుర్యోధనుడిని ఖండింపబడిన వాడినిగా భావించి తననుతాను ధన్యుడిగా ఆలోచిస్తూ భుజాస్ఫాలనం చేయగా, కొంచెం మిగిలిన ఆ కౌరవసైన్యం తడబాటు పొంది చేష్ట లుడిగినది. ఆ సమయంలో గుర్రాల గుంపులతో సుదర్శనుడు తానును ఉన్నట్టి దుర్యోధనుడిని చూచి శ్రీకృష్ణుడు అర్జునుడితో ఈ ప్రకారంగా అన్నాడు.

విశేషం: మూలమును అనుసరించి ఈ సన్నివేశంలో భీముడు సంహరించిన ధృతరాష్ట్ర పుత్రులు : 1). దుర్మర్షణుడు; 2). శ్రుతాంతుడు; 3). జైత్రుడు; 4). భూరిబలుడు; 5). రవి; 6). జయత్సేనుడు; 7). సుజాతుడు; 8). దుర్విషహుడు; 9). దుర్విమోచనుడు; 10). అరిహుడు; 11). దుష్ప్రధర్షుడు; 12). శ్రుతపర్వుడు; 13). మహాబాహుడు; 14). సుదర్శనుడు. వీరుకాక దుర్విరోచనుడు, దుష్కర్ణుడు, దుస్తరాజయుడు, దుష్ప్రధర్షణుడు అనే ధృతరాష్ట్రపుత్రులు ద్రోణపర్వంలో భీముడిచేత సంహరింపబడినట్లు ఉన్నది.

సీ. **'అరు లడంగిరి యుధిష్ఠిరుఁ డాది యగు భవ । ద్భ్రాతలు నీ పరిపాలనమున**
నుల్లసిల్లిరి సంజయుని బాడుదల వట్టి । కొని వచ్చి సాత్యకి వినుతి కెక్కె
నెలమి ధృష్టద్యుమ్నుఁ డెంతయు నొప్పె ని । ప్పుడ కూడి తఱుము మీప్రోవుగట్టి
నిలిచిన హయములం బొలియింపవలయు నిం । దున్నాఁడు చూచితె? యొడ్డు చక్కఁ

తే. **గా నమర్చుచుఁ జూడ్కులు గలయదెసల । బొరి నిగుడ్చుచు ధృతరాష్ట్రపుత్త్రుఁ డల్ల**
వాఁడె! తెల్లనిగొడుగుతో వాఁడి దక్కి । నివురు గప్పిన నొప్పఱు నిప్పువోలె. **368**

ప్రతిపదార్థం: అరులు= శత్రువులు; అడంగిరి= నశించారు; యుధిష్ఠిరుఁడు= ధర్మరాజు; ఆదియగు= మొదలు అగు; భవత్= నీ యొక్క; భ్రాతలు= సోదరులు; నీ పరిపాలనమునన్= నీయొక్క సంరక్షణమున; ఉల్లసిల్లిరి= వికసించిరి (ప్రకాశించిరి); సంజయుని; బాడుదల= అవమానించి; పట్టికొనివచ్చి; సాత్యకి; వినుతికిన్= మెప్పునకు; ఎక్కెన్= పొందెను; ఎలమిన్= సంతోషముతో; ధృష్టద్యుమ్నుఁడు; ఎంతయున్= మిక్కిలి; ఒప్పెన్= ప్రకాశించెను; ఇప్పుడు+అ= ఈ సమయముననే; కూడి= కలిసికొని; తఱుము= వెంటపడి పరిగెత్తునట్లు చేయు; మీప్రోవు= మీగుంపు (ప్రోగు); కట్టి= నిర్మించి (మీరు గుంపుగూడి); నిలిచిన; హయములన్= గుర్రములను; పొలియింప వలయున్= చంపవలయును; ఇందున్+ఉన్న+వాఁడు= ఇచ్చట ఉన్నాడు; చూచితె?= చూచితివా?; ఒడ్డు= సేనావ్యూహము; చక్కఁగాన్= చక్కగా; అమర్చుచున్= అమరజేయుచు (సర్దుబాటుచేయుచు); చూడ్కులు= చూపులు; కలయన్= అంతట; దెసలన్= దిక్కులను; పొరి= మిక్కిలి; నిగుడ్చుచున్= వ్యాపింపచేయుచు; ధృతరాష్ట్రపుత్రుఁడు= దుర్యోధనుడు; అల్లవాఁడె!= అదిగో అక్కడివాడే!; తెల్లని; గొడుగుతో; వాఁడి= వికాసము; దక్కి= పోయి; నివురు= నుసి; కప్పిన; ఒప్పు= అందము; అఱు= నశించు; నిప్పు+పోలెన్= అగ్నివలె; వాఁడి= వికాసము; దక్కి= పోయి; అల్లవాఁడె!= అదిగోవాడే!.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అర్జునుడితో చెప్పుతున్నాడు. 'శత్రువులు తగ్గిపోయారు. ధర్మరాజు మొదలగు నీ సోదరులు నీ సంరక్షణంలో ప్రకాశించారు. సంజయుడిని అవమానించి పట్టుకొని వచ్చి సాత్యకి మెప్పుపొందాడు. సంతోషంతో ధృష్టద్యుమ్నుడు మిక్కిలి ప్రకాశించాడు. ఈ సమయంలోనే కలిసికొని తరుమునట్లు మీరు గుంపుగా కూడి గుర్రాలను చంపవలయును. ఇదిగో ఒక్కడు ఉన్నాడు చూచితివా? సేనావ్యూహాన్ని చక్కగా అమర్చుతూ చూపులు అంతటా వ్యాపింపజేస్తూ దుర్యోధనుడు తెల్లని గొడుగుతో వికాసంపోయి అందం నశించి నివురుకప్పిన నిప్పువలె ఉన్నాడు చూచావా?

విశేషం: అలం: ఉపమ. పద్యములను గద్యములుగా రచించటం, అందులో అలతి అలతి పదవాక్యములతో సంవాదచారిమను ప్రదర్శించటం తిక్కనకు గల కవితా మార్మికత. 'నివురు గప్పిన నిప్పువోలె' - ఉపమ.

క. **ఇతనిని భవదీయోజ్జ్వల । శితనారాచప్రసారశిఖాభిలో**
ద్ధతి గతజీవితుఁ జేయుము । గృతకృత్యుఁడ వగదు జగము గీర్తింపంగన్. **369**

ప్రతిపదార్థం: ఇతనిని= ఈ దుర్యోధనుడిని; భవదీయ= నీయొక్క; ఉజ్జ్వల= మిక్కిలి ప్రకాశవంతమయిన; శిత= వాడి అయిన; నారాచ= బాణములయొక్క; ప్రసార= వ్యాపించుటవలన; శీఘ్రం= వేగముగా; ఆభీల= భయంకరమయిన; ఉద్ధతిన్= గర్వముతో; గత= పోయిన; జీవితున్= జీవము కలవాడినిగా; జగము= ప్రపంచము; కీర్తింపంగన్= పొగడునట్లుగా; చేయుము; కృతకృత్యుఁడవు= ధన్యుడవు; అగుదు(వు).

తాత్పర్యం: ఈ దుర్యోధనుడిని నీయొక్క ప్రకాశవంతమైన వాడి అయిన బాణాల వ్యాప్తితో శీఘ్రంగా భయంకరమయిన గర్వంతో ప్రపంచం కీర్తించేటట్లు సంహరించుము. ధన్యుడవు ఔతావు.

క. వినుము ధృతరాష్ట్రనందను । లనిలతనయుచేతఁ బొలిసి రందఱు నిం కొ
క్కనుజుండు నితండును ని । ల్చిన వా రయ్యిరువు రిపుడు చెల్లెద రెట్లున్'. 370

ప్రతిపదార్థం: వినుము ఆలకింపుము; ధృతరాష్ట్ర= ధృతరాష్ట్రునియొక్క; నందనులు= పుత్రులు; అందఱున్= అందరును; అనిల= వాయువుయొక్క; తనయుచేతన్= పుత్రుడిచేతను (భీమునిచేతను); పొలిసిరి= చచ్చిరి; ఇంకొక్క= ఇంక ఒక్క; అనుజుండు= తమ్ముడును; ఇతండును= ఈ దుర్యోధనుడును; నిల్చినవారు= నిలిచి ఉన్నారు (బతికి ఉన్నారు); ఎట్లున్= ఏ విధంగా అయినను; ఆ+ఇరువురు= ఆ ఇద్దరును; ఇపుడు= ఇప్పుడు; చెల్లెదరు= చత్తురు.

తాత్పర్యం: అర్జునా! ఆలకించుము. ధృతరాష్ట్ర పుత్రులందరు భీముడిచేత చచ్చారు. ఇంక ఒక తమ్ముడు, దుర్యోధనుడు మిగిలి ఉన్నారు. ఏ విధంగా అయినా ఆ ఇద్దరూ ఇప్పుడు చస్తారు'.

వ. అనిన విని సవ్యసాచి సవినయంబుగా నయ్యంబుజాక్షు వీక్షించి. 371

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; సవ్యసాచి= అర్జునుడు; సవినయంబుగాన్= వినయంతో; ఆ+అంబుజ+అక్షున్= ఆ శ్రీకృష్ణుడిని; వీక్షించి= చూచి.

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు చెప్పగా ఆలకించి, అర్జునుడు వినయంగా ఆ కృష్ణుడిని చూచి (తరువాతి పద్యంతో అన్వయం).

చ. అమరనదీతనూభవుని నస్త్రకళాగురుఁ గర్ణునిన్ మహా
సమరమునం దనేక బలసంఘములన్ బలవన్నృపాలవ
ర్గములను మద్రరాజుఁ దుదిగాఁ దెగటార్చె భవత్ప్రసాదది
వ్యమహిమ యింక నల్పతరవైరి సమూహము దాని కడ్డమే? 372

ప్రతిపదార్థం: అమరనదీ= దేవనది అయిన ఆకాశగంగానదియొక్క; తనూభవునిన్= పుత్రుని అనగా భీష్ముని; అస్త్రకళా= అస్త్రవిద్యాకళకు; గురున్= గురువు అయిన ద్రోణుని; కర్ణునిన్= కర్ణుని; అనేక= పలు; బల= బలవంతులయిన సైన్యం; సంఘములన్= సమూహములను; బలవత్= బలవంతులయిన; నృపాల= రాజులయొక్క; వర్గములను= సముదాయములను; తుదిగాన్= చివరగా; మద్రరాజు= శల్యుడు; మహాసమరమునందున్= గొప్ప యుద్ధమునందు; భవత్= మీ యొక్క; ప్రసాద= అనుగ్రహము యొక్క; దివ్య= దైవీయమయిన; మహిమ (ఈశ్వర సంబంధి శక్తి); తెగటార్చెన్= చంపెను; ఇంకన్= ఇంక; అల్పతర= మిక్కిలి స్వల్పమయిన; వైరి= శత్రువులయొక్క; సమూహము= సముదాయము; దానికిన్= సంహారమునకు (దుర్యోధనుని, అతని తమ్ముని సంహరించుటకు); అడ్డమే?= అడ్డము అగునా? (కాదని భావం).

తాత్పర్యం: భీష్ముడిని, ద్రోణుడిని, కర్ణుడిని పలుసేనాసమూహములను బలవంతులయిన రాజులయొక్క సముదాయాలను, చిట్టచివరగా శల్యుడిని ఈ గొప్ప యుద్ధంలో మీ అనుగ్రహ మహిమ చంపింది. ఇంక మిక్కిలి స్వల్పమైన శత్రుసమూహం అనుజుడితో కూడా దుర్యోధనుడిని సంహరించటానికి అడ్డం కాదు.

వ. ఇన్నూఱు రథంబులు నూఱేనుంగులు రెండువేల కాలుమానిసియు సౌబలునితోడి యేనూఱుగుఱ్ఱంబులు నింతియ కాదె యీసేన! యిది కృపాశ్వత్థామకృతవర్మలు గలసి నిలుప నిలిచినయది యేను దఱి యఱుముట కలిగెనే నింతపట్టును బరిమార్చెద నిమ్మూఁక పడియును బాఱియుం దనచుట్టు బయలైన సుయోధనుం డెట్లయ్యెడినో యటు సూడుము. మార్కొనియెనేని మదీయ మార్గణాగ్నికి నాహుతి సేసి కపటద్యూతంబున నపహృతంబులైన సకలధనంబులు నలుఁగుమొన మరల్చినవాఁడనై పాండవాగ్రజుని చింతవంత యంతయుఁ బుచ్చివైచెద. నేఁ డెల్లపనులు సక్కనయ్యెడుఁ. గరిపురపురంధ్రీజనులు తమపతులుఁ బుత్రులుం బొలియుట విని పాండవు లుద్దండ బాహువీర్యశౌర్య సమగ్రులని యెఱింగెదరుగాక!' యనుటయు నన్నరుమాటకు మెచ్చుచు నతండు. 373

ప్రతిపదార్థం: ఇన్నూఱు= రెండువందలు; రథంబులు= రథములు; నూఱు= వంద; ఏనుంగులు= ఏనుగులు; రెండువేల కాలుమానిసియున్= రెండువేల పదాతి దళమును; సౌబలుని= శకుని; తోడి; ఏనూఱు= అయిదువందలు; గుఱ్ఱంబులు= గుఱ్ఱములును; ఇంతియ= ఇంతే; కాదె!= కదా!; ఈసేన= ఈ సైన్యము (ఈ కౌరవ సైన్యము ఇంత అల్పమే కదా అని భావం); ఇది; కృప= కృపుడు; అశ్వత్థామ= అశ్వత్థామ; కృతవర్మలు= కృతవర్మలు; కలిసి; నిలుపన్= నిలుపగా; నిలిచినయది= నిలబడినట్టిది; ఏను= నేను; తఱి= సమీపించి; అఱుముట= ఆక్రమించుట; కలిగెనేని= కలిగినట్లు అయితే; ఇంతపట్టును= ఇది అంతయును; పరిమార్చెదను= సంహరించెదను; ఈ+మూఁక= ఈ సైన్యము; పడియును= చనిపోయియును; పాఱియున్= పాఱిపోయియును; తనచుట్టు= తనచుట్టును; బయలైన= శూన్యమయిన (ఖాళీ అయిన); సుయోధనుండు= దుర్యోధనుడు; ఎట్లు= ఏ విధముగా; అయ్యెడినో= అయినాడో; అటు= ఆ వైపు; చూడుము= తిలకించుము (చూడుము); మార్కొనియెనేని= ఎదుర్కొనినట్లయిన; మదీయ= నాయొక్క; మార్గణ= బాణములనెడి; అగ్నికిన్= అగ్నికి; ఆహుతి= వ్రేల్చుట; చేసి; కపట= మాయా; ద్యూతంబునన్= జూదమువలన; అపహృతంబులైన= అపహరింపబడినట్టి; సకల ధనంబులు= సమస్త సంపదలును; అలుఁగు= బాణములయొక్క; మొన= చివరిభాగముతో; (అలుఁగున్= బాణములతో; మొనన్= సేనావ్యూహమును); మరల్చినవాఁడనై= మరలించినవాడవై; పాండవాగ్రజుని= ధర్మరాజుయొక్క; చింతవంత= సంతాపముతో కూడిన విచారము; అంతయున్= అంతయును; పుచ్చివైచెదన్= పోగొట్టెదను; నేఁడు= నేడు; ఎల్లపనులు= అన్ని కార్యములు; చక్కన= బాగుగా; అయ్యెడున్= అగును; కరిపుర= హస్తినాపురము నందలి; పురంధ్రీజనులు= స్త్రీలు; తమపతులున్= తమయొక్క భర్తలును; పుత్రులున్= కుమారులును; పొలియుట= మరణించుట; విని= ఆలకించి; పాండవులు= పాండవులు (పాండురాజు పుత్రులు); ఉద్దండ= అడ్డులేని; బాహు= భుజబలములయొక్క; వీర్య= పరాక్రమము; శౌర్య= శూరత్వములందు; సమగ్రులు= సమృద్ధికలవారు; అని; ఎఱింగెదరుగాక!= తెలిసికొందురుగాక!; అనుటయును= ఇట్లు చెప్పుటయును; ఆ+నరు= ఆ అర్జునుడి; మాటకున్= పలుకునకు; మెచ్చుచున్= కొనియాడుచు; అతండు= ఆ కృష్ణుడు.

తాత్పర్యం: రెండువందల రథాలు, వంద ఏనుగులు, రెండువేల కాల్బలం శకునితో అయిదు వందల గుర్రాలు- ఇంతే కదా ఈ కౌరవసైన్యం. ఇది కృప కృతవర్మ అశ్వత్థామలు కలిసి నిలుపగా నిలబడినట్టిది. నేను సమీపించి ఆక్రమించటం కలిగినట్లయితే ఈ సైన్యాన్నంతా సంహరిస్తాను. ఈ సైన్యం చనిపోయి పారిపోయి తనచుట్టును శూన్యమైన సుయోధనుడు ఏ విధంగా ఉన్నాడో! అటు చూడుము. ఎదిరించినట్లయితే నా బాణాగ్నితో ఆహుతి చేసి

మాయాద్యూతంతో అపహరించబడిన సమస్తసంపదలను నా బాణాగ్రహంతో సేనా వ్యూహాన్ని మరలించిన వాడనై ధర్మరాజుయొక్క సంతాప విచారాలను అంతా పోగొట్టుతాను. నేడు అన్ని కార్యాలు బాగా అవుతాయి. హస్తినాపురమునందలి స్త్రీలు తమయొక్క భర్తలును, పుత్రులును మరణించటం ఆలకించి, పాండవులు అడ్డులేని భుజబల పరాక్రమశౌర్య సమృద్ధులు అని తెలిసికొంటారు గాక!' అని చెప్పగా ఆ అర్జునుడి పలుకులను కొనియాడుతూ శ్రీకృష్ణుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. అరదము గౌరవేంద్రుదెసకై నడపంగఁ గెలంకులం గడం
గిరి నకులానుజన్ముఁడును గీచకవైరియుఁ గౌరవేశ్వరుం
బొరిగొన నుత్సహించి వడి భూవర! వారి కెదిర్చె సౌబలుం
డరిబలముం దదీయ రథికావలియున్ వినుతింప నుగ్రుఁడై. 374

ప్రతిపదార్థం: భూవర!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అరదము= రథము; కౌరవేంద్రు= దుర్యోధనునియొక్క; దెసకై= దిక్కునకై; నడపంగన్= నడిపించగా; కెలంకులన్= ప్రక్కలను (రెండు వైపులను); నకుల= నకులునియొక్క; అనుజన్ముఁడును= తమ్ముడును (సహదేవుడును) (అనుసరించి పుట్టినవాడు అనుజన్ముడు); కీచకవైరియున్= భీముడును (కీచకుడికి శత్రువు); కౌరవ+ఈశ్వరున్= దుర్యోధనుని; పొరిగొనన్= చంపుటకు; ఉత్సహించి= ప్రయత్నించి; వడిన్= వేగముగా; కడంగిరి= పూనుకొనిరి; సౌబలుండు= శకుని (సుబలుని కుమారుడు); వడిన్= వేగముగా (ఉభయత్ర అన్వయము); అరి= శత్రువులయొక్క; బలమున్= సైన్యమును; తదీయ= అతనియొక్క; రథిక= రథికులయొక్క (మహాయోధుల); ఆవలియున్= సమూహమును; వినుతింపన్= స్తుతించునట్లు; ఉగ్రుఁడై= మిక్కిలి కోపము కలవాడై; వారికిన్= వారికి; ఎదిర్చెన్= ఎదిరించెను (ఎదురునిలిచెను);

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! శ్రీకృష్ణుడు రథాన్ని దుర్యోధనుడివైపు నడిపించగా రెండు ప్రక్కలను సహదేవుడూ భీముడూ దుర్యోధనుడిని చంపటానికి ప్రయత్నించి, వేగంగా పూనుకొన్నారు. శత్రుసైన్యం, వాళ్ళ రథిక సమూహమూ ప్రశంసిస్తూండగా, శకుని మిక్కిలి కోపించినవాడై వారికి ఎదురు నిలిచాడు.

వ. తక్కటివారు నుక్కెక్కి పురికొని రా శకునియు సుశర్ముండును సవ్యసాచిని సుదర్శనుండు సమీరనందనుని నీయగ్రనందనుండు సహదేవునిం దలపడి రట్టియెడ. 375

ప్రతిపదార్థం: తక్కటివారున్= మిగిలినవారును; ఉక్కు= బలము; ఎక్కి= అతిశయించి; పురికొనిరాన్= విజృంభించిరాగా; శకునియున్= శకునియు; సుశర్ముండును= సుశర్ముడును; సవ్యసాచిని= అర్జునుడిని; సుదర్శనుండు= సుదర్శనుడు (దుర్యోధనుని తమ్ముడు); సమీర= వాయువుయొక్క; నందనునిన్= పుత్రుడు భీముడిని; నీ= నీయొక్క; అగ్రనందనుండు= మొదటి పుత్రుడయిన దుర్యోధనుడు; సహదేవునిన్= సహదేవుడిని; తలపడిరి= ఎదుర్కొనిరి; అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: మిగిలినవారు బలం పుంజుకొని విజృంభించి రాగా శకుని, సుశర్ముడు అర్జునుడిని ఎదుర్కొన్నారు. దుర్యోధనుడి తమ్ముడు సుదర్శనుడు భీముడిని ఎదిరించాడు. దుర్యోధనుడు సహదేవుడిని ఎదుర్కొన్నాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వడముడిఁ దలమిగిలి రయం । బడరఁగ సహదేవుఁ డత్యుదగ్రత మెఱయం
దొడరి భవత్సుతు మార్కొని । నిడుదవెడఁదతూపులేసి నెటిఁ దూలించెన్. 376

ప్రతిపదార్థం: వడముడిన్= భీముడిని; తలమిగిలి= ముందునకువచ్చి; రయంబు= వేగం; అడఁరగన్= అతిశయించగా; సహదేవుఁడు; అతి= మిక్కిలి; ఉదగ్రతన్= భయంకరముగా; మెఱయన్= ప్రకాశింపగా; తొడరి= పూనిక వహించి; భవత్= నీయొక్క; సుతున్= పుత్రుని (దుర్యోధనుని); మార్కొని= ఎదుర్కొని; నిడుద= పొడవైన; వెడఁద= వెడల్పైన; తూపులు= బాణములు; ఏసి= ప్రయోగించి; నెఱిన్= మిక్కిలి; తూలించెన్= ఎగురగొట్టెను (చలింపచేసెను).

తాత్పర్యం: భీముడిని దాటుకుని వచ్చి వేగం అతిశయించగా సహదేవుడు మిక్కిలి భయంకరంగా ప్రకాశిస్తూ పూనిక వహించి నీ పుత్రుడైన దుర్యోధనుని ఎదుర్కొని పొడవైన, వెడల్పయిన బాణాలు ప్రయోగించి మిక్కిలి చలింపజేశాడు.

ఉ. కట్టియ వైచె నెన్నుదురు గాఁడ భవత్తనయుండు మాద్రి లేఁ
బట్టి నతండు సోలియును బాహిరపోవక తేరి యా విభుం
గిట్టి నిశాతబాణచయకీలితదేహునిఁ జేసె రావుతుల్
కట్టుపకాసులై నరునిఁ గప్పిరి శక్తులఁ దోమరంబులన్. 377

ప్రతిపదార్థం: భవత్= నీయొక్క; తనయుండు= పుత్రుడు (దుర్యోధనుడు); మాద్రి= మాద్రియొక్క; లేఁబట్టిన్= చిన్నకొడుకును (సహదేవుని); నెన్నుదురు= ఫాలభాగము; కాఁడన్= రంధ్రము పడునట్లు; కట్టియ= దండమును (దుడ్డుకర్రను); వైచెన్= వేసెను (విసిరెను); అతండు= ఆ సహదేవుడు; సోలియును= సొమ్మసిల్లిపోయినా; బాహిరపోవక= మూర్ఛిల్లక; తేరి= తెలివిపొంది; ఆ విభున్= ఆ ప్రభువు అయిన దుర్యోధనుని; కిట్టి= సమీపించి; నిశాత= మిక్కిలి వాడి అయిన; బాణచయ= బాణసమూహములతో; కీలిత= గుచ్చబడిన; దేహునిన్= దేహము కలవానిగా; చేసెన్= చేసెను; రావుతుల్= రౌతులు; కట్టుపకాసులై= అచలులై; శక్తులన్= శక్తులనే ఆయుధములతోను; తోమరంబులన్= తోమరములు అనే ఆయుధములతోను; నరునిన్= అర్జునుడిని; కప్పిరి= కప్పివేసిరి.

తాత్పర్యం: దుర్యోధనుడు సహదేవుడి ఫాలభాగం చిల్లులుపడేటట్లు దండం విసిరాడు. ఆ సహదేవుడు సొమ్మసిల్లి మూర్ఛిల్లక, తెలివిపొంది ఆ దుర్యోధనుడిని మిక్కిలి వాడియైన బాణ సమూహాలతో బంధించబడిన దేహం కలవాడినిగా చేశాడు. రౌతులు రణశూరులై శక్తులను తోమరాలను ప్రయోగించి అర్జునుడిని కప్పివేశారు.

వ. గాంధారదేశీయు లగు నాశ్వికులట్లు పొదివిన నొదవినకినుకఁ గ్రూరభల్లంబుల శిరంబులు ధరం దొరఁగించినఁ ద్రిగర్తస్యందనసందోహం బడరి గోవిందపురందరపుత్రులపైఁ బటుప్రదరపరంపరలు వరఁగించి విజృంభించిన నవ్విజయుండు. 378

ప్రతిపదార్థం: గాంధారదేశీయులగున్= గాంధారదేశమునకు సంబంధించిన; ఆశ్వికులు= రౌతులు; అట్లు= ఆ ప్రకారముగా; పొదివినన్= క్రమ్ముకొనిన; ఒదవిన= కలిగిన; కినుకన్= కోపముతో; క్రూర= భయంకరమయిన; భల్లంబులన్= బల్లెములతో; శిరంబులు= తలలు; ధరన్= భూమిపై; తొరఁగించినన్= పడునట్లు చేయగా; త్రిగర్త= త్రిగర్తదేశముయొక్క; స్యందన= రథములయొక్క; సందోహంబు= సమూహము; అడరి= విజృంభించి; గోవింద= శ్రీకృష్ణ; పురందర పుత్రులపైన్= అర్జునులపై; పటు= కఠినమయిన; ప్రదర= బాణములయొక్క; పరంపరలు= వరుసలు; పరఁగించి= ప్రయోగించి; విజృంభించినన్= విజృంభించగా; ఆ+విజయుండు= ఆ అర్జునుడు.

తాత్పర్యం: గాంధారదేశపు రౌతులు క్రమ్ముకొనగా కలిగిన కోపంతో అర్జునుడు భయంకరమైన బల్లెములతో తలలు నేలపై పడి దొర్లేటట్లు చేయగా త్రిగర్తదేశపు రథాల సమూహం విజృంభించి శ్రీకృష్ణార్జునులపై కఠినమైన బాణాల వరుసలు ప్రయోగించి విజృంభించగా ఆ అర్జునుడు. (తరువాతి పద్యంతో అన్వయము).

సీ. సత్యకర్మునితల చారుకుండల పరి । స్ఫురితత్వ మొందుచు ధరణి దొల్ల
నేసి మృగంబుపై కెరఁగుసింగమపోలెఁ । గిట్టి సత్యేషుని గీ టడంచి
బహుదినసంచితప్రకటకోపానల । జ్వాలలు సాకారలీలఁ బర్వు
తెఱంగున నరుణదృగ్దీప్తిజాలంబు సు । శర్మపై నిగిడించి సాయకత్ర

తే. యం బొడల నాటుటయుఁ దద్రథంబు లొక్క । పెట్టఁ గవిసిన నన్నిటిఁ బిలుకుమార్చి
రథ్యములఁ గూల్చి యతనియురంబు ఘోర । భల్లమున వ్రచ్చి నిర్జితప్రాణుఁ జేసె. 379

ప్రతిపదార్థం: సత్యకర్ముని తల; చారు= సుందరమయిన; కుండల= చెవికుండలములయొక్క; పరిస్ఫురితత్వము= అత్యంత ప్రకాశకత్వము; ఒందుచున్= పొందుచు; ధరణిన్= నేలపై; డొల్లన్= దొర్లునట్లుగ; ఏసి= ప్రయోగించి (కొట్టి); మృగంబుపైకిన్= లేడిపైకి; ఎరఁగు= దూకు; సింగమపోలెన్= సింహమువలె; కిట్టి= సమీపించి; సత్యేషుని; గీటడంచి= చంపి; బహుదిన= అనేకదినాలు; సంచిత= కూడబెట్టిన; ప్రకట= స్పష్టమయిన; కోప= కోపమనెడి; అనల= అగ్నియొక్క; జ్వాలలు= శిఖలు; సాకార లీలన్= ఆకారముతో కూడినరీతిగా; పర్వు= వ్యాపించు; తెఱఁగునన్= విధముగా; అరుణ= ఎఱ్ఱని; దృక్= చూపులయొక్క; దీప్తి= కాంతియొక్క; జాలంబు= సమూహము; సుశర్మపైన్= సుశర్ముడిపై; నిగిడించి= వ్యాపింపజేసి (ప్రసరింపచేసి); సాయక= బాణములయొక్క; త్రయంబు= మూడు (మూడు బాణములు); ఒడలన్= దేహమునందు; నాటుటయున్= గ్రుచ్చుటయును; తద్= ఆ; రథంబులు; ఒక్కపెట్టన్= ఒక్కుమ్మడిగా; కవిసినన్= వ్యాపించగా; అన్నిటిన్= అన్నిటిని; పిలుకుమార్చి= నాశనం చేసి; రథ్యములన్= గుఱ్ఱములను; కూల్చి= చంపి; అతని= ఆ సుశర్మయొక్క; ఉరంబు= వక్షఃస్థలము; ఘోర= భయంకరమయిన; భల్లమునన్= బల్లెముతో; వ్రచ్చి= చీల్చి; నిర్జిత= జయింపబడిన; ప్రాణున్= ప్రాణము కలవానినిగా; చేసెన్= చేసెను.

తాత్పర్యం: అర్జునుడు సత్యకర్ముడి తలను సుందరమైన చెవికుండలాలు బాగా మెరుస్తూ నేలపై దొర్లేటట్లు కొట్టాడు. లేడిపై పడిన సింహంవలె సమీపించి సత్యేషుని చంపాడు. అనేక దినాలు కూడబెట్టిన కోపాగ్నిజ్వాలలు ఆకృతిపొంది విలాసంగా వ్యాపించే విధంగా ఎఱ్ఱని దృక్కుల కాంతుల సమూహం సుశర్ముడిపై ప్రసరింపజేసి మూడు బాణాలు ఆతడి దేహంలో గ్రుచ్చాడు. ఆ సుశర్ముడి రథాలు ఒక్కుమ్మడిగా మీదపడగా వాటి నన్నింటినీ నాశనం చేశాడు. సుశర్మయొక్క వక్షఃస్థలమును భయంకరమయిన బల్లెంతో చీల్చి, అతడి ప్రాణాలను తీశాడు.

విశేషం: అలం: ఉపమ. ఈ పద్యంలో అర్జునుడు సత్యకర్ముడిని, సత్యేషుడిని, సుశర్ముడిని సంహరించాడు. వీరు సంశప్తకులు. ఇందలి సుశర్మ త్రిగర్త దేశాధీశుడు. అతడి తమ్ములు సత్యకర్మ, సత్యేషులు. వీరు అర్జునుడిని సంహరించగలమని ప్రతిజ్ఞచేశారు. 'మృగంబుపైకెరఁగు సింగమ పోలెన్'- ఉపమ.

వ. ఇవ్విధంబునఁ ద్రిగర్తపతిం బ్రేతపతిపాలి కనిచి మనదెస జనంబులు ఖేదంబుం దమవారు మోదంబు నొంద నతని నందనుల నేడ్వుర నెనమండ్ర ముప్పదుండ్ర మూఁడు మూఁడు గోలలం దలలు నఱికెఁ. దత్సైన్యశేషంబు బారిసమరె. భీమసేనుబారింబడిన సుదర్శనుండు దదీయశరజాలంబున నదర్శనగతుండై పదంపడి

తచ్ఛరవిఖండితకంఠుండైనఁ గోపంబు దీపింప వగమిగుల నక్కుమారుమూఁక యమ్మారుతసుతుఁ జుట్టు ముట్టిన నతండు బెట్టిదంబులగు తూపుల నది రూపడంగు నట్లేపున విహరింపఁ గనుంగొని సహింపక మహీపతిముందటిబలంబు బరవసంబునం గవిసిన నక్కౌంతేయసైన్యంబున సరభసంబున నెదిర్చి పేర్చిన సమయంబున సౌబలుండును సహదేవుం దాఁకినం దత్సుతుం డులూకుండు బాసటయై యడరె. వడముడియుఁ బిన్నతమ్మునికి బాసటయయ్యె. నా శకుని మాద్రీతనయునిఁ బ్రదీప్తభల్ల త్రయంబున నొప్పించి పదినారాచంబు లతని మేన గుప్పించినం గోపించుచు నయ్యిరువురు సాయకనికాయంబు నిగిడించిన నా గాంధారరాజు మొగ్గరంబునఁ గత్తళంబులు గరవాలంబులు పల్యాణంబులు మోరలు గంఠంబులు చరణంబులు గరంబులు శిరంబులు దునియలై తొరఁగిన ధాత్రి చిత్రాకారంబైయుండె. నిట్లు దన తురగ సముదయంబు సమయుటయుఁ జలం బెడపక నీ మఱంది యన్నకులానుజుం గిట్టి. 380

ప్రతిపదార్థం: ~~ఈ~~+విధంబునన్= ఈ ప్రకారముగా; త్రిగర్తపతిన్= త్రిగర్తదేశపు రాజు అయిన సుశర్మను; ప్రేతపతి= యమునియొక్క; పాలికి= వద్దకు; అనిచి= పంపి; మనదెస= మనవైపు; జనంబులు= జనులు; ఖేదంబున్= దుఃఖమును; తమవారు= పాండవపక్షమువారు; మోదంబును= ఆనందమును; ఒందన్= పొందునట్లు; అతని= ఆ సుశర్ముడి; నందనులన్= పుత్రులను; ఏడ్వురన్= ఏడుగురను; ఎనమంద్రన్= ఎనిమిది మందిని; ముప్పదుంద్రన్= ముప్పదిమందిని; మూఁడు మూఁడు= మూఁడేసి చొప్పున; కోలలన్= బాణములతో; తలలు= శిరములు; నఱికెన్= ఖండించెను; తద్= ఆ; సైన్యశేషంబు= మిగిలిన సైన్యము; బారిసమరెన్= నశించెను; భీమసేను= భీమునియొక్క; బారిన్= అధీనమునందు; పడిన; సుదర్శనుండు; తదీయ= ఆ భీమునియొక్క; శర= బాణములయొక్క; జాలంబునన్= సమూహము (వరుస) వలన; అదర్శనగతుండై= కనిపించకుండా పోయినవాడై (కప్పబడినవాడై); పదంపడి= వెనువెంటనే; తద్+శర= ఆ బాణములచే; విఖండిత= ఖండింపబడిన; కంఠుండు= కంఠముకలవాడు; ఐనన్= కాగా; కోపంబు= క్రోధము; దీపింపన్= ప్రజ్వలింపగా; వగ= దుఃఖము; మిగులన్= ఎక్కువకాగా; ఆ+కుమారు= ఆ కుమారునియొక్క (సుదర్శనునియొక్క); మూఁక= సైన్యము; ఆ+మారుత సుతున్= ఆ వాయుపుత్రుడయిన భీముని; చుట్టుముట్టినన్= చుట్టుముట్టగా (క్రమ్ముకొనగా); అతండు= ఆ భీముడు; బెట్టిదంబులగు= మిక్కిలి క్రూరములగు; తూపులన్= బాణములతో; అది= ఆ మూఁక(సేన); రూపు+అడంగునట్లు= నశించునట్లు; ఏపునన్= విజృంభణమున; విహరింపన్= విలాసముగా తిరుగుచుండగా; కనుంగొని= చూచి; సహింపక= ఓర్వక; మహీపతి= దుర్యోధనునియొక్క; ముందటి= అగ్రభాగమున ఉన్న(ముందున్న); బలంబు= సైన్యము; బరవసంబునన్= ధైర్యముతో; కవిసినన్= కలియబడగా; ఆ+కౌంతేయ= ఆ కుంతీపుత్రులయొక్క; సైన్యంబును= సైన్యము కూడా; సరభసంబునన్= మిక్కిలి వేగిరపాటుతో; (కోపముతో); ఎదిర్చి= ఎదిరించి; పేర్చిన= విజృంభించిన; సమయమునన్= సమయమునందు; సౌబలుండును= శకునియును; సహదేవున్= సహదేవుని; తాఁకినన్= ఎదుర్కొనగా; తత్సుతుండు= ఆతడి పుత్రుడు(శకుని పుత్రుడు); ఉలూకుండు; బాసటయై= సహాయకుడై; అడరెన్= విజృంభించెను; వడముడియున్= భీముడును; పిన్నతమ్మునికిన్= చిన్నతమ్ముడయిన సహదేవునికి; బాసట= సహాయకుడు; అయ్యెన్= అయ్యెను; ఆ శకుని; మాద్రీతనయునిన్= మాద్రి పుత్రుడయిన సహదేవుని; ప్రదీప్త= మిక్కిలి ప్రజ్జ్వలించిన; భల్ల= బల్లెములయొక్క; త్రయంబునన్= మూడింటితో; నొప్పించి= బాధించి; పది నారాచంబులు= పది వాడియైన బాణములు; అతని మేనన్= ఆ సహదేవుని దేహమునందు; కుప్పించినన్= కురిపించగా (ప్రయోగించగా); కోపించుచున్= కోపించుచు; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరును; సాయక= బాణములయొక్క; నికాయంబున్= సమూహమును; నిగిడించినన్= వ్యాపింపచేయగా (ఒకరిపై ఒకరు ప్రయోగించగా); ఆ గాంధారరాజు= ఆ శకుని; మొగ్గరంబునన్= ఆ వ్యూహమునందు; కత్తళంబులు= కవచములు; కరవాలంబులు= కత్తులు; పల్యాణంబులు= జీనులు; మోరలు= ముఖములు (ఇచ్చట గుర్రముల ముఖములు); కంఠంబులు; చరణంబులు= పాదములు (కాళ్ళు); కరంబులు= చేతులు; శిరంబులు= తలలు; తునియలై= ముక్కలై; తొరఁగినన్= రాలగా; ధాత్రి= భూమి(యుద్ధభూమి);

చిత్ర= బొమ్మలయొక్క; ఆకారంబై= ఆకృతి కలదియై; (చిత్ర= ఆశ్చర్యకరమయిన; ఆకారంబై= ఆకృతికలదియై); ఉండెను; ఇట్లు= ఈ ప్రకారముగా; తన= తనయొక్క; తురగ= గుఱ్ఱములయొక్క; సముదయంబు= సమూహము; సమయుటయున్= చచ్చుటయు; చలంబు= మత్సరము; ఎడపక= ఎడబాయక (వదలక); నీ మఱంది= నీ బావమరది అయిన శకుని; ఆ+నకుల+అనుజున్= ఆ సహదేవుని; కిట్టి= సమీపించి.

తాత్పర్యం: ఆ ప్రకారంగా త్రిగర్తదేశాధిపతి సుశర్మను యముని వద్దకు పంపి, మనవైపు జనులు దుఃఖాన్ని పాండవపక్షంవారు ఆనందాన్ని పొందేటట్లు ఆ సుశర్మ్మడి పుత్రులను ఏడుగురను, ఎనిమిదిమందిని, ముప్పదిమందిని - క్రమంగా మూడు మూడు బాణాలతో తలలు ఖండించాడు. మిగిలిన సైన్యం పారిపోయి నశించినది. భీముడి అధీనంలో పడిన సుదర్శనుడు ఆ భీముడి బాణసమూహాలవలన కప్పబడి వెనువెంటనే ఆ బాణాలచేత ఖండింపబడిన కంఠం కలవాడయ్యాడు. అప్పుడు క్రోధం ప్రజ్వలించగా దుఃఖం ఎక్కువకాగా ఆ సుదర్శనుడి సైన్యం భీముడిని చుట్టుముట్టగా భీముడు మిక్కిలి క్రూరములైన బాణాలతో ఆ మూక నశించేటట్లు విజృంభించాడు. విలాసంతో తిరుగగా చూచి ఓర్వక దుర్యోధనుడి ముందున్న సైన్యం ధైర్యంతో కలియబడింది. ఆ పాండవులసైన్యం కూడా వేగిరపాటుతో ఎదిరించి విజృంభించింది. శకుని సహదేవుడిని ప్రజ్వలిస్తున్న మూడు బల్లెములతో బాధించి పదిబాణాలు అతడి దేహంలో ప్రయోగించాడు. వారు పరస్పరం కోపిస్తూ ఆ ఇద్దరూ బాణాల సమూహాన్ని వ్యాపింపచేయగా, శకుని సేనావ్యూహమునందు కవచములు కత్తులు జీనులు గుఱ్ఱముల ముఖములు కంఠములు కాళ్ళు చేతులు తలలు ముక్కలై పడ్డాయి. అప్పుడు యుద్ధభూమి చిత్రించిన బొమ్మ ఆకారాన్ని పొంది ఉన్నది. ఈ ప్రకారంగా తన గుఱ్ఱాల సముదాయం సంహరించబడటంతో మాత్సర్యం విడువక నీ బావమరది శకుని ఆ సహదేవుడిని సమీపించి.

క. పెనుగడఁత దొడ్డ యత్తళ । మున వైచిన నతఁడు మూర్ఛమునిఁగి రథము మీఁ
దన పడినఁ గనలి యప్పా । వని పొదివెను గౌరవేంద్రవాహినిఁ గడఁకన్. 381

ప్రతిపదార్థం: పెను= పెద్ద; కడఁతన్= కణత భాగాన్ని; దొడ్డ= గొప్ప; అత్తళమునన్= ఈటెతో; వైచినన్= కొట్టగా; అతఁడు= ఆ సహదేవుడు; మూర్ఛమునిఁగి= మూర్ఛలోమునిగి; రథము మీఁదను= రథము మీదనే; పడినన్= పడగా; ఆ+పావని= ఆ భీముడు (పవనుని పుత్రుఁడు పావని); కనలి= కోపించి; కడఁకన్= పూనికతో; కౌరవేంద్ర= దుర్యోధనుని; వాహినిన్= సేనను; పొదివెను= క్రమ్మెను.

తాత్పర్యం: శకుని ఆ సహదేవుడి పెద్దకణతను గొప్ప ఈటెతో కొట్టగా సహదేవుడు మూర్ఛలో మునిగి రథంపై పడిపోగా, భీముడు కోపించి పూనికతో దుర్యోధనుడిని సేనను ఆక్రమించాడు.

వ. పొదివిన యవ్వీరునారాచంబుల తాఁకున. 382

ప్రతిపదార్థం: పొదివిన= క్రమ్ముకొనిన; ఆ+వీరు= ఆ వీరునియొక్క (భీమునియొక్క); నారాచంబుల= బాణములయొక్క; తాఁకునన్= యుద్ధంలో.

తాత్పర్యం: దుర్యోధనుడి సేనను క్రమ్ముకొని పరాక్రమవంతుడైన భీముడి బాణాలయొక్క యుద్ధంలో (తరువాతి పద్యంతో అన్వయం).

క. అది గొంత పుడమిఁ బడ ను । న్నది పాఱినఁ గని యదల్చి యవనీశుఁడు బె
ట్టిదముగ నెలుఁగు సూపెను । మద మారఁగ నబ్బలంబు మగుడు విధమునన్. 383

ప్రతిపదార్థం: అది= ఆ దుర్యోధనుని సేన; కొంత; పుడమిన్= భూమిమీద; పడన్= పడగా(చావగా); ఉన్నది= మిగిలియున్నది; పాఱినన్= పరుగెత్తి పారిపోగా; కని= చూచి; అదల్చి= అదలించి; అవనీ+ఈశుఁడు= రాజు (దుర్యోధనుడు); మదము= గర్వము; ఆరఁగన్= కలుగగా; ఆ+బలంబు= ఆ సైన్యము; మగుడు= మరలు; విధమునన్= విధముగా; బెట్టిదముగన్= కఠినముగ; ఎలుఁగున్= కంఠస్వరము; చూపెను (కేకపెట్టెను).

తాత్పర్యం: ఆ దుర్యోధనుడి సైన్యం కొంత చావగా మిగిలిన ఉన్న సేన పారిపోతూ ఉండగా చూచి, అదలించి దుర్యోధనుడు గర్వంతో ఆ సైన్యం మరలేటట్లుగా గట్టిగా ఒక కేక పెట్టాడు.

వ. ఇవ్విధంబున దొర యఱిమి తఱిమి యమ్మొన కుత్సాహంబుగాఁ జటులవాహంబగు రథంబెక్కి శకునిఁ గూడుకొని కవిసిన. 384

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారముగ; దొర= రాజు; అఱిమి= ఆక్రమించి; తఱిమి; ఆ+మొనకున్= ఆ సేనకు; ఉత్సాహంబుగాన్= ఉత్సాహం కలిగేటట్లుగా; చటుల= చలించే; వాహంబు= గుఱ్ఱము; అగు= కలుగు; రథంబు= రథము; ఎక్కి= అధిరోహించి; శకునిన్= శకునిని; కూడుకొని= కలిసికొని; కవిసినన్= వ్యాపించగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా దుర్యోధనుడు ఆక్రమించి తరిమి ఆ సేనకు ఉత్సాహం కలిగేటట్లు చేసి, చలించే గుఱ్ఱాలు కల రథం అధిరోహించి శకునిని కలిసికొని వ్యాపించగా.

తే. పాండవుల సైన్యమును సముద్దండ లీల । మాఱుకొనె నంతలో మూర్ఛదేఱి నకులు
తమ్ముఁ డమ్మామపైఁ బదియమ్ము లొక్క । పెట్టఁ గ్రుచ్చి యాతనివిలు బెట్టు ద్రుంచె. 385

ప్రతిపదార్థం: పాండవుల సైన్యమును= పాండవులయొక్క సైన్యముకూడా; సముద్దండలీలన్= భయంకరంగా; మాఱుకొనెను= ఎదుర్కొనెను; అంతలోన్= ఆ సమయంలో; మూర్ఛదేఱి= మూర్ఛనుండి తేరుకొని; నకులు తమ్ముఁడు= నకులుని తమ్ముడయిన సహదేవుడు; ఆ+మామపైన్= ఆ మామ అయిన శకునిపై; పది; అమ్ములు= బాణములు; ఒక్కపెట్టన్= ఒక్కసారిగా; క్రుచ్చి; ఆతని= ఆ శకుని; విలు= విల్లు; బెట్టు= గట్టిగా; త్రుంచెన్= ఖండించెను.

తాత్పర్యం: పాండవుల సైన్యం కూడా భయంకర లీలతో ఎదుర్కొన్నది. అంతలో మూర్ఛ నుండి తేరుకున్న సహదేవుడు ఆ శకునిపై పది బాణాలు ఒక్కసారిగా గుచ్చి ఆ శకుని విల్లు గట్టిగా ఖండించాడు.

ఉలూకుఁడు సహదేవుచేత మృతుం డగుట (సం. 9-26-23)

సీ. ఆ సౌబలుండు శరాసనాంతరదీప్తుఁ । డగుటయు నకులుఁడు ననిలసుతుఁడు
దాఁకిన వారి నతండు పెక్కమ్ముల । నొప్పింప నతని తనూజుఁ డనిల
సుతసహదేవుల సునిశితశరవర్ష । మునఁ గప్ప నయ్యులూకుని ననేక
సాయకంబుల నొంచి శకునిపై నఱువది । యమ్ములు నాటించి యనుచరులను

తే. **బెగడు పఱిచె నా భీముండు బె ట్టులూకుఁ । డడరి యన్నకులానుజు నంపవెల్లి**
ముంప నతఁడేచి పటుభల్లమున శిరంబు । ద్రుంచె నన్నలయెదలు సంతోష మొంద. **386**

ప్రతిపదార్థం: ఆ సౌబలుండు= ఆ శకుని; శరాసన+అంతర= మరియొక ధనువుతో; దీప్తుఁడు= ప్రకాశించువాడు; అగుటయున్; నకులుఁడు; అనిల= వాయువుయొక్క; సుతుఁడు= పుత్రుడు (భీముడు); తాఁకినన్= ఎదుర్కొనగా; వారిన్= వారిని; అతండు= ఆ శకుని; పెక్కు= అనేకములయిన; అమ్ములన్= బాణములతో; నొప్పింపన్= బాధించగా; అతని= ఆ శకునియొక్క; తనూజుఁడు= పుత్రుడైన ఉలూకుడు; అనిలసుత సహదేవులన్= భీముని సహదేవుని; సునిశిత= బాగుగా వాడియైన; శర= బాణాలయొక్క; వర్షమునన్= కురియించినందువలన; కప్పన్= కప్పివేయగా; ఆ+ఉలూకుని= ఆ ఉలూకుని; అనేక= పలు; సాయకంబులన్= బాణములతో; నొంచి= నొప్పించి; శకునిమైన్= శకుని దేహమునందు; అఱువది= అరవై; అమ్ములు= బాణములు; నాటించి= గ్రుచ్చి; అనుచరులను= అనుసరించి ఉన్న యోధులను; ఆ భీముండు; బెగడ పఱిచెను= భయముపొందునట్లు చేసెను; ఉలూకుడు; బెట్టు= గట్టిగా; అడరి= విజృంభించి; ఆ+నకుల+అనుజున్= ఆ నకులునియొక్క తమ్ముని (అనగా సహదేవుని); అంపవెల్లిన్= బాణాల ప్రవాహంలో; ముంపన్= ముంచగా; అతఁడు= ఆ సహదేవుడు; ఏచి= విజృంభించి; పటు= కఠినమైన; భల్లమునన్= బల్లెముతో; అన్నలయెదలు= అన్నలయొక్క మనస్సులు; సంతోషము= ఆనందము; ఒందన్= పొందునట్లుగా; శిరంబు= తల; త్రుంచెన్= ఖండించెను.

తాత్పర్యం: ఆ శకుని మరియొక ధనువుతో చెలరేగుతూ నకులుడు భీముడు ఎదుర్కొనగా వారిని పెక్కుబాణాలతో నొప్పించాడు. శకుని పుత్రుడు ఉలూకుడు భీమసహదేవులను బాగా వాడి అయిన బాణాలను కురిపించి కప్పివేయగా ఉలూకుడిని అనేక బాణాలతో నొప్పించి శకుని దేహంలో అరువది బాణాలు గ్రుచ్చి భీముడు శకుని అనుచరులను భయం పొందేటట్లు చేశాడు. ఉలూకుడు గట్టిగా విజృంభించి సహదేవుడిని అమ్ముల వెల్లువలో ముంచాడు. సహదేవుడు విజృంభించి కఠినమైన బల్లెముతో అన్నల మనసులు ఆనందం పొందేటట్లుగా ఉలూకుడి తలను ఖండించాడు.

విశేషం: ఉలూకుడు శకుని పుత్రుడు. మహాపరాక్రమవంతుడు. ఇతడు శాంతిప్రియుడు. 'శాకుని, కైతవ, సౌబలసుత, కైతవ్య' అని ఇతడికి పేర్లు. సంస్కృత మహాభారతంలో ఉలూకదూతాగమన పర్వమనే ఒక అవాంతర పర్వం ఉద్యోగపర్వంలో ఉన్నది.

క. **తనయుఁడు పడ శకుని కనుం । గొని శోకం బాత్మ నారఁగూరఁగ నశ్రుల్**
కనుఁగొనలయందు నినిచె । న్మనుజేశ్వర! విదురు భాషణంబులు దలఁచెన్. **387**

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= మానవులకు ప్రభువైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; తనయుండు= కుమారుడు; పడన్= కూలగా; శకుని; కనుంగొని= చూచి; శోకంబు= దుఃఖము; ఆత్మను= మనస్సును; ఆరఁగూరఁగన్= నిండుగా పొందగా; అశ్రుల్= బాష్పములు; కనుఁగొనలయందున్= కన్నుల చివరి భాగములయందు; నినిచెన్= నింపెను; విదురు= విదురునియొక్క; భాషణంబులు= పలుకులు; తలఁచెన్= స్మరించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! పుత్రుడైన ఉలూకుడు కూలిపోగా శకుని చూచి, దుఃఖంతో మనస్సు నిండగా బాష్పాలను కనుల చివరి భాగాలలో నింపి, ఆనాడు విదురుడు చెప్పిన మాటలను స్మరించాడు.

వ. **అ ట్లడలుచు నిట్టూర్పు నిగుడ సహదేవుపై నడరి మూఁడు నారాచంబుల నిగిడించిన.** **388**

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారంగా; అడలుచున్= దుఃఖించుచు; నిట్టూర్పు= నిశ్వాసము; నిగుడన్= వ్యాపించగా; సహదేవుపైన్= సహదేవునిమీద; అడరి= విజృంభించి; మూఁడు; నారాచంబులు= బాణములు; నిగిడించినన్= ప్రయోగించగా.

తాత్పర్యం: ఆ ప్రకారంగా శకుని దుఃఖిస్తూ నిశ్వాసం వ్యాపించగా సహదేవుడిపై విజృంభించి, మూడు బాణాలు ప్రయోగించగా.

చ. **అవి వెసఁ ద్రుంచి యాతనిశరాసనముం దునుమాడె నక్కుమా**
ర వరుఁ డతం డనిందితపరాక్రముఁడై పటుఖడ్గయష్టిదీ
ప్తవిపులముద్గరంబున విభాసితశక్తిని వైవఁ దోడుతో
నవియు ననేకబాణముల నాన్నృపసూనుఁడు నుగ్గుసేసినన్. **389**

ప్రతిపదార్థం: అవి= అవి (ఆ మూడు బాణములు); వెసన్= శీఘ్రముగా; త్రుంచి= ఖండించి; ఆతని= అతనియొక్క (శకుని); శరాసనమున్= ధనువును; ఆ+కుమార వరుఁడు= ఆ కుమార శ్రేష్ఠుడైన సహదేవుడు; తునుమాడెన్= ఖండించెను; అతండు= ఆ శకుని; అనిందిత= నిందింప బడని; పరాక్రముఁడై= పరాక్రమముకలవాడై; పటు= కఠినమైన; ఖడ్గ= కత్తిని; యష్టి= దుడ్డుకర్రను; దీప్త= ప్రజ్వలించుచున్న; విపుల= విశాలమైన; ముద్గరంబును= ఇనుపగదను; విభాసిత= మిక్కిలి ప్రకాశవంతమైన; శక్తినిన్= శక్తి అను ఆయుధమును; వైవన్= ప్రయోగించగా; తోడుతోన్= వెనువెంటనే; ఆ నృపసూనుఁడు= రాజపుత్రుడైన ఆ సహదేవుడు; అవియును= వానినికూడా; అనేకబాణములన్= పలువిధములయిన బాణములతో; నుగ్గు= పిండి; చేసినన్= చేయగా.

తాత్పర్యం: ఆ మూడు బాణాలను శీఘ్రంగా ఖండించి సహదేవుడు శకునియొక్క ధనువును కూడా ఖండించాడు. శకుని గొప్ప పరాక్రమం కలవాడై వాడిగల పెద్ద కత్తిని, కర్రను, ఇనుపగదను, మిక్కిలి కాంతిమంతమైన శక్తిని ప్రయోగించగా ఆ వెనువెంటనే ఆ సహదేవుడు అనేక బాణాలతో వాటిని కూడా పిండి చేశాడు. అట్లా చేయగా.

విశేషం: 'పటు ఖడ్గయష్టి దీప్త విపుల ముద్గరంబును' అనే పాఠము మూలానుగుణం. ఇందు ఉస్మానియా ప్రతిలో 'ముద్గరంబున' అని కలదు. అందువలన 'ముద్గరంబును' అని అర్థం వ్రాయబడింది. 'ప్రగృహ్య మహతీం గదామ్' (సం.9-27-36) మూలం. (శల్య. 28-38).

క. **కనుఁగొని పార్శ్వచరులు వి । చ్చిన శకునియుఁ బాఱె నుల్లసిల్లిరి కుంతీ**
తనయులు దదీయసేనా । జను లార్చిరి కురువిభుఁడు విషాదము నొందెన్. **390**

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; పార్శ్వచరులు= ప్రక్కలందుండు యోధులు (అనగా రక్షకులు - చక్ర రక్షకులు); విచ్చినన్= విడివడిపోగా; శకునియున్= శకునికూడా; పాఱెన్= పారిపోయెను; కుంతీతనయులు= కుంతీ పుత్రులైన పాండవులు; ఉల్లసిల్లిరి= సంతోషించిరి; తదీయ= ఆ పాండవులయొక్క; సేనాజనులు= సేనా నాయకులు; ఆర్చిరి= అరిచిరి; కురువిభుఁడు= దుర్యోధనుడు; విషాదమును= దుఃఖమును; ఒందెన్= పొందెను.

తాత్పర్యం: చూచి, రథరక్షకులైన యోధులు విడివడిపోగా శకుని కూడా పారిపోయాడు. కుంతీపుత్రులు సంతోషించారు. వారి సేనానాయకులు బొబ్బరించారు. దుర్యోధనుడు దుఃఖించాడు.

వ. ఇట్లు పాఱిన. 391

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా; పాఱినన్= పారిపోగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా పార్శ్వరక్షకులు పారిపోగా.

చ. అరదము సత్వరంబుగ శరావళి పెల్లుగఁ బర్వఁ బాండవా
వరజుఁడు పోవనీక పొదువన్ వడిఁ బింగలివారు పోరికిం
బురికొని త్రోచినన్ సుబలపుత్రుఁడు దత్తురగవ్రజంబుతో
బరవసమొప్పఁగా నతనిపైఁ గవిసెం గృతనిశ్చయాత్ముఁడై. 392

ప్రతిపదార్థం: సత్వరంబుగన్= మిక్కిలివేగముగ; అరదము= రథము; పెల్లుగన్= ఎక్కువగా; శర= బాణములయొక్క; ఆవళిన్= సమూహమును; పర్వన్= వ్యాపించగా; పాండవ+అవరజుఁడు= సహదేవుడు; పోవనీక= పోనీయక; పొదువన్= క్రమ్ముకొనగా; వడిన్= వేగముగా; పింగలివారు= వెనుకటివారు; పోరికిన్= యుద్ధమునకు; పురికొని= విజృంభించి; త్రోచినన్= కలియబడగా; సుబలపుత్రుఁడు= శకుని; కృత= చేయబడిన; నిశ్చయ= నిర్ణయముకల; ఆత్ముఁడై= మనసు కలవాడై; తద్= ఆ; తురగ= గుఱ్ఱములయొక్క; వ్రజంబుతోన్= సమూహముతో; బరవసము= ధైర్యము; ఒప్పఁగాన్= ప్రకాశింపగా; అతనిపైన్= ఆ సహదేవునిపై; కవిసెన్= కలియబడెను.

తాత్పర్యం: మిక్కిలివేగంతో రథం సాగుతూంటే, బాణాల సమూహం చుట్టుముట్టుతూంటే పాండవులలో చిన్నవాడైన సహదేవుడు పోనీయక క్రమ్ముకొన్నాడు. అప్పుడు వెనుకటివారు యుద్ధానికి విజృంభించి కలియబడగా శకుని నిశ్చయం కలిగిన మనస్సుకలవాడై ఆ గుఱ్ఱాల సమూహాలతో (తురంగసైన్యంతో) ధైర్యం వెల్లివిరియగా ఆ సహదేవుడిపై కలియబడ్డాడు.

వ. కవిసినం గని గుణంబు సారించి శరాసారం బడరించి యా సహదేవుం డిట్లనియె. 393

ప్రతిపదార్థం: కవిసినన్= కలియబడగా; కని= చూచి; గుణంబు= నారి; సారించి= సాగదీసి; శరాసారంబు= బాణవర్షం; అడరించి= కలిగించి; ఆ సహదేవుండు; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియెన్= అని పలికెను.

తాత్పర్యం: శకుని కలియబడగా చూచి, నారి సారించి, బాణాలు ప్రయోగించి, ఆ సహదేవుడు ఈ ప్రకారంగా అన్నాడు.

చ. 'తలఁకుట యొప్పునే నృపతి ధర్మము నూఁది యెదిర్చి యేమెయిన్
నిలుచుట యొప్పఁగాక మహనీయుల ధర్మతనూభవాదులం
బలికితి వీవు జూదపునెపంబునఁ దత్ఫలమందె దిప్డు మా
చలము బలంబు నేర్పడియెఁ జచ్చిరి మీ యవివేకు లందఱున్. 394

ప్రతిపదార్థం: నృపతిధర్మము= రాజధర్మమును; ఊఁది= విడిచి; తలఁకుట= భయపడుట; ఒప్పునే?= సమ్మతమగునా? (కాదు); ఏమెయిన్= ఏవిధముగానైనను; నిలుచుట= నిలబడుట (ధైర్యముగా ఉండుట); ఒప్పఁగాక= సమ్మతమగుగాక;

ఈవు= నీవు; జూదపు= జూదముయొక్క; నెపంబునన్= మిషతో; మహనీయులన్= మిక్కిలి గొప్పవారయిన; ధర్మతనూభవ+ ఆదులన్= ధర్మరాజు మొదలగు వారిని; పలికితివి= పలికితివి(తిట్టితివి); ఇప్డు= ఇప్పుడు (ఈ సమయమున); తత్ఫలము= ఆ ఫలితము; అందెదు= పొందగలవు; మీ= మీయొక్క; అవివేకులు= మూర్ఖులు; అందఱున్= అందరును; చచ్చిరి= మరణించారు; మా చలము= మా యొక్క కోపమును; బలమున్= బలమును; ఏర్పడియెన్= తేటపడెను.

తాత్పర్యం: 'రాజధర్మం విడిచి భయపడటం సమ్మతమగునా? ఏ విధంగానైనా నిలవటం ధైర్యంగా ఉండటమే ఉచితం. నీవు జూదం మిషతో మహాత్ములైన ధర్మరాజు మొదలైనవారిని తిట్టావు. ఈ సమయంలో ఆ ఫలితాన్ని పొందుము. నీ మూర్ఖులందరును మరణించారు. మా కోపం బలం ఇప్పుడు తేటతెల్లమయ్యాయి.

వ. మమ్ము నపహసించిన వారిలోఁ గురుకులదాహకుం డొక్కరుండ తక్కె నద్దురాత్ముండు సూచుచుండ భవదీయ శిరంబుఁదాలఫలంబు లగుడంబునం బడవైచు పగిదిఁ బటుభల్లంబున డొల్ల నేసెద మామా! పాఱక నిలువుమీ!' యని యట్లు బహుభంగులఁ బలికి యతం డేయు సాయకంబుల వారించి దశమార్గణంబులు మేనఁ జొనిపి. 395

ప్రతిపదార్థం: మమ్మున్= మమ్ములను; అపహసించినవారిలోన్= అవహేళన చేసినవారిలో (అనగా మమ్ములను అకారణంగా నిందించి అవమానం చేసిన వారిలో); కురుకుల= కురువంశమునకు; దాహకుండు= అగ్నివంటివాడు (అనగా కురువంశమును తగులబెట్టినవాడు); ఒక్కరుండ= ఒక్కడే; తక్కెను= మిగిలెను; ఆ+దురాత్ముండు= ఆ దుష్టబుద్ధికలవాడు; చూచుచుండన్= చూచుచుండగా; భవదీయ= నీ యొక్క; శిరంబున్= తలను; తాలఫలంబు= తాటిపండు; లగుడంబునన్= కఱ్ఱతో; పడవైచు= పడగొట్టు; పగిదిన్= విధముగా; పటు= కఠినమయిన; భల్లంబునన్= బల్లెముతో; డొల్లన్= నేల దొర్లునట్లు; ఏసెదన్= కొట్టెదను; మామా!= ఓ మామా!; పాఱక= పారిపోకుండ; నిలువుమీ!= నిలుచుండుమీ!; అని; అట్లు= ఆ ప్రకారంగా; బహుభంగులన్= పలువిధములుగా; పలికి; అతండు= ఆశకుని; ఏయు= ప్రయోగించు; సాయకంబులు= బాణములు; వారించి= నివారించి (అడ్డుకొని); దశ= పది; మార్గణంబులు= బాణములు; మేనన్= దేహమునందు; చొనిపి= గ్రుచ్చి.

తాత్పర్యం: ఓ మామా! మమ్ము అకారణంగా అవహేళనచేసిన వారిలో కురువంశమును తగులబెట్టినవాడయిన దుర్యోధనుడు ఒక్కడే మిగిలాడు. ఆ దుర్మార్గుడు చూస్తుండగా నీ తలను తాడిపండు కఱ్ఱతో పడగొట్టే విధంగా కఠినమైన బల్లెంతో నేలపడి దొర్లేటట్లు కొట్టుతాను. ఓ మామా! పారిపోకుండా నిలువుము' అని ఆ ప్రకారంగా పలు విధములుగా పలికి ఆ శకుని ప్రయోగించే బాణాలు అడ్డుకొని పది బాణాలు ఆ శకుని దేహమునందు గ్రుచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. తురగములు సిడము గొడుగును । శరాసనముఁ దునిమి యార్వ సాహసమున ని
ష్ఠుర శక్తిఁ బూన్చె నాతని । యురః స్థలము వైవ శకుని యుర్వీనాథా! 396

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; తురగములు= గుఱ్ఱములు; సిడము= ధ్వజము; గొడుగును; శరాసనమున్= ధనువును; తునిమి= ఖండించి; ఆర్వన్= అరవగా; శకుని; సాహసమునన్= తెగువతో; నిష్ఠుర= కఠినమైన; శక్తిన్= శక్తి అను ఆయుధమును; ఆతని= ఆ సహదేవుని; ఉరఃస్థలము= వక్షఃస్థలము; వైవన్= వైచుటకు (కొట్టుటకు); పూన్చెను= ప్రయోగించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సహదేవుడు శకుని గుఱ్ఱాలు, ధ్వజం, గొడుగు ధనువు ఖండించి పెద్దగా అరవగా శకుని తెగువతో కఠినమైన శక్తి అనే ఆయుధాన్ని ఆ సహదేవుడి వక్షఃస్థలాన్ని కొట్టటానికి ధరించాడు.

మ. సహదేవుం డది శాతభల్లమున నుత్సాహోగ్రుఁడై త్రుంచి దు
స్సహభల్లద్వితయంబునం గరయుగస్వైరచ్ఛిదాకేళి స
ల్పి హసద్వక్త్ర విలాస మొప్పెసఁగ నాభీలద్యుతిస్ఫారభ
ల్లహతిం గంఠము ద్రుంప మస్తకము డొల్లన్ డొల్లె మేనున్ మహిన్. 397

ప్రతిపదార్థం: సహదేవుండు= సహదేవుడు; ఉత్సాహ= ప్రయత్నముతో; ఉగ్రుఁడై= క్రోధంతో భయంకరమైన ఆకారము కలవాడై; శాత= వాడియైన (తీక్షణమైన); భల్లమునన్= బల్లెముతో; అది= ఆ శక్తిని; త్రుంచి= ఖండించి; దుస్సహ= భరింపశక్యము కాని; భల్ల= బల్లెములయొక్క; ద్వితయంబునన్= రెండింటితో; కరయుగ= రెండుచేతులతో; స్వైర= స్వేచ్ఛగా; ఛిదా= ఛేదించుటయనెడి; కేళిన్= క్రీడ; సల్పి= సలిపి; హసత్= నవ్వుచున్న; వక్త్ర= మోముయొక్క; విలాసము= లీల; ఒప్పెసఁగన్= ఒప్పునట్లుగా; ఆభీల= భయంకరమైన; ద్యుతి= కాంతితో; స్ఫార= గొప్పదైన; భల్ల= బల్లెములయొక్క; హతిన్= దెబ్బతో; కంఠము= గళము(గొంతు); త్రుంపన్= ఖండించగా; మస్తకము= శిరము; డొల్లన్= దొర్లగా; మహిన్= భూమిపై; మేనున్= దేహముకూడా; డొల్లెన్= దొర్లెను.

తాత్పర్యం: సహదేవుడు క్రోధంతో భయంకరమైన ఆకారం కలవాడై ప్రయత్నంతో తీక్షణమైన బల్లెంతో శకుని ప్రయోగించిన శక్తిని ఖండించి, భరింపశక్యం కాని రెండు బల్లెములతో రెండు చేతులతో స్వేచ్ఛగా ఛేదించే క్రీడ సలిపి నవ్వుముఖం విలాసంగా ప్రకాశించగా భయంకరమైన కాంతితో చలిస్తున్న బల్లెంయొక్క దెబ్బతో (శకుని) కంఠాన్ని ఖండించగా తల, మొండెం భూమిపై పడి దొర్లాయి.

వ. ఇట్లు కౌరవులదుర్నయంబునకు మూలంబగు శకునిఁ దెగటార్చి పేర్చియార్చిన యనుజన్ము నాలోకించి ధర్మతనయ ప్రముఖులు పరమ ప్రమోదభరితాంతఃకరణులై నిజశంఖంబులు పూరింప శౌరియుఁ బాంచజన్యరావంబున రోదసి నింప సుయోధను సేన చెదరక బెదరక నిలిచి యా సౌబలు సైన్యంబు సహదేవునిపై ననేకాస్త్ర శస్త్రంబులు గురియుచుఁ గవిసినం గవ్వడియు వడముడియు నవి యన్నియు మోఘంబు లగునట్లు చేసి యమ్మూఁక బలువడనేసి యుల్లాసభాసితు లైనం గని జనపతి శోకాక్రాంతమతియై హతశేషులైన నిజ సైనికులం బురికొల్పిన వారలు రక్షకరహితులయ్యును దెంపు పెంపున శంకింపక యాసవ్యసాచిం బొదివి తదస్త్రశిఖాసందోహంబున గ్రందిపోయి రక్కురురాజు దనచుట్టును బయలగుటఁ గలయం జూచి కట్టెదురఁ జెలంగు నా కౌంతేయులం గనుంగొని తొలంగిపోవం దలంచె ననుటయు నాంబికేయుండు సంజయు దిక్కు మొగంబై. 398

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగా; కౌరవుల= కౌరవులయొక్క; దుర్నయంబునకున్= దుర్నీతికి; మూలంబు= కారణము; అగు= అయినట్టి; శకునిన్= శకునిని; తెగటార్చి= చంపి; పేర్చి= అతిశయించి; ఆర్చినన్= అరచిన; అనుజన్మున్= తమ్ముడైన సహదేవుని (అనుసరించి జన్మించినవాడు అనుజన్ముడు); ఆలోకించి= చూచి; ధర్మతనయ ప్రముఖులు= ధర్మరాజు మొదలగు వారు; పరమ= అత్యంత; ప్రమోద= ఆనందముతో; భరిత= నిండిన; అంతఃకరణులై= మనసు కలవారై (మనోబుద్ధి చిత్తాహంకారములు అంతఃకరణ చతుష్టయము); నిజ= తమయొక్క; శంఖంబులు= శంఖములు; పూరింపన్= పూరించగా; శౌరియున్= శ్రీకృష్ణుడును; పాంచజన్య= పాంచజన్యమను పేరుగల శంఖముయొక్క; రావంబునన్= ధ్వనితో; రోదసి= భూమ్యాకాశమధ్యప్రదేశము; నింపన్= నిండిపోవునట్లు చేయగా; సుయోధను= దుర్యోధనునియొక్క; సేన= సైన్యము;

చెదరక= కలతచెందక; బెదరక= భయపడక; నిలిచి= నిలిచి; ఆ సౌబలు= ఆ శకునియొక్క; సైన్యంబు= సేన; సహదేవునిపైన్; అనేక= పలు; అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములు; శస్త్రంబులు= సామాన్య ఆయుధములు; కురియుచున్= కురిపించుచు; కవిసినన్= కలియబడగా; కవ్వడియున్= అర్జునుడును; వడముడియున్= భీముడును; అవియన్నియున్= ఆ అస్త్రశస్త్రములన్నియును; మోఘంబులు= నిరుపయోగములు; అగునట్లు; చేసి; ఆ+మూఁక= ఆ సేన; బలువడనేసి= బలము తగ్గించి; ఉల్లాస= సంతోషముతో; భాసితులైనన్= ప్రకాశవంతులు కాగా; కని= చూచి; జనపతి= దుర్యోధనుడు (జనులకు పతి అనగా రాజు); శోక= దుఃఖముతో; ఆక్రాంత= ఆక్రమింపబడిన; మతియై= బుద్ధికలవాడై; హతశేషులైన= చంపబడగా మిగిలినట్టి; నిజ= తనయొక్క; సైనికులన్= సేనలను; పురికొల్పినన్= క్రమ్ముకొనునట్లు చేయగా; వారలు= వారు; రక్షక= రక్షించువారు; రహితులయ్యును= లేనివారు అయ్యును; తెంపు= ధైర్యముయొక్క; పెంపునన్= ఆధిక్యమువలన; శంకింపక= అనుమానింపక; ఆ సవ్యసాచిన్= ఆ అర్జునుడిని; పొదివి= క్రమ్ముకొని; తద్= ఆ; అస్త్ర= బాణములయొక్క; శిఖా= అగ్రభాగములయొక్క; సందోహంబునన్= సమూహములవలన; ప్రమందిపోయిరి= మరణించారు; ఆ+కురురాజు= దుర్యోధనుడు; తనచుట్టును; బయలు= శూన్యము; అగుటన్; కలయంజూచి= అంతటా చూచి; కట్టెదురన్= ఎట్టఎదురుగ; చెలంగు= సంతోషించు; ఆ+కౌంతేయులన్= ఆ కుంతీపుత్రులైన పాండవులను; కనుంగొని= చూచి; తొలంగిపోవన్= తప్పుకొనిపోవుటకు; తలఁచెన్= ఆలోచించెను; అనుటయున్= అని చెప్పుటయు; ఆంబికేయుండు= అంబిక పుత్రుడైన ధృతరాష్ట్రుడు; సంజయుదిక్కు= సంజయునివైపు; మొగంబై= ముఖము కలవాడై.

తాత్పర్యం: ఈ ప్రకారంగా కౌరవుల చెడ్డ ప్రవర్తనకు కారణమైన శకునిని చంపి అతిశయించి, అరిచిన తమ్ముడు సహదేవుడిని చూచి ధర్మరాజు మొదలైన ప్రముఖులు అత్యంత ఆనందంతో నిండిన హృదయం కలవారై తమయొక్క శంఖాలు పూరింపగా శ్రీకృష్ణుడు కూడా పాంచజన్యమనే శంఖంయొక్క ధ్వనితో ఆకాశం నింపగా, దుర్యోధనుడియొక్క సైన్యం కలత చెందక భయపడక నిలిచి ఉన్నది. ఆ శకుని సైన్యం సహదేవుడిపై అనేక అస్త్రశస్త్రములు కురిపిస్తూ కలియబడింది. అప్పుడు అర్జునుడూ భీముడూ ఆ అస్త్రశస్త్రాలన్నింటిని నిరుపయోగములయ్యేటట్లు చేసి, ఆ సేన బలం తగ్గించి, సంతోషంతో వెలిగారు. అది చూచి దుర్యోధనుడు దుఃఖంతో నిండిన బుద్ధికలవాడై - చావగా మిగిలిన తనసేనను క్రమ్ముకొనునట్లు చేయగా వారు రక్షించేవాళ్ళు లేకపోయినా అధికమైన ధైర్యంతో అనుమానించక ఆ అర్జునుడిని క్రమ్ముకొని అతడి బాణాలనే మంటలలో మసి అయిపోయారు. ఆ దుర్యోధనుడు తన చుట్టూ శూన్యం కావటం చూచి, ఎట్ట ఎదుట సంతోషంతో ఉన్న పాండవులను చూచి యుద్ధభూమినుండి తొలగిపోవటానికి తలచాడు. ఇట్లా చెప్పగా ధృతరాష్ట్రుడు సంజయుడివైపు తిరిగి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **అట్లు మన సైన్యములు దెగటారినపుడు । కుంతి కొడుకులలో బలమెంత గలిగె?**
నకట! నాకొడు కెట్టివాఁడయ్యెఁ జెపుమ! । యనుడు నతఁ డిట్టు లనియె నమ్మనుజపతికి. **399**

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారముగా; మనసైన్యములు= మన సేనలు; తెగటారినపుడు= చంపబడినప్పుడు; కుంతికొడుకులలోన్= కుంతియొక్క పుత్రులలో; బలము= సైన్యము; ఎంత; కలిగెన్?= ఉన్నది?; అకట!= అయ్యో!; నా కొడుకు= నా పుత్రుడు; ఎట్టివాఁడు= ఎటువంటివాడు; అయ్యెన్= అయ్యెను(ఏమయ్యెను); చెపుమ!= చెప్పుము!; అనుడున్= అనగా; ఆ+మనుజపతికిన్= ఆ రాజునకు అనగా ధృతరాష్ట్రునకు; అతఁడు= ఆ సంజయుడు; ఇట్టులు= ఈ ప్రకారముగా; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: 'ఆ ప్రకారంగా మనసైన్యాలు చంపబడినపుడు కుంతి కొడుకులకు సైన్య మెంత మిగిలింది? అయ్యో! నా కొడుకు ఏమయ్యాడు? చెప్పుము.' - అనగా ఆ ధృతరాష్ట్రుడికి సంజయుడు ఇట్లా చెప్పాడు.

వ. అట్టి యెడ రెండు వేలు రథంబు లేడునూఱు గజంబు లైదువేలు గుఱ్ఱంబులు పదివేలు కాలుమానిసియుఁ దానును ధృష్టద్యుమ్నుండును సంగరాంగణంబున మెఱసి యుండె. 400

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయమున; రెండువేలు రథంబులు= రెండువేలు రథములు; ఏడునూఱు గజంబులు= ఏడువందలు ఏనుగులు; ఐదువేలు; గుఱ్ఱంబులు= గుర్రములు; పదివేలు; కాలుమానిసియున్= కాల్బలమును; తానును= తానును (దుర్యోధనుడును); ధృష్టద్యుమ్నుండును= ధృష్టద్యుమ్నుడును; సంగర+అంగణంబునన్= యుద్ధభూమియందు; మెఱసి= ప్రకాశించి; ఉండెన్= ఉండెను.

తాత్పర్యం: ఆ సమయమున రెండువేలు రథములు, ఏడువందలు ఏనుగులు, అయిదు వందల గుర్రాలు, పదివేల కాల్బలంతో ధృష్టద్యుమ్నుడు యుద్ధభూమియందు ప్రకాశించి ఉన్నాడు. దుర్యోధనుడు ఏకాకిగా మిగిలాడు.

విశేషం: "రథానాం ద్వేసహస్రేతు సప్తనాగశతాని చ । పంచచాశ్వ సహస్రాణి పత్తీనాం చ శతం శతాః॥
ఏత చ్ఛేష మభూ ద్రాజన్ పాండవానాం మహద్బలమ్ । పరిగృహ్య హి యద్యుద్ధే ధృష్టద్యుమ్నో వ్యవస్థితః।
ఏకాకీ భరతశ్రేష్ఠ తతో దుర్యోధనో నృపః ॥ (సం. 9-28-21,22,23)

క. పలపలని మూఁకలోఁ గాల్ । నిలువక గుఱ్ఱంబు డిగ్గి నీ కొడుకు గదా
కలిత భుజుండై యొక్కఁడుఁ । దొలఁగి చనియె నేమి చెప్పుదుం గురునాథా! 401

ప్రతిపదార్థం: కురునాథా! ధృతరాష్ట్రమహారాజా!; పలపలనిమూఁకలోన్= తఱిగిపోయిన సైన్యమునందు; కాల్‌నిలువక= ఉండలేక; గుఱ్ఱంబు= గుర్రము; డిగ్గి= దిగి; నీ కొడుకు= నీ కొడుకు (దుర్యోధనుడు); గదా= గదతో; కలిత= కూడిన; భుజుండై= బాహువులు కలవాడై; ఒక్కఁడున్= ఒక్కడును(ఏకాకిగా); తొలఁగి= తొలగి (యుద్ధభూమినుండి తప్పుకొని); చనియెన్= వెడలిపోయెను; ఏమి= ఏమి; చెప్పుదున్= చెప్పగలను.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! తగ్గిపోయిన సైన్యంలో ఉండలేక గుర్రం దిగి నీ కొడుకు దుర్యోధనుడు గద భుజమున ధరించి ఒక్కడే యుద్ధభూమినుండి తొలగి వెడలిపోయాడు. ఇంక ఏమి చెప్పగలను?'

వ. అని ధృతరాష్ట్రునకు సంజయుండు దుర్యోధను పలాయనం బెఱింగించె నని చెప్పిన విని యటమీఁది వృత్తాంతం బె ట్లయ్యె నని యడుగుటయును. 402

ప్రతిపదార్థం: అని= అని; ధృతరాష్ట్రునకు; సంజయుండు= సంజయుడు; దుర్యోధను= దుర్యోధనుడియొక్క; పలాయనంబు= పారిపోవుట; ఎఱింగించెను= తెలియజేసెను; అని; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; అటమీఁది= తరువాత; వృత్తాంతంబు= చరిత్రము; ఎట్లు= ఏ విధముగా; అయ్యెను= అయినది (జరిగెను); అని; అడుగుటయును= అడుగగా (జనమేజయుడు వైశంపాయనుని అడుగుటయును).

తాత్పర్యం: అని ఈ విధంగా ధృతరాష్ట్రుడికి సంజయుడు దుర్యోధనుడు పారిపోవుటం తెలియజేశాడు - అని చెప్పగా విని, అటు తరువాత చరిత్రం ఏ విధంగా జరిగిందని (జనమేజయుడు వైశంపాయనుని) అడుగగా.

ఆశ్వాసాంతము

ఉ. సంగవిదూరతాకలిత! శాంతరసస్ఫుటరోహ దిద్ధబో
ధాంగ! సమాశ్రితాపదుదయ జ్వలన ప్రశమప్రవర్తకా
పాంగమరీచిరూప వితతామృత వీచి విహార! వాసవో
త్సంగతలోపలాల్య పద! సంసృతివారణ! దైత్యదారణా. 403

ప్రతిపదార్థం: సంగవిదూరతాకలిత!= దేనితోను సంబంధంలేని వాడా!; (పరమేశ్వరుడు ఆకాశంవలె అవయవరహితుడగుటచేత దేనితోడను సక్తిలేనివాడు, కావుననే శ్రుతి పరమేశ్వరుడిని గూర్చి చెప్పుతూ "అసంగో హ్యయం పురుషః" (బృ. 4-3-15. చూ.40 ప) అని వర్ణించింది); శాంతరస= ప్రశాంతి రూపమైన శాంతరసమునందు; స్ఫుట= స్పష్టంగా; రోహత్= మొలుస్తున్న; ఇద్ధ= స్పష్టంగా ప్రకాశించే; బోధ= జ్ఞానమే; అంగ!= శరీరంగా కలవాడా!; సమాశ్రిత= ఆశ్రితులైన భక్తులయొక్క; ఆపద్+ఉదయ= విపత్తులు కలగటం అనెడి; జ్వలన= అగ్నిని; ప్రశమ= ఆర్పుటకు; ప్రవర్తక= ప్రవర్తింపజేయు; అపాంగ= క్రేగంటి ప్రసారంయొక్క; మరీచిరూప= కిరణరూపమగు; వితత= విస్తారమగు; అమృతవీచి= సుధాతరంగములందు; విహార!= విహరించేవాడా!; వాసవ= దేవేంద్రుడియొక్క; ఉత్సంగతల= ఊరు ప్రదేశంలో; ఉపలాల్య= లాలింపదగిన; పద!= చరణములు కలవాడా!; సంసృతివారణ!= సంసారమును అనగా తత్కృత బాధలను నివారించేవాడా!; దైత్యదారణా!= రక్కసులను చీల్చేవాడా!; (అనగా ధర్మవ్యవస్థా భంజకులను నశింపజేసేవాడనుట.)

తాత్పర్యం: నీవు నిరవయవుడవు అగుటచేత నీకు దేనితోనూ సంబంధంలేదు. శాంతరసంవలన కలిగే జ్ఞానమే నీ వాస్తవ రూపం. నీవు ఆశ్రితులయందు అమృతమయ కటాక్షాలను బరపి, వారి ఆపదలను పోగొట్టుట యందాసక్తుడవు. కావుననే సురేంద్రుడు సైతము తన తొడలపై నీ పాదముల నుంచుకొని సంవాహనం చేస్తుంటాడు. నీవు దైత్యులను చీల్చి చెండాడుతావు. భక్తుల సంసారబాధలను నివారిస్తుంటావు.

క. ఆశ్చర్య కరణ కరుణా! । నిశ్చల శుచిహృదయ భావనీయ విహరణా!
పశ్చిమనాడీ సరణ! పు । రశ్చరణధ్యేయ! భక్తరమణ విధేయా! 404

ప్రతిపదార్థం: ఆశ్చర్యకరణ కరుణా!= అచ్చెరువును కలుగజేసే దయకలవాడా!; (సామాన్య దేవతల కరుణారసం పరిమితమై ఉండగా హరిహరనాథుని దయ నిరవధికమగుటచేత ఆశ్చర్యజనకమని భావం. ఇట్టి యపార కరుణారసామృతమునే తిక్కయజ్వ తనకు స్వప్న ప్రత్యక్షం గావించిన హరిహరస్వామిని వర్ణిస్తూ "కరుణా రసము పొంగి తొరఁగెడు చాడ్పున శశిరేఖ మమృతంబు జాలువార''. (విరా. 1-12) అని వర్ణించాడు.) నిశ్చలశుచి హృదయ భావనీయ విహరణా! - నిశ్చల= చలింపనట్టియు; (నివాతదేశగత దీపకళికవోలె ఇతర చిత్తవృత్తులచేత ఆక్రమింపబడక ఏక రూపంతో ఉండి); శుచిహృదయ= నిర్మల చిత్తంచేత; భావనీయ= ఊహింపదగిన; విహరణా!= విహారం కలవాడా!; (పరమేశ్వరుడి లీలావిహారాలన్నీ నిర్మలము నిశ్చలము అగు హృదయం కలవారలకే అవగతములు అగునని భావం); పశ్చిమనాడీ సరణ!= సుషుమ్నా నాడిద్వారా ప్రసరించేవాడా!; (గుదస్థానగతమైన మూలాధార చక్రమునందలి చైతన్యాత్మకమై పరమేశ్వరరూపమగు కుండలినీశక్తి సుషుమ్నాద్వారమున మూలాధారాది షట్చక్రములను భేదించి బ్రహ్మరంధ్రమునందుట యోగశాస్త్ర ప్రసిద్ధం. కావున పరమేశ్వరుడు పశ్చిమ నాడీ సరణుఁ డనబడుతున్నాడు); పురశ్చరణధ్యేయ!= పురశ్చరణంచేత ధ్యానింపదగినవాడా!; (పురశ్చరణమునందు సంపూర్ణానుగ్రహం కొరకు పరమేశ్వరుడు ధ్యానింపదగినవాడని భావం); భక్తరమణవిధేయా!= భక్తులను ఆనందపరుస్తూ విధేయుడైనవాడా!

తాత్పర్యం: నీవు ఆపదలనందిన వారియెడ కనపరిచే దయను గమనిస్తే ఆశ్చర్యమౌతుంది. నీ విహారాలన్నీ అచంచలమైన హృదయంతో భావించదగినవే. యోగుల శరీరములయందు నీవు సుషుమ్నానాడీ మార్గాన

సంచరిస్తుంటావు. నీ అనుగ్రహమును సంపాదించటానికై ఉపాసకులు తమ మంత్ర పురశ్చరణంలో నిన్ను ధ్యానిస్తారు. అట్టి వారిని నీ వెల్లప్పుడు సంతోషపరుస్తూ వారికి విధేయుడవై ఉంటావు.

విశేషం: పైన నిరూపించబడిన ఉపాసనా ప్రక్రియలో నిమగ్నులైన భక్తులు పరమేశ్వర ధ్యానామృతహ్రదంలో నిమగ్నులౌతూ మహానందం పొందుతుండటంచేత పరమేశ్వరుడు భక్తుల నానందింపజేస్తాడు. అట్లే భక్తుల అభీష్టములను నెరవేర్చటంచేత భక్తులకు విధేయుడు ఔతున్నాడని భావం.

మాలిని: ప్రణవమయ గరిష్ఠోపాయ సంవేద్యభూమా!
భణన మనన దూరస్ఫార విస్తార సీమా!
గుణవిభవ నిరాసా కుంఠితోల్లాస ధామా!
గణన రహితలీలా! కల్ప నిత్యాభిరామా! **405**

ప్రతిపదార్థం: ప్రణవమయ= ప్రణవరూపమగు (ఓంకార రూపమగు); గరిష్ఠ+ఉపాయ= ఉత్తమోపాయంచేత; సంవేద్య= తెలియదగిన; భూమా!= భూమత్వం కలవాఁడా!; (మంత్రం దేవతా వాచకం. అది దేవతా స్వరూపమును తెలిసికొనుటకు సాధనము. అట్టి సాధనములలో "ప్రణవము" అని. ఇట్టి ప్రణవోపాసనమువలన దెలియదగిన తత్త్వం భూమభావం. కావున ఇట్టి భూమరూపుడగు పరమేశ్వరుడిని ప్రణవోపాసకులు మాత్రం తెలియగలరని భావం); భణన= పలుకుటకు; మనన= తలంచుటకు; దూర= అందని; స్ఫార= తేజంయొక్క; విస్తార= అతిశయమునకు; సీమా!= అవధి అగువాడా; (పరమేశ్వరుడి తేజోవిస్తారము వాఙ్మానసములకందని భావం. లేదా "స్ఫార విస్తార సీమ" అనగా అభివృద్ధి విస్తారమునకు స్థానమైనవాడు. బ్రహ్మ బృహద్రూపు డగుటచేత ఆతడు సర్వబృహత్త్వమునకు స్థానమని భావం); గుణ= సత్త్వ రజస్తమో గుణాలయొక్క; విభవ= అతిశయమును; నిరాస= నిరసించునట్టి; అకుంఠిత= వ్యర్థంకాని(మొక్కవోని); ఉల్లాస= ఆనందమునకు; ధామా!= స్థానమైనవాడా!; (అనగా త్రిగుణాత్మకమైన ప్రకృతియొక్క వికారమునకు అతీతమైన ఉత్తమానంద స్వరూపుడగుట); గణన రహితలీలా!= లెక్కలేనన్ని విలాసములు గలవాడా!; (పరమేశ్వరుడి విశ్వసృష్టి స్థితి సంహార రూపములగు విలాసములు గణనాతీతములని భావం); కల్పనిత్యాభిరామా!= కల్పసమయమున గూడ నశించని మనోహరత్వం కలవాడా! (కల్పమనగా రెండు వేల దైవయుగాల సమయమని అర్థం. అది ఒక బ్రహ్మదినం. ప్రళయ సమయం. ఇట్టి సమయంలో విశ్వమంతయు నశించినను పరమేశ్వరుడు నిత్యానందస్వరూపు డని భావం.)

తాత్పర్యం: నీ సర్వాతిశయ రూపం (భూమరూపము) శబ్దమునకు మూలకారణమైన ప్రణవముచేతనే తెలియవలెను. నీ తేజోవిశేషముయొక్క పరిమితి చెప్పుటకుగాని తలచుటకుగాని శక్యం కానిది. నీవు త్రిగుణాతీతుడవగుటచేత నీ ఆనందం స్థిరమైనది. నీ విలాసములు లెక్కకు మించినవి. యుగాంతమున సర్వప్రపంచం నశించినను నీ సౌందర్యం మాత్రం నశింపక స్థిరంగా ఉంటుంది.

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీమదాంధ్ర మహాభారతంబున శల్యపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము

తాత్పర్యం: ఇది మంగళకరమైనదీ, సంస్కృతాంధ్రోభయ కవులకు మిత్రుడైనవాడూ, కొమ్మనామాత్యపుత్రుడూ, పండితులచేత ఆరాధించబడేవాడూ (పండితులను ఎల్లప్పుడూ సేవించేవాడూ) అయిన తిక్కన సోమయాజిచేత రచించబడినదీ అయిన శుభప్రదమైన ఆంధ్రమహాభారతంలోని శల్యపర్వంలో మొదటి ఆశ్వాసం.

శల్యపర్వంలోని ప్రథమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శల్యపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీ కరణ నిపుణ పదప । ద్మా! కేవల సత్త్వసద్మ! మాయావ్యవధూ
త్యేకాయనగమ్యా! మధు । రాకృతి సర్వత్రరమ్య! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీకరణనిపుణ= సిరిని కల్గించటంలో నైపుణ్యంకల; పదపద్మా!= పాదపద్మాలు కలవాడా!; కేవల= కేవలం; సత్త్వసద్మ= సత్త్వ గుణానికి నిలయమైనవాడా!; మాయావ్యవధూతి+ఏకాయన గమ్యా!= మాయాగుణాన్ని నిరాకరించే ఒకే ఒక మార్గంచేత పొంద తగినవాడా!; మధుర+ఆకృతి= ఆనందస్వరూపంచేత; సర్వత్ర రమ్య!= అన్నిట అందమయిన వాడా!; హరిహరనాథా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నీ పాద పద్మాలు భక్తులకు అనంతమయిన సంపదల నిస్తాయి. నీవు సత్త్వ నిలయుడవు. మాయచేత నిండిన ప్రపంచాన్ని నిరాకరించటంచేతనే నీవు తెలియదగినవాడవు; ఆనందరూపమైన ఆకారంచేత అంతటా అందమైనవాడవు.

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; నట్లు నిజపుత్రుండు పరాజయంబు నొందుట యాక
ర్ణించి యాంబికేయుండు. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు; జనమేజయునకున్= జనమేజయుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; నిజపుత్రుండు= తన కుమారుడు(దుర్యోధనుడు); పరాజయంబున్+ఒందుటన్= ఓడిపోవటాన్ని; ఆకర్ణించి= విని; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! వైశంపాయనుండు జనమేజయుడితో ఈ విధంగా అన్నాడు: తన కుమారుడి ఓటమిని విని ధృతరాష్ట్రుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'మద మడఁగి యొక్కరుండును । గద చేకొని రాజరాజు కాల్నడ నెట వో
మదిఁ దలఁచి తొలఁగెనొకొ! యా । పద లిట్టివి కలవె మనుజపతులకు నెందున్? 3

ప్రతిపదార్థం: మదము+అడఁగి= గర్వం అణగిపోయి; ఒక్కరుండును= ఒక్కడే; గద చేకొని= గదను చేతబట్టి; రాజరాజు= దుర్యోధనుడు; కాల్నడన్= కాలినడకతో; ఎట+పోన్= ఏ దిక్కునకు పోవగా; మదిన్= మనసులో; తలఁచి= తలచుకొని; తొలఁగెనొకొ!= యుద్ధభూమినుండి తొలగివెళ్ళాడో?; ఎందున్= ఎక్కడగాని; మనుజపతులకున్= రాజులకు; ఇట్టి ఆపదలు= ఇటువంటి కష్టాలు; కలవె?= ఉన్నవా?

తాత్పర్యం: 'గర్వ మడగిన వాడై ఒకడే గదను చేతబట్టి దుర్యోధనుడు కాలి నడకను ఎటు వెళ్ళాడో? ఎక్కడైనా రాజులకు ఇట్టి బాధలు కలగటం ఉన్నదా? (లేదని భావం).

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. విశేషాంశాన్ని సామాన్యాంశం సమర్థిస్తున్నది.

వ. అనంతర వర్తనంబు తెఱం గెఱింగింపు 'మనుటయు నజ్జననాథునకు సంజయుం డిట్లనియె. 4

ప్రతిపదార్థం: అనంతర వర్తనంబు= తరువాత జరిగిన నడవడి; తెఱంగు= పద్ధతి; ఎఱింగింపుము+అనుటయున్= తెలుపుము అనగా; ఆ+జననాథునకున్= ఆ రాజుకు(ధృతరాష్ట్రుడికి); సంజయుండు+ఇట్లు+అనియెన్= సంజయు డీవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: (సుశర్మను ఓడించిన తరువాతి) యుద్ధ వృత్తాంతాన్ని వివరించు'మని అడుగగా సంజయుడు ధృతరాష్ట్రుడితో ఈ విధంగా పలికాడు:

సీ. 'ఏకాదశాక్షౌహిణీశుఁ డై పెంపునఁ । బొంపిరివోవు నప్పడమిఱేఁడు
వెనుక నొక్కరుఁడును జన లేక యేకాకి । యై పోయె నచటికి ననతిదూర
మై యుత్తరము ముట్టినట్టితూర్పున నొక్క । మడు వున్న, దానిలో నడఁగియుండు
వాఁడుగా నట్టు లవ్వలనికిఁ జని చని, । విదురువాక్యంబులు మదిఁ దలంచి

ఆ. 'యధికమతి నృపాలుననుజుండు సెప్పె న । ట్లకట! దానిఁ గొనన' యనుచు శోక
తప్తచిత్తుఁ డయ్యెఁ; దైవ మెవ్వరి నెట్లు । చేయఁ జాల? దేమి సెప్పఁ గలదు? 5

ప్రతిపదార్థం: ఏకాదశ+అక్షౌహిణీశుఁడు+ఐ= పదునొకండక్షౌహిణుల సేనకు నాయకుడై; పెంపునన్= గొప్పతనంతో; పొంపిరి+పోవు+ఆ+పుడమిఱేడు= అతిశయించే ఆ రాజు; (దుర్యోధనుడు); వెనుకన్= తన వెన్నంటి; ఒక్కరుఁడునున్+చనన్ లేక= వెళ్ళటానికి ఒక్కడు కూడా లేక; ఏకాకి ఐ= ఒంటరివాడయి, పోయెన్= వెళ్ళాడు; అచటికిన్= ఆ చోటునకు; అనతిదూరము+ఐ= కొద్దిదూరంగా; ఉత్తరము ముట్టినట్టి తూర్పునన్= ఈశాన్యభాగాన; ఒక్కమడువు+ఉన్నన్= ఒకనీటిమడుగు ఉండగా; దానిలోన్ అడఁగి+ఉండువాఁడుకాన్= ఆ మడువులో దాగికొనిఉండేవాడై; అట్టులు+ఆ+వలనికిన్= ఆ విధంగా ఆ దిక్కునకు; చనిచని= పోయి పోయి; విదురు+వాక్యంబులు= విదురుడి పలుకులు; మదిన్+తలంచి= మనసులో తలచుకొని; అధికమతి= మిక్కిలి తెలివైనవాడగు; నృపాలు+అనుజుండు+చెప్పెన్= రాజుగారి తమ్ముడు(ధృతరాష్ట్రుడి తమ్ముడైన విదురుడు) చెప్పాడు; అకట!= అయ్యో!; దానిన్= దానిని; కొనన్+అ= గ్రహించలేదు, స్వీకరించనేలేదు; అనుచున్= అంటూ; శోకతప్తచిత్తుఁడు+ అయ్యెన్= దుఃఖంతో బాధింపబడ్డ మనసుకలవాడైనాడు; దైవము= విధి; ఎవ్వరిన్+ఎట్లు= ఎవ్వరిని ఎట్లు; చేయన్+చాలదు!= చేయలేదు?; ఏమి చెప్పన్+కలదు?= ఏం చెప్పను?

తాత్పర్యం: 'పదకొండక్షౌహిణుల సైన్యానికి అధిపతిగా గొప్పదనంతో విలసిల్లే ఆ రాజు తన వెంట ఒకడు కూడా వచ్చేవాడు లేక ఏకాకిగా ఆ యుద్ధభూమినుండి వెళ్ళాడు. ఆ చోటికి దగ్గరగా ఈశాన్య భాగాన ఒక్క(నీటి) మడువు ఉన్నది. ఆ వైపునకు వెళ్ళి ఆ మడుగులో దాగికొని, విదురుడి మాటలు మనసులో తలచుకొంటూ 'అయ్యో! నేను ఆమాటలను మన్నించలేకపోయాను' అంటూ దుఃఖాతిశయంతో విచారించాడు. విధి ఎవరిని ఏమి చేస్తుందో ఏమి చెప్పగలం?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. విశేషాంశం సామాన్యాంశంచేత సమర్థింపబడుతున్నది.

వ. అట్టియెడ సుడిసి చిక్కిన మూఁకలు వీఁకమై నెదిర్చినం బొదివి నిరవశేషంబుగా సమయించి కృష్ణసారథికంబును ధవళహయంబును గపీంద్రకేతనంబును నగు నుజ్జ్వలస్యందనంబున నప్పురందరనందనుండు

బంధుమిత్రాభినందితుండై యొప్పె; నప్పుడు పాలికలన నీ బలం బఖిలంబును బెనుగాలిం బడిన పేరడవిపగిదిం గానంబడుచుండె; నందుఁ గృపాశ్వత్థామకృతవర్మలు మువ్వురు బ్రదికి పోయి; రాసమయంబున ధృష్టద్యుమ్నుండు నన్నుఁ గనుంగొని నగుచు సాత్యకి నుద్దేశించి. 6

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; సుడిసి చిక్కిన మూఁకలు= అలసి క్షీణించిన సేనలు; వీఁకమైన్= ఉత్సాహంతో; ఎదిర్చినన్= ఎదుర్కొనగా; పొదివి= క్రమ్ముకొని; నిరవశేషంబుగాన్= నిశ్శేషంగా; సమయించి= చంపి; కృష్ణసారథికంబును= కృష్ణుడు సారథిగా కలదియు; ధవళహయంబును= తెల్లని గుర్రాలు కలదియు; కపి+ఇంద్ర కేతనంబును= హనుమద్ధ్వజం కలదియు; అగు= అయిన; ఉజ్జ్వల స్యందనంబునన్= ప్రకాశిస్తున్న తేరిమీద; ఆ+పురందరనందనుండు= ఆ ఇంద్రపుత్రుడయిన అర్జునుడు; బంధుమిత్ర+అభినందితుండు+ఐ= బంధువులు, స్నేహితుల చేత పొగడబడినవాడై; ఒప్పెన్= ఒప్పిఉన్నాడు; అప్పుడు= ఆ సమయంలో; పాలికలనన్= యుద్ధరంగంలో; నీ బలంబు+అఖిలంబును= నీ సేన అంతా; పెనుగాలిన్+పడిన= పెద్దగాలి తాకిడికి పడిపోయిన; పేరడవి పగిదిన్= పెద్ద అడవి మాదిరిగా; కానంబడుచుండెన్= కనపడుతూ ఉన్నది; అందున్= ఆ సేనలో; కృపాశ్వత్థామ కృతవర్మలు; మువ్వురు బ్రదికిపోయిరి= ముగ్గురు మాత్రం బ్రదికి బయటపడ్డారు; ఆ సమయంబునన్= అట్టివేళలో; ధృష్టద్యుమ్నుండు; నన్నున్+కనుంగొని= ధృష్టద్యుమ్నుడు నన్ను గుర్తించి; నగుచున్= నవ్వుతూ; సాత్యకిన్+ఉద్దేశించి= సాత్యకితో.

తాత్పర్యం: ఆ సమయంలో ఓడి క్షీణించిన సేనలు పౌరుషంతో ఎదిరించగా, వారిని చుట్టుముట్టి ఒక్కరుకూడా మిగలకుండా చంపి, కృష్ణుడు రథం నడుపుతూ ఉండగా, తెల్లనిగుర్రాలూ, కపిధ్వజమూ శోభించే ప్రకాశవంతమైన రథంలో బంధుమిత్రాదులు అభినందిస్తూ ఉండగా అర్జునుడు రాణించాడు. అప్పుడు యుద్ధభూమిలో నీ సైన్యం పెద్దగాలికి నేలకొరిగిన పెద్ద అడవివలె కనబడింది. అందులో కృపుడు, అశ్వత్థామ, కృతవర్మ - ఈ ముగ్గురుమాత్రమే బ్రతికిపోయారు. ఆ సమయంలో ధృష్టద్యుమ్నుడు నన్ను చూచి నవ్వుతూ సాత్యకితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. 'వీని నేటికిఁ బట్టితి? వీఁడు బ్రదికి । యిచట వర్తించి మనకు నెగ్గేమి సేయు?
నప్రయోజన మిది; విడు' మనిన 'నేల । వీడుతు నీ ద్రోహితల దెగ నడుతు' ననుచు. 7

ప్రతిపదార్థం: వీనిన్+ఏటికిన్ పట్టితి(వి)?= (ఈ సంజయుడిని) ఇతడిని ఎందుకు పట్టుకొన్నావు?; వీఁడు బ్రతికి= వీడు ప్రాణాలతో ఉండి; ఇచటన్+వర్తించి= ఇక్కడ తిరుగుతూ; మనకున్; ఎగ్గు+ఏమి+చేయున్?= కీ డేమి చేయగలడు?; అప్రయోజనము+ఇది= ఈ పట్టుకొనటం నిరుపయోగం; విడుము+అనినన్= వదలుము అనగా; ఏల విడుతున్?= ఎందుకు వదలుతాను?; ఈ ద్రోహి తలన్= ఈ దుర్మార్గుడి తలను; తెగన్+అడుతున్= నరుకుతాను; అనుచున్= అంటూ.

తాత్పర్యం: 'వీడి నెందుకు పట్టుకొన్నావు? ఇతడివలన మన కేమీ కీడు కలుగుతుంది? ఇది నిష్ప్రయోజనమయిన పని' అనగా అతడు నవ్వుతూ 'వీడిని వదలటం ఎందుకు? తల తెగనరుకుతాను. 'వీడు ద్రోహి' అని అంటూ.

వ. ఆ శైనేయుండు వాలు వెఱికి వ్రేయం జూచునంతఁ గృష్ణద్వైపాయనుండు సన్నిధిచేసి, యతని వారించి, 'సంజయుం జంపుట యనుచితంబు; ముందల విడువు'మని యానతిచ్చిన నతండును వినతుండై' యట్ల కాక యని పలికి నన్ను విడిచెఁ; గృష్ణద్వైపాయనుండు మదీయాననం బాలోకించి 'బ్రదికిపోయి తెక్కడకైనం

బొ మ్మనుటయు' నమ్మునీంద్రు వీడ్కొంటి; నంత నతఁ డంతర్ధానంబు సేసె; నేను దత్ప్రదేశంబు వాసి నీసుతుండు సనిన చక్కటికిఁ గ్రోశమాత్రంబు వోయి ద్వైపాయనం బనం బ్రసిద్ధం బైన యమ్మడువు సమీపంబున. 8

ప్రతిపదార్థం: ఆ శైనేయుండు= ఆ సాత్యకి; వాలు+పెఱికి= కత్తి దూసి; వ్రేయన్+చూచునంతన్= దెబ్బకొట్టటానికి ప్రయత్నించేటంతలో; కృష్ణద్వైపాయనుండు సన్నిధి చేసి= వ్యాసుడు ప్రత్యక్షమై; అతనిన్+వారించి= సాత్యకిని అడ్డుకొని; సంజయున్+చంపుట అనుచితంబు= సంజయుడిని చంపటం న్యాయం కాదు; ముందల= ముందుతల (తలయొక్క ముందుభాగం); విడువుము+అని= వదలుమని; ఆనతి+ఇచ్చినన్= ఉత్తరువు చేయగా; వినతుండు+ఐ= అణకువతో; అట్ల కాక!= అట్లాగుననే!; అని పల్కి= చెప్పి; నన్నున్ విడిచెన్= నన్ను వదలాడు; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; మదీయ+ఆననంబు+ ఆలోకించి= నా మొగమును చూచి; బ్రదికిపోయితి(వి)= బ్రతికిబయటపడ్డావు; ఎక్కడకైనన్+పొమ్ము+అనుటయున్= ఎక్కడికైనా వెళ్లమని చెప్పగా; ఆ+మునీంద్రున్= వ్యాసమునీశ్వరుడిని; వీడ్కొంటిన్= వదలివెళ్ళాను; అంతన్= ఆ తరువాత; అతఁడు= వ్యాసుడు; అంతర్ధానంబు+చేసెన్= అంతర్ధానమైనాడు; ఏను తత్ప్రదేశంబు పాసి= నేనా చోటు వదలి; నీ సుతుండు చనిన చక్కటికిన్= నీ కుమారుడు వెళ్ళిన దిక్కునకు; క్రోశమాత్రంబు+పోయి= క్రోసు దూరం వెళ్ళి; ద్వైపాయనంబు+అనన్+ప్రసిద్ధంబు+ఐన= ద్వైపాయనమని ప్రఖ్యాతినొందిన; ఆ+మడువు సమీపంబునన్= ఆ కొలను దగ్గర.

తాత్పర్యం: ఆ సాత్యకి కత్తి తీసి నన్ను చంపటానికి పూనుకొన్నంతలో వ్యాసుడు ప్రత్యక్షమై వారించి సంజయుడిని చంపటం ఉచితం కాదన్నాడు. ఆతడి యాజ్ఞను ఆమోదించి సాత్యకి నన్ను వదలివేశాడు. అపుడు వ్యాసుడు నా మొగం చూచి 'బ్రతికిపోయావు. ఎక్కడికైనా వెళ్ళిపొ'మ్మన్నాడు. అపుడు మునిని వీడ్కొన్నాను. వ్యాసుడు అంతర్ధానమయ్యాడు. నేను దుర్యోధనుడు పోయిన దిక్కున నడిచి అక్కడకు క్రోసు దూరంలో ఉన్న ద్వైపాయనమనే కొలను వద్దకు చేరాను.

తే. అతనిఁ గాంచితి; నతఁ డశ్రు లడర నడలు । చూడ్కి నామోము చక్కఁగాఁ జూడ కోర
వోవఁ జూచుచు దీనతఁ బొందియునికి । గని మనంబున శోకంబు గదుర నేను. 9

ప్రతిపదార్థం: ఏను= నేను; అతనిన్+కాంచితిని= ఆ దుర్యోధనుడిని చూచాను; అతఁడు+అశ్రులు+అడరన్= అతడు కన్నీళ్ళు కారగా; అడలుచూడ్కిన్= భయముతోడి చూపుతో; నామోము= నా మొగమును; చక్కఁగాన్= నేరుగా; చూడక= చూడకుండా; ఓర+పోవన్+చూచుచున్= ఓరగా చూస్తూ; దీనతన్+పొంది= దైన్యంపొంది; ఉనికి= ఉండటం; నేను; కని= చూచి; మనంబునన్= నా మనసులో; శోకంబు+కదురన్= దుఃఖం కలుగగా.

తాత్పర్యం: దుర్యోధనుడిని చూచాను. అతడు కన్నీరొలుకగా నా మొగం చూడలేక ప్రక్కచూపులుచూస్తూ దీనత్వంతో ఉండటాన్ని గమనించి అతడి స్థితికి మనసులో దుఃఖం కలుగగా, నేను (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఒక్కింతసేపు పలుకు వెలువరింపఁ జాలక యూరకుండి, యెట్టకేల కెలుంగు దెచ్చుకొని పారాశర్యప్రసాదంబున బ్రదికినతెఱంగు సెప్పిన, నమ్మహీకాంతుండును గొంత ప్రొద్దు నిశ్చేష్టితుండై యుండి, పదంపడి నాదెసఁ జూచి 'మనదెస బ్రదికిన వారు గలరే?' యనినఁ గృపాచార్యాదిరథికత్రయంబును బేరుకొని 'వారలు బ్రతికిపోయిరి; తక్కొరుండును బ్రదుకుట లేదని యెఱింగించిన, నిట్టూర్పు నిగిడించుచు నామూఁపుపైఁ జే యిడి యన్నర నాథుండు నన్ను నీకడ కనుపం దలంచి నాతో ని ట్లనియె. 10

ప్రతిపదార్థం: ఒక్కింతసేపు= క్షణమాత్రకాలం; పలుకు వెలువరింపన్+చాలక= మాటపెగులక; ఊరకుండి= ఊరకొని; ఎట్టకేలకున్= చివరకు; ఎలుంగు+తెచ్చుకొని= గొంతుపెగల్చుకొని; పారాశర్య ప్రసాదంబునన్= వ్యాసుని దయతో; బ్రదికిన తెఱంగున్= బ్రదికిన విధమును; చెప్పినన్= చెప్పగా; ఆ+మహీకాంతుండును= రాజుగు ఆ దుర్యోధనుడును; కొంతప్రొద్దు= కొద్దిసేపు; నిశ్చేష్టితుండు+ఐ ఉండి= కదలిక లేనివాడై; నాదెసన్+చూచి= నాదిక్కునకు చూచి(సంజయుడి వైపు చూచి); మన దెసన్= మనవైపున; బ్రదికినవారు= బ్రతికిఉన్నవారు; కలరే?= ఉన్నారా?; అనినన్= అనగా; కృపాచార్య+ఆది రథికత్రయంబును= కృపాచార్యుడు మొదలయిన రథికులను ముగ్గురిని; పేరుకొని= చెప్పి; వారలు బ్రతికిపోయిరి= వారు బ్రతికిఉన్నారు; తక్కు+ ఒరుండును= వేరెవ్వరుడును; బ్రదుకుట లేదు+అని= జీవించలేదని; ఎఱింగించినన్= తెలుపగా; నిట్టూర్పు నిగుడించుచున్= నిట్టూర్పు వదలుచూ; నామూఁపుపైన్+చేయి+ఇడి= నా మూపున చేయి పెట్టి; ఆ+నరనాథుండు= ఆ రాజు (దుర్యోధనుడు); నన్నున్= (సంజయుడిని) నన్ను; నీకడకున్+అనుపన్+తలంచి= పంపాలని యోచించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కొంచెం సేపు మాట్లాడలేకుండా ఊరకుండి, తుదకు గొంతు పెగుల్చుకొని, వ్యాసుడి దయతో నేను బ్రతికిన విధాన్ని చెప్పగా, దుర్యోధనుడు కొంత సేపు కదలిక లేక ఉండిపోయాడు. పిమ్మట నా వైపు చూచి 'మన వారిలో బ్రతికి ఉన్నావా రున్నారా?' అని అడుగగా 'కృపాచార్యాది రథికులు ముగ్గురూ బ్రతికిపోయారు. ఇంకెవడూ లేడు' అని తెలుపగా, నిట్టూర్పుతో నా వీపుమీద చేయిపెట్టి ఆ రాజైన దుర్యోధనుడు నన్ను నీ వద్దకు పంపనెంచి నాతో ఇట్లా అన్నాడు:

తే. **'మాఱుమానిసి లేకుండ మడిసి రెల్ల । వారు నీ దెసఁ; బాండుభూవరతనూజు**
లాప్తులుం దాము నున్న వా; । రాహవమునఁ । బడక తొలఁగితిఁ బోటులఁ బడియు నేను'. **11**

ప్రతిపదార్థం: మాఱుమానిసి లేకుండన్= మరొక్కమనిషి కూడా లేకుండ; ఈ దెసన్= ఈవైపున; ఎల్లవారున్ మడిసిరి= అందరూ చనిపోయారు; పాండు భూవర తనూజులు= పాండవులును; తాము= తామును; ఆప్తులు= ఆత్మీయులును; ఆహవమునన్+పడక= యుద్ధంలో పడిపోకుండా; ఉన్నవారు= బ్రతికి ఉన్నారు; ఏను= నేను; పోటులన్+పడియున్= దెబ్బలు తినినా (చావకుండా); తొలఁగితిన్= తప్పించుకొన్నాను.

తాత్పర్యం: 'మరొక్క మనిషి లేకుండా ఈ వైపు వారంతా చనిపోయారు. పాండవులును వారి కాప్తులయినవారును జీవించి ఉన్నారు. దెబ్బలు తినినా నేను చావకుండా యుద్ధంలో తప్పించుకొన్నాను.'

వ. **అని.** **12**

తాత్పర్యం: అని చెప్పి.

క. **'కౌంతేయులబారిం బడ; । నింతియ సిరి చాలు; రాజ్య మెల్లను దారై**
పొంత ననుఁ బెట్టుకొని యొక । కొంత యొసఁగిరేని నట్టికూ డేమిటికిన్? **13**

ప్రతిపదార్థం: కౌంతేయుల బారిన్+పడను= పాండవులచే చిక్కక తప్పించుకొన్నాను; ఇంతియ= ఇంతమాత్రపు!; సిరి చాలు= సంపద చాలును; రాజ్యము+ఎల్లను= రాజ్యమంతటిని; తారై= తాముగా; పొంతన్+నను= నన్ను దగ్గర; పెట్టుకొని= ఉంచుకొని; ఒక కొంత= ఒకింత; ఒసఁగిరేనిన్= ఇస్తే; అట్టికూడు= అటువంటి తిండి; ఏమిటికిన్?= (నాకు) ఎందుకు?

తాత్పర్యం: 'పాండవుల బారిన పడకుండా నేను తప్పించుకొన్నాను. ఈ మాత్రపు సిరి నాకు చాలును. రాజ్యాన్ని పూర్తిగా తామే కైకొని, నన్ను దగ్గర పెట్టుకొని, ఒకింత నాకు ఇచ్చినా, అటువంటి నికృష్టపుకూడు నాకెందుకు?

క. అనుజులఁ దనుజుల మత్పరి । జనులను సమయించి వారు సమరోల్లాసం
బున మెఱయఁ జూడ నేర్తునె? । జననాథున కింతవట్టు సంజయ! చెపుమా! 14

ప్రతిపదార్థం: సంజయ!= ఓ సంజయుడా!; అనుజులన్= తోబుట్టులను; తనుజులన్= కుమారులను; మత్+పరిజనులను= నా సేవకులను; సమయించి= చంపి; వారు= పాండవులు; సమర+ఉల్లాసంబునన్= యుద్ధోత్సాహంతోడి ఆనందంతో; మెఱయన్= ప్రకాశింపగా, చూడన్+నేర్తునె?= చూడగలనా?; జననాథునకున్= రాజునకు (ధృతరాష్ట్రుడికి); ఇంతపట్టు= ఇంతమాత్రం; చెపుమా!= చెప్పుము!

తాత్పర్యం: సంజయా! తోబుట్టువులను, కుమారులను, సేవకులను అందరినీ యుద్ధంలో చంపి, పాండవులు విజయోత్సాహంతో వెలుగుతూ ఉండగా చూచి సహించగలనా? ధృతరాష్ట్రుడికీ సంగతిని చెప్పుము.

దుర్యోధనుఁడు ద్వైపాయనంబను మడుఁగున డాఁగియుండుట (సం. 9-28-51)

క. ఇమ్మడువులోన డాఁగెద; । నిమ్ముల నెచ్చటికినైన నేఁగెదఁ; దగు వృ
త్తమ్మునఁ దొలఁగి నిలిచి మఱి । యెమ్మెయినేనియును దీర్తు నేఁ బగయ సుమీ!' 15

ప్రతిపదార్థం: ఈ+మడువులోనన్= ఈ మడుగులోపల; డాఁగెదన్= దాగి ఉంటాను; ఇమ్ములన్= అనుకూలమైనపుడు; ఎచ్చటికినైనన్= ఎక్కడికైనా; ఏఁగెదన్= వెళ్ళుతాను; తగువృత్తమ్మునన్= తగినప్రవర్తనతో; తొలఁగి= తప్పుకొని; నిలిచి= నిలిచి ఉండి; మఱి= ఆ మీదట; ఏ+మెయిన్+ఏనియునున్= ఏరీతిగానైనా; ఏన్= నేను; పగయ= పగనే; తీర్తున్= తీర్చుకొంటాను; సుమీ!= సుమా!

తాత్పర్యం: ఈ మడుగులో దాగి, అనుకూలమైన సమయంలో ఎక్కడకయినా పోయి, వేచి అదను చూచి, ఏ విధంగానైనా నా పగ తీర్చుకొంటాను సుమా!'

వ. అని చెప్పి యమ్మడువు సొచ్చి మాయావిశేషంబున జలంబులు శరీరంబు సోఁకకుండ సంస్తంభనంబు సేసికొని యుండె; నంత రథ్యంబులు పరిశ్రాంతినొంది తూఁగాడ నస్త్రశస్త్రాదిక్షతంబు లగు నవయవంబులతోడ రాజదర్శన విషణ్ణులగుచుఁ గృపకృతవర్మాశ్వత్థామ లచ్చట మెలంగి దబ్బాటుగా నన్నుం గని 'సంజయా! బ్రదికితే?' యని పలికి 'కురుపతి ప్రాణంబులం గలఁడే?' యని యడిగిన నజ్జననాథుఁ డొక్కండును బాఱుతెంచి నీరిలో డాఁగియున్న తెఱం గెఱింగించి యా హ్రదంబు సూపి యే మిరువురము నొండొరులతో నాడినమాటలు దేటపడం జెప్పిన వార లత్యంత విషాదంబు నొంది. 16

ప్రతిపదార్థం: అని చెప్పి= ఆ విధంగా చెప్పి; ఆ+మడువు+చొచ్చి= ఆ కొలనులోనికి దిగి; మాయావిశేషంబునన్= మాయాశక్తివలన; జలంబులు శరీరంబు సోకక+ఉండన్= నీరు దేహం తగులకుండా ఉండేటట్లు; సంస్తంభనంబు= కదలని స్థితిని; చేసికొనిఉండెన్= ఏర్పరచుకొని ఉన్నాడు; అంతన్= ఆ మీదట; రథ్యంబులు= గుర్రాలు; పరిశ్రాంతిన్+ఒంది= అలసి; తూఁగాడన్= ఊగిసలాడగా; అస్త్రశస్త్ర+ఆదిక్షతంబులు+అగు= అస్త్రశస్త్రాదుల దెబ్బలవలన అయిన గాయాలు కల; అవయవంబులతోడన్= అంగాలతో;

రాజదర్శన విషణ్ణులు+అగుచున్= దుర్యోధనుడిని చూడటంకొరకు విచారపడుతూ; కృపకృతవర్మ+అశ్వత్థామలు= కృప కృతవర్మ అశ్వత్థామ లనువారు; అచ్చటన్+మెలంగి= అక్కడ తిరుగుచూ; దబ్బాటుగాన్+నన్నున్+కని= ఆకస్మికంగా నన్ను చూచి; సంజయా! బ్రదికితే? అని పలికి= సంజయా! బ్రతికి ఉన్నావా? అని అడిగి; కురుపతి= దుర్యోధనుడు; ప్రాణంబులన్+ కలఁడే?= ప్రాణాలతో ఉన్నాడా?; అని అడిగినన్= అని అడుగగా; ఆ+జననాథుండు+ఒక్కండును= ఆ రాజు ఒంటరిగా; పాఱుతెంచి= పరుగెత్తివచ్చి; నీరిలో డాఁగిఉన్న తెఱంగు+ఎఱింగించి= నీటిలో దాగిఉన్న విధం తెలిపి; ఆ హ్రదంబు+చూపి= ఆ నీటిలో మడుగు చూపించి; ఏము+ఇరువురము= మేమిద్దరము; (సంజయదుర్యోధనులు); ఒండొరులతోన్= ఒకరితో మరొకరు; ఆడిన మాటలు= మాట్లాడినమాటలు; తేటపడన్+చెప్పినన్= సుస్పష్టంగా చెప్పగా; వారలు= కృతవర్మ అశ్వత్థామలు; అత్యంత= మిక్కిలి; విషాదంబున్+ఒంది= దుఃఖపడి.

తాత్పర్యం: సంజయుడి కా విధంగా చెప్పి దుర్యోధనుడు తన మాయాశక్తితో ఆ కొలనులోనికి వెళ్ళి తన శరీరానికి నీళ్ళు తగులకుండా సంస్తంభన విద్యతో ఉన్నాడు. ఆ మీదట అలసిన గుఱ్ఱాలతో ఒంటికి తగిలిన దెబ్బలతో దొరను చూడటానికై దుఃఖపడుతున్నవారైన కృప కృతవర్మ అశ్వత్థామలు అక్కడ తిరుగుతూ అకస్మాత్తుగా నన్ను చూచి 'సంజయా! బ్రతికే ఉన్నావా? కురురాజు ప్రాణాలతో ఉన్నాడా?' అని అడిగితే ఆ రాజు ఒకడు మాత్రమే పరుగెత్తివచ్చి ఈ నీటిలో దాగిఉన్న విధానాన్ని తెలిపి, ఆ కొలనును చూపి మేమిద్దరం మాట్లాడుకొన్న మాటలు స్పష్టంగా చెప్పగా, కృప కృతవర్మ అశ్వత్థామలు చాలా దుఃఖించి.

చ. **'నరవరుఁ డేము సంగరమునం బడకున్కి యెఱుంగఁ డక్కటా!**
బరవస మేది వచ్చెఁ బిదపన్ వినియున్ మముఁ గూర్చికోలు దు
స్తర మనుబుద్ధి నిప్పటికి శత్రుల కన్మొఱఁగం దలంచి యీ
వెరవున డాఁగె; సర్వపృథివీపతి దుర్దశ నిట్లు పొందునే? 17

ప్రతిపదార్థం: అక్కటా!= అయ్యో!; నరవరుఁడు= రాజగు దుర్యోధనుడు; ఏము= మేము; సంగరమునన్+పడక+ఉన్కి= యుద్ధంలో చావకుండటం; ఎఱుంగఁడు= తెలియడు; బరవసము+ఏది= ధైర్యం నశించి; వచ్చెన్; పిదపన్= ఆ పిమ్మట; వినియున్= విని కూడా; మమున్+కూర్చికోలు= మమ్ము కలిపికొనటం; దుస్తరము= సాధ్యంకాదు; అను బుద్ధిన్= అనే ఆలోచనతో; ఇప్పటికిన్= ఇంతసేపటికి; శత్రుల= పగవారి; కన్మొఱఁగన్+తలంచి= కనుగప్పదలచుకొని; ఈ వెరవునన్= ఈ ఉపాయంతో; డాఁగెన్= దాగికొన్నాడు; సర్వపృథివీపతి= సమస్త భూమండలాధీశుడు(దుర్యోధనుడు); ఇట్లు= ఈ విధంగా; దుర్దశన్= కష్టదుఃస్థితిని; పొందునే?= అనుభవించునా?

తాత్పర్యం: రారాజు దుర్యోధనుడికి మేము యుద్ధరంగంలో చావకపోవటం తెలియదు; ధైర్యాన్ని పోగొట్టుకొన్నాడు. అయ్యో! పిమ్మట మేము జీవించి ఉన్నామని విని కూడా మమ్ము కలియటం అసాధ్యం అనే ఊహతో శత్రువుల కనుగప్పి ఉపాయంతో ఈ కొలనులో దాగాడు. సమస్తభూమండలాధీశుడు ఇట్టి కష్టాన్ని పొందటమా?'

వ. **అవ్విభుండు పెనుఁబ్రాపై నిలిచిన నేము పగతురతోడం బెనంగంజాలుదు మను సమయంబున విజయవిజృంభితు లగు పాండవులు సబలంబుగా నచ్చేరువ నడతెంచిన నా రథికులు దా రచ్చోట నిలుచుట కార్యంబు గా దని తలంచి ననుఁ గృపాచార్యు రథంబు మీఁద నిడికొని మనశిబిరంబున కరిగి; రందు. 18**

ప్రతిపదార్థం: ఆ+విభుండు= ఆ రాజు; పెనుప్రాపు+ఐ నిలిచినన్= పెద్ద అండగా ఉన్నట్లయితే; ఏము= మేము (ముగ్గురం); పగతుర తోడన్= శత్రువులతో; పెనంగన్+చాలుదుము= యుద్ధం చేయగలుగుదుము; అను సమయంబునన్= అనే కాలంలో; విజయ విజృంభితులు= విజయం పొందటంచేత ఉప్పొంగుతున్నవారు; అగు= అయిన; పాండవులు; సబలంబుగాన్= సైన్యంతో; ఆ+చేరువన్+నడతెంచినన్= ఆ సమీపానికిరాగా; ఆ రథికులు= ఆ రథవీరులు; తారు= తాము; ఆ+చోటన్= ఆ స్థలంలో; నిలుచుట= ఉండటం; కార్యము కాదు+అని= తగదని; తలంచి= భావించి; ననున్= నన్ను (సంజయుడిని); కృపాచార్యు రథంబుమీఁదన్= కృపాచార్యుడి తేరిమీద; ఇడుకొని= పెట్టుకొని; మన శిబిరంబునకున్= మన గుడారానికి; అరిగిరి= వెళ్ళారు; అందున్= అక్కడ (ఆ శిబిరంలో).

తాత్పర్యం: ఆ రాజు పెద్ద దిక్కుగా ఉన్నట్లయితే విరోధులతో యుద్ధం చేయగలము' అని మేము చెపుతున్న సమయాన విజయగర్వంతో పేట్రేగిన పాండవులు సైన్యంతో ఆ సమీపానికి రాగా వారు తా మక్కడ ఉండటం తగినది కాదని తలచి నన్ను కృపాచార్యుడి రథంమీద పెట్టుకొని, మన గుడారానికి వెళ్ళారు. అక్కడ. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. కలగొనఁ బాఱుచున్ సతులు గన్నుల నశ్రుజలంబు లొల్క వీఁ
పులపయి పెన్నెఱుల్ విరియఁ బొడ్మఁగ లాలలు రోదనధ్వనుల్
సెలఁగఁగ మోములుం దలలుఁ జేతులుఁ గెంపుగ మోఁదికొంచు భ
ర్తల సహజన్ములన్ సుతులఁ దండ్రులఁ బేర్కొని యార్తి నొందుచున్. 19

ప్రతిపదార్థం: కలగొనన్= కలతనంది; పాఱుచున్= పరుగెత్తుతూ; సతులు= స్త్రీలు; కన్నులన్+అశ్రుజలంబులు+ఒల్కన్= కళ్ళలో దుఃఖబాష్పాలు చిందగా; వీఁపులపయిన్= వీపులమీద; పెన్నెఱుల్= పెద్దవెంట్రుకలు(అనగా కురులు); విరియన్= విడిపోగా; లాలలు పొడ్మఁగన్= పెదవులనుండి చొంగ పుట్టగా; (ఏడ్చినపుడు సామాన్యంగా కలిగే చేష్ట); రోదనధ్వనుల్= ఏడ్పుల శబ్దాలు; చెలఁగఁగన్= మ్రోయగా; మోములున్+తలలు+చేతులు+కెంపుగన్+మోఁదికొంచున్= ముఖాలు, తలలు, చేతులు, ఎర్రగా అయ్యేటట్లు కొట్టుకొంటూ; భర్తలన్= మగలను; సహజన్ములన్= తోబుట్టువులను; సుతులన్= కుమారులను; తండ్రులన్= కన్నతండ్రులను; పేర్కొని= పిలుస్తూ; ఆర్తిన్+ఒందుచున్= పెద్దగా దుఃఖిస్తూ.

తాత్పర్యం: స్త్రీలు కలతచెంది పరుగెత్తుతూ, కనులనుండి చిందే దుఃఖాశ్రువులతోను, వీపులపై విరిసి వ్రేలాడే తలవెండ్రుకలతోను, నోటినుండి కారే చొంగతోను, ఏడ్పువలన కలిగే శబ్దంతో మొగాలు, తలలు, చేతులు ఎరుపెక్కగా మోదుకొంటూ, మగలను, తోబుట్టువులను, కుమారులను, తండ్రులను పేర్కొంటూ రోదిస్తూ. (తరువాతిపద్యంతో అన్వయం).

వ. హతశేషు లైన పతాకాతపత్రచామరభృదాది జనంబులవలన సకలజనసంక్షయంబు వినుచు నేలంబడి పొరలుచు లేచుచునికి యత్యంతకరుణంబై యుండె; నప్పుడు మాన్యవనితాజనంబులకావలివారునుం గడంగి వారలం దగిన వాహనంబులపై నిడికొని యిక్కడకు వచ్చిరి; తక్కినభీతజనంబులు పలుదెసలం బాఱె; రట్టియెడ నీ కొడుకు యుయుత్సుండు శోకసంతప్తచిత్తుండై. 20

ప్రతిపదార్థం: హతశేషులు+అయిన= చావగా మిగిలిన; పతాకా+ఆతపత్ర+చామరభృత్+ఆది+జనంబులవలనన్= జెండాలను, గొడుగులను, చామరాలను మోసేవారు మొదలైనవారివలన; సకల జనసంక్షయంబు వినుచున్= జనులందరిచావును వింటూ;

నేలన్+పడి= భూమిమీద పడి; పొరలుచున్ లేచుచున్+ఉనికి= పొర్లుతూ లేస్తూ ఉండటం; అత్యంతకరుణంబు+ఐ ఉండెన్= మిక్కిలి జాలిగొలిపేదిగా ఉండింది; అప్పుడు; మాన్య వనితాజనంబుల కావలివారును= గౌరవం కల స్త్రీ జనానికి ఉన్న రక్షకులున్నూ; కడంగి= పూని; వారలన్+తగిన వాహనంబులపైన్ ఇడికొని= వారందరిని తగిన వాహనాలమీద పెట్టుకొని; ఇక్కడకున్ వచ్చిరి; తక్కిన= మిగిలిన; భీతజనంబులున్= భయపడిన వారు; పలుదెసలన్+పాఱిరి= అనేక దిక్కులకు పరుగెత్తారు; అట్టిఎడన్= ఆ సమయంలో; నీ కొడుకు యుయుత్సుండు= నీ కుమారుడు - యుయుత్సుడనేవాడు; శోకసంతప్త చిత్తుండు+ఐ= దుఃఖంతో వేగిన మనసుతో.

తాత్పర్యం: చనిపోగా మిగిలిన వారు ధ్వజాలను, గొడుగులను, చామరాలను చేతపట్టుకొని వచ్చిన మనుష్యుల మూలాన సమస్త జననాశనాన్ని వింటూ భూమిమీద పొర్లుతూ లేస్తూ ఉండటం మిక్కిలి శోచనీయంగా ఉండింది. గౌరవంగల స్త్రీలను వారి సేవకులు తగిన వాహనాలతో ప్రయత్నపూర్వకంగా తీసికొని ఇక్కడకు వచ్చారు. భయపడిన జనం నానాదిక్కులకు పరుగులు తీశారు. అప్పుడు నీ కుమారుడు యుయుత్సుడు దుఃఖంతో మండే మనస్సుతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

శా. 'గంగానందనుఁ డాదిగాఁగఁ గురుసంఘం బెల్ల సంగ్రామధా
త్రిం గూలెం; బతియొక్కరుండు పటు కౌంతేయప్రతాపంబు పే
ర్మిం గీడ్పాటున కోర్చి పాఱె; విధి నామేఁ బ్రాణముల్ నిల్పె; నా
కుం గాంతాజనులం దగంగఁ బురికిం గొంచేఁగు టర్హం బగున్. 21

ప్రతిపదార్థం: గంగానందనుఁడు+ఆదికాఁగన్= భీష్ముడు మొదలుగా; కురుసంఘంబు+ఎల్లన్= కౌరవవర్గమంతా; సంగ్రామధాత్రిన్= యుద్ధభూమిలో; కూలెన్= కూలిపోయింది; పతి ఒక్కరుండు= రాజొక్కడు మాత్రం; పటుకౌంతేయ ప్రతాపంబు పేర్మిన్= తీవ్రమైన పాండవుల శౌర్యాధిక్యానికి; కీడ్పాటునకున్+ఓర్చి= కష్టానికి తట్టుకొని; పాఱెన్= పరుగెత్తాడు; విధి= దైవం; నా మేన్+ప్రాణముల్ నిల్పెన్= నా శరీరంలో ప్రాణాలను నిల్పింది; నాకున్; కాంతాజనులన్= ఆడువారిని; తగంగన్= తగినట్లుగా; పురికిన్+కొంచున్= ఊరికి పిలుచుకొని; ఏఁగుట= వెళ్ళటం; అర్హంబు+అగున్= యోగ్యమైనపని ఔతుంది.

తాత్పర్యం: భీష్ముడు మొదలుగా కౌరవులందరూ యుద్ధభూమిలో నశించారు. రా జొక్కడే (దుర్యోధనుడొక్కడే) తీవ్రమయిన పాండవుల ధాటికి ఓర్చి పరుగులు తీశాడు. దైవం నా ప్రాణాన్ని నిల్పింది. ఈ ఆడువారిని హస్తినాపురికి పిలిచికొనిపోవటం ఉచితమైన పని.

వ. ఏకాదశాక్షౌహిణీ భర్త మన్నించు మానవతులు గాసి యగుదురే?' యని మనంబునం దలపోసి రథంబు డిగ్గి యత్తెఱంగు శౌరికి నజాతశత్రునకు నెఱింగించిన నప్పాండవాగ్రజుండు పరమకృపాపరుండు గావునఁ బ్రీతుం డై శౌరియాననం బాలోకించి 'యది మేల కాదె?' యని పలికి, యతం డనుమతి సేయ నవ్వైశ్యాపుత్త్రుఁ బరిరంభణంబు సేసి 'లెస్స తలంపు తలంచి' తని సంభావించి వీడుకొలిపిన, నతండు రథారూఢుం డై రథ్యంబులఁ ద్వరితగతి నడపి భూపతి ప్రేయసీజనంబుల కధ్యక్షు లగువృద్ధకంచుకులం గలసి వారును దానును వారల నుచితప్రకారంబులఁ దేర్చి పురంబు ప్రవేశించునప్పుడెదుర విదురుం గాంచి. 22

ప్రతిపదార్థం: ఏకాదశ= పదకొండు; అక్షౌహిణీభర్త= అక్షౌహిణులసేనకు నాయకుడు; మన్నించు= గౌరవించే; మానవతులు= స్త్రీలు; గాసి అగుదురే?= కష్టాలపాలగుదురే?; అని మనంబునన్+తలపోసి= అని మనసులో తలచి; రథంబుడిగి= తేరు దిగి; ఆ+తెఱంగు శౌరికిన్= ఆ విధమును శ్రీకృష్ణుడికీ; అజాతశత్రునకున్= ధర్మరాజునకూ; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; పరమ కృపాపరుండు+కావునన్= మిక్కిలి దయగలవాడు కావటంచేత; ప్రీతుండై= సంతోషించినవాడై; శౌరి= శ్రీకృష్ణుడి; ఆననంబు+ఆలోకించి= మొగాన్ని చూచి; అది మేలు+అ కాదె= అది మంచిదే కదా!; అని పలికి= అనిచెప్పి; అతండు+అనుమతి+చేయన్= అతడు అంగీకరించగా; ఆ వైశ్యాపుత్రున్= ఆ వైశ్యాకుమారుడిని; పరిరంభణంబు+చేసి= కౌగిలించుకొని; లెస్స తలంపు తలంచితి(వి)= మేలగు యోచన చేశావు; అని సంభావించి= అని ఆదరించి; వీడుకొల్పినన్= పంపగా; అతండు= ఆ యుయుత్సుడు; రథారూఢుండు+ఐ= తేరునెక్కిన వాడై; రథ్యంబులన్+త్వరితగతిన్= గుర్రాలను వేగంగా తోలి; భూపతి ప్రేయసీ జనంబులకున్= రాజస్త్రీలకు; అధ్యక్షులు+అగు= అధికారులయిన; వృద్ధకంచుకులన్+కలిసి= ముసలికంచుకులను కలిసికొని; వారును+తానును= తామంతా; వారలన్; ఉచిత ప్రకారంబులన్+తేర్చి= సముచితంగా ఓదార్చి; పురంబు ప్రవేశించునప్పుడు; హస్తినాపట్టణం లోనికి వెళ్ళేటప్పుడు; ఎదురన్+విదురున్+కాంచి= ఎదురుగా విదురుడిని చూచి.

తాత్పర్యం: 'పదునొకండక్షౌహిణుల సేనలకు నాయకుడు ఆదరించే స్త్రీలు ఇంత కష్టానికి గురి అయ్యారే! అని మనసులో తలపోసి తేరు దిగి, శ్రీకృష్ణుడికి ధర్మరాజుకు తెలియచేయగా ధర్మరాజు దయతో ప్రీతిగా శ్రీకృష్ణుడి ముఖాన్ని చూచి 'అది మంచిదే కదా!' అని చెప్పి, ఆయన అనుమతితో ఆ వైశ్యాకుమారుడిని కౌగలించుకొని మంచి యోచన చేశావని, అతడిని ఆదరించి పంపాడు. అట్లా పంపగా యుయుత్సుడు రథారూఢుడై త్వరితగతిని రాజాంతఃపురకాంతలను రక్షించే అధికారులయిన వృద్ధకంచుకులను కలసి, వారితోపాటు తానుకూడా ఆ స్త్రీలను తగువిధంగా ఓదార్చి, హస్తినాపురంలో ప్రవేశించేటప్పుడు విదురుడు ఎదురుగా రాగా చూచినవాడై. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. అతఁ డడుగంగ శల్యసుబలాత్మజులుం బలమంతయున్ రణ
క్షితిఁ బడు టేర్పడం బలికి, చెప్పెఁ దురంగము డిగ్గి మేదినీ
పతి యొకరుండు పాఱుటయుఁ బాండవముఖ్యుఁడు ప్రీతిఁ బంపఁగా
నతివల నిల్లు సేర్చుటకు నై యిట రాకయు మానవేశ్వరా! 23

ప్రతిపదార్థం: మానవేశ్వరా!= ఓ రాజా! ధృతరాష్ట్రా!; అతఁడు+అడుగంగన్= ఆ విదురుడుఅడుగగా; శల్యసుబలాత్మజులున్= శల్యుడును; గాంధార రాజకుమారుడును (శకుని); బలము+అంతయున్= సేన మొత్తము; రణరక్షితిన్= యుద్ధభూమిలో; పడుట= పడిపోవటం(చనిపోవటం); ఏర్పడన్+పలికి= స్పష్టంగా చెప్పి; తురంగము డిగ్గి= గుర్రంనుండి దిగి; మేదినీపతి= రాజు(దుర్యోధనుడు); ఒకరుండు పాఱుటయున్= ఒకడే పారిపోవటం; పాండవముఖ్యుఁడు= ధర్మరాజు; ప్రీతిన్+పంపఁగాన్= ప్రేమతో పంపగా; అతివలన్= స్త్రీలను; ఇల్లు చేర్చుటకునై= ఇంటికి చేర్చటానికై; ఇటు రాకయున్= ఇట్లా రావటం; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఓ రాజా! విదురు డడుగగా శల్యుడు, గాంధారరాజు కుమారుడు శకునీ, సేనమొత్తం యుద్ధభూమిలో చనిపోవటం స్పష్టంగా చెప్పి, దుర్యోధనుడు గుర్రంనుండి దిగి ఒంటరిగా పరుగెత్తటం, ధర్మరాజు ప్రేమతో పంపగా అంతపురస్త్రీలను వారి ఇళ్ళకు చేర్చటానికి ఇక్కడకు (హస్తినకు రావటం) (యుయుత్సుడు చెప్పాడు).

వ. అనిన విని యతండు శోకవ్యాకులుం డగుచు నవ్వైశ్యాపుత్త్రుం బొగడి కాలోచితకృత్యం బాచరించి 'లెస్సచేసి' తని పలికి మఱియు నిట్లనియె. 24

ప్రతిపదార్థం: అనిన్+విని అతండు= విదురుడు; శోకవ్యాకులుండు+అగుచున్= దుఃఖంతో చీకాకు పడుతూ; ఆ+వైశ్యాపుత్రున్+ పొగడి= ఆ వైశ్యకుమారుడైన యుయుత్సుడిని పొగడి; కాలోచితకృత్యంబు+ఆచరించి;= ఆ సమయానికి తగిన పనులు చేసి; లెస్స చేసితి+అని పలికి= మంచిపని చేశావని మాటాడి; మఱియున్= ఇంకను; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అని చెప్పగా విని విదురుడు దుఃఖంతో కలతచెందాడు. యుయుత్సుడిని పొగడాడు. కాలోచిత కృత్యాలను చేసి, 'నీవు మంచిపని చేశా'వని పలికి, ఇంకను ఈ విధంగా అన్నాడు.

తే. 'ఎప్పుడును సంజయుఁడు వచ్చి యెఱుఁగఁ జెప్పుఁ। బతికి సమరవిశేషంబు లతఁడు నేఁటి
తెఱఁగు చెప్పెడిఁ గాక యేతెంచి మున్న। మనము వినిపింపఁ గాఁ దగ దనఘ! దీని. 25

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా! ఎప్పుడును; సంజయుఁడు; వచ్చి; పతికిన్= రాజుకు, ధృతరాష్ట్రుడికి; ఎఱుఁగన్+ చెప్పున్= తెలియచేస్తాడు; అతఁడు; నేఁటి తెఱంగున్= ఈనాటి పరిస్థితిని; పతికిన్= రాజునకు; సమర= యుద్ధమునందలి; విశేషంబులు= వివరములను; చెప్పెడిన్+కాక= చెప్పుగాక; మున్ను ఏతెంచి= ముందుగా వచ్చి; మనము; దీనిన్= ఈ వార్తను; వినిపింపఁగాన్= చెప్పగా; తగదు= తగదు.

తాత్పర్యం: 'సంజయుడు వచ్చి యుద్ధంలో జరిగిన అన్ని విషయాలను రాజునకు తెలుపుతాడు. ఈ దినం జరిగిన దానిని కూడ ఆతడే చెప్పుగాక! ముందుగా వచ్చి మనం తెలుపరాదు' అని ఇంకా ఇట్లా అన్నాడు.

వ. 'ఒండు ముఖంబున నివ్వార్త నగరు సొరకుండునట్లుగా సంవిధానంబు సేయవలయు; నీవు దుర్యోధను ప్రియాజనంబులను దద్రక్షకులను దోడ్కొని భవదీయమందిరంబునకుం జనుము; తక్కటివారి నంతంత నడఁకువతో నిలువ నియమింపవలయు' నని పలికి తానును యుయుత్సుండును సావధానప్రయత్నంబున నవ్విధానంబు సంఘటించి, నీ తమ్ముండు పెద్దమొగసాలం జాలుమానుసులం గావలివెట్టి, యభ్యంతరంబు ప్రవేశించి యుండె; నక్కడఁ గౌరవసేనాసన్నివేశం బత్యంతవిరళజనం బయ్యెఁ; మున్ను మాతంగతురంగసుభట బృంహిత హేషిత భాషణంబులవలన శబ్దాంతరంబు కర్ణగోచరంబు గానియట్టి యా శిబిరంబు నిశ్శబ్దం బయి యుండె ననిన విని యాంబికేయుం డిట్లనియె. 26

ప్రతిపదార్థం: ఒండు ముఖంబునన్= వేరొకరివలన; ఈ+వార్త నగరు చొరకుండునట్లుగాన్= ఈ మాట అంతఃపురానికి చేరకుండేటట్లు; సంవిధానంబు= కట్టడి; చేయవలయున్= చేయాలి; నీవు; దుర్యోధను; ప్రియాజనంబులను= ప్రియురాండ్రను; తద్+రక్షకులను= వారి కావలివారిని; తోడ్కొని= తీసికొని; భవదీయ= నీయొక్క; మందిరంబునకున్= ఇంటికి; చనుము= వెళ్ళుము; తక్కటివారిన్= మిగిలినవారిని; అంతంతన్= అక్కడక్కడ; అడఁకువతోన్= వినయంతో; నిలువన్= నిలచేటట్లు; నియమింపవలయున్= ఏర్పాటుచేయాలి; అని పలికి= అని చెప్పి; తానును; యుయుత్సుండును; సావధాన ప్రయత్నంబునన్= శ్రద్ధతో కూడిన ప్రయత్నంతో; ఆ+విధానంబున్= ఆ పద్ధతిని; సంఘటించి= చేసి; నీ తమ్ముండు= నీ తమ్ముడు; పెద్దమొగసాలన్= పెద్దవాకిలికి; చాలు మానుసులన్= సమర్థులైన మనుష్యులను; కావలి పెట్టి= కాపలా నిలిపి; అభ్యంతరంబున్= అంతఃపురాన్ని; ప్రవేశించి= చేరి; ఉండెన్= ఉన్నాడు; అక్కడన్= యుద్ధభూమిలో; కౌరవసేన= కురుసేనయొక్క; సన్నివేశంబు=

శిబిరం; అత్యంత= మిక్కిలి; విరళజనంబు+అయ్యెన్= పలుచబడిన మనుష్యులున్నదిగా ఐనది; మున్ను= అదివరలో; మాతంగ= ఏనుగుల; తురంగ= గుర్రాల; సుభట= శిక్షితులైన సేనలయొక్క; బృంహిత= ఘీంకారాలతోను; హేషిత= సకిలింతలతోను; శబ్ద+అంతరంబు= వేరే శబ్దం; కర్ణగోచరంబు+కాని అట్టి= చెవికి వినబడని; ఆ శిబిరంబు= ఆ సైనికుల గుడారం; నిశ్శబ్దంబు+అయి ఉండెన్= అలజడి లేకుండా ఉన్నట్టిది అయింది; అనినన్ విని= అనగా విని; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: వేరొకరిద్వారా ఈ వార్త నగరికి చేరకుండా ఉండేటట్లు కట్టడి చేయాలి. నీవు దుర్యోధనుడి అంతఃపురకాంతలను, వారి కావలివారిని పిలుచుకొని నీ ఇంటికి పొమ్ము. మిగిలినవారిని అక్కడక్కడ అడకువతో ఉండేటట్లు ఏర్పాట్లు చేయుము.' అని చెప్పి, తానూ యుయుత్సుడూ తగిన ప్రయత్నంతో ఆ పనిని నిర్వహించి నీ తమ్ముడైన విదురుడు తగినవారిని పెద్దవాకిలికి కాపుగా పెట్టి అంతఃపురం చేరాడు. ఇక యుద్ధరంగంలో కౌరవసైనికులు పలుచబడ్డాడు. ఒకనాడు మదపుటేనుగుల ఘీంకారాలు, గుర్రాల సకిలింతలు, పదాతి సైనికుల వీరస్వరాలతో శిబిరం ఎంతో సందడిగా ఉండి, వేరే చప్పుళ్ళను వినటానికి సాధ్యపడేది కాదు. అట్టి గుడారం ఇప్పుడు నిశ్శబ్దంగా ఉన్నది' అని చెప్పగా ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు:

క. 'సూతసుత! యిట్లు పగతుర । చేత మనబలంబు రాజసింహులు బంధు
వ్రాతమ్మును సమసినఁ దుది । నే తెఱఁగున నడచితిరి? నరేంద్రుఁడు మీరున్?' 27

ప్రతిపదార్థం: సూతసుత!= ఓ సంజయా!; ఇట్లు= ఈ మాదిరిగా; పగతుర చేతన్= విరోధులవలన; మన బలంబు= మన సేనలు; రాజసింహులు= రాజ శ్రేష్ఠులూ; బంధువ్రాతమ్మును= బాంధవుల సమూహమూ; సమసినన్= నాశనంకాగా; తుదిన్= చివరకు; నరేంద్రుఁడు= రాజును(దుర్యోధనుడు); మీరున్= మీరందరును; ఏ తెఱఁగునన్= ఏ విధంగా; నడచితిరి?= ప్రవర్తించారు?

తాత్పర్యం: 'ఓ సంజయా! ఈ విధంగా వైరులచేత మన సేనలు, రాజులు, బంధు సమూహం నాశనమయిన పిమ్మట మన రాజూ, మీరూ ఏం చేశారు?'

వ. అనుటయు నమ్మహీకాంతునకు సంజయుం డిట్లనియె 'నంత నయ్యెడకుఁ గౌంతేయులు సైన్యంబును దారును సుయోధనాన్వేషణపరు లయి రయంబున నరుగుదెంచు కలకలంబు వీతెంచిన. 28

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఆ+మహీకాంతునకున్= ఆ రాజునకు(ధృతరాష్ట్రుడికి); సంజయుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అంతన్= అంతలో; ఆ+ఎడకున్= ఆ చోటికి; కౌంతేయులు= పాండవులు; సైన్యంబును= సేనయు; తారును= తామును; సుయోధన+అన్వేషణపరులు+అయి= దుర్యోధనుడిని వెదకువారై; రయంబునన్= వేగంగా; అరుగుదెంచు= వచ్చే; కలకలంబు= కోలాహలం; వీతెంచినన్= వినరాగా.

తాత్పర్యం: అపుడు సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లాఅన్నాడు: 'అంతలో పాండవులు ససైన్యంగా కలకలారావంతో సుయోధనుడిని వెదకుతూ ఆ చోటికి రాగా (తరువాతి పద్యంతో అన్వయం).

క. కృతవర్మయుఁ గృపుఁడును గురు । సుతుఁడును గనుఁగొనుచు నొండుచోటికిఁ జని; ర
ట్లతిరభసంబునఁ గుంతీ । సుతు లచటికి వచ్చి నీదుసుతుఁ బలుగడలన్. 29

ప్రతిపదార్థం: కృతవర్మయున్ కృపుఁడును= కృతవర్మ, కృపాచార్యుడు; గురుసుతుఁడును= అశ్వత్థామయు; కనుఁగొనుచున్= వెదకుతూ; ఒండు చోటికిన్= వేరొక దిక్కునకు; చనిరి= వెళ్ళారు; అట్లు= ఆ విధంగా; అతిరభసంబునన్= మిక్కిలి తొందరగా; కుంతీసుతులు= కుంతి కుమారులు (పాండవులు); అచటికిన్= ఆ చోటుకు; వచ్చి; నీదు సుతున్= నీ కుమారుడిని; పలుగడలన్= అనేక దిక్కులలో.

తాత్పర్యం: కృతవర్మా, కృపుడూ, అశ్వత్థామా వారిని గమనించి మరొకచోటికి పోయారు. మిక్కిలి తొందరగా పాండవులు ఆ చోటికి వచ్చి నీ కుమారుడి కొరకు అనేక దిక్కులలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. అన్వేషించి కానమికి విషాదంబు నొందుచు మరలి చనిరి; చనునప్పు డజాతశత్రుండు నీ పుత్రునగరిలోని జనంబులఁ గృపతోడం గనుంగొని 'వెఱవకుండుఁ' డని పలికి చనియె; నట్లు వారు నిజశిబిరంబునకుం జనుటయు, మనయోధవరులు నేను మనంబున నడలు గదుర నమ్మడువుకడకుం బోయితిమి; కృపాదు లగు ముప్పురు దమరాక యెఱింగించి యమ్మనుజపతి కి ట్లనిరి. 30

ప్రతిపదార్థం: అన్వేషించి= వెదకి; కానమికిన్= కనపడనందుకు; విషాదంబున్+ఒందుచున్= చింతిస్తూ; మరలి చనిరి= తిరిగి వెళ్ళారు; చనునప్పుడు= వెళ్ళేటప్పుడు; అజాతశత్రుండు= ధర్మరాజు; నీ పుత్రునగరిలోని జనంబులన్= నీకుమారుడి శిబిరంలోని జనులను; కృపతోడన్+కనుంగొని= దయతో జూచి; వెఱవక+ఉండుఁడు+అని పలికి+చనియెన్= భయపడవద్దని చెప్పి వెళ్ళాడు; అట్లు వారు= ఆ విధంగా పాండవులు; నిజ శిబిరంబునకున్+చనుటయున్= తమ గుడారాలకు వెళ్ళగా; మన యోధవరులున్ నేనున్= మన వీరులూ నేనూ; మనంబునన్= మనసులో; అడలు+కదురన్= భయం కలుగగా; ఆ+మడువు కడకున్+పోయితిమి= ఆ కొలని వద్దకు (దుర్యోధనుడున్న ద్వైపాయన హ్రదం వద్దకు) పోయాము; కృపాదులగు= కృపుడు మొదలైన; ముప్పురు; ఆ+మనుజపతికిన్= రాజయిన ఆ దుర్యోధనుడికి; తమరాక= తాము రావటం; ఎఱింగించి= తెలిపి; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు:

తాత్పర్యం: (పాండవులు) వెదకి, కనబడనందులకు చింతిస్తూ తిరిగి వెళ్ళారు. పోయేటప్పుడు ధర్మరాజు నీ కుమారుడి శిబిరంలోని జనులను దయతో చూచి, 'భయపడకండి' అని వెళ్ళాడు. వారు వెళ్ళిన పిమ్మట మనసులో భయం కలుగగా మన వీరులతో కలసి నేను ఆ కొలను దగ్గరకు వెళ్ళాను. కృపాదులైన ముగ్గురూ రారాజునకు మా రాకను తెలిపి, పిమ్మట ఈ విధంగా అన్నారు:

కృపకృతవర్మాశ్వత్థామలు దుర్యోధనుం గని సంభాషించుట (సం.9-29-41)

క. 'లెమ్ము కురునాథ! కడఁగుము । మమ్ముం గొని పాండుపుత్రమథనమునకు; సై
న్య మ్మదియును నీచేతఁ గృ । శ మ్మయ్యెడుఁ జుమ్ము! వలదు శంకింపంగన్. 31

ప్రతిపదార్థం: లెమ్ము కురునాథ!= కురురాజా! లేవయ్యా; మమ్మున్+కొని= మా ముగ్గురిని తీసికొని; పాండుపుత్ర= పాండురాజ కుమారుల; మథనమునకున్= సంహారానికి; కడఁగుము= పూనుకొమ్ము; సైన్యమ్ము+అదియును= ఆ సేనకూడా; నీచేతన్= నీవలన; కృశమ్ము+అయ్యెడున్+చుమ్ము!= బలహీన పడగలదు సుమా!; శంకింపంగన్= అనుమానించగా; వలదు= వద్దు.

తాత్పర్యం: 'కురురాజా! లెమ్ము. మా ముగ్గురి అండతో పూనుకొని పాండవ సంహారానికి నడుము బిగించుము. నిస్సందేహంగా నీచేత పాండవ సైన్యం క్షీణిస్తుంది. వెనుకాడవద్దు.

వ. అట్లు కాక గెలిచి భూమి యేలుట యొండెఁ జచ్చినాకలోకసుఖం బనుభవించుట యొండెం గాని నీయట్టివాని కిట్టితెఱంగు కర్తవ్యంబుగా' దని పలికిన విని యవ్విభుండు వారల కి ట్లనియె. 32

ప్రతిపదార్థం: అట్లు కాక= ఆ విధంగా కాకుండా (పాండవులను జయించక); గెలిచి= జయించి; భూమి ఏలుట= రాజ్యాన్ని పాలించుటో; ఒండె= లేదా; చచ్చి; నాకలోక సుఖంబు+అనుభవించుట+ఒండెన్= స్వర్గసుఖాలను అనుభవించటమో; కాని; నీ+అట్టివానికిన్= నీ వంటివాడికి; ఇట్టి తెఱంగు= ఈ విధంగా ఉండటం(దొంగచాటుగా ఉండటం); కర్తవ్యంబు కాదు= చేయదగిన పనికాదు; అని= అంటూ; పలికినన్= మాటాడగా; విని; ఆ+విభుండు(దుర్యోధనుడు); వారలకున్= వారితో (కృపాదులతో); ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అంతే కాక గెలిచి భూమిని పాలించటం గాని, చనిపోయి స్వర్గలోక సుఖాన్ని అనుభవించటంగాని తగుతుంది. కాని నీవంటి వాని కిటువంటి తీరు తగదు' అని చెప్పగా విని ఆ రాజు వారితో ఇట్లా అన్నాడు:

చ. 'తనువు ఘనాస్త్రశస్త్రములతాఁకున నొప్పిని డప్పి పుట్టె నా
మనము వశంబు గా కెడలె మాటల చందము సూడ మీరు డ
స్సినయటు లున్నవార లనుజీవులు లేరు తొలంగి నేఁటి మా
త్ర నిలువుఁ డెల్లి పైకొని యరాతుల గెల్తము లావు వచ్చినన్. 33

ప్రతిపదార్థం: తనువు= ఒడలు; ఘన+అస్త్రశస్త్రముల= పెను బాణముల, కత్తుల; తాఁకునన్= దెబ్బలతో; (కల్గిన) నొప్పిని= బాధవలన; డప్పి+పుట్టెన్= దాహం కలుగుతున్నది; నా మనంబు= నా మనస్సు; వశంబుకాక+ఎడలెన్= సాధ్యం కాకుండా వికలమయింది; మాటల చందము= మాటల పద్ధతి; చూడన్= చూడగా; మీరు డస్సినఅటులు+ఉన్నవారలు= మీరుఅలసినట్లున్నారు; అనుజీవులు లేరు= సేవకులు లేరు; తొలంగి= తప్పుకొని; నేటిమాత్రన్= ఈ దినం మాత్రము; నిలువుఁడు= ఆగండి; ఎల్లి= రేపు; లావు వచ్చినన్= బలం వస్తే; పైకొని= మీదై; అరాతులన్= వైరులను; గెల్తము= జయిద్దాం.

తాత్పర్యం: 'నా శరీరానికి బాణాలయొక్క, కత్తులయొక్క దెబ్బలమూలంగా కల్గిన నొప్పి వలన దాహంగా ఉన్నది. నా మనసు వశం తప్పుతున్నది. మీరూ అలసినట్లున్నారు. సేవకులు కూడా లేరు. అందుచేత ఈరోజు ఆగండి. శక్తి వస్తే రేపు విజృంభించి వైరులను జయిద్దాం.'

వ. అనవుడు నగ్గురునందనుండు. 34

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆ+గురునందనుండు= ఆ గురుకుమారుడైన అశ్వత్థామ.

తాత్పర్యం: అనగా విని అశ్వత్థామ.

ఉ. 'ఏ లనుమాన? మేను సమయించెద వైరము నేఁటితోడఁ; బాం
చాలుర నెల్లఁ దీవ్రశరజాలములం బొలియించి కాని భూ

పాలక! పుచ్చఁ గత్తళము; పాటిగఁ బట్టుము నాదుమాట; లి
య్యాలితనంబు వాపెదఁ; బ్రియం బొనరించెద నీకుఁ దండ్రికిన్.' 35

ప్రతిపదార్థం: భూపాలక!= ఓ రాజా!; ఏల+అనుమానము?= సందేహ మెందుకు?; వైరము= శత్రుత్వం; నేటితోడన్= ఈ దినంతో; ఏను సమయించెదన్= నేను మాపుతాను; పాంచాలురన్+ఎల్లన్= పాంచాల దేశంవారినందరినీ; తీవ్రశరజాలములన్= వాడిఅయిన బాణాల సమూహాలతో; పొలియించి= సంహరించి; కాని; కత్తళము= కవచం; పుచ్చన్= విడిచిపెట్టను; నాదుమాటలు= నా మాటలు; పాటిగన్= ప్రమాణంగా; పట్టుము; ఈ+ఆలితనంబున్+పాపెదన్= దైన్యాన్ని తొలగిస్తాను; నీకున్; తండ్రికిన్= తండ్రియయిన ధృతరాష్ట్రుడికి; ప్రియంబు+ఒనరించెదన్= ప్రీతి కలిగిస్తాను.

తాత్పర్యం: 'నీ కనుమానం దేనికి? ఈ దినంతో వైరం లేకుండేటట్లు వాడిబాణాలతో పాంచాలురందరినీ చంపి కానీ కవచాన్ని విడువను. ప్రమాణంగా నా మాటను నమ్ముము. ఈ దైన్యాన్ని ముగిస్తాను. నీకూ, తండ్రిగారికి సంతోషం కల్గిస్తాను.' (అని అన్నాడు).

వ. అనియె; నపుడనిల సుతుని వేఁట కాఱులు మాంసభారంబులతోడఁ బరిశ్రాంతులై జలపానార్థం బమ్మడువునకు వచ్చి; రంతకుమున్ను ధర్మనందనుం డొక్కబోయం బొడఁగని 'దుర్యోధనుండు దొలఁగెం జెట్టుచేమల నడంగి యుండునో? మీరు మెలంగు నెడల నరయవలయు' ననిన వాఁడును వృకోదరుని మృగయులలోనివాఁ డగుటఁ దమవారికి నెదురు వోయి యమ్మాట తెలం గెఱిఁగించుటం జేసి యప్పని మనంబులం దున్నట్టి యాబోయ లట్లు కెలన నేమఱి సల్లాపంబులు సేయుచున్న యన్నరనాథుని యారథికవరుల వచనంబులు విని పూర్వాభ్యాసంబువలన నయ్యుక్తి ప్రత్యుక్తుల పరిపాటి దేటపడిన నన్నీటిలో నీకొడుకు డాఁగి యుంట నిశ్చయించి తమలో మెల్లన నిట్లనిరి. 36

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; అప్పుడు= ఆ సమయమున; అనిలసుతుని= భీముడియొక్క; వేఁటకాఱులు= బోయలు; మాంసభారంబులతోడన్= మాంసముయొక్క బరువువలన; పరిశ్రాంతులు+ఐ= అలసినవారై; జలపాన+అర్థంబు= నీరు త్రాగటంకొరకు; ఆ+మడువునకున్ వచ్చిరి= ఆ కొలనుకు వచ్చారు; అంతకు మున్ను= అంతకంటె ముందుగా; ధర్మనందనుండు+ఒక్కబోయన్+పొడఁగని= ధర్మరాజు ఒక బోయవాడిని చూచి; దుర్యోధనుండు తొలఁగెన్= దుర్యోధనుడు తప్పుకొన్నాడు; చెట్టుచేమలన్+అడంగి ఉండునో?= చెట్టు చేమలందు దాగి ఉంటాడేమో!; మీరు మెలంగు+ఎడలన్= మీరు తిరిగేటటువంటి చోటులతో; అరయవలయున్= గుర్తించాలి; అనినన్= అనగా; వాఁడును= ఆ బోయవాడు కూడా; వృకోదరుని= భీముడియొక్క; మృగయులలోని వాఁడు+అగుటన్= బోయలలోని వాడైనందున; తమవారికిన్= తనతోడివారికి; ఎదురు పోయి= ఎదు రేగి; ఆ+మాట తెలంగు+ఎఱింగిచుటన్+చేసి= తెలియజేయటంవలన; ఆ+పని; మనంబులందున్+ఉన్నట్టి= మనసులలో ఉన్న; ఆ బోయలు= ఆ బోయవారు; అట్లు= ఆ విధంగా; కెలనన్= ప్రక్కలయందు; ఏమఱి= ఏమరుపాటుగా; సల్లాపంబులు చేయుచున్నన్= స్వేచ్ఛగా మాటాడుకొంటూ ఉండగా; ఆ+నరనాథుని= ఆ దుర్యోధనుడి; ఆ రథికవరుల= ఆ వీరుల (కృప, కృతవర్మ, అశ్వత్థామల); వచనంబులు విని= మాటలు విని; పూర్వ+అభ్యాసంబువలనన్= వెనుకటి అనుభవంతో; (ఆ+ఉక్తి) ప్రత్యుక్తుల పరిపాటిన్= ఆ పరస్పర సంభాషణల పద్ధతి; తేటపడినన్= స్పష్టపడగా(తెలియగా); ఆ+నీటిలోన్= ఆ నీటిలో; నీ కొడుకు డాఁగియుండుట= నీ కుమారుడు దాగుకొని యుండటం; నిశ్చయించి= నిర్ణయించి; తమలోన్; మెల్లనన్= నెమ్మదిగా(రహస్యంగా); ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు;

తాత్పర్యం: భీముడి బోయవారు మాంసభారంతో అలసి ఆ మడుగు దగ్గరకు నీరు త్రాగేందుకు వచ్చారు. ధర్మజు డంతకు ముందు ఒక బోయవాడిని చూచి, 'దుర్యోధనుడు తప్పించుకొన్నాడు. చెట్లు చేమలలో దాగి ఉండవచ్చును. మీరు తిరిగేటప్పుడు గుర్తించండి' అని చెప్పగా వాడు కూడా భీముడి బోయలలో ఒకడు కావటంచేత మిగిలినవారికి ఎదురుగా పోయి, ఆ విషయం తెలియజేసినందున ఆ పని మనసులలో మెదలుతుండగా, ప్రక్కనే ఏమరుపాటుగా మాట్లాడుతున్న ఆ రాజుకూ, వీరులకూ సాగిన ఉక్తిప్రత్యుక్తులక్రమం విని, ఆ నీటిలో నీ కుమారుడు దాగి ఉండటాన్ని నిశ్చయించుకొని తమలో మెల్లగా ఈ విధంగా అనుకొన్నారు.

క. 'ఈ రథికులు తను నిమ్మెయిఁ । బోరికిఁ దఱుమంగఁ దాను బురికొన కిచటం
గౌరవపతి డాఁగినగతి । బోరనఁ జని చెప్పవలయు భూనాథునకున్. 37

ప్రతిపదార్థం: ఈ రథికులు= ఈ వీరులు; తనున్+ఈ+మెయిన్+పోరికిన్+తఱుమంగన్= వీరు ఈ విధంగా తనను యుద్ధానికి రెచ్చగొట్టగా; తాను; పురికొనక= ఉద్వేగ మందకుండా; ఇచటన్= ఈ చోట; కౌరవపతి= కౌరవరాజు దుర్యోధనుడు; డాఁగినగతి= దాగిన విధం; బోరనన్+చని= వేగంగా వెళ్ళి; భూనాథునకున్= ధర్మరాజుకు; చెప్పవలయున్= చెప్పవలసి ఉన్నది.

తాత్పర్యం: 'సేనానులు తనను ఆ విధంగా యుద్ధానికై తరుమగా ఉద్వేగపడకుండా దుర్యోధనుడు ఇక్కడ దాగికొని ఉన్న వైనం వేగంగా వెళ్ళి ధర్మజుడికి తెలియజేయాలి.

తే. అతఁడు పసదన మొసఁగు మారుత తనయుని । మున్ను గని మెచ్చు వడయుద; మన్నరేంద్రు
నతఁడ కాన్పించు మనల; రయమునఁ బోవ । వలయు; మాంసభారంబులు వలదు లెండు. 38

ప్రతిపదార్థం: అతఁడు= ధర్మరాజు; పసదనము+ఒసఁగున్= బహుమతి ఇస్తాడు; మారుత తనయునిన్= భీముడిని; మున్ను+కని= ముందుగా చూచి; మెచ్చు+పడయుదము= మెప్పుపొందుదాం; మనలను; ఆ+నరేంద్రున్+అతఁడు+అ కాన్పించున్= ఆ ధర్మరాజును అతడే కనపడేటట్లు చేస్తాడు; రయమునన్= వేగంగా; పోవవలయున్= పోవాలి; మాంసభారంబులు (వేటలోని)= మాంసాల బరువులు; వలదు= అక్కరలేదు; లెండు= లేవండి.

తాత్పర్యం: ధర్మరాజు మనకు బహుమతి నిస్తాడు. భీముడిని ముందుగా చూచి అతడి ఆదరాన్ని పొందుదాము. మనకు ఆ ధర్మరాజును ఆతడే చూపగలడు. ఈ మాంసాల బరువులు వదలి వేగంగా పోదాం లేవండి.'

వ. అని మోపులు డిగవిడిచి వెసం బాఱి; రయ్యవసరంబునఁ బాండునందనులు నీ నందను వెదక ననేక చారులం బొలికలని కెలంకులకం బుచ్చి, యాతండు తను కగపడమికిఁ జింతాక్రాంతు లై యుండ నాబోయలు భీమునిపణిహారులఁ ద్రోచికొనుచుం దన్మందిరంబు దఱియం జొచ్చి, యతనిం గాంచి, యమ్మడువున నమ్మహీపతి డాఁగి యునికి యెఱింగించి. 39

ప్రతిపదార్థం: అని= అంటూ; మోపులు డిగవిడిచి= బరువులు క్రింద దింపి; వెసన్+పాఱిరి= త్వరగా వెళ్ళారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; పాండు నందనులు= పాండురాజకుమారులు; నీ నందను వెదకన్= నీ కుమారుడిని వెదకటానికి; అనేక చారులన్= వేగులవారిని చాలమందిని; పొలికలని కెలంకులకున్+పుచ్చి= యుద్ధభూమి ప్రక్కలకు పంపి; ఆతండు తమకున్+అగపడమికిన్= ఆతడు తమకు కనపడనందులకు; చింతాక్రాంతులు+ఐ+ఉండన్= చింతతో ఉండగా;

ఆ బోయలు= ఆ బోయవారు; భీముని పణిహారులన్ త్రోచికొనుచున్= భీముడి సేవకులను త్రోసికొంటూ; తద్+మందిరంబును+తఱియన్+చొచ్చి= ఆతని భవనం చేరబోయి; అతనిన్+కాంచి= ఆ భీముడిని చూచి; ఆ+మడువునన్= ఆ కొలనులో; ఆ+మహీపతి= ఆ రాజు; డాఁగిఉనికి= దాగిఉండటం; ఎఱింగించి= తెలిపి.

తాత్పర్యం: ఆ బోయలు తమవీపులమీది బరువులను క్రిందకు దింపి త్వరగా వెళ్ళారు. అప్పటికే పాండవులు నీకొడుకును వెదకటానికి పట్టణానికి పలువురు గూఢచారులను పంపారు. వారికి నీ కొడుకు కనపడలేదని తెలిసి, పాండువులు నీ కుమారుడు ఉన్నచోటు తెలియనందున చింతిస్తూ ఉన్నారు. అపు డా బోయలు భీముడి సేవకులను ప్రక్కకు త్రోసికొంటూ వెళ్ళి నగరులోనికి వెళ్ళిచూచి, ఆ దుర్యోధను డా కొలనులో ఉండటం తెలిపి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. తమవిన్నమాట లన్నియుఁ । గ్రమమునఁ జెప్పిన నతండు గడుఁ బ్రియమున న
ర్థము లొసఁగె వారికి ననే । కములు వహింపంగఁ గొలఁది గాకుండంగన్. 40

ప్రతిపదార్థం: తమ విన్న మాటలన్నియున్= తాము విన్నట్టి మాటలన్నీ (కృపాదులతో దుర్యోధనుడు మాటాడిన మాటలు); క్రమమునన్ చెప్పినన్= వరుసగా చెప్పగా; అతండు= ఆ భీముడు; కడున్= మిక్కిలి; ప్రియమునన్= ప్రీతితో; వారికిన్= ఆ బోయలకు; అనేకములు= చాలా; వహింపఁగన్= మోయగా; కొలదిగాకుండంగన్= సాధ్యం కానట్లుగా; అర్థములు= ధనములు; ఒసఁగెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: బోయలు తాము విన్న మాటలన్నీ భీముడికి వరుస తప్పకుండా చెప్పారు. అందు కాతడు మెచ్చి, వారు మోయలేనన్ని బరువైన బహుమతులను ఇచ్చాడు.

వ. ఒసంగి యా లుబ్ధకుల నగ్రజుఁ గానిపించి 'దేవా! దుర్యోధనుండు ద్వైపాయనహ్రదంబున నొక్కక్షుద్రవిద్యంజేసి జలంబులు నిజశరీరంబు సోఁకకుండునట్లుగాఁ జేసికొని డాఁగియున్నవాఁడు; వీ రెఱింగి వచ్చి'రని యతనికి విన్నవించి, యా సుయోధనగురునందనాదుల సల్లాపంబు లెఱిఁగించిన, నతండు పరమహర్షంబున నా బోయలకు బహువిధంబు లగు పసదనంబు లిచ్చి తక్కిన తమ్ములకును గృష్ణునకుఁ జెప్పికొని వారును సకలబంధు మిత్రపరిజనంబులును దోడన చనుదేర నుద్దామగమనంబున. 41

ప్రతిపదార్థం: ఒసంగి= ఇచ్చి; ఆ లుబ్ధకులన్= ఆ బోయలను; అగ్రజున్+కానిపించి= తన అన్నఅగు ధర్మరాజునకు చూపి; దేవా!= స్వామి!; దుర్యోధనుండు; ద్వైపాయనహ్రదంబునన్= ద్వైపాయనమనే కొలనులో; ఒక్కక్షుద్రవిద్యన్+చేసి= ఒకానొకనీచమైన విద్యవలన; జలంబులు= నీళ్ళు; నిజశరీరంబు సోకకుండునట్లుగాన్= తన ఒడలికి తాకకుండే విధంగా; చేసికొని; డాఁగి= దాగికొని; ఉన్నవాఁడు; వీరు+ఎఱింగి వచ్చిరి= వీరు తెలిసికొని వచ్చారు; అని= అంటూ; అతనికిన్ విన్నవించి; ఆ సుయోధన గురునందనాదుల సల్లాపంబులు= ఆ దుర్యోధనాశ్వత్థామాదుల మాటలు; ఎఱింగించినన్= తెలుపగా; అతండు= ధర్మజుడు; పరమ హర్షంబునన్= మిక్కిలి ఆనందంతో; ఆ బోయలకు; బహువిధంబులు+అగు= అనేక రకాలయిన; పసదనంబులు+ఇచ్చి= బహుమానాలు ఇచ్చి; తక్కిన తమ్ములకును= మిగిలిన తమ్ములకును (అర్జున; నకుల, సహదేవులకు); కృష్ణునకునన్+చెప్పికొని= కృష్ణుడికి కూడ తెలియచేసి; వారును= వారందరూ; సకల బంధుమిత్ర పరిజనంబులును= బంధువులూ, స్నేహితులూ, సేవకులూ - అందరును; తోడన చనుదేరన్= వెంట బయలుదేరగా; ఉద్దామ గమనంబునన్= త్వరితమైన నడకతో.

తాత్పర్యం: (ఆ బోయలకు బహుమానములిచ్చి) ఆ కిరాతకులను ధర్మజుడికి చూపి, 'దేవా! దుర్యోధనుడు ద్వైపాయన హ్రదంలో దాగి ఉన్నాడు. ఒకానొక క్షుద్రవిద్య కారణంగా అతడి శరీరానికి నీరు తగలకుండా ఉన్నాడు. ఈ సంగతి నీకు తెలపటానికి వీరు వచ్చారు' అని అనగా ఆతడు వారు చెప్పిన వార్తను విని సంతోషించి, వారిని సత్కరించి, తక్కిన తమ్ములకు కృష్ణుడికి ఆ విషయాన్ని చెప్పి సమస్త బంధుమిత్రులతో వేగంగా వెళ్ళుతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. తురగ ఖురపుటరథనేమికరిపదాతి । ఘట్టనంబుల నేల గ్రక్కదల శంఖ
పణవనిస్సాణ కాహళ రణన మెల్ల । దెసలఁ బరఁగంగ వచ్చె నద్దెసకునధిప! 42

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; తురగఖురపుట= గుర్రాల డిప్పల వంటి గిట్టల; రథనేమి= రథచక్రాల పట్టాల; కరి= ఏనుగుల; పదాతి ఘట్టనంబులన్= కాల్బలాల తాకిడి వలనను; నేల; గ్రక్కదలన్= మిక్కిలిగా కదలగా; శంఖ= శంఖముల; పణవ= తప్పెటల; నిస్సాణ= నిస్సాణముల (చర్మవాద్యాల); కాహళ= కాహళములనే వాద్యాల; రణనము= చప్పుడు; ఎల్లదెసలన్= అన్ని దిక్కులా; పరఁగంగన్= వ్యాపించగా; ఆ+దెసకున్= ఆ వైపునకు; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: చతురంగ బలాల ఒత్తిడికి భూమి అదరుతూ ఉండగా, ఆ సమయంలో వివిధ వాద్యాల ధ్వనులు అన్ని దిక్కులా వ్యాపిస్తూ ఉండగా ధర్మరాజు ఆ వైపు వచ్చాడు.

వ. అట్లు ధర్మనందనుం డేతెంచు కలకలం బాలకించి యంతకమున్ను రణోత్సాహంబునకై రాజు నిర్బంధించు చున్న యగ్గురుపుత్రకృతవర్ము లతనితో నిట్లనిరి. 43

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; ధర్మనందనుండు= ధర్మరాజు; ఏతెంచు= వస్తున్న; కలకలంబు+ఆలకించి= శబ్దమును విని; అంతకున్ మున్ను= అంతకంటె ముందుగా; రణోత్సాహంబునకై= యుద్ధంమీది ఆసక్తితో; రాజున్= దుర్యోధనుడిని; నిర్బంధించుచున్న= తొందర చేస్తున్న; ఆ+గురుపుత్ర= అశ్వత్థామ; కృపకృతవర్మలు= కృపుడును, కృతవర్మయు; అతనితోన్ ఇట్లు+అనిరి= ఆ దుర్యోధనుడితో ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: ధర్మరాజు వస్తున్న కోలాహలాన్ని విని అంతకుముందు దుర్యోధనుడిని యుద్ధోత్సాహంతో నిర్బంధిస్తున్న అశ్వత్థామ కృప కృతవర్మలు ఇట్లా అన్నారు.

మ. 'ధరణీనాయక! పాండుపుత్రులు సముద్దామోద్ధతిన్ వీరె వ
చ్చిరి వీరిన్ వడిఁ గిట్టి తాఁకుదమొ? నీచిత్తంబు పోరాటకుం
జొరదే నిప్పటికిం దొలంగి చని యెచ్చోనైన నేముండి చె
చ్చెర రూపించినవేళఁ జెప్పినెడకుం జేరంగ నేతెంతుమో?' 44

ప్రతిపదార్థం: ధరణీనాయక!= ఓ రాజా!; పాండుపుత్రులు= పాండురాజు కుమారులు; సముద్దామ+ఉద్ధతిన్= నిరంకుశమైన పొగరుతో; వీరె వచ్చిరి= ఇదిగో ఇప్పుడే వచ్చారు; వీరిన్= ఈ పాండవులను; వడిన్= త్వరగా; కిట్టి తాఁకుదమొ?= సమీపించి యుద్ధం చేద్దామా?; నీ చిత్తంబు= నీ మనస్సు; పోరాటకున్+చొరదేన్= యుద్ధాని కిష్టపడకుంటే; ఇప్పటికిన్+తొలంగి చని= ఇప్పటికి తొలగిపోయి; ఏ+చో(ట)నైనన్= ఎక్కడనైనా; ఏము+ఉండి= మేముండి; చెచ్చెరన్= త్వరగా; రూపించినవేళన్= నిర్ణయించిన సమయానికి; చెప్పిన+ఎడకున్= నిర్ణయించిన చోటికి; చేరంగన్= చేరగా; ఏతెంతుమో?= వచ్చెదమా?

తాత్పర్యం: 'ఓ రాజా! పాండవులు పెరిగిన దర్పంతో అడ్డులేని ఆటోపంతో వచ్చారు. వారిని ఎదుర్కొని యుద్ధం చేద్దామా? లేక ఇప్పటికి తొలగిపోయి, ఎక్కడైనా దాగి, అదను చూచి నిర్ణయించిన చోటికి చేరుదామా?'

ఆ. అనుడు నా నృపాలుఁ డయ్యోధవరులతో। 'నిప్పు డనికి నుత్సహింప కెచటి
కేనిఁ దొలఁగిపోయి యిచటికి మగుడంగ। రండు పగలు సనిన రాత్రి యగుడు. 45

ప్రతిపదార్థం: అనుడున్= అనగా; ఆ నృపాలుఁడు= ఆ రాజు(దుర్యోధనుడు); ఆ+యోధవరులతోన్= ఆ సైనికముఖ్యులతో; ఇప్పుడు+అనికిన్= ఇపుడు యుద్ధానికి; ఉత్సహింపక= ఉత్సాహం చూపక; ఎచటకిన్+ఏనిన్= ఎక్కడికైనా; తొలఁగిపోయి= తప్పించుకొనిపోయి; పగలు+చనినన్= పగలుపోగా(వెలుతురుపోగా); రాత్రియగుడున్= రాత్రికాగా; మగుడంగన్= మరల; ఇచటికిన్ రండు= ఇక్కడకు రండి.

తాత్పర్యం: (వారిమాటకు) ఆ దుర్యోధనుడు ఆ సేనా ముఖ్యులతో (అశ్వత్థామ, కృపకృతవర్మలతో) 'ఇపుడు యుద్ధాసక్తిని చూపకుండా ఎక్కడికైనా వెళ్ళి, పగలు గడచి రాత్రి వచ్చినప్పుడు మరల రండి' అని అన్నాడు.

వ. వారు వారణపురంబున కనివారణఁ బోయెదరు; వోవుదురు గాక యిచ్చేరువఁ బోయిరేనియు ని మ్మడువున నాయునికి యెఱుంగలే; రట్లు గాక యెఱింగిరేనియు నన్నుఁ జేరరాదు; మదీయ విద్యా విశేషసంస్తంభితాంభోదుర్గంబున నిర్భయుండ నై యుండెదఁ బొం' డనినం బొగులు మనంబులతోడ నా రథికజనంబులు వోవం బతి జలంబులు శిలాసదృశంబులుగాఁ బరిస్తంభించె; నేనును బాండుసూనుల చారు లెల్లకడల మెలంగుటం జేసి రాజు నప్పుడు వెలువరించుట కర్జంబు గా దనియు నతనితోయస్తంభవైదగ్ధ్యం బెఱుంగుట నొలసిన యూఱటను ముందటియట్లు వారలతోడం జని చని చిత్తంబు గలంగినం జాలక యరదంబు డిగ్గి యచ్చట నొక్కయెడ నొదిఁగి నిలిచెద నని వారలకుం జెప్పి యమ్మడువు నఱుత నొక్కపఱపు గలపొదయీఱమిం దూఱి పొంచియుండితి; వారలు దూరంబు సని యొక్క విపులవటంబు పొంత విశ్రాంతి నొంది నీనందను వలనికిం జనిన హృదయంబులతోఁ దదీయకార్యచింతాభరంబు పట్టుకొనఁ దదనుబంధ సంభాషణంబులు సేయు చుండి రక్కడ. 46

ప్రతిపదార్థం: వారు= ఆ పాండువులు; వారణపురంబునకున్= హస్తిపట్టణానికి; అనివారణన్= తప్పనిసరిగా; పోయెదరు= వెళ్ళెదరు; పోవుదురుగాక!= పోతారుకాక!(పోతే పోయారు); ఈ+చేరువన్= ఈప్రక్కగా; పోయిరి+ఏనియున్= పోయినను; ఈ+మడువునన్= ఈ కొలనులో; నా+ఉనికి= నేనుండుట; ఎఱుంగలేరు= తెలియలేరు; అట్లుగాక ఎఱింగిరేనియున్= ఆ విధంగా కాకుండా తెలిసినట్లయినా; నన్నున్+చేర రాదు= నా దగ్గరకు వచ్చుటకు వీలుకాదు; మదీయ= నాయొక్క; విద్యావిశేష= విద్యాధిక్యముచే; సంస్తంభిత+అంభోదుర్గంబునన్= స్తంభింపజేయబడిన ఈ జలదుర్గంలో; నిర్భయుండను+ఐ ఉండెదన్= భయం లేకుండా ఉంటాను; పొండు= మీరు వెళ్ళండి; అనినన్= అనగా; పొగులు మనంబులతోన్= కుమిలే మనసులతో; ఆ రథికజనంబులు= ఆ వీరులు; పోవన్= వెళ్ళగా; పతి= రాజు(దుర్యోధనుడు); జలంబులు= నీటిని; శిలాసదృశంబులుగాన్= రాళ్ళవలె; పరిస్తంభించెన్= స్తంభింపజేశాడు; ఏనును= నేనును(సంజయుడు); పాండుసూనుల చారులు= పాండవుల వేగులు; ఎల్ల+ఎడలన్= అంతటనూ; మెలంగుటన్+చేసి= తిరగటంవలన; రాజును= దుర్యోధనుడిని; అప్పుడు; వెలువరించుట= బయలు చేయటం; కర్జంబుకాదు+అనియున్= సరిఅయిన పని కాదనియు; అతని తోయ స్తంభవైదగ్ధ్యంబు+ ఎఱుంగుటన్= వాని జలస్తంభన విద్యా నైపుణ్యాన్ని తెలిసిఉండటంవలన; ఒలసిన ఊఱటను= కలిగిన ఓర్మిచే; ముందటి+అట్లు=

వెనుకటి మాదిరిగానే; వారలతోడన్+చని చని= వారి వెంట వెళ్ళి వెళ్ళి; చిత్తంబు+కలంగినన్= మనసు కలతపడగా; చాలక= శక్తిలేక; డిగ్గి= దిగి; అచ్చటన్; ఒక్క+ఎడన్= ఒక చోట; ఒదిఁగి నిలిచెదన్= దాగి ఉంటాను; అని; వారలకున్+చెప్పి= వారికి చెప్పి; ఆ+మడువు+అఱుతన్= ఆ కొలను సమీపాన; ఒక్కపఱిపుకల= బాగా విస్తరించిన; పొద+ఈఱమిన్+దూరి= పొద జొంపంలో దూరి; పొంచి+ఉండితిన్= పొంచి ఉన్నాను; వారలు దూరంబు+చని= వారు దూరంగా వెళ్ళి; ఒక్క; విపుల= విస్తారమైన; వటంబు పొంతన్= మఱ్ఱిచెట్టు సమీపాన; విశ్రాంతిన్+ఒంది= అలసట తీర్చుకొని; నీనందనువలనికిన్+చనిన= నీ కుమారుని ప్రక్కకు ప్రసరించిన; హృదయంబులతోన్= మనసులతో; తదీయ కార్య చింతాభరంబు= అతడి వైపు వెళ్ళిన ఆలోచనల బరువును; పట్టుకొనన్= పట్టుకోగా; తదనుబంధ సంభాషణంబులు చేయుచుండిరి= దానికి సంబంధించిన మాటలు మాట్లాడుతూ ఉన్నారు.

తాత్పర్యం: 'ఆ పాండవులు తప్పకుండా హస్తినకు వెళ్ళితే వెళ్ళుతారు. ఈ ప్రక్కకు వచ్చినప్పటికిని ఈ కొలనులో నేను ఉండటం తెలిసికోలేరు. ఒకవేళ తెలిసికొన్నా నన్ను చేరలేరు. నా విద్యా వైదుష్యంతో స్తంభింపజేయబడిన ఈ జలదుర్గంలో నిర్భయంగా ఉండగలను. పొండి' అనగా ఆ రథికులు దిగులు గుండెలతో వెళ్ళారు. దుర్యోధనుడు జలాలను శిలలతో పోలే విధంగా స్తంభనవిద్యను పాటించి జలంలో ప్రవేశించాడు. పాండవుల గూఢచారులు నలుమూలలా తిరుగుతుండటంచేత అతడిని బయలు వెలువడేటట్లు చేయటం తగినపనికాదని భావించి, అతడి జలస్తంభన విద్యాపాండిత్యం తెలిసి ఉండటంచేత నేను ఊరట చెందాను. ముందటివలెనే రథికత్రయంతో కలిసి కొంతదూరం వెళ్ళాను. కాని, నా మనసు కలతపడటంతో నిలువలేక రథందిగి, అక్కడే ఒకచోట ఒదిగి ఉంటా' నని చెప్పి ఆ సరోవర సమీపంలోని ఒక పొదలో దాగి పొంచి ఉన్నాను. వారు దూరంగా వెళ్ళి, ఒక మఱ్ఱిచెట్టు క్రింద విశ్రాంతి తీసికొని బరువైన గుండెలతో నీ కుమారుడి పనికి సంబంధించిన మాటలు మాట్లాడుతున్నారు. ఇక ఇక్కడ. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. కలకల నవ్వుచుఁ బెలుచం । బలుకుచుఁ దమకెలఁకులందుఁ బాంచాలకుమా
రులు సనుదేరఁగఁ బాండుసు । తులు వచ్చిరి సంతసంబుతో మడువునకున్. 47

ప్రతిపదార్థం: కలకలనవ్వుచున్= గలగల నవ్వుతూ; పెలుచన్+పలుకుచున్= పెద్దగా మాట్లాడుతూ; తమ కెలఁకులందున్= తమ ప్రక్కలలో; పాంచాలకుమారులు చనుదేరఁగన్= పాంచాలరాజ కుమారులు రాగా; పాండుసుతులు= పాండురాజు కుమారులు; సంతసంబుతోన్, మడువునకున్+వచ్చిరి= ఆనందంతో కొలను దగ్గరకు వచ్చారు.

తాత్పర్యం: పాంచాలరాజు కుమారులు తమతో వస్తూ గలగల నవ్వుతూ, ఉచ్చైఃస్వరంతో మాట్లాడుతూ రాగా పాండురాజు కుమారులు సంతోషంతో ఆ కొలనువద్దకు వచ్చారు.

వ. ఇట్లు వచ్చి ధర్మతనయుండు భవత్తనయమాయాస్తంభితం బైన యాజలాశయంబు నిరూపించి తత్ప్రకారం బెఱింగించి యచ్యుతునితో నల్లన ని ట్లనియె. 48

ప్రతిపదార్థం: ఇట్లు వచ్చి= పై విధంగా వచ్చి; ధర్మతనయుండు= ధర్మరాజు; భవత్+తనయ= నీ కుమారుడి; మాయా స్తంభితంబు+ఐన= మాయచేత కట్టివేయబడిన; ఆ జలాశయంబున్= ఆ మడుగును; నిరూపించి= చూచి; తద్+ప్రకారంబు+ ఎఱింగించి= అదిఉన్న విధమును తెలిపి; అచ్యుతునితోన్= శ్రీకృష్ణుడితో; అల్లనన్= మెల్లగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఆ విధంగా వచ్చి ధర్మరాజు నీకుమారుడు మాయచేత స్తంభించేటట్లు చేసిన ఆ నీటిమడుగును చూచి, అది ఉండే తీరు చెప్పి, నెమ్మదిగా శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు:

క. 'చొరరాదు మనుజులకు నె । వ్వరికిని నిజ్జలము కౌరవక్షితిపతి ని
ర్భరమాయా సంరక్షా । భరితం బై; కాన వీతభయుఁ డాతండున్.' 49

ప్రతిపదార్థం: మనుజులకున్= మానవులకు; ఎవ్వరికిని; ఈ+జలము= ఈ నీరు; కౌరవక్షితిపతి= కౌరవరాజు(దుర్యోధనుడు); నిర్భర మాయాసంరక్షాభరితంబు+ఐ= అధికమగు మాయచేత కాపాడబడుతున్నదై(ఉండటంచేత); చొరరాదు= ప్రవేశింపసాధ్యం కాదు; కాన= కనుక; ఆతండున్= ఆతడు; వీతభయుఁడు= భయము లేనివాడు.

తాత్పర్యం: 'మానవులు ఎవరూ చొరరాని ఈ నీరు దుర్యోధనుడి పెనుమాయచేత కాపాడబడుతున్నది. కనుక ఆతడు భయం లేకుండా ఇందున్నాడు.

ధర్మరాజు మడుగున డాఁగియున్న దుర్యోధనుని దూఱనాడుట (సం. 9-30-6)

క. అని వెండియు నాపతి గురు । జననాథుగుఱించి పలుకు 'శక్రుఁడు దోడై
చనుదెంచె నేని పోవ । చ్చునె నాచేఁ దప్పి యిందుఁ జొచ్చినఁ దనకున్?' 50

ప్రతిపదార్థం: అని వెండియున్+ఆ పతి= అని మరల ఆ రాజు(ధర్మరాజు); కురుజననాథుగుఱించి= దుర్యోధనుడిని గూర్చి; పలుకున్= చెప్పుతున్నాడు; ఇందు చొచ్చినన్= ఈ మడుగులో దాగినను; తనకున్= దుర్యోధనుడికి; శక్రుఁడు= ఇంద్రుడు; తోడై చనుదెంచెను+ఏని= ఇంద్రుడు తోడుగా వచ్చినప్పటికిని; నాచేన్+తప్పి= నానుండి తప్పించుకొని; పోవచ్చునె?= పోనగునా?;

తాత్పర్యం: అంటూ ధర్మరాజు దుర్యోధనుడిని గూర్చి ఇట్లా అన్నాడు. 'మడుగులో దాగికొన్నా, దేవేంద్రుడు సహాయపడినా ఇతడు నా నుండి తప్పించుకొనటం సాధ్యం కాదు'

వ. అనిన విని యచ్యుతుం డతనికి నల్పస్వరంబున నిట్లనియె. 51

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విన్నవాడై; అచ్యుతుండు+అతనికిన్= శ్రీకృష్ణుడు ఆతడితో(ధర్మజుడితో); అల్పస్వరంబునన్= మెల్లని గొంతుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అనగా విన్న శ్రీకృష్ణు డా ధర్మజుడితో మెల్లని గొంతుతో ఇట్లా అన్నాడు:

ఉ. 'మాయలు గల్గు దుష్టులకు మాయపుభంగులె మందు గాక ని
ర్మాయత నుల్లసిల్లెడు పరాక్రమ లీలలు గొల్చు నెట్లు? దై
తేయులు దొల్లి మాయల నతిప్రబలాత్మకు లైనఁ దద్వధో
పాయములన్ జయింపరె నృపాలక! విష్ణుఁడు నింద్రుఁడుం దగన్. 52

ప్రతిపదార్థం: నృపాలక!= ఓ రాజా!; మాయలు కల్గు దుష్టులకున్= మోసాలుచేసే దుర్మార్గులకు; మాయపు భంగులె= మోసపు విధానాలే; మందు= ప్రతిక్రియ; కాక= అట్లు కాక; నిర్మాయతన్+ఉల్లసిల్లెడు= మోసం లేకుండా ప్రకాశించే;

పరాక్రమలీలలు= శత్రువులను జయించే విధాలు; ఎట్లు గొల్చున్?= ఏ విధంగా తగుతాయి?; తొల్లి= పూర్వం; దైతేయులు= రాక్షసులు; మాయలన్= మోసాలతో; అతిప్రబల+ఆత్మకులైనన్= మిక్కిలి బలవంతులు కాగా; విష్ణుడు ఇంద్రుడున్+తగన్= విష్ణుడూ ఇంద్రుడూ తగు విధంగా; తద్+వధ+ఉపాయములన్= వారిని చంపే ఉపాయాలతో; జయింపరె?= జయించరా?

తాత్పర్యం: మాయాత్మకులైన దుర్మార్గులకు మోసపు పద్ధతులే మందు. మాయతో కాకుండా విరోధులను జయించటం ఏ విధంగా సాధ్యం అవుతుంది? మిక్కిలి బలవంతులైన దైత్యులను విష్ణుడు, ఇంద్రుడు మాయోపాయాలతో జయించలేదా?

వ. హిరణ్యకశిపు వృత్రవధ ప్రకారంబు వినమె? రావణుండు హోమాదిమాయాక్రియావిఘాతంబునఁ గాదె రాముచేత నిర్జింపంబడె? నరకాసుర నేను బరిమార్చిన తెఱం గెఱుంగవే? వీఁడగపడునట్టి విధంబు సూచికొ' మ్మనిన విని యప్పాండవాగ్రజుండు జలాంతర్గతుం డై యున్న భవన్నందను నుద్దేశించి యిట్లనియె. 53

ప్రతిపదార్థం: హిరణ్యకశిపు= హిరణ్యకశిపుడియొక్క; వృత్రవధ= వృత్రాసురుడిని చంపిన; ప్రకారంబులు= పద్ధతులు; వినమె?= వినలేదా? రావణుండు? హోమ+ఆది= హోమము మొదలయిన; మాయాక్రియా= మోసపు చేష్టల; విఘాతంబులనన్+ కాదె?= అడ్డంకులవలన కాదా?; రాముచేతన్= శ్రీరాముడిచేత; నిర్జింపంబడియెన్?= సంహరింపబడ్డాడు?; నరకాసురునిన్; నేను; పరిమార్చిన= చంపిన; తెఱంగు= విధం; ఎఱుంగవే?= తెలియవా?; వీఁడు= దుర్యోధనుడు; అగపడునట్టి= కనపడే; విధంబు= పద్ధతి; చూచికొమ్ము= ఏర్పరచుకొనుము(వెదకుము); అనినన్= అనగా; విని= విన్నవాడై; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ పాండవులలో పెద్దవాడు(ధర్మరాజు); జలాంతర్గతుండై యున్న= నీటిలో ఉన్న; భవత్+నందనున్= నీ కుమారుడిని; ఉద్దేశించి= లక్షించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: 'హిరణ్యకశిపు వృత్రాసురులను చంపిన విధం వినలేదా? రావణాసురుడు కావించిన హోమాది మాయల విఘాతంవలన కదా శ్రీరాముడిచేత హతమార్చబడ్డాడు? నేను నరకాసురుడిని చంపిన పద్ధతి నీకు తెలియదా? (కనుక) దుర్యోధనుడు దొరకే పద్ధతిని ఎన్నుకొనుము' అనగా ధర్మరాజు నీటిలో ఉన్న నీ కుమారుడిని పేర్కొని ఇట్లా అన్నాడు:

చ. 'ఇటు తగునే సుయోధన! మహీవలయంబున నిట్టిదైన్య మె
చ్చట వినఁ జూడఁ గల్గెనె? యసంఖ్యులు రాజులు నీకుఁ గాఁగఁ జ
చ్చుటయును బంధుమిత్రులు విశుద్ధచరిత్రులు పోర నట్లు త్రుం
గుటయును జూచి; తేమిటికిఁ గ్రుంకితి నీళ్ళను? జావు దప్పనే? 54

ప్రతిపదార్థం: సుయోధన!= ఓ దుర్యోధనా!; ఇటు తగునే?= ఇట్లుండవచ్చునా?; మహీవలయంబునన్= భూగోళంలో; ఇట్టి దైన్యము= ఇటువంటి దీనావస్థ; ఎచ్చటన్= ఏ చోటా; వినన్+చూడన్+కల్గెనె!= వినలేదు, చూడలేదు కదా!; అసంఖ్యులు= లెక్కపెట్టలేనంతమంది; రాజులు; నీకున్+కాఁగన్= నీ కొరకు; చచ్చుటయును= చనిపోవటమూ; బంధుమిత్రులు= బంధువులు, స్నేహితులు; విశుద్ధచరిత్రులు= మంచి పేరున్నవారు; పోరన్= యుద్ధంలో; అట్లు త్రుంగుటయును= ఆ విధంగా చనిపోవటమూ; చూచితి(వి)= చూచావు; ఏమిటికిన్= ఎందుకై; నీళ్ళను= నీటిలో; క్రుంకితి(వి)?= మునిగావు?; చావు= చనిపోవటం; తప్పునే?= తప్పిపోతుందా?

తాత్పర్యం: 'దుర్యోధనా! లోకంలో ఇట్టి నీచమైన స్థితి నీకు తగునా? నీకై అనేకులు రాజులు చనిపోవటం, లెక్కపెట్టరానంతమంది బంధుమిత్రులు చనిపోవటం చూచావు. నీళ్ళలో ఎందుకు మునిగి దాగి ఉన్నావు? అంతమాత్రాన చావు తప్పుతుందా?

ఉ. శూరుఁడ వండ్రు నిన్ మడువు సొచ్చుట శౌర్యముచొప్పె? మాన మే
యూరికిఁ బోయె? నాజి నృపు లోడుదురే? నృపుఁ డున్న మాత్రయే?
కౌరవవంశజాతుఁడవు గష్టపుఁ జచ్చుట దెచ్చుకొంటి; నీ
పేరును బెంపు మాలి యరిబృందము నవ్వఁగ నిట్లు సేయుదే? 55

ప్రతిపదార్థం: శూరుడవు+అండ్రు నిన్= నిన్ను శౌర్యంకలవాడ వంటారు; మడువు చొచ్చుట= నీటిమడుగులో దూరటం; శౌర్యము చొప్పె?= పరాక్రమ ధర్మమా?; మానము+ఏ ఊరికిన్+పోయెన్?= నీ అభిమానం ఏ ఊరికి పోయింది?; (నీ అభిమానం చచ్చిందా?); ఆజిన్= యుద్ధంలో; నృపులు= రాజులు; ఓడుదురే?= వెనుకంజవేయుదురా?; నృపుఁ డన్న మాత్రయే?= నీకు కేవలం రాజమాత్రుడవా? (సామాన్యరాజువా?); కౌరవవంశజాతుఁడవు= కురువంశంలో పుట్టావు; కష్టపున్+చచ్చుట= నీచంగా చావటం; తెచ్చుకొంటి(వి)= తెచ్చుకొన్నావు; నీ పేరును పెంపు మాలి= నీ కీర్తి గొప్పతనం పోగా; అరిబృందము= వైరి సమూహం; నవ్వఁగన్= ఎగతాళి చేసి నవ్వగా; ఇట్లు చేయుదే?= ఈ విధంగా చేస్తావా?

తాత్పర్యం: దుర్యోధనా! నిన్ను శూరు డంటారు. నీ వీ కొలనులో దూరటం వీరధర్మమా? నీ అభిమానం ఏ ఊరికి పోయింది? యుద్ధంలో రాజులు వెనుకంజ వేస్తారా? నీవు సాధారణమైన రాజువా! కౌరవవంశంలో పుట్టావు. నీచమైన చావును తెచ్చుకొన్నావు. నీ కీర్తినీ, గొప్పతనాన్నీ వదలి శత్రుసమూహం నవ్వేటట్లు ఈ విధంగా చేస్తావా?

తే. క్షత్త్రధర్మంబు విడిచినఁ గలదె యిహము । బరముఁ? బేరోలగంబునఁ బలుకుపలుకు
లెల్ల మఱచితె? విను మవి పొల్లు లైనఁ । గష్టపాటు గా కుసు లేల గావ వచ్చు? 56

ప్రతిపదార్థం: క్షత్త్రధర్మంబు= రాజధర్మం; విడిచినన్= వదలితే; ఇహమున్ పరమున్ కలదె?= ఈ లోకములో గాని, ఊర్ధ్వలోకంలో గాని సుఖం ఉన్నదా?; పేరు+ఓలగంబునన్= పెద్దసభలో; పలుకు పలుకులు+ఎల్లన్= (ప్రేలిన ప్రేలాపనలు) మాటాడినమాటలన్నీ; మఱచితె?= మరచావా?; అవి= ఆ పలుకులు; పొల్లులు+ఐనన్= వ్యర్థములయితే; కష్టపాటు+కాక= కష్టంకలుగుతుందే కాని; ఉసుఱు= ప్రాణం; ఏల= ఎందుకు; కావన్+వచ్చున్= రక్షిస్తాయి? (రక్షించవనుట.)

తాత్పర్యం: రాజధర్మం వదిలితే ఇహపరా లుంటాయా? పెద్దసభలో ప్రేలిన ప్రేలాపనలు మరచావా? వినుము. వ్యర్థమైన కష్టమే కాక ఆ మాటలు ప్రాణాలను ఏ విధంగా కాపాడుకొనవచ్చును?

చ. కొడుకులు దమ్ములుం గలన ఘోరపుఁ జావులు సావఁ జూచి యె
ట్లొడఁబడె నీదుబుద్ధి యొడ లోముట కై? విను రాజరాజ! యి
మ్మడువున కీర్తి తెచ్చె విధి; మానము ప్రాణముకంటెఁ జాల నె
క్కు డగుట సెప్పఁగా వినవొకో? కడునీచతఁ బొంది తక్కటా! 57

ప్రతిపదార్థం: రాజరాజ!= రారాజా!; కొడుకులు తమ్ములున్= కుమారులు, తమ్ముళ్ళు; కలనన్= యుద్ధంలో; ఘోరపు చావులు చావన్+చూచి= భయంకరమయిన చావులు చావగా చూచి; నీదు బుద్ధి= నీ తెలివి; ఒడలు+ఓముటకై= శరీరాన్ని

కాపాడుకొనుటకై; ఎట్లు+ఒడఁబడెన్?= ఏ విధంగా ఒప్పుకొన్నది?; విధి= దైవం; నినున్= నిన్ను; ఈ+ మడువునకున్+ ఈడ్చితెచ్చెన్= ఈ కొలనిలోనికి ఈడ్చుకొని తెచ్చింది; మానము= అభిమానం; ప్రాణముకంటెన్= ప్రాణంకన్నా; చాలన్= మిక్కిలి; ఎక్కుడు+అగుట= ఎక్కువ కావటం; చెప్పఁగాన్= (లోకంలో) చెప్పుకోగా?; వినవు+ఒకో?= వినలేదా?; అక్కటా!= అయ్యో!; కడున్= మిక్కిలి; నీచతన్= నికృష్టతను; (దైన్యమును); పొందితి(వి)= పొందావు.

తాత్పర్యం: కుమారులు, తమ్ములు యుద్ధంలో భయంకరంగా చనిపోగా చూచిన నీ బుద్ధి శరీరాన్ని కాపాడుకొనటం కొరకు ఎట్లా ఒప్పుకొన్నది? రారాజా! దైవం ని న్నీ మడుగున కీడ్చి తెచ్చింది. అభిమానం ప్రాణంకంటే గొప్ప అని అనటం వినలేదా? మిక్కిలి నీచత్వాన్ని పొందావు.

శా. **అంభోగర్భము సొచ్చి పాండుసుతబాహాగర్వ దుర్వారసం**
రంభం బోర్వక డాఁగి యుండె నట రారా జిస్సిరో! చచ్చుచో
గాంభీర్యంబును ధైర్యమున్ విడిచి దోర్గర్వంబు బెండయ్యెనే?
శుంభన్మానము దూలెఁగా కని జనస్తోమంబు నిందింపదే? **58**

ప్రతిపదార్థం: రారాజు= దుర్యోధనుడు; పాండుసుత= పాండురాజ కుమారుల; బాహాగర్వ= భుజాల దర్పంయొక్క; సంరంభంబు+ఓర్వక= విజృంభణాన్ని సహించలేక; అంభస్+గర్భము+చొచ్చి= నీటిలోపలకు ప్రవేశించి; డాఁగిఉండెను+అట= దాగిఉన్నాడట; ఇస్సిరో!= ఛీ!; చచ్చుచోన్= చనిపోయేటపుడు; గాంభీర్యంబును ధైర్యమున్ విడిచి= గంభీరతను, ధైర్యమును వదలి; దోర్గర్వంబు= భుజాబలము; బెండు+అయ్యెనే?= నిస్సారమైపోయిందా?; శుంభత్+మానము= వికాసవంతమయిన అభిమానం; తూలెన్+కాక= పోయింది కదా; అని= అంటూ; జనస్తోమంబు= ప్రజల సమూహం; నిందింపదే?= దూషించదా?

తాత్పర్యం: రారాజు పాండురాజ కుమారుల భుజబల విజృంభణానికి తట్టుకొనలేక మడుగులో దాగినాడట! - అని ప్రజలు ఛీకొట్టరా! చచ్చేటపుడు భుజబలదర్పం కూడా తొలగిపోయిందా! వికాసంతో ఉండవలసిన అభిమానం నశించింది కాబోలు! అని అంటూ సమస్త జనులూ నిన్ను దూషించరా?

తే. **కర్ణశకునిదుశ్శాసనుల్ ఘనులు గాఁగఁ । దలఁచి వారలఁ గొని మమ్ము గెలుచువాఁడ**
వై మనంబున శంకింప కట్లు కీడు । చేసి తా తూఁపు దప్పిన గాసి యైతి. **59**

ప్రతిపదార్థం: కర్ణ= కర్ణుడు; శకుని; దుశ్శాసనుల్= దుశ్శాసనుడు; ఘనులు కాఁగన్+తలఁచి= గొప్పవాళ్ళుగా తలచుకొని; వారలన్= వారలను; కొని= చేకొని; మమ్మున్ గెలుచు= మమ్ములను గెలువదలచిన; వాఁడవు+ఐ= వాడవయి; మనంబునన్= మనసులో; శంకింపక= అనుమానించక; అట్లు= ఆ విధంగా; కీడుచేసితి(వి)= ఆ విధంగా బాధపెట్టావు; ఆ తూఁపు తప్పినన్= ఆ పూనిక తప్పిపోగా; గాసి ఐతి(వి)= కష్టపడ్డావు.

తాత్పర్యం: కర్ణ శకుని దుశ్శాసనులను గొప్పవారిగా నమ్మి వారి సహాయంతో ఎట్టి అనుమానమూ లేకుండా మమ్మల్ని గెలుద్దామని ఆ విధమైన కీడును చేశావు. ఆ పూనిక తప్పగా కష్టపడుతున్నావు.

వ. **నీ కొలంది గంటి; మగపడితి; వింక నెందుఁ బోవచ్చు?' నని మఱియు ని ట్లనియె.** **60**

ప్రతిపదార్థం: నీ కొలందిన్+కంటిమి= నీ శక్తి గమనించాము; అగపడితివి= కనిపించావు; ఇంకన్ ఎందున్+పోవచ్చున్= ఇక ఎక్కడకు పోగలవు?; అని మఱియున్= అని ఇంకనూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: (దుర్యోధనా)! ఇప్పటి నీ శక్తి చూచాము. మాకు దొరికావు. ఇక ఎక్కడకు పోగలవు?' అని ఇంకా ఈ విధంగా అన్నాడు:

మ. **'భయముం బాయఁగఁ ద్రోచి వీరగుణముం బాటించి సంగ్రామని**
శ్చయబుద్ధిం దలకొల్పి పౌరుషముమైఁ జా వొండె గెల్పొండెఁ గా
క యధీరత్వము నాకు నీడె యని వీఁకం బేర్చి వే తాఁకు మెం
తయుఁ బే రయ్యెడు; రమ్ము లె; మ్మొదిఁగినన్ దైన్యమ్ము వచ్చుంజుమీ!' 61

ప్రతిపదార్థం: భయమున్+పాయఁగన్+త్రోచి= భయాన్ని పోద్రోలి; వీరగుణమున్+పాటించి= వీరత్వమును చూపించి; సంగ్రామ నిశ్చయ బుద్ధిన్+తలకొల్పి= యుద్ధం మీద స్థిరమయిన మనసు నిల్పి; పౌరుషముమైన్= మగతనంతో; చావు+ఒండెన్, గెల్పు+ఒండెన్= చావో బ్రతుకో ఏదో ఒక్కటియే; కాక= తప్ప; (అని); అధీరత్వము= ధైర్యం లేకుండటం; నాకున్ ఈడె అని= నాకు తగునా? అనుకొంటూ; వీఁకన్+పేర్చి= ధైర్యంతో విజృంభించి; వేతాఁకుము= వెంటనే ఎదుర్కొనుము; ఎంతయున్+ పేరు+అయ్యెడున్= ఎంతయినా పేరు వస్తుంది (కీర్తి వస్తుంది); రమ్ము= రా; లెమ్ము= లే; ఒదిఁగినన్= దాగుకొంటే; దైన్యమ్ము= దీనత్వము; వచ్చున్+చుమీ= వస్తుంది సుమా!

తాత్పర్యం: భయాన్ని వీడి, వీరత్వంతో స్థిరమైన మనసుతో యుద్ధానికి సిద్ధమై మగతనంతో చావో జయమో ఏదో ఒకటి అని నిశ్చయించి, ధైర్యమును వదలటం నాకు తగునా? అనుకొంటూ విజంభించి వెంటనే ఎదుర్కొనుము. నీకు పేరు ప్రతిష్ఠలు కలుగుతాయి. రమ్ము, లెమ్ము! దాగుకొంటే దీనత వస్తుంది సుమా!'

చ. **అని మము నోర్చినం బృథివి యంతయు నేలఁగ వచ్చు; నీవు చ**
చ్చిన సురసద్మ సౌఖ్యములు చేకుఱు; రెండుదెఱంగులందు నొ
ప్పనియది లేదు డాఁగ నగుబాటును బ్రాణము చేటుఁ దెచ్చుకోల్
విను! మము నీ వెదుర్పఁ దగు వేయువిధంబులఁ జాటి చెప్పెదన్. 62

ప్రతిపదార్థం: అనిన్+మమున్+ఓర్చినన్= యుద్ధంలో మమ్ము ఓడిస్తే; నీవు; పృథివి+అంతయున్= భూమినంతటినీ; ఏలఁ గవచ్చున్= పాలించవచ్చును; చచ్చినన్= చనిపోతే; సురసద్మసౌఖ్యములు= స్వర్గసుఖాలు; చేకుఱున్= కలుగుతాయి; రెండు తెఱంగులందున్= ఈ రెండు పద్ధతులలో; ఒప్పని+అది లేదు= సరికానిది లేదు; డాఁగన్= దాగికొనగా; నగుబాటును= అవమానమును; ప్రాణము చేటు తెచ్చుకోల్= ప్రాణనష్టమును తెచ్చుకొనటమును; మమున్+నీవు+ఎదుర్పన్+తగున్= మమ్ము నీవు యుద్ధంలో ఎదుర్కొనటం తగిన పని; వేయు విధంబులన్= వేయివిధాలుగా; చాటిచెప్పెదన్= చాటింపువేసినట్లు చెప్తున్నాను; విను= వినుము.

తాత్పర్యం: నీవు యుద్ధంలో మమ్ము ఓడించినట్లయితే భూమండలమంతా పరిపాలింపవచ్చును. లేదా చనిపోతే స్వర్గలోకసుఖాలు పొందవచ్చును. ఈ రెండు పద్ధతులూ సరిఅయినవే. దాగుకొంటే అవమానం, ప్రాణాల పైకి తెచ్చుకొనటం ఔతుంది. నీవు మమ్ము యుద్ధంలో ఎదుర్కొనటం యుక్తం. నా మాట వినుము. వేయి విధాలుగా చాటింపు వేసినట్లు చెపుతూ ఉన్నాను.

వ. **తెంపు చేసి మామీఁద నుఱుకుట నీకు ధాత నిర్మించిన పరమధర్మంబు; పురుషుండ వైతేని దీని ననుష్ఠింపు' మనిన విని యవ్వసుమతీశునకు సుయోధనుం డి ట్లనియె. 63**

ప్రతిపదార్థం: తెంపు చేసిన మా మీఁదన్+ఉఱుకుట= మా పైకి సాహసంతో దూకడము; ధాత= బ్రహ్మ; నీకు నిర్మించిన= నీకు ఏర్పరచిన; పరమధర్మంబు= శ్రేష్ఠమయిన ధర్మం; పురుషుండవు+ఐతి(వి)+ఏని= మగవాడవైనట్లయితే; దీనిన్+ అనుష్ఠింపుము= దీనికి ఆచరింపుము; అనినన్ విని= అనగా విని; ఆ+వసుమతీశునకున్= ఆ రాజుతో(ధర్మరాజుతో); సుయోధనుండు+ఇట్లనియెన్= దుర్యోధను డీ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సాహసంతో మా మీదికి యుద్ధానికి దూకటమే బ్రహ్మ నీకు నిర్ణయించిన ధర్మం. దీనిని ఆచరించుము. మగటిమి కలవాడ వయితే దీనిని చేయుము.' అని ధర్మరాజు అనగా దుర్యోధనుడు ఈ విధంగా అన్నాడు.

దుర్యోధనుఁడు నీరిలోన యుండి ధర్మజున కుత్తరం బిచ్చుట (సం. 9-30-35)

సీ. 'నరుఁడు ప్రాణభయంబుఁ బొరయుట యరు దయ్య! వినుము తెల్లంబుగా మనుజనాథ!
రథవాహసారథిరహితుండ నగుటను । బాణాదిహేతిసంపదలు లేమిఁ
బరివారశూన్యత వాటిల్లుటను బంధు । మిత్రసహాయులు మిడి యడంగఁ
జచ్చుటయును బోట్ల నొచ్చి మేనును డప్పి । గూరి చిత్తంబును బోరి కెలయ

తే. కునికిఁ జేసియుఁ దొలఁగితి నొదిఁగి సేద । దేర్చుకొని రణమునకు నుదీర్ణవృత్తి
వచ్చువాఁడను నీవు మీవారు విశ్ర । మింపుఁ డంతకు మఱి రండు సొంపు సూప.' 64

ప్రతిపదార్థం: మనుజనాథ!= ఓ రాజా!; నరుఁడు= మానవుడు; ప్రాణభయంబున్+పొరయుట= ప్రాణభయాన్ని పొందటం; అరుదు+అయ్య!= ఆశ్చర్యమా!; తెల్లంబుగాన్= స్పష్టంగా; వినుము; రథవాహ= తేరు, గుర్రాలు; సారథి= సారథి; రహితుండను+ అగుటయున్= లేనివాడను అగుటవలనను; బాణ+ఆది హేతి సంపదలు లేమిన్= బాణాలు, ఆయుధాలు మొదలైన యుద్ధసాధనాలు లేనందునను; పరివారశూన్యత+పాటిల్లుటను= సేవకులు లేకుండటంచేత; మిత్ర, సహాయులు= స్నేహితులు, సహాయకారులు; మిడి+అడంగన్+చచ్చుటన్= గర్వం అణగి చనిపోవటం చేతను; పోట్లన్+నొచ్చి= దెబ్బలచేత నొవ్వబడి; మేనును= ఒడలును; డప్పికూరి= దాహం కాగా; చిత్తంబును= మనసును; పోరికిన్+ఎలయక+ఉనికిన్= యుద్ధానికి సిద్ధం కాకుండటంచేతను; తొలఁగితిన్= తప్పుకొన్నాను; ఒదిఁగి= తొలగి; సేదన్+తీర్చుకొని= అలుపు తీర్చుకొని; రణమునకున్= యుద్ధానికి; ఉదీర్ణవృత్తిన్= గొప్పగా; వచ్చువాఁడను= రాగలను; అంతకున్= అంతదాక; నీవున్+మీవారున్= నీవూ నీ మనుష్యులూ; విశ్రమింపుఁడు= విశ్రాంతి తీసికొనండి; సొంపు చూపన్= మీతీరు చూపటానికి; మఱిరండు= ఆ పైన రండి.

తాత్పర్యం: 'ఓ రాజా! మానవుడు ప్రాణభయం చెందటం ఆశ్చర్యమా? స్పష్టంగా వినుము. రథాలు, గుర్రాలు, సారథులు లేనివాడను, అస్త్రశస్త్రాలూ లేనివాడను, సేవకులు, స్నేహితులూ, సాయపడేవాళ్ళూ గర్వమణగిచనిపోవడం వలనా దెబ్బల వలన కలిగిన బాధచేతనూ, యుద్ధానికి తలపడలేకున్నాను. అందువలన తప్పుకొన్నాను. ఒక్కింత అలసట తీర్చుకొని గొప్పగా యుద్ధానికై తలపడతాను. మీవారూ మీరూ కొంత విశ్రాంతి తీసికొని తిరిగి మీ నైపుణ్యం చూపటానికి రండు.'

వ. అని పలికినఁ బాండవాగ్రజుండు. 65

ప్రతిపదార్థం: అని పలికినన్= అని మాటలాడగా; పాండవాగ్రజుండు= ధర్మరాజు.

తాత్పర్యం: అని మాటలాడగా ధర్మరాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఇందాఁక విశ్రమించితి; । మిందు నినుం దడవి కంటి; మిప్పు డిచట నీ
కుం దేటె డప్పి; కురుపతి । నందన! ర మ్మింక రణమునకు నాయిత మై.' 66

ప్రతిపదార్థం: కురుపతినందన!= కురురాజకుమారా!; ఇందాఁకన్= ఇంతవరకును; విశ్రమించితిమి= విశ్రాంతి తీసికొన్నాము; ఇందున్= ఇక్కడ; నినున్= నిన్ను; తడవి కంటిమి= వెదకి చూచాము; ఇప్పుడు+ఇచటన్= ఇపు డిక్కడ; నీకున్= నీకు; దప్పి తేఱెన్= అలసట తీరింది; ఆయితము+ఐ= సిద్ధమై; ఇంకన్+రణమునకున్+రమ్ము= ఇక యుద్ధానికి రమ్ము.

తాత్పర్యం: 'ఓ కురురాజ కుమారా! ఇంతదాక అలుపుదీరా విశ్రమించాము. వెదకి ఇక్కడ నిన్ను చూచాము. నీకూ ఇప్పటికి అలసట తీరింది. ఇక యుద్ధానికి సన్నద్ధమై రమ్ము.'

వ. అనుటయు. 67

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే.

తాత్పర్యం: ధర్మరాజు ఇట్లు అనగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'ఎవ్వరికిఁ గాఁగ రాజ్యంబు నెల్లభోగ । ములును గోరుదు రక్కుమారులును నాదు
తమ్ములును లేరు; తురగరథ ద్విపప్ర । హీన యయ్యె నీ క్షోణీయు; నేల పెనఁగ? 68

ప్రతిపదార్థం: ఎవ్వరికిన్+కాఁగన్= ఎవరి కొరకుగా; రాజ్యంబున్= రాజ్యమును; ఎల్లభోగంబులును= అన్ని సుఖాలూ; కోరుదురు= కోరుకొంటారో; ఆ+కుమారులును= ఆ కొడుకులున్నూ; నాదు తమ్ములును లేరు= నా తమ్ముళ్ళూ లేరు; ఈ క్షోణియున్= ఈ నేలకూడా; తురగ రథ ద్విప ప్రహీనము+అయ్యెన్= గుర్రాలూ, తేర్లూ, ఏనుగులూ నశించింది అయినది; పెనఁగన్+ఏల?= పెనుగులాట దేనికి?

తాత్పర్యం: 'ఎవరికొరకై రాజ్యాన్ని ఆశిస్తానో, ఎవరికొరకై భోగాలన్నిటినీ కోరుకొంటానో ఆ కుమారులూ నా తమ్ముళ్ళూ లేరు. ఈ భూమికూడా చతురంగ బలహీనమయినది. ఇంకెందుకు యుద్ధం చేయటం?

చ. ద్రుపదతనూజులన్ గెలిచి దోర్బలసంపద నుల్లసిల్లి మి
మ్మపజితదర్పహీను లగునట్లుగఁ జేసి సమస్తభూపతి
త్వపదము గంటినేనియు వృథారభసం బది యింపు గాదు క
ర్ణుపడుట భీష్ములేమిని గురుండు మృతుం డగుటన్ ధరాధిపా! 69

ప్రతిపదార్థం: ధరాధిపా!= ఓ రాజా!; ద్రుపద తనూజులన్= ద్రుపదుని కుమారులను; గెలిచి= జయించి; దోర్బలసంపదన్= భుజబలైశ్వర్యంతో; ఉల్లసిల్లి= సంతసించి; మిమ్మున్= మిమ్మల్ని; (పాండవులను) అపజిత దర్పహీనులు+అగునట్లుగన్+చేసి= జయింపబడని దర్పం లేనివారు అయ్యేటట్టు చేసి - దుర్దమ దర్పహీనులగునట్లు చేసి; సమస్త భూపతిత్వపదము= భూసామ్రాజ్యాధిపత్య పదవిని; కంటిన్+ఏనియున్= పొందినప్పటికినీ; వృథా= వ్యర్థమగు; రభసంబు= ఆర్భాటం; కర్ణు పడుటన్= కర్ణుడు చనిపోవటం చేతా; గురుండు= ద్రోణుడు; మృతుండు+అగుటన్= చనిపోవటంచేతా; అది ఇంపుగాదు= అది(నా) ఇష్టం కాదు;

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ద్రుపదుడి కుమారులను గెలిచి భుజబల సంపదతో సంతోషంగా మీ అందరనూ దుర్దమ గర్వహీనులనుగా చేసి రాజ్యాధిపత్యము నందినప్పటికీ ఈ వృథార్భాటం కర్ణభీష్మద్రోణులు గతించటం వలన నాకు ప్రీతిని కలిగించదు.

క. తనవారుఁ దానుఁ గూడఁగ । ననుభవసుఖ మందఁ డేని యది రాజ్యమె రా
జునకు? భవత్పరిజనములు । ననుజన్ములు బ్రదికి; రేలు మఖిలధరిత్రిన్. 70

ప్రతిపదార్థం: తనవారున్ తానున్ కూడఁగన్= తనవారును తానును కలిసి; అనుభవ సుఖము+అందఁడు+ఏని= అనుభవించదగిన సౌఖ్యం పొందనిచో; రాజునకున్= రాజైన వాడికి; అది రాజ్యమె?= ఆ రాజ్య మొక రాజ్యమా?; నీ సేవకులు; అనుజన్ములు= తోబుట్టువులు; బ్రదికిరి= బ్రతికిఉన్నారు; అఖిల ధరిత్రిన్ ఏలుము= ప్రపంచమంతటిని ఏలుకొమ్ము.

తాత్పర్యం: తన వారితో కలిసి అనుభవించదగు సుఖమే సుఖం. కాని, అది లేనిచో రాజునకు అది రాజ్యమూ కాదు. ఆ సుఖము సుఖమూ కాదు. నీ సోదరులు, సేవకులూ అందరూ బ్రతికే ఉన్నారు. ప్రపంచాన్నంతటినీ నీవే ఏలుకొమ్ము.

క. ఏ నింక సమర మొల్ల మ । హీనాయక! నీక యుర్వి నిచ్చితి శాంతిం
గానకుఁ జని వల్కలపరి । ధానుఁడ నై తప మొనర్చెదను మునుల కడన్. 71

ప్రతిపదార్థం: మహీనాయక!= ఓ రాజా!; ఏన్+ఇంకన్ సమరము+ఒల్లన్= నే నింక యుద్ధమున కిష్టపడను; నీకున్+అ= నీకే; ఉర్విన్+ఇచ్చితిన్; భూమిని(రాజ్యమును) ఇచ్చివేసినాను; శాంతిన్+కానకున్+చని= శాంతితో; అడవికి వెళ్ళి; వల్కలపరిధానుఁడను+ఐ= నార చీరలే బట్టలుగా కలవాడనై; మునులకడన్= తాపసుల వద్ద; తపము+ఒనర్చెదను= తపస్సు చేస్తాను.

తాత్పర్యం: నా కింక యుద్ధం వద్దు. ఓ రాజా! ఈ భూమిని నీ కిచ్చాను. శాంతంగా అడవులకు వెళ్ళి మునుల సన్నిధిని నారచీరలు కట్టుకొని తపస్సు చేసికొంటాను.

ఆ. ఓడి వచ్చినాఁడ నుద్ధతి నా కేల? । యుడుకు మాని నీవ యుర్వి యేలు
గుఱ్ఱములును నేనుఁగులు లేని బయలు నీ । తలనె కట్టికొనుము ధర్మతనయ!' 72

ప్రతిపదార్థం: ధర్మతనయ!= ధర్మరాజా!; ఓడి వచ్చినాఁడన్= ఓడిపోయివచ్చాను; ఉద్ధతి= గర్వం; నాకున్+ఏల?= నా కెందుకు?; ఉడుకు మాని= తాపం వదలి; నీవ+ఉర్వి+ఏలు= నీవే భూమిని పాలించుకొమ్ము; గుఱ్ఱములును+ఏనుఁగులున్ లేని బయలు= గుర్రాలు, ఏనుగులు లేని బీడును; నీ తలనె కట్టికొనుము= నీ నెత్తినే కట్టుకొనుము.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఓడిపోయి వచ్చినాను. నా కెందుకయ్యా గర్వం? ఈ భూమిని నీవే పాలించుకొమ్ము. గుర్రాలు, ఏనుగులు లేని ఈ బీడును నీ నెత్తిపైననే కట్టుకొమ్ము'.

చ. అన విని యన్నరేశ్వరుఁడు హాసముతో నతనింగుఱించి యి
ట్లనుఁ 'దనుజానుజన్మసుహృదాప్త సహాయుల సన్నఁ గాదె శ
ల్యునిఁ గొని మమ్ము గెల్చి సకలోర్వియు నేలుట కుత్సహించి తీ
పనవుట లేల? మాను మిది; పాటిగఁ బట్టుము లెమ్ము పోరికిన్. 73

ప్రతిపదార్థం: అనన్+విని= అనగా విన్నవాడై; ఆ+నరేశ్వరుఁడు= ఆ ధర్మరాజు; హాసముతోన్= నవ్వుతో; అతనిన్+గుఱించి= ఆ దుర్యోధనుడి గూర్చి; ఇట్లు+అనున్= ఈ విధంగా అంటున్నాడు; తనుజ+అనుజన్మ+సుహృద్+ఆప్తసహాయులు= కుమారులు, సోదరులు, స్నేహితులు, ఆత్మీయులు, సహాయకులు; చన్నన్+కాదె?= పోయిన తరువాతనే కదా!; శల్యునిన్+కైకొని= శల్యుడిని తీసికొని; మమ్మున్ గెల్చి= మమ్ము జయించి; సకల+ఉర్వియున్= భూమండలమంతయు; ఏలుటకున్= పాలించటానికి; ఉత్సహించితి(వి)= ఆసపడ్డావు; ఈ పనవుటలు= ఈ ప్రేలుటలు; ఏల?= ఎందుకు?; మానుము= మానుకొనుము; ఇది పాటిగన్+పట్టుము= దీనిని ధర్మంగా ఎంచుము; పోరికిన్= యుద్ధానికి; లెమ్ము= లే.

తాత్పర్యం: ధర్మరాజు దుర్యోధనుడితో నవ్వుతూ ఇట్లా అన్నాడు: 'కుమారులు, తమ్ములు, ఆప్తజనాలు, సహాయంగా వచ్చేవారూ గతించిన తరువాతనే కదా శల్యుడిని తీసికొనివచ్చి మమ్ము గెల్చి భూమండలమంతా పాలించవలెనని ఆశపడ్డావు. ఈ ప్రేలాపన లెందుకు గాని ధర్మం ఎంచి యుద్ధానికి లెమ్ము.

సీ. **నీ యీగి నేను భూనాయకుఁ డగు టొల్ల । రాజకోటికిఁ బరిగ్రహము సనునె?**
నిను ననిం దెగటార్చి నేలఁ బాలించెద । నను నోర్చితేని పెంపున సుఖింపు
మేమిటి వాఁడవై యిచ్చితి పుడమి నీ । కనియెడు మాట యిట్లాడె దిపుడు
నీవు ధరిత్రి యీ నేర్చినఁ గురుకులం । బునకు నిట్లాఅడిఁ బోవ నేల?

తే. **శాంతి నొందుటకై ధర్మసం విభాగ । కరణ మొనరింపవచ్చినకమలనాభు**
వాక్యవృత్తిఁ బాటింపక వాఁడి సూది । మోపి నంతైన నుర్వి యీనోప నంటి. 74

ప్రతిపదార్థం: నీ ఈగిన్= నీ దానాన్ని; ఏను= నేను; భూనాయకుఁడు+అగుటన్+ఒల్లన్= రాజగుటకు ఇష్టపడను; రాజకోటికిన్= రాజులకు; పరిగ్రహము= దానం తీసికొనటం; చనునె?= తగునా?; నినున్= నిన్ను; అనిన్= యుద్ధంలో; తెగటార్చి= నాశనం చేసి; నేలన్= భూమిని; పాలించెదన్= పరిపాలన చేస్తాను; ననున్+ఓర్చితి(వి)+ఏని= నన్ను ఓడించినట్లయితే; పెంపునన్= గొప్పగా; సుఖింపుము= సుఖించు; ఏమిటివాఁడవు+ఐ= ఏమంత గొప్పవాడవై; పుడమిన్= భూమిని (రాజ్యాన్ని); ఇచ్చితి(వి)?= ఇచ్చావు?; ఈక= ఇవ్వకుండా; అనియెడుమాట= అనే మాట; ఇపుడు= ఈ సమయంలో (అన్నీ కోలుపోయిన ఈ సమయంలో); ఇట్లు= ఈ రీతిగా; ఆడెదు= అంటున్నావు; నీవు ధరిత్రిన్+ఈన్+నేర్చినన్= నీవు భూమిని ఈయగల్గిన వాడవే అయితే; కురుకులంబునకున్= కురువంశం కొరకు; ఇట్లు+ఆఅడిన్+పోవ నేల?= ఈ విధంగా నిందాపాత్రమై పో నేల?; శాంతిన్+ఒందుటకై= శాంతిని పొందటానికి గాను; ధర్మసంవిభాగ కరణము= న్యాయంగా భాగమును పరిష్కరించటం; ఒనరింపన్= చేయుటకు; వచ్చిన= వచ్చినటువంటి; కమలనాభువాక్యవృత్తిన్= శ్రీకృష్ణుడిమాట తీరును; పాటింపక= నడవకుండా; వాఁడిసూదిన్= వాడి అయిన సూదిని; మోపినంతైనన్= ఆన్చినంతకూడ; ఉర్విన్= భూమిని; ఈన్+ఓపనంటి(వి)= ఈయలేనన్నావు.

తాత్పర్యం: నీ ఈ దానములో రాజగుటకు నేను అంగీకరించను. యుద్ధంలో చంపి భూమిని పాలిస్తాను. నన్ను ఓడించినట్లయితే గొప్పగా సంతోషించుము. నీ వెవడ వని భూదానం ఇచ్చావు? ఈ సమయంలో ఇట్లా మాట్లాడుతున్నావేమిటి? నీవే భూమిని ఈయగల్గితే కురువంశం ఇట్లా నిందాపాత్రం కానేల? ధర్మపద్ధతిలో భాగ పరిష్కారానికై వచ్చి మాట్లాడిన శ్రీకృష్ణుడి మాటలు లెక్కచేయకుండా వాడి సూది మొన మోపినంత భూమిని కూడ ఈయనన్నావు.

క. **ఏమి విధంబునఁ బోరలియు । భూమి కురున్నపాల! నీకుఁ బుచ్చుకొనఁగ రా**
కీమెయి దైన్యపడితి? నా । కేమార్గము వట్టి యిచ్చె దేర్పడఁ జెపుమా! 75

ప్రతిపదార్థం: కురునృపాల!= కౌరవరాజా!; ఏమి+విధంబునన్= ఏ ప్రకారంగా; పొరలియున్= పొరలినప్పటికీ - శ్రమించినప్పటికీ; నీకు భూమిన్!= నీకు భూమిని; పుచ్చుకొనఁగ రాక= తీసికొన వీలుపడక; ఈ మెయిన్= ఈ విధంగా; దైన్యపడితి?= నీచస్థితికి వచ్చావు?; నా కే మార్గము పట్టి ఇచ్చెదు?= నాకు ఏ విధంగా ఇస్తావు?; ఏర్పడన్+చెపుమా!= స్పష్టంగా చెప్పుము!

తాత్పర్యం: కౌరవరాజా! ఏ విధంగానూ - ఎంత పొరలినా - ఎంత శ్రమించినా; భూమిని తీసికొనటానికి నీకు వీలుపడక ఇంత నీచస్థితికి దిగజారావు? ఏ విధంగా దీనిని నాకిస్తావో స్పష్టంగా చెప్పుము.'

క. **అరులకు సిరి యిచ్చితి నను । వెరవి డియుం గలఁడె? దీని విడువుము నాకున్**
ధర యిచ్చి తేనియును నినుఁ । బొరిగొన కే విడువ నతిమి పోరుట యొప్పున్. **76**

ప్రతిపదార్థం: అరులకున్= వైరులకు; సిరి ఇచ్చితిన్+అను= సంపద నిస్తాననే; వెరవిఁడియున్+కలఁడె?= ఉపాయహీను డున్నాడా?; దీనిన్ విడువుము= ఈ ప్రయత్నం మానుకొమ్ము; నాకున్ ధరఇచ్చితి(వి)+ఏనియును= నాకు నీవు భూమి నిచ్చినప్పటికిని; నినున్= నిన్ను; పొరిగొనక= చంపకుండా; ఏన్ విడువన్= నేను వదలను; అతిమిన్= ఆక్రమించి(క్రమ్ముకొని); పోరుట= యుద్ధం చేయటం; ఒప్పున్= తగును.

తాత్పర్యం: వైరులకు సంపద నిస్తాననే వెర్రివా డుంటాడా? ఈ ప్రయత్నాన్ని మానుకొనుము. నాకు ఒకవేళ ఈ భూమిని ఇచ్చినా నిన్ను చంపక వదలను. కనుక విక్రమించి యుద్ధం చేయటమే తగును.

క. **నాచే నీ ప్రాణంబులు । నీచే నా జీవితంబు నిజ మున్నవి యి**
న్నీచత యవకార్యము రా । జోచితకర్మకృత నిశ్చయుఁడ వగుము నృపా!' **77**

ప్రతిపదార్థం: నృపా= రాజా!; నాచేన్ నీ ప్రాణంబులు= నీ ప్రాణాలు నాచేతను; నీచే నా జీవితంబు= నా ప్రాణం నీచేతను; ఉన్నవి= ఉన్నాయి; నిజము= అది సత్యం; ఈ+నీచతన్= ఈ నైచ్యం; అవకార్యము= చేయగూడని పని; రాజ+ఉచితకర్మ= విధి నిర్ణయించిన రాజులు చేయవలసిన పనియందు; కృతనిశ్చయుఁడవు+అగుము= నిశ్చయించుకొన్నవాడవుకమ్ము.

తాత్పర్యం: నీ ప్రాణాలు నాచేతిలోనూ నా ప్రాణాలు నీచేతిలోనూ ఉన్నాయి. ఇది నిజం. నీ ఈ నైచ్యం తగనిది, రాజులకు తగిన కర్మఅయిన యుద్ధానికి దృఢనిశ్చయుడవు కమ్ము.'

వ. **అని వెండియు నిట్లను 'జతుగృహంబు దహించితి, పాములం గఱపించితి, నీటం ద్రోయించితి, విషాన్నంబు వెట్టించితి; వెన్ని కపటోపాయంబులు సేసినను నీచేతఁ జెడక యునికి యెఱుంగవే? యింక నట్ల య మ్మాయలం బ్రయోజనంబు లేదు.** **78**

ప్రతిపదార్థం: అని వెండియున్+ఇట్లు+అనున్= అని మరియు ఈవిధంగా అన్నాడు; జతుగృహంబు దహించితి(వి)= లక్కయింటిని కాల్చావు; పాములన్+కఱపించితి(వి)= పాములచేత కరపించావు; నీటన్+త్రోయించితి(వి)= నీటిలో త్రోయించావు; విషాన్నంబు పెట్టించితి(వి)= విషం కలిపిన అన్నమును పెట్టించావు; ఎన్ని కపట+ఉపాయంబులు చేసినను= ఎన్ని విధాలయిన కుట్రలు చేసినను; నీచేతన్+చెడక+ఉనికి= నీవలన నాశనం కాకుండటం; ఎఱుంగవే?= నీవు ఎరుగవా?; ఇంకన్+అట్లు+అ= ముందు కూడా అట్లే; ఆ+మాయలన్+ప్రయోజనంబు లేదు= ఆ మోసాలవలన లాభంలేదు.

తాత్పర్యం: (ధర్మరాజు ఇంకా ఇట్లా అన్నాడు) లక్క ఇల్లు కాల్పించావు. పాములతో కరిపించావు. నీళ్ళలో త్రోయించావు, విషం కలిపిన అన్నం పెట్టించావు. ఎన్ని కుట్రలు చేసినప్పటికీ నీవలన మేము నాశనం కాకుండా ఉండగలగటం నీకు తెలియదా? ముందుకూడా అట్లే ఆ విధమైన మోసాలవలన ప్రయోజనం లేదు.

క. లే లెమ్ము! బిరుద వై ర । మ్మాలమునకు; నీవు నెఱుఁగ దవ్విధము కడున్
మే లొండు తెరవు లే; దిం । కేల యొదిఁగి కష్టపడ? నరేశ్వర! చెపుమా! 79

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= ఓ రాజా!; లే లెమ్ము= త్వరగా లే; బిరుదువు+ఐ= వీరుడవయి; ఆలమునకున్= యుద్ధానికి; రమ్ము= రా; నీవున్; ఎఱుఁగుదు(వు); ఆ+విధము= ఆ రీతి-యుద్ధానికి సిద్ధపడటం; కడున్= మిక్కిలి; మేలు= మంచిది; ఒండు= వేరొక; తెరువులేదు= మార్గములేదు; ఇంక= ఇక; ఒదిగి= తొలగి; కష్టపడున్ ఏల?= కష్టపడుట ఎందుకు? చెపుమా.

తాత్పర్యం: ఓ రాజా! లేచిరావయ్యా! యుద్ధానికి రమ్ము! నీకు ఇంతకంటె మేలైన మార్గం వేరే లేదు. ఆ సంగతి నీకూ తెలుసు. ఇంకనూ దాగికొని బాధపడట మెందుకు?'

వ. అని యివ్విధంబున నమ్మనుజేంద్రుండు మఱియుం బలుకఁ బెఱవారు నట్ల పలికి' రనిన విని
ధృతరాష్ట్రుండు. 80

ప్రతిపదార్థం: అని ఈ+విధంబునన్= అని ఈ ప్రకారంగా; ఆ+మనుజ+ఇంద్రుండు= ఆ ధర్మరాజు; మఱియున్= ఇంకను; పలుకన్= మాటాడగా; పెఱవారును= ఇతరులు కూడా; అట్లు+అ పలికిరి= అదే విధంగా మాటాడారు; అనినన్ విని= అని (సంజయుడు) చెప్పగా విన్నవాడై; ధృతరాష్ట్రుండు.

తాత్పర్యం: అని ఈ విధంగా ధర్మరాజు, మిగిలిన వారూ మాట్లాడారు.' అని సంజయుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'ఇట్లు జంకింపఁబడి మఱి యేమి సేసె । నాతనూజుండు? మున్ను నెన్నఁడును జంకఁ
బడినవాఁడు గాఁ డక్కట! పుడమి నాల్గు । సెఱఁగులును వెఱఁ దన పంపు సేయ బ్రదికె. 81

ప్రతిపదార్థం: నా తనూజుండు= నా కుమారుడు; ఇట్లు జంకింపఁబడి= ఈ విధంగా బెదరించబడి; మఱిఏమి+చేసెన్?= ఇంకేమి చేశాడు?; మున్ను= పూర్వం; ఎన్నఁడును= ఎప్పుడు కూడా; జంకబడినవాఁడు= బెదరించబడినవాడు; కాఁడు= కాదు; అక్కట!= అయ్యో!; పుడమి నాల్గు చెఱుగులును= భూమి నాల్గు దిక్కులూ; వెఱన్= భయంతో; తన పంపు+చేయన్ బ్రదికెన్= తన ఉత్తరువు పాటింపగా బ్రతికాడు.

తాత్పర్యం: 'ఈ విధంగా బెదరించబడ్డ నా కుమారుడు ఇం కేమి చేశాడు? ఇదివరలో ఎపుడూ కూడా భయపెట్టబడినవాడు కాడు. నాల్గుదిక్కులూ తా నంటే భయపడుతూ తన ఆజ్ఞను పాటించే విధంగా బ్రతికినవాడు. అయ్యో!

క. పరిజనహీనత దీనతఁ । బొరసినయెడ ముట్టుకొని రిపుప్రకరము ని
ష్ఠురవాక్యమ్ముల నమ్మెయిఁ । బరితాపము సేయ నేమిభంగి నిలిచెనో?' 82

ప్రతిపదార్థం: పరిజనహీనతన్= సేవకులు లేమిని; దీనతన్= దైన్యమును; పొరసిన+ఎడన్= కలిగినపుడు; ముట్టుకొని= తాకి; రిపుప్రకరము= వైరిసమూహం; ఆ+మెయిన్= ఆ విధంగా; నిష్ఠురవాక్యమ్ములన్= కఠినమైన మాటలతో; పరితాపము+చేయన్= బాధించగా; ఏమి భంగిన్ నిలిచెనో?= ఏ విధంగా (బ్రతికి) ఉన్నాడో!.

తాత్పర్యం: సేవకులు లేకుండా దీనంగా ఉండగా వైరిసేన క్రమ్ముకొని, ఆ విధంగా నిష్ఠురమైన మాటలతో బాధించగా (దెప్పుడు మాటలతో తూలనాడగా) ఏ విధంగా ఉండగలిగాడో?'

వ. **అనుటయు సంజయుం డమ్మనుజపతి కిట్లనియె 'నట్లు ధర్మతనయుండును దమ్ములుఁ గొడుకులును ద్రుపదపుత్రులును బొదువుకొని పలుకు పరుసని పలుకులకుఁ జిత్తం బుత్తలపడ నాననంబు పల్లటిల్లఁ గరంబులు విదిర్చి దురం బొనర్చువాఁడై యప్పాండవాగ్రజున కిట్లనియె.** 83

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; సంజయుండు; ఆ+మనుజపతికిన్+ఇట్లు+అనియెన్= సంజయు డా రాజుతో (ధృతరాష్ట్రుడితో) ఈ విధంగా అన్నాడు; అట్లు= ఆ విధంగా; ధర్మతనయుండును+తమ్ములున్+కొడుకులును= ధర్మరాజును, వానితమ్ములును, కుమారులును; ద్రుపదపుత్రులును= ద్రుపదరాజు కుమారులును; పొదువుకొని= చుట్టూ క్రమ్ముకొని; పలుకు పరుసని పలుకులకున్= మాట్లాడే పరుషవాక్యాలకు; చిత్తంబు+ఉత్తలపడన్= మనసు చీకాకుపడగా; ఆననంబు పల్లటిల్లన్= మొగం చిన్నపోగా; కరంబులు విదిర్చి= చేతులు విదలించుకొని; దురంబు+ఒనర్చువాఁడు+ఐ= యుద్ధం చేసేవాడై; ఆ+పాండవ+అగ్రజునకున్+ఇట్లు+అనియెన్= ఆ పాండవుల అన్న అయిన ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: సంజయుడు ధృతరాష్ట్రుడితో ఈ విధంగా అన్నాడు: ధర్మరాజు, అతడి తమ్ములు, ద్రుపద పుత్రులు చుట్టుకొని మాట్లాడే పరుషపు మాటలకు మనసు చీకాకుపడగా, మొగం చిన్నపోగా, చేతులు విదలించుకొని, యుద్ధం చేసేవాడుగా ఆ ధర్మరాజుతో (దుర్యోధనుడు) ఈ విధంగా అన్నాడు:

సీ. **'మీ రేవురును బరివార బాంధవమిత్ర । సహితుల, రఖిలాస్త్రశస్త్రవంతు**
లరు, కరిస్యందనతురగసమేతులు; । రే నొకరుండ, విహీనసహచ
రత్వంబు విగతాయుధత్వంబు వాహన । హీనత నొందితి; నే విధమున
నని యొనర్పఁగ వచ్చు? నది గాక పోటుల । డస్సితిఁ గడు; మీకు డప్పి లేదు;

తే. **వరుసఁ దగ నొక్కఁ డొక్కఁడ వచ్చి పోరుఁ; । డిపుడ వెడలి మిమ్మందఱ నెల్ల చెలులఁ**
జుట్టముల రూపుమాపెదఁ; జుట్టుముట్టి । పలువు రొక్కనితోఁ బోరఁ బాడి యగునె? 84

ప్రతిపదార్థం: మీరు+ఏవురును= మీ అయిదుగురూ; పరివార= సేనా పరివారంతో; బాంధవమిత్రసహితులరు= బంధువులతో, స్నేహితులతో కలిసి ఉన్నవారు; అఖిల+అస్త్రశస్త్రవంతులరు= అన్ని అస్త్రశస్త్రాలను కలిగినవారు కూడాను; కరిస్యందన తురంగ సమేతులరు= ఏనుగులు, తేరులు, గుర్రాలతో కూడి ఉన్నవారు; ఏను+ఒకరుండన్= నే నొక్కడనే; విహీనసహచరత్వంబు= తోడులేనితనం; విగత+ఆయుధత్వంబు= (యుద్ధానికి కావలసినన్ని) ఆయుధాలు లేనితనం = వాహనహీనత= వాహనాలు లేకుండటం; ఒందితిన్= పొందాను; ఏ విధముగన్+అని+ఒనర్పగవచ్చున్?= ఎట్లా యుద్ధం చేయాలి?; అది గాక= అంతే కాదు; పోటులన్= దెబ్బలవలన; కడున్ డస్సితిన్= మిక్కిలి అలసిపోయాను; మీకున్ డప్పి లేదు= మీకు శ్రమ(కూడా) లేదు; వరుసన్= క్రమంగా; ఒక్కడు+ఒక్కండు+ఆ వచ్చి= ఒకడొకడే వచ్చి; పోరుఁడు= యుద్ధం చేయండి; ఇపుడు+అ+వెడలి=

ఇపుడే (ఈ కొలను నుండి వెలువడి) వచ్చి; మిమ్మున్+అందఱన్= మీ అందరినీ; ఎల్ల చెలులన్= స్నేహితులందరినీ; చుట్టములన్= బంధువులను; రూపుమాపెదన్= చంపుతాను; పలువురు= అనేకులు; చుట్టుముట్టి= క్రమ్ముకొని; ఒక్కనితోన్+ పోరన్= ఒక్కడితో యుద్ధం చేయటం; పాడి అగునె?= ధర్మమా?

తాత్పర్యం: మీ ఐదుగురును సేనలతో బంధువులతో ఉన్నవారు, అఖిలాస్త్ర శస్త్రాలతో ఉన్నవారు, ఏనుగులు, రథాలు, గుర్రాలు కలిగినవారు, నేనా ఒక్కడను, సహచరులు, ఆయుధాలు, వాహనాలు లేనివాడిని. నేను ఏ విధంగా మీతో యుద్ధం చేయగలను? అంతేకాక దెబ్బలవలన అలసి ఉన్నాను. మీరు ఏ శ్రమా లేనివారు. ఏ విధంగా ఒక్కడనే మీతో యుద్ధం చేయటం? క్రమంగా ఒకరొక్కరే వచ్చి పోట్లాడండి. ఇపుడే వెలికి వచ్చి మీ అందరితో పోట్లాడి సమిత్రబాంధవంగా చంపుతాను. పెక్కుమంది ఒక్కడితో యుద్ధం చేయటం న్యాయమా?

వ. అట్లు మీరు సాలరేని. 85

ప్రతిపదార్థం: అట్లు మీరు+చాలరేని= ఆ విధంగా మీరు సమర్థులు కాకుంటే.

తాత్పర్యం: దానికి మీకు సామర్థ్యం లేకపోతే. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. తమ్ముల నిన్నుఁ గేశవునితమ్ముని ద్రౌపదియన్నదమ్ములం
గ్రమ్మన గీ టడంచెద నొకండన యే నిదె వచ్చి బాహుద
ర్పమ్మున నిర్గవారమును భానుఁడు దోఁచి సముజ్జ్వలాత్మతే
జమ్మున రూపుమాపు క్రియ; సజ్జత నిల్వుము సుస్థిరుండవై. 86

ప్రతిపదార్థం: తమ్ములన్ నిన్నున్= నిన్నూ నీ తమ్ములను; కేశవుని తమ్మునిన్= సాత్యకినీ; ద్రౌపది అన్నదమ్ములన్= ద్రౌపది అన్ననూ, తమ్ములనూ; గ్రమ్మనన్= వెంటనే; గీటడంచెదన్= నాశనం చేస్తాను(రూపుమాపుతాను); ఏను+ఒకండను+అ= నేనొక్కడనే; ఇదె వచ్చి= ఇదుగో వచ్చినవాడనై; బాహుదర్పమ్మునన్= భుజబలంతో; ఇర్గవారమును= చీకట్ల సమూహాన్ని; భానుఁడు+తోఁచి= సూర్యుడు ఉదయించి; సముజ్జ్వలాత్మతేజమ్మునన్= మిక్కిలి వెలిగేతనకాంతితో; రూపుమాపుక్రియన్= అణగార్చేటట్లు (సూర్యుడు తన వెలుగుతో చీకటిని పోగొట్టినట్లుగా); సుస్థిరుండవై నిల్వుము= సంసిద్ధతతో గట్టిగా నిలబడుము.

తాత్పర్యం: నేనొక్కడనే నిన్నూ, నీ తమ్ములనూ, సాత్యకినీ, ద్రౌపది అన్నదమ్ములనూ రూపుమాపుతాను. ఇదిగో వచ్చి భుజబలంతో సూర్యుడు ఉదయించి నిండైన వెలుగుతో చీకట్ల సముదాయాన్ని రూపుమాపినట్లుగా చంపుతాను. సంసిద్ధతతో, దృఢంగా నిలుపుము.

తే. వినుము నీకుఁ గృష్ణునకును వెఱచి కాదు । ముంద రేనట్టు లాడుట యెందుఁ జెల్లు
సమరధర్మంబు తెఱఁగు దెల్లముగ నెల్ల । వారలకుఁ దెల్పుటకుఁ గాని వసుమతీశ! 87

ప్రతిపదార్థం: వసుమతీశ!= ఓ రాజా!; వినుము; ముందర= ఇంతకు మునుపు; ఏన్+అట్టులు+ఆడుట= నేనావిధంగా మాట్లాడటం; ఎందున్= ఎక్కడనైనా; చెల్లు= సరిపోవునట్టి; సమరధర్మంబు తెఱఁగున్= యుద్ధన్యాయం; ఎల్లవారలకున్= అందరకూ; తెల్లముగన్= స్పష్టంగా; తెల్పుటకున్+కాని= తెలియటానికే గాని; నీకున్ కృష్ణునకును వెఱచి కాదు= నీకూ కృష్ణుడికీ భయపడికాదు.

తాత్పర్యం: ఓ రాజా! వినుము. నీకూ శ్రీకృష్ణుడికీ భయపడికాదు. యుద్ధ నీతిని అందరకూ తెలియచేయటానికే ఇంతవరకు నే నా విధంగా మాట్లాడాను.

వ. నేఁడు మిమ్ముందఱ సమయించి భీష్మద్రోణకర్ణభగదత్తబాహ్లికజయద్రథశకునిశల్యాదు లగు బంధుమిత్ర సహాయుల ఋణంబు దీర్చెద' నని పలికినం బాండవాగ్రజుం డి ట్లనియె. 88

ప్రతిపదార్థం: నేఁడు= ఈ దినం; మిమ్ము+అందఱన్ సమయించి= మీ అందరిని చంపి; భీష్మద్రోణకర్ణ భగదత్త బాహ్లిక జయద్రథ శకుని శల్య+ఆదులగు= భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, భగదత్తుడు, బాహ్లికుడు, సైంధవుడు, శకుని, శల్యుడు మొదలైన; బంధుమిత్ర సహాయుల ఋణంబు+తీర్చెదన్= బంధువుల, మిత్రుల, సహాయుల ఋణం తీరుస్తాను; అని పలికినన్= అని మాట్లాడగా; పాండవ+అగ్రజుండు+ఇట్లు+అనియెన్= ధర్మరాజు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ రోజు మీ అందరిని చంపి, భీష్మ ద్రోణ కర్ణ భగదత్త బాహ్లిక జయద్రథ శకుని శల్యాదులయిన బంధుమిత్రుల, సహాయుల ఋణం తీర్చుకొంటాను' అని మాట్లాడిన దుర్యోధనుడితో ధర్మరాజు ఈ విధంగా అన్నాడు:

చ. 'సమరము పాడి నీ వెఱిఁగి శత్రుల గెల్వఁగ నుత్సహించు టొ
ప్ప మనుజనాథ! యొక్కఁడును బూని మహాద్భుతబాహుసంపదన్
మము వడిఁ దాఁకెదం బిలుకు మార్చెద నంట యుదాత్త మైనధై
ర్యమహిమ గాదె! యి ట్లనిన యంతన యే నటు లేల చేసెదన్? 89

ప్రతిపదార్థం: మనుజనాథా!= ఓ రాజా!; సమరము పాడి= యుద్ధనీతి; నీవు+ఎఱిఁగి= నీవు తెలిసికొని; శత్రులన్+గెల్వఁగన్= వైరులను గెలవటానికి; ఉత్సహించుట+ఒప్పున్= ఆసక్తి చూపటం తగును; ఒక్కఁడును పూని= ఒక్కడే ప్రయత్నంతో; మహాద్భుత బాహుసంపదన్= గొప్పగా అబ్బురమును గల్గించే భుజబలంతో; మము వడిన్+తాఁకెదన్= మమ్ము - త్వరగా ఎదిరిస్తాను; పిలుకుమార్చెదన్+అంట= చంపెదననటం; ఉదాత్తమైన ధైర్యమహిమ+కాదె!= గొప్ప ధైర్యశక్తి కదా!; ఇట్లు+అనిన అంతనన్= ఈ విధంగా అన్నమాత్రాన; ఏన్+అటుల+ఏల చేసెదన్?= నే నా విధంగా ఎందుకు చేస్తాను?

తాత్పర్యం: ఓ రాజా!, యుద్ధధర్మాన్ని తెలిసి వైరులను గెలువటానికి నీవు ఆసక్తి చూపటం తగిఉన్నది. నీ వొక్కడివే భుజబలంతో మా అందర నెదుర్కొని చంపెద నంటున్నావు. అది మిక్కిలి గొప్పదే. అంతమాత్రాన నే నా విధంగా ఎందుకు చేస్తాను.

చ. వలసిన యస్త్రశస్త్రములు వాహనముం గొను; మొక్కరుండ నిన్
గలన జయించువాఁ; డతనిగర్వము నీ వడఁగించితేని యీ
యిల సకలంబు గైకొని వహింపుము రాజ్యవిభూతి; వాఁడు నిన్
దలపడి పోరుఁ జుట్టలును దక్కటివారలు నిల్చి చూడఁగన్.' 90

ప్రతిపదార్థం: వలసిన= అవసరమైన; అస్త్ర, శస్త్రములు= మంత్రసహిత బాణాలూ, మంత్రరహితబాణాలూ; వాహనమున్= వాహనాన్నీ; కొనుము= తీసికొమ్ము; నిన్= నిన్ను; ఒక్కరుండు+అ= ఒకడే; కలనన్= యుద్ధంలో; జయించువాఁడు=

జయిస్తాడు; అతని గర్వమున్= ఆతడి పొగరును; ఈవు= నీవు; అడఁగించితి(వి)+ఏని= అణచినట్లయితే; ఈ+ఇల సకలంబు= ఈ భూమి (రాజ్యం) మొత్తం; కైకొని= తీసికొని; రాజ్యవిభూతి= ప్రభుత్వ వైభవం; వహింపుము= పొందుము; వాఁడు= (నీతో ఎదురొడ్డిపోరే) వాడు; చుట్టలును= బంధువులూ; తక్కటివారలున్= మిగిలినవారూ; నిల్చి= నిలబడి; చూడఁగన్= చూస్తూ ఉండగా; నిన్= నిన్ను; తలపడి= ఎదుర్కొని; పోరున్= యుద్ధంచేస్తాడు.

తాత్పర్యం: దుర్యోధనా! నీకు అవసరమైన అస్త్రశస్త్రాలను వాహనాన్నీ తీసికొమ్ము. యుద్ధంలో నిన్ను మా పక్షంనుండి ఒక్కడే ఎదిరిస్తాడు. అతడి గర్వాన్ని నీవు అణచగలిగితే ఈ రాజ్యాన్నంత నీవే గ్రహించి దాని వైభవాన్ని అనుభవించుము. అతడు ఇక్కడి చుట్టాలూ, మిగిలినవారు నిలబడి చూస్తూ ఉండగా నిన్ను ఎదిరించి యుద్ధం చేస్తాడు.

వ. అనిన విని భవన్నందనుండు ధర్మనందనున కి ట్లనియె. 91

ప్రతిపదార్థం: అనినన్= ఇట్లా అనగా; విని; భవత్+నందనుండు= నీ కొడుకు; ధర్మనందనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధర్మరాజు ఇట్లు సమాధానం ఈయగా, దానికి నీ కొడుకు ఈ విధంగా ప్రత్యుత్తర మిచ్చాడు.

చ. 'అరదము లెక్కి ఘోరవివిధాస్త్రచయంబుల మున్ను పోరమే?
నరవర! క్రొత్తచందము రణంబు కరంబు ప్రియంబు సేయు; ని
ష్ఠురగదలం బదాతు లయి శూరతయున్ మహనీయధీరతా
స్ఫురణమునుం బొగడ్త వడఁ బోరుట మే లని నిశ్చయించితిన్. 92

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; అరదములు+ఎక్కి= తేరులమీది కెక్కి; ఘోర= భయంకరమయిన; వివిధ+అస్త్రచయంబులన్= అనేకములయిన అస్త్రములతో; పోరమే?= యుద్ధం చేయలేదా?; క్రొత్తచందము రణంబు= క్రొత్తపద్ధతి యుద్ధం; ప్రియంబు+ చేయున్= ప్రీతికొల్పుతుంది; నిష్ఠుర= కఠినమయిన; గదలన్+పదాతులు+అయి= గదలతో కాల్బంటులై; శూరతయున్= శౌర్యమును; మహనీయ= గొప్పది అయిన; ధీరతాస్ఫురణమునున్= ధైర్యస్ఫూర్తి; పొగడ్త+పడన్= కీర్తనీయం కాగా; పోరుట; మేలు+అని నిశ్చయించితిన్= మంచి దని నిర్ణయించుకొన్నారు.

తాత్పర్యం: 'రథాలమీద' అనేకాస్త్ర శస్త్రాలతో ఇదివరలో భయంకరంగా యుద్ధం చేశాం కదా! ఓ రాజా! ఇప్పుడు క్రొత్త రకమయిన యుద్ధం నాకు సంతోషదాయకం. భయంకరమయిన గదను చేతబూని కాల్బలంవలె నేలపై నిలిచి, మగటిమి, శౌర్యమూ తెలియగా, గొప్పగా యుద్ధం చేయటం మంచి దని నిశ్చయించాను.

తే. వింతకూరలు గుడుపున వేడ్క సేయు । భంగి సంగ్రామమున నూత్నభంగు లెడఁదఁ
గౌతుకము సేయుఁ గావున గద ధరించి । నిను సహోదరులను యోధులను జయింతు.' 93

ప్రతిపదార్థం: వింత కూరలు= అబ్బురమయిన కూరలు; కుడుపునన్= తినుటకు; వేడ్కచేయు= ఆసగొలుపు; భంగిన్= రీతిలో; సంగ్రామమునన్= యుద్ధంలో; నూత్నభంగులు= క్రొత్తపద్ధతులు తెలియగా; ఎడఁదన్= మనసులో; కౌతుకంబు చేయున్= ఆసగొల్పుతాయి; కావునన్= కనుక; గద ధరించి= గదను పూని; నిను సహోదరులను యోధులను జయింతున్= నిన్నూ, తోబుట్టువులనూ, వీరులనూ జయిస్తాను.

తాత్పర్యం: భోజనంలో క్రొత్తకూరలు ఆసక్తి గొలిపే విధంగా యుద్ధంలో క్రొత్త పద్ధతులు హృదయానికి ఉల్లాసం కలిగిస్తాయి. కాబట్టి గదతో నిన్నూ, నీ సోదరులనూ, వీరులనూ జయిస్తాను.'

చ. అనుటయుఁ బొంగి ధర్మసుతుఁ డాతనితో 'గద నొక్కరుండ నేఁ
గొనియెద నీదుప్రాణము లకుంఠితబాహువిలాసభాసి నై'
యనవుడుఁ బుట్ట లోపలి మహాభుజగేంద్రుఁడు రోఁజునట్టు రోఁ
జె నధిప! య వ్విభుండు దనచిత్తము నప్పలుకుల్ గలంచినన్. 94

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అనుటయున్= (దుర్యోధనుడు అట్లా అనగా)అనగా; పొంగి= ఉప్పొంగి; ధర్మసుతుఁడు= ధర్మరాజు; ఆతనితోన్= దుర్యోధనుడితో; గదన్= గదతో; ఒక్కరుండన్= ఒకడినే; అకుంఠిత బాహు విలాసభాసినై= కుంటుపోని భుజశక్తితో ప్రకాశిస్తూ; నీదుప్రాణములు+కొనియెదన్= నీ ప్రాణాలు తీస్తాను; అనవుడున్= అనగా; తన చిత్తమును= తన మనసును; ఆ+పలుకుల్= ఆ ధర్మరాజు మాటలు; కలంచినన్= కలతచెందించగా; ఆ+ విభుఁడు= ఆ దుర్యోధనుడు; పుట్టలోపలి= పుట్టలోఉన్న; మహాభుజగ+ఇంద్రుఁడు= పెనుబాము; రోఁజునట్లు= బుసకొట్టేటట్లుగా; రోఁజెన్= బుసకొట్టాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! అనగా ధర్మరాజు ఉప్పొంగి దుర్యోధనునితో గదతో నేనొక్కడనే మొక్కవోని భుజశక్తితో ప్రకాశిస్తూ నీ ప్రాణాలు తీస్తాననగా ఆ మాటలు తన చిత్తాన్ని కలత చెందించగా ఆ దుర్యోధనుడు పుట్టలోని పెనుపాము రోజినట్లుగా రోజినాడు.

విశేషం: అలం: ఉపమ.

దుర్యోధనుఁడు గదామండితుం డై హ్రదంబు వెడలివచ్చుట (సం. 9-31-45)

వ. అట్లు నిశ్వాసంబు నిగుడ నొడలు పొంగఁ బటుకశాఘాతంబునం గెరలు శూకలాశ్వంబుచందంబునఁ గెరలి జలస్తంభం బుడిపికొని మడువు సంక్షోభింప నపహసిత శైలసారోదారంబును గనకపట్టికామండితంబును నైన; గదాదండంబు విపులాంసపీఠంబున నమర్చుకొని వెడలె నట్లు సంరంభవిజృంభితుండై. 95

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; నిశ్వాసంబు= నిట్టూర్పు; నిగుడన్= రాగా; ఒడలు పొంగన్= శరీరం ఉప్పొంగగా; పటుకశాఘాతంబునన్= కటువైన చబుకు దెబ్బతో; కెరలు శూకల+అశ్వంబు చందంబునన్= విజృంభించే పొగరుబోతు గుర్రంవలె; కెరలి= విజృంభించి; జలస్తంభంబు+ఉడిపికొని= నీటిలో ఉన్న(కట్టును) వదలుకొని; మడువు= ఆ నీటిమడుగు; సంక్షోభింపన్= అల్లకల్లోలం కాగా; అపహసిత శైలసార+ఉదారంబును= కొండను పరిహసించే గొప్పదనం కలదియు; కనకపట్టికామండితంబును= బంగారపు పట్టికతో అందమైనదియును; అయిన= అయినట్టి; గదాదండంబు= పొడవగు కాడతో ఉన్న గద; విపుల+అంసపీఠంబునన్= విశాలమయిన భుజంమీద; అమర్చుకొని వెడలెన్= పెట్టుకొని వెడలివచ్చాడు; అట్లు= ఆ విధంగా; సంరంభవిజృంభితుండు+ఐ= అట్టహాసంతో దూకుతున్నవాడై.

తాత్పర్యం: ఆ విధంగా నిట్టూర్పులు వదలుతూ రాగా, ఒడ లుప్పొంగగా, చబుకుదెబ్బయొక్క తీవ్రతతో విజృంభించే పొగరుబోతు గుర్రంమాదిరిగా విజృంభించి, జలస్తంభనస్థితిని వదలివేసి ఆ నీటి మడుగు అల్లకల్లోలం

కాగా, కొండ కాఠిన్యాన్ని ఎగతాళి చేసే గొప్పదనం కలదీ, బంగారుపట్టీతో పొడవుగా ఉన్నదీ అయిన గదాదండాన్ని విస్తృతమైన తన భుజపీఠం మీద పెట్టుకొని దుర్యోధనుడు వెడలివచ్చాడు. ఆ విధంగా అట్టహాసంతో దూకుతున్నవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ.

తే. గదయుఁ దానును రుచిరశృంగమునఁ బొల్చు । పర్వతము గ్రేణి సేయు నీపట్టిఁ జూచి
కాలదండంబు చేకొని లీలఁ దోఁచు । జమునిఁగా మదిఁ దలఁచిరి జనము లెల్ల. 96

ప్రతిపదార్థం: గదయున్+తానును= తానూ గదయు; రుచిర శృంగరమునన్+పొల్చు= అందమైన శిఖరంతో ఒప్పునట్టి; పర్వతమున్+గ్రేణిచేయు= కొండను పరిహాసం చేసే; నీ పట్టిన్+చూచి= నీ కుమారుడిని చూచి; కాలదండంబు చేకొని= కాలదండాన్ని పట్టుకొని; లీలన్+తోఁచు= అలవోకగా కనుపించే; జమునిన్+కాన్= యముడిగా; జనములు+ఎల్లన్= మనుజులంతా; తలఁచిరి= మనసులో భావించారు.

తాత్పర్యం: గదతోపాటు తాను అందమైన శిఖరంతో వెలిగే పర్వతాన్ని పరిహసించే నీ కొడుకును చూచి, జనులందరూ అతడిని కాలదండంతో అవలీలగా తిరిగే యముడిగా భావించారు.

విశేషం: అలం: విషమం. భ్రాంతి (ఉపమేయానికి ఉపమానంకంటె ఆధిక్యం చెప్పబడినందువల్ల అలంకారం విషమం.)

వ. అతనిఁ గనుంగొని పాంచాలురును బాండవులును. 97

ప్రతిపదార్థం: అతనిన్+కనుంగొని= అతడిని చూచి; పాంచాలురును; పాండవులును.

తాత్పర్యం: అతడిని చూచి పాంచాలురూ, పాండవులూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. చిఱుతనగవుతో నొండొరు చేతు లప్ప । ళించి నిర్భరసంతోషలీల నొప్పి;
రమ్మహీనాథుఁ డయ్యపహాస మెఱిఁగి । బొమలు ముడివడఁ గనుఁగవఁ బొడమఁ గెంపు. 98

ప్రతిపదార్థం: చిఱుతనగవుతోన్= చిరునవ్వుతో; ఒండొరుచేతులు= ఒకరొకరి చేతులు; అప్పళించి= చప్పట్లు చరచి; నిర్భర సంతోషలీలన్+ఒప్పిరి= అధికమైన సంతసంతో ఒప్పారు; ఆ+మహీనాథుఁడు= ఆ రాజగు దుర్యోధనుడు; ఆ+అపహాసము+ ఎఱిఁగి= ఆ పరిహాసాన్ని తెలిసికొని; బొమలు ముడివడన్= కనుబొమలు సుళ్ళు తిరుగగా; కనుఁగవన్= కనుదోయిలో; కెంపు పొడమన్= కోపం కలుగగా;

తాత్పర్యం: (పాంచాల పాండవులు) చిర్నగవుతో ఒకరొకరు చేతులు చరచి విపరీతమైన సంతోషంతో ఒప్పిఉన్నారు. ఆ దుర్యోధను డా పరిహాసం గ్రహించి కనుబొమలు ముడిపడగా రెండు కన్నులలోను ఎర్రజీర కలుగగా. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. కోపావేశంబు నొంది యుద్వృత్తతారకంబుల వారల నెల్ల నాలోకించి. 99

ప్రతిపదార్థం: కోప+ఆవేశంబున్+ఒంది= కోపంతో ఉద్వేగపడి; ఉద్వృత్త తారకంబులన్= పైకెత్తబడిన కనుగ్రుడ్లతో; వారలన్+ఎల్లన్= వారందరినీ; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: కోపోద్వేగంతో పైకెత్తబడిన కనుగ్రుడ్లతో వారందరిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఈ గెలి వే లార్చెద బా । హాగర్వము మెఱయ మిమ్ము నందఱను మహీ
భాగమునఁ గూల్చి నెఱపెద । నాగద బలు పెట్టు లైన నగుఁ డందాఁకన్. 100

ప్రతిపదార్థం: ఈ గెలివి= ఈ సంతోషం; ఏల?= ఎందుకు?; బాహాగర్వము మెఱయన్= భుజబలం ప్రకాశించగా; అతిశయించగా; మిమ్మున్+అందఱను= మీ అందరినీ; మహీభాగమునన్+కూల్చి= భూమిమీద పడగొట్టి; ఆర్చెదన్= అరుస్తాను; ఎట్టులైనన్= ఏమయినప్పటికిని; నా గద= నా గదయొక్క; బలుపున్= బలమును; నెఱపెదన్= ప్రదర్శిస్తాను; అందాఁకన్= అంతదాక; నగుఁడు= నవ్వండి.

తాత్పర్యం: 'ఈ సంతోషం ఎందుకు? నా భుజబలం మెరయగా మీ అందరినీ భూమిమీద పడగొట్టి నా గద యొక్క బలాన్ని ప్రదర్శింపజేస్తాను. అంతవరకు మాత్రమే మీరంతా నవ్వండి.'

తే. అనుచుఁ బోటులఁ దొరుఁగు రక్తాంబుధార । లంగమెల్లను గప్పిన నప్పు డొప్పె
గావిసెలయేఱు లెల్లెడఁ గలయఁ బర్వఁ । బొలుచు కులపర్వతంబు చాడ్పున నతండు. 101

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; పోటులన్= దెబ్బలనుండి; తొరుఁగు= కారుతున్న; రక్త+అంబుధారలు= నెత్తురుచారికలు; అంగము+ఎల్లను కప్పినన్= ఒడలంతా కప్పగా; అప్పుడు= ఆ సమయంలో; కావిసెలయేఱులు= ఎర్రనికొండవాగులు; ఎల్లెడన్ కలయన్+పర్వన్= అన్ని దిక్కులందును (అంతటను) వ్యాపించగా; పొలుచు= ఒప్పు; కులపర్వతంబు చాడ్పునన్= కులపర్వతంవలె; అతండు ఒప్పెన్= ఆ దుర్యోధనుడు భాసించాడు.

తాత్పర్యం: అంటూ దెబ్బల నుండి జాలువారే నెత్తురు చారికలు ఎర్రని కొండవాగులవలె అన్నిదిక్కులకు వ్యాపించగా, కులపర్వతంవలె అతడు ఒప్పారాడు.

విశేషం: అలం: ఉపమ. పర్వతోపమ వలన దుర్యోధనుడి ధైర్యస్థైర్యాలు తెలుస్తున్నాయి.

వ. అట్లు ఘోరాకారుండై నిలిచి నీ కొడుకు పాండురాజుకొడుకులు బంధుమిత్రపరివారసమేతంబుగా నడరి
యొక్క పెట్ట తన్నుం బొదువుదు రని శంకించి పాండవాగ్రజుదెసఁ గనుంగొని. 102

ప్రతిపదార్థం: అట్లు ఘోర+ఆకారుండు+ఐ నిలిచి= ఆ విధంగా భయంకరమూర్తిగా నిలిచి; నీ కొడుకు= నీ కుమారుడు; పాండురాజు కొడుకులు= పాండు కుమారులు; బంధుమిత్ర పరివారసమేతంబుగాన్= బంధువులతోను, స్నేహితులతోను, సేవకులతోను కలసి; అడరి= విజృంభించి; ఒక్కపెట్టన్= ఒక్కుమ్మడిగా; తన్నున్+పొదువుదురు+అని శంకించి= తనను క్రమ్ముకొంటారని అనుమానించి; పాండవ+అగ్రజు+దెసన్+కనుంగొని= ధర్మరాజు దిక్కుచూచి.

తాత్పర్యం: ఆ విధంగా భయంకరాకారుడై నిలిచిన నీ కుమారుడు పాండవులూ, వారి బంధుమిత్రులూ, సేవకులూ, విజృంభించి ఒక్కుమ్మడిగా తనను క్రమ్ముకొంటారని అనుమానించి, ధర్మజుడి దెస చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. 'రండిట యొక్కఁ డొక్కఁడ దురం బొనరింపఁగ; మీరు పల్వు రొ
క్కండను నేను; హేతిహతకాయత డస్సినవాఁడ' నన్న నా
తం 'డభిమన్యు బాలుని నధర్మతఁ బ్రౌఢు లనేకయోధు లొ
క్కండన కెట్లు చంపి? రటు గాఁ గొను మిబ్బవరంబు'నావుడున్. 103

ప్రతిపదార్థం: రండు+ఇట= ఇటురండి; ఒక్కఁడు+ఒక్కఁడ= ఒకడొక్కడే; దురంబు+ఒనరింపఁగన్= యుద్ధం చేయటానికి; మీరు పల్వురు= మీరు చాలామంది; ఒక్కండను నేను= నే నొక్కడనే; హేతిహత కాయతన్= కత్తిదెబ్బలు కల దేహంతో; డస్సినవాఁడన్= అలసినవాడను; అన్నన్= అనగా; ఆతండు= ఆ ధర్మరాజు; బాలునిన్= పసివాడిని; అభిమన్యున్= అభిమన్యుడిని; అధర్మతన్= అన్యాయంగా; ప్రౌఢులు= నేర్పరులు; అనేకయోధులు= చాలామంది వీరులు; ఒక్కండు+అనక= ఒక్కడేఅని తలచకుండా; ఎట్లు చంపిరి?= ఏ విధంగా చంపారు; ఈ+బవరంబున్= ఈ యుద్ధంలో కూడ; అటుగాన్= ఆ విధంగానే; కొనుము= తీసికొనుము.

తాత్పర్యం: దుర్యోధనుడు ధర్మరాజుతో 'ఒకరొక్కరే యుద్ధానికి ఇటు రండి. మీ రనేకులు నే నొక్కడనే. కత్తివ్రేటులతో చాలా అలసిపోయాను.' అనగా ధర్మరాజు అభిమన్యుని 'పసివాడని ఎంచకుండా ప్రౌఢులైన మీ రనేకులు యోధవరులు ఏ విధంగా చంపారు? ఇపు డీ యుద్ధం కూడా అటులే అనుకొనుము' అని అనగా.

వ. నిరుత్తరుం డై యున్న భవత్తనయున కా ధర్మతనయుం డిట్లనియె. 104

ప్రతిపదార్థం: నిరుత్తరుండు+ఐ+ఉన్న= బదులు చెప్ప జాలకఉన్న; భవత్+తనయునకున్= నీ కుమారుడితో; ఆ ధర్మతనయుండు+ఇట్లు+అనియెన్= ఆ ధర్మరాజు ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: మారు పలుకలేక నిలిచిఉన్న నీ కొడుకుతో ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. 'ఏ నట్లు సూపి చెప్పితిఁ । గాని యది రణంబుపాడి గామి యెఱుఁగుదున్;
రా నీను నీదుపయి మ । త్సైనికులను వెఱవ కాయితము గమ్ము నృపా! 105

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; ఏను+అట్లు చూపి చెప్పితిన్‌కాని= నేనా విధంగా ఎత్తి చూపి చెప్పాను గాని; రణంబుపాడి= యుద్ధధర్మం; అది కామి= అది కాకపోవటం; ఎఱుఁగుదున్= తెలిసినవాడను; మత్+సైనికులను= నా సేనలను; నీదుపయిన్= నీ మీదకు; రానీను= రానియ్యను; వెఱవక= భయపడక; ఆయితము+కమ్ము= సిద్ధపడుము.

తాత్పర్యం: నే నా విధంగా ఎత్తి చూపాను. కానీ యుద్ధధర్మం అది కాదని నాకు తెలుసు. నా సేనను నీమీదకు రానీయను. భయపడకుండా సిద్ధం కమ్ము.

క. తల సక్క ముడిచికొని డ్రిం । డలవడ బంధించి పోరి కమరి నిలువు; నీ
వలచిన యట్టివ యిచ్చెద । నలఘుశిరస్త్రాణ కంకటాదులు నెమ్మిన్. 106

ప్రతిపదార్థం: తల+చక్కముడిచికొని= తలను బాగా కట్టుకొని(జుట్టును ముడివేసికొని); డ్రిండు+అలవడన్ బంధించి= తల వెనుక (మెత్తదనమునకై) దిండొక దానిని కట్టుకొని; పోరికిన్= యుద్ధానికి; అమరి నిలువు= బాగా నిలబడుము; నీ వలచిన

యట్టివ= నీవు ఇష్టపడినవాటినే; అలఘు= పెద్దవి అయిన; శిరస్త్రాణ కంకట+ఆదులు నెమ్మిన్= తలకును ఒంటికినీ రక్షలైన కవచాదులను; నెమ్మిన్= ప్రీతితో; ఇచ్చెదన్= ఇస్తాను;

తాత్పర్యం: తల జడను బాగా కట్టుకొని, తలక్రింద దిండును కట్టుకొని యుద్ధానికి వచ్చి నిలువుము. నీకు నచ్చిన వాటిని తలకు ఒంటికి సరిపడే కవచాలను ఇస్తాను.

వ. మఱియు నొక్క తెఱంగు నీమనంబున మెచ్చును నచ్చెరువును నెలకొనం బలికెద; నాకర్ణింపుము. 107

ప్రతిపదార్థం: మఱియున్+ఒక్క తెఱంగు= ఇంకొక విధం; నీ మనంబునన్= నీ మనసుతో; మెచ్చును+అచ్చెరువును; మెప్పూ. ఆశ్చర్యమూ; నెలకొనన్= కుదురుకొనే విధంగా; పలికెదన్= మాటాడుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఇంకొక విధం నీ మనసులో మెప్పు, ఆశ్చర్యం కుదిరేటట్లుగా మాటాడుతాను. వినుము.

తే. ఏఱికొను మీవు నొకని మాయేవురందు; । వాఁడు నీతోడ గదఁ బోరువాఁడు; వానిఁ
జంపి మహి యేలు; వానిచేఁ జచ్చి త్రిదివ । సౌఖ్య మొందుము; చేసితి సమయ మేను.' 108

ప్రతిపదార్థం: మా ఏవురు+అందున్+ఒకనిన్= మా అయిదురుగురితో ఒకడినిని; ఈవున్+ఏఱికొనుము= నీవు ఎంచుకొనుము; వాఁడు= అతడు; నీతోడన్= నీతో; గదన్+పోరుఁవాడు= గదతో యుద్ధం చేయగలడు; వానిన్= ఆతడిని; చంపి= నాశనంచేసి; మహి+ఏలు(ము)= భూమిని పాలించుము(లేదా); వానిచేన్+చచ్చి= ఆతడిచేతలో చనిపోయి; త్రిదివసౌఖ్యము= స్వర్గసౌఖ్యమును; ఒందుము= పొందుము; ఏను+సమయము+చేసితిన్= నేను ప్రమాణం చేస్తున్నాను.

తాత్పర్యం: మా ఐదుగురిలో ఒకడిని ఎన్నుకొనుము. వాడు నీతో యుద్ధం చేస్తాడు. వాడిని చంపి మొత్తం రాజ్యాన్ని ఏలుకొనుము. (లేదా) వాడివలన చచ్చి దేవలోకసుఖాన్ని పొందుము. నే నీ ప్రతిజ్ఞ చేస్తున్నాను.'

వ. అని పలికి యుజ్జ్వల వివిధవర్మంబు లాతని ముందటం బెట్టించి. 109

ప్రతిపదార్థం: అని పలికి= అని మాటాడి; ఉజ్జ్వల= కాంతిమంతాలైన; వివిధ వర్మంబులు= నానా విధాలయిన కవచాలను; వానిముందటన్+పెట్టించి= ఆ దుర్యోధనుడి ముందుంచి.

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా మాట్లాడి, కాంతిమంతాలయిన అనేక కవచాలను అతడి ముందు పెట్టించి.

క. 'విను జీవముతో నిన్నుం । జననిచ్చుట యొండు దక్క సమరంబున గో
రినయది నీ కొసఁగెద; నిం । తన చెడియెనె యకట! యన్నదమ్ముల కూర్ముల్?' 110

ప్రతిపదార్థం: విను; నిన్నున్= నిన్ను; జీవముతోన్= ప్రాణాలతో; చనన్+ఇచ్చుట= పోనీయటం; ఒండు= ఒకటి; తక్కన్= తప్ప; సమరంబునన్= యుద్ధంలో; కోరిన+అది= కోరుకొన్నది; నీకున్+ఒసఁగెదన్= నీ కిస్తాను; అన్నదమ్ముల కూర్ముల్= అన్నదమ్ములకుండే అభిమానాలు; అకట!= అయ్యో!; ఇంతన చెడియెనె?= ఈ మాత్రానికే చెడిపోయాయా?

తాత్పర్యం: 'వినుము. నిన్ను ప్రాణాలతో పోనీయటం తప్ప (ఈ) యుద్ధంలో నీ కోరినవన్నీ ఇస్తాను. ఇంతమాత్రాన అన్నదమ్ముల కున్న బంధుత్వం నశించినదా?'

వ. అనిన విని నీతనయుం 'డిట్ల కాక నీవు నా కలిగెదవే?' యని కనకచిత్రితంబులగు శిరస్త్రాణకంకటంబులు గైకొని ధరియించి కాంచనాచలంబు ననుకరించుచు గద చేత నమర్చి పాండవాగ్రజుం గనుంగొని.111

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విన్నవాడై; నీతనయుండు= నీకుమారుడు; ఇట్లు+అ కాక= ఇంతే కాక; నీవు నాకున్+అలిగెదవే?= నా మీద నీవు కోపగిస్తావా?; అని= అంటూ; కనక చిత్రితంబులు+అగు= బంగారు తొడిగిన; శిరస్త్రాణ కంకటంబులు కైకొని= తలకు, ఒడలికి కవచాలు తీసికొని; ధరియించి= వేసికొని; కాంచనాచలంబున్= మేరుపర్వతమును (బంగారు కొండను); అనుకరించుచున్= పోలి; గద చేతన్+అమర్చి= గదను చేతబట్టుకొని; పాండవాగ్రజున్+కనుంగొని= ధర్మరాజును చూచి.

తాత్పర్యం: అంతట నీ కుమారుడు 'అటులే! నీవు నాపై కోపగిస్తావా?' (కోపగించవు అని తెలుసు) అని బంగారుమయమయిన కవచాలను తలకూ శరీరానికీ వేసికొని మేరుపర్వతమును తలపిస్తూ గద చేతబూని ధర్మజుడిని చూచి.

సీ. 'కవలలో నొకఁ డొండె, గాండివి యొండె, వృ। కోదరుఁ డొండె, నీ వొండెఁ జేత
గద గొని యెక్కటికయ్యంబునకుఁ బూని । యేర్పడ నిలిచిన, నీ క్షణంబ
సమయంగఁ జూచెద; గ్రమమున మీ రెల్ల । నొకఁ డొక్కఁ డేతేరఁ బ్రకటబాహు
దర్పంబు పొగడొంద ధరఁ గూల ద్రేయుచు । వచ్చెద; మఱియు నీవారిలోన

తే. నలిగి యెవఁడు దాఁకిన నట్ల నాదు । గదకు నెరసేసి పేర్చెదఁ; గడు గదార
ణంబు నాతోడఁ జేయ మన్మథహరుండు । గడఁగ లేఁడు; మీ కెందుఁ బోఁ గలదు నేఁడు?' 112

ప్రతిపదార్థం: కవలలోన్+ఒకఁడు= నకుల సహదేవులలో ఒకడు; ఒండెన్= లేదా; గాండివి= అర్జునుడు; ఒండెన్= లేదా; వృకోదరుఁడు= భీముడు; ఒండెన్= లేదా; నీవు+ఒండెన్= నీవైనా కాని; చేతన్‌గదన్+కొని= గదను తీసికొని; ఎక్కటికయ్యంబునకున్= ఒక్కడుగా యుద్ధానికి; పూని= సన్నద్ధమై; ఏర్పడన్+నిలిచినన్= స్పష్టంగా నిలిచినట్లయితే; ఈ క్షణంబు+అ= ఇప్పుడే; సమయంగన్+చూచెదన్= చచ్చునట్లు చూస్తాను; క్రమమునన్= వరుసగా; మీరు+ఎల్లన్= మీరంతా; ఒకఁడు+ఒక్కఁడు+ఏతేరన్= ఒక్కొక్కడుగా రాగా; ప్రకట బాహుదర్పంబు= స్పష్టమయిన భుజబలం; పొగడు+ఒందన్= కీర్తనీయం కాగా; ధరన్= భూమిపై; కూలఁద్రేయుచున్ వచ్చెదన్= పడద్రోస్తూ వస్తాను; మఱియున్= ఇంకను; నీవారిలోనన్= నీ మనుష్యులలో; అలిగి= కోపంతో; ఎవ్వఁడు తాఁకినన్= ఎవ డెదుర్కొనప్పటికినీ; ఎర+చేసి= ఆ విధంగానే గదకు ఆహారం చేసి; కడున్= మిక్కిలి; పేర్చెదన్= అతిశయిస్తాను; గదారణంబున్= గదాయుద్ధాన్ని; నాతోడన్= నాతో; చేయన్= చేయగా; మన్మథహరుండు= ఈశ్వరుడు; కడఁగన్ లేఁడు= పూనుకొనలేడు; నేఁడు= ఈనాడు; మీకున్+ఎందున్ పోన్+కలదు?= మీ రెక్కడికి బోగలరు?

తాత్పర్యం: 'నకుల సహదేవులం దొకడు గానీ, అర్జునుడు కానీ, భీముడు కానీ, లేక నీవో - ఈ క్షణమే గద చేబూని ద్వంద్వయుద్ధానికి సిద్ధమైతే మీ చావును చూస్తాను. మీరంతా ఒక డొక్కడుగా వచ్చినట్లయితే నా భుజబలగర్వంతో భూమిమీద పడగొట్టుతాను. అంతేకాదు. నీ వాళ్ళలో ఎవరు వచ్చినా నా గదకు ఆహారంగా చేస్తాను. నాతో గదాయుద్ధానికి ఈశ్వరుడు కూడా సాహసించడు. ఇక మీరు నే డెక్కడికి పోగలరు?'

విశేషం: అలం: కావ్యార్థాపత్తి.

వ. ఇవ్విధంబున దుర్యోధనుం డుద్ధతుం డై మఱియుం బెద్ద యెలుంగునc బలుకుచుండ నతండు వినకుండc బద్మనాభుండు పాండవాగ్రజున కిట్లనియె. **113**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; దుర్యోధనుండు+ఉద్ధతుండు+ఐ= దుర్యోధనుడు గర్వించినవాడై; మఱియున్+పెద్దఎలుంగునన్= ఇంకాపెద్దగొంతుతో; పలుకుచుండన్= మాట్లాడుతూ ఉండగా; అతండు= దుర్యోధనుడు; వినకుండన్= వినకుండే విధంగా; పద్మనాభుండు= శ్రీకృష్ణుడు; పాండవ+అగ్రజునకున్+ఇట్లనియెన్= ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధను డీవిధంగా గర్వించి మాట్లాడుతూ మరింత పెద్ద గొంతుతో పలుకసాగాడు. అతడికి వినబడనట్లుగా శ్రీకృష్ణుడు ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు:

చ. 'ఇతcడు గదారణంబునకు నీ కొలcదిన్ నినుc బిల్చినన్ మరు
త్పతిసుతుc గోరినం జిఱుతతమ్ములలో నొకనిన్ వరించినన్
మతిసెడిరొక్కొవీర? లనుమాటకుc బాత్రము గామె? సాహసం
బుతఱియె? మేదినీశ! యిది బుద్ధి దొఱంగి తనుగ్రహంబునన్. **114**

ప్రతిపదార్థం: ఇతcడు= ఈ దుర్యోధనుడు; గదారణంబునకున్= గదాయుద్ధానికి; కొలcదిన్= ఇంతగా; నినున్ పిల్చినన్= నిన్ను పిలచినప్పటికిని; మరుత్పతిసుతున్+కోరినన్= దేవరాజసూను డయిన అర్జునుడిని ఆహ్వానించినప్పటికినీ; చిఱుత తమ్ములలోన్+ఒకనిన్= చిన్న తమ్ములైన నకుల సహదేవులలో ఒకడిని; వరించినన్= కోరినప్పటికినీ; వీరలు= ఈ పాండవులు; మతి+చెడిరి+ఒక్కొ?= మతి పోగొట్టుకొన్నారా?; అనుమాటకున్= అనే మాటకు; పాత్రను కామె?= పాత్రమగుదుము కదా!; సాహసంబు తఱియె?= సాహసించటానికి సమయమా?; మేదినీశ!= ఓ రాజా!(ధర్మజా!); ఇది= ఇట్టి చేష్ట; అనుగ్రహంబునన్= దయవలన; బుద్ధి తొఱంగితి(వి)= తెలివిని విడిచిపెట్టావు.

తాత్పర్యం: 'ఈ దుర్యోధనుడు గదాయుద్ధానికి ఇంతగా నిన్ను, అర్జునుడూ, నకులుడూ, సహదేవుడూ, వీరిలో ఒకరిని పిలిస్తే బుద్ధి చెడి పాండవులు దీని కొప్పుకొన్నారనే మాట వస్తుంది కదా! ఎక్కువదయ చూపటంలో తెలివిని విడిచావు.

చ. ఒకరునిc జంపితేని సకలోర్వియుc గైకొను మంట నీవు మున్
శకునికి మాయజూదమున సంపద లెల్లc ద్రయోదశాబ్దభో
గ్యకృతి నమర్చి యొడ్డి నటు లైనది పందెపుcగయ్య మయ్యె శ
త్రుకులము నెల్ల దుఃఖపడి త్రుంచుట దాc దుదిc బందెమాడనే? **115**

ప్రతిపదార్థం: ఒకరునిన్= ఒక్కడిని; చంపితి(వి)+ఏని= చంపినట్లయితే; సకల+ఉర్వియున్+కైకొనుము+అంట= భూమినంతను తీసికొనుమనటం; నీవు; మున్= ఇదివరకు; శకునికిన్; మాయజూదమునన్= మోసపూరిత మయిన జూదంలో; సంపదలు+ఎల్లన్= ఐశ్వర్యమంతటినీ; త్రయోదశ+అబ్ద= పదమూడేండ్లు; భోగ్యకృతిన్+అమర్చి= అనుభవించుకొనే పద్ధతిని సిద్ధం చేసి; ఒడ్డినటులు+ఐనది= పందముగా పెట్టినట్లైనది; పందెపున్+కయ్యము+అయ్యెన్= పందెమునకై యుద్ధమయింది; శత్రుకులమున్+ఎల్లన్= వైరికులమునంతటినీ; దుఃఖపడి త్రుంచుట= కష్టపడి చంపుట; తాన్= అది; తుదిన్= తుదకు; పందెము+ఆడనే?= పందె మాడటానికా?

తాత్పర్యం: ఓ ధర్మజా! ఒకడిని చంపితే భూమినంతనూ తీసికొనుమని చెప్పటం - ఇదివరకు నీవు మాయాజూదంలో శకునికి సంపదనంతనూ పదమూడేండ్లు అనుభవించటానికి సమర్పించినట్లు ఐనది. పందెపు జగడంగా తయారయింది. కష్టపడి వైరులను సంహరించటం - తుదకు పందెమాడటానికా?

చ. నరవర! యెక్క టెక్కటి పెనంగఁగ భీముని నైనఁ బన్పఁ గా
దరయఁగ భీముకంటె గదయందలి కౌశల మెక్కు డీ మహి
శ్వరునకు; భీముమేన బలసంపద మిక్కిలి; దానఁ బోవునే?
వెరవునఁ గోలుపోదె భుజవీర్యము? పోరుల నెందుఁ జూడమే?' 116

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; ఎక్కటి+ఎక్కటి పెనంగన్= ఒకరితో ఒక్కరే యుద్ధం చేయగా; భీమునిన్+ఐనన్= భీముడిని కూడా; పన్పన్+కాదు= పంపకూడదు; అరయఁగన్= పరిశీలించగా; ఈ మహీశ్వరునకున్= ఈ రాజునకు; భీముకంటెన్= భీముడికన్నను; గదయందలి కౌశలము+ఎక్కుడు= గదావిద్యయందలి నేర్పరితనం ఎక్కువ; భీముమేనన్= భీముడి శరీరంలో; బలసంపద మిక్కిలి= బలసంపద ఎక్కువ; దానన్+పోవునే?= అంతమాత్రాన సరిపోతుందా!; వెరవునన్= ఉపాయంతో; భుజవీర్యము= భుజబలం; కోలుపోదె= ఓడిపోదా?; పోరులన్+ఎందున్+చూడమే?= యుద్ధాలనెక్కడైనా చూడమా?

తాత్పర్యం: ఓ రాజా! ఒక్కరొక్కరుగా యుద్ధం చేయటానికి భీముడిని కూడా పంపరాదు. ఎందుకంటే ఈ మహారాజుకు గదావిద్యయందు నేర్పు ఎక్కువ. భీముడికి శరీరబల మెక్కువ. అంతమాత్రాన సరిపోతుందా? ఉపాయానికి ముందు భుజబలం వీగిపోవటం మనం యుద్ధాలలో చూస్తున్నాము కదా!'

వ. అనిన విని మహాబలనందనుండు వసుదేవనందనున కిట్లనియె. 117

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విని; మహాబలనందనుండు= భీమసేనుడు; వసుదేవనందనునకున్+ఇట్లు+అనియెన్= శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని భీముడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

శ్రీకృష్ణుఁడు భీము నగ్గించి దుర్యోధనుతోడి గదాయుద్ధమునకుఁ బనుచుట (సం. 9-32-15)

మ. 'గద నా చేతికి వచ్చినప్పుడు మహోగ్రక్రీడమై లోకము
ల్పదునాల్గున్ సమయింతుఁ బొ మ్మను సముల్లాసంబు న న్నొందు; దు
ర్మదసంరంభ వికత్థనుం డయిన కౌరవ్యాధముం డెట్లు నా
కెదు రై ప్రాణముతోడఁ బోవు? నృపు నిట్లే లొత్తె దీమాత్రకున్? 118

ప్రతిపదార్థం: గద నాచేతికిన్ వచ్చిన+అప్పుడు= నా చేతిలో గద ఉన్నపుడు (అనగా ధరించినపుడు); మహా+ఉగ్రక్రీడమైన్= మిక్కిలి భయంకరమైన ఆటతో; లోకముల్ పదునాల్గున్= పదునాల్గు లోకాలను; సమయింతున్+పొమ్ము= నిశ్చయంగా సంహరిస్తాను పోవయ్యా! (అని పరిహాసంగా); అను సముల్లాసంబు= అనే ఉత్సాహం; నన్నున్+ఒందున్= నాకు కలుగుతుంది; దుర్మదసంరంభ= దురహంకారంతో; వికత్థనుండు+అయిన= ఆత్మస్తుతి పరుడయిన; కౌరవ్య+అధముండు= కౌరవులలో నీచుడు; ఎట్లు= ఏ విధంగా; ఎదురై= ఎదుర్కొని; ప్రాణముతోడన్+పోవున్= బ్రతికిపోతాడు?; ఈ మాత్రకున్= ఇంత మాత్రానికే; నృపున్= ధర్మరాజును; ఇట్లు= ఈ విధంగా; ఏల+ఒత్తెదు?= ఎందుకు నిష్ఠురంగా మాటాడుతావు?

తాత్పర్యం: నా చేతిలో గద ఉండగా పదునాల్గులోకాలు ఎదురయినా ఆటవలె భయంకరంగా నిశ్చయంగా సంహరిస్తాను. దురహంకారంతో ఆత్మస్తుతి నున్న నీచ దుర్యోధనుడు నాకంట బడి ప్రాణాలతో పోగలడా? ఎందుకయ్యా ఇంతమాత్రానికే ధర్మరాజును నీవు వ్యర్థంగా మాట్లాడుతావు?

విశేషం: పొమ్మి - నిశ్చయార్థకం.

తే. వాని గద భారమునకు నొవ్వకయు నాదు । పటుగదాదండ ముద్దండ బాహుదర్ప
లీల విలసిల్ల వ్రేయుదు నేలఁ గూల । సంతసముతోడి మెచ్చు పుట్టింతు నీకు.' 119

ప్రతిపదార్థం: వాని గదభారమునకున్= ఆ దుర్యోధనుడి గదయొక్క బరువుకు; నొవ్వకయున్= బాధపడకుండా; నాదు పటుగదాదండము; ఉద్దండబాహుదర్పలీలన్= భయంకరభుజబలక్రీడతో; విలసిల్లి= ఒప్పి; నేలన్+కూలన్రేయుదున్= భూమిమీద పడద్రోసెదను; నీకున్; సంతసముతోడి= ఆనందంతో కూడిన; మెచ్చు= మెప్పు; పుట్టింతున్= కలిగిస్తాను.

తాత్పర్యం: (ఓ కృష్ణా!) ఆ దుర్యోధనుడి గదాభారానికి బాధపడకుండా భయంకర మైన నా భుజబలక్రీడతో ఒప్పి, అతడిని నేలగూలవేస్తాను. నీకు సంతోషంతో కూడిన మెప్పును కల్గిస్తాను.'

వ. అనుటయు నచ్యుతుండు ప్రియం బెసంగ నాకిమ్మీరమర్దను మొగంబునఁ జూడ్కి నిలిపి. 120

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; ప్రియంబు+ఎసంగన్= ప్రీతి కలుగగా; ఆ కిమ్మీరమర్దను మొగంబునన్= కిమ్మీరు డనే రాక్షసుడిని చంపిన ఆ భీముడి ముఖంపై; చూడ్కినిలిపి= చూపు నిలిపి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ప్రేమాతిశయంగా కిమ్మీరుడిని చంపిన భీముడి మొగమున ప్రీతి కలుగగా చూచినవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. 'బకవిధ్వంసన మాచరించితి; హిడింబప్రాణముల్ గొంటి కీ
చకనిర్మూలనకేలి సల్పితి జరాసంధాంగక స్వైర భం
జకలీలన్ విలసిల్లి తీ వవి మనుష్యస్ఫూర్తి మాత్రంబులే?
యొక మర్త్యుం డెదు రెట్లు నీకు? మది నే నూహింప కి ట్లాడితిన్. 121

ప్రతిపదార్థం: ఈవు= నీవు; బక విధ్వంసనము+ఆచరించితి(వి)= బకు డనే వానిని సంహరించావు; హిడింబ ప్రాణముల్+ కొంటి(వి)= హిడింబాసురుడి ప్రాణాలను తీశావు; కీచక నిర్మూలన కేలి+చల్పితి(వి)= కీచకులను మొత్తంగా నాశం చేశావు; జరాసంధ= జరాసంధుడి; అంగకస్వైర భంజకలీలన్ విలసిల్లితి(వి)= శరీరాంగాలను స్వైరంగా విరిచే ఆటలో ప్రకాశించావు; అవి= ఆయా పనులు; మనుష్యస్ఫూర్తి= మానవుడి ప్రజ్ఞ; మాత్రంబులే?= అంతమాత్రమేనా?; నీకున్; ఒక మర్త్యుండు= ఒకానొక మానవుడు; ఎదురు+ఎట్లు?= ఎదురై ఏ విధంగా ఉండగలడు?; మదిలోన్= మనసులో; ఊహింపక= యోచన సేయకుండ; ఇట్లు+ఆడితిన్= ఈ విధంగా అన్నాను.

తాత్పర్యం: 'బకుడిని నాశం చేశావు. హిడింబాసురుడిని సంహరించావు. జరాసంధుడిని శరీరభాగాలు స్వేచ్ఛగా విరిచి జయించావు. సామాన్య మానవుడు చేయగలిగిన పను లేనా ఇవి! మనుష్యులలో ఒకడు నీకు సాటియా? యోచించక ఇట్లా అన్నాను.

క. కాళింగాదిక్షోణీ । పాలుర నున్మదమహాద్విపప్రకరములన్
నేల నిడి కాలఁ జమరితి । వాలిన కురునృపకుమార వర్గంబులతోన్.' 122

ప్రతిపదార్థం: కాళింగ+ఆది క్షోణీపాలురన్= కాళింగుడు మొదలైన రాజులను; ఉన్మద మహాద్విప ప్రకరములన్= మిక్కిలి మత్తిల్లిన ఏనుగుల సమూహములను; నేలన్+ఇడి= భూమిపైన ఉంచి(పడద్రోసి); వాలిన= అతిశయించిన; కురునృప కుమారవర్గంబులతోన్= కురు రాజకుమార సమూహాలతో; కాలన్+చమరితి(వి)= కాలితో నలగగొట్టావు.

తాత్పర్యం: కాళింగాది రాజులను, కురురాజ కుమారులను మత్తిల్లిన ఏనుగుల గుంపును నేలద్రోసి కాలితో నలియద్రొక్కావు.

వ. అని పలికి కురుపతిదెసఁ గటాక్షవీక్షణంబు నిగుడ వెండియు. 123

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; కురుపతిదెసన్= దుర్యోధనుడి దిక్కునకు; కటాక్షవీక్షణంబు= కడకంటి చూపులు; నిగుడన్= వ్యాపించగా; వెండియున్= మరల.

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు పలికి, దుర్యోధనుడివైపు కడగంటి చూపు సారించి, మరల భీముడితో ఇట్లా అన్నాడు.

తే. 'వాలి దుశ్శాసనుని ఱొమ్ము వ్రయ్యఁ జీరి । నీవు నెత్తురు ద్రావంగ నిన్ను నతఁడు
చూచుచుండియు వెఱసొచ్చి స్రుక్కెఁగాక । కవియఁజాలెనె నీపయిఁ బవనతనయ? 124

ప్రతిపదార్థం: పవనతనయ!= ఓ వాయుపుత్రా! (భీమసేనా!); వాలి= విజృంభించి; దుశ్శాసనుని ఱొమ్ము= దుశ్శాసనుడి రొమ్మును; వ్రయ్యన్+చీరి= పగిలేటట్లు చీల్చి; నీవు నెత్తురు త్రావంగన్= నీవు నెత్తురు త్రాగగా; అతఁడు= ఆ దుర్యోధనుడు; నిన్నున్= నిన్ను; చూచుచుండియున్= చూస్తున్నప్పటికినీ; వెఱన్+చొచ్చి= భయపడి; స్రుక్కెన్+కాక= (భయంతో) అణగినాడుగాని; నీ పయిన్+కవయన్+చాలెనె?= నీ మీదకు క్రమ్ముకొన గల్గాడా?

తాత్పర్యం: '(నీవు) విజృంభించి దుశ్శాసనుడి రొమ్మును చీల్చి అతడి నెత్తురును త్రాగినపుడు చూస్తూ ఉన్నప్పటికినీ భయంతో అణగి, ముడుచుకొని ఉన్నాడు. కాని నీమీదకు ఈ దుర్యోధనుడు దాడి చేయగలిగాడా?

చ. అగపడి కచ్చువెట్టి యితఁ డాడినమాటల కిప్డు బల్లిదుం
డుగఁ గొని యేను బల్వురుఁ గడు న్వడి నీతనిఁ జంపకుండ నే
మిగ సమయంబు సేసి తిది మేలొకొ? యంటి నృపాలుతోడ నీ
మగఁటిమి చందముల్ దలఁచి మారుతనందన! యూఱడిల్లితిన్. 125

ప్రతిపదార్థం: మారుతనందన!= వాయునందనా!; అగపడి= వశపడి; కచ్చు+పెట్టి= గర్వంతో; ఇతఁడు+ఆడిన మాటలకున్= ఇతడు మాట్లాడిన మాటలకు; ఇప్డు= ఈ సమయంలో; బల్లిదుండుగన్+కొని= బలవంతుడుగా లెక్కచేసి; ఏను; పల్వురున్= చాలమంది; కడున్+వడిన్= మిక్కిలి వేగంగా; వీనిన్+చంపకుండన్= చంపకుండ ఉండేటట్లు; ఏమిగ+సమయంబు+చేసితి(వి)?= ఏమని ప్రతిజ్ఞ చేశావు?; ఇది మేలు+ఒకొ?= ఇది మంచిదేనా అని?; నృపాలు తోడన్= ధర్మరాజుతో; అంటిన్; నీ మగఁటిమి చందముల్= నీ బలముయొక్క విధములు; తలఁచి= తలచుకొని; ఊఱడిల్లితిన్= ఊరటచెందాను.

తాత్పర్యం: భీమసేనా! గర్వంతో ఈ దుర్యోధనుడు ఆడిన మాటలకు అతడిని బలవంతుడిగా పరిగణించి, ధర్మరాజుతో 'అందరూ వెంటనే వేగంగా వీడిని చంపకుండా ఏమని ప్రతిజ్ఞ చేశావు?' అన్నాను. అయితే, నీ శౌర్యాన్ని జ్ఞాపకం చేసికొని ఊరట చెందాను.

చ. తులువతనంబునన్ సభకు ద్రోపది ముందల వట్టి యీడ్చి య
ట్లలఁపఁగఁ జూచి నీవు దగ నాడిన రెండు దెఱంగులందుఁ బెం
పొలయఁగ దుస్ససేనుపని యొక్కటి దీర్చితి; తీర్పు మింక బా
హుల కసివోవ వీనిపనియుం ద్వరితక్రమవిక్రమంబునన్. 126

ప్రతిపదార్థం: తులువతనంబునన్= తుంటరితనంతో; సభకున్= సభలోనికి; ద్రోపదిన్= ద్రౌపదిని; ముందల(ముందు+తల)+పట్టి= జుట్టుపట్టుకొని; ఈడ్చి= లాగి; అట్లు= ఆ మాదిరిగా; అలఁపఁగన్= బాధించగా; చూచి= చూచిన; నీవు (ఓ భీమసేనా నీవు); తగన్= తగినట్లు; ఆడిన రెండు తెఱంగుల+అందున్= చెప్పిన రెండు విధాలలో; పెంపు+ఒలయఁగన్= గొప్పదనం తెలియగా; దుస్ససేను పని+ఒక్కటి= దుశ్శాసనుడి పని ఒక్కటి - మొదటిదానిని; తీర్చితి(వి)= తీర్చుకొన్నావు(సంహరించావు); ఇంకన్= ఇక పోగా; బాహుల కసి+పోవన్= భుజాల కసి తీరేటట్లుగా; వీని పనియున్= ఈ దుర్యోధనుడి పనినికూడా(అనగా చంపటం); త్వరితక్రమ విక్రమంబునన్= తొందరగా క్రమవిజృంభణంతో; తీర్పుము= నెరవేర్చుము.

తాత్పర్యం: తుంటరితనంతో సభలో ద్రౌపది ముందరి జుట్టును పట్టుకొని లాగి, ఆ విధంగా బాధించగా చూచిన నీవు చేసిన ప్రతిజ్ఞలలో రెండింటిలో మొదటిదానిని దుశ్శాసనుడిని చంపి తీర్చుకొన్నావు. ఇక పోగా భుజాల తీట తీరేటట్లుగా ఈ దుర్యోధనుడి పనిని కూడా తీర్చుము (చంపుము), విజృంభించుము, త్వరపడుము.

తే. పరజయము నొంది కట్టుము పట్ట మఖిల । ధరణి రాజ్యంబునకు ధర్మతనయుఁ బ్రీతి
బంధులకు నెల్లఁ గన్నులపండు వగుచు । నీవుఁ దమ్ములు సుఖవృత్తి నెలవుకొనుఁడు!' 127

ప్రతిపదార్థం: పరజయమున్+ఒంది= శత్రుజయముపొంది; అఖిల ధరణిరాజ్యంబునకున్= సమస్త భూసామ్రాజ్యానికి; ప్రీతిన్= ప్రియంతో; ధర్మతనయున్= ధర్మరాజుకు; పట్టము కట్టుము= పట్టాభిషేకం చేయుము; నీవు+తమ్ములు= నీవూ, నీ తమ్ములూ; ఎల్ల బంధువులకున్= బంధువులందరికి; కన్నులపండువు+అగుచున్= కన్నులపండుగగా; సుఖవృత్తిన్+నెలవు కొనుఁడు= సుఖంగా ఉండండి.

తాత్పర్యం: శత్రుజయాన్ని సాధించి, సమస్త భూమండలానికీ ధర్మరాజును ప్రభువుగా పట్టాభిషేకం చేయుము. బంధువులకు కన్నులపండువుగా నీవూ, నీ తమ్ములూ సుఖంగా ఉండండి.'

వ. అని మఱియును. 128

ప్రతిపదార్థం: అని మఱియున్= అని ఇంకను.

తాత్పర్యం: అని ఇంకను. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. 'బరవస మొప్ప నీవు గదపండువు సేయఁ దలంచి తాఁకినం
గురుపతి నిర్జితుం డగుటకుం బవనాత్మజ! యేను బూఁట; పో

టరితన మెల్లఁ జూపుము; కడంగుము నీ' వని యేలిమాటమై
నరవర! ధర్మసూనుఁడు వినన్ విజయం బొసఁగెన్ మఱందికిన్. 129

ప్రతిపదార్థం: నరవర!= రాజా! ధృతరాష్ట్రా!; పవన+ఆత్మజ!= వాయునందనా!; బరవసము+ఒప్పన్= ధైర్యముఒప్పగా; నీవు గదపండువు చేయన్+తలంచి తాఁకినన్= గదకు పండువు చేయనెంచి తాకినట్లయితే; కురుపతి= కురురాజు; నిర్జితుండు+ అగుటకున్= ఓడిపోవటానికి; ఏను+పూఁట= నేను బాధ్యత వహిస్తాను; పోటరితనము= (నీ)వీరత్వమును; ఎల్లన్+చూపుము=అంతటినీ ప్రదర్శించుము; నీవు; కడంగుము= పూనుకొనుము; అని= అంటూ; ధర్మసూనుఁడు+వినన్= ధర్మరాజు వినేటట్లు; ఏలిమాటన్= కృత్రిమంగా; మఱందికిన్= మేనమరదికి(భీముడికి); విజయం బొసఁగెన్= జయమునిచ్చాడు.

తాత్పర్యం: ఓ రాజా! ధైర్యంతో నీవు గదకు పండుగు చేయ నెంచి తలపడితే దుర్యోధనుడు హతుడవుతాడు. భీమసేనా! అందుకు నేను బాధ్యుడను. నీ పరాక్రమాన్ని పూర్తిగా ప్రదర్శించుము. పూనుకో - అని పరిహాసంగా ధర్మరాజు వినేటట్లుగా భీముడికి కృత్రిమంగా విజయం చేకూరేటట్లుగా (కృష్ణుడు) పలికాడు.

వ. ఇవ్విధంబున వృకోదరునకు మనోజయప్రదంబు లగు మాట లాడి 'దుర్యోధనుండు దండిమగండు; శ్రమంబునుం జాలఁగలఁడు; నీ వతిప్రయత్నంబునుఁ బెనంగవలయుఁ జుమ్మీ!' యని పలికె; నప్పుడు సాత్యకి యా సమీరనందను నగ్గించెఁ, బాంచాలురుఁ దక్కునుంగలుగు ధరణీశులు నబ్బలుమగనిఁ బ్రశంసించి; రతం డగ్రజునాననం బాలోకించి. 130

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; వృకోదరునకున్= భీముడికి; జయప్రదంబులు+అగు మాటలు+ఆడి= జయాన్ని కలిగించే మాటలు చెప్పి; దుర్యోధనుండు; దండిమగండు= పెద్దవీరుడు; శ్రమంబునున్+చాలన్+కలఁడు= సాధనబాగా చేశాడు; ప్రయత్నంబునన్= నీవు మిక్కిలి ప్రయత్నంతో; పెనంగవలయున్+చుమ్మీ!= పోట్లాడవలెను సుమా!; అని పలికెన్= అని మాటాడాడు; అప్పుడు= ఆ సమయంలో; సాత్యకి; సమీరనందనున్= భీముడిని; అగ్గించెన్= పొగడాడు; పాంచాలురు= పాంచాల దేశంవారును; తక్కునున్+కలుగు= మిగిలిన; ధరణీశులున్= రాజులును; ఆ+బలుమగనిన్= బలవంతు డయిన ఆ వీరుడిని; ప్రశంసించిరి= పొగడారు; అతండు+అగ్రజుని+ఆననంబు+ఆలోకించి= అతడు తన అన్న అయిన ధర్మజుడి మొగాన్ని చూచి.

తాత్పర్యం: (శ్రీకృష్ణుడు) ఈ విధంగా భీముడికి జయం కలిగేటట్లు మాట్లాడి, 'దుర్యోధనుడు పెద్దవీరుడు; గదాయుద్ధ సాధన బాగా చేసినవాడు. నీవు మిక్కిలి ప్రయత్నంతో పోట్లాడవలెను' అన్నాడు. సాత్యకి, పాంచాల కుమారులూ, మిగిలిన వారూ బలవంతుడైన భీమసేనుడిని పొగడారు. ఆతడు అన్నగారి మొగం చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'వినుము నరేంద్ర! యేను బలవిక్రమముల్ వొగడొంద నిక్కుల
ఘ్నునిపయి నామనంబు నతికోపము; పార్థుఁడు ఖాండవంబునం
దనలముపర్వఁ జేసినటు లగ్గలికన్ నిగిడించెదన్; గదం
గొనియెదఁ బ్రాణముల్; మహి యకుంఠితశాస్త్రిగ నేలు మంతయున్. 131

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= ఓ రాజా!(ధర్మజా); వినుము; ఏను; బలవిక్రమముల్ పొగడు+ఒందన్= బలశౌర్యాలు కీర్తికెక్కగా; ఈ+కులఘ్నునిపయిన్= ఈ కులనాశకుడిమీద; నామనంబు+అతికోపము= నా మనసుయొక్క మిక్కిలి కోపం; పార్థుఁడు=

అర్జునుడు; ఖాండవంబునందున్= ఖాండవవనంలో; అనలము పర్వన్+చేసినటులు= అగ్నిని వ్యాపింపచేసిన విధంగా; అగ్గటికన్= అతిశయంగా; నిగిడించెదన్= వ్యాపింపచేస్తాను; గదన్= గదతో; ప్రాణముల్ కొనియెదన్= (వీని) ప్రాణాలను తీస్తాను; అకుంఠిత శాస్తిగన్= కుంటువోవని ఆజ్ఞతో; మహి= భూమి; అంతయున్+ఏలుము= మొత్తమును పరిపాలింపుము.

తాత్పర్యం: 'ఓ రాజా! వినుము. నేను బలశౌర్యాలు కీర్తించబడగా ఈ కులకంటకుడిపై నున్న నా మనసులోని కోపాన్ని అర్జునుడు ఖాండవవనంలో వ్యాపింపజేసిన అగ్నివలె మిక్కిలి వ్యాపింపజేస్తాను. గదతో వాడి ప్రాణాలు తీస్తాను. అడ్డులేని అధికారంతో శాసకుడవుగా రాజ్యాన్ని పాలించుము.

విశేషం: అలంకారం: ఉపమ.

ఆ. మహితకీర్తి పుష్పమాలికఁ బూన్చెద । నిన్నుఁ జీకురాజు నేఁడు వనరుఁ
గాక! శకుని బుద్ధికతమునఁ దమ కింత । పుట్టె నని తనూజుపొలియు టెఱిఁగి.' 132

ప్రతిపదార్థం: మహితకీర్తి= గొప్పదైన కీర్తి అనెడి; పుష్పమాలికన్= పూలమాలను; నిన్నున్; పూన్చెదన్= ధరింపజేస్తాను; శకునిబుద్ధి కతమునన్= శకుని తెలివి కారణంగా; తమకున్+ఇంత పుట్టెను+అని= తమకు చివర కీవిధంగా చేటు కలిగిందని; తనూజు పొలియుట+ఎఱిఁగి= కుమారుడు చనిపోవటం తెలిసి; చీఁకురాజు= అంధుడయిన రాజు (ధృతరాష్ట్రుడు); వనరుఁగాక!= దుఃఖించునుగాక!

తాత్పర్యం: ధర్మరాజా! గొప్పకీర్తి అనే పూలమాలను నీకు ధరింపజేస్తాను. శకుని ఉపదేశంవలన తమకిటువంటి చేటు వాటిల్లినదని కొడుకు చావు విని అంధరాజు నేడు దుఃఖించుగాక!

వ. అని పలికి సన్నాహంబు శోభిల్లుచుండ గదాదండంబుఁ గేల నమర్చి వృత్రున కభిముఖుం డగు వాసవుండునుం బోలె దుర్యోధనుదిక్కు మొగంబై నిర్వ్యూహం బైన శుండాలంబు చందంబున నున్న యన్నరపతిఁ గనుంగొని తమయన్నయుఁ దమ్ములు నెమ్మనంబుల సంతసిల్లఁ దానును సమరోల్లాసభాసితుం డగుచు నతని కిట్లనియె. 133

ప్రతిపదార్థం: అని పలికి= అని మాటాడి; సన్నాహంబు శోభిల్లుచుండన్= ప్రయత్నం ప్రకాశిస్తూ ఉండగా; గదాదండంబున్= దండంవంటి గదను; కేలన్+అమర్చి= చేత పట్టుకొని; వృత్రునకున్+అభిముఖుండు+అగు వాసవుండున్+పోలెన్= వృత్రాసురుడి కెదురయిన ఇంద్రుడివలె; దుర్యోధను దిక్కు మొగంబు+ఐ= దుర్యోధనుడి ప్రక్కకు తిరిగినవాడై; నిర్వ్యూహంబు+ఐన శుండాలంబు చందంబునన్= కట్టువీడిన మదపుటేనుగువలె; ఉన్న ఆ+నరపతిన్+కనుంగొని= ఆ రాజును (దుర్యోధనుడిని) చూచి; తమ అన్నయున్+తమ్ములున్= తమ అన్నగారయిన ధర్మజుడును, తమ్ములైన అర్జున నకుల సహదేవులును; నెమ్మనంబులన్ సంతసిల్లన్= నిండు మనసులతో సంతోషించగా; తానును= భీమసేనుడు; సమర+ఉల్లాసభాసితుండు+ అగుచున్= యుద్ధోత్సాహంతో ప్రకాశిస్తూ; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ దుర్యోధనుడితో ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఆ విధంగా మాటాడి, తన ప్రయత్నం శోభించగా గదను చేత ధరించి వృత్రాసురుడి ఎదురుగా వెళ్ళిన ఇంద్రుడివలె దుర్యోధనుడివైపు మొగం కలవాడై కట్టువిప్పబడిన మదపుటేనుగువలె ఉన్న ఆ రాజును చూచి, తన అన్నగారూ, తమ్ములూ మనసునిండుగా సంతోషించగా భీమసేనుడు యుద్ధోత్సాహంతో వెలుగుతున్నవాడై ఆ దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

ఉ. 'ఇట్టిది క్రూరకర్మ మని యించుక కొంకక లక్కయింటఁ జి
చ్చొట్టితి మాయజూదమున నుత్తము ధర్మజుఁ దూలఁ బుచ్చి తా
చుట్టలుఁ బెద్దలుం జెలులుఁ జూడఁగ ద్రోవది భంగపెట్టి తి
ట్టట్టన కింకఁ దత్ఫలము లన్నిటి నొందుము చేరి తగ్గ మై. 134

ప్రతిపదార్థం: ఇట్టిది క్రూరకర్మము+అని= ఈ పని క్రూరమైన పని అంటూ; ఇంచుక కొంకక= ఒకింతకూడా సందేహించకుండా; లక్కయింటన్+చిచ్చు+ఒట్టితి= లక్కయింటికి నిప్పుపెట్టావు; మాయజూదమునన్= మోసపు జూదంలో; ధర్మజు+తూలన్+పుచ్చితి(వి)= ధర్మరాజును ఓడించావు; ఆ చుట్టలు= ఆ బాంధవులు; పెద్దలున్= పెద్దవారూ; చెలులున్ చూడఁగన్= స్నేహితులు చూస్తూ ఉండగా; ద్రోవదిన్= ద్రౌపదిని; ఇట్టు అట్టు+అనన్= ఇటు అటు అనకుండా(జంకకుండా); భంగపెట్టితి(వి)= అవమానించావు; ఇంకన్ తద్+ఫలములు= ఆ పనులవలన కలిగే ఫలితాలు; అన్నిటిన్+ఒందుము= మొత్తాన్ని అనుభవించుము; అగ్గమై= వశమై; చేరితి(వి)= దగ్గరకు వచ్చావు.

తాత్పర్యం: 'ఈ పని క్రూరమైన నీచకర్మ అని తలచకుండా లక్క ఇంటికి నిప్పు పెట్టావు. మాయాజూదంలో ధర్మరాజును ఓడించావు. చుట్టాలు, పెద్దలు, స్నేహితులు చూస్తూ ఉండగా జంకకుండా ద్రౌపదిని అవమానం పాలు చేశావు. వీటికన్నింటికిని మొత్తంగా ఫలితాన్ని అనుభవించుము. నా చేతికి చిక్కావు.

సీ. గాంగేయకుంభజ కర్ణశల్యాదులు । నీకుఁగాఁ బెనఁగి యనేకబంధు
మిత్రులు మడిసిరి ధాత్రీపతులఁ దోడు । దెచ్చితి పలువురఁ జచ్చి రంత
పట్టువారును దోడఁబుట్టువు లెల్లను । గూలి; రంతటికిని మూల మైన
శకుని గీటడఁగె; నిం కొకరుఁడ వీ వున్న । వాఁడవు; విను! నిన్ను నేఁడు నాదు

తే. గదకు నెర సేసి లోకంబు కల్మషంబు । లేను బాపెద; నీరజ్జు లేల? నాకుఁ
జక్కనై రమ్ము మద్భుజాస్తంభశుంభ । దుగ్రకేళికిఁ బాత్రమై యోట దక్కి'. 135

ప్రతిపదార్థం: గాంగేయ= భీష్ముడు; కుంభజ= ద్రోణుడు; కర్ణ= కర్ణుడు; శల్య+ఆదులు= శల్యుడు మొదలయినవారు; నీకున్+కాన్+పెనంగి= నీ కొరకై యుద్ధంచేసి; అనేక బంధుమిత్రులు= ఎందరో బంధువులు స్నేహితులు; మడిసిరి= చనిపోయినారు; ధాత్రీపతుల+పలువురన్+తోడుతెచ్చితి(వి)= ఎందరినో రాజులను సహాయంగా తీసికొనివచ్చావు; అంత+పట్టువారును= అంతమట్టుకు వారంతా; చచ్చిరి= చనిపోయారు; తోడఁబుట్టువులు+ఎల్లను= నీ తోబుట్టిన వారంతా; కూలిరి= చనిపోయారు; అంతటికిని= ఈ మొత్తానికి; మూలము+ఐన= కారణమైన; శకుని; గీటడఁగెన్= నశించాడు; ఇంకన్+ఒకరుఁడవు= ఇంక ఒక్కడవు; ఈవు+ఉన్నవాఁడవు= నీవున్నావు; విను= వినుము; నిన్నున్ నేఁడు నాదుగదకున్+ఎర చేసి= ఈ దినం నిన్ను నాగద కాహారంగా వేసి; లోకంబు= లోకాలయొక్క; కల్మషంబులు= పాపాలు; ఏను+పాపెదన్= నేను తొలగిస్తాను; ఈ రజ్జులు+ఏల?= ఈ పనికిరాని మాట లెందుకు?; నాకున్+చక్కనై= నా కెదురుగా; మద్భుజాస్తంభ= కంబాలవంటి నా భుజాల; శుంభత్+ఉగ్రకేళి= గర్వంతో భయంకరమయిన క్రీడకు; పాత్రము+ఐ= ఆధారమై; ఓట+తక్కి= జంకు మాని; రమ్ము.

తాత్పర్యం: నీకొరకై భీష్మద్రోణ కర్ణశల్యాదులు, అనేకులు బంధుమిత్రులు మరణించారు. రాజులను తోడు తెచ్చుకొన్నావు. వారు కూడా చచ్చారు. తోబుట్టువు లందరూ నశించారు. దీనికంతటికిని మూలంగా ఉండిన శకుని

చనిపోయాడు. ఇంక నీ వొక్కడ వున్నావు. వినుము. నిన్ను నేడు నా గదకు ఆహారంగా చేసి లోకంలోని పాపాన్నంతా నేను పోగొట్టుతాను. నీ ఈ పనికిరాని మాట లెందుకు? అనుమానించకుండా నా కెదురుగా రమ్ము. నా భుజదర్పభయంకర క్రీడకు పాత్రమైనావు.'

చ. అనుడు నెదిర్చి నీతనయుఁ డాతని కిట్లను 'నేల రిత్త గ
ర్జనములు? గానవే పటు భుజాకలితోగ్రగదా సముద్ధటున్
నను? నిటు రమ్ము! సూపుము రణంబున నీదుబలంబుఁ జేవయున్;
మన మిటు చేరి నిల్చి వెడ మాటల నాడుచు నున్కి యొప్పునే? 136

ప్రతిపదార్థం: అనుడున్= అనగా; ఎదిర్చి= ఎదుర్కొని; నీ తనయుఁడు= నీ కుమారుడు; ఆతనికిన్+ఇట్లు+అనున్= ఆ భీముడితో ఈ విధంగా అన్నాడు; ఏల రిత్త గర్జనములు?= వ్యర్థమైన గర్జింపులెందుకు?; పటు= తీవ్రమయిన; భుజాకలిత= చేతియందున్న; ఉగ్రగదాసముద్భటున్= భయంకరమయిన గదతో ఎత్తివచ్చినవాడిని; ననున్= నన్ను; కానవే?= చూడవా?; ఇటు రమ్ము= ఈ దిక్కునకు రమ్ము; రణంబునన్= యుద్ధంలో; నీదు బలంబు= నీ శక్తి; చేవయున్= నేర్పును; చూపుము; మనము+ఇటు చేరి నిల్చి= మన మీవిధంగా చేరి; వెడమాటలన్+ఆడుచున్+ఉన్కి= పనికిరాని మాటలను మాట్లాడటం; ఒప్పునే?= తగునా?

తాత్పర్యం: అనగా విని, నీ కుమారుడు భీముడితో ఇట్లా అన్నాడు: 'ఈ వ్యర్థమైన గర్జన లెందుకు? కఠినమైన నా భుజదండంతో భయంకరమైన గద నెత్తి వచ్చిన నన్ను చూడలేదా? ఇటు రమ్ము. యుద్ధంలో నీ బలాన్నీ చేవనూ చూపుము. మనం ఈ విధంగా నిలిచి పనికిరాని మాటలు మాట్లాడటం తగునా?

క. వినుము గదారణమున ననుఁ । జెనయఁగ వాసవున కైనఁ జెల్లదు; నీ వీ
యనిఁ బాడి దప్ప కుండఁగ । బెనఁగుము ప్రాణంబుతోడఁ బ్రిదిలెదు భీమా!' 137

ప్రతిపదార్థం: భీమా!; వినుము; గదారణమునన్= గదాయుద్ధంలో; ననున్+చెనయఁగన్= నన్ను+ఎదుర్కొవటానికి; వాసవునకున్+ ఐనన్= ఇంద్రుడికైనా; చెల్లదు= సాధ్యం కాదు; నీవు+ఈ+అనిన్= నీ వీ యుద్ధంలో; పాడితప్పకుండఁగన్= ధర్మపద్ధతిని తప్పకుండా; పెనఁగుము= యుద్ధం చేయుము; ప్రాణములతోడన్+ప్రిదిలెదు(వు)= ప్రాణాలతో ఊడిపోతావు (చనిపోతావు).

తాత్పర్యం: ఓ భీమా! వినుము. గదాయుద్ధంలో నన్ను ఎదుర్కొనటానికి ఇంద్రుడికైనా సాధ్యం కాదు. నీ వీ యుద్ధంలో ధర్మం తప్పకుండా యుద్ధం చేయుము. ప్రాణాలతో తప్పుకొనలేవు.'

వ. అనిన విని పాంచాలురుం దక్కిన జనపాలురుం బ్రశంసించి మత్తమాతంగంబుఁ దాలశబ్దంబుల నుబ్బం జేయునోజ రారాజుఁ బ్రహర్షంబు నొందించిరి; గజబృంహితంబులు హయహేషితంబులును జెలంగె నాయుధంబు లెక్కుడు మెఱుంగులఁ బొలిచెఁ; దదనంతరంబ యెల్లవారును నెడగలుగఁ గూర్చుండి రమ్మహావీరులు దలపడువారై వీరోద్రేకంబునం జేసి యతిలోకం బగు నవష్టంభంబున విజృంభించి యొండొరుల నవలోకించి రట్టియెడ. 138

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విని; పాంచాలురున్+తక్కిన జనపాలురున్+ప్రశంసించి= పాంచాల దేశీయులూ, మిగిలిన రాజులూ పొగడి; మత్తమాతంగంబున్= మదపుటేనుగును; తాల శబ్దంబులన్+ఉబ్బన్+చేయున్+ఓజన్= తాళాల

చప్పుళ్ళతో ఉత్సాహం కలిగించే విధంగా; రారాజున్= దుర్యోధనుడిని; ప్రహర్షంబున్+ఒందించిరి= సంతోషం కలిగేటట్లు చేశారు; గజ బృంహితంబులు= ఏనుగుల ఘీంకారాలు; హయహేషితంబులును= గుఱ్ఱాల సకిలింతలూ; చెలంగెన్= మ్రోగాయి; ఆయుధంబులు= యుద్ధానికి వాడే అస్త్రశస్త్రాలు; ఎక్కుడు మెఱుంగులన్+పొలిచెన్= మిక్కిలి వెలుగులతో ఒప్పినవి (బాగా పదనుపెట్టటంవలన); తదనంతరంబ= ఆ మీదట; ఎల్లవారును= అందరును; ఎడ+కలుగన్+కూర్చుండిరి= విడిగా దూరముండేటట్లు కూర్చున్నారు; ఆ+మహావీరులు= ఆ గొప్ప యోధులు; తలపడువారు+ఐ= ఎదుర్కొనేవారుగా; వీర+ఉద్రేకంబునన్+చేసి= వీరోద్రేకాలతో; అతిలోకంబు+అగు= లోకాతీతమైన; అవష్టంభంబునన్= గర్వంతో; విజృంభించి= రేగి; ఒండొరులన్+అవలోకించిరి= ఒకరినొకరు చూచుకొన్నారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: దుర్యోధనుడు అట్లా అనగా పాంచాలురు, మిగిలిన రాజులు అతడిని పొగడినారు. మదపుటేనుగును శబ్దాలతో ఉబ్బించే విధంగా చేశారు. ఏనుగులు ఘీంకారాలతోను, గుఱ్ఱాలు సకిలింతలతోను ఒప్పాయి. ఆయుధాలు బాగా మెరిశాయి. ఆ తరువాత అందరూ ఎడంగా కూర్చున్నారు. ఆ గొప్ప వీరులు వీరోద్రేకాలతో గర్వంతో విజృంభించి ఒకరి నొకరు చూచుకొన్నారు. ఆ సమయంలో.

భీమదుర్యోధనుల గదాయుద్ధము సూడ బలరాముఁడు వచ్చుట (సం. 9-33-2)

సీ. యదుకుల దీపకుం డగు రాముఁ డవ్వార్త । యంతకమును విని యక్కుమారు
లాత్మశిష్యులు గాన నాహవ మీక్షింపఁ । దీవ్రయానమున నేతెంచి దృష్టి
గోచరుం డగుటయుఁ, గురునాథ! తగ నెల్ల । వారు నెదుర్కొని గారవమునఁ
బ్రణమిల్లిన నతండు ప్రత్యభివందన । మాచరింపంగ ధర్మాత్మజుండు

తే. సమ్మదంబునఁ బరిరంభణమ్ము సేసెఁ; । నరుఁడుఁ గవలును ద్రౌపదీనందనులును
వందనం బొనరించిరి; వారి నాతఁ । డర్హభంగి భాషణముల నాదరించె. 139

ప్రతిపదార్థం: కురునాథ!= ఓ కురురాజా, ధృతరాష్ట్రా!; యదుకుల దీపకుండు+అగు రాముఁడు= యాదవవంశాన్ని వెలుగజేసే బలరాముడు; ఆ+వార్తన్= ఆ భీమ దుర్యోధనుల గదాయుద్ధ వార్తను; అంతక మును విని= అంతకుముందే విని; ఆ+కుమారులు= ఆ రాజకుమారులు; ఆత్మ శిష్యులుకానన్= తన శిష్యులు కనుక; ఆహవము+ఈక్షింపన్= యుద్ధాన్ని చూడటానికై; తీవ్రయానమునన్= వేగమైన ప్రయాణంతో; ఏతెంచి= వచ్చి; దృష్టిగోచరుండు+అగుటయున్= కనబడగా; ఎల్లవారున్+ఎదుర్కొని= అందరును ఎదురేగి; గారవమునన్+ప్రణమిల్లినన్= గౌరవంతో నమస్కరించగా; అతఁడు= ఆ బలరాముడు; ప్రత్యభినందనము+ఆచరింపఁగన్= ఎదురు నమస్కారం చేయగా; ధర్మాత్మజుండు= ధర్మరాజు; సమ్మదంబునన్= సంతోషంతో; పరిరంభణంబు చేసెన్= కౌగిలించుకొన్నాడు; నరుఁడున్= అర్జునుడు; కవలును= నకుల సహదేవులూ; ద్రౌపదీనందనులును= ఉపపాండవులూ; వందనంబు+ఒనరించిరి= నమస్కారం చేశారు; అతఁడు= ఆ బలరాముడూ; వారిన్= ఆ అందరిని; అర్హభాషణములన్= ఉచితమైన మాటలతో; ఆదరించెన్= గౌరవించాడు.

తాత్పర్యం: యాదవకుల ప్రదీపకుడైన బలరాము డా వార్తను అంతకుముందే విని, ఆ కుమారులు తనకు శిష్యులు కావటంచేత వారి యుద్ధం చూడటానికి వేగమైన పయనంచేసి వచ్చాడు. ఆతడు కనబడగానే అందరూ ఎదురేగి గౌరవంతో నమస్కారం చేశారు. బదులుగా అతడును నమస్కరించాడు. ధర్మరా జాతడిని కౌగలించుకొన్నాడు. అర్జున నకుల సహదేవులు, ఉపపాండవులు నమస్కరించారు. వారందరినీ తగిన విధంగా ఆ బలరాముడు ఆదరించాడు.

క. హరియును సాత్యకియు వినయ । భరితాంతఃకరణు లగుచుఁ బ్రణతు లయిన న
య్యిరువురను గ్రుచ్చి బెరయం । బరిరంభణ మాచరించెఁ బరమప్రీతిన్. 140

ప్రతిపదార్థం: హరియును= శ్రీకృష్ణుడునూ; సాత్యకియున్; వినయభరిత+అంతఃకరణులు+అగుచున్= అణకువతో నిండిన మనసు కలవారై; ప్రణతులు+అయినన్= నమస్కరించగా; ఆ+ఇరువురను గ్రుచ్చి= ఆ యిర్వురినీ గట్టిగా; బెరయన్= కూడేటట్లుగా; పరిరంభణము= కౌగిలింత; పరమప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; ఆచరించెన్= చేశాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణసాత్యకులు వినయముతో నిండిన మనసుతో నమస్కారం చేయగా వారినిరువురిని గ్రుచ్చి కౌగిలించుకొన్నాడు.

వ. ఇత్తెఱంగున నెల్లవారలు నాబలదేవునిఁ గాంచి కుశలప్రశ్నంబు సేసి; రయ్యాదవపుంగవుండు సదుత్తరం బిచ్చి 'యేను బోయి పెక్కుదినంబు లయ్యె' నని యుగ్గడించి, 'మిమ్మునిందఱను జూచుటకును నాశిష్యులగదా యుద్ధం బనుసంధించుటకును వచ్చితి' ననియె; నమ్మరుత్సుతుండును భవత్సుతుండును గదలు సేతులన యుండ నతనిఁ జేరి భక్తిం బ్రణామంబు లాచరించిన నతం డాదరించె; నంతఁ గౌంతేయాగ్రజుండు రౌహిణేయుతో 'నన్నదమ్ముల యిరువుర యెక్కటిపోరు సూడు'మని పలికి వా రట్లు ద్వంద్వయుద్ధంబునకు సన్నద్ధులైన తెఱం గెఱింగించిన, నతండు 'లెస్సకాక!' యని యనుమతి సేసె-నని సంజయుండు ధృతరాష్ట్రునకు రామునాగమనంబు సెప్పె ననిన విని, తదీయప్రవర్తన శ్రవణకుతూహలాయత్తచిత్తుం డైన జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె. 141

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; ఎల్లవారలున్= అందరూ; ఆ బలదేవునిన్+కాంచి= ఆ బలరాముడిని చూచి; కుశలప్రశ్నంబు చేసిరి= క్షేమ సమాచారాలను అడిగారు; ఆ+యాదవ పుంగవుండు= ఆ యాదవులలో శ్రేష్ఠుడు; సత్+ఉత్తరంబు+ఇచ్చి= మంచి బదులిచ్చి; ఏనున్+పోయి పెక్కుదినంబులయ్యెన్= నేను వెళ్ళి చాలా రోజులయింది; అని ఉగ్గడించి= అని చెప్పి; మిమ్ములన్+ఇందఱన్+చూచుటకును= మిమ్మందరిని చూడటానికి; నా శిష్యుల గదాయుద్ధంబు; అనుసంధించుటకును= కూర్చుటకుగాను; వచ్చితిన్+అనియెన్= వచ్చాను అన్నాడు; ఆ+మరుత్సుతుండును= ఆ వాయునందనుడూ; భవత్సుతుండును= నీ కుమారుడూ; గదలు చేతులన ఉండన్= గదలు చేతులలోనే ఉండగా; అతనిన్+చేరి= ఆయనను సమీపించి; భక్తిన్+ప్రణామంబులు+ఆచరించినన్= భక్తితో నమస్కారాలు చేయగా; అతండు+ఆదరించెన్= ఆతడు ప్రీతిగా మన్నించాడు; అంతన్+కౌంతేయ+అగ్రజుండు= అంతట కుంతి కుమారులలో పెద్దవాడైన ధర్మరాజు; రౌహిణేయుతోన్= రోహిణీకుమారుడయిన బలరాముడితో; అన్నదమ్ములు+ఇరువుర= అన్నదమ్ములిద్దరి; ఎక్కటిపోరు చూడుము+అని= ఒక్కరినొక్కరే ఎదుర్కొని చేసే యుద్ధాన్ని చూడుమని; పలికి= మాటాడి; వారు+అట్లు ద్వంద్వ యుద్ధంబునకున్= వా రా విధంగా ద్వంద్వ యుద్ధానికి; సన్నద్ధులు+ఐన తెఱంగు= సిద్ధమైన తీరు; ఎఱింగించినన్= తెలియచేయగా; అతండు= ఆ బలరాముడు; లెస్స కాక!= మేలు గాక!; అని= అంటూ; అనుమతి+చేసెన్= అంగీకారం తెలిపాడు; అని= అంటూ; సంజయుండు ధృతరాష్ట్రునకు; రాము+ఆగమనంబు చెప్పెన్+అనినన్ విని= బలరాముడి రాకను చెప్పాడు - అనగా విని; తదీయ= వారియొక్క; ప్రవర్తన= నడవడిని గూర్చి; శ్రవణకుతూహల+ఆయత్త చిత్తుండు+ఐన= వినుట కాసక్తి నిండిన మనసున్న వాడైన; జనమేజయుండు= జనమేజయ చక్రవర్తి; వైశంపాయనునకున్+ఇట్లు+అనియెన్= వైశంపాయనమునితో ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఈ విధంగా వారంతా ఆ బలరాముడిని చూచి, అతడి క్షేమాలను గురించి అడిగారు. ఆ యాదవ ముఖ్యుడును బదులిచ్చి 'నేను పోయి చాలా నాళ్ళయింది. మిమ్మింతమందిని చూడటానికీ నా శిష్యుల గదాయుద్ధాన్ని

కూర్చటానికీ వచ్చాను'- అన్నాడు. ఆ వాయునందనుడు, నీ కుమారుడు, గదలతోనే అతడికి దగ్గరగా పోయి నమస్కారం చేశారు. ఆతడు వారిని ప్రీతిగా చూచాడు. అపుడు ధర్మరాజు బలరాముడితో అన్నదమ్ముల ద్వంద్వయుద్ధాన్ని చూడవలసిందిగా చెప్పి, వా రా ద్వంద్వ యుద్ధానికి సిద్ధమైన తీరు తెలుపగా అతడు మంచిదని అనుమతిచ్చాడు. అని ధృతరాష్ట్రుడితో సంజయుడు బలరాముడి రాకను గురించిన విశేషం తెలియజెప్పగా విని జనమేజయుడు ఆ యుద్ధ విశేషాలను వినటానికి ఆసక్తి చూపుతూ వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు.

తే. **ఉభయవాహిని సంగరోద్యోగసమయ । మున హలాయుధుఁ డేతెంచి మురహరుండు**
పాండురాజసూనులయెడఁ బక్షపాతి । యని విరాటాదిబంధులు వినఁగఁ బలికి. **142**

ప్రతిపదార్థం: ఉభయవాహిని= ఇరువాగుల సేన; సంగర+ఉద్యోగసమయమునన్= యుద్ధానికి ప్రయత్నించే వేళలో; హలాయుధుఁడు= బలరాముడు; ఏతెంచి= వచ్చి; మురహరుండు= మురాసురుడిని చంపిన శ్రీకృష్ణుడు; పాండురాజ సూనుల+ఎడన్= పాండురాజు కుమారులమీద; పక్షపాతి అని= అభిమాని అని; విరాట+ఆది= విరాటుడు మొదలయిన; బంధులు= బంధువులు; వినఁగన్+పలికి= వినేటట్లుచెప్పి.

తాత్పర్యం: ఇరువైపు సేనలూ యుద్ధ ప్రయత్నంలో ఉండగా బలరాము డక్కడకు వచ్చి విరాటాది బంధువులంతా వినేటట్లుగా శ్రీకృష్ణుడు పాండవ పక్షపాతి అని చెప్పి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **హరి యెఱుఁగని చక్కటియును । బురుషార్థము నా కెఱుంగఁ బోలునె? యీ ని**
ష్ఠురత వినఁ జూడఁ జాలక । సరస్వతీతీర్థమునకుఁ జనియెడు బుద్ధిన్. **143**

ప్రతిపదార్థం: హరి= శ్రీకృష్ణుడు; ఎఱుఁగని= తెలియని; చక్కటియును= మార్గమూ; పురుషార్థము= పురుషార్థమూ; నాకున్+ఎఱుంగన్+పోలునె?= నాకు తెలియనగునా?; ఈ నిష్ఠురతన్= ఈ కష్టపు పని; వినన్+చూడన్+చాలక= విన లేక, కన లేక; సరస్వతీ తీర్థమునకున్; చనియెడు బుద్ధిన్= వెళ్ళవలననే మనసుతో.

తాత్పర్యం: శ్రీకృష్ణుడికి తెలియని మార్గమూ పురుషార్థమూ నే నెఱుగగలనా? ఈ కష్టమైన విషయాన్ని నేను వినలేను, చూడ లేను - అని సరస్వతీ తీర్థమునకు పోవలెనని మనసుతో. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. **మీ కెఱింగించి పో వచ్చితిఁ బోయి వచ్చెద' నని వాసుదేవ ధర్మజు లొడఁబడి యనుపఁ జనియె నని వింటి బలదేవుండు తీర్థయాత్ర నిర్వర్తించిన తెఱంగును భీమసుయోధనుల గదాయుద్ధంబు చెల్లినభంగియు నతని కాలోన నచటి కేఁగుదేర సమకూరిన విధంబును వివరించి చెప్పు' మనిన జనమేజయునకు వైశంపాయనుం డి ట్లనియె.** **144**

ప్రతిపదార్థం: మీకున్+ఎఱింగించిపోన్= మీకు తెలిపిపోవటానికి; వచ్చితిన్= వచ్చాను; పోయివచ్చెదను= వెళ్ళివస్తాను; అని; వాసుదేవ ధర్మజులు= శ్రీకృష్ణుడును, ధర్మరాజును; ఒడఁబడి= ఇష్టపడి; అనుపన్+చనియెన్= పంపగా వెళ్ళాడు; అని వింటిన్= అని విన్నాను; బలదేవుండు= బలరాముడు; తీర్థయాత్ర= తీర్థయాత్రను; నిర్వర్తించిన తెఱంగును= సాగించిన విధమును; భీమసుయోధనుల గదాయుద్ధంబు; చెల్లిన భంగియున్= సాగిన విధమును; అతనికిన్= ఆ బలరాముడికి; ఆలోనన్= అంతలోనే; ఏఁగుదేరన్ సమకూరిన విధంబును= రావటానికి ఏర్పడిన విధమును; వివరించి= విస్తారంగా; చెప్పుము; అనినన్= అనగా; జనమేజయునకున్= జనమేజయుడితో; వైశంపాయనుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: (బలరాముడు) మీకు చెప్పి పోవటానికై వచ్చాను. పోయి వస్తాను-' అనగా శ్రీకృష్ణధర్మజులు ఒప్పికొని పంపగా వెళ్ళా డని విన్నాను. బలరాముడు సాగించిన తీర్థయాత్రా విధానాన్నీ, భీమదుర్యోధనులు సాగించిన గదాయుద్ధాన్నీ, బలరాము డంతలోనే అక్కడకు వచ్చిన పద్ధతిని, సవిస్తరంగా చెప్పవలసింది' అని జనమేజయుడు అడుగగా, వైశంపాయనుడు ఇట్లా అన్నాడు.

సీ. **'వినుము నరేంద్ర! యవ్విధమునఁ జని యమ్మ । హాత్ముండు గోసువర్ణాదు లైన**
దానార్హబహుపదార్థంబులు దన యగ్ని । హోత్రంబు దెచ్చుట కుచితజనులఁ
బుచ్చె ననేక విప్రుల నాప్తసచివుల । వలయు రథ ద్విపాశ్వములగముల
రావించెఁ దండులప్రముఖభోజన సాధన । ములు సంపన్నహృద్యములు గాఁగఁ

ఆ. **దేరఁ బనిచె నిట్లు తీర్థయాత్రాసంవి । ధాన మాచరించి మాననీయ**
మగు సరస్వతీమహాంభోధిసంగమ । స్థానమునకుఁ జనియె సవినయముగ. **145**

ప్రతిపదార్థం: నరేంద్ర!= ఓ జనమేజయ చక్రవర్తీ!; వినుము; ఆ+విధమునన్+చని= ఆ మాదిరిగా వెళ్ళి; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడు(బలరాముడు); గో సువర్ణాదులు+ఐన= పశువులు, సువర్ణములు ఐన; నానార్హబహు పదార్థంబులు= తగిన వస్తువు లనేకములను; తన+అగ్నిహోత్రంబున్= తన అగ్నిహోత్రమును (గార్హపత్యాగ్నిని); తెచ్చుటకున్= తీసికొని వచ్చుటకు; ఉచిత జనులన్+పుచ్చెన్= తగిన మనుష్యులను పంపాడు; అనేకవిప్రులన్= బ్రాహ్మణులను చాలమందిని; ఆప్తసచివులన్= ఆత్మీయు లయిన మంత్రులను; వలయు రథద్విప+అశ్వముల గములన్= అవసరమైన తేరులను, ఏనుగులను, గుర్రాలను, రావించెన్= రప్పించాడు; తండుల ప్రముఖ= బియ్యం మొదలైన అవసరమయిన; భోజన సాధనములు= ఆహారవస్తువులు; సంపన్నహృద్యములు+కాఁగన్= సమృద్ధములును, మనోహరములును అగునట్లు; తేరన్+పనిచెన్= తీసికొని రా పంపాడు; ఇట్లు తీర్థయాత్రా సంవిధానము+ఆచరించి= ఈవిధంగా తీర్థాలను సేవించి; మాననీయము+అగు= ప్రశస్తమయి నట్టి; సరస్వతీమహాంభోధిసంగమస్థానమునకున్= సరస్వతీ తీర్థం సముద్రంలో కలిసే చోటునకు; సవినయముగన్+చనియెన్= సవినయంగా వెళ్ళాడు.

తాత్పర్యం: 'ఓ రాజేంద్రా! ఆ మాదిరిగా వెళ్ళిన మహనీయుడైన, బలరాముడు సమస్త సంపదలతోను, అవసరమైన సంభారాలతోను తాను చేయవలసిన అగ్నికార్యాలకు అనువైన అగ్నిహోత్రాన్ని తీసికొని రావటానికి అర్హులయిన వారిని పంపాడు. అనేకులు బ్రాహ్మణులను, ఆప్తులయిన మంత్రులను అవసరమైన రథాలు ఏనుగులను, గుర్రాలను రావించుకొన్నాడు. భోజనానికి కావలసిన మంచి బియ్యాన్ని, ఇతర భోజన పదార్థాలను చక్కగా అమరేటట్లు ఆజ్ఞ ఇచ్చాడు. ఈ విధంగా యాత్రను ఏర్పాటు గావించుకొని, పవిత్రమయిన సరస్వతీనది సముద్రంలో కలిసేచోటునకు అడకువతో వెళ్ళాడు.

వ. **అది ప్రభాసం బనుపేరం బరఁగు న ట్లందులకుఁ జని తీర్థసేవనం బనుష్ఠించి యంతనుండియుఁ బథిశ్రాంతిప్రయాణంబుల సరస్వతి చేరువ నడచి తదీయ సకలతీర్థంబు లాడుచు నన్నపానంబుల నాసనశయనయానంబులను ధేనుకనకరత్నాంబరాభరణాదిద్రవ్యంబులను విప్రుల నతిప్రీతులఁ జేయుచు, బాలవృద్ధవనితావికలాంగదుర్బలప్రాయులఁ బరిశ్రాంతు లైనయెడలఁ దడిమికొని యథేష్ట ప్రకారంబుల శరీరస్థితి నడిపింపఁ దగువారిని నియోగించి మఱియు ననేకధర్మంబు లాచరించుచుఁ గురుక్షేత్రంబునకు**

వచ్చె' ననుటయు జనమేజయుం డా తీర్థవిశేషంబులు వివరించి చెప్పు మనుడు వైశంపాయనుం డిట్లనియె. 146

ప్రతిపదార్థం: అది= ఆ సంగమస్థానం; ప్రభాసంబునుపేరన్+బరఁగున్= ప్రభాసమనే పేరుతో ఒప్పుతుంది; అట్లు+అందులకున్+ చని; తీర్థసేవనంబు+అనుష్ఠించి= తీర్థస్నానాదులనుచేసి; అంతనుండియున్= అక్కడినుండి; పథిశ్రాంతి ప్రయాణంబులన్= నడకవలన కలుగు శ్రమతో ప్రయాణములతో; సరస్వతి చేరువన్+నడచి= సరస్వతికి దగ్గరగా నడచి; తదీయ= దాని సంబంధమగు; సకలతీర్థంబులు+ఆడుచున్= అన్ని తీర్థాలలో స్నానంచేస్తూ; అన్నపానంబులన్+ఆసన+శయన+యానంబులను= అన్నపానాలను, ఆసనాలను, పడకలను, ప్రయాణాలను; ధేను= ఆవులను; కనక= బంగారు; రత్న+అంబర+ఆభరణ+ఆది ద్రవ్యంబులను= నవరత్నములతోనూ, వస్త్రములతోను, నగలతోను కూడిన సంపదలను(ఇచ్చుటవలన); విప్రులను= బ్రాహ్మణులను; అతి ప్రీతులన్+చేయుచు= మిక్కిలిగా తృప్తిపరుస్తూ; బాల= పసివారు; వృద్ధ= ముదుసలులు; వనితా= స్త్రీలు; వికల+అంగ= అంగవైకల్యం కల; దుర్బలప్రాయులన్= బలహీనులైనవారిని; పరిశ్రాంతులు+అయిన ఎడలన్= అలసినట్లయితే; తడిమికొని= నిమురుకొంటూ; యథేష్టప్రకారంబులన్= వారి ఇష్టానుసారంగా; శరీరస్థితి= ఆరోగ్యానికి తగినట్లు; నడపింపన్+ తగువారిన్= నడిపించతగ్గవారిని; నియోగించి; ఆజ్ఞాపించి; మఱియున్= ఇంకను; అనేక= చాలా; ధర్మంబులు= ధర్మాలు; ఆచరించుచున్= చేస్తూ; కురుక్షేత్రంబునకున్= కురుక్షేత్రానికి; వచ్చెన్= వచ్చాడు; అనుటయున్= అనగా; జనమేజయుండు; ఆ తీర్థ= ఆ తీర్థముయొక్క; విశేషంబులు= గొప్పదనాలు; వివరించి; చెప్పుము+అనుడున్= చెప్పుమనగా; వైశంపాయనుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఆ సంగమస్థానానికి ప్రభాసతీర్థ మని పేరు. ఆ తీర్థమును ఆరాధించి, అక్కడినుండి మార్గాయాసంతో కూడిన పయనాలతో సరస్వతికి సమీపంగా నడచి, అందున్న అన్ని తీర్థాలలో మునుగుతూ, ఆహారశయనాదులకు ఏర్పాట్లు చేసి, గోవులను సంపదను పట్టువస్త్రాలనూ, నగలనూ బ్రాహ్మణుల కొసగి వారిని సంతోషపరిచి, పసివారినీ, ముదుసలివారినీ, స్త్రీలనూ అంగవైకల్యం గలవారినీ బలహీనులైన వారిని అలసినచోటులలో ఆదుకొనేవారిని ఏర్పాటు చేసి, ఇంకను అనేక ధర్మాలు చేస్తూ కురుక్షేత్రానికి వచ్చాడు - అని అనగా జనమేజయుడు తీర్థ విశేషాలను వివరించు మనగా వైశంపాయను డీ విధంగా చెప్పాడు:

క. మును చనియెఁ బ్రభాసమునకు । నని చెప్పితి నతని నది మహత్తరతీర్థ
మ్ము నరేంద్ర! యందుఁ జంద్రుఁడు । దన యక్ష్మం దీర్చుకొని గతవ్యథుఁ డయ్యెన్. 147

ప్రతిపదార్థం: నరేంద్ర!= ఓ రాజా!; అతనిన్; మును చనియెన్+ప్రభాసమునకున్+అని చెప్పితిన్= ఇదివరకు ప్రభాస తీర్థమునకు వెళ్ళాడని చెప్పాను; అది; మహత్తర= గొప్ప; తీర్థమ్ము= తీర్థం; అందున్= ఆ తీర్థంలో; చంద్రుఁడు; తన; యక్ష్మన్+తీర్చుకొని= క్షయవ్యాధిని; తీర్చుకొని= పోగొట్టుకొని; గత= పోయిన; వ్యథుడు+అయ్యెన్= బాధగలవాడయ్యాడు.

తాత్పర్యం: ఆతడు ప్రభాసతీర్థానికి ముందుగా వెళ్ళాడని చెప్పాను. అది మిక్కిలి మహిమ(శక్తి) కల తీర్థం. ఓ రాజా! చంద్రు డాతీర్థంలో మునిగి తన క్షయవ్యాధిని పోగొట్టుకొన్నాడు.

ప్రభాసతీర్థ ప్రభావవర్ణనము (సం. 9-33-36)

వ. అత్తెఱం గెఱింగించెద దక్షకన్యకల నశ్విన్యాదు లగు సప్తవింశతి సంఖ్యలఁ జంద్రుండు వివాహం బయ్యె నందు రోహిణి రూపాతిశయవతి యగుటం జేసి తదాసక్తుండైనఁ దక్కటివారు వగ నొంది తండ్రికడకుం

జని చంద్రుని యన్యాయం బెఱింగించిన, నా ప్రజాపతి చంద్రునితో నుగ్గడించి 'యది చాల నధర్మం బింక నిట్లు సేసి తేని శపింతుఁ జుమ్మీ! సముఁడవై వర్తింపు' మనుటయు నమ్మాట దెస ననాదరంబు సేసి యతండు వెండియుఁ దొంటియట్ల వర్తించిన నెఱింగి యమ్మహాత్ముండు కోపించి యఱుఁదెవులు గొనుమని శాపం బిచ్చిన, నయ్యోషధినాథుండు నానాఁటికిఁ గృశుం డయ్యె న ట్లాతెవులుచేత నతండు పోఁడిమి మాలిన నోషధులు పసచెడియె; దానఁ బ్రజలు డయ్యం జొచ్చి; రది చంద్రకార్శ్యహేతుకం బగుట యనుసంధించి. **148**

ప్రతిపదార్థం: ఆ+తెఱంగు= ఆ విధాన్ని(తీర్థమహత్త్యమును); ఎఱింగించెదన్= తెలుపుతాను; దక్షకన్యకలన్= దక్షుడికూతులైన; అశ్విని+ఆదులు+అగు= అశ్విని మొదలైనవారిని; సప్తవింశతి సంఖ్యలన్= ఇరవై ఏడుమందిని; చంద్రుఁడు వివాహంబయ్యెన్= చంద్రుడు పెండ్లాడాడు; అందున్= వారిలో; రోహిణి= రోహిణిఅనునామె; రూపాతిశయవతి+అగుటన్+చేసి= మిక్కిలి అందగత్తె అయినందున; తద్+ఆసక్తుండు+ఐనన్= ఆమె అందు ప్రీతికలవాడు కాగా; తక్కటివారు= మిగిలినవారు; వగన్+ఒంది= దుఃఖపడి; తండ్రికడకున్+చని= తమ తండ్రి వద్దకు వెళ్ళి; చంద్రుని అన్యాయంబు+ఎఱింగించినన్= చంద్రుడి అధర్మమును తెలుపగా; ఆ ప్రజాపతి= ఆ దక్షప్రజాపతి; చంద్రునితోన్+ఉగ్గడించి= చంద్రుడితో మాటాడి; అది చాలన్+అధర్మంబు= అది మిక్కిలి అన్యాయం; ఇంకన్+ఇట్లు+చేసితి(వి)+ఏని= ఇంకా ఇట్లాగే చేశావంటే; శపింతున్+చుమ్మీ!= శాపమిస్తాను సుమా!; సముఁడవు+ఐ= సమానుడవుగా; వర్తింపుము= నడచుకొనుము; అనుటయున్= అని చెప్పటమూ; ఆ+మాటదెసన్= ఆ మాటకు; అనాదరంబు+చేసి= లెక్కచేయక; అతండు= చంద్రుడు; వెండియున్= మరల; తొంటి+అట్లు+అ= వెనుకటిమాదిరిగనే; వర్తించినన్+ఎఱింగి= నడచుకొనగా తెలిసికొని; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడైన దక్షుడు; కోపించి; అఱుఁదెవులు+ గొనుమని= కృశించే జబ్బును(క్షయను) పొందుమని; శాపంబు+ఇచ్చినన్= శాపం ఇవ్వగా; ఆ+ఓషధినాథుండు= ఆ చంద్రుడు; నానాఁటికిన్+కృశుండు+అయ్యెన్= దినదినానికి క్షీణించాడు; అట్లు+ఆ తెవులుచేతన్= ఆ విధంగా ఆ జబ్బుతో; అతడు పోఁడిమి మాలినన్= వాడు ఒప్పులేనివాడు కాగా; ఓషధులు; పసచెడియన్= బలహీనము అయినవి; దానన్+ప్రజలు= అందుచేత ప్రజలు; డయ్యన్+చొచ్చిరి= అలసట కలవారైరి; అది; చంద్రకార్శ్య= చంద్రుడు కృశించిన; హేతుకంబు+అగుటన్= కారణం కావటంతో; అనుసంధించి= కూర్చి.

తాత్పర్యం: ఆ వివరాన్ని తెలియజేస్తాను. దక్షుడి కూతులు ఇరువదిఏడుగురను (అశ్విని మొదలైనవారిని) చంద్రుడు పెండ్లాడాడు. వారిలో చాలా అందగత్తెఅయిన రోహిణియందు అభిమానం ఎక్కువగా కలిగి ప్రవర్తించగా, మిగిలిన వారు మనస్తాపంతో తండ్రి వద్దకు వెళ్ళి, చంద్రుడు చేసే అన్యాయాన్ని చెప్పారు. ఆ దక్షప్రజాపతి చంద్రుడితో అది చాలా అన్యాయ మనీ ఇకముందా విధంగా చేస్తే శపిస్తాననీ అన్నాడు. ఆ మాటను లెక్కచేయకుండా చంద్రుడు వెనకటివలెనే ప్రవర్తించసాగాడు. ఆ విషయాన్ని తెలిసికొన్న దక్షుడు కోపించి అతడిని క్షయవ్యాధిచేత బాధనందు మని శపించాడు. దానితో ఓషధీపతి అయిన చంద్రుడు దినదినానికీ కృశించి పోయాడు. ఆ రోగంవలన ఆతడు కళావిహీనుడుకాగా ఓషధులు కూడా బలహీనాలయ్యాయి. అందుచేత ప్రజలు అలసిపోజొచ్చారు. అది చంద్రుడు కృశించిన కారణంగా జరిగిందని గ్రహించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. దేవత లమృతాంశునితో । 'నీ వేటికిఁ గృశుఁడ వైతి? నిక్కము చెపుమా!'
నావుడుఁ దనతెఱఁ గేర్పడఁ । గా వారికి నతఁడు సెప్పెఁ గౌరవముఖ్యా.!' **149**

ప్రతిపదార్థం: కౌరవముఖ్యా!= కురువంశంలో ప్రధానుడైనవాడా! జనమేజయా!; దేవతలు+అమృత+అంశునితోన్= దేవతలు చంద్రుడితో; నీవు+ఏటికిన్ కృశుఁడవు+ఐతి(వి)?= నీవెందుకై కృశించిపోయావో; నిక్కము చెపుమా!= నిజం చెప్పుము;

నావుడున్= అనగా; తన తెఱఁగు+ఏర్పడఁగాన్= తన స్థితి స్పష్టంగా తెలియగా; అతఁడు= చంద్రుడు; వారికిన్+చెప్పెన్= ఆ దేవతలకు చెప్పాడు.

తాత్పర్యం: ఓ కౌరవరాజా! జనమేజయా! దేవతలు చంద్రుడిని 'నీవు ఇట్లా క్షీణించిపోవటానికి కారణ మేమిటో నిజంగా చెప్పుము.' అని అడుగగా, అతడు వాళ్ళకు ఆ వివరమంతా చెప్పాడు.

క. విని వార లతనిఁ దోడ్కొని । చని ప్రార్థించుటయుఁ దగఁ బ్రసన్నుం డై యి
ట్లను దక్షుఁ 'డఖిల భార్యా । జనులయెడన్ నడవవలయు శశి సమవృత్తిన్. 150

ప్రతిపదార్థం: విని= అది విన్నవారై; వారలు= ఆ దేవతలు; అతనిన్+తోడ్కొని= ఆ చంద్రుడి తీసికొని; చని= వెళ్ళి; ప్రార్థించుటయున్= ప్రార్థించగా; తగన్+ప్రసన్నుండు+ఐ= తగునట్లుగా దయగలవాడై; దక్షుఁడు+ఇట్లనున్= దక్షు డీ విధంగా అన్నాడు; అఖిల భార్యాజనులఎడన్= భార్యలందరి విషయంలోను; శశి= చంద్రుడు; సమవృత్తిన్= సమానమైన ప్రవర్తనంతో; నడవవలయున్= నడచుకొనవలెను.

తాత్పర్యం: దేవతలు విని, చంద్రుడిని తోడుకొనిపోయి దక్షుడిని ప్రార్థించగా ఆదరంతో ఆతడు 'భార్యలందరి విషయంలోనూ చంద్రుడు సమానమైన అభిమానంతో నడచుకొనవలయు'నని చెప్పాడు.

వ. అట్లు నడచుచు సరస్వతీజలనిధిసంగమకలితం బైన తీర్థంబుజలంబుల నిమగ్నుం డై వృద్ధిఁ బొందు; వరుసన పదియేను పదియేనుదినంబులు సంక్షయంబును బ్రవర్ధనంబు నొందం గలవాఁ' డని చెప్పి వెండియు. 151

ప్రతిపదార్థం: అట్లు నడచుచున్= ఆ విధంగా నడుస్తూ; సరస్వతీ జలనిధి సంగమకలితంబు+ఐన= సరస్వతీ తీర్థమూ సముద్రమూ కలసిన తీర్థముల నీళ్ళలో; నిమగ్నుండు+ఐ= స్నానంచేసి (మునిగి); వృద్ధిన్+పొందున్= వృద్ధిపొందుతాడు; వరుసన= క్రమంగా; పది ఏను+పది ఏను దినంబులు= పదిహేను దినాల చొప్పున; సంక్షయంబును= తగ్గుటయున్నూ; ప్రవర్ధనంబున్ ఒందన్= పెరుగుటయున్నూ; ఒందన్+కలవాఁడు; అని చెప్పి వెండియున్= అని చెప్పి ఆ మీదట.

తాత్పర్యం: ఆ విధంగా నడుస్తూ సరస్వతీ నది సముద్రంలో కలిసేచోట కల పవిత్రతీర్థములలో మునిగి వృద్ధిని పొందే పద్ధతిలో పదిహేను దినాలు తగ్గుతూ పెరుగుతూ ఉండగలడు' అని చెప్పి ఇంకను. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'అమవస సమవస నా తీ । ర్థమునఁ గృతస్నానుఁ డై సుధాకరుఁడు ప్రవృ
ద్ధి మహితతనుఁ డగు' నని యతఁ । డమరుల వీడ్కొల్పి యా మృగాంకునితోడన్. 152

ప్రతిపదార్థం: అమవస+అమవసన్= ప్రతి అమావాస్య నాడూ; సుధాకరుఁడు= చంద్రుడు; ఆ తీర్థమునన్= ఆ తీర్థంలో; కృతస్నానుండు+ఐ= స్నానమాడి; ప్రవృద్ధి మహితతనుఁడు+అగును+అని= (ఆరోగ్యం) పెరిగిశక్తిమంతమయిన శరీరంకలవాడౌతా డని; అఁతడు+అమరులన్ వీడ్కొని= ఆ దక్షుడు దేవతలను పంపించి; ఆ మృగాంకునితోడన్= ఆ చంద్రుడితో.

తాత్పర్యం: 'అమావాస్యకు, అమావాస్యకు, చంద్రు డా తీర్థంలో స్నానమాడి ప్రవర్ధమానమయ్యే శక్తిగల శరీరంకలవా డవుతాడు' అని దేవతలను పంపివేసి, ఆ దక్షుడు చంద్రుడితో ఈ విధంగా అన్నాడు:

వ. 'వనితలకు విప్రులకు నవమానంబు సేయకుమీ!' యని పలికి వీడ్కొలిపె నట్లు శాపమోక్షంబు గని చంద్రుం డాతీర్థంబునకుఁ జని తదీయ జలస్నానంబున నాప్యాయితశరీరుండై లోక ప్రభాసుం డయ్యెఁ; నదికారణంబుగా నాతీర్థంబు ప్రభాసం బనుపేరం బ్రసిద్ధి నొందెఁ; నందుండి యా రోహిణీ నందనుం డరిగి చమసోద్భేదనం బను తీర్థంబున నొకరాత్రి వసియించి, యుదపానంబునకుం బోయెఁ; దానివిశేషం బాకర్ణింపుము. 153

ప్రతిపదార్థం: వనితలకున్= స్త్రీలకును; విప్రులకున్= బ్రాహ్మణులకును; అవమానంబు+చేయకుమీ!= అవమానం చేయవద్దు సుమా!; అని పలికి వీడ్కొలిపెన్= అని చెప్పి పంపాడు; అట్లు శాపమోక్షంబున్+కని= ఆ విధంగా శాపమునుండి విమోచనం పొందే తెరవు చూచి; చంద్రుండు+ఆ తీర్థంబునకున్ చని= చంద్రు డా తీర్థానికి వెళ్ళి; తదీయ జలస్నానంబునన్= ఆ నీటిలో స్నానం చేయటంచేత; ఆప్యాయిత శరీరుండు+ఐ= సుఖమయమైన శరీరంకలవాడు అయి; లోక ప్రభాసుండు+అయ్యెన్= లోకాన్ని కాంతిమంతం చేసినవా డయ్యాడు; అది కారణంబుగాన్= ఆ కారణంవలన; ఆ తీర్థంబు= ఆ సంగమ తీర్థం; ప్రభాసంబు+అను పేరన్+ప్రసద్ధిన్+అందెన్= (ఆ తీర్థం) ప్రభాసమనే పేరుతో కీర్తిపొందినది; అందుండి= అక్కడినుండి; ఆ రోహిణీ నందనుండు+అరిగి= రోహిణి కుమారుడైన బలరాముడు వెళ్ళి; చమసోద్భేదనంబు+అను తీర్థంబునన్= చమసోద్భేదన మనే పేరున్న ఆ తీర్థంలో; (యాగ సమయంలో అందరును తీసికొనే ఒక విధమయిన రసం పుట్టే చోటు); ఒక రాత్రి వసియించి= ఒక్కరాత్రి మాత్రం ఉండి; ఉదపానంబునకున్+పోయెన్= ఉదపానమనే బావికిపోయాడు; దాని విశేషంబులు= దాని గొప్పదనమును; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: 'స్త్రీలను, బ్రాహ్మణులను అవమానింపవద్దు.' అని వీడ్కొలిపాడు. ఆ విధంగా శాపం తొలగిపోయే విధాన్ని తెలిసి చంద్రు డా తీర్థానికి పోయి ఆ నీటిలో స్నానం చేసి చక్కని శరీరంతో లోకాన వెలిగాడు. ఆ కారణంచేత ఆ తీర్థం ప్రభాసమని కీర్తి నందింది. అక్కడనుండి బలరాముడు చమసోద్భేదనతీర్థంలో ఒక రాత్రి ఉండి స్నానమాడి ఉదపానమనే బావిని సేవించటానికి వెళ్ళాడు. ఆ కథ వినుము.

క. త్రితుఁ డనఁగా ద్వితుఁ డన నే। కతుఁ డనగఁ దపస్విసుతులు గల; రా విప్ర
త్రితయము భూపాలురకును। గ్రతుదీక్ష లొనర్చి ధేనుగణముం బడసెన్. 154

ప్రతిపదార్థం: త్రితుఁడు+అనఁగాన్= త్రితుడనే పేరు కలవాడు; ద్వితుఁడు+అనన్= ద్వితుడనేవాడు; ఏకతుఁడు+అనఁగన్= ఏకతు డనేవాడును; తపస్వి సుతులు= మునికుమారులు; కలరు= ఉన్నారు; ఆ విప్రత్రితయము= ఆ ముగ్గురు బ్రాహ్మణులును; భూపాలురకును= రాజులకు; క్రతుదీక్షలు+ఒనర్చి= యజ్ఞదీక్ష లిచ్చి; ధేనుగణమున్+పడసెన్= ఆవులను పొందారు.

తాత్పర్యం: త్రితుడు, ద్వితుడు, ఏకతుడు అనే మునికుమారు లుండేవారు. వారు రాజులకు యజ్ఞదీక్షలనిచ్చి ఆవులను పొందారు.

వ. పడసి యొక్కట నేతెంచునెడ నయ్యేకతద్వితులు నిజభ్రాత యగు త్రితుని వంచించి తా రాగోవులఁ దొలంగ నడిచికొని పోవువారుగాఁ బాపబుద్ధి కుత్సహించి; రాసమయంబునఁ దెరువున నొక్కవృకం బున్నఁ దద్భయంబునం దొలంగం బోయి ప్రమాదంబున ద్రితుండు నూతం బడిన నయ్యిరువురు నతని నుపేక్షించి ధేనువులం గొనిపోయి; రమ్మునికుమారుండు నిర్జలం బైన యయ్యుదపానంబున నుండి సోమపానంబు సేసినం గాని యీ దురితంబు వాయ దని తలంచి యజ్ఞసాధనంబునకుఁ బ్రతివిధులు

సంకల్పరూపంబున సంపాదించికొని క్రతువొనరించిన దేవతలు సన్నిధిసేసి హవిర్భాగంబులు గైకొనిరి. సరస్వతీజలంబు తత్కూపంబున నుద్గతంబై యా సవనపతి నుద్ధరించె; నయ్యమరులు వరం బడుగు మనిన నమ్మహాద్విజుండు. 155

ప్రతిపదార్థం: పడసి యొక్కన్ ఏతెంచునెడన్= ఆ విధంగా పొంది ఒక్కడూ వచ్చే సమయంలో; ఆ+ఏకతద్వితులు= ఆ యేకత ద్వితు లనేవారు; నిజభ్రాతఅగు= తమ సోదరుడయిన; త్రితుని= త్రితు డనే వాడిని; వంచించి= మోసంచేసి; తారు= తాము; ఆ గోవులన్= ఆ పశువులను; తొలంగన్+అడిచికొనిపోవువారుగాన్= తప్పించి తోలుకొని పోయే వారై; పాపబుద్ధికిన్= మోసపు చేష్టకు; ఉత్సహించిరి= ఆసపడ్డారు; ఆ సమయంబునన్= ఆ వేళలో; తెరువునన్= బాటలో; ఒక్క వృకంబు+ఉన్నన్= ఒక తోడేలుండగా; తద్+భయంబునన్+తొలంగన్+పోయి= దానివలన భయంతో తప్పుకొనబోయి; ప్రమాదంబునన్= ప్రమాదవశాన; త్రితుండు= త్రితుడనేవాడు; నూతన్+పడినన్= బావిలో పడగా; అతనిన్+ఉపేక్షించి= వాడిని లెక్కసేయకుండా; ధేనువులన్+కొనిపోయిరి= ఆవులను తీసికొనిపోయారు; ఆ+మునికుమారుండు= ఆ తపసి కుమారుడు; నిర్జలంబు+అయిన ఆ+ఉదపానంబుననుండి= నీరులేని ఆ బావినుండి; సోమపానంబు+చేసినఁగాని= సోమరసాన్ని త్రాగితేగాని; ఈ దురితంబు= ఈ పాపం; పాయదు+అని తలంచి= పోదని భావించి; యజ్ఞసాధనంబునకున్+ప్రతినిధులు= యజ్ఞాన్ని సాగించటానికి మారువిధానాలు; సంకల్పరూపంబునన్ సంపాదించుకొని= సంకల్పమాత్రాన సంపాదించుకొని; క్రతువు+ఒనరించినన్= యజ్ఞం చేయగా; దేవతలు సన్నిధి+చేసి= దేవతలు ప్రత్యక్షమై; హవిర్భాగంబులు గైకొనిరి= యజ్ఞహవిస్సులో భాగాలను తీసికొన్నారు; సరస్వతీ జలంబు= సరస్వతీ తీర్థంలోని నీరు; తద్+కూపంబునన్+ఉద్గతంబు+ఐ= ఆ బావిలో పుట్టుకొని వచ్చి; ఆ సవనపతిన్= ఆ యజ్ఞపతిని; ఉద్ధరించెన్= గట్టెక్కించింది; ఆ+అమరులు; వరంబు+అడుగుము+అనినన్= ఆ దేవతలు వరమడుగు మనగా; ఆ+మహాద్విజుండు= ఆ గొప్ప బ్రాహ్మణుడు.

తాత్పర్యం: ఆవులను పొంది, ఒకడూ వస్తుండగా తోడబుట్టినవారయిన ఏకద్వితులు త్రితుని మోసగించి అతడి ఆవులను అపహరించి దాటుకొని పోయేవారయి పాపపుచేష్టకు ఆసక్తి చూపారు. ఆ సమయంలో దారిలో ఒక పెద్ద తోడేలుండగా భయపడి తప్పుకోబోయి ప్రమాదవశాత్తు త్రితుడు బావిలో పడగా ఆ ఇరువురూ అతడిని లెక్క చేయక ఆవులను తోలుకొనిపోయారు. ఆ తాపసబాలుడు నీరు లేని ఆ బావినుండి సోమపానం చేస్తేగాని ఈ పాపం పోదని తలచి యజ్ఞం చేయటానికి ప్రతినిధులను సంకల్పరూపంగా సంపాదించుకొని యజ్ఞం చేయగా దేవతలు ప్రత్యక్షమై హవిర్భాగాలు తీసికొన్నారు. సరస్వతీ జలం ఆ బావినుండి పుట్టి ఆ యజ్ఞపతిని కాపాడింది. ఆ దేవతలు వరమును దేనినైనా కోరుకొమ్మనగా, ఆ బ్రాహ్మణోత్తముడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'వినుఁ డుపస్పర్శ మిందుఁ జేసిన యతండు । వడయువాఁడు మహిత సోమపానఫలము
వరము నా కిది' యనుటయు వార లట్టు । లవుట సంప్రీతి మై నిచ్చి దివికిఁ జనిరి. 156

ప్రతిపదార్థం: వినుఁడు= (మీరంతా) వినండి; ఇందున్= ఈ తీర్థంలో; ఉప స్పర్శ చేసిన+అతండు= స్నానం (ఆచమనం) చేసినవాడు; మహిత= మహత్త్వంకల; సోమపానఫలము= సోమరసాన్ని త్రాగిన ఫలితాన్ని; పడయువాఁడు= పొందగలడు; ఇది నాకున్ వరము= ఇదియే నాకు (ఈయదగిన) వరం; అనుటయున్= అనగా; వారలు+అట్టులు+అవుట= వా రావిధంగా కావటాన్ని (వరమును); సంప్రీతిమైన్+ఇచ్చి= సంతోషంతో ఇచ్చి; దివికిన్+చనిరి= స్వర్గానికి వెళ్ళారు.

తాత్పర్యం: ఈ తీర్థంలో స్నానం చేసినవాడు సోమరసాన్ని త్రాగిన ఫలితం పొందినవాడు కావాలి. ఇది నేను కోరే వరం.' అనగా, వారు అట్లే అగుగాక!' అని వర మిచ్చి సంతోషంతో దేవలోకానికి వెళ్ళారు.

వ. అట్టి యయ్యుదపానంబును సేవించి వినశనంబునకుఁ జనియెఁ; దత్తీర్థంబు హీనజాతులకుఁ బొడసూపక నశించుఁ గావున వినశనం బనం బరఁగె; మఱియు భూమికంబునకుఁ బోయె; నది యప్సరోగీతనృత్య విహారభూమి యగుట భూమికం బనఁ బ్రసిద్ధం బయ్యెఁ; బదంపడి గంధర్వతీర్థంబునకు నేఁగె; నది విశ్వావసుప్రభృతిగంధర్వతపస్సిద్ధిస్థానం; బందుండి గర్గస్రోతంబునకుఁ జనియె; నందు గర్గుండు సన్మునిసేవితుండై చిరకాలంబు వసించె; నచ్చోటు గదలి యా బలభద్రుండు. 157

ప్రతిపదార్థం: అట్టి= అంతమహిమ కల; ఆ+ఉదపానంబును సేవించి= ఆ నీటిని త్రాగుటచేత సేవించి(నవాడై); వినశనంబునకున్+చనియెన్= వినశనమనే తీర్థమున్న చోటికి వెళ్ళాడు; తద్+తీర్థంబు= ఆ తీర్థం; హీనజాతులకున్+పొడసూపక= నీచజాతులకు కానరాక; నశించున్+కావునన్= నశించిపోతుంది కనుక; వినశనంబు+అనన్+పరఁగెన్= వినశనము అనే పేరుతో ఒప్పింది; మఱియున్= ఇంకనూ; భూమికంబునకున్+పోయెన్= భూమికతీర్థానికి వెళ్ళాడు; అది= ఆచోటు; అప్సరో గీతనృత్య విహారభూమి= దేవతావేశ్యలు సంగీత నాట్యాలతో తిరిగేచోటు; అగుటన్= అగుటవలన; భూమికంబు+అనన్= భూమికమనే పేరుతో; ప్రసిద్ధంబు+అయ్యెన్= ప్రఖ్యాతి నందింది; పదంపడి= ఆ మీదట; గంధర్వ తీర్థంబునకున్+ఏఁగెన్= గంధర్వమనే తీర్థానికి వెళ్ళాడు; అది= ఆ చోటు; విశ్వావసుప్రభృతి= విశ్వావసుడు మొదలైన; గంధర్వ తపస్సిద్ధి కలిగినచోటు; అందుండి గర్గస్రోతంబునకున్+చనియెన్= గర్గస్రోతమనే పేరున్న చోటికి వెళ్ళాడు; అందున్= ఆ చోటు; గర్గుండు= గర్గమహాముని; సత్+మునిసేవితుండు+ఐ= మంచిమునులచేత సేవించబడుతూ; చిరకాలంబు= చాలకాలం; వసించెన్= కాపురమున్నాడు; ఆ+చోటున్+కదలి= ఆచోటు దాటి; ఆ బలభద్రుండు= ఆ బలరాముడు.

తాత్పర్యం: అటువంటి తీర్థాన్ని సేవించి, వినశనానికి వెళ్ళాడు. ఆ తీర్థం తక్కువ జాతివారికి కానరాకుండా నశిస్తుంది గనుక వినశనమని పిలువబడింది. ఇంకను భూమికమనే తీర్థానికి కూడ వెళ్ళాడు. అది అప్సరసలు సంగీత గీతనృత్యాలతో విహారం చేసే చోటు. ఆ తరువాత గంధర్వ తీర్థానికి వెళ్ళాడు. ఆ చోటు విశ్వావసుడు మొదలైన గంధర్వులు తపస్సిద్ధి పొందినట్టిది. అక్కడనుండి గర్గస్రోతమునకు వెళ్ళాడు. అది గర్గుడు సన్మునులచేత సేవించబడి చాలకాలం నివాసం చేసిన చోటు. అటనుండి బలరాముడు కదలి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. వినుము శంఖతీర్థమునకు నైసర్గిక । మునకు నాగధన్వమునకు వరుసఁ
జనియె; నాగధన్వ మనునది వాసుకి । స్థాన మచటఁ దొల్లి సకల సురులు. 158

ప్రతిపదార్థం: వినుము; శంఖతీర్థమునకున్; నైసర్గికమునకున్= నైసర్గికము అనే తీర్థానికీ; నాగధన్వమునకున్ వరుసన్+చనియెన్= నాగధన్వమనే చోటునకూ వరుసగా వెళ్ళాడు; నాగధన్వము+అనునది= నాగధన్వమనే పేరున్నది; వాసుకిస్థానము= (నాగేంద్రుడగు) వాసుకి ఉన్నచోటు; అచటన్; తొల్లి= అంతకు పూర్వం; సకలసురులు= దేవతలందరును.

తాత్పర్యం: శంఖతీర్థమునకూ, నైసర్గికానికీ, నాగధన్వానికీ వరుసగా వెళ్ళాడు. ఆ నాగధన్వం వాసుకికి నివాసస్థానం కావడంచేత, ఇంతకు మునుపు దేవతలందరూ అక్కడ. (తరువాతి వచనంతో అన్వయం).

వ. నాగేంద్రత్వమునకు వాసుకి నభిషేకించి; రందుండి యా నీలాంబరుండు నైమిశంబున కరిగె; నయ్యెడం దొల్లి సరస్వతి యనునేఱు దూరం బై యుండ నైమిశారణ్యవాసు లగుమునులు క్రతువు సేయం దొడంగిన; నాసరస్వతి వారల సంభావించుటకు మలంగి పాఱినకతంబునం దటసమీపం బయ్యెఁ; నవ్విశేషంబు విని

విస్మితుం డగుచు నాహలాయుధం డా తీర్థంబుఁ గొనియాడి, సప్తసారస్వతంబునకుం బోయె నచ్చట మంకణుండును మహాముని వసించుఁ దొల్లి నలినభవుసత్రంబున నైమిశారణ్యమునుల యాగంబున గయుని క్రతువున నుద్దాలకునధ్వరంబున వసిష్ఠుసప్తతంతువున గురునిసవనంబున వెండియు నొకమఱి యాపరమేష్ఠి యజ్ఞంబున హిమవత్పుష్కరాదు లైన తత్ప్రదేశంబులకు సుప్రభయుఁ గనకాక్షియు విశాలయు సురతన్వయు నోఘమాలయు సువేణియు విమలోదకయు ననునామంబుల నారీవేషయుక్తయై సరస్వతి చని యజమానసకల దేవముని సంభావన వడసె నట్టి సప్తాకారంబుల నాసంయమియాశ్రమంబునఁ బ్రవర్తించుట నది సప్తసారస్వతం బనం బరఁగె; నమ్మంకణుని చరితంబులు మఱియునుం గల వాశ్చర్యకరంబులు వినుము. 159

ప్రతిపదార్థం: నాగ+ఇంద్రత్వమునకున్= పాములకు రాజుగా; వాసుకిన్+అభిషేకించిరి= వాసుకిని అభిషేకం చేశారు; అందుండి= అక్కడనుండి; ఆ నీలాంబరుండు= నీలంరంగు గల వస్త్రాన్ని ధరించినవాడైన బలరాముడు; నైమిశంబునకున్+అరిగెన్= నైమిశ మనే పేరున్న వనానికి వెళ్ళాడు; ఆ+ఎడన్+తొల్లి సరస్వతి అను+ఏఱు= ఆ చోట పూర్వం సరస్వతిఅనే పేరున్న ఏరు; దూరంబు+ఐ+ఉండన్= చాలదూరంగా ఉండగా; నైమిశారణ్యావాసులు+అగు మునులు= నైమిశారణ్యంలో కాపురముండే తాపసులు; క్రతువు చేయన్+తొడంగినన్= యజ్ఞం చేయటాన్ని మొదలుపెట్టగా; ఆ సరస్వతి వారల సంభావించుటకున్= ఆ సరస్వతీనది వారి నాదరించటానికి; మలంగి= తిరిగి; పాఱిన+కతంబునన్= ప్రవహించిన కారణంగా; తటసమీపంబు+అయ్యెన్= తీరానికి దగ్గరైనది; ఆ+విశేషంబు విని= ఆ గొప్పను విన్నవాడై; విస్మితుండు+అగుచున్= ఆశ్చర్యంపొందుతూ; ఆ హలాయుధుండు= నాగలి ఆయుధంగా కల ఆ బలరాముడు; ఆ తీర్థంబున్+కొనియాడి= ఆ తీర్థాన్ని కీర్తించి; సప్తసరాస్వతంబునకున్+పోయెన్= సప్తసారస్వతమనే తీర్థానికి పోయాడు; అచ్చటన్= ఆ చోట; మంకణుండు+అను మహాముని వసించున్= మంకణముని ఉన్నాడు; తొల్లి= పూర్వం; నవినభవుసత్రంబునన్= బ్రహ్మయజ్ఞంలో; నైమిశారణ్యమునుల యాగంబునన్= నైమిశారణ్యంలో ఉన్న మునులు చేసే యాగంలో; గయుని క్రతువునన్= గయుడు చేసిన యజ్ఞంలో; ఉద్దాలకుని అధ్వరంబునన్= ఉద్దాలకుడి యాగంలో; వసిష్ఠుసప్తతంతువునన్= వసిష్ఠుడి యాగంలో; గయుని క్రతువునన్= గయుడు చేసిన యజ్ఞంలో; ఉద్దాలకుని అధ్వరంబునన్= ఉద్దాలకుడి యాగంలో; వసిష్ఠుసప్తతంతువునన్= వసిష్ఠుడి యాగంలో; గురుని సవనంబునన్= గురుడి యాగంలో; వెండియున్+ఒకమఱి= ఇంకొకమారు; ఆ+పరమేష్ఠి యజ్ఞంబునన్= బ్రహ్మకావించే ఆ యజ్ఞంలో; హిమవత్+పుష్కరాదులు+ఐన= హిమవంతము, పుష్కరం మొదలైన; తద్+ప్రదేశంబులకున్= ఆ చోటులకు; సుప్రభయు; కనకాక్షియు; విశాలయు; సురతన్వయు; ఓఘమాలయు; సువేణియు; విమలోదకయు; అను నామంబులన్= అనే పేర్లతో; నారీవేషయుక్త+ఐ= స్త్రీకి ఆమోదయోగ్యమయ్యే వేషంతో; సరస్వతి చని= సరస్వతి(నది) వెళ్ళి; యజమాన= యజ్ఞకర్తయొక్కయు, సకల దేవముని, సంభావన పడసెన్= అందరు దేవతలయొక్క, మునులయొక్క, మర్యాదలను పొందింది; అట్టిసప్త+ఆకారంబులన్= ఆ విధంగా ఏడు రూపాలతో; ఆ సంయమి ఆశ్రయంబునన్+ప్రర్తించుటన్= ఆ తాపసి ఆశ్రమంలో తిరగటంవలన; అది= ఆ నది; సప్తసారస్వతంబు+అనన్+పరఁగెన్= సప్త సారస్వతముగా ఒప్పిఉన్నది; ఆ+మంకణుని చరితంబులు మఱియునున్ కలవు= ఆ మంకణముని గాథలు ఇంకా ఉన్నవి; ఆశ్చర్యకరంబులు= అబ్బురమును కలిగించేవి; వినుము.

తాత్పర్యం: పాములకు రాజైనట్లు వాసుకిని అభిషేకించారు. అక్కడినుండి ఆ నీలాంబరుడు (బలరాముడు) నైమిశానికి వెళ్ళాడు. మునుపు సరస్వతి అనే నది దూరంగా ఉండగా నైమిశారణ్యంలో ఉండే తాపసులు యజ్ఞం చేయటం మొదలు పెట్టగానే ఆ సరస్వతి వారిని గౌరవించటానికై తిరిగి పారిన కారణాన అది తటసమీపమైనది.

ఆ ప్రత్యేకతను విని ఆశ్చర్యపడి, బలరాముడు ఆ తీర్థాన్ని పొగడి సప్తసారస్వతానికి వెళ్ళాడు. ఆ చోట మంకణు డనే గొప్ప తపస్వి పూర్వముండేవాడు. పూర్వం బ్రహ్మచేసిన యాగంలో, నైమిశంలోని మునులయాగంలో, గయుడి యజ్ఞంలో, ఉద్దాలకుడి యజ్ఞంలో, వసిష్ఠుడి సప్తతంతువులో, గురుడి యాగంలో, ఇంకా ఒకమారు బ్రహ్మయజ్ఞంలో, హిమవంతం, పుష్కరం మొదలైన చోటులలోను, సుప్రభ, కనకాక్షి, విశాల, సురతన్వ, ఓఘమాల, సువేణి, విమలోదక- అనే పేర్లతో స్త్రీవేషంలో సరస్వతి వెళ్ళి, యజ్ఞకర్తలవలననూ, సమస్తదేవతలవలననూ, మునులవలననూ గౌరవం పొందింది. ఆ విధంగా ఏడు రూపాలతో ఆ తపస్వి ఆశ్రమంలో తిరగటంచేత సప్తసారస్వతమని ఒప్పింది. ఆ మంకణుని గాథలు ఆశ్చర్యాన్ని కల్గించేవి ఇంకనూ ఉన్నవి. వినుము.

మంకణమహాముని మాహాత్మ్యాభివర్ణనము (సం. 9-37-1)

సీ. అతఁడు సరస్వతి నవగాహనము సేయు। చుండి యా చేరువ నోర్తు తడుపు
గట్టక నీళ్ళాడఁగాఁ జూడఁ దనదు శు। క్లము నిర్గమించిన ఘటసురక్షి
తము సేయ సప్తభేదము లొంది యది సత్పు। రుషు లైరి వారు మరుద్గణంబు
నకు సంజననకారణం బైరి; విను మొక్క। నాఁ డ త్తపస్వి వ్రేల్నాటి దర్భ

ఆ. గంటిఁ గూరయసరు గాఱిన నర్తించె। నతఁడు తపముసిద్ధి కాత్మఁ బొంగి
జగము లెల్లఁ దాన సంక్షోభ మొందె; ని। ర్జరులు భీతిఁ జనిరి శంభుఁ గాన. 160

ప్రతిపదార్థం: అతఁడు= ఆ మంకణుడు; సరస్వతిన్+అవగాహనమున్+చేయుచుండి= సరస్వతీ నదిలో స్నానంచేస్తూ ఉండగా; ఆ చేరువన్= ఆ సమీపంలో; ఓర్తు= ఒకర్తె; తడుపు+కట్టక= వస్త్రం కట్టుకొనకుండా; నీళ్ళాడఁగాన్= స్నానమాడగా; చూడన్= చూడగా(చూడటంవలన); తనదు శుక్లము= తనవీర్యం; నిర్గమించినన్= వెలువడగా; ఘటసురక్షితము+చేయన్= కుండలో భద్రంచేయగా; సప్తభేదములు+ఒంది= ఏడు భాగాలుగా అయి; సత్పురుషులు+ఐరి= పుణ్యవంతులైనారు; వారు= ఆ ఏడ్గురును; మరుద్గణంబులకున్= దేవతలకు; సంజననకారణంబు+ఐరి= పుట్టుకకు కారణమైనారు; వినుము= ఇంకను వినుము; ఒక్కనాఁడు= ఒకానొక దినాన; ఆ తపస్వి= ఆ మునియొక్క; వ్రేల్+నాటి= వ్రేలియందు గ్రుచ్చుకొని; దర్భగంటిన్= దర్భచేత ఏర్పడిన ఆ గాయంనుండి; కూర+అసరు= శాకరసం; కాఱినన్= స్రవించగా; అతఁడు= ఆ ముని; తపము సిద్ధికి= తపస్సిద్ధికి; ఆత్మన్+పొంగి= మనసులో సంతసించి; నర్తించెన్= నాట్యమాడాడు; జగములు+ఎల్లన్= అన్ని లోకాలు; దానన్+సంక్షోభము+ ఒందెన్= దానివలన అల్లకల్లోలమయ్యాయి; నిర్జరులు= దేవతలు; భీతిన్= భయంతో; శంభున్+కానన్+చనిరి= పరమేశ్వరుడిని చూడటానికి పోయారు.

తాత్పర్యం: ఆ మంకణుడు సరస్వతీనదిలో స్నానం చేస్తుండగా సమీపంలో ఒకతె గుడ్డ కట్టుకొనకుండా స్నానం చేయటం చూడగా తననుండి వీర్యం వెలువడింది. దానిని కుండలో భద్రం చేయగా అది ఏడు భాగాలై సత్పురుషు లయ్యారు. దేవతలపుట్టుకకు వారే కారణ మయ్యారు. అందువలన ప్రపంచ మంతా అల్లకల్లోలమైనది. దేవతలు భయంతో శివుడిని చూడటానికి వెళ్ళారు.

వ. కని యంతయు నెఱింగించిన నద్దేవోత్తముం డాభూదేవోత్తముపాలి కరిగి 'యిది యెంతటి విశేషంబు? దపంబు లిట్టివే? నర్తించుట మాను' మని పలికి తన యంగుటంబు వ్రేలం గీఱిన నందు భస్మంబు గాఱిన నాసంయమి సిగ్గువడి దండప్రణామంబు సేసి. 161

ప్రతిపదార్థం: కని= చూచి; అంతయున్= మొత్తం; ఎఱింగించినన్= మొత్తం తెలుపగా; ఆ+దేవ+ఉత్తముండు= ఆ దేవతలలో ఉత్తముడు(శ్రేష్ఠుడు); ఆ భూదేవ+ఉత్తము పాలికిన్+అరిగి= ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుని వద్దకు వెళ్ళి; ఇది ఎంతటి విశేషంబు!= ఇది ఏమంత గొప్ప విషయం!; తపంబులు+ఇట్టివే?= తపస్సులంటే ఇవేనా?; నర్తించుట మానుము+అని పలికి= నాట్యం చేయటం నిలుపు మని చెప్పి; తన అంగుటంబున్ వ్రేలన్+గీఱినన్= తన బొటనవ్రేలిని వ్రేలితో గీరగా; అందున్ భస్మంబు+ కాఱినన్= దానినుండి బూడిద కారగా; ఆ సంయమి సిగ్గుపడి= ఆ తాపసి సిగ్గుపడి; దండప్రణామంబు+చేసి= దండమువలె నేలపైబడి నమస్కారం చేసి.

తాత్పర్యం: (శంభుడిని) చూచి అంతా తెలుపగా ఆ దేవోత్తముడు ఆ బ్రాహ్మణోత్తముడి వద్దకు వెళ్ళి, 'ఇది ఏమంత శ్రేష్ఠమైనది! తపస్సు లిటువంటివా? నాట్యం చేయటం నిలిపివేయుము -' అని చెప్పి తన బొటనవ్రేలిని వ్రేలితో గీరగా - అందుండి భస్మం కారింది. దానికి ఆ తపస్వి సిగ్గుపడి సాష్టాంగ నమస్కారం చేశాడు.

ఆ. 'దైవ మెల్లఁ దలఁప నీవ సమస్తజ । గంబులకును, నేడుగడయు నీవ;
కర్మఫలదుఁడవును గర్మప్రదుండవు । నీవ కరుణ నన్నుఁ గావు మభవ!' 162

ప్రతిపదార్థం: అభవ!= పుట్టుక లేనివాడా! ఈశ్వరా!; ఎల్లన్ తలఁపన్= అంతా తలచగా; దైవము; సమస్త జగంబులకును నీవు+అ= అన్ని లోకాలకును నీవే; ఏడుగడయున్+నీవు+అ= రక్షకుడవు కూడా నీవే; కర్మఫలదుఁడవును+కర్మప్రదుండవును= చేసే పనులకు ఫలితమును, చేయవలసిన పనిని చేయించువాడవును; ఈవ= నీవే; నన్నున్+కరుణన్= నన్ను దయతో; కావుము= కాపాడుము.

తాత్పర్యం: 'అంతా తలపోయగా నీవే దైవం. ఆధారం కూడా నీవే. పనులను చేయించే వాడవు, చేసినదానికి ఫలితాన్ని ఇచ్చేవాడవూ నీవే. దయతో నన్ను కాపాడుము.'

వ. అని వెండియు ననేక ప్రకారంబులం బ్రశంసించినం బ్రసన్నుండై పశుపతి యతనికిఁ దపఃప్రభావం బక్షీణంబుగా వరం బిచ్చి చనియె; నమ్మహాముని నృత్యంబు మానిన జగంబుల సంక్షోభంబు శాంతం బయ్యెఁ; నట్టి యమ్మహాత్మునినివాసం బైన సప్తసారస్వతంబున నుండి యాసీరి యౌశనంబునకుం బోయె; వినుము! తొల్లి రఘురామునిచేతఁ జచ్చిన మహోదరుం డను నసుర తలపునుక యొక్క తపస్వికాలఁ దగిలి పుచ్చ రాకున్న నతండు వేదనం బొందుచుండం గని యార్యులు 'నౌశనం బనుతీర్థంబు శక్రుండు దపంబుసేసినచో టందుఁ బొమ్ము; నీదురితంబు వాయు' ననిన మహోదరనామధేయుండగు నాసంయమి యచ్చటికిం జనినఁ గపాలంబు ముక్తం బయ్యెఁ; దానంజేసి యది కపాలమోచనం బనం బరఁగు; నచ్చోటు గదలి పృథూదకంబున కరిగెఁ; దదీయ విశేషంబు వినుము! గాధి యను మహారాజు కొడుకు విశ్వామిత్రుం డనునతండు. 163

ప్రతిపదార్థం: అని= అంటూ; వెండియున్= ఇంకను; అనేక ప్రకారంబులన్= నానావిధాలుగా; ప్రశంసించినన్= కీర్తించగా; ప్రసన్నుండు+ఐ= అనుగ్రహపరుడై; పశుపతి= పరమశివుడు; అతనికిన్= ఆ మునికి; తపః ప్రభావంబు= తపశ్శక్తి; అక్షీణంబు+కాన్= నాశనం కాకుండా; వరంబు+ఇచ్చి చనియెన్= వరమొసగి వెళ్ళాడు; ఆ+మహాముని= ఆ గొప్ప తపసి; నృత్యంబు= నాట్యమును; మానినన్= మానివేయగా; జగంబుల సంక్షోభంబు= లోకాలలో అలజడి; శాంతంబు అయ్యెన్= శాంతించింది; అట్టి ఆ+మహాత్ముని నివాసం బైన; సప్త సారస్వతంబున నుండి= సప్తసారస్వతమునుండి; ఆ సీరి= ఆ బలరాముడు; ఔశనంబునకున్+ పోయెన్= ఔశనమనే తీర్థమునకు వెళ్ళాడు; వినుము; తొల్లి= ఇదివరలో; రఘురామునిచేతన్= రఘురాముడిచేత; చచ్చిన=

చనిపోయిన; మహోదరుండు+అను అసుర= మహోదరుడనే రాకాసి; తలపునుక= తలపుర్రె; ఒక్కతపస్వి కాలన్+తగిలి= ఒక తాపసి కాలికి తగిలి; పుచ్చ రాకున్నన్= తీసివేయగాకుండగా; అతండు వేదనన్+పొందుచుండన్+కని= ఆతడు బాధపడుతూ ఉండగా చూచి; ఆర్యులు= పూజ్యులు; సరస్వతిని= సరస్వతీ తీర్థమున; ఔశనం బను తీర్థంబు= ఔశన తీర్థం; శక్రుండు= ఇంద్రుఁడు; తపంబు సేసిన చోటు; అందున్+పొమ్ము= ఆ చోటునకు పోవలసినది; నీ దురితంబు+పాయున్+అనినన్= నీ పాపాలు పోతాయనగా; అచ్చటికిన్+చనినన్= ఆ చోటునకు పోగా; కపాలంబు ముక్తంబు+అయ్యెన్= కపాలం వదలివేసింది; దానన్+చేసి= అందువలన; అది కపాలమోచనంబు+అనన్+పరఁగున్= దానికి కపాలమోచనమని పేరు వచ్చింది; ఆ+చోటు వదలి= ఆ స్థానాన్ని వదలి; పృథూదకంబునకున్+చనియెన్= పృథూదక తీర్థానికి వెళ్ళాడు; తదీయ విశేషంబు వినుము= దానికి సంబంధించిన విశేషం వినుము; గాధిఅను మహారాజు కొడుకు= గాధిరాజు కుమారుడు; విశ్వామిత్రుండు+అను+అతండు= విశ్వామిత్రు డనేవాడు.

తాత్పర్యం: అని ఇంకను అనేక విధాలుగా కీర్తించగా ప్రత్యక్షమై పరమశివుడు అతడికి తపశ్శక్తి నశించకుండా వరమిచ్చి వెళ్ళాడు. ఆ తాపసి నాట్యాన్ని మానివేయగా ప్రపంచంలోని అలజడి శాంతించింది. అటువంటి ఆ మహనీయుడికి ఉనికిపట్టయిన ఏడు సరస్వతీ తీర్థాలనుండి ఆ బలరాముడు ఔశనమునకు పోయాడు. ఆ విషయాన్ని వినుము. పూర్వం రఘురాముడిచేత చనిపోయిన మహోదరుడనే రాక్షసుడి తల పుర్రె ఒక తపస్వి కాలికి తగిలి దానిని తొలగించటానికి సాధ్యంకాక అతడు బాధపడుతుండగా చూచిన పెద్దలు 'ఔశనతీర్థంలో ఇంద్రుడు తపం చేసినచోటునకు పొమ్ము. నీ పాపములు తొలగిపోతాయి' అనగా ఆ ముని ఆ చోటునకు పోగా పుర్రెఎముక వదలింది. అందుచేత అది కపాల మోచన మని పిలువబడుతున్నది. బలరాముడు ఆచోటును వదలి పృథూదక తీర్థానికి వెళ్ళాడు. దాని గొప్పతనాన్ని వినుము. గాధి అనే మహారాజు కుమారుడు విశ్వామిత్రు డనేవాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. తండ్రి యట్ల సకలధాత్రీశుఁ డై యుండి । దనుజమథనమునకు దండు వెడలి
యరుగునెడ వసిష్ఠునాశ్రమంబున పొంత । విడియఁ బరిజనములు వినయ మెడలి. 164

ప్రతిపదార్థం: తండ్రి+అట్లు+అ= తండ్రి మాదిరి; సకలధాత్రీశుఁడు ఐ ఉండి= సమస్త భూమికిని రాజైఉండి; దనుజమథనమునకున్= దానవులను చంపటానికి; దండు వెడలి= సేనతో వెళ్ళి; అరుగు+ఎడన్= వెళ్ళేటప్పుడు; వసిష్ఠు+ ఆశ్రమంబున పొంతన్= వసిష్ఠుడి ఆశ్రమానికి దగ్గర; విడియన్= నిలువగా(విడిసిఉండగా); పరిజనములు= సేవకులు; వినయము+ఎడలి= పరివారం అడకువ లేక.

తాత్పర్యం: సమస్త భూలోకనాథు డైన తన తండ్రివలెనే దానవులను చంపటానికి సేనతో వెళ్ళేటపుడు వసిష్ఠుడి ఆశ్రమంప్రక్క విడిసిన సేనలు క్రమం తప్పి. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అందు దుర్నయంబు లాచరించిన నమ్ముని కోపించి నిజహోమధేనువు నాలోకించి 'నీ బలంబు పనుపు' మనిన నది దనమాహాత్మ్యంబున నచట నావహిల్లిన ఘోరాకారు లగు వీరులఁ బనుప వార లారాజు వరూథిని మడియించిన శేషించిన జనంబులు పలుగడలం పాఱి; రట్లు దురవస్థం బొందు నాసేనం జూచి యగ్గాధినందనుం డెల్ల శక్తులకంటెఁ దపశ్శక్తి యెక్కుడగుట యెఱింగి యాపృథూదకంబునఁ దపంబు

సేయుచుండ దానికి దేవపతి విఘ్నంబు సేయ, మఱియు నియమ నిష్ఠుండై బ్రహ్మచేత బ్రాహ్మణ్యంబును బడసె నత్తీర్థంబునుండి యాబలభద్రుండు బకాశ్రమంబున కరిగె; నయ్యెడఁ బకుండను మునీంద్రుండు తొల్లి. **165**

ప్రతిపదార్థం: అందు దుర్నయంబులు+ఆచరించినన్= ఆ ఆశ్రమం దగ్గర నీతిమాలిన పనులు చేయగా; ఆ+ముని= ఆ వసిష్ఠుడు; కోపించి; నిజ= తన; హోమధేనువును; ఆలోకించి= చూచి; నీ బలంబున్; నీ శక్తిని; పనుపుము+అనినన్= ఆజ్ఞాపించుము; అనగా; అది= ఆ ఆవు; తన మాహాత్మ్యంబునన్= తన శక్తితో; అచటన్+ఆవహిల్లిన= అక్కడ కానవచ్చిన; ఘోర+ఆకారులు+అగు= భయంకరు లయిన; వీరులన్+పనుపన్= వీరులను పంపగా; వారలు= ఆ వీరులు; ఆ రాజు వరూథినిన్= ఆ రాజుసేనను; మడియించినన్= చంపగా; శేషించిన జనంబులు= మిగిలిన వారు; పలుగడలన్+పాఱిరి= అనేక దిక్కులకు పరుగుతీశారు; అట్లు దురవస్థన్+చెందు ఆసేనన్+చూచి= ఆ విధంగా కష్టపడే ఆ సేనను చూచి; ఆ+గాధినందనుండు= ఆ గాధిరాజకుమారుడు; ఎల్లశక్తులకంటెన్= అన్ని బలాలకంటే; తపశ్శక్తి= తపోబలం; ఎక్కుడు+అగుటన్= గొప్పది కావటం; ఎఱింగి= తెలిసికొని; ఆ పృథూదకంబునన్+తపంబు చేయుచుండన్= ఆ పృథూదక తీర్థంలో తపస్సు చేస్తూ ఉండగా; దానికిన్= ఆ తపస్సునకు; దేవపతి= ఇంద్రుడు; విఘ్నంబు+చేయన్= అడ్డంకులు కల్గించగా; మఱియున్ నియమనిష్ఠుండు+ఐ= నియమంతో ఇంకా పట్టుదల కలవాడై; బ్రహ్మచేత బ్రాహ్మణ్యంబును పడసెన్= బ్రహ్మదేవుడి వలన బ్రాహ్మణ్యమును పొందాడు; ఆ+తీర్థంబున నుండి= ఆ తీర్థం వద్దనుండి; బలరాముండు; బక+ఆశ్రమంబునకున్+అరిగెన్= బకాశ్రమానికి వెళ్ళాడు; ఆ+ఎడన్= ఆ చోట; బకుండు+అను ముని+ఇంద్రుండు= బకు డనే తాపసి; తొల్లి= పూర్వం.

తాత్పర్యం: ఆ వసిష్ఠుడి ఆశ్రమంలో చెడ్డపనులను చేసిన ఆ తాపసి కోపించి తమ యజ్ఞధేనువును పిలిచి 'నీ శక్తిని చూపు' మన్నాడు. ఆ ఆవు భయంకరాకారులయిన వీరులను పంపగా వా రా రాజు సేనను చంపగా మిగిలినవారు పలుదిక్కులకు పరుగెత్తారు. ఆ విధంగా దురవస్థ నందిన తన సేనను జూచి ఆ గాధికుమారుడు అన్ని బలాలకంటె తపోబలమే గొప్పదని తెలిసికొని ఆ పృథూదక తీర్థంలో తపస్సు చేశాడు. ఆ తపస్సునకు దేవరాజయిన ఇంద్రుడు అడ్డంకులు కలిగించాడు. ఇంకను బ్రహ్మనుగూర్చి నియమంతో పట్టుదలగా ఆతడు తపస్సుచేసి బ్రహ్మత్వమును పొందాడు. అట్టి తీర్థంనుండి బలరాముడు బకుడి ఆశ్రమానికి వెళ్ళాడు. ఆ చోట బకుడనే తాపసి తొల్లిటి కాలంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **ధృతరాష్ట్రుం డను ధరణీ । పతి దన్ను నధఃకరించి పలికినఁ గోపా**
న్వితుఁడై హోమ మొనర్చెను । ఘృతనరమాంసముల నతనికిం గీ డొదవన్. **166**

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండు+అను ధరణీపతి= ధృతరాష్ట్రు డనే పేరు గల రాజు; తన్నున్+అధఃకరించి పలికినన్= తనను(బకుడిని) తిరస్కరించి మాటాడగా; కోప+అన్వితుడై= కోపం కలవాడై; ఘృత నరమాంసములన్= నేతితోను, మానవమాంసంతోను; అతనికిన్+కీడు+ఒదవన్= ఆ ధృతరాష్ట్రుడికి కీడు కలిగేటందుకు; హోమము+ఒనర్చెను= హోమం చేశాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రు డనే రాజు బకుడిని తిరస్కరించాడు. దానికి కోపంతో అతనికి హాని కలగటానికి ఆ ముని నేతితోను, నరమాంసంతోను హోమంచేశాడు.

ఆ. **నఱుకఁ బడిన యడవి తెఱఁగున నతని రా । ష్ట్రంబు సకల జంతు సముదయములు**
మడియ విన్ననయ్యు నడలి యా భూపతి । యత్తపస్విపాలి కరుగుదెంచి. **167**

ప్రతిపదార్థం: నఱుకఁబడిన= నరికివేయబడ్డ; అడవి; తెఱఁగునన్= మాదిరిగా; అతని; రాష్ట్రంబు= దేశంలోని; సకల జంతు సముదయములు= ప్రాణికోటి అంతయు; మడియన్= నశించగా; విన్నన+అయ్యున్= చిన్నబోయి వైవర్ణ్యం చెంది; అడలి= భయపడి; ఆ+తపస్వి= ఆ ముని; పాలికిన్= వద్దకు; ఆ భూపతి= ఆ ధృతరాష్ట్రరాజు; అరుగుదెంచి= వచ్చి.

తాత్పర్యం: నరికివేసిన అడవివలె ప్రాణికోటి అంతా నశించగా అతని దేశం చిన్నపోగా ఆ రాజు భయపడి ఆ తాపసివద్దకు వచ్చి (తరువాతి వచనంతో అన్వయం).

వ. దండప్రణామం బాచరించి పెక్కుభంగులఁ దేలించి మున్ను ధేను నిమిత్తం బగుదుర్భాషణంబుల నింత పుట్టుటం జేసి యాసంయమికి ననేక ధేనువుల నొసంగి దురితోపశాంతి యొనర్చె; నట్టి బకాశ్రమంబున నుండి రేవతీరమణుండు యయాతంబునకుం బోయె నందు యయాతి యజ్ఞంబున భోజనసమయంబున ఘృతదుగ్ధాదులయందు విప్రుం డెయ్యది గోరిన నది యెల్ల సరస్వతి సంపూర్ణ మనోరథంబు గా నొసంగుచు వచ్చె; నయ్యెడఁ గదలి వసిష్ఠావగాహంబునకు వచ్చెఁ; దత్ప్రదేశంబు దొల్లి విశ్వామిత్రునాశ్రమం; బతండు వసిష్ఠునెడఁ దపోవిషయమత్సరంబునఁ గుపితుండై. 168

ప్రతిపదార్థం: దండప్రణామంబు+ఆచరించి= దండం వలె సాష్టాంగంగా నమస్కారం చేసి; పెక్కుభంగుల తేలించి= అనేక విధాలుగా సంతోషపరిచి; మున్ను= అదివరకు; ధేనునిమిత్తంబు+అగు= ఆవు కారణంగా కల్గిన; దుర్భాషణంబులన్= చెడ్డమాటలవలన; ఇంత+పుట్టుటన్+చేసి= ఇంత(కష్టం) కలగటంచేత; ఆ సంయమికిన్= ఆ తాపసికి; అనేక ధేనువులన్+ఒసంగి= ఎన్నో ఆవుల నిచ్చి; దురిత+ఉపశాంతి+ఒనర్చెన్= పాపమునకు శాంతి కల్గించినాడు; అట్టి బక+ఆశ్రమంబుననుండి= అటువంటి శక్తికల బకుడి తపోవనమునుండి; రేవతీరమణుండు= రేవతి ప్రియుడయిన బలరాముడు; యయాతంబునకున్+పోయెన్= యయాతమనే చోటికి వెళ్ళాడు; అందున్= ఆ చోట; యయాతియజ్ఞంబునన్= యయాతి చేస్తున్న యాగంలో; భోజన సమయంబునన్= అన్నం తినేటప్పుడు; ఘృతదుగ్ధాదులయందున్= నేతిలోను, పాలలోను (ఈ మొదలయినవానిలో); ఏ+అది కోరినన్= దేని నాశిస్తే; అది ఎల్లన్= వాటినంతను; సరస్వతి సంపూర్ణమనోరథంబుగాన్+ఒసంగుచున్= సరస్వతీ తీర్థం నిండుగా కోరికలు తీరేటట్లు ఇస్తూ; వచ్చెన్= వచ్చినది; ఆ+ఎడన్+కదలి= ఆ చోటునుండి బయలుదేరి; వసిష్ఠ+అవగాహంబునకున్ వచ్చెన్= వసిష్ఠతీర్థానికి వచ్చాడు; తద్+ప్రదేశంబు= ఆ చోటు; తొల్లి విశ్వామిత్రుఆశ్రమంబు= వెనుక విశ్వామిత్ర మహర్షి తపోవనం; అతండు= ఆ విశ్వామిత్రుడు; వసిష్ఠున్+ఎడన్= వసిష్ఠుడి మీద; తపోవిషయమత్సరంబునన్+కుపితుండు+ఐ= తపస్సునకు సంబంధించిన అసూయతో కోపం కలవాడై.

తాత్పర్యం: (ధృతరాష్ట్రరాజు బకుడికి నమస్కారం చేశాడు). సాష్టాంగ నమస్కారం చేసి అనేక విధాలుగా సంతృప్తి పరచి, గతంలో ఆవు కారణంగా (కష్టాలను తలచుకొని) దుర్భాషణముల వలన కలిగిన దానిని తలచుకొని ఆ తాపసికి ఎన్నో ఆవుల నిచ్చి పాపమును పోగొట్టుకొన్నాడు. అటువంటి బకాశ్రమం నుండి యయాతమనే చోటుకు బలరాముడు వెళ్ళాడు. అక్కడ యయాతి చేసే యజ్ఞంలో భోజన వేళలో నేతులు, పాలు బ్రాహ్మణుడు ఏది కోరిన దానినంతా సరస్వతి నిండయిన మనస్తృప్తితో ఇస్తూ వచ్చింది. ఆ చోటు వదలి వసిష్ఠ తీర్థానికి వెళ్ళాడు. మును పది విశ్వామిత్రుడి ఆశ్రమం. ఆ విశ్వామిత్రుడు తపోవిషయంగా వసిష్ఠుని యెడ అసూయతో కోపించినవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. అతని వధించుటకై సరస్వతి మదిఁ । దలఁచిన నానది తత్క్షణంబ
సౌమ్యవేషంబునఁ జనుదెంచి నిభృత యై । పని యేమి? యనిన నమ్ముని వసిష్ఠుఁ

గొనిరమ్ము నాకడ కని పంచెఁ; బంచిన । వార లిద్దఱ తపోవైభవంబు
నకు భయమందుచు నరనాథ యరిగి వ । సిష్ఠున కప్పని సెప్పెఁ దెలియ

తే. నాతఁ డవ్వాహినికి నిట్టు లనియె 'నన్ను । నీవు గొనిపోక తక్కిన నీకు శాప
మిచ్చు నగ్గాధిసుతుఁడు దదిచ్ఛ సలుపు । మించు కేనియుఁ గొంకక యెప్పుడైన. 169

ప్రతిపదార్థం: అతనిన్ వధించుటకై= ఆ వసిష్ఠుడిని చంపటానికి; మదిన్+తలంచినన్= (విశ్వామిత్రుడు) మనసులో తలచుకొనగా; ఆ నది= ఆ సరస్వతి; తత్క్షణంబ= వెంటనే; సౌమ్యవేషంబునన్+చనుదెంచి= శాంతమగు వేషంతో వచ్చి; నిభృత+ఐ= అడకువ కలదిగా; పని+ఏమి+అనినన్= తాను చేయవలసిన కార్యమేమి అని అడుగగా; ఆ+ముని= ఆ విశ్వామిత్రముని; వసిష్ఠున్+కొని నాకడకున్ రమ్ము= వసిష్ఠుడిని నా వద్దకు తీసికొనిరమ్ము; అని పంచెన్= అన్న ఆజ్ఞతో పంపాడు; పంచినన్= (అట్లు) పంపగా; వారల+ఇద్దఱ తపోవైభవంబునకున్+భయమందుచు= ఆ ఇద్దరి (వసిష్ఠ విశ్వామిత్రుల) తపశ్శక్తికి భయపడుతూ; నరనాథ!= ఓ రజా!; అరిగి= వెళ్ళి; వసిష్ఠునకున్+ఆ+పని తెలియన్ చెప్పెన్= వసిష్ఠునకా కార్యమును చెప్పింది; ఆతఁడు+ఆ+వాహినికిన్+ ఇట్టులు+అనియెన్= ఆ వసిష్ఠు డానదితో ఈ విధంగా అన్నాడు; నన్నున్; నీవు; కొనిపోక తక్కినన్= పిలిచికొని పోకపోతే; నీకున్; ఆ+గాధిసుతుండు= ఆ గాధికొడుకు; శాపము+ఇచ్చున్= శాపమిస్తాడు; ఇంచుక+ఏనియున్+కొంకక= కొంచెంకూడా సందేహించకుండా; ఎప్పుడైనన్= ఏ సమయంలో నైనా; తదిచ్ఛ సలుపుము= ఆ గాధేయుడి కోర్కెను నెరవేర్చుము.

తాత్పర్యం: వసిష్ఠుడిని చంపటానికై విశ్వామిత్రుడు తన మనసులో తలచుకొన్నాడు. ఆ సరస్వతీనదిని తలచుకొనగా వెంటనే శాంతమూర్తిగా వినయంతో వచ్చి (ఆ విశ్వామిత్రుడిని) తాను చేయనగు పని ఏమో అడిగింది. దాని కాతడు వెంటనే వసిష్ఠుడిని తన వద్దకు పిలిచికొని రమ్మన్నాడు. ఆ ఉత్తరువు విని ఆ నది ఇర్వురి తపశ్శక్తికి భయపడింది. ఓ రాజా! ఆ నది వెళ్ళి వసిష్ఠున కా విషయం చెప్పింది. వసిష్ఠు డా నదీమతల్లితో ఇట్లా అన్నాడు: 'నన్ను నీవు పిలుచుకొనిపోకపోతే నీ కా విశ్వామిత్రుడు శాపమిస్తాడు. వాని కోరిక ప్రకారం ఏ మాత్రం సందేహించకుండా ఆ పనిని చేయుము.'

వ. అని యనుజ్ఞ యిచ్చిన సరస్వతి యత్తపస్వి తనచేరువ నొకప్పుడు జపయుక్తుండై యుండం గూలాపహరణంబు సేసి వఱుత నమ్మహాత్ముం గొనిపోయిన, నతం డాంగిరసమంత్రముల నత్తరంగిణిం బ్రణుతించె; నదియు సంప్రీత యగుచు నమ్మునిని విశ్వామిత్రునకు సన్నిహితుం జేసిన, నతని నగ్గాధిసూనుండు వధియింప సాధనం బన్వేషించు నాలోన వంచించి యా ప్రవాహం బవ్వసిష్ఠుఁ దొలంగించినఁ గోపించి విశ్వామిత్రుండు 'శోణిత వాహిని వగు' మని శపించిన నొక్కసంవత్సరం బత్తటిని దైత్యసేవితయై యుండె; నత్తీర్థంబునకుఁ గొందఱు మును లేతెంచి యా దురవస్థ నాలోకించి. 170

ప్రతిపదార్థం: అని= అంటూ; అనుజ్ఞ ఇచ్చినన్= ఆమోదమును తెలియజేయగా (ఇష్టంతో ఆమోదమును తెలుపగా); సరస్వతి= ఆ సరస్వతీ నది; ఆ+తపస్వి= ఆ ముని; తన చేరువన్= తన సమీపంలో; ఒకప్పుడు= ఒకనాడు; జపయుక్తుండు+ఐ ఉండన్= జపంచేసికొంటూ ఉండగా; కూలాపహరణంబు+చేసి= ఆ గట్టును తెంచి; అఱుతన్= మెడపై; ఆ+మహాత్మున్+ కొనిపోయినన్= ఆ తాపసిని తీసికొనిపోగా; అతండు+ఆంగిరసమంత్రంబులన్= ఆ వసిష్ఠుడు ఆంగిరసమంత్రాలతో; ఆ+తరంగిణిన్= ఆ నదిని; ప్రస్తుతించెన్= ప్రార్థించాడు; అదియున్= ఆ నదియు; సంప్రీతఅగుచున్= సంతోషమందుచు;

ఆ+మునిన్= ఆ తాపసి అయిన వసిష్ఠుడిని; విశ్వామిత్రునకున్ సన్నిహితున్+చేసినన్= విశ్వామిత్రుడికి దగ్గరచేయగా; అతనిని= ఆ వసిష్ఠుడిని; ఆ+గాధిసూనుండు= ఆ విశ్వామిత్రుడు; వధియించు సాధనంబు= చంపుట కవసరమైన ఆయుధాన్ని; అన్వేషించున్+ఆలోనన్= వెదికేటంతలోగా; వంచించి= మోసంచేసి; ఆ ప్రవాహంబు= ఆ నది; ఆ+వసిష్ఠున్+తొలఁగించినన్= ఆ వసిష్ఠుడిని తప్పించగా; కోపించి విశ్వామిత్రుండు= విశ్వామిత్రుడు కోపం చేసికొని; శోణితవాహిని వగుము+అని= నెత్రుటేరువు కమ్మని; శపించినన్= శాపమీయగా; ఒక్క సంవత్సరంబు+అత్తటిని= ఒక ఏడాదిపాటు ఆనది; దైత్యసేవితయై ఉండెన్= రాకాసులతో సేవించబడుతూ ఉండంది; ఆ తీర్థంబునకున్= ఆ తీర్థానికి; కొందఱు మునులు= తాపసులు కొంతమంది; ఏతెంచి= వచ్చి; ఆ దురవస్థన్= ఆ కష్టమైన స్థితిని; ఆలోకించి= చూచినవారై.

తాత్పర్యం: అని చెబుతూ ఉత్తరువులీయగా సరస్వతీనది తన సమీపంలో ఆ తపసి ఒకానొకనాడు జపం చేస్తూ ఉండగా ఆ గట్టును కోసి భుజంమీద మహనీయుడిని తీసికొనిపోగా వసిష్ఠుడు అంగీరస మంత్ర జపములను జపిస్తూ ఆ నదీమతల్లిని పొగడాడు. అందుచే ఆ నది అతడిని విశ్వామిత్రుడికి దగ్గర చేయగా ఆ విశ్వామిత్రుడు అతడిని చంపటానికై మార్గాలను వెదకుతుండగా వంచనతో ఆ ఏరు వసిష్ఠుడిని తప్పించింది. విశ్వామిత్రు డా ఏరును నెత్రుటేరుగా కమ్మని శపించాడు. ఒక్క సంవత్సరం పాటు ఆ ఏరు రాక్షసులచేత సేవించబడింది. ఆ తీర్థానికి కొంతమంది తాపసులు వచ్చి ఆ కష్టదశను చూచి(నారు). (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అమ్మహానది నడిగి వా రత్తెఱంగు । దెలిసి నిజయత్నబలమునఁ దీర్పఁ దీఱె
నట్టిదురవస్థ; వారలు నాత్మఁ బ్రీతి । యూనఁ జలిపిరి పావనస్నానవిధులు. 171

ప్రతిపదార్థం: వారలు= ఆ తాపసులు; ఆ+మహానదిన్+అడిగి= ఆ గొప్ప నదిని విచారించి తెలిసికొని; నిజయత్నబలమునన్= తమ ప్రయత్నబలంతో; తీర్పన్= ఆ బలంతో తొలగించగా; అట్టి దురవస్థ= ఆ కష్టం; తీరెన్= తొలగింది; ఆత్మన్+ప్రీతి+ ఊనన్= మనస్సు సంతసించగా; పావనస్నానవిధులు= పవిత్రమయిన స్నానాదికార్యాలు; చలిపిరి= చేశారు.

తాత్పర్యం: ఆ తాపసులంతా ఆ మహానదిని అడిగి విషయమంతా తెలిసికొని, తమ ప్రయత్న బలంతో ఆ కష్టదశను తొలగించారు. మనసుకు సంతోషం కలుగగా పవిత్రమయిన స్నానాది కార్యాలు చేశారు.

వ. అప్పడు గొందఱు బ్రహ్మరాక్షసు లమ్మునులకుఁ బ్రణమిల్లి తమచేసిన విప్రద్వేషగురుజనావమానదుష్టాన్న భక్షణాదులగు పాతకంబులు వేఱువేఱ యుపన్యసించి 'యే మియ్యెడ వసియించి యున్నవారము; మాకు నిష్కృతి యనుగ్రహింపవలయు' ననుటయు వార లాపనికి సరస్వతిం బ్రార్థించిన నమ్మహానది యరుణానదివలన నట్టితెఱం గగు టెఱుంగుం గావున నిగూఢంబుగా నరుణం దనలోనికిఁ దెచ్చి 'దీన మజ్జనంబు సేయుఁ' డని యనుమతి సేసిన. 172

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; కొందఱు= కొంతమంది; బ్రహ్మరాక్షసులు= బొమ్మరాకాసులు; ఆ+మునులకున్= ఆ తపస్వులకు; ప్రణమిల్లి= నమస్కారంచేసి; తమ= తాము; చేసిన= కావించిన; విప్రద్వేష= బ్రాహ్మణులయందు విరోధం; గురుజన+అవమాన= గురువులను అవమానం చేయటం; దుష్ట+అన్న భక్షణ+ఆదులు+అగు= చెడుభోజనాలు చేయటం మొదలైన; పాతకంబులు= పాపాలను; వేఱువేఱ ఉపన్యసించి= ప్రత్యేకంగా తెలిపి (వివరించి); ఏము+ఈ+ఎడన్‌వసియించి ఉన్నవారము= మే మిక్కడ నివాసమున్నాము; మాకున్; నిష్కృతి= ప్రాయశ్చిత్తం; అనుగ్రహింపవలయున్= దయచేయవలెను; అనుటయున్; వారలు= ఆ తపసులు; ఆ పనికిన్= ఆ కోరిక తీర్చటానికి; సరస్వతిన్+ప్రార్థించినన్= సరస్వతిని వేడుకోగా;

ఆ+మహానది= ఆ గొప్పఏరు; అరుణానదివలనన్= అరుణానదిమూలాన; అట్టి తెఱంగు+అగుటన్= ఆ విధంగా కావటాన్ని; ఎఱుంగున్+కావునన్= తెలిసికొన్నది గనుక; నిగూఢంబుగాన్= రహస్యంగా; అరుణన్= అరుణానదిని; తనలోనికిన్+తెచ్చి= తనలోనికి తీసికొనివచ్చి; దీనన్= ఈ నదిలో; మజ్జనంబు+చేయుఁడు= స్నానమాడండి; అని= అంటూ; అనుమతి+చేసినన్= ఉత్తరువీయగా.

తాత్పర్యం: కొంతమంది బ్రహ్మరాక్షసులు అపు డా మునులకు నమస్కారం చేసి తాము అదివరకు కావించిన బ్రాహ్మణ దూషణ గురు జనావమాన దుష్టాన్న భోజనాది పాతకాలను తెలిపి, 'మే మీ చోట నివసిస్తున్నాము. మా దోషాలు తొలగిపోయేటట్లను గ్రహించవలయును'. అని వేడుకొనగా ఆ తాపసు లా కోరికను తీర్చుటకై సరస్వతిని ప్రార్థించారు. అంత సరస్వతీనది అరుణానది మూలంగా ఆ విధంగా కావటం తనకు ముందే తెలియటం వలన రహస్యంగా అరుణానదిని తనలోనికి తీసికొనివచ్చి 'ఈ నదిలో మునుగండి' అని ఉత్తరువు చేయగా (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. అజ్జలములఁ గ్రుంకి యాబ్రహ్మరాక్షసుల్ । తనువు లచట విడిచి ధర్మపరుల
గతికిఁ బోయి; రట్టు లతిగూఢ మై యున్న । యరుణ తెఱఁ గెఱింగి యమరపతియు. 173

ప్రతిపదార్థం: ఆ+జలములన్+క్రుంకి= ఆ ఏటి నీటిలో మునిగి; ఆ బ్రహ్మరాక్షసుల్= ఆ బొమ్మరాకాసులు; తనువులు+అచటన్+విడిచి= శరీరాల నక్కడ వదలివేసి; ధర్మపరులగతికిన్+పోయిరి= ధర్మాత్ములు పోయే ఉత్తమస్థితికి వెళ్ళారు; అట్టులు= ఆ విధంగా; అతి గూఢమైఉన్న= మిక్కిలి రహస్యంగా ఉండే; అరుణ తెఱఁగు+ఎఱింగి= అరుణానది విధానము తెలిసికొని; అమరపతియున్= దేవేంద్రుడుకూడ.

తాత్పర్యం: ఆ నీటిలో మునిగి ఆ బ్రహ్మరాక్షసులు తమ శరీరాల నక్కడ వదలి, ధర్మాత్ములు పోయే గతికి వెళ్ళారు. ఆ విధంగా అతిరహస్యంగా ఉండే ఆ అరుణానది విషయం తెలిసికొని దేవేంద్రుడు కూడా. (తరువాతి వచనంతో అన్వయం).

వ. తాను సఖ్యంబు సేసి నమ్మించి నముచిఁ జంపిన పాపంబు తదీయస్నానంబునం బాపికొనియె; నట్టి పుణ్యస్థానంబుననుండి యత్తాలధ్వజుండు సోమతీర్థంబునకుం జనియె; నది సోముండు రాజసూయంబు చేసినచోఁ; టయ్యెడ ననిమిషులు షణ్ముఖునకు నిర్జరసేనాధిపత్యంబునకు నభిషేకంబు సేసి; రతండు తారకాదులైన యసురులం దెగటార్చె నతని జననాదివృత్తాంతంబు కౌరవవంశజాతుండ వగు నీకు వినఁదగుఁ జెప్పెద నాకర్ణింపుము. 174

ప్రతిపదార్థం: తాను; సఖ్యంబు చేసి= స్నేహం చేసి; నమ్మించి= నమ్మకం చూపి; నముచిన్= నముచి అనే రాక్షసుడిని; చంపిన= హతమార్చిన; పాపంబు= దోషం; తదీయ స్నానంబునన్+పాపికొనియెన్= ఆ నదిలో స్నానం చేయటంవలన పోగొట్టుకొన్నాడు; అట్టి పుణ్యస్థానంబునుండి= అటువంటి పవిత్రమయిన చోటునుండి; ఆ తాలధ్వజుండు= ఆ బలరాముడు; సోమతీర్థంబునకున్= సోమతీర్థమునకు; చనియెన్= వెళ్ళాడు; అది; సోముండు= చంద్రుడు; రాజసూయంబు చేసిన చోటు= రాజసూయమనే యాగం చేసిన చోటు; ఆ+ఎడన్= ఆ చోట; అనిమిషులు= దేవతలు; షణ్ముఖునకున్= ఆరుమొగాల దేవర అయిన సుబ్రహ్మణ్యస్వామికి; నిర్జర సేనాధిపత్యంబునకున్= దేవసేనాపతిత్వమునకు; అభిషేకంబు+చేసిరి= పట్టాభిషేకం చేశారు; అతండు= ఆ షణ్ముఖుడు; తారక+ఆదులయిన అసురులన్+తెగటార్చెన్= తారకుడు మొదలయిన రాక్షసులను

హతమార్చాడు; అతని జనన+ఆదివృత్తాంతము= అతని పుట్టుక మొదలయిన విషయాలు; కౌరవవంశ జాతుండవు+అగు= కురువంశంలో పుట్టినవాడయిన నీకు; వినన్+తగున్= వినటం ఉచితం; చెప్పెదన్= చెప్పుతున్నాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: స్నేహం చేసి తాను నమ్మకాన్ని కలిగించి నముచిని చంపిన పాపం ఆ నదిలో స్నానం చేసినందున తొలగించుకొన్నాడు ఇంద్రుడు. అటువంటి పుణ్యభూమి నుండి ఆ బలరాముడు సోమతీర్థానికి పోయాడు. ఆ తీర్థం చంద్రుడు రాజసూయం చేసినట్టి చోటు. అచటనే దేవతలు ఆరు మొగాల స్వామి సుబ్రహ్మణ్యుడికి దేవసేనాపతిగా పట్టం కట్టారు. ఆతడు తారకాది అసురులను తెగటార్చాడు. కౌరవవంశంలో పుట్టిన జనమేజయా! నీ వా కథ వినవలయును. చెప్పుతాను - వినుము.

కుమారస్వామి ప్రభావాభివర్ణనము (సం. 9-43-56)

ఆ. **'హరుఁడు దనదువీర్య మగ్నియం దిడిన వ । హింపఁజాల కజున కెఱుఁగఁ జెప్పి**
యతఁడు వనుప దాని నగ్ని గంగాగర్భ । భూతముగ నొనర్చె భూపవర్య! 175

ప్రతిపదార్థం: భూపవర్య!= ఓ రాజశ్రేష్ఠా! (జనమేజయా!); హరుఁడు= పరమశివుడు; తనదువీర్యము= తన వీర్యమును; అగ్నియందు+ఇడినన్= అగ్నిలో ఉంచగా; వహింపన్+చాలక= (ఆ శక్తిని) భరించలేక; అజునకున్= స్రష్టకు(బ్రహ్మకు); ఎఱుఁగన్+చెప్పి= తెలియచేసి; అతఁడు= బ్రహ్మ; పనుపన్= (పంపగా); ఆజ్ఞాపించగా; దానిని= ఆ శక్తిని; గంగాగర్భభూతముగన్= గంగ కడుపున ఉండేటట్లుగా; ఒనర్చెన్= చేసెను.

తాత్పర్యం: పరమశివుడు తన వీర్యాన్ని అగ్నిలో నిక్షేపించగా, ఆ శక్తిని భరింపలేక ఆ అగ్ని సృష్టికర్త అయిన బ్రహ్మకు తెలుపగా, ఆ బ్రహ్మ దానిని గంగానదీ గర్భంలో దాచుమని చెప్పగా అట్లే చేశాడు. (అని జనమేజయుడికి వైశంపాయనుడు చెప్పాడు).

వ. **తేజోమయం బైన యాగర్భంబు గంగ హిమవన్నగంబుమీఁద నముత్సృష్టంబు సేసినఁ గనకమయం బైనశరస్తంబంబున నగ్నిసన్నిభుం డగుకుమారుండై యొప్పె; నయ్యెడ మెలంగుకృత్తిక లక్కుమారుం గని పుత్రార్థినులై యందఱు నొక్కపెట్ట 'వీఁడు మాకొడు' కని పలుకుచుఁ గరతలంబుల నెత్త, నప్పు డయ్యార్వుఱ చన్నులుం జేపిన నద్దారకుండు చంద్రనిభంబు లైన యాననంబు లాఱు దాల్చి సప్తమాతృస్తన్యపానం బాచరించిన విస్మయప్రమోదభరిత లై వార లాశిశువు నెప్పటియెడన యునిచి; ర ట్లయ్యగ్నిభవుండు గాంగేయుండును శరజన్ముండును గార్తికేయుండును నయ్యె; నయ్యెడకు బృహస్పతి యేతెంచి జాతకర్మాద్యనుష్ఠానంబుల నిర్వర్తించి పోయెఁ; దత్ప్రదేశంబు దన మహానుభావంబున జాతరూప మయంబై యుండు. 176**

ప్రతిపదార్థం: తేజోమయంబు+ఐన ఆ గర్భంబు= కాంతిమంతమైన ఆ గర్భం; హిమవత్+నగంబుమీఁదన్= మంచుకొండపైన; సముత్సృష్టంబు+చేసినన్= విడచిపెట్టగా; కనకమయంబు+ఐన= బంగారుమయమయిన; శరస్తంబంబునన్= రెల్లుగడ్డిలో; అగ్ని సన్నిభుండు+అగు= అగ్నితో సమానుడైన; కుమారుండు+ఐ= పుత్రుడుగా; ఒప్పెన్= ఉన్నాడు; ఆ+ఎడన్= ఆ చోటులో, మెలంగు= తిరుగాడుతున్న; కృత్తికలు= కృత్తిక దేవతలు(కన్యలు); ఆ+కుమారున్+కని= ఆ కుమారుడిని చూచి; అందఱున్

పుత్ర+అర్థినులై= కుమారుడిని ఆశించినవారై; వీఁడు మాకొడుకని పలుకుచున్= ఈ పిల్లవాడు మా కుమారుడని చెప్పుతూ; కరతలంబులన్+ఎత్తన్= చేతులలోని కెత్తుకొనగా; అప్పుడు+ఆయార్వుర చన్నులున్+చేపినన్= ఆ సమయాన ఆ ఆరుగురి చన్నులూ పాలు చేపగా; ఆ+దారకుండు= ఆ పిల్లవాడు; చంద్రనిభంబులైన= చంద్రుడితో సమానమైన; ఆననంబులు+ఆఱు+ తాల్చి= మొగాలు ఆరింటిని పొంది; సప్తమాతృస్తన్య పానంబు+ఆచరించినన్= ఆ ఏడుగురి తల్లులు చన్నుబాలు త్రాగగా; వార లా శిశువును= వా రా బిడ్డను; ఎప్పటి ఎడన= ఎపుడూ ఉన్న చోటునందే; ఉనిచిరి= ఉంచారు; అట్లు+ఆ+అగ్నిభవుండు= ఆ విధంగా ఆ అగ్నినుండి పుట్టినవాడు; గాంగేయుండును= గంగకొడుకునూ; శరజన్ముండును= రెల్లునందు పుట్టినవాడునూ; కార్తికేయుండును= కృత్తికల కుమారుడును; అయ్యెన్= అయ్యాడు; ఆ+ఎడకున్= ఆ చోటునకు; బృహస్పతి వచ్చి= జాతకర్మాది+అనుష్ఠానంబులన్= జాతకర్మ మొదలయిన ఆచార విధులను; నిర్వర్తించిపోయెన్= జరిపి వెళ్ళాడు; తద్+ప్రదేశంబు= ఆ చోటు; తన మహానుభావంబునన్= తన మహాశక్తి మూలాన; జాతరూపమయంబు+ఐ+ఉండున్= బంగారుమయమై ఉంటుంది.

తాత్పర్యం: కాంతిమంతుడైన ఆ బిడ్డను గంగ హిమాలయం మీద నిలుపగా బంగారు మయమైన రెల్లు దర్భలలో అగ్నితో తుల్యుడయిన కొడుకుగా ఉన్నాడు. ఆ చోట తిరిగే కృత్తిక లా బాలుడిని చూచి కుమారుడికై ఒక్కమారే వీడు నా కుమారుడు 'నా కుమారు' డని చేతులలోని కెత్తుకొన్నారు. అపు డా ఆరుగురికీ చన్నులు చేపినవి. ఆ పసివాడు చంద్రుడితో సమానమైన ఆరుమొగాలతో ఆ మాతల స్తన్యాన్ని త్రాగాడు. వా రాశ్చర్యమానసలై సంతోషంతో ఆ బిడ్డను యథాస్థానంలో వదలారు. అందుచేత ఆతడు అగ్నిభవుడుగాను, గాంగేయుడుగాను శరజన్ముడుగాను, కార్తికేయుడుగాను అయ్యాడు. అచ్చటికి బృహస్పతి వచ్చి అతడికి జాతకర్మాది ఆచారాలను జరిపి వెళ్ళాడు. ఆ మహానుభావుడి శక్తిచేత ఆ చోటు బంగారు మయమై ఉంటుంది.

విశేషం: 'సప్తమాతృస్తన్యపానంబాచరించిన' అనేదానికి 'అయ్యారుగుర మాతృస్తన్య, సమస్త మాతృస్తన్యపానంబులు అనే పాఠాంతరాలున్నాయి.

క. **విను మక్కుమారుఁ డుత్తమ । మనఁ దగియెడుతపము దనవిహారముగా వ**
ర్ధన మొందె ధాత్రి ధాత్రిగ । ధనురాగమమును శ్రుతులును దనుఁ గొలువంగన్. **177**

ప్రతిపదార్థం: వినుము; ఆ+కుమారుఁడు= ఆ కుమారస్వామి; ఉత్తమము= శ్రేష్ఠం; అనన్= అనగా; తగియెడు= తగిన; తపము; తన విహారము+కాన్= తాను తిరుగుచోటుగా; ధాత్రి= భూమి; ధాత్రిగన్= దాదిగా; ధనున్+ఆగమమును= ధనుర్వేదమును; శ్రుతులును= వేదాలును; తనున్+కొలువంగన్= తనను సేవించగా; వర్ధనము+అందెన్= వృద్ధిపొందాడు.

తాత్పర్యం: ఆ కుమారుడు ఉత్తమమైన తపస్సు విహారంగా భూమి దాదిగా ధనుర్వేదాది వేదాలు తనను సేవించగా వృద్ధి పొందాడు. వినుము.

వ. **ఒక్కనాఁ డక్కుమారుం జూచువేడుక శివుండు శైలకన్యకయుం దానుఁ బ్రకృష్టబలపరాక్రమంబులు నానాప్రకారవదనశరీరంబులు గలుగు ప్రమథ గణంబు గొలువ నయ్యెడకుఁ జనుదెంచె; నప్పుడు బ్రహ్మవిష్ణులును నింద్రాదిదిక్పాలురును రుద్రాదిత్యమరుద్వసుప్రభృతి సకలసురులును గరుడగంధర్వకిన్నరకింపురుష సిద్ధవిద్యాధరయక్షాది దివ్యులును మునులును మఱియుఁ బితృదేవతలును ననుచరసమేతులై యేతెంచిరి;**

మూర్తిమంతంబు లై యోషధిసరిత్సముద్రపర్వతంబులు నరుదెంచె; నిట్లు నిజదర్శనకౌతుకంబున వచ్చిన యమ్మహాసమూహంబున కభిముఖుండై యోగబలాన్వితుం డగు నబ్బాలుండు రా నన్నీలగ్రీవుండు నిరీక్షించి యంతర్గతంబున. 178

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు+ఆ కుమారున్= ఒకానొక దినాన ఆ కుమారుడిని; చూచువేడుకన్= చూడాలి అనే కోరికతో; శివుండు= పరమశివుడు; శైలకన్యయున్+తానున్= పార్వతియు తానును; ప్రకృష్ట బలపరాక్రమంబులు= ఉత్కృష్టమయిన బలశౌర్యాలు; నానా ప్రకారవదన శరీరంబులు= అనేక విధాలయిన ముఖములు శరీరములును; కలుగు= కలిగిన; ప్రమథగణంబు+ కొలువన్= ప్రమథగణాలు సేవించగా; ఆ+ఎడకున్+చనుదెంచెన్= ఆచోటునకు వచ్చాడు; అప్పుడు= ఆ సమయాన; బ్రహ్మవిష్ణులును= బ్రహ్మయు, విష్ణువును; ఇంద్ర+ఆది దిక్పాలురును= ఇంద్రుడు మొదలయిన దిక్పతులును; రుద్ర+ఆదిత్య+ మరుత్+వసుప్రభృతి+సకలసురులును= ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, సప్తమరుత్తులు, అష్టవసువులు, మొదలయిన దేవతలందరును; గరుడ, గంధర్వ, కిన్నర, కింపురుష, సిద్ధ, విద్యాధర, యక్షాది దివ్యులును= గరుడులు, గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు, సిద్ధులు, విద్యాధరులు, యక్షులు, మొదలైన దివ్యగణాలును; మునులను= తాపసులును; మఱియున్; పితృదేవతలును= ఇంకను పితృదేవతలును(వీరందరును); అనుచర సమేతులు+ఐ ఏతెంచిరి= పరివారంతో కూడి వచ్చారు; మూర్తిమంతంబులై= ఆకారాలతో; ఓషధి= ఓషధులును; సరిత్+సముద్ర+పర్వతంబులు= నదులు, సప్త సముద్రాలు, పర్వతాలు; అరుదెంచెన్= వచ్చాయి; ఇట్లు= ఈ విధంగా; నిజదర్శనకౌతుకంబునన్= తన్ను చూచే ఉత్సాహంతో; వచ్చినన్= రాగా; ఆ+మహా సమూహంబునకున్= ఆ గొప్ప సమూహానికి; అభిముఖుండు+ఐ= ఎదురై; యోగబలాన్వితుండు+అగు= యోగశక్తితో కూడినవాడైన; ఆ+బాలుండు= ఆ బాలకుడు; రాన్= రాగా; ఆ+నీలగ్రీవుండు= ఆ నీలకంఠుడు; నిరీక్షించి= ఎదురుచూచి; అంతర్గతంబునన్= మనసులో.

తాత్పర్యం: ఒకనాడు కుమారుడిని చూచే ఆసక్తితో పరమేశ్వరుడు పార్వతితో విశేషమైన బలాన్నీ, శక్తినీ అనేక విధాలయిన శరీరాలు కలిగిన ప్రమథగణాలు సేవించగా ఆ చోటునకు వచ్చాడు. అపుడు బ్రహ్మ విష్ణులు, ఇంద్రాది దిక్పాలురు, ఏకాదశరుద్ర ద్వాదశాదిత్య సప్తమరుత్తులు, అష్టవసువులు మొదలయిన సమస్త దేవతలును, గరుడ గంధర్వ కిన్నర కింపురుష సిద్ధ విద్యాధర యక్షాది దివ్యులును, తాపసులును, ఇంకను పితృదేవతలును వారి పరివారంలో కూడివచ్చారు. ఓషధులు నదులు సప్త సముద్రాలు సప్తకులపర్వతాలు మూర్తిమంతములై వచ్చాయి. ఈ విధంగా తనను చూడగా ఆసక్తులైన వచ్చిన ఆ గొప్ప సమూహానికి ఎదురేగి యోగబలంతో కూడుకొన్న ఆ పసివాడు రాగా ఆ నీలకంఠుడు తేరిపార చూచి, మనసులో. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. 'ఉమయు నగ్నియు గంగయు నుండ నన్ను । గారవంబున నధికునిఁగాఁ దలంచి
చక్క నాపాలి కేతెంచునొక్కొ! వీఁడు । సంభృతస్నేహ భక్తివిస్రంభుఁ డగుచు.' 179

ప్రతిపదార్థం: ఉమయున్= పార్వతియును; అగ్నియున్= అగ్నిదేవుడును; గంగయున్= గంగాదేవియును; ఉండన్= ఉండగా; నన్నున్ గారవంబునన్= నన్ను ఆదరంతో; అధికునిగాన్+తలంచి= గొప్పవానిగా భావించుకొని; చక్కన్= నేరుగా; నా పాలికిన్+ఏతెంచు నొక్కొ వీఁడు?= ఈతడు నా దగ్గరకు వచ్చునా?; సంభృత= నిండిన; స్నేహ= స్నేహం, భక్తి అనువాటితో విశ్వాసంగలవాడు అవుతూ; విస్రంభుఁడు+అగుచున్= నమ్మకం కలవాడై.

తాత్పర్యం: 'పార్వతి, అగ్ని, గంగ, మొదలైనవారుండగా గౌరవంతో నన్ను గొప్పగా తలచుకొని ఇతడు స్నేహంతోను, భక్తితోను నా దగ్గరకు వస్తాడా?'

క. **అనుచుండఁగ నమ్మువ్వురు । తనతన చిత్తమున నట్ల తలఁపఁగ నది యె**
ల్లను దివ్యబోధమునఁ గని । కొని య బ్బాలుండు యోగకుశలత వెలయన్. **180**

ప్రతిపదార్థం: అనుచుండఁగన్= అంటూ ఉండగా; ఆ+మువ్వురు= ఆ ముగ్గురును(పార్వతి, అగ్ని, గంగలు) తన తన చిత్తమునన్= తమ తమ మనస్సులలో; అట్ల తలఁపఁగన్= ఆ విధంగానే తలచుకొనగా; అది ఎల్లను= దానినంతా; దివ్యబోధమునన్; కనికొని= చూచినవాడై; ఆ+బాలుండు= ఆ పసివాడు; యోగ కుశలత వెలయన్= యోగమునందలి నేర్పుతో ప్రకాశించగా.

తాత్పర్యం: అంటూ ఆ ముగ్గురూ తమ తమ మనసులలో అదే విధంగా తలచుకొన్నారు. దానినంతా దివ్యజ్ఞానంతో తెలిసికొని, ఆ బాలుడు యోగశక్తి ప్రకాశించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. **మూర్తిచతుష్టయంబు దాల్చి యన్నలువుర యొద్దకు నేకకాలంబునం జనినం గని యెల్లవారు**
నద్భుతమగ్నమానసు లై; రక్కుమారుండు పదంపడి యొక్కరుం డై పొలిచి నిలిచె; నప్పుడు. **181**

ప్రతిపదార్థం: మూర్తిచతుష్టయంబు+తాల్చి= నాలుగు ఆకారాలను పొందినవాడై; ఆ+నలువుర ఒద్దకున్= ఆ నలుగురి దగ్గరకు; (ఉమాగ్ని గంగా పరమశివుల కడకు); ఏకకాలంబునన్+చనినన్= ఒక్కసారిగానే వెళ్ళగా; కని= చూచి; ఎల్లవారున్= అందరూ; అద్భుత మగ్న మానసులు+ఐరి= ఆశ్చర్యంలో మునుగునట్టి మనసులు కలవారయ్యారు; ఆ+కుమారుండు= ఆ కుమారస్వామి; పదంపడి= ఆ మీదట; ఒక్కరుండు+ఐ పొలిచి= ఒకడుగా ఒప్పి; నిలిచెన్= నిలిచాడు; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆతడు నాలుగు ఆకారాలతో ఆ నలుగురి ఒద్దకు వెళ్ళాడు. ఒకేమారు ఆతడు వెళ్ళగా చూచిన వారందరూ అబ్బురపడ్డారు. మరల ఆ కుమారస్వామి ఒకడుగా కానవచ్చి నిలిచాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. **హరుఁడును గంగయున్ శిఖియు నంబికయుం బ్రణిపాతపూర్వని**
ర్భర వినయంబుతోడఁ దగఁ బద్మజుఁ జేరి 'మహాత్మ! యిక్కుమా
రు రుచిరమూర్తికిన్ గుణగురుత్వవిభూతికి నీడు గాఁగ ని
మ్మరసి యుదాత్త మైనపద' మన్న నతండు ప్రియం బెలర్పఁగన్. **182**

ప్రతిపదార్థం: హరుఁడును= ఈశ్వరుడునూ; గంగయున్= గంగాదేవియునూ; శిఖియున్= అగ్నియునూ; అంబికయున్= పార్వతియునూ; ప్రణిపాతపూర్వ నిర్భర వినయంబుతోడన్= నమస్కారపూర్వకంగా మిక్కిలి అణకువతో; తగన్= తగువిధంగా; పద్మజున్+చేరి= బ్రహ్మవద్దకు వెళ్ళి; మహాత్మ!= ఓ మహనీయుడా!; ఈ+కుమారు= ఈ కుమారుడియొక్క; రుచిరమూర్తికిన్= తేజోమయమూర్తికి; గుణగురుత్వవిభూతికిన్= గొప్ప గుణసంపదకు; ఈడుకాఁగన్= సాటిగా; అరసి= చూచి; ఉదాత్తము+ఐన పదము= గొప్ప స్థానమును; ఇమ్ము= ఒసగుము; అన్నన్= అనగా; అతండు= ఆ బ్రహ్మ; ప్రియంబు+ఎలర్పఁగన్= ప్రీతి కలుగగా.

తాత్పర్యం: పరమశివుడు, పార్వతి, గంగ, అగ్ని సంతోషంతోను, వినయంతోను, తగు విధంగా బ్రహ్మవద్దకు వెళ్ళి, 'మహనీయుడా! ఈ బాలుడి తేజోమయమూర్తికీ గుణసంపదకూ తగిన గొప్ప పదవిని ఆలోచించి ఈయవలసినది' అని అడిగారు. అందులకు బ్రహ్మ ప్రీతితో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. దేవహితపరుం డగుటం జేసి చిత్తంబునఁ దలపోసి 'వీఁడు దేవసేనకుం బతి యగుంగాక!' యని నిశ్చయించి వారల వీక్షించి యవ్విధ మెల్లవారును వినం దెలియఁ బలికి శక్రవరుణాదు లగుమేటి వేల్పుల నబ్బాలునకుం జూపి 'వీరు నీకు రక్షణీయు' లని యప్పగించె; నయ్యమరవరు లక్కుమారు నభిషేకంబు సేయుద మని వారిజాసనుం బురస్కరించుకొని యెల్లవారును దోడన యరుగుదేర సరస్వతీసమీపంబునకుం జని సకలరత్నమయం బైన దివ్యపీఠంబు హిమవంతుండు వెట్ట నం దా భూతపతిపుత్రు నునిచి బృహస్పతి హోమకార్యంబు నిర్వర్తింప నీశానవిష్ణు విధికౌశికులు లోనుగా నమర ముఖ్యు లభిషేకద్రవ్యంబులు సారస్వతజలపూర్ణ మణికనక కలశంబులు ధరియించి గంధర్వాప్సరోగణంబులు సంగీతమంగళం బాచరింప మహామునిప్రకర పుణ్యాహఘోషంబులు సెలంగ నుమా శ్రీసరస్వతీశచీప్రముఖ లైన పుణ్యాంగనలు దీవనలతో సేస లొలుక నభిషేకించి సమ్మోదంబున సేనాధిపత్యంబునకుం బట్టంబు గట్టిరి; తొల్లి తత్త్వదేశంబున దేవతలు జలాధిపత్యంబునకు వరుణు నభిషిక్తుం జేసి; రవ్వరుణాభిషేకంబుకంటెఁ గుమారాభిషేకం బొప్పె; న ప్పావకసంభవునకుఁ గామదమన కమలభవశార్ఙ్గి శతమఖ ప్రముఖు లగు సకల ప్రభువులు దమతమయనుచరులయందు రూపగుణబలపరాక్రమాధికు లైన వారి నేటి భీమఘంటాకర్ణ సంక్రమ దండధర సహితు లగు ననేకవీరుల నొసంగి వారల బెరసి వర్తించుటకుఁ దగిన సేనాంగసముదయంబు నమ్మహితాత్మునకు మూలబలంబుగా నొనర్చి; రబ్బలంబులఁ జిత్రాభరణ వర్మాయుధధరులును వివిధ ప్రకారాకారులు నగు గజకర్ణ నికుంభ కుముదాదు లైన సైనికులు మెఱసి యుల్లసిల్లి; రమ్మ్యోకలతో శత్రుభయంకరంబు లగుచు మాతృకాగణంబులు ప్రభాసినీ విశాలాక్షీ పాలితాపురస్సరంబులై పొలిచె నట్టియెడ. 183

ప్రతిపదార్థం: దేవహిత పరుండు+అగుటన్+చేసి= దేవతలకు మేలు చేసేవాడు కావటంవలన; చిత్తంబునన్+తలపోసి= మనసులో తలచుకొని; వీఁడు= ఈ బాలుడు; దేవసేనకున్+పతి+అగున్+కాక!= దేవతల సేనకు నాయకు డగుగాక!; అని నిశ్చయించి= అంటూ నిర్ణయించి; వారలన్ వీక్షించి= ఆ పరమశివుడు మొదలయిన వారిని చూచి; ఆ+విధము= ఆ పద్ధతిని (ఆ బాలుడు దేవసేనానాయకుడయ్యే విధమును); ఎల్లవారును= అందరును; వినన్= వినగా; తెలియన్+పలికి= స్పష్టంగా తెలిసేటట్లుగా చెప్పి; శక్రవరుణ+ఆదులు+అగు మేటి వేల్పులన్= ఇంద్రుడు, వరుణుడు మొదలయిన గొప్ప దేవతలను; ఆ+బాలునకున్+చూపి= ఆ పిల్లవాడికి చూపించి; వీరు నీకు రక్షణీయులు= వీరంతా నీకు కాపాడదగినవారు; అని అప్పగించెన్= అని ఒప్పచెప్పాడు; ఆ+అమరవరులు= ఆ దేవతాశ్రేష్ఠులు; ఆ+కుమారున్= ఆ బాలుడిని; అభిషేకంబు చేయుదము+అని= (సేనానిగా) పట్టం కట్టుదామని; వారిజాసనున్ పురస్కరించుకొని= బ్రహ్మను ముందుంచుకొని; ఎల్లవారును= అందరును; అరుగుదేరన్= బయలుదేరి రాగా; సరస్వతీ సమీపంబునకున్+చని= సరస్వతీ తీర్థం దగ్గరకు వెళ్ళి; సకల రత్నమయంబు+ఐన= అన్ని రత్నాలతో నిండిన; దివ్యపీఠంబు= ఉత్కృష్టమైన పీఠమును; హిమవంతుడు పెట్టన్= హిమవంతుడు ఏర్పాటు చేయగా; అందున్+ఆభూతపతి పుత్రునిన్= అక్కడ నా ప్రమథనాథుడి కుమారుడిని; ఉనిచి= నిలిపి; బృహస్పతి= దేవగురువు; హోమకార్యంబు నిర్వర్తింపన్= హోమాదికాలైన పనులు చేయగా; ఈశాన విష్ణు విధి కౌశికులు లోనుగాన్= పరమశివుడు, విష్ణువు, బ్రహ్మ, కౌశిక మహర్షి మొదలుగా(త్రిమూర్తులందరును); అమరముఖ్యులు= దేవతలతో తలమానికము లయినవారు; అభిషేక ద్రవ్యంబులు= సేనాని పట్టాభిషేకాని కవసరమయిన వస్తువులు; సారస్వత జల= సరస్వతీ నదినీటితో; పూర్ణ= నిండిన; మణికనక కలశంబులు= రత్నాలు తాపిన బంగారు కుండలు; ధరియించి= చేతబట్టుకొని; గంధర్వఅప్సరోగణంబులు= గంధర్వులు, అప్సరసలు; సంగీత మంగళంబు+ఆచరింపన్= సంగీతంతో మంగళాదులు చేయగా;

మహాముని ప్రకర పుణ్యాహ ఘోషంబులు చెలంగన్= గొప్ప తాపసి సమూహాలు కావించే పుణ్యాహవాచన వేద ఘోషములు మ్రోయగా; ఉమా+శ్రీ+సరస్వతీ+శచీప్రముఖ= పార్వతి, లక్ష్మి, సరస్వతి, శచి మొదలయిన; పుణ్యాంగనలు= ముత్తైదువలు; సేసలు+ఒలుకన్+అభిషేకించి= సేస బ్రాలతో స్నానంచేయించి; సమ్మోదంబునన్= సంతోషంతో; సేనాధిపత్యంబునకున్+పట్టంబు కట్టి= సేనానాయకత్వానికి పట్టంకట్టి; తొల్లి= వెనుకటి కాలంలో; తద్+ప్రదేశంబునన్= ఆ చోట; దేవతలు; జల+అధిపత్యంబునకున్= నీటిమీది అధికారానికి; వరుణున్+అభిషిక్తున్+చేసిరి= వరుణుడిని అధిపతిగా చేశారు; ఆ+వరుణ+అభిషేకంబుకంటెన్= ఆ వరుణుడికి జరిగిన అభిషేకంకంటె; కుమార+అభిషేకంబు+ఒప్పెన్= ఆ బాలకుడి అభిషేకం ఒప్పారింది; ఆ+పావకసంభవునకున్= ఆ యగ్నినుండి పుట్టినవాడికి; కామదమన= మన్మథుడి పొగ రణచిన శివుడు; కమలభవ= బ్రహ్మ; శార్ఙ్గి= విష్ణువు; శతమఖ ప్రముఖులు+అగు= దేవేంద్రుడు మొదలైన; సకల ప్రభువులు= అధిపతులందరూ; తమ తమ అనుచరులయందున్= తమ తమ సేవకులలో; రూపగుణ బలపరాక్రమ+అధికులు+ఐన వారిని= ఆకృతిలోను, గుణంలోను బలంలోను వైరులను+ఆక్రమించుకొనటంలోను గొప్పవారైన వారిని; ఏఱి= లెక్కించి; భీమ= భయంకరమైన; ఘంటాకర్ణ= ఘంటాకర్ణుడనేవాడును; సంక్రమ= సంక్రముడు; దండధరసహితులు+అగు; అనేక వీరులన్+ఒసంగి= ఎందరో బలశాలుల నిచ్చి; వారలన్+బెరసి= వారితో కలసి; వర్తించుటకున్= తిరగటానికి; తగిన సేనా+అంగ సముదయంబున్= తగినట్టి సేనా సమూహాన్ని; ఆ+మహితాత్మునకున్ మూలబలంబుగాన్+ఒనర్చినన్= ఆ శక్తిమంతుడికి ఆధారమయ్యే సేనగా చేయగా; ఆ+బలంబులన్= ఆ సేనలో; చిత్ర+ఆభరణ+వర్మ+ఆయుధధరులును= రకరకాలైన ఆభరణాలను, కవచాలను, ఆయుధాలను ధరించినవాళ్ళు; వివిధ ప్రకార+ఆకారులున్+అగు= అనేక విధాలయిన శరీరాలున్నవారు ఐన; గజకర్ణ= గజకర్ణుడు; నికుంభ= నికుంభుడు; కుముద+ఆదులు+ఐన= కుముదుడు మొదలయిన; సైనికులు= భటులు; మెఱసి= విజృంభించి; ఉల్లసిల్లిరి= సంతోషించారు; ఆ+మూఁకలతోన్= ఆ సేనలతో; శత్రుభయంకరంబులు+అగుచున్= వైరులకు భయాన్ని కలిగిస్తూ; మాతృకాగణంబులు= సప్తమాతృకలూ, ప్రమథగణాలూ, ప్రభాసినీ విశాలాక్షీ పాలికాపురస్సరంబులు+ఐ= ప్రభాసినియు, విశాలాక్షియు పాలిక ముందున్నవారై; పొలిచెన్= ఒప్పింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: (బ్రహ్మ) ఆ బాలుడు దేవతలకు ప్రియుడనే విషయాన్ని తెలిసికొని, 'ఈతడు దేవసేనాపతిఅగు గాక!' అని నిర్ణయించాడు. అక్కడివారినంతా కలయజూచాడు. వారందరు తెలిసికొనేటట్లు ఆ విషయాన్ని చెప్పాడు. ఇంద్రుడు వరుణుడు మొదలయిన ప్రధానులైన దేవరాజులను ఆ బాలుడికి చూపి 'వీరంతా నీకు రక్షకులు' అని ఒప్పచెప్పి ఆ కుమారస్వామికి అభిషేకం చేద్దామని తలచి, బ్రహ్మను ముందుంచుకొని అందరూ కూడిరాగా సరస్వతీ తీర్థం దగ్గరకు వెళ్ళాడు. అన్ని రత్నాలను నింపిన దివ్యపీఠాన్ని పర్వతరాజైన హిమవంతుడు పెట్టగా దానిమీద ఆ భూతనాథుడి కుమారుడిని నిలిపి, బృహస్పతి హోమాదికాలు చేయగా ఈశానుడు విష్ణుడు బ్రహ్మ, కౌశికులు మొదలైన దేవ ప్రముఖులు అభిషేక వస్తువులను సరస్వతి నీటితో నింపిన బంగారు మయమైన రత్నాలు తాపిన గిండీలను మోసికొంటూ గంధర్వాప్సరోగణాలు సంగీతంలో మంగళాశీస్సులు పలుకగా మహాముని సమూహాలు పుణ్యాహవేదఘోషలతోను, పార్వతి, లక్ష్మి, సరస్వతి, శచి మొదలైన ముత్తయిదువలు అక్షతలతో స్నానం చేయించి సంతోషంతో సేనానాయకత్వానికి పట్టాభిషేకం చేసి ఆధిపత్యాన్ని ఒసగారు. మును పాచోట దేవతలు జలాధిపతిగా వరుణుడిని అభిషేకించారు. ఆ వరుణాభిషేకం కంటె కుమారాభిషేకం ఒప్పింది. ఆ అగ్నిదేవసంభవుడికి పరమశివుడు, బ్రహ్మ, విష్ణువు మొదలైన ప్రభువులందరూ తమతమ సేవకులందలి రూపాధిక్యాన్నీ, బలాధిక్యాన్నీ, పరాక్రమాధిక్యాన్నీ కలవారిని ఎన్నుకొని భీమ ఘంటాకర్ణ సంక్రమ దండధర సహితు లయిన ఎందరో వీరుల నొసగి వారితో కలసి తిరగటానికి తగినటువంటి సేనాంగాల సమూహాన్నీ ఆ శక్తిమూర్తికి మూలబలంగా ఇచ్చారు. ఆ సేనలు చిత్రాభరణవర్మాయుధధారులుగా అనేక ప్రకారాకారు లైన గజకర్ణ నికుంభకుముదాదులైన సైనికులు ఒప్పారు. ఆ

సేనతో వైరిభయంకరు లైన సప్త మాతృకాగణాలు ప్రభాసినీ విశాలాక్షీ పాలికాపురస్సరంగా నిలచాయి. అటువంటి సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. **శంకరుఁ డుదిత భాస్కరనిభధ్వజమును, । వాసవుఁ డసురవిధ్వంసకరణ**
పరిణతశక్తియు, హరి బలవర్ధని । యగు వనమాలయు, నగజ యెపుడు
మాయని వెలిపట్టుదోయిని, గంగ యు । జ్జ్వల సుధామయకమండలువు, గురుఁడు
దీప్తదండము, వైనతేయుండు మహితమ । యూరంబు, వరుణుం డుదార రూప

తే. **మైన తామ్రచూడంబును, నర్థవిభుఁడు । దర్పితచ్ఛాగమును, శతదళభవుండు**
లసితకృష్ణాజినంబును నసమసమర । జయము నొసఁగిరి ప్రీతి నా షణ్ముఖునకు. **184**

ప్రతిపదార్థం: శంకరుఁడు= ఈశ్వరుడు; ఉదిత= ఉదయించే; భాస్కర నిభ ధ్వజమును= సూర్యుడితో సమానమైన పతాకాన్నీ; వాసవుఁడు= ఇంద్రుడు; అసుర, విధ్వంసకరణ, పరిణత శక్తియున్= రాక్షసులను నాశనం చేయడంలో పక్వత పొందిన శక్తిని; హరి= విష్ణువు; బలవర్ధని+అగు= శక్తిని పెంచగలుగు; వనమాలయున్= వనమాలను; అగజ= పార్వతి; మాయని= మాసిపోని; వెలిపట్టుదోయిని= తెల్లపట్టు జతను; గంగ= గంగాదేవి; ఉజ్జ్వల= వెలుగుతున్న; సుధామయ= అమృతమయమైన; కమండలువు= కమండలాన్నీ; గురుఁడు= బృహస్పతి; దీప్తదండమున్= ప్రకాశించే దండాన్నీ; వైనతేయుండు= గరుత్మంతుడు; మహిత మయూరంబున్= మహిమ కల నెమలిని; వరుణుండు; ఉదారరూపము+ఐన= గొప్పరూపంకల; తామ్రచూడంబును= కోడిపుంజును; అర్థవిభుఁడు= కుబేరుడు; దర్పిత+ఛాగమును= పొగరుబోతు మేకను; శతదళభవుండు= బ్రహ్మ; లసిత= సొగసైన; కృష్ణాజినంబును= ఇర్రితోలును; సమరజయమును= యుద్ధంలో సాటిలేని గెలుపును; ఆ షణ్ముఖునకున్= ఆ ఆరుమొగాల వాడికి; ప్రీతిన్= ప్రేమతో; ఒసఁగిరి= ఇచ్చారు.

తాత్పర్యం: పరమేశ్వరుడు ఉదయభానుడికి సమానమైన కాంతిని, ఇంద్రుడు రాక్షసులను నాశనం చేయగల పరిపక్వమయిన శక్తిని, విష్ణుడు బలమును పెంచే వనమాలను, పార్వతి ఏవేళలోనూ నాశనం కాని తెల్లపట్టు వస్త్రాల జతను, గంగాదేవి ప్రకాశవంతమయినదీ, అమృతంతో నిండినదీ ఐన కమండలాన్నీ, బృహస్పతి వెలుగు దండాన్నీ, గరుడుడు మహిమగల నెమలిని, వరుణుడు ఉదారరూపమైన కుక్కుటమునూ, కుబేరుడు పొగరుబోతు మేకను, స్రష్ట అందమైన జింకతోలును సాటిలేని యుద్ధవిజయాన్నీ ఆ షణ్ముఖుడికి ప్రేమతో ఇచ్చారు.

వ. **ఇట్లు సిద్ధస్వరూపదీపితుం డైన యతని నాపోవక చూచుచు శంకరుండు 'వీని కీ విభవంబునకు ననాయాసంబున నమరవిరోధి నాశంబు గావించుటకు వలయు' నని తలంచి భూతమయం బగు మహాసైన్యంబు సమర్పించె; నప్పు డింద్రాదిబృందారకులు నిజబలసందోహంబులతో నాబర్హివాహనుఁ బరివేష్టించిరి; శంఖభేరీపణవగోముఖ ప్రముఖతూర్యంబులు దిక్కులు పిక్కటిల్లఁ జెలంగె; నట్లు మహతి యగు దేవసేనకుఁ బతియై యమ్మహాసేనుండు సురముఖ్యులఁ జూచి 'మీ కెవ్వరి నేనియుం జంపను జెఱుపను వలసియున్నది యట్టిబల్లిదంపుఁ బగఱం బరిమార్చెద' నని వరం బిచ్చిన వారలు బహుప్రమోదంబు నొందిరి; సేన యార్చినఁ ద్రిలోకంబులు నాదమయంబు లయ్యెఁ; నవ్విధంబున విశాఖుని నుత్తమపదస్థునిఁ గావించి విరించి వైకుంఠ శ్రీకంఠులు నిజేచ్ఛఁ జనిరి; పదంపడి యగ్గుహుండు దేవతలు తారకాసురునివలన నలంగి యునికి యెఱింగి.** **185**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సిద్ధస్వరూప దీపితుండు+ఐన= స్వభావసిద్ధంగా ప్రకాశించే ఆకృతికలవాడైన; అతనిన్= ఆ ఆరుమొగాలవాడిని; ఆపోవక= తృప్తినందకుండా; చూచుచున్= చూస్తూ; శంకరుండు= పరమేశ్వరుడు; వీనికిన్+ఈ విభవంబునకున్= ఈ బాలకుడికి ఈ ఐశ్వర్యం; అనాయాసంబునన్= సుఖంగా; అమర విరోధినాశంబుకావించుటకున్= దేవతల శత్రువులను చంపటానికి; వలయునని తలంచి= అవసరమని భావించి; భూతమయంబు+అగు= ప్రమథ గణాలతో నిండిన; మహాసైన్యంబును= పెను సేనను; సమర్పించెన్= ఇచ్చాడు; అప్పుడు= ఆ సమయంలో; ఇంద్ర+ఆది బృందారకులు= ఇంద్రుడు మొదలైన దేవతలు; నిజ బల సందోహంబులతోన్= తమ సేనాసమూహాలతో; ఆ బర్హివాహనున్+పరివేష్టించిరి= ఆ నెమలి వాహనంగా కలవాడిని - కుమారస్వామిని చుట్టుకొనినారు; శంఖ= శంఖం; భేరీ= నగారాలు; పణవ= ఉడుక; గోముఖ ప్రముఖ తూర్యంబులు= ఆవు మొగంవంటి తూర్య నాదవాద్యాలు; దిక్కులు పిక్కటిల్లన్+చెలంగెన్= దిక్కులు నిండగా మ్రోగాయి; అట్లు= ఆ విధంగా; మహతి+అగు= గొప్పదైన; దేవసేనకున్= సురసేనకు; పతి+ఐ= నాయకుడై; ఆ+ మహాసేనుండు= ఆ కుమారస్వామి; సురముఖ్యులన్+చూచి= దేవతలలో ముఖ్యులయిన వారిని చూచినవాడై; మీకున్; ఎవ్వరిని+ఏనియున్= ఎవరినైనా; చంపన్+చెఱుపనున్ వలసిఉన్నది= చంపటం, పాడుచేయటం కావలసిఉన్నది; అట్టి= అటువంటి; బల్లిదంపు+పగఱన్= బలవంతు లైన శత్రువులను; పరిమార్చెదను అని వరంబు+ఇచ్చినన్= చంపెద నని వరము నొసగగా; వారలు= ఆ దేవతలు; బహుప్రమోదంబున్+ఒందిరి= మిక్కిలి సంతోషించారు; సేన= సైన్యం; ఆర్చినన్= సింహనాదం చేయగా; త్రిలోకంబులు= ముల్లోకాలు; నాదమయంబులు+అయ్యెన్= శబ్దాలతో నిండింది; ఆ+విధంబునన్= ఆ ప్రకారంగా; విశాఖునిన్= ఆరుమొగాల వాడిని (విశాఖా నక్షత్రంలో పుట్టినవాడిని); ఉత్తమపదస్థునిన్+కావించి= గొప్ప పదవిలో నిలిపి; విరించి= బ్రహ్మ; వైకుంఠ= విష్ణుడు; శ్రీకంఠులు= గరళకంఠుడును; నిజ+ఇచ్చన్+చనిరి= తమ కిష్టమయిన చోటులకు వెళ్ళారు; పదంపడి= ఆ మీదట; ఆ+గుహుండు= ఆ సుబ్రహ్మణ్యుడును; దేవతలు= దేవతలును; తారక+అసురని వలనన్= తారకుడనే రాక్షసుడి మూలాన; నలంగి+ఉనికి= బాధపడి ఉండటం; ఎఱింగి= తెలిసికొని.

తాత్పర్యం: ఈ విధంగా నిజరూపంతో వెలుగుతున్న వాడిని వదలకుండా చూచిన శివుడు 'ఈతడికి ఈ వైభవంతో సుఖంగా శ్రమలేకుండా రాక్షసవినాశం చేయటానికి సాధ్య మవుతుంది.' అని యోచించి ప్రమథగణాలతో నిండిన మహాసేనను ఇచ్చాడు. అపుడు ఇంద్రుడు మొదలైన దేవతలు తమ బలాలతో నెమలివాహనంగా కలిగిన కుమారస్వామి చుట్టూ చేరారు. శంఖం, భేరి, పణవం, గోముఖం మొదలైన తూర్య శబ్దాలు దిక్కులనిండా వ్యాపించాయి. అటువంటి శక్తిమంతమైన సురసైన్యానికి నాయకుడుగా ఆ మహాసేనుడు దేవతలను చూచి 'మీ రెవరినైనా చంపటంగాని, నాశనం చేయటంగానీ చేయవలసి ఉన్నదా? అటువంటి బలవంతు లైన శత్రువులను నాశనం చేస్తాను.' అని మాట ఇచ్చాడు. వా రంతా చాలా ఆనందించారు. సేన చేసిన సింహనాదానికి ముల్లోకాలు నాదమయము లయ్యాయి. ఆ విధంగా విశాఖుడిని ఉన్నత స్థానంలో నిలిపి బ్రహ్మ విష్ణు శివులు తమకు నచ్చిన చోటులకు వెళ్ళారు. ఆపై షణ్ముఖుడు దేవతలు తారకుడివలన బాధపడటం తెలిసికొని. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. బలయుతముగ నడచిన న । బ్బలియుండు ననేకదైత్యబలములతో న
గ్గలిక నెదురు నడచెను ద । ద్బలయుగమున కక్కజంపు భండన మయ్యెన్. 186

ప్రతిపదార్థం: బలయుతముగన్ నడచినన్= సేనలతో నడువగా; ఆ+బలియుండు= ఆ బలవంతుడు(తారకుడు); అనేక దైత్యబలములతోన్= అనేక రాక్షసబలాలతో; అగ్గలికన్= శౌర్యంతో; ఎదురు నడచెను= ఎదురువెళ్ళాడు; తద్+బలయుగమునకు= ఆ ఇరుసేనలకు; అక్కజంపు భండనము+అయ్యెన్= ఆశ్చర్యమును కల్గించే యుద్ధమైనది.

తాత్పర్యం: బలయుతుడై ఆ కుమారస్వామి నడవగా - ఆ బలవంతు డైన తారకుడు పలువురు రాక్షస సైనికులతో శౌర్యంతో ఎదురువెళ్ళాడు. ఆ సేనలు రెంటికి ఆశ్చర్యం కల్గించే యుద్ధం జరిగింది.

కుమారస్వామి తారకాసురుం జంపి దేవతలకు ముదంబు సేయుట (సం. 9-45-63)

వ. అట్టియెడ. 187

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయాన.

తాత్పర్యం: ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. తనదొరలుఁ దాను దారక । దనుజేంద్రుఁడు గార్తికేయుఁ దాఁకిన నమృతా
శన గణ సమ్మదసంపా । దనుఁ డగుచును శక్తి యతఁడు ధరియించె నృపా! 188

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; తన దొరలున్+తానున్= తాను, తన రాజులును; తారక దనుజేంద్రుఁడు= తారకు డనే రాక్షసరాజు; కార్తికేయున్+తాఁకినన్= షణ్ముఖుడిని ఎదుర్కొనగా; అమృత+అశన గణ= దేవసమూహములకు; సమ్మదసంపాదనుఁడు+ అగుచును= సంతోషాన్ని కలిగించేవాడగుతూ; అతఁడు= షణ్ముఖుడు; శక్తి ధరియించెన్= శక్త్యాయుధాన్ని ధరించాడు.

తాత్పర్యం: తారకాసురుడు తన రాజులతో కుమారస్వామిని ఎదుర్కొన్నాడు. అమృతాహారులయిన దేవతలకు సంతోషంగా నా ఆరుమొగాలదేవుడు శక్త్యాయుధాన్ని పూనాడు.

వ. అమ్మహనీయసాధనంబున ననేకకోటిశక్తు లుద్భవించి నానాదానవప్రకరంబుల బడలువడం జేసి, యుల్కాసహస్రంబుల పిడుగులతండంబుల మ్రోఁతచందంబున విరావం బావహిల్ల నది ప్రయోగించి యమ్మహాత్ముండు మహిషత్రిపాదభృతోదరు లను దనుజసేనాపతులం బొలియింప నిలింపసైన్యంబులు సంరంభంబున దైత్యబలంబులం దెగటార్చె; నక్కుమారుండు ప్రయోగింప నాశక్తి పగతురం బిలుకుమార్చి క్రమ్మఱఁ గరతలంబునకు వచ్చు చుండె; నత్తారకుం డట్లు దమవారు సమసిన సక్రోధుండై యగ్గుహునిఁ గిట్టి బెట్టిదం బగు నతని శక్త్యస్త్రంబులతాఁకునం బడియె; నిట్లు జయంబు సేకొని యక్కార్తికేయుండు వెలింగె; విబుధులు ప్రమోదంబు నొందిరి; పదంపడి. 189

ప్రతిపదార్థం: ఆ+మహనీయ సాధనంబునన్= ఆ మహత్త్వంగల ఆయుధంతో; అనేక కోటిశక్తులు+ఉద్భవించి= ఎన్నోకోట్ల ప్రాణులు (శక్తిమంతమైనవి) పుట్టి; నానాదానవ ప్రకరంబులన్= అనేక రాక్షస సమూహాలను; బడలు+పడన్+చేసి= అలసిపోయేటట్లు కావించి; ఉల్కా సహస్రంబులు+పిడుగుల+తండంబుల+మ్రోఁతచందంబునన్= అగ్ని గోళాలను పిడుగులగుంపుల శబ్దంమాదిరిగా; విరావంబు+ఆవహిల్లన్= గొప్ప శబ్దం క్రమ్ముకోగా; అది ప్రయోగించి= ఆ శక్తిని ప్రయోగించి; ఆ+మహాత్ముండు= ఆ శక్తిమంతుడైన కుమారస్వామి; మహిష+త్రిపాదభృత+ఉదరులు= మహిషుడు, త్రిపాదభృతోదరుడు; అను= అనే పేరున్న; దనుజసేనాపతులన్+పొలియింపన్= రాక్షస సేనా నాయకులను చంపగా; నిలింప సైన్యంబులు= దేవసేనలు; సంరంభంబునన్= ఉత్సాహంతో; దైత్యబలంబులన్+తెగటార్చెన్= రాక్షససేనలను నాశం చేశాయి; ఆ+కుమారుండు ప్రయోగింపన్= ఆ కుమారస్వామి వేయగా; ఆ శక్తి= ఆ శక్త్యాయుధము; పగతురన్+పిలుకుమార్చి= విరోధులను చంపి; క్రమ్మఱన్= మరల; కరతలంబునకున్= చేతిలోనికి; వచ్చుచుండెన్= వస్తూ ఉండినది; ఆ+తారకుండు= ఆ తారకాసురుడు; అట్లు= ఆ విధంగా; తమవారు= తన

వైపు ఉన్నవారు; సమసినన్= చనిపోగా; ఆ+గుహునిన్+కిట్టి= ఆ కుమారస్వామిని సమీపించి; బెట్టిదంబు+అగు+అతని= బలముగలదయిన అతడి; శక్త్యస్త్రంబుల తాఁకునన్+పడియెన్= శక్త్యాయుధాల దెబ్బకు చనిపోయాడు; ఇట్లు జయంబు+చేకొని= ఈ విధంగా విజయాన్ని పొంది; ఆ కార్తికేయుండు= ఆ కుమారస్వామి; వెలింగెన్= ప్రకాశించాడు; విబుధులు= దేవతలు; ప్రమోదంబున్+ఒందిరి= సంతోషించారు; పదంపడి= ఆ మీదట.

తాత్పర్యం: భయంకరమైన మహత్త్వశక్తిగల ఆ అస్త్రం నుండి అనేక కోట్ల శక్తులు పుట్టి, నానా రాక్షస సమూహాలను అలయజేశాయి. ఆ శక్తినుండి అనేకాగ్నిగోళాల పిడుగుల గుంపుమ్రోత క్రమ్ముకోగా అది ఎందరో దానవసేనానాయకులను హతమార్చింది. దేవసేనలు ఉత్సాహంతో రాక్షససేనలను తెగటార్చాయి. ఆ బాలుడు శక్త్యాయుధాన్ని వేయగా అది శత్రువులను రూపుమాపి, తిరిగి అతడి చేతిలోనికి వస్తూ ఉన్నది. ఆ విధంగా తనవారు చావగా తారకుడు కోపంతో ఆ గుహుడిని తాకి, బలయుతమైన అతడి శక్త్యాయుధపు దెబ్బకు పడిపోయాడు. ఆ కార్తికేయుడు విజయంతో వెలిగాడు. దేవతలంతా ఆనందించారు. ఆ మీదట. (తరువాతి పద్యంతో అన్వయం).

క. బలికొడుకు బాణుఁ డనియెడు । బలవదసురవల్లభుండు బాధించు నను
ర్త్యులఁ గ్రౌంచపర్వతాశ్రయ । బలిష్ఠుఁ డయి జగము లెల్ల భయముం బొందన్. 190

ప్రతిపదార్థం: బలి కొడుకు= బలిచక్రవర్తి కుమారుడు; బాణుఁడు+అనియెడు బలవత్+అసురవల్లభుండు= బాణు డనే పేరున్న బలవంతుడైన రాక్షసరాజు; క్రౌంచపర్వతాశ్రయ బలిష్ఠుఁడయి= క్రౌంచపర్వతం స్థావరంగా బలవంతుడై; జగములు+ ఎల్లన్ భయము+అందన్= లోకాలంతా భయమందగా; అమర్త్యులన్= దేవతలను; బాధించున్= కష్టపెట్టుతాడు.

తాత్పర్యం: బలిచక్రవర్తి కుమారుడు బాణుడనే పేరు కలవాడు బలవంతుడైన రాక్షసరాజు. క్రౌంచపర్వతం తన ఉనికిగా చేసికొని, లోకభయంకరుడుగా దేవతలను బాధపెట్టుతూ ఉన్నాడు.

వ. దానిని విని యమ్మహాసేనుండు. 191

ప్రతిపదార్థం: దానిన్+విని= ఆ విషయమును విని; ఆ+మహాసేనుండు= ఆ కుమారస్వామి.

తాత్పర్యం: ఆ వృత్తాంతాన్ని వినిన కుమారస్వామి. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. కడిమిం బోయి మహోగ్రశక్తినిహతిం గ్రౌంచంబు భేదించి యె
క్కుడు గర్వంబున వచ్చి మార్కొనిన రక్షోనాథుఁ దత్సైన్యముం
గడు వేగంబున రూపుమాపి మునిసంఘంబుల్ ప్రశంసింపఁ బె
ల్లడరన్ నిర్జరదుందుభిధ్వనులు పుష్పాసార మొప్పారఁగన్. 192

ప్రతిపదార్థం: కడిమిన్+పోయి= పరాక్రమంతో వెళ్ళి; మహోగ్రశక్తి నిహతిన్+క్రౌంచంబున్+భేదించి= మహాభయంకరమైన శక్త్యాయుధపు దెబ్బతో క్రౌంచపర్వతాన్ని చీల్చి; ఎక్కుడు గర్వంబునన్ వచ్చి= మిక్కిలి అహంకారంతో వచ్చి; మార్కొనినన్= ఎదుర్కొనగా; రక్షస్+నాథున్= రాక్షసరాజును(బాణుని); తద్+సైన్యమున్= వాని సేనను; కడు వేగంబునన్+రూపుమాపి= మిక్కిలి తొందరగా నాశనంచేసి; మునిసంఘంబుల్= తాపసిసమూహాలు; ప్రశంసింపన్= పొగడగా; నిర్జర= దేవతల; దుందుభిధ్వనులు= భేరీ శబ్దాలు; పెల్లు+అడరన్= మిక్కిలి వ్యాపించగా; పుష్ప+ఆసారము+ఒప్పారఁగన్= పూలవాన శోభించగా (కురియగా).

తాత్పర్యం: రాక్షసరాజు (బాణుడు) పరాక్రమంతో పోయి భయంకరమైన శక్తిగల కత్తివేటుతో క్రౌంచపర్వతాన్ని చీల్చాడు. ఎక్కువ గర్వంతో వచ్చిన ఆ రాక్షస రాజును, వాడి సేనను మునులందరూ తనను పొగడగా, దేవదుందుభులు ఎక్కువగా మ్రోగగా, పూలవాన కురియగా మిగుల వేగంగా కుమారస్వామి నాశనం చేసి - (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. త్రిభువనానందకరుం డై విజయవిభవాతిశయంబున నొప్పె; ని ట్లఖిలలోక సంభావనీయం బగు షణ్ముఖచరితంబు లాకర్ణించి కృతార్థుండ వైతి; కౌరవాన్వయపావన! యాబలదేవువృత్తాంతంబు కొంఱంత విను; మతం డత్తీర్థంబునఁ బ్రతిష్ఠితుండైన కుమారునకుఁ బ్రదక్షిణప్రణామంబు లాచరించి యందలిపెద్దలు కుమరాభిషేకంబు సెప్పఁ జెవులపండువు సేసి. 193

ప్రతిపదార్థం: కౌరవ+అన్వయపావన!= కురువంశంలో పవిత్రుడైనవాడా! జనమేజయా!; త్రిభువన+ఆనందకరుండు+ఐ= ముల్లోకాలకు సంతోషం కల్గించినవాడై; విజయవిభవ+అతిశయంబునన్= గెలుపువలని వైభవంయొక్క ఆధిక్యంతో; ఒప్పెన్= ఒప్పి ఉన్నాడు; ఇట్లు+అఖిలలోక సంభావనీయంబు+అగు= ఈ విధంగా అన్ని లోకాలలోను పొగడదగినదైన; షణ్ముఖచరితంబులు+ఆకర్ణించి= ఆరు మొగాల వాడి కథలు విని; కృతార్థుండవు+ఐతి(వి)= ధన్యుడవైనావు; ఆ బలదేవు వృత్తాంతంబు కొంఱంత వినుము= ఆ బలరాముడి గాథను మిగిలిన దానిని వినుము; అతండు= ఆ బలరాముడు; ఆ+ తీర్థంబునన్= ఆ సరస్వతీ తీర్థంలో; ప్రతిష్ఠితుండు+ఐన= నిలుపబడినవాడయిన; కుమారునకున్= కుమారస్వామికి; ప్రదక్షిణ ప్రణామంబులు+ఆచరించి= ప్రదక్షిణనమస్కారాలు చేసి; అందలి పెద్దలు= అక్కడున్న పెద్దవారు; కుమార+అభిషేకంబు+ చెప్పన్= కుమారస్వామి పట్టాభిషేకాన్ని గూర్చి చెప్పగా; చెవులపండువు+చేసి= ఇంపుగా విని.

తాత్పర్యం: ఈ విధంగా ముల్లోకాలకు సంతోషం కల్గించిన వాడై విజయైశ్వర్యంతో ఉన్నాడు. సమస్త లోకాలూ గౌరవించవలసిన ఆ ఆరుమొగాల వాడి గాథలు విని ధన్యుడవైనావు. ఓ కురువంశపావనా! ఆ బలరాముడి కథను మిగిలిన దానిని వినుము. ఆత డా తీర్థంలో నిలుపబడిన కుమారస్వామికి ప్రదక్షిణపూర్వక నమస్కారాలను చేసి అక్కడి పెద్దలయినవారు కుమారస్వామి పట్టాభిషేకాదులను గూర్చి చెప్పగా చెవులకు ఇంపుగా విని.

ఆ. అగ్నితీర్థమునకు నరిగె; నయ్యెడఁ దొల్లి । యగ్ని డాఁగియున్న నమరు లచటి
కేఁగుదెంచి కాంచి; రిద్ధశమీగర్భ । లీనుఁ డైన యతని మానవేంద్ర! 194

ప్రతిపదార్థం: మానవేంద్ర!= ఓ రాజా!; అగ్నితీర్థమునకున్= అగ్నితీర్థానికి; అరిగెన్= వెళ్ళాడు; తొల్లి= పూర్వం; అగ్ని= అగ్నిదేవుడు; డాఁగిఉన్నన్= దాగికొని ఉండగా; అమరులు= దేవతలు; అచటికిన్+ఏఁగుదెంచి= ఆ చోటికి వచ్చి; ఇద్ధశమీ గర్భలీనుఁడు+ఐన= ప్రకాశిస్తున్న జమ్మికడుపున అణగి ఉన్న; అతనిన్= ఆ అగ్నిని; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: అగ్నితీర్థం చాలా పవిత్రమైనదని విని బలరాముడు అక్కడకు వెళ్ళాడు. పూర్వం అగ్నిదేవుడు అందులో దిగి ఉండగా, దేవతలందరునూ అక్కడకు వచ్చారు. ప్రకాశిస్తున్న జమ్మిచెట్టు కడుపులో లీనమైన అతడిని చూచారు.

వ. భృగుశాపంబునం బ్రాపించు సర్వభక్షకత్వంబునకుఁ జాకల తొలంగిన యగ్నిదేవు నట్లు గని బ్రహ్మాదిదేవత లమ్మునివచనం బమోఘంబు గావున నీవు సర్వభక్షకుం డయ్యు మాలో నగ్రపూజ్యుండ వని యొడంబఱిచి నిజస్థానంబునకుం జనునప్పు డత్తీర్థంబు పరమపావనం బని తజ్జలంబులఁ గృతస్నాను లైరి; యందుండి

యాసీరి కౌబేర తీర్థంబునకుం జనియె; నది కుబేరుండు తపంబు సేసి ధనాధిపత్యంబు మొదలైనవరంబులు వడసినచో; టయ్యెడఁ గదలి యతండు. 195

ప్రతిపదార్థం: భృగుడిశాపంబునన్= భృగుమహర్షి శాపంచేత; ప్రాపించు= సిద్ధించు; సర్వభక్షకత్వంబునకున్= అన్నిటినీ తినే దానికి; చాలక= సరిపోక (చాలకుండా); తొలంగిన+అగ్నిదేవునట్లు కని= తప్పుకొన్న అగ్నిదేవుడిని ఈ విధంగా ఉండగా చూచి; బ్రహ్మఆదిదేవతలు= బ్రహ్మమొదలయిన దేవతలందరూ; ఆ+మునివచనంబు+అమోఘంబు+కావునన్= ఆ తాపసి మాటలు వ్యర్థంకానివి కనుక; నీవు సర్వభక్షణుండు+అయ్యున్= అన్నిటినీ తినేవాడవైనప్పటికిని; మాలోన్= మాలో; అగ్రపూజ్యుండవు= తొలుత పూజించతగినవాడవు; అని= అంటూ; ఒడంబఱిచి= ఒప్పించి; నిజస్థానంబునకున్= తన చోటికి; చనునప్పుడు= వెళ్ళేటప్పుడు; ఆ తీర్థంబు పరమపావనంబు+అని= ఆ తీర్థం చాలా పవిత్రమైనదంటూ; తద్+జలంబులన్= ఆ నీటిలో; కృతస్నానులు+ఐరి= స్నానం చేశారు; అందుండి= అక్కడినుండి; ఆ సీరి= ఆ బలరాముడు; కౌబేర తీర్థంబునకున్+చనియెన్= కుబేరతీర్థానికి వెళ్ళాడు; అది= ఆచోటు; కుబేరుండు+తపంబుచేసి= కుబేరుడు తపస్సు చేసి; ధన+ఆధిపత్యంబున్= ధనంమీద అధిపతిత్వాన్ని; వడసినచోటు= (వరంగా) పొందినచోటు; ఆ+ఎడన్+కదలి= ఆచోటునుండి కదలి; ఆతండు.

తాత్పర్యం: భృగుడిశాపం వలన కలిగే సర్వభక్షకత్వమునకు ఓర్వని దాగి ఉన్న అగ్నిదేవుడిని చూచి బ్రహ్మాది దేవతలు 'ఆ మునిమాటలు అమోఘమయినందువలన నీవు అన్నింటిని తినేవాడవైనా మాలో తొలుత పూజించదగినవాడవు' అని ఒప్పించి తమ తమ చోటులకు వెళ్ళారు. తమ చోటులకు వెళ్ళేటపుడు ఆ తీర్థం పరమపవిత్రమయినదని అంటూ ఆ నీటిలో స్నానమాడారు. బలరాము డక్కడినుండి కుబేరతీర్థానికి వెళ్ళాడు. అది కుబేరుడు తపస్సు చేసినందున ఐశ్వర్యాధిపత్యం మొదలయిన వరాలు పొందినచోటు. ఆ చోటునుండి అతడు ముందుకు సాగాడు.

ప్రభావతి యను మునికన్యక మహిమాభివర్ణనము (సం. 9-47-2)

సీ. **బదరిపాచన నామ పరమతీర్థమునకుఁ । జనియె; భరద్వాజతనయ తొల్లి**
యచటఁ బ్రభావతి యనునది యింద్రుండు । పతి గాఁగఁ గోరి తపంబు సేయ
నతఁడు వసిష్ఠునాకృతి దాల్చి వచ్చిన । నయ్యింతి యర్ఘ్యపాద్యాదు లిచ్చి
భక్తితోఁ జేరి 'మత్పాణి శక్రున కిచ్చు । దాన; నప్పూనిక మానఁ గాని

తే. **వలయుపనిఁ బంపుఁ' డన్న నవ్వొలయ నమ్మ । హాత్ముఁ 'డది యట్ల యగుఁ గాని యతివ! వీనిఁ**
బక్వములు సేయు' మని కొన్ని బదరిఫలము । లా నితంబినిచే నిచ్చి యవుల నుండ. 196

ప్రతిపదార్థం: బదరిపాచన నామ పరమతీర్థమునకున్+చనియెన్= బదరి పాచనమనే శ్రేష్ఠమైన తీర్థానికి వెళ్ళాడు; తొల్లి= పూర్వం; అచటన్= ఆ చోటులో; భరద్వాజ తనయ= భరద్వాజుడి కొమార్తె; ప్రభావతి+అనునది= ప్రభావతి అనే ఆమె; ఇంద్రుండు+పతి+కాఁగన్+కోరి= ఇంద్రుడిని భర్తగా కోరి; తపంబు+చేయన్= తపస్సు చేయగా; అతఁడు= ఆ ఇంద్రుడు; వసిష్ఠ+ఆకృతి తాల్చి వచ్చినన్= వసిష్ఠుడి వేషంలో రాగా; ఆ+ఇంతి= ఆ స్త్రీ (భరద్వాజుడి కూతురు); అర్ఘ్యపాద్య+ఆదులు+ ఇచ్చి= అర్ఘ్యం పాద్యం మొదలైన సంప్రదాయబద్ధమైన స్వాగతములిచ్చి; భక్తితోన్+చేరి= భక్తితో దగ్గరకు వెళ్ళి; మత్పాణి= నా చేతిని; శక్రునకున్+ఇచ్చుదానన్= ఇంద్రుడికిస్తాను; ఆ+పూనిక మానన్= ఆ ప్రయత్నం వదలను; కాని= కానైతే; వలయుపనిన్= అవసరమైన పనిని; పంపుఁడు= ఆనతివ్వండి; అన్నన్= అనగా; నవ్వు+ఒలయన్= నవ్వు జనించగా; ఆ+

మహాత్ముఁడు= ఆ మహనీయుడు; అది అట్ల+అగున్+కాని= ఆ పని అట్లే అవుతుంది కాని; అతివ!= ఓ స్త్రీ!; వీని పక్వములు చేయుము+అని= వీటిని పరిపాకం చెందే విధంగా చేయుము అని; కొన్ని బదరిఫలములు= కొన్ని రేగుపండ్లు; ఆ నితంబిని చేన్+ఇచ్చి= ఆ స్త్రీ చేతి కిచ్చి; అవులన్+ఉండన్= దూరంగా ఉండగా.

తాత్పర్యం: బదరిపాచనం అనే పవిత్రమయిన తీర్థానికి వెళ్ళాడు. అది పావన తీర్థ మనీ పూర్వ మచట భరద్వాజుడి కూతురు ప్రభావతి అనే పేరుగలఆమె ఇంద్రుడిని భర్తగా కోరి తపస్సు చేయగా ఇంద్రుడు వసిష్ఠుడి వేషంతో వచ్చాడు. ఆ స్త్రీ అర్ఘ్యపాద్యాదు లిచ్చింది. భక్తితో ఆతడి వద్దకు వెళ్ళి 'నా చేతిని ఇంద్రుడికే ఇస్తాను, ఆ ప్రయత్నం మానుకోను. అయితే మీకు కావలసిన పనికి నన్ను వినియోగించుకొనండి'. అన్నది. అది విని, ఇంద్రుడు 'అట్లే కానిమ్ము' అని ఆమె చేతికి కొన్ని రేగుపండ్లు ఇచ్చి వాటిని పక్వమయ్యేటట్లు చేయుమని అడిగి దూరంగా ఉన్నాడు.

వ. అదియును గృతస్నానయుఁ గలితధౌతపరిధానయు నై ప్రాయి నగ్ని రాజఁబెట్టి యాఫలంబులు జలంబులతోడఁ గూడ నెక్కించి వండుచుండ నవి పాకంబునకు రాకయుండ వెండియుఁ దన సవరించిన కాష్ఠంబులు గ్రమంబున నిడి యనలంబు ప్రబలంబు సేయఁ గాష్ఠంబులు సమసెఁ గాని యారేఁగుఁబం డ్లురియవయ్యెఁ; గాష్ఠంబులు గలయెడకుం బోయి తెచ్చునంత కగ్ని యాఱెనేని దుష్పాకం బగు నని యా మగువ తనకా లింధనంబుగా నిడి పాకంబు సేయఁ గనుంగొని పాకశాసనుం డచ్చెరువొంది ప్రత్యక్షంబై 'శుభాంగి! నీదు నిష్ఠాతిశయంబునకు మెచ్చితి. భవదభిమతం బిచ్చితిని. తనువు విడిచి త్రిదివమ్మునకు రమ్ము. సర్వపాపహరం బైన యీ తీర్థంబు లోకత్రయప్రఖ్యాతం బయ్యెడు' మనియె. నమ్మహాభాగయు నాసుమనోవిభునకు మనోరమ యై వెలసె; నట్టి బదరిపాచనంబుననుండి. 197

ప్రతిపదార్థం: అదియును= ఆ భరద్వాజుడి కూతురును; కృతస్నానయున్= స్నానంచేసినదియు; కలితధౌతపరివిధానయున్+ఐ= ఉతికిన(మడుగు)చీరను కట్టుకొన్నదై; ప్రాయిన్+అగ్ని రాజన్+పెట్టి= పొయ్యిలో నిప్పును ముట్టించి మండజేసి; ఆ ఫలంబులు= ఆ రేగుపండ్లు; జలంబులతోడన్= నీటితోకూడా; ఎక్కించి= పొయ్యిమీద కెక్కించి; వండుచుండన్= వంట చేస్తూఉండగా (ఉడికిస్తుండగా); అవి పాకంబునకున్ రాకఉండన్= ఆ పండ్లు పరిపక్వమైన స్థితికి రాకుండా ఉండగా; వెండియున్= ఇంకను; తన సవరించిన కాష్ఠంబులు= తాను సరిచేసిన కట్టెలు; క్రమంబునన్= వరుసగా; ఇడి= (పొయ్యిలో) ఉంచి; అనలంబున్= నిప్పును; ప్రబలంబుచేయన్= ఎక్కువ మండేటట్లు చేయగా; కాష్ఠంబులు= కట్టెలు; సమసెన్+కాని= అయిపోయాయి కాని; ఆ రేగుపండ్లు+ఉరియవు+అవయ్యెన్= ఆ రేగుపండ్లు ఉడకలేదు; కాష్ఠంబులు+కల+ఎడకున్+పోయి= కట్టె లున్నచోటికి పోయి; తెచ్చునంతకున్= తెచ్చేసరికి; అగ్ని ఆఱెను+ఏని= నిప్పు చల్లారిపోతే; దుష్పాకంబు+అగును+అని= చెడిన వంటఔతుందని; ఆ మగువ= ఆ స్త్రీ; తనకాలు+ఇంధనంబుగాన్+ఇడి= తనకాలినే కట్టెగా చేసిపెట్టి; పాకంబు+చేయన్= వంట చేయగా; కనుంగొని= చూచి; పాకశాసనుండు+అచ్చెరువు+ఒంది= ఇంద్రు డబ్బురపడి; ప్రత్యక్షంబు+ఐ= కనబడి; శుభాంగి!= ఓ సుందరీ!; నీదునిష్ఠాతిశయంబునకున్ మెచ్చితి= నీ పట్టుదలకూ నియమానికీ మెచ్చుకొన్నాను; తనువు విడిచి= ఈ (మానవ) శరీరాన్ని వదలి త్రిదివంబునకున్+రమ్ము= స్వర్గానికి రమ్ము; సర్వపాపహరంబు+ఐ= అన్ని పాపాలను పోగొట్టునదై; ఈ తీర్థంబు= ఈ పవిత్రమయిన తీర్థం; లోకత్రయ ప్రఖ్యాతంబు+అయ్యెడున్= ముల్లోకాలలో ప్రసిద్ధినందుతుంది; అనియెన్= అన్నాడు; ఆ+మహాభాగయున్= ఆ మహానుభావురాలు కూడా; ఆ సుమనోవిభునకున్= ఆ దేవరాజునకు; మనోరమ ఐ= భార్యయై; వెలసెన్= ఒప్పింది; అట్టి బదరిపాచనంబుననుండి= అటువంటి బదరి పాచన పవిత్రతీర్థం నుండి.

తాత్పర్యం: ఆ భరద్వాజుడి కూతురు స్నానమాడి మడుగు వస్త్రాలను కట్టుకొని పొయ్యిలో నిప్పును రాజజేసి పండ్లను నీటితో కూడా పొయ్యిమీద కెక్కించి వండుతూ ఉండగా, అవి ఉడికి పాకానికి రాకుండినవి. ఇంకనూ తాను చక్కజేసిన కట్టెలను వరుసగా పెట్టి, నిప్పును ప్రబలం చేయగా కట్టె లైపోయినవి. కాని ఆ రేగుపండ్లు ఉడకలేదు. 'కట్టెలుండే చోటికి పోయి తెచ్చేలోపల నిప్పు ఆరిపోతే వంట చెడిపోతుంది.' అని ఆ స్త్రీ తన కాలినే వంటకట్టెగా పెట్టి వంట చేయటాన్ని చూచిన ఇంద్రుడు అబ్బురపడి ప్రత్యక్షమై 'సుందరీ! నీ నిష్ఠాతిశయానికి సంతోషించాను. నీకోర్కెను తీరుస్తున్నాను. ఈ శరీరాన్ని వదలి దేవలోకానికి రమ్ము. పాపాలనంతా తొలగించే ఈ తీర్థం ముల్లోకాలలో కీర్తింపబడుతుంది.' అని అన్నాడు. ఆమెకూడా ఆ దేవరాజునకు భార్యగా ఒప్పారింది. అటువంటి బదరిపాచనం నుండి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. ఇంద్రతీర్థమునకు నేఁగె నా బలభద్రుఁ । డచట నూఱుక్రతువు లాచరించి
యనిమిషేశ్వరుండు గనియె శతక్రతుఁ । డనుప్రసిద్ధితోడ నతులపదము. 198

ప్రతిపదార్థం: ఆ బలభద్రుఁడు= ఆ బలరాముడు; ఇంద్రతీర్థమునకున్+ఏఁగెన్= ఇంద్రతీర్థానికి వెళ్ళాడు; అచటన్= ఆ తీర్థంలో; నూఱు క్రతువులు+ఆచరించి= నూరు యజ్ఞాలు చేసి; అనిమిష+ఈశ్వరుండు= దేవరాజు; శతక్రతుఁడు= నూరుయాగాలు చేసినవాడు; అను ప్రసిద్ధితోడన్= అనే కీర్తితో; అతులపదము= సాటిలేని స్థానాన్ని; కనియెన్= పొందాడు.

తాత్పర్యం: ఆ తరువాత బలరాముడు ఇంద్రతీర్థానికి వెళ్ళాడు. ఆ తీర్థంలో ఇంద్రుడు నూరుయాగాలు చేసి శతక్రతుడనే కీర్తితోపాటు సాటిలేని పదవిని పొందాడు.

వ. అచ్చోటు గదలి హలాయుధుండు రామతీర్థంబునకుం బోయెఁ; బలుమాఱు రాజుల నెల్లను బొరిగొని పరశురాముం డతృప్తుండై ప్రాయశ్చిత్తంబుగా నయ్యెడఁ గశ్యపు నుపదర్శనంబున రాజసూయంబులు నశ్వమేధంబులు వాజపేయంబులు ననేకంబు లొనర్చి యమ్మునీంద్రునకు దక్షిణ సమస్తక్షోణియు నొసంగె; నందుండి యయ్యేకకుండలుండు యామునంబునకుం జనియె; నది వరుణుండు రాజసూయంబులు సేసినప; ట్టయ్యధ్వరంబు నవసానంబున దేవాసురులకు సకలభూతసంక్షయకరం బగు చున్న సంగరంబు ప్రవర్తించె. 199

ప్రతిపదార్థం: ఆ+చేటున్+కదలి= ఆ చోటునుండి వెడలిపోయి; హలాయుధుండు= బలరాముడు; రామతీర్థంబునకున్+పోయెన్= రామతీర్థానికి వెళ్ళాడు; పలుమారు రాజులన్+ఎల్లను పొరిగొని= పలుమార్లు రాజులనంతా హతమార్చి; పరశురాముండు+ అతృప్తుండు+ఐ= పరశురాముడు సంతోషపడకుండా; ప్రాయశ్చిత్తంబుగాన్= చేసిన తప్పునకు శిక్షగా; ఆ+ఎడన్= ఆచోటులో; కశ్యపు+ఉపదర్శనంబునన్= కశ్యపుడి పర్యవేక్షణలో; రాజసూయంబులు= రాజసూయ యాగాలు; అశ్వమేధంబులు= అశ్వమేధయాగాలు; వాజపేయంబులు= వాజపేయ యాగాలు; అనేకంబులు+ఒనర్చెన్= చాలా చేశాడు; ఆ+మునీంద్రునకున్= ఆ ఋషీంద్రుడికి; దక్షిణ= దక్షిణగా; సమస్త క్షోణియున్= భూమినంతను; ఒసంగెన్= ఇచ్చాడు; అందుండి= అక్కడనుండి; ఆ+ఏకకుండలుండు= ఒకకుండలం గలవాడైన అతడు; యామునంబునకున్+చనియెన్= యామునతీర్థమునకు వెళ్ళాడు; అది వరుణుండు రాజసూయంబు చేసినపట్టు= ఆ చోటు వరుణుండు రాజసూయ యాగం చేసిన చోటు; ఆ+అధ్వరంబు+ అవసానంబునన్= ఆ యాగాంతమున; దేవ+అసురులకున్= దేవతలకు, రాక్షసులకును; సకల భూతసంక్షయకరంబు= సమస్త ప్రాణులకు నాశకరమైనది; అగుచున్న= జరుగుతున్న; సంగరంబు ప్రవర్తించెన్= యుద్ధం సాగినది.

తాత్పర్యం: బలరాము డా చోటునుండి కదలి రామతీర్థానికి వెళ్ళాడు. పరశురాముడు పెక్కుమార్లు రాజులను చంపికూడా తృప్తి పొందక ప్రాయశ్చిత్తంగా కశ్యపుడి పర్యవేక్షణలో రాజసూయ, అశ్వమేధ, వాజపేయాది యాగాలు చేసి, సమస్తభూమిని ఆ మునీంద్రుడికి దక్షిణగా ఇచ్చాడు. ఆ చోటునుండి ఏకకుండలుడైన బలరాముడు యాముని తీర్థమునకు వెళ్ళాడు. అది వరుణుడు రాజసూయ యాగం చేసిన చోటు. ఆ యజ్ఞం ముగిసేసమయంలో దేవతలకు- రాక్షసులకు సమస్త ప్రపంచనాశంకరమయిన యుద్ధం నడచింది.

ఆ. అచటు గదలి యాతఁ డాదిత్యతీర్థసం । సేవనమున కరిగె ధీవిశాల!
యందుఁ గ్రతు వొనర్చి యాదిత్యుఁ డుజ్జ్వల । జ్యోతిషాధిపత్యశోభి యయ్యె. 200

ప్రతిపదార్థం: ధీవిశాల!= మంచిబుద్ధిమంతుడా!; అచటుకదలి+ఆతఁడు= ఆ బలరాము డా చోటునుండి బయలుదేరి; ఆదిత్య తీర్థ సంసేవనమునకున్+అరిగెన్= ఆదిత్య తీర్థాన్ని సేవించటానికి వెళ్ళాడు; అందున్+క్రతువు+ఒనర్చి= అక్కడ యాగం చేసి; ఆదిత్యుఁడు= సూర్యుడు; ఉజ్జ్వల= ప్రకాశవంతమైన; జ్యోతిషాధిపత్య శోభి+అయ్యెన్= గ్రహాధిపత్యంచేత ప్రకాశించాడు.

తాత్పర్యం: బలరాము డాచోటునుండి వెళ్ళి సూర్యతీర్థాన్ని సేవించటానికి వెళ్ళాడు. సూర్యు డా చోట యాగం చేసి, ప్రకాశమానమైన గ్రహాధిపత్యాన్ని పొందాడు.

వ. ద్వైపాయనుండును శుకుండును గృష్ణుండును జైమినియు దేవల జైగీషవ్యాదు లగు నైష్ఠికు లనేకు లయ్యెడ నద్భుతయోగసిద్ధిం బొందిరి. 201

ప్రతిపదార్థం: ద్వైపాయనుండును= వ్యాసుడునూ; శుకుండును= శుకమహర్షియున్నూ; కృష్ణుండును= శ్రీకృష్ణుడునూ; జైమినియున్= జైమినిమునియునూ; మఱియును= ఇంకను; దేవల= దేవల ఋషియునూ; జైగీషవ్యాదులు+అగు= జైగీషవ్యుడూ మొదలైన; నైష్ఠికులు+అనేకులు= నిష్ఠగలవారు చాలమంది; ఆ+ఎడన్= ఆచోట(సూర్యతీర్థంలో); అద్భుతయోగస్థితిన్+పొందిరి= ఆశ్చర్యకరయోగ సిద్ధిని పొందారు.

తాత్పర్యం: వ్యాసుడూ, శుకుడూ, కృష్ణుడూ, జైమినీ, ఇంకా దేవలుడు, జైగీషవ్యుడు మొదలగు నిష్ఠాపరు లనేకులు అచ్చట అద్భుతమైన యోగసిద్ధిని పొందారు.

తే. అచటినుండి సారస్వత మను వసిష్ఠ । తీర్థమున కేఁగె నా బలదేవుఁ డధిప
యందుఁ దొల్లి నిష్ఠాతిశయంబుమై ద । ధీచి యనుముని నియమంబు లాచరించె. 202

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; అచటినుండి= ఆ సూర్యతీర్థంనుండి, సారస్వతము+అను= సారస్వతం అనేపేరుగల; వసిష్ఠతీర్థమునకున్= వసిష్ఠతీర్థానికి; ఆ బలదేవుఁడు= ఆ బలరాముడు; ఏఁగెన్= వెళ్ళాడు; అందున్= ఆ తీర్థంలో; నిష్ఠా+అతిశయంబుమైన్= మిక్కిలి శ్రద్ధతో; దధీచి అను ముని= దధీచి అనే పేరుగల ముని; నియమంబులు+ఆచరించెన్= నియమాలను పాటించాడు.

తాత్పర్యం: ఆ ఆదిత్య తీర్థంనుండి బలరాముడు సారస్వతమనే వసిష్ఠ తీర్థానికి వెళ్ళాడు. పూర్వ మా చోట దధీచి అనే ముని మిక్కిలి నియమంతో తపస్సు చేశాడు.

వ. ఆ నియమాచరణంబునకు నింద్రుండు శంకించి తద్విఘ్నకరణంబునకు నలంబుస యనునప్సరోవనితం బుత్తెంచినఁ దదీయదర్శనంబున నమ్ముని వీర్యంబు స్ఖలించిన దాని సరస్వతి గర్భంబుగా ధరియించి పుత్రుం గాంచి తపస్విజనగోష్ఠి నున్న యత్తపోధనుకడకుఁ దెచ్చి 'వీఁడు నీకొడుకు; భవత్తేజంబు వృథ వోనీక యేను వహించి కాంచితి; వీనిం గైకొను' మనిన నతండు వాని నెత్తికొని యాలింగనంబును మూర్ధఘ్రాణంబును జేసి యాసరిద్వర నాలోకించి 'నీవు బ్రహ్మసరస్సున జనియించితి; పుణ్యనదులయందు మేటి' వని సంస్తుతించి 'నీజలంబులం దర్పణంబు సేసిన విశ్వేదేవతలుఁ బితరులు గంధర్వులుఁ దృప్తులౌదు' రని యనుగ్రహించి 'యిక్కుమారుండు నీ పేర సారస్వతుం డనం బరఁగుఁ బదంపడి పండ్రెండేం డ్లనావృష్టి యైన నయ్యాపదఁ బొంద కుండఁ బెక్కండ్రు మునుల రక్షించి వేదాధ్యయనంబులు సేయించు' నని చెప్పి యొప్పగించిన సరస్వతి ప్రీత యై తనయుం గొని చనియె; నా కాలంబున. 203

ప్రతిపదార్థం: ఆ నియమ+ఆచరణంబునకున్= ఆ నియమాన్ని ఆచరించటానికి; ఇంద్రుండు శంకించి= ఇంద్రుడు అనుమానించి; తద్+విఘ్నకరణంబునకున్= ఆ దధీచి నియమానికి అడ్డు తగలటానికి; అలంబుస+అను+అప్సరస్+వనితన్+పుత్తెంచినన్= అలంబుస అనే అప్సరసను పంపగా; తదీయ దర్శనంబునన్= ఆమెను చూడటంచేత; ఆ+మునివీర్యంబు= ఆ దధీచి మునియొక్క వీర్యం; స్ఖలించినన్= జారగా; దానిన్= ఆ వీర్యమును; సరస్వతి గర్భంబుగాన్ ధరియించి= సరస్వతి తన కడుపులో మోసి; పుత్రున్+కాంచి= కొడుకును కని; తపస్విజన గోష్ఠిన్+ఉన్న= మునిజనుల గోష్ఠిలోనున్న; ఆ+తపోధనుకడకున్+తెచ్చి= ఆ తాపసివద్దకు తీసికొనివచ్చి; వీఁడు నీ కొడుకు= వీడు నీ కుమారుడు; భవత్+తేజంబు వృథపోనీక= నీ శక్తిని వ్యర్థం కానీయక; ఏను వహించి= నేను మోసి; కాంచితిన్= కన్నాను; కైకొనుము+అనినన్= తీసికొను మనగా; అతండు= ఆ దధీచి; వానిన్= ఆ బాలుడిని ఎత్తికొని; ఆలింగనంబును= కౌగిలిని; మూర్ధఘ్రాణంబును= శిరస్సు నాఘ్రాణించుట; చేసి= చేసినవాడై; ఆ సరిద్వరన్+ఆలోకించి= శ్రేష్ఠమైన ఆ నదిని చూచి; నీవు బ్రహ్మ సరస్సున జనియించితి(వి)= నీవు బ్రహ్మతీర్థంలో పుట్టావు; పుణ్యనదులఅందున్= పవిత్రమైన నదులలో; మేటివి= గొప్పదానవు; అని సంస్తుతించి= అంటూ పొగడి; నీ జలంబులన్+తర్పణంబు చేసినన్= నీనీటిలో (పితరులకు) తర్పణం చేస్తే; విశ్వేదేవతలు; పితరులు= పితృదేవతలు; గంధర్వులు= గంధర్వులు; తృప్తులు+ఔదురు= సంతుష్టు లవుదురు; అని అనుగ్రహించి= అంటూ దయజూపి; ఈ+కుమారుండు= ఈ బాలుడు; నీపేర సారస్వతుండు+అనన్+పరఁగున్= నీ పేరుమీద ఈ పసివాడు సారస్వతుడని పిలువబడతాడు; పదంపడి= ఆ మీదట; పండ్రెండు+ఏండ్లు= పన్నెండు సంవత్సరాలు; అనావృష్టి+ఐనన్= వానలు లేకుండిన; ఆ+ఆపద+పొందకుండన్= ఆ ప్రమాదం వలని కష్టమును అనుభవించకుండా; పెక్కండ్రు మునులన్ రక్షించి= చాలామంది తాపసులను కాపాడి; వేదాధ్యయనంబులు= వేదమును చదవటం; చేయించును+అని చెప్పి= చేయిస్తాడని చెప్పి; ఒప్పగించినన్= అప్పజెప్పగా; సరస్వతి ప్రీత+ఐ= సరస్వతి సంతోషించి; తనయున్+కొని చనియెన్= తన కుమారుడిని తీసికొని వెళ్ళింది; ఆ కాలంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ దధీచి తపో నియమానికి దేవరాజు సంశయించి దానికి అడ్డు వేయటానికై అలంబుస అనే అప్సరః కాంతను పంపాడు. ఆమెను చూడటంతో ఆ మునికి వీర్యం జారింది. దానిని సరస్వతీనది తన కడుపున దాచి, కుమారుడిని కని ఆ తపోధనుడి వద్దకు తీసికొనివచ్చి, తాపసుల గోష్ఠిలోనున్న దధీచితో 'వీడు నీ కొడుకు; - నీ వీర్యాన్ని వ్యర్థం కానీయక నేను ధరించి కన్నాను. వీడిని తీసికొనుము' అన్నది. ఆత డా కుమారుడిని ఎత్తుకొని కౌగిలించుకొని, ప్రేమతో శిరస్సు ముద్దుపెట్టుకొని, ఆ నదీమతల్లిని చూచి 'నీవు బ్రహ్మ సరస్సున పుట్టావు. పవిత్రమైన నదులలో మేటివి' అని మెచ్చి, నీ జలాలతో తర్పణం వదలితే దేవతలు, పితృదేవతులు, విశ్వేదేవతలు,

గంధర్వులు తృప్తిపొందుతారు' అని దయచూపి, 'ఈ బాలుడు నీ పేరున సారస్వతు డనబడతాడు. ముందు పన్నెండేండ్లు వానలు లేక కాటకం వస్తే ఆ ప్రమాదంనుండి అనేకులు మునులను కాపాడి వేదవిద్య నేర్పుతాడు' అని చెప్పి ఒప్పగించగా సరస్వతి సంతోషించి, కుమారుడితో వెళ్ళింది. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. అమరులకు నసురులకుఁ గల । హము గలిగిన బలవిరోధి యాయుధనికురుం
బము సవరించు మహోద్యో । గమునఁ బ్రవర్తించె వీరకౌతుక మలరన్. **204**

ప్రతిపదార్థం: అమరులకున్+అసురులకున్= దేవతలకు రాక్షసులకును; కలహము కలిగినన్= జగడం రాగా; బలవిరోధి= ఇంద్రుడు; ఆయుధ నికురుంబమున్= అస్త్రసమూహాన్ని; సవరించు= చక్కచేసే; మహా+ఉద్యోగమునన్= గొప్ప ప్రయత్నంలో; వీరకౌతుకము+అలరన్= వీరోత్సాహాలు ఒప్పగా; ప్రవర్తించెన్= నడచుకొన్నాడు.

తాత్పర్యం: దేవాసురులకు యుద్ధం రాగా ఇంద్రుడు అస్త్రసమూహాన్ని సవరించే పెనుప్రయత్నంలో వీరోత్సాహాలతో ప్రకాశించాడు.

వ. అ ట్లుద్యోగించి. **205**

ప్రతిపదార్థం: అట్లు+ఉద్యోగించి= ఆ విధంగా ప్రయత్నం చేసి.

తాత్పర్యం: ఆ విధంగా ప్రయత్నించి.

చ. జగముల నెందునుం బడయఁ జాల కతండు దధీచియస్థులం
దగియెడునాయుధంబు లగుఁ దత్పరతం జని వేఁడ నాతఁ డి
చ్చు గురుతరాక్షయోజ్జ్వలయశోనిరతుం డని పంపఁగా నిలిం
పగణము వోయి వేఁడిన నృపాలక! యిచ్చె నతండు ప్రీతితోన్. **206**

ప్రతిపదార్థం: నృపాలక!= ఓ రాజా! (జనమేజయా!); అతండు= ఆ ఇంద్రుడు; జగములన్+ఎందునున్+పడయన్+చాలక= లోకాలలో ఎక్కడను పొందలేక; దధీచి అస్థులన్= దధీచి ఎముకలలో; తగియెడు నాయుధంబులు+అగున్= తగిన (యుద్ధసాధనాలు) ఆయుధాలు కాగలవు; తత్పరతన్= ఆసక్తితో(పట్టుదలతో); చని వేఁడన్= వెళ్ళి ప్రార్థించగా; ఆతఁడు+ ఇచ్చున్= ఆతడు+ఈయగలడు; (దధీచి ఈయగలడు); గురుతర= గొప్పదయిన; అక్షయ= నాశనంకాని; ఉజ్జ్వల= ప్రకాశించే; యశోనిరతుండు= కీర్తిమంతుడు; అని= అంటూ; పంపఁగాన్= పంపించగా; నిలింపగణము= దేవతల సమూహాలు; పోయి వేఁడినన్= దగ్గరకు పోయి ప్రార్థించగా; అతండు= ఆ దధీచి; ప్రీతితోన్+ఇచ్చెన్= సంతోషంతో ఇచ్చాడు.

తాత్పర్యం: ఇంద్రుడు ప్రపంచంలో ఎక్కడా పొందలేనివైన దధీచి ఎముకలు ఆయుధాలు కాగల వని పట్టుదలతో వెళ్ళి ప్రార్థించగా 'దధీచి ఈయగలడు. అతడు విస్తారమూ, ప్రకాశవంతమూ నాశంకానిదీ అయిన కీర్తి కలవా' డని పంపగా దేవతలు పోయి వేడుకొనగా ప్రీతితో దధీచి ఇచ్చాడు. ఓ రాజా! (వినుము). (అని జనమేజయుడికి వైశంపాయనముని చెప్పాడు.)

వ. ఇచ్చి యతం దవ్యయలోకంబున కరిగె; నమరవరుండును దదస్థుల వజ్రాయుధంబు నొనర్చి పేర్చె; నంత నాసారస్వతుండు ద్వాదశవార్షికం బగుననావృష్టి దురితంబునఁ దన్నుఁ జేరి పిన్న యనక

విద్యావిశేషకలితంబైన గౌరవంబున శిష్యత్వంబు భజియించిన యఱువదివేవురు మునుల సరస్వతీప్రభావజనితం బగు నన్నంబున రక్షించుచు వేదంబుఁ జదివించె; నా సారస్వతతీర్థంబున నుండి యాసంకర్షణుండు వృద్ధకన్యాశ్రమంబు నకుం బోయె నయ్యెడ గర్గవంశవర్యుం డగు ఖని యను తపోధనుండు. 207

ప్రతిపదార్థం: ఇచ్చి+అతండు+అవ్యయ లోకంబునకున్+అరిగెన్= ఆ ఎముకల నిచ్చి ఆయన నాశనం లేనట్టి లోకానికి వెళ్ళాడు; అమరవరుండును= దేవరాజును; తద్+అస్థులన్ వజ్రాయుధంబు+ఒనర్చి= ఆ ఎముకలతో వజ్రాయుధం చేసి; పేర్చెన్= విజృంభించాడు; అంతన్+ఆ సారస్వతుండు= ఆ మీదట ఆ సరస్వతీ తనయుడు; ద్వాదశ వార్షికంబు+అగు= పండ్రెండేండ్లు సాగిన; అనావృష్టి దురితంబునన్= వానలేనట్టి కష్టంతో; తన్నున్+చేరి= తన వద్దకు వచ్చి; పిన్న+అనక= పసివాడనకుండా; విద్యావిశేష కలితంబు+ఐన= చదువరితనంతో కూడుకొన్న; గౌరవంబునన్= మర్యాదతో; శిష్యత్వంబు= శిష్యత్వంతో, భజియించినన్= పూజించగా; అఱువది+వేవురు మునుల= అరవైవేలమంది తాపసులను; సరస్వతీ ప్రభావజనితంబు+అగు= సరస్వతీ తీర్థప్రభావం వలన కలిగిన; అన్నంబునన్ రక్షించుచున్= భోజనంతో కాపాడుతూ; వేదంబున్+చదివించెన్= వేదాధ్యయనం చేయించాడు; ఆ సారస్వత తీర్థంబున నుండి; ఆ సంకర్షణుండు= ఆ బలరాముడు; వృద్ధకన్యా+ఆశ్రమంబునకున్+పోయెన్= వృద్ధకన్యయొక్క తపోవనానికి వెళ్ళాడు; ఆ+ఎడన్= అక్కడ; గర్గవంశవర్యుండు+అగు= గర్గమహాముని వంశంలో శ్రేష్ఠుడైన; 'ఖని' అను తపోధనుండు= ఖనిఅని పేరుండే తాపసి.

తాత్పర్యం: దధీచి తన ఎముకలను ఇచ్చి, నాశనం లేని లోకాలకు వెళ్ళిపోయాడు. ఆ ఎముకలతో ఇంద్రుడు వజ్రాయుధాన్ని తయారు చేసికొని విజృంభించాడు. అటు పిమ్మట సారస్వతుడు పన్నెండేళ్ళపాటు సాగిన అనావృష్టి కారణంగా తాను చిన్నవాడైనా విద్యావంతుడు కావటం వలన తన శిష్యత్వాన్ని స్వీకరించిన అరవై వేలమంది మునులను సరస్వతీనదీ ప్రభావం వలన లభించిన అన్నంతో కాపాడుతూ వేదాధ్యయనం చేయించాడు. అట్టి సారస్వత తీర్థం నుండి బలరాముడు వృద్ధకన్యాశ్రమానికి వెళ్ళాడు. అక్కడ గర్గవంశంలో ఉత్తముడైన 'ఖని' అనే ఋషి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. పరమతపమున నొకకన్యఁ బడసి పెంచి। దివమునకు నేఁగె; నది తపస్స్థిరతఁ బూని
పతి వరింపంగ నొల్లక బ్రహ్మచర్య। మున వెలింగి య య్యాశ్రమమున వసించె. 208

ప్రతిపదార్థం: పరమతపమునన్= గొప్పతపస్సుతో; ఒక కన్యకన్+పడసి= ఒక కూతును పొంది; పెంచి; దివమునకున్+ఏఁగెన్= స్వర్గానికి వెళ్ళాడు; అది= ఆ కన్య; తపఃస్థిరతన్+పూని= స్థిరమైన తపస్సుచేసి; పతిన్+వరింపంగన్+ఒల్లక= భర్తను వరించటానికి ఇష్టపడక; బ్రహ్మచర్యమునన్ వెలింగి= బ్రహ్మచర్య నిష్ఠతో ప్రకాశించి; ఆ+ఆశ్రమమునన్ వసించెన్= ఆ ఆశ్రమంలో ఉండింది.

తాత్పర్యం: ఖని అనే పరమతాపసి తపశ్శక్తితో ఒక కూతురిని పొంది పెంచి స్వర్గానికి వెళ్ళాడు. ఆ కన్య స్థిరమైన తపస్సునకు పూనుకొని, భర్తను వరించటానికి ఇష్టపడకుండా బ్రహ్మచర్యాశ్రమంలో ప్రకాశిస్తూ ఆ ఆశ్రమంలో ఉండిపోయింది.

వ. పదంపడి యత్యంతవృద్ధ యై పరలోకగమనంబు గోరె; నప్పుడు యదృచ్ఛాసన్నిహితుం డైన నారదుం డక్కన్యక కిట్లనియె. 209

ప్రతిపదార్థం: పదంపడి= ఆ మీదట; అత్యంత వృద్ధ ఐ= మిక్కిలి ముదుసలిఅయి; పరలోక గమనంబు+కోరెన్= పరలోకానికి పోవాలని కోరింది; అప్పుడు= ఆ సమయంలో; యదృచ్ఛా సన్నిహితుండు+ఐన నారదుండు= తలవని తలంపుగా దగ్గరకు వచ్చి నారదుడు; ఆ+కన్యకకున్= ఆ (వృద్ధ) కన్యకతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ మీదట చాలముదుసలిఅయిన ఆ కన్యకకు పరలోకానికి వెళ్ళవలెననే ఆస కలిగింది. అపుడు తలవని తలంపుగా అక్కడికి వచ్చిన నారదుడు ఆకన్యతో ఈ విధంగా అన్నాడు.

క. 'విను! పాణిగ్రహణము సే । యనివనితకుఁ బుణ్యలోక మప్రాప్యము గా
వున నే యుపాయమున నై । నను దగియెడు వరు వరింపు నలినదళాక్షీ!'. 210

ప్రతిపదార్థం: నలినదళ+అక్షీ!= ఓ పద్మాలరేకులవంటి కన్నులు కలదానా!; విను= వినుము; పాణిగ్రహణము చేయని వనితకున్= పెండ్లిచేసికొనని స్త్రీకి; పుణ్యాలోకము= పవిత్రమగు లోకం; అప్రాప్యము= కలుగదు; కావునన్= అందుచేత; ఏ+ ఉపాయమునన్+ఐనను= ఏదైనా ఉపాయంతో; తగియెడు= (నీకు) తగిన; వరున్+వరింపు(ము)= భర్తను ఎన్నుకొనుము.

తాత్పర్యం: 'ఓ పద్మదళాక్షీ! వినుము. వివాహం కాని స్త్రీకి పుణ్యలోకాలు కలుగవు. కనుక ఏదేని ఉపాయంతో నీకు తగిన భర్తను ఎన్నుకొనుము.'

ఆ. అనిన నిజతపంబు నర్ధంబు లంచంబు । గాఁగ నిచ్చి యదియు గాలవాత్మ
జుని వరించె; నతఁడు సుదతితో సమయంబు । పలికికొనియె ధరణిపాలవర్య! 211

ప్రతిపదార్థం: ధరణిపాలవర్య!= రాజశ్రేష్ఠుడా!; అనినన్= అనగా; నిజతపంబు= తన తపస్సుయొక్క; అర్ధంబు= సగభాగం; లంచంబుకాగన్+ఇచ్చి= లంచంగా ఇచ్చి; అదియున్= ఆ ఋని కూతురు; గాలవ+ఆత్మజునిన్ వరించెన్= గాలవుడి కుమారుడిని వివాహమాడింది; అతఁడు= ఆ గాలవుడి కుమారుడు; సుదతితోన్= ఆ స్త్రీతో; సమయంబు పలికికొనియెన్= కట్టడి చేసికొన్నాడు.

తాత్పర్యం: తన తపస్సుతో సగం లంచంగా ఇచ్చి ఆ వృద్ధకన్యక గాలవుడి కుమారుడిని వివాహమాడింది అతడుకూడ ఆమెతో ఒక కట్టడి చేసికొన్నాడు.

వ. సమయంబు నేకరాత్ర సహవాస సమ్మతికలితం; బట్లు పాణిగ్రహణ సంస్కారవతి యై యావృద్ధకన్యక దైవయోగంబున నారాత్రి మనోహరయౌవనయుఁ బరమానులేపమాల్యాంబరభూషణాభిరామయు నయ్యె; నమ్మునియుఁ బ్రీతుండై యన్నాతిసంగతి నన్నిసి గడపెఁ; బ్రభాతంబున నన్నితంబిని యతని కిట్లనియె. 212

ప్రతిపదార్థం: సమయంబు= (ఆతడు చేసికొన్న ఒడంబడిక) ప్రమాణం; ఏకరాత్ర సహవాస సమ్మతి కలితంబు= ఒకరాత్రి కలిసిఉండటం అనే ఒప్పుదలతో కూడింది (అనగా ఒకరాత్రి మాత్రమే ఆ వృద్ధకన్యకు భర్తగా వ్యవహరించేందుకు); అట్లు= ఆ ప్రకారం; పాణిగ్రహణ సంస్కారవతి ఐ= వివాహ సంస్కారం కలదియై; ఆ వృద్ధకన్యక= ఆ ముదుసలి కన్యక; దైవయోగంబునన్= దైవానుగ్రహంచేత; ఆ రాత్రి= ఆ రాత్రి సమయాన; మనోహర యౌవనయున్= సుందర యౌవనము; పరమ+అనులేపన+మాల్య+అంబర+భూషణ+అభిరామయున్= ఉత్తమ సుగంధ ద్రవ్యాలతోను, పూమాలలతోను, వస్త్రాలతోను,

నగలతోను, చాలా అందగత్తెగాను; అయ్యెను= అయింది; ఆ+మునియున్+ప్రీతుండు+ఐ= ఆ తపసికూడా సంతోషించినవాడై; ఆ+నాతి సంగతిన్= ఆ స్త్రీ సాంగత్యంతో; ఆ నిసిన్+గడపెన్= ఆ రాత్రి గడపాడు; ప్రభాతంబునన్= ఉదయాన; ఆ+నితంబిని= ఆ స్త్రీ; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆతడితో ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఆ ముని చేసిన కట్టడి - ఒక్కరాత్రి మాత్రం ఆమెతో కలిసి ఉండటం. ఆ విధంగా వివాహసంస్కారవతి అయిన ఆ ముదుసలికన్నె దైవానుగ్రహంతో ఆ రాత్రి మనసును ఆకర్షించే వయసుకత్తెగా, సాటిలేని సుగంధవస్తువులతోను, వస్త్రాలతోను, నగలతోను చాలా అందగత్తెగా ఐనది. ఆ ముని కూడా ప్రీతినందినవాడై ఆ ఇంతితో కలిసి సంతోషంగా ఆ రాత్రిని గడిపాడు. ఉదయాన ఆమె ఆతడితో ఇట్లా అన్నది.

తే. 'ఒక్క రేయి నీపాల నాయునికి గాఁగ । బలికికొన్నార; మది సెల్లె నలఘుచరిత!
పోయి వచ్చెద' నని దివంబునకుఁ బోవ । నుత్సహించె నమ్ముని మది నుమ్మలింప. 213

ప్రతిపదార్థం: అలఘుచరిత!= ఓ గొప్ప నడవడిక కలవాడా!; ఒక్కరేయి= ఒకరాత్రి (మాత్రం); నీపాలన్= నీతో; నాఉనికి+ కాఁగన్= నేనుఉండేటట్లుగా; పలికి కొన్నారము= మాటాడుకొన్నాం; అది చెల్లెన్= అది అయిపోయింది; పోయివచ్చెదన్= వెళ్లివస్తాను; అని; ఆ తపసి; మదిన్+ఉమ్మలింపన్= దుఃఖపడగా; దివంబునకున్+పోవన్= స్వర్గానికి పోవటానికి; ఉత్సహించెన్= ఆసక్తిని చూపింది.

తాత్పర్యం: 'ఒకరాత్రి మాత్రం నీతో కలిసి ఉండటానికి ప్రమాణం చేసికొన్నాము. అది గడచిపోయింది. ఓ పుణ్యాత్ముడా! నేను పోయి వస్తాను.' అని స్వర్గానికి వెళ్ళటానికి ఆసక్తిని చూపింది. ఆ తపసి మనసున చాలా బాధపడ్డాడు.

వ. ఇట్లుత్సహించి 'యిత్తీరంబున దేవఋషిపితృతర్పణపరుండై యొక్కనాఁడుపవసించినవాఁడు పంచాశద్వత్సర పరిపూరణీయం బగు నైష్ఠిక బ్రహ్మచర్య ఫలంబు వడయువాఁ'డని పలికి తనువువిడిచి దివంబున కరిగెఁ; గురువంశోత్తమా! యయ్యెడ నారేవతీపతి శల్యుండు రణంబునఁ బాండవులచేత నిహతుం డగుట విని, వగచుచు నచ్చటికిఁ జేరువ యగు శమంతపంచకంబునకుం జని, యందులమునులఁ గురుక్షేత్రవిశేషంబు లడిగిన. వార లతనికి నది ప్రజాపతి యుత్తరవేది యనియును, సమస్తదేవతలు నందు వరిష్ఠంబు లడిగిన, వార లతనికి నది ప్రజాపతి యుత్తరవేది యనియును, సమస్తదేవతలు నందు వరిష్ఠంబు లగుసత్రంబు లాచరించి రనియును, దానిఁగురుం డనురాజు దున్నుటం జేసి దానికిఁ గురుక్షేత్రం బనునామంబు గలిగె ననియు నెఱింగించిన, న య్యేకకుండలుం 'డాభూమీశ్వరుఁ డేమి ప్రయోజనంబునకు దున్నె?' ననుటయు, నాతపోధను లి ట్లనిరి. 214

ప్రతిపదార్థం: కురువంశ+ఉత్తమా!= కురువంశంలో ఉత్తముడైన వాడా! (జనమేజయా!); ఇట్లు+ఉత్సహించి= ఈ విధంగా ఆసక్తిని చూపి; ఈ+తీరంబునన్= ఈ గట్టువద్ద; దేవఋషి పితృ తర్పణ పరుండు+ఐ= దేవతలకును, ఋషులకును, పితరులకును, తృప్తి చేసేవాడుగా; ఒక్కనాడు ఉపవసించువాఁడు= ఒక దినం ఉపవాసం ఉండేవాడు; పంచాశద్వత్సర పరిపూరణీయుండగు నైష్ఠిక బ్రహ్మచర్య ఫలంబు పడయు వాఁడు+అని= ఏబది వత్సరాల నియమంతో గడపిన బ్రహ్మచర్య వ్రతఫలితాన్ని పొందగలవాడని; పలికి= చెప్పి; తనువు విడిచి= శరీరాన్ని వదలి; దివంబునకున్+అరిగెన్= స్వర్గానికి వెళ్లింది;

ఆ+ఎడన్+ఆరేయి నిలిచి= ఆ చోట ఆ రాత్రి ఉండి; శల్యుండు= శల్యుడు; రణంబునన్= యుద్ధంలో; పాండవులచేతన్= పాండవులచే; నిహతుండు+అగుట= చంపబడటం; విని= విన్నవాడయి; వగచుచున్= దుఃఖిస్తూ; అచ్చటికిన్+చేరువ+అగు= ఆ చోటుకు దగ్గరైన; శమంతపంచకంబునకున్+చని= శమంతపంచకమనే చోటికి వెళ్ళి; అందు మునులన్= అక్కడి తాపసులను; కురుక్షేత్ర విశేషంబులు+అడిగినన్= కురుక్షేత్రంలోని విశేషాలను గూర్చి అడుగగా; వారలు+అతనికిన్= వారు ఆ బలరాముడికి; అది= ఆ తీర్థమున్నచోటు; ప్రజాపతి= స్రష్టకు; ఉత్తరవేది= ఉత్తరమున ఉండే యజ్ఞాదులు చేసికొనటానికై యున్నట్టి తిన్నె; అనియును= అనిచెప్పి; సమస్తదేవతలు= దేవతలందరూ; అందున్= ఆ చోట; వరిష్ఠంబు+అగు= శ్రేష్ఠమైన; వ్రతంబులు+ఆచరించిరి+అనియున్= నోములు కావించినారనీ; దానిన్= ఆ చోటును (తిన్నెను); కురుండు+అనురాజు దున్నుటన్‌చేసి= కురుడనే రాజు దున్నినందువలన; దానికి; కురుక్షేత్రంబు+అను నామంబు కలిగెన్= కురుక్షేత్రమని పేరు కలిగింది; అనియున్ ఎఱింగించినన్= అని చెప్పగా; ఆ+ఏకకుండలుండు= ఆ బలరాముడు; ఆ భూమి+ఈశ్వరుఁడు= ఆ కురురాజు; ఏమిప్రయోజనంబునకున్= ఏ ఫలానికై; దున్నెన్?= దున్నాడు?; అనుటయున్= అని అడుగగా; ఆ తపోధనులు= ఆ తాపసులు; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధమైన ఆసక్తితో ఈ తీరంలో దేవతలను, ఋషులను, పితరులను తృప్తిపరచేవాడుగా ఒకరోజు ఉపవాసం చేసినవాడు ఏబది సంవత్సరాలు నియమంతో గడిపిన బ్రహ్మచర్య వ్రతఫలాన్ని పొందగలడు.' అని చెప్పి ఆ వృద్ధకన్య తన శరీరాన్ని వదలి స్వర్గానికి వెళ్లింది. కురువంశీయులలో ఉత్తముడైనవాడా! అక్కడ బలరాముడు శల్యుడు యుద్ధంలో పాండవులచేత చంపబడటాన్ని విని దుఃఖిస్తూ ఆ చోటునకు దగ్గరగా ఉన్న శమంతపంచకతీర్థానికి వెళ్ళి అక్కడ ఉన్న మునులను కురుక్షేత్ర విశేషాలు అడిగినాడు. దానికి వారు 'అది బ్రహ్మకు ఉత్తరదిక్కున నున్న యజ్ఞవేది' అనీ, ఎందరో దేవతలు అందు శ్రేష్ఠములైన యజ్ఞాలను చేశారనీ తెలిపారు. ఆ చోటును కురు డనే రాజు దున్నుట మూలంగా దానికి కురుక్షేత్రమనే పేరు వచ్చింది' అని కూడా చెప్పారు. 'ఆ రాజు ఏ ఫలాన్ని ఆశించి దానిని దున్నాడు?' అని బలరాముడు అడుగగా వాళ్ళు ఈ విధంగా అన్నారు.

కురుక్షేత్ర ప్రభావాభివర్ణనము (సం. 9-52-4)

సీ. 'ఇందుఁ బుట్టినజను లెల్లను దుదిఁ ద్రిది । వంబున కరుగంగవలయు నని మ
నంబునఁ గోరి యన్నరపతి దున్నంగ, । నింద్రుఁడు సనుదెంచి యేల యిచట
దునియెద? వనిన నమ్మనుజాధిపతి తన । కోర్కి సెప్పిన, గేలిగొనుచుఁ జనియెఁ;
బలుమఱు నద్దేవపతి వచ్చి వెండియు । నుల్లసమాడుచు నుండు నతని

ఆ. నతఁడు నిష్ఠఁ గుంద కనిశంబు దున్నంగ । వరముఁ బ్రీతి నొసఁగువాఁడు గాఁగ
నమరు లెఱుఁగ నిశ్చయము సేసి యాశక్రుఁ । డచటి కేగుదెంచి యతనితోడ. 215

ప్రతిపదార్థం: ఇందున్+పుట్టిన జనులు+ఎల్లను= ఒక్కడ పుట్టిన మానవులంతా; తుదిన్= చివరకు; త్రిదివంబునకున్+అరుగంగన్ +వలయును+అని= దేవలోకానికి వెళ్ళాలి అని; మనంబునన్= మనసులో ఆశించి; ఆ+నరపతి= ఆ కురురాజు; దున్నంగన్= భూమిని దున్నగా; ఇంద్రుఁడు చనుదెంచి= ఇంద్రుడు వచ్చి; ఏల ఇచటన్ దునియెదవు+అనినన్= ఇక్కడ ఎందుకు నేలను దున్నుతున్నావని అడుగగా; ఆ+మనుజ+అధిపతి తన కోర్కి చెప్పినన్= ఆ రాజు తన ఆశయాన్ని చెప్పగా; గేలిగొనుచున్+ చనియెన్= పరిహసిస్తూ వెళ్ళాడు; ఆ+దేవపతి= దేవరాజు; పలుమఱున్ వచ్చి= పెక్కుమారులు వచ్చి; వెండియున్+ఉల్లసము+ ఆడుచున్+ఉండున్= ఇంకా పరిహాసం చేస్తూనే ఉన్నాడు; అతనిన్= ఆ రాజును; అతఁడు నిష్ఠన్+కుందక= ఆ రాజు

నియమం తప్పకుండా; దున్నంగన్= భూమిని దున్నగా; వరమున్ ప్రీతినొసఁగువాఁడుగాన్= ప్రీతితో వరం ఇచ్చేవాడుగా; అమరులు+ఎఱుఁగన్= దేవతలకు తెలియగా; నిశ్చయం చేసి= నిర్ణయించి; ఆ శక్రుఁడు+అచటికిన్+ఏగుదెంచి= ఆ ఇంద్రుడక్కడకు వచ్చి; అతనితోడన్= ఆ రాజుతో (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ఈ క్షేత్రంలో పుట్టిన వారంతా తుదకు స్వర్గానికే వెళ్లవలె నని మనసులో తలచి, ఆ రాజు భూమిని దున్నుతుండగా ఇంద్రుడు వచ్చి భూమి దున్నే కారణ మడిగాడు. దానికి ఆ రాజు తన మనసులోని కోరికను చెప్పగా ఎగతాళి చేస్తూ వెళ్ళాడు. అనేక పర్యాయాలు ఆ దేవరాజు వచ్చి మరల మరల దానిని ఎగతాళిచేశాడు. ఐనా, ఆ రాజు తన నిష్ఠను వదలక దున్నుతూ ఉండగా, దేవతలకు తెలిసేవిధంగా వరాన్ని ఈయదలచి, ఇంద్రుడు ఆచోటికి వచ్చి ఆతడితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. ఈ పుణ్యక్షేత్రంబున నిరాహారులై దేహంబు విడిచిన వారలకు నిందు సమరంబు సేసి సమ్యక్ప్రకారంబున మృతిఁ బొందిన సమస్తజంతువులకును సురలోకప్రాప్తి గలిగెడు' మని పల్కి నిజస్థానంబునకుం జనియె; నట్లు చను చుండి యాశతమఖుఁడు సంభావనాతిశయంబున. 216

ప్రతిపదార్థం: ఈ పుణ్యక్షేత్రంబునన్= ఈ పవిత్ర క్షేత్రంలో; నిరాహారులు+ఐ= భోజనాన్ని మానిన వారుగా; దేహంబును విడిచిన వారలకున్= శరీరత్యాగం చేసిన వారికినీ; ఇందు సమరంబు చేసి= ఇక్కడ యుద్ధం చేసి; సమ్యక్+ప్రకారంబునన్= సరియగు విధానంతో; మృతిన్+పొందిన= చనిపోయిన; సమస్త జంతువులకును= అన్ని ప్రాణులకున్నూ; సురలోక ప్రాప్తి కలిగెడున్= స్వర్గలోకం కలుగుతుంది; అని పల్కి= అంటూ చెప్పి; నిజస్థానంబునకున్+చనియెన్= తన చోటగు దేవలోకానికి వెళ్ళాడు; అట్లు చనుచుండి ఆ శతమఖుఁడు= ఆ విధంగా వెళ్లుతూ ఆ ఇంద్రుడు; సంభావనా+అతిశయంబునన్= గౌరవాతిశయంతో.

తాత్పర్యం: ఈ పవిత్రక్షేత్రంలో ఉపవాసంచేస్తూ దేహత్యాగం చేసినవారికీ, ఇక్కడ యుద్ధంచేసి సముచితమైన పద్ధతిలో చనిపోయిన సమస్త ప్రాణులకూ, స్వర్గలోక ప్రాప్తికలుగుతుంది.' అని చెప్పి దేవలోకానికి వెళ్ళాడు. ఆ విధంగా వెళ్ళుతూ ఆ ఇంద్రుడు గౌరవాతిశయంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'గాలిఁ గురుక్షేత్రంబున । ధూలి తనువుఁ జెంది నరుని దుష్కర్మములం
దోలి యతనికి ధరిత్రిం । దూలి మధురలీలమై నతులగతి యొసఁగున్. 217

ప్రతిపదార్థం: కురుక్షేత్రంబునన్= కురుక్షేత్రంలో; గాలిన్= వాయువుచేత; ధూలి= దుమ్ము; తనువున్+చెంది= ఒడలిని తాకి; నరుని= మానవుని; దుష్కర్మములన్+తోలి= చెడుపాపాలను తొలగించి; అతనికిన్= ఆ మానవుడికి; ధరిత్రిన్= భూమియందు; తూలి= తొలగి; మధురలీలమైన్= తీయని ఆటగా; అతులగతి ఒసఁగున్= సాటిలేని గతి - ఉత్తమగతి నిస్తుంది.

తాత్పర్యం: 'కురుక్షేత్రంలో మానవుడి శరీరాన్ని గాలి, దుమ్ము తాకి పాపాలను తొలగించి, భూమిని విడిచిపోయిన పిమ్మట ఉత్తమగతిని కలిగిస్తుంది.

వ. అని నిర్దేశించినఁ గురునృపాలుండును గృతకృత్యుండై సంతోషించె' నని చెప్పుటయు, నా ప్రలంబవైరి ప్రమోదభరితుం డగుచు మెలంగి యశ్వత్థమధూకామ్రబిల్వాదిభూరుహోప శోభితం బైన నిజపూర్వాశ్రమంబుఁ

గనుంగొని 'యిది యెవ్వరియాశ్రమం?' బని యడిగిన నమ్మును 'లియ్యెడఁ దొల్లి విష్ణుదేవుండు దపంబు సేసినచోటు; మఱియు శాండిల్యప్రభృతు లిందు యోగసిద్ధిం బొంది' రనిన విని యయ్యాశ్రమంబుఁ గొనియాడి తత్ప్రదేశంబున బహిఃపరివారంబు నెల్ల వీడుకొల్పి యొక్కపుణ్యాచలం బెక్కి దానితటంబున సమస్థలంబున మునిజనసహితంబుగ నాసీనుం డయ్యెఁ; నాసమయంబున నిచ్చటికి జటామండలకలితుండును గుశచీరచ్ఛాయా సుందరుండును గలహప్రియుండును నగు నారదుండు హేమదండంబును మణికమండలువును గచ్ఛపవీణయుం బొలుపు మెఱయ నేతెంచిన, నెల్లవారలుం బ్రత్యుత్థానప్రణామంబు లాచరించి సుఖోపవిష్టుం జేసి పరివేష్టించి; రా దేవమునిం గొల్చియుండి య బ్బలదేవుండు. 218

ప్రతిపదార్థం: అని నిర్దేశించినన్= అని ఆజ్ఞాపించగా; కురునృపాలుండును= కురురాజును; కృతకృత్యుండు+ఐ= చేయదగినపని చేసినవాడై; సంతోషించెన్= సంతోషించాడు; అని చెప్పుటయున్= అంటూ చెప్పగా; ఆ ప్రలంబవైరి= ఆ ప్రలంబుడి శత్రువు (బలరాముడు); ప్రమోదభరితుండు+అగుచున్= సంతోషంచేత నిండినవాడై; మెలంగి= నడచుకొని; అశ్వత్థ= రావి; మధూక= ఇప్ప; ఆమ్ర= మామిడి; బిల్వ= మారేడు; ఆది= మొదలయిన; భూరహ= చెట్లతో; ఉపశోభితంబు+ఐన= అందంగా ఉన్న; నిజపూర్వ+ఆశ్రమంబున్+కనుంగొని= తన వెనుకటి ఆశ్రమాన్ని చూచి; ఇది ఎవ్వరి+ఆశ్రమంబు+అని+అడిగినన్= ఇది ఎవ్వరి ఆశ్రమ మని అడుగగా; ఆ+మునులు= ఆ తపస్వులు; ఈ+ఎడన్= ఈ చోట; తొల్లి విష్ణుదేవుండు= పూర్వం విష్ణుదేవుడు; తపంబు చేసిన చోటు= తపస్సు చేసిన చోటు; మఱియున్= ఇంకను; శాండిల్య ప్రభృతులు= శాండిల్యుడు మొదలయినవారు; ఇందున్= ఈ చోట; యోగసిద్ధిన్+పొందిరి+అనినన్= యోగసిద్ధి పొందారనిన; విని; ఆ+ఆశ్రమంబున్+ కొనియాడి= ఆ తపోవనాన్ని పొగడి; తత్ప్రదేశంబునన్= ఆచోటున; బహిఃపరివారంబును+ఎల్లన్ వీడుకొల్పి= వెలుపల ఉండదగిన సేవకులకు వీడ్కోలు+ఇచ్చి; ఒక్కపుణ్య+అచలంబు+ఎక్కి= ఒక పవిత్రమైన కొండనెక్కి; దాని తటంబునన్= దాని చరియపై; సమస్థలంబునన్= సమమైన నేలపై; మునిజన సహితంబుగా ఆసీనుండు+అయ్యెన్= మునులతో కూడి కూర్చున్నాడు; ఆ సమయంబునన్ ఇచ్చటికిన్= ఆ వేళలో ఈచోటునకు; జటామండల కలితుండును= జటామండలంతో కూడినవాడూ; కుశచీరచ్ఛాయా సుందరుండును= దర్భలు, నారచీరలచే రేఖా సుందరుడైనవాడూ; కలహప్రియుండును= జగడాలకు ఆనందించేవాడూ; అగు; నారదుండు; హేమదండంబును= బంగారు యోగ దండాన్నీ; మణికమండలువును= మణులు తాపిన కమండలాన్నీ; కచ్ఛపవీణయున్= కచ్ఛపమనే పేరుగల వీణయు; పొలుపు మెఱయన్= అందం అతిశయించగా; ఏతెంచినన్= రాగా; ఎల్లవారును= అందరును; ప్రత్యుత్థాన= ఎదురేగి; ప్రణామంబులు= నమస్కారాలు; ఆచరించి= చేసి; సుఖంగా కూర్చుండబెట్టి; పరివేష్టించిరి= చుట్టూ కూడారు; ఆ దేవమునిన్+కొల్చిఉండి= ఆ దేవతాపసిని సేవించి; ఆ+బలదేవుండు= ఆ బలరాముడు.

తాత్పర్యం: అని ఆజ్ఞాపించగా కురురాజు తాను ధన్యుడైనట్లుగా సంతోషించాడు - అని చెప్పగా బలరాముడు సంతోషంతో తిరిగి చెప్పగా ఇప్ప, మామిడి, మారేడు మొదలయిన చెట్లతో అందంగా ఉన్న తన వెనుకటి ఆశ్రమాన్ని గుర్తించి 'ఇది ఎవ్వరి తపోవనవం' అని అడుగగా ఆ తాపసులు 'ఈ చోట ముందు విష్ణుదేవుడు తపస్సు చేశాడు. ఇంకను శాండిల్యుడు మొదలయినవారు ఈ చోట యోగసిద్ధిని పొందారు'. అనగా విని ఆ తపోవనమును పొగడి ఆ చోట తన సేనను నిల్పి, ఒక పవిత్రమైన కొండమీదకు ఎక్కి, దాని చరియవద్ద చదునైన చోట మునిజనులతో కూడి కూర్చున్నాడు. ఆ సమయాన అక్కడకు జడలకొప్పుతో కూడినవాడూ, నారచీరల చాయగలిగిన అందగాడూ జగడాలపై ఇష్టం కలవాడూ ఐన నారదుడు బంగారు యోగదండమూ, రత్నాలు పొదిగిన కమండలమూ, 'కచ్ఛపి'

అనే తన వీణా అందగించగా అందరూ లేచి ఎదురేగి నమస్కరించి, కూర్చుండజేసి తామూ చుట్టూ కూర్చున్నారు. ఆ దేవఋషిని సేవించి ఆ బలరాముడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కురువృత్తాంతం బడిగినఁ । గరమేర్పడఁ జెప్పె నతఁడు గాంగేయుండున్
గురుఁడును గర్ణుఁడు శల్యుఁడు । వరుస ననిం దెగుట కౌరవక్షితినాథా! 219

ప్రతిపదార్థం: కౌరవ క్షితినాథా!= ఓ కురురాజా!; కురువృత్తాంతంబున్= కౌరవుల కథను; అడిగినన్= అడుగగా; కరము= మిక్కిలి; ఏర్పడన్= స్పష్టం కాగా; అతఁడు= ఆ ముని; గాంగేయుండున్= భీష్ముడున్నూ; గురుఁడును= ద్రోణుడున్నూ; కర్ణుఁడు= కర్ణుడునూ; శల్యుఁడు= శల్యుడున్నూ; వరుసన్= క్రమంగా; అనిన్+తెగుటన్= యుద్ధంలో చనిపోవటాన్ని; ఏర్పడన్+ చెప్పెన్= స్పష్టంగా చెప్పాడు.

తాత్పర్యం: ఓ కురురాజా! బలరాముడు కురువీరుల వృత్తాంతాన్ని అడుగగా, ఆ తాపసి భీష్మద్రోణ కర్ణ శల్యాదులు వరుసగా పడిపోవటాన్ని స్పష్టంగా చెప్పాడు.

వ. మఱియును మృతు లైన నృపకుమారాది యోధవరులం జెప్పి పదునెనిమిది దివసంబులఁ జెల్లిన సంగరంబు తెఱంగును, సంక్షేమరూపంబునఁ దెలియఁబలికి, దుర్యోధనసైన్యం బంతయు సమయుటయు, నందుఁ గృపాశ్వత్థామ కృతవర్మలు బ్రదికిపోవుటయు నన్నరపాలుఁ డోడి పాఱి ద్వైపాయన హ్రదంబు సొచ్చి జలంబుల సంస్తంభించి డాఁగుటయు, నది పాండవు లెఱింగి సపరివారంబుగాఁ జనుదెంచి యమ్మడువుఁ జుట్టుముట్టి బెట్టిదంపు మాట లాడుటయు, దానం గనలి యమ్మనుజవరుండు మడువు వెడలి వచ్చుటయు నెఱింగించి బిరుదు మగ లగు పగతురు పెక్కండ్రు పొదివికొనియుండం గురుపతియు నుక్కు దక్కక యున్నవాఁ; డద్దండితనంబుఁ జూచిన మెత్తు వీ వని యుగ్గడించి. 220

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; మృతులు+ఐన= చనిపోయిన; నృపకుమార+ఆది యోధవరులన్= రాజకుమారులు మొదలైన యుద్ధవీరులను; చెప్పి= పేర్కొని చెప్పి; పదునెనిమిది దివసంబులు= పద్దెనిమిది దినాలు; చెల్లిన సంగరంబు తెఱంగును= జరిగిన యుద్ధ విధానాన్ని; సంక్షేప రూపంబునన్= సంగ్రహంగా; తెలియన్+పలికి= తెలిసేటట్లు చెప్పి; దుర్యోధన సైన్యంబు+అంతయున్ సమయుటయున్= దుర్యోధనుడి సేన అంతా నాశనం కావటం; అందున్= దానిలో; కృప+అశ్వత్థామ కృతవర్మలు= కృపుడు, అశ్వత్థామ, కృతవర్మ అనేవారు; బ్రదికిపోవుటయున్= జీవించి ఉండటమున్నూ; ఆ+నరపాలుఁడు= ఆ రాజైన దుర్యోధనుడు; ఓడిపాఱి= ఓటమినంది పరుగెత్తి; ద్వైపాయనహ్రదంబు+చొచ్చి= ద్వైపాయన మనే నీటి మడుగులోనికి వెళ్ళి; జలంబుల స్తంభించి= నీటిని కదలకుండా చేసి; డాఁగుటయున్= దాగిఉండటమునూ; అది; పాండవులు; ఎఱింగి= తెలిసికొని; సపరివారంబుగాన్= సేవకులతో; చనుదెంచి= అక్కడకువచ్చి; ఆ+మడువున్ చుట్టుముట్టి= ఆ నీటిమడుగు చుట్టును దండుతో ముట్టడించి; బెట్టిదంపు మాటలు+ఆడుటయున్= నిష్ఠురమైన మాటలు పలుకుటయూ; దానన్+కనలి= ఆ మాటలకు కోపించి; ఆ+మనుజవరుండు= ఆ రాజగు దుర్యోధనుడు; మడువు వెడలి వచ్చుటయున్= ఆ మడుగునుండి బయటకూ రావటమునూ; ఎఱింగించి= తెలిపి; బిరుదుమగలు+అగు పగతురు= బలవంతులయిన విరోధులు; పెక్కండ్రు పొదివికొని+ఉండన్= చాలామంది చుట్టుకొని ఉండగా; కురుపతియున్ ఉక్కుదక్కక= కురురాజయిన దుర్యోధనుడును దర్పం వదలకుండా; ఉన్నవాఁడు= ఉన్నాడు; ఆ+దండితనంబున్ చూచినన్= ఆ దర్పమును చూస్తే; ఈవు= నీవును; మెత్తువు+అ= మెచ్చుకొందువంటూ; ఉగ్గడించి= చెప్పి.

తాత్పర్యం: ఇంకా చనిపోయిన రాజకుమారు లయిన వీరులను గూర్చి చెప్పి, పదునెనిమిది నాళ్ళ యుద్ధాన్ని సంగ్రహంగా తెలిపి దుర్యోధనుడి సేన అంతా నశించటం, వారిలో కృపాశ్వత్థామ కృతవర్మలు మాత్రం బ్రదికి ఉండటం, ఆ రాజు ఓడి పారిపోయి ద్వైపాయనమనే నీటి మడుగులో దూరి దాగికొని ఉండటం, దానిని పాండవులు తెలిసికొని సేనతో వెళ్ళి ఆ మడుగును చుట్టుముట్టి, నిష్ఠురంగా మాటాడినందున ఆ అభిమానధనుడు (రాజు) కోపించి నీటి మడుగునుండి వెలికిరావటం తెలిపి, పేరున్న వీరులయిన శత్రువులు చాలామంది క్రమ్ముకొని ఉండగా కురురాజు దర్పాన్ని వదలక శోభించాడు. ఆ గొప్పతనాన్ని చూస్తే నీవు మెచ్చుకొంటావు' అని చెప్పి.

వ. అతనికి భీమసేనునకు నాహవ మయ్యెడు నొంటిమై మహా
ద్భుతబలశౌర్య ధైర్యములఁ బొల్చు భవత్ప్రియశిష్యులన్ సుశి
క్షితులఁ గనుంగొనం దలఁపు చిత్తమునన్ మొలతెంచునేనిఁ బొ
మ్మతుల గదాకృతోజ్జ్వల విహార ముదారనిరూఢి నొప్పెడున్. 221

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ దుర్యోధనుడికీ; భీమసేనునకున్= భీమునకును; ఒంటిమైన్= ఒక్కడితో(ఎక్కటి); ఆహవము+ అయ్యెడున్= యుద్ధమవుతుంది; మహా+అద్భుత+బల+శౌర్య+ధైర్యములన్= ఆశ్చర్యకరాలైన బలపరాక్రమధైర్యాలతో; పొల్చు= ఒప్పే; భవత్+ప్రియశిష్యులన్= నీకు ప్రీతిగొల్పే శిష్యులను; సుశిక్షితులన్= చక్కని శిక్షణ గల వారిని; కనుంగొనన్+ తలఁపు= చూడవలెననే కోరిక; చిత్తమునన్ మొలతెంచునేనిన్= మనసులో తలెత్తితే పొమ్ము= వెళ్ళుము; అతుల= సాటిలేని; గదాకృత+ఉజ్జ్వల విహారము= గదలతో చేసే చక్కనైన విహారం; ఉదారనిరూఢిన్= గొప్ప ప్రసిద్ధితో; ఒప్పెడున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: దుర్యోధనుడికీ భీమసేనుడికీ ఎక్కటి యుద్ధం జరుగుతుంది. భుజబలశౌర్యాలతోను మంచి శిక్షణతోను ఉన్న నీ శిష్యులను చూడవలెననే కోరిక మనసులో తలెత్తితే పొమ్ము. గదలవలన కలిగే సాటిలేని సొగసైన ఆ విహారం గొప్పగా ఉంటుంది.'

వ. అనిన విని యమ్మునీంద్రునిం దక్కటిమునులను వీడ్కొని యచలంబు డిగ్గి యభ్యంతరపరిజనంబుల నిజపురంబున కనిచి, యన్నీలాంబరుం డరదంబు సమీపంబునకుఁ జని సరస్వతి నాలోకించి. 222

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విన్నవాడై; ఆ+మునీంద్రునిన్, ఆ తాపసిని; తక్కటి మునులను వీడ్కొని= మిగిలిన తాపసులను వదలి; అచలంబు డిగ్గి= ఆ కొండను దిగి; అభ్యంతర పరిజనంబులన్= అంతఃపుర సేవకులను; నిజపురంబునకున్ అనిచి= తన ఊరికి పంపినవాడై; ఆ+నీల+అంబరుండు= ఆ బలరాముడు; అరదంబు సమీపంబునకున్+చని= తేరు వద్దకు వెళ్ళి; సరస్వతిన్ ఆలోకించి= సరస్వతీ తీర్థాన్ని చూచి.

తాత్పర్యం: ఆ ముని లట్లా చెప్పగా విన్నవాడై బలరాముడు ఆ మునిని, తక్కిన మునులను వదలి, ఆ కొండను దిగి అంతఃపుర స్త్రీలను, సేవకులను తన ఊరికి పంపి, తన తేరు వద్దకు వెళ్ళి, సరస్వతిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. అరయఁగ మేటి పుణ్యనదులందు సరస్వతి సౌఖ్యసంపదల్
నరులకుఁ గల్గు నిజ్జగమునం బరలోకమునందు నీసరి
ద్వర నొకనాఁడు సేరినను వాసవముఖ్య సమస్తదేవతా
వరులును నిందు మేల్ వడయవత్తురు సంస్కృతి సాలు సిద్ధికిన్. 223

ప్రతిపదార్థం: అరయంగన్= చూడగా; మేటి పుణ్యనదులందున్= పవిత్రమైన నదులలో శ్రేష్ఠమైన; సరస్వతి= సరస్వతీనది; ఈ+జగమునన్= ఈ లోకంలో; నరులకున్= మనుజులకు; సౌఖ్య సంపదల్ కల్గున్= సుఖం సంపదలు కలుగుతాయి; పరలోకమునందున్= చనిపోయిన తరువాత స్వర్గలోకాదులలో; ఈ సరిద్వరన్= ఈ నదీమతల్లిని; ఒకనాఁడు చేరినను= ఒక దినం చేరినప్పటికినీ (అనగా ఒక మారు సేవించినను); వాసవముఖ్య సమస్త దేవతావరులును= ఇంద్రాది దేవతా శ్రేష్ఠులంతా; ఇందున్= ఈ నదిలో; మేల్+పడయవత్తురు= మంచి జరగటానికి వస్తారు; సిద్ధికిన్= తపస్సిద్ధికి; సంస్మృతి+చాలున్= మనసుతో తలచుకొనటమే చాలును.

తాత్పర్యం: పరిశీలించగా ఉత్తమమైన నదులలో సరస్వతి మేటి. ఈ లోకంలో మానవులకు సుఖసంపదలు కలిగేదానికీ చనిపోయిన తరువాత స్వర్గలోక సిద్ధికీ ఉత్తమమైన ఈ నదిని చేరితే చాలును. ఇంద్రాది దేవముఖ్యులు కూడా ఈచోట సౌఖ్యం పొందటానికై వస్తారు. మనసులో తలచుకొన్నమాత్రం చేతనే సిద్ధి కలుగుతుంది.

తే. **అనుచుఁ బలుమాఱు చూచుచు నధికభక్తి । మోడ్పుఁగేలు శిరంబును మోపికొనుచుఁ**
బుణ్యతమనిజమూర్తి విస్ఫూర్తి మెఱయ । నమ్మురారాతిపూర్వజుఁ డరద మెక్కి. 224

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; పలుమాఱు చూచుచున్= పెక్కుమార్లు చూస్తూ; అధిక భక్తిన్= మిక్కిలి భక్తితో; మోడ్పు+కేలు= జోడించిన చేతులు; శిరంబునన్ మోపికొనుచున్= తలపై పెట్టుకొంటూ; పుణ్యతమ= ఉత్తమ పుణ్యములు; నిజమూర్తి విస్ఫూర్తి మెఱయన్= తమ ప్రకాశంతో వెలుగగా; ఆ+ముర+అరాతి+పూర్వజుఁడు= ఆ మురారికి అన్న అయిన బలరాముడు; అరదము+ఎక్కి= తేరు ఎక్కి.

తాత్పర్యం: ఆ విధంగా చెప్తుతూ పలుపర్యాయాలు చూస్తూ మిక్కిలి భక్తితో నమస్కారం చేసి, చేతులను తలమీద పెట్టుకొని పుణ్యాతిశయంచేత తనమూర్తి శక్తి ఎక్కువకాగా ఆ బలరాముడు తన రథం ఎక్కి. (తరువాతి గద్యంతో అన్వయం).

వ. **అతిత్వరితగమనంబున ద్వైపాయనహ్రదంబునకుఁ జనుదెంచె; నయ్యెడ. 225**

ప్రతిపదార్థం: అది త్వరితగమనంబునన్= మిక్కిలి వేగంగా ప్రయాణం చేసి; ద్వైపాయన హ్రదంబునకున్= ద్వైపాయన మనే మడుగున్న చోటునకు; చనుదెంచెన్= ఏతెంచాడు; ఆ+ఎడన్= ఆ చోట.

తాత్పర్యం: మిక్కిలి వేగంగా బయలుదేరి ప్రయాణం చేసి, ద్వైపాయనమనే మడుగున్న చోటికి బలరాముడు వచ్చి, అక్కడ.

తే. **ధర్మపుత్రాదులును సుయోధనుఁడు నతని । గన్న తెఱఁ గాంబికేయుండు విన్న తెఱఁగు**
నధిప! ముసు చెప్పినాఁడ; న ట్లన్నరేంద్ర । కుంజరుఁడు విని యిట్లను సంజయునకు. 226

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; జనమేజయా!; ధర్మపుత్ర+ఆదులును= ధర్మరాజు మొదలైనవారునూ; సుయోధనుండున్= దుర్యోధనుడునూ; అతనిన్+కన్న తెఱఁగు= అతనిని చూచిన విధం; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుండు; విన్నతెఱఁగు= విన్నపద్ధతి; ముసు చెప్పినాఁడన్= ఇదివరకే చెప్పాను; అట్లు= ఆ విధంగా; ఆ+నరేంద్రకుంజరుఁడు= ఆ రాజశ్రేష్ఠుడు (ధృతరాష్ట్రుడు) విని= విన్నవాడై; సంజయునకున్= సంజయుడితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఓ జనమేజయరాజా! ధర్మరాజు మొదలైన వారూ సుయోధనుడూ ఆ బలరాముడిని చూచిన విధాన్ని ఇదివరకే చెప్పాను. ఆ విధంగా ఆ రాజశ్రేష్ఠుడు(ధృతరాష్ట్రుడు) విని సంజయుడితో ఇట్లా అన్నాడు:

పాండవ దుర్యోధనులు ద్వైపాయనహ్రదంబు విడిచి పొలికలనికిఁ బోవుట (సం. 9-54-3)

క. 'బలభద్రుఁడు సనుదెంచిన । నలఘుగదాస్ఫురిత భుజసహాయత్వసము
జ్జ్వలుఁ డగు మత్పుత్రునకుం । దెలివి మిగులకున్నె? రణముతెఱఁ గె ట్లయ్యెన్?' 227

ప్రతిపదార్థం: బలభద్రుఁడు; చనుదెంచినన్= (ద్వైపాయనమునకు) రాగా; అలఘుగదా స్ఫురిత= పెద్ద గద నుండి వెలువడుచున్న; భుజసహాయత్వ సముజ్జ్వలుఁడు+అగు= భుజబలంతో వెలుగుతున్నవాడైన; మత్+పుత్రునకున్+తెలివిమిగులక+ఉన్నె?= నా కుమారుడైన దుర్యోధనుడికి ప్రజ్ఞ ఎక్కువ కాకుంటుందా?; రణము తెఱఁగు+ఎట్లు+అయ్యెన్= యుద్ధపద్ధతి ఏవిధంగా సాగింది?

తాత్పర్యం: 'బలరాముడిని చూడగానే సాటిలేని భుజబల సహాయంతో ప్రకాశించే గదాధరుడైన నా కుమారుడి తెలివి ఎక్కువౌతుంది కదా! అయితే యుద్ధ మెట్లా సాగింది?'

క. అనుటయు నతఁ డిట్లను న । జ్జనపతికి హలాయుధుండు సనుదెంచి నె
మ్మనము దెలివొందె మూఁపులు । దనరె మొగం బలరె నీదుతనయున కధిపా! 228

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; అతఁడు= ఆ సంజయుడు; ఆ+జనపతికిన్= ఆ ధృతరాష్ట్ర మహారాజుకు; ఇట్లు+అనున్= ఇలా అన్నారు; అధిపా!= ఓ రాజా!; హల+ఆయుధుండు చనుదెంచినన్= బలరాముడు రాగా; నీదు తనయునకున్= నీ కుమారుడికి; నెమ్మనము తెలివి+ఒందెన్= మనసు వికసించింది; మూఁపులు+తనరెన్= భుజాలు విజృంభించినవి; మొగంబు+అలరెన్= ముఖం సంతోషంతో వెలిగింది (వికసించింది).

తాత్పర్యం: అనగా సంజయుడు ధృతరాష్ట్రుడితో 'ఓ రాజా! బలరాముడు రాగానే నీ కుమారుడికి మనస్సు వికసించింది. భుజాలు అదిరినవి. మొగం సంతోషంతో నిండింది.

వ. ఇట్లు ప్రీతుం డై యాతండు ధర్మనందనుం జూచి 'శమంతపంచకంబు ప్రజాపతియుత్తరవేది యనఁ బ్రసిద్ధం బైన పుణ్యస్థలం; బయ్యెడం బ్రధనంబున నిధనంబు నొందినవారికి సద్గతి యగుట ధ్రువం బని విందు; మిప్పటి పొలికలనికిం బోవుద' మనిన నతం డాద్వైపాయనహ్రదం బాసీమలోనిది గామి యెఱుంగుం గావున నమ్మాట కియ్యకొని తదభిముఖుం డైపోవ నాదుర్యోధనుండును గదాకలనంబున నంసపీఠంబు పొలుపార మత్తగజేంద్రయానంబున నమరప్రస్తూయమానుం డగుచుఁ జన శంఖభేరీప్రముఖతూర్య స్వనంబులు సెలంగె; నిట్లు పాండవపరివృతుండై యచటికి నీ కొడుకు నడచి యమర్ష సముజ్జ్వలుం డై. 229

ప్రతిపదార్థం: ఇట్లు ప్రీతుండు+ఐ= ఈ విధంగా సంతోషపడి; ఆతండు; ధర్మనందనున్+చూచి= ధర్మరాజును చూచి; శమంతపంచకంబు= శమంతపంచక మనే చోటు; ప్రజాపతి= బ్రహ్మకు; ఉత్తరవేది= ఉత్తరదిక్కునందలి యజ్ఞవేది; అనన్+ప్రసిద్ధంబు= అనగా ప్రఖ్యాతమైనది; ఐన పుణ్యస్థలంబు= అయినట్టి పవిత్రమైన చోటు; ఆ+ఎడన్+ప్రధనంబునన్= ఆ చోట

యుద్ధంలో; నిధనంబును+ఒందినవారికిన్= మరణించినవారికి; సద్గతిఅగుట= మంచిగతి కలుగుట (పుణ్యం కల్గటం); ధ్రువంబు+అని విందుము= నిశ్చయ మని వింటాము; ఇప్పటిపొలికలనికిన్+పోవుదము+అనినన్= మామూలుగా యుద్ధం చేసే చోటికిపోదాము అనగా; అతండు+ఆ ద్వైపాయనహ్రదంబు= ఆత డా ద్వైపాయనమనే మడుగు; ఆ సీమలోనిది+కామి ఎఱుంగున్+కావునన్= ఆ ప్రాంతంలోనికి కాకుండటం తెలియును గనుక; ఆ+మాటకున్+ఇయ్యకొని= ఆ మాటకు కట్టువడి; తదభిముఖుండు+ఐ పోవన్= దానివైపునకు వెళ్ళగా; ఆ దుర్యోధనుండును= ఆ దుర్యోధనుడు; గదాకలనంబునన్= గదతో కూడుటచేత; అంసపీఠంబు పొలుపు+ఆరన్= భుజపీఠం అందగించగా; మత్తగజేంద్రయానంబునన్= మదపుటేనుగు నడకతో; అమరప్రస్తూయమానుండు+అగుచున్= దేవతల పొగడ్తల నందుతూ; చనన్= వెళ్ళగా; శంఖ భేరీ ప్రముఖ తూర్యస్వనంబులు= శంఖాలు నగారాలు మొదలైన కొమ్ముబూరల శబ్దాలు; చెలంగెన్= మ్రోగాయి; ఇట్లు= ఈ విధంగా; పాండవ పరివృతుండు+ఐ= పాండవులచేత చుట్టుకొనబడిన వాడై; అచటికిన్= ఆ చోటునకు; నీ కొడుకు నడచి= నీ కుమారుడు వెళ్ళి; అమర్ష సముజ్జ్వలుండు+ఐ= కోపంతో వెలిగినవాడై.

తాత్పర్యం: ఈ విధంగా సంతోషించి దుర్యోధనుడు ధర్మరాజుతో 'శమంతపంచకం బ్రహ్మకు ఉత్తరదిక్కున యజ్ఞవేదిక అని ప్రఖ్యాతిగల పుణ్యభూమి. ఆ చోటులో యుద్ధంలో చనిపోయిన వారికి సద్గతి కలుగుట నిశ్చయం అని విన్నాము. ఎప్పుడూ యుద్ధం చేస్తున్న చోటికి వెళ్ళుదాము.' అనగా నాత డా ద్వైపాయనమనే మడుగు ఆ ప్రాంతంలోనిది కాదు గనుక ఆ మాటకు ఒప్పుకొన్నాడు. ఆ దిక్కునకు పోగా దుర్యోధనుడు గదతో కూడిన భుజబలం ఒప్పుతుండగా మదపుటేనుగు నడకతో యుద్ధానికి సిద్ధమగుతూ దేవతలు పొగడుతుండగా శంఖభేరీ కాహళాది వాద్యాల శబ్దాలు ఒప్పారాయి. ఈ ప్రకారంగా పాండవులు చుట్టుకొనగా ఆ స్థలానికి నీ కుమారుడు వచ్చి, గర్వంతో ప్రకాశిస్తూ - (తరువాతి పద్యంతో అన్వయం).

క. నిలిచిన సకలజనులు నెడ । గవిసి బలసి నిలిచి రపుడు గదయుఁ బసిఁడి క
త్తళము మెఱయ నతనియెదురఁ । జెలువొందె బకారి హేమశిఖరియుఁ బోలెన్. 230

ప్రతిపదార్థం: నిలిచినన్= నిలువగా; సకలజనులు= జనులంతా; అపుడు= ఆ సమయంలో; ఎడ గవిసి= ఆ ప్రక్కకు చేరిపోయి; బలసి నిలిచిరి= గుమిగూడి నిలిచారు; అపుడు= ఆ సమయంలో; గదయున్= గదయూ; పసిఁడి కత్తళము మెఱయన్= బంగారు కవచం ప్రకాశించగా; అతని+ఎదురన్= ఆ దుర్యోధనుడికి ఎదురుగా; బక+అరి= బకుడనే రాక్షసుడికి శత్రువు (భీమసేనుడు); హేమశిఖరియున్+పోలెన్= బంగారు కొండవలె, మేరుశైలం మాదిరి; చెలువు+ఒందెన్= అందగించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు నిలువగా జనులందరునూ ఒకదిక్కుగా కలిసి నిలిచారు. అపుడు గద, బంగారు కవచం మెరయగా భీమసేనుడు బంగారు శైలంవలె దుర్యోధనుడి కెదురుగా సొగసుగా నిలిచాడు.

విశేషం: అలం: ఉపమ.

చ. కనుఁగొని దర్పమంథరము గా నతఁ డిట్లనుఁ బాండవాగ్రజ
న్మునకు 'వడిం బెనంగఁగ సనుం బవనాత్మజుఁ జూచు వేడ్క ని
జ్జనతతి యంతకంత కిటు సందడిగాఁ దనయిచ్చఁ గ్రమ్ముదెం
చునొ? యుపవేశనిశ్చలతఁ జూచిన మే లఖిల ప్రియంబుగన్.' 231

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; దర్పమంథరముగాన్= గర్వం తక్కువ అగునట్లుగా; పాండవ+అగ్రజన్మునకున్= ధర్మరాజుతో; అతఁడు+ఇట్లనున్= ఆ దుర్యోధనుడు+ఇట్లంటున్నాడు; వడిన్+పెనంగఁగన్= త్వరగా యుద్ధం చేయటానికై; చనున్= తగును; పవన+ఆత్మజున్ చూచువేడ్కన్= భీమసేనుడిని చూచే ఆసక్తితో; ఈ+జనతతి= ఈ జన సమూహం; అంతకంతకున్+ఇటు సందడిగాన్= అంతకంతకూ ఈ విధమైన సందడి కాగా; తన+ఇచ్చన్+క్రమ్ముదెంచునొ?= స్వేచ్ఛగా క్రమ్ముకొనునో; అఖిల ప్రియంబుగన్= అందరికినీ మేలగునట్లుగా; ఉపవేశనిశ్చలతన్= సందడి లేకుండా నిశ్చలంగా మార్చుండేటట్లు; చూచినన్= చూచినట్లయితే; మేలు= మంచిది.

తాత్పర్యం: దుర్యోధనుడు పొగరుబోతుతనం తగ్గగా ధర్మరాజును చూచి, ఇట్లా అన్నాడు- 'త్వరలో యుద్ధం చేయటానికి వస్తున్న నన్నూ భీముడిని చూచే వినోదంతో ఈ జనసమూహం స్వేచ్ఛగా మూగుతారేమో? వాళ్ళు కదలకుండా కూర్చుండి మా యుద్ధాన్ని చూస్తే అందరికీ మేలు.'

వ. అని భూపాలుర నెల్ల నాలోకించినం బాంచాలాదు లగు నయ్యందఱను ధర్మనందనుండు గూర్చుండ నియోగించి, బలదేవ వాసుదేవ సహితంబుగఁ దాను నాసీనుం డయ్యె; నమ్మహీనాథమండలంబున సితప్రభుం డైన యన్నీలాంబరుండు తారకామధ్యవర్తియై మెఱయుమృగాంకు ననుకరించె; నట్టియెడ భీమసేనుండును దుర్యోధనుండును. 232

ప్రతిపదార్థం: అని భూపాలురన్+ఎల్లన్+ఆలోకించినన్= అంటూ రాజులనందరినీ బాగా చూడగా; పాంచాల+ఆదులైన+ అందఱును= పాంచాలాది దేశాల రాజులైన వారందరినీ; ధర్మనందనుండు= ధర్మరాజు; కూర్చుండన్ నియోగించి= కూర్చుండుడని ఉత్తరువుచేసి; బలదేవ, వాసుదేవ సహితంబుగాన్= బలరాముడితోను, శ్రీకృష్ణుడితోను కలిసి; తానున్+ఆసీనుండు+అయ్యెన్= తానూ కూర్చున్నాడు; ఆ+మహీనాథమండలంబునన్= ఆ రాజులోకంలో; సితప్రభుండు+ఐ= తెల్లనికాంతి కలవాడై; ఆ+నీల+అంబరుండు= నీలవస్త్రధారిఅయిన ఆ బలరాముడు; తారకామధ్యవర్తి+ఐ= నక్షత్రాల నడుమనున్నవాడైన; మెఱయు మృగాంకున్+అనుకరించెన్= ప్రకాశించే చంద్రుడిని అనుకరించాడు(చంద్రుడివలె ఉన్నాడు); అట్టి+ఎడన్= ఆ సమయంలో; భీమసేనుండును; దుర్యోధనుండును.

తాత్పర్యం: (దుర్యోధనుడు) రాజుల నందరినీ చూస్తూ ఉండగా పాంచాలం మొదలైన దేశాల రాజులనందరినీ కూర్చుండుడని ధర్మజు డాజ్ఞాపించాడు. బలరాముడితోనూ శ్రీకృష్ణుడితోనూ తానూ కూర్చున్నాడు. అపుడు బలరాముడు తెల్లనిమేనిరంగుతో నక్షత్రాల నడుమ వెలిగే చంద్రుడివలె వెలిగాడు. ఆ సమయంలో భీమసేనుడు, దుర్యోధనుడు (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ.

సీ. ఆభీల గర్జన శోభితదేహు లై । యుద్ధటవృషములయొప్పుఁ దాల్చి,
రోష మహావిషభీషణవదను లై । చండోరగంబుల చంద మొంది
మదసముజ్జృంభితమండితాకారు లై । భద్రద్విపంబుల పగిదిఁ బొల్చి,
చారుగదాశృంగ సందీప్త మూర్తు లై । మహితపర్వతములమాడ్కి మెఱసి,

ఆ. వాసుదేవయుగము వరుణద్వయంబు వై । శ్రవణయుగ్మకంబు రామయమము
వోలె దర్శనీయలీల వహించి యం । భోధియుగళ మనఁగఁ బొంగు మిగిలి. 233

ప్రతిపదార్థం: ఆభీల= భయంకరమైన; గర్జన= సింహగర్జనలతో; శోభితదేహులు+ఐ= సుందరశరీరులుఅయి; ఉద్భటవృషముల+ ఒప్పున్+తాల్చి= ఏపైన గిత్తల హొయల నంది; రోష= కోపంతో; మహావిషభీషణ వదనులు+ఐ= పెద్ద విషంతో; మిక్కిలి భయమును కలిగించే ముఖాలతో; చండ+ఉరగంబుల చందము+ఒంది= భయంకరాలయిన పెనుబాములవలె ఉండి; మద= గర్వంతో; సముజ్జృంభిత= మిక్కిలి పేట్రేగినందున; మండిత+ఆకారులై= అలంకరించబడిన శరీరాలు కలవారై; భద్రద్విపంబుల పగిదిన్ పొల్చి= మదపుటేనుగువలె ఒప్పి; చారు గదా శృంగ సందీప్త మూర్తులు+ఐ= గొప్పగదలనే శిఖరాలతో ప్రకాశిస్తున్న ఆకారాలు కలవారై; మహిత పర్వతముల మాడ్కిన్= గొప్ప పర్వతాలవలె; మెఱసి; వాసుదేవయుగము= ఇద్దరు వాసుదేవులు; వరుణద్వయంబు= ఇద్దరు వరుణులు; వైశ్రవణయుగ్మకంబు= కుబేరులజంట; రామయమము= ఇద్దరు శ్రీరామచంద్రులు; పోలెన్= వలె; దర్శనీయలీలన్ వహించి= చూడదగిన సొంపుకలిగి; అంబోధి= సముద్రముల; యుగళము+అనఁగన్= జంటయో అనగా; పొంగు= పొంగు(దర్పం); మిగిలి= మించి.

తాత్పర్యం: భయంకర గర్జనలతో కూడిన అందమైన శరీరాలు కలిగి, మదించిన ఎద్దుల అందంతో ఒప్పి, కోపమనే విషంతోఉన్న ముఖాలతో భయంకరమైన పాముల పద్ధతిని కలిగి, మదంతో వికసించే ఆకారాలు మదించిన ఏనుగుల మాదిరి ఉండి అందమైన గదల కొమ్ములతో ప్రకాశిస్తూ పెనుగొండలవలె ఇర్వురు వాసుదేవులవలె, వరుణులిద్దరివలె, కుబేరద్వయంవలె, శ్రీరాములిర్వురవలె అందంగా కనుపిస్తూ, దర్పాతిశయంతో రెండు సముద్రాలవలె పొంగారి - (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. ఒండొరులం జుఱచుఱం జూచుచుఁ, బరస్పరహృదయ విదారణంబు లగు దారుణభాషణంబు లెసఁగ శుంభదవష్టంభంబునం బొలిచి నిలిచి; రనిన విని యాంబికేయుండు. 234

ప్రతిపదార్థం: ఒండొరులన్ చుఱచుఱన్+చూచుచున్= ఒకరిని మరొకరు కోపంతో చూస్తూ; పరస్పర హృదయ విదారణంబులు+అగు దారుణ భాషణంబులు+ఎసఁగన్= ఒకరొక్కరి గుండెలు పగిలేటట్లు తీవ్రపదజాలంతో కూడిన మాటలు ఎక్కువగా మాటాడుతూ; శుంభత్+అవష్టంభంబునన్+పొలిచి= పెనుగర్వంతో ఒప్పి; నిలిచిరి= నిలిచారు; అనినన్= అనగా; విని; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: ఒకరినొకరు కొరకొర చూస్తూ, ఒకరిగుండెలు చీలేటట్లు మఱొక్కరు తీవ్రపదాలతో మాటాడుతూ పెనుగర్వంతో నిలిచారు. అనగా విని ధృతరాష్ట్రుడు - (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'తనుఁ బదునొకఁ డక్షౌహిణు । లనూనవిభవమునఁ గొలువ నఖిలనృపులుఁ బం
చినపని సేయ నెగడునా । తనయుం డేకాకియుం బదాతియు నయ్యెన్. 235

ప్రతిపదార్థం: తనున్+పదునొకఁడు+అక్షౌహిణులు= తనను పదకొండక్షౌహిని సేనలు; అనూన= సాటిలేని; విభవమునన్+ కొలువన్= ఐశ్వర్యంతో సేవించగా; అఖిలనృపులున్= రాజులందఱును; పంచిన పని చేయన్= చెప్పినపని చేయగా; నెగడు= ఒప్పారే; నా తనయుండు= నా కుమారుడు; ఏకాకియున్= ఒక్కడును; పదాతియున్+అయ్యెన్= కాలిబంటు అయ్యాడు.

తాత్పర్యం: పదకొండక్షౌహిణుల సేనలు సాటిలేనట్లుగా వైభవంగా సేవించగా రాజులంతా తన ఆజ్ఞను శిరసావహించగా ఉండే నా కుమారుడు ఏకాకీ పదాతీ అయ్యాడు.

తే. సకల ధరణికి నాథుఁడై సంపదలకు । నెల్ల భాజన మగు కౌరవేంద్రుఁ డనద
తనము దోఁపంగ గదఁ జేతఁ గొని వినిశ్చ । యమునఁ బోరికి నమరెనే? యక్క టకట! 236

ప్రతిపదార్థం: సకల ధరణికిన్ నాథుఁడు+ఐ= భూమికిన్+అంతకును రాజు+ఐ; సంపదలకున్+ఎల్లన్= ఐశ్వర్యాలంతటికీ; భాజనము+అగు= స్థానమైన; కౌరవేంద్రుఁడు= కౌరవరాజు(దుర్యోధనుడు); అనదతనము తోఁపంగన్= దిక్కులేని విధం కానరాగా; గద చేతన్+కొని= చేతిలో గదను పట్టుకొని; వినిశ్చయమునన్= నిశ్చయం లేకుండా; అక్కట+అకట!= అయ్యయ్యో!; పోరికిన్= యుద్ధానికి; అమరెనే?= సిద్ధమైనాడా?

తాత్పర్యం: సమస్తభూమికిని రాజుగా సంపదలకు తావలమైన కౌరవరాజు దుర్యోధనుడు దిక్కు లేని అనాథ మాదిరిగా గదచేత పట్టుకొని విగతనిశ్చయుడై పాదచారిగా యుద్ధానికి సిద్ధమైనాడా? అయ్యయ్యో!

వ. ఏ మనం గలదు సంజయా! దైవంబ నేర్చుం గాక!' యని పనవి యూర కుండె; నట్లున్న యమ్మానవపతికి సూతసూనుం డి ట్లనియె. 237

ప్రతిపదార్థం: సంజయా!= ఓ సంజయుడా!; ఏమనన్+కలదు= చెప్పటానికేమున్నది?; దైవంబు నేర్చున్+కాక= దేవుడికే తెలియును; అని= అంటూ; పనవి= దుఃఖించి; ఊరకుండెన్= మిన్నకున్నాడు; అట్లు+ఉన్న= ఆ విధంగా మాట్లాడకున్న; ఆ+మానవపతికిన్= ఆ రాజైన ధృతరాష్ట్రుడికి; సూతసూనుండు+ఇట్లు+అనియెన్= సూతుడి కుమార డయిన సంజయుడు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సంజయా! ఏమనగలను? అంతా దైవానికే ఎరుక.' అని అంటూ దుఃఖిస్తూ ఊరకున్నాడు. అట్లున్న ఆ ధృతరాష్ట్ర మహారాజుతో సంజయుడు ఈ విధంగా అన్నాడు:

క. 'నీసుతుఁడు సమర విషయో । ల్లాసంబున నంగకంబులం బొం గారం
గా సుస్వరమున నాకుం । తీసూనునిఁ బిలిచె నుద్ధతిన్ రణమునకున్.' 238

ప్రతిపదార్థం: నీ సుతుఁడు= నీకొడుకు; సమరవిషయ+ఉల్లాసంబునన్= యుద్ధానికి సంబంధించిన ఉత్సాహంతో; అంగకంబులన్= శరీరావయవాలలో; పొంగు+ఆరంగాన్= గర్వం అతిశయించగా; సుస్వరమునన్= గంభీరస్వరంతో; ఆ కుంతీసూనునిన్= కుంతీకుమారుడైన భీమసేనుడిని; రణమునకున్= యుద్ధానికి; ఉద్ధతిన్= గర్వంతో; పిలిచెన్= పిలిచాడు.

తాత్పర్యం: యుద్ధం మీది ఉత్సాహంతో నీ కొడుకు శరీరం ఉప్పొంగగా స్పష్టమైన కంఠంతో భీమసేనుడిని యుద్ధానికి పిలిచాడు.

వ. ఆ సమయంబున. 239

ప్రతిపదార్థం: ఆ సమయంలో.

తాత్పర్యం: అప్పుడు.

క. ఉర్వీవలయము వడఁకెను, । బర్వము గాకయును రాహు భానునిఁ బట్టెం,
బర్వతము లురిలె, వఱుకులు । సర్వదిశల నఱచె, నభము శర్కర గురిసెన్. 240

ప్రతిపదార్థం: ఉర్వీవలయము= భూగోళం; వడఁకెను= వణకింది; పర్వము= అమావాస్యాపర్వదినం; కాకయును= కాకుండగనే; రాహు భానునిన్ పట్టెన్= రాహువు సూర్యుడిని పట్టుకొన్నాడు; (సూర్యగ్రహణం అమావాస్య పర్వదినాన జరుగుతుంది); పర్వతములు+ఉరిలెన్= సప్తకులపర్వతాలు దొర్లినవి; వఱళులు= నక్కలు; సర్వదిశలన్+అఱచెన్= అన్ని దిక్కులలోను అరచాయి; నభము= ఆకాశం; శర్కరన్+కురిసెన్= ఇసుక వాన కురిసింది (ఇవి అన్నీ అపశకునాలే).

తాత్పర్యం: భూగోళం వణకింది, అమావాస్యా పర్వదినం కాకుండగనే సూర్యుడిని రాహువు పట్టుకొన్నాడు. కొండలు దొర్లాయి. నక్క లన్ని దిక్కులలో అరచాయి. ఆకాశంనుండి ఇసుక వాన కురిసింది.

వ. మఱియు నిర్ఘాతపాతప్రభృతి మహోత్పాతంబులు గలిగె; వాని నెల్ల ననుసంధించి గంధవహనందనుండు గాంధారీనందనుం జూపి ధర్మనందనున కిట్లనియె. 241

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; నిర్ఘాతపాత= పిడుగులు రాలుట; ప్రభృతి= మొదలయిన; మహా+ఉత్పాతంబులు కలిగెన్= అపశకునాలు కలిగాయి; వానిన్+ఎల్లన్= ఆ అన్నింటినీ; అనుసంధించి= కలిపికొని; గంధవహనందనుండు= వాయుసూనుడైన భీమసేనడు; గాంధారీనందనున్+చూచి= గాంధారి కొడుకైన దుర్యోధనుడిని చూచి; ధర్మనందనునకున్ ఇట్లు+అనియెన్= ధర్మరాజుతో ఈవిధంగా అన్నాడు:

తాత్పర్యం: ఇంకనూ పిడుగులు రాలటం మొదలైన అపశకునాలు కలిగాయి. వాటి నన్నిటినీ సమన్వయించి భీమసేనుడు దుర్యోధనుడిని చూపిస్తూ ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు:

సీ. 'అశ్రమంబున గెల్వ నగు నాకుఁ జూపఱు । గొనియాడఁ బోరాడి కూల్చి తొడలు
పొడిసేసి యిన్నీచుఁ బొలియింతు మద్గదా । దండసముద్దండతావిభూతి
యవధరింపుము; వీని యాయువు దెగటాఱె; । నిక్కులపాంసను నిట్టు లేను
గదిసియుఁ గ్రమ్మఱఁ గరిపురంబునకుఁ బో । నిత్తునే? ధృతరాష్ట్రుఁ డింక వగలఁ

ఆ. బొగులువాఁడు గాక! పోఁడిమితో నుండు । వాఁడె? వీఁడు మనల వాలి పఱుపఁ
దొల్లి పడినపాటు లెల్ల వెలారింతు । నధిప! నీమనమున హర్ష మెసఁగ.' 242

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ధర్మజా!); అశ్రమంబునన్= అనాయాసంగా; నాకున్+గెల్వన్+అగు= జయించగలను; చూపఱు కొనియాడన్= చూచేవారు పొగడగా; పోరాడి కూల్చి= యుద్ధంచేసి పడగొట్టి; తొడలు= తొడలను; పొడి+చేసి= నుగ్గునుగ్గుగా చేసి; ఈ+నీచున్= ఈ దుష్టుడిని; పొలియింతున్= చంపుతాను; మత్+గదాదండ= నాగదయొక్క; సముద్దండతావిభూతి= మిక్కిలి గొప్పదైన శక్తిని; అవధరింపుము= చూడుము; వీని= ఇతడియొక్క; ఆయువు+తెగటాఱెన్= ఆయుస్సు నశించింది; ఈ+కులపాంసనున్= వంశానికి చెడు పేరు తెచ్చిన వీడిని; ఇట్టులు+ఏను+కదిసియున్= ఈ విధంగా నేను తలపడి; క్రమ్మఱన్= మరల; కరిపురంబునకున్+పోనిత్తునే?= హస్తినాపురికి పోనిస్తావా?; ధృతరాష్ట్రుఁడు+ఇంకన్ వలగన్+పొగులువాఁడుగాక= ఇంక ధృతరాష్ట్రుడు దుఃఖాలతో కుమిలిపోగలడు; పోఁడిమితోన్+ఉండువాడె?= సౌఖ్యంతో ఉండగలడా?; నీ మనమునన్ హర్షము ఎసఁగన్= నీ మనసునకు సంతోషం కలుగగా; వీఁడు= ఇతడు; మనలన్= మనలనందరను; వాలి= విజృంభించి; పఱుపన్= కష్టపెట్టగా; తొల్లిపడిన పాటులు+ఎల్లన్= మునుపు పడిన కష్టాలనన్నింటినీ; వెలారింతున్= పోగొట్టుతాను.

తాత్పర్యం: 'చూచేవారు పొగడగా అనాయాసంగా పోరాడి పడగొట్టి తొడలు పొడిచేసి ఈ నీచుడిని హతమారుస్తాను. నా గదాదండం యొక్క ఆధిక్యాన్ని చూడుము. వీడి యాయువు నశించింది. ఈ కులనాశకుని దగ్గరకు చేరిన నేను

ఈ విధంగా మరల ఇతడిని హస్తినాపురికి పోనిస్తానా? ధృతరాష్ట్రుడింక దుఃఖంతో కుములకుండా సంతోషంగా ఉండగలడా? వీడు మనలను అల్లరిపాలు చేయగా మనం పడిన కష్టాలన్నిటినీ ఓ రాజా! నీ మనసునకు సంతోషం కలిగేటట్లు పోగొట్టుతాను.'

వ. అని పలికి దుర్యోధనాభిముఖుం డై. 243

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పుచూ; దుర్యోధన+అభిముఖుండై= దుర్యోధనునకు ఎదురై.

తాత్పర్యం: అని దుర్యోధనుడికి ఎదురై నిలిచి - (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నెఱి మాలి వీరి నీతఁడు । పఱిచినపాటులకుఁ దగినఫల మగు నని 'యి
త్తెఱఁగునకు నియ్యకొని చూ । పఱుపొగడఁగ నిన్ను నిపుడ పడవైచుటకున్. 244

ప్రతిపదార్థం: నెఱి మాలి= నీతి మాలి; వీరిన్= ఈ అందరను; ఈతఁడు= వీడు; పఱిచిన పాటులకున్= పెట్టిన కష్టాలకు; తగిన ఫలము+అగున్+అని= సరియైన ఫలితం అవుతుందని; ఈ+తెఱఁగునకున్= ఈ పద్ధతికి; ఇయ్యకొని= ఒప్పుకొని; చూపఱు+పొగడఁగన్= చూచే వారు కీర్తించగా; నిన్నున్; ఇపుడు+అ= ఇప్పుడే; పడవైచుటకున్= పడగొట్టటానికి.

తాత్పర్యం: 'నీతిమాలి వీరి నందరినీ ఈ దుష్టుడు పెట్టిన కష్టాలకు తగినవిధంగా బుద్ధిచెప్పుతాను.' అంటూ, 'దుర్యోధనా! అందరూ పొగడుతూ ఉండగా నిన్ను ఇప్పుడే పడగొట్టటానికి. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. అమరి యున్నాఁడ; నాబారి కగ్గ మైతి; । పడుదుగా కింక; నీకు నెక్కడకుఁ బోవ
వచ్చు?' ననవుడు నిది 'యేల పెచ్చు పెరిఁగి । యాల మెడసేసి యనిలజ! ప్రేలె దిట్లు?' 245

ప్రతిపదార్థం: అమరి+ఉన్నాఁడన్= సిద్ధంగా ఉన్నాను; నాబారికిన్+అగ్గము+ఐతి(వి)= నా హింసకు చిక్కావు; పడుదు(వు)+కాక= చస్తావు గాక; ఇంకన్ నీకున్+ఎక్కడకున్+పోవన్ వచ్చున్?= ఇక నీవే దిక్కుకు పోగలవు?; అనవుడున్= అనగా; అనిలజ!= ఓ భీమా!; ఇది ఏల?; పెచ్చుపెరిఁగి= పేట్రేగి; ఆలము+ఎడన్+చేసి= యుద్ధం మాని; ఇట్లు ప్రేలెదు?= ఈ విధంగా వాగుతున్నావు?

తాత్పర్యం: నేను సిద్ధంగా ఉన్నాను. నా చేతికి చిక్కావు. ఇంక నీవెక్కడకు పోగలవు? నీకేది దిక్కు?' అని భీముడు అనగా, 'ఓ భీమసేనా! ఎందుకు పేట్రేగి ప్రేలుతున్నావు? యుద్ధానికి ఆలస్యం చేస్తున్నావు?'

వ. అని కురువిభుండు వెండియు నిట్లనియె. 246

ప్రతిపదార్థం: అని= అంటూ; కురువిభుండు= దుర్యోధనుడు; వెండియున్= ఇంకను; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అంటూ దుర్యోధనుడు ఇంకా ఈ విధంగా పలికాడు.

క. 'పలుకుల వెఱపించెద వా । కొలఁదియె? దుర్యోధనుం డకుంఠితబాహా
బలుఁ; డిదె యవలీల నినుం । బొలియించెడిఁ; బలుకు లుడిగి పోరాడు ధృతిన్. 247

ప్రతిపదార్థం: పలుకులన్= మాటలతో; వెఱపించెదవు= భయపెట్టుతున్నావు; ఆ కొలఁదియె?= అంతేనా?; దుర్యోధనుండు; అకుంఠిత బాహాబలుఁడు= మొక్కవోని భుజబలంఉన్నవాడు; ఇదె= ఇపుడే; అవలీలన్= అనాయాసంగా; నినున్+పొలియించెడిన్= నిన్ను చంపుతున్నాడు; పలుకులు+ఉడిగి= మాటలు మాని; ధృతిన్= ధైర్యంతో; పోరాడు(ము)= యుద్ధం చేయుము.

తాత్పర్యం: 'మాటలతో బెదిరిస్తున్నావు. అంతమాత్రమేనా? కుంటుపడని భుజబలంతో దుర్యోధను డిదే అనాయాసంగా నిన్ను చంపగలడు. మాటలు మాని ధైర్యంగా యుద్ధం చేయుము.

శా. వ్యూహాభావము సూచి నన్నసదుగా నూహించెదో భీమ! మ
ద్బాహాచండిమసారదుర్దమగదాదండంబు దృప్యద్భవ
ద్దేహోల్లాసము నెట్లు దీనదశకుం దే నోర్చునో చూడుమీ!
యాహా పుట్టెడు లాఁతి చూపఱకు; హాహా పుట్టు మీ వారికిన్. 248

ప్రతిపదార్థం: భీమ!= ఓ భీమసేనా!; వ్యూహ్+అభావము+చూచి= సైన్యంలేకుండాన్ని చూచి; నన్నున్+అసదుగాన్+ఊహించెదో?= నన్ను బలహీనుడిగా భావిస్తున్నావా?; మత్+బాహా చండిమసార= నా భుజబలంయొక్క శక్తి; దుర్దమ= అణచరాని; గదాదండంబు= గదాయుధం; దృప్యత్= గర్వించిన (బలంచేత); భవద్దేహ+ఉల్లాసమున్= ఒడలి ఉత్సాహాన్ని; ఎట్టు దీనదశకున్+తేన్+ఓపునో= ఏ విధంగా శోచనీయమైన స్థితికి తెస్తుందో; చూడుమీ!= చూడుమా!; లాఁతి చూపఱకున్= ఇతరులైన చూపరులకు; ఆహా పుట్టెడున్= ఆశ్చర్యం కలుగుతుంది; మీవారికిన్= మీవారందరికీ; హాహా పుట్టున్= దుఃఖం కలుగుతుంది.

తాత్పర్యం: నాకు సేనా సమూహం లేకుండటాన్ని చూచి నన్ను బలహీనుడవనుకొన్నావా? భీమసేనా! నా భుజబలసారమైన గదాదండం జయించరానిది. గర్వంతో నిండిన ఉత్సాహంతో కూడిన నీ శరీరాన్ని ఏ విధంగా దీనస్థితికి తెస్తుందో చూడుము. అది చూచే ఇతరులకు ఆశ్చర్యం కలుగుతుంది. మీవారందరికీ దుఃఖం కలుగుతుంది.

ఉ. నా కెదురై పినాకియుఁ బినాకము వట్టక యుద్ధతిన్ గదా
భీకరవృత్తి చూపుటకుఁ బేర్చిన నెక్కుడు వేర్చి చీరికిం
గైకొన కే పడంచి భుజగర్వసమున్నతి నిర్వహింతు; నీ
కే కడ డాఁగ వచ్చు? గద నే నని సేయుటకుం గడంగినన్.' 249

ప్రతిపదార్థం: గదన్= గదతో; ఏను= నేను; అని+చేయుటకున్+కడంగినన్= యుద్ధం చేయటానికి మొదలుపెట్టితే; నాకున్+ఎదురై= నన్నెదుర్కొని; పినాకియున్= ఈశ్వరుడుకూడా; పినాకము+పట్టక= పినాకమనే వింటిని పట్టుకోకుండా; ఉద్ధతిన్= గర్వంతో; గదా భీకరవృత్తిన్= భయంకరమైన గదయొక్క చేష్టను; చూపుటకున్= ప్రదర్శించుటకు; పేర్చినన్= విజృంభించగా; ఎక్కుడు పేర్చి= మిక్కిలి విజృంభించి; చీరికిన్+కైకొనక= లెక్కచేయకుండా; ఏపు+అడంచి= పొగరును పోకార్చి; భుజగర్వసమున్నతి నిర్వహింతున్= భుజములయొక్క గర్వాధిక్యాన్ని ప్రదర్శిస్తాను; (ఇపుడు) నీకున్+ఏకడన్+డాఁగన్+వచ్చున్= నీవు ఎక్కడ దాగటానికి సాధ్యమౌతుంది?

తాత్పర్యం: నేను గదతో యుద్ధం చేయటం మొదలుపెట్టితే ఈశ్వరుడు కూడా తన ధనుస్సయిన పినాకమును పట్టుకోకుండా భయంకరమైన గదాయుద్ధానికి విజృంభిస్తే, నేను అంతకంటె ఎక్కువ విజృంభించి లెక్క చేయకుండా శత్రువు పొగరును పోకార్చి భుజబలగర్వాధిక్యమును నడుపుతాను. నీ వెక్కడ దాగగలవు?'

విశేషం: అలం: అతిశయోక్తి, కావ్యార్థాపత్తి.

వ. అని మఱియును. 250

ప్రతిపదార్థం: అని మఱియును= అంటూ ఇంకను.

తాత్పర్యం: అంటూ ఇంకా.

క. 'గదఁగయ్య మెన్నఁడొకొ చే । యుదు భీమునితోడ? ననుచు నుల్లంబునఁ గో
రుదు నెపుడు; నిప్పుడు నా । కది యొదవెన్ విధికృతిం; గృతార్థుఁడ నైతిన్. 251

ప్రతిపదార్థం: భీముతోడన్= భీముడితో; గదన్= గదతో; కయ్యము= యుద్ధం; ఎన్నఁడొకో?= ఏ దినమో?; చేయుదున్= చేసెదను; అనుచున్= అంటూ; ఉల్లంబునన్= మనసులో; ఎప్పుడున్= అన్నివేళలా; కోరుదున్= కోరుకొంటాను; విధికృతిన్= బ్రహ్మ పనివలన; ఇప్పుడు నాకున్+అది+ఒదవెన్= ఈ సమయాన నాకది సిద్ధించింది; కృతార్థుఁడన్+ఐతిన్= ధన్యుడనయ్యాను.

తాత్పర్యం: గద చేతబట్టి భీమసేనుడితో యుద్ధ మెపుడు చేస్తానా? - అని నా మనసులో ఎప్పుడూ కోరుకొంటాను. విధివశాన ఇపుడు నా కది సిద్ధించింది. ధన్యుడనయ్యాను.

వ. నీ విట చక్కనయి రమ్ము.' 252

ప్రతిపదార్థం: నీ విట చక్కనయి రమ్ము= నీవు+ఈ కడకు సరిగా రమ్ము.

తాత్పర్యం: నీవు ఇక్కడకు సిద్ధంగా రమ్ము.'

చ. అన విని యెల్లవారు భవదాత్మజు మెచ్చి నుతించి; రయ్యశో
ధనుఁ డరివీరు లట్లు ప్రథితంబుగఁ దన్ బొగడం బ్రమోది యై
వినుచుఁ బ్రవర్ధితం బయిన వీరగుణంబున నుల్లసిల్లె నా
తనిపయి భీముఁ డుద్యతగదాస్ఫురణన్ నడచెన్ నరేశ్వరా! 253

ప్రతిపదార్థం: నరేశ్వరా!= ఓ రాజా!; అనన్ విని= అనగా విన్నవారై; ఎల్లవారున్= అందరునూ; భవదాత్మజున్= నీ కుమారుడైన దుర్యోధనుడిని; మెచ్చి= మెచ్చుకొని; నుతించిరి= కీర్తించారు; ఆ+యశోధనుఁడు= ఆ కీర్తిసంపన్నుడు; అరివీరులు= శత్రువీరులు; అట్లు= ఆ విధంగా; ప్రథితంబుగన్+తన్+పొగడన్= ప్రఖ్యాతిగా తనను పొగడగా; ప్రమోది ఐ= సంతోషం కలవాడై; వినుచున్= వింటూ; ప్రవర్ధితంబు+అయిన= పెరిగిన; వీరగుణంబునన్= శౌర్యంతో; ఉల్లసిల్లెన్= సంతోషించాడు; ఆతని పయిన్= ఆతడి మీదకు; భీముఁడు= భీమసేనుడు; ఉద్యతగదాస్ఫురణన్= పైకెత్తిన గదయొక్క స్ఫూర్తితో; నడచెన్= తలపడటానికి నడచాడు.

తాత్పర్యం: (దుర్యోధనుడు యుద్ధానికి సిద్ధమై రమ్మ) అనగా విని అందరూ అతడిని మెచ్చుకొని పొగిడారు. ధృతరాష్ట్రమహారాజా! ఆ కీర్తిసంపన్నుడు (దుర్యోధనుడు) శత్రువీరులు ఆవిధంగా ప్రఖ్యాతిగా తనను పొగడగా ఆనందించి వింటూ వీరత్వపు పెంపుతో ఉల్లసిల్లినాడు. ఆతనిపై భీమసేనుడు గద పైకెత్తి నడచినాడు.

వ. అప్పుడు కుంజరబృంహితంబులును హయహేషలునుం జెలంగె; నిట్లు తన మీఁద నడచు వడముడిం జూచి నీకొడు కదల్చుచు గదాసముల్లాసంబు భాసమానంబుగ వీఁక నెదుర్కొని తాఁకిన. 254

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయాన; కుంజరబృంహితంబులును= ఏనుగుల ఘీంకారశబ్దాలున్నూ; హయహేషలును= గుఱ్ఱాల సకిలింతలున్నూ; చెలంగెన్= ఒప్పినవి; ఇట్లు= ఈ విధంగా; తనమీఁదన్ నడచు= తనపైకి దూకుతున్న; వడముడిన్+ చూచి= భీమసేనుడిని చూచి; నీ కొడుకు= నీ కుమారుడు; అదల్చుచున్= బెదరిస్తూ; గదాసముల్లాసంబు= గదతో కూడిన సంతోషం; భాసమానంబుగన్= ప్రకాశించగా; వీఁకన్+ఎదుర్కొని తాఁకినన్= పరాక్రమంతో ఎదుర్కొని తాకగా.

తాత్పర్యం: ఆ సమయాన ఏనుగుల ఘీంకారాలూ, గుఱ్ఱాల సకిలింతలూ ధ్వనించాయి. ఈ ప్రకారంగా తనమీదకు దూకుతున్న భీమసేనుడిని చూచి, నీ కుమారుడు బెదరిస్తూ గదతో కూడిన సంతోషపు వెలుగుతో పరాక్రమంతో ఎదుర్కొని తాకగా. (తరువాతి పద్యంతో అన్వయం).

భీమసేన దుర్యోధనుల గదాయుద్ధము (సం. 9-56-1)

సీ. చండగదాపరస్పర ఘట్టనంబుల । మింటఁ బె ల్లడరెడుమంటగములఁ
బరమఘోరము లగు పదతాడనంబుల । నొలయు వసుంధరాచలనములను
నుద్భటక్రోధ సముద్రేకములఁ జూడ్కు । లం దుల్లసిల్లెడు నరుణరుచుల
దారుణధ్వను లగుతర్జనలీలలఁ । బరఁగుపర్వత గుహాప్రతిరవముల

తే. ననిమిషుల దృష్టు లిఱుమిట్లు గొనఁగ భుజగ । పతియుఁ గూర్మంబు సంకటపడఁగఁ దరణి
కిరణములు వెల్కఁ బాఱ దిక్కరులు బెదర । నొప్పె నత్తొలితాకు మహోగ్ర మగుచు. 255

ప్రతిపదార్థం: చండగదా= భయంకరమైన గదల; ఘట్టనంబులన్= రాపిడులతో; మింటన్= ఆకాశాన; పెల్లు+అడరెడు= మిక్కిలి ఎక్కువైన; మంట గములన్= మంటల గుంపులచేతను; పరమ ఘోరములు+అగు= మిక్కిలి భయంకరాలు+అయిన; పదతాడనంబులన్= కాళ్ళతో కొట్టటంవలన; ఒలయు వసుంధరాచలనములను= భూకంపములచేతను; ఉద్భటక్రోధ సముద్రేకములన్= ఎక్కువైన కోపంతో కూడి ఉద్రేకాలతో; చూడ్కులందున్= చూపులలో; ఉల్లసిల్లెడు= ఒప్పే; అరుణరుచులన్= ఎఱ్ఱని కాంతులచేతను; దారుణధ్వనులు+అగు= భయంకరమైన శబ్దములుగల; తర్జనలీలలన్= బెదరింపులతో; పరఁగు= వ్యాపించిన; పర్వతగుహా ప్రతిరవములన్= కొండగుహల ప్రతిధ్వనులచేతను; అనిమిషుల దృష్టులు= రెప్పపాటులేని దేవతల చూపులు; మిఱుమిట్లు+కొనఁగన్= చెదరిపోగా; భుజగపతియున్= ఆదిశేషుడును; కూర్మంబున్= ఆదికూర్మమును (భూమిని మోయునటువంటి తాబేలు); సంకట పడఁగన్= కష్టపడగా (కలతనందగా); తరణి కిరణములు= సూర్యకిరణాలు; వెల్కన్+పారన్= (వెలుక+పాఱు) వెలవెలబోగా; దిక్కరులు బెదరన్= దిగ్గజాలు బెదిరిపోగా; ఆ+తొలితాఁకు= ఆ తొలిసారి ఎదుర్కొనటం (తొలిదెబ్బ); మహా+ఉగ్రము+అగుచున్= మిక్కిలి భయంకరంగా; ఒప్పెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: భయంకరమైన గదలయొక్క తాకిడులతో, ఆకసంలో ఎక్కువగా మండే మంటల గుంపుచేత, మిక్కిలి ఘోరమైన కాలితాకిడికి భూకంపంతోను, ఎక్కువైన కోపం యొక్క ఉద్రేకాలతో ఎఱ్ఱని కంటి కాంతులచేతను, భయంకరమైన శబ్దాలు కలిగిన బెదరింపులతో ప్రతిధ్వను లిచ్చే కొండ గుహలచేతను, రెప్పపాటులేని దేవతల చూపులు బెదరిపోయేటట్లుగాను, భూభారం వహిస్తున్న ఆదిశేషుడు, తాబేలు కష్టపడేటట్లుగాను సూర్యకిరణాలు వెలవెలపోయేటట్లుగాను, దిగ్గజాలు భయపడగా, ఆ తొలితాకు భయంకరంగా ఒప్పింది.

విశేషం: అతిశయోక్తి.

వ. ఇట్లు తలపడి మండలప్రచార వివిధ ప్రకారంబులం బుడమికిం జిత్రగదాసారణ బహుభంగుల నింగికిం గ్రొత్త యొ ప్పొలయం దమలావును వేగంబును నేర్పును దర్పంబును జూపఱకు వెఱఁగుఁ బుట్టింప నంతకంతకు నెక్కుడగు మదంబులం బొదలెడు బాహుదండంబుల బలనైపుణంబు లగ్గింపం బేర్చు బీరంబుల నొండొరుల సంరంభంబుల సరకుగొనక యక్కురుపాండవపుంగవులు జంభవాసవులచందంబునం బెనంగినం బలుదెఱంగు లైన గదా ప్రహతులం దునియలుఁ బఱియలుఁ దుముళ్ళునై సీసకంబులు కత్తళంబులు ధరాతలంబునం దొఱంగె; నట్టియెడ. 256

ప్రతిపదార్థం: ఇట్లు తలపడి= ఈ విధముగా ఎదుర్కొని; మండల ప్రచార వివిధ ప్రకారంబులన్= వలయాకారంగా విధాలుగా తిరుగుతూ; పుడమికిన్= భూమికి; చిత్ర+గదా+ఆసారణ+బహుభంగులన్= గదను త్రిప్పటంలో అనేకవిధాల చిత్రమైన పద్ధతిలో; నింగికిన్ క్రొత్త ఒప్పు+ఒలయన్= ఆకసానికి క్రొత్తసొగసు రాగా; తమ లావును వేగంబును= తమ తమ బలము, త్వర; నేర్పును దర్పంబును= ప్రజ్ఞయు, గర్వంబును; చూపఱకున్ వెఱఁగు+పుట్టింపన్= చూచేవారికి ఆశ్చర్యం కలిగించగా; అంతకున్+అంతకున్; ఎక్కుడు+అగు మదంబులన్ పొదలెడు= ఎక్కువైన గర్వాలతో ఒప్పిన; బాహుదండంబుల= దండములవంటి భుజాలయొక్క; బలనైపుణంబులు+అగ్గింపన్= బలం, నేర్పరితనం మెచ్చుకొనగా; పేర్చు= విజృంభించే; బీరంబులన్= ప్రగల్భాలతో ఒండొరుల సంరంభంబులన్= ఒకళ్ళొకళ్ళు గొప్పను లెక్కచేయక; ఆ+కురుపాండవ పుంగవులు= ఆ కురువంశ పాండవశ్రేష్ఠులు; జంభవాసవుల చందంబునన్= జంభాసుర ఇంద్రులవలె; పెనంగినన్= పోట్లాడగా; పలు తెఱంగులు+ఐన= అనేక విధాలైన; గదాప్రహతులన్= గదల దెబ్బలచేత; తునియలున్= ముక్కలుగను; పఱియలున్= బద్దలుగను; తుముళ్ళును+ఐ= చిన్నముక్కలుగను మారి; సీసకంబులు= కిరీటాలు; కత్తళంబులు= కవచాలు; ధరాతలంబునన్= భూమిపైన; తొఱంగెన్= దొర్లాయి; అట్టి ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా ఎదుర్కొని, చక్రాకారంగా పలురకాలుగా విచిత్రంగా గదలను త్రిప్పుతూ, భూమికి ఆకాశానికి ఒక క్రొత్త సొగసు ఒప్పేటట్లుగా తమ బలాన్ని వేగాన్ని తెలివిని గర్వాన్ని చూచేవారికి ఆశ్చర్యం కలిగేటట్లుగా అప్పటప్పటికి ఎక్కువైన అహంకారంతో ఒప్పిన భుజబలం యొక్క నేర్పరితనాన్ని పొగడగా విజృంభించి, వీరత్వంతో ఒకరు మరియొకరి ఉత్సాహాన్ని లెక్కచేయక, ఆ కౌరవ పాండవశ్రేష్ఠులు జంభేంద్రుల వలె పోట్లాడగా పలు రకాలైన గదల దెబ్బలచేత ముక్కలు ముక్కలైన కిరీటాలు, కవచాలు భూమిమీద దొర్లాయి. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

మ. ఒకది క్కుద్ధతిఁ బూన్చి యొండుదెస వ్రేయున్ మేను వంచించి వ్రేఁ
తకుఁ దప్పన్ వడివ్రేయు నొడ్డనమునం దప్పించి వేగంబు గుం
దక నొప్పించుఁ జలం బెలర్పఁగ గదాదండంబు దూలించుఁ బాం
డుకుమారుం డుఱ కట్లు కౌరవవిభుండుం గేలి సల్పుం దగన్. 257

ప్రతిపదార్థం: ఒక దిక్కు+ఉద్ధతిన్+పూన్చి= ఒక వంక గర్వంతో చూపి; ఒండు దెసన్ వ్రేయున్= ఇంకో దిక్కునకు విసరును; మేను వంచించి= ఒడలను తప్పించి; వ్రేఁతకున్= వేసిన దెబ్బకు; తప్పన్= తప్పిపోగా; వడిన్ వ్రేయున్= శీఘ్రంగా దెబ్బకొట్టును; ఒడ్డనమునన్ తప్పించి= వ్యూహం నుండి తప్పించి; వేగంబు+కుందక= తొందర తగ్గకుండా; నొప్పించున్= బాధపెట్టుతాడు;

చలంబు= మాత్సర్యం; ఎలర్పఁగన్= తెలియగా; గదాదండంబున్= గదను; తూలించున్= ఆడించును; పాండు కుమారుండు= భీమసేనుడు; ఉఱక= లక్ష్యపెట్టక; అట్లు= అదే ప్రకారంగా; కౌరవవిభుండున్= దుర్యోధనుడుకూడ; తగన్= తగినట్లుగా; కేళిసల్పెన్= యుద్ధక్రీడను చేశాడు.

తాత్పర్యం: ఒక ప్రక్కకు చూపి మరొక ప్రక్కకు వేస్తూ శరీరాన్ని తప్పించి దెబ్బ తప్పగా శీఘ్రంగా వేస్తూ వ్యూహం నుండి తప్పించి త్వరతగ్గకుండా బాధిస్తూ, మత్సరం అతిశయించగా గదాదండాన్ని ఆడిస్తూ భీమసేనుడు అట్లా దూకగా, దుర్యోధనుడు కూడా తగినట్లుగా యుద్ధం చేశాడు.

విశేషం: అలం: స్వభావోక్తి.

వ. మఱియును శిక్షావిశేషంబులు వెలయ నుల్లసిల్లి. 258

ప్రతిపదార్థం: మఱియును= ఇంకను; శిక్షావిశేషంబులు= తమ తమ అభ్యాసాల యొక్క గొప్ప; వెలయన్= ప్రఖ్యాతంకాగా; ఉల్లసిల్లి= విజృంభించి.

తాత్పర్యం: ఇంకా ఇరువురూ తమ తమ విద్యాభ్యాసాలు ప్రకాశించగా విజృంభించి.

మ. గదతోడన్ గద చుట్టి రాఁ దిగుచుచున్ గం డొప్ప లంఘించి మా
ఱు దెసల్ గైకొనుచుం గడంగి పలుమాఱుం దాఁకుచుం బాయుచుం
బదబాహాకటిమధ్యవక్షముల సంభావ్యత్వరాచిత్రితో
న్మదనానాగతరేఖలన్ మెఱయ భీమత్వత్సుతుల్ దీప్తు లై. 259

ప్రతిపదార్థం: గదతోడన్ గద చుట్టిరాన్= గదతో గద తిరిగి రాగా (అనగా త్రిప్పెడు గదతో మరియొకని గదకూడ త్రిప్పుచు); తిగుచుచున్= లాగుతూ; గండు+ఒప్పన్= మగటిమి అతిశయించగా; లంఘించి= దూకి; మాఱుదెసన్ కైకొనుచున్= దిక్కులు మారుస్తూ; కడంగి= ప్రయత్న పూర్వకంగా; పలుమాఱున్= అనేక పర్యాయాలు; తాఁకుచున్ పాయుచున్= తగులుతూ దూరమౌతూ; పద= పాదాలు; బాహా= చేతులను; కటిమధ్య= నడుముభాగాన; వక్షములన్= గుండెలలోను; సంభావ్యత్వరా= కలిగే సంభ్రమంతో; చిత్రిత= బొమ్మవలె; ఉన్మద= దర్పంయొక్క; నానాగత రేఖలన్= అనేక విధాలైన గుర్తులతో; మెఱయ= ప్రకాశించే; భీమ= భీమసేనుడును; త్వత్+సుతుల్= నీ కుమారుడును; దీప్తులై= వెలుగుతూ.

తాత్పర్యం: గదతో గద చుట్టుకొని రాగా లాగుతూ, మగటిమి అతిశయించగా దూకుతూ, ప్రక్కదిక్కులు చూస్తూ, ప్రయత్నంతో అనేక పర్యాయాలు ఒకరిని మరొకరు తాకుతూ, దూరంగా పోతూ, పడగా భుజాలను, నడుము మధ్యభాగాన గుండెపైన వేగిరపాటుతో కూడిన బొమ్మ గీసినట్లు అనేక రకాలైన చేష్టలతో, దర్పంతో మెరిసే భీమసేనుడూ, నీ కుమారుడూ ప్రకాశించినవారై - (తరువాతి పద్యంతో న్వయం.)

విశేషం: అలం: స్వభావోక్తి. ఇక్కడ 'మెఱయు' క్రియకాదు. ధాతుజ విశేషణం.

ఉ. తప్పినయప్పు డ్రేటు దముఁ దాఁకినయప్పు డనేక భంగులై
యొప్పలు బల్పులున్ మెఱయ నుల్లములన్ సకలాంగకంబులం

గప్పఁ దలిర్చు కోపములఁ గ్రమ్మెడు రక్తములన్ సురవ్రజం
బప్పటి కప్డు వింత యగునచ్చెరు వొందఁగఁ బోరి రేపునన్. **260**

ప్రతిపదార్థం: తప్పినఅప్డు= తమ గురి తప్పినప్పుడు; వ్రేటు= దెబ్బ; తమున్+తాఁకిన అప్డు= తమను తాకినప్పుడు; అనేక భంగులు+ఐ= నానావిధాలుగా; ఒప్పులు బల్పులున్= ఒప్పుట అధిక్యాలూ; ఉల్లములన్= మనసులలో; మెఱయన్= ప్రకాశించగా; సకల+అంగకంబులన్ కప్పన్= శరీరాలలోని అన్ని భాగాలను క్రమ్ముకోగా; తలిర్చు కోపములన్= కానవచ్చే కోపాలతోను; క్రమ్మెడు రక్తములన్= క్రమ్ముకున్న నెత్తుటితోను; అప్పటికప్డు= వెనువెంటనే; సురవ్రజము= దేవతాసమూహం; వింత అగు= వింత అయిన; అచ్చెరువు+ఒందఁగన్= ఆశ్చర్యాన్ని పొందగా; ఏపునన్ పోరిరి= పరాక్రమంతో పోట్లాడినారు.

తాత్పర్యం: తమ గురిపెట్టిన దెబ్బ తప్పినప్పుడు ఆ దెబ్బ తమను తాకినప్పుడు అనేకవిధాలయిన ఒప్పు, బలుపు వికసించగా మనస్సులను, శరీరంలోని భాగాలన్నీ కప్పుకొనగా చిగిర్చిన కోపాలవలన క్రమ్ముకొనే నెత్తుటిని చూచి దేవతా సమూహాలు ఆశ్చర్యంతో అప్పటికప్పుడు వింతగా చూస్తుండగా పౌరుషంతో యుద్ధం చేశారు.

విశేషం: అలం: స్వభావోక్తి.

వ. ఆ సమయంబున. **261**

తాత్పర్యం: అప్పుడు.

సీ. వితతవీరాగ్రహావేశాదిదర్పిత । చిత్తులై యొండొరు నొత్తరించు
నుగ్రమహోద్ధతి నుద్భటాటోపతీ । వ్రములగు సమరవిభ్రమము లంగ
సంగతంబులు గాఁగ జయవాంఛనాత్మర । క్షణములవలని నైపుణము లెడలు
టయు, ననర్గళ నిరూఢప్రహారంబులం । దంద బెట్టిరువురయందు సూడు

తే. పడఁగఁ దాఁకిన శోణిత ప్రసరణంబు । నిరతిశయ మైన వెడ సోలి నిలిచి గదలు
వామకరముల నూఁదియు వారు మగుడఁ । బోరి కెలయుట నిర్భరాద్భుతము సేసె. **262**

ప్రతిపదార్థం: వితత= విస్తారమైన; వీర= వీరత్వమును; ఆగ్రహ+ఆవేశ= కోపం, ఉద్వేగం; ఆది= మొదలైన దానిచేత; దర్పిత చిత్తులు+ఐ= గర్వంతో కూడిన మనస్సు కలవారై; ఒండొరున్= ఒకరికొకరు; ఒత్తరించున్= అతిశయించును(ఆక్రమించును); ఉగ్రమహా+ఉద్ధతిన్= భయంకరమైన దర్పంతో; ఉద్భట ఆటోప తీవ్రములు+అగు= గర్వముయొక్క ఆర్భాటంచేత తీవ్రములైన; సమరవిభ్రమములు= యుద్ధపు చేష్టలు; అంగసంగతంబులు కాఁగన్= శరీరంతో కూడి ఉండగా; జయవాంఛన్= జయంపై కోరికతో; ఆత్మరక్షణముల వలని= తనను తాను కాపాడుకొనే; నైపుణములు= నేర్పరితనాలు; ఎడలుటయున్= పోవటమును; అనర్గళ= అడ్డులేని; నిరూఢ ప్రహారంబులు= గట్టిదెబ్బలు; అందంద= అక్కడక్కడ; ఇరువుర అందున్= భీమదుర్యోధను లిద్దరియందును; బెట్టు= మిక్కిలి; సూడుపడఁగన్= గాయమయ్యేటట్లు; తాఁకినన్= తగులగా; శోణిత-ప్రసవణంబు= రక్తస్రావం; నిరతిశయము+ఐనన్= ఎక్కువకాగా; వెడ= ఇంచుక; సోలి= మూర్ఛిల్లి; నిలిచి= ఆగి; గదలు= చేలియందలి గదాయుధాలు; వామకరములన్+ఊఁదియున్= ఎడమచేతులతో నొక్కిపట్టియు; వారు; మగుడన్+పోరికిన్+ఎలయుట= మరల యుద్ధమునకు ప్రయత్నించుట; నిర్భర+అద్భుతము చేసెన్= ఎక్కు వైన ఆశ్చర్యాన్ని కలిగించింది.

తాత్పర్యం: విస్తారమైన వీరత్వంతో కోపావేశాలతో మదించిన మనస్సులతో ఒకరినొకరు తప్పించుకొంటూ భయంకరమయిన గర్వాధిక్యం, ఆర్భాటపు ఆధిక్యం కలిగిన యుద్ధపు వికారాలు శరీరంతో కలసిపోగా జయవాంఛతో తమను కాపాడుకొనే నేర్పరితనం సడలిపోగా సాటిలేని గదలయొక్క దెబ్బలవలన అక్కడక్కడ ఇద్దరి శరీరాలలో గాయాలు తగులగా ఆ గాయాలనుండి కారే నెత్తురు వలన ఇంచుక సొమ్మసిల్లి నిలిచి గదలను ఎడమచేతితో ఊదుకొని కూడా మరల వారు యుద్ధానికి ప్రయత్నించటం మిక్కిలి అద్భుతంగా కానవచ్చింది.

విశేషం: అలం: స్వభావోక్తి.

వ. ఇట్లు ధైర్యధుర్యోత్సాహంబులం బొదలి. 263

తాత్పర్యం: ఈ విధంగా ధైర్యంతోడి ఉత్సాహంతో ఒప్పి.

శా. రౌద్రోల్లాసము మూర్తి సంకలన ఘోరంబై పొరిం బేర్చె నా
నుద్రిక్తం బగునూత్నరక్తమున మగ్నోన్మగ్నతం బొల్చి త
ర్జద్రూపోగ్రగదాయుగంబు విసరత్సంధ్యాంబుదద్వంద్వభా
స్వద్రేఖాలలితంబు చెన్నువడసెన్ వారిద్దఱుం బోరఁగన్. 264

ప్రతిపదార్థం: వారు+ఇద్దఱున్= భీమదుర్యోధను లిరువురూ; పోరఁగన్= యుద్ధం చేస్తూ ఉండగా; రౌద్ర+ఉల్లాసము= కోపముయొక్క ఉత్సాహం; మూర్తి సంకలన ఘోరంబు+ఐ= ఆకారంతో కూడుకొనియుండుటచేత భయంకరమై; పొరిన్ పేర్చెన్+నాన్= మిక్కిలి అతిశయించినదా అన్నట్లు; ఉద్రిక్తంబు+అగు= ఉద్రేకంతో కూడిన; నూత్నరక్తమునన్= క్రొత్తనెత్తుటిలో; మగ్న+ఉన్మగ్నతన్+పొల్చి= మునిగి తేలటంతో ఒప్పి; తర్జత్+రూప= భయపెట్టుచున్న ఆకారంచేత; ఉగ్రగదాయుగంబు= భయంకరమైన గదల జంట; విసరత్= విశేషంగా కదలుతున్న; సంధ్యా+అంబుద= సంధ్యాకాల మేఘాల; ద్వంద్వ= జంటయొక్క; భాస్వత్+రేఖా - లలితంబు= ప్రకాశిస్తున్న విలాసంచేత మనోహరమయినది; చెన్ను+పడసెన్= అందం పొందింది.

తాత్పర్యం: ఆకృతి వహించిన రౌద్రంయొక్క ఉత్సాహం రూపందాల్చటంచే భయంకరంగా యుద్ధంలో విజృంభించినదా? అన్నట్లు వెలికి వచ్చే క్రొత్తనెత్తుటిలో మునిగి తేలటంతో ఒప్పి బెదరించుచున్న తగిన భయంకరమైన గదల జంట సంధ్యాకాలంలో వ్యాపించిన మేఘాల జతయొక్క ప్రకాశించే రేఖలచేత వారిద్దరు పోట్లాడగా అందాన్ని సంతరించుకొన్నది.

విశేషం: ఉత్ప్రేక్ష, ఉపమ.

క. సుర లచ్చెరువును మెచ్చును । బిరికొనుచిత్తములతోడఁ బెద్దయుఁ బ్రొ ద్ద
య్యిరువుర గెలుపోటమి తెఱఁ । గరసి నిరూపింపనేరరైరి నరేంద్రా! 265

ప్రతిపదార్థం: నరేంద్రా!= ఓ రాజా!; సురలు= దేవతలు; అచ్చెరువును= ఆశ్చర్యమూ; మెచ్చును= మెప్పుకోలూ; పిరికొను చిత్తములతోడన్= పెనవేసుకొన్న మనస్సులతో; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; ఆ+ఇరువుర గెలుపు, ఓటమి తెఱఁగు+అరసి= ఆ ఇద్దరి యొక్క జయాపజయాల విధమును గుర్తించి; నిరూపింపనేరరైరి= చెప్పలేకపోయారు.

తాత్పర్యం: ఓ రాజా! దేవతలు ఆశ్చర్యాన్ని, మెప్పును పెనవేసుకొన్న మనస్సులతో చాలాసేపు వారిద్దరి జయాపజయాలను చూచి ఇదమిత్థమని నిర్ణయించలేకపోయారు.

తే. **అప్పు డప్పుడ తలపడినట్టు లప్పు । డేచి విలసిల్లు మేనుల యెఱ్ఱచెలువు**
గలయఁ బూచిన నడ మ్రోదువులఁ దలంపఁ । బట్టుగా నొప్పె నధిప! నీపట్టిదోయి. **266**

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; అప్పుడప్పుడ తలపడినట్టులు= అపుడపుడే ఎదురుకొన్నట్లుగా; అప్పుడు= ఆ సమయాన; ఏచి= విజృంభించి; విలసిల్లుమేనుల= ప్రకాశించే శరీరాలయొక్క; ఎఱ్ఱచెలువు= ఎర్రని అందం; కలయన్+పూచిన= అంతటా విరబూచిన; నడమ్రోదువులన్+తలంపన్= నడచే మోదుగుచెట్లతోడి పోలికను తలపించటానికి స్థానంగా; పట్టు కాన్; నీ పట్టిదోయి= నీ కుమారద్వయం; ఒప్పెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: ఓ రాజా! అపుడపుడే ఎదురయినట్లుగా ఆ సమయంలో విజృంభించి ప్రకాశించే ఒడళ్ళు ఎర్రగా అందంగా విరబూచిన నడయాడు మోదుగుచెట్లను తలపించేటట్లు ఒప్పాయి. నీ కొడుకులు ఇద్దరూ అట్లా వెలిగారు.

విశేషం: అలం: స్మృతి.

వ. **ఇవ్విధంబున నొండొరులకు వట్రపడక యమ్మేటిమగలు సాటోపసంరంభంబులం బెనంగి; రందు గాంధారీనందనుండు వలపలించి చుట్టుకొని రా నది సరకుసేయక బకవైరి దాపలించి తిరిగినం బెరిఁగిన యీరసంబున నుల్లసితుం డై యాభూవల్లభుం డతనిబరియెముక లగల వ్రేసిన, నవ్వీరుం డక్కౌరవపతి కరంబుతో నగ్గద బీఱువోవ వ్రేయం బాయక మగుడం బూన్చి సారించినం దోరంపు మెఱుంగు లెసంగం జెలంగుశబ్దంబులు నింగి ముట్ట బెట్టిదంబుగఁ దా వెరవునం దిరిగి యద్ధరణీశుండు శిరస్తాడనంబు సేసెఁ, జేసినం గౌంతేయుండు గంపింపమి యక్కజం బై యుండె; నంత నగ్గలం బగునలుక నవ్వడముడి పుడమి తేనివెడఁద యురం బుపలక్షించి లాఘవఘోరంబుగ గదాదండంబు ద్రిప్పి వైన, నాతం డది మేనినుసులునం దప్పింప నది యిల చలింపం బడిన నన్నుసులు తెఱపిన యురికి యద్భుతవేగుం డగు నావాయుపుత్రుండు గద పుచ్చుకొని తిరుగుసందున దుర్యోధనుండు తదీయ వక్షఃస్థలంబు దారుణప్రహారంబున నొప్పించిన నతండు పాండవపాంచాలుర చిత్తంబులు దూలసోలియు, నాలోనన తెలివొంది బలవిక్రమంబులు మెఱయ నమ్మేదినీపతి పార్శ్వభాగంబు బెట్టడిచిన మ్రోఁకరిలంబడియును వీఁక చెడక యెగసి యజ్జగతీపతి తన్ను నగుచు నార్చుపగతురు సిగ్గువడ నగ్గలికసొంపు పొంపిరివోవఁ బవనతనయుఫాలకర్ణ మధ్యప్రదేశంబు పటుప్రహతిం బగిల్చిన నొల్లంబోయి శీఘ్రంబునం దేరి యమ్మహాబలనందనుండు గండతలంబునం దొరుఁగునెత్తు రనుమదంబున మత్తకరి ననుకరించుచుఁ దుండంబు చందంబునం జెలు వొందుగద యల్లార్చి పేర్చి వ్రేటుగొనిన మెడకెలను దాఁకి నీకొడుకు మహాపవనపతితం బగు సాలంబు పోలికిం గూలినం గని ధర్మ పుత్రప్రముఖులు ప్రమోదంబు నొందిరి; గ్రక్కున లేచి కాలాకారుం డై ధాత్రీనాథుఁడు చిత్రభ్రమణంబుల వెగడుపఱిచి పలువ్రేటుల నొప్పించినం గిమ్మీరవైరి వసుధం డ్రెళ్ళుటయు నది సావుగాఁ గొని**

యక్కురుసింహుండు సింహనాదంబు సేయ నవ్వాయుసుతుండు సావమి యెఱింగి యాభూపతి పెనంగుభంగియుఁ గనుంగొని మెచ్చి సురప్రకరంబులు పుష్పవర్షంబు గురియం బరులకుం భయం బొలసె; నంతం దెలిసి భీమసేనుం డుద్వృత్తలోచనుం డై వీరావష్టంభంబునం బొలిచె; నప్పుడు సాత్యకి ధృష్టద్యుమ్న నకులసహదేవు లే లేమి? యని సుయోధను సంగ్రామంబునకుం బిలిచిన విని యా వృకోదరుండు వారల వల దని వారించి విగతఖేదుం డగుచు నాకేశుండు నముచిం దాఁకిన తెఱంగున రారాజుం దలపడి బహుచిత్రగతులం జరింపం జూచి సవ్యసాచి జనార్దనున కి ట్లనియె. 267

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; ఒండొరులకున్+వ(ట)పడక= ఒకరికొకరు వశపడకుండా; ఆ+మేటిమగలు= ఆగొప్పవీరులు; సాటోప సంరంభంబులన్+పెనంగిరి= ఆర్భాటంతో తొందరతో యుద్ధం చేశారు; అందున్+గాంధారీ నందనుండు= వారిలో దుర్యోధనుడు; వలపలించి= కుడివైపు నుండి; చుట్టుకొనిరాన్= తిరిగిరాగా; అది సరకు చేయక= దానిని లెక్కపెట్టకుండా; బకవైరి= భీమసేనుండు; దాపలించి= ఎడమవైపునుండి; తిరిగినన్= తిరిగిరాగా; పెరిఁగిన ఈరసంబునన్= ఎక్కువైన కోపంతో; ఉల్లసితుండు+ఐ= ఉత్సాహిఅయి; ఆ భూవల్లభుండు= ఆ దుర్యోధనుడు; అతని బరిఎముకలు= ఆ భీముడి ప్రక్క ఎముకలు; అగలన్+వ్రేసినన్= విరిగేటట్లు కొట్టగా; ఆ+వీరుండు= ఆ భీముడు; ఆ+కౌరవపతి= ఆ దుర్యోధనుడి; కరంబుతోన్= చేతితో; ఆ+గద బీఱు+పోవన్+వ్రేయన్+పాయక= ఆ గద వ్యర్థమయ్యేటట్లు కొట్టినను, విడువక; మగుడన్+ పూన్చి= మరల ప్రయత్నించి; సారించినన్= విసరగా; తోరంపు మెఱుంగులు= దట్టమయిన నిప్పురవ్వలు; ఎసంగన్+చెలంగు శబ్దంబులు= ఎక్కువగా మ్రోసే శబ్దాలు; నింగి ముట్టన్= ఆకాశమంటి తాకగా; బెట్టిదంబుగన్= గట్టిగా; తాన్+వెరవునన్+తిరిగి= తాను ఉపాయంతో మరలి; ఆ+ధరణీశుండు= ఆ దుర్యోధనుడు; శిరస్తాడనంబు+చేసెన్= తలతో కొట్టెను; చేసినన్= చేయగా; కౌంతేయుండు= భీమసేనుడు; కంపింపమి+అక్కజంబు+ఐ+ఉండెన్= భయంతో వణకకుండటం ఆశ్చర్యంగా ఉండినది; అంతన్= ఆ మీద; అగ్గలంబు+అగు+అలుకన్= ఎక్కువైన కోపంతో; ఆ+వడముడి= ఆ భీమసేనుడు; పుడమిఱేని= రాజైన దుర్యోధనుడి; వెడఁదఉరంబు+ఉపలక్షించి= విశాలమైన ఎదురురొమ్మును గురిచూచి; లాఘవ ఘోరంబుగన్= తేలికగా భయమును కలిగిచేటట్లుగా; గదాదండంబు త్రిప్పి వైవన్= గదను గిరగిర త్రిప్పికొట్టగా; ఆతండు= దుర్యోధనుడు; అది= ఆ దెబ్బను; మేనిన్+నుసులునన్+తప్పింపన్= శరీరాన్ని లాఘవంతో తప్పించగా; అది= ఆ గద; ఇల చలింపన్+పడినన్= భూమి కదలగా క్రింద పడగా; ఆ నుసులు తెఱపిన= ఆ లాఘవపు అవకాశంలో; ఉఱికి= దూకి; అద్భుత వేగుండు+అగు= ఆశ్చర్యము కల్గించే త్వర కలవాడైన; ఆ+వాయుపుత్రుండు= ఆ భీముడు; గద పుచ్చుకొని= గదను తీసికొని; తిరుగు సందునన్= తిరిగే వ్యవధిలో; దుర్యోధనుండు తదీయ వక్షస్+స్థలంబున్= దుర్యోధను డా భీముడి గుండెలను; దారుణ ప్రహారంబునన్= భయంకరమైన దెబ్బతో; నొప్పించినన్= బాధించగా; అతండు= ఆ భీముడు; పాండవ పాంచాలుర చిత్తంబులు= పాండవులయు, పాంచాలురయు, మనసులు; తూలన్= తూలిపోగా; సోలియున్= సొమ్మసిల్లినప్పటికినీ; ఆలోనన= అంతలోనే; తెలివి+ఒంది= ప్రజ్ఞ తెలిసి; బలవిక్రమంబులు మెఱయన్= బలమును, శౌర్యమును ప్రకాశించగా; ఆ+మేదినీపతి= ఆ దుర్యోధనుడి; పార్శ్వభాగంబున్= ప్రక్కలను; బెట్టు+అడిచినన్= మిక్కిలిగా కొట్టగా; మ్రోఁకరిలన్+పడియున్= బోరగిల క్రిందబడినను; వీఁక చెడక= పరాక్రమం చెదరకుండా; ఎగసి= మీదకు ఎగిరి; ఆ+జగతీపతి= ఆ రాజు; తన్ను నగుచున్+ ఆర్చుపగతురు= తన్ను జూచి పరిహాసిస్తూ గర్జనం చేసే శత్రువులు; సిగ్గుపడన్= సిగ్గుతో తలవంచగా; అగ్గలిక సొంపు= దూకుడుపాటి యొక్క సొగసు; పొంపిరి పోవన్= నశించగా; పవనతనయు ఫాల కర్ణ మధ్య ప్రదేశంబు= భీమసేనుడి వెన్నుదురు, చెవులయొక్క నడిమిభాగం; పటు ప్రహతిన్+పగిల్చినన్= పెనుదెబ్బతో పగిలేటట్లు కొట్టగా; ఒల్లన్+పోయి= మూర్ఛిల్లి; శీఘ్రంబునన్+తేఱి= త్వరగా తేరుకొని; ఆ+మహాబలనందనుండు= ఆ వాయుదేవకుమారుడైన భీముడు; గండతలంబునన్+తొరుఁగు నెత్తురు= చెంపలనుండి జాలువారే నెత్తురు; అను మదంబునన్= అనే మదధారతో; మత్తకరి ననుకరించుచున్= మదపుటేనుగును అనుకరిస్తూ; తుండంబు చందంబునన్= తొండంవలె; చెలువొందు= సొగసైన; గదఅల్లార్చి=

గదను ఆడించి; పేర్చి= విజృంభించి; వ్రేటుకొనినన్= దెబ్బవేయగా; మెడకెలనున్ తాఁకి= మెడ ప్రక్క తగిలి; నీకొడుకు= నీ కుమారుడు; మహాపవనపతితంబు+అగు= పెనుగాలికి క్రిందపడిన; సాలంబు పోలికిన్+కూలినన్= మద్దిచెట్టువలె పడిపోగా; కని= చూచి; ధర్మపుత్రప్రముఖులు= ధర్మరాజు మొదలైన వారు; ప్రమోదంబున్+ఒందిరి= సంతోషించారు; గ్రక్కునన్ లేచి= శీఘ్రంగా లేచి; కాల+ఆకారుండు+ఐ= యముడివలె; ధాత్రీనాథుఁడు= దుర్యోధనుడు; చిత్రభ్రమణంబులన్= చిత్రంగా తిరగటం వలన; వెగడుపఱిచి= భయం కలిగించి; పటువ్రేటులన్ నొప్పించినన్= పెక్కు దెబ్బలతో బాధించగా; కిమ్మీరవైరి= కిమ్మీరునకు శత్రువైన భీముడు; వసుధన్+త్రెళ్ళుటయున్= భూమిమీద పడగా; అది చావుగాన్+కొని= అది చావటంగా భావించి; ఆ+కురుసింహుండు= ఆ దుర్యోధనుడు; సింహనాదంబు చేయన్= సింహగర్జనం చేయగా; ఆ+వాయుసుతుండు= ఆ భీముడు; చావమి ఎఱింగి= చనిపోకుండటం తెలిసికొని; ఆ భూపతి= ఆ రాజు; పెనంగు భంగియున్= పెనగులాడేవిధాన్ని; తెలిసికొని= తెలిసికొన్నవారై; మెచ్చి= మెచ్చుకొని; సురప్రకరంబు= దేవతల సమూహాలు; పుష్పవర్షంబు కురియన్= పూలవాన కురిపించగా; పరులకున్ భయంబు+ఒలసెన్= ఇతరులకు భయము కలిగింది; అంతన్+తెలిసి= అంతలో ప్రజ్ఞ వచ్చినవాడై; భీమసేనుండు= భీముడు; ఉద్వృత్తలోచనుండు+ఐ= వెలికి ఉబ్బిన కన్నులు కలవాడై; వీర+అవష్టంభంబునన్+పొలిచెన్= వీరాహంకారంతో వెలిగాడు; అప్పుడు= ఆ సమయంలో; సాత్యకి ధృష్టద్యుమ్న నకుల సహదేవులు= సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, నకులుడు, సహదేవుడును; ఏమి+అని= ఏమిరా అంటూ; సుయోధను సంగ్రామంబునకున్ పిలిచినన్= దుర్యోధనుడిని యుద్ధానికి పిలువగా; విని= విన్నవాడై; ఆ వృకోదరుండు= ఆ భీముడు; వారలన్+వలదు+అని వారించి= వద్దని వారిని అడ్డుకొని; విగత ఖేదుండు+అగుచున్= కష్టంలేనివాడై; నాకేశుండు= ఇంద్రుడు; నముచిన్+తాఁకిన తెఱంగునన్= నముచిఅనే రాక్షసుడిని ఎదుర్కొన్నట్లుగా; రారాజున్+తలపడి= దుర్యోధనుడిని ఎదుర్కొని; బహుచిత్ర గతులన్+చరింపన్= అనేక విధాలుగా తిరుగగా; చూచి= చూచినవాడై; సవ్యసాచి= అర్జునుడు; జనార్దనునకున్+ఇట్లు+అనియెన్= శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఒకరికొకరు తీసిపోకుండా ఆ మొనగాళ్ళు ఈ విధంగా ఆటోపసంరంభాలతో పోట్లాడారు. వారిలో దుర్యోధనుడు కుడివైపునకు చుట్టుకొని రాగా దానిని లెక్కించకుండా భీముడు ఎడమవైపునకు తిరుగగా ఈర్ష్యతో ఉత్సాహం కలవాడై ఆ రాజు వాని ప్రక్క ఎముకలను విరిగేటట్టుకొట్టాడు. అందుకా వీరుడైన భీముడు ఆ దుర్యోధనుడిని ఆ దెబ్బను వృథా చేశాడు. వదలకుండా మరల పూనికతో విసరివేయగా కలిగిన దట్టమైన శబ్దాలు ఆకాశన్నంటాయి. అందు భీముడేమాత్రం జంకలేదు. అది అందరికీ ఆశ్చర్యంగా తోచింది. అంతట ఎక్కువ కోపంతో ఆ భీముడు రాజుయొక్క విశాలమైన వక్షఃస్థలాన్ని గురిగా చేసి భయంకరమైన గదాదండాన్ని త్రిప్పి కొట్టగా అతడు దానిని శరీరాన్ని త్రిప్పటంవలన తప్పించుకొన్నాడు. అది భూమిని గడగడలాడించింది. ఆ స్వల్ప వ్యవధానంలో మిక్కిలి వేగంగా భీముడు గదతో తిరిగే సమయాన దుర్యోధనుడు వాడిగుండెను దారుణ మయిన దెబ్బతో బాధించాడు. అందు కాతడు పాంచాల పాండవుల మనస్సులు తూలిపోగా సోలికూడా, అంతలోనే ప్రజ్ఞ దెలిసి బలపరాక్రమములు వికసించగా నా దుర్యోధనుడి ప్రక్కలలో తీవ్రమైన దెబ్బ కొట్టగా బోర్లపడికూడా ధైర్యం చెడకుండా రారాజు, తనను అపహసించే శత్రువులు సిగ్గుపడగా సొగసు నశించగా, భీమసేనుడి నుదురు చెవి మధ్య భాగాన్ని తీవ్రమైన దెబ్బతో పగులకొట్టగా మూర్ఛిల్లాడు. అయినా వెంటనే తేరికొని ఆ భీముడు చెంపలమీద జాల్వారే నెత్తురనే మదజలంతో కూడిన మదపుటేనుగును అనుకరిస్తూ, తొండంవలె అందంగా ఒప్పారే పెద్ద గదను త్రిప్పుతూ విజృంభించాడు. అది అప్పటికే దెబ్బతిన్న మెడ ప్రక్కభాగాన్ని తాకగా, నీ కొడుకు పెనుగాలికి క్రిందపడిన మద్దిచెట్టువలె కూలిపోయాడు. అది చూచి ధర్మరాజు మొదలైనవారు సంతోషించారు. అపుడు వెంటనే లేచి యముడివలె రారాజు విచిత్ర గతులతో బెదిరించి పెక్కు దెబ్బలతో బాధించగా భీముడు భూమిమీద పడగా,

దానిని చావుగా తలచి ఆ దుర్యోధనుడు సింహనాదం చేశాడు. భీముడు చావకుండా ఉండటం గ్రహించి, దుర్యోధనుడు యుద్ధం చేసిన విధాన్ని చూచి మెచ్చి దేవతా సమూహాలు పూలవాన కురిపించగా శత్రువులకు భయం కలిగింది. అంత ఒళ్ళు తెలిసి భీముడు పైకి సుళ్ళు తిరుగుతున్న చూపులతో వీరత్వం ఉట్టిపడగా ఒప్పారాడు. ఆ సమయంలో సాత్యకి ధృష్టద్యుమ్న నకుల సహదేవులు ఏమి! ఏమి! అని దుర్యోధనుడిని యుద్ధానికి పిలువగా విని భీముడు వారలను వలదని వారిస్తూ దుఃఖంలేనివాడయి, ఇంద్రుడు నముచిని ఎదుర్కొన్న విధంగా రారాజుతో తలపడి వివిధగతులతో పోరుతూ ఉండగా చూచి అర్జునుడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: స్వభావోక్తి, ఉపమ.

శ్రీకృష్ణుఁ డర్జునునితో భీమదుర్యోధనుల తారతమ్యంబు చెప్పుట (సం. 9-57-2)

క. 'భీముని సుయోధనుని సం । గ్రామంబు తెఱంగుఁ జూడఁ గా నెవ్వరి యం
దేమే నధికతఁ దోఁచెడి? । నీమది నున్నట్లు చెప్పు నీరజనాభా!' 268

ప్రతిపదార్థం: నీరజనాభా!= పద్మనాభుడా! (శ్రీకృష్ణా!); భీముని సుయోధనుని= భీముడియొక్క, సుయోధనుడియొక్క; సంగ్రామంబు తెఱంగున్+చూడఁగాన్= యుద్ధగతిని చూడగా; ఎవ్వరి అందున్+ఏమేని+అధికత+తోఁచెడిన్?= ఎవ్వరిలో ఏ గొప్పతనం తోస్తున్నది?; నీమదిన్+ఉన్నట్లు= నీ మనస్సులో ఉన్నవిధంగా; చెప్పు= చెప్పుము.

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! భీమదుర్యోధనుల యుద్ధగతిని చూస్తే ఎవరిలో ఏయే గొప్పతనం కానవస్తున్నదో నీ మనసులో ఉన్నదున్నట్లు చెప్పుము.'

చ. అన విని శౌరి యిట్లనియె నర్జునుతోడ 'గురూపదేశ సం
జనితసమన్వయంబు సదృశంబ తలంపఁగ నిద్దఱందుఁ; బా
వని మెయి లావు పెద్ద; కురువల్లభుఁ డారయఁ గౌశలంబు పెం
పున నధికుండు తత్పరతఁ బూని శ్రమం బధికంబు సేయుటన్. 269

ప్రతిపదార్థం: అనన్ అని= ఆ విధంగా అర్జును డనగా విన్నవాడై; శౌరి ఇట్లు+అనియెన్= శ్రీకృష్ణు డిట్లా అన్నాడు: అర్జునుతోడన్= అర్జునుడితో; గురూపదేశ సంజనిత సమన్వయంబు= గురువు నేర్పటంవలన కలిగిన సమన్వయశక్తి; తలంపఁగన్= యోచించిచూడగా; ఇద్దరు+అందున్= ఇరువురిలో; సదృశంబు+అ= సమానమే; పావని మెయిలావు పెద్ద= భీమసేనుని శరీరబలం గొప్పది; ఆరయన్= చూడగా; కురువల్లభుఁడు= దుర్యోధనుడు; తత్పరతన్= పట్టుదలతో; పూని= ప్రయత్నంతో; శ్రమంబు= గదాయుధానికి చెందిన విద్యాపరిశ్రమం; అధికంబు+చేయుటన్= ఎక్కువగా చేసినందున; కౌశలంబు పెంపునన్= నేర్పరితనంలోని ఆధిక్యంచేత; అధికుండు= మిన్న.

తాత్పర్యం: అర్జునుడి ప్రశ్నకు శ్రీకృష్ణు డీవిధంగా బదులు చెప్పాడు: 'గురూపదేశం ఇరువురికీ సమానమే. యోచనచేయగా ఇరువురిలో భీముడికి బలంగల శరీర మున్నది. పరిశ్రమ, పట్టుదల కారణంగా దుర్యోధనుడు నేర్పరితనంలో భీముడికంటె అధికుడు.

ఆ. లావు గలిగి మొక్కలమ్మునఁ గీచకా। రాతి సొచ్చి ధార్తరాష్ట్రు వెరవు
వలన నొచ్చుచున్నవాఁడు గావున ధర్మ। సంగరమున నరిది జయము గొనుట. 270

ప్రతిపదార్థం: లావుకలిగి= బలం కలిగి; మొక్కలమ్మునన్= మొరకుగా (మూర్ఖంగా); కీచక+అరాతి= భీముడు; చొచ్చి= దూరి; ధార్తరాష్ట్రు వెరవువలనన్= దుర్యోధనుడి నేర్పరితనంవలన; నొచ్చుచున్నవాఁడు= బాధపడుతున్నాడు; కావునన్= అందువలన; ధర్మసంగరమునన్= ధర్మయుద్ధంలో; జయమున్+కొనుట= (భీముడు)జయంపొందటం; అరిది= అరుదు.

తాత్పర్యం: శారీరకమైన బలమున్నది కనుక భీముడు మూర్ఖపు పట్టుతో దూరి, నేర్పు ఉపాయమూ కల దుర్యోధనుడి దెబ్బకు నొచ్చుకొంటున్నాడు. కాబట్టి ధర్మయుద్ధంలో అతడు జయం పొందటం అరుదు.

వ. అన్యాయంబునం జంపువాఁ డింతియ మాయలు గల పగఱ మాయాప్రకారంబులం బరిమార్చుటయ తగు; నింద్రునివృత్ర వధ వ్యాపారంబు వినమె? జూదంబునప్పు డనిలసుతుండు సుయోధనుతొడలు విఱుగ నడుచువాఁడ నని ప్రతిన వట్టినవాఁ; డది యట్లుండె; గదా యుద్ధంబు నాభికి దిగువ యైన శరీరభాగంబు నొప్పించుట ధర్మంబుగా దది యొండుమైఁ గండడఁచి మఱి పరిభవరూపంబుగ నూరుభంగంబు సేసి ప్రతిజ్ఞ నెఱపువాఁ; డిది తలంపునం బెట్టక పెనంగె నేని ధర్మనందనునకు దైన్యంబు దెచ్చు; నట్లగుటఁ బూనికి పేర నూరులు భంజించి వధియించుట తప్ప నొం డుపాయంబు లేదు; ధర్మనందనునివలన మనకు భయం బావహిల్లె; నెట్లనిన భీష్మద్రోణప్రముఖబలవదరాతులం బొలియించుటం జేసి జయంబును యశంబునుం జేకుఱి యున్న యెడ నవి సందిగ్ధంబు లైనయట్లు గా నొకని జయించి సామ్రాజ్యంబు గొనుమని దుర్యోధనుతోడం బలికి, యతనితోడం గదాసమరంబునకు భీమసేనుం జొనిపె; నింత నిర్బుద్ధి యగునె? హతబంధుమిత్ర పరివారుండై రాజ్యంబునం దాస విడిచి మడువు సొచ్చినవాని వెదకి వెలార్చి యెక్కటికయ్యంబునకుఁ బిలుతురే? పదుమూఁడు వత్సరంబులు మత్సరాధికుం డగునగ్గాంధారేయుండు భీము జయించుటకయి గదాపరిశ్రమం బాచరించె; నూర్ధ్వతిర్యగ్గతి సముల్లాసంబున మెఱయు చున్నవాఁ; డీభీమునకుం బెద్దకాలం బేని శ్రమంబు లే దిమ్మహాభాగుండు ధర్మంబు దొఱంగియైన నిక్కులపాంసనునిం బిలుకుమార్పకున్న నింక నించుక సేపునకుఁ దాన తెగుఁ; దెగిన, మీకు నెల్ల నిప్పాపాత్ముండు రా జగుట కోర్వవచ్చునే?' యనుటయు. 271

ప్రతిపదార్థం: అన్యాయంబునన్+చంపువాఁడు= మోసంతో చంపేవాడు; ఇంతియ మాయలు కల పగఱన్= ఇంతే మోసాలున్న వైరులను; మాయాప్రకారంబులన్= మోసపు పద్ధతుల్లోనే; పరిమార్చుటయ తగున్= చంపుటే తగును; ఇంద్రుని వృత్రవధ వ్యాపారంబు వినమె?= ఇంద్రుడు వృత్రాసురుడిని చంపిన పద్ధతి వినలేదా?; జూదంబు+అప్పుడు+అనిలసుతుండు= జూదమాడిన సమయాన భీముడు; సుయోధను తొడలు విఱుగన్+అడుచువాఁడను+అని= దుర్యోధనుడి తొడలు విరుగగొట్టువాడనని; ప్రతిన పట్టినవాఁడు= శపథం చేశాడు; అది అట్లుండెన్= దానిని ఆవిధంగా ఉండనిమ్ము; గదాయుద్ధంబు, నాభికిన్, దిగువఐన= గదాయుద్ధం బొడ్డుకు క్రిందనున్న; శరీర భాగంబు నొప్పించుట; అది; దానిని; ధర్మంబు+కాదు= ఒడలి భాగాన్ని కొట్టటం న్యాయం కాదు; ఒండుమైన్= వేరొకమార్గాన; గండు+అడఁచి= పొగరు నశింపచేసి; మఱి పరిభవరూపంబుగాన్ ఊరుభంగంబు+చేసి= అవమాన సూచకంగా తొడలు విరిచి; ప్రతిజ్ఞ నెఱపువాఁడు= మాటను నిలుపుకొనగలడు; ఇది తలంపునన్ పెట్టక= ఇది మనసులో జ్ఞాపకం పెట్టుకొనకుండా; పెనంగెనేనిన్= యుద్ధం చేస్తే; ధర్మనందనునకున్+దైన్యంబు

తెచ్చున్= ధర్మరాజునకు దుఃఖం తెస్తాడు; అట్లు+అగుటన్= అందుచేత; పూనిక పేరన్= ప్రతిజ్ఞఅనే మిషతో; ఊరులు భంజించి= తొడలు విరిచి; వధియించుట తప్పన్= చంపటం తప్ప; ఒండు+ఉపాయంబు లేదు= వేరే మార్గంలేదు; ధర్మనందనుని వలనన్= ధర్మజుడి మూలాన; మనకున్; భయంబు+ఆవహిల్లెన్= భయం ఏర్పడింది; ఎట్లు+అనినన్= ఏ విధంగానంటే; భీష్మద్రోణ ప్రముఖ= భీష్ముడు, ద్రోణుడు, మొదలైన; బలవత్+అరాతులన్+పొలియించుటన్+చేసి= బలం కల వైరులను చంపటంవలన; జయంబును, యశంబును= విజయాన్నీ, కీర్తినీ; చేకుఱి+ఉన్న ఎడన్= పొందిన సమయంలో; అవి సందిగ్ధంబులు+ఐన అట్లుగాన్= అవి అనుమానింపదగిన విధంగా; ఒకనిన్ జయించి= ఒక్కడిని గెలిచి; సామ్రాజ్యంబు కొనుము+అని= రాజ్యాన్ని పొందుమని; దుర్యోధనుతోడన్+పలికి= దుర్యోధనుడితో మాట్లాడి; అతడితోడన్ గదాసమరంబునకున్= వాడితో గదాయుద్ధానికి; భీమసేనున్+చొనిపెన్= భీముడిని పంపాడు; ఇంత నిర్బుద్ధి+అగునె?= ఇంతబుద్ధి లేనివాడౌతాడా?; హతబంధుమిత్రు పరివారుండు+ఐ= చనిపోయిన బందుగులు, స్నేహితులు సేవకులు కలిగినవాడై; రాజ్యంబు+ఆస+విడిచి= రాజ్యాపేక్ష లేకుండా; మడువు+చొచ్చినవానిన్= నీటిమడుగులో దాగినవాడిని; వెదకి వెలార్చి= వెదకి బయటకు లాగి; ఎక్కటికయ్యంబునకున్+పిలుతురే?= ఒకరితో ఒక్కరే చేసే యుద్ధానికి పిలుస్తారా?; పదుమూఁడు వత్సరంబులు= పదమూడేండ్లు; మత్సర+అధికుండు+అగు= అసూయాగ్రస్తుడయిన; ఆ+గాంధారేయుండు= ఆ గాంధారీనందనుడు; భీమున్+జయించుటకయి= భీమసేనుడిని జయించటం కొరకు; గదాపరిశ్రమంబు+ఆచరించెన్= గదాపరిశ్రమ చేశాడు; ఊర్ధ్వ తిర్యగ్గతి సముల్లాసంబునన్= పైకి, అడ్డంగాను వెళ్ళే ఉత్సాహంతో; మెఱయుచున్నవాఁడు= ప్రకాశిస్తున్నాడు; ఈ భీమునకున్ పెద్దకాలంబేని= ఈ భీముడికి చాలకాలంగా; శ్రమంబు లేదు= గదాపరిశ్రమ లేదు; ఈ+మహాభాగుండు= ఈ పుణ్యాత్ముడు; ధర్మంబు+తొఱంగి= ధర్మాన్ని వదలి; ఐనన్= అయినప్పటికినీ; ఈ+కులపాంసనునిన్= ఈ వంశనాశకుడిని; పిలుకుమార్పకున్నన్= చంపకుంటే; ఇంక ఇంచుకసేపునకున్= ఇంక కొంతసేపటికి; తాను+అ+తెగున్= తానే చనిపోతాడు; తెగినన్= చావగా; మీకున్= మీ అందరికీ; ఈ+పాప+ఆత్ముండు= ఈ పాపి; రాజు+అగుటకున్= రాజు కావటానికి; ఓర్వన్ వచ్చునే?= సహించవచ్చునా?; అనుటయున్= అనగానే.

తాత్పర్యం: మోసంతో చంపేవాడు అంతే మోసమున్న వైరులను మోసపువిధానంతోనే చంపటం తగి ఉంటుంది. ఇంద్రుడు వృత్రుడిని చంపిన పద్ధతి వినలేదా? జూద మాడినప్పుడు వాయునందనుడు దుర్యోధనుడి తొడలు విరుగగొట్టువాడ నని శపథం చేశాడు. దానిని అట్లా ఉండనిమ్ము. గదాయుద్ధంలో బొడ్డుకు క్రిందిభాగంలో నొప్పించటం ధర్మం కాదు. కాబట్టి వేరొక మార్గాన్ని అవలంబించాలి. అవమానం చేసినట్లుగా తొడలను విరిచి, ప్రతిజ్ఞను నెరవేర్చుకొనవచ్చును. దీనిని మనసులో పెట్టుకొనకుండా యుద్ధం చేస్తే ధర్మరాజునకు దుఃఖం తెచ్చిపెట్టినట్లువుతుంది. అందువలన ప్రతిజ్ఞ పేరుతో తొడలు విరిచి చంపటంతప్ప వేరే ఉపాయం లేదు. ధర్మరాజు మూలాన మనకు భయం కల్గుతూ ఉన్నది. ఏమంటే భీష్మద్రోణాది శత్రువులను చంపించటంవలన జయాన్ని, కీర్తినీ పొందికూడా, అవి రెండూ సందేహాస్పదాలు అయ్యేట్లుగా ఒక్కడిని జయించి సామ్రాజ్యాన్నంతనూ తీసికొమ్మని దుర్యోధనుడితో చెప్పి వాడితో గదాయుద్ధం చేయటానికి భీమసేనుడిని నియమించాడు. ఇంత బుద్ధిహీను డయ్యాడా? బంధుమిత్రులందరూ నశించగా రాజ్యంమీది ఆస వదలి మడుగులో దూరిన వాడిని వెదకి వెలికిలాగి ద్వంద్వ యుద్ధానికి పిలువదగనా? పదుమూడు సంవత్సరాలు అసూయతో నిండిన ఆ దుర్యోధనుడు భీముడిని జయించటం కొరకే గదాపరిశ్రమ చేశాడు. పైకి, అడ్డంగానూ తిరుగుతూ సంతోషంతో ప్రకాశిస్తున్నాడు. ఈ భీముడికి చాలాకాలంనుండి గదా పరిశ్రమ లేదు. ఈ ధర్మాత్ముడు ధర్మమును అతిక్రమించి అయినా ఈ కులనాశకుడిని చంపకపోతే ఇంకొంత సేపటికి తానే హతుడౌతాడు. ఇతడు చనిపోతే ఈ పాపి మీకు రాజు అయ్యే దురవస్థను ఓర్వవచ్చునా? మీ కిది ఇష్టమా?' - అనగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. విని క్రీడి యపుడు మారుత । తనయుఁడు దనుఁ జూడ నూరుతలము కరతలం
బున నప్పళించె; నతఁడును । గనికొనియెను సన్న యగుటఁ గౌరవముఖ్యా! 272

ప్రతిపదార్థం: కౌరవముఖ్యా!= కురుశ్రేష్ఠుడా!; క్రీడి= అర్జునుడు; విని; అపుడు= ఆ సమయాన; మారుతతనయుఁడు= భీమసేనుడు; తనున్+చూడన్= తనవైపు చూడగా; ఊరుతలము= తొడలపైభాగం; కరతలంబునన్+అప్పళించెన్= చేతితో చరిచాడు; అతఁడును= ఆ భీముడు; కని= చూచి; సన్న= సైగ; అగుటన్= కావటంచేత; కొనియెను= గ్రహించాడు.

తాత్పర్యం: కౌరవశ్రేష్ఠా! ఆ సమయంలో భీముడు తనవైపు చూసినపుడు అర్జునుడు తొడలు చేతితో చరిచాడు. ఆ సైగను భీముడు చూచి గ్రహించాడు.

వ. కనికొని 'యధర్మం బైన నూరుభంగంబు సేయు మని కృష్ణానుమతి జిష్ణుండు పనిచె; నాకు నొండుమెయి నెట్లునుం బగతు పాటు లేక తక్కెనే నవ్విధం బాచరింతుఁ గాక! యని మనంబున నిశ్చయించి, వివిధగతులఁ జరియింపం గురుపతియు బాహుచిత్ర ప్రచారంబుల నుల్లసిల్లఁ దత్సంగ్రామం బామిషార్థిగరుడ ద్వయసమరంబు చందంబున దర్శనీయం బై యుండె; నట్టియెడ. 273

ప్రతిపదార్థం: కనుకొని= చూచి గుర్తించి(సైగను గుర్తించి); అధర్మంబు+ఐనన్= అన్యాయమైనా; ఊరుభంగంబు+చేయుము+ అని= తొడలు విరుగగొట్టుమని; కృష్ణ+అనుమతిన్= కృష్ణుడి ఆమోదంతో; జిష్ణుండు= అర్జునుడు; పనిచెన్= ఆజ్ఞాపించాడు; నాకున్ ఒండుమెయిన్= నాకు ఇంకొక్క విధంగా; ఎట్లునున్= ఏ విధంగానూ; పగతుపాటు లేక తక్కెనేని= శత్రువు పడటం జరగకపోతే; ఆ+విధంబు= ఆ పద్ధతినే; ఆచరింతున్+కాక!= అనుసరిస్తాను గాక!; అని మనంబునన్ నిశ్చయించి= అని మనసులో నిర్ణయించుకొని; వివిధ గతులన్= అనేక పద్ధతులలో; చరియింపన్= తిరుగగా; కురుపతియున్= దుర్యోధనుడును; బాహుచిత్రప్రచారంబులన్= చేతుల వింత తిరుగుళ్ళతో; ఉల్లసిల్లన్= ఉత్సహించగా; తద్+సంగ్రామంబు= ఆ యుద్ధం; ఆమిష+అర్థి= మాంసానికై ఆసపడే; గరుడద్వయ సమరంబు చందంబునన్= రెండు గరుత్మంతుల యుద్ధంవలె; దర్శనీయంబు+ ఐ ఉండెన్= చూడదగి ఉండింది; అట్టి ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: చూచి గుర్తించి, 'అన్యాయమైనా తొడలు విరుగగొట్టుమన్న శ్రీకృష్ణుడి అనుమతిని అర్జునుడు తెలుపగా నాకు వేరొక దారిలో శత్రువును పడగొట్టే వీలుకాకుంటే ఆ పద్ధతినే అనుసరిస్తాను.' అని భీముడు మనసులో నిశ్చయించుకొని అనేక విధాలుగా తిరుగుతుండగా దుర్యోధనుడును చేతుల చిత్రగతులలో తిరుగుతున్నాడు ఆ యుద్ధం చూచేవారికి ఇరువురు గరుత్మంతులు మాంసంకొరకు సాగించే పోరాటంవలె అబ్బురంగా తోచింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

ఆ. పాండురాజసుతుఁడు పటుతరోల్లాసి యై । వైచుటయును ధరణివల్లభుండు
తొలఁగ దాఁటె రయము దలకొని గదఁ బుచ్చి । కొనియె నాబకాంతకుండు నుఱికి. 274

ప్రతిపదార్థం: పాండురాజ సుతుఁడు= పాండురాజ కుమారుడైన భీమసేనుడు; పటుతర= దృఢమైన; ఉల్లాసి+ఐ= ఉత్సాహిగా; వైచుటయును= వేయగా; ధరణివల్లభుండు= రాజయిన దుర్యోధనుడు; తొలఁగదాఁటెన్= తప్పించుకొన్నాడు; ఆ బకాంతకుండు= బకాసురుడిని చంపినవాడైన ఆ భీముడు; ఉఱికి= దూకి; రయము తలకొని= వేగం పుంజుకొని; గదన్+పుచ్చికొనియెన్= గదను తీసికొన్నాడు.

తాత్పర్యం: పాండురాజకుమారుడైన భీముడు ఉత్సాహంతో గట్టిగా దెబ్బ వేయగా దుర్యోధనుడు తప్పించుకొన్నాడు. ఆ బకాంతకుడు దూకి వేగంగా గదను తీసికొన్నాడు.

దుర్యోధనుఁడు భీముగదాదండమునఁ దొడలు విఱిగి పడుట (సం. 9-57-45)

క. ఆలోనం గురుధరణీ । పాలుఁ డదరి వ్రేయుటయును బవనసుతునిమై
సోలెః నది గానఁ డాపతి । కేళీవిభ్రమము దోఁపఁ గ్రేళ్ళుఱికె నృపా! 275

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; ఆలోనన్= అంతలోనే; కురుధరణీపాలుఁడు= కురురాజు దుర్యోధనుడు; అదరి వ్రేయుటయును= విజృంభించి కొట్టగా; పవనసుతునిమై= భీముడి ఒడలు; సోలెన్= సొమ్మసిల్లింది; ఆ పతి= ఆ రాజు; అది కానఁడు= దానిని చూడలేదు; కేళీ విభ్రమము తోఁపన్= యుద్ధక్రీడ యొక్క వికాసం తెలియగా; క్రేళ్ళు ఉఱికెన్= ఎగిరి దూకాడు.

తాత్పర్యం: దుర్యోధను డంతలోనే వేగంగా కొట్టగా భీముడి ఒడలు సొమ్మసిల్లింది. రాజు దానిని గమనించలేదు. యుద్ధక్రీడా విలాసంతో ఎగిరి దూకాడు.

చ. ఉఱికినఁ దేఱి పై కుఱికి యుగ్రత భీముఁడు వ్రేయ నవ్విభుం
డుఱక మహాద్భుతస్ఫురణ నూర్ధ్వ పరిభ్రమణంబు సేసినం
దెలిపి యతండు గాంచి సముదీర్ణరయంబున వైచెఁ బెన్దొడల్
విఱిగి నగాగ్ర ముద్భటపవిప్రహతిం బడుచాడ్పునం బడన్. 276

ప్రతిపదార్థం: ఉఱికినన్= దూకగా; ఉగ్రతన్= భయంకరంగా; భీముఁడు= భీమసేనుడు; తేఱి= తేరికొని; పైకిన్+ఉఱికి= పైకిదూకి; వ్రేయన్= కొట్టగా; ఆ+విభుండు= ఆదుర్యోధనుడు; ఉఱక= లెక్కచేయక; మహా+అద్భుతస్ఫురణన్= మిగుల ఆశ్చర్యాన్ని కలిగిస్తూ; ఊర్ధ్వపరిభ్రమణంబుచేసినన్= పైన దిరుగగా; తెలిపి+అతండు+కాంచి= ఆ భీముడు సందు చూచి; నగ+అగ్రము= కొండకమ్ము; ఉద్భట= భయంకరమైన; పవి= వజ్రముయొక్క; ప్రహతిన్= దెబ్బకు; పడు చాడ్పునన్= పడునట్లుగా; పెన్+తొడల్= పెద్దవయిన తొడలు; విఱిగి పడన్= విరిగి క్రింద పడేటట్లుగా; సముదీర్ణరయంబునన్= మిక్కిలి వేగంతో; వైచెన్= కొట్టాడు.

తాత్పర్యం: (దుర్యోధనుడు) దూకగా భీమసేనుడు (మూర్ఛనుండి) తేరికొని మీదికి దూకి భయంకరంగా కొట్టగా ఆ దుర్యోధనుడు లెక్కచేయకుండా మిగులఅబ్బురాన్ని కలిగిస్తూ పై ఎగిరి తిరుగుతూ ఉండగా భీముడు సందు చూచి భయంకరమైన వజ్రపుదెబ్బతో విరిగిపడే కొండ కొన కొమ్ము మాదిరిగా పెద్దవైన తొడలు విరిగి కూలేట్లుగా మిక్కిలి వేగంగా కొట్టాడు.

విశేషం: అలం: స్వభావోక్తి, ఉపమ.

వ. అప్పుడు మహోల్కాపాతంబులును బాంసుమాంస రక్త వర్షంబులును వికృతంబు లగు కరితురగబృంహిత హేషాఘోషంబులును మఱియు ననేకోత్పాతంబులును గలిగిన నట్లు కౌరవపతి వడుటకు నుబ్బునం

బొదలిన పాంచాలురుం బాండవులు నుద్విగ్నచిత్తులైరి; వియత్తలం బంతయు నొక్కమ్రోఁతగా నగ్గదాయుద్ధ విశేషంబు లగ్గించుచు సురగరుడఖచరాదులు నిజస్థానంబులకుం జని; రిట్లు తనగదతాఁకునఁ దొడలు విఱిగి సింగంబుచేతం గూలిన గంధశుండాలంబు చందంబునం బడియున్న నీ కొడుకుం జేరం జని భీమసేనుండు. 277

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; మహా+ఉల్కా+పాతంబులును= పెద్దతోక చుక్కలు కింద రాలటం; పాంసుమాంస రక్త వర్షంబులును= దుమ్ము, మాంసం, రక్తం - వీటి వర్షాలు; వికృతంబులు+అగు= వికారమైన; కరితురగ= ఏనుగులయొక్క, గుర్రాలయొక్క; బృంహిత= ఘీంకారాల; హేషా= సకిలింతల; ఘోషంబులును= శబ్దాలు; మఱియున్= ఇంకను; అనేక ఉత్పాతంబులును= ఎన్నో ప్రళయ చిహ్నలును; కలిగినన్= కలుగగా; అట్లు= ఆ ప్రకారంగా; కౌరవపతిపడుటకున్= దుర్యోధనుడు క్రింద కూలటానికి; ఉబ్బునన్= సంతసంతో; పొదలిన= ఒప్పిన; పాంచాలురున్= పాంచాలురూ; పాండవులును; ఉద్విగ్నచిత్తులైరి= ఉద్వేగంతోడి మనస్సులు గలవారైరి; వియత్+తలంబు+అంతయున్= ఆకాశమంతా; ఒక్కమ్రోఁతగాన్= ఒకే శబ్దంగా; ఆ+గదాయుద్ధ విశేషంబులు= ఆ గదాయుద్ధం యొక్క విశేషాలను; అగ్గించుచున్= పొగడుతూ; సురగరుడ ఖచరాదులు= దేవతలు గరుడులు గగనచరులు మొదలైనవారు; నిజస్థానంబులకున్+చనిరి= తమ తమ చోట్లకు వెళ్ళారు; ఇట్లు= ఈ ప్రకారంగా; తన గదతాఁకునన్= తన గద దెబ్బచేత; తొడలు నిఱిగి= ఊరుభంగమై; సింగంబు చేతన్ కూలిన= సింహముచేత క్రిందపడ్డ; గంధశుండాలంబు= మదపుటేనుగు; చందంబునన్= వలె; పడి ఉన్న= క్రిందపడి ఉన్న; నీ కొడుకున్+చేరన్+చని= నీ కొడుకు దగ్గరకు చేరి; భీమసేనుండు= భీముడు.

తాత్పర్యం: ఆ సమయంలో పెద్ద తోకచుక్కలు నేలకు రాలాయి. దుమ్ము, మాంసఖండాలు నెత్తురు వానలుగా కురిశాయి. ఏనుగుల, గుర్రాల ఘీంకారాలు, సకిలింతల శబ్దాలే కాక అనేకములైన దుశ్శకునాలు కలిగాయి. ఆ విధంగా దుర్యోధనుడు పడినందులకు సంతోషం పొందిన పాంచాలురు, పాండవులు ఉద్విగ్నమనస్కులైనారు. ఆకాశంలో తిరుగులాడే దేవతలు, గరుడులు మొదలైనవారు ఆ గదాయుద్ధాన్ని కీర్తిస్తూ తమ తమ చోట్లకు వెళ్ళారు. ఈ విధంగా గదదెబ్బతో తొడలు విరిగి సింహంచేత కూల్చబడిన మదపుటేనుగువలె పడి ఉన్న నీ కుమారుడిని చేరి భీమసేనుడు.

విశేషం: అలం: ఉపమ.

తే. **'ఏకవస్త్రఁ బాంచాలి నట్లీడ్చి తేరఁ । బనిచి సభలోనఁ బఱిచిన పాపఫలము**
ననుభవింపుము దుష్టాత్మ!' యనుచు వామచరణమున బెట్టిదము గాఁగ శిరము దన్నె. 278

ప్రతిపదార్థం: దుష్టాత్మ!= నీచమైన మనస్సు కలవాడా!; ఏకవస్త్రన్= ఒకే కట్టుగుడ్డ కల(ముట్టైన)దానిని; పాంచాలిన్= ద్రౌపదిని; అట్లు= ఆ విధంగా(కొప్పు పట్టి లాగి); ఈడ్చి తేరన్+పనిచి= లాగికొని తీసికొనిరావటానికి ఉత్తరువు చేసి; సభలోనన్= సభలో; పఱిచిన= అవమానం చేసిన; పాపఫలమున్= పాపముయొక్క ఫలితాన్ని; అనుభవింపుము= పొందుము; అనుచున్= అని అంటూ; వామచరణమునన్= ఎడమకాలితో; శిరమున్= తలను; బెట్టిదముకాఁగన్ తన్నెన్= గట్టిగా తన్నాడు.

తాత్పర్యం: 'నీచాత్ముడా! ఏకవస్త్ర(ముట్టైన) అయిన ద్రౌపదిని ఆ విధంగా లాగి తీసికొని వచ్చి, సభలో అవమానం చేసిన పాపానికి తగిన ఫలం అనుభవించుము' అంటూ తన ఎడమ పాదంతో అతడి తలను (భీముడు) గట్టిగా తన్నాడు.

వ. తన్ని యలుక మలుగక యతని యాననం బాలోకించి. 279

ప్రతిపదార్థం: తన్ని; అలుక మలుగక= కోపం తగ్గక; అతని ఆననంబు= ఆ దుర్యోధనుడి ముఖం; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: తన్ని ఇంకా కోపం తగ్గక, ఆ దుర్యోధనుడి ముఖంవైపు చూచి.

క. 'పసు లని యార్చుచు మము ను । ల్లస మాడిన ధర్మహీనులను నృపధర్మం
బెసఁగఁగ నే మిదె యిప్పుడు । పసు లని యార్చెదము మగుడ బంధుద్రోహీ! 280

ప్రతిపదార్థం: బంధుద్రోహీ!= బంధువులకు ద్రోహం తలపెట్టేవాడా!; పసులు+అని= పశువులారా! అని; ఆర్చుచున్= అరుస్తూ; మమున్= మమ్మ; ఉల్లసము+ఆడిన= ఎగతాళి చేసిన; ధర్మహీనులను= ధర్మం లేనివారిని; నృపధర్మంబు+ ఎసఁగఁగన్= రాజధర్మం అతిశయించగా; ఏము= మేము; ఇదె= ఇప్పుడే; మగుడన్= మరలా; పసులని ఆర్చెదము= పశువులని పిలుస్తాము.

తాత్పర్యం: 'ఓ బంధుద్రోహీ! పశువులని అరుస్తూ మమ్మ పరిహసించిన నీతిమాలినవారిని రాజధర్మం అతిశయించగా- ఇదిగో! ఇప్పుడు మేము మరల 'పశువులారా!' అని మిమ్ములను పిలుస్తూ అరుస్తాము.

క. విను మేను కల్లసారెలు । గొని కపటపు నెత్త మాడుకుశలతఁ గా దొ
ప్పనివారు నేపడంచుట । ఘనబాహు స్వైరకేళిఁ గాని దురాత్మా!' 281

ప్రతిపదార్థం: దురాత్మా!= దుర్మార్గుడా!; వినుము= నా మాట వినుము; ఏను= నేను; కల్లసారెలు+కొని= మోసపు పాచికలను తీసికొని; కపటపు= మోసపు; నెత్తము= జూదము; ఆడు ఆడునటువంటి; కుశలతన్+కాదు= నేర్పుతో కాదు; ఒప్పనివారు= ఇష్టంలేని వారిని(శత్రువులను); ఘనబాహు స్వైరకేళిన్= గొప్ప భుజబలంతో కూడిన యుద్ధక్రీడతో; ఏపు+అడంచుట+కాని= గర్వాన్ని అణచటమే (కాని).

తాత్పర్యం: ఓ దుష్టుడా! వినుము. ఇది గొప్పదైన బాహుక్రీడతో శత్రువుల గర్వాన్ని అణచటమేగాని, మోసపుసారెలతో కపటపు జూదంలోని నేర్పరితనంతో కాదు.'

వ. అని పలికి పెలుచ నవ్వి ధర్మనందనగోవిందపాంచాలప్రకరపార్థసాత్యకినకులసహదేవుల నాలోకించి. 282

ప్రతిపదార్థం: అని పలికి= అని మాటాడి; పెలుచన్ నవ్వి= పెద్దగా నవ్వి; ధర్మనందన= ధర్మరాజును; గోవింద= శ్రీకృష్ణుడిని; పాంచాల ప్రకర= పాంచాలుర సమూహమును; పార్థ= అర్జునుడిని; సాత్యకి= సాత్యకిని; నకుల సహదేవులను= నకులుడిని, సహదేవుడిని (వీరందరిని); ఆలోకించి= కలియచూచి.

తాత్పర్యం: ఆ విధంగా మాటాడి పెద్దగా నవ్వి ధర్మజ, శ్రీకృష్ణ, పాంచాలురను, అర్జున, సాత్యకి, నకుల సహదేవులను చూచి.

ఆ. 'శంక లేక కడఁగి సభ కట్లు పాంచాలి । నంటరానిదాని నొంటిచీర
తోన యున్న సాధ్వి వేనలి వట్టి యీ । డ్చించినతనిఁ జూడుఁ డంచుఁ బొదలి. 283

ప్రతిపదార్థం: శంక లేక= అనుమానం లేకుండా; కడఁగి= పూనుకొని; సభకున్= రాజసభకు; అట్లు= ఆ విధంగా; పాంచాలిన్= ద్రౌపదిన్; అంటరానిదానిన్= తాకరాని దానిని; ఒంటిచీరతోన్+అ ఉన్న= ఏకవస్త్ర అయి ఉన్న; సాధ్విన్= పతివ్రతను; వేనలి+పట్టి+ఈడ్పించిన= కొప్పు పట్టి లాగించిన; అతనిన్= అతడిని; చూడుఁడు= చూడండి; అంచున్= అంటూ; పొదలి= ఒప్పి.

తాత్పర్యం: 'సందేహించకుండా సభలోకి కావాలనే ఆ విధంగా ద్రౌపదిని తాకరాని దానిని, ఏకవస్త్రను, పతివ్రతను కొప్పుబట్టి లాగించిన వాడిని చూడండి' అని ఉప్పొంగి.

వ. 'పాంచాలి సేసినతపంబు పెంపున నీశోభనంబు సమకూఱె' ననిన విని వారు ప్రమోదంబు నొంద మిక్కిలి సంతసంబునం దేలి యక్కురుఘస్మరుండు నర్తించుచెన్ను దోఁపఁ జెలంగి. 284

ప్రతిపదార్థం: పాంచాలి= ద్రౌపది; చేసిన తపంబు పెంపునన్= కావించిన తపసు యొక్క గొప్పతనంతో; ఈ శోభనంబు= ఈ మంగళం; సమకూఱెన్= సిద్ధించింది; అనినన్= అనగా; విని= విన్న వారు; ప్రమోదంబునన్+ఒందన్= సంతోషించగా; మిక్కిలి సంతసంబునన్ తేలి= చాల సంతోషంతో తేలియాడి; ఆ+కురు ఘస్మరుండు= ఆ కౌరవులను చంపినవాడు - భీముడు; నర్తించు= నాట్యం చేసే; చెన్ను= సొగసు; తోఁపన్= తోచేటట్లు; చెలంగి= ఆర్చి.

తాత్పర్యం: 'పాంచాలి తపఃఫలితంగా ఈ శుభం జరిగింది.' అని భీముడు అనగా దానిని వినిన అందరూ సంతోషించి, కౌరవులను చంపిన భీముడు నాట్యంచేసే విధం తోచగా ఆర్చి -

చ. 'మును మము గొడ్డువోయి రని ముష్కరతం జెడనాడినట్టి దు
ర్జనుల ననిం గడంగి ధృతరాష్ట్రతనూజుల బంధువర్గమి
త్రనికరసైన్యకోటిసహితంబుగ గీటడఁగింపఁ గంటి; మిం
క నమరలోక మైన నరకం బయినన్ సరి మాకు నారయన్.' 285

ప్రతిపదార్థం: మును= ఇదివరకు; మమున్= మమ్ము; గొడ్డువోయిరని= వ్యర్థులని, పౌరుషహీనులయ్యారని; ముష్కరతన్= మూర్ఖత్వంతో; చెడన్+ఆడి నట్టి= దూషించినటువంటి (తిట్టినటువంటి); దుర్జనులన్= దుష్టులను; ధృతరాష్ట్ర తనూజులన్= ధృతరాష్ట్రుడి కుమారులను; బంధువర్గ= బంధువుల సమూహంతోను; మిత్ర నికర= స్నేహితులతోను కూడుకొన్న; సైన్యకోటి సహితంబుగాన్= పెక్కు సైన్యాలతో సహా; కడంగి= పూని; అనిన్= యుద్ధంలో; గీటడఁగింపన్= చంపటాన్ని; కంటిమి= చూడగలిగాము; ఇంకన్= ఇక; అమరలోకము+ఐనన్= స్వర్గమైనా; నరకంబు+ఐనన్= నరకలోకమైనా; ఆరయన్= చూడగా; మాకున్ సరి= మాకు సమానమే!

తాత్పర్యం: 'ఇదివరకు మమ్ము వ్యర్థజీవు లని, పౌరుషహీనులని మూర్ఖతతో తిట్టినటువంటి దుర్మార్గులను, ధృతరాష్ట్రుడి కుమారులను బంధుమిత్రసైన్య సమూహంతో యుద్ధరంగంతో పనిబట్టి నాశం చేయగా చూడగలిగాము. ఇక మాకు స్వర్గమైనా నరకమైనా - ఒకటే!

క. అని గదఁ జేకొని నృప! నీ । తనయునిమెడ వట్టి యదిమి తల గ్రమ్మఱఁ ద
న్నినఁ గని మును దన్నుట నె । మ్మన మెరియ తదగ్రజుం డమర్షముతోడన్. 286

ప్రతిపదార్థం: నృప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అని గదన్+చేకొని= అంటూ గద తీసికొని; నీ తనయుని మెడన్= నీ కుమారుడి మెడను; పట్టి అదిమి= పట్టుకొని నొక్కి; తలన్= తలను; క్రమ్మఱన్= మరలా; తన్నినన్= తన్నగా; కని= చూచి; మును తన్నుట= ఇదివరకు తన్నటమే; నెమ్మనము= మనస్సు; ఎరియన్= మండించగా; తదగ్రజుండు= వాని అన్న అయిన ధర్మరాజు; అమర్షముతోడన్= కోపంతో.

తాత్పర్యం: ఓ రాజా! ఆ విధంగా గదను చేతిలోనికి తీసికొని నీ కుమారుడి మెడను అదిమిపెట్టి తలను మరల తన్నగా దానిని చూచి, ఇదివరకు తన్నినందులకే మనస్సులో మండుతున్న ధర్మజుడు కోపంతో - (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. హర్షావేశలఘు చారిత్రుం డగు నమ్మారుతపుత్రున కి ట్లనియె. 287

ప్రతిపదార్థం: హర్ష+ఆవేశ= సంతోషం వలన కలిగిన ఆవేశంవలన; లఘుచారిత్రుండు+అగు= అల్ప నడవడిక గల; ఆ+మారుత పుత్రునకున్= ఆ భీమసేనుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సంతోషావేశంతో అల్పమైన ప్రవర్తనం ప్రదర్శించిన ఆ భీమసేనుడితో (ధర్మజుడు) ఇట్లా అన్నాడు:

చ. 'తల యది యేల తన్నెద? వధర్మము నొందుట కాత్మ రోయఁగా
వలవదె? రాజ రా జనుజవర్గముఁ దక్కినబంధుకోటియుం
గలపరివారముం దెగిన గౌరవ మేదకఁ బోరి సంగర
స్థలమునఁ బడ్డ నీతులువచందముచేఁత జనంబు మెచ్చునే? 288

ప్రతిపదార్థం: తల+అది+ఏలతన్నెదవు?= తలను ఎందుకు తన్నుతున్నావు?; అధర్మమున్+ఒందుటకున్= ధర్మాన్ని అతిక్రమించటానికి; ఆత్మన్ రోయఁగా వలవదె?= మనస్సులో అసహ్యించుకొనవలదా?; రాజరాజు= దుర్యోధనుడు; అనుజవర్గమున్= తమ్ములూ; తక్కిన బంధుకోటియున్= మిగిలిన బంధు సమూహమూ; కల పరివారమున్= ఉన్న సేన అంతా; తెగినన్= నశించిపోగా; గౌరవము+ఏదక= మర్యాదను వదలక; పోరి= యుద్ధం చేసి; సంగర స్థలమునన్ పడ్డన్= యుద్ధరంగంలో పడిపోగా; ఈ తులువ చందముచేఁత= పొగరుబోతు తనపు చేష్ట; జనంబు= జనం; మెచ్చునే?= మెచ్చుకొంటుందా?

తాత్పర్యం: 'ఈ తలను తన్నటమెందుకు? ఇది అధర్మం. ఇటువంటి చేష్ట మనసా అసహ్యించుకొన తగినది; పోగా, సోదరులు, బంధువులు గల సైన్యం నశించినా మర్యాద వదలక రారాజు దుర్యోధనుడు సమరంలో పాల్గొని రణక్షేత్రంలో పడ్డాడు. ఇటువంటి వేళ ఈ పొగరుపోతు చేతను జనులు మెచ్చుకొంటారా?

క. మును లోకము ధర్మపరుం । డనఁ బరఁగినవాఁడ విట్టు లనుచితకృత్యం
బునకుఁ జనఁ దగునె దీనం । గనియెడుఫల మేమి? దూష్యగర్వం బేలా?' 289

ప్రతిపదార్థం: మును లోకము= ఇదివరకు లోకం; ధర్మపరుండు+అనన్= ధర్మాత్ముడన; పరఁగినవాఁడవు= పేరు కలిగినవాడవు; ఇట్టులు= ఈ విధంగా; అనుచిత కృత్యంబునకున్= ఉచితముకాని పనికి; చనన్+తగునే?= పూనుకోవచ్చునా?; దీనన్= ఇందువల్ల; కనియెడు ఫలమేమి?= పొందే ఫలితమేమి?; దూష్య గర్వంబేలా?= నిందింపదగిన పొగరుబోతుతనం ఎందులకు?

తాత్పర్యం: ఇదివరలో లోకంలో ధర్మపు నడవడిక కలవాడవనే పేరు పొందావు. ఈ విధమైన అన్యాయమైన పనికి పూనుకొనవచ్చునా? దీనివలన పొందే ఫలితమేమి? నిందనీయమైన అహంకార మెందుకు?'

వ. అని దూఱి దుర్యోధనుం జూచి బాష్పాకులలోచనుం డై. 290

ప్రతిపదార్థం: అని దూఱి= అని నిందించి; దుర్యోధనున్+చూచి= దుర్యోధనుడి దిక్కు చూచి; బాష్ప+ఆకుల+లోచనుండు+ఐ= కన్నీటితో కలతనొందిన చూపు కలవాడై.

తాత్పర్యం: ఈవిధంగా నిందించి, కన్నీటితో నిండిన దృష్టితో దుర్యోధనుడిని చూచి.

సీ. 'విధి ప్రతికూలుఁ డై వేరంబు పుట్టించి । మాకు నీవును మేము నీకు నలిగి
యితరేతరద్రోహమతిఁ దెగి యింతలు । సేయుట గావించె; నీ యధర్మ
పరతయు లోభంబు బాల్యంబు మదమును । నిన్ను నింతకుఁ దెచ్చె; నీకతమున
నాకు బాంధవ కులనాశంబు వాటిల్లె; । ధృతరాష్ట్రు కోడండ్రు తీవ్రశోక

తే. కారి యయినవైధవ్యంబు కారణముగ । నన్ను నిందింతు' రనువచనములు మొదలు
గాఁగ బహు విలాపంబులఁ గరుణ మావ । హిల్ల దురపిల్లె నుల్లంబు దల్లడిల్ల.' 291

ప్రతిపదార్థం: విధి= దైవం; ప్రతికూలుఁడు+ఐ= ఎదురుతిరిగి; వేరంబు= శత్రుత్వమును; పుట్టించి= కలిగించి; మాకున్ నీవును= మా యెడ నీవును; మేము నీకున్= మేము నీయందును; అలిగి= కోపించి; ఇతరేతర ద్రోహమతిన్= పరస్పర ద్రోహబుద్ధి; తెగి= తెగించి; ఇంతలు చేయుట= ఇంతపని చేయటం(అనగా యుద్ధం మొదలైనవి); కావించెన్= చేశాడు; నీ అధర్మపరతయున్= నీ యొక్క అధర్మాసక్తి; లోభంబు= అత్యాశ; బాల్యంబు= చిన్నతనం; మదమును= గర్వమును; నిన్నున్ ఇంతకున్+తెచ్చెన్= నిన్నీ స్థితికి తీసికొని వచ్చింది; నీ కతమునన్= నీ కారణంగా; నాకున్; బాంధవ కులనాశంబు+పాటిల్లెన్= బంధువంశనాశం కలిగింది; ధృతరాష్ట్రు కోడండ్రు= ధృతరాష్ట్రుడి కోడళ్ళు; తీవ్రశోకకారి+ఐన= పెనుదుఃఖాన్ని కలిగించేది అయిన; వైధవ్యంబు కారణముగన్= భర్తృహీనత్వం కారణంగా - అనగా వైధవ్యావస్థవలన; నన్నున్; నిందింతురు; అను వచనములు మొదలు కాఁగన్= అనే పలుకులు మొదలుగా; బహువిలాపంబులన్= పలు ఏడ్పులతో; కరుణము ఆవహిల్లన్= కరుణరసం కలుగగా; ఉల్లంబు తల్లడిల్లన్= మనసు కలతపడగా; దురపిల్లెన్= దుఃఖపడినాడు.

తాత్పర్యం: 'దైవం వ్యతిరేకించి శత్రుత్వాన్ని కలిగించి మాపై నీవును, నీపై మేమును కోపించి పరస్పరం ద్రోహబుద్ధితో విడిపోయేటట్లు చేసి ఇంత పనిచేయించాడు. నీ అధర్మం, అత్యాశ, పసితనం, గర్వం, ని న్నీస్థితికి తెచ్చాయి. నీ కారణంగా నాకు బంధువంశనాశమైనది. ధృతరాష్ట్రుడి కోడళ్ళు తీవ్ర దుఃఖానికి లోనయ్యే వైధవ్యం కారణంగా నన్ను దూషిస్తారు' అనే పలుకులు మొదలుగా అనేక విధములయిన దుఃఖపుమాటలతో కరుణరసం నిండుకొనగా మనసు తల్లడిల్లగా ధర్మరాజు దుఃఖించాడు.

వ. అనిన విని ధృతరాష్ట్రుండు సంజయున కి ట్లనియె. 292

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విని; ధృతరాష్ట్రుండు; సంజయునకున్+ఇట్లు+అనియెన్= సంజయుడితో ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అనగా విని, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఈ విధంగా అన్నాడు:

చ. 'అనిలసుతుం డధర్మమున నమ్మెయిఁ గౌరవమేదినీశ్వరుం
దనయెదురన్ వధింపఁగ గదాసమరాఖిలధర్మవేది నాఁ
జనిన హలాయుధుండు గని సంజయ! యే మని పల్కె? నంత వాఁ
డనుజులకున్ మఱందులకు నట్టియెడ న్మొగమోడ నేర్చునే? 293

ప్రతిపదార్థం: సంజయా!= ఓ సంజయుడా!; అనిలసుతుండు= భీముడు; ఆ+మెయిన్= ఆ ప్రకారంగా; అధర్మమునన్= అన్యాయంగా; కౌరవమేదినీ+ఈశ్వరున్= కురువంశ రాజయిన దుర్యోధనుడిని; తన ఎదురన్= తన ముందు (తనకంటికి ఎదురుగా); వధింపఁగన్= చంపగా; గదాసమర= గదాయుద్ధంలోని; అఖిల ధర్మవేది= అన్ని ధర్మాలను తెలిసినవాడు; నాన్= అనగా; చనిన= ఒప్పిన; హల+ఆయుధుండు= బలరాముడు; కని= చూచి; ఏమని పల్కెన్?= ఏమని మాటాడాడు?; అంతవాఁడు= ఆ గొప్పవాడు; అనుజులకున్= తమ్ములకు; మఱందులకున్= బావమరదులకు; అట్టి ఎడన్= ఆ సమయంలో; మొగమోడ నేర్చునే?= మొగమును తప్పించ కలిగి ఉంటాడా?

తాత్పర్యం: 'సంజయా! ఆ విధంగా భీమసేనుడు అధర్మంగా దుర్యోధనుడిని తన కట్టెదుట చంపగా గదాయుద్ధపు సమస్త ధర్మాలు తెలిసినవా డని ప్రసిద్ధిని గడించిన బలరాముడు చూచి ఏమని మాట్లాడాడు? అంత గొప్పవాడు తోబుట్టువుల యెడ, మేనమరదుల పట్ల మొగమాటం వహిస్తాడా?'

చ. అనవుడు నాతఁ డిట్టు లను నమ్మనుజేంద్రున కప్డు రోహిణీ
తనయుఁడు కోపవేగమునఁ దామ్రముఖుం డయి లేచి బాహు లె
త్తి 'నృపతులార! చూచితిరె తెల్లముగా బకవైరివిక్రమం
బున తెఱఁ? గిట్టివాని మనభూములఁ గంటిమె యెన్నఁ డేనియున్? 294

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆతఁడు= ఆ సంజయుడు; అప్డు= ఆ సమయంలో; ఆ+మనుజేంద్రునకున్= ఆ రాజుతో; ఇట్టులు+అనున్= ఈ ప్రకారంగా అన్నాడు; రోహిణీతనయుఁడు= బలరాముడు; కోపవేగమునన్= కోపపు తొట్రుపాటుతో; తామ్రముఖుండు+ఐ లేచి= ఎర్రనైన ముఖంతో లేచి; బాహులు+ఎత్తి= చేతులు పైకెత్తి; నృపతులార!= ఓ రాజులారా!; తెల్లముగాన్= స్పష్టంగా; చూచితిరె?= చూచారా!; బకవైరి విక్రమంబున తెఱఁగు= బకాసురుని చంపినవాడి యొక్క శౌర్యపు పద్ధతి; ఎన్నఁడేనియున్= ఎప్పుడైనా; మన భూములన్= మనదేశాలలో; ఇట్టివానిన్+కంటిమె?= ఇటువంటి వాడిని చూచామా?

తాత్పర్యం: సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: 'ఆ సమయంలో రోహిణికుమారుడు కోపాతిశయంతో ముఖం ఎర్రబడగా లేచి, చేతులు పైకెత్తి, చుట్టూ ఉన్న రాజులలో 'బకవిధ్వంసియొక్క పరాక్రమ పద్ధతిని స్పష్టంగా చూచారా? మన దేశంలో ఎప్పుడైనా ఇటువంటి వారిని చూచామా?

వ. గదాయుద్ధంబున నాభికి దిగువ యగుశరీరభాగంబు నొప్పించుట ధర్మంబుగా దను శాస్త్రోక్తి వినమె? వీఁడు విచ్చలవిడిఁ దెంపు సేసె' నని పలుకు నమ్మహాత్ముని మనంబున రోషానలంబు నముత్థితం బగుటయు నప్పుడు. 295

ప్రతిపదార్థం: గదా యుద్ధంబునన్= గదతో చేసే పోరాటంతో; నాభికిన్ దిగువ అగు శరీరభాగంబున్= బొడ్డునకు క్రిందిదైన శరీరభాగమును; నొప్పించుట= బాధించటం; ధర్మంబు+కాదు= న్యాయం కాదు; అను శాస్త్ర+ఉక్తి= అన్న నీతిశాస్త్రపు మాట; వినమే?= వినలేదా!; వీఁడు= ఈ భీమసేనుడు; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; తెంపు+చేసెన్= సాహసం చేశాడు; అని= అంటూ; పలుకు= మాటాడుతున్న; ఆ+మహాత్ముని= ఆ గొప్పవాడి; మనంబునన్= మనస్సులో; రోష+అనలంబు= రోషాగ్ని; సముత్థితంబు+అగుటయున్= బాగా రేగగా; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: గదాయుద్ధంలో బొడ్డుకు దిగువభాగంలో బాధించటం న్యాయంకాదు- అనే యుద్ధనీతిశాస్త్ర ధర్మాన్ని వినలేదా! ఈ భీముడు విచ్చలవిడిగా తెగించాడు.' అని అంటున్న ఆ మహాత్ముడి (బలరాముడి) మనస్సులో రోషాగ్ని ప్రజ్వలించగా అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. నిజరథము మీఁది హలమును । భుజశిఖరమునం దమర్చి భూమి యద్రువ వా
యుజుదెసకు నడచె నుద్భట । గజరిపుచంక్రమణ రేఖ గతియం దొలయన్. 296

ప్రతిపదార్థం: నిజరథము మీఁది= తన తేరుమీది; హలమును= నాగలిని; భుజశిఖరమునందు+అమర్చి= భుజం మీద నిలుపుకొని; భూమి+అద్రువన్= భూమి వణకగా; వాయుజు దెసకున్= భీముడి దిక్కునకు; ఉద్భట= భయంకరమైన; గజరిపు= సింగముయొక్క; చంక్రమణరేఖ= తిరిగే పద్ధతి; గతి అందున్= నడకలో; ఒలయన్= కానరాగా; నడచెన్= మీదకు నడచాడు.

తాత్పర్యం: (బలరాముడు) తన రథంమీద ఉన్న నాగలిని భుజంపైన పెట్టుకొని, భూమి వణకగా, భయంకరమైన సింహం తిరిగే పద్ధతి నడకలో కానరాగా భీముడి వైపునకు నడచాడు.

శ్రీకృష్ణుఁడు బలరామునకుఁ గోపోపశమనంబు చేయుట (సం. 9-59-7)

వ. దానికిం బవమానసూనుండు సోదరభుజబలనిజబలంబు లేకముఖత్వంబున నెప్పడుం గలుగు మనోబలంబు వలనం జలింప కుండె; నట్టియెడ వేగంబ వినయవినతుం డగుచు నచ్యుతుం డడ్డంబు సొచ్చి దీర్ఘవృత్తపీనంబు లగుబాహువుల హలాయుధుఁ బట్టి కైలాసశైలంబు గదిసిన యంజనమహీధరంబుమాడ్కి నొప్పి యనూనస్వరంబున నతని కిట్లనియె. 297

ప్రతిపదార్థం: దానికిన్= ఆ చేష్టకు; పవమాన సూనుండు= భీమసేనుడు; సోదర భుజబల నిజబలంబులు= తన తోబుట్టువుల యొక్క భుజశక్తి, తనశక్తి; ఏకముఖత్వంబునన్= ఒక్కటిగా; ఎప్పుడున్ కలుగు= ఎల్లవేళలా కలుగుతున్న; మనోబలంబువలనన్+ చలింపకుండెన్= మానసిక స్థైర్యం వలన కదలకుండా ఉన్నాడు; అట్టిఎడన్= ఆ వేళ; వేగంబ= శీఘ్రంగా; వినతుండు+అగుచున్= అణకువతో వంగినవాడౌతూ; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; అడ్డంబు+చొచ్చి= అడ్డం వచ్చి; దీర్ఘవృత్త పీనంబులు+అగు బాహువులన్= పొడవైన, గుండ్రనైన బలసిన చేతులతో; హలాయుధున్ పట్టి= బలరాముడిని పట్టుకొని; కైలాసశైలంబున్ కదిసిన= కైలాస పర్వతాన్ని సమీపించిన; అంజన మహీధరంబు మాడ్కిన్= కాటుకకొండవలె; ఒప్పి= తగిఉండి; అనూన స్వరంబునన్= పెద్దగొంతుతో; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ బలరాముడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ బలరాముడి పద్ధతికి భీమసేనుడు తనయొక్క, తన తోబుట్టువుల యొక్క శక్తి ఒక్కటై నిలకడతోడి మనఃస్థైర్యంతో స్థిరంగా ఉన్నాడు. అటువంటి సమయంలో త్వరగా వినయంతో కూడినవాడై శ్రీకృష్ణుడు అడ్డంగా

పోయి, పొడవైన, గుండ్రనైన, బలిసిన తన చేతులతో బలరాముడిని పట్టుకొని కైలాసపర్వతాన్ని కాటుకకొండ పట్టుకొన్నట్లుగా ఒప్పి, పెద్దగొంతుతో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: ఉపమ. బలరాముడు తెలుపు. అందుచేత అతడికి తెల్లని కైలాసంతో పోలిక, కృష్ణుడు నలుపు. అందుకే అతనికి కాటుకకొండతో పోలిక.

క. తనవృద్ధియు మిత్రునివ । ర్ధనమును దత్సఖసమృద్ధి ప్రబలుటయును శ
త్రునిదెస నిన్నియుఁ జెడుటయు । నను షడ్విధములను దన్ను నతిశుభ మొందున్. 298

ప్రతిపదార్థం: తన వృద్ధియున్= తన ఎదుగుదల; మిత్రుని వర్ధనమును= స్నేహితుడి ఎదుగుదలయును; తద్+సఖ సమృద్ధి= ఆ స్నేహితుల సమృద్ధి; ప్రబలుటయున్= పెరుగుటయు; శత్రుని దెసన్= వైరియెడ; ఇన్నియున్+చెడుటయున్= పైని చెప్పిన వన్నీ నశించి పోవుటయు; అను= అన్నటువంటి; షడ్విధములను= ఆరు పద్ధతుల చేతను; తన్నున్= తన యెడ; అతిశుభము+ ఒందున్= మిక్కిలి మేలు కలిగిస్తుంది.

తాత్పర్యం: తాను పెంపుచెందటం, తన మిత్రుడు పెరగటం, ఆ స్నేహితులు దండిగా ప్రబలటం, శత్రువు విషయంలో ఇన్నీ చెడిపోవటం అనే ఆరువిధాలు తనకు మిక్కిలి మేలు కలిగిస్తాయి.

విశేషం: తన పెంపూ, తన మిత్రుని పెంపూ, తన మిత్రుల సమృద్ధి అధికం కావటం - అనేవి తన విషయంలోనూ, ఇవన్నీ శత్రువు విషయంలో చెడిపోవటమూ - అంటే - తనకు పెంపు లేమి, తన మిత్రునకు పెంపు లేమి, తనకు మిత్రుల సమృద్ధి అధికం కాకపోవటం - అనే ఈ ఆరు విధాలూ తనకు శుభం కలిగిస్తాయి.

వ. ఏతత్ప్రకారంబు విపరీతం బగుట యొప్పు; దట్లు గావున మిత్రునకుం గీడు వాటిల్లి నెడ నేర్పు గలుగునేని మైత్రిపరుం డయిన పౌరుషశాలి యది శమింపం జేయు సత్యపరాక్రము లగు పాండవులు మనకుఁ బరమ మిత్రులు; విశేషించి మన మేనత్తకొడుకు, లనీతిపరులచేతం బరిభవింపంబడినవారు గావున వీరల కభ్యుదయంబు గలిగించుట నీకుం గర్తవ్యంబు. 299

ప్రతిపదార్థం: ఏతద్+ప్రకారంబు= ఈ పద్ధతి; విపరీతంబు+అగుట ఒప్పదు= వ్యతిరేకం కావటం తగదు; అట్లు కావునన్= అందుచేత; మిత్రులకున్ కీడు వాటిల్లిన+ఎడన్= స్నేహితులకు కష్టం కలిగినప్పుడు; నేర్పు కలిగెనేని= చేతనైతే; మైత్రి పరుండు+ఐన పౌరషశాలి= స్నేహశీలిఅయిన శక్తి కలవాడు; అది= ఆ కీడును; శమింపన్ చేయు= అణగచేస్తాడు; సత్యపరాక్రములు+అగు పాండవులు= సత్యమైన, వీరం కల పాండవులు; మనకున్+పరమమిత్రులు= మనకు మిక్కిలి స్నేహితులు; విశేషించి= మీదు మిక్కిలి; మన మేనత్త కొడుకులు= మన మేనత్త కుమారులు; అనీతిపరుల చేతన్= నీతిలేని వారి వలన; పరిభవింపఁబడినవారు= అవమానానికి లోనయినవారు; కావునన్= అందువలన; వీరలకున్= ఈ పాండవులకు; అభ్యుదయంబు కలిగించుట= మేలు చేకూర్చటం; నీకున్+కర్తవ్యంబు= నీకు చేయదగిన పని.

తాత్పర్యం: పై నీతి విపరీతం కావటం తగదు. అందుచేత మిత్రుడికి కష్టం కలిగినప్పుడు ప్రజ్ఞ కలిగిన, స్నేహపరుడైన, బలవంతుడు దానిని ఆదుకొంటాడు. సత్యపరాక్రములైన పాండవులు మనకు మిక్కిలి స్నేహితులు. మీదుమిక్కిలి మన మేనత్త కొడుకులు కూడా. నీతిలేనివారిచేత అవమానానికి లోనయినవారు. కనుక వీరికి అభ్యుదయం కలిగించటం నీకు చేయవలసిన పని.

విశేషం: అంటే పైన చెప్పిన షడ్విధశుభకరములలోను, రెండవది (మిత్రుని వర్ధనం) మూడవది (సఖసమృద్ధి ప్రబలటం) మనం చేయాలి. అప్పుడు మనకు అతిశుభం కలుగుతుంది.

తే. ప్రతిన నెఱపుట నృపులకుఁ బరమధర్మ । మగుట మనమునఁ జర్చింపు; మనిలసుతుఁడు
గద సుయోధను తొడలు భగ్నములు సేయు । వాఁడు గా సభఁ బూనినవాఁడు గాఁడె? 300

ప్రతిపదార్థం: ప్రతిన నెఱపుట= శపథాన్ని నెరవేర్చటం; నృపులకున్= రాజులకు; పరమ ధర్మము+అగుటన్= ఉత్తమ న్యాయంకావటం; మనమునన్+చర్చింపుము= మనస్సులో తలచుకొనుము; అనిలసుతుఁడు= భీమసేనుడు; గదన్= గదతో; సుయోధనుతొడలు= దుర్యోధనుడి తొడలను; భగ్నములు చేయువాఁడుగాన్= విరుగగొట్టేవాడుగా; సభన్= సభలో; పూనినవాఁడు కాఁడె?= ప్రతిజ్ఞ చేసినవాడు కాడా?

తాత్పర్యం: రాజులకు ప్రతిజ్ఞ నెరవేర్చటం ఉత్కృష్టధర్మం అనే విషయాన్ని మనస్సులో యోచించుము. వాయు తనయుడైన భీముడు గదతో దుర్యోధనుడి తొడలను విరుగగొట్టుతానని సభలో ప్రతిజ్ఞచేశాడు కదా!

వ. అట్లుంగాక మైత్రేయమహాముని శాపంబున దుర్యోధనుతొడలు భీమసేనుగదాఘాతంబున భగ్నంబులు గాఁ గలయవి యై యుండె; నిప్పు డట్లయ్యెం గావున దీన దోషంబు దోఁపదు; క్రోధం బుపసంహరింపుము; కుంతీనందనుల యభివృద్ధి మనకు సమృద్ధిఁ జేయు' ననిన నతనికి హలాయుధుం డి ట్లనియె. 301

ప్రతిపదార్థం: అట్లున్ కాక= అంతే కాకుండా; మైత్రేయ మహాముని= మైత్రేయ మహర్షి; శాపంబునన్= ఇచ్చిన శాపం కారణంగా; దుర్యోధను తొడలు= దుర్యోధనుడి తొడలు; భీమసేను= భీముడియొక్క; గదాఘాతంబునన్= గద దెబ్బచేత; భగ్నంబులు+కాన్+కలవిఐ+ఉండెన్= విరిగిపోయేవయి ఉండినవి; ఇప్పుడు+అట్లు+అయ్యెన్= ఇప్పుడు ఆ ప్రకారంగా అయినది; కావునన్= అందువలన; దీనన్= ఈ చేష్టయందు; దోషంబు తోఁపదు= తప్పు కనిపించదు; క్రోధంబు+ఉపసంహరింపుము= కోపాన్ని వదలుము; కుంతీ నందనుల+అభివృద్ధి= కుంతి కుమారులయొక్క పెంపు; మనకున్ సమృద్ధి+చేయున్= మనకు మేలు చేస్తుంది; అనినన్= అనగా; అతనికిన్; హలాయుధుండు+ఇట్లు+అనియెన్= బలరాముడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీముడి శపథం మాత్రమే కాదు. మైత్రేయ మహాముని శాపం కారణంగా కూడా భీముడి గదయొక్క తాకిడికి దుర్యోధనుడి తొడలు విరుగవలసి ఉన్నది. ఇప్పు డది జరిగింది. దీనిలో దోషం లేదు. నీ కోపాన్ని అణగించుకొమ్ము. కుంతికుమారులయొక్క క్షేమం మనకు మంచిని కలిగిస్తుంది' అన్నటువంటి శ్రీకృష్ణుడితో బలరాము డిట్లా అన్నాడు:

తే. 'ఓపి ధర్మార్థ కామంబు లొకటి నొకటి । నాశ మొందింప కుండంగ నడపవలయుఁ
గాక! ధర్మంబు సెడ నర్థకామములను । గోరు పురుషుండు నిందకుఁ గుదురుగాఁడె? 302

ప్రతిపదార్థం: ఓపి= చాలి; ధర్మార్థ కామంబులు+ఒకటిన్+ఒకటి= ధర్మార్థ కామాలు ఒకదాని నొకటి; నాశము+ఒందింపకుండన్ నడపవలయున్= నాశం చేయకుండా నడచుకొనవలయును; కాక= ఆ విధంగా కాకుండా; ధర్మంబు+చెడన్= ధర్మం నశించిపోయేటట్లు; అర్థకామములను కోరు పురుషుండు= సంపదలను, కామములను ఆశించే పురుషుడు; నిందకున్ కుదురు+కాఁడె?= అపకీర్తికి చోటుకదా!

తాత్పర్యం: 'ధర్మార్థ కామాలు క్రమంగా ఒకదానినొకటి నాశనం చేయకుండా నడచుకొనవలసి ఉన్నది. అట్లుకాక ధర్మం చెడిపోయేటట్లు అర్థాన్నీ, కామాన్నీ కోరే మానవుడు అపకీర్తికి ఆలవాలం కాడా?

క. మునిశాపంబును బ్రతినయు । నని చెప్పితి; గలుగుఁ గాక!' యని విను ధర్మం
బున వానిన్ నెఱపక యి । ట్లనిలసుతుఁడు గలఁచెఁ గాదె యన్నెఱి యెల్లన్.' 303

ప్రతిపదార్థం: మునిశాపంబును= ముని ఇచ్చిన శాపమూ; ప్రతినయున్= ప్రతిజ్ఞయూ; అని చెప్పితి(వి)= అని చెప్పావు; కలుగున్+కాక!= అవి ఉండవచ్చు గాక; విను= వినుము; అనిన్= యుద్ధంలో; ధర్మంబునన్ వానిన్ నెఱపక= ధర్మంతో ఆ పనులు చేయకుండా; ఇట్లు= ఈ విధంగా; ఆ+నెఱి+ఎల్లన్= ఆ ధర్మము నంతటిని; అనిలసుతుఁడు= భీమసేనుడు; కలఁచెన్+కాదె!= చెడిపెను కదా!

తాత్పర్యం: మునీశ్వరుడి శాపం, భీముడి ప్రతిజ్ఞ - అని చెప్పావు. కావచ్చును. కాని, ధర్మవిరుద్ధంగా వ్యవహరించి యుద్ధంలో ఈ విధంగా భీమసేనుడు న్యాయాన్నంతటిని చీకాకు పరచాడు కదా! అర్థకామాలకోసం భీముడు యుద్ధధర్మాన్ని బలి చేశాడు కదా!'

చ. అన విని కృష్ణుఁ డిట్టు లను 'నాతనికిన్ నిను నిజ్జగంబు ధ
ర్మనిరతమానసుండు మధురత్వనిరూఢుఁడు దోషదూరుఁ డం
చనిశము సంస్తుతించును మహాత్మ! యడంపుము క్రోధ; మీతఁడుం
దనదు ప్రతిజ్ఞ కై రిపు గదాహతుఁ జేసె; నధర్మ మే లగున్? 304

ప్రతిపదార్థం: అనిన్+విని= అనగా వినినవాడై; ఆతనికిన్= ఆ బలరాముడితో; కృష్ణుఁడు+ఇట్టులు+అనున్= శ్రీకృష్ణుడు ఈ విధంగా చెప్పాడు; మహాత్మ!= ఓ మహనీయుడా!; నినున్= నిన్ను; ఈ+జగంబు= ఈ లోకం; ధర్మనిరతమానసుండు= ధర్మమునం దాసక్తితోడి మనసున్నవాడు; మధురత్వ నిరూఢుఁడు= తీయదనమగు నడవడియందు పట్టున్నవాడు; దోషదూరుఁడు= దోషం లేనివాడు; అంచున్= అంటూ; అనిశమున్= ఎల్లప్పుడూ; సంస్తుతించును= కీర్తిస్తుంది; క్రోధము= కోపం; అడంపుము= మానుకొనుము; ఈతఁడును= ఈ భీముడు కూడా; తనదు ప్రతిజ్ఞకై= తను చేసిన శపథానికి గాను; రిపున్= వైరిని; గదాహతున్+చేసెన్= గదతో పడగొట్టాడు; అధర్మము+ఏల+అగున్= (అది) న్యాయాతిక్రమణం ఎందు కవుతుంది?

తాత్పర్యం: బలరాము డట్లా అనగా విన్న శ్రీకృష్ణుడు ఆతడితో నిట్లా అన్నాడు: 'లోకం నిన్ను ధర్మతత్పరుడుగా తీయని మనసున్నవాడుగా ఎపుడూ కీర్తిస్తుంటుంది. ఓ మహాత్మా! కోపాన్ని మానుకొనుము. ఈ భీముడు తన ప్రతిజ్ఞను నెరవేర్చటానికి శత్రువును గదాహతుడిగా చేశాడు. ఇది ప్రతిజ్ఞానిర్వహణమే కాని ఏ విధంగా అధర్మమౌతుంది?

వ. అదియును నిలిచి మార్కొన్న యప్పుడును నడచు నెడను గాదు; పొడ వెగసి పై కుఱికినఁ దన్నుం గాచికొనుటయుం బ్రతిన నెఱపుటయును గారణముగా దొరకొనిన నాభికి దిగువ గదా! యని యుడిగి చావ వచ్చునే? గద నూరుభంగంబు సేయుదు ననుభీమసేను పూనికి పదుమూఁడు వత్సరంబులేని వేఁచిన యది యక్కులపాంసనుం డేల తలంపకుండె? మఱచెనేనిం జెడుఁగాక! మనకేమి? కలియుగంబు చేరువ యాసన్నం బయ్యె; నివ్విధంబులు ధర్మంబు లై చెల్లకుండునే? యట్లుంగాక పుట్టినంతనుండియుం

గపటంబున నపకారంబులు సేయుచున్న వీనిఁ గపటప్రకారంబునఁ బడవైచుట ధర్మహాని యై తోఁపదు; వీఁడు పాండవ యాదవ వంశవర్ధనుం డగు సుభద్రానందనుం దెగటార్చిన తెఱం గెఱుంగమే?' యనిన నా బలదేవుండు బలు మొగంబుతో 'నిట్టి చెనఁట గెలుపు గెలిచిన భీముండు వొగడు వడయుం గాక! రణధర్మంబు దప్పక పెనంగినట్టి ధర్మాత్ముం డైన దుర్యోధనున కుత్తమలోకం బయ్యెడు' మనుచు నతనికిం జెప్పి రథాధిరూఢుం డై పాండవేయపాంచాలయదుప్రవరులు చిన్నంబోవ నిజపురంబున కరిగెఁ; దదనంతరంబ వాసుదేవుండు ధర్మపుత్త్రు నాలోకించు నెడ నతండు దీనాననంబుతోడ మానసంబు విషాదంబు నొంద నూరకున్న, నారాయణుం డతని కిట్లనియె. **305**

ప్రతిపదార్థం: అదియును= అదికూడా - నాభి దిగువ కొట్టటం కూడ; నిలిచి మార్కొన్న అప్పుడు= నిలిచి ఎదుర్కొన్నప్పుడు; నడచున్= జరుగుతుంది; ఎడను కాదు= వేఱయినపుడు కాదు; పొడవు+ఎగసి= పైకి దూకి; పైకి+ఉఱికినన్= మీదకు దూకితే; తన్నున్+కాచికొనుటయున్= తనను కాపాడుకొనటం; ప్రతిన నెఱపుటయును కారణముగాన్= ప్రతిజ్ఞా పాలన చేయుటయు కారణంగా; దొరకొనినన్= పూనుకొన్నచో; నాభికిన్ దిగువన్+కదా!+అని= బొడ్డునకు క్రింది భాగాన కదా! అనుకొంటూ; చావవచ్చునే?= చావనగునా?; గదన్= గదతో; ఊరుభంగంబు చేయుదున్= తొడలను విరుగగొట్టుతాను; అను భీమసేను పూనికి= అన్న భీముడి ప్రతిన; పదుమూఁడు వత్సరంబులు+ఏని వేఁచిన+అది= పదమూడు సంవత్సరాలు కాచుకొన్నది; ఆ+కులపాంసనుండు= ఆ వంశ నాశకుడు; ఏల= ఎందుకు; తలంపకుండెన్?= తలచుకోకుండా ఉన్నాడు?; మఱచెనేనిన్+చెడుఁగాక!= మరచిపోతే నాశమగుగాక!; మనకేల?= మనకున్+ఎందుకు?; కలియుగంబుచొరవ= కలియుగ ప్రవేశం; ఆసన్నంబు+అయ్యెన్= దాపయింది; ఈ+విధంబులు= ఈ నడకలు; ధర్మంబులు+ఐ= ధర్మాలుగా; చెల్లకుండునే= నడవకుంటాయా; అట్లున్+కాక= అంతే కాకుండా; పుట్టినంత నుండియున్= జన్మించిన నాటినుండీ; కపటంబునన్= మోసంతో; అపకారంబులు చేయుచున్న వీనిన్= కష్టాలు కలిగిస్తూ ఉన్న వీడికి; కపటప్రకారంబునన్= మోసపు పద్ధతిలో; పడవైచుట= చంపుట; ధర్మహాని+ఐ తోఁపదు= నీతి తప్పుటగా తోచదు; వీఁడు= ఈ దుర్యోధనుడు; పాండవ యాదవ వంశవర్ధనుండు+అగు= పాండవులయు యాదవులయు కులవర్ధనుడైన; సుభద్రా నందనున్ తెగటార్చిన్ తెఱంగు= సుభద్రకుమారుడైన అభిమన్యుడిని చంపిన విధం; ఎఱుంగమే?= తెలియమా?; అనినన్= అనగా; ఆ బలదేవుండు= ఆ బలరాముడు; బలుమొగంబుతోన్= గండుముఖంతో; ఇట్టి చెనఁటి గెలుపు= ఇటువంటి కుత్సితపు గెలుపును; గెలిచిన= గెలిచినట్టి; భీముడు పొగడు+పడయున్+కాక!= భీమసేనుడు కీర్తిపొందుతాడు గాక!; రణధర్మంబు తప్పక= యుద్ధనీతిని వదలక; పెనంగిన+అట్టి= యుద్ధం చేసిన; ధర్మాత్ముండు+ఐన= నీతిపరుడైన; దుర్యోధనునకున్+ఉత్తమ లోకంబు+అయ్యెడున్= పుణ్యలోకం దుర్యోధనుడికి కలుగుతుంది కాక!; అనుచున్= అంటూ; అతనికిన్+చెప్పి= శ్రీకృష్ణుడితో చెప్పి; రథ+అధిరూఢుండు+ఐ= తేరెక్కినవాడయి; పాండవేయ పాంచాల యదు ప్రవరులు= పాండవులు పాంచాలురు; యాదవముఖ్యులు; చిన్నన్+పోవన్= సిగ్గుపడగా; నిజపురంబునకున్+అరిగెన్= తన ఊరికి వెళ్ళాడు; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; ధర్మపుత్రు నాలోకించు+ఎడన్= ధర్మరాజును చూడగా; అతండు= ధర్మరాజు; దీన+ ఆననంబుతోడన్= విషణ్ణమైన మొగంతో; మానసంబు విషాదంబున్+ఒందన్= మనసు దుఃఖపడగా; ఊరకున్నన్= మిన్నకుండగా; నారాయణుండు+అతనికిన్+ఇట్లు+అనియెన్= శ్రీకృష్ణు డీవిధంగా అన్నాడు.

తాత్పర్యం: నిలిచి ఎదుర్కొన్నపుడూ నడచేటప్పుడూ కాకుండా పైకెగసి దూకినపుడు ఆత్మరక్షణకై ప్రతిజ్ఞను నెరవేర్చటం కారణంగా పూనుకొని బొడ్డునకు క్రిందకదా అని ఊరకొని చావవచ్చునా? గదతో తొడలు విరుగగొట్టుతా నన్న భీమసేనుడి ప్రయత్నం పదుమూడు సంవత్సరాలు కాచుకొని ఉండగా ఆ కులనాశకుడు దానిని తలచుకొనకుండా మరచితే నాశనమగుగాక! మన కెందుకు? కలియుగం ప్రవేశించే సమయం సిద్ధమైంది. ఇట్లాంటివి ధర్మబద్ధ మయి చెల్లకుండా ఉంటాయా? అంతే కాదు పుట్టిననాటినుండీ మోసమే నడవడి అయిన ఈతడిని పడవేయటం ధర్మహానిగా

తోచదు. వీడు పాండవ యాదవవంశ దీపకుడైన సుభద్రాతనయుడిని చంపిన పద్ధతి మనకు తెలియదా?' అని అనగా విని, బలరాముడు గండుమొగంతో 'ఈ విధమైన కపటపు గెలుపును గెలిచిన భీముడు ప్రశంసలు పొందుతాడుకాక! యుద్ధధర్మమును అతిక్రమించక యుద్ధం చేసిన ధర్మపరుడైన దుర్యోధనుడికి పుణ్యలోకాలు కలుగుతాయి.' అంటూ కృష్ణుడికి చెప్పి, తేరెక్కి పాండవులు, పాంచాలురు, యాదవులు చిన్నబోవగా తన ఊరికి బలరాముడు వెళ్ళాడు. పిమ్మట శ్రీకృష్ణుడు ధర్మజుడిని చూడగా అతడు దైన్యాన్ని ప్రకటించే మనసుతో దుఃఖపడుతుండగా అతడితో శ్రీకృష్ణు డీ విధంగా అన్నాడు:

ఆ. 'బంధునాశకుండు పాపాత్ముఁ డీసుయో । ధనుఁడు వీని సమరధరణిఁ గూల్చి
శిరము దన్నె భీముఁ; డరయంగ నది యధ । ర్మంబె? నీకు నేల మఱుఁగఁ జెపుమ! 306

ప్రతిపదార్థం: బంధునాశకుండు= బంధువులను నశింపజేసినవాడు; పాపాత్ముఁడు= పాపాలు చేసినవాడు; ఈ సుయోధనుఁడు= ఈ దుర్యోధనుడు; వీనిన్= ఈతనిని; సమరధరణిన్+కూల్చి= యుద్ధభూమిలో చంపి; భీముఁడు= భీముడు; శిరము తన్నెన్= తలను తన్నాడు; అది= ఆ పని; అరయంగన్= చూడగా; అధర్మంబె?= అన్యాయమా?; నీకున్ మఱుఁగన్?= నీవు శోకించటం?; ఏల= ఎందుకు?; చెపుమ!= చెప్పుము.

తాత్పర్యం: 'బంధునాశనానికి కారకుడూ, పాపకర్ముడూ అయిన ఈ సుయోధునుడిని యుద్ధభూమిలో పడగొట్టి భీముడు తలను తన్నాడు, అది అధర్మమా? దీనికి నీవు విచారించటమెందుకు? చెప్పుము.

వ. తలఁ దన్నువాఁడ నను ప్రతిజ్ఞయుఁ గీచకారాతికిం గలదు గాదె?' యనిన విని కుంతీనందనుండు దేవకీనందనున కిట్లనియె. 307

ప్రతిపదార్థం: తలన్+తన్నువాఁడను+అను ప్రతిజ్ఞయున్= తలను తన్నుతాననే శపథంకూడా; కీచక+అరాతికిన్+కలదు కాదె!= కీచక వైరిఅయిన భీముడికి ఉన్నదికదా!; అనినన్ విని= అనగా విని; కుంతీనందనుండు= కుంతి కుమారుడైన ధర్మజుడు; దేవకీ నందనునకున్= దేవకీ కుమారుడైన శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: తలను తన్నుతానని కూడా కీచకవైరి భీముడు శపథం చేసి ఉన్నాడు కదా!' అను మాటను విన్న ధర్మజుడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

క. 'కురుకులము పొలియుటకు మది । యెఱియంగా నున్న నాకు నితఁ డీరాజున్
శిర ముఱక తన్ని యిమ్మెయిఁ । బరిభవ మొందింప వగపు పాటిలకున్నే? 308

ప్రతిపదార్థం: కురు కులము పొలియుటకున్= కురువంశం నశించటానికి; మది= మనసు; ఎఱియంగాన్= పరితపించగా; ఉన్ననాకున్= ఉన్నట్టినాకు; ఇతఁడు= ఈ భీముడు; ఈ రాజున్= ఈ దుర్యోధనుడిని; శిరమున్= తలను; ఉఱక తన్ని= ఊఱకతన్ని; ఈ+మెయిన్= ఈవిధంగా; పరిభవము+ఒందింపన్= అవమానించగా; వగపు పాటిలక+ఉన్నే?= దుఃఖం కలుగక ఉంటుందా!

తాత్పర్యం: 'కురుకులం నాశనమయినందుకు అసలే మనసు పరితాపం పడుతున్న నాకు భీముడు ఈ రాజును ఈ విధంగా తలను తన్ని అవమానించటం వలన దుఃఖం కలుగకుండా ఉంటుందా?

తే. **ఇతఁడు పఱిచిన పాటులు హృదయకీలి । తంబు లై భీమసేనుండు తగవు మాలె**
నేమి సేయంగవచ్చుఁ? బోనిమ్ము పుణ్య । పాపచింత యిం కేటికిఁ బద్మనాభ!' **309**

ప్రతిపదార్థం: పద్మనాభ!= శ్రీకృష్ణా!; ఇతఁడు= ఈ దుర్యోధనుడు; పఱిచిన పాటులు= పెట్టిన కష్టాలు; హృదయ కీలితంబులు+ఐ= గుండె మంటలుకాగా; భీమసేనుడు; తగవు మాలెన్= ధర్మాన్ని వదలాడు; ఏమి+చేయంగ వచ్చున్?= ఏమి చేయగలం?; పోనిమ్ము; పుణ్యాపాపచింత= పుణ్యామో పాపమో దానిని గూర్చి తలచుకొనటం; ఇంకన్+ఏటికిన్= ఇంక ఎందుకు?

తాత్పర్యం: ఈ దుర్యోధనుడు పెట్టిన కష్టాలు గుండెను మండింపగా భీముడు సమతాధర్మాన్ని వదలాడు. ఏమి చేయగలం? పోతే పోనిమ్ము. ఓ పద్మనాభా! పుణ్యాపాపాలను గూర్చిన తలపు ఇం కెందుకు?'

వ. **అనుటయు 'నట్లు కాక దీని నింత గొనియాడ నేల?' యని యతండు భీమసేనపక్షపాతంబున నతనిచింత గీటునం బుచ్చె; వివ్వచ్చుండు నెఱయం బ్రియం బందని డెందంబుతోఁ గీడు మే లాడక యూరకుండె; నమ్మారుతి మోదం బెసఁగ మోడ్పుఁగేలు ఫాలతలంబున మోపికొనుచు నుత్ఫుల్లంబు లగు లోచనంబుల నొప్పి నిజాగ్రజుం జేరం జని యి ట్లనియె.** **310**

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; అట్ల+కాక= అంతేకాని; దీనినిన్= ఈ పనిని; ఇంత+కొనియాడన్+ఏల?= ఇంతగా తర్కించటం ఎందుకు?; అని అతండు= అంటూ శ్రీకృష్ణుడు; భీమసేన పక్షపాతంబునన్= భీముడిమీద అభిమానంతో; అతని చింత= ఆ ధర్మజుడి చింతను; గీటునంబుచ్చెన్= తొలగించాడు; వివ్వచ్చుండు= అర్జునుడు; నెఱయన్+ప్రియంబు+అందని డెందంబుతోన్= నిండుగా సంతసించని మనసుతో; కీడు మేలు+ఆడక= మంచి చెడులను పలుకకుండా; ఊరక+ఉండెన్= ఊరకుండిపోయాడు; ఆ+మారుతి= ఆ భీముడు; మోదంబు= సంతోషం; ఎసఁగన్= ఎక్కువకాగా; మోడ్పు+కేలు= చేతులుజోడించి; ఫాలతలంబునన్ మోపికొనుచున్= నెన్నుదుటికి తాకించుకొంటూ; ఉత్ఫుల్లంబులు+అగు= వికసించిన; లోచనంబులన్= కన్నులతో; ఒప్పి= తగిఉండి; నిజ+అగ్రజున్+చేరన్+చని= తన అన్నవద్దకు వెళ్ళి.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అనగా శ్రీకృష్ణుడు 'దీనిని గూర్చి ఇంతగా మాట్లాడటం ఎందుకు? అని భీముడి పక్షం వహించి, ధర్మజుడికి కలిగిన చింతను తొలగించాడు. అర్జునుడు నిండైన ప్రీతి కలుగని మనసుతో మంచి చెడులను చెప్పక ఊరకున్నాడు. భీమసేనుడు సంతోషంతో రెండు చేతులను జోడించి నమస్కరిస్తూ వికసితనేత్రుడై తన అన్న వద్దకు చేరి, ఈ విధంగా అన్నాడు:

చ. **'పరిభవకారి యైన కులపాంసనుఁ డాహవభూమిఁ గూలెఁ ద**
త్పరమతి వైరముం బెనిచి పాపవినిశ్చయ కారకత్వని
ష్ఠురు లగు దుస్ససేనుఁడును సూతసుతుండును సౌబలుండుఁ ద్రుం
గి రితనికంటె మున్ను; మహికిం బతి వీవ! భరింపు మున్నతిన్.' **311**

ప్రతిపదార్థం: పరిభవకారిఐన కులపాంసనుఁడు= అవమాన కారకు డైన కుల నాశకుడు; ఆహవ భూమిన్+కూలెన్= యుద్ధరంగంలో చనిపోయాడు; తత్పరమతిన్= తదేకమైన మనస్సుతో; వైరమున్ పెనిచి= శత్రుత్వాన్ని పెంచి; పాప వినిశ్చయ కారకత్వ నిష్ఠురులు+అగు= పాపపు పనిచేయించటంలో పట్టుదల కలవారైన; దుస్ససేనుఁడును= దుశ్శాసనుడూ; సూతసుతుండును= కర్ణుడూ; సౌబలుండు= శకునీ; ఇతనికంటెన్ మున్ను= ఈ దుర్యోధనుడి కన్న ముందుగా; త్రుంగిరి= చనిపోయారు; మహికిన్+పతివి+ఈవ= భూమికి రాజువు నీవే. ఉన్నతిన్ భరింపుము= ఔన్నత్యాన్ని భరించుము.

తాత్పర్యం: అవమానాలకు కారణమైన వాడు, కులనాశకుడు యుద్ధరంగంలో చనిపోయాడు. పట్టుదలతో శత్రుత్వాన్ని పెంచి పాపకార్యాలు చేయించటంలో, కఠినమైన మనసు గల దుశ్శాసన, కర్ణ శకునులు ఇతడికంటె ముందుగా చనిపోయారు. భూమికి రాజువు నీవే. అన్ని విధాలా ఔన్నత్యంతో ఈ రాజ్యభారాన్ని వహించుము.' (అని అన్నతో భీము డన్నాడు).

వ. అనిన విని ధర్మతనయుం డతని కిట్లనియె. 312

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విన్నవాడైన; ధర్మతనయుండు= ధర్మరాజు; అతనికిన్= ఆ భీముడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు భీముడితో ఇట్లా అన్నాడు:

క. హరితలఁపు గూడఁ గురుపతిఁ । బరిమార్చితి, ప్రతినతోడఁ బగ దీర్చితి; నీ
కరయంగ దైవబలవి । స్ఫురిత భుజాబలము లింత చొప్పడి యున్నే! 313

ప్రతిపదార్థం: హరితలఁపు+కూడన్= శ్రీకృష్ణుడి భావం కూడిరాగా; కురుపతిన్+పరిమార్చితి(వి)= దుర్యోధనుడిని చంపావు; ప్రతినతోడన్= శపథంతో; పగదీర్చితి(వి)= వైరమును తీర్చుకొన్నావు; నీకున్+అరయఁగన్= నీకు చూడగా; దైవబల= దైవబలంచేత విస్ఫురితభుజాబలము= ప్రకాశించే భుజబలం; ఇంత చొప్పడి+ఉన్నే?= ఇంతగా సమకూరిందా?

తాత్పర్యం: 'శ్రీకృష్ణుడి తలపు సాయం కాగా, నీ వైరం, ప్రతిజ్ఞ తీరేటట్లుగా చేశావు. చూడగా నీకు దైవబలంతోడయిన భుజబలంగా ఇంత సమకూరిందా?

వ. అని సంభావించె' ననిన విని యాంబికేయుండు సంజయు నుద్దేశించి. 314

ప్రతిపదార్థం: అని సంభావించెన్= అని గౌరవించాడు; అనినన్= అనగా; విని= విన్నవాడై; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; సంజయున్+ఉద్దేశించి= సంజయుడితో (ఇట్లా మాట్లాడాడు).

తాత్పర్యం: అని గౌరవించాడు అనగా విని, ధృతరాష్ట్రుడు సంజయుడితో - (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. 'అట్లు వడియున్న యక్కౌరవాధినాథుఁ । జూచి పాండుతనూజులు సోమకులును
నేమి సేసిరి? నా కది యెఱుఁగఁ జెప్పు' । మనుడు నతఁ డిట్టు లనియె నమ్మనుజపతికి. 315

ప్రతిపదార్థం: అట్లు పడి ఉన్న= ఆ విధంగా (తొడలు విరిగి) పడిఉన్న; ఆ+కౌరవాధినాథున్+చూచి= కురురాజ నాయకుడైన దుర్యోధనుడిని చూచి; పాండుతనూజులు= పాండు రాజకుమారులైన పాండవులు; సోమకులును= సోమకాదులును; ఏమి చేసిరి?= ఏమిచేశారు; నాకున్+అది+ఎఱుఁగన్ చెప్పుము+అనుడున్= నాకది తెలియచేయుమనగా; ఆ+మనుజ పతికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; ఆతఁడు+ఇట్టులు+అనియెన్= ఆ సంజయుడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'యుద్ధ రంగంతో తొడలు విరిగిపడి ఉన్న కురురాజును జూచి పాండవులును పాంచాలురు ఏమి చేశారు? నాకు తెలియజేయుము.' అని ధృతరాష్ట్రుడు అడుగగా సంజయుడు అతడితో ఇట్లా అన్నాడు:

వ. 'దేవా! యేమి సెప్పుదుఁ? బాండవులును బాంచాలురునుం దక్కటి భూపతులునుం గృష్ణసహితంబుగా నుబ్బునం బొంగి చీరలు వీచువారును విండులు విసరువారును గుణధ్వని సేయువారును శంఖంబు లొత్తువారును భేరీపణవాదులు మ్రోగించువారును బెలుచ నార్చువారును నయి పేర్చినం బృథివికి వ్రేఁగగు నట్లుండె నిత్తెఱంగునం జెలంగి మారుతిసూరెలం జేరి యిట్లనిరి. 316

ప్రతిపదార్థం: దేవా! ఏమి చెప్పుదున్?= ప్రభూ! ఏమనగలను?; పాండవులును; పాంచాలురున్+తక్కటి భూపతులునున్= పాండవ, పాంచాలురు మాత్రమే కాక మిగిలిన రాజులు కూడా; కృష్ణసహితంబుగాన్= కృష్ణుడితోకూడా; ఉబ్బునన్+పొంగి= సంతోషంతో ఉప్పొంగి; చీరలు వీచువారును= బట్టలను ఊపేవాళ్ళు; విండులు విసరువారును= ధనుస్సులను ఆడించేవాళ్ళు; గుణ ధ్వనిసేయువారును= అల్లెత్రాటిని మీటేవాళ్ళు; శంఖంబులు+ఒత్తువారును= శంఖధ్వానం చేసేవాళ్ళు; భేరీపణవ+ఆదులు= నగారాలును, కొమ్ములు మొదలైనవాటిని; మ్రోగించువారును= శబ్దం చేసేవారూ; పెలుచన్+ఆర్చువారును= పెద్దగా అరచేవారూ; అయి= అగుచు; పేర్చినన్= విజృంభించగా; పృథివికిన్= భూమికి; వ్రేఁగు+అగునట్లు+ఉండెన్= భారం కలిగే విధంగా ఉండింది; ఈ+తెఱంగునన్+చెలంగి= ఈ విధంగా ఒప్పాది; మారుతి= భీముడి; సూరెలన్+చేరి ఇట్లు+అనిరి= ప్రక్కలలో చేరి ఈ విధంగా అన్నారు:

తాత్పర్యం: 'ఓ రాజా! ఏమని చెప్పగలను? పాండవ, పాంచాల, తదితర దేశాధిపతులును శ్రీకృష్ణుడితో కలిసి సంతసంతో ఉప్పొంగి గుడ్డలు విసరుచున్నవారూ, ధనుష్టంకారాలు చేసేవారూ, శంఖాలు పూరించే వారూ, భేరీభాంకృతుల ధ్వనింపజేసేవారూ, పెద్దగా అరిచేవారూ అయి, విజృంభించి, భూమి అదరేటట్లుగా పై విధంగా తిరిగి భీముడి ప్రక్క చేరి ఇట్లా అన్నారు.

మ. 'గదనే ర్పెక్కుడు గల్గు దర్పఘనుఁ డీ కౌరవ్యరాజన్యుఁ డు
న్మదలీలం బయి నట్లు బె ట్టుఱికిన న్వంచించి పో కిట్లుసే
యుదె? నీవాటునఁ బెన్దొడల్ విఱిగి వీఁ డుర్విం బడెన్ మాకు నొ
ప్ప దలిర్పం బులకాంకురంబు లెసఁగం బో విప్పడుం జూడుమీ! 317

ప్రతిపదార్థం: గద నేర్పు= గదను త్రిప్పటంలో ప్రజ్ఞ; ఎక్కుడుకల్గు= ఎక్కువగా గల; దర్పఘనుఁడు= గర్వంచేత ఘనుడైన; ఈ కౌరవరాజ్యన్యుఁడు= ఈ కౌరవరాజ శ్రేష్ఠుడు; ఉన్మదలీలన్= మిక్కిలి అహంకారపు చేష్టతో; అట్లు= ఆ విధంగా; బెట్టు+ఉఱికినన్= మిక్కిలి దూకగా; వంచించిపోక= మోసంతో తప్పించుకొనకుండా; ఇట్లు చేయుదె?= ఈ విధంగా చేసితివా? (బాగా చేశావనుట); నీ పాటునన్= నీ దెబ్బకు; పెన్+తొడల్ విరిగి= పెద్దతొడలు విరిగి; ఈతడు+ఉర్విన్+పడెన్= ఇతడు(దుర్యోధనుడు) భూమిమీద పడ్డాడు; మాకున్= మాకందరికీ; ఒప్పు+తలిర్పన్= సొగసు వికసించగా; పులక+అంకురంబులు= గగుర్పాటు మొలకలు; ఎసఁగన్= ఒప్పారగా; ఇప్పుడున్= ఇప్పుడుకూడా; పోవు= పోకుండా ఉన్నాయి; చూడుమీ!= చూడుము.

తాత్పర్యం: 'ఈ దుర్యోధనుడు గదాయుద్ధంలో ఎక్కువ నేర్పుగల గర్వాధికుడు. వీడు గర్వంతో ఆ విధంగా మీదకు దూకగా మోసంతో తప్పించుకొనకుండా ఇట్లా చేశావు గదా! నీదెబ్బకు వీడు తొడలు విరిగి నేలకూలాడు. మాకందరికీ ఒప్పుగా కలిగిన గగుర్పాటు ఇప్పటికీ తగ్గలేదు. నీవే చూడుము.

ఆ. పరులచేతఁ గాని పని యైనవృత్ర వ । ధంబుఁ బోని యరివధంబు నిర్వ
హించియున్న నిన్ను నే మింద్రుఁ గొనియాడు । నమరులట్ల పొగడెదము సెలంగి. 318

ప్రతిపదార్థం: పరులచేతన్= ఇతరులవలన; కానిపనిఐన; వృత్రవధంబున్= వృత్రాసుర సంహారం; పోని= పోలిన; అరివధంబు= వైరి చావును; నిర్వహించి ఉన్న నిన్నున్= కొనసాగించి యున్న నిన్ను; ఏము= మేము; ఇంద్రున్+కొనియాడు= ఇంద్రుడిని పొగడే; అమరులు+అట్లు+అ= దేవతలవలె; చెలంగి= ఒప్పి; పొగడెదము= కీర్తిస్తాము.

తాత్పర్యం: ఇతరులకు సాధ్యం కానిపని వృత్రాసురవధ. దానిని పోలిన శత్రుసంహారాన్ని సాగించిన నిన్ను ఇంద్రుడిని దేవతలు పొగడినట్లుగా పొగడుతాము.

విశేషం: అలం: ఉపమ.

క. **అవమానంబులు సేసిన । యవినీతుల దుస్ససేనుఁ డాదిగఁ గలవా**
రి వధించి యడుగు పగతుని । యవుదల నిడి; తింతవార లవనిం గలరే?' **319**

ప్రతిపదార్థం: అవమానంబులు చేసిన= అవమానాలు కావించినట్టి; అవినీతులన్= దుర్మార్గులను; దుస్ససేనుఁడు+ఆదిగన్+కలవారిన్+వధించి= దుశ్శాసనుడు మొదలైన వారిని చంపి; అడుగు= పాదము; అవుదలన్+ఇడితి(వి)= నెత్తిమీద పెట్టావు; ఇంతవారలు= ఇంతటివారు; అవనిన్+కలరే?= భూమిలో ఉన్నారా?

తాత్పర్యం: అవమానాలు చేసిన నీతిమాలిన దుశ్శాసనాదులను చంపి, నీ పాదమును శత్రువు నడినెత్తిమీద పెట్టావు. ఇంతటి వారు భూమిలో ఉన్నారా?'

వ. **అని మఱియు ననేకప్రకారంబుల బ్రశంసించిరి; భీముచేసిన గదాసమర ధర్మవిరోధంబు లాఁతి రాజులమనంబుల నుండునో? యని శంకించి కృష్ణుం డెల్లరాజులం గలయం గనుంగొని యిట్లనియె.** **320**

ప్రతిపదార్థం: అని మఱియున్+అనేక ప్రకారంబులన్+ప్రశంసించిరి= అని ఇంకను అనేక విధాలుగా పొగడారు; భీము చేసిన= భీముడు కావించిన; గదాసమర= గదాయుద్ధంలో; ధర్మవిరోధంబు= ధర్మాతిక్రమణం; లాఁతిరాజుల మనంబులన్+ఉండునో అని= ఇతర రాజుల మనసులలో ఉంటుందేమోఅని; శంకించి= అనుమానపడి; కృష్ణుండు+ఎల్లరాజులన్+కలయన్+కనుంగొని= కృష్ణుడు రాజు లందరిని బాగా చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అంటూ ఇంకా అనేక విధాల పొగడారు. భీముడు కావించిన గదా యుద్ధ ధర్మాతిక్రమణం ఇతర రాజుల మనసులో ఇంకా ఉంటుందేమో అని వారిని తేరిపార చూచి శ్రీకృష్ణు డిట్లా అన్నాడు:

చ. **'చక్కటి లేని యాలమునఁ జంపె ననన్ వల; దీదురాత్మకుం**
డక్కటికంబు లేక సతి నంతలు సేసిననుం గృపారతిం
దక్కక తండ్రిపా లడిగె ధర్మజుఁ; డన్నెఱి సేయఁ డయ్యెఁ; వీఁ
డుక్కివుఁ; డిట్టి చావునకు యుక్తుఁ డగుం దలపోసి చూడఁగన్. **321**

ప్రతిపదార్థం: చక్కటి లేని ఆలమునన్= ధర్మంలేని యుద్ధంలో; ఈ దురాత్మకున్= ఈ దుర్మార్గుడిని; చంపెన్+అనన్ వలదు= చంపాడని అనవద్దు; అక్కటికంబు లేక= కనికరంలేకుండా; సతిన్+అంతలు చేసినన్= పతివ్రతయైన భార్యను అంత అవమానం చేసినప్పటికిని; కృపారతిన్+తక్కక= దయాసక్తిని వదలకుండా; ధర్మజుఁడు+తండ్రిపాలు+అడిగెన్= తండ్రిభాగమును ధర్మరాజు కోరినాడు; ఆ+నెఱిన్= ఆ ధర్మమును; చేయఁడు+అయ్యెన్= చేసినాడు కాడు; వీఁడు= ఈ దుర్యోధనుడు; ఉక్కివుఁడు= మూర్ఖుడు; తలపోసి= యోచించి; చూడఁగన్= పరిశీలించగా; ఇట్టి చావునకున్= ఈ విధమైనచావునకు; యుక్తుఁడు+అగున్= తగినవాడు.

తాత్పర్యం: 'ధర్మం కాని యుద్ధంతో ఈ దుర్మార్గుడిని ఇట్లా చంపా డనవద్దు. కనికరం లేకుండా స్త్రీని పతివ్రతను అంతగా అవమానం చేసినప్పటికినీ, దయతో తమతండ్రిపాలిమ్మని ధర్మజుడు కోరాడు. ఆ ధర్మాన్నీ వీడు నిర్వర్తించలేదు. ఈ దుర్యోధనుడు మోసగాడు. యోచించి చూడగా ఇటువంటి చావుకు వీడు తగినవాడే.

క. విదురాదులు సెప్పఁగ ను । న్మదుఁ డై యీఁడయ్యెఁ దగినమాత్రయు భూసం
పద వీఁడు పాండవుల కిది । యది యగునె బకారి ప్రతిన కగ్గం బైనన్. 322

ప్రతిపదార్థం: విదుర+ఆదులు చెప్పఁగన్; ఉన్మదుఁడు+ఐ= గర్వితుడై; తగిన మాత్రయు భూ సంపదన్= తగినంత భూమిని; పాండవులకున్= పాండవులకు; వీఁడు= ఈ దుర్యోధనుడు; ఈడు+అయ్యెన్= ఇచ్చినవాడుకాదు; బకారిప్రతినకున్= బకవైరి శపథానికి; అగ్గంబు+ఐనన్= లోనైతే; ఇది+అది+అగునె= ఏమౌతుంది?

తాత్పర్యం: విదురాదు లెందరో చెప్పారు. అయినా ఉన్మాదిఅయి తగినంత మాత్రపు భూమిని కూడా ఇతడు పాండవుల కీయలేదు. బకవైరి ప్రతిజ్ఞకు లొంగిపోతే ఇది అది (ఇది= ఇట్లా చంపటం, అది= అధర్మం) అవుతుందా?

విశేషం: అలం: ఉపమ.

ఆ. నేలఁ గూలి ప్రాను వోలె నిట్లున్నయి । ప్పాపకర్ము గుఱిచి పాడితెఱఁగు
తేటపడఁగ మాటలాట దానేల ? మీ ! రెక్కుఁ డరదముల మహీశులారా ! 323

ప్రతిపదార్థం: మహీశులార= ఓ రాజులార!; నేలన్+కూలి= భూమిమీదపడి; ప్రానువోలెన్ ఇట్లు+ఉన్న= వృక్షం మాదిరి ఇట్లా ఉన్నటువంటి; ఈ పాపకర్మున్ గుఱిచి= ఈ దుష్ట చరితుడిని గూర్చి; పాడి తెఱఁగు= ధర్మపద్ధతి; తేట+పడఁగన్= స్పష్టంగాతెలియగా; తాను= ఈ దుర్యోధనుడు; మాటలు+ఆట= మాటాడటం; ఏల?= ఎందుకు? మీరు; అరదములన్= తేరులను; ఎక్కుఁడు= ఎక్కండి.

తాత్పర్యం: ఓ రాజులారా! కరాకటి వ్రేళ్ళతో పెల్లగిలబడిన ప్రానువలె భూమిమీద పడిఉన్న ఈ పాపాత్ముడినిగూర్చి ధర్మ పద్ధతి విషయమై మాటలాడనేల? మీరందరును మీమీ రథముల నెక్కండి! (ఈ విషయమై చర్చ అవసరమన్నాడు).

విశేషం: అలం: ఉపమ.

వ. అని యిట్లు పుండరీకాక్షుండు దన్ను నాక్షేపించుట యాకర్ణించి కౌరవేశ్వరుండు గోపాయత్తచిత్తుండై పిఱుందు మోవ లేచి చేతుల భూతలం బూఁదికొని బొమముడితోడి చూడ్కి యతనిపయిం బఱపె, నప్పు డపరభాగంబు విఱుగ వ్రేటు వడి యలిగి తల యెత్తి చూచు మహానాగంబు చందంబు దోఁచె; నట్లు ప్రాణాంతకరణం బైన వేదనాభరంబు దలంపక కూర్చుండి మున్నాకృష్ణుండు జిష్ణుతోడ సంభాషించుటయు, నతం డూరుతలంబుఁ గరపుటంబున నప్పళించుటయు వెడవెడ గనుటం జేసి భీమువాటునం దొడలు విఱిగి పడినప్ప డప్పటి బుడిబుడిమాటలు నా సన్నయు దీనికిం గాకేమి? యని యూహించి, చేయునది లేక యవుడు గఱచుచున్న వాఁ డగుట నగ్గోపాలదేవునితో ని ట్లనియె. 324

ప్రతిపదార్థం: అని ఇట్లు= అని ఈ ప్రకారం; పుండరీకాక్షుండు= శ్రీకృష్ణుడు; తన్నున్+ఆక్షేపించుటయున్= తనను తిరస్కారభావంతో మాట్లాడగా; ఆకర్ణించి= విని; కౌరవ+ఈశ్వరుండు= దుర్యోధనుడు; కోప+ఆయత్తుండు+ఐ= కోపముపొందినవాడై; పిఱుందు మోవన్‌లేచి= పిఱుదులమీద తన బరువును ఊని పైకి లేచి; చేతుల భూతలంబు+ ఊఁదికొని= చేతులను భూమిమీద ఊనుకొని; బొమముడితోడి చూడ్కి= బొమముడితో (కోపంతో) చూపును; అతనిపయిన్+ పఱపెన్= శ్రీకృష్ణుడిమీద ప్రసరింపజేశాడు; అప్పుడు= ఆ సమయంలో; అపరభాగంబు= క్రింది భాగం; విఱుగన్= విరిగిపోగా;

వ్రేటువడి= దెబ్బ తగిలి; తలఎత్తి= తల మీదికెత్తి; చూచు= చూస్తున్న; మహానాగంబు చందంబు తోఁచెన్= పెద్దపాము విధంగా కనబడ్డాడు; అట్లు= ఆ విధంగా; ప్రాణాంతకరణంబు= ప్రాణం పోయే విధంగా; అయిన= అయినట్టి; వేదనాభరంబుతలంపక= బాధను యోచించకుండా; కూర్చుండి= కూర్చున్నవాడై; మున్ను+ఆకృష్ణుండు= ముందుగా శ్రీకృష్ణుడు; జిష్ణుతోడన్ సంభాషించుటయున్= అర్జునుడితో మాటాడటమున్నూ; అతండు= అర్జునుడు; ఊరుతలంబున్= తొడలున్నచోటును; కరపుటంబునన్= ముంజేతితో; అప్పళించుటయున్= చరచుటయున్నూ; వెడవెడన్= ఇంచించుక; కనుటయున్+చేసి= చూచుటవలన; భీమువాటునన్= భీముడిదెబ్బకు; తొడలు విరిగిపడినప్పుడు= తొడలు విరిగిపోయి పడినపుడు; అప్పటి బుడిబుడిమాటలు= ఆ వేళ మాటాడిన తొట్రుపాటుతో కూడిన మాటలను; ఆ సన్నయున్= ఆ సైగయున్; దీనికిన్+కాకేమి అని+ఊహించి= ఇందుకొరకే గదా అని నమ్మి; చేయునది లేక= చేయగల్గింది లేకుండా; అపుడు గఱచుచున్న వాఁడు+ అగుటన్= (కోపంతో) పెదవి కొరుకుతూ ఉండటంవలన; ఆ గోపాలదేవుతోన్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: శ్వేతపద్మాలవంటి కన్నులుగల శ్రీకృష్ణుడు తనను ఆవిధంగా ఆక్షేపించటాన్ని విన్న దుర్యోధనుడు కోపం నిండిన మనసుతో చేతులను నేలనూదుకొని పిరుదులను మోయగా లేచి, తన చూపులను ఆతడిమీదకు వ్యాపింపజేశాడు. అపు డాతడు దెబ్బతిని కోపంతో పడగను పైకెత్తి చూచే మహానాగేంద్రుడివలె కానవచ్చాడు. ఆ విధంగా ప్రాణా లూడబీకుతున్న బాధను కూడా లెక్కచేయకుండా కూర్చుండి, ఇదివరకు శ్రీకృష్ణుడు అర్జునుడితో గుసగుసలాడగా అర్జునుడు తొడలను చేతులతో చరచటాన్ని కొంతకొంత చూడటంవలన భీముడి దెబ్బకు తొడలు విరిగిపడిన విధానం, అపు డాతడిని గేలితనపు మాటలను, సైగను - దీనికి గదా అని తలచుకొని చేయగలిగింది లేకపోవటంతో, (కోపంతో) పెదవి నొక్కుతూ శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

తొడలు విఱిగి పడిన దుర్యోధనుఁడు కృష్ణు నాక్షేపించుట (సం. 9-60-27)

సీ. 'కంసదాసునిపుత్ర! కానవు నీ దురా । చారంబుఁ, గృపయు లజ్జయును లేక
ప్రేలెదు; నీవు సెప్పినఁ బార్థు చేసిన । సన్న గై కొని గదాసంగరంబు
పాడి దొఱఁగి యిప్పాపకర్ముఁడు వైచెఁ । గాక; చక్కటి తోడికయ్య మైన
లీల మిమ్మందఱ నేలపాలుగఁ జేయ । నే? శిఖండి గడంగి యేసె ననఁగ

తే. నర్జునుఁడు శాంతనవుఁ గూల్చునట్లు చేసి; । తస్త్రగురుచావునకుఁ బాండవాగ్రజన్ము
బొంకు మని పంచి; తరదంబు పుడమిఁ గ్రుంగఁ । గర్ణుఁ జంపించి; తే మనఁ గలదు నిన్ను? 325

ప్రతిపదార్థం: కంసదాసుని పుత్ర!= కంసుడికి బానిసఅయిన వసుదేవుడి కుమారా!; నీ దురాచారంబు కానవు= నీ చెడ్డ ఆచారాన్ని గుర్తించవు; కృపయున్ లజ్జయును లేక ప్రేలెదు= దయ, సిగ్గూ లేకుండా ప్రేలుచున్నావు; నీవు చెప్పినన్= నీవు చెప్పగా; పార్థు చేసిన సన్నన్= అర్జునుడు చేసిన సైగ; కైకొని= స్వీకరించి(తీసికొని); గదా సంగరంబు పాడి= గదా యుద్ధ ధర్మమును; తొఱఁగి= వదలి; ఈ+పాపకర్ముఁడు= ఈ పాపాత్ముడు; వైచెన్+కాక= కొట్టాడు కాని; చక్కటి= సరిఅయిన; తోడి కయ్యము+ఐనన్= ఎదురుగా సమానమైన యుద్ధమైతే; లీలన్= ఆటగా; మిమ్మున్+అందఱన్= మీ అందరినీ; నేలపాలుగన్+చేయనే?= మట్టి కరిపించనా?; శిఖండి కడంగి ఏసెన్+అనంగన్= శిఖండి పూనుకొని బాణాలు వేసినట్లు; అర్జునుడు శాంతనవున్+కూల్చునట్లు= భీష్ముడిని అర్జునుడు పడగొట్టేటట్లు; చేసితి(వి)= చేశావు; అస్త్రగురు చావునకున్= ధనురాచార్యుడి చావుకై; పాండవ+అగ్రజన్మున్= పాండవ జ్యేష్ఠుడైన ధర్మరాజును; బొంకుము+అని పంచితి(వి)= అబద్ధమాడేటట్లు చేశావు; అరదంబు= తేరు; పుడమిన్= భూమిలో; క్రుంగన్= క్రుంగిపోగా; కర్ణున్+చంపించి(వి)= కర్ణుడిని చంపించావు; నిన్ను ఏమనన్+కలదు?= నిన్నేమనగలను?

తాత్పర్యం: 'ఓ కంసదాసుని కుమారుడా! నీ తప్పుడు చేష్టను గుర్తించవు. కరుణ, దయ లేకుండా వాగుతున్నావు. నీవు చెప్పగా అర్జునుడు చేసిన సైగ నందుకొని గదాయుద్ధధర్మాన్ని తప్పి ఈ పాపాత్ముడు కొట్టాడు కాని న్యాయమైన పోరాటంతో మీ అందరనూ మట్టి కరపించకుండేవాడినా? శిఖండి పూనుకొని వేశాడన్నట్లుగా అర్జునుడు భీష్ముడిని పడగొట్టేటట్లు చేశావు. ధనురాచార్యుడి చావుకై ధర్మజుడిని అబద్ధమాడుమని ఉత్తర్వుచేశావు. రథం భూమిలో కూరుకొనగా కర్ణుడిని చంపించావు. ని న్నేమనవచ్చును?

క. భూరిశ్రవుఁ డొక్కనితోఁ । బోరఁగ నేయించి తట్లు; పాడిచీఁకటి నం
హోరహితు సైంధవుని నరు । బారిపఱిచి; తిట్టి నీకుఁ బల్కులు సనునే? 326

ప్రతిపదార్థం: భూరిశ్రవుఁడు+ఒక్కనితోన్= భూరిశ్రవుడు వేరొక్కడితో; పోరగన్+ఏయించితి= పోరాడేటట్లు చేయించావు; అట్లు= ఆ విధంగా; పాడిచీఁకటి= అసుర సంధ్యలో; పోరగన్ అంహోరహితున్= పాపాలు లేనివాడిని; సైంధవుని= సైంధవుడనే వాడిని; నరుబారి పఱిచితి(వి)= అర్జునుడికి చిక్కేటట్లు చేశావు; ఇట్టి నీకున్= ఇటువంటి నీకు; పల్కులు= మాటలు; చనునే?= తగునా?

తాత్పర్యం: భూరిశ్రవుడొకడితో పోరాడేటప్పుడు (బాణం) వేయించావు. ఆ విధంగా పాడిచీకటిలో పుణ్యాత్ముడైన సైంధవుడిని అర్జునుని బారినపడేటట్లుగా చేశావు. ఇట్టి నీవు మాట్లాడడం తగి యున్నదా?

క. నను భీష్ము గురుని సూతసు । తుని భూరిశ్రవు జయద్రథుం జక్కటి ద
ప్పనియనిఁ గోల్పుచ్చఁగ వ । చ్చునె నీకుం గపటశూర! సుచరితదూరా!' 327

ప్రతిపదార్థం: కపటశూర!= మోసపువీరుడా!; సుచరితదూరా!= సత్ప్రవర్తనలేనివాడా!; నన్నున్= నన్ను; భీష్మున్= భీష్ముడిని; గురునిన్= గురువైన ద్రోణుడిని; సూతసుతునిన్= కర్ణుడిని; భూరిశ్రవున్= భూరిశ్రవుడిని; జయద్రథున్= సైంధవుడిని; చక్కటితప్పని= న్యాయం దప్పిపోని; అనిన్= యుద్ధంలో; నీకున్; కోల్పుచ్చఁగన్+వచ్చునే?= ఓడించనగునా?

తాత్పర్యం: మోసపూరితుడ వైన పాపాత్ముడైన కృష్ణా! నీకు నన్ను, భీష్ముడిని, గురువైన ద్రోణుడిని, కర్ణుడిని, భూరిశ్రవుడినీ, సైంధవుడినీ న్యాయం తప్పని యుద్ధంలో ఓడించటం సాధ్యమైన పనియేనా?'

వ. అనిన విని యచ్యుతుం డతని నవలోకించి 'నీవు భీముని బాలునిఁ బాములం గఱపించియు విషం బిడియు నీటం ద్రోచియుం బలుమాఱుం జంప దెగితివి; గొంతియుఁ గొడుకు లేవురును నిద్రించుసమయంబున జతు గృహంబు దహించితివి; ధర్మోత్తరచరిత్రుం డగు నజాతశత్రుసంపదలఁ గపటద్యూతంబున నపహరించి; తంత దనివిం బోక యాజ్ఞసేని నేకవస్త్ర రజస్వలం గొలువులోపల భంగపెట్టి తాప్రొద్ద నిన్ను నిట్టి దురవస్థకుం దేరం దగి యుండ నట్లు పోయి సమయంబు నడపి నీచేసిన సకల దుష్కృతంబులు సహించిన యిప్పాండవాగ్రజుండు వనుప నేను బుడమిపా లడుగ వచ్చిన నీ నేరవైతి; నీ నేరమి నిట్లైతి; భవదీయం బగులోభంబునం బాపనిశ్చయంబున మదంబున శాంతచిత్తు లగుశాంతనవద్రోణులకుం బ్రాణహాని వాటిల్లె; వినుము! ద్రుపదుని తపోయజ్ఞ ప్రభావంబుల నదియ పనిగా జనియించిన శిఖండిధృష్టద్యుమ్ను లాభీష్మ గురులమరణంబులకుఁ గారణంబులు గాక తక్కుదురే? పెక్కండ్రతోడం బోరి డస్సినసాత్యకిం జంపువాఁ డైన

భూరిశ్రవుం జంప కుందుమే? యనేకప్రౌఢ యోధు లొక్కరుని బాలు సౌభద్రుం బొదివి చంపినం బూనినపూన్కి నిఖిలోపాయంబుల నెఱపక పుణ్యాత్మయైన పాంచాలి నరణ్యంబునం బరిభవించిన పాపాత్ముని సైంధవుని బ్రదికిపో విడిచి యర్జునుం డగ్నిం బ్రవేశించునే? యి న్నీతిపరుల చరిత్రంబులు నిర్మలంబులు; ఘోషయాత్ర నిన్ను గంధర్వులు పట్టుకొని పోవునప్పుడు నీ వారెల్లం బాఱిన నర్జునుండు నిన్ను విడిపించుట యెఱుంగవే? గాంగేయకుంభజకర్ణాశ్వత్థామ కృపు లుద్దామ సమగ్రసైన్యంబులతోడ నడవ నీవు విరటుని గోవులం బట్టికొని పోవు చోట మీరందఱుఁ దనసమ్మోహనాస్త్రంబున మూర్ఛితులైన సమయంబున నర్జునుండు నిన్నుం గాచుట యెఱుంగ రాదె? నీ వాపాదించిన పాపంబుల కెల్ల మూలం బైన కర్ణునరదంబు ధరణిం గ్రుంగినఁ గవ్వడి వాని నేయ కేల కాచికొని యుండు? నుండె నేనియు భూసుర శాపంబున నష్టైనరథంబునకు విష్కృతి గలుగునే? కావున నన్నీచు సమయించుట సముచితంబు; యుధిష్ఠిరుండు శల్యుం దెగటార్చిన తెఱం గొప్పనొప్ప దని యుగ్గడింపక మేలు సేసితి; పాండునందనులు పుట్టినంతటినుండి నేఁడు దుదిగా నీయెడ ధర్మవిరోధం బాచరింపరు; కురుకులంబునకు గుద్దలి గొని దుర్ద్యూతంబు నీవు తొడరితి; దాన నింతలు వుట్టెఁ; బవనుపట్టి పట్టినప్రతిన యెఱుంగవె? గద నూరుభంగంబు సేయుదు నని పలికి పిడికిటం బొడుచునే?' యవి 'యెల్లను వృథాజల్పంబు లూరకుండు' మనుటయు నజ్జననాథుండు జనార్దనున కి ట్లనియె. **328**

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విని; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; అతనిన్+అలోకించి= అతడిని(దుర్యోధనుడిని) చూచి; నీవు భీముని బాలుని= నీవు పసివాడయిన భీముని; పాములన్+కరపించియున్= పాములచేత కరపించి; విషంబు+ఇడియున్= విషమును పెట్టియు; నీటన్+త్రోచియున్= నీళ్ళలో త్రోసియు; పలుమాఱున్= అనేకమార్లు; చంపన్+తెగితివి= చంపటానికి సాహసించావు; గొంతియున్= కుంతి; కుమారులు+ఏవురును= అయిదుగురు కుమారులును; నిద్రించు సమయంబునన్= నిదురించేటపుడు; జతుగృహంబు= లక్కయింటిని; దహించితి(వి)= కాల్చావు; ధర్మోత్తర చరిత్రుండు+అగు= ఉత్తమ ధర్మచరిత్ర కలవాడయిన; అజాతశత్రు సంపదలన్= వైరులులేని వాడైన ధర్మరాజు ఐశ్వర్యమును; కపట ద్యూతంబునన్= మోసపు జూదంతో; అపహరించితి(వి)= కొల్లగొన్నావు; అంత తనివిన్+పోక= అంతటితో తృప్తినందకుండా; యాజ్ఞసేనిని= ద్రౌపదిని; ఏకవస్త్రన్= ఒకే చీరగలదానిని; రజస్వలన్= ఋతుస్నాతను; కొలువులోపల భంగపెట్టితి(వి)= సభలో అవమానం చేశావు; ఆ ప్రొద్దు= ఆ దినమే; నిన్నున్+ఇట్టి దురవస్థకున్= నిన్నీ భంగపాటగు స్థితికి; తేరన్+తగిఉండన్= తీసికొని రా తగిఉండగా; అట్లు పోయి= ఆ విధంగా(అడవులకు) పోయి; సమయంబు నడిపి= ప్రతిజ్ఞ జరుపుకొని; నీ చేసిన సకల దుష్కృతంబులు సహించినన్= నీవు కావించిన పాపాలు ఓర్చుకోగా; ఈ+పాండవ+అగ్రజుండు= ఈ ధర్మరాజు; పనుపన్= పంపగా; ఏను పుడమిపాలు+అడుగన్ వచ్చినన్= నేను భూమిలో భాగం అడుగరాగా; ఈనేరవైతి= ఈయలేకపోయావు; నీ నేరమిన్= నీ ఎరుక లేక పోవుటచేత; ఇట్లు+అయితి(వి)= ఈ విధంగా అయావు; భవదీయంబు+అగు లోభంబునన్= నీయొక్క లోభగుణంవలన; పాపనిశ్చయంబునన్= పాపచింత కారణంచేత; మదంబునన్= గర్వంతో; శాంతచిత్తులు+అగు= శాంత మనస్కులయిన; శాంతనవ= భీష్మ; ద్రోణులకున్= ద్రోణులకును; ప్రాణహాని+పాటిల్లెన్= ప్రాణమునకు ప్రమాదం కలిగింది; ద్రుపదుడి తపోయజ్ఞ ప్రభావంబులన్= ద్రుపదునియొక్క తపస్సు, యజ్ఞముల శక్తులచేత; అదియ పనిగా జనియించిన= ఆ కారణంగా పుట్టిన; శిఖండి ధృష్టద్యుమ్నులు= శిఖండియు ధృష్టద్యుమ్నుడును; ఆ భీష్మగురుల మరణంబులకున్= ఆ భీష్మద్రోణుల చావులకు; కారణంబులు+కాక= నిమిత్తం కాకుండా; తక్కుదురే?= తప్పుకొనగలరా?; పెక్కండ్ర తోడన్+పోరి= చాలమందితో యుద్ధంచేసి; డస్సిన= అలసిన; సాత్యకిన్= సాత్యకిని; చంపువాఁడు+ఐన= చంపపూనుకొన్న; భూరిశ్రవున్+ చంపకుందుమే?= భూరిశ్రవుడిని చంపక ఊరుకొందుమా?; అనేకప్రౌఢయోధులు= మిక్కిలి అనుభవమున్న ప్రౌఢులైన

వీరులు; ఒక్కరునిన్= ఒకడిని; బాలున్= పసివాడిని; సౌభద్రున్+ పొదివి= సుభద్రాతనయుడిని (అభిమన్యుడిని) క్రమ్ముకొని; చంపినన్+పూనిన పూన్కిన్= చంపగా చేసిన ప్రతినను; నిఖిల+ ఉపాయంబులు నెఱపక= అన్ని ఉపాయాలనూ ఉపయోగించకుండా; పుణ్య+ఆత్మ+ఐన పాంచాలిని= పవిత్రమూర్తిఅయిన ద్రౌపదిని; అరణ్యంబునన్= అడవిలో; పరిభవించిన= అవమానించిన; పాపాత్మునిన్= దుష్టుడిని; సైంధవుడిని బ్రదికిపోన్+విడిచి= సైంధవుని బ్రదికిపోనిచ్చి; అర్జునుండు+అగ్నిన్+ప్రవేశించునే?= అర్జును డగ్నిలో దూకునా?; ఈ+నీతిపరుల చరిత్రంబులు= ఈ+నీతిమంతుల చరిత్రలు; నిర్మలంబులు= స్వచ్ఛమైనవి; ఘోషయాత్రన్= ఆవులకొరకు వెళ్లిన యాత్రలో; నిన్నున్ గంధర్వులు పట్టుకొనిపోవునప్పుడు= నిన్ను గంధర్వులు నిర్బంధించి పట్టుకొనిపోయేటపుడు; నీవారు+ఎల్లన్+పాఱినన్= నీ వారంతా పరుగెత్తిపోగా; అర్జునుండు; నిన్నున్ విడిపించుట ఎఱుఁగవే?= నిన్ను తప్పించటం తెలియదా?; గాంగేయ కుంభజ కర్ణాశ్వత్థామ కృపులు= భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ, కృపాచార్యుడును; ఉద్దామ సమగ్ర సైన్యంబులతోడన్= గొప్ప సన్నద్ధం అయిన సేనలతో; నడవన్= (దండు) వెడలగా; నీవు విరటుని గోవులన్+పట్టుకొనిపోవుచోటన్= నీవు విరటుని ఆలమందను పట్టుకొని పోయేటపుడు; మీరు+అందఱున్= మీరందరును; తన సమ్మోహన+అస్త్రమునన్= తన సమ్మోహనాస్త్రంచేత; మూర్ఛితులు+ఐన సమయంబునన్= మూర్ఛపోయిన సమయాన; అర్జునుఁడు నిన్నున్+కాచుట= నిన్ను కాపాడటం; ఎఱుంగరాదె?= తెలియదా?; నీవు+ఆపాదించిన పాపంబులకున్+ఎల్లన్= నీవు వారిమీద మోపిన పాపాలకంతటికి; మూలంబు+ఐన= ఆధారమైన; కర్ణ+అరదంబు= కర్ణుడితేరు; ధరణిన్+క్రుంగినన్= భూమిలో దిగబడగా; కవ్వడి వానిన్+ఏయక= సవ్యసాచి వాడిని కొట్టక; ఏల కాచికొనిఉండున్?= ఎందులకు వేచి ఉంటాడు? ఉండెన్+ఏనియున్= ఉన్నప్పటికిని; భూసురశాపంబునన్= బ్రాహ్మణుడి శాపంవలన; అట్లయిన రథంబునకున్= ఆ విధంగా తన తేరునకు; నిష్కృతి కల్గునే?= ప్రాశ్చిత్తం కల్గుతుందా?; కావునన్= కనుక; ఆ+నీచున్+సమయించుట సముచితంబు= ఆ నీచుడిని చంపటం న్యాయం; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; శల్యున్+తెగటార్చిన తెఱంగు= శల్యుడిని చంపిన విధం; ఒప్పున్+ఒప్పదు+అని= తగును-తగదని చెప్పకుండా; మేలుచేసితి= మంచిపని చేశావు; పాండునందనులు= పాండురాజకుమారులు; పుట్టినప్పటినుండి= పుట్టిననాటినుండి; నేఁడు తుది= ఈనాటిదాకా; నీ+ఎడన్= నీ విషయంగా; ధర్మవిరోధంబు= ధర్మానికి వ్యతిరేకంగా (అన్యాయంగా); ఆచరింపరు= చేయరు; కురుకులంబునకున్= కురువంశానికి; గుద్దలికొని= గునపం తీసికొని (కుళ్ళగించుటకు); దుర్ద్యూతంబు= మోసపు జూదానికి; నీవు+అ+తొడరితి(వి)= నీవే పూనుకొన్నావు; దానన్+ఇంతలు+పుట్టెన్= అందుచేత ఇంత జరిగింది; పవన తనయుండు= భీమసేనుడు; పట్టిన= పూనిన; ప్రతిన= శపథమును; ఎఱుంగవే?= తెలియవా?; గదన్= గదతో; ఊరుభంగంబున్+చేయుదును+అని= తొడలు విఱుగగొట్టుతానని; పలికి= చెప్పి; పిడికిటన్+ పొడుచునే?= పిడికిలితో పోటు పొడుస్తాడా?; అవి+ఎల్లను= అవి అంతా; వృథాజల్పంబులు= వ్యర్థమైన మాటలు; ఊరకుండుము= మాట్లాడకుండా ఉండుము; అనుటయున్= అనగా; ఆ+జననాథుండు= ఆ రాజు(దుర్యోధనుడు); జనార్దనునకున్+ఇట్లు+అనియెన్= శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు దుర్యోధనుడిని చూచి, 'పసివాడయిన భీముడిని పాములచే కరిపించావు. విషాన్నమును పెట్టించావు. నీళ్ళలో త్రోయించావు. అనేక విధాల తెగించావు. కుంతి కుమారులైదుగురితో కలసి నిదురించేటపుడు లక్క ఇంటిని కాల్పించావు. ఉత్తమ ధర్మప్రవర్తనం కలవాడయినవాడూ అజాతశత్రువూ ఐన ధర్మజుడి సంపదను మోసపు జూదంలో కొల్లగొన్నావు. ఏకవస్త్రయు ఋతుస్నాతయుఅయిన ద్రౌపదిని నిండు సభలో అవమానము చేశావు. ఆనాడే నిన్నీ భంగపాటునకు తేవలసి ఉండింది. కాని, ఆ విధంగా (అరణ్య, అజ్ఞాత వాసాలకు) పోయి ప్రతిజ్ఞను నిలుపుకొని, ధర్మజుడు పంపగా భూభాగాన్ని అడగటానికి నేను రాగా ఇచ్చావు కావు. నీకు జ్ఞానం లేకుండటంచేత ఇట్లయిపోయావు. నీ లోభగుణం, పాపం, మదం, అహంకారం, శాంతమనస్కులైన భీష్మద్రోణులకు ప్రాణహాని కలిగించాయి; ద్రుపదుడి తపస్సు, యజ్ఞాలు కారణంగా జన్మించిన శిఖండి ధృష్టద్యుమ్నులు, ఆ

భీష్మగురుల చావులకు నిమిత్తం కాకుండా తప్పుతుందా? చాలామందితో యుద్ధం చేసి అలసిన సాత్యకిని చంపటానికై పూనుకొన్న భూరిశ్రవుడిని చంపకుంటామా? మిక్కిలి పసివాడైన అభిమన్యుడిని ప్రౌఢులు చుట్టుకొని చంపగా చేసిన శపథాన్ని అన్ని ఉపాయాలతో నెరవేర్చకుంటారా? పతివ్రతఅయిన ద్రౌపదిని అడవిలో అవమానించిన దుర్మార్గుడు - సైంధవుడిని బ్రదికిపోనీయవచ్చునా? పోనిచ్చి అర్జునుడు అగ్గిలో దూకుతాడా? ఈ నీతిమంతుల జీవితాలు స్వచ్ఛములైనవి. ఘోషయాత్రలో గంధర్వులు నిన్ను పట్టుకొని పోగా నీ వారంతా పరుగెత్తారు. అప్పుడు అర్జునుడు నిన్ను విడిపించటం ఎరుగవా? భీష్మద్రోణ కర్ణ, అశ్వత్థామ కృపులు గొప్పసేనతో వెళ్ళగా నీవు విరాటరాజు పశువులను పట్టినపుడు మీరంతా తన సమ్మోహనాస్త్రంవలన మూర్ఛితులు కాగా అర్జునుడు నిన్ను కాపాడటం జ్ఞాపకంలేదా? నీవు కావించిన పాపాలకంతా మూలమైన కర్ణుడి తేరు భూమిలో క్రుంగినపుడు సవ్యసాచి వాడిని చంపకుండా ఎందుకు కాచుకొని ఉండాలి? ఉండెనుపో. బ్రాహ్మణుడి శాపంవలన అట్లా క్రుంగిన తేరునకు విముక్తి ఉంటుందా? కాబట్టి ఆ నీచుని చంపటం న్యాయమే. ధర్మజుడు శల్యుడిని చంపటంలోని ఒప్పుతప్పులను పేర్కొనకుండా వదలిపెట్టి మంచిపనినే చేశావు. పాండవులు పుట్టిన నాటినుండీ నీయెడ ధర్మాతిక్రమణం చేయలేదు. కురువంశాన్ని గునపం తీసికొని కుళ్ళగించిన తీరును నీవు మోసపు జూదానికి పూనుకొన్నావు. అందుచేతనే ఇంత జరిగింది. భీముడు పట్టిన శపథం తెలియదా? గదతో తొడలు విరుగగొట్టుతానని శపథం చేసినవాడు పిడికిలితో పొడుస్తాడా?అని, నీవన్నీ వ్యర్థవాదాలు. ఊరుకొనుము.' అనగా దుర్యోధనుడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు.

చ. 'చదివితి నెల్ల వేదములు, జన్నము లొప్పఁగ జేసితిన్, రమా
స్పద మగువృత్తిఁ బొల్చి నరపాలకు లెల్లను గొల్వఁ గంటి, దు
ర్మదరిపు గాఢగర్వపరిమర్దన కేళి యొనర్చితిం, దగం
దుది నని మిత్రబాంధవులతోఁ ద్రిదివంబున కేఁగు టొప్పదే? 329

ప్రతిపదార్థం: ఎల్ల వేదములు= వేదాలన్నీ; చదివితిన్= చదివాను; జన్నముల్= యజ్ఞాలను; ఒప్పఁగన్+చేసితిన్= తగినట్లుగా చేశాను (ధర్మవిధంగా); రమా+ఆస్పదమగు వృత్తిన్+పోల్చి= సందకు తావైన నడవడితో ఒప్పి; నరపాలకులు+ఎల్లన్= రాజులందరూ (సామంతరాజు లంతా); కొల్వన్= సేవించగా; కంటిన్= చూడగలిగాను; దుర్మద రిపు= దురహంకారు లయిన శత్రువులయొక్క; గర్వమర్దనకేళి ఒనర్చితిన్= పొగరును నాశనం చేశాను; తగన్= తగినట్లుగా (పొగడ్తకు తగినట్లు); తుదిన్= చివర; అనిన్= యుద్ధంలో; మిత్రబాంధవులతోన్= బంధువులతోను, స్నేహితులతోను; త్రిదివంబునకున్= స్వర్గానికి; ఏఁగుట+ఒప్పదే?= వెళ్ళటం తగదా!

తాత్పర్యం: 'అన్ని వేదాలను చదివాను. యజ్ఞాలు విధిప్రకారం చేశాను. సంపదకు తావలమైన నడవడితో బ్రతికాను. రాజులెందరో సేవించగా చూచాను. దురహంకారగర్వంతో ఉన్న రాజులను యుద్ధంలో జయించాను. తుదకు స్నేహితులతోను, బంధువులతోను కలసి స్వర్గానికి వెళ్ళటం ఒప్పదా?

వ. నీకుం జూడ నెట్టివాఁడ నైనను నా కేమి? మీరింకఁ బశ్చాత్తాపదుఃఖితు లగుచు నుందురు గాక' యనియె; నప్పు డతనిపైఁ బుష్పవర్షంబులు గురిసె, దేవదుందుభులు మొరసె; దిశలు దెలివొందెం; మృదుసమీరణంబు సుగంధి యై వీతెంచె; నంతయు ననుసంధించి యక్కౌంతేయులు దారు ధర్మంబు దొఱంగి గాంగేయద్రోణ

కర్ణశల్యదుర్యోధనాదుల వధించుట యత్తఱిం గ్రొత్తయై తోఁచినఁ, జిత్తంబుల వగయు లజ్జయు మిగులం బొడమి మొగంబులఁ దోఁప విన్ననై యున్నం జూచి వెన్నుండు తత్సమీపంబునకుం జని వారలతో నిట్లనియె. **330**

ప్రతిపదార్థం: నీకున్+చూడన్+ఎట్టి వాఁడన్+ఐనను= చూడగా నీ కెటువంటి వాడయినప్పటికినీ; నా కేమి?; మీరింక పశ్చాత్తాప దుఃఖితులగుచున్+ఉందురుగాక= మీ రికమీద పశ్చాత్తాపంతో దుఃఖపడుతూ ఉంటారుగాక; అనియెన్= అన్నాడు; అప్పుడు+అతనిపైన్ పుష్పవర్షంబులు గురిసెన్= అపు డా దుర్యోధనుడి మీద పూలవాన కురిసింది; దేవ దుందుభులు మొరసెన్= దేవతల దుందుభిధ్వానాలు మ్రోగాయి; దిశలు తెలివొందెన్= దిక్కులు తెల్లబడ్డాయి; మృదు సమీరంబు= చల్లని గాలి; సుగంధిఐ వీచెన్= సువాసనలతో వీచింది; అంతయు ననుసంధించి= అన్నిటిని కలిపి; ఆ+కౌంతేయులు= ఆ కుంతీ తనయులు (పాండవులు); తారు= తాము; ధర్మంబుతొఁలంగి= ధర్మాన్ని వదలి; గాంగేయ ద్రోణ కర్ణ శల్య దుర్యోధనాదులన్ వధించుట= భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, దుర్యోధనాదులను చంపటం; ఆ+తఱిన్+క్రొత్తఐ తోఁచినన్= ఆ సమయాన క్రొత్తగా కానరాగా; చిత్తంబులన్= మనసులలో; వగయున్= దుఃఖమూ; లజ్జయున్= సిగ్గూ; మిగులన్+పొడమి= మిక్కిలిగా కలిగి; మొగంబులన్+తోఁపన్= ముఖాలలో కానరాగా; విన్ననై+ఉన్నన్+చూచి= దైన్యంతో ఉండగా చూచి; వెన్నుండు= శ్రీకృష్ణుడు; తద్+సమీపంబునకున్+చని= వారి దగ్గరకు వెళ్ళి; వారలతోన్+ఇట్లు+అనియెన్= వారితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: నీ దృష్టిలో నేనెటువంటివాడ నైనా కావచ్చును. అయితే నా కేమి? మీ రంతా పశ్చాత్తాప దుఃఖంతో ఉంటారుగాక!' అన్నాడు. అపు డా దుర్యోధనునిమీద పూలవాన కురిసింది. దేవదుందుభులు మ్రోగాయి. దిక్కులన్నీ తెల్లబడ్డాయి. చల్లని గాలి సువాసనలతో వీచింది. వీటినంతా కలుపుకొని కుంతి కుమారులైన పాండవులు తాము ధర్మాతిక్రమణం చేసి భీష్మ ద్రోణ కర్ణ శల్య దుర్యోధనాదులను చంపిన తీరు క్రొత్తగా తోచగా మనసులలోని సిగ్గు, వగపు మొగాలలో తోచి విన్నబోగా శ్రీకృష్ణుడు వారితో ఇట్లా అన్నాడు.

సీ. **'గాంగేయ గురు కర్ణ కౌరవపతులఁ జ । క్కటి యనిఁ బరిమార్పఁ గాన మైతి**
మని మీరు వగవకుఁ; డద్దొర లుగ్రాస్త్ర । వేదులు, ప్రస్ఫుటవిక్రమమున
నడరి వారల గెల్చు టరిది గావున నేను । బహువిధోపాయముల్ పన్ని యిట్లు
దీర్చితిఁ గాక, యతీవ్రపరాక్రము । లలఁతులఁ బోదురే? యట్లుఁ గాక

తే. **వారి విధి యివ్విధమునఁ జావంగఁ జేసె । దైవఘటనలు దప్పింప మీవశంబె?**
సురలు దనుజులు గెల్చిన చొప్పు లిట్లు; । సంతసపు సమయంబున వంత లేల? **331**

ప్రతిపదార్థం: గాంగేయ గురు కర్ణ కౌరవపతులన్= భీష్మ ద్రోణ కర్ణ దుర్యోధనులను; చక్కటి అనిన్= ధర్మయుద్ధంలో; పరిమార్పన్= చంపగా; కానము+ఐతిమి= చూడలేకపోయాము; అని= అనుకొని; మీరు వగవకుఁడు= మీరు దుఃఖపడవద్దు; ఆ+దొరలు= ఆ రాజులు; ఉగ్ర+అస్త్రవేదులు= భయంకరమైన అస్త్ర రహస్యాలు తెలిసినవారు; ప్రస్ఫుట విక్రమమునన్= స్పష్టమైన శౌర్యంతో; అడరి= అతిశయించి; వారలన్ గెల్చుట= అటువంటివారిని జయించటం; అరిది= ఆశ్చర్యం; కావునన్= కనుక; ఏను= నేను; బహువిధ+ఉపాయముల్+పన్ని= నానా ఉపాయాలను యుద్ధ సన్నద్ధంగా చేసి; ఇట్లు తీర్చితిన్+కాక= ఈ విధంగా చేయగలిగాను కాని; ఆ+తీవ్ర పరాక్రములు= ఆ భయంకర వీరులు; అలఁతులన్+పోదురే= తేలికగా చనిపోతారా?; అట్లున్+కాక= అంతేకాకుండా; వారిన్; విధి= బ్రహ్మ; ఈ+విధమునన్= ఈ ప్రకారంగా; చావంగన్+చేసెన్= చచ్చేటట్లుగా చేశాడు; దైవఘటనలు= విధి నిర్ణయాలను; తప్పింపన్= తప్పిపోజేయగా; మీ వశంబె?= మీకు సాధ్యమా; సురలు

దనుజులన్= దేవతలు రాక్షసులను; గెల్చినచొప్పున్= జయించిన విధానాలు; ఇట్లు+అ= ఇట్టివే; సంతసపు సమయంబునన్= ఆనందించేవేళలో; వంతలు+ఏల?= దుఃఖం ఎందుకు?

తాత్పర్యం: 'భీష్మ ద్రోణ కర్ణ దుర్యోధనులను సవ్యమైన రణకౌశలంతో చంపలేకపోయామని మీరు దుఃఖించవద్దు. వారందరును భయంకరమైన అస్త్రరహస్యాలు తెలిసినవారు. ప్రస్ఫుటమైన శౌర్యంతో వారిని గెలవటం అసాధ్యం. కనుక అనేక ఉపాయాలతో ఈ విధంగా వారిని చంపించాను. లేకుంటే ఆ తీవ్ర పరాక్రమాలు కల ఆ వీరులు సులభంగా పోతారా? అంతే కాదు. వారిని విధి ఈ విధంగా చచ్చేటట్లు చేసినది. దైవనిర్ణయాన్ని తప్పించటం మీకు సాధ్యమా! దేవతలు రాక్షసులను గెల్చిన తీరిటువంటిదే? ఈ సంతోష సమయంలో దుఃఖ మెందుకు?

పాండవులు గృష్ణసాత్యకులతోఁ గౌరవశిబిరమునకుం బోవుట (సం. 9-61-3)

వ. కృతకృత్యుల మైతిమి; ప్రొద్దునుం జాల వ్రాలె; సేనయు సైనికవరులును విశ్రమింపవలయుఁ; బోదము లెం' డనినఁ బాండవులు దెలివొందఁ బాంచాలురునుం దక్కిన భూపాలురునుం బ్రమోదంబు నొంది; రప్పుడు కృష్ణుండు పాంచజన్యంబు పూరించిన నర్జునుండు దేవదత్తంబును, యుధిష్ఠిరుం డనంతవిజయంబును భీమసేనుండు పౌండ్రంబును, నకులసహదేవులు సుఘోషమణిపుష్పకంబులును బూరించిరి. సకలరథికోత్తములును దమతమ శంఖంబు లొత్తిరి. భేరీపణవాదితూర్యంబులు మ్రోసె. నా సముత్థితనినాదంబులు నింగి నిండె; నిఖిలజనంబులుం బాండవేయులం బొగడునులివు దిక్కుల దీటుకొనియె; ని ట్లుబ్బునం జెలంగుచు వార లందఱు నచ్చోటు గదలిరి; కౌంతేయులుఁ గౌరవ శిబిరంబునకుం జనిన సాత్యకి యనుగమనంబు సేసె; ధృష్టద్యుమ్నప్రముఖు లైన ద్రుపదజ్ఞాతులును ద్రౌపదేయులునుం దక్కినధరణీశులును దమవిడిదలలం గాని విశ్రమంబునకు వెరవుగా దని తలంచి తా రందుఁ బోయి నాఁటి రాత్రి నిలిచి రేపకడ గరిపుర ప్రయాణంబున కొదవం జనుదెంచువారుగా విన్నవించి ధర్మతనయు ననుమతి వడసి సైన్య సమేతంబుగాఁ బోయి రట్లు వార లటు వోవ నప్పాండునందనులు సని సంగీత ప్రవర్తక సంఘంబులు విరిసి చనిన రిత్తయై యున్న రంగస్థలంబుచందంబునం బాడఱియున్న యాశిబిరంబుఁ బ్రవేశించి, నీనందను నగరు సొచ్చిన, నచ్చట నున్న పరిచారికులును దత్సహవాసులును మణికనకాది వస్తుసంచయాధ్యక్షులును నయ్యుధిష్ఠిరుంగాంచి యాదరణంబు వడసి; రక్కుంతీ నందనులు రథంబులు డిగ్గునవసరంబున వాసుదేవుండు వాసవి నాలోకించి. 332

ప్రతిపదార్థం: కృతకృత్యులము+ఐతిమి= ధన్యుల మైనాము; ప్రొద్దునున్ చాలన్రవాలెన్= ప్రొద్దుకూడా చాలా అయింది. సేనయున్, సైనికవరులును= బలములు, సేనానులును; విశ్రమింపవలయున్= విశ్రాంతిని పొందాలి; పోదము లెండు= పోదాము రండి; అనినన్= అనగా; పాండవులు; తెలివి+ఒందన్= ప్రసన్నులుకాగా; తక్కిన భూపాలురునున్= మిగిలినరాజులు; ప్రమోదంబున్+ ఒందిరి= సంతోషించారు; అప్పుడు; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; పాంచజన్యంబున్+పూరించినన్= పాంచజన్యాన్ని ఊదగా; అర్జునుండు= అర్జునుడును; దేవదత్తంబును= తనశంఖమైన దేవదత్తమును; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; అనంత విజయంబును= అనంత విజయమనే పేరున్న శంఖాన్ని; భీమసేనుండు పౌండ్రంబును= భీముడు పౌండ్రమనే దానిని; నకుల సహదేవులు సుఘోషమణిపుష్పకంబులును= నకులుడు, సహదేవుడు సుఘోషము, మణిపుష్పకము అనే వాటిని; పూరించిరి=

ఊదారు; సకల రథిక+ఉత్తములును= అందరు సేనా నాయకులును; తమ తమ శంఖంబులు+ఒత్తిరి= తమ తమ శంఖాలను పూరించారు; భేరీపణవ+ఆది తూర్యంబులు మ్రోసెన్= నగారాలు, ఉడుకలు మ్రోగాయి; ఆ సముద్ధత నినాదంబులు= ఆ ఎక్కువయిన శబ్దాలు; నింగి నిండెన్= ఆకాశం దాకా నిండినవి; నిఖిల జనంబులున్= జనులంతా; పాండవేయులన్+ పొగడు+ఉలివు= పాండవులను కీర్తించే శబ్దం; దిక్కుల దీటుకొనియెన్= దిక్కులదాకా తగిలింది; ఇట్లు+ఉబ్బునన్+చెలంగుచున్= ఈ విధంగా సంతోషంతో ఒప్పుతూ; వారలు+అందఱున్+అచ్చోటు కదలిరి= వారంతా ఆ చోటునుండి వెళ్ళారు; కౌంతేయులు= కుంతి కుమారులు; కౌరవ శిబిరంబునకున్+చనినన్= కౌరవుల గుడారాలకు వెళ్ళగా; సాత్యకి అనుగమనంబు చేసెన్= సాత్యకి తోడుగా వెళ్ళాడు; ధృష్టద్యుమ్న ప్రముఖులు+ఐన= ధృష్టద్యుమ్నాది ముఖ్యులును; ద్రుపదజ్ఞాతులును= ద్రుపదుడి దాయాదులును; ద్రౌపదేయులును= ఉపపాండవులును; తక్కిన ధరణీ+ఈశులు= మిగిలిన రాజులును; తమ విడిదలలన్+కాని= తమ విడిదులలో తప్ప; విశ్రమంబునకున్ వెరవుగాదని తలంచి= విశ్రాంతి పొందుటకు తగదని భావించి; తారు+అందున్+ పోయి= తాము+ఆ+చోటికి వెళ్ళి; నాఁటి రాత్రి నిలిచి= ఆ రాత్రికి ఉండి; రేపకడ= తెల్లవారగా; కరిపురప్రయాణంబునకున్= హస్తినాపురికి ప్రయాణం కావటానికి; ఒదవన్+చనుదెంచువారుగాన్= తగునట్లు వచ్చువారుగా; విన్నవించి= చెప్పి; ధర్మతనయు+అనుమతి పడసి= ధర్మరాజు అనుజ్ఞ పొంది; సైన్యసమేతంబుగాన్+పోయిరి= సేనలతో కూడా వెళ్ళారు; వారలు+అటుపోవన్= సేనా సమూహంతో వారావిధంగా వెళ్ళగానే; ఆ+పాండునందనులు చని= ఆ పాండు కుమారులు వెళ్ళి; సంగీత ప్రవర్తక సంఘంబులు= సంగీతం ప్రచారం చేసే సమాజాలు; విరిసి చనినన్= వెళ్ళిపోగా; రిత్తఐ ఉన్న= శూన్యమైపోయిన; రంగస్థలంబు చందంబునన్= నాటక రంగభూమి మాదిరిగా; పాడు+అఱి+ఉన్న= బీడువారిన; ఆ శిబిరంబున్+ప్రవేశించి= ఆ గుడారంలోనికి పోయి; నీ నందను నగరున్+చొచ్చిన= నీ కుమారుడి (దుర్యోధనుడి) మేడలోనికి వెళ్ళగా; అచ్చటన+ఉన్న పరిచారకులును= అక్కడ ఉండిన సేవకులును; తత్సహవాసులును= వారి స్నేహితులును; మణికనక+ఆది వస్తు సంచయ+ అధ్యక్షులును= మణులకు బంగారానికిని అధికారులయిన వారును; ఆ+యుధిష్ఠిరున్+కాంచి= ఆ ధర్మజుడిని చూచి; ఆదరణంబు పడసిరి= ప్రేమను పొందినవారయ్యారు; ఆ+కుంతీనందనులు= ఆ పాండవులు; రథంబులు డిగ్గ+అవసరంబునన్= తేరులనుండి దిగే సమయంలో; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; వాసవిన్= అర్జునుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: చేయవలసిన పనిని చేశాము. ధన్యులము. సాయంకాలమైనది. సేనతో సేనానులు కూడా విశ్రాంతి పొందవలసిఉన్నది. పోదాము. లేవండి'- అనగా పాండవులు ప్రసన్నులైనారు. పాంచాలురూ మిగిలిన రాజులూ సంతోషించారు. అపుడు కృష్ణుడు తన శంఖం పాంచజన్యమును ఊదాడు. అర్జునుడు దేవదత్తాన్నీ, ధర్మజుడు అనంతవిజయాన్నీ, భీముడు పౌండ్రాన్నీ, నకులుడు సుఘోషాన్నీ, సహదేవుడు మణిపుష్పకాన్నీ పూరించారు. సేనానాయకు లందరూ తమ తమ శంఖాలను పూరించారు. నగారాలు, తూర్యములు మ్రోగాయి. పైకెగసిన శబ్దాలు ఆకసందాకా నిండింది. జనులంతా పాండవులను పొగడే ప్రశంసలు దిక్కులను తాకాయి. ఈ సంతోషంతో వారంతా ఆ చోటనుండి వెళ్ళారు. కుంతి కుమారులు కౌరవుల గుడారాలకు వెళ్ళగా, సాత్యకి వారి ననుసరించాడు. ధృష్టద్యుమ్నుడు మొదలైన ద్రుపదుడి దాయాదులూ, ఉపపాండవులూ, తక్కిన రాజులును తమ విడిదులకు వెళ్ళి విశ్రాంతి పొందటం మంచిదనుకొని తా మా రాత్రి అక్కడ నిలిచి మరునాటి ఉదయాన హస్తినాపురానికి ప్రయాణమునకు తగినట్లుగా వస్తామని మనవి చేసి, ధర్మరాజు అనుమతి తీసికొని, సైన్యంతో వెళ్ళారు. వా రా విధంగా పోగా, సంగీతాన్ని అందించే బృందాలు వెళ్ళిపోగా చిన్నపోయినట్లు కనుపించే రంగస్థలం వలె వెలవెలపోయే ఆ గుడారం లోనికి పాండవులు పోయి, నీ కుమారు డుండే నగరులోనికి పోగా, ఆ చోటినుండే సేవకులు, వారి అనుయాయులు, మణి కనకాది సమూహాలకు అధికారులు, ఆ యుధిష్ఠిరుడిని చూచి ఆదరణ పొందారు. ఆ కుంతీకుమారులు తేరులు దిగే సమయంలో శ్రీకృష్ణుడు అర్జునుడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ.

క. 'కవదొనలును గాండీవము । నవల నిడం బనుపు; ముంద రరదము డిగు; మే
న విదప డిగియెద; శుభకర । మవు నవ్విధ; మట్లు సేయు' మనుడు నతండున్. 333

ప్రతిపదార్థం: కవదొనలును= అమ్ములపొదుల జతయూ; గాండీవమున్= గాండీమనే అర్జునుని విల్లునూ; అవలన్= దూరంగా; ఇడన్+పనుపుము= పెట్టుటకై పంపుము; ముందర రథమున్= ముందుగా తేరునుండి; దిగుము; ఏన= నేనే; పిదపన్ డిగియెదన్= ఆ తరువాత దిగుతాను; ఈ+విధము= ఈ పద్ధతి; శుభకరము+అగున్= మేలు ఔతుంది; అట్లు చేయుము= ఆ విధంగా చేయవలసింది; అనుడున్= అనగా; అతండున్= అర్జునుడు కూడా.

తాత్పర్యం: 'గాండీవమును ధనుస్సును అమ్ముల పొదుల జంటను ఆవల పెట్టేటట్లు చేయుము. నీవు ముందుగా తేరునుండి దిగుము. నేను తరువాత దిగుతాను. అది క్షేమకరం.' అనగా అర్జునుడు కూడా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ధనువు తూణీరయుగళంబుఁ గొనుచు రథము । డిగుడు, శౌరి పగ్గంబుల నొగల ముడిచి
డిగియెఁ; గేతనకపియు భూతగణయుతము । గాఁ దొలంగె; నత్తేరు తత్క్షణమ మండె. 334

ప్రతిపదార్థం: ధనువున్= వింటిని; తూణీరయుగళంబున్= అమ్ములపొది జంటను; కొనుచున్= తీసికొని; రథము డిగుడున్= తేరినుండి దిగగానే; శౌరి= కృష్ణుడు; పగ్గంబులన్= గుఱ్ఱాల పగ్గాలను; నొగలన్= తొట్టెలో; ముడిచి= చుట్టి; దిగియెన్= దిగాడు; కేతన కపియున్= జెండా మీది హనుమంతుడుకూడా; భూతగణయుతముగాన్= భూతముల సమూహంతో; తొలంగెన్= తప్పుకొన్నాడు; తద్+క్షణము+అ= వెంటనే; ఆ+తేరు= ఆ రథం; మండెన్= మండిపోయింది.

తాత్పర్యం: వింటిని, తూణీరాల జంటను తీసికొని (అర్జునుడు) రథం దిగాడు. శ్రీకృష్ణుడు పగ్గాలను తొట్టెలో ముడిచిపెట్టి క్రిందికి దిగాడు. ధ్వజం మీది ఆంజనేయుడు భూతగణంతో తొలగిపోయాడు. వెంటనే ఆ తేరు మండిపోయింది.

అగ్నిదత్తం బైన యర్జును రథంబు కాలిపోవుట (సం. 9-61-14)

క. తురగంబులతోఁ గూడఁగ । నరదము సకలంబు నుజ్జ్వలానలశిఖలన్
సురసురఁ బోయినఁ గని య । న్నరుఁ డచ్చెరువంది కృష్ణునకు నభిముఖుఁ డై. 335

ప్రతిపదార్థం: తురగములతోన్+కూడఁగన్= గుఱ్ఱాలతో కూడా; అరదము సకలంబున్= తేరు మొత్తంగా; ఉజ్జ్వల+అనలశిఖలన్= ప్రకాశించే కాంతి గల నిప్పు మంటలతో; సురసురన్+పోయినన్+కని= సురసుర శబ్దంతో మండగా చూచి; ఆ+నరుఁడు= ఆ అర్జునుడు; అచ్చెరువు+అంది= ఆశ్చర్యపడి; కృష్ణునకున్+అభిముఖుఁడు+ఐ= కృష్ణుడికెదురుగా (నిలిచి).

తాత్పర్యం: గుఱ్ఱాలతో కూడిన తేరు మొత్తంగా తీవ్రాగ్నిజ్వాలలతో చురచుర శబ్దం చేస్తూ మండిపోగా చూచిన అర్జునుడు అబ్బురంగా శ్రీకృష్ణుడికి ఎదురుగా (తిరిగి). (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. వినయంబుతోడ మోడ్పుగేలు ఫాలతలంబునఁ గదియించి వినతుండై 'దేవా! యిట్టి యాశ్చర్యంబుం గలదే? యీ రథంబు దగ్ధం బగుటకుఁ గారణం బేమి? నాకు వినందగునేని యానతి' మ్మనిన మురారాతి యతని కిట్లనియె. 336

ప్రతిపదార్థం: వినయంబుతోడన్= అణకువతో; మోడ్పు+కేలు ఫాలతంబునన్+కదియించి= జోడించిన చేయి నెన్నుదుటికి చేర్చి; వినతుండు+ఐ= నమస్కారం చేసినవాడై; దేవా!= ఓ స్వామీ!; ఇట్టి ఆశ్చర్యంబు+కలదె?= ఇటువంటి వింత ఉన్నదా?; ఈ రథంబు దగ్ధంబు+అగుటకున్+కారణంబు+ఏమి?= ఈ తేరు కాలిపోవటానికి కల కారణమేమి?; నాకు వినన్+తగునేని= నేను వినదగినదయితే; ఆనతి ఇమ్ము+అనినన్= తెలియజేయుము అనగా; ముర+అరాతి= శ్రీకృష్ణుడు; అతనికిన్+ఇట్లు+ అనియెన్= అర్జునుడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అణకువతో నమస్కరించి వినమ్రుడై 'ఇది చాలా వింతగా ఉన్నది. ఈ తేరు కాలిపోవటానికి కారణ మేమి? నేను వినదగినదయితే సెలవీయండి.' అనగా శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు.

క. 'గురుకర్ణుల యస్త్రాగ్నుల । నెరిసినయది మున్ను; దీని నిటు గాకుండం
భరపడి రక్షించితి; సం । గరము దెగినఁ దొలఁగి యిపుడు గాల విడిచితిన్.' 337

ప్రతిపదార్థం: గురు కర్ణుల అస్త్ర+అగ్నులన్+ఎరిసిన అది= ద్రోణుడియొక్క కర్ణుడియొక్క బాణాగ్నులచే మండినది; మున్ను= ముందుగానే; దీనిన్= ఈ తేరును; ఇటు కాకుండన్= ఈ విధంగా నుసి కాకుండా; భరపడి రక్షించితిన్= వహించి కాపాడాను; సంగరము తెగినన్= యుద్ధం పూర్తికాగా; తొలఁగి= తప్పుకొని; ఇపుడు= ఈ సమయంలో; కాలన్= కాలిపోగా; విడిచితిన్= వదలాను.

తాత్పర్యం: 'ఈ రథం ద్రోణుడి, కర్ణుడి బాణాగ్నులచేత ఇదివరకే మండింది. ఇది మండకుండా నేను ఇట్లు రక్షించాను. యుద్ధం ముగిసింది. కనుక దీనిని ఈ విధంగా కాలటానికి వదలిపెట్టాను.'

వ. అని చెప్పి యప్పు డద్భుతరసమగ్నులగుచున్న తక్కటి పాండవులం గనుంగొని యలరుమొగంబున నలంతినవ్వు కాంతి దళుకొత్తఁ గౌంతేయాగ్రజుం గౌఁగిలించికొని 'యే నుపప్లావ్యంబునకు వచ్చి నినుఁ గనిన నీవు నాకు మధుపర్కం బిచ్చి విష్వచ్చుఁ జూపి 'వీఁడు నీకు రక్షణీయుండు సుమీ!' యని యప్పగించి; తేనును నియ్యకొంటి; నట్ల నాసఖుండును సురక్షితుండై వీరక్షయకరం బగుమహాసంగరంబు భవద్భీమనకుల సహదేవసహితంబుగ నిస్తరించి జయంబు గైకొనియె; నిటమీఁదం జేయ వలయు కార్యంబులు నడపు' మనవుడు నతం డచ్యుతున కిట్లనియె. 338

ప్రతిపదార్థం: అని చెప్పి= ఆ విధంగా చెప్పి; అప్పుడు= ఆ సమయంలో; అద్భుతరసమగ్నులు= అద్భుతరసంలో మునుగుతూ ఉండే; తక్కటి పాండవులన్+కనుంగొని= మిగిలిన పాండవులను చూచి; అలరు మొగంబునన్+అలంతినవ్వుకాంతి+తళుకు+ ఒత్తన్= వికసించిన మొగంలో చిరునగవు కాంతి మెరయగా; కౌంతేయ+అగ్రజున్= ధర్మరాజును; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; ఏను+ఉపప్లావ్యంబునకున్ వచ్చి= నేను ఉపప్లావ్యానికి వచ్చి; నిన్నున్+కనినన్= నిన్ను చూడగా; నీవు నాకున్ మధుపర్కంబు+ఇచ్చి= నీవు నాకు కొత్తబట్టలు ఇచ్చి; విష్వచ్చున్+చూపి= అర్జునుడిని చూపించి; వీఁడు నీకు రక్షణీయుండు సుమీ! అని= వీడు నీవు కాపాడవలసినవాడు సుమా! అని; అప్పగించితి(వి)= అప్పగించావు; ఏనును+ఇయ్యకొంటిన్=

నేనుకూడా ఒప్పుకొన్నాను; అట్ల= ఆ విధంగా; నా సఖుండును= నా నేస్తమును; సురక్షితుండు+ఐ= చక్కగా కాపాడబడి; వీర క్షయకరంబు+అగు= వీర నాశకమైన; మహా సంగరంబున్= గొప్పదైన యుద్ధాన్ని; భవద్భీమ నకుల సహదేవ సహితంబుగాన్= నీ భీమ నకుల సహదేవులతోసహా; నిస్తరించి= దాటి; జయంబు+కైకొనియెన్= జయము పొందాడు; ఇటమీఁదన్+చేయవలయు కార్యంబులు= ఇక మీద చేయవలసిన పనులను; నడపుము= సాగించుము; అనవుడున్= అనగా; అతండు= ఆ ధర్మరాజు; అచ్యుతునకున్+ఇట్లు+అనియెన్= శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ఆ విధంగా చెప్పి, అద్భుతరసంలో మునిగిన మిగిలిన పాండవులను చూచి, వికసించిన తన మొగంలో చిరునగవు కాంతి మెరయగా, ధర్మజుడిని కౌగిలించుకొని ఇట్లా అన్నాడు. 'నేను ఉపప్లావ్యపురానికి వచ్చి నిన్ను చూచినపుడు నాకు వస్త్రాలను ఇచ్చి అర్జునుడిని చూపి 'వీడు నీవు తప్పక కాపాడవలసిన వాడు సుమా!' అని అప్పగించావు. నేను కూడా ఒప్పుకొన్నాను. ఆ విధంగా నా నేస్తమూ రక్షించబడ్డాడు. వీరనాశకమైన మహాయుద్ధాన్ని ఈ భీమ నకుల సహదేవులతో కలసి విస్తరించాడు. జయమును పొందాడు. ఇక పై చేయవలసిన పనులను నీవు నడపుము.' అనగా ఆతడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

తే. **'ద్రోణకర్ణ దివ్యాస్త్రముల్ క్రూరభంగిఁ । గవియునప్పుడు మము నీవు గావకున్న**
బ్రదుకు టెంతద? వ్వధిక శుభంబులకు భ । వత్ప్రసాదంబు గని కాదె వాసుదేవ!' **339**

ప్రతిపదార్థం: వాసుదేవ!= శ్రీకృష్ణా!; ద్రోణ కర్ణ దివ్య+అస్త్రముల్= ద్రోణుడి, కర్ణుడి, దివ్యాస్త్రాలు; క్రూరభంగిన్= భయంకరంగా; కవియునప్పుడు= క్రమ్ముకొనేటప్పుడు; మమున్ నీవు కావకున్నన్= మమ్ము నీవు కాపాడకుంటే; బ్రతుకుట+ఎంత దవ్వు?= బ్రతుకెంత దూరమో; అధికశుభంబులకున్= మిక్కిలి మేళ్ళకు; భవత్ప్రసాదంబు గని కాదె= నీ యనుగ్రహం గని వంటిది కదా!

తాత్పర్యం: 'ఓ వాసుదేవా! ద్రోణ కర్ణుల, దివ్యాస్త్రాలు భయంకరంగా మమ్ము కమ్ముకొన్నపుడు నీవు కాపాడకపోతే మా జీవితాలు ఎంత దూరంలో ఉండేవో! నీ అనుగ్రహమనే నిధి ఉండబట్టి కదా మిక్కిలి మేలునందగలిగాము!'

వ. **అని వెండియు.** **340**

ప్రతిపదార్థం: అని వెండియున్= అంటూ ఇంకనూ.

తాత్పర్యం: అంటూ ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **'మునిపతి కృష్ణద్వైపా । యనుఁడు ప్రబోధించె నన్ను 'నచ్యుతుఁ డే ది**
క్కున నుండు నెమ్మి నా ది । క్కునకు జయము గల్గు' నని యకుంఠితకరుణన్. **341**

ప్రతిపదార్థం: మునిపతి= ముని నాయకుడు; కృష్ణద్వైపాయనుఁడు= వ్యాసుడు; అచ్యుతుఁడు+ఏ+దిక్కునన్+ఉండున్= శ్రీకృష్ణు డేవైపున ఉంటాడో; ఆ దిక్కునకున్= ఆ వైపునకు; నెమ్మిన్= ప్రీతితో; జయము= విజయం; అకుంఠిత కరుణన్= కుంటువోని దయతో; కల్గున్+అని= కలుగుతుందని; నన్నున్ ప్రబోధించెన్= నాకు తెలియచేశాడు.

తాత్పర్యం: 'మునినాయకుడైన వ్యాసుడు నన్ను హెచ్చరించాడు. శ్రీకృష్ణు డేవై పుంటాడో జయ మాదిక్కునకే కలుగుతుం' దని విశేషమైన కరుణతో చెప్పాడు.'

వ. అనుటయు మాధవుం డమ్మనుజేంద్రున కిట్లనియె. 342

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; మాధవుండు= శ్రీకృష్ణుడు; ఆ+మనుజ+ఇంద్రునకున్+ఇట్లు+అనియెన్= ఆ రాజేంద్రుడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మజుడు అట్లా అనగా శ్రీకృష్ణుడు ఆ రాజేంద్రుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'మనకుం గౌరవులకుఁ బదు । నెనిమిది యక్షౌహిణులు మహీశ్వర! కల; వ
ప్పెనుమొన లన్నిటిలో న । ర్జుననకుఁ బాటి యని యొక్కరునిఁ బేర్కొనుమా! 343

ప్రతిపదార్థం: మహీశ్వర!= ఓ రాజా!; మనకున్ కౌరవులకున్= మనకూ కౌరవులకును; పదునెనిమిది యక్షౌహిణులు కలవు= పద్దెనిమిది అక్షౌహిణులున్నాయి(సేనలు); ఆ+పెను మొనలు+అన్నిటిలోన్= ఆ పెద్ద సైన్యమంతలోను; అర్జుననకున్ పాటి అని= అర్జునుడిని సమానుడని; ఒక్కరునిన్= ఒకడిని; పేర్కొనుమా!= పేర్కొనుము.

తాత్పర్యం: 'మనకూ కౌరవులకూ కలసి పద్దెనిమిది అక్షౌహిణుల సేన ఉన్నది. అంతటి పెద్ద సేనలో అర్జునుడికి సమానంగా ఒక్కడిని పేర్కొనగలవా?

తే. ఈశ్వరుఁడు క్రీడి కస్త్రంబు లిచ్చుచోట । 'మత్సముండవు గ' మ్మని వత్సలత్వ
గౌరవంబునఁ బల్కెఁ; నిక్కముగ నంత । వాఁడు గాఁడె నీతమ్ముఁడు వసుమతీశ! 344

ప్రతిపదార్థం: వసుమతీ!+ఈశ!= ఓ రాజా!; ఈశ్వరుఁడు= పరమశివుడు; క్రీడికిన్= అర్జునుడికి; అస్త్రంబులు+ఇచ్చుచోటన్= అస్త్రాలిచ్చేటప్పుడు; మత్సముండవు కమ్ము= నాతో సమానుడవు కమ్ము; అని= అంటూ; వత్సలత్వ గౌరవంబునన్= వాత్సల్యాధిక్యంతో; పల్కెన్= అన్నాడు; నీ తమ్ముఁడు= నీ సోదరుడగు అర్జునుడు; నిక్కముగన్= నిజంగా; అంతవాఁడు కాఁడె?= అంతటివాడే కదా!

తాత్పర్యం: పరమశివుడు అస్త్రాలను ఇచ్చినపుడు అర్జునుడితో 'నాతో సమానుడవు నీవు కావాలి' అని అధిక వాత్సల్యంతో చెప్పాడు. ఓ రాజా! నీ తమ్ముడయిన అర్జునుడు అంతటివాడే కదా!

చ. కరుణ జనించి శాత్రవుల గాండివి సంపఁగ నొల్లఁడయ్యెఁ; నేఁ
బరువడిఁ దెల్పి యైక్యపరిభావ నిరూఢము గాఁగఁ జేసినం
దిర మయి పోరికిం గృతమతిన్ మఱి చొచ్చి సరిత్సుతాదులన్
వెరవున గీటడంచెఁ దనవిక్రమ మెందుఁ బ్రసిద్ధి కెక్కఁగన్. 345

ప్రతిపదార్థం: గాండివి= అర్జునుడు; కరుణ జనించి= దయ గలిగి; శాత్రవులన్= వైరులను; చంపఁగన్= చంపగా; ఒల్లఁడు+అయ్యెన్= ఇష్టపడలేదు; ఏన్= నేను; పరువడిన్= క్రమంగా; తెల్పి= బోధించి; ఐక్యపరిభావ నిరూఢము కాఁగన్= కలిసి ఉండటాన్ని తిరస్కరించే విధంగా; చేసినన్= చేయగా - అనగా గీతోపదేశంచేత - రణోన్ముఖుడిని చేయగా; తిరము+అయి= స్థిరంగా ఉండి; పోరికిన్= యుద్ధానికి; కృతమతిన్= నిశ్చయంతో; మఱి చొచ్చి= ఆ మీద ప్రయత్నించి; సరిత్సుత+ఆదులన్= గాంగేయాదులను; వెరవునన్= ఉపాయంతో; తన విక్రమము= తన శౌర్యం; ఎందున్= ఎక్కడకూడా; ప్రసిద్ధికెక్కఁగన్= కీర్తినందగా; గీటు అడంచెన్= చంపాడు.

తాత్పర్యం: అర్జునుడు దయగలిగి శత్రువులను చంపటానికి ఇష్టపడలేదు. ఆ మీద నేను క్రమంగా కలిసి ఉనికిని తిరస్కరించే విధంగా గీతోపదేశం చేసి రణోన్ముఖుడిని చేయగా - దాని వలన తన శౌర్యం ప్రసిద్ధిచెందగా కృతనిశ్చయుడై యుద్ధానికి పూనుకొన్నాడు. భీష్మాదులను చంపాడు.

క. అచ్చెరువు సంపుటకుఁ దన । యిచ్చఁ జొరక కేలి సలిపె నిన్నాళ్ళును వి
వ్వచ్చుఁడు; హిత మేఁ జెప్పినఁ । బొచ్చెము లే కంతరంగమున నిల్పెఁ దగన్. 346

ప్రతిపదార్థం: అచ్చెరువు= ఆశ్చర్యంగా; చంపుటకున్= చంపటానికి; తన ఇచ్చన్+చొరక= తన ఇష్టంతో పూనుకొనక; ఇన్నాళ్ళును= ఇన్ని దినాలూ; కేళి సలిపెన్= యుద్ధం చేశాడు; వివ్వచ్చుఁడు= బీభత్సుడు (అర్జునునకు); హితము+ఏన్+చెప్పినన్= నేను మంచి చెప్పగా(గీతను ఉపదేశించగా); పొచ్చెము లేక= అనుమానం లేకుండా; అంతరంగమునన్= మనసులో; తగన్+నిల్పెన్= తప్పకుండా నిల్పుకొన్నాడు.

తాత్పర్యం: తన మనసులో శత్రువులను చంపటానికి ఇష్టపడకుండానే ఇన్నాళ్ళూ ఆశ్చర్యంగా యుద్ధక్రీడ సాగించాడు. అర్జునుడికి నేను హితాన్ని చెప్పగా సందేహించకుండా మనసులో నిలుపుకొన్నాడు.

క. ఏ నుపదేశించితి ననఁ । గా నొక పెం పెంచినాఁడు గాని తలంపన్
మానవనాథ! సురేశ్వర । సూనుఁడు నాయట్టివాఁడ చు మ్మేపనికిన్. 347

ప్రతిపదార్థం: మానవనాథ!= ఓ ధర్మరాజా!; ఏను+ఉపదేశించితిన్= నేను ఉపదేశం చేశాను; అనఁగాన్; ఒకపెంపు+ఎఁచినాఁడుగాని= ఒక గొప్పగా అనుకొన్నాడు గాని; తలంపన్= యోచన చేయగా; సురేశ్వర సూనుఁడు= ఇంద్రతనయుడైన అర్జునుడు; ఏ పనికిన్= ఏ పనికైనా; నా+అట్టివాఁడు+అ+చుమ్మ!= నా వంటివాడే సుమా!

తాత్పర్యం: ఓ రాజా! నేను ఉపదేశం చేశానని గౌరవంగా భావించాడు కాని యోచన చేసి చూడగా ఇంద్రవర జన్ముడయిన అర్జునుడు కూడా ఏ పని చేయటానికైనా నా అంతటివాడే సుమా!

క. నిమిషార్ధంబున త్రైలో । క్యమును సురాఘురయుతంబు గా నోర్చుం గో
పము పొడమినఁ గవ్వడి క । య్యమునం గురుబలము గెలుచు టరుదే తలఁపన్?' 348

ప్రతిపదార్థం: కోపము పొడమినన్= కోపం కలిగితే; కవ్వడి= అర్జునుడు; కయ్యమునన్= యుద్ధంలో; నిమిష+అర్ధంబునన్= అరనిముసంలో; త్రైలోక్యమును= ముల్లోకాలను; సుర+అసురయుతంబుగాన్= దేవాసురులతో సహా; ఓర్చున్= ఓడిస్తాడు; కురుబలము గెలుచుట= కౌరవసేనను గెలవటం; తలఁపన్ అరుదే?= యోచిస్తే ఆశ్చర్యమా?

తాత్పర్యం: కోపం వస్తే అర్జునుడు అరనిముసంలో ముల్లోకాలను ఓడించగలడు. కాగా యుద్ధంలో కౌరవసేనను ఓడించటంలో అబ్బుర మేమున్నది?'

విశేషం: అలం: కావ్యార్థపత్తి.

వ. అని పలికె; నిట్లు సల్లాపసౌఖ్యం బనుభవించి వాహనమోచనం బాచరించిరి; తదనంతరంబ కౌంతేయులు గమనీయాభరణంబులుం గనకరాసులును రత్నసంచయంబులు మొదలుగా మహనీయవస్తు విస్తారంబునం

బ్రస్తుతిపాత్రంబైన నీపుత్రు భాండాగారంబుఁ జేకొని, నాఁడు పొలికలనికిం బోవక యున్న రథరథ్యమాతంగ తురంగంబులం జూచికొని దాసదాసీకుబ్జవామనగణంబులం గైకొని, యధిక ప్రమదసమద చేష్టితంబుల నుల్లసిల్లిరి; కొండొకసేపునకు శౌరి వారలతో నిట్లనియె. 349

ప్రతిపదార్థం: అని పలికెన్= అంటూ మాటలాడాడు; ఇట్లు= ఈ విధంగా; సల్లాపసౌఖ్యంబు+అనుభవించి= సంభాషణ సంతోషాన్ని పొంది; వాహన మోచనంబు+ఆచరించిరి= తమ తమ వాహనములను విడిచారు; తదనంతరంబు+అ= ఆ మీదట; కౌంతేయులు= పాండవులు; కమనీయ+ఆభరణంబులున్= అందమైన నగలును; కనకరాసులును= బంగారు కుప్పలును; రత్నసంచయంబులు= నవరత్న సమూహాలు; మొదలుగాన్= మొదలైన వాటితో; మహనీయవస్తు= గొప్పవస్తువులయొక్క; విస్తారంబునన్= సమృద్ధితో; ప్రస్తుతి పాత్రంబు+ఐన= పొగడదగిన; నీ పుత్రు భాండాగారంబున్ చేకొని= నీ కుమారుడి బొక్కసాన్ని తీసికొని; వాఁడు పొలికలనికిన్+పోవక ఉన్న= ఆనాడు యుద్ధానికి వెళ్ళకుండా ఉన్నట్టి; రథ= తేరులను; రథ్య= గుర్రాలను; మాతంగ= ఏనుగులను; తురంగంబులన్= గుర్రాలను; చూచికొని= చూచుకొంటూ; దాసదాసీ= సేవకులను సేవకురాండ్రను; కుబ్జవామన గణంబులన్= పొట్టివారి గుంపులను; కైకొని= తీసికొని; అధిక ప్రమద చేష్టితంబులన్= మిక్కిలి ఆనందకారణమైన చేష్టలతో; ఉల్లసిల్లిరి= సంతషించారు; కొండొక సేపునకున్= కొంతసేపటికి; శౌరి= కృష్ణుడు; వారలతోన్+ఇట్లు+అనియెన్= వారితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు పాండవులతో తీయని మాటలాడి ఆనందాన్ని పొందాడు. పాండవులు వాహనాలను వదలి బంగారు, రత్నాల రాసులు మొదలయిన గొప్ప సంపదతో నిండి కీర్తిపాత్రమైన నీ కుమారుడి బొక్కసాన్ని కైవసం చేసికొన్నారు. యుద్ధరంగానికి పోకుండా ఉన్న తేరులను, గుర్రాలను, మదపుటేనుగులను చూచికొంటూ దాసదాసీలను, పొట్టివారి సమూహాన్ని తీసికొని మిక్కిలి ఉల్లాసంతో ఉండగా శ్రీకృష్ణుడు వారితో ఇట్లా అన్నాడు.

ఆ. 'వీడు పాడు గాన విశ్రాంతి కియ్యెడ । మనము మసలవలదు; మంగళార్థ
ముగ శుచిప్రదేశమున కేఁగి యచ్చోట । నుచితవర్తనముల నుండవలయు.' 350

ప్రతిపదార్థం: వీడు= స్కంధావారం; పాడుకానన్= పాడుపడింది కనుక (నాశమైనది కనుక); విశ్రాంతికిన్= విశ్రాంతికై; ఈ+ఎడన్= ఈ చోట; మనము మసలవలదు= మనం నిలువ వద్దు; మంగళ+అర్థముగన్= క్షేమానికై; శుచి ప్రదేశమునకున్+ఏఁగి= స్వచ్ఛమైన(నిర్మలమైన) చోటునకు వెళ్ళి; ఆ+చోటన్= ఆ స్థలంలో; ఉచితవర్తనములన్= తగిన నడవడులతో; ఉండవలయున్= ఉండాలి.

తాత్పర్యం: 'ఈ సైనిక శిబిరం పాడుపడింది కనుక మన మిక్కడ విశ్రాంతికై ఉండటం సరికాదు. మంగళకరంగా ఉండటానికి వేరొక నిర్మలమైన చోటికి వెళ్ళి అక్కడ తగిన తీరులో ఉందాము.'

క. అని చెప్పి పాండు నృపనం । దనులం దన తమ్మునిన్ ముదం బెసఁగఁగఁ దో
డ్కొని పోయెను వసుదేవుని । తనయుఁడు శిబిరంబు వెడలి ధరణీనాథా! 351

ప్రతిపదార్థం: ధరణీనాథా!= ఓ రాజా!; అని చెప్పి= అని చెపుతూ; పాండు నృపనందనులన్= పాండు రాజు కుమారులను; తమ్మునిన్= సాత్యకినీ; ముదంబు+ఎసఁగఁగన్= సంతోషం కలుగగా; వసుదేవుని తనయుఁడు= శ్రీకృష్ణుడు; శిబిరంబు వెడలి; తోడ్కొనిపోయెను= పిలిచికొనిపోయినాడు.

తాత్పర్యం: ఓ రాజా - ధృతరాష్ట్రా! వాసుదేవుడు ఆ విధంగా చెపుతూ పాండురాజు కుమారులనూ, సాత్యకినీ దుర్యోధనుడి శిబిరమునుండి సంతోషాతిశయంతో తోడ్కొని పోయాడు.

వ. ఇట్లు వోవునప్పుడు శౌరిసారథి యైన దారకుండు మున్నెప్పుడును విడిదలం దమతేరు నశ్వంబులనుం బరికించి యుండెడువాఁడు బోయలు నీకొడుకు మడువున డాఁగినయునికి చెప్పిన నయ్యెడకు వచ్చు కౌంతేయులతో వీడెల్ల నొక్కతలగా వెడలివేడుకఁ జూడం జనుదేరఁ, దాను నయ్యరదంబున శైబ్యసుగ్రీవ మేఘ పుష్పవలాహకంబులం బూన్చికొని వచ్చుటం జేసి తా నప్పుడు కౌరవ శిబిరంబునకుఁ దోడన యరుగుదెంచెం గావున నొదవి సుకల్పితస్యందనుం డై యుద్దామోదరుదృష్టిపథంబు నిల్చె; ధర్మనందనుండును దమ్ములును సాత్యకియును సముచితవాహనంబులు దెప్పించుకొని యారోహణంబు సేయ నన్నారాయణుండు నిజరథారూఢుం డై యత్తెఱఁగునం బోయి. 352

ప్రతిపదార్థం: ఇట్లు+పోవునప్పుడు= ఈ విధంగా వెళ్ళేటప్పుడు; శౌరిసారథిఐన దారకుండు= శ్రీకృష్ణుడి సారథి అయిన దారకుడనే వాడు; మున్ను+ఎప్పుడును= అంతకుముందు+ఏనాడును; విడిదలన్= విడిది ఉండే చోటులలో; తమతేరు నశ్వంబులనున్+పరికించి= తమతేరి గుర్రాలను తేరిచూచి; ఉండెడువాఁడు= ఉండేవాడు; బోయలు= సేవకులు; నీ కొడుకు మడువునన్ డాఁగిన+ఉనికిన్= నీ కుమారుడు మడుగులో దాగుకొని ఉండటం చెప్పగా; ఆ+ఎడకున్= ఆ చోటికి; వచ్చు= వస్తూ ఉన్న; కౌంతేయులతోన్= పాండవులతో; వీడెల్లన్= ఊరంతటినీ; ఒక్కతలగాన్ వెడలి= ఒక్కటిగా వచ్చి; వేడుక చూడన్+చనుదేరన్= వినోదాన్ని చూడటానికై రాగా; తాను ఆ+అరదంబునన్= (శ్రీకృష్ణుడు) తానే ఆ తేరు మీద; శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకంబులన్ పూన్చికొని వచ్చుటన్+చేసి= ఈ పేర్లుగల గుర్రాలను సిద్ధంచేసి తీసికొనివచ్చుటవలన; తాను+అప్పుడు= తా నా సమయంలో; కౌరవ శిబిరంబునకున్ తోడన+ అరుగుదెంచెన్+కావునన్= కౌరవుల శిబిరానికి వెంటనే వచ్చాడు కనుక; ఒదవి= తగినట్లుగా; సుకల్పిత స్యందనుండు+ఐ= చక్కగా చేసిన తేరు గలవాడుగా; ఆ+దామోదరు దృష్టిపథంబున్+నిల్చెన్= ఆ శ్రీకృష్ణుని దృష్టిలో పడ్డాడు; ధర్మనందనుండును= ధర్మరాజు; తమ్ములును= అతడి సోదరులూ; సాత్యకియును= సాత్యకియు; సముచిత వాహనంబులు తెప్పించుకొని= తగిన వాహనాలను తెప్పించుకొని; ఆరోహణంబు చేయన్= ఎక్కగా; ఆ+నారాయణుండు= ఆ శ్రీకృష్ణుడు; నిజ రథారూఢుండు+ఐ= తన తేరెక్కిన వాడై; ఆ+ తెఱఁగునన్+పోయి= ఆ విధంగా వెళ్ళి.

తాత్పర్యం: .... నీ కొడుకు మడుగులో దాగి వుండడాన్ని చెప్పగా ఆ చోటుకు వచ్చు పాండవులతో శిబిరంలోని వారందరూ ఆ వేడుక చూడటానికి బయలుదేరగా తాను (దారుకుడు) ఆ రథానికి శైబ్య సుగ్రీవ మేఘ పుష్ప వలాహకములను పూన్చికొని ఉత్సాహంతో వచ్చినాడు కాబట్టి తాను కూడా వారితో పాటు కౌరవ శిబిరానికి వచ్చినందున తగినట్లుగా తీర్చిదిద్దిన రథంతో దామోదరుడు చూపునకు ఎదురుగా నిలిపాడు. ధర్మరాజు, తమ్ములు, సాత్యకి, తగిన వాహనాలు తెప్పించుకొని ఎక్కగా ఆ నారాయణుడు తన తేరెక్కి ఆ విధంగా వెళ్ళి.

తే. ఓఘవతి యనఁ బరఁగిన యొక్క పుణ్య । తటిని చేరువఁ గల్గిన దానితీర
భూమియం దర్ఘ్య మగుతలమున వసించి । రమ్మహాత్ములు చిత్తంబు లలర నధిప!' 353

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; ఓఘవతి అనన్+పరఁగిన= ఓఘవతి అనే పేరుతో ఉన్నట్టి; ఒక్కపుణ్యతటిని= ఒక పవిత్ర నదియొక్క; చేరువన్ గల్గిన= దగ్గరున్న దాని; తీర భూమి అందున్= దాని గట్టునందు; అర్ఘ్యము+అగు తలమునన్=

అర్హమైన నేలపై; చిత్తంబులు+అలరన్= మనసు సంతోషంతో చిగుర్చగా; ఆ+మహాత్ములు= ఆ మహనీయులు; వసించిరి= ఉన్నారు.

తాత్పర్యం: ఓ మహారాజా! వారంతా సంతోష మనస్కులై ఓఘవతి అనే పేరున్న పుణ్యనదీతీరంలో ఉచితమైన స్థలంలో ఉన్నారు.'

వ. అని యిట్లు సంజయుండు ధృతరాష్ట్రునకుఁ బాండవుల విజయంబు తెలిఅంగుఁ జెప్పె నని వైశం పాయనుండు. 354

ప్రతిపదార్థం: అని ఇట్లు సంజయుండు; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రుడితో; పాండవుల విజయంబు తెలిఅంగున్+చెప్పెన్= పాండవులు గెలిచిన తీరును చెప్పాడు; అని వైశంపాయనుండు.

తాత్పర్యం: ఈవిధంగా సంజయుడు ధృతరాష్ట్రుడితో పాండవుల విజయాన్ని వర్ణించా డని వైశంపాయనుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. జనమేజయునకు నిట్లను । విను మప్పుడు ధర్మసుతుఁడు విష్ణుని వదనం
బునఁ జూడ్కి నిలిపి, 'కరిపుర । మునకుం బోవలయు నీకుఁ బురుషార్థనిధీ!' 355

ప్రతిపదార్థం: జనమేజయునకున్= జనమేజయ చక్రవర్తితో; ఇట్లనున్= ఈ విధంగా అన్నాడు; వినుము; అప్పుడు= ఆ సమయంలో; ధర్మసుతుఁడు= ధర్మరాజు; విష్ణుని వదనంబునన్= శ్రీకృష్ణుడి ముఖంమీద; చూడ్కి నిలిపి= చూపు నిలిపి; పురుషార్థనిధీ!= శ్రీకృష్ణా!; నీకున్= నీవు; కరిపురమునకున్+పోవలయున్= హస్తినాపురికి పోవలసి ఉన్నది.

తాత్పర్యం: వైశంపాయనుడు జనమేజయ చక్రవర్తితో ఈ విధంగా అన్నాడు. ధర్మజుడు శ్రీకృష్ణుడిని చూస్తూ 'పురుషార్థాలకు నిధివైన కృష్ణా! ఇప్పుడు నీవు హస్తినాపురికి వెళ్ళాలి.'

వ. అని ప్రార్థించె; ననుటయు నమ్మనుజపతి యమ్మహీసురవరున కిట్లనియె. 356

ప్రతిపదార్థం: అని ప్రార్థించెన్= అని ప్రార్థించాడు; అనుటయున్= అనగా; ఆ+మనుజపతి= ఆ జనమేజయరాజు; ఆ+మహీసురవరునకున్+ఇట్లు+అనియెన్= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడితో (వైశంపాయనుడితో); ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని ప్రార్థించా డని చెప్పగా, జనమేజయుడు వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు:

చ. 'అని ధృతరాష్ట్ర నందనుల నందఱ గీ టడఁగించి వేఁడి యా
యనకడ కచ్యుతుం బనుపునంతటి కార్య విశేషమేమి గ
ల్గెనొ? మునినాథ! యానృపతికిన్ మది నాకు వినంగ వేడ్క వు
ట్టినయది యత్తెఱంగు ప్రకటింపు పరిస్ఫుటవాక్యసంపదన్.' 357

ప్రతిపదార్థం: మునినాథ!= ఓ వైశంపాయన మునీశ్వరా!; అనిన్= యుద్ధంలో; ధృతరాష్ట్ర నందనులన్= ధృతరాష్ట్రుడి కుమారులను; అందఱన్= అందరినీ; గీటడఁగించి= రూపుమాపి (సంహరించి); వేఁడి= కోరి; ఆయనకడకున్= ఆ ధృతరాష్ట్రుడి

వద్దకు; అచ్యుతున్+పనుపునంతటి= శ్రీకృష్ణుడిని పంపవలసినంత; కార్యవిశేషము= గొప్ప పని; ఆ+నృపతికిన్= ఆ ధర్మరాజునకు; ఏమి కల్గెనో?= ఏమి కలిగిందో?; నాకున్ వినంగన్= నేను వినవలెననే; వేడ్క= ఆసక్తి; మదిన్= మనసులో; పుట్టిన అది= కలిగింది; పరిస్ఫుట వాక్య సంపదన్= నిండైన స్పష్టమైన; వాక్యసంపదతో; ప్రకటింపు(ము)= తెలియజేయుము.

తాత్పర్యం: 'ఓ వైశంపాయన మునీశ్వరా! యుద్ధంలో ధృతరాష్ట్రుడి కుమారులను అందరిని చంపి, అతడివద్దకు శ్రీకృష్ణుడిని వేడుకొని పంపవలసినంతటి ప్రత్యేకమైనపని ధర్మరాజునకు ఏమి కలిగింది? నా మనసులో దానిని తెలిసికొనవలెననే కోరిక కలిగింది. ఆ వైనాన్ని చక్కటి మాటలున్న వాక్యాలలో స్పష్టంగా తెలుపవలసినది.'

వ. అనవుడు నాసంయమి యిట్లనియె. 358

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆ సంయమి= ఆ తాపసియైన వైశంపాయనుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా ఆ వైశంపాయనుడు ఇట్లా అన్నాడు:

ఉ. 'కౌరవముఖ్యు ధర్మగతి గాని తెఱంగునఁ గ్రీడి పంపఁగా
మారుతి గూల్చె నట్లగుట మాన్యచరిత్రుఁడు ధర్మసూతి గాం
ధారి శపించు దీని విని త మ్మని యాత్మఁ దలంచి యిమ్మెయిం
గూరినభీతి నవ్వనితకుం దగుభంగి శమం బొనర్పఁగన్. 359

ప్రతిపదార్థం: కౌరవముఖ్యున్= దుర్యోధనుడిని; ధర్మగతిగాని తెఱంగునన్= ధర్మపద్ధతి కాని విధంగా; క్రీడి పంపఁగాన్= అర్జునుడు పంపగా (తెలియజేయగా); మారుతి కూల్చెన్= భీముడు పడవేసినాడు; అట్లు+అగుటన్= ఆ విధంగా అయినందున; మాన్యచరిత్రుఁడు= పూజనీయమైన శీలం కలవాడైన; ధర్మసూతి= ధర్మరాజు; గాంధారి; దీనిన్ విని= ఈ వార్తను విని; తమ్మున్; శపించున్= శపిస్తుంది; అని; ఆత్మన్+తలంచి= మదిలో తలచి; ఈ+మెయిన్+కూరిన భీతిన్= ఈ విధంగా కలిగిన భయంతో; ఆ+వనితకున్= ఆ స్త్రీకి (గాంధారికి); తగు భంగిన్= తగినట్లుగా; శమంబు+ఒనర్పఁగన్= శాంతిని కలిగించటానికి.

తాత్పర్యం: కౌరవులలో ముఖ్యుడయిన దుర్యోధనుడిని యుద్ధరంగంలో అర్జునుడి సైగతో భీముడు అధర్మంగా పడగొట్టాడని విన్నందువలన గాంధారి తమ్ము శపిస్తుందని పవిత్రచరిత్రుడైన ధర్మరాజు మనసులో భయపడి ఆమెను ఏ విధంగానైనా శాంతింపజేయటానికి. (తరువాతి వచనంతో అన్వయం).

శ్రీకృష్ణుఁడు గాంధారి నూఱడింపఁ గరిపురంబునకుఁ బోవుట (సం. 9-61-40)

వ. పనిచెం గాని ధృతరాష్ట్రు నుద్దేశించి కా: దట యచ్యుతుం దరిగి యప్పటి కుచితం బగువిధంబునఁ గార్యంబు నడపె; నాకర్ణింపు; మట్లు దన్నుఁ బ్రార్థించిన నప్పురుషోత్తముండు పనితెఱం గడిగి, పాండవాగ్రజుండు సెప్ప విని, రథారూఢుం డై యతిరయంబునఁ గరినగరంబున కరిగి, మొగసాల నిలిచి, యాంబికేయునకుఁ దనరాక యెఱిఁగించి పుచ్చి, తగం జొచ్చి యంతక మున్న గాంధారీద్వితీయుండై కొడుకులదెస వగలం బొగులుచున్న యమ్మహీకాంతునివలని కారుణ్యంబున నతనికడకుం జనుదెంచి యున్న

కృష్ణద్వైపాయనమహామునిం గని వినయసంభ్రమంబులు దలకొనఁ దత్పాదంబులకుఁ బ్రణమిల్లి యక్కురురాజునకు గాంధారరాజనందనకు నమస్కరించి, కులపతిసన్నిధి యగుట నిలాతలంబునం గూర్చున్న యజ్జననాథు సమీపంబున నాసీనుండై. 360

ప్రతిపదార్థం: పనిచెన్+కాని= (ధర్మజుడు) పంపాడుగాని; ధృతరాష్ట్రున్+ఉద్దేశించి కాదు= ధృతరాష్ట్రుడిగురించి కాదు; అట= పిమ్మట; అచ్యుతుండు+అరిగి= శ్రీకృష్ణుడు వెళ్ళి; అప్పటికిన్= ఆ సమయానికి; ఉచితంబు+అగు విధంబునన్= తగినట్లుగా; కార్యంబు నడపెన్= పనిని సాగించాడు; ఆకర్ణింపుము= వినుము; అట్లు తన్నున్ ప్రార్థించినన్= ఆ విధంగా తనను ప్రార్థన చేయగా; ఆ+పురుషోత్తముండు= ఆ శ్రీకృష్ణుడు; పనితెఱఁగు+అడిగి= చేయవలసిన పని పద్ధతిని అడిగి; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; చెప్పన్ విని= చెప్పగా విన్నవాడై; రథ+ఆరూఢుండు+ఐ= తెరెక్కినవాడై; అతిరయంబునన్= మిక్కిలి వేగంగా; కరినగరంబునకున్+అరిగి= హస్తినాపురికి వెళ్ళి; మొగసాలన్ నిలిచి= తలవాకిటిలో నిలిచి; ఆంబికేయునకున్= ధృతరాష్ట్రుడికి; తన రాక ఎఱిఁగించి పుచ్చి= తాను వచ్చుటను తెలియజేసి; తగన్+చొచ్చి= తగిన విధంగా లోనికి వెళ్ళి; అంతకమున్ను+అ= అంతకంటె ముందుగానే; గాంధారీ ద్వితీయుండు+ఐ= గాంధారితో కూడి ఉన్నవాడై; కొడుకులదెసన్= తన కుమారుల విషయంలో; వగలన్+పొగలుచున్న= దుఃఖంతో కుములుతూ ఉండే; ఆ+మహీకాంతుని వలని= ఆ రాజు దెసకు; కారుణ్యంబునన్= దయతో; అతని కడకున్+చనుదెంచి ఉన్న= అతని యొద్దకు (ధృతరాష్ట్రుడి వద్దకు) వచ్చి ఉన్నట్టి; కృష్ణద్వైపాయన మహామునిన్+కని= వ్యాసమహామునిని చూచి; వినయ సంభ్రమంబులు తలకొనన్= అణకువ, ఆశ్చర్యం కలుగగా; తద్+పాదంబులకున్+ప్రణమిల్లి= ఆయన కాళ్ళకు నమస్కరించి; ఆ+కురురాజునకున్= ఆ కురువంశ రాజునకు; గాంధార రాజ నందనకున్= గాంధారీదేవికి; నమస్కరించి; కులపతి సన్నిధి+అగుటన్= తమ ఇంటి పెద్దయైన వ్యాసుడు సమీపస్థుడు అగుటచే; ఇలాతలంబునన్= నేలపై; కూర్చున్న; ఆ+జననాథు= ఆ రాజుకు; సమీపంబునన్= దగ్గరలో; ఆసీనుండు+ఐ= కూర్చుండి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడిని పంపాడు గాని, అది ధృతరాష్ట్రుడిని మనసులో పెట్టుకొనికాదు. దానికి కృష్ణుడు తగినవిధమైన కార్యాన్ని జరిపాడు-అని జనమేజయుడికి వైశంపాయనుడు చెప్పాడు. ధర్మరాజు ప్రార్థించగా శ్రీకృష్ణుడు తాను చేయవలసిన పని ఏమో చెప్పుమని అడిగాడు. తన రథంపై చాలవేగంగా హస్తినకు వెళ్ళి వీథివాకిట నిలిచి ధృతరాష్ట్రుడికి తాను వచ్చిన విషయం తెలియజేశాడు. తగు విధంగా లోనికి వెళ్ళాడు. గాంధారితో కలసి కుమారులను తలచుకొని దుఃఖిస్తూ ఉన్న ఆ మహారాజుమీద దయతో ఆయన వద్దకు వచ్చి ఉన్న వ్యాసమహర్షిని చూచి, వినయంతో కూడిన తొట్రుపాటుతో ఆయన పాదాలకు నమస్కరించాడు. ఆ ధృతరాష్ట్ర గాంధారీదేవులకు నమస్కారంచేసి, కులాధిపతి వ్యాసుడు ప్రత్యక్షమైనందున భూమి మీద కూర్చొని ఉన్న ఆ రాజునకు (ధృతరాష్ట్రుడికి) దగ్గరగా కూర్చున్నారు.

ఆ. అన్నరేంద్రు పాణి యల్లన తనకరా । బ్జమునఁ గీలుకొల్పి బహుళబాష్ప
కలితవదనుఁ డగుచు గళమున నెలుఁ గురి । యాడ వగచి యమ్మురాంతకుండు. 361

ప్రతిపదార్థం: ఆ+నర+ఇంద్రు పాణిన్= ఆ ధృతరాష్ట్ర మహారాజుచేతిని; అల్లనన్= నెమ్మదిగా; తనకర+అబ్జములన్= తన హస్తపద్మాలతో; కీలు+కొల్పి= ఉంచి; బహుళబాష్పకలిత వదనుఁడు+అగుచున్= మిగుల కన్నీటితో కూడిన మొగం కలవాడై; గళమునన్= కంఠంతో; ఎలుఁగు= శబ్దం; ఉరి ఆడన్= ఊగిసలాడగా - డగ్గుత్తిక పడగా; వగచి= దుఃఖపడి; ఆ+ముర+ అంతకుండు= ఆ శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రరాజు చేతులను నెమ్మదిగా తన చేతులలోనికి తీసికొని, మిక్కిలి కన్నీళ్ళతో గొంతు బొంగురుపోగా, శ్రీకృష్ణుడు దుఃఖించి.

వ. తత్ప్రదేశంబున నున్న కనకకలశజలంబుల ముఖప్రక్షాళనంబు సేసి యెలుంగు నూలుకొనం జేసి యిట్లనియె. 362

ప్రతిపదార్థం: తద్+ప్రదేశంబునన్+ఉన్న= ఆ చోటులో ఉన్నట్టి; కనక కలశ జలంబులన్= బంగారుపాత్రలోని నీటితో; ముఖప్రక్షాళనంబు+చేసి= మొగం కడిగికొని; ఎలుంగున్= మాటను; నూలుకొనన్+చేసి= బాగా సరి చేసికొని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ ప్రక్కనే ఉన్న బంగారుచెంబులోని నీటితో మొగం కడిగికొని, గొంతు సరి చేసికొని, ఇట్లా అన్నాడు.

చ. అకట! కులం బకారణము యంతయు నాశము నొందె; నిట్టిదా
నికిఁ జొర నొల్ల రైరి మహనీయచరిత్రులు నాఁడు పాండవుల్;
స్సకలము నీ వెఱుంగుదు చలంబును నీసును దక్కి నన్ను సం
ధికి నిట రా నొనర్చుట మదిం దలపోయు మదెట్టిశాంతియో!' 363

ప్రతిపదార్థం: అకట!= అయ్యో! కులంబు= వంశం; అంతయున్= మొత్తంగా; అకారణము+అ= నిష్కారణంగా; నాశమున్+ఒందెన్= నాశమయింది; ఇట్టిదానికిన్= ఇటువంటి స్థితికి; మహనీయ చరిత్రులు= ఉదార గుణశీలురైన పాండవులు; చొరన్+ఒల్లరు+ఐరి= పూనుకొనినవారు కారు; సకలము= మొత్తం; నీవు+ఎఱుంగుదు(వు)= నీకు తెలియును; చలంబునున్= పట్టుదలయు; ఈసును= అసూయయు; తక్కి= వదలి; నన్నున్; సంధికిన్+ఇట+రాన్+ఒనర్చుటన్= సంధికై ఇక్కడకు వచ్చేటట్లు చేయటం; నీవు మదిన్ తలపోయుము= నీవు మనసులో జ్ఞాపకానికి తెచ్చుకొనుము (ఊహించుము); అది+ఎట్టి శాంతియో!= అది ఏ ఎంతటి శాంతియో (నీకు అర్థం కాగలదు).

తాత్పర్యం: 'అయ్యో! మీ వంశమంతా నిష్కారణంగా నాశమైంది. ఇటువంటి స్థితికి ఏ మాత్రమూ ఇష్టపడకుండా మహనీయ చరిత్ర కల పాండవు లానాడు నన్ను రాయబారం పంపారు. ఆ సంగతి అంతా నీకు తెలుసు. పట్టుదల, అసూయ వదలి నీ వద్దకు సంధికై నేను వచ్చేటట్లు చేశారు. ఆ శాంతి ఎంతటిదో నీవు మనసులో తలపోయుము. (అని శ్రీకృష్ణుడు అన్నాడు).

వ. అని యంత నిలువక. 364

ప్రతిపదార్థం: అని+అంతన్ నిలువకన్= అంటూ, అంత మాత్రంతో నిలువకుండా.

తాత్పర్యం: అంటూ, అంతమాత్రంతో ఆగకుండా.

క. 'గెలువరె జూదము లెందును? । గలదే తలఁబట్టి పుణ్యకాంతఁ గొలువులో
పలి కీడ్చి తెచ్చి వలువల । నొలుచుట? యే మనఁగవచ్చు నుర్వీనాథా! 365

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= ఓ రాజా!; జూదములు; ఎందును= ఎక్కడా; గెలువరె?= జూదాలు ఆడి గెలువరా?; పుణ్యాకాంతన్= పవిత్రమయిన స్త్రీని; తలన్+పట్టి= జుట్టు పట్టుకొని; కొలువులోపలికిన్+ఈడ్చి తెచ్చి= సభలోనికి లాగి తీసికొనివచ్చి; వలువలన్+ఒలుచుట= కట్టుగుడ్డలను విప్పటం; కలదే= ఉన్నదా?; ఏమి+అనఁగవచ్చున్= ఏమనవచ్చును?

తాత్పర్యం: 'ఓ రాజా! జూదా లాడి గెలువరా! ఎక్కడనైనా పవిత్రకాంతలను తలపట్టి ఈడ్చి లాగికొని వచ్చి కట్టుగుడ్డలను ఊడదీయటం ఉన్నదా? దీనిని ఏమనవచ్చును?

క. **దానికి నొచ్చినమనముల । తో నడవికిఁ బోయి బహుళదుఃఖంబుల న**
ట్లూని విరాటుపురిం బడఁ । గానియిడుమ వడియు వారు గనలర? కంటే. **366**

ప్రతిపదార్థం: దానికిన్= ఆ పనికి; నొచ్చిన మనములతోన్= నొప్పి కలిగిన మనస్సులతో; అడవికిన్+పోయి= అరణ్యానికి పోయి; బహుళదుఃఖంబులన్= అనేక దుఃఖాలను; అట్లు+ఊని= ఆ ప్రకారం వహించి; విరాటుపురిన్= విరటుడి నగరంలో; పడన్+కాని+ఇడుమ పడియున్= పడరాని పాట్లు పడికూడా; వారు= ఆ పాండవులు; కనలర?= కోపించనే లేదు; కంటే?= గమనించావా?

తాత్పర్యం: ఆ పనికి మనసులో బాధ కలిగి అడవులకు పోయి అనేక దుఃఖాలననుభవించి ఆ విధంగా విరటుడి నగరంలో పడరాని పాట్లు పడిన ఆ పాండవులు కోపించనే లేదు. చూచావా?

ఉ. **ఏవుర కుండ నొక్కొకటి యిమ్మని యూళులు వేఁడి కాన రై**
రే వలన దన్న నీ కొడుకు లెమ్మెయి మానర లోభ గర్వముల్;
నీవును నట్ల కాక మహనీయమతుల్ విదురాదిబాంధవుల్
వేవురు సెప్పరే? యధిప! వింటె తగం బలు కొక్కఁ డేనియున్? **367**

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; ఏవురకున్= అయిదుగురుకిని; ఉండన్= ఉండటానికి; ఒక్కొకటి ఇమ్మని= ఒక్కొకదానిని ఇమ్మని; ఊళులు= ఊర్లను; వేఁడి= అర్థించి; కానరైరి= పొందలేకపోయారు; నీ కొడుకులు= నీ కుమారులు; ఏన్+వలదు+అన్నన్= నేను వద్దనినను; లోభగర్వముల్= పిసినారితననాన్నీ, అహంకారాన్నీ; ఏ+మెయిన్= ఏ విధంగాను; మానరు+అ= వదలనే లేదు; నీవును= నీవు కూడా; అట్లుకాక= అంతే; మహనీయమతుల్= గొప్పమనసున్నవారు; విదురాది బాంధవుల్= విదురుడు మొదలయిన బంధువులు; వేవురు చెప్పరే?= వేయిమంది చెప్పలేదా?; తగన్= తగిన విధంగా; పలుకు+ఒక్కఁడు+ఏనియున్= ఒక్కమాటనయినా; వింటె?= విన్నావా?

తాత్పర్యం: ఓ రాజా! అయిదుగురికి ఉండటానికై, తలకొక ఊరిమ్మని అర్థించి పొందలేకపోయారు. నేను వద్దన్నా నీ కొడుకులు అహంకారాలను ఏ విధంగానూ మానలేదు. నీవు కూడా అంతే. మహనీయులైన విదురాది బంధువులు అనేకులు చెప్పలేదా? ఒక మాటనైనా తగిన విధంగా విన్నావా?

క. **కాలోపహత మనస్కుఁడు । మేలు తెరువు వట్టు నెట్లు? మెయికొని యది యిం**
కేల తలపోయ? నుడుపం । జాలుదురే నరులు దైవసంపాదితముల్?' **368**

ప్రతిపదార్థం: కాల+ఉపహత మనస్కుఁడు= కాలవైపరీత్యంవలన దెబ్బతిన్న మనసు కలవాడు; మెయికొని= ఇష్టంతో; మేలు తెరువు= మంచిమార్గం; ఎట్లు+పట్టున్?= ఏ విధంగా అనుసరిస్తాడు?; అది= దానిని; ఇంకేల తలపోయన్?= ఇక యోచించటం ఎందుకు?; నరులు= మనుష్యులు; దైవ సంపాదితముల్= దైవప్రాప్తాలను; ఉడుపన్+చాలుదురే?= ఆపగలరా?

తాత్పర్యం: కాలవైపరీత్యంవలన మనుష్యుడు మంచిమార్గాన్ని ఏ విధంగా ఇష్టంతో అనుసరించగలడు? ఇక దానినిగూర్చి ఆలోచించటం దేనికి? విధి నిర్ణయాన్ని మానవులు ఆపగలరా?'

వ. అని వెండియు నిట్లనియెఁ 'బాండవులు గల్మషాయత్త చిత్తులు గామియు, మీరు నెఱిలేమియు విచారింపుము; మేను మ్రొక్కి వేఁడికొనియెద; వారలదెసఁ గోపంబు లేకుండవలయు; నట్లుం గాక నీకును గాంధారికిని వలయు పరలోకక్రియాకలాపంబులు వారయంద నిలిచెం గావున వారికి శుభంబు గోరుట లెస్స! మీ చిత్తంబు నొప్పించితి నని యెప్పాట దురపిల్లెడునో ధర్మజుతెఱం గెఱింగెదు గాక' యని పల్కి గాంధారరాజనందన నుద్దేశించి. 369

ప్రతిపదార్థం: అని వెండియున్+ఇట్లు+అనియెన్= అంటూ ఇంకా ఈ విధంగా అన్నాడు; పాండవులు కల్మష+ఆయత్త చిత్తులు కామియున్= పాండవులు పాపంతో నిండుకొన్న మనసుకలవారు కాకుండుటయును; మీరు నెఱి లేమియున్= మీరు ధర్మం లేకుండుటయును; విచారింపుము= యోచింపుము; ఏను మ్రొక్కివేఁడికొనియెదన్= నేను ప్రార్థించి వేడుకొంటాను; వారల దెసన్= వారిమీద (పాండవుల మీద); కోపంబు లేకుండ వలయున్= కోపం లేకుండా ఉండవలెను; అట్లున్+కాక= అంతేకాక; నీకును గాంధారికిని= నీకూ గాంధారికినీ; వలయు= అవసరమైన; పరలోక క్రియా కలాపంబులు= పరలోక కార్యక్రమాలు; వారియందున్+అ నిలిచెన్= వారి మీదనే ఉన్నవి; కావున వారికిన్ శుభంబు కోరుట లెస్స!= మేలు!; మీ చిత్తంబు నొప్పించితిని+అని= మీ మనసుకు కష్టం కలిగించానని; ఏ+పాట దుఃఅపిల్లెడునో= ఎంతగా దుఃఖిస్తాడో; ధర్మజుతెఱంగు= ధర్మజుడి మనసు; ఎఱింగెదు(వు)+కాక= తెలిసికొనగలవు గాక; అని పల్కి= అంటూ మాట్లాడి; గాంధార రాజనందనన్+ఉద్దేశించి= గాంధారీదేవిని ఉద్దేశించి.

తాత్పర్యం: ఇంకా ఈ విధంగా కృష్ణుడు అన్నాడు. 'పాండవులు కపటచింతన లేనివారూ, మీరు న్యాయపరులు కాకపోవుటా ఆలోచించుము. వారి మీద కోపం లేకుండా ఉండాలని నేను ప్రార్థనాపూర్వకంగా వేడుకొంటున్నాను. అంతేకాకుండా నీకూ గాంధారీదేవికిని పరలోక క్రియలు చేయవలసిన బాధ్యత వారిమీద ఉన్నది. కాబట్టి వారికి మేలు కోరుకొనుము. అది మంచిది. మీ మనసునకు కష్టం కలిగించినా నని ధర్మరాజు ఎంతగా దుఃఖిస్తున్నాడో తెలియగలవు.' అని, గాంధారి నుద్దేశించి - (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. 'నీ కెన వచ్చు రాజరమణిన్ ధరనెందును గంటిమే? నృపా
నీకము వించు నుండ సుతునిం దగు పల్కుల నంత యొత్తుదే?
నా కది సిక్కెఁ జిత్తమున నాఁటి ప్రియం బగుచుండ నిప్పుడున్
లోకవిరుద్ధ వృత్తి చపలుం డితఁ డి మ్మెఱుఁగండ యేమియున్. 370

ప్రతిపదార్థం: నీకున్+ఎనవచ్చు= నీకు సమానమైన; రాజరమణిన్= రాజకాంతను; ధరన్+ఎందునున్+కంటిమే?= భూమిలో ఎక్కడనైనా చూచామా?; నృప+అనీకము వించున్+ఉండన్= రాజ సమూహం వింటూ ఉండగా; సుతునిన్= నీ కొడుకును (దుర్యోధనుడిని); అంత+ఒత్తుదే?= అంత బలవంతం చేస్తావా?; నాకున్+అది= నాకు ఈ నడవడి; చిత్తమునన్= మనసులో;

చిక్కెన్= తగిలింది; ఇప్పుడున్= ఈదినం కూడా; చిత్తమునన్ నాటి= మనసులో హత్తుకొని; ప్రియంబు+అగుచుండున్= ప్రీతిని కలిగిస్తూ ఉన్నది; ఇతఁడు= దుర్యోధనుడు; లోక విరుద్ధవృత్తి= లోకానికి వ్యతిరేకమైన నడవడిచేత; చపలుండు= చంచల మనస్కుడు; ఇమ్ము= మేలు; ఏమియున్ ఎఱుఁగండు+అ= తన కేది మేలో ఎంతమాత్రమూ తెలియనే తెలియడు.

తాత్పర్యం: నీకు సరి అయిన రాజకాంతను లోకంలో ఎక్కడను చూడలేము. లేకపోతే రాజులందరూ వింటూ ఉండగా కుమారుడిని అంతగా ఒత్తిడిచేస్తావా? ఇప్పటికినీ అది (అనగా నీ నడవడి) నా మనసులో హత్తుకొని ఉన్నది, ప్రీతిని కలిగిస్తూ ఉన్నది. కాని, ఆ చపలప్రవృత్తి కల ఆ దుర్యోధనుడు ఏ మాత్రమూ తనకేది మేలో తెలియనే తెలియనివా డయ్యాడు.

క. నీమాటకు దుర్యోధనుఁ । డామెయిఁ దాఁ ద్రుళ్ళిపడక యవుఁ గా కని నాఁ
డే మేనిఁ గొంత యక్కట! భూమి యొసఁగెనేని యింత పుట్టదు సుమ్మీ! 371

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; నీ మాటకున్= నీ మాట ప్రకారం; దుర్యోధనుఁడు+ఆమెయిన్= దుర్యోధనుడు ఆ విధంగా; త్రుళ్ళిపడక= గర్వించకుండా; అవున్+కాకని= సరే అని; నాఁడు= ఆ దినం; ఏమి+ఏని= ఏదో; కొంత= కొంచెమైనా; భూమిని= భూభాగాన్ని; ఒసఁగెన్+ఏని= ఇచ్చి ఉన్నట్లయితే; ఇంత+పుట్టదు సుమ్మీ!= ఇంత జరిగి ఉండదు సుమా!

తాత్పర్యం: దుర్యోధనుడు ఆ దినం గర్వాన్ని వీడి, నీ మాటకు సరే అని కొంత భూమిని ఇచ్చిఉంటే ఇంత దూరం వచ్చి ఉండేది కాదు.

వ. కీడు వుట్టునని నీవు సెప్పితి; చెప్పిన మాటయుం దలకూడెఁ; బాండవులవలనం దప్పు లే దని యెఱుంగుదు గాదె! వారల కలుగ కుండునది; నీ వలిగి చూచినం ద్రిలోకంబులు భస్మీభూతంబు లగునట్టి తపఃప్రభావంబునం బ్రసిద్ధవు గావున నిన్నుం బ్రార్థించెద' నని పల్కిన నద్దేవి 'యది యంతయు నీ చెప్పినట్టిద' యని వెండియు. 372

ప్రతిపదార్థం: కీడు+పుట్టునని నీవు చెప్పితి(వి)= చెడు కలుగుతుందని నీవు చెప్పావు; నీవు చెప్పిన మాటయున్= నీ మాటకూడా; తలకూడెన్= సిద్ధించింది; పాండవులవలనన్+తప్పు లేదు+అని ఎఱుంగుదు(వు)= పాండవులయందు తప్పులేదని నీకు తెలియును కదా!; వారలకున్+అలుగకుండునది= వారి మీద కోపించకుండా ఉండుము; నీవు+అలిగిచూచినన్= నీవు కోపంతో చూచినట్లయితే; త్రిలోకంబులు= ముల్లోకాలు; భస్మీభూతంబులు+అగును= బూడిద అవుతాయి; అట్టి తపః ప్రభావంబునన్= అటువంటి తపశ్శక్తిచే; ప్రసిద్ధవు= పేరున్నదానవు; కావునన్= అందుచేత; నిన్నున్+ప్రార్థించెదన్= నీకు ప్రార్థన చేస్తున్నాను; అని పల్కినన్= అని చెప్పగా; ఆ+దేవి= ఆ గాంధారీదేవి; అది అంతయున్= ఆ చరిత్ర అంతా; నీ చెప్పినట్టిది+అ= నీవు చెప్పిన విధమైనదే; అని వెండియున్= అని ఇంకను.

తాత్పర్యం: కీడు కలుగుతుందని నీవు చెప్పావు. ఆ మాట సిద్ధించింది. పాండవులపట్ల ఏ తప్పూ లేదు అనే విషయం నీకూ తెలియును. వారిని కోపగించవద్దని నిన్ను వేడుకొంటున్నాను. నీవు కోపంతో చూస్తే మూడు లోకాలూ బూడిద అవుతాయి. నీ తపశ్శక్తి అంతటిది. కాబట్టి నిన్ను ప్రార్థిస్తున్నాను' అనగా ఆ గాంధారీదేవి 'అంతా నీవు చెప్పిన విధంగానే జరిగింది' అని ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'విపులవిషాదతాపమున వేదన నొందు మదీయ బుద్ధి కుం
దపగత మయ్యెఁ నీదువచనామృతసేచనఁ జేసి యిట్టిచో
నపరిమిత ప్రభావ! విను మంధుఁడు దీనుఁడు వృద్ధు నైన యీ
నృపు నరయంగఁ బాండవులు నీవును యుక్తులు గారె! యెమ్మెయిన్.' 373

ప్రతిపదార్థం: అపరిమిత ప్రభావ!= కొలువ సాధ్యం కాని శక్తి కలవాడా!; విపుల విషాద తాపమునన్= మిక్కిలి దుఃఖంవలని వేడిమివలన; వేదనన్+ఒందు= బాధపడుతున్న; మదీయబుద్ధి= నా బుద్ధి (మనసులోని); కుందు= దుఃఖం; నీదు వచన+అమృత సేచన చేసి= నీ మాటలనే అమృతపు తడుపుచేత; అపగతము+అయ్యెన్= తొలగిపోయింది; ఇట్టిచోన్= ఈ సమయంలో; వినుము= నా మాటను వినుము; అంధుఁడు= గ్రుడ్డివాడు; దీనుఁడు= దీనస్థితిలో ఉన్నవాడు; వృద్ధు= ముసలివాడూ; ఐన= అయినట్టి; ఈ నృపున్= ఈ రాజును; అరయంగన్= రక్షించటానికి; పాండవులు నీవును= నీవును పాండవులు కూడా; ఏ+ మెయిన్= ఎటుచూచినను; యుక్తులు కారె!= తగినవారు కాదా!

తాత్పర్యం: 'విస్తారమైన దుఃఖాగ్నిచేత బాధపడుతున్న నాకు నీ వచనామృతం వలన దుఃఖం తొలగింది. అపరిమిత ప్రభావా! ఈ సమయంలో గ్రుడ్డివాడు, ముదుసలి, దీనావస్థలో ఉన్నవాడు ఐన ఈ రాజును పాండవులూ నీవూ రక్షించటానికి ఏ విధంగా చూచినా తగినవారు కారా?'

వ. అని పయిచీరచెఱంగు మొగంబున నదిమికొని యేడ్చినఁ గృష్ణుండు వివిధ వాక్యంబుల నద్దేవిం దేర్చి ధృతరాష్ట్రునకు మనస్తాపోపశమనంబుగాఁ బలికెఁ; నట్టియెడ నశ్వత్థామ యుత్సాహం బమ్మహాత్మునకు హృదయగోచరం బగుటయు, దిగ్గన లేచి పారాశర్యు చరణంబులకు వినతుం డై యవ్విభునకుం బ్రణమిల్లి యతనితో నిట్లనియె. 374

ప్రతిపదార్థం: అని= అంటూ; పయిచీరచెఱంగు మొగంబునన్+అదిమికొని= మీది చీరకొంగును మొగమున ఒత్తుకొని; ఏడ్చినన్= దుఃఖపడగా; కృష్ణుండు= శ్రీకృష్ణుఁడు; వివిధవాక్యంబులన్= అనేక విధాలయిన మాటలతో; ఆ+దేవిని= ఆ గాంధారీదేవిని; తేర్చి= ఓదార్చి; ధృతరాష్ట్రునకున్ మనస్తాప+ఉపశమనంబుగాన్+పల్కెన్= ధృతరాష్ట్రుడికి మనసు చల్లనఅయ్యేటట్లుగా మాటాడాడు; అట్టి యెడన్= అటువంటి సమయంలో; అశ్వత్థామ ఉత్సాహంబు= అశ్వత్థామ యొక్క ఉత్సాహం; ఆ+ మహాత్మునకున్= ఆ శ్రీకృష్ణుడికి; హృదయ గోచరంబు+అగుటయున్= మనసునకు తోచగా; దిగ్గన లేచి= ఉన్నపళంగా లేచి; పారాశర్యుచరణంబులకున్ వినతుండు+ఐ= వ్యాసుడి పాదాలకు నమస్కారం చేసిన వాడై; ఆ+విభునకున్+ప్రణమిల్లి= ఆ ధృతరాష్ట్రుడికి నమస్కారం చేసి; అతనితోన్ ఇట్లు+అనియెన్= అతడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: గాంధారి తన పైటకొంగును ముఖమున ఒత్తుకొని దుఃఖపడగా శ్రీకృష్ణుడు నానావిధ ఉపశమన వాక్యాలతో ఆమెను ఓదార్చాడు. ధృతరాష్ట్రుడికి మనస్తాపం పోయేటట్లు మాటాడాడు. ఆ సమయంలో అతడికి అశ్వత్థామ సమరోత్సాహం గోచరించింది. అంత దిగ్గన లేచి వ్యాసుడికి ధృతరాష్ట్రుడికి నమస్కరించి ధృతరాష్ట్రుడితో ఈ విధంగా అన్నాడు:

క. 'గురుసుతుఁడు పాండవులకుం। గర మల్గును; వారిఁ బొదువఁగా నతఁ డీ ప్రొ
ద్దురవడిఁ గదియును; బోయెద। దురపిల్లకుమయ్య మది విధూతకళంకా! 375

ప్రతిపదార్థం: విధూతకళంకా!= పాపం లేనివాడా!; గురుసుతుఁడు= అశ్వత్థామ; పాండవులకున్+కరము+అల్గును= పాండవుల మీద మిక్కిలి కోపిస్తాడు; వారిన్+పొదువన్+కాన్= వారిని కమ్ముకొనగా; అతఁడు= ఆ అశ్వత్థామ; ఈ ప్రొద్దు+ఉరవడి= ఈ దినం త్వరగా; కదియును= దగ్గరచేరును; పోయెదన్= వెళ్ళుతాను; మదిన్= మనసులో; దురసిల్లకుము+అయ్యా= దుఃఖపడవద్దు.

తాత్పర్యం: అశ్వత్థామ పాండవులమీద మిక్కిలి కోపిస్తాడు. వారిని కమ్ముకొనటానికై అతడు త్వరగా వారి వద్దకు చేరుతాడు. నేను వెళ్ళివస్తాను. పాపరహితుడా! మనసులో దుఃఖపడవద్దు.'

చ. **అన విని రాజు దేవులు మురారికి నిట్లని 'రెంతయున్ రయం**
బునఁ జనుమయ్య! పాండునృపపుత్రుల నెమ్మెయి నైనఁ గాచికోల్
వినుతి గదయ్య నీకు! నిను వేయి విధంబుల నాశ్రయించు టె
ల్లను ఫల మొందఁ జేయఁగఁ దలంచుట పెంపు సుమయ్య కేశవా! **376**

ప్రతిపదార్థం: అనన్+విని= అని కృష్ణుడు అనగా విన్నవారై; రాజు, దేవులు= ధృతరాష్ట్రుడును, గాంధారియు; మురఅరికిన్+ ఇట్లు+అనిరి= శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నారు; కేశవా!= కృష్ణా!; ఎంతయున్ రయమునన్= ఎంతో వేగంగా; చనుము+అయ్య!= వెళ్ళవయ్యా!; పాండు నృప పుత్రులను= పాండురాజ కుమారులను; ఏ+మెయిన్+ఐనన్= ఏ విధంగానయినా; కాచికోల్= కాపాడుకోవటం; నీకున్+వినుతి కదయ్య!= నీకు కీర్తింపదగినది కదయ్యా! (ధర్మం కదా!); నినున్= నిన్ను; వేయివిధంబులన్= ఎన్నో విధాలుగా; ఆశ్రయించుట= ఆశ్రయించటం; ఎల్లను= అంతా; ఫలమున్+ఒందన్+చేయఁగన్+తలంచుట= ఫలితాన్ని పొందేటట్లు చేయటాన్ని తలచుకోవటం; పెంపు సుమయ్య!= గౌరవమే కదయ్యా!

తాత్పర్యం: అని కృష్ణు డనగా గాంధారీధృతరాష్ట్రులు అతడితో ఇట్లా అన్నారు. 'శీఘ్రంగా వెళ్ళవయ్యా! కేశవా! పాండురాజ కుమారులను కాపాడటం నీకు న్యాయం కదా! నిన్ను వారు వేయి విధాలుగా ఆశ్రయించటాన్ని సఫలం చేయదలచటం నీకు పెంపు గదా!

శ్రీకృష్ణుండు కరిపురంబుననుండి పాండవులయొద్దకు వచ్చుట (సం. 9-62-72)

వ. **పొమ్ము, పునర్దర్శనమయ్యెడు' మని వీడ్కొల్పిన వాసుదేవుండు వెడలెం; దదనంతరంబ వేదవ్యాసమునీశ్వరుండు వారలతో 'మీకు శోకోపశమనంబుగ నిప్పుడు శౌరి సెప్పిన వచనంబు లాదరణీయంబులు సుండీ!' యని యుపదేశించి వెండియు వలయు వాక్యంబుల వారికి నాశ్వాసంబు గావించి యంతర్ధానంబు సేసె; నిత్తెఱంగున గోవిందుండు కృతకృత్యుండై వెలువడి యరదం బెక్కియతి త్వరితగతి నోఘవతీతీరంబున కరిగి, పాండవులం గని, తాను ధృతరాష్ట్ర సన్నిధి గాంధారిం గనుటయు, వారలకు 'దుర్యోధనుండు దెగియె' నని నెట్టనం జెప్పక బెరసుంబల్కులుగా నయ్యాంబికేయుని యుపేక్షనుం గొడుకుల కీడునం దత్కులంబునకు సంక్షయంబు వాటిల్లుట యుగ్గడించుటయు, నాసందునఁ బాండవుల వలనఁ బాపంబు లేమి దెల్పుటయును, నారాజును దేవులును వారిం గోపింపకుండం బ్రార్థించుటయు నుపచారవచనంబుల చందంబున వార లా వృద్ధులకు నిస్తారకు లని పటుకుటయు, విశేషించి గాంధారికి నుచితభాషణంబుల నత్యంతోపశాంతి గలిగించుటయు, నప్పలుకు లన్నింటను దుది నయ్యిరువురు దయచేసినది సామాన్యంబున ననుష్ఠించిన**

యాపత్సమయ సమాగమంబుగాఁ గొనినమాత్రయ కాని యొండెఱుంగక యునికియు, నగ్గాంధారరాజనందన దనకు మగని నప్పగించుటయు నెఱింగించి, యంతక మున్న వచ్చి యావిచిత్రవీర్యపుత్త్రుకడం బారాశర్యుం డున్న వాఁ డమ్మహాత్ముం డే నిట వచ్చిన పిదప నాదంపతులకు నాయొనర్చిన యుపదేశంబు దృఢం బగునట్టి మాట లాడనోపు ననియు, నతని యునికి యట్లుగాఁ దన పోయినపని సఫలం బగుటయుఁ, బాండునందనులకుఁ దెలియఁ జెప్పె నని వైశంపాయనుండు జనమేజయున కి ట్లనియె. 377

ప్రతిపదార్థం: పొమ్ము= వెళ్ళుము; పునః+దర్శనము+అయ్యెడున్= మరల కానవత్తువు గాక; అని వీడ్కొల్పినన్= అని పంపగా; వాసుదేవుండు వెడలెన్= శ్రీకృష్ణుడు వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= ఆ మీదట; వేదవ్యాస మునీశ్వరుండు= వేదవ్యాస ఋషి; వారలతోన్= ఆ గాంధారీ ధృతరాష్ట్రులతో; మీకున్ శోక+ఉపశమనంబుగన్= మీకు దుఃఖంలేకుండేటట్లు; ఇప్పుడు= ఈ సమయంలో; శౌరి చెప్పిన వచనంబులు= శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు; ఆదరణీయంబులు= గౌరవించదగినవి; సుండు+ఈ!= సుమండీ!; అని ఉపదేశించి= అని తెలియజేసి; వెండియున్= ఇంకను; వలయు వాక్యంబులన్= అవసరమైన మాటలతో; వారికిన్ ఆశ్వాసంబు కావించి= వారికి ఓదార్పు కలిగించి; అంతర్ధానంబు చేసెన్= అంతర్ధానమయ్యాడు; ఈ+ తెఱంగునన్ గోవిందుఁడు= ఈ విధంగా శ్రీకృష్ణుడు; కృతకృత్యుండు+ఐ= చేయదగు పనిచేసిన వాడుగా; వెలువడి= బయటకు వచ్చి; అరదంబు+ఎక్కి= తేరెక్కి; అతి త్వరితగతిన్= మిక్కిలి వేగంగా; ఓఘవతీ తీరంబునకున్+అరిగి= ఓఘవతీ నది గట్టునకు చేరి; పాండవులన్+కని= పాండవులను చూచి; తాను ధృతరాష్ట్ర సన్నిధిన్ గాంధారిన్+కనుటయున్= తాను ధృతరాష్ట్రుడి వద్ద గాంధారిని చూచిన విధాన్నీ; వారలకున్= ఆ ఇద్దరకును; దుర్యోధనుండు తెగియెన్+అని= దుర్యోధనుడు చనిపోయాడని; నెట్టన చెప్పక= వెంటనే తెలుపకుండా; బెరసు+పల్కులుగాన్= క్రూరమైన మాటలుగా; ఆ+ఆంబికేయుని= ఆ ధృతరాష్ట్రుడి; ఉపేక్షను= అశ్రద్ధను; కొడుకుల కీడును= కొడుకుల పాపమును; తద్+కులంబునకున్= వారి వంశానికి; సంక్షయంబు పాటిల్లుట= నాశం కలగటం; ఉగ్గడించుటయున్= చెప్పటమూ; ఆ సందునన్= ఆ సందర్భంలో; పాండవులవలనన్= పాండవుల దెస; పాపంబు లేమిన్= తప్పులేకుండటం; తెల్పుటయును= తెలియజేయటం; ఆ రాజును దేవులును= ఆ గాంధారీ ధృతరాష్ట్రులు; వారిన్+కోపింపకుండ ప్రార్థించుటయున్= పాండవులమీద కోపపడకుండా ప్రార్థన చేయటం; ఉపచార వచనంబుల చందంబుగన్= ఓదార్పు మాటల మాదిరిగా; వారలు= పాండవులు; ఆ వృద్ధులకున్= ఆ ముదుసలివారికి; నిస్తారకులని పలుకుటయున్= తరింపజేసే వారని చెప్పటమూ; విశేషించి= ఎక్కువగా; గాంధారికిన్= గాంధారీదేవికి; ఉచిత భాషణంబులన్= తగిన మాటలతో; అత్యంత+ఉపశాంతి కలిగించుటయున్= మిక్కిలి ఓదార్పు చేకూర్చుటయును; ఆ+పలుకులు+ అన్నింటను= ఈ మాటలన్నిటిలోను; తుదిని= కడకు; ఆ+ఇరువురు= ఆ ఇద్దరును (గాంధారీ ధృతరాష్ట్రులు); తన చేసినది= తాను కావించినది; సామాన్యంబునన్= సాధారణంగా; అనుష్ఠించిన= ఆచరించినట్టి; ఆపద్+సమయ సమాగమంబుగాన్= కష్టకాలంలో కలవడంగా; కొనిన మాత్రయ కాని= గ్రహించడమే కాని; ఒండు+ఎఱుంగక ఉనికియున్= వేరే తెలియకుండటమునూ; ఆ+గాంధారరాజనందన= ఆ గాంధారీదేవి; తనకున్ మగనిన్+అప్పగించుటయున్= శ్రీకృష్ణుడికి భర్తను (ధృతరాష్ట్రుని) ఒప్పగించటం; ఎఱింగించి= తెలియచేసి; అంతక మున్ను వచ్చి= అంతకంటే ముందుగానే వచ్చి; ఆ విచిత్రవీర్య పుత్రుకడన్= ఆ ధృతరాష్ట్రుడి వద్ద; పారాశర్యుండు ఉన్నవాఁడు= వ్యాసుడు ఉన్నాడు; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడు; ఏన్+ఇటన్ వచ్చిన పిదపన్= నేనీ దిక్కునకు వచ్చిన తరువాత; ఆ దంపతులకున్= ఆ భార్యా భర్తలకు (గాంధారీ ధృతరాష్ట్రులకు); నా ఒనర్చిన ఉపదేశంబు= నేను చేసిన ఉపదేశం; దృఢంబు+అగునట్టి= నిశ్చయమైనటువంటి; మాటలాడన్+ఓపును+అనియున్= మాటలాడి ఉంటాడని; అతని+ఉనికి= ఆయన ఉండుట; అట్లుగాన్= ఆ విధంగా కావడంవల్ల; తనపోయిన పని= తాను వెళ్ళిన పని; సఫలంబగుటయున్= సిద్ధినందుటయును; పాండునందనులకున్= పాండవులకు; తెలియన్+చెప్పెనని= తెలిపాడని; వైశంపాయనుండు= వైశంపాయన ముని; జనమేజయునకున్= జనమేజయ చక్రవర్తితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: గాంధారీ ధృతరాష్ట్రులు 'వెళ్ళిరమ్ము. మరలా చూద్దాముగాక!' అని శ్రీకృష్ణుడికి వీడ్కోలిచ్చారు. ఆయన కూడా వెళ్ళాడు. ఆ తరువాత వేదవ్యాస మునీశ్వరుడు గాంధారీ ధృతరాష్ట్రులతో 'మీకు దుఃఖశాంతికై కృష్ణు డీ సమయంలో చెప్పినమాటలు ఆచరించటం గౌరవించటం తగును' అని ఉపదేశించాడు. ఇంకా అవసరమైన మాటలను వారిని ఓదార్చటానికై చెప్పి తానంతర్ధానమయ్యాడు. శ్రీకృష్ణుడు తాను వచ్చిన పనిని ఈ విధంగా చేసి, ఆ మీదట తన తేరుమీద వేగంగా ఓఘవతీ తీరానికి వెళ్ళి, పాండవులను చూచి, తాను ధృతరాష్ట్రుని సమక్షంలో గాంధారిని చూచిన విధమునూ, దుర్యోధనుడి చావును, వెంటనే వారికి తాను తెలుపకుండా కఠినమైన మాటలతో ధృతరాష్ట్రుడి అశ్రద్ధనూ, కొడుకుల తప్పు వల్ల జరిగిన కులనాశమునూ చెప్పటం, ఆ విషయంలో పాండవులు దోషం చేయలేదని చెప్పి ఆ ఇరువురునూ పాండవులను కోపగించరాదని ప్రార్థించటమూ, ఉపచారవచనాలవలె పాండవులు, ఆ వృద్ధుల్ని తరింపజేసే వారని పల్కడమూ, విశేషించి గాంధారీ దేవికి తగుమాటలతో మిక్కిలి ఉపశాంతి కల్గించడమూ, ఆ మాటల చివరని ఆ ఇరువురు తాను చేసినది ఆపత్సమయ సమాగమంగా భావించడమేగానీ మరొకటి తెలియకుండయు వేరేమీయూ కాదని ఆ గాంధారీదేవి తనకు ధృతరాష్ట్రుడిని అప్పగించిన తీరును తెలియజేశాడు. తనకన్న ముందుగా వ్యాసుడు, ధృతరాష్ట్రుడి వద్ద నున్న విషయమునూ, తానిట్లువచ్చిన తరువాత ఆ మహర్షి ఆ వృద్ధదంపతులకు తాను కావించిన ఉపదేశాన్ని వివరించి ఉంటాడనీ చెప్పి, తాను సఫలీకృతుడైనట్లు పాండవులకు తెలిపాడు - అని వైశంపాయనుడు జనమేజయుడితో చెప్పాడు.

క. విను మోఘవతీతీరం । బున కమ్మెయిఁ బాండురాజపుత్రులు ప్రీతిం
జనిన తెఱఁగు సంజయుచే । విని ధృతరాష్ట్రుండు శోకవిహ్వలుఁ డగుచున్. 378

ప్రతిపదార్థం: వినుము; ఓఘవతీ తీరంబునకున్= ఓఘవతీ తీర్థం దరికి; ఆ+మెయిన్= ఆ విధంగా; పాండురాజ పుత్రులు= పాండవులు; ప్రీతిన్+చనిన తెఱఁగు= ప్రీతితో వెళ్ళిన విధమును; సంజయుచేన్+విని= సంజయుడివలన విని; ధృతరాష్ట్రుండు; శోకవిహ్వలుఁడు+అగుచున్= దుఃఖంతో స్వాధీనం తప్పినవాడై.

తాత్పర్యం: నేను చెప్పేది వినుము. పాండురాజకుమారులు ఆ విధంగా ఓఘవతీ తీరానికి వెళ్ళిన విధమును సంజయుడివలన విని ధృతరాష్ట్రుడు స్వాధీనం తప్పినవాడై మిక్కిలి దుఃఖంతో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అతని కిట్లనియె. 379

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ సంజయుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు సంజయుడిని ఈ విధంగా అడిగాడు.

ఆ. 'తొడలు విఱిగి నేలఁబడియుండఁ దలదన్ని । నట్టి భీమసేనుఁ డగ్రజుండు
ననుజచయముఁ దాను నరిగినపిమ్మట! నెట్టు లయ్యె నమ్మహీశ్వరుండు?' 380

ప్రతిపదార్థం: తొడలు విఱిగి= తొడలు విరిగిపోయి; నేలన్+పడిఉండన్= భూమిమీద పడిఉండగా; తలన్+తన్నినట్టి భీమసేనుఁడు= తలను తన్నిన భీముడు; అగ్రజుండున్= అన్నగారైన ధర్మరాజు; అనుజచయమున్= తమ్ముల సమూహమును; తానున్= తానుకూడా; అరిగిన పిమ్మటన్= వెళ్ళిన తరువాత; ఆ+మహీశ్వరుండు= ఆ దుర్యోధనుడు; ఎట్టులు+అయ్యెన్?= ఏమైనాడు?

తాత్పర్యం: 'తొడలు విరిగి నేలమీద పడినవాని తలను తన్నిన భీముడు, అన్నగారితోనూ తమ్ములతోనూ కలసి వెళ్ళిన మీదట ఆ దుర్యోధనుడు ఏమైనాడు?'

వ. అని యడిగిన నమ్మానవపతికి నాసూతనూనుం డిట్లను 'నేను బొదలో నుండి, యుధిష్ఠిరుండు యుద్ధ సమయంబు నిశ్చయించిన నీ కొడుకు పొలికలనికి నడచునప్పుడు వెడలి, పాండవపరిజనంబులం గలసి వారు నన్నుఁ డాసినదృష్టిం గనుంగొని నక్కురపతికిం బొడసూపక చని, గదారణం బనుసంధించి యునికింజేసి యక్కౌంతేయు లరిగినయనంతరంబ యమ్మహీకాంతునికడకుం బొగులుచుఁ బోయితిఁ; బోయిన నతండు ధూళి పొదివిన వదనంబుపై నెఱసిన వెండ్రుకలు వాయంద్రోచికొని, నా మొగంబుఁ జూచి, ధర్మనందను నిందించుచు నవుడు గఱచి కన్నీరు గ్రమ్మ నిట్టూర్పు నిగిడించి. 381

ప్రతిపదార్థం: అని అడిగినన్ ఆ+మానవపతికిన్= (తొడలు విరిగి నేలమీద పడిన దుర్యోధను డేమైనాడని అడిగిన ఆ ధృతరాష్ట్రుడికి) ఆ విధంగా అడుగగా ఆ రాజునకు; ఆ సూతసూనుండు+ఇట్లనున్= ఆ సంజయుడు ఈ విధంగా అన్నాడు; నేను పొదలోన్+ఉండి= నేను పొదలో దాగి ఉండి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; యుద్ధసమయంబున్= యుద్ధానికి వేళను; నిశ్చయించినన్= నిర్ణయించగా; నీ కొడుకు= నీ కుమారుడు; పొలికలనికిన్= యుద్ధభూమికి; నడచునప్పుడు= వెడలేటప్పుడు; వెడలి= బయల్పిడి వెళ్ళి; పాండవ పరిజనంబులన్+కలసి= పాండవుల సేవకులను కలిసికొని; వారు నన్ను డాసిన దృష్టి కనుంగొనన్= వారు నన్ను సమీపించగా గమనించి; ఆ+కురుపతికిన్+పొడసూపక= ఆ దుర్యోధనుడికి కానరాకుండా; చని= వెళ్ళి; గదారణంబు+అనుసంధించి ఉనికిన్+చేసి= గదా యుద్ధమును పరిశీలించియున్నందువల్ల; ఆ+కౌంతేయులు= ఆ కుంతీ తనయులు; అరిగిన+అనంతరంబు+అ= వెళ్ళిన తరువాత; ఆ+మహీకాంతుని కడకున్= ఆ రాజువద్దకు; పొగులుచున్= పరితపిస్తూ; పోయితిన్= వెళ్ళాను; పోయినన్= పోగా; అతండు= ఆ రాజు; ధూళి పొదివిన వదనంబుపైన్= దుమ్ము క్రమ్మిన ముఖాన; నెఱసిన= వ్యాపించిన (చిందర వందరగా పడిఉన్న); వెండ్రుకలు= వెంట్రుకలను; పాయన్+త్రోచికొని= తొలగద్రోచికొని; నా మొగంబు చూచి= నా ముఖం చూచి; ధర్మనందనున్ నిందించుచున్= ధర్మరాజును దూషిస్తూ; అవుడుకఱచి= క్రింది పెదవిని తొక్కిపట్టి; కన్నీరు క్రమ్మన్ నిట్టూర్చి= కన్నీరు క్రమ్ముకోగా నిట్టూర్పు వదలి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు అడిగిన దానికి సంజయుడు సమాధానంగా ఇట్లా చెప్పాడు. 'నేను పొదలో దాగికొనిఉండి ధర్మరాజు యుద్ధసమయాన్ని నిశ్చయించటం వలన నీ కుమారుడు కదనరంగానికి వెళ్ళేటప్పుడు పాండవుల సేవకులను కలిసి వాళ్ళు నా దగ్గరకు రావటాన్ని గుర్తించి, ఆ సుయోధనుడికి కానరాకుండా వెళ్ళి గదాయుద్ధాన్ని పరిశీలించి యున్నందువల్ల కుంతీతనయులు వెళ్ళిన తదుపరి వెళ్ళాను. అతడు దుమ్ముకమ్ముకొన్న ముఖం మీద చిందరవందరగా పడిఉన్న వెంట్రుకలను తొలగించుకొని నా ముఖం చూచి కన్నీళ్ళతో ధర్మరాజును దూషిస్తూ పెదవి కరచిపట్టి నిట్టూర్పు వదలి. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. 'నేల నాలుగు సెఱఁగులు నేలి భీష్మ। గురుకృపాదులపైఁ గార్యభరము నిల్పి
యున్న వానికి దుది నిట్టు లుండవలసెఁ। గాల సంప్రాప్త మేరికిఁ గడప వచ్చు? 382

ప్రతిపదార్థం: నేల నాలుగు చెఱఁగులున్+ఏలి= నేల నాలుగు దిక్కులను పాలించి; భీష్మగురు కృపాదులపైన్= భీష్మ ద్రోణ కృపులమీద; కార్య భరము నిల్పి= పనిచేసే బాధ్యతను నిలిపి; ఉన్న వానికిన్= ఉన్నటువంటి ఆతనికి; తుదిన్+ఇట్టులుండవలసెన్= చివరకు ఈ విధంగా ఉండవలసి వచ్చింది; కాలసంప్రాప్తము= విధిని; ఏరికిన్ గడపవచ్చున్?= ఎవరికి దాటటానికి సాధ్యం?

తాత్పర్యం: 'నాలుగు దిక్కులకూ వ్యాపించిన రాజ్యాన్ని పాలించి, భీష్మద్రోణకృపాదులకు కార్య భారాన్ని అప్పజెప్పి ఉన్న వాడికి చివరకు ఇట్టి అవస్థ కలిగింది. విధి ఇట్లున్నది. దైవనిర్ణయాన్ని అతిక్రమించటం ఎవరికి సాధ్యం?

విశేషం: అర్థాంతరన్యాసం. విశేషాంశాన్ని సామాన్యాంశం సమర్థిస్తున్నది.

క. ననుఁ బదునొకఁ డక్షౌహిణు । లనూనవిభవమునఁ గొల్వ నఖిల నృపులు పం
చిన పని సేసి మెలఁగి; ర । ట్లునికి గనిన నీవ యిట్టు లునికియుఁ గంటే? 383

ప్రతిపదార్థం: పదునొకఁడు+అక్షౌహిణులు= పదకొండ క్షౌహిణీ సేన; ననున్= నన్ను; అనూనవిభవమునన్= గొప్ప వైభవముతో; కొల్వన్= సేవించగా; అఖిల నృపులు= రాజులందరును; పంచిన పనిచేసి= చెప్పిన పనిని చేసి; మెలఁగిరి= తిరిగారు; అట్లు+ ఉనికిన్+కనినన్= ఆ విధంగా ఉండటాన్ని చూచిన; నీవ= నీవే; ఇట్టులు+ఉనికియున్+కంటే?= ఇట్లా ఉండటాన్ని చూచావా?

తాత్పర్యం: పదకొండు అక్షౌహిణులసేన ఎంతో వైభవంగా కొల్వగా సాటిలేని వైభవంతో రాజులందరూ సేవించగా ఆ విధంగా ఉన్న నన్ను చూచావు. ఇపుడు ఈ విధంగా ఉండటాన్ని చూస్తున్నావా?

ఆ. వాయునందనుఁడు గదాయుద్ధధర్మంబు । నుజ్జగించి నింద కోర్చి యిట్లు
సేసె నిత్తెఱంగు సెప్పుమీ! సంజయ! । మనకు నిపుడు గల్గుజనుల కెల్ల. 384

ప్రతిపదార్థం: సంజయ!= ఓ సంజయుడా!; వాయునందనుఁడు= భీమసేనుడు; గదా యుద్ధ ధర్మంబున్= గదా యుద్ధపు నియమాన్ని; ఉజ్జగించి= తప్పిపోయి; నిందకున్+ఓర్చి= లోకనిందను భరించటానికి సిద్ధపడి; ఈ+తెఱంగు= ఈ విధాన్ని; మనకున్ ఇపుడు కల్గు జనులకున్+ఎల్లన్= మన కిపు డున్న మనుజుల కందరికీ; చెప్పుమీ= చెపుమా.

తాత్పర్యం: ఓ సంజయా! భీముడు గదాయుద్ధ నియమాల నతిక్రమించి ఈ విధంగా చేశాడనీ, లోక నిందను భరించటానికి సిద్ధమైనాడనీ మిగిలి ఉన్న మన వారికందరకూ చెప్పుము.

చ. అనిమిషవాహినీతనయు నస్త్రకళాగురు సౌమదత్తిఁ గ
ర్ణుని రణధర్మహీనతకు రోయక చంపినభంగులున్ మరు
త్తనయుఁడు నేఁడు సేసిన విధంబును లోకులు పాండురాజనం
దనతతిఁ బ్రువ్వఁ దిట్టరె? వృథావిజయం బిది యెంత యొప్పెడున్? 385

ప్రతిపదార్థం: అనిమిష వాహినీ తనయున్= దివ్య నదిఅయిన గంగా తనయుడైన భీష్ముడిని; అస్త్రకళా గురున్= ధనురాచార్యుడిని (ద్రోణుడిని); సౌమదత్తిన్= భూరిశ్రవుడిని; కర్ణునిన్; రణ ధర్మహీనతకున్= యుద్ధ ధర్మమును తప్పటానికి; రోయక= అసహ్యపడక; చంపిన భంగులున్= చంపిన పద్ధతులును; మరుత్+తనయుఁడు= వాయునందనుడైన భీముడు; నేఁడు చేసిన విధంబును= ఈ దినం కావించిన పద్ధతిని; లోకులు= లోకమందరి వారు; పాండురాజనందనతతిన్= పాండుకుమారుల సమూహాన్ని; ప్రువ్వన్= పురుగులు పడగా (నాశమందగా); తిట్టరె!= నిందించరా; వృథావిజయంబు= వ్యర్థమైన విజయం; ఇది= ఈ పొందినది; ఎంత ఒప్పెడున్?= ఎంత తగి ఉన్నది?

తాత్పర్యం: భీష్మద్రోణ భూరిశ్రవ కర్ణులను యుద్ధధర్మాన్ని పాటించకుండా నీచంగా చంపిన తీరును, ఈరోజు వాయునందనుడు కావించిన పద్ధతిని లోకులంతా పాండవులను పురుగులు పడగా తిట్టరా? ఈ వృథా విజయం- - ఏ మాత్రం తగి ఉన్నది?

క. అనిలజుఁడు పోలెఁ గపటపు । టనువునఁ బగవారి నోర్చి హర్షంబునఁ దే
లునె? తూలపోనిమగఁటిమి । దనకుఁ గలుగునట్టి కీర్తి తత్పరుఁ డెందున్. 386

ప్రతిపదార్థం: తూలపోని= చలించని; మగఁటిమి= పరాక్రమం; తనకున్; కలుగునట్టి; కీర్తితత్పరుఁడు= కీర్తి కావాలనుకొనేవాడు; ఎందున్= ఎక్కడైనా; అనిలజుఁడు+పోలెన్= భీముడివలె; కపటపు+అనువునన్= మోసపు పద్ధతిలో; పగవారిన్= శత్రువులను; ఓర్చి= ఓడించి; హర్షంబునన్= సంతోషంతో; తేలునె?= తేలిపోతాడా?

తాత్పర్యం: వాయుతనయు డైన భీముడివలె మోసంతో విరోధుల నోడించినవాడు సంతోషంతో తేలియాడగలడా? తూలిపోని మగతనం కలవాడు కీర్తి కాముకుడైన వాడు ఎక్కడనైనా అట్లా ఉంటాడా?

చ. మఱియు నొకండు వింటె? పవమాన తనూజుని చెయ్దిఁ బెన్దొడల్
విఱిగి ధరిత్రిఁ బడ్డయెడ వేగమె వచ్చి శిరంబుఁ దన్నె నే
డ్తెఱ గలయప్డు శత్రు నవధీరితుఁ జేయుట యొప్పఁ గాక యే
పఱినఁ బరాభవించిన జనావళి నవ్వదె? నొవ్వదే మదిన్? 387

ప్రతిపదార్థం: మఱియున్+ఒకండు= ఇంకొక్కటి; వింటె?= విన్నావా?; పవమానతనూజుని చెయ్దిన్= భీముడి పనిచేత; పెన్+తొడల్ విఱిగి= పెద్ద తొడలు విరిగిపోయి; ధరిత్రిన్+పడ్డయెడన్= భూమిమీదపడినప్పుడు; వేగమె వచ్చి= త్వరగా వచ్చి; శిరంబున్+తన్నెన్= తలను తన్నాడు; ఏడ్తెఱ+కల యప్డు= ఆధిక్యం కలిగినపుడు; శత్రున్= వైరిని; అవధీరితున్+చేయుట= తిరస్కరించటం; ఒప్పున్+కాక= తగునుగాక; ఏపు+అఱినన్= ఆధిక్యం నశించగా; పరాభవించినన్= అవమానం కావిస్తే; జనావళి నవ్వదె?= జనసమూహం నవ్వదా?; మదిన్ నొవ్వదే?= మనసులో నొచ్చుకోదా?

తాత్పర్యం: ఇంకను భీముడి చేష్ట మరొకదానిని విన్నావా? తొడలు విరిగిపడి ఉన్నపుడు శీఘ్రంగా వచ్చి నా తలను తన్నాడు. ఆధిక్యమున్నపుడు తిరస్కారభావంతో చూడవచ్చును. అంతవరకు తగును గాని ఆధిక్యం నశించిన సమయంలో అవమానిస్తే జనసమూహం నవ్వదా? మనసులో నొచ్చుకోదా?

క. మనరాజును దేవులు భం । డనము తగవు నేర్పరించుటకు నేర్తురు; భీ
ముని చేసినయది సంజయ! । వినిపింపుము వారలకు సవిస్తారముగన్. 388

ప్రతిపదార్థం: సంజయా!; మనరాజును+దేవులు= ధృతరాష్ట్రుడు, రాణులు; భండనము తగవు= యుద్ధ ధర్మమును; ఏర్పరించుటకున్= వివరించటానికి; నేర్తురు= తెలిసి ఉన్నారు; భీముడి చేసిన+అది= భీముడు కావించిన దానిని; వారలకున్= వాళ్ళకు; సవిస్తారముగన్= వివరంగా; వినిపింపుము= తెలుపుము.

తాత్పర్యం: ఓ సంజయా! మన రాజును, రాణులును యుద్ధధర్మమును విశ్లేషించటం తెలిసినవారు. భీముడు చేసిన పనిని వారలకు విస్తారంగా వివరించుము.

వ. మఱియును. **389**

ప్రతిపదార్థం: మరియును= ఇంకను.

తాత్పర్యం: ఇంకా.

మ. చెలులం జుట్టలఁ బ్రోచి యర్థిజనులన్ శ్రీమంతులన్ జేసి, వి
ప్రుల భవ్యస్థితి మన్చి యాగములు పేరుం బెంపు శోభిల్ల ని
ట్టలపుం ద్యాగము దానమున్ నడపి నిష్ఠం బెక్కు సెల్లించి యు
జ్జ్వలతేజంబున నిద్ధభూతి భుజగర్వస్ఫూర్తిఁ బొల్పారితిన్. **390**

ప్రతిపదార్థం: చెలులన్+చుట్టలన్+ప్రోచి= స్నేహితులను బంధువులను రక్షించి; అర్థిజనులన్= ఆశ్రయించిన వారిని; శ్రీమంతులన్+చేసి= ఐశ్వర్యవంతులను కావించి; విప్రులన్= బ్రాహ్మణులను; భవ్యస్థితిన్= యోగ్యమైన స్థితిలో; మన్చి= కాపాడి; పేరున్+పెంపు శోభిల్లన్= కీర్తి గొప్పతనం ప్రకాశించగా; యాగములు; ఇట్టలపున్+త్యాగము+దానమున్ నడపి= మిక్కిలి త్యాగంతో దానాలు చేసి; నిష్ఠన్+పెక్కు+చెల్లించి= నియమంతో చాలా వాటిని చేసి; ఉజ్జ్వలతేజంబునన్= మిక్కిలి ప్రకాశంతో; ఇద్ధభూతిన్= గొప్ప సంపదతో; భుజగర్వస్ఫూర్తిన్= భుజబలంతో; పొల్పు+ఆరితిన్= ఒప్పి ఉన్నాను.

తాత్పర్యం: స్నేహితులను బంధువులను రక్షించి, ఆశ్రయించినవాళ్ళను శ్రీమంతులనుగా చేశాను. బ్రాహ్మణులను క్షేమంగా ఉండగా కాపాడాను. కీర్తి ప్రతిష్ఠలు పెరుగగా యాగాలు చేశాను. మిక్కిలి ప్రకాశవంతమైన తేజస్సుతో సాటిలేని సంపదతో భుజబలంతో స్థిరంగా వెలిగాను.

క. పగవారి నాశ్రయింపక । మగఁటిమియును బ్రాభవంబు మానము నెందుం
బొగడొంద నుల్లసిల్లితిఁ । దెగునంతకు లక్ష్మితోఁ బ్రదీప్తుఁడ నైతిన్. **391**

ప్రతిపదార్థం: పగవారిన్+ఆశ్రయింపక= వైరులను ఆశ్రయించక; మగఁటిమియును= వీరత్వమును; ప్రాభవంబున్= గొప్పదనమును; మానమున్= అభిమానమును; ఎందున్+పొగడొందన్= ఎక్కడ కూడా కీర్తింపబడగా; ఉల్లసిల్లితిన్= ఆనందంగా ఉన్నాను; తెగు+అంతకున్= క్రిందపడిపోవుదాకా; లక్ష్మితోన్= సంపదతో; ప్రదీప్తుడను+ఐతిన్= ప్రకాశించాను.

తాత్పర్యం: క్రిందపడేదాకా శత్రువులను ఆశ్రయించకుండా వీరత్వంతో గొప్ప అభిమానంతో అంతటా పొగడబడుతూ సంతోషంతో వెలిగాను.

క. సమరము శమంతపంచక । సమీపమున ధర్మవృత్తిఁ జలుపఁగ నత్యు
త్తమ లోకము సమకూఱెను; । విమలాత్ముఁడ నైతి; నొండు వేయును నేలా? **392**

ప్రతిపదార్థం: శమంత పంచక సమీపమునన్= శమంత పంచకం దగ్గర; సమరమున్= యుద్ధంలో; ధర్మవృత్తిన్+చలుపఁగన్= న్యాయంగా చేయగా; అత్యుత్తమ లోకము= మిగుల పవిత్రమైన లోకము; సమకూఱెను= సిద్ధించింది; విమల+ఆత్ముఁడన్+ఐతిన్= నిర్మలమనస్కుడ నైనాను; ఒండు= వేరు; వేయున్+ఏలా?= వేయి మాటలెందుకు?

తాత్పర్యం: శమంతపంచకం దగ్గర యుద్ధం ధర్మంగా చేయగా పుణ్యలోకాలు ప్రాప్తించాయి. నిర్మల మనస్కుడ నైనాను. వేయి మాట లెందుకు?

క. ఎదిరి పెనగంగఁ జాలక నిదురవోవ । నొంచు తెఱఁగున, విషము వెట్టించు పగిది,
నింటఁ జిచ్చిడు చాడ్పున, నిట్లు సేసి । పడయుదురుగాక రాజ్య మప్పాండుసుతులు!' 393

ప్రతిపదార్థం: ఆ+పాండుసుతులు= ఆ పాండురాజు కొడుకులు; ఎదిరి పెనగంగన్+చాలక= ఎదుర్కొని యుద్ధం చేయలేక; నిదుర+పోవన్= నిదుర పోతుండగా; నొంచు తెఱఁగునన్= బాధించే విధంగా; విషము పెట్టించు పగిదిన్= విషం పెట్టించిన విధంగా; ఇంటన్+చిచ్చిడు చాడ్పునన్= ఇంటికి అగ్గిపెట్టిన విధంగా; ఇట్లు చేసిన= ఈ విధంగా చేసి (మోసంగా కొట్టి); రాజ్యము= రాజ్యమును; పడయుదురుగాక!= పొందుదురు గాక!

తాత్పర్యం: ఆ పాండురాజు కొడుకులు ఎదుర్కొని పోరాడలేక నిద్రించేవాడిని బాధించిన విధంగాను, విషప్రయోగం చేసినట్లూ - ఇంటికి అగ్గిపెట్టినట్లుగాను, ఈ విధంగా (మోసంతో) రాజ్యాన్ని పొందుదురుగాక!'

వ. అని యంత నిలువక. 394

ప్రతిపదార్థం: అని= అంటూ; అంతన్ నిలువక= అంతటితో ఆగకుండా.

తాత్పర్యం: అంటూ అంతటితో ఆగకుండా - (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. 'పాపకర్ము లయినపాండుతనూజులు । సమరధర్మ మెడలి జయము గొనుట
గురుసుతునకుఁ గృపునకుం గృతవర్మ కు । దేట పఱుపు నాదుమాట గాఁగ. 395

ప్రతిపదార్థం: పాపకర్ములు+అయిన= పాపాత్ములయిన; పాండు తనూజులు= పాండురాజు కుమారులు; సమరధర్మము+ఎడలి= యుద్ధ నీతిని అతిక్రమించి; జయము+కొనుట= గెలవటాన్ని; గురుసుతునకున్= అశ్వత్థామకు; కృపునకున్= కృపాచార్యుడికి; కృతవర్మకున్= కృతవర్మకును; నాదుమాట కాఁగన్= నా మాటగా; తేట+పఱుపు(ము)= స్పష్టంగా చెప్పుము.

తాత్పర్యం: 'పాపాత్ము లయిన పాండురాజు కుమారులు యుద్ధ ధర్మాన్ని అతిక్రమించి జయమందిన పద్ధతిని అశ్వత్థామ, కృప, కృతవర్మలకు స్పష్టంగా నా మాటగా తెలియజేయుము.

క. దేవవ్రతగురుకర్ణుల । దేవసములఁ బాడి దొఱఁగి తెగటార్చుటయున్
నీవు దలఁపించి వారల । తో వెండియు నిట్టు లనుము దుర్జనదూరా! 396

ప్రతిపదార్థం: దుర్జనదూరా!= చెడ్డవారికి దూరంగా ఉండేవాడా!; దేవవ్రత= భీష్మ; గురు= ద్రోణాచార్య; కర్ణులన్= కర్ణులను; దేవసములన్= దేవతాసములను; పాడిన్+తొఱఁగి= ధర్మం తప్పి; తెగటార్చుటయున్= చంపటాన్నీ; నీవు తలఁపించి= నీవు జ్ఞాపకం చేసి; వారలతోన్= అశ్వత్థామ, కృప, కృతవర్మలతో; వెండియున్= ఇంకను; ఇట్టులు+అనుము= ఈ విధంగా చెప్పుము.

తాత్పర్యం: పాపదూరుడా! దేవసమాను లయిన భీష్మ ద్రోణ కర్ణులను ధర్మాతిక్రమణం చేసి చంపటాన్ని నీవు (వారికి) జ్ఞాపకం చేసి, అశ్వత్థామ, కృప, కృతవర్మలతో ఇంకా ఇట్లా చెప్పుము.

ఆ. కపటధర్మకంచుకంబున వెలసిరి । గాని సత్యపురుషకారపరులు
గారు పాండుసుతులు; వారల నమ్మంగఁ । గాదు సేత గుండెకాయ యిడిన. 397

ప్రతిపదార్థం: పాండుసుతులు= పాండురాజ కుమారులు; కపట= మోసమయిన; ధర్మకంచుకంబునన్ వెలసిరికాని= ధర్మమనే కవచంతో (ముసుగుతో) ఉన్నారు కానీ; సత్యపురుషకారపరులుకారు= సత్యమైన మగటిమి కలవారు కారు; గుండెకాయ= గుండెకాయను (మనసును); చేతన్= చేతిలో; ఇడినన్= పెట్టినప్పటికిని; వారలన్ నమ్మంగన్ కాదు= వారలను నమ్మరాదు.

తాత్పర్యం: పాండురాజు కుమారులు సత్య ప్రయత్నపరులుకారు. మోసపు ధర్మమనే కవచంతో బ్రతికారు. అరచేతిలో గుండెకాయను తీసి పెట్టినప్పటికినీ వారిని నమ్మరాదు.

వ. ఇది నామాట గాఁ జెప్పు' మని పలికె నప్పు డచ్చేరువపల్లెలవారు దన్నుం జూడ వచ్చిన నజ్జనంబులఁ గలయం గనుంగొని గాంగేయుండును గుంభసంభవుండును మొదలైన బంధుమిత్రులను లక్ష్మణుండు లోనుగాఁ గల కుమారులను బేరుకొని వారు మున్ను సనుటం జెప్పి, వారు సనినలోకంబ తనకుఁ బాటిల్లుట యుగ్గడించి, తన దేవులును దుస్సలయు నాదిగాఁ గల యబలలు దాసు లేనిపిమ్మటఁ బొందుదురవస్థలు వాక్రుచ్చి పనవిన విని వారలు గన్నీరొలుక నుమ్మలికంబు గూరునుల్లంబులతోఁ జని; రందుఁ గొంద అశ్వత్థామ ప్రముఖరథికత్రయం బయ్యెడ మెలంగుట యెఱింగి వారలకు రాజరాజువార్త సెప్పిన వారలు సత్వరంబున నచ్చటి కరుదెంచి యరదంబు డిగ్గి. 398

ప్రతిపదార్థం: ఇది= ఈ విషయం; నా మాటగాన్+చెప్పుము= నేను చెప్పినట్లుగా తెలుపుము; అని పలికెన్= అని చెప్పాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+చేరువ= ఆ సమీపంలోఉన్న; పల్లెవారు= జానపదులు; తన్నున్+చూడవచ్చినన్= తనను (దుర్యోధనుడిని) చూడరాగా; ఆ+జనంబులన్+కలయన్+కనుంగొని= ఆ జనులను బాగుగా చూచి; గాంగేయుండును= భీష్ముడును; కుంభ సంభవుండును= ద్రోణుండును; మొదలైన బంధుమిత్రులును; లక్ష్మణుండు లోనుగాగల కుమారులను= లక్ష్మణుడు మొదలైన కుమారులను; పేరుకొని= పేర్కొని; వారు మున్ను చనుటన్+చెప్పి= వా రంతకు ముందుగానే చనిపోవటాన్ని తెల్పి; వారు చనిన లోకంబు+ఆ= వారువెళ్ళిన లోకమే; తనకున్+పాటిల్లుట ఉగ్గడించి= తనకూ సిద్ధించుటను చెప్పి; తన దేవులును, దుస్సలయున్ ఆదిగాన్+కల ఆబలలు= తనరాణులు, తోడబుట్టువగు దుస్సల మొదలైన ఆడవారు; తాను లేని పిమ్మటన్= తానులేకున్న తరువాత; పొందు దురవస్థలు= అనుభవించే కష్టాలను; వాక్రుచ్చి= చెప్పి; పనవినన్ విని= దుఃఖించగా విన్నవారై; వారలు= ఆ జానపదులు; కన్నీరు+ఒలుకన్= కళ్ళలో నీరు చిందగా; ఉమ్మలికంబు కూరు+ ఉల్లంబులతోన్= దుఃఖంనిండిని మనసులతో; చనిరి= వెళ్ళారు; అందున్= వారిలో; కొందఱు= కొంతమంది; అశ్వత్థామ ప్రముఖ= అశ్వత్థామ మొదలైన ముఖ్యులయిన; రథికత్రయంబు= సేనానులు ముగ్గురు; ఆ+ఎడన్+మెలంగుటన్= ఆ ప్రాంతంలో తిరుగుతూ ఉండటం; ఎఱింగి= తెలిసి; వారలకున్= ఆ రథిక త్రయానికి; రాజరాజు= దుర్యోధనుడి; వార్త= విషయం; చెప్పినన్= చెప్పగా; వారలు= ఆ రథికులు; సత్వరంబునన్= వేగంగా; అచ్చటికిన్+అరుగుదెంచి= ఆ చోటునకు వచ్చి; అరదంబులు డిగ్గి= తేరులు దిగి.

తాత్పర్యం: (దుర్యోధనుడు సంజయుడితో) 'ఈ చెప్పేది నా మాటలుగా చెప్పుము' అన్నాడు. ఆ సమయాన అక్కడకు దగ్గరగా ఉండే జనపదాలలోని వారంతా తనను చూడడానికై రాగా వారినంతా తేరిపారచూచి, భీష్మద్రోణాది ముఖ్యులైన బంధుమిత్రులను, లక్ష్మణుడు మొదలయిన కుమారులను తలచుకొని వారంతా ముందుగా చనిపోవటాన్ని తెలిపి, వారు పోయిన లోకాలు తనకు కూడా సిద్ధిస్తాయని చెప్పి, తన రాణులు, దుస్సల మొదలయిని స్త్రీలు. తాను లేని తరువాత పొందే కష్టాలను తెలిపి దుఃఖించగా వారు కన్నీటితో కుములుతున్న మనసులతో వెళ్ళారు. వారిలో

కొంతమంది అశ్వత్థామ మొదలయిన ముఖ్య సేనానులు ముగ్గురూ ఆ ప్రాంతంలో తిరగటాన్ని విని, వారి కా రాజరాజు స్థితిని తెలుపగా వా రతివేగంగా ఆ చోటికి వచ్చి తమ రథాలు దిగి.

కృప కృతవర్మాశ్వత్థామలు దుర్యోధనుం జేరి విలపించుట (సం. 9-64-3)

సీ. కడుబెట్టిదం బగు గాలిచేఁ గూలిన । మహనీయసాలభూరుహము పోల్కిఁ,
బ్రబలకిరాతమార్గణములఁ ద్రెళ్ళిన । రాజితవన్యవారణము మాడ్కిఁ,
గల్పాంత వాయుసఖస్ఫురణంబున । నివిరి పోయిన మహార్ణవము కరణిఁ,
గాలపర్యయమునఁ దూలి మేదినిమీఁదఁ । బడిన పూర్ణేందు బింబంబు పగిది.

తే. దుఃస్థుఁ డై యుండియును నొప్పు దొరుఁగకున్న । యన్న రేశ్వరుఁ గనుఁగొని యడలు నెడల
తోడ మేనులు దూలఁగఁ దొట్రుపడుచుఁ । జేరి యాతని చుట్టు వాసీను లైరి. 399

ప్రతిపదార్థం: కడు బెట్టిదంబగు గాలిచేన్= మిక్కిలి భయంకరమైన గాలి మూలంగా; కూలిన= పడిపోయిన; మహనీయ= గొప్పదైన; సాలభూరుహము పోల్కిన్= మద్ది చెట్టుమాదిరిగను; ప్రబల= బలవంతులైన; కిరాతమార్గణములన్= బోయవారి బాణములవలన; త్రెళ్ళిన= పడిన; రాజిత= అందమైన; వన్యవారణము మాడ్కిన్= అడవి ఏనుగువలెను; కల్పాంత= ప్రళయకాలమునందలి; వాయుసఖ= అగ్ని యొక్క; స్ఫురణమునన్= విజృంభణంతో; ఇవిరిపోయిన= ఎండిపోయినవంటి; మహార్ణవము కరణిన్= పెను సంద్రము మాదిరిగను; కాలపర్యయమునన్= కాలం మారటంచేత; తూలి= తూలిపోయి; మేదినిమీఁదన్+పడిన= భూమి మీదపడిపోయిన; పూర్ణ+ఇందు బింబంబు పగిదిన్= నిండు చందురుడి మాదిరిగను; దుఃస్థుడైఉండియును= దుఃఖంలో ఉన్నవాడై కూడా; ఒప్పు= సొగసు(శోభ); తొరుఁగకున్న= తొలగిపోకుండా ఉన్నట్టి; ఆ+నరేశ్వరున్+కనుఁగొని= ఆ రాజరాజును చూచి; అడలు= బాధనొందు; ఎడల తోడన్= గుండెలతో; మేనులు= శరీరాలు; తూలఁగన్= తూలిపోగా; తొట్రుపడుచున్= తడబడుతూ; చేరి= ఆ చోటు చేరి; అతని చుట్టున్= అతడి చుట్టూరా; ఆసీనులు+ఐరి= కూర్చున్నారు.

తాత్పర్యం: మిక్కిలి పెనుగాలికి కూలి పడిపోయిన మద్దిచెట్టువలెను, బలవంతులయిన బోయల బాణాల దెబ్బలకు పడిపోయిన అడవి ఏనుగు వలెను, ప్రళయకాలంలోని అగ్నివలన ఎండిపోయిన పెనుసంద్రంవలెను, కాలం తలక్రిందులు కావటంచేత తూలిపోయి భూమిమీద పడిన నిండు చందురుడివలెను, దుఃఖితుడై కూడా శోభ తొలగకుండా ఉన్న ఆ రాజరాజును చూచి దుఃఖంతో అదురుతున్నట్టి గుండెలతో కూడి, తూలిపోయే శరీరాలు వణకుతుండగా ఆ దుర్యోధనుడి చుట్టూ కూర్చున్నారు.

విశేషం: అలం: మాలోపమ.

వ. ఆసీనులైన యెడ నగ్గురుసుతుండు. 400

ప్రతిపదార్థం: ఆసీనులైన ఎడన్= కూర్చున్న సమయంలో; ఆ+గురుసుతుండు= ఆ అశ్వత్థామ.

తాత్పర్యం: ఆ కృపకృతవర్మాశ్వత్థామలు కూర్చోగా, వారిలో అశ్వత్థామ. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. 'అక్కట! యెప్డుఁ బల్వురు ధరాధిపతుల్ గొలువంగ నుండు నీ
వొక్కరుఁ డున్నవాఁడవు; మహోన్నతపీఠ మలంకరించు నిన్
దెక్కలిఁ దాఁకి ధాత యిలఁ ద్రెళ్ళెడునట్లుగఁ జేసె; నీబలం
బెక్కడఁ బోయె? సైన్యపతు లేరొకొ యిక్కడ రారు? భూవరా! 401

ప్రతిపదార్థం: భూవరా!= ఓ రాజా!; అక్కట!= అయ్యో!; ఎప్డున్= అన్ని సమయాలలోనూ; పల్వురు= చాలామంది; ధరాధిపతుల్= రాజులు; కొలువంగన్= సేవించగా; ఉండు నీవు= ఉండే నీవు; ఒక్కరుడు+ఉన్న వాఁడవు= ఒక్కడవే ఉన్నావు; మహా+ఉన్నత పీఠము+అలంకరించు= మిక్కిలి ఎత్తైన గద్దెపై అందంగా కూర్చుంటూ ఉండే; నిన్= నిన్ను; తెక్కలి తాఁకి= మోసంగా ఎదుర్కొని; ధాత= విధి; ఇలన్= భూమిమీద; త్రెళ్ళెడునట్లుగన్+చేసెన్= పడేటట్లుగా చేశాడు; నీ బలంబు+ఎక్కడన్+పోయెన్?= నీ శక్తి ఎటు పోయింది?; ఇక్కడన్= ఈ చోటికి; సైన్యపతులు= సేనా నాయకులు; ఏల+రారు+ఒకొ?= ఎందుకు రావటం లేదు?

తాత్పర్యం: 'ఓ రాజా! అన్ని సమయాలలోనూ పెక్కురాజులు సేవించగా ఉండే నీవు, ఇప్పుడు ఒక్కడవే ఉన్నావు. మహోన్నతమైన గద్దెను అలంకరిచే నిన్ను విధి మోసంగా తాకి భూమిపై పడేటట్లుగా చేశాడు. నీబలం అంతా ఎక్కడకు పోయింది? సేనాపతులు రారేమి?

తే. కడలుకొనఁ జుట్టుఁ బట్టెడు గొడుగు లెవ్వి? । యెసక మెసఁగంగ సీవురు లేల పట్ట
రంగమున? నాననంబున నవని ధూళి । గదిరె; జలక మే లాడవు కౌరవేంద్ర? 402

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కురురాజా!; కడలుకొనన్= అతిశయంగా; చుట్టును= నీ చుట్టూ; పట్టెడు= పట్టుకొనే; గొడుగులు+ఏవి?= గొడుగులు ఏవి?; ఎసకమెసఁగంగన్= మిక్కిలిగా (అతిశయంగా); సీవురులు= వింజామరలు; ఏల పట్టరు?= ఎందుకు పట్టుకోరు?; అంగమునన్= ఒంటిమీద; ఆననంబునన్= ముఖాన; అవనిధూళి= భూమిమీద దుమ్ము; కదిరెన్?= ఉన్నది; జలకము= స్నానం; ఏల+ఆడవు?= ఎందుకు చేయవు?

తాత్పర్యం: ఓ కౌరవేంద్రా! ఎల్లవేళలా నీ చుట్టూ పట్టుకొనే గొడుగు లేవి? అతిశయ మైన వింజామరలను ఎందుకు పట్టుకోరు? ఒడలిమీద, ముఖాన దుమ్ము ఉన్న దేమి? స్నాన మెందుకు చేయవు?

చ. అనిమిషవాహినీ తనయుఁ డస్త్ర గురుండును నీకు నెప్పుడుం
గనువెలుఁ గై చరింతురు వికర్ణుఁడు దుస్సేనుఁడున్;
నిను నొకయప్డుఁ బాయ రవినీతు లొకో నృప! వార లెల్ల నె
మ్మనమున శంక లేక యొకమాటును నిక్కడఁ జేర రెవ్వరున్. 403

ప్రతిపదార్థం: నృప!= ఓ రాజా!; అనిమిష వాహినీ తనయుఁడు= గాంగేయుడు (దేవనది తనయుడు); అస్త్రగురుండును= ధనురాచార్యుడును; ఎప్పుడున్= అన్ని సమయాలలో; నీకున్ కనువెలుఁగై చరింతురు= ఎల్లవేళలా నీకు కంటివెలుగుగా తిరిగేవారు; వికర్ణుఁడు, దుస్సేనుఁడున్= వికర్ణ, దుశ్శాసనులు; నినున్= నిన్ను; ఒకయప్డున్+పాయరు= ఒక్క పర్యాయంకూడా వదలివెళ్ళరు; వారలు+ఎల్లన్ అవినీతులొకో?= వారు దుర్నీతులా?; నెమ్మనమునన్ శంకలేక= మనసులో అనుమానించకుండా (చెప్పుము); ఒకమాటును= ఒక మారుకూడా; ఇక్కడన్= ఈ చోట; చేరరు= చేరినారు కారు.

తాత్పర్యం: భీష్మ ద్రోణులు అన్ని వేళలలోనూ నీకు కంటికి వెలుగుగా తిరిగేవారు. వికర్ణ, దుశ్శాసనులు నిన్నెపుడూ వదలి ఉండరు. వారంతా నీతి బాహ్యులా? ఓ రాజా! వారు ఎవరు కానీ ఇక్కడ ఒక పర్యాయం కూడా చేరకున్నారే! నీ మనసులో అనుమానం లేకుండా (వారిని గూర్చి) చెప్పుము.

క. నీయెడఁ జంచల యయ్యెను । శ్రీ యెవ్వరి నచలవృత్తిఁ జెందెడు విధి య
ట్లై యున్నవారి నిట్టులు । సేయఁడె? యే నింక నేమి సేయుదు నధిపా! 404

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా!; నీ+ఎడన్= నీయందు; శ్రీ= లక్ష్మి; చంచల+అయ్యెను= అస్థిరమైనది; అచలవృత్తిన్= స్థిరంగా; ఎవ్వరిన్= ఎవరి యెడ; చెందెడున్= చేరునో; విధి= దైవం; అట్లైఉన్న వారి నిట్టులు= ఆ విధంగా ఉన్న వారినీ విధంగా (అనగా ఐశ్వర్యవంతులను విధి ఈ విధంగా); చేయఁడె?; ఏను+ఇంకన్+ఏమి చేయుదున్?= నే నింక ఏమి చేయగలను?

తాత్పర్యం: నీపట్ల లక్ష్మి అస్థిరమైనది. మరెవ్వరి వద్ద స్థిరపడబోతున్నదో? విధి సంపదగలవారిని లేనివారినిగా చేయదా? ఓ రాజా! నే నింక ఏమి చేయగలను?'

తే. అని విలాపంబు సేసిన విని విభుండు । గన్నుఁగవ నశ్రు లురలంగఁ గరపుటములఁ
దుడిచికొనుచు డగ్గుత్తి దొడరు నెలుఁగు । నెట్టకేలకు నూల్కొల్పి యిట్టు లనియె. 405

ప్రతిపదార్థం: అని విలాపంబు చేసినన్= అని దుఃఖించగా; విని= విన్నవాడై; విభుండు= రాజయిన దుర్యోధనుడు; కన్నుఁగవన్= రెండుకళ్ళలో; అశ్రులు+ఉరులంగన్= నీరు దొర్లగా; కరపుటములన్= దొప్పలవంటి చేతులతో; తుడిచికొనుచున్= తుడిచివేసికొంటూ; డగ్గుత్తిన్= బొంగురుపోయిన గొంతు; తొడరు= కలుగు; ఎలుఁగున్= కంఠస్వరాన్ని; ఎట్టకేలకున్= తుదకు; నూల్కొల్పి= సరిచేసి; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అశ్వత్థామ ఆ విధంగా దుఃఖించగా, రాజు కన్నీళ్ళు దొర్లుతుండగా చేతులతో తుడిచికొంటూ గద్గదికమైన కంఠస్వరాన్ని సరిచేసికొని ఇట్లా అన్నాడు.

క. 'మనుజులకు నిట్టిచందము । మును ధాత సృజించినది; ప్రమోదము ఖేదం
బున వచ్చును బర్యాయం । బున; దీని నెఱుంగవలదె పురుషుం డనఘా!;' 406

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్మా!; మనుజులకున్= మానవులకు; ఇట్టి చందము= ఈ స్థితి; మును= ఇదివరకే; ధాత సృజించినది= విధి (బ్రహ్మ) కల్పించిఉన్నదే; ప్రమోదము= సంతోషం; ఖేదంబును= దుఃఖమూ; పర్యాయంబునన్= ఒకదాని వెంట నొకటి; వచ్చును= కలుగుతాయి; పురుషుండు= మానవుడు; దీనిన్ ఎఱుంగ వలదె?= దీనిని తెలియవద్దా?

తాత్పర్యం: పుణ్యాత్మా! ఈ స్థితిని మానవులకు విధాత ఇదివరకే నిర్ణయించాడు. సుఖ దుఃఖాలు పర్యాయంగా కలుగుతాయి. దీనిని మానవుడు తెలిసికొనవద్దా?'

వ. అని యారథికవరుల నాలోకించి. 407

ప్రతిపదార్థం: అని= అంటూ; ఆ రథిక వరులన్= ఆ సైనిక శ్రేష్ఠులను; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: దుర్యోధనుడు ఈ విధంగా పలికి, ఆ ముగ్గురినీ చూచి.

సీ. **'పయిపయి నెంత లాపదలు వచ్చిన నైన । నుత్సాహ మెడలక యుద్ధ మరులు**
సేడ్పడునట్లుగాఁ జేసెడి బంధులు । మిత్రులు సోదరుల్ పుత్రులట్లు
బలసమేతంబు భండనంబునఁ ద్రుంగ । నొక్కఁడు నిల్చుట యొప్పు నెట్లు?
మద్బాహువీర్యంబు మహిత ధైర్యంబును । దలమున్కలైన సధర్మవృత్తి

తే. **సంగరంబు సేయఁ జాలక శత్రు లిట్లు । నొంప సద్గతి వడయుట సొంపు గాదె**
యదియుఁ గాక విద్విషులచే నాజిఁ బడక । యుండ మిముఁ గాంచునమ్మేలు నొదవె నాకు. **408**

ప్రతిపదార్థం: పయిపయిన్= ఒక దానిమీద ఇంకొకటిగా; ఎంతలు+ఆపదలు= ఎంతటి కష్టాలు; వచ్చినన్= వచ్చినను; ఐనన్= అయినప్పటికిని; ఉత్సాహము= ధైర్యం; ఎడలక= సడలిపోకుండా; యుద్ధము= యుద్ధమును; అరులు= వైరులు; చేడ్పడునట్లుగాన్= నాశమయ్యేటట్లుగా; చేసెడి బంధులు మిత్రులు, సోదరుల్, పుత్రులు= చేసే బంధువులు, స్నేహితులు, తోబుట్టువులు, కుమారులును; అట్లు= ఆ విధంగా; బలసమేతంబుగాన్= సేనతో కూడా; భండనంబునన్= యుద్ధంలో; త్రుంగన్= నశించగా; ఒక్కఁడు నిల్చుట= ఒకడు మాత్రము నిలిచి యుండటం; ఎట్లు= ఏ విధంగా; ఒప్పున్= తగును?; మత్+బాహువీర్యంబున్= నా భుజబలమూ; మహిత ధైర్యంబును= మహిమగల శక్తీ; తలమున్కలు+ఐనన్= అధికంగా కాగా; సధర్మవృత్తిన్= న్యాయంగా; సంగరము చేయన్+చాలక= యుద్ధం చేయలేక; శత్రులు+ఇట్లు నొంపన్= వైరులు ఈ విధంగా బాధించగా; సద్గతి పడయుట= పుణ్యగతనిని పొందటం; సొంపు+కాదె= సొగసుకదా!; అదియున్+కాక= అంతేకాక; విద్విషుల చేన్= వైరులవలన; అనిన్= యుద్ధంలో; పడకఉండెన్= పడిపోకుండా ఉండగా; మిమ్మున్+కాంచు= మిమ్ములను చూచే; ఆ+మేలు= ఆ అదృష్టం; నాకున్+ఒదవెన్= నాకు కలిగింది.

తాత్పర్యం: ఒక దానిమీద మరొకటిగా ఎంతటి ఆపదలు వచ్చినా ధైర్యం వదలకుండా యుద్ధం చేసి శత్రువులను హతమార్చే బంధువులు, స్నేహితులు, కుమారులు, సోదరులు, సైన్యంతో కూడా ఆ విధంగా యుద్ధంలో చనిపోగా ఒక్కడు మాత్రం బ్రతికి ఉండటం ఒప్పునా? నా భుజబలం, ధైర్యం తలమున్కలైనాయి. ధర్మబద్ధంగా శత్రువులు యుద్ధం చేయలేక ఈ విధంగా బాధించగా పుణ్యగతిని పొందటం సొగసు కదా! కానీ, శత్రువులచేత యుద్ధరంగంలో చనిపోకుండా ఉన్న మిమ్ములను చూచే అదృష్టం నాకు దక్కింది.

చ. **వినుఁడు మహానుభావుఁ డగు విష్ణు నెఱింగి యెఱింగి యే మిముం**
గొని వెఱ పేది కాదె పగకుం దలకొంట; జయంబు గోరి మీ
రును బలశౌర్య సంపదనురూపముగాఁ బొగడొందు భంగులం
బెనఁగితి; రేమి సేయుదురు బెట్టిదుఁ డై విధి తప్పఁ జూచినన్? **409**

ప్రతిపదార్థం: వినుఁడు= మీరు వినండి; మహానుభావుడుగ విష్ణున్= గొప్పవాడైన విష్ణుమూర్తిని; ఎఱింగి ఎఱింగి= తెలిసి తెలిసి; ఏన్= నేను; మిమున్+కొని= మిమ్ము స్వీకరించి; వెఱపు+ఏదికాదె= భయములేకుండా కదా; జయంబున్+కోరి= విజయమును ఆశించి; పగకున్+తలకొంటిన్= వైరానికి పూనుకొన్నాను; మీరును= మీరుకూడా; బలశౌర్యసంపదనురూపముగా= శక్తీ, వీరత్వమూ అనే సంపదకు తగినట్లుగా; పొగడొందుభంగులన్= పొగడ్తలు పొందే విధంగా; పెనఁగితిరి= యుద్ధం చేశారు (అయినను); విధి= దైవం; బెట్టిదుఁడు+ఐ= క్రూరుడై; తప్పన్+చూచినన్= వేరుగా తలంచితే; ఏమి చేయుదురు?= ఏమి చేయగలరు?

తాత్పర్యం: మహానుభావుడైన విష్ణుమూర్తిని తెలిసితెలిసీ మిమ్ముగొని భయమును వదలి జయం ఆశించి పూనుకొన్నాను. మీరు కూడా బలశౌర్య సంపదలకు తగినట్లుగా కీర్తనీయంగా యుద్ధం చేశారు. అయినా దుర్విధి బలవంతుడై వేరుగా చూచినపుడు మీ రేమి చేయగలరు?

వ. **వగవ కుండుం' డని యేఁ బొదలోనం బొంచి యున్నది మొదలుగ గదాయుద్ధంబు పాడి విడిచి వడముడి పుడమితేనిం బడవైచి తలదన్నుట తుదిగా నైన వృత్తాంతం బెల్ల నప్పు డారథికవరులకుఁ దేటపడం బలికిన విని పాండవుల దెస నీసును రోసంబు నెత్తి గురునందనుం డరుణాననుం డగుచు నవుడు గఱచి కఠినాక్షరకలితంబు గా నక్కౌరవేశ్వరున కి ట్లనియె.** **410**

ప్రతిపదార్థం: వగవక+ఉండుండు= దుఃఖించకుండా ఉండండి; అని= అంటూ; పొదలోనన్+పొంచి ఉన్నది మొదలుగన్= పొదలోపల దాగికొని ఉండటం మొదలుగా; గదాయుద్ధంబుపాడిన్= గదాయుద్ధ ధర్మమును; విడిచి= వదలి; వడముడి= భీమసేనుడు; పుడమి+తేనిన్+పడవైచి= రాజునునేలపై పడద్రోసి; తలన్+తన్నుట తుదిగాన్+ఐన= తలను దన్నటం వరకు అంతటినీ; అప్పుడు+ఆ రథికవరులకున్= ఆ సమయాన ఆ సేనా నాయక శ్రేష్ఠులకు; తేటపడన్+పలికినన్= తెలిసేటట్లు చెప్పగా; విని= విన్నవారై; పాండవులదెసన్= పాండవుల మీద; ఈసును= ఈర్ష్యయు; రోసంబున్+ఎత్తి= కోపం కలిగి; గురునందనుండు+అరుణ+ఆననుండు+అగుచున్= అశ్వత్థామ ఎర్రనైన ముఖం కలవాడౌతూ; ఔడుగఱచి= పెదవిని నొక్కిపట్టుకొని; కఠినాక్షర కలితంబుగాన్= తీవ్రమైన మాటలతో కూడినవిగా; ఆ+కౌరవేశ్వరునకున్+ఇట్లనియెన్= ఆ కౌరవరాజయిన దుర్యోధనుడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుఃఖపడవద్దు' - అని సంజయుడు పొదలో దాగికొని ఉన్నప్పటినుండి గదాయుద్ధంలో న్యాయం వదలి భీముడు దుర్యోధనుడిని క్రిందపడదోసి తలను తన్నుట తుదిగా సాగిన విషయాన్నంతటినీ ఆ రథిక శ్రేష్ఠులకు స్పష్టంగా తెలిసేటట్లుగా చెప్పగా విని పాండవుల ఎడ అసూయ, కోపం కలిగి అశ్వత్థామ ముఖం జేగురు రంగు కలది కాగా క్రిందిపెదవిని నొక్కి కరచిపట్టికొని తీక్షణమగు మాటలతో ఆ కౌరవరాజుతో ఇట్లా అన్నాడు.

ఉ. **'పాండవ లట్లు మజ్జనకుఁ బాపవిధిఁ దెగఁ జూచినప్పడుం**
జండతర ప్రకోపము నసహ్యపు శోకము నిట్లు చిత్త మొం
డొండఁ గలంప నే నిపుడ యొక్కడుఁ దక్కక యుండ వారి ను
ద్దండ మదస్త్రవహ్నిఁ బరిదగ్ధులఁ జేయక యెట్టు లుండుదున్? **411**

ప్రతిపదార్థం: పాండవులు+అట్లు= పాండవులు ఆ విధంగా; మత్+జనకున్= నా తండ్రిఅయిన ద్రోణుడిని; పాపవిధిన్= చెడుమార్గంతో; తెగన్+చూచినప్పుడున్= చనిపోయేటట్లుగా చేసినప్పుడును; చండతరప్రకోపమున్= తీవ్రమైన కోపమును; అసహ్యపు శోకము= భరించరాని దుఃఖమును; ఇట్లు= ఈ విధంగా; చిత్తమున్= మనసును; ఒండొండన్= ఒకటొకటిగా; కలంపన్= చీకాకు పరచగా; నేను= నేను; ఇపుడు= ఇప్పుడే; ఒక్కడున్ తక్కక ఉండన్= ఒకడు కూడా మిగుల కుండా; వారిన్= పాండవులను; ఉద్దండ= భయంకరమైన; మదస్త్రవహ్నిన్= నా బాణాగ్నిచేత; పరిదగ్ధులన్+చేయక= బాగా కాల్చకుండా; ఎట్టులు+ఉండుదున్= ఏ విధంగా ఉండగలను.

తాత్పర్యం: 'పాండవులు ఆ విధంగా నా తండ్రిని దుర్మార్గంగా చంపినప్పుడుకూడా, తీవ్రమైన కోపాన్ని, భరించరాని దుఃఖాన్ని ఒకటొకటిగా ఈ విధంగా మనసును కలత పెట్టవు. ఇప్పుడే ఒక్కడు కూడా మిగులకుండా వారిని (పాండవులను) భయంకరమైన నా బాణాగ్నిచేత పూర్తిగా దహించక ఏ విధంగా ఉండగలను?

తే. వినుము సత్యంబు వల్కెద మనుజనాథ! । యదరి యందఱఁ బాంచాలు రాదిగాఁగఁ
గలుగు బాంధవమిత్ర సంఘములతోడఁ । గూడ నేఁ డిదె కృష్ణుండు సూడఁ ద్రుంతు. 412

ప్రతిపదార్థం: మనుజనాథ!= ఓ రాజా!; సత్యంబు పల్కెదన్ వినుము= నిజమే చెపుతున్నాను వినుము; అదరి= అతిశయించి; పాంచాలురు+ఆదిగాఁగన్= పాంచాలురు మొదలుగా; అందఱన్= అందరినీ; కలుగు= ఉన్నట్టి; బాంధవ మిత్ర సంఘంబు తోడన్= బంధు మిత్ర సమూహంతో; కూడన్= కలియగా; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; చూడన్= చూస్తుండగా; నేఁడు= ఈ దినం; ఇదె= ఇదిగో; త్రుంతున్= చంపుతాను.

తాత్పర్యం: ఓ రాజా! నేను నిజమే చెప్పుతున్నాను వినుము. విజృంభించి పాంచాలురు మొదలుగా ఉన్నట్టి బంధుమిత్ర సమూహమును శ్రీకృష్ణుడు చూస్తూండగా ఇదిగో నేడు హతమారుస్తాను.

వ. పనుపు' మనిన హృష్టుండై యజ్జనపతి గృపాచార్యుం గనుంగొని యొక్క కలశంబున జలంబు నినిచికొని రమ్మనుటయు, నమ్మహీసురవరుండు దమ్ముం జూడ వచ్చి యచ్చట నున్న సమీపాశ్రమమునికుమారులం బ్రార్థించి యొక్కకలశంబు దెప్పించి దానిం దోయపూర్ణంబుఁ గావించి తెచ్చిన. 413

ప్రతిపదార్థం: పనుపుము= ఆజ్ఞాపింపుము; అనినన్= అనగా; హృష్టుండు+ఐ= సంతోషమంది; ఆ+జనపతి= ఆ రాజైన దుర్యోధనుడు; కృపాచార్యున్+కనుంగొని= కృపాచార్యుడిని చూచి; ఒక్క కలశంబునన్= ఒకపాత్రలో; జలంబున్= నీటిని; నినిచికొని= నింపుకొని; రమ్మనుటయు= రావలసినదని కోరగా; ఆ+మహీసూరవరుండు= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు; తమ్మున్+ చూడవచ్చి= తమను చూడటానికై వచ్చిన; అచ్చటన్+ఉన్న= ఆ చోటులోనుండే; సమీప= దగ్గరి; ఆశ్రమ ముని కుమారులన్+ ప్రార్థించి= తపోవనంలోని ఋషికుమారులను ప్రార్థించి; ఒక్కకలశంబు తెప్పించి= ఒక పాత్రను తెప్పించుకొని; దానిన్+ తోయపూర్ణంబు కావించి తెచ్చినన్= దానిని నీటితో నింపి తీసుకొనిరాగా.

తాత్పర్యం: (అశ్వత్థామ) ఆజ్ఞాపింపు' మనగా ఆ రాజు సంతోషించి కృపాచార్యుడితో ఒక చెంబునిండా నీరు తెప్పించు మన్నాడు. ఆ బ్రాహ్మణుడు తమను చూడవచ్చిన - అక్కడకు సమీపాన ఉన్న మున్యాశ్రమంలోని మునికుమారులను ప్రార్థించి ఒక కలశాన్ని తెప్పించి దాని నిండా నీరు తీసికొని రాగా.

చ. అతనికి నెమ్మి నిట్లనియె నమ్మనుజేంద్రుఁడు 'నీవు వేగ మం
చితముగ ద్రోణపుత్రు నభిషిక్తునిఁ జేయుము ప్రీతి మచ్చమూ
పతియఁగ భూసురుండు నృపపంపునఁ గయ్యముసేఁత లోకవి
శ్రుత మగుధర్మ మట్లగుటఁ జూవె యొనర్చెద నవ్విశేషమున్.' 414

ప్రతిపదార్థం: ఆ+మనుజ+ఇంద్రుఁడు= ఆ రాజు దుర్యోధనుడు; అతనికిన్= ఆ కృపుడితో; నెమ్మిన్= ప్రీతితో; ఇట్లు+అనియెన్; నీవు; వేగము= శీఘ్రంగా; అంచితముగన్= ఒప్పుగా; ద్రోణపుత్రున్= అశ్వత్థామను; ప్రీతిన్= ఇష్టంతో; మత్+చమూపతియున్+ కాన్= నా సేనాపతిగా; అభిషిక్తునిన్= అభిషేకించబడినవాడినిగా; చేయుము; భూసురుండు= బ్రాహ్మణుడు; నృప పంపునన్=

ఆ రాజాజ్ఞతో; కయ్యము+చేఁత= యుద్ధం చేయటం; లోకవిశ్రుతము+అగు ధర్మము= జగత్ప్రసిద్ధమైన ధర్మం; అట్లు+అగుటన్+ చూవె= అందుచేతనే సుమా!; ఆ విశేషమున్= బ్రాహ్మణుడిని సేనాపతిని అభిషేకించటం అనే విశేషాన్ని; ఒనర్చెదన్= చేస్తాను.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు కృపునితో ఇట్లా అన్నాడు: 'వెంటనే నీవు ద్రోణుడి కుమారుడిని నాసేనా నాయకుడుగా ప్రీతితో అభిషేకించుము. బ్రాహ్మణుడు రాజాజ్ఞమెయి యుద్ధం చేయటం లోకప్రఖ్యాతమైన ధర్మం. అందువలన ఆ విశేషమైన పనిని చేస్తాను.

వ. అనవుడు నతండు సంప్రీతుం డై యగ్గురునందనునకు సేనాధిపత్యాభిషేకం బాచరించిన. 415

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; అతండు సంప్రీతుండు+ఐ= అతడు ఆనందించి; ఆ+గురునందనునకున్= అశ్వత్థామకు; సేనాధిపత్య+అభిషేకంబున్+ఆచరించినన్= సేనాధిపతిగా అభిషేకం చేయగా.

తాత్పర్యం: అనగా విని కృపుడు సంతోషించి అశ్వత్థామను సేనాధిపతిగా అభిషేకించగా.

ఉ. ఆ రథికోత్తముం డధికహర్షముఁ బొందుచు నమ్మహీశ్వరున్
గారవ మొప్పఁ గ్రుచ్చి యిటిగౌఁగిటఁ జేర్చి యుదాత్తసింహనా
దారవ ముల్లసిల్లఁగఁ బ్రియంబుమెయిం గృప యాదవోత్తముల్
సేరి కెలంకులం జనఁగఁ జెచ్చెర నేఁగె నుదగ్రమూర్తి యై. 416

ప్రతిపదార్థం: ఆ రథిక+ఉత్తముండు= ఆ సేనానాయక శ్రేష్ఠుడు - అశ్వత్థామ; అధిక హర్షమున్+పొందుచున్= మిక్కిలి సంతోషిస్తూ; ఆ+మహీశ్వరున్= ఆ దుర్యోధనుడిని; గారవము+ఒప్పన్= గౌరవం తగునట్లుగా; క్రుచ్చి ఇటికౌఁగింటన్+చేర్చి= గట్టిగా హత్తుకొని కౌగిలో చేర్చుకొని; ఉదాత్త= పెద్ద; సింహనాదా రవము= సింహగర్జనం; ఉల్లసిల్లఁగన్= ఒప్పగా; ప్రియంబుమెయిన్= ప్రీతితో; కృప= కృపుడును; యాదవ+ఉత్తముల్= యాదవ ముఖ్యులు; చేరి= కూడి; కెలంకులన్+చనఁగన్= ప్రక్కల వెళ్ళగా; ఉదగ్రమూర్తిఐ= భయంకర మూర్తిగా; చెచ్చెరన్+ఏఁగెన్= వెంటనే వెళ్ళాడు.

తాత్పర్యం: ఆ సేనాని చాలా సంతోషంతో ఆ రాజును గౌరవంతో బిగియార కౌగిలించుకొని గొప్పదైన సింహనాదం ఒప్పగా ప్రీతితో కృపుడూ, యాదవ ప్రముఖులూ ప్రక్కలలో చేరి నడవగా భయంకరమూర్తి అయి వెంటనే వెళ్ళాడు.

వ. ఇ ట్లశ్వత్థామ కృప కృతవర్ములును మహోద్యోగంబున. 417

ప్రతిపదార్థం: ఇట్లు+అశ్వత్థామ, కృప కృతవర్ములును= ఈ విధంగా అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ; మహా+ఉద్యోగంబునన్= పెను ప్రయత్నంతో.

తాత్పర్యం: ఈ విధంగా అశ్వత్థామా, కృపుడూ, కృతవర్మా గొప్పదైన ప్రయత్నంతో - (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అరినిరవశేషనిరసన । పరమానంద ప్రచరిత పాండవ పుత్త్రో
త్కర బాంధవనికర పరి । స్ఫురణాఢ్య తదీయశిబిరమున కభిముఖు లై. 418

ప్రతిపదార్థం: అరి నిరవశేష నిరసన= శత్రువుల నిశ్శేష నిరసనం (నాశనం) చేత; పరమ+ఆనంద ప్రచరిత= గొప్ప సంతోషం కలిగి ఉన్న; పాండవ - పుత్త్ర+ఉత్కర= పాండవుల కుమారుల సమూహముయొక్కయు; బాంధవ - నికర= చుట్టాల సమూహం యొక్కయు; పరిస్ఫురణ= విజృంభణంచేత; ఆఢ్య= సంపన్నమైన; తదీయ= వారిదైన; శిబిరమునకున్= గుడారమునకు; అభిముఖులు+ఐ= ఉన్ముఖులై.

తాత్పర్యం: శత్రువులను నిశ్శేషంగా కూల్చటంవలని పరమానందం కల పాండవపుత్ర సమూహంయొక్కయు, చుట్టాల సమూహంయొక్కయు విజృంభణంచేత సంపన్నమైన పాండవశిబిరమునకు ఉన్ముఖులై.

వ. చని రని యిట్లు ధృతరాష్ట్రునకు సంజయుం డశ్వత్థామోత్సాహంబు తెఱం గెఱింగించె నని వైశంపాయనుండు
సెప్పిన విని జనమేజయుం డట మీఁది వృత్తాంతం బెఱింగింపు మని యడుగుటయు. 419

ప్రతిపదార్థం: చనిరి= వెళ్ళారు; అనిఇట్లు= అని ఆ విధంగా; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రుడితో; సంజయుండు= సంజయుడు; అశ్వత్థామ= అశ్వత్థామయొక్క; ఉత్సాహంబు= వేడుకయొక్క; తెఱంగు= విధమును; ఎఱింగించెన్= తెలిపాడు; అని వైశంపాయనుండు చెప్పినన్= అని వైశంపాయన ముని చెప్పగా; విని= విన్నవాడై; జనమేజయుండు= జనమేజయ చక్రవర్తి; అటుమీఁది వృత్తాంతంబు= ఆపై సమాచారాన్ని; ఎఱింగింపుము+అని= తెలియజేయుమని; అడుగుటయున్= అడుగగా.

తాత్పర్యం: ఆ రథికత్రయం అట్లా వెళ్ళారని సంజయుడు ధృతరాష్ట్రుడికి ఈ రీతిగా అశ్వత్థామ ఉత్సాహాన్ని తెలిపాడు అని వైశంపాయనుడు చెప్పగా ఆ తరువాతి సమాచారాన్ని తెలియజేయుమని జనమేజయుడు అడిగాడు.

ఆశ్వాసాంతము

మ. శ్రుతివాక్యార్థమయ ప్రభావ! మునిసంస్తుత్యానుభావా! శచీ
పతిముఖ్యానిమిషాభివాద్య నిరసద్భావైకవేద్యా! మహో
న్నత హేతుత్వవిరాజమానచరణా! నమ్రాపదుత్తారణా!
సతతోన్నిద్ర విధైకభక్తసులభా! సంవిత్ప్రభావల్లభా! 420

ప్రతిపదార్థం: శ్రుతివాక్య+అర్థ మయ ప్రభావ!= వేదార్థరూపమైన శక్తి కలవాడా! (వేదవాక్యాల కున్న అర్థమే రూపెత్తినవాడా!); మునిసంస్తుత్య+అనుభావా!= మునులచేత ప్రార్థించదగిన ప్రభావం కలవాడా!; శచీపతి ముఖ్య= ఇంద్రుడు మొదలైన; అనిమిష= దేవతలచేత; అభివాద్య= నమస్కరించదగినవాడా!; నిరసద్భావ+ఏకవేద్యా!= ఇది కాదు. ఇది కాదు అనునట్టి రూపాన్ని భావంచేతనే తెలియదగినవాడా!; మహా+ఉన్నత= మిక్కిలి గొప్పదైన; హేతుత్వ= కారణమవటంచేత; విరాజమాన= వెలుగుతున్నట్టి; చరణా!= పాదాలుకలవాడా!; నమ్ర+ఆపదుత్తారణా!= విధేయులయిన భక్తులను ఆపదలనుండి దాటించేవాడా!; సతత= ఎల్లప్పుడూ; ఉన్నిద్రవిధా+ఏక= అన్ని సమయాలలో ప్రజ్ఞావంతులై ప్రమాదాలకు లోనుకాకుండా ఒక్కటి ఐన; భక్త సులభా!= భక్తులకు వశ్యుడా!; సంవిత్ప్రభావల్లభా!= జ్ఞానచైతన్య శక్తికి వల్లభుడా!

తాత్పర్యం: వేదాలలోని వాక్యార్థాల శక్తి స్వరూపుడవు. ఋషులంతా నీ మహత్త్వాన్ని పొగడుతున్నారు. ఇంద్రాదిదేవతలంతా నీకు నమస్కరిస్తున్నారు. నీవు ఇదికాదిది కాదనేతత్త్వం (నేతి నేతివాదం) వలన తెలియదగిన వాడవు. నీ పాదాలు అత్యున్నతమైన హేతువులుగా ప్రకాశిస్తాయి. నీవు వినమ్రులయిన వారి ఆపదలను తొలగిస్తావు. నిన్ను మరువని భక్తులకు నీవు సులభుడవు.

విశేషం: అలం: ప్రతిపాదంలోనూ అంత్యానుప్రాసాలంకారం. నిరసద్భావైకవేద్యా - దీనికి వా. ప్రతిలో పాఠాంతరమున్నది. అది - నిరహంభావైక వేద్యా= అహంభావశూన్యు లైనవారిచేతనే తెలియదగినవాడా - అహంకారశూన్యులకు మాత్రమే తెలియదగినవాడా!

క. సిత నీలాదిక వర్ణా! హితవై కృత దూర! మానసేజ్యాధారా
శతదళభవసత్యవతీ। సుతాదిబుధ మతిలతా ప్రసూనాకారా! 421

ప్రతిపదార్థం: సిత నీల+ఆదిక వర్ణా!= తెల్లని, నల్లని మొదలైన రంగులు కలవాడా! (శివుడు తెల్లని వర్ణం కలవాడు, విష్ణువు నల్లని కలువవంటి రంగు కలవాడు); హితవైకృతదూర!= ఆప్తులయిన తాపసులకు వికారమైన రూపాలకు దూరమైనవాడా! (భక్తులకు స్వస్వరూపంలో కానవచ్చేవాడా!); మానస+ఇజ్యాధారా!= మనసునందు కావించే యజ్ఞానికి ఆధారమైనవాడా! (అంతస్సున మానసిక యజ్ఞానికి ఆధారమైనవాడని); శతదళ భవ= బ్రహ్మకును (పద్మం నుండి పుట్టినవాడు బ్రహ్మ); సత్యవతీసుత= సత్యవతి కుమారుడైన వ్యాసుడు; ఆది= మొదలయిన; బుధ= పండితులయొక్క (తాపసులయొక్క); మతిలతా= బుద్ధిఅనే తీగకు; ప్రసూన+ఆకారా!= పూవువంటివాడా! (తపస్వుల బుద్ధి అనే తీగలకు వికసించే పూవును పోలినవాడా).

తాత్పర్యం: (పరబ్రహ్మతత్త్వమును వర్ణించటం) తెల్లని నల్లని రంగులు కలవాడా! ఆత్మీయులైన ఋషులకు యథార్థంగా దర్శనమిచ్చేవాడా! మహనీయులయిన యోగులు తమ మనసులలో చేసే యజ్ఞానికి ఆధారమైనవాడా! స్రష్ట అయిన బ్రహ్మకు, వేదవ్యాసుడికి, ఇతరపండితులకు గల బుద్ధి అనే తీగకు పూవువంటివాడా!

విశేషం: అలం: రూపకం, అంత్యానుప్రాసం.

మాలిని.

భరిత వికసనాంతః పద్మనిశ్రేణికాసం
చరణ పరిణతత్వశ్లాఘనీయ క్రమోద్య
న్మరుదుపగమలీలా మథ్యమానేందు బింబ
క్షరదమృత వికారోత్సారణానంద రూపా! 422

ప్రతిపదార్థం: భరిత= నిండైన; వికసన= వికాసంకల; అంతః పద్మ= శరీరంలోని పద్మాల (షట్చక్రాల) ఆకారం కల; నిశ్రేణికా= (వరుసలు) నిచ్చెనవంటి దానిమీద; సంచరణ= సంచరించటం మూలాన సిద్ధించినట్టి; పరిణతత్వ= పరిపాకం వలన; శ్లాఘనీయ= పొగడదగినట్టి; క్రమ+ఉద్యత్+మరుత్+ఉపగమ+లీలా= వరుసగా పైకి లేచే ప్రాణవాయువునకు పొందిక అయిన క్రీడచేత; మథ్యమాన= త్రచ్చుటమూలాన (మథింపబడుచున్న); ఇందుబింబ= చంద్రబింబంనుండి; క్షరత్= జాలువారుచున్న; అమృతవికార= అమృతాకారంతో; ఉత్సారణ+ఆనంద రూపా!= కదలుతున్న ఆనందస్వరూపా!

తాత్పర్యం: పరమేశ్వరా! యోగీశ్వరులు తమ యోగాభ్యాసం మూలంగా సునిశిత పరిశీలనంతో తమ శక్తిని మూలాధారాది స్థానాలతో నిచ్చెన ఎక్కినట్లు అధిరోహించి, వరుసగా వికసింపజేసి, దానినుండి జాలువారే అమృతాన్ని అనుభవించి ఆనందసాగరంలో మునుగజేసే నిత్యానందరూపా!

విశేషం: ఈ పద్యంలో తిక్కనగారికి గల యోగశాస్త్ర పరిచయాన్ని పాఠకులు గుర్తించవలసి ఉన్నది.

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కనసోమయాజి ప్రణీతం బయిన శ్రీమహాభారతంబున శల్యపర్వంబునందు సర్వంబును ద్వితీయాశ్వాసము.

తాత్పర్యం: ఇది మంగళకరమై సంస్కృతాంధ్రోభయకవులకు మిత్రుడైనవాడూ, కొమ్మనామాత్యుడి కుమారుడూ, పండితుల ప్రశంసలచేత ప్రకాశించేవాడూ (పండితులను సేవించటంలో రాణించేవాడూ) అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శ్రీమహాభారతంలోని శల్యపర్వం మొత్తం ముగిసిన రెండవ అశ్వాసం.

శల్యపర్వంలో రెండవ ఆశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్రమహాభారతంలో శల్యపర్వం ముగిసింది.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

సౌప్తికపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీమ త్కౌస్తుభ రత్నో । ద్దామారణ రశ్మి భూతి ధవళ మరీచి
స్తోమ పరభాగ రమ్య మ । హా మహిత స్ఫురిత వక్ష! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీమత్= శోభావంతమైన; కౌస్తుభ రత్న= కౌస్తుభ మనే పేరుగల మణి యొక్క; ఉద్దామ= మిక్కిలి; అరుణ= ఎర్రనైన; రశ్మి= కాంతుల యొక్కయు; భూతి= బూది (విభూతి) యొక్క; ధవళ= తెల్లనైన; మరీచి= కాంతుల యొక్కయు; స్తోమ= సమూహము యొక్క; పరభాగ= అతిశయంచేత; రమ్య= అందమైన; మహత్ (మహా)= మిక్కిలి; మహిత= గొప్పదియు; స్ఫురిత= ప్రకాశించినదియు అగు; వక్ష!= రొమ్ముగలవాడా!; హరిహరనాథా!= హరిహరనాథు డనే పేరుగల దైవమా!

తాత్పర్యం: శోభావంతమైన కౌస్తుభమణి చిమ్మే ఎర్రటి కాంతుల అతిశయంవలన, శరీరానికి పూసుకొన్న విభూతి చిమ్మే తెల్లటి కాంతుల అతిశయం వలన అందమై మిక్కిలి గొప్పదీ, ప్రకాశించేదీ అయిన వక్షఃస్థలం గల ఓ హరిహరనాథా!

విశేషం: అలం: యథాసంఖ్యం. ఈ పద్యంలో హరి స్వరూపం, హరస్వరూపం- ఈ రెండూ ఏకమైన హరిహరనాథుడి మూర్తిని కవి వర్ణిస్తున్నాడు. హరి తన వక్షఃస్థలంపై కౌస్తుభమణిని ధరిస్తాడు. హరుడు తన వక్షఃస్థలానికి విభూతి పూసుకొంటాడు. కౌస్తుభం ఎర్రటి కాంతులను, విభూతి తెల్లటి కాంతులనూ చిమ్ముటవలన హరిహరనాథుడి వక్షఃస్థలం అందంగా ప్రకాశిస్తోంది అని భావం.

లక్ష్మీనివాసం కావడం చేతను, సర్వమంగళా స్వరూపం అగుటవల్లనూ హరిహరనాథుని ఉరఃస్థలం సంపదకూ, వైరాగ్యానికీ ఉపలక్షణం అయింది. అందువలన హరిహరనాథస్వామి భౌతిక ఆధ్యాత్మిక ఆనందాలను ప్రసాదించేవాడని ధ్వని.

కౌస్తుభమణి అరుణరశ్మలు హరికీ, భూతి ధవళమరీచులు హరుడికీ చెందటం వలన ఈ పద్యంలోని అలంకారం యథాసంఖ్యం.

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కి ట్లనియె. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు= ఆ పేరు గల వ్యాస శిష్యుడు; జనమేజయునకున్= పరీక్షిన్మహారాజు పుత్రుడైన జనమేజయుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! వ్యాస శిష్యుడైన వైశంపాయనమహర్షి జనమేజయ మహారాజుతో ఈ విధంగా అన్నాడు.

విశేషం: దేవా! అనేది కృతికర్త అయిన తిక్కన కృతిపతి అయిన హరిహరనాథుడిని సంబోధించిన పదం. వైశంపాయనుడు వ్యాసుడి శిష్యుడు. ముని. జనమేజయుడు ఉత్తరాభిమన్యుల కుమారుడయిన పరీక్షిత్తు కొడుకు. వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పినట్లు తిక్కన హరిహరనాథుడితో భారత కథ చెప్తున్నాడు.

తే. సంజయునిచేత గురుసుతోత్సాహ మట్లు । వినిన ధృతరాష్ట్రు డిట్లను; 'వీరవర్యు
డనఁగఁజాలు నశ్వత్థామయును, సహాయ । రథికులును విక్రమించిన క్రమము సె పుమ!' 3

ప్రతిపదార్థం: సంజయుని చేతన్= సంజయుడి ద్వారా; గురుసుత+ఉత్సాహము= గురుడైన ద్రోణాచార్యుడి కుమారుడైన అశ్వత్థామ యొక్క యుద్ధోత్సాహం; అట్లు= ఆ విధంగా; వినిన= విన్నవాడైన; ధృతరాష్ట్రుఁడు; ఇట్లు; అనున్= ఈ విధంగా అన్నాడు; వీరవర్యుఁడు= వీరులలో శ్రేష్ఠుడు; అనఁగన్+చాలు= అనదగిన; అశ్వత్థామయును; సహాయ రథికులును= అతడికి తోడుపడే రథికులూ (కృపాచార్య కృతవర్మలూ); విక్రమించిన క్రమము= పరాక్రమించిన విధం; చెపుమ!= చెప్పుమా!

తాత్పర్యం: సంజయుడి ద్వారా అశ్వత్థామ పొందిన శత్రుసంహారోత్సాహాన్ని ఆ రీతిగా విన్న ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు. 'సంజయా! వీరశ్రేష్ఠు డనదగిన అశ్వత్థామా, అతడికి తోడుపడే రథికులూ ఎట్లా పరాక్రమించారో చెప్పుము.'

విశేషం: గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రుడికి ఎప్పటికప్పుడు యుద్ధ విశేషాలు చెపుతూ ఉండడానికి వ్యాసుడు సంజయుడిని నియమించాడు. అందువలన యుద్ధ వార్తలు అతడు ఎప్పటికప్పుడు ధృతరాష్ట్రుడికి నివేదిస్తూ ఉంటాడు.

వ. అనుటయు నమ్మానవపతి కా సూతసూనుం డి ట్లను; 'నవ్విధంబునఁ గురుపతి యశ్వత్థామ కభిషేకంబు సేయిం చిన నా కృపాచార్యుండును గృతవర్మయు గురుపుత్రు నుత్సాహంబున కుపోద్బలకం బగు నుద్యోగంబునం బొదలి; రమ్ముువ్వురు మహీపాలుండు పాండవులం బరిమార్చుటకుం బనిచిన నట్లు పూని దక్షిణంబు ముట్టి పడమట నున్న పాండవ శిబిరంబున కభిముఖు లై చని; రత్తెఱంగున నన్వీటి కెలని కనతి దూరంబుగాఁ జని యా రథికవరు లాలించి. 4

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధృతరాష్ట్రు డనగా; ఆ+మానవపతికిన్= ఆ రాజుకు (ధృతరాష్ట్రుడికి); ఆ సూతసూనుండు= ఆ సూతపుత్రుడైన సంజయుడు; ఇట్లు+అనున్= ఇట్లా చెపుతున్నాడు; ఆ+విధంబునన్= ఆ రీతిగా; కురుపతి= కౌరవ రాజయిన దుర్యోధనుడు; అశ్వత్థామకున్; అభిషేకంబు= సేనాధిపత్యాభిషేకం; చేయించినన్= చేయించగా; ఆ కృపాచార్యుండును; కృతవర్మయున్; గరు పుత్రు+ఉత్సాహంబునకున్= ద్రోణుడి కొడుకైన అశ్వత్థామ యొక్క ఉత్సాహానికి; ఉపోద్బలకంబు+అగు= ప్రోత్సాహకరమైన; ఉద్యోగంబునన్= ప్రయత్నంలో; పొదలిరి= ప్రవర్తిల్లారు; ఆ+ముప్వురున్= అశ్వత్థామ; కృపాచార్యుడు; కృతవర్మ అనే ఆ ముగ్గురూ; మహీపాలుండు= రాజు (దుర్యోధనుడు); పాండవులన్; పరిమార్చుటకున్= చంపడానికి; పనిచినన్= పంపగా; అట్లు; పూని= కడగి; దక్షిణంబున్= దక్షిణ దిక్కును; ముట్టి= ఆక్రమించి; పడమటన్= పడమటి దిక్కునందు; ఉన్న; పాండవ శిబిరంబునకున్= పాండవుల విడిదికి; అభిముఖులు+ఐ= ఎదురు ముఖాలు కలవారయి; చనిరి= వెళ్ళారు; ఆ+తెఱంగునన్= ఆ విధంగా; ఆ+వీటి కెలనికిన్= ఆ విడిది ప్రక్కకు; న+అతి దూరంబుగాన్= దగ్గరగా; చని= పోయి; ఆ రథికవరులు= ఆ రథికశ్రేష్ఠులు; ఆలించి= విని.

తాత్పర్యం: అని అనగా ఆ ధృతరాష్ట్ర మహారాజుతో సంజయుడు ఇట్లా అన్నాడు. 'ఆ విధంగా దుర్యోధనుడు అశ్వత్థామకు సేనాధిపత్యాభిషేకం చేయించగా ఆ కృపాచార్యుడూ, కృతవర్మా, అశ్వత్థామయొక్క శత్రు సంహారోత్సాహానికి ప్రోత్సాహకరమైన పనియందు ప్రవర్తిల్లారు. ఆ ముగ్గురూ-దుర్యోధనుడు తమను పాండవులను చంపటానికి పంపగా, ఆ రీతిగా పూని, దక్షిణ దిక్కుకు వెళ్ళి, ఆ తర్వాత పడమటగా ఉన్న పాండవుల శిబిరం వైపు వెళ్ళారు. ఆ విధంగా ఆ శిబిరానికి దగ్గరగా పోయి, ఆ రథిక శ్రేష్ఠులు విని.

వ. అందలి వార లెల్లను జయంబునఁ బొంగుచుఁ బేరెలుంగు లం
దంద చెలంగఁగాఁ బలుక నార్వఁగ నొత్తిలి నవ్వ నాకసం
బందినయట్టి మ్రోఁత విని యక్కడ వోవఁగ నుల్కి రప్పు ద
మ్ముం దడవన్ వడిన్ వెడలు మూఁకలు మ్రోయుటగాఁ దలంచుచున్. 5

ప్రతిపదార్థం: అందలివారలు= ఆ శిబిరంలో ఉన్నవాళ్ళు; ఎల్లనున్= అందరూ; జయంబునన్= గెలుపుతో; పొంగుచున్= ఉబ్బుతూ; పేరు+ఎలుంగులు= పెద్ద కంఠస్వరాలు; అందంద= అక్కడక్కడా; చెలంగఁగాన్= మ్రోయగా; పలుకన్= మాటలాడగా; అర్వఁగన్= అరవగా; ఒత్తిలి= బిగ్గరగా; నవ్వన్= నవ్వగా; ఆకసంబు+అందిన= ఆకాశాన్ని తాకిన; అట్టి= అటువంటి; మ్రోఁతన్= ధ్వనిని; విని; అప్డు= అప్పుడు; తమ్మున్= తమను; తడవన్= పట్టుకొనడానికి; వడిన్= వేగంగా; వెడలు= బయలుదేరునట్టి; మూఁకలు= సేనలు; మ్రోయుటగాన్= ధ్వని చేయటంగా; తలంచుచున్= భావిస్తూ; అక్కడ+పోవఁగన్= అక్కడికి వెళ్ళడానికి; ఉల్కిరి= భయపడ్డారు.

తాత్పర్యం: ఆ శిబిరంలో ఉన్నవాళ్ళందరూ జయోత్సాహంతో పొంగిపోతూ పెద్ద పెద్ద కంఠస్వరాలు మ్రోగుతుండగా, అరుపులూ, అట్టహాసాలూ చేశారు. మిన్నుముట్టే ఆ ధ్వనిని విని అప్పుడు తమను వెదకటానికి వేగంగా వెళ్ళే సేనలు చేసే ధ్వనిగా భావించి, ఆ ముగ్గురు వీరులూ అక్కడికి వెళ్ళటానికి భయపడ్డారు.

విశేషం: తప్పుపని చేసేవాడు ఎవ డేమి చేసినా తనను కనిపెడుతున్నాడని తన నీడ చూచికొని తనే భయపడుతుంటాడు. అట్లాగే అశ్వత్థామాదులు పాండవ శిబిరంలో సైన్యం జయానందంతో పెట్టే కేకలూ, నవ్వే నవ్వులూ విని అవన్నీ తమను పట్టుకొనటానికి వాళ్ళు చేసే శబ్దాలు అని భ్రమించి అక్కడికి పోవటానికి భయపడ్డారని భావం.

వ. ఉలికి యట వోవు టుడిగి యెచ్చటి కేనియుం దొలంగి నిలిచి మఱి కర్జంబుఁ జూచికొనువారై యా రథికవరులు మగిడి తూర్పుదెస కొంతదవ్వరిగి'రనిన నమ్మాటలు వెడవెడ వినుచుం దనకుం బాటిల్లిన దురవస్థ చింతించుచు నాంబికేయుం డి ట్లనియె. 6

ప్రతిపదార్థం: ఉలికి= భయపడి; అట+పోవుట+ఉడిగి= అక్కడికి పోవటానికి భయపడి; ఎచ్చటికిన్+ఏనియున్+తొలంగి= ఎక్కడికో తప్పుకొని నిలిచి; మఱి= పిమ్మట; కర్జంబున్= పనిని; చూచికొనువారు+ఐ= ఆలోచించుకొనేవారై; ఆ రథికవరులు= ఆ రథిక శ్రేష్ఠులు (కృపాశ్వత్థామ కృతవర్మలు); మగిడి= వెనుదిరిగి; తూర్పుదెస= తూర్పు దిక్కుగా; కొంత దవ్వు+అరిగిరి= కొంతదూరం వెళ్ళారు; అనినన్= అని సంజయుడు చెప్పగా; ఆ+మాటలు; వెడవెడ వినుచున్= నిరుత్సాహంతో వింటూ; తనకున్; పాటిల్లిన= సంభవించిన; దురవస్థ= దుస్థితిని గురించి; చింతించుచున్= విచారిస్తూ; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు (అంబిక కొడుకు); ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'ఆ వీరులు భయంతో అక్కడికి పోవటం మాని ఎక్కడికో తప్పుకొని నిలిచి, తరువాత తాము చేయవలసిన పనిని గూర్చి ఆలోచించుకొంటూ తిరిగి తూర్పు దిక్కుగా కొంతదూరం వెళ్లారు' అని సంజయుడు చెప్పే మాటలను ఆసక్తి లేకుండా వింటూ, తనకు సంభవించిన దుస్థితిని గూర్చి తలచుకొంటూ ధృతరాష్ట్రుడు అతడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ధృతరాష్ట్రుడికి తమ వీరులు ఓడిపోతున్నారనే మాటలు రుచించవు. అందుచేతనే సంజయుడి మాటలను అనాసక్తితో వినటం జరిగింది.

వ. **'సంజయ! కురురాజు సమయునే యిట్లు భీమునిచేత? బలశౌర్యముల నజయ్యుఁ
డని నమ్మియుండితిఁ; దనయులు నూర్వురు మడియుట వినియు నా మనము పెక్కు
పఱియలై పోవనిభంగిఁ జూడఁగ ఱాత నొనరించినదిగాఁగ నోపు. నింక
నడియరితనమున నప్పాండవుల నాశ్రయింపఁగఁజాల; నే నెక్కడేనిఁ**

ఆ. **బోదుఁ గాక; యట్టి భూపాలు తండ్రినై, । ప్రాభవమునఁ బేర్చి పరమ దైన్య
వృత్తి కోర్వఁదగునె? విన వశమే మాట । లా మరుత్తనూజుఁ డాడ నాకు?** 7

ప్రతిపదార్థం: సంజయ!= ఓ సంజయా!. కురురాజు= దుర్యోధనుడు; ఇట్లు= ఈ విధంగా; భీమునిచేతన్= భీమునిచేతిలో; సమయునే?= చనిపోతాడా?; బల శౌర్యములన్= బలపరాక్రమాల విషయంలో; అజయ్యుఁడు+అని= జయించరానివాడని; నమ్మి+ఉండితిన్= నమ్మి ఉంటిని; తనయులు= కొడుకులు; నూర్వురున్= నూరుమందీ; మడియుట= చావటం; వినియున్= విని కూడా; నా మనసు= నా మనస్సు; పెక్కు పఱియలు+ఐ= పోవని భంగిన్= ముక్కలయిపోవని విధం; చూడఁగన్= చూస్తే; ఱాతన్= రాతితో; ఒనరించినది కాఁగన్ ఓవున్= చేసినదై వుండాలి; ఇంకన్= ఇకపై; అడియరితనమునన్= దాస్యంతో; ఆ+పాండవులన్= ఆశ్రయింపఁగన్+చాలన్= ఆశ్రయించలేను; నేను; ఎక్కడ+ఏనిన్= ఎక్కడికైనా; పోదున్+కాక= పోతాను కాని; అట్టి భూపాలు తండ్రిన్+ఐ= అటువంటి మహారాజుకు తండ్రినై; ప్రాభవమునన్= దొరతనంతో; పేర్చి= అతిశయించి; పరమ దైన్య వృత్తికిన్= మిక్కిలి దీనమైన పరిస్థితికి; ఓర్వన్+తగునె?= సహించగలనా?; ఆ మరుత్+తనూజుఁడు= ఆ భీముడు (వాయువు కొడుకు); మాటలు+ఆడన్= నిందించగా; నాకున్; వినన్+వశమే?= వినటానికి సాధ్యమా?

తాత్పర్యం: 'ఓయి సంజయా! దుర్యోధనుడు ఈ విధంగా భీముడిచేత దెబ్బతిని చనిపోతాడా? అతడు బలపరాక్రమాలలో ఇతరులకు జయించరానివాడని నమ్మి ఉన్నాను. నూరుగురు కొడుకుల చావు విని కూడా నా మనస్సు ముక్కలు ముక్కలై పోకపోవటం చూస్తే అది రాతితో నిర్మించబడి ఉండాలి. ఇకమీద దాస్యభావంతో ఆ పాండవులను ఆశ్రయించలేను. నేను అటువంటి మహారాజుకు తండ్రినై దొరతనంతో వెలిగి పరమ దైన్యంతో ప్రవర్తించగలనా? ఆ భీముడు పలికిన నిందావాక్యాలు నేను వినగలనా?

విశేషం: ధృతరాష్ట్రుడి పలుకులలో, దుర్యోధనుడిమీద అతడికిగల ప్రేమా, భీముడిపై గల ద్వేషమూ స్పష్టపడతాయి.

వ. **అని పలికి 'యశ్వత్థామ ప్రభృతు లేమిసేసి?' రనుటయు నజ్జనపతికి సంజయుం డిట్లనియె.** 8

ప్రతిపదార్థం: అని; పలికి; అశ్వత్థామ ప్రభృతులు= అశ్వత్థామ మొదలైన వారు; ఏమి+చేసిరి; అనుటయున్; ఆ+జనపతికిన్= ఆ రాజుకు (ధృతరాష్ట్రుడికి); సంజయుండు; ఇట్లు; అనియెన్= సంజయుడు ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని పలికి ధృతరాష్ట్రుడు 'అశ్వత్థామ మొదలైన వీరులు తరవాత ఏం చేశా?' రని అడుగగా అతడితో సంజయుడు ఇట్లా అన్నాడు.

క. ఇమ్మెయి నా రథికవరులు । గ్రమ్మఱి చని యడవి సొచ్చి కని రొక మడు; వం
దిమ్ముల సూతజనులు ర । థ్యమ్ముల నీళ్ళకును దిగువ నప్పుడు దారున్. 9

ప్రతిపదార్థం: ఆ రథిక వరులు= ఆ రథిక శ్రేష్ఠులు; ఈ+మెయిన్= ఈ రీతిగా; క్రమ్మఱి= మరలి; చని= పోయి; అడవి+చొచ్చి= అడవిలో ప్రవేశించి; ఒక మడువున్= ఒక మడుగును; కనిరి= చూశారు; అందున్= ఆ మడుగులో; ఇమ్ములన్= ప్రీతితో; సూత జనులు= రథంతోలేవాళ్ళు; రథ్యమ్ములన్= గుర్రాలను; నీళ్ళకును= నీళ్ళకోసం; తిగువన్= విడువగా; అప్పుడు; తారున్= తామును (అశ్వత్థామాదులునూ).

తాత్పర్యం: ఆ అశ్వత్థామాది రథికశ్రేష్ఠులు ఈ రీతిగా మరలిపోయి అడవిలో ప్రవేశించి, ఒక మడుగును చూశారు. రథచోదకులు గుర్రాలను నీళ్ళ కోసం విడిచిపెట్టగా అప్పుడు తామును. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. రథంబులు డిగ్గి యంబుపానంబు సేసి యాస్రోతదెస నాలించుచుండిరి. 10

ప్రతిపదార్థం: రథంబులు; డిగ్గి= దిగి; అంబు పానంబు+చేసి= నీళ్ళు త్రాగి; ఆ స్రోత దెసన్= ఆ ధ్వని వైపు; ఆలించు చున్+ఉండిరి= వింటూ ఉన్నారు.

తాత్పర్యం: (అశ్వత్థామాదులు) రథాలు దిగి, నీళ్ళు త్రాగి, ఆ చప్పుడు వచ్చే దిశవైపు చెవులొగ్గి వింటున్నారు.

తే. అంతఁ బశ్చిమ ధరణీధరాగ్ర పశ్చి । మంబునకుఁ బోయె మార్తాండమండలంబు;
సాంధ్యసమయ కృత్యంబులు సలిపి రపుడు । రథికవర్యులు ముప్వురు రాజముఖ్య! 11

ప్రతిపదార్థం: రాజముఖ్య!= ఓ రాజశ్రేష్ఠుడా!; ధృతరాష్ట్రా!; అంతన్= తరువాత; మార్తాండ మండలంబు= సూర్యబింబం; పశ్చిమ ధరణీధర+అగ్ర పశ్చిమంబునకున్= పడమటి కొండ కొనవెనుకకు; పోయెన్; అపుడు; రథికవర్యులు ముప్వురున్= రథిక శ్రేష్ఠులు ముగ్గురూ (కృపాశ్వత్థామ కృతవర్మలు); సాంధ్యసమయ కృత్యంబులు= సాయంకాల సంధ్యాసమయోచితాలైన పనులు - సంధ్యావందనాదులు; సలిపిరి= చేశారు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! అంత సూర్యాస్తమయం అయింది. అప్పుడు ఆ రథికశ్రేష్ఠులైన కృపాశ్వత్థామ కృతవర్మలు ముగ్గురూ సాయంకాల సంధ్యావందనాది కార్యక్రమాలు నిర్వర్తించారు.

వ. సలిపి నా రొక్క వటవిటపి సమీపంబున నాసీను లై; రా సమయంబున. 12

ప్రతిపదార్థం: సలిపి= చేసి; వారు; ఒక్క వట - విటపి - సమీపంబునన్= ఒక మర్రిచెట్టు దగ్గర; ఆసీనులు+ఐరి= కూర్చొన్నారు; ఆ సమయంబునన్= అప్పుడు.

తాత్పర్యం: ఆ విధంగా చేసి వాళ్ళు ఒక మర్రిచెట్టు దగ్గర ఆసీనులయ్యారు. అప్పుడు (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. వారిముఖమండలములతో వారిజములు । మొగిడె; శోకతమంబుతో నిగిడెఁ దిమిర
పటలి; బహు విచారములతోఁ బరఁగఁ బొల్చె । భూత బేతాళ గణములు భూపవర్య! 13

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజశ్రేష్ఠుడవైన ధృతరాష్ట్రా!; వారి ముఖ మండలములతోన్= ఆ ముగ్గురి ముఖబింబాలతోపాటు; వారిజములు= పద్మాలు; మొగిడెన్= ముడుచుకొన్నాయి!; శోకతమంబుతోన్= దుఃఖాంధకారంతోపాటు; తిమిర పటలి= చీకట్ల సమూహం; నిగిడెన్= వ్యాపించింది; బహు విచారములతోన్= (వారికి కలిగిన) పెక్కు ఆలోచనలతోపాటు; భూత బేతాళ గణములు= దయ్యాల, పిశాచాల గుంపులు; పరఁగన్= ఒప్పుగా; పొల్చెన్= ఒప్పాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! ఆ సమయంలో ఆ ముగ్గురి ముఖబింబాలతో పాటు పద్మాలు ముడుచుకొన్నాయి. దుఃఖాంధకారంతోపాటు చీకట్లు వ్యాపించాయి. అనేక ఆలోచనలతోపాటు భూతాలు, పిశాచాలు ఒప్పాయి.

విశేషం: అలం: సహోక్తి. కర్తవ్యం బోధపడక ఆ ముగ్గురి ముఖాలూ ముడుచుకొన్నాయి. సాయంసమయం కాబట్టి తామరపువ్వులు ముకుళించాయి. వాళ్ళ ముఖాలు పద్మాలవలె ఉన్నాయన్నమాట. ఏం చేయాలో తోచక వాళ్ళు దుఃఖించారు. చీకట్లు అలముకొన్నాయి. వాళ్ళ దుఃఖం చీకటివలె ఉందన్నమాట. వాళ్ళ మనస్సులలో ఎన్నో ఆలోచనలున్నాయి. భూతాలూ పిశాచాలూ విజృంభించాయి. వాళ్ళ ఆలోచనలు భూతపిశాచాలవలె ఉన్నాయన్నమాట. ఈ విధంగా ఉపమేయోపమానాలకి సహ భావం ఉంది. కాబట్టి ఇందులోని అలంకారం సహోక్తి. ఇట్లా కథతో ప్రకృతిని జోడించి వర్ణించటం బాగు.

క. కలుగు గురుసుతున కెట్లుం । బని చూడ నమరగణ మధికకుతూ
హలమున వచ్చెనొ యనఁ జు । క్కలు దోఁచెన్ గగనవీథిఁ గౌరవనాథా!. 14

ప్రతిపదార్థం: కౌరవనాథా!= కురువంశ రాజా! ధృతరాష్ట్రా!; గురు సుతునకున్= ద్రోణకుమారుడైన అశ్వత్థామకు; ఎట్టున్= ఏ విధంగా అయినా తప్పక; కలహంబు= యుద్ధం; కలుగున్= జరుగుతుంది అని; అమరగణము= దేవతల సమూహం; అధిక కుతూహలమునన్= మిక్కిలి ఆసక్తితో; చూడన్= చూడటానికి; వచ్చెనొ= వచ్చిందా?; అనన్= అన్నట్లు; చుక్కలు= నక్షత్రాలు; గగన వీథిన్= ఆకాశప్రదేశంలో; తోఁచెన్= కనబడ్డాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! 'అశ్వత్థామకు ఎట్లాగూ యుద్ధం సిద్ధిస్తుంది' అని దేవతల సమూహం మిక్కిలి వేడుకతో చూడాలని వచ్చిందా - అన్నట్లుగా ఆకాశంలో నక్షత్రాలు కనబడ్డాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, ఇందులో ఉపమేయమైన దేవతలను ఉపమానమైన చుక్కలుగా కవి సంభావించాడు కాబట్టి అలంకారం ఉత్ప్రేక్ష. ఇక్కడ కూడా కవి ప్రకృతిని కథతో మేళవించి వర్ణించటం చూడవచ్చు.

వ. ఇట్లు రాత్రి యగుట దివాచరంబు లైన జంతువు లుపశాంత వర్తనంబు లయ్యెఁ; రాత్రించరంబు లైనవి సంచరింపం దొడంగెఁ; నప్పడమ్మువ్వురు నెవ్వగలఁ గూరిన మనంబులతోఁ గురుబలం బకారణంబ పొలియుట

యుగ్గడించి తత్సంబంధకలితంబులైన భాషణంబులు సెల్లుచుండనుండి డప్పి గూరి కొండొకసేపునకు మహీ తలంబున మేనులు వైచి వందురుచుండి; రందుఁ గృపకృతవర్ములు నిద్రవొందిరి; గురునందనుండు క్రోధా తిశయంబునం జేసి నిదురవోవక వటవిటపంబు గలయం గనుంగొనువాఁడు తదీయశాఖోపశాఖల నానా కాకంబులు నిలీనంబులై నిద్రించుచుండ నాలోకించె; నయ్యవసరంబున. 15

ప్రతిపదార్థం: ఇట్లు రాత్రి అగుటన్= ఈ విధంగా రాత్రికావటంతో; దివాచరంబులు+ఐన జంతువులు= పగలు సంచరించే ప్రాణులు; ఉపశాంత వర్తనంబులు+అయ్యెన్= ఉడిగిన వ్యాపారాలు గలవి అయినాయి. రాత్రి చరంబులు+ఐనవి= రాత్రి సంచరించేవి; సంచరింపన్+తొడంగెన్= తిరగనారంభించాయి; అప్పుడు ఆ+ముచ్చురున్ నెవ్వగలన్ (నెఱ+వగలన్)= మిక్కిలి చింతలతో; కూరిన= నిండిన; మనంబులన్= మనస్సులతో; కురు బలంబు= కురుసేన; ఆకారణంబు+అ= నిష్కారణంగానే; పొలియుట= చావటం; ఉగ్గడించి= చెప్పి; తద్+సంబంధ కలితంబులు+ఐన భాషణంబులు= ఆ సంబంధంతో కూడుకొన్న మాటలు; చెల్లుచున్+ ఉండన్+ఉండి= సాగుతుండగా ఉండి; డప్పి= శ్రమ; కూరి= చెంది; కొండొక సేపునకున్= కొంతసేపటికి; మహీతలంబునన్= నేలమీద; మేనులు= శరీరాలు; వైచి= వేసి; వందురుచున్+ఉండిరి= విచారిస్తూ ఉండినారు; అందున్= వారిలో; కృప కృత వర్ములు= కృపాచార్యుడూ; కృతవర్మా; నిద్ర+పొందిరి= నిద్రపోయారు; గురు నందనుండు= గురుసుతుడు (అశ్వత్థామ); క్రోధ+అతిశయంబునన్+చేసి= కోపాధిక్యంచేత; నిదుర+పోవక= నిద్రించక; వట విటపంబున్= మఱ్ఱిచెట్టును; కలయన్= అంతటా; కనుంగొనువాఁడు=చూచేవాడు; తదీయ శాఖా+ఉపశాఖలన్= దాని శాఖలందును ఉపశాఖలందును; నానాకాకంబులు= పెక్కు కాకులు; నిలీనంబులు+ఐ= దాగినవయి; నిద్రించుచున్+ఉండన్= నిద్రిస్తూ ఉండగా; ఆలోకించెన్= చూశాడు; ఆ+ అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఇట్లా రాత్రి అవటంచేత పగలు సంచరించే ప్రాణులు సంచరించటం మానివేశాయి. రాత్రి తిరిగేవి తిరుగనారంభించాయి. అప్పుడు ఆ ముగ్గురూ దుఃఖాక్రాంత మనస్కులై కౌరవసేన నిష్కారణంగా చావటానికి సంబంధించిన మాటలు మాట్లాడుకొంటూ ఉండి, శ్రమచెంది, కొంతసేపటికి నేలమీద మేనులు వాల్చి దుఃఖిస్తూ ఉండిపోయారు. వాళ్ళలో కృపాచార్యుడూ, కృతవర్ముడూ నిద్రించారు. కాని, అశ్వత్థామ కోపాతిశయంచేత నిద్రపోక మఱ్ఱిచెట్టు అంతటా చూస్తూ దాని శాఖోపశాఖలలో దాగి నిద్రిస్తూ ఉన్న ఎన్నో కాకులను చూచాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: కృపకృతవర్ములకంటె అశ్వత్థామకు బాధ అధికం. ఎందుచేత నంటే అతడి తండ్రిని ధృష్టద్యుమ్నుడు అన్యాయంగా చంపాడు. పైగా తా నిప్పుడు సేనాధిపతి. అందుచేత బాధ్యతకూడా ఉన్నది. ఆ కారణంగా కృప కృతవర్ములు హాయిగా నిద్రపోయారు. కాని అశ్వత్థామకు మాత్రం నిద్రపట్టలేదు.

సీ. **మిడుఁగుఱుగములు గ్రమ్మినయట్లు నిగిడెడు రోచులు గల మిడిగ్రుడ్లుదనర**
మెఱుఁగారు కెంజాయ మెఱసిన యెఱకల మోపున నెసఁగు పెన్ మ్రోఁతతోడఁ
గాకుల భీషణాకారత వేళ్ళతో లీలమై నెగసిన శైలమనఁగఁ;
గర ముగ్రమగు మొగ మిరుదెస మురియించి యామిషంబుల యిక్క లరసికొనుచు;

తే. **నచటి బయలెల్లఁ దానయై యక్కజంపుఁ । జందమును, ఘోరమైన నిస్వనముఁ, జండ**
గతియు భూతవితానభీకరముగా ను । లూక మొక్కటి వచ్చె భూలోకనాథ! 16

ప్రతిపదార్థం: భూలోకనాథ!= రాజా! ధృతరాష్ట్రా!; మిగుఁగుఱు గములు= అగ్నికణాల సమూహాలు; క్రమ్మిన+అట్లు= వ్యాపించిన విధంగా; నిగిడెడు= వెలువడే; రోచులు= కాంతులు; కల= ఉన్న; మిడిగ్రుడ్లు; తనరన్= ఒప్పగా; మెఱుగారు (మెఱుఁగు+ఆరు)= మిక్కిలి ప్రకాశించే; కెంజాయన్ (కెంపు+చాయన్)= ఎఱ్ఱటి కాంతిచేత; మెఱసిన= మెరిసినట్టి; ఎఱకల= ఈకల యొక్క; మోపునన్= సమూహంచేత; ఎసఁగు= కలిగే; పెన్ మ్రోఁతతోడన్= పెద్దధ్వనితో; కాళుల= కాళ్ళయొక్క; భీషణ+ఆకారతన్= భయంకర స్వరూపంచేత; వేళ్ళతోన్= మూలములతో; లీలమైన్= అలవోకగా; ఎగసిన= ఎగిరిన; శైలము= కొండ; అనఁగన్= అనగా; కరము= మిక్కిలి; ఉగ్రము+అగు= భయంకరమైన; మొగము= ముఖం; ఇరుదెసన్= రెండువైపులకు; మురియించి= త్రిప్పి; ఆమిషంబుల+ఇక్కలు= మాంసములుండే చోట్లు; అరసి కొనుచున్= చూచుకొంటూ; అచటి బయలు+ ఎల్లన్= అక్కడి బహిఃప్రదేశమంతా; తాను+ఆ+ఐ= తానే అయి; అక్కజంపు+చందమును= ఆశ్చర్యకర రూపమూ; ఘోరము+ ఐన= భయంకరమైన; నిస్వనమున్= ధ్వనీ; చండ గతియున్= తీవ్రమైన గమనమూ; భూత వితాన భీకరము+కాన్= ప్రాణికోటికి వెరవు కలిగించేది కాగా; ఉలూకము+ఒక్కటి= ఒక గ్రుడ్లగూబ; వచ్చెన్= వచ్చింది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! అగ్నికణాల సమూహం వ్యాపించినట్లు వెలువడే కాంతులుగల మిట్టగ్రుడ్లు ఒప్పగాను, మిక్కిలి ప్రకాశించే ఎఱ్ఱటికాంతితో మెరిసిపోయే ఈకల సమూహంచేత కలిగే పెద్దధ్వనితోనూ, కాళ్ళ భయంకరాకారంతో సమూలంగా అలవోకగా ఎగిరిన కొండ మాదిరిగానూ, మిక్కిలి భయంకరమైనముఖం రెండువైపులకూ త్రిప్పి, మాంసఖండాలు పడి ఉన్న ప్రదేశాలను అన్వేషిస్తూ అక్కడి బయలంతా తనే అయి, ఆశ్చర్యకరమైన రూపమూ, భయంకరమైన ధ్వనీ, తీవ్రమైన గమనమూ ప్రాణికోటికి వెరపూ పుట్టించగా ఒక గ్రుడ్లగూబ వచ్చింది.

విశేషం: అలం: స్వభావోక్తి. కవి గ్రుడ్లగూబని స్వభావసిద్ధంగా వర్ణించాడు. కాబట్టి ఇందులోని అలంకారం స్వభావోక్తి. 'కాళుల..శైల మనఁగ' అనేచోట అలంకారం సంబంధాతిశయోక్తి. ఆకారాన్ని కన్నులకు కట్టినట్లు వర్ణించటం తిక్కన ప్రత్యేకత.

అశ్వత్థామ యులూకంబు కాకంబులఁ జంపుట నాలోకించుట (సం.10-1-39)

వ. వచ్చి యన్వటవిటపంబు నూఁది యక్కాకంబుల నాలోకించి యంగంబుల యుద్భటత్వం బుడిసికొని గమ నంబు తిన్నఁదనంబు దలకొనఁ జొచ్చి వాని నాక్రమించి. 17

ప్రతిపదార్థం: వచ్చి; ఆ+వట విటపంబున్= ఆ మర్రిచెట్టుకొమ్మని; ఊఁది= ఆధారంగా చేసికొని; ఆ+కాకంబులన్= ఆ కాకులను; ఆలోకించి= చూచి; అంగంబుల= అవయవాలయొక్క; ఉద్భటత్వంబు= ఆధిక్యాన్ని; ఉడిపికొని= తగ్గించుకొని; గమనంబు= నడక; తిన్నఁదనంబు= మెల్లనితనం; తలకొనన్= ఒప్పగా; చొచ్చి= ప్రవేశించి; వానిన్= ఆ కాకుల్ని; ఆక్రమించి= చుట్టుకొని.

తాత్పర్యం: ఆ విధంగా గుడ్లగూబ వచ్చి ఆ చెట్టుకొమ్మను ఆధారంగా చేసికొని ఆ కాకులను చూచి తన అవయవాల అధిక్యాన్ని తగ్గించుకొని, మెల్లగా నడుస్తూ ప్రవేశించి వాటిని చుట్టుకొని (ఆక్రమించుకొని). (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: గుడ్లగూబ అవయవాలు విరివిగా ఉంటే కాకులు ఎగిరిపోతాయి. కాబట్టి అది వాటిని ముడుచుకుంది. అట్లాగే గమనం ప్రచండంగా ఉంటే కాకులు పసిగట్టి ఎగిరిపోతాయి కాబట్టి అది మెలకువతో మెల్లగా నడిచి వచ్చి వాటిని పట్టుకున్నది.

ఉ. కొన్నిటి కంఠముల్ నులుపుఁ, గొన్నిటి కాళులు ద్రుంచు నుగ్రతం
గొన్నిటి పక్షముల్ నఱకుఁ గొన్నిటి పొట్టలు వ్రచ్చు లీలమైఁ.
గొన్నిటి నప్పళించుకొని కోలెముకల్ నుఱుమాడు, నిట్టు ల
య్యన్నిటి నయ్యులూకము రయం బెసఁగన్ వధియించె భూవరా! 18

ప్రతిపదార్థం: భూవరా!= రాజా! ధృతరాష్ట్రా!; కొన్నిటి కంఠముల్= కొన్ని కాకుల పీకలు; నులుపున్= పిసుకుతుంది; కొన్నిటి కాళులు= కాళ్ళు; ఉగ్రతన్= భయంకరత్వంతో; త్రుంచున్= విరగ్గొడుతుంది; పక్షముల్= రెక్కలు; నఱకున్= నరుకుతుంది; లీలమైన్= విలాసంగా; కొన్నిటి; పొట్టలు; వ్రచ్చున్= చీల్చుతుంది; అప్పళించుకొని= అదిమిపట్టుకొని; కోలెముకల్ (కోల+ఎముకల్)= వెన్నెముకలు; నుఱుమాడున్= పొడిచేస్తుంది; ఇట్టులు= ఈ విధంగా; ఆ+అన్నిటిన్= ఆ కాకులను అన్నింటినీ; ఆ+ఉలూకము= ఆ గ్రుడ్లగూబ; రయంబు= వేగం; ఎసఁగన్= అతిశయించగా; వధియించెన్= చంపింది.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! కొన్ని కాకుల పీకలు నులిమీ, కొన్నింటి కాళ్ళు భయంకరంగా విరుగకొట్టీ, కొన్నింటి రెక్కలు నరికీ, కొన్నిటి పొట్టలు అలవోకగా చీల్చీ, కొన్నిటిని అదిమి పట్టుకొని వెన్నెముకలు పొడిచిచేసీ -ఈ విధంగా ఆ గ్రుడ్లగూబ ఆ కాకులను అన్నింటినీ అతివేగంగా చంపింది.

వ. ఇవ్విధంబున నిద్రావివశంబు లైన యవ్వాయసంబుల వివిధంబులగు వధంబుల గీటడఁగించి యా కౌశికంబు శత్రువులం బొదివి సమయించిన మేటి మగని మాడ్కి మోదంబు నొందినం గని యగ్గురునందనుం డాచందం బొనర్చుటకు డెందంబున నుత్సాహంబు వొడమి పొంగి తనలోన. 18

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; నిద్రా వివశంబులు+ఐన= నిద్రకు స్వాధీనమైన; నిద్రపోతూ ఉన్న; ఆ+వాయసంబులన్= ఆ కాకులను; వివిధంబులు+అగు వధంబులన్= రకరకాల చంపటాలతో; గీటడఁగించి= నాశనంచేసి (చంపి); ఆ+కౌశికంబు= ఆ గ్రుడ్లగూబ; శత్రువులన్= విరోధులను; పొదివి= ఆక్రమించి; సమయించిన= చంపిన; మేటి మగని మాడ్కిన్= గొప్ప శూరునివలె; మోదంబున్= సంతోషం; ఒందినన్= పొందగా; కని= చూచి; ఆ+గురు నందనుండు= ఆ గురు సుతుడు (అశ్వత్థామ); ఆ+చందంబు= ఆ విధంగా; ఒనర్చుటకున్= చేయటానికి; డెందంబునన్= హృదయంలో; ఉత్సాహంబు= వేడుక; పొడమి= పుట్టి; పొంగి= ఉత్సహించి; తనలోనన్= తనలో.

తాత్పర్యం: ఆ గ్రుడ్లగూబ ఈ విధంగా నిద్రపోతూ ఉన్న ఆ కాకులను రకరకాలుగా చంపి విరోధులను ఆక్రమించి చంపిన గొప్పవీరుడివలె సంతోషించటం చూచి, ఆ అశ్వత్థామ తాను కూడా ఆ రీతిగా చేయటానికి మనస్సులో వేడుకపడి ఉత్సాహంతో తనలో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ. 'ఆ కౌశికంబు...మోదంబు నొందినన్' ఇందులోని అలంకారం పూర్ణోపమ. నిద్రపోతూ ఉన్న కాకులను చంపిన గ్రుడ్లగూబను శత్రువులను చంపిన మేటి వీరుడితో పోల్చటంవలన, మేటివీరుడైన తనుకూడా తన శత్రువులను నిద్రపోతూండగా చంపాలనే కర్తవ్యాన్ని అశ్వత్థామ తెలిసికొన్నాడు కాబట్టి ఈ అలంకారాని కిక్కడ ఎంతో ఔచిత్యం ఉన్నది.

తే. 'ఇవ్విహంగమ ముపదేశ మిచ్చె నాకు । నిద్రవోవంగ శత్రుల నిగ్రహింతు;
నింత లెస్సగునే! ముంద రేమి తెలఁగు । గాననైతిని నా పూను కార్యమునకు.' 20

ప్రతిపదార్థం: ఈ+విహంగమము= ఈ పక్షి; నాకున్; ఉపదేశము+ఇచ్చెన్= ఉపదేశించింది; శత్రులన్= విరోధుల్ని; నిద్ర+పోవంగన్= నిద్రపోతూ ఉండగా; నిగ్రహింతున్= చంపుతాను; ఇంత లెస్స+అగునే!= ఇంత మంచిదౌనా!; నా పూను కార్యమునకున్= నేను పూనుకొన్న పనికి; ముందర= మొదట్లో; ఏమి తెఱఁగు= ఏ విధమూ; కానన్+ఐతిని= కానలేకపోయాను.

తాత్పర్యం: 'ఈ పక్షి నాకు కర్తవ్యాన్ని ఉపదేశించింది. శత్రువులను నిద్రపోతూ ఉండగా చంపుతాను. ఈ ఆలోచన ఎంత బాగున్నది! నేను చేపట్టిన పనికి ఇంతకు ముందు ఏం చేయాలో తెలిసింది కాదు.'

వ. అని వెండియు. 21

ప్రతిపదార్థం: అని; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని ఇంకా.

ఉ. పాండునరేంద్రనందనుల బాంధవ పుత్త్రయుతంబుగాఁగ ను
ద్దండత నే వధింతు నని దర్పమెలర్పఁగఁ గౌరవాధినా
థుండు వినంగఁ బల్కితిని; దుర్దమ దోర్బలు లమ్మహాత్మకుల్
గండున బెట్టు పైఁ బడుట కార్యము గాదు తలంచి చూడఁగన్. 22

ప్రతిపదార్థం: పాండు నర+ఇంద్ర నందనులన్= పాండురాజుకొడుకులైన పాండవులను; బాంధవ పుత్ర యుతంబు కాఁగన్= బంధు పుత్రసహితంగా; ఉద్దండతన్= తెగువతో; ఏన్= నేను; వధింతున్+అని= చంపుతానని; దర్పము= గర్వం; ఎలర్పఁగన్= అతిశయించగా; కౌరవ+అధినాథుండు= కురుపతి దుర్యోధనుడు; వినంగన్= వినేటట్లు; పల్కితివి= అన్నాను; ఆ+మహాత్మకుల్= ఆ మహాత్ములైన; పాండవులు; దుర్దమ దోర్బలులు= అణచరాని భుజబలం గలవాళ్ళు; తలంచి చూడఁగన్= ఆలోచించగా; గండు నన్= గర్వంతో; బెట్టు= గట్టిగా; పైన్+పడుట= మీదపడటం; కార్యము+కాదు= చేయవలసినది కాదు (ప్రయోజనంలేదు).

తాత్పర్యం: 'పాండవులను సబంధుపుత్త్రంగా చంపుతానని నేను తెగించి గర్వాతిశయంతో దుర్యోధనుడితో అన్నాను. ఆ మహాత్ములు అణచరాని భుజబల సంపన్నులు. ఆలోచించగా గర్వంతో గట్టిగా వాళ్ళమీద పడటం మంచిదికాదు.'

క. అరవాయి గొనక బెట్టుగఁ । బరిగొని యక్కడిఁది మగలపై నడరుట యు
ద్ధురగతి నగ్నిజ్వాలో । త్కరముపయిన్ మిడుత యుఱుకు కరణియ కాదే? 23

ప్రతిపదార్థం: అరవాయి కొనక= సందేహించకుండా; బెట్టుగన్= శీఘ్రంగా; పరిగొని= చుట్టుముట్టి; ఆ+కడిఁది మగలపైన్= ఆ మహావీరులపై; అడరుట= విజృంభించటం; ఉద్ధుర గతిన్= తటాలున; అగ్ని జ్వాలా+ఉత్కరము; పయిన్= అగ్నిజ్వాలల సమూహం మీద; మిడుత; ఉఱుకు కరణి+అ+కాదే?= ఉరికే విధమేకదా?

తాత్పర్యం: 'సందేహించకుండా శీఘ్రమే చుట్టుముట్టి ఆ మహావీరులమీద విజృంభించటం తటాలున అగ్నిజ్వాలలలో మిడుత ఉరకటం లాంటిదే కదా!'

విశేషం: అలం: నిదర్శన 'అక్కడిఁది మగలపై...కరణియ' ఉపమాన వాక్యార్థానికీ ఉపమేయ వాక్యార్థానికీ అభేదం చెప్పటంచేత ఇందులోని అలంకారం నిదర్శన. ఇచ్చట అగ్నిజ్వాలలు పాండవులు, మిడుత అశ్వత్థామ-అనే ధ్వని కన్పడుతూ ఉన్నది.

వ. **పాండవులం బరిమార్చుపని నేడ చేయక మఱిచేసిన నారాజు నిర్గత ప్రాణుండైన నాకెలసం బెవ్వరికెక్కడుఁ? జక్కటితోడి బవరంబున నబ్బలుమగల గెలువరాదని యిట్లురియాడు నా చిత్తంబు చింతాపరంపర వాయ నీ పక్షి విచేష్టితంబు లోచనగోచరంబయ్యెఁ బగతురఁ దెగటార్చునెడ నన్యాయంబనక యుపాయం బెయ్యది దొరకొనిన దాన నుత్సహింపవలయుట శాస్త్రసిద్ధంబ కాదే? యెట్లనిన.** **24**

ప్రతిపదార్థం: పాండవులన్; పరిమార్చు పని= చంపే పని; నేఁడు+అ= ఈ రోజే; చేయక= చేయకుండా; మఱి= తరువాత; చేసినన్= చేస్తే; ఆ రాజు= దుర్యోధనుడు; నిర్గత ప్రాణుండు+ఐనన్= చచ్చిపోతే; నా కెలసంబు= నేను చేసినపని; ఎవ్వరికిన్= ఎవరికి; ఎక్కెడున్?= నచ్చుతుంది?; చక్కటి తోడి బవరంబునన్= ధర్మయుద్ధంతో; ఆ+బలు మగలన్= ఆ మహావీరులను; గెలువన్+ రాదు+అని= గెలవటం అశక్యమని; ఇట్లు= ఈ రీతిగా; ఉరియాడు= తటపటాయించే; నా చిత్తంబు= నా మనస్సు లోని; చింతా పరంపర= ఆలోచనల వరుస; పాయన్= పోయేటట్లు; ఈ పక్షి విచేష్టితంబు= ఈ పక్షియొక్క చేష్ట; లోచన గోచరంబు+అయ్యెన్= కనబడింది; పగతురన్= శత్రువుల్ని; తెగటార్చు+ఎడన్= చంపేటప్పుడు; అన్యాయంబు+అనక= అధర్మం అనకుండా; ఉపాయంబు+ఏ+అది= ఏ ఉపాయం; దొరకొనినన్= లభిస్తే; దానన్= దానిలో; ఉత్సహింపన్+వలయుట= ఉత్సాహం చూపాలనటం (ప్రయత్నించటం); శాస్త్ర సిద్ధంబు+అ= శాస్త్రంచేత సిద్ధించేది; కాదే?= కాదా?; ఎట్లు+అనినన్= ఎట్లా అంటే.

తాత్పర్యం: పాండవులను నేడు చంపక, తరువాత ఎప్పుడో చంపితే ఈ లోగా దుర్యోధనుడు కన్నుమూస్తే నేను చేసినపనిని ఎవరు మెచ్చుకొంటారు? ధర్మయుద్ధంలో ఆ మహావీరులను చంపటం అశక్యం అని ఇట్లా కళవళపడే నా మనస్సులోని చింత పోయేటట్లు ఈ పక్షి చేష్ట నా కంటపడింది. శత్రువులను చంపేటప్పుడు అధర్మం అనకుండా లభించిన ఉపాయంతో ఉత్సహించాలనటం శాస్త్రసమ్మతమే కాదా! ఎట్లా అంటే. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఉస్మానియా యూనివర్శిటీ వారి ప్రతులలోని...'గోచరం బయ్యు' ననే పాఠంకంటె, తె.వి. ప్రతిలోని '...గోచరం బయ్యెననే పాఠం మేలనిపించింది.

తే. **ఎత్తినప్పుడు, విడియుచోఁ, నిఱుకటంపుఁ । దెరువునందు, నడవు సెడి తిరుగఁబడిన**
యట్టియెడ, నిద్రవోయెడు నవసరమున । శాత్రవుల బెట్టు పైఁబడి చంపవలయు. **25**

ప్రతిపదార్థం: ఎత్తినప్పుడున్ (ఎత్తిన+అప్పుడున్)= దండెత్తినప్పుడూ; విడియుచోన్= విడిదిచేసినప్పుడూ; ఇఱుకటంపుఁ; దెరువునందున్ (ఇఱుకటము+తెరువు)= ఇరుకైన దారిలోనూ; నడపుసెడి= నడక నశించి; తిరుగఁబడిన+అట్టి+ఎడన్= తిరగ బడినప్పుడూ; నిద్ర+ పోయెడు+అవసరమునన్= నిద్రించేటప్పుడూ; శాత్రవులన్= విరోధులను; బెట్టు= క్రూరంగా; పైఁబడి= మీదపడి; చంపవలయున్;

తాత్పర్యం: దండెత్తినప్పుడూ, విడిది చేసినప్పుడూ, ఇరుకైన దారిలోనూ, గతిలేక తిరగబడినప్పుడూ, నిద్రించేటప్పుడూ శత్రువులను క్రూరంగా మీదపడి చంపాలి.

వ. అను నీతివాక్యంబులు విందు; నంగీకృతక్షత్రధర్ముం డగు వానికి నిట్టివి కర్తవ్యంబు; లట్లుఁగాక పాండవేయులు పితామహగురులైన భీష్మద్రోణులఁ దెగటార్చునెడం జక్కటిగల తెఱంగున సంగరంబు చేసిరె? యంగరాజును, రారాజును బరిమార్చిన భంగులఁ దలంపంగూడునె? కావునఁ గల్మషోపాయులగు కౌంతేయుల నిద్రా సమయంబున గొబ్బున నిగ్రహించుట నీతియ కాని నింద్యంబుగా' దని నిశ్చయించె; నట్లు క్రూరవ్యవసాయుం డగు నగ్గురుసుతుండు దన మామను, గృతవర్మను మేలుకొల్పి యిట్టి సమయంబున నిద్రించితిమని లజ్జించు చున్న యా రథికవరులతో నిట్లనియె. 26

ప్రతిపదార్థం: అను నీతి వాక్యంబులు= అనే నీతివాక్యాలు; విందున్= వింటాను; అంగీకృత క్షత్రధర్ముండు+అగు+వానికిన్= క్షత్రియ ధర్మాన్ని అవలంబించిన వాడికి; ఇట్టివి= ఇటువంటివి; కర్తవ్యంబులు= చేయదగ్గవి; అట్లుఁగాక= అదీగాక; పాండవేయులు= పాండవులు; పితామహగురులు+ఐన= తాతా, గురువూ అయిన; భీష్మ ద్రోణులన్= భీష్ముడినీ, ద్రోణుడినీ; తెగటార్చు+ఎడన్= చంపేటప్పుడు; చక్కటి+కల-తెఱంగునన్= న్యాయమైన విధంగా; సంగరంబు= యుద్ధం; చేసిరె?= చేశారా?; అంగరాజును= కర్ణుడిని; రారాజును= దుర్యోధనుడినీ; పరిమార్చిన భంగులన్= చంపిన పద్ధతులను; తలంపన్+కూడునె?= అనుకోవచ్చా?; కావునన్= కాబట్టి; కల్మష+ఉపాయులు+అగు కౌంతేయులన్= దుష్టమైన ఉపాయాలు గల పాండవులను; నిద్రాసమయంబునన్= నిద్రించే సమయంలో; గొబ్బునన్= వెంటనే; నిగ్రహించుట= చంపటం; నీతి+అ= నీతే కాని; నింద్యంబు= నిందింపదగింది; కాదు+అని= కాదని; నిశ్చయించెన్= నిర్ణయించుకొన్నాడు; అట్లు క్రూర వ్యవసాయుండు+అగు= క్రూరమైన ప్రయత్నం గలవాడైన; ఆ+గురుసుతుండు= ఆ గురుపుత్రుడైన అశ్వత్థామ; తన మామను= తన మేనమామ అయిన కృపాచార్యుడిని; కృతవర్మను; మేలుకొల్పి= లేపి; ఇట్టి సమయంబునన్= ఇటువంటి క్లిష్టసమయంలో; నిద్రించితిమి+అని= నిద్రపోయామని; లజ్జించుచున్+ఉన్న= సిగ్గు పడుతూ ఉన్న; ఆ రథికవరులతోన్= ఆ రథికోత్తములతో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: ఏ పద్ధతిని అనుసరించి అయినా శత్రువులను చంపవచ్చును- అనే నీతివాక్యాలు విన్నాను. క్షత్రియధర్మం అవలంబించినవాడికి ఇట్లాంటి పనులు చేయదగినవి. అదీకాక పాండవులు తాత అయిన భీష్ముడిని, గురువైన ద్రోణుడినీ చంపేటప్పుడు న్యాయమార్గంలో యుద్ధం చేశారా? కర్ణుడినీ, దుర్యోధనుడినీ చంపిన రీతులని మనసులోనైనా అనుకొనవచ్చునా? కాబట్టి దుష్టమైన ఉపాయాలు గల పాండవులను నిద్రించేటప్పుడు ఆకస్మికంగా చంపటం నీతే కాని నిందించదగింది కాదని నిర్ణయించుకొన్నాడు. ఆ విధంగా క్రూరమైన ప్రయత్నాన్ని తలపెట్టిన ఆ అశ్వత్థామ తన మేనమామ అయిన కృపాచార్యుడినీ, కృతవర్మనూ మేలుకొలిపి, ఇటువంటి క్లిష్టసమయంలో నిద్రపోయామని సిగ్గుపడుతూ ఉన్న ఆ రథికశ్రేష్ఠులతో ఇట్లా అన్నాడు:

విశేషం: శిఖండిని ముందుపెట్టుకొని భీష్ముడినీ, అస్త్రత్యాగం చేసిన ద్రోణుడిని చంపటంలో పాండవులు న్యాయాన్ని వదలిపెట్టారని ధ్వని.

సీ. 'మొగ దప్పితిమి రణమున మన మకట! ము । వ్వురము; రారాజు నొక్కరునిఁ బాండు
తనయులు దమవారుఁ దారును బెక్కండ్రు । గూడి చుట్టును ముట్టి గుల్లపఱచి;
రేకాదశాక్షౌహిణీశ్వరుఁ డట్లొంటి । మెయిఁ జిక్కి పోరుచుండియును బాడి
దప్పం; దవ్విభుని నధర్మ విక్రమమునఁ । బాపాత్మకుండగు బకవిరోధి

ఆ. గూల్చె; నంతఁ బోక కురుదేశ రాజ్యాభి । షిక్తమైన యతని శిరము దన్నెఁ;
బరిభవంబు నొంచెఁ బ్రాణాంతకరవేద । నాతిశయముకంటె నన్నరేంద్రు. 27

ప్రతిపదార్థం: అకట! అయ్యో!; మనము ముగ్వురమున్= మనం ముగ్గురమూ; రణమునన్= యుద్ధంలో; మొగదప్పితిమి= మొగంతప్పించాము; రారాజున్+ఒక్కరునిన్= దుర్యోధనుడిని ఒక్కడినీ; పాండు తనయులు= పాండురాజు కొడుకులు; తమవారున్= తమవాళ్ళూ; తారును= తామూ; పెక్కండ్రు= అనేకులు; కూడి= కలిసి; చుట్టును ముట్టి= చుట్టుముట్టి; గుల్లపటిచిరి= అవమానిం చారు; ఏకాదశాక్షౌహిణీశ్వరుఁడు= పదకొండు అక్షౌహిణులకు ప్రభువైన దుర్యోధనుడు; అట్లు= ఆ విధంగా అతిదీనంగా; ఒంటిమెయిన్= ఒంటరివాడయి; చిక్కి= నిలిచి; పోరుచున్+ఉండియును= యుద్ధం చేస్తూ ఉన్నప్పటికీ; పాడి= ధర్మం; తప్పఁడు; ఆ+విభునిన్= ఆ రాజును; అధర్మ విక్రమమునన్= అన్యాయమైన పరాక్రమంతో; పాపాత్మకుండు+అగు= దుర్మార్గుడైన; బక విరోధి= బకాసురుడి శత్రువైన భీముడు; కూల్చెన్= పడగొట్టాడు; అంతన్+పోక= అంతటితో ఊరుకోక; కురు దేశరాజ్య+ అభిషిక్తము+ఐన= కురుదేశ రాజ్యమందు అభిషేకించబడిన; అతని శిరమున్= అతడి తలను; తన్నెన్= తన్నివాడు; ఆ+ నర+ఇంద్రున్= ఆ రాజును (దుర్యోధనుడిని); ప్రాణ+అంతకర వేదనా+అతిశయముకంటెన్= ప్రాణంతీసే బాధాధిక్యం కన్నా; పరిభవంబు= అవమానము; నొంచెన్= బాధించింది.

తాత్పర్యం: 'అయ్యో! మనం ముగ్గురం యుద్ధంలో దుర్యోధనుడిదగ్గర లేకుండా మొగం తప్పించాము. రాజరాజును ఒక్కడినీ పాండవులు తమ వాళ్ళూ తామూ అనేకులు కలిసి చుట్టుముట్టి అవమానించారు. పదకొండు అక్షౌహిణుల బలానికి ప్రభువైన ఆ రాజరాజు ఆ విధంగా ఒంటరివాడై నిలిచి పోరుతున్నప్పటికీ ధర్మం తప్పడు. అట్లాంటి వాడిని దుర్మార్గుడైన భీముడు అధర్మపరాక్రమం చూపి కూల్చాడు. అంతటితో ఊరుకొనక కురుదేశ రాజ్యాభిషిక్తమైన అతడి శిరస్సును తన్నాడు. ఆ రాజును ప్రాణం తీసే బాధాధిక్యం కంటె. అవమానం అధికంగా బాధించింది.

విశేషం: దుర్యోధనుడు ఎంతటి అభిమానవంతుడో అశ్వత్థామ మాటలవలన తెలుస్తుంది.

క. లావును వెరవును గలుగు మ । హా వీరు లనేకు లట్టు లన్నిదినము లా
'భూవిభునకై పెనఁగి జయ । మీ వలఁతులు గాకపోయి రే మనవచ్చున్? 28

ప్రతిపదార్థం: లావును= బలమూ; వెరవును= ఉపాయమూ; కలుగు= కల; మహత్+వీరులు= గొప్ప వీరులు; అనేకులు= పెక్కుమంది; అట్టులు= ఆ రీతిగా; అన్ని దినములు= అన్నిరోజులు; ఆ భూవిభునకున్+ఐ= ఆ రాజుకోసం; పెనఁగి= యుద్ధంచేసి; జయము= గెలుపు; ఈన్= ఇవ్వటానికి; వలఁతులు= సమర్థులు; కాకపోయిరి; ఏమి+అనన్+వచ్చున్?= ఏమనాలి?

తాత్పర్యం: బలమూ, ఉపాయమూ ఉన్న మహావీరులు అనేకులు ఆ విధంగా అన్ని రోజులు ఆ రాజుకోసం పోరాడి అతడిని గెలిపించలేకపోయారు. ఏమనాలి?

ఆ. ఎవ్వరెంతఁ జేసిరేనియు విధియొండు । దలఁప నా ఫలంబు దలఁగ కేల
యుండు? నిట్లు గాఁగ నున్నది గా; కేమి । యెసకమెసఁగు కౌరవేంద్రు మనుపు?' 29

ప్రతిపదార్థం: ఎవ్వరు; ఎంతన్= ఎంతటిసాయం; చేసిరి+ఏనియున్= చేసినప్పటికీ; విధి= దైవం; ఒండు= ఇంకొకటి; తలఁ పన్= తలిస్తే; ఆ ఫలంబు= ఆ ఫలం; తలఁగక+ఏల+ఉండున్= తొలగకుండా ఎట్లా ఉంటుంది?; ఇట్లు+కాఁగన్+ఉన్నది+కాక= ఇలా కావాలని ఉన్నదికాక; కౌరవ+ఇంద్రు మనుపు= దుర్యోధనుడి రక్షణ; ఏమి+ఎసకము+ఎసఁగున్= ఏమి ఒప్పుతుంది?

తాత్పర్యం: ఎవరెంత చేసినప్పటికీ దైవం వేరుగా తలిస్తే, ఫలం ఎట్లా దక్కుతుంది? దుర్యోధనుడి రక్షణ ఇట్లా కావలసి ఉండగా, ఏమి ఒప్పుతుంది?

వ. అని పలుమాటలాడి 'మీ మది కలంగకున్నదేని యీ మహావ్యసనంబునకుఁ గర్తవ్యం బెద్ది చెప్పవలయు' నని నఁ గృపాచార్యుండు ధనురాచార్యనందను మొగంబు గనుంగొని 'నీవు చెప్పఁదలఁచిన యంత వట్టు నుం జెప్పి కార్యం బడిగితేని నాకుఁ దోఁచిన దానిం జెప్పెద విను' మని యిట్లనియె. 30

ప్రతిపదార్థం: అని పలు మాటలు+ఆడి= పెక్కు పలుకులు పలికి; మీ మది= మీ మనస్సు; కలంగక+ఉన్నది+ఏనిన్= చేయదగినదేది; చెప్పవలయున్= చెప్పాలి; అనినన్= అనగా; కృపాచార్యుండు; ధనురాచార్య నందను మొగంబు= ద్రోణుడి కొడుకైన అశ్వత్థామ ముఖం; కనుంగొని= చూచి; నీవు చెప్పన్+తలఁచిన= అంత+పట్టునున్= చెప్పాలనుకున్నదంతా; చెప్పి; కార్యంబు= చేయవలసిన దానిని; అడిగితి(వి)+ఏనిన్= అడిగినట్లయితే; నాకున్ తోఁచిన దానిన్= చెప్పెదన్ వినుము; అని ఇట్లు అనియెన్.

తాత్పర్యం: అని పెక్కు పలుకులు పలికి 'మీ మనస్సు కలతచెందక పోతే, ఈ మహాకష్టానికి ఏం చెయ్యాలో చెప్పాలి' అనగా, కృపాచార్యుడు అశ్వత్థామ ముఖం చూచి 'నీవు చెప్పాలనుకున్నదంతా చెప్పి ఏం చేయాలో అడిగితే నాకు తోచింది నేను చెపుతాను. వినుము' అని ఇట్లా అన్నాడు:

కృపాచార్యుఁ డశ్వత్థామకు నీతివిశేషంబు లెఱింగించుట (సం.10-2-1)

సీ. 'ప్రారంభములకెల్లఁ బౌరుషమ్మును దైవ । ముును సాధనమ్ములు వినుము వాని
లోన నొక్కటి చేతఁ గానేర వనఘ! త । త్ఫల సిద్ధు; లెట్లన్నఁ. దఱచు వాన
కారు పొలంబునఁ గల్గె నేనియుఁ గొల్చు । గావింప నేర్చునే? కల విధమున
వల నేర్పడఁగ దున్నఁ బొలములో నైన వ । ర్షంబు లేకున్న ధాన్యంబు లగునె?

ఆ. కాఁపు లావు వెరవు గల్గి కర్శనము సే । యంగ, వృష్టి దగినయట్లు గలుగ
ఫలము గల్గు; నట్లు పౌరుషంబునకు దై । వంబు తోడుపాటు వలయు నెందు. 31

ప్రతిపదార్థం: అనఘ= పాపరహితుడా!= ప్రారంభములకున్+ఎల్లన్= ప్రయత్నాలకన్నిటికీ; పౌరుషమ్మును= పురుషకారమూ; దైవమును= దైవమూ; సాధనమ్ములు= సాధనాలు; వినుము; వానిలోనన్= వాటిలో; ఒక్కటిచేతన్= ఒకదానిచేత; తద్+ఫల సిద్ధులు= ఆ ఫలం సిద్ధించటాలు; కాన్+నేరవు= కాజాలవు; ఎట్లు+అన్నన్= ఎట్లా అంటే; తఱచు= అధికంగా; వానకారు= వర్షం; పొలంబునన్= పొలంలో; కల్గెన్+ఏనియున్= కలిగినప్పటికీ; కల విధమునన్= ఎలాగయినా; కొల్చు= ధాన్యం; కావింపన్+నేర్చునే= చేయగలదా?; వలను= నేర్పు; ఏర్పడఁగన్= స్పష్టపడేటట్లు; దున్నన్= దున్నివా; పొలములోన్; ఐన వర్షంబు= కావలసిన వాన; లేక+ఉన్నన్= లేకపోతే; ధాన్యంబులు అగునె?= ధాన్యం పండునా?; కాఁపు= రైతు; లావు= శక్తీ; వెరవు= ఉపాయమూ; కల్గి= కలిగి; కర్శనము+చేయంగన్= దున్నితే; వృష్టి= వర్షం; తగిన+అట్లు= తగినవిధంగా; కలుగన్= కలిగితే; ఫలము కల్గున్= ఫలితం కలుగుతుంది; అట్లు= ఆ విధంగా; ఎందున్= ఏ విషయంలోనైనా; పౌరుషంబునకున్= పురుషప్రయత్నానికి; దైవంబు= దైవంయొక్క; తోడుపాటు= సహాయం; వలయున్= అవసరం.

తాత్పర్యం: 'పాపరహితుడవైన అశ్వత్థామా! అన్ని ప్రయత్నాలకూ పురుషకారమూ, దైవమూ సాధనాలు, వినుము. ఆ రెండింటిలో ఒక దానిచేతనే ఫలసిద్ధి కాజాలదు. ఎట్లా అంటే తరచుగా పొలంలో వానలు కురిసినప్పటికీ రైతు ఏ విధంగానూ ధాన్యం పండించగలడా? నేర్పుతో దున్నినా పొలంలో వర్షం తగినంత కురిస్తేనే ఫలం లభిస్తుంది. అట్లా ఎక్కడైనా పురుషప్రయత్నానికి దైవం తోడుపడాలి.'

విశేషం: దైవ ముండి పురుషకారం లేకపోయినా పురుషకార ముండి దైవం లేకపోయినా కార్యం సిద్ధించదు. ఏ కార్యమైనా సిద్ధించాలంటే దైవం పౌరుషం - ఈ రెండూ ఉండాల్సిందే. దైవ పౌరుషాల్లో ఏ ఒక్కదానివలన కార్యసిద్ధి జరుగదు. రెండూ ఉండాలనే సామాన్యాంశం కర్షకుడి కృషీ వానా అనే విశేషాంశంచేత సమర్థింప బడింది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

వ. 'అదియునుం గాక.' 32

తాత్పర్యం: 'అదీ గాక.'

క. 'తగుపని కుద్యోగించుచుఁ । దగ వెఱిఁగెడు హితుల కనుమతంబుగఁ జేయన్
జగతీ సురవర! కార్యము । లగు; వారికిఁ గలుగు విధి సహాయత్వంబున్.' 33

ప్రతిపదార్థం: జగతీసురవర!= బ్రాహ్మణోత్తమా! అశ్వత్థామా!; తగు పనికిన్= తగినపనికి; ఉద్యోగించుచున్= ప్రయత్నంచేస్తూ; తగవు+ఎఱిఁగెడు హితులకున్= ధర్మవేత్తలైన శ్రేయోభిలాషులకు; అనుమతంబుగన్= సమ్మతంగా; చేయన్= చేస్తే; కార్యములు= పనులు; అగున్= అవుతాయి; వారికిన్; విధి సహాయత్వంబున్= దైవం తోడుపాటు కూడా; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: 'బ్రాహ్మణోత్తమా! అశ్వత్థామా! తగిన పనికి ప్రయత్నిస్తూ ధర్మం తెలిసిన శ్రేయోభిలాషులకు సమ్మతంగా చేసినట్లయితే పనులు నెరవేరుతాయి. వాళ్ళకు దైవం కూడ తోడుపడుతుంది.'

క. 'ధర్మము దప్పక నయగతిఁ । గర్మాచరణంబు నడపఁగా ఫలసిద్ధిన్
నిర్మలయశ మగుఁ; దప్పినఁ, । బేర్మి సెడదె నింద రా నభేద్యోత్సాహా!' 34

ప్రతిపదార్థం: అభేద్య+ఉత్సాహా!= చెక్కు చెదరని ఉత్సాహం కలవాడా - అశ్వత్థామా!; ధర్మం= న్యాయం; తప్పక= తప్ప కుండా; నయ గతిన్= నీతిమార్గాన; కర్మాచరణంబున్= కార్యనిర్వహణం; నడపఁగాన్= జరిపినట్లయితే; ఫలసిద్ధిన్= ఫలసిద్ధీ; నిర్మల యశము= స్వచ్ఛమైన కీర్తి; అగున్ తప్పినన్= అలా కాకుంటే; నిందరాన్= అపకీర్తి కలుగగా; పేర్మి= గౌరవం; చెడదె?= నశించదా? (చెడుతుందని భావం).

తాత్పర్యం: చెక్కు చెదరని ఉత్సాహం గల అశ్వత్థామా! ధర్మం తప్పకుండా నీతితో పని చేసినట్లయితే ఫలసిద్ధీ, సత్కీర్తీ లభిస్తాయి. అట్లా కాకుంటే అపకీర్తి కలుగుతుంది. గౌరవమూ నశిస్తుంది.

విశేషం: 'నీ ఉత్సాహం అభేద్యమే కాని దానిని ధర్మయుక్తమైన పనియెడ చూపించుము. లేకపోతే అపకీర్తి కలిగి గౌరవం నశిస్తుం' దని అశ్వత్థామకు కృపాచార్యుడి హెచ్చరిక. 'దప్పదు పేర్మి సెడదె నిందరా దభేద్యోత్సాహ' అనే ఉస్మానియా యూనివర్శిటీ ప్రతి పాఠముకంటే, నా..తె.వి. ప్రతులలలోని దప్పినఁ బేర్మి సెడదె నిందరా నభేద్యోత్సాహ' అనే పాఠమే మేలనిపించింది.

ఉ. 'నీతి దొఱంగి కార్యముల నెట్టన యాగ్రహవృత్తిఁ జేసినం
బ్రీతిగ సిద్ధిఁ బొందినను భీతియుఁ గుత్సయుఁ బుట్టు; భూజను
ల్వేతురు; చేటు చేఁతలు ఫలింపక తక్కిన, మున్న వచ్చు న
త్యాతురతాస్పదంబు లగు నాపద; లిద్ధ వివేకవైభవా!' 35

ప్రతిపదార్థం: ఇద్ధ వివేక వైభవా!= మంచి వివేకసంపద గలవాడా! అశ్వత్థామా!; నీతి; తొఱంగి= విడిచి; కార్యములన్= పనులను; నెట్టన= అనాలోచితంగా; ఆగ్రహ వృత్తిన్= పట్టుదలతో; చేసినన్= చేస్తే; ప్రీతిగన్= సంతోషం కలిగేటట్లు; సిద్ధిన్+పొందినను= ఫలించినప్పటికీ; భీతియున్= భయమూ; కుత్సయున్= నిందా; పుట్టున్; భూ జనుల్= ప్రజలు; వేతురు= బాధిస్తారు; చేటు చేఁతలు= దుష్కార్యాలు; ఫలింపక తక్కినన్= ఫలించకపోతే; అత్యాతురతాస్పరంబులు+అగు= అధికమైన బాధకు చోటుఅయిన; ఆపదలు; మిక్కిలి బాధ కలిగించే కష్టాలు; మున్ను+అ= ముందుగానే వచ్చున్= కలుగుతాయి.

తాత్పర్యం: 'మంచి వివేక సంపదగల అశ్వత్థామా! నీతిమాలిన పనులు అనాలోచితంగా వట్టి పట్టుదలతో చేస్తే, సంతోషం కలిగేటట్లు ఒకవేళ అని సిద్ధించినా, భయమూ, నిందా కలుగుతాయి. ప్రజలు బాధిస్తారు. ఆ దుష్కార్యాలు నెరవేరకపోతే మిక్కిలి బాధలకు చోటయిన ఆపదలు ముందు సంభవిస్తాయి.'

విశేషం: 'ఇద్ధ వివేకవైభవా! అని అశ్వత్థామని సంబోధించడంలో మంచి వివేకంగల నీవు ఈ సమయంలో పట్టుదలే ప్రధానంగా అనాలోచితంగా పాడుపని చేస్తే దుష్ఫలితాలు అనుభవిస్తావు. అందుచేత వివేకంతో ప్రవర్తించు' మని అతడికి కృపాచార్యుడి ఉపదేశం'....నాపద సిద్ధ వివేక వైభవా' అనే ఉ.యూ.ప్రతులలోని పాఠంకంటె. తె.వి.ప్రతిలోని..నాపద లిద్ధవివేక వైభవా అనే పాఠమే మేలనిపించింది.

ఉ. 'క్రోధము, లోభమున్, భయముఁ గూరిన చిత్తముతోడ దుష్క్రియా
సాధనవృత్తి దుర్జనుఁడు సజ్జను లాఁగఁగఁ జేయు కార్యముల్
బాధలఁ బెట్టకున్నె? సిరి పాయఁగఁ జేయకయున్నె వానిఁ? దీ
వ్రాధి నితాంత దుఃఖ హృదయత్వము దేరకయున్నె వానికిన్?' 36

ప్రతిపదార్థం: క్రోధమున్= కోపమూ; లోభమున్= దురాశా; భయమున్= భయమూ; కూరిన= నిండిన; చిత్తముతోడన్= మనస్సుతో; దుర్జనుఁడు= చెడ్డవాఁడు; సత్+జనులు= మంచివాళ్ళు; అఁగఁగన్= వద్దంటూండగా; దుష్క్రియా సాధన వృత్తిన్= పాడు పనిని సాధించే ప్రవర్తనతో; చేయు కార్యముల్= చేసే పనులు; బాధలన్+పెట్టక+ఉన్నె?= బాధించకుండా ఉంటాయా?; వానిన్= ఆ దుర్మార్గుడిని; సిరి= సంపద; పాయఁగన్+చేయక+ఉన్నె?= కోల్పోయేటట్లు చేయకుండా ఉంటాయా?; వానికిన్= వాడికి; తీవ్ర+అది నితాంత దుఃఖ హృదయత్వము= అధికమైన మనోవ్యాధిచేత మిక్కిలి దుఃఖంతో కూడిన హృదయం; తేరక+ఉన్నె?= తేకుండా ఉంటుందా? కలిగించకుండా ఉంటుందా?

తాత్పర్యం: కోపమూ, దురాశా, భయమూ నిండిన మనస్సుతో దుర్మార్గుడు మంచివాళ్ళు వద్దని వారిస్తున్నా, పాడుపనిని సాధించాలనే అభిప్రాయంతో చేసే పనులు బాధించకుండా ఉంటాయా? ఆ దుర్మార్గుడు సిరిని కోల్పోయేటట్లు చేయకుండా ఉంటాయా? వాడికి తీవ్రమైన మనోవ్యాధితో మిక్కిలి దుఃఖితమైన మనస్సును కలిగించకుండా ఉంటాయా? (తప్పక అట్లా చేస్తాయని భావం).

చ. వినుము కురుక్షితీశుఁడు వివేక విదూరుఁడు క్రోధలోభముల్
మనమునఁ బేర్చినన్ దురభిమానమునన్ హితులెంత చెప్పిన
న్వినక బహుప్రకారముల నిందకు నోర్చి పరాభవించె స
జ్జనులగు పాండుపుత్రుల; నసత్పథవృత్తికిఁ జేటు దప్పునే?' 37

ప్రతిపదార్థం: వినుము; కురుక్షితి+ఈశుఁడు= కురురాజు దుర్యోధనుడు; వివేక విదూరుఁడు= వివేకానికి మిక్కిలి దూరమైన వాడు; క్రోధ లోభముల్= కోపమూ, దురాశా; మనమునన్= మనస్సులో; పేర్చినన్= అతిశయించగా; దురభిమానమునన్= దుర్గర్వంతో; హితులు= శ్రేయోభిలాషులు; ఎంత చెప్పినన్= ఎంత చెప్పినా; వినక; బహు ప్రకారములన్= అనేకవిధాల; నిందకున్; ఓర్చి= సహించి; సత్+జనులు+అగు= మంచివాళ్ళైన; పాండుపుత్రులన్= పాండవులను; పరాభవించెన్= అవమానిం చాడు; అసత్+ పథవృత్తికిన్= దుర్మార్గంతో నడిచేవాడికి; చేటు= నాశం; తప్పునే?= తప్పుతుందా?

తాత్పర్యం: 'అశ్వత్థామా! వినుము. దుర్యోధనుడు అవివేకి. కోపమూ, దురాశా మనస్సులో అతిశయించగా దుర్గ ర్వంతో శ్రేయోభిలాషు లెంత చెప్పినా వినిపించుకొనక అనేక విధాల నిందలు పడి, ఉత్తములైన పాండవులను పరాభవించాడు. దుర్మార్గంలో నడిచేవాడికి నాశం తప్పుతుందా?' (తప్పదని భావం).

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. దుర్యోధనుడు దుర్మార్గుడై పాండవులను పరాభవించి నశించాడనే విశేషాంశం దుర్మార్గుడికి చేటు తప్పదనే సామాన్యాంశం చేత సమర్థించబడింది కాబట్టి ఇక్కడ అలంకారం అర్థాంతరన్యాసం.

వ. అని పలికి తమ్మునతండు 'మీ మది గలఁగకయున్నదేనిఁ గర్తవ్యంబుఁ జెప్పవలయు' నని యడిగినమాట లుగ్గడించి 38

ప్రతిపదార్థం: అని పలికి; అతండు= అశ్వత్థామ; మీ మది= మీ మనస్సు; కలఁగక+ఉన్నది+ఏనిన్= కలతచెందకున్నట్లయితే; కర్తవ్యంబున్= చేయదగినదానిని; చెప్పన్+వలయున్= చెప్పాలి అని; తమ్మున్= తమను; అడిగిన మాటలు; ఉగ్గడించి= పలికి.

తాత్పర్యం: అని పలికి, అశ్వత్థామ 'మీ మనస్సు కలత చెందకున్నట్లయితే చేయదగినదానిని చెప్పా'లని తమను అడిగిన మాటలు గుర్తుచేసి.

క. 'జగ మెఱుఁగఁగ దుశ్శీలుం । డగు భూనాథుండు వోయినట్టులె పోఁగాఁ
దెగడుం జేటుఁ గలిగి వగ । మిగులను మది గలఁగదే యమిత్రధ్వంసీ!' 39

ప్రతిపదార్థం: అమిత్ర ధ్వంసీ!= శత్రునాశకుడా - అశ్వత్థామా!; జగము= లోకం; ఎఱుఁగఁగన్= ఎరిగేలాగా; దుశ్శీలుండు= దుష్టస్వభావుడు; అగు; భూనాథుండు= రాజు; పోయిన+అట్టులు+ఎ+పోఁగాన్= నశించినట్లే నశించగా; తెగడున్= నిందా; చేటున్= కీడూ; కలిగి; వగ= దుఃఖం; మిగులను= అతిశయించగా; మది= మనస్సు; కలఁగదే?= కలతచెందదా?

తాత్పర్యం: 'శత్రునాశంకరుడవైన అశ్వత్థామా! లోక ప్రసిద్ధంగా దుష్టస్వభావుడైన రాజు పోయినట్లే పోగా, నిందా, కీడూ కలిగి దుఃఖం అతిశయిస్తే మనస్సు కలతచెందదా? (తప్పక కలత చెందుతుందని భావం.)

వ. ‘అది యట్లుండె మన కిప్పు డిది కర్తవ్యం బని నిశ్చయింప మన మేమి నేర్తుము? తగవు తెఱంగెఱింగిం చెద నాకర్ణింపుము.’ 40

ప్రతిపదార్థం: అది; అట్లు+ఉండెన్; మనకున్= మనకు; ఇప్పుడు; ఇది; కర్తవ్యంబు= చేయదగినది అని; నిశ్చయింపన్= నిర్ణయించటానికి; మనము; ఏమి; నేర్తుము?= ఎరుగుదుము?; తగవు తెఱంగు= ధర్మప్రకారం; ఎఱింగించెదన్= తెలుపుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అది అట్లా ఉండనిమ్ము. ఇప్పుడు ఇదీ కర్తవ్యం అని మనం ఏమి నిర్ణయించగలం? ధర్మ ప్రకారం చెపుతాను వినుము.

**క. ‘మన మందఱమును ధృతరా । ష్ట్రుని కడకుం బోయి కార్యసూత్ర మతనిచే
వినవలయు; నాతఁ డెయ్యది । గని పలికిన నదియ మనకుఁ గర్తవ్య మగున్.’ 41**

ప్రతిపదార్థం: మనము; అందఱమును; ధృతరాష్ట్రుని కడకున్= ధృతరాష్ట్రుడి దగ్గరకు; పోయి= వెళ్ళి; అతనిచేన్= అతడినుంచి; కార్యసూత్రము= కర్తవ్యం యొక్క క్రమం; వినన్+వలయున్= వినాలి; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; ఎయ్యది= ఏది; కని= చూచి; పలికినన్= చెపితే; అది+అ= అదే; మనకున్= మనకు; కర్తవ్యము+అగున్= చేయదగినది అవుతుంది.

తాత్పర్యం: ‘మనం అందరం ధృతరాష్ట్రుడి దగ్గరకు పోయి అతడివలన కర్తవ్యం వినాలి. అతడు ఆలోచించి ఏమి చెపితే అదే మనకు కర్తవ్యం అవుతుంది.’

వ. అమ్మహీకాంతుండు. 42

ప్రతిపదార్థం: ఆ+మహీ కాంతుండు= ఆ రాజు - ధృతరాష్ట్రుడు

తాత్పర్యం: అని పలికి, అశ్వత్థామ ‘మీ మనస్సు కలత చెందకున్నట్లయితే చేయదగినదానిని చెప్పా’లని తమను ఆ ధృతరాష్ట్రుడు అడిగిన మాటలు గుర్తుచేసి.

**క. తానును గాంధారియు నె । ద్దానిం గార్యంబు గాఁగఁ దలఁచి పనిచినన్
దానికిఁ గా దన వలవదు; । పూని యనుష్ఠింత; మదియ పొగ డొందించున్. 43**

ప్రతిపదార్థం: తానును= ఆ ధృతరాష్ట్రుడూ; గాంధారియున్= అతడి భార్య గాంధారీ; ఏ+దానిన్= దేనిని; కార్యంబు+కాఁగన్= కర్తవ్యంగా; తలఁచి= ఎంచి; పనిచినన్= ఆజ్ఞాపించినా; దానికిన్; కాదు+అనన్+వలవదు= కాదనవద్దు; పూని= ప్రయత్నించి; అనుష్ఠింతము= చేద్దాం; అది+అ= అదే; పొగడు= కీర్తి; ఒందించున్= పొందేటట్లు చేస్తుంది.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రుడూ, అతడి భార్య గాంధారీ ఏది కర్తవ్యమని చూచి ఆనతిస్తే దానిని కాదనకుండా పూనికతో ఆచరిద్దాము. అదే మనకు కీర్తి కలిగిస్తుంది.

వ. వారలకడ విదురుండు నుండు నమ్మువ్వురు విచారించి చెప్పిన కార్యంబునకు నిందగలుగ; దట్లుంగాకయెట్లు పొరలినను దైవోపహతంబు లగు కార్యంబులు సిద్ధిఁ బొందునె? యడిచిపడవలవదు. విచారించి కొంద’ మనవుడు శోక దందహ్యమానమానసుం డగుచు నగ్గురపుత్రుండు కృతవర్మను నతని నాలోకించి. 44

ప్రతిపదార్థం: వారల కడన్= ఆ గాంధారీ ధృతరాష్ట్రులదగ్గర; విదురుండున్= విదురుడుకూడా; ఉండున్= ఉంటాడు; ఆ+ ముప్వురున్= ఆ ముగ్గురు-గాంధారీ ధృతరాష్ట్ర విదురులు; విచారించి= ఆలోచించి; చెప్పిన కార్యంబునకున్= చెప్పిన కర్త వ్యానికి; నింద కలుగదు; అట్లున్+కాక= అదీకాక; ఎట్లు= ఎట్లా; పొదలినను= దొర్లినా (శ్రమపడ్డా); దైవ+ఉపహతంబులు= దైవంచేత కొట్టబడినవి అగు; కార్యంబులు= పనులు; సిద్ధిన్+పొందునె?= ఫలిస్తాయా?; అడిచిపడన్+వలవదు= తొందరపడవద్దు; విచారించికొందము= ఆలోచించుకుందాము; అనవుడున్= అనగానే; శోక దందహ్యమాన మానసుండు= దుఃఖంచేత దహింపబడుతూ ఉన్న మనస్సు గలవాడు; అగుచున్= అవుతూ; ఆ+గురు పుత్రుండు= ఆ అశ్వత్థామ; కృతవర్మను= కృత వర్మనూ; అతనిన్= కృపాచార్యుడినీ; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: 'ఆ గాంధారీ ధృతరాష్ట్రుల దగ్గర విదురుడు కూడా ఉంటాడు. ఆ ముగ్గురూ ఆలోచించి చెప్పిన పనికి నింద ఉండదు. అదీగాక ఎంత శ్రమించినా దైవదూషితాలైన కార్యాలు ఫలిస్తాయా? తొందరపడవద్దు. ఆలోచించుకుందాము.' అనగానే దుఃఖంచేత దహించబడుతూన్న మనస్సుగల అశ్వత్థామ కృతవర్మనీ, కృపాచార్యుడినీ చూచి

అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలతోఁ దనపూన్కి స్థిరీకరించుట (సం.10-3-1)

సీ. వెరవిట్టి తెఱఁ గిది వెంగలితనమని, । యెల్లవాఁడును దన యెఱిఁగినట్టి
తెఱఁగున నిజకార్య దృష్టియ కయికొను । నొరుల నేర్పులు పట్టనొల్లఁ; డాత్మ
బుద్ధియ మే లని పొగడు; నన్యుల చిత్త । వృత్తుల నిందించు; వివిధగతులఁ
జెందెడు నాత్మీయ చేతః ప్రవర్తన । మరయఁడు; దాన బాల్యమున దలఁచు

ఆ. తలఁపు గీడుచేసి, యెలప్రాయమున నొండు । తలఁపునందుఁ బట్టుకొలుపుఁ బ్రీతి;
ముదిమి వచ్చినతఱి నదియును విడిచి య । న్యంబు లైన నేర్పు లాచరించు. 45

ప్రతిపదార్థం: వెరవు= నేర్పు; ఇట్టి తెఱఁగు= ఈ విధమైనది; ఇది; వెంగలితనము= వెర్రితనము అని; ఎల్లవాఁడును= ప్రతీవాడూ; తన+ఎఱిఁగిన+అట్టి= తనకు తెలిసినట్టి; తెఱఁగునన్= విధంగా; నిజ కార్యదృష్టి+అ= తన పనియందు చూపే; కయికొనున్= స్వీకరిస్తాడు; ఒరుల నేర్పులు= ఇతరుల నేర్పులు; పట్టన్= స్వీకరించటానికి; ఒల్లఁడు= ఇష్టపడడు; ఆత్మబుద్ధి+అ= తన తలపే; మేలు+అని= మంచిదని; పొగడున్= పొగడుకుంటాడు; అన్యుల= ఇతరుల; చిత్తవృత్తులన్= మనోభిప్రాయాలను; నిందించున్= తిట్టుతాడు, ఒప్పుకోడు; వివిధగతులన్+చెందెడు= అనేకవిధాలుగా ఉండే; ఆత్మీయ చేతన్+ ప్రవర్తనము= తన చిత్తవృత్తిని; అరయఁడు= చూడడు; తాను+అ= తనే; బాల్యమునన్= చిన్నతనంలో; తలఁచు తలఁపు= చేసే ఆలోచనను; కీడుచేసి= తిరస్కరించి; ఎల ప్రాయమునన్= యౌవనంలో; ఒండు తలఁపు+అందున్= ఇంకో అభిప్రాయంపై; ప్రీతిన్= ఇష్టాన్ని; పట్టుకొలుపున్= నిలుపుతాడు; ముదిమి= ముసలితనం; వచ్చిన; తఱిన్= వచ్చినప్పుడు; అదియును= ఆ అభిప్రాయాన్ని; కూడా; విడిచి; అన్యంబులు+ఐన= వేరైన; నేర్పులు; ఆచరించున్= చేస్తాడు.

తాత్పర్యం: నేర్పు ఈ విధమైనది. ఇది వెర్రితనం అని ప్రతీవాడూ తనకు తెలిసిన విధంగా తన పనియందలి చూపే మంచిదని భావిస్తాడు. ఇతరుల నేర్పులను అంగీకరించడు. తన తలపే మంచిదని పొగడుకొంటాడు. ఇతరుల మనోభిప్రాయాలను నిందిస్తాడు. తన ఆలోచనలు నిలకడగా ఉండక రకరకాలుగా ఉండటం గమనించడు.

తమ చిన్నతనంలో ఏర్పరచుకొన్న అభిప్రాయాలను తిరస్కరించి, యౌవనం వచ్చాక వేరే అభిప్రాయంపై మక్కువ చూపుతాడు. ముసలితనం వచ్చినప్పుడు అదికూడా విడిచిపెట్టి వేరే నేర్పులను ఆచరిస్తాడు.

విశేషం: 'నా పరిస్థితిని నా చూపుతో అర్థం చేసికొని నా అభిప్రాయాలను మన్నించు' మని అశ్వత్థామ కృపాచార్యుడిని సాధారణీకరించి వేడుకొనటం గమనార్హం.

క. ఆపదఁ బడి యొక్కఁడు స । ద్వ్యాపారము గాఁగఁ జూచి దాని నడవు; శ్రీ
ప్రాపించిన నరుఁ డొండొక । చూపున వర్తించు నది విశుద్ధపదముగన్. 45

ప్రతిపదార్థం: నరుఁడు= మనుష్యుడు; ఆపదన్= ఆపదలో; పడి= చిక్కుకొని; ఒక్కఁడు= ఒక్కటి- ఒక పనిని; సద్వ్యాపారము+కాఁగన్+చూచి= మంచి పనిగా భావించి; దానిన్= ఆ పనిని; నడపున్= ఆచరిస్తాడు; శ్రీ= సంపద; ప్రాపించినన్= కలిగితే; ఒండొక= వేరొక; చూపునన్= దృష్టితో; అది= ఆ చూపు; విశుద్ధ పదముగన్= మిక్కిలి పవిత్రమైనదిగా అత్యుత్తమమైనదిగా వర్తించున్= ప్రవర్తిస్తాడు.

తాత్పర్యం: మానవుడు ఆపదలో ఉన్నప్పుడు ఒకపని మంచిదని భావించి దానిని ఆచరిస్తాడు. సంపద వచ్చినప్పుడు వేరే చూపుతో అది ప్రశస్తమని భావించి ప్రవర్తిస్తాడు.

విశేషం: 'యుద్ధంలో తండ్రిని అన్యాయంగా కోల్పోయి నేను ఆపదలో ఉన్నాను. నా చూపు ఒక విధంగా ఉంటుంది. అది మంచిదని నా అభిప్రాయం. నీ కట్లాంటి ఆపదలేదు. కాబట్టి నీ చూపు వేరుగా ఉంటుంది. అదే మంచిదని నీ అభిప్రాయం. నా పరిస్థితిని బట్టి నా చూపును అర్థం చేసికొనుము' అని అశ్వత్థామ కృపుడిని వేడుకొంటున్నాడు.

క. తగునని మరణాదులకై । తెగువదెసన్ మానవుండు దృఢనిశ్చయతం
దగిలినయది పరమహితం । బుగ వదలక నడుపు నన్యబుద్ధులు గొనమిన్. 47

ప్రతిపదార్థం: మానవుండు= మనుష్యుడు; మరణ+ఆదులకై= చావూ మొదలైన వాటికి; తెగువదెసన్= సాహసంవైపు; తగున్+అని= తగినదని; దృఢనిశ్చయతన్= గట్టి నిర్ణయంతో; తగిలిన+అది= ఇష్టపడినది; పరమ హితంబునన్= మిక్కిలి మేలయినదని; వదలక= విడువక; అన్యబుద్ధులు= ఇతరుల తలంపులు; కొనమిన్= స్వీకరించిక పోవడం; నడుపున్= చేస్తాడు (అన్యబుద్ధులను స్వీకరించడు).

తాత్పర్యం: మనుష్యుడు మరణాదులకు కూడా తెగించి ఒక పని మంచిదని దృఢనిశ్చయంతో ఇష్టపడి, దానిని మిక్కిలి మేలయినదని వదలక, ఇతరుల తలంపులను తోసి పుచ్చుతాడు.

వ. 'మీ రెఱుంగనియది లేదు. నాకుం దోఁచిన కర్జంబు మన కందఱకును శోకనాశంబగునట్టిది, దాని వినుండు చెప్పెదఁ బ్రజాపతి ప్రజల సృజించి విప్రునకు దమంబును, క్షత్రియునకుఁ దేజంబును, వైశ్యునకు దక్షత్వంబును, శూద్రునకుఁ ద్రివర్ణానుకూలతయు వలయు గుణంబులుగా విధించెం గావున శాంతుండు గాని విప్రుండును, దేజస్విగాని రాజును, దక్షుండుగాని వైశ్యుండును, ద్రివర్ణానుకూలుండుగాని శూద్రుండును నిందం బడుదు; రదియట్లుండె; నేనును విప్రకులంబునందు జన పూజితం బైన వంశంబునందు జనియించిభాగ్యహీనతవలన

రాజోచిత ధర్మం బనుష్ఠించితి, నడుమ నా నిష్ఠ వదలి విప్రధర్మంబు మహనీయంబైన, నది యాచరించు వాడనగుట నా మదికిం జూడమేలై యుండ దదియుంగాక. 48

ప్రతిపదార్థం: మీరు; ఎఱుంగని+అది= తెలియనిది లేదు; నాకున్= నాకు; తోచిన కర్జంబు= తోచిన కార్యం; మనకున్= అందఱకును; శోకనాశంబు+అగు+అట్టిది= శోకాన్ని పోగొట్టేది; దానిన్; వినుండు; చెప్పెదన్; ప్రజాపతి= బ్రహ్మ; ప్రజలన్= ప్రజలను; సృజించి= పుట్టించి; విప్రునకున్= బ్రాహ్మణుడికి; దమంబును= ఇంద్రియ నిగ్రహమూ; క్షత్రియునకున్= రాజుకు తేజంబును; వైశ్యునకున్= కోమటికి; దక్షత్వంబును; సామర్థ్యమూ; శూద్రునకున్; త్రివర్ణ+అనుకూలతయున్= మూడు వర్ణాల వారికీ అనుకూలంగా ఉండటమూ; వలయు గుణంబులు+కాన్= కావలసిన గుణాలుగా; విధించెన్= ఏర్పరిచాడు; కావునన్; శాంతుండు+కాని= శాంతగుణంలేని; విప్రుండును= బ్రాహ్మణుడూ; తేజస్వి+కాని రాజును= తేజస్వంతుడు కాని రాజూ; దక్షుండు+కాని వైశ్యుండును= సమర్థుడుకాని కోమటీ; త్రివర్ణ+అనుకూలుండు+కాని శూద్రుండును= మూడు వర్ణాల వారికీ అనుకూలుండు కాని శూద్రుడూ; నిందన్+పడుదురు= నింద్యులవుతారు; అది+అట్లు+ఉండెన్= అది అట్లా ఉండగా; ఏనును= నేనుకూడా; విప్ర కులంబు+అందున్= బ్రహ్మణకులంలో; జనపూజితంబు+ఐన= జనులు పూజించే; వంశంబు+ అందున్= వంశంలో; జనియించి= పుట్టి; భాగ్య హీనతవలనన్= దౌర్భాగ్యవశంచేత; రాజు+ఉచిత ధర్మంబు= క్షత్రియుడికి ఉచితమైన ధర్మం; అనుష్ఠించితిన్= ఆచరించాను; నడుమన్= మధ్యలో; ఆ నిష్ఠ= ఆ బ్రాహ్మణాచారాన్ని వదలి; విప్రధర్మంబు= బ్రాహ్మణధర్మం; మహనీయంబు+ఐనన్= గొప్పది కదా అని; అది ఆచరించువాఁడన్+అగుట= అనుష్ఠించే వాడిని కావటం; నా మదికిన్+చూడన్= నా మనస్సుకి చూస్తే; మేలు+ఐ+ఉండదు= బాగా ఉండదు; అదియున్+కాక= అదీగాక.

తాత్పర్యం: మీకు తెలియనిది లేదు. నాకు తోచినకార్యం మన కందరికీ శోకం పోగొట్టేది. దానిని వినండి, చెపుతాను. బ్రహ్మ ప్రజలను సృష్టించి బ్రాహ్మణుడికి ఇంద్రియనిగ్రహమూ, క్షత్రియుడికి తేజస్సూ, కోమటికి దక్షతా, శూద్రుడికి త్రివర్ణానుకూలతా ఉండవలసిన గుణాలుగా నిర్ణయించాడు. కాబట్టి, శాంతగుణం లేని బ్రాహ్మణుడూ, తేజస్వంతుడు కాని క్షత్రియుడూ, దక్షతలేని కోమటీ, త్రివర్ణానుకూలత లేని శూద్రుడూ నింద్యులవుతారు. అది అట్లా ఉండనిమ్ము. నేను కూడా జనులు పూజించే బ్రాహ్మణ వంశంలో పుట్టి నా దౌర్భాగ్యవశంచేత క్షత్రియోచిత ధర్మం ఆచరించాను. మధ్యలో ఆ ఆచారం వదలి, బ్రాహ్మణధర్మం మహనీయమైనది కదా! అని మళ్ళీ దానిని ఆచరించటం నాకు నచ్చదు. అదీగాక. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'మేటి విల్లును దివ్యాస్త్ర కోటియును ధ। రించి మెఱయంగ నాజి వధించెఁ దండ్రి
నొకఁడు; వాఁడును రూపుతో నుండు నట్టె। యెట్లు తలయెత్తి మెలఁగుదు నేను జెపుఁడ?' 49

ప్రతిపదార్థం: మేటి విల్లును= గొప్ప ధనుస్సునూ; దివ్య+అస్త్ర కోటియును= దివ్యాలైన అస్త్రాల సమూహాన్నీ, ధరించి= తాల్చి; మెఱయంగన్= ప్రకాశిస్తూ ఉండగా; తండ్రిన్= నా తండ్రియైన ద్రోణుడిని ఒకడు; ఆజిన్= యుద్ధంలో; వధించెన్= చంపాడు; వాడును; రూపుతోన్= రూపంతో; సజీవుడై; ఉండున్+అట్టె!= ఉన్నాడట!; నేను; ఎట్లు; తల+ఎత్తి= తలెత్తుకుని సిగ్గుతో; తలవంచుకోకుండా; మెలఁగుదున్= ఉంటాను; చెపుఁడ?= చెప్పండి?

తాత్పర్యం: గొప్ప విల్లూ, దివ్యాస్త్రాలూ ధరించి మెరిసిపోతూ ఉండగా నా తండ్రిని యుద్ధంలో ఒకడు చంపాడు. వా డింకా సజీవుడై ఉన్నాడు. నేను సిగ్గుతో తలవంచుకొనకుండా ఎట్లా తలెత్తుకొని తిరుగుతానో మీరే చెప్పండి.

విశేషం: అశ్వత్థామ తన తండ్రిని చంపిన ధృష్టద్యుమ్నుడి పేరు ఉచ్చరించటానికి కూడా అసహ్యించుకొంటున్నాడు. అందుచేతనే అతడి పేరు చెప్పకుండా 'ఒకడు' అని మాత్రం అన్నాడు.

క. వాఁడు మొదలుగాఁ బగతుర । వాఁడి గలుగు తూపుగముల వలన మెఱసి యే
నేఁడు వధింతును; నెవ్వగ । వేఁడిమిఁ బడఁజాల కొక్క వెరవుఁ దలఁచితిన్. 50

ప్రతిపదార్థం: వాఁడు= ఆ పితృహంత అయిన దుర్మార్గుడు ధృష్టద్యుమ్నుడు; మొదలు+కాన్= మొదలుకొని; పగతురన్= శత్రువులను; వాఁడి= పదును; కలుగు; తూపుగముల= బాణ సమూహాల; వలన; మెఱసి= ప్రకాశించి; ఏన్= నేను; నేఁడు= ఈ వేళ; వధింతును= చంపుతాను; నెఱ+వగ= నిండు దుఃఖంయొక్క; వేఁడిమిన్; పడన్+చాలక= భరించలేక; ఒక్క వెరవు= ఒక ఉపాయం; తలఁచితిన్= ఆలోచించాను.

తాత్పర్యం: ఆ దుర్మార్గుడైన ధృష్టద్యుమ్నుడు మొదలుగా శత్రువులను పదునుగల అస్త్రాల సముదాయంతో నేర్పు ప్రకటించి నేను ఈ వేళ వధిస్తాను. దుఃఖాగ్నితాపం భరించలేక ఒక ఉపాయం ఆలోచించాను.

క. లే దింకం బగ యని ధను । రాదుల దెస వాహనముల యందును సంత్య
క్తాదరులై పగతురు నేఁ । డాదమఱచి నిద్రవోదు; రని తఱి పాడునన్. 51

ప్రతిపదార్థం: పగతురు= శత్రువులు; ఇంకన్; పగ= వైరం; లేదు అని; ధనురాదుల దెసన్= విల్లులు మొదలైన వాని విషయంలోనూ; వాహనముల+అందును= వాహనాల విషయంలోనూ; సంత్యక్త+అదరులై= విడిచి పెట్టబడిన జాగ్రత్త కలవారయి; నేఁడు= ఈ నాడు; ఆదమఱచి= ఏమరుపాటు గలిగి; నిద్ర+పోదురు= నిద్రపోతున్నారు; అది; పాడునన్= చంపటానికి; తఱి= సమయం.

తాత్పర్యం: శత్రువులు ఇంక పగ లేదని విల్లులు మొదలైన వాటి విషయంలోనూ, వాహనాల విషయంలోనూ జాగ్రత్తపడకుండా ఈనాడు ఏమరుపాటుతో నిద్రపోతున్నారు. చంపటానికి ఇది తరుణం.

ఆ. ఓడిపోయి దప్పినూని గట్టును చెట్టుఁ । జేరి యొదిఁగి యున్నవారిఁ గాఁగ
మనలఁ దలఁతు రరులు; మనముల నావంత । శంకలేదు; సంతసంబు ఘనము. 52

ప్రతిపదార్థం: ఓడిపోయి; డప్పిన్+ఊని= దప్పిచెంది; గట్టును+చెట్టున్= గట్టూ చెట్టూ; చేరి; ఒదిఁగి+ఉన్నవారిన్+కాఁగన్= దాగియున్న వాళ్ళనుగా; అరులు= శత్రువులు; మనలన్= మనలను; తలఁతురు= భావిస్తారు; అవ+అంత= అవగింజంతైనా-కొంచెంకూడా; శంక= అనుమానం లేదు; సంతసంబు= సంతోషం; ఘనము= అధికం.

తాత్పర్యం: యుద్ధంలో ఓడిపోయి, దప్పిచెంది గట్టూచెట్టూ పట్టి దాగుకొని ఉన్నామని మనలను శత్రువులు భావిస్తారు. వాళ్ళకి ఆవంతైనా అనుమానం లేదు. పైగా సంతోషం అధికం.

చ. మదమునఁ దేలి యేనుఱిన మార్తుర దాడిగఁ బోయి బెట్టు ము
ట్టెద; శరజాల సత్వర పటిష్ఠతఁ బల్వురఁ ద్రుంతుఁ; గొందఱం

జదువుదు నుల్లసత్పరిఘసంహననంబునఁ; గొన్ని కంఠముల్
చిరుముదు నేల రక్తపరిషిక్తముగాఁ గరవాల ధారలన్. 53

ప్రతిపదార్థం: (నేను-కర్త); మదమునన్= గర్వంతో; తేలి= ఆనందించి; ఏమఱిన మార్తురన్= పరాకుపడియున్న శత్రువులను; దాడిగన్+పోయి= దండెత్తిపోయి; బెట్టు= శీఘ్రంగా; ముట్టెదన్= తాకుతాను; శరజాల సత్వర పటిష్ఠతన్= బాణ సమూహంయొక్క వేగంతో కూడిన అమిత పటుత్వంతో; పల్వురన్= అనేకులను; త్రుంతున్= ఖండిస్తాను; కొందఱన్= కొంతమందిని; ఉల్ల సత్+పరిఘ సంహననంబునన్= ప్రకాశించే శూలాయుధాల సముదాయంతో; చదుపుదున్= చంపుతాను; కొన్ని కంఠముల్= కొన్ని పీకలు; నేల= భూమి; రక్త పరిషిక్తము+కాన్= రక్తంతో తడిసింది కాగా; కరవాల ధారలన్= కత్తుల అంచులతో; చిదుము దున్= కోస్తాను.

తాత్పర్యం: జయగర్వంతో తేలిపోతూ పరాకుగా ఉన్న శత్రువులపైకి నేను దండెత్తిపోయి శీఘ్రంగా తాకుతాను. బాణాల సత్వరమైన పటుత్వంతో అనేకులను ఖండిస్తాను. కొందరిని ప్రకాశించే ఇనుపగుదియల సమూహంతో చంపుతాను. నేల రక్తంతో తడిసేటట్లుగా కొన్ని పీకలను కత్తులతో కోస్తాను.

తే. గెలుపు నూఱట నొదవు నగ్గలపు నిద్రఁ । బీనుఁగులుఁ బోలె నున్న యా బిరుదుమగలఁ
జంపి పీనుంగుఁబెంట గావింపవలయు । శిబిర మెల్లను భూతముల్ సెలఁగుచుండ. 54

ప్రతిపదార్థం: గెలుపు+ఊఱటన్= జయంవల్ల కలిగిన ఓదార్పుతో; ఒదవు= పుట్టే; అగ్గలపు నిద్రన్= అధికమైన నిద్రతో; పీనుఁగులున్+పోలెన్= శవాలలా; ఉన్న; ఆ బిరుదు మగలన్= ఆ శక్తివంతులైన; వీరులను; చంపి; శిబిరము+ఎల్లను= విడిది అంతా; భూతముల్= పిశాచాలు; చెలఁగుచున్+ఉండన్= విజృంభిస్తూండగా; పీనుంగు పెంట= పీనుగుల పెంట; కావింపన్+వలయున్= చేయాలి;

తాత్పర్యం: జయంవలన కలిగిన ఓదార్పుతో పుట్టే అధికమైన నిద్రపొంది శవాలవలె ఉన్న సమర్థులైన వీరులను చంపి విడిది మొత్తం పిశాచాలు విజృంభించేటట్లు పీనుగులపెంట చేయాలి.

వ. అని వెండియు. 55

ప్రతిపదార్థం: అని; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని పలికి మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కరి హయ నర శవముల భ । గ్న రథంబుల నెరసి ద్రుపదనందనగాత్రో
త్కరము పడియుండఁ జూడక । పరిభవతాపోపశాంతి పడయఁగ నగునే? 56

ప్రతిపదార్థం: కరి హయ నర శవములన్= ఏనుగుల, గుర్రాల, మనుష్యుల పీనుగులతోనూ; భగ్న రథంబులన్= విరిగి పోయిన రథాలతోనూ; నెరసి= నిండి; ద్రుపద నందన గాత్ర+ఉత్కరము= ద్రుపదుడి కొడుకైన ధృష్టద్యుమ్నుడి అవయవాల సమూహం; పడి+ఉండన్= పడి ఉండగా; చూడక= చూడకపోతే; పరిభవ తాప+ఉపశాంతి= అవమానం వల్ల కలిగే తాపం యొక్క ఉపశమనం; పడయఁగన్+అగునే?= పొందటానికి శక్యమా?

తాత్పర్యం: ఏనుగుల, గుర్రాల, మనుష్యుల పీనుగులోనూ, విరిగిన రథాలతోనూ నిండి ధృష్టద్యుమ్నుడి అవయవాల సమూహం పడి ఉండటం చూడకపోతే అవమానాగ్ని తాపం చల్లారుతుందా? (చల్లారదని భావం).

శా. ధృష్టద్యుమ్నుని ముట్టి పట్టుదు; మరోద్రేకం బడంగింతు; ను
త్కృష్టాస్త్రంబులఁ జంప; నల్క పశుభంగిం జంపినం గాని పో;
దిష్టావాప్తి యనంగ నా కిదియె కాదే యిప్డు? కౌంతేయులన్
గష్టస్వైరవిధాభియోగమృతులం గావింతు నుగ్రాకృతిన్. 57

ప్రతిపదార్థం: ధృష్టద్యుమ్నునిన్= ధృష్టద్యుమ్నుడిని; ముట్టి= తాకి; పట్టుదున్= పట్టుకుంటాను; మద+ఉద్రేకంబు= గర్వాతిశయం; అడంగింతున్= అణచివస్తాను; ఉత్కృష్టాస్త్రంబులన్= గొప్పవైన బాణాలతో; చంపన్= చంపను; అల్క= (నాకు వాడిమీద ఉన్న) కోపం; పశుభంగిన్= పశువులా; చంపినన్+కాని= చంపితేకాని; పోదు= నశించదు; ఇప్డు= ఇప్పుడు; ఇష్ట+అవాప్తి= కోరిక ఫలించటం; అనంగన్= అంటే; నాకున్= ఇదియె= ఇదే; కాదే?= కాదా?; కౌంతేయులన్= కుంతీ పుత్రులను - పాండవులను; ఉగ్ర+ఆకృతిన్= భయంకరాకారంతో; కష్టస్వైర విధా+అభియోగ మృతులన్= క్రూరమూ, స్వేచ్ఛతో గూడినదీ అగు ప్రకారం గల ముట్టడి వలన చచ్చినవారినిగా; కావింతున్= చేస్తాను.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడిని తాకి పట్టుకుంటాను. వాడి గర్వాతిశయం అణచివేస్తాను. వాడిని గొప్ప అస్త్రాలతో చంపను. పశువును చంపినట్లు చంపితే కాని వాడిపై నాకున్న కోపం చల్లారదు. ఇప్పుడు నా కోరిక నెరవేరటం అంటే ఇదే కదా! పాండవులను భయంకరాకారంతో క్రూరంగానూ, ఇష్టం వచ్చినట్లుగానూ ముట్టడించి చంపుతాను.

క. అలిగిన పినాకి చందం । బలవడ శిబిరంబుఁ జొచ్చి యందఱఁ బగఱం
బొలియించెద; శుద్ధుఁడఁ గా వలదే జనకునకు నాదు వల నేర్పడఁగన్? 58

ప్రతిపదార్థం: (నేను-కర్త); అలిగిన పినాకి చందంబు= కోపించిన ఈశ్వరుడి విధం; అలవడన్= ఒప్పగా; శిబిరంబున్= విడిదిని; చొచ్చి= ప్రవేశించి; అందఱన్+పగఱన్= శత్రువుల నందరిని; పొలియించెదన్= చంపుతాను; జనకునకున్= తండ్రికి; నాదు వలను= నా సామర్థ్యం; ఏర్పడఁగన్= స్పష్టపడగా; శుద్ధుఁడన్= పవిత్రుడిని - పితృణ విముక్తుడిని; కావలదే= కావద్దా?

తాత్పర్యం: నేను కోపించిన పినాకపాణిలాగా శత్రువుల శిబిరంలో ప్రవేశించి పగవారి నందరినీ చంపుతాను. తండ్రికి నా శక్తిని స్పష్టపరిచి పితృణ విముక్తుడినయి పవిత్రుడిని కావద్దా? (కావాలని భావం).

క. పాండవులం । బాంచాలురఁ । జండ భుజా విభవ మెసఁగ సమయించి కృతా
ర్థుండ నయి పెంపుఁ దేజము । గండును; దక్కొండు లేదు కార్యము దలఁపన్. 59

ప్రతిపదార్థం: (నేను-కర్త); పాండవులన్= పాండవులను; పాంచాలురన్= పాంచాల దేశీయులను - ధృష్టద్యుమ్నాదులనూ; చండ భుజా విభవము= తీవ్రమైన భుజబల సంపద; ఎసఁగన్= అతిశయించగా; సమయించి= చంపి; కృత+అర్థుండన్+అయి= కృతకృత్యుడినయి; పెంపున్= గొప్పతనమూ; తేజము= తేజస్సూ; గండును= పౌరుషమును - పొందుతాను; తలఁపన్= ఆలోచించగా; తక్కు+ఒండు= ఇంకొక; కార్యము= పని; లేదు.

తాత్పర్యం: నేను పాండవులనూ, పాంచాలురనూ తీవ్ర భుజబల సంపద అతిశయించగా చంపి కృతకృత్యుడనయి గొప్పతనమూ, తేజస్సూ పొందుతాను. ఆలోచించగా ఇంతకంటె వేరే పని లేదు.

వ. అనవుడుఁ గృపాచార్యుం డి ట్లనియె. 60

ప్రతిపదార్థం: అనవుడన్= అని అశ్వత్థామ అనగానే; కృపాచార్యుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని అశ్వత్థామ అనగానే కృపాచార్యు డిట్లా అన్నాడు:

సీ. పఱిచిన వారికిఁ బగమాఱు పఱుపంగ । నుత్సహించుట కడు నొప్పగాదె?
దైవయోగంబునఁ దగిన యుద్యోగంబు । నీ మానసంబున నెలవుకొనియె;
మాకు నీ పూన్కి సమ్మత; మేము దీనికి । నీ తోడివారము; నీవు డస్సి
యున్నవాఁడవు నిద్రయును లేకయున్నది; । నెడఁగురు పడియె దీ యడవిలోన

ఆ. నెమ్మి డప్పిదేఱ నిద్రించి వేగినఁ । దెలివితోడ నత్యుదీర్ణవృత్తిఁ
గరఁగి యేము దోడ నడతేర నడరిన, । నరిగణంబు గెలుతు వశ్రమమున. 61

ప్రతిపదార్థం: పఱిచిన వారికిన్= బాధించినవాళ్ళకు; పగన్= వైరంతో; మాఱు పఱుపంగన్= ప్రత్యపకారం చేయటానికి; ఉత్సహించుట= వేడుకపడటం; కడున్= మిక్కిలి; ఒప్పు; కాదె?= కాదా?; దైవ యోగంబునన్= దైవవశాత్తు; తగిన ఉద్యోగంబు= తగిన కార్యం; నీ మానసంబునన్= నీ మనస్సులో; నెలవుకొనియెన్= చోటు చేసుకుంది; మాకున్; నీ పూన్కి= నీ ప్రయత్నం; సమ్మతము= ఇష్టం; ఏము= మేము; దీనికిన్; నీతోడివారము= నీతోపాటు ఉండేవాళ్ళం; నీవు; డస్సి+ఉన్నవాఁడవు= అలసిపోయి ఉన్నావు; నిద్రయును= నిద్రకూడా; లేక+ఉన్నది= లేకుండా పోయింది; ఈ+అడవితోనన్; వెడఁగురు పడియెదు= జడత్వం పొందుతావు; నెమ్మిన్= సుఖంగా; డప్పి+తేఱన్= దప్పితీరేటట్లు; నిద్రించి; వేగినన్= తెల్లవారగానే; తెలివితోడన్= మెలకువతో; అతి+ఉదీర్ణ వృత్తిన్= మిక్కిలి ఉద్రేకంతో కూడిన ప్రవర్తనతో; కడఁగి= పూని; ఏము= మేమిద్దరం; తోడన్= కూడా; నడతేరన్= రాగా; అడరినన్= విజృంభిస్తే; అరిగణంబున్= శత్రుసమూహాన్ని; అశ్రమమునన్= అనాయాసంగా; గెలుతువు.

తాత్పర్యం: బాధించినవాళ్ళకు పగతో ప్రత్యపకారం చేయటానికి ఉత్సాహపడటం ఎంతో మంచిదికదా! అదృష్ట వశాత్తూ తగినకార్యం నీ మనస్సులో చోటు చేసికొన్నది మాకు నీ ప్రయత్నం సమ్మతమే. మేము దీనికి నీతోపాటు ఉంటాము. నీవు అలసిపోయి ఉన్నావు. నిద్రకూడా పోని నీవు ఈ అడవిలో జడత్వం పొందుతావు. (బద్ధకంగా ఉంటావు). అలసట తీరేటట్లు సుఖంగా పండుకొని తెల్లవారగానే మెలకువతో మంచి ఉద్రేకం పొంది, పూని, మేమిద్దరం నీవెంట రాగా విజృంభించుము. అప్పుడు నీవు శత్రు సమూహాన్ని అనాయాసంగా గెలుస్తావు.

విశేషం: శబ్దరత్నాకరంలో 'వెడఁగురుపడు' శబ్దానికి 'జడత్వమునొందు' అని అర్థం ఇవ్వబడింది. సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'వెడఁగురుపడు' ఉన్నది కాని 'వెడగరవడు' లేదు. 'వెడఁగురువడు' అనేదానికి జడత్వము నొందు, కాంతిహీనమగు - అనే అర్థాలు ఇచ్చి దీనినే ఉదాహరణగా ఇచ్చారు. అందుచేత దీనినే స్వీకరించడమయినది.

మ. వరదివ్యాస్త్రవిదుండు బాహుఘనుఁ డశ్వత్థామ పైఁ బోవ, ను
ద్ధురలీలం గృతవర్మయుం గృపుఁడు నుద్యోగస్ఫురన్మూర్తులై
వెరవుం జేవయుఁ జూపి తో నడవ, దోర్వీర్యోద్ధతిన్ మార్కొనన్
నరయోధావళి గాదు దేవతతికి న్రా దెమ్మెయిం జూడఁగన్. 62

ప్రతిపదార్థం: వర దివ్య+అస్త్ర విదుండు= శ్రేష్ఠములూ, దివ్యములూ అయిన అస్త్రాలు తెలిసినవాడు; బాహు ఘనుఁడు= భుజబలంలో గొప్పవాడూ (అయిన); అశ్వత్థామ; పైన్+పోవన్= దండెత్తిపోగా; ఉద్ధురలీలన్= సమర్థంగా; కృతవర్మయున్-కృపుఁడున్= కృతవర్మా, కృపాచార్యుడూ, ఉద్యోగ స్ఫురత్+మూర్తులు+ఐ= కార్యాచరణంలో ప్రకాశిస్తూన్న ఆకారాలు కలవారై; వెరవున్= ఉపాయమూ; చేవయున్= సామర్థ్యమూ; చూపి; తోన్+నడవన్= కూడా నడవగా; దోర్వీర్య+ఉద్ధతిన్= భుజపరాక్రమాతి శయంతో; మార్కొనన్= ఎదుర్కొనటానికి; ఏ+మెయిన్= ఏ విధంగా; చూడఁగన్= చూసినా; నరయోధ+అవళి కాదు= మానవ వీరుల సమూహం కాదు; దేతతికిన్= దేవతల సమూహానికి కూడా; రాదు= శక్యంకాదు.

తాత్పర్యం: వరదివ్యాస్త్రవేత్తా, భుజబలఘనుడూ అయిన అశ్వత్థామ దండెత్తిపోతే, కృతవర్మా, కృపాచార్యుడూ సమర్థంగా కార్యాచరణంలో ప్రకాశిస్తూన్న ఆకారాలతో కూడా నడవగా, భుజపరాక్రమాతిశయంతో ఎదుర్కొనటానికి ఏవిధంగా చూచినా మానవవీరులకే కాదు దేవతలకు కూడా శక్యం కాదు.

వ. అని మఱియును. 63

తాత్పర్యం: అని ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'విను కృతవర్మ దివ్యశరవేది బలాఢ్యుడు శౌర్యశాలి, యే
మను సమరోద్యమంబునకు నూల్కొనఁజాలుట నీ వెఱుంగు, 'ది
ట్లని గణతింపరాదు గురునట్టిఁడ యీతఁ' డనంగవచ్చు ని
న్ననఘచరిత్ర! యిట్టి రథికావలి వైరుల నెట్లుఁ జేయదే!' 64

ప్రతిపదార్థం: అనఘ చరిత్ర!= పాపరహితమైన చరిత్రగలవాడా! అశ్వత్థామా!; విను; కృతవర్మ; దివ్య శర వేది= దివ్యాస్త్ర విదుడు; బల+ఆఢ్యుఁడు= బలసంపన్నుడు; శౌర్యశాలి= పరాక్రమ సంపన్నుడు; ఏనును= నేను కూడా; సమర+ఉద్యమంబునకున్= యుద్ధకార్యానికి; నూల్కొనన్+చాలుట= పూనుకోగలగడం; నీవు+ఎఱుంగుదు(వు)= నీ వెరుగుదువు; నిన్నున్; ఈతఁడు= ఈ అశ్వత్థామ; ఇట్లు+అని= ఇలాంటివాడిని; గణుతింపన్ రాదు= పరిగణించరాదు; గురునట్టిఁడ= ద్రోణుడంతటివాడే; అనంగన్+వచ్చున్= అనవచ్చు; ఇట్టి; రథిక+అవలి= ఇటువంటి రథికుల సమూహం; వైరులన్= శత్రువులను; ఎట్లున్+చేయదే= ఏమయినా చేయదా?

తాత్పర్యం: 'పాపరహితుడవైన అశ్వత్థామా! వినుము. కృతవర్మ దివ్యాస్త్రవిదుడూ, బలాఢ్యుడూ, శౌర్య సంపన్నుడూ. నేను కూడా యుద్ధం ఎట్లా చేస్తానో నీకు తెలుసు. ఇక నీవు 'నిన్ను ఇట్లాంటివాడూ అట్లాంటివాడూ అవటానికి వీల్లేదు. సాక్షాత్తు ద్రోణుడంతటివాడే' అని చెప్పవచ్చు.

వ. 'కావునఁ గోదండంబుఁ నెక్కుడించి, కంకటం బూడ్చి, నిద్రింపు మేము నిద్రాగమనంబున జడులమై యున్న వారము; ప్రభాతం బగుటయు నెల్లవారలకు నుల్లంబు దెలివొందు; నప్పుడు గడంగి యోధులం బొదినిపేరు వాడి పొలియింతము; మనము పాంచాల సహితంబుగాఁ బాండవులం దెగటార్చుటయొండె, వారి చేతం దెగుట యొండె నయ్యెడుం గాక, రిత్త మరలుదుమే?' యనిన మామకు నశ్వత్థామ యిట్లనియె. 65

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; కోదండంబు నెక్కుడించి (కోదండంబు+ఎక్కు డించి)= వింటిని నారిలేకుండా చేసి; కంకటంబు= ఊడ్చి= కవచం తీసివేసి; నిద్రింపుము= నిద్రపొమ్ము; ఏమున్= మేముకూడా; నిద్ర+ఆగమనంబునన్= నిద్ర రావటంచేత; జడులము+ఐ+ఉన్నవారము= బద్ధకంగా ఉన్నాము; ప్రభాతంబు+అగుటయున్= తెల్లారగానే; ఎల్లవారలకున్= అందరికీ; ఉల్లంబు= మనస్సు; తెలివొందున్= నిర్మలంగా ఉంటుంది; అప్పుడు; కడంగి= పూని; యోధులన్= వీరులను; పొదివి= ఆక్రమించి; పేరువాడి= పేర్కొని-బాహాటంగా; పొలియింతము= చంపుదాము; మనము; పాంచాల; సహితంబుగాన్= పాంచాలురతో కూడా; పాండవులన్= పాండవులను; తెగటార్చుట+ఒండెన్= చంపడమో; వారిచేతన్; తెగుట+ఒండెన్= చావటమో; అయ్యెడున్+కాక= అగుగాక; రిత్త మరలుదుమే?= ఊరికే తిరిగి వస్తామా?; అనినన్= మామకున్= కృపాచార్యుడికి; అశ్వత్థామ; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'కాబట్టి, నీవు వింటినుండి నారి తొలగించి, కవచం తీసివేసి నిద్రపొమ్ము, మేముకూడా నిద్రచేత బద్ధకంగా ఉన్నాము. తెల్లవారగానే అందరికీ మనస్సు నిర్మలంగా ఉంటుంది. అప్పుడు యుద్ధానికి పూని వీరులను ఆక్రమించి బాహాటంగా చంపుదాము. మనం పాంచాలసహితంగా పాండవులను చంపటమో, లేక వాళ్ళచేత చావటమో చేస్తాము గాని ఊరికే తిరిగివస్తామా?' అన్న మామతో అశ్వత్థామ ఇట్లా అన్నాడు;

తే. 'అలుక యెత్తినవానికి, నర్థచింత । కునకు, నాతురునకుఁ, గామ గోచరాత్ము
నికిని వచ్చునే, విను నిద్ర? నీవు నెఱుఁగు । దెఱిఁగియుండి యి ట్లేడిటికి నేఁప నన్ను?' 66

ప్రతిపదార్థం: విను; అలుక+ఎత్తినవానికిన్= కోపం అతిశయించినవాడికీ; అర్థచింతకునకున్= డబ్బును గూర్చి ఆలోచించేవాడికీ; ఆతురునకున్= వ్యాధిగ్రస్తుడికీ; కామ గోచర+ఆత్మునికిని= కామం ఆవేశించిన మనస్సు గలవాడికీ; నిద్ర వచ్చునే?; నీవున్+ఎఱుఁగుదు= నువ్వు ఎరుగుదువు; ఎఱిఁగి+ఉండి= ఎరిగికూడా; నన్నున్; ఇట్లు= ఈవిధంగా; ఏఁపన్= బాధించటం; ఏటికిన్= ఎందుకు?

తాత్పర్యం: 'వినుము కోపం అతిశయించినవాడికీ, డబ్బును గూర్చి ఆలోచించేవాడికీ, వ్యాధిగ్రస్తుడికీ, కామోద్రిక్తుడికీ నిద్రవస్తుందా? నీవూ ఎరుగుదువు. ఎరిగికూడా నన్ను ఇట్లా బాధించటం ఎందుకు?

క. ఎన్నఁబడి జనులెఱిఁగిన । యిన్నాలుగు తెఱఁగులందు నెయ్యదియైనన్
గన్ను మొగుడ నీదటె నా । కిన్నియుఁ గలుగంగ నిద్రయేటికి వచ్చున్? 67

ప్రతిపదార్థం: ఎన్నఁబడి= గణించబడి; జనులు+ఎఱింగిన= మనుష్యులెరిగిన; ఈ+నాలుగు తెఱగుల+అందున్= ఈ నాలుగు విధాలైన కారణాలలోనూ; ఏ+అది+ఐనన్= ఏ ఒక్కటైనా; కన్ను మొగుడనీదు+అటె= కన్నుమూతపడనీయదట. నిద్రపట్టనీయదట; నాకున్= నాకు; ఇన్నియున్= ఈ నాలుగూ; కలుగంగన్= ఉండగా; నిద్ర; ఏటికిన్= ఎందుకు; వచ్చున్?= వస్తుంది?

తాత్పర్యం: మనుష్యు లెరిగిన ఈ నాలుగు విధాలైన కారణాలలోనూ ఏ ఒక్కటైనా నిద్రపోవనీదంటే, ఇవన్నీ ఉన్న నాకు నిద్ర ఎట్లా పడుతుంది? (పట్టదని భావం.)

విశేషం: అలం: కావ్యార్థాపత్తి తన కా నాలుగూ ఎట్లా ఉన్నాయో అశ్వత్థామ తరువాతి పద్యంలో వివరిస్తున్నాడు. వాటిలో ఏ ఒక్కటి ఉన్నా నిద్రపట్టదంటే ఇంక ఆ నాలుగూ ఉన్నప్పుడు నిద్రపట్టదని వేరే చెప్పాలా? - అనటంచేత ఇక్కడ అలంకారం కావ్యార్థాపత్తి.

చ. 'గురుదెసవంత నాతురతఁ గూరెద, వైరిఁ దలంచి కోప సం
భరితుఁడ నయ్యెదన్, సమర భంగి నిరూపణచింత నొందెదం,
గురుపతికిం బ్రియం బెసఁగఁ గోరుట నుత్తలపాటు సెందెదం
బురుషనరేణ్య! యే నిదురవోవఁగ నెమ్మెయి నేర్తుఁ జెప్పుమా.' 68

ప్రతిపదార్థం: పురుష నరేణ్యా!= మనుష్యులలో శ్రేష్ఠుడా! - కృపాచార్యా!; గురుదెస వంతన్= తండ్రి విషయమైన దుఃఖంవలన; ఆతురతన్= పీడతో; కూరెదన్= క్రుంగి ఉన్నాను; వైరిన్= శత్రువుని; తలంచి= స్మరించి; కోప సంభరితుఁడన్+అయ్యెదన్= కోపంతో నిండినవాడిని అయి ఉన్నాను; సమరభంగి నిరూపణ చింతన్= యుద్ధప్రకారం నిర్ణయించే చింతను; ఒందెదన్= పొంది ఉన్నాను; కురుపతికిన్= దుర్యోధనుడికి; ప్రియంబు+ఎసఁగన్= సంతోషం అతిశయించటానికి; కోరుటన్= కోరటంచేత; ఉత్తలపాటు+చెందెదన్= కలతచెంది ఉన్నాను; ఏన్= నేను; నిదుర+పోవఁగన్= నిద్రించటానికి; ఏ+మెయిన్= ఏ విధంగా; నేర్తున్= సమర్థుడిని అవుతాను; చెప్పుమా.

తాత్పర్యం: పురుషశ్రేష్ఠుడవైన ఓ కృపాచార్యా!. నాకు నిద్రపట్టకపోవటానికి గల కారణాలు నాలుగూ ఉన్నాయి. ఎట్లా అంటే - తండ్రి అన్యాయంగా చచ్చిపోయాడే అని ఆతురతతో క్రుంగి ఉన్నాను. శత్రువును తలచుకొని కోపంతో నిండి ఉన్నాను. ఎట్లాంటి యుద్ధం చేసి శత్రువులపై కసి తీర్చుకోవాలా - అనే చింత కలిగి ఉన్నాను. దుర్యోధనుడికి సంతోషాతిశయం కూర్చాలనే కోరిక అధికమయి కలతచెంది ఉన్నాను. ఇట్లా నాలుగూ కలిగి ఉన్న నే నెట్లా నిద్రపోగలనో నీవే చెప్పుము.

శా. 'సారాచారనిరూఢుఁ డైన ధనురాచార్యున్ వధింపంగఁ గ
న్నారం జూచితి నీవుఁ; దత్పరిభవం బట్లుండె; భగ్నోరుఁడై
రారా జెంతయు దీనవృత్తిఁ జెవులారం బల్కఁగా విన్న యే
నీ రే యూరక నిద్రవోదునటె! యిట్లే లంటి, వీరోత్తమా? 69

ప్రతిపదార్థం: వీర+ఉత్తమా!= వీరశ్రేష్ఠుడా కృపాచార్యా!; సారాచార నిరూఢుఁడు+ఐన= శ్రేష్ఠమైన ప్రవర్తనంచేత ప్రసిద్ధి వహించినవాడైన; ధనురాచార్యున్= ధనుర్విద్యాగురువైన ద్రోణుడిని; వధింపంగన్= చంపగా; ఈవున్= నీవుకూడా; కన్ను+అరన్= ప్రత్యక్షంగా; చూచితి= చూశావు; తత్+పరిభవంబు= ఆ పరాభవం; అట్లు+ఉండెన్= అట్లా ఉండనిమ్ము; రారాజు= దుర్యోధనుడు; భగ్న+ ఊరుఁడు+ఐ= విరిగిన తొడలు గలవాడయి; ఎంతయున్= ఎంతో; దీనవృత్తిన్= దీనంగా; చెవులు+అరన్= చెవులారా; పల్కఁగాన్= పలకగా; విన్న= విన్నట్టి; ఏను= నేను; ఈ రే= ఈ రాత్రి; ఊరక= ఉపేక్షాభావంతో; నిద్రపోదునటె!= నిద్రపోతానా?; ఇట్లు+ఏల+అంటి(ఎ)?= ఇట్లా ఎందుకన్నావు?

తాత్పర్యం: 'వీరశ్రేష్ఠుడవైన కృపాచార్యా!; సదాచార సంపన్నతలో ప్రసిద్ధి వహించిన ధనుర్విద్యాగురుడిని ద్రోణుడిని చంపటం నీవుకూడా కళ్ళారా చూశావు. ఆ పరాభవం మాట ట్లా ఉండనిమ్ము. రాజరాజు తొడలు విరిగి ఎంతో దీనంగా పలికిన పలుకులు చెవులారా విన్న నేను ఈ రాత్రి ఉపేక్షాభావంతో నిద్రపోతానా? ఇట్లా ఎందుకంటావు?'

విశేషం: 'వీరోత్తమా!' అని కృపాచార్యుడిని సంబోధించటంలో 'ఇట్లా అనటం వీరుడి లక్షణమా! నీవు కేవలవీరుడివి కావు. వీరోత్తముడివే. నువ్విట్లా అనటం భావ్యమా!? అనే ఎత్తిపొడుపు ధ్వనిస్తుంది.

ఆ. 'మనము వినఁగ రాజు పనవిన భంగి కే। క్రూరచిత్తుఁడైన గుందకున్నె?
కరుణ లేకయున్న పురుషున కేనిఁ గ। న్నీరు దొరుఁగకుండునే, మహాత్మ?' 70

ప్రతిపదార్థం: మహాత్మ!= మహానుభావా, కృపాచార్యా!; మనము; వినఁగన్= వింటూండగా; రాజు= దుర్యోధనుడు; పనవిన భంగికిన్= దుఃఖించిన రీతికి; ఏ క్రూరచిత్తుఁడు+ఐనన్= ఏ కఠినాత్ముడైనా; కుందక+ఉన్నె?= బాధపడకుండా ఉంటాడా?; కరుణ= దయ; లేక+ఉన్న= లేనట్టి; పురుషునకున్+ఏనిన్= పురుషుడికైనా; కన్నీరు తొరుఁగక+ఉండునే= కారకుండా ఉంటుందా?

తాత్పర్యం: మహానుభావా కృపాచార్యా! మనం వింటూండగా దుర్యోధనుడు దుఃఖించిన రీతికి ఎటువంటి కఠినాత్ముడైనా బాధపడకుండా ఉంటాడా? ఎంత నిర్దయుడైన పురుషుడైనా కన్నీరు కార్చకుండా ఉంటాడా?

విశేషం: 'దుర్యోధనుడి దీనాలాపాలు విన్న మనం అంత క్రూరచిత్తులం, నిర్దయులం కామే! బాధపడకుండా, కన్నీరుపెట్టకుండా ఉండగలమా?' అని అశ్వత్థామ కృపుడిని రెచ్చగొడుతున్నాడు.

చ. అతఁడు మదీయ సఖ్యవరుఁ, డక్కట! యేఁ గసుగందకుండ నా
క్షితిపతి యిమ్మెయిం బరులచేతఁ బరాభవ మొందె; దానిఁ జూ
చితి; మును లోకు లవ్విభుని చేటును, బాండుతనూజకోటి యు
న్నతియును జెప్పవింటి; నది నా మది సూడెఁడు; నిద్రవచ్చునే? 71

ప్రతిపదార్థం: అతఁడు= ఆ దుర్యోధనుడు; మదీయ సఖ్యవరుఁడు= నా మిత్రులలో శ్రేష్ఠుడు; అక్కట!= అయ్యో!; ఏన్= నేను; కసుగందక+ఉండన్= చెక్కుచెదరకుండా ఉంటూండగా; ఆ క్షితిపతి= ఆ రాజు; ఈ+మెయిన్= ఈ విధంగా; పరుల చేతన్= శత్రువులచేత; పరాభవము= అవమానము; ఒందెన్= పొందాడు; దానిన్= ఆ ఘోరాన్ని; చూచితిన్= చూశాను; మును= ఇదివరకు; లోకంబు= జనం; ఆ+విభుని చేటును= ఆ రాజు చేడ్పాటూ; పాండు తనూజ కోటి= పాండురాజు కొడుకుల యొక్క; ఉన్నతియును= ఔన్నత్యమూ; చెప్పన్= చెప్పగా; వింటిన్= విన్నాను; అది; నామదిన్= నా మనస్సును; సూడెడున్= దహిస్తోంది; నిద్రవచ్చునే?= నిద్రపడుతుందా? (పట్టదని భావం.)

తాత్పర్యం: 'ఆ దుర్యోధనుడు నాకు మంచి చెలికాడు. అయ్యో! నేను నిక్షేపంవలె ఏ అపాయమూ లేకుండా ఉంటూండగా, ఆ రాజు ఈ విధంగా శత్రువులచేత అవమానం పొందాడు. ఆ ఘోరాన్ని నేను చూచాను. ఇదివరకు లోకులు ఆ రాజు చేడ్పాటూ, పాండవుల ఔన్నత్యమూ చెప్పగా విన్నాను. అది నా మనస్సును దహించివేస్తున్నది. నాకు నిద్ర ఎట్లా పడుతుంది?

విశేషం: అశ్వత్థామ మాటలలో అతడి ప్రభుభక్తి పరాయణతా, మిత్రప్రేమా స్పష్టపడుతున్నాయి.

వ. అదియునుం గాక. **72**

తాత్పర్యం: అదీకాక.

ఉ. కవ్వడియున్ ముకుందుఁడును గావలిగా భయమేదియున్న వీ
డెవ్వరికైన ముట్టుకొని యే నని పేర్చి జయింపవచ్చునే?
యెవ్విధి నైననుం బగఱ యే పడఁగించుట పౌరుషంబ; యే
నొవ్వక గెల్తు రాత్రిమెయి నూల్కొని తాఁకితినేని మాతురా! **73**

ప్రతిపదార్థం: మాతులా= మామా! కృపాచార్యా!; కవ్వడియున్= అర్జునుడూ; ముకుందుఁడును= కృష్ణుడూ; కావలిగాన్= కాపుగా; భయము+ఏది+ఉన్న వీడు= భయం లేకున్న శిబిరం; ఎవ్వరికిన్+ఐనన్= ఎవరికైనా; ముట్టుకొని= మార్కొని; ఏను+అని= నేనని; పేర్చి= విజృంభించి; జయింపన్+వచ్చునే= గెలువతరమా?; ఏ+విధిన్+ఐననున్= ఏ రీతిగానైనా; పగఱ= శత్రువులయొక్క; ఏపు= విజృంభణ; అడఁగించుట= అణచటం; పౌరుషంబు+అ= మగతనమే; ఏన్= నేను; రాత్రి మెయిన్= రాత్రియందు; నూల్కొని= పురికొని; తాఁకితిన్+ఏనిన్= తలపడితే!; నొవ్వక= అశ్రమంగా; గెల్తున్= జయిస్తాను.

తాత్పర్యం: 'మామా! అర్జునుడూ, కృష్ణుడూ రక్షకు లవటంచేత భయమనేది లేకుండా ఉన్న శిబిరంపై దండెత్తి నేనని విజృంభించి ఎవడైనా గెలువగలడా? ఎట్లా అయినా శత్రువుల విజృంభణం అణచటం మగతనం. నేను రాత్రివేళ పురికొని తలపడితే అశ్రమంగా గెలుస్తాను.'

ఆ. ఇట్లు నిశ్చయించి యెసకంపుఁ గడఁకతో । నున్నవాఁడ; నిట్టి నన్ను మాన్ప
రామి యెఱుఁగ కంటి; రారాజు మన్నన । వమ్ము చేసి మరలవచ్చు నెట్లు? **74**

ప్రతిపదార్థం: ఇట్లు; నిశ్చయించి= నిర్ణయించుకుని; ఎసకంపున్+కడఁకతోన్= అధికమైన ప్రయత్నంతో; ఉన్నవాఁడన్= ఉన్నాను; ఇట్టి నన్నున్= ఇట్లాంటి నన్ను; మాన్పన్+రామి= విరమింపజేయలేకపోవటం; ఎఱుఁగక= తెలియక; అంటి(వి)= అన్నావు; రారాజు మన్నన= దుర్యోధనుడి అదరం; వమ్ముచేసి= వ్యర్థం చేసి; మరలన్+వచ్చున్+ఎట్లు= తిరిగిపోవటం ఎట్లాసాధ్యం?

తాత్పర్యం: ఇట్లా నిర్ణయించుకొని పెద్ద ప్రయత్నంతో ఉన్నాను. ఇట్లాంటి నన్ను వారించలేనని తెలియక అట్లా అన్నావు. దుర్యోధనుడు చూపిన ఆదరం వ్యర్థం చేసి తిరిగిపోవటం ఎట్లా సాధ్యం?

క. సమయింతుం బొదివి సౌప్తిక । సమయంబున నెల్లభంగిఁ జతురంగసమే
తముగాఁగఁ బాండునృపసుత । సముదయమును ద్రుపదభూపసంతానంబున్. **75**

ప్రతిపదార్థం: పాండు నృప సుత సముదయమును= పాండురాజు కొడుకుల సమూహాన్నీ; ద్రుపద భూప సంతానంబున్= ద్రుపద రాజు సంతతినీ; చతురంగ సమేతము+కాఁగన్= రథగజ తురగ పదాతు లనే నాలుగువిధాలైన బలాలతో కూడా; ఎల్లభంగిన్= సర్వవిధాలా; సౌప్తిక సమయంబునన్= నిద్రించేవేళ; పొదివి= చుట్టుముట్టి; సమయింతున్= చంపుతాను.

తాత్పర్యం: పాండవులనూ, ద్రుపదరాజు సంతతినీ చతురంగ బలాలతో కూడా సర్వవిధాలా నిద్రాసమయంలో చుట్టుముట్టి చంపుతాను.

వ. సమయించి మఱి విశ్రమించియు నిద్రించియు సుఖించెద; నీవు నిద్ర పేరు సెప్పి యుద్యోగంబు మాన్పి మరల్పఁ జూచెద; విది తగ వగునే?' యనిన గురునందనునకు గౌతముం డిట్లనియె: 76

ప్రతిపదార్థం: సమయించి= చంపి; మఱి= మరీ; విశ్రమించియున్= విశ్రమించీ; నిద్రించియున్= నిద్రించీ; సుఖించెదన్= సుఖపడతాను; నీవు; నిద్రపేరు+చెప్పి= నిద్ర అంటూ; ఉద్యోగంబు= పూనిక; మాన్పి= విరమింపజేసి; మరల్పన్+చూచెదవు= మరలించాలని చూస్తున్నావు; ఇది; తగవు= న్యాయం; అగునే?= అవుతుందా?; అనినన్= అని అశ్వత్థామ అనగా; గురునందనునకున్= గురు పుత్రుడైన అశ్వత్థామకు; గౌతముండు= కృపాచార్యుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'చంపి మరీ విశ్రమించీ, నిద్రించీ సుఖిస్తాను. నీవు నిద్ర నిద్ర అంటూ ఆ పూనికను మాన్పి నన్ను మరలించాలని చూస్తున్నావు. ఇది నీకు న్యాయమా?' అనిన అశ్వత్థామతో కృపాచార్యు డిట్లా అన్నాడు.

కృపాచార్యుఁడు నిద్రాసక్తులఁ జంపఁదగదని యశ్వత్థామకు హితవు చెప్పుట (సం.10-5-1)

చ. అలుక మనంబునం గదిరినాతఁడు దాను నెఱుంగఁ డొడ్లచేఁ
దెలియఁడు కార్యతంత్రములు; ధీమహితుండగువాని కైననుం
జెలులును జుట్టలుం దగిలి చెప్పఁగఁ జొప్పడుఁగాక తక్కు ని
ర్మలమగు నీతితంత్రము దిరం బయి చిత్తమునందు నిల్చునే? 77

ప్రతిపదార్థం: కార్య తంత్రములు= కార్యాచరణవిధానాలు; అలుక= కోపం; మనంబునన్= మనసులో; కదిరిన+అతఁడు= అతిశయించినవాడు; తానున్+ఎఱుంగఁడు= తనూ ఎరుగడు; ఒడ్లచేన్= ఇతరులచేతనూ; తెలియఁడు= తెలిసికోడు; ధీ-మహితుండు+అగు= బుద్ధిచేత గొప్పవాడైన; వానికిన్+ఐననున్= వాడికైనా; తక్కు= ఇతరమైన; నిర్మలము+అగు= స్వచ్ఛమైన; నీతి తంత్రము= నీతికార్య విధానం; చెలులును= మిత్రులూ; చుట్టలున్= చుట్టాలూ; తగిలి - చెప్పఁగన్= వెంటబడిచెపితే; చొప్పడున్+కాక= తెలుస్తుంది కాని; తిరంబు+అయి= నిలకడ కలిగి; చిత్తము+అందున్= మనసుతో; నిల్చునే= నిలుస్తుందా?

తాత్పర్యం: కార్యాచరణ పద్ధతులు కోపావిష్ట మనస్కుడు తనూ ఎరగడు, ఇతరులు చెప్పినా తెలిసికొనలేడు. మంచి బుద్ధిమంతుడికి కూడా తక్కిన నీతికార్య విధానం మిత్రులూ, చుట్టాలూ వెంటబడి చెపితే తెలుస్తుంది కాని మనసులో సుస్థిరంగా నాటుకొనదు.

విశేషం: 'నీ మనస్సు కోపంతో నిండి ఉన్నది కాబట్టి కర్తవ్యం నీకు తోచదు. నావంటివాడు చెప్పినా తెలియదు. నీవంటి బుద్ధిమంతుడికి హితులమైన మేము చెపితే నీతితంత్రం తెలుస్తుంది కాని అది మనసు కోపోద్రిక్తమైనపుడు స్థిరంగా ఉండదు. అందుచేత నీవు కోపం విడిచిపెట్టాలి' అని కృపాచార్యుడు అశ్వత్థామకు బోధించ ప్రయత్నిస్తున్నాడు.

క. మతి నెప్పుడుఁ దా ధర్మ । స్థితి నూహించుచును, హితులు సెప్పెడి వెర వు
ద్ధతి దక్కి యాచరించుచు । జితేంద్రియత గలిగి నడవఁ జెందు శుభంబుల్. 78

ప్రతిపదార్థం: తాన్= తాను; ఎప్పుడున్= ఎప్పుడూ; మతిన్= మనసులో; ధర్మస్థితిన్= ధర్మంయొక్క ఉనికిని; ఊహించుచును= భావిస్తూ; హితులు= మిత్రులు; చెప్పెడి వెరవు= చెప్పే ఉపాయం; ఉద్ధతి+తక్కి= గర్వం విడిచిపెట్టి; ఆచరించుచున్= చేస్తూ; జిత+ఇంద్రియత కలిగి= ఇంద్రియజయం కలిగి; నడవన్= నడుచుకుంటే; శుభంబుల్= మేళ్ళు; చెందున్= కలుగుతాయి.

తాత్పర్యం: ఎప్పుడూ మనస్సులో ధర్మస్థితిని భావిస్తూ మిత్రులు చెప్పే ఉపాయాన్ని గర్వం విడిచిపెట్టి ఆచరిస్తూ, ఇంద్రియాలను జయించి నడుచుకొంటే మేలు కలుగుతుంది.

విశేషం: 'నీకు మేలు కలగాలంటే నీవు ధర్మాన్నే భావించాలి. కోపం విడిచి నేను చెప్పే మంచిని ఆచరించాలి. జితేంద్రియుడవు కావాలి అని అశ్వత్థామకు కృపుడి బోధ.

తే. **దుష్పథంబులఁ జొరనీక తొలఁగఁ దివుతు । రాప్త జనములు దగ వశ్యు లయినవార**
లందుఁ బుణ్యంబు దొలఁగని యతఁడు దొలఁగు; । దొలఁగ నేరఁడు భాగ్యంబు దొలఁగువాఁడు. **79**

ప్రతిపదార్థం: ఆప్తజనములు= ఇష్టజనులు; తగన్= తగినవిధంగా; దుష్పథంబులన్= అపమార్గాలలో; చొరనీక= ప్రవేశించనీయకుండా; తొలఁగన్+తివుతురు= తొలగేటట్లు నెట్టుతారు; వశ్యులు+అయిన-వారల+అందున్= తమకు వశులైన వాళ్ళలో; పుణ్యంబు; తొలఁగని+అతఁడు= తొలగనివాడు; తొలఁగున్= ఆ మార్గం నుంచి తొలగుతాడు; భాగ్యంబు+తొలఁగువాఁడు= నిర్భాగ్యుడు; తొలఁగన్+నేరఁడు= తొలగలేదు, అపమార్గంలోనే నడుస్తాడు.

తాత్పర్యం: ఆప్తులైన వాళ్ళు తగినవిధంగా తమ మిత్రులను అపమార్గం పట్టిపోకుండా ఇవతలకి లాగుతారు. కాని, ఆ వశులైన వాళ్ళలో పుణ్యాత్ముడు దుర్మార్గం నుంచి తొలగుతాడు. నిర్భాగ్యుడు తొలగలేడు.

క. **మతిమంతు లైనవారికి । హితులగు వెరవుగలవార లెఱిఁగింతురు దు**
స్థితి గాకుండఁగఁ గార్యము । గతి యొత్తియుఁ దప్పు లిడియుఁ గడవఁ బలికియున్. **80**

ప్రతిపదార్థం: మతిమంతులు+ఐన వారికిన్= బుద్ధిమంతులైన వాళ్ళకు; హితులు+అగు వెరవు+కలవారలు= మిత్రులైన ఉపాయశాలులు; దుస్థితి; కాక+ఉండఁగన్= కాకుండా; కార్యము గతి= కార్యపద్ధతి; ఒత్తియున్= పీడించే; తప్పులు+ఇడియున్= అపరాధం మోపి; కడవన్+పలికియున్= తొలగిపోయేటట్లు మాటలు అనీ; ఎఱిఁగింతురు= బోధిస్తారు.

తాత్పర్యం: మిత్రులైన ఉపాయశాలులు బుద్ధిమంతులైన వాళ్ళకు చెడిపోకుండా కార్యపద్ధతిని పీడించీ, అపరాధం మోపీ, తొలగిపోయేటట్లు మాటలను అనీ బోధిస్తారు.

క. **నా పలుకునట్టి యాగ్రహ । దీపితుఁ డగు టుడిగి మదికిఁ దిన్నఁదనము నీ**
వాపాదింపుము చలమును, । గోపముఁ గ్రౌర్యంబు విడువు గుణరత్ననిధీ! **81**

ప్రతిపదార్థం: గుణ రత్న నిధీ!= రత్నాలవంటి గుణాలకు - సద్గుణాలకు నిధానమైనవాడా! అశ్వత్థామా!; నా పలుకు+పట్టి= నా మాట విని; ఆగ్రహ దీపితుఁడు+అగుట= కోపంతో మండిపడేవాడు అవటం; ఉడిగి= మాని - కోపోద్రేకం విడిచిపెట్టి; మదికిన్= మనస్సుకి; నీవు; తిన్నఁదనము= ఋజుత్వం - నిర్వక్రత; ఆపాదింపుము= కలిగించుము; చలమును= పట్టుదలా; కోపమున్= కోపమూ; క్రౌర్యంబున్= క్రూరత్వమూ; విడువు(ము)= విడిచిపెట్టుము.

తాత్పర్యం: సద్గుణనిధీ - అశ్వత్థామా!; నా మాట విని, కోపోద్రేకం విడిచిపెట్టి, నీ మనస్సుకు తిన్నదనాన్ని కలిగించుము. పట్టుదలా, కోపమూ క్రూరత్వమూ విడిచిపెట్టుము.

వ. 'అట్లైనం బశ్చాత్తాపంబునం బడవు, నిద్రించినవానిని, నాయుధంబులు విడిచినవానిని, వాహన వైకల్యంబు నొందినవానిని, శరణుసొచ్చినవానిని, దలవీడినవానిని వధియించుట ధర్మంబుగా; దీ సమయంబున సమస్త సైన్యంబును, బాండవ పాంచాలురు నిద్రవోవుదురు. నిదుర సావునట్టిదికాదె? పీనుంగులుం బోలెఁ బడి యున్న వారిం బొడిచి పాపంబు గట్టుకొని నరకంబునఁ బడుట మేలె? మహాస్త్రవిదులగు రథికముఖ్యుల యందు మేటి యనంబరఁగి యింతకు మున్నేమిటం గల్మషంబు లేని నీయట్టివాని కిట్టి దుష్కర్మంబు గర్తవ్యం బగునె? యిది మడుఁగుఁ జీరయందు మసి దాఁకినట్లయ్యెడు. సూర్యసంకాశుండవగు నీవు సూర్యోదయ సమయంబునఁ బ్రకాశప్రకారం బైన పరాక్రమంబున కుపక్రమింపు' మనవుడు నశ్వత్థామ గృపాచార్యున కిట్లనియె; 82

ప్రతిపదార్థం: అట్లు+ఐనన్= అట్లా అయ్యే పక్షంలో; పశ్చాత్తాపంబునన్+పడవు= అను తాపంలో పడవు - తరువాత దుఃఖించాల్సిన పని నీకుండదు; నిద్రించినవానిని= నిద్రపోతున్నవాడినీ; ఆయుధంబులు విడిచినవానిని= నిరాయుధుడైన వాడినీ; వాహన వైకల్యంబున్+ఒందినవానిని= వాహనం విరిగిపోయిన వాడినీ; శరణ+చొచ్చినవానిని= శరణన్నవాడిని; తలవీడిన వాడిని= జుట్టుము వీడిన వాడినీ; వధియించుట= చంపటం; ధర్మంబు కాదు= న్యాయం కాదు; ఈ సమయంబునన్= ఇప్పుడు; సమస్త సైన్యంబును= సైన్యం అంతా; పాండవ పాంచాలురున్= పాండవులూ, పాంచాలదేశీయులూ; నిద్ర+పోవుదురు= నిద్రిస్తూ ఉంటారు; నిదుర= నిద్ర; చావు+అట్టిది కాదె?= చావులాంటిదే కాదా?; పీనుంగులున్+పోలెన్= శవాలవలె; పడి+ఉన్నవారిన్= పడి ఉన్నవాళ్ళను; పొడిచి= వధించి; పాపంబు+కట్టుకొని= పాపం మూటకట్టుకొని; నరకంబునన్+పడుటమేలె?= నరకంలో పడటం మంచిదా?; మహాస్త్రవిదులు= గొప్ప అస్త్రాలు తెలిసినవాళ్ళు; అగు; రథిక ముఖ్యుల+అందున్= రథికశ్రేష్ఠులలో; మేటి= గొప్పవాడు; అనన్+పరఁగి= అనేటట్టు ఒప్పి; ఇంతకున్+మున్ను= ఇంతకుముందు; ఏమిటన్= ఏ విషయంలోనూ కల్మషంబు= కళంకం; లేని; నీ+అట్టివానికిన్= నీలాంటి వాడికి; ఇట్టి దుష్కర్మంబు= ఇటువంటి పాడుపని; కర్తవ్యంబు+అగునె= చేయదగిందా?; ఇది; మడుఁగు+చీర+అందున్= పరిశుద్ధమైన వస్త్రంపై; మసి= మరక; తాఁకిన+అట్లు+అయ్యెడున్= అంటుకున్నట్లు అవుతుంది; సూర్య సంకాశుండవు+అగు నీవు= సూర్యుడితో సమానుడవైన నీవు; సూర్య+ఉదయ సమయంబునన్= సూర్యుడు ఉదయించేవేళ; ప్రకాశ ప్రకారంబు+ఐన= ప్రకాశించే విధంగల; పరాక్రమంబునకున్= పరాక్రమానికి; ఉపక్రమింపుము= ఆరంభించుము; అనవుడున్= అనగానే; అశ్వత్థామ, కృపాచార్యునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు;

తాత్పర్యం: 'ఆ పక్షంలో నీకు తరువాత విచారించవలసిన పని ఉండదు. నిద్రించినవాడినీ, నిరాయుధుడైన వాడినీ, వాహనం విరిగిపోయిన వాడినీ, శరణన్నవాడినీ, జుట్టుముడివీడిన వాడినీ వధించటం ధర్మంకాదు. ఇప్పుడు సైన్యం అంతా, పాండవులూ, పాంచాలురూ నిద్రపోతూంటారు. నిద్ర చావువంటిదే కాదా! శవాలవలె పడి ఉన్నవాళ్ళను చంపి పాపం మూటకట్టుకొని నరకంలో పడటం మంచిదా? అస్త్రవిద్యాపారంగతులైన రథికశ్రేష్ఠులలో గొప్పవాడు అని పేరుపొంది ఇంతవరకూ ఏ విషయంలోనూ కళంకంలేని నీవంటివాడికి ఇటువంటి పాడుపని చేయదగినదా? ఇది పరిశుద్ధమైన వస్త్రంమీద మరక ఏర్పడినట్లు ఉంటుంది. సూర్యుడితో సమానుడైన నీవు సూర్యోదయ సమయంలో ప్రకాశించే విధంగా పరాక్రమించటానికి ఆరంభించుము.' అనగానే అశ్వత్థామ కృపాచార్యుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: లుప్తోపమ. 'ఇదే మడఁగు జీరయందు మది దాఁకినట్లయ్యెడు' - ఇందులో ఇది ఉపమేయం మడుఁగుఁ జీరయందు - దాఁకుట' ఉపమానం 'అట్లు' ఉపమావాచకం. సామాన్యధర్మం లోపించింది. కాబట్టి ఇక్కడ అలంకారం లుప్తోపమ.

సీ. 'నీ చెప్పినది యెల్ల నిజము; శాసింపఁగఁ । దగువాఁడవై హితం బగు తెఱంగు
నా కెఱింగించితి; నీ కేను జెప్పెద । నేర్పడ వినుమయ్య యెల్ల నృపులు
గనుఁగొనుచుండ మజ్జనకుని సన్న్యస్త । శస్త్రుని నట్లు పాంచాల రాజ
సుతుఁడు ధృష్టద్యుమ్నుఁ డతి పాతకం బని । కొంకక తల పట్టుకొని వధించె;

ఆ. భీష్ము నా శిఖండి పేరఁ గృత్రిమ సమ । రమున నర్జునుండు సమయఁజూచె;
నరద ముర్విఁ గ్రుంగి యనువు దప్పిన డిగ్గి । యెత్తుచుండఁ గర్ణు నేసె నరుఁడు.' 83

ప్రతిపదార్థం: నీ చెప్పిన+అది+ఎల్లన్= నువ్వు చెప్పినదంతా; నిజము; శాసింపంగన్+తగు వాఁడవు+ఐ= ఆజ్ఞాపించదగిన వాడవయి; హితంబు+అగు తెఱంగు= మేలయినరీతి; నాకున్; ఎఱింగించితి వి= తెలిపావు; నీకున్; ఏన్; చెప్పెదన్; ఏర్పడన్= స్పష్టంగా; వినుమయ్యా= వినుము; ఎల్ల నృపులున్= రాజులందరూ; కనుఁగొనుచున్+ఉండన్= చూస్తూండగా; మత్+జనకునిన్= నా తండ్రిని (ద్రోణుడిని); సన్న్యస్త - శస్త్రునిన్= సన్న్యసించిన శస్త్రాలు గలవాడిని - శస్త్రాలు విడిచిపెట్టినవాడిని; అట్లు= ఆ విధంగా; పాంచాల రాజ సుతుఁడు= పాంచాల రాజయిన ద్రుపదుడి కొడుకు; ధృష్టద్యుమ్నుఁడు; అతి పాతకంబు+అని= మిక్కిలి పాపం అని; కొంకక= సందేహించకుండా; తలపట్టుకొని; వధించెన్= చంపాడు; అర్జునుండు; భీష్మున్; ఆ శిఖండి పేరన్= ఆ శిఖండి మిషతో; కృత్రిమ సమరమునన్= మోసపు యుద్ధంలో; సమయన్+చూచెన్= చంపాడు; అరదము= రథం; ఉర్విన్= భూమిలో; క్రుంగి= దిగబడి; అనువు+తప్పినన్= వీలు తప్పితే; డిగ్గి= దిగి; ఎత్తుచున్+ఉండన్= ఎత్తుతూ ఉండగా; నరుఁడు= అర్జునుడు; కర్ణున్= కర్ణుడిని; ఏసెన్= చంపాడు.

తాత్పర్యం: 'నీవు చెప్పినదంతా నిజం. ఆజ్ఞాపించదగినవాడవై నాకు హితం ఉపదేశించావు. నీకు నేను చెపుతాను సావధానంగా వినుము. రాజులందరూ చూస్తూండగా నా తండ్రిని - అస్త్రసన్న్యాసం చేసినవాడిని ఆ విధంగా ద్రుపదుడి కొడుకు ధృష్టద్యుమ్నుడు మహాపాపం అని సందేహించక తలపట్టుకొని చంపాడు. అర్జునుడు భీష్ముడిని ఆ శిఖండి వంకతో మోసపు యుద్ధంలో చంపాడు. రథం భూమిలో కూరుకుపోయి వీలు తప్పితే దిగి దానిని ఎత్తుతూండగా అర్జునుడు కర్ణుడిని చంపాడు.

ఆ. చేయి నరుఁడు దునుమఁ బ్రాయోపవేశ ప్ర । వృత్తిమైఁ బ్రశాంత చిత్తుఁడైన
పుణ్యపురుషు నట్టి భూరిశ్రవునిఁ గృష్ణు । ననుజుఁ డట్లు సంపె నాగ్రహమున. 84

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; చేయి; తునుమన్= ఖండించగా; ప్రాయోపవేశ ప్రవృత్తిమైన్= ఆమరణ నిరాహారదీక్షతో; ప్రశాంత చిత్తుఁడు+ఐన= మిక్కిలి శాంతంగల మనస్సుగలవాడైన; పుణ్యపురుషున్= పుణ్యాత్ముడిని; అట్టి= అటువంటి; భూరిశ్రవునిన్; కృష్ణు+అనుజుఁడు= కృష్ణుడి తమ్ముడు - సాత్యకి; ఆగ్రహమునన్= కోపంతో; అట్లు= ఆ విధంగా; చంపెన్= చంపాడు.

తాత్పర్యం: అర్జునుడు చేయి నరకగా, ఆమరణ నిరాహారదీక్షపూని ప్రశాంత మనస్సుతో ఉన్న పుణ్యాత్ముడు భూరిశ్రవుడిని కృష్ణుడి తమ్ముడు సాత్యకి కోపంతో ఆ రీతిగా చంపాడు.

చ. పలువురు గూడి కౌరవనృపాలకు నొక్కరుఁ జుట్టుమట్టి వి
చ్చలవిడిఁ బాపకర్మ మనుశంక యొకించుకయేని లేక యూ
రులు గద నుగ్గుసేయఁగ మరుత్సుతునిం బురికొల్పి; రిన్ని భం
గుల మును వారె కాదె చెడఁగ్రొచ్చిరి సంగరధర్మసేతువున్? 85

ప్రతిపదార్థం: పలువురు+కూడి= అనేకులు కూడి; కౌరవనృపాలకున్+ఒక్కరున్= కురురాజైన దుర్యోధనుడిని ఒక్కడినీ; చుట్టుముట్టి= ముట్టడించి; విచ్చలవిడిన్= నిరాటంకంగా; పాపకర్మము= దుష్కృత్యం; అను శంక= అనే సంశయం; ఒకించుకయేనిన్= కొంచెంకూడా; లేక; గదన్= గదతో; ఊరులు= తొడలు; నుగ్గు+చేయఁగన్= విరుగగొట్టడానికి; మరుత్సుతునిన్= వాయుపుత్రుడిని - భీముడిని; పురికొల్పిరి= ప్రేరేపించారు; ఇన్ని భంగులన్= ఇన్నివిధాలుగా; మును= పూర్వం; సంగరధర్మ సేతువున్= యుద్ధధర్మం అనే వంతెనను; వారెకాదె!= వారేకదా!; చెడఁగ్రొచ్చిరి= పాడుచేశారు.

తాత్పర్యం: 'అనేకులు కలిసి దుర్యోధనుడిని ఒక్కడినీ ముట్టడించి నిరాటంకంగా దుష్కృత్య మనే సంశయం కొంచెంకూడా లేకుండా గదతో తొడలు విరుగగొట్టు మని భీముడిని ప్రేరేపించారు. ఇన్నివిధాలుగా ముందు వాళ్ళే కదా యుద్ధధర్మం అనే వంతెనను పాడుచేసింది.

విశేషం: అలం: రూపకం. 'సంగరధర్మ సేతువున్' అనేచోట సంగరధర్మం అనే సేతువుని అని ఉపమేయోపమానాలకి అభేదం చెప్పబడటం చేత అలంకారం రూపకం.

వ. వారి నెట్లు నిందింపవు! మమ్ము నెట్లు వారించెద? వాలింపుము. 86

ప్రతిపదార్థం: వారిన్= ఆ పాండవుల్ని; ఎట్లు నిందింపవు?= తిట్టవెందుచేత?; మమ్మున్; ఎట్లు; వారించెదవు?= అడ్డగిస్తున్నావు; ఆలింపుము= వినుము.

తాత్పర్యం: వాళ్ళని నిందించవేమి? మమ్మల్ని అడ్డగిస్తావేమి? వినుము.

ఉ. 'తొడలు విఱిగి నేలఁ బడియుండి నను౯ గని। మానవేంద్రుఁ డట్లు దీనవృత్తి
నాడెఁ గొన్ని మాట; లవి యంతరంగంబు। నందుఁ జిక్కి కినుక యలఁత సేసె.' 87

ప్రతిపదార్థం: తొడలు; విఱిగి; నేలన్= నేలమీద; పడి+ఉండి; మానవేంద్రుఁడు= నరపతి - దుర్యోధనుడు; ననున్+కని= నన్ను చూచి; అట్లు= ఆ రీతిగా; దీనవృత్తిన్= విచారంతో; కొన్ని మాటలు; అడెన్= పలికాడు; అవి= ఆ మాటలు; అంతరంగంబునందున్= నా మనస్సులో; చిక్కి= నాటుకొని; కినుక= కోపం; అలఁత= బాధ; చేసెన్= కలిగించాయి.

తాత్పర్యం: 'తొడలు విరిగి నేలమీద పడి ఉండి నన్ను చూచి దుర్యోధనుడు ఆ రీతిగా విచారంతో కొన్ని మాటలు పలికాడు. అవి నా మనస్సులో నాటుకొని కోపం తెప్పించి బాధను కలిగించాయి.

వ. వాని వెలార్పవలయు; మజ్జనక హనన సంతుష్టుండగు ధృష్టద్యుమ్నుండు లోనైన యప్పాపాత్ములఁ బాపంబు తెరువున రూపుమాపెద; దీనంజేసి కీటజన్మంబు పాటిల్లినను మేల కాని యీ కడంక మాననేర; నన్ను వారింప నెవ్వరి వశంబగు?' నని దిగ్గనలేచి యగ్గురుతనయుండు రథంబెక్కినం గనుంగొని యగ్గౌతముం డును గృతవర్ముండు. 88

ప్రతిపదార్థం: వానిన్= వాటిని; వెలార్పవలయున్= బయలుపరచాలి; మత్+జనక హనన= నా తండ్రిని చంపటంచేత; సంతుష్టుండు+అగు= సంతుష్టుడయిన; ధృష్టద్యుమ్నుండు; లోను+ఐన= మొదలైన; ఆ+పాప+ఆత్ములన్= ఆ దురాత్ములను; పాపంబు తెరువునన్= అధర్మమార్గంలో; రూపుమాపెదన్= చంపుతాను; దీనన్+చేసి= ఇందువల్ల; కీట జన్మంబు= పురుగు పుట్టుక; పాటిల్లినన్= కలిగినా; మేలు+అ= మంచిదే; కాని; ఈ కడంకన్= ఈ ప్రయత్నం; మానన్+నేరన్= మానలేను; నన్నున్= నన్ను; వారింపన్= అడ్డగించటానికి; ఎవ్వరి వశంబు+అగున్?+అని= ఎవరి తరమౌతుందని; దిగ్గనన్+లేచి= తటాలున లేచి; ఆ+గురు తనయుండు= ఆ గురుపుత్రుడు అశ్వత్థామ; రథంబు; ఎక్కినన్= ఎక్కగా; కనుంగొని= చూచి; ఆ+గౌతముండును= ఆ కృపాచార్యుడూ; కృతవర్ముండున్= కృతవర్మా-

తాత్పర్యం: 'ఆ మాటలను బయలుపరచాలి. నా తండ్రిని చంపి సంతోషించే ధృష్టద్యుమ్నుడూ మొదలైన ఆ దురాత్ములను అధర్మమార్గంలో చంపుతాను. దానివలన నాకు పురుగు పుట్టువు కలిగినా మంచిదే కాని ఈ ప్రయత్నం మానలేను. నన్ను ఆపడం ఎవరితనం? అని తటాలున లేచి అశ్వత్థామ రథం ఎక్కటం చూసి కృపాచార్యుడూ, కృతవర్మా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ధృష్టద్యుమ్నాదులు 'పాపాత్ములు' కావున వాళ్ళను 'పాపంబు తెరువు' ననే రూపుమాపుతానని అశ్వత్థామ సమర్థన. అశ్వత్థామ మాటలలో అతడి దృఢనిశ్చయత్వం తెలుస్తుంది.

ఆ. 'ఏక నిశ్చయమున నిట యేఁగుదెంచితి । మనఘ! నీవు నేము నధిపు పనికి;
నిట్టి మమ్ము వేఱు పెట్టి యెక్కటి కార్య । మాచరించువాఁడ వగుట దగునె?' 89

ప్రతిపదార్థం: అనఘ= పాపంలేనివాడా! అశ్వత్థామా!; నీవున్+ఏమున్= నీవూ, మేమూ; అధిపు పనికిన్= రాజు పనిమీద; ఏక నిశ్చయమునన్= ఒకే నిర్ణయంతో; ఇట ఏఁగుదెంచితిమి= ఇక్కడికి వచ్చాము; ఇట్టి మమ్మున్= ఇటువంటి మమ్ములను; వేఱుపెట్టి= వేరుచేసి; ఎక్కటి= నీవు ఒక్కడివే; కార్యము= పని; ఆచరించువాఁడవు+అగుట= చేసేవాడివవటం; తగునె?= ఉచితమా?

తాత్పర్యం: 'పాపరహితుడవైన అశ్వత్థామా! నీవూ, మేమూ రాజు పనిమీద ఇక్కడికి ఏకాభిప్రాయంతో వచ్చాము. ఇటువంటి మమ్మల్ని వేరుచేసి నీవు ఒక్కడివే పనిచేయటం తగునా?'

చ. అనవుడు నాతఁడిట్లులను నమ్మహితాత్ముల కే నవశ్యముం
జని ద్రుపదాత్మజుం బొదివి చంపెద దుర్గతిఁబోవుచావుగా
ఘనభుజశక్తి శౌర్యము నకంపిత ధైర్యమునున్ వెలుంగ; మీ
రును దెలివొంది కూడికొన రూఢికి నెక్కుద మెల్ల భంగులన్.' 90

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; అతఁడు= అశ్వత్థామ; ఆ+మహిత+ఆత్ములకున్= ఆ మహాశయులతో - కృపకృతవర్మలతో; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అంటాడు; ఏను= నేను; అవశ్యమున్= తప్పకుండా; చని= వెళ్ళి; ద్రుపద+ఆత్మజున్= ద్రుపద పుత్రుడైన ధృష్టద్యుమ్నుడిని; పొదివి= ఆక్రమించి; ఘన భుజశక్తి= గొప్ప భుజబలమూ; శౌర్యమున్= పరాక్రమమూ; అకంపిత ధైర్యమునున్= చలించని ధైర్యమూ; వెలుంగన్= ప్రకాశించగా; దుర్గతిన్+పోవు చావు+కాన్= దుర్గతికి పోయే చావుగా; చంపెదన్= చంపుతాను; మీరును= మీరుకూడా; తెలివొంది= తెలివికలిగి; కూడికొనన్= నాతో కలిస్తే; ఎల్ల భంగులన్= అన్ని విధాలా; రూఢికిన్+ఎక్కుదము= ప్రసిద్ధి కెక్కుతాం.

తాత్పర్యం: కృపకృతవర్మ లట్లా అనగానే అశ్వత్థామ ఆ మహాశయులతో ఇట్లా అన్నాడు: 'నేను తప్పకుండా వెళ్ళి ధృష్టద్యుమ్నుడిని చుట్టుముట్టి, గొప్ప భుజబలమూ, పరాక్రమమూ, చలించని ధైర్యమూ ప్రకాశించగా, వాడు దుర్గతికి పోయే చావు చచ్చేటట్లు చంపుతాను. మీరుకూడా తెలివికలిగి నాతో కలిస్తే అన్నివిధాలా ప్రసిద్ధికెక్కుతాం.'

విశేషం: ఆ పనిలో వాళ్ళు తనతో కలవటం తెలివీ, కలవకపోవటం అజ్ఞానమూ అని అశ్వత్థామ అంటున్నాడు. 'మీరు తెలివిగా నాతో కలిస్తే కలవండి. మీరు కలవకపోయినా నేనొక్కడినే నా పరాక్రమం చూపి వాడిని దుర్మరణం పాలు చేస్తా' నని అశ్వత్థామ తన నిశ్చితాభిప్రాయం చెపుతున్నాడు.

ఆ. 'ఒండు తలఁపు లుడిగి రం' డని పోవ, నా । రథికవరులు గడఁగి రథము లెక్కి
మొనసి చనిరి వారు ముర్వురు నగ్నిత్ర । యంబుఁ బోలి యొప్పి యప్ప డధిప! 91

ప్రతిపదార్థం: ఒండు తలఁపులు= వేరే ఆలోచనలు; ఉడిగి= మాని; రండు; అని; పోవన్= అశ్వత్థామ వెళ్ళగా; అధిప!= ఓ రాజా! ధృతరాష్ట్రా! అప్పుడు; ఆ రథికవరులు= ఆ రథిక శ్రేష్ఠులిద్దరూ; కడఁగి= పూని; రథములు+ఎక్కి; మొనసి= సంసిద్ధులై; వారు ముర్వురున్= వాళ్ళు ముగ్గురూ; అగ్ని త్రయంబున్= మూడగ్నులను పోలి; ఒప్పి; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: 'వేరే ఆలోచనలు మాని నాతో రండి' అని అశ్వత్థామ పోతూ ఉంటే ధృతరాష్ట్రా! అప్పుడు ఆ రథిక శ్రేష్ఠులిద్దరూ పూని, రథాలెక్కి సంసిద్ధులై, ముగ్గురూ త్రేతాగ్నులవలె ఒప్పి వెళ్ళారు.

విశేషం: అలం: ఉపమ. అశ్వత్థామా, కృపుడూ, కృతవర్మా - ఈ ముగ్గురూ మూడగ్నులతో పోల్చబడ్డారు కాబట్టి ఇక్కడ అలంకారం ఉపమ. అగ్నిత్రయం - గార్హపత్యం, దక్షిణాగ్ని, ఆహవనీయం.

వ. అట్లు చని నిద్రావివశం బైన పాండవ శిబిరంబు డగ్గఱి' రనిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె. 92

ప్రతిపదార్థం: అట్లు; చని= వెళ్ళి; నిద్రా వివశంబు+ఐన= నిద్రతో ఒళ్ళు తెలియనిదైన; పాండవ శిబిరంబున్= పాండవుల బిడారాన్ని; డగ్గఱిరి= సమీపించిరి; అనినన్= అని సంజయుడు చెప్పగా; విని; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఆ రీతిగా వెళ్ళి, నిద్రతో ఒళ్ళు తెలియక పడి ఉన్న పాండవుల సేనను సమీపించారు' అని సంజయుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు అతడితో ఇట్లా అన్నాడు:

ఆ. 'రాజుఁ గూల్చి జయముఁ దేజంబుఁ బొందిన । యత్యుదగ్ర విభవు లైన యరుల
శిబిర మాక్రమింపఁ జిత్తంబులందుఁ దెం । పొదవి ముప్పురట్లు గదియు టరిది! 93

ప్రతిపదార్థం: రాజున్= రాజును - దుర్యోధనుడిని; కూల్చి= పడగొట్టి; జయమున్= గెలుపూ; తేజంబున్= తేజస్సూ; పొందిన; అతి+ఉదగ్ర విభవులు+ఐన= మిక్కిలి గొప్ప వైభవం; కలవారైన; అరుల= శత్రువులయొక్క; శిబిరము= బిడారం - స్కంధావారం; ఆక్రమింపన్= ముట్టడించటానికి; చిత్తంబుల+అందున్= మనస్సులలో; తెంపు= సాహసం; ఒదవి= కలిగి; ముప్పురు; అట్లు; కదియుట= సమీపించటం; అరిది!= ఆశ్చర్యం!

తాత్పర్యం: 'దుర్యోధనుడిని పడగొట్టి గెలుపూ, తేజస్సూ పొందిన మహావైభవోపేతులైన శత్రువుల స్కంధావారాన్ని ఆక్రమించటానికి మనస్సులలో సాహసం కలిగి ముగ్గురూ అట్లా సమీపించటం ఆశ్చర్యకరం.

విశేషం: తన వాళ్ళు శత్రువులపై పరాక్రమించారంటే ధృతరాష్ట్రుడికి చాలా సంతోషం.

వ. వారు చేసిన విధంబు వివరింపు' మనిన నా సూతసుతుండు విచిత్రవీర్యనందనున కి ట్లనియె. 'నట్ల శిబిర ద్వార ప్రదేశంబునకు నడచి సహాయులం గడచి యశ్వత్థామ యుద్దామరభసంబునఁ జన నుత్సహించె, నట్టియెడ. 94

ప్రతిపదార్థం: వారు చేసిన విధంబు వివరింపుము; అనినన్= ఆ సూతసుతుండు= అసూతపుత్రుడు సంజయుడు; విచిత్రవీర్య నందనునకున్= విచిత్రవీర్యుడి కొడుకైన ధృతరాష్ట్రుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అట్లు; శిబిర ద్వార ప్రదేశంబునకున్= శిబిర ద్వార దేశానికి; నడచి; సహాయులన్= తోడుగా వచ్చిన వాళ్ళవి - కృపకృతవర్మలను; కడచి= అతిక్రమించి; అశ్వత్థామ; ఉద్దామ రభసంబునన్= అధికమైన కోపావేశంతో; చనన్= పోవటానికి; ఉత్సహించెన్= యత్నించాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: వాళ్ళు ఏం చేశారో వివరంగా చెప్పుము' అంటే, ఆ సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: 'అట్లా శిబిర ద్వారం దగ్గరికి నడచి తనకు తోడుగా వచ్చిన కృపకృతవర్మలను అతిక్రమించి అశ్వత్థామ మిక్కిలి కోపావేశంతో పోవాలని యత్నించాడు. ఆ సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం).

అశ్వత్థామకు శివుఁడు భూతాకృతియై తోఁచుట (సం. 10-6-1)

సీ. క్షరితశోణితమగు శార్దూల చర్మంబు । పరిధానకరణి విభాసితముగ;
నురగాత్మకములైన యుపవీతములు హార । ములు నంగదంబులు పొలుపుమిగుల;
వివృతవిశాలాస్యవివరంబు నిశిత దం । ష్ట్రానికరంబు ఘోరంబు గాఁగ;
భాసుర కాంతి వికాసంబు లగు లోచ । నంబులు బహుసహస్రంబు లొప్ప;

తే. నుగ్రమును సుందరంబును నుజ్జ్వలంబు । నై మహాకార మద్భుత మావహింప
భూత మొక్కటి భీషణ స్ఫురణ మెసక । మెసఁగ నగ్గురుపుత్త్రు కట్టెదుర నిలిచె. 95

ప్రతిపదార్థం: క్షరిత శోణితము+అగు= కారిన రక్తం కలదైన; శార్దూల చర్మంబు= పులితోలు; పరిధాన కరణిన్= వస్త్రం లాగా; విభాసితముగన్= ప్రకాశించగాను; ఉరగాత్మకములైన= పాములే అయిన; ఉపవీతములున్= జందెములూ; హారములున్= ముత్యాపేరులూ; అంగదంబులు= భుజకీర్తులూ; పొలుపు మిగులన్= ప్రకాశించగాను; వివృత విశాల+అస్య వివరంబు= తెరవబడ్డ పెద్ద ముఖరంధ్రమూ; నిశిత దంష్ట్రా నికరంబు= వాడి కోరల సమూహమూ; ఘోరంబు+కాఁగన్= భయంకరంగా ఉండగాను; భాసుర కాంతి వికాసంబులు= ప్రకాశించే కాంతుల మెరుపులు గలవి; అగు; లోచనంబులు= కళ్ళు; బహు సహస్రంబులు= పెక్కువేలు; ఒప్పన్= ఒప్పగాను; ఉగ్రమును= భయంకరమూ; సుందరంబును= అందమైనదీ; ఉజ్జ్వలంబున్+ఐ= ప్రకాశించేదీ అయి; మహాకారము= పెద్దరూపం; అద్భుతము= ఆశ్చర్యం; ఆవహింపన్= కలిగించగాను; భూతము+ఒక్కటి= ఒక భూతం; భీషణ స్ఫురణము= భయంకరస్ఫూర్తి; ఎసకము+ఎసఁగన్= కలిగేటట్లు; ఆ+గురుపుత్రు= ఆ అశ్వత్థామ; కడు+ఎదురన్= ఎట్టయెదుట; నిలిచెన్.

తాత్పర్యం: రక్తం కారే పులితోలు వస్త్రంవలె ప్రకాశిస్తూండగా; పాములు జందెములుగా, ముత్యాలపేరులుగా, భుజకీర్తులుగా ఒప్పుతూ ఉండగా; తెరచుకొన్న పెద్ద నోటి రంధ్రమూ, అందులోని వాడికోరల సమూహమూ భయంకరం కాగా, ప్రకాశించే కాంతులతో మెరిసే వేలకొద్దీ కళ్ళు ఒప్పగా, భయంకరమూ, సుందరమూ ప్రకాశించేదీ అయి పెద్ద రూపం ఆశ్చర్యం కలిగిస్తూ ఉండగా ఒక భూతం వెరపు కలిగించేటట్లు ఆ అశ్వత్థామ ఎట్టఎదుట ప్రత్యక్షమైనది.

క. విను మా భూతం బిట్టిది । యని కలరూ పేర్పఱింప నమరులకు వశం
బె? నరేంద్ర! తదాకృతి గనుఁ । గొనినన్ భేదిల్లవలయుఁ గొండకు నైనన్ 96

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= రాజా!; ధృతరాష్ట్రా!; వినుము; ఆ భూతంబు; ఇట్టిది= ఇటువంటిది; అని; కలరూపు= యథార్థం; ఏర్పఱింపన్= నిరూపించటానికి; అమరులకున్= దేవతలకైనా; వశంబు+ఎ?= తరమా?; తద్+ఆకృతి= దాని ఆకారం; కనుంగొనినన్= చూస్తే; కొండకున్+ఐనన్= కొండకైనా; భేదిల్లన్ వలయున్= బ్రద్దలవాల్సిందే.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! వినుము. ఆ భూతం ఇటువంటిదని యథార్థ్యం నిర్ణయించటానికి దేవతలకు కూడా తరంకాదు. దాని ఆకారం చూస్తే కొండ అయినా బ్రద్దలవాల్సినదే.

విశేషం: 'అమరులకు వశంబె' - అమరులకు కూడా తరం కాదన్నప్పుడు మర్త్యులమాట. వేరే చెప్పాలా? అని ధ్వనించటం చేత కావ్యార్థాపత్త్యలంకార ధ్వని. అలాగే 'కొండకు నైనన్ భేదిల్లవలయున్' అనటంచేత స్థిరస్వరూపమైన కొండే భేదిల్లితే చరస్వరూపాలైన మనుష్యులమాట వేరే చెప్పనక్కరలేదని ధ్వనించటం వలన అక్కడకూడా కావ్యార్థాపత్త్యలంకార ధ్వని.

వ. ఇ ట్లతని యగ్రభాగంబున నావిర్భూతం బైన యమ్మహాభూతంబు నాస్యకుహరంబున, నాసికా వివరంబులఁ, జెవులఁ, గన్నుల, నన్నింట మంటలు వెడలి మింట నడరఁ దదీయతనుతేజోమరీచిసంఘంబుల శంఖ చక్రగదాహస్తులై హృషీకేశు లనేకులు వెడలి; రి ట్లఖిలభూతభయంకరంబగు నమ్మహాభూతంబు నాలోకించి యవ్వీరవరుండు. 97

ప్రతిపదార్థం: ఇట్లు; అతని; అగ్రభాగంబునన్= ఎదుట; అవిర్భూతంబు+ఐన= పుట్టిన; ఆ+మహత్ భూతంబు+అస్య కుహరంబునన్= ఆ మహాభూతంయొక్క గుహవంటి నోటిలోనూ; నాసికా వివరంబులన్= ముక్కు రంధ్రాలలోనూ; చెవులన్; కన్నులన్; అన్నింటన్= మంటలు; వెడలి; మింటన్= ఆకాశంలో; అడరన్= విజృంభించగా; తదీయ తను తేజస్+మరీచి సంగంబులన్= దానిదైన శరీరకాంతి కిరణాల సమూహాల్లోంచి; శంఖ చక్ర గదా హస్తులు+ఐ= శంఖం, చక్రం, గద, చేతుల్లో గలవారై; హృషీకేశులు= విష్ణులు; అనేకులు= పెక్కుమంది; వెడలిరి; ఇట్లు= ఈ విధంగా; అఖిల భూత భయంకరంబు+అగు= ఎల్ల ప్రాణులకు వెరపు కలిగించే దయిన; ఆ+మహా+భూతంబున్= ఆ మహాభూతాన్ని; ఆలోకించి= చూచి; ఆ+వీరవరుండు= ఆ వీరశ్రేష్ఠుడు - అశ్వత్థామ.

తాత్పర్యం: ఈ రీతిగా అతడి యెదుట పుట్టిన ఆ మహాభూతం గుహలాంటి నోట్లోనూ, ముక్కు రంధ్రాల్లోనూ, చెవుల్లోనూ, కన్నులలోనూ - అన్నిటిలోనూ మంటలు వెలువడి ఆకాశంలో విజృంభించగా, దాని శరీరకాంతి కిరణాల్లోనుండి శంఖం, చక్రం, గదా, ధరించిన విష్ణువు లనేకులు వెలువడ్డారు. ఇట్లా సర్వప్రాణులకూ వెరపు పుట్టించే ఆ మహాభూతాన్ని చూసి ఆ వీరశ్రేష్ఠుడైన అశ్వత్థామ. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. హృదయమునం గలంక యొకయించుక యేనియు లేక వీర సం
పద యలరంగ భల్లముఖ బాణతతుల్ నిగిడింపఁ బెద్దగా
వదనంము విచ్చి భూత మనివార్య విధంబునఁ ద్రావె బాడబం
బుదధిజలంబు ద్రాగెడు మహోగ్ర సముద్ధతి వాని నన్నిటిన్. 96

ప్రతిపదార్థం: హృదయమునన్= మనస్సులో; కలంక= జంకు; ఒక+ఇంచుక+ఏమనియున్= కొంచెంకూడా; లేక; వీర సంపద= పరాక్రమ సంపద; అలరంగన్= ఒప్పేటట్లు; భల్లముఖ బాణతతుల్= భల్లమూ మొదలైన బాణాల సమూహాలు; నిగిడింపన్= ప్రయోగించగా; భూతము; పెద్దగాన్; వదనమున్= నోటిని; విచ్చి= తెరచి; బాడబంబు= బడబాగ్ని; ఉదధి జలంబు= సముద్రపునీరు; త్రాగెడు= త్రాగే; మహోగ్ర సముద్ధతిన్= మిక్కలి భయంకరమైన ఆటోపంతో; వానిన్+అన్నిటిన్= ఆ బాణాలనన్నింటినీ; అనివార్య విధంబునన్= నివారించరాని రీతిగా; త్రావెన్= త్రాగింది.

తాత్పర్యం: మనసులో ఏ మాత్రమూ బెదురులేకుండా పరాక్రమ సంపద ఒప్పేటట్లు భల్లమూ మొదలైన బాణ సమూహాలు ప్రయోగించగా, భూతం నోరు పెద్దది చేసి, బడబాగ్ని సముద్రపునీటిని అతి భయంకరంగా త్రాగే టట్లు, వాటి నన్నిటినీ నివారించరాని విధంగా మ్రింగింది.

విశేషం: అలం: ఉపమ. 'బాడబం..వానినన్నిటిన్' భూతము త్రావె' అనటంలో అలంకారం ఉపమ. అశ్వత్థామ భల్లాలను ఉదధి జలంతో పోల్చటం వలన వాటి అసంఖ్యాకత్వమూ, భూతాన్ని బాడబంతో పోల్చటం వలన దాని అనివార్యతా, భీషణత్వమూ తెలుస్తాయి.

చ. అతుల శరంబు లట్లు వృథయైనఁ గనుంగొని ద్రౌణి రశ్మి మం
డిత మహనీయశక్తి నిగిడించిన భూతముఁ దాఁకి యంత్యకా
లతిమిరవైరి మండల విలగ్న మహోల్కయుఁ బోలెఁ బిన్న పి
న్న తునియలై యడంగె నరనాథ! యతండు విషాద మందఁగన్. 99

ప్రతిపదార్థం: నరనాథ!= రాజు! ధృతరాష్ట్రా!; అట్లు= ఆ రీతిగా; అతుల శరంబులు= సాటిలేని బాణాలు; వృథ+ఐనన్= వ్యర్థం కాగా; ద్రోణి= అశ్వత్థామ; కనుంగొని= చూసి; రశ్మి మండిత మహనీయ శక్తిన్= కిరణాలచేత అలంకరించబడిన గొప్ప శక్త్యాయుధాన్ని; నిగిడించినన్= ప్రయోగించగా; (అది); భూతమున్; తాఁకి; అంత్యకాల= ప్రళయసమయపు; తిమిరవైరి= చీఁకట్ల శత్రువు అగు సూర్యుడియొక్క; మండల= బింబానికి; విలగ్న= గురిపెట్టబడిన; మహోల్కయున్+పోలెన్= గొప్ప ఉల్కవలె; అతండు= అశ్వత్తామ; విషాదము+అందఁగన్= విచారం పొందగా; పిన్న పిన్న తునియలు+ఐ= చిన్న చిన్న ముక్కలై; అడంగెన్= నశించింది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! ఆ రీతిగా సాటిలేని బాణాలు వ్యర్థం కాగా అశ్వత్థామ చూచి కాంతులతో ప్రకాశించే గొప్ప శక్త్యాయుధాన్ని ప్రయోగించాడు. అది భూతాన్ని తాకి ప్రళయ కాలపు సూర్యబింబాన్ని తాకిన గొప్ప ఉల్కవలె చిన్న చిన్న ముక్కలై నశించింది. దానికి అశ్వత్థామ చింతించాడు.

విశేషం: అలం: ఉపమ. భూతం ప్రళయకాల సూర్యబింబంతోనూ, అశ్వత్థామ శక్తి చిన్న ఉల్కతోనూ పోల్చబడటంచేత ఇక్కడ అలంకారం ఉపమ. దీనివలన భూతం భయంకరత్వమూ, శక్తి అల్పత్వమూ స్పష్టమవుతున్నాయి.

చ. అలఘుతరాత్మసారుఁడగు నగ్గురుపుత్రుఁడు ఘోరఖడ్గమున్
బిలగతసర్పముం దిగిచి భీషణరేఖ నటించుభంగి న
గ్గలపు రయంబునం బెటికి గాఢవిముక్తము గాఁగ వైచినం
బొలుపటి పోయె దూదిక్రియ భూతశరీరసమాగమంబునన్. 100

ప్రతిపదార్థం: అలఘుతర+ఆత్మసారుఁడు+అగు= మిక్కిలి ఎక్కువ మనోబలంగలవాడైన; ఆ+గురుపుత్రుఁడు= ఆ అశ్వత్థామ; ఘోర ఖడ్గమున్= భయంకరమైన కత్తిని; బిలగత సర్పమున్= కన్నంలోని పాము అయినదానిని; తిగిచి= (ఒరలోంచి) లాగి; భీషణ రేఖ= భయంకరత్వం; నటించు భంగిన్= తోచే విధంగా; అగ్గలము+రయంబునన్= అమితవేగంతో; పెటికి= విసిరి; గాఢవిముక్తము+కాఁగన్= పూర్తిగా విడుపబడినదిగా, వైచినన్= ప్రయోగించగా, భూత శరీర సమాగమంబునన్= భూతం శరీరంతో కలవటంచేత; దూదిక్రియన్= దూదివలె; పొలుపు+అటి పోయెన్= నశించినది.

తాత్పర్యం: గొప్ప మనోబలం కల ఆ అశ్వత్థామ కన్నంలోనుండి పాము వలె ఒరలోనుంచి భయంకరమైన ఖడ్గాన్ని లాగి, వెరవు తోచే విధంగా అమితవేగంతో గట్టిగా విసరగా, అది భూతం శరీరాన్ని తాకి దూదివలె కాలి నశించింది.

విశేషం: అలం: రూపకం. ఉపమ. 'ఘోరఖడ్గమున్ బిలగత సర్పమున్'-అనేచోట ఉపమేయోపమానాలకి అభేదం చెప్పబడినది కాబట్టి, అలంకారం రూపకం. 'దూదిక్రియ' అనేచోట ఉపమేయోపమానాలకి మంచి సాదృశ్యం చెప్పబడింది కాబట్టి అలంకారం ఉపమ.

తే. సరభసంబుగఁ దోమర సమితిఁ జక్ర। వితతిఁ బరఁగించి పేర్చె నవ్వీరవర్యుఁ;
దదియు నదియును దోడ్తోడ నల్ల నగుచు । మ్రింగె నమ్మహాభూతంబు మేదినీశ! 101

ప్రతిపదార్థం: మేదినీశ!= రాజా! ధృతరాష్ట్రా!; ఆ+వీరవర్యుఁడు= ఆ వీరశ్రేష్ఠుడు అశ్వత్థామ; సరభసంబుగన్= కోపావేశంతో; తోమర సమితిన్= ఇనుపగుదియల సమూహాన్నీ; చక్ర వితతిన్= చక్రాయుధాల సమూహాన్నీ; పరఁగించి= ప్రయోగించి; పేర్చెన్= అతిశయించాడు; ఆ+మహాభూతంబు= ఆ గొప్ప భూతం; అల్లన్= మెల్లగా; నగుచున్= నవ్వుతూ; తోడ్తోడన్= వెంటనే; అదియున్+అదియును= దానినీ, దానినీ మ్రింగెన్.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! ఆ వీరోత్తముడైన అశ్వత్థామ కోపావేశంతో తోమర సమూహాన్నీ చక్ర సమూహాన్నీ ప్రయోగించి విజృంభించాడు. ఆ మహాభూతం చిరునవ్వుతో వెంటనే దానినీ దానినీ మ్రింగివేసింది.

క. అలిగి యతండు నితాంతో। జ్జ్వల గద వైచుటయు నదియు సత్వరలీలన్
జలచర మామిషముంగొను। పొలుపు నెఱయ మెఱయ మ్రింగె భూతం బధిపా! 102

ప్రతిపదార్థం: అధిపా!= రాజా! ధృతరాష్ట్రా!; అతండు= అశ్వత్థామ; అలిగి= కోపించి; నితాంత+ఉజ్జ్వల గదన్= మిక్కిలి ప్రకాశించే గదను; వైచుటయున్= ప్రయోగించగా; భూతంబు; సత్వర లీలన్= వెంటనే; జలచరము= చేప; అమిషమున్= మాంసాన్ని; కొను= గ్రహించే, పొలుపు= విధం; నెఱయన్= బాగుగా; మెఱయన్= ప్రకాశించగా; అదియున్ మ్రింగెన్= దానిని కూడా మ్రింగింది.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! అశ్వత్థామ కోపంతో మిక్కిలి ప్రకాశించే గదను ప్రయోగించగా, భూతం వెంటనే దానిని కూడా చేప మాంసాన్ని గ్రహించే విధంగా మ్రింగింది.

విశేషం: అలం: ఉపమ. 'జలచర మామిషముం గొను పొలుపు నెఱయ మెఱయ - నదియు మ్రింగె భూతంబు' - ఉపమేయోపమానాలకి మంచి సాదృశ్యం చెప్పబడింది కాబట్టి అలంకారం ఉపమ.

ఆ. ఇవ్విధమున సకల హేతులు వమ్మయి। పోవ నతివిషణ్ణబుద్ధి యగుచు
నట్టు నిట్టుఁ జూచు నతనికి బహు జనా। ర్దనులు దోఁచి రంబరమున నెల్ల. 103

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ రీతిగా; సకల హేతులున్= అన్ని ఆయుధాలూ; వమ్ము+అయి పోనన్= వ్యర్థమయిపోగా; అతి విషణ్ణ బుద్ధి= మిక్కిలి విచారంతో కూడిన మనస్సు కలవాడు; అగుచున్= అవుతూ; అట్టున్+ఇట్టున్= అటూ ఇటూ; చూచు+అతనికిన్= చూచే అశ్వత్థామకు; అంబరమునన్+ఎల్లన్= ఆకాశంలో అంతటా; బహు జనార్దనులు= ఎందరో విష్ణువులు; తోఁచిరి= కనబడ్డారు.

తాత్పర్యం: ఈ విధంగా ఆయుధాలన్నీ వ్యర్థమయిపోగా మనస్సులో మిక్కిలి బాధపడుతూ అటూ ఇటూ చూచే అశ్వత్థామకు ఆకాశంలో అంతటా ఎంతోమంది విష్ణువులు కనబడ్డారు.

ఉ. భీకర విష్ణురూపములు పెక్కిటు లొక్కటఁ దోఁపఁ దీవ్రతా
పాకులమానసుండగుచు నగ్గురుసూనుఁడు 'దుర్మదంబునన్
జేకొననైతి నట్లు కృపు చెప్పిన సత్యహితోపదేశముల్;
నా కిది పెద్దయే?' యని మనంబున నిట్లని వల్కె వెండియున్. 104

ప్రతిపదార్థం: భీకర విష్ణు రూపములు= భయంకర విష్ణుమూర్తులు; పెక్కు= అనేకం; ఇటులు= ఈ విధంగా; ఒక్కటన్= ఒక్కుమ్మడిగా; తోఁపన్= కనబడగా; ఆ+గురు సూనుఁడు= ఆ అశ్వత్థామ; తీవ్ర తాప+ఆకుల మాననుండు+అగుచున్= అధికమైన దుఃఖంచేత కలిగిన మనస్సు కలవాడు అవుతూ; అట్లు= ఆ రీతిగా; కృపు చెప్పిన= కృపుడు చెప్పిన; సత్య హిత+ఉపదేశముల్= సత్యాలూ; శ్రేయస్కరాలూ అయిన హితోపదేశాలు; దుర్మదంబునన్= పాడుగర్వంతో; చేకొనన్+ఐతిన్= వినిపించుకొలేదు; నాకున్; ఇది= ఈ దురవస్థ; పెద్దయే= ఎక్కువా?; అని; వెండియున్= మళ్ళీ; మనంబునన్= మనస్సులో; ఇట్లు+అని+పల్కెన్= ఇట్లా తలపోశాడు.

తాత్పర్యం: భయంకర విష్ణుమూర్తులు ఈ విధంగా ఒక్కుమ్మడిగా కనబడగా అశ్వత్థామ అధిక దుఃఖంచేత మనస్సు కలిగినవాడై 'ఆ విధంగా కృపుడు చెప్పిన సత్యాలూ, శ్రేయస్కరాలూ అయిన హితోపదేశాలు దుర్గర్వంతో వినిపించుకొనలేదు. నాకీ శాస్తి ఎక్కువేమీ కాదు' అని మనస్సులో మళ్ళీ ఇట్లా తలపోశాడు.

విశేషం: 'చేతులు కాలాక ఆకులు పట్టుకొనటం వలె ఉన్నది' అశ్వత్థామ పశ్చాత్తాపం.

ఆ. **'మహిత శాస్త్ర కలిత మార్గంబు విడిచి ని । జేచ్ఛఁ బగఱ గెలువ నెవ్వఁ డరుగు**
వాని నయ్యధర్మవర్తన క్రౌర్యమ । యెవ్విధమునఁ జెఱుచు నింత నిజము.' **105**

ప్రతిపదార్థం: ఎప్పుడు; మహిత శాస్త్ర కలిత మార్గంబున్= గొప్పదైన శాస్త్రోక్త పద్ధతిని; విడిచి; నిజేచ్ఛన్= తన ఇష్టప్రకారం; పగఱన్= శత్రువులను; గెలువన్= జయించటానికి; అరుగున్= వెడతాడో; వానిన్= వాడిని; ఏ+విధమునన్= ఏ విధంగానైనా సరే; ఆ+అధర్మ వర్తన+క్రౌర్యము= ఆ ధర్మరహిత ప్రవర్తనతోడి క్రూరత్వమే; చెఱుచున్= నశింపజేస్తుంది; ఇంత నిజము= ఇది నిజం.

తాత్పర్యం: శాస్త్ర విహిత పద్ధతిని విడిచిపెట్టి తన ఇష్టం వచ్చినట్లు శత్రువులను జయించటానికి పూనుకొనే వాడిని, ఎట్లాగయినా సరే ఆ ధర్మేతరమైన క్రూరప్రవర్తనే నశింపజేస్తుంది ఇది నిజం.

సీ. **గోవు, బ్రాహ్మణు, బాలకుని, వృద్ధు, నంధుని, । సఖుఁ, దోడఁబుట్టువు, జడుఁ బ్రమత్తు,**
మత్తుని, గురుని, నున్మత్తుని, సుప్తుని, । నంగన, భీతుని నస్త్రశస్త్ర
నిహతి నొప్పించుట విహితంబు గాదని । యార్యులు సెప్పుదు; రట్టి ధర్మ
మార్గంబు దొఱఁగి దుర్మంత్రంబుమైఁ బగ । యడఁగింపఁ గడఁగిన నసురవృత్తిఁ

ఆ. **జేట గాక కార్యసిద్ధి గా నేర్చునే? పెద్ద యెత్తికొనిన భీతి మగుడఁ**
బడుట కష్టసరణి; బలిమి దయ్యముతోడఁ । జెల్ల; దింక నేమి సేయువాఁడ? **106**

ప్రతిపదార్థం: గోవున్= ఆవునూ; బ్రాహ్మణున్; బాలకునిన్= బాలుడినీ; వృద్ధున్= ముసలివాడినీ; అంధునిన్= గ్రుడ్డివాడినీ; సఖున్= చెలికాడినీ; తోడఁబుట్టువున్= సోదరుడినీ; జడున్= మందుడినీ; ప్రమత్తున్= ఏమరుపాటుగా ఉన్నవాడినీ; మత్తునిన్= మైకంలో ఉన్నవాడినీ; గురునిన్= ఉపాధ్యాయుడినీ; ఉన్మత్తునిన్= పిచ్చివాడినీ; సుప్తునిన్= నిద్రించినవాడినీ; అంగనన్= స్త్రీనీ; భీతునిన్= భయపడినవాడినీ; అస్త్ర శస్త్ర నిహతిన్= అస్త్రాల శస్త్రాల దెబ్బచేత; నొప్పించుట= బాధించటం; విహితంబు= చేయదగినది; కాదని; ఆర్యులు= పూజ్యులు; చెప్పుదురు; అట్టి ధర్మమార్గంబు= అటువంటి ధర్మమార్గం; తొఱఁగి= విడిచి;

దుర్మంత్రంబుమైన్= దురాలోచనతో; అసురవృత్తిన్= రాక్షస ప్రవృత్తితో; పగ= వైరం; అడఁగింపన్= నశింపచేయటానికి; కడఁగినన్= ప్రయత్నిస్తే; చేటు+ఆ+కాక= కీడేగాని; కార్యసిద్ధి; కాన్+నేర్చునే= కాగలదా?; పెద్ద ఎత్తికొనిన భీతిన్= మిక్కిలి అతిశయించిన భయంతో; మగుడఁ బడుట= మరలటం; కష్ట సరణి= కష్టమార్గం; బలిమి= శౌర్యం; దయ్యముతోడన్= దైవంతో; భూతంతో; చెల్లదు= పనికిరాదు; ఇంకన్+ఏమి చేయువాఁడన్= ఇంకేమి చేస్తాను?

తాత్పర్యం: ఆవునూ, బ్రాహ్మణుడినీ, బాలుడినీ, ముసలివాడినీ, గ్రుడ్డివాడినీ, చెలికాడినీ, సోదరుడినీ, మందుడినీ, ఏమరినవాడినీ, మైకంలో ఉన్నవాడినీ, గురుడినీ, పిచ్చివాడినీ, నిద్రపోతూన్నవాడినీ, ఆడదానినీ, భయపడినవాడినీ, అస్త్రశస్త్రాలతో కొట్టి బాధించటం చేయదగింది కాదని పెద్దలంటారు. అటువంటి ధర్మమార్గం విడిచిపెట్టి దురాలోచనతో రాక్షస ప్రవృత్తితో వైరం అణచటానికి ప్రయత్నిస్తే కీడే కాని కార్యం నెరవేరుతుందా? మిక్కిలి అతిశయించిన భయంతో మరలగలగటం కష్టం. బలం దైవం ముందు (భూతం ముందు) పనికిరాదు. ఇంకేమి చేయటం?

ఉ. అక్రమవృత్తి గీడుతెరువై ఫలియింపద; ద్రోణసూతి దు
ర్విక్రమనింద కర్హుఁడె? సవిస్మయ మైనమనంబు భూతవృ
త్తిక్రమవేదిగాదు; గణుతింపఁగ నేమియొ యిమ్మహాద్భుత
ప్రక్రియ కాదికారణము? పాపనిరూఢుఁడు నీతిఁగాంచునే? 107

ప్రతిపదార్థం: అక్రమవృత్తి= అధర్మప్రవర్తన; కీడు తెరువు+ఐ= చేటుకు మార్గమై; ఫలియింపదు!అ= ఫలించనే ఫలించదు; ద్రోణసూతి= ద్రోణుడికొడుకు; దుర్విక్రమ నిందకున్= దుష్టపరాక్రముడు అనే నిందకు; అర్హుఁడు+ఎ?= తగినవాడా?; సవిస్మయము+ఐన మనంబు= గర్వంతో కూడుకున్న మనస్సు; భూతవృత్తి క్రమ వేది+కాదు= భూతం ప్రవర్తన క్రమం తెలిసికొనేది కాదు; గణుతింపఁగన్= ఎంచగా; ఈ+మహత్(మహా)+అద్భుత ప్రక్రియకున్= ఈ మహాశ్చర్యకరమైన కార్య విధానానికి; ఆదికారణము= మూలకారణం; ఏమియొ?= ఏమిటో?; పాప నిరూఢుఁడు= పాపంలో ప్రసిద్ధుడు; నీతిన్= కార్యపద్ధతిని; కాంచునే= తెలిసికొంటాడా?

తాత్పర్యం: అధర్మ ప్రవర్తన చేటుకి మార్గమై ఎప్పటికీ ఫలించదు. ద్రోణుడి కొడుకునైన నేను దుష్టపరాక్రముడనే నింద కర్హుడినా? గర్వితమైన మనస్సు భూతం ప్రవర్తన క్రమం తెలిసికొనలేదు. ఎంచగా మహాశ్చర్యాన్ని కలిగించే ఈ కార్యవిధానానికి మూలకారణ మేమిటో? పాపకార్యాలలో ప్రసిద్ధుడైనవాడు కార్యపద్ధతిని తెలిసికొనగలడా?'

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. అశ్వత్థామ పశ్చాత్తాపం చూడదగ్గది. నీవు పశ్చాత్తాపపడవలసి వస్తుందని కృపుడు చెప్పనే చెప్పాడు. 'పాప నిరూఢుడు నీతిఁగాంచునే?' అనే సామాన్యాంశంచేత 'అశ్వత్థామ పాపకార్యం మూలంగా భూతం ప్రవర్తనకి కారణమేమిటో తెలుసుకోలేకపోతున్నా' డనే విశేషాంశం సమర్థించబడుతున్నది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

వ. అని పెక్కు భంగుల వగచి పల్లటిల్లిన చిత్తంబుఁ బట్టుకొల్పి యిట్లని నిశ్చయించె. 108

ప్రతిపదార్థం: అని; పెక్కు భంగులన్= అనేకవిధాల; వగచి= చింతించి; పల్లటిల్లిన చిత్తంబున్= చెదరిన మనస్సును; పట్టుకొల్పి= కుదుటపరుచుకుని; ఇట్లు+అని; నిశ్చయించెన్= నిర్ణయించాడు.

తాత్పర్యం: అని అనేకవిధాల చింతించి, చెదరిన మనస్సును కుదుటపరచుకొని ఇట్లా నిర్ణయించాడు.

వ. భావం బేకముఖంబుఁ జేసికొని యావద్ధ్వాంతభానున్, మహా
దేవుం, బర్వత కన్యకాప్రియు, దయార్ద్రీభూత చేతస్కు లో
కావిర్భావ వివర్ధనా లయకృతి వ్యాపార పారంగతున్.
దేవేంద్ర ప్రముఖామరార్చితుని భక్తి ప్రౌఢతం గొల్చెదన్. 109

ప్రతిపదార్థం: భావంబు= మనస్సు; ఏకముఖంబున్= ఒకటే ఉద్దేశం; గలదానినిగా చేసికొని; ఆపద్+ధ్వాంతభానున్= ఆపదలనే చీకట్లకు సూర్యుడైనవాడూ, పర్వతకన్యకా ప్రియున్= హిమవత్పర్వత పుత్రిక అయిన పార్వతికి భర్త అయినవాడూ; దయా+అర్ద్రీభూత చేతస్కున్= దయారసంచేత తడిసినదిగా అయిన మనస్సుగలవాడూ; లోక= లోకాలయొక్క; అవిర్భావ= పుట్టుకా; వివర్ధనా= పోషణా; లయ కృతి= నాశంకరణం; (అనే); వ్యాపార= పనులందు; పారంగతున్= ఆవలి ఒడ్డును పొందినవాడూ, ఆరితేరినవాడూ; దేవ+ఇంద్ర= దేవేంద్రుడు; ప్రముఖ= మొదలైన; అమర= దేవతలచేత; అర్చితునిన్= పూజింపబడినవాడూ (అయిన); మహాదేవున్= పరమేశ్వరుడిని; భక్తిప్రౌఢతన్= భక్త్యతిశయంతో; కొల్చెదన్= సేవిస్తాను.

తాత్పర్యం: నేను నా మనస్సును కేంద్రీకరించుకొని ఆపదలనే చీకట్లకు సూర్యుడైనవాడూ, పార్వతీపతీ, దయారసంచేత తడిసిన మనస్సుకలవాడూ, లోకాలను పుట్టించటం, పోషించటం, నశింపజేయటం అనే పనులలో ఆరితేరినవాడూ, దేవేంద్రాది దేవతలచేత పూజింపబడేవాడూ అయిన మహాదేవుడిని అధికభక్తితో సేవిస్తాను.

విశేషం: అలం: రూపకం. భావం బేకముఖంబుఁ జేసికొని - చంచలమైన మనస్సుని ఏకాగ్రం చేసికొని. అపద్ధ్వాంత భానున్ - ఆపదలకీ - చీకట్లకీ; మహాదేవుడికీ - భానుడికీ అభేదం చెప్పబడింది కాబట్టి అలంకారం రూపకం.

ఆ. అఖిల దేవతామయాత్ముఁ డద్దేవుఁ; డ । ట్లగుట నిఖిలదైవికాపదుదయ
నిరసనం బొనర్చు; నియతి నప్పరమేశుఁ । గొలిచి, యుపుడ కీడు దొలఁగఁ ద్రోతు.' 110

ప్రతిపదార్థం: ఆ+దేవుడు= ఆ పరమేశ్వరుడు; అఖిల దేవతా మయ+ఆత్ముఁడు= ఎల్ల దేవతలతోనూ నిండిన స్వరూపం గలవాడు; అట్లు+అగుటన్= అందుచేత; నిఖిల దైవిక+ఆపద్+ఉదయ నిరసనంబు= దైవికంగా వచ్చే అన్ని ఆపదల తొలగింపూ; ఒనర్చున్= చేస్తాడు; నియతిన్= నియమంతో; ఆ+పరమ+ఈశున్= ఆ పరమేశ్వరుడిని; కొలిచి= సేవించి; ఇపుడు+అ= ఇప్పుడే; కీడు= ఆపద; తొలగన్+త్రోతున్= పోగొట్టుకుంటాను.

తాత్పర్యం: ఆ దేవుడు సర్వదేవతామయ స్వరూపుడు. అందుచేత అతడు దైవికంగా వచ్చే అన్ని ఆపదలనూ తొలగిస్తాడు. నేను ఆ పరమేశ్వరుడిని నియమంతో సేవించి ఇప్పుడే ఆపద పోగొట్టుకొంటాను.'

విశేషం: ఆధ్యాత్మికాలూ, ఆధిదైవికాలూ, ఆధిభౌతికాలూ అని ఆపదలు మూడు రకాలు. వీటినే తాపత్రయం అంటారు. ఆధ్యాత్మికాలంటే మనశ్శరీరాదుల వలన కలిగేవి. శోకమోహ జ్వరాది దుఃఖాలు. ఆధిదైవికాలంటే అగ్నీ, వాయువూ మొదలైన దేవతల వలన కలిగేవి. ఆధిభౌతికాలంటే వ్యాఘ్ర సర్పాది ప్రాణుల వలన కలిగేవి. ఇక్కడ అశ్వత్థామకు కలిగిన ఆపద ఏమిటో అంతుపట్టని ఒక భూతం వలన కలిగింది కాబట్టి ఆధిదైవికం. దానిని తొలగించుకొనాలంటే - అఖిల దేవతామయాత్ముడైన పరమేశ్వరుడే శరణ్యం. అందుచేతనే అతడినే కొలుస్తానంటున్నాడు అశ్వత్థామ.

వ. అని యిట్లు నిశ్చయించి నియతుండై రథంబు డిగ్గి ధరణీతలంబునం గూర్చుండి భావంబున భూతనాథు నెల కొలిపి యక్కుంభజసంభవుండు. 111

ప్రతిపదార్థం: అని; ఇట్లు; నిశ్చయించి; నియతుండు+ఐ= నియమం గలవాడై; రథంబున్; డిగ్గి= దిగి; ధరణీతలంబునన్= నేలమీద; కూర్చుండి; భావంబునన్= హృదయంలో; భూతనాథున్= ఈశ్వరుడిని; నెలకొలిపి= స్థాపించి; ఆ+కుంభజ సంభవుండు= ఆ ద్రోణ పుత్రుడు - అశ్వత్థామ.

తాత్పర్యం: అని ఈ రీతిగా నిర్ణయించి నియమవంతుడై రథం దిగి నేలపై కూర్చొని హృదయంలో ఈశ్వరుడిని స్థాపించికొని ఆ అశ్వత్థామ. (తరువాతి పద్యంతో అన్వయం).

అశ్వత్థామ శివున కాత్మోపహారం బొసంగ నిశ్చయించుట (సం. 10-7-4)

సీ. 'స్థాణు, నుగ్రుని, శివు, శర్వు, నీశానుని, । భద్రప్రదుని, శంభు, రుద్రు, గిరిశు,
నవ్యయు, శ్రీకంఠు, హరుఁ, బరమేశ్వరుఁ, । బురహరు, నజుని, శంకరుఁ, ద్రినేత్రు,
బహురూపు, విశ్వరూపత్వసంవ్యాప్తుని. । నంబికా హృదయేశు, నమరవంద్యు,
గణనాథు, విభు, శూలఖట్వాంగధరు, జటా । మండలాలంకృతమౌళి, నభవు

ఆ. నాశ్రయించి యతని కాత్మోపహార మ । ర్పించువాఁడఁ గాక పెక్కు తలఁపు
లేల నాకు నమ్మహేశ్వరేశ్వరుఁ డెట్టి । గతి యొనర్చి నది సుఖంబ కాదె?' 112

ప్రతిపదార్థం: స్థాణున్; ఉగ్రునిన్; శివున్; శర్వున్; ఈశానునిన్; భద్రప్రదునిన్= శుభాలు ఇచ్చేవాడిని; శంభున్; రుద్రున్; గిరిశున్= కొండమీద పరుండేవాడివి - ఈశ్వరుడిని; అవ్యయున్= నాశనం లేనివాడివి; శ్రీకంఠున్= విషకంఠుడిని; హరున్; పరమేశ్వరున్; పురహరున్= పురత్రయాన్ని హరించినవాడిని; అజునిన్= పుట్టుకలేనివాడిని; శంకరున్= శుభాలు కలిగించేవాడిని; త్రినేత్రున్= ముక్కంటిని; బహురూపున్= అనేకరూపాలు గలవాడిని; విశ్వరూపత్వ సంవ్యాప్తునిన్= విశ్వరూపంతో బాగా వ్యాపించిన వాడిని; అంబికా హృదయ+ఈశున్= పార్వతీ హృదయాధినాథుడిని; అమరనంద్యున్= దేవతలచేత నమస్కరించదగిన వాడిని; గణనాథున్= ప్రమథాధిపతిని; విభున్= ప్రభుని; శూలఖట్వాంగ ధరున్= త్రిశూలమూ; ఖట్వాంగమనే ఆయుధమూ ధరించేవాడినీ; జటామండల+అలంకృత మౌళిన్= జడల గుంపుచేత అలంకరించబడిన శిరస్సుగలవాడిని; అభవున్= పుట్టుక లేనివాడిని; ఆశ్రయించి; అతనికిన్; ఆత్మ+ఉపహారము= ఆత్మబలిదానం; అర్పించువాఁడన్+కాక= ఇచ్చే వాడినికాని - ఇస్తాను కాని; పెక్కు తలఁపులు+ఏల?= అనేకాలోచనలు ఎందుకూ?; నాకున్; ఆ+మహేశ్వర+ఈశ్వరుఁడు= ఆ పరమేశ్వరుడు; ఎట్టి గతిన్= ఏగతి; ఒనర్చెన్= చేశాడో; అది, సుఖంబు+అ+కాదె!= మేలేకదా!

తాత్పర్యం: 'స్థాణుడినీ, ఉగ్రుడినీ, శివుడినీ, శర్వుడినీ, ఈశానుడినీ, శుభప్రదుడినీ, శంభుడినీ, రుద్రుడినీ, గిరిశుడినీ, అవ్యయుడినీ, శ్రీకంఠుడినీ, హరుడినీ, పరమేశ్వరుడినీ, పురహరుడినీ, అజుడినీ, శంకరుడినీ, త్రినేత్రుడినీ, బహురూపుడినీ, విశ్వరూపంతో అంతా వ్యాపించినవాడినీ, పార్వతీ హృదయేశ్వరుడినీ, అమరవంద్యుడినీ, ప్రమథాధిపతినీ, విభుడినీ, శూలమూ ఖట్వాంగమూ ధరించేవాడినీ, జటామండల విభూషిత శిరస్కుడినీ, అభవుడినీ ఆశ్రయించి అతడికి నేను ఆత్మబలిదానం ఇస్తాను. పలు ఆలోచన లెందుకూ? నాకు ఆ పరమేశ్వరుడు ఏ గతి నిర్ణయిస్తే అదే సుఖం కాదా!'

వ. అని తలంచి భూతకృత్యం బైన పరాక్రమ ప్రతిబంధ రూపం బుగ్గడించి. 113

ప్రతిపదార్థం: అని; తలంచి; భూతకృత్యంబు+ఐన= భూతం చేసే పనిఅయిన; పరాక్రమ ప్రతిబంధ రూపంబు= పరాక్రమానికి ఆటంకం అయినది; ఉగ్గడించి= చెప్పి.

తాత్పర్యం: అని తలచి తన పరాక్రమానికి ఆటంకం కలిగించే భూతం పనిని చెప్పి (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఏ నీ యాపదఁ గడచిన । నానా భూతోపహార నవ్యార్చన నీ
శానునిఁ బ్రీతుం జేసెదఁ । బూని ప్రమథగణము నన్నుఁ బొగడునటులుగన్.' 114

ప్రతిపదార్థం: ఏను= నేను; ఈ+ఆపదన్; కడచినన్= దాటితే; ప్రమథ గణము= ప్రమథుల సమూహం; నన్నున్= పొగడునటులుగన్= పొగిడేటట్లు; పూని= ప్రయత్నించి; నానా భూత+ఉపహార - నవ్య+అర్చనన్= అనేక ప్రాణుల బలిదానం అనే కొత్త పూజచేత; ఈశానునిన్= శివుడిని ప్రీతున్+చేసెదన్= తృప్తి పరుస్తాను.

తాత్పర్యం: 'నేను ఈ ఆపదనుంచి గట్టెక్కితే ప్రమథగణాలు నన్ను పొగిడేటట్లు పూని, అనేక ప్రాణుల బలిదానం కొత్త రకమైన పూజతో ఈశ్వరుడిని తృప్తిపరుస్తాను.

చ. అని హృదయంబునం బలుకు నమ్మహనీయచరిత్రు ముందటం
గనకపువేది దోఁచె నధికద్యుతిజాలము లుల్లసిల్ల; నం
దనలము విస్ఫురత్పటుశిఖావలి నొప్పి వెలింగె; దానికి
న్మనము దవిర్ప; నిశ్చయమునం దెలివొందె నతండు నెంతయున్. 115

ప్రతిపదార్థం: అని; హృదయంబునన్= మనస్సులో; పలుకు; ఆ+మహనీయ చరిత్రు= ఆ గొప్ప చరిత్ర గలవాడియొక్క- అశ్వత్థామయొక్క; ముందటన్= ఎదుట; అధికద్యుతి జాలములు= పెక్కుకాంతుల సమూహాలు; ఉల్లసిల్లన్= ప్రకాశించగా; కనకము+వేది= బంగారపుటరుగు; తోఁచెన్= కనబడింది; అందున్= ఆ వేదిమీద; ఆనలము= అగ్ని; విస్ఫురత్+పటు శిఖా+ఆవలిన్= ప్రకాశించే తీక్ష్ణమైన జ్వాలల వరుసతో; ఒప్పి; వెలింగెన్; దానికిన్; అతండు= అశ్వత్థామ; మనము; తలిర్పన్= పల్లవించగా - సంతోషించగా; నిశ్చయమునన్= నిర్ణయంతో; ఎంతయున్= మిక్కిలి; తెలివి+ఒందెన్= ప్రకాశించేడు.

తాత్పర్యం: అని మనస్సులో తలచే ఆ మహనీయ చరిత్రుడైన అశ్వత్థామకు ఎదుట పలుకాంతుల సమూహంతో ఒప్పే బంగారు అరుగు కనబడింది. దానిమీద ప్రకాశించే తీక్షణ జ్వాలలతో ఒప్పి అగ్ని వెలిగింది. దానికి మనస్సు పల్లవించగా అతడు నిర్ణయంతో ఎంతో ప్రకాశించాడు.

వ. అప్పుడు ప్రదీప్తవదనులుఁ, బ్రజ్వలిత నేత్రులు, నేకపాదులుఁ, గరితురంగ సింహసూకరానన సమాన ముఖులును, దీవ్ర దంష్ట్రాకరాళాస్యులును మఱియు ననేక ప్రకారంబులగు వక్త్రంబులం బొలుచువారును, వక్రాంగులు, దీర్ఘదేహులు, హ్రస్వశరీరులు, నతి స్థూలకాయులుఁ, గృశమూర్తులుఁ, బింగళగాత్రులు, నీలతనులు,

మఱి నా నావర్ణంబులు గలుగువారును, బంచశిఖులును, జటాధారులును, గిరీటధరులును, మఱియు బహుభంగి కంబులైన మౌళితలంబులం బొలుపొందువారును లోనుగా వివిధ విశేష వికృతస్వరూపులగు నసంఖ్యాత ప్రమథులు చిత్రాంబర మాల్యాంగరాగంబులు, రత్నకనకమయ భుజగాస్థిమాలా భూషణం బులును, ధనుస్తూణ కృపాణ ముసల ముద్గర పరశు భిండివాల శూల ప్రభృతి స్ఫార ప్రహరణంబులు మెఱయ మృదంగ పణవ డమరు ఘంటా గోముఖాది తూర్యంబులు మొరయ విస్ఫుర ద్ధ్వజ పతాకాకుంచికలు శోభిల్లఁ బాడుచు, నాడుచు, నార్చుచు, బొబ్బలిడుచు, నవుడుగఱచుచుఁ, ద్రుళ్ళుచు, గురువులువాఱుచుఁ, గరటి బృంహితంబులుఁ, గంభీరవగర్జితంబులు, శంఖరవంబులు, భేరీధ్వనులుంబోని యెలుంగులు సెలంగ,బెట్టి దంబులగు పలుదెఱంగుల పలుకు లెసంగ, బ్రహ్మద్వేషు లగువారి మాంసరుధిరంబులఁ బూర్ణంబు లగు కపాలంబులు గరతలంబులం గొని యాభీలంబు లగు భక్షణపానంబు లాచరించుచు, సోమపాన శమదమ తపోబ్రహ్మచర్య ప్రముఖుంబు లగు తమ విశిష్టకర్మంబులకు భవుండు విస్మయంబు నొందుంగాని యష్ట గుణంబగు నైశ్వర్యంబు నొందియుఁడారువిస్మితులుగాని యట్టిమహానుభావు లద్దేవునకు గౌరికి గజముఖ షణ్ముఖులకంటె నర్మిలికిం బట్టగు భవ్యులు దివ్యజనస్తవ్యు బఁయ్యస్త్ర గురుతనూభవు తెంపెఱుంగుటకు సౌప్తిక వ్యాపార ఘోరత్వంబుఁ గనుంగొని వినోదించుటకు వచ్చి యతని చిత్తంబునకు బెదరు పుట్టించువారై భీషణా కారంబుల నుల్లసిల్లిన నాధైర్యధుర్యుండు. **116**

ప్రతిపదార్థం: అప్పుడు; ప్రదీప్త వదనులున్= మిక్కిలి ప్రకాశించే ముఖాలు కలవారూ; ప్రజ్వలిత నేత్రులున్= మిక్కిలి మండే కళ్ళు కలవారూ; ఏకపాదులున్= ఒకే పాదం కలవారూ; కరి తురంగ సింహ సూకర+ఆనన సమానముఖులును= ఏనుగు, గుర్రం, సింహం, పంది వీటి ముఖాలవంటి ముఖాలు కలవారూ; తీవ్ర దంష్ట్రా కరాళ+ఆస్యులును= తీక్షణములైన కోరలచే భయంకరాలైన ముఖాలు కలవారూ; మఱియున్; అనేక ప్రకారంబులు+అగు= బహువిధాలైన; వక్త్రంబులన్= ముఖాలతో; పొలుచువారును= ఒప్పేవారూ; వక్ర+అంగులు= వంకర మైన శరీరాలు కలవారూ; దీర్ఘ దేహులున్= పొడవైన శరీరాలు కలవారూ; హ్రస్వ శరీరులున్= పొట్టి శరీరాలు కలవారూ; అతిస్థూలకాయులున్= మిక్కిలి లావైన శరీరాలు కలవారూ; కృశమూర్తులున్= సన్నటి శరీరాలు కలవారూ; పింగళ గాత్రులున్= గోరోచనపు వర్ణం కల శరీరాలు కలవారూ; నీల తనులున్= నల్లటి శరీరాలు కలవారూ; మఱి= ఇంకా; నానా వర్ణంబులు+కలుగువారును= పెక్కు రంగులు కలవారూ; పంచ శిఖులును= అయిదు సిగలు కలవారూ; జటాధారులును= జడలు ధరించినవారూ; కిరీట ధరులును= కిరీటాలు ధరించినవారూ; మఱియున్= ఇంకనూ; బహు భంగికంబులు+ఐన= అనేకవిధాలయిన; మౌళి తలంబులన్= శిరః ప్రదేశాలతో; పొలుపు+ ఒందువారును= ఒప్పేవారూ; లోనుగాన్= మున్నుగా; వివిధ విశేష వికృత స్వరూపులు= రకరకాల మిక్కిలి వికృతాలైన స్వరూపాలు కలవారూ; అగు; అసంఖ్యాత ప్రమథులు= లెక్కలేనంతమంది ప్రమథులు; చిత్ర-అంబర మాల్య+అంగరాగంబులు= రంగు రంగుల వస్త్రాలూ, దండలూ, మైపూతలూ, రత్న కనకమయ భుజ+అస్థి మాలా భూషణంబులును= మణులతోటీ, బంగారంతోటీ చేయబడ్డ అలంకారాలూ, సర్పాలంకారాలూ, ఎముకల దండల అలంకారాలూ, ధనుస్తూణ కృపాణ ముసల ముద్గర పరశు భిండివాల శూల ప్రభృతి స్ఫార ప్రహరణంబులున్= విండ్లూ, అమ్ములపొదలూ, ఖడ్గాలూ, ముసలాలూ, ముద్గరాలూ, గండ్రగొడ్డళ్ళూ, భిండివాలాలూ, శూలాలూ మొదలైన ఎన్నో ఆయుధాలు; మెఱయన్= ప్రకాశించగా; మృదంగ పణవ డమరు ఘంటా గోముఖ+అది - తూర్యంబులున్= మద్దెల, పణవం, డమరువు, గంట, గోముఖం మొదలైన వాద్యాలు; మొరయన్= ధ్వనించగ; విస్ఫురత్+ధ్వజ పతాకా కుంచికలు= ప్రకాశించే జెండాకర్రలూ, జెండాలూ, గుంజలూ, శోభిల్లన్= ఒప్పగా; పాడుచున్= పాటలు పాడుతూ; ఆడుచున్= ఆటలాడుతూ; ఆర్చుచున్= అరుస్తూ; బొబ్బలు+ఇడుచున్= కేకలు పెడుతూ; అవుడు+కఱచుచున్= పెదవులు కొరుక్కుంటూ; త్రుళ్ళుచున్= ఎగిరిపడుతూ; గురువులు+పాఱుచున్= పరుగెత్తుతూ;

కరటి బృంహితంబులున్= ఏనుగు ఘీంకారాలనూ; కంఠీరవ గర్జితంబులున్= సింహగర్జనలనూ; శంఖ రవంబులున్= శంఖ ధ్వనులనూ; భేరీ ధ్వనులున్= భేరీ ధ్వనులనూ; పోని= పోలిన; ఎలుంగులు= కంఠస్వరాలు; చెలంగన్= మ్రోయగా; బెట్టి దంబులు+అగు= పలు+తెఱంగుల పలుకులు= పరుషాలైన అనేక విధాల మాటలు; ఎసంగన్= అతిశయించగా; బ్రహ్మ ద్వేషులు+అగు వారి= బ్రాహ్మణద్వేషం కలవారియొక్క; మాంస రుధిరంబులన్= మాంసాలతోనూ, రక్తాలతోనూ; పూర్ణంబులు+ అగు= నిండినవైన; కపాలంబులు= పుర్రెలను; కరతలంబులన్= చేతులతో; కొని; అభీలంబులు+అగు= భయంకరాలైన; భక్షణ పానంబులు= తినటం, త్రాగటం; ఆచరించుచున్= చేస్తూ; సోమపాన శమ దమ తపస్(ః)+బ్రహ్మచర్య ప్రముఖంబులు+ అగు= సోమరసం త్రాగటం శాంతం, ఇంద్రియనిగ్రహం, తపస్సూ, బ్రహ్మచర్యం మొదలైనవైన తమ విశిష్ట కర్మంబులకున్= తమ ఉత్తమ కర్మలకు; భవుండు= ఈశ్వరుఁడు, విస్మయంబున్+ఒందున్+కాని= ఆశ్చర్యపడతాడు కాని; అష్టగుణంబు+ అగు+ఐశ్వర్యంబున్= అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశత్వం వశిత్వం అనే ఎనిమిది విధాలైన విభూ తిని; ఒందియున్= పొందికూడా; తారు= తాము; విస్మితులు= గర్వితులు; కాని+అట్టి మహానుభావులు= కానట్టి మహాత్ములు; ఆ+దేవునకున్= ఆ శివుడికీ; గౌరికిన్= పార్వతికీ; గజముఖ షణ్ముఖులకంటెన్= వినాయక కుమారస్వాములకన్నా; అర్మిలికిన్= ప్రేమకి; పట్టు+అగు= స్థానమైన; భవ్యులు= యోగ్యులు; దివ్య జన స్తవ్యులు= దేవతలచేత స్తుతించదగినవారు; ఆ+అస్త్ర గురుతనూభవు తెంపు= ఆ అశ్వత్థామ సాహసకార్యం; ఎఱుంగుటకున్= తెలిసికోవటానికి; సౌప్తిక వ్యాపార ఘోరత్వంబున్= నిద్రించే శత్రువులను చంపే పనియొక్క దారుణాన్ని; కనుంగొని= చూచి; వినోదించుటకున్= ఆనందించటానికీ; వచ్చి; అతని చిత్తంబునకున్= అతడి మనస్సుకి; బెదరు= భయం; పుట్టించువారు+ఐ= కలిగించేవారై; భీషణ+ఆకారంబులన్= భయంకర రూపాలతో; ఉల్లసిల్లినన్= ఒప్పగా; ఆ ధైర్యధుర్యుండు= ఆ ధైర్యభారం వహించేవాడు- మహాధీరుడు ఆ అశ్వత్థామ.

తాత్పర్యం: అప్పుడు ప్రకాశించే ముఖాలూ, మండే కళ్ళూ కలవారూ, ఒకే పాదం కలవారూ, ఏనుగు, గుర్రం, సింహం, పంది ముఖాలవారూ, వాడికోరలతో భయంకరాలైన ముఖాలు కలవారూ, ఇంకా బహువిధాలైన ముఖాలతో ఒప్పేవారూ, వంకర, పొడుగు, పొట్టి శరీరాలు కలవారూ, మిక్కిలి లావుపాటివారూ, సన్నటివారూ, గోరోచనం రంగువారూ, నల్లటివారూ, ఇంకా నానావర్ణాలవారూ, అయిదు సిగలు కలవారూ, జడలు ధరించినవారూ, కిరీటాలు ధరించినవారూ, ఇంకా పలురకాలైనా శిరస్సులతో ఒప్పేవారూ - ఈ రీతిగా రకరకాల మిక్కిలి వికృత స్వరూపాలు కలవారూ అయిన లెక్కలేనంతమంది ప్రమథులు రంగురంగుల వస్త్రాలూ, దండలూ, మైపూతలూ, మణిమయాలం కారాలూ, సువర్ణాలంకారాలూ, సర్పాలంకారాలూ, ఎముకల దండల అలంకారాలూ ధరించి, విండ్లూ, అరసపాదులూ, ఖడ్గాలూ, ముసలాయుధాలూ, ముద్గరాలూ, గండ్రగొడ్డళ్ళూ, భిండివాలాలూ, శూలాలూ మొదలైన ఎన్నో ఆయుధాలు ప్రకాశించగా, మద్దెల, పణవం, డమరువు, గంట, గోముఖం మొదలైన వాద్యాలు ధ్వనించగా, ప్రకాశించే ధ్వజాలూ, పతాకలూ, గుంజలూ ఒప్పగా, పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ, అరుస్తూ, కేకలు పెడుతూ, పెదవులు కొరు క్కొంటూ, ఎగిరిపడుతూ, పరుగెత్తుతూ, ఏనుగుఘీంకారాలనూ, సింహగర్జనలనూ, శంఖధ్వనులనూ, భేరీనాదాలనూ పోలిన కంఠస్వరాలు మ్రోయగా, అనేక విధాల పరుషవాక్కులు అతిశయించగా, బ్రాహ్మణద్వేషుల మాంసరక్తాలతో నిండిన పుర్రెలను చేతులతో పట్టుకొని భయంకరంగా తింటూ, త్రాగుతూ, సోమపానం, శమదమాలూ, తపస్సూ, బ్రహ్మచర్యం మొదలైన తమ మంచిపనులకు ఈశ్వరుడు ఆశ్చర్యపడతాడు కాని, అణిమాద్యష్ట విధవిభూతులనూ పొందికూడా గర్వించని మహాత్ములు, ఆ శివుడికీ, పార్వతికీ వినాయక కుమారస్వాముల కంటే కూడా ప్రేమాస్పదులై యోగ్యులూ, దేవతలచేత స్తుతింపదగినవారూ ఆ అశ్వత్థామ సాహసకార్యం తెలిసికొనటానికీ, నిద్రించే శత్రువులను సంహరించే దారుణాన్ని చూచి ఆనందించటానికీ వచ్చి,అతడి మనస్సుకు భయం పుట్టించాలని భయంకర స్వరూపాలతో ఒప్పగా, మహాధీరుడైన ఆ అశ్వత్థామ. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: కరటి బృంహితంబులఁ గంఠీరవ గర్జితంబులు శంఖరవంబులు భేరీధ్వనులుం బోని యెలుంగులు.. 'అలంకారం మాలోపమ.

మ. వెఱ పావంతయులేక వారిఁ గలయన్ వీక్షించి నమ్మోమునం
జిఱునవ్వున్, మదిఁ దెంపుసొంపు వెలయం, జెల్వంబురెట్టింప, నం
దఱుఁ గీర్తింప, రథంబుమీఁది ఘనకోదండంబు చేనంది, చి
చ్చుఱుకం జేరె నుదాత్తభంగి మహనీయోత్సాహ సందీప్తుఁడై. 117

ప్రతిపదార్థం: వెఱవు= భయం; అవ+అంతయున్= కొంచెంకూడా; లేక; వారిన్= ఆ ప్రమథుల్ని; కలయన్= బాగుగా; వీక్షించి= చూచి; నెఱ+మోమునన్= నిండుముఖంలో; చిఱునవ్వున్= చిరునవ్వు; మదిన్= మనస్సులో; తెంపు సొంపున్= సాహసపు విధమూ; వెలయన్= స్పష్టపడగా; చెల్వంబు= అందం; రెట్టింపన్= ఇనుమడించగా; అందఱున్= అందరూ; కీర్తింపన్= పొగడగా; రథంబుమీఁది= రథంమీద ఉన్న; ఘనకోదండంబు= గొప్ప విల్లు; చేన్+అంది= చేతితో పుచ్చుకొని; మహనీయ= అధికమైన; ఉత్సాహ= వేడుకచేత; సందీప్తుఁడు+ఐ= మిక్కిలి ప్రకాశించినవాడై; ఉదాత్తభంగిన్= ఒప్పైన విధంగా; చిచ్చు+ఉఱుకన్= అగ్గిలో ఉరకటానికి; చేరెన్= సమీపించాడు.

తాత్పర్యం: కొంచెంకూడా భయంలేకుండా ఆ ప్రమథులను బాగా చూచి, ముఖంలో చిరునవ్వు, మనస్సులో సాహసంచేసే విధమూ స్పష్టపడగా, అందం ఇనుమడించగా, అందరూ పొగడుతూండగా, రథంమీదున్న గొప్పవిల్లు చేతితో పుచ్చుకొని మంచి ఉత్సాహంతో ఒప్పైన రీతిలో అగ్గిలో ఉరకటానికి సమీపించాడు.

ఆ. ఇవ్విధమునఁ జేరి యవ్వేది లోపల । భాసమానుఁడైన పావకుండు
దేహమొక్క యాహుతిగఁ జేయుటకుఁ దగు । నంత లేకయునికి నతఁడు సూచి. 118

ప్రతిపదార్థం: అతఁడు= అశ్వత్థామ; ఈ+విధమునన్= ఈ విధంగా; చేరి= సమీపించి; ఆ+వేదిలోపలన్= ఆ అరుగులోపల; భాసమానుఁడు+ఐన= ప్రకాశిస్తున్న; పావకుండు= అగ్నిదేవుడు; దేహము= శరీరం; ఒక్క+ఆహుతిగన్= ఒకే వేలిమిగా; చేయుటకున్; తగు+అంత= చాలినంత; లేక+ఉనికిన్= లేకపోవటం చూచి.

తాత్పర్యం: అశ్వత్థామ ఈ విధంగా వేదిని సమీపించి, దానిలోపల వెలిగే అగ్ని తన దేహాన్ని ఒక్క వేలిమిగా చేయటానికి చాలినంత లేకపోవటం చూచి.

క. తన యరదముమీఁదం గల । ధనుర్వితానము, లసత్ప్రదర జాలములం
గొనివచ్చి వేదియం దిం । ధనములుగాఁ జేర్చి తెంపు దలకొనుమదితోన్. 119

ప్రతిపదార్థం: తన+అరదము మీఁదన్= తనరథంమీద; కల= ఉన్న; ధనుస్(;)+వితానమున్= విండ్ల సమూహాన్ని; లసత్+ప్రదర-జాలములన్= ప్రకాశిస్తున్న బాణాల సమూహాలనూ; కొనివచ్చి; వేదియందున్= తిన్నెమీద; ఇంధనములు+కాన్= కట్టెలుగా; పేర్చి= అమర్చి; తెంపు= సాహసం; తలకొను మదితోన్= అతిశయించే మనస్సుతో.

తాత్పర్యం: తన రథంమీద ఉన్న విండ్ల సమూహాన్నీ, మెరిసే బాణ సమూహాలనూ తీసికొనివచ్చి వేదిమీద కట్టెలుగా పేర్చి, సాహసం అతిశయించే తలంపుతో.

వ. పేర్చి యప్పరమేశ్వరు నుద్దేశించి. 120

ప్రతిపదార్థం: పేర్చి= విజృంభించి; ఆ+పరమేశ్వరున్= ఆ పరమేశ్వరుడిని; ఉద్దేశించి= గురించి.

తాత్పర్యం: విజృంభించి, ఆ పరమేశ్వరుడిని గురించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'తెఱఁ గెట్టిదియో నా మది । నెఱుఁగ మదాత్మోపహార మిచ్చెద నీకుం
గఱకంఠ! వరము నాకుఁ బ । గఱఁ బరిమార్పంగ శక్తి గలుగుటయ చుమీ!;' 121

ప్రతిపదార్థం: కఱకంఠ= గరళకంఠా! - ఈశ్వరా!; తెఱఁగు= విధం; ఎట్టిదియో= ఏదో; నా మదిన్= నా మనస్సులో; ఎఱుఁగన్= ఎరుగను; నీకున్; మత్+ఆత్మ+ఉపహారము= నా ఆత్మబలిదానం; ఇచ్చెదన్; నాకున్; పగఱన్= శత్రువులను; పరిమార్పంగన్= చదవటానికి; శక్తి= సామర్థ్యం; కలుగుట+అ= కలగటమే; వరము= వరం; చుమీ= సుమీ!

తాత్పర్యం: 'పరమేశ్వరా! ఏమి చేయాలో నా మనస్సుకు తట్టటం లేదు. నీకు నేను ఆత్మబలిదానం చేస్తాను. నాకు శత్రువులను చంపే శక్తి కలగటమే వరం సుమా!'

వ. అని ప్రార్థించి. 122

తాత్పర్యం: అని కోరి.

క. 'ఆంగిరస కుల జనిత మీ । యంగము శిఖియందు దీని నాహుతిగాఁ జే
యం గంటి భవద్భక్తి సు । సంగతిమతితోఁ గృతార్థజన్ముఁడ నైతిన్.' 123

ప్రతిపదార్థం: ఈ+అంగము= ఈ శరీరం; ఆంగిరస కుల జనితము= అంగిరసుని వంశంలో పుట్టినది; దీనిన్; భవత్+భక్తి సుసంగత మతితోన్= నీయందలి భక్తితో కూడిన మనస్సుతో; శిఖియందున్= అగ్నిలో; ఆహుతి+కాన్= హోమంగా; చేయన్+కంటిన్= చేయగలిగాను; కృతార్థ జన్ముఁడన్+ఐతిన్= ధన్యమైన పుట్టుక గలవాడిని అయ్యాను.

తాత్పర్యం: 'ఈ నా శరీరం అంగిరసుడి వంశంలో పుట్టింది. దీనిని నీ అందలి భక్తితో కూడిన మనస్సుతో అగ్నిలో హోమం చేసే అదృష్టాన్ని పొందాను. నా పుట్టుక ధన్యమైనది.'

క. అని పలుకుచుఁ బరమేశ్వరు । మనమున నిడి యూర్ధ్వ బాహు మహితాకారుం
డును ఘనసమాధి యగుచున్ । విను మురికెను గురుసుతుండు వేదికపైకిన్. 124

ప్రతిపదార్థం: వినుము= వినుము (ధృతరాష్ట్రా)!; అని; పలుకుచున్= అంటూ; పరమేశ్వరున్; మనమునన్+ఇడి= మనస్సులో పెట్టుకొని; గురుసుతుండు= అశ్వత్థామ; ఊర్ధ్వ బాహుమహిత+ఆకారుండును= చేతులు పైకెత్తిన గొప్ప రూపం కలవాడూ; ఘనసమాధి= గొప్పధ్యానం కలవాడూ; అగుచున్; వేదికపైకిన్= వేదికమీదికి; ఉఱికెను.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! వినుము. ఈ విధంగా అంటూ అశ్వత్థామ పరమేశ్వరుడిని మనసులో నిలుపుకొని పైకి చేతులుగల గొప్ప ఆకారమూ, గొప్పధ్యానమూ కలవాడవుతూ వేదికమీదికి ఉరికాడు.

ఆ. ఉఱికి మంటలోన నుల్లంబు తెలివొక । యింతయేనిఁ గుంద కిద్ధమూర్తిఁ
దేజరిల్ల నున్న ధీరవర్యునకుఁ బ్ర । త్యక్షమయ్యె శివుఁడు దయదలిర్ప. 125

ప్రతిపదార్థం: మంటలోనన్; ఉఱికి; ఉల్లంబు తెలివి= మనోవికాసం; ఒక+ఇంత+ఏనిన్= కొంచెమైనా; కుందక= తగ్గక; ఇద్ధమూర్తిన్= కాంతిమంతమైన రూపంతో; తేజరిల్లన్+ఉన్న= ప్రకాశిస్తూన్న; ధీరవర్యునకున్= ధైర్యవంతులలో శ్రేష్ఠుడైన అశ్వత్థామకు; శివుఁడు; దయ తలిర్పన్= దయ అతిశయించగా; ప్రత్యక్షము+అయ్యెన్= సాక్షాత్కరించాడు.

తాత్పర్యం: మంటలో ఉరికి, తెలివి కొంచెమైనా తగ్గక, కాంతిమంతమైన ఆకారంతో ప్రకాశిస్తూన్న ధీరశ్రేష్ఠుడైన అశ్వత్థామకు శివుడు దయాతిశయంతో సాక్షాత్కరించాడు.

అశ్వత్థామకు శివుఁడు ప్రత్యక్షంబై ఖడ్గం బొసంగుట (సం. 10-7-59)

వ. ఇ ట్లెదుర నిల్చిన భక్తవత్సలుం డగు భవానీవిభుండు దరహసిత ముఖుండగుచు దివ్యావలోకనామృతంబు వెల్లిగొల్పిన నవ్వేదియందుఁ గమలాకరంబులో నున్న చందంబునఁ బ్రమోదంబు నొందియున్నయన్నరోత్తమునకు నారాయణప్రియుం డిట్లనియె. 126

ప్రతిపదార్థం: ఇట్లు; ఎదురన్= ముందర; నిల్చిన; భక్తవత్సలుండు+అగు= భక్తులపై ప్రేమకలవాడైన; భవానీవిభుండు= పార్వతీపతి; దరహసిత ముఖుండు+అగుచున్= చిరునవ్వుమొగం కలవాడు అవుతూ; దివ్య+అవలోకన+అమృతంబున్= దివ్యమైన దృష్టి అనే అమృతాన్ని; వెల్లి+కొల్పినన్= ప్రవహింపచేయగా; ఆ+వేది+అందున్= ఆ అరుగుమీద; కమలాకరంబులోన్= సరస్సులో; ఉన్న చందంబునన్= ఉన్న విధంగా; ప్రమోదంబున్= సంతోషాన్ని; ఒంది+ఉన్న= పొంది ఉన్నట్టి; ఆ+ నర+ ఉత్తమునకున్= ఆ మానవశ్రేష్ఠుడైన అశ్వత్థామకు; నారాయణ ప్రియుండు= విష్ణుప్రియుడైన శివుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా ప్రత్యక్షమైన భక్తవత్సలుడు పరమేశ్వరుడు చిరునవ్వుతో దివ్యదృష్టి అనే అమృతం ప్రవహించేటట్లు చేయగా, ఆ అరుగుమీద సరస్సులో ఉన్నవిధంగా సంతోషంతో ఉన్న ఆ మానవశ్రేష్ఠుడైన అశ్వత్థామతో విష్ణుసఖుడైన ఈశ్వరుడు ఈ రీతిగా అన్నాడు:

విశేషం: అలం: రూపకం, ఉత్ప్రేక్ష. దివ్యావలోకనామృతంబు - దివ్యావలోకనం అనే అమృతం - ఉపమేయోపమానాలకి అభేదం చెప్పబడింది కాబట్టి అలంకారం రూపకం. అవ్వేదియందుఁ గమలాకరంబులో నున్న చందంబున - కమలాకరంలో ఉన్నట్లు సంభావించబడుతున్నాడు కాబట్టి అలంకారం ఉత్ప్రేక్ష. నారాయణ ప్రియుడు - విష్ణుప్రియుడు శివుడు. శివప్రియుడు విష్ణుడు.

క. 'ఇమ్మెయి నీ దగు సత్క । ర్మమ్ము విశేషమునఁ జేసి మానస మత్యం
తమ్ము ప్రియమందె నీకు వ । రమ్మొసఁగఁగ వచ్చితిన్ ధరాసురవర్యా!' 127

ప్రతిపదార్థం: ధరా-సురవర్యా= బ్రాహ్మణశ్రేష్ఠుడా - అశ్వత్థామా!; ఈ+మెయిన్= ఈ విధంగా; నీది+అగు= నీదయిన; సత్+కర్మమ్ము విశేషమునన్+చేసి= మంచి పనియొక్క విశేషంచేత; మానసము= (నా) మనస్సు; అత్యంతమ్ము= మిక్కిలి; ప్రియము+అందెన్= సంతోషించినది; నీకున్= వరమ్ము; ఒసఁగఁగన్= ఇవ్వటానికి; వచ్చితిన్= వచ్చితిని.

తాత్పర్యం: 'బ్రాహ్మణోత్తమా అశ్వత్థామా! ఈ రీతిగా నీ సత్కార్య విశిష్టతచేత నా మనస్సు ఎంతో సంతోషించింది. నీకు వరం ఇవ్వటానికి వచ్చాను.'

వ. అనవుడు. 128

తాత్పర్యం: శివుడు ఈ రీతిగా అనగానే.

తే. తనువు పులకల ప్రోవుగా, మనము గాఢ । సంభృతానందముగ శరాచార్యసుతుఁడు
వితత సంభ్రముఁడై వేది వెడలి సాఁగి । మ్రొక్కి లేచి ఫాలంబున మొగిచెఁ గేలు. 129

ప్రతిపదార్థం: శర+ఆచార్య సుతుఁడు= అస్త్రగురుడైన ద్రోణుడి కొడుకు - అశ్వత్థామ; తనువు= శరీరం; పులకల ప్రోవు+కాన్= గగుర్పాటుల రాశి కాగా; మనము= మనస్సు; గాఢ - సంభృత+ఆనందము+కన్= అధికంగా కలిగిన సంతోషం కలదికాగా; వితత- సంభ్రముఁడు!== ఎక్కువ వేగిరపాటు కలవాడై; వేదిన్+వెడలి= అరుగునుంచి లేచి; సాఁగి-మ్రొక్కి= సాష్టాంగ నమస్కారం చేసి; లేచి; ఫాలంబునన్= నుదుటిమీద; కేలు మొగిచెన్= నమస్కరించాడు.

తాత్పర్యం: అశ్వత్థామ మేను పులకలతో నిండగా, మనస్సు అధికానందం కలది కాగా, మిక్కిలి వేగిరపాటుతో వేదిమీదనుండి వచ్చి, సాష్టాంగపడి లేచి, నుదుటిమీద కేలుమోడ్చాడు.

వ. అప్పుడు. 130

తాత్పర్యం: ఆ సమయంలో.

చ. అతని మొగంబుమీఁద నొలయన్ మధురంబగు చూడ్కి పార్వతీ
పతి మృదురీతి నిట్టు లను; 'భవ్యములైన తపంబు, సత్యము,
స్థృతియును, శౌచముం గలిగి నిశ్చలభక్తి నొనర్చుఁ గృష్ణుఁ డ
ప్రతిమసపర్య నాకు; ననురక్తుఁడ నేనును నమ్మురారికిన్.' 131

ప్రతిపదార్థం: అతని మొగంబు మీఁదన్= ఆ అశ్వత్థామ ముఖంమీద; మధురంబు+అగు చూడ్కి= ఇంపయిన చూపు; ఒలయన్= వ్యాపించగా; పార్వతీపతి= పార్వతిభర్త - పరమేశ్వరుడు; మృదురీతిన్= మెత్తగా; ఇట్టులు+అనున్= ఇట్లా అంటాడు; భవ్యములు+ఐన= యోగ్యాలైన; తపంబున్; సత్యమున్; ధృతియును= యజ్ఞమూ; శౌచమున్= పవిత్రతా; కలిగి; కృష్ణుఁడు; నాకున్; అప్రతిమ-సపర్యన్= సాటిలేని పూజ; నిశ్చలభక్తిన్= అచంచలమైన భక్తితో; ఒనర్చున్= చేస్తాడు; నేనును; ఆ+మురారికిన్= ఆ కృష్ణుడికి; అనురక్తుఁడన్= ఇష్టుడను.

తాత్పర్యం: ఆ అశ్వత్థామ ముఖంమీద తన ఇంపయిన చూపు వ్యాపించగా పరమేశ్వరుడు మృదువుగా ఇట్లా అన్నాడు: 'యోగ్యములైన తపస్సూ, సత్యమూ, యజ్ఞమూ, పవిత్రతా కలిగి కృష్ణుడు నాకు అచంచలమైన భక్తితో సాటిలేని పూజ చేస్తాడు. నేనుకూడా ఆ కృష్ణుడికి ఇష్టుడను.

విశేషం: ఈ పద్యంలో 'నిశ్చల భక్తి యొనర్చుఁ గృష్ణుఁ డప్రతిమ సపర్య నాకు' అనే పాఠంకంటె, 'నిశ్చలభక్తి నొనర్చుఁ గృష్ణుఁ డప్రతిమ సపర్య నాకు' అనే పాఠం ఉంటే అన్వయం సుగమంగా ఉంటుంది అనిపించింది. కాని, ఆ పాఠం

ఎందులోనూ కనబడలేదు. అయినా - పెద్దమార్పేమీ కాదుగదా అని స్వతంత్రించి ఆ విధంగా మార్చటం జరిగింది. సహృదయులు అర్థం చేసికొనగలరు. 'ధృతియును' అనే పదానికి తపస్సత్యశౌచాలతో దీటుగా ఉంటుందని ప్రకరణోచితంగా 'యజ్ఞ' మని అర్థం చెప్పబడింది. యజ్ఞమనే అర్థంకూడా నిఘంటువులలో ఇవ్వబడింది.

క. అతనికి సన్మానము సే। యు తలంపున భూతరూప యుక్తుఁడనై వ
చ్చితి నినుఁ బాంచాలురపై। నతి స్ఫురణఁ బోవనీక యడ్డం బైతిన్. 132

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ కృష్ణుడికి; సన్మానము+చేయు తలంపునన్= గౌరవం చేసే ఉద్దేశంతో; భూత రూప యుక్తుఁడన్+ఐ= భూతాకారంతో కూడినవాడినయి; వచ్చితిన్; నినున్; పాంచాలురపైన్= పాంచాలురమీదికి; అతి స్ఫురణన్= మిక్కిలి విజృంభణంతో; పోవనీక= పోనీకుండా; అడ్డంబు+ఐతిన్= అడ్డగించాను.

తాత్పర్యం: ఆ కృష్ణుడికి గౌరవం చేద్దామనే ఉద్దేశంతో భూతాకారం తాల్చి వచ్చాను. నిన్ను పాంచాలురమీదికి మిక్కిలి విజృంభణంతో దండెత్తకుండా అడ్డగించాను.

తే. తెల్లముగ నీదు చిత్తంబు తెఱఁ గెఱుంగ। వలసి నే ని ట్లనేకమాయలు పొనర్చి,
యస్త్రశస్త్ర నిరాసంబు నాచరించి,। కేలి సలిపితి వేయును నేల చెపుమ.' 133

ప్రతిపదార్థం: నీదు చిత్తంబు - తెఱఁగు= నీ మనఃప్రకారం; తెల్లముగన్= స్పష్టంగా; ఎఱుంగన్ - వలసి= తెలుసుకోవాలని; నేను; ఇట్లు; అనేకమాయలు= ఎన్నోమాయలు; పొనర్చి= చేసి; అస్త్ర శస్త్ర నిరాసంబున్= అస్త్రాల శస్త్రాల ఖండనం; ఆచరించి= చేసి; కేలి-సలిపితిన్= క్రీడించాను; వేయునున్+ఏల-చెపుమ= వేయి మాటలెందుకు చెప్పుము.

తాత్పర్యం: నీ మనోభిప్రాయం స్పష్టంగా తెలిసికొనాలని నేను ఇట్లా అనేక మాయలు పన్ని, నీ అస్త్రాలనూ, శస్త్రాలనూ ఖండించి క్రీడించాను. వేయుమాట లెందుకు చెప్పుము.

వ. 'కృష్ణ సన్మానంబును గృతంబయ్యెఁ; బాంచాలురకుఁ గాలంబు డగ్గఱియె; నేఁడు దెగుదురు; నీవు నా యను గ్రహంబు వడసి' తని యొక్క మహనీయఖడ్గం బవ్విప్రు ని చేతి కిచ్చుచు నతండెఱుంగకుండఁ దేజోరూపం బున నతని తనువున నావేశించె; నిట్లు రుద్రుండొలసిన యగ్గురునందనుండమంద హర్షమయమూర్తియై యతులప్రభనొప్పెఁ; మున్ను భూతంబుచేత నవహృతంబులైన యస్త్రశస్త్రంబులును, బిదప వేదియం బిడిన యాయుధంబులు నమ్మహావీరుని తేరిపైఁ బూర్వ ప్రకారంబున నుండె; నప్పుడు ప్రమథగణంబు లదృష్టా కారంబులై యమ్మహాత్మునిఁ బరమాత్మ్యుఁ గొలుచుచందంబునబలసి రా రథారూఢుండై పాండవ శిబిరం బునకు నాతండు నడవఁ దోడన కృపకృతవర్మలు నడచి'; రనిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె. 134

ప్రతిపదార్థం: కృష్ణ సన్మానంబును= కృష్ణుని సమ్మానమూ; కృతంబు+అయ్యెన్= చేయబడినది; పాంచాలురకున్; కాలంబు డగ్గఱియెన్= పోగాలం సమీపించింది; నేఁడు= ఈవేళ; తెగుదురు= చస్తారు; నీవు; నా+అనుగ్రహంబు+పడసితి(వి)= నా అనుగ్రహం పొందావు; అని; ఒక్క; మహనీయ ఖడ్గంబు= గొప్ప ఖడ్గం; ఆ+విప్రుని చేతికిన్= ఆ బ్రాహ్మణుడి చేతికి;

ఇచ్చుచున్; అతఁడు; ఎఱుఁగక+ఉండన్= తెలియకుండా; తేజన్(;)+ రూపంబునన్= తేజోరూపంలో; అతని తనువునన్= అతడి శరీరంలో; ఆవేశించెన్= ప్రవేశించాడు; ఇట్లు; రుద్రుండు+ఒలసిన+ఆ+గురునందనుండు= రుద్రుడు ఆవేశించిన ఆ అశ్వత్థామ; అమంద హర్షమయమూర్తి+ఐ= అధికమైన సంతోషంతో నిండిన ఆకారం కలవాడై; అతుల ప్రభన్= సాటిలేని కాంతితో; ఒప్పెన్; మున్ను= ఇంతకుముందు; భూతంబుచేతన్= అపహృతంబులు+ఐన= అపహరించబడ్డ; అస్త్ర శస్త్రంబులును= అస్త్రాలూ, శస్త్రాలూ; పిదపన్= తరువాత; వేదియందున్; ఇడిన= పెట్టిన; ఆయుధంబులున్= ఆ+మహావీరుని తేరిపైన్= ఆ గొప్పవీరుడైన అశ్వత్థామయొక్క రథంమీద; పూర్వ ప్రకారంబునన్= మునుపటివలె; ఉండెన్; అప్పుడు; ప్రమథ-గణంబులు; అదృష్ట+ఆకారంబులై= కనబడని ఆకారాలు కలవారై; ఆ+మహాత్మని= ఆ మహనీయుడిని- అశ్వత్థామను; పరమాత్మున్= దేవుడిని; కొలుచు చందంబునన్= కొలిచేవిధంగా; బలసి-రాన్= పరివేష్టించి రాగా; రథారూఢుండై= రథం ఎక్కినవాడై; పాండవ శిబిరంబునకున్= పాండవుల బిడారానికి; అతండు= అశ్వత్థామ; నడవన్= నడుస్తుండగా; తోడన్+ఆ= వెంట; కృప కృతవర్ములు= కృపుడూ, కృతవర్మా; నడచిరి; అనినన్; విని; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'కృష్ణుడి సమ్మానంకూడా జరిగింది. పాంచాలురకు పోగాలం దాపురించినది. ఈవేళ చస్తారు. నువ్వు నా అనుగ్రహం పొందావు' అని ఒక గొప్ప ఖడ్గాన్ని ఆ బ్రాహ్మణుడి చేతి కిస్తూ, అతడికి తెలియకుండా తేజోరూపంలో అతడి శరీరంలో ప్రవేశించాడు. ఇట్లా రుద్రు డావేశించిన ఆ అశ్వత్థామ చాలా సంతోషించి, సాటిలేని కాంతితో వెలుగొందాడు. పూర్వం భూతంచేత అపహరించబడ్డ అస్త్రశస్త్రాలూ, తరువాత వేదిమీద పెట్టిన ఆయుధాలూ ఆ మహావీరుడి రథంమీద ఇదివరకువలె ఉన్నాయి. అప్పుడు ప్రమథగణాలు కనిపించని ఆకారాలతో ఆ మహాత్ముడిని పరమాత్ముడిని కొలిచేటట్లు పరివేష్టించి వస్తుండగా, రథం ఎక్కి పాండవుల శిబిరానికి అతడు నడుస్తుంటే కూడా కృపుడూ, కృతవర్మా నడిచారు' అని చెప్పగా విని ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు.

చ. అతఁ డటు లేపునం జనఁగ నా కృపుఁడుం గృతవర్మయున్ 'మహో
న్నత వరలాభ గర్విత మనస్కుఁడు ద్రోణసుతుండు వోవఁగా,
నితని క్రియన్ బలోద్ధతి సహిష్ణుత గల్గునె యొడ్ల? కంచు సం
భృత భయ చిత్తవృత్తులయి పెంపఱఁ బోరు గదా పిఱిందికిన్?' 135

ప్రతిపదార్థం: అతఁడు= అశ్వత్థామ; అటులు= ఆ విధంగా; ఏపునన్= విజృంభణతో; చనఁగన్= వెళ్ళగా; మహత్+ఉన్నత= మిక్కిలి గొప్పదైన; వర= వరంయొక్క; లాభ= ప్రాప్తిచేత; గర్విత= గర్వించిన; మనస్కుఁడు= మనస్సు కలవాఁడు(అయిన); ద్రోణసుతుండు= అశ్వత్థామ; పోవఁగాన్= పోతోంటే; ఇతని క్రియన్= ఇతడిలాగ; ఒడ్లకున్= ఇతరులకు; బల+ఉద్ధతి= బలగర్వమూ; సహిష్ణుత= ఓర్పూ; కల్గునె?= ఉంటాయా?; అంచున్= అని; కృపుఁడున్+కృతవర్మయున్= కృపుడూ, కృతవర్మా; సంభృత భయ చిత్తవృత్తులు+అయి= భయంతో నిండిన మనోవ్యాపారాలు గలవారై; పెంపు+అఱన్= గొప్పతనం నశించగా; పిఱిందికిన్= వెనక్కి; పోరు+కదా= వెళ్ళరుకదా!

తాత్పర్యం: అశ్వత్థామ ఆ విధంగా విజృంభించి వెళ్ళగా, 'మిక్కిలి గొప్పవరం లభించటంచేత గర్వించిన మనస్సుకల అశ్వత్థామ పోతోంటే, ఇతడివలె ఇతరులకు బలగర్వమూ, ఓర్మీ ఉంటాయా?' అని భయం నిండిన మనస్సులు కలవారై, తమ గొప్పతనం నశించేటట్లు కృపుడూ, కృతవర్మా వెనుకకు వెళ్ళిపోరు గదా!'

వ. మఱియును. **136**

తాత్పర్యం: ఇంకనూ.

వ. పటువేగంబున ముట్టి ద్రోణసుతుఁ డప్పాంచాలలోకంబుఁ ద
క్కటి భూపాలుర, ద్రౌపదీతనయ వర్గంబున్ భూజాఖేలనో
ద్భట ఖడ్గోల్లసనంబు పాల్పఱిచి తద్ధాత్రీతలం బెల్ల నె
త్తుట జొత్తిల్లఁగఁ జేసెనే రిపుచమూ దుర్వార ఘోరాకృతిన్? **137**

ప్రతిపదార్థం: ద్రోణ సుతుఁడు= అశ్వత్థామ; రిపు= శత్రువులయొక్క; చమూ= సేనలకు; దుర్వార= వారించడానికి శక్యంకాని; ఘోర+ఆకృతిన్= భయంకరాకారంతో; పటు వేగంబునన్= తీవ్రమైన వేగంతో; ముట్టి= తాకి; ఆ+పాంచాల లోకంబున్= ఆ పాంచాలుర సమూహాన్నీ; తక్కటి= మిగిలిన; భూపాలురన్= రాజులనూ; ద్రౌపదీ తనయ వర్గంబున్= ద్రౌపది కొడుకుల సమూహాన్నీ; భుజా= బాహువులయొక్క; ఖేలన= కదలికచేత; ఉద్భట= ఉగ్రమైన; ఖడ్గ= కత్తియొక్క; ఉల్లసనంబు= ప్రకాశానికి; పాల్పఱిచి= ఆధీనమయ్యేటట్లు చేసి; తద్+ధాత్రీ తలంబు+ఎల్లన్= ఆ భూప్రదేశమంతా; నెత్తుటన్= రక్తంతో; జొత్తిల్లఁగన్+చేసెనే?= ఎర్రబడేటట్లు చేశాడా?

తాత్పర్యం: 'అశ్వత్థామ శత్రుసేనలకు వారించశక్యం కాని భయంకరాకారంతో తీవ్రవేగంతో ముట్టడించి ఆ పాంచాలుర సమూహాన్నీ, తక్కిన రాజులనూ, ఉపపాండవులనూ బాహువుల కదలికచేత ఉగ్రమైన ఖడ్గపు ప్రకాశానికి ఆధీనమయ్యేటట్లు చేసి, ఆ భూభాగమంతా రక్తంతో ఎర్రబడేటట్లు చేశాడా?'

విశేషం: అశ్వత్థామ పాండవపక్ష వీరులను ఎట్లా చంపాడో తెలిసికొనటానికి ధృతరాష్ట్రుడి అత్యాసక్తి గమనించదగ్గది. అతడు దానిని ధర్మంగా చేశాడా?, అధర్మంగా చేశాడా? అనేది అతడికి అనవసరం.

క. పాండవ శిబిరముఁ జొచ్చి య। ఖండిత పౌరుషము వెలయఁగాఁ గలశజపు
త్రుం డది యంతయు మత్పు। త్రుం డరిగెడి తెరువునం దరుగఁజేసెఁ గదే? **138**

ప్రతిపదార్థం: కలశజ పుత్రుండు= కంభజుడి (ద్రోణుడి) కొడుకు అశ్వత్థామ; పాండవ శిబిరమున్= పాండవుల స్కంధావారం; చొచ్చి= ప్రవేశించి; అఖండిత పౌరుషము= మొక్కవోని పరాక్రమం; వెలయఁగాన్= ఒప్పేటట్లు; అది+అంతయున్= ఆ మారణహోమం అంతా; మత్+పుత్రుండు= నా కొడుకు దుర్యోధనుడు; అరిగెడి తెరువునందున్= వెళ్ళేదారిలో - అనుకున్న రీతిలో; అరుగన్+చేసెన్+కదే= వెళ్ళేటట్లు చేశాడు కదా!

తాత్పర్యం: అశ్వత్థామ పాండవుల స్కంధావారం ప్రవేశించి అకుంఠిత పరాక్రమం ఒప్పేవిధంగా ఆ మారణహోమం అంతా నా కొడుకు అరిగే మార్గంలోనే - అనుకున్నట్లుగానే జరిగేటట్లు చేశాడు కదా!

వ. సమరప్రకారం బంతయు సవిస్తరంబుగా నెఱిఁగింపు మనుటయు నతం డి ట్లనియె. **139**

ప్రతిపదార్థం: సమర ప్రకారంబు+అంతయున్= యుద్ధం తీరు అంతా; సవిస్తరంబుగాన్= వివరంగా; ఎఱిఁగింపుము+ అనుటయున్= చెప్పుమనగా; అతండు= ఆ సంజయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: యుద్ధం జరిగిన తీరంతా వివరంగా చెప్పు' మనగా సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

తే. ఇవ్విధంబున గరురుసుతుఁ డేపు మిగిలి । చనఁగఁ గృపుఁడును గృతవర్మయును దలిర్చు
కడఁక నతనితో నడచిరి గాని వారి । వలన నించుకయును నరవాయి లేదు. 140

ప్రతిపదార్థం: గురు సుతుఁడు= అశ్వత్థామ; ఈ+విధంబునన్= ఈ విధంగా; ఏపు మిగిలి= విజృంభణం అతిశయించి; చనఁగన్= వెళ్ళగా; కృపుఁడును, కృతవర్మయును; తలిర్చు కడఁకన్= చిగిర్చిన పూనికతోన్= ఆ అశ్వత్థామతో; నడచిరి+కాని= నడిచారు కాని; వారి వలనన్= వాళ్ళ విషయంలో; ఇంచుకయును= కొంచెంకూడా; అరవాయి లేదు= వెనుకతీత లేదు.

తాత్పర్యం: అశ్వత్థామ ఈ విధంగా అతిశయించిన విజృంభణంతో వెళ్ళగా కృపుడూ, కృతవర్మా చివురించిన పూనికతో అతడి వెంట నడిచారు కాని, వారి విషయంలో ఏమాత్రం వెనుకపాటులేదు.

వ. ఇట్లు తన కెలంకుల నడచు నవ్వీరుల నాలోకించి యాచార్యసుతుఁడు సంతోషించి. 141

ప్రతిపదార్థం: ఇట్లు; తన కెలంకులన్= తన ప్రక్కల; నడచు= నడిచే; ఆ+వీరులన్= ఆ వీరులను-కృపకృతవర్ములను; ఆలోకించి= చూచి; ఆచార్యసుతుఁడు= గురుపుత్రుడు - అశ్వత్థామ; సంతోషించి.

తాత్పర్యం: ఈ విధంగా తన కిరుప్రక్కలా నడిచే ఆ వీరులను చూసి అశ్వత్థామ సంతోషించి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. 'మీరును దెంపుసొం పెసఁగ మిక్కిలి బీరము లావు చూపఁగాఁ
గోరి కడంగి పైఁబడుటకుం దగి యుండదు వీడు మీ బలో
దారత ప్రాపునం జని యుదగ్ర భుజావిభవంబు పెంపు సొం
పారఁగ నవ్విరోధి నిచయంబు సమస్తము నేన త్రుంచెదన్.' 142

ప్రతిపదార్థం: మీరును= మీరుకూడా; తెంపు సొంపు+ఎసఁగన్= సాహసపు తీరు అతిశయించగా; మిక్కిలి; బీరమున్= పరాక్రమమూ; లావు= బలము; చూపఁగాన్+కోరి= చూపించగోరి; కడంగి= పూని; పైన్+పడుటకున్= మీద పడటానికి; వీడు= శిబిరం; తగి+ఉండదు= తగినట్టుగా ఉండదు; మీ బల+ఉదారత ప్రాపునన్= మీ పరాక్రమాతిశయం అండగా; చని= వెళ్ళి; ఉదగ్ర బుజా విభవంబు పెంపు సొంపు+అరఁగన్= తీవ్రమైన బాహుబల సంపదయొక్క అధిక్యం అందగించగా; ఆ+విరోధి నిచయంబున్= ఆ శత్రువర్గాన్ని; సమస్తమున్= సర్వాన్నీ; నేను+అ= నేనొక్కడినే; త్రుంచెదన్= ఖండిస్తాను.

తాత్పర్యం: మీరు కూడా సాహసాతిశయంతో మిక్కిలి పరాక్రమం, బలం చూపించగోరి పూని మీద పడటానికి శత్రుశిబిరం తగినట్లుగా ఉండదు. మీ బలాధిక్యం అండగా వెళ్ళి, నా తీవ్రమయిన బాహుబల సంపద చూపి, ఆ శత్రుసమూహం సర్వం నే నొక్కడినే ఖండిస్తాను.

వ. అని యిట్లు వారి నగ్గించి వాకిట నిలిపి మహనీయ బాణ బాణాసనంబులు వహించి సుప్రసుప్త సకల జనంబైన యా శిబిరంబుఁ జొచ్చి తాను మున్న గతాగతజనంబులవలనఁ బ్రసంగాధీనతం జేసి యవ్విడిదల తెఱంగు లిట్టిట్టివి వారి సన్నివేశంబు లిచ్చటిచ్చట నని సాభిజ్ఞానంబుగా వినియునికి కతంబున నరసికొనిపోవ

నేర్చి తొలుత ధృష్టద్యుమ్ను సదనంబునకు నరిగి బాణబాణాసన సహితంబై యున్న రథంబు డిగి రుద్రు నుద్దేశించి మానసంబున. 143

ప్రతిపదార్థం: అని; ఇట్లు; వారిన్; అగ్గించి= కొనియాడి; వాకిటన్= ద్వారం దగ్గర; నిలిపి; బాణ బాణాసనంబులు= అమ్ములూ, విండ్లూ; వహించి= తాల్చి; సుప్రసుప్త సకల జనంబు+ఐన= బాగా నిద్రపోయిన ఎల్లజనులు కలిగిన; ఆ శిబిరంబున్+చొచ్చి= ఆ శిబిరంలో ప్రవేశించి; తాను; మున్ను+అ= ముందే; గత+అగత - జనంబులవలనన్= పోయి వచ్చే జనాలవలన; ప్రసంగాధీనతన్+చేసి= సంభాషణవశంచేత; ఆ+విడిదిల తెఱంగులు= ఆ శిబిరం వైనాలు; ఇట్టి+ఇట్టి+అని= ఇట్లాటినిట్లాటివి; వారి సన్నివేశంబులు= వారి విడిదలలు; ఇచ్చటన్+ఇచ్చటన్+అని= ఇక్కడ ఇక్కడ అని; సాభిజ్ఞానంబుగాన్= గుర్తుండే విధంగా; విని+ఉనికి కతంబునన్= విని ఉండటంచేత; అరసికొనిపోవన్+చేర్చి= చూచికొనిపోగలిగి; తొలుతన్= మొదట; ధృష్టద్యుమ్ను-సదనంబునకున్= ధృష్టద్యుమ్నుడి శిబిరానికి; అరిగి= వెళ్ళి; బాణ బాణ+అసన సహితంబు+ఐ+ఉన్న= అమ్ములతోనూ, విండ్లతోనూ కూడియున్న; రథంబున్+డిగి= రథం దిగి; రుద్రున్+ఉద్దేశించి= శివుడిని గురించి; మానసంబునన్= మనస్సులో.

తాత్పర్యం: అని ఇట్లా వారిని కొనియాడి వాకిట్లో నిలిపి, గొప్పవైన అమ్ములూ, విండ్లూ పుచ్చుకొని, బాగా నిద్రపోతూ ఉన్న జనులుగల శిబిరంలో ప్రవేశించి, తను ఇంతకుముందే వచ్చేపోయే జనులవలన సంభాషణవశంచేత ఆ శిబిరం వైనాలు ఇట్లాంటి విట్లాంటివి, వాళ్ళ విడిదలలు ఇక్కడిక్కడ అని గుర్తులతో విని ఉండటంచేత చూచికొని పోగలిగి, మొదట ధృష్టద్యుమ్నుడి శిబిరానికి వెళ్ళి, బాణాలూ, విండ్లూ కల రథం దిగి రుద్రుడిని గురించి మనస్సులో, (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'పూనితి నిష్ఠమెయి న్నిను । నానా భూతోపహార నవ్యార్చన నీ
కే నొనరించెద; నది యీ । శానా! కైకొనుము; సుప్రసన్నుఁడ వగుమీ.' 144

ప్రతిపదార్థం: ఈశానా!= ఈశ్వరా!; నినున్= నిన్ను; నిష్ఠమెయిన్= నిష్ఠతో; పూనితిన్= తలచాను; నీకున్; ఏను= నేను; నానా భూత+ఉపహార నవ్య+అర్చనన్= అనేక ప్రాణుల బలిదానమనే క్రొత్త పూజను; ఒనరించెదన్= చేస్తాను; అది= ఆ పూజ; కైకొనుము= స్వీకరించు; సుప్రసన్నుఁడవు+అగుమీ= మిక్కిలి దయగలవాడవు కమ్ము.

తాత్పర్యం: 'ఈశ్వరా! నిన్ను నేను నిష్ఠతో ధ్యానించాను. నీకు అనేక ప్రాణుల బలిదాన మనే పూజ చేస్తాను. అది స్వీకరించి నన్ను దయచూడుము.'

వ. అనుచు నరిగి 145

తాత్పర్యం: అంటూ వెళ్ళి.

తే. అచటి జనములు పగలింటి యాహవమున । శ్రమముఁ బొందియు, నిశ్శేషశత్రు నాశ
నమున నూఱటఁ జేసియు నమితనిద్ర । నొంది యత్యంతవివశులై యుండ నతఁడు. 146

ప్రతిపదార్థం: అచటి జనములు= అక్కడి జనులు; పగలింటి - ఆహవమునన్= పగటి యుద్ధంచేత; శ్రమమున్+పొందియున్= అలసిపోయీ; నిశ్శేష శత్రు నాశనమునన్= సంపూర్ణ శత్రునాశనంచేత; ఊఱటన్+చేసియున్= ఊరటచెందీ; అమిత నిద్రన్= గాఢనిద్రను; ఒంది= పొంది; అత్యంత వివశులు+ఐ= మిక్కిలి ఒళ్ళు తెలియనివారై; ఉండన్= ఉండగా; అతఁడు= అశ్వత్థామ.

తాత్పర్యం: అక్కడి జనులు పగలు చేసిన యుద్ధం వలన అలసిపోయీ, సంపూర్ణంగా శత్రునాశనం అయింది గదా అని ఊరట చెందీ, బాగా నిద్రపట్టి ఒళ్ళు తెలియని స్థితిలో ఉండగా అశ్వత్థామ. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. మందగతిం బ్రవేశించి యన్వేషించి. 147

ప్రతిపదార్థం: మందగతిన్= మందగమనంతో; ప్రవేశించి; అన్వేషించి= వెదకి.

తాత్పర్యం: మెల్లగా ప్రవేశించి వెదకి.

చ. తెరయును, మేలుకట్లుఁ, దగు దీవియలుం జెలు వొంద మేటిచ
ప్పరమునఁ జాల హృద్యమగు పాన్పున నూఱడి నిద్రపోవు న
గ్గురువధికారిఁ గాంచి మదిఁ గ్రోధము మోదము సందడింప సు
స్థిరతఁ బదప్రహారమునఁ దెల్పెఁ దృణీకరణాభిరాముఁడై. 148

ప్రతిపదార్థం: తెరయును= తెరా; మేలుకట్లున్= చాందినీలూ; తగు దీవియలున్= తగిన దీపాలూ; చెలువు+ఒందన్= ఒప్పగా; మేటి చప్పరమునన్= పెద్ద గుడారంలో; చాలన్+హృద్యము+అగు పాన్పునన్= మిక్కిలి హృదయానందకరమైన శయ్యమీద; ఊఱడి= ఊరటచెంది; నిద్ర+పోవు= నిద్రపోతూన్న; ఆ+గురు వధకారిన్= ఆ గురుహంతయైన - ధృష్టద్యుమ్నుడిని; కాంచి= చూచి(అతఁడు); మదిన్= మనస్సులో; క్రోధమున్= కోపమూ; మోదమున్= సంతోషమూ; సందడింపన్= అతిశయించగా; సుస్థిరతన్= మంచి నిలకడతో, మంచి ధైర్యంతో; తృణీకరణ+అభిరాముఁడు+ఐ= అలక్ష్యం చేయడం చేత మనోహరుడై; పదప్రహారమునన్= కాలి దెబ్బతో - తన్నుతో; తెల్పెన్= లేపాడు.

తాత్పర్యం: తెరా, చాందినీలూ, తగిన దీపాలూ ఒప్పుతుండగా పెద్ద గుడారంలో మిక్కిలి హృదయానందకరమైన పాన్పుమీద నిశ్చింతగా నిద్రపోతూన్న ఆ గురుహంతను-ధృష్టద్యుమ్నుడిని చూచి మనస్సులో కోపమూ, సంతోషమూ అతిశయించగా మంచి ధైర్యంతో, లెక్కచేయని భావంతో అందగించి, కాలితో తన్ని లేపాడు.

వ. తెలిపినఁ గనువిచ్చి తన్నుం జూచి యెఱింగియుఁ గలంగక రణదుర్మదుండైన యా ద్రుపదనందనుఁడు దిగ్గన లేచినం దనచేతివిల్లు విడిచి యతని తలఁబట్టుకొని పెడమఱలఁ దిగిచి యబ్బలియుండు. 149

ప్రతిపదార్థం: తెలిపినన్= లేపగా; - కనువిచ్చి= కళ్ళు తెరిచి; తన్నున్+చూచి= తనని (అశ్వత్థామని) చూసి; ఎఱింగియున్= తెలిసికూడా; కలంగక= కలతచెందక; రణ దుర్మదుండు+ఐన= యుద్ధగర్వితుడైన; ఆ ద్రుపదనందనుఁడు= ఆ ద్రుపదపుత్రుడు - ధృష్టద్యుమ్నుడు; దిగ్గనన్= గబుక్కున; లేచినన్= లేవగా; ఆ+బలియుండు= ఆ బలశాలి - అశ్వత్థామ; తన చేతి విల్లు విడిచి; అతని తలన్; పట్టుకొని; పెడమఱలన్+తిగిచి= వెనుకకు త్రిప్పి.

తాత్పర్యం: లేపితే కళ్ళు తెరిచి తనను చూసి ఫలానా అని తెలిసికూడా కలతచెందక యుద్ధగర్వితుడైన ఆ ధృష్టద్యుమ్నుడు తటాలున లేచాడు. అప్పుడు బలశాలియైన ఆ అశ్వత్థామ తన చేతివిల్లు పడవేసి అతడి తల పట్టుకుని వెనుకకు మెలిపెట్టి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. నేలపయిం బడం దిగిచి నిష్ఠురభంగి నురఃస్థలంబు మో
కాల నొగిల్చి యేపున మొగం బతిదారుణ ముష్టి నొంచె ని

ద్రాలసవృత్తి నంగములయందు బలంబును బుద్ధి నేర్పునుం
జాలని యవ్విరోధి వివశత్వముఁ బొందఁగఁ జేసె వ్రేల్మిడిన్. 150

ప్రతిపదార్థం: నేలపయిన్; పడన్+తిగిచి= పడేటట్లు లాగి; నిష్ఠుర భంగిన్= మోటతనంగా; ఉరస్+స్థలంబున్= వక్షఃస్థలాన్ని; మోకాలన్= (తన) మోకాలితో; నొగిల్చి= బాధించి; ఏపునన్= విజృంభణంతో; అతి దారుణ ముష్టిన్= మిక్కిలి క్రూరమైన పిడికిలితో; నొంచెన్= బాధించాడు; నిద్రా+అలస వృత్తిన్= నిద్రమైకంలో ఉండటంచేత; అంగములయందున్= అవయవాలలో; బలంబును; బుద్ధి-నేర్పునున్= బుద్ధిపటుత్వమూ; చాలని; ఆ+విరోధిన్= ఆ శత్రువును - ధృష్టద్యుమ్నుడిని; వ్రేల్మిడిన్= చిటికలో; వివశత్వమున్= ఒళ్ళు తెలియనితనం; పొందఁగన్+చేసెన్= పొందించాడు.

తాత్పర్యం: నేలమీద పడేటట్లు లాగి మోటతనంగా అతడి వక్షఃస్థలాన్ని తన మోకాలితో పొడిచి, విజృంభణంతో మిక్కిలి క్రూరమైన పిడికిలితో పొడిచి బాధించాడు. నిద్రమత్తులో ఉండటంచేత అవయవాల పటుత్వమూ, బుద్ధిబలమూ చాలని ఆ శత్రువును - ధృష్టద్యుమ్నుడిని ఒక చిటికలో స్పృహతప్పేటట్లు చేశాడు.

వ. ఇవ్విధంబున నతనిచేత ధృష్టద్యుమ్నుండు. 151

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; అతని చేతన్= అశ్వత్థామచేత; ధృష్టద్యుమ్నుండు.

తాత్పర్యం: ఈ రీతిగా అశ్వత్థామచేత ధృష్టద్యుమ్నుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. వివశత భీతిఁ బొంది కడు విహ్వలుఁడై తనుఁ జూడ ద్రోణసం
భవుఁడు వెసన్ శరాసనము వాపి గుణంబు తదీయకంఠముం
దవులఁగఁ జేర్చి వాగురవిధం బొడఁగూర్చి మనంబు విక్రమో
త్సవమున నుబ్బఁగాఁ బశువుఁ జంపెడు చాడ్పునఁ జంపు వేడుకన్. 152

ప్రతిపదార్థం: వివశతన్= ఒళ్ళు తెలియనితనంతో; భీతిన్+పొంది= భయపడి; కడున్= మిక్కిలి; విహ్వలుఁడు+ఐ= అధైర్యపడినవాడై; తనున్+చూడన్= తనను చూడగా; ద్రోణ సంభవుఁడు= ద్రోణుడి కొడుకు - అశ్వత్థామ; వెసన్= శీఘ్రంగా; గుణంబు= అల్లెత్రాడు; శరాసనము+పాపి= వింటినుంచి ఊడదీసి; తదీయ కంఠమున్= వాడి పీకకు; తవులఁగన్+చేర్చి= తగిలించి; వాగుర- విధంబు+ఒడఁగూర్చి= ఉరితాడులా చేసి; మనంబు= (తన) మనస్సు; విక్రమోత్సవమునన్= పరాక్రమపు వేడుకతో; ఉబ్బఁగాన్= పొంగగా; పశువున్; చంపెడు - చాడ్పునన్= చంపే విధంగా; చంపు వేడుకన్= చంపేకోరికతో.

తాత్పర్యం: ఒళ్ళు తెలియనితనంతో భయపడి మిక్కిలి అధైర్యపడిన వాడై తనను చూడగా, అశ్వత్థామ శీఘ్రంగా అల్లెత్రాడును వింటినుండి ఊడదీసి వాడి కంఠానికి బిగించి ఉరిత్రాడువలె చేసి మనస్సు పరాక్రమపు వేడుకతో పొంగగా పశువును చంపేవిధంగా చంపే కోరికతో. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. ఉరంబును మెడయును నిరుగాలం ద్రొక్కినఁ ద్రోచియు దైన్యంబు దోఁప గోళ్ళ గీఱియు నిస్తరింపలేక యెలుంగు వెడలకున్న నెట్టకేలకు మాట వెడవెడ యెఱుంగవచ్చు తెఱంగునఁ బాంచాలవరుం డమ్మహీసుర వరున కిట్లనియె. 153

ప్రతిపదార్థం: ఉరంబును= రొమ్ము; మెడయును= మెడా; ఇరుకాలన్= రెండు కాళ్ళతో; త్రొక్కినన్= త్రొక్కగా; త్రోచియున్= (వాడు) గెంటీ; దైన్యంబు+తోఁపన్= దీనత్వం తోచేటట్టు; గోళ్ళన్= గోళ్ళతో; గీఱియున్= రక్కీ; నిస్తరింపన్+లేక= నెట్టలేక; ఎలుంగు= కంఠస్వరం; వెడలక+ఉన్నన్= పెగలకుంటే; ఎట్టకేలకున్= చివరకి; మాట; వెడవెడ= కొద్దికొద్దిగా; ఎఱుంగన్+వచ్చు= తెఱుంగునన్= తెలిసేటట్టు; పాంచాలవరుండు= పాంచాలరాజు - ధృష్టద్యుమ్నుడు; ఆ+మహీసుర వరునకున్= ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుడికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: రొమ్ము, మెడా రెండు కాళ్ళతో త్రొక్కగా, వాడు గెంటీ, దైన్యంతో గోళ్ళతో గీరీ నెట్టలేక, కంఠస్వరం పైకి రాకుంటే, చివరకు మాట కొంచెం తెలిసేటట్లు ధృష్టద్యుమ్నుడు ఆ బ్రాహ్మణోత్తముడితో ఈ విధంగా అన్నాడు.

క. 'గురుపుత్ర! శస్త్ర నిహతిం । బొరిపుచ్చుము; తడయ నేల? పుణ్యగతికిఁ జె
చ్చెరఁ బోవునట్లు సేయుట । పరికింపఁగ మేలకాదె పగతురకైనన్?' 154

ప్రతిపదార్థం: గురుపుత్ర= అశ్వత్థామా!; శస్త్ర నిహతిన్= శస్త్రముల దెబ్బచే; పొరిపుచ్చుము= చంపుము; తడయన్+ఏల?= ఆలస్యం ఎందుకూ?; పరికింపఁగన్= చూడగా; పగతురకున్+ఐనన్= శత్రువులకైనా; పుణ్య గతికిన్= ఉత్తమగతికి; చెచ్చెరన్= శీఘ్రంగా; పోవు+అట్లు= పోయేటట్టు; చేయుట; మేలు+అ+కాదె!= మంచిదే కదా!

తాత్పర్యం: 'అశ్వత్థామా! శస్త్రంతో కొట్టి చంపుము. ఆలస్యం ఎందుకూ? విచారించగా శత్రువులకైనా ఉత్తమగతికి వెంటనే పోయేటట్లు చేయటం మంచిదేకదా!'

వ. అనిన విని యశ్వత్థామ యతని మొగంబు చూచి. 155

ప్రతిపదార్థం: అనినన్; విని; అశ్వత్థామ; అతని మొగంబు= అతడి ముఖం; చూచి.

తాత్పర్యం: అనగా విని అశ్వత్థామ అతడి ముఖం చూచి.

క. 'వినుము గురుద్రోహికిఁ గ । ల్గునె యుత్తమ గతి? నితాంత కుత్సితభంగిం
దునిమితివి నీవు గురు; నే । నను దుర్విధకరణమున నినుం దెగఁ జూతున్.' 156

ప్రతిపదార్థం: వినుము; గురుద్రోహికిన్= గురువుకు ద్రోహం చేసిన వాడికి- గురుహంతకు; ఉత్తమగతి= సద్గతి; కల్గునె?= కలుగుతుందా?; నీవు; గురున్; నితాంత కుత్సిత భంగిన్= అత్యంతం నింద్యమైన పద్ధతిలో; తునిమితివి= చంపావు; నేనును; నినున్; దుర్విధ కరణమునన్= దుర్మార్గపు చేతతో; తెగన్+చూతున్= చంపజూస్తాను.

తాత్పర్యం: 'వినుము. గురువుకు ద్రోహం చేసినవాడికి సద్గతి లభిస్తుందా? నీవు గురువును అత్యంత నింద్యమైన మార్గంలో చంపావు. నేను కూడా నిన్ను దుర్మార్గంగానే చంపజూస్తాను.'

విశేషం: అలం: అర్థాంతరన్యాసం; ఇందులో 'గురుద్రోహికిఁ గల్గునె యుత్తమగతి?' అనే సామాన్యాంశం, 'నితాంత కుత్సిత భంగిం దునిమితివి నీవు గురు' అని విశేషాంశంచేత సమర్థించబడుతున్నది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

ఆ. అనుచుఁ బెలుచ నొంప నచ్చటి జనములు । గలఁగి యపుడు మేలుకాంచి చూచి
భయము దోఁపఁ గడిఁది బలుగాముగాఁ దమ । యుల్లములఁ దలంచి యొదిఁగియుండ. 157

ప్రతిపదార్థం: అనుచున్; పెలుచన్= అధికంగా; నొంపన్= బాధించగా; అచ్చటి జనములు= అక్కడున్న జనులు; కలఁగి= కలత చెంది; అపుడు; మేలుకాంచి= నిద్రలేచి; చూచి; భయము+తోఁపన్= భయం కలుగగా; కడిఁది - బలు - గాముగాన్= క్రూరుడైన గొప్ప పిశాచంగా; తమ+ఉల్లములన్= తమ మనస్సులలో; తలంచి; ఒదిఁగి+ఉండన్= తప్పుకుని ఉండగా.

తాత్పర్యం: అంటూ మిక్కిలి బాధించగా అక్కడి జనులు కలతచెంది అప్పుడు మేలుకొని చూచి, భయంతో క్రూరుడైన మేటి రాక్షసుడని మనస్సులలో భావించి తొలగగా.

అశ్వత్థామ నిద్రాపరవశుండగు ధృష్టద్యుమ్నుం జంపుట (సం. 10-8-21)

ఉ. కాలను గేలనుం జదిపి గంధకరిం దెగటార్చు సింహముం
బోలుచుఁ బేర్చి యాద్రుపద భూపసుతున్ సమయించె వేదనన్
దూలఁగ రోఁజఁగాఁ బలుమఱుం బొరలంబడి లాలగ్రక్కన
వ్వాలుమగండు ప్రాక్పరిభవంబుఁ దలంచుచుఁ గ్రౌర్యధుర్యుఁడై. 158

ప్రతిపదార్థం: ఆ+వాలు మగండు= ఆ గొప్పవీరుడు - అశ్వత్థామ; గంధకరిన్= మదగజాన్ని; తెగటార్చు= చంపే; సింహమున్+ పోలుచున్= సింహాన్ని పోలుతూ; పేర్చి= విజృంభించి; ప్రాక్పరిభవంబున్= పూర్వపు పరాభవాన్ని; తలంచుచున్= తలచుకుంటూ; క్రౌర్యధుర్యుఁడు+ఐ= క్రూరత్వపు భారం వహించినవాడయి- అధికకోపం గలవాడై; వేదనన్= బాధతో; తూలఁగన్= బాధతో అరుస్తూండగా; రోఁజంగాన్= ఆయాసపడుతూండగా; పలుమఱున్= చాలాసార్లు; పొరలంబడి= దొర్లి; లాల క్రక్కన్= చొంగ కార్చగా; ఆ ద్రుపద భూపసుతున్= ఆ ద్రుపదరాజు కొడుకును - ధృష్టద్యుమ్నుడిని; కాలను+కేలనున్= కాలుతోనూ, చేతితోనూ, చదిపి= చితుకగొట్టి; సమయించెన్= చంపాడు.

తాత్పర్యం: ఆ వీరశ్రేష్ఠుడైన అశ్వత్థామ మదగజాన్ని చంపే సింహాన్ని పోలుతూ, విజృంభించి, పూర్వపు పరాభవాన్ని తలచుకొంటూ, అధిక కోపంతో ఆ ధృష్టద్యుమ్నుడిని బాధతో అరుస్తూ అతడు ఆయాసపడుతూండగా, మాటిమాటికి దొర్లి చొంగ కార్చగా, కాలుతోనూ, చేతితోనూ చితకగొట్టి చంపాడు.

విశేషం: అలం: ఉపమ. 'గంధకరిం దెగటార్చు సింహముం బోలుచు' - అశ్వత్థామను సింహంతోనూ, ధృష్టద్యుమ్నుడిని గంధకరితోనూ పోల్చి ఉపమేయోపమానాలకు రమణీయమైన సాదృశ్యం చెప్పబడింది కాబట్టి, ఇక్కడ అలంకారం ఉపమ. తెగటార్చటం సామాన్యధర్మం. పోలుచున్ - ఉపమావాచకం. నాలుగంశాలూ ఉన్నాయి కనుక ఇది పూర్ణోపమ.

క. ధృష్టద్యుమ్నుని నిట్లతి । కష్టవిధిప్రాప్తమరణుఁ గావించి మహా
వష్టంభోజ్జ్వలుఁడును సం । హృష్టాత్ముఁడు నగుచు వింట నిడియె గుణంబున్. 159

ప్రతిపదార్థం: ఇట్లు; ధృష్టద్యుమ్నునిన్; అతి కష్ట విధి ప్రాప్త మరణున్= మిక్కిలి బాధాకరమైన విధానంచేత పొందబడిన చావు గలవాడిని; కావించి= చేసి; మహా+అవష్టంభ+ఉజ్జ్వలుఁడును= గొప్ప గర్వంతో ప్రకాశించేవాడునూ; సంహృష్ట+ఆత్ముఁడున్= సంతోషించిన మనస్సు గలవాడునూ; అగుచున్; గుణంబున్= అల్లెత్రాటిని; వింటన్= వింటియందు; ఇడియెన్= అమర్చాడు.

తాత్పర్యం: ఈ విధంగా ధృష్టద్యుమ్నుడిని మిక్కిలి బాధాకరమైన విధానంచేత చంపి, ఎంతో గర్వంతో ప్రకాశిస్తూ, మనస్సులో సంతోషిస్తూ అల్లెత్రాడు వింటికి అమర్చాడు.

వ. ఇట్లు సజ్యం బయిన చాపంబు ముష్టి నమర్చి యాచార్యనందనుండు. 160

ప్రతిపదార్థం: ఇట్లు; సజ్యంబు+అయిన= అల్లెత్రాటితో కూడుకొన్న; చాపంబున్= వింటిని; ముష్టిన్= పిడికిట్లో; అమర్చి= ఉంచి; ఆచార్య నందనుండు= గురుపుత్రుడు - అశ్వత్థామ.

తాత్పర్యం: ఈ విధంగా అల్లెత్రాడు బిగించిన వింటిని పిడికిలితో పట్టుకొని అశ్వత్థామ.

ఆ. చప్పరంబు వెడలి చనుదెంచి యల్లని । నగవు నెఱయ సూతు మొగమునందుఁ
జూడ్కి వొలయ రత్నసుందరం బగు నిజ । స్యందనంబు పైకిఁ జనియె నధిప! 161

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్రా!; చప్పరంబున్= గుడారంలోనుండి; వెడలి; చనుదెంచి= వచ్చి; అల్లని నగవు= చిరునవ్వు; నెఱయన్= వెలయగా; సూతు-మొగమునందున్= సారథిముఖంపై; చూడ్కి= చూపు; పొలయన్= ప్రసరించగా; రత్న సుందరంబు+ అగు= మణులచేత అందమైన; నిజ స్యందనంబు పైకిన్= తనదైన రథంమీదికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! గుడారంలోనుండి బయటికి వచ్చి చిరునవ్వు నవ్వుతూ, సారథి ముఖంవైపు చూస్తూ, మణులచేత మనోహరమైన తన రథం మీదికి వెళ్ళాడు.

మ. అదరం బిమ్మెయి నెక్కి, యుబ్బి, శిబిరం బాప్రొద్ద నిశ్శేషతం
బొరయం జేయుకుతూహలంబు మది నుప్పొంగన్, లసన్నేమి ని
ష్ఠుర నాదంబు ప్రమోదముం బెనుప రక్షోభూతచిత్తంబులం
బరవీరావలి యిండ్ల కందవ లెడం బాటించుచుం బోయినన్. 162

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; అదరంబు= రథం; ఎక్కి; ఉబ్బి= సంతోషించి; ఆ ప్రొద్దు= ఆ వేళే; శిబిరంబు= స్కంధావారం; నిశ్శేషతన్= మిగలకపోవటం; పొరయన్+చేయు= పొందించే, కుతూహలంబు= వేడుక; మదిన్= మనస్సులో; ఉప్పొంగన్= అధికం కాగా; లసత్+నేమి నిష్ఠురనాదంబు= ప్రకాశించే రథచక్రాల పట్టాలయొక్క పరుషమైన ధ్వని; రక్షోభూత చిత్తంబులన్= రాక్షసుల, పిశాచాల మనసుల్లో; ప్రమోదమున్= సంతోషాన్ని; పెనుపన్= వృద్ధి పొందించగా; పరవీర+ఆవలి= శత్రువీరుల వరుసయొక్క; ఇండ్ల కందువలు= ఇళ్ళ జాడలు; ఎడన్= హృదయంలో; పాటించుచున్= తెలిసికొంటూ; పోయినన్= పోగా.

తాత్పర్యం: ఈ విధంగా రథ మెక్కి సంతోషించి, ఆవేళే శిబిరం మొత్తం తుడిచిపెట్టేయాలనే కోరిక ఎక్కువకాగా, రథచక్రాల పట్టాల పరుషధ్వని రాక్షసుల, పిశాచాల మనసులలో సంతోషాన్ని వృద్ధి పొందించగా, శత్రువీరుల ఇళ్ళ జాడలు మనస్సులో గుర్తు చేసికొంటూ వెళ్ళగా.

తే. పీనుఁగై యున్న పాంచాలసూనుఁ జూచి । రక్షకులును, దదీయ పురంధ్రులును స
మగ్ర శోకాంధకార నిమగ్నచిత్త । వృత్తులై యేడ్చి రెలుఁగులు మిన్నుముట్ట. 163

ప్రతిపదార్థం: పీనుఁగు+ఐ= శవమై; ఉన్న; పాంచాల సూనున్= పాంచాల రాజు కొడుకును - ధృష్టద్యుమ్నుడిని; చూచి; రక్షకులును= కాపలావాళ్ళూ; తదీయ పురంధ్రులును= వారి ఆడవాళ్ళూ; సమగ్ర= సంపూర్ణమైన; శోక+అంధకార= దుఃఖ

మనే చీకటిలో; నిమగ్న= మునిగిన; చిత్త వృత్తులు+ఐ= మనస్సుల వర్తనం కలవారై; ఎలుంగులు= కంఠధ్వనులు; మిన్ను ముట్టన్= ఆకాశాన్ని అంటగా; ఏడ్చిరి.

తాత్పర్యం: శవమై పోయిన ధృష్టద్యుమ్నుడిని చూచి కాపలాదారులూ, వారి ఆడువారూ సంపూర్ణ దుఃఖాంధకారంలో మునిగిపోయిన మనస్సులు కలిగి, కంఠధ్వనులు మిన్నుముట్టేటట్టు ఏడ్చారు.

క. ఆ కలకలమున మేల్కని । యా కెలఁకుల యిండ్ల రాజు లది యే మనుచున్
వే కదియం గని యా జను । లాకులరవ మెసఁగ నిట్టు లనిరి నరేంద్రా! 164

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= ధృతరాష్ట్ర మహారాజా!; ఆ కలకలమునన్= ఆ పెద్దమ్రోఁతచేత; మేల్కని= మేలుకొని; ఆ కెలఁకుల ఇండ్ల రాజులు= ఆ ప్రక్క ఇళ్ళల్లోని రాజులు; అది; ఏమి; అనుచున్; వే= శీఘ్రంగా; కదియన్= సమీపించగా; కని= చూచి; ఆ జనులు; ఆకులరవము= కలగిన ధ్వని; ఎసఁగన్= అతిశయించగా; ఇట్టులు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: రాజా! ధృతరాష్ట్రా! ఆ పెనుమ్రోతకు మేలుకొని ఆ ప్రక్క ఇళ్ళల్లోని రాజులు అదేమిటంటూ వడివడిగా సమీపించగా చూచి అక్కడి జనులు రోదనధ్వని అతిశయించగా ఈ విధంగా అన్నారు.

క. 'రక్కసుఁడో, మానిసియో । నిక్క మెఱుంగము; వధించె నృపసూనుని వీఁ
డొక్కరుఁ డుదగ్రుఁడై, రథ । మెక్కి యరిగెడున్; దురాత్ము నెయిదుఁడు కడఁకన్.' 165

ప్రతిపదార్థం: రక్కసుఁడో= రాక్షసుడో; మానిసియో= మనుష్యుడో; నిక్కము+ఎఱుంగము= నిజం ఎరగం; వీఁడు+ఒక్కరుఁడు= వీడొక్కడూ; ఉద్రగుఁడు+ఐ= భయంకరుడై; నృప సూనునిన్= రాజపుత్రుడిని-ధృష్టద్యుమ్నుడిని; వధించెన్= చంపాడు; రథము+ఎక్కి; అరిగెడున్= వెళ్ళిపోతున్నాడు; దురాత్మున్= దుర్మార్గుడిని; కడఁకన్= పూనికతో; ఎయిదుఁడు= వెంబడించండి.

తాత్పర్యం: 'రాక్షసుడో, మనుష్యుడో మాకు నిజం తెలవదు. వీడు ఒక్కడూ భయంకరుడై ధృష్టద్యుమ్నుడిని చంపాడు. రథం ఎక్కి పోతున్నాడు. దుర్మార్గుడిని ప్రయత్నంతో వెంబడించండి.'

వ. అనిన విని యన్నరపతులు తల లెత్తి చూచి 'పోనీక పొదువుం' డనుచు సపరివారంబుగా నడరి యశ్వత్థామం బొదివిన నుద్దామప్రకారంబునం దిరిగి మూఁపులు పెరుఁగ గొనయంబు సారించి. 166

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ+నరపతులు= ఆ రాజులు; తలలు+ఎత్తి; చూచి; పోనీక పొదువుండు= వెళ్ళకుండా పట్టుకొనండి; అనుచున్= అంటూ; సపరివారంబుగాన్= పరివార సహితంగా; అడరి= విజృంభించి; అశ్వత్థామన్= అశ్వత్థామను; పొదివినన్= పట్టుకోగా; ఉద్దామ ప్రకారంబునన్= భయంకరమైన రీతిలో; తిరిగి= మరలి; మూఁపులు= భుజాలు; పెరుఁగన్= పొంగగా; గొనయంబు= వింటిత్రాడు; సారించి= లాగి.

తాత్పర్యం: అనగా విని ఆ రాజులు తలలు పైకెత్తి చూచి 'వెళ్ళకుండా పట్టుకోండి' అంటూ పరివార సమేతంగా విజృంభించి అశ్వత్థామని పట్టుకోగా అతడు భయంకరమైన విధంగా మరలి భుజాలు పొంగగా వింటినారి సారించి (తరువాతి పద్యంతో అన్వయం).

మ. ఖరనారాచపరంపరా విహరణ క్రౌర్యంబునన్ శాత ని
ష్ఠుర భల్ల ప్రవిసారదారుణతర క్షోణీశులం, దద్భటో
త్కరముం గేలియవోలె గీటడఁచె దోర్గర్వం బఖర్వంబుగా
వెరవుం జేవయు భూతముల్ వొగడ నవ్వీరుండు ధీరోద్ధతిన్. 167

ప్రతిపదార్థం: ఆ+వీరుండు= ఆ వీరుడైన అశ్వత్థామ; ధీర+ఉద్ధతిన్= గంభీరమైన గర్వంతో; ఖర= వాడియైన; నారాచ= బాణాలయొక్క; పరంపరా= వరుసయొక్క; విహరణ= తొలగించటంలోని; క్రౌర్యంబునన్= క్రూరత్వంతో; దోస్(ః)+గర్వంబు= భుజబలగర్వం; అఖర్వంబు+కాన్= అతిశయించగా; వెరవున్= ఉపాయమూ; చేవయున్= బలమూ; భూతముల్= పిశాచాలు; పొగడన్= కొనియాడగా; శాత= వాడివీ; నిష్ఠుర= పరుషమైనవీ(అయిన); భల్ల= అస్త్రాలయొక్క; ప్రవిసార= విశేష ప్రసారంచేత; దారుణతర= మిక్కిలి భయంకరులైన; క్షోణీ+ఈశులన్= భూపతులనూ; తద్+భట+ఉత్కరమున్= వాళ్ళ వీరుల సమూహాన్నీ; కేలి+అ+పోలెన్= ఆటే అనేటట్లు; గీటడచెన్= చంపాడు.

తాత్పర్యం: ఆ వీరుడైన అశ్వత్థామ ధీరోద్ధతుడై వాడిబాణాల పరంపరను నివారించే క్రూరత్వంతో, తన భుజబలం అతిశయించగా, తన ఉపాయాన్నీ, చేవనూ పిశాచాలు కొనియాడగా, వాడివీ పరుషమైనవీ అయిన బాణాలను విశేషంగా ప్రయోగించే అతిభయంకరులైన రాజులనూ, వాళ్ళ భటసమూహాన్నీ చంపాడు.

విశేషం: అశ్వత్థామకు శత్రురాజులను చంపటం ఒక ఆట - వినోదం. భూతాలు పొగడటం, శత్రువులను చంపి అతడు తమకు విందు చేస్తాడు గదా అని. ధీరోద్ధతిన్ - అశ్వత్థామ ధీరోద్ధతుడే కాని ధీరోదాత్తుడు కాడని సూచన.

వ. తదనంతరంబ యుత్తమౌజునిలోఁగిలి చొచ్చికృపాణపాణియై యరదంబు డిగ్గి యరసికొని యతని యభ్యంతర మందిరంబుఁ బ్రవేశించి. 168

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తరువాతనే; ఉత్తమౌజుని= ఉత్తమౌజుడియొక్క; లోఁగిలి+చొచ్చి= ఇంట్లో (శిబిరం) ప్రవేశించి; కృపాణపాణి+ఐ= చేతితో కత్తి పుచ్చుకొని; అదరంబున్+డిగ్గి= రథం దిగి; అరసికొని= చూచికొని; అతని; అభ్యంతర మందిరంబున్= అంతఃపురగృహం; ప్రవేశించి.

తాత్పర్యం: ఆ వెంటనే ఉత్తమౌజుడి గుడారంలో ప్రవేశించి కత్తి పుచ్చుకొని రథం దిగి చూచికొని అతడి అంతః పుర గృహంలోకి వెళ్ళి.

సీ. అలికిడి మేల్కనునతని ధృష్టద్యుమ్నుఁ। బట్టిన క్రియఁ దలపట్టి యీడ్చి
యాతనిఁ జంపిన యట్టులు పశుమర। ణాతి కౌతుకమున నవనిఁ బెట్టి
చంప, నచ్చేరువఁ జప్పరంబున శయ। నించు యుధామన్యుఁ డెఱిఁగి కడఁగి
చనుదెంచి రాక్షసుఁడని తలంచియుఁ గొంకు। పెట్టక పెనుగద బెట్టు వ్రేయ

ఆ. వ్రేటువడి చలింప కాటోపదీపితుఁ। డగుచు గురుతనూజుఁ డక్కుమారు
నగ్రజన్ముంబోలె నుగ్రత వధియించెఁ। గాని ఖడ్గలీల గలుగదయ్యె. 169

ప్రతిపదార్థం: అలికిడిన్= చప్పుడుచేత; మేల్కను+అతనిన్= మేలుకొనే అతడిని - ఉత్తమౌజుడిని; ధృష్టద్యుమ్నున్; పట్టిన క్రియన్= పట్టిన విధంగా; తలపట్టి+ఈడ్చి= తలపట్టుకొని ఈడ్చి; ఆతనిన్= ధృష్టద్యుమ్నుడిని; చంపిన+అట్టులు= చంపిన

విధంగా; పశుమరణ+అతి కౌతుకమునన్= పశువుచావుపై గల గొప్ప వేడుకతో; అవనిన్= నేలమీద; పెట్టి; చంపన్= చంపగా; ఆ+చేరువన్= ఆ సమీపంలో; చప్పరంబునన్= గుడారంలో; శయనించు= పండుకొన్న; యుధామన్యుఁడు; ఎఱిఁగి= తెలిసి; కడఁగి= పూని; చనుదెంచి= వచ్చి; రాక్షసుఁడు+అని; తలంచియున్= భావించీ; కొంకు పెట్టక= సంకోచించక; పెను గదన్= పెద్ద గదతో; బెట్టు వ్రేయన్= గట్టిగా కొట్టగా; వ్రేటు+పడి= దెబ్బతిని; చలింపక= కదలక; ఆటోప దీపితుఁడు= విజృంభణంచేత ప్రకాశించినవాడు; అగుచున్= అవుతూ; గురు తనూజుఁడు= గురు పుత్రుడు అశ్వత్థామ; ఆ+కుమారున్= ఆ కుమారుడిని, యుధామన్యుడిని; అగ్రజన్మున్+పోలెన్= అన్న అయిన ఉత్తమౌజుడివలె; ఉగ్రతన్= భయంకరంగా; వధియించెన్= చంపాడు; కాని; ఖడ్గలీల= ఖడ్గవినోదం; కలుగదు+అయ్యెన్= కలగలేదు.

తాత్పర్యం: అలికిడికి మేలుకొన్న ఆ ఉత్తమౌజుడిని ధృష్టద్యుమ్నుడిని పట్టుకున్నట్లుగానే తలపట్టి ఈడ్చి, అతడిని చంపిన విధంగానే బలిపశువువలె చంపాలనే అత్యాసక్తితో నేలమీద పడవైచి చంపగా, అక్కడే గుడారంలో పరున్న యుధామన్యుడు తెలిసి పూని వచ్చి రాక్షసుడని భావించీ, సంకోచించక పెద్ద గదతో గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బ తినినా అశ్వత్థామ చలించక విజృంభణంతో ప్రకాశిస్తూ, ఆ కుమారుడిని యుధామన్యుడిని - అన్న అయిన ఉత్తమౌజుడివలె క్రూరంగా చంపాడు. కాని, అతడికి ఖడ్గవినోదం కలగలేదు.

వ. ఇట్లు ద్రుపదపుత్త్రుల నొక్కుమ్మడి నిరువుర గీటడంచి యబ్బలుమగండు. 170

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ద్రుపద పుత్త్రులన్= ద్రుపదుడి కొడుకులను; ఒక్క+ఉమ్మడిన్= ఒక్కమాటుగా; ఇరువురన్= ఇద్దరినీ; గీటు+అడంచి= చంపి; ఆ+బలు+మగండు= ఆ మహావీరుడు.

తాత్పర్యం: ఈ విధంగా ద్రుపదుడి కొడుకులను ఇద్దరినీ చంపి ఆ మహా వీరుడైన అశ్వత్థామ. (తరువాతి పద్యంతో అన్వయం).

శా. కాలాకారతఁ బేర్చి దోర్లసిత ఖడ్గస్ఫారసాంద్రప్రభా
జాలం బొప్పఁగ నిట్లు సొచ్చి లఘుసంచారంబు శోభిల్లఁ బాం
చాల వ్రాతముఁ గ్రీడమైఁ దునిమె రక్షశ్శ్రేణి మాంసంబుఁ గీ
లాలంబుం గబళించి త్రావి మదలీలాలోలతం గ్రాలఁగన్. 171

ప్రతిపదార్థం: కాల+ఆకారతన్= యముడి రూపం వంటి రూపంతో; పేర్చి= విజృంభించి; దోస్(ః)+లలిత= బాహువునందు ప్రకాశించే; ఖడ్గ= కత్తియొక్క; స్ఫార= అధికమూ; సాంద్ర= దట్టమూ (అయిన); ప్రభా= కాంతులయొక్క; జాలంబు= సమూహం; ఒప్పఁగన్; ఇట్లు= ఈ విధంగా; చొచ్చి= ప్రవేశించి; లఘు సంచారంబు= వడిగల సంచారం; శోభిల్లన్= ఒప్పగా; రక్షస్+శ్రేణి= రాక్షసుల సమూహం; మాంసంబున్; కీలాలంబున్= నెత్తురూ; కబళించి= తిని; త్రావి= త్రాగి; మదలీలా లోలతన్= గర్వంయొక్క విలాసంపైగల అత్యాసక్తితో; క్రాలఁగన్= ప్రవర్తిల్లగా; పాంచాల వ్రాతమున్= పాంచాలుర సమూహాన్ని; క్రీడమైన్= లీలతో; తునిమెన్= చంపాడు.

తాత్పర్యం: యముడి రీతిగా విజృంభించి, చేతిలోని కత్తియొక్క మిక్కిలి దట్టమైన కాంతుల సమూహం ఒప్పగా, ఈ విధంగా ప్రవేశించి, వడిగా సంచరిస్తూ, రాక్షసుల సమూహం మాంసం తినీ, రక్తం త్రాగీ, గర్వంతో ప్రవర్తిల్లగా (అశ్వత్థామ) పాంచాల వీరుల సమూహాన్ని లీలగా చంపాడు.

విశేషం: 'కాలాకారతన్' - ఇక్కడ ఆకార శబ్దాన్ని ఇవార్థకంగా భావించవచ్చును. అప్పుడు అలంకారం ఉపమ. 'మాంసంబుఁ గబళించి, కీలాలంబుం ద్రావి' అని క్రమాన్వయం.

వ. అట్టియెడ. 172

తాత్పర్యం: అట్టి+ఎడన్= అటువంటి సమయంలో.

శా. నిద్రాసక్తునిఁ, గొంత మేల్కనిన వానిన్, సుప్రబుద్ధాత్ముఁడై
యుద్రేకంబును శౌర్యసారమును బాహూల్లాసముం జూపఁ జం
చద్రేఖం దిరమైనవానిఁ దను నుత్సాహోగ్రతం దాఁకి యు
న్నిద్రస్వైర సముద్ధతిన్ మెఱయువానిం దున్మె నేకాకృతిన్. 173

ప్రతిపదార్థం: నిద్రా+సక్తునిన్= నిద్రావశుడినీ; కొంత మేల్కనినవానిన్= కొంచెం మేలుకున్నవాడినీ; సుప్రబుద్ధ+ఆత్ముఁడు+ఐ= బాగా మెలకువ వచ్చినవాడై; ఉద్రేకంబును= ఆవేశమూ; శౌర్య సారమును= పరాక్రమోన్నతీ; బాహు+ఉల్లాసమున్= భుజబల ప్రకాశాన్నీ; చూపన్= చూపించటానికి; చంచత్+రేఖన్= చలిస్తూన్న విలాసంతో; తిరము+ఐన వానిన్= నిలకడగల వాడినీ; తనున్= తనని; ఉత్సాహ+ఉగ్రతన్= ఉత్సాహాతిశయంతో; తాఁకి= ఎదిరించి; ఉన్నిద్ర స్వైర సముద్ధతిన్= జాగరూకమూ; స్వేచ్ఛగలదీ(అగు) విజృంభణంతో; మెఱయు వానిన్= ప్రకాశించేవాడినీ; ఏక+ఆకృతిన్= ఒక్కడూ; తున్మెన్= వధించాడు.

తాత్పర్యం: నిద్రావశుడినీ, కొంచెం మేలుకొన్నవాడినీ, బాగా మేలుకొని ఆవేశంతో శౌర్యోన్నతినీ, భుజబల ప్రకాశాన్నీ చూపాలని ఉబలాటపడుతూన్నవాడినీ, తనను అత్యుత్సాహంతో తాకి జాగరూకతతో ఇష్టం వచ్చినట్లు విజృంభించేవాడినీ అశ్వత్థామ ఒక్కడూ వధించాడు.

వ. మఱియు నతండు. 174

తాత్పర్యం: ఇంకా ఆ అశ్వత్థామ.

అశ్వత్థామ కరితురంగంబులపై కుఱికి నఱకుట (సం. 10-8-39)

స్రగ్ధర. తుండంబుల్ నుగ్గునుగ్గై తొరఁగఁగఁ జులుకం ద్రుంచుఁ, గుంభస్థలంబు
ల్ఖండించున్ మౌక్తికంబు ల్గలయఁగఁ జెదరం, గాయముల్ ప్రేవుఁబ్రోవుల్
చండంబుల్ సాంద్రరక్త స్రవమున బెరయన్ జాల్వడన్, వ్రేయు నిమ్మై
శుండాలశ్రేణి మాయించుచు, వెలిఁగి, హయస్తోమశాలాగతుండై. 175

ప్రతిపదార్థం: తుండంబుల్= తొండాలు; నుగ్గునుగ్గు+ఐ= ముక్కలు ముక్కలై; తొరుఁగఁగన్= రాలగా; చులుకన్= సులభంగా; త్రుంచున్= ఖండిస్తాడు; మౌక్తికంబులు= ముత్యాలు; కలయఁగన్= అంతటా; చెదరన్= ఇటూ అటూ పడగా; కుంభ స్థలంబుల్; ఖండించున్= త్రుంచుతాడు; కాయముల్= శరీరాలు; ప్రేవుఁబ్రోవుల్= పేగుల రాశులు; చండంబుల్= తీవ్రమైనవి-భయంకరమైనవి; సాంద్ర రక్త స్రవమునన్= దట్టమైన రక్తప్రవాహంతో; బెరయన్= కూడుకోగా; జాలు+పడన్= ప్రవహించగా; వ్రేయున్= కొడతాడు; ఈ+మైన్= ఈ విధంగా; శుండాల శ్రేణిన్= ఏనుగుల వరసను; మాయించుచున్= చంపుతూ; వెలిఁగి= ప్రకాశించి; హయస్తోమ శాలా గతుండు+ఐ= గుర్రాల సమూహం ఉండే శాలలోకి వెళ్ళిన వాడై.

తాత్పర్యం: తొండాలు ముక్కలు ముక్కలై రాలేటట్టు అనాయాసంగా ఖండించాడు. ముత్యాలు అంతటా చెదరిపడేటట్టు కుంభస్థలాలు పగలగొట్టాడు. శరీరాలూ, ప్రేగుల పోగులూ భయంకరాలై దట్టమైన రక్తప్రవాహంతో కూడి పారేటట్లు కొట్టాడు. ఈ రీతిగా ఏనుగుల గుంపును చంపుతూ ఒప్పి గుర్రాలశాలకు వెళ్ళి.

విశేషం: స్రగ్ధరలో నాలుగు పాదాలుంటాయి. ఒక్కొక్కపాదంలో మ,భ,ర,న,య,య,య అనే గణాలుంటాయి. 1-8-15 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉంటుంది.

ఉ. కొన్నిటి పాదముల్ నఱుకుఁ; గొన్నిటి మోరలు సెక్కు లీలమైఁ
గొన్నిటి కంఠముల్ దునుముఁ; గొన్నిటి వీఁపులు వ్రచ్చు నుబ్బునం
గొన్నిటి సర్వగాత్రములు క్రూరవిచేష్టితవిక్రమంబు దోఁ
ప న్నుఱుమాడుఁ బ్రౌఢబలభాసితభూరిభుజావిహారుఁడై. 176

ప్రతిపదార్థం: ప్రౌఢ= గొప్పదైన; బల= బలంచేత; భాసిత= ప్రకాశించిన; భూరి= అధికమైన; భుజా= బాహువులయొక్క; విహారుఁడు+ఐ= క్రీడగలవాడయి; కొన్నిటి పాదముల్= కొన్ని గుర్రాల కాళ్ళు; నఱుకున్= తెగగొట్టాడు; కొన్నిటి మోరలు= కొన్నింటి ముట్టెలు; లీలమైన్= విలాసంగా-అవలీలగా; చెక్కున్= చెక్కాడు; ఉబ్బునన్= సంతోషంతో; కొన్నిటి కంఠముల్= కొన్నిటి పీకలు; తునుమున్= ఖండించాడు; కొన్నిటి వీఁపులు; వ్రచ్చున్= చీరాడు; క్రూర విచేష్టిత విక్రమంబు= భయంకరపు పనులు చేసే పరాక్రమం; తోఁపన్= తోచేటట్లు; కొన్నిటి సర్వ గాత్రములు= కొన్నిటి అన్ని అవయవాలూ; నుఱుమాడున్= ముక్కలు చేశాడు.

తాత్పర్యం: (అశ్వత్థామ) గొప్పబలంతో ప్రకాశించే అధికబాహుబలంతో క్రీడిస్తూ కొన్ని గుర్రాల కాళ్ళు తెగగొట్టాడు. కొన్నింటి ముట్టెలు అనాయాసంగా చెక్కాడు. కొన్నిటి పీకలు సంతోషంతో ఖండించాడు. కొన్నిటి వీపులు చీరాడు. భయంకర పరాక్రమం తోచేటట్లు కొన్నిటి అవయవాలన్నీ ముక్కలు చేశాడు.

విశేషం: ఇందులోని నఱకు, చెక్కు, తునుము, వ్రచ్చు, నుఱుమాడు అనే తద్ధర్మార్థక క్రియలన్నీ భూతార్థకాలని గ్రహించాలి. 'నఱుకున్= నరికెను, నరికాడు' - ఇత్యాదిగా గ్రహించాలి.

వ. ఇబ్భంగిఁ బీనుంగుపెంటలైన పాంచాలుర విడిదల వెడలి విజయోద్దాముండగు నశ్వత్థామ చల్లడము, దట్టి మొదలయిన పరికరంబులు పాటించియున్న గనపలోఁగిళ్ళకుం జని, తొలుత దొరలం దునుముచుఁ, బరిజన మాతంగ తురంగ మండలముల ముట్టి, విదళన వినోదంబులు సలుపుచు, నొక్కొక్కయెడ మార్తురు మేల్కని పన్ని మార్కొనిన, మారి మసంగినట్లు, మృత్యుదేవత గెరలిన చాడ్పున, జముండు నలిరేఁగిన కరణిఁ, గనుపుగొట్టి, కాలుకాలం బెనంగిన పీనుంగులను, గనక రత్నవలయంబులఁ జెలువందు చేతులను, దునిసిపడిన కరికరంబులతో సరసమాడు చెలువునం జలనంబు నొందు చరణంబులను, నావులించు తలలను, వేదండ దంత ఖండంబులను, ఘోటక ముఖలేశంబులను, రథావయవ శకలంబులను, మడువులు గట్టు నెత్తురులను, గుప్పలు గొను కండలను, బెనంగొను ప్రేవులను, బెనుతిట్టలగు నెమ్ములను, మూర్తిమంతంబు లయినట్టి యద్భుతంబునకు, భయానకంబునకు, బీభత్సంబునకు, నన్నేల నెలవగునట్లుగాఁ

జేయుచుఁ, జెలంగి చెలంగి మలంగి మలంగి తన కరవాల లీలలు భూతబేతాళంబులకుఁ బ్రీతిఁ బెనుపఁ జతురంగంబులం బాఱినను, బీఱువోయినను మరలినను, దెరలినను, గలంగినను, దొలంగినను, దఱిమినను, నఱిమినను, గిట్టినను, ముట్టినను, దాను వానిం బొదివి పొలియించుచు, బలువిడియు, నుబ్బును, వెరవును, బరుసఁదనంబు, నొక్కచందంబునఁజెల్ల నందొక్కటినైనను దక్కనీక యంతకంతకు నెక్కుడగు కోపంబున నాటోపంబు దీపింప, వాదరఁ జిక్కిన యెముకతునుకలు గోఱదౌడల కైవడి గలిగి రుధిరానులేపనంబున నాభీలంబగు నసిపట్టిక ఘోరాకారయైన రాక్షసి పగతుర గీటడంగించుటకుఁ దనకుఁ దోడువచ్చిన తెఱంగున మెఱయఁ జేదిసైన్య సన్నివేశంబు లోనుగాఁగల బలుచోట్లఁ గమలాకరంబు సొచ్చిన ఘనలులాయంబు రేఖయుఁ, గేలివనంబుఁ దఱిసిన మత్తశుండాలంబు పోల్కియును, గాంతారంబు దరికొను దావపావకు విధంబును దోఁప విహరించుచు, వలయుతఱి రథం బెక్కుచుఁ, బాదచారియై విక్రమించుచు, వెరవు దొరకొనినప్పుడు నగ్గలికమై బెరయఁ బెనంగి రక్తంబున సిక్తంబైన శరీరంబు దారుణ ప్రకారంబున నుల్లసిల్లఁ, దన్ను సకల జనులు దానవుండని తలంపఁ, బెంపారు భీషణోద్ధతిఁ బ్రవర్తిల్లు పరాక్రమక్రీడ నతిశయిల్లి, రాజమందిరంబు సొర నప్పళించుచుఁ, దద్ద్వారంబున కభిముఖుండై యరిగె నట్టియెడ. 177

ప్రతిపదార్థం: ఈ+భంగిన్= ఈ విధంగా; పీనుంగు పెంటలు+ఐన; పాంచాలుర విడిదలన్= పాంచాలురున్న శిబిరం; వెడలి; విజయ+ఉద్దాముండు+అగు= గెలుపుచేత భయంకరుడైన అశ్వత్థామ; చల్లడము= లోపలిలాగు; దట్టి= కాసెకోక; మొదలు+అయిన పరికరంబులు= మున్నగు నడికట్లు; పాటించి= ధరించి; ఉన్న గనప లోఁగిళ్ళకున్= మిగిలిన పెద్ద ఇళ్ళలోనికి; చని= వెళ్ళి; తొలుతన్= మొదట; దొరలన్= ప్రభువులను; తునుముచున్= చంపుతూ; పరిజన మాతంగ తురంగ మండలంబులన్= బలగాన్నీ, ఏనుగుల గుఱ్ఱాల సమూహాలనూ; ముట్టి= తాకి; విదళన వినోదంబులు= ముక్కలు చేసే వేడుకలు; సలుపుచున్= చేస్తూ; ఒక్కొక్క+ఎడన్= ఒక్కోసారి; మార్తురు= శత్రువులు; మేల్కని= మేలుకొని; పన్ని= తలపడి; మార్కొనినన్= ఎదిరిస్తే; మారి మసంగిన+అట్లు= మిక్కిలి విజృంభించిన విధంగా; మృత్యుదేవత; కెరలిన చాడ్పునన్= చెలరేగిన రీతిని; జముండు= యముడు; నలిరేఁగిన కరణిన్= విజృంభించిన తీరుగా; కనుపు+కొట్టి= సంహరించి; కాలు కాలన్+పెనంగిన పీనుంగులను= కాలు కాలితో పెనవేసికొన్న శవాలతోనూ; కనక రత్న వలయంబులన్= మణులు పొదిగిన బంగారపు మురుగులతో; చెలువు+అందు చేతులను= ఒప్పే చేతులతోనూ; తునిసిపడిన= ముక్కలైపడ్డ; కరి కరంబులతోన్= ఏనుగులతొండాలతో; సరసము+ఆడు చెలువునన్= హాస్యమాడే రీతిగా; చలనంబున్+ఒందు చరణంబులను= కదలాడే కాళ్ళతోనూ; ఆవులించు తలలను= ఆవలించే తలలతోనూ; వేదండ దంత ఖండంబులను= ఏనుగుల దంతాల ముక్కలతోనూ; ఘోటక ముఖ లేశంబులను= గుఱ్ఱాల ముఖాల ముక్కలతోనూ; రథ+అవయవ శకలంబులను= రథాల భాగాల ముక్కలతోనూ; మడువులు+కట్టు నెత్తురులను= ప్రవాహాలైన రక్తాలతోనూ; కుప్పలు+కొను కండలను= రాశులైన కండలతోనూ; పెనంగొను ప్రేవులను= ఒకదానితో ఒకటి పెనవేసికొన్న ప్రేగులతోనూ; పెనుతిట్టలు+అగు ఎమ్ములను= పెద్ద గుట్టలైన ఎముకలతోనూ; మూర్తిమంతంబులు+అయిన+అట్టి= రూపుదాల్చినట్టి; అద్భుతంబునకున్= అద్భుతరసానికీ; భయానకంబునకున్= భయానక రసానికీ; బీభత్సంబునకున్= బీభత్సరసానికీ; ఆ+నేల= ఆ ప్రదేశం; నెలవు+అగు+అట్లు+కాన్= స్థానం అయ్యేటట్లుగా; చేయుచున్= చేస్తూ; చెలంగి చెలంగి= మిక్కిలి విజృంభించి; మలంగి మలంగి= తిరిగి తిరిగీ; తన కరవాల లీలలు= తన ఖడ్గవిలాసాలు; భూత బేతాళంబులకున్= దయ్యాలకూ పిశాచాలకూ; ప్రీతి= సంతోషం; పెనుపన్= పెంచగా; చతుర్(ః)+ అంగంబులన్= రథాలూ, ఏనుగులూ, గుఱ్ఱాలూ, కాల్బంటులూ అనే నాలుగు విధాల సేనలనూ; పాఱినను= పారిపోయినా; బీఱు+పోయినను=

వెనుదీసినా; మరలినను= మరలిపోయినా; తెరలినను= జంకినా; కలంగినను= భయపడినా; తొలంగినను; తఱిమినను= కవిసినా; అఱిమినను= ఎదుర్కొనినా; కిట్టినను= సమీపించినా; ముట్టినను= తాకినా; తాను; వానిన్= ఆ బలాలను; పొదివి= ఆక్రమించి; పొలియించుచున్= చంపుతూ; బలువిడియున్= పరాక్రమమూ; ఉబ్బును= గర్వమూ; వెరవును= ఉపాయమూ; పరుసఁదనంబున్= కాఠిన్యమూ; ఒక్క చందంబునన్= ఒక్కలా; చెల్లన్= సాగగా; అందున్= ఆ బలాలలో; పొదివి= ఆక్ర మించి; పొలియించుచున్= చంపుతూ; బలువిడియున్= పరాక్రమమూ; ఉబ్బును= గర్వమూ; వెరవును= ఉపాయమూ; పరుసఁ దనంబున్= కాఠిన్యమూ; ఒక్క చందంబునన్= ఒక్కలా; చెల్లన్= సాగగా; అందున్= ఆ బలాలలో; ఒక్కటిన్+ఐనను= ఏఒక్క దానినీకూడా; తక్కనీక= మిగలనివ్వక; అంతకంతకున్= క్రమ క్రమంగా; ఎక్కుడు+అగు= అధికమయ్యే; కోపంబునన్= కోపంతో; ఆటోపంబు= గర్వం; దీపింపన్= ప్రకాశించగా; వాదరన్= కత్తి అంచున; చిక్కిన= తగులుకున్న ఎముక; తునుకలు= (ఎముకల) ముక్కలు; కోఱ దౌడల కైవడి= కోరలు గల దౌడల విధం; కలిగి; రుధిర+ అనులేపనంబునన్= నెత్తురు పూతచే; ఆభీలంబు+అగు= భయంకరమైన; అసిపట్టిక= కత్తి; ఘోర+ఆకార+ఐన+రాక్షసి= భయంకరరూపంగల రాక్షసి; పగతురన్= శత్రువులను; గీటడంగించుటకున్= చంపటానికి; తనకున్; తోడువచ్చిన తెఱంగునన్= సాయపడటానికి వచ్చినట్లుగా; మెఱయన్= ప్రకాశించగా; చేది సైన్య సన్నివేశంబు లోనుగాన్ కల= చేదిదేశపు సైన్యం గుడారం మొదలుగా గల; పలుచోట్లన్= అనేక ప్రదేశాలలో; కమలాకరంబు= సరస్సు; చొచ్చిన= ప్రవేశించిన; ఘన లులాయంబు రేఖయున్= పెద్ద దున్నపోతు విధమూ; కేలివనంబున్= ఉద్యానవనాన్ని; తఱిసిన= ప్రవేశించిన; మత్తశుండాలంబు+పోల్కియును= మదించిన ఏనుగు విధమూ; కాంతారంబున్= అడవిని; దరికొను= కాల్చే; దావ పావకు విధంబును= కార్చిచ్చు విధమూ; తోఁపన్= స్ఫురించగా; విహరించుచున్= సంచరిస్తూ; వలయు తఱిన్= అవసరమయినప్పుడు; రథం+ఎక్కుచున్= రథం ఎక్కుతూ; పాదచారి+ఐ= నడుస్తూ; విక్రమించుచున్= పరాక్రమిస్తూ; వెరవు దొరకొనన్= ఉపాయం లభించగా, వీలు చిక్కగా; అప్పుడు= ఆ సమయంలో; అగ్గలికమైన్= విజృంభణంతో; బెరయన్= ఒప్పి; పెనంగి= యుద్ధంచేసి; పగతుర రక్తంబునన్= శత్రువుల నెత్తుటితో; సిక్తంబు+ఐన= తడిసిన; శరీరంబు; దారుణ ప్రకారంబునన్= భయంకరమైన రీతిగా; ఉల్లసిల్లన్= ప్రకాశించగా; తన్నున్= తనను; సకల జనులున్= అందరూ; దానవుండు+అని= రాక్షసుడని; తలంపన్= భావించగా; పెంపారు= అతిశయించే; భీషణ+ఉద్ధతి= భయంకరమైన గర్వంతో; ప్రవర్తిల్లు= ఉండు, సాగు; పరాక్రమ క్రీడన్= విక్రమ లీలతో; అతిశయిల్లి= మించి; రాజమందిరంబు= రాజభవనం; చొరన్= ప్రవేశించటానికి; అప్పళించుచున్= ఉత్సహిస్తూ; తద్+ద్వారంబునకున్= దాని ద్వారానికి; అభిముఖుండు+ఐ= ఎదురై; అరిగెన్= వెళ్ళాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా పీనుగుపెంట అయిన పాంచాల వీరుల శిబిరంలోనుండి వచ్చి జయ గర్వితుడైన అశ్వత్థామ చల్లడమూ, కాసెకోకా ధరించి మిగిలిన పెద్ద శిబిరాలలోకి వెళ్ళి మొదట ప్రభువులను చంపి, తరువాత పరిజనులనూ ఏనుగుల, గుర్రాల సమూహాలనూ తాకి ముక్కలుగా చేస్తూ, ఒక్కోసారి శత్రువులు మేలుకొని తలపడితే మిక్కిలి విజృంభించి మృత్యుదేవత చెలరేగిన విధంగా, యముడు విజృంభించిన రీతిగా వాళ్ళను సంహరించి, కాలు కాలితో పెనువేసుకున్న శవాలతోనూ, ముక్కలై పడిన ఏనుగు తొండాలతో సరసమాడే రీతిగా కదలాడే కాళ్ళతోనూ, ఆవులించే తలలతోనూ, ఏనుగుదంతాల ముక్కలతోనూ, గుర్రాల ముఖాల శకలాలతోనూ, రథభాగాల ముక్కలతోనూ, మడుగులు కట్టే నెత్తురుతోనూ, రాశులైన కండలతోనూ, ఒండొంటితో పెనవేసికొనిపోయిన ప్రేగులతోనూ, పెద్ద గుట్టలయిన ఎముకలతోనూ, రూపుతాల్చిన అద్భుత భయానక బీభత్స రసాలకు ఆ ప్రదేశం స్థానమయ్యేటట్లు చేస్తూ, మిక్కిలి విజృంభించీ, తిరిగి తిరిగీ, తన ఖడ్గ విలాసాలు భూతబేతాళాలకు ప్రీతి పెంచుతూండగా, చతురంగబలాలను, పారిపోయినా, వెనుదీసినా, మరలిపోయినా, జంకినా, కలగినా, తొలగినా, కవిసినా, మార్కొన్నా, సమీపించినా, తాకినా, ఆక్రమించి చంపుతూ, పరాక్రమమూ, గర్వమూ, ఉపాయమూ, కాఠిన్యమూ

ఒక్కటై సాగగా, ఆ బలాలలో ఏ ఒక్క దానినీ మిగలనివ్వక, పోను పోను ఎక్కువయ్యే కోపంతో ప్రకాశించగా, అంచుకు అంటుకొన్న ఎముకల ముక్కలు కోరల దౌడలలో ఉండి, నెత్తురు పూతచే భయంకరమైన కత్తి శత్రువులను చంపటంలో తనకు తోడు పడటానికి వచ్చిన భయంకరాకార అయిన రాక్షసివలె ప్రకాశించగా, చేదిసైన్యం ఉన్న గుడారం మొదలుకొని పెక్కుచోట్ల సరస్సులో ప్రవేశించిన పెనుదున్నపోతువలె, ఉద్యానవనం ప్రవేశించిన మత్తేభం వలె, అడవిని కాల్చే కార్చిచ్చువలె విహరిస్తూ, అవసరమయినప్పుడు రథం ఎక్కీ, నడిచీ, పరాక్రమిస్తూ, వీలు చిక్కినప్పుడు విజృంభిస్తూ యుద్ధం చేసి శత్రువులనెత్తురుతో తడిసిన శరీరం భయంకరంగా ప్రకాశించగా, తనను అందరూ రాక్షసుడని భావించగా, అతిశయించే భయంకరౌద్ధత్యంతో సాగే విక్రమక్రీడతో మించి, రాజభవనం ప్రవేశించటానికి ఉత్సహిస్తూ, దాని ద్వారంవైపు వెళ్ళాడు. ఆ సమయంలో.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, ఉపమ, భ్రాంతిమంతం. 'మృత్యు దేవత గెరలిన చాడ్పున', 'జముండు నలిరేఁగిన కరణి'- అలంకారాలు ఉత్ప్రేక్షలు. 'తునిసి పడిన కరి కరంబులతో సరసమాడు చెలువునం జలనంబు నొందు చరణంబులను' - అలంకారం ఉత్ప్రేక్ష. 'వాదరఁ జిక్కిన యెముక తునుకలు గోఱదౌడలకైవడి గలిగి'- అలంకారం ఉపమ. 'అసిపట్టిక ఘోరాకారయైన రాక్షసి పగతుర గీటడంగించుటకుఁ దనకుఁ దోడు వచ్చిన తెఱంగున మెఱయ' - అలంకారం ఉత్ప్రేక్ష. 'కమలాకరంబు సొచ్చిన ఘన లులాయంబు రేఖయుఁ, గేలివనంబుఁ దఱిసిన మత్త శుండాలంబు పోల్కియును, గాంతారంబు దరికొను దావపావకు విధంబును దోఁప'- మూడూ మూడు ఉపమలు. 'తన్ను సకల జనులు దానవుండని తలంప' అలంకారం భ్రాంతిమంతం.

సీ. **కలయంగ వీడుమేల్కని యమ్మహావీరుఁ । డొక్కఁడ మెలఁగుటయు, నతండు**
దొలుత ధృష్టద్యుమ్నుఁ ద్రుంచి తద్బంధు సం । తతి గీటడఁచి యోధదంతితురగ
చయముల నెల్లను సమయంగఁ జూచుచు । రాకయుఁ, గర్ణ పరంపరావ
గతమున సన్నాహగాఢమై యెక్కడె । క్కడయని కడఁగి శిఖండి ద్రౌప

తే. **దేయులును దానుఁ బన్ని యుద్వృత్త శౌర్య । మాన తుంగ ప్రభద్రక మాత్స్య తతులు**
తోడ బలువిడిఁ దఱుమంగ ద్రోణ తనయు । ముట్టి శస్త్రాస్త్రచయముల ముంచుటయును. **178**

ప్రతిపదార్థం: వీడు= శిబిరం; కలయంగన్= అంతటా; మేల్కని= మేలుకుని; ఆ+మహావీరుఁడు= ఆ గొప్పవీరుడు - అశ్వత్థామ; ఒక్కఁడు+అ= ఒక్కడే; మెలఁగుటయున్= సంచరించటమూ; అతండు; తొలుతన్= మొదట; ధృష్టద్యుమ్నున్; త్రుంచి= చంపి; తద్+బంధు సంతతిన్= ఆతడి చుట్టాలసమూహాన్ని; గీటు+అడఁచి= చంపి; యోధ దంతి తురగ చయములన్+ఎల్లను= వీరుల, ఏనుగుల, గుర్రాల-సమూహాలన్నిటినీ; సమయంగన్+చూచుచున్ రాకయున్= చంపుతూ రావటమూ; కర్ణ పరంపరా+అవగతమునన్= వినికి వరుసచే తెలియటంచేత; సన్నాహగాఢము+ఐ= యుద్ధ ప్రయత్నంలో మునిగినదయి; ఎక్కడ+ఎక్కడ+అని; కడఁగి= పూని; శిఖండి; ద్రౌపదేయులును= ద్రౌపది కొడుకులూ; తానున్; పన్ని= వ్యూహంగా ఏర్పడి; ఉద్వృత్త శౌర్యమాన తుంగ ప్రభద్రక మాత్స్యతతులు= అధికమైన పరాక్రమంచేతా, పౌరుషంచేతా, ఉగ్రులైన ప్రభద్రకుల, మాత్స్యుల సమూహాలు; తోడన్= కూడా; బలువిడిన్= పరాక్రమంతో; తఱుమంగన్= తరమగా; ద్రోణ తనయున్= అశ్వత్థామను; ముట్టి= తాకి; శస్త్ర+అస్త్ర చయములన్= శస్త్రాల, అస్త్రాల సమూహాలతో; ముంచుటయును= ముంచగా.

తాత్పర్యం: శిబిరం అంతా మేలుకొని, ఆ మహావీరుడైన అశ్వత్థామ ఒక్కడే సంచరించటమూ, అతడు మొదట ధృష్టద్యుమ్నుడిని చంపి, అతడి చుట్టాలను చంపి, వీరులనూ, ఏనుగులనూ, గుర్రాలనూ చంపుతూ రావటమూ, ఆనోటా ఆనోటా విని యుద్ధ ప్రయత్నంలో మునిగి, ఎక్కడెక్కడని పూని, శిఖండీ, ఉప పాండవులూ వ్యూహంగా ఏర్పడి, అధిక పరాక్రమం చేతా, పౌరుషంచేతా ఉగ్రులైన ప్రభద్రకులూ, మాత్స్యులూ తమతో కూడ వచ్చి పరాక్రమంతో తరమగా, అశ్వత్థామను తాకి శస్త్రాలతోనూ, అస్త్రాలతోనూ ముంచగా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: శిఖండి పూర్వజన్మలో అంబ. ఈమె భీష్ముడి మీది కోపంతో అతడిపై పగ తీర్చుకొనాలని ఈశ్వరుడిని గురించి తపస్సుచేసి వరం పొంది మరుజన్మలో ద్రుపదుడికి కూతురై పుట్టింది. ఆ తరువాత శిఖండిగా రూపాంతరం చెందింది. స్త్రీతోనూ పూర్వం స్త్రీరూపం గలవారితోనూ షండుడితోను తాను యుద్ధం చేయనని నియమం. అది తెలిసి అర్జునుడు శిఖండిని ముందు పెట్టుకొని భీష్ముడితో యుద్ధానికి రాగా భీష్ముడు అస్త్రసన్న్యాసం చేస్తాడు. అర్జునుడు అప్పుడు భీష్ముడిని జయిస్తాడు.

వ. వారల నేర్పడ నాలోకించి. 179

ప్రతిపదార్థం: వారలన్= శిఖండి మొదలుగా గల శత్రువీరులను; ఏర్పడన్= బాగా; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: (అశ్వత్థామ) శిఖండి మొదలైన వాళ్ళను బాగా చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. అగ్గురునందనుండు హరిణావలిఁ గాంచి కుభృత్తటంబు వే
డిగ్గు మృగేంద్రు చాడ్పునఁ గడిందిమగంటిమి యుల్లసిల్లఁగా
డిగ్గి రథంబు చోద్యపువడిం గలయన్ బెరసెం గరంబులం
దగ్గల మైన ఖేటకము నద్భుతఖడ్గముఁ దేజరిల్లఁగన్. 180

ప్రతిపదార్థం: ఆ+గురు నందనుండు= ఆ గురుపుత్రుడు-అశ్వత్థామ; హరిణ+ఆవలిన్= లేళ్ళవరసను; కాంచి= చూచి; కుభృత్+తటంబున్= పర్వత ప్రదేశంనుండి; వే= శీఘ్రంగా; డిగ్గు= దిగే, మృగ+ఇంద్రు-చాడ్పునన్= సింహంలా; కడింది-మగంటిమి= గొప్పపరాక్రమం; ఉల్లసిల్లఁగాన్= ప్రకాశించగా; రథంబున్+డిగ్గి= రథందిగి; కరంబులందున్= చేతులలో; అగ్గలము+ఐన= అతిశయించిన; ఖేటకమున్= డాలూ; అద్భుత ఖడ్గమున్= ఆశ్చర్యకరమైన కత్తీ; తేజరిల్లఁగన్= ప్రకాశించగా; చోద్యము+వడిన్= వింతయైన వేగంతో; కలయన్= అంతటా; బెరసెన్= కవిశాడు.

తాత్పర్యం: ఆ అశ్వత్థామ లేళ్ళను చూచి కొండపైనుండి గబగబా దిగే సింహంవలె, గొప్ప పరాక్రమం ఒప్పగా, రథం దిగి, చేతులలో మంచి డాలూ, ఆశ్చర్యకరమైన కత్తీ ప్రకాశించగా మహావేగంతో అంతటా వ్యాపించాడు.

విశేషం: అలం: ఉపమ.'కుభృత్తటంబు వే డిగ్గు మృగేంద్రుచాడ్పున'- అలంకారం ఉపమ. దీనివలన శత్రువుల అల్పత్వమూ, అశ్వత్థామ ఘనతా తెలుస్తాయి.

మహాస్రగ్ధర.

చతురంగచ్ఛేద కేళీ సరభస కలనాశ్చర్య ధౌరేయ నానా
గతులం ద న్నెల్లవారుం గడిఁది యసుర నాఁగా నతిక్రూర చేష్టో

ద్ధతి యొప్పం జొచ్చి సైన్యాస్త్రముల నతని యస్త్రంబులం ద్రుంచి వీఁకం
బ్రతివింధ్యుం గిట్టి రెండై పడఁగఁ దునిమెఁ దద్భాసమానాంగయష్టిన్. **181**

ప్రతిపదార్థం: చతుః+అంగ+ఛేద= రథ గజ తురగ పదాతులనే నాలుగు రకాల సైన్యాన్నీ ఖండించటం (అనే); కేళీ= క్రీడలో; సరభస కలనా= వేగంతో కూడుకున్న; ఆశ్చర్య ధౌరేయ= ఆశ్చర్యభారం వహించిన-మిక్కిలి ఆశ్చర్యకరమైన; నానాగతులన్= అనేకవిధాలచేత; తన్నున్= తనను; ఎల్లవారున్= అందరూ; కడిఁది+అసుర నాఁగాన్= క్రూర రాక్షసుడనగా; అతి క్రూర చేష్టా+ఉద్ధతి= మిక్కిలి క్రూరములైన పనుల తీవ్రత; ఒప్పన్= ఒప్పగా; చొచ్చి= ప్రవేశించి; సైన్య+అస్త్రములన్= (శత్రు) సైన్యపు అస్త్రాలను; అతని+అస్త్రంబులన్= ప్రతివింధ్యుడి అస్త్రాలతో; త్రుంచి= ఖండించి; వీఁకన్= పరాక్రమంతో; ప్రతివింధ్యున్= ప్రతివింధ్యుడనేవాడిని - ధర్మరాజు కొడుకును; కిట్టి= సమీపించి; తద్+భాసమాన+అంగయష్టిన్= అతడి ప్రకాశిస్తూ ఉన్న కర్రవంటి శరీరాన్ని; రెండు+ఐ= పడఁగన్= రెండు ముక్కలై పడేటట్లు; తునిమెన్= ఖండించాడు.

తాత్పర్యం: చతురంగబలాలనూ ఛేదించటం అనే ఆటలో వేగంతో కూడుకొన్న మహాశ్చర్యకరాలైన పెక్కు విధాలవలన తనను అందరూ మహారాక్షసు డని భావించగా, మిక్కిలి క్రూరములైన చేష్టల తీవ్రత ఒప్పగా ప్రవేశించి శత్రుసేనల అస్త్రాలను తన అస్త్రాలతో ఖండించి, పరాక్రమంతో ప్రతివింధ్యుడిని సమీపించి, వాడి మెరిసే దేహయష్టిని రెండు ముక్కలై పడేటట్లు ఖండించాడు.

విశేషం: మహాస్రగ్ధరలో నాలుగు పాదాలుంటాయి. ఒక్కొక్క పాదంలో స,త,త,న,స,ర,ర,గ అనే గణాలుంటాయి. 1-9-16 అక్షరాలకు యతిమైత్రి. ప్రాస నియమం ఉంటుంది.

వ. ఇవ్విధంబున ధర్మతనయనందనుని నడుము దెగనడిచి యార్చి పేర్చిన. **182**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ధర్మతనయ-నందనుని= ధర్మరాజు కొడుకుయొక్క; ప్రతివింధ్యుడియొక్క నడుము; తెగన్+అడిచి= తెగగొట్టి; ఆర్చి= అరచి; పేర్చినన్= విజృంభించగా;

తాత్పర్యం: ఈ రీతిగా ప్రతివింధ్యుడి నడుము తెగగొట్టి అరచి విజృంభించగా.

మహాస్రగ్ధర.

అతిశోక క్రోధవేగవ్యథిత హృదయుఁడై యశ్వసాదిత్వ వీరో
ద్ధతిఁ బ్రౌఢస్ఫూర్తి సెల్వొందఁగ సబళముఁ దద్గాత్రముఁ జొన్పఁ బూఁచె
న్శ్రుతసోముం; డల్లఁ బట్టె న్గురుసుతుఁ డదియున్; స్రుక్కు చెన్నార, నల్క
న్ధృతఖడ్గుండైనఁ, జేయు న్శిరముఁ దురగము న్వ్రేల్మిడిం ద్రుంచి వైచెన్. **183**

ప్రతిపదార్థం: శ్రుతసోముండు= భీముడి కొడుకైన శ్రుతసోముడు; అతి= మిక్కిలి; శోక= దుఃఖంయొక్క; క్రోధ= కోపంయొక్క; వేగ= ఉద్రేకంచేత; వ్యథిత= బాధపడిన; హృదయుఁడు+ఐ= హృదయం గలవాడై; అశ్వ సాదిత్వ వీర+ఉద్ధతిన్= గుర్రపురౌతైన వీరుడియొక్క ఔద్ధత్యంతో; ప్రౌఢస్ఫూర్తి= గొప్ప ప్రకాశం; చెల్వు+ఒందఁగన్= అందగించగా; సబళమున్= సబళ మనే ఆయుధాన్ని; తద్+గాత్రమున్= అతడి (అశ్వత్థామయొక్క) శరీరాన్ని; చొన్పన్(చొనుపన్)= గ్రుచ్చుకొనేటట్లు; పూఁచెన్= ప్రయోగించాడు; గురుసుతుఁడు= అశ్వత్థామ; అదియున్= దానినికూడా; అల్లన్= మెల్లగా; పట్టెన్= పట్టుకున్నాడు; స్రుక్కు=

దుఃఖం; చెన్ను+ఆరన్= ఒప్పగా, కలుగగా; అల్కన్= కోపంతో; ధృతఖడ్గుండు+ఐనన్= (శ్రుతసోముడు) కత్తి పట్టుకున్నవాడు కాగా; చే+ఉన్= చేతినీ; శిరమున్= తలనూ; తురగమున్= గుఱ్ఱాన్నీ; వ్రేల్మిడిన్= చిటికెలో; త్రుంచివైచెన్= (అశ్వత్థామ) నరికివేశాడు.

తాత్పర్యం: భీముడి కుమారుడైన శ్రుతసోముడు అమిత శోక క్రోధముల ఉద్రేకంచేత హృదయం వ్యథ చెందగా గుఱ్ఱాన్ని అధిరోహించిన వీరుడి ఔద్ధత్యంతో, గొప్ప స్ఫూర్తి అందగించగా, సబళం అనే ఆయుధాన్ని అశ్వత్థామ శరీరానికి గ్రుచ్చుకొనేటట్టు ప్రయోగించాడు. అశ్వత్థామ దానిని మెల్లగా పట్టుకోవటంతో అతడు దుఃఖించి కోపంతో ఖడ్గం ధరించాడు. అప్పుడు అశ్వత్థామ అతడి చేతినీ, శిరస్సునూ, గుఱ్ఱాన్నీ ఒక్క చిటికెలో నరికివేశాడు.

విశేషం: తెలుగులో భీముడి కొడుకు పేరు 'శ్రుతసోము' డని ఉండగా, సంస్కృత భారత ప్రతులలో 'సుతసోము' డని ఉన్నది.

వ. ఇవ్విధంబునఁ జిత్రవధంబునకు గోచరుండైన కీచకాంతకతనయుం గనుంగొని. 184

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; చిత్రవధంబునకున్+గోచరుండు+ఐన= చిత్రవధకు గురి అయిన; కీచక+అంతక తనయున్= కీచకుడిని చంపిన భీముడి కొడుకుని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: ఈ రీతిగా చిత్రవధకు గురి అయిన భీమపుత్రుడిని- శ్రుతసోముడిని చూచి. (తరువాత పద్యంతో అన్వయం).

మహాస్రగ్ధర

'నినుఁగూడన్ వీఁడె వచ్చెన్ నృపుఁ' డనుచు శతానీకుఁ డాభీల చక్రం
బున నశ్వత్థామ వక్షంబునను రుధిరముం బొంగఁగాఁ జేయ నప్పా
టున నీడంబోక బల్వేటున నిలఁ బడ నాటోపముం జూపి యంతం
దనివో కా దుర్జయుం డాతని శిరమును దద్గాత్రముం బాపె లీలన్. 185

ప్రతిపదార్థం: నినున్+కూడన్= నిన్ను కలియటానికి-నీతో పోరాడటానికి; నృపుఁడు= రాజు; వీఁడె; వచ్చెన్= ఇదే వచ్చాడు; అనుచున్= అంటూ; శతానీకుఁడు= నకులుడి కొడుకైన శతానీకు డనేవాడు; ఆభీల చక్రంబునన్= భయంకరమైన చక్రాయుధంతో; అశ్వత్థామ వక్షంబునను= అశ్వత్థామయొక్క రొమ్మునుండి; రుధిరమున్= రక్తాన్ని; పొంగఁగాన్+చేయన్= పొంగేటట్టు చేయగా; ఆ దుర్జయుండు= గెలవశక్యంకాని ఆ అశ్వత్థామ; ఆ+పాటునన్= ఆ కష్టంచేత; ఈడంబోక= వెనుదీయక; బల్+వేటునన్= పెద్దదెబ్బతో; ఇలన్= నేలమీద; పడన్= పడేటట్లు; ఆటోపమున్= విజృంభణం; చూపి; అంతన్= దానితో; తనివి+పోక= తృప్తిపడక; లీలన్= సులభంగా; ఆతని శిరమును= ఆ శతానీకుడి తలను; తద్+గాత్రమున్= అతడి శరీరం నుండి; పాపెన్= తొలగించాడు.

తాత్పర్యం: 'నీతో పోరాడటానికి రాజు ఇదే వచ్చా'డంటూ నకులుడి పుత్రుడైన శతానీకుడు భయంకరమైన చక్రాయుధంతో అశ్వత్థామ రొమ్మునుండి రక్తం పొంగేటట్లు చేశాడు. గెలువశక్యం కాని అశ్వత్థామ ఆ దెబ్బకు వెనుదీయక, గట్టిదెబ్బతో వాడు నేలపై పడేటట్లు విజృంభించి, దానితో తృప్తి పడక, వాడి శిరస్సును శరీరం నుంచి అవలీలగా వేరుచేశాడు.

వ. ఇట్లు నకుల సూనుఁడు సమసిన. 186

ప్రతిపదార్థం: ఇట్లు; నకుల సూనుఁడు= నకులుడి కొడుకు-శతానీకుడు; సమసినన్= చావగా.

తాత్పర్యం: ఇట్లా నకులుడి కొడుకైన శతానీకుడు చావగా.

మహాస్రగ్ధర.

శ్రుతసేనుం డప్డు గోపస్ఫురదరుణమరీచుల్ దలిర్పంగఁ జక్షు
ర్ద్వితయంబుం గెంపునం బొందిన చెలువము సందీప్త ఘోరంబుగా బె
ట్టతనిం జంచద్గదన్ వ్రేయఁగ నుఱక తదాస్యచ్ఛిదాస్ఫారకేళీ
చతురుండై యక్కుమారున్ జముకడ కనిచెం జండదోర్దర్ప మొప్పన్. 187

ప్రతిపదార్థం: అప్డు= అప్పుడు; శ్రుతసేనుండు= సహదేవుడి కొడుకైన శ్రుతసేనుడు; కోపస్ఫురత్+అరుణ మరీచుల్= కోపంతో ప్రకాశించే ఎర్రటికాంతులు; తలిర్పంగన్= కన్పట్టగా; చక్షుస్(ః)+ద్వితయంబున్= రెండుకళ్ళూ; కెంపునన్+పొందిన చెలువము= ఎర్రబడ్డ అందం; సందీప్త ఘోరంబు+కాన్= వెలుగొంది భయంకరం కాగా; అతనిన్= అశ్వత్థామను; బెట్టు= గట్టిగా; చంచత్+గదన్= చలిస్తున్న గదతో; వ్రేయఁగన్= కొట్టగా; ఉఱక= (అశ్వత్థామ) లెక్కచేయక; తద్= ఆ శ్రుతసేనుడియొక్క; ఆస్య= ముఖంయొక్క; ఛిదా= నరకడం అనే; స్ఫార= అధికమైన; కేళీ= క్రీడయందు; చతురుండు+ఐ= నేర్పుగలవాడయి; ఆ+కుమారున్= ఆ బాలుడిని; చండ దోస్(ః)+దర్పము= తీవ్రమైన భుజగర్వం; ఒప్పన్= ఒప్పగా; జము కడకున్+అనిచెన్= యముడి దగ్గరకు పంపాడు - చంపాడు.

తాత్పర్యం: అప్పుడు సహదేవుడి కొడుకైన శ్రుతసేనుడు కోపంతో నేత్రద్వయం ఎర్రబడి భయంకరం కాగా, అశ్వత్థామను గదను తిప్పుతూ గట్టిగా కొట్టాడు. అశ్వత్థామ లక్ష్యపెట్టక వాడి ముఖ ఖండన క్రీడలో నేర్పుగలవాడయి ఆ కుమారుడిని భుజపరాక్రమగర్వం ఒప్పగా యమసదనానికి పంపాడు.

విశేషం: సహదేవుడి కొడుకు తెలుగులో శ్రుతసేను డని ఉండగా, సంస్కృత భారతంలో శ్రుతకర్ముడని ఉన్నది.

వ. ఇత్తెఱంగున వికృతాననుండై పడి మృతుండైన సహదేవ సుతుం జూచి రోషంబునం బేర్చి. 188

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; వికృత+ఆననుండు+ఐ= విరూపమైన ముఖం గలవాడయి; పడి; మృతుండు+ఐన= చచ్చిన; సహదేవ సుతున్= సహదేవుడి కొడుకును- శ్రుతసేనుడిని; చూచి; రోషంబునన్= కోపంతో; పేర్చి= విజృంభించి.

తాత్పర్యం: ఈ విధంగా వికృతమైన ముఖంతో పడి చచ్చిన సహదేవుడి కొడుకును - శ్రుతసేనుడిని చూచి కోపంతో విజృంభించి.

మహాస్రగ్ధర.

వితతజ్యానాద మాశావితతి నినిచి దోర్వీర్యమేపార బాణ
ప్రతితం దన్నుంప, వీఁకం బలుక జడియుచున్ బల్విడిం బేర్చి చంచ

ద్గతిఁ గ్రీడం దంతి హేలాదళనరతమృగేంద్ర స్ఫురన్మూర్తి దోఁపన్
శ్రుతకీర్తిం గిట్టి కంఠత్రుటనవిలసనారూఢి నవ్విప్రుఁ డొప్పెన్. 189

ప్రతిపదార్థం: (శ్రుతకీర్తి-కర్త) వితత జ్యా నాదము= అధికమైన వింటినారిధ్వని; ఆశా వితతిన్= దిక్కుల సమూహంలో; నినిచి= నిండించి; దోస్(ః)+వీర్యము= భుజపరాక్రమం; ఏపారన్= అతిశయించగా; బాణ ప్రతతిన్= బాణాల సమూహంతో; తన్+ముంపన్= తనని ముంచగా; ఆ+విప్రుఁడు= ఆ బ్రాహ్మణుడు - అశ్వత్థామ; వీఁకన్= ఉత్సాహంతో; పలుకన్= డాలును; జడియుచున్= తిప్పుతూ; బలు+విడిన్= పరాక్రమంతో; పేర్చి= విజృంభించి; చంచత్+గతిన్= కదులుతూన్న గమనంతో; క్రీడన్= ఆటతో; దంతి= ఏనుగుయొక్క; హేలా= అనాయాసపు; దళన= చీల్చుటయందు; రత= ఆసక్తమయిన; మృగ+ఇంద్ర= సింహంయొక్క; స్ఫురత్+మూర్తి= ప్రకాశిస్తున్న ఆకారం; తోఁపన్= తోచేటట్టు; శ్రుతకీర్తిన్= అర్జునుడి కొడుకైన శ్రుతకీర్తిని; కిట్టి= సమీపించి; కంఠ= కంఠంయొక్క; త్రుటన= ఖండనంయొక్క; విలసన= ప్రకాశంయొక్క; ఆరూఢిన్= గొప్పతనంతో; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: అర్జునుడి కొడుకైన శ్రుతకీర్తి అధికమైన వింటినారిధ్వనిని దిక్కులందు నిండించి, భుజపరాక్రమం అతిశయించగా బాణ సమూహంతో అశ్వత్థామను ముంచగా, ఆ బ్రాహ్మణుడు ఉత్సాహంతో డాలు తిప్పుతూ, పరాక్రమంతో విజృంభించి, ఆటతో, ఏనుగును చీల్చటంలో ఆసక్తికరమైన సింహంవలె శ్రుతకీర్తిని సమీపించి కంఠం ఖండించాడు.

విశేషం: అలం: ఉపమ. 'దంతి హేలా దళన రత మృగేంద్ర స్ఫురన్మూర్తి దోఁపన్' - అలంకారం ఉపమ.

ఈ దారుణ మహామారణ క్రియాభివర్ణనంలో పాండవ సుత పంచకహనన క్రియాబీభత్సాన్ని 'మహాస్రగ్ధర' లలోనే వర్ణించివుండడం ఒక విశేషం.

వ. ఇట్లు ద్రౌపదీ తనయ పంచకంబు పంచత్వంబు నొందినఁ గ్రోధాతిరేకంబునఁ బ్రభద్రకులును, శాంతనవాంతకుండును ధృష్టద్యుమ్నాంతకుఁ జుట్టుముట్టి. 190

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ద్రౌపదీ తనయ పంచకంబు= ద్రౌపది కొడుకు లైదుగురూ; పంచత్వంబున్+ఒందినన్= చావగా; క్రోధ+అతిరేకంబునన్= కోపాతిశయంతో; ప్రభద్రకులును; శాంతనవ+అంతకుండును= భీష్ముడిని అంతమొందించిన శిఖండీ; ధృష్టద్యుమ్న+అంతకున్= ధృష్టద్యుమ్నుడిని సంహరించిన అశ్వత్థామను; చుట్టుముట్టి= ముట్టడించి.

తాత్పర్యం: ఈ విధంగా ద్రౌపదికొడుకులు అయిదుగురూ చావగా, కోపాతిశయంతో ప్రభద్రకులూ, శిఖండీ అశ్వత్థామను ముట్టడించి.

చ. శరములఁ దోమరంబులను జక్రములన్ వెసఁ గప్పి బెట్టు ము
ద్గర కరవాల కుంతముఖ దారుణ హేతుల నొంప, నాతఁ డు
ద్ధుర గతులం బ్రభద్రకులఁ ద్రుంచుచుఁ గేళి యొనర్పఁగా, శిఖం
డి రుచిర మార్గణంబు భ్రుకుటిస్థలి నొంచె సముద్ధటోన్నతిన్. 191

ప్రతిపదార్థం: శరములన్= బాణాలతోనూ; తోమరంబులను= చిల్లకోలలతోనూ; చక్రములన్= చక్రాయుధాలతోనూ; వెసన్= శీఘ్రంగా; కప్పి; బెట్టు= మిక్కిలి ఎక్కువగా; ముద్గర కరవాల కుంత ముఖ దారుణ హేతులన్= ముద్గరాలూ, కత్తులూ,

బల్లెములూ మొదలైన భయంకరాయుధాలతో; నొంపన్= బాధించగా; ఆతఁడు= అశ్వత్థామ; ఉద్ధుర గతులన్= తీవ్రములైన ప్రకారాలతో; ప్రభద్రకులన్; త్రుంచుచున్= వధిస్తూ; కేళి= క్రీడ; ఒనర్పఁగాన్= చేయగా; శిఖండి రుచిర మార్గణంబు= శిఖండియొక్క మనోహరమైన బాణం; సముద్భట+ఉన్నతిన్= అతిశయమైన ఉన్నతితో; భ్రుకుటి స్థలిన్= బొమముడి ప్రదేశాన్ని; నొంచెన్= బాధించింది.

తాత్పర్యం: బాణాలతోనూ, తోమరాలతోనూ, చక్రాలతోనూ శీఘ్రంగా కప్పి, మిక్కిలి ఎక్కువగా ముద్గరాలూ, కత్తులూ, కుంతాలూ మొదలైన భయంకరాయుధాలతో బాధించారు. అశ్వత్థామ తీవ్ర ప్రకారాలతో ప్రభద్రకులను ఖండిస్తూ విహరించాడు. శిఖండి తన మనోహరమైన బాణంతో అతడి బొమముడి స్థలాన్ని మిక్కిలి గట్టిగా కొట్టి బాదించాడు.

అశ్వత్థామ శిఖండిం బొదివి చంపుట (సం. 10-8-66)

క. **గురుసుతుఁడు క్రోధమయమగు । బరవసమున నప్పు డా ద్రుపదనందను మే**
నిరువఱియ గాఁగ నేసెను । శిరము నుదగ్రతఁ గృపాణశిక్ష మెఱయఁగన్. 192

ప్రతిపదార్థం: గురుసుతుఁడు= అశ్వత్థామ; క్రోధ మయము+అగు= కోపంతో నిండిన; బరవసమునన్= ఉత్సాహంతో; అప్పుడు; ఆ-ద్రుపద నందను మేను= ఆ ద్రుపద పుత్రుడైన శిఖండియొక్క శరీరం; ఇరు+పఱియ కాఁగన్= రెండు ముక్కలయ్యేటట్టు; శిరమున్= తలను; ఉదగ్రతన్= భయంకరంగా; కృపాణ శిక్ష= ఖడ్గవిద్య; మెఱయఁగన్= ప్రకాశించగా; ఏసెను= నరికాడు.

తాత్పర్యం: అశ్వత్థామ కోపంతో నిండిన ఉత్సాహంతో అప్పుడు ఆ శిఖండి శరీరం రెండు ముక్కలయ్యేటట్టు అతడి తలను భయంకరంగా ఖడ్గవిద్య ప్రకాశించే విధంగా నరికాడు.

వ. **ఇవ్విధంబున దొరలు దెగినను బాంచాల ప్రభద్రక మత్స్యసైన్య శేషంబులు వోక పెనంగిన నతండు మాతంగ వితాన విదళనం బప్పడు సలిపిన కంఠీరవంబు తనమీఁద హరిణకులంబు గవిసిన నెట్టిదగు నట్టివాఁడగుచుఁ బేర్చి యార్చె; నత్తెఱంగు తుములంబునఁ బొడగానమిఁ బాండునందనులు కృష్ణసాత్యకులును నా శిబిరమున లేకయునికి యెఱింగె; నప్పుడు గనుంగొను జనంబులకు నితం డశ్వత్థామ యనుబుద్ధి వొడమె; నది యెట్టనినఁ గురుపాండవులు భండనంబుఁ జేయందొడంగినయది మొదలుగా రాత్రులచ్చటి జనులు నీలతనువును, రక్తాస్యనయనయు, రక్తాంబరధరయు, రక్తమాల్యానులేపనయు నగు లేమ యొక్కతి దమవీటివారు నిద్రపోవుచుండఁ దలలు వీడ మేనులు వికృతంబులై వ్రేలం బాశంబులఁ గరితురగ సహితంబుగా బంధించి ఘోరసంరంభంబునం దెచ్చి తెచ్చి యశ్వత్థామ యగ్రభాగంబునం బెట్ట నుగ్ర భావంబున నతండు దునుముచు నార్చు చునికిఁ గలలు గాంతు; రట్లగుటం జేసి నిద్రాసక్తులం జంపుటయు నవ్విధంబునార్పును నేర్పడ ననుసంధించి యక్కలల ఫలంబు గాకేమి యని తలంచి చొచ్చి పోటునకు నయ్యరాతి రాత్రిమై వచ్చుట నిశ్చయించి యశ్వత్థామగా నెఱింగి; రవ్వీరుండు మెఱుంగు మెఱచినట్లు వివిధగతులఁ జరించినం జెండాడినం జూచియు నీడంబోక రణక్రీడ సల్పిన, నబ్బలుమగండు సముద్దండ బాహుదండవిలాసుండై.** 193

ప్రతిపదార్థం: ఇవ్విధంబునన్; దొరలు= రాజులు (నాయకులు); తెగినను= చచ్చినా; పాంచాల ప్రభద్రక= పాంచాలురయొక్కయు; ప్రభద్రకుల యొక్కయు; మత్స్య= మాత్స్యులయొక్కయు; సైన్య శేషంబులు= సేనలలో మిగుళ్ళు; పోక పెనంగినన్= పోవకుండా పోరితే; అతండు= అశ్వత్థామ; మాతంగ వితాన విదళనంబు= ఏనుగుల గుంపుల ఖండనం; అప్పుడు; సలిపిన= చేసిన; కంఠీరవంబు= సింహం; తన మీఁదన్; హరిణ కులంబు= లేళ్ళ సమూహం; కవిసినన్= పడితే; ఎట్టి+అది+అగున్= ఎటువంటిది అవుతుందో; అట్టి-వాఁడు+అగుచున్= అటువంటివాడు అవుతూ; పేర్చి= విజృంభించి; ఆర్చెన్= అరిచాడు; ఆ+తెఱంగు తుములంబునన్= ఆ విధమైన దొమ్మియుద్ధంలో; పొడగానమిన్= కనబడకపోవటంచేత; పాండు నందనులు= పాండవులూ; కృష్ణ సాత్యకులును= కృష్ణుడూ, సాత్యకీ; ఆ శిబిరమునన్= ఆ విడిదలలో; లేక+ఉనికి= లేకపోవటం; ఎఱింగెన్= తెలిసికొన్నాడు; అప్పుడు; కనుంగొను జనంబులకున్= చూసే జనులకు; ఇతండు; అశ్వత్థామ; అను బుద్ధి= అనే తలంపు; పొడమెన్= పుట్టింది; అది ఎట్టు+అనినన్= అది ఎట్లా అంటే; కురు పాండవులు= కౌరవులూ, పాండవులూ; భండనంబున్= యుద్ధం; చేయన్+తొడంగిన+అది= మొదలుగాన్= చేయటం ప్రారంభించినది మొదలుకొని; రాత్రులు= రాత్రివేళలలో; అచ్చటి= జనులు; నీల తనువును= నల్లటి శరీరంగలదీ; రక్త+ఆస్య నయనయున్= ఎర్రటి ముఖమూ, కళ్ళూ కలదీ; రక్త+అంబర ధరయున్= ఎర్రటి బట్టలు ధరించినదీ; రక్తమాల్య+అనులేపనయున్= ఎర్రటి దండలూ, పూతలూ కలదీ అగు; లేమ ఒక్కతి= స్త్రీ ఒక్కర్తె; తమ వీటి వారు= తమ ప్రదేశంలో ఉన్నవాళ్ళు; నిద్రపోవుచున్+ఉండన్= నిద్రపోతూండగా; తలలు వీడన్= శిరోజాలు విడిపోగా; మేనులు= శరీరాలు; వికృతంబులు+ఐ వ్రేలన్= విరూపాలయి వ్రేలాడుతూ ఉండగా; పాశంబులన్= త్రాళ్ళతో; కరి తురగ సహితంబుగాన్= ఏనుగులతోనూ, గుర్రాలతోనూ; బంధించి= కట్టి; ఘోర సంరంభంబునన్= భయంకరమైన ఆటోపంతో; తెచ్చి తెచ్చి= తెగతెచ్చి; అశ్వత్థామ+అగ్ర భాగంబునన్= అశ్వత్థామ ఎదుట; పెట్టన్= పెట్టగా; అతండు= అతడు; ఉగ్రభావంబునన్= కోపంతో; తునుముచున్= ముక్కలు చేస్తూ; ఆర్చుచున్+ఉనికిన్= అరుస్తూండటం; కలలు+కాంతురు= కలలుకంటారు; ('కాంతురు' అనే ఈ తద్ధర్మక్రియ భూతార్థకమే- 'కాంచారు' అని అర్థం); అట్లు+ అగుటన్+చేసి= అందుచేత; నిద్రాసక్తులన్= నిద్రపోతూన్నవాళ్ళను; చంపుటయున్= చంపటమూ; ఆ+విధంబు+ఆర్పును= ఆ రీతి అరుపూ; ఏర్పడన్= స్పష్టంగా; అనుసంధించి= సమన్వయించుకొని; ఆ+కలల ఫలంబు కాకేమి= ఆ కలలఫలమే అని; తలంచి; చొచ్చి= ప్రవేశించి; పోటునకున్= యుద్ధానికి; ఆ+అరాతి= ఆ శత్రువు; రాత్రిమైన్= రాత్రివేళ; వచ్చుట= రావటం; నిశ్చయించి; అశ్వత్థామన్+కాన్= అశ్వత్థామనుగా; ఎఱింగిరి= తెలిసికొన్నారు; ఆ+వీరుండు= ఆ శూరుడు (అశ్వత్థామ); మెఱుంగు= మెరుపు; మెఱచిన+అట్లు= మెరిసిన విధంగా; వివిధ గతులన్= రకరకాలుగా; చరించినన్= ప్రవర్తించినా; చెండాడినన్= వధించినా; చూచియున్= చూచికూడా; ఈడంబోక= వెనుదీయక; రణక్రీడ= యుద్ధం; సల్పినన్= చేయగా; ఆ+బలు మగండు= ఆ మహావీరుడు (అశ్వత్థామ); సముద్దండ బాహుదండ విలాసుండు+ఐ= మిక్కిలి అధికమైన భుజాదండాల లీల కలవాడై.

తాత్పర్యం: ఈ విధంగా నాయకులు చచ్చినా, పాంచాల ప్రభద్రక మత్స్య సేనలలో మిగిలినవాళ్ళు పోక పోరితే, అతడు ఏనుగుల గుంపు నప్పుడు చంపిన సింహం తనమీదికి లేళ్ళగుంపు ఉరికితే ఎట్లా అవుతుందో అట్లా అవుతూ విజృంభించి అరిచాడు. ఆ రీతి దొమ్మియుద్ధంలో కనబడకపోవటంచేత పాండవులూ, కృష్ణార్జునులూ ఆ శిబిరంలో లేరని తెలిసికొన్నాడు. అప్పుడు చూచే జనాలకు ఇతడు అశ్వత్థామ అనే తలంపు కలిగింది. అది ఎట్లా అంటే, కౌరవులూ, పాండవులూ యుద్ధం చేయటానికి ప్రారంభించింది మొదలుకొని రాత్రివేళలలో అక్కడివాళ్ళు నల్లటి శరీరమూ, ఎర్రటిముఖమూ, కళ్ళూ, ఎర్రటి వస్త్రమూ, ఎర్రటి దండలూ, పూతా కల స్త్రీ ఒకతె తమ ప్రదేశంలో నిద్రపోతూన్నవాళ్ళను జుట్టువిడిపోయి, శరీరాలు విరూపాలయి వేలాడగా త్రాళ్ళతో ఏనుగులతోనూ, గుర్రాలతోనూ సహా బంధించి భయంకరాటోపంతో తెచ్చి తెచ్చి అశ్వత్థామ ఎదుట పెట్టగా కోపంతో అతడు ఖండిస్తూ అరుస్తూ ఉన్నట్లు కలలు కన్నారు. అందుచేత నిద్రిస్తూన్న వాళ్ళను చంపటం, ఆ విధంగా అరవటం బాగా సమన్వయించుకొని

అది అంతా ఆ కలల ఫలమే అని నిశ్చయించి, యుద్ధానికి ఆ శత్రువు రాత్రివేళ రావటం నిశ్చయించి అశ్వత్థామ అని గుర్తించారు. ఆ వీరుడైన అశ్వత్థామ మెరుపు మెరిసినట్లు రకరకాలుగా ప్రవర్తించటం, వధించటం చూచికూడా వెనుదీయక యుద్ధం చేయగా, ఆ మహావీరుడు గొప్ప భుజబలం కలవాడై.

విశేషం: అలం: ఉపమ. 'అతండు మాతంగ వితాన విదళనం బప్పుడు సలిపిన కంఠీరవంబు తన మీఁద హరిణకులంబు గవిసిన నెట్టిదగు నట్టివాఁ డగుచు' అలంకారం ఉపమ.

మహాస్రగ్ధర.

తలలన్ హస్తమ్ములం బాదములఁ దనువులం దత్ప్రదేశంబు గప్పం;
దొలఁగించున్ వానిఁ గ్రొన్నెత్తురు వఱపి, హయస్తోమదంతిప్రతానం
బుల మేదోమాంస ఖండంబుల దనుజమహాభోజనం బావహించు,
న్మలఁగం బాఱుం, జెలంగు, న్నలి నెసఁగు, జయోన్మత్తుఁడై మానవేంద్రా! 194

ప్రతిపదార్థం: మానవ+ఇంద్రా!= ఓ రాజా! ధృతరాష్ట్రా!; (పూర్వవచనంలోని 'అబ్బలుమగండు'-కర్త); జయోన్మత్తుఁడు+ఐ= గెలుపుచేత మిక్కిలి గర్వించినవాడై; తద్+ప్రదేశంబు= ఆ చోటిని; తలలన్= తలలతోనూ; హస్తమ్ములన్= చేతులతోనూ; పాదములన్= కాళ్ళతోనూ; తనువులన్= శరీరాలతోనూ; కప్పున్= కప్పాడు; క్రొత్త+నెత్తురు= క్రొత్తరక్తం; పఱపి= పారించి; వానిన్= ఆ తలలూ మొదలైన వాటిని; తొలఁగించున్= కొట్టుకుపోయేటట్లు చేశాడు; హయ-స్తోమ= గుఱ్ఱాల సమూహంయొక్క; దంతి ప్రతానంబుల= ఏనుగుల సమూహంయొక్క; మేదస్(ః)+మాంసఖండంబులన్= మెదడుతోనూ, మాంసపు ముక్కలతోనూ; దనుజ మహత్(మహా)+భోజనంబు= రాక్షసుల గొప్ప ఆహారం; ఆవహించున్= కల్పించాడు; మలఁగన్+పాఱున్= సంచరించాడు; చెలంగున్= సింహనాదం చేశాడు; నలిన్= ఉత్సాహంతో; ఎసఁగున్= అతిశయించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రా! ఆ అశ్వత్థామ విజయగర్వంతో ఆ యుద్ధరంగాన్ని తలలతోనూ, చేతులతోనూ, కాళ్ళతోనూ, శరీరాలతోనూ కప్పివేశాడు. క్రొత్త నెత్తురు పారించి వాటిని కొట్టుకుపోయేటట్టు చేశాడు. గుఱ్ఱాల, ఏనుగుల గుంపుల మేదస్సులతోనూ, మాంసపు ముక్కలతోనూ రాక్షసులకు గొప్ప ఆహారం కల్పించాడు. అతడు తిరిగాడు, సింహనాదం చేశాడు. ఉత్సాహంతో అతిశయించాడు.

విశేషం: ఇందులోని సమాపక క్రియలన్నీ తద్ధర్మార్థకాలయినా, భూతార్థస్ఫోరకాలు.

తే. అట్లు విహరించి హతశేషులైన జనులు । పాఱఁ గనుఁగొని రథమెక్కి పటురయమున
వారి వెనుకొని మెఱుఁగు వాలారు తూపు । గములు పరఁగించి యందఱ సమయఁజూచి. 195

ప్రతిపదార్థం: (పూర్వవచనంలోని 'అబ్బలుమగండు'-కర్త); అట్లు= ఆ రీతిగా; విహరించి= క్రీడించి; హతశేషులు+ఐన జనులు= చావగా మిగిలిన జనులు; పాఱన్+కనుఁగొని= పారిపోవటం చూచి; రథము+ఎక్కి; పటు రయమునన్= తీవ్రవేగంతో; వారిన్= ఆ పారిపోతూన్నవాళ్ళను; వెనుకొని= వెంటాడి; మెఱుఁగు వాలారు తూపు గములు= ప్రకాశించే వాడి బాణాల సమూహాలు; పరఁగించి= ప్రయోగించి; అందఱన్= అందరనీ; సమయన్+చూచి= చచ్చేటట్టు చూచి.

తాత్పర్యం: అశ్వత్థామ ఆ రీతిగా క్రీడించి, చావగా మిగిలిన జనులు పారిపోతూ ఉంటే చూచి రథం ఎక్కి, తీవ్రవేగంతో వాళ్ళను వెంబడించి, ప్రకాశించే వాడి బాణాల సమూహం ప్రయోగించి, అందరినీ చంపి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఆ కలన నట్లు సేసి మ। హాకుల జనతతులు గాఁగ నన్యస్థలులున్
భీకరరథగతుల నుద। గ్రాకృతియై మెఱసి యమ్ము లడరింపంగన్. 196

ప్రతిపదార్థం: (193 వచనంలోని 'అబ్బలుమగండు' - కర్త); ఆ కలనన్= ఆ ప్రదేశంలో; అట్లు+చేసి= ఆ విధంగా చేసి; అన్యస్థలులున్= ఇతర ప్రదేశాలు కూడా; మహా+ఆకుల జన తతులు+కాఁగన్= మిక్కిలి కలతచెందిన మనుష్యుల గుంపులు కలిగినవి కాగా; భీకర రథగతులన్= భయంకరమైన రథ గమనాలతో; ఉదగ్ర+ఆకృతి+ఐ= భయంకరాకారుడై; మెఱసి= ప్రకాశించి; అమ్ములు= బాణాలు; అడరింపంగన్= ప్రయోగించగా.

తాత్పర్యం: అశ్వత్థామ ఆ ప్రదేశంలో ఆ విధంగా చేసి, ఇతర స్థలాలు కూడా కలత చెందిన జనులు కలవి అవుతూఉండగా, భయంకర రథగమనాలతో, భయంకరాకారుడై ప్రకాశించి బాణాలు ప్రయోగించగా. (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఇట్లెసఁగు బహుళకోలాహలంబున హయంబులు నిభంబులుఁగట్లు దెంచుకొని కలయంబాఱెఁ; బాఱుటయు గోడిగలకై దంతపాతకలహంబులం గెరలుగుండ్లక్రందునను, నొండొంటి మదగంధంబులు సహింపక మార్కొని పోరాడు సామజంబుల సమ్మర్దంబునను, గాళ్ళు దునిసియుఁ, జేతులు నలసియు, నురంబు లవిసియు, వెన్నులు విఱిగియుఁ, బ్రక్కలు నొగిలియుఁ, దలలు పగిలియుఁ, జాఁపకట్టువడి చదిసియుఁ, గ్రంతలనిఱకటంపుఁ జోట్ల మానవకోట్లు పీనుంగు తిట్టలగుచుండఁ బలకయు వాలునుం గొని యవ్వాలుమగండు వేడుకం దేరుడిగ్గి యగ్గజంబులను ఘోటకంబులను బొదివి పాటవాటోపం బొప్పవిపాటన వినోదంబు సలిపె; నప్పుడు గొందఱు నెఱయ మేల్కనని భ్రమను, భయంబునను బాదంబులు గుదివడఁబాఱలేక నెలవెడలిన యెలుంగుల నస్తవ్యస్తపుమాటలాడఁ, గొందఱు జనకసహోదరాదులగు బంధువులఁ బేరుపేరం బిలుచుచుం దిరిగి కనుదిరిగి తమవారు గానివారల చెట్టలు వట్టుకొని చనఁ, గొందఱు కైదువులు గొని కదిసి నిదురకన్నులం బొదువు చెలులను జుట్టంబులను బగఱ యని సమయింపఁ, గొందఱెదురుగాఁ జనుదెంచినవా 'రిదియేమి?' యని యడుగ, 'నశ్వత్థామసొచ్చిపొడుచుచున్నవాఁ'డనిన, 'వాసుదేవార్జునులు శిబిరంబున లేమి నప్పాపాత్ముక కిట్లు సేయవచ్చెంగాక వారున్నఁదన్ను గాసిసేయరే?' యని పలుకఁ, గొందఱు 'బీభత్సుం డిట్టి పరాక్రమంబు సేసినం జూచి మనంబున రోయకుండునే? యతండెన్నఁ డేనియు వాహన వికలుఁడైనవానిని, చేత నాయుధంబులు లేని వానిని, దలవీడిన వానిని, వెఱచినవానిని, వెఱఁగుపడినవానిని, నిద్రించువానిని నొంచునే?' యని యర్జును నగ్గింప, నయ్యందఱ నగ్గురునందనుండు గురుతరంబయిన కురురాజు పరిభవంబు నప్పటప్పటికిఁ దలంపఁ బెంపారు దారుణ క్రూరత్వంబునఁ గోలుమసంగి, యించుక యరవాయిఁగొనక, చెండియుం, ద్రుంచియుం, జించియుఁ, దుంగమడుఁగుఁ జొచ్చిన మాతంగంబు పగిది బడలువడం జేసె; నా సమయంబున. 197

ప్రతిపదార్థం: ఇట్లు+ఎసఁగు= ఈ విధంగా అతిశయించే; బహుళ కోలాహలంబునన్= అధికమైన కలకలంతో; హయంబులున్= గుర్రాలూ; ఇభంబులున్= ఏనుగులూ; కట్లు తెంచుకొని= బంధనాలు తెంపుకొని; కలయన్+పాఱెన్= అన్నివైపులకూ పరుగెత్తాయి; పాఱుటయున్= పరుగెత్తగా; గోడిగలకై= ఆడగుర్రాలకోసం; దంత పాత కలహంబులన్= పళ్ళూడే పోట్లాటలలో; కెరలు= ఎగిరిపడే; గుండ్ల= రాళ్ళవలని; క్రందునను= ఉపద్రవంచేతా; ఒండొంటి మద గంధంబులు= పరస్పర మదవాసనలు;

సహింపక= ఓర్వక; మార్కొని= ఎదుర్కొని; పోరాడు= కలహించే; సామజంబుల= ఏనుగుల; సమ్మర్దంబునను= త్రొక్కుళ్ళచేతా; కాళ్ళు; తునిసియున్= ముక్కలయీ; చేతులు; నలిసియున్= విరిగీ; ఉరంబులు= రొమ్ములు; అవిసియున్= బ్రద్దలయీ; వెన్నులు= వెన్నుపూసలు; విఱిగియున్= విరిగీ; ప్రక్కలు; నొగిలియున్= నలిగీ; తలలు; పగిలియున్= పగిలీ; చాఁపకట్టు+పడి= నేలమట్టంగా పడి; చదిసియున్= చచ్చీ; క్రంతలన్= సందులలో; ఇఱుకటము+చోట్లన్= ఇరుకు ప్రదేశాలలో; మానవకోట్లు= మనుష్యుల సమూహాలు; పీనుంగు తిట్టలు+అగుచున్+ఉండన్= పీనుగుల ప్రోగులు అవుతూండగా; పలకయున్= డాలూ; వాలునున్= కత్తీ; కొని= పుచ్చుకొని; ఆ+వాలు మగండు= ఆ శూరుడు(అశ్వత్థామ); వేడుకన్= సంతోషంతో; తేరు= రథం; డిగ్గి= దిగి; ఆ+గజంబులను= ఆ ఏనుగులను; ఘోటకంబులను= గుర్రాలను; పొదివి= చుట్టుకొని; పాటవ+ఆటోపంబు= నేర్పుయొక్క అతిశయం; ఒప్పన్= ఒప్పగా; విపాటన వినోదంబు= ఖండించే వేడుక; సలిపెన్= చేశాడు; అప్పుడు; కొందఱు; నెఱయన్= పూర్తిగా; మేల్కనని= మేలుకొనని; భ్రమను= భ్రాంతి చేతనూ; భయంబునను= భయంతోనూ; పాదంబులు= కాళ్ళు; గుదివడిన్= కట్టువడిగా; పాఱన్+లేక= పరుగెత్తలేక; నెలవు+ఎడలిన+ఎలుంగులన్= పట్టుతప్పిన స్వరాలతో; అస్తవ్యస్తపు మాటలు ఆడన్= తారుమారు మాటలు మాటాడగా; కొందఱు; జనక సహోదర+ఆదులు+అగు= తండ్రి, సోదరుడు మొదలైన; బంధువులన్= చుట్టాలను; పేరపేరున్= పేరుపేరు వరుసను; పిలుచుచున్= పిలుస్తూ; తిరిగి= సంచరించి; కనుదిరిగి= కళ్ళు తిరిగి; తమవారు+కానివారల= తమ బంధువులు కాని వాళ్ళయొక్క; చెట్టలు+పట్టుకొని చనన్= చేతులు పట్టుకొని వెళ్ళగా; కొందఱు; కైదువులు+కొని= కత్తులు పుచ్చుకొని; కదిసి= సమీపించి; నిదుర కన్నులన్= నిద్రకళ్ళతో; పొదువు= చుట్టూఉన్న; చెలులను= మిత్రులనూ; చుట్టంబులను= చుట్టాలను; పగఱ+అని= శత్రవులని; సమయింపన్= చంపగా; కొందఱు; ఎదురుగాన్+చనుదెంచి వారు= ఎదురుగా వచ్చినవాళ్ళు; ఇది+ఏమి+అని+అడుగన్= ఇదే మిటని అడుగగా; అశ్వత్థామ; చొచ్చి= ప్రవేశించి; పొడుచుచున్+ఉన్నవాఁడు+అనినన్= చంపుతున్నాడని చెప్పగా; వాసుదేవార్జునులు= కృష్ణుడూ, అర్జునుడూ; శిబిరంబునన్= విడిదలలో; లేమిన్= లేకపోవటంచతే; ఆ+పాప+ఆత్మునకున్= ఆ దుర్మార్గుడికి; ఇట్లు= ఈ రీతిగా; చేయన్+వచ్చెన్+కాక= చేయడం సాధ్యమయింది కాని; వారు+ఉన్నన్= ఆ కృష్ణార్జునులు ఉంటే; తన్నున్= తనను; గాసి+చేయరే= నాశనం చేయరా; అని పలుకన్= అని పలుకగా; కొందఱు; బీభత్సుండు= అర్జునుడు; ఇట్టి పరాక్రమంబు చేసినన్= ఇటువంటి దుష్టమైన పరాక్రమం చేస్తే; చూచి; మనంబునన్= మనస్సులో; రోయక+ఉండునే= అసహ్యించుకోకుండా ఉంటాడా?; అతండు= అర్జునుడు; ఎన్నఁడు+ఏనియున్= ఎప్పుడైనా; వాహన వికలుఁడు+ఐన వానిని= భగ్న రథుడినీ; చేతన్= చేతిలో; ఆయుధంబులు లేని వానిని= ఆయుధాలు లేనివాడినీ; తలవీడినవానిని= జుట్టు ముడివీడిన వాడినీ; వెఱచిన వానిని= భయపడినవాడినీ; వెఱఁగు పడిన వానిని= నిశ్చేష్టుడైన వాడినీ; నిద్రించువానిని= నిద్రపోతూన్న వాడినీ; నొంచునే?= బాధిస్తాడా?; అని; అర్జునున్; అగ్గింపన్= పొగడగా; ఆ+అందఱన్= వాళ్ళందరినీ; ఆ+గురు నందనుండు= ఆ గురుపుత్రుడు అశ్వత్థామ; గురుతరంబు+అయిన= మిక్కిలి గొప్పదైన; కురురాజు పరిభవంబు= దుర్యోధనుడి పరాభవం; అప్పటప్పటికిన్= మాటిమాటికి; తలంపన్= స్మరించగా; పెంపు+ఆరు= ఎక్కువయ్యే; దారుణ క్రూరత్వంబునన్= భయంకరమైన క్రౌర్యంతో; కోలుమసంగి= విజృంభించి; ఇంచుక+అరవాయి+కొనక= కొంచెమైనా సందే హించక; వెండియున్= మళ్ళీ; త్రుంచియున్= ఖండించీ; చించియున్= నరికీ; తుంగ మడుగున్= తుంగగడ్డి అలమిన మడుగును; చొచ్చిన= ప్రవేశించిన; మాతంగంబు పగిదిన్= ఏనుగువలె; బడలు+పడన్+చేసెన్= అలయించాడు; ఆ సమయంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా అతిశయించే అధికమైన కలకలంలో గుర్రాలూ, ఏనుగులూ కట్లు తెంచుకొని అన్నివైపులకూ పరుగెత్తాయి. ఆడగుర్రాలకొరకు పళ్ళూడిపోయే పోట్లాటలలో ఎగిరిపడే రాళ్ళవలన కలిగే ఉపద్రవంచేతా, ఒకదాని మదవాసన ఇంకోదానికి సరిపడక ఒకదాని నొకటి ఎదుర్కొని పరుగెత్తే ఏనుగుల త్రొక్కిళ్ళచేతా కాళ్ళు ముక్కలయీ, చేతులు విరిగీ, రొమ్ములు బ్రద్దలయీ, వెన్నులు విరిగీ, ప్రక్కలు నలిగీ, తలలు పగిలీ నేలమట్టంగా పడి చచ్చీ, సందులలోనూ, ఇరుకుప్రదేశాలలోనూ మనుష్యుల సమూహాలు పీనుగులు గుట్టలుగుట్టలవుతూ ఉండగా, ఆ

శూరుడు డాలూ, కత్తీ పట్టుకొని సంతోషంతో రథం దిగి ఆ ఏనుగులనూ, గుర్రాలనూ చుట్టుముట్టి నేర్పు అతిశయించగా ఖండించి వినోదించాడు. అప్పుడు కొందరు పూర్తిగా మెలకువరాక భ్రాంతిచేతా, భయంతోనూ, కాళ్ళు కట్టుపడి పరుగెత్తలేక పట్టుతప్పిన స్వరాలతో తారుమారు మాటలు పలికారు. కొందరు తండ్రి, సోదరుడు మొదలైన చుట్టాలను పేరు పేరు వరసన పిలుస్తూ సంచరించి కళ్ళుతిరిగి తమ బంధువులు కానివాళ్ళ చేతులు పట్టుకొని వెళ్ళారు. కొందరు కత్తులు పుచ్చుకొని సమీపించి నిద్రకళ్ళతో చుట్టూ ఉన్న మిత్రులనూ, చుట్టాలనూ శత్రువు లనుకొని చంపారు. కొందరు ఎదురుగా వచ్చినవాళ్ళు ఇదేమి టని అడుగగా, అశ్వత్థామ వచ్చి చంపుతున్నా డని చెప్పగా, కృష్ణార్జునులిద్దరూ శిబిరంలో లేకపోవటంచేత ఆ దుర్మార్గుడు ఈ విధంగా చేయగలిగాడు కాని, వాళ్ళే ఉంటే అతడిని నాశనం చేసేవారుకారా అని అన్నారు. కొందరు ఇట్లాంటి దుష్పరాక్రమం చూపితే అర్జునుడు అసహ్యించుకొనకుండా ఉంటాడా? అతడెప్పుడైనా భగ్నరథుడినీ, నిరాయుధుడినీ, ముక్తకేశుడినీ, భీతుడినీ, నిశ్చేష్టుడినీ, నిద్రితుడినీ బాధిస్తాడా? అని అర్జునుడిని పొగిడారు. వాళ్ళందరినీ ఆ గురుపుత్రుడు - గురుతరమైన దుర్యోధనుడి పరాభవం మాటిమాటికి గుర్తుకు రాగా, ఎక్కువయ్యే భయంకర క్రౌర్యంతో విజృంభించి కొంచెమైనా సందేహించక మళ్ళీ త్రుంచీ చించీ తుంగగడ్డి అలుముకొన్న మడుగును ప్రవేశించిన ఏనుగువలె అలయించాడు. ఆ సమయంలో.

విశేషం: అలం: ఉపమ. 'తుంగ మడుగుఁ జొచ్చిన మాతంగంబు పగిది బడలువడం జేసె.' - అలంకారం ఉపమ.

సీ. **ఆ యోధవరు బారి కగ్గంబు గాక ద । వ్వుల భీతిఁ దలల చీరలును వీడఁ**
బాదంబులట దొట్రువడఁ బాఱి కొందఱు । మానవాధీశులు సైనికులును
విడిదల వాకిట వెడలుచోఁ గృప కృత । వర్మలఁగని వఱువట్లు వట్టు
పెదవులు దడుపుచు 'సదయతఁ గావరే' । యనుచు మ్రొక్కఁగ నమ్మహాత్ము లపుడు

తే. **రాక్షసావేశ సంభృత క్రౌర్యులగుట । నధిప! యాత్మీయ మానుషహాని దలఁప**
లేక వారలఁ బొదివి యనేకభల్ల । దారితులఁ జేసి రందఱఁ దరతరంబ. **198**

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! ధృతరాష్ట్రా!; కొందఱు-మానవ+అధి+ఈశులున్= కొంతమంది రాజులూ; సైనికులును= సైనికులూ; ఆ యోధవరు బారికిన్= ఆ వీరశ్రేష్ఠుడి హింసకు; అగ్గంబు+కాక= లోనుకాక; దవ్వులన్= దూరంగా; భీతిన్= భయంతో; తలల చీరలును వీడన్= తలపాగాలు ఊడిపోగా; పాదంబులు= కాళ్ళు; అట= అక్కడ; తొట్రు+పడన్= తడబడగా; పాఱి= పరుగెత్తి; విడిదల వాకిటన్+వెడలుచోన్= శిబిరం వెలుపలికి వెళ్ళేటప్పుడు; కృపకృతవర్మలన్+కని= కృపుడినీ; కృతవర్ముడినీ చూచి; వఱువట్లు+పట్టు= మిక్కిలి యెండిపోయిన; పెదవులు; తడుపుచున్= తడిచేసికొంటూ; సదయతన్= దయతో; కావరే= రక్షించరా, అనుచున్; మ్రొక్కఁగన్= నమస్కరించగా; ఆ+మహాత్ములు= ఆ మహనీయులు-కృపకృతవర్ములు; అపుడు; రాక్షస+ఆవేశ-సంభృత క్రౌర్యులు+అగుటన్= రాక్షసుల ఆవేశంతో కూడుకొన్న క్రూరత్వం గలవారవటంచేత; ఆత్మీయ మానుష హాని= తమ మనుష్యుల నాశనం; తలఁపన్+లేక= ఓర్చుకోలేక; వారలన్= వాళ్ళని; పొదివి= చుట్టుముట్టి; అందఱన్= అందరినీ; తరతరంబు+అ= క్రమక్రమంగా; అనేక భల్ల దారితులన్= పెక్కు బాణాలచేత చీల్చబడినవారిని; చేసిరి.

తాత్పర్యం: ఓ రాజా! ధృతరాష్ట్రా! కొంతమంది రాజులూ, సైనికులూ ఆ అశ్వత్థామ చేసిన హింసకు లోనుగాక దూరంగా భయంతో తలపాగాలు వీడీ, కాళ్ళు తడబడీ పరుగెత్తి, శిబిరంలో నుండి బయటికి వచ్చే కృపకృతవర్మలను

చూచి, మిక్కిలి ఎండిపోయే పెదవులను తడుపుకొంటూ 'దయతో రక్షించరా' అంటూ మ్రొక్కితే, ఆ మహాత్ములు అప్పుడు రాక్షసావేశక్రూరులై తమ పక్షీయుల నాశనం ఓర్వలేక చుట్టుముట్టి అందరినీ క్రమక్రమంగా పెక్కు బాణాలతో చీల్చివేశారు.

క. ధరణి నెఱిదప్ప నొఱగిన । కరిహయనరచయము లొఱలఁగాఁ గరుణము భూ
వర! యొరసె శిబిరమునఁ దన । కరయఁగఁ జేరుగడ లేమి నది వృథ యయ్యెన్. 199

ప్రతిపదార్థం: భూవర!= రాజా! ధృతరాష్ట్రా!; ధరణిన్= నేలమీద; నెఱి+తప్పన్= ఒప్పు తప్పేటట్టు; ఒఱగిన= వ్రాలిన; కరిహయ నర చయములు= ఏనుగుల, గుర్రాల, మనుష్యుల గుంపులు; ఒఱలఁగాన్= అరవగా; శిబిరమునన్= విడిదలలో; కరుణము= కరుణరసం; ఒరసెన్= వ్యాపించింది; అరయఁగన్= చూడఁగా; తనకున్; చేరుగడ= ఆశ్రయం; లేమిన్= లేకపోవటంచేత; అది= ఆ కరుణ రసం; వృథ+అయ్యెన్= వ్యర్థమయింది.

తాత్పర్యం: ఓ రాజా! ధృతరాష్ట్రా! నేలమీద ఒప్పు తప్పి వ్రాలిన ఏనుగుల, గుర్రాల, మనుష్యుల గుంపులు అరవగా శిబిరంలో కరుణరసం వ్యాపించింది. చూడగా తనకు ఆలంబనం లేకపోవటంచేత ఆ కరుణరసం వ్యర్థమయిపోయింది.

విశేషం: కరుణరసం శిబిరంలో వ్యాపించింది కాని దానికి ఆలంబన విభావం లేకపోవటం చేత - అంటే శిబిరం శూన్యం అవటంచేత అది వ్యర్థమయిపోయింది.

వ. అట్టియెడ. 200

తాత్పర్యం: అటువంటి సమయంలో.

మహాస్రగ్ధర.

దనుజవ్రాతంబు కాంతాతతియును బ్రజలుం దారు; నానా విధోగ్ర
ధ్వను లాకాశావకీర్ణత్వ మహిమఁ బొరయం, దంష్ట్ర లత్యంత ఘోర
త్వనిరూఢిం బొంద నార్చుం; దఱచుగ నగు; నుత్తారసల్లాపముల్ సే
యు; నలిం గ్రందారఁ బైపై నురవడిఁ గవియున్ హుంకృతాభీలభంగిన్. 201

ప్రతిపదార్థం: దనుజ వ్రాతంబు= రాక్షసుల సమూహం; కాంతా తతియును= భార్యల సమూహమూ; ప్రజలున్= బిడ్డలూ; తారున్= సంచరించింది; నానా విధ= పెక్కుభంగులైన; ఉగ్ర= భయంకరాలయిన; ధ్వనులు; ఆకాశ= ఆకాశంలో; అవకీర్ణత్వ= వ్యాప్తియొక్క; మహిమన్= గొప్పతనం; పొరయన్= పొందేటట్లు; దంష్ట్రలు= కోరలు; అత్యంత ఘోరత్వ నిరూఢిన్= మిక్కిలి భయంకరత్వ ప్రసిద్ధిని; పొందన్= పొందేటట్లు; ఆర్చున్= అరిచింది; తఱచుగన్= మాటిమాటికి; నగున్= నవ్వింది; ఉత్తార సల్లాపముల్= మిక్కుటమైన ధ్వనిగల సంభాషణలు; చేయున్= చేసింది; నలిన్= ఉత్సాహంతో; హుంకృత+అభీల భంగిన్= హుంకారంయొక్క భయంకర ప్రకారంతో; క్రందారన్= అతిదారుణమైన ధ్వని నిండగా; పైపైన్= మిక్కిలి; ఉరవడిన్= విజృంభణతో; కవియున్= ఉరికింది.

తాత్పర్యం: రాక్షస సమూహం తన భార్యలతో బిడ్డలతో సంచరించింది. అనేక విధాలయిన భయంకర ధ్వనులు ఆకాశంలో వ్యాపించేటట్లు, కోరలు మిక్కిలి భయంకరంగా కనిపించేటట్లు అరిచింది. మాటిమాటికి నవ్వింది. మిక్కుటమైన ధ్వనితో సంభాషించింది. ఉత్సాహంతో అతిదారుణధ్వనితో భయంకరంగా హుంకరిస్తూ మిక్కిలి విజృంభణంతో ఉరికింది.

విశేషం: ఇందులోని సమాపకక్రియలన్నీ తద్ధర్మార్థకాలయినా, అవి అన్నీ భూతార్థ స్ఫోరకాలు.

వ. ఇవ్విధంబున వివిధ వికారాననంబులు బహుళ భంగిక కరపాదంబులు గలుగు నపరిమిత క్రవ్యాదులు గవిసి మేదో మాంస మస్తిష్క మజ్జంబు లానుచుం జవియైన వానిం బుత్ర మిత్ర కళత్రాదుల కొసంగుచు నన్యకోటి బెరసిన యెడఁ ద్రోద్రోపు లాడి యవియుఁ గైకొనుచుం గీలాల పానంబున మత్తిల్లి నృత్యంబులు సేయుచు మఱియు ననేకప్రకారంబుల విహారంబు సలుపుచు నుల్లసిల్లిరి. పదంపడి యఱపీనుఁగు లొఱలుటయును దానవగణంబు కలకలంబును డిందువడియె నప్పుడు జగంబులు గొని కాలిన కాలాగ్నియుం బోలెఁ బాండవ శిబిరంబు నిరవశేషంబుగా సమయించి శమియించి చాపాచార్య నందనుండు మే నెత్తుట జొత్తిల్లి మోహాంధ్యంబుతోఁ గలసి యునికింజేసి సాంద్రతర రక్తసిక్తంబు లైన బాహుఖడ్గంబు లేక ద్రవ్యంబు చందంబు నొంద మరలి తాను బ్రవేశించు తఱి నెట్లుండె నట్ల నిశ్శబ్దం బైన యవ్విడిదల వెడలు చుండఁ దెలతెలవేగె; నిట్లు ప్రతిన నెఱపి కృపకృతవర్మల పాలికిం జనుదెంచి వారలతో నిట్లనియె. 202

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; వివిధ వికార ఆననంబులు= రకరకాలుగా వికృతాలైన ముఖాలు; బహుళ భంగిక కర పాదంబులు= పెక్కు విధాలైన చేతులు, కాళ్ళు; కలుగు; అపరిమిత క్రవ్యాదులు= అసంఖ్యాక రాక్షసులు; కవిసి= వ్యాపించి; మేదస్(ః)+మాంస మస్తిష్క మజ్జంబులు= మేదస్సూ, మాంసమూ, మస్తిష్కమూ, మజ్జా; ఆనుచున్= తింటూ; చవి+ఐన వానిన్= రుచిగలవాటిని; పుత్ర మిత్ర కళత్ర+ఆదులకున్= కొడుకులూ, స్నేహితులూ, భార్యలూ మొదలైన వారికి; ఒసంగుచున్= ఇస్తూ; అన్య కోటి= ఇతరుల సమూహం; బెరసిన+ఎడన్= కూడినప్పుడు; త్రోద్రోపులు+ఆడి= ఒకదాని నింకొకటి త్రోసుకుని; అవియున్= అవికూడా; కైకొనుచున్= తీసికొంటూ; కీలాల పానంబునన్= రక్తం త్రాగటంచేత; మత్తిల్లి= మదించి; నృత్యంబులు+చేయుచున్= నృత్యాలు చేస్తూ; మఱియున్= ఇంకా; అనేక ప్రకారంబులన్= పలు విధాల; విహారంబు సలుపుచున్= విహరిస్తూ; ఉల్లసిల్లిరి= సంతోషించారు; పదంపడి= పిమ్మట; అఱపీనుఁగులు= ప్రాణావశిష్టులైన ప్రాణులు; ఒఱలుటయును= మూలగగా; దానవ గణంబు కలకలంబును= రాక్షసుల గుంపు సందడీ; డిందు+పడియెన్= అణగింది; అప్పుడు; జగంబులు+కొని కాలిన కాల+అగ్నియున్+పోలెన్= లోకాలను ముట్టి కాలిన ప్రళయాగ్నిలాగా; పాండవ శిబిరంబున్= పాండువుల విడిదలను; నిరవశేషంబు+కాన్= పూర్తిగా; సమయించి= చంపి; శమియించి= శాంతించి; చాప+ఆచార్య నందనుండు= ధనుర్గురు పుత్రుడు - అశ్వత్థామ; మేః= శరీరం; నెత్తుటన్= రక్తంతో; జొత్తిల్లి= ఎర్రబడి; మోహ+ఆంధ్యంబుతోన్= మోహం అనే చీకటితో; కలిసి+ఉనికిన్+చేసి= కలిసియుండటంచేత; సాంద్రతర రక్తసిక్తంబులు+ఐన= మిక్కిలి ఎక్కువైన రక్తంతో తడిసిన వైన; బాహు ఖడ్గంబులు= చేయీ, కత్తీ; ఏకద్రవ్యంబు చందంబున్+ఒందన్= ఒక్క వస్తువులాగే ఉండగా; మరలి= తిరిగి; తాను; ప్రవేశించు+తఱిన్= ప్రవేశించునప్పుడు; ఎట్లు+ఉండెన్= ఎట్లా ఉందో; అట్లు+అ= అట్లే; నిశ్శబ్దంబు+ఐన= చప్పుడు లేని; ఆ+విడిదలన్= ఆ శిబిరంలోనుండి; వెడలుచున్+ఉండన్= బయటికి వస్తూంటే; తెలతెల వేగెన్= తెల్లవారింది; ఇట్లు; ప్రతిన= శపథం; నెఱపి= నెరవేర్చి; కృప కృతవర్మల పాలికిన్= కృపాచార్య కృతవర్మల దగ్గరకు; చనుదెంచి= వచ్చి; వారలతోన్= వారితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఈ విధంగా రకరకాలుగా వికృతాలైన ముఖాలూ, పెక్కురీతులైన చేతులూ కాళ్ళూ కలిగిన పెక్కుమంది రాక్షసులు గుమిగూడి మేదస్సూ, మాంసమూ, మస్తిష్కమూ, మజ్జా భుజిస్తూ రుచిగా ఉన్నవాటిని కొడుకులకూ, స్నేహితులకూ, భార్యలకూ ఇస్తూ, పరాయివాళ్ళు చేరితే గెంటివేసి వాటిని కూడా తీసికొంటూ, రక్తం త్రాగటంచేత మదించి నాట్యాలు చేస్తూ, ఇంకా అనేక విధాలుగా విహరిస్తూ ఒప్పారు. తరువాత ప్రాణావశిష్టులైన ప్రాణులు

మూల్లగా రాక్షస సమూహం సందడికూడా తగ్గింది. అప్పుడు లోకాలను తగులబెట్టే ప్రళయాగ్నివలె పాండవ శిబిరంలోని వాళ్ళను యావన్మందినీ చంపి శాంతించి అశ్వత్థామ శరీరం రక్తంతో ఎర్రబడి మోహపుచీకటితో కలిసి ఉండటంచేత అధిక రక్తంతో తడిసిన చేయీ కత్తీ ఒకే వస్తువువలె కనబడగా, మళ్ళీ తను ప్రవేశించినప్పుడు ఎట్లా ఉందో అలాగే నిశ్శబ్దంగా ఉన్న ఆ శిబిరంలోనుండి బయటకు వస్తూంటే తెల్లవారింది. ఇట్లా శపథం నెరవేర్చి కృపకృతవర్మల దగ్గరికి వచ్చి వాళ్ళతో ఇట్లా అన్నాడు:

విశేషం: మోహాంధ్యము - మోహమనే ఆంధ్యం - రూపకం. 'జగంబులు గొని కాలిన కాలాగ్నియుంబోలె' - అలంకారం ఉత్ప్రేక్ష.

అశ్వత్థామ పాండవ శిబిరంబు వెడలి కృపకృతవర్మలఁ గూడికొనుట (సం. 10-8-140)

సీ. **'సకల పాంచాలురు సమసిరి పాంచాలి । కొడుకు లందఱు జముకడకుఁ జనిరి;**
చేది మాత్స్య ప్రభద్రాది బలంబులు । నిరవశేషంబుగా నేలఁ గలిసె;
మాటలు పెక్కేల? మానిసి గుఱ్ఱ మే । నుం గను పేరెల్లఁ ద్రుంగెఁ బాండు
భూవరనందను లేవురుఁ గృష్ణుఁడు । సాత్యకియును నెందుఁ జనిరొ కాని

తే. **తండ్రియును నేలినాతఁడు దైన్యపడిన । దాని కరులపై వచ్చి యీశాను వరము**
గాంచి మీరలు పెనుఁబ్రాపు గాఁగ వీడు । దటియుటకు నెంతదగునంత పఱుపఁగంటి.' **203**

ప్రతిపదార్థం: సకల పాంచాలురున్= పాంచాలు రందరూ; సమసిరి= చచ్చారు; పాంచాలి కొడుకులు+అందఱున్= ద్రౌపది కొడుకు లందరూ; జముకడకున్= యముడి దగ్గరకు; చనిరి= వెళ్ళారు, చచ్చిపోయారు; చేది మాత్స్య ప్రభద్ర+ఆది బలంబులు= చేది బలాలూ, మాత్స్యబలాలూ, ప్రభద్రకుల బలాలూ మొదలైనవి; నిరవశేషంబుగాన్= ఏమీ మిగలకుండా; నేలన్+కలిసెన్= నశించాయి; మాటలు పెక్కు+ఏల?= ఇన్ని మాటలెందుకు?; మానిసి= మనుష్యుడు; గుఱ్ఱము; ఏనుంగు+అను పేరు+ఎల్లన్= ఏనుగు అనే మాట సర్వం; త్రుంగెన్= నశించింది; పాండు భూవర నందనులు+ఏవురున్= పాండురాజు కొడుకు లైదుగురూ; కృష్ణుడున్; సాత్యకియును; ఎందున్+చనిరొ కాని= ఎక్కడికి వెళ్ళారో కాని; తండ్రియును= నా తండ్రియైన ద్రోణుడూ; ఏలిన+ఆతఁడున్= రాజైన దుర్యోధనుడూ; దైన్యపడిన దానికిన్= దీనత్వం పొందిన దానికి; అరులపైన్= శత్రువులపైకి; వచ్చి; ఈశాను వరము= ఈశ్వరుడి వరం; కాంచి= పొంది; మీరలు= మీరిద్దరూ; పెను+ప్రాపు+కాఁగన్= పెద్ద అండకాగా; వీడు= శిబిరం; తటియుటకున్= సమీపించటానికి; ఎంత+తగున్= ఎంత తగుతుందో; అంత= అంతా; పఱుపన్+కంటిన్= బాధించగలిగాను.

తాత్పర్యం: 'పాంచాలు రందరూ చచ్చారు. ద్రౌపది కొడుకులు అందరూ నశించారు. చేది మాత్స్య ప్రభద్రకాదుల సేనలు ఏమీ మిగలకుండా నశించాయి. ఇన్ని మాటలెందుకు? మనుష్యుడు, గుర్రం, ఏనుగు అనే మాటలేకుండా పోయింది. పాండవు లైదుగురూ, కృష్ణుడూ, సాత్యకీ ఎక్కడకు వెళ్ళారో కాని, నా తండ్రీ, నా ప్రభువూ దైన్యం పొందినందుకు శత్రువులపై దండెత్తి వచ్చి, ఈశ్వరుడి వరం పొంది, మీరు పెద్ద అండకాగా, నేను శిబిరం ప్రవేశించటానికి ఎంత తగుతుందో అంతా చేసి బాధించాను.'

వ. అని చెప్పిన వినుచు మున్ను రాక్షసావేశంబునం జేసి నీచపరాక్రమంబు లాచరించి తదనంతరంబ తెలిసి యా రథికవరులు వగం బొగులుచున్నవారు గావున నగ్గురునందన నగ్గింపం దలంపక యూరకుండి తమ మనోవికృతి యతం డెఱుంగకమున్న తలలు వంచుకొని తగు తెఱంగునఁ బొగడిన నతండు. 204

ప్రతిపదార్థం: అని; చెప్పినన్; వినుచున్; మున్ను= మొదట; రాక్షస+ఆవేశంబునన్+చేసి= రాక్షసు డావేశించటం చేత; నీచ పరాక్రమంబులు= తుచ్ఛ పరాక్రమాలు; ఆచరించి= చేసి; తద్+అనంతరంబు+అ= ఆ పిమ్మటనే; తెలిసి= గ్రహించి; ఆ రథికవరులు= ఆ రథికశ్రేష్ఠులైన కృపకృతవర్మలు; వగన్= పశ్చాత్తాపంతో; పొగులుచున్+ఉన్నవారు+కావునన్= బాధపడుతున్నారు కాబట్టి; ఆ+గురునందనున్= ఆ గురుపుత్రుడిని-అశ్వత్థామను; అగ్గింపన్+తలంపక= పొగడనెంచక; ఊరక+ఉండి; తమ మనస్(ః)+వికృతి= తమ మనస్సులోని మార్పు; అతండు; ఎఱుంగక మున్ను+అ= తెలిసికోవటానికి ముందే; తలలు వంచుకొని; తగు తెఱంగునన్= తగిన విధంగా; పొగడినన్= పొగడగా; అతండు= అశ్వత్థామ.

తాత్పర్యం: అని చెప్పగా వింటూ మొదట రాక్షసు డావేశించటం చేత తుచ్ఛంగా పరాక్రమించి, ఆ వెంటనే గ్రహించికొని ఆ రథిక శ్రేష్ఠులైన కృపకృతవర్మలు పశ్చాత్తాపంతో తపిస్తున్నారు కాబట్టి ఆ గురుపుత్రుడిని పొగడటానికి ఇచ్ఛగించక ఊరుకొని తమ మనస్సు మార్పు అతడు గ్రహించటానికి ముందే తలలు వంచుకుని సముచిత రీతిని పొగడితే, అతడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'పాండుతనయులు నాచేతఁ బట్టువడుట । తెగుట గలిగిన ననుఁ గొంత పొగడఁ దగును;
జలముమై రిత్తవాండ్రను జంపు టరయ । మీరు గొనియాడు నంతటి పౌరుషంబె?' 205

ప్రతిపదార్థం: పాండు తనయులు= పాండురాజు కొడుకులు- పాండవులు; నాచేతన్; పట్టువడుట= చిక్కటం; తెగుట= చావటం; కలిగినను= సంభవిస్తే; ననున్= నన్ను; కొంత; పొగడన్+తగును= పొగడటం మంచిది; చలముమైన్= పట్టుదలతో; రిత్తవాండ్రను= పనికిమాలినవాళ్ళను- అల్పులను; చంపుట; అరయన్= చూడగా; మీరు; కొనియాడు+అంతటి= పొగిడేటంత; పౌరుషంబు+ఎ?= పౌరుషమా? (కాదనుట).

తాత్పర్యం: 'పాండవులు నా చేత చిక్కటం, చావటం సంభవిస్తే నన్ను ఏదో కొంత పొగడటం మంచిది. పట్టుపట్టి పనికిమాలిన వాళ్ళను చంపటం 'మీరు పొగిడేటంతటి పౌరుషమా?'

వ. అనిన విని వారలు 'ధృష్టద్యుమ్న ప్రముఖ పాంచాలురను బ్రతివింధ్యాది ద్రౌపదేయులను బేరుకొని వారివారి బలంబులను మాత్స్యానీకప్రభృతి సైన్యంబులను నొక్కరూపేనియుఁ ద్రిక్కకుండ నొక్కరుండవ రెండు జాములలో నేలం గలిపితి; కరం బచ్చెరువుగాదె!' యని యతనిం గౌఁగిలించుకొని రనుటయు సంజయునకు ధృతంరాష్ట్రుం డిట్లనియె: 206

ప్రతిపదార్థం: అనినన్; విని; వారలు; ధృష్టద్యుమ్న ప్రముఖ పాంచాలురను= ధృష్టద్యుమ్నుడు మొదలైన పాంచాలురనూ; ప్రతివింధ్య+ఆది-ద్రౌపదేయులను= ప్రతివింధ్యుడూ మొదలైన ద్రౌపదీకుమారులనూ; పేరుకొని= పేర్కొని; వారి వారి బలంబులను= వారి వారి సేనలనూ; మాత్స్య+అనీక ప్రభృతి సైన్యంబులను= మాత్స్య సైన్యం మొదలైన సైన్యాలనూ; ఒక్కరూపు+ఏనియున్+త్రిక్కక+ఉండన్= ఒక్క మనిషికూడా మిగలకుండా; ఒక్కరుండవు+అ= ఒక్కడివే; రెండు జాములలో; నేలన్+కలిపితి(వి)= నశింపజేశావు; కరంబు= మిక్కిలి; అచ్చెరువు+కాదె?= ఆశ్చర్యం కాదా?; అని; అతనిన్= అతడిని; కౌఁగిలించుకొనిరి; అనుటయున్; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని వాళ్ళు 'ధృష్టద్యుమ్నాది పాంచాలురనూ, ప్రతివింధ్యాది ద్రౌపదీ కుమారులనూ పేర్కొని వారి వారి సేనలనూ మాత్స్యసైన్యం మొదలైన సైన్యాలనూ ఒక్కడు కూడా మిగలకుండా ఒక్కడవే రెండు జాములలో రూపుమాపావు. ఇది అత్యంతం ఆశ్చర్యకరం కాదా?' అని అతడిని కౌగలించుకొన్నారు. అని చెప్పగా ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇలా అన్నాడు:

క. 'కురుపతికి జయము గోరెడు । గురుపుత్త్రుఁడు మున్న యేలొకో యిటు తఱికిం
జొరక యెడ మడిసినను మఱి । వెరవుం జేవయును జూప వేడుక వడియెన్.' 207

ప్రతిపదార్థం: కురుపతికిన్= కురురాజునకు- దుర్యోధనుడికి; జయము; కోరెడు; గురుపుత్త్రుఁడు= అశ్వత్థామ; మున్న= ముందే; ఏల+ఒకో= ఎందుచేత; ఇటు= ఈ రీతిగా; తఱికిన్+చొరవ= సమయానికి పూనుకోక; ఎడ మడిసినను= అదను తప్పగా; మఱి= తరువాత; వెరవున్= ఉపాయమూ; చేవయును= బలమూ; చూపన్= ప్రదర్శించటానికి; వేడుక పడియెన్= ఉత్సహించాడు.

తాత్పర్యం: 'దుర్యోధనుడికి జయం కోరే అశ్వత్థామ ముందే ఎందుకో ఈ రీతిగా సమయానికి పూనుకోక, సమయం మించిన తరువాత ఉపాయమూ, బలమూ ప్రదర్శించటానికి ఉత్సహించాడు.'

వ. అనిన యమ్మహీపతి కతం డిట్లనియె. 208

ప్రతిపదార్థం: అనిన+ఆ+మహీపతికిన్= అని పలికిన ఆ ధృతరాష్ట్రుడికి; అతండు= సంజయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అట్లా అడిగిన ఆ ధృతరాష్ట్రుడితో సంజయు డిట్లా అన్నాడు:

ఉ. 'పాండు నృపాలనందనుల బాహుబలంబున కోడి యాతఁడు
ద్దండతఁ గుంది యుండి వసుధావరునూరులు నుగ్గుసేసి భీ
ముండు దదుత్తమాంగము సముద్ధతిఁ దన్నిన దాన శోకముం
జండతర ప్రకోపము నసహ్యపు వేదన సేయ నత్తఱిన్. 209

ప్రతిపదార్థం: ఆతఁడు= అశ్వత్థామ; పాండు నృపాల నందనుల= పాండురాజు కొడుకులయొక్క; బాహు బలంబునకున్= భుజపరాక్రమానికి; ఓడి= భయపడి; ఉద్దండతన్= అధికంగా; కుంది+ఉండి= బాధపడి ఉండి; భీముండు; వసుధావరు+ఊరులు= రాజు (దుర్యోధనుడి) తొడలు; నుగ్గు+చేసి= విరుగగొట్టి; తద్+ఉత్తమాంగమున్= అతడి శిరస్సును; సముద్ధతిన్= మిక్కిలి గర్వంతో; తన్నినన్= తన్నితే; దానన్= ఆ కారణంచేత; శోకమున్= దుఃఖమూ; చండతర ప్రకోపమున్= మిక్కిలి తీవ్రమైన కోపమూ; అసహ్యము+వేదన= దుస్సహమైన బాధ; చేయన్= చేయగా; ఆ+తఱిని= అప్పుడు.

తాత్పర్యం: 'అశ్వత్థామ పాండవుల భుజపరాక్రమానికి వెరచి అధికంగా బాధపడుతూ ఉండి, భీముడు దుర్యోధనుడి తొడలు విరుగగొట్టి అతడి శిరస్సును తన్నిన కారణంచేత, దుఃఖమూ, తీవ్రమైన కోపమూ దుస్సహమైన వేదనా కలుగగా, అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. గురుని చావు తెలఁగు క్రొత్తయై మనమున । నావహిల్లుటయు మహాగ్రహమున
బాసయిచ్చి రాజు పనుపును బడసి యు । దగ్రవృత్తి నరిగి యట్లు సేసె. 210

ప్రతిపదార్థం: (పూర్వపద్యంలోని 'ఆతఁడు' కర్త) గురుని చావు తెలఁగు= తండ్రి మరణవిధం; క్రొత్త+ఐ= అపూర్వమై; మనమునన్= మనస్సులో; ఆవహిల్లుటయున్= ఉండగా; మహా+ఆగ్రహమునన్= మిక్కిలి కోపంతో; బాస+ఇచ్చి= శపథంచేసి; రాజు పనుపును= దుర్యోధనుడి ఆనతిని; పడసి= పొంది; ఉదగ్ర వృత్తిన్= భయంకరవ్యాపారంతో; అరిగి= వెళ్ళి; అట్లు+చేసెన్= ఆ విధంగా చేశాడు.

తాత్పర్యం: తండ్రి చచ్చిన విధం అపూర్వమై మనస్సులో నాటగా మహాక్రోధంతో శపథం చేసి, రాజానుమతిని పొంది, భయంకరోద్యోగంతో వెళ్ళి ఆ రీతిగా చేశాడు.

ఉ. తా వెసఁ బోవునప్డు బలదర్ప సమగ్రులు పాండుపుత్రు ల
చ్చో వసియింపకున్కిఁ దనచూచిన కార్య మతం డొనర్చె; దే
వావలికైన నత్తెఱఁగు నాక్రమలీలలు సెల్ల నేర్చునే?
భూవర! వారలున్న విధిపోకలఁ బోవుట గాక యంతయున్.' 211

ప్రతిపదార్థం: తాన్= తాను(అశ్వత్థామ); వెసన్= శీఘ్రంగా; పోవు+అప్డు= వెళ్ళినపుడు; బల దర్ప సమగ్రులు= పరాక్రమ గర్వంతో నిండినవారు(అగు); పాండుపుత్రులు= పాండురాజు కొడుకులు; ఆ+చోటన్= ఆ ప్రదేశంలో; వసియింపక+ఉన్కిన్= ఉండకపోవటంచేత; అతండు= అశ్వత్థామ; తన చూచిన కార్యము= తను అనుకున్న పని; ఒనర్చెన్= చేశాడు; భూవర!= ఓ రాజా! ధృతరాష్ట్రా!; వారలు+ఉన్నన్= పాండవులు ఆ సమయంలో అక్కడ ఉన్నట్లయితే; ఆ+తెఱఁగు+ఆక్రమ లీలలు= ఆ విధమైన ఆక్రమణపు తీరులు; దేవావలికైనన్= దేవతల సమూహానికైనా; చెల్లన్+నేర్చునే= సాగగలిగేవా?; అంతయున్= అంతా; విధి పోకలన్= దైవగతులలో; పోవుట+కాక= పోవుటమే కదా!

తాత్పర్యం: అశ్వత్థామ శీఘ్రంగా వెళ్ళినప్పుడు పరాక్రమగర్వంతో నిండిన పాండవులు అక్కడ లేకపోవటంచేత అశ్వత్థామ తాననుకొన్న పని చేశాడు. ధృతరాష్ట్రా! దైవగతి ననుసరించి అంతా నడవటం తప్ప, పాండవులు అక్కడే ఉన్నట్లయితే అశ్వత్థామ చేసిన ఆ విధమైన ఆక్రమణపు తీరులు దేవతల సమూహానికి కూడా సాగగలిగేవా?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. విధి నిర్ణయంవలన అంతా అట్లా జరిగింది కాని పాండవులు అక్కడే ఉన్నట్లయితే అశ్వత్థామ చేసిన ఆక్రమణలు దేవతలు కూడా చేయగలిగేవారు కారని భావం. దేవతలకు కూడా సాధ్యం కాదంటే, అశ్వత్థామ మాట వేరే చెప్పాలా? అనటంచేత అలంకారం కావ్యార్థాపత్తి.

వ. అని చెప్పి విను మట్లు కృపకృతవర్మలచేత సంభావితుండై కుంభసంభవసంభవుండు వారలతో మనమిఁక 'మనుజపతి కడకుఁ దడయక పోవలయుఁ బుణ్యంబున మనము వోపునంతకుం బ్రాణంబులు గలిగి యుండెనేని యిత్తెఱం గెఱింగింత' మనుటయు వార లట్లకాక యని యచ్చోటు గదలి యమ్మువ్వురును భూవల్లభసల్లాప కుతూహలంబున రయంబునం జనుదెంచి. 212

ప్రతిపదార్థం: అని చెప్పి; వినుము; అట్లు; కృప కృతవర్మల చేతన్; సంభావితుండు+ఐ= ఆదరింపబడినవాడయి; కుంభసంభవ సంభవుండు= ద్రోణుడి కొడుకు-అశ్వత్థామ; వారలతోన్= ఆ కృపకృతవర్మలతో; మనము; ఇఁకన్; మనుజపతి కడకున్=రాజు

(దుర్యోధనుడి) దగ్గరకు; తడయక= ఆలస్యం చేయకుండా; పోవలయున్= వెళ్ళాలి; పుణ్యంబునన్= అదృష్టం వలన; మనము; పోవు+అంతకున్= వెళ్ళేటప్పటికి; ప్రాణంబులు+కలిగి+ఉండెన్+ఏని= బ్రదికి ఉన్నట్లయితే; ఈ+తెఱంగు= ఈ విధం; ఎఱింగింతము= చెపుదాము; అనుటయున్= అనగా; వారలు; అట్లు+అ కాక= అట్లాగే అని; ఆ+చోటు= ఆ ప్రదేశం; కదలి; ఆ+మువ్వురును= ఆ ముగ్గురూ; భూ వల్లభ సల్లాప కుతూహలంబునన్= రాజుతో సంభాషించే కోరికతో; రయంబునన్= వేగంగా; చనుదెంచి= వచ్చి.

తాత్పర్యం: అని చెప్పి, ధృతరాష్ట్రా! వినుము. ఆ రీతిగా కృప కృతవర్మల చేత ఆదరించబడినవాడయి అశ్వత్థామ వాళ్ళతో 'ఇంక మనం దుర్యోధనుడి దగ్గరికి వెంటనే వెళ్ళాలి. అదృష్టవశంచేత మనం వెళ్ళే సరికి అతడు బ్రదికి ఉంటే, జరిగినదంతా చెపుదాము' అనగా, వాళ్ళు అట్లే అన్నారు. ఆ ముగ్గురూ అక్కడినుండి బయలుదేరి రాజుతో మాట్లాడాలనే కోరికతో వేగంగా వచ్చి.

అశ్వత్థామాది రథికత్రయంబు దుర్యోధనుం గనుంగొనుట (సం. 10-9-1)

తే. **రక్త సంసిక్తమైన ధరాతలమున । నార్తిఁ బొరలుచు నూర్పు లందంద సంద**
డింప జీవంబు వెడల నుంకింపఁ జేష్ట । లొయ్యనొయ్యన యడఁగంగ నున్న యధిపు. **213**

ప్రతిపదార్థం: రక్త సంసిక్తము+ఐన= రక్తంతో బాగా తడిసిన; ధరాతలమునన్= నేలమీద; ఆర్తిన్= బాధతో; పొరలుచున్= అటూ ఇటూ దొర్లుతూ; ఊర్పులు= శ్వాసలు; అందంద= మిక్కిలి; సందడింపన్= అధికంకాగా; జీవంబు= ప్రాణంబు; వెడలన్+ఉంకింపన్= పోవటానికి సిద్ధమవగా; చేష్టలు; ఒయ్యనొయ్యన= క్రమక్రమంగా; అడఁగంగన్= ఉడుగగా; ఉన్న+అధిపున్= ఉన్న రాజును- దుర్యోధనుడిని.

తాత్పర్యం: నెత్తుటితో తడిసిన నేలమీద బాధతో అటూ ఇటూ దొర్లుతూ, మిక్కిలి ఆయాసపడుతూ, ప్రాణం పోవటానికి సిద్ధపడి, క్రమక్రమంగా చేష్టలుడిగిన దుర్యోధనుడిని. (తరువాత పద్యంతో అన్వయం).

మహాస్రగ్ధర.

కని శోకం బాత్మలం దగ్గలముగ రథముల్ గ్రక్కునన్ డిగ్గి, భూమిన్
ధనువుల్ వోవైచి, భాష్పోద్గమము వొదువు వక్త్రంబులన్ విప్రలాపం
బును దైన్యం బావహిల్లం బొరలుచుఁ బొరి నా భూవిభున్ శాంతదృష్టిం
గనుఁగొంచుం జేరి, కే లంగముపయి నిడుచుం గౌఁగిటం జేర్చుకొంచున్. **214**

ప్రతిపదార్థం: కని= చూచి; శోకంబు= దుఃఖం; ఆత్మలందున్= మనస్సులలో; అగ్గలముగన్= అధికంకాగా; రథముల్; గ్రక్కునన్= శీఘ్రంగా; డిగ్గి= దిగి; భూమిన్= నేలమీద; ధనువుల్= విల్లులు; పోన్+వైచి= పడవేసి; బాష్ప+ఉద్గమము= కన్నీటిపొంగు; పొదువు వక్త్రంబులన్= ఆక్రమించే ముఖాలలో; విప్రలాపంబును= ప్రేలాపనా; దైన్యంబు= విచారం; ఆవహిల్లన్= కలుగగా; పొరలుచున్= ఉంటూ; పొరిన్= మాటికి; ఆ భూవిభున్= ఆ రాజును-దుర్యోధనుడిని; శాంతదృష్టిన్= శాంతమైన చూపుతో; కనుఁగొంచున్= చూస్తూ; చేరి= సమీపించి; కేలు= చేయి; అంగముపయిన్= అతడు శరీరంమీద; ఇడుచున్= పెడుతూ; కౌఁగిటన్+చేర్చుకొంచున్= కౌగిలించుకుంటూ.

తాత్పర్యం: చూచి మనస్సులలో దుఃఖం అధికంకాగా, వెంటనే దిగి నేలమీద విల్లులు పడవైచి, కన్నీళ్ళు క్రమ్మే వదనాలలో ప్రేలాపనా, దుఃఖమూ కలుగగా, మాటి మాటికి ఆ రాజును శాంతదృష్టితో చూస్తూ, చేరి, చేయి అతడి శరీరంమీద ఉంచుతూ, కౌగిలించుకొంటూ. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. పురపురఁ బొక్కి యా నృపతిపుంగవు చుట్టును నుండి 'యక్కటా!
ధరణి సమస్తమున్ భవదుదారమహాజ్ఞకు లోను సేసి యి
ప్పరుసున నీవు దీనతకు భాజనమైతి; విధాత కెందు దు
ష్కర మగు కార్యముం గలదె? కౌరవనాయక! మ మ్మెఱుంగుదే?' 215

ప్రతిపదార్థం: పురపురన్+పొక్కి= పురపుర ఏడ్చి; ఆ నృపతి పుంగవు చుట్టునున్+ఉండి= ఆ రాజశ్రేష్ఠుడి చుట్టూ ఉండి; అక్కటా!= అయ్యో!; ధరణిన్+సమస్తమున్= భూమినంతనూ; భవత్+ఉదార మహా+ఆజ్ఞకున్= నీ తిరుగులేని ఆజ్ఞకు; లోను+చేసి= వశంచేసి; ఈ+పరుసునన్= ఈ రీతిగా; నీవు; దీనతకున్= దైన్యానికి; భాజనము+ఐతి(వి)= పాత్రుడవయ్యావు; విధాతకున్= బ్రహ్మకు; ఎందున్= ఎక్కడైనా; దుష్కరము+అగు= చేయరాని; కార్యమున్= పని అంటూ; కలదె?= ఉందా?; కౌరవనాయక!= కురురాజా!; మమ్మున్+ఎఱుంగుదే?= మేమెవరమో తెలుసా?

తాత్పర్యం: పురపురా ఏడ్చి ఆ రాజోత్తముడి చుట్టూ ఉండి 'అయ్యో! భూమినంతనూ నీ తిరుగులేని ఆనకు వశం చేసి ఈ విధంగా నీవు దైన్యం పొందావు. బ్రహ్మకు చేయరాని పనంటూ ఎక్కడైనా ఉన్నదా? కురురాజా! మమ్ములను గుర్తుపట్టావా?'

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 'విధాత కెందు దుష్కరమగు కార్యముం గలదె?' అనే సామాన్యంచేత విశేషం సమర్థించబడినది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

క. అన నప్పలుకులు వెడ వెడ । విని యా విభుఁ డల్లఁ గన్ను విచ్చిన వదనం
బునఁ జూడ్కి నిలిపి కలశజ । తనయుం డి ట్లనియె గద్గదగళుం డగుచున్. 216

ప్రతిపదార్థం: అనన్= అనగా; ఆ+పలుకులు= ఆ మాటలు; వెడవెడ విని= అశ్రద్ధగా; విని; విభుఁడు= రాజు-దుర్యోధనుడు; అల్లన్= మెల్లగా; కన్ను విచ్చినన్= కళ్ళు తెరువగా; కలశజ తనయుండు= కుంభజుడి కొడుకు- అశ్వత్థామ; వదనంబునన్= (అతడి) ముఖంపై; చూడ్కిన్= చూపును; నిలిపి; గద్గద గళుండు+అగుచున్= డగ్గుత్తిక పడిన కంఠంగలవాడు అవుతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా ఆ మాటలు అశ్రద్ధగా విని దుర్యోధనుడు మెల్లగా కళ్ళు తెరవగా, ఆ అశ్వత్థామ అతడి ముఖంమీద చూపు నిలిపి డగ్గుత్తికపడ్డ స్వరంతో ఇట్లా అన్నాడు:

చ. 'అమితబలంబు దర్పమును నద్భుత ధీరతయున్ గదాపరి
శ్రమముఁ బొగడ్త కెక్కు నినుఁ జక్క నెదుర్చుట గాక పోర రం
ధ్రముగని యొక్కఁ డుద్ధతి గదం దెగటార్చుట గల్లెనట్టె యిం
క మగల కెట్టివారలకుఁ గల్గ దపాయము దైవ మల్గినన్? 217

ప్రతిపదార్థం: అమిత బలంబున్= అపార పరాక్రమమూ; దర్పమును= గర్వమూ; అద్భుత ధీరతయున్= ఆశ్చర్యకరధైర్యమూ; గదా పరిశ్రమమున్= గదా విద్యాభ్యాసమూ; పొగడ్తకున్+ఎక్కు నినున్= ప్రశంసనీయుడవైన నిన్ను; చక్కన్= చక్కగా; ఎదుర్చుట+కాక= ఎదిరించకుండా; పోరన్= యుద్ధంలో; రంధ్రము+కని= సందు కనిపెట్టి; ఒక్కఁడు; ఉద్ధతిన్= ఔద్ధత్యంతో;

గదన్= గదతో; తెగటార్చుట= వధించటం; కల్గెన్+అట్టె= సంభవించిందట; దైవము= విధి; అల్గినన్= ఆగ్రహిస్తే; ఇంకన్; మగలకున్+ఎట్టి వారలకున్= ఎటువంటి శూరులకైనా; అపాయము= హాని; కల్గదు?= సంభవించదు?

తాత్పర్యం: 'అపార పరాక్రమమూ, అహంకారమూ, ఆశ్చర్యకర ధైర్యమూ, గదాయుద్ధాభ్యాసమూ ప్రశంసనీయాలై ఉన్న నిన్ను చక్కగా యుద్ధంలో ఎదిరించాలే కాని యుద్ధంలో అవకాశం గమనించి, ఒకానొకడు ఔద్ధత్యంతో గద పుచ్చుకొని కొట్టటం సంభవించిందట! దైవానుగ్రహం లేకపోతే, ఇంక ఎంతటి శూరులయితే మాత్రం అపాయం సంభవించకుండా ఉంటుందా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. భీముడు సందు కనిపెట్టి తొడలు విరగ్గొట్టి దుర్యోధనుడిని నేల కూలుస్తాడు. దుర్యోధనుడు నేలకూలటం దైవం ఆగ్రహించటంవల్లనే కాని, పరాక్రమలోపంవలన కాదని అశ్వత్థామ ప్రశంస. ఇందులో సామాన్యాంశంచేత విశేషాంశం సమర్థించబడింది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

చ. **దురమునఁ బెంపుఁ జేవయును దుర్దమలీల వెలుంగుచుండ సు**
స్థిరత శమంతపంచక విశిష్ట తలంబునఁ బోరి సద్గతిన్
బొరసెదు; నీకునై వగపు పుట్టదు; బంధులు, రాజు, దేవులుం
దిరియుదు రింక; వారి దగు దీనత కోర్వక యుమ్మలించెదన్. **218**

ప్రతిపదార్థం: దురమునన్= యుద్ధంలో; పెంపున్= గొప్పతనమూ; చేవయును= బలమూ; దుర్దమలీలన్= అణచరాని విధంగా; వెలుంగుచున్+ఉండన్= ప్రకాశిస్తూండగా; సుస్థిరతన్= నిలకడతో; శమంతపంచక విశిష్ట తలంబునన్= శమంతపంచకం అనే ప్రత్యేకస్థలంలో; పోరి= యుద్ధంచేసి; సత్+గతిన్= ఉత్తమ గతిని; పొరసెదు= పొందుతావు; నీకున్+ఐ= నీ విషయంలో; వగపు పుట్టదు= విచారం కలుగదు; ఇంకన్= ఇకమీద; బంధులున్= చుట్టాలు; రాజున్= రాజూ (ధృతరాష్ట్రుడూ); దేవులున్= రాణులూ; తిరియుదురు= యాచకులవుతారు; వారిదగు (వారిది+అగు)= వారిదైన; దీనతకున్= దైన్యానికి; ఓర్వక= సహించక; ఉమ్మలించెదన్= విచారిస్తున్నాను.

తాత్పర్యం: యుద్ధంలో పెంపూ, చేవా అణచరాని విధంగా ఒప్పుతూండగా సుస్థిరత్వంతో శమంతపంచకమనే ప్రత్యేక స్థలంలో యుద్ధంచేసిన నీవు ఉత్తమగతిని పొందుతావు. నీకొరకు విచారించను. బంధువులూ, రాజూ, రాణులూ ఇంక బిచ్చమెత్తుకొంటారు. నేను వారి దైన్యానికి ఓర్చుకొనలేక విచారిస్తున్నాను.

విశేషం: శమంత పంచకం - పరశురాముడు వైరి రాజులను సంహరించి, ఆ రక్తాన్ని అయిదు మడుగులుగా చేసి పితృతర్పణం చేశాడు. తత్సమీప ప్రదేశానికి శమంతపంచకం అనిపేరు. అక్కడే కురుపాండవులు యుద్ధం చేయటం వలన దానికి కురుక్షేత్రం అనికూడా పేరు. 'ఉమ్మలించెదన్' అనే తద్ధర్మార్థక రూపం వర్తమానార్థకం. 'ఉమ్మలించుచున్నాను' అని అర్థం.

ఉ. **సీరి యనారతంబుఁ దన శిష్యులలోపల నెల్ల నిన్ను దు**
ర్వార పరాక్రమాఢ్యుఁడని వర్ణన సేయుట గేలిచేసి యా
మారుతికిన్ జయం బొసఁగె మాల విధాతృఁడు; వాని గెల్పుకో
లేరికి సమ్మతంబగునె యిట్టిది? దీనను బెంపు గల్గునే? **219**

ప్రతిపదార్థం: సీరి= బలరాముడు; అనారతంబున్= ఎల్లప్పుడూ; తన శిష్యులలోపలన్+ఎల్లన్= తన శిష్యులందరిలోనూ; నిన్నున్; దుర్వార పరాక్రమ+ఆఢ్యుఁడు+అని= అవార్య పరాక్రమ సంపన్నుడని; వర్ణన+చేయుటన్= పొగడటాన్ని; గేలిచేసి= పరిహరించి; మాల విధాత్రుఁడు= చండాలపు బ్రహ్మ; ఆ-మారుతికిన్= ఆ భీముడికి; జయంబు+ఒసఁగెన్= గెలుపు చేకూర్చాడు; వాని-గెల్పుకోలు= ఆ భీముడి గెలుపు; ఇట్టిది= ఇటువంటిది; ఏరికిన్= ఎవరికైనా; సమ్మతంబు+అగునె?= అంగీకారం అవుతుందా?; దీనను= దీనిచేత; పెంపు+కల్గునే?= గొప్పతనం కలుగుతుందా?

తాత్పర్యం: బలరాము డెప్పుడూ నిన్ను తన శిష్యులందరిలోనూ అవార్య పరాక్రమ సంపన్నుడవని పొగడటాన్ని పరిహసించి మాలదైవం ఆ భీముడికి గెలుపు చేకూర్చాడు. అతడి ఇటువంటి గెలుపు ఎవరికైనా అంగీకారం అవుతుందా? దీనివలన అతడికి గొప్పతనం కలుగుతుందా?

చ. కురువర! నీ మగంటిమియుఁ గోల్తలయున్ బలముం జలంబు దు
స్తరగతిఁ బేర్చి భీమునకుఁ జావక పోవఁగరాని యట్టిదై
నరు బెదరించి కేశవు మనంబు గలంచి యధర్మవృత్తికిం
జొరుఁడని పంచె; దీని దివిజుల్ గని; రిం కిటవేయు నేటికిన్? 220

ప్రతిపదార్థం: కురువర!= కురుపతీ-దుర్యోధనా!; నీ మగంటిమియున్= నీ పరాక్రమమూ; కోల్తలయున్= యుద్ధమూ; బలమున్= బలమూ; చలంబున్= పట్టుదలా; దుస్తర గతిన్= దాటశక్యంకాని విధంగా; పేర్చి= విజృంభించి; భీమునకున్; చావకపోవఁగన్-రాని+అట్టిది+ఐ= చావు అనివార్యం అన్నటువంటి దయి; నరున్= అర్జునుడిని; బెదరించి= భయపెట్టి; కేశవు మనంబు= కృష్ణుడి మనస్సు; కలంచి= కలతచెందేటట్టు చేసి; అధర్మ వృత్తికిన్= అన్యాయ ప్రవర్తనకు; చొరుఁడు+అని= పూనుకొనండి అని; పంచెన్= నియోగించింది; దీనిన్; దివిజుల్= దేవతలు; కనిరి= చూశారు; ఇంకన్; ఇటన్= ఈ విషయంలో; వేయున్+ఏటికిన్= వేయి మాటలెందుకు?

తాత్పర్యం: దుర్యోధనా! నీ పరాక్రమమూ, యుద్ధనైపుణ్యమూ, బలమూ, పట్టుదలా దాట శక్యంకాని విధంగా విజృంభించి భీముడికి చావుతప్పదు అన్నటువంటివై, అర్జునుడిని భయపెట్టి, కృష్ణుడి మనస్సును కలత చెందించి, అన్యాయ ప్రవృత్తికి పూనుకొనేటట్లు చేశాయి. ఇదంతా దేవతలు కనిపెట్టారు. ఇంక ఈ విషయంలో వేయి మాట లెందుకు?

ఉ. ధర్మము మాని యూరులు గదం బొడి సేసినయంతఁ బోక దు
ష్కర్ముఁడు వాయుజుం డెడమకాల శిరంబటు దన్నెఁ జూచి యా
ధర్మసుతుండు శాస్తిఁ దగ దానికిఁ జేయఁడ; యాతఁడెప్డు నం
తర్మదదుష్టుఁ; డీ గెలుపు దైన్యము సేయదె? కీర్తి మాయదే? 221

ప్రతిపదార్థం: దుష్కర్ముఁడు= చెడ్డపనులు చేసేవాడైన; వాయుజుండు= భీముడు; ధర్మము మాని= ధర్మం విడిచి; ఊరులు= తొడలు; గదన్= గదతో; పొడి+చేసిన+అంతన్+పోక= నుగ్గుచేసి, అంతటితో ఊరుకోక; ఎడమకాలన్= ఎడమకాలితో; శిరంబు= తల; అటు= ఆ రీతిగా; తన్నెన్= తన్నాడు; ఆ ధర్మసుతుండు= ఆ ధర్మరాజు; చూచి; దానికిన్; శాస్తిన్= శిక్షను; తగన్= తగినవిధంగా; చేయఁడు+అ= చేయనేలేదు; ఆతఁడు= ఆ ధర్మరాజు; ఎప్డున్= ఎప్పుడూ; అంతర్మదదుష్టుఁడు= లోపల గర్వం గల దుర్జనుడు; ఈ గెలుపు= ఇటుంటి జయం; దైన్యము+చేయదె?= నైచ్యం కలిగించదా?; కీర్తి మాయదే= కీర్తి నశించదా?

తాత్పర్యం: దుర్మార్గుడైన భీముడు ధర్మం తప్పి నీ తొడలు గదతో విరుగగొట్టి అంతతో ఊరుకోక ఎడమకాలితో నీ శిరస్సు ఆ విధంగా తన్నాడు. ఆ ధర్మరాజు అది చూచి కూడా దానికి తగిన శాస్తి చేయనే లేదు. అత డెప్పుడూ పైకి కనిపించని గర్వంగల దుర్జనుడు. ఈ గెలుపు అతడికి నైచ్యం కలిగించదా? దానివలన కీర్తి నశించదా?

క. కౌరవనాయక! నీదు గ । దారణ గౌరవము సకల ధరణీజన చే
తోరంజనమై నిర్మల । సారయశోధనము నీకు సంపాదించెన్.' 222

ప్రతిపదార్థం: కౌరవనాయక!= కురురాజా! దుర్యోధనా!; నీదు గదా రణ గౌరవము= నీ గదాయుద్ధ మహత్త్వం; సకల ధరణీ జన చేతస్(ః)+రంజనము+ఐ= ఎల్ల భూజనుల మనస్సులకీ ఆనందాన్ని కలిగించేదయి; నీకున్; నిర్మలసార యశస్(ః)+ ధనమున్= పవిత్రమూ, శ్రేష్ఠమూ అయిన కీర్తిధనాన్ని; సంపాదించెన్= సంపాదించిపెట్టింది.

తాత్పర్యం: దుర్యోధనా! నీ గదాయుద్ధ మహత్త్వం ఎల్ల జనుల మనస్సుల ఆనందం కలిగించేదయి నీకు నిర్మలమూ, సారవంతమూ అయిన కీర్తిధనాన్ని సంపాదించిపెట్టింది'.

వ. అని పలికి తన మానుషంబు తెఱం గూహించి. 223

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; తన మానుషంబు తెఱంగు= తన గౌరవపురీతి; ఊహించి= తలచి.

తాత్పర్యం: అని పలికి తన గౌరవం సంగతి తలచి. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'కుడువఁగఁ గట్ట, బంధులకుఁ గోటి విధంబులఁ బెట్ట, జన్నము
ల్నడుప, ననేక ధర్మవిధులం బొగ డొందఁగఁ జాలునట్టి యె
క్కుడు సిరి యిచ్చి పేర్మి నొక కొండగ మన్చిన నీవు సావఁగా
నొడ లిటు లోమితిం; గురుకులోత్తమ ! యేనొక సేవకుండనే?' 224

ప్రతిపదార్థం: కుడువఁగన్= తినటానికీ; కట్టన్= ధరించటానికీ; బంధులకున్= చుట్టాలకు; కోటి విధంబులన్= అనేక రీతులుగా; పెట్టన్= పెట్టటానికీ; జన్నముల్= యజ్ఞాలు; నడుపన్= చేయించటానికీ; అనేక ధర్మవిధులన్= పెక్కు ధర్మకార్యాలలో; పొగడు+ఒందఁగన్= పేరు పొందటానికీ; చాలును+అట్టి= సరిపడేటటువంటి; ఎక్కుడు సిరి+ఇచ్చి= అధికమైన సంపదనిచ్చి; పేర్మిన్= ప్రేమతో; ఒక కొండగన్= ఒక కొండలా; మన్చిన నీవు= పోషించిన నువ్వు; చావఁగాన్= చచ్చిపోగా; ఇటులు= ఈ ఇధంగా; ఒడలు+ఓమితిన్= శరీరం తాల్చాను-బ్రదికి ఉన్నాను; కురు-కుల+ఉత్తమ!= కురువంశ శ్రేష్ఠుడా-దుర్యోధనా!; ఏను= నేను; ఒక సేవకుండనే= ఒక ఉత్తమ సేవకుడనా?

తాత్పర్యం: 'తినటానికీ, కట్టుకొనటానికీ, బంధువులకు అనేక విధాల పెట్టటానికీ, యజ్ఞాలు చేయించటానికీ, పెక్కు ధర్మకార్యాలలో పేరు గాంచటానికీ సరిపడేటంత అధికమైన సంపద నిచ్చి ప్రేమతో ఒక కొండవలె నన్ను సాకిన నీవు చచ్చిపోతూ ఉంటే నే నిట్లా బ్రదికి ఉన్నాను. కురువంశశ్రేష్ఠా! నేనూ ఒక సేవకుడనా?'

వ. అని తన్నుఁ దాన నిందించుకొనుచు మఱియు. 225

ప్రతిపదార్థం: అని; తన్నున్+తాను+అ= తనని తనే; నిందించుకొనుచున్= తిట్టుకుంటూ; మఱియున్= ఇంకా.

తాత్పర్యం: అని తనను తాను నిందించుకొంటూ, ఇంకా (ఇట్లా అన్నాడు).

ఉ. 'న్యాయము దప్పకుండఁగ రణం బొనరించి దివంబు గైకొనం
బోయెద; వందు రాఁదగిన పుణ్యము సేయుటలేదు గాని, మా
చేయు మనంబునుం దనియఁ జెండఁగఁ బడ్డ విరోధివర్గమున్
నీయెడ కిం పొనర్పఁగ గణింపఁగ భాగ్యము గల్గె భూవరా! 226

ప్రతిపదార్థం: భూవరా!= రాజా! దుర్యోధనా!; న్యాయము= ధర్మం; తప్పక+ఉండఁగన్= తప్పకుండా; రణంబు= యుద్ధం; ఒనరించి= చేసి; దివంబు= స్వర్గం; కైకొనన్+పోయెదవు= పొందబోతున్నావు; అందున్= అక్కడికి; రాన్+తగిన= నిన్ను అనుసరించి వచ్చే; పుణ్యము= సుకృతము; చేయుట లేదు= మేము చేసింది లేదు; కాని; మా చేయున్= మా చెయ్యీ, మనంబునున్= మనస్సూ; తనియన్- తృప్తిపడేటట్లు; చెండఁగన్+పడ్డ= ఖండించబడిన; విరోధివర్గమున్= శత్రుసమూహాన్ని; నీ+ఎడకున్= నీ హృదయానికి; ఇంపు+ఒనర్పఁగన్= ఆనందం కలిగేటట్టు; గణింపఁగన్+భాగ్యము+కల్గెన్= లెక్కపెట్టే అదృష్టం కలిగింది.

తాత్పర్యం: 'దుర్యోధనా! నీవు ధర్మం తప్పకుండా యుద్ధంచేసి (వీర)స్వర్గం అలంకరింపబోతున్నావు. అక్కడ రాదగిన పుణ్యం నీతో మేము చేయాలి కాని, మా చెయ్యీ, మనస్సూ తృప్తి పడేటట్టు దొరికిన శత్రువులను మట్టుబెట్టి; నీ మనస్సుకు ఆనందం కలిగేటట్లు లెక్కపెట్టే అదృష్టం మాకు కలిగింది. దొరికిన శత్రువులను చంపి నీ మనస్సుకు ఆనందం కలిగించే అదృష్టం మాకు దక్కింది.

విశేషం: ఉస్మానియా ప్రతిలోని 'చెందగఁబడ్డ' అనే పాఠం కంటె వావిళ్ళప్రతిలోని 'చెండగఁబడ్డ' పాఠం సమంజసమని గ్రహించబడింది.

ఆ. పుణ్యలోకమునకుఁ బోయినయప్పుడు । ద్రోణుఁ గాంచి నీకు ద్రోహియైన
జనవినింద్య చరితుఁ జంపె దృష్టద్యుమ్ను । నీ తనూజఁ డనుము తొలుత. 227

ప్రతిపదార్థం: పుణ్య లోకమునకున్= పుణ్యలోకానికి - స్వర్గానికి; పోయిన+అప్పుడు= నువ్వు వెళ్ళినప్పుడు; ద్రోణున్= ద్రోణుడిని; కాంచి= చూచి; తొలుతన్= మొదట; అనఘ!= ఓ పాపరహితుడా!; నీకున్; ద్రోహి+ఐన= ద్రోహం చేసిన; జన వినింద్య చరితున్= జనులచేత విశేషంగా నిందింపదగిన నడవడిగల వాడిని; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుడిని; నీ తనూజుఁడు= నీ కుమారుడైన అశ్వత్థామ; చంపెన్+అనుము= చంపాడని చెప్పుము.

తాత్పర్యం: నీవు పుణ్యలోకానికి పోయినప్పుడు ద్రోణుడిని చూచి మొదట 'ఓ పాపరహితుడా! నీకు ద్రోహం చేసిన దుశ్చరితుడిని-ధృష్టద్యుమ్నుడిని నీ కొడుకు చంపా'డని చెప్పుము.

వ. అని నా మాటుగా నమస్కరించి కౌఁగిలించుకొనుము. మఱియు వలయు సల్లాపంబులు సేయుము. బాహ్లిక సోమదత్తభూరిశ్రవస్సైంధవప్రముఖ భవదీయ బాంధవజనంబులతో నా చేసిన కుశలప్రశ్నంబుగా సంభావింపు మది యట్లుండె రేయింటి తెఱం గెఱింగించెద. 228

ప్రతిపదార్థం: అని; నా మాఱుగాన్= నాకు బదులుగా; నమస్కరించి; కౌఁగిలించుకొనుము; మఱియున్; వలయు సల్లాపంబులు= చేయవలసిన సంభాషణలు; చేయుము; బాహ్లిక సోమదత్త - భూరిశ్రవస్+సైంధవ-ప్రముఖ-భవదీయ- బాంధవ-జనంబులతోన్= బాహ్లికుడూ, సోమదత్తుడూ, భూరిశ్రవసుడూ, సైంధవుడూ మొదలైన నీ చుట్టాలను; నా చేసిన కుశల ప్రశ్నంబుగా= నేను క్షేమం అడిగినట్టుగా; సంభావింపుము= మన్నించుము; అది+అట్లు+ఉండెన్= అది అలా ఉండనీ; రేయింటి-తెఱంగు= రాత్రి జరిగిన విధం; ఎఱింగించెదన్= చెపుతాను.

తాత్పర్యం: అని నాకు బదులుగా నమస్కరించి కౌగిలించుకొమ్ము. ఇంకా చేయవలసిన సంభాషణలు చేయుము. బాహ్లికుడూ, సోమదత్తుడూ, భూరిశ్రవుడూ, సైంధవుడూ మొదలైన నీ చుట్టాలను నేను క్షేమం అడిగినట్లు చెప్పి మన్నించుము. అది అట్లా ఉండనిమ్ము. రాత్రి జరిగిన విధం చెప్పుతాను. వినుము.

విశేషం: బాహ్లికుడు - ప్రతీపుడి కొడుకు. శంతనుడి సోదరుడు. సోమదత్తుడి తండ్రి. సోమదత్తుడు- బాహ్లికుడి కొడుకు. భూరిశ్రవుడు - సోమదత్తుడు కొడుకు. సైంధవుడు - దుర్యోధనుడి బావ. దుస్సల భర్త. వీళ్ళందరూ దుర్యోధనుడి పక్షాన పాండవులతో యుద్ధం చేసిన వీరులు.

సీ. **అమృతంబు నింపు కర్ణములకు నొసఁగెడు । మాట లాకర్ణింపు మనుజనాథ!**
శాత్రవ శిబిరంబు సౌప్తికవేళఁ బ్ర । వేశించి నీచుఁ గిల్బిషమయాత్ముఁ
దొలుత ధృష్టద్యుమ్నుఁ ద్రుంచితిఁ బశుమర । ణంబుగాఁ దదనంతరంబ కవిసి
వాని బంధులనెల్ల వరుస గీటడఁగించి । ద్రౌపదీసుతుల నందఱను బొదివి

తే. **మిడుక మిడుకంగఁ జంపి యప్పుడమి యెల్లఁ । దునియ పెంటగఁ గరివాజిమనుజతతుల**
నెల్ల నఱికితిఁ బాండవు లేవురును ము । రారియును సాత్యకియును నా బారిఁ బడరు'. **229**

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా! దుర్యోధనా!; కర్ణములకున్= చెవులకు; అమృతంబు నింపు= అమృత సమృద్ధి; ఒసఁగెడు= ఇచ్చేటి; మాటలు; ఆకర్ణింపు(ము)= విను; సౌప్తికవేళన్= నిద్రించే సమయంలో; శాత్రవ శిబిరంబున్= శత్రువుల శిబిరాన్ని; ప్రవేశించి= చొచ్చి; నీచున్ కిల్బిషమయ+ఆత్మున్ - ధృష్టద్యుమ్నున్= తుచ్ఛుడూ, పాపాత్ముడూ అయిన ధృష్టద్యుమ్నుడిని; తొలుతన్= మొదట; పశుమరణంబు+కాన్= పశువును చంపేటట్లు; త్రుంచితిన్= వధించాను; తద్+అనంతరంబు+అ= ఆ వెంటనే; కవిసి= పైబడి; వాని బంధులన్+ఎల్లన్= వాడి చుట్టాల నందరినీ; వరుసన్= వరుసగా; గీటడఁగించి= చంపి; ద్రౌపదీసుతులన్+అందఱను= ద్రౌపది కొడుకుల నందరినీ; పొదివి= మార్కొని; మిడుక మిడుకంగన్= త్రుళ్ళిపడుతూండగా; చంపి; ఆ+పుడమి+ఎల్లన్= ఆ యుద్ధభూమి అంతా; తునియ పెంటగన్= పెంట తుక్కుతో నిండినదిగా; కరి వాజి మనుజ తతులన్+ఎల్లన్= ఏనుగుల, గుర్రాల, మనుష్యుల సమూహాలన్నిటినీ; నఱికితిన్= నరికాను; పాండవులు+ఏవురును= పాండవులయిదుగురూ; మురారియును= కృష్ణుడూ; సాత్యకియునూ= సాత్యకీ; నా బారిన్+పడరు= నా హింసకు లోనుకారు.

తాత్పర్యం: రాజా! దుర్యోధనా! నీ చెవులకు అమృతసమృద్ధిని సమకూర్చే మాటలు చెపుతాను వినుము. నిద్రించే సమయంలో నేను శత్రువుల శిబిరం ప్రవేశించి, తుచ్ఛుడూ, పాపాత్ముడూ అయిన ధృష్టద్యుమ్నుడిని మొదట పశువును వధించేటట్టు వధించాను. ఆ వెంటనే, పైబడి వాడి చుట్టాల నందరినీ వరుసగా చంపి, ద్రౌపది కుమారుల నందరినీ మార్కొని, త్రుళ్ళిపడుతూండగా చంపి, ఆ యుద్ధభూమి అంతా పెంట తుక్కుతో నిండేటట్లు ఏనుగుల, గుర్రాల, మనుష్యుల సమూహాలనన్నిటినీ నరికాను. పాండవులయిదుగురూ, కృష్ణుడూ, సాత్యకీ నా హింసకు లోను కాలేదు'.

వ. అని చెప్పి 230

తాత్పర్యం: అని పలికి.

ఉ. 'ఏ మటు పోక శౌరి మది నేర్పడ మున్ గని డాఁగురించెనో
యేమిటి కెందుఁ బోయిరొ నరేంద్ర! యెఱుంగము ధర్మదూష్య సం
గ్రామ విధంబులం జయము గల్గియు వారికి దక్కదయ్యె వా
రేమయి రేమి మా కెలస మెక్కె నెఱుంగుము మమ్ము ముప్వురన్. 231

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= రాజా! దుర్యోధనా!; ఏము+అటు+పోక= మేము అటు వెళ్ళటం; శౌరి= కృష్ణుడు; మదిన్= మనస్సులో; ఏర్పడన్= స్పష్టంగా; మున్= ముందుగా; కని= కనిపెట్టి; డాఁగురించెనో= దాచాడో; ఏమిటికిన్= ఎందుకోసం; ఎందున్+పోయిరో= ఎక్కడికి వెళ్ళారో; ఎఱుంగము= మేమెరుగం; ధర్మ దూష్య సంగ్రామ విధంబులన్= ధర్మబాహ్యాలైన యుద్ధ విధానం వలన; జయము+కల్గియున్= జయం లభించినప్పటికీ; వారికిన్; దక్కదు+అయ్యెన్= లభించనట్టే అయింది; వారు+ఏమి+అయిరి+ఏమి= వాళ్ళు ఏమయితే నేమి?; మా కెలసము+ఎక్కెన్= మాకు కావలసినపని నెరవేరింది; మమ్మున్+ ముప్వురన్= మా ముగ్గురినీ; ఎఱుంగుము= తెలిసికొమ్ము.

తాత్పర్యం: 'రాజా! దుర్యోధనా! మేము అట్లా వెళ్ళటం కృష్ణుడు ముందుగానే బాగా ఊహించి దాచిపెట్టాడో! వాళ్ళు ఎందుకోసం ఎక్కడికి వెళ్ళారో మాకు తెలియదు. ధర్మబాహ్యమైన యుద్ధవిధానాల వలన వాళ్ళకు జయం లభించినా లభించనట్లే. వాళ్ళు ఏమయితేనేమి? మా అభీష్టం నెరవేరింది. మా ముగ్గురినీ తెలిసికొమ్ము.'

వ. అని కలిపికొని పలికి కృపకృతవర్మల వలనుం జూచి. 232

ప్రతిపదార్థం: అని; కలిపికొని= వాళ్ళను కూడా కలుపుకొని; పలికి; కృపకృతవర్మల వలనున్+చూచి= కృపకృతవర్మలవైపు చూచి.

తాత్పర్యం: అని వాళ్ళను కూడా కలుపుకొని పలికి, కృపకృతవర్మలవైపు చూచి.

క. 'వీరి పెనుఁబ్రాపు వడసినఁ । గౌరవకులనాథ! యేన కా దరయంగాఁ
జీరికిఁ బోవని వారును । వైరుల సమయంగఁ జేయ వలఁతుల కారే?' 233

ప్రతిపదార్థం: కౌరవ కులనాథ!= కురువంశపతీ! దుర్యోధనా!; వీరి పెనుఁబ్రాపు+పడసినన్= ఈ కృపకృతవర్మల పెద్ద తోడ్పాటు పొందితే; ఏను+అ+కాదు= నేనేకాదు; అరయంగాన్= చూడగా; చీరికిన్+పోవని వారును= ఎందుకూ పనికిరానివాళ్ళు కూడా; వైరులన్= శత్రువులను; సమయంగన్+చేయన్= చంపటానికి; వలఁతులు+అ+కారే= సమర్థులే కారా?

తాత్పర్యం: 'దుర్యోధనా! ఈ కృపకృతవర్మల గొప్ప తోడ్పాటు లభిస్తే నేనే కాదు, చూడగా ఎందుకూ పనికిరాని వాళ్ళు కూడా శత్రువులను చంపటానికి సమర్థులు కారా?'

వ. అనిన నమ్మాటలు మనఃప్రియంబులై నాలుకకు లావిచ్చిన నా భూవరుం డమ్మహీసురవరున కిట్లనియె. 234

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+మాటలు= ఆ పలుకులు; మనస్(ః)+ప్రియంబులు+ఐ= మనస్సుకు సంతోషం కలిగించేవయి; నాలుకకున్; లావు+ఇచ్చినన్= శక్తినివ్వగా; ఆ-భూ-వరుండు= ఆ రాజు-దుర్యోధనుడు; ఆ+మహీసురవరునకున్= ఆబ్రాహ్మణశ్రేష్ఠుడికి- అశ్వత్థామకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా, ఆ మాటలు మనస్సుకు ఆనందం కలిగించి నాలుకకు శక్తి నివ్వగా దుర్యోధనుడు అశ్వత్థామతో ఇట్లా అన్నాడు;

క. 'నీవును నీ యోధవరులు । నావైరులఁ బఱిచినంత యాచార్యుండున్,
దేవవ్రతుండుఁ బఱిచిరె? । భావింపఁగ దుష్కరంపుఁ బని యిది యనఘా! 235

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! అశ్వత్థామా!; నీవును; ఈ యోధవరులున్= ఈ వీరశ్రేష్ఠులూ - కృపాచార్య కృతవర్మలూ; ఆ వైరులన్= ఆ శత్రువులను; పఱచిన+అంత= బాధించినంతగా; ఆచార్యుండున్= గురుడూ-ద్రోణుడూ; దేవవ్రతుండున్= భీష్ముడూ; పఱిచిరె?= బాధించారా?; భావింపఁగన్= తలచగా; ఇది; దుష్కరంపుఁబని= కష్టసాధ్యమైన పని.

తాత్పర్యం: 'పాపరహితుడైన అశ్వత్థామా! నీవు, ఈ వీరశ్రేష్ఠులైన కృపకృతవర్మలూ ఆ శత్రువులను బాధించినంతగా, ద్రోణాచార్యుడూ భీష్ముడూ బాధించారా? ఆలోచించగా ఇది చాలా కష్టసాధ్యమైన పని.

ఆ. కర్ణు మనము పెద్దగాఁ గొనియాడుదు; । మతనికంటె శల్యుఁ డధికుఁడందు;
రతఁడు నతఁడు నిట్టి యాక్రమంబున నాకుఁ । బ్రియము సేయఁ జూచిరే మహాత్మ!' 236

ప్రతిపదార్థం: మహాత్మ!= మహానుభావా! అశ్వత్థామా!; మనము; కర్ణున్= కర్ణుడిని; పెద్దగాన్= అధికంగా; కొనియాడుదుము= పొగడుతాము; శల్యుఁడు; అతనికంటెన్= కర్ణుడికన్నా; అధికుఁడు+అందురు= గట్టివాడంటారు; అతఁడున్+అతఁడున్= ఆ కర్ణుడూ; ఆ శల్యుడూ; ఇట్టి ఆక్రమంబునన్= ఇటువంటి ఆక్రమణంలో; నాకున్; ప్రియము+చేయన్+చూచిరే= ప్రీతి కలిగించనెంచారా?

తాత్పర్యం: మహాత్మా! అశ్వత్థామా! మనం కర్ణుడిని చాలా గొప్పవాడని ప్రశంసిస్తాము. శల్యుడు అతడికన్నా గట్టివాడని అంటాము. కాని, అతడూ అతడూ ఇటువంటి ఆక్రమణంలో నాకు ప్రీతిని కలిగించనెంచారా?'

వ. అని యమ్మువ్వుర మొగంబులు గలయం గనుంగొని 'మీరు కృతకృత్యులరు. సుఖులరై యుండుఁడు, పునర్దర్శనంబు త్రిదివంబున నయ్యెడుఁగాక. వగలు మాని పొం' డని పల్కి ప్రాణంబులు విడిచిన, వారలవ్వసుమతీ పతిఁ గౌఁగిలించుకొని వలగొని వచ్చి మరలి మరలి చూచుచు నరదంబు లెక్కియరిగీ; రంత నుదయగిరి శిఖరంబునకు ఖరకరుండు వచ్చె, నేను నిత్తెఱంగు నీకెఱింగింపవచ్చితి; నాహవప్రకారం బంతయు నీకు వినిపించుటకు నాఁడు మునీశ్వరుండు నన్నుఁబనిచి యొసంగిన దివ్యదర్శనత్వంబు నీ కొడుకు తోడిదయయ్యె' నని యిట్లు సంజయుండు ధృతరాష్ట్రునకు నశ్వత్థామాది రథికత్రయ వ్యాపార కథనపూర్వకంబుగా దుర్యోధను లోకాంతరగమనంబు సెప్పి; ననిన విని 'యటమీఁదఁ బాండునందను లెవ్విధంబునం బ్రవర్తించి?' రని యడుగుటయు. 237

ప్రతిపదార్థం: అని; ఆ+ముప్పురమొగంబులు= ఆ ముగ్గురి ముఖాలూ; కలయన్+కనుంగొని= బాగుగా చూచి; మీరు; కృతకృత్యులరు= పని నెరవేర్చినవారు; సుఖులరు+ఐ ఉండుఁడు= సుఖంగా ఉండండి; పునర్+దర్శనంబు= మళ్ళీచూడడం; త్రిదివంబునన్+అయ్యెడున్+కాక= స్వర్గంలో అగుగాక!; వగలుమాని= దుఃఖం విడిచి; పొండు; అని; పలికి; ప్రాణంబులు విడిచినన్; వారలు, ఆ+వసుమతీ పతిన్= ఆ రాజును; కౌఁగిలించుకొని; వలగొని వచ్చి= ప్రదక్షిణంచేసి; మరలి మరలి చూచు

చున్= తిరిగి తిరిగి చూస్తూ; అరదంబులు+ఎక్కి= రథాలెక్కి; అరిగిరి= వెళ్ళారు; అంతన్= తరువాత; ఖరకరుండు= సూర్యుడు; ఉదయగిరి శిఖరంబునకున్= తూర్పుకొండ శిఖరానికి; వచ్చెన్; ఏనున్= నేనూ; ఈ+తెఱంగు= ఈ విధం; నీకున్; ఎఱింగింపన్+వచ్చితిన్= చెప్పటానికి వచ్చాను; ఆహవ ప్రకారంబు+అంతయున్= యుద్ధ విధానం అంతా; నీకున్; వినిపించుటకున్; నాఁడు= అప్పుడు; ముని+ఈశ్వరుండు= మునిశ్రేష్ఠుడైన వ్యాసుడు; నన్నున్; పనిచి= ఆజ్ఞాపించి; ఒసంగిన= ఇచ్చిన; దివ్యదర్శనత్వంబు= దివ్యదర్శనం; నీ కొడుకుతోడిది+అ= నీ కుమారుడితోపాటిదే అయింది; అని; ఇట్లు= ఈ విధంగా; సంజయుండు= సంజయుడు; ధృతరాష్ట్రునకున్; అశ్వత్థామ+ఆది రథిక త్రయ వ్యాపార కథన పూర్వకంబుగాన్= అశ్వత్థామ మొదలగు ముగ్గురు వీరుల పని తీరు చెప్పటం మొదలుకొని; దుర్యోధను= దుర్యోధనుడియొక్క; లోక+అంతర గమనంబు= అన్యలోకానికి పోవటం; చెప్పెన్; అనినన్; విని; అటమీఁదన్= ఆ తరువాత; పాండు నందనులు= పాండవులు; ఏ+విధంబునన్= ఎట్లా; ప్రవర్తించిరి+అని+అడుగుటయున్= ప్రవర్తించారని అడుగగా.

తాత్పర్యం: అని ఆ ముగ్గురి ముఖాలు బాగా చూచి, 'మీరు కృతార్థులు. సుఖంగా ఉండండి. మళ్ళీ స్వర్గంలో కలిసికొందాం. దుఃఖించక పొండి' అని పలికి ప్రాణాలు విడిచాడు. వాళ్ళు ఆ రాజును కౌగిలించుకొని, అతడికి ప్రదక్షిణం చేసి, మళ్ళీ మళ్ళీ చూస్తూ రథా లెక్కి వెళ్ళారు. అంత సూర్యోదయం అయింది. నేనూ ఈ వృత్తాంతం నీకు చెప్పాలని వచ్చాను. యుద్ధక్రమం అంతా నీకు వినిపించటానికి అప్పుడు వ్యాసమునీంద్రుడు నన్నాదేశించి ఇచ్చిన దివ్యదర్శనం నీ కుమారుడితోపాటిదే అయింది' అని ఇట్లా సంజయుడు ధృతరాష్ట్రుడికి అశ్వత్థామాది రథికులు ముగ్గురూ చేసిన పని చెప్పటం మొదలుకొని దుర్యోధనుడు లోకాంతరం వెళ్ళటం దాకా చెప్పాడు. అని చెప్పగా విని తరువాత పాండవులు ఎట్లా ప్రవర్తించారని వైశంపాయనుడిని జనమేజయుడు అడుగగా (ద్వితీయాశ్వాసంలోని వచనంతో అన్వయం).

విశేషం: ధృతరాష్ట్రుడు భారతయుద్ధ విశేషాలు తెలిసికొనగోరితే, వ్యాసుడు సంజయుడికి ఒక దివ్యశక్తిని అనుగ్రహించాడు. ఆ శక్తివలన సంజయుడు యుద్ధభూమిలో బాణాలు తగలక, ఎవ్వరిచేతా చూడబడక, తను ప్రతివారి సంభాషణా వినగలిగాడు. అతడు అట్లా తెలిసికొంటూ ధృతరాష్ట్రుడికి ఎప్పటికప్పుడు యుద్ధ విశేషాలు చెప్పుతూ వచ్చాడు. ఆ శక్తి దుర్యోధనమరణంతో నశించింది.

ఆశ్వాసాంతము

మహాస్రగ్ధర.

పరమజ్ఞేయ స్వభావా! భవభయ హరణ ప్రౌఢనామానుభావా!
కరఖేలచ్చక్రశూలా! కలుషహృదయ సాంగత్య వైముఖ్యశీలా!
కరుణాయత్తాంతరంగా! కమలభవ మనఃకంజసంవాస భృంగా!
దురిత ధ్వాంత ప్రదీపా తుల నిరసన సంస్తుత్య నిర్భాసరూపా! 238

ప్రతిపదార్థం: పరమజ్ఞేయ స్వభావా!= మిక్కిలి తెలిసికొనదగిన స్వభావం కలవాడా!; భవ= సంసారమువలని; భయ= భీతి యొక్క; హరణ= పోగొట్టడంలో; ప్రౌఢ= నేర్పుగల; నామ= పేరుయొక్క; అనుభావా!= ప్రభావం కలవాడా!; కర= చేతిలో; ఖేలత్= ఆడుతున్న; చక్ర= సుదర్శన చక్రమూ; శూలా= త్రిశూలమూ కలవాడా!; కలుష= దుష్టమైన; హృదయ= హృదయం కలవారితోడి; సాంగత్య= కూటమికి; వైముఖ్య= విముఖత్వం కల; శీలా!= స్వభావం కలవాడా!; కరుణా+ఆయత్త+అంతరంగా!= దయకు అధీనమైన మనస్సుకలవాడా!; కమలభవ= బ్రహ్మయొక్క; మనస్(ః)+కంజ= మనస్సు అనే పద్మంలో; సంవాస=

నివాసంకల; భృంగా!= తుమ్మెద అయినవాడా!; దురిత= పాపం అనే; ధ్వాంత= చీకటికి; ప్రదీప= గొప్పదనం యొక్క; అతుల= సాటిలేని; నిరసన= తిరస్కారంచేత; సంస్తుత్య= మిక్కిలి పొగడదగిన; నిర్భాస రూపా!= అతిశయమైన కాంతితోడి ఆకారం కలవాడా!; (ఇవన్నీ హరిహరనాథుడికి విశేషణాలు).

తాత్పర్యం: మిక్కిలి తెలిసికొనదగిన స్వభావం కలవాడా! సంసారభీతిని పోగొట్టటంలో నిపుణమైన నామ ప్రభావం కలవాడా! చేతిలో క్రీడిస్తున్న చక్ర శూలాలు గలవాడా! దుష్టుల తోడి సాంగత్యానికి విముఖమైన శీలం కలవాడా! దయాధీనమైన మనస్సు కలవాడా! బ్రహ్మ మనఃపద్మంలో నివసించే తుమ్మెద అయినవాడా! పాపాంధకార ప్రదీపాన్ని సాటిలేని విధంగా తిరస్కరించే పొగడబడిన కాంత్యతిశయం కల రూపం కలవాడా! హరిహరనాథా!

విశేషం: పరమ......స్వభావా= హరిహరనాథుడికి స్వభావం కంటె తెలిసికొనదగినది ఇంకొకటి లేదు. భవ......భావా= అతడి నామ మహిమ సంసారభయాన్ని పోగొట్టడంలో గొప్పది. కర....శూలా= ఆ దేవుడు హరిహరనాథుడు కాబట్టి హరిచేతిలో చక్రమూ, హరుడిచేతిలో త్రిశూలమూ ఉన్నాయి. కలుష......శీలా= అతడి శీలం దుర్జనసాంగత్యానికి విముఖమైనది. కరుణా.... రంగా= అతడి అంతరంగం దయాధీనమైనది. కమలభవ.....భృంగా= అతడు బ్రహ్మ మనఃపద్మంలో ఉండే తుమ్మెద. దురిత.....రూపా= అతడి రూపం పాపాంధకారాన్ని పారద్రోలే ప్రదీపాన్ని సాటిలేని విధంగా తిరస్కరించే సంస్తుత్యమైన కాంత్యతిశయం కలది. 'కమల భవ మనఃకంజ సంవాసభృంగా' - అలంకారం రూపకం, 'దురితధ్వాంత.......' అలంకారం రూపకం.

క. పరిణామగమ్య! నిగమా । పర నిష్ఠా సంపదచల భావన రమ్యా!
నిరుపమ సౌందర్య! తప । శ్చరణ నిరత హృదయ కమల సముదిత సూర్యా! 239

ప్రతిపదార్థం: పరిణామ గమ్య= విశ్వరూప పరిణతిచేతనే తెలియదగినవాడా!; నిగమ= వేదములయందలి; అపర= ఉత్తరభాగము అనగా ఉపనిషద్భాగమునందలి; నిష్ఠా= యోగనిష్ఠ అనే; సంపద్= సంపదచేత; అచలభావన= నిశ్చలధ్యానంచేత; రమ్యా!= అందమైనవాడా!; నిరుపమ సౌందర్య!= సాటిలేని శోభకలవాడా!; తపస్+చరణ= తపస్సు నాచరించటంలో; నిరత= మిక్కిలి ఆసక్తమైన; హృదయ కమల= హృదయమనే పద్మానికి; సముదిత= స్ఫుటంగా ఉదయించిన; సూర్యా!= సూర్యుడైనవాడా!;

తాత్పర్యం: విశ్వరూప పరిణతిచేతనే తెలియదగినవాడా! వేదముల ఉత్తరభాగములైన ఉపనిషద్భాగములందలి యోగనిష్ఠ అనే సంపద తోడి నిశ్చలధ్యానంచేత రమ్యమైనవాడా! నిరుపమాన సౌందర్యం గలవాడా! తపస్సు నాచరించటంలో ఆసక్తమైన హృదయకమలానికి లెస్సగా ఉదయించిన సూర్యుడైనవాడా! హరిహరనాథా!

విశేషం: 'తపశ్చరణ సూర్యా!' తపస్సునాచరించేవారి హృదయపద్మాలను వికసింపజేసేవాడా- అలంకారం రూపకం.

మాలిని.

చరణ యుగళకాంతి స్ఫారలీలా! నిరూఢా
దర సుఖమయయుక్తా! ధర్మ శీలానురక్తా!
సుర సముదయ రక్షా! సువ్రతా సంగ హేలా
కర మహిమ కటాక్షా! గాఢ సర్వానుపేక్షా! 240

ప్రతిపదార్థం: చరణ యుగళ= పాదద్వంద్వం యొక్క; కాంతి= శోభచే; స్ఫార= విపులమగు; లీలా!= విలాసం కలవాడా!; (సర్వవ్యాపకుడైన పరమేశ్వరుడి పాదద్వంద్వచ్ఛాయ విశ్వమంతటా వ్యాపించి వెలుగుతోంది అని భావం); నిరూఢ= స్థిరమూ

అనగా శాశ్వతమూ; అదర= భయరహితమూ; అయిన; సుఖమయ= ఆనందరూపములతో; యుక్తా!= కూడినవాడా!; (నిరూఢ+ఆదర అని విభజిస్తే; గొప్ప ఆదరం వలన కలిగే సుఖం అని చెప్పవచ్చు); ధర్మశీల= ధర్మస్వభావం కలవాళ్ళపై, పుణ్యపురుషులపై; అనురక్తా!= అనురాగం కలవాడా!; సుర= దేవతలయొక్క; సముదయ= సమూహంయొక్క; రక్షా!= రక్షణకలవాడా! -దేవతలను రక్షించేవాడా!; సువ్రత= ఉత్తమ సంకల్పంలో; ఆసంగ= ఆసక్తిగల సాధుపురుషులకు; హేలాకర= ఆనందం కలిగించే; మహిమ కటాక్షా!= గొప్పశక్తికల క్రీగంటి చూపుకలవాడా! (పరమేశ్వరుడి కటాక్షప్రసారం సువ్రతాసక్తులగు సాధుపురుషుల కానందం కలగజేస్తుందని భావం); గాఢ సర్వ+అనుపేక్షా!= సమస్త జగద్వ్యాపారమునందూ అతిశయమైన అనుపేక్షాభావం(శ్రద్ధ) కలవాడా!

తాత్పర్యం: పాదద్వంద్వకాంతిచేత విశ్వాన్నంతనూ ప్రకాశింపజేసేవాడా! శాశ్వతమూ, భయరహితమూ అయిన గొప్ప ఆదరంతో కూడిన ఆనంద రూపాలతో కూడినవాడా! ధర్మస్వభావం కలవారియెడ అనురాగం కలవాడా! దేవతా సమూహాన్ని రక్షించేవాడా! ఉత్తమవ్రతాలలో ఆసక్తిగల సాధుపురుషులకు ఆనందం కలిగించే క్రీగంటి చూపు కలవాడా! సమస్త జగద్వ్యాపారములందునూ అతిశయమైన శ్రద్ధకలవాడా! హరిహరనాథా!

విశేషం: మాలినికి నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలోనూ న,న,మ,య,య అనే గణాలుంటాయి. 1-9 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

గద్యము.

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతంబున సౌప్తిక పర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది; శ్రీమత్+ఉభయకవిమిత్ర= శ్రీమంతుడైన ఉభయకవిమిత్ర బిరుదం కలవాడూ; కొమ్మన+అమాత్య పుత్ర= కొమ్మనమంత్రి కుమారుడూ; బుధ+ఆరాధన విరాజి= పండితుల-దేవతల-పూజచే ప్రకాశించేవాడూ (అయిన); తిక్కన సోమయాజి= తిక్కన అనేపేరుగల సోమయాజిచేత; ప్రణీతంబు+ఐన= రచించబడిన; శ్రీమహాభారతంబునన్= శ్రీమహాభారతంలో; సౌప్తిక పర్వంబునందున్= సౌప్తికమనే పేరుగల పర్వంలో; ప్రథమ+ఆశ్వాసము= మొదటి ఆశ్వాసము.

తాత్పర్యం: ఇది శ్రీమంతుడైన ఉభయకవిమిత్ర బిరుదం కలవాడూ, కొమ్మనమంత్రి కుమారుడూ, పండితుల పూజలచేత ప్రకాశించేవాడూ, (దేవతలను, పండితులను పూజించటం వలన రాణించేవాడూ), అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శ్రీ మహాభారతంలోని సౌప్తికపర్వంలో మొదటి ఆశ్వాసం.

సౌప్తికపర్వంలో ప్రథమాశ్వాసం సమాప్తం